శ్రీవేదవ్యాస విరచితం

మత్స్యమహాపురాణం

ద్వితీయ భాగం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

డా॥ కె.నీలకంఠం

సంపాదకులు

'మహామహోపాధ్యాయ'

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

పూర్వ ప్రత్యేకాధికారి

పురాణేతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2021

MATSYAMAHAPURANAM
SECOND PART
(with Telugu Translation)

Translated by
Dr. K.Neelakantham

Editor
Dr. Samudrala Lakshmanaiah

T.T.D. Religious Publications Series No.1393


First Print : 2021

Copies: 500

Published by
Dr. K.S. Jawahar Reddy, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.


Cover Design and
D.T.P. Type Setting
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతి అమ్మవారు

శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

పండితపరిషత్తు

(సలహామండలి)

అధ్యక్షులు

డా॥ కె.యస్. జవహర్ రెడ్డి గారు ఐ.ఏ.యస్.

కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

సభ్యులు

శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి గారు ఐ.డి.ఇ.యస్.
అదనపు కార్యనిర్వహణాధికారి
తి.తి.దే.,తిరుపతి

శ్రీమతి యస్. భార్గవి గారు ఐ.ఏ.యస్.
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
తి.తి.దే.,తిరుపతి

డా॥ కందాడై రామానుజాచార్యులు గారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల
హైదరాబాద్

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యం గారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్ లైబ్రరీ – హైదరాబాద్

డా॥ ధూళిపాళ మహదేవమణి గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దేవస్థానములు

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ గారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం – తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు గారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల – తిరుపతి

డా॥ కె. ప్రతాప్ గారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం – తిరుపతి

కన్వీనర్

డా॥ యస్. దక్షిణామూర్తి శర్మ

ప్రత్యేకాధికారి ఐ/సి, పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణేతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి.

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి

డా॥ సూరం శ్రీనివాసులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కాలేజ్
తిమ్మసముద్రం

డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్
నిడదవోలు

డా॥ కలవకొలను కాశీ విశ్వేశ్వరశర్మగారు
సంస్కృతోపన్యాసకులు,
కె.ఎస్.ఎన్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
అనంతపురం

డా॥ తూమాటి సంజీవరావు గారు
చెన్నై, తమిళనాడు.

డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్స్ లైబ్రరీ, హైదరాబాద్

డా॥ కె.నీలకంఠంగారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

డా॥ పి.పి.వి.డి నాగత్రిశూలపాణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ&పిజి కళాశాల,అనంతపురం.

శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మగారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల
హిందూ ధర్మప్రచారపరిషత్, తి.తి.దే

కన్వీనర్

డా॥ యస్. దక్షిణామూర్తి శర్మ
ప్రత్యేకాధికారి ఐ/సి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయానుక్రమణిక

తొలిపలుకు



పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ అని భగవద్గీత.

శిష్టులను రక్షించడానికీ, దుష్టులను శిక్షించడానికీ, ధర్మాన్ని స్థాపించడానికీ భగవంతుడు ప్రతి యుగంలోనూ అవతరిస్తాడు. భగవదవతారాలలో పది అవతారాలు చాలా ముఖ్యమైనవి. ఈ అవతారాలకు చెందిన చరిత్రలు పురాణాలలో చూడవచ్చు.

దశావతారాలలో మత్స్యావతారం ఒకటి. మత్స్యరూపుడయిన మహావిష్ణువు వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన విషయాలు మత్స్యపురాణంలో నిబంధించడమయింది.

పదునాల్గువేల శ్లోకాలుగల ఈ పురాణాన్ని తెలుగు తాత్పర్యంతో రెండు సంపుటాలుగా ప్రకటిస్తున్నాము.

ఈ భాగంలో తారకాసురవృత్తాంతం, పార్వతీపరమేశ్వరుల కుమారుడుగా కుమారస్వామి జననం, తారకాసురసంహారం, వివిధములైన రాజధర్మాలు, సామ-దాన-భేద-దండోపాయాలు, వివిధ పుణ్యక్షేత్రాల ప్రశస్తి, స్వప్నఫలాలు, దశావతారాలలోని వామన వరాహావతారాల వర్ణన-మొదలైన అంశాలు ప్రతిపాదింపబడి వున్నాయి. పితృశ్రాద్ధాది విషయాలు గూడా వివరింపబడివున్నాయి.

వ్యాసభాగవత, వాల్మీకిరామాయణాలను వ్యాఖ్యానాలతో ప్రచురించిన తరువాత అష్టాదశపురాణాలను తెలుగు అనువాదంతో ముద్రించాలని దేవస్థానం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రసిద్ధ పండితులు సహకరించారు.

కూర్మపురాణం, బ్రహ్మపురాణం రెండుభాగాలు, విష్ణుపురాణం, మత్స్యపురాణం-ప్రథమభాగం-ఇటీవలే ముద్రితమై ఆవిష్కరింపబడినాయి. ప్రస్తుతం ఆచార్య నీలకంఠంగారి అనువాదంతో మత్స్యపురాణం – ద్వితీయభాగాన్ని ప్రచురిస్తున్నాము.

పురాణ ఇతిహాస ప్రాజెక్టు పూర్వ ప్రత్యేకాధికారి, మహామహోపాధ్యాయ, డా॥ సముద్రాల లక్ష్మణయ్య ఇంతవరకు ఈ ప్రాజెక్టు ద్వారా వెలువడిన ప్రచురణలకు సంపాదకత్వం వహించారు. వారికి మా అభినందనలు. ప్రస్తుతం ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డా॥ సింగరాజు దక్షిణామూర్తిశర్మగారినీ, మరియు పండితపరిషత్తు సభ్యులనూ, పరిష్కరణపరిషత్సభ్యులనూ, ఇతరవిధాల సహకరించినవారినీ అభినందిస్తున్నాము.

తక్కిన పురాణాల ప్రచురణ కూడా ఏడుకొండలవాని దయతో త్వరలో పూర్తి కాగలదని భావిస్తున్నాము.

డా॥ కే.యస్.జవహర్ రెడ్డి ఐ.ఏ.యస్
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నివేదన

యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

ధర్మమూలకమైన వేదాలలో కనిపించని అంశాలు స్మృతులలో కనిపిస్తాయి. శ్రుతిస్మృతులు రెండింటిలోను గోచరించని అంశాలను పురాణాలనుండి గ్రహించవచ్చు.

దీనినిబట్టి పురాణాల ప్రాముఖ్యం ఎంతటిదో అవగతమవుతుంది. వేదార్థాలను కథల ద్వారా జనానీకానికి అందుబాటులోకి తేవడమే కాక వేదాలలో లభించని విషయాలను గూడా తెలియజేసేవి గాన వాఙ్మయంలో పురాణాలకు నిరుపమానమైన విశిష్టత సిద్ధించింది.

ప్రాచీనకాలంలో గురుకులంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు 14 విద్యలను అభ్యసించేవారని ఈ క్రింది శ్లోకం తెలియజేస్తున్నది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యాహ్యేతాశ్చతుర్దశ ॥

నాల్గు వేదాలు, ఆరు వేదాంగాలు, మీమాంసాశాస్త్రం, న్యాయశాస్త్రం, పురాణం, ధర్మశాస్త్రం–ఇవే పదునాల్గు విద్యలు.

వేదవ్యాసుడు సంస్కృతంలో రచించిన పదునెనిమిది పురాణాలను వాటి విలువ గుర్తించిన ధర్మసంస్థలు–వివిధభాషలలోకి అనువదించి ప్రచురిస్తున్నాయి. వారి కృషి శ్లాఘనీయం.

తి.తి.దేవస్థానం భాగవతం ప్రాజెక్టు ఏర్పాటు చేసి తద్వారా మూడు వ్యాఖ్యానాలతో–వ్యాసభాగవతాన్ని పదునాల్గు బృహత్సంపుటాలుగా ప్రచురించింది. తదనంతరం వాల్మీకి రామాయణాన్ని రెండు వ్యాఖ్యానాలతో పరిష్కరించి ఎనిమిది సంపుటాలుగా ముద్రించింది. తదుపరి ప్రాజెక్టు పేరును 'పురాణ ఇతిహాస ప్రాజెక్టు'గా మార్చి తద్వారా శ్రీవ్యాసవిరచితాలైన అష్టాదశపురాణాలను సరళమైన తెలుగు భాషలోకి అనువదించి ప్రకటించాలని నిర్ణయించింది.

ఆ నిర్ణయం మేరకు ఇప్పటివరకు కూర్మ–విష్ణు–బ్రహ్మపురాణాలు అనువాదంతో సహా ప్రచురించబడ్డాయి. 14వేల శ్లోకాలు గల మత్స్యపురాణాన్ని రెండు సంపుటాలుగా రూపొందించి అందలి మొదటి సంపుటాన్ని ముందే ప్రకటించడం జరిగింది. ఆ సంపుటం నాచేతనే అనువదించబడింది. ఈ పురాణానికే చెందిన రెండవ సంపుట మిది. దీనిని డా॥ నీలకంఠం గారు అనువదించారు. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఇందులో కుమారస్వామి జననం, తారకసంహారం, వామన వరాహ అవతారాల ప్రస్తావన మున్నగు విషయాలున్నాయి.

ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పండితులకు నమోవాకాలు. ఈ గ్రంథాన్ని ఓపికతో సరిచూచి అవసరమైన పరిష్కరణలు గావించి ముద్రణార్హంగా రూపొందించిన పరిష్కరణ పరిషత్తు సభ్యులకూ, ప్రాజెక్టు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలిస్తున్న పండిత పరిషత్తు సభ్యులకూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.


ప్రాజెక్టు కార్యనిర్వహణకు తగినంత ప్రోత్సాహమిస్తూ ఈ పురాణ వాఙ్మయం ఈ రీతిగా వెలుగులోకి రావడానికి ముఖ్యకారణభూతులైన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలివారికీ, విశేషించి ధర్మకార్యనిరతులైన కార్యనిర్వహణాధికారి శ్రీమాన్ డా॥ కే.యస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.యస్. గారికీ, అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.యస్. గారికీ మరియు సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి ఐ.ఏ.యస్. గారికీ, ప్రస్తుతం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డా॥ సింగరాజు దక్షిణామూర్తిశర్మగారికీ కృతజ్ఞతా పూర్వకవందనాలు.

అనువదించిన పురాణాలను డి.టి.పి చేసిన తరువాత అక్షరశోధన, భాషలో క్లిష్టతను తొలగించటం మొదలగు కార్యక్రమాలను నిర్వహిస్తున్న డా॥ కె. ప్రతాప్ గారికీ, శ్రీ యస్. బి. యస్. భట్టాచార్యకూ, సహాయపరిశోధకులు డా॥ యస్. దశరథకూ, గతంలో పనిచేసిన డా॥ యస్. పూర్ణవల్లికీ, దీనిని ముద్రణయోగ్యంగా రూపొందించిన డి.టి.పి. ఆపరేటర్లు శ్రీ బి.వెంకట్రాయులుకూ, శ్రీ టి. పి. అశోక్ కుమార్‌కూ అభినందనలు.

ఈ అష్టాదశ పురాణ ప్రచురణ కార్యక్రమం శ్రీనివాసుని దయతో త్వరలో నెరవేరుగాక!

డా॥ సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి,
పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దే., తిరుపతి.

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

పురాణప్రశస్తి
(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామాథర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూలమైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యంకాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలి వుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।

కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్యై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథాకథనం ద్వారా ధర్మస్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణకథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞాన వైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం–12–3–14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః' పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానావిధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక –చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్ద నిర్వచనం

పురాణం అంటే – పురా భవం ప్రాచీనకాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం – ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా-అణతి-ఆగతానాగతే కథయతీతి పురాణం-అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా-పూర్వస్మిన్ జాతమితి పురాణమ్-పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా-అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా-ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం - పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం.

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్య నివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూప నిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది–శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం–శిరస్సు, పద్మపురాణం–హృదయం, విష్ణుపురాణం–దక్షిణహస్తం, వాయుపురాణం–వామహస్తం, భాగవతపురాణం–తొడలు, నారదపురాణం–నాభి, మార్కేండయపురాణం–దక్షిణపాదం, అగ్నిపురాణం–వామపాదం, భవిష్యపురాణం–కుడి మోకాలు, బ్రహ్మవైవర్త పురాణం–ఎడమ మోకాలు, లింగపురాణం–కుడి చీలమండ, వరాహపురాణం–ఎడమ చీలమండ, స్కాంద పురాణం–కేశాలు, వామనపురాణం–చర్మం, కూర్మపురాణం–వీపు, మత్స్యపురాణం–మెదడు, గరుడపురాణం–మజ్జ, బ్రహ్మాండపురాణం–ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆ యా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు–(1) మత్స్యపురాణం (2) మార్కండేయపురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు –(1) భాగవతం (2) భవిష్యపురాణం –'బ్ర'తో ప్రారంభమయ్యేవి –మూడు (1) బ్రహ్మపురాణం (2) బ్రహ్మాండపురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం –'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణుపురాణం (2) వాయుపురాణం (3) వామనపురాణం (4) వరాహపురాణం –అ=అగ్నిపురాణం నా=నారదపురాణం–ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడపురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రిందివిధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్తలింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మసంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు –

> **వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।**
> **గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥**

రాజసాలు –

> **బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।**
> **భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥**

తామసాలు –

> **మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।**
> **ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥**

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతర దేవతల కంటె అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానా నామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది. –

> **ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।**
> **క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।**
> **అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥**

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడు రూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మపురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశభాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతః పరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్తమపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతం ప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణలక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం – ఆ యా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు - మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆ యా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పది లక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం: –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆ యా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥
దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశ పఞ్చ చతుశ్శతమ్ ॥
చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చ శతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥
చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥
కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥
త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2-9)**

1. బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	-	55,000	,,
3. విష్ణుపురాణం	-	23,000	,,
4. వాయుపురాణం	-	24,000	,,
5. భాగవతపురాణం	-	18,000	,,
6. నారదపురాణం	-	25,000	,,
7. మార్కండేయపురాణం	-	9,000	,,
8. అగ్నిపురాణం	-	15,400	,,
9. భవిష్యపురాణం	-	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11. లింగపురాణం	-	11,000	,,
12. వరాహపురాణం	-	24,000	,,
13. స్కందపురాణం	-	81,100	,,
14. వామనపురాణం	-	10,000	,,
15. కూర్మపురాణం	-	17,000	,,
16. మత్స్యపురాణం	-	14,000	,,
17. గరుడపురాణం	-	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	-	12,000	,,
మొత్తం శ్లోకాలు	-	**4,00,0000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆ యా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమా, రూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహమైం దనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలు గూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి, అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచితసంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణుపురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవో౽ధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తి నివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకర రామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ-భక్తి-ధ్యాన-జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాది కథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణ వృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణ సారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితాలని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వత నైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతి ప్రాచీన కాలంనుండి నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతి పురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు - తి.తి.దే.

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

14,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్ర సగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడ మయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమ క్షేత్రమనే పూరీ జగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటె బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగి వున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగ ధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడి యుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తు డవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతి హేతువులైన, మానవ జీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడి వున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహంవల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణుధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తన ప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణ కర్మ నామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర! ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేదని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'–అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీ చింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి, అలసిపోయి, తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతని మాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవత శ్రవణమే అని చెప్పి భాగవత ప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతార ప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ-ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలి స్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నా కథలు పఠించేవాడు, వినేవాడు, నా కథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరి సుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగినులున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు. పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు. పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు. ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడి వున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణ భారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ

వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగరవర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు,

అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నా మాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందుకా దేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహసంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతర పురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెంద్రుకలతో పోల్చబడిన ఈ గ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాది కథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగర పరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగి వున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలలో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తిజనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు–ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు – శిష్యుడు–వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకల పాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి–ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు–మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన–ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని, భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14,000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం

మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –

అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం. ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గల జ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండపురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. **"బ్రహ్మాండం చాస్థి గీయతే"** అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తరభాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

మత్స్యపురాణం - ద్వితీయభాగ కథాసారాంశం

మత్స్యపురాణపు ఉత్తరార్ధం 151వ అధ్యాయం నుండి ఆరంభమై 291వ అధ్యాయంతో సమాప్తమవుతుంది. ఈ అధ్యాయం గ్రసనాసురవధతో ఆరంభమవుతుంది. "నిమిదైత్యుడు, మధనాసురుడు, శుంభాసురుడు, గ్రసనాసురుడు, మహిషాసురుడు జంభాసురుడు" మొదలగు రాక్షసులందరూ శ్రీమహావిష్ణువుపై దండెత్తగా శ్రీమహావిష్ణువు వారిపై ప్రయోగించిన రుద్రాస్త్రం, కాలదండాస్త్రం, గద, ముద్గరం మొదలగు అస్త్రములన్నీ నిష్ఫలములై పోగా చివరిగా చక్రాయుధమును ప్రయోగించి రాక్షస సైన్యాధిపతియైన గ్రసనాసురుని శ్రీమహావిష్ణువు సంహరిస్తాడు. తదనంతరం యుద్ధభూమిలో మహిషాసురుని, శుంభాసురుని తన పరాక్రమంతో ఓడించి వారిద్దరిని మున్ముందు శక్తిస్వరూపిణియైన జగన్మాత సంహరిస్తుందని తెలిపి యుద్ధభూమినుండి పంపివేసి మధనాసురునిమాత్రం వధిస్తాడు. కాని ఆ సమయాన నిమిదైత్యుడు, జంభాసురుడు తమ బలములతో శ్రీమహావిష్ణువుయొక్క గరుడవాహనమును కొట్టగా అది భరించలేని గరుడుడు అత్యంతవేగముతో శ్రీమన్నారాయణునితో కూడ యుద్ధభూమినుండి నిష్క్రమిస్తాడు. అది చూచిన ఇంద్రాది దేవతలు శ్రీమన్నారాయణుని స్తుతించి,

శక్తేనోపేక్షితో నీచో మన్యతే బలమాత్మనః ।
తస్మాన్న నీచం మతిమాన్ దుర్గహీనం హి సంత్యజేత్ ॥(153-4,5)

శక్తి గలవాడు నీచుణ్ణి ఉపేక్షించినచో వాడు అది తన బలమే అనుకొంటాడు గదా! ఓ పరమాత్మ అంటూ ప్రోత్సహించారు. అపుడు నారాయణుడు ఇంద్రునితో దుష్టులైన దైత్యులను వివిధ ఉపాయములతో వధించాలి, కేవలం శక్తి పరాక్రమాదులతో మాత్రం వీలుకాదని తారకాసురుడు పసివాడైన కార్తికేయుని చేతిలో వధింపబడుతాడు, మహిషాసురుని వంటివారు స్త్రీశక్తి ద్వారా సంహరింపబడుతారు, ఇప్పుడు జంభాసురుడు ఇత్యాదులను నీవు మాత్రమే వధింపగల్గుతావని వివరించాడు. శ్రీమన్నారాయణుని ఆదేశముపై ఇంద్రుడు గజాసురుడు, నిమిదైత్యుడు, జంభాసురుడు మొదలగు రాక్షసులను సంహరించాడు. ఈ సందర్భములో "గాంధర్వాస్త్రం త్వాష్ట్రాస్త్రము, మౌసలాస్త్రము, శైలాస్త్రము, ఐషీకాస్త్రము" ఇత్యాది విశిష్టాస్త్రప్రయోగాలు ఇక్కడ వర్ణింపబడ్డాయి. అటు పిమ్మట జంభాసురాదుల వధతో కోపోద్రిక్తుడైన తారకాసురుడు దేవతలపై దండెత్తి వారిని జయించాడు.

తారకాసురుని భయంతో పారిపోయిన దేవతలు బ్రహ్మదేవుని స్తుతిస్తారు. బ్రహ్మదేవుడు అష్టదిక్పాలకులయొక్క దీనమైన స్థితిని చూచి విచారము పొంది శివకేశవులిద్దరినీ పిలిచి తారకాసుర ప్రభావాన్ని వివరిస్తాడు. అపుడు దేవతలంతా తాము యుద్ధములో జూచిన తారకాసురుని దౌష్ట్యమును వర్ణించి వానినుండి లోకములను రక్షింపుమని ప్రార్థిస్తారు. బ్రహ్మదేవుడు తారకుని సంహరించవలసినవాడు ఇంకా జన్మించలేదని, వాడు కేవలం ఏడు దివసముల వయసుగల శిశువు చేతిలో మాత్రమే తాను సంహరింపబడవలెనని వరం పొందినట్లు వివరించి, ఆ శిశువు పరమశివునకు జన్మించవలసియున్నది. కాని ప్రస్తుతం ఆ శివుడు పత్నీరహితుడు, ఆయనకు పార్వతీదేవితో వివాహము కావలసియున్నది, వారిద్దరికి కలిగిన పుత్రుడే తారకుని వధిస్తాడు కనుక కొంతకాలం సంయమనం పాటించవలసినదని దేవతలను అనునయిస్తాడు. తర్వాత రాత్రిదేవతను పిలిచి శివపార్వతుల వివాహం గురించి

వివరించి, వివాహానంతరము వారిద్దరి మధ్యలో నీవు వాక్కలహము సృష్టించమని చెబుతాడు. రాత్రి దేవత గర్భవతియైన మేనాదేవినే ఆశ్రయించి ఉండుటవలన పార్వతీదేవి నలుపు (శ్యామల) వర్ణముతో జన్మిస్తుంది, కల్యాణానంతరము సంగమసమయాన పార్వతీదేవిని నీవు నల్లగా ఉన్నావని శివుడు పరిహసించగా హిమగిరిసుత తన తపశ్శక్తిచేత మరల గౌరవర్ణమును పొందెదనని చెప్పి వెళ్ళిపోతుంది. నీవు కూడ రాక్షససంహారము చేయుటలో అత్యంత ప్రధానపాత్ర పోషించవలసియున్నదని, నీవు పార్వతీదేవి అంశంతో దైత్యసంహారానికి తోడ్పడగలవని రాత్రిదేవతకు చెప్తాడు. అంతే కాకుండా బ్రహ్మదేవుడు

త్వం ముక్తిః సర్వభూతానాం త్వం గతిః సర్వదేహినామ్ ।
త్వం చ కీర్తిమతాం కీర్తిః త్వం మూర్తిః సర్వదేహినామ్ ॥

అని రాత్రిదేవతను స్తుతిస్తాడు.

రాత్రిదేవత వెంటనే నిద్రించుచున్న మేనాదేవి ఉదరమున ప్రవేశించి గర్భములోనున్న పార్వతీదేవి శరీరవర్ణాన్ని మార్చివేస్తుంది. తదనంతరం హిమసుత జన్మించుట, పెరిగి యుక్తవయస్కురాలగుట, ఇంద్రుడు నారదుని హిమవంతుని వద్దకు పంపుట, నారదుడు పార్వతీదేవి పరమశివుని భార్య యగునని తదర్థమై ప్రయత్నం చేయవలసినదని హిమవంతునకు చెప్పుట, ఇంద్రుడు మన్మథుని ప్రేరేపించుట, శివునకు పార్వతి యందనురక్తి కలుగుట, శివుడు మన్మథుని దహించివేయుట, రతీదేవి సాంబశివుని స్తుతించుట, మన్మథ దహనమును వినిన హిమవంతుడు పునరాలోచించుట ఇత్యాది సంఘటనలన్నింటిని మత్స్యపురాణం చక్కగా వర్ణించింది. ఈ సందర్భంలో

తపోభిః ప్రాప్యతేఽభీష్టం నాసాధ్యం హి తపస్యతః ।
దుర్భగత్వం వృథా లోకే వహతే సతిసాధనే ॥

తపసి భ్రష్టసందేహా ఉద్యమోఽర్థజిగీషయా ।
సాఽహం తపః కరిష్యామి యదహం ప్రాప్య దుర్లభా ॥

భావినోఽర్థాః భవన్త్యేవ హఠేనానిచ్ఛతోఽపి వా ।
ఉపాయైః దుర్లభాన్ భావాన్ ప్రాప్నువంతి హ్యతంద్రితాః ॥(154-290, 292,295)

అని తన తండ్రికి స్వమనోరథమును తెలిపి తపస్సుతో సాధ్యము కానిది లేదని పార్వతి వివరిస్తుంది. తర్వాత ఇంద్రునిచే పంపబడిన సప్తర్షుల ఆధ్వర్యవమున శివపార్వతుల కల్యాణం, గజాననుడు మఱియు వీరకుడు ఉద్భవించుట, శివపార్వతుల సంగమమును ఇక్కడ చక్కగా వర్ణిస్తుంది మత్స్యపురాణం.

ఆ తర్వాత శివుడు పార్వతీదేవిని నీవు నల్లగా ఉన్నావని చందనవృక్షానికి చుట్టుకొని ఉన్న నల్లత్రాచువలె ఉన్నావని పరిహసింపగా ఆమె కోపోద్రిక్తురాలై నీకొఱకై ఎంతోకాలము తపస్సు చేసిన నాకు ఈ అవమానం తగినదే అని తెలుపుతూ నేను మరల తపమాచరించి గౌరవర్ణమును పొందుదునని అక్కడినుండి వెళ్ళిపోవడానికి సిద్ధపడుతుంది. "ఎంత స్వస్థచిత్తులైనప్పటికినీ మనోవైకల్యం వలన ఒక్కోసారి విపరీతార్థం తోస్తుంది, నేను నిన్ను ఎటువంటి దురుద్దేశ్యంతోనూ అలా అనలేదని శివుడు ఎంతగా బ్రతిమాలినా పార్వతీదేవి వినిపించుకోకుండా

అక్కడి నుండి వెళ్ళిపోతుంటే ప్రమథగణములు దుఃఖముతో ఆమె వెంట పరిగెడుతూ నివారించుటకు యత్నిస్తారు. వీరకుడు కూడ ఆ జగన్మాత పాదములను పట్టుకొని బ్రతిమాలుతుంటే "నీవు ఇక్కడే ఉండి పరమశివుని వద్దకు ఎవరైనా వచ్చినచో నాకు వెంటనే తెలుపవలెనని తనకొఱకై శివుని ద్వారము దగ్గఱ కాపలా ఉండుమని చెప్పి హిమసుత తపస్సు చేసుకొనుటకు వెళ్ళుతుంది.

అలా వెళ్ళిపోతున్న పార్వతీదేవిని చూచి, మేనాదేవికి మిత్రురాలైన 'కుసుమామోదిని' ఆమెను వెళ్ళవద్దని నివారించుటకు ప్రయత్నిస్తుంది కాని పార్వతీదేవి ఆమెను కూడ శివుని వద్దనే కాపలాగా ఉండమని ప్రార్థించి ఆ దేవుని దగ్గఱకు ఎవరైనా వచ్చినట్లైతే వెంటనే నాకు తెలుపవలసిందని చెప్పి తపమాచరించుటకు తండ్రియొక్క ఉద్యానవనానికి వెళ్ళుతుంది. అక్కడ ముందుగా తపస్సునకు విఘ్నంగా ఉండే ఆభరణాలన్నింటిని వదిలి, నారవస్త్రములను ధరించి కఠోరమైన తపస్సు చేస్తుంది.

ఇదంతా గమనించిన అంధకాసురుని పుత్రుడైన "ఆఢి" అనే దైత్యుడు తన తండ్రిని వధించిన శివునిపై పగతీర్చుకొనుట కుద్యుక్తుడవుతాడు. అయితే ఈ "ఆఢి" కూడ పూర్వము తన తపస్సుతో బ్రహ్మదేవుని మెప్పించి తనకు మరణము లేకుండా ఉండే వరమును కోరుకోగా అది అసంభవమని చెప్పి నీవు నీ అసలు రూపాన్ని మార్చుకున్నప్పుడు మాత్రమే మరణం పొందుతావని చెప్పిన విషయాన్ని మరచి, శివుని ద్వారము దగ్గఱ ఉన్నట్టి వీరకునికి కనబడకుండా ముందుగా ఒక సర్పముగా మారి శివుని గృహములో ప్రవేశిస్తాడు, తర్వాత సౌందర్యవతియైన పార్వతీదేవి రూపాన్ని ధరించి శివుని వద్దకు వెళ్ళుతాడు. రాక్షసమాయను గమనించిన పరమశివుడు "ఆఢి" దైత్యుని సంహరిస్తాడు. కాని 'ఆఢి' మాయను తెలుసుకోలేని కుసుమామోదిని పార్వతీదేవి వద్దకు వెళ్ళి పరమశివుని వద్ద చూచిన స్త్రీ గుఱించి తెలుపుతుంది. అది వినిన జగన్మాత క్రోధముతో వీరకుణ్ణి శపిస్తుంది. ఆ సమయాన తన క్రోధంనుండి ఉద్భవించిన భీకరమైన సింహమును అధిష్ఠించుటకు సిద్ధపడుతున్న పార్వతీదేవిని చూచి బ్రహ్మదేవుడు అక్కడికి వేగముగా వచ్చి ఆమెను నివారిస్తాడు, ఆమె మరల ఆచరిస్తున్న ఘోరతపస్సునకు కారణమును తెలిసికొని ఆమెకు గౌరవర్ణమును మఱియు శివునిలో అర్ధభాగమును కూడ పొందే వరమును ప్రసాదిస్తాడు. తర్వాత ఆమెనుండి బయటపడిన రాత్రిదేవికి ఆ సింహవాహనమునిచ్చి వింధ్యవాసినిగా లోకరక్షణ చేయమని ఆదేశిస్తాడు. ఇతఃపరం "కౌశికీ" అను పేరుతో ప్రసిద్ధిపొందుతావని రాక్షససంహారములో నీవు తోడ్పడవలసిందని తెలిపి సెలవు తీసుకుంటాడు బ్రహ్మదేవుడు. అప్పుడు పార్వతీదేవి శివాంతఃపురమును ప్రవేశించుటకు ప్రయత్నించగా తన శ్యామవర్ణమును త్యజించి గౌరవర్ణముతో వచ్చిన ఆమెను తెలుసుకోలేని వీరకుడు ఆమెను అడ్డగించి ఇతః పూర్వమే స్త్రీ రూపము ధరించి లోపల ప్రవేశించిన దైత్యుడొకడిని పరమశివుడు వధించాడని తెలుపుతూ వాడి ప్రవేశమును నేను గమనించలేకపోతిననే బాధను కూడ ఆమెకు వివరిస్తాడు. రాక్షసమాయ గుఱించి తెలిసికోలేని నేను కుసుమామోదిని చెప్పినది విని ఈ వీరకుని శపించితినే అని విచారించుతూ

అకార్యం క్రియతే మూఢైః ప్రాయః క్రోధసమీరితైః ।
క్రోధేన నశ్యతే కీర్తిః క్రోధో హన్తి స్థిరాం శ్రియమ్ ।
అపరిచ్ఛిన్నతత్త్వార్థా పుత్రం శాపితవత్యహమ్ ॥(158-3,4)

అని పార్వతీదేవి కోపమెంత అనర్థదాయకమో లోకమునకు తెలుపుతుంది. అనంతరం వీరకునికి తన స్వరూపం తెలుపగ వీరకుడు అనేక శ్లోకములతో ఆ మాతృదేవతను స్తుతిస్తాడు. స్తోత్రముతో సంతుష్టురాలైన జగన్మాత వీరకుని ఆశీర్వదించి భర్తృగృహమున ప్రవేశిస్తుంది. అపుడు పరమశివుని దర్శనార్థమై నిరీక్షిస్తున్న దేవతలను

నివారించి వీరకుడు వారివారి నివాసములకు పంపుతాడు. పార్వతీపరమేశ్వరుల అంతఃపురసంగమమునకు విఘ్నం కలిగించకూడదని వారికి చెబుతాడు.

అనేక సంవత్సరములు గడిచిన తర్వాత అత్యంత ఆసక్తితో నిరీక్షిస్తున్న దేవతలు అగ్నిదేవుని ప్రేరేపించి అతడిని కైలాసానికి పంపుతారు. అగ్నిదేవుడు ఒక శుకరూపమున శివుని అంతఃపురంలోకి ప్రవేశిస్తాడు. అది గమనించిన సాంబశివుడు సంభోగసమయంలో ఇక్కడికి వచ్చి విఘ్నం కలిగించావు కనుక పడిపోతున్న ఈ వీర్యాన్ని నీవే భరించవలెనని ఆజ్ఞాపించగా అగ్ని అది త్రాగి తర్వాత ఆయా దేవతల యొక్క ఉదరములలోనికి జారవిడుస్తాడు. కాని మహేశ్వర తేజస్సు వారి ఉదరములను ఛేదించుకొని బయటపడి శంకరుని నివాసమునకు సమీపముననున్న దివ్యమైన సరస్సులో ప్రవేశిస్తుంది. సువర్ణమయములైన పద్మములుగల ఆ సరస్సులో స్నానమాచరించి ఒక అనర్ఘమైన పద్మమును శిరస్సున ధరించి ఆ సరస్సులోని నీటిని త్రాగుటకై పార్వతి సిద్ధపడుతుంది. అపుడు ఆరుమంది కృత్తికానక్షత్రదేవతలు స్నానమాచరించి తామరాకులలో నీటిని తీసుకొని రాగా పార్వతీదేవి నీరు త్రాగవలెననే అభీష్టమును వారికి తెలుపుతుంది. ఆ నక్షత్రదేవతలు ఇది సామాన్యజలం కాదని, దీనిని త్రాగగానే నీవు గర్భము ధరింతువని పుత్రునికి జన్మనిత్తువని తెలుపుతూ, ఆ పుత్రుడు లోకములన్నింటిలో మా పుత్రుడుగా అనగా 'కార్తికేయుడు' గా విఖ్యాతుడగుటకు, నీవు అంగీకరించవలసినదని ప్రార్థిస్తారు. వారి ప్రార్థనను ఆలకించి ఆ జలమును త్రాగిన జగన్మాత ప్రభాకరసమానమైన తేజస్సు కలిగిన పుత్రునికి జన్మనిస్తుంది. పరమాద్భుతమైన 'శక్తి' అను ఆయుధముతో మఱియు ఆరుగురు కృత్తికల కోరికతో జన్మించినవాడు కనుక ఆ బిడ్డ షణ్ముఖుడైనాడు. కుత్సితులైన దైత్యులను వధించుటకే జన్మించాడు కనుక "కుమారు" డనే నామం కూడ పొందాడు.

దీప్తో మారయితుం దైత్యాన్ కుత్సితాన్ కనకచ్ఛవిః ।
ఏతస్మాత్కారణాదేవ కుమారశ్చాపి సోఽభవత్ ॥(158-41)

విశేషించి ఒకటిగా చేయబడిన ఆరు ముఖములు (శాఖలు) కలవాడు కావున 'విశాఖు'డని, శివుని నుండి అగ్నిదేవుని ముఖమునందు స్కందించిన (జారిపడిన) వీర్యమునుండి జన్మించుట వలన 'స్కందుడు' అని ఇంకా "కార్తికేయుడు" అని అనేక నామములు కలవాడౌతాడు. చైత్రబహుళ అమావాస్య రోజున విశాలమైన శరకాననమున జన్మించుట వలన 'శరవణుం' దని కూడ ప్రసిద్ధి. అయితే కుమారుడు, స్కందుడు అని ఇద్దరుగా జన్మించిన వీరిద్దరిని చైత్రశుక్లపంచమినాడు ఇంద్రుడు ఒకే శిశువుగా మార్చెనని, చైత్రశుక్ల షష్ఠితిథియందు బ్రహ్మాది దేవతలందరూ కలిసి ఈ కుమారస్వామిని దేవతల సేనానాయకునిగా అభిషేకించిరని, ఇంద్రుడు తన పుత్రికయైన దేవసేనను ఆతనికిచ్చి పెళ్ళి చేసెనని మత్స్యపురాణం వివరిస్తున్నది. అటు తర్వాత అతనికి శ్రీమహావిష్ణువు మొదలుకొని దేవతలందరూ వారివారి ఆయుధములను, తేజస్సును వాహనములను బహుమానములుగా ఇస్తారు. అప్పుడు దేవతలందరూ "నమః కుమారాయ మహాప్రభాయ, స్కందాయ చ స్కందితదానవాయ" అంటూ తమ మోకాళ్ళపై భూమిపై నిలుచుండి ఆ కుమారుణ్ణి స్తుతిస్తారు. దానితో సంతుష్టుడై స్కందుడు వారి కోరిక ఏమిటని ప్రశ్నిస్తాడు. ఇంద్రుడు తారకాసురుని వలన దేవతలంతా పడుతున్న నరకయాతన గుఱించి వివరించి వెంటనే నీవతనిని వధించవలెనని ప్రార్థిస్తాడు. వెంటనే స్కందుని అంగీకారంతో తారకాసురుని యుద్ధమునకు సిద్ధము కమ్మని తెల్పుటకు దూతను పంపిస్తాడు. దూత తెలిపిన మాటలను విని తారకాసురుడు ఎన్నోసార్లు నాచేతిలో పరాజయం పొందిన

ఇంద్రుడు ఇపుడు ప్రత్యక్షంగా యుద్ధానికి సిద్ధపడుమని తెలుపుటలో ఏదో భావముందని తలుస్తాడు. వెంటనే తన రాజభవన ప్రాసాదమునుండి తమపైకి దండెత్తి వస్తున్న దేవసైన్యమును చూస్తాడు. అట్లే సైన్యాధిపతిగా ప్రకాశిస్తున్న బాలుడికి దేవసైన్యము చేస్తున్న జయజయధ్వానములు వింటాడు.

తనకు ఒక బాలుని చేతిలో మరణం ప్రాప్తించునన్న బ్రహ్మదేవుని వాక్యములను స్మరించుకుంటాడు. వెంటనే యుద్ధమునకై సన్నద్ధుడై బయల్దేరుతాడు. తన ముందు కుమారుణ్ణి చూచి–

కిం బాల! యోద్ధుకామోఽసి క్రీడాకందుక లీలయా ।
త్వయా న దానవా దృష్టాః యత్సంగర విభీషకాః ।
బాలత్వాదథ తే బుద్ధిః ఏవం స్వల్పార్థ దర్శినీ ॥ (160–4,5)

అంటూ కార్తికేయుని పరిహసిస్తాడు. కాని కార్తికేయుడు ఏమాత్రం భయం పొందక తారకాసురుని

శిశుత్వం మావమంస్థా మే శిశుః కాలభుజంగమః ।
దుష్ప్రేక్ష్యో భాస్కరో బాలస్తథాహం దుర్జయః శిశుః ॥ (160–7,8)

అని చెబుతూ బాలుడనని నా పరాక్రమమును తక్కువ అంచనా వేయకుమని తెలుపుతాడు. తారకాసురుడు మాటలతో లాభం లేదని అనేక విధములైన ఆయుధములను కుమారునిపై ప్రయోగిస్తాడు. కాని అవేవీ పనిచేయక పోవుటతో కంపించి పోతుంటాడు, అది గమనించిన 'కాలనేమి' ఇత్యాది భయంకర రాక్షసులందరూ కుమారస్వామిపై లంఘించి ఘోరమైన యుద్ధం చేస్తారు కాని ఆ స్వామి పరాక్రమానికి తాళలేక యుద్ధభూమినుండి పారిపోతారు. అపుడు మరల తారకుడు కార్తికేయునిపై లంఘించి యుద్ధము చేయుచుండగా కార్తికేయుడు అప్రతిహతమైన తన 'శక్తి' ఆయుధంతో ఆ దైత్యేంద్రుణ్ణి సంహరిస్తాడు. అది చూచిన దేవతలందరూ సంతుష్టులై ఆ కుమారుణ్ణి స్తుతిస్తారు. ఇక్కడ మహాశక్తి సంపన్నుడైన ఈ కుమారస్వామి చరితం పఠించినవారు అభీష్టసిద్ధిని పొందుతారని మత్స్యపురాణం తెలుపుతుంది.

తదనంతరము శౌనకాదిఋషుల కోరిక ప్రకారము సూతుడు హిరణ్యకశిపు వృత్తాంతము వివరిస్తాడు. పూర్వం కృతయుగంలో హిరణ్యకశిపుడనే దైత్యేంద్రుడు జలావాసియై అనేకవేల సంవత్సరాలు బ్రహ్మదేవుని గురించి తపస్సు చేశాడు. ఆతని తపస్సుకు మెచ్చిన బ్రహ్మ సపరివారంగా హిరణ్యకశిపునకు దర్శనమిచ్చి ఏ వరం కావాలని అడుగగా, ఆ దైత్యుడు

న దేవాసురగంధర్వాః న యక్షోరగరాక్షసాః ।
న మానుషాః పిశాచా వా హన్యుర్మాం దేవసత్తమ ॥
ఋషయో వా న మాం శాపైః శపేయుః ప్రపితామహ ॥
న చాస్త్రేణ న శస్త్రేణ గిరిణా పాదపేన చ
న శుష్కేణ న చార్ద్రేణ న దివా న నిశాఽథవా । (161–11,12,13)

అంటూ తనను ఎవరూ సంహరింపకుండా ఉండునట్లు, ఎటువంటి ఆయుధముతో కూడ తనను

వధించకుండా ఉండునట్లు, రాత్రికాని పగలుకాని తనకు మరణం ఉండకుండునట్లు, ఋషులు మునులు ఎవ్వరూ తనకు శాపమివ్వకుండునట్లు వరము ప్రసాదించమని కోరుతాడు. ఆ వరాన్ని హిరణ్యకశిపునకు ప్రసాదించి తన లోకానికి వెళ్ళిపోయిన బ్రహ్మదేవుని వద్దకు దేవతలంతా వెళ్ళి మొరపెట్టుకుంటారు. వారి ప్రార్థనను విని జగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువు ఆ దైత్యేంద్రుని ఏదో ఒక ఉపాయంతో సంహరించునని, భయపడవలదని వారికి బ్రహ్మ అభయమిస్తాడు.

అటు బ్రహ్మదేవునినుండి వరం పొందిన హిరణ్యకశిపుడు గర్వముతో లోకులందరిని అమితంగా బాధపెడుతాడు. దేవతల కోరికను మన్నించిన శ్రీమహావిష్ణువు.

నరస్య కృత్వార్ధతనుం సింహస్యార్ధతనుం తథా ।
నారసింహేన వపుషా పాణిం సంస్పృశ్య పాణినా ॥ (161-37)

నరసింహుని రూపాన హిరణ్యకశిపుని సభకు వెళ్తాడు. ఇక్కడ దివ్యమైన హిరణ్యకశిపుని సభామంటపమును చాలా మహత్తరంగా మత్స్యపురాణం వర్ణిస్తుంది. గంధర్వాదులచేత, అనేకమంది అప్సరసలచేత, ఆరాధింపబడుతున్న వీరాధివీరులైన దైత్యులచేత, ప్రహ్లాదుడు సుమతి మొదలగు వారిచేత పరివృతుడైన హిరణ్యకశిపుని నరసింహస్వామి రూపముననున్న శ్రీమన్నారాయణుడు చూస్తాడు. ఆ విధముగా సభలో ప్రవేశించిన నరసింహుని చూచిన ప్రహ్లాదుడు

న శ్రుతం న చ నో దృష్టం నారసింహమిదం వపుః ।
అవ్యక్తప్రభవం దివ్యం కిమిదం రూపమాగతమ్॥
దైత్యాన్తకరణం ఘోరం శంసతీవ మనో మమ ॥(162-4,5)

అంటూ "ఓ మహారాజా! ఓ దైత్యాధిపా! ఇటువంటి రూపం గురించి వినుటకాని చూచుటకాని జరుగలేదు. 'నరసింహ' రూపములోనున్న ఈ రూపాన్ని చూస్తే దైత్యవంశమును అంతము చేయుటకే వచ్చినదా అనిపిస్తున్నది" అని హిరణ్యకశిపునకు చెబుతాడు. అంతేకాదు, అష్టదిక్పాలకులు, సూర్యచంద్రులు, ఇంద్రాది దేవతలు, బ్రహ్మ, శివుడు ఇంకనూ, స్థావరజంగమాత్మకమైన ఈ చరాచర సృష్టియంతయు ఈ రూపములో కనబడుతున్నది అనితండ్రికి వివరిస్తాడు. ప్రహ్లాదుని మాటలు వినిన హిరణ్యకశిపుడు వెంటనే దానవగణములను పిలిచి, మృగేంద్రరూపమైన ఈ ప్రాణిని పట్టుకొని వధింపుడని ఆజ్ఞాపిస్తాడు. కాని అది లెక్కించని నరసింహప్రభువు సింహనాదము చేస్తూ హిరణ్యకశిపుని సభనంతటిని విధ్వంసం చేయుట చూసి హిరణ్యకశిపుడే సాక్షాత్తూ ఆ నరసింహునిపై అనేక విధాల ఆయుధములను ప్రయోగిస్తాడు. ఇంకనూ ప్రజ్వలితములైన వివిధ అస్త్రములతో నరసింహుని ఆక్రమిస్తాడు, ఆతని దానవగణమంత కూడ నాగుపాములను పోలిన పాశములతో నరసింహుని చుట్టుముడుతారు కాని నరసింహుడు ఏ మాత్రము చలించక తన పరాక్రమంతో వారినందరిని భయకంపితులను జేస్తాడు.

పరిస్థితిని గమించిన హిరణ్యకశిపుడు తానే స్వయంగా మరల నరసింహునితో యుద్ధము చేయుటకు సన్నద్ధుడవుతుండగా అనేకవిధ అశుభశకునములు కలుగుతాయి, వేటినీ లెక్కచేయకుండా ఆ దానవుడు నరసింహునితో యుద్ధం చేయుచుండగా సమయం (పగలు,రాత్రి రెండింటి సంధికాలం) కొఱకు వేచిచూచి వెంటనే తన నఖములనే ఆయుధములుగా ఉపయోగించి ఆ దేవుడు హిరణ్యకశిపుని సంహరిస్తాడు. అపుడు

దేవతలు, మునులు, ఋషులు అందరూ సనాతనుడైన ఆ దేవదేవుని స్తుతిస్తారు. తర్వాత శ్రీమన్నారాయణుడు నరసింహరూపమును అక్కడే వదిలి వైకుంఠమునకు వెళ్ళిపోతాడు.

అటు తర్వాత నరసింహరూపుడైన శ్రీమన్నారాయణుని మహత్త్వము విని సంతోషించిన శౌనకాదులు పాద్మమహాకల్ప వృత్తాంతము వివరింపుమని సూతమహర్షిని ప్రార్థిస్తారు. అపుడు సూతుడు పూర్వము మనువుకు మత్స్యుని రూపముననున్న భగవంతుడు చెప్పిన పాద్మకల్ప వృత్తాంతమంతా ఆ మహర్షులకు వినిపిస్తాడు.

కియతా చైవ కాలేన శేతే వై పురుషోత్తమః ।
కియన్తం వా స్వపితి చ కోఽస్య కాలస్య సమ్భవః ॥(164-7,8)

అంటూ మనువు పురుషోత్తముడు ఎంతకాలము సముద్రజలమందు శయనించును, ఎప్పుడు మేలుకొనును ఇత్యాది అనేక విధ విషయములను వివరింపుమని ప్రార్థించగా మత్స్యభగవానుడు ఈ విధముగా చెబుతాడు.

కః సముత్సహతే జ్ఞాతుం పరం నారాయణాత్మకమ్ ॥

బ్రహ్మదేవునకు కూడ విదితము కానటువంటి ఆ శ్రీమన్నారాయణ తత్త్వము ఎవరు తెలుసుకోగలుగుతారు? "కర్తా, కారకుడు, బుద్ధి, మనస్సు, క్షేత్రజ్ఞుడు, వేదము, తపస్సు, ప్రణవము, యజ్ఞము, పురుషుడు" అంతా ఆ పరమాత్మయే,

యత్సత్యం యదమృతమక్షరం పరం యద్
యద్ భూతం పరమమిదం చ యద్ భవిష్యద్ ।
యత్కించి చ్చర మచరం యదస్తి చాన్యత్
తత్సర్వం పురుషవరః ప్రభుః పురాణః ॥ (164-28)

సత్యం, అమృతం, అక్షరం, భూతం, వర్తమానం, భవిష్యత్తు ఈ చరాచరజగత్తు అంతా ఆ పురుషోత్తముడే యని పరమాత్ముని మహత్త్వము వివరిస్తాడు.

అటు తర్వాత క్రమంగా నాలుగుయుగముల పరిమాణమును వివరిస్తాడు. కృతయుగము యొక్క పరిమాణము నాలుగువేల దివ్యవర్షములు. దాని సంధ్యాకాలపు పరిమాణము నాలుగువందల దివ్యవర్షములు. ఈ యుగములో ధర్మము నాలుగు పాదాలతో నడుస్తుంది. అధర్మము ఒక పాదముకన్న తక్కువ ఉంటుంది. ప్రజలంతా స్వధర్మనిరతులై ఈ యుగమున సజ్జనులుగా ఉంటారు. సత్యము, శౌచము, ధర్మము సమృద్ధిగా ఉంటాయి. ఇక త్రేతాయుగపు పరిమాణము మూడువేల దివ్యవర్షములు, సంధ్యాకాలము మూడువందల దివ్యవర్షములు, ధర్మము మూడు పాదాలతో నడిస్తే అధర్మము రెండు పాదాలతో నడుస్తుంది ఈ యుగంలో. సత్యము, సత్త్వము రెండుకూడా చక్కగా విధింపబడినప్పటికి ఆయా వర్ణములవారు స్వధర్మమును సరిగా ఆచరించరు. తర్వాత ద్వాపరయుగపు పరిమాణము రెండువేల దివ్యవర్షములైతే దాని సంధ్యాకాల పరిమాణము రెండు వందల దివ్యవర్షములు. ఈ యుగమున ప్రజలు రజోగుణప్రధానులై అర్థమునకు మాత్రమే ప్రాధాన్యత నిస్తారు, కర్మరహితులై క్షుద్రబుద్ధి కలవారౌతారు. ఈ యుగమున ధర్మము రెండు పాదాలతో అధర్మము మూడుపాదాలతో నడుస్తాయి. ఈ విపర్యయం వలన కలియుగము నాటికి ధర్మము క్రమముగా నశించిపోతుంది. బ్రహ్మణ్యమునందాసక్తి నశిస్తుంది. ఉపవాసాది వ్రతాలను

కూడ జనులు వదిలివేస్తారు. ఇక కలియుగపు పరిమాణము ఒకవేయి దివ్యవర్షములు, సంధ్యాకాలము ఒకవంద దివ్యవర్షములు. ఈ యుగము అన్ని యుగముల కంటే క్రూరమైనది. అధర్మము నాలుగు పాదాలతో నడిస్తే ధర్మము ఒకపాదంతో నడుస్తుంది. ప్రజలు తమోగుణప్రధానులై కాముకులవుతారు. సాత్త్వికులు, సాధుస్వభావం కలవారు, సత్యవచనులు ఈ యుగములో చాలా అరుదుగా కనబడుతారు. జనులు ఆశ్రమ ధర్మములను విరుద్ధమైన రీతిలో ఆచరిస్తారు. ఇక పండ్రెండు వేల దివ్యవర్షముల కాలము ఒక మహాయుగము (చతుర్యుగమని కూడ అంటారు) అటువంటి వేయి చతుర్యుగములు బ్రహ్మదేవునకు ఒక పగలు. అది గడువగానే సమస్త చరాచర సృష్టినంతా ఉపసంహరించి శ్రీమన్నారాయణుడు జగత్సంహరణార్థమై ప్రళయమును సృష్టిస్తాడు. తర్వాత యోగము నాశ్రయించి ఏకార్ణవ జలమునందు అనేక యుగములు ఆ పరమాత్మ యోగనిద్రలో ఉంటాడు. యజ్ఞపురుషుడిగా పిలువబడే ఆ పురుషోత్తముడు “బ్రహ్మ, ఉద్గాతలూ, హోతా, అధ్వర్యు”. అను నలుగురు ప్రధాన ఋత్విజులతోపాటు ప్రస్తోత, పోత” ఇత్యాది 12 మంది ఋత్విజులను కూడ సృష్టిస్తాడు. తదనంతరం ఆకాశము, వాయువు, అగ్ని, జలము ఇత్యాదులను సృష్టించి సహస్రదళములతో గూడిన సూర్యసమానకాంతిగల ఒక మహాపద్మమును తన నాభినుండి ఉద్భవింపజేస్తాడు. తర్వాత ఆ పద్మము నుండి సర్వతేజోమయుడు సకలలోక స్రష్టయు అయిన బ్రహ్మదేవుని సృష్టిస్తాడు.

తచ్చ పద్మం పురాణజ్ఞాః పృథివీరూపముత్తమమ్ ।
నారాయణసముద్భూతం ప్రవదన్తి మహర్షయః ।
యా పద్మా సా రసాదేవీ పృథివీ పరిచక్ష్యతే ॥ (169-3,4)

నారాయణుని నాభినుండి ఉద్భవించిన ఆ పద్మమే పృథివీ రూపమును పొందినదని మహర్షులంటారు. ఆ పద్మమునందలి సారమే మార్పుచెంది అత్యంత ఉన్నతములైన పదార్థములుగా ఉద్భవించాయి. అవే హిమవత్-మేరు-నిషధ-కైలాస-వింధ్య ఇత్యాది పర్వతములు. ఈ పర్వతముల మధ్యన నున్న దేశమునకే జంబూద్వీపము అను పేరు కలదు. ఈ జంబూద్వీపము యజ్ఞయాగాది కర్మలకు ప్రసిద్ధము. ఈ పర్వతముల నుండి స్రవించిన జలమే అనేక పవిత్రములైన నదులుగా పరిణమించి ప్రసిద్ధినొందినది. పద్మమునకు అడుగుభాగమున కల పర్ణములే దైత్యులకు, సర్పములకు అనేక విధ పక్షులకు ఆవాసస్థానమైనవి. దైత్యదానవ దేశములకు మధ్యభాగముననున్న మహార్ణవభాగమునకే రసాతలమని పేరు. మహాపాపాత్ములు దీనిలో మునిగిపోతారు. ఈ పద్మమునకు నడుమ ఏకార్ణవజలమునందు తేలియున్నట్టి భూభాగమునకే “మహీ” అనిపేరు. దీనికి నాలుగు దిక్కులయందు నాలుగు మహాసాగరములున్నవి. ఈ విధముగా శ్రీమన్నారాయణుని సంకల్పానుసారము పుష్కరము. అనగా పద్మమునుండి ఉద్భవించిన ఈ పృథివికి పద్మసంభవమని పేరు వచ్చినది. ఇట్టి సృష్టిక్రమమే ‘పాద్మకల్పక్రమము’ అని ఖ్యాతి పొందినదని సూతుడు శౌనకాదులకు వివరిస్తాడు.

అటుతర్వాత మధుకైటభులను శ్రీమన్నారాయణుడు సంహరిస్తాడు. బ్రహ్మదేవుడు పరమాత్ముని ఆజ్ఞతో స్వాయంభువ మన్వాదులను, అష్టవసువులను, రుద్రులను, అప్సరసలను అనేక విధదేవతాగణమును సృష్టిస్తాడు. తర్వాత మయుడు, తారుడు, కాలనేమి, అంధకాసురుడు ఇత్యాది అత్యంత భయానకులైన రాక్షసులందరిని శ్రీమహావిష్ణువు మఱియు పరమశివుడు సంహరిస్తారు. తదనంతరము పరమశివుడే స్వయముగా

వారాణసీతు భువనత్రయ సారభూతా రమ్యా సదా మమ పురీ గిరిరాజపుత్రి ।

అత్రాగతా వివిధ దుష్కృతకారిణోఽపి పాపక్షయాద్విరజసః ప్రతిభాన్తి మర్త్యాః ॥ (179-78).

అంటూ పార్వతీదేవికి వివరించినటువంటి వారాణసీ క్షేత్రమహత్త్వమును సూతుడు శౌనకాది మహర్షులకు వివరిస్తాడు. హరికేశుడను యక్షునకు పరమశివుడిచ్చిన వరములను వివరించుచు వారాణసీ క్షేత్రమునసున్న అద్భుతమైన ఉద్యానవనమును, అతనికిచ్చిన క్షేత్రపాలకత్వమును, గణాధ్యక్షతను, దండపాణిత్వము మొదలగు వాటి గురించి తెలుపుతాడు. అంతేకాక

యత్ర సన్నిహితో నిత్యం అవిముక్తే నిరన్తరమ్ ।
తత్ క్షేత్రం న మయా ముక్తమవిముక్తం తతః స్మృతమ్ ॥

శివుడు నిరంతరం ఆ క్షేత్రమును విడువకుండా ఉంటాడు. కావున 'ఈ వారాణసీ' క్షేత్రమును "అవిముక్తము"అని అంటారని తెలుపుతాడు. అంతేకాక

యోగక్షేత్రం తపః క్షేత్రం సిద్ధగంధర్వసేవితమ్ ।
సరితః సాగరాః శైలాః నావిముక్తసమా భువి ॥ (134-43)

అవి సుమారుగా ఆరు అధ్యాయములలో వారాణసీ క్షేత్రమహత్త్వము వర్ణింపబడింది. వారాణసీ మాహాత్మ్యమును వినిన తర్వాత ఋషులంతా నర్మదానదీ వైశిష్ట్యమును వినగోరుతారు. "కథం ప్రలయకాలేఽపి న నష్టా నర్మదా పురా" ప్రళయకాలమందు కూడ నశింపకుండా ఉన్నట్టి నర్మదానదిని గురించి అడుగుతారు. అప్పుడు మార్కండేయుడు పాండునందనుడైన ధర్మరాజునకు వినిపించిన నర్మదామహత్త్వమును సూతుడు వివరిస్తాడు.

పుణ్యా కనఖలే గంగా కురుక్షేత్రే సరస్వతీ ।
గ్రామే వా యది వాఽరణ్యే పుణ్యా సర్వత్రా నర్మదా ॥ (186-10)

హరిద్వారము దగ్గఱనున్న కనఖల క్షేత్రమున మాత్రమే గంగానది పవిత్రము, కురుక్షేత్ర సమీపమున మాత్రమే సరస్వతీ నది పవిత్రము కాని నర్మదానది గ్రామమునందైనను, అరణ్యమునందైనను అంతటా పవిత్రమైనదే. కళింగదేశపు పూర్వభాగమునందున్న అమరకంటక పర్వతపు శిఖరములనుండి ప్రవహించే నర్మదానది ముల్లోకములలోని అన్నింటికంటే కూడ పుణ్యప్రదమైనది. మూడురోజులు స్నానమాచరిస్తే సరస్వతీ నది, ఏడు రోజులు స్నానమాచరిస్తే యమునానది, ఒకసారి స్నానమాచరిస్తే గంగానది మనల్ని పవిత్రుల్ని చేస్తాయి. కాని నర్మదానది కేవలం దర్శనమాత్రం చేత పవిత్రులను జేస్తుంది. అమరకంటకము, జలేశ్వరము, కపిలానది, విశల్యకరణి, ఇత్యాది పర్వతములు, నదులు, తీర్థరాజములు నర్మదానదీ పరీవాహమునున్న ప్రాంతములన్నియు పవిత్రమైనవే. ఈ సందర్భముననే త్రిపురాసురుడని పేరుగాంచిన బాణుని మహత్త్వము, జ్వాలేశ్వర, మహేశ్వర ఇత్యాది తీర్థముల మహత్త్వము కూడ సూతుడు వివరిస్తాడు. బాణాసురుడు చేసిన "శివస్తుతి" చాలా విశిష్టమైనది. ఇంకనూ ఓంకారేశ్వరము, యంత్రేశ్వరము, ఆమ్రాతకేశ్వరము, బ్రహ్మావర్తము, అగారేశ్వరము, కరంజతీర్థం, కుండలేశ్వరము, విమలేశ్వరము ఇత్యాది నర్మదానదికి సంబంధించిన వందలకొలది తీర్థముల మహత్త్వమును కూడ వివరిస్తాడు. ఇక్కడ సుమారుగా పది అధ్యాయములలో వర్ణింపబడిన నర్మదానదీ మాహాత్మ్యము అనుపమానమైనది. అవశ్యముగా పఠించవలసినది.

తర్వాత మత్స్యపురాణములో ఋషుల గోత్ర ప్రవర కథనం విస్తృతంగా చేయబడినది. ఈ క్రమమున

భృగు, అంగీరస, అత్రి, మరీచ, అగస్త్య, కపిశ, పులస్త్య, పులహ, వసిష్ఠ, చ్యవన, ఔర్వ, జమదగ్ని ఇత్యాది వందలాది ఋషులయొక్క గోత్రప్రవరములను తెలుపుతూ ఇట్లు ఏకగోత్రమే కాకుండా ప్రవరలోని ఋషులలో కూడ ఒక్క ఋషి ఉన్నప్పటికినీ వివాహాది సంబంధములు కుదుర్చుకోకూడదని వర్ణింపబడినది. ఈ సందర్భమున పరాశరవంశవర్ణనము చేయుచు "పూర్వము" 'నిమి' చక్రవర్తికి వసిష్ఠమహర్షి పురోహితుడిగా ఉండేవాడని, యజ్ఞయాగాది క్రతువులు అనవరతం చేసి అలసటలో ఉన్న వసిష్ఠుని వెంటనే తనకొఱకు యజ్ఞం నిర్వహించమని 'నిమి' చక్రవర్తి కోరగా తన అలసట గుఱించి వివరించి తనకు కించిత్ విశ్రాంతి అవసరమని వసిష్ఠుడు ప్రార్థిస్తాడు. కాని తాను రాజునని తన ఆజ్ఞ ధిక్కరించుట వలన నిన్ను శపిస్తున్నానని, రాజు గురువునైన నన్ను లెక్కచేయక పోవుట వలన నేనే నిన్ను శపిస్తున్నానని వసిష్ఠుడు ఇద్దరు పరస్పరం శపించుకుని విగతదేహులై బ్రహ్మదేవుని దగ్గఱకు వెళ్తారు.

ఇక్కడ–**శ్వః కార్యమద్య కుర్వీత పూర్వాహ్ణే చాపరాహ్ణకమ్ ।**
నహి ప్రతీక్షతే మృత్యుః కృతం వాస్య న వా కృతమ్ ॥ (201–7) అనే

ప్రసిద్ధ ఆభాణకం 'నిమి' చక్రవర్తి చెబుతాడు.

బ్రహ్మదేవుడు – **నేత్రపక్ష్మసు సర్వేషాం త్వం వసిష్యసి పార్థివ ।**
త్వత్సంబంధాత్తదా తేషాం నిమేషః సంభవిష్యతి ॥
చాలయిష్యన్తి తు తదా నేత్రపక్ష్మాణి మానవాః ॥ (201–18,19,20)

అని నిమికి నీవు ప్రాణుల యొక్క కనురెప్పలలో ఉంటావనీ, నీ వలననే ప్రాణులు కనురెప్పలు కదిలించ గల్గుతారని – 'నిమి'కి వరమిస్తాడు. 'మిత్రావరుణులు' అనే జంటదేవతలకు నీవు పుత్రునిగా జన్మిస్తావని అప్పుడు కూడ ఇదే పేరుతో ప్రసిద్ధుడవు కాగలవని వసిష్ఠునికి వరమిస్తాడు.

దీని తర్వాత "పితృగాథా కీర్తనమ్" అను శీర్షికతో పితరులు నిధనానన్తరం తమకు శాస్త్రోక్తమైన కర్మలను దానాదుల ఆచరించు పుత్రులను కోరుకొనుట, ధేను దాన మహత్త్వము, కృష్ణాజినప్రదానము, వృషోత్సర్గవిధానము ఇత్యాదులు వివరింపబడ్డాయి. తదనంతరం సావిత్ర్యుపాఖ్యానం సుప్రసిద్ధమైన ఈ కథ ఆరు అధ్యాయములలో చెప్పబడింది. దీనిలో

ఇమం లోకం మాతృభక్త్యా పితృభక్త్యా తు మధ్యమమ్ ।
గురుశుశ్రూషయా చైవ బ్రహ్మలోకం సమశ్నుతే ॥
సర్వే తస్యాదృతాః ధర్మాః యస్యైతే త్రయ ఆదృతాః ॥ (210–211)

ఇత్యాది శ్లోకాలలో ఆధునికలోకులు తెలుసుకోవలసిన మాతృభక్తి, పితృభక్తి, గురుశుశ్రూషల వైశిష్ట్యం,

నిగ్రహేణాసతాం రాజా సతాం చ పరిపాలనాత్ ।
ఏతావదేవ కర్తవ్యం రాజ్ఞా స్వర్గమభీప్సునా ॥ (211–8)

ఇత్యాదుల ద్వారా రాజు యొక్క కర్తవ్యం, అంతేకాక సత్పురుషుల మహత్త్వం, పతివ్రతల గొప్పతనం,

కార్యసాధనకు కావలసిన శ్రద్ధ, పట్టుదల, విశ్వాసం ఇత్యాది విషయాలనెన్నింటినో సావిత్ర్యుపాఖ్యానం ద్వారా మత్స్యపురాణం తెలుపుతుంది.

అనంతరం మత్స్యపురాణం రాజధర్మముల గురించి చాలా విస్తృతముగా వర్ణించింది. "రాజ్ఞోఽభిషిక్తమాత్రస్య కింను కృత్యతమం భవేత్" అని మనువు అడిగిన ప్రశ్నకు సమాధానంగా సుమారుగా ముప్పదిమూడు అధ్యాయములలో రాజధర్మాల గుఱించి మత్స్యభగవానుడు తెలుపుతాడు. సేనాపతి, ప్రతీహారుడు, దూత, అంగరక్షకులు, తాంబూలకరండధారులు, సాంధివిగ్రహకుడు (విదేశీవ్యవహారములను చూచువాడు), దేశరక్షకుడు అంగరక్షకుడు, ధనుర్ధారి, సారథి, సూదాధ్యక్షుడు, ధర్మాధికారి, దౌవారికుడు, లేఖకుడు, ధనాధ్యక్షుడు, వైద్యుడు, గజతురగాధ్యక్షులు, స్థపతి, అస్త్రాచార్యుడు, అన్తఃపురాధ్యక్షుడు మొదలగు రాజుకు రాజ్యానికి సంబంధించిన వారిని నియమించుటలో అనుసరించవలసిన విషయములన్నీ వివరిస్తాడు. లేఖకుని విషయమును ప్రస్తావిస్తూ

ఉపాయవాక్య కుశలః సర్వశాస్త్రవిశారదః ।
బహ్వర్థవక్తా చాల్పేన లేఖకః స్యాన్నృపోత్తమ ॥ (215-7,8)

లేఖకునకుండవలసిన లక్షణములను తెలుపుతాడు. ఆయా స్థానములలో నియమింపబడే అధికారులకు సంబంధించిన అర్హతలను వివరిస్తాడు. అంతేకాక రాజు ఆదరించవలసిన, పోషించవలసిన కళలన్నింటి గుఱించి చెబుతాడు. ఇంకనూ రాజుయొక్క బాధ్యతలను తెలుపుతూ-

బకవచ్చిన్తయేదర్థాన్ సింహవచ్చ పరాక్రమేత్ (215-68)
వృకవచ్చాపి లుమ్పేత శశవచ్చ వినిక్షిపేత్ (215-69)
తథా చ మధురాభాషీ భవేత్ కోకిలవన్నృపః (215-70)

రాజు కొంగవలె ధ్యానముతో నిశ్చలచిత్తముతో రాజనీతిని ఆలోచించాలి, అవసరానుగుణముగా సింహము వలె పరాక్రమించాలి, నక్కవలె వ్యవహరించాలి. కుందేలు వలె దుమికి దుమికి పరుగుతీయాలని, సందర్భానుసారముగా అతను కోకిలవలె మధురముగా మృదువుగా మాట్లాడాలని చెబుతాడు. తర్వాత రాజుయొక్క అనుచరుల లక్షణములను, వారు నడుచుకోవలసిన రీతిని గుఱించి మత్స్య భగవానుడు తెలుపుతాడు. తర్వాత రాజు తన రాజ్యములో ఔషధుల సంచయనం ఎట్లు చేయవలెనో, ఏ రకములైన ఔషధవృక్షములను పెంచవలెనో, విషనిర్మూలనౌషధముల ఆవశ్యకత, ద్రవ్య సంచయనం, ధాన్యసంచయనం, రాజభవనాదుల సంరక్షణ, విహార వనముల సంరక్షణ, రాజ ధర్మానుకీర్తనం ఇత్యాది అనేక విషయాలను వివరిస్తాడు. ఈ సందర్భంగా మత్స్యపురాణంలో వందలకొలది ఔషధుల పేర్లు, వనస్పతులనామములు, వివిధధాన్యముల పేర్లు తెలుపబడ్డాయి. రాజధర్మానుకీర్తన ప్రసంగమున దైవపురుషకార వర్ణనము, సామదానభేదదండాది ఉపాయములు, వృష్టివైకృతి ప్రశమనము, ఉత్పాత ప్రశమనము, దండయాత్రాదుల శకునములు ఇత్యాది వివిధ అంశములను చెబుతున్నపుడు

నాలసాః ప్రాప్నువంత్యర్థాన్ న చ దైవపరాయణాః ।
తస్మాత్సర్వం ప్రయత్నేన ఆచరేద్ధర్మముత్తమమ్ ॥
త్యక్త్వాఽలసాన్ దైవపరాన్ మనుష్యాన్ ఉత్థానయుక్తాన్ పురుషాన్ హి లక్ష్మీః ।

అన్విష్య యత్నాత్ వృణుయాన్నృపేంద్ర తస్మాత్సదోత్థానవతా హి భావ్యమ్ ॥ (221-11,12)

మొదలగు వందలకొలది సుభాషితములు లోకోపయుక్తములైనవెన్నియో మత్స్యపురాణంలో కనబడ్డాయి.

తర్వాత వామనావతారము, వరాహావతారము, అమృతమంథనము మొదలగు సంఘటనలు వర్ణింపబడ్డాయి. వాటి తర్వాత సూతుడు వాస్తువిద్య గుఱించి చాలా విశదముగా తెలుపుతాడు. భృగువు, అత్రి, వసిష్ఠుడు, విశ్వకర్మ, మయుడు మొదలగు అష్టాదశ వాస్తుశాస్త్ర ప్రవర్తకులు తెలిపిన ఆ శాస్త్రమును సంక్షిప్తముగా వివరిస్తాడు. అంధకాసురవధ సందర్భమున శివుని ఫాలతలమునుండి క్రిందబడిన చెమటబిందువు మహాభూతముగా మారి ఆ అంధకాసురవధ సందర్భాన రాక్షసులందరి రక్తాన్నంతటిని త్రాగినప్పటికి తృప్తి పొందక పరమశివుని గుఱించి ఘోరమైన తపస్సుచేసి ముల్లోకములను మ్రింగివేయగలశక్తిని పొంది భూమిపై పడింది. అది చూచిన బ్రహ్మాదిదేవతలంతా అది పైకిలేవకుండా ఉండునట్లు త్రొక్కి అణిచివేశారు. ఆ బాధ భరించలేని ఆ భూతము గృహనిర్మాణ సందర్భమున వేయు 'బలి' నీకు ఆహారమగునని బ్రహ్మనుండి మరల వరము పొందుతుంది. అప్పటి నుండియే లోకమున వాస్తు శాంతి, బలిప్రదానము ఇత్యాదులు శాస్త్రోక్తముగా ఆచరించుచుండిరి అని "వాస్తు" ఉద్భవ ఘట్టమును శౌనకాదులకు సూతుడు తెలుపుతాడు. తత్ప్రసంగమునందు ఏకాశీతి పదవాస్తు నిర్ణయము, గృహాదుల వైశాల్యము, వాస్తువిద్యానుకీర్తనమ్, దేవతార్చానుకీర్తనమ్, ప్రతిమాలక్షణము, పీఠికానుకీర్తనము, లింగలక్షణము, దేవతా ప్రతిష్ఠానుకీర్తనము, అధివాసనవిధి, వాస్తుదోషోపశమనవిధి, ప్రాసాదానుకీర్తనము మొదలగు అనేక విషయములు వాస్తుశాస్త్రమునకు సంబంధించినవి ప్రమాణపురస్సరముగా వివరిస్తాడు. సుమారుగా ఇరువది అధ్యాయములలో అత్యంత విస్తృతముగా కేవలం గృహములకే కాకుండా, ఆయా దేవతల ప్రతిమలపరిమాణము, మంటపములు, ప్రాసాదములు, వాటికి సంబంధించిన అన్ని వివరములను తెలిపి, తదర్థం చేయవలసిన శాంత్యాదులను వర్ణిస్తాడు. చాలా విస్తృతముగా ఉన్నందున వాస్తుశాస్త్రవిషయాలన్నింటిని పురాణపఠనం ద్వారా తెలుసుకోవడం ఉచితము.

తర్వాత "రాజవంశానుకీర్తనం" ద్వారా కలియుగమున ఆయా దేశములను పాలించు "ఇక్ష్వాకు, మగధ బృహద్రథ, అవంతి, మౌర్య, ఇత్యాది వంశములకు చెందిన రాజుల పరిపాలనా కాలము వివరిస్తాడు. తదనంతరము "మహాదానానుకీర్తనమ్" పేరుతో తులాపురుషదానం, హిరణ్యగర్భదానం, కల్పపాదపదానం, గోసహస్రదానం మొదలగు పదహారు మహాదానాల గుఱించి వర్ణిస్తాడు, చివరలో

కల్పమానం త్వయా ప్రోక్తం మన్వన్తరయుగేషు చ ।
ఇదానీం కల్పనామాని సమాసాత్కథయాచ్యుత ॥

అనే మనువుయొక్క ప్రార్థనను విని మత్స్యభగవానుడు శ్వేతకల్పము మొదలుకొని పితృకల్పము వఱకు ముప్పది కల్పముల పేర్లను క్రమముగా వివరిస్తాడు. ఈ ముప్పది కల్పములలో తామసములు, రాజసములు, సాత్త్వికములు మఱియు సంకీర్ణములైన కల్పములు కూడ ఉండునని, సంకీర్ణ కల్పములందు సరస్వతీమాహాత్మ్యము లేదా పితరుల మాహాత్మ్యము నిరూపింపబడును, తామస ప్రధానములైన వాటియందు అగ్ని మఱియు శివుని

తత్త్వములు, రజోగుణప్రధానములైన వాటిలో బ్రహ్మతత్త్వము మఱియు సాత్త్విక కల్పములందు విష్ణు తత్త్వము ప్రధానముగా వర్ణింపబడును. చివరగా

పురాణసంహితా చేయం తవ భూప మయోదితా ।
సర్వపాపహరా నిత్యమారోగ్యశ్రీఫలప్రదా ॥ (290-20)

అంటూ ఓ రాజా! నేను నీకు వివరించి చెప్పిన ఈ మత్స్యపురాణసంహిత సర్వపాపహరము, నిత్యమూ ఆరోగ్యమును, సంపదను, మంచిఫలితములనిచ్చునని తెలుపుతూ మత్స్యపురాణపఠన శ్రవణాదుల మహత్త్వమును సూతముని వివరిస్తాడు. అంతిమమైన 291వ అధ్యాయమునందు సంపూర్ణ మత్స్యపురాణ అనుక్రమణిక ఇవ్వబడినది.

ఏతత్పవిత్రమాయుష్యం ఏతత్ కీర్తివివర్ధనమ్ ।
ఏతత్ పవిత్రం కల్యాణం మహాపాపహరం శుభమ్ ॥ (291-30)

ఇతి శమ్.

డా॥ నీలకంఠం

ఓమ్ శ్రీగురుభ్యో నమః

శ్రీమద్వైపాయనముని ప్రణీతమ్

మత్స్యపురాణమ్ - మత్స్యపురాణం

ద్వితీయభాగః - ద్వితీయభాగం

ఏకపంచాశదధిక శతతమోఽధ్యాయః - నూటయాభై ఒకటవ అధ్యాయం

గ్రసనాసురవధః - విష్ణువు గ్రసనుని వధించుట

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

తం దృష్ట్వా దానవాః క్రుద్ధాః చేరుః స్వైః స్వైర్బలైర్వృతాః ।
సరఘా ఇవ మాక్షీకహరణే సర్వతో దిశమ్ ॥1॥

ఆతనిని (విష్ణువును) చూచిన దానవులు క్రుద్ధులై తమ తమ సైన్యాలతో కూడి తేనెటీగలు తేనెను తెచ్చుటకు కదిలివెళ్ళినట్లు అన్ని దిక్కులనుండి అతనిపైకి (విష్ణువుపై) దండెత్తారు.

కృష్ణచామరజాలాఢ్యే సుధా విరచితాంకురే ।
చిత్రపంచపతాకే తు ప్రభిన్నకరటాముఖే ॥2॥

పర్వతాభే గజే భీమే మదస్రావిణి దుర్ధరే ।
ఆరుహ్యాజౌ నిమిర్దైత్యో హరిం ప్రత్యుద్యయౌ బలీ ॥3॥

నల్లని చామరాలను, అమృతంతో చేసినట్లున్న దంతపు మొలకలను, విభిన్న వర్ణాలతో కూడిన ఐదు పతాకములను ధరించిన మరియు గండస్థలం నుండి మదము స్రవించుచున్న, పర్వతాన్ని పోలినట్టి భయంకరమైన గజాన్ని అధిరోహించి బలవంతుడైన నిమి అనే దానవుడు విష్ణువుపై దండెత్తాడు .

తస్యాసన్ దానవా రౌద్రా గజస్య పదరక్షిణః ।
సప్తవింశతి సాహస్రాః కిరీటకవచోజ్జ్వలాః ॥4॥

దృఢమైన కిరీటాలతో మరియు కవచములతో ప్రకాశిస్తున్న రౌద్రాకారులైన ఇరవై ఏడు వేల మంది దానవులు ఆ గజాన్ని రక్షిస్తూ వున్నారు.

అశ్వారూఢశ్చ మథనో జమ్భకశ్చోష్ట్రవాహనః ।
శుమ్భో ఽపి విపులం మేషం సమారుహ్యావ్రజద్రణమ్ ॥5॥

మథనుడనే దానవుడు అశ్వాన్ని, జంభకుడు ఉష్ట్రాన్ని(ఒంటెను), శుంభుడు బలిష్ఠమైన మేషాన్ని (మేకని) అధిరోహించి యుద్ధభూమికి వెళ్ళారు.

అపరే దానవేంద్రాస్తు యత్తా నానాస్త్రపాణయః ।
ఆజఘ్నుః సమరే క్రుద్ధా విష్ణు మక్లిష్టకారిణమ్ ॥6॥

వివిధాలైన ఆయుధాలను కలిగిన మరికొంతమంది రాక్షసులు కోపోద్రిక్తులై అక్లిష్టకారియైన (తేలికగా కార్యాన్ని సాధించువాడైన) విష్ణువును కొట్టారు.

పరిఘేణ నిమిర్దైత్యో మథనో ముద్గరేణ తు ।
శుమ్భః శూలేన తీక్ష్ణేన ప్రాప్తేన గ్రసన స్తథా ॥7॥

చక్రేణ మహిషః క్రుద్ధో జమ్భః శక్త్యా మహారణే ।
జఘ్నుర్నారాయణం సర్వే శేషాస్తీక్ష్ణైశ్చ మార్గణైః ॥8॥

నిమి దైత్యుడు పరిఘమనే ఆయుధంతో, మథనాసురుడు ముద్గరంతో, శుంభుడు శూలంతో, గ్రసనాసురుడు పదునైన ప్రసనముతో, మహిషుడు చక్రముతో, క్రుద్ధుడైన జంభుడు శక్తితో, మరికొంతమంది రాక్షసులు, తీక్ష్ణమైన బాణాలతో విష్ణువును కొట్టారు.

తాన్యస్త్రాణి ప్రయుక్తాని శరీరం వివిశుర్హరేః ।
గురూక్తాన్యుపదిష్టాని సచ్ఛిష్యస్య శృతావివ ॥9॥

ఆ రాక్షసులచే ప్రయోగించబడిన విభిన్న ఆయుధాలు గురువు ఉపదేశము మంచి శిష్యుని చెవిలో ప్రవేశించినట్లు విష్ణువు హృదయంలో ప్రవేశించాయి.

అసమ్భ్రాన్తో రణే విష్ణుః అథ జగ్రాహ కార్ముకమ్ ।
శరాంశ్చాశీవిషాకారాం స్తైల ధౌతానజిహ్మగాన్ ॥10॥

తతోఽభిసంధ్య దైత్యాస్తానాకర్ణాకృష్టకార్ముకః ।
అభ్యద్రవద్రణే క్రుద్ధో దైత్యానీకే తు పౌరుషాత్ ॥11॥

అపుడు ఎటువంటి తడబాటు పొందని శ్రీవిష్ణువు ధనుస్సును, సర్పాల వంటి మరియు తైలాదులతో పదును చేయబడినటువంటి బాణాలను కూడ తీసుకొని, ధనుస్సు యొక్క అల్లెత్రాడును ఆకర్ణాంతం లాగి ఆ బాణాలను దైత్యులపై సంధిస్తూ, పౌరుషంతో, క్రోధంతో యుద్ధభూమిలో ఆ రాక్షససమూహం వైపు పరుగెత్తాడు.

నిమిం వివ్యాధ వింశత్యా బాణానా మగ్నివర్చసామ్ ।
మథనం దశభి ర్బాణైః శుమ్భం పంచభిరేవ చ ॥12॥

ఏకేన మహిషం క్రుద్ధో వివ్యాధోరసి పత్త్రిణా ।
జమ్భం ద్వాదశభిస్తీక్ష్ణైః సర్వాంశ్చైకైకశోఽష్టభిః ॥13॥

అగ్నితుల్యాలైన ఇరవై బాణాలతో నిమిని, పదిబాణాలతో మథనాసురుడిని ఐదింటిని శుంభుని వైపు, పదునైన ఒకే బాణంతో మహిషుని, పదునైన పన్నెండు బాణాలతో జంభుడిని మరియు ఎనిమిది బాణాలతో మిగిలిన రాక్షసులందరి కొట్టాడు.

తస్య తల్లాఘవం దృష్ట్వా దానవాః క్రోధమూర్ఛితాః ।
నర్దమానాః ప్రయత్నేన చక్రురత్యద్భుతం రణమ్ ॥14॥

విష్ణువు యొక్క అత్యంత వేగవంతమైన దాడిని గమనించి, క్రోధోద్రిక్తులైన దానవులు కూడ సింహం వలె గర్జిస్తూ, ఇతోఽధికమైన ప్రయత్నంతో విష్ణువుతో అత్యద్భుతంగా యుద్ధం చేయసాగారు.

చిచ్ఛేదాఽథ ధనుర్విష్ణోః నిమిర్భల్లేన దానవః ।
సంధ్యమానం శరం హస్తే చిచ్ఛేద మహిషాసురః ॥15॥

నిమిదైత్యుడు బల్లెంతో విష్ణువు యొక్క ధనుస్సు, మరియు రాక్షసులవైపు సంధిస్తున్న బాణాలను మహిషాసురుడు ఛేదించారు.

పీడయామాస గరుడం జమ్భస్తీక్ష్ణైస్తు సాయకైః ।
భుజం తస్యాఽహనద్గాఢం శుమ్భో భూధరసన్నిభః ॥16॥

జంభాసురుడు పదునైన బాణాలతో విష్ణు వాహనమైన గరుడుని ఓడించాడు. మరియు పర్వతాకారుడైన శుంభాసురుడు తన బాణాలతో విష్ణువు యొక్క భుజాన్ని గాఢంగా కొట్టాడు.

ఛిన్నే ధనుషి గోవిందో గదాం జగ్రాహ భీషణామ్ ।
తాం ప్రాహిణోత్ స వేగేన మథనాయ మహాహవే ॥17॥

తన ధనుస్సు రాక్షసులచేతిలో ఛిన్నం కాగ విష్ణువు వెంటనే భీషణమైన గదను తీసికొని వేగంగా మథనాసురునిపై విసిరాడు.

తామప్రాప్తాం నిమిర్బాణైః చిచ్ఛేద తిలశో రణే ।
తాం నాశమాగతాం దృష్ట్వా హీనాగ్రే ప్రార్థనా మివ ॥18॥

జగ్రాహ ముద్గరం ఘోరం దివ్యరత్నపరిష్కృతమ్।
తం ముమోచాఽథ వేగేన నిమి ముద్దిశ్య దానవమ్ ॥19॥

కాని, ఆ గద మథనుని చేరే లోపలే నిమి దానిని నువ్వు గింజల పరిమాణంలో ఛేదించాడు. అపుడు హీనుని యందు చేసిన ప్రార్థన వలె వ్యర్థమైన ఆ గదను చూచి, దివ్యమైన రత్నాలు పొదిగిన 'ముద్గరాన్ని' తీసుకుని వెంటనే ఘోరాకారుడైన నిమి దైత్యునిపై ప్రయోగించాడు.

తమాయాన్తం వియత్యేవ త్రయో దైత్యా న్యవారయన్।
గదయా జమ్భదైత్యస్తు గ్రసనః పట్టిశేన తు ॥20॥

శక్త్యా చ మహిషో దైత్యః స్వపక్షజయకాంక్షయా ।
నిరాకృతం తమాలోక్య దుర్జనే ప్రణయం యథా॥21॥

అపుడు తమపైకి వస్తున్న 'ముద్గరాన్ని' చూచి, అది గాలిలో ఉండగనే జంభుడు, గ్రసనుడు, మహిషుడను ఆ ముగ్గురు రాక్షసులు తమ గద, పట్టిశం, శక్తి అనే ఆయుధాలతో తమకే జయం కలుగుతుందనే ఆకాంక్షతో దానిని (ముద్గరాన్ని) అడ్డగించారు. దుర్జనుని యందు చూపిన ప్రీతివలె తనచే ప్రయోగించబడిన "ముద్గం" వ్యర్థమవటం చూచి,

జగ్రాహ శక్తిముగ్రాగ్రామష్ట ఘంటోత్కటస్వనామ్ ।
జమ్భాయ తాం సముద్దిశ్య ప్రాహిణోద్రణభీషణః ॥22॥

విష్ణువు అత్యుగ్రమైన ఎనిమిది ఘంటలతో భయంకరమైన ధ్వని గలిగిన 'శక్తి' అనే ఆయుధాన్ని తీసుకుని దానిని జంభాసురునిపై ప్రయోగించాడు.

తామమ్బరస్థాం జగ్రాహ గజో దానవనందనః ॥23॥

కాని ఆ 'శక్తి'ని ఆకాశంలో ఉండగనే గజాసురుడనే దానవనందనుడు పట్టుకొన్నాడు – (అడ్డుకొన్నాడు)

గృహీతాం తాం సమాలోక్య శిక్షామివ వివేకిభిః ॥23॥

దృఢం భారసహం సారమన్యదాదాయ కార్ముకమ్ ।
రౌద్రాస్త్రమభిసంధాయ తస్మిన్ బాణం ముమోచ హ ॥24॥

వివేకవంతులైన శిష్యులచే గ్రహించబడిన గురూపదేశం వలె గజాసురునిచే శక్త్యాయుధం గ్రహించబడుట చూచిన విష్ణువు దృఢమైన భారసహమైన యుద్ధభాగాన్ని సహించగల ధనుస్సును తీసికొని దాని ద్వారా రౌద్రాస్త్రాన్ని దైత్యులపై ప్రయోగించాడు.

తతోఽస్త్రతేజసా సర్వం వ్యాప్తం లోకం చరాచరమ్ ।
తతో బాణమయం సర్వం ఆకాశం సమదృశ్యత ॥25॥

భూర్దిశో విదిశశ్చైవ బాణజాలమయా బభుః ॥26॥

ఆ రౌద్రాస్త్రపు తేజస్సు చరాచరప్రపంచమంతా వ్యాపించింది. ఆకాశమంతా బాణమయమై కనబడింది. భూమి మరియు దిక్కులన్నీ కూడ బాణాలతో నిండినట్లున్నాయి.

దృష్ట్వా తదస్త్రమాహాత్మ్యం సేనానీర్గ్రసనోఽసురః ॥26॥

బ్రాహ్మమస్త్ర చకారాసౌ సర్వాస్త్ర వినివారణమ్ ।
తేన తత్ ప్రశమం యాతం రౌద్రాస్త్రం లోక ఘస్మరమ్ ॥27॥

ఆ అస్త్ర మాహాత్మ్యాన్ని చూచి, రాక్షససేనానియైన గ్రసనాసురుడు అన్నివిధాలైన అస్త్రాలను నివారించే శక్తి గల బ్రహ్మాస్త్రాన్ని విష్ణువుపై ప్రయోగించాడు. దానితో లోకనాశకమైన రౌద్రాస్త్రం శాంతించింది.

అస్త్రే ప్రతిహతే తస్మిన్ విష్ణుర్దానవసూదనః ।
కాలదండాస్త్రమకరోత్ సర్వలోకభయంకరమ్ ॥28॥

అపుడు దానవాంతకుడైన విష్ణువు సర్వలోకభయంకరమైన కాలదండాస్త్రాన్ని ఆతనిపై ప్రయోగించాడు.

సంధీయమానే తస్మింస్తు మారుతః పరుషో వవౌ ।
చకమ్పే చ మహీదేవీ దైత్యా భిన్న ధియోఽభవన్ ॥29॥

విష్ణువు ఆ అస్త్రం సంధిస్తూండగనే భయంకరమైన వాయువు వీచింది, పృథివి కంపించింది, దానవులందరూ మతిభ్రష్టులనారు.

తదస్త్రముగ్రం దృష్ట్వా తు దానవా యుద్ధదుర్మదాః ।
చక్రురస్త్రాణి దివ్యాని నానారూపాణి సంయుగే ॥30॥

మరియు ఉగ్రమైన ఆ అస్త్రాన్ని చూచి యుద్ధదుర్మదులైన దానవులు దివ్యాలైన అనేకాస్త్రాలను యుద్ధంలో సంధించారు.

నారాయణాస్త్రం గ్రసనో గృహీత్వా చక్రం నిమిః స్వాస్త్రవరం ముమోచ ।
ఐషీక మస్త్రం చ చకార జమ్భః తత్కాల దండాస్త్ర నివారణాయ ॥31॥

అపుడు, ఆ కాలదండాస్త్రాన్ని నివారించటానికి గ్రసనాసురుడు నారాయణాస్త్రాన్ని, నిమిదైత్యుడు తన చక్రాయుధాన్ని, జంభాసురుడు 'ఐషీక' మనే అస్త్రాన్ని ప్రయోగించారు.

యావన్న సంధానదశాం ప్రయాన్తి దైత్యేశ్వరాశ్చాస్త్ర నివారణాయ ।
తావత్ క్షణేనైన జఘానకోటీ ర్దైత్యేశ్వరాణాం సగజాన్ సహాశ్వాన్ ॥32॥

కాని దైత్యేశ్వరులు వారి అస్త్రాలను ప్రయోగించడానికి ఉద్యుక్తులవుతుండగ (ప్రయత్నించుండగ) ఆ కాలదండాస్త్రం క్షణకాలంలో గజాలతో అశ్వాలతో కూడిన ఒక కోటిమంది దైత్యులను సంహరించింది.

అనన్తరం శాన్త మభూత్తదస్త్రం దైత్యాస్త్ర యోగేన తు కాలదండమ్ ।
శాన్తం తదాలోక్య హరిః స్వశస్త్రం స్వవిక్రమే మన్యుపరీతమూర్తిః ॥33॥

ఆ విధంగా అనేక రాక్షసులను సంహరించిన పిమ్మట, గ్రసనాదులచే ప్రయోగించబడిన నారాయణాద్యస్త్రాల శక్తి చేత కాలదండాస్త్రం శాంతించింది. అలా శాంతించిన తన శస్త్రాన్ని చూచి శ్రీహరి తన పరాక్రమంతో కోపోద్రిక్తుడయ్యాడు.

జగ్రాహ చక్రం తపనాయుతాభం ఉగ్రార మాత్మానమివాద్వితీయమ్ ।
చిక్షేప సేనాపతయేఽభిసంధ్య కంఠస్థలం వజ్రకఠోర ముగ్రమ్ ॥34॥

అపుడు, వేల కొలది సూర్యులయొక్క కాంతివంటి కాంతి గలిగినదీ, తనకు ప్రతిరూపమైనదీ మరియు వజ్రం వలె కఠినమైనదీ ఉగ్రమైనదైన చక్రాయుధాన్ని దైత్యసేనానియైన గ్రసనాసురుని కంఠస్థలం పై ప్రయోగించాడు.

చక్రం తదాకాశగతం విలోక్య సర్వాత్మనా దైత్యవరాః స్వవీర్యైః ।
నాఽశక్నువన్ వారయితుం ప్రచండం దైవం యథా కర్మ ముధా ప్రపన్నమ్ ॥35॥

ఆకాశమార్గమున తమవైపు ప్రచండంగా వస్తున్న చక్రాయుధాన్ని చూచి, దైత్యశ్రేష్ఠులు తమ పరాక్రమంతో దానిని నివారించలేకపోయారు. దైవాన్ని స్వకర్మలతో ఎదురింప ప్రయత్నించిన వారివలె వారి ప్రయాస వ్యర్థమయింది.

తమప్రతర్క్యం జనయన్నజయ్యం చక్రం పపాత గ్రసనస్య కణ్ఠే ।
ద్విధా తు కృత్వా గ్రసనస్య కణ్ఠం తద్రక్త ధారారుణఘోరనాభి ॥
జగామ భూయోఽపి జనార్దనస్య పాణిం ప్రవృద్ధానలతుల్యదీప్తిః ॥36॥

ఊహించటానికి వీలుకానంత శక్తిగలిగిన ఆ చక్రాయుధం గ్రసనాసురుని కంఠాన్ని రెండుగా చీల్చి, వాని రక్తపు ధారలతో ఎఱ్ఱనైన భయంకరమైన నాభి కలదై, ప్రవర్ధమానమవుతున్న బాగామండుతున్న అగ్నితో సమానమైన తేజస్సుకలదై తిరిగి జనార్దనుని హస్తాన్ని చేరింది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దేవాసుర సంగ్రామే గ్రసనవధో నామ
ఏకపంచాశదధిక శతతమోఽధ్యాయః ॥151॥

శ్రీమత్స్యమహాపురాణంలో దేవాసుర సంగ్రామంలో విష్ణువు గ్రసనుని వధించుట అనే
నూటయాభై ఒకటవ అధ్యాయం సమాప్తం



ద్విపంచాశదధిక శతతమోఽధ్యాయః- నూటయాభై రెండవ అధ్యాయం

మథనాది సంగ్రామః - మథనాది సంగ్రామం

సూత ఉవాచ - సూతుడు చెప్పెను.

తస్మిన్ వినిహతే దైత్యే గ్రసనే లోకనాయకే ।
నిర్మర్యాదమయుధ్యన్త హరిణా సహ దానవాః ॥1॥

తమ సేనానాయకుడైన గ్రసనాసురుడు మరణించగా, రాక్షసులు అవధులు హద్దులు లేనివారై మరింత పట్టుదలతో శ్రీహరితో యుద్ధము చేశారు

పట్టిశైర్ముసలైః పాశైః గదాభిః కుణపై రపి ।
తీక్ష్ణానసైశ్చ నారాచైః చక్రైః శక్తిభిరేవ చ ॥2॥

తానస్త్రాన్ దానవైర్ముక్తాన్ చిత్రయోధీ జనార్దనః ।
ఏకైకం శతశశ్చక్రే బాణై రగ్నిశిఖోపమైః ॥3॥

పట్టిశములు, ముసలములు, పాశములు, గదలు, కుణపములు, తీక్ష్ణములైన బాణములు, చక్రములు, మరియు శక్తి మొదలగు అనేకాయుధాలతో వారు యుద్ధం చేశారు. అత్యద్భుతంగా యుద్ధం చేయుటలో కౌశలం గల జనార్దనుడు దానవులచే ప్రయోగించబడిన ఆయుధాలలో ఒక్కొకదానిని అగ్నిజ్వాలలను బోలిన తన బాణాలలో వందలకొలది ముక్కలుగ ఖండించాడు.

తమః క్షీణాయుధప్రాయా దానవా భ్రాంతచేతసః ।
అస్త్రాణ్యాదాతు మభవన్న సమర్థా యదా రణే ॥4॥

తదా మృతై ర్గజై రశ్వైః జనార్దన మయోధయన్ ।
సమంతాత్ కోటిశో దైత్యాః సర్వతః ప్రత్యయోధయన్ ॥5॥

తమ ఆయుధములన్నీ క్షీణించిపోగా, భ్రాంతచిత్తులైన దానవులు యుద్ధంలో మరికొన్ని అస్త్రాలు ప్రయోగించలేక మృతిచెందిన గజాలను, అశ్వాలను ఆయుధాలుగ ఉపయోగిస్తూ శ్రీహరితో యుద్ధం చేశారు. అంతేకాక అన్ని వైపుల నుండి కోట్లాది దానవులు శ్రీహరిని చుట్టుముట్టారు.

బహుకృత్వా వపుర్విష్ణుః కించిచ్ఛాంతభుజోఽభవత్ ।
ఉవాచ చ గరుత్మంతం తస్మిన్ సుతుములే రణే ॥6॥

గరుత్మన్ కచ్చిదశ్రాంతః త్వ మస్మిన్నపి సాంప్రతమ్ ।
యద్యశ్రాంతోఽసి తద్యాహి మథనస్య రథం ప్రతి ॥7॥

శ్రాంతోఽస్యథ ముహూర్తం త్వం రణాదపసృతో భవ ।

ఆ విధంగా అనేకమంది దైత్యులతో నిర్విరామంగా యుద్ధం చేసిన శ్రీ మహావిష్ణువు శ్రమచెందిన భుజములు కలవాడై ఆ తుముల యుద్ధంలో గరుత్మంతుడితో "ఓ గరుత్మంతుడా ! నీవు ఇంతవరకు యుద్ధంలో అలసిపోలేదని నేను భావిస్తున్నాను. ఒకవేళ నీవు అలసిపోనట్లైతే రథాన్ని మథనాసురునివైపు తీసుకువెళ్ళు, లేనిచో ఒక ముహూర్తకాలం రథాన్ని యుద్ధభూమి వెలుపలకు తీసుకువెళ్ళు.

ఇత్యుక్తో గరుడస్తేన విష్ణునా ప్రభవిష్ణునా ॥8॥

ఆససాద రణే దైత్యం మథనం ఘోరదర్శనమ్ ।

అత్యంత సమర్థుడైన శ్రీమహావిష్ణువు ఆదేశాన్ని విని గరుడుడు వెంటనే ఘోరాకారుడైన మథనాసురుని దగ్గరకు విష్ణువును తీసుకువెళ్ళాడు.

దైత్యస్త్వభిముఖం దృష్ట్వా శంఖచక్రగదాధరమ్ ॥9॥

జఘాన భిందిపాలేన శితబాణేన వక్షసి ।
తత్ప్రహార మచిన్త్యైవ విష్ణుస్తస్మిన్మహాహవే ॥10॥

జఘాన పంచభిర్బాణైః మార్జితైశ్చ శిలాశితైః ।
పునర్దశభిరాకృష్టైః తం తతాడ స్తనాంతరే ॥11॥

శంఖచక్ర గదాధరుడైన శ్రీహరిని తనముందు చూచిన మథనాసురుడు వెంటనే భిందిపాలంతో మరియు పదునైన బాణాలతో కూడ ఆతని వక్షమున కొట్టాడు. కాని విష్ణువు ప్రహారమును లెక్కచేయకనే ఆ మహాయుద్ధంలో శిలలపై పదును చేయబడిన తీక్ష్ణములైన ఐదు బాణాలను ఆ రాక్షసునిపై సంధించి, ఇంకొక ఐదు బాణాలను ధనుస్సుతో ఆకర్ణాంతం లాగి ఆతని వక్షఃస్థలం పై కొట్టాడు.

విద్ధో మర్మసు దైత్యేంద్రో హరిబాణై రకమ్పత ।
స ముహూర్తం సమాశ్వాస్య జగ్రాహ పరిఘం తదా॥12॥

జఘ్నే జనార్దనం చాపి పరిఘేణాగ్నివర్చసా ।
విష్ణుస్తేన ప్రహారేణ కించిదాఘూర్ణితోఽభవత్ ॥13॥

శ్రీహరి బాణాలచే ప్రాణనాడులయందు దెబ్బలు తినినవాడై ఆ మథనాసురుడు భయకంపితుడయ్యాడు. మరియు క్షణకాలము విశ్రాంతి పొంది అగ్నితో సమానమైన పరిఘమనే ఆయుధంతో జనార్దనుని కొట్టాడు. విష్ణువు కూడ ఆ పరిఘపు దెబ్బతో దిమ్మెరపోయాడు.

తతః క్రోధవివృత్తాక్షో గదాం జగ్రాహ మాధవః ।
మథనం సరథం రోషాత్ నిష్పిపేశాథ రోషతః ॥14॥

అపుడు క్రోధవివృతలోచనుడైన కోపంతో విప్పారిన కన్నులు కలవాడైన మాధవుడు రోషంతో గదను తీసుకొని మథనాసురుని రథంతో కూడ ముద్దచేశాడు.

స పపాతాథ దైత్యేంద్రః క్షయకాలే ఽచలో యథా ।
తస్మిన్నిపతితే భూమౌ దానవే వీర్యశాలిని ॥15॥

అవసాదం యయుర్దైత్యాః కర్దమే కరిణో యథా ।
తతస్తేషు విపన్నేషు దానవేష్వతిమానిషు ॥16॥

ప్రకోపాద్రక్తనయనో మహిషో దానవేశ్వరః ।
ప్రత్యుద్యయౌ హరిం రౌద్రః స్వబాహుబలమాస్థితః ॥ 17॥

ప్రళయకాలంలో పర్వతం క్రిందపడినట్లుగా ఆ మథనాసురుడు వెంటనే క్రిందపడిపోగానే అపుడు అభిమానవంతులైన దానవులు బురదలో చిక్కుకుపోయిన ఏనుగువలె తమ శక్తిని కోల్పోయారు. ఆ విధంగా నిర్వీర్యులవుతున్న దానవులను చూచి కోపంతో ఎఱ్ఱని నేత్రాలు కల మహిషాసురుడు తన బాహుబలాన్నే ఆధారంగా జేసికొని రౌద్రాకారుడై విష్ణువుపై యుద్ధం చేశాడు.

తీక్ష్ణధారేణ శూలేన మహిషో హరిమర్దయన్ ।
శక్త్యా చ గరుడం వీరో మహిషోఽభ్యహనత్ హృది ॥18॥

వీరుడైన మహిషుడు తీక్ష్ణవంతమైన శూలంతో విష్ణువునూ, శక్తి అనే ఆయుధంతో గరుడునీ హృదయం పై కొట్టాడు.

తతో వ్యావృత్య వదనం మహాచలగుహానిభమ్ ।
గ్రస్తుమైచ్ఛద్రణే దైత్యః సగరుత్మంతమచ్యుతమ్॥19॥

విశాలమైన పర్వతపు గుహవలె తననోటిని తెరచి ఆ దైత్యుడు గరుత్మంతునితో కూడ శ్రీహరిని మ్రింగగోరాడు.

అథాచ్యుతోఽపి విజ్ఞాయ దానవస్య చికీర్షితమ్ ।
వదనం పూరయామాస దివ్యై రస్త్రైర్మహాబలః ॥20॥

దానవుని మనోభావమును తెలిసికొని మహాబలుడైన అచ్యుతుడు అనేక దివ్యాస్త్రాలతో వాని నోటిని నింపాడు.

మహిషస్యాథ సస్పృజే బాణౌఘం గరుడధ్వజః ।
పిధాయ వదనం దివ్యైః దివ్యాస్త్ర పరిమంత్రితైః ॥21॥

దివ్యమంత్రాలతో అభిమంత్రించిన అనేక బాణాలతో గరుడధ్వజుడైన శ్రీహరి ఆ మహిషాసురుని ముఖంపైన ప్రయోగించాడు. దివ్యాస్త్రాలతో అతని గోటినిని తిప్పివేశాడు.

స తైర్బాణైరభిహతో మహిషోఽచలసన్నిభః ।
పరివర్తిత కాయోఽధః పపాత న మమార చ ॥22॥

ఆ దివ్యాస్త్రాలతో కొట్టబడిన పర్వతాకారుడైన మహిషుడు వెల్లకిల క్రింద పడిపోయాడు కాని మరణించలేదు.

మహిషం పతితం దృష్ట్వా భూమౌ ప్రోవాచ కేశవః ।
మహిషాసుర మత్తస్త్వం వధం నాస్త్రై రిహార్హసి ॥23॥

యోషిద్ వధ్యః పురోక్తోఽసి సాక్షాత్కమలయోనినా ।
ఉత్తిష్ఠ జీవితం రక్ష గచ్ఛాస్మాత్ సంగరాద్ ద్రుతమ్ ॥24॥

క్రిందపడిన మహిషుణ్ణి చూచి కేశవుడు 'ఓ మహిషాసురా! నా అస్త్రములచే మరణించే అర్హత నీకు లేదు. నీవు స్త్రీచే వధింపబడుతావని సాక్షాత్తు బ్రహ్మ చెప్పివున్నాడు. కావున లేచి వెంటచే ఈ రణభూమినుండి శీఘ్రంగా నిష్క్రమించు, జీవితాన్ని కాపాడుకో" అని చెప్పాడు.

తస్మిన్ పరాఙ్ముఖే దైత్యే మహిషే శుంభదానవః ।
సందష్టోష్ఠపుటః కోపాత్ భృకుటీ కుటిలాననః ॥25॥

నిర్మథ్య పాణినా పాణిం ధనురాదాయ భైరవమ్ ।
సజ్యం చకార సధనుః శరాంశ్చాశీవిషోపమామ్ ॥26॥

మహిషాసురుడు పరాఙ్ముఖుడై పారిపోగా, వెంటనే శుంభాసురుడనే వాడు కోపంతో పెదవులను కొరుకుతూ, కనుబొమ్మలను వికృతంగా త్రిప్పుతూ, తన చేతులను మర్దించుకొంటూ, భైరవమనే ధనుస్సును, సర్పవిషంతో సమానమైన బాణాలను సిద్ధము చేసికొన్నాడు.

స చిత్ర యోధీ దృఢముష్టిపాతః తతస్తు విష్ణుం గరుడం చ దైత్యః ।
బాణైర్జ్వలద్వహ్నిశిఖానికాశైః క్షిప్తై రసంఖ్యైః పరిఘాతహీనైః ॥27॥

చిత్రయోధుడైన ఆ దైత్యుడు దృఢమైన ముష్టిపాతంతో అగ్నిజ్వాలలను బోలిన మరియు ఎదురుదెబ్బ తీయడానికి వీలు కానటువంటి అసంఖ్యాకాలైన బాణాలతో విష్ణువును మరియు గరుడుని కూడ కొట్టాడు.

విష్ణుశ్చ దైత్యేంద్ర శరాహతోఽపి భుశుండిమాదాయ కృతాంతతుల్యామ్ ।
తయా భుశుండ్యా చ పిపేశ మేషం శుంభస్య పత్రం ధరణీధరాభమ్ ॥28

శుంభుని బాణాలతో కొట్టబడినప్పటికిని శ్రీవిష్ణువు యమపాశతుల్యమైన 'భుశుండి' అనే అస్త్రంతో మొదట శుంభుని యొక్క పర్వత సదృశమైన 'మేష' వాహనాన్ని పిండిచేశాడు.

తస్మాదవప్లుత్య హతాచ్చ మేషాత్ భూమౌ పదాతిః స తు దైత్యనాథః ।
తతో మహీస్థస్య హరిః శరౌఘాన్ ముమోచ కాలానలతుల్యభాసః ॥29॥

చచ్చిన తన మేషవాహనము నుండి దూకి, నేలపై నిలుచుని ఆ దైత్యుడు యుద్ధం చేశాడు. శ్రీహరి ప్రళయాగ్నిని పోలిన బాణాలను ఆ అసురుడిపై సంధించాడు.

శరైస్త్రిభిస్తస్య భుజం బిభేద షడ్భిశ్చ శీర్షం దశభిశ్చ కేతుమ్ ।
విష్ణుర్వికృష్టైః శ్రవణావసానం దైత్యస్య వివ్యాధ వివృత్తనేత్రః ॥30॥

శ్రీహరి క్రోధంతో తన నేత్రాలను త్రిప్పుతూ ధనుస్సును ఆకర్ణాంతం లాగి, మూడు బాణాలతో ఆతని భుజాన్ని, ఆరింటితో తలను, పదింటితో వాడి ధ్వజాన్ని కూడ ఛేదించాడు.

స తేన విద్ధో వ్యథితో బభూవ దైత్యేశ్వరో విస్రుత శోణితౌఘః ।
తతోఽస్య కించిచ్చలితస్య ధైర్యాత్ ఉవాచ శంభాంబుజశార్ఙ్గపాణిః ॥31॥

అపుడు రక్త ప్రవాహంతో కూడిన శరీరం కలవాడై ఆ దైత్యేశ్వరుడు చాలా వ్యథనొందాడు. అట్లు చలించిన శంభుని చూచి శంఖాంబుజశార్ఙ్గపాణియైన (శంఖం, పద్మం, శార్ఙ్గమనే ధనుస్సుగల) పరమాత్మ ఇలా అన్నాడు.

కుమారవధ్యోఽసి రణం విముంచ శుంభాసుర! స్వల్పతరైరహోభిః ।
వధం చ మత్తోఽర్హసి నేహ మూఢ వృథైవ కిం యుద్ధసముత్సుకోఽసి ॥32॥

"ఓ శుంభాసురా! స్వల్పకాలంలోనే నీవు కుమారస్వామిచేత వధించబడతావు కనుక రణభూమిని విడిచి పారిపో. ఓ మూర్ఖుడా! నాతో యుద్ధం చేసే అర్హత నీకు లేదు" అని శ్రీహరి ఆ దైత్యునికి చెప్పాడు.

జంభో వచో విష్ణుముఖాన్నిశమ్య నిమిశ్చ నిష్పేష్టు మియేష విష్ణుమ్ ।
గదామథోఽద్యమ్య నిమిః ప్రచండాం జఘాన గాఢాం గరుడం శిరస్తః ॥33॥

విష్ణువు మాటలు వినిన జంభుడు మరియు నిమి అనే దైత్యులిద్దరు ఆతనిపైకి దండెత్తారు. నిమి దైత్యుడు తన గదను పైకి ఎత్తి బలంగా గరుడుని శిరస్సుపై కొట్టాడు.

తత్కర్మ దృష్ట్వా దితిజాస్తు సర్వే జగర్జురుచ్చైః కృతసింహనాదాః ।
ధనూంషి చాస్ఫోట్య ఖురాభిఘాతైః వ్యదారయన్ భూమిమపి ప్రచండాః ॥
వాసాంసి చైవాదుధువుః పరే తు దధ్ముశ్చ శంఖానక గోముఖౌఘాన్ ॥34॥

అది చూచిన దైత్యులందరు బిగ్గరగ అరచారు. సింహనాదాలు చేశారు. ధనుష్టంకారం గావించారు. ప్రచండులై భూమిని కఠినమైన దెబ్బలతో బ్రద్దలు కొట్టారు. వస్త్రాలను విసిరి వేశారు. శంఖాలు, ఆనకాలు, గోముఖాలు మొదలగు వాద్యాలను గూడ మ్రోగించారు.

అథ సంజ్ఞామవాప్యాశు గరుడోఽపి స కేశవః ।
పరాఙ్ముఖో రణాత్తస్మాత్ పలాయత మహాజవః ॥35॥

కొంత సేపటి తర్వాత తేరుకున్న గరుడుడు శ్రీమన్నారాయణునితో గూడ యుద్ధభూమి నుండి అత్యంతవేగంతో పారిపోయాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దేవాసురసంగ్రామే మథనాది సంగ్రామో నామ
ద్విపంచాశదధిక శతతమోఽధ్యాయః ॥152॥

శ్రీ మత్స్య మహాపురాణంలో దేవాసుర సంగ్రామ ఘట్టంలో 'మథనాది సంగ్రామం' అనే
నూటయాభై రెండవ అధ్యాయం సమాప్తం.

త్రిపంచాశదధిక శతతమోఽధ్యాయః – నూటయాభై మూడవ అధ్యాయం

తారకజయః – తారకజయం

సూత ఉవాచ ః – సూతుడు చెప్పాడు

తమాలోక్య పలాయన్తం విభ్రష్టధ్వజకార్ముకమ్ ।
హరిం దేవః సహస్రాక్షో మేనే భగ్నం దురాహవే ॥1॥

ధ్వజం మరియు ధనుస్సు కూడా లేకుండా పలాయనం చిత్తగించిన శ్రీహరిని చూచి సహస్రాక్షుడైన ఇంద్రుడు దైత్యులచేతిలో ఆతడు ఓడిపోయాడని తలచాడు.

దైత్యాంశ్చ ముదితాన్ దృష్ట్వా కర్తవ్యం నాధ్యగచ్ఛత ।
అథాఽయాన్నికటే విష్ణోః సురేశః పాకశాసన: ॥2॥

ఉవాచ చైనం మధురం ప్రోత్సాహపరిబృంహకమ్।
కిమేభిః క్రీడసే దేవ దానవైర్దుష్టమానసైః ॥3॥

సంతుష్టులైన దైత్యులను చూచి ఏమి చేయాలో తోచని ఇంద్రుడు శ్రీమహావిష్ణువు సమీపానికి వెళ్ళి దేవా! దుష్టబుద్ధిగలిగిన ఈ రాక్షసులతో ఆడుకొంటావేమిటి అని మధురమైన మాటలతో ప్రోత్సాహపూర్వకంగా అడిగాడు.

దుర్జనైర్లబ్ధరంధ్రస్య పురుషస్య కుతః క్రియా ।
శక్తేనోపేక్షితో నీచో మన్యతే బలమాత్మనః ॥4॥

దుర్జనులచేత తెలిసికొనబడిన లోపములుగలవారికి ఇంక కార్యాచరణమెలా ఉంటుంది. విజయమెలా ప్రాప్తిస్తుంది. శక్తిగలిగినవాడు నీచుని ఉపేక్షిస్తే వాడు అది తన బలమేనని అనుకొంటాడు.

తస్మాన్న నీచం మతిమాన్ దుర్గహీనం హి సంత్యజేత్ ।
అథాగ్రేసరసంపత్త్యా రథినో జయమాప్నుయుః ॥5॥

కనుక బుద్ధిమంతుడైన వాడు దుష్టుణ్ణి, నీచుణ్ణి వదిలిపెట్టరాదు. తమ బలసంపత్తుచేత ముందుకు సాగినటువంటి వీరులే జయం పొందుతారు.

కస్తే సఖాఽభవచ్చాగ్రే హిరణ్యాక్షవధే విభో ।
హిరణ్యకశిపుర్దైత్యో వీర్యశాలీ మదోద్ధత: ॥6॥

త్వాం ప్రాప్యాపశ్యదసురో విషమం స్మృతివిభ్రమమ్ ।
పూర్వేఽప్యతిబలా యే చ దైత్యేంద్రాః సురవిద్విషః ॥7॥

వినాశమాగతాః ప్రాప్య శలభా ఇవ పావకమ్ ।
యుగే యుగే చ దైత్యానాం త్వమేవాంతకరో హరే ॥8॥

ప్రభూ! పూర్వము నీవు హిరణ్యాక్షుని వధించినప్పుడు నీకు ఏ మిత్రులు సహాయకులుగా ఉన్నారు? వీర్యవంతుడైన ,మద గర్వితుడైన హిరణ్యకశిపుడు నీ ముందుకు వచ్చిన వెంటనే స్మృతి విభ్రమం పొందాడు. ఇంకా దేవతలకు శత్రువులైనటువంటి అతిబలవంతులైన రాక్షసులెందరో అగ్నిలో పడిన మిడుతలవలె నిన్ను చూస్తూనే నశించిపోయారు. కదా ఓ హరీ ప్రతియుగములోను నీవే దైత్యులను నశింపజేసే శక్తిగలవాడవు.

తథైవాద్యేహ మగ్నానాం భవ విష్ణో సురాశ్రయః ।
ఏవముక్తస్తతో విష్ణుః వ్యవర్ధత మహాభుజః ॥9॥

బుధ్వా పరమయా యుక్తః సర్వభూతాశ్రయోఽరిహా ।
అథోవాచ సహస్రాక్షం కాలక్షమమధోక్షజః ॥10॥

కావున ఇప్పుడు కూడా ఆపత్తులో మగ్నమైన దేవతలకు నీవే ఆశ్రయభూతుడవు కావలయును.(ఆశ్రయం కల్పించవలసినది) అని ఇంద్రుడు పలుకగా మహాభుజుడు, శత్రునాశకుడు సమస్తప్రాణులకు ఆశ్రయుడు బుద్ధిమంతుడు మరియు అధోక్షజుడు అయిన శ్రీవిష్ణువు ఇతోధికమైన బలపరాక్రమాలు పొందినవాడై సహస్రాక్షుడైన ఇంద్రునితో సందర్భోచితంగా ఇలా అన్నాడు.

దైత్యేంద్రాః స్వైర్వధోపాయైః శక్యా హన్తుం హి నాన్యతః ।
దుర్జయస్తారకో దైత్యో ముక్త్వా సప్తదినం శిశుమ్॥11॥

దైత్యేంద్రులను వారివారి వధోపాయాలతో చంపవచ్చును కాని, కేవలం శక్తిపరాక్రమాలతో వీలుకాదు. తారకాసురుడు ఏడు దినముల శిశువును విడిచి మరొకరిచే జయింపబడడం.

కశ్చిత్ స్త్రీవధ్యతాం ప్రాప్తో వధేఽన్యస్య కుమారికా ।
జమ్భస్తు వధ్యతాం ప్రాప్తో దానవః క్రూరవిక్రమః ॥12॥

ఒకడు స్త్రీచేత వధింపబడవలసినవాడు, మరొకడు కుమారిచేతిలో వధింపబడవలసినవాడు. క్రూర పరాక్రమవంతుడైన జంభాసురుని మాత్రం వధించవచ్చును.

తస్మాద్వీర్యేణ దివ్యేన జహి జమ్భం జగజ్జ్వరమ్ ।
అవధ్యః సర్వభూతానాం త్వాం వినా స తు దానవః॥13॥
మయా గుప్తో రణే జమ్భం జగత్కంటకముద్ధర ।

కావున జగానికంతటికి జ్వరం కలిగిస్తున్న జంభాసురుని దివ్యమైన పరాక్రమముతో నీవే వధించాలి. అతడు కేవలం నీచేతనే వధింపగలిగినవాడు. (నీవు తప్ప ఎవరుకూడా వాడిని వధింపలేరు.) నా రక్షణలో జగత్కంటకుడైన జంభాసురుని నీవు నిర్మూలించవలసిందే.

తద్వైకుంఠవచః శ్రుత్వా సహస్రాక్షో ఽమరారిహా ॥14॥
సమాదిశత్ సురాన్ సర్వాన్ సైన్యస్య రచనాం ప్రతి ।

సహస్రాక్షుడు, దేవతల శత్రుసంహారకుడు అయిన ఇంద్రుడు వైకుంఠుని మాటలు విని సైన్యరచనకొరకై దేవతలందరిని ఆదేశించాడు.

యత్సారం సర్వలోకేషు వీర్యస్య తపసోపి చ ॥15॥

తదేకాదశరుద్రాంస్తు చకారాగ్రేసరాన్ హరిః ।
వ్యాలభోగాంగసన్నద్ధా బలినో నీలకంధరాః ॥16॥

సమస్తలోకాలలో తపోవీర్యాదులకు సారరూపులైన, సర్పాల పడగలనే భుజకీర్తులుగా ధరించిన మరియు బలవంతులైన ఏకాదశ రుద్రులను అగ్రేసరులుగా(సేనాపతులుగా)ఇంద్రుడు నియమించాడు.

చంద్రఖండనృముండాలీమండితోరుశిఖండినః ।
శూలజ్వాలావలిప్తాంగా భుజమండలభైరవాః ॥17॥

పింగోత్తుంగజటాజూటాః సింహచర్మానుషంగిణః ।
కపాలీశాదయో రుద్రాః విద్రావితమహాసురాః ॥18॥

చంద్రరేఖతోనూ, మానవకపాలాలతోనూ అలంకరించబడిన పెద్ద జుట్టుముడులు గలవారూ శూలాల కాంతిచేత నిండిన శరీరం గలవారూ గుండ్రని భుజాలతో భయంకరులూ పింగళవర్ణం కలిగి ఎత్తైన జడల సమూహంగలవారూ సింహ చర్మాన్ని ధరించినవారూ అయిన కపాలీశుడు మొదలైన రుద్రులు గొప్పగొప్ప రాక్షసులని పారద్రోలారు.

కపాలీ పింగలో భీమో విరూపాక్షో విలోహితః ।
అజేశః శాసనః శాస్తా శంభుశ్చండో ధ్రువస్తథా॥19॥

ఏతే ఏకాదశానంతబలా రుద్రా ప్రభావిణః ।
పాలయన్తో బలస్యాగ్రే దారయన్తశ్చదానవాన్॥20॥

ఆప్యాయన్తశ్చ త్రిదశాన్ గర్జంత ఇవ చాంబుదాః ।
హిమాచలాభే మహతి కాంచనాంబురుహస్రజి ॥21॥

ప్రచలచ్చామరే హేమఘంటాసంఘాతమండితే ।
ఐరావతే చతుర్దన్తే మాతంగేఽచలసంస్థితే ॥22॥

మహామదజలస్రావే కామరూపే శతక్రతుః ।
తస్థౌ హిమగిరేః శృంగే భానుమానివ దీప్తిమాన్ ॥23॥

కపాలి, పింగలుడు, భీముడు, విరూపాక్షుడు, విలోహితుడు, అజేశుడు, శాసనుడు, శాస్త శంభుడు, చండుడు, ధ్రువుడు అను అనంతబలులు మరియు సమర్ధులైన ఏకాదశరుద్రులు దేవతల సైన్యం అగ్రభాగంలో ఉండి. దానవసమూహాన్ని చీల్చివేస్తూ, మేఘాలవలె గర్జిస్తూ త్రిదశవాసులైన దేవతలకు తృప్తి కలిగిస్తున్నారు.

హిమాచలం వంటి కాంతిగలిగిన బంగారు తామరపుష్పాముల మాలలతో, చామరాలతో మరియు బంగారు ఘంటలతో అలంకృతమై నాలుగు దంతాలు కలిగిన, మదజలం స్రవిస్తున్న ఐరావతాన్ని అధిరోహించిన కామ రూపధారి అయిన ఇంద్రుడు హిమవత్పర్వతశిఖరం పై ప్రకాశిస్తున్న సూర్యుని వలె వున్నాడు.

తస్యారక్షత్ పదం సవ్యం మారుతోఽ మితవిక్రమః ।
జుగోపాపరమగ్నిస్తుజ్వాలాపూరితదిఙ్ముఖః ।।24।।

అమితపరాక్రమవంతుడైన వాయుదేవుడు ఎడమవైపునుండి, దిక్కులన్నింటికి తన జ్వాలలను ప్రసరింపజేస్తున్న అగ్నిదేవుడు కుడివైపు నుండి ఇంద్రుని రక్షింపసాగారు.

పృష్ఠ రక్ష్యోఽ భవద్విష్ణుః ససైన్యస్య శతక్రతోః ।
ఆదిత్యా వసవో విశ్విమరుతశ్చాశ్వేనావపి ।।25।।

గంధర్వా రాక్షసా యక్షాః సకిన్నరమహోరగాః ।
నానావిధాయుధాశ్చిత్రాః దధానా హేమభూషణాః ।।26।।

కోటిశః కోటిశః కృత్వా వృందం చిహ్నోపలక్షితమ్ ।
విశ్రామయన్తః స్వాం కీర్తిం బందివృందపురాః సురాః।।
చేరుర్దైత్యవధే హృష్టాః సహేంద్రాః సురజాతయః।।27।।

శతక్రతువైన ఇంద్రుని, ఆతని సైన్యాన్ని శ్రీమహావిష్ణువు వెనుకభాగం నుండి రక్షిస్తున్నాడు. ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, విశ్వేదేవతలు, మరుద్గణాలు, అశ్వినీ దేవతలు, గంధర్వులు,రాక్షసులు, యక్షులు, కిన్నరులు, నాగదేవతలు, బంగారు నగలను ధరించినవారై, అనేక విధాలైన ఆయుధాలతో ఒక్కో కోటికి ఒక బృందంగా ఏర్పడి, వంది మాగధుల స్తోత్రాలతో తమను కీర్తిస్తూండగా, ఇంద్రునితో కూడ అత్యంతోత్సాహంతో దైత్యులను వధించడానికి ముందుకు సాగారు.

శతక్రతోరమరనికాయపాలితా పతాకినీ గజశతవాజినాదితా ।
సితాతపత్రధ్వజపటకోటిమండితా బభూవ సా దితిసుతశోకవర్ధినీ ।।28।।

ఇంద్రుని ఆధిపత్యంలో గల దేవతల సైన్యం చేత రక్షించబడినదీ వందలాది అశ్వాలతో, ఏనుగులతో, పెద్ద మోతగలదీ ఛత్రాలతో, ధ్వజాలతో అలంకరింపబడినయిన ఆ దేవసేన రాక్షససైన్యపు శోకాన్ని అధికమయ్యేటట్లు చేసింది.

ఆయాన్తీమవలోక్యాథ సురసేనాం గజాసురః ।
గజరూపీ మహాంభోదసంఘాతో భాతి భైరవః ।।29।।

తమ వైపు వస్తున్న దేవసైన్యాన్ని చూచి గజరూపుడైన గజాసురుడు భయంకరమైన మేఘసమూహం వలె కదులుతున్నాడు.

పరశ్వథాయుధో దైత్యః దంశితోష్ఠకసంపుటః ।
మమర్ద చ రణే దేవాన్ చిక్షేపాన్యాన్ కరేణ తు ॥30॥

పరాన్ పరశునా జఘ్నే దైత్యేంద్రో రౌద్రవిక్రమః ।

గండ్రగొడ్డలి ఆయిధంగా కల రాక్షసుడు పళ్ళతో తన పెదవులని కొరికినవాడై దేవతలని యుద్ధంలో మర్దించాడు. కొందరిని చేతితో నెట్టివేశాడు. భయంకరుడైన ఆ రాక్షసుడు మరికొందరిని గొడ్డలితో నరికాడు.

తస్య పాతయతః సేనాం యక్షగంధర్వకిన్నరాః ॥31॥

ముముచుః సంహతాః సర్వే చిత్రశస్త్రాస్త్రసంహతమ్ ।
పాశాన్ పరశ్వధాం శ్చక్రాన్ భిందిపాలాన్ సముద్గరాన్॥32॥

కుంతాన్ ప్రాసానసీంస్తీక్ష్ణాన్ ముద్గరాంశ్చాపి దుస్సహాన్ ।
తాన్ సర్వాన్ సోఽగ్రసద్దైత్యః కమలానీవ యూథపః ॥33॥

అలా తమసైన్యాన్ని నశింపజేస్తున్న గజాసురుని చూచి యక్షులు, గంధర్వులు, కిన్నరులు మొదలైన వారంతా వివిధ శస్త్రాల అస్త్రాలతో పాటు అనేనేకపాశాలను, పరశువులను, చక్రములను, భింది కాపాలమును, ముద్గరాలను, కుంతాలను, తీక్ష్ణాలైన ప్రాసాలను అతనిపై సంధించారు. కాని వాటినన్నింటిని గజాసురుడు మదించిన గజము కమలాలను వలె మ్రింగివేశాడు.

కోపాస్ఫాలితదీర్ఘాగ్రకరాస్ఫోటేన పాతయన్ ।
విచచార రణే దేవాన్ దుష్ప్రేక్ష్యే గజదానవః ॥34॥

కోపముతో భీకరంగా అరుస్తూ అత్యంతదీర్ఘాలైన తన భుజాలతో దేవతలను క్రిందపడవేస్తూ, భయం కరమైన ఆ యుద్ధభూమిలో గజాసురుడు తిరుగుతున్నాడు.

యస్మిన్యస్మిన్నిపతతి సురవృందే గజాసురః ।
తస్మింస్తస్మిన్ మహాశబ్దో హాహాకారకృతోఽభవత్ ॥35॥

దేవతలబృందంలో ఎవరెవరిపైన ఆ గజాసురుడు పడుతున్నాడో వారినుండి భీతావహాలైన హాహాకారాలు వెలువడుతున్నాయి.

అథ విద్రావమాణం తద్బలం ప్రేక్ష్య సమన్తతః ।
రుద్రాః పరస్పరం ప్రోచురహఙ్కారోద్ధితార్చిషః ॥36॥

పిమ్మట అన్ని వైపులా పరుగెడుతున్న ఆ సైన్యాన్ని చూచి అహంకారంచే మండుతున్న అగ్నులవలె రుద్రులు పరస్పరం మాట్లాడుకున్నారు.

భో భో గృహ్ణీత దైత్యేన్ద్రం మర్దతైనం హతాశ్రయమ్ ।
కర్షతైనం శితైః శూలైః భంజతైనం చ మర్మసు ॥37॥

ఈ దైత్యేంద్రుడిని పట్టుకో, ఈ రాక్షసుడిని మర్దించు, పదునైన శూలాలతో వీని మర్మావయవాలను ఛేదించు.

కపాలీవాక్యమాకర్ణ్య శూలం శితశిఖాముఖమ్ ।
సమ్మార్జ్య వామహస్తేన సంరమ్భవివృతేక్షణః ॥38॥

అధావన్ భ్రుకుటీవక్రో దైత్యేన్ద్రాభిముఖో రణే ।
దృఢేన ముష్టిబంధేన శూలం విష్టభ్య నిర్మలమ్ ॥39॥

జఘాన కుంభదేశే తు కపాలీ గజదానవమ్ ।

ఆ మాటలువిని కపాలి అనే రుద్రుడు పదునైన తన శూలాన్ని వామహస్తంతో తుడిచి, సంరంభంతో, ముడిచిన కనుబొమ్మలు కలవాడై యుద్ధభూమిలో ఆ గజాసురునికి ముందుకు పరుగెత్తి, దృఢమైన పిడికిలితో శూలాన్ని పట్టుకొని అతని కుంభస్థలంపై కొట్టాడు.

తతో దశాపి తే రుద్రా నిర్మలాయోమయైః రణే ॥40॥

జఘ్నుః శూలైశ్చ దైత్యేన్ద్రం శైలవర్ష్మాణమాహవే ।
స్రుతశోణితరన్ధ్రస్తు శితశూలముఖాదితః ॥41॥

బభౌ కృష్ణచ్ఛవిర్దైత్యః శరదీవామలం సరః ।
ప్రోత్ఫుల్లారుణ నీలాబ్జసంఘాతం సర్వతో దిశమ్॥42॥

తరువాత మిగతా పదిమంది రుద్రులు స్వచ్ఛమైన ఉక్కుమొనలుగల శూలాలతో పర్వతాన్ని బోలిన శరీరం గల రాక్షసుని పొడిచారు. పదునైన శూలపుమొనలతో పొడవబడగా రంధ్రాలనుండి కారుతున్న రక్తం వలన నల్లని శరీరాకారం గల ఆ గజాసురుడు వికసించిన నల్లని మరియు ఎరుపు కలువలతో శరత్కాలపు సరస్సువలె ప్రకాశించాడు.

భస్మశుభ్రతనుచ్ఛాయై రుద్రై ర్హంసైరివావృతః ।
ఉపస్థితార్ద్రిదైత్యోఽథ ప్రచలత్కర్ణపల్లవః ॥43॥

శమ్భుం బిభేద దశనైర్నాభిదేశే గజాసురః ।

భస్మపుకాంతితో మెరుస్తున్న శరీరంగల ఆ రుద్రుల చేత ఆవరించబడిన ఆ రాక్షసుడు హంసలచేత చుట్టబడినట్లు కనబడ్డాడు, అటువంటి రుద్రులతో ముట్టడించబడిన చిగురుటాకు వంటి కర్ణాలు గల ఆ గజాసురుడు ముందుకు సాగి, శంభు అనే రుద్రుని నాభిప్రదేశాన్ని తన దంతాలతో చీల్చాడు.

దృష్ట్వా సక్తం తు రుద్రాభ్యాం నవరుద్రాస్తతోఽద్భుతమ్ ॥44॥

తతక్షుర్వివిధైః శస్త్రైః శరీరమమరద్విషః ।
నిర్భయా బలినో యుద్ధే రణభూమౌ వ్యవస్థితాః ॥45॥

మృతం మహిషమాసాద్య వనే గోమాయవో యథా ।

ఇంతలో ఇద్దరు రుద్రులకు చిక్కిన గజాసురుని చూచి మిగతా తొమ్మిదిమంది రుద్రులు అనేక విధాలైన శస్త్రాలతో దేవతల శత్రువైనవాని శరీరాన్ని కొట్టారు. చచ్చిన మహిషం దగ్గరకు నిర్భయంగా చేరిన నక్కలవలె యుద్ధభూమిలో నిర్భయులై ఆ నవరుద్రులు ఆ దైత్యుని చుట్టుముట్టారు.

కపాలినం పరిత్యజ్య గతశ్చాసురపుంగవః ॥46॥

వేగేన కుపితో దైత్యః నవరుద్రానుపాద్రవత్।
మమర్ద చరణాఘాతైః దన్తైశ్చాపి కరేణ చ॥47॥

అపుడు ఆ అసురశ్రేష్ఠుడు కపాలిని వదలి కోపంతో వేగంగా ఆ తొమ్మిదిమంది రుద్రులపైకి పరిగెత్తాడు. మరియు వారిని పాదాలతో, దంతాలతో, చేతులతో మర్దించాడు.

సతైస్తుముల యుద్ధేన శ్రమమాసాదితో యదా ।
తదా కపాలీ జగ్రాహ కరం తస్యామరద్విషః ॥48॥

భ్రామయామాస వేగేన హ్యతీవ చ గజాసురమ్ ।
దృష్ట్వా తమసురం దైత్యం కించిత్ స్ఫురితజీవితమ్॥49॥

నిరుత్సాహం రణే తస్మిన్ గతయుద్ధోత్సవోద్యమమ్ ।
తతః పతత ఏవాస్య చర్మచోత్కృత్య భైరవమ్ ॥50॥

స్రవత్సర్వాంగరక్తౌఘం చకారామ్బరమాత్మనః ।

ఎపుడైతే వారందరితో గొప్ప యుద్ధముచేస్తూ ఆ గజాసురుడు అలసిపోయాడో, అప్పుడు కపాలీ అనే రుద్రుడు వెంటనే అతని చేతిని పట్టుకొని అత్యంతవేగంగా త్రిప్పాడు. అపుడు బలరహితుడై యుద్ధపు ఉత్సాహన్ని కోల్పోయి కొన ఊపిరితో క్రింద పడిపోతున్న ఆ అసురుణ్ణి చూచి, అతని శరీరపు అవయవాల నుండి రక్తం కారుతుండగా, వాని చర్మాన్ని భయంకరంగా ఒలిచి దానిని తన వస్త్రంగా చేసుకొన్నాడు.

దృష్ట్వా వినిహితం దైత్యం దానవేంద్రా మహాబలాః ॥51॥

విత్రేసుర్దుద్రువుర్జగ్ముః నిపేతుశ్చ సహస్రః ।
దృష్ట్వా కపాలినో రూపం గజచర్మాంబరావృతమ్ ॥52॥

దిక్షు భూమౌ తమేవోగ్రం రుద్రం దైత్యా వ్యలోకయన్ ।

ఆ విధంగా చంపబడిన గజాసురుని చూచి మహాబలులైన వేలకొలది దానవులు భయపడి పారిపోయారు. కొంతమంది క్రింద పడిపోయారు. ఇంకను గజాసురచర్మాన్ని ధరించిన కపాలిని చూచిన వారందరికి అన్ని దిక్కులలోను, భూమిమీద, అన్నివైపులా కూడ భయంకరాకారుడైన ఆ కపాలి రుద్రుడే కనపడ్డాడు.

ఏవం విలులితే తస్మిన్ దానవేంద్రే మహాబలే ॥53॥

ద్విపాధిరూఢో దైత్యేంద్రో హతదుందుభినా తతః ।
కల్పాన్తామ్బుధరాభేణ దుర్ధరేణాపి దానవః ॥54॥

నిమిరభ్యపతత్తూర్ణం సురసైన్యాని లోడయన్।
యాం యాం నిమిగజో యాతి దిశం తాం తాం సవాహనాః ॥55॥

సన్త్యజ్య దుద్రువుర్దేవా భయార్తాస్త్యక్తహేతయః ।
గంధేన సురమాతంగా దుద్రువుస్తస్య హస్తినః ॥56॥

ఆ విధంగా మహాబలుడైన గజాసురుడు మరణించగా, ప్రళయకాలపు మేఘం వలె, దుర్ధరమైన దుందుభిని మ్రోగిస్తూ, మహా గజాన్ని అధిరోహించి, నిమి అనే దానవుడు దేవతల సైన్యంపైకి వేగంగా దండెత్తాడు. అపుడు నిమి గజం ఏ ఏ దిక్కుకు పరుగెత్తిందో ఆయా దిక్కులలో వున్న దేవతలు తమ వాహనాలతో కూడ భయార్తులై, వదలిన జీవితాశకలవారై అక్కడనుండి పారిపోతున్నారు. ఆ గజం మదపువాసనను చూచి దేవతల గజాలు పరుగెత్తాయి.

పలాయితేషు సైన్యేషు సురాణాం పాకశాసనః ।
తస్థౌ దిక్పాలకైః సార్ధమష్టభిః కేశవేన చ ॥57॥

అలా దేవతల సైన్యాలు పారిపోతున్నా ఇంద్రుడు కేశవునితో మరియు అష్టదిక్పాలకులతో రణరంగంలోనే నిలచాడు.

సమ్ప్రాప్తో నిమిమాతంగో యావచ్ఛక్రగజం ప్రతి ।
తావచ్ఛక్రగజో యాతో ముక్త్వా నాదం సభైరవమ్ ॥58॥

ధ్రియమాణోఽపి యత్నేన రణే నైవ చ తిష్ఠతి ।

ఆ నిమి అనే రాక్షసుని ఏనుగు తన వైపు రాగా ఇంద్రుని ఐరావతం భయంతో ఘీంకరిస్తూ పరుగెత్తసాగింది. ఎంత ప్రయత్నించినా యుద్ధరంగాన నిలువలేకపోయింది.

పలాయితే గజే తస్మిన్నారూఢః పాకశాసనః ॥59॥

విపరీతముఖోఽయుద్ధ్య ద్దానవేన్ద్రబలం ప్రతి ।
శతక్రతుస్తు వజ్రేణ నిమిం వక్షస్యతాడయత్ ॥60॥

గదయా దన్తినశ్చాస్య గణ్డదేశేఽహనద్దృఢమ్ ।

ఆ విధంగా పారిపోతున్న ఐరావతంపైననే ఎదురు త్రిప్పిన ముఖం గలవాడై ఆ ఇంద్రుడు ఆ దానవేంద్రుని సైన్యంపై దండెత్తాడు. వజ్రాయుధంతో నిమి వక్షఃస్థలంపై కొట్టాడు. మరియు గదతో ఆ దైత్యుని వాహనమైన ఏనుగు గండస్థలం పై కూడ గట్టిగా కొట్టాడు.

తత్ప్రహారమచిన్త్యైవ నిమిర్నిర్భయపౌరుషః ॥61॥

ఐరావతం కటీదేశే ముద్గరేణాభ్యతాడయత్ ।
స హతో ముద్గరేణాథ శక్రకుంజర ఆహవే ॥62॥

జగామ పశ్చాచ్చరణైః ధరణీ భూధరాకృతిః ।
లాఘవాత్ క్షిప్రముత్థాయ తతోమరమహాగజః ॥63॥

రణాదపససర్పా ఽఽశు భీషితో నిమిహస్తినా ।
తతో వాయుర్వవౌ రూక్షో బహుశర్కరపాంసులః ॥64॥

కాని నిమిదైత్యుడు దానిని లెక్కచేయక, పౌరుషంతో నిర్భయంగా ముద్గరమనే ఆయుధంతో ఐరావతం కటిప్రదేశాన్ని కొట్టాడు. దానితో దెబ్బతినిన ఇంద్రుని ఐరావతం వెనుకకాళ్ళను ముడిచి పర్వతమంత శరీరంతో భూమిపై పడిపోయినా, వెంటనే పైకి లేచి, నిమిగజాన్ని చూచి భయంతో రణభూమినుండి పారిపోయింది. అపుడు ఇసుకధూళితో నిండిన వాయువు భయంకరంగా వీచింది.

సమ్ముఖో నిమిమాతంగో జవనాచలకమ్పనః ।
స్రుతరక్తో బభౌ శైలో ఘనధాతుహ్రదో యథా ॥65 ॥

ఐరావతానికి ఎదురుగా నిలిచిన వేగంతో పర్వతాన్ని కదలించే నిమి వాహనమైన ఏనుగు రక్తం కారుతున్న శరీరంతో గైరికాది ధాతువులతో కూడిన మడుగులోనున్న పర్వతం వలె ప్రకాశించింది.

ధనేశోఽపి గదాం గుర్వీం తస్య దానవహస్తినః ।
చిక్షేప వేగాద్దైత్యేంద్రే నిపపాతాస్య మూర్ధని ॥66॥

ఇంతలో ధనాధిపతి కుబేరుడు కూడ శ్రేష్ఠమైన గదను నిమిదైత్యుని పైకి విసరగా అది ఆ దానవుని ఏనుగు తలపై పడింది.

గజో గదనిపాతేన స తేన పరిమూర్ఛితః ।
దన్తైర్భిత్వా ధరాం వేగాత్ పపాతాచలసన్నిభః ॥67॥

కుబేరుని గద దెబ్బతో ఆ గజం మూర్ఛపోయింది. మరియు తన దంతాలతో భూమిని బద్దలు చేస్తూ పర్వతం వలె నేలపై పడిపోయింది.

పతితే తు గజే తస్మిన్ సింహనాదో మహానభూత్ ।
సర్వతః సురసైన్యానాం గజబృంహితబృంహితైః ॥68॥

హ్రేషారవేణ చాశ్వానాం గుణాస్ఫోటశ్చ ధన్వినామ్ ।

అలా నిమిగజం క్రిందపడిపోగా, దేవతల సైన్యాలు సింహనాదం చేశాయి. ఏనుగుల ఘీంకారాలు, గుర్రాల సకిలింతలు, వీరుల ధనుష్టంకారాలు యుద్ధభూమి అంతట వ్యాపించాయి.

గజం తం నిహతం దృష్ట్వా నిమిం చాపి పరాఙ్ముఖమ్ ॥69॥

శ్రుత్వా చ సింహనాదం చ సురాణామతికోపనః ।
జంభో జజ్వాల కోపేన పీతాஉజ్య ఇవ పావకః ॥70॥

చనిపోయిన నిమి ఏనుగును మరియు యుద్ధభూమినుండి పారిపోతున్న నిమిని కూడ చూచి జంభాసురుడు నెయ్యిత్రాగిన అగ్నివలె జ్వలించాడు.

స సురాన్ కోపరక్తాక్షో ధనుష్యారోప్య సాయకమ్ ।
తిష్ఠతేత్యబ్రవీత్తావత్ సారథిం చాప్యచోదయత్ ॥ 71॥

కోపంతో ఎర్రబడిన కన్నులు గల బాణాన్ని ధనుస్సు పై ఎక్కుపెట్టి దేవతలను నిలువుమని చెబుతూ వారివైపు రథం తీసుకెళ్ళమని సారథిని ప్రేరేపించాడు.

వేగేన చలతస్తస్య తద్రథస్యాభవద్ ద్యుతిః ।
యథాదిత్యసహస్రస్యాభ్యుదితస్యోదయాచలే ॥ 72 ॥

వేగంగా పోతున్న జంభుని రథకాంతి ఉదయిస్తున్న సహస్రసూర్యుల కాంతి వలె ఉండినది.

పతాకినా రథేనాஉஉజౌ కింకిణీజాలమాలినా ।
శశిశుభ్రాతపత్రేణ స త్యేన స్యందనేన తు ॥73॥

ఘట్టయన్ సురసైన్యానాం హృదయం సమదృశ్యత ।

పతాకాలతో, గంటలమాలతో ,చంద్రునివలె వున్న శ్వేతచ్ఛత్రంతో కూడిన రథాన్ని అధిష్ఠించి ఆ దైత్యుడు దేవ సైన్యాల హృదయాలను వణికించుతూ యుద్ధంలో కనబడ్డాడు.

తమాయాన్తమభిప్రేక్ష్య ధనుష్యాహితసాయకః ॥74॥

శతక్రతురదీనాత్మా దృఢమాదత్తకార్ముకమ్ ।
బాణం చ తైలధౌతాగ్రమర్ధచంద్రమజిహ్మగమ్ ॥75॥

తేనాస్య సశరం చాపం రణే చిచ్ఛేద వృత్రహా ।

ఆ విధంగా వస్తున్న జంభుని చూచి ఇంద్రుడు దృఢమైన ధనుస్సు, తైలంతో శుద్ధిచేసిన పదునైన మరియు అర్ధచంద్రాకారం వంటి బాణాన్ని తీసుకుని, దానితో ఆ దైత్యుని ధనుస్సును బాణాన్ని కూడ ఛేదించాడు.

క్షిప్రం సన్త్యజ్య తచ్చాపం జంభో దానవనందనః ॥76॥

అన్యత్ కార్ముకమాదాయ వేగవద్భారసాధనమ్ ।
శరాంశ్చాஉஉశీవిషాకారాన్ తైలధౌతానజిహ్మగాన్ ॥77॥

శక్రం వివ్యాధ దశభిః జత్రుదేశే తు పత్రిభిః ।
హృదయే చ త్రిభిశ్చాపి ద్వాభ్యాం చ స్కన్ధయోర్ద్వయోః ॥78॥

వెంటనే ఆ ధనుస్సును వదలి, జంభుడు వేగవంతమైన మరియు భారమైన ఇంకొక ధనుస్సును తీసికొని తైలంతో పదునుచేయబడిన సర్పాకారాలైన బాణాలను గూడ గ్రహించి వాటిలో పదింటిచేత ఇంద్రుని మోకాళ్ళను, మూడింటితో హృదయాన్ని, రెండింటితో భుజాలను కొట్టాడు.

శక్రోఽపి దానవేంద్రాయ బాణజాలమపీదృశమ్ ।
అప్రాప్తాన్ దానవేంద్రస్తు శరాన్ శక్రభుజేరితాన్ ॥79॥

చిచ్ఛేద దశధాఽఽకాశే శరైరగ్నిశిఖోపమైః ।

ఇంద్రుడు కూడ ఆ దానవునిపై బాణసమూహాన్ని వదలగా జంభుడు అవి తనను చేరేలోపలే అగ్ని జ్వాలల వంటి తన బాణాలతో వాటిని పదిముక్కలుగ ఖండించాడు.

తతస్తుశరజాలేన దేవేంద్రో దానవేశ్వరమ్ ॥80॥

ఆచ్ఛాదయత యత్నేన వర్షాస్వివ ఘనైర్నభః ।
దైత్యో ఽపి బాణజాలం తద్ వ్యథమత్సాయకైః శితైః ॥81॥

యథా వాయుర్ఘనాటోపం పరివార్య దిశోముఖే ।

అప్పుడు ఇంద్రుడు మరల అనేక బాణాలతో ఆ దానవుని వర్షాకాలపుమేఘాలు ఆకాశాన్ని కప్పివేసినట్లు కప్పాడు. దైత్యుడు కూడ బలమైన వాయువు మేఘాల ఆడంబరాన్ని పలుదిక్కులకు చెదరగొట్టినట్లు పదునైన తన బాణాలతో ఇంద్రుని బాణాలను చెదరగొట్టాడు.

శక్రోఽథ క్రోధసంరంభాన్న విశేషయతే యదా ॥82॥

దానవేన్ద్రం తదా చక్రే గాంధర్వాస్త్రం మహాద్భుతమ్ ।
తదుత్థతేజసా వ్యాప్తమభూత్ గగనగోచరమ్ ॥83॥

ఎప్పుడైతే ఇంద్రుడు తన క్రోధాన్ని నిగ్రహహించుకోలేక పోయాడో అప్పుడు మహాద్భుతమైన గాంధర్వాస్త్రాన్ని ఆ దానవునిపై సంధించాడు. ఆ అస్త్ర కాంతి ఆకాశమంతా వ్యాపించింది.

గంధర్వనగరైశ్చాపి నానాప్రాకారతోరణైః ।
ముంచద్భిరద్భుతాకారైః అస్త్రవృష్టిం సమన్తతః ॥84॥

అథాస్త్రవృష్ట్యా దైత్యానాం హన్యమానా మహా చమూః ।
జంభం శరణ మాగచ్ఛదప్రమేయపరాక్రమమ్ ॥85 ॥

వ్యాకులోపి స్వయం దైత్యఃస్త్రహస్రాక్షాస్త్రపీడితః ।
స్మరన్ సాధుసమాచారం భీతత్రాణపరోఽభవత్ ॥86॥

ఆ సమయంలో అనేక విధప్రాకారాలతో, తోరణాలతో కూడ అలంకృతమైవున్న గంధర్వనగరమంతా అక్కడకి వచ్చి, అద్భుతమైన అస్త్రవర్షంతో ఆ దానవసైన్యాన్ని, నియంత్రించగా, ఆ సైన్యం సాటిలేని పరాక్రమం

గల జంభాసురుని శరణు వేడింది. అప్పుడు స్వయంగా వ్యాకులచిత్తుడైనప్పటికి సహస్రాక్షుడైన ఇంద్రుని అస్త్రాలచే పీడింపబడినవాడై జరిగిన దానిని స్మరిస్తూ భయపడుతున్న దానవులను రక్షించే ప్రయత్నం చేశాడు.

అథాస్త్రం మౌసలం నామ ముమోచాదితినందనః ।
తతోఽ యోముసలైః సర్వమభవత్ పూరితం జగత్ ॥87॥

ఏక ప్రహారకరణైః అప్రధృష్యైః సమన్తతః ।
గంధర్వనగరం తేషు గంధర్వాస్త్రవినిర్మితమ్ ॥88॥

అపుడా దైత్యుడు మౌసలాస్త్రాన్ని సంధించాడు. దానితో జగత్తంతా ముసలాలతో నిండిపోయింది. అవన్నీ ఒకే విధంగా అణిచివేయడానికి వీలుకానివై గంధర్వాస్త్రంతో నిర్మించబడిన గంధర్వనగరానికి వ్యాప్తిచెందింది.

గాంధర్వమస్త్రం సంధాయ సురసైన్యేషు చాపరమ్ ।
ఏకైకేన ప్రహారేణ గజానశ్వాన్ మహారథాన్ ॥89॥

రథాశ్వాన్ సోఽ హనత్ క్షిప్రం శతశోఽ థ సహస్రశః ।

జంభాసురుడు మరొక గాంధర్వాస్త్రాన్ని దేవతల సైన్యంపై సంధించి ఒక్కొక్క దెబ్బతో వందలకొలది గజాలను, అశ్వాలను, మహారథికులను కూడ వేగంగా సంహరించసాగాడు.

తతః సురాధిపస్త్వాష్ట్రమస్త్రం చ సముదీరయత్ ॥90॥

సంధ్యమానే తతస్త్వాష్ట్రే నిశ్చేరుః పావకార్చిషః ।
తతో యన్త్రమయాన్ దివ్యాన్ ఆయుధాన్ దుష్ప్రధర్షిణః ॥91॥

తైర్యన్త్రైరభవద్ బద్ధమన్తరిక్షే వితానకమ్ ।

అది చూచి, సురాధిపతియైన ఇంద్రుడు త్వాష్ట్రమనే అస్త్రాన్ని సంధించాడు. ఆ అస్త్రాన్ని సంధిస్తూండగనే అంతటా అగ్నిజ్వాలలు వ్యాప్తి చెందాయి. దాని నుండి ఇంద్రుడు ఎదురించ శక్యంకాని యంత్రమయాలైన మరియు దివ్యాలైన అనేక అస్త్రాలు సంధించగా వాటితో అంతరిక్షంలో చాందిని వంటిది ఏర్పడింది.

వితానకేన తేనాథ ప్రశమం మౌసలే గతే ॥92॥
శైలాస్త్రం ముముచే జమ్భో యన్త్రసంఘాతతాడనమ్ ।

వ్యామప్రమాణైరుపలైః తతో వర్షమవర్తత ॥93॥

ఆ పందిరివలన మౌసలాస్త్రం ప్రశమించింది. అపుడు జంభుడు యంత్రమయాలైన ఆయుధాలను నశింపజేయడానికి శైలాస్త్రాన్ని ప్రయోగించాడు. దానితో అక్కడ పెద్ద పరమాణం గల రాళ్ళవర్షం కురవసాగింది.

త్వాష్ట్రస్య నిర్మితాన్యాశు యంత్రాణి తదనన్తరమ్ ।
తేనోపలనిపాతేన గతాని తిలశస్తతః ॥94॥

యన్త్రాణి తిలశః కృత్వా శైలాస్త్రం పరమూర్ధసు ।
నిపపాతాతివేగేనాదారయత్ పృథివీం తతః ॥95॥

శైలాస్త్రం ఇంద్రుని త్వాష్ట్రాస్త్రం చేత నిర్మించబడిన యంత్రమయమైన ఆయుధాలన్నింటిని నువ్వు గింజలవలె చేయగా అవి శత్రువుల తలలపై పడ్డాయి. మరియు ఆ శైలాస్త్రం భూమిని కూడ ఛేదించింది.

తతో వజ్రాస్త్రమకరోత్ సహస్రాక్షః పురందరః ।
తదోపలమహావర్షం వ్యశీర్యత సమన్తతః ॥96 ॥

సహస్రాక్షుడైన ఇంద్రుడు వెంటనే వజ్రాయుధాన్ని వదలగా అంతటా కురుస్తున్న గొప్ప రాళ్ళవర్షం చెదిరిపోయింది.

తతః ప్రశాన్తే శైలాస్త్రే జంభో భూధరసన్నిభః ।
ఐషీకమస్త్రమకరోత్ అభీతోఽతిపరాక్రమః ॥97॥

దానితో జంభుని శైలాస్త్రం ప్రశమించిపోగా, పర్వాతాకారుడు అతిపరాక్రమశాలియైన జంభుడు నిర్భయంగా ఐషీకమనే అస్త్రాన్ని వదిలాడు.

ఐషీకేణాగమన్నాశం వజ్రాస్త్రం శక్రవల్లభమ్ ।
విజృమ్భత్యథచైషీకే పరమాస్త్రేఽతిదుర్భరే ॥98 ॥

జజ్వాలుర్దేవసైన్యాని సస్యన్దనగజాని తు ।

ఐషీకాస్త్రం వలన ఇంద్రుని వజ్రాయుధం నశించిపోయింది. భరింపశక్యం కాని ఐషీకాస్త్రం విజృంభించగా రథాలు మరియు గజాలతో పాటు దేవతల సైన్యాలు జ్వలించిపోయాయి. (తగులబడిపోయాయి.)

దహ్యమానేష్వనీకేషు తేజసా సురసత్తమః॥ 99॥

ఆగ్నేయమస్త్రమకరోత్ బలవాన్ పాకశాసనః ।
తేనాస్త్రేణ తతస్త్వైన్ద్రం అగ్రసత్తదనన్తరమ్ ॥100॥

ఆ ఐషికాస్త్రము వలన దేవసైన్యములు దహించిపోతుండగా పాకశాసనుడైన ఇంద్రుడు ఆగ్నేయాస్త్రమును సంధించెను. (అగ్నేయాస్త్రాన్ని సంధించాడు.) ఆ ఆగ్నేయాస్త్రము జంభుని ఐషీకాస్త్రాన్ని మ్రింగింది.

తస్మిన్ ప్రతిహతే చాస్త్రే పావకాస్త్రం వ్యజృమ్భత ।
జజ్వాల కాయం జంభస్య సరథం చ ససారథిమ్ ॥101 ॥

ఐషీకాస్త్రం శాంతించిన వెంటనే ఆగ్నేయాస్త్రం విభృంభించింది. దానితో జంభుని శరీరం రథం మరియు రథసారథితో కూడ కాలిపోయింది.

తతః ప్రతిహతః సోఽథ దైత్యేన్ద్రః ప్రతిభానవాన్ ।
వారుణాస్త్రం ముమోచాథ శమనం పావకార్చిషామ్ ॥102 ॥

తన అస్త్రం ఆ విధంగా ప్రతిహతం కాగా, ప్రతిభావంతుడైన ఆ జంభాసురుడు అగ్నిజ్వాలలను ప్రశమింపజేసే వారుణాస్త్రాన్ని ప్రయోగించాడు.

తతో జలధరైర్వ్యోమ స్ఫురద్విద్యుల్లతాకులై : ।
గమ్భీరమురజధ్వానైః ఆపూరితమివామ్బరమ్ ॥103॥

కరీంద్రకరతుల్యాభిః జలధారాభిరమ్బరాత్ ।
పతన్తీభిర్జగత్సర్వం క్షణేనాపూరితం బభౌ ॥104॥

అపుడు వెంటనే క్షణకాలంలోనే ఆకాశమంతా మేఘాలతో, మెరసే మెరపులతో, గంభీరమైన ఉరుములతో నిండిపోయింది. మరియు ఏనుగు తొండంతో సమానమైన వర్షపు జలధారలతో సమస్త జగత్తు నిండి పోయింది.

శాన్తమాగ్నేయమస్త్రం తత్ ప్రవిలోక్య సురాధిపః ।
వాయవ్యమస్త్రమకరోత్ మేఘసంఘాతనాశనమ్ ॥105॥

జంభుని వారుణాస్త్రంతో శాంతించిన ఆగ్నేయాస్త్రాన్ని చూచి సురాధిపుడైన ఇంద్రుడు మేఘసమూహాన్ని నశింపజేసే వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు.

వాయవ్యాస్త్రబలేనాథ నిర్ధూతే మేఘమండలే ।
బభూవ విమలం వ్యోమ నీలోత్పలదలప్రభమ్ ॥106 ॥

వాయవ్యాస్త్ర బలంతో మేఘ సముదాయం చెదరిపోగా, ఆకాశం నిర్మలంగా నల్లకలువల వంటి కాంతితో ప్రకాశించింది.

వాయునా చాతిఘోరేణ కంపితాస్తే తు దానవాః ।
న శేకుస్తత్ర తే స్థాతుం రణే ఽతిబలినోఽపి యే ॥107॥

అతి ఘోరమైన వేగం గల వాయవ్యాస్త్రంతో కంపించిన దానవులు, బలవంతులైనప్పటికి యుద్ధంలో నిలువలేకపోయారు.

తదా జంభోఽభవచ్ఛైలో దశయోజనవిస్తృత : ।
మారుతప్రతిఘాతార్థం దానవానాం భయాపహః ॥108॥

ముక్తనానాయుధోదగ్రతేజోఽభిజ్వలితద్రుమః ।

దానవులకు భయం కలిగించిన వాయవ్యాస్త్రాన్ని ప్రతిఘటించడానికి జంభాసురుడు దశయోజన (పదియోజనాల) విస్తీర్ణం గల పర్వతరూపం ధరించాడు. మరియు అనేక విధాలైన ఆయుధాలను దేవతలపైకి సంధించాడు.

తతః ప్రశమితే వాయౌ దైత్యేన్ద్రే పర్వతాకృతౌ ॥109॥

మహాశనీం వజ్రమయీం ముమోచాశు శతక్రతుః ।
తయాశన్యా పతితయా దైత్యస్యాచలరూపిణః ॥110॥

కందరాణి వ్యశీర్యన్త సమన్తాన్నిర్ఝరాణితు ।
తతః సా దానవేంద్రస్య శైలమాయా న్యవర్తత ॥111॥

జంభాసురుడు పర్వతాకారం దాల్చగా ప్రశమించిన తన వాయువ్యాస్త్రాన్ని చూచి శతక్రతువైన ఇంద్రుడు పిడుగు వంటి వజ్రాస్త్రాన్ని వదలాడు. దానితో పర్వాతాకారంలో వున్న జంభునియొక్క, గుహలు, నదులు మొదలైనవన్నీ చీలిపోయాయి. ఇంకను ఆ దానవేంద్రుని శైలరూపమాయ కూడ తొలగిపోయింది.

నివృత్తశైలమాయోఽథ దానవేన్ద్రో మదోత్కటః ।
బభూవ కుంజరో భీమో మహాశైలసమాకృతిః ॥112॥

శైలరూపమైన మాయ తొలగిపోగా దానవేంద్రుడు వెంటనే పర్వతాకారం మరియు భయంకరమైన ఏనుగు రూపం దాల్చాడు.

స మమర్ద సురానీకం దన్తైశ్చాభ్యహనత్ సురాన్ ।
బభంజ పృష్ఠతః కాంశ్చిత్ కరేణావేష్ట్య దానవః ॥113॥

ఏనుగు రూపంలో వున్న దానవుడు సురసైన్యాన్ని మర్దించాడు. కొంత మంది దేవతలను తన దంతాలతో, మరికొంత మందిని పృష్ఠభాగంలో కొట్టాడు. ఇంకొందరిని తొండంతో చుట్టి క్రిందపడవేశాడు.

తతః క్షపయతస్తస్య సురసైన్యాని వృత్రహా ।
అస్త్రం త్రైలోక్యదుర్ధర్షం నారసింహం ముమోచ హ ॥114॥

ఆ విధంగా నశించిపోతున్న సురసైన్యాన్ని చూచి ఇంద్రుడు ముల్లోకాల చేత కూడ ఎదురింప శక్యంకాని నారసింహాస్త్రాన్ని సంధించాడు.

తతః సింహసహస్రాణి నిశ్చేరుర్మన్త్రతేజసా ।
కృష్ణదంష్ట్రాట్టహాసాని క్రకచాభనఖాని చ ॥115॥

దాని నుండి మంత్ర బలం చేత పదునైన కోరలతో రంపంతో సమానమైన గ్రోళ్ళతో వేలకొలది సింహాలు బయటకు వచ్చాయి.

తైర్విపాటితగాత్రోఽసౌ గజమాయాం వ్యపోథయత్ ॥

ఆ సింహాలచే చీల్చబడిన శరీరం గలవాడై, ఆ దైత్యుడు మాయాగజరూపాన్ని వదలి వేశాడు.

తతశ్చాశీవిషో ఘోరోఽభవత్ ఫణశతాకులః ॥116॥

విషనిఃశ్వాసనిర్దగ్ధం సురసైన్యం మహారథః ।
తతోఽస్త్రం గారుడం చక్రే శక్రశ్చారుభుజస్తదా ॥117॥

అపుడా మహారథుడైన దైత్యుడు వందలకొలది పడగలతో విషశ్వాసలతో భయంకరమైన సర్పరూపం దాల్చి దేవసైన్యాన్ని నశింపజేయసాగాడు. అది చూచి అతని పైకి ఇంద్రుడు గారుడాస్త్రాన్ని వదిలాడు.

తతో గరుత్మతస్తస్మాత్ సహస్రాణి వినిర్యయుః ।
తైర్గరుత్మద్భిరాసాద్య జమ్భో భుజగరూపవాన్ ॥ 118॥

కృతస్తు ఖండశో దైత్యః సాస్య మాయా వ్యనశ్యత ।

అంతట ఆ గరుడాస్త్రం నుండి వేలకొలది గరుడులుద్భవించి సర్పాకారుడైన జంభుని ఖండాలుగా చేయగా అతని సర్పాకారమైన మాయ నశించింది.

ప్రణష్టాయాం తు మాయాయాం తతో జంభో మహాసురః ॥119॥

చకార రూపమతులం చంద్రాదిత్యపథానుగమ్ ।
వివృత్తవదనో గ్రస్తుం ఇయేష సురపుంగవాన్ ॥120॥

సర్పాకారమైన మాయ నశించగా, జంభాసురుడు సూర్యచంద్రుల మార్గం వరకు వ్యాప్తమైన దేహం కలవాడై తన నోటిని విశాలంగా తెరిచి సురశ్రేష్ఠులను మ్రింగటానికి ప్రయత్నించాడు.

తతోఽస్య వివిశుర్వక్త్రం సమహారథకుంజరాః ।
సురసేనావిశద్ భీమం పాతాలోత్తానతాలుకమ్ ॥121॥

అపుడు మహారథికులూ, గజాలతో కూడిన దేవతల సైన్యం పాతాళం వలె పొడవైన కోరలు గల వాని నోటిలోకి పోయింది.

సైన్యేషు గ్రస్యమానేషు దానవేన బలీయసా ।
శక్రో దైన్యం సమాపన్నః శ్రాంతబాహుః సవాహనః ॥122॥

కర్తవ్యతాం నాధ్యగచ్ఛత్ ప్రోవాచేదం జనార్దనమ్ ॥
కిమనన్తరమత్రాఽస్తి కర్తవ్యస్యావశేషితమ్ ॥123॥

యదాశ్రిత్య ఘటామో ఽస్య దానవస్య యుయుత్సవః ।

బలిష్ఠుడైన దానవుని చేత దేవసైన్యము మ్రింగబడుచుండగా వాహనంపైన ఉన్న ఇంద్రుడు శ్రమపొందిన బాహువులు కలావాడై దీనత్వమును పొంది, ఏమి చేయవలెనో తోచక జనార్దనునితో ఇట్లు పలికెను. ఈ దానవునితో యుద్ధము చేయుటలో ఇంక మనము చేయగలిగినది ఏది మిగిలియున్నదని అడిగెను.

తతో హరిరువాచేదం వజ్రాయుధముదారధీః ॥124॥

న సామ్ప్రతం రణస్త్యాజ్యః త్వయా కాతరభైరవః ।
వర్ధస్వాశు మహామాయాం పురందర రిపుం ప్రతి ॥125॥

అపుడు వజ్రాయుధం కలిగిన ఇంద్రునితో బుద్ధిశాలియైన హరి ఈ విధంగా చెప్పాడు. పిరికితనంతో ఇపుడు యుద్ధం మానుకొనడం ఉచితం కాదు. పురందరా!వెంటనే శత్రువునుద్దేశించి నీ మాయని పెంపొందించు

మయైష లక్షితో దైత్యో ఉధిష్ఠితః ప్రాప్తపౌరుషః ।
మా శక్ర మోహమాగచ్ఛ క్షిప్రమస్త్రం స్మర ప్రభో ॥126॥

ఇంద్రా! ఈ దైత్యుడు మిక్కిలి పౌరుషాన్ని పొంది యుద్ధంలో స్థిరపడుతున్నట్లుగా నాకు కనబడుతున్నాడు. కావున నీవు మోహాన్ని పొందక వెంటనే ఇంకొక అస్త్రాన్ని స్మరించుకో.

తతః శక్రః ప్రకుపితో దానవం ప్రతి దేవరాట్ ।
నారాయణాస్త్రం ప్రయతో ముమోచాసురవక్షసి ॥127॥

అది వినిన దేవేంద్రుడు కోపంతో జంభుని వక్షఃస్థలంపై నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు.

ఏతస్మిన్నన్తరే దైత్యో వివృతాస్యో ఉగ్రసత్ క్షణాత్ ।
త్రీణి లక్షాణి గంధర్వకిన్నరోరగరక్షసామ్ ॥128॥

ఇంతలో (ఆనారాయణాస్త్రాన్ని ప్రయోగించే లోపలనే) ఆ దైత్యుడు నోరు విశాలంగా తెరచి మూడు లక్షల మంది గంధర్వ, కిన్నర, ఉరగాది జాతుల వారిని మ్రింగాడు.

తతో నారాయణాస్త్రం తత్ పపాతాసురవక్షసి ।
మహాస్త్రభిన్నహృదయః సుస్రావ రుధిరం చ సః ॥129॥

అదే సమయంలో నారాయణాస్త్రం ఆ దైత్యుని వక్షః స్థలంపై పడగా గుండె పగిలి ఆతని శరీరం నుండి రక్తం స్రవించింది.

రణాగారమివోద్గారం తత్యాజాసురనన్దనః ॥
తదస్త్రతేజసా తస్య రూపం దైత్యస్య నాశితమ్ ॥130॥

తరువాత అ అసురనందనుని శరీరం నారాయణాస్త్ర తేజస్సు చేత నశించిపోగా దైత్యుడు ఆ రణభూమిని వదలి వెళ్ళిపోయాడు.

తత ఏవాన్తర్దధే దైత్యో వియత్యనుపలక్షితః ।
గగనస్థః సదైత్యేన్ద్రః శస్త్రాసన మతీన్ద్రియమ్ ॥131॥

ముమోచ సురసైన్యానాం సంహారే కారణం పరమ్ ।
ప్రాసాన్ పరశ్వథాంశ్చక్రాన్ బాణవజ్రాన్ సముద్గరాన్ ॥132॥

కుఠారాన్ సహ ఖడ్గైశ్చ భిన్దిపాలనయోగుడాన్ ।
వవర్ష దానవో రౌద్రో హ్యవన్ధ్యానక్షయానపి ॥133॥

దైత్యేంద్రుడైన జంభుడు వెంటనే ఎవరికి కనబడకుండా ఆకాశంలో అంతర్ధానం చెంది, అక్కడి నుండే సురసైన్యాలను సంహరించడమే పనిగా అనేక విధాలైన అస్త్రాలను అనగా నిరర్థకం కానటువంటి ప్రాసాలను,

గొడ్డళ్ళను, చక్రాలను, బాణాలను, ముద్గరములను, కుఠారాలను, ఖడ్గాలను, భిందిపాలాలు మొదలగు వాటిని రౌద్రాకారుడై దేవతలపై ప్రయోగించాడు.

తైరస్త్రైర్దానవైర్ముక్తైః దేవానీకేషు భీషణైః ।
బాహుభిర్ధరణిః పూర్ణా శిరోభిశ్చ సకుండలైః ॥134॥

ఊరుభిర్గజహస్తాభైః కరీన్ద్రైర్వాచలోపమైః ।
భగ్నేషాదండచక్రాక్షైః రథైః సారథిభిః సహ ॥135॥

దేవతల సైన్యంపై ఆ దానవునిచే సంధించబడిన భయంకరాలైన అస్త్రాలచేత అనేక మంది దేవతలు గతప్రాణులైనారు. కుండలాలతో గూడిన శిరస్సులు, ఏనుగు తొండం వంటి తొడలు, పర్వతాల వంటి ఏనుగులు, విరిగిన కాడులు, ఇరుసులు, రథాలు, సారథులు మొదలగు వానితో భూమి నిండి పోయింది.

దుఃసంచారా ఽభవత్ పృథ్వీ మాంసశోణితకర్దమా ।
రుధిరోగ్రహ్రదావర్తా శవరాశిశిలోచ్చయైః ॥136॥

భూమి మాంసపు ముద్దలతోను, రక్తపు మడుగులతోను, గుట్టల వలె పడిపోయిన శవరాశులతోను నిండినదై సంచరించుటకు కూడా సాధ్యం కానిదయింది.

కబంధనృత్యసంకులే స్రవద్వసాస్రకర్దమే జగత్త్రయోపసంహృతా సమే సమస్తదేహినామ్ ।
శృగాల గృధ్రవాయసాః పరం ప్రమోదమాదధుః క్వచిద్వికృష్టలోచనః శవస్య రౌతి వాయసః ॥137॥

యుద్ధభూమిలో అంతటా కళేబరాలు నృత్యం చేస్తున్నాయి. స్రవించిన రక్తంతో బురదవలె ఏర్పడింది. ఈ స్థితి ప్రాణులందరికి ముల్లోకాల ప్రళయం వలె కనబడింది. నక్కలు, గ్రద్దలు, కాకులు మొదలగునవి చాలా సంతోషం పొందాయి. ఒక చోట శవం కన్నును పీకుతూ ఒక కాకి అరుస్తున్నది.

వికృష్టపీవరాన్త్రకాః ప్రయాన్తి జంబుకాః క్వచిత్ క్వచిత్ స్థితోఽతిభీషణః స్వచంచుచర్వితో బకః ।
మృతస్య మాంసమాహరన్ శ్వజాతయశ్చ సంస్థితాః క్వచిద్ వృకో గజాసృజం పపౌ నిలీయతాన్త్రతః ॥138॥

ఒక చోట నక్కలు శవాలలోని బలిసిన ప్రేగులను ఈడ్చుకొనిపోతున్నాయి. ఒక చోట కొంగ ఒకటి ముక్కుతో దేనినో నములుతూ భయంకరంగా కనపడింది. శునకాలు కూడ మృతదేహపు మాంసాలను తింటున్నాయి. ఒక చోట తోడేలు ఒకటి ఏనుగు రక్తాన్ని త్రాగి దానిలోనే దాగి కూర్చొన్నది.

క్వచిత్తురంగమండలీ వికృష్యతే శ్వజాతిభిః క్వచిత్ పిశాచజాతకైః ప్రపేతశోణితాసవైః ।
స్వకామినీయుతైః ద్రుతం ప్రమోదమత్తసంభ్రమైః మమేతదానయాననం ఖురోఽయమస్తు మే ప్రియః ॥139॥

ఒక చోట కుక్కలు గుర్రాల శవాలను ఈడ్చుకొని పోతున్నాయి. ఒక చోట పిశాచజాతులు రక్తధారను సేవించి తమ కాంతులతో గూడ వేగంగా పరుగెత్తుతూ ప్రమోదంతో ఉన్మత్తులవుతున్నారు. వారిలో కొంత మంది ఈ శవపు ముఖం నాకు ఇష్టమని, కొంత మంది గుర్రపు గిట్టలు నాకు ఇష్టం కావున తెచ్చి ఇమ్మని అడుగుతున్నారు.

కరోఽయమబ్జసన్నిభో మమాస్తు కర్ణపూరకః సరోషమీక్షతేఽపరా వపాం వినా ప్రియం తదా ।
పరా ప్రియా హ్యావాపయద్ ధృతోష్ణశోణితాసవమ్ వికృష్య శావచర్మ తత్ ప్రబద్ధసాంద్రపల్లవమ్ ॥140॥

ఈ చేయి పద్మంవలె ఉన్నది కావున నాకు కర్ణాభరణంగా, పనికి వస్తుంద కొంత మంది స్త్రీలు అడుగుతుండగా, ఇంకొక స్త్రీ పిశాచం తాను అడిగిన మాంసాదికం తేలేదని కోపంతో ప్రియుని చూస్తున్నది. మరొక స్త్రీ పిశాచి తన ప్రియుడు తెచ్చిన ఉష్ణరక్తమనే ఆసవాన్ని (సారాయిని) త్రాగటానికి ఒక శవం చర్మాన్ని ఒలిచి చిగురాకుల దొన్నెవలె చేసికొన్నది.

చకార యక్షకామినీ తరుం కుఠారపాటితమ్ ।
గజస్య దన్తమాత్మజం ప్రగృహ్య కుంభసంపుటమ్ ॥
విపాట్య మౌక్తికం పరం ప్రియప్రసాదమిచ్ఛతే ।
సమాంసశోణితాసవం పపుశ్చ యక్షరాక్షసాః॥141॥

ఒక యక్షస్త్రీ గొడ్డలితో చెట్టును నరికి దానికి ఏనుగు కుంభస్థలాన్ని ఊయలగా కట్టి మరొక ఏనుగు దంతాన్ని శిశువుగా చేసికొంది. ఏనుగు కుంభస్థలం నుండి లభించిన ముత్యాలను ప్రియునకిచ్చి వాని అనుగ్రహం కోరింది. కొంత మంది యక్షులు, రాక్షసులు మాంసంతో కూడిన రక్తాస్రవాన్ని త్రాగుతున్నారు.

మృతాశ్వకేశవాసితం రసం ప్రగృహ్య పాణినా ప్రియావిముక్తజీవితం సమానయాసృగాసవమ్ ।
న పథ్యతాం ప్రయాతి మే గతం శ్మశానగోచరమ్ నరస్య తజ్జహాత్యసౌ ప్రశస్య కిన్నరాననమ్ ॥142॥

ఒక పిశాచం ఇలా అంటున్నది. శ్మశానంలో లభిస్తున్న ఈ రక్తం నాకు రుచించటం లేదు. ప్రియురాలి కొరకై ప్రాణ త్యాగం చేసిన ఆ కిన్నరుని రక్తాసవాన్ని తీసుకురా, అదికూడ మృతిచెందిన అశ్వం కేశాల వాసన వలె ఉండాలి.

స నాగ ఏష నో భయం దధాతి ముక్తజీవితః న దానవస్య శక్యతే మయా తదేకయాఽననమ్ ।
ఇతి ప్రియాయ వల్లభా వదన్తి యక్షయోషితః పరే కపాలపాణయః పిశాచయక్షరాక్షసాః ॥143॥

చనిపోయిన ఆ ఏనుగును చూచి నాకు ఏ మాత్రం భయం కలుగటం లేదు. ఈ దానవుని ముఖాన్ని నేను ఒక్కదానినే తినలేను అని ఇలా యక్షిణులు తమ ప్రియులతో చెబుతున్నారు. మరి కొంతమంది యక్షరాక్షస పిశాచాలు కపాలాలను చేతిలో పట్టుకొని తిరుగుతున్నారు.

వదన్తి దేహి దేహి మే మమాతిభక్ష్యచారిణః పరేఽవతీర్య శోణితాఽపగాసు ధౌతమూర్తయః ।
పితౄన్ ప్రతర్ప్య దేవతాః సమర్చయంతి చామిషైః గజోడుపే సుసంస్థితాస్తరంతి శోణితం హ్రదమ్ ॥144॥

అతిగా తినేటువంటి నాకు ఇంకనూ ఇమ్మని కొందరడుగుతున్నారు. మరికొంతమంది రక్తపు నదులలో స్నానం చేస్తున్నారు. కొందరు రక్తంతో పితరులకు తర్పణాలు అర్పిస్తున్నారు. మరికొందరు ఈ ఏనుగులను తెప్పలుగా చేసికుని నెత్తుటి చెరువును దాటుతున్నారు.

ఇతి ప్రగాఢసంకటే సురాసురే సుసంగరే ।
భయం విసృజ్య దుర్జయా భటాః స్ఫురంతి మానినః ॥145॥

ఈ విధంగా మిక్కిలి సంకటమైన దేవాసుర యుద్ధంలో అభిమానులు మరియు వీరులైన భటులందరూ భయరహితులై ప్రకాశిస్తున్నారు.

తతః శక్రో ధనేశశ్చ వరుణః పవనోఽనలః ।
యమోఽపి నిరృతిశ్చాపి దివ్యాస్త్రాణి మహాబలాః ॥146॥

ఆకాశే ముముచుః సర్వే దానవానభిసంధ్య తే ।
అస్త్రాణి వ్యర్థతాం జగ్ముః దేవానాం దానవాన్ ప్రతి ॥147॥

ఆ సమయంలో ఇంద్రుడు, కుబేరుడు, వరుణుడు వాయువు, అగ్ని, యముడు, నిరృతి మొదలగు మహాబలులైన అష్టదిక్పాలకులందరు అనేక దివ్యాస్త్రాలను రాక్షసులపైకి సంధించి ఆకాశం లోకి వదిలారు. కాని దానవులపైకి సంధించిన అస్త్రాలన్నీ వ్యర్థాలయినాయి.

సంరంభేణావ్యయుధ్యంత సంహతాస్తుములేన చ ।
గతిం న వివిదుశ్చాపి శ్రాన్తా దైత్యస్య దేవతాః ॥148॥

దైత్యాస్త్రభిన్నసర్వాంగాః హ్యకించిత్కరతాం గతాః ।
పరస్పరం వ్యలీయన్త గావః శీతార్దితా ఇవ ॥149॥

వారంతా సంరంభంతో తుములయుద్ధం కూడ చేశారు. అపుడు బాగా అలసిపోయిన దేవతలకు ఏమి చేయాలో తోచలేదు. దైత్యుల అస్త్రాలతో దేవతల శరీరాలపై అనేక గాయాలయినాయి. మరియు చలికి తాళలేక ఆవులు వాటి గుంపులో కలిసిపోవటానికి యత్నించినట్లు దేవతలు కూడ ఒకరితో నింకొకరు ముడుచుకొంటున్నారు.

తదవస్థాన్ హరిర్దృష్ట్వా దేవాన్ శక్రమువాచ హ ।
బ్రహ్మాస్త్రం స్మరవేంద్ర యస్యాఽవధ్యోన విద్యతే ।
విష్ణునా చోదితః శక్రః సస్మారాస్త్రం మహౌజసమ్ ॥150॥

దేవతల ఆ అవస్థలను చూచిన విష్ణువు ఇంద్రునికి బ్రహ్మాస్త్రాన్ని గుర్తుచేశాడు. బ్రహ్మాస్త్రంతో వధింపబడని వాడు లేడని చెప్పాడు. అపుడు విష్ణువుచేత ప్రేరేపించబడిన ఇంద్రుడు మహాశక్తి గలిగిన బ్రహ్మాస్త్రాన్ని స్మరించుకొన్నాడు.

సంపూజితం నిత్యమరాతినాశనం సమాహితం బాణమమిత్రఘాతినమ్ ।
ధనుష్యజయ్యే వినియోజ్య బుద్ధిమాన్ అభూత్తతో మన్త్రసమాధిమానసః ॥151॥

సమన్త్రముచ్చార్య యతాన్తరాశయో వధాయ దైత్యస్య ధియాభిసన్ధ్యాఽతు ।
వికృష్య కర్ణాన్తమకుంఠదీధితిం ముమోచ వీక్ష్యామ్బరమార్గమున్ముఖః ॥152॥

నిత్యం బాగా పూజించబడే శత్రువులను నశింపచేసే సంధించిన వెంటనే శత్రువులను సంహరించే బ్రహ్మాస్త్రాని ధీశాలి అయిన ఇంద్రుడు ధనుస్సులో ఎక్కుపెట్టి సమాహితచిత్తుడై అస్త్రపు మంత్రాన్ని ఉచ్చరించి, ఆకార్ణాంతం లాగిన ధనుస్సు నుండి ఆ దైత్యుని వధించటానికి ఆకాశం వైపు చూచి బాణాన్ని వదిలాడు.

(పూజించదగినదీ శత్రనాశనాన్ని కలిగేది దాచబడిన బాణాన్ని బుద్ధిమంతుడైన ఇంద్రుడు ఓడించరాని ధనుస్సులో ఎక్కించిమంత్రాన్ని ధ్యానించసాగాడు. బ్రహ్మాస్త్రమంత్రాన్ని ఉచ్చరించి లోపల స్థిరనిశ్చయం కలవాడై సంధించి చెవివరకు లాగి ఆకాశం పైకి చూస్తూ వదిలాడు.)

అథాఽసురః ప్రేక్ష్య మహాస్త్రమాహితం విహాయ మాయామవనౌ వ్యతిష్ఠత్ ।
ప్రవేపమానేన ముఖేన శుష్యతా బలేన గాత్రేణ చ సమ్భ్రమాకులః ॥153॥

అపుడు ఆ జంభాసురుడు బ్రహ్మాస్త్ర సంధానాన్ని చూచి వెంటనే తన మాయారూపాన్ని వదిలి నేలపై నిలబడ్డాడు. కంపిస్తున్న శరీరంతో, ఎండిపోతున్న నోటితో బలహీనమవుతున్న దేహంతో ఆ అసురుడు సంభ్రమానికి లోనయ్యాడు.

తతస్తు తస్యాస్త్రవరాభిమన్త్రితః శశోఽర్ధచంద్రప్రతిమో మహారణే।
పురన్దరస్యాసనబంధుతాం గతో నవార్కబిమ్బం వపుషా విడమ్బయన్ ॥154॥

ఇంతలో ఆయుధాలలో శ్రేష్ఠమైన, అర్ధచంద్రాకారంలో వున్న ఆ బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి యుద్ధరంగంలో ఆ రాక్షసునిపై సంధించగా, ఇంద్రుని ఆసన బంధుత్వాన్ని పొందిన ఆ అస్త్రం సూర్యబింబాన్ని పోలిన రూపంలో శత్రువుపై పడింది.

కిరీటకోటి స్ఫుటకాన్తిసంకటం సుగంధినానా కుసుమాధివాసితమ్ ।
ప్రకీర్ణ ధూమజ్వలనాభమూర్ధజం పపాత జమ్భస్య శిరః సకుండలమ్ ॥155॥

కోటి కిరీటకాంతులతో స్ఫుటంగా ప్రకాశిసున్న, అనేక విధ సుగంధ పుష్పవాసనలతో కూడివున్న, ధూమావృతమైన అగ్నిని బోలి పరివ్యాప్తాలైన వెంట్రుకలు గల మరియు కుండలాలు గల ఆ జంభాసురుని శిరస్సు క్రిందపడిపోయింది.

తస్మిన్ వినిహతే జమ్భే దానవేన్ద్రాః పరాఙ్ముఖాః ।
తతస్తే భగ్నసంకల్పాః ప్రయయుర్యత్రతారకః ॥156॥

తాంస్తు త్రస్తాన్ సమాలోక్య శృత్వా రోషమగాత్పరమ్ ।
స జమ్భదానవేంద్రం తు సురైః రణముఖే హతమ్ ॥157॥

ఆ విధంగా జంభాసురుడు వధింపబడగా దానవవీరులు యుద్ధం నుండి పరాఙ్ముఖులై భగ్నమైన ఆశలు గలవారై, తారకాసురుని దగ్గరకు వెళ్ళారు. భయపడిపోయిన ఆ దానవులను చూచి, దేవతల చేతిలో మరణించిన జంభాసురుని గురించి విని మిక్కిలి రోషాన్ని పొందాడు.

సావలేపం ససంరమ్భం సగర్వం సపరాక్రమమ్ ।
సావిష్కారమనాకారం తారకో భావమావిశత్ ॥158॥

అంత తారకాసురునికి అభిమానం, ఉద్వేగం, గర్వం, పరాక్రమం, అహంకాం, రోషం, మొదలగు భావములెన్నో కలిగాయి.

స జైత్రం రథమాస్థాయ సహస్రేణ గరుత్మతామ్ ।
సంరమ్భాద్దానవేన్ద్రస్తు సురైః రణముఖే గతః ॥159॥

వేయి గరుత్మంతులతో సమానమైన జైత్రరథాన్ని అధిరోహించి దానవేంద్రుడైన తారకుడు మిక్కిలి సంరంభంతో దేవతలతో యుద్ధం చేయడానికి యుద్ధభూమికి వెళ్ళాడు.

సర్వాయుధపరిష్కారః సర్వాస్త్రపరిరక్షితః ।
త్రైలోక్య ఋద్ధిసమ్పన్నః సువిస్తృతమహాసనః ॥160॥

రణాయాభ్యపతత్తూర్ణం సైన్యేన మహతా వృతః ।

సర్వాయుధాలతో కూడుకొన్నవాడై, అనేక అస్త్రాలతో రక్షించబడుతున్నవాడై, ముల్లోకాలలోని సర్వసమృద్ధాలను కలిగినవాడై, విశాలమైన ఆసనం కలవాడై, గొప్ప సైన్యంతో చాలా వేగంతో తారకుడు రణరంగానికి వెళ్ళాడు.

జమ్భాస్త్రక్షత సర్వాంగం త్యక్త్వైరావతదన్తినమ్ ॥161॥

సజ్జం మాతలినా గుప్తం రథమిన్ద్రో உధ్యతిష్ఠత।
తప్తహేమపరిష్కారం మహారత్నసమన్వితమ్ ॥162॥

చతుర్యోజనవిస్తీర్ణం సిద్ధసంగపరిష్కృతమ్ ।
గంధర్వకిన్నరోద్గీతం అప్సరోనృత్యసంకులమ్ ॥163॥

సర్వాయుధమసమ్బాధం విచిత్రరచనోజ్జ్వలమ్ ।

జంభాసురుని అస్త్రాల దెబ్బలతో గాయపడిన శరీరం గల ఇంద్రుడు ఐరావతం వదిలి, మాతలిచే రక్షించబడిన రథాన్ని అధిష్ఠించాడు. అది శుద్ధి చేయబడిన బంగారపు అలంకారాలు కలది, మహారత్నాలతో అలంకరించ బడినది, నాలుగుయోజనాల విస్తీర్ణం గలది, సిద్ధుల సమూహాల చేత పరిష్కృతమైనది, గానం చేస్తూన్న గంధర్వులు, కిన్నరులు కలది, అప్సరసల నృత్యంతో పరివ్యాప్తమైనది, సర్వాయుధాలతో కూడినది మరియు విచిత్రాలైన కూర్పులతో కూడినదై ప్రకాశిస్తూ ఉండినది.

తం రథం దేవరాజస్య పరివార్య సమన్తతః ॥164॥

దంశితా లోకపాలాస్తు తస్థుః సగరుడధ్వజాః ।

దేవరాజైన ఇంద్రుని ఆ రథాన్ని అన్ని వైపుల నుండి,అష్టదిక్పాలకులు శ్రీహరితో కూడ చుట్టుముట్టారు.

తతశ్చచాల వసుధా తతో రూక్షో మరుద్వవౌ ॥165॥

తతో ఽ మ్బుదయ ఉద్భూతాః తతో నష్టా రవిప్రభా ।
తతస్తమః సముద్భూతం నాతోఽ దృశ్యన్త తారకాః ॥166॥

తతో జజ్వలు రస్త్రాణి తతోఽ కమ్పతవాహినీ ।

అపుడు భూమి కంపించింది. వాయువు భయంకరంగా వీచింది. సముద్రాలు అల్లకల్లోలాలయ్యాయి. సూర్యుని ప్రకాశం (కాంతి) నశించిపోయింది. అంతటా చీకటి వ్యాపించింది. నక్షత్రాలు కనబడలేదు. ఆయుధాలు జ్వలించాయి. సైన్యం కంపించింది.

ఏకతస్తారకో దైత్యః సురసంఘస్తు చైకతః ॥167॥

లోకావసాదమేకత్ర జగత్పాలనమేకతః ।
చరాచరాణి భూతాని సురాసురవిభేదతః ॥168॥

తద్విధాప్యేకతాం యాతం దదృశుః ప్రేక్షకా ఇవ
యద్వస్తు కించిల్లోకేషు త్రిషు సత్తాస్వరూపకమ్।
తత్తత్రాదృశ్యతాశేషం ఖిలీభూతవిభూతికమ్ ॥169॥

ఒక వైపు తారకాసురుడు మరొక వైపు దేవసమూహాలు, ఒక వైపు లోకనాశం మరొక వైపు జగత్పాలనం, ఈ విధంగా దేవతలకు రాక్షసులకు కలిగిన విభేదాన్ని సకల చరాచరప్రపంచం ప్రాణులన్నీ కూడ ప్రేక్షకుల వలె చూస్తున్నారు. ముల్లోకాలలో ప్రతి వస్తువు తన సత్వాన్ని (రూపాన్ని) కోల్పోయింది. అశేషలోకమంతా నశించిపోయిన ఐశ్వర్యాలు కలది వలె కనబడింది.

అస్త్రాణి తేజాంసి ధనాని ధైర్యం సేనాబలం వీర్యపరాక్రమౌ చ ।
సత్త్వౌజసాం తన్నికరం బభూవ సురాసురాణాం తపసో బలేన ॥170॥

అస్త్రాలు, తేజస్సు, ధనం, ధైర్యం, సేనాబలం, వీర్యం, పరాక్రమం, మొదలైనవన్నీ నిరీర్యాలయ్యాయి. కేవలం తపోబలం చేతనే సంపాదించిన దేవతల మరియు రాక్షసుల సత్త్వౌజస్సులు రెండూ పోటీపడుతున్నాయి.

అథాభిముఖమాయాన్తం నవభిర్నతపర్వభిః ।
బాణైరనలకల్పాగ్రైః బిభిదుస్తారకం హృది ॥171॥

అపుడు తమ ముందుకు వస్తున్న తారకాసురుని చూచి దేవతలు అగ్నితో సమానమైన అగ్రభాగం గల తొమ్మిదేసి బాణాలతో ఆ దైత్యుని హృదయం పై కొట్టారు.

స తానచింత్య దైత్యేన్ద్ర సురబాణాన్ గతాన్ హృది ।
నవభిర్నవభిర్బాణైః సురాన్ వివ్యాధ దానవః ॥172॥

తన హృదయం పై పడుతున్న దేవతల బాణాలను లెక్కచేయక దైత్యేంద్రుడైన తారకుడు కూడ వారిని తొమ్మిదేసి బాణాలతో కొట్టాడు.

జగద్ధరణ సమ్భూతైః శల్యైరివ పురస్సరైః ।
తతోఽచ్ఛిన్నం శరవ్రాతం సంగ్రామే ముముచుః సురాః ॥173॥

అనన్తరం చ కాన్తానాం అశ్రుపాతమివానిశమ్ ।
తదప్రాప్తం వియత్యేవ నాశయామాస దానవః ॥174॥

శరైర్యథా కుచరితైః ప్రఖ్యాతం పరమాగతమ్ ।
సునిర్మలం క్రమాయాతం కుపుత్రః స్వం మహాకులమ్ ॥175॥

జగత్తును హరించి వేయడానికి ఉద్భవించినట్లున్న, ఎదురు లేకుండా ముందుకు వెళ్ళగలిగినట్లున్న అనేక బాణాలను దేవతలు యుద్ధరంగంలో సంధించారు. స్త్రీ కన్నుల నుండి ఎడతెరిపి లేకుండా కారే కన్నీటి వలె దేవతలు బాణాలను ఎడతెరిపి లేకుండా రాక్షసునిపై సంధించారు. ఆ బాణాలు తనను చేరటానికి ముందే ఆ దానవుడు ఏ విధంగానైతే ఒక కుపుత్రుడు నిర్మలమైన, పరంపరాగతమైన, ప్రఖ్యాతమైనట్టి వంశాన్ని తన చెడు ప్రవర్తనతో నాశనం చేస్తాడో, ఆ విధంగా ఆ దేవతల బాణాలను ఆకాశంలోనే నాశనం కావించాడు.

తతో నివార్య తద్ బాణజాలం సురభుజేరితమ్ ।
బాణైర్వ్యోమ దిశః పృథ్వీం పూరయామాస దానవః ॥176॥

దేవతల బాణసమూహాన్ని నిర్మూలించిన దానవుడు తన బాణాలను ఆకాశంలో, భూమిమీద అన్ని దిక్కులలో, వ్యాపింపజేశాడు.

చిచ్ఛేద పుంఖదేశేషు స్వకే స్థానే చ లాఘవాత్ ॥
బాణజాలైః సుతీక్ష్ణాగ్రైః కంకబర్హిణవాజితైః ॥177॥

కర్ణాన్తకృష్టైర్విమలైః సువర్ణరజతోజ్జ్వలైః ।
శాస్త్రార్థైః సంశయప్రాప్తాన్ యథార్థాన్యై వికల్పితైః ॥178॥

తన బాణాలతో దేవతల బాణాల అగ్రభాగాలను అత్యంత సులభంగా ఛేదించాడు. మిక్కిలి తీక్ష్ణాలైన, నెమళ్ళ ఈకలతో కట్టిన, బంగారంతో, వెండితో కూడ ప్రకాశిస్తూన్న తన బాణాలు ధనుస్సు పై ఎక్కుపెట్టి ఆకర్ణాంతం అల్లెత్రాడును లాగి మహావేగంతో దేవతలపై సంధించాడు. శాస్త్రార్థం జరిగేటప్పుడు సంశయాలను యథార్థవాదనలతో ఖండించినట్లు ఆ తారకుడు దేవతల బాణాలను ఛేదించాడు.

తతః శతేన బాణానాం శక్రం వివ్యాధ దానవః ।
నారాయణం చ సప్తత్యా నవత్యా చ హుతాశనమ్ ॥179॥

అటు తర్వాత ఆ దానవుడు వంద బాణాలతో ఇంద్రుని, డెబ్బది బాణాలతో నారాయణుని, తొంబై బాణాలతో అగ్నిదేవుని కొట్టాడు.

దశభిర్మారుతం మూర్ధ్ని యమం దశభిరేవ చ ।
ధనదం చైవ సప్తత్యా వరుణం చ తథాష్టభిః ॥180॥
వింశత్యా నిఋృతిం దైత్యః పునశ్చాష్టభిరేవ చ ।
వివ్యాధ పునరేకైకం దశభిర్దశభిః శరైః ॥181॥

ఇంకనూ పది బాణాలతో వాయుదేవుని, పదింటితో యముని, డెబ్బై బాణాలతో కుబేరుని, ఎనిమిదింటితో వరుణుని, ఇరవై బాణాలతో నిఋృతిని మరియు మరల ఒక్కొక్కరిని పదేసి బాణాలతో ఆ దైత్యుడు కొట్టాడు.

తథా చ మాతలిం దైత్యో వివ్యాధ త్రిభిరాశుగైః ।
గరుడం దశభిశ్చైవ స వివ్యాధ పతత్రిభిః ॥182॥

అట్లే వేగవంతుడైన రాక్షసుడు మూడు బాణములతో మాతలిని, పదింటితో గరుడుని కూడ కొట్టాడు.

పునశ్చ దైత్యో దేవానాం తిలశో నవపర్వభిః ।
చకార వర్మజాతాని చిచ్ఛేద చ ధనూంషి తు ॥
తతో వికవచా దేవా విధనుష్కాః శరైః కృతాః ॥183॥

మరల ఆ దైత్యుడు దేవతల బాణాలను ధనుస్సులను ముక్కలు ముక్కలుగా ఛేదించాడు మరియు దేవతలందరిని కవచాలు, ధనుస్సులు లేనివారిగా చేశాడు.

అథాన్యాని చాపాని తస్మిన్ సరోషాః రణే లోకపాలాః గృహీత్వా సమన్తాత్ ।
శరైరక్షయైర్దానవేన్ద్రం తతక్షుః తదా దానవోఽమర్షసంరక్తనేత్రః॥184॥

శరానగ్నికల్పాన్ వవర్షామరాణాం తతో బాణమాదాయ కల్పానలాభమ్।
జఘానోరసి క్షిప్రమిన్ద్రం సుబాహుం మహేన్ద్రోఽప్యకమ్పద్రథోపస్థ ఏవ ॥185॥

అపుడు లోకపాలకులైన దేవతలు కూడ యుద్ధంలో రోషంతో వేరే ధనుస్సులు, బాణాలు తీసుకుని దానవేంద్రుడైన తారకుని కొట్టారు. వెంటనే ఆ దానవుడు కూడ రక్తనేత్రుడై అగ్నితో సమానమైన అనేక బాణాలను దేవతలపై వర్షింపజేశాడు. మరియు ఇంకొక తీక్ష్ణమైన బాణంతో దృఢమైన బాహువులు కలిగిన ఇంద్రుని వక్షఃస్థలంలో కొట్టాడు. దానితో ఇంద్రుడు రథంలోనే వణికిపోయాడు.

విలోక్యాన్తరిక్షే సహస్రార్కబిమ్బం పునర్దానవో విష్ణుముద్భూతవీర్యమ్ ।
శరాభ్యాం జఘానాంసమూలే సలీలం తతః కేశవస్యాపతచ్ఛార్ఙ్గమగ్రే ॥186॥

అంతరిక్షంలో వేయి సూర్యబింబాలను చూచి అది విష్ణువే నని తలచి ఆ దానవుడు బాణాలతో విష్ణువు భుజమూలంలో కొట్టాడు. దానివలన కేశవుని ధనుస్సు క్రిందపడిపోయింది.

తతస్తారకః ప్రేతనాథం పృషత్కైః వసుం తస్య సవ్యే స్మరన్ క్షుద్రభావమ్।
శరైరగ్నికల్పైర్జలేశస్య కాయం రణే ఽశోషయద్ దుర్జయో దైత్యరాజః ॥187॥

తరువాత దుర్జయుడైన తారకుడు క్షుద్రభావన కలవాడై బాణాలతో ప్రేతనాథుడైన యముని, అతనికి దక్షిణం వైపువున్న వసువును కొట్టాడు. మరియు అగ్ని సదృశాలైన బాణాలతో జలేశుడైన వరుణుని కూడ ఎండగొట్టాడు.

శరైరగ్నికల్పైశ్చకారాశు దైత్య స్తథా రాక్షసాన్ భీతభీతాన్ దిశాసు।
పృషత్కైశ్చ రూక్షైః వికారప్రయుక్తం చకారానిలం లీలయైవాసురేశః ॥188॥

ఇంకను యుద్ధంలో భీతావహులైన రాక్షసులను పలుదిశలకు పంపించి, ఆ అసురేశుడు తీక్ష్ణాలైన బాణాలతో వాయుదేవుని కూడ కొట్టాడు.

క్షణాల్లబ్ధచిత్తాః స్వయం విష్ణుశక్రానలాద్యాః సుసంహత్య తీక్ష్ణైః పృషత్కైః ।
ప్రచక్రుః ప్రచండేన దైత్యేన సార్ధం మహాసజ్గరం సజ్గరగ్రాసకల్పమ్ ॥189॥

తారకాసురుడు చేస్తున్న యుద్ధాన్ని చూచి క్షణకాలంలోనే తేరుకున్న విష్ణువు, ఇంద్రుడు, అగ్ని మొదలైన వారంతా ఏకమై ప్రచండుడైన ఆ దైత్యునితో భీకరమైన యుద్ధం చేశారు. పదునైన బాణాలతో వానిని కొట్టారు.

అథానమ్య చాపం హరిస్తీక్ష్ణబాణైః హనత్ సారథిం దైత్యరాజస్య హృద్యమ్ ।
ధ్వజం ధూమకేతుః కిరీటం మహేన్ద్రో ధనేశో ధనుః కాంచనానద్ధపృష్ఠమ్ ॥
యమో బాహుదండం రథాంగాని వాయుః నిశాచారిణామీశ్వరస్యాపి వర్మ ॥190॥

హరి హృద్యమైన తన ధనుస్సును తీసుకుని పదునైన బాణాలతో ఆ దైత్యుని సారథిని కొట్టాడు, మరియు అగ్ని ఆతని ధ్వజాన్ని, ఇంద్రుడు కిరీటాన్ని, కుబేరుడు వాడి బంగారపు ధనుస్సును, యముడు భుజదండాన్ని, వాయువు రథాంగాలను, నిరృతి ఆ నిశాచరేశుని కవచాన్ని కొట్టారు.

దృష్ట్వా తద్యుద్ధమమరైః అకృత్రిమపరాక్రమమ్ ।
దైత్యనాథః కృతం సంఖ్యే స్వబాహుయుగబాన్ధవః ॥191॥

ముమోచ ముద్గరం భీమం సహస్రాక్షాయ సంగరే ॥

అసాధారణమైన పరాక్రమంతో యుద్ధం చేస్తున్న దేవతలను చూచి దైత్యనాథుడైన తారాకాసురుడు తన బాహువులే సహాయకులుగా చేసికొని భయంకరమైన ముద్గరాన్ని ఇంద్రునిపైకి విసిరాడు.

దృష్ట్వా ముద్గరమాయాన్తం అనివార్యమథామ్బరే ॥ 192 ॥

రథాదాప్లుత్య ధరణీమగమత్ పాకశాసనః ।
ముద్గరోఽపి రథోపస్థే పపాత పరుషస్వనః ॥ 193 ॥

స రథం చూర్ణయామాస న మమార చ మాతలిః ।

ఆకాశమార్గాన వస్తున్న అనివార్యమైన ఆ ముద్గరాన్ని చూచి ఇంద్రుడు రథం నుండి దూకి భూమిపై పడ్డాడు. ముద్గరం కూడ పరుషమైన ధ్వనితో రథం పై పడి దానిని చూర్ణం చేసింది. కాని మాతలిని మాత్రం వధించలేదు.

గృహీత్వా పట్టిశం దైత్యో జఘానోరసి కేశవమ్ ॥ 194 ॥

స్కన్ధే గురుత్మతః సోఽపి నిషసాద విచేతనః ।
ఖడ్గేన రాక్షసేంద్రస్య నిచకర్త చ వాహనమ్॥ 195 ॥

పట్టిశమనే ఆయుధంతో కేశవుని వక్షః స్థలంలో కొట్టగా అతడు అచేతనుడై గరుడునిపై పడిపోయాడు. ఆ దైత్యుడు నిర్‌ృతిని అతని వాహనాన్ని కూడ ఖండించాడు.

యమం చ పాతయామాస భూమౌ దైత్యో భుశుండినా ।
వహ్నించ భిందిపాలేన తాడయామాస మూర్ధని ॥ 196 ॥

దైత్యుడు భుశుండి అనే ఆయుధంతో యముని నేలపై పడగొట్టాడు. మరియు భిందిపాలంతో అతని తలపై (శిరస్సుపై) కొట్టాడు.

వాయుం చ దోర్భ్యాముత్క్షిప్య పాతయామాస భూతలే ।
ధనేశం చ ధనుష్కోట్యా కుట్టయామాస కోపనః ॥ 197 ॥

వాయువును తన బాహువులతో పైకెత్తి నేలపై పడవేశాడు. మరియు కోపం గలవాడై ధనుస్సుతో కుబేరుని కొట్టాడు.

తతో దేవనికాయానాం ఏకైకం సమరే తతః ।
జఘానాస్త్రైరసంఖ్యేయైః దైత్యేన్ద్రో ఽమితవిక్రమః ॥ 198 ॥

తర్వాత అమిత పరాక్రమవంతుడైన ఆ దైత్యేంద్రుడు దేవతల సమూహంలో ఒక్కొక్కరిని అసంఖ్యాకాలైన అస్త్రాలతో కొట్టాడు.

లబ్ధసంజ్ఞః క్షణాద్విష్ణుః చక్రం జగ్రాహ దుర్ధరమ్ ।
దానవేన్ద్రవసాసిక్తం పిశితాశనకోన్ముఖమ్ ॥ 199 ॥

ముమోచ దానవేన్ద్రస్య దృఢం వక్షసి కేశవః ।
పపాత చక్రం దైత్యస్య హృదయే భాస్కరద్యుతిః ॥ 200 ॥

దైత్యుని సాహసాన్ని గమనించిన విష్ణువు వెంటనే దుర్ధరమైన చక్రాన్ని తీసుకుని, అనేక దైత్యులను సంహరించి వారి రక్తంతో పదునైన కొనలు కల దానిని ఆ దానవేంద్రుని దృఢమైన వక్షఃస్థలంపై విడిచాడు. సూర్యుని వంటి కాంతి గలిగిన ఆ చక్రాయుధం అతని హృదయంపై పడింది.

వ్యశీర్యత తతః కాయే నీలోత్పలమివాశ్మని ।
తతో వజ్రం మహేన్ద్రస్తు ప్రముమోచార్చితం చిరమ్ ॥ 201 ॥

యస్మిన్ జయాశా శక్రస్య దానవేన్ద్రరణే త్వభూత్ ।
తారకస్య సుసంప్రాప్య శరీరం శౌర్యశాలినః ॥ 202 ॥

వ్యశీర్యత వికీర్ణార్చిః శతధా ఖండతాంగతమ్ ।

చక్రాయుధం తారకాసురుని శరీరంపై పడి, దానిని చీల్చి వెంటనే నల్లకలువ వలె భూమిపై పడిపోయింది. అపుడు దానవులతో చేస్తున్న యుద్ధంలో తనకు జయం కలిగిస్తుందనే ఆశతో ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని తారకుని పై సంధించాడు. కాని అది వీరుడైన తారకుని శరీరాన్ని చేరి వెంటనే శమించిన జ్వాలలు కలదై వంద ముక్కలుగా విరిగి క్రిందపడింది.

వినాశమగమన్ముక్తం వాయునాఽసుర వక్షసి ॥ 203 ॥

జ్వలితం జ్వలనాభాసం అఙ్కుశం కులిశం యథా ।
వినాశమాగతం దృష్ట్వా వాయుశ్చాఙ్కుశమాహవే ॥ 204 ॥

రుష్టః శైలేన్ద్రముత్పాట్య పుష్పితద్రుమకందరమ్।
చిక్షేప దానవేన్ద్రాయ పంచయోజనవిస్తృతమ్ ॥ 205 ॥

నశించిపోయిన వజ్రాయుధాన్ని చూచి, వాయుదేవుడు అగ్నివలె జ్వలిస్తున్న అంకుశమనే ఆయుధాన్ని తారకుని పైకి సంధించాడు. కాని అది కూడ నశించి పోగా వెంటనే ఐదు యోజనాల దూరం వరకు విస్తరించి, పుష్పించిన వృక్షాలనే కందరాలు కలిగిన శ్రేష్ఠమైన ఒక పర్వతాన్ని పెకలించి దానవేంద్రుని పైకి విసిరాడు.

మహీధరం తమాయాన్తం దైత్యః స్మితముఖస్తదా ।
జగ్రాహ వామహస్తేన బాలకందుకలీలయా ॥ 206 ॥

తన వైపు వస్తున్న ఆ పర్వతాన్ని చూచి, ఆ దైత్యుడు (నగుమోముతో)నవ్వుముఖంతో బాలుడు బంతితో ఆడే విధంగా తన వామహస్తంతో దానిని పట్టుకొన్నాడు.

తతో దండం సముద్యమ్య కృతాన్తః క్రోధమూర్ఛితః ।
దైత్యేన్ద్రం మూర్ధ్ని చిక్షేప భ్రామ్య వేగేన దుర్జయః ॥ 207 ॥

సోఽసురస్యాపతన్మూర్ధ్ని దైత్యస్తం చ న బుద్ధవాన్ ।

అపుడు యముడు మిక్కిలి క్రోధం కలవాడై జయించడానికి శక్యంకాని దండాన్ని తీసుకుని, వేగంగా త్రిప్పి తారకుని తలపై విసిరాడు. తన తలపై పడుతున్న ఆ దండాన్ని తారకుడు లెక్కజేయలేదు.(ఆయుధంగానే పరిగణించలేదు).

కల్పాన్తదహనాలోకామజయ్యాం జ్వలనస్తతః ॥ 208 ॥

శక్తిం చిక్షేప దుర్ధర్షాం దానవేంద్రాయ సంయుగే ।
నవా శిరీషమాలేవ సాస్యవక్షస్యరాజత ॥ 209 ॥

జ్వలనః = అగ్ని. ప్రళయకాళపు అగ్ని వలె ప్రకాశిస్తు అజేయమైన తన'శక్తి' ఆయుధాన్ని తారకునిపై సంధించగా అది అపుడే వికసించిన శిరీషపుష్పమాలవలె ఆతని ఎదపై ప్రకాశించింది.

తతః ఖడ్గం సమాకృష్య కోశాదాకాశనిర్మలమ్ ।
భాసితాసితదిగ్భాగం లోకపాలోఽపి నిర్మృతిః ॥ 210 ॥

చిక్షేప దానవేన్ద్రాయ తస్య మూర్ధ్ని పపాత చ ।
పతితశ్చాగమత్ ఖడ్గః స శీఘ్రం శతఖండతామ్ ॥ 211 ॥

లోకపాలకుడైన నిఋృతి కూడ ఆకాశంవలె నిర్మలమైన మరియు దిక్కులన్నింటిని ప్రకాశింపజేయగల తన ఖడ్గాన్ని తారకునిపై విసిరాడు. అది (అతని) తలపై పడి వెంటనే నూరు ముక్కలై క్రిందపడిపోయింది.

జలేశస్తూగ్రదుర్ధర్షం విషపావకభైరవమ్ ।
ముమోచ పాశం దైత్యస్య భుజబంధాభిలాషకః ॥ 212 ॥

స దైత్యభుజమాసాద్య సర్పః సద్యో వ్యపద్యత ।
స్ఫుటితక్రకచక్రూర దశనాలిర్మహాహనుః ॥ 213 ॥

జలాధిపతియైన వరుణుడు ఆ దైత్యుని భుజములను బంధించాలనే అభిలాషతో దుర్ధర్షమైన మరియు భయంకరమైన విషజ్వాలలతో కూడిన సర్పరూపమైన పాశాన్ని వదిలాడు. కాని అది కూడ రంపాలవలె వున్న భయంకరమైన కోరలు కలిగినదైనప్పటికిని అతని భుజంపై పడి వెంటనే మరణించింది.

తతోఽశ్వినౌ సమరుతః ససాధ్యాః సమహోరగాః ।
యక్షరాక్షసగంధర్వాః దివ్యనానాస్త్రపాణయః ॥ 214 ॥

జఘ్నుర్దైత్యేశ్వరం సర్వే సంభూయ సుమహాబలాః ।
న చాస్త్రాణ్యస్య సజ్జన్త గాత్రే వజ్రాచలోపమే ॥ 215 ॥

తర్వాత మహాబలులైన అశ్వినీదేవతలు, సాధ్యదేవతలు, నాగదేవతలు, యక్షరాక్షస గంధర్వాదులందరూ సంఘటితులై అనేక దివ్యాస్త్రాలు కలవారై ఆ దైత్యునితో యుద్ధం చేశారు. కాని వజ్రాచలం వంటి ఆతని శరీరాన్ని ఆ అస్త్రాలు ఏమీ చేయలేకపోయాయి.

తతో రథాదవప్లుత్య తారకో దానవాధిపః ।
జఘాన కోటిశో దేవాన్ కరపార్ష్ణిభిరేవ చ ॥ 216 ॥

దానవాధిపుడైన తారకుడు రథమునుండి దూకి కోట్లాది దేవతలను ముష్టిఘాతములతో కొట్టాడు.

హతశేషాణి సైన్యాని దేవానాం విప్రదుద్రువుః ।
దిశో భీతాని సన్త్యజ్య రణోపకరణాని తు ॥ 217 ॥

చావగా మిగిలిన దేవతలందరూ తమ శస్త్రాస్త్రాలను! యుద్ధోపకరణాలన్నింటిని కూడ యుద్ధభూమిలోనే వదలి, భయంతో పలు దిక్కులకు పరుగెత్తారు.

లోకపాలాంస్తతో దైత్యః బబంధేంద్రముఖాన్ రణే ।
సకేశవాన్ దృఢైః పాశైః పశుమారః పశూనివ ॥ 218 ॥

అపుడా దైత్యుడు లోకపాలకులైన ఇంద్రాది దేవతలను, విష్ణువును కూడ దృఢమైన పాశంతో కటికవాడు పశువులను బంధించినట్లు బంధించాడు.

స భూయో రథమాస్థాయ జగామ స్వకమాలయమ్ ।
సిద్ధగన్ధర్వసంఘుష్టవిపులాచలమస్తకమ్ ॥ 219 ॥

స్తూయమానే దితిసుతైః అప్సరోభిర్వినోదితః ।
త్రైలోక్యలక్ష్మీస్తద్దేశే ప్రావిశత్ స్వపురం యథా ॥ 220 ॥

తర్వాత తారకాసురుడు తన రథమెక్కి స్వనివాసానికి వెళ్ళాడు. అంత సిద్ధులు, గంధర్వులు గానం చేశారు. అసురులందరూ స్తుతించారు. అప్సరసలు ఆతనిని వినోదింపజేశారు. అపుడు విశాలమైన పర్వతం వలె వున్న శిరస్సు గలిగిన తారకాసురుడు తన నగరంలో ప్రవేశించాడు. సాక్షాత్తు త్రైలోక్యలక్ష్మి ఆ నగరంలో ప్రవేశించినట్లున్నది.

నిషసాదాసనే పద్మరాగరత్నవినిర్మితే ।
తతః కిన్నరగన్ధర్వనాగనారీవినోదితైః ॥
క్షణం వినోద్యమానస్తు ప్రచలన్మణికుండలః ॥ 221 ॥

మణులతో కూడిన కుండలాలను ధరించిన ఆ తారకాసురుడు, పద్మరాగరత్నాలతో నిర్మించిన సింహాసనాన్ని అధిష్ఠించి, కిన్నర-గంధర్వ-నాగకన్యలు వినోదం కలిగిస్తుండగా ముల్లోకాలను పరిపాలించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే దేవాసురసంగ్రామే తారకజయలాభో నామ
త్రిపంచాశదధిక శతతమోఽధ్యాయః ॥153॥

శ్రీమత్స్యమహాపురాణంలో దేవాసుర సంగ్రామ ఘట్టంలో "తారకజయం" అనే
నూట యాభైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుష్పంచాశదధిక శతతమోఽధ్యాయః - నూటయాభై నాల్గవ అధ్యాయం

కుమారసంభవః - కుమారసంభవం

సూత ఉవాచ - సూతుడు చెప్పెడు.

ప్రాదురాసీత్ ప్రతీహారః శుభ్రనీలాంశుకామ్బరః ।
స జానుభ్యాం మహీంగత్వా పిహితాస్యః స్వపాణినా ॥ 1 ॥

ఉవాచానావిలం వాక్యం అల్పాక్షరపరిస్ఫుటమ్ ।
దైత్యేన్ద్రమర్కవృన్దానాం బిభ్రతం భాస్వరం వపుః ॥ 2 ॥

సూతుడు మరల ఈ విధంగా మునులనుద్దేశించి చెప్పనారంభించాడు. స్వచ్ఛమైన నీలపురంగు వస్త్రాన్ని ధరించిన ప్రతీహారుడు (ద్వారపాలకుడు) అనేక సూర్యుల ప్రకాశంతో కూడిన శరీరం గల తారకాసురుని వద్దకు వచ్చాడు. ఆ ద్వారపాలకుడు వినయంతో మోకాళ్ళను నేలపై ఆనించి, ముఖాన్ని చేత్తోకప్పుకుని, స్వల్పమైన స్పష్టమైన మాటలతో ఆ తారకాసురునకు ఈ విధంగా చెప్పాడు.

కాలనేమిః సురాన్ బద్ధాంశ్చాదాయ ద్వారి తిష్ఠతి ।
స విజ్ఞాపయతి స్థేయం క్వ బన్దీభిరితి ప్రభో ॥ 3 ॥

ఓ రాజా! కాలనేమి అనువాడు బంధించిన దేవతలను తీసుకుని వచ్చి ద్వారం వద్ద నిల్చున్నాడు. బందీలను ఎక్కడ ఉంచవలసినదని మీకు విజ్ఞప్తి చేస్తున్నాడు.

తన్నిశమ్యాబ్రవీద్దైత్యః ప్రతీహారస్య భాషితమ్ ।
యథేష్టం స్థీయతామేభిః గృహం మే భువనత్రయమ్ ॥ 4 ॥

ఆ ద్వారపాలకుని మాటలు విని తారకాసురుడు ఇలా చెప్పాడు. వారు తమ ఇష్టానుసారంగా ఎక్కడైనైనా ఉండవచ్చు. ఈ ముల్లోకాలన్నీ నా గృహాలే.

కేవలం పాశబంధేన విముక్తైరవిలమ్బితమ్ ।
ఏవం కృతే తతో దేవాః దూయమానేన చేతసా ॥ 5 ॥

జగ్ముర్జగద్గురుం ద్రష్టుం శరణం కమలోద్భవమ్ ।
నివేదితాస్తే శక్రాద్యాః శిరోభిర్ధరణిం గతాః ॥ 6 ॥

తుష్టువుః స్పష్టవర్ణార్థైః వచోభిః కమలాసనమ్ ।

తారకుని మాటలే పాశబంధాల నుండి ముక్తులై వెంటనే వ్యథ చెందిన మనస్సులతో దేవతలు జగద్గురువు, కమలోద్భవుడైన బ్రహ్మదేవుని దర్శించుకోవటానికి వెళ్ళారు. శక్రాది దేవతలందరూ వినయంతో తమ తలలు భూమిపై ఆనించి బ్రహ్మకు నమస్కరించి స్పష్టమైన అర్థాలు గలిగిన వాక్కులతో స్తుతించారు (సంతోషపెట్టారు).

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

త్వమోంకారో స్యంకురాయ ప్రసూతో విశ్వస్యాత్మానన్తభేదస్య పూర్వమ్ ।
సమ్భూతస్యానన్తరం సత్త్వమూర్తే సంహారేచ్ఛేస్తే నమో రుద్రమూర్తే ॥ 7 ॥

ఓ దేవా! నీవు ఓంకార స్వరూపుడవు, అనంతమైన ఈ విశ్వానికి నీవు అంకుర స్వరూపుడవై జన్మించావు. పుట్టిన వెంటనే సత్త్వమూర్తివైనప్పటికిని, నీవు సంహారరూపుడైన రుద్రమూర్తివి. నీకు నమస్సులు.

వ్యక్తం నీత్వా త్వం వపుః స్వం మహిమ్నా తస్మాదణ్డాత్ స్వాభిదానాదచిన్త్యః ।
ద్యావాపృథ్వ్యోరూర్ధ్వఖండావరాభ్యాం హ్యండాదస్మాత్త్వం విభాగం కరోషి ॥ 8 ॥

నీ మహిమతో నీ స్వరూపాన్ని వ్యక్తంచేసి, నీ నామంతోనే ప్రసిద్ధమైన బ్రహ్మాండంలో అచింత్యుడవయ్యావు. నీ ఈ అండాన్నే భూమ్యాకాశాలనే క్రింది, పై ఖండాలుగా విభాగం చేశావు.

వ్యక్తం మేరౌ యజ్ఞనాయుస్తవాభూ దేవం విద్మస్త్వత్ ప్రణీతశ్చకాస్తి ।
వ్యక్తం దేవాజన్మనః శాశ్వతస్య ద్యౌస్తే మూర్ధా లోచనే చన్ద్రసూర్యౌ ॥ 9 ॥

ఓ దేవా! మేరుపర్వతంపై ఉన్న జనులందరికీ కూడ నీవు నిర్ణయించిన ఆయుష్షే ఇప్పటికీ స్థిరమై ఉన్నదని మాకు తెలుసు. నీవు పుట్టుక లేనివాడవు, శాశ్వతుడవు అయిన నీకు లలాటం ఆకాశము, సూర్యచంద్రులు నీ నేత్రాలు.

వ్యాలాః కేశాః శ్రోత్రరంధ్రా దిశస్తే పాదౌ భూమిర్నాభిరంధ్రే సముద్రాః ।
మాయాకారః కారణం త్వం ప్రసిద్ధో వేదైః శాంతో జ్యోతిషా త్వం విముక్తః ॥ 10 ॥

సర్పాలు నీ కేశాలు. దిశలే నీ కర్ణరంధ్రాలు, భూమియే పాదం, సముద్రాలు నాభిరంధ్రం, నీవే మాయాకారుడవు, నీవే కారణం, నీవే శాంతుడవని, నీవే జ్యోతి అని వేదాలు నిర్వచిస్తున్నాయి.

వేదార్థేషు త్వాం వివృణ్వన్తి బుద్ధాః హృత్పద్మాన్తః సన్నివిష్టం పురాణమ్ ।
త్వామాత్మానం లబ్ధయోగా గృణన్తి సాంఖ్యైర్యాస్తాః సప్తసూక్ష్మాః ప్రణీతాః ॥ 11 ॥

జ్ఞానులు నిన్ను ఈ హృదయకమలంలో అమరివున్న పురుషుడవని వేదార్థాలలో వివరిస్తున్నారు. యోగులు నిన్నే ఆత్మగా చెబుతారు, సాంఖ్యతత్త్వవిదులు నీవే సప్త సూక్ష్మతత్త్వాలని (1.మహత్ 2.అహంకారం, 3.పంచతన్మాత్రలు) అంటారు.

తాసాం హేతుర్యాష్టమీ చాపి గీతా తస్యాం తస్యాం గీయసే వై త్వమన్తమ్ ।
దృష్ట్వా మూర్తిం స్థూలసూక్ష్మాం చకార దేవైర్భావాః కారణైః కైశ్చిదుక్తాః ॥ 12 ॥

ఆ ఏడు సూక్ష్మతత్త్వాలకు కారణమైన ఎనిమిదవ తత్త్వం అవ్యక్తం; ఆ చివరి తత్త్వంగా కీర్తించబడిన నీవు ఈ స్వరూపాన్ని చూసి స్థూలసూక్ష్మరూప ప్రపంచాన్ని సృష్టించావు. కొన్ని అవ్యక్తకారణాలచేత దేవతలు కొన్ని భావాల్ని చెప్పారు.

సంభూతాస్తే త్వత్త ఏవాదిసర్గే భూయస్త్వాం తాం వాసనాం తేభ్యుపేయుః ।
త్వత్సంకల్పేనాంతమాయాతి గూఢః కాలోఽమేయో ధ్వస్తసంఖ్యావికల్పః ॥ 13 ॥

అవి సృష్ట్యారంభంలో నీ నుండే ఉద్భవించినాయి. మరల అవి నీ వలననే స్వవాసనను=సంస్కారాన్ని పొందుతాయి. అమేయమైన, అతిగూఢమైన సంఖ్యావికల్పానికి కూడ ఊహించరానిదైన కాలం కూడ నీ సంకల్పం చేతనే అంతమౌతుంది.

భావాభావవ్యక్తి సంహారహేతుః త్వం సోఽనంతస్తస్య కర్తాసి చాత్మన్ ।
యేఽన్యే సూక్ష్మాః సంతి తేభ్యోఽభిగీతః స్థూలాభావాశ్చావృతారశ్చ తేషామ్ ॥ 14 ॥

అనంతమైన ఈ చరాచర ప్రపంచంలో భావాభావాలకు, మరియు సంహారానికి నీవే కారణం. స్థూలసూక్ష్మ భావములన్నింటికి నీవే ఆత్మవు. వాటికంటే సూక్ష్మములని చెప్పబడినవాటిని స్థూలభావాలు ఆవరిస్తాయి.

తేభ్యః స్థూలస్తైః పురాణైః ప్రతీతో భూతం భవ్యం చైవముద్భూతిభాజామ్ ।
భావే భావే భావితం త్వా యునక్తి యుక్తం యుక్తం వ్యక్తిభావాన్నిరస్య ॥
ఇత్థం దేవో భక్తిభాజాం శరణ్యః త్రాతా గోప్తా నో భవాననంతమూర్తిః ॥ 15 ॥

దేవా! ఈ స్థూల సూక్ష్మాదులన్నింటికంటె నీవు ప్రాచీనుడవు. శాశ్వతుడవని ప్రసిద్ధి. భూతిభాజులు అనగా జన్మను పొందిన ప్రాణులందరికీ భూత భవిష్యత్తులు నీవే. ప్రతి ఆలోచనలోనూ నిన్ను బావించి నీతో కలుస్తారు. నీతో ఐక్యమయి అయి, వారి ప్రత్యేకభావాన్ని నిరసిస్తారు. ఈ విధంగా భక్తులందరికి దిక్కు నీవే! అనంతస్వరూపుడవైన నీవే మాకు పాలకుడవు రక్షకుడవు.

విరించిమమరాః స్తుత్వా బ్రహ్మాణమవికారిణమ్ ।
తస్థుర్మనోభిరిష్టార్థసంప్రాప్తిప్రార్థనాస్తతః ॥

ఇట్లు దేవతలిలా వికార రహితుడైన బ్రహ్మదేవుని స్తుతించి మనోభీష్ట సిద్ధికొరకు వినమ్రులై నిలిచారు.

ఏవం స్తుతో విరించిస్తు ప్రసాదం పరమం గతః ।
అమరాన్ వరదేనాహ వామహస్తేన నిర్దిశన్ ॥ 17 ॥

ఆ విధంగా స్తుతించబడిన బ్రహ్మదేవుడు పరమానుగ్రహం కలవాడయ్యాడు. మరియు స్వవామహస్తంతో నిర్దేశిస్తూ దేవతలకు నేను వరదునని చెప్పాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ దేవుడు చెప్పాడు.

నారీ యాఽభర్తృకాఽస్మాత్తనుతే త్యక్తభూషణా ।
న రాజతే తథా శక్ర మ్లానవక్త్ర శిరోరుహా ॥ 18 ॥

ఓ ఇంద్రా! నీవు అకస్మాత్తుగా భర్త గతించగా తన అలంకారపు వస్తువులన్నీ వదలివేసినదీ, ఒడలినముఖమూ జుట్టూ కలిగినదీ అయిన స్త్రీ వలె ప్రకాశరహితుడవైనావు.

హుతాశన విముక్తోఽపి న ధూమేన విరాజసే ।
భస్మనేవ ప్రతిచ్ఛన్నో దగ్ధదావశ్చిరోషితః ॥ 19 ॥

అగ్నిదేవుడా! తారకాసురుడు నిన్ను విడిచిపెట్టినప్పటికీ నీవు అడవినంతా కాల్చిన తరువాత చాలాకాలమయ్యాక బూడిదతో కప్పబడి, పొగచూరినవానిలా కాంతిహీనంగా వున్నావు.

యమామయమయేనైవ శరీరే త్వం విరాజసే ।
దండస్యాలంబనేనేవ హ్యకృచ్ఛస్తు పదే పదే ॥ 20 ॥

యముడా! వ్యాధిమయమైన శరీరంతో వున్న వాడివలె వున్న నీవు అసలు ప్రకాశించటం లేదు. దండం సహాయంతో తడబడుతూ నడుస్తున్నావు.

రజనీచరనాథోఽపి కిం భీత ఇవ భాషసే ।
రాక్షసేంద్ర క్షతారాతే త్వమరాతిక్షతో యథా ॥ 21 ॥

ఓ నిర్పతీ! నిశాచరనాథుడవైన నీవు భయపడుతూ మాట్లాడుతున్నావేమి? శత్రువులను గాయపరిచే రాక్షసేంద్రుడవై వారి చేతిలో నీవు గాయపడినట్లున్నావే?

తనుస్తే వరుణోచ్ఛుష్కా పరీతస్యేవ వహ్నినా ।
విముక్తరుధిరం పాశం ఫణిభిః ప్రవిలోకయత్ ॥ 22 ॥

వరుణా! అగ్ని చుట్టుముట్టడం వల్ల నీ శరీరం చిక్కిపోయినట్లు ఉంది. నీకు పాశాలులాగా వున్న సర్పాలు రక్తాన్ని క్రక్కుతున్నటున్నవి కదా!

వాయో! భవాన్ విచేతస్కస్త్వమస్మిన్గైరివ నిర్జితః ।
కిం త్వం బిభేషి ధనద! సన్న్యస్యైవ కుబేరతామ్ ॥ 23 ॥

వాయుదేవుడా! శతృవులచే ఓడిపోయి చేతనారహితుడివలె ఉన్నావేమి? కుబేరా! అదేమిటి నీ కుబేరత్వాన్ని వదలి భయపడుతున్నావేమి?

రుద్రాస్త్రిశూలినస్సంతః వదధ్వం బహుశూలతామ్ ।
భవన్తః కేన తత్క్షిప్తం తేజస్తు భవతామపి ॥ 24 ॥

ఓ రుద్రలారా! శూలధారులై వుండి కూడ శూలాలతో పొడవబడిన వారివలె ఉన్నారేమిటి? మీ ఈ తేజస్సును ఎవరు హరించారో చెప్పండి.

అకించిత్కరతాం యాతః కరస్తే న విభాసతే ।
అలం నీలోత్పలాభేన చక్రేణ మధుసూదన ॥ 25 ॥
కిం త్వయానుదరాలీనభువనప్రవిలోకనమ్ ।
క్రియతే స్తిమితాక్షేణ భవతా విశ్వతోముఖ ॥ 26 ॥

ఓ మధుసూదనా! నీలోత్పలం వంటి కాంతి గలిగిన చక్రాన్ని ధరించే నీ హస్తం దైన్యాన్ని(దీనత్వాన్ని) పొందిందేమి? ఓ విశ్వతోముఖా! నీ నుండే పుట్టి, నీలోనే దాగివున్న ఈ ముల్లోకాలను ఏ విధంగా రక్షించగలనని రెప్ప వాల్చకుండా చూస్తున్నావేమి?

ఏవముక్తాః సురాస్తేన బ్రహ్మణా బ్రహ్మమూర్తినా ।
వాచాం ప్రధానభూతత్వాత్ మారుతం తమచోదయన్ ॥ 27 ॥

వేదమూర్తిమైన బ్రహ్మదేవుని మాటలు విన్న దేవతలు వాక్కులకు ప్రధానుడైన వాయుదేవుని ప్రేరేపించారు.

అథ విష్ణుముఖైర్దేవైః శ్వసనః ప్రతిబోధితః ।
చతుర్ముఖం తదా ప్రాహ చరాచరగురుం విభుమ్ ॥ 28 ॥

విష్ణువు మొదలగు దేవతలచే ప్రేరేపించబడిన వాయుదేవుడు ఈ చరాచరప్రపంచానికి గురువు, చతుర్ముఖుడైన బ్రహ్మదేవునితో ఇలా అన్నాడు.

న తు వేత్సి చరాచరభూతగతం భవభావమతీవ మహానుచ్ఛ్రితః ప్రభవః ।
పునరర్థివచోభివిస్తృత శ్రవణోపమకౌతుకభావకృతః ॥ 29 ॥

ఓ బ్రహ్మదేవా! ఈ చరాచర ప్రపంచానికి కారణభూతుడవైన నీకు తెలియనిది లేదు కదా! అయినా నిన్నర్థించడానికి వచ్చిన వారినుండే నీ దగ్గరకు వచ్చిన కారణాన్ని తెలుసుకోవాలనే కోరికతో మమ్మల్ని కారణమడుగుతున్నావు.

త్వమనంతకరోషి జగద్భవతాం స చరాచరగర్భవిభిన్నగుణామ్ ।
అమరాసురమేతదశేషమపి త్వయి తుల్యమహో జనకోఽపి స యతః ॥
పితురస్తి తథాపి మనోవికృతిః సగుణో విగుణో బలవానబలః ॥ 30 ॥

దేవతలు, రాక్షసులు మొదలుకొని అనంతం, అశేషం, సత్త్వరజస్తమోగుణాత్మకమై ఈ ప్రపంచాన్ని నీవే సృష్టించావు. ఈ జగత్తుకు నీవు తండ్రిలాంటివాడవు. అయినప్పటికి తండ్రియైన నీకు మా బలాబలాలు, సగుణాలు, దుర్గుణాలు మనోవికృతులు తెలియనివి కావు.

భవతో వరలాభనివృత్తభయః కులిశాంగసుతో దితిజోఽతిబలః ।
సచరాచరనిర్మథనే కిమితి కితవస్తు కుతో విహితో భవతా ॥ 31 ॥

ఓ దేవా! అతిబలవంతుడైన కులిశాంగసుతుడైన తారకాసురుడు నీ నుండి పొందిన వరంతో నిర్భయుడై ఈ ప్రపంచాన్నంతటిని హింసిస్తున్నాడు. ఈ విధంగా లోకాన్ని హింసించే వంచకుడిని ఎలా సృష్టించావు?

కిల దేవ త్వయా స్థితయే జగతాం మహదద్భుతచిత్రవిచిత్రగుణాః ।
అపి తుష్టికృతః శ్రుతకామఫలా విహితా ద్విజనాయక దేవగణాః ॥ 32 ॥

ఈ ముల్లోకాల స్థితి కొరకై నీవు అద్భుతమైన మరియు చిత్ర విచిత్రాలైన గుణాలను (సత్త్వరజస్తమో గుణాలను) కలిగిన వారినందరిని సృష్టించావు, వారిలో ద్విజశ్రేష్ఠులను, దేవతలను మంచిపనులు చేసేవారిగా ఉద్భవింపజేశావు.

అపి నాకమభూత్ కిల యజ్ఞభుజాం భవతో వినియోగవశాత్సతతమ్ ।
అపహృత్య విమానగణం స కృతో దితిజేన మహామరుభూమిసమః ॥ 33 ॥

యజ్ఞయాగాది కర్మలలో అర్పించే హవిస్సునే భుజించే దేవతలకు స్వర్గలోకం నిలయంగా ఉండినది. కాని దేవతల విమానగణాన్ని అపహరించి ఆ స్వర్గలోకాన్ని తారకుడు మరుభూమితో సమానమైనదిగా చేశాడు.

కృతవానసి సర్వగుణాతిశయం యమశేషమహీధరరాజతయా ।
సమమింగిత భావవిధిః స గిరిః గగనేన సదోచ్ఛ్రయతాం గతః ॥ 34 ॥

అధివాసవిహార విధావుచితో దితిజేన పవిక్షతశృంగతటః ।
పరిలుంఠితరత్నగుహానివహో బహుదైత్యసమాశ్రయతాం గతః ॥ 35 ॥

సర్వసద్గుణాలతో కూడిన ఏ పర్వతాన్ని నీవు పర్వతాలన్నింటికిని అధిపతిగా చేశావో, ఆ పర్వతం తన ఇంగిత జ్ఞానంతో ఆకాశమెత్తు పెరిగింది, దేవతలందరికి విహార యోగ్యమైన ఆ పర్వతం యొక్క శిఖరాలను ఖండించిన తారకుడు ఆ పర్వతగుహలలోని రత్నాలను దోచివేసి దానిని రాక్షసులకు నిలయంగా చేశాడు.

సురరాజ స తస్య భయేన గతం వ్యదధాదశరీర ఇతోఽపి వృథా ।
ఉపయోగ్యతయా వివృతం సుచిరం విమలద్యుతిపూరితదిగ్వదనమ్ ॥ 36 ॥

భవతైవ వినిర్మితమాదియుగే సురహేతిసమూహమనుత్తమిదమ్ ।
దితిజస్య శరీరమవాప్య గతం శతధా మతిభేదమివాల్పమనాః ॥ 37 ॥

ఓ దేవా! దేవదేవ! ఆ మేరుపర్వతం ఆ తారకాసురునికి భయపడినదై అశరీరంగా మిగిలి, తన స్వచ్ఛకాంతులతో దిగ్భాగాలను నింపి సుందరంగా చెయ్యడానికి ఉపయోగిస్తోంది. ఆదియుగంలో దైత్యులందరిని నిర్మూలించడానికి నీవు సృష్టించిన ఆయుధపరమైన ఆ పర్వతం ఆ అసురుని భయంతో ఆ తారకుని శరీరాన్నిచేరి, అల్పులకు కలిగిన వేయివిధాలైన మతిభేదంలాగా అనేక విధాలుగా భిన్నమైపోయింది.

ఆసారధూలిధ్వస్తాంగా ద్వారస్థాః స్మః కదర్థినః ।
లబ్ధప్రవేశాః కృచ్ఛ్రేణ వయం తస్యామరద్విషః ॥ 38 ॥

మేము దుమ్ము కొట్టుకున్న శరీరాలతో అవమానంతో, అతికష్టంగా దేవతల శత్రువైన ఆ తారకుని నగరంలో ప్రవేశించి ద్వారం వద్ద నిలబడ్డాము.

సభాయామమరా దేవ! నికృష్టేఽప్యుపవేశితాః ।
వేత్రహస్తైరజల్పన్తః తతోఽపహసితాస్తు తైః ॥ 39 ॥

ఓ దేవా! సభలో వేత్రదండాలు గల భటులు మమ్మల్ని నికృష్టమైన ఆసనాలపై కూర్చొంబెట్టి అపహాస్యం చేశారు.

మహార్హాః సిద్ధసర్వార్థాః భవన్తః స్వల్పభాషిణః ।
చాటుయుక్తమతో కర్మ హ్యమరా బహుభాషత ॥ 40 ॥

సభేయం దైత్యసింహస్య న శక్రస్య తు సంస్థితాః ।
వదతేతి చ దైత్యస్య ప్రేష్యైర్విహసితా బహు ॥ 41 ॥

దేవతలారా! మీరు పూజ్యులు, సర్వార్థాలు సిద్ధి పొందినవారు, మితభాషులు. కాని ఇపుడు చాటుయుక్తంగా అనగా ప్రశంసార్థంగా బాగా మాట్లాడండి. దైత్యసింహుడైన తారకుని సభ ఇదని ఇంద్రసభ కాదని తెలుసుకోండని మమ్మల్ని ఆ దైత్యుని సేవకులు మిక్కిలి అపహాస్యం చేశారు.

ఋతవో మూర్తిమంతస్తముపాసంతే హ్యహర్నిశమ్ ।
కృతాపరాధసంత్రాసం న త్యజంతి కదాచన ॥ 42 ॥

ఋతువులన్నీ మూర్తిమంతాలై అహర్నిశలూ ఆ తారకుడినే సేవిస్తున్నాయి. మరియు వాడి సేవను వదలితే ఎటువంటి అపరాధమవుతుందోననే భయంతో ఒక క్షణం కూడ వదలి పెట్టకుండా ఉపాసిస్తున్నాయి.

తంత్రీత్రయలయోపేతం సిద్ధగంధర్వకిన్నరైః ।
సురాగముపధా నిత్యం గీయతే తస్య వేశ్మసు ॥ 43 ॥

సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు తంత్రీవాద్యాలతో, తాలం, లయతో కూడిన రాగంతో అతని భవనాల్లో గానం చేస్తున్నారు.

హన్తా కృతోపకరణైః మిత్రాణి గురులాఘవైః ।
శరణాగతసంత్యాగీ త్యక్తసత్యపరిశ్రయః ॥ 44 ॥

ఇతి నిశ్శేష మథవా నిశ్శేషం వై న శక్యతే ।
తస్యాஉవినయమాఖ్యాతుం స్రష్టా తత్ర పరాయణమ్ ॥ 45 ॥

పెద్దవీ, చిన్నవీ అయిన ఉపకరణాలతో స్నేహితులకు కూడా సంహర్తగా ఉన్నాడు. తనను శరణువేడిన వారిని కూడ వదలిపెడతాడు. సత్యానికి స్థానమీయడు. అతని అవినయాన్ని నిశ్శేషంగా చెప్పటం సాధ్యం కాదు. ఆ అవినయాన్ని తెలుసుకోవడం సృష్టికర్తవైన నీకే సాధ్యం.

ఇత్యుక్తః స్వాత్మభూర్దేవః సురైర్దైత్యవిచేష్టితే ।
సురానువాచ భగవాన్ తతః స్మిత ముఖాంబుజః ॥ 46 ॥

తారకాసురుని చేష్టలు దేవతల ద్వారా విన్న బ్రహ్మదేవుడు చిరునవ్వుతో వారినుద్దేశించి ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ – బహ్మ దేవుడు చెప్పాడు.

అవధ్యస్తారకో దైత్యః సర్వైరపి సురాసురైః ।
యస్య వధ్యః స నాద్యాఽపి జాతస్త్రిభువనే పుమాన్ ॥ 47 ॥

ఓ దేవతలారా! సురాసురులందరూ ఏకమైనా ఈ తారకాసురుని సంహరించలేరు. ఇతనిని సంహరించేవాడు నేటికీ ముల్లోకాలలో ఎక్కడా పుట్టలేదు.

మయా స వరదానేన ఛందయిత్వా నివారితః ।
తపసః సాంప్రతం రాజా త్రైలోక్యదహనాత్మకాత్ ॥ 48 ॥

నేను వానికి కోరిన వరమిచ్చి, సంతోషింపజేసి, ప్రస్తుతం ముల్లోకాలనే దహించివేసే తపస్సు నుండి విరమింపజేశాను.

స చ వవ్రే వధం దైత్యః శిశుతః సప్తవాసరాత్ ।
స సప్తదివసో బాలః శంకరాద్యో భవిష్యతి ॥ 49 ॥

తారకస్య నిహంతా స భాస్కరాభో భవిష్యతి ।
సాంప్రతం చాప్యపత్నీకః శంకరో భగవాన్ ప్రభుః ॥ 50 ॥

ఏడు దినముల వయస్సు గల శిశువుచే తనకు మృతి కావలెనని తారకుడు వరమడిగాడు. ఆ ఏడు దినముల వయస్సు గల శిశువు శంకర భగవానునికి జన్మించవలసివున్నది. సూర్యుని వంటి తేజస్సు గల శివుని కుమారుడే తారకాసురుని సంహరించగలడు. కాని పూజ్యుడైన శంకరుడు ఇప్పుడు పత్నీరహితుడు.

యచ్ఛాయముక్తవాన్యస్యా హ్యుత్తానకరతా సదా ।
ఉత్తానో వరదః పాణిరేష దేవ్యాః సదైవ తు ॥ 51 ॥

ఏ దేవి యొక్క హస్తం ఎల్లప్పుడు ఉత్థానమై అనగా నిలువుగా అభయప్రదంగా వుంటుందో ఆమె కుమారుడే ఈ తారకుని సంహరిస్తాడని మీకు చెప్పాను కదా!

హిమాచలస్య దుహితా సా తు దేవీ భవిష్యతి ।
తస్యాః సకాశాద్యః శర్వస్త్వరణ్యాం పావకో యథా ॥ 52 ॥
జనయిష్యతి తం ప్రాప్య తారకం స హనిష్యతి ॥

ఆ దేవి ఇప్పుడు హిమవంతుని కుమార్తె అవుతుంది. శివుడు (ఆమెను వివాహమాడి,) అరణ్యం నుండి అగ్ని ఉద్భవించినట్లుగా ఆమె నుండి ఒక కుమారుణ్ణి జన్మింపజేస్తాడు. అతనే ఈ తారకాసురుని వధిస్తాడు.

మయాప్యుపాయః స కృతో యథైవం హి భవిష్యతి ॥ 53 ॥

శేషశ్చాప్యస్య విభవో వినశ్యేత్తదనన్తరమ్ ।
స్తోకకాలం ప్రతీక్షధ్వం నిర్విశంకేన చేతసా ॥ 54 ॥

దీనికి కావలిసిన ఉపాయము నేను ఆలోచించితిని. అనతికాలములోనే తారకుని వైభవమంత నశించిపోవును కావున ఎటువంటి సందేహములు లేకుండా మీరు కొంతకాలము వేచి చూడవలసినది.

ఇత్యుక్తా స్త్రిదశాస్తేన సాక్షాత్ కమలజన్మనా ।
జగ్ముస్తం ప్రణిపత్యేశం యథా యోగం దివౌకసః ॥ 55 ॥

ఇట్లు కమలజన్ముడైన బ్రహ్మదేవుడు చెప్పిన మాటలు విని దేవతలు ఆయనకు నమస్కరించి అక్కడి నుండి వెళ్ళిపోయిరి.

తతో గతేషు దేవేషు బ్రహ్మా లోకపితామహః ।
నిశాం సస్మార భగవాన్ స్వతనోః పూర్వసంభవామ్ ॥ 56 ॥

దేవతలు వెళ్ళిపోయిన తర్వాత లోక పితామహుడైన బ్రహ్మదేవుడు తనకంటె ముందు సంభవించిన 'నిశా'దేవిని (రాత్రి దేవతను) స్మరించాడు.

తతో భగవతీ రాత్రి రుపతస్థే పితామహమ్ ।
తాం వివిక్తే సమాలోక్య బ్రహ్మోవాచ విభావరీమ్ ॥ 57 ॥

అట్లా స్మరించినంతనే రాత్రి దేవత పితామహుని ముందు నిలిచింది. తన ముందు ప్రత్యక్షమైన ఆ (విభావరి) రాత్రి దేవతను చూచి బ్రహ్మదేవుడు ఇలా చెప్పాడు.

బ్రహ్మోవాచ - బ్రహ్మదేవుడు చెప్పాడు.

విభావరి! మహత్కార్యం విబుధానాముపస్థితమ్ ।
తత్కర్తవ్యం త్వయా దేవి శృణు కార్యస్య నిశ్చయమ్ ॥ 58 ॥

ఓ విభావరీ! దేవతలకు సంబంధించిన ఒక మహత్తర కార్యమున్నది. అది నిశ్చయంగా నీవు చేయవలసింది కావున నేను చెప్పేది విను.

తారకో నామ దైత్యేంద్రః సురకేతురనిర్జితః ।
తస్యాభావాయ భగవాన్ జనయిష్యతి చేశ్వరః ॥ 59 ॥

సుతం స భవితా తస్య తారకస్యాంతకారకః ।

తారకుడనే దైత్యుడు అజేయుడై దేవతలకు ఉత్పాతంగా వున్నాడు. వాని నాశనానికై శంకరభగవానుడు ఒక కుమారుని పుట్టించవలసి వున్నది. శంకర సుతుడే తారకాసురుని అంతమొందిస్తాడు.

శంకరస్యాభవత్ పత్నీ సతీ దక్షసుతా తు యా ॥ 60 ॥

సా మృతా కుపితా దేవీ కస్మింశ్చిత్ కారణాంతరే ।
భవితా హిమశైలస్య దుహితా లోకభావినీ ॥ 61 ॥

శంకరుని భార్య, దక్ష ప్రజాపతి కుమార్తె సతీదేవి కారణాంతరం వలన కోపంతో దేహత్యాగం చేసింది కదా, లోకభావిని అనగా సమస్త లోకాల క్షేమాన్ని కోరే ఆమె శైలేంద్రుడైన హిమవంతుని పుత్రికగా జన్మిస్తుంది.

విరహేణ హరస్తస్యాః మత్వా శూన్యం జగత్త్రయమ్ ।
తపస్యన్ హిమశైలస్య కందరే సిద్ధసేవితే ॥ 62 ॥

ప్రతీక్షమాణ స్తజ్జన్మ కంచిత్ కాలం నివత్స్యతి ।
తయోః సుతప్తతపసోః భవితా యో మహాబలః ॥ 63 ॥
స భవిష్యతి దైత్యస్య తారకస్య వినాశకః ।

ఆ సతీదేవి విరహంతో జగత్తంతా శూన్యమని తలచి శివుడు సిద్ధులచే సేవించబడే హిమవత్పర్వత గుహలో తపస్సు చేస్తూ ఆమె కొరకై కొంత కాలం నిరీక్షిస్తాడు. వారిద్దరి కలయికతో, తపోబలంతో జన్మించే మహాబలుడే ఈ తారకాసురుని నశింపజేస్తాడు.

జాతమాత్రా తు సా దేవీ స్వల్పసంజ్ఞా చ భామినీ ॥ 64 ॥

విరహోత్కంఠితా గాఢం హరసంగమలాలసా ।
తయోః సుతప్తతపసోః సంయోగః స్యాచ్ఛుభాననే ॥ 65 ॥

జన్మించిన వెంటనే ఆ జగన్మాతకు శివుని గుఱించి తెలుస్తుంది. విరహాన్ని భరించలేని ఆమె శివుని సంగమాన్ని కోరుతుంది. అలా తపస్సు చేస్తున్న వారిద్దరికీ సంగమం జరుగుతుంది. మంగళవదనా! వారివల్ల పుట్టినవాడు తారకాసుర సంహర్త.

తతస్తాభ్యాం తు జనితః స్వల్పో వాక్కలహో భవేత్ ।
తతోఽపి సంశయో భూయస్తారకం ప్రతి దృశ్యతే ॥ 66 ॥

తయోః సంయుక్తయోస్తస్మాత్సురతాసక్తికారణే ।
విఘ్నస్త్వయా విధాతవ్యో యథా తాభ్యాం తథా శ్రుణు ॥ 67 ॥

వారికి చిన్న వాక్కలహం జరగాలి. అలా వాక్కలహం కలిగిస్తే తారకుని వధ విషయంలో మళ్ళీ సంశయం కలుగుతుంది. అందుకని సురతాసక్తితో సంయోగం పొందుతున్న శివపార్వతులకు సంతానం కలగటంలో నీవు విఘ్నం కలిగించవలెను. అది ఎలా చేయాలో విను.

గర్భస్థానే చ తన్మాతుః స్వేన రూపేణ రంజయ ।
తతో విహాయ శర్వస్తాం విశ్రాంతో నర్మపూర్వకమ్ ॥ 68 ॥

భర్త్సయిష్యతి తాం దేవీం తతః సా కుపితా సతీ ।
ప్రయాస్యతి తపశ్చర్తుం తత్తస్మాత్తపసే పునః ॥ 69 ॥

నీవు పార్వతీమాతయైన మేనాదేవి గర్భాన్ని ఆశ్రయించి ఆ గర్భంలోవున్న పిండానికి నీ వర్ణం కలిగేటట్లు చేయి. వివాహం అయిన తరువాత శివుడు పార్వతీ దేహచ్ఛాయ విషయంలో పరిహాసమాడతాడు. దానితో కోపగించిన పార్వతీదేవి మరల తపస్సు చేయడానికి వెళ్ళుతుంది. (రాత్రీదేవి నలుపు వర్ణం కలది కావున ఆమె బ్రహ్మదేవుని ఆదేశానుసారం గర్భవతియైన మేనాను ఆశ్రయించి ఉండడం వలన సహజంగా తెలుపు వర్ణం కల పార్వతీదేవిని నలుపు వర్ణం కలదిగా కనబడేటట్లు చేసిందని వివాహానంతరం శివుడు ఆమెలోని నలుపు వర్ణాన్ని మాత్రమే గ్రహించి పరిహాసం చేశాడని, అపుడు పార్వతి కోపంతో మరల కఠిన తపస్సు చేసి గౌరవర్ణాన్ని (తెలుపు రంగును) పొంది గౌరీ అని పిలువబడిందని ప్రతీతి).

జనయిష్యతి యం శర్వాదమితద్యుతిమండితమ్ ।
స భవిష్యతి హంతా వై సురారీణామసంశయమ్ ॥ 70 ॥

ఆ విధంగా తపస్సు చేసిన తర్వాత శివుని వలన మిక్కిలి తేజోవంతుడైన కుమారునికి జన్మనిస్తుంది. ఆ కుమారుడే తారకాది అసురులందరిని వధిస్తాడనటంలో సందేహం లేదు.

త్వయాపి దానవా దేవి హంతవ్యా లోకదుర్జయాః ।
యావచ్చ న సతీదేహసంక్రాంతగుణసంచయా ॥ 71 ॥

తత్సంగమేన తావత్త్వం దైత్యాన్ హంతుం న శక్ష్యసే ।
ఏవం కృతే తపస్తప్త్వా సృష్టిసంహారకారిణీ ॥ 72 ॥

ఓ రాత్రిదేవీ! నీవు కూడ లోకదుర్జయులైన ఈ దానవులందరిని వధించాలి. కాని నీకు పార్వతీదేవి దేహంతో సంబంధమున్నప్పుడే రాక్షసవధ చేయగలవు. కావున సృష్టిసంహారకారిణివైన నీవు కూడ దానికోసం తదర్థమై తపస్సు చేయాలి.

సమాప్త నియమా దేవీ యదా చోమా భవిష్యతి ।
తదా స్వమేవ తద్రూపం శైలజా ప్రతిపత్స్యతే ॥ 73 ॥

తనుస్తవాపి సహజా సైకానంశా భవిష్యతి ॥
రూపాంశేన తు సంయుక్తా త్వముమాయాం భవిష్యసి ॥ 74 ॥

నీవలా తపస్సు చేస్తూ వుండగా పార్వతి తన తపోనిష్ఠను ముగించుకుని 'ఉమా' అని పిలువబడుతుంది. అటు తర్వాత శైలపుత్రి అయిన ఆమె తన సహజ వర్ణాన్ని పొందుతుంది. అప్పుడు నీవు కూడ పార్వతీదేవి అంశభూతురాలవు కాదు సాక్షాత్తు ఆమె ఏకాత్మతా తత్త్వమే అని జనులు నిన్ను పూజిస్తారు.

ఏకానంశేతి లోకస్త్వాం వరదే పూజయిష్యతి ।
భేదైర్బహువిధాకారైః సర్వగా కామసాధినీ ॥ 75 ॥

ఓ రాత్రిదేవీ! ఇంకనూ నీవు సాక్షాత్తు పార్వతీదేవేనని లోకులందరూ నిన్ను పూజిస్తారు. అనేక విధాలైన రూపాలతో నీవు భక్తుల కోరికలన్నీ సిద్ధింపజేస్తావు.

ఓంకారవక్త్రా గాయత్రీ త్వమితి బ్రహ్మవాదిభిః ।
ఆక్రాన్తిరూర్జితాకారా రాజభిశ్చ మహాభుజైః ॥ 76 ॥

త్వం భూరితి విశాం మాతా శూద్రైః శైవీతి పూజితా ।
క్షాన్తిర్మునీనామక్షోభ్యా దయా నియమినామితి ॥ 77 ॥

బ్రహ్మవిదులు నిన్ను ఓంకార స్వరూప గాయత్రి అని, పరాక్రమవంతులైన రాజులేమో (క్షత్రియులు) ''ఊర్జితాక్రాంత'' అని, వైశులు 'భూమాత' అని, శూద్రులు 'శైవీ' అని, మునులు క్షోభింపశక్యం కాని 'క్షాన్తి'స్వరూపురాలవని, నియమవంతులు లేదా ఇంద్రియనిగ్రహం కలవారు 'దయా' స్వరూపురాలవని పూజిస్తారు.

త్వం మహోపాయ సందోహా నీతిర్నయవిసర్పిణామ్ ।
పరిచ్ఛిత్తిస్త్వమర్థానాం త్వమీహా ప్రాణిహృచ్ఛయా ॥ 78 ॥

నీతిశాస్త్రమార్గంలో ప్రవర్తించేవారికి నీవు 'మహోపాయ సందోహ' అనగా మహత్త్వాలైన ఉపాయాలు గల నీతి మార్గాన్ని చూపించే దానివి. ధర్మానికి నీవు 'పరిచ్ఛిత్తివి'. అనగా ధర్మప్రమాణాన్ని తెలిపే దానివి. ప్రాణులకందరికిని నీవు "ఈహా" వంటిదానవు. ప్రాణుల హృదయాలలో నీవు 'కోరిక'వై ఉంటావు.

త్వం ముక్తిః సర్వభూతానాం త్వం గతిః సర్వదేహినామ్ ।
త్వం చ కీర్తిమతాం కీర్తిః త్వం మూర్తిః సర్వదేహినామ్ ॥ 79 ॥

ప్రాణులందరికి నీవే ముక్తివి, నీవే గతివి. కీర్తిమంతుల కీర్తివి నీవే, దేహులందరి మూర్తివి కూడ నీవే.

రతిస్త్వం రక్తచిత్తానాం ప్రీతిస్త్వం హృష్టదర్శినామ్ ।
త్వం కాన్తిః కృతభూషాణాం త్వం శాన్తిర్దుఃఖకర్మణామ్ ॥ 80 ॥

త్వం భ్రాన్తిః సర్వబోధానాం త్వం గతిః క్రతుయాజినామ్ ।
జలధీనాం మహావేలా త్వం చ లీలావిలాసినామ్ ॥ 81 ॥

అనురాగవంతుల ప్రేమవు నీవే, సంతుష్టుల ప్రీతివి నీవే, అలంకృతుల కాంతివి నీవే, దుఃఖ కర్మలకు శాంతివి నీవే, సర్వజ్ఞానముల విషయంలో భ్రాంతివి నీవే, యాజ్ఞికులందరికి నీవే గతివి, సముద్రాల ఒడ్డువు నీవే మరియు విలాసవంతుల విలాసం కూడ నీవే.

సంభూతిస్త్వం పదార్థానాం స్థితిస్త్వం లోకపాలినీ ।
త్వం కాలరాత్రిర్నిశ్శేషభువనావలినాశినీ ॥ 82 ॥

ప్రియకంఠగ్రహానందదాయినీ త్వం విభావరీ ।
ఇత్యనేకవిధైర్దేవి రూపైర్లోకే త్వమర్చితా ॥ 83 ॥

పదార్థాలకు నీవు "సంభూతి" లోకగమనానికి 'స్థితి'స్వరూపవు, సకలభువననాశిని అయిన కాళరాత్రివి నీవే, ప్రియకంఠాలింగనం వలన కలిగే ఆనందదాయినివి విభావరివి నీవే, ఇలా అనేక విధాలైన, రూపాలుగా లోకంలో నీవు పూజించబడతావు.

**యే త్వాం స్తోష్యంతి వరదే పూజయిష్యంతి వాపి యే ।
తే సర్వకామానాప్స్యంతి నియతా నాత్ర సంశయః ॥ 84 ॥**

వరాలను ప్రసాదించే ఓ రాత్రిదేవీ! ఎవరు నిన్ను నిగ్రహంతో స్తుతిస్తారో, ఎవరు నిన్ను పూజిస్తారో, వారు కోరుకున్నవన్నీ పొందుతారు దీనిలో సందేహం లేదు.

**ఇత్యుక్తా సా నిశాదేవీ తథేత్యుక్త్వా కృతాంజలిః ।
జగామ త్వరితా తూర్ణం గృహం హిమగిరేః పరమ్ ॥ 85 ॥**

బ్రహ్మదేవుని ఆదేశం విని వినయంతో అలాగే చేస్తానని చెప్పి వెంటనే త్వరితగతిన హిమవంతుని గృహానికి వెళ్ళింది.

**తత్రాసనా మహాహర్మ్యే రత్నభిత్తి సమాశ్రయామ్ ।
దదర్శ మేనామాపాండుచ్ఛవి వక్త్రసరోరుహామ్ ॥ 86 ॥**

**కించిచ్ఛ్యామముఖోదగ్రస్తనభారావనామితామ్ ।
మహౌషధిగణాబద్ధ మంత్రరాజనిషేవితామ్ ॥ 87 ॥
ఉద్వహన్ కనకోన్నద్ధజీవరక్షామహోరగామ్ ।**

అక్కడ హిమవంతుని మహాహర్మ్యంలో రత్నాభరణాలు ధరించిన, కొంచెం తెల్లని ఛాయతో వున్న ముఖకమలం గల, స్తనభారంతో వంగిన శరీరం గల, మహౌషధి సమూహంతో కూర్చబడిన మహామంత్రరక్షాబంధం ధరించిన, స్వచ్ఛమైన బంగారంతో చేయబడిన, జీవరక్షాప్రదమైన సర్పాభరణం కలిగిన మేనాదేవిని చూచింది.

**మణిదీపగణజ్యోతిర్మహాలోకప్రకాశితే ॥
ప్రకీర్ణబహుసిద్ధార్థే మనోజపరివారకే ।
శుచిచీనాంశుకచ్ఛన్నభూశయాస్తరణోజ్జ్వలే ॥ 89 ॥
ధూపామోదమనోరమ్యే సర్జగంధోపయోగకే ॥**

ఆ మేనాదేవి వున్న భవనం మణిదీప సమూహాల కాంతితో ప్రకాశిస్తున్నదై, కావలసిన వస్తువులన్నింటితో వ్యాప్తిచెందినదై, అనుకూలమైన పరిచారక గణం కలదై, పట్టు వస్త్రాలతో చేయబడిన పడక పరుపులు కలదై, మనోజ్ఞాలైన ధూప వాసనలతో నిండినదై, సర్వవిధ సుగంధద్రవ్యాలతో కూడినదై వున్నది.

**తతః క్రమేణ దివసే గతే దూరం విభావరీ ॥ 90 ॥
వ్యజృమ్భత సుఖోదర్కే తతో మేనా మహాగృహే ॥
ప్రసుప్తప్రాయపురుషే నిద్రాభూతోపచారికే ॥ 91 ॥**

అప్పుడు క్రమంగా పగటి సమయం ముగిసి రాత్రి అవుతుండగా, ఆ మేనాదేవి గృహం అత్యధిక సుఖ విశేషం కలది అయింది. పురుషులందరు నిద్రపోతున్నారు. పరిచారికలు కూడ నిద్రావస్థలోకి వెళ్ళుతున్నారు.

స్ఫుటాలోకే శశభృతి భ్రాంతిరాత్రివిహంగమే ।
రజనీచరభూతానాం సంఘైరావృతచత్వరే ॥92॥

గాఢకంఠగ్రహాలగ్నసుభగేష్టజనే తతః ।
కించిదాకులతాం ప్రాప్తే మేనా నేత్రాంబుజద్వయే ॥ 93 ॥

చంద్రుడు స్ఫుటంగా ప్రకాశిస్తున్నాడు. రాత్రి సంచరించే పక్షులు తిరుగుతున్నాయి. గృహపు ముంగిళ్ళలో క్షుద్ర భూతాలు తిరుగనారంభించాయి. ప్రియులు గాఢాలింగన సుఖాన్ని అనుభవించసాగారు. అప్పుడు మేనాదేవి నేత్రకమలాలు కూడ నిద్రాసుఖం కోసం కలవరపడుతున్నట్లున్నాయి.

ఆవివేశ ముఖే రాత్రిః సుచిరస్ఫుటసంగమా ।
జన్మదాయా జగన్మాతుః క్రమేణ జఠరాంతరే ॥
ఆవివేశాంతరం జన్మ మన్యమానా క్షపా తు వై ।
అరంజయచ్ఛవిం దేవ్యా గుహారణ్యే విభావరీ ॥ 95 ॥

అదే సమయంలో రాత్రిదేవి మేనాదేవితో కలసిపోయి, ఆమె ముఖం ద్వారా జగన్మాతకు జన్మనివ్వబోతున్న ఆమె గర్భంలో ప్రవేశించింది. వెంటనే గుహునికి (పుట్టబోయె కుమారస్వామికి) అరణి అయిన పార్వతీదేవి దేహకాంతిని జయించి ఆమె శరీర వర్ణాన్ని నలుపు రంగుగా చేసింది.

తతో జగత్పతిప్రాణహేతుర్హిమగిరిప్రియా ।
బ్రాహ్మే ముహూర్తే సుభగే వ్యసూయత గుహారణిమ్ ॥ 97 ॥

తరువాత జగత్పతికి ప్రాణహేతువు, హిమవంతునికి ప్రియురాలైన మేనాదేవి శుభప్రదమైన బ్రాహ్మీముహూర్తంలో గుహునికి జన్మనివ్వబోయే పార్వతిదేవికి జన్మనిచ్చింది.

తస్యాం తు జాయమానాయాం జన్తవః స్థాణుజంగమాః ।
అభవన్ సుఖినః సర్వే సర్వలోకనివాసినః ॥ 97 ॥

నారకాణామపి తదా సుఖం స్వర్గసమం మహత్ ।
అభవత్క్రూరసత్త్వానాం చేతః శాన్తిం చ దేహినామ్ ॥ 98 ॥

జగన్మాతఅయిన పార్వతీదేవి జన్మించగా స్థావరజంగమాత్మకాలైన ఈ లోకాలన్నింటిలో ప్రాణులందరూ సుఖాన్ని పొందారు. నరకలోకవాసులకు కూడ స్వర్గసుఖం ప్రాప్తించింది. క్రూరసత్త్వులైన ప్రాణులందరి మనస్సు శాంతించింది.

జ్యోతిషామపి తేజస్త్వమభవత్ సురతోన్నతా ।
వనాశ్రితాశ్చౌషధయః స్వాదువంతి ఫలాని చ ॥ 99 ॥

గంధవంతి చ మాల్యాని విమలం చ నభోఽభవత్ ।
మారుతశ్చ సుఖస్పర్శో దిశాశ్చ సుమనోహరాః ॥ 100 ॥

నక్షత్రాల కాంతి అధికమయింది. వనౌషధులన్నీ మధురఫలాలతో నిండినాయి. పుష్పాలన్నీ సుగంధ యుక్తాలయ్యాయి. ఆకాశం నిర్మలమయింది. వాయువు సుఖస్పర్శకలదయింది మరియు దిశలన్నీ సుమనోహరాలయ్యాయి.

తేన చోద్భూతఫలితపరిపాకగుణోజ్జ్వలాః ।
అభవత్ పృథివీ దేవీ శాలిమాలాకులాపి వా ॥ 101 ॥

చక్కగా ఫలించిన వరిపైరు పంటల వరుసలతో పృథివి అంతా కూడ సస్యశ్యామల మయ్యింది.

తపాంసి దీర్ఘచీర్ణాని మునీనాం భావితాత్మనామ్ ।
తస్మిన్ గతాని సాఫల్యం కాలే నిర్మలచేతసామ్ ॥ 102 ॥

అనాదికాలం నుండి భావితాత్ములై, నిర్మలాంతఃకరణులై తపస్సు చేస్తున్న మునులు పార్వతీదేవి జన్మసమయాన సఫలత్వాన్ని పొందారు.

విస్మృతాని చ శాస్త్రాణి ప్రాదుర్భావం ప్రపేదిరే ।
ప్రభావస్తీర్థముఖ్యానాం తదా పుణ్యతమోఽభవత్ ॥ 103 ॥

విస్మరించబడిన శాస్త్రాలన్నీ ఉద్ధృతాలయ్యాయి. ముఖ్యమైన తీర్థాల ప్రభావం మరింత పుణ్యతమమయింది.

అంతరిక్షే సురాశ్చాసన్విమానేషు సహస్రశః ।
సమహేంద్ర హరిబ్రహ్మావాయు వహ్నిపురోగమాః ॥ 104 ॥

పుష్పవృష్టిం ప్రముముచుః తస్మింస్తు హిమభూధరే ।
జగుర్గంధర్వముఖ్యాశ్చ ననృతుశ్చాప్సరోగణాః ॥ 105 ॥

ఇంద్రుడు, హరి, బ్రహ్మ, వాయువు, అగ్ని మొదలగు ప్రముఖులతో పాటు వేల కొలది దేవతలు అంతరిక్షంలో విమానాలలో వుండి ఆ హిమవత్పర్వతం మీద పుష్పవృష్టి కురిపించారు. గంధర్వముఖ్యులు గానం చేశారు. అప్సరసలు నాట్యం చేశారు.

మేరుప్రభృతయశ్చాపి మూర్తిమంతో మహాబలాః ।
తస్మిన్ మహోత్సవే ప్రాప్తే దివ్యప్రాభృతపాణయః ॥ 106 ॥

సరితః సాగరాశ్చైవ సమాజగ్ముశ్చ సర్వశః ।

ఆ శుభసమయంలో మహాబలిష్ఠులైన మేరువు మొదలగు మహాపర్వతాలన్నీ శరీరధారులై పలు దివ్యమైన వస్తువులను బహుమానాలుగా తీసుకొని హిమవంతుని దగ్గరకు వచ్చారు, మరియు నదులు సముద్రాలన్నీ కూడ అక్కడకు బయల్దేరాయి. (వెళ్లాయి)

హిమశైలోఽభవల్లోకే తథా సర్వైశ్చరాచరైః ॥ 107 ॥

సేవ్యశ్చాపృథిగమ్యశ్చ సశ్రేయాంశ్చాచలోత్తమః ।
అనుభూయోత్సవం దేవాః జగ్ముః స్వానాలయాన్ముదా ॥ 108 ॥

దేవ గంధర్వనాగేన్ద్ర శైల శీలావనీగణాః ।

పర్వతోత్తముడు మరియు భాగ్యవంతుడైన హిమవంతుడు ఆ సమయంలో సకలచరాచరాలకు సేవ్యుడయ్యాడు, ఆశ్రయణీయుడయ్యాడు. దేవ గంధర్వ నాగేంద్ర శైలేంద్రాదులందరూ ఆ ఉత్సవంలో పాల్గొని సంతోషంతో వారి వారి స్థానాలకు వెళ్ళిపోయారు.

హిమశైలసుతా దేవీ స్వయంపూర్వికయా తతః ॥ 109 ॥

క్రమేణ వృద్ధిమానీతా లక్ష్మీవానలసైర్బుధైః ।
క్రమేణ రూపసౌభాగ్యప్రబోధైర్భువనత్రయమ్ ॥ 110 ॥

అజయద్భూషయచ్చాపి నిఃసాధారైర్నగాత్మజా ॥

హిమశైల సుత అయిన పార్వతీదేవి స్వయంగా పెరుగుతున్నది లక్ష్మీవంతుడైన ఆ హిమవంతుడు దేవతల సహాయంతో ఆ జగన్మాతను క్రమంగా పెంచి పెద్దచేశారు. నగాత్మజ అయిన ఆమె తన అసాధారణమైన రూపంతో, గణాలతో లోకాన్ని జయించింది. లోకమంతటికి అలంకారమయింది.

ఏతస్మిన్నంతరే శక్రో నారదం దేవసమ్మతమ్ ॥ 111 ॥

దేవర్షిమథ సస్మార కార్యసాధనసత్వరమ్ ।
స్మృతిం శక్రస్య విజ్ఞాయ జాతాం తు భగవాంస్తదా ॥ 112 ॥

ఆజగామ ముదా యుక్తో మహేంద్రస్య నివేశనమ్ ।

ఇంతలో ఇంద్రుడు దేవపూజ్యుడు దేవర్షి అయిన నారదుని తమ దేవకార్య నిమిత్తమై స్మరించాడు. ఇంద్రుడు తనను స్మరించడం తెలిసికొన్న నారదుడు వెంటనే సంతోషంతో ఇంద్రభవనానికి వచ్చాడు.

తం స దృష్ట్వా సహస్రాక్షః సముత్థాయ మహాసనాత్ ॥ 113 ॥

యథార్ఘేణ తు పాద్యేన పూజయామాస వాసవః ।
శక్రప్రణీతాం తాం పూజాం ప్రతిగృహ్య యథావిధి ॥ 114 ॥

నారదః కుశలం దేవమపృచ్ఛత్ పాకశాసనమ్ ॥
పృష్టే చ కుశలే శక్రః ప్రోవాచ వచనం ప్రభుః ॥ 115 ॥

సహస్రాక్షుడైన ఇంద్రుడు నారదుని రాకను చూచి తన సింహాసనం నుండి లేచి, ఉచితాలైన అర్ఘ్యపాద్యాదులతో అతనిని పూజించాడు. ఇంద్రుడు యథావిధిగా చేసిన పూజను గ్రహించిన నారదుడు సంతోషించి కుశలప్రశ్నలడిగాడు. ఆ కుశలప్రశ్నలు విన్న ఇంద్రుడు నారదునికి ఇలా చెప్పసాగాడు.

ఇంద్ర ఉవాచ - ఇంద్రుడు చెప్పాడు.

కుశలస్యాంకురే తావత్సంభూతే భువనత్రయే ।
తత్ఫలోద్భవసంపత్తౌ త్వం భవాతంద్రితో మునే ॥ 116 ॥

మహర్షీ! ముల్లోకాలకు క్షేమం కలిగించే అంకురం (దేవి) జన్మించింది. ఆ అంకురం ఫలించడంలో నీవు కూడ అసత్యం లేకుండా తోడ్పడవలసివున్నది.

వేత్సి చైతత్సమస్తం త్వం తథాపి పరిచోదకః ।
నిర్వృతిం పరమాం యాతి నివేద్యార్థం సుహృజ్జనే ॥ 117 ॥

తద్యథా శైలజా దేవీ యోగం యాయాత్ పినాకినా ।
శీఘ్రం తదుద్యమః సర్వైరస్మత్పక్షైర్విధీయతామ్ ॥ 118 ॥

నారదా! ఈ విషయమంతా నీకు తెలుసు. అయినా మరల నానుండి వినడానికి నన్ను ప్రోత్సహిస్తున్నావు. అంతేకాక తన మనసులోని విషయాలను సహృదయులైన మిత్రులకు చెబితే తృప్తి కలుగుతుంది. హృదయ భారం కూడ తగ్గిపోతుంది. ఇప్పుడు శివపార్వతుల సంగమం కోసం మన పక్షాన వున్న వారందరం కలసి ప్రయత్నించవలసివున్నది.

అవగమ్యార్థమఖిలం తత ఆమంత్ర్య నారదః ।
శక్రం జగామ భగవాన్ హిమశైలనివేశనమ్ ॥ 119 ॥

ఇంద్రుడు చెప్పిన విషయమంతా విని, అతని నుండి సెలవు తీసుకుని నారదమహర్షి వెంటనే హిమవంతుని భవనానికి వెళ్ళాడు.

తత్ర ద్వారే స విప్రేంద్రశ్చిత్ర వేత్రలతాకులే ॥
వందితో హిమశైలేన నిర్గతేన పురోమునిః ॥ 120 ॥

సహ ప్రవిశ్య భవనం భువో భూషణతాం గతమ్ ।
నివేదితే స్వయం హైమే హిమశైలేన విస్తృతే ॥ 121 ॥

నారదుడు చిత్రాలైన వేత్రలతలతో అలంకరించబడిన హిమవంతుని భవనం ద్వారాన్ని చేరుకోగా, హిమవంతుడే స్వయంగా అతనికి ఎదురేగి నమస్కరించి స్వాగతం పలికాడు. తర్వాత నారదుడు హిమవంతునితో కూడ త్రిభువనాలకే భూషణప్రాయమైన అతని భవనంలో ప్రవేశించి, హిమవంతుడు చూపించిన విశాలమైన బంగారు అసనాన్ని అధిరోహించాడు.

మహాసనే మునివరో నిషసాదాతులద్యుతిః ॥
యథార్హం చార్ఘ్యపాద్యం చ శైలస్తస్మై న్యవేదయత్ ॥ 122 ॥

అసమాన తేజస్సు గల మునిశ్రేష్ఠుడైన నారదుడు మహాసనాన్ని అధిష్ఠించగా, శైలరాజు ఉచితమైన రీతిలో ఆతనికి అర్ఘ్య పాద్యాలు అందించాడు.

మునిస్తు ప్రతిజగ్రాహ తమర్ఘ్యం విధివత్ తదా ।
గృహీతార్ఘ్యం మునివరం అపృచ్ఛత్ శ్లక్ష్ణయా గిరా ॥ 123 ॥

కుశలం తపసః శైలః శనైః ఫుల్లాననాంబుజః ।
మునిరప్యద్రిరాజానం అపృచ్ఛత్కుశలం తదా ॥ 124 ॥

నారదమునీంద్రుడు కూడ ఆ అర్ఘ్యాదులను యథావిధిగా స్వీకరించాడు. తర్వాత హిమవంతుడు వికసించిన పద్మం వంటి ముఖం గలవాడై మృదువైన మాటలతో నారదుని తపోవిషయమై కుశలమడిగాడు. అప్పుడు నారదుడు కూడ పర్వతరాజైన హిమవంతుని కుశలములడిగాడు.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

అహోఽవతారితాః సర్వే సన్నివేశో మహాగిరే! ।
పృథుత్వం మనసా తుల్యం కందరాణాం తథాచల! ॥ 125 ॥

గురుత్వం తే గుణౌఘానాం స్థావరాదతిరిచ్యతే ।
ప్రసన్నతా చ తోయస్య మనసోఽప్యధికా చ తే ॥ 126 ॥

న లక్షయామః శైలేన్ద్ర! శిష్యతే కందరోదరాత్ ।
న చ లక్ష్మీస్తథా స్వర్గే కుత్రాధికతయా స్థితా ॥ 127 ॥

ఓ హిమవంతుడా! మహాగిరీ! నీవు అన్ని మంచి సన్నివేశాలకు స్థానభూతుడవు, దేవతావతారరూపుడవు, లోతైన మరియు విశాలమైన కందరాలు నీ గొప్ప మనస్సుకు తార్కాణాలు, స్థావరరూపుడవైన నీ గురుత్వం కంటె నీ గుణసముదాయం మించివున్నది. నీవు ధరించిన నిర్మలమైన నదీజలం కంటె నీ మనస్సు నిర్మలమైనది. ఇంతటి నీ వైశాల్యం మహత్త్వం నేను ఎక్కడా చూడలేదు. ఓ శైలేంద్రా! స్వర్గలోకం తర్వాత లక్ష్మీదేవి నీ ఈ హిమాచలం పైనే అధికంగా నివసిస్తున్నది.

నానా తపోభిర్మునిభిః జ్వలనార్కసమప్రభైః
పావనైః పావితో నిత్యం త్వత్కందరసమాశ్రితైః ॥ 128 ॥

సూర్యునితో సమానమైన కాంతి గలిగిన మునుల తపస్సులచేత నీ పర్వత గుహలు పవిత్రాలైనాయి.

అవమత్య విమానాని స్వర్గవాసవిరాగిణః ।
పితుర్గృహ ఇవాసన్నా దేవగంధర్వ కిన్నరాః ॥ 129 ॥

స్వర్గలోక నివాసంపై వైరాగ్యం పొంది, తమ విమానాలను కూడ విడిచిపెట్టి దేవతలు, గంధర్వులు, కిన్నరులు తమ తండ్రి గృహంలో వున్నట్లు నీ హిమాచలంపై నివసిస్తున్నారు.

అహో ధన్యోఽసి శైలేంద్ర యస్య తే కందరం హరః ।
అధ్యాస్తే లోకనాథోఽపి సమాధాన పరాయణః ॥ 130 ॥

ఓ శైలేంద్రా! నీ కందరాన్నే నివాసంగా జేసికొని లోకనాథుడైన పరమశివుడు సమాహితచిత్తుడై తపమాచరిస్తున్నాడు. నీవు ధన్యుడవు.

ఇత్యుక్తవతి దేవర్షౌ నారదే సాదరం గిరా ।
హిమశైలస్య మహిషీ మేనా మునిదిదృక్షయా ॥ 131 ॥

అనుయాతా దుహిత్రా తు స్వల్పాలిపరిచారికా ।
లజ్జాప్రణయనమ్రాంగీ ప్రవివేశ నివేశనమ్ ॥ 132 ॥

దేవర్షి నారదుడు సాదరంగా ఇలా చెబుతుండగా, హిమవంతుని పట్టమహిషియైన మేనాదేవి నారదమునిని చూడాలనే కోరికతో కూతురైన పార్వతిని వెంటబెట్టుకొని, స్వల్పమైన సఖీపరివార గణంతో, సిగ్గుతో మరియు వినయంతో వినమ్రురాలై అక్కడకు ప్రవేశించింది. (వచ్చింది).

తత్ర స్థితో మునివరః శైలేన సహితో వశీ ।
దృష్ట్వా తు తేజసో రాశిం మునిం శైలప్రియా తదా ॥ 133 ॥

వవందే గూఢవదనా పాణిపద్మకృతాంజలిః ।

హిమవంతునితో కూడ అక్కడ ఆసీనుడైవున్న గొప్ప తేజస్సంపన్నుడైన నారదమహర్షిని చూచి పర్వత రాజుకు ప్రియురాలైన మేనా కమలాలవంటి తన హస్తాలతో తలవంచి ఆయనకు నమస్కరించింది.

తాం విలోక్య మహాభాగో మహర్షిరమితద్యుతిః ॥ 134 ॥

ఆశీర్భిరమృతోద్గారరూపాభిస్తాం వ్యవర్ధయన్ ।

అమిత తేజోవంతుడైన నారద మహర్షి ఆమెను చూచి, అమృతతుల్యాలైన ఆశీర్వచనాలతో ఆమెను (మేనాదేవిని) వర్ధిల్లజేశాడు.

తతో విస్మిత చిత్తా తు హిమవద్గిరిపుత్రికా ॥ 135 ॥

ఉద్వైక్షన్నారదం దేవీ మునిమద్భుతరూపిణమ్ ।
ఏహి వత్సేతి చాప్యుక్తా ఋషిణా స్నిగ్ధయా గిరా ॥ 136 ॥

హిమవద్గిరి పుత్రికయైన పార్వతీదేవి ఆశ్చర్యచకితురాలై అద్భుతమైన రూపం గల నారదమహర్షిని చూసింది. నారదుడు కూడ ప్రీతికరమైన మాటతో బిడ్డా! ఇటు రమ్మని పిలిచాడు.

కంఠే గృహీత్వా పితరముత్సంగే సముపావిశత్ ।
ఉవాచ మాతా తాం దేవీ మభివందయ పుత్రికే! ॥ 137 ॥

పార్వతి తన తండ్రి మెడ చుట్టూ చేతులు వేసి ప్రేమతో ఆయన తొడపై కూర్చున్నది. అపుడు మేనా 'పుత్రీ! నారదమునీంద్రునకు నమస్కరించు' అని చెప్పింది.

భగవంతం తతో ధన్యం పతిమాప్స్యసి సమ్మతమ్ ।
ఇత్యుక్తా తు తతో మాత్రా వస్త్రాంతపిహితాననా ॥ 138 ॥

కించిత్కంపితమూర్ధా తు వాక్యం నోవాచ కించన ।

నీవు భగవానుడైన, ధన్యుడైన, నీకు ఇష్టమైన భర్తను పొందుతావని మేనాదేవి చెప్పగా, పార్వతి వస్త్రపు అంచుతో ముఖం దాచుకుని, శిరస్సు కొంచెం కంపించగా ఏమీ మాట్లాడలేకపోయింది.

తతః పునరువాచేదం వాక్యం మాతా సుతాం తదా ॥ 139 ॥

వత్సే వందయ దేవర్షిం తతో దాస్యామి తే శుభమ్ ।
రత్నక్రీడనకం రమ్యం స్థాపితం యచ్చిరం మయా ॥ 140 ॥

అప్పుడు తల్లి మరల కుమార్తెతో ఇలా అన్నది అమ్మా దేవర్షికి నమస్కరించు. అలా చేస్తే, నేను చాలా కాలం నుండి నీ కోసం దాచి ఉంచిన రమ్యమైన, రత్నాల ఆటవస్తువును నీ కిస్తాను అని చెప్పింది.

ఇత్యుక్తా తు తతో వేగాదుద్ధృత్య చరణౌ తదా ।
వవందే మూర్ధ్ని సంధాయ కరపంకజకుడ్మలమ్ ॥ 141 ॥

పార్వతి తల్లి మాటలు విని వేగంగా లేచి పంకజపు మొగ్గల వంటి తన లేత చేతులను పైకెత్తి మహర్షికి నమస్కరించింది.

కృతే తు వందనం తస్యా మాతా సఖీముఖేన తు ।
చోదయామాస శనకైః తస్యాః సౌభాగ్యశంసినామ్ ॥ 142 ॥

శరీరలక్షణానాం తు విజ్ఞానాయ తు కౌతుకాత్ ।
స్త్రీస్వభావాద్యద్దుహితుః చింతా హృది సముద్వహన్ ॥ 143 ॥

పార్వతి నమస్కరించిన తర్వాత స్వభావసిద్ధంగానే కూతురి భవిష్యత్తు గురించి విచారం కలిగిన మేనా పార్వతీదేవి సౌభాగ్యాన్ని, ఆమె శరీర లక్షణాలను తెలుసుకోవాలన్న ఉత్సాహంతో మెల్లగా తన సఖురాలిని పిలిచి నారదుని అడుగమని ప్రోత్సహించింది.

జ్ఞాత్వా తదింగితం శైలో మహిష్యా హృదయేన తు ।
అనుద్గీర్ణోఽక్షతిర్మేనే రమ్యమేతదుపస్థితమ్ ॥ 144 ॥

హిమవంతుడు కూడ తన పట్టమహిషి సఖికి చేస్తున్న సంజ్ఞాసూచన ద్వారా ఆమె అభిప్రాయాన్ని తెలిసికొని సంతసించాడు. ఇది ఉచితమైన సమయమే అనుకొని శుభమే జరుగుతుందని భావించాడు.

చోదితః శైలమహిషీ సఖ్యా మునివరస్తదా ।
స్మితాననో మహాభాగో వాక్యం ప్రోవాచ నారదః ॥ 145 ॥

న జాతోఽస్యాః పతిర్భద్రే! లక్షణైశ్చ వివర్జితా ॥
ఉత్తానహస్తా సతతం చరణైర్వ్యభిచారిభిః ॥
స్వచ్ఛాయయా భవిష్యేయం కిమన్యద్ బహు భాష్యతే? ॥ 146 ॥

మేనాదేవి సఖురాలిచే ప్రేరేపించబడిన మునిశ్రేష్ఠుడైన నారదుడు చిరునవ్వుతో 'మంగళప్రదమైనభావన గల్గిన ఓ మేనా! ఈమెకు కావలసిన పతి ఇంకా పుట్టలేదు. అంతేకాక ఈమెలో మంచి లక్షణాలు కనబడటంలేదు. ఈమె చేతులు ఎప్పుడూ ఉత్తానాలై, పాదాలు కూడ ఒకచోట నిలువక చంచల స్వభావం కలవై ఉన్నాయి. ఇంకా ఇంతకన్న ఎక్కువ చెప్పవలసినదేముంది?

శ్రుత్వైతత్ సంభ్రమావిష్టో ధ్వస్తధైర్యో మహాబలః ।
నారదం ప్రత్యువాచాథ సాశ్రుకంఠో మహాగిరిః ॥ 147 ॥

నారదుని మాటలు విని మహాబలుడైన హిమవంతుడు ధైర్యం నశించగా కన్నీటితో ఇలా మారు పలికాడు.

హిమవానువాచ – హిమంతుడు చెప్పాడు

సంసారస్యాతి దోషస్య దుర్విజ్ఞేయా గతిర్యతః ।
సృష్ట్యాం చావశ్యభావిన్యాం కేనాప్యతిశయాత్మనా ॥ 148 ॥

కర్త్రా ప్రణేతా మర్యాదా స్థితా సంసారిణామియమ్ ।
యో జాయతే హి యద్బీజో జనితుః స హ్యసార్థకః ॥ 149 ॥

ఈ సంసారం మిక్కిలి దోషయుక్తమైనది. దీని గమనాన్ని తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ఈ సృష్టిలో తప్పనిసరిగా జరుగవలసిన దానిని గురించి సర్వాతిశయాత్ముడైన సృష్టికర్తచేతనే స్వయంగా ఒక హద్దు నియమించబడింది. ఎవడు ఎవని వీర్యం వలన జన్మిస్తాడో అతడు ఈ సంసారంలో ఆ తండ్రికి ఏదీ సాధించడు.

జనితా చాపి జాతస్య న కశ్చిదితి యత్ స్ఫుటమ్ ।
స్వకర్మణైవ జాయన్తే వివిధా భూతజాతయః ॥ 150 ॥

అండజో అండజాజ్జాతః పునర్జాయేత మానవః ।
మానుషాచ్చ సరీసృప్యాం మనుష్యత్వేన జాయతే ॥ 151 ॥

తన పుట్టుకకు కారణమైన తండ్రి కూడ పుట్టిన సంతానానికి ఏమీ చేయలేడు. ప్రాణులంతా స్వస్వకర్మానుసారమే జన్మిస్తారు. అండజాలు అండజాల నుండే పుడతాయి. ఒక జన్మలో అండజంగా వున్నది మరొక జన్మలో మానవుడుగా పుడుతుంది. ఇప్పుడు మానవుడుగా నున్న జీవి మరో జన్మలో సరీసృపం కావచ్చును. అలాగే సరీసృపంగా వున్న వాడు మరల మానవుడుగా జన్మిస్తాడు.

తత్రాదిజాతౌ శ్రేష్ఠాయాం ధర్మస్యోత్కర్షణేన తు ।
అపుత్ర జన్మినః శేషాః ప్రాణినః సమవస్థితాః ॥ 152 ॥

మనుజాస్తత్ర జాయంతే యతో న గృహధర్మిణః ।
క్రమేణాశ్రమ సంప్రాప్తిర్బ్రహ్మచారివ్రతాదను ॥ 153 ॥

అంతేకాక జీవుడు తాను ఆచరించిన ధర్మకర్మానుసారం శ్రేష్ఠమైన జాతిలో పుడతాడు. మానవులు తప్ప మిగిలిన ఏ ప్రాణులు కూడ పుత్రులు కలగాలనే విషయాన్ని ఎరుగవు (వాటికి తల్లి, తండ్రి), కొడుకు అనే సంబంధాలుండవు, తల్లిదండ్రుల కోసం పుత్రుడు, పుత్రుని కోసం తల్లిదండ్రులు ఆచరించే కర్మలుండవు కదా). మానవులు కూడ పుట్టుకతోనే గృహస్థులుగా పుట్టరు. బ్రహ్మచర్యవ్రతంతో ఆరంభమై గృహస్థాది ఆశ్రమాలు క్రమంగా ప్రాప్తిస్తాయి.

తస్య కర్తుర్నియోగేన సంసారో యేన వర్ధితః ।
సంసారస్య కుతో వృద్ధిః సర్వే స్యుర్యది నిగ్రహాః ॥ 154 ॥

అతః కర్త్రా తు శాస్త్రేషు సుతలాభః ప్రశంసితః ।
ప్రాణినాం మోహనార్థాయ నరకత్రాణసంశ్రయాత్ ॥ 155 ॥

సృష్టికర్త ఆజ్ఞ చేతనే ఈ సంసారం వృద్ధిపొందుతుంది. లోకంలో అందరూ నిగ్రహం కలవారే అయితే ఈ సృష్టి ఎలా వృద్ధి పొందుతుంది? సృష్టికర్త స్వయంగా ప్రాణులకు మోహం కలిగించే, నరకాదిలోకాల నుండి రక్షించే 'పుత్రలాభం' గురించి శాస్త్రాలతో ప్రశంసించాడు.

స్త్రియా విరహితా సృష్టిః జన్తూనాం నోపపద్యతే ।
స్త్రీ జాతిషు ప్రకృత్యైవ కృపణా దైన్యభాషిణీ ॥
శాస్త్రాలోచనసామర్థ్యం ఉజ్ఝితం తాసు వేధసా ॥ 156 ॥

కాని స్త్రీ లేకుండా ప్రాణులలో సృష్టి జరగడానికి అవకాశం లేదు. ప్రకృతిసిద్ధంగానే స్త్రీ జాతికి భయం, దీనంగా మాట్లాడడం ఆపాదించబడ్డాయి. అంతేకాక సృష్టికర్త వారికి శాస్త్రాలోచన చేసే సామర్థ్యం కూడ లేకుండా చేశాడు.

శాస్త్రేషూక్తమసందిగ్ధం బహువారం మహాఫలమ్ ।
దశపుత్రసమా కన్యా యా న స్యాచ్ఛీలవర్జితా ॥ 157 ॥

కాని శాస్త్రాలలో ఆ విధంగా చెప్పింది అసందిగ్ధమే. పుత్రిక జన్మ మంచి ఫలితమిచ్చిన సంఘటనలు అనేకమున్నాయి. శీలవతియైన ఒక కన్య పదిమంది పుత్రులతో సమానం.

వాక్యమేతత్ ఫలభ్రష్టం పుంసి గ్లానితరం పరమ్ ।
కన్యా హి కృపణా శోచ్యా పితుర్దుఃఖవివర్ధినీ ॥ 158 ॥

యాఽపి స్యాత్ పూర్ణసర్వాఢ్యా పతిపుత్రధనాదిభిః ।
కిం పునర్దుర్భగా హీనా పతిపుత్రధనాదిభిః ॥ 159 ॥

కాని ఈ వాక్యం నిష్ఫలమైనది పురుషులకు వ్యథ కలిగించేదియు అయింది. దీనురాలైన మరియు దుఃఖితురాలైన కూతురు తల్లిదండ్రులకు దుఃఖాన్నే కలిగిస్తుంది. పతిపుత్రధనాదులతో పరిపూర్ణురాలైనప్పటికి తన దీనత్వంతో తల్లిదండ్రులకు విచారం కలిగిస్తుంది. ఇక దురదృష్టవంతురాలైన పతిపుత్రధనాదులు లేని కూతురి గురించి ఏమి చెప్పాలి?

త్వం చోక్తవాన్ సుతాయా మే శరీరే దోషసంగ్రహమ్ ।
అహెూ ముహ్యామి శుష్యామి గ్లామి సీదామి నారద ॥ 160 ॥

ఓ నారదా! నా కూతురి శరీరంలో అనేక దోషాలున్నాయని చెప్పావు. నాకు నిఃస్పృహ కలుగుతున్నది. శుష్కించి పోతున్నాను. వ్యథపొందుతున్నాను కృశించిపోతున్నాను.

అయుక్త మథ వక్తవ్యం అప్రాప్యమపి సాంప్రతమ్ ।
అనుగ్రహేణ మే ఛ్చింది దుఃఖం కన్యాశ్రయం మునే ॥ 161 ॥

నా కూతురు విషయంలో అయుక్తమైనది పొందరానిది ఏది వున్నదో నాయందు అనుగ్రహంతో వివరించి కన్యాసంబంధమైన నా దుఃఖాన్ని ఛేదించు.

పరిచ్ఛిన్నేఽప్యసందిగ్ధే మనఃపరిభవాశ్రయమ్ ।
తృష్ణా ముష్ణాతి నిష్ణాతా ఫలలోభాశ్రయా శుభా ॥ 162 ॥

ఇంత కంటె గొప్ప మేలు కలిగేది ఏది తెలిసినా, మనస్సులో అవమానపడుతున్నా ఇంకనూ ఏదో శుభప్రదమైన ఫలం కలుగుతుందనే ప్రగాఢమైన ఆశ నన్ను వదలడం లేదు.

స్త్రీణాం హి పరమం జన్మ కులానాముభయాత్మనామ్ ।
ఇహాముత్ర సుఖాయోక్తం సత్పతిప్రాప్తిసంజ్ఞితమ్ ॥ 163 ॥

స్త్రీల జన్మ ఉభయ (పుట్టినింటికి, మెట్టినింటికి) వంశాలకు శుభము కలిగిస్తుంది. ఇంకను ఆమెకు మంచి భర్త దొరికితే ఈ రెండు వంశాలకు ఇహలోకంలో పరలోకంలో కూడ ప్రీతి కలిగిస్తుంది.

దుర్లభః సత్పతిః స్త్రీణాం విగుణోఽపి పతిః కిల ॥
న ప్రాప్యతే వినా పుణ్యైః పతిర్నార్యా కదాచన ॥ 164 ॥

స్త్రీలకు గుణవంతుడైన మంచి భర్త దొరకటం దుర్లభమే. స్త్రీకి పుణ్యకర్మలు లేకుండా ఎప్పుడూ మంచి భర్త దొరకడు.

యతో నిస్సాధనో ధర్మః పరిమాణోజ్ఝితా రతిః ।
ధనం జీవితపర్యాప్తం పతౌ నార్యా ప్రతిష్ఠితమ్ ॥ 165 ॥

నిర్ధనో దుర్భగో మూర్ఖః సర్వలక్షణవర్జితః ।
దైవతం పరమం నార్యాః పతిరుక్తః సదైవ హి ॥ 166 ॥

తాను ఎటువంటి సాధన చేయకపోయినా, భర్త ధర్మాచరణం వలన వచ్చే ధనం మరియు అపరిమితమైన సుఖానుభవాలు స్త్రీ పొందుతుంది. నిర్ధనుడు, దుష్టుడు, మూర్ఖుడు మరియు ఎటువంటి మంచిలక్షణాలు లేనివాడైనప్పటికి స్త్రీకి భర్త సదా పరదైవమని చెప్పబడింది. (శాస్త్రాలలో).

త్వయా చోక్తం హి! దేవర్షే న జాతోఽస్యాః పతిః కిల ।
ఏతద్దౌర్భాగ్యమతులమ్ అసంఖ్యం గురు దుస్సహమ్ ॥ 167 ॥

చరాచరే భూతసర్గే యదద్యాపి చ నో మునే ।
న స జాత ఇతి బ్రూషే తేన మే వ్యాకులం మనః ॥ 168 ॥

దేవర్షీ! నా ఈ కూతురికి కావలసినవాడు ఇంకనూ పుట్టలేదని నీవన్నావు. ఈ దౌర్భాగ్యం సాటిలేనిది, లెక్కలేనిది మరియు భరించటానికి శక్యంకానిది. ఓ మునీశ్వరా! ఈ చరాచర భూతసృష్టిలో ఈమెకు కావలసినవాడు ఇప్పటికీ జన్మించలేదని చెబుతున్న మీ మాటలు నాకు మనోవ్యాకులతను కలిగిస్తున్నాయి.

మనుష్యదేవ జాతీనాం శుభాశుభనివేదకమ్ ।
లక్షణం హస్త పాదాదౌ విహితైర్లక్షణైఃకిల ॥ 169 ॥

మనుష్య దేవ జాతుల వారందరికి శుభాశుభాలను తెలియజేసే లక్షణాలు పాద, హస్తాలలోనే చిహ్నితమై వుంటాయి కదా!

సేయముత్థానహస్తేతి త్వయోక్తా మునిపుంగవ! ।
ఉత్థానహస్తతా ప్రోక్తా యాచతామేవ నిత్యదా ॥ 170 ॥
శుభోదయానాం ధన్యానాం న కదాచిత్ ప్రయచ్ఛతామ్ ॥

ఓ మునిపుంగవా! ఈ నా కూతురు 'ఉత్థానహస్తా' – అనగా – అరచేయి పైకి వచ్చేటట్లు పెట్టుకొని వుండేదని నీవన్నావు. ఇటువంటి లక్షణం యాచించుకొనేవారికే వుంటుంది కాని శుభసమృద్ధికలవారికి, ధన్యులైనవారికి, ఇతరులకు దానం చేసేవారికి వుండదు కదా!

స్వచ్ఛాయ యాస్యాశ్చరణౌ త్వయోక్తౌ వ్యభిచారిణౌ ॥ 171 ॥
తత్రాపి శ్రేయసాం హ్యాశా మునే తు ప్రతిభాతి నః ॥

అంతేకాక ఈమె పాదాలు కూడ తన నీడవున్న చోట నుండి కదిలిపోతూ చంచలస్వభావం కలవై వుంటాయన్నావు. కనుక ఈ నా కూతురికి శ్రేయస్సు లభిస్తుందన్న ఆశ కూడ మాకు కనబడటం లేదు.

శరీరలక్షణాశ్చాన్యే పృథక్ ఫలనివేదినః ॥ 172 ॥
సౌభాగ్యధనపుత్రాయుః పతిలాభానుశంసనమ్ ।
తైశ్చ సర్వైర్విహీనేయం త్వమాత్థ మునిపుంగవ ॥ 173 ॥

సౌభాగ్యం, ధనం, పుత్రులు, ఆయుష్షు, మంచి భర్త మొదలైనవన్నీ లభిస్తాయని తెలిపే వివిధ శరీర లక్షణాలు ఎన్నో వుంటాయి కదా, మునివరా! అవేవీ ఈమెకు లేవని చెప్పావు కదా!

త్వం మే సర్వం విజానాసి సత్యవాగసి చాప్యతః ।
ముహ్యామి మునిశార్దూల! హృదయం దీర్యతీవ మే ॥
ఇత్యుక్త్వా విరతః శైలో మహాదుఃఖవిచారణాత్ ॥ 174 ॥

మునిశ్రేష్ఠుడా! నీవు నాకు చెందినది సర్వం తెలిసిన వాడవు, సత్యవచనుడవు. నీ మాటలు విన్న నాకు బాధ కలుగుతున్నది. నా హృదయం బ్రద్దలవుతున్నది - అంటూ హిమవంతుడు తన దుఃఖాన్ని నారదునికి తెలిపాడు.

శ్రుత్వైతదఖిలం తస్మాత్ శైలరాజముఖాంబుజాత్ ॥
స్మితపూర్వమువాచేదం నారదో దేవచోదితః ॥ 175 ॥

శైలరాజైన హిమవంతుడు చెప్పినదంతా విని, దేవతలచేత ప్రేరేపితుడైన దేవర్షి నారదుడు చిరునవ్వుతో మరల ఇలా చెప్పాడు.

నారద ఉవాచ - నారదుడు చెప్పాడు.

హర్షస్థానేఽ పి మహతి త్వయా దుఃఖం నిరూప్యతే ।
అపరిచ్ఛిన్నవాక్యార్థే మోహం యాసి మహాగిరే ॥ 176 ॥

గొప్పగా హర్షించే విషయంలో కూడ నీవు దుఃఖం ప్రకటిస్తున్నావు. ఓ హిమాచలా! అపరిచ్ఛిన్నమైన వాక్యార్థాన్ని తెలుసుకోకుండ నీవు మోహము పొందుచున్నావు.

ఇమాం శృణు గిరం మత్తో రహస్యపరినిష్ఠితామ్ ।
సమాహితో మహాశైల మయోక్తస్య విచారణే ॥ 177 ॥

ఇప్పుడు నేను చెప్పబోయే రహస్యార్థాన్ని వివరించే నా మాటలు శ్రద్ధగా వినుము. ఓ మహాశైలా! తర్వాత దాన్ని గురించి ఆలోచించడానికి సమాహితచిత్తుడవై వుండు.

న జాతోఽ స్యాః పతిర్దేవ్యా యన్మయోక్తం హిమాచల! ।
న స జాతో మహాదేవో భూతభవ్యభవోద్భవః ॥
శరణ్యః శాశ్వతః శాస్తా శంకరః పరమేశ్వరః ॥ 178 ॥

ఓ హిమవంతుడా! ఈమెకు పతి కావలసిన వాడు ఇంకనూ జన్మించలేదని నేనన్నాను. నిజమే ఆ మహాదేవుడు పుట్టినవాడు కాదు. సమస్త భూతాల వ్యక్తస్థితిని తెలుపువాడు. అతను అందరికి శరణ్యుడు, శాశ్వతుడు, శాసించేవాడు, శంకరుడు-శుభాలను కలుగజేసేవాడు మరియు పరమేశ్వరుడు.

బ్రహ్మవిష్ణింద్రమునయో జన్మమృత్యుజ్వరార్దితాః ।
తస్యైతే పరమేశస్య సర్వే క్రీడనకా గిరే ॥ 179 ॥

ఓ గిరీంద్రుడా! బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, మునులు మొదలగు వారి కందరికీ జన్మము, మృత్యువు, జ్వరము ఇత్యాది బాధలు కలవు. పరమేశ్వరునికి వారంతా కూడ ఆటవస్తువులు.

ఆస్తే బ్రహ్మా తదిచ్ఛాతః సంభూతో భువనప్రభుః ।
విష్ణుర్యుగే యుగే జాతో నానాజాతిర్మహాతనుః ॥ 180 ॥
మన్యసే మాయయా జాతం విష్ణుం చాపి యుగే యుగే ।
ఆత్మనో న వినాశోఽస్తి స్థావరాంతేపి భూధర ॥ 181 ॥

ఆ పరమేశ్వరుని కోరిక ప్రకారమే బ్రహ్మదేవుడు ఈ త్రిభువనాలకు సృష్టికర్త అయ్యాడు. శ్రీమహావిష్ణువు కూడ ప్రతియుగంలో వివిధ జన్మలలో మహాతనువు కలవాడై పుడతాడు. ప్రతి యుగమున విష్ణువు మాయకు వశుడై విభిన్న అవతారాల రూపంలో జన్మిస్తున్నాడు. ఓ భూధరా! అవతరిస్తాడు. ప్రళయకాలాంతంలో కూడ ఈ ఆత్మకు నాశం లేదు.

సంసారే జాయమానస్య మ్రియమాణస్య దేహినః ।
నశ్యతే దేహమేవాత్ర నాత్మనో నాశ ఉచ్యతే ॥ 182 ॥

బ్రహ్మాదిస్థావరాంతోఽయం సంసారో యః ప్రకీర్తితః ।
స జన్మమృత్యుదుఃఖార్తో హ్యవశః పరివర్తతే ॥ 183 ॥

ఈ సంసారంలో జన్మిస్తున్న మరియు మరణిస్తున్న జీవుని దేహానికే నాశం కాని, ఆత్మకు నాశం లేదు. బ్రహ్మ మొదలుకొని స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచంలో జన్మమృత్యు దుఃఖార్తులై వుంటారు. కాని ఆత్మ మాత్రం ఒక దేహం నుండి మరొక దేహానికి మారుతుంటుంది.

మహాదేవోఽచలః స్థాణుర్న జాతో జనకోఽజరః ।
భవిష్యతి పతిః సోఽస్యాః జగన్నాథో నిరామయః ॥ 184 ॥

కాని ఆ మహాదేవుడు అచలుడు, స్థాణువు స్థిరంగా వుండేవాడు, అతనే ఇతరులను పుట్టిస్తాడు. ఈయనకు వృద్ధాప్యముండదు. జగత్ప్రభువు మరియు నిరామయుడు అనగా ఎటువంటి దోషం కూడ లేనివాడైన పరమేశ్వరుడు ఈ నీ కూతురికి భర్త అవుతాడు.

యదుక్తం చ మయా దేవి లక్షణైర్వర్జితా తవ ।
శ్రుత్వైతస్యాపి వాక్యస్య సమ్యక్త్వేన విచారణమ్ ॥ 185 ॥

ఈ దేవి లక్షణ వర్జితయని నీకు నాచే చెప్పబడినది కదా, ఆ నా మాటలను చక్కగా విపులీకరించెదను వినుము.

లక్షణం దైవికో హ్యఙ్కః శరీరావయవాశ్రయః ।
సర్వాయుర్ధనసౌభాగ్యపరిమాణ ప్రకాశకః ॥ 186 ॥

లక్షణము దైవికముగా శరీరావయవములను ఆశ్రయించి ఉండునట్టి ఒకానొక గుర్తు. వివిధ అవయవములందు కనబడు లక్షణములు ఆయుష్యము, ధనము, సౌభాగ్యము మొదలగు వాటి యొక్క పరిమాణమును తెలుపునటువంటి చిహ్నములు.

అనన్తస్యాప్రమేయస్య సౌభాగ్యస్యాస్య భూధర ।
నైవాంకో లక్షణాకారః శరీరే సంవిధీయతే ॥ 187 ॥

అతో౽స్యా లక్షణం గాత్రే శైల నాస్తి మహామతే ।

అనంతం, అప్రమేయమైన ఈమె యొక్క సౌభాగ్యానికి లక్షణం ఇది అని చెప్పదగినటువంటి చిహ్నమేదీ ఈమె శరీరమునందు కనబడటం లేదు. అందుకే ఓ మహామతీ! శైలేంద్రా! ఈ పార్వతి శరీరంలో లక్షణా లేవియు లేవన్నాను.

యథాహముక్తవానస్యా హ్యుత్థానకరతాం సదా ॥ 188 ॥

ఉత్థానో వరదః పాణి రేష దేవ్యా సదైవ తు ।
సురాసుర మునిత్రాతా వరదేయం భవిష్యతి ॥ 189 ॥

ఈ పార్వతి ఎప్పుడూ ఉత్తానహస్తయై ఉంటుందని చెప్పాను కదా! అదేమంటే, ఈ దేవీ హస్తం ఎప్పుడూ వరాలిచ్చుటకై ఉత్థానమై ఉంటుంది మరియు ఈమె సురులకు, అసురులకు, మునులకు కూడ రక్షకురాలై వరాలిస్తుంది.

యచ్చ ప్రోక్తం మయా పాదౌ స్వచ్ఛాయా వ్యభిచారిణౌ ।
అస్యాః శృణు మమాత్రాపి వాగ్యుక్తిం శైలసత్తమ! ॥ 190 ॥

తరువాత ఈమె పాదాలు తమ నీడవున్న చోట నిలువకుండా చరిస్తూ వుంటాయని చెప్పాను కదా! ఓ శైలోత్తమా! ఈ విషయంలో కూడ నా వివరణను విను.

చరణౌ పద్మసంకాశావస్యాః స్వచ్ఛనఖోజ్జ్వలౌ ।
సురాసురాణాం నమతాం కిరీటమణికాన్తిభిః ॥ 191 ॥

విచిత్రవర్ణైర్భాసంతౌ స్వచ్ఛాయాప్రతిబింబితౌ ।

స్వచ్ఛమైన మరియు ఉజ్జ్వలమైన కాంతితో గూడిన నఖాలతో (గోళ్ళతో) ప్రకాశిస్తున్న ఈమె పాదపద్మాలకు సురాసురులందరు నమస్కరిస్తూ ఉంటారు. అప్పుడు విభిన్నాలైన వర్ణాలు గలిగిన వారి కిరీటమణికాంతులతో ఈ పార్వతీదేవి చరణాల ప్రతిబింబం కూడ మార్పు చెందుతుంటుంది కదా! అందుకే "స్వచ్ఛాయావ్యభిచారిణౌ అస్యాః పాదౌ" అని చెప్పాను.

భార్యా జగద్గురోర్హ్యేషా వృషాఙ్కస్య మహీధర! ॥ 192 ॥

జననీ లోకధర్మస్య సంభూతా భూతభావనీ ।
శివేయం పావనాయైవ త్వత్క్షేత్రే పావకద్యుతిః ॥ 193 ॥

ఓ మహీధరా! జగద్గురువు మరియు వృషభధ్వజుడైన పరమశివునికి ఈమె భార్య అవుతుంది. సకలలోక జనని, భూత భావన అయిన ఈ 'శివా' పార్వతి అగ్నిదేవుని వంటి తన తేజస్సుతో మిమ్మల్ని పవిత్రం చేయడానికే మీ క్షేత్రంలో జన్మించింది.

తద్యథా శీఘ్రమేవైషా యోగం యాయాత్ పినాకినా ।
తథా విధేయం విధివత్ త్వయా శైలేంద్రసత్తమ! ।
అత్యంతం హి మహత్కార్యం దేవానాం హిమభూధర! ॥ 194 ॥

కావున ఓ శైలేంద్రా! ఈమె తొందరగా శివునితో కలిసేటట్లుగా నీవు యథావిధి ప్రయత్నం చేయాలి. హిమవంతుడా! ఇందులో దేవతలకు కూడ ఒక మహత్కార్యముంది.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఏవం శ్రుత్వా తు శైలేంద్రో నారదాత్సర్వమేవ హి ।
ఆత్మానం స పునర్జాతం మేనే మేనాపతిస్తదా ॥ 195 ॥

నమస్కృత్య వృషాంకాయ తదా దేవాయ ధీమతే ।
ఉవాచ సోఽపి సంహృష్టో నారదం తు హిమాచలః ॥ 196 ॥

మేనాపతియైన హిమవంతుడు నారదమహర్షి ద్వారా పార్వతీదేవి సౌభాగ్యం గురించి విని, తాను మరల జన్మించినట్లు భావించాడు. వెంటనే ధీమంతుడైన పరమేశ్వరునికి నమస్కరించుకొని సంతుష్ట మనస్కుడై నారదునితో ఇలా అన్నాడు.

హిమవానువాచ – హిమవంతుడు చెప్పాడు.

దుస్తరాన్నరకాద్ఘోరాత్ ఉద్ధృతోఽస్మి త్వయా మునే ।
పాతాలాదహముద్ఘోరాత్ సప్తలోకాధిపః కృతః ॥ 197 ॥

హిమాచలోఽస్మి విఖ్యాతస్త్వయా మునివరాధునా ।
హిమాచలేఽచలగుణం ప్రాపితోఽస్మి సమున్నతిమ్ ॥ 198 ॥

ఓ మునీశ్వరా ! దుస్తరమైన, ఘోరమైన నరకంలో పడకుండా ఉద్ధరించావు. పాతాళంలో పడబోతున్న నన్ను పైకి లేపి సప్తలోకాలకు అధిపతిని చేసినట్లున్నది. ఓ మునివరా! ఇప్పుడు నేను ప్రసిద్ధి చెందిన హిమాచలాన్ని నాలోని అచల గుణాన్ని పోగొట్టుకోకుండా సమున్నతిని పొందేటట్లు చేశావు.

ఆనందదివసాహారి హృదయం మేధునా మునే ।
నాధ్యవస్యతి కృత్యానాం ప్రవిభాగవిచారణమ్ ॥ 199 ॥

యది వాచామధీశః స్యాం త్వద్గుణానాం విచారణే ॥ 200 ॥

మునీంద్రా! ఈ రోజు నా హృదయం మహదానందాన్ని పొందుతున్నది. నేను చేయవలసిన పనులేమిటో ఆ ఆనందంలో తెలుసుకోలేక పోతున్నాను. నేను వాక్కులకు అధిపతియైన బృహస్పతిని అయినట్లైతే మీ గుణాలను వర్ణించడానికి సమర్థుడనవుతాను.

భవద్విధానాం నియతం అమోఘం దర్శనం మునే ।
తవాస్మాన్ ప్రతి చాపల్యం వ్యక్తం మమ మహామునే ॥ 201 ॥

ఓ మునీశ్వరా! అమోఘమైన మీ వంటి వారి దర్శనం ఎప్పుడూ వ్యర్థం కాదు. ఇప్పుడు నీవు మమ్మల్ని చూడాలనే తపనతో ఇక్కడికి వచ్చి, మమ్మల్ని అనుగ్రహించడానికేనని తెలుస్తున్నది.

భవద్భిరేవ కృతోఽహం నివాసాయాత్మరూపిణమ్ ।
మునీనాం దేవతానాం చ స్వయం కర్తాపి కల్మషమ్ ॥ 202 ॥

తథాఽపి వస్తున్యేకస్మిన్నాజ్ఞా మే సంప్రదీయతామ్ ।
ఇత్యుక్తవతి శైలేంద్రే స తదా హర్షనిర్భరః ॥ 203 ॥

నేను స్వయంగా కల్మషుడనైనప్పటికి, మీ వంటి మహానుభావుల వలనే మునులకు, దేవతలకు నివాసయోగ్యుడనయ్యాను. ఇప్పుడు ఒక విషయంలో మీరు నాకు ఆజ్ఞ ఈయవలసివున్నదని పర్వతరాజైన హిమవంతుడు సంతోషంతో పలుకగా నారదుడు హిమవంతునితో ఇలా అన్నాడు.

తథా చ నారదో వాక్యం శ్రుతం సర్వమితి ప్రభో ।
సురకార్యే య ఏవార్థః తవాపి సుమహత్తరః ॥ 204 ॥

ఇత్యుక్త్వా నారదః శీఘ్రం జగామ త్రిదివం ప్రతి ।

ప్రభూ హిమవంతుడా! నీవు చెప్పిన విషమమంతా విన్నాను. ప్రస్తుతం దేవకార్య సాధనమే నీకు మహత్తర కార్యక్రమము అని హిమవంతునికి చెప్పి వెంటనే నారదుడు స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు.

స గత్వా శక్రభవనం అమరం సందదర్శ హ ॥ 205 ॥

తతోఽభిరూపే స మునిః ఉపవిష్టో మహాసనే ।
పృష్టః శక్రేణ ప్రోవాచ హిమజాసంశ్రయాం కథామ్ ॥ 206 ॥

నారదుడు ఇంద్ర భవనానికి వెళ్ళి, దేవేంద్రుని సందర్శించుకుని యోగ్యమైన ఉన్నతాసనం పై కూర్చున్నాడు. తర్వాత పార్వతిదేవి వృత్తాంతాన్ని ఇంద్రునకు వినిపించాడు.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

సమూహ్య యత్తు కర్తవ్యః తన్మయా కృతమేవ హి ।
కింతు పంచశరస్యైవ సమయోఽయముపస్థితః ॥ 207 ॥

నేను చేయవలసిన ఆవశ్యకమైన పని నేను చేశాను. ఇక ఇప్పుడు తరువాతి కార్యం మన్మథుడు నిర్వహించవలసివున్నది.

ఇత్యుక్తో దేవరాజస్తు మునినా కార్యదర్శినా ।
చూతాంకురాస్త్రం సస్మార భగవాన్ పాకశాసనః ॥ 208 ॥

కార్యదక్షుడైన నారదుని మాటలు విని, పాకశాసనుడైన దేవేంద్రుడు మామిడిపువ్వే అస్త్రంగా గల మన్మథుని స్మరించాడు.

సంస్మృతస్తు తదా క్షిప్రం సహస్రాక్షేణ ధీమతా ।
ఉపతస్థే రతియుతః సవిలాసో ఝషధ్వజః ॥ 209 ॥

ధీమంతుడు, సహస్రాక్షుడు అయిన ఇంద్రుడు స్మరించిన వెంటనే మత్స్యధ్వజుడైన మన్మథుడు రతీదేవితో కూడ విలాసంగా ఇంద్రుని ఎదుట నిలబడ్డాడు.

ప్రాదుర్భూతం తు తం దృష్ట్వా శక్రః ప్రోవాచ సాదరమ్ ।
ఉపదేశేన బహునా కిం త్వాం ప్రతి వదే ప్రియమ్ ॥
మనోభవోఽసి తేన త్వం వేత్సి భూతమనోగతమ్ ॥ 210 ॥

ఇలా తనముందు నిలబడివున్న మన్మథుని చూచి ఇంద్రుడు సాదరంగా ఇలా అన్నాడు. ఇప్పుడు అనేక ఉపదేశాలతో ఏమి పని? నీతో ప్రియమైన మాటలు ఏమి చెబుతాను. నీవు మనోభవుడవు, కాబట్టి ప్రాణుల మనస్సులోని విషయాలు తెలిసినవాడవు.

తద్యథార్థకమేవ త్వం కురు నాకసదాం ప్రియమ్ ।
శంకరం యోజయ క్షిప్రం గిరిపుత్ర్యా మనో భవ! ॥
సంయుతో మధునా చైవ ఋతురాజేన దుర్జయ ॥ 211 ॥

ఓ మన్మథా! నీవిప్పుడు స్వర్గవాసులైన దేవతలందరికి ప్రియం కలిగించే పని చేయవలసివున్నది. పరమశివుని గిరిపుత్రియైన పార్వతీదేవితో కలిసేటట్లు నీవు ప్రయత్నించాలి. ఈ విషయంలో దుర్జయుడవైన నీవు వెంటనే ఋతురాజైన వసంతునితో కలిసి వెళ్ళు.

ఇత్యుక్తో మదనస్తేన శక్రేణ స్వార్థ సిద్ధయే ।
ప్రోవాచ పంచబాణోఽథ వాక్యం భీతః శతక్రతుమ్ ॥ 212 ॥

తన కార్యసిద్ధికై ఇంద్రుడు చెప్పిన విషయాన్ని విని పంచబాణుడైన మన్మథుడు భయంతో ఇలా అన్నాడు.

కామ ఉవాచ – మన్మథుడు చెప్పాడు.

అనయా దేవసామగ్ర్యా మునిదానవభీమయా ।
దుస్సాధ్యః శంకరో దేవః కిం న వేత్సి జగత్ప్రభో! ॥ 213 ॥

ప్రభూ! దేవేంద్రా! మునులను, దానవులను మోహింపజేసే శక్తి గల ఈ దేవసామగ్రితో పరమేశ్వరుడైన శివుని జయించడం సాధ్యమా! అది మీకు తెలియదా!

తస్య దేవస్య వేత్థ త్వం కరణం తు యదవ్యయమ్।
ప్రాయః ప్రసాదః కోపోఽపి సర్వో హి మహతాం మహాన్ ॥ 214 ॥

ఆ పరమశివుని నశించని, తరగిపోని క్రియాశక్తి ఎటువంటిదో నీకు తెలుసు కదా! మహాపురుషుల అనుగ్రహం మరియు కోపం అన్నీ కూడ గొప్పగానే వుంటాయి కదా!

సర్వోపభోగసారా హి సుందర్యః స్వర్గసంభవాః ।
అధ్యాశ్రితం చ యత్సౌఖ్యం భవతా నష్టచేష్టితమ్ ॥ 215 ॥

ప్రమాదాదథ విభ్రశ్యేత్ ఈశం ప్రతి విచింత్యతామ్ ।

స్వర్గలోకంలోని సుందరులు సర్వోపభోగాలకు సారమని భావించి ఏ సుఖాన్నైతే అందరూ ఆశ్రయిస్తారో ఆ సుఖమిప్పుడు నీవు చేసేపని వలన నశించిపోతుంది. ఒక్కోసారి విభ్రంశమై పోతుంది కూడ. కనుక నీవు ఈశ్వరుని విషయంలో మరోసారి ఆలోచించవలసింది.

ప్రాగేవ చేహ దృశ్యంతే భూతానాం కార్యసంభవాః ॥ 216 ॥

విశేషం కాంక్షతాం శక్ర! సామాన్యాద్భ్రంశనం ఫలమ్ ।
శ్రుత్వైతద్వచనం శక్రస్తమువాచామరైః సహ ॥ 217 ॥

పూర్వకాలం నుండి ప్రాణులు తాము చేసే పనుల ద్వారా విశేషమైన ఫలితాన్ని కోరి వాటిని ఆచరించగా సామాన్యమైన ఫలితం కూడ కనబడకపోవటం సాధారణంగా లోకంలో మనకు కనబడుతున్నదే అని చెప్పిన మన్మథుని ధైర్యాన్ని ధ్వంసం చేసే శక్తి గల ఈర్ష్యను చపలమైన చిత్తంలో నిలపాలి. దానినిప్పుడు శివునిపై ప్రయోగిస్తాను. దానితో శివుని మనస్సులో వికృతి కలుగుతుంది.

పిధాయ ధైర్యద్వారాణి సంతోషమపకృష్య చ ।
అవగంతుం హి మాం తత్ర న కశ్చిదతిపండితః ॥ 224 ॥

వికల్పమాత్రావస్థానాం వైరూప్యం మనసో భవేత్ ।
పశ్చాన్మూల క్రియారంభ గంభీరావర్త దుస్తరః ॥ 225 ॥

ధైర్యద్వారాలు మూసికొని అనగా ధైర్యాన్ని కోల్పోయి, సంతోషాన్ని మరచిపోయి ఇలా ఇలా చేస్తున్న నన్ను ఏ పండితుడు కూడ తెలిసికోలేడు. ఇది చేయాలా అది చేయలా అనే సందిగ్ధ భావనతో వున్న వారి మనస్సు వికృత్వాన్ని పొందుతుంది. ఆ తర్వాత అసలు చేసే పని సుడిగుండాలతో గూడిన కార్యగతి ప్రవాహాన్ని ఆపడం సాధ్యం కాదు.

హరిష్యామి హరస్యాహం తపస్తస్య స్థిరాత్మనః ।
ఇంద్రియగ్రామమావృత్య రమ్యసాధన సంవిధిః ॥ 226 ॥

అందుకని ఇప్పుడు నేను ఇక ఆలోచించకుండా వెంటనే రమ్యాలైన సాధనాలతో స్థిరచిత్తుడైన పరమశివుని ఇంద్రియాలను ఆవరించి ఆయన తపస్సును భగ్నం చేస్తాను.

చింతయిత్వేతి మదనో భూతభర్తుస్తదాశ్రమమ్ ।
జగామ జగతీసారం సరలద్రుమవేదికమ్ ॥ 227 ॥

శాంతసత్త్వసమాకీర్ణం అచలప్రాణసంకులమ్ ।
నానాపుష్పలతాజాలం గగనస్థ గణేశ్వరమ్ ॥ 228 ॥

అలా ఆలోచించిన మన్మథుడు భూతపతియైన పరమశివుని ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ ఆశ్రమము సకల జగత్తునకు సారం వంటిది. సరళద్రుమ(వృక్ష) వేదికలు కలది. అనేక పుష్పలతలతో ఉండినది. అక్కడ ప్రాణులన్నియు శాంత స్వభావము మరియు నిశ్చల స్వభావము కలవి. అనేక పుష్పములతో కూడినది. ప్రమథ గణములన్నియు ఆ ఆశ్రమపు ఆకాశమున సర్వదా తిరుగుచుండెను.

నిర్వ్యగ్ర వృషభాధ్యుష్ట నీలశాద్వలసానుకమ్ ।
తత్రాపశ్యత్ త్రినేత్రస్య రమ్యం కంచిద్ ద్వితీయకమ్ ॥ 229 ॥

అచ్చట దివ్యమైన శరీరము గల వృషభముతో,చక్కని పచ్చిక బయళ్ళతో ఎత్తైన పర్వత శిఖరముదైన గల త్రినేత్రుడైన ఆ పరమశివుని రమ్యమైన ఆశ్రమమును మన్మథుడు చూచాడు.

వీరకం లోకవీరేశం ఈశానశదృసద్యుతిమ్ ।
యక్షకుంకుమ కింజల్కపుంజాపింగజటాసటమ్ ॥ 230 ॥
వేత్రపాణినమవ్యగ్రముగ్రభోగీంద్రభూషణమ్ ।

ఇంకను శివుని వంటి తేజస్సు కల, కుంకుమపూవుల కేసరాల రాశివలె పింగల వర్ణం గల జటాజూటం కలిగిన, చేతిలో వేత్రదండం దాల్చివున్న, సర్పాలనే నీ ఆభరణాలుగా ధరించిన వీరులకు అధిపతియైన వీరకుడనే శివోపాసకుని కూడ చూచాడు.

తతో నిమీలితోన్నిద్రపద్మపత్రాభలోచనమ్ ॥ 231 ॥

ప్రేక్షమాణమృజు స్థాన స్థితనాసాగ్రలోచనమ్ ।
శ్రవస్తరస సింహేంద్ర చర్మలంబోత్తరీయకమ్ ॥ 232 ॥

ఆ తర్వాత అచ్చట వికసించిన తామర పూరేకులవంటి కనులు మూసికొని, నాసాగ్రంపై స్థిరంగా తన దృష్టిని నిలిపిన, శ్రేష్ఠమైన సింహపుచర్మంతో పాటు వ్రేలాడుతున్న ఉత్తరీయం కలిగిన శివుని చూచాడు.

శ్రవణాహిముఖోన్ముక్తనిఃశ్వాసానలపింగలమ్ ।
ప్రేంఖత్కపాలపర్యంత తుంబిలంబిజటాచయమ్ ॥ 233 ॥

కృతవాసుకిపర్యంకనాభిమూలనివేశితమ్ ।
బ్రహ్మాంజలిస్థపుచ్ఛాగ్రనిబద్ధోరగభూషణమ్ ॥ 234 ॥

దదర్శ శంకరం కామః క్రమాత్ప్రాప్తోఽంతికం శనైః ।

చెవుల పైనుండి చుట్టుకొనివున్న సర్పాల నోటి నుండి వెలువడుతున్న వాయువు వల్ల పింగళ వర్ణం పొంది చెక్కిళ్ళ వరకు వ్రేలాడుతున్న ఆనగ పిందెలవంటి జటలు కలిగిన, వాసుకి అనే సర్పాన్ని దానిలో తమతో కలను చుట్టుకొని సర్పాలను మొలత్రాడుగా చుట్టుకొని నాభి మూలంతో ముడిగా చేసికొనివున్న, బ్రహ్మాంజలితో కూర్చునివున్న, సర్పములనే ఆభరణాలుగా కలిగివున్న ఆ శంకరుని దగ్గరకు వెళ్ళి మన్మథుడు మెల్లగా చూచాడు.

తతో భ్రమరఝుంకార మాలంబిద్రుమసానుకమ్ ॥ 235 ॥

ప్రవిష్టః కర్ణరంధ్రేణ భవస్య మదనో మనః ।

తర్వాత క్రిందకు వంగిన చెట్లు గల సానువులలో వ్యాపించిన తుమ్మెదల ఝుంకారాలతో కలసి చెవి రంధ్రం ద్వారా మన్మథుడు శివుని మనస్సులో ప్రవేశించాడు.

శంకరస్తమథాకర్ణ్య మధురం మదనాశ్రయమ్ ॥ 236 ॥

సస్మార చాద్రిదుహితాం దయితాం రక్తమానసః ।

మన్మథుడు చేత ఆశ్రయించిన మధురమైన ఆ ఝుంకారధ్వనిని విని, శివుడు అనురాగంతో కూడిన మనస్సు కలవాడై హిమవత్పుత్రయైన పార్వతిని స్మరించాడు.

తతః సా తస్య శనకైః తిరోభూయాతి నిర్మలా ॥ 237 ॥

సమాధిభావనా తస్థౌ లక్ష్యప్రత్యక్షరూపిణీ ।
తతస్తన్మయతాం యాతః ప్రత్యూహ పిశితాశయః ॥ 238 ॥

అప్పుడు అంతవరకు కనబడకుండా వున్న నిర్మలాంతఃకరణయైన పార్వతీదేవి శివుడు తలచిన వెంటనే సమాధిభావనలో కనబడేటట్లు ప్రత్యక్ష రూపం కలదై ఆయన ముందు నిలబడింది. శివుని మనస్సు తపో భంగం పొంది పార్వతిలో తన్మయమైపోయింది.

వశిత్వేన బుబోధేశో వికృతిం మదనాత్మికామ్ ।
ఈశత్కోప సమావిష్టో ధైర్యమాలంబ్య ధూర్జటిః ॥ 239 ॥

నిరాసే మదనస్థిత్యా యోగమాయాసమావృతః ।
స తయా మాయయా విష్టో జజ్వాల మదనస్తతః ॥ 240 ॥

కాని ఇంద్రియనిగ్రహం కలవాడైన పరమశివుడు అది మన్మథునిచే కలిగిన వికారమని తెలిసికొని, కొంచెం ధైర్యాన్ని పొంది కోపంతో వెంటనే తన నుండి మన్మథుని తొలిగించడానికి యోగమాయను తలంచి, ఆ యోగమాయా శక్తితో మదనుని దహించివేశాడు.

ఇచ్ఛాశరీరో దుర్జేయో రోషదోషమహాశ్రయః ।
హృదయాన్నిర్గతః సోఽథ వాసనావ్యసనాత్మకః ॥ 241 ॥

బహిః స్థలం సమాలంబ్య హ్యుపతస్థౌ ఝషధ్వజః ।
అనుయాతోஉథ హృద్యేన మిత్రేణ మధునా సహ ॥ 242 ॥

కామరూపుడు, జయించుటకు శక్యం కానివాడు, రోషదోషాది మనోవికారాలకు ఆశ్రయుడు అయిన మదనుడు వాసనాజనిత వ్యసనరూపుడై శివుని హృదయం నుండి వెలుపలకు వచ్చి నిలిచాడు. అప్పుడాతనితో మిత్రుడు, మనోహరుడూ అయిన వసంతుడు కూడ వున్నాడు.

సహకారతరౌ దృష్ట్వా మృదుమారుత నిర్ధుతమ్ ।
స్తబకం మదనో రమ్యం హరవక్షసి సత్వరమ్ ॥ 243 ॥

ముమోచ మోహనం నామ మార్గణం మకరధ్వజః ।

మకరధ్వజుడు వెంటనే అక్కడ మామిడి వృక్షంలో మంద మారుతానికి వదలిన మామిడి పూగుత్తిని చూచి మోహనమనే బాణాన్ని వక్షఃస్థలంపై వదిలాడు.

శివస్య హృదయే శుద్ధే నాశశాలీ మహాశరః ॥ 244 ॥

పపాత పరుషప్రాంశు పుష్పబాణో విమోహనః ।
తతః కరణసందేహో విద్ధస్తు హృదయే భవః ॥ 245 ॥

బభూవ భూధరౌపమ్య ధైర్యో ఉపి మదనోన్ముఖః ।

సులభంగా నశింపజేసే శక్తి గల ఆ మహాశరం శివుని శుద్ధమైన పరుషమైనటువంటి మోహింపజేయు శక్తి కలిగినటువంటి హృదయంలో పడింది. ఆ బాణం ప్రభావంతో పర్వతం వంటి అచలమైన ధైర్యం గల శివుడు ఇంద్రియనిగ్రహాన్ని కోల్పోయి మదన పరవశుడయ్యాడు.

తతః ప్రభుత్వాద్భావానాం నావేశం సమపద్యత ॥ 246 ॥

బాహ్యం బహు సమాసాద్య ప్రత్యూహప్రసవాత్మకమ్ ।
తతః కోపానలోద్భూతఘోరహుంకారభీషణే ॥ 247 ॥

బభూవ వదనే నేత్రం తృతీయమనలాకులమ్ ।
రుద్రస్య రౌద్రవపుషో జగత్సంహారవైభవమ్ ॥ 248 ॥

శివుడు మన్మథోద్దీప్తాలైన భావాల వల్ల ఆవేశాన్ని పొందలేదు. కాని వెంటనే తనకు విఘ్నం కలిగించిన ఆయా పరిస్థితులను తన ముందు గ్రహించినవాడై కోపాగ్నితో ఘోరం మరియు భయంకరమైన హుంకార శబ్దం వెలువడగా ముఖంలో అగ్నివంటి తృతీయ నేత్రముద్భవించింది. అపుడు రౌద్రాకారుడైన రుద్రుని శరీరం జగత్తునంతా నశింపజేసేదిగా కనబడింది.

తదంతికస్థే మదనే వ్యస్ఫారయత ధూర్జటిః ।
తం నేత్రవిస్ఫులింగేన క్రోశతాం నాకవాసినామ్ ॥ 249 ॥

గమితో భస్మసాత్ తూర్ణం కందర్పః కామిదర్పకః ।

శివుడు ఆ అగ్నిని తన సమీపంలో వున్న మన్మథునిపై ప్రసరింపజేశాడు. శివుని నేత్రం నుండి వెలువడిన ఆ అగ్ని కణాలు స్వర్గవాసులైన దేవతలు హాహాకారాలు చేస్తుండగా కాముకులను ఉద్దీపింపజేసే మన్మథుని శీఘ్రంగా భస్మం చేశాయి.

స తు తం భస్మసాత్ కృత్వా హరనేత్రోద్భవోఽనలః ॥ 250 ॥

వ్యజృంభత జగద్దగ్ధుం జ్వాలా హుంకారఘస్మరః ।
తతో భవో జగద్ధేతోః వ్యభజజ్జాతవేదసమ్ ॥ 251 ॥

సహకారే మధౌ చంద్రే సుమనస్సు పరేష్వపి ।
భృంగేషు కోకిలాస్యేషు విభాగేన స్మరానలమ్ ॥ 252 ॥

హరనేత్రం నుండి ఉద్భవించిన ఆ అగ్ని మదనుని భస్మం చేసిన పిదప భయంకరమైన జ్వాలలతో జగత్తునంతటిని దహించివేయటానికి ఉద్యుక్తమయింది. కాని శివుడు లోకానుగ్రహం కోసం ఆ అగ్నిని మామిడి వృక్షం, వసంతఋతువు, చంద్రుడు, వాసనలు గల పువ్వులు, తుమ్మెదలు, కోకిలలు మొదలగు వాటి యందు పడేటట్లు విభజించాడు.

స బాహ్యాంతరవిద్ధేన హరేణ స్మరమార్గణః ॥
రాగస్నేహ సమిద్ధాంతర్ధావం తీవ్రహుతాశనః ॥ 253 ॥

విభక్తలోకసంక్షోభకరో దుర్వారజృంభితః ।
సంప్రాప్య స్నేహసంపృక్తం కామినాం హృదయే కిల ॥ 254 ॥

జ్వలత్యహర్నిశం భీమో దుశ్చికిత్స్యముఖాత్మకః ।

మన్మథుని బాణం శివునిలో ప్రవేశించి, ఆ తరువాత అగ్నిరూపాన్ని పొంది శివుని నేత్రాగ్ని సంపర్కం వలన తీవ్రహుతాశనుడై అనురాగం స్నేహాలనే సమిధలతో ప్రజ్వలించింది. అందుకనే అది ఈ పదార్థాలన్నింటిలో విభజించబడి లోకంలోని ప్రాణుల హృదయాలకు సంక్షోభం కలిగించింది. కాముకుల హృదయాలలో ప్రవేశించి చికిత్స చేయడానికి కూడ వీలుకానిదై రాత్రి, పగలు కూడ వారిని దహించి వేస్తున్నది.

విలోక్య హరహుంకారజ్వాలాభస్మకృతం స్మరమ్ ॥ 255 ॥

విలలాప రతిః క్రూరం బంధునా మధునా సహ ।
తతో విలప్య బహుశో మధునా పరిసాంత్వితా ॥ 256 ॥

హరహుంకార జ్వాలలతో భస్మమైన మదనుని చూచి రతీదేవి తన సోదరుడైన వసంతునితో కూడ వ్యథతో విలపించింది. ఆ తరువాత వసంతుడామెను అనేకవిధాలుగా ఓదార్చాడు.

జగామ శరణం దేవమిందుమౌలిం త్రిలోచనమ్ ।
భృంగానుయాతాం సంగృహ్య పుష్పితాం సహకారజామ్ ॥ 257 ॥

లతాం పవిత్రకస్థానే పాణౌ పరభృతాం సఖీమ్ ।
నిర్బధ్య తు జటాజూటం కుటిలైరలకై రతిః ॥ 258 ॥

ఉద్ధూల్య గాత్రం శుభ్రేణ హృద్యేన స్మరభస్మనా ।
జానుభ్యా మవనీం గత్వా ప్రోవాచేందువిభూషణమ్ ॥ 259 ॥

అప్పుడామె త్రిలోచనుడు, చంద్రశేఖరుడు అయిన పరమశివుని శరణువేడింది. తుమ్మెదలు అనుసరించిన మామిడి పూరెమ్మను 'పవిత్రం'గా ధరించి, కోకిలయనే సఖురాలితో కూడినదై, కుటిలాలైన తన జుట్టునే జటాజూటంగా చేసికొని, హృద్యమైన శుభ్రమైన మన్మథుని భస్మాన్నే విభూతిగా ధరించి, మోకాళ్ళను నేలపై ఆనించి ఇందు విభూషణుడైన శివుని ఇలా స్తుతించింది. ("నా రుద్రో రుద్ర మర్చయేత్" అని చెప్పిన దాని ప్రకారంగా శివుని సేవించేటప్పుడు సరియైన దీక్షా నియమాలు పాటించవలసివున్నది. అందుకని రతీదేవి శివుని ప్రసన్నుని చేసుకోవటానికై భస్మం, జటాజూటం మొదలగు వాటిని ధరించింది).

రతిరువాచ – రతిదేవి చెప్పింది.

నమఃశివాయాఽస్తు నిరామయాయ నమఃశివాయాస్తు మనోమయాయ ।
నమఃశివాయాఽస్తు సురార్చితాయ తుభ్యం సదా భక్తకృపాపరాయ ॥ 260 ॥

నిరామయుడవు అనగా దోషరహితుడవు, నాశరహితుడవు, అయిన మనోమయుడవు, శుభకరుడవు, దేవతలచే పూజించబడేవాడవు, ఎల్లప్పుడు భక్తులయెడ కృపకలవాడవు అయిన నీకు నమస్కారం.

నమో భవాయాఽస్తు భవోద్భవాయ నమోఽస్తుతే ధ్వస్తమనోభవాయ ।
నమోఽస్తుతే గూఢమహావ్రతాయ నమోఽస్తు మాయాగహనాఽశ్రయాయ ॥ 261 ॥

భవమనగా సంసారం. సంసార రూపుడవు, సంసారోద్భవానికి కారకుడవు, మన్మథుని నశింపజేసిన వాడవు, నిగూఢమైన మహావ్రతాలను ఆచరించే వాడవు, మిక్కిలి గహనమైన 'మాయ' కు ఆశ్రయుడవు అయిన నీకు నమస్సులు.

నమోఽస్తు శర్వాయ నమః శివాయ నమోఽస్తు సిద్ధాయ పురాతనాయ ।
నమోఽస్తు కాలాయ నమః కలాయ నమోఽస్తు తే జ్ఞానవరప్రదాయ ॥ 262 ॥

శర్వుడవు = దుష్టులను హింసిచేవాడవు, శివుడవు, సిద్ధుడవు, ప్రాచీనుడవు, కాలస్వరూపుడవు, కాలప్రేరకుడవు మరియు జ్ఞానవరప్రదుడవు అయిన నీకు నమస్సులు.

నమోఽస్తుతే కాలకలాతిగాయ నమోఽనిసర్గామలభూషణాయ ।
నమోఽస్త్వమేయాంధకమర్దకాయ నమః శరణ్యాయ నమోఽగుణాయ ॥ 263 ॥

కాలాతీతుడవు, స్వస్వరూపమనే నిర్మలమైన ఆభరణం కలవాడవు, అమేయుడవు, అంధకాసుర నాశకుడవు, శరణ్యుడవు మరియు నిర్గుణుడవు అయిన నీకు నమస్సులు.

నమోఽస్తు తే భీమగణానుగాయ నమోఽస్తు నానాభువనాదికర్త్రే ।
నమోఽస్తు నానాజగతాం విధాత్రే నమోఽస్తు తే చిత్రఫలప్రయోక్త్రే ॥ 264 ॥

ఓ పరమశివా! భయంకరమైన ప్రమథగణాలచే అనుసరించబడేవాడవు, నానా భువనాలకు ఆదికర్తవు, నానాజగన్నిర్మాతవు, చిత్రాలైన ఫలాలనిచ్చేవాడవు అయిన నీకు నమస్సులు.

సర్వావసానే హ్యవినాశనేత్రే నమోఽస్తు చిత్రాధ్వర భాగభోక్త్రే ।
నమోఽస్తు భక్తాభిమతప్రదాత్రే నమః సదా తే భవసంగహర్త్రే ॥ 265 ॥

అన్నీ నశించినా కూడ నశించని నేత్రాలు కలవాడవు, నానావిధాలైన యజ్ఞాలలో అర్పించిన హవిస్సులను భుజించేవాడవు, భక్తులకు అభిమతాలైన వరాలనిచ్చేవాడవు, సంసార బంధ విమోచకుడవు అయిన నీకు నమస్సులు.

అనంతరూపాయ సదైవ తుభ్యం అసహ్యకోపాయ నమోఽస్తు తుభ్యమ్ ।
శశాంకచిహ్నాయ సదైవ తుభ్యం అమేయమానాయ నమః స్తుతాయ ॥ 266 ॥

అనంతమైన రూపాలు కలవాడవు, కోపాన్ని సహించని వాడవు, చంద్రుడు గుర్తుగా కలవాడవు, కొలవలేని కొలత కలవాడవు, స్తుతిప్రియుడవు అయిన నీకు నమస్సులు.

వృషేంద్రయానాయ పురాంతకాయ నమః ప్రసిద్ధాయ మహౌషధాయ ।
నమోఽస్తు భక్త్యాఽభిమతప్రదాయ నమోఽస్తు సర్వార్తి హరాయ తుభ్యమ్ ॥ 267 ॥

వృషభవాహనుడవు, త్రిపురాంతకుడవు, ప్రసిద్ధుడవు, మహౌషధిస్వరూపుడవు, భక్తులకు అభీష్టాలను ప్రసాదించే వాడవు, అందరి ఆర్తులను పోగొట్టే వాడవు అయిన నీకు నమస్సులు.

చరాచరాచార విచారవర్యం ఆచార్యముత్ప్రేక్షిత భూతసర్గమ్ ।
త్వామిందుమౌలిం శరణం ప్రపన్నా ప్రియాఽప్రమేయం మహతాం మహేశమ్ ॥ 268 ॥

ఈ చరాచర జగత్తు కదలికను తెలిసిన ఆచార్యుడవు, ఊహించిన విధంగా భూతసృష్టిని చేసే సమర్థుడవు, చంద్రమౌళి, అందరికీ ఇష్టమైన వాడవు, అప్రమేయుడవు, గొప్పవారికే గొప్పవాడవు మహేశ్వరుడవు అయిన నిన్ను శరణు పొందాను (అని రతీదేవి శివుని ప్రార్థించింది).

ప్రయచ్ఛ మే కామయశః సమృద్ధిం పునః ప్రభో జీవతు కామదేవః ।
ప్రియం వినా త్వాం ప్రియజీవితేషు త్వత్తోఽపరః కో భువనేష్విహాస్తి ॥ 269 ॥

ప్రభూ! నా పతి కామునికి కీర్తి సమృద్ధినిమ్ము. కామదేవుని మరల బ్రతికించుము. ప్రియమైన జీవితాన్ని ప్రసాదించేవాడు ఈ త్రిభువనాలలో నీవు తప్ప ఎవరున్నారు?

ప్రభుః ప్రియాయాః ప్రసవః ప్రియాణాం ప్రణీతపర్యాయపరాపరార్థః ।
త్వమేవమేకో భువనస్య నాథో దయాలురున్మీలిత భక్తభీతిః ॥ 270 ॥

ప్రియులైనవారికి ప్రభువువు, ప్రియమైన కోరికలు తీర్చేవాడవు, పరాపరార్థములను విచారించి భక్తులకు సిద్ధి కలిగించే వాడవు, సకల లోకనాథుడవు, దయకలవాడవు, భక్తులకు కలిగిన భీతిని నశింపజేసేవాడవు నీవొక్కడవే.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఇత్థం స్తుతః శంకర ఈద్య ఈశో వృషాకపిర్మన్మథకాంతయా తు ।
తుతోష దోషాకరఖండధారీ హ్యువాచ చైనాం మధురం నిరీక్ష్య ॥ 271 ॥

మన్మథకాంతయైన రతీదేవి ఈ విధంగా స్తుతించగా వృషభవాహనుడు, అర్థశశాంకశేఖరుడు అయిన శంకరుడు సంతుష్టుడై ఆమెను అనుగ్రహంతో చూచి ఇలా అన్నాడు.

శంకర ఉవాచ – శంకరుడు చెప్పాడు.

భవితేతి చ కామోஉయం కాలాత్కాంతోஉచిరాదపి ।
అనంగ ఇతి లోకేషు ఖ్యాతిం పుత్రి! గమిష్యతి ॥ 272 ॥

పుత్రీ! నీ కోరిక త్వరలోనే సిద్ధిస్తుంది. నీ పతియైన ఈ మదనుడు అనంగుడుగా (శరీర రహితుడుగా) లోకంలో ప్రసిద్ధి పొందుతాడు.

ఇత్యుక్తా శిరసా వన్ద్య గిరిశం కామవల్లభా ।
జగామోపవనం రమ్యం రతిస్తు హిమభూభృతః ॥ 273 ॥

అలా అనుగ్రహించగా రతీదేవి శివునికి శిరస్సు వంచి నమస్కరించి, హిమవత్పర్వతం పైన వున్న రమ్యమైన ఉపవనానికి వెళ్ళింది.

రురోద చాపి బహుశో దీనా రమ్యే స్థలే తు సా ।
మరణవ్యవసాయాత్తు నివృత్తా సా హరాజ్ఞయా ॥ 274 ॥

అక్కడ ఆ రమ్యమైన ఉపవనంలో ఆమె శివుని ఆజ్ఞ వలన మరణప్రయత్నము నుండి విరమించినప్పటకీ, ఆర్తితో దీనురాలై అనేక విధాలుగా రోదించింది.

అథ నారదవాక్యేన చోదితో హిమభూధరః ।
కృతాభరణసంస్కారాం కృతకౌతుకమంగలామ్ ॥ 275 ॥

స్వర్గపుష్పకృతాపీడాం శుభ్రచీనాంశుకాంబరామ్ ।
సఖీభ్యాం సంయుతాం శైలో గృహీత్వా స్వసుతాం తతః ॥ 276 ॥

జగామ శుభయోగేన తదా సంపూర్ణమానసః ।

తరువాత నారదుని మాటలతో ప్రేరేపించబడిన హిమవంతుడు తన కూతురైన పార్వతిని ఆభరణాదులతో అలంకరింపజేసి, మంగలప్రదమైన కౌతుకాన్ని=అనగా కంకణాన్ని కూడ ధరింపజేసి, స్వర్గ పుష్పాలతో అలంకరింపజేసి, శుభప్రదమైన పట్టు వస్త్రాన్ని ధరింపజేసి, ఇద్దరు సఖురాళ్ళు ఆమెతో పాటు వస్తూండగా శుభయోగం సంప్రాప్తించిందనుకొని నిండు మనస్సుతో బయల్దేరి వెళ్ళాడు.

స కాననాన్యుపక్రమ్య వనాన్యుపవనాని చ ॥ 277 ॥

దదర్శ రుదతీం నారీమప్రతర్క్యమహౌజసమ్ ।
రూపేణాసదృశీం లోకే రమ్యేషు వనసానుషు ॥ 278 ॥

కౌతుకేన పరామృశ్య తాం దృష్ట్వా రుదతీం గిరిః ।
ఉపసర్ప్య తతస్తస్యా నికటే సోఽభ్యపృచ్ఛత ॥ 279 ॥

పార్వతీ సహితుడైన హిమవంతుడు అనేక కాననాలను, వనములను, ఉపవనాలను కూడ దాటి ఒకచోట రమ్యమైన ఉపవనంలో అసమాన సౌందర్యం కలిగి, ఊహింపశక్యం కాని మహాతేజోవంతురాలై విలపిస్తున్న ఒక స్త్రీని చూచి, ఆమె దగ్గరకు వెళ్ళి కుతూహలంతో పరామర్శించి ఇలా అడిగాడు.

హిమవానువాచ – హిమవంతుడు అడిగాడు.

కాసి? కస్యాసి? కల్యాణి! కిమర్థం చాపి రోదిషి? ।
నైతదల్పమహం మన్యే కారణం లోకసుందరి! ॥ 280 ॥

కల్యాణీ! నీవెవరవు? ఎవరి దానవు, ఎందుకు ఏడుస్తున్నావు? ఓ లోక సుందరీ! నీ దుఃఖానికి కారణం అల్పమైంది కాదని నేననుకొంటున్నాను.

సా తస్య వచనం శ్రుత్వా ఉవాచ మధునా సహ ।
రుదతీ శోకజననం శ్వసతీ దైన్యవర్ధనమ్ ॥ 281 ॥

హిమవంతుని మాటలు విన్న రతీదేవి వసంతునితో కూడ ఏడుస్తూ , నిట్టూరుస్తూ ఎదుటి వారికి కూడ బాధ మరియు దైన్యం కలిగేటట్లు ఇలా అన్నది.

రతి రువాచ – రతీదేవి చెప్పింది.

కామస్య దయితాం భార్యాం రతిం మాం విద్ధి సువ్రత! ।
గిరావస్మిన్ మహాభాగ! గిరిశస్తపసి స్థితః ॥ 282 ॥

తేన ప్రత్యూహరుష్టేన విస్ఫార్యాలోక్య లోచనమ్ ।
దగ్ధోఽసౌ ఝషకేతుస్తు మమ కాంతోఽతి వల్లభః ॥ 283 ॥

ఓ సువ్రతా! నేను మన్మథుణ్ణి భార్యయైన రతీదేవిని. ఓ మహానుభావా! ఈ పర్వతంపై భగవంతుడైన పరమశివుడు తపస్సు చేస్తున్నాడు. తన తపస్సుకు కలిగిన విఘ్నానికి కోపించి, తన తృతీయనేత్రం తెరచి, అగ్ని జ్వాలలను వదలి, మీనకేతనుడైన నా భర్త మన్మథుని దగ్ధం చేశాడు.

అహం తు శరణం యాతా తం దేవం భయవిహ్వలా ।
స్తుతవత్యథ సంస్తుత్యా తతో మాం గిరిశోఽబ్రవీత్ ॥ 284 ॥

భయవిహ్వలురాలనైన నేను ఆ దేవుని శరణువేడాను. నా స్తుతికి మెచ్చిన శివుడు నాతో ఇలా చెప్పాడు.

తుష్టోఽహం కామదయితే కామోఽయం తే భవిష్యతి ।
త్వత్స్తుతిం చాప్యధీయానో నరో భక్త్యా మదాశ్రయః ॥
లప్స్యతే కాంక్షితం కామం నివర్త్య మరణాదితః ॥ 285 ॥

కాముని ప్రియురాలవైన ఓ రతీ! నీ స్తోత్రంతో నేను సంతుష్టుడనయ్యాను. నీ కోరిక తప్పనిసరిగా నెరవేరుతుంది. ఇంకను నీవు నా కొరకు చేసిన ఈ స్తోత్రాన్ని ఎవరైతే భక్తితో అధ్యయనం చేసి నన్ను శరణువేడుతారో వారు కోరిన కోరికలు ఫలిస్తాయి. వాళ్ళు ఎటువంటి దుర్మరణాన్ని కూడ పొందరు.

ప్రతీక్షన్తీ చ తద్వాక్య మాశావేశాదిభిర్వ్యహమ్ ।
శరీరం పరిరక్షిష్యే కంచిత్ కాలం మహాద్యుతే! ॥ 286 ॥

మహాతేజోవంతుడవైన ఓ హిమవంతుడా! పరమశివుని మాటలు విన్న నేను ఆశతో నా కోరికలు ఫలించడానికై నిరీక్షిస్తూ మరికొంత కాలం ఈ శరీరాన్ని రక్షిస్తూ ప్రతీక్షిస్తాను. అని రతీదేవి హిమవంతునికి చెప్పింది.

ఇత్యుక్తస్తు తదా రత్యా శైలః సంభ్రమభీషితః ।
పాణావాదాయ హి సుతాం గంతుమైచ్ఛత్ స్వకం పురమ్ ॥ 287 ॥

రతీదేవి చెప్పిన మాటలు విన్న హిమవంతుడు సంభ్రమాన్నీ భయాన్నీ కూడ పొంది వెంటనే తన కూతురైన పార్వతి చేయి పట్టుకొని తన పురానికి వెళ్ళిపోదలచాడు.

భావినోఽవశ్య భావిత్వాద్భవిత్రీ భూతభావినీ ।
లజ్జమానా సఖీముఖైరువాచ పితరం గిరిమ్ ॥ 288 ॥

కావలసింది కాకుండా ఉండదు. భవితవ్యం అవశ్యంభావి కనుక భూతభవిష్యద్వర్తమానాలకు కూడ హేతువైన పార్వతి సిగ్గుపడుతూ సఖురాండ్ర ద్వారా తండ్రికిలా చెప్పింది.

శైలదుహితోవాచ – శైలసుత పార్వతి చెప్పింది.

దుర్భాగ్యేణ శరీరేణ కిం మమానేన కారణమ్ ।
కథం చ తాదృశం ప్రాప్తం సుఖం మే సపతిర్భవేత్? ॥ 289 ॥

దౌర్భాగ్యమైన నా ఈ శరీరంతో ఇంక ఏమి ప్రయోజనం? నేను ఏ ప్రయత్నం చేస్తే సులభంగా ఆయన్ని పతిగా పొందుతాను?

తపోభిః ప్రాప్యతేఽభీష్టం నాసాధ్యం హి తపస్యతః ।
దుర్భగత్వం వృథా లోకో వహతే సతి సాధనే ॥ 290 ॥

తపస్సుతో మనోభీష్టాన్ని సాధించవచ్చు. తపస్సుతో సాధ్యం కానిది లేదు. సాధనాలున్నా లోకంలో జనులు వ్యర్థంగా దౌర్భాగ్యాన్ని పొందుతున్నారు.

జీవితాద్దుర్భగాచ్ఛ్రేయో మరణైర్వ్యతపస్యతః ।
భవిష్యామి న సందేహో నియమైః శోషయే తనుమ్ ॥ 291 ॥

తపస్సు చేయకుండా దురదృష్టవంతమైన జీవితాన్ని గడపటం కంటె మరణమే మేలు. నియమాచరణంతో తనువు కృశించినా నేను ఆయన్ని సాధిస్తాను. సందేహం లేదు.

తపసి భ్రష్టసందేహే ఉద్యమేఽర్థజిగీషయా ।
సాహం తపః కరిష్యామి యదహం ప్రాప్య దుర్లభా ॥ 292 ॥

కార్యం సాధించాలనే జిగీషతో (జయించాలనే కోరికతో) ఎటువంటి సందేహం లేకుండా దృఢసంకల్పంతో తపస్సనే ఉద్యమం చేస్తే సాధ్యం కానిది లేదు. కావున నేను తపస్సు చేసి దుర్లభమైన దానిని సాధించుకుంటాను.

ఇత్యుక్తః శైలరాజస్తు దుహిత్రా స్నేహవిక్లమః ।
ఉవాచ వాచా శైలేంద్రో స్నేహగద్గదవర్ణయా ॥ 293 ॥

శైలేంద్రుడు తన కూతురు చెప్పిన మాటలు మరియు ఆమె దృఢసంకల్పాన్ని విని పుత్రికావాత్సల్యంతో గద్గద స్వరంతో స్నేహపూర్వకంగా ఇలా అన్నాడు.

హిమవానువాచ – హిమవంతుడు చెప్పాడు.

ఉమేఽతిచపలే పుత్రి! న క్షమం తావకం వపుః ।
సోఢుం క్లేశస్వరూపస్య తపసః సౌమ్యదర్శనే ॥ 294 ॥

పుత్రీ! ఉమా! నీవు చాలా సౌమ్యురాలవు. తపస్సు వలన కలిగే క్లేశాలను నీ శరీరం తట్టుకోలేదు.

భావీన్యభివిచార్యాణి పదార్థాని సదైవ తు ।
భావినోఽర్థా భవంత్యేవ హఠేనానిచ్ఛతోఽపి వా ॥ 295 ॥

పుత్రీ! ఏవేవి జరుగవలసివున్నవో అవి ఎప్పుడూ తప్పనిసరిగా జరిగే తీరుతాయి. మనకు ఇష్టమైనా కాకున్నా జరుగవలసినవి తప్పకుండా జరిగి తీరుతాయి.

తస్మాన్న తపసా తేఽస్తి బాలే! కించిత్ ప్రయోజనమ్ ।
భవనాయైవ గచ్ఛామశ్చింతయిష్యామి తత్ర వై ॥ 296 ॥

కావున బాలా! తపస్సు వలన నీకు ప్రత్యేకంగా కలిగే ప్రయోజనమేమీ లేదు. కావున మనం మన ఇంటికి వెళ్ళిపోదాం, అక్కడే తరువాత చేయవలసినదాన్ని విచారిద్దాం.

ఇత్యుక్తా తు యదా నైవ గృహాయాభ్యేతి శైలజా ।
తతః స చింతయాఽఽవిష్టో దుహితాం ప్రశశంస చ ॥ 297 ॥

తన తండ్రి ఆ విధంగా చెప్పగా పార్వతి ఇంటికి వెళ్ళడానికి ఇష్టపడలేదు. ఆమె పట్టుదలకు హిమవంతుడు చింతాక్రాంతుడైనప్పటికి కూతురిని ప్రశంసించాడు.

తతోఽన్తరిక్షే దివ్యా వాగభూద్ భువన భూతలే ।
ఉమేఽతిచపలే! పుత్రి! త్వయోక్తా తనయా తతః ॥ 298 ॥

ఉమేతి నామ తేనాస్యా భువనేషు భవిష్యతి ।
సిద్ధిం చ మూర్తిమత్యేషా సాధయిష్యతి చింతితామ్ ॥ 299 ॥

అప్పుడు ఆకాశం నుండి భూమికి మంగళకరమైన మాట వినబడింది. ఓ హిమవంతుడా! నీవే స్వయంగా ఉమా (వద్దు తల్లీ ఈ తపస్సు) అని నీ పుత్రిక నుద్దేశించి అన్నావు కదా! ఇప్పుడు త్రిభువనాలలో ఈమె 'ఉమా' అనే పేరుతో ప్రసిద్ధి పొందుతుంది. మరియు మూర్తీభవించిన సిద్ధిరూపమైన ఈమె తాను అనుకున్నదానిని సిద్ధింపజేసుకొంటుంది. (సాధిస్తుంది).

ఇతి శ్రుత్వా తు వచనమాకాశాత్ కాశపాండురః ।
అనుజ్ఞాయ తు తాం శైలో జగామాఽఽశు స్వమందిరమ్ ॥ 300 ॥

ఆ విధంగా ఆకాశం నుండి వినబడిన దివ్యమైన మాటలను విన్న రెల్లువలె తెల్లనైన హిమవంతుడు కూతురిని తపస్సు చేయడానికి అనుమతించి వెంటనే తన భవనానికి వెళ్ళాడు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

శైలజాఽపి యయౌ శైలమగమ్యమపి దైవతైః ।
సఖీభ్యామనుయాతా తు నియతా నగరాజజా ॥ 301 ॥

శైలసుత పార్వతీదేవి స్థిరచిత్తంతో ఇద్దరు సఖురాళ్ళు అనుసరించగా దేవతలకు కూడ చేరడానికి వీలుకాని పర్వతప్రాంతానికి బయలుదేరి వెళ్ళింది.

శృంగం హిమవతః పుణ్యం నానాధాతువిభూషితమ్ ।
దివ్యపుష్పలతాకీర్ణం సిద్ధగంధర్వసేవితమ్ ॥ 302 ॥

నానామృగగణాకీర్ణం భ్రమరోద్ఘుష్టపాదపమ్ ।
దివ్యప్రస్రవణోపేతం దీర్ఘికాభిరలంకృతమ్ ॥ 303 ॥

నానాపక్షిగణాకీర్ణం చక్రవాకోపశోభితమ్ ।
జలజస్థలజైః పుష్పైః ప్రోత్ఫుల్లైరుపశోభితమ్ ॥ 304 ॥

చిత్రకందరసంస్థానం గుహాగృహమనోహరమ్ ।
విహంగ సంగసంజుష్టం కల్పపాదపసంకటమ్ ॥ 305॥

పార్వతిదేవి అనేక విధాలైన గైరికాదిధాతువులచే అలంకరించబడిన, దివ్యమైన పుష్పాలతో వ్యాపించివున్నట్టి, సిద్ధులు, గంధర్వులు మొదలగు వారిచే సేవించబడిన, అనేక విధాలైన మృగాలచే పరివ్యాప్తమైన, తుమ్మెదలు

వ్రాలిన వృక్షాలు కలిగిన, దివ్యమైన సేలయేళ్ళతో మరియు దిగుడుబావులతో అలంకృతమైన, వివిధ పక్షిసమూహాలతో, చక్రవాకపక్షులతో ఉపశోభితమైన, వికసించిన కమలాలుగల సరస్సులతో అలంకరించబడిన, విచిత్రాలైన కందరాలకు స్థానభూతమైన, మనోహరాలైన గుహాగృహాలు కలిగిన, విహంగనాదాలతో, కల్పవృక్షాలతోనిండిన పవిత్రమైన హిమవత్పర్వతశృంగానికి తపస్సు చేయడానికి వెళ్ళింది.

తత్రాపశ్యన్మహాశాఖం శాఖినం హరితచ్ఛదమ్ ।
సర్వర్తు కుసుమోపేతం మనోరథశతోజ్జ్వలమ్ ॥ 306 ॥

నానాపుష్పసమాకీర్ణం నానావిధఫలాన్వితమ్ ।
నతం సూర్యస్య రుచిభిః భిన్నసంహతపల్లవమ్ ॥ 307 ॥

ఆ పర్వత శృంగంలో పచ్చని ఆకులతోనిండిన, విశాలమైన కొమ్మలుకలిగిన ఒక మహావృక్షాన్ని పార్వతి చూచింది. ఆ వృక్షం అన్ని ఋతువులలో వికసించే కుసుమాలతో, అనేక విధాలైన పుష్పాలతో మరియు ఫలాలతో కూడినదై మనోరథాలన్నింటిని ఫలవంతం చేసేటట్లున్న ఆ వృక్షం సూర్యుని కిరణాల కాంతితో ప్రకాశింస్తున్నది.

తత్రాంబరాణి సన్త్యజ్య భూషణాని చ శైలజా ।
సంవీతా వల్కలైర్దివ్యైః దర్భనిర్మితమేఖలా ॥ 308 ॥

త్రిఃస్నాతా పాటలాహారా బభూవ శరదాం శతమ్ ।

అక్కడ పార్వతి విలువైన తన వస్త్రాభరణాలన్నీ విడిచిపెట్టి దివ్యమైన వల్కలాలను మరియు దర్భలతో చేసిన మొలత్రాడును కూడ ధరించి, ప్రతిరోజు మూడు సార్లు అనగా ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలాలలో స్నానమాచరిస్తూ, నియతమైన ఆహారాన్ని తీసుకొంటూ వందల సంవత్సరాలు తపస్సు చేసింది.

శతమేకేన శీర్ణేన పర్ణేనావర్తయత్తదా ॥ 309 ॥

నిరాహారా శతం సాఽభూత్సమానాం తపసాం నిధిః ।

ఆ తపోనిధి ఎండి పడిపోయిన ఒక్క ఆకును ఒక రోజుకు ఆహారంగా గ్రహించి నూరేళ్ళు నిరాహారంగా ఘోర తపస్సు చేసింది.

తత ఉద్వేజితాస్సర్వే ప్రాణినస్తత్తపోఽగ్నినా ॥ 310 ॥

పార్వతిదేవి తపస్సు అనే అగ్నితో ప్రాణులందరు ఉద్వేగాన్ని పొందారు.

తతః సస్మార భగవాన్ మునీన్ సప్త శతక్రతుః ।
తే సమాగమ్య మునయః సర్వే సముదితాస్తతః ॥ 311 ॥

పూజితాశ్చ మహేంద్రేణ పప్రచ్ఛుస్తం ప్రయోజనమ్ ।
కిమర్థం తు సురశ్రేష్ఠ! సంస్మృతాస్తు వయం త్వయా? ॥ 312 ॥

అప్పుడు శతక్రతువైన ఇంద్రుడు సపర్షులను స్మరించాడు. సపర్షులు వెంటనే ఇంద్రుని వద్దకు వచ్చి, అతనిచే పూజించబడినవారై ఆ సురశ్రేష్ఠుడు వారిని స్మరించుటకు గల కారణమేమిటని అడిగారు.

శక్రః ప్రోవాచ శృణ్వంతు భగవంతః ప్రయోజనమ్ ।
హిమాచలే తపో ఘోరం తప్యతే భూధరాత్మజా ॥
తస్యా హ్యభిమతం కామం భవంతః కర్తుమర్హథ ॥ 313 ॥

పూజ్యులైన సప్తర్షులారా ! హిమవత్పర్వతంపై హిమవంతుని పుత్రికయైన పార్వతీదేవి ఘోరమైన తపస్సు చేస్తున్నది. ఆమె అభీష్టాన్ని నెరవేర్చడానికి మీరే తగినవారు.

తపః సమాపనం దేవ్యా జగదర్థం త్వరాన్వితాః ।
తథేత్యుక్త్వా తు శైలేన్ద్రం సిద్ధసంఘాతసేవితమ్ ॥ 314 ॥

లోకక్షేమం కోసం ఆమె తపస్సు త్వరగా ముగియాలి అని ఇంద్రుడు చెప్పగా విని సప్తర్షులు వెంటనే సిద్ధులు సేవించే హిమవత్పర్వతంపై పార్వతీదేవి తపస్సుచేసే ప్రదేశానికి వెళ్ళారు.

ఊచురాగత్య మునయ స్తామథో మధురాక్షరమ్ ।
పుత్రి! కిం తే వ్యవసితః కామః కమలలోచనే ॥ 315 ॥

సప్తర్షులు "కమలాలవంటి కన్నులుగల ఓ పుత్రీ ! నీవు ఏ కోరికతో ఈ తపస్సు చేస్తున్నావని" వాత్సల్యంతో మధురంగా అడిగారు.

తానువాచ తతో దేవీ సలజ్జా గౌరవాన్మునీన్ ।
తపస్యతో మహాభాగాః ప్రాప్య మౌనం భవాదృశాన్ ॥ 316 ॥

అప్పుడు పార్వతి బిడియంతో మునులతో సగౌరవంగా ఇలా అన్నది. "ఓ మహానుభావులారా! మీ వంటి తపస్సంపన్నులముందు మౌనం వహించటం ఉత్తమం".

వందనాయ నియుక్తా ధీః పావయత్యవికల్పితమ్ ।
ప్రశ్నోన్ముఖత్వాద్భవతాం యుక్తమాసనమాదితః ॥ 317 ॥

ఉపవిష్టాః శ్రమోన్ముక్తాః తతః ప్రక్ష్యథ మామతః ।
ఇత్యుక్త్వా సా తతశ్చక్రే కృతాసనపరిగ్రహాన్ ॥ 318 ॥

మీవంటి వారికి మౌనంగా నమస్కరించినా అది నిస్సంశయంగా జనులను పవిత్రులను చేస్తుంది. మీరిప్పుడేదో ప్రశ్నించేటట్లున్నారు. ముందుగా యుక్తమైన ఆసనాలను అధిష్ఠించి, విశ్రాంతి పొంది, ఆపైన నన్ను ప్రశ్నించండని వారిని ప్రార్థించి పార్వతీదేవి వారికి అర్ఘ్యపాద్య ఆసనాదులను సమకూర్చింది.

సా తు తాన్ విధివత్పూజ్యాన్ పూజయిత్వా విధానతః ।
ఉవాచాదిత్యసంకాశాన్ మునీన్ సప్త సతీ శనైః ॥ 319 ॥

పూజ్యులైన వారిని విధివిధానంగా పూజించి, సూర్యుని తేజస్సువంటి తేజస్సుగల ఆ సప్తర్షులను ఉద్దేశించి పార్వతి నెమ్మదిగా ఇలా అన్నది.

త్యక్త్వా వ్రతాత్మకం మౌనం మౌనం జగ్రాహ హ్రీమయమ్ ।
భావం తస్యాస్తు మౌనాంతం తస్యాః సప్తర్షయో యథా ॥ 320 ॥

పార్వతి తన వ్రతానికి అనగా తపస్సుకు సంబంధించిన మౌనం వదలి బిడియపుమౌనాన్ని స్వీకరించింది. సప్తర్షులు ఆమె మౌనపుభావాన్ని గ్రహించారు.

గౌరవాధీనతాం ప్రాప్తాః పప్రచ్ఛుస్తాం పునస్తథా ।
సాఽపి గౌరవగర్భేణ మనసా చారుహాసినీ ॥ 321 ॥

మునీన్ కాంతకథా లోకే ప్రేక్ష్య ప్రోవాచ వాగ్యమమ్ ।
భగవంతో విజానంతి ప్రాణినాం మానసం హితమ్ ॥ 322 ॥

ఆమె వారిపట్ల చూపిన ఆదరానికి సప్తర్షులు గౌరవభావాన్ని పొంది మరల మొదట తాము అడిగిన ప్రశ్ననే అడిగారు. ఆమె కూడ వారియందు ఆదరభావంతో సహజంగా స్త్రీలకుండే బిడియాన్ని వదిలి సుందరదరహాసంతో ప్రకృతి సిద్ధంగా ప్రాణుల మనస్సులో ఏవో కొన్ని కోరికలుంటాయనే విషయం మీకు తెలిసిందే కదా! అని వారితో అన్నది.

మనోగతిభిరత్యర్థం కందర్ప్యంతే హి దేహినః ।
కేచిత్తు నిపుణాస్తత్ర ఘటంతే విబుధోపమైః ॥ 323 ॥

మానవులు తమకు కలిగిన కోరికలకు మిక్కిలి వివశులైపోతారు. వారిలో కొంతమంది నిపుణులైనవారు దేవతలతో సమానంగా నియమాలను పాటిస్తారు.

ఉపాయైర్దుర్లభాన్ భావాన్ ప్రాప్నువంతి హ్యతంద్రితాః ।
అపరే తు పరిచ్ఛిన్నా నానాకారాభ్యుపక్రమాః॥ 324 ॥

దేహాంతరార్థమారంభమాశ్రయంతి హితప్రదమ్ ।

నిపుణులైన వారు అలసట చెందకుండా ఉపాయాలతో దుర్లభాలైన వాటిని కూడ పొందుతారు. మరికొందరు పరిమితమైన ఉపక్రమాలతో అనేక రకాలుగా ప్రయత్నిస్తారు. కాని, అది వారి దేహాంతరంలో అనగా మరు జన్మలో వారికి హితం కలిగించడానికి ఉపయోగపడుతుంది, ఈ జన్మలో కార్యసాధనకు ఉపయోగపడదు.

మమత్వాకాశసంభూతపుష్పదామవిభూషితమ్ ॥ 325 ॥
వన్ధ్యాసుతం ప్రాప్తుకామా మనః ప్రసరతే ముహుః ।
అహం కిల భవం దేవం పతిం ప్రాప్తుం సముద్యతా ॥ 326 ॥

కాని నా మనస్సు మాత్రం ఆకాశకుసుమాలను ధరించిన వంధ్యాసుతుని పొందాలని కోరుకుంటున్నది. నేను దేవుడైన భవుని, పరమశివుని పతిగా పొందాలనే ప్రయత్నంతో వున్నాను.

ప్రకృత్యైవ దురాధర్షం తపస్యంతం తు సంప్రతి ।
సురాసురైరనిర్ణీతపరమార్థ క్రియాశ్రయమ్ ॥327॥

సాంప్రతం చాపి నిర్దగ్ధమదనం వీతరాగిణమ్ ।
కథమారాధయేదీశం మాదృశీ తాదృశం శివమ్ ॥ 328 ॥

సహజంగానే పొందటానికి వీలుకానివాడు, ప్రస్తుతం తపోనిష్ఠలో వున్నవాడు, సురాసురులచే కూడ ఇటువంటి వాడని నిర్ధారించడానికి శక్యం కానివాడు, ఇప్పుడు మన్మథుని దహించివేసినవాడు, దేనియందు అనురక్తుడు కానివాడైన ఆ ఈశ్వరుని నేను ఏ విధంగానైనా ఆరాధిస్తాను (కథమపి) (నేను ఆరాధింపక ఎలా ఉంటాను?)

ఇత్యుక్తా మునయస్తే తు స్థిరతాం మనసస్తతః ।
జ్ఞాతుమస్యా వచః ప్రోచుః ప్రక్రమాత్రుకృతార్థకమ్ ॥ 329 ॥

పార్వతీదేవి మాటలు విన్న మునులు ఆమె మనఃస్థైర్యాన్ని తెలుసుకోగోరిన సందర్భోచితమైన మాటలతో ఇలా అన్నారు.

మునయ ఊచుః- మునులు చెప్పారు.

ద్వివిధం తు సుఖం తావత్పుత్రి! లోకేషు భావ్యతే ।
శరీరస్యాస్య సంభోగైః చేతసశ్చాపి నిర్వృతిః ॥ 330 ॥

పుత్రీ! లోకంలో సుఖం రెండు విధాలని భావిస్తారు. భోగించేశారీరకసుఖమొకటైతే, మనస్సుకు కలిగేది రెండవది.

ప్రకృత్యా స తు దిగ్వాసా భీమః పితృవణేశయః ।
కపాలీ భిక్షుకో నగ్నో విరూపాక్షః స్థిరక్రియః ॥ 331 ॥

ప్రమత్తోన్మత్తకాకారో బీభత్సకృతసంగ్రహః ।
పతినా తేన కస్తేఽర్థో మూరేనాఖిలకాంక్షితః ॥ 332 ॥

పుత్రీ! సహజంగా దిక్కులే వస్త్రంగా కలవాడు, భయంకరమైన రూపం కలవాడు, శ్మశానంలో నివసించేవాడు, కపాలం ధరించినవాడు, భిక్షుకుడు, నగ్నంగా ఉండేవాడు, వికృతమైన మూడవకన్ను కలవాడు, స్థిరమైన పనులు చేసేవాడు, ప్రమత్తమైన మరియు ఉన్మత్తమైన ఆకారం గలవాడు, భయాన్ని కలిగించే వస్తువులను సంగ్రహించేవాడు ఆ శివుని పతిగాపొంది నీవు ఏ ప్రయోజనాన్ని పొందుతావు.

యది హ్యస్య శరీరస్య భోగమిచ్ఛసి సాంప్రతమ్ ।
తత్కథం తే మహాదేవాద్భయభాజో జుగుప్సితమ్ ॥ 333 ॥

స్రవద్రక్త వసాభ్యక్త కపాలకృతభూషణాత్ ।
శ్వసదుగ్రభుజంగేంద్రకృతభూషణభీషణాత్ ॥ 334 ॥

శ్మశానవాసినో రౌద్రప్రమథానుగతాత్ సతి ।

ఒకవేళ నీవు అతనినుండి నీశరీరసుఖాన్నే కోరుతున్నట్లైతే భయంకరుడు, జుగుప్స కలిగించేవాడు, రక్తం కారుతున్న చర్మాలను ధరించేవాడు, కపాలాలను ఆభరణాలుగా ధరించేవాడు, బుసలు కొడుతూ ఉగ్రరూపంతో ఉన్న భయంకర సర్పాలను ఆభరణలుగా ధరించేవాడు, శ్మశానంలో నివసించేవాడు, రౌద్రులైన ప్రమథగణాలతో సేవించబడేవాడైన ఆ మహాదేవునివలన నీకు ఏమి సుఖం కలుగుతుంది!.

సురేంద్రముకుటవ్రాతనిఘృష్టచరణోఽరిహా ॥ 335 ॥

హరిరస్తి జగద్ధాతా శ్రీకాంతోఽనంతమూర్తిమాన్ ।
నాథో యజ్ఞభుజామస్తి తథేంద్రః పాకశాసనః ॥ 336 ॥

దేవతానాం నిధిశ్చాస్తి జ్వలనః సర్వకామకృత్ ।
వాయురస్తి జగద్ధాతా యః ప్రాణః సర్వదేహినామ్ ॥ 337 ॥

తథా వైశ్రవణో రాజా సర్వార్థమతిమాన్ విభుః ।

ఏభ్య ఏకతమం కస్మాన్న త్వం సంప్రాప్తుమిచ్ఛసి ॥ 338 ॥

పుత్రీ ! శత్రుసంహారకుడు, దేవతలందరు కిరీటాలు వంచి నమస్కరించేవాడు, అనంతమూర్తి, జగద్రక్షకుడు, శ్రీకాంతుడు అయిన హరి ఉన్నాడు. మరియు యజ్ఞములలో హవిస్సును భుజించే దేవతలప్రభువైన ఇంద్రుడున్నాడు. దేవతలకు నిధివంటివాడు, సర్వకామప్రదుడు అయిన అగ్నిదేవుడున్నాడు. జగత్తును ధరించేవాడు, సర్వదేహాలకు ప్రాణభూతుడైన వాయుదేవుడున్నాడు. ఇంకను విశ్రవసుని పుత్రుడు ధనాధిపతియైన కుబేరుడున్నాడు. వీరిలో ఎవరినో ఒకరిని నీవు ఎందుకు పతిగా పొందవలెనని అనుకోవడం లేదు?

ఉతాన్యదేహసంప్రాప్త్యా సుఖం తే మనసేప్సితమ్ ।
ఏవమేతత్తవాప్యత్ర ప్రభవో నాకసంపదామ్ ॥
అస్మిన్నేహ పరత్రాఽపి కల్యాణప్రాప్తయస్తవ ॥ 339 ॥

పితురేవాఽస్తి తత్సర్వం సురేభ్యో యన్న విద్యతే ।
అతస్త్వత్ప్రాప్తయే క్లేశః సవాప్యత్రాఫలస్తవ ॥ 340 ॥

లేక మరొక శరీరాన్ని (జన్మను) పొందిన తర్వాత నీ మనోభీష్టమైన సుఖాన్ని పొందగోరి ఈ తపస్సు చేస్తున్నట్లైతే అది కూడ వ్యర్థమే. ఎందుకంటే ఇక్కడే ఈ జన్మలోనే నీకు స్వర్గసుఖాలన్నీ లభిస్తున్నాయి. ఈ హిమవంతుని గిరులే స్వర్గసుఖాలకు మూలం. ఈ జన్మలోనేకాక పరత్రకూడ నీకు శుభం కలుగజేసే భోగభాగ్యాలు ఇక్కడ అనేకం ఉన్నాయి. వీటన్నింటికి స్థానం మీ తండ్రియైన హిమవంతుడే. దేవతల దగ్గర కూడ లేనివి ఇక్కడున్నాయి. కనుక కేవలం సుఖప్రాప్తికోసం నీవు ఇంత క్లేశాన్ని అనుభవిస్తూ తపస్సు చేయవలసిన పని లేదు.

ప్రాయేణ ప్రార్థితో భద్రే! సుస్వల్పోప్యతిదుర్లభః ।
అస్య తే విధియోగస్య ధాతా కర్తాఽత్ర చైవ హి॥ 341 ॥

కల్యాణీ! ఎంత స్వల్పమైనదైనా మనస్సు చాలా ఇష్టపడి కోరుకున్నది దుర్లభమైపోవుటం లోకంలో సహజమే కదా! విధియోగం వలన నీవు ఆచరించుచున్న ఈ తపస్సునకు నీ ఈ శ్రమకు విధియే (బ్రహ్మనే) కారణమని సప్తర్షులు పార్వతితో అన్నారు.

సూత ఉవాచ ః–సూతుడు చెప్పాడు.

ఇత్యుక్తా సా తు కుపితా మునివర్యేషు శైలజా ।
ఉవాచ కోపరక్తాక్షీ స్ఫురద్భిర్దశనచ్ఛదైః ॥ 342 ॥

ఆ విధమైన వారి మాటలు విన్న పార్వతీదేవి మునులయెడ కోపంతో, రక్తవర్ణం పొందిన నేత్రాలతో మరియు కంపిస్తున్న పెదవులతో ఇలా పలికింది.

దేవ్యువాచ–దేవి చెప్పింది.

అసద్గ్రహస్య కా ప్రీతిః వ్యసనస్య క్వ యంత్రణా ।
విపరీతార్థబోద్ధారః సత్పథే కేన యోజితాః ॥ 343 ॥

ఏవం మాం వేత్థ దుష్ప్రజ్ఞాం హ్యస్థానాసద్గ్రహప్రియామ్ ।
న మాం ప్రతి విచారోఽస్తి తతోఽహంకారమానినీ ॥ 344 ॥

మంచిదికానిదానిని పొందటంలో ప్రీతి ఏమున్నది? కోరికలకు అదుపేమున్నది? విపరీతమైన అర్థాన్ని గ్రహించిన వారిని సన్మార్గంలో నడిపించడానికి ప్రయత్నిస్తారు? నాకు తగని దానిని తగని స్థానాన్ని కోరుకుంటున్న ప్రజ్ఞాహీనురాలుగా నన్ను మీరు తెలిసికొంటున్నారు. అహంకారంతో, అభిమానంతో నేనిలా మాట్లాడుతున్నానని మీరు నన్ను అనుకున్నా నాకు విచారం లేదు.

ప్రజాపతిసమాః సర్వే భవంతః సర్వదర్శినః ।
నూనం న వేత్థ తం దేవం శాశ్వతం జగతః ప్రభుమ్ ॥ 345 ॥

అజమీశానమవ్యక్తమమేయమహిమోదయమ్ ॥ 346 ॥

సర్వజ్ఞులు, ప్రజాపతిసమానులైన మీరు శాశ్వతుడు, జగత్తంతటికి ప్రభువైనవాడు, అజుడు =జన్మరహితుడు, ఈశానుడు=శ్రేష్ఠుడు, అవ్యక్తుడు, అమేయమైన మహిమకల ఆ దేవుని మహత్త్వాన్ని తెలిసికొన్నట్లు లేదు.

ఆస్తాం తద్ధర్మసద్భావసంబోధస్తావదద్భుతః ।
విదుర్యం న హరిబ్రహ్మప్రముఖా హి సురేశ్వరాః ॥ 347 ॥

అతడు ప్రతిష్ఠించిన ధర్మపుస్థితిని సంపూర్ణంగా తెలుసుకొనుట కూడ ఆశ్చర్యకరమైన విషయమే. అది తెలుకొనుట అంత సులభం కాదు. హరి, బ్రహ్మ మొదలగు ప్రముఖులైన సురేశ్వరు లెవరూ కూడ ఆ పరమశివుని తత్త్వము నెరుగరు.

యత్తస్య విభవాత్ స్వోత్థం భువనేషు విజృమ్భితమ్ ।
ప్రకటం సర్వభూతానాం తదప్యత్ర న వేత్థ కిమ్ ॥ 348 ॥

ఆ పరమశివునినుండి స్వయంగా ఉద్భవించి సర్వప్రాణులలో, సకలభువనాలలో వెలసివున్న ఆతని మహత్త్వాన్ని కూడ మీరెరుగరా!

కస్యైతద్గగనం మూర్తిః కస్యాగ్నిః కస్య మారుతః ।
కస్య భూః కస్య వరుణః కశ్చన్ద్రార్కవిలోచనః ॥ 349 ॥

ఆకాశము, భూమి, అగ్ని, వాయువు, వరుణుడు ఇవన్నీ అతని అంశాలే కాక మరెక్కడివి? సూర్యచంద్రులాతని కన్నులు కదా!

కస్యార్చయన్తి లోకేషు లిఙ్గం భక్త్యా సురాసురాః ।
యం బ్రువన్తీశ్వరం దేవా విధీన్ద్రాద్యా మహర్షయః ॥ 350 ॥

లోకంలో సురాసురులందరు భక్తితో ఆ లింగమూర్తినే పూజిసున్నారు కదా! బ్రహ్మ, ఇంద్రుడు మరియు మహర్షులు ఆ దేవునే ఈశ్వరుడని అంటారు కదా!

ప్రభావం ప్రభవం చైవ తేషామపి న వేత్థ కిమ్ ।
అదితిః కస్య మాతేయం కస్మాజ్జాతో జనార్దనః ॥ 351 ॥

అదితేః కశ్యపాజ్జాతా దేవా నారాయణాదయః ।
మరీచేః కశ్యపః పుత్రో హ్యదితిర్దక్షపుత్రికా ॥ 352 ॥

మరీచిశ్చాపి దక్షశ్చ పుత్రౌ తౌ బ్రహ్మణః కిల ।
బ్రహ్మా హిరణ్మయాత్త్వణ్డాద్దివ్యసిద్ధివిభూషితాత్ ॥ 353 ॥

ఆ పరమశివుని ప్రభావమూ, పుట్టుకా కూడా మీకు తెలిసినట్లు లేదు. ఈ అదితి ఎవరి తల్లి? జనార్దనుడు ఎవరినుండి జన్మించాడు? నారాయణాది దేవతలందరూ కశ్యపునిద్వారా అదితికి జన్మించారు. మరీచిపుత్రుడీ కశ్యపుడు, అదితి దక్షునిపుత్రిక. ఈ మరీచి, దక్షుడూ ఇద్దరూ బ్రహ్మపుత్రులు, దివ్యసిద్ధివిభూషితమైన హిరణ్మయమైన అండము నుండే కదా బ్రహ్మదేవుడు జన్మించాడు.

కస్య ప్రాదురభూద్ధ్యానాత్ప్రక్షుబ్ధాః ప్రాకృతాంశకాః ।
ప్రకృతౌ తు తృతీయాయాం మధుద్విడ్జననక్రియా ॥ 354 ॥

ఆ ఈశ్వరుని ధ్యానం వలననే కదా ప్రకృత్యంశములన్ని ప్రక్షుబ్ధములై సృష్టింపబడ్డాయి. తర్వాత మూల ప్రకృతినుండి మూడవదైన అహంకారతత్త్వమునుండియే కదా మధుకైటభసంహారి జననం జరిగింది.

జాతః ససర్జ షడ్వర్గాన్ బుద్ధిపూర్వాన్ స్వకర్మజాన్ ।
అజాతః కోభవే ద్వేధా బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ॥ 355 ॥

యః స్వయోగేన సంక్షోభ్య ప్రాకృతం కృతవానిదమ్ ।
బ్రహ్మణః సిద్ధిసర్వార్థమైశ్వర్యం లోకకర్తృతామ్ ॥ 356 ॥

ఆ మూలప్రకృతిద్వారా ఆయా జీవుల కామకర్మకృతములైన "జాయతే, అస్తి, విపరిణమతే, వర్ధతే, అపక్షీయతే, నశ్యతి" అను షడ్భావ వికారములతో గూడిన ప్రాణి సృష్టి ఆరంభించబడినది. పుట్టుకలేనివాడు అని చెప్పబడే బ్రహ్మకూడ అవ్యక్తతత్త్వమునకు జన్మకారణమైన పరబ్రహ్మ స్వరూపుడైన ఈశ్వరునినుండే జన్మించాడు. ఈశ్వరుడే మూల ప్రకృతియందు స్పందన కలుగజేసి ఈ లోకమునంతా సృష్టించి, బ్రహ్మకు సర్వార్థసిద్ధిని కలిగింపజేసి ఈ సృష్టికంతటికిని లోకకర్త అగునట్లు చేశాడు.

విదుర్విష్ణ్వాదయో యచ్చ స్వమహిమ్నా సదైవ హి ।
కృత్వాఽన్యం దేహమన్యాదృక్ తాదృక్ కృత్వా పునర్హరిః ॥ 357 ॥

కురుతే జగతః కృత్యముత్తమాధమమధ్యమమ్ ।
ఏవమేవ హి సంసారో యో జన్మమరణాత్మకః ॥ 358 ॥

కర్మణశ్చ ఫలంహ్యేతన్నానా రూపసముద్భవమ్ ।

మహిమాన్వితుడైన ఆ ఈశ్వరుని విష్ణువు మొదలగు దేవతలందరు తెలుసుకోవడంకోసం సదా ప్రయత్నిస్తారు. ఈశ్వరుని సంకల్పం వలననే విష్ణువు అసాధారణాలైన అనేక అవతారాలనెత్తి ఉత్తమ, మధ్యమాధమ భేదములుగల లోకవ్యాపారాన్ని నిర్వర్తిస్తున్నాడు. జన్మమరణాత్మకమైన సంసార స్వరూపమే ఇలా వుంటుంది. అనేకరకాలుగా ఉద్భవించిన ఇదంతా 'కర్మ' ఫలమే.

అథ నారాయణో దేవః స్వకాం ఛాయాం సమాశ్రయాత్ ॥ 359 ॥

తత్ప్రేరితః ప్రకురుతే జన్మ నానాప్రకారకమ్ ।
సా పి కర్మణ ఏవోక్తా ప్రేరణీ వివశాత్మనామ్॥ 360 ॥

యథోన్మాదిజుష్టస్య మతిరేవ హి సా భవేత్ ।
ఇష్టాన్యేవ యథార్థాని విపరీతాని మన్యతే ॥ 361 ॥

లోకస్య వ్యవహారేషు సృష్టేషు హసతే సదా ।

ఇంకానూ, ఈశ్వరుని ప్రేరణవలననే నారాయణుడు తన ఛాయ అయిన మాయను ఆశ్రయించి నానా జన్మలను పొందుతాడు. వివశాత్ములైన విష్ణువు మొదలగు వారందరు పొందే ప్రేరణ కూడ ఉన్మాదాది దోషదూషితులైన వారి మతి ప్రవృత్తి మాత్రమే కాని వేరు కాదు. దాని ప్రభావం వలననే ఇష్టములు, యథార్థములు అయిన వాటిని కూడ విపరీతంగా భావిస్తారు.

ధర్మాధర్మఫలావాప్తౌ విష్ణురేవ నిబోధితః ॥ 362 ॥

అథానాదిత్వమస్యాస్తి సామాన్యాత్తు తదాత్మనా ।
న హ్యస్య జీవితం దీర్ఘం దృష్టం దేహే తు కుత్రచిత్ ॥ 363 ॥

మానవులచే ధర్మాధర్మాలవలన పొందే ఫలాలకు ఈశ్వరుని ఆధీనుడైన విష్ణువే కారణమని శాస్త్రాలు చెప్పాయి. జీవునికి సామాన్యంగా అనాదిత్వమే చెప్పబడింది కాని, ఇతడు ఏ శరీరంలో కూడ దీర్ఘకాలమున్నట్లు కనబడదు.

భవద్భిర్యస్య నో దృష్టం అన్తమగ్రమథాపి వా ।
దేహినా ధర్మ ఏవైష క్వచిజ్జాయేత్ క్వచిత్ మ్రియేత్ ॥ 364 ॥

క్వచిద్గర్భగతో నశ్యేత్ క్వచిజ్జీవేజ్జరామయః ।
క్వచిత్సమాః శతం జీవేత్ క్వచిద్బాల్యే విపద్యతే ॥ 365 ॥

ఈ జీవుని అంతం గాని అగ్రం కాని (ఉద్భవం) మీరెవరూ చూడలేదు. ఒకచోట పుట్టం, మరొక చోట మరణించటం అనేది దేహధారియైన ఈ జీవుని ధర్మం. ఒకసారి గర్భంలో ఉండగానే మరణిస్తాడు. మరోచోట వృద్ధాప్యంచేతగాని, వ్యాధిచేత గాని మరణిస్తాడు. ఒకచోట వందసంవత్సరముల తర్వాత, మరొకచోట బాల్యము నందే మరణిస్తాడు.

శతాయుః పురుషో యస్తు సోఽనన్తః స్వల్పజన్మనః ।
జీవితో యో న మ్రియతే తస్మాత్సోఽమర ఉచ్యతే ॥ 366 ॥

స్వల్పకాలం జీవించేవానికంటే నూరేండ్లు జీవించేవాడు అనంతకాలజీవిగా కనపడతాడు. కావున పుట్టిన తర్వాత మరణించక జీవించి ఉండేవాడిని అమరుడని అంటారు.

అదృష్టజన్మనిధనాహ్యేవం విష్ణ్వాదయో మతాః ।
ఏతత్సంశుద్ధమైశ్వర్యం సంసారే కో లభేదిహ? ॥ 367 ॥

అల్పజీవులైన మానవులకు విష్ణ్వాదుల జననమరణాలు తెలియవు. ఈ సంసారంలో జన్మమరణాదులులేని ఈశ్వరత్వాన్ని ఈ సంసారమున ఎవరు పొందగలరు?

తత్ర క్షయాదియోగాత్తు నానాశ్చర్యస్వరూపిణః ।
తస్మాద్దివశ్చరాన్ సర్వాన్ మలినాన్ స్వల్పభూతికాన్ ॥ 368 ॥

జీవనమరణాలనేవి ఉండటం వలన నానాశ్చర్యకర స్వభావాలు కలిగిన దేవతలందరు మలినస్వరూపులు. వీరందరి ఈశ్వరత్వం కూడ మిక్కిలి స్వల్పమైనది.

నాహం భద్రాః! కిలేచ్ఛామి ఋతే శర్వాత్పినాకినః ।
స్థితం చ తారతమ్యేన ప్రాణినాం పరమం త్విదమ్ ॥ 369 ॥

కావున పూజ్యులారా ! నేను శర్వుడు (శర్వుడనగా సర్వప్రాణిసంహారకుడు, అందరూ నశించినప్పటికి నశించని వాడు), పినాకపాణియైన శివుని తప్ప వేరెవరినీ పతిగా అంగీకరించను.

ధీబలైశ్వర్యకార్యాది ప్రమాణం మహతాం మహత్ ।
యస్మాన్న కించిదపరం శర్వం యస్మాత్ ప్రవర్తతే ॥ 370 ॥

యస్యైశ్వర్యమనాద్యన్తం తమహం శరణం గతా ।
ఏష మే వ్యవసాయశ్చ దీర్ఘో౽తివిపరీతకః ॥ 371 ॥

జ్ఞానబలఐశ్వర్యాదులన్నీ కలిగిన మహానుభావులందరిలో పరమశివుడు పరమోత్కృష్టుడు. ఆ పరాత్పరుని ఈశ్వరత్వానికి ఆద్యంతాలు లేవు. లోకంలో సర్వమూ ఆతనినుండే ప్రవర్తించబడుతున్నది. నేను అలాంటి ఈశ్వరునే ఆశ్రయిస్తున్నాను. లోకానికి ఇది విపరీతంగా కనబడుతున్నప్పటికి ఇదే నా దృఢనిశ్చయం. దీనిలో మార్పు లేదు.

యాత వా తిష్ఠతైవాథ మునయో మద్విధాయకాః ।
ఏవం నిశమ్య వచనం దేవ్యా మునివరాస్తదా ॥ 372 ॥
ఆనన్దాశ్రుపరీతాక్షాః సస్వజుస్తాం తపస్వినీమ్ ।
ఊచుశ్చ పరమప్రీతాః శైలజాం మధురం వచః॥ 373 ॥

నాకు విధినియమాదులను బోధించే ఓమునులారా! మీరిక్కడ ఉన్నా, లేదా వెళ్ళిపోయినా నా ఈ నిర్ణయంలో మార్పు ఉండదని దృఢంగా చెప్పిన పార్వతీదేవి మాటలు విన్న ఆ మునిశ్రేష్ఠులందరు తపస్వినియైన ఆమెను అభినందించారు. మరియు పరమప్రీతికలవారై మధురాలైన మాటలతో ఆమెనుద్దేశించి ఇలా అన్నారు.

ఋషయ ఊచుః –ఋషులు చెప్పారు.

అత్యద్భుతాస్యహో పుత్రి! జ్ఞానమూర్తిరివామలా ।
ప్రసాదయతి నో భావం భవభావప్రతిశ్రయాత్ ॥ 374 ॥

పుత్రీ! అత్యద్భుతస్వరూపం గల నీవు మాకు నిర్మలమైన జ్ఞానమూర్తివలే కనబడుతున్నావు. నీవు సర్వభావంతో శివుని ఆశ్రయించి మాభావాన్ని ప్రసన్నం చేస్తున్నావు.

న తు విద్మో వయం తస్య దేవస్యైశ్వర్యమద్భుతమ్ ।
త్వన్నిశ్చయస్య దృఢతాం వేత్తుం వయమిహాగతాః ॥ 375 ॥

ఆ మహాదేవునియొక్క అద్భుతమైన ఐశ్వర్యమునుగూర్చి మాకు తెలియదు. కాని కేవలం ఆతనియందు నీ దృఢనిశ్చయాన్ని తెలిసికోవడానికే ఇక్కడకు వచ్చాము.

అచిరాదేవ తన్వఙ్గి కామస్తే౽యం భవిష్యతి ।
క్వా౽౽దిత్యస్య ప్రభా యాతి రత్నేభ్యః క్వద్యుతిః పృథక్ ॥ 376 ॥

కోఽర్థో వర్ణాలికావ్యక్తః కథం త్వం గిరిశం వినా ।
యామో నైకాభ్యుపాయేన తమభ్యర్థయితుం వయమ్॥ 377 ॥

ఓ తన్వంగీ! సుందరమైన రూపముకలదానా! అచిరకాలంలోనే నీ కోరిక సిద్ధిస్తుంది. సూర్యుని విడిచి సూర్యకాంతి ఎక్కడికి వెళుతుంది? రత్నములను విడిచి రత్నకాంతి ఎలా వెళుతుంది? అనేకాక్షరాలతో కూడిన ఒక శబ్దాన్ని విడిచి అర్థం వేరొకచోటికి ఎలా వెళుతుంది? అలాగే నీవు కూడ పరమేశ్వరుని విడిచివుండవు. అనేకోపాయాలను ఆలోచించి నీకోరిక ఫలింపజేయడానికి మేము ఆ శివుని అభ్యర్థించడానికి వెళ్ళుతున్నాము.

అస్మాకమపి వై సోఽర్థః సుతరాం హృది వర్తతే! ।
అతస్త్వమేవ సా బుద్ధిః యతో నీతిస్త్వమేవ హి ॥ 378 ॥
అతో నిస్సంశయం కార్యం శంకరోఽపి విధాస్యతి ।
ఇత్యుక్త్వా పూజితా యాతా మునయో గిరికన్యయా ॥ 379 ॥

మా అందరి పరమప్రయోజనం కూడ అదే. (మా అందరి కోరిక కూడ అదే) ఈ కార్యసాధనకు కావలసిన బుద్ధి, ఉపాయం కూడ నీవే. అనగా శివునియందు నీకున్న దృఢానురాగమే దీనికి సాధనం. కావున పరమశివుడు కూడ ఈ కార్యాన్ని నిస్సంశయంగా నెరవేరుస్తాడని చెప్పి ఆ గిరికన్యయైన పార్వతిచేత పూజించబడి మునులు అక్కడి నుండి వెళ్ళిపోయారు.

ప్రయయుర్గిరిశం ద్రష్టుం ప్రస్థం హిమవతో మహత్ ।
గంగామ్బుప్లావితాత్మానం పింగబద్ధజటాసటమ్ ॥ 380 ॥
భృంగానుయాతపాణిస్థమన్దారకుసుమస్రజమ్ ।
గిరేః సంప్రాప్య తే ప్రస్థం దదృశుః శంకరాశ్రయమ్ ॥ 381 ॥

ఇలా పలికి సప్తర్షులు శివుని దర్శించడానికై ఆ మహానుభావుడున్న హిమవత్పర్వతపు ఉన్నతమైన ప్రదేశానికి (పర్వత సానువుకు) వెళ్ళారు. గంగాజలధారలచే పవిత్రమై పింగళమైన, జటాజూటపువర్ణం గల, శివుని చేతిలోని మందార కుసుమమాలను అనుసరిస్తున్న తుమ్మెదలు గల ఆ పర్వతసానువుకు వెళ్ళి అక్కడ వున్న శివుని ఆశ్రమాన్ని చూశారు.

ప్రశాన్తాశేషసత్త్వౌఘం నవస్తిమితకాననమ్ ।
నిశ్శబ్దాక్షోభసలిలప్రపాతం సర్వతోదిశమ్ ॥ 382 ॥

ఆ ఆశ్రమంలో మృగసమూహాలన్నీ ప్రశాంతంగా ఉన్నాయి. వనప్రదేశమంతా నిశ్చలంగా ఉండినది. అన్ని వైపులా జలపాతాలు కల్లోలపడకుండా, శబ్దం చేయకుండా పడుతున్నాయి.

తత్రాపశ్యంస్తతో ద్వారి వీరకం వేత్రపాణినమ్ ।
సప్త తే మునయః పూజ్యాః వినీతాః కార్యగౌరవాత్ ॥ 383 ॥

ఊచుర్మధురభాషిణ్యా వాచా తే వాగ్మినాం వరాః ।

ఆ ఆశ్రమద్వారంలో పూజ్యులైన సప్తర్షులు వేత్రదండం గల వీరకుని చూశారు. తాము వచ్చిన పని గొప్పది, గౌరవంతో కూడినది. కావున మాట్లాడుటలో నేర్పరులైనవారు వినయంతో మధురమైన వాక్యాలతో ఇలా అన్నారు.

ద్రష్టుం వయమిహాఽఽయాతాః శరణ్యం గణనాయకమ్ ॥ 384 ॥

త్రిలోచనం విజానీహి సురకార్యప్రచోదితాః ।
త్వమేవ నో గతిస్తత్ర్వం యథా కాలానతిక్రమః ॥ 385 ॥

సా ప్రార్థనైషా ప్రాయేణ ప్రతీహారమయప్రభుః ।
ఇత్యుక్తో మునిభిః సోఽథ గౌరవాత్తానువాచ సః ॥ 386 ॥

లోకశరణ్యుడు, ప్రమథగణాధిపతియైన ఆ త్రిలోచనుని దర్శించుకోవడానికి మేమిక్కడికి వచ్చాము. దేవ కార్య ప్రేరణే మా రాకకు కారణమని నీవు తెలిసికో మరియు కాలాతిక్రమంకాకుండా ఆ దేవుని దర్శనం కలిగించడం లో నీవే మాకు దిక్కు. సాధారణంగా ద్వారపాలకుల అనుకూలతచేతనే ప్రభువులు దర్శనమిస్తారు కదా! అని పలికిన మునుల మాటలు విన్న వీరకుడు సాదరంగా వారితో ఇలా అన్నాడు.

సమన్వాస్యాపరాం సన్ధ్యాం స్నాత్వా మందాకినీజలే ।
క్షణేన భవితా విప్రాస్తత్ర ద్రక్ష్యథ శూలినమ్ ॥ 387 ॥

విప్రులారా! ఈశ్వరుడు మందాకినీనదిలో స్నానం చేసి, సాయంసంధ్యనుపాసించి క్షణకాలంలోనే ఈశ్వరుడు ఇక్కడికి వస్తాడు. అపుడు మీరు ఆ దేవుని దర్శించుకోవచ్చు.

ఇత్యుక్తా మునయస్తస్థుస్తే తత్కాలప్రతీక్షిణః ।
గమ్భీరామ్బుధరం ప్రావృట్ తృషితాశ్చాతకా యథా ॥ 388 ॥

వీరకుని మాటలు విన్న సప్తర్షులు బాగా దప్పికగలిగిన చాతకపక్షులు వర్షాకాలంలో గంభీరమైన మేఘం కోసం నిరీక్షించినట్లు పరమశివుని రాకకై నిరీక్షించారు.

తతః క్షణేన నిష్పన్నసమాధానక్రియావిధిః ।
వీరాసనం బిభేదీశో మృగచర్మనివాసితమ్ ॥ 389 ॥

తరువాత క్షణకాలంలోనే శివుని యోగసమాధి అనుష్ఠానం ముగిసింది. వెంటనే శివుడు మృగచర్మంతో ఏర్పర్చిన వీరాసనంనుండి లేచాడు.

తతో వినీతో జానుభ్యామవలమ్బ్య మహీం తథా ।
ఉవాచ వీరకో దేవం ప్రణామైకసమాశ్రయః ॥ 390 ॥

సంప్రాప్తా మునయః సప్త త్వాం ద్రష్టుం దీప్తతేజసః ।
విభో సమాదిశ ద్రష్టుమవగన్తుమిహార్హసి ।
తేఽబ్రువన్ దేవ కార్యేణ తవ దర్శనలాలసాః ॥ 391 ॥

అప్పుడు వీరకుడు మోకాళ్ళు నేలపై ఆనించి వినయంతో శివునికి ప్రణమిల్లి ఇలా చెప్పాడు. ప్రభూ! తేజోవంతులైన సప్తర్షులు మిమ్మల్ని దర్శించాలనే కోరికతో ఇక్కడకు వచ్చివున్నారు. దేవకార్యాన్ని సాధించేందుకు వారిక్కడకు వచ్చినట్లు తెలిపినారు. కావున వారు మిమ్మల్ని దర్శించుకోవడానికి అనుమతించ వలసిందని ప్రార్థిస్తున్నానని చెప్పాడు.

ఇత్యుక్తో ధూర్జటిస్తేన వీరకేణ మహాత్మనా ।
భ్రూభఙ్గసంజ్ఞయా తేషాం ప్రవేశాజ్ఞాం దదౌ తదా ॥ 392 ॥

మహాత్ముడైన వీరకుని మాటలు విన్న శివుడు కనుసైగతోనే సప్తర్షులను ప్రవేశింపజేయమని ఆదేశించాడు.

మూర్ధకమ్పేన తాన్ సర్వాన్ వీరకోఽపి మహామునీన్ ।
ఆజుహావావిదూరస్థాన్ దర్శనాయ పినాకినః ॥ 393 ॥

వీరకుడు కూడ వెంటనే కొద్దిదూరంలోనే నిరీక్షిస్తున్న మహర్షులను కేవలం తల ఊపుతూ (సైగ చేస్తూ) శివుని దర్శించుకోవడానికి పిలిచాడు.

త్వరా బద్ధార్ధచూడాస్తే లమ్బకృష్ణాజినామ్బరాః ।
వివిశుర్వేదికాం శుద్ధాం గిరిశస్య విభూతిభిః ॥ 394 ॥

పిలుపునందుకొన్న సప్తర్షులు తొందరలో తమ జటలను సగమే ముడివేసికొని, ధరించిన కృష్ణాజినాలనే వస్త్రాలు వ్రేలాడుతుండగా విభూతులతో సిద్ధంగావున్న పరమశివుని వేదికపైకి ప్రవేశించారు.

బద్ధపాణిపుటాక్షిప్తనానాపుష్పోత్కరాస్తతః ।
పినాకిపాదయుగలం వన్ద్యం నాకనివాసినామ్ ॥ 395 ॥

వారు దోసిళ్ళతో స్వర్గలోకపు పుష్పాలను తీసుకుని పరమశివునిపై వెదజల్లుతూ, దేవతలవలె పినాకపాణి పాదపద్మములకు వందనం చేశారు.

తతః స్నిగ్ధేక్షితాః శాన్తా మునయః శూలపాణినా ।
మన్మథారిం తతో దృష్ట్వా సమ్యక్తుష్టువురాదృతాః ॥ 396 ॥

శూలపాణియైన శివుడు తన ప్రేమార్ద్రమైన చూపులు వారిపై ప్రసరింపజేయగా, సప్తర్షులు శాంతచిత్తులై, ఆదరభావంతో ఆ దేవుని చూస్తూ ఆనందంతో ఇలా స్తుతించారు.

ఋషయ ఊచుః- ఋషులు పలికారు.

అహో కృతార్థా వయమేవ సామ్ప్రతం సురేశ్వరోఽప్యత్ర పురో భవిష్యతి ।
భవత్ప్రసాదామలవారిసేకతః ఫలేన కాచిత్ తపసా నియుజ్యతే ॥ 397॥

ఓ పరమశివా! ఇపుడు నీ దర్శనంచే మేము కృతార్థులమయ్యాము. అలాగే సురేశ్వరుడైన ఇంద్రుడు కూడ కృతార్థుడవుతున్నాడు. మరియు నీ అనుగ్రహమనే నిర్మలమైన జలంతో పవిత్రురాలు కావాలనే కోరికతో ఒకానొక స్త్రీ తపస్సు చేస్తున్నది.

జయత్యసౌ ధన్యతరో హిమాచల స్త్వదాశ్రయం యస్య సుతా తపస్యతి ।

స దైత్యరాజోఽపి మహాఫలోదయో విమూలితాశేషసురో హి తారకః ॥ 398 ॥

త్వదీయమంశం ప్రవిలోక్య కల్మషాత్ స్వకం శరీరం పరిమోక్ష్యతే హి యః ।

ఈ హిమవంతుడూ కూడ ధన్యుడే. ఆతని పుత్రికే స్వయంగా నీ ఆశ్రయాన్ని కోరి తపస్సు చేస్తున్నది. మరియు సమస్తదేవతలను నిర్మూలించిన మహాబలపరాక్రమాలుగల దైత్యరాజైన తారకాసురుడూ ధన్యుడే. ఎందుకంటే నీ అంశభూతమైన తత్త్వాన్ని(కుమారస్వామిని) దర్శించుకొని తన పాపాలనుండి ముక్తి పొందగోరుతున్నాడు.

స ధన్యధీర్లోకపితా చతుర్ముఖో హరిశ్చ యత్స్వప్నమవప్నిదీపితః ॥399॥

త్వదంఘ్రియుగ్మం హృదయేన బిభ్రతః మహాభితాపప్రశమైకహేతుకమ్ ।
త్వమేవ చైకో వివిధాకృతక్రియః కిలేతి వాచా విధురైర్విభావ్యతే ॥ 400 ॥

ఆ తారకాసుడు కలిగించిన భయసంభ్రమాదులకు వశులై, దానిచేత మహోద్విగ్నులై, ఆ అసురుడు కలిగించిన తాపప్రశాంతి హేతువులైన నీ పాదకమలాలను తమ హృదయాలలో నిలుపుకొని నిన్నే ఆరాధిస్తున్న చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు, స్థితికారకుడైన విష్ణువు కూడ ధన్యులే. వాస్తవంగా నీవొక్కడవే అనేక రూపాలలో అనేక విధాలైన పనులు చేస్తున్నావు. కాని అది తెలిసికోలేని మూర్ఖులు నీ గురించి విభిన్నంగా పలుకుతారు.

అథాద్య ఏకస్త్వమవైషి నాన్యథా జగత్తథా నిర్ఘృణతాం తవ స్పృశేత్ ।
న వేత్సి వా దుఃఖమిదం భవాత్మకం విహన్యతే తే ఖలు సర్వతః క్రియా ॥ 401 ॥

ఆద్యుడవైన నీవు ఈవిధంగా జరుగుతున్న లోకోపద్రవాన్ని తెలిసికొని కూడ ప్రతిక్రియను ఆలోచించకుంటే లోకం నిన్ను నిర్దయుడంటుంది. లోకంలోని భవాత్మకమైన=సంసారాత్మకమైన ఈ దుఃఖం నీకు తెలియదా? మీరు సృష్టిస్థితిలయాలనే క్రియలన్నింటిని ఈ తారకాసురుడు ధ్వంసం చేస్తున్న విషయం నీకు తెలిసినదే కదా!.

ఉపేక్షసే చేజ్జగతాముపద్రవం దయామయత్వం తవ కేన కథ్యతే ।
స్వయోగమాయామహిమాగుహాశ్రయం న విద్యతే నిర్మలభూతిగౌరవమ్॥ 402 ॥

ఈ ప్రపంచానికి కలిగే ఉపద్రవాన్ని నీవు ఉపేక్షిస్తే నిన్ను దయామయుడని ఎవరంటారు? తన యోగమాయా మహిమలకు ఆశ్రయమైయున్న నీ ఐశ్వర్యమును, గౌరవమును ఎవరునూ పొగడరు కదా!.

వయం చ తే ధన్యతరాః శరీరిణాం యదీదృశం త్వాం ప్రతిలోకయామహే ।
అదర్శనం తేన మనోరథో యథా ప్రయాసి సాఫల్యతయా మనోగతమ్ ।
జగద్విధానైకవిధౌ జగన్ముఖే కరిష్యసేఽతో బలభిచ్చరా వయమ్ ॥403॥

మహానుభావుడవైన నిన్ను దర్శించగలిగినందుకు మేము ప్రాణులందరికంటె ధన్యులం. మొదట మేము కూడ నీ దర్శనం ప్రాప్తిస్తుందో లేదోఅని చింతించాము. కాని ఇప్పుడు నీ దర్శనంతో మా మనోరథం సఫలమైంది. ఓ విశ్వతోముఖ ఈ జగత్తుయొక్క విధానకర్తవైన నీవు కోరిన వాటికంటే అధికంగానే కోరికలు నెరవేర్చగలవు.

వినేమురిత్థం మునయో విసృజ్య తాం గిరం గిరీశ శ్రుతిభూమి సన్నిధౌ ।
ఉత్కృష్టకేదార ఇవావనీతలే సుబీజముష్టిం సుఫలాయ కర్షకాః ॥ 404 ॥

కర్షకులు మంచి పంట పండుటకై ఉత్కృష్టమైన పంటపొలంలో విత్తనాలు జల్లినట్లుండినది. ఈ విధంగా సప్తర్షులు తమ వాక్కులను పరమేశ్వరుని శ్రవణభూమి సమీపంలో అర్పణచేసి అనగా శివునకు సవినమ్రులై తాము చెప్పదలుచుకున్నదంతా వివరించి ఆతనికి నమస్కరించారు.

తేషాం శ్రుత్వా తతో రమ్యాం ప్రక్రమోపక్రమక్రియామ్ ।
వాచం వాచస్పతిరివ ప్రోవాచ స్మితసుందరః ॥ 405 ॥

ఆ సప్తర్షుల రమ్యములైన మాటలు విన్న పరమేశ్వరుడు అందమైన చిరునవ్వుతో బృహస్పతివలె మధురమైన వచనములు ఇలా పలికాడు.

శర్వ ఉవాచః– శివుడు పలికాడు.

జానే లోకవిధానస్య కన్యాం సత్కార్యముత్తమమ్ ।
జాతో ప్రాలేయశైలస్య సంకేతకనిరూపణా ॥ 406 ॥

ఈ లోకవిధానానికి సంబంధించిన ఉత్తమమైన సత్కార్యాన్ని మరియు దీనికంతటికి సంకేతాలను తెలిపే దేవి హిమవంతునికి పుత్రికగా జన్మించిందని నాకు తెలుసు.

సత్యముత్కంఠితాస్సర్వే దేవకార్యార్థముద్యతాః ।
తేషాం త్వరన్తి చేతాంసి కిన్తు కార్యం వివక్షితమ్ ॥ 407 ॥

లోకయాత్రానుగన్తవ్యా విశేషేణ విచక్షణైః ।
సేవన్తే తే యతో ధర్మం తత్ర్పామాణ్యాత్ స్థితాః పరాః ॥ 408 ॥

అందరూ దేవకార్యం సాధించడానికై ఉద్యుక్తులై వున్నారని, అత్యంత ఉత్కంఠతో వున్నారని, దాన్ని సాధించడానికి వారి మనస్సులు చాలా త్వరపడుతున్నాయని నాకు తెలుసు. అయినా ఆ కార్యాన్ని సాధించడానికి విచక్షణులైన వారు విశేషంగా లోకరీతిననుసరించి పని చేయాలి కదా! ధర్మాన్ని అనుసరించి మనమాచరించే వాటినే ఇతరులు ప్రమాణంగా గ్రహిస్తారు.

ఇత్యుక్తా మునయో జగ్ముస్త్వరితాస్తు హిమాచలమ్ ।
తత్ర తే పూజితాస్తేన హిమశైలేన సాదరమ్ ॥
ఊచుర్మునివరాః ప్రీతాః స్వల్పవర్ణం త్వరాన్వితాః ॥ 409 ॥

పరమేశ్వరుని మాటలు విన్న సప్తర్షులు వెంటనే వేగంగా హిమవంతుని వద్దకు వెళ్ళారు. అక్కడ హిమవంతునిచే సాదరంగా పూజింపబడి సంతుష్టులై శైలేంద్రునితో సంక్షిప్తంగా ఇలా చెప్పారు.

మునయః ఊచుః- మునులు చెప్పారు.

దేవో దుహితరం సాక్షాత్ పినాకీ తవ మార్గతే ।
తచ్ఛీఘ్రం పావయాత్మానమాహుత్యేవానలార్పణాత్ ॥ 410 ॥

ఓ హిమవంతుడా! పినాకపాణియైన ఆ మహాదేవుడే సాక్షాత్తు నీ కూతురిని పత్నిగా కోరుకుంటున్నాడు. కావున వెంటనే నీవు ఆహుతిని అగ్నికి అర్పించినట్లు పార్వతిని అతనికి అర్పించి నిన్ను నీవు పవిత్రం చేసుకో.

కార్యమేతచ్చ దేవానాం సుచిరం పరివర్తతే ।
జగదుద్ధరణాయైష క్రియతాం వై సముద్యమః ॥ 411 ॥

దీనిలో చాలా కాలంగా దేవతల మహత్తరకార్యం ఇమిడివున్నది. జగత్తునుద్ధరించడానికి నీవు వెంటనే ఉద్యమించాలి.

ఇత్యుక్తస్తై స్తదా శైలో హర్షావిష్టో వదన్మునీన్ ।
అసమర్థోఽభవద్వక్తుముత్తరం ప్రార్థయన్ శివమ్ ॥ 412 ॥

సప్తర్షుల మాటలు విన్న హిమవంతుడు సంతోషంతో బదులు చెప్పాలనుకున్నాడు. కాని శివుని ప్రార్థిస్తూ సరైన సమాధానం చెప్పలేకపోయాడు.

తతో మేనా మునీన్ వన్ద్య ప్రోవాచ స్నేహవిక్లవా ।
దుహితుస్తాన్ మునీంశ్చైవ చరణాశ్రయమర్థవిత్ ॥ 413 ॥

అపుడు హిమవంతునిభార్య మేనాదేవి మునుల పాదాలకు నమస్కరించి, కూతురియందున్న ప్రేమాతిశయంతో వారిని ఉద్దేశించి వెంటనే అర్థవంతమైన వాక్కులతో ఇలా అన్నది.

మేనోవాచః- మేనా చెప్పింది.

యదర్థం దుహితుర్జన్మ నేచ్ఛన్త్యపి మహాఫలమ్ ।
తదేవోపస్థితం సర్వం ప్రక్రమేణైవ సాంప్రతమ్ ॥ 414 ॥

కూతురి జన్మ (పుట్టుక) తల్లిదండ్రులకు మహాఫలవంతమైనదే. తల్లిదండ్రులు కూతురి విషయంలో ఏది జరుగకూడదని అనుకొంటారో అదే ఇప్పుడు మా కూతురి విషయంలో జరిగింది.

కులజన్మ వయోరూప విభూత్యర్థియుతోఽపి యః ।
వరస్తస్యాపి చాహూయ సుతా దేయా హ్యయాచతః ॥ 415 ॥

తత్సమస్తతపో ఘోరం కథం పుత్రీ ప్రయాస్యతి ।
పుత్రీవాక్యాద్యదత్రాస్తి విధేయం తద్విధీయతామ్ ॥ 416 ॥

వంశము, జన్మ, వయస్సు, రూపము, సంపద మొదలైనవన్ని సమృద్ధిగా ఉన్న వరుడు లభిస్తే ఆతడు కోరకున్నప్పటికి తల్లిదండ్రులు ఆతనిని ఆహ్వానించి కూతురు నాతనికిచ్చి పెళ్లి చేయాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ఆ శివుడు తనకు ఇష్టం కానట్లైతే మా పార్వతి ఆతనినుద్దేశించి ఘోరమైన తపస్సు ఎలా చేస్తుంది? కావున మా పుత్రిక కోరికననుసరించి ఆమె కోరినట్లుగా మీరు ఆచరించండి.

ఇత్యుక్తా మునయస్తే తు ప్రియయా హిమభూభృతః ।
ఊచుః పునరుదారార్థం నారీచిత్తప్రసాదకమ్ ॥ 417 ॥

హిమవంతుని భార్య మేనా చెప్పిన ఆ మాటలు విన్న సప్తర్షులు స్త్రీలమనస్సుకు ఆహ్లాదం కలిగించే ఉదారమైన అర్థవంతమైన మాటలతో ఆమెనుద్దేశించి ఇలా అన్నారు.

మునయ ఊచుః- మునులు పలికారు.

ఐశ్వర్యమవగచ్ఛస్వ శంకరస్య సురాసురైః ।
ఆరాధ్యమానపాదాబ్జయుగలత్వాత్ సునిర్వృతైః ॥ 418 ॥

సురాసురులందరూ ఆ పరమేశ్వరుని పాదకమలద్వయాన్ని ఆరాధించి సుఖశాంతులను పొందుతున్నారు. దీనిద్వారా ఆ పరమశివుని ఐశ్వర్యమెంతటిదో తెలుసుకోండి.

యస్యోపయోగి యద్రూపం సా చ తత్ప్రాప్తయే చిరమ్ ।
ఘోరం తపస్యతే బాలా తేన రూపేణ నిర్వృతిః ॥ 419 ॥

యస్తద్వ్రతాని దివ్యాని నయిష్యతి సమాపనమ్ ।
తత్ర సావహితా తావత్ తస్మాత్త్సైవ భవిష్యతి॥ 420 ॥

మీ పుత్రిక పార్వతీదేవి కూడ ఆ పరమేశ్వరుణ్ణి పొందడానికై చాలాకాలంనుండి ఘోరమైన తపస్సు చేస్తున్నది. ఎవరిద్వారానైతే ఆమె ఆచరిస్తున్న దివ్యమైన వ్రతాలకు ఫలితం లభిస్తుందో ఆతనియందే మనస్సును స్థిరంగా నిలిపివున్నది. కావున తప్పనిసరిగా ఈమే ఆ పరమశివునికి ఇల్లాలు అవుతుంది.

ఇత్యుక్త్వా గిరిణా సార్థం తే యయుర్యత్ర శైలజా ।
జితార్కజ్వలనజ్వాలా తపస్తేజోమయీ హ్యుమా ॥ 421 ॥

ఇలా చెప్పి సప్తర్షులు హిమవంతునితో గూడ అగ్ని తేజస్సునుమించిన తేజస్సుకలిగిన తపస్సు చేయటం వలన అమితమైన తేజోమయరూపము కలిగిన ఆ శైల పార్వతి తపస్సు చేస్తున్న ప్రదేశానికి వెళ్ళారు.

ప్రోచుస్తాం మునయః స్నిగ్ధం సమ్మాన్య పథమాగతమ్ ।
రమ్యం ప్రియం మనోహారి మా రూపం తపసా దహ ॥ 422 ॥

మునులందరు ప్రీతి పూర్వకంగా ఆ పార్వతీదేవితో ఇలా అన్నారు. రమ్యమైన, ప్రియమైన, మనోహరమైన మరియు సర్వజనాదరణీమైన ఈ నీ రూపాన్ని తపస్సు అనే అగ్నిచే దహించకు.

ప్రాతస్తే శఙ్కరః పాణిమేష పుత్రి గ్రహీష్యతి ।
వయమర్థితవన్తస్తే పితరం పూర్వమాగతాః ॥ 423 ॥

పిత్రా సహ గృహం గచ్ఛ వయం యామః స్వమందిరమ్॥ 424 ॥

పుత్రీ! రేపు ఉదయమే శంకరుడు నీ పాణిగ్రహణం చేస్తాడు. ఈ విషయమై మేమంతా ముందుగానే వచ్చి మీ తండ్రిని ప్రార్థించాము. కావున నీవు మీ తండ్రిగారితో ఇంటికి వెళ్ళు మేము కూడ మా ఇళ్ళకు వెళతాము.

ఇత్యుక్తా తపసః సత్యం ఫలమస్తీతి చిన్త్య సా ।
త్వరమాణా యయౌ వేశ్మ పితుర్దివ్యార్థశోభితమ్ ॥ 425 ॥

సా తత్ర రజనీం మేనే వర్షాయుతసమాం సతీ ।
హరదర్శనసంజాతమహోత్కణ్ఠా హిమాద్రిజా ॥ 426 ॥

ఆ విధంగా మునులు చెప్పగా పార్వతి తన తపఃఫలము సిద్ధిస్తుందని తలంచి వెంటనే దివ్యములైన సంపదలతో శోభిస్తున్న తన పితృగృహానికి వెళ్ళింది. తర్వాత ఆ పరమేశ్వర దర్శనం ఎప్పుడు కలుగుతుందా అనే గొప్ప ఉత్కంఠతో వున్న ఆ హైమవతికి ఆ రాత్రి పదివేల సంవత్సరాలకు వలె తోచింది.

తతో ముహూర్తే బ్రాహ్మే తు తస్యాశ్చక్రుః సుహృత్ప్రియాః ।
నానా మంగల సందోహాన్యథావత్ క్రమపూర్వకమ్ ॥ 427 ॥

దివ్యమణ్డనమఙ్గానాం మందిరే బహుమఙ్గలే।
ఉపాసత గిరిం మూర్తా ఋతవః సార్వకామికాః ॥ 428 ॥

తర్వాత ఆమె సఖులైన సురస్త్రీలు బ్రాహ్మీముహూర్తంలో సంప్రదాయానుసారంగా మంగళప్రదాలైన అనేక ఆభరణాలతో ఆమెను అలంకరింపజేశారు. బహుమంగళప్రదమైన దివ్యస్త్రీలతో అలరారుతున్న హిమవంతుని మందిరాన్ని సర్వకామఫలప్రదులైన ఆరు ఋతువులు మూర్తీభవించినవారై సేవించారు.

వాయవో వారిదాశ్చాసన్ సమ్మార్జనవిధౌ గిరేః ।
హర్మ్యేషు శ్రీః స్వయం దేవీ కృతనానాప్రసాధనా ॥ 429 ॥

వాయువులు గిరిప్రదేశాన్ని శుభ్రం చేశాయి. మేఘాలు నీళ్ళు చల్లాయి. స్వయంగా లక్ష్మీదేవి హిమవంతుని భవనాలలో కావలసిన పదార్థాలన్నింటిని సమకూర్చింది.

కాన్తిః సర్వేషు భావేషు బుద్ధిశ్చాభవదాకులా ।
చిన్తామణి ప్రభృతయో రత్నాః శైలం సమన్తతః ॥ 430 ॥

ఉపతస్థుర్నగాశ్చాపి కల్పకామమహాద్రుమాః ।
ఓషధ్యో మూర్తిమత్యశ్చ దివ్యౌషధిసమన్వితాః ॥ 431 ॥

రసాశ్చ ధాతవశ్చైవ సర్వే శైలస్య కింకరాః ।
కింకరాస్తస్య శైలస్య వ్యగ్రాశ్చాఽఽజ్ఞానువర్తినః॥ 432 ॥

అన్ని పదార్థాలలో, అన్ని భావాలలో కూడ కాంతి మరియు సమృద్ధి పుష్టిగా ఉండినది. చింతామణి మొదలగు రత్నాలన్నీ ఆ పర్వతశ్రేష్ఠుని సేవించుకొన్నాయి. అంతేకాక ఇతర పర్వతాలు, కల్పవృక్షాదులు కూడా హిమవంతునికి సేవచేయడానికి సిద్ధంగా వుండినవి. ఓషధులు, దివ్యౌషధులు, రసములు, ధాతువులు మొదలగునవి శరీరాకృతిని పొంది హిమవంతునికి సేవకులయ్యారు. మరియు ఆ శైలాధిరాజు ఆజ్ఞను పాలించడానికి సర్వసన్నద్ధులై సిద్ధంగా వున్నారు.

నద్యః సముద్రా నిఖిలాః స్థావరం జఙ్గమం చ యత్ ।
తత్సర్వం హిమశైలస్య మహిమానమవర్ధయత్ ॥ 433 ॥

నదులు, సముద్రాలు, స్థావరజంగమాత్మకమైన పదార్థాలన్నీ అతనికి సేవచేస్తూ హిమవంతుని గొప్పతనాన్ని వృద్ధిపరచాయి.

అభవన్మునయో నాగా యక్షగంధర్వకిన్నరాః ।
శంకరస్యాపి విబుధా గంధమాదనపర్వతే ॥ 434 ॥
సర్వే మండనసంభారస్తస్థుర్నిర్మలమూర్తయః ।

అటు గంధమాదనపర్వతంపై మునులు, నాగదేవతలు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, మరియు దేవతలందరు నిర్మలమూర్తులై పరమశివుని అలంకరించడానికి అనేకాభరణాలతో సిద్ధపడ్డారు.

శర్వస్యాపి జటాజూటే చంద్రఖండం పితామహః ॥ 435 ॥

బబంధ ప్రణయోదారవిస్ఫారితవిలోచనా ।
కపాలమాలా విపులాం చాముండా మూర్ధ్ని బంధత ॥ 436 ॥

ఉవాచ చాపి వచనం పుత్రం జనయ శంకర ।
యో దైత్యేంద్రకులం హత్వా మాం రక్తైస్తర్పయిష్యతి ॥ 437 ॥

పితామహుడైన బ్రహ్మదేవుడు శివుని జటాజూటంలో చంద్రఖండాన్ని అలంకరించాడు. ప్రేమతో ఉదారభావంతో విప్పారిన నేత్రాలుగల చాముండా శివుని శిరమున విపులమైన కపాలమాలను ధరింపజేసింది. మరియు దైత్యేంద్రకులమును నిర్మూలించి వారి రక్తంతో మాకు సంతృప్తి గలిగించే పుత్రుని కను శంకరా అని చెప్పింది.

సౌరిర్జ్వలచ్ఛిరోరత్నం ముకుటం చానలోల్బణమ్ ।
భుజగాభరణం గృహ్య సజ్జం శంభోః పురోఽభవత్ ॥ 438 ॥

యముడు ప్రకాశిస్తున్న శిరోరత్నాలు గల, అగ్నితో సమానమైన కాంతిగలిగిన, సర్పాలు ఆభరణాలుగా గల కిరీటాన్ని చేతిలో పట్టుకుని పరమశివుని ముందు నిలిచాడు.

శక్రో గజాజినం తస్య వసాభ్యక్తాగ్రపల్లవమ్ ।
దధ్రే సరభసం స్విద్యద్విస్తీర్ణముఖపంకజమ్ ॥ 439 ॥

దేవేంద్రుదు కూడ వికసించిన విశాలమైన మిక్కిలి ముఖకమలం గల శివునిలో గజచర్మమును ఉత్సాహంతో ధరింపజేశాడు.

వాయుశ్చ విపులం తీక్ష్ణ శృంగం హిమగిరిప్రభమ్ ।
వృషం విభూషయామాస హరయానం మహౌజసమ్ ॥ 440 ॥

వాయుదేవుడు విశాలమైన మరియు తీక్ష్ణములైన కొమ్ములు గలిగిన, హిమవంతునివంటి తెల్లని కాంతి గలిగి. మరియు దృఢంగా, మనోహరంగా నున్నట్టి వృషభాన్ని శివునికి వాహనంగా ఇచ్చి, దానిపై శివుని అలంకరింపజేశాడు.

వితేనుర్నయనాన్తస్థాః శమ్భోః సూర్యానలేన్దవః ।
స్వాం ద్యుతిం లోకనాథస్య జగతః కర్మసాక్షిణః ॥ 441 ॥

ఈ విశ్వానికి కర్మ సాక్షులైన సూర్యచంద్రులు మరియు అగ్ని లోకనాథుడైన ఆ పరమేశ్వరుని కన్నులలో వుండి తమ కాంతిని ఆతని శరీరములో విస్తరింపజేశారు.

చితాభస్మం సమాధాయ కపాలే రజతప్రభమ్ ।
మనుజాస్థిమయీం మాలామాబబన్ధ చ పాణినా ॥ 442 ॥

ప్రేతాధిపః పురో ద్వారే సగదః సమవర్తత ।

ప్రేతాధిపుడైన యముడు ఒక కపాలంలో వెండినిబోలిన చితాభస్మాన్ని తీసుకొని, తన చేతితో మానవ ఎముకల మాలను శివుని కంఠంలో ధరింపజేసి, గదతో ద్వారసమీపంలో నిలబడ్డాడు.

నానాకారమహారత్న భూషణం ధనదాహృతమ్ ॥ 443 ॥

విహాయోదగ్రసర్పేన్ద్ర కటకేన స్వపాణినా ।
కర్ణోత్తంసం చకారేశో వాసుకిం తక్షకం స్వయమ్ ॥ 444 ॥

జలాధీశా హృతాం స్థాస్నుప్రసూనావేష్టితాం పృథక్ ।

కుబేరుడు స్వయంగా తెచ్చిన వివిధాకారాలలో వున్న మహారత్నాలతో కూడిన ఆభరణమును వదిలి ఈశ్వరుడు భయంకరమైన సర్పాలే కడియాలుగా వున్న తన చేతితో వాసుకిని, మరియు తక్షకుని కూడ తన చెవులకు ఆభరణాలుగా ధరించాడు. అలాగే వరుణదేవుడు తెచ్చిన చెదరిపోని పూలమాలను గూడా ధరించాడు.

తతస్తు తే గణాధీశాః వినయాత్తత్ర వీరకమ్ ॥ 445 ॥

ప్రోచుర్వ్యగ్రాకృతే త్వం నో సమావేదయ శూలినే ।

అపుడు, ప్రమథగణాధిపతులు వినయంగా (వీరకునితో ఆపేరు గల ద్వారపాలకుడని పురాణాంకాలు చెబుతున్నాయి). నీకు అప్పగించిన ఆయా పనులలో ఎప్పుడూ వ్యగ్రుడవై ఉండే ఓ వీరకా! మా రాకను పరమేశ్వరునికి తెలుపు.

నిష్పన్నాభరణం దేవం ప్రసాధ్యేశం ప్రసాధనైః ॥ 446 ॥
సప్త వారిధయస్తస్థుః కర్తుం దర్పణవిభ్రమమ్ ।

ఆయా ఆభరణములతో అలంకరించబడిన పరమేశ్వరుని చూచి సప్తసముద్రాలు అతనిముందు అద్దము వలె నిలిచాయి.

తతో విలోకితాత్మానం మహాంబుధిజలోదరే ॥ 447 ॥

ధరామాలింగ్య జానుభ్యాం స్థాణుం ప్రోవాచ కేశవః ।
శోభసే దేవరూపేణ జగదానందదాయినా ॥ 448 ॥

అప్పుడు అద్దం వలే తనముందున్న సప్త సముద్రాడిలలో తన రూపాన్ని చూచుకొనగా, శ్రీహరి మోకాళ్ళను భూమిపై ఆనించి కూర్చుని, పరమశివునితో "దేవా ప్రపంచానికి ఆనందం కలిగించే రూపంతో శోభిస్తున్నావు" అన్నాడు.

మాతరః ప్రేరయన్ కామవధూం వైధవ్య చిహ్నితామ్ ।
కాలోఽయమితి చాలక్ష్య ప్రకారేంగిత సంజ్ఞయా ॥ 449 ॥
తతస్తాశ్చోదితా దేవమూచుః ప్రహసితాననాః ।
రతిః పురస్తవ ప్రాప్తా నాభాతి మదనోజ్ఝితా ॥ 450 ॥

ఇదే మంచి సమయమని తలంచిన మాతృకలు వైధవ్యలక్షణములతో నున్న మన్మథ పత్నియైన రతీదేవి కేవలం ఇంగిత సంజ్ఞలతో ముందుకు వెళ్ళుటకై ప్రేరేపించిరి. అటు తర్వాత ఆ మాతృకలు హసనోన్ముఖులై ఆ పరమేశ్వరునితో "మన్మథుడు లేక రతీదేవి కాంతి విహీనమై తమ ముందు" నిల్చున్నదని చెప్పిరి.

తతస్తాం సన్నివార్యాహ వామహస్తాగ్రసంజ్ఞయా ।
ప్రయాణే గిరిజావక్త్ర దర్శనోత్సుకమానసః ॥ 451 ॥

పార్వతీదేవి ముఖాన్ని చూడాలనే ఉత్సాహంతో కూడిన మనస్సుగల పరమశివుడు ప్రయాణోన్ముఖుడై ఎడమచేతి సైగతోనే ఆమెను వారించాడు.

తతో హరో హిమగిరికందరాకృతిం సమున్నతం మృదుగతిభిః ప్రచోదయన్ ।
మహావృషం గణతుములాహితేక్షణః స భూధరానశనిరివ ప్రకమ్పయన్ ॥ 452 ॥

తర్వాత శివుడు హిమగిరికందరం వలె తెల్లగానున్న, ఎత్తైన మహావృషభాన్నెక్కి దానిని నిదానంగా వెళ్ళుటకై ప్రేరేపిస్తూ, ప్రమథగణాలకు కూడ బయల్దేరుటకై సైగ చేస్తూ, ఆ పర్వతశ్రేణులను పిడుగువలె కంపింపజేస్తూ వివాహార్థమై బయలుదేరాడు.

తతో హరిర్ద్రుతపదపద్ధతిపురః సరః శ్రమాద్ ద్రుమనికరేషు విశ్రమన్ ।
ధరారజఃశబలిత భూషణోఽబ్రవీత్ ప్రయాత మా కురుత పథోఽస్య సంకటమ్ ॥ 453 ॥

అప్పుడు శ్రీహరి గూడా త్వరితగతిన ముందుకు వెళుతూ శ్రమ కలిగినప్పుడు చెట్లనీడలో విశ్రాంతి పొందుతూ, దారిలో పైకి లేస్తున్న ధూళివలన తన ఆభరణాలు రంగుమారగా తమను అనుసరించి వస్తున్న వారందరికి "ముందుకు సాగుమని, దారి మధ్యలో ఆగి శివుని మార్గానికి ఆటంకం కలిగించవద్దని చెప్పాడు.

ప్రభోః పునః ప్రథమనియోగమూర్జయన్ సుతోఽబ్రవీద్ భ్రుకుటిముఖోఽపి వీరకః ।
వియచ్చరా వియతి కిమస్తి కాన్తకం? ప్రయాత నో ధరణిధరా విదూరతః ॥ 454 ॥

మహార్ణవాః కురుత శిలోపమం పయః సురద్విషాం గమనమహాతికర్దమమ్ ।
గణేశ్వరాశ్చపలతయా న గమ్యతాం సురేశ్వరైః స్థితమతిభిర్నిరీక్ష్యతే ॥ 455 ॥

ముందుగానే ప్రభువు తనకిచ్చిన ఆజ్ఞననుసరించి, వీరకుడు తన కనుబొమ్మలు ముడివేసి ఇలా చెప్పాడు. "ఓ దేవతలారా! ఆకాశంలో ఏమి వింత ఉందని చూస్తున్నారు?, పర్వతములారా! మీరు మాకు కొంచెం దూరంగా పొండి. మహాసముద్రములారా! రాక్షస సంచారంవలన బురదగా మారిన మీ జలమును శిలవలె గట్టిపరచుకొనండి. గణాధిపతులారా! చంచలమైన గతితో అటు నిటు పరుగెత్తకండి, స్థిరచిత్తులైన దేవతలు మిమ్మల్ని గమనిస్తున్నారు.

న భృంగిణా స్వతనుమవేక్ష్య నీయతే పినాకినః పృథుముఖమణ్డమగ్రతః ।
వృథా యమ ! ప్రకటితదంతకోటరం త్వమాయుధం వహసి విహాయ పంజరమ్॥ 456 ॥

పదం న యద్రథతురగైః పురద్విషా ప్రముచ్యతే బహుతరం మాతృసంకులమ్ ।
అమీ సురాః పృథగనుయాయిభిర్వృతాః పదాతయో ద్విగుణపథాన్ హరప్రియాః ॥ 457 ॥

భృంగి తన విశాలకాయాన్ని చూసుకుంటూ నడుస్తున్నాడే కాని, పరమశివుడు తన విశాలముఖ మండలాగ్రాన్ని ప్రసరింపజేస్తున్న దారి వెంట వెళ్ళడం లేదు. ఓ యమధర్మరాజా! నీవేమిటి నీ దంతముల నడుమనున్న సందులు బయటపడేటట్టు నోరు తెరుచుకొని అస్థిపంజరానికి బదులుగా దండాయుధాన్ని పట్టుకుని వెళుతున్నావు. రథాలు, అశ్వాలు, మరియు మాతృకలు మొదలగు వాటిచేత ఆక్రమించబడిన మార్గంలో పరమేశ్వరుడు నిదానంగా ముందుకు కదులుతున్నాడు. హరునికి ఇష్టపాత్రులైన దేవతలు తమ అనుయాయులతో కూడ నడుస్తూ, వేరొక మార్గాన్ననుసరించి చాలా ముందుకు వెళుతున్నారు.

బ్రాహ్మీ మాహేశ్వరీ చండీ వారాహీ వైష్ణవీ తథా ।
కౌమారీ చైవ చాముండాచర్చి కేత్యష్టమాతరః ॥

అనే శ్లోకప్రమాణాన్ననుసరించి ఈ ఎనిమిది మంది మాతృకలు శివునికి సేవచేయడానికి నియుక్తులైనారని తెలుస్తున్నది. అయితే ఈ మాతృకలు స్కందుని సేవిస్తారని, స్కందమాతలని ప్రసిద్ధిగా వివరించబడివున్నది. కానీ

బ్రాహ్మీ మాహేశ్వరీ చైవ కౌమారీ వైష్ణవీ తథా ।
మాహేంద్రీ చైవ వారాహీ చాముండా చైవ మాతరః ॥

అనే ఇంకొక శ్లోకాన్ని బట్టి ఈ మాతృకలు ఏడుగురు ఉంటారని, మరికొన్నిచోట్ల పదహారుమంది మాతృకలని కూడ చెప్పినట్లు ఇతిహాసాలు తెలుపుతున్నాయి.

స్వవాహనైః పవనవిధూత చామరైః చలద్ధ్వజైర్వ్రజత విహారశీలిభిః ।
సురాః స్వకం కిమితి న రాగమూర్జితం విచార్యతే నియతలయత్రయానుగమ్ ॥ 458 ॥

ఓ దేవతలారా! గాలిచే కదులుతున్న చామరాలు మరియు ధ్వజాలు గలిగిన విహరించే స్వభావం గల మీ మీ రథాలనధిరోహించి ముందుకు నడవండి, అయినా ఇదేమిటి, మూడు లయలతో కూడ సాధనచేసిన రాగాలను మీరు ఆలపించటం లేదే?

న కిన్నరైరభిభవితుం హి శక్యతే విభూషణప్రచయసముద్భవో ధ్వనిః ।
స్వజాతికాః కిమితి చ షడ్జమధ్యమ పృథుస్వరం బహుతరమత్ర వక్ష్యతే ॥ 459 ॥

కిన్నరులు తమ ఆభరణాల రాపిడివలన కలుగుతున్న ధ్వనిని మరుగుపడేటట్లు గొంతెత్తి పాడలేకపోతున్నారే? తమజాతికే చెందిన ప్రమథాదులు షడ్జమధ్యమస్వరాలతో బిగ్గరగా బహుతరంగా ఎందుకని పాడలేకపోతున్నారు.

నతానతానతనతతానతాం గతాః పృథక్తయా సమయకృతా విభిన్నతామ్ ।
విశంకితా భవదతిభేదశీలినః ప్రయాన్త్యమీ ద్రుతపదమేవ గౌదకాః ॥ 460 ॥

బాగా వంగిపోయిన శరీరాలుగల గౌదకులు వారి కళలకు సంబంధించిన సంస్కృతిని మరచి, ఎవరికి వారుగా విడిపోయి భయంతో, సందేహంతో త్వరత్వరగా అడుగులువేస్తూ అలా వెళ్ళిపోతున్నారేమిటి?

విసంహతాః కిమితి న షాడ్గవాదయః స్వగీతకైర్లలితపదప్రయోగజైః ।
ప్రభోః పురో భవతి హి యస్య చాక్షతం సముద్గతార్థకమితి తత్ప్రతీయతే ॥ 461 ॥

ఇదేమిటి? షాడ్గవాదులు (సంగీతజ్ఞులు) కూడ వేరువేరుగా విడిపోయి నడుస్తున్నారు? లలితపదప్రయోగాలు గలిగిన మీ గీతాలతో ప్రభువుముందు అక్షతమైన సంగీతాన్ని మధురంగా వినిపించరేమి?

అమీ పృథగ్విరచితరమ్యరాసకం విలాసినో బహుగమకస్వభావకమ్ ।
ప్రయుంజతే గిరిశయశోవిసారిణం ప్రకీర్ణకం బహుతరనాగజాతయః ॥ 462 ॥

అనేక నాగజాతులకు చెందిన విలాసాలు గల స్త్రీలు కూడ ఎవరికి వారు విడిపోయి అనేక గమకాలతో కూడిన రాసకనృత్తాన్ని అభినయిస్తూ, పరమశివుని యశస్సును విస్తరింపచేయక, ప్రకీర్ణక విధానాన్ని అనుసరిస్తున్నారెందుకు?

అమీ కథం కకుభికథాః ప్రతిక్షణం ధ్వనన్తి తే వివిధవధూవిమిశ్రితాః ।
న జాతయో ధ్వనిమురజా సమీరితా న మూర్ఛితాః కిమితి చ మూర్ఛనాత్మికాః ॥ 463 ॥

శ్రుతి ప్రియక్రమగతిభేదసాధనం తతాదికం కిమితి న తుమ్బురేరితమ్।
న హన్యతే బహువిధవాద్యడమ్బరం ప్రకీర్ణవీణామురజాది నామ యత్ ॥ 464 ॥

ఇదేమిటి, అనేక జాతులకు చెందిన దేవయువతులు కూడ ఒక క్రమంలో ఉండకుండా ప్రతి క్షణం విభిన్న దిశలకు చేరి, పరస్పరం కలసిపోయిన మాటలతో, పాటలతో ధ్వని చేస్తున్నారు? వానివలన మధురమైన స్వరాలతో గూడిన మృదంగ వాద్యధ్వనులు వినిపించుటం లేదే?[1], సంగీత శాస్త్రానికి సంబంధించిన మూర్ఛనలు [2] ప్రధానంగా గల గీతాలు వినిపించటం లేదే, మరియు వినడానికి ఇంపైన క్రమగతి గల, సంగీతానికి సంబంధించిన తుంబురాదులు చెప్పిన వీణామృదంగాది వాద్యవిశేషాలను మృదువుగా మ్రోగించుటలేదేందుకు?

1. నిషాద, ఋషభ, గాంధార, షడ్జ, మధ్యమ, దైవత, పంచమశ్చ ఇత్యమీ సప్త తంత్రీ కంఠోత్థితాః స్వరాః ॥ సంగీతశాస్త్రానుసారం ఇవి ఏడు స్వరాలు.

2. "క్రమాత్స్వరాణాం సప్తానాం ఆరోహశ్చావరోహణమ్ ।
సా మూర్ఛేత్యుచ్యతే గ్రామస్థా ఏతాః సప్త సప్త చ ॥

అనే సంగీతశాస్త్ర శ్లోకానుసారం సప్తస్వరాలు ఆరోహణ- అవరోహణ క్రమంలో మిశ్రితాలై మృదుమధురంగా వినబడటమే 'మూర్ఛన' అని, ఇది 21 విధాలని తెలుస్తున్నది.

ఇతీరితే గిరిమవధానశాలినః సురాసురాః సపది తు వీరకసంజ్ఞయా ।
నియామితాః ప్రయయురతీవ హర్షితాః చరాచరం జగదఖిలం హ్యపూరయన్ ॥ 465 ॥

అలా చెబుతున్న వీరకుని మాటలు సావధానంగా విన్న సురాసురులందరూ వెంటనే నియమబద్ధులై హర్షాతిరేకంతో చరాచరజగత్తంతా తామే నిండినట్లు భావిస్తూ ముందుకు సాగారు.

ఇతి స్తనత్కకుభి రసన్మహార్ణవే స్తనద్ఘనే విదలితశైలకన్దరే ।
జగత్యభూత్తుముల ఇవాఽఽకులీకృతః పినాకినా త్వరితగతేన భూధరః ॥ 466 ॥

ఇలా మహాసముద్రాల ధ్వనులచే, మేఘాల ఉరుములచే దిశలన్నీ ప్రతిధ్వనిస్తూండగా, పర్వతగుహలా పగిలిపోతున్నట్లున్న ధ్వనులతో జగమంతా తుములమగుతున్నట్లుండగా తన నగరానికి తరలివస్తున్న శివుని చూచి భూధరుడైన హిమవంతుడు కలత చెందాడు.

పరిజ్వలత్కనకసహస్రతోరణం క్వచిన్మిలన్మరకతవేశ్మవేదికమ్ ।
క్వచిత్క్వచిద్విమలవిదూర్యభూమికం క్వచిద్గలజ్జలధర రమ్యనిర్ఝరమ్ ॥ 467 ॥

ఆ హిమగిరి నగరంలో ప్రకాశిస్తున్న వేలకొలది తోరణములున్నాయి. కొన్ని చోట్ల మెరుస్తున్న మరకతమణి వేదికలున్నాయి. మరి కొన్నిచోట్ల నిర్మలములైన వైడూర్యపు భూమికలున్నాయి. మరియు ఇంకొన్ని ప్రదేశాలలో జలధారలతో గూడిన అందమైన సెలయేళ్ళున్నాయి.

చలద్ధ్వజప్రవరసహస్రమండితం సురద్రుమస్తబకవికీర్ణచత్వరమ్ ।
సితాసితారుణరుచిధాతువర్ణకం శ్రియోజ్జ్వలం ప్రవితతమార్గగోపురమ్ ॥ 468 ॥

విజృంభితాప్రతిమసధూమవారిదం సుగంధిచిః పురపవనైర్మనోహరమ్ ।
హరోభిమహాగిరినగరం సమాసదత్ క్షణాదివ ప్రవరసురాసురస్తుతః॥ 469 ॥

మరియు ఆ హిమవంతుని నగరంలో శుభప్రదాలైన వేలకొలది పతాకాలు అంతటా కదులుతున్నాయి. గృహాల ముంగిళ్ళలో కల్పవృక్షాల పూలు చల్లబడినాయి. తెల్లని, నల్లని మరియు ఎర్రని, గైరికాది ధాతువులతో అంతటా అలంకరించబడినాయి. దారి పొడవునా ఆయా భవనాల గోపురాలు కాంతితో ప్రశాశిస్తున్నాయి. సాటిలేని మేఘాలు ఆ నగరపు ఆకాశంలో వ్యాపించుచుండినవి. మనోహరాలైన సుగంధపరిమళాలతో కూడిన వాయువు సర్వత్ర వ్యాపించింది. ఈ విధంగా అనేకానేక అలంకారాలతో శోభిల్లుతున్న ఆ మహాగిరినగరంలో సురాసురులందరిచేత స్తుతింపబడిన పరమేశ్వరుడు ప్రవేశించాడు.

తం ప్రవిశన్తమగాత్ ప్రవిలోక్య వ్యాకులతాం నగరం గిరిభర్తుః ।
వ్యగ్రపురంధ్రిజనం జవియానం ధావిత మార్గజనాకులరథ్యమ్ ॥ 470 ॥

అలా ప్రవేశింస్తున్న శివుని చూచి నగాధిరాజైన హిమవంతుని నగరమంతా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యింది. వ్యాకులతచెందింది. తమ పనులలో నిమగ్నులైన ముత్తైదువలు ఇటునటు పరుగెత్తారు. అలాగే ప్రజలందరితో ఆ నగరపు మార్గాలన్నీ నిండిపోయాయి.

హర్మ్యగవాక్షగతామరనగరీ లోచననీలసరోరుహమాలమ్ ।

సుప్రకటా సమదృశ్యత కాచిత్ స్వాభరణాంశువితానవిగూఢా ॥ 471 ॥

భవనాల గవాక్షాలనుండి చూస్తున్న దేవతాస్త్రీల నేత్రపంక్తులు నల్లకలువల మాలవలె వున్నాయి. ఒక స్త్రీ తన ఆభరణ కాంతివలన అధికకాంతి కలదిగా కనబడింది. (గవాక్షం నుండి చూస్తున్న ఆమె ఇంకనూ కాంతిమతిగా వీధిలోని వారికి కనబడింది).

కాప్యఖిలీకృతమణ్డనభూషా త్యక్తసఖీప్రణయా హరమైక్షత్ ।
కాచిదువాచ విలంబితమాలా కాతరతాం సఖి! మా కురు మూఢే ॥ 472 ॥

వారిలో ఒక స్త్రీ తన ఆభరణాలన్నీ అలంకరించుకొని సఖురాలిపై నున్న ప్రీతిని కూడ లెక్కచేయక హరుని చూడటానికి పరుగెత్తింది. ఇంకొక స్త్రీ తన స్నేహితురాలితో 'మూర్ఖ! తొందరపడి ఆ పుష్పమాలను అలా వ్రేలాడదీస్తూ బయటకు రాకు' అని సలహా ఇచ్చింది.

దగ్ధమనోభవ ఏవ పినాకీ కామయతే స్వయమేవ విహర్తుమ్ ।
కాచిదపి స్వయమేవ పతన్తీ ప్రాహ పరాం విరహస్ఖలితాంగీమ్ ॥ 473 ॥

ఒక స్త్రీ శివుని చూడాలన్న తొందరలో తాను పడిపోతూనే శివవిరహంతో తడబడుతున్న శరీరం గల ఇంకొక స్త్రీతో "పినాకియైన శివుడు మన్మథునే దహించాడు, ఎవరూ లేకుండా తానొక్కడే విహరించాలనుకుంటాడు." ఈతనికొరకు ఎందుకు పరుగెత్తుతున్నావు అని అన్నది.

మా చపలే మదనవ్యతిషంగం శంకరజం స్ఖలనేన వదత్వమ్ ।
కాపి కృతవ్యవధానమదృష్ట్వా యుక్తివశాద్గిరిశో హ్యయమూచే ॥ 474 ॥

ఒక స్త్రీ తనకు ఎంత ప్రయత్నించినా శివుడు కనబడక పోవటం వలన ఇంకొక స్త్రీతో చాలా యుక్తిగా "ఓ చపలచిత్తురాలా! శివునిముందు పొరపాటున కూడ మన్మథ సంబంధమైన విషయాల్ని మాట్లాడకు"అని చెప్పింది.

ఏష స యత్ర సహస్రమఖాద్యాః నాక సదామధిపాః స్వయముక్తైః ।
నామభిరిన్దుజటం నిజసేవా ప్రాప్తఫలాయ నతాస్తు ఘటన్తే ॥ 475 ॥

సహస్రాధిక యజ్ఞయాగాదికర్మలు నిర్వహించిన ఇంద్రాదిదేవతలు ఏదో ఒక ఫలమాశించి, అనేక విధాలైన నామాలతో, నమస్సులతో పూజించు శివుడితడే అని ఒక స్త్రీ చెబుతుండినది.

ఏష స చైష స ఏష యదగ్రే ఘర్మపరీతతనుః శశిమౌలీ ।
ధావతి వజ్రధరోఽమరరాజో మార్గమముం వివృతీకరణాయ ॥ 476 ॥

"వజ్రాయుధుడైన ఇంద్రుడు చెమటతో తడిసిన శరీరం కలవాడై, మార్గాన్ని విశాలం చేస్తూ ఎవరి ముందైతే పరుగెత్తుతున్నాడో అతనే శివుడు " అని ఒక స్త్రీ ఇంకొక స్త్రీతో చెబుతున్నది.

ఏష స పద్మభవోఽయముపేత్య ప్రాంశుజటామృగచర్మనిగూఢః ।
సప్రణయం కరఘట్టితచక్రం కించిదువాచ మితం శ్రుతిమూలే ॥ 477 ॥

జటాజూటంకల మరియు మృగచర్మాన్ని ధరించిన అతని దగ్గరకు వెళ్లి పద్మభవుడైన బ్రహ్మాదేవుడు ఆత్మీయంగా చెవిలో మెల్లగా ఏదియో చెబుతున్నాడు కదా అతనే శివుడని ఇంకొక స్త్రీ చెబుతున్నది.

ఏవమభూత్సురనారికులానాం చిత్తవిసంష్ఠులతా గురురాగాత్ ।
శంకరసంశ్రయణాద్గిరిజాయా జన్మఫలం పరమం త్వితి చోచుః ॥ 478 ॥

ఇలా దేవతా స్త్రీలు ఆ పరమశివుని చూచి అనురాగపారవశ్యంతో చిత్తం కలవరపడుతుండగా "పరమేశ్వరుని ఆశ్రయించబోతున్న పార్వతీదేవి జన్మ సఫలం" కదా! అని అందరూ అనుకొంటున్నారు.

తతో హిమగిరేర్వేశ్మ విశ్వకర్మనివేదితమ్ ।
మహానీలమయస్తమ్భం జ్వలత్కాంచనకుట్టిమమ్ ॥ 479 ॥

ముక్తాజాల పరిష్కారం జ్వలితౌషధిదీపితమ్ ।
క్రీడోద్యానసహస్రాఢ్యం కాంచనాబద్ధదీర్ఘికమ్ ॥ 480 ॥

మహేంద్రప్రముఖాః సర్వే సురా దృష్ట్వా తదద్భుతమ్ ।
నేత్రాణి సఫలాన్యద్య మనోభిరితి తే దధుః ॥ 481 ॥

అంతట సాక్షాత్తు విశ్వకర్మచే నిర్మించబడిన, మహానీలమణిమయస్తంభాలు కలిగిన, బంగారం వలె మెరుస్తున్న నేలలు గలిగిన, ముత్యపుజాలరులే అలంకరణాలుగా ఉపయోగించబడిన కాంతివంతాలైన ఓషధులచే ప్రకాశిస్తున్న, వేలకొలది క్రీడోద్యానాలు గలిగిన, బంగారపు కట్టలతో అలంకరించబడిన సరస్సులు కలిగిన అద్భుతమైన ఆ హిమవన్నగరాన్ని చూచి ఇంద్రాదిదేవతలందరూ నేడు తమ నేత్రాలు సఫలాలయ్యాయని మనస్సులో తలంచారు.

విమర్దకీర్ణకేయూరా హరిణా ద్వారి రోధితాః ।
కథంచిత్ ప్రముఖాస్తత్ర వివిశుర్నాకవాసినః ॥ 482 ॥

ప్రవేశద్వారం వద్ద సాక్షాత్తు శ్రీహరి నిలుచుని అందరినీ పరీక్షించి లోపలికి ప్రవేశింపజేస్తున్నా. ఆ సమ్మర్దంలో భుజకీర్తులు మొదలగు ఆభరణాలన్నీ చెదిరిపోతుండగా ప్రముఖులైన దేవతలందరూ లోపలికి ప్రవేశించారు.

ప్రణతేనాచలేంద్రేణ పూజితోఽథ చతుర్ముఖః ।
చకార విధినా సర్వం విధిమన్త్రపురస్సరమ్ ॥ 483 ॥

శర్వస్య పాణిగ్రహణమగ్నిసాక్షికమక్షతమ్ ।

తర్వాత పర్వతరాజైన హిమవంతునిచేత పూజించబడిన చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు అగ్నిసాక్షిగా యథావిధిగా మంత్ర పురస్సరంగా, ఎటువంటి విఘ్నంలేకుండా పరమశివుని పాణిగ్రహణ మహోత్సవాన్ని జరిపించాడు.

దాతా మహీభృతాం నాథో హోతా దేవశ్చతుర్ముఖః ॥ 484 ॥

వరః పశుపతిః సాక్షాత్ కన్యా విశ్వారణిస్తథా ।
చరాచరాణి భూతాని సురాసురవరాణి చ ॥ 485 ॥

తత్రాప్యేతే నియమతో హ్యభవన్ వ్యగ్రమూర్తయః ।

ఈ మహోత్సవంలో పర్వతరాజు దాత. బ్రహ్మదేవుడు పురోహితుడు. సాక్షుత్తు పశుపతి వరుడు. విశ్వసృష్టికర్త్రియైన మహాదేవి వధువు. చరాచరభూతాలు, సురాసురులందరు నియమవంతులైన తదేకవ్యగ్రులైన పెండ్లి పెద్దలయ్యారు.

ముమోచాభినవాన్ సర్వాన్ సస్యశాలీన్ రసౌషధీః ॥ 486 ॥

వ్యగ్రా తు పృథివీదేవీ సర్వభావమనోరమా ।
గృహీత్వా వరుణః సర్వరత్నాన్యాభరణాని తు ॥ 487 ॥

పుణ్యాని చ పవిత్రాణి నానారత్నమయాని తు ।
తస్థౌ సాభరణో దేవో హర్షదః సర్వదేహినామ్ ॥ 488 ॥

ఈ వివాహంలో పృథివీదేవత సర్వభావాలతో మనోహరరూపయై, ఆనందపడుతూ, తననుండి ఉద్భవించిన అన్ని విధాలైన సస్యములను, వరిధాన్యాది జాతులను, రసాలను, ఓషధులను వధూవరులకు కానుకలుగా అర్పించింది. తర్వాత వరుణదేవుడు, పవిత్రాలైన, అనేక రత్నాలను మరియు రత్నమయాలైన వివిధ ఆ భరణాలను సమస్తప్రాణులకు ఆనందాన్ని కలిగిస్తూ వధూవరులకు కానుకలుగా ఇచ్చాడు.

ధనదశ్చాపి దివ్యాని హైమాన్యాభరణాని చ ।
జాతరూపవిచిత్రాణి ప్రయతః సముపస్థితః ॥ 489 ॥

ధనాధిపతియైన కుబేరుడు కూడ దివ్యాలు, చిత్రవిచిత్రాలైన బంగారు ఆభరణాలను కానుకలుగా ఇచ్చాడు.

వాయుర్వవౌ సుసురభిః సుఖసంస్పర్శనో విభుః ।
ఛత్రమిన్దుకరోద్గారం సుసితం చ శతక్రతుః ॥ 490 ॥
జగ్రాహ ముదితః స్రగ్వీ బాహుభిర్బహుభూషణైః ।

వాయుదేవుడు సుఖస్పర్శను సువాసనలను కలుగజేసే మనోహరమైన గాలి వీచేటట్లు చేశాడు. దేవేంద్రుడు చంద్రునికాంతివంటి కాంతిగలిగిన తెల్లని ఛత్రాన్ని శివుని శిరస్సుకు పట్టి అనేకాభరణాలతో అలంకరించబడిన తన చేతులతో పుష్పమాలలను పట్టుకుని మహానందంతో వధూవరుల ముందు నిలిచాడు.

జగుర్గన్ధర్వముఖ్యాశ్చ ననృతుశ్చాప్సరో గణాః॥ 491 ॥

వాదయన్తోఽతిమధురం జగుర్గన్ధర్వకిన్నరాః ।
మూర్తాశ్చ ఋతవస్తత్ర జగుశ్చ ననృతుశ్చ వై ॥ 492 ॥

ఇంకనూ గంధర్వముఖ్యులు గానం చేశారు. అప్సరసలు నాట్యం చేశారు. మరికొంతమంది గంధర్వులు, కిన్నరులు అత్యంత మధురంగా పాడుతూ వాద్యాలు ప్రయోగించారు. షడ్రుతువులు కూడ రూపుదాల్చి గానం చేస్తూ నాట్యం చేశాయి.

చపలాశ్చ గణాస్తస్థుః లోలయన్తో హిమాచలమ్ ।
ఉత్తిష్ఠన్ క్రమశశ్చాత్ర విశ్వభుగ్భగనేత్రహా ॥ 493 ॥

చకారౌద్వాహికం కృత్యం పత్న్యా సహ యథోచితమ్ ।

ప్రమథగణాలు చపలురై హిమవంతుని కలవరపెడుతూ, ఉద్వేగంతో నాట్యం చేశారు. అపుడు విశ్వకర్త భగుడను పేరుగల ఆదిత్యుని కన్నులు తీసివేసిన పరమశివుడు క్రమంగా లేచి నిల్చుని పత్నీసహితుడై యథోచితంగా మిగిలిన వివాహక్రియలను నిర్వర్తించాడు.

దత్తార్ఘో గిరిరాజేన సురవృన్దైర్వినోదితః ॥ 494 ॥

అవసత్తాం క్షపాం తత్ర పత్న్యా సహ పురాన్తకః ।

గిరిరాజైన హిమవంతుడిచ్చిన అర్ఘ్యపాద్యాదులను అందుకొని, సురబృందాలు వినోదం కలిగించగా పురాంతకుడైన శివుడు పార్వతితో గూడ ఆ రాత్రి అక్కడే గడిపాడు.

తతో గన్ధర్వగీతేన నృత్యేనాప్సరసామపి॥ 495 ॥

స్తుతిభిర్దేవదైత్యానాం విబుద్ధో విబుధాధిపః ।
ఆమన్త్ర్య హిమశైలేన్ద్రం ప్రభాతే చోమయా సహ ॥
జగామమన్దరగిరిం వాయువేగేన శృంగిణా ॥ 496 ॥

తదనంతరం గంధర్వులు గీతాలతో, అప్సరసలు నాట్యంతో, సురాసురులు స్తోత్రపాఠాలతో దేవదేవుడు పార్వతీసహితుడైన పరమశివుని మేల్కొల్పారు. తర్వాత ప్రభాతకాలంలో ఉమాసహితుడైన శివుడు హిమవంతునివద్ద సెలవు తీసుకుని శృంగి వాహనమెక్కి వాయువేగంతో మందర పర్వతానికి వెళ్ళాడు.

తతో గతే భగవతి నీలలోహితే సహోమయా రతిమలభన్న భూధరః ।
సబాన్ధవో భవతి చ కస్య నో మనో విసంస్థులం జగతి హి కన్యకాపితుః ॥ 497 ॥

భగవానుడు నీలలోహితుడూ అయిన శివుడు పార్వతీదేవితో కూడ వెడలిపోయిన తర్వాత పర్వతరాజైన హిమవంతుడు బాధపడ్డాడు. బంధువులందరూ ఇంటివద్ద ఉన్నప్పటికి కూతురు అల్లుడితో వెళ్ళిపోయిన బాధనుండి తేరుకోలేకపోయాడు. సాధారణంగా ఇటువంటి సమయాలలో ఏ తండ్రి మనస్సు కలతచెందకుండా వుంటుంది?

జ్వలన్మణిస్ఫుటనవహాటకోత్కటం స్ఫురద్ద్యుతిస్ఫటికగవాక్షగోపురమ్ ।
హరో గిరౌ చిరమనుకల్పితం తదా విసర్జితామరనివహోఽవిశత్ స్వకమ్ ॥ 498 ॥

మందరగిరికి చేరిన పిమ్మట పరమశివుడు దేవతలకు వీడ్కోలుచెప్పి, పార్వతీసహితుడై అనేక విధ రత్నాలతో, బంగారపుకాంతులతో ప్రకాశిస్తున్నట్టి మరియు స్ఫటికాలతో నిర్మించిన గవాక్షాలు, గోపురాలు గల తన పట్టణంలోకి ప్రవేశించాడు.

తత్రోమాసహితో దేవో విజహార భగాక్షహా ।
పురోద్యానేషు రమ్యేషు వివిక్తేషు వనేషు చ ॥ 499 ॥

సురక్త హృదయో దేవ్యా మకరాంకపురస్సరః ।

అక్కడ భగనేత్రహరుడైన శివుడు ఉమతో కూడ మిక్కిలి అనురాగంతో సుందరోద్యానాలలో, వనాలలో ఏకాంతస్థలాలలో మన్మథోద్వేగంతో విహరించాడు.

తతో బహుతిథే కాలే సుతకామా గిరేః సుతా ॥ 500 ॥

సఖీభిః సహితా క్రీడాం చక్రే కృత్రిమపుత్రకైః ।

అలా చాలాకాలం గడిచిన తరువాత పుత్రవాంఛ గలిగిన ఉమాదేవి తన సఖురాళ్ళతో కలసి పిల్లల బొమ్మలతో ఆడుకొన్నది.

కదాచిత్ గంధతైలేన గాత్రమభ్యజ్య శైలజా ॥ 501 ॥

చూర్ణైరుద్వర్తయామాస మలినాన్తరితాం తనుమ్ ।
తదుద్వర్తనకం గృహ్య నరం చక్రే గజాననమ్ ॥ 502 ॥

ఒకసారి పార్వతీదేవి తన శరీరానికి సుగంధతైలాన్ని పూసుకొని నలుగుపిండితో తన దేహపు నలుముకొంది. ఆ మురికి నలుగుతో గజముఖం మరియు మానవాకారం గల బొమ్మను చేసింది.

పుత్రకం క్రీడతీ దేవీ తం చాక్షిపయదమ్భసి ।
జాహ్నవ్యాస్తు శివా సఖ్యాస్తతః సోఽభూద్ బృహద్వపుః ॥ 503 ॥

కాయేనాతివిశాలేన జగదాపూరయత్తదా ।
పుత్రేత్యువాచ తం దేవీ పుత్రేత్యూచే చ జాహ్నవీ ॥ 504 ॥

పార్వతీదేవి తన సఖురాళ్ళతో కలసి ఆ బొమ్మతో ఆడుకొంటూ దానిని గంగాజలంలో వేసింది. అపుడా బొమ్మ శరీరం పెద్దదయింది. అది మరింత పెద్దదై జగత్తంతా నిండింది. అపుడు పార్వతీదేవి, గంగానది కూడ దానిని నా కొడుకు, నా కొడుకు అన్నారు.

గాంగేయ ఇతి దేవైస్తు పూజితోఽభూద్గజాననః ।
వినాయకాధిపత్యంచ దదావస్య పితామహః ॥ 505 ॥

దేవతలు గజాననుని 'గాంగేయు' డని పూజించారు. పితామహుడైన బ్రహ్మదేవుడు ఆ గజాననునికి వినాయకాధిపత్యాన్నిచ్చాడు.

పునః సా క్రీడనం చక్రే పుత్రార్థం వరవర్ణినీ ।
మనోజ్ఞమంకురం రూఢమశోకస్య శుభాననా ॥ 506 ॥

వర్ధయామాస తం చాపి కృతసంస్కారమంగళా ।

శ్రేష్ఠమైన మేనిఛాయ గల పార్వతి ఇంకను పుత్రులు కావాలనే కోరికతో పిల్లలబొమ్మలతో ఆడుచుండెడిది. ఆ శుభానన అప్పుడే మొలకెత్తిన బాల అశోకవృక్షానికి పుత్రోచితాలైన మంగళసంస్కారాలు చేసి పెంచింది.

బృహస్పతి ముఖైర్వి ప్రైః దివస్పతిపురోగమైః ॥ 507 ॥

తతో దేవైశ్చ మునిభిః ప్రోక్తా దేవీత్విదం వచః ।
భవాని! భవతీ భవ్యా సమ్భూతా లోకభూతయే ॥ 508 ॥

ప్రాయః సుతఫలో లోకః పుత్రపౌత్రైశ్చ లభ్యతే ।
అపుత్రాశ్చ ప్రజాః ప్రాయో దృశ్యన్తే దైవహేతవః ॥ 509 ॥

అది చూచి ప్రముఖులైన బృహస్పతి, ఇంద్రుడు మొదలగు దేవతలు మరియు మునులు ఆ దేవితో ఇలా అన్నారు "భవానీ! నీవు లోకోపకారానికై జన్మించినదానవు, సర్వమంగళస్వరూపవు. లోకంలో ప్రాణులందరికీ పుత్రోద్భవమే పరమార్థం. పుత్రులు పౌత్రులున్నవారికి ఉత్తమలోకములు లభిస్తాయి. కాని దైవికాలైన కారణాలవలన లోకంలో కొందరు పుత్రులు లేనివారు కనబడుతున్నారు.

అధునా దర్శితే మార్గే మర్యాదాం కర్తుమర్హసి ।
ఫలం కిం భవితా దేవి కల్పితైస్తరుపుత్రకైః ।
ఇత్యుక్తా హర్షపూర్ణాంగీ ప్రోవాచోమా శుభాం గిరమ్ ॥ 510 ॥

ఇప్పుడు నీవు కూడ మన పూర్వులు చూపించిన మార్గాన్నే అనుసరించి మర్యాదను కాపాడవలసినది. ఓ దేవీ! చెట్ల మొక్కలనే పుత్రులుగా కల్పించుకొని ఆదరించుటవలన ప్రయోజనమేమిటని వారు ఆమె నడిగారు. ఆ మాటలు విన్న పార్వతి సంతోషంతో శుభప్రధాలైన మాటలతో ఇలా అన్నది.

దేవ్యువాచః- దేవి చెప్పింది.

ఏవం నిరుదకే దేశే యః కూపం కారయేద్ బుధః ।
బిందౌ బిందౌ చ తోయస్య వసేత్సంవత్సరం దివి ॥ 511 ॥

నీళ్ళులేని దేశంలో బావిని త్రవ్వించే వివేకవంతుడు ఆ బావిలో ఎన్ని జలబిందువులుంటాయో అన్ని సంవత్సరాలు స్వర్గలోకంలో నివసిస్తాడని మన పూర్వీకులు చెప్పారు.

దశకూపసమా వాపీ దశవాపీసమో హ్రదః ।
దశహ్రదసమః పుత్రో దశపుత్రసమో ద్రుమః ।
ఏషైవ మమ మర్యాదా నియతా లోకభావినీ ॥ 512 ॥

ఒక విశాలమైన దిగుడు బావి త్రవ్విస్తే అది పది మామూలుబావులతో సమానం. అలాగే ఒక సరస్సు నిర్మాణం పది దిగుడుబావులతో సమానం. మరియు ఒక పుత్రుడు అటువంటి పది సరస్సులతో సమానం. అయితే ఒక చెట్టు పదిమంది పుత్రులతో సమానమని మన పూర్వులు చెప్పారు. నేను దానినే అనుసరిస్తున్నాను.

ఇత్యుక్తాస్తు తతో విప్రా బృహస్పతిపురోగమాః ।
జగ్ముః స్వమందిరాణ్యేవ భవానీం వన్ద్య సాదరమ్ ॥ 513 ॥

ఇలా భవాని చెప్పిన మాటలు విని బృహస్పతి మొదలగు దేవతలందరు ఆమెకు ఆదరంతో నమస్కరించి తమ తమ భవనాలకు వెళ్ళారు.

గతేషు తేషు దేవోఽపి శంకరః పర్వతాత్మజామ్ ।
పాణినా లంబమానేన శనైః ప్రావేశయచ్ఛుభామ్ ॥ 514 ॥

చిత్తప్రసాదజననం ప్రాసాదమనుగోపురమ్ ।
లమ్బమౌక్తికదామానాం మాలికాకులవేదికమ్ ॥ 515 ॥

నిర్ధౌతకలధౌతం చ క్రీడాగృహమనోరమమ్ ।
ప్రకీర్ణకుసుమోద్దామమత్తాలికుల కూజితమ్ ॥ 516 ॥

ఆ విధంగా దేవతలందరు నిష్క్రమించిన తర్వాత శంకరుడు శుభప్రదయైన పార్వతీదేవి చేయి పట్టుకుని తన ప్రాసాదంలో ప్రవేశించాడు. ఆ ప్రాసాదం చిత్తానికి ఆహ్లాదం కలిగించేది, గోపురాలతో కూడినది, ముత్యపుమాలలతో అలంకరించబడిన వేదికలు కలిగినది, శుద్ధిచేసిన వెండి మరియు బంగారుకట్టడములు కలది, మనోహరాలైన క్రీడా గృహాలు కలిగినది, అంతటా వెదజల్లబడిన సుగంధపుష్పాలు కలది, మదించిన తుమ్మెదల ఝుంకారాలతో నిండినది.

కిన్నరోద్గీతసంగీతగృహాన్తరితభిత్తికమ్ ।
సుగంధిధూపసంఘాతమనఃప్రార్థ్యమలక్షితమ్ ॥ 517 ॥

క్రీడన్మయూరనారీభిః వృతం వై తతవాదిభిః ।
హంససంఘాతసంఘుష్టం స్ఫాటికస్తమ్భవేదికమ్ ॥ 518 ॥

కిన్నరులు ఉచ్చైఃస్వరంతో పాడుబడుతున్న సంగీత ధ్వనులచే ప్రతిధ్వనిస్తున్న గోడలు కలది, సుగంధ ధూపాలతో మనస్సులను ఆకర్షించునది. ఇంతకు ముందు ఎక్కడా చూడబడనిది, మయూరాలు నాట్యం చేస్తున్నది, సుందరీమణులైన స్త్రీలతో, వీణాదివాద్యాలతో పరివ్యాప్తమైనది, ధ్వనులుచేస్తున్న హంసలగుంపులు గలిగినది, స్ఫటికమణులచే నిర్మితాలైన స్తంభాలతో, వేదికలతో అలంకరించబడినది.

అనారతమతిప్రీత్యా బహుశః కిన్నరాకులమ్ ।
శుకైర్యత్రాభిహన్యన్తే పద్మరాగవినిర్మితాః ॥ 519 ॥

భిత్తయో దాడిమభ్రాన్త్యా ప్రతిబింబితమౌక్తికాః ।

ఎల్లప్పుడు మిక్కిలి ప్రీతితో కూడిన కిన్నరులతో గుంపు నిండినది, పద్మరాగమణులచే నిర్మితాలైన గోడలను చూచి దానిమ్మగింజలనే భ్రమతో చిలుకలచేత వ్యాప్తిపొందినది, గోడలయందు ప్రతిబింబిస్తున్న ముత్యాలు కల ఆ ప్రాసాదంలో పరమేశ్వరుడు పార్వతీసహితుడై ప్రవేశించాడు.

తత్రాక్షక్రీడయా దేవో విహర్తుముపచక్రమే॥ 520 ॥

స్వచ్ఛేంద్రనీలభూభాగే క్రీడంతౌ యత్ర బింబితౌ ।
వపుః సహయతాం ప్రాప్తౌ వినోదరసనిర్వృతౌ॥ 521 ॥

అటువంటి ఆ ప్రాసాదంలో శివుడు పార్వతితో పాచికలాడడం మొదలు పెట్టాడు. స్వచ్ఛమైన ఇంద్రనీలమణుల ఫలకంలో తమ శరీరం ప్రతిబింబించిన వినోదపారవశ్యంతో పార్వతీపరమేశ్వరులు ఆ ఆటలో నిమగ్నులయ్యారు.

ఏవం ప్రక్రీడతోస్తత్ర దేవీశంకరయోస్తదా ।
ప్రాదుర్భవన్మహాశబ్దస్తద్గృహోదరగోచరః ॥ 522 ॥

ఇలా భవానీశంకరులా ఆటలో నిమగ్నమై వుండగా ఆ భవనాంతరాళం నుండి ఒక మహాధ్వని వినిపించింది.

తచ్ఛ్రుత్వా కౌతుకాద్దేవీ కిమేతదితి శంకరమ్ ।
పప్రచ్ఛ తం శుభతనుః హరం విస్మయపూర్వకమ్ ॥ 523 ॥

అది విని శుభాంగియైన పార్వతి కుతూహలంతో, మరియు విస్మయంతో ఆ ధ్వని ఏమిటని శివుని ప్రశ్నించింది.

ఉవాచ దేవీం నైతత్తే దృష్టపూర్వం సువిస్మితే ।
ఏతే గణేశాః క్రీడన్తే శైలేఽస్మిన్ మత్ప్రియాః సదా ॥ 524 ॥

శివుడు కూడ "ఈ ధ్వనిచేత విస్మయంచెందిన మనస్సు కలదానా! నీ విదివరకు ఈ ధ్వని వినియుండవు, నాకు ప్రీతిపాత్రులైన గణాధిపతులీ పర్వతంలో ఎల్లప్పుడు క్రీడిస్తూ వుంటారు"అని చెప్పాడు.

తపసా బ్రహ్మచర్యేణ నియమైః క్షేత్రసేవనైః ।
యైరహం తోషితః పూర్వం త ఏతే మనుజోత్తమాః ॥ 525 ॥

మత్సమీపమను ప్రాప్తాః మమ హృద్యా శుభాననే ।
కామరూపా మహోత్సాహా మహారూపగుణాన్వితాః ॥ 526 ॥

కర్మభిర్విస్మయం తేషాం ప్రయామి బలశాలినామ్ ।

దేవీ! తపస్సుచేత, బ్రహ్మచర్యాదినియమాలచేత, పవిత్రక్షేత్రసందర్శనాలచేత పూర్వజన్మలో నన్ను సంతృప్తి పరిచిన మనుజోత్తములు వీరు. ఓ శుభాననా! వీరంతా నాకు ఇష్టమైన వారు. ఇప్పుడు నన్ను చేరుకుని గణత్వాన్ని పొందినవారు. వీరు మహా ఉత్సాహవంతులు. మహద్రూపము మరియు మహాగుణములు కలవారే కాక తమ ఇచ్ఛానుసారంగా స్వరూపాన్ని మార్చుకునే శక్తికలవారు. బలశాలురైన వీరి కర్మలను చూచి, నేనే విస్మయాన్ని పొందుతున్నాను.

సామరస్యాస్య జగతః సృష్టిసంహరణక్షమాః ॥ 527 ॥

బ్రహ్మ విష్ణ్వింద్రగంధర్వైః సకిన్నరమహోరగైః ।
వివర్జితోఽ ప్యహం నిత్యం నైభిర్విరహితో రమే ॥ 528 ॥

హృద్యా మే చారు సర్వాంగాస్త ఏతే క్రీడితా గిరౌ ।

దేవతలతో సమానంగా ఈ జగత్తంతటిని సృష్టించి సంహరించగల శక్తికలవారు వీరు. బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, గంధర్వులు, కిన్నరులు, నాగదేవతలు మొదలగు వారెవ్వరు నా దగ్గర లేకున్నా వీరు నన్నెప్పుడూ విడువరు. సుందరశరీరులైన వారే ఇప్పుడీ పర్వతప్రాంతంలో క్రీడిస్తున్నారు.

ఇత్యుక్తా తతో దేవీ త్యక్తా తద్విస్మయాకులా ॥ 529 ॥

గవాక్షాన్తరమాసాద్య ప్రేక్షతే విస్మితాననా ।
యావన్తస్తే కృశా దీర్ఘా హ్రస్వాః స్థూలా మహోదరాః ॥ 530 ॥

శివుని మాటలు విన్న పార్వతి ఆశ్చర్యచకితురాలై పాచికలాడుట ఆపి గవాక్షం (కిటికీ) నుండి వారిని చూచి విస్మయం చెందింది. వారిలో కొంతమంది కృశించిన శరీరం కలవారు, దీర్ఘదేహులు, పొట్టివారు, స్థూలకాయులు మరియు మహోదరులు కూడ వున్నారు.

వ్యాఘ్రేభవదనాః కేచిత్ కేచిన్మేషజరూపిణః ।
అనేక ప్రాణిరూపాశ్చ జ్వాలాస్యాః కృష్ణపింగలాః॥ 531 ॥

సౌమ్యా భీమాః స్మితముఖాః కృష్ణపింగజటాసటాః ।
నానావిహంగవదనాః నానావిధమృగాననాః ॥ 532 ॥

కౌశేయ చర్మవసనాః నగ్నాశ్చాన్యే విరూపిణః ।
గోకర్ణా గజకర్ణాశ్చ బహు వక్త్రేక్షణోదరాః ॥ 533 ॥

వారిలో వ్యాఘ్రముఖులు, గజముఖులు, మేకల మరియు గొఱ్ఱెల రూపాలు, విభిన్నప్రాణులరూపములు కలవారు, జ్వలిస్తున్న ముఖం గలవారు, నలుపు మరియు పింగళ వర్ణం కలవారు, సౌమ్యులు, భయంకరులు, స్మితముఖులు, నల్లని మరియు పింగళవర్ణపు జటాజూటం కలవారు, నానావిధపక్షులముఖం కలవారు, నానావిధమృగాల ముఖములుకలవారు, పట్టువస్త్రాలు ధరించినవారు, మృగచర్మాలు ధరించినవారు, నగ్నంగావున్నవారు, వికృతరూపం కలవారు, గోవుల మరియు గజాల చెవులు కలవారు, బహువిధ ముఖాలు గలవారు మరియు మహోదరులు కూడ ఉన్నారు.

బహుపాదా బహుభుజాః దివ్యనానాస్త్రపాణయః ।
అనేక కుసుమాపీడాః నానావ్యాలవిభూషణాః ॥ 534 ॥

వృత్తనానాయుధధరాః నానాకవచభూషణాః ।
విచిత్రవాహనారూఢాః దివ్యరూపా వియచ్చరాః ॥ 535 ॥

వీణావాద్యరవాఘుష్టాః నానాస్థానకనర్తకాః ।
గణేశాంస్తాంస్తథా దృష్ట్వా దేవీ ప్రోవాచ శంకరమ్ ॥ 536 ॥

ఇంకా, అనేకపాదాలు గలవారు, అనేక భుజాలు కలవారు, అనేక దివ్యాస్త్రాలను చేబూనిన వారు, అనేకవిధ కుసుమాలను ధరించినవారు, అనేక సర్పాలు ఆభరణాలుగా గలవారు, అనేకవిధాలైన ఆయుధాలను కవచాలను ఆభరణాలను ధరించినవారు, దివ్యమైన రూపం కలవారు, ఆకాశసంచారులు, వీణాది వాయిద్యాలను మ్రోగించేవారు, విభిన్న వేషాలు దాల్చి నాట్యం చేసేవారు కూడ ఉన్న గణేశులసమూహాన్ని చూచి పార్వతీదేవి శంకరునితో ఇలా అన్నది.

దేవ్యువాచః- దేవి చెప్పింది.

గణేశాః కతి సంఖ్యాతా కిం నామానః కిమాత్మకాః ।
ఏకైకశో మమ బ్రూహి ధిష్ఠితా యే పృథక్ పృథక్ ॥ 537 ॥

గణేశులెందరు? వారి పేర్లేమి ? వారు ఎటువంటి రూపం కలవారు?(అసలు రూపమేమిటి?) వారిలో ఒక్కొక్కరి గురించి నాకు వేరువేరుగా వివరించండి.

శంకర ఉవాచః- శంకరుడు చెప్పాడు.

కోటిసంఖ్యా హ్యసంఖ్యాతా నానా విఖ్యాతపౌరుషాః ।
జగదాపూరితం సర్వై రేభిర్భీమైర్మహాబలైః ॥ 538 ॥

సిద్ధక్షేత్రేషు రథ్యాసు జీర్ణోద్యానేషు వేశ్మసు ।
దానవానాం శరీరేషు బాలేషూన్మత్తకేషు చ ॥

ఏతే విశన్తి ముదితా నానాహారవిహారిణాః ॥ 539 ॥

వీరు నానా కోట్లసంఖ్యలో వున్నారు. అసంఖ్యాకులుగా వున్నారు. వివిధాలైన వీరి పౌరుషాలు ప్రఖ్యాతాలు, భయంకరులు మహాబలులైన వీరిచే జగత్తంతా నిండివున్నది. సిద్ధ క్షేత్రాలలో, వీథులలో, జీర్ణోద్యానాలలో మరియు జీర్ణగృహాలలో, దానవులశరీరాలలో, బాలురలో, ఉన్మత్తులలో వీరు నానాహారవిహారులు కనుక చాలా సంతోషంగా ప్రవేశిస్తారు.

ఊష్మపాః ఫేనపాశ్చైవ ధూమపా మధుపాయినః ।
రక్తపాః సర్వభక్షాశ్చ వాయుపా హ్యంబుభోజనాః॥ 540 ॥

గేయనృత్యోపహారాశ్చ నానా వాద్యరవప్రియాః ।
న హ్యేషాం వై అనన్తాంస్తాన్ గుణాన్ వక్తుం హి శక్యతే ॥ 541 ॥

వీరు ఊష్మజలం త్రాగేవారు, నురుగును సేవించేవారు, పొగత్రాగేవారు, మధుపానం చేసేవారు, రక్తం త్రాగేవారు, సర్వం భక్షించేవారు, వాయుభక్షకులు, జలభక్షకులు. వీరికి గేయాలు, నృత్యాలు ప్రియమైన ఉపాయనాలు, వీరు అనేకవిధ వాద్యప్రియులు. అనంతాలైన వీరి గుణాలు వర్ణించడానికి శక్యం కాదు అని శివుడు ఆ గణాధీశుల గురించి పార్వతికి చెప్పాడు.

దేవ్యువాచ ః– దేవి చెప్పింది.

మార్గత్వగుత్తరాసంగః శుద్ధాంగో ముంజమేఖలీ ।
వామస్థేన చ శిక్యేన చపలో రంజితాననః ॥ 542 ॥

మృగదంష్ట్రో హ్యుత్పలానాం స్రగ్దామో మధురాకృతిః ।
పాషాణశకలోత్తానకాంస్యతాల ప్రవర్తకః ॥ 543 ॥

అసౌ గణేశ్వరో దేవః కిం నామా కిన్నరానుగః ।
య ఏష గణగీతేషు దత్తకర్ణో ముహుర్ముహుః ॥ 544 ॥

దేవా! జింకచర్మముత్తరీయంగా గల, శుద్ధాంగుడైన, ముంజదర్భతోచేసిన మొలత్రాడు గల, వామ భుజమున వ్రేలాడుతున్న చిక్కము (ఉట్టి) గల, చపలుడైన, రంజితాననుడైన, మృగదంష్ట్రుడైన (మృగముల దంతములను బోలిన దంతములు కలవాడు) కలువలమాలలు ధరించిన, మధురాకృతి గలిగిన, పాషాణశకలాలచేత కంచుతాళాలను మ్రోగిస్తున్న, మరియు కిన్నరులను అనుసరిస్తున్న ప్రమథ గణాలు ఆలపిస్తున్న గీతధ్వనిని మరల మరల చెవియొగ్గి వింటున్న ఈ గణాధిపతి పేరు ఏమిటి.

శర్వ ఉవాచః- శివుడు చెప్పాడు.

స ఏష వీరకో దేవి సదా మద్హృదయప్రియః ।
నానాశ్చర్యగుణాధారో గణేశ్వరగణార్చితః ॥ 545 ॥

దేవీ! ఈతను వీరకుడు. నాకు అత్యంతప్రియమైనవాడు. ఆశ్చర్యకరమైన గుణాలు కలవాడు. గణేశ్వర గణాలచేత ఎల్లప్పుడు ఆరాధించబడేవాడు.

దేవ్యువాచః- దేవి చెప్పింది.

ఈదృశస్య సుతస్యాస్తి మమోత్కంఠా పురాన్తక ।
కదాహమీదృశం పుత్రం ద్రక్ష్యామ్యానందదాయినమ్ ॥ 546 ॥

దేవా! పురాంతకా! ఇటువంటి కొడుకు కావాలని నాకు చాలా ఉత్కంఠ కలుగుతున్నది. ఆనందాన్ని కలిగించే ఇటువంటి పుత్రుణ్ని ఎప్పుడు చూడగలను?

శర్వ ఉవాచ ః- శర్వుడు చెప్పాడు.

ఏష ఏవ సుతస్తేఽస్తు నయనానన్దహేతుకః ।
త్వయా మాత్రా కృతార్థస్తు వీరకోఽపి సుమధ్యమే ॥ 547 ॥

దేవీ! సుమధ్యమా ! నీ నయనాందకరుడైన ఇతడే నీకు సుతుడు అగుగాక! ఓ దేవీ! నీవు తల్లివై ఈ వీరకుడిని కృతార్థుణ్ణి చేయి.

ఇత్యుక్తా ప్రేషయామాస విజయాం హర్షణోత్సుకా ।
వీరకానయనాయాఽఽశు దుహితా హిమభూభృతః ॥ 548 ॥

ఆ విధంగా ఈశ్వరుడు చెప్పగా, పార్వతీదేవి హర్షాతిరేకంతో వీరకుని పిలుచుకు రమ్మని తన సఖియైన విజయను పంపింది.

సాఽవరుహ్య త్వరాయుక్తా ప్రాసాదాదంబరస్పృశః ।
విజయోవాచ గణపం గణమధ్యే ప్రవర్తితా ॥ 549 ॥

సఖురాలైన విజయ ఆకాశాన్ని స్పృశించేంత ఎత్తైన ఆ ప్రాసాదం నుండి తొందరగా దిగి గణాల మధ్యలోవున్న వీరకుని వద్దకు వెళ్ళి ఇలా చెప్పింది.

విజయోవాచః- విజయ చెప్పింది.

ఏహి వీరక చాపల్యాత్త్వయా దేవః ప్రకోపితః ।
కిముత్తరం వదత్యర్థే నృత్యరంగే తు శైలజా ॥ 550 ॥

వీరకా! నీవు చేసిన చాపల్యపుపనులకు మహాదేవునికి కోపం వచ్చింది. ఏమి సమాధానమిస్తావో వచ్చి ఇవ్వు. శివునితో పాటు పార్వతీదేవి కూడ నృత్యరంగశాలలోనే వున్నది.

ఇత్యుక్తస్త్యక్తపాషాణశకలో మార్జితాననః ।
ఆహూతస్తు తయోద్భూతమూలప్రస్తావశంసకః ॥ 551 ॥

దేవ్యాః సమీపమాగచ్ఛత్ విజయానుగతః శనైః ।

విజయ మాటలు విన్న వెంటనే వీరకుడు తన చేతిలోవున్న పాషాణఖండాలను విడిచి, తన ముఖం తుడుచుకొని ఆమె ఏ కారణం చేత పిలిచిందో ఆ విషయాన్ని సవివరంగా చెప్పదలచి బయల్దేరాడు. విజయ తన వెంట వస్తూండగా వీరకుడు మెల్లగా దేవి దగ్గరకు వెళ్ళాడు.

ప్రాసాదశిఖరాత్ఫుల్లరక్తామ్బుజనిభద్యుతిః ॥ 552 ॥

తం దృష్ట్వా ప్రస్రుతానల్ప స్వాదుక్షీరపయోధరా ।
గిరిజోవాచ సస్నేహం గిరా మధురవర్ణయా ॥ 553 ॥

పార్వతీదేవి ప్రాసాదశిఖరం నుండే వీరకుని చూచి, వికసించిన ఎర్రతామరపుష్పము వంటి కాంతిగల దయ్యింది. వెంటనే ఆమె స్తనద్వయం నుండి పాలు స్రవింపసాగినవి. అపుడు వెంటనే స్నేహపూర్వకంగా మధుర వర్ణాలతో కూడిన తియ్యని మాటలతో వీరకునుద్దేశించి ఆ దేవి ఇలా అన్నది.

ఉమోవాచ ః– ఉమ చెప్పింది.

ఏహ్యేహి యాతోఽసి మే పుత్రతాం ।
దేవదేవేన దత్తోఽధునా వీరక ॥ 554 ॥

ఇత్యేవమంకే నిధాయాథ తం ।
పర్యచుంబత్కపోలే కలవాదినమ్ ॥ 555 ॥

వీరకుని తన దగ్గరకు పిలుస్తూ పార్వతీదేవి రమ్ము నాయనా వీరకా! నీవు నా పుత్రుడవయ్యావు. దేవదేవుడు నిన్ను నాకు పుత్రునిగా ఇప్పుడే ఇచ్చాడు. అని చెబుతూ అతనిని తన తొడపై కూర్చుండబెట్టి ముద్దుగా మాట్లాడుతున్న ఆతని కోమలమైన చెక్కిళ్ళపై ముద్దు పెట్టుకొన్నది.

మూర్ధ్న్యుపాఘ్రాయ సమ్మార్జ్య గాత్రాణి భూషయామాస దివ్యైః స్వయం భూషణైః ।
కింకిణీ మేఖలానూపురైర్మా ణిక్యకేయూరహారోరుమూలగుణైః ॥ 556 ॥

కోమలైః పల్లవైశ్చిత్రితైశ్చారుభిః దివ్యమంత్రోద్భవైస్తస్య శుభైస్తతో ।
భూరిభిశ్చాకరోన్మిశ్ర సిద్ధార్థకైరంగరక్షావిధిః॥ 557 ॥

తలపై ముద్దుతో స్పృశించి, అవయవాలను తుడిచి, దివ్య విభూషణాలతో, గజ్జెల మొలత్రాడుతో, నూపురాలతో, మాణిక్యాలు, కేయూరాలు, హారాలు, కోమలపల్లవాలు, పుష్పమాలలు మొదలగు వాటితో పార్వతి పుత్రుడిగా స్వీకరించిన వీరకుని అలంకరించింది. మరియు దివ్యమంత్రాలతో, శుభప్రదాలైన విభూతులతో, మంత్రాలచేత పవిత్రం చేసిన అక్షతలతో ఆ బాలుడికి శరీరరక్ష చేసింది.

ఏవమాదాయ చోవాచ కృత్వా స్రజం మూర్ధ్ని గోరోచనాపత్రభంగోజ్జ్వలైః ॥ 558 ॥

ఇంకా ఆతని తలపైన గోరోచనము నుంచి, వివిధ పత్రాలకాంతితో ప్రశాశిస్తున్న మాలను ధరింపజేసి, తన దగ్గరకు తీసుకుని వీరకునితో ఇలా చెప్పింది.

వత్స గచ్ఛాధునా క్రీడ సార్ధం గణైరప్రమత్తో వచే శ్వభ్రవర్జీశనైర్వ్యాలమాలాకులాః ।
శైలసానుద్రుమదన్తిభిర్భిన్నసరాః పరే సజ్జినః ॥ 559 ॥

ఇక వెళ్ళి ఇప్పుడు జాగరూకుడవై గణాలతో కూడ ఆడుకో. శుభ్రంగా ఉండడానికి ప్రయత్నించు. మట్టితో, పాములతో ఆడేటప్పుడు జాగ్రత్తగా ఉండవలసింది. కొండలు, వృక్షాలు, గజాలు మరియు నీ సహబాలకులందరిలో నీవే అజేయుడవుగా ఉండవలసింది.

జాహ్నవీయం జలం క్షుబ్ధతోయాకులం కూలమ్ ।
మా విశేథా బహువ్యాఘ్రదుష్టే వనే ॥ 560 ॥

మిక్కిలి కల్లోలితమైన ప్రవాహం గల గంగానదిలో ప్రవేశించకు. అలాగే అనేక క్రూరమృగాలు, పెద్దపులులు గల అరణ్యాలలో కూడ ప్రవేశించకు.

వత్సాసంఖ్యేషు దుర్గా గణేశేష్వేతస్మిన్ వీరకే ।
పుత్రభావోపతుష్టాన్తఃకరణా తిష్ఠతు ॥ 561 ॥

అసంఖ్యాకులైన గణేశులందరిలో దుర్గాస్వరూపిణి పార్వతి ఆ వీరకునియందే పుత్రభావంతో సంతృప్తి చెందిన అంతరంగం కలదై వుంటుంది.

స్వస్య పితృజనప్రార్థితర్ధి భవ్య మాయాతి భావిన్యసౌ భవ్యతా ॥ 562 ॥

సాధారణంగా వాత్సల్యం తన తల్లిదండ్రుల కోరిక భవిష్యత్తులో అవశ్యం సత్ఫలితాన్నిస్తుంది.

సోఽపి నిభృత్య సర్వగణైః సస్మయమాహ బాలత్వలీలారసావిష్టధీః ॥ 563 ॥

ఆ వీరకుడు కూడ ప్రమథగణాలతో బాల్యానికి తగిన ఆటలు ఆడుతూ, రసానుభూతిని పొందుతూ, మరింత ఆసక్తితో ఇలా అన్నాడు.

ఏష మాత్రా స్వయం మే కృతభూషణోఽత్ర ఏష పటః పటలైర్భిన్నబిభిః ।
సిందువారస్య పుష్పైరియం మాలతీమిశ్రితా మాలికా మే శిరస్యాహితా ॥ 564 ॥

ఇది మా అమ్మ నాకు స్వయంగా తొడిగిన ఆభరణం, ఈ ఎరుపురంగు చుక్కలు గల వస్త్రం కూడ మా అమ్మ నాకు ఇచ్చినదే. సిందువారపుష్పాలు మరియు మాలతీ పుష్పాలతో అల్లిన మాలను కూడ మా అమ్మయే నా తలపై అలంకరించిందని వీరకుడు సంతోషంతో నవ్వుతూ చెప్పాడు.

కోఽయమాతోద్యధారీ గణస్తస్య దాస్యామి హస్తాదిదం క్రీడనమ్ ॥ 565 ॥

ఆతోద్యమనే వాద్యవిశేషాన్ని ధరించిన ఈ గణనాథుడెవ్వరు? అతనికి స్వయంగా నా చేతులతో ఈ ఆటవస్తువు నిస్తాను.

దక్షిణాత్పశ్చిమం పశ్చిమాదుత్తర ముత్తరాత్ పూర్వమభ్యేత్య సఖ్యాయుతా ప్రేక్షతీ తమ్ ।
గవాక్షాన్తరాద్వీరకం శైలపుత్రీ బహిః క్రీడనం యజ్జగన్మాతురప్యేష చిత్తభ్రమః ॥ 566 ॥

పార్వతీదేవి తన సఖురాలితో కూడ దక్షిణం నుండి పశ్చిమానికి, అక్కడి నుండి ఉత్తరానికి మరల అక్కడ నుండి తూర్పువైపు తిరుగుతూ గవాక్షాలనుండి బయట ఆడుతున్న వీరకుణ్ణి చూచింది. జగన్మాతయైన ఆ శైలపుత్రికకే ఇలాంటి పుత్రవ్యామోహం కలగడం ఆశ్చర్యం కదా!

పుత్రలుబ్ధో జనస్తత్ర కోవామోహమాయాతి ।
స్వల్పచేతా జడో మాంసరక్తవిణ్మూత్రసంఘాతదేహః ॥ 567 ॥

జగన్మాతయైన ఆమెకే ఇలా మోహం కలిగితే అల్పబుద్ధులు, జడులు, మాంస, రక్త, మలమూత్రాది సముదాయంతో నిండిన శరీరాలుగల సాధారణజనులు పుత్రులు కావాలని మోహం పొందటంలో ఆశ్చర్యమేముంది?

ద్రష్టుమభ్యన్తరం నాకవాసేశ్వరై రిన్దుమౌలిం ప్రవిష్టేషు కక్షాన్తరమ్ ॥ 568 ॥

వాహనాదవరోహా గణాస్తైర్యుతో లోకపాలాస్త్రమూర్తో
హ్యయం ఖడ్గ విఖడ్గకరో నిర్మమః కృతాన్తః కస్య ।
కేనాహతో బ్రూత మౌనే భవనోఽస్త్రదండేన కిందుఃస్పృహః ॥ 569 ॥

భీమమూర్త్యానసే నాస్తి కృత్యం గిరౌ య ఏషోఽస్త్రజ్ఞేన కిం వధ్యతే ॥ 570 ॥

మా వృథా లోకపాలానుగచిత్తతా ఏవమేవైత దిత్యూచురస్మై తదా దేవతాః॥ 571 ॥

అప్పుడు శివుని దర్శింపగోరి స్వర్గలోకవాసులైన దేవతలు తమ తమ వాహనాలపై వచ్చి వాటినుండి దిగి లోనికి ప్రవేశిస్తున్నారు. అంతలో ప్రమథగణాలు అక్కడకు వచ్చి వారి వాహనాలను దిగుతూ పరస్పరం ఇలా అనుకొంటున్నారు. ఈ యముడు మిగతా లోకపాలకులతో కలసి ఖడ్గం, పాశము, దండం మొదలగు ఆయుధాలను విడిచి కేవలం ముద్గరమన్నే ఆయుధాన్నే చేతబూని ఇక్కడికి వచ్చివున్నాడే, అసలు ఎవరితను? నల్లని ఆకారము గలిగిన ఈతనిని ఎవరైన కొడితే ఏమవుతుంది? అయినా ఈతని భయంకరాకారం చూచి ఎవరు భయపడరు? ఈ భయంకరాకృతి గలిగిన ఈయనకు ఈ పర్వతంపైన ఏమి పని వుంటుంది? ఈతని దీర్ఘదేహాన్ని భయం కలిగించే రూపాన్ని చూచి కొందరు అస్త్ర నైపుణ్యం కలవాడని అనుకొంటారేమో? ఇలా పరిహాసవాక్యాలు పలుకుతున్న ప్రమథులను చూచి దేవతలు వీరి చిలిపి చేష్టలను లెక్కించవద్దని యమునికి చెప్పారు. అలాగే మిగతా లోకపాలకులకు కూడ వారి చేష్టలకు భయపడవద్దని ధైర్యం చెప్పారు.

దేవదేవానుగం వీరకం లక్షణా ప్రాహ దేవీ
వనం పర్వతా నిర్ఝరాణ్యాగ్నిదేవ్యానథో భూతపా ।
నిర్ఝరాంభోనిపాతేషు నిమజ్జత ॥ 572 ॥

పుష్పజాలావనద్ధేషు ధామస్వపి శేత
ప్రోత్తుంగనానాద్రికుంజేష్వనుగర్జన్తు ।
హే మారుతాస్ఫోటసంక్షేపణాత్మామతః ॥ 573 ॥

ప్రమథులతోచేరి ఆడుతున్న దేవదేవునికి ఇష్టుడైన వీరకుని చూచి పార్వతీదేవి ఇలా అన్నది. వనాలలో, పర్వతాలలో సెలయేళ్ళలో, అగ్నిదేవతా మార్గాలలో జాగరూకతతో సంచరించుచు. జలపాతాలలో స్నానమాచరించు. పుష్పలతలు అల్లుకొన్న పొదరిళ్ళలో జాగరూకుడవై శయనించుము (విశ్రాంతి తీసుకో). ఎత్తైన అనేక పర్వత నికుంజాలలో ధ్వనిచేస్తూ సంచరించు. ఆ వీరకునికి తగుజాగ్రత్తలు వివరిస్తూ వాయుదేవుని "నీవు విజృంభించి వీచకుండా మా వీరకునికె అనుకూలంగా వీచు" అని కోరింది.

కాంచనోత్తుంగ శృంగావరోహక్షితౌ హేమరేణూత్కరాసంగద్యుతిం ఖేచరాణాం వనాధాయిని రమ్యే బహురూప సంపత్ప్రకరే గణాన్వాసితం మందరకందరే సుందరమందారపుష్పప్రవాలాంబుజే సిద్ధనారీభిరాపీతరూపామృతం విస్తృతైర్నేత్రపాత్రైరనున్మేషిభిః వీరకం శైలపుత్రీ నిమేషాన్తరాదస్మరత్ పుత్రగృద్ధ్నీ వినోదార్థినీ ॥ 574 ॥

ఉత్తుంగాలైన బంగారు మేరుపర్వతపు శిఖరాలపైకి ఎక్కుతూ మరల దిగుతూ ఆటలాడుతున్న ఆ వీరకుని శరీరం బంగారురేఖలతో, బంగారుపుధూళితో నిండిపోయింది. ఖేచరులైన దేవతలు సంచరిస్తూ, సుందర వన ప్రదేశాలలో ప్రమథగణాలు తనను అనుసరించి రాగా రమ్యాలైన మందార పుష్పాలు, చిగురుటాకులు పద్మాలచే అలంకృతమైవున్న మందరపర్వత గుహలలో తన్మయుడై ఆడుతున్న ఆతని వినోదాలను, రూపామృతాన్ని సిద్ధస్త్రీలు రెప్పవాల్చకుండా విప్పారిన నేత్రాలతో గ్రోలు తుండగా, వినోదం కోరే శైలపుత్రి పార్వతీదేవి పుత్రవాత్సల్యంతో నిమిషం గూడా పోనివ్వకుండా ఆ వీరకుని స్మరించింది.

సోऽపి తాదృక్ క్షణావాప్త పుణ్యోదయో యోऽపి
జన్మాన్తరస్యాత్మజత్వం గతః క్రీడతస్తస్య తృప్తిః కథం జాయతే? ।
యోऽపి భావి జగద్వేధసా తేజః కల్పితః ప్రతిక్షణం
దివ్యగీతక్షణో నృత్యలోలో గణేశైః ప్రణతః ॥ 575 ॥

అపుడా వీరకుడు కూడ తన పుణ్యసంచయం వలననే ఇంతటి వాత్సల్యాన్ని పొందగలుగుతున్నానని, బహుశః జన్మాంతంలో తాను ఆమెకు పుత్రుడై వుండవచ్చునని తలంచి ఎంతకు తృప్తిచెందక ఆడుకొంటున్నాడు. విశ్వ సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు ఈ వీరకుని అగ్నితేజస్సుతో సృష్టించి వుండవచ్చు. ప్రతిక్షణము దివ్యమైన గీతాలను వింటూ నృత్యాలను ఆసక్తితో చూస్తూ, గణేశులు ప్రణమిల్లుతుండగా వీరకుడు ఆనందంగా కాలం గడుపుతున్నాడు.

క్షణం సింహనాదాకులే గండశైలే సృజద్రత్నజాలే బృహత్సాలతాలే ।
క్షణం ఫుల్లనానాతమాలాలికాలే క్షణం వృక్షమూలే విలోలేమరాలే ॥ 576 ॥

ఒక క్షణంలో సింహనాదాలతో ప్రతిధ్వనిస్తున్న, రత్నజాలపరిపూర్ణమైన మరియు ఎత్తైన సాల, తాల వృక్షాలతో దట్టంగా వున్న పర్వతశిఖరాలపైన, మరొక క్షణంలో పుష్పించిన అనేకవిధాలైన తమాలవృక్షాల వనాలలో వేరొక క్షణంలో వృక్షపునీడలలో మరియు హంసలతో నిండిన సరస్సులలో ఆ వీరకుడు ఆడుతున్నాడు.

క్షణే స్వల్పపంకే జలే పంకజాఢ్యే క్షణం మాతురంకే శుభే నిష్కలంకే ।
పరిక్రీడితే బాలలీలావిహారీ గణేశాధిపో దేవతానన్దకారీ ।
నికుంజేషు విద్యాధరైర్గీతశీలః పినాకీవ లీలావిలాసైః సలీలః॥ 577 ॥

ఒక క్షణంలో స్వల్పమైన బురద గలిగి వికసించిన కమలాలు గలిగిన సరస్సుల సమీపంలో, మరొక క్షణంలో శుభప్రదమైన నిష్కళంకమైన తల్లి ఒడిలో బాలక్రీడలతో విహార వినోదాన్ననుభవిస్తూ, దేవతలకానందాన్ని కలిగిస్తూ, గణేశాధిపుడైన ఆ వీరకుడు పరమానందంగా ఆడుకొంటున్నాడు. మరియు కొన్నిసార్లు ఆ వీరకుడు పినాకపాణియైన శివునివలే పొదరిళ్ళలో విద్యాధరులతో కలిసి విలాసంగా పాడుతూ ఆడుకొంటున్నాడు.

ప్రకాశ్య భువనాభోగీ తతో దినకరే గతే ।
దేశాన్తరం తదా పశ్చాద్దూరమస్తావనీధరమ్ ॥ 578 ॥

సూర్యుడు ఆ సమయంలో విస్తారమైన ఈ భువనాన్ని ప్రకాశింపజేసి, అస్తాచలానికి వెనుక దూరంలో వున్న దేశాంతరానికి వెళ్ళిపోయాడు.

ఉదయంస్తే పురోభావీ యో హి చాస్తేఽవనీధరః ।
మిత్రత్వమస్య సుదృఢం హృదయే పరిచిన్త్యతామ్ ॥ 579 ॥

నిత్య మారాధితః శ్రీమాన్ పృథుమూలః సమున్నతః ।
నాకరోత్సేవితుం మేరురుపకారం పతిష్యతః ॥ 580 ॥

ఉదయాచలంలో ఉదయిస్తూ అస్తాచలంలో అస్తమిస్తున్న ఆ సూర్యభగవానునికి ఈ రెండు పర్వతాలకు మధ్యనున్న గాఢమైన మిత్రత్వం ఎంత గొప్పదో విచారించండి. ఒక పర్వతం ఉదయించడానికి సహాయకారి ఐతే ఇంకొకపర్వతం అస్తమించడానికి ఉపకరిస్తున్నది. కాని చాలా విశాలమైన ఉన్నతమైన పృథివికి మధ్యలోనున్న మేరు పర్వతం ఆ భగవానునికి ఏమాత్రం ఉపకరించడం లేదు. సూర్యుడు మేరుపర్వతానికి ప్రదక్షిణ చేస్తున్నట్లు కదలుతుంటాడని కదా మనకు పురాణాలు చెబుతున్నాయి. ఆవిధంగా సూర్యుడు నిత్యం ఆరాధించినా మేరువు ఆ దినకరునికి ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

జలేఽప్యేషా వ్యవస్థేతి సంశ్రయేతాఖిలం బుధః ।
దినాన్తానుగతో భానుః స్వజనత్వమపూరయత్ ॥ 581 ॥

మేరువువంటివాడే వరుణుడు. జలంలో కూడ ఇటువంటి వ్యవస్థే వున్నది. అయినా పండితుడైనవాడు తనకుపయోగపడే వాటినన్నింటిని జాగరూకతతో ఉపయోగించుకొంటాడు. సూర్యుడు అస్తమయంలో నీటిలో ప్రవేశించి వరుణుడు తన వాడేనని నిరూపించుకొంటాడు.

సంధ్యాబద్ధాంజలిపుటా మునయోఽభిముఖా రవిమ్ ।
యాచన్త్యాగమనం శీఘ్రం నివార్యాత్మని భావితమ్ ॥ 582 ॥

సంధ్యాసమయంలో మునులు అంజలి ఘటించి వారి బాధలను అణచివేసికొని, సూర్యునికి అభిముఖులై ఆ భగవానుని మరల శీఘ్రంగ రమ్మని ప్రార్థిస్తారు.

వ్యజృంభదథ లోకేఽస్మిన్ క్రమాద్వైభావరం తమః ।
కుటిలస్యేవ హృదయే కాలుష్యం దూషయన్మనః ॥ 583 ॥

క్రమంగా లోకంలో విభావరికి (బ్రహ్మదేవుడు ఏ దేవినైతే ప్రళయాధిష్ఠాత్రి అని యోగమాయ అని ప్రార్థించాడో ఆ దేవియే విభావరి, భయంకరమైన అంధకారంతో కూడుకున్న రాత్రి.) సంబంధించిన చీకటి అంతటా వ్యాపించింది. అది సజ్జనుల మనస్సును కూడ కలుషితం చేసే శక్తిగల దుర్జనుల హృదయపుమాలిన్యం వలె ఉంది.

జ్వలత్ఫణిఫణారత్న దీపోద్యోతితభిత్తికే ।
శయనం శశిసంఘాత శుభ్రవస్త్రోత్తరచ్ఛదమ్ ॥ 584 ॥

నానారత్నద్యుతిలసచ్ఛక్రచాపవిడమ్బకమ్ ।
రత్నకింకిణికాజాలం లంబముక్తాకలాపకమ్ ॥ 585 ॥

కమనీయచలల్లోలవితానాచ్ఛాదితాంబరమ్ ।
మందిరే మందసంచారఃశనైర్గిరిసుతాయుతః ॥ 586 ॥

అపుడు పరమశివుని శయనమందిరపు గోడలు మహానాగాల పడగలలో జ్వలిస్తున్న రత్నదీపాలతో మిక్కిలి ప్రకాశిస్తుండినవి. మరియు అనేక రత్నకాంతులతో ఇంద్రధనుస్సువలె ప్రకాశిస్తుండినవి. దానిలో చంద్రుల సముదాయం వంటి తెలుపురంగు దుప్పటి పరిచియున్నట్లుండినది. ఇంకనూ ఆ శయనం పై రత్నాలతో చేయించిన చిరుగజ్జెలు మరియు ముత్యాలగుత్తులు కూడ వ్రేలాడుతుండినవి. అందమైన, కదులుతున్న వితానంలో ఆకాశం కప్పబడినదా అన్నట్లుండినది. ఇలాంటి మందిరంలో శివుడు పార్వతితో పాటు నెమ్మదిగా సంచరిస్తున్నాడు.

తస్థౌ గిరిసుతాబాహులతా మీలితకంధరః ।
శశిమౌలిసితజ్యోత్స్నా శుచిపూరిత గోచరః ॥ 587 ॥

గిరిజాఽప్యసితాపాంగీ నీలోత్పలదలచ్ఛవిః ।
విభావర్యా చ సంపృక్తా బభూవాతితమోమయీ ॥
తామువాచ తతో దేవః క్రీడాకేలికలాయుతామ్ ॥ 588 ॥

క్రమంగా శివుని కంఠం పార్వతీదేవి బాహు లతల ఆలింగనంలో లీనమయింది. ఆతని శిరస్సునందుగల చంద్రునియొక్క తెల్లని వెన్నెల కాంతులతో నిండి ఆ పరిసరమంతా పవిత్రమయింది. నల్లని కనుబొమ్మలుగల పార్వతీదేవి శరీరవర్ణము నల్లకలువల ఛాయను పొందినట్లున్నది. అటువంటి ఆమె శరీరకాంతి రాత్రి కాంతిలో కలసి నల్లగా కనబడింది. అప్పుడు క్రీడాకేళి కళలలో ఆరితేరిన పార్వతితో ఇలా అన్నాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే కుమారసంభవో నామ చతుః పంచాశదధికశతతమోఽధ్యాయః ॥154॥

మత్స్యమహాపురాణంలో కుమారసంభవ మనే నూట యాభైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచపంచాశదధికశతతమోఽధ్యాయః - నూటయాభై ఐదవ అధ్యాయం

దేవ్యాః తపోఽనుగమనమ్ - పార్వతీదేవి తపస్సుకై వెళ్ళుట

శర్వ ఉవాచ- శర్వుడు చెప్పాడు.

శరీరే మమ తన్వంగి సితే భాస్యసితద్యుతిః ।
భుజంగీ వాసితా శుద్ధా సంశ్లిష్టా చందనే తరౌ ॥ 1 ॥

సుందరీ! తెల్లగా ప్రకాశించే నా దేహంపై నల్లని నీ మేని ఛాయ చక్కని చందన వృక్షానికి చుట్టుకొనిన నల్లని ఆడత్రాచు పాము వలె వున్నది.

చంద్రతాపేన సంపృక్తా రుచిరాంబరయా తథా ।
రజనీవాసితే పక్షే దృష్టదోషం దదాసి మే ॥ 2 ॥

నీవు నిర్మలమైన ఆకాశంలో చంద్రుని వెనుక వున్న నల్లని మచ్చ వలె ఉండి కృష్ణపక్షపు రాత్రివలె నాకు దృష్టి దోషం కలిగిస్తున్నావు.

ఇత్యుక్తా గిరిజా తేన ముక్తకంఠా పినాకినా ।
ఉవాచ కోపరక్తాక్షీ భృకుటీ కుటిలాననా ॥ 3 ॥

శివుడు ఆ విధంగా చెప్పగా పార్వతీదేవి కోపంతో నేత్రాలు ఎర్రబడగా, కనుబొమలను వికృతంగా ముడివేసి శివుని కౌగిలినుండి విడివడి ఇలా అన్నది.

దేవ్యువాచ- దేవి చెప్పింది.

స్వకృతేన జనఃసర్వో జాడ్యేన పరిభూయతే ।
అవశ్యమర్థాత్ ప్రాప్నోతి ఖండనం శశిమండన ॥ 4 ॥

ఓ చంద్రభూషణా! ప్రతివాడును స్వయం బుద్ధిమాంద్యం వలన అవమానం పొందుతాడు. యాచించిన వాడు ఎప్పుడో ఒకసారి తప్పక అవమానం పొందుతాడు.

తపోభిర్దీర్ఘచరితైర్యచ్చ ప్రార్థితవత్యహమ్ ।
తస్యా మే నియతస్త్వేష హ్యవమానః పదేపదే ॥ 5 ॥

ఏదో కోరి దీర్ఘకాలపర్యంతం నేను చేసిన తపస్సుకు ఫలం ఈ అవమానం. ఇది నన్ను అడుగడుగునా బాధ పెడుతున్నది.

నైవాస్మి కుటిలా శర్వ విషమా నైవ ధూర్జటే ।
సవిషస్త్వం గతః ఖ్యాతిం వ్యక్తం దోషాకరాశ్రయాత్॥6॥

కాని శర్వా! నేను కుటిలను కాను, ఓ ధూర్జటీ! విషమను అంతకంటె కాను. విషానికి మరియు దోషాకరుడైన చంద్రునికి కూడ ఆశ్రయమిచ్చి నీవు లోకంలో ఖ్యాతి పొందావు.

నాహం పూష్ణోఽపి దశనా నేత్రే చాస్మి భగస్య హి ।
ఆదిత్యశ్చ విజానాతి భగవాన్ ద్వాదశాత్మకః ॥ 7 ॥

మూర్ధ్ని శూలం జనయసి స్వైర్దోషైర్మామధిక్షిపన్ ।
యస్త్వం మామాహ కృష్ణేతి మహాకాలేతి విశ్రుతః ॥8॥

నేను పూషణుని దంతాలను కాను, భగుని నేత్రాలను కూడ కాను. పూజ్యుడు, ద్వాదశాత్ముడైన సూర్యభగవానునికి ఇది తెలుసు. నీకుండే లోటు నీకుండగా నన్ను నిందించి నాకు శిరోవేదన కలిగిస్తున్నావు.నన్ను కృష్ణా=నల్లనిదానా అంటున్నావే కాని నీవే మహాకాలుడవు(ముదురు నలుపు రంగువాడవు) అని ప్రసిద్ధి కదా!

యాస్యామ్యహం పరిత్యక్త్వా చాత్మానం తపసా గిరిమ్ ।
జీవన్త్యా నాస్తి మే కృత్యం ధూర్తేన పరిభూతయా ॥9॥

కావున నేనే ఇవన్నీ వదలి పెట్టి మరల తపస్సు చేసుకోవడానికి పర్వత ప్రాంతానికి వెళ్ళిపోతాను. ఒక ధూర్తునిచే అవమానించబడిన నాకు జీవించి సాధించవలసినదే లేదు.

నిశమ్య తస్యా వచనం కోపతీక్ష్ణాక్షరం భవః ।
ఉవాచాధికసంభ్రాన్తః ప్రణయేనేందుమౌలినా ॥10॥

ఇలా కోపంతో తీక్ష్ణంగా పలికిన పార్వతిదేవి మాటలు విని సంభ్రాంతచిత్తుడై చంద్రశేఖరుడైన శివుడు అనురాగంతో ఇలా చెప్పాడు.

శర్వ ఉవాచ- శివుడు చెప్పాడు.

అగాత్మజాసి గిరిజే నాహం నిన్దాపరస్తవ ।
త్వద్భక్తిబుద్ధ్యా కృతవాన్ తవాహం నామ సంశ్రయమ్ ॥11॥

గిరిజా! నీవు పర్వతరాజు పుత్రికవు. నేను నిన్ను నిందించటం లేదు. నీకున్న భక్తిని తెలుసుకోవడానికే నేను నిన్నా పేరుతో పిలిచాను.

వికల్పః స్వస్థచిత్తేఽపి గిరిజే నైవ కల్పనా ।
యద్యేవం కుపితా భీరు త్వం తవాహం న వై పునః ॥12॥

పార్వతీ! స్వస్థచిత్తుడైన వానికి కూడ ఒక్కోసారి వికల్పాలు కలుగుతాయి. కావున ఎట్టి కల్పనలను చేయవద్దు. ఒకవేళ నీకు కోపం వస్తే ఇంకెప్పుడు ఈ విధంగా మాట్లాడను.

నర్మవాదీ భవిష్యామి జహి కోపం శుచిస్మితే ।
శిరసా ప్రణతశ్చాహం రచితస్తే మయాంజలిః ॥13॥

ఓ నిర్మలమైన చిరునవ్వు కలదానా! నేను యథార్థమునే చెప్పెదను. కోపాన్ని వదులు. ఇంకెప్పుడూ ఇలా పలుకను. శిరస్సు వంచి, ప్రణామాంజలి ఘటిస్తున్నాను.

స్నేహేనాప్యవమానేన నిందితేనైతి విక్రియామ్ ।
తస్మాన్న జాతు రుష్టస్య నర్మస్పృష్టో జనః కిల ॥14॥

స్నేహంతో మాట్లాడినప్పటికి ఒక్కోసారి కొందరు తనను అవమానించినట్లు భావిస్తారు. కనుక ఎప్పుడూ కోపంతో వున్న వారి ముందు హాస్యానికైనా పరిహాసం చేయరాదు.

అనేకైశ్చాటుభిర్దేవీ దేవేన ప్రతిబోధితా ।
కోపం తీవ్రం న తత్యాజ సతీ మర్మణి ఘట్టితా ॥15॥

శివునిచే ఎన్ని విధాల అనునయించబడినా, ప్రార్థించబడినా, ముందు శివుడన్న మాటలు తన మనస్సును నొప్పించటం వలన పార్వతి కోపతీవ్రతను వదలలేదు.

అవష్టబ్ధమథాస్ఫాల్య వాసః శంకరపాణినా ।
విపర్యస్తాలకా వేగాద్యాతుమైచ్ఛత శైలజా ॥ 16 ॥

శంకరుని ముందునుండి లేచి అతను పట్టుకొనిన వస్త్ర కొంగును కూడ విదలించుకొని, చెదిరిన జుట్టుతో చాలా వేగంగా అక్కడి నుండి వెళ్ళిపోవడానికి పార్వతి సిద్ధపడింది.

తస్యా వ్రజన్త్యాః కోపేన పునరాహ పురాన్తకః ।
సత్యం సర్వైరవయవైః సుతాసి సదృశీ పితుః ॥ 17 ॥

హిమాచలస్య శృంగైస్తైర్మేఘజాలాకులై ర్నభః ।
తథా దురవగాహ్యేభ్యో హృదయేభ్యస్తవాశయః ॥ 18 ॥

అలా కోపంతో వెళ్ళిపోతున్న పార్వతిని చూచి పురాంతకుడైన శివుడు ఇలా అన్నాడు. నీవు నిజంగా అన్ని అంశాలలోనూ మీ తండ్రిని పోలిన కూతురివే. మేఘసమూహాలతో వ్యాప్తమైన హిమవంతుని ఎత్తైన శిఖరాల నుండి ఆకాశమును తెలుసుకొనుట ఎంతటి కష్టమో అట్లే దురవగాహమైన నీ హృదయమందలి ఆశయమును తెలుసుకొనుట కూడా అంతే కష్టము.

కాఠిన్యాంకస్త్వమస్మభ్యం వనేభ్యో బహుధా గతా ।
కుటిలత్వం చ వర్త్మభ్యో దుః సేవ్యత్వం హిమాదపి ।
సంక్రాంతిః సర్వదైవేతి తన్వంగి హిమశైలరాట్ ॥19॥

హిమవత్పర్వత వనాలలోవున్న వృక్షాల వంటి కఠినత్వాన్ని, అక్కడున్న విభిన్న మార్గాల వక్రత్వాన్ని, సేవించడానికి యోగ్యం కాని 'మంచు' వంటి స్వభావాన్ని నీవు పొందావు. ఇవన్ని సత్యంగా తండ్రినుండి నీకు సంక్రమించినవే.

ఇత్యుక్తా సా పునః ప్రాహ గిరిశం శైలజా తదా ।
కోపకంపితమూర్ధా చ ప్రస్ఫురద్దశనచ్ఛదా ॥20॥

శివుడావిధంగా చెప్పగా పార్వతి మరింత కోపంతో కంపిస్తుండగా, శిరస్సు, వణుకుతున్న పెదవులతో ఇలా చెప్పింది.

ఉమోవాచ – పార్వతి చెప్పింది.

మా సర్వాన్ దోషదానేన నిన్దాన్యాన్ గుణినో జనాన్ ।
తవాపి దుష్టసంపర్కాత్ సంక్రాన్తం సర్వమేవ హి ॥21॥

వ్యాలేభ్యోఽధిక జిహ్మత్వం భస్మనా స్నేహబంధనమ్ ।
హృత్కాలుష్యం శశాంకాత్తు దుర్బోధిత్వం వృషాదపి ॥22॥

ఏవేవో దోషాలను చూపుతూ గుణవంతులైన వారిని నిందించవద్దు. నీకున్న దోషాలన్నీ నీకు కూడ దుష్ట సాంగత్యం వలన లభించినవే. నీ సర్పాల నుండి వక్రత్వాన్ని, భస్మము నుండి ప్రేమరాహిత్యాన్ని, శశాంకుని నుండి హృదయమాలిన్యాన్ని, వృషభాన్ని నుండి అవగాహనా రాహిత్యాన్ని నీవు పొందావు.

తథా బహు కిముక్తేన అలం వాచా శ్రమేణ తే ।
శ్మశానవాసాన్నిర్భీస్త్వం నగ్నత్వాన్న తవ త్రపా ॥23॥

నిర్ఘృణత్వం కపాలిత్వాద్దయా తే విగతా చిరమ్ ।
ఇత్యుక్త్వా మందిరాత్తస్మాన్నిర్జగామ హిమాద్రిజా ॥ 24 ॥

ఇంతకంటే ఎక్కువ ఏమి చెప్పాలి? శ్రమ మాత్రమే కలుగుతుంది. నీవు శ్మశాన నివాసం వల్ల నిర్భయత్వాన్ని చేత పొందావు. నగ్నత్వం నుండి సిగ్గులేమిని, కపాలముల నుండి దయారాహిత్యాన్ని పొందావు. దయ అనేది నీ నుండి ఎప్పుడో పోయింది. అని చెబుతూ హిమాద్రిజ ఆ మందిరం నుండి వెళ్ళిపోసాగింది.

తస్యాం వ్రజన్త్యాం దేవేశగణైః కిలకిలో ధ్వనిః ।
క్వ మాతర్గచ్ఛసి త్యక్త్వా రుదన్తో ధావితాః పునః ॥25॥

ఆ విధంగా వెళ్ళిపోవుచున్న పార్వతీదేవిని చూచి ప్రమథగణాలు కలకలారావాలు చేశారు. అమ్మా! మమ్మల్ని వదలి ఎక్కడికి వెళ్ళుతున్నావని దుఃఖిస్తూ ఆమె వెంటనే పరిగెత్తారు.

విష్టభ్య చరణౌ దేవ్యా వీరకో బాష్పగద్గదమ్ ।
ప్రోవాచ మాతః కింత్వేతత్ క్వ యాసి కుపితాననా ॥26॥

అహం త్వా మనుయాస్యామి వ్రజన్తీం స్నేహవర్జితామ్ ।
నో చేత్ పతిష్యే శిఖరాత్ తపోనిష్ఠే త్వయోజ్ఝితః ॥27॥

వీరకుడు దేవి పాదాలను పట్టుకొని, కన్నీటితో, గద్గదస్వరంతో కోపించిన మనస్సు గలదానవై నీవు ఎక్కడికి వెళ్ళుతున్నావు, ఇదేమి? స్నేహాన్ని వదలి వెళ్ళుతున్న నీతోనే నేను కూడ వస్తాను. లేనిచో ఓ తపోనిష్ఠురాలా! నీవు వదలివేస్తే ఈ పర్వత శిఖరం నుండి క్రింద పడతాను.

**ఉన్నామ్య వదనం దేవీ దక్షిణేన తు పాణినా ।
ఉవాచ వీరకం మాతా శోకం పుత్రక మా కృథాః ॥28॥**

శైలాగ్రాత్ పతితుం నైవ న చాగన్తుం మయా సహ ।

అపుడు దేవి తన కుడిచేతి తో వీరకుని ముఖాన్ని పైకెత్తి, పుత్రకా! నీవు ఈ విషయంలో దుఃఖించకూడదు, మఱియు గిరిశిఖరం నుండి పడిపోవటం కాని, నాతో కూడ రావడానికి ప్రయత్నం చేయకూడదు.

యుక్తం తే పుత్ర వక్ష్యామి యేన కార్యేణ తచ్ఛృణు ॥29॥

**కృష్ణేత్యుక్త్వా హరేణాహం నిందితా చాప్యనిందితా ।
సాఽహం తపః కరిష్యామి యేన గౌరీత్వమాప్నుయామ్ ॥30॥**

నీకు యోగ్యమైన కార్యాన్ని అప్పగిస్తాను విను. శివుడు నన్ను నల్లని దానివని నిందించాడు, అవమానించాడు కావున నేను ఇప్పుడు తపస్సు చేసి గౌరీత్వాన్ని అనగా తెల్లదనాన్ని పొందుతాను.

**ఏష స్త్రీలమ్పటో దేవో యాతాయాం మయ్యనన్తరమ్ ।
ద్వారరక్షా త్వయా కార్యా నిత్యం రంధ్రానవేక్షిణా ॥31॥**

**యథా న కాచిత్ప్రవిశేద్యోషిదత్ర హరాన్తికమ్ ।
దృష్ట్వా పరస్త్రియశ్చాత్ర వదేథా మమ పుత్రక ! ॥32॥**

శీఘ్రమేవ కరిష్యామి యథాయుక్తమనన్తరమ్ ।

ఈ పరమశివుడు స్త్రీ లంపటుడని తెలుస్తూన్నది. కావున నేను వెళ్ళిపోయిన తర్వాత నీవు మిక్కిలి జాగరూకుడవై ఈ ద్వారరక్షణకార్యం చేయాలి. శివుని వద్దకు ఏ స్త్రీ కూడ ప్రవేశించకుండా చూడు. ఒక వేళ ఏ స్త్రీయైనా ప్రవేశిస్తే చూచినవెంటనే నాకు తెలుపవలసినది. పుత్రకా! నేను వచ్చి ఆ తరువాత చేయవలసిన పని వెంటనే చేస్తానని వీరకుని పార్వతి అనునయించింది.

ఏవమస్త్వితి దేవీం స వీరకః ప్రాహ సామ్ప్రతమ్ ॥33॥

**మాతురాజ్ఞాఽమృతాహ్లాదప్లావితాంగో గతజ్వరః ।
జగామ కక్ష్యాం సంద్రష్టుం ప్రణిపత్య చ మాతరమ్ ॥34॥**

అది విన్న వీరకుడు అమ్మ చెప్పిన కార్యాన్ని నిర్వహిస్తానని చెప్పాడు. అమృతతుల్యమైన తల్లి ఆదేశంతో ఆహ్లాదాన్ని పొంది, సంతాపం తొలగిపోగా ఆ జగన్మాతకు నమస్కరించి, శివభవన ప్రవేశద్వారం వద్దకు వెళ్ళాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే కుమారసమ్భవే దేవ్యాః తపోఽనుగమనం నామ పంచపంచాశదధికశత తమోఽధ్యాయః ॥ 155 ॥

శ్రీమత్స్య మహాపురాణంలో కుమారసంభవ సందర్భంలో పార్వతితపస్సుకై వెళ్ళుట అనే నూట యాభై ఐదవ అధ్యాయం సమాప్తం.

షట్ పంచాదశదధిక శతతమోఽధ్యాయః - నూటయాబై ఆరవ అధ్యాయం

ఆడివధః- ఆడివధ

సూత ఉవాచ ః- సూతుడు చెప్పాడు.

దేవీం సాఽపశ్యదాయాన్తీం సఖీం మాతుర్విభూషితామ్ ।
కుసుమామోదినీం నామ తస్య శైలస్య దేవతామ్ ॥1॥

మరల తపస్సు చేయడానికి వెళ్ళుతున్న పార్వతీదేవి తన తల్లియైన మేనకకు మిత్రురాలైన, చక్కగా అలంకరించుకొని తన వైపు వస్తున్న కుసుమామోదిని అనే ఆ పర్వతదేవతను చూచింది.

సాఽపి దృష్ట్వా గిరిసుతాం స్నేహవిక్లవమానసా ।
క్వ పుత్రి! గచ్ఛసీత్యుచ్చైరాలింగ్యోవాచ దేవతా ॥2॥

ఆ కుసుమామోదిని కూడ గిరిసుతను చూచి స్నేహపరవశమైన మనస్సుతో ఆత్మీయతతో ఆమెను కౌగిలించుకొని పుత్రీ! ఎక్కడికి వెళ్ళుతున్నావని అడిగింది.

సా చాస్యై సర్వమాచఖ్యౌ శంకరాత్కోపకారణమ్ ।
పునశ్చోవాచ గిరిజా దేవతాం మాతృసమ్మతామ్ ॥3॥

పార్వతీదేవి కూడ శంకరునితో తనకు జరిగిన సంభాషణాన్ని మఱియు తన కోపకారణాన్నంతటిని కూడ తన తల్లితో సమానురాలైన కుసుమామోదిని అనే ఆ దేవతకు వివరించింది.

ఉమోవాచ - ఉమ చెప్పింది.

నిత్యం శైలాధిరాజస్య దేవతా త్వమనిందితే ।
సర్వతః సన్నిధానం తే మమ చాతీవ వత్సలా ॥4॥

అతస్తు తే ప్రవక్ష్యామి యద్విధేయం తదా ధియా ।
అన్యస్త్రీసంప్రవేశస్తు త్వయా రక్ష్యః ప్రయత్నతః ॥5॥

రహస్యత్ర ప్రయత్నేన చేతసా సతతం గిరౌ ।
పినాకినః ప్రవిష్టాయాం వక్తవ్యం మే త్వయాఽనఘే ॥ 6 ॥

శైలాధిరాజుకే దేవతా స్వరూపురాలివైన నీవు మిక్కిలి పవిత్రురాలవు, నాకు కూడ ఆత్మీయమైనదానవు. నీ సాన్నిధ్యం నాకు ప్రతిరోజు అన్నివైపులా ఉంటుంది. కావున నీవు ప్రశంసార్హమైన నీ బుద్ధితో ఆలోచించి చేయవలసిన పని ఒకటి నీకు చెబుతున్నాను. ఇతర స్త్రీలు ఎవరూ కూడ ఇక్కడ ప్రవేశించకుండా నీవు ప్రయత్నపూర్వకంగా రక్షించవలసింది. ఇది రహస్యప్రదేశం, సావధానచిత్తురాలవై ఎల్లప్పుడూ ఈ గిరిపై తిరుగుతూ, ఎవరైనా స్త్రీ ఈ పరమశివుని ప్రదేశాన ప్రవేశించినట్లైతే నాకు వెంటనే తెలుపవలసింది.

తతోऽహం సంవిధాస్యామి యత్కృత్యం తదనన్తరమ్ ।
ఇత్యుక్తా సా తథేత్యుక్త్వా జగామ స్వగిరిం శుభమ్ ॥7॥

అటు తర్వాత చేయవలసిన పనిని నేను వచ్చి నిర్వర్తించుకోగలను అని పార్వతీదేవి చెప్పగా విన్న ఆ కుసుమామోదిని, జగన్మాత తనకు చెప్పిన పనికి అంగీకరించి తన నివాసమైన పర్వతప్రాంతానికి వెళ్ళింది.

ఉమాపి పితురుద్యానం జగామాద్రిసుతా ద్రుతమ్ ।
అన్తరిక్షం సమావిశ్య మేఘమాలామివ ప్రభా ॥8॥

అద్రిసుతయైన ఉమ కూడ వెంటనే మేఘమాలను ఆశ్రయించిన మెఱుపువలె అంతరిక్షమార్గంలో తన తండ్రి ఉద్యానవనానికి వెళ్ళింది.

త్యక్త్వా విభూషణాన్యస్య వృక్షవల్కలధారిణీ ।
గ్రీష్మే పంచాగ్నిసంతప్తా వర్షాసు చ జలోషితా ॥9॥

వన్యాహారా నిరాహారా శుష్కా స్థండిలశాయినీ ।
ఏవం సాధయతీ తత్ర తపసా సంవ్యవస్థితా ॥10॥

తన విభూషణాలన్నింటిని వదలి, నార వస్త్రాలను ధరించి, గ్రీష్మర్తువులో పంచాగ్నుల మధ్యలో మిక్కిలి తపిస్తూ, వర్షర్తువులో నీటిలో తడుస్తూ, వనసంబంధాలైన ఆహారాలనే స్వీకరిస్తూ, ఒక్కోసారి ఆహారం లేక కృశించినదై నేలపై శయనిస్తూ, కఠినమైన సాధన చేస్తూ తపస్సులో నిమగ్నురాలయింది.

జ్ఞాత్వా తు తాం గిరిసుతాం దైత్యస్తత్రాన్తరే బలీ ।
అంధకస్య సుతో దృప్తః పితుర్వధమనుస్మరన్ ॥11॥

దేవాన్ సర్వాన్విజిత్యాజౌ బకభ్రాతా రణోత్కటః ।
ఆడిర్నామాన్తరప్రేక్షీ సతతం చంద్రమౌలినః ॥12 ॥

ఆజగామామరరిపుః పురం త్రిపురఘాతినః ।

ఆ సమయంలో 'ఆడి' అనే దైత్యుడు గిరిసుత కోపగించుకొని తపస్సు చేయడానికి వెళ్ళిపోయిందనే విషయాన్ని తెలిసికొన్నాడు. ఆతడు అంధకాసురుని పుత్రుడు మఱియు బకాసురుని సోదరుడు. చాలా గర్విష్ఠుడు, యుద్ధాలలో అనేక మంది దేవతలను జయించినవాడు బలశాలి, తన తండ్రియైన అంధకాసురుని సంహరించిన శివునిపై దండెత్తడానికి నిరీక్షిస్తున్నవాడు. ఇప్పుడు తన తండ్రి వధను గుర్తుచేసుకొని ఇదే సరైన సమయమని తలంచి త్రిపురాంతకుడైన శివుని అంతఃపుర సమీపానికి వచ్చాడు.

స తత్రాగత్య దదృశే వీరకం ద్వార్యవస్థితమ్ ॥ 13 ॥

శివుని అంతః పురప్రదేశానికి వచ్చిన ఆ దైత్యుడు ద్వారం వద్ద వున్న వీరకుని చూశాడు.

విచిన్త్య సోఽపి స్వవరం దత్తం కమలయోనినా ।
హతే తదాఽన్ధకే దైత్యే గిరిశేనామరద్విషి ॥14॥

ఆడిశ్చకార విపులం తపః పరమదారుణమ్ ।
తమాగత్యాబ్రవీద్ బ్రహ్మా తపసా పరితోషితః ॥15॥

అపుడు ఆడికి పూర్వం బ్రహ్మదేవుడు తన కిచ్చిన వరం గుర్తుకొచ్చింది. పూర్వం అంధకాసురుని సంహరించిన తరువాత ఈ దైత్యుడు బ్రహ్మదేవుని గురించి పరమదారుణమైన, కఠినమైన తపస్సు చేయగా, ఆతని తపస్సుకు సంతోషించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఇలా అన్నాడు.

కిమాదే దానవశ్రేష్ఠ తపసా ప్రాప్తుమిచ్ఛసి ।
బ్రహ్మాణమాహ దైత్యస్తు నిర్మృత్యుత్వమహం వృణే ॥16॥

దానశ్రేష్ఠుడవైన 'ఆడి' అనే దైత్యుడా! ఈ తపస్సుచే నీవు ఏమి పొందాలని కోరుకుంటున్నావని బ్రహ్మదేవుడు అడుగగా, ఆ దైత్యుడు నాకు మృత్యువు ఉండకూడదనే వరం కావాలని చెప్పాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

న కశ్చిచ్చ వినా మృత్యుం నరో దానవ విద్యతే ।
యతస్తతోఽపి దైత్యేన్ద్ర మృత్యుః ప్రాప్యః శరీరిణా ॥17॥

ఓ దైత్యుడా! మృత్యువులేని వాడెవడునూ ప్రపంచంలో వుండడు. శరీరాన్ని పొందినవాడు ఏదో ఒక రీతిన మరణం పొందడం తప్పదు.

ఇత్యుక్తో దైత్యసింహస్తు ప్రోవాచామ్బుజసమ్భవమ్ ।
రూపస్య పరివర్తో మే యదా స్యాత్పద్మసంభవ! ॥18॥

తదా మృత్యుర్మమ భవేదన్యథా త్వమరోహ్యహమ్ ।

బ్రహ్మదేవుడు ఆ విధంగా చెప్పగా 'ఆడి' దైత్యుడు పద్మభవుడైన బ్రహ్మదేవునితో ఇలా అన్నాడు. ఓ పద్మసంభవా! అట్లైతే నా రూపం ఎప్పుడు మారుతుందో అప్పుడు మాత్రమే నాకు మరణం కలుగుగాక లేనిచో నేను శాశ్వతంగా అమరుడనై వుంటాను.

ఇత్యుక్తస్తు తదోవాచ తుష్టః కమలసంభవః ॥ 19 ॥

యదా ద్వితీయో రూపస్య వివర్తస్తే భవిష్యతి ।
తదా తే భవితా మృత్యురన్యథా న భవిష్యతి ॥20॥

అది విన్న కమల సంభవుడు సంతుష్టుడై ఇలా చెప్పాడు. ఓ దైత్యుడా! ఎప్పుడు నీ రూపం మారి రెండవ రూపాన్ని పొందుతావో, అప్పుడే నీకు మృత్యువు వస్తుంది. కాని అది లేకపోతే నీకు మృత్యువు సంభవించదని చెప్పాడు.

ఇత్యుక్తోఽ మరతాం మేనే దైత్యసూనుర్మహాబలః ।
తస్మిన్ కాలే తు సంస్మృత్య తద్వధోపాయమాత్మనః ॥ 21 ॥

పరిహర్తుం దృష్టిపథం వీరకస్యాభవత్తదా ।
భుజంగరూపీ రంధ్రేణ ప్రవివేశ దృశః పథమ్ ॥ 22 ॥

అప్పుడు మహాబలుడైన ఆ దైత్యుడు తనకు అమరత్వం లభించినట్లేనని తలంచాడు కాని, అక్కడ శివుని అంతఃపురంలో ప్రవేశించు సమయంలో తన వధోపాయాన్ని, బ్రహ్మదేవుడిచ్చిన వరాన్ని మరచి ద్వారం దగ్గర వున్న వీరకుని దృష్టి మరల్చుటకై సర్పాకారాన్ని పొంది ఒకానొక రంధ్రం ద్వారా శివుని అంతపురఃలోకి ప్రవేశించాడు.

పరిహృత్య గణేశస్య దానవోఽసౌ సుదుర్జయః ।
అలక్షితో గణేశేన ప్రవిష్టోఽథ పురాన్తకమ్ ॥23॥

గణనాయకుడైన వీరకుని దృష్టిలో పడకుండా సుదుర్జయుడైన దానవుడు పాము రూపంలో పురాంతకుడైన శివుని అంతఃపుర ప్రదేశంలో ప్రవేశించాడు. వీరకుడు దానిని గమనించలేదు.

భుజంగ రూపం సన్త్యజ్య బభూవాథ మహాసురః ।
ఉమారూపీచ్ఛలయితుం గిరిశం మూఢచేతనః ॥24॥

మూఢచిత్తుడైన ఆ మహాసురుడు పరమశివుని మోసగించడానికి సర్పరూపాన్ని వదలి ఉమారూపాన్ని పొందాడు.

కృత్వా మాయాం తతో రూపమప్రతర్క్యమనోహరమ్ ।
సర్వావయవసంపూర్ణం సర్వాభిజ్ఞానసంవృతమ్ ॥25॥

కృత్వా ముఖాన్తరే దన్తాన్ దైత్యో వజ్రోపమాన్ దృఢాన్ ।
తీక్ష్ణాగ్రాన్ బుద్ధిమోహేన గిరిశం హన్తుముద్యతః ॥26॥

కృత్వోమారూపసంస్థానం గతో దైత్యో హరాన్తికమ్ ।
పాపో రమ్యాకృతిశ్చిత్ర భూషణామ్బరభూషితః ॥ 27॥

ఆ పాపాత్ముడు ఊహించడానికి కూడ శక్యం గాని మనోహరమైన మాయా ఉమారూపాన్ని ధరించాడు. పార్వతీదేవికి సంబంధించిన చిహ్నములతో సర్వావయసంపూర్ణుడై పార్వతివలె వున్నాడు. మరియు తన కపట బుద్ధితో పరమశివుని హతమార్చుటకై నోటిలో వజ్రం వంటి పదునైన దంతాలను అమర్చుకొన్నాడు. తర్వాత రంగు రంగుల ఆభరణాలు, వస్త్రాలు ధరించి సుందరరూపంతో శివుని సమీపానికి వెళ్ళాడు.

తం దృష్ట్వా గిరిశస్తుష్టస్తదాలింగ్య మహాసురమ్ ।
మన్యమానో గిరిసుతాం సర్వైరవయవాన్తరైః ॥28॥

అపృచ్ఛత్ సాధు తే భావో గిరిపుత్రి న కృత్రిమః ।
యా త్వం మదాశయం జ్ఞాత్వా ప్రాప్తేహ వరవర్ణిని ॥29॥

ఆమె సర్వావయవశోభి అయిన పార్వతీదేవియే అని తలచి శివుడు సంతుష్టుడై ఆ మహాసురుని ఆలింగనం చేసికొని, గిరిపుత్రీ! కృత్రిమం కాని నీ భావం ప్రశంసార్హమైంది. నా ఆశయాన్ని తెలిసికొని నీవు మరల నా దగ్గరకు రావడమే దానికి ప్రమాణం అని శివుడు మాయాపార్వతి రూపంలో వున్న ఆ అసురునితో అన్నాడు.

త్వయా విరహితం శూన్యం మన్యమానో జగత్త్రయమ్ ।
ప్రాప్తా ప్రసన్నవదనా యుక్తమేవం విధం త్వయి ॥30॥

నీవు లేని ఈ ముల్లోకాలు శూన్యమని భావిస్తున్న నా సమీపానికి నీవు రావడం ప్రీతిదాయకం. నీవీ విధంగా ఆచరించడం యుక్తమే.

ఇత్యుక్తో దానవేన్ద్రస్తు తం బభాషే స్మయన్ శనైః ।
న చాఽబుధ్యదభిజ్ఞానం ప్రాయస్త్రిపురఘాతినః ॥31॥

శివుని మాటలు విని పార్వతీదేవి రూపంలో వున్న దానవేంద్రుడు పరమశివునికి మాత్రమే తెలిసిన పార్వతీదేవి అవయవచిహ్నాలు తెలియనివాడు కావున కపటపు నవ్వుతో ఇలా అన్నాడు.

దేవ్యువాచ– దేవి చెప్పింది.

యాతాస్మ్యహం తపశ్చర్తుం వాల్లభ్యాయ తవాతులమ్ ।
రతిశ్చ తత్ర మే నాఽభూత్ తతః ప్రాప్తా త్వదన్తికమ్ ॥32॥

అసామాన్యమైన నీ ప్రేమను ఇతోధికంగా పొందాలనే కాంక్షతో తపస్సుచేయడానికి వెళ్ళాను కాని, నీవు లేకుండా నాకు ఆహ్లాదం కలుగక మరల నీ దగ్గరకు వచ్చాను.

ఇత్యుక్తః శంకరః శంకాం కాంచిత్ప్రాప్యావధారయత్ ।
హృదయేన సమాధాయ దేవః ప్రహసితాననః ॥33॥

ఆ మాటలు విన్న శివునికి సందేహము కలిగింది. వెంటనే అది ప్రకటించకుండా మనస్సును స్థిరం చేసికొని ఆ సందేహాన్ని నిర్ధారించడానికి నగుమోముతో ఇలా ఆలోచించాడు.

కుపితా మయి తన్వంగీ ప్రకృత్యా చ దృఢవ్రతా ।
అప్రాప్తకామా సంప్రాప్తా కిమేతత్సంశయో మమ ॥ 34 ॥

సౌందర్యవతియైన పార్వతి నాపై కోపగించుకొని తపస్సు చేయడానికి వెళ్ళింది. తాను సహజసిద్ధంగానే మిక్కలి దృఢమైన నియమం కలది కాని, తాను అనుకొన్న కోరిక ఫలించకుండా ఎలా తిరిగి వచ్చిందని నాకు సందేహం కలుగుతున్నది.

ఇతి చిన్త్య హరస్తస్యా అభిజ్ఞానం విధారయన్ ।
నాఽపశ్యద్వామపార్శ్వే తు తదంగే పద్మలక్షణమ్ ॥ 35 ॥

లోమావర్తం తు రచితం తతో దేవః పినాకధృక్ ।
అబుధ్యద్దానవీం మాయామాకారం గూహయంస్తతః ॥ 36 ॥

మేఢ్రే వజ్రాస్త్రమాదాయ దానవం తమసూదయత్ ।

అని శివుడు తన మనస్సులో అనుకొని వెంటనే పార్వతీదేవికి వుండే అవయవ చిహ్నాలను పరికించి చూస్తూ ఆమెకు సహజముగా ఎడమవైపు ఉండవలసిన లోమావర్తమైన పద్మాకారపు చిహ్నం లేదని పినాకపాణి గ్రహించాడు. మరియు తనయొక్క నిజస్వరూపాన్ని దాచుకొను విధమైన ఇదొక దానవమాయ అని తెలిసికొని వెంటనే తన వజ్రాస్త్రంతో ఆ 'ఆడి' అనే దానవుణ్ణి సంహరించాడు.

అబుధ్యద్వీరకో నైవ దానవేంద్రం నిషూదితమ్ ॥37॥

కాని ద్వారం దగ్గర సమీపాన ఉన్న వీరకుడు ఈ దానవసంహారం గురించి తెలుసుకోలేకపోయాడు.

హరేణ సూదితం దృష్ట్వా స్త్రీరూపం దానవేశ్వరమ్ ।
అపరిచ్ఛిన్నతత్త్వార్థా శైలపుత్ర్యై న్యవేదయత్ ॥38॥

దూతేన మారుతేనాశుగామినా నగదేవతా ।
శ్రుత్వా వాయు ముఖాద్దేవీ క్రోధరక్తవిలోచనా ।
అశపద్వీరకం పుత్రం హృదయేన విదూయతా ॥39॥

ఆ విధంగా హరునిచే వధించబడిన స్త్రీ రూపుడైన దానవేంద్రుని చూచి, వాస్తవమైన విషయాన్ని తెలిసికొనుటకై ప్రయత్నించకనే నగదేవతయైన ఆ కుసుమామోదిని వాయుదేవుని ద్వారా ఆ విషయమంతయు శైలపుత్రికి తెలిపెను. వాయుదేవుని ద్వారా అది వినిన పార్వతీదేవి క్రోధంతో ఎర్రబడిన కన్నులు కలదై హృదయంలో బాధపడుతూ పుత్రుడైన వీరకుని శపించింది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే కుమారసంభవే 'ఆడివధో' నామ
షట్ పంచాదశదధిక శతతమోఽధ్యాయః ॥40॥

శ్రీ మత్స్య మహపురాణంలో కుమారసంభవ ఘట్టంలో 'ఆడివధ' అను పేరు గల
నూట యాభైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్త పంచాశదధికశతతమోఽధ్యాయః - నూటయాబై ఏడవ అధ్యాయం

వీరకశాపః - వీరకశాపం

దేవ్యువాచ- దేవి చెప్పింది.

మాతరం మాం పరిత్యజ్య యస్మాత్త్వం స్నేహవిక్లవాత్ ।
విహితావసరః స్త్రీణాం శంకరస్య రహోవిధౌ ॥1॥

తస్మాత్తే పరుషా రూక్షా జడా హృదయవర్జితా ।
గణేశ క్షారసదృశీ శిలా మాతా భవిష్యతి ॥2॥

వీరకా! నీ యందు మిక్కిలి వాత్సల్య పరిపూర్ణురాలనైన నన్ను అనగా నీ తల్లిని కూడ లెక్కచేయక శంకరుని రహస్య ప్రదేశంలో ప్రవేశించడానికి ఇతర స్త్రీలకు అవకాశమిచ్చావు కావున పరుషమైన, క్రూరమైన, అచేతనమైన మరియు హృదయం లేని క్షారసదృశమైన శిల నీకు తల్లి అవుతుందని పార్వతీదేవి వీరకుని శపించింది.

నిమిత్తమేతద్వ్యాఖ్యాతం వీరకస్య శిలోదయే ।
సోఽభవత్ప్రక్రమేణైవ విచిత్రాఖ్యాన సంశ్రయః ॥3॥

వీరకుడు శిలనుండి ఉద్భవించడానికి కారణం ఈ శాపమే. ఇంకా క్రమక్రమంగా ఈ ఉదంతమే అనేక విచిత్ర కథాఖ్యానాలకు ఆశ్రయమైంది.

ఏవముత్సృష్టశాపాయా గిరిపుత్ర్యాస్తదన్తరమ్ ।
నిర్జగామ ముఖాత్క్రోధః సింహరూపీ మహాబలః ॥4॥

ఇలా శపించిన తత్క్షణమే పార్వతీదేవి ముఖం నుండి ఆమె క్రోధం మహాబలం గల సింహం రూపంలో బయల్పడింది.

స తు సింహః కరాలాస్యో జటాజటిలకంధరః ।
ప్రోద్ధూతలంబలాంగూలో దంష్ట్రోత్కటముఖాతటః ॥5॥

వ్యావృత్తాస్యో లలజ్జిహ్వః క్షామకుక్షిశ్చిఖాదిషుః ।
తస్యాశు వర్తితుం దేవీ వ్యవస్యత సతీ తదా ॥6॥

ఆ సింహం భీకరమైన ముఖం, జూలుతో పైకెత్తిన కంఠప్రదేశం, పొడవుగా వ్రేలాడుతున్న తోక, పదునైన కోరలు, విశాలంగా తెరిచిన నోరు, కదులుతున్న నాలుక, ఎండిన కుక్షి మొదలగు వాటితో దొరికినదానిని తినాలనే కోరిక కలిగి (చిఖాదిషుః=తినాలనే కోరికగలవాడు) వుంది. దానిని చూచిన పార్వతీదేవి ఆ సింహానికి ఆహారం కావడానికి ప్రయత్నించింది.

జ్ఞాత్వా మనోగతం తస్యా భగవాంశ్చతురాననః ।
ఆజగామాశ్రమపదం సంపదామాశ్రయం తదా ।
ఆగమ్యోవాచ దేవేశో గిరిజాం స్పష్టయా గిరా ॥7॥

ఆమె మనఃసంకల్పాన్ని తెలిసికొని చతురాననుడైన బ్రహ్మదేవుడు సకలసంపదలకు నిలయమైన ఆ పార్వతీదేవి ఆశ్రమానికి వచ్చాడు. మరియు వెంటనే స్పష్టమైన మాటలతో ఆమెతో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ - బ్రహ్మ చెప్పాడు.

కిం పుత్రి ప్రాప్తుకామాసి కిమలభ్యం దదామి తే ।
విరమ్యతామతిక్లేశాత్తపసోస్మాన్మదాజ్ఞయా ॥8॥

పుత్రీ! నీవు ఏమి పొందగోరుతున్నావు? అది ఎంత దుర్లభమైనదైనా నీకు నేనిస్తాను. నామాట విని మిక్కిలి కష్టతరమైన ఈ తపస్సు చాలించు.

తచ్ఛ్రు త్వోవాచ గిరిజా గురుం గౌరవగర్భితమ్ ।
వాక్యం వాచా చిరోద్గీర్ణవర్ణనిర్ణీతవాంఛితమ్ ॥9॥

బ్రహ్మదేవుని మాటలు విన్న గిరిజ చాలాకాలం నుండి తనలోవున్న తన రంగుమార్పునకు సంబంధించిన కోరికను స్పష్టమైన మాటలతో గౌరవపూర్వకంగా ఆ చతుర్ముఖునికి ఇలా వినిపించింది.

దేవ్యువాచ - దేవి చెప్పింది.

తపసా దుష్కరేణాప్తః పతిత్వే శంకరో మయా ।
స మాం శ్యామలవర్ణేతి బహుశః ప్రోక్తవాన్ భవః ॥10 ॥

స్యామహం కాంచనాకారా వాల్లభ్యేన చ సంయుతా ।
భర్తుర్భూతపతేరంగ మేకతో నిర్విశేఽంకవత్ ॥11॥

నేను దుష్కరమైన తపస్సు చేసి శంకరుని పతిగా పొందాను. కాని నన్ను భవుడు "శ్యామలవర్ణా" (నల్లనిదానా) అని పదేపదే అంటున్నాడు. నేను బంగారు వర్ణం (రంగు) కలదానను మరియు నా భర్తకు ప్రీతి పాత్రురాలను కావాలి. అంతేకాక భూతపతియైన నా పతి ఒడినిచేరి అతని శరీరంలో నేను (ఒక అంగం వలె) ప్రవేశించాలి. ఇదే నా తపస్సుకు కారణం.

తస్యాస్తద్భాషితం శ్రుత్వా ప్రోవాచ కమలాసనః ।
ఏవం భవ త్వం భూయశ్చ భర్తృదేహార్ధధారిణీ ॥12॥

ఆ విధమైన పార్వతీదేవి మాటలు విన్న కమలాసనుడు "నీవు కోరుకున్న విధంగా మారిపోతావు. ఇంకను నీ భర్త దేహంలో అర్ధభాగాన్ని ధరిస్తా"వని చెప్పాడు.

తతస్తత్యాజ భృంగాంగం ఫుల్లనీలోత్పలత్వచమ్ ॥13॥

ఆ విధమైన వరాన్ని పార్వతీదేవి వికసించిన నల్లకలువలను బోలిన తన శ్యామలవర్ణాన్ని వదలి పెట్టింది.

త్వచా సా చాఽభవద్దీప్తా ఘంటాహస్తా త్రిలోచనా ।
నానా భరణ పూర్ణాంగీ పీత కౌశేయధారిణీ ॥14॥

త్రిలోచన అయిన ఆ పార్వతీదేవి అనేక ఆభరణాలు దీప్తిమంతమైన శరీరపు కాంతి గలదై, చేతిలో ఘంటను పట్టుకొని పచ్చని పట్టువస్త్రాన్ని ధరించినది.

తామబ్రవీత్తతో బ్రహ్మా దేవీం నీలాంబుజత్విషమ్ ।
నిశే భూధరజాదేహసంపర్కాత్త్వం మమాజ్ఞయా ॥15॥

నల్లకలువ వంటి కాంతి గలిగిన ఆ దేవితో బ్రహ్మ ఇలా అన్నాడు. ఓ నిశా! (రాత్రి దేవీ!) పూర్వం నా ఆజ్ఞను అనుసరించే నీవు పార్వతీదేవి దేహాన్ని సంక్రమించావు.

సంప్రాప్తా కృతకృత్యత్వమేకానంశా పురా హ్యాసి ।
య ఏష సింహః ప్రోద్భూతో దేవ్యాః క్రోధాద్వరాననే ॥16॥

స తేఽస్తు వాహనం దేవి కేతౌ చాస్తు మహాబలః ।
గచ్ఛ వింధ్యాచలం తత్ర సురకార్యం కరిష్యసి ॥17॥

ఓ నిశాదేవీ! నీవు ఇంతవరకు ఆ పార్వతీదేవితో ఏకా+అనంశా అనగా ఒకటిగా మరియు అంశభూతవు కూడ అయ్యి కృతకృత్యురాలవైనావు. ఓ వరాననా! సాక్షాత్తు దేవి కోపం నుండి ఉద్భవించిన ఈ సింహం నీకు వాహనమవటమే కాక నీ ధ్వజచిహ్నంగా కూడ వుంటుంది. నీవిపుడు వింధ్యాచలానికి వెళ్ళి దేవకార్యాన్ని నెరవేరుస్తావు.

పంచాలో నామ యక్షోఽయం యక్షలక్ష పదానుగః ।
దత్తస్తే కింకరో దేవి! మయా మాయాశతైర్యుతః ॥18॥

నేను పంచాలుడనే ఈ యక్షుణ్ణి నీకు కింకరుడిగా ఇస్తున్నాను. ఇతనిని లక్షలమంది యక్షులు అనుసరిస్తారు. ఇతడు వందలాది మాయలు తెలిసినవాడు.

ఇత్యుక్తా కౌశికీ దేవీ వింధ్యశైలం జగామ హ ।

బ్రహ్మదేవుడు ఆ విధంగా చెప్పబడిన కౌశికీదేవి వింధ్యాచలానికి వెళ్ళిపోయింది. (పార్వతీదేవి దేహమనే కోశం నుండి ఉత్పన్నమైనది కావున ఈమెను 'కౌశికీ' అంటారని నిఘంటువు.)

ఉమాపి ప్రాప్తసంకల్పా జగామ గిరిశాన్తికమ్ ॥19॥

ప్రవిశన్తీం తదా ద్వారి హ్యపకృష్య సమాహితః ।
రురోధ వీరకో దేవీం హేమవేత్రలతాధరః ॥20॥

సిద్ధించిన సంకల్పం గల ఉమ కూడ పరమశివుని దగ్గరకు వెళ్ళింది. కాని శివుని అంతఃపురద్వారంలో సావధానచిత్తుడై బంగారు వేత్రలత ధరించిన వీరకుడు పార్వతీదేవిని లోపలికి ప్రవేశించకుండా అడ్డగించాడు.

తామువాచ చ కోపేన రూపాత్తు వ్యభిచారిణీమ్ ।
ప్రయోజనం న తేఽస్తీహ గచ్ఛ యావన్న భేత్స్యసి ॥21॥

దేవ్యా రూపధరో దైత్యో దేవం వంచయితుం త్విహ ।
ప్రవిష్టో న చ దృష్టోఽసౌ స వై దేవేన ఘాతితః ॥22॥

ఇంతకుముందున్న రూపంలో కాకుండా క్రొత్త రూపంలో శివుని అంతఃపురంలోకి ప్రవేశిస్తున్న ఆమెతో వీరకుడు కోపంతో ఇలా అన్నాడు. నీ కిక్కడ ఎటువంటి ప్రయోజనం వుండదు. నిన్ను చేధించివేయక ముందే ఇక్కడ నుండి వెళ్ళిపో. ఇంతకు ముందు దైత్యుడొకడు స్త్రీ రూపాన్ని ధరించి దేవదేవుని వంచించడానికి లోపలికి ప్రవేశించి పరమశివునిచే చంపబడ్డాడు. ఆ దైత్యుడలా ప్రవేశించడం నేను చూడలేకపోయాను.

ఘాతితే చాహమాజ్ఞప్తో నీలకంఠేన కోపినా ।
ద్వారేషు నావధానం తే యస్మాత్పశ్యామి వై తతః ॥23॥

భవిష్యసి న మద్వాఃస్థో వర్షపూగాన్యనేకశః ।
అతస్తేఽత్ర న దాస్యామి ప్రవేశం గమ్యతాం ద్రుతమ్ ॥24॥

ఆ దైత్యుని సంహరించిన తర్వాత నీలకంఠుడు కోపంగా నాతో ఇలా అన్నాడు. వీరకా! నీవు ద్వారం వద్ద సావధాన చిత్తుడవై వుండటం లేదు. కనుక నేనే ఆ పని చూచుకొంటాను. అనేక సంవత్సరాల పర్యంతం నీవు ఈ నా ద్వారపాలక సేవలో వుండరాదని చెప్పాడు. కావున నేనిపుడు నిన్ను లోపలికి ప్రవేశించనివ్వను. ఇక్కడి నుండి తొందరగా వెళ్ళిపొమ్ము.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే కుమారసంభవే వీరకశాపో నామ

సప్త పంచాశదధిక శతతమోఽధ్యాయః ॥ 157 ॥

మత్స్యమహాపూరాణంలో కుమారసంభవ ఘట్టంలో 'వీరకశాప' మనే

నూటయాభై ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్ట పంచాశదధిక శతతమోఽధ్యాయః – నూటయాభై ఎనిమిదవ అధ్యాయం

కుమారసంభవః – కుమారసంభవం

వీరక ఉవాచ – వీరకుడు చెప్పాడు.

ఏవముక్త్వా గిరిసుతా మాతా మే స్నేహవత్సలా ।
ప్రవేశం లభతే నాన్యా నారీ కమలలోచనే ॥ 1 ॥

ఓ కమలలోచనా! స్నేహవత్స అయి మా అమ్మ గిరిసుతకు తప్ప ఇక్కడ ఇతర స్త్రీకెవరికీ ప్రవేశం లేదు. (వీరకునికి ఇప్పుడు శివాంతఃపురంలో ప్రవేశించుటకు వచ్చింది సాక్షాత్తు పార్వతీదేవియే అని తెలియదనే విషయం పూర్వాధ్యాయంలో చెప్పబడింది).

ఇత్యుక్తా తు తదా దేవీ చిన్తయామాస చేతసా ।
న సా నారీతి దైత్యోఽసౌ వాయుర్మే యామభాషత ॥ 2 ॥

వీరకుని మాటలు విని పార్వతీదేవి మనస్సులో ఇలా ఆలోచించింది. వాయువు నాకు ఏ వ్యక్తి గురించి చెప్పాడో ఆ వ్యక్తి స్త్రీ కాదా, అతను దైత్యుడా! అని చింతించింది.

వృథైవ వీరకః శప్తో మయా క్రోధపరీతయా ।
అకార్యం క్రియతే మూఢైః ప్రాయః క్రోధసమీరితైః ॥ 3 ॥

క్రోధేన నశ్యతే కీర్తిః క్రోధో హన్తి స్థిరాం శ్రియమ్ ।
అపరిచ్ఛిన్నతత్త్వార్థా పుత్రం శాపితవత్యహమ్ ॥
విపరీతార్థబుద్ధీనాం సులభో విపదోదయః ॥ 4 ॥

క్రోధంతో అకారణంగా వీరకుని శపించాను. సాధారణంగా క్రోధానికి వశులైన వారు మూర్ఖులై చేయకూడని పని చేస్తారు. క్రోధం వలన కీర్తి నశిస్తుంది, క్రోధం వలన స్థిరమైన సంపదలు కూడ నశిస్తాయి. నేనిపుడు ఆలోచనారహితనై సత్యం తెలుసుకోకుండా పుత్రుని శపించాను. విపరీతమైన విషయాలలో బుద్ధిగల వారికి సులభంగా ఆపదలు కలుగుతాయి కదా!

సంచిన్త్యైవమువాచేదం వీరకం ప్రతి శైలజా ।
లజ్జాసజ్జవికారేణ వదనేనాంబుజత్విషా ॥ 5 ॥

పార్వతీదేవి ఇలా ఆలోచిస్తూ పద్మపుకాంతి వంటి కాంతి గలిగిన తన ముఖం వీరకుని శపించిన కారణంగా సిగ్గుతో కొంచెం కాంతిహీనం కాగా వీరకునితో ఇలా అన్నది.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

అహం వీరక తే మాతా మా తేఽస్తు మనసో భ్రమః ।
శంకరస్యాస్మి దయితా సుతా తు హిమభూభృతః ॥ 6 ॥

మమ గాత్రచ్ఛవిభ్రాన్త్యా మా శంకాం పుత్ర భావయ ।
తుష్టేన గౌరతా దత్తా మమేయం పద్మజన్మనా ॥ 7 ॥

కుమారా! వీరకా! నేను మీ అమ్మను. నీ మనస్సులో భ్రమ పడవద్దు. నేను శంకరుని అర్ధాంగిని, హిమవంతుని పుత్రికను. నా శరీరపు వర్ణం మారిందని నీవు సందేహ పడవద్దు. నేను చేసిన తపస్సుకు సంతుష్టుడై బ్రహ్మదేవుడు నాకీ గౌరత్వాన్ని (తెల్లదనాన్ని) ప్రసాదించాడు.

మయా శప్తో ఽ స్యవిదితే వృత్తాన్తే దైత్యనిర్మితే ।
జ్ఞాత్వా నారీ ప్రవేశం తు శంకరే రహసి స్థితే ॥ 8 ॥

శంకరుని రహస్య ప్రదేశంలో ఒక స్త్రీ ప్రవేశించిందని తెలిసికొని మాత్రమే నేను నిన్ను శపించాను కాని నేను దైత్యుడైన 'ఆడి' చేసిన మాయను తెలుసుకోలేకపోయాను.

న నివర్తయితుం శక్యః శాపః కిన్తు బ్రవీమి తే ।
శీఘ్రమేష్యసి మానుష్యాత్స త్వం కామసమన్వితః ॥9॥

వీరకా! ఇప్పుడు శాపాన్ని మరల్చుట సాధ్యం కాదు గాని, నీవు శీఘ్రంగానే మనుష్యజన్మను పొంది మరల మన్మథునితో పాటు నా సాన్నిధ్యానికి వస్తావని పార్వతీదేవి వీరకునికి చెప్పింది.

శిరసా తు తతో వన్ద్య మాతరం పూర్ణమానసః ।
ఉవాచార్చితపూర్ణేందుద్యుతిం చ హిమశైలజామ్ ॥ 10 ॥

అది విన్న వీరకుడు శిరస్సు వంచి తల్లికి నమస్కరించి నిండు మనస్సుతో పూర్ణచంద్రుని వంటి కాంతి గలిగిన హిమవంతుని పుత్రికతో ఇలా అన్నాడు.

వీరక ఉవాచ – వీరకుడు చెప్పాడు.

నతసురాసురమౌలిమిలన్మణి ప్రచయకాంతికరాలనఖాంకితే ।
నగసుతే! శరణాగతవత్సలే తవ నతోఽ స్మి నతార్తివినాశిని ॥ 11 ॥

వినమ్రులై నమస్కరిస్తున్న సురాసురుల శిరస్త్రాణపు మణుల కాంతితో నిమ్నోన్నతాలైన గోళ్ళు గుర్తుగా గల దేవీ! నమస్కరించిన వారి ఆర్తిని నశింపజేసే తల్లీ! నగరాజపుత్రీ! శరణాగతవత్సలా! నీకు నమస్సులు.

తపనమండలమండితకంధరే పృథు సవర్ణసువర్ణనగద్యుతే ।
విషభుజంగనిషంగవిభూషితే గిరిసుతే భవతీమహమాశ్రయే ॥12॥

సూర్యమండలం వలె అలంకృతమైన కంఠం గల ఓ జననీ! మేరుపర్వతము యొక్క బంగారు కాంతివంటి కాంతి గలదానా! విష సర్పములచే అలంకరింపబడినదానా! ఓ పార్వతీ! నిన్ను నేను ఆశ్రయిస్తున్నాను.

జగతి కః ప్రణతాభిమతం దదౌ ఝటితి సిద్ధనుతే భవతీ యథా ।
జగతి కాంచన వాంఛతి శంకరో భువనధృత్తనయే భవతీ యథా ॥13 ॥

సిద్ధుల ప్రణతులందుకొను నీవలె ప్రణతులగు వారికి! శీఘ్రముగ అభిమతములు ఇచ్చినవారు లోకమందింకె వరున్నారు? ధరణీధర (పర్వత) పుత్రీ! శంకరుడు నిన్నుగాక మరి ఏ స్త్రీని కాని కోరడు కదా!

విమలయోగవినిర్మితదుర్జయ స్వతనుతుల్య మహేశ్వరమండలే ।
విదలితాంధకబాంధవసంహతి సురవరైః ప్రథమం త్వమభిష్టుతా ॥14॥

నీవు విమలమగు యోగంతో మహేశ్వరుని వలెనే దుర్జయమగు స్వదేహకాంతిని సంపాదించితివి. అంధక బాంధవులను చీల్చినదానవు. సురవరులు కూడా మొదట నిన్నే స్తుతిస్తారు.

సితసటాపటలోద్ధతకంధరాభర మహామృగరాజరథస్థితా ।
విమలశక్తిముఖానలపింగలాయత భుజౌఘవిపిష్టమహాసురా ॥15॥

తెల్లని జూలు రాశి కలిగి గర్వముతో ఠీవిగానున్న దృఢమగు మెడగల మృగరాజనెడు రథమారోహించు దానవు, నిర్మల శక్తి కలిగిన శక్తి మొదలగు ఆయుధములు ధరించి అగ్నివలె పచ్చని జ్వలించు కాంతిగల భుజ సమూహములతో మహాసురులను పిండి చేసినదానవు.

నిగదితా భువనైరితి చండికా జనని శుంభనిశుంభనిషూదనీ
ప్రణతచింతితదానవదానవప్రమథనైకరతిస్తరసా భువి ॥16॥

అందుచేతనే జగమున 'చండిక' యని చెప్పబడినదానవు శుంభ నిశుంభుల చంపుదానవు, నీవే ప్రణతులగు వారి కోరికల నీడేర్చుదానవు, క్రొత్త (శక్తిగల) దానవుల నలుగగొట్టుటకై లోకమున శీఘ్రంగా మిక్కిలి ఆసక్తితో ప్రవర్తించుదానవు.

వియతి వాయుపథే జ్వలనోజ్జ్వలేఽవనితలే తవ దేవి చ యద్వపుః ।
తదజితేఽప్రతిమే ప్రణమామ్యహం భువనభావిని తే భవవల్లభే ॥ 17 ॥

అమ్మా! అన్ని భువనములను సృష్టించినదానా! శంకరప్రియా! ఎవరిచేతనూ జయింపబడనిదానా! సాటిలేనిదానా! అగ్నివలె ప్రకాశించేదానా! ఆకాశంలో, వాయుమార్గంలో, భూతలంలో ఉన్న నీ శరీరానికి నా నమస్కారాలు.

జలధయో లలితోద్ధతవీచయో హుతవహద్యుతయశ్చ చరాచరమ్ ।
ఫణసహస్రభృతశ్చ భుజంగమాః త్వదభిధాస్యతి మయ్యభయంకరాః ॥ 18 ॥

ఈ చరాచరప్రపంచంలో లలితాలు మరియు ఉద్ధతాలైన తరంగాలు గలిగిన సముద్రాలు, అగ్నిజ్వాలలు, వేలకొలది పడగలు గలిగిన సర్పాలు మొదలగునవేవీ నీ నామస్మరణ చేస్తున్న నాకు హాని కలిగించ లేవు.

భగవతి స్థిరభక్తిజనాశ్రయే ప్రతిగతో భవతీచరణాశ్రయమ్ ।
కరణజాతమిహాస్తు మమాచల న్నుతిలవాప్తిఫలాశయహేతుతః ॥
ప్రశమమేహి మమాత్మజవత్సలే! తవ నమోఽస్తు జగత్త్రయసంశ్రయే ।
త్వయి మమాస్తు మతిః సతతం శివే శరణగోఽస్మి నతోఽస్మి నమోఽస్తు తే ॥ 19 ॥

ఓ భగవతీ! స్థిరమైనభక్తి కలిగిన జనులకు ఆశ్రయం కల్పించుదానా! నీ చరణాలను ఆశ్రయిస్తున్నాను. అల్పమైన ఈ నా స్తుతి చేత నా ఇంద్రియాలన్నీ పవిత్రములయ్యేటట్లు ఆశీర్వదించు ఓ పుత్రవత్సలా! ఓ పుత్రవత్సలా! ఓ జగత్త్రయాశ్రయా! శాంతించు. ఓ జననీ నీకు ప్రణమిల్లుతున్నాను. ఓ శుభప్రదా! నా మనస్సు ఎల్లప్పుడు నీయందే వుండేటట్లు చేయి. తల్లీ! నిన్నే శరణు వేడుతున్నాను. నీకు నమస్కరిస్తున్నాను.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ప్రసన్నా తు తతో దేవీ వీరకస్యేతి సంస్తుతా ।
ప్రవివేశ శుభం భర్తుః భవనం భూధరాత్మజా ॥ 20 ॥

ఆ విధంగా వీరకుడు చేసిన స్తుతికి ప్రసన్నురాలై పర్వతరాజపుత్రి పార్వతీదేవి శుభప్రదమైన భర్తృగృహంలో ప్రవేశించింది.

ద్వారస్థో వీరకో దేవాన్ హరదర్శనకాంక్షిణః ।
వ్యసర్జయత్ స్వకాన్యేవ గృహాణ్యాదరపూర్వకః ॥ 21॥

అపుడు పరమశివుని దర్శనం కోసం వచ్చిన దేవతలను ద్వారం వద్దనున్న వీరకుడు ఆదరపూర్వకంగానే వారి గృహాలకు పంపివేశాడు.

నాస్త్యత్రావసరో దేవా దేవ్యా సహ వృషాకపిః ।
నిభృతః క్రీడతీత్యుక్తా యయుస్తే చ యథాగతమ్ ॥ 22 ॥

ఓ దేవతలారా! "వృషభధ్వజుడైన పరమశివుని దర్శించడానికి ఇది యోగ్యమైన సమయం కాదు. ఆ పరాత్పరుడు దేవితో కూడ రహస్యక్రీడలలో నిమగ్నుడైవున్నాడు" అని చెప్పిన వీరకుని మాటలు విని దేవతలు వచ్చినదారినే వెళ్ళిపోయారు.

గతే వర్షసహస్రం తు దేవాస్త్వరితమానసాః ।
జ్వలనం చోదయామాసుః జ్ఞాతుం శంకరచేష్టితమ్ ॥ 23 ॥

వేయిసంవత్సరాలు గడచిన తరువాత దేవతలు ఆతురతతో శంకరుడేమి చేస్తున్నాడో తెలిసికోవడానికి అగ్నిదేవుని ప్రేరేపించారు.

ప్రవిశ్య జాలరన్ధ్రేణ శుకరూపీ హుతాశనః ।
దదృశే శయనే శర్వం రతం గిరిజయా సహ ॥ 24 ॥

హుతాశనుడైన అగ్నిదేవుడు చిలుకరూపంలో ద్వారరంధ్రం ద్వారా శివుని అంతఃపురంలో ప్రవేశించి పార్వతీదేవితో కూడ శయనంపై వున్న శివుని చూచాడు.

దదృశే తం చ దేవేశో హుతాశం శుకరూపిణమ్ ।
తమువాచ మహాదేవః కించిత్కోపసమన్వితః ॥ 25 ॥

దేవేశుడైన మహాదేవుడు కూడ చిలుక రూపంలో వున్న అగ్నిదేవుని చూచి కొంచెం కోపంతో ఇలా అన్నాడు.

శర్వ ఉవాచ – శర్వుడు చెప్పాడు.

యస్మాత్తు త్వత్కృతో విఘ్న స్తస్మాత్త్వయ్యుపపద్యతే ।
ఇత్యుక్తః ప్రాంజలిర్వహ్ని రపిబత్ వీర్యమాహితమ్ ॥ 26 ॥

ఈ సంభోగ సమయంలో నీ వలన విఘ్నం కలిగింది కావున వీర్యాన్ని నీవే భరించవలసింది అని శివుడు చెప్పిన మాటలు విన్న అగ్నిదేవుడు అంజలి పట్టి వీర్యాన్ని త్రాగాడు.

((1) "నిషిక్తమర్ధం దేవ్యాం వై శుక్రస్య శుకవిగ్రహః ।
లజ్జయా విరతిస్థాయాం త్వమర్ధం పిబ పావక " ॥

అనే ఈ శ్లోకం శ్రీ కే.యల్. జోషిగారు సంస్కరించిన 'పరిమల్ పబ్లికేషన్ వారి ప్రతిలో కనబడుట లేదు. కాని ఈ శ్లోకం ఇక్కడ లేకపోతే అర్థం పొసగక పోవచ్చు.

"దేవియందు నేను వదలిన శుక్రంలో అర్ధభాగం ఇవతలే ఉండిపోయింది. నీవు ఇక్కడకు రావడం వలన ఆమె సిగ్గుతో దానిని గ్రహించే స్థితిలో లేనట్లు కనబడుతున్నది. పావకా! నీ వలన విఘ్నం కలిగింది. కనుక ఈ అర్ధభాగాన్ని నీవే త్రాగవలసింది" అని శివుడు అగ్నిదేవునికి చెప్పిన మాటలు కొన్ని ప్రతులలో వున్నాయి. అవి ఈ సందర్భంలో ఇక్కడ తెలిసికోవడం అవసరం.)

తేనాపూర్యత తాన్ దేవాన్ తత్తత్కాయవిభేదతః ।
విపాట్య జఠరం తేషాం వీర్యం మాహేశ్వరం తతః ॥ 27 ॥

నిష్క్రాన్తం తప్తహేమాభం వితతే శంకరాశ్రమే ।
తస్మిన్ సరో మహజ్జాతం విమలం బహుయోజనమ్ ॥ 28 ॥
ప్రోత్ఫుల్లహేమకమలం నానావిహగనాదితమ్ ॥

తరువాత అగ్ని ఆ వీర్యాన్ని ఆయా దేవతల పరిమితిని అనుసరించి వారి ఉదరాలలో నింపాడు. కాని మహేశ్వరునికి సంబంధించిన ఆ వీర్యం వారి ఉదరాలలో ఉండలేక వాటిని ఛేదించుకుని బయటకు వచ్చి, మెరుగు పెట్టిన బంగారపు కాంతి గల ఆ వీర్యం శంకరుని నివాసానికి సమీపంలో వున్న సరస్సులోకి ప్రవేశించింది. ఆ సరస్సు బహుయోజన విస్తీర్ణమై, వికసించిన అనేక కమలాలు మరియు పక్షుల కిలకిలారావాలతో నిండి వుంది.

తచ్ఛ్రుత్వా తు తతో దేవీ హేమద్రుమమహాజలమ్ ॥ 29 ॥

జగామ కౌతుకావిష్టా తత్సరః కనకాంబుజమ్ ॥
తత్ర కృత్వా జలక్రీడాం తదబ్జకృతశేఖరా ॥ 30 ॥

బంగారు వృక్షాలతో నిండిన జలం గల ఆ సరస్సు గురించి విని పార్వతీదేవి మిక్కిలి కుతూహలంతో బంగారు పద్మాలు గల ఆ సరస్సుకు వెళ్ళింది. మరియు ఆ సరస్సులో స్నానం చేసి కొప్పులో పద్మాన్ని ధరించింది.

ఉపవిష్టా తతస్తస్య తీరే దేవీ సఖీయుతా ।
పాతుకామా చ తత్తోయం స్వాదు నిర్మలపంకజమ్ ॥ 31 ॥

తర్వాత సఖురాళ్ళతో కూడ ఆ సరస్సు ఒడ్డున కూర్చుని నిర్మలమైన, పంకజాలు గల మరియు రుచివంతాలైన ఆ సరస్సులోని జలాన్ని త్రాగదలచింది.

అపశ్యత్ కృత్తికాః స్నాతాః షడర్కద్యుతిసన్నిభమ్ ।
పద్మపత్రే తు తద్వారి గృహీత్వోపస్థితా గృహమ్ ॥ 32 ॥

హర్షాదువాచ పశ్యామి పద్మపత్రే స్థితం పయః ।
తతస్తా ఊచురఖిలం కృత్తికా హిమశైలజామ్ ॥ 33 ॥

అప్పుడు ఆరుగురు కృత్తికానక్షత్రదేవతలు ఆ సరస్సులో స్నానం చేసి సూర్యునితో సమానమైన కాంతి గలిగిన సరస్సునీటిని తామరాకులోకి తీసుకొని తమ గృహానికి బయలుదేరి వెడుతూండగా తామరాకులో వున్న ఆ నీటిని ఆ సరస్సు ఒడ్డున వున్న పార్వతీదేవి చూసింది. తాను చూశానని సంతోషంతో చెప్పింది. అది విన్న కృత్తికలు పార్వతితో వివరంగా ఇలా అన్నారు.

కృత్తికాః ఊచుః - కృత్తికలు చెప్పారు.

దాస్యామో యది తే గర్భః సంభూతో యో భవిష్యతి ।
యోఽస్మాకమపి పుత్రః స్యాదస్మన్నామ్నా చ వర్తతామ్ ॥
భవేల్లోకేషు విఖ్యాతః సర్వేష్వపి శుభాననే ॥

ఓ శుభాననా! దేవీ! ఈ నీరు త్రాగడం వలన నీవు గర్భం ధరించి ఏ పుత్రునికైతే జన్మనిస్తావో అతను మాకు కూడ కుమారుడై మా పేరుతోనే లోకాలన్నింటిలో విఖ్యాతుడవటానికి నీవు అంగీకరిస్తే మేము ఈ జలము నిస్తామని కృత్తికలు పార్వతికి చెప్పారు.

ఇత్యుక్తోవాచ గిరిజా కథం మద్గాత్రసంభవః ।
సర్వై రవయవైర్యుక్తో భవతీభ్యః సుతో భవేత్! ॥ 35 ॥

కృత్తికలు చెప్పిన ఆ మాటలు విని పార్వతీదేవి “నా శరీరం నుండి జన్మించి, నన్ను బోలిన అవయవాలు గల నా పుత్రుడు మీ కుమారుడెలా అవుతాడని అడిగింది.

తతస్తాం కృత్తికా ఊచుర్విధాస్యామోఽస్య వై వయమ్ ।
ఉత్తమాన్యుత్తమాంగాని యద్యేవం తు భవిష్యతి ॥ 36 ॥

అయితే మేము ఈ బాలునికి మంచి ఉత్తమాంగాలను అనగా శిరస్సులను ఏర్పరచడానికి అంగీకరించుము అని ప్రార్థించారు.

ఉక్తా వై శైలజా ప్రాహ భవత్వేవమనిన్దితాః ।

వారు ఆ విధంగా ప్రార్థించగా శైలజ "ఓ పవిత్రులారా! అలాగే కానిండు" అని చెప్పింది.

తతస్తా హర్షసంపూర్ణాః పద్మపత్రస్థితం పయః ॥ 37 ॥
తస్యై దదుస్తయా చాపి తత్పీతం క్రమశో జలమ్ ॥

అప్పుడు ఆ కృత్తికలు సంతోషంతో నిండిన మనస్సులతో తామరాకులోని జలాన్ని పార్వతీదేవి కిచ్చారు. ఆమె కూడ సావధానంగా ఆ నీరు త్రాగింది.

పీతే తు సలిలే తస్మింస్తతస్తస్మిన్సరోవరే ॥ 38 ॥

విపాట్య దేవ్యాశ్చ తతో దక్షిణాం కుక్షిముద్గతః ।
నిశ్చక్రామాద్భుతో బాలః సర్వలోకవిభాకరః ॥ 39 ॥

ఆ విధంగా ఆ సరోవరజలాన్ని త్రాగిన వెంటనే దేవి యొక్క దక్షిణకుక్షిని చీల్చుకొని అద్భుతమైన మరియు సర్వలోకాలను ప్రకాశింపజేసే బాలుడుద్భవించాడు.

ప్రభాకర ప్రభాకారః ప్రకాశకనకప్రభః ।
గృహీత నిర్మలోదగ్రశక్తిశూలః షడాననః ॥ 40 ॥

ఆ బాలుడు సూర్యుని వంటి కాంతి కలవాడు, మేలిమిబంగారమువలె ప్రకాశించేవాడు, నిర్మలమైన పదునైన అంచులుగల 'శక్తి' అనే ఆయుధాన్ని ధరించినవాడు మరియు ఆరు కృత్తికానక్షత్రముల నుండి ఏర్పడినవాడు కనుక ఆరు ముఖాలు కలవాడై వున్నాడు. (షణ్ముఖుడు)

దీప్తో మారయితుం దైత్యాన్ కుత్సితాన్ కనకచ్ఛవిః ।
@Ôk Í ˆÔ ØÐ ²< ê ÅÉe Ös ÁÐ| ¾k þe_ భవత్ ॥ 41 ॥

దీప్తిమంతుడై, బంగారంవంటి కాంతి కలవాడై, దుష్టులైన దైత్యులను హతమార్చడానికి ఉద్భవించాడు. కావున ("కు+మార") కుమారుడని ప్రసిద్ధుడయ్యాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే తారకోపాఖ్యానే కుమారసంభవో నామ
అష్టపంచాశదధిక శతతమోఽధ్యాయః ॥158॥

మత్స్యమహాపురాణంలో తారకోపాఖ్యానంలో 'కుమార సంభవ' మనే
నూట యాభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోన షష్ట్యధిక శతతమోఽధ్యాయః - నూటయాభై తొమ్మిదవ అధ్యాయం
దేవాసురసంగ్రామే రణోద్యోగః - దేవాసురసంగ్రామంలో యుద్ధసన్నాహం

వామం విదార్య నిష్క్రాన్తః సుతో దేవ్యాః పునః శిశుః ।
స్కందాచ్చ వదనే వహ్నే శుక్రాత్సువదనోఽరిహా ॥ 1 ॥

ఆ తర్వాత మరల పార్వతీదేవి ఉదరపు ఎడమభాగాన్ని చీల్చుకొని ఇంకొక శిశువు ఉద్భవించాడు. ఇతడు కూడా పరమశివునినుండి అగ్నిదేవుని నోటిలోకి స్కందమైన అనగా జారిన వీర్యం నుండి సువదనుడై శత్రు సంహారకుడై జన్మించిన శిశువే.

కృత్తికామేలనాదేవ శాఖాభిః సవిశేషతః ।
శాఖాభిధాః సమాఖ్యాతాః షట్సు వక్త్రేషు విస్తృతా ॥ 2 ॥

యతస్తతో విశాఖోఽసౌ ఖ్యాతో లోకేషు షణ్ముఖః ।
స్కందో విశాఖః షడ్వక్త్రః కార్తికేయశ్చ విశ్రుతః ॥ 3 ॥

కృత్తికలు ఆ శిశువు ఆరు శిరస్సులను ఒకటిగా కలిపారు. ఆరు ముఖాలుగా విస్తరిల్లిన ఆ కుమారుని రూపభేదాలకే శాఖలు అని ప్రసిద్ధి. మరియు విశేషించి ఒకటిగా చేయబడిన ఆరు ముఖములు (శాఖలు) కలవాడు కావున లోకమునందు ఆ శిశువు విశాఖుడని, షణ్ముఖుడని ప్రసిద్ధి పొందాడు. ఇంకనూ శివునినుండి అగ్నిదేవుని ముఖంలో స్కందించిన (జారిపడిన) వీర్యంనుండి జన్మించడంవలన 'స్కందుదు' అని, కృత్తికాదులకు జన్మించటం వలన 'కార్తికేయుడని' కూడ ప్రసిద్ధి పొందాడు.

చైత్రస్య బహులే పక్షే పంచదశ్యాం మహాబలౌ ।
సంభూతావర్కసదృశౌ విశాలే శరకాననే ॥ 4 ॥

చైత్రమాసపు బహుళపక్షంలో అమావాస్య రోజున మహాబలులు, సూర్యసమాన కాంతిమంతులూ అయిన వీరిద్దరు విశాలమైనశరవనంలో (శరవణమని ప్రసిద్ధి) జన్మించారు.

చైత్రస్యైవ సితే పక్షే పంచమ్యాం పాకశాసనః ।
బాలకాభ్యాం చకారైకం మత్వా చామర భూతయే ॥ 5 ॥

అమావాస్యనాడు జన్మించిన వీరిని ఆరవరోజున చైత్రశుక్లపంచమినాడు ఇంద్రుడు దేవతలక్షేమానికై ఈ ఇద్దరు బాలుర కలయికతో ఒకే శిశువును నిర్మించెను. (ఉత్తర భారతదేశంలో కృష్ణపక్షము ముందు, శుక్లపక్షము తర్వాత లెక్కిస్తారు.)

తస్యామేవ తతః షష్ఠ్యామభిషిక్తో గుహఃప్రభుః ।
సర్వైరమరసంఘాతైః బ్రహ్మేంద్రోపేంద్రభాస్కరైః ॥ 6 ॥

గన్ధమాల్యైః శుభైర్ధూపైస్తథా క్రీడనకై రపి ।
ఛత్రైశ్చామరజాలైశ్చ భూషణైశ్చ విలేపనైః ॥ 7 ॥
అభిషిక్తో విధానేన యథావత్ షణ్ముఖః ప్రభుః ।

ఆ తర్వాత చైత్రశుక్ల షష్ఠి తిథినాడు ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు, సూర్యుడు మరియు అనేకదేవతల సమూహాల సమక్షంలో సమర్థుడైన ఈ గుహుని దేవతల సేనానాయకునిగా అభిషేకించారు. గంధమాల్యాలు, సుగంధధూపాలు, మరియు ఛత్రాలు, చామరాలు, ఆభరణాలు, విలేపనాలు మొదలగు వాటిచే యథావిధిగా షణ్ముఖుని సేనా నాయకునిగా అభిషేకించారు.

సుతామస్మై దదౌ శక్రో దేవసేనేతి విశ్రుతామ్ ॥ 8 ॥

పత్న్యర్థం దేవదేవస్య దదౌ విష్ణుస్తదాయుధాన్ ।
యక్షాణాం దశలక్షాణి దదావస్మై ధనాధిపః ॥ 9 ॥

తర్వాత ఇంద్రుడు దేవదేవుడైన ఈ గుహునకు పత్నిగా తన పుత్రికయైన దేవసేనను ఇచ్చాడు. అప్పుడే శ్రీ మహావిష్ణువు ఇతనికి అనేక ఆయుధాలను, ధనాధిపుడైన కుబేరుడు పదిలక్షల యక్షులను కానుకగా ఇచ్చారు.

దదౌ హుతాశనస్తేజో దదౌ వాయుశ్చ వాహనమ్ ।
దదౌ క్రీడనకం త్వష్టా కుక్కుటం కామరూపిణమ్ ॥ 10 ॥

ఏవం సురాస్తు తే సర్వే పరివారమనుత్తమమ్ ।
దదుర్ముదితచేతస్కాః స్కన్దాయాదిత్యవర్చసే ॥ 11 ॥

మరియు అగ్ని తన తేజస్సును, వాయువు వాహనాన్ని, త్వష్ట కామరూపియైన కుక్కుటమనే ఆటవస్తువును మరియు దేవతలందరు ఉత్తమమైన పరివారగణాన్ని సూర్యునివంటి తేజోవంతుడైన ఆ స్కందునికి సంతుష్టాంతరంగులై ఇచ్చారు.

జానుభ్యామవనౌ స్థిత్వా సురసంఘాస్తమస్తువన్ ।
స్తోత్రేణానేన వరదం షణ్ముఖం ముఖ్యశః సురాః ॥ 12 ॥

దేవతలందరు మోకాళ్ళతో భూమిపై నిలచి వరదుడైన షణ్ముఖుని ఈ (చెప్పబోవు) స్తోత్రంతో స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

నమః కుమారాయ మహాప్రభాయ స్కందాయ చ స్కందితదానవాయ ।
నవార్కవిద్యుద్ద్యుతయే నమోఽస్తు తే నమోఽస్తుతే షణ్ముఖ కామరూప ॥ 13 ॥

పినద్ధనానాభరణాయ భర్త్రే నమో రణే దారుణదారుణాయ ।
నమోఽస్తు తేఽర్కప్రతిమప్రభాయ నమోఽస్తు గుహ్యాయ గుహాయ తుభ్యమ్ ॥ 14 ॥

మహత్తరమైన కాంతి గలవాడు, దానవులను నశింపజేసేవాడు, అయిన కుమారునికి, స్కందునికి, షణ్ముఖునికి నమస్సులు. వివిధాలైన ఆభరణాలను ధరించినవాడు, యుద్ధంలో అనేకమంది దానవులను సంహరింపజేసేవాడు, రవిసమానతేజోవంతుడు అయిన గుహునికి నమస్కారాలు.

నమోஉస్తు త్రైలోక్యభయాపహాయ నమోஉస్తు తే బాలకృపాపరాయ ।
నమో విశాలామలలోచనాయ నమో విశాఖాయ మహావ్రతాయ ॥ 15 ॥

ముల్లోకాల భయాన్నిపోగొట్టే వాడు, బాలుడును, కృపాపరుడు, విశాలమైన మరియు నిర్మలమైన కన్నులు కలవాడు, విశాలుడు అని ప్రసిద్ధనామం గలవాడు, శ్రేష్ఠవ్రతుడు అయిన కుమారునకు నమస్కారం.

నమో నమసేஉస్తు మనోహరాయ నమో నమస్తేஉస్తు రణోత్కటాయ ।
నమో మయూరోజ్జ్వలవాహనాయ నమోஉస్తు కేయూరవరాయ తుభ్యమ్ ॥16 ॥

నమో ధృతోదగ్రపతాకినే నమో నమః ప్రభావ ప్రణతాయ తేஉస్తు ।
నమో నమస్తే వరవీర్యశాలినే క్రియాపరాణాం భవభవ్యమూర్తయే ॥ 17 ॥

మనోహరుడవు, యుద్ధమునందు శక్తిగలవాడవు ఉజ్జ్వలమైన మయూర వాహనం కలవాడవు, మంచి భుజకీర్తులు ధరించినవాడవు అయిన ఓ కుమారా! నీకు నమస్సులు. ఉగ్రమైన మరియు ఉన్నతమైన పతాకాన్ని ధరించినవాడవు, ప్రభావశాలురచేత కూడ ప్రణతులందుకొనేవాడవు, గొప్ప ప్రతాపం కలవాడవు, క్రియాపరులైన వారిపట్ల మక్కువ గలవాడవు, మంగళప్రదమైన మూర్తిస్వరూపం గలవాడవు అయిన ఓ కుమారా! నీకు నమస్సులు.

క్రియాపరా యజ్ఞపతిం చ స్తుత్వా విరేమురేవం హ్యమరాధిపాద్యాః ।
ఏవం తదా షడ్వదనం తు సేంద్రాః ముదా సుతుష్టశ్చ గుహస్తతస్తాన్ ॥
నిరీక్ష్య నేత్రైరమలైః సురేశాన్ శత్రూన్ హనిష్యామి గతజ్వరాః స్థ ॥ 18 ॥

క్రియాపరులైన ఇంద్రాది దేవతలందరు యజ్ఞపతియైన కుమారుని ఈ విధంగా స్తుతించి నమస్కరించారు. అప్పుడు షడాననుడైన కుమారుడు మిక్కిలి సంతుష్టుడై నిర్మలమైన నేత్రాలతో ఇంద్రాదిదేవతలందరిని చూచి నేను శత్రువులందరిని సంహరిస్తాను. మీరిక నిర్భయులుగా వుండండని చెప్పాడు.

కుమార ఉవాచ – కుమారుడు చెప్పాడు

కం వః కామం ప్రయచ్ఛామి దేవతా బ్రూత నిర్వృతాః ।
యద్యప్యసాధ్యం హృద్యం వో హృదయే చిన్తితం పరమ్ ॥ 19 ॥

"ఓ దేవతలారా! మీ కోరిక ఏమిటో నిస్సందేహంగా చెప్పండి. మీ మనఃసంకల్పమేమిటో వివరించండి. అది ఎంతటి అసాధ్యమైనదైనప్పటికి నేను తీరుస్తాను" అని కుమారుడు దేవతలకు చెప్పాడు.

ఇత్యుక్తాస్తు సురాస్తేన స్తుత్వా ప్రణతమౌలయః ।
సర్వ ఏవ మహాత్మానం గుహం తద్గతమానసాః ॥ 20 ॥

గుహుడు ఆ విధంగా చెప్పగా దేవతలందరు అతనికి శిరస్సు వంచి నమస్సులర్పించి ఆయనయందే మనస్సు నుంచి మహాత్ముడైన గుహునితో ఇలా అన్నారు.

దైత్యేన్ద్రస్తారకో నామ సర్వామరకులాన్తకృత్ ।
బలవాన్ దుర్జయో దుష్టో దురాచా రోతిఽకోపనః ॥
తమేవ జహి హృద్యోఽర్థ ఏషోఽస్మాకం భయాపహః ॥ 21 ॥

దేవతల కులనాశకుడైన తారకుడనే దైత్యేంద్రుడున్నాడు. అతడు మిక్కిలి బలవంతుడు, జయించుటకు శక్యం కానివాడు, దుష్టుడు, దురాచారుడు మరియు అతికోపిష్ఠి. ఆ దైత్యేంద్రుడు మాకు భయం కలిగిస్తున్నాడు. అతనిని నీవు సంహరించాలి. అదే మా హృదయమందున్న కోరిక.

ఏవముక్తస్తథేత్యుక్త్వా సర్వామరపదానుగః ।
జగామ జగతాం నాథః స్తూయమానోఽమరేశ్వరైః ॥ 22 ॥
తారకస్య వధార్థాయ జగతః కంటకస్య వై ॥

దేవతలు ఆ విధంగా చెప్పగా కుమారస్వామి వెంటనే దానికి అంగీకరించాడు. మరియు దేవతలందరూ తనను స్తుతిస్తూ వెంట రాగా జగన్నాథుడు జగత్తుకు కంటకుడైన తారకాసురుని వధించడానికి బయల్దేరాడు.

తతశ్చ ప్రేషయామాస శక్రో లబ్ధసమాశ్రయః ॥ 23 ॥
దూతం దానవసింహస్య పరుషాక్షరవాదినమ్ ।
స తు గత్వాఽబ్రవీద్దైత్యం నిర్భయో భీమదర్శనః ॥ 24 ॥

అప్పుడు తనకు దృఢమైన సమాశ్రయం దొరకడం వలన ఇంద్రుడు దానవసింహుడైన తారకాసురుని వద్దకు పరుషంగా మాట్లాడగల, భీకరాకారంగల మరియు భయరహితుడైన ఒక దూతను పంపాడు. ఆ దూత కూడ ఆ అసురుని వద్దకు వెళ్ళి ఇలా చెప్పాడు.

దూత ఉవాచ – దూత చెప్పాడు.

శక్రస్త్వామాహ దేవేశో దైత్యకేతో దివస్పతిః ।
తారకాసుర తచ్ఛ్రుత్వా ఘట శక్త్యా యథేచ్ఛయా ॥ 25 ॥

యజ్జగద్దలనాదాప్తం కిల్బిషం దానవ త్వయా ।
తస్యాహం శాసకస్తేఽద్య రాజాస్మి భువనత్రయే ॥ 26 ॥

"ఓ తారకాసురా! దేవేశుడు, స్వర్గపతియైన ఇంద్రుడు నీకీవిధంగా చెబుతున్నాడు. అది విని నీకు తోచినట్లు నీ శక్తికి తగినట్లు యథేచ్ఛగా చేయి. ఓ దానవా! నీవు ముల్లోకాలకు బాధ కలిగించి పాపం పొందావు. భువనత్రయ పాలకుడనైన నేనిప్పుడు నిన్ను నియంత్రిస్తాను." అని ఇంద్రుని దూత తారకాసురునికి చెప్పాడు.

శ్రుత్వైతద్దూతవచనం కోపసంరక్తలోచనః ।
ఉవాచ దూతం దుష్టాత్మా నష్టప్రాయవిభూతికః ॥ 27 ॥

దూతవచనం విని, కోపంతో ఎఱ్ఱబడిన కన్నులుగలవాడై దుష్టాత్ముడు మరియు నశించబోయే వైభవం గలవాడూ అయిన తారకాసురుడిలా అన్నాడు.

తారక ఉవాచ – తారకుడు చెప్పాడు

దృష్టం తే పౌరుషం శక్ర రణేషు శతశో మయా ।
నిస్త్రపత్వాన్న తే లజ్జా విద్యతే శక్ర దుర్మతే ॥ 28 ॥

ఇంద్రా! నేను వందలసార్లు యుద్ధరంగంలో నీ పౌరుషాన్ని చూచాను. ఓ దుర్మతీ! నీకు సిగ్గు, బిడియం రెండూ లేవు.

ఏవ ముక్తే గతే దూతే చిన్తయాయాస దానవః ।
నాలబ్ధసంశ్రయః శక్రో వక్తుమేవం హి చార్హతి ॥ 29 ॥

జితః స శక్రో నోఽ కస్మాజ్జాయతే సంశ్రయాశ్రయః ।
నిమిత్తాని చ దుష్టాని సోఽ పశ్యద్దుష్టచేష్టితః ॥ 30 ॥

దూత ఆ విధంగా చెప్పి వెళ్ళిన తరువాత దానవుడిలా చింతించసాగాడు. "ఇంద్రునికి ఏదో ఒక బలమైన ఆశ్రయం దొరుకనిదే ఈ విధంగా పలుకలేడు. అనేకసార్లు మాతో ఓడిపోయిన ఇంద్రుడు అకస్మాత్తుగా ఏదో ఒక అండ దొరకనిదే ఇలా మాట్లాడడని సందేహం కలుగుతున్నది." అని దుర్మార్గుడైన తారకుడు ఆలోచిస్తూండగానే చెడు శకునాలు కనబడసాగినవి.

పాంసువర్షమసృక్పాతం గగనాదవనీతలే ।
భుజనేత్రప్రకంపం చ వక్త్రశోషం మనోభ్రమమ్ ॥ 31 ॥

స్వకాన్తావక్త్రపద్మానాం మ్లానతాం చ వ్యలోకయత్ ।
దుష్టాంశ్చ ప్రాణినో రౌద్రాన్ సోఽ పశ్యద్దుష్టవేదినః ॥ 32 ॥

ఆకాశము నుండి ధూళి వర్షము మరియు రక్తపాతం నేలపై వర్షించడం, (ఎడమ) భుజం, నేత్రం మొదలగునవి అదరటం, నోరు ఎండిపోవటం, చిత్తభ్రమ కలగటం మరియు పద్మాలనుబోలిన తన భార్యల ముఖాలు వాడిపోవుట, దుష్టులైన ప్రాణులు రౌద్రరూపాన్ని పొందటం మొదలైన అనేక చెడు శకునాలు దుష్టతారకునికి కనబడినాయి.

తదచిన్త్యైవ దితిజో న్యస్తచింతోఽ భవత్ క్షణాత్ ।

అయినను ఆ దుశ్శకునాలను లెక్కచేయక క్షణంలో నిశ్చింతగా వున్నాడు.

యావద్గజఘటాఘణ్టారణత్కారరవోత్కటామ్ ॥ 33 ॥

తద్వత్తురగసంఘాతక్షుణ్ణభూరేణుపింజరామ్ ।
చంచలస్యందనోదగ్రధ్వజరాజివిరాజితామ్ ॥ 34 ॥

విమానై శ్చాద్భుతాకారై శ్చలితామరచామరైః ।
తాం భూషణనిబద్ధాం చ కిన్నరోద్గీతనాదితామ్ ॥ 35 ॥

నానానాకతరూత్ఫుల్ల కుసుమాపీడధారిణీమ్ ।
వికోశాస్త్ర పరిష్కారాం వర్మనిర్మలదర్శనామ్ ॥ 36 ॥

బంద్యు ద్ఘుష్టస్తుతిరవాం నానా వాద్య నినాదితామ్ ।
సేనాం నాకసదాం దైత్యఃప్రాసాదస్థో వ్యలోకయత్ ॥ 37 ॥

ఇంతలో గజసమూహాల ఘంటారావాలతో ఉత్కటమైన రణధ్వని గల, అశ్వాల గుంపుల గిట్టలచే నలిగిన ధూళిరేణువులతో ఎఱ్రబడిన భూప్రదేశం గల, వేగవంతాలు, ఉగ్రాలు మరియు ధ్వజాలతో ప్రకాశిస్తున్న రథపంక్తి గల, మరియు అద్భుతాకారం గలిగిన విమానాలతో కదులుతున్న దేవతల చామరాలతో, అనేక ఆభరణాలతో, హెచ్చు స్వరంతో పాడుతున్న కిన్నరుల గీతాలతో, స్వర్గలోకంలోని అనేక వృక్షాలలో వికసించిన పుష్పగుత్తులను ధరించి ఖడ్గాద్యాయుధాలతో, విభిన్నమైన అస్త్రాలతో, శోభిల్లుతూ, ఉచ్చస్వరంతో పాడుతున్న వందిమాగధులతోనూ వివిధ వాద్య ధ్వనులతోనూ కూడిన దేవతల సైన్యాన్ని తారకాసురుడు తన భవనప్రాసాదం నుండి చూశాడు.

చిన్తయామాస స తదా కించిదుద్భ్రాన్తమానసః ।
అపూర్వకో భవేద్యోద్ధా యో మయా న వినిర్జితః ॥ 38 ॥

అలా ఆ దేవసైన్యాన్ని చూచి తారకాసురుడు అప్పుడు ఉద్విగ్న మనస్సుతో నేను జయించని ఈ నూతన యోధుడెవరై వుంటాడని చింతించాడు.

తతశ్చిన్తాకులో దైత్యః శుశ్రావ కటుకాక్షరమ్ ।
సిద్ధవన్దిభిరుద్ఘుష్టమిదం హృదయదారుణమ్ ॥ 39 ॥

ఆ విధంగా చింతాక్రాంతుడైన దైత్యుడు పరుషాక్షరాలతో వందిజనులు బిగ్గరగా పాడుతున్న తన హృదయ విదారకమైన ఈ గాథ విన్నాడు.

అథ గాథా – ఆ గాథ ఇలా ఉంది.

జయాతులశక్తిదీధితిపింజర భుజదండచండరణరభస ।
సురవదనకుముదకాననవికాసనేన్దో! కుమార జయ దితిజకులమహోదధివడవానల! ॥ 40 ॥

అసమానమైన శక్తితో మరియు వివిధ ఆయుధాల కాంతులతో పింజరవర్ణం పొందిన వాడా! భుజదండాలతో ప్రచండమైన యుద్ధావేశం కలవాడా ! దేవతల ముఖాలనే కలువలను వికసింపజేసే చంద్రుడా! కుమారులలో శ్రేష్ఠుడా! దైత్యవంశమనే మహాసముద్రమునకు బడబాగ్ని వంటివాడా! నీకు జయము, నీకు జయము.

షణ్ముఖ మధురరవమయూరరథ! సురముకుట కోటిఘట్టితచరణనఖాంకుర మహాసన! ।
జయ లలిత చూడాకలాపనవవిమలదల కమలకాన్త! దైత్యవంశదుఃసహదావానల! ॥ 41 ॥

షణ్ముఖా! మధురధ్వనిగల మయూరవాహనం గలవాడా ! దేవతల కిరీటపు కాంతులతో ప్రకాశిస్తున్న మహోన్నతాసనం కలవాడా! నీకు జయము. నిర్మలమైన, అప్పుడే వికసించిన కమలముల వంటి కాంతి గలవాడా! దైత్య వంశానికి సహింపరాని దావానలం వంటివాడా! నీకు జయము.

జయ విశాఖ విభో జయ సకలలోకతారక! ।
స్కంద జయ గౌరీనందన ఘంటాప్రియ ॥
ప్రియవిశాఖవిభో! ధృతపతాకప్రకీర్ణపటుల
కనకభూషణసుభాదినకరచ్ఛాయ! ॥ 42 ॥

ఓ విశాఖుడా! ఓ ప్రభూ! సకలలోకాలను తరింపజేసేవాడా! ఓ స్కందా! నీకు జయము నీకు జయము. గౌరీనందనుడా! ఘంటాప్రియుడా! ప్రకీర్ణాలైన బంగారపు ఆభరణకాంతులతో మెరుస్తున్న సూర్యుని వంటివాడా! నీకు నీకు జయము, నీకు జయము.

జయ జనితసంభ్రమలీలాలూనాఖిలారాతే ।
జయ సకలలోకతారక! దితిజాసురవరతారకాన్తక!
స్కన్ద! జయ బాల సప్తవాసర! జయ భువనావలి శోక వినాశన! ॥ 43 ॥

యుద్ధసంరంభంలో అలవోకగా శత్రువులందరినీ నశింపజేసేవాడా! నీకు జయము. సకలలోక తారకుడా! నీకు జయము. దితి సంతానంలో శ్రేష్ఠుడైన తారకాసుర సంహారకా! నీకు జయము. ఓ స్కంద నామధేయుడా! ఏడు రోజుల బాలుడా! భువనసమూహశోకనిర్మూలకా! నీకు జయము.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దేవాసురసంగ్రామే రణోద్యోగోనామ
ఏకోన షష్ట్యధికశతతమోఽధ్యాయః ॥159॥

శ్రీమత్స్య మహాపురాణంలోని దేవాసురసంగ్రామంలో యుద్ధసన్నాహమనే
నూటయాభై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



షష్ట్యధికశతతమోఽధ్యాయః - నూట అరవైయవ అధ్యాయం

తారకవధః - తారకవధ

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

శ్రుత్వైతత్తారకః సర్వముద్ఘుష్టం దేవవన్దిభిః ।
సస్మార బ్రహ్మణో వాక్యం వధం బాలాదుపస్థితమ్ ॥ 1 ॥

వందిమాగధులు ఉన్నత స్వరంతో ఆలపించిన ఆ స్తోత్రాలను, జయధ్వానాలను విని తనకు బాలుని వలన మరణం ప్రాప్తిస్తుందన్న బ్రహ్మదేవుని వాక్యాలు స్మరించుకొన్నాడు.

స్మృత్వా ధర్మం హ్యవర్మాంగః పదాతిరపదానుగః ।
మన్దిరాన్నిర్జగామాశు శోకగ్రస్తేన చేతసా ॥ 2 ॥

అప్పుడు ధర్మాన్ని స్మరించుకొని, కవచాదులు కూడ ధరించకుండా పాదచారియై, పదాతులైన సైనికులు వెంటరాగా, శోకతప్తమనస్కుడై తారకుడు వెంటనే తన భవనం నుండి బయటకు వచ్చాడు.

కాలనేమిముఖా దైత్యాః సంరంభాద్భ్రాన్తచేతసః ॥
యోధా ధావత గృహ్ణీత యోజయధ్వం వరూథినీమ్ ॥ 3 ॥

ఓ కాలనేమి మొదలగు దైత్యయోధులారా! భావావేశంతో మీరు భ్రాంతచిత్తులైనప్పటకీ శీఘ్రంగా పరుగెత్తండి, సైన్యాన్ని సిద్ధం చేయండి. ఆయుధాలను గ్రహించండి అని తారకాసురుడు ఆవేశంతో చెప్పాడు.

కుమారం తారకో దృష్ట్వా బభాషే భీషణాకృతిః ।
కిం బాల యోద్ధుకామోఽసి క్రీడాకందుకలీలయా ॥ 4 ॥

తారకాసురుడు భయంకరాకారుడై కుమారుని చూచి ఇలా అన్నాడు. ఓ పసివాడా! నీవు యుద్ధం చేయదల్చుకున్నావా? ఇది బంతితో ఆడుకోవటం అనుకొంటున్నావా?

త్వయా న దానవా దృష్టా యత్సంగరవిభీషణాః ।
బాలత్వాదథ తే బుద్ధిః ఏవం స్వల్పార్థదర్శినీ ॥ 5 ॥

యుద్ధంలో భయంకరాకారులైన దానవులను నీవు చూడలేదు. బాలుడవు కావున నీ బుద్ధి కేవలం స్వల్పమైన విషయాలను మాత్రమే అవగతం చేసుకోగలదు.

కుమారో ఽపి తమగ్రస్థం బభాషే హర్షయన్ సురాన్ ।
శృణు తారక! శాస్త్రార్థస్తవ చైవ నిరూప్యతే ॥ 6 ॥

కుమారుడు కూడ తన ముందున్న తారకాసురుణ్ణి చూచి దేవతలకానందం కలిగేటట్లు అతనితో ఓ తారకా! శాస్త్రార్థమంటే ఏమిటో ఇప్పుడు నేను నిరూపిస్తాను విను అన్నాడు.

శాస్త్రైరర్థా న దృశ్యంతే సమయే నిర్భయే భటైః ।
శిశుత్వం మావమంస్థా మే శిశుః కాలభుజంగమః ॥ 7 ॥

నిర్భయులైన భటులు యుద్ధభూమిలో శాస్త్రార్థాల గురించి ఆలోచించరు. నా శిశుత్వాన్ని నీవు తక్కువగా చూడకు. కాలసర్పం శిశువే ఐనా లోకాన్ని నశింపజేస్తుంది.

దుష్ప్రేక్ష్యో భాస్కరో బాలస్తథాఽహం దుర్జయః శిశుః ।
అల్పాక్షరో న మన్త్రః కిం సుస్ఫురో దైత్య దృశ్యతే? ॥ 8 ॥

ఓ దానవా! భాస్కరుడు బాలుడైనప్పటికీ చూడడానికి శక్యం కాదు. అలాగే నేను కూడ శిశువునైనప్పటికీ దుర్జయుడను అనగా జయింప శక్యం కానటువంటి వాడను. మంత్రము అల్పాక్షరాలు కలదే అయినా మిక్కిలి ప్రభావవంతంగా వుంటుంది కదా!

కుమారే ప్రోక్తవత్యేవం దైత్యశ్చిక్షేప ముద్గరమ్ ।
కుమారస్తం నిరస్యాథ వజ్రేణామోఘవర్చసా ॥ 9 ॥

కుమారుడలా పలుకుతుండగానే తారకాసురుడు ముద్గరమనే ఆయుధాన్ని ఆతనిపైకి వేశాడు. కాని దానిని కుమారుడు అమోఘమైన వర్చస్సు గల వజ్రాయుధంతో త్రిప్పి పంపాడు.

తతశ్చిక్షేప దైత్యేన్ద్రోభిన్దిపాలమయోమయమ్ ।
కరేణ తచ్చ జగ్రాహ కార్తికేయోఽమరారిహా ॥ 10 ॥

అప్పుడు దైత్యుడు ఇనుముతో చేసిన భిందిపాలమనే ఆయుధాన్ని కుమారునిపై సంధించగా దేవతల శత్రువులను నశింపజేసే కార్తికేయుడు ఆ ఆయుధాన్ని చేతితో సులభంగా పట్టుకొన్నాడు.

గదాం ముమోచ దైత్యాయ షణ్ముఖోఽపి ఖరస్వనామ్
తయా హతస్తతో దైత్యశ్చకంపేఽచలరాడివ ॥ 11 ॥

అనంతరం షణ్ముఖుడు కూడ భయంకరమైన ధ్వని గల గదాయుధాన్ని దైత్యునిపై వేయగా, దానితో దెబ్బతిన్న వాడు పర్వతరాజువలె కంపించిపోయాడు.

మేనే చ దుర్జయం దైత్యః తదా షడ్వదనం రణే ।
చిన్తయామాస బుద్ధ్యా వై ప్రాప్తః కాలో న సంశయః ॥ 12 ॥

అప్పుడు యుద్ధంలో షణ్ముఖుని జయించడం సాధ్యంకాదని తారకాసురుడు అనుకొన్నాడు. మరియు తనకు కాలం సమీపించినట్లున్నదని భావించాడు.

కంపితం తు తమాలోక్య కాలనేమిపురోగమాః ।
సర్వే దైత్యేశ్వరా జఘ్నుః కుమారం రణదారుణమ్ ॥ 13 ॥

తారకుడు కంపించుట చూచి కాలనేమి మొదలగు రాక్షసనాయకులందరు దారుణమైన రణకౌశలం గల కుమారుని కొట్టారు.

స తైః ప్రహారైరస్పృష్టో వృథాక్లేశైర్మహాద్యుతిః ।
రణశౌండాస్తు దైత్యేంద్రాః పునః ప్రాసైఃశిలీముఖైః ॥ 14 ॥

కుమారం సామరం జఘ్నుర్బలినో దేవకంటకాః ।
కుమారస్య వృథా నా భూత్ దైత్యాస్త్రనిహతస్య తు ॥ 15 ॥

కాని, ఆ దెబ్బలేవీ మహాతేజశ్శాలి అయిన కుమారుని స్పృశించలేకపోయాయి. వారి ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి. కాని రణరంగంలో నిపుణులు, బలశాలురు, దేవకంటకులూ అయిన ఆ దైత్యేంద్రులు మరల దేవతలను మరియు కుమారుని కూడ పదునైన బాణాలతో కొట్టారు. కాని ఆ దైత్యులు వేసిన అస్త్రాలేవీ కుమారునికి బాధ కలిగించలేకపోయాయి.

ప్రాణాంతకరణో జాతో దేవానాం దానవాహవః ।
దేవాన్నిపీడితాన్ దృష్ట్వా కుమారః కోపమావిశత్ ॥ 16 ॥

దానవులతో యుద్ధం దేవతలకు ప్రాణాంతకమయింది. దానవులు పీడిస్తున్న దేవతలను చూచి కుమారుడు కోపావిష్టుడయ్యాడు.

తతోऽస్త్రైర్వారయామాస దానవానామనీకినీమ్ ॥
తతస్తైర్నిష్ప్రతీకారైస్తాడితాః సురకంటకాః ॥ 17 ॥

కాలనేమిముఖాః సర్వే రణాదాసన్ పరాఙ్ముఖాః ।
విద్రుతేష్వథ దైత్యేషు హతేషు చ సమన్తతః ॥ 18 ॥

కుమారస్వామి అప్పుడు అనేక అస్త్రాలను సంధించి దానవులసేనను నివారించాడు. తిరుగులేని శస్త్రాలతో దేవకంటకులను కొట్టాడు. కుమారుని పరాక్రమం చూసి కాలనేమి మొదలగు దానవులందరు యుద్ధభూమినుండి పారిపోయారు. అలా దైత్యప్రముఖులందరు కుమారునితో దెబ్బలు తిని యుద్ధంనుండి పారిపోయారని తారకుడు విన్నాడు.

తతః క్రుద్ధో మహాదైత్యస్తారకోऽసురనాయకః ।
జగ్రాహ చ గదాం దివ్యాం హేమజాలపరిష్కృతామ్ ॥ 19 ॥

జఘ్నే కుమారం గదయా నిష్టప్తకనకాంగదః ।
శరైర్మయూరం చిత్రైశ్చ చకార విముఖం రణే ॥ 20 ॥

అది విని అసురనాయకుడు మరియు మహాదైత్యుడూ అయిన తారకాసురుడు మిక్కిలి కోపం కలిగిన వాడై సువర్ణమయమైన మరియు దివ్యమైన గదను తీసికొని కుమారునిపై సంధించాడు. అలాగే చిత్రాలైన ఆయుధాలతో కుమారుని వాహనమైన మయూరాన్ని కూడ యుద్ధవిముఖంగా చేశాడు.

బాహునా హేమకేయూరరుచిరేణ షడాననః ।
తతోఽబ్రవీన్మహాసేనస్తారకం దానవాధిపమ్ ॥ 22 ॥

తిష్ఠ తిష్ఠ సుదుర్బుద్ధే జీవలోకం విలోకయ ।
హతోఽస్యద్య మయా శక్త్యాస్మర శస్త్రం సుశిక్షితమ్ ॥ 23 ॥

సువర్ణ కంకణాలతో అలంకృతాలైన బాహువులు గల షణ్ముఖుడు దానవాధిపుడైన తారకునితో ఇలా అన్నాడు. ఓ దుష్టబుద్ధీ! నిలు నిలు ఒకసారి ఈ జీవలోకాన్ని చూచుకో, ఇప్పుడొక క్షణకాలంలో నా ఆయుధమైన శక్తిచే నీవు వధింపబడతావు. కావున నీవు బాగా నేర్చుకొన్న శస్త్రమేదైనా నీ వద్ద వుంటే దానిని స్మరించుకో.

ఇత్యుక్త్వా చ తతః శక్తిం ముమోచ దితిజం ప్రతి ।
సా కుమారభుజోత్సృష్టా తత్కేయూర రవానుగా ॥
బిభేద దైత్యహృదయం వజ్రశైలేన్ద్రకర్కశమ్ ॥ 24 ॥

గతాసుః సంపపాతోర్వ్యాం ప్రలయే భూధరో యథా ।
వికీర్ణముకుటోష్ణీషో విస్రస్తాఖిలభూషణః ॥ 25 ॥

ఇలా చెప్పి మహాసేనుడైన కుమారుడు 'శక్తి' ఆయుధాన్ని తారకునిపై సంధించాడు. కుమారుని భుజముల నుండి విడువబడిన ఆ శక్తి ఆతని భుజకీర్తుల ధ్వని అనుసరించగా వజ్రంవలె మరియు శైలరాజం వలె కర్కశమైన తారకాసురుని హృదయాన్ని చీల్చింది. దానితో జారిపడిన కిరీటం, చెదరిన ముంగురులు, విడిపోయిన ఆభరణాలు కలవాడై తన ప్రాణాలు కోల్పోయి ప్రళయకాలంలో పర్వతరాజం పడిపోయినట్లు ఆ దైత్యుడు భూమిపై పడిపోయాడు.

తస్మిన్ వినిహతే దైత్యే త్రిదశానాం మహోత్సవః ।
నా భూత్కశ్చిత్తదా దుఃఖీ నరకేష్వపి పాపకృత్ ॥ 26 ॥

అలా దైత్యుడు సంహరించబడగా దేవతలకు అదొక మహోత్సవమయ్యింది. పాపం చేసి నరకంలో వున్న వారికి కూడ ఆ దైత్యుని వధ దుఃఖం కలిగించలేదు.

స్తువంతః షణ్ముఖం దేవాః క్రీడన్తశ్చాంగనాయుతాః ।
జగ్ముః స్వానేవ భవనాన్భూరిధామాన ఉత్సుకాః ॥ 27 ॥

దదుశ్చాపి వరం సర్వే దేవాః స్కందముఖం ప్రతి ।
తుష్టాః సంప్రాప్తసర్వేచ్ఛాః సహ సిద్ధైస్తపోధనైః ॥ 28 ॥

దేవతలందరు షణ్ముఖుని స్తుతిస్తూ, తమతమ స్త్రీలతో క్రీడిస్తూ, మిక్కిలి ఉత్సాహంతో తేజోవంతులై తమ భవనాలకు వెళ్ళారు. మరియు తమ కోర్కెలన్నీ ఫలించటం వల్ల సంతుష్టులై స్కందునికి అనేక వరాలు ప్రసాదించి సిద్ధులతో తపోధనులతో కూడ అక్కడనుండి నిష్క్రమించారు.

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

యః పఠేత్ స్కన్దసంబద్ధాం కథాం మర్త్యో మహామతిః ।
శృణుయాచ్ఛ్రావయేద్వాఽపి స భవేత్కీర్తిమాన్నరః ॥29॥

స్కందునికి సంబంధించిన ఈ కథను శీలవంతుడైన ఏ మానవుడు పఠిస్తాడో, వింటాడో వినిపిస్తాడో అటువంటి లోకంలో కీర్తిమంతుడవుతాడు.

బహ్వాయుః సుభగః శ్రీమాన్ కాంతిమాన్ శుభదర్శనః ।
భూతేభ్యో నిర్భయశ్చాపి సర్వదుఃఖవివర్జితః ॥30॥

మరియు ఆ మర్త్యుడు దీర్ఘాయుష్మంతుడు, సౌందర్యవంతుడు, శ్రీమంతుడు, కాంతిమంతుడు, శుభప్రదమైన ఆకృతిగలవాడు, ఏ ప్రాణులనుండి కూడ భయాన్ని పొందనివాడు మరియు దుఃఖరహితుడు అవుతాడు.

సంధ్యాముపాస్య యఃపూర్వాం స్కందస్య చరితం పఠేత్ ।
స ముక్తః కిల్బిషైః సర్వైర్మహాధనపతిర్భవేత్ ॥31॥

ప్రాతఃకాలంలో సంధ్యోపాసన చేసి ఎవరైతే ఈ స్కందుని చరిత్రను పఠిస్తారో వారు సర్వపాపాలనుండి విముక్తులై గొప్ప ధనవంతులవుతారు.

బాలానాం వ్యాధిజుష్టానాం రాజద్వారం చ సేవతామ్ ।
ఇదం తత్పరమం దివ్యం సర్వదా సర్వకామదమ్ ।
తనుక్షయే చ సాయుజ్యం షణ్ముఖస్య వ్రజేన్నరః ॥32॥

వ్యాధిగ్రస్తులైన బాలురకు, రాజద్వారానాశ్రయించి సేవించే వారికి ఇదొక దివ్య సాధనం. ఎల్లవేళలలా అన్ని కోరికలను తీర్చేటటువంటిది. మరియు మానవులు దేహం నశించిన తరువాత షణ్ముఖుడైన కుమారస్వామి సాయుజ్యాన్ని పొందుతారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే తారకవధో నామ షష్ట్యధికశతతమోఽధ్యాయః ॥160॥

శ్రీమత్స్య మహాపురాణంలో 'తారకవధ' అనే నూట అరవైయవ అధ్యాయం సమాప్తం



ఏకషష్ట్యధిక శతతమోఽధ్యాయః – నూటఅరవై ఒకటవ అధ్యాయం

నారసింహ ప్రాదుర్భావః – నరసింహుడు అవతరించుట

ఋషయ ఊచుః – ఋషులు చెప్పారు.

ఇదానీం శ్రోతుమిచ్ఛామో హిరణ్యకశిపోర్వధమ్ ।
నరసింహస్య మాహాత్మ్యం తథా పాపవినాశనమ్ ॥ 1 ॥

ఇపుడు హిరణ్యకశిపుని వధ మరియు పాపాలన్నీ నశింపజేసే నరసింహుని మాహాత్మ్యాన్ని వినగోరుచున్నామని ఋషులు చెప్పారు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

పురా కృతయుగే విప్రా! హిరణ్యకశిపుః ప్రభుః ।
దైత్యానామాదిపురుషః చకార స మహత్తపః ॥ 2 ॥

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ ।
జలవాసీ సమభవత్ స్నానమౌనధృతవ్రతః ॥ 3 ॥

విప్రులారా! పూర్వం కృతయుగంలో దైత్యులకు ఆదిపురుషుడైన హిరణ్యకశిపుడనే దైత్యుడు పదకొండువేల సంవత్సరాల వరకు జలవాసియై, దృఢవ్రతుడై, మౌనంతో శమ దమ బ్రహ్మచర్యాది నియమాలతో మహత్తరమైన తపస్సు నాచరించాడు.

తతః శమదమాభ్యాం చ బ్రహ్మచర్యేణ చైవ హి ।
బ్రహ్మా ప్రీతోఽభవత్తస్య తపసా నియమేన చ ॥ 4 ॥

తతః స్వయంభూర్భగవాన్ స్వయమాగమ్య తత్ర హ ।
విమానేనార్కవర్ణేన హంసయుక్తేన భాస్వతా ॥ 5 ॥

అతని తపస్సుకు నియమాలకు కూడ స్వయంభువైన బ్రహ్మదేవుడు ప్రీతిచెందాడు. మరియు సాక్షాత్తు భగవానుడైన ఆ దేవుడు సూర్యుని వంటి ప్రకాశం గలిగిన మరియు హంసలతో ప్రకాశిస్తున్న విమానమెక్కి ఆ హిరణ్యకశిపుని దగ్గరకు వచ్చాడు.

ఆదిత్యైర్వసుభిః సాధ్యై ర్మరుద్భిర్దైవతై స్తథా ।
రుద్రైర్విశ్వసహాయైశ్చ యక్షరాక్షసపన్నగైః ॥ 6 ॥

దిగ్భిశ్చైవ విదిగ్భిశ్చ నదీభిఃసాగరై స్తథా ।
నక్షత్రైశ్చ ముహూర్తైశ్చ ఖేచరైశ్చ మహాగ్రహైః ॥ 7 ॥

ఇంకను ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, సాధ్యులు, మరుత్తులు, ఏకాదశరుద్రులు, విశ్వేదేవతలు, అశ్వసహాయులైన యక్షులు, రాక్షసులు, పన్నగాలు, దిక్కులు, విదిక్కులు, నదులు, సముద్రాలు, నక్షత్రాలు, ముహూర్తాలు, ఖేచరాలు (పక్షులు) మహాగ్రహాదులందరితో కలసి అతని సమీపానికి వచ్చాడు.

దేవైర్బ్రహ్మర్షిభిః సార్ధం సిద్ధైః సప్తర్షిభిస్తథా ।
రాజర్షిభిః పుణ్యకృద్భిః గంధర్వాప్సరసాం గణైః ॥ 8 ॥

చరాచరగురుః శ్రీమాన్ వృతః సర్వైర్దివౌకసైః ।
బ్రహ్మ బ్రహ్మవిదాం శ్రేష్ఠో దైత్యం వచనమబ్రవీద్ ॥ 9 ॥

దేవతలు, బ్రహ్మర్షులు, సిద్ధులు, సప్తర్షులు, పుణ్యాత్ములైన రాజర్షులు, గంధర్వులు, అప్సరసలు, స్వర్గలోక నివాసులందరితో ఈ చరాచర ప్రపంచానికి తండ్రి మరియు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడూ అయిన బ్రహ్మదేవుడు హిరణ్యకశిపుని వద్దకు వచ్చి అతనితో ఇలా అన్నాడు.

ప్రీతోఽస్మి తవ భక్తస్య తపసాఽనేన సువ్రత ।
వరం వరయ భద్రం తే యథేష్టం కామమాప్నుహి ॥ 10 ॥

సువ్రతుడవు మరియు భక్తుడవూ అయిన నీ ఈ తపస్సుచేత సంతోషించాను. నీకు కావలసిన వరం కోరుకొని నీ అభీష్టాన్ని పొందుమని బ్రహ్మదేవుడు హిరణ్యకశిపునితో అన్నాడు.

హిరణ్యకశిపు రువాచ – హిరణ్యకశిపుడు చెప్పాడు.

న దేవాసురగంధర్వా న యక్షోరగరాక్షసాః ।
న మానుషాః పిశాచా వా హన్యుర్మాం దేవతసత్తమ! ॥ 11 ॥

ఓ దేవోత్తమా! దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, సర్పాలు, రాక్షసులు, మనుష్యులు, పిశాచాలు మొదలగు వారెవరును నన్ను వధించకుండా వరం కావాలి.

ఋషయో వా న మాం శాపైః శపేయుః ప్రపితామహ! ।
యది మే భగవన్ ప్రీతో వర ఏష వృతో మయా ॥ 12 ॥

ఓ పితామహా! నన్ను ఋషులు శపించకూడదు. ఓ భగవంతుడా! నీవు నా తపస్సుతో ప్రీతిచెందితే ఇలాంటి వరాన్నివ్వవలసిందని హిరణ్యకశిపుడు బ్రహ్మతో చెప్పాడు.

న చాస్త్రేణ న శస్త్రేణ గిరిణా పాదపేన చ ।
న శుష్కేణ న చార్ద్రేణ న దివా న నిశాఽథవా ॥ 13 ॥

అస్త్రంచేత గాని, శస్త్రంచేత గాని, పర్వతంతో గాని, వృక్షంతో గాని, ఎండినదానితో గాని తడిగానున్నదానితో గాని, పగలు గాని, రాత్రి గాని నన్నెవరూ చంపకుందురుగాక!

భవేయమహమేవార్కః సోమో వాయుర్హుతాశనః ।
సలిలం చాన్తరిక్షం చ నక్షత్రాణి దిశో దశ ॥14 ॥

అహం క్రోధశ్చ కామశ్చ వరుణో వాసవో యమః ।
ధనదశ్చ ధనాధ్యక్షో యక్షః కింపురుషాధిపః ॥ 15 ॥

సూర్యుడు-చంద్రుడు-వాయువు-అగ్ని-జలం-అన్తరిక్షం నక్షత్రాలు మరియు దశదిశలు కూడ నేనే కావాలి. నేనే క్రోధం, కామం, వరుణుడు, వసువులు, యముడు, కుబేరుడు, ధనాధిపతి మరియు కింపురుషాధిపతిని కావాలి.

బ్రహ్మోవాచ - బ్రహ్మ చెప్పాడు

ఏతే దివ్యా వరాస్తాత! మయా దత్తా స్తవాద్భుతాః ।
సర్వాన్ కామాన్ సదా వత్స! ప్రాప్స్యసే త్వం న సంశయః ॥ 16 ॥

నాయనా! దివ్యాలు, అద్భుతాలూ అయిన ఈ వరాలన్నీ నేను నీకు ప్రసాదిస్తున్నాను. వత్సా! నీవు ఈ వరాలతో నీ కోరికలన్నీ తీర్చుకొంటావు. ఇందుకు సందేహం లేదు.

ఏవముక్త్వా స భగవాన్ జగామాకాశ ఏవ హి ।
వైరాజం బ్రహ్మసదనం బ్రహ్మర్షిగణసేవితమ్ ॥ 17 ॥

ఇలా చెప్పి ఆ భగవానుడు అంతరిక్ష మార్గంలో బ్రహ్మర్షి గణాలు సేవించే బ్రహ్మసదనమైన వైరాజమనే తన లోకానికి వెళ్ళిపోయాడు.

తతో దేవాశ్చ నాగాశ్చ గంధర్వా ఋషిభిః సహ ।
వరప్రదానం శ్రుత్వైవ పితామహముపస్థితాః ॥ 18 ॥

హిరణ్యకశిపునికిచ్చిన వరాలను విని, దేవతలు, నాగులు, గంధర్వులు, ఋషులందరితో కలసి పితామహుడైన బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళారు.

దేవా ఊచుః - దేవతలు చెప్పారు.

వరప్రసాదాద్భగవన్! వధిష్యతి స నోఽసురః ।
తత్ప్రసీదాశు భగవన్! వధోఽప్యస్య విచిన్త్యతామ్ ॥ 19 ॥

భగవన్ సర్వభూతానామాదికర్తా స్వయం ప్రభుః ।
స్రష్టా త్వం హవ్యకవ్యానామవ్యక్త ప్రకృతిర్ధ్రువః ॥ 20 ॥

ఓ దేవా! నీ వరప్రదానం వలన ఆ అసురుడు మమ్మల్ని వధిస్తాడు. కావున వెంటనే వాడి వధ గురించి అలోచించమని ప్రార్థిస్తున్నాము. ఓ దేవా! ప్రాణులన్నింటికి నీవు ఆదికర్తవు, అందరికి ప్రభుడువు, హవ్యకవ్యాదులనేర్పరచిన వాడివి, అవ్యక్తమైన, ప్రకృతి నుండి ఉద్భవించినవాడివి.

సర్వలోకహితం వాక్యం శ్రుత్వా దేవః ప్రజాపతిః ।
ఆశ్వాసయామాస సురాన్ సుశీతైర్వచనాంబుభిః ॥ 21 ॥

ప్రజాపతియైన బ్రహ్మదేవుడు సర్వలోకహితమైన దేవతల మాటలు విని చల్లని వాక్కులనే జలాలతో వారినిలా ఓదార్చాడు.

అవశ్యం త్రిదశాస్తేన ప్రాప్తవ్యం తపసః ఫలమ్ ।
తపసోఽన్తే ఽస్య భగవాన్ వధం విష్ణుః కరిష్యతి ॥ 22 ॥

ఓ దేవతలారా! వాడు చేసిన తపస్సు ఫలం తప్పనిసరిగా పొందవలసిందే. ఆ తపఃఫలం ముగియగానే విష్ణు భగవానుడు వాడిని సంహరిస్తాడు.

తచ్ఛ్రుత్వా విబుధా వాక్యం సర్వే పంకజజన్మనః ।
స్వాని స్థానాని దివ్యాని విప్రా జగ్ముర్ముదాన్వితాః ॥ 23 ॥

విప్రులారా! పద్మోద్భవుడైన బ్రహ్మదేవుని మాటలు విని దేవతలందరు సంతుష్టులై దివ్యాలైన తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు.

లబ్ధమాత్రే వరే చాఽథ సర్వాః సోఽబాధత ప్రజాః ।
హిరణ్యకశిపుర్దైత్యో వరదానేన దర్పితః ॥ 24 ॥

దైత్యుడైన ఆ హిరణ్యకశిపుడు వరం పొందిన దర్పంతో ప్రజలందరిని బాధపెట్టటం ఆరంభించాడు.

ఆశ్రమేషు మహాభాగాన్ స మునీన్ శంసితవ్రతాన్ ।
సత్యధర్మపరాన్ దాన్తాన్ ధర్షయామాస దానవః ॥ 25 ॥

సత్యధర్మపరులు, మనోనిగ్రహం గలవారు, తపోనిష్ఠులై ఆశ్రమాలలో నివసిస్తున్న మహానుభావులైన మునులను ఆ దానవుడు బాధపెడుతుండినాడు.

దేవాన్ త్రిభువనస్థాంశ్చ పరాజిత్య మహాసురః ।
త్రైలోక్యం వశమానీయ స్వర్గే వసతి దానవః ॥ 26 ॥

మహాసురుడైన ఆ దానవుడు స్వర్గలోకవాసులైన దేవతలందరిని ఓడించి, ముల్లోకాలను తన వశం చేసికొని స్వర్గంలో నివసించసాగాడు.

యదా వరమదోత్సిక్తశ్చోదితః కాలధర్మతః ।
యజ్ఞియానకరోద్దైత్యాన్ అయజ్ఞియాంశ్చ దేవతాః ॥ 27 ॥

దివ్యమైన వరాన్ని పొందిన మదంతో ఆ దైత్యుడు కాలధర్మాన్ననుసరించి దైత్యులందరికీ యజ్ఞయాగాదులలో భాగం కల్పించి దేవతలకు అటువంటి అవకాశం లేకుండా చేశాడు.

తదాదిత్యాశ్చ సాధ్యాశ్చ విశ్వే చ వసవస్తథా ।
సేంద్రా దేవగణా యక్షాః సిద్ధద్విజమహర్షయః ॥ 28 ॥

శరణ్యం శరణం విష్ణుముపతస్థుర్మహాబలమ్ ।
దేవదేవం యజ్ఞమయం వాసుదేవం సనాతనమ్ ॥ 29 ॥

అప్పుడు ఆదిత్యులు, సాధ్యులు, విశ్వేదేవతలు, వసువులు, ఇంద్రునితో గూడ దేవతల సమూహాలన్నీ, యక్షులు, ద్విజులు, మహర్షులు మొదలగు వారందరు మహాబలుడు, సనాతనుడు, యజ్ఞమయుడు ("యజ్ఞో యజ్ఞపతిర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః యజ్ఞభృద్యజ్ఞకృద్యజ్ఞీ యజ్ఞభుగ్యజ్ఞసాధన" అని విష్ణు సహస్రనామాలలో చెప్పిన ప్రకారంగా యజమ్ఞయుడని ఇక్కడ చెప్పబడింది) వాసుదేవుడు, సకల లోక శరణ్యుడూ అయిన శ్రీ మహావిష్ణువును శరణు కోరి ఆశ్రయించారు.

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

నారాయణ! మహాభాగ! దేవాస్త్వాం శరణం గతాః ।
త్రాయస్వ జహి దైత్యేన్ద్రం హిరణ్యకశిపుం ప్రభో ॥ 30

త్వం హి నః పరమో ధాతా త్వం హి నః పరమో గురుః ।
త్వం హి నః పరమో దేవో బ్రహ్మాదీనాం సురోత్తమ ॥ 31 ॥

నారాయణా! మహానుభావా! దేవతలు నిన్ను శరణుజొచ్చారు. ఓ ప్రభూ! వారిని రక్షించు. దైత్యేంద్రుడైన హిరణ్యకశిపుని వధించు. ఓ సురోత్తమా! బ్రహ్మాదులమైన మా అందరికీ నీవే రక్షకుడవు, ఆశ్రయుడవు, పరమగురుడవు.

విష్ణురువాచ – విష్ణువు చెప్పాడు.

భయం త్యజధ్వమమరా అభయం వో దదామ్యహమ్ ।
తథైవ త్రిదివం దేవాః ప్రతిపద్యత మా చిరమ్ ॥ 32 ॥

ఏషోఽహం సగణం దైత్యం వరదానేన దర్పితమ్ ।
అవధ్యమమరేంద్రాణాం దానవేంద్రం నిహన్మ్యహమ్ ॥ 33 ॥

ఓ దేవతలారా! భయాన్ని వదలండి. నేను మీకు అభయమిస్తున్నాను. మీరు త్వరలోనే మీ స్వర్గలోకాన్ని తిరిగి పొందుతారు. వరదానంతో గర్వితుడైన అమరేంద్రాదులచే వధింపశక్యం కాని దానవేంద్రుడైన ఆ దైత్యుని సపరివారంగా నిర్మూలిస్తానని విష్ణువు దేవతలకు చెప్పాడు.

ఏవముక్త్వా తు భగవాన్ విసృజ్య త్రిదశేశ్వరాన్ ।
వధం సంకల్పయామాస హిరణ్యకశిపోః ప్రభుః ॥ 34 ॥

జగత్ప్రభువైన భగవానుడు అలా చెప్పి దేవతలందరిని పంపివేసి హిరణ్యకశిపుని వధను సంకల్పించాడు.

సాహాయ్యం చ మహాబాహు రోఙ్కారం గృహ్య సత్వరమ్ ।
అథోఙ్కారసహాయస్తు భగవాన్ విష్ణురవ్యయః ॥ 35 ॥
హిరణ్యకశిపుస్థానం జగామ హరిరీశ్వరః ॥

వెంటనే 'ఓం' కారాన్ని సహాయునిగా తీసుకొని, భగవంతుడు, అవ్యయుడు, మహాబాహువు, ఈశ్వరుడు, విష్ణువూ అయిన ఆ పరమాత్మ హిరణ్యకశిపుడున్న చోటుకు వెళ్ళాడు.

తేజసా భాస్కరాకారః శశీ కాన్త్యేవ చాపరః ॥ 36 ॥

నరస్య కృత్వాఽర్ధతనుం సింహస్యార్ధతనుం తథా ॥
నారసింహేన వపుషా పాణిం సంస్పృశ్య పాణినా ॥ 37 ॥

భాస్కరుని వంటి తేజస్సు, చంద్రుని వంటి కాంతి గలవాడై (ఇక్కడ సూర్యుని తేజస్సు వంటి తీక్ష్ణమైన పరాక్రమం గలవాడని, చంద్రుని కాంతి వంటి కాంతితో లోకానికి ఆహ్లాదం కలిగించేవాడని అర్థం గ్రహించవలసింది) సగం శరీరంలో నరుడు, సగం శరీరంలో సింహాకారం గలవాడై చేతితో ఇంకొక చేతిని స్పృశిస్తూ నారసింహశరీరంతో హిరణ్యకశిపుడున్న చోటుకు హరి వెళ్ళాడు.

తతోఽపశ్యత విస్తీర్ణాం దివ్యాం రమ్యాం మనోరమామ్ ।
సర్వకామయుతాం శుభ్రాం హిరణ్యకశిపోః సభామ్ ॥ 38 ॥

విస్తీర్ణాం యోజనశతం శతమధ్యర్ధపాయతామ్ ।
వైహాయసీం కామగమాం పంచయోజన విస్తృతామ్ ॥ 39 ॥

అక్కడ ఆ దేవుడు విస్తీర్ణము, దివ్యము, రమ్యము, మనోహరము, సర్వాభీష్టాలను తీర్చేది, శుభ్రమైనది, వంద యోజనాల పొడవున విస్తరించింది, ఏబదియోజనాల కంటే తక్కువ లేకుండా వెడల్పు గలది, ఆకాశంలో ఎగురుతూ కోరుకున్న చోటికి వెళ్ళగలిగిన పంచయోజన విస్తృతమైన హిరణ్యకశిపుని సభను చూశాడు.

జరాశోకక్లమాపేత నిష్ప్రకమ్పాం శివాం సుఖామ్ ।
వేశ్మహర్మ్యవతీం రమ్యాం జ్వలంతీమివ తేజసా ॥40॥

అన్తస్సలిలసంయుక్తాం విహితాం విశ్వకర్మణా ।
దివ్యరత్నమయైర్వృక్షైః ఫలపుష్పప్రదైర్యుతామ్ ॥41॥

వార్ధక్యం, శోకం,శ్రమ మొదలైనవి లేనిది, కదలించడానికి వీలు కానిది, శుభప్రదమూ మరియు సుఖప్రదమైనది భవనాలు, సౌధాలు కలిగినది, రమ్యమైనది తేజస్సుతో ప్రకాశించేది, అంతర్భాగంలో నీరుండేటట్లు విశ్వకర్మచే సృష్టించబడినది. దివ్యరత్నాలు మరియు ఫలపుష్పాదులతో కూడుకొనివున్న వృక్షాలు గల హిరణ్యకశిపుని సభను హరి చూశాడు.

నీలపీతసితశ్యామైః కృష్ణై ర్లోహితకైరపి ।
అవతానైస్తథా గుల్మైః మంజరీశతధారిభిః ॥ 42 ॥

సితాభ్రఘనసంకాశా ప్లవన్తీవ వ్యదృశ్యత ।
రశ్మిమతీ భాస్వరా చ దివ్యగన్ధ మనోరమా ॥ 43 ॥

నీలం, పసుపు, తెలుపు, నలుపు మరియు ఎరుపు రంగు అగు తీగల పందిళ్ళ గుబురులు, వందలకొలది మంజరులు (అనగా పూగుత్తులు) కలిగి ఆ హిరణ్యకశిపుని సభ తేలిపోతున్న తెల్లని మేఘాల సమూహం వలె కనబడింది. మరియు ఆ సభ ప్రకాశించే కిరణాలు కలదై, సుగంధమయమై, మనోహరంగా వున్నది.

ససుఖా న చ దుఃఖా సా న శీతా న చ ఘర్మదా ।
న క్షుత్పిపాసే గ్లానిం వా ప్రాప్య తాం ప్రాప్నువంతి తే ॥ 44 ॥

ఆ సభ సర్వసుఖాలతో కూడి వుంది. అక్కడ దుఃఖం ఏ మాత్రమూ లేదు. ఎక్కువ చల్లదనం కాని, ఎక్కువ వేడి కాని అక్కడ లేదు. ఆ సభ ఆకలి దప్పులకు అతతీతంగా వుంది. అక్కడివారికి బాధ, కష్టం అనేదే లేదు.

నానారూపైరుపకృతాం విచిత్రైరతిభాస్వరైః ।
స్తంభైర్న బిభృతా సా వై శాశ్వతీ చాక్షపా సదా ॥ 45 ॥

అతిచంద్రం చ సూర్యం చ శిఖినం చ స్వయంప్రభా ॥
దీప్యతే నాకపృష్ఠస్థా భాసయంతీవ భాస్కరమ్ ॥ 46 ॥

బాగా ప్రకాశిస్తున్న అనేక విచిత్ర రూపాలు గల సాధనాలతో అలంకరించబడినది, స్తంభాల ఆధారం లేనిది, (స్తంభాలు లేకుండానే కట్టిన సభాగారం) శాశ్వతమైనది, రాత్రియే ఎరుగనిది, చంద్ర-సూర్య-అగ్నుల కంటె అధికమైన స్వయంప్రభ కలది, స్వర్గలోకం కంటె ఎత్తైన స్థానంలో వుండి తన తేజస్సుతో సూర్యభగవానుని కూడా తేజోవంతుని చేస్తున్నదా అనేటట్లున్న హిరణ్యకశిపుని సభాగారాన్ని శ్రీహరి చూశాడు.

సర్వే చ కామాః ప్రచురాః యే దివ్యా యే చ మానుషాః ।
రసయుక్తం ప్రభూతం చ భక్ష్యభోజ్యమనన్తకమ్ ॥47 ॥

పుణ్యగంధస్రజశ్చాత్ర నిత్యపుష్పఫలద్రుమాః ।
ఉష్ణే శీతాని తోయాని శీతేచోష్ణాని సన్తి చ ॥ 48 ॥

దేవతలకు మరియు మనుష్యులకు సంబంధించిన కోరికలన్నీ తీర్చేది, అనంతమైన రుచికరమైన భక్ష్య భోజ్యాదులను కల్పిస్తున్నది, పవిత్రమైన సుగంధమాలతో అలంకరించబడినది, ప్రతిరోజుపుష్పాలు మరియు ఫలాలతో గూడిన వృక్షాలు గలది, వేసవి కాలంలో చల్లని నీరు శీత కాలంలో ఉష్ణజలం కల ఆ దైత్యుని సభను హరి చూశాడు.

పుష్పితాగ్రా మహాశాఖాః ప్రవాలాంకురధారిణః ।
లతావితాన సంఛన్నా నదీషు చ సరస్సు చ ॥ 49 ॥

వృక్షాన్ బహువిధాంస్తత్ర మృగేంద్రో దదృశే ప్రభుః ॥

నదులు, మరియు సరస్సులలో పూచిన కొనలు గల కొమ్మలతో గూడిన మహావృక్షాలు, చిగురుటాకులు మరియు మొలుకలు గలిగిన తీగల పందిళ్ళతో కూడిన అనేక విధాలైన వృక్షాలు గల హిరణ్యకశిపుని సభను నరసింహప్రభువు చూశాడు.

గంధవంతి చ పుష్పాణి రసవన్తి ఫలాని చ ॥ 50 ॥

నాతిశీతాని నోష్ణాని తత్ర తత్ర సరాంసి చ ।
అపశ్యత్సర్వతీర్థాని సభాయాం తస్య స ప్రభుః ॥ 51 ॥

సువాసనలు గల పుష్పాలు రసవంతాలైన ఫలాలు గల అనేక వృక్షాలతో రమ్యంగా కనబడుతున్న మిక్కిలి వేడి, మిక్కిలి చల్లదనం లేని జలములు గల సరస్సులతో, అనేక పుణ్యతీర్థాలతో శోభిల్లుతున్న హిరణ్యకశిపుని సభను హరి చూశాడు.

నలినైః పుండరీకైశ్చ శతశత్రైః సుగంధిభిః ।
రక్తైః కువలయైర్నీలైః కుముదైః సంవృతాని చ ॥ 52 ॥

సుకాన్తైర్ధార్తరాష్ట్రైశ్చ రాజహంసైశ్చ సుప్రియైః ।
కారండవైశ్చక్రవాకైః సారసైః కురరైరపి ॥ 53 ॥

విమలైః స్ఫాటికాభైశ్చ పాండరచ్ఛదనైర్ద్విజైః ।
బహుహంసోపగీతాని సారసాభిరుతాని చ ॥ 54 ॥

మరియు అక్కడ వున్న ఆ సరస్సులు వికసించిన, సుగంధం గల పద్మాలతోను, పుండరీక మరియు శతపత్ర పుష్పాలతోను, ఎరుపు రంగు గల కువలయాలతోను, నీలపు రంగు కుముదాలతోను మరియు మనోహరాలైన ధార్త రాష్ట్ర పక్షులతోను, ప్రీతి కలిగించే రాజహంసలతోను, కారండవాలు, చక్రవాకాలు, సారసాలు, కురరాలు మొదలగు పక్షులతోను, అక్కడి సరస్సులు, తీర్థాలు ఆహ్లాదకరంగా వున్నాయి. అంతేకాక స్వచ్ఛమైన స్ఫటిక కాంతిని బోలిన తెల్లని రెక్కలు గల పక్షులతోను, హంసల మరియు సారస పక్షుల కూతలతో ఆ సరస్సులు ప్రకాశవంతంగా వున్నాయి.

గంధవత్యః శుభాస్తత్ర పుష్పమంజరిధారిణీః ।
దృష్టవాన్ పర్వతాగ్రేషు నానాపుష్పధరా లతాః ॥ 55 ॥

కేతక్యశోకసరలాః పున్నాగతిలకార్జునాః ।
చూతా నీపాః ప్రస్థపుష్పాః కదంబా వకులా ధవాః ॥ 56 ॥

ప్రియంగు పాటలా వృక్షాః శాల్మల్యః సహరిద్రకాః ।
సాలా స్తాలా స్తమాలాశ్చ చమ్పకాశ్చ మనోరమాః ॥ 57 ॥

మరియు ఆ దేవదేవునికి అక్కడి పర్వతాగ్రాలలో పుష్పమంజరులతో నిండిన శుభప్రదాలైన అనేకవిధాలైన లతలు, కేతకీ, అశోక, సరల, పున్నాగ, తిలక, అర్జున, చూత, నీప, ప్రస్థ, కదంబ, వకుళధవ మొదలగు అనేక పుష్పములు, ప్రియంగు, పాటల, శాల్మలీ, హరిద్రక, సాల, తాల, తమాల, చంపకం మొదలగు హృద్యాలైన అనేక వృక్షాలు కనబడినాయి.

తథైవాన్యే వ్యరాజన్త సభాయాం పుష్పితా ద్రుమాః ।
విద్రుమాశ్చ జ్వలితాగ్నిసమప్రభాః ॥ 58 ॥

ఇంకను అక్కడ వికసించిన పుష్పాలతో అనేక ఇతర వృక్షాలున్నాయి. అంతేకాక జ్వలిస్తున్న అగ్నితో సమానమైన కాంతి గల అనేకానేక బృహద్వృక్షాలు కూడ వున్నాయి.

స్కంధవన్తః సుశాఖాశ్చ బహుతాల సముచ్చయాః ।
అర్జునాశోకపర్ణాశ్చ బహవశ్చిత్రకా ద్రుమాః ॥ 59 ॥

దృఢమైన మూలాలు విశాలమైన కొమ్ములు గల అనేక తాటి చెట్ల ఎత్తుగల అశోక పర్ణ మొదలగు అనేక చిత్రాలైన అనేక వృక్షాలు కూడ వున్నాయి.

వరుణో వత్సనాభశ్చ పనసాః సహ చందనైః ।
నీపాః సుమనసశ్చైవ నింబా అశ్వత్థతిందుకాః ॥ 60 ॥

పారిజాతాశ్చ లోధ్రాశ్చ మల్లికా భద్రదారవః ।
ఆమలక్యస్తథా జంబూ లకుచాః శైలవాలుకాః ॥ 61 ॥

ఇంకనూ వరుణ–వత్సనాభ–పనస–చందన–నీప–సుమనస–నింబ–అశ్వత్థ–తిందుక–పారిజాత–లోధ్ర మల్లికా –భద్రదారు–ఆమలక–జంబూ–లకుచ–శైలవాలుక మొదలైన వృక్షాలక్కడ వున్నాయి.

ఖర్జుర్యో నారికేలాశ్చ హరీతకవిభీతకాః ।
కాలీయకా దుకూలాశ్చ హింగవః పరియాత్రకాః ॥ 62 ॥

మన్దారకున్దలక్తాశ్చ పతంగా కుటజాస్తథా ।
రక్తాః కురంటకాశ్చైవ నీలాశ్చాగరుభిః సహ ॥ 63 ॥

మరియు ఖర్జూర–నారికేల–హరీతక–విభీతక–కారియక–దుకూల–హింగు–పరియాత్రక–మందార కుంద లత్తుక–పతంగ–కుటజాదివృక్షాలు, ఎర్రని కురంటకాలు, నల్లని అగరు వృక్షాలు కూడ వున్నాయి.

కదంబాశ్చైవ భవ్యాశ్చ దాడిమా బీజపూరకాః ।
సప్తపర్ణాశ్చ బిల్వాశ్చ మధుపైరావృతాస్తథా ॥ 64 ॥

అశోకాశ్చ తమాలాశ్చ నానాగుల్మలతావృతాః ।
మధూకాః సప్తపర్ణాశ్చ బహవస్తీరగా ద్రుమాః ॥ 65 ॥

భవ్యాలైన కదంబవృక్షాలు, గింజలు నిండుగా వున్న దానిమ్మ పండ్ల వృక్షాలు, సప్తపర్ణాలు, బిల్వవృక్షాలు, మరియు తుమ్మెదలతో చుట్టు ముట్టిన ఇతర వృక్షాలు, అశోక–తమాలాది వృక్షాలు, అనేక విధాలైన లతలు తీగలతో చుట్టుకొన్న మరి కొన్ని వృక్షాలు, మధూకాలు, సప్తపర్ణాలు మరియు తీరప్రాంతంలో వున్న అనేక వృక్షపంక్తులు గల హిరణ్యకశిపుని సభను శ్రీహరి చూశాడు.

లతాశ్చ వివిధాకారాః పత్రపుష్పఫలోపగాః ।
ఏతే చాన్యే చ బహవః తత్ర కాననజా ద్రుమాః ॥ 66 ॥

నానాపుష్పఫలోపేతా వ్యరాజన్త సమన్తతః ।

పలు రకాల పూలు, పళ్ళతో వున్న మరియు పత్రాలు, పుష్పాలు, ఫలాలు కూడ కలిగిన అనేక విధాలైన లతలతోనే గాక ఇంకనూ వనంలోవుండే అనేక విధాలైన వృక్షాలతో హిరణ్యకశిపుని సభ అంతటా శోభాయమానంగా వుండినది.

చకోరాః శతపత్రాశ్చ మత్తకోకిలసారికాః ॥ 67 ॥

పుష్పితాన్ పుష్పితాగ్రస్థాన్ సమ్పతన్తి మహాద్రుమాన్ ॥
రక్తపీతారుణాస్తత్ర పాదపాగ్రరతాః ఖగాః ॥ 68 ॥

పరస్పరమవేక్షన్తే ప్రహృష్టా జీవజీవకాః ।

చకోరాలు, శతపత్రాలు, మత్తకోకిలలు, సారికలు మొదలుగునవి పుష్పించిన మహావృక్షాల అగ్రభాగాన విహరిస్తూ వున్నాయి. ఎర్రని, అరుణ వర్ణం గల పచ్చని మరికొన్ని పక్షులు వృక్షపు కొమ్మల చివరిభాగాలలో మెదలుతూ సంతోషంతో పరస్పరం చూచుకొంటున్నాయి.

తస్యాం సభాయాం దైత్యేంద్రో హిరణ్యకశిపుస్తదా ॥ 69 ॥

స్త్రీసహస్రైః పరివృతః విచిత్రాభరణాంబరః ।
అనర్ఘ్యమణివజ్రార్చిః శిఖాజ్వలితకుండలః ॥ 70 ॥

అపుడా సభలో దైత్యేంద్రుడైన హిరణ్యకశిపుడు వేలకొలది స్త్రీలతో పరివృతుడై, విచిత్రాలైన వస్త్రాలు ఆభరణాలు ధరించి, వెలకట్టలేని మణులు, వజ్రాలతో ప్రకాశిస్తూ, అగ్నివలె ప్రకాశించే కుండలాలు ధరించి కొలువు తీరివున్నాడు.

ఆసీనశ్చాసనే చిత్రే దశనల్వప్రమాణతః ।
దివాకరనిభే దివ్యే దివ్యాస్తరణసంస్తృతే ॥ 71 ॥

దివ్యగంధవహస్తత్ర మారుతః సుసుఖో వవౌ ॥
హిరణ్యకశిపుర్దైత్యః ఆస్తే జ్వలితకుండలః ॥ 72 ॥

దివ్యాలైన పరుపుల వంటి మెత్తని వస్త్రాలు పరిచిన, సూర్యుని వలె ప్రకాశిస్తున్న పది నల్వముల ఘన పరిమాణం గల చిత్రమైన ఆసనంపై హిరణ్యకశిపుడు కూర్చున్నాడు. (నల్వమనగా "నల్వః కిష్కు చతుశ్శతమ్" అని కోశగ్రంథాలలో చెప్పిన దాని ప్రకారంగా తొమ్మిదివేల ఆరువందల అంగుళాల పరిణామం గల బృహత్తరమైన ఆసనంపై ఆ దైత్యుడు కూర్చున్నాడని తెలిసికోవాలి.) మరియు అక్కడ దివ్యాలైన సువాసనలు గలిగిన వాయువు వీస్తూ వున్నది.

ఉపచేరుర్మహాదైత్యం హిరణ్యకశిపుం తదా ।
దివ్యతానేన గీతాని జగుర్గంధర్వసత్తమాః ॥ 73 ॥

అప్పుడు గంధర్వోత్తములు మహాదైత్యుడైన హిరణ్యకశిపుని కొలిచారు. దివ్యతానంతో గీతాలాలపించారు.

విశ్వాచీ సహజన్యా చ ప్రమ్లోచేత్యభివిశ్రుతా ।
దివ్యా చ సౌరభేయీ చ సమీచీ పుంజికస్థలీ ॥ 74 ॥

మిత్రకేశీ చ రంభా చ చిత్రలేఖా శుచిస్మితా ॥
చారుకేశీ ఘృతాచీ చ మేనకా చోర్వశీ తథా ॥ 75 ॥

ఏతాః సహస్రశశ్చాన్యా నృత్యగీతవిశారదాః ।
ఉపతిష్ఠన్తి రాజానం హిరణ్యకశిపుం ప్రభుమ్ ॥ 76 ॥

విశ్వాచి, సహజన్య. ప్రమ్లోచ, సౌరభేయి, సమీచి, పుంజకస్థలి, మిత్రకేశి, రంభ, చిత్రలేఖ, శుచిస్మిత, చారుకేశి, ఘృతాచి, మేనక, ఊర్వశి, మొదలగు అప్సరసలే గాక వేలకొలది నృత్య గీత విశారదలైన దేవతాస్త్రీలు రాజైన హిరణ్యకశిపుని సేవిస్తున్నారు.

తత్రాసీనం మహాబాహుం హిరణ్యకశిపుం ప్రభుమ్ ।
ఉపాసతే దితేః పుత్రాః సర్వే లబ్ధవరాస్తథా ॥ 77 ॥

అలా సింహాసనాన్నధిష్ఠించిన మహాబాహువైన హిరణ్యకశిపుమహారాజును అనేకవిధాలైన వరాలు పొందిన దితి పుత్రులందరూ సేవిస్తున్నారు.

తమప్రతిమకర్మాణం శతశోఽథ సహస్రశః ।
బలిర్విరోచనస్తత్ర నరకః పృథివీసుతః ॥ 78 ॥

ప్రహ్లాదో విప్రచిత్తిశ్చ గవిష్ఠశ్చ మహాసురః ।
సురహన్తా దుఃఖహన్తా సునామా సుమతిర్వరః ॥ 79 ॥

బలి, విరోచనుడు, పృథివీసుతుడైన నరకాసురుడు, ప్రహ్లాదుడు, విప్రచిత్తి, గవిష్ఠుడు, సురహంతకుడైన, సునాముడు, మరియు దుఃఖాన్ని పోగొట్టే సుమతి మొదలగు వందలకొలది వేలకొలది దైత్యులు తిరుగులేని (సాటిలేని) పనులు చేసే ఆ హిరణ్యకశిపుని సేవిస్తున్నారు.

ఘటోదరో మహాపార్శ్వః కథనః పిఠరస్తథా ।
విశ్వరూపః సురూపశ్చ స్వబలశ్చ మహాబలః ॥ 80 ॥

దశగ్రీవశ్చ వాలీ చ మేఘవాసా మహాసురః ।
ఘటాసోఽకంపనశ్చైవ ప్రజనశ్చేంద్రతాపనః ॥ 81 ॥

ఇంకనూ ఘటోదరుడు, మహాపార్శ్వుడు, కథనుడు, పిఠరుడు, విశ్వరూపుడు, సురూపుడు, స్వబలుడు, మహాబలుడు, దశగ్రీవుడు, వాలి (అను పేరుగల రాక్షసుడు) మహాసురుడైన, మేఘవాసనుడు, ఘటాస్యుడు, అకంపనుడు, ప్రజనుడు, ఇంద్రతాపనుడు మొదలగు దైత్యులందరూ హిరణ్యకశిపుని సేవిస్తున్నారు.

దైత్యదానవసంఘాస్తే సర్వే జ్వలితకుండలాః ।
స్రగ్విణో వాగ్మినః సర్వే సదైవ చరితవ్రతాః ॥ 82 ॥

సర్వే లబ్ధవరాః శూరాః సర్వే విగతమృత్యవః ।
ఏతే చాన్యే చ బహవో హిరణ్యకశిపుం ప్రభుమ్ ॥ 83 ॥

ఉపాసన్తి మహాత్మానం సర్వే దివ్యపరిచ్ఛదాః ।
విమానైర్వివిధాకారైః భ్రాజమానైరివాగ్నిభిః ॥ 84 ॥

దైత్య దానవ సంఘాలలోని వారంతా ప్రకాశిస్తూన్న కుండలాలు గలవారు, వాచాలత్వం కలవారు, చరితవ్రతులు, వరాలు పొందినవారు, శూరులు, మృత్యురహితులు. వీరు మాత్రమే కాక ఇంకనూ దివ్య వస్త్రాలు ధరించిన అనేకమంది దైత్యులు అగ్నితో సమానమైన కాంతి గలిగిన వివిధ విమానాలనధిరోహించి మహాత్ముడైన హిరణ్యకశిపుని సేవిస్తున్నారు.

మహేంద్రవపుషః సర్వే విచిత్రాంగదబాహవః ।
భూషితాంగా దితేః పుత్రాస్తముపాసన్త సర్వశః ॥ 85 ॥

మహేంద్రుని శరీరంవంటి శరీరం కల దైత్యులందరూ తమ చేతులకు విచిత్రాలైన భుజకీర్తులను ధరించి హిరిణ్యకశిపుని అన్ని వైపులా సేవిస్తున్నారు.

తస్యాం సభాయాం దివ్యాయామసురాః పర్వతోపమాః ।
హిరణ్యవపుషః సర్వే దివాకరసమప్రభాః ॥ 86 ॥

న శ్రుతం నైవ దృష్టం హి హిరణ్యకశిపోర్యథా ।
ఐశ్వర్యం దైత్యసింహస్య యథా తస్య మహాత్మనః ॥ 87 ॥

అటువంటి దివ్యమైన సభలో పర్వతాలవంటివారు, బంగారు వర్ణపు శరీరాలు గలవారు, సూర్యునితో సమానమైన కాంతిగల దైత్యులెందరో ఆ హిరణ్యకశిపుని సేవిస్తున్నారు. దైత్యసింహుడు, మహానుభావుడు అయినట్టి ఆ హిరణ్యకశిపుని ఐశ్వర్యం వంటిదానిని ఇంతవరకు వినలేదు మరియు చూడనూలేదనటంలో సందేహం లేదు.

కనకరజతచిత్రవేదికాయాం పరిధృతరత్నవిచిత్రవీథికాయామ్ ।
స దదర్శ మృగాధిపః సభాయాం సురచితరత్నగవాక్షశోభితాయామ్ ॥ 88 ॥

కనకవిమలహారభూషితాంగం దితితనయం స మృగాధిపో దదర్శ ।
దివసకర మహాప్రభం జ్వలంతం దితిజసహస్రశతైర్నిషేవ్యమాణమ్ ॥ 89 ॥

రత్నాలతో నిర్మించిన గవాక్షాలతో శోభాయమానంగా వున్న ఆ సభలో వెండి మరియు బంగారాలతో నిర్మించిన వేదిక మీదవున్న రత్నఖచితమైన సింహాసనాన్నధిష్ఠించి, స్వచ్ఛాలైన బంగారు హారాలు ధరించిన, సూర్యసమాన తేజస్సుతో ప్రకాశిస్తున్న, వేలకొలది దైత్యులచేత సేవించబడుతున్న దితి తనయుడైన హిరణ్యకశిపుని నరసింహస్వామి చూశాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నారసింహప్రాదుర్భావో నామ ఏకషష్ట్యధికశతతమోऽధ్యాయః ॥161॥

శ్రీమత్స్య మహాపురాణంలో నరసింహుడు అవతరించటమనే నూట అరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్విషష్ట్యధిక శతతమోఽధ్యాయః - నూటఅరవై రెండవ అధ్యాయం
నరసింహప్రాదుర్భావః - నరసింహుడు అవతరించుట

(ప్రహ్లాదవర్ణిత నరసింహరూప మహత్త్వము హిరణ్యకశిపుని ఆజ్ఞానుసారము నరసింహుని పై దైత్యులు అస్త్రములు సంధించుట.)

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

తతో దృష్ట్వా మహాత్మానం కాలచక్రమివాగతమ్ ।
నరసింహవపుశ్ఛన్నం భస్మచ్ఛన్నమివానలమ్ ॥ 1॥

హిరణ్యకశిపోః పుత్రః ప్రహ్లాదోనామ వీర్యవాన్ ।
దివ్యేన చక్షుషా సింహమపశ్యద్దేవ మాగతమ్ ॥ 2 ॥

కాలచక్రము వలె, నివురుగప్పిన నిప్పువలె నరసింహరూపంలో వచ్చిన మహానుభావుడైన ఆ దేవుని హిరణ్యకశిపుని పుత్రుడు, వీర్యవంతుడైన ప్రహ్లాదుడు దివ్యనేత్రంతో చూచాడు. భయంకరమైన పరాక్రమం గల రాక్షసులు, బ్రహ్మదేవుడు, శివుడు మొదలగు వారందరూ ఈయన నుదుటిపై తిరుగుతున్నట్లున్నారు. స్థావరాలు, జంగమాలైన ప్రాణులన్నీ ఈయనలో కనబడుతున్నాయి.

తం దృష్ట్వా రుక్మశైలాభం అపూర్వాం తనుమాశ్రితమ్।
విస్మితా దానవాః సర్వే హిరణ్యకశిపుశ్చ సః ॥3॥

బంగారు కొండవంటి అపూర్వమైన శరీరమును కలిగియున్న నరసింహుని చూచి దానవులందరునూ విస్మయము చెందిరి. హిరణ్యకశివుడు కూడా ఆశ్చర్యచకితుడయ్యెను.

ప్రహ్లాద ఉవాచ - ప్రహ్లాదుడు చెప్పాడు.

మహాబాహో మహారాజ దైత్యానామాదిసంభవ ।
న శ్రుతం న చ నో దృష్టం నారసింహమిదం వపుః ॥4॥

అవ్యక్తప్రభవం దివ్యం కిమిదం రూపమాగతమ్ ।
దైత్యాంతకరణం ఘోరం శంసతీవ మనో మమ ॥5॥

ప్రహ్లాదుడు హిరణ్యకశిపునితో అనెను. ఓ మహారాజా! ఓ మహాబాహూ! దైత్యులలో మొదట జన్మించినవాడా! ఇటువంటి నరసింహరూపము గురించి ఎప్పుడును వినలేదు చూడనూలేదు. అవ్యక్తప్రభవమైన మరియు దివ్యమైన ఈ రూపమెట్లు వచ్చినది? ఇది ఘోరమైన దైత్యవంశనాశనమునకు కారణమగునేమోనని నా మనస్సు శంకించుచున్నది.

అస్య దేవాః శరీరస్థాః సాగరాః సరితశ్చ యాః ।
హిమవాన్ పారియాత్రశ్చ యే చాన్యే కులపర్వతాః ॥6॥

చంద్రమాశ్చ సనక్షత్రైరాదిత్యైర్వసుభిః సహ ।
ధనదో వరుణశ్చైవ యమః చక్రః శచీపతిః ॥ 7॥

ఈ దేవుని యొక్క శరీరమున సాగరములు, నదులు, హిమవంతుడు, పారియాత్రుడు (వింధ్యుడని కోశములు చెప్పుచున్నవి) మొదలగు కులపర్వతములు, నక్షత్రములు, వసువులు, సూర్యచంద్రులు, కుబేరులు, వరుణుడు, యముడు, శచీపతియైన ఇంద్రుడు మొదలగువారు కనబడుచున్నారు.

మరుతో దేవగంధర్వా ఋషయశ్చ తపోధనాః ।
నాగా యక్షాః పిశాచాశ్చ రాక్షసా భీమవిక్రమాః ॥8॥

బ్రహ్మా దేవః పశుపతిః లలాటస్థా భ్రమంతి వై ।
స్థావరాని చ సర్వాణి జంగమాని తథైవ చ ॥9॥

ఇంకనూ వాయువులు, దేవతలు, గంధర్వులు, తపోధనులైన ఋషులు, నాగులు, యక్షులు, పిశాచములు, భయంకరులైన రాక్షసులు, బ్రహ్మదేవుడు, శివుడు మొదలగు వారందరూ ఈతని లలాటమున తిరుగుతున్నట్లున్నారు. స్థావరములు, జంగమములైన ప్రాణులన్ని ఈతనిలో కనబడుచున్నవి.

భవాంశ్చ సహితోஉస్మాభిః సర్వైర్దైత్యగణైర్వృతః ।
విమానశతసంకీర్ణా తథైవ భవతః సభా ॥ 10 ॥

సర్వం త్రిభువనం రాజన్ లోకధర్మాశ్చ శాశ్వతాః ।
దృశ్యన్తే నారసింహేஉస్మిన్ తథేదమఖిలం జగత్ ॥ 11 ॥

ఓ రాజా! ఈ దైత్యగణాలతో పాటు నేను, నీవు, వందల కొలది విమానాలతో పరివ్యాప్తమైన నీ సభ, శాశ్వతాలైన లోకధర్మాలు, త్రిభువనాలు, మరియు ఈ ప్రపంచమంతా ఈ నారసింహునిలో కనబడుతున్నాయి.

ప్రజాపతిశ్చాత్ర మనుర్మహాత్మా గ్రహాశ్చ యోగాశ్చ మహీరుహాశ్చ ।
ఉత్పాతకాలశ్చ ధృతిర్మతిశ్చ రతిశ్చ సత్యం చ తపో దమశ్చ ॥ 12 ॥

సనత్కుమారశ్చ మహానుభావో విశ్వేచ దేవా ఋషయశ్చ సర్వే ।
క్రోధశ్చ కామశ్చ తథైవ హర్షో ధర్మశ్చ మోహః పితరశ్చ సర్వే ॥ 13 ॥

ప్రజాపతులు, మహాత్ములైన మనువులు, గ్రహాలు, యోగాలు, ఉత్పాతకాలం, ధృతి, మతి, రతి, సత్యం, తపస్సు, దమము, మహానుభావుడైన సనత్కుమారుడు, విశ్వేదేవతలు, ఋషులందరు, క్రోధం, కామం, హర్షం, ధర్మం, మోహం మరియు పితరులందరు నరసింహరూపంలో కనబడుతున్నారు.

ప్రహ్లాదస్య వచః శృత్వా హిరణ్యకశిపుః ప్రభుః ।
ఉవాచ దానవాన్ సర్వాన్ గణాంశ్చ స గణాధిపాన్ ॥ 14 ॥

మృగేంద్రో గృహ్యతామేష అపూర్వాం తనుమాస్థితః ।
యది వా సంశయః కశ్చిద్ వధ్యతాం వనగోచరః ॥ 15 ॥

ప్రహ్లాదుని మాటలు విన్న ప్రభువైన హిరణ్యకశిపుడు దానవగణాలను, గణాధిపతులను కూడ ఉద్దేశించి ఇలా అన్నాడు. అపూర్వమైన ఇంతకు ముందెప్పుడూ విననటువంటి మృగేంద్రరూపమైన ఈ ప్రాణిని పట్టుకోండి. ఒకవేళ ఇది వన్యమృగమేనని అనుమానమొస్తే వధించండని చెప్పాడు.

తే దానవగణాః సర్వే మృగేంద్రం భీమవిక్రమమ్ ।
పరిక్షిపంతో ముదితాస్త్రాసయామాసురోజసా॥16॥

హిరణ్యకశివుని మాటలు వినిన ఆ దానవగణమంతయు భయంకరపరాక్రమముగల ఆ మృగేంద్రుని చుట్టుముట్టి ఆనందముతో తమ శక్తికొలది భయపెట్టిరి.

సింహనాదం విముచ్యాథ నరసింహో మహాబలః ।
బభంజ తాం సభాం సర్వాం వ్యాదితాస్య ఇవాంతకః ॥ 17॥

అపుడు మహాబలుడైన నరసింహుడు యమునివలె నోరు తెరిచి, సింహనాదము చేయుచు ఆ సభనంతటిని విరుగగొట్టెను.

సభాయాం భజ్యమానాయాం హిరణ్యకశిపుః స్వయమ్ ।
చిక్షేపాస్త్రాణి సింహస్య రోషాద్వ్యాకులలోచనః ॥18॥

ఆ విధముగ సభనంతటిని భేదించుచుండుట చూచి హిరణ్యకశిపుడు రోషముతో వ్యాకుల చిత్తుడై స్వయముగా అనేకాస్త్రములు నరసింహునిపై సంధించెను.

సర్వాస్త్రాణామథ జ్యేష్ఠం దండమస్త్రం సుదారుణమ్ ।
కాలచక్రం తథా ఘోరం విష్ణుచక్రం తథా పరమ్॥19॥

పైతామహం తథాత్యుత్థం త్రైలోక్య దహనం మహత్ ।
విచిత్రమశనీం చైవా శుష్కార్ద్రం చాశినిద్వయమ్ ॥20॥

అస్త్రములన్నింటిలో గొప్పదైన అత్యన్తదారుణమైన దండాయుధమును, ఘోరములైన కాలచక్రమును మరియు విష్ణుచక్రమును, అత్యుగ్రమైన మరియు ముల్లోకములను దహించు శక్తి గల బ్రహ్మాస్త్రమును, శుష్కము మరియు ఆర్ద్రమైన దానిని కూడ నిర్మూలింపశక్తిగల విచిత్రమైన వజ్రాయుధమును కూడ నరసింహునిపై హిరణ్యకశిపుడు సంధించెను.

రౌద్రం తథోగ్రం శూలంచ కంకాలం ముసలం తథా॥
మోహనం శోషణం చైవ సంతాపన విలాపనమ్॥21॥

వాయవ్యం మథనం చైవ కాపాలమథ కైకరమ్।
తథాప్రతిహతాం శక్తిం కౌశమస్త్రం తథైవ చ ॥22॥

రౌద్రము మరియు ఉగ్రముగా ఉన్నటువంటి శూలాయుధము, కంకాలము, ముసలము, మోహనాస్త్రము, శోషణాస్త్రము, సంతాపనాస్త్రము, విలాపనాస్త్రము, వాయవ్యాస్త్రము, మథనాస్త్రము, కాపాలాస్త్రము, కైకరాస్త్రము, అప్రతిహతమైన శక్తి-అస్త్రము, క్రౌంచాస్త్రము మొదలగు వాటిని కూడ హిరణ్యకశిపుడు నారసింహుని పై సంధించెను.

అస్త్రం బ్రహ్మశిరం చైవ సోమాస్త్రం శిశిరం తథా ।
కంపనం శాతనం చైవ త్వాష్ట్రం చైవ సుభైరవమ్ ॥ 23 ॥

కాలముద్గరమక్షోభ్యం తపనం చ మహాబలమ్ ।
సంవర్తనం మాదనం చ తథా మాయాధరం పరమ్ ॥ 24 ॥

ఇంకనూ బ్రహ్మశిరాస్త్రం, సోమాస్త్రం, శిశిరాస్త్రం, కంపనాస్త్రం, శాతనాస్త్రం, త్వాష్ట్రం, సుభైరవం, భయంకరమైన గదాయుధం, ఎదురులేనటువంటి తపనాస్త్రం, మహాబలం, సంవర్తనం, మాదనాస్త్రం మరియు మాయాధరం మొదలగు అస్త్రాలను కూడ హిరణ్యకశిపుడు నారసింహునిపై సంధించాడు.

గాంధర్వమస్త్రం దయితమసిరత్నం చ నందకమ్ ।
ప్రస్వాపనం ప్రమథనం వారుణం చాస్త్రముత్తమమ్ ॥
అస్త్రం పాశుపతం చైవ యస్యాప్రతిహతా గతిః ॥ 25 ॥

అస్త్రం హయశిరశ్చైవ బ్రాహ్మమస్త్రం తథైవ చ ।
నారాయణాస్త్రమైంద్రం చ సార్పమస్త్రం తథాద్భుతమ్ ॥ 26 ॥

ప్రియమైన గాంధర్వాస్త్రం, అసిరత్నమైన, నందకమైన, ప్రస్వాపనాస్త్రం, ప్రమథనాస్త్రం, ఉత్తమమైన వారుణాస్త్రం, అప్రతిహతమైన శక్తి గల పాశుపతాస్త్రం, హయశిరోస్త్రం, బ్రహ్మాస్త్రం, నారాయణాస్త్రం, ఐంద్రం మరియు అద్భుతమైన సర్పాస్త్రం మొదలగు అస్త్రాలను నరసింహునిపై సంధించాడు.

పైశాచమస్త్రమజితం శోషదం శామనం తథా ।
మహాబలం భావనం చ ప్రస్థాపనవికంపనే ॥ 27 ॥

ఏతాన్యస్త్రాణి దివ్యాని హిరణ్యకశిపుస్తదా ।
అసృజన్నరసింహస్య దీప్తస్యాగ్నేరివాహుతిమ్ ॥ 28 ॥

అపజయమెరుగని పైశాచాస్త్రం, శోషదం, శామనం, మహాబలంకల భావనాస్త్రం, ప్రస్థాపనం, వికంపనం మొదలగు అనేకాలైన దివ్యాస్త్రాలు జ్వలిస్తున్న అగ్నిలో ఆహుతి వేసినట్లు హిరణ్యకశిపుడు నరసింహునిపై వదిలాడు.

అస్త్రైః ప్రజ్వలితైః సింహమావృణోదసురోత్తమః ।
వివస్వాన్ ఘర్మసమయే హిమవంతమివాంశుభిః ॥ 29 ॥

స హ్యమర్షానిలోద్భూతో దైత్యానాం సైన్యసాగరః ।
క్షణేన ప్లావయామాస మైనాకమివ సాగరః ॥ 30 ॥

అసురోత్తముడైన హిరణ్యకశిపుడు వేసవికాలంలో సూర్యుడు తన కిరణాలతో హిమవంతునిపై పడినట్లు, బాగా జ్వలిస్తున్న అస్త్రాలతో నరసింహుని ఆక్రమించాడు. మరియు సముద్రుని బోలిన ఆతని సైన్యం కూడ మైనాకుని సముద్రం ముంచినట్లు కోపమనే వాయువుతో క్షణకాలంలోనే ఆ నరసింహుని కప్పివేశారు.

ప్రాసైః పాశైశ్చ ఖడ్గైశ్చ గదాభిర్ముసలైస్తథా ।
వజ్రైరశనిభిశ్చైవ సాగ్నిభిశ్చ మహాద్రుమైః ॥ 31 ॥

ముద్గరైర్భిందిపాలైశ్చ శిలోలూఖలపర్వతైః ।
శతఘ్నీభిశ్చ దీప్తాభిః దండైరపి సుదారుణైః ॥ 32 ॥

ప్రాసాలు, పాశాలు, ఖడ్గాలు, గదలు, ముసలాలు, వజ్రాయుధాలు, అగ్నితో కూడిన పిడుగులు, మహావృక్షాలు, ముద్గరాలు, భిందిపాలాలు, శిలలు, పర్వతాలు, దీప్తిమంతాలైన శతఘ్నులు, దారుణాలైన దండాయుధాలు మొదలగువాటితో ఆ దైత్యసైన్యం నరసింహుని ఆక్రమించింది.

తే దానవాః పాశగృహీతహస్తాః మహేంద్రతుల్యాశనివజ్రవేగాః ।
సమన్తతోఽభ్యుద్యత బాహుకాయాః స్థితాస్త్రిశీర్షా ఇవ నాగపాశాః ॥ 33 ॥

చేతులలో పాశాలను ధరించిన ఆ దానవులు మహేంద్రుని వజ్రాశనులతో సమానమైన వేగం కలవారై దృఢమైన శరీరాలు మరియు పైకెత్తిన బాహువులు కలవారై మూడుతలల నాగుపాములను బోలిన పాశాలతో నరసింహుని చుట్టుముట్టారు.

సువర్ణమాలాకులభూషితాంగాః పీతాంశుకాభోగవిభావితాంగాః ।
ముక్తావలీదామసనాథకక్షాః హంసా ఇవాభాన్తి విశాలపక్షాః ॥ 34 ॥

తమ శరీరావయవాలను బంగారు మాలలతో అలంకరించుకొన్న, పచ్చని పట్టువస్త్రాలు ధరించిన మెడలో ముత్యాలహారాలు అలంకరించుకొన్న ఆ దానవులు విశాల పక్షాలు గలిగిన హంసల వలె కనబడినారు.

తేషాం తు వాయుప్రతిమౌజసాం వై కేయూరమౌలీవలయోత్కటానామ్ ॥
తాన్యుత్తమాంగాన్యభితో విభాన్తి ప్రభాతసూర్యాంశుసమప్రభాణి ॥ 35 ॥

వాయు సమాన తేజస్సు కల ఆ దైత్యులు, భుజకీర్తులతో ఉత్కటాలైన శిరోభూషణాలతో ప్రాతఃకాలపు సూర్యకిరణాలతో సమానమైన కాంతి కలవారై సర్వత్ర ప్రకాశిస్తున్నారు.

క్షిపద్భిరుగ్రైర్జ్వలితైర్మహాబలైః మహాస్త్రపూగైః సుసమావృతో బభౌ ।
గిరిర్యథా సంతతవర్షిభిర్ఘనైః కృతాంధకారాన్తరకందరో ద్రుమైః ॥ 36 ॥

మహాబలులైన ఆ దైత్యులు సంధించి ఉగ్రమైన మరియు మండుతున్న శస్త్రాస్త్రసమూహాలతో ఆవరించబడిన ఆ నరసింహుడు ఎడతెరిపి లేకుండా వర్షించుచున్న దట్టమైన మేఘాలతో అంతటా అంధకారం వ్యాపించిన గుహలు, వృక్షాలు గల పర్వతం వలె ప్రకాశించాడు.

తైర్హన్యమానోఽపి మహాస్త్రజాలైః మహాబలైర్దైత్యగణైః సమేతైః ।
నాఽకమ్పతాజౌ భగవాన్ ప్రతాపాత్ స్థితః ప్రకృత్యా హిమవానివాచలః ॥ 37 ॥

మహాబలులైన దైత్యులందరూ మహాస్త్ర జాలంతో కొట్టుతున్నప్పటికిని నరసింహభగవానుడు యుద్ధంలో హిమవంతుని వలె నిశ్చలుడై స్థిరంగా నిలిచాడు కాని ఏ మాత్రం కదలలేదు.

సన్త్రాసితాస్తేన నృసింహరూపిణా దితేః సుతాః పావకతుల్యతేజసా ।
భయాద్విచేలుః పవనోద్ధుతాంగాః యథోర్మయః సాగరవారిసంభవాః ॥ 38 ॥

అగ్ని సమాన తేజస్సు గల నరసింహరూపధారియైన దేవుని వల్ల భయకంపితులై దైత్యులందరూ పెనుగాలికి ఉవ్వెత్తున లేచే సముద్రపు అలల వలె వుండినారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నారసింహప్రాదుర్భావో నామ ద్విషష్ట్యధికశతతమోఽధ్యాయః ॥ 162 ॥

శ్రీమత్స్య మహాపురాణంలో నరసింహుడు అవతరించుట అనే నూటఅరవై రెండవ అధ్యాయం సమాప్తం.



త్రిషష్ట్యధిక శతతమోఽధ్యాయః – నూటఅరవై మూడవ అధ్యాయం

హిరణ్యకశిపు వధః – హిరణ్యకశిపుని వధించుట

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఖరాః ఖరముఖాశ్చైవ మకరాశీవిషాననాః ।
ఈహామృగముఖాశ్చాన్యే వరాహముఖసంస్థితాః ॥ 1 ॥

బాలసూర్యముఖాశ్చాన్యే ధూమకేతుముఖాస్తథా ।
అర్ధచంద్రార్ధవక్త్రాశ్చ అగ్నిదీప్తముఖాస్తథా ॥ 2 ॥

హంస కుక్కుటవక్త్రాశ్చ వ్యాదితాస్యా భయావహాః ।
సింహాస్యా లేలిహానాశ్చ కాక గృధ్రముఖాస్తథా ॥ 3 ॥

ద్విజిహ్వాకా వక్రశీర్షాస్తథోల్కాముఖసంస్థితాః ।
మహాగ్రహముఖాశ్చాన్యే దానవా బలదర్పితాః ॥ 4 ॥

శైలసంవర్ష్మణస్తస్య శరీరే శరవృష్టిభిః ।
అవధ్యస్య మృగేంద్రస్య న వ్యథాం చక్రు రాహవే ॥ 5 ॥

గాడిదలు, మొసళ్ళు, పాములు, ఈహామృగాలు మరియు వరాహాల ముఖాల వంటి ముఖాలు గలిగిన దైత్యులు, బాల సూర్యుడు, ధూమకేతువు, అర్ధచంద్రుడు, మొదలగు వాటిని బోలిన ముఖాలు మరియు అగ్నివలె జ్వలించే ముఖాలు గల దైత్యులు, హంసలు, కుక్కుటాలు, సింహాలు, సర్పాలు, కాకులు, గ్రద్దలు మొదలగు వాటి వంటి ముఖాలు గలవారు మరియు విశాలంగా నోరు తెరచుకొని భయంకరంగా కనబడుతున్న ముఖాలు గల దైత్యులు, మరియు రెండు నాలుకలు గలవారు, వక్రంగావున్న తలలు కలవారు, ఉల్కల వంటి ముఖాలు గలవారు, మహాగ్రహాల వంటి ముఖాలు కలవారు మరియు బలగర్వితులూ అయిన దానవులందరు పర్వతాకారపు శరీరం కలిగి అవధ్యుడైన ఆ నరసింహుని శరీరంపై బాణాల వర్షాలు కురిపించారు కాని యుద్ధంలో ఆ దేవునికి ఎటువంటి వ్యథనూ కలిగించలేకపోయారు.

ఏవం భూయోఽపరాన్ ఘోరానసృజన్ దానవేశ్వరాః ।
మృగేంద్రస్యోపరి క్రుద్ధాః నిఃశ్వసన్త ఇవోరగాః ॥ 6 ॥

ఇలా దానవేశ్వరులందరు సర్పాల వలె బుసకొడుతూ కోపంతో నరసింహునిపై మరికొన్ని భయంకరాలైన బాణాలను వదిలారు.

తే దానవశరా ఘోరా దానవేంద్రసమీరితాః ।
విలయం జగ్మురాకాశే ఖద్యోతా ఇవ పర్వతే ॥ 7 ॥

కాని దానవేంద్రులు వదలిన ఘోరబాణాలన్నీ పర్వతంపై మెరపుల వలె ఆకాశంలో లయమయ్యాయి.

తతశ్చక్రాణి దివ్యాని దైత్యాః క్రోధసమన్వితాః ।
మృగేంద్రాయాసృజన్నాశు జ్వలితాని సమన్తతః ॥8॥

తైరాసీద్గగనం చక్రైః సంపతద్భిరితస్తతః ।
యుగాన్తే సంప్రకాశద్భిః చంద్రాదిత్యగ్రహైరివ ॥9॥

అప్పుడు దైత్యులు క్రోధయుక్తులై జ్వలించుచున్న దివ్యములైన చక్రములను అన్ని దిశల నుండి నరసింహునిపై సంధించారు. అట్లు అన్ని దిశలనుండి పడుతున్న ఆ చక్రములతో ప్రళయకాలమున జ్వలించు చంద్రసూర్యాది గ్రహములతో ఆకాశము ఎట్లు భయము గొల్పునో అట్లు నరసింహుడు కనబడ్డాడు.

తాని సర్వాణి చక్రాణి మృగేంద్రేణ మహాత్మనా ।
గ్రస్తాన్యుదీర్ణాని తదా పావకార్చిస్సమాని వై ॥10॥

తాని చక్రాణి వదనే విశమానాని భాంతి వై ।
మేఘోదరదరీష్వేవ చంద్రసూర్యగ్రహా ఇవ ॥11॥

అగ్ని సమానములైన ఆ చక్రములన్నియు మహాత్ముడైన నరసింహునిచే మ్రింగివేయబడ్డాయి. ఆ చక్రములన్నియు మేఘసమూహపు గుహలలో సూర్యచంద్రులు ప్రవేశించుచున్నట్లు ఆ నరసింహుని నోటిలో ప్రవేశింపసాగాయి.

హిరణ్యకశిపుర్దైత్యో భూయః ప్రాసృజదూర్జితామ్ ।
శక్తిం ప్రజ్వలితాం ఘోరం ధౌతశస్త్రతడిత్ప్రభామ్ ॥12॥

అపుడు, దైత్యుడైన హిరణ్యకశిపుడు మరల ఘోరమైన మఱియు ప్రజ్వలితమైన మెరుపువంటికాంతి గలిగిన 'శక్తి' ఆయుధమును నరసింహునిపై ప్రయోగించాడు.

తామాపతన్తీం సంప్రేక్ష్య మృగేంద్రః శక్తిముజ్జ్వలామ్ ।
హుంకారేణైవ రౌద్రేణ బభంజ భగవాంస్తదా ॥13॥

అట్లు తనపై పడబోవుచున్న ఉజ్జ్వలమైన 'శక్తి' ఆయుధమును చూచి మృగేంద్రరూపుడైన నరసింహుడు రౌద్రమైన హుంకారముతోనే విరిచివేశాడు.

రరాజ భగ్నా సా శక్తి ర్మృగేంద్రేణ మహీతలే ।
సవిస్ఫులింగా జ్వలితా మహోల్కేవ దివశ్చ్యుతా ॥14॥

అట్లు మృగేంద్రునిచే భగ్నము చేయబడిన ఆ 'శక్తి' ఆయుధము నిప్పురవ్వలతో జ్వలించుచు ఆకాశమునుండి భూమిపై పడుచున్న మహోల్కము వలె కనబడింది.

నారాచపంక్తిః సింహస్య ప్రాప్తా రేజే విదూరతః ।
నీలోత్పలపలాశానాం మాలేవోజ్జ్వలదర్శనా ॥15॥

దైత్యులు సంధించిన బాణాల పంక్తి నరసింహునికి దూరంలోనే నిలిచి నల్లకలువలు, మోదుగ పూలమాల వలె ఉజ్జ్వలంగా ప్రకాశించింది.

స గర్జిత్వా యథాన్యాయం విక్రమ్య చ యథాసుఖమ్ ।
తత్సైన్యముత్సారితవాన్ తృణాగ్రాణీవ మారుతః ॥16॥

ఆ నృసింహుడు యథాన్యాయంగా గర్జించి, యథాసుఖంగా అనగా సులభంగా పరాక్రమించి, వాయువు గడ్డికొసలను వలె ఆ సైన్యాన్ని నశింపజేశాడు.

తతోఽశ్మవర్షం దైత్యేంద్రా వ్యసృజన్త నభోగతాః ।
నగమాత్రైశ్శిలాఖండైర్గిరిశృంగైర్మహాప్రభైః ॥17॥

అప్పుడు దైత్యేంద్రులు ఆకాశంలో వుండి మహాకాంతిమంతమైన కొండలంతటి శిలాఖండాలతో గిరిశృంగాలతో నృసింహునిపై రాళ్ళవాన కురిపించారు.

తదశ్మవర్షం సింహస్య మహన్మూర్ధని పాతితమ్ ।
దిశో దశ వికీర్ణా వై ఖద్యోతప్రకరా ఇవ ॥18॥

కాని ఆ రాళ్ళవాన మహానుభావుడైన ఆ దేవుని తలపై పడి మిణుగుడు పురుగుల వలె పది దిక్కులలో వ్యాప్తి చెంది పడిపోయింది.

తదాశ్మౌఘైర్దైత్యగణాః పునఃసింహమరిన్దమమ్ ।
ఛాదయాంచక్రిరే మేఘా ధారాభిరివ పర్వతమ్ ॥19॥

మేఘాలు జలధారలతో పర్వతాన్ని కప్పివేసినట్లు మరల ఆ దైత్యగణాలు శత్రునాశకుడైన ఆ నరసింహదేవుని శిలారాసులతో కప్పివేశాయి.

న చ తం చాలయామాసుర్దైత్యౌఘా దేవసత్తమమ్ ।
భీమవేగోఽచలశ్రేష్ఠం సముద్ర ఇవ మందరమ్ ॥ 20 ॥

కాని భయంకర వేగం గల సముద్రం పర్వతశ్రేష్ఠుడైన మందరగిరిని చలింపజేయలేనట్లే ఆ దైత్య సమూహాలు దేవసత్తముడైన నృసింహుని చలింపజేయలేకపోయాయి.

తతోఽశ్మవర్షే విహతే జలవర్షమనన్తరమ్ ।
ధారాభిరక్షమాత్రాభిః ప్రాదురాసీత్సమన్తతః ॥ 21 ॥

అలా అశ్మవర్షము వ్యర్థం కాగా దైత్యులు నరసింహునిపై అన్ని వైపుల నుండి జలవర్షం కురిపించారు. ఆ జలవర్షపు ధారలు బండిచక్రపు ఇరుసంత లావుగా ఉండినవి.

నభసః ప్రచ్యుతా ధారాస్తిగ్మవేగాః సమన్తతః ।
ఆవృత్య సర్వతో వ్యోమ దిశశ్చోపదిశస్తథా ॥ 22 ॥

ధారా దివి చ సర్వత్ర వసుధాయాం చ సర్వశః ।
న స్పృశన్తి చ తా దేవం నిపతంతోఽనిశం భువి ॥ 23 ॥

బాహ్యతో వవృషుర్వర్షం నోపరిష్టాచ్చ వవృషుః ।
మృగేంద్రప్రతిరూపస్య స్థితస్య యుధి మాయయా ॥ 24 ॥

తీవ్రమైన వేగంతో ఆకాశం నుండి అంతటా పడుతున్న ఆ జలధారలతో అటు ఆకాశమే కాకుండా దిశలు, ఉపదిశలు, అంతరిక్షం, ద్యులోకం, భూమి మొదలైనవన్నీ భయంకరంగా కప్పివేయబడినాయి. కాని అలా నిర్విరామంగా పడుతున్న ఆ జలధారలు ఆ దేవుని స్పృశించలేకపోయాయి. యుద్ధంలో మృగేంద్రరూపంలో స్థిరంగా నిలచిన ఆ దేవునికి జలధారలు వెలుపలనే పడినాయి, కాని మీద పడలేదు.

హతేఽశ్మవర్షే తుములే జలవర్షే చ శోషితే ।
సోఽసృజద్దానవో మాయామగ్నివాయుసమరితామ్ ॥ 25 ॥

ఆ విధంగా రాళ్ళతో కురిపించిన వాన అణగిపోగా, నీటిధారలతో కూడిన వాన కూడ ఎండిపోగా ఆ దానవుడు అగ్ని వాయువులతో కూడిన మాయా యుద్ధం మొదలుపెట్టాడు.

మహేన్ద్రస్తోయదైః సార్ధం సహస్రాక్షో మహాద్యుతిః ।
మహతా తోయవర్షేణ శమయామాస పావకమ్ ॥ 26 ॥

అప్పుడు సహస్రాక్షుడు, మహాద్యుతిమంతుడూ అయిన మహేంద్రుడు ఆ అగ్నిని మేఘాలతో కూడిన మహాజల వర్షంతో శమింపజేశాడు.

తస్యాం ప్రతిహతాయాం తు మాయాయాం యుధి దానవః ।
అసృజద్ఘోరసంకాశం తమస్తీవ్రం సమన్తతః ॥ 27 ॥

ఆ మాయ కూడ శమించిపోగా ఆ దానవుడు యుద్ధంలో ఘోరమైన అంధకారాన్ని సృష్టించాడు. ఆ అంధకారం అన్ని దిశలకు వ్యాప్తి చెందింది.

తమసా సంవృతే లోకే దైత్యేష్వాత్తాయుధేషు చ ।
స్వతేజసా పరివృతో దివాకర ఇవాబభౌ ॥ 28 ॥

త్రిశిఖాం భ్రుకుటీం చాస్య దదృశుర్దానవా రణే ।
లలాటస్థాం త్రిశూలాంకాం గంగాం త్రిపథగామివ ॥ 29 ॥

అలా నలువైపుల నుండి క్రమ్మిన ఘోరాంధకారం నడుమ దానవులు ఆయుధసహితులై తన ముందు నిలువగా నరసింహుడు తన తేజస్సుతో చుట్టబడిన సూర్యుని వలె ప్రకాశించాడు. యుద్ధంలో అప్పుడు దానవులు మూడు శిఖలలో వున్న నరసింహుని లలాటాన్ని చూచారు. అది త్రిశూలపు చిహ్నంతో ముడివడిన కనుబొమల మధ్య నుండి మూడు త్రోవల ద్వారా (త్రిపథగా) ప్రవహించే గంగానది వలె కనబడింది.

తతః సర్వాసు మాయాసు హతాసు దితినందనాః ।
హిరణ్యకశిపుం దైత్యం వివర్ణాః శరణం యయుః ॥ 30 ॥

ఆ విధంగా తమ మాయలన్నీ వీగిపోగా దైత్యులు నిస్తేజులై దైత్యేంద్రుడైన హిరణ్యకశిపుని శరణువేడారు.

తతః ప్రజ్వలితః క్రోధాత్ ప్రదహన్నివ తేజసా ।
తస్మిన్ క్రుద్ధే తు దైత్యేంద్రే తమోభూతమభూజ్జగత్ ॥ 31 ॥

ఆవహః ప్రవహశ్చైవ వివహోఽథ హ్యుదావహః ।
పరావహః సంవహశ్చ మహాబలపరాక్రమాః ॥ 32 ॥

తథా పరివహః శ్రీమాన్ ఉత్పాతభయశంసనాః ।
ఇత్యేవం క్షుభితాః సప్త మరుతో గగనే చరాః ॥ 33 ॥

అప్పుడు హిరణ్యకశిపుడు కోపోద్రిక్తుడై తన తేజస్సుతో ప్రజ్వలిస్తున్నట్లు కనబడినాడు. అలా దైత్యేంద్రుడు కోపించగా జగత్తంతా అంధకారమయమయింది. ఆ సమయంలో ఆవహం, ప్రవహం, వివహం, ఉదాహవం, పరావహం, సంవహం, పరివహమనే మహాబలపరాక్రమాలు గల సప్తవాయువులు ఉత్పాతభయాన్ని సూచిస్తూ గగనసంచారులై క్షోభింపజేశాయి.

యే గ్రహాః సర్వలోకస్య క్షయే ప్రాదుర్భవన్తి వై ।
తే సర్వే గగనే దృష్టా వ్యచరన్త యథాసుఖమ్ ॥ 34 ॥

అన్యం గతే చాప్యచరన్ మార్గం నిశి నిశాచరః ।
సగ్రహః సహ నక్షత్రై రాకాపతిరరిందమః ॥ 35 ॥

మరియు లోకాలన్ని నశించే కాలంలో అనగా ప్రళయకాలంలో ఉద్భవించే గ్రహాలన్నీ ఆకాశంలో యథేచ్ఛగా తిరుగుతూ కనబడినాయి. అంతేకాక శత్రునాశకుడు రాకాపతి, నిశాచరుడూ అయిన చంద్రుడు కూడ తన సహజ మార్గాన్ని వదలి గ్రహ నక్షత్రాలతో కలసి వేరే మార్గంలో సంచరించసాగాడు.

వివర్ణతాం చ భగవాన్ గతో దివి దివాకరః ।
కృష్ణం కబంధం చ తథా లక్ష్యతే సుమహద్దివి ॥ 36 ॥

అముంచచ్చార్చిషాం వృందం భూమివృత్తిర్విభావసుః ।
గగనస్థశ్చ భగవాన్ అభీక్ష్ణం పరిదృశ్యతే ॥ 37 ॥

మరియు పగలే సూర్యభగవానుడు వివర్ణుడయ్యాడు. అలాగే ఆకాశంలో భయంకరమైన నల్లని మొండెమొకటి కనబడింది. అగ్నిదేవుడు భూమిని విడచి తన జ్వాలలతో ఆకాశంలో మండుతూ కనబడసాగాడు.

సప్త ధూమ్రనిభా ఘోరా సూర్యా దివి సముత్థితాః ।
సోమస్య గగనస్థస్య గ్రహాస్తిష్ఠన్తి శృంగగాః ॥ 38 ॥

వామేన దక్షిణే చైవ స్థితౌ శుక్రబృహస్పతీ ।
శనైశ్చరో లోహితాంగో జ్వలనాంగసమద్యుతీ ॥ 39 ॥

సమం సమధిరోహన్తః సర్వే తే గగనే చరాః ।
శృంగాని శనకైర్ఘోరాః యుగాంతావర్తినో గ్రహాః ॥ 40 ॥

ఘోరమైన పొగవలె వున్న సప్త సూర్యులు ఆకాశంలో ఉదయించి కనబడినారు. అంతేకాక అంతరిక్షంలో ప్రకాశిస్తున్న చంద్రుని కొమ్ములపై (పూర్ణిమ చంద్రుడు కాక మిగతా రోజులలో కొమ్ము ఆకారంలో వెలిగే చంద్రుడు) గ్రహాలన్నీ కనబడసాగినవి. చంద్రుని ఎడమ కొమ్ముపై శుక్రుడు, కుడి వైపున బహస్పతి మరొక వైపున అగ్నివలె జ్వలిస్తున్న శని మరియు అంగారకుడు కనబడసాగెను. యుగప్రళయకాలంలో మాత్రమే ఈ విధంగా కనబడే గ్రహాలన్నీ ఇప్పుడు చంద్రుని కొమ్ములపై కనబడుతున్నారు.

చంద్రమాశ్చ సనక్షత్రైః గ్రహైస్సహ తమోనుదః ।
చరాచరవినాశాయ రోహిణీం నాభ్యనందత ॥ 41 ॥

గృహ్యతే రాహుణా చంద్ర ఉల్కాభిరభిహన్యతే।
ఉల్కాః ప్రజ్వలితాశ్చంద్రే విచరన్తి యథాసుఖమ్ ॥ 42 ॥

గ్రహ-నక్షత్రాదులతో కూడి లోకంలో అంధకారాన్ని నిర్మూలించవలసిన చంద్రుడు రోహిణిని అభినందించలేదు. ఇది చరాచరవినాశానికి సూచకంగా వుంది. మరియు రాహువు చంద్రుని మ్రింగసాగాడు. ఉల్కలు చంద్రునికి అవరోధం కల్పిస్తూ ప్రజ్వలితాలై ఆతనియందే యథేచ్ఛగా తిరుగుతున్నాయి.

దేవానామపి యో దేవః సోఽ ప్యవర్షత శోణితమ్ ।
అపతన్ గగనాదుల్కా విద్యుద్రూపా మహాస్వనాః ॥ 43 ॥

దేవేంద్రుడు ఆకాశం నుండి రక్తం వర్షించాడు. మెరపుల వంటి ఉల్కలు మహాధ్వనులతో క్రిందపడసాగాయి.

అకాలే చ ద్రుమాః సర్వే పుష్పన్తి చ ఫలన్తి చ ।
లతాశ్చ సఫలాః సర్వా యే చాహుర్దైత్యనాశనమ్ ॥ 44 ॥

ఫలైః ఫలాన్యజాయన్త పుష్పైః పుష్పం తథైవ చ ।

వృక్షాలు అకాలంలో పుష్పించాయి, ఫలించాయి, పండ్లు పండని లతలలో పండ్లు ఉద్భవించాయి. అంతేకాక పువ్వుల నుండి పువ్వులు, ఫలాల నుండి ఫలాలుద్భవించాయి. ఇదంతా దైత్యనాశనాన్ని సూచిస్తున్నది.

ఉన్మీలంతి నిమీలంతి హసంతి చ రుదంతి చ ॥ 45 ॥

విక్రోశంతి చ గంభీరా ధూమయంతి జ్వలంతి చ ।
ప్రతిమాః సర్వదేవానాం వేదయంతి మహద్భయమ్ ॥ 46 ॥

దేవతల ప్రతిమలన్నీ కన్నులు తెరుస్తూ, మూస్తూ, నవ్వుతూ, ఏడుస్తూ, గంభీర ధ్వనితో అరుస్తూ, జ్వలిస్తూ, పొగలుగ్రక్కుతూ రాబోవు మహాభయాన్ని సూచిస్తున్నాయి.

ఆరణ్యైః సహ సంసృష్టా గ్రామ్యాశ్చ మృగపక్షిణః ।
చక్రుః సుభైరవం తత్ర మహాయుద్ధముపస్థితమ్ ॥ 47 ॥

నద్యశ్చ ప్రతికూలాని వహన్తి కలుషోదకాః ।
న ప్రకాశన్తి చ దిశో రక్తరేణుసమాకులాః ॥ 48 ॥

వానస్పత్యో న పూజ్యంతే పూజనార్హాః కథంచన ।
వాయువేగేన హన్యన్తే భజ్యన్తే ప్రణమన్తి చ ॥ 49 ॥

గ్రామాలలో వుండే మృగాలు, పక్షులు అడవులలో వుండే వాటితో కలిసి మహాయుద్ధాన్ని సూచిస్తున్నాయి. అవి భయంరకమైన ధ్వనులు చేస్తున్నాయి. నదులు కలుషపూరితాలైన జలాలతో ప్రతికూల మార్గంలో ప్రవహించసాగాయి. దిక్కులన్నీ రక్తంతో, ధూళితో నిండిపోయి కాంతి విహీనాలయ్యాయి. పూజింపదగిన వనస్పతులను పూజించడం లేదు. అంతేకాక అవి గాలి వేగంగా వీచటం వలన విరిగిపోతున్నాయి. మరియు వాటిని నరికేస్తున్నారు.అవి నేలపై పడిపోయి నమస్కరిస్తున్నట్లు వుంటున్నాయి.

యదా చ సర్వభూతానాం ఛాయా న పరివర్తతే ।
అపరాహ్ణగతే సూర్యే లోకానాం యుగసంక్షయే ॥ 50 ॥

తదా హిరణ్యకశిపోః దైత్యస్యోపరివేశ్మనః ।
భాండాగారాయుధాగారే నివిష్టమభవన్మధు ॥ 51 ॥

సూర్యుడు అపరాహ్ణంలో ప్రవేశించినంతనే చరాచర ప్రాణులందరికి తమ నీడ కూడ కనబడలేదు. ఇది యుగాంతాన్ని సూచిస్తున్నది. అప్పుడు దైత్యేంద్రుడైన హిరణ్యకశిపుని భవనంపైన, భాండాగారం మరియు ఆయుధాగారాల్లో తేనె తుట్టెలు పట్టాయి.

అసురాణాం వినాశాయ సురాణాం విజయాయ చ ।
దృశ్యన్తే వివిధోత్పాతాః ఘోరా ఘోరనిదర్శనాః ॥ 52 ॥

ఏతే చాన్యే చ బహవో ఘోరోత్పాతాః సముత్థితాః ।
దైత్యేంద్రస్య వినాశాయ దృశ్యన్తే కాలనిర్మితాః ॥ 53 ॥

ఈ విధంగా అసురుల నాశనాన్ని, దేవతల విజయాన్ని సూచించే ఘోరాలైన పలురకాల ఉత్పాతాలు కనబడినాయి. ఇంతే కాక దైత్యేంద్రుడైన హిరణ్యకశిపుని వినాశనాన్ని సూచించే కాలనిర్మితాలైన ఘోరోత్పాతాలు చాలా కనబడినాయి.

మేదిన్యాం కంపమానాయాం దైత్యేంద్రేణ మహాత్మనా ।
మహీధరా నాగగణా నిపేతురమితౌజసః ॥ 54 ॥

విషజ్వాలాకులైర్వక్త్రైర్విముంచంతో హుతాశనమ్ ।
చతుఃశీర్షాః పంచశీర్షాః సప్తశీర్షాశ్చ పన్నగాః ॥ 55 ॥

మహాత్ముడైన దైత్యేంద్రుడు భూమిని కంపింపజేయగా మహాబలం గలిగిన సర్పగణాలన్నీ విషజ్వాలలు గలిగిన ముఖాలనుండి అగ్నిని గ్రక్కసాగినాయి. ఆ సర్పగణాలలో నాలుగు ఐదు మరియు ఏడు తలలు గలిగిన నాగులు కూడ వున్నాయి.

వాసుకిస్తక్షకశ్చైవ కర్కోటకధనంజయౌ ।
ఏలాముఖః కాలియశ్చ మహాపద్మశ్చ వీర్యవాన్ ॥ 56 ॥

సహస్రశీర్షో నాగో వై హేమతాలధ్వజః ప్రభుః ।
శేషోఽనంతో మహాభాగో దుష్ప్రకంప్యః ప్రకంపితః ॥ 57 ॥

మరియు వాసుకి, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు, ఏలాముఖుడు, కాళియుడు, వీర్యవంతుడైన మహాపద్ముడు మొదలగువారు కంపించారు. ఇంకనూ వేయి శిరస్సులు కలవాడు, బంగారు తాటిచెట్టు ధ్వజంగా కలవాడు, కంపింపజేయడానికి శక్యం కానివాడు, మహానుభావుడు, అనంతుడూ అయిన శేషుడు కూడ కంపించాడు.

దీప్తాన్యన్తర్జలస్థాని పృథివీధరణాని చ ।
తదా కృద్ధేన మహతా కంపితాని సమన్తతః ॥ 58 ॥

నాగాస్తేజోధరాశ్చాపి పాతాలతలచారిణః ॥

నీటిమధ్య సంచరించే దీప్తిమంతాలైన ప్రాణులు మరియు ఈ భూమండలమంతటికిని ఆధారాలైన అనేక ప్రాణులు మహత్తరమైన కోపంతో కంపించసాగినవి. మరియు తేజోవంతాలైన పాతాళలోకంలోని నాగులు కూడ అమితముగ కంపించాయి.

హిరణ్యకశిపుర్దైత్యః తదా సంస్పృష్టవాన్ మహీమ్ । 59 ॥
సందష్టోష్ఠపుటః క్రోధాద్వరాహ ఇవ పూర్వజః ॥

అపుడు దైత్యుడైన హిరణ్యకశిపుడు కోపంతో తన పెదవులను కొరుకుతూ వరాహుని చేతిలో మరణించిన హిరణ్యాక్షుని వలె భూమి అంతా కంపించేటట్లు స్పృశించాడు.

నదీ భాగీరథీ చైవ సరయూః కౌశికీ తథా ॥ 60 ॥

యమునా త్వథ కావేరీ కృష్ణవేణీ చ నిమ్నగా ॥
సువేణీ చ మహాభాగా నదీ గోదావరీ తథా ॥ 61 ॥

చర్మణ్వతీ చ సింధుశ్చ తథా నదనదీపతిః ।
కమలప్రభవశ్చైవ శోణో మణినిభోదకః ॥ 62 ॥

గోమతీ గోకులాకీర్ణా తథా పూర్ణసరస్వతీ ॥ 63॥

మహీ కాలమహీ చైవ తమసా పుణ్యవాహినీ ।

భాగీరథి, సరయువు, కౌశికి, యమున, కావేరి, కృష్ణవేణి, సువేణ, గోదావరి, చర్మణ్వతి, సింధు, మణుల కాంతి వంటి కాంతి గలిగిన జలముగల శోణానది, శుభజలాలు గల నర్మద, వేత్రవతి, గోవుల మందలతో నిండిన గోమతి, పూర్ణమైన సరస్వతి, మహి మరియు కాలమహీ నదులు, పుణ్యవాహినియైన తమసానది మొదలగు నదులన్నింటిని అతని స్పర్శచేత కంపింపజేశాడు.

జంబూద్వీపం రత్నవటం సర్వరత్నోపశోభితమ్ ॥ 64 ॥

సువర్ణప్రకటం చైవ సువర్ణాకరమండితమ్ ।
మహానదం చ లౌహిత్యం శైలకాననశోభితమ్ ॥ 65 ॥

పత్తనం కోశకరణమృషివీరజనాకరమ్ ।
మాగధాశ్చ మహాగ్రామా ముండాః శృంగాస్తథైవ చ ॥ 66 ॥

సుహ్యా మల్లా విదేహాశ్చ మాలవాః కాశికోసలాః ।
భవనం వైనతేయస్య దైత్యేంద్రేణాభికంపితమ్ ॥ 67 ॥

కైలాసశిఖరాకారం యత్ కృతం విశ్వకర్మణా ।

మరియు సర్వరత్నోపశోభితమైన జంబూద్వీపాన్ని, బంగారానికి నిలయమైన సువర్ణప్రకటాన్ని, మహానదులతో, పర్వతాలతో, ఉపవనాలతో శోభిల్లుతున్న లౌహిత్యదేశాన్ని, ఋషులకు, వీరులకు గనియైన కోశకారుల పట్టణాన్ని, మహాగ్రామాలు గల మగధ దేశాన్ని, సుహ్య, మల్ల, విదేహ మాలవ, కాశి, కోసల మొదలగు దేశాలన్నింటిని మరియు విశ్వకర్మచే స్వయంగా నిర్మితమైన, కైలాస శిఖరాకారాన్ని బోలిన వైనతేయుని భవనాన్ని కూడ కంపింజేశాడు.

రక్తతోయో మహాభీమో లౌహిత్యో నామ సాగరః ॥ 68 ॥

ఉదయశ్చ మహాశైల ఉచ్ఛ్రితః శతయోజనమ్ ।
సువర్ణవేదికః శ్రీమాన్ మేఘపంక్తినిషేవితః ॥ 69 ॥

భ్రాజమానోఽర్కసదృశైః జాతరూపమయైర్ద్రుమైః ।
శాలైస్తాలైస్తమాలైశ్చ కర్ణికారైశ్చ పుష్పితైః ॥ 70 ॥

అయోముఖశ్చ విఖ్యాతః పర్వతో ధాతుమండితః ।
తమాలవనగంధశ్చ పర్వతో మలయః శుభః ॥ 71 ॥

ఎఱ్ఱని నీటితో మహాభయంకరంగా కనబడు లౌహిత్యమనే సాగరాన్ని, నూరుయోజనాల విస్తీర్ణంలో వ్యాపించి, అనేక సువర్ణవేదికలతో అలంకరించబడిన, మేఘపంక్తులతో సేవింపబడిన, సూర్యునివంటి కాంతి గలిగిన, శాల–తాల–తమాలాది వృక్షాలతో మరియు పుష్పించిన కర్ణికార వృక్షాలతో ప్రకాశిస్తున్న ఉదయమహాపర్వతాన్ని, గైరికాదిధాతువులతో శోభిస్తున్న అయోముఖ పర్వతాన్ని, తమాల వనగంధంతో ప్రసిద్ధిచెందిన శుభప్రదమైన మలయ పర్వతాన్ని కూడ ఆ దైత్యుడు కంపింపజేశాడు.

సురాష్ట్రాశ్చ సుబాహ్లీకా శూరభీరాస్త థైవ చ ।
భోజాః పాండ్యాశ్చ వంగాశ్చ కలింగాస్తామ్రలిప్తకాః ॥ 72 ॥

తథైవోంఁడ్రాశ్చ పౌంఁడ్రాశ్చ వామచూడాః సకేరలాః ।
క్షోభితాస్తేన దైత్యేన సదేవాశ్చాప్సరోగణాః ॥ 73 ॥

సురాష్ట్ర, సుబాహ్లీక–శూర–భీర–భోజ–పాండ్య–వంగ–కలింగ–తామ్రలిప్త–ఓంఁడ్ర–పౌంఁడ్ర–వామచూడ–కేరళాది దేశాలను, అప్సరోగణాలతో గూడిన దేవతలను కూడ ఆ రాక్షసుడు కంపింపజేశాడు.

అగస్త్యభవనం చైవ యదగమ్యం కృతం పురా ।
సిద్ధచారణసంఘైశ్చ విప్రకీర్ణం మనోహరమ్ ॥ 74 ॥

విచిత్రనానావిహగం సుపుష్పితమహాద్రుమమ్ ।
జాతరూపమయైశ్శృంగైర్గగనం విలిఖన్నివ ॥ 75 ॥

చంద్రసూర్యాంశుసంకాశైః సాగరాంబుసమావృతైః ।
విద్యుత్వా త్పర్వతఃశ్రీమాన్ ఆయతః శతయోజనమ్ ॥ 76 ॥

విద్యుతాం యత్ర సంఘాతా నిపాత్యన్తే నగోత్తమే ।
ఋషభః పర్వతశ్చైవ శ్రీమాన్ వృషభసంజ్ఞితః ॥ 77 ॥

పూర్వం చేరుకోవడానికి శక్యం కాని అగస్త్యభవనాన్ని, సిద్ధచారణ సంఘాలతో ఎల్లప్పుడూ వ్యాప్తమైన, అనేక విధాలైన పక్షుల సమూహాలతో మనోహరంగా వున్న, చక్కగా పుష్పించిన అనేక మహావృక్షాలు గలిగిన, బంగారుమయాలైన శిఖరాగ్రాలతో ఆకాశాన్ని తాకుతున్న, చంద్ర సూర్యాదుల కిరణాలతో ప్రకాశిస్తున్న, సాగరజలాలతో కూడివున్న, నూరుయోజనాల వరకు విస్తీర్ణమైవున్న, ఋషులచేత ప్రసరించబడుతున్న మెరపులు గల వైద్యుతమనే మహాపర్వతాన్ని మరియు శ్రేష్ఠమైన వృషభపర్వతాన్ని కూడ ఆ దైత్యుడు కంపింపజేశాడు.

కుంజరః పర్వతః శ్రీమాన్ యత్రాగస్త్యగృహం శుభమ్ ।
విశాలాక్షశ్చ దుర్ధర్షః సర్పాణామాలయః పురీ ॥ 78 ॥

తథా భోగవతీ చాపి దైత్యేంద్రేణాభికంపితా ।
మహాసేనో గిరిశ్చైవ పారియాత్రశ్చ పర్వతః ॥ 79 ॥

చక్రవాంశ్చ గిరిశ్రేష్ఠో వారాహశ్చైవ పర్వతః ।

ఇంకనూ శుభప్రదమైన అగస్త్య గృహమున్న కుంజర పర్వతాన్ని, చేరుకోవడానికి వీలుకాని విశాలాక్ష పర్వతాన్ని, సర్పాలకు ఆవాసమైన భోగవతీపురాన్ని, మహాసేన పర్వతాన్ని, పారియాత్ర-చక్రవాక-వారాహాది పర్వతములన్నిటిని ఆ దైత్యుడు కంపింపజేశాడు.

ప్రాగ్జ్యోతిషపురం చాపి జాతరూపమయం శుభమ్ ॥ 80 ॥

యస్మిన్వసతి దుష్టాత్మా నరకో నామ దానవః ।
మేఘశ్చ పర్వతశ్రేష్ఠో మేఘగంభీరనిఃస్వనః ॥ 81 ॥

షష్టిస్తత్ర సహస్రాణి పర్వతానాం ద్విజోత్తమాః ।

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! దుష్టాత్ముడైన నరకుడనే దానవుడు నివసించే ప్రాగ్జ్యోతిషపురాన్ని, బంగారు మయమైన, శుభప్రదమైన మేఘం వలె గంభీరధ్వనితో గూడిన మేఘమనే పర్వతరాజాన్ని మరియు అరవైవేల పర్వతాలన్నింటిని ఆ దైత్యుడు కంపింపజేశాడు.

తరుణాదిత్య సంకాశో మేరుస్తత్ర మహాగిరిః ॥ 82 ॥
యక్షరాక్షసగంధర్వై ర్నిత్యం సేవితకందరః ।

హేమగర్భో మహాశైలస్తథా హేమసఖో గిరిః ॥ 83 ॥
కైలాసశ్చైవ శైలేంద్రో దానవేంద్రేణ కంపితాః ।

మరియు యక్ష రాక్షస గంధర్వాదులచే నిత్యమూ సేవించబడుతున్న గుహలు గలిగి బాలాదిత్యుని వలె ప్రకాశిస్తున్న మేరు మహాపర్వతాన్ని, హేమగర్భ-హేమసఖ మహాపర్వతాలను, శైలేంద్రుడైన కైలాస పర్వతాన్ని ఆ దైత్యేంద్రుడు కంపింపజేశాడు.

హేమ పుష్కరసంఛన్నం తేన వైఖానసం సరః ॥ 84 ॥

కంపితం మానసం చైవ హంసకారండవాకులమ్ ।
త్రిశృంగపర్వతశ్చైవ కుమారీ చ సరిద్వరా ॥ 85 ॥

తుషారచయసంఛన్నో మందరశ్చాపి పర్వతః ।
ఉశీరబిందుశ్చ గిరిశ్చంద్రప్రస్థస్తథాద్రిరాట్ ॥ 86 ॥

బంగారు పద్మాలతో కప్పబడిన వైఖానస సరస్సును, హంసకారండవాది పక్షులతో పరివ్యాప్తమైన మానస సరస్సును, త్రిశృంగ పర్వతాన్ని, శ్రేష్ఠమైన కుమారీ నదిని, మంచురాశితో కప్పబడిన మందర పర్వతాన్ని, ఉశీరబిందు-చంద్రప్రస్థాది పర్వత రాజాలను కూడ హిరణ్యకశిపు దైత్యుడు కంపింపజేశాడు.

ప్రజాపతిగిరిశ్చైవ తథా పుష్కరపర్వతః ।
దేవాభ్రపర్వతశ్చైవ తథా వై రేణుకో గిరిః ॥ 87 ॥

క్రౌంచః సప్తర్షి శైలశ్చ ధూమ్రవర్ణశ్చ పర్వతః ।
ఏతే చాన్యే చ గిరయో దేశా జనపదాస్తథా ॥ 88 ॥

నద్యః ససాగరాః సర్వాః సోఽకమ్పయత దానవః ।

మరియు ప్రజాపతి పర్వతం, పుష్కర పర్వతం, దేవాభ్రపర్వతం, రేణుక పర్వతం, క్రౌంచ పర్వతం, సప్తర్షి పర్వతం, ధూమ్రవర్ణపర్వతం మొదలగు పర్వతాలే కాక అనేక దేశాలు, పట్టణాలు, నదులు, సాగరాలన్నింటినీ ఆ దానవుడు కంపింపజేశాడు.

కపిలశ్చ మహీపుత్రో వ్యాఘ్రవాంశ్చైవ కంపితః ॥ 89 ॥

ఖేచరాశ్చ సతీపుత్రాః పాతాల తలవాసినః ।
గణస్తథా పరో రౌద్రో మేఘనామాంకుశాయుధః ॥ 90 ॥

ఊర్ధ్వగో భీమవేగశ్చ సర్వ ఏవాభికంపితాః ।

ఇంకనూ మహీపుత్రుడైన కపిలుడు, వ్యాఘ్రవంతుడు కూడ కంపించారు. గగనచరులైన సతీపుత్రులు పాతాళ లోకవాసులు, రౌద్రమైన దేవగణం, అంకుశమే ఆయుధంగా గల మేఘనాముడు, భయంకరమైన వేగం గల ఊర్ధ్వగుడు మొదలగు వారందరినీ హిరణ్యకశిపుడు కంపింపజేశాడు.

గదీ శూలీ కరాలశ్చ హిరణ్యకశిపుస్తదా ॥ 91 ॥

జీమూతఘనసంకాశో జీమూతఘననిఃస్వనః ।
జీమూతఘననిర్ఘోషో జీమూత ఇవ వేగవాన్ ॥ 92 ॥

దేవారిర్దితిజో వీరో నృసింహం సముపాద్రవత్ ।
సముత్పత్య తతస్తీక్ష్ణైః మృగేంద్రేణ మహానఖైః ।
తదోంకార సహాయేన విదార్య నిహతో యుధి ॥ 93 ॥

అటు తర్వాత గద, శూల, కరాలాది ఆయుధాలు ధరించినవాడై దేవతల శత్రువు, దితి పుత్రుడూ అయిన హిరణ్యకశపుడు మేఘపంక్తి వలె ప్రకాశిస్తూ మేఘాల వలె గర్జిస్తూ మేఘాల వంటి వేగం కలవాడై నృసింహునిపై లంఘించాడు. కాని ఓంకార మాత్ర సహాయుడైన నృసింహదేవుడు తీక్ష్ణములైన గొప్ప గోళ్ళే ఆయుధాలుగా కలవాడై ఆ హిరణ్యకశిపునిపై పడి వాడి శరీరాన్ని చీల్చి వధించాడు.

మహీ చ కాలశ్చ శశీ నభశ్చ గ్రహాశ్చ సూర్యశ్చ దిశశ్చ సర్వాః ।
నద్యశ్చ శైలాశ్చ మహార్ణవాశ్చ గతాః ప్రసాదం దితిపుత్రినాశాత్ ॥ 94 ॥

ఆ హిరణ్యకశిపుని వధతో భూమి, కాలం, చంద్రుడు, ఆకాశం, గ్రహాలు, సూర్యుడు, దిక్కులు, నదులు, పర్వతాలు, సముద్రాలు మొదలైనవన్నీ ప్రశాంతిని పొందాయి.

తతః ప్రముదితా దేవా ఋషయశ్చ తపోధనాః ।
తుష్టువుర్నామభిర్దివ్యైరాదిదేవం సనాతనమ్ ॥ 95 ॥

యత్త్వయా విహితం దేవ నారసింహమిదం వపుః ।
ఏతదేవార్చయిష్యన్తి పరావరవిదో జనాః ॥ 96 ॥

అప్పుడు సంతుష్టులైన దేవతలు, ఋషులు తపోధనులైన మునులు సనాతనుడైన ఆ ఆదిదేవుని అనేక దివ్య నామములతో స్తుతించారు. ఓ దేవా! నీవు ఏ ఈ నరసింహరూపాన్ని ధరించావో, దానినే తత్త్వవేత్తలు సదా అర్చిస్తారని స్తుతించారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

భవాన్ బ్రహ్మా చ రుద్రశ్చ మహేంద్రో దేవసత్తమాః ।
భవాన్ కర్తా వికర్తా చ లోకానాం ప్రభవోఽవ్యయః ॥ 97 ॥

ఓ దేవా! బ్రహ్మ, రుద్రుడు, దేవసత్తముడైన మహేంద్రుడూ నీవే, అవ్యయుడవైన నీవు ఈ లోకాలన్నింటికి కారణం, నీవే కర్తవు, వికర్తవు. సృష్టి స్థితి లయాలకు నీవే కారణం.

పరాం చ సిద్ధిం చ పరం చ దేవం పరం చ మన్త్రం పరమం హవిశ్చ ।
పరం చ ధర్మం పరమం చ విశ్వం త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్ ॥ 98 ॥

పరం శరీరం పరమం చ బ్రహ్మ పరం చ యోగం పరమాం చ వాణీమ్ ।
పరం రహస్యం పరమాం గతిం చ త్వామాహు రగ్ర్యం పురుషం పురాణమ్ ॥ 99 ॥

ఉత్కృష్టమైన సిద్ధివి, దేవుడవు, మంత్రం, హవిస్సు, ధర్మం, విశ్వం, శరీరం, బ్రహ్మ, యోగం, వాక్కు, రహస్యం, గతి మొదలగు వాటిన్నింటికి పురాణపురుషుడవైన నిన్నే ప్రధాన హేతువని తత్త్వవేత్తలు చెబుతున్నారు.

ఏవం పరస్యాపి పరం పదం యత్ పరం పరస్యాపి పరం చ దేవమ్ ।
పరం పరస్యాపి పరం చ భూతం త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్ ॥ 100 ॥

పరం పరస్యాపి పరం రహస్యం పరం పరస్యాపి పరం మహత్త్వమ్ ।
పరం పరస్యాపి పరం మహద్యత్ త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్ ॥ 101 ॥

పరం పరస్యాపి పరం నిధానం పరం పరస్యాపి పరం పవిత్రమ్ ।
పరం పరస్యాపి పరం చ దాన్తమ్ త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్ ॥ 102 ॥

సర్వోత్కృష్టమైన పదం, సర్వోత్కృష్టుడైన దేవుడు, పరమ రహస్యం, పరమ మహత్త్వం, లోకంలో అన్నింటికంటె గొప్ప స్థానం, పరమనిధానం, పరమపవిత్రం, పరమశాంతి మొదలగు వాటికన్నింటికిని నీవే కారణమని, నీవే స్థానభూతుడువని, నీవే మూలపురుషుడవని తత్త్వ వేత్తలు తెలుపుతున్నారు.

ఏవ ముక్త్వాతు భగవాన్ సర్వలోకపితామహః ।
స్తుత్వా నారాయణం దేవం బ్రహ్మలోకం గతః ప్రభుః ॥ 103 ॥

సర్వలోక పితామహుడైన బ్రహ్మదేవుడీవిధంగా దేవదేవుడైన నారాయణుని స్తుతించి బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

తతో నదత్సు తూర్యేషు నృత్యంతీష్వప్సరాసు చ ।
క్షీరదస్యోత్తరం కూలం జగామ హరిరీశ్వరః ॥ 104 ॥

నారసింహం వపుర్దేవః స్థాపయిత్వా సుదీప్తిమత్ ।
పౌరాణం రూపమాస్థాయ ప్రయయౌ గరుడధ్వజః ॥ 105 ॥

అష్టచక్రేణ యానేన భూతయుక్తేన భాస్వతా ।
అవ్యక్తప్రకృతిర్దేవః స్వస్థానం గతవాన్ ప్రభుః ॥ 106 ॥

ఆ తరువాత తూర్యాలు మ్రోగుతుండగా, అప్సరసలు నాట్యం చేస్తుండగా, ప్రభువైన శ్రీహరి క్షీరసాగరపు ఉత్తర తీరానికి వెళ్ళాడు. మరియు గరుడధ్వజుడైన ఆ ప్రభువు దీప్తిమంతమైన నారసింహశరీరాన్ని అక్కడ వుంచి, తన పూర్వరూపాన్ని ధరించి, అష్ట చక్రాలు కల, పంచ మహాభూతాలతో కూడి ప్రకాశించే వాహనాన్నధిష్ఠించి, అవ్యక్తతత్త్వాన్ని పొంది ఆ దేవదేవుడు స్వస్థానానికి వెళ్ళాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే హిరణ్యకశిపువధో నామ త్రిషష్ట్యధిక శతతమోఽధ్యాయః ॥163॥

శ్రీమత్స్య మహాపురాణంలో హిరణ్యకశిపు వధ అనే నూట అరవైమూడవ అధ్యాయం సమాప్తం



చతుష్షష్ట్యధిక శతతమోఽధ్యాయః – నూటఅరవై నాల్గవ అధ్యాయం

పద్మోద్భవ ప్రాదుర్భావౌ – పద్మోద్భవ, ప్రాదుర్భావాలు

ఋషయ ఊచుః – ఋషులు చెప్పారు.

కథితం నరసింహస్య మాహాత్మ్యం విస్తరేణ చ ।
పునస్తస్యైవ మాహాత్మ్యం అన్యద్విస్తరతో వద ॥ 1 ॥

పద్మరూపమభూదేతత్ కథం హేమమయం జగత్ ।
కథం చ వైష్ణవీ సృష్టిః పద్మమధ్యేఽభవత్పురా ॥ 2 ॥

ఓ సూతమునీ! నరసింహరూపుడైన నారాయణుని మాహాత్మ్యాన్ని విస్తరంగా చెప్పావు. మరల ఆ దేవునికి సంబంధించిన మరొక మాహాత్మ్యాన్ని విస్తరంగా వివరించు. పూర్వం ఈ ప్రపంచం బంగారం పద్మం రూపంలో ఎలా ఉండినది? మరియు ఆ పద్మం మధ్యనుండి విష్ణు సంబంధమైన సృష్టి ఎలా జరిగింది?

సూత ఉవాచ – సూత చెప్పాడు.

శ్రుత్వా చ నరసింహస్య మాహాత్మ్యం రవినందనః ।
విస్మయోత్ఫుల్లనయనః పునః పప్రచ్ఛ కేశవమ్ ॥ 3 ॥

నరసింహుని మాహాత్మ్యాన్ని విని, ఆశ్చర్యంతో నేత్రాలు వికసించగా సూర్యుని కుమారుడైన వైవస్వతమనువు మరల కేశవుని ఈ విధంగా అడిగాడు.

మనురువాచ – మనువు చెప్పాడు.

కథం పాద్మే మహాకల్పే తవ పద్మమయం జగత్? ।
జలార్ణవగతస్యేహ నాభౌ జాతం జనార్దన ॥ 4 ॥

ప్రభావాత్పద్మనాభస్య స్వపతః సాగరామ్భసి ।
పుష్కరే చ కథం భూతాః దేవాః సర్షిగణాః పురా? ॥ 5 ॥

ఓ జనార్దనా! పూర్వం పాద్మమహాకల్పంలో జలార్ణవంలో నిద్రిస్తున్న నీ నాభి నుండి పద్మమయమైన ఈ జగత్తు ఎలా సృష్టించబడింది? మరియు సముద్రపు నీటిలో నిద్రిస్తున్న పద్మనాభుని ప్రభావం వలన పద్మంలో దేవతలు, ఋషిగణాలు ఎలా ఉద్భవించారు?

ఏనమాఖ్యాహి నిఖిలం యోగం యోగవిదాం పతే! ।
శృణ్వతస్తస్య మే కీర్తిం న తృప్తిరుపజాయతే ॥ 6 ॥

ఓ దేవా! నీవు యోగవిదులకు అధిపతివి. కావున నిఖిలమైన ఈ యోగ క్రమమంతా నాకు వివరించుము. ఆతని కీర్తిని వింటున్న నాకు తృప్తి కలగడం లేదు.

కియతా చైవ కాలేన శేతే వై పురుషోత్తమః ।
కియన్తం వా స్వపితి చ కోఽస్య కాలస్య సమ్భవః ॥ 7 ॥

కియతా వాఽథకాలేన హ్యుత్తిష్ఠతి మహాయశాః ।
కథం చోత్థాయ భగవాన్ సృజతే నిఖిలం జగత్ ॥ 8 ॥

పురుషోత్తముడు ఎంతకాలం సముద్రజలాల్లో శయనించివుంటాడు? ఎంతకాలం వరకు నిద్రిస్తాడు? ఆ మహాయశస్వి ఎంతకాలం తర్వాత మేలుకొంటాడు? తర్వాత నిఖిలమైన ఈ జగత్తును ఎలా సృష్టిస్తాడు? దీనికేమైనా సమయం నిర్ధారించబడి వున్నదా?

కే ప్రజాపతయస్తావదాసన్ పూర్వం మహామునే! ।
కథం నిర్మితవాంశ్చైవ చిత్రం లోకం సనాతనమ్ ॥ 9 ॥

ఓ మహామునీ! పూర్వం ప్రజాపతులుగా ఎవరున్నారు? మరియు సనాతనమైన, చిత్రమైన ఈ లోకాన్ని అతడు ఎలా సృష్టించాడు?

కథమేకార్ణవే శూన్యే నష్టస్థావరజంగమే ।
దగ్ధదేవాసురనరే ప్రనష్టోరగరాక్షసే ॥ 10 ॥

నష్టానిలానలే లోకే నష్టాకాశమహీతలే ।
కేవలం గహ్వరీభూతే మహాభూతవిపర్యయే ॥ 11 ॥

విభుర్మహాభూతపతిర్మహాతేజా మహాకృతిః ।
ఆస్తే సురవరశ్రేష్ఠో విధిమాస్థాయ యోగవిత్ ॥ 12 ॥

ప్రళయకాలంలో ఈ జగత్తంతా ఏకార్ణవమూ, శూన్యమూ కూడా అయి, స్థావరజంగమప్రాణులన్నీ నశించగా, దేవతలు, అసురులు, నరులు, సర్పాలు, రాక్షసులు, మొదలగు వారంతా నశించి, వాయువు, అగ్ని, ఆకాశం, భూమి నశించి పంచమహాభూతాలు కూడ లేక కేవలం సర్వమూ గహ్వరం కాగా, సర్వవ్యాపి, మహాభూతములకు అధిపతి, మహాతేజస్కుడు, మహాకారం గలవాడు, సురవర శ్రేష్ఠుడు, యోగజ్ఞుడూ అయిన ఆ పురుషోత్తముడు విధినాశ్రయించి అక్కడ ఎలా వున్నాడు?

శృణుయాం పరయా భక్త్యా బ్రహ్మన్నేతదశేషతః ।
వక్తుమర్హసి ధర్మిష్ఠ! యశో నారాయణాత్మకమ్ ॥ 13 ॥

శ్రద్ధయా చోపవిష్టానాం భగవన్ వక్తుమర్హసి ॥ 14 ॥

బ్రహ్మజ్ఞుడవు, ధర్మజ్ఞుడవూ అయిన ఓ దేవా! పరమభక్తితో అదంతా వినగోరుతున్నాను. కావున నాకదంతా వివరించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. శ్రద్ధతో కూర్చొనివున్న మాకందరికి నారాయణుని కీర్తిని వైభవాన్ని గురించి చెప్పండి.

మత్స్య ఉవాచ – మత్స్యదేవుడు చెప్పాడు.

నారాయణస్య యశసః శ్రవణే యా తవ స్పృహా ।
తద్వంశ్యాన్వయభూయస్య న్యాయ్యం రవికులర్షభ ॥ 15 ॥

ఓ రవికుల శ్రేష్ఠా! నారాయణాంశభూతుడైన రామునికి మూలపురుషుడైన నారాయణుని గురించి వినాలనే కోరిక నీకు కలగడం సముచితమే.

శృణుష్వాదిపురాణేషు వేదేభ్యశ్చ యథా శ్రుతమ్ ।
బ్రాహ్మణానాం చ వదతాం శ్రుత్వా వై సుమహాత్మనామ్ ॥ 16 ॥

యథా చ తపసా దృష్ట్వా బృహస్పతిసమద్యుతిః ।
పరాశరసుతః శ్రీమాన్ గురుర్ద్వైపాయనోఽబ్రవీత్ ॥ 17 ॥

తత్తేహం కథయిష్యామి యథాశక్తి యథాశ్రుతి ।
యద్విజ్ఞాతుం మయా శక్యమృషిమాత్రేణ సత్తమాః ॥ 18 ॥

ఓ ఋషిశ్రేష్ఠులారా! వేదములోను, ఆది పురాణాలలోను వివరించబడిన దానిని, మహానుభావులైన బ్రాహ్మణుల నుండి విని, తన తపోబలంతో తెలిసికొని, బృహస్పతితో సమానమైన జ్ఞానంగల పరాశరసుతుడైన మా గురువు ద్వైపాయనుడు విస్తృతంగా వివరించాడో అది విన్నది విన్నట్లు నా శక్తి కొద్ది నేను తెలుసుకోవడానికి ప్రయత్నం చేసినదానిని మీకు చెబుతాను వినండి.

కః సముత్సహతే జ్ఞాతుం పరం నారాయణాత్మకమ్ ।
విశ్వాయతశ్చ యద్ బ్రహ్మా న వేదయతి తత్త్వతః ॥ 19 ॥

విశ్వమంతటికిని ఆశ్రయుడు సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు కూడ ఏ తత్త్వాన్ని తెలియజేయడానికి సమర్థుడు కాడో అటువంటి నారాయణాత్మకమైన పరతత్త్వాన్ని ఎవరు తెలుసుకోగలరు?

తత్కర్మ విశ్వవేదానాం తద్రహస్యం మహర్షిణామ్ ।
తమిజ్యం సర్వయజ్ఞానాం తత్తత్త్వం సర్వదర్శినామ్ ॥
తదధ్యాత్మవిదాం చిన్త్యం నరకం చ వికర్మిణామ్ ॥ 20 ॥

ఆ నారాయణతత్త్వము వేదాలన్నింటిలో ప్రతిపాదించబడిన కర్మానుష్ఠానం. అది మహర్షులకు కూడ తెలుసుకోవడానికి శక్యం కాని రహస్యం అన్నివిధాలైన యజ్ఞాలలో స్తుతించబడిన మరియు పరమతాత్త్వికులు చేత కనుగొన్న తత్త్వం అదే. ఆధ్యాత్మిక వేత్తలు చింతించేది కూడ అదే, మరియు విరుద్ధ కర్మాలాచరించే వారికి నరకాన్ని చూపేది ఆ తత్త్వమే.

అధిదైవం చ యద్దేవం అధియజ్ఞం సుసంజ్ఞితమ్ ।
తద్ భూతమధిభూతం చ తత్పరం పరమర్షిణామ్ ॥ 21 ॥

స యజ్ఞో వేదనిర్దిష్టస్తత్తపః కవయో విదుః ।
యః కర్తా కారకో బుద్ధిర్మనః క్షేత్రజ్ఞ ఏవ చ ॥ 22 ॥

పరమోత్కృష్టమైన అధిదైవం, అధియజ్ఞం, అధిభూతం మహర్షులకు కూడ తెలుసుకోవడానికి సాధ్యం కాని తత్త్వమదే, వేద నిర్దిష్టమైన యజ్ఞం మరియు తపస్సు కూడ అతనేనని ఋషులు చెబుతారు. అతడే కర్త, కారకుడు, బుద్ధి, మనస్సు మరియు క్షేత్రజ్ఞుడని తెలిసికోవాలి.

ప్రణవః పురుషః శాస్తా ఏకశ్చేతి విభావ్యతే ।
ప్రాణః పంచవిధశ్చైవ ధ్రువ అక్షర ఏవ చ ॥ 23 ॥

కాలః పాకశ్చ పక్తా చ ద్రష్టా స్వాధ్యాయ ఏవ చ ॥
ఉచ్యతే వివిధైర్దేవః స ఏవాయం న తత్పరమ్ ॥ 24 ॥

ప్రణవం, పురుషుడు, శాసించేవాడు, ప్రాణాపానవ్యానోదాన సమానాత్మకమైన పంచప్రాణాలు, ధ్రువమైన అక్షరం, కాలం, పాకం, పాకం చేసేవాడు, ద్రష్ట (అనగా సాక్షి), స్వాధ్యాయం కూడ అతడేనని సర్వజ్ఞులు చెప్పారు. అతని కంటె గొప్పవాడు ఎవరూ లేరు.

స ఏవ భగవాన్ సర్వం కరోతి వికరోతి చ ।
సోఽస్మాన్ కారయతే సర్వాన్ సోఽత్యేతి వ్యాకులీకృతాన్ ॥ 25 ॥

ఆ భగవంతుడే ఈ ప్రపంచాన్నంతటిని సృష్టిస్తాడు మరియు నశింపజేస్తాడు కూడ. అతడే మనతో అనేక విధాలైన పనులు చేయిస్తాడు. బాధపడే వారికి శాంతి కలిగిస్తాడు.

యజామహే తమేవాద్యం తమేవేచ్ఛామ నిర్వృతాః ।
యో వక్తా యచ్చ వక్తవ్యం యచ్చాహం తద్ బ్రవీమి వః ॥ 26 ॥

ఆద్యుడైన ఆ పరమాత్మనే మనము యజిస్తున్నాము. అతని ద్వారానే నిర్వృతిని పొందగోరుతున్నాము. అతనే చెప్పేవాడు, చెప్పవలసింది కూడ. అతని గురించే నేను మీకు వివరిస్తున్నాను.

శ్రూయతే యచ్చ వై శ్రవ్యం యచ్చాన్యత్ పరిజల్ప్యతే ।
యాః కథాశ్చైవ వర్తన్తే శ్రుతయో వాఽథ తత్పరాః ॥
విశ్వం విశ్వపతిర్యశ్చ స తు నారాయణః స్మృతః ॥ 27 ॥

వినేది మరియు వినబడవలసింది కూడ అతడే. మనము మాట్లాడే మాటలకు కూడ అతనే ఆధారం. మనము వింటున్న వేదాలు, వాటికి సంబంధించిన కథలన్నీ అతనికి సంబంధించినవే. విశ్వం మరియు విశ్వపతి కూడ ఆ నారాయణుడే.

యత్సత్యం యదమృతమక్షరం పరం యద్ యద్ భూతం పరమమిదం చ యద్ భవిష్యద్ ।
యద్ కించిచ్చరమచరం యదస్తి చాన్యత్ తత్సర్వం పురుషవరః ప్రభుః పురాణః ॥ 28 ॥

సత్యం, అమృతత్వం, అక్షరం, పరతత్త్వం, భూతకాలం, వర్తమానం, భవిష్యత్తు, చరం అచరం, మరియు సర్వం, పురుష శ్రేష్ఠుడు, ప్రభువు పురాణపురుషుడూ అతడే, ఆ నారాయణుడే.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే పద్మోద్భవప్రాదుర్భావే చతుఃషష్ట్యధికశతతమోఽధ్యాయః ॥ 164 ॥

శ్రీమత్స్య మహాపురాణంలో పద్మోద్భవ ప్రాదుర్భావములనే నూట అరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచ షష్ట్యధిక శతతమోఽధ్యాయః – నూటఅరవై ఐదవ అధ్యాయం

చతుర్యుగపరిమాణాది కథనమ్ – నాలుగు యుగముల పరిమాణం వివరించుట

మత్స్య ఉవాచ – మత్స్య దేవుడు చెప్పాడు.

చత్వార్యాహుః సహస్రాణి వర్షాణాం తు కృతం యుగమ్ ।
తస్య తావచ్ఛతీ సంధ్యా ద్విగుణా రవినందన ॥ 1 ॥

యత్ర ధర్మశ్చతుష్పాద స్త్వధర్మః పాదవిగ్రహః ।
స్వధర్మనిరతాః సన్తో జాయన్తే యత్ర మానవాః ॥ 2 ॥

ఓ సూర్య పుత్రా! నాలుగు వేల దివ్య సంవత్సరాలు కృతయుగం, ఎనిమిది వందల దివ్య సంవత్సరాల సమయం సంధ్యాకాలం, ఈ యుగంలో ధర్మం నాలుగు పాదాలలో నడుస్తుంది. అధర్మం ఒక పాదం కంటె తక్కువగా ఉంటుంది. ఈ యుగంలో మానవులు స్వధర్మనిరతులై సజ్జనులుగా వుంటారు.

విప్రాః స్థితా ధర్మపరా రాజవృత్తౌ స్థితా నృపాః ।
కృష్యామభిరతా వైశ్యాః శూద్రాః శుశ్రూషవః స్థితాః ॥ 3 ॥

తదా సత్యం చ శౌచం చ ధర్మశ్చైవ వివర్ధతే ।
సద్భిరాచరితం కర్మ క్రియతే ఖ్యాయతే చ వై ॥ 4 ॥

విప్రులు స్వధర్మపరులై వుంటారు. రాజులు రాజ్యపరిపాలన చేస్తారు. మరియు వైశ్యులు వ్యవసాయం చేస్తారు. శూద్రులు సేవాపరులుగా ఉంటారు. అప్పుడు సత్యం, శౌచం, ధర్మం మొదలగునవి వృద్ధిపొందుతాయి. సజ్జనులు ఆచరించిన కర్మలను మెచ్చుకొని జనులంతా వాటినే ఆచరిస్తారు.

ఏతత్కార్తయుగం వృత్తం సర్వేషామపి పార్థివ ।
ప్రాణినాం ధర్మసంగానామపి వై నీచజన్మనామ్ ॥ 5 ॥

ఓ రాజా! ఈ కృతయుగంలో ప్రాణులందరూ తమ తమ ధర్మాన్ననుసరించి కర్మలాచరిస్తారు. నీచ జన్ములగు వారు కూడ తమ ధర్మాన్ననుసరించే స్వకర్మలనాచరిస్తారు.

త్రీణి వర్షసహస్రాణి త్రేతాయుగమిహోచ్యతే ।
తస్య తావచ్ఛతీ సంధ్యా ద్విగుణా పరికీర్త్యతే ॥ 6 ॥

ద్వాభ్యామధర్మః పాదాభ్యాం త్రిభిర్ధర్మో వ్యవస్థితః ।
యత్ర సత్యం చ సత్త్వం చ త్రేతాధర్మో విధీయతే ॥ 7 ॥

చతుర్వర్ణస్య వైకృత్యాద్యాన్తి దౌర్బల్యమాశ్రమాః ॥ 8 ॥
ఏషా త్రేతాయుగగతిః విచిత్రా దేవనిర్మితా ।

త్రేతాయుగపు పరిమాణం మూడువేల దివ్య సంవత్సరాలని, సంధ్యాకాలం ఆరువందల దివ్య సంవత్సరాలని చెబుతున్నారు. ఈ యుగంలో ధర్మం మూడు పాదాలతో, అధర్మం రెండు పాదాలతో నడుస్తుంది. ఈ యుగంలో

సత్యం, సత్త్వం చక్కగా విధింపబడినా ఆయా వర్ణాల వారు స్వధర్మాన్ని సరిగా ఆచరించరు. దాని వలన నాలుగు వర్ణాల వారు దుర్బలత్వాన్ని పొందుతారు. దేవుడిలా త్రేతాయుగపు నడకను దేవునిచే విచిత్రంగా ఏర్పాటు చేశాడు.

ద్వాపరస్య తు యాచేష్టా తామపి శ్రోతుమర్హసి ॥ 9 ॥

ద్వాపరం ద్వే సహస్రే తు వర్షాణాం రవినందన ।
తస్య తావచ్ఛతీ సంధ్యా ద్విగుణా యుగముచ్యతే ॥ 10 ॥

ఓ రవినందనా! ఇప్పుడు ద్వాపరయుగపు ప్రవృత్తిని కూడ విను. ఈ యుగం పరిమాణం రెండువేల దివ్య సంవత్సరాలు, దాని సంధ్యా కాలం నాలుగువందల దివ్యసంవత్సరాలు. అదే దాని సంధ్యాంశం.

తత్ర చార్థపరాః సర్వే ప్రాణినో రజసా హతాః ।
సర్వే నైష్కృతికాః క్షుద్రా జాయన్తే రవినందన ॥ 11 ॥

ఓ మనూ! ఈ యుగంలో మానవులు రజోగుణప్రధానులై అర్థానికి అనగా ధనానికి మాత్రమే ప్రాధాన్యమిస్తారు. అందరూ కర్మరహితులై క్షుద్రబుద్ధి కలవారవుతారు.

ద్వాభ్యాం ధర్మః స్థితః పద్భ్యామధర్మస్త్రిభిరుత్థితః ।
విపర్యయాచ్ఛనైర్ధర్మః క్షయమేతి కలౌ యుగే ॥ 12 ॥

బ్రాహ్మణ్యం క్షయధర్మశ్చ తథౌత్సుక్యం విశీర్యతే ।
వ్రతోపవాసాస్త్యజ్యన్తే ద్వాపరే యుగపర్యయే ॥ 13 ॥

ఈ యుగంలో ధర్మం రెండు పాదాలు మాత్రమే వుండగా అధర్మం మూడు పాదాలుంటుంది. ఈ విపర్యయం వలన కలియుగం నాటికి క్రమంగా ధర్మం క్షీణిస్తుంది. ఇంకను ద్వాపర యుగం చివరినాటికి క్రమంగా ధర్మం క్షీణించగా బ్రాహ్మణ ధర్మం, అలాగే ఉత్సాహం నశిస్తాయి. వ్రతాలు, ఉపవాసాలు కూడ జనులు త్యజిస్తారు.

తథా వర్షసహస్రం తు వర్షాణాం ద్వే శతే అపి ।
సంధ్యయా సహ సంఖ్యాతం క్రూరం కలియుగం స్మృతమ్ ॥ 14 ॥

యత్రాధర్మశ్చతుష్పాదః స్యాద్ధర్మః పాదవిగ్రహః ।
కామినస్తమసాచ్ఛన్నా జాయన్తే తత్ర మానవాః ॥ 15 ॥

అలాగే కలియుగపు పరిమాణం ఒక వెయ్యి దివ్య సంవత్సరాలుంటుంది. మరియు దాని సంధ్యాకాలం రెండు వందల దివ్య సంవత్సరాలు, అదే దాని సంధ్యాంశం. ఈ కలియుగం అన్ని యుగాల కంటో క్రూరమైనది. దీనిలో అధర్మం నాలుగు పాదాలుంటుంది. ధర్మం ఒక పాదం కంటె తక్కువగానే ఉంటుంది. మానవులు తమోగుణ ప్రధానులై కాముకులవుతారు.

నైవాతిసాత్త్వికః కశ్చి న్న సాధు ర్న చ సత్యవాక్ ।
నాస్తికా బ్రహ్మభక్తా వా జాయన్తే తత్ర మానవాః ॥ 16 ॥

అహంకారగృహీతాశ్చ ప్రక్షీణస్నేహబంధనాః ।
విప్రాఃశూద్రసమాచారాః సన్తి సర్వే కలౌ యుగే ॥ 17 ॥

ఆశ్రమాణాం విపర్యాసః కలౌ సంపరివర్తతే ।
వర్ణానాం చైవ సందేహో యుగాన్తే రవినందన ॥ 18 ॥

మిక్కిలి సాత్త్వికులు, సాధుస్వభావం కలవారు, సత్యవచనులు ఈ కలియుగంలో చాలా అరుదుగా కనబడతారు. బ్రాహ్మణులు నాస్తికులవుతారు. మానవులు అహంకారం కలవారై పరస్పరం స్నేహబంధం లేనివారవుతారు. మరియు విప్రులు శూద్ర ప్రవర్తనం కలవారవుతారు. ఆశ్రమ ధర్మాలను విరుద్ధ మార్గంలో ఆచరిస్తారు. మరియు యుగాంతకాలంలో మానవులలో వర్ణాల విషయంలో సందేహం కలుగుతుంది.

విద్యాద్ద్వాదశసాహస్రీం యుగాఖ్యాం పూర్వనిర్మితామ్ ।
ఏవం సహస్రపర్యన్తం తదహో బ్రాహ్మముచ్యతే ॥ 19 ॥

పంద్రెండువేల దివ్య సంవత్సరాల కాలం ఒక మహాయుగమని తెలుసుకోవాలి. దీనినే చతుర్ యుగమని కూడ అంటారు. అటువంటి వేయి చతుర్యుగాలు బ్రహ్మదేవునికి ఒక పగలుగా చెబుతారు.

తతోఽహని గతే తస్మిన్ సర్వేషామేవ జీవినామ్ ।
శరీరనిర్వృతిం దృష్ట్వా లోకసంహార బుద్ధితః ॥ 20 ॥

దేవతానాం చ సర్వాసాం బ్రహ్మాదీనాం మహీపతే ।
దైత్యానాం దానవానాం చ యక్షరాక్షసపక్షిణామ్ ॥ 21 ॥

గంధర్వాణామప్సరసాం భుజంగానాం చ పార్థివ! ।
పర్వతానాం నదీనాం చ పశూనాం చైవ సత్తమ ।
తిర్యగ్యోనిగతానాం చ సత్త్వానాం కృమిణాం తథా ॥ 22 ॥

మహాభూతపతిః పంచ హత్వా భూతాని భూతకృత్ ।
జగత్సంహరణార్థాయ కురుతే వైశసం మహత్ ॥ 23 ॥

అటువంటి కాలం గడువగానే సమస్త ప్రాణుల శరీరం నాశనం చేయదలచి లోక సంహారం చేయాలనే సంకల్పంతో మహాభూతపతియైన శ్రీమన్నారాయణుడు బహ్మాది సర్వదేవతలను, దైత్య, దానవ, యక్ష, రాక్షస, పక్షి , గంధర్వ, అప్సరస, భుజంగ, పర్వత, నదీ పశు, ప్రభృతులను మరియు తిర్యగ్యోనిగత సర్వ ప్రాణులను, కృములు మొదలగువాటిని మొదలుకొని సమస్త జడ పదార్థాల నుండి పంచమహాభూతాలను ఉపసంహరించి జగత్సంహరణార్థమై మహాప్రళయాన్ని చేస్తాడు.

భూత్వా సూర్యశ్చక్షుషీ చాదదానో భూత్వా వాయుః ప్రాణినాం ప్రాణజాలమ్ ।
భూత్వా వహ్నిర్నిర్దహన్ సర్వలోకాన్ భూత్వా మేఘో భూయ ఉగ్రోఽప్యవర్షత్ ॥ 24 ॥

అపుడు ఆ భగవానుడు తానే సూర్యుడై సమస్త ప్రాణుల నేత్రాలను, వాయువై ప్రాణములను కూడ ఉపసంహరించి, అగ్నియై సర్వలోకాలను దహించి, మరల భయంకర మేఘాకారుడై ఉగ్రంగా సర్వత్ర వర్షిస్తాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే చతుర్యుగ పరిమాణాది కథనే పంచషష్ట్యధికశతతమోఽధ్యాయః ॥165॥

శ్రీమత్స్య మహాపురాణంలో నాలుగు యుగముల పరిమాణం వివరించటమనే నూటఅరవై ఐదవ అధ్యాయం సమాప్తం.

షట్షష్ట్యధికశతతమోఽధ్యాయః – నూటఅరవై ఆరవ అధ్యాయం

ప్రలయవర్ణనమ్ – ప్రలయవర్ణనం

మత్స్య ఉవాచ – మత్స్యదేవుడు చెప్పాడు.

భూత్వా నారాయణో యోగీ సత్త్వమూర్తిర్విభావసుః ।
గభస్తిభిః ప్రదీప్తాభిః సంశోషయతి సాగరాన్ ॥ 1 ॥

యోగి మరియు సత్త్వమూర్తి అయిన శ్రీమన్నారాయణుడు సూర్యుడై ప్రజ్వలిస్తున్న కిరణాలతో సముద్రాలను ఎండింపజేశాడు.

తతః పీత్వార్ణవాన్ సర్వాన్నదీః కూపాంశ్చ సర్వశః ।
పర్వతానాం చ సలిలం సర్వమాదాయ రశ్మిభిః ॥ 2 ॥

భిత్త్వా గభస్తిభిశ్చైవ మహీం గత్వా రసాతలాత్ ।
పాతాలజలమాదాయ పిబతే రసముత్తమమ్ ॥ 3 ॥

సముద్రాలు, నదులు, బావులు మరియు పర్వతాలలోని యందలి నీటినంతటిని తన కిరణాలతో గ్రహించి, భూమండలంలోవున్న నీటిని సంపూర్ణంగా త్రాగి ఆ తరువాత పాతాళలోకానికి కూడ వెళ్ళి అక్కడి జలాన్నంతటిని తన కిరణాలతో పీలుస్తాడు.

మూత్రాసృక్క్లేదమన్యచ్చ యదస్తి ప్రాణిషు ధ్రువమ్ ।
తత్సర్వమరవిందాక్ష ఆదత్తే పురుషోత్తమః ॥ 4 ॥

వాయుశ్చ భగవాన్ భూత్వా విధున్వానోఽఖిలం జగత్ ।
ప్రాణాపానసమానాద్యాన్ వాయూనాకర్షతే హరిః ॥ 5 ॥

తరువాత అరవిందాక్షుడైన పురుషోత్తముడు సర్వప్రాణులలో వుండే మూత్ర రక్తాది ద్రవాలను పీలుస్తాడు. అంతేకాక వెంటనే భగవంతుడైన ఆ హరి అఖిలజగత్తును చలింపజేస్తూ ప్రాణులలో వున్న ప్రాణాపానసమానాది వాయువులను కూడ ఆకర్షిస్తాడు.

తతో దేవగణాః సర్వే భూతాన్యేవ చ యాని తు ।
గంధో ఘ్రాణం శరీరం చ పృథివీం సంశ్రితాః గుణాః ॥ 6 ॥

జిహ్వా రసశ్చ స్నేహశ్చ సంశ్రితాః సలిలే గుణాః ।
రూపం చక్షుర్విపాకశ్చ జ్యోతిరేవాశ్రితా గుణాః ॥ 7 ॥

స్పర్శః ప్రాణశ్చ చేష్టా చ పవనే సంశ్రితా గుణాః ।
శబ్దః శ్రోత్రం చ ఖాన్యేవ గగనే సంశ్రితా గుణాః ॥ 8 ॥

అటు తర్వాత దేవతల సమూహాలు, పంచ మహాభూతాలు మరియు గంధం, ఘ్రాణం, శరీరాలు మొదలైనవన్నీ పృథ్విలో కలిసిపోతాయి. అంతేకాక జిహ్వ, రస, స్నేహాది గుణాలు జలంలో మరియు చక్షూ రూప విపాకాలు అగ్నిలో స్పర్శ ప్రాణచేష్టాదులు వాయువులో, శ్రోత్ర శబ్ద శూన్యత్వాదులు ఆకాశంలో కలసిపోతాయి.

లోకమాయా భగవతా ముహూర్తేన వినాశితా ।
మనో బుద్ధిశ్చ సర్వేషాం క్షేత్రజ్ఞశ్చేతి యః శ్రుతః ॥ 9 ॥

తం వరేణ్యం పరమేష్ఠీ హృశీకేశముపాశ్రితః ।
తతో భగవతస్తస్య రశ్మిభిః పరివారితః ॥ 10 ॥

ఇలా లోకమాయ భగవంతునిచే ముహూర్తకాలంలో నశింపజేయబడుతుంది. అన్నిప్రాణుల మనస్సు, బుద్ధి, క్షేత్రజ్ఞుడు అని చెప్పబడుతున్నవాడు, వరేణ్యుడు, పరమేష్ఠియైన ఆ హృషీకేశుని లోకాన్ని ఆశ్రయిస్తుంది, అప్పుడు లోకమంతా భగవంతుని కిరణాలతో వ్యాప్తిచెందుతుంది.

వాయునాక్రమ్యమాణాసు ద్రుమశాఖాసు చాశ్రితాః ।
తేషాం సంఘర్షణోద్భూతః పావకః శతధా జ్వలన్ ॥ 11 ॥

అదహచ్చ తదా సర్వం వృతః సంవర్తకోఽనలః ।
సపర్వతద్రుమాన్ గుల్మాన్ లతావల్లీస్తృణాని చ ॥ 12 ॥

విమానాని చ దివ్యాని పురాణి వివిధాని చ ।
యాని చాశ్రయణీయాని తాని సర్వాణి సోఽదహత్ ॥ 13 ॥

తర్వాత భయంకరమైన వాయువుచే ఆక్రమింపబడినదై వృక్షశాఖలనాశ్రయించి వాటి రాపిడితో పుట్టిన ప్రళయాగ్ని వందల విధాలుగా జ్వలిస్తూ అన్ని దిక్కుల వ్యాపించి సర్వాన్ని దహించివేస్తుంది. ఇంకనూ పర్వతాలను, లతలను, తృణాలను, దివ్యాలైన విమానాలను, వివిధ పురాలను, మరియు వాటినాశ్రయించి వున్న వాటినన్నింటిని దహించివేస్తుంది.

భస్మీకృత్య తతః సర్వాల్లోకాన్ లోకగురుర్హరిః ।
భూయో నిర్వాపయామాస యుగాన్తేన చ కర్మణా ॥ 14 ॥

లోకగురువైన హరి ఆ విధంగా లోకాలన్నింటిని భస్మం చేసి మరల యుగాంతంలో అటువంటి ప్రక్రియతోనే ఆ అగ్నిని చల్లారుస్తాడు.

సహస్రవృష్టిః శతధా భూత్వా కృష్ణో మహాబలః ।
దివ్యతోయేన హవిషా తర్పయామాస మేదినీమ్ ॥ 15 ॥

తతః క్షీరనికాయేన స్వాదునా పరమామ్బసా ।
శివేన పుణ్యేన మహీ నిర్వాణమగమత్ పరమ్ ॥ 16 ॥

తేన రోధేన సంఛన్నా పయసాం వర్షతో ధరా ।
ఏకార్ణవజలీభూతా సర్వసత్త్వ వివర్జితా ॥ 17 ॥

అపుడు మహాబలుడైన కృష్ణుడు వందల విధాలుగా సహస్రవృష్టిని కురిపిస్తూ దివ్యతోయమనే హవిస్సుతో పృథివిని తడుపుతాడు. తియ్యని పాలవంటి రుచికల, శుభప్రదాలు, పుణ్యప్రదాలు మంగళకరాలైన జలాలతో భూమి మహాతృప్తిని పొందుతుంది. అలా వేగవంతమైన వర్షపుజలంతో కప్పబడిన భూమి సర్వప్రాణిరహితమై ఏకార్ణవమైన జలంలో మునుగుతుంది.

మహాసత్త్వాన్యపి విభుం ప్రవిష్టాన్యమితౌజసమ్ ।
నష్టార్కపవనాకాశే సూక్ష్మే జగతి సంవృతే ॥ 18 ॥

సంశోషమాత్మనా కృత్వా సముద్రానపి దేహినః ।
దగ్ధ్వా సంప్లావ్య చ తథా స్వపిత్యేకః సనాతనః ॥ 19 ॥

పౌరాణం రూపమాస్థాయ స్వపిత్యమితవిక్రమః ।

జగమంతాను సూర్య-వాయు-ఆకాశాదులు లేక సూక్ష్మమై మరుగున పడిపోగా. మహాసత్త్వం గల ప్రాణులన్నీ అమితమైన ఓజస్సు గల ఆ పరమాత్మలో ప్రవేశిస్తాయి. అమిత పరాక్రమశాలి మరియు సనాతనుడైన భగవానుడు సముద్రాలను కూడ ఎండింపజేసి, తర్వాత అంతటిని దహించివేసి, పిమ్మట నీటితో ముంచెత్తి తానొకడు మాత్రమే పురాణమైన శుద్ధరూపాన్ని పొంది నిద్రిస్తాడు.

ఏకార్ణవజలవ్యాపీ యోగీ యోగముపాశ్రితః ॥ 20 ॥

అనేకాని సహస్రాణి యుగాన్యేకార్ణవాంభసి ।
న చైనం కశ్చిదవ్యక్తం వ్యక్తం వేదితుమర్హతి ॥ 21 ॥

అలా యోగి యోగాన్నాశ్రయించి ఏకార్ణవజలంలో సర్వత్ర వ్యాపించి అనేక సహస్ర యుగాల కాలపర్యంతం యోగనిద్రలో వుంటాడు. అప్పుడా పరమాత్మను వ్యక్తరూపునిగా కాని అవ్యక్తరూపునిగాకాని ఎవరూ తెలుసుకోలేరు.

కశ్చైవ పురుషో నామ కిం యోగః కశ్చ యోగవాన్ ।
అసౌ కియన్తం కాలం చ ఏకార్ణవవిధిం ప్రభుః ।
కరిష్యతీతి భగవానితి కశ్చిన్న బుధ్యతే ॥ 22 ॥

ఈ పురుషుడెవరు? ఇతని యోగమేది? ఈ యోగి ఎవరు? భగవంతుడైన ఈ ప్రభువు ఎంతకాలము వరకు ఈ ఏకార్ణవస్థితిలో వుంటాడు? అనే ఈ విషయాన్ని ఎవరు కూడ ఎరుగరు.

న ద్రష్టా నైవ గమితా న జ్ఞాతా నైవ పార్శ్వగః ।
తస్య న జ్ఞాయతే కించిత్తమృతే దేవసత్తమమ్ ॥ 23 ॥

ఆ దేవసత్తము డొక్కడే గాని ఆతనిని చూచినవాడు కాని, పొందినవాడు గాని, తెలుసుకొనినవాడు గాని, పార్శ్వచరుడు గాని వున్నట్లు తెలియదు.

నభః క్షితిం పవనమపః ప్రకాశం ప్రజాపతిం భువనధరం సురేశ్వరమ్ ।
పితామహం శ్రుతినిలయం మహామునిం ప్రశామ్య భూయః శయనం హ్యరోచయత్ ॥ 24 ॥

ఆకాశం, పృథివి, వాయువు, జలం, తేజస్సు (అగ్ని) మొదలగు పంచమహాభూతాలను, ప్రజాపతిని, భువనధరుడైన సురేశ్వరుని, వేదాలకు నిలయమైనవాడు మరియు మహాముని అయిన బ్రహ్మను తనలో లయింపజేసి మరల తన ఇష్టప్రకారంగానే ఈ ఏకార్ణవజలంలో శయనించి వుంటాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే పద్మోద్భవ ప్రాదుర్భావే ప్రలయ వర్ణనం నామ

షట్షష్ట్యధికశతతమోఽధ్యాయః ॥166॥

శ్రీమత్స్యమహాపురాణంలో పద్మోద్భవ ప్రాదుర్భావఘట్టంలో ప్రలయ వర్ణనమనే

నూట అరవైఆరవ అధ్యాయం సమాప్తం



సప్త షష్ట్యధికశతతమోఽధ్యాయః – నూటఅరవై ఏడవ అధ్యాయం

పద్మోద్భవప్రాదుర్భావమ్ – పద్మోద్భవ ప్రాదుర్భావం

విష్ణువు ఏకార్ణవజలంలో శయనించడం.

మత్స్య ఉవాచ – మత్స్య దేవుడు చెప్పాడు.

ఏవమేకార్ణవీభూతే శేతే లోకే మహాద్యుతిః ।
ప్రచ్ఛాద్య సలిలేనోర్వీం హంసో నారాయణస్తదా ॥ 1 ॥

మహతో రజసో మధ్యే మహార్ణవసరస్సు వై ।
విరజస్కం మహాబాహుం అక్షయం బ్రహ్మ యద్విదుః ॥ 2 ॥

మహాప్రకాశవంతుడు, హంసరూపుడు అయిన శ్రీమన్నారాయణుడు పృథివినంతటిని నీటితో కప్పివేసి ఏకార్ణవీభూతమైన లోకంతో గొప్పదైన రజోగుణరాశి మధ్యలో మహార్ణవసరస్సు మధ్యభాగంలో శయనిస్తాడు. అతనినే రజోగుణరహితుడు, మహాబాహువు, అక్షయుడూ అయిన పరమాత్మా అని తత్త్వవేత్తలంటారు.

ఆత్మరూపప్రకాశేన తమసా సంవృతః ప్రభుః ।
మనః సాత్త్వికమాధాయ యత్ర తత్సత్యమాసత ॥ 3 ॥

ప్రభువైన శ్రీ మహావిష్ణువు అపుడు ఆత్మరూపప్రకాశంతో తమోగుణాన్ని నశింపజేసి మనస్సును సత్త్వగుణమయంగా జేసికొంటాడు. (సత్త్వగుణసంపన్నులు మాత్రమే ఆ సత్యాన్ని గ్రహించగలరు)

యథాతథ పరం జ్ఞానం భూతం తద్ బ్రహ్మణా పురా ।
రహస్యారణ్యకోద్దిష్టం యచ్చోపనిషదం స్మృతమ్ ॥ 4 ॥

బ్రహ్మతత్త్వానికి సంబంధించిన యథాతథమైన పరమజ్ఞానం రహస్యాలైన ఆరణ్యక ఉపనిషత్తులలో బ్రహ్మచే పూర్వమే ప్రతిపాదించబడింది.

పురుషో యజ్ఞ ఇత్యేతత్ యత్పరం పరికీర్తితమ్ ।
యశ్చాన్యః పురుషాఖ్యః స్యాత్ స ఏష పురుషోత్తమః ॥ 5 ॥

యే చ యజ్ఞకరా విప్రా యే చర్త్విజ ఇతిస్మృతాః ।
అస్మాదేవ పురా భూతా యజ్ఞేభ్యః శ్రూయతాం తథా ॥ 6 ॥

ఆ తత్త్వానికే పురుషుడని, బ్రహ్మమని పేర్లున్నాయి. అతని కంటె శ్రేష్ఠులైన పురుషులు లేరు కావున అతడే పురుషోత్తముడు. ఆ పురుషుడే యజ్ఞపురుషుడని కీర్తింపబడ్డాడు. యజ్ఞం నిర్వహించే ఋత్విజులు, బ్రాహ్మణులు, మరియు యజ్ఞాలు కూడ ఈ పురుషోత్తమునినుండే ఉద్భవించినాయి.

బ్రహ్మాణం ప్రథమం వక్త్రాత్ ఉద్గాతారం చ సామగమ్ ।
హోతారమపి చాధ్వర్యుం బాహుభ్యామసృజత్ ప్రభుః ॥ 7 ॥

బ్రహ్మణో బ్రాహ్మణాచ్ఛంసి ప్రస్తోతారం చ సర్వశః ।
తౌ మిత్రావరుణౌ పృష్ఠాత్ ప్రతిప్రస్తారమేవ చ ॥ 8 ॥

ఆ పురుషోత్తముడే మొట్టమొదట తన ముఖం నుండి బ్రహ్మను, మరియు సామవేదజ్ఞుడైన ఉద్గాతను, బాహువులనుండి హౌతను మరియు అధ్వర్యుని సృష్టించాడు. అంతేకాక బ్రహ్మనుండి అనగా హృదయం నుండి 'బ్రాహ్మణాచ్ఛంసి'ని, మరియు ప్రస్తోతను, వీపునుండి మిత్రావరుణులను మరియు ప్రతిప్రస్తాతను ఉద్భవింపజేశాడు.

ఉదరాత్ ప్రతిహర్తారం పోతారం చైవ పార్థివ ।
అచ్ఛావాకమథోరుభ్యాం నేష్టారం చైవ పార్థివ ॥ 9 ॥

పాణిభ్యామథ చాగ్నీధ్రం సుబ్రహ్మణ్యం చ జానుతః ।
గ్రావస్తుతం తు పాదాభ్యాం ఉన్నేతారం చ యాజుషమ్ ॥ 10 ॥

ఇంకనూ ఆ పురుషోత్తముడు ఉదరము నుండి ప్రతిహర్తను మరియు పోతను, తొడల నుండి అచ్ఛావకుని, మరియు నేష్టను, మోకాళ్ళనుండి సుబ్రహ్మణ్యుని, పాదాల నుండి గ్రావస్తుతను మరియు ఉన్నేతను సృష్టించాడు.

ఏవమే వైష భగవాన్ షోడశైవ జగత్పతిః ।
ప్రవక్తృం సర్వయజ్ఞానాం ఋత్విజోఽసృజదుత్తమాన్ ॥ 11 ॥

తదేష వై వేదమయః పురుషో యజ్ఞసంస్థితః ।
వేదాశ్చైతన్మయాః సర్వే సాంగోపనిషదక్రియాః ॥ 12 ॥

ఈ విధంగా జగత్పతియైన భగవంతుడు సర్వయజ్ఞప్రవర్తకులైన పదహారు మంది ఉత్తములైన ఋత్విజులను సృష్టించాడు. ఈ కారణం చేత ఆ పరమపురుషుని వేదమయుడని, యజ్ఞమయుడని అంటారు. వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు మరియు యజ్ఞయాగాది క్రియలన్నీ ఆ భగవన్మయాలేనని పండితులు అంటారు.

(1.బ్రహ్మ, 2.ఉద్గాత, 3.హౌత, 4.అధ్వర్యువు(డ), 5.బ్రాహ్మణాంచ్ఛంసి, 6.ప్రస్తోత, 7.మైత్రా వరుణుడు, 8.ప్రతిప్రస్థాత, 9.పోత, 10.ప్రతిహర్త, 11.అచ్ఛావాకుడు,12.నేష్ట, 13.అగ్నీధ్రుడు, 14.సుబ్రహ్మణ్యుడు, 15. గ్రావస్తుతుడు, 16.ఉన్నేత మొదలగు పదహారు మంది ఋత్తిజులుంటారని శాస్త్రప్రమాణం. వీరినందరిని ఆ పరమాత్మ ఆయా అవయవాలనుండి సృష్టింపజేశాడని పురాణాలు స్పష్టపరుస్తున్నాయి. వీరిలో బ్రహ్మ, ఉద్గాత, హౌత మరియు అధ్వర్యువు అనే నలుగురు ప్రధాన ఋత్వికులు. ఇక మిగిలిన పన్నెండు మంది ఋత్విజులలో బ్రాహ్మణాచ్ఛంసి, పోత మరియు అగ్నీధ్రుడనే ముగ్గురు బ్రహ్మకు, ప్రస్తోత, ప్రతిహర్త మరియు సుబ్రహ్మణ్యుడనే ముగ్గురు ఉద్గాతకు, మైత్రా వరుణుడు, అచ్ఛావాకుడు గ్రావస్తుతుడు అనే ముగ్గురు హౌతకు, ప్రతిప్రస్థాత, నేష్ట మరియు ఉన్నేతలనే ముగ్గురు అధ్యర్యువుకు యజ్ఞ యాగాదులు నిర్వహించేటప్పుడు సహాయకులుగా వుంటారని కూడ ధర్మశాస్త్ర గ్రంథాలలో వివరించబడివున్నది.)

స్వపిత్యేకార్ణవే చైవ యదాశ్చర్యమభూత్ పురా ।
శ్రూయన్తాం తద్యథా విప్రా మార్కండేయః కుతూహలాత్ ॥ 13 ॥

గీర్ణో భగవతస్తస్య కుక్షావేవ మహామునిః ।
బహువర్షసహస్రాయుస్తస్యైవ వరతేజసా ॥ 14 ॥

పూర్వం ఏకార్ణవజలంలో జగత్పతియైన ఆ పురుషోత్తముడు నిద్రిస్తూండగా ఒక ఆశ్చర్యరకమైన సంఘటన జరిగింది. ఓ విప్రులారా! అదెలా జరిగిందో చెబుతాను. కుతూహలంతో శ్రద్ధగా వినండి. అనేక వేల సంవత్సరాల ఆయుష్షు కలిగిన మార్కండేయమహామునిని ఆ భగవానుడు మ్రింగగా ఆయన ఆతని కుక్షిలోనే ఆ దేవుని పరమోత్కృష్టమైన తేజస్సుతో వ్యాపించి వున్నాడు.

అటంస్తీర్థప్రసంగేన పృథివీతీర్థగోచరాన్ ।
ఆశ్రమాణి చ పుణ్యాని దేవతాయతనాని చ ॥ 15 ॥

దేశాన్ రాష్ట్రాణి చిత్రాణి పురాణి వివిధాని చ ।
జపహోమపరః శాన్తస్తపో ఘోరం సమాస్థితః ॥ 16 ॥

ఆ మార్కండేయముని ఆ పరమతేజస్సులో వ్యాప్తుడై వుండికూడ తీర్థయాత్రలు చేస్తూ, భూమిపై సంచరిస్తూ, పుణ్యతీర్థాలలో, ఆశ్రమాలలో, దేవాలయాలలో, రాష్ట్రాలలో, విచిత్రాలైన వివిధపురాలలో సంచరిస్తూ, జపహోమ పరుడై, శాంతచిత్తుడై ఘోరమైన తపస్సును చేశాడు.

మార్కండేయస్తతస్తస్య శనైర్వక్త్రాద్వినిస్సృతః ।
స నిష్క్రామన్ న చాత్మానం జానీతే దేవమాయయా ॥ 17 ॥

నిష్క్రమ్యాప్యస్య వదనాదేకార్ణవమథో జగత్ ।
సర్వతస్తమసాచ్ఛన్నం మార్కండేయోఽన్వవైక్షత ॥ 18 ॥

అటు తర్వాత మార్కండేయముని ఆ పరాత్పరుని ముఖం నుండి మెల్లగా వెలికి వస్తూ ఇదంతా ఆ భగవంతుని మాయ వలననే జరుగుతున్నదని తెలిసికొని ఈ విశ్వమంతా ఏకార్ణవమై అంధకారం ఆవరించి వుండటాన్ని చూశాడు.

తస్యోత్పన్నం భయం తీవ్రం సంశయశ్చాత్మజీవితే ।
దేవదర్శనసంహృష్టో విస్మయం పరమం గతః ॥ 19 ॥

చిన్తయన్ జలమధ్యస్థో మార్కండేయోఽన్వవైక్షత ।
కిం ను స్యాన్మమ చిన్తేయం మోహః స్వప్నోఽనుభూయతే ॥ 20 ॥

అలా చూచిన ఆ మహామునికి తీవ్రమైన భయం కలిగింది. ఇంకా తన జీవితాన్ని గూర్చి సంశయం కూడ కలిగింది. కాని వెంటనే అక్కడ భగవద్దర్శనం కలగడం వల్ల సంతుష్టుడై ఆశ్చర్యచకితుడయ్యాడు. మార్కండేయముని జలం మధ్యలో వుండి నా చిత్తంలో ఏమైనా మోహం కలుగుతున్నదా లేక నేను ఏదైనా కలగంటున్నానా అనుకొన్నాడు.

వ్యక్తమన్యతమో భావః తేషాం సమ్భావితో మమ ।
నహీదృశం జగత్ క్లేశమయుక్తం సత్యమర్హతి ॥ 21 ॥

నష్టచంద్రార్కపవనే నష్టపర్వతభూతలే ।
కతమః స్యాదయం లోక ఇతి చిన్తామవస్థితః ॥ 22 ॥

ఈ జగత్తంతా అంధకారం ఆవరించివున్నదని నేనే భావిస్తున్నానేమో? ఈ జగత్తుకు ఇటువంటి క్లేశం కలగటం సమంజసం కాదు కదా అని ఆ ముని అనుకొన్నాడు. చంద్రుడు, సూర్యుడు, వాయువు, పర్వతాలు, భూతలం మొదలైనవన్నీ నశించినట్లున్నాయి కనుక ఇది ఏ లోకం అయి వుంటుందో అని చింతాక్రాంతుడయ్యాడు.

దదర్శ చాపి పురుషం స్వపన్తం పర్వతోపమమ్ ।
సలిలేఽర్ధమథో మగ్నం జీమూతమివ సాగరే ॥ 23 ॥

జ్వలన్తమివ తేజోభిః గోయుక్తమివభాస్కరమ్ ।
శర్వర్యాం జాగ్రతమివ భాసన్తం స్వేన తేజసా ॥ 24 ॥

దేవం ద్రష్టుమిహాయాతః కో భవానితి విస్మయాత్ ।
తథైవ స మునిః కుక్షిం పునరేవ ప్రవేశితః ॥ 25 ॥

ఆ విధంగా చింతిస్తున్న మార్కండేయముని అదే సమయంలో సముద్రపు జలంపై నిద్రిస్తున్న పర్వతసదృశుడైన పురుషుని చూశాడు. అతడు సముద్రంలో సగభాగం వరకు మునిగిన బృహత్తరమైన మేఘంవలె వున్నాడు. మరియు తన తేజస్సుతో ప్రకాశిస్తూ కిరణాలతో వున్న భాస్కరుని వలె వున్నాడు. అమితమైన తన తేజస్సుతో ప్రకాశిస్తూ రాత్రిలో కూడ మేల్కొని వున్నట్లుగా వున్నాడు. అప్పుడు "నేను భగవానుని దర్శించడానికి ఇక్కడికి వచ్చాను. మరి నీవెవరవు" అని విస్మయంతో ప్రశ్నిస్తూండగానే ఆ మార్కండేయముని భగవానుని కుక్షిలోకి వెళ్ళిపోయాడు.

సంప్రవిష్టః పునః కుక్షిం మార్కండేయోఽతివిస్మయః ।
తథైవ చ పునర్భూయో విజానన్ స్వప్నదర్శనమ్ ॥ 26 ॥

స తథైవ యథాపూర్వం యో ధరామటతే పురా ।
పుణ్యతీర్థజలోపేతాం వివిధాన్యాశ్రమాణి చ ॥ 27 ॥

ఆ విధంగా మార్కండేయుడు ఆ భగవంతుని కుక్షిలో ప్రవేశించి, చాలా ఆశ్చర్యపడుతూ, ఇదంతా స్వప్నదర్శనమని తెలిసికొంటూ, దేవదేవుని కుక్షిలోనే మరలా యథాపూర్వం పుణ్యతీర్థజలాలతో కూడిన భూలోక సంచారంచేస్తూ అనేక ఆశ్రమాలను చూశాడు.

క్రతుభిర్యజమానాంశ్చ సమాప్తవరదక్షిణాన్ ।
అపశ్యద్దేవకుక్షిస్థాన్ యాజకాన్ శతశో హితాన్ ॥ 28 ॥

సద్వృత్త మాశ్రితాః సర్వే వర్ణా బ్రాహ్మణపూర్వకాః ।
చత్వారశ్చాశ్రమాః సమ్యగ్యథోద్దిష్టా మయా తవ ॥ 29 ॥

మార్కండేయముని ఇంకనూ దానిలో వివిధములైన యజ్ఞయాగాది క్రతువులను ఆచరిస్తున్నవారిని, వారిని శ్రేష్ఠదక్షిణలతో సత్కరిస్తున్నవారిని, హితకరాలైన యజ్ఞాలు చేయిస్తున్న వందలకొలది యాజకులను చూశాడు. అంతేకాక, నేను నీకు తెలిపిన బ్రాహ్మణాది నాలుగు వర్ణాలవారు నాలుగు ఆశ్రమాల వారు, కూడా సద్వర్తనులై ఆయా ధర్మాలను శ్రద్ధతో ఆచరించడం ఆ ముని చూశాడు.

ఏవం వర్షశతం సాగ్రం మార్కండేయస్య ధీమతః ।
చరతః పృథివీం సర్వాం న కుక్ష్యన్తః స మోక్షితః ॥ 30 ॥

ఇలా ధీమంతుడైన మార్కండేయముని దివ్యాలైన వంద సంవత్సరాలు సంపూర్ణంగా అక్కడ సంచరించినా భగవంతుని కుక్షిలో నుండి బయటపడలేదు.

తతః కదాచిదథ వై పునర్వక్త్రాద్వినిస్సృతః ।
సుప్తం న్యగ్రోధశాఖాయాం బాలమైకం నిరైక్షత ॥ 31 ॥

తథైవైకార్ణవజలే నీహారేణావృతాంబరే ।
అవ్యగ్రః క్రీడతే లోకే సర్వభూతవివర్జితే ॥ 32 ॥

ఆ విధంగా సంచరిస్తూ ఒకానొకప్పుడు భగవంతుని ముఖం నుండి వెలుపలికి వచ్చి, మర్రి వృక్షపు కొమ్మ పైన నిద్రిస్తున్న బాలునొకని చూశాడు. అలాగే ఏకార్ణవజలంలో మంచుతో కప్పబడిన అంతరిక్షం మధ్యలో ఏ ప్రాణీ లేని లోకంలో నిశ్చింతగా క్రీడిస్తున్నాడు.

స మునిర్విస్మయావిష్టః కౌతూహలసమన్వితః ।
బాలమాదిత్యసంకాశం నాశక్నోదభివీక్షితుమ్ ॥ 33 ॥

ఆ ముని విస్మయావిష్టుడై అత్యంత కుతూహలంతో కూడిన వాడైనప్పటికి ఆదిత్యునితో సమానుడైన ఆ బాలుని సమగ్రంగా చూడలేకపోయాడు.

స చిన్తయన్ తథైకాన్తే స్థిత్వా సలిలసన్నిధౌ ।
పూర్వదృష్టమిదం మన్యే శంకితో దేవమాయయా ॥ 34 ॥

అగాధసలిలే తస్మిన్ మార్కండేయః సువిస్మయః ।
ప్లవంస్తథార్తిమగమద్ భయాత్సంత్రస్తలోచనః ॥ 35 ॥

అపుడా మార్కండేయముని ఏకాంతంలో జలధిసన్నిధి నిలిచి దీర్ఘంగా ఆలోచించి ఇదంతా దేవమాయ వల్ల ఇది నేనంతకు ముందు జూచిందే అనుకొని మిక్కిలి విస్మయంతో ఆ అగాధసలిలాల్లో తేలుతూ, ఈదులాడుతూ శ్రమ పొందినవాడై, భయకంపితలోచనుడయ్యాడు.

స తస్మై భగవానాహ స్వాగతం బాలయోగవాన్ ।
బభాషే మేఘతుల్యేన స్వరేణ పురుషోత్తమః ॥ 36 ॥

మా భైర్వత్స న భేతవ్యమిహైవాయాహి మేఽన్తికమ్ ।
మార్కండేయో మునిస్త్వాహ బాలం తం శ్రమపీడితః ॥ 37 ॥

అప్పుడు భగవానుడైన ఆ బాలయోగి మార్కండేయమునికి స్వాగతం పలికాడు. ఇంకను ఆ పురుషోత్తముడు మేఘ సమానమైన స్వరంతో "వత్స! భయపడకు, నా దగ్గరకు రా' అని పిలిచాడు. అప్పుడు శ్రమపడిన మార్కండేయముని ఆ బాలునితో ఇలా అన్నాడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు పలికాడు.

కో మాం నామ్నా కీర్తయతి తపః పరిభవన్మమ ।
దివ్యం వర్షసహస్రాఖ్యం ధర్షయన్నివ మే వయః ॥ 38 ॥

న హ్యేష వః సమాచారో దేవేష్వపి మమోచితః ।
మాం బ్రహ్మాపి హి దేవేశో దీర్ఘాయురితి భాషతే ॥ 39 ॥

కస్తమో ఘోరమాసాద్య మామద్య త్యక్తజీవితః ।
మార్కండేయేతి మాముక్త్వా మృత్యుమీక్షితుమర్హతి ॥ 40 ॥

"నా తపస్సుకు పరాభవం కలిగిస్తూ దివ్య వర్ష సహస్రాల పరిమాణం గల నా వయస్సును కూడ లెక్కించక నన్ను పేరుతో పిలుస్తున్న ఇతడెవరు? ఇలా కించపరచే నడవడి దేవతలలో కూడ లేదు. దేవేశుడైన బ్రహ్మదేవుడు కూడ నన్ను "దీర్ఘాయూ" అని సంభోదిస్తాడు. ఇటువంటి నన్ను తాను ఘోరాంధకారంలో వుండి, జీవితాశ వదలుకొని 'మార్కండేయా' అని నన్ను పేరుతో పిలిచి మృత్యువును దర్శింపగోరుతున్న ఇతడెవరు?

ఏవ మాభాష్య తం క్రోధాన్మార్కండేయో మహామునిః ।
తథైవ భగవాన్ భూయో బభాషే మధుసూదనః ॥ 41 ॥

అని ఆ మార్కండేయ మహాముని క్రోధంతో పలుకగా భగవానుడు మధుసూదనుడు అయిన ఆ బాలుడు కూడ మరల పూర్వపు మేఘగంభీరధ్వనితో ఇలా అన్నాడు.

శ్రీ భగవానువాచ – భగవానుడు పలికాడు.

అహం తే జనకో వత్స హృషీకేశః పితా గురుః ।
ఆయుః ప్రదాతా పౌరాణః కిం మాం త్వం నోపసర్పసి ॥ 42 ॥

మాం పుత్రకామః ప్రథమం పితా తేఽంగిరసో మునిః ।
పూర్వమారాధయామాస తపస్తీవ్రం సమాశ్రితః ॥ 43 ॥

వత్సా! నేను నీ తండ్రిని, హృషీకేశుడను, గురువును, ఆయుఃప్రదాతను, ప్రాచీనుడను. నీవెందుకు నా దగ్గరకు రాలేకపోతున్నావు? పూర్వకాలంలో నీ తండ్రి అంగిరస ముని పుత్రవాంఛతో తీవ్రమైన తపస్సుచేస్తూ నన్నారాధించాడు. తీవ్రమైన తపస్సు చేశాడు.

తతస్త్వాం ఘోరతపసా ప్రావృణోదమితౌజసమ్ ।
ఉక్తవానహమాత్మస్థం మహర్షిమమితౌజసమ్ ॥ 44 ॥

కః సముత్సహతే చాన్యో యో న భూతాత్మకాత్మజః ।
ద్రష్టుమేకార్ణవగతం క్రీడంతం యోగవర్త్మనా ॥ 45 ॥

మరియు అమిత తేజోవంతుడవైన నీవు పుత్రుడిగా కావాలని వరం కోరుకున్నాడు. నాలో వున్నవాడు, అమితమైన తేజఃసంపన్నుడైన ఆ మహర్షి కోరికను నేను మన్నించాను. అటువంటి తపఃసంపన్నుడైన మహర్షి పుత్రుడు కాక మరెవ్వరు ఏకార్ణవగతుడై యోగమాయతో క్రీడిస్తూన్న నన్ను చూడగలడు? అని చెప్పాడు.

తతః ప్రహృష్టవదనో విస్మయోత్ఫుల్లలోచనః ।
మూర్ధ్ని బద్ధాంజలిపుటో మార్కండేయో మహాతపాః ॥ 46 ॥

నామగోత్రే తతః ప్రోచ్య దీర్ఘాయుర్లోకపూజితః ।
తస్మై భగవతే భక్త్యా నమస్కారమథాకరోత్ ॥ 47 ॥

భగవంతుని మాటలు విని, దీర్ఘాయుష్కుడు, లోకపూజితుడు, మహాతపశ్శాలియైన మార్కండేయ మహాముని సంతుష్టవదనుడై, ఆశ్చర్యంతో కన్నులు వికసించగా, తలపై దోసిలి నిలిపి తన గోత్రనామాలు చెప్పి, మిక్కిలి భక్తితో భగవంతునికి నమస్కరించాడు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పెను.

ఇచ్ఛేయం తత్త్వతో మాయామిమాం జ్ఞాతుం తవానఘ ।
యదేకార్ణవమధ్యస్థః శేషే త్వం బాలరూపవాన్ ॥ 48 ॥

కిం సంజ్ఞశ్చైవ భగవాన్ లోకే విజ్ఞాయసే ప్రభో! ।
తర్కయే త్వాం మహాత్మానం కో హ్యన్యః స్థాతుమర్హతి? ॥ 49 ॥

ఓ దేవా! నీవు బాలరూపుడవై ఏకార్ణవమధ్యస్థుడవై వున్న కారణాన్ని, నీ ఈ మాయకు గల వాస్తవరూపాన్ని తెలుసుకోగోరుతున్నాను. ఓ భగవంతుడా! నీవు ఏ పేరుతో ఈ లోకంలో వ్యవహరించబడతావు? నీవు మహాత్ముడవని భావిస్తున్నాను. అలా కానిచో ఈ ఏకార్ణవజలంలో ఎలా ఉండగలవు దేవా? అని మార్కండేయుడన్నాడు.

శ్రీ భగవానువాచ – భగవంతుడు చెప్పాడు.

అహం నారాయణో బ్రహ్మన్ సర్వభూః సర్వనాశనః ।
అహం సహస్రశీర్షా ఖ్యైఃయః పదైరభిసంజ్ఞితః ॥ 50 ॥

ఆదిత్యవర్ణః పురుషో మఖే బ్రహ్మమయో మఖః ।
అహమగ్నిర్హవ్యవాహో యాదసాం పతిరవ్యయః ॥ 51 ॥

'ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! నేను నారాయణుడను, నేను విశ్వమంతటికి కారణం, సృష్టి స్థితి లయాలకు కూడ నేనే కారణం, నన్ను సహస్రశీర్షాది అనేక పేర్లతో వ్యవహరిస్తారు. ఆదిత్యవర్ణం గల పురుషుడను, యజ్ఞంలో సేవించబడే బ్రహ్మను, హవ్యవాహుడైన అగ్నిని, జలచరాలకధిపతియైన సముద్రుడనూ నేనే'.

అహమింద్రపదే శక్రో వర్షాణాం పరివత్సరః ।
అహం యోగీ యుగాఖ్యశ్చ యుగాంతావర్త ఏవ చ ॥ 52 ॥

అహం సర్వాణి సత్త్వాని దైవతాన్యఖిలాని తు ।
భుజంగానామహం శేషః తార్క్ష్యో వై సర్వపక్షిణామ్ ॥ 53 ॥

ఇంద్రపదవిలో వున్న శక్రుడను, సంవత్సరాలలో పరివత్సరం, యోగి, యుగం, యుగాంతంలో ఆవృతి నేనే. ప్రాణులన్నీ నేనే, అఖిల దేవతలు నేనే, సర్పాలలో శేషుడను, పక్షులలో గరుత్మంతుడనూ నేనే అని భగవంతుడు చెప్పాడు.

కృతాన్తః సర్వభూతానాం విశ్వేషాం కాలసంజ్ఞితః ।
అహం ధర్మస్తపశ్చాహం సర్వాశ్రమనివాసినామ్ ॥ 54 ॥

అహం చైవ సరిద్దివ్యా క్షీరోదశ్చ మహార్ణవః ।
యత్తత్ సత్యం చ పరమం అహమేకః ప్రజాపతిః ॥ 55 ॥

'సర్వభూతాలకు కాలుడనే యముడను, ఆయా ఆశ్రమ ధర్మములాచరించేవారి ధర్మాన్ని, తపస్సును నేనే. దివ్యమైన గంగానదిని, క్షీరసముద్రాన్ని నేనే. పరమసత్యాన్ని మరియు ప్రజాపతిని కూడ నేనే' అని భగవంతుడు చెప్పాడు.

అహం సాంఖ్యమహం యోగోఽప్యహం తత్పరమం పదమ్ ।
అహమిజ్యా క్రియా చాహమహం విద్యాధిపః స్మృతః ॥ 56 ॥

అహం జ్యోతిరహం వాయు రహం భూమి రహం నభః ।
అహమాపః సముద్రశ్చ నక్షత్రాణి దిశో దశ ॥ 57 ॥

'సాంఖ్యం, యోగం, పరమపదం, యజ్ఞం, క్రియ, విద్యాధిపతి, అగ్ని, వాయువు, భూమి, ఆకాశం, నీరు, సముద్రం, నక్షత్రాలు, దశదిశలు కూడ నేనే'.

అహం వర్షమహం సోమః పర్జన్యోఽహమహం రవిః ।
క్షీరోదసాగరే చాహం సముద్రే బడవాముఖః ॥ 58 ॥

వహ్నిః సంవర్తకో భూత్వా పిబంస్తోయమయం హవిః ।
అహం పురాణః పరమం తథైవాహం పరాయణమ్ ॥ 59 ॥

'నేనే వర్షం, సోముడు (చంద్రుడు), పర్జన్యుడు, సూర్యుడు, క్షీరసాగరం, బడబాగ్ని, నేను సంవర్తకాగ్నినై జలరూప హవిస్సును త్రాగుతున్నాను. నేను చాలా ప్రాచీనుడను. అలాగే పరాయణం కూడా నేనే'.

అహం భూతస్య భవ్యస్య వర్తమానస్య సంభవః ।
యత్కించిత్ పశ్యసే విప్ర యచ్ఛృణోషి చ కించన ॥ 60 ॥

యల్లోకే చానుభవసి, తత్సర్వం మామనుస్మర ।
విశ్వం సృష్టం మయా పూర్వం సృజ్యం చాద్యాపి పశ్య మామ్ ॥ 61 ॥

'భూత భవిష్యద్వర్తమానాలకు కారణం నేనే. ఓ బ్రాహ్మణోత్తమా! నీవు చూస్తున్నది, వింటున్నది, అనుభవిస్తున్నది కూడ నేనేనని తెలిసికో. పూర్వం సృష్టించినది ఇప్పుడు సృష్టించబడుతున్నది కూడ నేనే అని తెలుసుకో'.

యుగే యుగే చ స్రక్ష్యామి మార్కండేయాఖిలం జగత్ ।
తదేతదఖిలం సర్వం మార్కండేయావధారయ ॥ 62 ॥

శుశ్రూషుర్మమ ధర్మాంశ్చ కుక్షౌ చర సుఖం మమ ।
మమ బ్రహ్మ శరీరస్థో దేవైశ్చ ఋషిభి స్సహ ॥ 63 ॥

'ఓ మార్కండేయా! యుగయుగంలో నేనే అఖిల జగత్తును సృష్టిస్తాను? నా ధర్మాలను వింటూ నీవు నా ఉదరంలోనే సుఖంగా సంచరించు. బ్రహ్మ కూడ దేవతలతో, ఋషులతో నాలోనే వున్నాడు'.

వ్యక్తమవ్యక్తయోగం మామవగచ్ఛాసురద్విషమ్ ।
అహమేకాక్షరో మన్త్రస్త్ర్యక్షరశ్చైవ తారకః ॥ 64 ॥

పరస్త్రివర్ణాదోంకార స్త్రివర్గార్థనిదర్శనః ।
ఏవమాదిపురాణేశో వదన్నేవ మహామతిః ॥ 65 ॥

వక్త్రమాహతవానాశు మార్కండేయం మహామునిమ్ ।
తతో భగవతః కుక్షిం ప్రవిష్టో మునిసత్తమః ॥
స తస్మిన్ సుఖమేకాన్తే శుశ్రూషుర్హంసమవ్యయమ్ ॥ 66 ॥

'వ్యక్తం మరియు అవ్యక్తమైన తత్త్వాలు, అసురనాశకుణ్ణి, ఏకాక్షరమంత్రమైన ఆకారాన్ని, మూడక్షరాల తారక మంత్రాన్ని నేనే. ధర్మార్థ కామమోక్షాలనే మూడు పురుషార్థాలకంటె పరమైన త్రివర్గతత్త్వాన్ని నిరూపించే ఓంకారాన్ని నేనే', అని చెబుతూ మహామతిమంతుడు, పురాణపురుషుడు, ఈశ్వరుడు, నారాయణుడు తన నోటిని తెరచి మార్కండేయ మహామునిని దానిలోకి ప్రవేశింపజేశాడు. అటు తర్వాత మునిసత్తముడైన మార్కండేయుడు కూడ భగవంతుని కుక్షిలో ప్రవేశించి ఏకాంతంలో అవ్యయుడు, హంసరూపుడూ ఐన ఆ భగవానుని సుఖంగా సేవిస్తూ వున్నాడు.

యోఽహమేవ వివిధతనుం పరిశ్రితో మహార్ణవే వ్యపగతచంద్రభాస్కరే ।
శనైశ్చరన్ ప్రభురపి హంససంజ్ఞితోఽసృజం జగద్విరహితకాలపర్యయే ॥ 67 ॥

నేనే వివిధములైన తనువులను ధరించి, లోకములన్నింటిని ప్రవర్తింపజేసి, చంద్ర సూర్యులు లేని మహైకార్ణవంలో వివిధ రూపాలతో మెల్లగా సంచరిస్తూ మరల కాలం ఆసన్నమైనప్పుడు తత్పరిణామానుసారంగా లోకాలన్నింటిని సృజిస్తూ విహరిస్తూ హంసరూప భగవానుడను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే పద్మోద్భవప్రాదుర్భావే సప్తషష్ట్యధిక శతతమోఽధ్యాయః ॥ 167॥

శ్రీమత్స్యమహాపురాణంలో పద్మోద్భవప్రాదుర్భావంలో నూట అరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టషష్ట్యధిక శతతమోఽధ్యాయః – నూటఅరవై ఎనిమిదవ అధ్యాయం
భగవన్నాభితః కమలోత్పత్తివర్ణనమ్ – శ్రీ మన్నారాయణుని నాభినుండి కమలోత్పత్తి వర్ణనం

మత్స్య ఉవాచ – మత్స్య దేవుడు చెప్పాడు.

ఆపో వై స విభుర్భూత్వా చారయామాస వై తపః ।
ఛాదయిత్వాఽఽత్మనో దేహం యాదసాం కులసంభవమ్ ॥ 1 ॥

విభుడు అనగా సర్వవ్యాపి, సర్వశక్తి సంపన్నుడు ఐన శ్రీమన్నారాయణుడు జలజంతువులకు జన్మస్థానమైన జలరూపంలో తానుండి తన వాస్తవరూపాన్ని మరుగుపరచి మరల తపస్సు చేయనారంభించాడు.

తతో మహాత్మాఽతిబలో మతిం లోకస్య సర్జనే ।
మహతాం పంచభూతానాం విశ్వో విశ్వమచింతయత్ ॥ 2 ॥

ఆ విధంగా తపస్సు చేసిన తరువాత మహాత్ముడు, అతిబలుడు, విశ్వవ్యాప్తుడు అయిన పరమాత్మ లోకసృష్టి మరియు పంచమహాభూతముల సృష్టి విషయాన్ని కూడ విచారించాడు.

తస్య చిన్తయమానస్య నిర్వాతే సంస్థితేఽర్ణవే ।
నిరాకాశే తోయమయే సూక్ష్మే జగతి గహ్వరే ॥ 3 ॥

ఈషత్ సంక్షోభయామాస సోఽర్ణవం సలిలాశ్రయః ।
అనన్తరోర్మిభిః సూక్ష్మమథచ్ఛిద్రమభూత్ పురా ॥ 4 ॥

అతడావిధంగా ఆలోచిస్తూండగానే గాలి లేక సముద్రం నిశ్చలమై వుండగా, సృష్టింపబడబోతున్న జగత్తంతా సూక్ష్మరూపమై కనబడగా, ఆకాశం లేని మిక్కిలి లోతైన జలాన్ని ఆశ్రయించివున్న పరమాత్మ ఆ సముద్రాన్ని కొంచెం సంక్షోభింపజేశాడు. అలా చేయటం వలన ప్రప్రథమంగా సముద్రపు నీటి అలలలో సూక్ష్మమైన రంధ్రమేర్పడింది.

శబ్దం ప్రతి తదోద్భూతో మారుతశ్ఛిద్రసంభవః ।
స లబ్ధ్వాన్తరమక్షోభ్యో వ్యవర్ధత సమీరణః ॥ 5 ॥

వివర్ధతా బలవతా వేగాద్విక్షోభితోఽర్ణవః ।
తస్యార్ణవస్య క్షుబ్ధస్య తస్మిన్నమ్భసి మంథితే ।
కృష్ణవర్త్మా సమభవత్ ప్రభుర్వైశ్వానరో మహాన్ ॥ 6 ॥

దాని నుండి సూక్ష్మభూతమైన ఆకాశముద్భవించింది. మరియు శబ్దగుణకమైన ఆ ఆకాశమపు ఛిద్రం నుండి వాయువు ఉద్భవించింది. ఆ వాయువు చాలా అభివృద్ధిపొంది అక్షోభ్యమైన సముద్రాన్ని కూడ క్షోభింపజేయగా దాని నుండి అగ్ని ఉద్భవించింది. నల్లని పొగతో త్రోవను సూచించేవాడు కావున 'కృష్ణవర్త్మ' అనే పేరుతో

పిలువబడుతున్న ఆ అగ్నిదేవుడు జనులందరి జఠరాలలో వుండి జీర్ణం చేసే శక్తికలవాడు కనుక వైశ్వానరుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు.

తతః స శోషయామాస పావకః సలిలం బహు ।
క్షయాజ్జలనిధేశ్ఛిద్రమభవద్విస్తృతం నభః ॥ 7 ॥

ఆత్మతేజోద్భవాః పుణ్యాః ఆపోఽమృతరసోపమాః ।

ఆకాశం ఛిద్రసంభూతం వాయురాకాశసంభవః ॥ 8 ॥

ఆభ్యాం సంఘర్షణోద్భూతం పావకం వాయుసంభవమ్ ।
దృష్ట్వా ప్రీతో మహాదేవో మహాభూతవిభావనః ॥ 9 ॥

ఆ వైశ్వానరుడు నీటినంతటిని శోషింపజేశాడు. అలా జలం ఎండి ఏర్పడిన రంధ్రంలో విశాలమైన ఆకాశం ఏర్పడింది. అప్పుడు అగ్ని తన తేజస్సు నుండి అమృతతుల్యమైన రుచి గల జలాన్ని ఉద్భవింపజేశాడు. ఇలా పరస్పర సంఘర్షణల వలన జలములఛిద్రం నుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు, దాని నుండి అగ్ని మరియు అగ్ని నుండి మరల జలముద్భవించాయి. అలా పంచమహాభూతాలను చూచి మహాదేవుడు ప్రీతి చెందాడు.

దృష్ట్వా భూతాని భగవాన్ లోకసృష్ట్యర్థముత్తమమ్ ।
బ్రహ్మణో జన్మసహితం బహురూపో వ్యచిన్తయత్ ॥ 10 ॥

ఆ పంచమహాభూతాలను చూచి అనేక రూపాలు గల భగవంతుడైన నారాయణుడు ఉత్తమమైన లోకాన్ని సృష్టించటానికి ముందు బ్రహ్మ పుట్టుకను గురించి కూడా విచారించాడు.

చతుర్యుగాభిసంఖ్యాతే సహస్రయుగపర్యయే ।
బహుజన్మవిశుద్ధాత్మబ్రహ్మణేహ నిరుచ్యతే ॥ 11 ॥

ఇంతకు ముందు చెప్పినట్లు నాలుగుయుగాలకు సంబంధించిన పన్నెండువేల దివ్య సంవత్సరాల పరిమాణం గల వేయి సంవత్సరాలు గడిస్తే బ్రహ్మకు ఒక పగలు అవుతుంది. బ్రహ్మ అనేక జన్మలలో తనను తాను విశుద్ధంగా జేసుకొన్న జీవాత్మ, చైతన్యస్వరూపుడు.

యత్ పృథివ్యాం ద్విజేంద్రాణాం తపసా భావితాత్మనామ్ ।
జ్ఞానం దృష్టం తు విశ్వార్థే యోగినాం యాతి ముఖ్యతామ్ ॥ 12 ॥

తం యోగవంతం విజ్ఞాయ సంపూర్ణైశ్వర్యముత్తమమ్ ।
పదే బ్రహ్మణి విశ్వేశం న్యయోజయత యోగవిత్ ॥ 13 ॥

భూలోకంలో తమ తపోబలంతో భావితాత్ములైన, ద్విజశ్రేష్ఠులైన యోగులచే విశ్వకల్యాణం కొరకై ఉపయోగించే జ్ఞానాన్ని దర్శించి సంపూర్ణమైన ఈశ్వరత్వాన్ని సంపాదించిన యోగిపుంగవుని విశ్వేశునిగా గుర్తించి యోగవిదుడైన నారాయణుడు అతనిని బ్రహ్మపదంలో నియోగించాడు.

తతస్తస్మిన్ మహాతోయే మహీశో హరిరచ్యుతః ।
స్వయం క్రీడంశ్చ విధివన్మోదతే సర్వలోకకృత్ ॥ 14 ॥

పద్మం నాభ్యుద్భవం చైకం సముత్పాదితవాంస్తదా ।
సహస్రపర్ణం విరజం భాస్కరాభం హిరణ్మయమ్ ॥ 15 ॥

ఆ తరువాత అచ్యుతుడు, హరి, సర్వలోక కర్తయైన నారాయణుడు ఆ మహాజలంలో యథావిధిగా జలక్రీడ చేస్తూ ఆనందిస్తూ తన నాభినుండి పద్మాన్ని ఉద్భవింపజేశాడు. సువర్ణమయమైన ఆ పద్మం వేయి దళాలతో సూర్యసమాన కాంతితో ప్రకాశిస్తూ వుండినది.

హుతాశనజ్వలిత శిఖోజ్జ్వలత్ ప్రభముపస్థితం శరదమలార్కతేజసమ్ ।
విరాజతే కమలముదారవర్చసం మహాత్మనస్తనురుహచారుదర్శనమ్ ॥ 16 ॥

ఇంకను ఆ పద్మం ప్రజ్వరిల్లుతున్న అగ్ని శిఖలవలె ప్రకాశవంతమైన కాంతులు గలదై, శరత్కాలపు సూర్యునివంటి నిర్మలమైన తేజస్సు గలదై వుండినది. మహాత్ముడైన శ్రీ మన్నారాయణుని తనువునుండి ఉత్పన్నమై, మనోహరమైన రూపం గలిగి, ఉదారమైన వర్చస్సుతో ప్రకాశిస్తూ వుండినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే భగవన్నాభితః కమల్పోత్తి వర్ణనం నామ
అష్ట షష్ట్యధిక శతతమోధ్యాయః ॥168॥

శ్రీమత్స్య మహాపురాణంలో శ్రీమన్నారాయణుని నాభినుండి కమలోత్పత్తి వర్ణనమనే
నూటఅరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం



ఏకోనసప్తత్యధిక శతతమోఽధ్యాయః - నూటఅరవై తొమ్మిదవ అధ్యాయం

నారాయణ నాభికమలాత్ పద్మోద్భవ ప్రాదుర్భావః

నారాయణుని నాభికమలం నుండి బ్రహ్మ ఆవిర్భవించుట

మత్స్య ఉవాచ - మత్స్యదేవుడు చెప్పాడు.

అథ యోగవతాం శ్రేష్ఠమసృజద్ భూరితేజసమ్ ।
స్రష్టారం సర్వలోకానాం బ్రహ్మాణం సర్వతోముఖమ్ ॥ 1 ॥

యస్మిన్ హిరణ్మయే పద్మే బహుయోజనవిస్తృతే ।
సర్వతేజోగుణమయం పార్థివైర్లక్షణైర్వృతమ్ ॥ 2 ॥

అటు తర్వాత శ్రీమన్నారాయణుడు బహుయోజనవిస్తీర్ణం గల ఆ హిరణ్మయపద్మం నుండి గొప్ప తేజోమయుడు, యోగులలో శ్రేష్ఠుడు, అన్ని దిశలలో ముఖాలు కలవాడు, అన్ని తేజోగుణాలు కలవాడు, రాజ లక్షణాలు కలవాడు, సకలలోక స్రష్ట అయిన బ్రహ్మను సృష్టించాడు.

తచ్చ పద్మం పురాణజ్ఞాః పృథివీరూపముత్తమమ్ ।
నారాయణసముద్భూతం ప్రవదన్తి మహర్షయః ॥ 3 ॥

యా పద్మా సా రసా దేవీ పృథివీ పరిచక్ష్యతే ।

నారాయణుని నుండి ఉద్భవించిన ఆ పద్మం పృథివీరూపాన్ని పొందిందని పురాణజ్ఞులైన మహర్షులు చెబుతున్నారు. మరియు ఆ పద్మమే రసాదేవి అయిన పృథివి అని చెప్పబడుతున్నది.

యే పద్మసారగురవః తాన్ దివ్యాన్ పర్వతాన్ విదుః ॥ 4 ॥

హిమవన్తం చ మేరుం చ నీలం నిషధమేవ చ ।
కైలాసం ముంజవన్తం చ తథాఽన్యం గంధమాదనమ్ ॥ 5 ॥

పుణ్యం త్రిశిఖరం చైవ కాన్తం మందరమేవ చ ।
ఉదయం పింజరం చైవ విన్ధ్యవన్తం చ పర్వతమ్ ॥ 6 ॥

ఏతే దేవగణానాం చ సిద్ధానాం చ మహాత్మనామ్ ।
ఆశ్రయాః పుణ్యశీలానాం సర్వకామఫలప్రదాః ॥ 7 ॥

ఈ పద్మంలోని సారమే మార్పు చెంది మిక్కిలి బరువు గల పదార్థాలుగా ఏర్పడ్డాయి. అవే దివ్యాలైన పర్వతాలయ్యాయి. ఆ పర్వతాలే హిమవంతం-మేరు-నీల-నిషధ-కైలాస-ముంజవంత-గంధమాదన-త్రికూట-మందర-ఉదయ-పింజర-వింధ్యవంతం మొదలగు పర్వతాలు. ఇవి దేవగణాలకు, మహాత్ములైన సిద్ధులకు, పుణ్యశీలురైన మహానుభావులకు ఆశ్రయాలై కోరికలన్నింటినీ తీరుస్తున్నాయి.

ఏతేషామన్తరే దేశో జంబూద్వీప ఇతి స్మృతః ।
జంబూద్వీపస్య సంస్థానం యజ్ఞియా యత్ర వై క్రియాః ॥ 8 ॥

ఈ పర్వతాలన్నింటి నడుమ వున్న దేశానికే జంబూద్వీపమని పేరున్నది. ఈ జంబూద్వీపం యజ్ఞ, యాగాది వైదిక కర్మలన్నింటికి ప్రసిద్ధం.

ఏభ్యో యత్రస్రవతే తోయం దివ్యామృతరసోపమమ్ ।
దివ్యాస్తీర్థశతాధారాః సురమ్యాః సరితః స్మృతాః ॥ 9 ॥

ఈ పర్వతాల నుండి స్రవించే దివ్యామృతరసంతో సమానమైన జలం వందలకొలది దివ్యతీర్థాలకు ఆధారాలైన నదులుగా పరిణమించి ప్రసిద్ధిపొందినాయి.

స్మృతాని యాని పద్మస్య కేసరాణి సమన్తతః ।
అసంఖ్యేయాః పృథివ్యాస్తే విశ్వే వై ధాతుపర్వతాః ॥ 10 ॥

శ్రీహరి నాభినుండి ఉద్భవించిన పద్మంలోని కేసరాలే ఈ విశ్వంలో అంతటా భూమిపైన అసంఖ్యాకాలైన గైరికాది ధాతువులకు ఆలవాలాలైన పర్వతాలుగా ఏర్పడ్డాయని భావించారు.

యాని పద్మస్య పర్ణాని భూరీణి తు నరాధిప ।
తే దుర్గమాః శైలచితా మ్లేచ్ఛదేశా వికల్పితాః ॥ 11 ॥

ఓ రాజా! అసంఖ్యాకాలైన ఈ పద్మం యొక్క దళాలే పర్వతసమూహాలతో వ్యాప్తమై దుర్గమాలైన పర్వతాలు గల మ్లేచ్ఛదేశాలుగా వికల్పం చెందినాయి.

యాన్యధోభాగపర్ణాని తే నివాసాస్తు భాగశః ।
దైత్యానామురగాణాం చ పతఙ్గానాం చ పార్థివ ॥ 12 ॥

మరియు ఆ పద్మం అడుగుభాగాన వున్న ఆకులు భాగక్రమంలో దైత్యులకు, సర్పాలకు మరియు అనేకవిధ పక్షులకు ఆవాస స్థానాలైనాయి.

తేషాం మహార్ణవో యత్ర తద్రసేత్యభిసంజ్ఞితమ్ ।
మహాపాతకకర్మాణో మజ్జన్తే యత్ర మానవాః ॥ 13 ॥

దైత్యదానవ ప్రదేశాలకు మధ్యభాగంలోవున్న మహార్ణవానికే రసాతలమని పేరు. దీనిలో మహాపాపాలనాచరించే జనులు మునుగుతారు.

పద్మస్యాన్తరతో యత్తదేకార్ణవగతా మహీ ।
ప్రోక్తాథ దిక్షు సర్వాసు చత్వారః సలిలాకరాః ॥ 14 ॥

ఈ పద్మానికి నడుమ ఏకార్ణవజలంలో తేలివున్న భూభాగానికే 'మహీ' (భూమి) అని పేరు. ఈ భూమికి నాలుగు దిక్కులలో నాలుగు మహా సాగరాలున్నాయి.

ఏవం నారాయణస్యార్థే మహీ పుష్కరసంభవా ।
ప్రాదుర్భావోఽ ప్యయం తస్మాన్నామ్నా పుష్కరసంజ్ఞితః ॥ 15 ॥

ఈ విధంగా నారాయణుని సంకల్పానుసారం పుష్కరం అనగా పద్మం నుండి ఉద్భవించిన ఈ 'మహీ' పృథ్వికి 'పుష్కర సంభవ' అని పేరు కలిగింది. ('పుష్కర' మనే శబ్దానికి జలం, పద్మం అని రెండు అర్థాలున్నాయి) అని కోశగ్రంథాల ద్వారా తెలుస్తున్నది. నారాయణాశ్రయమైన జలం నుండి పద్మం మరియు పద్మం నుండి పృథ్వి ఉద్భవించినాయి. కావున ఈ రెండు అర్థాలు కూడ పుష్కర శబ్దానికి చెప్పవచ్చు అని విజ్ఞుల అభిప్రాయం. ఈ విధంగా ఈ ప్రాదుర్భావానికి అనగా ఇటువంటి సృష్టిక్రమానికి 'పుష్కరసృష్టి' అని మరియు 'పాద్మకల్పక్రమం' అని పేరు వచ్చినది.

ఏతస్మాత్కారణాత్తజ్జ్ఞైః పురాణైః పరమర్షిభిః ।
యాజ్ఞికైర్వేదదృష్టాన్తైః యజ్ఞే పద్మవిధిః స్మృతః ॥ 16 ॥

ఈ కారణం చేతనే సృష్టితత్త్వం తెలిసిన తత్త్వవిదులైన ప్రాచీన మహర్షులు యాజ్ఞికులు యజ్ఞంలో వేదదృష్టాంతాలతో పద్మవిధి, అనే యజ్ఞ ప్రక్రియను చెప్పారు.

ఏవం భగవతా తేన విశ్వేషాం ధారణావిధిః ।
పర్వతానాం నదీనాం చ హ్రదానాం చైవ నిర్మితః ॥ 17 ॥

ఇలా భగవానుడైన నారాయణుడు ఈ ప్రపంచంలోని పర్వతాలు, నదులు, సరస్సులు మొదలగు వాటి ధారణావిధానాన్ని ఏర్పాటు చేశాడు.

విభుస్తథైవాప్రతిమప్రభావః ప్రభాకరాభో వరుణాసితద్యుతిః ।
శనైః స్వయంభూః శయనం సృజత్తదా జగన్మయం పద్మవిధిం మహార్ణవే ॥ 18 ॥

సర్వవ్యాపి, అనుపమానప్రభావం కలవాడు, సూర్యుని వంటి తేజస్సు కలవాడు, వరుణుని వంటి నల్లని కాంతి గలవాడు, స్వయంభువు అయిన శ్రీమన్నారాయణుడు జగన్మయమైన పద్మవిధిని సృష్టించి మహార్ణవంలో నెమ్మదిగా శయనించెను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నారాయణ నాభికమాలాత్ పద్మోద్భవ ప్రాదుర్భావో ఏకోనసప్తత్యధికశతతమోఽ ధ్యాయః ॥ 169॥

శ్రీమత్స్య మహాపురాణంలో నారాయణుని నాభి కమలం నుండి పద్మోద్భవప్రాదుర్భావ మనే నూటఅరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



సప్తత్యధిక శతతమోఽధ్యాయః - నూట డెబ్బైయవ అధ్యాయం

మధుకైటభరాక్షస జననమ్ - మధు కైటభులనే రాక్షసుల జననం

మత్స్య ఉవాచ - మత్స్యదేవుడు చెప్పాడు.

విష్ణుస్తపసి సంభూతో మధుర్నామ మహాసురః ।
తేనైవ చ సహోద్భూతో రజసా కైటభస్తతః ॥ 1 ॥

తౌ రజస్తమసౌ విఘ్నసంభూతౌ తామసౌ గణౌ ।
ఏకార్ణవే జగత్సర్వం క్షోభయన్తౌ మహాబలౌ ॥ 2 ॥

భగవానుడైన శ్రీ మన్నారాయణుడు యోగనిద్రలో వుండగా, బ్రహ్మదేవుని తపస్సుకు విఘ్నం కలిగించిన మధు అనే అసురుడు ముందుగా ఉద్భవించాడు. వానిననుసరించి రజోగుణప్రధానుడైన కైటభుడనే అసురుడు కూడ ఉద్భవించాడు. వీరిద్దరు రజస్తమోగుణ ప్రధానులై భగవంతుని సృష్టికి విఘ్నము కలిగించడానికి జనించారు. మరియు మహాబలశాలురైన వీరిద్దరూ ఏకార్ణవజలరూపంలో వున్న జగత్తును క్షోభింపజేయసాగారు.

విశే: భగవంతుడు చేసే సృష్టి, స్థితి, లయలలో సృష్టికి రజోగుణం, స్థితికి సత్త్వగుణం, లయానికి తమోగుణాలు కారణాలని, ఆ మూడు గుణాలు శుద్ధరూపంలో ఉండకుండా మాలిన్యాన్ని పొందినప్పుడు అనగా అవి వాటి క్రమాన్ని తప్పినప్పుడు ఆ యా ప్రక్రియలలో విఘ్నమేర్పడుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇక్కడ రజస్తమోగుణప్రధానులైన మధుకైటభులు ఆ రెండు గుణాల మాలిన్యరూపులని గ్రహించాలి.

దివ్యరక్తాంబరధరౌ శ్వేతదీప్తాగ్రదంష్ట్రిణౌ ।
కిరీటకుండలోదగ్రౌ కేయూరవలయోజ్జ్వలౌ ॥ 3 ॥

మహావిక్రమతామ్రాక్షౌ పీనోరస్కౌ మహాభుజౌ ।
మహాగిరేః సంహననౌ జంగమావివ పర్వతౌ ॥ 4 ॥

దివ్యాలైన ఎర్రని వస్త్రాలను ధరించి, పదునైన తెల్లని కోరలు గలిగి, ప్రకాశవంతాలైన కిరీటాలు, కేయూరాలు, కుండలాలు ధరించి, మహాపరాక్రమశాలురై, ఎర్రని నేత్రాలు, విశాలమైన వక్షఃస్థలాలు, దృఢమైన భుజాలు కలిగిన వారిద్దరు పర్వతాలను బోలిన శరీరాలు గలవారై అటు ఇటు సంచరించే శక్తిగల పర్వతాల వలె వున్నారు.

విశే: పర్వతాలు ప్రాచీనకాలంలో సంచరించేవని, జనావాసాలను భగ్నం చేసేవని వాటి రెక్కలను ఇంద్రుడు తన వజ్రాయుధంతో ఖండించాడని అందుకే అవి స్థిరంగా ఒకేచోట నిలిచిపోయాయని పురాణాలు తెలుపుతున్నాయి).

నవమేఘప్రతీకాశౌ ఆదిత్యసదృశాననౌ ।
విద్యుదాభౌ గదాగ్రాభ్యాం కరాభ్యామతిభీషణౌ ॥ 5 ॥

తౌ పాదయోస్తు విన్యాసాదుత్క్షిపంతావివార్ణవమ్ ।
కంపయన్తావివ హరిం శయానం మధుసూదనమ్ ॥ 6 ॥

మరియు తొలకరి మేఘాల వలె నల్లని రూపం గల, సూర్యుని వంటి ముఖాలు గల, మెరపువంటి ప్రకాశంగల, చేతులలో అతిభీషణాలైన గదలు గల, ఆ మధుకైటభులిద్దరు తమ పాదవిన్యాసాలతో మహార్ణవంలో కల్లోలం సృష్టిస్తూ దానిలో (యోగనిద్రలో) శయనించివున్న మధుసూదనుని కూడ కంపింపజేస్తున్నారు.

తౌ తత్ర విచరన్తౌ స్మ పుష్కరే విశ్వతోముఖమ్ ।
యోగినాం శ్రేష్ఠమాసాద్య దీప్తం దదృశతుస్తదా ॥ 7 ॥

నారాయణసమాజ్ఞాతం సృజన్తమఖిలాః ప్రజాః ।
దైవతాని చ విశ్వాని మానసానసురానృషీన్ ॥ 8 ॥

వారిద్దరు అక్కడ విశ్వవ్యాప్తమైవున్న పుష్కరమనే జలార్ణవంలో ఆవిధంగా సంచరిస్తూ యోగిశ్రేష్ఠుడు, దీప్తిమంతుడు శ్రీమన్నారాయణుని ఆజ్ఞ ననుసరించి లోకాలను, దేవతలను, అసురులను, మానసపుత్రులైన మునులను, ఋషులను మరియు సమస్త ప్రజలను సృష్టిస్తున్నాడు. బ్రహ్మదేవుని చూశారు.

తతస్తావూచతుస్తత్ర బ్రహ్మాణమసురోత్తమౌ ।
దీప్తౌ ముమూర్షూ సంక్రుద్ధౌ రోషవ్యాకులితేక్షణౌ ॥ 9 ॥

ప్రకాశిస్తున్నవారు, రోషంతో ఎర్రబడిన కన్నులుగలవారు, మిక్కిలి కోపోద్రిక్తులు మరియు అచిరకాలంలోనే మరణించబోతున్న ఆ అసురశ్రేష్ఠులిద్దరు బ్రహ్మదేవునితో ఇలా అన్నారు.

కస్త్వం పుష్కరమధ్యస్థః సితోష్ణీషశ్చతుర్ముఖః ।
ఆధాయ నియమం మోహాదాస్తే త్వం విగతజ్వరః ॥ 10 ॥

పద్మం మధ్యలో వుండి, తెల్లని తలపాగ ధరించి, నాలుగు ముఖాలు గలిగి, తాపరహితుడవై, మోహంతో అనగా అజ్ఞానంతో నియమాచరణం చేస్తున్న నీవెవరవు?

ఏహ్యాగచ్ఛావయోర్యుద్ధం దేహి త్వం కమలోద్భవ ।
ఆవాభ్యాం పరమీశాభ్యాం అశక్తస్త్వమిహార్ణవే ॥ 11 ॥

ఓ కమలోద్భవా! రా! వచ్చి మా ఇద్దరితో యుద్ధం చేయి. అయినా ఈ మహార్ణవంలో గొప్ప శక్తిగల మాతో నీవు యుద్ధం చేయలేవు. నీవు మా ముందు అశక్తుడవు.

తత్ర కశ్చోద్భవస్తుభ్యం కేన వాఽసి నియోజితః ।
కః స్రష్టా కశ్చ తే గోప్తా కేన నామ్నా విధీయసే ॥ 12 ॥

నీ జన్మకారకుడెవరు? నిన్ను ఈ పనికి ఎవరు నియోగించారు? నిన్ను ఎవరు సృష్టించారు? నిన్ను రక్షించేవాడెవరు? నీ పేరేమిటి?

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు చెప్పాడు.

ఏక ఇత్యుచ్యతే లోకైరవిచిన్త్యః సహస్రదృక్ ।
తత్సంయోగేన భవతోః కర్మ నామావగచ్ఛతామ్ ॥ 13 ॥

వేయి కన్నులు కలవాడు, ఊహించడానికి శక్యం కానివాడు, ఈ విశ్వాన్నంతటిని సృష్టించేవాడు రక్షించేవాడు కూడ ఒక్కడే ఆ పరమాత్మ అని చెబుతున్నారు. నన్ను ఈ కర్మకు నియోగించిన వాడూ అతడే. అయినా ఆయన గురించి అడుగుతున్న మీరెవరు? మీ పేరేమి? మీ పని ఏమిటి? అని బ్రహ్మ అడిగాడు.

మధుకైటభావూచతుః – మధుకైటభులు చెప్పారు.

నావయోః పరమం లోకే కించిదస్తి మహామతే ।
ఆవాభ్యాం ఛాద్యతే విశ్వం తమసా రజసాఽథ వై ॥ 14 ॥

రజస్తమోమయావా వామృషీణామవలంఘితౌ ।
ఛాద్యమానౌ ధర్మశీలౌ దుస్తరౌ సర్వదేహినామ్ ॥ 15 ॥

ఓ మహామతీ! లోకంలో మమ్మల్ని మించినదేదీ లేదు. రజస్తమోగుణాలతో మేము విశ్వమంతటిని కప్పివేస్తాము. రజస్తమోగుణాలతో వున్న మమ్మల్ని, ఋషులు కూడ దాటలేరు. ధర్మంగా ప్రవర్తించే మేము ఎవరికీ కనబడకుండా ఉంటాము. ప్రాణులెవ్వరూ మమ్మల్ని జయించలేరు.

ఆవాభ్యాముహ్యతే లోకో దుష్కరాభ్యాం యుగే యుగే ।
ఆవామర్థశ్చ కామశ్చ యజ్ఞస్స్వర్గపరిగ్రహః ॥ 16 ॥

సుఖం యత్ర ముదా యుక్తం యత్ర శ్రీః కీర్తిరేవ చ ।
యేషాం యత్ కాంక్షితం చైవ తత్తదావాం విచిన్తయ ॥ 17 ॥

ఎవరిచేతనూ ఎటువంటి హానిని పొందలేని మేమే ప్రతి యుగంలోనూ ఈ లోకాన్ని నడుపుతుంటాము. మేమే అర్థాన్ని, కామాన్ని, యజ్ఞం వల్ల కలిగే స్వర్గసుఖాన్ని, సంతోషాన్ని, సంపదను, కీర్తిని మరియు మానవులలో ఎవరు ఏది కోరుకొంటారో వారికి దానిని కల్పించేవారిగా తెలుసుకొనుము.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా అన్నాడు.

యత్నాద్యోగవతో దృష్ట్వా యోగః పూర్వం మయార్జితః ।
తం సమాధాయ గుణవత్సత్త్వం చాస్మి సమాశ్రితః ॥ 18 ॥

యః పురో యోగమతిమాన్ యోగాఖ్యః సత్త్వమేవ చ ।
రజసస్తమసశ్చైవ యః స్రష్టా విశ్వసమ్భవః ॥ 19 ॥

తతో భూతాని జాయన్తే సాత్త్వికానీతరాణి చ ।
స ఏవ హి యువాం నాశే వశీ దేవో హనిష్యతి ॥ 20 ॥

నేను నా ప్రయత్నంతో యోగాత్మకుడైన హరి దయవలన ఇంతకు ముందే యోగఫలాన్ని పొందాను. గుణవంతమైన ఆ యోగం ద్వారానే నేను సత్త్వగుణాన్నాశ్రయించాను. అందరికంటె శ్రేష్ఠుడు, యోగజ్ఞుడు, యోగమనే పేరు కలవాడు! సత్త్వగుణరూపుడు, ఈ రజస్తమోగుణాలకు కారకుడు! ఈ విశ్వస్రష్ట ఎవరో అతనినుండే సాత్త్వికాలు

మరియు ఇతర గుణాల ప్రాణులన్నీ ఉద్భవిస్తున్నాయి. సత్త్వగుణసంపన్నుడు సర్వేంద్రియాలను జయించిన ఆ దేవుడే మీ ఇద్దరిని నశింపజేసే సమర్థుడు. అతడే మిమ్మల్ని వధిస్తాడని బ్రహ్మ చెప్పాడు.

స్వపన్నేవ తతః శ్రీమాన్ బహుయోజనవిస్తృతమ్ ।
బాహుం నారాయణో బ్రహ్మ కృతవానాత్మమాయయా ॥ 21 ॥

కృష్యమాణౌ తతస్తస్య బాహునా బాహుశాలినః ।
చేరతుస్తౌ విగలితౌ శకునావివ పీవరౌ ॥ 22 ॥

అదే సమయంలో పరబ్రహ్మస్వరూపుడు పూజ్యుడు అయిన శ్రీ మన్నారాయణుడు నిద్రిస్తూనే యోజనాల పొడవు వున్న తన బాహువులను చాచాడు. ఆయన తన బాహుబలంతో ఆ మధుకైటభులను లాగుతుండగా వారు కూడా బలిసిన పక్షుల వలె జారిపోతున్నప్పటికీ ఆ హరి సమీపానికి చేరారు.

తతస్తావాహతుర్గత్వా తదా దేవం సనాతనమ్ ।
పద్మనాభం హృషీకేశం ప్రణిపత్య స్థితావుభౌ ॥ 23 ॥

జానీమస్త్వాం విశ్వయోనిం త్వామేకం పురుషోత్తమమ్ ।
త్వామావాం పాహి హేత్వర్థమిదం నౌ బుద్ధికారణమ్ ॥ 24 ॥

అమోఘదర్శనః సత్వం యతస్త్వాం విద్మ శాశ్వతమ్ ।
తతస్త్వామాగతావావామభితః ప్రసమీక్షితుమ్ ॥ 25 ॥

తదిచ్ఛామో వరం దేవ త్వత్తోఽద్భుతమరిందమ ।
అమోఘదర్శనోఽసి త్వం నమస్తే సమితింజయ ॥ 26 ॥

అప్పుడు వారిద్దరు సనాతనుడు, పద్మనాభుడు, హృషీకేశుడూ అయిన ఆ దేవుని దగ్గరకు వెళ్ళి, వినయంతో నమస్కరించి ఆ పరాత్పరునితో ఇలా అన్నారు. ఈ విశ్వానికంతటికి కారణుడవైన పురుషోత్తముడవు నీవేనని మేమెరుగుదుము. నీవు మమ్మల్ని రక్షించు. ఇది మా బుద్ధికి సహేతుకంగా తోచింది. నీవు అమోఘదర్శనుడవు, శాశ్వతుడవని కూడ మాకు తెలుసు. కావుననే నిన్ను దర్శించుకోవడానికి నీ వద్దకు వచ్చాము. ఓ అమోఘదర్శనా! ఓ శత్రుసంహారకా! ఓ సమితింజయా! నీకు మా వందనాలు, మాకు వరం ప్రసాదించు.

శ్రీ భగవానువాచ – భగవంతుడిలా అన్నాడు.

కిమర్థం హి ద్రుతం బ్రూథ వరం హ్యసురసత్తమౌ।
దత్తాయుష్కౌ పునర్భూయో రహో జీవితుమిచ్ఛథః ॥ 27 ॥

ఓ అసురోత్తములారా! మీరు నా నుండి వరమెందుకు పొందగోరుతున్నారు? నా నుండి ఆయుష్షును వరంగా పొంది మరల రహస్యంగా జీవింపగోరుతున్నారా?

మధుకైటభావూచతుః – మధుకైటభులిలా అన్నారు

యస్మిన్న కశ్చిన్మృతవాన్ దేవ తస్మిన్ ప్రభో వధమ్ ।
తమిచ్ఛావో వరం చైవ త్వత్తో నోఽస్తు మహావ్రత! ॥ 28 ॥

ఓ ప్రభూ, దేవా, మహావ్రతా! ఇంతకు ముందు ఎవరుకూడ మరణించని చోట మమ్మలిని వధించు. మేము కోరుకునే వరమిదేనని ఆ అసురులిద్దరు చెప్పారు.

శ్రీ భగవానువాచ – భగవంతుడిలా అన్నాడు

బాఢం యువాం తు ప్రవరౌ భవిష్యత్కాలసంభవే ।
భవిష్యతో న సందేహః సత్యమేవ బ్రవీమి వామ్ ॥ 29 ॥

సరే బాగుంది. భవిష్యత్కాలంలో మీరు గొప్ప వారవుతారు. సందేహం లేదు. నేను మీకు సత్యాన్నే చెబుతున్నాను.

వరం ప్రదాయాథ మహాసురాభ్యాం సనాతనో విశ్వవరః సురోత్తమః ।
రజస్తమోవర్గభవాయనౌ యమౌ మమన్థ తావూరుతలేన వై ప్రభుః ॥ 30 ॥

విశ్వశ్రేష్ఠుడు, సనాతనుడు, సురోత్తముడూ అయిన శ్రీ మన్నారాయణుడు ఆ అసురశ్రేష్ఠులకు వరమిచ్చి, వారికిచ్చిన మాట ప్రకారంగా రజస్తమోగుణరూపులైన వారిద్దరిని తన తొడలపై నలిపి వధించాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మధుకైటభ రాక్షస జననం సప్తత్యధికశతతమోఽధ్యాయః ॥170॥

శ్రీమత్స్య మహాపురాణంలో మధుకైటభులనే రాక్షసుల జననం అనే నూట డెబ్బైయవ అధ్యాయం సమాప్తం



ఏకసప్తత్యధిక శతతమోऽధ్యాయః – నూటడెబ్బై ఒకటవ అధ్యాయం
బ్రహ్మణా స్వాయంభువమన్వాదీనాం సృష్టిః
బ్రహ్మదేవుడు స్వాయంభువ మనువు మొదలగు వారిని సృష్టించుట

మత్స్య ఉవాచ – మత్స్యదేవుడు చెప్పాడు.

స్థిత్వా చ తస్మిన్ కమలే బ్రహ్మా బ్రహ్మవిదాం వరః ।
ఊర్ధ్వబాహుర్మహాతేజాస్తపో ఘోరం సమాశ్రితః ॥ 1 ॥

బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడైన, మహాతేజశ్శాలియైన బ్రహ్మదేవుడు శ్రీ మన్నారాయణుని నాభి కమలంలోనే వుండి చేతులు పైకెత్తి ఘోరమైన తపస్సు చేశాడు.

ప్రజ్వలన్నివ తేజోభిః భాభిః స్వాభిస్తమోనుదః ।
బభాసే సర్వధర్మస్థః సహస్రాంశురివాంశుభిః ॥ 2 ॥

అతడు తన తేజోరాశితో వెలిగిపోతూ తన కాంతులతో అంధకారాన్ని పోగొడుతూ అన్ని ధర్మాలలో వుంటూ వేయి కిరణాలు గల సూర్యుని వలె ప్రకాశించాడు.

విశే:శ్రీ మన్నారాయణుడు విశ్వసృష్టి కోసమే బ్రహ్మనుద్భవింపజేశాడు. కాని మధ్యలో మధు కైటభుల ప్రవేశం వలన బ్రహ్మ తపస్సు భగ్నమయింది. కావున ఇప్పుడు మరల సృష్టి క్రమాన్ని ఆరంభించటానికి యత్నించటం మొదలుపెట్టాడు. సృష్టిఅనేది ఒక సాధారణమైన పని కాదు, అందుకే సకల వేదసారం తెలిసిన. ధర్మాలన్నీ తెలిసిన బ్రహ్మ ఉత్కృష్టమైన తన తేజస్సుతో మరల తపస్సు చేయటం ఆరంభించాడని భావం.

అథాన్యద్రూపమాస్థాయ శంభుర్నారాయణోऽవ్యయః ।
ఆజగామ మహాతేజా యోగాచార్యో మహాయశాః ॥ 3 ॥

అలా బ్రహ్మ తపస్సు చేస్తుండగా ఎటువంటి వికారం లేని అవ్యయుడు శ్రీ మన్నారాయణుడు మహాయశశ్శాలి మరియు మహాతేజస్సంపన్నుడూ ఐన యోగాచార్యుని రూపంలో ఆ బ్రహ్మదేవుని ముందుకు వచ్చాడు.

సాంఖ్యాచార్యో హి మతిమాన్ కపిలో బ్రాహ్మణో వరః ।
ఉభావపి మహాత్మానౌ స్తువన్తౌ క్షేత్రతత్పరౌ ॥ 4 ॥

మరియు బ్రాహ్మణశ్రేష్ఠుడు, మహాబుద్ధిశాలి, సాంఖ్య దర్శనాచార్యుడూ అయిన 'కపిలు' ని రూపంలో కూడ ప్రసన్నుడయ్యాడు. ఈ ఇద్దరు మహానుభావులు ప్రకృతి పురుషుల భేదాన్ని బాగా తెలిసినవారు.

తౌ ప్రాప్తావూచతుస్తత్ర బ్రహ్మాణమమితౌజసమ్ ।
పరావరవిశేషజ్ఞౌ పూజితౌ చ మహర్షిభిః ॥ 5 ॥

బ్రహ్మాత్మా దృఢబంధశ్చ విశాలో జగదాస్థితః ।
గ్రామణీః సర్వభూతానాం బ్రహ్మా త్రైలోక్యపూజితః ॥ 6 ॥

తయోస్తద్వచనం శ్రుత్వా బ్రహ్మాఽభ్యాహృతయోగవిత్ ।
త్రీనిమాన్ కృతవాన్ లోకాన్ యథేయం బ్రహ్మణః శ్రుతిః ॥ 7 ॥

పర మరియు అపర విద్యలలో విశేషమైన జ్ఞానం గల మహర్షులందరి చేత పూజింపబడిన వారిద్దరూ అమితమైన తేజస్సంపన్నుడైన బ్రహ్మదేవునితో ఇలా అన్నారు. బ్రహ్మ తాను ఆత్మరూపుడు, దృఢమైన అమరిక గలవాడు, విశాలుడు, జగత్తును ఆశ్రయించి ఉన్నవాడు, సర్వప్రాణులలో శ్రేష్ఠుడు మరియు మూడు లోకాల్లో పూజించబడేవాడు. వారిద్దరి మాటలలో ప్రతిపాదించబడిన యోగాన్ని గ్రహించిన బ్రహ్మ ఈ మూడు లోకాలను సృష్టించాడు.

పుత్రం స్వాయంభువం చైవం సముత్పాదితవానృషిః ।
తస్యాగ్రే వాగ్యతస్తస్థౌ బ్రహ్మాణమజమవ్యయమ్ ॥ 8 ॥

ఈ ముల్లోకాలతో పాటు బ్రహ్మ 'స్వాయంభువుడు' అనే మానసపుత్రుని కూడ ఉద్భవింపజేశాడు. పుట్టిన వెంటనే ఆ పుత్రుడు బ్రహ్మదేవుని ముందు మౌనియై నిలబడ్డాడు.

విశే:బ్రహ్మ తాను స్వయంభువు కావున ఆతని పుత్రుడు 'స్వాయంభువుడు' అని పండితుల అభిప్రాయం

సోత్పన్నమాత్రో బ్రహ్మాణముక్తవాన్మానసః సుతః ।
కిం కుర్మస్తవ సాహాయ్యం బ్రవీతు భగవానృషిః ॥ 9 ॥

మానసపుత్రుడైన స్వాయంభువుడు బ్రహ్మతో ఇలా అన్నాడు. ఓ ఋషీ! ఓ దేవా! నీకు నేను ఏవిధమైన సహాయం చేయాలో చెప్పు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా అన్నాడు.

య ఏష కపిలో బ్రహ్మా నారాయణమయస్తథా ।
వదతో భవతస్తత్త్వం తత్కురుష్వ మహామతే ॥ 10 ॥

ఓ బుద్ధిమంతుడా! స్వాయంభువా! బ్రహ్మస్వరూపుడైన కపిలుడు, నారాయణమయుడైన యోగాచార్యుడు నీకు తత్త్వాన్ని ఉపదేశిస్తాడు. నీవు దాని నాచరించు.

బ్రహ్మణస్తు తదర్థన్తు తదా భూయః సముత్థితః ।
శూశ్రూషురస్మి యువయోః కిం కరోమి కృతాంజలిః ॥ 11 ॥

స్వాయంభువు బ్రహ్మ మాటలు విని వారిరువురి వైపు తిరిగి అంజలి బద్ధుడై మీరు ఏమి చేయమంటే అది చేయటానికి సిద్ధంగా ఉన్నానని వినయంతో వారిద్దరికి చెప్పాడు.

శ్రీ భగవానువాచ – భగవానుడు చెప్పాడు.

యత్సత్యమక్షరం బ్రహ్మన్నష్టాదశవిధం తు తత్ ।
యత్సత్యం యదృతం తత్తు పరం పదమనుస్మర ॥ 12 ॥

ఓ బ్రహ్మజ్ఞానం కలవాడా! ఏది సత్యమో, ఏది నశించదో అది (ప్రకృతి) పద్దెనిమి విధాలు (మనస్సు, బుద్ధి, అహంకారం, పంచతన్మాత్రలు, పంచ మహాభూతాలు, పంచేంద్రియాలు) మరియు ఏది సత్యమో అనగా వాక్కాయ కర్మలతో అనుభవంలోకి తెచ్చుకోగలిగింది, ఋతం అనగా బుద్ధి వికాసంతో నిశ్చితమైన తత్త్వాన్ని తెలుసుకోగలిగింది ఏదో దానినే అనుస్మరించు, అని చెప్పాడు.

ఏతద్వచో నిశమ్యైవ యయౌ స దిశముత్తరామ్ ।
గత్వా చ తత్ర బ్రహ్మత్వమగమద్ జ్ఞానతేజసా ॥ 13 ॥

ఆ మాటలు విని స్వాయంభువుడు ఉత్తర దిక్కుకు వెళ్ళాడు. అక్కడ తన జ్ఞానతేజస్సుతో అతడు బ్రహ్మత్వాన్ని పొందాడు.

తతో బ్రహ్మ భువం నామ ద్వితీయమసృజత్ ప్రభుః ।
సంకల్పయిత్వా మనసా తమేవ చ మహామనాః ॥ 14 ॥

తతః సోఽథాబ్రవీద్వాక్యం కిం కరోమి పితామహ ।
పితామహసమాజ్ఞాతో బ్రహ్మాణం సముపస్థితః ॥15 ॥

బ్రహ్మాభ్యాసం తు కృతవాన్ భువశ్చ పృథివీం గతః ।
ప్రాప్తం చ పరమం స్థానం స తయోః పార్శ్వమాగతః ॥ 16 ॥

తర్వాత మహామనస్వియైన బ్రహ్మ తన మనస్సులో సంకల్పించుకొని 'భువుడనే' రెండవ మానస పుత్రుని జనింపజేశాడు. అతడు కూడ జనించిన వెంటనే తాను ఏమి చేయాలో చెప్పమని పితామహుని ప్రార్థించాడు. తర్వాత పితామహుని ఆజ్ఞానుసారం బ్రహ్మజ్ఞానాన్ని పొంది, బ్రహ్మాభ్యాసాన్ని అనుష్ఠించి 'భువుడు' పృథివీతలానికి వెళ్ళిపోయాడు పరమోత్కృష్టమైన స్థానాన్ని పొందాడు. అతడు వారిద్దరి ప్రక్కకు వచ్చాడు.

తస్మిన్నపి గతే పుత్రే తృతీయమసృజత్ ప్రభుః ।
సాంఖ్యప్రవృత్తికుశలం భూర్భువం నామతో విభుమ్ ॥ 17 ॥

గోపతిత్వం సమాసాద్య తయోరేవాగమద్గతిమ్ ।
ఏవం పుత్రాస్త్రయోఽప్యేతే ఉక్తాః శంభోర్మహాత్మనః ॥ 18 ॥

ఆ విధంగా రెండవ పుత్రుడు కూడా వెళ్ళిపోయిన తర్వాత బ్రహ్మ సమర్థుడైన 'భూర్భువు' డనే మూడవ మానస పుత్రుని జనింపజేశాడు. అతడు కూడ సాంఖ్యతత్త్వాన్ని తెలిసికొని 'గోపతిత్వా'న్ని అనగా 'ద్యులోకాధిపత్యాన్ని' పొంది తన కంటె ముందు జన్మించిన ఇద్దరు మానస పుత్రులవలెనే ఉత్కృష్టమైన స్థానాన్ని పొందాడు. ఇలా బ్రహ్మకు జనించిన ముగ్గురు మానసపుత్రుల విషయం వివరించబడింది.

తాన్ గృహీత్వా సుతాంస్తస్య ప్రయాతః స్వార్జితాం గతిమ్ ।
నారాయణశ్చ భగవాన్ కపిలశ్చ యతీశ్వరః ॥ 19 ॥

ఇలా నారాయణ భగవానుడు మరియు యతీశ్వరుడగు కపిలుడు ఆ ముగ్గురు బ్రహ్మమానస పుత్రులను తమ మార్గానికి త్రిప్పుకుని వారికి ముక్తిని ప్రసాదించి, తాము కూడ తాము సాధించిన ఉత్తమగతిని పొందారు.

విశే: మొదటి అక్షరతత్త్వం ప్రణవం, దాని తత్త్వం పరమాత్ముడు శ్రీ మన్నారాయణుడు. ప్రణవోపాసనతో మోక్షగతినందించే మార్గాలే సాంఖ్య - యోగ దర్శనాలు. ప్రణవానికి విస్తరణం "భూః - భువః సువః" అను మూడు మహావ్యాహృతులు. అవే "పృథివీ - అంతరిక్షం - ద్యులోకం". ఈ మూడింటి సావయవరూపాలే ఈ ముగ్గురు బ్రహ్మ మానసపుత్రులని పురాణాలు చెబుతున్నాయి.)

యం కాలం తౌ గతౌ ముక్తౌ బ్రహ్మా తం కాలమేవ హి ।
తతో ఘోరతమం భూయః సంశ్రితః పరమం వ్రతమ్ ॥ 20 ॥

న రేమేఽథ తతో బ్రహ్మా ప్రభురేకస్తపశ్చరన్ ।
శరీరాత్తాం తతో భార్యాం సముత్పాదితవాన్ శుభామ్ ॥ 21 ॥

యోగాచార్యుడైన శ్రీ మన్నారాయణుడు, సాంఖ్యాచారుడైన కపిలుడు కూడ ముక్తులై ఎప్పుడైతే వెళ్ళిపోయారో అప్పటినుండి బ్రహ్మ మరల ఘోరమైన తపస్సు చేయనారంభించాడు. కాని ప్రభువైన ఆ బ్రహ్మ కూడ తపస్సు చేస్తున్నా ఒంటరితనం వలన తృప్తి పొందలేకపోయాడు. అందుచేతనే తన శరీరం నుండి శుభరూపం గల స్త్రీని తనకు భార్యగా సృష్టించుకొన్నాడు.

తపసా తేజసా చైవ వర్చసా నియమేన చ ।
సదృశీమాత్మనో దేవీం సమర్థాం లోకసర్జనే ॥ 22 ॥

తయా సమాహితస్తత్ర రేమే బ్రహ్మా తపశ్చరన్ ।
సృజన్ ప్రజానాం పతయః సాగరాంశ్చాసృజద్విభుః ॥ 23 ॥

ఆమె తపస్సులో, తేజస్సులో, వర్చస్సులో, నియమాచరణంలో తనకు సమానమైనది, తానింతకు ముందు సంకల్పించిన ప్రకారం లోకసృష్టిలో తనకు తోడ్పడే సమర్థురాలు, ఆమెతో కూడ తపస్సు చేస్తూ ఆనందాన్ని పొందాడు. ఆమె సహాయంతోనే ప్రజాపతులను, సముద్రాలను సృష్టించాడు.

తతో జగాద త్రిపదాం గాయత్రీం వేదపూజితామ్ ।
అపరాంశ్చైవ చతురో వేదాన్ గాయత్రిసంభవాన్ ॥ 24 ॥

ఆత్మనః సదృశాన్ పుత్రానసృజద్వై పితామహః ।
విశ్వే ప్రజానాం పతయో యేభ్యో లోకాః వినిఃసృతాః ॥ 25 ॥

ఆ తర్వాత వేదాలలో పూజించబడే త్రిపదాగాయత్రిని అనగా మూడు అష్టాక్షరపాదాలు గల గాయత్రిని పద్మోద్భవుడుచ్చరించాడు. తదనంతరం గాయత్రి నుండి ఉద్భవించిన నాలుగు వేదాలను కూడ ఉచ్చరించాడు.

తర్వాత పితామహుడు తన వంటి వారే ఐన మానసపుత్రులను సృష్టించాడు. వారి నుండే విశ్వంలోని ప్రజాపతులు, లోకాలన్నీ ఉద్భవించాయి.

విశ్వేశం ప్రథమం తావన్మహాతాపసమాత్మజమ్ ।
సర్వమన్త్రహితం పుణ్యం నామ్నా ధర్మం చ సృష్టవాన్ ॥ 26 ॥

దక్షం మరీచిమత్రిం చ పులస్త్యం పులహం క్రతుమ్ ।
వసిష్ఠం గౌతమం చైవ భృగుమంగిరసం మనుమ్ ॥ 27 ॥

అథైవాద్భుతమిత్యేతే జ్ఞేయాః పైతామహర్షయః ।
త్రయోదశగుణం ధర్మమాలభన్త మహర్షయః ॥ 28 ॥

అందులో మొట్టమొదట విశ్వానికి అధిపతియైన ధర్ముడనే కుమారుని సృష్టించాడు. ఈ ధర్ముడు మహాతపస్వి పుణ్యాత్ముడు, మంత్రాలన్నింటికి మేలు చేసేవాడు. తదనంతరం దక్షుడు, మరీచి, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు, గౌతముడు, భృగువు, అంగిరసుడు మనువు మొదలగు పదిమంది ప్రజాపతులను సృష్టించాడు. చివరగా 'అద్భుతుడు' అనే పుత్రుని కూడ సృష్టించాడు. వీరందరిని పైతామహా ఋషులని అంటారు. (పితామహుడైన బ్రహ్మ మానసపుత్రులు కనుక) వీరందరు పదమూడు లక్షణాలు గల పవిత్రమైన ధర్మాన్ని అనుసరించారు.

అదితిర్దితిర్దనుః కాలా అనాయుః సింహికా మునిః ।
తామ్రా క్రోధాథ సురసా వినతా కద్రురేవ చ ॥ 29 ॥

దక్షస్యాపత్యమేతా వై కన్యా ద్వాదశ పార్థివ ।
మరీచేః కశ్యపః పుత్రస్తపసా నిర్మితః కిల ॥ 30 ॥

తస్మై కన్యా ద్వాదశాన్యా దక్షస్తాః ప్రదదౌ కిల ॥

అదితి, దితి, దనువు, కాల, అనాయువు, సింహిక, ముని, తామ్ర, క్రోధ, సురస, వినత, మరియు కద్రు అనే పన్నెండుమంది దక్షుని కుమార్తెలు. మరీచి మహర్షి తన తపశ్శక్తితో కశ్యపుని పుత్రునిగా సృష్టించాడు. దక్షుడు తన పన్నెండు మంది కన్యలను కశ్యపునకిచ్చి వివాహం చేశాడు.

నక్షత్రాణి చ సోమాయ తదా వై దత్తమాన్నృషిః ॥ 31 ॥

రోహిణ్యాదీని సర్వాణి పుణ్యాని రవినందన ।

మరియు పవిత్రములైన రోహిణ్యాది ఇరువది ఏడు నక్షత్రములను దక్షుడు సోమునకు (చంద్రునకు) ఇచ్చెను.

లక్ష్మీర్మరుత్వతీ సాధ్యా విశ్వేశా చ మతా శుభా ॥ 32 ॥

దేవీ సరస్వతీ చైవ బ్రహ్మణా నిర్మితాః పురా ।
ఏతాః పంచ వరిష్ఠా వై సురశ్రేష్ఠాయ పార్థివ ॥ 33 ॥

దత్తా భద్రాయ ధర్మాయ బ్రహ్మణా దృష్టకర్మణా ।

సృష్టి ప్రక్రియను తెలుకున్న బ్రహ్మ పూర్వమే తనచే సృష్టించబడిన వరిష్ఠులైన లక్ష్మి, మరుత్వతి, సాధ్యా, విశ్వేశ, సరస్వతి అను ఐదుమంది శుభ స్వరూపాలను సురశ్రేష్ఠుడు శుభప్రదుడూ అయిన ధర్మునకిచ్చాడు.

యా చ సార్థవతీ పత్నీ బ్రహ్మణః కామరూపిణీ ॥ 34 ॥

సురభిః సా హితా భూత్వా బ్రహ్మాణం సముపస్థితా ।
తతస్తామగమద్ బ్రహ్మ మైథునం లోకపూజితః ॥ 35 ॥

లోకసర్జన హేతుజ్ఞో గవామర్థాయ సత్తమః ।
జజ్ఞిరే చ సుతాస్తాభ్యాం విపులా ధూమసన్నిభాః ॥ 36 ॥

నక్తసంధ్యాభ్రసంకాశా ప్రాదహం స్తిగ్మతేజసః ।
తే రుదన్తో ద్రవన్తశ్చ గర్జయన్తః పితామహమ్ ॥ 37 ॥

రోదనాద్ద్రవణాచ్చైవ రుద్రా ఇతి తతః స్మృతాః ।
నిరృతిశ్చైవ శంభుర్ద్వి తృతీయశ్చాపరాజితః ॥ 38 ॥

మృగవ్యాధః కపర్దీ చ దహనోఽథ ఖరశ్చ వై ।
అహిర్బుధ్న్యశ్చ భగవాన్ కపాలీ చాపి పింగలః ॥ 39 ॥

సేనానీ చ మహాతేజాః రుద్రాస్త్వేకాదశ స్మృతాః ।

శబ్దార్థాల స్వరూపం కలిగిన ధర్ముని పత్ని (సరస్వతి) సురభిరూపాన్ని పొంది లోకహితం కోసం బ్రహ్మను సమీపించగా లోకపూజితుడు సృష్టిప్రక్రియ తెలిసిన బ్రహ్మ గోజాతిని సృష్టించాలనే సంకల్పంతో ఆమెతో కలిశాడు. అప్పుడు ఆమె యందు విశాలరూపం గలవారు, పొగను బోలిన వర్ణం గలవారు, సంధ్యాకాలపు మేఘాల వలె ప్రకాశించేవారు, తీక్ష్ణమైన తేజస్సు గలవారు, లోకాలనే దహించి వేస్తున్నట్లున్నవారు జన్మించారు. వారు 'రుదన్తః' – అనగా ఏడుస్తూ, ద్రవన్తః – అనగా పరుగెత్తుతూ" బ్రహ్మ వద్దకు వెళ్ళారు కావున వారిని 'రుద్రులనే' పేరుతో వ్యవహరించారు. వారే నిరృతి, శంభుడు, అపరాజితుడు, మృగవ్యాధుడు, కపర్ది, దహనుడు, ఖరుడు, అహిర్బుధ్న్యుడు, కపాలి, పింగళుడు, మరియు మహాతేజస్కుడైన సేనాని అనే పదకొండు మంది రుద్రులు.

తస్యామేవ సురభ్యాం చ గావో యజ్ఞేశ్వరాశ్చ వై ॥ 40 ॥

ప్రకృష్టాశ్చ తథా మాయాః సురభ్యాః పశవోఽక్షరాః ।
అజాశ్చైవ తు హంసాశ్చ తథైవామృతముత్తమమ్ ॥ 41 ॥

ఓషధ్యః ప్రవరాయాశ్చ సురభ్యాస్తాః సముత్థితాః ।

ఆ సురభియందే బ్రహ్మ వలన యజ్ఞంలో ఆధిపత్యం గల గోవులు, ఉత్తమ మాయలు, అక్షయమైన పశువులు, మేకలు, హంసలు శ్రేష్ఠమైన అమృతం, ఉత్కృష్టాలైన ఓషధులు మొదలగునవి పుట్టాయి.

ధర్మాల్లక్ష్మీస్తథా కామం సాధ్యాసాధ్యాన్ వ్యజాయత ॥ 42॥

భవం చ ప్రభవం చైవ హీశం చాసురహం తథా ।
అరుణం చారుణిం చైవ విశ్వావసు బలధ్రువౌ ॥ 43 ॥

హవిష్యం చ వితానం చ విధానశమితావపి ।
వత్సరం చైవ భూతిం చ సర్వాసురనిషూదనమ్ ॥ 44 ॥

సుపర్వాణం బృహత్కాన్తిః సాధ్యా లోకనమస్కృతా ।

ధర్ముని వలన లక్ష్మి కాముని కన్నది. అలాగే 'సాధ్య' అనే ఆమె ధర్ముని వలననే 'సాధ్యులు' అనే దేవజాతులను కన్నది. వారే భవుడు, ప్రభవుడు, ఈశుడు, అసురహుడు, అరుణుడు, ఆరుణి, విశ్వావసువు, బాలధ్రువుడు, హవిష్యుడు, వితానుడు, విధానుడు, శమితుడు, వత్సరుడు, సర్వాసురనాశకుడగు భూతి, మరియు సుపర్వాణుడు అనేవారు, వీరందరూ మిక్కిలి కాంతిమంతులు మరియు లోకపూజ్యులు.

తమేవానుగతా దేవీ జనయామాస వై సురాన్ ॥ 45 ॥

ధరం వై ప్రథమం దేవం ద్వితీయం ధ్రువమవ్యయమ్ ।
విశ్వావసుం తృతీయం చ చతుర్థం సోమమీశ్వరమ్ ॥46 ॥

తతో౽నురూపమాయం చ యమస్తస్మాదనన్తరమ్ ।
సప్తమం చ తథా వాయుం అష్టమం నిరృతిం వసుమ్ ॥ 47 ॥

ధర్మస్యాపత్యమేతద్వై సుదేవ్యాం సమజాయత ।

అలాగే సురభి ధర్మునే అనుగమించి అతని వలన అష్టవసువులను దేవతాగణాలను కన్నది. వారిలో మొదటి వాడు ధరుడు, రెండవవాడు అవ్యయుడైన ధ్రువుడు, మూడవవాడు విశ్వావసువు, నాలుగవవాడు ఈశ్వరుడైన సోముడు, ఐదవవాడు తదనురూపుడైన ఆయుడను వాడు, ఆరవవాడు యముడు, ఏడవవాడు వాయువు, ఎనిమిదవవాడు నిరృతి. ఈ ఎనిమిది వసువులు సురభియందు ధర్ముని వలన కలిగిన సంతానం.

విశ్వేదేవాశ్చ విశ్వాయాం ధర్మాజ్జాతా ఇతి శ్రుతిః ॥ 48 ॥

దక్షశ్చైవ మహాబాహుః పుష్కరస్వన ఏవ చ ।
చాక్షుషస్తు మనుశ్చైవ తథా మధుమహోరగౌ ॥ 49 ॥

విభ్రాన్తకవపుర్బాలో విష్కమ్భశ్చ మహాయశాః ।
గరుడశ్చాతిసత్త్వౌజా భాస్కరప్రీతిమద్యుతిః ॥ 50 ॥

విశ్వాన్ దేవాన్ దేవమాతా విశ్వేశాజనయత్సుతాన్ ।

విశ్వా అనే ఆమె యందు ధర్ముని వలన విశ్వేదేవులనే దేవగణాలు కలిగారు. వారు మహాబాహుడైన దక్షుడు, పుష్కరస్వనుడు, చాక్షుషుడు, మనువు, మధువు, మహోరగుడు, విభ్రాంతకవపువు, బాలుడు,

మహాయశస్వియైన విష్కంభకుడు, అత్యధికమైన సత్త్వము మరియు ఓజస్సు కలవాడు, భాస్కరునితో సమానమైన కాంతి గలవాడూ అయిన గరుడుడు మొదలగు పదిమంది. దేవమాతలలో ఒకరైన 'విశ్వేశా' అనే ఆమె ధర్ముని ద్వారా వీరందరికి జన్మనిచ్చింది.

మరుత్త్వతీ తు మరుతో దేవానజనయత్సుతాన్ ॥ 51 ॥

అగ్నిం చక్షుం రవిర్జ్యోతిః సావిత్రం మిత్రమేవ చ ।
అమరం శరవృష్టిం చ సుకర్షం చ మహాభుజమ్ ॥ 52 ॥

విరాజం చైవ వాచం చ విశ్వావసుమతిం తథా ।
అశ్వమిత్రం చిత్రరశ్మిం తథా నిషధనం నృప ॥ 53 ॥

హూయన్తం వాడవం చైవ చారిత్రం మందపన్నగమ్ ।
బృహన్తం వై బృహద్రూపం తథా వై పూతనానుగమ్ ॥ 54 ॥

మరుత్వతీ పురా జజ్ఞే ఏతాన్వై మరుతాం గణాన్ ।

మరియు ధర్ముని వలన మరుత్వతి అనే ఆమెకు మరుత్తులనే దేవగణాలు కలిగారు. వారు – అగ్ని, చక్షువు, రవి, జ్యోతి, సావిత్రుడు, మిత్రుడు, అమరుడు, శరవృష్టి, మహాభుజుడగు సుకర్షుడు, విరాజుడు, వాక్కు విశ్వావసు, మతి, అశ్వమిత్రుడు, చిత్రరశ్మి, నిషధనుడు, హూయత్తు, బాడవుడు, చారిత్రుడు, మందపన్నగుడు, బృహత్తు, బృహద్రూపుడు, పూతనానుగుడు. వీరందరిని పూర్వం మరుత్వతి ధర్ముని వలన కుమారులుగా పొందినది.

అదితిః కశ్యపాజ్జజ్ఞే ఆదిత్యాన్ ద్వాదశైవ హి ॥ 55 ॥

ఇన్ద్రో విష్ణుర్భగస్త్వష్టా వరుణో హ్యర్యమా రవిః ।
పూషా మిత్రశ్చ ధనదో ధాతా పర్జన్య ఏవ చ ॥ 56 ॥

ఇత్యేతే ద్వాదశాదిత్యా వరిష్ఠాస్త్రిదివౌకసః ।

అదితి కశ్యపుని ద్వారా ద్వాదశాదిత్యులకు జన్మనిచ్చింది. వారు ఇంద్రుడు, విష్ణువు, భగుడు, త్వష్ట, వరుణుడు, అర్యముడు, రవి, పూష, మిత్రుడు, ధనదుడు, ధాత, పర్జన్యుడు అనే వారు. వీరందరు శ్రేష్ఠులైన దేవతలు.

ఆదిత్యస్య సరస్వత్యాం జజ్ఞాతే ద్వౌ సుతౌ వరౌ ॥ 57 ॥

తపఃశ్రేష్ఠౌ గుణిశ్రేష్ఠౌ త్రిదివస్యాపి సమ్మతౌ ।

ఆదిత్యునకు సరస్వతి ద్వారా ఇద్దరు సుతులు కలిగారు. వారు తపోనిష్ఠులు మరియు గుణవంతులు. వారు స్వర్గలోక పూజ్యులు.

దనుస్తు దానవాన్ జజ్ఞే దితిర్దైత్యాన్ వ్యజాయత ॥ 58 ॥

కాలా తు వై కాలకేయానసురాన్ రాక్షసాంస్తు వై ।
అనాయుషాయాస్తనయాన్ వ్యాధయః సుమహాబలాః ॥ 59 ॥

తర్వాత దనువుయందు దానవులు, దితియందు దైత్యులు కలిగారు. కాలయందు కాలకేయులనే అసురులు, రాక్షసులు మరియు అనాయుషయందు మహాబలవంతులగు వ్యాధులు కలిగాయి.

సింహికా గ్రహమాతా వై గంధర్వజననీ మునిః ।
తామ్రాత్వప్సరసాం మాతా పుణ్యానాం భారతోద్భవ ॥ 60 ॥

క్రోధాయాః సర్వభూతాని పిశాచాశ్చైవ పార్థివ ।
జజ్ఞే యక్షగణాంశ్చైవ రాక్షసాంశ్చ విశాంపతే ॥ 61 ॥

అలాగే సింహిక నుండి గ్రహాలు, ముని నుండి గంధర్వులు, తామ్ర నుండి పుణ్యాత్ములైన అప్సరసలు, క్రోధ నుండి పిశాచాలు, యక్షరాక్షసులు మరియు అనేక ప్రాణులు జన్మించారు.

చతుష్పదాని సత్త్వాని తథా గావస్తు సౌరభాః ।
సువర్ణాన్ పక్షిణశ్చైవ వినతా చాప్యజాయత ॥ 62 ॥

నాలుగు పాదాలు గల ప్రాణులైన గోజాతులు, సురభి నుండి పుట్టాయి. మరియు వినత సుపర్ణాది పక్షి జాతులకు జన్మనిచ్చింది.

మహీధరాన్ సర్వనాగాన్ దేవీ కద్రూర్వ్యజాయత ।
ఏవం వృద్ధిం సమగమన్ విశ్వే లోకాః పరన్తప ॥ 63 ॥

కద్రువ పర్వతాలకు, సర్పాలకు, జన్మనిచ్చింది. ఈ విధంగా లోకాలన్నీ వృద్ధి పొందాయి.

తదా వై పౌష్కరో రాజన్ ప్రాదుర్భావో మహాత్మనః ।
ప్రాదుర్భావః పౌష్కరస్తే మయా ద్వైపాయనేరితః ॥ 64 ॥

పురాణః పురుషశ్చైవ మయా విష్ణుర్హరిః ప్రభుః ।
కథితస్తేఽనుపూర్వ్యేణ సంస్తుతః పరమర్షిభిః ॥ 65 ॥

ఓ రాజా! మహాత్ముడైన బ్రహ్మకు కలిగిన పౌష్కరప్రాదుర్భావం అనగా (పద్మోద్భవం). (పుష్కరం అనే శబ్దానికి జలం పద్మం అని అర్థాలు) పద్మసృష్టి స్వరూపం ఇటువంటిది. ఇలా ద్వైపాయనుడు చెప్పిన ఈ సృష్టిక్రమాన్ని మరియు మహర్షులు స్తుతించిన, పురాణపురుషుడైన శ్రీమన్నారాయణుని గురించి క్రమంగా మీకు వివరించాను.

యశ్చేదమగ్ర్యం శృణుయాత్ పురాణం సదా నరః పర్వసు గౌరవేణ ।
అవాప్య లోకాన్ స హి వీతరాగః పరత్ర చ స్వర్గఫలాని భుంక్తే ॥ 66 ॥

ఉత్తమమైన ఈ పురాణాన్ని పర్వదినాలలో వైరాగ్యదృష్టితో వినే మానవుడు ఇహలోకంలో సర్వ సుఖాలనుభవించి, పరలోకంలో స్వర్గసుఖాలను పొందుతాడు.

చక్షుషా మనసా వాచా కర్మణా చ చతుర్విధమ్ ।
ప్రసాదయతి యః కృష్ణం తం కృష్ణోఽనుప్రసీదతి ॥ 67 ॥

కన్నులతో, మనస్సుతో, వాక్కుతో, కర్మతో కూడ (చక్షువు మనస్సు వాక్కు కర్మ అనే నాలుగు విధాలతో) కృష్ణుని ఆరాధించే వారిని కృష్ణపరమాత్మ వెంటనే అనుగ్రహిస్తాడు.

రాజా చ లభతే రాజ్యమధనశ్చోత్తమం ధనమ్ ।
క్షీణాయుర్లభతే చాయుః పుత్రకామః సుతం తథా ॥ 68 ॥

(కృష్ణుని ఆరాధిస్తే) రాజు తాను నష్టపోయిన రాజ్యాన్ని తిరిగి పొందుతాడు. బీదవాడు ధనాన్ని పొందుతాడు. అల్పాయుష్కుడు ఆయుష్యాన్ని పొందుతాడు. అలాగే పుత్రుని కోరేవాడు పుత్రుని పొందుతాడు.

యజ్ఞా వేదాస్తథా కామాస్తపాంసి వివిధాని చ ।
ప్రాప్నోతి వివిధం పుణ్యం విష్ణుభక్తో ధనాని చ ॥ 69 ॥

యద్యత్కామయతే కించిత్ తత్తల్లోకేశ్వరాద్భవేత్ ।

విష్ణుభక్తుడు యజ్ఞాలాచరించటం వలన, వేదాలు పఠించటం వలన మరియు అనేక విధాలైన తపస్సులు ఆచరించటం వలన కలిగే ఫలాలన్నీ పొందుతాడు. అనేక విధాలైన పుణ్యాలను, ధనాన్ని కూడ పొందుతాడు. ఇంకను అతను కోరినవన్నీ లోకేశ్వరుని అనుగ్రహం వల్ల లభిస్తాయి.

సర్వం విహాయ య ఇమం పఠేత్ పౌష్కరకం హరేః ॥ 70 ॥

ప్రాదుర్భావం నృపశ్రేష్ఠ న తస్య హ్యశుభం భవేత్ ।
ఏష పౌష్కరకో నామ ప్రాదుర్భావో మహాత్మనః
కీర్తితస్తే మహాభాగ వ్యాసశ్రుతినిదర్శనాత్ ॥ 71 ॥

ఓ నృపశ్రేష్ఠా! ఎవరైతే అన్నీ వదలి అనగా తదేకధ్యానంతో ఈ పౌష్కరప్రాదుర్భావ వృత్తాంతాన్ని పఠిస్తారో వారు ఎటువంటి అశుభాన్ని పొందరు. ఓ మహాభాగా! ఈ విధంగా వ్యాసుని వల్ల విన్న మహాత్ముడైన బ్రహ్మదేవుని పౌష్కరప్రాదుర్భావాన్ని గురించి నీకు వివరించాను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే బ్రహ్మణా స్వాయంభువ మన్వాదీనాం సృష్టిర్నామ
ఏకసప్తత్యధికశతతమోఽధ్యాయః ॥171॥

శ్రీ మత్స్యమహాపురాణంలో బ్రహ్మదేవుడు స్వాయంభువ మనువు మొదలగువారిని సృష్టించటమనే
నూట డెబ్బైఒకటవ అధ్యాయం సమాప్తం

ద్విసప్తత్యధిక శతతమోऽధ్యాయః – నూటడెబ్బై రెండవ అధ్యాయం

శ్రీవిష్ణుమహిమా తారకామయ సంగ్రామ ప్రస్తావనమ్

శ్రీవిష్ణుమహిమ మరియు తారకామయ సంగ్రామ ప్రస్తావన

మత్స్య ఉవాచ – మత్స్యదేవుడు చెప్పాడు.

విష్ణుత్వం శృణు విష్ణోశ్చ హరిత్వం చ కృతే యుగే ।
వైకుంఠత్వం చ దేవేషు కృష్ణత్వం మానుషేషు చ ॥ 1 ॥

కృతాది యుగాలలో విష్ణువు విష్ణుత్వం (సర్వవాపకత్త్వాన్ని) మరియు హరిత్వాన్ని (దోషాలన్నింటినీ హరించేవాడు కావున) దేవతల విషయంలో వైకుంఠత్వాన్ని, మానవుల విషయంలో కృష్ణత్వాన్ని ఎలా పొందాడో వివరిస్తాను వినుమని చెప్పాడు.

విశే:ఈ మత్స్య మహాపురాణంలో సుమారుగా దేవతలకు అసురులకు మధ్యలో జరిగిన పన్నెండు సంగ్రామాలు వర్ణించబడ్డాయి. వాటిలో ఈ తారకామయ సంగ్రామమొకటి. 'తారకామయ' అనే పదానికి తారుడు, కాలనేమి మరియు మయుడు అనే ముగ్గురు రాక్షసులతో పరమాత్మ చేసిన సంగ్రామమని గమనించవలసిందని కొంతమంది పండితులు నిర్వచించి వున్నారు).

ఈశ్వరస్య హి తస్యైషా కర్మణాం గహనా గతిః ।
సంప్రత్యతీతాన్ భవ్యాంశ్చ శృణు రాజన్ యథాతథమ్ ॥ 2 ॥

ఈశ్వరుని కర్మలు మిక్కిలి గహనమైనవి. ఇప్పుడు జరుగుతున్నవాటిని, జరిగిపోయిన వాటిని మరియు రాబోవు వాటిని గురించి కూడ చెబుతాను శ్రద్ధగా విను.

అవ్యక్తో వ్యక్తలింగస్థో య ఏష భగవాన్ ప్రభుః ।
నారాయణో హ్యనన్తాత్మా ప్రభవోऽవ్యయ ఏవ చ ॥ 3 ॥

ఏష నారాయణో భూత్వా హరిరాసీత్ సనాతనః ।
బ్రహ్మా వాయుశ్చ సోమశ్చ ధర్మః శక్రో బృహస్పతిః ॥ 4 ॥

ప్రభువైన ఈ భగవంతుడు కనబడని రూపం గలవాడైనా లోకహితం కోసం కనబడే చిహ్నాలు (లక్షణాలు) కలవాడవుతున్నాడు. ఈ నారాయణుడు అనంతుడు, అవ్యయుడు, సర్వాశ్రయుడు. ఈ నారాయణుడే హరి, బ్రహ్మ, వాయువు, సోముడు, ధర్మము, శక్రుడు మరియు బృహస్పతి. ఇతడే సనాతనుడైన శ్రీహరి.

అదితేరపి పుత్రత్వం సమేత్య రవినందన ।
ఏష విష్ణురితి ఖ్యాత ఇన్ద్రస్యావరజో విభుః ॥ 5 ॥

ప్రసాదజం హ్యస్య విభోరదిత్యాః పుత్రకారణమ్ ।
వధార్థం సురశత్రూణాం దైత్యదానవరక్షసామ్ ॥ 6 ॥

ఈ విష్ణువే అదితికి పుత్రుడైనందున ఇంద్రుడికి తమ్ముడై 'ఉపేంద్ర'త్వాన్ని పొందాడు. సర్వవ్యాప్తియైన విష్ణువు అదితికి పుత్రుడవటానికి రెండు కారణాలున్నాయి. ఒకటి అదితిని అనుగ్రహించడమైతే రెండవది సురశత్రువులైన దైత్య దానవ రాక్షసాదులను సంహరించడం.

ప్రధానాత్మా పురాహ్యేష బ్రహ్మాణమసృజత్ ప్రభుః ।
సోఽసృజత్ పూర్వపురుషః పురా కల్పే ప్రజాపతీన్ ॥ 7 ॥

ఈ ప్రభువే పూర్వం ప్రధానరూపుడై బ్రహ్మను సృష్టించాడు. ఆ బ్రహ్మ పూర్వకాలంలో ప్రజాపతులను సృష్టించాడు.

అసృజన్మానవాంస్తత్ర బ్రహ్మవంశ్యాననుత్తమాన్ ।
తేభ్యోఽభవన్మహాత్మభ్యో బహుధా బ్రహ్మ శాశ్వతమ్ ॥ 8 ॥

ఆ తరువాత మానవులను, వారిలో ఉత్తములైన బ్రాహ్మణులను సృష్టించాడు. ఆ మహాత్ముల నుండే శాశ్వతమైన బ్రహ్మజ్ఞానం (వేదము) ప్రవర్తిల్లింది.

ఏతదాశ్చర్యభూతస్య విష్ణోః కర్మానుకీర్తనమ్ ।
కీర్తనీయస్య లోకేషు కీర్త్యమానం నిబోధ మే ॥ 9 ॥

అత్యంతాశ్చర్యభూతుడు మరియు కీర్తనీయుడు అయిన విష్ణువు యొక్క కీర్తనక్రమము లోకాల్లో ఎల్లప్పుడు కీర్తించబడుతున్న ఈతని కర్మ విశేషాలను చెబుతాను వినుమని మత్స్యదేవుడు చెప్పాడు.

వృతే వృత్రవధే తత్ర వర్తమానే కృతే యుగే ।
ఆసీత్ త్రైలోక్యవిఖ్యాతః సంగ్రామస్తారకామయః ॥ 10 ॥

యత్ర తే దానవా ఘోరాః సర్వే సంగ్రామదుర్జయాః ।
ఘ్నన్తి దేవగణాన్ సర్వాన్ సయక్షోరగరాక్షసాన్ ॥ 11 ॥

తే వధ్యమానా విముఖాః క్షీణప్రహరణా రణే ।
త్రాతారం మనసా జగ్ముః దేవం నారాయణం ప్రభుమ్ ॥ 12 ॥

పూర్వం కృతయుగంలో వృత్రాసుర వధ్యాంతరం మూడు లోకాల్లో ప్రసిద్ధి చెందిన తారకామయమనే సంగ్రామం జరిగింది. ఆ యుద్ధంలో ఎవరితో కూడ యుద్ధంలో ఓటమి పొందని ఘోరదానవులు సర్వదేవ గణాలను, యక్ష పన్నగ రాక్షసాదులను కూడ చంపారు. అపుడు దేవతలు ఆయుధశక్తి క్షీణించగా యుద్ధవిముఖులై లోకరక్షకుడగు శ్రీ మన్నారాయణుని తమ మనస్సులోనే ధ్యానించారు.

ఏతస్మిన్నన్తరే మేఘాః నిర్వాణాంగారవర్చసః ।
సార్కచంద్రగ్రహగణం ఛాదయన్తో నభస్తలమ్ ॥ 13 ॥

రేణువిద్యుద్గణోపేతా ఘోరనిర్హ్రాదకారిణః ।
అన్యోన్యవేగాభిహతాః ప్రవవుః సప్తమారుతాః ॥ 14 ॥

ఇంతలో చల్లారిన బొగ్గులవంటి కాంతిగలిగిన మేఘాలు సూర్యచంద్రులను, ఆకాశాన్ని కప్పివేస్తూ భయంకరమైన విద్యుద్గణాలతో (మెరపులతో) ఘోరమైన ధ్వనులు చేశాయి. మరియు పర స్పరస్పర్ధతో సప్త మారుతాలు భయంకరంగా వీశాయి.

దీప్తతోయాశనిఘనైః వజ్రవేగానలానిలైః ।
రవైః సుఘోరైరుత్పాతైః దహ్యమానమివాంబరమ్ ॥ 15 ॥

ప్రకాశించే నీటితోను మరియు పిడుగులతోను కూడిన మేఘాలతో వజ్రాయుధం వంటి వేగం గల వాయ్వగ్నులతో, మిక్కిలి ఘోరాలైన ఉత్పాతాలతో ఆకాశం దహించబడుతున్నదా అన్నట్లున్నది.

తత ఉల్కాసహస్రాణి నిపేతుః ఖగతాన్యపి ।
దివ్యాని చ విమానాని ప్రపతన్త్యుత్పతన్తి చ ॥ 16 ॥

వేల కొలది ఉల్కలు, గ్రహఖండాలు ఆకాశం నుండి రాలుతున్నాయి. దివ్య విమానాలు క్రిందపడుతూ ఎగురుతున్నాయి.

చతుర్యుగాన్తే పర్యాయే లోకానాం యద్భయం భవేత్ ।
అరూపవన్తి రూపాణి తస్మిన్నుత్పాతలక్షణే ॥ 17 ॥

జాతం చ నిష్ప్రభం సర్వం న ప్రాజ్ఞాయత కించన ।
తిమిరౌఘపరిక్షిప్తా న రేజుశ్చ దిశో దశ ॥ 18 ॥

నాలుగు యుగాలు గడచిన పిదప చివరలో లోకాలకు ఎటువంటి భయం కలుగుతుందో అటువంటి భయాన్ని కలిగించే ఆ ఉత్పాతాల వలన అన్నీ తమ తమ స్వరూపాలను కోల్పోతున్నాయి. అంతా కాంతిరహిత మయింది. పది దిక్కులు అంధకారసమూహాలతో పరివ్యాప్తాలై కాంతి విహీనాలయ్యాయి.

వివేశ రూపిణీ కాలీ కాలమేఘావగుంఠితా ।
ద్యౌర్నభాత్యభిభూతార్కా ఘోరేణ తమసావృతా ॥ 19 ॥

తాన్ ఘనౌఘాన్ సతిమిరాన్ దోర్భ్యామాక్షిప్య స ప్రభుః ।
వపుః సందర్శయామాస దివ్యం కృష్ణవపుర్హరిః ॥ 20 ॥

నల్లని మేఘములచే ఆవరించబడి నల్లనిరూపం దాల్చిన కాళి లోకంలో ప్రవేశించింది. సూర్యుడు మరుగున పడగా అంతా ఘోరమైన అంధకారంతో ఆకాశం కాంతిరహితమయింది. అప్పుడు మబ్బుల సమూహాన్ని వాటివలన కలిగిన చీకటులను కూడ తన బాహువులతో ఎత్తివేసి ప్రభువైన హరి తన నల్లనిశరీరాన్ని దర్శింపజేశాడు.

బలాహకాంజననిభం బలాహకతనూరుహమ్ ।
తేజసా వపుషా చైవ కృష్ణం కృష్ణమివాచలమ్ ॥ 21 ॥

దీప్తపీతాంబరధరం తప్తకాంచనభూషణమ్ ।
ధూమాన్ధకారవపుషం యుగాన్తాగ్నిమివోత్థితమ్ ॥ 22 ॥

చతుర్ద్విగుణపీనాంసం కిరీటచ్ఛన్నమూర్ధజమ్ ।
బభౌ చామీకరప్రఖ్యైరాయుధైరుపశోభితమ్ ॥ 23 ॥

ఆ శరీరం నల్లనిమేఘం వలె మరియు కాటుక వలె మెరుస్తూ, అటువంటి రంగుగల కేశాలతో నల్లని పర్వతం వలె ఉన్నది. ప్రకాశవంతమైన పీతాంబరాన్ని మెరుస్తున్న బంగారు ఆభరణాలను ధరించి, ధూమం మరియు అంధకారం వంటి శరీరం, దృఢమైన నాలుగు భుజాలు, కిరీటంతో కప్పివేసిన కేశాలు గలవాడై యుగాంతంలో ప్రజ్వరిల్లే అగ్నివలె ఉన్నాడు. చెక్కబడి ప్రకాశిస్తున్న బంగారు ఆయుధాలతో ప్రకాశిస్తున్నాడు.

చంద్రార్కకిరణోద్యోతం గిరికూటమివోచ్ఛ్రితమ్ ।
నందకానందితకరం శరాశీవిషధారిణమ్ ॥ 24 ॥

శక్తిచిత్రఫలోదగ్రం శంఖచక్రగదాధరమ్ ।
విష్ణుం శైలం మహాశూలం శ్రీవృక్షం శార్ఙ్గధన్వినమ్ ॥ 25 ॥

(దైత్యుల చేతిలో పరాజయం పొంది ఖిన్నులై వున్న దేవతలకు శ్రీ మన్నారాయణుడు దర్శనమిచ్చాడు అనే 41 వ శ్లోకం వరకు ఇలాగే అన్వయం చేసుకోవాలి). చంద్రుని మరియు సూర్యుని కిరణాలతో ప్రకాశిస్తున్న, ఉన్నతమైన పర్వతశిఖరం వలె వున్న, నందకమనే ఖడ్గంతో గూడిన చేయగల సర్పాల వంటి బాణాలను చేతులలో చిత్రమైన శక్తితో మరియు బలంతో ఉగ్రుడై వున్న, శంఖ, చక్ర, గదలను ధరించిన గొప్ప శూలాన్ని, శ్రీవృక్షాన్ని, శార్ఙ్గమనే ధనుస్సును కూడ ధరించిన విష్ణువనే పర్వతాన్ని (దేవతలు దర్శించారు).

త్రిదశోదారఫలదం స్వర్గస్త్రీచారుపల్లవమ్ ।
సర్వలోకమనఃకాన్తం సర్వసత్త్వమనోహరమ్ ॥ 26 ॥

దేవతలందరికి ఉదారంగా ఫలమిచ్చే, స్వర్గలోకపు స్త్రీలనే అందమైన చిగురుటాకులను ధరించిన, అన్ని లోకాల వారి మనస్సులకు ఆహ్లాదం కలిగించే, ప్రాణులందరికీ ఆనందం కలిగించే (దేవుని దేవతలు దర్శించారు).

నానావిమానవిటపం తోయదాంబుమధుస్రవమ్ ।
విద్యాహంకారసారాఢ్యం మహాభూతప్రరోహణమ్ ॥ 27 ॥

విశేషపత్రైర్నిచితం గ్రహనక్షత్రపుష్పితమ్ ।
దైత్యలోకమహాస్కంధం మర్త్యలోకే ప్రకాశినమ్ ॥ 28 ॥

విమానాలనే నానాశాఖలు కలిగిన మేఘజలాలనే తేనెను స్రవించుచున్న, విద్యచే కలిగిన అహంకారమనే సారం కలిగివున్న, పంచమహాభూతాలనే మొలకలు కలిగిన, విశేషమైన పత్రాలతో కూడిన, గ్రహాలు నక్షత్రాలు అనే పుష్పాలు కలిగిన, దైత్యలోకమనే మహాకాండం కలిగిన, మానవమర్త్యలోకంలో ప్రకాశిస్తున్న (దేవుని దేవతలు దర్శించారు).

సాగరాకారనిర్హ్రాదం రసాతలమహాశ్రయమ్ ।
మృగేంద్ర పార్శ్వైర్విततం పక్షిజంతునిషేవితమ్ ॥ 29 ॥

శీలార్థచారుగంధాఢ్యం సర్వలోకమహాద్రుమమ్ ।
అవ్యక్తానన్తసలిలం వ్యక్తాహంకారఫేనిలమ్ ॥ 30 ॥

సాగరపు హెూరు వంటి ధ్వనికలిగిన, రసాతల (పాతాళ) మనే గొప్ప ఆశ్రయం కలిగిన, మృగేంద్రాలనే పార్శ్వాలతో వ్యాప్తమైన, వివిధ పక్షులు మరియు జంతువులచే సేవించబడుతున్న, శీలంతో, ధనంతో, దివ్యమైన సువాసనలతో కూడిన, సర్వలోక సముదాయమనే మహావృక్షంవలె వున్న, అవ్యక్తమైన అనంతమైన జలం కలిగిన, వ్యక్తమైన అహంకారమనే నురుగు కలిగివున్న (దేవుని దర్శించారు.)

మహాభూతతరంగౌఘం గ్రహనక్షత్రబుద్బుదమ్ ।
విమానగరుత (వాహనైర్యా) వ్యాప్తం తోయదాడంబరాకులమ్ ॥ 31 ॥

జన్తుమత్స్యగణాకీర్ణం శైలశంఖకులైర్యుతమ్ ।
త్రైగుణ్యవిషయావర్తం సర్వలోకతిమింగలమ్ ॥ 32 ॥

మహాభూతములనే తరంగసమూహాలు మరియు గ్రహాలు, నక్షత్రాలు అనే బుడగలు కలిగిన, విమానాలనే పక్షులతో వ్యాప్తమైన, మేఘాల ఆడంబరాలతో నిండిన, అనేక ప్రాణిగణాలతో, మత్స్యసమూహాలతో వ్యాప్తమైన, పర్వతాలనే శంఖాలరాసులు గలిగిన, సత్త్వరజస్తమోగుణాలతో కూడిన, విషయభోగాలనే సుఖాలు గలిగిన, సర్వలోకాలనే తిమింగలాలతో నిండిన(దేవుని దర్శించారు).

వీరవృక్షలతాగుల్మం భుజగోత్కృష్టశైవలమ్ ।
ద్వాదశార్కమహాద్వీపం రుద్రైకాదశపత్తనమ్ ॥ 33 ॥

వస్వష్టపర్వతోపేతం త్రైలోక్యాంభోమహోదధిమ్ ।
సంధ్యాసంఖ్యోర్మిసలిలం సుపర్ణానిలసేవితమ్ ॥ 34 ॥

వీరులనే వృక్షాలు, లతలు, పొదలుగల, సర్పాలనే గొప్ప నాచుగల, ద్వాదశాదిత్యులనే మహాద్వీపాలు, ఏకాదశ రుద్రులనే పట్టణాలు, అష్టవసువులనే పర్వతాలు గల సంధ్యలనే అసంఖ్యాకాలైన అలలు గల నీటితో నిండిన, మూడులోకాలనే మహాసముద్రాలు గల గరుడుడనే వాయువుతో (వాయు గరుడులతో) సేవించబడుతున్న (దేవుని దర్శించారు).

దైత్యరక్షోగణగ్రాహం యక్షోరగఝషాకులమ్ ।
పితామహమహావీర్యం సర్వ(స్వర్గ)స్త్రీరత్నశోభితమ్ ॥ 35 ॥

శ్రీకీర్తికాంతిలక్ష్మీభిర్నదీభిరుపశోభితమ్ ।
కాలయోగిమహాపర్వప్రలయోత్పత్తివేగినమ్ ॥ 36 ॥

దైత్య, రాక్షస గణాలనే మొసళ్ళు, యక్షులు, నాగులనే చేపలు, పితామహుడనే మహావీర్యం, అందరు స్త్రీలనే రత్నాలు, శ్రీ ,కీర్తి, కాంతి, లక్ష్ములు అనే నదులు, కాలయోగాలనే మహాపర్వాలు, సృష్టిప్రళయాలు మొదలగునవి కలిగిన (దేవుని దర్శించారు).

తం తు యోగమహాపారం నారాయణమహార్ణవమ్ ।
దేవాధిదేవం వరదం భక్తానాం భక్తవత్సలమ్ ॥ 37 ॥

అను(గహకరం దేవం (ప్రశాన్తికరణం శుభమ్ (శివమ్) ।

యోగమనే గొప్ప ఒడ్డు కలిగిన నారాయణుడనే ఆ మహార్ణవాన్ని, దేవాధిదేవుడు, వరములిచ్చేవాడు, భక్తవత్సలుడు, అను(గహించే దేవుడు, (ప్రశాంతతనిచ్చేవాడు, శుభకరుడు అయిన (ఆ దేవుని దర్శించారు.)

హర్యశ్వరథసంయుక్తే సువర్ణధ్వజసేవితే ॥ 38 ॥

(గహచం(ద్రార్కరచితే మందరాక్షవరావృతే ।
అనన్తరశ్మిభిర్యుక్తే విస్తీర్ణే మేరుగహ్వరే ॥ 39 ॥

తారకాచి(త్రకుసుమే (గహనక్ష(త్రబంధురే ।
భయేష్వభయదం వ్యోమ్ని దేవా దైత్యపరాజితాః ॥ 40 ॥

దదృశుస్తే స్థితం దేవం దివ్యే లోకమయే రథే ।
తే కృతాంజలయః సర్వే దేవాః శ(క్రపురోగమాః ॥ 41 ॥

జయశబ్దం పురస్కృత్య శరణ్యం శరణం గతాః ।

పచ్చని రథాశ్వాలు కలిగిన గరుడధ్వజ శోభితమైన, (గహాలు, సూర్యచం(ద్రులతో రచింపబడిన, మందర పర్వతమనే ఇరుసు గల, అనంతమైన కిరణాలు కల, విస్తీర్ణాలైన మేరు పర్వతపు గుహలు కల, నక్ష(త్రాదులతో కూడిన, ఆకాశంలో దివ్యలోకమయమైన రథమునందున్న, భయాలు కలిగినప్పుడు అభయాలిచ్చే ఆ దేవదేవుని దైత్యులచేత పరాజితులైన శ(క్రాది దేవతలందరూ వినమ్రులై చూచారు. (దర్శించారు), మరియు జయ జయ ధ్వానాలు చేస్తూ రక్షకుడైన ఆ శ్రీ మన్నారాయణుని శరణు వేడారు.

స తేషాం తాం గిరం (శుత్వా విష్ణుర్దైవతదైవతమ్ ॥ 42 ॥

మనశ్చ(క్రే వినాశాయ దానవానాం మహామృధే ।
ఆకాశే తు స్థితో విష్ణుః ఉత్తమం వపురాస్థితః ॥ 43 ॥

ఉవాచ దేవతాః సర్వాః స(ప్రతిజ్ఞమిదం వచః ।
శాంతిం (వ్రజత భ(ద్రం వో మా భైష్ట మరుతా గణాః ॥ 44 ॥

జితా మే దానవాః సర్వే (త్రైలోక్యం పరిగృహ్యతామ్ ।

దేవతల (ప్రార్థనను విని దేవదేవుడైన శ్రీమహావిష్ణువు ఒకానొక మహాయుద్ధంలో దానవులను వధించుటకై నిశ్చయించుకొన్నాడు. ఉత్తమరూపం ధరించిన విష్ణువు ఆకాశంలో నిలబడి (ప్రతిజ్ఞాపూర్వకంగా దేవతలందరిని ఉద్దేశించి ఇలా అన్నాడు. ఓ దేవగణములారా! శాంతిని పొందండి మీకు శుభం కలుగుతుంది. భయపడవద్దు. దానవులందరినీ నేను జయిస్తాను. మీరంతా మరల మూడు లోకాలను పొందుతారు.

తే తస్య సత్యసంధస్య విష్ణోర్వాక్యేన తోషితాః ॥ 45 ॥

దేవాః ప్రీతిం సమాజగ్ముః ప్రాశ్యామృతమివోత్తమమ్ ।

దేవతలందరూ సత్యసంధుడైన శ్రీమహావిష్ణువు మాటలను విని సంతోషించారు. మరియు ఉత్తమమైన అమృతం త్రాగినంత ప్రీతిని పొందారు.

తతస్తమః సంహృతం తద్వినేశుశ్చ బలాహకాః ॥ 46 ॥

ప్రవవుశ్చ శివా వాతాః ప్రశాన్తాశ్చ దిశో దశ ।
శుద్ధప్రభాణి జ్యోతీంషి సోమం చక్రుః ప్రదక్షిణమ్ ॥ 47 ॥

అపుడు అక్కడ పరివ్యాప్తమైన అంధకారం నశించిపోయింది. మేఘాలు తొలిగిపోయాయి. శుభప్రదాలైన గాలులు వీచాయి. దశ దిశలు ప్రశాంతతను పొందాయి. ప్రకాశవంతాలైన నక్షత్రాలు చంద్రుని చుట్టూ ప్రదక్షిణాలు చేశాయి.

న విగ్రహం గ్రహాశ్చక్రుః ప్రశాన్తాశ్చాపి సింధవః ।
విరజస్కాఽభవన్మార్గాః నాకవర్గాదయస్త్రయః ॥ 48 ॥

యథార్థమూహుః సరితో నాపి చుక్షుభిరేఽర్ణవాః ।
ఆసన్ శుభానీంద్రియాణి నరాణామన్తరాత్మసు ॥ 49 ॥

గ్రహాలు పరస్పరం యుద్ధాలు మానివేశాయి. (గ్రహాల పరస్పరం కలయిక లోకోపద్రవానికి కారణమవు తుందని జ్యోతిశ్శాస్త్రం చెబుతున్నది.) సముద్రాలు, నదులు ప్రశాంతంగా ఉన్నాయి. మార్గాలన్నీ ధూళిరహితా లయ్యాయి. స్వర్గాది ముల్లోకాలు ప్రశాంతతను పొందాయి. నదులు యథోచితంగా ప్రవహించనారంభిచాయి. సముద్రాలు కల్లోలం చెందలేదు. మానవుల అంతఃకరణంలో అన్నీ శుభప్రవృత్తులే కలిగాయి.

మహర్షయో వీతశోకా వేదానుచ్చైరధీయత ।
యజ్ఞేషు చ హవిః పాకం శివమాప చ పావకః ॥ 50 ॥

ప్రవృత్తధర్మాః సంవృత్తా లోకా ముదితమానసాః ।
విష్ణోర్దత్తప్రతిజ్ఞాయ శ్రుత్వారినిధనే గిరమ్ ॥ 51 ॥

శోకరహితులైన మహర్షులు ఉచ్చైఃస్వరంతో స్పష్టంగా వేదాధ్యయనం చేశారు. యజ్ఞాలలో అగ్నిదేవుడు లోకాలకు శుభప్రదమైన హవిస్సును స్వీకరించాడు. లోకాలన్నీ ధర్మప్రవృత్తి కలవై సంతోషాన్ని పొందాయి. శత్రుసంహారం కోసం విష్ణువు చేసిన ప్రతిజ్ఞను విని లోకాలన్నీ శాంతించాయి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే శ్రీవిష్ణుమహిమ మరియు తారకామయసంగ్రామో నామ ద్విసప్తత్యధిక శతతమోఽధ్యాయః ॥ 172 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలో శ్రీవిష్ణుమహిమ మరియు తారకామయసంగ్రామ ప్రస్తావనమనే నూట డెబ్బై రెండవ అధ్యాయం సమాప్తం.

త్రిసప్తత్యధికశతతమోఽధ్యాయః – నూటడెబ్బై మూడవ అధ్యాయం

దైత్యదానవ యుద్ధప్రయత్నః – దైత్యదానవ యుద్ధప్రయత్నం

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

తతోఽభయం విష్ణువచః శ్రుత్వా దైత్యాశ్చ దానవాః ।
ఉద్యోగం విపులం చక్రు ర్యుద్ధాయ విజయాయ చ ॥ 1 ॥

తదనన్తంతరం విష్ణువు యొక్క అభయాన్ని విని దేవతలు, దైత్యులు కూడ యుద్ధంలో విజయం కొరకై విపులమైన ప్రయత్నం చేయనారంభించారు.

మయస్తు కాంచనమయః త్రినల్వాయతమక్షయమ్ ।
చతుశ్చక్రం సువిపులం సుకల్పితమహాయుగమ్ ॥ 2 ॥

కింకిణీజాలనిర్ఘోషం ద్వీపిచర్మపరిష్కృతమ్ ।
రుచిరం రత్నజాలైశ్చ హేమజాలైశ్చ శోభితమ్ ॥ 3 ॥

అపుడు మయుడను దైత్యుడు సువర్ణమయమైన మూడు నల్వములు అనగా సుమారు 1200 చదరపు మూరలంత విశాలమైనది, అక్షయమైనది, నాలుగు చక్రములు కలది, దానికి కట్టిన గంటల యొక్క ధ్వనులతో కూడినది, సింహపు చర్మముతో అలంకరింపబడినది, రత్నములతో బంగారు ఆభరణములతో శోభిల్లుతున్నట్టి (రథమును అధిష్ఠించెను అని ఎనిమిదవ శ్లోకము వరకు గ్రహింపవలసినది)

ఈహామృగగణాకీర్ణం పక్షిపంక్తివిరాజితమ్ ।
దివ్యాస్త్రతూణీరధరం పయోధరనినాదితమ్ ॥ 4 ॥

స్వక్షం రథవరోదారం సూపస్థం గగనోపమమ్ ।
గదాపరిఘసంపూర్ణం మూర్తి మన్తమివార్ణవమ్ ॥ 5 ॥

ఈహామృగగణాలతో మరియు పక్షిపంక్తుల చిత్రాలతో ప్రకాశించుచున్నట్టి, దివ్యములైన అస్త్రములు మరియు అమ్ముల పొదలుగూడ కలిగియున్నటువంటి, మేఘము వంటి గంభీరమైన ధ్వని కలిగినటువంటి, దృఢమైన ఇరుసు కలిగినటువంటి రథశ్రేష్ఠములలో శ్రేష్ఠమైనటువంటి, విశాలమైన రథికూర్చుండే స్థానము కలిగినటువంటి, గదలు, పరిఘాలు మొదలగు ఆయుధాలతో నిండినట్టియు సముద్రమే రథముగా రూపొందినట్లుండిన(రథమును మయుడు అధిష్ఠించాడు).

హేమకేయూరవలయం స్వర్ణమండలకూబరమ్ ।
సపతాకధ్వజోపేతం సాదిత్యమివ మందరమ్ ॥ 6 ॥
గజేంద్రాభోగవపుషం క్వచిత్కేసరివర్చసమ్ ।
యుక్తమృక్షసహస్రేణ సమృద్ధాంబుదనాదితమ్ ॥ 7 ॥

దీప్తమాకాశగం దివ్యం రథం పరరథారుజమ్ ।
అధ్యతిష్ఠద్రణాకాంక్షీ మేరుం దీప్త ఇవాంశుమాన్ ॥ 8 ॥

బంగారంతో జేసిన కేయూరములు = భుజకీర్తులు మరియు కంకణాలచే అలంకరింపబడినటువంటి, పతకాలు, ధ్వజాలు కలిగినటువంటి, సూర్యునిచే ప్రకాశించుచున్న మందరపర్వతము వలె నున్నట్టి, గజేంద్రుని వలే బృహద్రూపము మరియు సింహము వంటి వర్చస్సు కలిగినటువంటి, వెయ్యి ఎలుగుబంటులతో లాగబడుచున్నట్టి, సమృద్ధమైన జలము కలిగిన మేఘముల వలె ధ్వని చేయుచున్నట్టి, ఆకాశమార్గాన సంచరించుచున్నట్టి, శత్రు రథములను ధ్వంసం చేయునట్టి దివ్యమైన రథాన్ని కాంతిమంతుడైన సూర్యుడు మేరు పర్వతాన్నధిష్ఠించినట్లు మయుడధిష్ఠించాడు.

తారముత్క్రోశవిస్తారం సర్వం హేమమయం రథమ్ ।
శైలాకారసంబాధం నీలాంజనచయోపమమ్ ॥ 9 ॥
కార్ష్ణాయసమయం దివ్యం లోహేషాబద్ధకూబరమ్ ।
తిమిరోద్గారి కిరణం గర్జన్తమివ తోయదమ్ ॥ 10 ॥
లోహజాలేన మహతా స గవాక్షేణ దంశితమ్ ।
ఆయసైః పరిఘైః పూర్ణం క్షేపణీయైశ్చ ముద్గరైః ॥ 11 ॥

(విరోచనుడను దైత్యుడుధిరోహించిన రథము) క్రోశమున కంటే మించిన వైశాల్యము కలది, సర్వమూ బంగారమయమైనది, పర్వతాకారం కలది, విస్తారమైనది, నల్లని కాటుకరాశివలె ప్రకాశించునట్టిది, నల్లని ఉక్కుతో నిర్మింపబడినది, లోహముతో చేయబడిన కాడి, నొగలు మొదలగునవి కలిగినట్టిది, చీకటులనే కిరణములు కలిగినట్టిది, ఉరుముతున్న మేఘము వంటి ధ్వని కలిగినటువంటిది, లోహముతో చేసిన పరిఘములు, ఇతర ఆయుధములు మరియు ముద్గరములతో కూడియున్నట్టిది(అయిన రథమును విరోచినుడు అధిరోహించాడు అని 13వ శ్లోకం వరకు అన్వయం)

ప్రాసైః పాశైశ్చ వితతైరసంయుక్తైశ్చ కంటకైః ।
శోభితం త్రాసయానైశ్చ తోమరైశ్చ పరశ్వధైః ॥ 12 ॥

మరియు శూలాలతో, పాశాలతో, ముళ్ళు (కంటకాలు) గలిగిన ఆయుధాలతో, భయం కలిగించు తోమరాలతో, గొడ్డళ్ళతో నిండినటువంటి (రథమధిరోహించాడు.)

ఉద్యస్తం ద్విషతాం హేతోః ద్వితీయమివ మందరమ్ ।
యుక్తం ఖరసహస్రేణ సోఽధ్యారోహద్రథోత్తమమ్ ॥ 13 ॥

శత్రువులతో యుద్ధం చేయుటకై ఉద్యోమిస్తున్న మందరపర్వతము వలెనున్నట్టి, వెలకొలది ఖరములతో(గాడిదలతో) లాగుబడుచున్నట్టి ఉగ్రమైన రథాన్ని విరోచనుడను దైత్యుడు అధిరోహించాడు.

విరోచనస్తు సంక్రుద్ధో గదాపాణిరవస్థితః ।
ప్రముఖే తస్య సైన్యస్య దీప్తశృంగ ఇవాచలః ॥ 14 ॥

అత్యన్తక్రుద్ధుడైన విరోచనుడు చేతిలో గదాయుధము కలవాడై దైత్య సైన్యమునకు ముందు ప్రకాశించు శిఖరములు గల పర్వతపు ఆకారము కలవాడై ఉండెను.

యుక్తం రథసహస్రేణ హయగ్రీవస్తు దానవః ।
స్యందనం వాహయామాస సపత్నానీకమర్దనః ॥ 15 ॥

మరియు హయగ్రీవుడనే దానవుడు వేలకొలది రథములు తనను అనుసరించి రాగా, శత్రుసైన్యమును నశింపజేయు సంకల్పముతో తన రథమధిరోహించి ముందుకు వెళ్ళాడు.

వ్యాయతం కిష్కుసాహస్రం ధనుర్విస్ఫారయన్ మహత్ ।
వారాహః ప్రముఖే తస్థౌ సప్రరోహ ఇవాచలః ॥ 16 ॥

వారాహుడను మరొక దైత్యుడు వేయి మూరల పొడవుగల మహాధనస్సును చేత బూని దానిని ధ్వనింపచేస్తూ ప్రరోహములతో అనగా మొలకలతో నిండిన పర్వతమును బోలినవాడై సైన్యానికి ముందు నిలిచాడు.

ఖరస్తు విక్షరన్ దర్పాన్నేత్రాభ్యాం రోషజం జలమ్ ।
స్ఫురద్దంతోష్ఠనయనం సంగ్రామం సో ऽభ్యకాంక్షత ॥ 17 ॥

ఖరుడను దైత్యుడు దర్పంతో రోషంతో కన్నుల నుండి జారిపడుతున్న కన్నీటిని చిందిస్తూ వణుకుతున్న దంతాలతో పెదవులతో మరియు కన్నులతో యుద్ధం చేయవలెనను కాంక్షతో ముందుకు వెళ్ళాడు.

త్వష్టా త్వష్టగజం ఘోరం యానమాస్థాయ దానవః ।
వ్యూహితుం దానవం వ్యూహం పరిచక్రామ వీర్యవాన్ ॥ 18 ॥

వీర్యవంతుడైన త్వష్టయను దైత్యుడు ఎనిమిది ఏనుగులను గలిగిన భయంకరమైన రథాన్నెక్కి దానవుల సేనా వ్యూహాన్ని రచించుటకు ముందుకు సాగాడు.

విప్రచిత్తిసుతశ్చైవ శ్వేతకుండలభూషణః ।
శ్వేతశ్వేత ప్రతీకాశో యుద్ధాయాభిముఖే స్థితః ॥ 19 ॥

అరిష్టో బలిపుత్రశ్చ వరిష్ఠోऽద్రిశిలాయుధః ।
యుద్ధాయాభిముఖస్తస్థౌ ధరాధరవికంపనః ॥ 20 ॥

శ్వేత కుండలములు ధరించిన విప్రతిచిత్తుడనే దైత్యుని పుత్రుడు శ్వేత పర్వతాకారుడై యుద్ధాభిముఖముగా నిలిచాడు మరియు బలిపుత్రుడైన అరిష్టుడను దైత్యుడు శ్రేష్ఠములైన శిలలనే ఆయుధాలుగా గ్రహించి లోకాలనన్నింటిని కంపింపచేస్తూ యుద్ధాభిముఖుడై నిలిచాడు.

కిశోరస్త్వభిసంహర్షాత్ కిశోర ఇవ చోదితః ।
సబలా దానవాశ్చైవ సన్నహ్యన్తే యథాక్రమమ్ ॥ 21 ॥

అభవద్దైత్యసైన్యస్య మధ్యే రవిరివోదితః ।

కిశోరుడనే మరొక దైత్యుడు రెచ్చగొట్టబడిన సింహపు పిల్లవలె 'యుద్ధం నందు అధికోత్సాహంతో బయల్దేరాడు. అతనితో పాటు బలవంతులైన అనేక మంది దానవులు యుద్ధానికై సన్నద్ధులైనారు. అపుడు ఆ దైత్యసైన్యం మధ్యలో కిశోరదైత్యుడు సూర్యుని వలె ప్రకాశించాడు.

లమ్బస్తు నవమేఘాభః ప్రలంబాబరభూషణః ॥ 22 ॥

దైత్యవ్యూహగతో భాతి సనీహార ఇవాంశుమాన్ ।

లంబుడనే దానవుడు కూడ వర్షపు మేఘాల వంటి ఆకారం కలవాడై వ్రేలాడుతున్న వస్త్రాభరణాలు కలవాడై దైత్యవ్యూహవు మధ్యలోనికి వెళ్ళి మంచుతో ఆవరింపబడిన సూర్యునివలె వుండినాడు.

స్వర్భానురాస్యయోధీ తు దశనోష్ఠేక్షణాయుధః ॥ 23 ॥

హంసస్తి తిష్ఠతి దైత్యానాం ప్రముఖే స మహాగ్రహః ।

ఇంతలో మహాగ్రహం స్వర్భానువు అనగా రాహువు కూడ పెదవులను కొరుకుతూ, భయంకరమైన చూపులతో యుద్ధము చేయుటకై దైత్యసేనల ముందు నిలబడ్డాడు.

అన్యే హయగతాస్తత్ర గజస్కంధగతాః పరే ॥ 24 ॥

సింహవ్యాఘ్రగతాశ్చాన్యే వరాహర్క్షేషు చాపరే ।
కేచిత్ ఖరోష్ట్రయాతారః కేచిచ్ఛ్వాపదవాహనాః ॥ 25 ॥

పత్తిన స్త్వపరే దైత్యాః భీషణాః వికృతాననాః ।
ఏకపాదార్ధపాదాశ్చ ననృతుర్యుద్ధకాంక్షిణః ॥ 26 ॥

ఇంకనూ అనేక మంది దానవులు అశ్వాలను గజాలను, సింహాలను, వ్యాఘ్రాలను, వరాహాలను, ఎలుగుబంటిలను, గాడిదలను, ఒంటెలను మరియు మేఘాలను వాహనాలుగా జేసికొని యుద్ధానికై బయల్దేరారు. వారిలో కొంతమంది దైత్యులు పదాతులై అనగా నడుస్తున్న వారై భీషణాలైన మరియు వికృతాలైన ముఖాలు గలవారై ఉండినారు. కొంతమంది ఒకే పాదం కలవారు కాగా మరికొంతమంది అర్ధపాదం మాత్రమే కలిగియుండి యుద్ధకాంక్షతో నృతం చేశారు.

ఆస్ఫోటయన్తో బహవః క్ష్వేదన్తశ్చ తథాపరే ।
హృష్టశార్దూల నిర్ఘోషా నేదుర్దానవపుంగవాః ॥ 27 ॥

తే గదా పరిఘైరుగ్రైః శిలాముసలపాణయః ।
బాహుభిః పరిఘాకారైః తర్జయన్తి స్మ దేవతాః ॥ 28 ॥

వారిలో కొంతమంది భుజాలు చరుచుచుండిరి, అశ్వాల వలె సకిలించుచుండిరి, పులుల వలే గర్జించుచుండిరి. దానవ శ్రేష్ఠులందరు అనేక నినాదములు చేయుచుండిరి. ఉగ్రములైన గదలు, పరిఘములు, శిలలు, ముసలములు, చేతిలో ధరించి వుండిరి. కొంతమంది పరిఘాయుధాకారము గలిగిన భుజములతో దేవతలను భయపెట్టుచుండిరి.

పాశైః ప్రాసైశ్చ పరిఘైః తోమరైః కుశపట్టిశైః ।
చిక్రీడుస్తే శతఘ్నీభిః శతధారైశ్చ ముద్గరైః ॥ 29 ॥

గండశైలైశ్చ శైలైశ్చ పరిఘైశ్చోత్తమాయసైః ।
చక్రైశ్చ దైత్య ప్రవరాశ్చక్రురానందితం బలమ్ ॥ 30 ॥

పాశములు, ప్రాసలు, పరిఘములు, తోమరములు, కుశపట్టిశములు, శతఘ్నులు, శతధారములు, ముద్గరములు పెద్దశిలలు, శైలములు, ఉత్తమాయుధములు, చక్రములు మొదలగు అనేక వివిధ ఆయుధాలతో దైత్యులందరూ అత్యంతానందంతో యుద్ధమున క్రీడించుచుండినారు.

ఏతద్దానవసైన్యం తత్సర్వం యుద్ధమదోత్కటమ్ ।
దేవానభిముఖే తస్థౌ మేఘానీకమివోద్ధతమ్ ॥ 31 ॥

తదద్భుతం దైత్యసహస్రగాఢం వాయ్వగ్ని శైలాంబుదతోయకల్పమ్ ।
బలం రణౌఘాభ్యుదయేఽభ్యుదీర్ణం యుయుత్సయోన్మత్తమివావభాసే ॥ 32 ॥

ఇట్లు దానవసైన్యమంతయు యుద్ధమదముచే ఉద్ధతములైన మేఘసమూహమువలె యుద్ధరంగమునకు చేరి దేవతల ఎదుట నిలుచుండిరి.

ఇంకనూ వేలకొలది దైత్యులు దృఢములైన వాయు, అగ్ని, శైలాదులను బోలిన అస్త్రములు కలిగి యుద్ధం నందు విజయం పొందవలెనన్న ప్రోత్సాహంతో, ఉన్మత్తులై యుద్ధభూమి యందు ప్రకాశించుచుండినారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తారకామయసంగ్రామే దైత్యదానవ యుద్ధప్రయత్నో నామ
త్రిసప్తత్యధిక శతతమోఽధ్యాయః ॥173॥

శ్రీమత్స్య మహాపురాణంలో తారకామయ సంగ్రామ ప్రస్తావమున దైత్యదానవ యుద్ధప్రయత్నమనే
నూట డెబ్బైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుస్సప్తత్యధికశతతమోఽధ్యాయః - నూటడెబ్బై నాల్గవ అధ్యాయం

తారకామయ యుద్ధార్థం దేవతైః కృత సేనా సన్నాహః

తారకామయ యుద్ధార్థం దేవతలు చేసిన సేనా సన్నాహం

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

శ్రుతస్తే దైత్యసైన్యస్య విస్తరో రవినందన ।
సురాణామపి సైన్యస్య విస్తరం వైష్ణవం శ్రుణు ॥ 1 ॥

రవి కుమారుడవైన ఓ మనూ! నీవింతవరకు దైత్యులయొక్క సైన్యవిస్తారం విన్నావు. ఇప్పుడు విష్ణు సంబంధీకులైన దేవతల యొక్క సేనావిస్తారం గురించి విను.

అదిత్యా వసవో రుద్రా అశ్వినా చ మహాబలా ।
సబలాః సానుగాశ్చైవ సన్నహ్యన్త యథాక్రమమ్ ॥ 2 ॥

ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ఇద్దరు అశ్వినులు స్వసైన్యములతో కూడ యుద్ధానికి సన్నద్ధులగుచుండినారు.

పురుహూతస్తు పురతో లోకపాలః సహస్రదృక్ ।
గ్రామణీః సర్వదేవానామారురోహ సురద్విపమ్ ॥ 3 ॥

మధ్యే చాస్య రథః సర్వపక్షిప్రవరరంహసః ।
సుచారు చక్ర చరణో హేమవజ్రపరిష్కృతః ॥ 4 ॥

పురుహూతుడను పేరుతో పిలువబడువాడు, వేయి కన్నులు గలవాడు, లోకపాలకుడూ అయిన ఇంద్రుడు దేవతలందరికి నాయకుడై దేవగజమగు ఐరావతమును అధిష్ఠించాడు. దేవతల యొక్క సైన్యపు మధ్యమున సర్వ పక్షి శ్రేష్ఠుడైన గరుత్మంతుని వంటి వేగము గల, అందమైన చక్రములతో, బంగారంతో, వజ్రములతో పరిష్కరింపబడిన ఆ ఇంద్రుని రథముండెను.

దేవగంధర్వ యక్షౌ ఘైరనుయాతః సహస్రశః ।
దీప్తిమద్భి స్సదస్యైశ్చ బ్రహ్మర్షిభి రభిష్టుతః ॥ 5 ॥

వజ్ర విస్ఫూర్జితోద్భూతై ర్విద్యుదిన్ద్రాయుధోదితైః ।
యుక్తో బలాహకగణైః పర్వతైరివ కామగైః ॥ 6 ॥

యమారూఢః స భగవాన్ పర్యేతి సకలం జగత్ ।
హవిర్ధానేషు గాయన్తి విప్రా మఖముఖేష్థితాః ॥ 7 ॥

వేలకొలది దేవ గంధర్వ యక్షాదులు ఆ రథమునను సరించారు. దీప్తిమంతులైన బ్రహ్మర్షులు యజ్ఞాయాగాది కర్మల యందుండు సదస్యులు ఆ రథమునకు అన్ని వైపుల నిలిచి స్తోత్రం చేశారు. పిడుగులతో, గర్జనములతో, మెరుపులతో మరియు ఇంద్రధనస్సులతో పరివ్యాప్తమైన పర్వతాకారములోనున్న మేఘమును బోలిన ఆ రథమందు ఇంద్రుడు తన ఇచ్ఛానుసారముగా సకలలోకములు సంచరిస్తాడు.

స్వర్గే శక్రానుయాతేషు దేవతూర్య నినాదిషు ।
సుందర్యః పరినృత్యన్తి శతశోఽప్సరసాం గణాః ॥ 8 ॥

యజ్ఞారంభమున హవిర్ధానములను స్థానములయందు వేద పాఠము చేయు విప్రులు అక్కడ ఇంద్రుని కీర్తిస్తూ వేదగానం చేయుచుండినారు. స్వర్గలోకమున యుద్ధసన్నద్ధమై బయల్దేరిన ఆ శక్రుని సేనయందు దేవతలు తూర్యాది వాద్యములు మ్రోగించుచుండగా సౌందర్యవతులైన అప్సరసలు వందలకొలదిగా నృత్యము చేశారు.

కేతునా నాగరాజేన రాజమానో యథా రవిః ।
యుక్తో హయసహస్రేణ మనోమారుత రంహసా ॥ 9 ॥

స స్యందనవరో భాతి గుప్తో మాతలినా తదా ।
కృత్స్నః పరివృతో మేరుః భాస్కరస్యేవ తేజసా ॥ 10 ॥

నాగరాజైన శేషుని ధ్వజముతో కూడిన ఆ రథము సూర్యుని వంటి కాంతితో ప్రకాశించుచుండెను. మరియు మనోవేగముతో వాయువేగముతో సమానముగా పురుగెత్తునటువంటి వేయి అశ్వములతో కూడినట్టి శ్రేష్ఠమైన ఆ రథము మాతలి అను సారథిచేత రక్షింపబడుచున్నదై మేరుపర్వతమంతయూ వ్యాపించిన సూర్యుని యొక్క తేజస్సు వంటి కాంతి గలిగినదై యుండెను.

యమస్తు దండముద్యమ్య కాలయుక్తశ్చ ముద్గరమ్ ।
తస్థౌ సురగణానీకే దైత్యాన్ నాదేన భీషయన్ ॥ 11 ॥

కాలపాశం, దండం, ముద్గరం మొదలైనవి కలిగియున్నట్టి యముడు దైత్యులను భయపెట్టుచూ, దేవతల సైన్యం ముందు నిలిచాడు.

చతుర్భిస్సాగరైర్యుక్తో లేలిహానైశ్చ పన్నగైః ।
శంఖముక్తాంగదధరో బిభ్రత్తోయమయం వపుః ॥ 12 ॥

కాలపాశాన్ సమావిధ్యన్ హయైః శశికరోపమైః ।
వాయ్వేరితైర్జలాకారైః కుర్వల్లీలాః సహస్రశః ॥ 13 ॥

పాండురోద్ధూతవసనః ప్రవాలరుచిరాంగదః ।
మణిశ్యామోత్తమవపుః హరిభారార్పితో వరః ॥ 14 ॥

వరుణః పాశభృన్మధ్యే దేవానీకే స తస్థివాన్ ।
యుద్ధవేలామభిలషన్ భిన్నవేల ఇవార్ణవః ॥ 15 ॥

ఇంతలో వరుణుడు నాలుగు సముద్రములతోనూ, భయంకరముగ కదులుచున్న నాలుకలు గల సర్పములతోనూ, శంఖములు మరియు ముత్యములు కూడ పొదిగినటువంటి గదతోను, జలమయమైన శరీరముతోనూ, కాలపాశమును ధరించినవాడై చంద్రుని వెన్నెల వంటి తెల్లని అశ్వములు కలిగిన రథంతోనూ, గాలి వలన కదులుతున్న తరంగములు గల జలముతోనూ, వేలకొలది విలాసములు ప్రకటించుచు, తెల్లని వస్త్రము ధరించి, పగడములతో పొదిగిన భుజకీర్తులతో, మణులతో నీలాకారము పొందిన శరీరముతో, శ్రేష్ఠమైన హారభారముతో, పాశమును ధరించినవాడై దేవతల సైన్యపు మధ్యమున నిలుచుండెను. ఉవ్వెత్తున్న ఎగురుతున్న తరంగములతో ఒడ్డుదాటి వచ్చుచున్న సముద్రము వలే అత్యంత ఉత్కంఠతతో వరుణుడు యుద్ధము కొరకై వేచి చూస్తున్నట్లుండెను.

యక్ష రాక్షససైన్యేన గుహ్యకానాం గణైరపి ।
యుక్తశ్చ శంఖపద్మాభ్యాం నిధీనామధిపః ప్రభుః ॥ 16 ॥

రాజరాజేశ్వరః శ్రీమాన్ గదాపాణి రదృశ్యత ।
విమానయోధీ ధనదో విమానే పుష్పకే స్థితః ॥ 17 ॥

స రాజరాజః శుశుభే యుద్ధార్థీ నరవాహనః ।
ఉక్షాణమాస్థితః సంఖ్యే సాక్షాదివ శివః స్వయమ్ ॥ 18 ॥

అపుడు నిధులకు అధిపతి, రాజాధిరాజులకే ఈశ్వరుడు (రాజరాజేశ్వరుడు కుబేరుడని ఈ పురాణంలో చెప్పబడినది) ధనదుడూ అయిన కుబేరుడు యక్షరాక్షసాదుల సైన్యముతో, గుహ్యక గణముతో శంఖపద్మాది నిధులతో, గదాపాణియై యుద్ధమునకు సన్నద్ధుడయ్యెను. విమాన యోధియైన ఆ కుబేరుడు పుష్పకవిమానము నధిరోహించెను. మరియు ధనాధిపతి రాజరాజు అని పేరుపొందిన ఆ కుబేరుడు యుద్ధార్థియై నరవాహనారూఢుడై వృషభము నెక్కి వచ్చిన శివుని వలె ప్రకాశించెను.

పూర్వపక్షః సహస్రాక్షః పితృరాజస్తు దక్షిణః ।
వరుణం పశ్చిమం పక్షం ఉత్తరం నరవాహనః ॥ 19 ॥

చతుర్షు యుక్తాశ్చత్వారో లోకపాలా మహాబలాః ।
స్వాసు దిక్షు స్వరక్షన్త తస్య దేవబలస్య తే ॥ 20 ॥

సహస్రాక్షుడైన ఇంద్రుడు తూర్పుదిశను, పితృరాజైన యముడు దక్షిణదిశను, వరుణుడు పశ్చిమదిశను, నరవాహనుడైన కుబేరుడు ఉత్తరదిశను రక్షించుచు మహాబలులైన ఆ నలుగురు ఆ లోకపాలకులు దేవసైన్యమును నాలుగువైపులనుండి కాపాడుచుండిరి.

సూర్యః సప్తాశ్వయుక్తేన రథేనామిత గామినా ।
శ్రియా జాజ్వల్యమానేన దీప్యమానైశ్చ రశ్మిభిః ॥ 21 ॥

ఉదయాస్తగ చక్రేణ మేరుపర్వతగామినా ।
త్రిదివ ద్వార చక్రేణ తపతా లోకమవ్యయమ్ ॥ 22 ॥

సహస్రరశ్మియుక్తేన భ్రాజమానేన తేజసా ।
చచార మధ్యేలోకానాం ద్వాదశాత్మా దినేశ్వరః ॥ 23 ॥

ద్వాదశాత్ముడు, దినేశ్వరుడూ అయిన సూర్యుడు సప్తాశ్వములతో కూడిన అమితమైన వేగము గలిగిన రథమునధిరోహించి దీప్తిమంతములైన స్వకిరణముల యొక్క శోభలో ప్రకాశిస్తూ, ఉదయించుట, అస్తమించుట అను మిషతో మేరుపర్వతము వరకు వెళ్ళగలిగిన, తన కాన్తి చేత స్వర్గలోక ద్వారమును కూడ ప్రకాశింపజేయునట్టి సహస్రరశ్మియుక్తుడైన ఆ సూర్యుడు దేవతల యొక్క సైన్యము మధ్యలో నిలిచాడు.

సోమఃశ్వేతహయైర్యాతి స్యందనే శీతరశ్మివాన్ ।
హిమవత్తోయ పూర్ణాభిః భాభిరాహ్లాదయన్ జగత్ ॥ 24 ॥

తమృక్షపూగానుగతం శిశిరాంశుం ద్విజేశ్వరమ్ ।
శశచ్ఛాయాంకితతనుం నైశస్య తమసః క్షయమ్ ॥ 25 ॥

జ్యోతిషామీశ్వరం వ్యోమ్ని రసానాం రసదం ప్రభుమ్ ।
ఓషధీనాం సహస్రాణాం నిధానమమృతస్య చ ॥ 26 ॥

జగతః ప్రథమం భాగం సౌమ్యం సత్యమయం రథమ్ ।
దదృశుర్దానవాః సోమం హిమప్రహరణం స్థితమ్ ॥ 27 ॥

తెల్లని కిరణములు గలిగిన చంద్రుడు శ్వేతాశ్వములు గల రథము నధిరోహించి హిమజలములతో కూడిన చల్లని కాంతులతో జగత్తును ఆహ్లాదపరుస్తూ యుద్ధానికి బయల్దేరెను. నక్షత్రముల గుంపులచే అనుసరింపబడిన, చల్లని కిరణములు గలిగిన, కుందేటి మచ్చగలిగిన శరీరము గల్గినట్టి, రాత్రులలో అంధకారమును నశింపజేయునట్టి, జ్యోతిర్గణములకు మరియు ఓషధులకు అధిపతి ఐనట్టి అమృతనిధియైనట్టి, జగత్తులో మొదటిదైన సౌమ్యభాగరూపము కలిగినట్టి, సత్యమయుడైనట్టి, హిమమే ఆయుధముగా గలిగినట్టి, సత్యమయుడైనట్టి, హిమమే ఆయుధముగా గలిగినట్టి, రథము నెక్కి వచ్చుచున్నట్టి ఆ చంద్రుని దానవులు చూశారు.

యః ప్రాణఃసర్వభూతానాం పంచధా భిద్యతే నృషు ।
సప్తధాతుగతో లోకాన్ త్రీన్ దధార చచార చ ॥ 28 ॥

యమాహురగ్నికర్తారం సర్వప్రభవమీశ్వరమ్ ।
సప్తస్వరగతో యశ్చ నిత్యం గీర్భిరుదీర్యతే ॥ 29 ॥

యం వదన్త్యుత్తమం భూతం యం వదన్త్యశరీరిణమ్ ।
యమాహురాకాశగమం శీఘ్రగం శబ్దయోనిగమ్ ॥ 30 ॥

సవాయు స్సర్వభూతాయు రుద్భూతః స్వేన తేజసా ।
వవౌ ప్రవ్యథయన్ దైత్యాన్ ప్రతిలోమం స తోయదః ॥ 31 ॥

ఎవరు ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమాన అను ఐదు భాగములుగా సర్వభూతముల ప్రాణమై యుండునో, సప్తధాతువులు కలిగియున్న మూడులోకములను ఎవరు ధరించునో మరియు నిర్మించునో, ఎవరు అగ్నికి సృష్టికర్తయని చెప్పబడునో, ఎవరు చరాచర ప్రపంచమునకు మూలకారణుడైన ఈశ్వరుడని చెప్పబడెనో, ఎవరు సప్తస్వరములందుండునో, ఎవరు వాక్కుల రూపమున కీర్తింపబడునో, ఎవరిని ఉత్తముడని లోకులందురో, ఎవరు శరీరహితుడో,ఎవరు ఆకాశమున సంచరించునో, ఎవరు శబ్దసృష్టికి కారణభూతుడో, ఎవరు సర్వభూతములకు ఆయువు (ప్రాణము)గా ఉండునో, ఆవాయు దేవుడు తన తేజస్సుతో అక్కడ దేవసైన్యమున ఉద్భవించి మేఘములతో కూడ అధికముగా వీచుచు దైత్య సైన్యమును భయపెట్టెను.

మరుతో దివ్యగంధర్వై ర్విద్యాధరగణైః సహ ।
చిక్రీడురసిభిః శుభ్రైః నిర్ముక్తైరివ పన్నగైః ॥ 32 ॥

మరుత్తులను గణదేవతలు, గంధర్వులతోను, విద్యాధరులతోను కలిసి కుబుసము విడిచిన సర్పములవంటి ఖడ్గములతో యుద్ధభూమి యందాడుచుండిరి.

సృజన్తస్సర్పపతయస్తీవ్రం దోషమయం విషమ్ ।
శరభూతా దివీన్ద్రాణాం చేరుర్వ్యాత్తాననా దివి ॥ 33 ॥

సర్పరాజులందరూ తీవ్రమైన విషము గ్రక్కుచు ఇంద్రాది దేవతలకు తామే బాణములై భయంకరముగా నోళ్ళు తెరుచుకుని ద్యులోకమున సంచరించసాగారు.

పర్వతైశ్చ శిలాశృంగైః శతశైశ్చైవ పాదపైః ।
ఉపతస్థుస్సురగణాః ప్రహర్తుం దానవే బలే ॥ 34 ॥

ఇతర దేవగణములందరు కూడ పర్వతములతో, శిలలతో, శిఖరములతో, వందలకొలది వృక్షములతో దానవసైన్యమును కొట్టుటకై సన్నద్ధులైనారు.

యః స దేవో హృశీకేశః పద్మనాభస్త్రివిక్రమః ।
యుగాన్తే కృష్ణవర్ణాభో విశ్వస్య జగతఃప్రభుః ॥ 35 ॥

సర్వయోనిః స మధుహా హవ్యభుక్ క్రతు సంస్థితః ।
భూమ్యాపో వ్యోమ భూతాత్మా శ్యామః శాన్తికరోఽరిహా ॥ 36 ॥

అరిఘ్నమమరాదీనాం చక్రం గృహ్య గదాధరః ।
అర్కం నగాదివోద్యన్తం ఉద్యమ్యోత్తమ తేజసా ॥ 37 ॥

సవ్యేనాలంబ్య మహతీం సర్వాసురవినాశినీమ్ ।
కరేణ కాలీం వపుషా శత్రుకాలప్రదాం గదామ్ ॥ 38 ॥

అన్యైర్భుజైః ప్రదీప్తాభైః భుజగారిధ్వజః ప్రభుః ।
దధారాయుధజాతాని శార్‌ఙ్గాదీని మహాబలః ॥ 39 ॥

అపుడు దేవదేవుడు, హృశీకేశుడు, పద్మనాభుడు, త్రివిక్రముడు, యుగాన్తమున నల్లని రూపమును పొందువాడు, సర్వజగత్ప్రభువు, సర్వజగత్కారణుడు, మధు యను రాక్షసుని సంహరించినవాడు, యజ్ఞాదిక్రతువల యందు సన్నిహితుడై ఉండువాడు, హవిస్సులను భుజించువాడు, పృథివ్యప్తేజోవాయ్వాకాశ రూపముగలవాడు, నీలమేఘశ్యాముడు, శత్రునాశకుడు మరియు గదాధరుడూ అయిన శ్రీమన్నారాయణుడు సూర్యునివంటి ఉత్తమమైన తేజస్సు గలిగిన మరియు దేవతల శత్రువులను సంహరించగలిగిన చక్రాయుధమును కుడిచేతితోను, అసురులందరినీ నశింపజేయునట్టి శత్రువలందరికి ప్రళయకాలపుశక్తివలె కనబడునట్టిదియు అగు గదను ఎడమ చేతిలో ధరించాడు. మరియు సర్పశత్రువైన గరుడుడు ధ్వజముగా కలిగినవాడు, సర్వసమర్థుడు, మహాబలుడూ అయిన నారాయణుడు ఇతర భుజములతో శార్‌ఙ్గము మొదలగు ఆయుధములను ధరించాడు.

స కశ్యపస్యాత్మభువం ద్విజం భుజగభోజనమ్ ।
పవనాధిక సంపాతం గగనక్షోభకం ఖగమ్ ॥ 40 ॥

భుజగేంద్రేణ వదనే నివిష్టేన విరాజితమ్ ।
అమృతారంభనిర్ముక్తం మందరాద్రిమివోచ్ఛ్రితమ్ ॥ 41 ॥

కశ్యప ప్రజాపతి పుత్రుడు, పక్షిజాతీయుడు, సర్పభోజనుడు, వాయువు కన్న వేగముగా వెళ్ళువాడు, ఆకాశమును కూడ క్షోభింపజేయువాడు, నోటిలో నున్న సర్పరాజముతో ప్రకాశించువాడు, అమృతము కొరకై కవ్వముగా ఉపయోగించిన మందరపర్వతము వంటివాడు (అయిన గరుడని విష్ణువు అధిరోహించెనని 47వ శ్లోకము వరకు అన్వయించుకోవలెను).

దేవాసురవిమర్దేషు బహుశో దృఢవిక్రమమ్ ।
మహేన్ద్రేణామృతస్యార్థే వజ్రేణ కృతలక్షణమ్ ॥ 42 ॥

శిఖినం బలినం చైవ తప్తకుండలభూషణమ్ ।
విచిత్ర పత్రవసనం ధాతుమన్తమివాచలమ్ ॥ 43 ॥

దేవాసుర సంగ్రామముల యందు అనేక విధములుగా తన పరాక్రమమును ప్రదర్శించినవాడు, అమృత విషయమై ఇంద్రుడు వేసిన వజ్రాయుధపు మచ్చగలవాడు, శిఖగలవాడు, బలవంతుడు, కాంతిమంతములైన కుండలములను ధరించినవాడు, విచిత్రములైన రెక్కలు గలవాడు, గైరికాది ధాతువులతో ప్రకాశించునటువంటి పర్వతము వలె నున్నవాడు (అయిన గరుడుని విష్ణువధిష్ఠించాడు.)

స్ఫీతక్రోడావలంబేన శీతాంశుసమతేజసా ।
భోగిభోగావసక్తేన మణిరత్నేన భాస్వతా ॥ 44 ॥

పక్షాభ్యాం చారుపత్రాభ్యాం ఆవృత్యదివిలీలయా ।
యుగాన్తే సేంద్రచాపాభ్యాం తోయదాభ్యామివాంబరమ్ ॥ 45 ॥

దృఢమైన వక్షఃస్థలమందు వ్రేలాడుచున్నట్టి, చంద్రుని వంటి కాంతి గలిగినటువంటి, సర్పముల యొక్క పడగలయందున్నటువంటి మణిశ్రేష్ఠముతో ప్రకాశించుచున్నవాడైన మరియు సుందరములైన ఈకలతో కూడిన రెక్కలు గలిగిన, సునాయాసముగా ఆకాశమునావరించి సంచరించగల, యుగాంతమందు ఇంద్రధనుస్సుతో పాటు ఆకాశమునందు వ్యాప్తమైన మేఘము వంటివాడైన (గరుడుని విష్ణువు అధిష్ఠించాడు.)

నీలలోహితపీతాభిః పతాకాభిరలంకృతమ్ ।
కేతువేషప్రతిచ్ఛనం మహాకాయనికేతనమ్ ॥ 46 ॥

అరుణావరజం శ్రీమాన్ ఆరుహ్యా సమరే విభుః ।
సువర్ణస్వర్ణవపుషా సుపర్ణం ఖేచరోత్తమమ్ ॥ 47 ॥

నీల, ఎరుపు, పచ్చని వర్ణములు గల పతాకముల చేత అలంకరింపబడినవాడు, పతాకముతో కప్పబడిన మహా శరీరమనే గ్రహముగా ఉన్నట్టి, సూర్యుని రథసారథియైన అరుణునకు తమ్ముడైన, బంగారుకాంతి వంటి శరీరము కలవాడైన పక్షిశ్రేష్ఠుడైన గరుడుని శ్రీమాన్ మహావిష్ణువు అధిరోహించి సమరోద్యుక్తుడైనాడు.

తమన్వయుర్దేవగణాః మునయశ్చ సమాహితాః ।
గీర్భిఃపరమమస్త్రాభిః తుష్టువుశ్చ జనార్దనమ్ ॥ 48 ॥

దేవతలు, సమాహితచిత్తులైన మునులు ఉత్తమములైన మంత్రములతో పవిత్రములైన వాక్కులతో ఆ జనార్దనుని స్తుతిస్తూ అనుసరించారు.

తద్వైశ్రవణసంశ్లిష్టం వైవస్వతపురస్సరమ్ ।
ద్విజరాజపరిక్షిప్తం దేవరాజవిరాజితమ్ ॥ 49 ॥

చంద్రప్రభాభిర్విపులం యుద్ధాయ సమవర్తత ।
స్వస్త్యస్తు దేవేభ్య ఇతి బృహస్పతిరభాషత ॥ 50 ॥
స్వస్త్యస్తు దానవానీకే ఉశనా వాక్యమాదదే॥50॥

అప్పుడు దేవతల సైన్యము కుబేరుడు, యముడు, గరుడుడు, ఇంద్రుడు మొదలగు వారితో కూడినదై చంద్రుని కాంతులతో ప్రకాశించుచున్నదై యుద్ధమునకు సిద్ధమయ్యెను.ఆ సమయమున దేవతలకు శుభమగుగాక! యని బృహస్పతి అన్నాడు. దానవులకు శుభమగుగాక! యని శుక్రాచార్యుడన్నాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే తారకామయసంగ్రామే తారకామయ యుద్ధార్థం దైవతైః కృత సేనా సన్నాహో నామ చతుఃసప్తత్యధికశతతమోఽధ్యాయః ॥174॥

శ్రీమత్స్యమహాపురాణమున తారకామయసంగ్రామప్రస్తావమున దేవతల సేనాసన్నాహమనే
నూట డెబ్బై నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచసప్తత్యధికశతతమోఽధ్యాయః - నూటడెబ్బై ఐదవ అధ్యాయం

దేవాసుర యుద్ధం - దేవాసుర యుద్ధం

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

తాభ్యాం బలాభ్యాం సంజజ్ఞే తుములో విగ్రహస్తదా ।
సురాణామసురాణాం చ పరస్పర జయైషిణామ్ ॥ 1 ॥

పరస్పరము జయము కోరుకొంటున్న దేవతలకు మరియు అసురులకు మరియు వారి సేనలకు మధ్య తుముల యుద్ధము ఆరంభింపబడెను. పరస్పరము తుముల యుద్ధము చేయనారంభించారు.

దానవా దైవతైస్సార్థం నానాప్రహరణోద్యతాః ।
సమీయుర్యుధ్యమానా వై పర్వతా ఇవ పర్వతైః ॥ 2 ॥

అనేకవిధములైన ఆయుధములతో కూడినవారై దానవులు దేవతలతో యుద్ధం చేయసాగారు. అపుడు పర్వతములు పర్వతములతో యుద్ధము చేయుచున్నవా అనునట్లుండెను.

తత్సురాసురసంయుక్తం యుద్ధమత్యద్భుతం బభౌ ।
ధర్మాధర్మసమాయుక్తం దర్పేణ వినయేన చ ॥ 3 ॥

ఆ విధముగా సురులు అసురుల మధ్యలో జరుగుతున్న అత్యద్భుతమైన ఆ యుద్ధము ధర్మాధర్మములకు దర్ప-వినయములకు జరిగిన యుద్ధము వలె కనబడెను.

తతో రథై ర్విప్రయుక్తైః వారణైశ్చ ప్రచోదితైః ।
ఉత్పతద్భిశ్చ గగన మసిహస్తైః సమన్తతః ॥ 4 ॥

క్షిప్యమాణైశ్చ ముసలైః సమ్పతద్భిశ్చ సాయకైః ।
చాపైర్విస్ఫార్యమాణైశ్చ పాత్యమానైశ్చ ముద్గరైః ॥ 5 ॥

తద్యుద్ధమభవద్ఘోరం దేవదానవసంకులమ్ ।
జగతస్త్రాసజననం యుగసంవర్తకోపమమ్ ॥ 6 ॥

అపుడు ఎగిసిపడుతున్న రథములతో, అత్యంతముగా ప్రేరేపింపబడిన ఏనుగులతో, ఆకాశమునకు ఎగిరిపడుతున్న ఖడ్గహస్తులైన సైనికులతో, విసిరివేయబడుచున్న బాణములతో, విస్ఫార్యములైన ధనుష్యములతో మీద పడవేయబడుచున్న ముద్గరములతో దేవదానవులకు జరుగుతున్న ఆ భయంకరమైన యుద్ధము జగత్తునకంతటికిని భయము కలిగించుచున్నదై ప్రళయకాలము సమీపించినట్లుండెను.

హస్తముక్తైశ్చ పరిఘైః విప్రయుక్తైశ్చ పర్వతైః ।
దానవాః సమరే జఘ్నుః దేవానింద్రపురోగమాన్ ॥ 7 ॥

తే వధ్యమానా బలిభిః దానవైర్జయకాంక్షిభిః ।
విషణ్ణవదనా దేవా జగ్మురార్తిం పరాం మృధే ॥ 8 ॥

దానవులా యుద్ధమున తమ చేతులతో పరిఘములను మరియు పర్వతమును కూడ దేవతలపై విసిరి వేయుచు ఇంద్రాది దేవతలందరిని బాధపెట్టుచుండిరి. జయకాంక్షతో దానవ సైన్యములచే హింసింపబడుచున్న దేవతలు విషణ్ణవదనులై యుద్ధమున వ్యథ చెందుచుండిరి.

తేఽ స్త్రశూల ప్రమథితాః పరిఘైర్భిన్న మస్తకాః ।
భిన్నోరస్కా దితిసుతైర్వేముః రక్తం వ్రణైర్ముహుః ॥ 9 ॥

అసురులు తమను అస్త్రములతో, శూలములతో మథించుచుండగా మరియు పరిఘములతో తమ తలలను పగులగొట్టుచుండగా, అనేక ఆయుధములతో తమ వక్షఃస్థలములను చీల్చుచుండగా దేవతల యొక్క దేహముల నుండి రక్తము ప్రవహించసాగెను.

వేష్టితాః శరజాలైశ్చ నిర్యత్నాశ్చాసురైః కృతాః ।
ప్రవిష్టా దానవీం మాయాం న శేకుస్తే విచేష్టితుమ్ ॥ 10 ॥

బాణపు సమూహములను దేవతలపై సంధించుచు అసురులు వారిని యత్నరహితులనుజేసిరి. మరియు ఆ విధమైన దానవమాయలో పడిన దేవతలు నిశ్చేష్టులై పోయిరి.

అస్తంగతమివాభాతి నిష్ప్రాణసదృశాకృతిః ।
బలం సురాణామసురైర్నిష్ప్రయత్నాయుధం కృతమ్ ॥ 11 ॥

అసురులు అనేకవిధములైన ఆయుధములతో దేవతల సైన్యమును ప్రయత్నరహితమగునట్లు చేసిరి. దాని వలన ప్రాణరహితమైన ఆకృతిని పొందిన దేవతల సైన్యము అస్తమించినట్లు కనబడెను.

దైత్యచాపచ్యుతాన్ ఘోరాన్ ఛిత్వా వజ్రేణ తాఞ్ఛరాన్ ।
శక్రో దైత్యబలం ఘోరం వివేశ బహులోచనః ॥ 12 ॥

అప్పుడు సహస్రనేత్రుడైన ఇంద్రుడు దైత్యుల యొక్క ధనుష్యముల నుండి విడువబడిన పదునైన బాణములను తన వజ్రాయుధముతో ఛేదించుచు దైత్యసైన్యమందు ప్రవేశించెను.

స దైత్య ప్రముఖాన్ హత్వా తద్దానవబలం మహత్ ।
తామసేనాస్త్రజాలేన తమోభూత మథాకరోత్ ॥ 13 ॥

ఇంద్రుడు దానవ ప్రముఖులందరిని సంహరించి ఆ మహాదానవ సైన్యమును తామసమైన అస్త్రజాలమును పయోగించి అంధకారమయము జేశాడు.

తేఽన్యోన్యం నావబుధ్యన్త దేవానాం వాహనాని చ ।
ఘోరేణ తమసావిష్టాః పురుహూతస్య తేజసా ॥ 14 ॥

పురుహూతుడైన ఇంద్రుని తేజస్సుచేత సృష్టింపబడిన మోహాంధకారమున పడిన దానవులు పరస్పరము వారిని వారే తెలుసుకోలేకపోయారు. దేవతల వాహనములను కూడ గుర్తించలేక పోయారు.

మాయాపాశైర్విముక్తాస్తు యత్నవంతః సురోత్తమాః ।
వపూంషి దైత్యసింహానాం తమోభూతాన్యపాతయన్ ॥ 15 ॥

అపుడు దేవతలు ప్రయత్నవంతులై మాయాపాశములను వదిలించుకొని తమస్సుచేత వ్యాప్తములైన దైత్యులదేహములను పడగొట్టసాగిరి.

అపధ్వస్తా విసంజ్ఞాశ్చ తమసా నీలవర్చసా ।
పేతుస్తే దానవగణాః ఛిన్న పక్షా ఇవాద్రయః ॥ 16 ॥

ధ్వంసింపబడినవారై తెలివిని కోల్పోయినవారై నల్లని దేహములతో ఆ దానవులందరూ రెక్కలు విరిగిన పర్వతములవలె పడిపోయారు.

తద్ఘనీభూత దైత్యేన్ద్ర మన్ధకార మివార్ణవే ।
దానవం దేవకదనం తమోభూతమివాభవత్ ॥ 17 ॥

ఇంద్రునిచే సృష్టింపబడిన ఆ తమస్సుచే మహాసముద్రమున వ్యాపించిన అంధకారము వలె దానవులందరూ ఒక ముద్దగా చేసినట్లు కనబడసాగిరి. దేవతలచే సృష్టింపబడిన ఆ తమస్సు వలన జగత్తునంతయూ అంధకార మయమైనట్లుండెను.

తదాసృజన్మహామాయాం మయస్తాం తామసీం దహన్ ।
యుగాన్తోద్యోతజననీం సృషా మౌర్వేణ వహ్నినా ॥ 18 ॥

అప్పుడు మయుడను దైత్యుడు ఇంద్రుని ఆ తామసమాయను దహించి వేయగల మహామాయను ఔర్వాగ్ని (బడబాగ్ని)తో కూడ సృష్టించాడు.

సా దదాహ తతఃసర్వాన్ మాయా మయ వికల్పితా ।
దైత్యాశ్చాదిత్య వపుషః సద్య ఉత్తస్థురాహవే ॥ 19 ॥

మయునిచే సృష్టింపబడిన ఆ మహామాయ దేవతలందరిని దహింపసాగెను. అప్పుడు దైత్యులందరూ రవిసమాన తేజస్సు కలవారై ఉవ్వెత్తున లేచి రణరంగమున నిలిచిరి.

మాయామౌర్వీం సమాసాద్య దహ్యమాన దివౌకసః ।
భేజిరే చంద్రవిషయం శీతాంశుం సలిలప్రదమ్ ॥ 20 ॥

తౌ దహ్యమానా హ్యౌర్వేణ వహ్నినా నష్టచేతసః ।
శశంసుర్వజ్రిణం దేవాః సంతప్తాః శరణైషిణః ॥ 21 ॥

బడబాగ్నితో కూడుకొన్న తమను చేరి దహించుచుండగా దేవతలందరు చల్లని కిరణములు గలదియు జలములో కూడుకొని యున్నదియు అయిన చంద్రుడున్న ప్రదేశమునకు వెళ్ళిరి. మరియు ఔర్వాగ్ని మాయచే

దహింపబడుచున్న వారందరూ ఆ బాధను తట్టుకోలేనివారలై చేష్టాహీనులై ఇంద్రుని శరణు వేడారు. తమను రక్షింపమని ప్రార్థించారు.

సంతప్తే మాయయా సైన్యే హన్యమానే చ దానవైః ।
చోదితో దేవరాజేన వరుణో వాక్యమబ్రవీత్ ॥ 22 ॥

దానవులు సృష్టించిన ఆ మాయచేత తమ సైన్యము దహించివేయబడుతూ సంతప్తమగుచుండుట చూచి, దేవరాజైన ఇంద్రునిచే ప్రేరేపింపబడిన వరుణుడు అతనితో ఇట్లన్నాడు.

ఊర్వో బ్రహ్మర్షిజః శక్ర! తపస్తేపే సుదారుణమ్ ।
ఊర్వస్త్వపూర్వతేజస్వీ సదృశో బ్రహ్మణో గుణైః ॥ 23 ॥

తం తపంతమివాదిత్యం తపసా జగదవ్యయమ్ ।
ఉపతస్థుర్మునిగణాః దివ్యా దేవర్షిభిస్సహ ॥ 24 ॥

హిరణ్యకశిపుశ్చైవ దానవో దానవేశ్వరః ।
ఋషిం విజ్ఞాపయామాసుః పురా పరమతేజసమ్ ॥ 25 ॥

ఓ ఇంద్రా! ఊర్వుడు బ్రహర్షివంశజుడు, అపూర్వమైన తేజోవంతుడు, గుణములలో బ్రహ్మతో సమానుడు, అతడు మహాదారుణమైన తపమాచరించాడు. నిర్వికారుడై ఘోరమైన తపస్సు చేస్తూ ఆదిత్యుని వలే ప్రకాశించుచున్న ఆ ఊర్వుని దగ్గరకు మునులు దేవర్షులు, దేవతలు మొదలగు వారందరు వెళ్ళారు. మరియు దానవేశ్వరుడైన హిరణ్యకశిపుడు కూడ వచ్చాడు. వారందరూ పురారి సమతేజస్కుడైన ఆ ఊర్వుడనే ఋషిని ఇట్లు ప్రార్థించారు.

ఊచుర్బ్రహ్మర్షయస్తం తు వచనం ధర్మసంహితమ్ ।
ఋషివంశేషు భగవన్ ఛిన్నమూలమిదం పదమ్ ॥ 26 ॥

ఏకస్త్వ మనపత్యశ్చ గోత్రాయాన్యో న వర్తతే ।
కౌమారం వ్రతమాస్థాయ క్లేశమేవానువర్తసే ॥ 27 ॥

బ్రహ్మర్షులు ధర్మసహితములైన వచనములతో ఇట్లు పలికారు. ఓ పరమపూజ్యుడా! ఋషి వంశముల యందు మీ స్థానము మూలచ్ఛేదము కాబోవుచున్నది. నీవా సంతానము లేనివాడవు, అనపత్యుడవు, మీ వంశమునందు గోత్ర వృద్ధికారకులింకెవరునూ లేరు. ఇపుడు నీవు బ్రహ్మచర్యవ్రతమునను సరిస్తూ తపస్సు చేయుచూ అత్యన్త క్లేశాన్ని పొందుతున్నావు.

బహూని విప్రగోత్రాణి మునీనాం భావితాత్మనామ్ ।
ఏకదేహాని తిష్ఠన్తి వివిక్తాని వినా ప్రజాః ॥ 28 ॥

ఏవముచ్ఛిన్నమూలైశ్చ పుత్రైర్నో నాస్తి కారణమ్ ।
భవాంస్తు తపసా శ్రేష్ఠో ప్రజాపతి సమద్యుతిః ॥ 29 ॥

తత్ర వర్తస్వ వంశాయ వర్ధయాత్మానమాత్మనా ।
త్వయా ధర్మోర్జితస్తేన ద్వితీయాం కురు వై తనుమ్ ॥ 30 ॥

భావితాత్ములైన మునులకు సంబంధించిన అనేక విప్రగోత్రములు సంతానము లేక అనగా తమ నుండి ఎవరునూ జన్మించక పోవుట వలన వంశోద్ధారకులు లేక ఏకదేహులై ఉన్నారు. ఇట్లు పుత్రులు లేక ఛిన్నమూలములైన వంశములు గల వారితో ఇపుడు మాకు పనిలేదు. నీవైతే తపస్సంపన్నుడవు, ప్రజాపతితో, సమానమైన కాంతి గలవాడవు కావున నీవు నీ వంశమును కాపాడుకొనుటకు ప్రయత్నించుము, నీ వంశమును వృద్ధి పొందునట్లు చేయగలిగే శక్తి గలవాడవు, నీవు ధర్మమును తెలిసికొనినవాడవు కనుక ఇపుడు నీ నుండి ఇంకొక దేహాన్ని సృష్టించు అని చెప్పారు.

స ఏవముక్తో మునిభి రూర్వో మర్మసు తాడితః ।
జగర్హే తానృషిగణాన్ వచనం చేదమబ్రవీత్ ॥ 31 ॥

యథాయం విహితో ధర్మో మునీనాం శాశ్వతస్తు సః ।
ఆర్షం వై సేవతః కర్మ వన్యమూలఫలాశినః ॥ 32 ॥

బ్రహ్మయోనౌ ప్రసూతస్య బ్రాహ్మణస్యాత్మదర్శినః ।
బ్రహ్మచర్యం సుచరితం బ్రహ్మాణమపి చాలయేత్ ॥ 33 ॥

మునులచేత, దేవర్షులచేత ఆ విధముగా చెప్పబడిన ఊర్వుడు మర్మస్థానమునందు దెబ్బకొట్టినట్లు బాధపడి ఆ ఋషిగణమును నిందిస్తూ వారితో ఇట్లన్నాడు. మునులందరిచేత అనుసరింపబడవలసిన శాశ్వతమైన ధర్మం ఏదైతే చెప్పబడిందో నేను దానినే అనుసరిస్తున్నాను. ఆర్షమైన ఈ ధర్మాన్ని అనుసరిస్తూ, వన్యమూల ఫలాలను సేవిస్తూ, బ్రహ్మవంశ పరంపరయందు జన్మించి, స్వాత్మను దర్శించి అనగా ఆత్మజ్ఞానము పొందిన బ్రాహ్మణుడు బ్రహ్మచర్యవ్రతాన్ని చక్కగా అనుసరించిన తపోనిష్ఠులు బ్రహ్మను కూడ నడిపిస్తారు.

జనానాం వృత్తయస్త్రిస్రో యద్ గృహాశ్రమవాసినామ్ ।
అస్మాకం తు వరం వృత్తి ర్వనాశ్రమనివాసినామ్ ॥ 34 ॥

అబ్భక్షా వాయుభక్షాశ్చ దన్తోలూఖలినస్తథా ।
అశ్మకుట్టా దశ తపాః పంచాతప సహాశ్చ తే ॥ 35 ॥

ఏతే తపసి తిష్ఠన్తి వ్రతైరపి సుదుష్కరైః ।
బ్రహ్మచర్యం పురస్కృత్య ప్రార్థయన్తి పరాంగతిమ్ ॥ 36 ॥

గృహస్థాశ్రమవాసులైనవారికి ఉపకరించువృత్తులు మూడు విధములు.(యాజనము=యజ్ఞయాగాది కర్మలాచరించి వాటి ద్వారా వచ్చు ధనముతో జీవనవృత్తిని సాగించుట, అధ్యాపనము= శిష్యులకు వేదాది విద్యలను బోధించి వారి తల్లిదండ్రులు, రాజులు మొదలగువారు వారి ఇచ్ఛానుసారము ఇచ్చినటువంటి ధనముతో జీవన వృత్తి సాగించుట, ప్రతిగ్రహము=సాత్త్వికములైన దానములు గ్రహించి జీవించుట అని గృహస్థాశ్రమంలో ఉండువారికి సంబంధించిన జీవనవృత్తిని పురాణములు శాస్త్రగ్రంథములు తెలుపుచున్నవి) కాని వనాశ్రమ

వాసులమైన మాబోటివారలకు సంబంధించిన శ్రేష్ఠమైన వృత్తి భిన్నముగానే ఉండును. దానిననుసరించి వనాశ్రమవాసులమైన మాకు జలభక్షణము, వాయుభక్షణము, వృక్షపుకొయ్యతో చేయబడిన రోలు రోకలి ఇత్యాదుల సహాయంతో ధాన్యమును, సంస్కరించుకుని అది భక్షించుట, రాళ్ళపై ధాన్యమును, దుంపలను అరగదీసి,వాటిని మరల చూర్ణములుగా చేసికొని భక్షించుట, ఎటువంటి ఆహారము తినకుండా ఉండుట మొదలగు వాటిని అనుసరిస్తూ పంచాగ్నుల వేడిని కూడ భరిస్తూ నిరన్తరం తపస్సు చేస్తూ, దుష్కరములైన వ్రతనియమాదులను అనుసరించుట, బ్రహ్మచర్యనియమమును కఠినంగా పాటిస్తూ పరమగతిని పొందుటనే పరమావధిగా శాస్త్రాలు విధించాయి. (ఇంతే కాక ఉపాసకులకు మరియు సద్ బ్రాహ్మణులకు 1. అయాచిత 2. ఉంఛ 3. శుక్ల 4. భిక్షా అను నాలుగు వృత్తులు అనగా జీవనోపాయాలను కూడ కొన్ని పురాణాలలో ధర్మశాస్త్ర గ్రంథాలలో వివరించబడ్డాయి. అయాచితవృత్తి యనగా యాచించకుండా ఇతరులెవరైనా వారి ఇష్టానుసారము తెచ్చి ఇచ్చినది మాత్రమే స్వీకరించి జీవనం సాగించుట, ఉంఛవృత్తి = పంటపొలాలలో రైతు సేకరించుకుని పోగా మిగిలిన ధాన్యాన్ని సమకూర్చుకుని జీవించుట ఇత్యాదులు, శుక్లవృత్తి = తన సాటి బ్రాహ్మణుని నుండి మాత్రమే యాచించి తెచ్చుకున్నట్టి ఆహారాదులతో జీవించుట, భిక్షవృత్తి = శాస్త్రనిషిద్ధాలు కానటువంటి వారి నుండి శాస్త్ర నిషిద్ధాలు కాని ఆహారమును మాత్రమే యాచించి దానితో జీవనయానం సాగించుట ఇత్యాది వివరాలు చాలా సందర్భాలలో పురాణాదులలో వ్రాయబడి వున్నాయి.)

బ్రహ్మచర్యా ద్బ్రాహ్మణస్య బ్రాహ్మణత్వం విధీయతే ।
ఏవమాహుః పరే లోకే బ్రహ్మచర్యవిదో జనాః ॥ 37 ॥

బ్రహ్మచర్యే స్థితం ధైర్యం బ్రహ్మచర్యే స్థితం తపః ।
యే స్థితా బ్రహ్మచర్యేషు బ్రాహ్మణా దివి సంస్థితాః ॥ 38 ॥

బ్రహ్మచర్యం పాటించుటవలనే బ్రాహ్మణుడు బ్రాహ్మణుడనిపించుకొంటాడు. అని బ్రహ్మచర్య విదులైన పండితులు లోకమందు చెప్పుచున్నారు. బ్రహ్మచర్యమునందే ధైర్యత్వమున్నది, బ్రహ్మచర్యము నందే తపస్సు నిలిచియున్నది, ఎవరైతే ఇహలోకమున బ్రహ్మచర్యమును స్థిరచిత్తులై నిష్ఠతో అనుసరింతురో వారే స్వర్గలోకానికి వెళుతారు.

నాస్తి యోగం వినా సిద్ధిర్నవా సిద్ధిం వినా యశః ।
నాస్తి లోకే యశోమూలం బ్రహ్మచర్యాత్పరం తపః ॥ 39 ॥

యోగము లేకుండా సిద్ధి కలుగదు, సిద్ధిలేనిదే యశము = కీర్తిలేదు, యశస్సుకు మూలమైన బ్రహ్మచర్యమనే తపస్సుకు మించినది ఈ లోకమున మరొకటి లేదు.

యో నిగృహ్యేంద్రియగ్రామం భూతగ్రామం చ పంచకమ్ ।
బ్రహ్మచర్యం సమాధత్తే కిమతః పరమం తపః ॥ 40 ॥

ఎవడు ఇంద్రియములను నిగ్రహించుకొని పంచమహాభూతములను స్వాధీనపరుచుకొని బ్రహచర్యవ్రతము నాచరించునో అట్టివాని తపస్సునకంటే అధికమైన తపస్సు లోకమున ఉండదు.

అయోగే కేశధరణం అసంకల్పవ్రతక్రియా ।
అబ్రహ్మచర్యే చర్యాయ త్రయం స్యాద్దంభసంజ్ఞకమ్ ॥ 41 ॥

యోగాభ్యాసము చేయకనే యోగివలె కనబడుటకు జుట్టు పెంచుకొనుట (శిఖాధారణము చేయుట) నిర్దిష్టమైన సంకల్పము లేకుండానే వ్రతనియమాదులను ఆచరించుట, బ్రహ్మచర్యవ్రతము పాటించకయే బ్రహ్మచారి చేయు పనులను ఆచరించుట మొదలగు మూడు పనులు కేవలం దాంభికుల లక్షణములు.

క్వ దారాః క్వ చ సంయోగః క్వ చ భావివిపర్యయః ।
నన్వియం బ్రహ్మణా సృష్టా మనసా మానసీః ప్రజాః ॥ 42 ॥
యద్యస్తి తపసో వీర్యం యుష్మాకం విదితాత్మనామ్ ।
సృజధ్వం మానసాన్ పుత్రాన్ ప్రాజాపత్యేన కర్మణా ॥ 43 ॥

ఎక్కడ భార్య? ఎక్కడ భార్యాసంయోగము, ఎక్కడ భావవిపర్యయము? ఎక్కడ మనోవికారము? ఇదంతయు బ్రహ్మ సృష్టించిన మానస ప్రజాసృష్టియే కదా, ఒక వేళ ఆత్మతత్త్వమెరిగిన మీకు తపఃశక్తి ఉన్నట్లైతే ప్రాజాపత్య కర్మానుష్ఠానముతో మానస పుత్రులను సృష్టించుటకు యత్నింపుము. (ప్రాజాపత్యకర్మానుష్ఠానమనగా ఆ యుగమున దేవతలు, ఋషులు, మునులు తమ తపశ్శక్తి చేత భార్యా సంబంధము లేకనే సంతానమును పొందేవారు)

మనసా నిర్మితా యోనిరాధాతవ్యా తపస్విభిః ।
న దారయోగో బీజం వా వ్రతముక్తం తపస్వినామ్ ॥ 44 ॥

యదిదం లుప్తధర్మార్థం యుష్మాభిరిహ నిర్భయైః ।
వ్యాహృతం సద్భిరత్యర్థమ సద్భిరివ మే మతమ్ ॥ 45 ॥

తపస్వులైనవారు తమ మనస్సంకల్పముచేత సృష్టింపబడిన యోని యందు తమ తపశ్శక్తిచేత పొందినటువంటి వీర్యమును నిలిపి సంతానము పొందవలయును కాని భార్యసంపర్కముతో సంతానప్రాప్తిని పొందే వ్రతమేదియును తపోనిష్ఠులకు చెప్పబడలేదు. సజ్జనులైన మీరు నిర్భయులై పలికిన ధర్మతత్త్వము ఏమీ లేనటువంటి మాటలు నాకు అసజ్జనులు పలికే మాటలుగా తోచుచున్నవి.

వపుర్దీప్తాన్తరాత్మానమేతత్ కృత్వా మనోమయమ్ ।
దారయోగం వినా స్రక్ష్యే పుత్రమాత్మ తనూరుహమ్ ॥ 46 ॥

ఏవమాత్మానమాత్మా మే ద్వితీయం జనయిష్యతి ।
వన్యేనానేన విధినా దిధిక్షన్తమివ ప్రజాః ॥ 47 ॥

దీప్తిమంతమైన అంతరాత్మ కలిగిన నేను భార్యాసంబంధము లేకయే మనస్సంకల్పముతో నా శరీరజుడగు పుత్రుని సృష్టిస్తాను. ఇట్లు వానప్రస్థులైన తపస్వుల కొరకు విధింపబడిన ప్రాజాపత్య విధానము ద్వారా నా ఆత్మ నుండి రెండవ ఆత్మను సృష్టిస్తాను. నా ద్వారా సృష్టింపబడినవాడు ప్రజలను దహింపజేసే కోరిక గలవాడేమో యనునట్లుంటాడు.

ఊర్వస్తు తపసావిష్టో నివేశ్యోరుం హుతాశనే ।
మమన్థైకేన దర్భేణ సుతస్య ప్రభవారిణమ్ ॥ 48 ॥

తస్యోరుం సహసా భిత్త్వా జ్వాలామాలీ హ్యనింధనః ।
జగతో దహనా కాంక్షీ పుత్రోఽగ్నిః సమపద్యత ॥ 49 ॥

ఊర్వస్యోరుం వినిర్భిద్య ఔర్వో నామాన్తకోఽనలః ।
దిధక్షన్నివ లోకాంస్త్రీన్ జజ్ఞే పరమకోపనః ॥ 50 ॥

తరువాత తపోనిష్ఠుడైన ఊర్వుడు తన (ఊరువు) తొడను అగ్నిపై నిలిపి ఒక దర్భచేత స్వపుత్రోత్పత్తికి కారణమగు తన ఊరువును మధించెను. అపుడు అత్యన్త వేగముగా ఆతని ఊరువుని ఛేధించుకొని జ్వాలలే మాలలుగా కలవాడైన ఇంధనములు లేకనే ప్రకాశించువాడూ, జగములను దహింపగోరువాడూ అయిన అగ్నియే పుత్రుడుగా జన్మించాడు. ఈ విధముగా ఊర్వుని ఊరువుల నుండి ఉద్భవించినవాడు కనుక అనలుడు ఔర్వుడు అనే పేరు పొందాడు. అత్యన్తకోప స్వభావుడైన ఈ ఔర్వుడనే అగ్ని ముల్లోకములను దహింపగోరుచున్నట్లుగా ఉండెను.

ఉత్పన్నమాత్రశ్చోవాచ పితరం క్షీణయా గిరా ।
క్షుధా మే బాధతే తాత జగద్భక్ష్యే త్యజస్వ మామ్ ॥ 51 ॥

త్రిదివారోహిభిర్జ్వాలైః జృమ్భమాణో దిశో దశ ।
నిర్దహన్ సర్వభూతాని వవృధే సోఽన్తకోఽనలః ॥ 52 ॥

అట్లు జన్మించిన వెంటనే ఔర్వుడు దీనముగా తన తండ్రితో ఇట్లన్నాడు. ఓ తండ్రీ! నన్ను ఆకలి బాధపెట్టుచున్నది. నన్ను వదిలిపెట్టుము, ఈ లోకమునంతటిని భక్షింతును అన్నాడు. వెంటనే స్వర్గలోకము వరకు ఎగిసే జ్వాలలతో విజృంభిస్తూ ఆ అన్తకాగ్ని దశదిక్కులయందు వ్యాపిస్తూ సర్వభూతములను దహిస్తూ వృద్ధిపొందింది.

ఏతస్మిన్నన్తరే బ్రహ్మా మునిమూర్వం సభాజయన్ ।
ఉవాచ వార్యతాం పుత్రో జగతశ్చ దయాం కురు ॥ 53 ॥

అస్యాపత్యస్య తే విప్ర కరిష్యే స్థానముత్తమమ్ ।
తథ్యమేతద్వచః పుత్ర శ్రుణు త్వం వరదాంవర ॥ 54 ॥

ఇంతలో బ్రహ్మదేవుడు ఊర్వుని దగ్గరకు వచ్చి ఆతనిని అనునయిస్తూ "పుత్రుడా ! నీ పుత్రుని వారించు, జగత్తు పై దయ జూపు, ఓ బ్రాహ్మణా! నీ ఈ పుత్రునకు నేను ఉత్తమమైన స్థానాన్ని కల్పిస్తాను, ఇది సత్యం, ఓ విద్వాంసుడా! నా మాట విను అని చెప్పెను.

ఊర్వః ఉవాచ – ఊర్వుడు పలికాడు.

ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యన్మేఽద్య భగవాఞ్ఛిశోః ।
మతిమేతాం దదాతీహ పరమానుగ్రహాయ వై ॥ 55 ॥

ప్రభాతకాలే సంప్రాప్తా కాంక్షితవ్యే సమాగమే ।
భగవంస్తర్పితః పుత్రః కైర్హవ్యైః ప్రాప్యతే సుఖమ్ ॥ 56 ॥

కుత్ర చాస్య నివాసః స్యాద్భోజనం వా కిమాత్మకమ్ ।
విధాస్యతీహ భగవాన్ వీర్యతుల్యం మహౌజసః ॥ 57 ॥

దేవా! నేను ధన్యుడను, అనుగ్రహింపబడినవాడినైతిని, భగవంతుడవైన నీవు ఈ శిశువు పై అనుగ్రహముతో ఇటువంటి ఉపదేశం ఇస్తున్నావు. ప్రభాతకాలమున మా ఇరువురి సమాగమము కాంక్షింపదగినదే కదా! (ప్రాతఃకాలమున తండ్రి తన కొడుకును వాత్సల్యముతో దగ్గరకు తీసుకొనుట సామాన్యమే కదా) కనుక ఓ దేవా! అప్పుడు నా ఈ పుత్రుని ఏ హవిస్సులతో తృప్తి పరిచినచో ఆతనికి తృప్తి కలుగును? ఇతని నివాసమెక్కడ? మహత్త్వమైన ఓజస్సు గల ఈతని పరాక్రమమునకు తగిన ఎటువంటి భోజనం నీవు ఏర్పాటు చేస్తావు అని ప్రార్థించాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

వడవాముఖేऽస్య వసతిః సముద్రే వై భవిష్యతి ।
మమ యోనిర్జలం విప్ర తస్య పీతవతః సుఖమ్ ॥ 58 ॥

యత్రాహమాస నియతం పిబన్వారిమయం హవిః ।
తద్ధవిస్తవ పుత్రస్య విసృజామ్యాలయం చ తత్ ॥ 59 ॥

ఓ విప్రుడా! ఈతనికి సముద్రమునందు గల ఆడుగుర్రపు నోటియందు అనగా అటువంటి ఆకృతి గల ప్రదేశమున నివాసము ఏర్పరుతను, నా జన్మ హేతువైన జలమే ఈతనికి ఆహారమై సుఖప్రదమగును. నేను ఎల్లప్పుడు ఎచటనైతే నివసిస్తూ అక్కడి జలమయమగు హవిస్సునే ఆరగించుచుంటినో ఆ జలమునే ఈ నీ పుత్రునకు నివాసస్థలముగా మరియు ఆ హవిస్సునే ఆహారరూపంగా వదులుతున్నాను.

తతో యుగాన్తే భూతానా మేష చాహం చ పుత్రక ।
సహితౌ విచరిష్యావో నిష్పుత్రాణా మృణాపహౌ ॥ 60 ॥

ఏషోऽగ్నిరన్తకాలే తు సలిలాశీ మయా కృతః ।
దహనః సర్వభూతానాం సదేవాసుర రక్షసామ్ ॥ 61 ॥

తర్వాత ఓ పుత్రకా! యుగాన్త మందు నేను మరియు ఈ నీ పుత్రుడు కలిసి సంచరింతుము ఇతడు పుత్ర సంతానము లేని వారికి పుత్రుడై నీటినంతటిని త్రాగునట్లు గాను దేవాసురరాక్షసులందరిని దహించి వేయునట్లునూ నేను ఏర్పాటు చేయుదును అని బ్రహ్మ ఊర్వునకు చెప్పెను.

ఏవమస్త్వితి తం సో ऽగ్ని సంవృతజ్వాలమండలః ।
ప్రవివేశార్ణవముఖం ప్రక్షిప్య పితరి ప్రభామ్ ॥62 ॥

అట్లే కానిమ్ముమని అంగీకరించి ఆ అగ్నికూడ తన జ్వాలా మండలమునంతటిని మరుగుపరుచుకొని, స్వతేజస్సును తండ్రియైన ఊర్వుని యందుంచి సముద్రపు ముఖమందు ప్రవేశించెను.

ప్రతియాతస్తతో బ్రహ్మా యే చ సర్వే మహర్షయః ।
ఊర్వ స్యాగ్నేః ప్రభాం జ్ఞాత్వా స్వాంస్వాంగతిముపాశ్రితాః ॥ 63 ॥

అటు తర్వాత బ్రహ్మ స్వలోకమునకు వెళ్ళిపోయెను, అపుడు మహర్షులందరు కూడ ఊర్వుని కుమారుడైన అగ్నియొక్క తేజోవిశేషమును తెలిసికొని స్వస్వప్రదేశములకు వెళ్ళిపోయారు.

హిరణ్య కశిపుర్దృష్ట్వా తదా తన్మహదద్భుతమ్ ।
ఊర్వం ప్రణత సర్వాంగో వాక్యమేతదువాచ హ ॥ 64 ॥

భగవన్నద్భుతమిదం సంవృతం లోకసాక్షికమ్ ।
తపసా తే మునిశ్రేష్ఠః పరితుష్టః పితామహః ॥ 65 ॥

ఆ మహాద్భుతమును చూచిన హిరణ్యకశిపుడు సర్వాంగములతో ఊర్వునకు నమస్కరించి అతనితో ఇట్లన్నాడు. ఓ పూజ్యుడా! లోకమంతయూ సాక్షిగా ఉండగా ఈ అద్భుతం జరిగింది. ఓ మునిశ్రేష్ఠా! నీ తపస్సుచేత పితామహుడైన బ్రహ్మదేవుడు కూడ సంతోషించాడు.

అహం తు తవ పుత్రస్య తవ చైవ మహావ్రత ।
భృత్య ఇత్యవగన్తవ్యః సాధ్యో యదిహ కర్మణా ॥ 66 ॥

తన్మాం పశ్య సమాపన్నం తవైవారాధనే రతమ్ ।
యది సీదే మునిశ్రేష్ఠ! తదైవ స్యాత్పరాజయః ॥ 67 ॥

ఓ మహావ్రతుడా! నీ చేత సాధింపబడిన ఈ మహత్కార్యము చేత నేను నీకు నీకుమారునకు కూడ భృత్యుడనని భావింపవలసినది. ఓ మునిశ్రేష్ఠా! నిన్ను ఆశ్రయించి నీ సేవలోనే ఆసక్తుడనై ఉన్న నన్ను చూడు, ఇక పిమ్మట నాకు ఏదైనా క్లేశం కలిగిన అది నీ పరాజయమేనని తెలిసికో.

ఊర్వ ఉవాచ – ఊర్వుడు పలికాడు.

ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య తేఽహం గురుః స్థితః ।
నాస్తి మే తపసానేన భయమద్యేహ సువ్రత ॥ 68 ॥

తామేవ మాయాం గృహ్ణీష్వ మమ పుత్రేణ నిర్మితామ్ ।
నిరిన్ధనా మగ్నిమయీం దుర్ధర్షాం పావకైరపి ॥ 69 ॥

నీ అంతటివాడికి గురువునైనాను. కావున నేను ధన్యుడను, నేను అనుగ్రహింపబడ్డాను. ఓ సువ్రతుడా! నేను ఇంతవరకు ఆచరించిన ఈ తపస్సు వలన నాకెట్టి భయము లేదు. నా పుత్రునిచే నిర్మితమైనట్టి ఇంధనములో పనిలేకుండా జ్వలించునట్టి అగ్ని రూపముననున్నట్టి పావకాగ్నులచేత జయింపబడనట్టి ఈ ఔర్వమాయనే నీకిస్తున్నాను, తీసుకో అని ఊర్వుడన్నాడు.

ఏషా తే స్వస్య వంశస్య వశగాఽరివినిగ్రహే ।
సంరక్షత్యాత్మపక్షం చ విపక్షం చ ప్రధర్షతి ॥ 70 ॥

ఏవ మస్త్వితి తాం గృహ్య ప్రణమ్య మునిపుంగవమ్ ।
జగామ త్రిదివం హృష్టః కృతార్థో దానవేశ్వరః ॥

ఓ హిరణ్యకశిపా! ఈ మాయ శత్రువలను నిగ్రహించుటలో నీ వంశము వారందరికీ అధీనమై వుంటుంది. ఇది స్వపక్షాన్ని రక్షిస్తుంది శత్రుపక్షాన్ని జయిస్తుంది. అని ఊర్వుడు చెప్పగా విని హిరణ్యకశిపుడు సరేనని దానిని గ్రహించి ఆ మునిపుంగవునకు నమస్కరించి సంతుష్టుడై కృతార్థుడై స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు.

ఏషా దుర్విషహో మాయా దేవైరపి దురాసదా ।
ఔర్వేణ నిర్మితా పూర్వం పావకేనోర్వసూనునా ॥ 72 ॥

ఈ మాయ సహించుటకు శక్యము కానటువంటిది, దేవతల చేత కూడ జయించుటకు శక్యము కానటువంటిది, ఊర్వుని ఊరువులనుండి ఉద్భవించిన ఔర్వునిచే నిర్మింపబడినటువంటి పావకాగ్ని ఇది.

తస్మింస్తు వ్యుత్థితే దైత్యే నిర్వీర్యైషా న సంశయః ।
శాపో హ్యస్యాః పురాదత్తః సృష్టా యేనైవ తేజసా ॥ 73 ॥

యద్యేషా ప్రతి హన్తవ్యా కర్తవ్యో భగవాన్ సుఖీ ।
దీయతాం మే నఖా శక్ర తోయయోనిర్నిశాకరః ॥ 74 ॥

తేనాహం సహ సంగమ్య యాదోభిశ్చ సమావృతః ।
మాయా మేతాం హనిష్యామి త్వత్ప్రసాదాన్న సంశయః ॥ 75 ॥

దీనిని ప్రయోగించిన దైత్యుని అణిచివేసినచో ఈ మాయ నిర్వీర్యమౌతుంది. ఈ విషయంలో సంశయం లేదు. ఇది ఏ మునియొక్క తేజస్సుచేత నిర్మింపబడినదో ఆతనిచేతనే శాపం పొందింది. ఒకవేళ ఈ మాయను అణిచి వేయవలెనన్నచో, భగవానుడవైన నిన్ను సుఖవంతునిగా చేయవలెనన్నచో ఓ ఇంద్రా! జలమునుండియే ఉద్భవించిన చంద్రుని నాకు సహాయకునిగా ఇమ్ము. నేను అతనితో మరియు జలజంతువులతో కూడ కలిసి వెళ్ళి ఈ మాయను నశింపజేస్తాను, ఇది నీ అనుగ్రహం ద్వారానే శక్యమౌతుంది. సందేహింపకు అని వరుణుడు ఇంద్రునితో అన్నాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే తారకామయ సంగ్రామే దేవాసుర యుద్ధం నామ
పంచసప్తత్యధిక శతతమోఽధ్యాయః ॥175॥

శ్రీమత్స్యమహాపురాణమున తారకామయసంగ్రామ సందర్భమున దేవాసురయుద్ధమనే
నూటడెబ్బై అయిదవ అధ్యాయం సమాప్తం.

షట్ సప్తత్యధిక శతతమోఽధ్యాయః – నూటడెబ్బై ఆరవ అధ్యాయం

తారకామయ యుద్ధమ్ – దేవతలకు మరియు తారకామయునకు జరిగిన యుద్ధం

మత్స్య ఉవాచ – మత్స్యుడు పలికాడు.

ఏవ మస్త్వితి సంహృష్టః శక్ర స్త్రిదశవర్ధనః ।
సందిదేశాగ్రతః సోమం యుద్ధాయ శిశిరాయుధమ్ ॥ 1 ॥

దేవతలయొక్క వృద్ధినే కాంక్షించు ఇంద్రుడు వరుణుని మాటలు విని సంతోషముతో సరేనని అంగీకరించి శిశిరాయుధుడైన చంద్రుని ముందుగా యుద్ధానికి వెళ్ళమని సందేశించాడు.

గచ్ఛ సోమ సహాయత్వం కురు పాశధరస్య వై ।
అసురాణాం వినాశాయ జయార్థం చ దివౌకసామ్ ॥ 2 ॥

ఓ చంద్రా! పాశధరుడైన వరుణునకు సహాయంగా వెళ్ళు. అసురుల వినాశానికి దేవతల జయానికి తోడ్పడు.

త్వం మత్తః ప్రతివీర్యశ్చ జ్యోతిషాం చేశ్వరేశ్వరః ।
త్వన్మయం సర్వలోకేషు రసం వేదవిదో విదుః ॥ 3 ॥

క్షయవృద్ధీ తవ వ్యక్తే సాగరస్యేవ మండలే ।
పరివర్త స్యహోరాత్రం కాలం జయతి యోజయన్ ॥ 4 ॥

నీవు మాకంటే శక్తిమంతుడవు, జ్యోతిస్సులకు పరమేశ్వరుడువు. సర్వలోకములయందలి రసద్రవ్య మంతయూ చంద్రమయమేనని వేదవేత్తలు చెబుతారు. సముద్రుడికి వలే నీకు కూడ క్షయం, వృద్ధిరెండూ కలవు, కాలమును జగత్తునకు అన్వయం జేస్తూ నీవు అహోరాత్రాలను పరివర్తనం చేస్తావు.

లోకచ్ఛాయామయః లక్ష్మ తవాఙ్కః శశసన్నిభః ।
న విదుః సోమ దేవాపి యే చ నక్షత్రయోనయః ॥ 5 ॥

త్వమాదిత్య పథాదూర్ధ్వం జ్యోతిషాం చోపరిస్థితః ।
తమః ప్రోత్సార్య మహసా భాసయన్వృఖిలం జగత్ ॥ 6 ॥

ఈ లోకపు నీడతో ఏర్పడిన గుర్తు నీ యందు కుందేటి రూపమును పొంది కనబడుతున్నది. ఓ చంద్రా! నక్షత్రముల జన్మకు కారణభూతులైన దేవతలకు కూడ నీ మహిమ తెలియదు. నీవు ఆదిత్య మండలమున కంటే నక్షత్రమండలమున కంటే ఊర్ధ్వముననున్నావు. నీ శక్తితో లోకములోని అంధకారాన్ని పోగొట్టి వెలుతురులో ప్రకాశింపజేస్తావు.

శ్వేతభానుర్హిమతను ర్జ్యోతిషా మధిపఃశశీ ।
అధికృత్కాలయోగాత్మా ఇష్టో యజ్ఞశ్చ సోఽ వ్యయః ॥ 7 ॥

ఓషధీశః క్రియాయోనిః అబ్జయోనిరనుష్ణభాః ।
శీతాంశు రమృతాధారశ్చపలః శ్వేతవాహనః ॥ 8 ॥

నీవు తెల్లని కిరణములు కలవాడవు, హిమమయమైన కాంతిగలవాడవు, నీవు జ్యోతిస్సులకధిపతివి, అధికమైన శుభము కలిగించువాడవు, కాలయోగాత్ముడవు, అవ్యయుడవు, యజ్ఞమన ఇష్టము కలవాడవు, ఓషధులకు అధిపతివి, జనులాచరించే క్రియలన్నింటికి కారణభూతుడవు, కుముదములను వికసింపజేయువాడవు, ఊష్ణత్వరహితుడవు, శీతలకిరణములు కలవాడవు, అమృతధారలు కలవాడవు మరియు శ్వేతవాహనుడవు.

త్వం కాన్తిః కాన్తివపుషాం త్వం సోమః సోమపాయినామ్ ।
సౌమ్యస్త్వం సర్వభూతానాం తిమిరఘ్నస్త్వ మృక్షురాట్ ॥ 9 ॥

తద్గచ్ఛ త్వం మహాసైన్యం వరుణేన వరూథినా ।
శమయ త్వాసురీం మాయాం యయా దహ్యామ సంయుగే ॥ 10 ॥

కాంతిమంతులైన వారియొక్క శరీరపు కాంతివి నీవే, సోమపానము చేయువారికి సోమము నీవే, సర్వభూతములయందు సౌమ్యుడవు నీవే, అంధకారమును నశింపజేయువాడవు నీవే, నక్షత్రములకు నీవే రాజువు, ఇటువంటి అనేక గుణములు కలవాడివి కావున కవచధారియైన వరుణుడితో కూడ మహాసేనలోనికి వెళ్ళుము, మనలందరిని దహించివేయబోవుచున్న ఆ అసురమాయను శమింపజేయుము.

సోమ ఉవాచ - సోముడు చెప్పాడు

యన్మాం వదసి యుద్ధార్థే దేవరాజ వరప్రద ।
ఏవం వర్షామి శిశిరం దైత్యమాయాపకర్షణమ్ ॥ 11 ॥

ఏతాన్ మచ్ఛీతనిర్దగ్ధాన్ పశ్య స్వహిమవేష్టితాన్ ।
విమాయాన్ విమదాంశ్చైవ దైత్యసింహాన్మహాహవే ॥ 12 ॥

వరప్రదుడవైన ఓ దేవరాజా ఇంద్రా! నీవే స్వయంగా నన్ను యుద్ధానికి వెళ్ళుమని ఆదేశిస్తున్నావు కనుక నీవు చెప్పినట్లే దైత్యమాయను నశింపజేయు మంచును వర్షిస్తాను. సింహములను బోలిన ఈ దైత్యులందరూ నా మంచు వర్షముచే దగ్ధులై ఈ మహాయుద్ధము నందు మాయా హీనులు, మదహీనులు కూడ అవుతారు; చూడు.

తథా హిమకరోత్సృష్టాః సపాశా హిమవృష్టయః ।
వేష్టయన్తి స్మ తాన్ ఘోరాన్ దైత్యాన్ మేఘగణా ఇవ ॥ 13 ॥

అట్లు హిమకరుడు ప్రయోగించ పాశములతో కూడిన హిమవర్షములు మేఘగణములవలే ఘోరరూపులైన ఆ దైత్యులను చుట్టుకొన్నాయి.

తౌ పాశ శీతాంశుధరా వరుణేందూ మహాబలౌ ।
జఘ్నతుర్హిమపాతైశ్చ పాశపాతైశ్చ దానవాన్ ॥ 14 ॥

ద్వావమ్బునాథౌ సమరే తౌ పాశహిమయోధినౌ ।
మృధే చేరతురమ్భోభిః క్షుబ్ధావివ మహార్ణవౌ ॥ 15 ॥

పాశధరుడైన వరుణుడు హిమధరుడైన చంద్రుడును మహాబలవంతులై పాశపాతములతో, హిమ పాతములతో దానవులను యుద్ధమునందు చంపుచుండిరి. జలాధినాథులు మరియు పాశహిమధరులూ అయిన వారిరువురు యుద్ధమునందు కల్లోలితమైన సముద్రము వలే నీటిచేత కల్లోలం సృష్టించుచుండిరి.

తాభ్యామాప్లావితం సైన్యం తద్దానవమదృశ్యత ।
జగత్సంవర్తకాంభోదైః ప్రవిష్టైరివ సంవృతమ్ ॥ 16 ॥

తావుద్యతామ్బమునాథౌతు శశాంకవరుణావుభౌ ।
శమయామాసతుర్మాయాం దేవా దైత్యేన్ద్ర నిర్మితామ్ ॥ 17 ॥

వారిద్దరి చేత ముంచివేయబడిన దానవ సైన్యము జగత్ప్రళయ కాలపు మేఘములు తమ సైన్యమున ప్రవేశించి వాటి చేత తాము కప్పివేయబడుచున్నారో యనునట్లుండెను. మరియు జలాధినాథులైన ఆ శశాంక వరుణులిద్దరూ దైత్యేంద్రుడైన మయునిచే నిర్మింపబడిన ఆ మాయను శమింపజేశారు.

శీతాంశుజలనిర్దగ్ధాః పాశైశ్చ స్పందితా రణే ।
న శేకుశ్చలితుం దైత్యాః విశిరస్కా ఇవాద్రయః ॥ 18 ॥

చంద్రుని హిమకిరణములచేత నిర్దగ్ధులై, వరుణుని పాశములతో బంధింపబడినవారై ఆదైత్యులు శిఖరములు లేని పర్వతములవలే కదలలేక అక్కడే ఉండిపోయారు.

శీతాంశు విహితాస్తే తు దైత్యాస్తోయహిమార్దితాః ।
హిమాప్లావిత సర్వాంగా నిరుష్మాణ ఇవాగ్నయః ॥ 19 ॥

తేషాం తు దివి దైత్యానాం విపరీత ప్రభాణి వై ।
విమానాని విచిత్రాణి ప్రపతున్త్యుత్పతన్తి చ ॥ 20 ॥

చల్లని కిరణములచేత మరియు జలములచేత మర్దింపబడినవారై, మంచుచేత కప్పివేయబడిన ఆ దైత్యులు మంచుచేత వేడిలేకుండా చేయబడిన అగ్నులవలె కనబడ్డారు. అట్లు నిర్వీర్యులుగా చేయబడిన ఆ దైత్యుల యొక్క విపరీత కాంతులు కలిగినటువంటి విచిత్రములైనటువంటి విమానములు ఆకాశము పైకి ఎగురుచూ భూమి పై పడిపోవుచూ కనపడెను.

తాన్ పాశ హస్త గ్రథితాన్ ఛాదితాన్ శీతరశ్మిభిః ।
మయో దదర్శ మాయావీ దానవాన్ దివి దానవః ॥ 21 ॥

పాశములచేత కట్టివేయబడినటువంటి శీతలకిరణములచేత కప్పివేయబడినటువంటి దానవులందరిని మాయావియైన మయుడు చూచాడు.

స శిలాజాలవితతాం ఖడ్గచర్మాట్ట హాసినీమ్ ।
పాదపోత్కట కూటాగ్రాం కందరా కీర్ణకాననామ్ ॥ 22 ॥

సింహవ్యాఘ్రగణాకీర్ణాం నదద్భిర్గజయూథపైః ।
ఈహామృగగణాకీర్ణాం పవనాఘూర్ణితద్రుమామ్ ॥ 23 ॥

నిర్మితాం స్వేన యత్నేన కూజితాం దివి కామగామ్ ।
ప్రథితాం పార్వతీం మాయాం అసృజత్స సమన్తతః ॥ 24 ॥

అప్పుడు శిలల సమూహములచేత వ్యాప్తమైనట్టి, ఖడ్గముల యొక్క అట్టహాసపు ధ్వనులచేత నిండినటువంటి, ఉత్కటములైన మహావృక్షముల చేత వ్యాప్తమైన శిఖరాగ్రములు కలిగినటువంటి, గుహలయందు కూడ వ్యాపించిన అడవులు కలిగినటువంటి, సింహములు మరియు వ్యాఘ్రముల గణములచేత కూడుకొనియున్నటువంటి, గజయూథముల యొక్క ఘీంకారములచే ప్రతిధ్వనించుచున్నటువంటి, ఈహామృగగణములచేత పరివ్యాప్తమైనటువంటి, వాయువుల చేత కదిలించి వేయబడిన వృక్షములు కలిగినటువంటి, ఆకాశమునందు భయంకరమైన ధ్వనులు చేయుచున్నట్టి ఒక పర్వతమయమైన మాయను అత్యన్త ప్రయత్నముతో అక్కడ సృష్టించాడు.

సాసిశబ్దైః శిలావర్షైః సమ్పతద్భిశ్చ పాదపైః ।
జఘాన దేవసంఘాంశ్చ దానవాంశ్చాప్యజీవయత్ ॥ 25 ॥

ఆ పార్వత మాయ ఖడ్గముల ధ్వనులతోను, రాళ్ళవర్షముతోను, వృక్షపాతములతోను దేవ సమూహములను చంపుచు దానవులను జీవింపజేయుచుండెను.

నైశాకరీ వారణీ చ మాయేఽన్తర్దధతుస్తతః ।
అసిభిశ్చాయసగణైః కిరన్ దేవగణాన్ రణే ॥ 26 ॥

సాశ్మయన్త్రాయుధఘనా ద్రుమపర్వతసంకటా ।
అభవద్ఘోరసంచారా పృథివీ పర్వతైరివ ॥ 27 ॥

ఖడ్గములు మరియు ఇనుప ఆయుధముల సమూహములతో ఆ పార్వత మాయ దేవ సైన్యమును క్రమ్మివేయుచుండగా చంద్రవరుణులచే ప్రయోగింపబడిన మాయ అంతర్ధానమయ్యింది. అపుడు రాళ్ళతోను యంత్ర నిర్మితములైన ఆయుధములతోను, వృక్షములతోను మరియు పర్వతములతోను దట్టముగా వ్యాప్తిచెందిన ఆ యుద్ధభూమి సంచరించుటకు వీలుకానిదై పృథివి యంతయు పర్వతమయమైనట్లుండెను.

అశ్మనా ప్రహతాః కేచిచ్ఛిలాభిః శకలీకృతాః ।
నానిరుద్ధో ద్రుమగణైః దేవోఽదృశ్యత కశ్చన ॥ 28 ॥

తదపధ్వస్త ధనుషం భగ్నప్రహరణావిలమ్ ।
నిష్ప్రయత్నం సురానీకం వర్జయిత్వా గదాధరమ్ ॥ 29 ॥

దేవతలలో కొంతమంది రాళ్లతో కొట్టబడ్డారు. కొంతమంది శిలలచేత శకలాలుగా చేయబడ్డారు. వృక్షముల చేత నిరోధింపబడనటువంటి దేవతలలో ఒకడైననూ లేకుండెను. (దేవతలందరి మార్గములు అడ్డగించబడినవి) మరియు వారిలో కొంతమంది తమ ధనుష్కమును పోగొట్టుకొన్నారు. మరికొంతమంది తమ ఆయుధములు భగ్నం చేయబడుట వలన దుఃఖతప్తులైరి మరియు ప్రయత్నరహితులైనారు. ఒక్క గదాధరుడైన శ్రీమహావిష్ణువు తప్ప అందరూ తమ ఆయుధాలు పోగొట్టుకొన్నారు.

సహి యుద్ధగతః శ్రీమానీశానోఽశ్మ వ్యకమ్పత ।
సహిష్ణుత్వా జ్జగత్స్వామీ న చుక్రోధ గదాధరః ॥ 30 ॥

కాలజ్ఞః కాలమేఘాభః సమీక్షన్ కాలమాహవే ।
దేవాసుర విమర్దంతు ద్రష్టుకామస్తదా హరిః ॥ 31 ॥

యుద్ధమునందు ప్రవేశించిన శ్రీమంతుడూ, ఈశానుడూ అయిన శ్రీమహావిష్ణువు కొంచెము కూడ కంపించకపోయాడు. జగత్తునకే ప్రభువైన ఆ గదాధరుడు ఓర్పుగలవాడు కావున కోపించలేదు. మరియు కాలజ్ఞుడు, కాలమేఘము వంటి కాంతి గలవాడూ అయిన ఆ పరమాత్మ యుద్ధమున తగిన సమయమునకై నిరీక్షిస్తూ సురాసురుల మధ్యలో జరుగుతున్న యుద్ధమును చూచుటకై స్తబ్ధుడైయుండెను.

తతో భగవతా దృష్టౌ రణే పావకమారుతౌ ।
చోదితౌ విష్ణువాక్యేన తౌ మాయామపకర్షతామ్ ॥ 32 ॥

తాభ్యాముద్ధాన్త వేగాభ్యాం ప్రవృద్ధాభ్యాం మహాహవే ।
దగ్ధా సా పార్వతీ మాయా భస్మీభూతా ననాశ హ ॥ 33 ॥

అదే సమయమున యుద్ధరంగము శ్రీహరిచే అగ్ని వాయువులిద్దరూ చూడబడిరి. వెంటనే శ్రీహరి మాటలతో ప్రేరేపితులైన వారిద్దరు మయాసురుని మాయను ధ్వంసము చేయనారంభించిరి. మరియు ఆ మహాయుద్ధమున అత్యన్తవేగముతో వృద్ధిపొందిన వారిద్దరి చేత ఆ పర్వతమాయ దగ్ధమై, భస్మీభూతమై నశించిపోయెను.

సోఽనిలోఽనల సంయుక్తః సోఽనలశ్చానిలాకులః ।
దైత్యసేనాం దదహతుః యుగాన్తేష్వివ మూర్ఛితా ॥ 34 ॥

వాయుః ప్రధావితస్తత్ర పశ్చాదగ్నిస్తు మారుతమ్ ।
చేరతుర్దానవానీకే క్రీడన్తా వనిలానలౌ ॥ 35 ॥

అనిలుడైన వాయువు మరియు అనలుడైన అగ్ని పరస్పరము సహాయముతో యుగాంతమందు వలే అతిశీఘ్రముగా అంతట వ్యాపించి దైత్యసేనను దహించివేశారు. ఆ యుద్ధభూమి యందు వాయువు ఒక చోటికి

పరుగెత్తిపోగా అతనిననుసరించి అగ్ని ఆప్రదేశమునకు వెళ్ళి అటువైపు ఉన్నట్టి దైత్యసేనను దహించెను. ఇట్లు వారిద్దరు ఆటలాడుకొనుచున్నట్లుగా దానవసేనయందు సంచరించిరి.

భస్మావయవభూతేషు ప్రపతత్సూత్పతత్సు చ ।
దానావానాం విమానేషు నిపతత్సు సమన్తతః ॥ 36 ॥

వాత స్కంధాపవిద్ధేషు కృతకర్మణి పావకే ।
మాయాబంధే నివృత్తే తు స్తూయమానే గదాధరే ॥ 37 ॥

అగ్నివాయువులచేత దహింపబడిన అంగములు కలవారైన దానవులు పైకి ఎగిరిపడుచు లేచుచుండగా వారి యొక్క విమానములు కూడా ముక్కలుగా భిన్నమై అంతటా పడుచుండగా, మరికొన్ని వాతస్కంధములలోనికి ఎగిరిపడుచుండగా, అగ్ని తనపని తాను నిర్వర్తిస్తుండగా, మాయాబంధము పూర్తిగా నివృత్తమై పోవుచుండగా, గదాధరుడైన విష్ణువు స్తుతింపబడుచుండగా (కాలనేమియనే దానవుడు యుద్ధభూమి యందు ప్రవేశించాడు అని 48వ శ్లోకము వరకు అన్వయం చెప్పుకోవలసియున్నది)

నిష్ప్రయత్నేషు దైత్యేషు త్రైలోక్యే ముక్తబంధనే ।
సంప్రహృష్టేషు దేవేషు సాధు సాధ్వితి సర్వశః ॥ 38 ॥

జయే దశశతాక్షస్య దైత్యానాం చ పరాజయే ।
దిక్షు సర్వాసు శుద్ధాసు ప్రవృత్తే ధర్మవిస్తరే ॥ 39 ॥

అపావృతే చంద్రమసి స్వస్థానస్థే దివాకరే ।
ప్రకృతిస్థేషు లోకేషు త్రిషు చారిత్రబంధుషు ॥ 40 ॥

దైత్యులు ప్రయత్నహీనులగుచుండగా, ముల్లోకములు బంధవిముక్తములగుచుండగా, దేవతలందరూ సంతుష్టులగుచుండగా, “సాధు సాధు” (బాగు, బాగు) అనే ధ్వనులంతటా వినబడుచుండగా, దశశతాక్షుడు= సహస్రాక్షుడైన ఇంద్రుడు జయము పొందుచుండగా, దైత్యులందరూ పరాజితులగుచుండగా, దిశలన్నియు నిర్మలములగుచుండగా, ధర్మము సర్వత్ర ప్రవర్తమానమగుచుండగా, చంద్రుడు తన స్థానమునకు మరలిరాగా, సూర్యుడు స్వస్థానమున నిలువగా, ముల్లోకములు తమ స్వభావమును పొంది ధర్మము నిర్వర్తించుచుండగా,

యజమానేషు భూతేషు ప్రశాన్తేషు చ పాప్మసు ।
అభిన్నబంధనే మృత్యా హూయమానే హుతాశనే ॥ 41 ॥

యజ్ఞశోభిషు దేవేషు స్వర్గార్థం దర్శయత్సు చ ।
లోకపాలేషు సర్వేషు దిక్షు సంయానవర్తిషు ॥ 42 ॥

సర్వప్రాణులు యజ్ఞములాచరించుచుండగా, పాపములన్నియు నివృత్తములగుచుండగా, మృత్యువు అదుపులో ఉండగా, హుతాశనుడైన అగ్నిదేవుడు హవిస్సులతో ప్రీతిపొందుచుండగా, దేవతలందరూ

యజ్ఞభాగములతో శోభిల్లుచుండగా, మరల స్వర్గలోకమును చూచినవారగుచుండగా, లోకపాలకులందరు తమ తమ దిక్కులయందు తగిన విధముగా పాలించుచుండగా,

భావే తపసి సిద్ధానామభావే పాపకర్మణామ్ ।
దేవపక్షే ప్రముదితే దైత్యపక్షే విషీదతి ॥ 43 ॥

త్రిపాద విగ్రహే ధర్మే అధర్మే పాదవిగ్రహే ।
అపావృత్తే మహాద్వారే వర్తమానే చ సత్పథే ॥ 44 ॥

సిద్ధులయొక్క తపస్సులు ఫలించుచుండగా, పాపకర్మలు నశించుచుండగా, దేవ పక్షము ఆనందించుచుండగా, దైత్యపక్షము దుఃఖించుచుండగా, ధర్మము మూడు పాళ్ళు మరియు అధర్మము కేవలం ఒకపాలు మాత్రమే ప్రవర్తించబడుచుండగా, ధర్మప్రవృత్తమైన మహాద్వారము తెరుచుకొనుచుండగా, సర్వత్ర సన్మార్గమే కలుగుచుండగా,

లోకే ప్రవృత్తే ధర్మేషు సుధర్మేష్వాశ్రమేషు చ।
ప్రజా రక్షణయుక్తేషు భ్రాజమానేషు రాజసు ॥ 45 ॥

ప్రశాన్త కల్మషే లోకే శాంతే తమసి దానవే ।
అగ్నిమారుతయోస్తత్ర వృత్తే సంగ్రామకర్మణి ॥ 46 ॥

లోకము ధర్మమున ప్రవర్తింపబడుచుండగా, అందరిచే ఆయా ఆశ్రమధర్మములు అనుసరింపబడుచుండగా పరాక్రమవంతులైన రాజులు ప్రజా రక్షణలో నిమగ్నులగుచుండగా, లోకమున కల్మషములు ప్రశాంతించగా, అగ్ని వాయువులిద్దరు జరిపిన యుద్ధము వలన దానవులు తమోగుణము శాంతించుచుండగా,

తన్మయా విపులా లోకాస్తాభ్యాం కృతజయక్రియాః ।
పూర్వం దైత్యభయం శ్రుత్వా మారుతాగ్నికృతం మహత్ ॥ 47 ॥

కాలనేమీతి విఖ్యాతో దానవః ప్రత్యదృశ్యత ॥
భాస్కరాకారముకుటః శింజితాభరణాంగదః ॥ 48 ॥

అగ్నివాయువులు దేవతలకు కలిగించిన మహత్తర విజయమును మరియు వారిచే దానవులకు కలిగించిన భయమును కూడ విని కాలనేమి యనే విఖ్యాతుడైన దానవుడు హఠాత్తుగా అక్కడ కనబడ్డాడు. సూర్యుని బోలిన కిరీటముతో, శరీరమున ధరించిన ఆభరణముల ధ్వనులతో కూడినవాడై అతను ప్రవేశించెను.

మందరాద్రి ప్రతీకాశో మహారజతపర్వతః ।
శత ప్రహరణోదగ్రః శతబాహుః శతాననః ॥ 49 ॥

శతశీర్షః స్థితః శ్రీమాన్ శతశృఙ్గ ఇవాచలః ।
పక్షే మహతి సంవృద్ధో నిదాఘ ఇవ పావకః ॥ 50 ॥

ధూమ్రకేశో హరిశ్మశ్రు సందష్టోష్ఠపుటాననః ।
త్రైలోక్యాన్తర విస్తారి ధారయన్ విపులం వపుః ॥ 51 ॥

ఇంకనూ మందరపర్వతము వలే ప్రకాశించువాడు, వెండిపర్వతము వలె ఉన్నవాడు, భయంకరములైన వందలాది ఆయుధములను ధరించినవాడు, నూరు బాహువులు మరియు నూరు తలలు కలవాడు అగుట వలన నూరు శిఖరములు కలిగిన పర్వతమువలే ప్రకాశించుచున్నవాడు, ధూమ్రకేశుడు, పచ్చని మీసములు కలవాడు, కోపము వలన అదురుచున్న ముఖము మరియు పెదవులు కలవాడు, ముల్లోకములందంతటనూ వ్యాపించునంతటి విపులమైన శరీరము కలవాడైన ఆ కాలనేమి (ముందటి శ్లోకముతో అన్వయము చేసికోవలసి ఉన్నది).

బాహుభిస్తులయన్ వ్యోమ క్షిపన్ పద్భ్యాం మహీధరాన్ ।
ఈరయన్ ముఖనిఃశ్వాసైః వృష్టి యుక్తాన్ బలాహకాన్ ॥ 52 ॥

తన బాహువులతో ఆకాశమును కదల్చుచు, పాదములతో పర్వతపుకొండలను పడగొట్టుచు, వర్షించునటువంటి మేఘములను తన ముఖనిఃశ్వాసములచే చెదరగొట్టుచు యుద్ధమున ప్రవేశించాడు.

తిర్యగాయతరక్తాక్షం మందరోదగ్రవర్చసమ్ ।
దిధక్షన్త మివాయాన్తం సర్వాన్ దేవగణాన్ మృధే ॥ 53 ॥

తర్జయన్తం సురగణాన్ ఛాదయన్తం దిశోదశ ।
సంవర్తకాలే తృషితం దృష్టం మృత్యుమివోత్థితమ్ ॥ 54 ॥

కోపముతో విప్పారిన ఎర్రని కన్నులు గలవాడు, మందర పర్వతము వంటి ఉగ్రమైన వర్చస్సుకలవాడు, యుద్ధమునందు దేవగణములను దహించివేయుటకై వచ్చుచున్నవాడు, దేవగణములు కొట్టుచున్నవాడు, దశదిశలను కప్పివేయుచున్నవాడు, ప్రళయకాలమునందు అత్యన్త దప్పిక కలిగిన మృత్యువువలె పైకి లేచుచున్నవాడు.

సుతలేనోచ్ఛ్రయవతా విపులాంగులిపర్వణా ।
లమ్బాభరణపూర్ణేన కించిచ్చలిత కర్మణా ॥ 55 ॥

ఉచ్ఛ్రితేనాగ్రహస్తేన దక్షిణేన వపుష్మతా ।
దానవాన్దేవనిహతాన్ ఉత్తిష్ఠధ్వమితి బ్రువన్ ॥ 56 ॥

తం కాలనేమిం సమరే ద్విషతా కాలచేష్టితమ్ ।
వీక్షన్తే స్మ సురాః సర్వే భయవిత్రస్తలోచనాః ॥ 57 ॥

విశాలమైన కాంతివంతమైన అరచెయ్యి కలిగి, విపులములగు వ్రేళ్ళకణువులు గలిగి, వ్రేలాడుతున్న ఆభరణములతో, పైకి లేపిన కుడి ముంజేతి కలవాడై దేవతలచేత హతులైన దానవులను లెమ్ము లెమ్మని పిలుచుచూ, ఉసిగొల్పుచూ శత్రువులకు యుద్ధమునందు యముడివలె కనబడుచున్న ఆ కాలనేమి అనే దైత్యశ్రేష్ఠుని భయముచే కంపితములైన నేత్రములు గలవారైన దేవతలు చూచారు.

తం వీక్షన్తి స్మ భూతాని క్రమన్తం కాలనేమినమ్ ।
త్రివిక్రమం విక్రమన్తం నారాయణమివాపరమ్ ॥ 58 ॥

సోఽత్యుచ్ఛ్రయపురః పాదం మారుతాఘూర్ణితాంబరః ।
ప్రక్రామన్నసురో యుద్ధే త్రాసయామాస దేవతాః ॥ 59 ॥

తన అడుగులతో విక్రమిస్తున్న అపర నారాయణునివలె ముందుకు అడుగులువేస్తూ వస్తున్న ఆ కాలనేమిని సర్వభూతములు చూచుచుండెను. పైకి లేపిన ముందటి పాదములతో, చెలరేగిన గాలివలన ఆకాశమునే కంపింపజేయుచు ఆ కాలనేమి దైత్యుడు యుద్ధమునందు దేవతలందరిని భయపెట్టాడు.

సమయేనాసురేంద్రేణ పరిష్వక్తస్తతో రణే ।
కాలనేమిర్బభౌ దైత్యః సవిష్ణురివ మన్దరః ॥ 60 ॥


అప్పుడు అసుర శ్రేష్ఠుడైన మయునిచే యుద్ధభూమి యందు ఆలింగనము చేసికొనబడిన కాలనేమి దైత్యుడు మందరపర్వతముతో కూడిన విష్ణువువలె కనపడ్డాడు.

అథ వివ్యథిరే దేవాః సర్వే శక్రపురోగమాః ।
కాలనేమిం సమాయాన్తం దృష్ట్వా కాలమివాపరమ్ ॥ 61 ॥

అట్లు అపరకాలయముని వలే తమ వైపు వచ్చుచున్న కాలనేమిని చూచి ఇంద్రాది దేవతలందరూ మిగుల వ్యథను పొందారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తారకామయ యుద్ధే
షట్ సప్తత్యధిక శతతమోఽధ్యాయః ॥176॥

శ్రీమత్స్య మహాపురాణమున తారకామయ దేవతలకు మరియు తారకామయునకు జరిగిన యుద్ధమనే
నూట డెబ్బై ఆరవ అధ్యాయం సమాప్తం



సప్త సప్తత్యధికశతతమోఽధ్యాయః - నూటడెబ్బై ఏడవ అధ్యాయం

కాలనేమి విజయః - కాలనేమి విజయం

దానవానామనీకేషు కాలనేమిర్మహాసురః ।
వివర్ధిత మహాతేజా స్తపాన్తే జలదో యథా ॥ 1 ॥

దానవుల సైన్యము నందు మహాసురుడైన కాలనేమి తన మహాతేజస్సుతో వృద్ధి పొందుతూ గ్రీష్మాన్తమున ఆకాశమునందు వ్యాప్తమైన వర్షపు మేఘము వలె కనబడుతుండెను.

తం త్రైలోక్యాన్తరగతం దృష్ట్వా తే దానవేశ్వరాః ।
ఉత్తస్థురపరిశ్రాన్తాః పీత్వాఽమృతమనుత్తమమ్ ॥ 2 ॥

త్రిలోకాంతర్భాగమున నిండియున్న కాలనేమిని చూచి ఆ దానవేశ్వరులందరూ ఉత్తమమైన అమృతము త్రాగినంత సంతోషముతో తమ శ్రమను మరిచిపోయి లేచారు.

తే వీతభయసంత్రాసా మయతారపురోగమాః ।
తారకామయసంగ్రామే సతతం జితకాశినః ॥ 3 ॥

రేజురాయోధనగతాః దానవా యుద్ధకాంక్షిణః ।
మన్త్ర మభ్యసతాం తేషాం వ్యూహం చ పరిధావతామ్ ॥ 4 ॥

ప్రేక్షతాం చాభవత్ ప్రీతిర్దానవం కాలనేమినమ్ ।
యే తు తత్ర మయస్యాసన్ ముఖ్యా యుద్ధ పురస్సరాః ॥ 5 ॥

తే తు సర్వే భయం త్యక్త్వా హృష్టా యోద్ధుముపస్థితాః ।

మయుడు, తారుడు మొదలగు దానవశ్రేష్ఠులతో కూడిన రాక్షస సేనలు తారకామయ సంగ్రామమున భయ కంపిత రహితులై ఎల్లప్పుడూ యుద్ధము చేయగోరుతూ ప్రకాశించుచుండిరి, యుద్ధకాంక్ష గలిగిన కొంతమంది దానవులు మంత్రములను పరిక్షించుకొనుచుండిరి. మరికొంతమంది యుద్ధవ్యూహములలో అటునిటు పరుగెత్తుచుండిరి. కాలనేమి దైత్యుని యుద్ధమునందు జూచి కొంతమంది దానవులు ప్రీతినొందిరి మరియు ఏ దానవముఖ్యులైతే యుద్ధమునందు మయుని అనుసరించుచుండిరో వారందరూ భయమును వదిలి, హర్షాతిరేకముతో యుద్ధము జేయుటకై సన్నద్ధులైనారు.

మయస్తారో వరాహశ్చ హయగ్రీవశ్చ వీర్యవాన్ ॥ 6 ॥

విప్రచిత్తిసుతః శ్వేతః ఖరలమ్బావుభావపి ।
అరిష్టో బలిపుత్రశ్చ కిశోరాఖ్యస్తథైవ చ ॥ 7 ॥

స్వర్భాను శ్చామరప్రఖ్యో వక్త్ర యోధీ మహాసురః ।
ఏతేஉ స్త్రవేదినః సర్వే సర్వే తపసి సుస్థితాః ॥ 8 ॥

దానవాః కృతినో జగ్ముః కాలనేమిం తముద్ధతమ్ ।

మయుడు, తారుడు, వరాహుడు, వీర్యవంతుడైన హయగ్రీవుడు, విప్రచిత్తియను దానవుని పుత్రుడైన శ్వేతుడు, ఖరుడు, లంబుడు, బలిపుత్రుడైన అరిష్టుడు, కిశోరుడు, దేవతల వలే ప్రకాశించునట్టి స్వర్భానువు, వక్త్రయోధియను మహాసురుడు, ఇత్యాది అస్త్రవిద్యా నిపుణులు మరియు తపోనిష్ఠులూ అయిన దానవులందరు పరాక్రమశాలియైన ఆ కాలనేమిని అనుసరించారు.

తే గదాభిర్భుశుండీభి శ్చక్రై రథ పరశ్వథైః ॥ 9 ॥

కాలకల్పైశ్చ ముసలైః క్షేపణీయైశ్చ ముద్గరైః ।
అశ్మభిశ్చాద్రి సదృశైః సదృశైః గణ్డశైలైశ్చ దారుణైః ॥ 10 ॥

పట్టిశైర్భిన్దిపాలైశ్చ పరిఘైశ్చోత్తమాయసైః ।
ఘాతనీభిః సుగుర్వీభిః శతఘ్నీభిస్తథైవ చ ॥ 11 ॥

గదలు, భుషుండములు, చక్రములు, గొడ్డళ్ళు, కాలదండము వంటి ముసలములు, విసిరివేసే ముద్గరములు, కొండలవంటి రాళ్ళు, దారుణమైన గండశైలములు, పట్టిశములు, భిందిపాలములు, ఉత్తమమైన ఇనుముతో చేయబడిన పరిఘములు, అత్యన్త బరువు గలిగిన ఘాతనీ ఆయుధములు, శతఘ్నులు మొదలగు ఆయుధములతో దానవులు యుద్ధము చేయుటకై సన్నద్ధులైరి.

యుగైర్యన్త్రైశ్చ నిర్ముక్తై ర్మార్గణై రుగ్రతాడితైః ।
దోర్భిశ్చాయతదీప్తైశ్చ ప్రాసైః పాశైశ్చ మూర్ఛనైః ॥ 12 ॥

భుజంగవక్త్రైర్లేలిహానైః విసర్పద్భిశ్చ సాయకైః ।
వజ్రైః ప్రహరణీయైశ్చ దీప్యమానైశ్చ తోమరైః ॥ 13 ॥

వదులుటకు సిద్ధముగా నున్న యన్త్రాయుధములు, ఉగ్రములైన బాణములు, ప్రకాశవన్తమైన ప్రాసములు, పాశములు, మూర్ఛనములు, సర్పముఖము కలిగినటువంటి మరియు సర్పము వలె వడివడిగా వెళ్ళునట్టి బాణములు, కొట్టుటకు యోగ్యమైన వజ్రములు, కాన్తి మన్తములైన తోమరములు(మొదలగు ఆయుధములతో యుద్ధము జేయుటకై దానవులు సన్నద్ధులైరి)

వికోశైరసిభిస్తీక్ష్ణైః శూలైశ్చ సితనిర్మలైః ।
దైత్యాః సందీప్తమనసః ప్రగృహీతశరాసనాః ॥ 14 ॥

తతః పురస్కృత్య తదా కాలనేమిం మహాహవే ।
సా దీప్తశస్త్ర ప్రవరా దైత్యానాం రురుచే చమూః ॥ 15 ॥

ద్యౌర్నిమీలిత సర్వాంగా ఘనానీలాంబుదాగమే ।

మరియు ఒరయందున్నట్టి తీక్ష్ణములైన ఖడ్గములు తెల్లని నిర్మలములైన శూలములు మొదలగు వాటితో దైత్యులు ప్రోత్సాహకరమైన మనస్సులతో ధనుష్యాదులను చేతులలో కలిగినవారై యుద్ధమున నిలిచిరి. తరువాత ఆ మహాయుద్ధమున కాలనేమిని ముందుంచుకొని దీప్తములైన మరియు శ్రేష్ఠములైన ఆయుధములు గలిగినట్టి ఆ దానవసైన్యము నీలమేఘములు క్రమ్మగా సంపూర్ణముగా కప్పివేయబడిన ఆకాశమువలే ప్రకాశించెను.

దేవతానామపి చమూ ర్ముముదే శక్రపాలితా ॥ 16 ॥

ఉపేతా సితకృష్ణాభ్యాం తారాభ్యాం చంద్రసూర్యయోః ।
వాయువేగవతీ సౌమ్యా తారాగణపతాకినీ ॥ 17 ॥

తోయదా విద్ధవసనా గ్రహనక్షత్రహాసినీ ।
యమేంద్రవరుణై ర్గుప్తా ధనదేన చ ధీమతా ॥ 18 ॥

సంప్రదీప్తాగ్నినయనా నారాయణ పరాయణా ।
సా సముద్రౌఘ సదృశీ దివ్యా దేవ మహాచమూః ॥ 19 ॥

రరాజాస్త్రవతీ భీమా యత్ర గంధర్వశాలినీ ।

అపుడు ఇంద్రునిచే పాలింపబడుచున్న దేవతల సేనకూడ చంద్ర సూర్యుల తెల్లని మరియు నల్లని కనుపాపలు కలిగి, వాయువేగమువంటి వేగము కలిగి, సౌమ్యమైన తారాగణమే పతాకముకాగా, మేఘములనే వస్త్రములు ధరించి, గ్రహనక్షత్రములతో నవ్వుచూ, యమేంద్రవరుణకుబేరాదులచేత రక్షింపబడుచున్నదై, జ్వాలలతో ప్రకాశించుచున్న అగ్ని వంటి నేత్రములు కలదై, శ్రీమన్నారాయణ పరాయణమై సముద్రపు జలరాశిని బోలినదై, భయంకరములైన అస్త్రములు గలదై గంధర్వాదులతో కూడినదై ప్రకాశించెను.

తయోశ్చమ్వోస్తదానీం తు బభూవ స సమాగమః ॥ 20 ॥

ద్యావాపృథివ్యోః సంయోగో యథా స్యాద్యుగపర్యయే ।
తద్యుద్ధమభవద్ఘోరం దేవదానవసంకులమ్ ॥ 21 ॥

అపుడు ప్రళయకాలమందు భూమ్యాకాశములు కలిసిపోయినట్లు ఆ దేవదానవసేనలు రెండు పరస్పరమెదుర్కొనెను. ఆ రెండు సైన్యములకు ఘోరమైన యుద్ధం జరిగింది.

క్షమాపరాక్రమపరం దర్పస్య వినయస్య చ ।
నిశ్చక్రముర్బలాభ్యాంతు భీమాస్తత్ర సురాసురాః ॥ 22 ॥

పూర్వాపరాభ్యాం సంరబ్ధాః సాగరాభ్యామివాంబుదాః ।
తాభ్యాం బలాభ్యాం సంహృష్టాశ్చేరుస్తే దేవదానవాః ॥ 23 ॥

వనాభ్యాం పార్వతీయాభ్యాం పుష్పితాభ్యాం యథా గజాః ।

ఆయుద్ధము క్షమాపరాక్రమములకు, దర్పవినయములకు మధ్య జరిగిన యుద్ధము వలె ఉండెను. అట్లు భయంకరములైన ఆ దేవదానవుల సేనలు తూర్పు పడమర సముద్రములనుండి వెలికి వచ్చి పరస్పరము కలిసిపోయిన మేఘముల వలె నుండెను. ఉత్తేజితులైన ఆ సేనలు రెండు పర్వతశ్రేణులలో బాగుగా పుష్పించిన వనములందు తిరుగునట్టి గజములవలె నుండెను.

సమాజఘ్నుస్తతో భేరీః శంఖాన్ దధ్మురనేకశః ॥ 24 ॥

స శబ్దో ద్యాం భువం ఖం చ దిశశ్చ సమపూరయత్ ।
జ్యాఘాత తల నిర్ఘోషో ధనుషాం కూజితాని చ ॥ 25 ॥

దుందుభీనాం చ నినదో దైత్య మన్తర్దధుః స్వనమ్ ।

తర్వాత వారు భేరులను మ్రోగించిరి, అనేకములుగా శంఖములను పూరించిరి. ఆ ధ్వని భూమ్యాకాశములయందు పలుదిక్కుల యందు, పదిదిక్కులయందును నిండిపోయెను. అల్లెత్రాటిని వేగముగా లాగుట వలన వచ్చిన ధనుష్యములటంకారధ్వని, దుందుభుల ధ్వని, రాక్షసుల యొక్క అరుపుల ధ్వని పరస్పరము కలసి ప్రతిధ్వనించెను.

తేఽన్యోన్య మభిసంపేతుః పాతయన్తః పరస్పరమ్ ॥ 26 ॥

బభంజుర్బాహుభిర్బాహూన్ ద్వంద్వమన్యే యుయుత్సవః ।
దేవాస్తు చాశని ఘోరం పరిఘాంశ్చోత్తమాయసాన్ ॥ 27 ॥

నిస్త్రింశాన్ ససృజుః సంఖ్యే గదాగుర్వీంశ్చ దానవాః ।
గదానిపాతైర్భగ్నాంగాః బాణైశ్చ శకలీకృతాః ॥ 28 ॥

దేవతలు దానవులు పరస్పరమెదుర్కొని ఒకరినొకరు పడవేసికొనుచుండిరి. బాహువులతో బాహువులను విరగగొట్టుకొనుచుండిరి. కొందరు ద్వంద్వయుద్ధము చేయుచుండిరి. దేవతలు ఘోరములైన పిడుగులను, లోహనిర్మితములైన పరిఘములను, భయంకరములైన ఖడ్గములను, బరువైన గదలను యుద్ధమునందు ప్రయోగించిరి. అంత దానవులు గదాపాతములతో భగ్నాంగులై బాణములతో ముక్కలై క్రిందపడిపోవుచుండిరి.

పరిపేతుర్భృశం కేచిత్ పునః కేచిత్తు జఘ్నిరే ।
తతో రథైః సతురగైర్విమానైశ్చాశు గామిభిః ॥ 29 ॥

సమీయుస్తే సుసంరబ్ధా రోషాద్యన్యోన్యమాహవే ।
సంవర్తమానాః సమరే సందష్టోష్ఠపుటాననాః ॥ 30 ॥

ఇంక కొంతమంది దానవులు మిక్కిలి కొట్టబడుచుండిరి, కొంతమంది చంపబడుచుండిరి, మరికొంత మంది వేగముగా పరుగెత్తు అశ్వములు గలిగిన రథములు మరియు విమానములనధిరోహించి రోషముతో ఆ మహాయుద్ధము నందు పరస్పరము పెదవులు కొరకుచు ముఖములను కంపింపజేయుచు యద్ధము చేయుచుండిరి.

రథా రథైర్నిరుధ్యన్తే పాదాతాశ్చ పదాతిభిః ।
తేషాం రథానాం తుములః సశబ్దః శబ్దవాహినామ్ ॥ 31 ॥

నభో నభశ్చ హి యథా నభస్యైర్జలదస్వనైః ।
బభంజుస్తు రథాన్ కేచిత్ కేచిత్సమ్మర్దితా రథైః ॥ 32 ॥

సంబాధమన్యే సంప్రాప్య న శేకుశ్చలితుం రథాన్ ।
అన్యోన్య మన్యే సమరే దోర్భ్యా ముక్షిప్య దంశితాః ॥ 33 ॥

మరియు రథికులు రధికులతో, పదాతులు పదాతులతో యుద్ధము చేయుచుండిరి. వారి రథముల యొక్క తుములధ్వని శ్రావణ భాద్రపదమాసములందు కలుగు వర్షాకాలపు మేఘముల ధ్వని వలె ఉండెను. వారిలో కొంతమంది రథములను విరుగగొట్టిరి. మరికొంతమంది రథములచేత (విరిగిన) యుద్ధము చేసిరి. కొందరు సైన్యసమ్మర్దమున చిక్కుకుని రథములను ముందుకు తీసుకువెళ్ళలేక పోయిరి. కొంతమంది పరస్పరము బాహు యుద్ధము చేయుచుండిరి. కొందరు శత్రువులను బాహువులతో ఎత్తి పడవేయుచుండిరి.

సంహ్రాదమానాభరణాః జఘ్ను స్తత్రాపి చర్మిణః ।
అస్త్రైరన్యే వినిర్భిన్నా వేమూ రక్తం హతా యుధి ॥ 34 ॥

క్షరజ్జలానాం సదృశాః జలదానాం సమాగమే ।
తైరస్త్ర శస్త్ర గ్రథితం క్షిప్తోక్షిప్త గజావిలమ్ ॥ 35 ॥

దేవదానవసంక్షుబ్ధం సంకులం యుద్ధమాబభౌ ।
తద్దానవ మహామేఘం దేవాయుధవిరాజితమ్ ॥ 36 ॥

అన్యోన్యబాణవర్షేణ యుద్ధ దుర్దిన మాబభౌ ।

కొంతమంది తాము ధరించిన ఆభరణాదులు ధ్వని చేయుచుండగా కత్తులు డాళ్ళు మొదలగు వాటిని పట్టుకుని యున్న వారిని సంహరించుచుండిరి. కొంతమంది అస్త్రపు దెబ్బల వలన కలిగిన గాయములనుండి కారుతున్న రక్తముతో మృతి చెందిరి. కొంతమంది నిరన్తరం వర్షించు మేఘమువలె ఉండిరి. అస్త్రశస్త్రాదులతో విసిరి వేయబడుచుతున్న గజములతో ఆదేవదానవుల తుముల యుద్ధము అతి భయంకరముగా నుండెను. దానవులనే మహామేఘములపై దేవతలచే విడువ బడిన ఇంద్రధనువులతో, పరస్పరము కురిపించుచ్చున బాణవర్షముతో యుద్ధమున ఆదినము దుర్దినము అనగా మేఘములు ఆకాశమునందు ఆవరించినదిగా ప్రకాశించెను.

ఏతస్మిన్నన్తరే క్రుద్ధః కాలనేమిః స దానవః ॥ 37 ॥

వ్యవర్ధత సముద్రోఘైః పూర్యమాణ ఇవామ్బుదః ।
తస్య విద్యుచ్చలాపీడైః ప్రదీప్తా శనివర్షిణః ॥ 38 ॥

గాత్రైర్నాగగిరిప్రఖ్యా వినిపేతుర్బలాహకాః ।

ఇంతలో క్రుద్ధుడైన కాలనేమి దానవుడు సముద్రజలములతో నిండిన మేఘముల వలె వృద్ధిపొందెను. మెరుపుల వంటి ఆభరణములు గల ఆతని శరీరము నుండి పిడుగులను వర్షించు ఏనుగులను మరియు పర్వతములను బోలిన మేఘములు వెలువడసాగెను.

క్రోధాన్నిశ్వసతస్తస్య భ్రూభేదస్వేదవర్షిణః ॥ 39 ॥

సాగ్ని స్ఫులింగ ప్రతతా ముఖాన్ని ష్పేతురర్చిషః ।
తిర్యగూర్ధ్వం చ గగనే వవృధుస్తస్య బాహవః ॥ 40 ॥

పర్వతాదివ నిష్క్రాన్తాః పంచాస్యా ఇవ పన్నగాః ।

క్రోధము వలన వదులుచున్న శ్వాసలుగల ఆతని ముఖమునుండి కనుబొమ్మలనుండి చెమట వర్షించుచు పొగలతో నిండిన అగ్నిజ్వాలలు బయటకు రాసాగెను. ఆతని బాహువులు ఆకాశమునందు అడ్డముగాను నిలువుగాను వృద్ధిపొందుచు పర్వతములనుండి వెలువడే ఐదుతలల పాములవలె కనబడుచుండెను.

సోఽ_స్త్రజాలై ర్బహువిధైః ధనుభిః పరిఘైరపి ॥ 41 ॥

దివ్యమాకాశమాహవే పర్వతై రుచ్ఛ్రితైరివ ।
సోఽ_నిలోద్ధృత వసనస్తస్థౌ సంగ్రామలాలసః ॥ 42 ॥

సంధ్యాతపగ్రస్త శిలః సాక్షాన్మేరురివాచలః ।
ఊరువేగ ప్రమథితైః శైలశృంగాగ్రపాదపైః ॥ 43 ॥

అపాతయద్దేవగణాన్ వజ్రేణేవ మహాగిరీన్ ।

అతను ఉపయోగించిన అస్త్రజాలములు, ధనువులు, పరిఘములు మొదలగునవి ఆకాశమునందంతయూ వ్యాపించి ఉన్నతములైన పర్వతముల వలె కనబడుచుండెను. సంగ్రామ కాంక్షియైన అతడు గాలితో చెదిరి ఎగిరిపడుచున్న వస్త్రముకలవాడై సంధ్యాకాలపు ఎండతో ప్రకాశిస్తున్న శిలలు గల మేరు పర్వతము వలె ఉండెను. పర్వత శిఖరములతోను, వృక్షములతోను అత్యంత వేగముగా వజ్రాయుధముచేత మహాపర్వతములను పడవేసినట్లు అతను దేవగణములను పడవేసెను.

బహుభిః శస్త్ర నిస్త్రింశైః ఛిన్న భిన్న శిరోరుహాః ॥ 44 ॥

న శేకుశ్చలితుం దేవా కాలనేమి హతా యుధి ।
ముష్టిభిర్నిహతాః కేచిత్ కేచిత్తు విదలీకృతాః ॥ 45 ॥

యత్ర గంధర్వపతయః పేతుః సహ మహోరగైః ।
తేన విత్రాసితా దేవాః సమరే కాలనేమినా ॥ 46 ॥

న శేకుర్యత్నవన్తో౽పి యత్నం కర్తుం విచేతసః ।

యుద్ధమునందు కాలనేమి చేత విడువబడిన శస్త్రాస్త్రముల యొక్క , ఖడ్గముల యొక్క దెబ్బల వలన పగిలిన శిరస్సులు గలవారైన దేవతలు కదలలేకపోయారు. వారిలో కొంతమంది ఆతని ముష్టిఘాతాలతో పడిపోయారు. మరికొంతమంది చీల్చబడ్డారు. గంధర్వులు, సర్పగణములు మొదలుకొని దేవతలందురు కాలనేమి ధాటికి భయపడి ఎంత ప్రయత్నము చేసినప్పటికిని వాని ఎదుట నిలబడలేకపోయారు.

తేన శక్రః సహస్రాక్షః స్పందితః శరబంధనైః ॥ 47 ॥

ఐరావతగతః సంఖ్యే చలితుం న శశాక హ ।
నిర్జలామ్భోద సదృశో నిర్జలార్ణవ సప్రభః ॥ 48 ॥

నిర్వ్యాపారః కృతస్తేన విపాశో వరుణో మృధే ।
రణే వైశ్రవణస్తేన పరిఘైః కామరూపిణా ॥ 49 ॥

విత్తదో౽పి కృతః సంఖ్యే నిర్జితః కాలనేమినా ।

కాలనేమి యొక్క శరబంధనములతో బంధితుడైన సహస్రాక్షుడగు ఇంద్రుడు కూడ ఐరావతము నధిరోహించినప్పటికిని కదలలేకపోయాడు. వరుణుడు కూడ వాడి దెబ్బలతో పాశరహితుడై జలము లేని మేఘము వలె, నీరు లేక ఎండిపోయిన సముద్రము వలె నిశ్చేష్టుడయ్యాడు. మరియు విశ్రవ ప్రజాపతి కుమారుడైన ధనాధిపతి కుబేరుడు కూడ కాలనేమి యొక్క పరిఘపు (ఆయుధం) దెబ్బలతో జయింపబడ్డాడు.

యమః సర్వ హరస్తేన మృత్యు ప్రహరణా రణే ॥ 50 ॥

యామ్యామవస్థాం సంత్యజ్య భీతః స్వాం దిశమావిశత్ ।
సలోకపాలానుత్సార్య కృత్వా తేషాం కర్మ తత్ ॥ 51 ॥

దిక్షు సర్వాసు దేహం స్వం చతుర్ధా విదధే తదా ।
స నక్షత్ర పథం గత్వా దివ్యం స్వర్భానుదర్శనమ్ ॥ 52 ॥

జహార లక్ష్మీం సోమస్య తం చాస్య విషయం మహత్ ।

అందరి ప్రాణములను హరించునట్టి మృత్యురూపుడైన యముడు కూడ వాడి ప్రహరణములకు భయపడి యముడిగా తన ధర్మములను వదిలి తన దక్షిణదిశకు పారిపోయెను. ఇట్లు లోకపాలకులను తరిమికొట్టి వారి ఆధికారిక కర్మలను హరించి, తన దేహమునే నాలుగు దిక్కులయందు నాలుగు భాగములుగా నిర్మించాడు. తర్వాత రాహువు చే చూపబడిన దివ్య నక్షత్ర మార్గమునకు పోయి వాడు చంద్రుని ఐశ్వర్యమును, కాంతిని కూడ హరించాడు.

చాలయామాస దీప్తాంశుం స్వర్గద్వారాత్స భాస్కరమ్ ॥ 53 ॥

సాయనం చాస్య విషయం జహార దినకర్మ చ ।
సోఽగ్నిం దేవముఖం దృష్ట్వా చకారాత్మముఖాశ్రయమ్ ॥ 54 ॥

వాయుం చ తరసా జిత్వా చకారాత్మవశానుగమ్ ।
స సముద్రాన్సమానీయ సర్వాశ్చ సరితో బలాత్ ॥ 55 ॥

చకారాత్మముఖే వీర్యాద్దేహభూతాశ్చ సిన్ధవః ।
అపః స్వవశగాః కృత్వా దివిజా యాశ్చ భూమిజాః ॥ 56 ॥

స స్వయం భూరివాఽఽభాతి మహాభూతపతిర్యథా ।

కాలనేమి స్వర్గ ద్వారమునుండి దీప్తాంశుడైన భాస్కరుని తరిమివేసి అతనికి గల ఆయనాదులను, దివసములను ఏర్పరుచు శక్తిని స్వాధీనము చేసికొన్నాడు. అట్లే దేవముఖుడైన అగ్నిని, మరియు వాయుదేవుని కూడ స్వ పరాక్రమంతో జయించి తన వశం జేసికొన్నాడు. సముద్రాలను, నదులను కూడ తన బలంతో వశం చేసికొన్నాడు. అప్పుడు సముద్రాలన్నియు వాడి దేహమైనాయి. స్వర్గలోకపు మరియు భూలోకపు నదులన్నింటిని తన వశము చేసికొనిన ఆ దైత్యుడు స్వయంగా మహాభూతపతివలె ప్రకాశించాడు.

సర్వలోకమయో దైత్యః సర్వభూతభయావహః ॥ 57 ॥

స లోకపాలైకవపుః చంద్రాదిత్యగ్రహాత్మవాన్ ।
స్థాపయామాస జగతీం సుగుప్తాం ధరణీధరైః ॥ 58 ॥

పావకానిల సంపాతో రరాజ యుధి దానవః ।
పారమేష్ఠ్యే స్థితః స్థానే లోకానాం ప్రభవోపమే ॥
తం తుష్టువుర్దైత్యగణాః దేవా ఇవ పితామహమ్ ॥ 59 ॥

సర్వలోకమయుడు, సర్వభూతభయావహుడు, లోకపాలకులందరిని వశము చేసికొనినవాడు, చంద్రాదిత్యులే ఆత్మగా గలవాడు, వాయ్వగ్నులే శరీరముగా గలవాడు అయిన ఆ కాలనేమి దానవుడు పర్వతాదులచే రక్షింపబడుచున్న భూమండలమునంతటిని స్వాధీనం చేసికొని యుద్ధమునందు ప్రకాశించాడు. మరియు పరమేష్ఠియైన బ్రహ్మస్థానమునందు నిలిచి లోకముల యొక్క ఉత్పత్తి కే కారణభూతుడి వలే ప్రకాశిస్తున్న ఆ కాలనేమిని దేవతలు బ్రహ్మదేవుని స్తుతించినట్లు దైత్యులందరూ స్తుతించారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే తారకామయయుద్ధే కాలనేమివిజయో నామ
సప్త సప్తత్యధిక శతతమోఽధ్యాయః ॥177॥

శ్రీమత్స్యమహాపురాణంలో తారకామయయుద్ధ ప్రస్తావమున కాలనేమి విజయమను
నూట డెబ్బైఏడవ అధ్యాయం సమాప్తం

అష్టసప్తత్యధిక శతతమోఽధ్యాయః - నూట డెబ్బై ఎనిమిదవ అధ్యాయం

కాలనేమి వధ: దేవైఃకృతా విష్ణుస్తుతిః - కాలనేమివధ-దేవతలు విష్ణువును స్తుతించుట

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

పఞ్చ తం నాభ్యవర్తన్త విపరీతేన కర్మణా ।
వేదో ధర్మః క్షమా సత్యం శ్రీశ్చ నారాయణాశ్రయా ॥ 1 ॥

కాలనేమి ఆచరిస్తున్న విపరీతమైన, విరుద్ధమైన కర్మల వలన వేదం, ధర్మం, క్షమా, సత్యం మరియు నారాయణాశ్రితయైన సంపత్తు (లక్ష్మి) అను ఐదు తత్త్వాలు అతనిని వరించకపోయాయి.

స తేషా మనుపస్థానాత్ స క్రోధో దానవేశ్వరః ।
వైష్ణవం పదమన్విచ్ఛన్ యయౌ నారాయణాన్తికమ్ ॥ 2 ॥

ఆ ఐదు తనను సేవింపకపోవుటవలన ఆ దానవేశ్వరుడు క్రోధయుక్తుడై విష్ణుస్థానాన్ని అన్వేషిస్తూ శ్రీమన్నారాయణుని దగ్గరకు వెళ్ళాడు.

స దదర్శ సుపర్ణస్థం శంఖశక్రగదాధరమ్ ।
దానవానాం వినాశాయ భ్రామయన్తం గదాం శుభామ్ ॥ 3 ॥

సజలామ్భోద సదృశం విద్యుత్సదృశవాససమ్ ।
స్వారూఢం స్వర్ణపక్షాఢ్యం శిఖినం కాశ్యపం ఖగమ్ ॥ 4 ॥

అచ్చట గరుడుని అధిష్ఠించియున్నటువంటి, శంఖచక్రగదాదులను ధరించినటువంటి, దానవుల వినాశనమును శుభప్రదమైన గదను త్రిప్పుచున్నటువంటి వర్షాకాలపు మేఘసదృశుడైనట్టి, మెరుపువంటి వస్త్రమును ధరించినటువంటి, బంగారు రెక్కలు మరియు శిఖ కలిగియున్న కశ్యప పుత్రుడైన గరుడుని అధిష్ఠించియున్నట్టి శ్రీమన్నారాయణుని ఆ దైత్యుడు చూచాడు.

దృష్ట్వా దైత్య వినాశాయ రణే స్వస్థమవస్థితమ్ ।
దానవో విష్ణు మక్షోభ్యం బభాషే లబ్ధమానసః ॥ 5 ॥

దైత్య వినాశనమునకు కృతనిశ్చయుడై యుద్ధరంగమున నున్నట్టి క్షోభింపచేయడానికి అశక్యుడైనట్టి విష్ణువుతో లబ్ధమానసుడైన ఆ దానవుడిట్లు పలికాడు.

అయం స రిపురస్మాకం పూర్వేషాం ప్రాణనాశనః ।
అర్ణవావాసినశ్చైవ మధోర్వై కైటభస్య చ ॥ 6 ॥

అయం స విగ్రహోఽస్మాకమశామ్యః కిల కథ్యతే ।
అనేన సంయుగేష్వద్య దానవా బహవో హతాః ॥ 7 ॥

మా పూర్వులందరి ప్రాణనాశకుడైన శత్రువు ఇతడే, సముద్రంలో నివసించు అసురులైన మా మధుకైటభులను సంహరించినది ఇతడే, యుద్ధము నందు మాచే ఓడింపబడటానికి శక్యము కానటువంటి వాడితనేనని చెప్పబడినది. ఈతని చేత జరిగిన యుద్ధములలో అనేకమంది దానవులు హతులైనారు.

అయం సనిర్ఘృణో లోకే స్త్రీబాలనిరపత్రపః ।
యేన దానవనారీణాం సీమాన్తోద్ధరణం కృతమ్ ॥ 8 ॥

అయం స విష్ణుర్దేవానాం వైకుణ్ఠశ్చ దివౌకసామ్ ।
అనన్తో భోగినామప్సు స్వపన్నాద్యః స్వయంభువః ॥ 9 ॥

లోకమున ఈతడు నిర్దయుడు, స్త్రీల విషయమున మరియు బాలుర విషయమున కూడ నిర్దయుడే, దుష్టులైన స్త్రీలను బాలురను కూడ శిక్షించుటలో సిగ్గుపడని వాడితడే, దేవతలకు విష్ణువీతడే, స్వర్గలోకవాసులకు, వైకుంఠుడు కూడ ఇతడే. సర్పములలో అనంతుడు మరియు జలములలో నిద్రించు స్వయంభువునూ ఇతడే.

అయం సనాథో దేవానా మస్మాకం వ్యథితాత్మనామ్ ।
అన్య క్రోధం సమాసాద్య హిరణ్యకశిపుర్హతః ॥ 10 ॥

మాచే వ్యథలను పొందిన దేవతలకు ప్రభువు ఈతడే, ఈతని కోపమునకు కారణుడై హిరణ్యకశిపుడు చంపబడ్డాడు.

అస్య ఛాయాముపాశ్రిత్య దేవా మఖముఖే స్థితాః ।
ఆజ్యం మహర్షిభిర్దత్త మశ్నువన్తి త్రిధా హుతమ్ ॥ 11 ॥

ఈతని నీడను ఆశ్రయించియే దేవతలు యజ్ఞయాగాది క్రతువలందు పాల్గొనినవారలై మహర్షుల చేత ప్రాతర్మధ్యాహ్న సాయంకాలాదులయందు సమర్పించిన ఘృతాది హవ్యములను భుజింపగలుగుతున్నారు.

అయం స నిధనే హేతుః సర్వేషామమర ద్విషామ్ ।
యస్య చక్రే ప్రవిష్టాని కులాన్యస్మాకమాహవే ॥ 12 ॥

దేవతల శత్రువులందరి మరణకారకుడితడే. మన రాక్షసకులములన్నియు యుద్ధము నందు ఈతని చక్రమునకే ఆహుతి అయినవి.

అయం స కిల యుద్ధేషు సురార్థే త్యక్తజీవితః ।
సవితుస్తేజసా తుల్యం చక్రం క్షిపతి శత్రుషు ॥ 13 ॥

అయం స కాలో దైత్యానాం కాలభూతః సమాస్థితః ।
అతిక్రాన్తస్య కాలస్య ఫలం ప్రాప్స్యతి కేశవః ॥ 14 ॥

దేవతలకొరకై యుద్ధములందు స్వజీవితమునే త్యాగము చేయువాడితడే. సూర్యతేజస్సుతో తుల్యమైన చక్రమును శత్రువుల పైకి సంధించువాడు కూడ ఇతడే. దైత్యుల పాలిట కాలయముడైన కాలాత్మకుడు కూడ ఇతడే. అయినా ఈ కేశవుడు గడిచిన కాలమందు చేసిన తన పనులకు తప్పకుండా ఫలమునునుభవిస్తాడు.

దిష్ట్యేదానీం సమక్షం మే విష్ణురేవ సమాగతః ।
అద్య మద్బాహు నిష్పిష్టో మామేవ ప్రణమిష్యతి ॥ 15 ॥

అదృష్టము కొలది ఈ విష్ణువే ఇప్పుడు నా సమక్షమునకు వచ్చినాడు. నా భుజముల చేత నలిగిపోయి ఇప్పుడు ఇతను నాకే నమస్కరిస్తాడు.

యాస్యామ్యపచితిం దిష్ట్యా పూర్వేషా మద్య సంయుగే ।
ఇమం నారాయణం హత్వా దానవానాం భయావహమ్ ॥ 16 ॥

క్షిప్రమేవ హనిష్యామి రణేఽ మరగణాంస్తతః ।
జాత్యన్తరగతో హ్యేష బాధతే దానవాన్ మృధే ॥ 17 ॥

అదృష్టము కొలది దానవులందరికీ భయావహుడైన నారాయణుడు నా ముందుకు వచ్చియున్నాడు. ఈతనిని చంపి మా పూర్వులందరికి తృప్తి కలిగిస్తాను. తర్వాత వెంటనే దేవతల గణాలను వధిస్తాను. ఎందుకనగా దేవతల పక్షపాతియైన ఈ విష్ణువు యుద్ధము నందు ఎల్లప్పుడునూ దానవులను బాధపెట్టుచున్నాడు.

ఏషోఽ నన్తః పురా భూత్వా పద్మనాభ ఇతి శ్రుతః ।
జఘానైకార్ణవే ఘోరే తావుభౌ మధుకైటభౌ ॥ 18 ॥

అనన్తుడైన ఈ విష్ణువు పూర్వం పద్మనాభుడని ప్రసిద్ధిపొంది, ఘోరమైన ఏకార్ణవ సముద్రాన మా మధుకైటభులను సంహరించాడు.

ద్విధాభూతం వపుఃకృత్వా సింహస్యార్ధం నరస్య చ ।
పితరం మే జఘానైకో హిరణ్యకశిపుం పురా ॥ 19 ॥

పూర్వము సగము నరుడుగ సగము సింహముగా రెండు విధములగు దేహము ధరించినవాడై మా తండ్రియైన హిరణ్యకశిపుని సంహరించాడు.

శుభం గర్భమధత్తైనమదితిర్దేవతారణిః ।
త్రీన్లోకానుజ్జహారైకః క్రమమాణాస్త్రిభిః క్రమైః ॥ 20 ॥

దేవతలనే అగ్నికి అరణియైన అదితి ఈతనిని తన శుభ గర్భముగా ధరించి కనెను. అపుడతడు మూడు అడుగులతో క్రమంగా ముందుకు అడుగులు వేస్తూ తానొక్కడే మూడు లోకాలను హరించాడు.

(వామనావతారపుమహిమ ఇది)

భూయస్త్విదానీం సంగ్రామే సంప్రాప్తే తారకామయే ।
మయా సహ సమాగమ్య స దేవో వినశిష్యతి ॥ 21 ॥

ఏవముక్త్వా బహువిధం క్షిపన్నారాయణం రణే ।
వాగ్భిరప్రతిరూపాభిః యుద్ధమేవాభ్యరోచయత్ ॥ 22 ॥

ఇప్పుడు మరల తారకామయ సంగ్రామము సంప్రాప్తించినది, దీనిలో ఈతను నాతో యుద్ధము చేసి నశించిపోతాడు. అని ఆ నారాయణుని అనేక రకములుగా అప్రతిమానములైన నిందా వాక్యములతో అధిక్షేపిస్తూ ఆదేవదేవునితో యుద్ధం చేయడానికి సన్నద్ధుడైనాడు.

క్షిప్యమాణోऽసురేంద్రేణ న చుకోప గదాధరః ।
క్షమాబలేన మహతా సస్మితం చేదమబ్రవీత్ ॥ 23 ॥

అల్పం దర్పబలం దైత్య స్థిరమక్రోధజం బలమ్ ।
హతస్త్వం దర్పజైర్దోషైః హిత్వా యద్భాషసే క్షమమ్ ॥ 24 ॥

అధీరస్త్వం మమ మతో ధిగేతత్తవ వాగ్బలమ్ ।
న యత్ర పురుషాః సన్తి తత్ర గర్జన్తి యోషితః ॥ 25 ॥

అట్లు ఆ అసురేంద్రుడు తనను నిందించుచున్నను గదాధరుడైన శ్రీమహావిష్ణువు కోపగించలేదు, మహత్తరమైన ఓర్పుతో నవ్వుతూ ఆ రాక్షసునితో ఇట్లన్నాడు. ఓ దైత్యుడా! దర్పంతో కూడిన బలం అల్పమైంది, క్రోధంలేకుండా క్షమతో కూడుకొన్న బలం స్థిరమైంది. నీవు ఓర్పు లేకుండా మాట్లాడుతున్నావు, దర్పం వలన ఉద్భవించే దోషాలతోనే నీవు హతుడవు కాగలవు, నా దృష్టిలో నీవు ధీరుడవు కాదు, నీ వాగ్బలము పనికి మాలింది, పురుషులు లేని చోటనే స్త్రీలు గర్జిస్తారు.

అహం త్వాం దైత్య పశ్యామి పూర్వేషాం మార్గగామినామ్ ।
ప్రజాపతికృతం సేతుం భిత్త్వా కః స్వస్తిమాన్ వ్రజేత్ ॥ 26 ॥

అద్య త్వాం నాశయిష్యామి దేవవ్యాపార ఘాతకమ్ ।
స్వేషు స్వేషు చ స్థానేషు స్థాపయిష్యామి దేవతాః ॥ 27 ॥

ఓ దైత్యుడా! నీవు నీ పూర్వుల మార్గమునే అనుసరిస్తావన్నట్లు నాకు కనబడుతున్నది. ప్రజాపతిచే నిర్మింపబడిన సేతువును త్రెంపిన వాడెవ్వడు శుభం పొందుతాడు? దేవతల ప్రవృత్తికే ఘాతకం కలిగిస్తున్న నిన్ను ఇప్పుడే వధించగలను మరియు దేవతలను వారి వారి స్థానాలలో నిలుపుతాను.

ఏవం బ్రువతి వాక్యంతు మృధే శ్రీవత్సధారిణి ।
జహాస దానవః క్రోధాత్ హస్తాంశ్చక్రే సహాయుధాన్ ॥ 28 ॥

స బాహుశతముద్యమ్య సర్వాస్త్రగ్రహణం రణే ।
క్రోధాద్విగుణ రక్తాక్షో విష్ణుం వక్షస్యతాడయత్ ॥ 29 ॥

దానవాశ్చాపి సమరే మయతారపురోగమాః ।
ఉద్యతాయుధ నిస్త్రింశా విష్ణుమభ్యద్రవన్ రణే ॥ 30 ॥

యుద్ధము నందు శ్రీవత్సలాంఛనుడిట్లు పలుకు చుండగానే కాలనేమి దైత్యుడు క్రోధంతో అట్టహాసం చేశాడు. తన చేతులలోనికి ఆయుధాలను తీసుకొన్నాడు. ఆయుధాలు కలిగిన తన నూరుభుజాలను యుద్ధము

నందు పైకెత్తి, క్రోధముతో ద్విగుణీకృతమైన రక్తవర్ణపు కన్నులు కలవాడై విష్ణువు యొక్క వక్షఃస్థలమున కొట్టాడు. అపుడే మయుడు, తారకుడు మొదలగు దానవులందరు కూడ ఖడ్గాది స్వ ఆయుధములను గ్రహించినవారై యుద్ధము నందు విష్ణువుపైకి పరుగెత్తిరి.

స తాడ్యమానోఽతిబలైః దైత్యైః సర్వోద్యతాయుధైః ।
న చచాల తతో యుద్ధే కమ్ప్యమాన ఇవాచలః ॥ 31 ॥

అతిబలవంతులైన సర్వవిధ ఆయుధములతో కూడిన దైత్యులందరిచేత యుద్ధము నందు కొట్టబడుచున్నప్పటికిని కదలని కొండలవలె శ్రీ మహావిష్ణువు చలించకుండెను.

సంసక్తశ్చ సుపర్ణేన కాలనేమీ మహాసురః ।
సర్వప్రాణేన మహతీం గదాముద్యమ్య బాహుభిః ॥ 32 ॥

ఘోరాం జ్వలంతీం ముముచే సంరబ్ధో గరుడోపరి ।
కర్మణా తేన దైత్యస్య విష్ణుర్విస్మయ మావిశత్ ॥ 33 ॥

అపుడు కాలనేమి మహాసురుడు గరుడునితో తలపడి తన సంపూర్ణమైన బలమునుపయోగించి, ఘోరమైనట్టి ప్రకాశవంతమైనట్టి గదను స్వభుజములతో పైకెత్తి అత్యన్త సంరంభముతో గరుడుని పైకి వదిలాడు. దైత్యుడు చేసిన ఈ పనికి విష్ణువు విస్మయం పొందాడు.

యదా తేన సుపర్ణస్య పాతితా మూర్ధ్ని సా గదా ।
సుపర్ణం వ్యథితం దృష్ట్వా కృత్తం చ వపురాత్మనః ॥ 34 ॥

క్రోధసంరక్తనయనో వైకుణ్ఠశ్చక్రమాదదే ।
వ్యవర్ధత స వేగేన సుపర్ణేన సమం విభుః ॥ 35 ॥

భుజాశ్చాస్య వ్యవర్ధన్త వ్యాప్నువన్తో దిశో దశ ।
ప్రదిశశ్చైవ ఖం గాం వై పూరయామాస కేశవః ॥ 36 ॥

వవృధే చ పునర్లోకాన్ క్రాన్తుకామ ఇవౌజసా ।

వెంటనే ఆ దైత్యుడు వేగముగా ఆ గదను గరుడుని తలపై వేశాడు. దానితో వ్యథ చెందిన గరుడుని మరియు దాని వలన గాయపడిన తన శరీరమును కూడ చూచి, క్రోధయుక్త నేత్రుడైన వైకుంఠుడు తన చక్రాయుధమును చేతిలోనికి తీసుకొన్నాడు. అదిచూచి గరుడుడు ఉత్సాహముతో వృద్ధిపొందసాగాడు. అతనితో పాటు శ్రీమహావిష్ణువు కూడ వృద్ధి పొందసాగాడు. శ్రీమహావిష్ణువు యొక్క భుజములు దశదిశలయందు వ్యాప్తి చెంది వృద్ధి పొందసాగాయి. కేశవుడు తన శరీరమును అన్ని దిక్కులయందును, ఆకాశమందును పృథ్వి యందంతటనూ విస్తరింపజేశాడు. మరోకమారు లోకములన్నింటిని తన తేజస్సుతో ఆక్రమింపగోరువాడివలే శ్రీమహావిష్ణువు వృద్ధిపొందెను.

తర్జనాయా సురేన్ద్రాణాం వర్ధమానం నభస్తలే ॥ 37 ॥

ఋషయశ్చైవ గంధర్వాః తుష్టువుర్మధుసూదనమ్ ।

రాక్షసేంద్రులను భయపెట్టుటకై అట్లు వర్ధిల్లుచున్న మధుసూదనుని చూచి ఆకాశమునుండి ఋషులు గంధర్వులు మొదలగువారు స్తుతించిరి.

సర్వాన్ కిరీటేన లిహన్ సాభ్రమమ్బరమమ్బరైః ॥ 38 ॥

పద్భ్యా మాక్రమ్య వసుధాం దిశః ప్రచ్ఛాద్య బాహుభిః ।
స సూర్యకరతుల్యాభం సహస్రారమరిక్షయమ్ ॥ 39 ॥

దీప్తాగ్ని సదృశం ఘోరం దర్శనేన సుదర్శనమ్ ।
సువర్ణరేణు పర్యన్తం వజ్రనాభం భయాపహమ్ ॥ 40 ॥

ఆకాశమెత్తు పెరుగుతున్న శ్రీమన్నారాయణుడు తన కిరీటముతో ఆకాశములోని మేఘములను సమస్త భూమండలమును తన పాదములతో ఆక్రమించి, బాహువులతో దిక్కులనాక్రమించి, సూర్యకిరణములతో సమానమైన కాంతిగలిగిన వేయి అరలు కలదియు, శత్రుక్షయము చేయునదియు, మండుతున్న అగ్నితో సమానముగా నున్న ఘోరమైన కాంతి గలదియు చూచుటకు సుదర్శనమైనదియు (అనగా చూడాలనిపించే మంచి ఆకారము గలదియు) అంచులయందు బంగారుపు మెరుగులు గలదియు, మధ్యలో వజ్రము కలదియు మరియు భయము కలిగించునదియూ (అయిన సుదర్శన, చక్రమును సంధించి ఆ రాక్షసుని భుజములను ఛేదించినని 46వ శ్లోకం వరకు అన్వయము)

మేదోఽస్థి మజ్జారుధిరైః సిక్తదానవసమ్భవైః ।
అద్వితీయ ప్రహరణం క్షురపర్యన్తమణ్డలమ్ ॥ 41 ॥

స్రగ్దామ మాలావితతం కామగం కామరూపిణమ్ ।
స్వయం స్వయంభువా సృష్టం భయదం సర్వవిద్విషామ్ ॥ 42 ॥

మహర్షిరోషైరావిష్టం నిత్యమాహవ దర్పితమ్ ।

దానవులయొక్క మాంసము, ఎముకలు, రక్తము మొదలగువాటిచేత తడిసినదియు, ఆయుధములలో సాటిలేనిదియు, తీక్ష్ణమైన అంచులతో ఏర్పడిన మండలము కలదియు, పుష్పమాలికలతో అలంకరింబడినదియు, శ్రీమన్నారాయణుని కోరిక ప్రకారము వోవునదియు, స్వయంభువైన బ్రహ్మచే సృష్టింపడినదియు, శత్రువులందరికి భయము కలిగించునదియు, మహర్షుల రోషముచేత ప్రదీప్తమైనదియు, ఎల్లప్పుడు యుద్ధమునందు ప్రవేశించుదర్పము కలదియు అగు (సుదర్శన చక్రమును ....అన్వవామ్

క్షేపణాద్యస్య ముహ్యన్తి లోకాః సస్థాణుజఙ్గమాః ॥ 43 ॥

క్రవ్యాదాని చ భూతాని తృప్తిం యాన్తి మహామృధే ।
తదప్రతిమ కర్మోగ్రం సమానం సూర్యవర్చసా ॥ 44 ॥

చక్రముద్యమ్య సమరే క్రోధదీప్తో గదాధరః ।
సముష్ణన్ దానవం తేజః సమరే స్వేన తేజసా ॥ 45 ॥

చిచ్ఛేద బాహూంశ్చక్రేణ శ్రీధరః కాలనేమినః ।
తచ్చ వక్రశతం ఘోరం సాగ్ని పూర్ణాట్టహాసి వై ॥ 46 ॥

తస్య దైత్యస్య చక్రేణ ప్రమమాథ బలాద్ధరిః ।

మరియు విసిరినంతనే స్థావరజంగమాత్మకములైన లోకములన్నింటికి మోహము కలిగించునదియు మహాయుద్ధములందు మాంసాహారులైన ప్రాణులకు తృప్తి కలిగించునదియు, సూర్య తేజస్సుతో సమానమైనదియు అగు సుదర్శన చక్రమును తీసుకుని క్రోధదీప్తుడైన గదాధరుడు యుద్ధమునందు తన తేజస్సుతో ఆదానవ తేజస్సును హరించుచు కాలనేమియొక్క బాహువులను ఛేదించెను. మరియు ఆచక్రముతోనే అగ్నికుండములవలె మండుచూ అట్టహాసము చేయుచున్న కాలనేమియొక్క నూరుముఖములను కూడ ఛేదించెను.

సచ్ఛిన్న బాహుర్వ్యశిరా న ప్రాకమ్పత దానవః ॥ 47 ॥

కబంధోఽవస్థితః సంఖ్యే విశాఖ ఇవ పాదపః ।
సంవితత్య మహాపక్షౌ వాయోః కృత్వా సమం జవమ్ ॥ 48 ॥

ఉరసా పాతయామాస గరుడః కాలనేమినమ్ ।
స తస్య దేహో విముఖో విబాహుశ్చ పరిభ్రమన్ ॥ 49 ॥

నిపపాత దివం త్యక్త్వా క్షోభయన్ ధరణీతలమ్ ।

తలలు మరియు బాహువులు తెగిపోయినప్పటికిని ఆ దానవుడు చలించకపోయెను. కొమ్మలు తెగిన వృక్షము వలె యుద్ధమునందు ఆతని మొండిమట్లే యుండెను. అపుడు గరుడుడు వాయు సమాన వేగముతో వచ్చి విశాలమైన తన రెక్కలను విస్తరింపజేసి వక్షఃస్థలముతో కాలనేమిని క్రిందపడవేసెను. అపుడు ముఖములు మరియు బాహువులు కూడ లేనట్టి ఆతని దేహము పొర్లుతూ అంతరిక్షమును వదిలి భూమండలమును క్షోభింపజేయుచు క్రిందపడెను.

తస్మిన్ని పతితే దైత్యే దేవాః సర్షిగణాస్తదా ॥ 50 ॥

సాధు సాధ్వితి వైకుంఠం సమేతాః ప్రత్యపూజయన్ ।

అట్లా దైత్యుడు క్రిందపడగానే దేవతలు, ఋషులు కూడ 'సాధు సాధు'(బాగుబాగు) అనుచు అందరూ కలిసి వైకుంఠుని పూజించిరి.

అపరే యే తు దైత్యాశ్చ యుద్ధే దుష్టపరాక్రమాః ॥ 51 ॥

తే సర్వే బాహుభిర్వ్యాప్తా న శేకుశ్చలితుం రణే ।
కాంశ్చిత్ కేశేషు జగ్రాహ కాంశ్చిత్ కంఠేషు పీడయన్ ॥ 52 ॥

చకర్ష కస్యచిద్వక్త్రం మధ్యే ౭గృహ్ణాదథా పరమ్ ।
తే గదాచక్రనిర్దగ్ధాః గత సత్త్వా గతాసవః ॥ 53 ॥

గగనాద్ భ్రష్టసర్వాంగాః నిపేతుర్ధరణీతలే ।

యుద్ధమునందు శ్రీమహావిష్ణువు యొక్క పరాక్రమమును జూచిన ఇతర దైత్యులందరూ ఆతని బాహువులలో చిక్కుకుని యుద్ధము నందు కొంచెము కూడ కదలలేకపోయిరి. అపుడు విష్ణువు వారిలో కొంతమందిని జుట్టుతో పట్టుకొనెను, కొంత మంది కంఠమును చేజిక్కించుకుని హింసించెను, కొంతమంది ముఖమును నరికెను. మరికొంతమంది శరీరమధ్యభాగమును పట్టుకొని హింసించెను. ఆ విధముగ శ్రీమహావిష్ణువు యొక్క గద మరియు చక్రాది ఆయుధములచే దగ్ధులై బలహీనులై ప్రాణములను కూడ కోల్పోయి శరీరాంగములన్నింటిని పోగొట్టుకొని ఆకాశము నుండి భూమిపై పడిపోయిరి.

తేషు దైత్యేషు సర్వేషు హతేషు పురుషోత్తమః ॥ 54 ॥

తస్థౌ శక్రప్రియం కృత్వా కృతకర్మా గదాధరః ।

ఆ విధముగా దైత్యులందరూ హతులు కాగా గదాధరుడైన పురుషోత్తముడు ఇంద్రునికి ప్రీతి కలిగించు కర్మనాచరించి కృతకృత్యుడై యుద్ధరంగమున నిలిచెను.

తస్మిన్ విమర్దే సంగ్రామే నివృత్తే తారకామయే ॥ 55 ॥

తం దేశమాజగామాశు బ్రహ్మా లోకపితామహః ।
సర్వైర్బ్రహ్మర్షిభిః సార్ధం గంధర్వాప్సరసాం గణైః ॥ 56 ॥

అట్లా తారకామయమను యుద్ధము ముగియగానే లోకపితామహుడైన బ్రహ్మదేవుడు బ్రహ్మర్షులందరితో మరియు గంధర్వులు అప్సరసల సమూహములతో కూడ అచ్చటికి వచ్చెను.

దేవదేవో హరిం దేవం పూజయన్వాక్యమబ్రవీత్ ।
కృతం దేవ మహత్కర్మ సురాణాం శల్యముద్ధృతమ్ ॥
వధేనానేన దైత్యానాం వయం చ పరితోషితాః ॥ 57 ॥

బ్రహ్మదేవుడు శ్రీహరిని పూజించి ఇట్లు పలికెను. ఓ దేవా! ఈ దానవ వధతో నీవు మహత్తరమైన కార్యమును నెరవేర్చితివి, దేవతల హృదయములోని శల్యమును తొలిగించితివి, ఈ దైత్య వధతో మేము కూడ చాలా సంతసించితిమి.

యో౭యం త్వయా హతో విష్ణో కాలనేమీ మహాసురః ।
త్వమేకో౭స్య మృధే హంతా నాన్యః కశ్చన విద్యతే ॥ 58 ॥

ఏష దేవాన్ పరిభవన్ లోకాంశ్చ స చరాచరాన్ ।
ఋషీణాం కదనం కృత్వా మామపి ప్రతిగర్జతి ॥ 59 ॥

తదనేన తవాగ్ర్యేణ పరితుష్టోఽస్మి కర్మణా ।
యదయం కాలకల్పస్తు కాలనేమీ నిపాతితః ॥ 60 ॥

హే విష్ణో! ఇప్పుడు యుద్ధమున నీచే వధింపబడిన ఈ మహాసురుడైన కాలనేమిని నీవు తప్ప ఎవరును వధించలేరు. వీడు సకల చరాచరలోకములను, దేవతలను, ఋషులను అవమానపరుచుచు బాధపెట్టుచు నన్ను కూడ గర్జించుచున్నాడు. అట్టి దుష్టుడిని నీవు వధించితివి, నీ ఈ కార్యము చేత నేను సంతసించితిని. కాలపురుషునితో సమానుడైన ఈ కాలనేమి మరణించినాడు ఇది అందరికి శుభప్రదము.

తదాగచ్ఛస్వ భద్రం తే గచ్ఛామ దివముత్తమమ్ ।
బ్రహ్మర్షయ స్త్వా తత్రస్థాః ప్రతీక్షన్తే సదోగతాః ॥ 61 ॥

ఓ దేవా! రమ్ము, మనమందరము కలిసి స్వర్గలోకమునకు పోవుదము, నీకు శుభము కలుగుగాక! అక్కడ బ్రహ్మర్షులందరూ సభలో నీకొరకై నిరీక్షించుచున్నారు.

కం చాహం తవ దాస్యామి వరం వరవతాం వర ।
సురేష్వథ చ దైత్యేషు వరాణాం వరదో భవాన్ ॥ 62 ॥

నిర్యాతయైత త్రైలోక్యం స్ఫీతం నిహతకంటకమ్ ।
అస్మిన్నేవ మృధే విష్ణో వక్రాయ సుమహాత్మనే ॥ 63 ॥

మరియు వరములను కోరువారలలో నీవే ఉత్తముడవు అట్లే దేవతలకు దానవులకు కూడ వరములిచ్చుటలో కూడ నీవే శ్రేష్ఠుడవు కావున నేను నీకు ఎటువంటి వరమివ్వగలను? ఇప్పుడు నిష్కంటకమైనట్టి సర్వ సమృద్ధమైనట్టి ఈ త్రైలోక్యమును మహాత్ముడైన ఇంద్రునకు ఈ యుద్ధరంగమునందే అప్పగింపుము.

ఏవముక్తో భగవతా బ్రహ్మణా హరిరవ్యయః ।
దేవాన్ శక్రముఖాన్ సర్వానువాచ శుభయా గిరా ॥ 64 ॥

బ్రహ్మచేత ఆ విధముగా వివరింపబడిన అవ్యయుడైన శ్రీహరి ఇంద్రాది దేవతందరిని ఉద్దేశించి శుభప్రదములైన వాక్కులతో ఇట్లు పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు చెప్పాడు.

శ్రుణ్వన్తు త్రిదశాః సర్వే యావన్తోఽత్ర సమాగతాః ।
శ్రవణా వహితైః స్తోత్రైః పురస్కృత్య పురన్దరమ్ ॥ 65 ॥

అస్మాభిః సమరే సర్వే కాలనేమి ముఖా హతాః ।
దానవా విక్రమోపేతాః శక్రాదపి మహత్తరాః ॥ 66 ॥

అస్మిన్ మహతి సంగ్రామే దైతేయా ద్వౌ వినిఃసృతౌ ।
విరోచనశ్చ దైత్యేంద్రః స్వర్భానుశ్చ మహాగ్రహః ॥ 67 ॥

ఇక్కడ సమావిష్టులైన సర్వదేవతలారా! ఇంద్రుడు మొదలగు మీరంతా అవహితచిత్తులై నేను చెప్పునది వినుము. మేము కాలనేమి ప్రభృతి దానవులందరిని వధించితిమి. ఇంద్రునికంటే బలవత్తరులైన పరాక్రమవంతులైన దానవులందరూ మాచే సంగ్రామమున వధింపబడిరి. కాని ఈ మహాసంగ్రామమున తప్పించుకొని పోయిన వారిద్దరూ దానవులే, వారు:- దైత్యేంద్రుడైన విరోచనుడు మరియు మహాబలుడగు స్వర్భానువు = రాహువు.

స్వాం దిశం భజతాం శక్రో దిశం వరుణ ఏవ చ ।
యామ్యాం యమః పాలయతాముత్తరాం చ ధనాధిపః ॥ 68 ॥

ఋక్షైః సహ యథా యోగం గచ్ఛతాం చైవ చంద్రమాః ।
అబ్దమృత్యు ముఖే సూర్యో భజతామయనైః స్సహ ॥ 69 ॥

ఇంద్రుడు, వరుణుడు, యముడు మరియు కుబేరుడు తమ తమ దిక్కులకు పోయి వాటిని చక్కగా పాలింతురుగాక! నక్షత్రసహితుడైన చంద్రుడు కూడ తన స్థానమునకు వెళ్ళి వాటితో పాటు వృద్ధి పొందుగాక! సూర్యుడు కూడ సంవత్సరములు, యనములు, ఋతువులు మొదలగు వాటిని ఆశ్రయించి కాలమును నడుపుగాక!

ఆజ్యభాగాః ప్రవర్తన్తాం సదస్యైరభిపూజితాః ।
హూయన్తా మగ్నయో విప్రైః వేదదృష్టేన కర్మణా ॥ 70 ॥

దేవాశ్చాప్యగ్నిహోమేన స్వాధ్యాయేన మహర్షయః ।
శ్రాద్ధేన పితరశ్చైవ తృప్తిం యాన్తు యథా సుఖమ్ ॥ 71 ॥

సదస్యులైన ఋత్వికులచేత అభిపూజితములైన ఆజ్యభాగములు సదా ప్రవర్తిల్లు గాక! వేద విహితమైన కర్మానుసారముగా విప్రులు అగ్నిదేవునికి హవిస్సులర్పింతురు గాక! దేవతలు అగ్ని హోమములతో, మహర్షులు స్వాధ్యాయముతోను, పితరులు శ్రాద్ధాది కర్మలతోను సుఖముగా తృప్తిపొందురు గాక!

వాయుశ్చరతు మార్గస్థస్త్రిధా దీప్యతు పావనః ।
త్రీంస్తు వర్ణాంశ్చ లోకాం స్త్రీన్ స్తర్పయంశ్చాత్మజైర్గుణైః ॥ 72 ॥

క్రతవః సమ్ప్రవర్తన్తాం దీక్షణీయైర్ద్విజాతిభిః ।
దక్షిణాశ్చోప పాద్యన్తాం యాజ్ఞకేభ్యః పృథక్ పృథక్ ॥ 73 ॥

వాయువు తన మార్గమునందు చక్కగా ప్రవర్తించుగాక! తనకు స్వాభావికములైన సత్త్వ రజస్తమో గుణత్రయముతో కూడిన అగ్నిదేవుడు ఆ గుణములకు ప్రతీకములైన శుక్ల రక్త కృష్ణవర్ణ త్రయముతో వెలుగుచు ఆ మూడు వర్ణములను మరియు మూడులోకములను కూడ తృప్తి కలిగించుగాక! దీక్షాబద్ధులైన బ్రాహ్మణుల చేత యజ్ఞయాగాది క్రతువులు సర్వదా ప్రవర్తించుగాక! యాజ్ఞకులకు నియమానుసారముగా దక్షిణలు లభించుగాక!

గాం తు సూర్యోరసాన్ సోమో వాయుః ప్రాణాంశ్చ ప్రాణిషు ।
తర్పయన్తః ప్రవర్తన్తాం సర్వ ఏవ స్వకర్మభిః ॥ 74 ॥

యథావదానుపూర్వ్యేణ మహేంద్రమలయోద్భవాః ।
త్రైలోక్యమాతరః సర్వాః సముద్రం యాన్తు సిన్ధవః ॥ 75 ॥

సూర్యుడు గోవులను, చంద్రుడు రసద్రవ్యములను, వాయువు ప్రాణులయొక్క ప్రాణవాయువును అందరూ తమ తమ కర్మలను నియమానుసారముగా ఆచరించుచు లోకులకు తృప్తి కలిగింతురుగాక! (సంస్కృతమున 'గో' శబ్దమునకు ఆవులు, గ్రహములు, కిరణములు, వేద వాక్కు ఇత్యాద్యనేక అర్థములు కలవు.సూర్యుడు తన కిరణములను సర్వత్ర వ్యాపింపజేసినప్పుడే ఇవన్నియు రక్షింపబడుతాయి మరియు మహేంద్ర మలయాది పర్వతములనుండి ఉద్భవించిన త్రైలోక్య మాతృమూర్తులైన పవిత్రనదులన్నియు పూర్వమువలెనే క్రమముగా సముద్రుని చేరుగాక!

దైత్యేభ్య స్త్యజ్యతాం భీశ్చ శాంతిం వ్రజత దేవతాః ।
స్వస్తి వో౽స్తు గమిష్యామి బ్రహ్మలోకం సనాతనమ్ ॥ 76 ॥

ఓ దేవతలారా! దైత్యుల నుండి వచ్చు భయములను విడిచి పెట్టుము, శాంతిని పొందుము, మీ అందరికి శుభం కలుగుగాక! నేను సనాతనమైన బ్రహ్మలోకానికి వెళ్ళెదను.

స్వగృహే స్వర్గలోకే వా సంగ్రామే వా విశేషతః ।
విశ్రమ్భో వా న మన్తవ్యో నిత్యం క్షుద్రా హి దానవాః ॥ 77 ॥

ఛిద్రేషు ప్రహరన్త్యేతే న తేషాం సంస్థితి ర్ధ్రువా ।
సౌమ్యానాం ఋజుభావానాం భవతా మార్దవం ధనమ్ ॥ 78 ॥

సృగృహమునందు కాని, స్వర్గలోకమున గాని లేదా సంగ్రామమున కాని ఎప్పుడు మాకు ఏమి లెమ్మను నమ్మకముతో ఉండకూడదు. దానవులు ఎల్లప్పుడూ క్షుద్రస్వభావము కలవారే, ఛిద్రములందు అనగా మనవద్దనుండే లోటుపాట్లను అదనుగా తీసుకుని వారు దెబ్బ తీయటానికి యత్నింతురు. స్థిరముగా ఉండుట వారి ప్రకృతికి విరుద్ధము. మీరేమో సౌమ్య స్వభావులు, నిష్కపటులు, మంచితనమే మీ ధనం.

ఏవముక్త్వా సురగణాన్ విష్ణుః సత్య పరాక్రమః ।
జగామ బ్రహ్మణా సార్ధం స్వలోకం తు మహాయశాః ॥ 79 ॥

ఏతదాశ్చర్య మభవత్ సంగ్రామే తారకామయే ।
దానవానాం చ విష్ణోశ్చ యన్మాం త్వం పరిపృష్టవాన్ ॥ 80 ॥

ఇట్లు దేవతలకు చెప్పి, సత్యపరాక్రముడు మహాయశస్వి అయిన శ్రీమహావిష్ణువు బ్రహ్మతో కూడ స్వలోకమును వెళ్ళిపోయెను, ఈ విధముగా దానవులకు విష్ణువుకు మధ్యన జరిగిన తారకామయ యుద్ధ ప్రస్తావమున చోటు చేసుకున్న ఆశ్చర్యము ఇదే, ఈ విషయమే నీవు నన్ను అడిగినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే పద్మోద్భవ ప్రాదుర్భావ సంగ్రహే కాలనేమివధో నామ అష్టసప్తత్యధిక శతతమో౽ధ్యాయః॥ 178॥

శ్రీ మత్స్యమహాపురాణమున పద్మోద్భవ ప్రాదుర్భావ సంగ్రహమున కాలనేమి వధ - దేవతలు విష్ణువును స్తుతించుట అనే నూట డెబ్బైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనాశీత్యధిక శతతమోఽధ్యాయః – నూటడెబ్బై తొమ్మిదవ అధ్యాయం

అంధక వధః – అంధకాసుర వధ

ఋషయః ఊచుః – ఋషులు పలికారు.

శ్రుతః పద్మోద్భవస్తాత విస్తరేణ త్వయేరితః ।
సమాసాద్భవమాహాత్మ్యం భైరవస్య విధీయతామ్ ॥ 1 ॥

సూతా! నీవు విస్తరంగా వివరించిన పద్మోద్భవ వృత్తాంతాన్ని విన్నాము. ఇపుడు శివుని రూపమైన భైరవమాహాత్మ్యాన్ని సంగ్రహంగా వినిపించు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

తస్యాపి దేవదేవస్య శృణుధ్వం కర్మ చోత్తమమ్ ।
ఆసీద్దైత్యో ఽన్ధకో నామ భిన్నాంజనచయోపమః ॥ 2 ॥

తపసా మహతా యుక్తో హ్యవధ్యస్త్రిదివౌకసామ్ ।

ఆ దేవదేవుని ఉత్తమమైన కర్మను గురించి వివరిస్తాను, శ్రద్ధగా విను. పూర్వం అంధకుడనే దైత్యుడుండేవాడు. వాడు కాటుక రాశివంటి కాంతి గలవాడు. మహత్తరమైన తపశ్శక్తితో కూడివున్నవాడు, దేవతలచేత కూడ వధింపబడలేనివాడు.

స కదాచిన్మహాదేవం పార్వత్యా సహితం ప్రభుమ్ ॥ 3 ॥

క్రీడమానం తదా దృష్ట్వా హర్తుం దేవీం ప్రచక్రమే ।
తస్య యుద్ధం తదా ఘోరమభవత్సహ శమ్భునా ॥ 4 ॥

ఆవన్త్యే విషయే ఘోరే మహాకాలవనం ప్రతి ।
తస్మిన్ యుద్ధే తదా రుద్రశ్చాన్ధకేనాతిపీడితః ॥ 5 ॥

సుషువే బాణమత్యుగ్రం నామ్నా పాశుపతం హి తత్ ।

వాడొకప్పుడు పార్వతీ సహితుడై విహరిస్తున్న మహాదేవుని చూచి ఆ దేవిని అపహరించుటకు ఉద్యుక్తుడయ్యాడు. అపుడు శివునికి అంధకాసురునితో ఘోరమైన యుద్ధం జరిగింది. అవంతీ దేశ ప్రాంతంలో ఉన్న మహాకాల వనంలో వారిద్దరి మధ్యలో జరిగిన ఘోరమైన యుద్ధంలో అంధకుడు శివుణ్ణి బాగా బాధపెట్టాడు. కాని పాశుపతమనే అత్యుగ్రమైన బాణాన్ని వానిపై ప్రయోగించాడు.

రుద్రబాణవినిర్భేదాద్రుధిరాదన్ధకస్య తు ॥ 6 ॥

అన్ధకాశ్చ సముత్పన్నాః శతశోఽథ సహస్రశః ।
తేషాం విదార్యమాణానాం రుధిరాదపరే పునః ॥ 7 ॥

బభూవురన్ధకా ఘోరా యైర్వ్యాప్తమఖిలం జగత్ ।

రుద్రుని బాణంతో ఛేదించబడిన అంధకాసురుని దేహపు రక్తం నుండి వానిని పోలినవారు వందలు, వేలకొలది ఉద్భవించారు. వారిని ఛేదిస్తుండగా మరల వారి రక్తం నుండి ఇంకొందరు ఉద్భవించసాగారు. ఇలా ఘోరాకృతి గలిగిన అంధకాసురులతో సమస్త జగత్తు వ్యాప్తమయింది.

ఏవం మాయావినం దృష్ట్వా తం చ దేవస్తథాన్ధకమ్ ॥ 8 ॥

పానార్థమన్ధ కాస్రస్య సోऽసృజన్మాతరస్తదా ।

అలా మాయావి అయిన అంధకుని చూచిన పరమశివుడు వాడి రక్తాన్ని త్రాగటానికి మాతృకలను సృష్టించాడు.

మాహేశ్వరీ తథా బ్రాహ్మీ కౌమారీ మాలినీ తథా ॥ 9 ॥

సౌపర్ణీ హ్యథ వాయవ్యా శాక్రీ వై నైఋృతా తథా ।
సౌరీ సౌమ్యా శివా దూతీ చాముండా చాథ వారుణీ ॥ 10 ॥

వారాహీ నారసింహీచ వైష్ణవీ చ చలచ్ఛిఖా ।
శతానన్దా భగానన్దా పిచ్ఛిలా భగమాలినీ ॥ 11 ॥

బలా చాతిబలా రక్తా సురభీ ముఖమండికా ।
మాతృనన్దా సునన్దా చ బిడాలీ శకునీ తథా ॥ 12 ॥

రేవతీ చ మహారక్తా తథైవ పిలపిచ్ఛికా ।
జయా చ విజయా చైవ జయన్తీ చాపరాజితా ॥ 13 ॥

కాలీ చైవ మహాకాలీ దూతీ చైవ తథైవ చ ।
సుభగా దుర్భగా చైవ కరాలీ నందినీ తథా ॥ 14 ॥

మాహేశ్వరి, బ్రాహ్మి, కౌమారి, మాలని, సౌపర్ణి, వాయవ్య, శాక్రి, నైఋృతి, సౌరి, సౌమ్య, శివ, దూత, చాముండ, వారుణి, వారాహి, నరసింహ, వైష్ణవి, చలచ్ఛిఖ, శతానంద, భగానంద, పిచ్ఛిల, భగమాలిని, బల, అతిబల, రక్త, సురభి, ముఖమండిక, మాతృనంద, సునంద, బిడాలి, శకుని, రేవతి, మహారక్త, పిలిపిచ్ఛిక, జయ, విజయ, జయంతి, అపరాజిత, కాళి, మహాకాళి, దూతి, సుభగ, దుర్భగ, కరాళి, నందిని,

అదితిశ్చ దితిశ్చైవ మారీ వై మృత్యురేవ చ ।
కర్ణమోటీ తథా గ్రామ్యా ఉలూకీ చ ఘటోదరీ ॥ 15 ॥

కపాలీ వజ్రహస్తా చ పిశాచీ రాక్షసీ తథా ।
భుశుణ్డీ శాఙ్కరీ చణ్డా లాఙ్గలీ కుటభీ తథా ॥ 16 ॥

ఖేటా సులోచనా ధూమ్రా ఏకవీరా కరాలినీ ।
విశాలదంష్ట్రిణీ శ్యామా త్రిజటీ కుక్కుటీ తథా ॥ 17 ॥

వైనాయకీ చ వైతాలీ ఉన్మత్తోదుమ్బరీ తథా ।
సిద్ధిశ్చ లేలిహానా చ కేకరీ గర్దభీ తథా ॥ 18 ॥

అదితి, దితి, మారి, మృత్యు, కర్ణమోటి, గ్రామ్య, ఉలూకి, ఘటోదరి, కపాలి, వజ్రహస్త, పిశాచి, రాక్షసి, భుశుండి, శాంకరి, చండ, లాంగలి, కుటభి, ఖేట, సులోచన, ధూమ్ర, ఏకవీర, కరాలిని, విశాలదంష్ట్రిణి, శ్యామ, త్రిజటి, కుక్కుటి, వైనాయకి, వైతాలి, ఉన్మత్తోదుంబరి, సిద్ధి, లేలిహాన, కేకరి, గర్దభి,

భ్రుకుటీ బహుపుత్రీ చ ప్రేతయానా విడమ్బినీ ।
క్రౌంచా శైలముఖీ చైవ వినతా సురసా దనుః ॥ 19 ॥

ఉషా రమ్భా మేనకా చ సలిలా చిత్రరూపిణీ ।
స్వాహా స్వధా వషట్కారా ధృతిర్జ్యేష్ఠా కపర్దినీ ॥ 20 ॥

మాయా విచిత్రరూపా చ కామరూపా చ సఙ్గమా ।
ముఖేవిలా మఙ్గలా చ మహానాసా మహాముఖీ ॥ 21 ॥

కుమారీ రోచనా భీమా సదాహా చ మదోద్ధతా ।
అలమ్బాక్షీ కాలపర్ణీ కుమ్భకర్ణీ మహాసురీ ॥ 22 ॥

కేశినీ శఙ్ఖినీ లమ్బా పిఙ్గలా లోహితాముఖీ ।
ఘణ్టారవాథ దంష్ట్రాలా రోచనా కాకజఙ్ఘికా ॥ 23 ॥

భ్రుకుటి, బహుపుత్రీ, ప్రేతయాన, విడంబినీ, క్రౌంచ, శైలముఖి, వినత, సురస, దను, ఉష, రంభ, మేనక, సలిల, చిత్రరూపిణి, స్వాహ, స్వధా, వషట్కార, ధృతి, జ్యేష్ఠ, కపర్దిని, మాయ, విచిత్రరూప, కామరూప, సంగమ, ముఖేవిల, మంగళ, మహానాస, మహాముఖి, కుమారి, రోచన, భీమ, సదాహ, మదోద్ధత, అలంబాక్షి, కాలపర్ణి, కుంభకర్ణి, మహాసురీ, కేశినీ, శంఖినీ, లంబా, పింగళ, లోహితాముఖి, ఘంటారవ, దంష్ట్రాల, రోచన, కాకజంఘిక,

గోకర్ణికాజముఖికా మహాగ్రీవా మహాముఖీ ।
ఉల్కాముఖీ ధూమశిఖా కమ్పినీ పరికమ్పినీ ॥ 24 ॥

మోహనా కమ్పనా క్ష్వేలా నిర్భయా బాహుశాలినీ ।
సర్పకర్ణీ తథైకాక్షీ విశోకా నన్దినీ తథా ॥ 25 ॥

జ్యోత్స్నాముఖీ చ రభసా నికుంభా రక్తకమ్పనా ।
అవికారా మహాచిత్రా చన్ద్రసేనా మనోరమా ॥ 26 ॥

అదర్శనా హరత్పాపా మాతఙ్గీ లమ్బమేఖలా ।
అబాలా వఞ్చనా కాలీ ప్రమోదా లాఙ్గలావతీ ॥ 27 ॥

చిత్తా చిత్తజలా కోణా శాన్తికాఘవినాశినీ ।
లమ్బస్తనీ లమ్బసటా విసటా వాసచూర్ణినీ ॥ 28 ॥

గోకర్ణిక, అజముఖిక, మహాగ్రీవ, మహాముఖి, ఉల్కాముఖి, ధూమశిఖ, కంపిని, పరికంపిని, మోహన, కంపన, క్ష్వేళ, నిర్భయ, బాహుశాలిని, సర్పకర్ణి, ఏకాక్షి, విశోక, నందిని, జ్యోత్స్నాముఖి, రభస, నికుంభ, రక్తకంపన, అవికార, మహాచిత్ర, చంద్రసేన, మనోరమ, అదర్శన, హరత్పాప, మాతంగి, లంబమేఖల, అబాల, వంచన, కాళి, ప్రమోద, లాంగలావతి, చిత్త, చిత్తజల, కోణ, శాంతిక, అఘవినాశిని, లంబస్తని, లంబసట, విసట, వాసచూర్ణిని,

స్ఖలన్తీ దీర్ఘకేశీ చ సుచిరా సుందరీ శుభా ।
అయోముఖీ కటుముఖీ క్రోధనీ చ తథాశనీ ॥ 29 ॥

కుటుమ్బికా ముక్తికా చ చంద్రికా బలమోహినీ ।
సామాన్యా హాసినీ లమ్బా కోవిదారీ సమాసవీ ॥ 30 ॥

శఙ్కుకర్ణీ మహానాదా మహాదేవీ మహోదరీ ।
హుంకారీ రుద్రసుసటా రుద్రేశీ భూతడామరీ ॥ 31 ॥

పిండజిహ్వా చలజ్జ్వాలా శిఖా జ్వాలాముఖీ తథా ।
ఏతాశ్చాన్యాశ్చ దేవేశః సోஉసృజన్మాతరస్తదా ॥ 32 ॥

స్ఖలంతి, దీర్ఘకేశి, సుచిర, సుందరి, శుభ, అయోముఖి, కటుముఖి, క్రోధని, అశని, కుటుంబిక, ముక్తిక, చంద్రిక, బలమోహిని, సామాన్య, హాసిని, లంబ, కోవిదారి, సమాసవీ, శంకుకర్ణీ, మహానాద, మహాదేవి, మహోదరి, హుంకారి, రుద్రసుసట, రుద్రేశి, భూతడామరి, పిండజిహ్వ, చలజ్జ్వాల, శిఖ, జ్వాలాముఖి మొదలగు వారేకాక ఇంకనూ ఇతర మాతృగణాలను కూడ పరమశివుడు సృష్టించాడు.

అన్ధకానాం మహాఘోరాః పపుస్త్రుధిరం తదా ।
తతో உన్ధకాసృజః సర్వాః పరాం తృప్తిముపాగతాః ॥ 33 ॥

తాసు తృప్తాసు సంభూతా భూయ ఏవాన్ధకప్రజాః ।
అర్దితస్తైర్మహాదేవః శూలముద్గరపాణిభిః ॥ 34 ॥

అలా శివునిచే సృష్టించబడిన మహాఘోర మాతృకలు అంధకుల రక్తాన్ని త్రాగారు. ఆ అంధకుల రక్తంతో వారందరు కడు తృప్తి పొందారు. వారు తృప్తి పొందిన తరువాత మరల అంధక పుత్రులు జనించి, చేతులలో శూలాలు, ముద్గరాలు ధరించి మహాదేవుని బాధపెట్టసాగారు.

తతః స శంకరో దేవస్త్వన్ధకైర్వ్యాకులీకృతః ।
జగామ శరణం దేవం వాసుదేవమజం విభుమ్ ॥ 35 ॥

అంధకుల చేత బాధితుడైన శంకరుడు జగత్ప్రభువైన వాసుదేవుని శరణు వేడాడు.

తతస్తు భగవాన్ విష్ణుః సృష్టవాన్ శుష్కరేవతీమ్ ।
యా పపౌ సకలం తేషామన్ధకానామసృక్ క్షణాత్ ॥ 36 ॥

యథా యథా చ రుధిరం పిబన్త్యన్ధకసంభవమ్ ।
తథా తథాధికం దేవీ సంశుష్యతి జనాధిప ॥ 37 ॥

పీయమానే తయా తేషామన్ధకానాం తథాసృజి ।
అన్ధకాస్తు క్షయం నీతాః సర్వే తే త్రిపురారిణా ॥ 38 ॥

అపుడు విష్ణు భగవానుడు శష్కరేవతి అనే దేవతను సృష్టించాడు. ఆమె క్షణకాలంలోనే ఆ అంధకుల రక్తమంతా త్రాగి వేసింది. అలా అంధకుల నుండి వచ్చిన రక్తాన్ని ఆమె త్రాగినకొలది ఎండిపోసాగింది. రాజా! ఆమె త్రాగుతుండగా త్రిపురారియైన శివుడు అక్కడ ఉన్న అంధకులందరినీ క్షయం చేశాడు.

మూలాన్ధకం తు విక్రమ్య తదా శర్వస్త్రిలోకధృక్ ।
చకార వేగాచ్ఛూలాగ్రే స చ తుష్టావ శంకరమ్ ॥ 39 ॥

అన్ధకస్తు మహావీర్యస్తస్య తుష్టోఽభవద్భవః ।
సామీప్యం ప్రదదౌ నిత్యం గణేశత్వం తథైవ చ ॥ 40 ॥

తర్వాత త్రిలోకాధిపతియైన పరమశివుడు తన పరాక్రమంతో అసలైన అంధకాసురుని మహావేగంతో తన శూలాగ్రంలో బంధించగా, మహావీరుడైన అంధకాసురుడు శివుని స్తుతించాడు. ఆ స్తోత్రంతో సంతుష్టుడైన శివుడు వానికి నిత్యం తన సాన్నిధ్యాన్ని మరియు గణేశత్వాన్ని కూడ ప్రసాదించాడు.

తతో మాతృగణాః సర్వే శంకరం వాక్యమబ్రువన్ ।
భగవన్ భక్షయిష్యామః సదేవాసురమానుషాన్ ॥
త్వత్ప్రసాదాజ్జగత్సర్వం తదనుజ్ఞాతుమర్హసి ॥ 41 ॥

అపుడు మాతృగణాలన్నీ శంకరునితో ఇలా పలికారు. ఓ భగవంతుడా! దేవతలు, రాక్షసులు, మనుష్యులు మొదలగువారితో కూడిన ఈ జగత్తును మేము భక్షిస్తాము. దానికి నీ అనుగ్రహం కావాలి. దయతో అనుజ్ఞనివ్వు అని ప్రార్థించారు.

శంకర ఉవాచ – శంకరుడు బదులిచ్చాడు.

భవతీభిః ప్రజాః సర్వాః రక్షణీయా న సంశయః ।
తస్మాద్ఘోరాదభిప్రాయాన్మనః శీఘ్రం నివర్త్యతామ్ ॥ 42 ॥

మీచేత ప్రజలందరూ రక్షించబడాలి, ఇది నిస్సంశయం కనుక ఘోరమైన ఆ అభిప్రాయం నుండి మీ మనస్సును మరల్చుకొనండి అని శంకరుడు వారితో అన్నాడు.

ఇత్యేవం శంకరేణోక్తం అనాదృత్య వచస్తదా ।
భక్షయామాసురత్యుగ్రాః త్రైలోక్యం సచరాచరమ్ ॥ 43 ॥

కానీ ఆ విధమైన శంకరుని మాటలు లెక్కచేయక, ఆదరించక ఆ మాతృకలు మిక్కిలి ఉగ్రరూపులై చరాచరాలతో కూడిన మూడు లోకాలను భక్షించసాగారు.

త్రైలోక్యే భక్ష్యమాణే తు తదా మాతృగణేన వై ।
నృసింహమూర్తిం దేవేశం ప్రదధ్యౌ భగవాన్ శివః ॥ 44 ॥

అనాదినిధనం దేవం సర్వలోకభవోద్భవమ్ ।
దైత్యేంద్రవక్షోరుధిరచర్చితాగ్రమహానఖమ్ ॥ 45 ॥

శివుని మాటలు ఆదరించక ఎప్పుడైతే మాతృకలు ముల్లోకాలను భక్షించసాగారో అపుడు పరమశివుడు దేవదేవుడు, అనాదినిధనుడు, సర్వలోక సృష్టికి కారణుడు, దైత్యేంద్రుడైన హిరణ్యకశిపుని వక్షఃస్థలం చీల్చటం వలన వచ్చినటువంటి రక్తంతో ప్రకాశిస్తున్న గోళ్ళు కలవాడు (అయిన నృసింహమూర్తిని ధ్యానించాడు అని 52వ శ్లోకము వరకు అన్వయము)

విద్యుజ్జిహ్వం మహాదంష్ట్రం స్ఫురత్కేసరకణ్ఠకమ్ ।
కల్పాన్తమారుతక్షుబ్ధం సప్తార్ణవసమస్వనమ్ ॥ 46 ॥

వజ్రతీక్ష్ణనఖం ఘోరమాకర్ణవ్యాదితాననమ్ ।
మేరుశైలప్రతీకాశముదయార్కసమేక్షణమ్ ॥ 47 ॥

హిమాద్రిశిఖరాకారం చారుదంష్ట్రోజ్వలాననమ్ ।
నఖనిస్సృతరోషాగ్నిజ్వాలాకేసరమాలినమ్ ॥ 48 ॥

మెరుపువంటి నాలుక కలవాడు, గొప్ప కోరలు గలవాడు, ప్రకాశిస్తున్న జూలు కలవాడు, ప్రళయకాలమందలి గాలిచేత కలత పడిన సప్త సముద్రముల వంటి ధ్వని కలవాడు, వజ్రం వంటి గట్టి పదునైన గోళ్ళు కలవాడు, ఘోరరూపం కలవాడు, చెవులవరకు వ్యాపించిన విశాలమైన నోరు కలవాడు, మేరు పర్వతం వలె మెరసేవాడు, ఉదయించే సూర్యుని వంటి కన్నులు గలవాడు, హిమవత్పర్వత శిఖరం వంటి ఆకృతి గలవాడు, చక్కనైన కోరలతో ప్రకాశించే ముఖం గలవాడు, గోళ్ళనుండి ఉద్భవిస్తున్న రోషాగ్ని జ్వాలలనే కేసరాలు (జూలు) కలవాడు, (అయిన నృసింహమూర్తిని శివుడు ధ్యానించాడు.)

వజ్రాంగదం సుముకుటం హారకేయూరభూషణమ్ ।
శ్రోణీసూత్రేణ మహతా కాంచనేన విరాజితమ్ ॥ 49 ॥

నీలోత్పలదలశ్యామం వాసోయుగవిభూషణమ్ ।
తేజసాక్రాన్తసకలబ్రహ్మాణ్డాగారసంకులమ్ ॥ 50 ॥

పవనం భ్రామ్యమాణానాం హుతహవ్యవహార్చిషామ్ ।
ఆవర్తసదృశాకారైః సంయుక్తం దేహలోమజైః ॥ 52 ॥

సర్వపుష్పవిచిత్రాం చ ధారయన్తం మహాస్రజమ్ ।

భుజకీర్తులు, కిరీటం, హారాలు, కేయూరాలు మొదలైన ఆభరణాలతో, మరియు బంగారపు కటిసూత్రంతో కూడ ప్రకాశిస్తున్నవాడు, నల్లకలువవంటి ఛాయ కలవాడు, రెండు వస్త్రాలను అలంకారంగా ధరించినవాడు, తనతేజస్సుతో సకల బ్రహ్మాండాంతరాళాన్ని వ్యాపించినవాడు, బలమైన గాలిచేత త్రిప్పబడుచున్నట్టి తమయందు అర్పించబడిన హవిస్సులను తీసుకునిపోవు అగ్నిజ్వాలల సుడులతో సమానమైన ఆకారములు గల కేశములతో కూడినవాడు, సర్వవర్ణములు గల పుష్పములతో కూర్చబడిన మహామాలను ధరించినవాడు అయిన నృసింహమూర్తిని పరమశివుడు ధ్యానించాడు.

స ధ్యాతమాత్రో భగవాన్ ప్రదదౌ తస్య దర్శనమ్ ॥ 52 ॥

యాదృశేనైవ రూపేణ ధ్యాతో రుద్రేణ ధీమతా ।
తాదృశేనైవ రూపేణ దుర్నిరీక్ష్యేణ దైవతైః ॥ 53 ॥

ప్రణిపత్య తు దేవేశం తదా తుష్టావ శంకరః ॥ 54 ॥

ధీమంతుడైన శివుడు ఏ రూపం కలవానినిగా తనను ధ్యానించాడో అదే రూపంలో నృసింహపరమాత్మ ధ్యానించిన వెంటనే ఆతనికి (శివునకు) దర్శనమిచ్చాడు. దేవతలకు కూడ చూడడానికి శక్యం కానటువంటి తన రూపంతో శివునికి దర్శనమిచ్చాడు. అపుడు శివుడు ఆ దేవునికి నమస్కరించి ఈ విధంగా స్తుతించాడు.

శంకర ఉవాచ – శంకరుడు చెప్పాడు.

నమస్తేఽస్తు జగన్నాథ నరసింహవపుర్ధర ।
దైత్యనాథాసృజాపూర్ణనఖశక్తివిరాజిత ॥ 55 ॥

తతః సకలసంలగ్నహేమపింగలవిగ్రహ ।
నతోఽస్మి పద్మనాభ త్వాం సురశక్రజగద్గురో ॥ 56 ॥

ఓ జగన్నాథా! నృసింహదేహధారీ! దైత్యానాథుడైన హిరణ్యకశిపుని రక్తంతో నిండిన గోళ్ళు అనే శక్తి చేత ప్రకాశించేవాడా! నీకు నా నమస్సులు. సకల జగత్తులో వ్యాపించిన బంగారుపు వర్ణము వంటి పచ్చని దేహం కలవాడా! ఓ పద్మనాభా! ఇంద్రాది దేవతలకు, సకల జగత్తులకు కూడ గురువైన వాడా! నీకు నమస్కరిస్తున్నాను.

కల్పాన్తాంభోదనిర్ఘోషసూర్యకోటిసమప్రభ ।
సహస్రయమసంక్రోధసహస్రేంద్ర పరాక్రమ ॥ 57 ॥

సహస్రధనదస్ఫీత సహస్రవరుణాత్మక ।
సహస్రకాలరచిత సహస్రనియతేంద్రియ ॥ 58 ॥

సహస్రభూర్మహాధైర్య సహస్రానన్తమూర్తిమన్ ।
సహస్రచంద్రప్రతిమ సహస్రగ్రహవిక్రమ ॥ 59 ॥

సహస్రరుద్రతేజస్క సహస్రబ్రహ్మసంస్తుత ।
సహస్రబాహువేగోగ్ర సహస్రాస్యనిరీక్షణ ॥
సహస్రయన్త్రమథన సహస్రవధమోచన ॥ 60 ॥

ప్రళయకాలపు మేఘముల ధ్వని వంటి గంభీరస్వరం కలవాడా! వెయ్యి సూర్యులతో సమానమైన కాంతిగలవాడా! క్రోధంలో వేయిమంది యములతో సమానమైనవాడా! పరాక్రమంలో వేయిమంది ఇంద్రులతో సమానమైనవాడా! ధనంలో వేయిమంది కుబేరులతో సమానమైన వాడా! వేయిమంది వరుణుల వంటి బలం కలవాడా! వేయికాలాలను రచించేవాడా! సహస్రాధికమైన ఇంద్రియ నిగ్రహం కలవాడా! వేయిమారులు ఉద్భవించేవాడా! సహస్రాలు, అసంఖ్యాకాలు అయిన మూర్తిమత్వాన్ని ధరించేవాడా! వేయిచంద్రులతో సమానమైనవాడా! వేయి గ్రహాల పరాక్రమం కలవాడా! వేయి రుద్రుల తేజస్సు కలవాడా! వేయిమంది బ్రహ్మలచేత స్తుతించబడేవాడా! వేయి చేతులు కలవాడా! ఉగ్రరూపుడా! వేగవంతుడా! వేయి ముఖాలతో, నేత్రాలతో దర్శించేవాడా! వేయి యంత్రాల వలె మథించేవాడా! వేలమందికి బంధ విమోచనం కల్పించేవాడా! ఓ నృసింహప్రభూ! నీకు నా నమస్కారం అని శివుడు ఆ పరమేశ్వరుని అనేకవిధాలుగా స్తుతించాడు.

అన్ధకస్య వినాశాయ యా సృష్టా మాతరో మయా ।
అనాదృత్య తు మద్వాక్యం భక్షయన్త్యద్య తాః ప్రజాః ॥ 61 ॥

కృత్వా తాశ్చ న శక్తోఽహం సంహర్తుమపరాజిత ।
స్వయం కృత్వా కథం తాసాం వినాశమభికారయే ॥ 62 ॥

ఓ దేవా! అంధకాసుర వినాశనం కొరకు ఏ మాతృకలు నాచే సృష్టించబడినారో, వారిపుడు నా మాటను ఆదరించక ప్రజలందరిని భక్షిస్తున్నారు. ఓ అపరాజిత! నా చేత సృష్టించబడిన వారిని నేనిపుడు సంహరించలేక పోతున్నాను, అయినా నేనే వారిని సృష్టించి మరల వారినెలా వినాశనం చెయ్యగలను?

ఏవముక్తః స రుద్రేణ నరసింహవపుర్ధరః ।
ససర్జ దేవీ జిహ్వాయాస్తదా వాణీశ్వరీం హరిః ॥ 63 ॥

హృదయాచ్చ తథా మాయా గుహ్యాచ్చ భవమాలినీ ।
అస్థిభ్యశ్చ తథా కాలీ సృష్టా పూర్వం మహాత్మనా ॥ 64 ॥

యయా తద్రుధిరం పీతమన్ధకానాం మహాత్మనామ్ ।
యా చాస్మిన్ కథితా లోకే నామతః శుష్కరేవతీ ॥ 65 ॥

రుద్రుడు ఆ విధంగా వివరించగా నరసింహమూర్తి రూపంలో ఉన్న భగవానుడు తన నాలుక నుండి వాణీశ్వరిని, హృదయం నుండి మాయను, గుహ్యం నండి భగమాలినిని సృష్టించాడు. అంతకుముందే ఎముకల నుండి కాళిని సృష్టంచివున్నాడు. అంధకుల రక్తాన్ని తాగిన శుష్కరేవతి ఈమెయే.

ద్వాత్రింశన్మాతరః సృష్టా గాత్రేభ్యశ్చక్రిణా తతః ।
తాసాం నామాని వక్ష్యామి తాని మే గదతః శృణు ॥ 66 ॥

ఆ నలుగురు శక్తులను సృష్టించిన తర్వాత నృసింహుడు తన శరీరము నుండి ఇంకనూ ముప్పై రెండు మంది శక్తులను సృష్టించాడు. ఇప్పుడు వారి పేర్లను వివరిస్తాను, విను.

సర్వాస్తాస్తు మహాభాగా ఘంటాకర్ణీ తథైవ చ ।
త్రైలోక్య మోహినీ పుణ్యా సర్వసత్త్వవశంకరీ ॥ 67 ॥

తథా చ చక్రహృదయా పంచమీ వ్యోమచారిణీ ।
శంఖినీ లేఖినీ చైవ కాలసంకర్షణీ తథా ॥ 68 ॥

ఇత్యేతాః పృష్ఠగా రాజన్ వాగీశానుచరాః స్మృతాః ।

ఆ శక్తులందరూ మంచి మహత్త్వం గలవారే. వారిలో మహాభాగ్యశాలినియైన ఘంటాకర్ణి, త్రైలోక్య మోహిని, సర్వసత్త్వ వశంకరి, చక్రహృదయ, వ్యోమచారిణి, శంఖిని, లేఖిని, కాలసంకర్షణి అనే ఈ ఎనిమిది మందిని మొదటి శక్తి అయిన వాగీశ్వరి అనుచరులుగా చెబుతారు.

సంకర్షణీ తథాశ్వత్థా బీజభావాపరాజితా ॥ 69 ॥

కల్యాణీ మధుదంష్ట్రీ చ కమలోత్పలహస్తికా ।
ఇతి దేవ్యష్టకం రాజన్ మాయానుచరముచ్యతే ॥ 70 ॥

సంకర్షణి, అశ్వత్థ, బీజభావ, అపరాజిత, కల్యాణి, మధుదంష్ట్రి, కమలహస్తిక, ఉత్పలహస్తిక అనే ఎనిమిది శక్తుల్ని మాయా అనే శక్తికి అనుచరులుగా చెబుతారు.

అజితా సూక్ష్మహృదయా వృద్ధావేశాశ్మదంశనా ।
నృసింహభైరవా బిల్వా గరుత్మద్ధృదయా జయా ॥ 71 ॥

భవమాలిన్యనుచరా ఇత్యష్టౌ నృప మాతరః ।

అజిత, సూక్ష్మహృదయ, వృద్ధావేశ, అశ్మదంశన, నృసింహభైరవ, బిల్వ, గరుత్మహృదయ, జయ అనే ఎనిమిది మంది మాతృకలు మూడవదైన భవమాలిని అనుచరులుగా సృష్టించబడినారు.

ఆకర్ణనీ సమ్భటా చ తథైవోత్తరమాలికా ॥ 72 ॥

జ్వాలాముఖీ భీషణికా కామధేనుశ్చ బాలికా ।
తథా పద్మకరా రాజన్ రేవత్యనుచరాః స్మృతాః ॥ 73 ॥

ఆకర్ణని, సంభట, ఉత్తరమాలిక, జ్వాలాముఖి, భీషణిక, కామధేను, బాలిక, మరియు పద్మకర అనే ఈ ఎనిమిది మంది శుష్కరేవతి అనుచరులుగా సృష్టించబడినారు.

అష్టౌ మహాబలాః సర్వా దేవగాత్రసముద్భవాః ।
త్రైలోక్యసృష్టిసంహారసమర్థాః సర్వదేవతాః ॥ 74 ॥

తాః సృష్టమాత్రా దేవేన క్రుద్ధా మాతృగణస్య తు ।
ప్రధావితా మహారాజ క్రోధవిస్ఫారితేక్షణాః ॥ 75 ॥

అవిషహ్యతమం తాసాం దృష్టితేజః సుదారుణమ్ ।
తమేవ శరణం ప్రాప్తా నృసింహో వాక్యమబ్రవీత్ ॥ 76 ॥

నృసింహదేవుని శరీరం నుండి ఉద్భవించిన వీరందరూ మహాబలశాలినులు. ఈ దేవతలందరూ మూడులోకాలను సృష్టించి, మరల సంహరించే శక్తి కలవారు. ఆ విధంగా దేవుని చేత సృష్టించబడిన వెంటనే ఆ మాతృగణాలు కోపంతో మెరుస్తున్న కన్నులు గలవారై, శివునిచే సృష్టించబడిన మాతృగణాల మీదకు పరుగెత్తారు. ఈ దారుణాన్ని సహించలేని శివమాతృకలు నృసింహదేవునే శరణువేడారు.

యథా మనుష్యాః పశవః పాలయన్తి చిరాత్సుతాన్ ।
జయన్తి తే తథైవాశు యథా వై దేవతాగణాః ॥ 77 ॥

భవత్యస్తు తథా లోకాన్ పాలయన్తు మయేరితాః ।
మనుజైశ్చ తథా దేవైః యజధ్వం త్రిపురాన్తకమ్ ॥ 78 ॥

న చ బాధా ప్రకర్తవ్యా యే భక్తాస్త్రిపురాన్తకే ।
యే చ మాం సంస్మరన్తీహ తే చ రక్ష్యా సదా నరాః ॥ 79 ॥

తనను శరణువేడిన శివమాతృకలతో నృసింహదేవుడిలా అన్నాడు. ఎలాగైతే మనుష్యులు, పశువులు, తమ బిడ్డలను చాలాకాలం వరకు పోషిస్తూ రక్షిస్తారో అలాగే దేవతాగణాలు వారిని రక్షించాలి కదా! మీరు కూడ నా మాటలు విని లోకాలను రక్షించండి. మనుష్యులు, దేవతలు అందరు కూడ త్రిపురాంతకుడైన శివుని పూజించేటట్లు చేయండి. పరమశివుని భక్తులకు లోకంలో ఎటువంటి బాధ కలుగకూడదు. అంతేకాక నన్ను ఎల్లప్పుడు స్మరించేవారిని కూడ మీరు రక్షించాలి.

బలికర్మ కరిష్యన్తి యుష్మాకం యే సదా నరాః ।
సర్వకామప్రదాస్తేషాం భవిష్యధ్వం తథైవ చ ॥ 80 ॥

ఉచ్ఛ్వాసనాదికం యే చ కథయన్తి మయేరితమ్ ।
తే చ రక్ష్యాః సదా లోకాః రక్షితవ్యం చ శాసనమ్ ॥ 81 ॥

ఏ నరులైతే మీకు బలులర్పిస్తారో వారికి సర్వకామఫలాలనిచ్చి రక్షించండి. నేను పెట్టిన నియమాలను గొప్ప చెప్పేవారిని, లోకాలను, మరియు నా శాసనాన్ని కూడ మీరు ఎల్లప్పుడు రక్షించాలి.

రౌద్రీం చైవ పరాం మూర్తిం మహాదేవః ప్రదాస్యతి ।
యుష్మన్ముఖ్యా మహాదేవ్యస్తదుక్తం పరిరక్ష్యథ ॥ 82 ॥

మహాదేవుడు మీకు ఉత్తమమైన రౌద్రరూపాన్ని అనుగ్రహించగలడు. ఓ ముఖ్యులైన మహాదేవులారా! శివుడు ఆదేశించినట్లు ఈ లోకాన్ని పరిరక్షించండి.

మయా మాతృగణః సృష్టో యోఽయం విగతసాధ్వసః ।
ఏష నిత్యం విశాలాక్షో మయైవ సహ రంస్యతే ॥ 83 ॥

లోకంలో కలుగుతున్న భయాన్ని పోగొట్టడానికి మాతృగణం నాచే సృష్టించబడింది. ఆ మాతృకలు తన విశాల నేత్రాలతో లోకాలను కనిపెడుతూ నాతో కూడ లోకాలలో విహరిస్తూంటారు.

మయా సార్ధం తథా పూజాం నరేభ్యశ్చైవ లప్స్యథ ।
పృథక్ సుపూజితా లోకైః సర్వాన్ కామాన్ ప్రదాస్యథ ॥ 84 ॥

శుష్కాం సంపూజయిష్యన్తి యే చ పుత్రార్థినో జనాః ।
తేషాం పుత్రప్రదా దేవీ భవిష్యతి న సంశయః ॥ 85 ॥

మీరు మరియు నాచే సృష్టించబడిన ఈ మాతృకలు కూడ నాతో సమానంగా మానవులనుండి పూజల నందుకొంటారు. పూజించబడిన మీరు వారి కోరికలను తీర్చండి. అలాగే పుత్రార్థులైన ఏ జనులు ఈ శుష్కరేవతిని పూజిస్తారో వారికి ఈమె పుత్రులను ప్రసాదిస్తుంది. దీనిలో సందేహం లేదు.

ఏవముక్త్వా స భగవాన్ సహ మాతృగణేన తు ।
జ్వాలామాలాకులవపుః తత్రైవాన్తరధీయత ॥ 86 ॥

ఈ విధంగా వారికి ఉపదేశించి జ్వాలామాలలతో నిండిన శరీరం గల నృసింహభగవానుడు తాను సృష్టించిన ఆ మాతృకా గణంతో కూడ అక్కడే అంతర్ధానమయ్యాడు.

తత్ర తీర్థం సముత్పన్నం కృతశౌచేతి యజ్ఞగుః ।
తత్రాపి పూర్వజో దేవో జగదార్తిహరో హరః ॥ 87 ॥

రౌద్రస్య మాతృవర్గస్య దత్త్వా రుద్రస్తు పార్థివ ।
రౌద్రాం దివ్యాం తనుం తత్ర మాతృమధ్యే వ్యవస్థితః ॥ 88 ॥

నృసింహభగవానుడు అంతర్ధానం చెందిన ఆ ప్రదేశంలో 'కృతశౌచం' అను తీర్థముద్భవించింది. ఈ చరాచరప్రపంచానికంటె ముందే ఉన్నవాడు, ముల్లోకాల ఆర్తిని నశింపజేసేవాడూ అయిన హరుడు తాను సృష్టించిన రౌద్రరూప మాతృగణానికి రౌద్రం మరియు దివ్యమైన మూర్తిత్వాన్ని ప్రసాదించి, అక్కడే ఆ మాతృకాగణం మధ్యలో తాను కూడ రుద్రుడై ఉండిపోయాడు.

సప్త తా మాతరో దేవ్యః సార్ధనారీనరః శివః ।
నివేశ్య రౌద్రం తత్ స్థానం తత్రైవాన్తరధీయత ॥ 89 ॥

అర్ధనారీశ్వరుడైన శివుడు తాను సృష్టించిన ఆ మాతృకాగణంలో ప్రధానులైన (1) బ్రాహ్మి, (2) మాహేశ్వరి, (3) కౌమారి, (4) వైష్ణవి, (5) వారాహి, (6) ఇంద్రాణి, (7) చాముండ అనే సప్తమాతృకలను ఆ రుద్రస్థానంలో ఉండేటట్లు స్థానం కల్పించి, తాను కూడ అక్కడనే అంతర్ధానం చెందాడు.

స మాతృవర్గస్య హరస్య మూర్తిఃయదా యదా యాతి చ తత్సమీపే ।
దేవేశ్వరస్యాపి నృసింహమూర్తేః పూజాం విధత్తే త్రిపురాంధకారిః ॥ 90 ॥

ఈ వృత్తాంతమంతా జరిగిన ప్రదేశానికి సమీపంలో ఉన్న శివుని వద్దకు ఎప్పుడెప్పుడు ఆ మాతృకాగణం వస్తుందో అప్పుడు త్రిపురాంతకుడు, అంధకాంతకుడు అయిన శివుడు దేవాధిదేవుడైన నృసింహమూర్తిని ఈ నాటికీ పూజిస్తూ ఉంటాడు.

(ఈ అధ్యాయంలో అంధకాసురుని వధించే సందర్భంలో శివుడు రౌద్ర మాతృకాగణాన్ని సృష్టించడం, ఆ రౌద్రమాతృకాగణాన్ని శమింపజేయడానికి శివుని ప్రార్థన ననుసరించి నృసింహమూర్తి కూడ మాతృకాగణాన్ని సృష్టించటం ఈ అధ్యాయం విశేషం. ఇందులో శివుడు భైరవుడెలా అయ్యాడనే ప్రశ్నకు సమాధానం ఇవ్వబడింది. జనమాచరించే ఉచ్చాటనాదుల వలన లేదా ఇతర విపరీత కారణాల వలన భూతాది బాధలు చెందినప్పుడు వాటి నుండి ముక్తి పొందడానికి ఈ మాతృకాగణాలను ఆరాధించుట ప్రతీతి. ఇలాగే భీరువులు అంటే భయపడేవారి భయాన్ని పోగొట్టే భైరవీ మాతృకలను సృష్టించి శివుడు "భైరవు" డయ్యాడని దీని ద్వారా తెలుపబడింది.)

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అన్ధకవధో నామ ఏకోనాశీత్యధిక శతతమోఽధ్యాయః ॥ 179 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అంధకాసుర వధ అనే నూట డెబ్బైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



అశీత్యధిక ద్విశతతమోఽధ్యాయః – నూట ఎనభైయవ అధ్యాయం

దండపాణి వర ప్రదానమ్ – దండపాణి (యక్ష) వరప్రదానం

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

శ్రుతోఽన్ధకవధః సూత యథావత్త్వదుదీరితః ।
వారాణస్యాస్తు మాహాత్మ్యం శ్రోతుమిచ్ఛామ సామ్ప్రతమ్ ॥ 1 ॥

సూతా! నీచే వివరించబడిన అంధకాసురవధ గురించి విన్నాము ఇపుడు నీ ద్వారా వారాణసీ మాహాత్మ్యాన్ని వినగోరుచున్నాము.

భగవాన్ పిఙ్గలః కేన గణత్వం సముపాగతః ।
అన్నదత్వం చ సంప్రాప్తో వారాణస్యాం మహాద్యుతిః ॥ 2 ॥

క్షేత్రపాలః కథం జాతః ప్రియత్వం చ కథం గతః ।
ఏతదిచ్ఛామ కథితం శ్రోతుం బ్రహ్మసుత త్వయా ॥ 3 ॥

భగవానుడైన పింగళుడు గణాలలో స్థానాన్ని ఎలా సంపాదించాడు? మహాతేజశ్శాలియైన అతడు వారాణసిలో అన్నదాత ఎలా అయ్యాడు? మరియు క్షేత్రపాలకుడుగా ఎలా నియిమించబడ్డాడు? శివునికి ప్రీతిపాత్రుడెలా అయ్యాడు? “ఓ బ్రహ్మసుతా! నీ ద్వారా ఈ వివరాలన్నీ వినాలనే కుతూహలంతో ఉన్నాము” అని ఋషులు సూతుని ప్రార్థించారు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

శృణుధ్వం వై యథా లేభే గణేశత్వం చ పింగలః ।
అన్నదత్వం చ లోకానాం స్థానం వారాణసీ త్విహ ॥ 4 ॥

ఋషులారా! పింగళుడు గణేశత్వాన్ని మరియు అన్న దాతృత్వాన్నెలా పొందాడు? మరియు పుణ్యప్రదమైన వారాణసిలో అతడు స్థానాన్నెలా పొందాడో వివరిస్తాను వినండని ఆ వివరం సూతుడు చెప్పనారంభించాడు.

పూర్ణభద్రసుతః శ్రీమానాసీద్యక్షః ప్రతాపవాన్ ।
హరికేశ ఇతి ఖ్యాతో బ్రహ్మణ్యో ధార్మికశ్చ హ ॥ 5 ॥

తస్య జన్మప్రభృత్యేవ శర్వే భక్తిరనుత్తమా ।
తదాసీత్తన్నమస్కారస్తన్నిష్ఠస్తత్పరాయణః ॥ 6 ॥

ఆసీనశ్చ శయానశ్చ గచ్ఛంస్తిష్ఠన్ననువ్రజన్ ।
భుంజానోఽథ పిబన్వాపి రుద్రమేవాన్వచిన్తయత్ ॥ 7 ॥

పూర్వం పూర్ణభద్రుని పుత్రుడు, పూజ్యుడు, ప్రతాపవంతుడు ఐన 'హరికేశు' డనే యక్షుడుండినాడు. అతడు బ్రాహ్మణుడు (బ్రహ్మజ్ఞానం కలిగినవాడు), ధర్మానుష్ఠాన పరుడు, ధార్మికుడు. అతనికి పుట్టుక నుండియే శివుని యందు అనుపమానమైన భక్తి ఉండెడిది. ఎప్పుడూ శివునే నమస్కరిస్తూ, శివునే ధ్యానిస్తూ, సంపూర్ణంగా శివ పరాయణుడై ఉండేవాడు. కూర్చోనివున్నా, పడుకొనివున్నా, ఒకే చోట నిలుచొనివున్నా, నడుస్తున్నా, తింటున్నా, త్రాగుతున్నా ఎల్లప్పుడూ రుద్రునే స్మరిస్తుండేవాడు.

తమేవం యుక్తమనసం పూర్ణభద్రః పితాఽబ్రవీత్ ।
న త్వాం పుత్రమహం మన్యే దుర్జాతో యస్త్వమన్యథా ॥ 8 ॥

న హి యక్షకులీనానామేతద్వృత్తం భవత్యుత ।
గుహ్యకా బత యూయం వై స్వభావాత్ క్రూరచేతసః ॥ 9 ॥

క్రవ్యాదాశ్చైవ కింభక్షా హింసాశీలాశ్చ పుత్రక ।
మైవం కార్షీర్న తే వృత్తిరేవం దృష్టా మహాత్మనా ॥ 10 ॥

స్వయమ్భువా యథాదిష్టా త్యక్తవ్యా యది నో భవేత్ ।
ఆశ్రమాన్తరజం కర్మ న కుర్యుర్గృహిణస్తు తత్ ॥ 11 ॥

అలా శివునియందే సమాహితచిత్తుడైవున్న అతనితో తండ్రియైన పూర్ణభద్రుడిలా అన్నాడు. ఓపుత్రా! నీవు నా కుమారునివేనని నాకనిపంచుట లేదు. నీవు మా వంశంలో ఏదో తప్పుగా జన్మించినట్లున్నావు. యక్షజాతిలో జన్మించిన వారికి ఇటువంటి నడివడికనే ఉండదు. గుహ్యకులం అనగా యక్షులమైన మనం సాధారణంగానే క్రూరస్వభావం కలవారం. మాంసాహారం, నీచాహారాన్ని మనం సేవిస్తాము. మనం హింసాశీలురం. కావున నీవెలా వ్యవహరించటం ఉచితం కాదు. నిజానికి మహానుభావుడైన స్వయంభూ ప్రజాపతిచే మనకేది ఆదేశింపబడినదో ఆ ధర్మాన్ని విడువ కూడదు. మనకేది ధర్మమో దానినే ఆచరించాలి. గృహస్థులైనవారు గృహస్థ ధర్మాన్ని వదిలి వేరొక ఆశ్రమ (బ్రహ్మచర్యాది) ధర్మాన్ని పాటించరు కదా!

హిత్వా మనుష్యభావం చ కర్మభిర్వివిధైశ్చర ।
యత్త్వమేవం విమార్గస్థో మనుష్యాజ్జాత ఏవ చ ॥ 12 ॥

యథావద్వివిధం తేషాం కర్మ తజ్జాతిసంశ్రయమ్ ।
మయాఽపి విహితం పశ్య కర్మైతన్నాత్ర సంశయః ॥ 13 ॥

కావున నీవు ఈ మనుష్య స్వభావాన్ని వదిలిపెట్టి, మన జాతికి తగినటువంటి వివిధ కర్మలను ఆచరించు. ఇలా నీవు వేరొక మార్గాన్ననుసరిస్తున్నావు కావున నీవు మనుష్యుని వలన జన్మించి ఉంటావని లోకం భావిస్తుంది. కావున మేము ఆచరిస్తున్న యక్షజాతికి యోగ్యమైన కర్మలను నీవు కూడ ఆచరించు. నేనాచరిస్తున్న కర్మలన్నీ యక్షజాతికి యోగ్యమైన కర్మలే అనటంలో సందేహం లేదు.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఏవముక్త్వా స తం పుత్రం పూర్ణభద్రః ప్రతాపవాన్ ।
ఉవాచ నిష్క్రమక్షిప్రం గచ్ఛ పుత్ర యథేచ్ఛసి ॥ 14 ॥

ప్రతాపవంతుడైన పూర్ణభద్రుడీ విధంగా చెప్పి, ఆ తరువాత పుత్రునిలో ఎటువంటి మార్పు లేదని గ్రహించి, నిష్ఠురమైన మాటలతో 'ఓ పుత్రా!' ఇక్కడినుండి త్వరగా వెళ్ళిపో. నీ వెలా కోరుకొంటున్నావో అక్కడికి వెళ్ళు. నీ ఇచ్ఛానుసారం నడుచుకో.

తతః స నిర్గతస్త్యక్త్వా గృహం సంబంధినస్తథా ।
వారాణసీం సమాసాద్య తపస్తేపే సుదుశ్చరమ్ ॥ 15 ॥

స్థాణుభూతో హ్యనిమిషః శుష్కకాష్ఠోపలోపమః ।
సన్నియమ్యేంద్రియగ్రామమవాతిష్ఠత నిశ్చలః ॥ 16 ॥

తండ్రి మాటలు విన్న హరికేశుడు గృహాన్ని, తన పరివారమంతటిని వదిలి వారణాసికి చేరుకుని, అక్కడ కఠోరమైన తపస్సు చేశాడు. రెప్పవాల్చకుండా స్థాణువువలె, ఎండిపోయిన కొయ్యవలె, రాతివలె నిశ్చలుడై ఉండి, ఇంద్రియ నిగ్రహం కలవాడై మౌనంగా తపస్సు చేశాడు.

అథ తస్యైవమనిశం తత్పరస్య తదాశిషః ।
సహస్రమేకం వర్షాణాం దివ్యమప్యభ్యవర్తత ॥ 17 ॥

వల్మీకేన సమాక్రాన్తో భక్ష్యమాణః పిపీలికైః ।
వజ్రసూచీముఖై స్తీ క్ష్ణై ర్విధ్యమానస్తథైవ చ ॥ 18 ॥

నిర్మాంసరుధిరత్వక్ చ కున్దశంఖేన్దుసప్రభః ।
అస్థిశేషోఽభవచ్ఛర్వం దేహం వై చిన్తయన్నపి ॥ 19 ॥

అలా అతను ఎల్లప్పుడూ శివధ్యాన తత్పరుడై, తదేకచిత్తుడై, తపస్సు చేస్తుండగా వేయి దివ్యసంవత్సరాలు గడిచాయి. అతనిపై చీమల పుట్టలు పెరిగాయి. అతని శరీరాన్ని చీమలు తిన్నాయి. వజ్రపు సూది వంటి తీక్ష్ణమైన ముక్కులు గల పురుగులు ఆతని శరీరాన్ని కుట్టాయి. దాని వలన ఆతని శరీరంలో మాంసం, రక్తం, చర్మం కూడ నశించిపోగా కేవలం ఎముకలు మాత్రం మిగిలిపోయి శంఖమువలె మరియు చంద్రుని వలె తెల్లగా ఉండినాడు. ఐనా దేహం గురించి చింతించక శివుని తపస్సునందే నిమగ్నుడయ్యాడు.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

ఏతస్మిన్నన్తరే దేవీ వ్యజ్ఞాపయత శఙ్కరమ్ ।
ఉద్యానం పునరేవేదం ద్రష్టుమిచ్ఛామి సర్వదా ॥ 20 ॥

క్షేత్రస్య దేవ మాహాత్మ్యం శ్రోతుం కౌతూహలం హి మే ।
యతశ్చ ప్రియమేతత్తే తథాఽస్య ఫలముత్తమమ్ ॥ 21 ॥

ఇంతలో పార్వతీదేవి శివుని ఈవిధంగా ప్రార్థించింది. దేవా! ఇక్కడ కనబడుతున్న ఈ ఉద్యానవనాన్ని ఎల్లప్పుడూ చూస్తూ ఉండాలని, ఈ వారాణసీ క్షేత్ర మాహాత్మ్యాన్ని వినాలని నాకు కుతూహలంగా ఉన్నది. ఇది నాకు మిక్కిలి ప్రియమైన క్షేత్రం మరియు దీని ఫలము కూడా చాలా ఉత్తమమైనది అని పార్వతి శివుని ప్రార్థించింది.

ఇతి విజ్ఞాపితో దేవః శర్వాణ్యా పరమేశ్వరః ।
శర్వః పృష్టో యథాతథ్యమాఖ్యాతుముపచక్రమే ॥ 22 ॥

నిర్జగామ చ దేవేశః పార్వత్యా సహ శంకరః ।
ఉద్యానం దర్శయామాస దేవ్యా దేవః పినాకధృక్ ॥ 23 ॥

ఆ విధంగా పార్వతీదేవి విజ్ఞాపన చేయగా పరమేశ్వరుడు ఆ వారాణసీ మహత్త్వాన్ని యథాతథంగా ఆమెకు వివరించడానికి ఉపక్రమించాడు. వెంటనే దేవేశుడు, పినాకధారియైన శంకరుడు పార్వతీ సహితుడై బయలుదేరి ఆమెకు ఆ ఉద్యానవనాన్ని చూపిస్తూ ఇలా వర్ణించసాగాడు.

దేవదేవ ఉవాచ - దేవదేవుడు చెప్పాడు.

ప్రోత్ఫుల్లనానావిధగుల్మశోభితం లతాప్రతానావతతం మనోహరమ్ ।
విరూఢపుష్పైః పరితః ప్రియంగుభిః సుపుష్పితైః కంటకితైశ్చ కేతకైః ॥ 24 ॥

తమాలగుల్మైర్నిచితం సుగంధిభిః సకర్ణికారైర్బకులైశ్చ సర్వశః ।
అశోకపున్నాగవరైః సుపుష్పితైః ద్విరేఫమాలాకుల పుష్పసంచయైః ॥ 25 ॥

ఈ ఉద్యానవనం బాగా వికసించిన తీగల గుబురులతోను, పొదలతోను ప్రకాశిస్తున్నది. తీగల సమూహాలచేత పరివ్యాప్తమైనది. బాగా వికసించిన పుష్పాలు గల ప్రియంగు వృక్షాలతోను, చక్కని పువ్వులతో స్వభావసిద్ధంగానే ముళ్ళు కలగిన కేతక వృక్షాలతోను, సుగంధయుక్తాలైన, తమాల గుల్మాలతోను, కర్ణికార మరియు వకుళ వృక్షాలతోను, బాగా పువ్వులు కలిగిన శ్రేష్ఠములైన అశోక, పున్నాగ వృక్షాలతోను, తుమ్మెద పంక్తులతోవ్యాప్తమైన రాలిన అనేక పుష్పసమూహాలతోను శోభిస్తున్నది.

క్వచిత్ ప్రఫుల్లామ్బుజరేణురూషితైః విహంగమైశ్చారుకలప్రణాదిభిః ।
వినాదితం సారసమండనాదిభిః ప్రమత్తదాత్యూహరుతైశ్చ వల్గుభిః ॥ 26 ॥

క్వచిచ్చ చక్రాహ్వరవోపనాదితం క్వచిచ్చ కాదంబకదంబకైర్యుతమ్ ।
క్వచిచ్చ కారండవనాదనాదితం క్వచిచ్చ మత్తాలికులాకులీకృతమ్ ॥ 27 ॥

కొన్నిచోట్ల చక్కగా వికసించిన కమలాల పుప్పొడిచే కప్పబడిన పక్షుల మృదువైన ధ్వనులతోను, కొన్నిచోట్ల అందమైన సారస పక్షుల మరియు మదించిన నల్లని తుమ్మెదల సొగసైన కూతలతో, కొన్ని ప్రదేశాలలో చక్రవాక పక్షుల మరికొన్ని చోట్ల హంసల సమూహాలతో, ఇంకొన్ని ప్రదేశాలలో కారండవాలనే నీటి పక్షుల కూజితాలతో ఈ ఉద్యానవనం ప్రతిధ్వనిస్తున్నది.

మదాకులాభిస్త్వమరాంగనాభిః నిషేవితం చారు సుగన్ధి పుష్పమ్ ।
క్వచిత్సుపుష్పైః సహకారవృక్షైః లతోపగూఢైస్తిలక ద్రుమైశ్చ ॥ 28 ॥

¢ ŸÔ$ <‘«ŠÁ¾ధచారణం ప్రమత్త నృత్యాప్సరసాం గణాకులమ్ ।
ప్రహృష్టనానావిధపక్షి సేవితం ప్రమత్తహారీతకులోపనాదితమ్ ॥ 29 ॥

అందమైన, సుగంధంతో కూడిన పుష్పాలను ధరించి కామోన్మత్తలైన దేవతా స్త్రీలచేత, బాగా వికసించిన సహకార(మామిడి) వృక్షాలచేత లతలతో అల్లుకోబడిన తిలకవృక్షాలచేత, గీతాలాలపిస్తున్న విద్యాధర స్త్రీలచేత, మత్తుగా నృత్యం చేస్తున్న అప్సరసల సమూహాలచేత, ప్రకృష్టమైన హర్షంతో ఎగురుతున్న పక్షి గణాలచేత మరియు మిక్కిలి మత్తుతో కూడిన హారీత పక్షుల ధ్వనులచేత సేవించబడుతున్నదీ ఉద్యానవనం.

మృగేంద్రనాదాకులసత్త్వమానసైః క్వచిత్ క్వచిద్ద్వంద్వకదంబకైర్మృగైః ।
ప్రఫుల్లనానావిధచారుపంకజైః సరస్తటాకైరుపశోభితం క్వచిత్ ॥ 30 ॥

సింహాల గర్జనలతో భయం పొందిన చిత్తం గలవై, ఇటునటు పరుగెత్తుతున్న జింకల జంటలతో, బాగా వికసించిన అనేక విధాలైన కమలాలతో నిండిన సరస్సులతో మరియు తటాకాలతో అలంకరించబడినదీ ఉద్యానవనం.

నిబిడనిచులనీలం నీలకంఠాభిరామం మదముదితవిహంగవ్రాతనాదాభిరామమ్ ।
కుసుమిత తరుశాఖాలీనమత్తద్విరేఫం నవకిసలయశోభాశోభితప్రాన్తశాఖమ్ ॥ 31 ॥

ఇంకనూ ఈ ఉద్యానవనం దట్టమైన నిచుల (పబ్బలి) వృక్షాలతో నీలపు వర్ణాన్ని పొందినదై, నెమళ్ళకు ఇష్టమైన ప్రదేశమై, మత్తులో మిక్కిలి సంతోషంగా ఉన్న పక్షుల కూజితాలతో నిండినదై, బాగా పూచిన చెట్ల కొమ్మలందు మరుగై ఉన్న మదించిన తుమ్మెదలతో నిండినదై, అప్పుడప్పుడే వస్తున్న లేత చిగురుటాకులు గల కొమ్మలు గలిగిన చెట్లతో శోభిస్తున్నది.

క్వచిచ్చ దన్తిక్షతచారువీరుధం క్వచిల్లతాలింగితచారువృక్షకమ్ ।
క్వచిద్విలాసాలసగామిబర్హిణం నిషేవితం కింపురుషవ్రజైః క్వచిత్ ॥ 32 ॥

కొన్నిచోట్ల ఏనుగుల చేత త్రుంచబడిన అందమైన తీగలతో, కొన్నిచోట్ల తీగలచేత అల్లుకోబడిన సుందరాలైన వృక్షాలతో, కొన్ని చోట్ల చాలా విలాసవంతంగా తిరుగుతున్న నెమళ్ళతో, మరికొన్ని చోట్ల కింపురుషులచేత సేవించబడుతూ ఈ ఉద్యానవనం శోభిల్లుతున్నది.

పారావతధ్వనివికూజితచారుశృంగైః అభ్రంకషైసితమనోహరచారురూపైః ।
ఆకీర్ణపుష్పనికురంబవిముక్తహాసైః విభ్రాజితం త్రిదశదేవకులైరనేకైః ॥ 33 ॥

ఫుల్లోత్పలాగురుసహస్రవితానయుక్తైః తోయాశయైః సమనుశోభితదేవమార్గమ్ ।
మార్గాంతరాగలితపుష్పవిచిత్రభక్తి సంబద్ధగుల్మ విటపైర్విహగైరుపేతమ్ ॥ 34 ॥

తెల్లగా ఉన్నటువంటి, మనోహరమైనట్టి మరియు అందమైనట్టి, ఆకాశమును త్రాకుతున్నట్టి పర్వత శిఖరాలతో, వాటిపైన ప్రతిధ్వనిస్తున్న పావురాల కూజితాలతో, సర్వత్ర వ్యాపించిన పుష్పరాశుల మందహాసాలతో, మరియు అనేకమంది దేవతల విహారాలతో, వికసించిన కలువలు గల జలాశయాలతో, వేలకుపైగా అగురు వృక్షాలచేత వ్యాపించబడి దేవతామార్గం వలె కనబడుచున్నట్టి, మార్గాలలో వ్యాపించిన విచిత్ర పుష్పాలచేత మరియు లతాగుల్మాలచేత, పక్షులచేత కూడ శోభిల్లుతున్నదీ ఉద్యానవనం.

తుంగాగ్రైర్నీలపుష్పస్తబకభరనతప్రాన్తశాఖైరశోకైః
మత్తాలివ్రాతతగీతశ్రుతిసుఖజననైర్భాసితాన్తర్మనోజ్ఞైః ।
రాత్రౌ చంద్రస్య భాసా కుసుమితతిలకై రేకతాంసమ్ప్రయాతం
ఛాయాసుప్తప్రబుద్ధస్థిత హరిణకులాలుప్త దర్భాంకురాగ్రమ్ ॥ 35 ॥

ఈ ఉద్యానవనంలో ఎత్తైన కొమ్మలు గల అశోకవృక్షాలు బాగా వికసించిన నీలపురంగు పుష్పగుచ్ఛాల భారంతో వంగి, అందంగా ఉన్నవి. అలా వికసించిన పువ్వుల మకరందాన్ని సేవించి ఉన్మత్తాలైన భ్రమరాల మనోహరాలైన గుంజారవాలతో ప్రతిధ్వనిస్తున్నది. రాత్రిలో చంద్రుని కాంతిచేత వికసించిన పువ్వులు గల తిలక వృక్షాలు ఆనందం కలిగిస్తున్నవి. కొన్ని చోట్ల చెట్ల నీడలో నిద్రబోయి, కూర్చున్న మరియు నిలబడి ఉన్న జింకల సమూహాలచేత తినబడి అగ్రభాగాలతో మిగిలిపోయిన దర్భలతో ప్రకాశిస్తున్నది.

హంసానాం పక్షపాతప్రచలితకమలస్వచ్ఛవిస్తీర్ణతోయం
తోయానాం తీరజాతప్రవికచకదలీవాటనృత్యన్మయూరమ్ ।
మాయూరైః పక్షచంద్రైః క్వచిదపి పతితైరంజితక్ష్మాప్రదేశం
దేశే దేశే వికీర్ణప్రముదితవిలసన్మత్తహారీతవృక్షమ్ ॥ 36 ॥

హంసల రెక్కల గాలిచేత బాగా కదులుతున్న కమలాలతో నిండిన స్వచ్ఛమైన జలాలు కల విశాలమైన సరస్సుల తీరంలో గల అరటిచెట్ల నడుమ నృత్యం చేస్తున్న నెమళ్ళు, వాటి నుండి రాలిపడిన పింఛపు ఖండాలతో మనోహరంగా కనబడే ప్రదేశాలు, ఆయా ప్రదేశాలలో మత్తులో మిక్కిలి సంతోషంతో వృక్షాలపై ఎగురుతున్న హారీత పక్షులతో ఈ ఉపవనం అలరారుతున్నది.

సారంగైః క్వచిదపి సేవితప్రదేశం సంఛన్నం కుసుమచయైః క్వచిద్విచిత్రైః ।
హృష్టాభిః క్వచిదపి కిన్నరాంగనాభిః క్షీబాభిః సుమధుర గీతవృక్షఖండమ్ ॥ 37 ॥

సంసృష్టైః క్వచిదుపలిప్త కీర్ణపుష్పైః ఆవాసైః పరివృతపాదపం మునీనామ్ ।
ఆ మూలాత్ఫలనిచితైః క్వచిద్విశాలైః ఉత్తుంగైః పనసమహీరుహైరుపేతమ్ ॥ 38 ॥

ఈ ఉపవనంలో ఒకచోట సారంగాలనే జింకలు కూర్చుని ఉన్నాయి. ఒకచోట వివిధవర్ణాలు గల పువ్వులు భూమిపై వ్యాపించి ఉన్నాయి. ఒక చోట కిన్నరస్త్రీలు హర్షాతిరేకంతో విహరిస్తున్నారు. మరొకచోట కిన్నరుల సుమధుర గాత్రంతో వృక్షాల కొమ్మలు ప్రతిధ్వనిస్తున్నాయి. చక్కగా అలికి పువ్వులు వెదజల్లిన మునుల నివాసప్రదేశాలు అనేక వృక్షాలతో అలరారుతున్నాయి. ఇంకనూ కొన్నిచెట్లు వ్రేళ్ళనుండే ఫలాలు కలిగి ఉన్నాయి. మరియు ఎత్తైన, విశాలమైన పనసవృక్షాలు కూడ పండ్లతో నిండి వున్నాయి.

ఫుల్లాతిముక్తకలతాగృహసిద్ధలీలం సిద్ధాంగనాకనకనూపురనాదరమ్యమ్ ।
రమ్యప్రియంగుతరుమంజరిసక్తభృంగం భృంగావలీషు స్ఖలితాంబుకదంబపుష్పమ్ ॥ 39 ॥

బాగా వికసించిన (ప్రకాశిస్తున్న) అతిముక్త లతా గృహాలలో సిద్ధులు విహరిస్తున్నారు. సిద్ధాంగనల బంగారు నూపుర నాదాలతో ఈ ప్రదేశం కడు రమ్యంగా ఉన్నది. సుందరాలైన ప్రియంగు వృక్షాలపై తుమ్మెదలు నాదం చేస్తూ వ్రాలుతున్నాయి. తుమ్మెదల పంక్తులు వాటిపై వ్రాలటం వలన అంబు, కదంబ మొదలగు పుష్పాలు భూమిపై పడుతున్నాయి.

పుష్పోత్కరానిలవిఘూర్ణితపాదపాగ్రమగ్రేసరో భువి నిపాతితవంశగుల్మమ్ ।
గుల్మాన్తరప్రభృతిలీనమృగీసమూహం సంముహ్యతః తనుభృతామపవర్గదాతృ ॥ 40 ॥

కొన్నిచోట్ల పుష్పరాశులతో కూడ వృక్షాల అగ్రభాగాలు (కొనలు) గాలి ప్రకంపనలచే భూమిపై ఉన్న వెదురు వనాలపై పడుచున్నవి. అలా వాటి చేత ఏర్పడిన వెదురు వృక్షపు పొదలలో ఆడలేళ్ళు దాగి ఉంటున్నాయి. అంతేకాక పరవశంతో దీని ఔన్నత్యాన్ని చూస్తున్న ప్రాణులకు మోక్షంతో సమానమైన సుఖాన్ని కలిగిస్తున్నదీ ఉద్యానవనం.

చంద్రాంశుజాలశబలైస్తిలకైర్మనోజ్ఞైఃసిందూరకుంకుమకుసుంభనిభై రశోకైః ।
చామీకరాభినిచయై రథ కర్ణికారైఃఫుల్లారవిందరచితం సువిశాలశాఖైః ॥ 41 ॥

కొన్నిచోట్ల మనోహరాలైన చంద్రుని కిరణాలను బోలిన తెల్లని తిలక పుష్పాలతో, సిందూరం వలె కుంకుమ పూవులవలె మరియు కుసుమ పూవుల వలె వున్న రక్తాశోక పుష్పాలతో బంగారు వన్నె గలిగిన కర్ణికార(పచ్చగన్నేరు) పుష్పాలతో మరియు ఆయా వృక్షాల విశాలమైన కొమ్మలతో, బాగుగా వికసించిన కమలాలతో ఈ వనం శోభిస్తున్నది.

క్వచిద్రజతపర్ణాభైః క్వచిద్విద్రుమసన్నిభైః ।
క్వచిత్కాంచనసంకాశైః పుష్పైరాచితభూతలమ్ ॥ 42 ॥

పున్నాగేషు ద్విజగణవిరుతం రక్తాశోకస్తబకభరనతమ్ ।
రమ్యోపాన్తశ్రమహరపవనం ఫుల్లాబ్జేషు భ్రమరవిలసితమ్ ॥ 43 ॥

కొన్నిచోట్ల వెండిరేకుల వంటి, కొన్నిచోట్ల పగడాల వంటి మరికొన్నిచోట్ల బంగారు వర్ణం వంటి పువ్వులతో ఈ ఉద్యానవన భూతలం నిండివున్నది. మరియు పున్నాగ వృక్షాలందున్న పక్షుల కూతలతో, రక్తాశోకపు పుష్పాల గుత్తులతో వంగిన కొమ్మలతో, సుందరాలైన పరిసరాలలో శ్రమను మరిపింపజేసే గాలులతో, సంపూర్ణంగా వికసించిన పద్మాలకై వ్రాలుతున్న తుమ్మెదలతో ఈ ఉద్యానవనం రమ్యంగా ఉన్నది.

సకల భువనభర్తా లోకనాథస్తదానీం తుహినశిఖరిపుత్ర్యాః సార్ధమిష్టై ర్గణేశైః ।
వివిధతరువిశాలం మత్తహృష్టాన్యపుష్ట ముపవనతరురమ్యం దర్శయామాస దేవ్యాః ॥ 44 ॥

అప్పుడు, సమస్త భువనాలను పరిపాలించేవాడు, లోకనాథుడూ అయిన పరమేశ్వరుడు హిమవత్పుత్రికయైన పార్వతీదేవితో, తనకు ఇష్టులైన గణేశులతో కూడ విహరిస్తూ వివిధ వృక్షాలతో విశాలమైన మరియు ఆనంద పరవశాలైన మత్తకోకిలలతో కూడ నిండిన ఆ ఉపవన వృక్ష రామణీయకతను దేవికి చూపినాడు.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

ఉద్యానం దర్శితం దేవ! శోభయా పరయా యుతమ్ ।
క్షేత్రస్య తు గుణాన్ సర్వాన్ పునర్వక్తుమిహార్హసి ॥ 45 ॥

అస్య క్షేత్రస్య మాహాత్మ్యమవిముక్తస్య తత్తథా ।
శ్రుత్వాఽపి హి న మే తృప్తిరతో భూయో వదస్వ మే ॥ 46 ॥

ఓ దేవా! మిక్కిలి శోభాయుతమైన ఉద్యానవనాన్ని చూపించావు. ఇపుడు ఈ క్షేత్రపు గుణాలన్నింటినీ వివరించు. అవిముక్తమైన ఈ క్షేత్రపు మాహాత్మ్యాన్ని ఎన్నిమార్లు విన్నప్పటికి నాకు తృప్తి కలగటంలేదు. కావున దేవా! మరల దీని మహత్త్వాన్ని తెలుపుమని ప్రార్థిస్తున్నాను.

దేవదేవ ఉవాచ – దేవదేవుడు చెప్పాడు.

ఇదం గుహ్యతమం క్షేత్రం సదా వారాణసీ మమ ।
సర్వేషామేవ భూతానాం హేతుర్మోక్షస్య సర్వదా ॥ 47 ॥

అస్మిన్సిద్ధాః సదా దేవి మదీయం వ్రతమాస్థితాః ।
నానాలింగధరా నిత్యం మమ లోకాభికాంక్షిణః ॥ 48 ॥

అభ్యస్యన్తి పరం యోగం ముక్తాత్మానో జితేంద్రియాః ।

అపుడు మహాదేవుడీ విధంగా వివరించాడు. ఓ దేవీ! ఇది పరమరహస్యమైన క్షేత్రం. ఈ వారాణసీ క్షేత్రం నాకు సంబంధించింది. ఇది ప్రాణులందరికీ ఎల్లప్పుడూ మోక్షహేతువు. ఇక్కడ అనేకమంది సిద్ధులు నా వ్రతాన్ని, ఎల్లప్పుడూ ఆచరిస్తూ ఉంటారు. నా లోక నివాసాన్ని కాంక్షిస్తూ నానా విధాలైన నా చిహ్నాలను ధరించి, అనేక వ్రతాలనాచరిస్తారు. జితేంద్రియులైన వారెందరో ఉత్తమమైన యోగసాధన చేసి మోక్షాన్ని పొందుతారు.

నానావృక్షసమాకీర్ణే నానావిహగకూజితే ॥ 49 ॥

కమలోత్పలపుష్పాఢ్యైః సరోభిః సమలంకృతే ।
అప్సరోగణగంధర్వైః సదా సంసేవితే శుభే ॥ 50 ॥

రోచతే మే సదా వాసో యేన కార్యేణ తచ్ఛృణు ।

అనేక విధాలైన వృక్షాలతో వ్యాప్తమైవున్నట్టి, అనేక విధాలైన పక్షుల కూజితాలతో కూడివున్నట్టి, కమలాలు, కలువలు మరియు నానావిధ పుష్పాలతో సమలంకృతాలైన సరస్సులతో, అప్సరసలు మరియు గంధర్వాదులచేత ఎల్లప్పుడు సేవించబడే శుభప్రదమైన ఈ క్షేత్రంలో సదా నివాసం చేయటం నాకు ప్రీతిపాత్రం. దానికి కారణాన్ని వివరిస్తాను విను.

మన్మనా మమ భక్తశ్చ మయి సర్వార్పితక్రియః ॥ 51 ॥

యథా మోక్షమిహాప్నోతి హ్యన్యత్ర తు న తత్ క్వచిత్ ।

నాయందే మనస్సునుంచి నాయందే సకల క్రియలనర్పించే భక్తుడు ఇక్కడ ఎలా మోక్షం పొందుతాడో అలా ఇంక ఎక్కడా పొందలేడు.

ఏతన్మమ పురం దివ్యం గుహ్యాద్గుహ్యతరం మహత్ ॥ 52 ॥

బ్రహ్మాదయస్తు జానన్తి యేఽపి సిద్ధా ముముక్షవః ।
అతః ప్రియతమం క్షేత్రం తస్మాచ్చేహ రతిర్మమ ॥ 53 ॥

గుహ్యాతి గుహ్యమైన మహత్తరమైన ఈ నా క్షేత్రం అన్ని క్షేత్రములలో కెల్ల దివ్యమైనది. బ్రహ్మాదులు, ముముక్షువులైన సిద్ధులు ఈ విషయాన్ని ఎరుగుదురు. అందుకే ఇది నాకు ప్రియతమమైన క్షేత్రం. దీనియందు నాకు ఆసక్తి కూడ అధికమే.

విముక్తం న మయా యస్మాన్మోక్ష్యతే వా కదాచన ।
మహత్ క్షేత్రమిదం తస్మాదవిముక్తమిదం స్మృతమ్ ॥ 54 ॥

అందుకే ఈ క్షేత్రాన్ని నేను ఎప్పుడూ వదిలిపెట్టను. ఇది అంతటి మహాక్షేత్రం. అందుకే ఈ క్షేత్రానికి 'అవిముక్తకము' అనే పేరు ప్రసిద్ధం.

నైమిషేఽథ కురుక్షేత్రే గంగాద్వారేఽథ పుష్కరే ।
స్నానాత్సంసేవితాద్వాపి న మోక్షః ప్రాప్యతే యతః ॥ 55 ॥

ఇహ సంప్రాప్యతే యేన తత ఏతద్విశిష్యతే ।
ప్రయాగే చ భవేన్మోక్ష ఇహ వా మత్పరిగ్రహాత్ ॥ 56 ॥

నైమిషారణ్యం, కురుక్షేత్రం, గంగాద్వారం, పుష్కరక్షేత్రం మరియు ఇతర పుణ్యక్షేత్రాలలో స్నానమాచరించినా, సేవించినా మోక్షము లభించదు. కాని ఈ క్షేత్రంలో అది లభిస్తుంది. కావుననే ఇది విశిష్టమైనది. ప్రయాగ మరియు ఈ వారణాసి క్షేత్రాలు నాతో కూడి ఉండటం వలన మోక్షం లభిస్తుంది.

ప్రయాగాదపి తీర్థాగ్ర్యాత్ ఇదమేవ మహత్ స్మృతమ్ ।
జైగీషవ్యః పరాం సిద్ధిం యోగతః స మహాతపాః ॥ 57 ॥

తీర్థరాజమైన ప్రయాగ కన్నా ఈ వారణాసి క్షేత్రమే మహత్త్వం కలదిగా చెప్పబడింది. మహాతపశ్శాలియైన జైగీషవ్యుడనే యోగి ఇక్కడనే యోగం ద్వారా సిద్ధిని పొందాడు.

అస్య క్షేత్రస్య మాహాత్మ్యాద్ భక్త్యా చ మమ భావనాత్ ।
జైగీషవ్యో మహాశ్రేష్ఠో యోగినాం స్థానమిష్యతే ॥ 58 ॥

ధ్యాయతస్తత్ర మాం నిత్యం యోగాగ్నిర్దీప్యతే భృశమ్ ।
కైవల్యం పరమం యాతి దేవానామపి దుర్లభమ్ ॥ 59 ॥

అవ్యక్త లింగైర్మునిభిః సర్వసిద్ధాన్తవేదిభిః ।
ఇహ సంప్రాప్యతే మోక్షో దుర్లభో దేవదానవైః ॥ 60 ॥

ఈ క్షేత్రపు మాహాత్మ్యం వలన మరియు నాయందు భక్తి భావన కలిగివున్నందున మహాత్ముడైన జైగీషవ్యుడనే మునీశ్వరుడు యోగులలో విశిష్టస్థానాన్ని పొందాడు. ఇక్కడ ఉండి నిత్యమూ నన్నే ధ్యానించేవారి యోగాగ్ని అమితంగా ప్రకాశిస్తుంది. నన్నే ధ్యానించేవారు దేవతలకు కూడ దుర్లభమైన పరమోత్కృష్టమైన కైవల్యాన్ని పొందుతారు. సర్వసిద్ధాంతవేత్తలు, బాహ్యాడంబరాలు లేని మునిపుంగవులు దేవతలకు, దానవులకు కూడ దుర్లభమైన, మోక్షాన్ని పొందుతారు.

తేభ్యశ్చాహం ప్రయచ్ఛామి భోగైశ్వర్యమనుత్తమమ్ ।
ఆత్మనశ్చైవ సాయుజ్యమీప్సితం స్థానమేవ చ ॥ 61 ॥

కుబేరస్తు మహాయక్షస్తథా సర్వార్పితక్రియః ।
క్షేత్రసంవసనాదేవ గణేశత్వమవాప హ ॥ 62 ॥

అటువంటి వారికి నేను ఉత్తమమైన భోగాలను, ఐశ్వర్యాన్ని, వారు కోరిన స్థానాన్ని మరియు నా సాయుజ్యాన్ని కూడ కల్పిస్తాను. మహాయక్షుడైన కుబేరుడు తాను చేసే క్రియలన్నీ నాకే అర్పించి ఈ క్షేత్రాన్ని సేవించటం వలననే గణేశత్వాన్ని పొందాడు.

సంవర్తో భవితా యశ్చ సోఽపి భక్త్యా మమైవ తు ।
ఇహైవారాధ్య మాం దేవి సిద్ధిం యాస్యత్యనుత్తమమ్ ॥ 63 ॥

దేవీ! నా భక్తుడుగా జన్మించబోయే సంవర్తుడనే సిద్ధుడు ఇక్కడ నన్ను భక్తి శ్రద్ధలతో ఆరాధించి ఉత్తమమైన గతిని పొందుతాడు.

పరాశరసుతో యోగీ ఋషిర్వ్యాసో మహాతపాః ।
ధర్మకర్తా భవిష్యశ్చ వేదసంస్థాప్రవర్తకః ॥ 64 ॥

రంస్యతే సోఽపి పద్మాక్షి క్షేత్రేఽస్మిన్మునిపుంగవః ।

ఓ పద్మాక్షీ! పరాశరుని కుమారుడు, యోగి, మహాతపస్సంపన్నుడు, ఋషి, ధర్మకర్త, వేద వ్యవస్థా ప్రవర్తకుడు, మునిశ్రేష్ఠుడూ అయిన వేదవ్యాసమహర్షి కూడ ఈ క్షేత్రంలోనే నివసిస్తాడు.

బ్రహ్మా దేవర్షిభిః సార్ధం విష్ణుర్వాయుర్దివాకరః ॥ 65 ॥

దేవరాజస్తథా శక్రో యేఽపి చాఽన్యే దివౌకసః ।
ఉపాసన్తే మహాత్మానః సర్వే మామేవ సువ్రతే ॥ 66 ॥

ఓ సువ్రతా! దేవర్షులతో పాటు బ్రహ్మ, విష్ణువు, వాయువు, దివాకరుడు, దేవరాజైన ఇంద్రుడు మరియు స్వర్గవాసులైన మహాత్ములందరూ ఇక్కడ నన్నే ఉపాసిస్తారు.

అన్యేఽపి యోగినః సిద్ధాశ్ఛన్నరూపా మహావ్రతాః ।
అనన్యమనసో భూత్వా మామిహోపాసతే సదా ॥ 67 ॥

ఇంకనూ అనేకమంది యోగులు, సిద్ధులు మహావ్రతులై, ప్రచ్ఛన్నరూపధారులై, ఏకాగ్రచిత్తులై ఇక్కడ ఎల్లప్పుడూ నన్ను ఉపాసిస్తారు.

అలర్కశ్చ పురీమేతాం మత్ప్రసాదాదవాప్స్యతి ।
స చైనాం పూర్వవత్ కృత్వా చాతుర్వర్ణ్యాశ్రమాకులామ్ ॥ 68 ॥

స్ఫీతాం జనసమాకీర్ణాం భక్త్యా చ సుచిరం నృపః ।
మయి సర్వార్పితప్రాణో మామేవ ప్రతిపత్స్యతే ॥ 69 ॥

నా అనుగ్రహం వలననే అలర్కుడు ఈ కాశీపట్టణానికి రాజు అవుతాడు. అతడు తన పూర్వులవలె బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది నాలుగు వర్ణాల వారితో, బ్రహ్మచర్యాది చతురాశ్రమ మార్గాననుసరించే వారితో, అనేక, మంది జనులతో కూడుకొన్న ఈ కాశీపట్టణాన్ని భక్తిశ్రద్ధలతో పరిపాలించి తన గుణాలను, క్రియలను నాకే అర్పించి చివరకు నన్నే పొందుతాడు.

తతః ప్రభృతి చార్వంగి యేఽపి క్షేత్రనివాసినః ।
గృహిణో లింగినో వాపి మద్భక్తా మత్పరాయణాః ॥ 70 ॥

మత్ప్రసాదాద్ భజిష్యన్తి మోక్షం పరమదుర్లభమ్ ।
విషయాసక్త చిత్తోఽపి త్యక్తధర్మరతిర్నరః ॥ 71 ॥

ఇహ క్షేత్రే మృతః సోఽపి సంసారం న పుర్విశేత్ ।

ఓ లావణ్యవతీ! అది మొదలుకొని ఈ క్షేత్రంలో నివసించేవారు గృహిణులుకాని, సంన్యాసులుకాని, నా భక్తులై నన్నే ఆశ్రయించి ఉన్నవారందరూ నా అనుగ్రహం వలన పరమదుర్లభమైన మోక్షాన్ని పొందుతున్నారు. మరియు ప్రాపంచిక సుఖాలలో ఆసక్తి కల చిత్తం కల్గిన వాడైనా, ధర్మాచరణాన్ని వదిలిపెట్టినవాడైనా ఈ కాశీక్షేత్రంలో మరణిస్తే మరల ఈ సంసారంలో ప్రవేశించడు. (పునర్జన్మ రహితుడు కాగలడు)

యే పునర్నిర్మమా ధీరాః సత్త్వస్థా విజితేంద్రియాః ॥ 72 ॥

వ్రతినశ్చ నిరారంభాః సర్వే తే మయి భావితాః ।
దేహభంగం సమాసాద్య ధీమన్తః సంగవర్జితాః ॥
గతా ఏవ పరం మోక్షం ప్రసాదాన్మమ సువ్రతే ॥ 73 ॥

ఓ సువ్రతా! మమతానురాగాలకు అతీతులైన ధీరులు, సత్తగుణసంపన్నులు, జితేంద్రియులు, వ్రతనియమాలననుసరించేవారు, డాంబికం లేనివారు, నాయందే మనస్సును భావన చేసేవారు, బుద్ధిమంతులు, సర్వసంగపరిత్యాగులు మొదలైన వారందరూ ఈ దేహాన్ని వదిలిన పిదప నాదయ వలన శ్రేష్ఠమైన మోక్షాన్ని తప్పక పొందినారు.

జన్మాంతరసహస్రేషు యుంజన్ యోగమవాప్నుయాత్ ।
తమిహైవ పరం మోక్షం మరణాదధిగచ్ఛతి ॥ 74 ॥

ఏతత్సంక్షేపతో దేవి క్షేత్రస్యాస్య మహత్ఫలమ్ ।
అవిముక్తస్య కథితం మయా తే గుహ్యముత్తమమ్ ॥ 75 ॥

దేవీ! వేలకొలది జన్మలలో యోగమనుష్ఠించిన యోగులు ఎలాగైతే సిద్ధిని పొందుతారో అలాగే జనులు ఇక్కడ ఈ క్షేత్రంలో మరణించిన మాత్రాన మోక్షాన్ని పొందుతారు. అతిరహస్యమైన, ఉత్తమమైన ఈ అవిముక్త క్షేత్రం యొక్క మహత్తరమైన ఫలాన్ని నీకు నేను సంక్షిప్తంగా వివరించాను.

అతః పరతరం నాస్తి సిద్ధిగుహ్యం మహేశ్వరి ।
ఏతద్ బుధ్యన్తి యోగజ్ఞా యే చ యోగేశ్వరా భువి ॥ 76 ॥

ఏతదేవ పరం స్థానమేతదేవ పరం శివమ్ ।
ఏతదేవ పరం బ్రహ్మ ఏతదేవ పరం పదమ్ ॥ 77 ॥

ఓ మహేశ్వరీ! దీనికంటె ఉత్తమమైన రహస్య సిద్ధి ఇంకొక్కటి లేదు. యోగజ్ఞులు, యోగేశ్వరులు ఈ భూలోకంలో దీని మహత్త్వాన్ని తెలిసికోగలరు. ఇదే గొప్ప స్థానం. ఇదే శుభప్రదమైన స్థలం. ఇదే పరబ్రహ్మతత్త్వం. ఇదే పరమపదం.

వారాణసీ తు భువనత్రయసారభూతా రమ్యా సదా మమ పురీ గిరిరాజపుత్రి! ।
అత్రాగతా వివిధదుష్కృతకారిణోఽపి పాపక్షయాద్విరజసః ప్రతిభాన్తి మర్త్యాః ॥ 78 ॥

ఏతత్ స్మృతం ప్రియతమం మమ దేవి నిత్యం క్షేత్రం విచిత్రతరుగుల్మలతా సుపుష్పమ్ ।
అస్మిన్ మృతాస్తనుభృతః పదమాప్నువన్తి మూర్ఖాగమేన రహితాపి న సంశయోఽత్ర ॥ 79 ॥

ఓ గిరిరాజపుత్రీ! వారాణసీపురం లోకత్రయసారం. ఈ నా కాశీపురి ఎల్లప్పుడూ రమ్యమైనది. ఈ క్షేత్రానికి వచ్చినవారు వివిధ దుష్కృతాలు చేసిన వారైనప్పటికి మానవులు తమ పాపం నుండి విముక్తులై ప్రకాశిస్తారు. ఓ దేవీ! విచిత్రాలైన వృక్షాలు, లతాగుల్మాలు, పుష్పాలు మొదలైన వాటితో నిత్యమూ అలరారుతుండే ఈ క్షేత్రం నాకత్యంత ప్రియతమమైనది. మూర్ఖులు, వైదిక జ్ఞానరహితులు అయిన వారైన మానవులు కూడ ఇక్కడ మృతి చెందిన మాత్రాన పరమపదాన్ని పొందుతారు. దీనిలో సందేహం లేదు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఏతస్మిన్నన్తరే దేవో దేవీం ప్రాహగిరీంద్రజామ్ ।
దాతుం ప్రసాదాద్యక్షాయ వరం భక్తాయ భామిని ॥ 80 ॥

భక్తో మమ వరారోహే తపసా హతకిల్బిషః ।
అహో వరమసౌ లబ్ధుమస్మత్తో భువనేశ్వరి ॥ 81 ॥

ఏవముక్త్వా తతో దేవః సహ దేవ్యా జగత్పతిః ।
జగామ యక్షో యత్రాస్తే కృశో ధమనిసన్తతః ॥ 82 ॥

ఇంతలోనే తన భక్తుడైన యక్షునికి వరమీయ దలచిన మహాదేవుడు గిరిరాజపుత్రియైన పార్వతితో ఇలా అన్నాడు. ఓ భామినీ! ఓ భువనేశ్వరీ! ఓ వరారోహా! నా భక్తుడైన ఈ యక్షుడు మన నుండి వరం పొందదలిచి తపస్సుచేత సకల పాపాలనూ నశింపజేసికొన్నాడు అని చెప్పి జగత్పతియైన మహాదేవుడు కృశించిన శరీరం గలవాడైన ఆ యక్షుడు ఉండే ప్రదేశానికి వెళ్ళాడు.

తతస్తం గుహ్యకం దేవీ దృష్టిపాతైర్నిరీక్షతీ ।
శ్వేతవర్ణం విచర్మాణం స్నాయుబద్ధాస్థిపంజరమ్ ॥ 83 ॥

దేవీ ప్రాహ తదా దేవం దర్శయన్తీ చ గుహ్యకమ్ ।
సత్యం నామ భవానుగ్రో దేవైరుక్తస్తు శంకర ॥ 84 ॥

ఈదృశే చాస్య తపసి న ప్రయచ్ఛసి యద్వరమ్ ।

అపుడు చర్మమే లేక తెల్లని వర్ణం కలవాడై, సన్నని నరాలతో కూడిన అస్థిపంజరం వలె ఉన్న ఆ గుహ్యకుని చూచి దేవి అతనిని పరమశివునకు చూపుతూ ఓ దేవా! శంకరా! దేవతలు నిన్ను 'ఉగ్రుడు' అని అన్న మాట సత్యమే. నిజంగా నీవు ఉగ్రుడవే. ఇతడింత ఘోర తపస్సు చేసినా నీవు వరమీయ లేదు.

అతః క్షేత్రే మహాదేవ పుణ్యే సమ్యగుపాసితే ॥ 85 ॥

కథమేవం పరిక్లేశం ప్రాప్తో యక్షకుమారకః ।
శీఘ్రమస్య వరం యచ్ఛ ప్రసాదాత్ పరమేశ్వర ॥ 86 ॥

ఓ మహాదేవా! పుణ్యప్రదమైన ఈ క్షేత్రాన్ని శ్రద్ధగా సేవించినా యక్షకుమారుడు ఇంత క్లేశాన్ని ఎందుకు నీవు పొందాలి? పరమేశ్వరా! ప్రసన్నుడవై ఇతనికి వెంటనే వరం ప్రసాదించు.

ఏవం మన్వాదయో దేవ వదన్తి పరమర్షయః ।
రుష్టాద్వా చాథ తుష్టాద్వా సిద్ధిస్తూభయతో భవేత్ ॥
భోగప్రాప్తిస్తథా రాజ్యమన్తే మోక్షః సదాశివాత్ ॥ 87 ॥

ఓ దేవా! మనువు మొదలైనవారు మరియు మహర్షులు కూడ ఇలా చెబుతారు. "వాక్కుతో పరమశివుని ప్రసన్నం చేసుకొనినా, చేసుకోలేకపోయినా జనులు సిద్ధి పొందుతారు. సకల భోగాలననుభవించి, రాజ్యాన్ని పొంది, చివరిలో సదాశివుని ద్వారా జనులు మోక్షాన్ని పొందుతారు" అని.

ఏవముక్తస్తతో దేవః సహ దేవ్యా జగత్పతిః ।
జగామ యక్షో యత్రాస్తే కృశో ధమనిసన్తతః ॥ 88 ॥

పార్వతీదేవి ఆ విధంగా చెప్పగా జగత్పతియైన శివుడు ఆమెతో కూడ కృశించిపోయిన శరీరంగల యక్షుడు ఉన్న ప్రదేశానికి వెళ్ళాడు.

తం దృష్ట్వా ప్రణతం భక్త్యా హరికేశో వృషధ్వజః ।
దివ్యం చక్షురదాత్తస్మై యేనాపశ్యత్స శంకరమ్ ॥ 89 ॥

అథ యక్షస్తదాదేశాత్ శనైరున్మీల్య చక్షుషీ ।
అపశ్యత్సగణం దేవం వృషధ్వజముపస్థితమ్ ॥ 90 ॥

భక్తితో నమస్కరిస్తున్న అతనిని చూచి హరికేశుడు, వృషధ్వజుడు అయిన శివుడు అతనికి దివ్యనేత్రాన్ని ప్రసాదించాడు. దానితో అతను శివుని చూడగలిగాడు. అపుడు శివుని ఆదేశాన్ననుసరించి ఆ యక్షుడు మెల్లగా కన్నులు తెరిచి ప్రమథాది గణసహితుడైన శంకరుని చూచాడు.

దేవదేవ ఉవాచ - దేవదేవుడు పలికాడు.

వరం దదామి తే పూర్వం త్రైలోక్యే దర్శనం తథా ।
సావర్ణ్యం చ శరీరస్య పశ్య మాం విగతజ్వరః ॥ 91 ॥

నేను నీకు అపూర్వమైన వరము నిస్తున్నాను. దానితో నీవు మూడు లోకాలను చూడగలవు. నా శరీర వర్ణాలతో సమానమైన శరీరవర్ణాన్ని నీవు పొందగలవు. నీవు సంతాపం లేకుండా నన్ను చూడు.

సూతఉవాచ -సూతుడు పలికాడు.

తతః స లబ్ధ్వా తు వరం శరీరేణాక్షతేన చ ।
పాదయోః ప్రణతస్తస్థౌ కృత్వా శిరసి చాంజలిమ్ ॥ 92 ॥

ఉవాచాథ తథా తేన వరదోఽస్మీతి చోదితః ।
భగవన్ భక్తిమవ్యగ్రాం త్వయ్యనన్యాం విధత్స్వ మే ॥ 93 ॥

అన్నదత్వం చ లోకానాం గాణపత్యం తథాక్షయమ్ ।
అవిముక్తం చ తే స్థానం పశ్యేయం సర్వదా యథా ॥ 94 ॥

ఏతదిచ్ఛామి దేవేశ త్వత్తో వరమనుత్తమమ్ ॥ 95 ॥

అపుడు శివుని నుండి వరం పొందిన అతడు అక్షతమైన, ఎటువంటి లోపాలు లేని శరీరాన్ని పొంది, చేతులు జోడించి, శిరస్సును వంచి శివుని పాదములకు ప్రణతుడై ఇలా అన్నాడు. ఓ భగవంతుడా! దేవదేవా! నీయందు నాకు అవ్యగ్రమైన భక్తి కలుగేటట్లు వరమివ్వు. లోకాలన్నింటికి అన్నదాత అయ్యేటట్లుగా, నీ గణాలలో నెనొకడినయ్యేటట్లుగా వరమివ్వు. దానితో నేను సదా నీ ఈ అవిముక్త క్షేత్రాన్ని చూస్తూంటాను. దేవదేవా! నీ నుండి నేను కోరుకునే ఉత్తమమైన వరమిదే. నాకు ప్రసాదించు.

దేవదేవ ఉవాచ - దేవదేవుడు చెప్పాడు.

జరామరణసన్త్యక్తః సర్వరోగవివర్జితః ।
భవిష్యసి గణాధ్యక్షో ధనదః సర్వపూజితః ॥ 96 ॥

అజేయశ్చాపి సర్వేషాం యోగైశ్వర్యం సమాశ్రితః ।
అన్నదశ్చాపి లోకేభ్యః క్షేత్రపాలో భవిష్యసి ॥ 97 ॥

మహాబలో మహాసత్త్వో బ్రహ్మణ్యో మమ చ ప్రియః ।
త్ర్యక్షశ్చ దండపాణిశ్చ మహాయోగీ తథైవ చ ॥ 98 ॥

దేవదేవుడు "నీవు జరామరణములు లేనివాడవై, సర్వరోగరహితుడవై అందరిచే పూజించబడే గణాధ్యక్షుడైన ధనాధిపతివి కాగలవు. అతులమైన ఐశ్వర్యాన్ని, యోగాన్ని పొందినవాడవై, అందరిలో అజేయుడవై నిలుస్తావు. లోకులందరికి అన్నదాతవై క్షేత్రపాలకుడవు కాగలవు. నాకు ప్రీతిపాత్రుడవై, మహాబలవంతుడవై, పరాక్రమవంతుడవై, త్రినేత్రుడవై, దండపాణివి, మహాయోగివి కూడ కాగలవు" అని చెప్పాడు.

ఉద్భ్రమః సంభ్రమశ్చైవ గణౌ తే పరిచారకౌ ।
తవాజ్ఞయా కరిష్యేతే లోకస్యోద్భ్రమసంభ్రమౌ ॥ 99 ॥

ఉద్భ్రముడు, సంభ్రముడు అనే గణనాయకులిద్దరూ నీకు సేవకులై నీ ఆజ్ఞ ననుసరించి లోకమంతటికి మోహాన్ని, ఆశ్చర్యాన్ని కూడ కలిగిస్తారు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఏవం స భగవాంస్తత్ర యక్షం కృత్వా గణేశ్వరమ్ ।
జగామ వామదేవేశః సహ తేనామరేశ్వరః ॥ 100 ॥

ఆ విధంగా అమరేశ్వరుడు వామదేవుడూ అయిన మహేశ్వరుడు యక్షుని గణేశ్వరునిగా చేసి అతనితో కూడ తన నివాసానికి వెళ్ళాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దండపాణివరప్రదానం నామ
అశీత్యధికశతతమోఽధ్యాయః ॥ 180 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని దండపాణి (యక్ష)వరప్రదానమనే
నూటఎనబైయవ అధ్యాయం సమాప్తం



ఏకాశీత్యధిక శతతమోఽధ్యాయః - నూటఎనభై ఒకటవ అధ్యాయం

అవిముక్త క్షేత్ర మాహాత్మ్యమ్ - అవిముక్త క్షేత్రమాహాత్మ్యం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

ఇమాం పుణ్యోద్భవాం స్నిగ్ధాం కథాం పాపప్రణాశినీమ్ ।
శృణ్వన్తు ఋషయః సర్వే సువిశుద్ధాస్తపోధనాః ॥ 1 ॥

పరిశుద్ధాత్ములు, తపోధనులైన ఓ మహర్షులారా! పుణ్యప్రదం, మనోహరం, పాపాలను నశింపజేయు ఈ కథను సమాహిత చిత్తులై వినండి. అని సూతుడు ఋషులకు చెప్పాడు.

గణేశ్వరపతిం దివ్యం రుద్రతుల్యపరాక్రమమ్ ।
సనత్కుమారో భగవాన్ అపృచ్ఛన్నందికేశ్వరమ్ ॥ 2 ॥

బ్రూహి గుహ్యం యథా తత్త్వం యత్ర నిత్యం భవః స్థితః ।
మాహాత్మ్యం సర్వభూతానాం పరమాత్మా మహేశ్వరః ॥ 3 ॥

ఘోరరూపం సమాస్థాయ దుష్కరం దేవదానవైః ।
ఆభూతసంప్లవం యావత్ స్థాణుభూతో మహేశ్వరః ॥ 4 ॥

ఒకప్పుడు భగవానుడైన సనత్కుమారుడు గణేశ్వరుల కధిపతి, దివ్యుడు, రుద్రునితో సమానమైన పరాక్రమం గల నందికేశ్వరుని ఇలా అడిగాడు. సర్వభూతాలకు అధిపతి, పరమాత్మ అయిన మహేశ్వరుడు దేవదానవులెవ్వరికి సాధ్యం కానట్టి ఘోరరూపాన్ని ధరించి, స్థాణురూపుడై ప్రళయకాలం వరకు నిత్యమూ నివసిస్తాడో ఆ ప్రదేశం యొక్క రహస్యమైన మాహాత్మ్యాన్ని వినిపించు అని ప్రార్థించాడు.

నందికేశ్వర ఉవాచ - నందికేశ్వరుడు చెప్పాడు.

పురా దేవేన యత్ ప్రోక్తం పురాణం పుణ్యముత్తమమ్ ।
తత్సర్వం సంప్రవక్ష్యామి నమస్కృత్య మహేశ్వరమ్ ॥ 5 ॥

తతో దేవేన తుష్టేన ఉమాయాః ప్రియకామ్యయా ।
కథితం భువి విఖ్యాతం యత్ర నిత్యం స్వయం స్థితః ॥ 6 ॥

రుద్రస్యార్ధాసనగతా మేరుశృంగే యశస్వినీ ।
మహాదేవం తతో దేవీ ప్రణతా పరిపృచ్ఛతి ॥ 7 ॥

పూర్వం ఆ మహాదేవుడే స్వయంగా చెప్పినది ప్రాచీనం, పుణ్యప్రదం మరియు ఉత్తమమైన ఆ విషయ మంతటిని ఆ మహేశ్వరునికి నమస్కరించి మీకు వివరిస్తాను. అప్పుడు ఉమాదేవి విషయంలో సంతుష్టుడైన శివుడు ఆమెకు ప్రీతి కలిగించ గోరి తాను నిత్యం నివాసముండే భూప్రపంచంలో విఖ్యాతమైన ఈ విషయమంతా స్వయంగా చెప్పాడు. పూర్వం మేరు పర్వత శిఖరంపై రుద్రుని అర్ధాసనాన్ని అధిరోహించిన యశస్వినియైన పార్వతీదేవి మహాదేవునికి నమస్కరించి ఇలా అడిగింది.

భగవన్ దేవదేవేశ చంద్రార్ధకృతశేఖర ।
ధర్మం ప్రబ్రూహి మర్త్యానాం భువి చైవోర్ధ్వరేతసామ్ ॥ 8 ॥

జప్తం దత్తం హుతం చేష్టం తపస్తప్తం కృతం చ యత్ ।
ధ్యానాధ్యయనసంపన్నం కథం భవతి చాక్షయమ్ ॥ 9 ॥

జన్మాన్తర సహస్రేణ యత్పాపం పూర్వసంచితమ్ ।
కథం తత్ క్షయమాయాతి తన్మమాఽచక్ష్వ శంకర ॥ 10 ॥

భగవంతుడా! దేవదేవా! ప్రభూ! చంద్రశేఖరా! ఈ భూలోకంలో ఊర్ధ్వరేతస్కులైన మానవులాచరించే ధర్మాన్ని గురించి నాకు వివరించు. జపాలు, దానాలు, యజ్ఞాలు, తపస్సులు మొదలైన వాటిచేత మరియు ధ్యానాలు, అధ్యయనాలు మొదలైన వాటిచేత సంపాదించిన పుణ్యం అక్షయమెలా అవుతుంది? వేలజన్మాంతరాలలో పూర్వం సంచితమైన పాపాలెలా నశిస్తాయి? శంకరా! నాకు చెప్పు.

యస్మిన్ వ్యవస్థితో భక్త్యా తుష్యసే పరమేశ్వర ।
వ్రతాని నియమాశ్చైవ ఆచారో ధర్మ ఏవ చ ॥ 11 ॥

సర్వసిద్ధికరం యత్ర హ్యక్షయ్యగతిదాయకమ్ ।
వక్తుమర్హసి తత్సర్వం పరం కౌతూహలం హి మే ॥ 12 ॥

మరియు ఓ పరమేశ్వరా! నీవు ఏవిధమైన భక్తిచేత సంతుష్టుడవు కాగలవు? వ్రతాలు, నియమాలు, ఆచారాలు, ధర్మాలు మొదలైనవి ఎక్కడ ఆచరిస్తే సర్వసిద్ధిప్రదాలు అవుతాయి? అక్షయమైన స్థానాన్ని ప్రసాదిస్తాయి. ఇవన్నీ వినాలనే కుతూహలంతో ఉన్నాను. కావున నీవు వివరించవలసినది.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు చెప్పాడు.

శృణు దేవి ప్రవక్ష్యామి గుహ్యానాం గుహ్యముత్తమమ్ ।
సర్వక్షేత్రేషు విఖ్యాతం అవిముక్తం ప్రియం మమ ॥ 13 ॥

అష్టపుష్టిః పురా ప్రోక్తా స్థానానాం స్థానముత్తమమ్ ।
యత్ర సాక్షాత్స్వయం రుద్రః కృత్తివాసాః స్వయం స్థితః ॥ 14 ॥

దేవీ! నేను చెబుతాను, విను. రహస్యమైన వాటిలో మిక్కిలి రహస్యమైనది, అన్ని క్షేత్రాలలో ప్రసిద్ధమైన అవిముక్తం (వారాణసీ) నాకు ప్రియమైనది. పూర్వులు చెప్పిన అరవై ఎనిమిది పుణ్యక్షేత్రాలలో ఇది ఉత్తమమైన క్షేత్రం. గజచర్మధారియైన రుద్రుడు సాక్షాత్తుగా ఇక్కడ ఉంటాడు.

యత్ర సన్నిహితో నిత్యమవిముక్తే నిరన్తరమ్ ।
తత్ క్షేత్రం న మయా ముక్తమవిముక్తం తతః స్మృతమ్ ॥ 15 ॥

అవిముక్తే పరా సిద్ధిరవిముక్తే పరా గతిః ।
జప్తం దత్తం హుతం చేష్టం తపస్తప్తం కృతం చ యత్ ॥ 16 ॥

ధ్యానమధ్యయనం దానం సర్వం భవతి చాక్షయమ్ ।
జన్మాన్తరసహస్రేణ యత్పాపం పూర్వ సంచితమ్ ॥ 17 ॥

అవిముక్తం ప్రవిష్టస్య తత్సర్వం వ్రజతి క్షయమ్ ।
అవిముక్తాగ్నినా దగ్ధమగ్నౌ తూలమివాహితమ్ ॥ 18 ॥

ఈ అవిముక్తక్షేత్రంలో (నేను) ఆ శివుడు నిరంతరం సన్నిహితుడై ఉంటాడు. ఈ క్షేత్రం నాచే అవిముక్తం అనగా విడువబడనిది కావున దీనికి "అవిముక్తం" అని పేరు ఏర్పడింది. ఈ క్షేత్రం పరమోత్కృష్టమైన సిద్ధిని, గతిని కూడ కలిగిస్తుంది. ఇక్కడ చేసిన జపాలు, దానాలు, యజ్ఞాలు, తపస్సులు, ధ్యానం, అధ్యయనాలు మొదలైనవన్నీ అక్షయమైన ఫలమునిస్తాయి. వేల కొలది పూర్వజన్మలలో సంచితమైన పాపం ఈ అవిముక్త క్షేత్రంలో ప్రవేశించినంత మాత్రాననే నశించిపోతుంది. అగ్నిలో వేసిన దూది క్షణకాలంలో దగ్ధమై ఏవిధంగా బూడిదైపోతుందో అలాగే ఈ అవిముక్తాగ్నిలో పూర్వం సంపాదించిన పాపాలన్నీ దగ్ధాలై పోతాయి.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రా వై వర్ణసంకరాః ।
కృమిమ్లేచ్ఛాశ్చ యే చాన్యే సంకీర్ణాః పాపయోనయః ॥ 19 ॥

కీటాః పిపీలికాశ్చైవ యే చాన్యే మృగపక్షిణః ।
కాలేన నిధనం ప్రాప్తా అవిముక్తే శృణు ప్రియే ॥ 20 ॥

చంద్రార్ధమౌలినః సర్వే లలాటాక్షా వృషధ్వజాః ।
శివే మమ పురే దేవి జాయన్తే తత్ర మానవాః ॥ 21 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, సంకీర్ణజాతివారు, కృమిలు, మ్లేచ్ఛులు, పాపజన్ములు, కీటములు, చీమలు, ఇంకనూ మృగములు, పక్షులు మొదలైన ప్రాణులన్నీ కాలానుసారంగా ఈ అవిముక్త క్షేత్రంలో మృతి చెందితే చంద్రశేఖరులు, త్రినేత్రధారులు, వృషధ్వజులు అయి శుభప్రదమైన నా పురంలోనే జన్మిస్తారు.

అకామో వా సకామో వా హ్యపి తిర్యగ్గతోఽపి వా ।
అవిముక్తే త్యజన్ ప్రాణాన్మమ లోకే మహీయతే ॥ 22 ॥

అవియుక్తం యదా గచ్ఛేత్ కదాచిత్ కాలపర్యయాత్ ।
అశ్మనా చరణౌ బద్ధ్వా తత్రైవ నిధనం వ్రజేత్ ॥ 23 ॥

అవిముక్తం గతో దేవి న నిర్గచ్ఛేత్తతః పునః ।
సోఽపి మత్పదమాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥ 24 ॥

కోరికలు లేనివారైనా, ఉన్నవారైనా, మానవులే కాక పశు పక్ష్యాది ప్రాణులు కూడ ఈ అవిముక్తక్షేత్రంలో ప్రాణాలను త్యజిస్తే (మరణిస్తే) నా లోకంలో పూజించబడతారు. ఎప్పుడైనా ఈ అవిముక్త క్షేత్రానికి వచ్చినవారు ఇక్కడి నుండి వెళ్ళకుండా ఉండటానికి కాళ్ళకు రాళ్ళు కట్టుకొని స్థిరంగా ఇక్కడే ఉండి కాలానుసారంగా మరణిస్తే వారు కూడ నా స్థానాన్నే పొందుతారు. ఇంకనూ ఓ దేవీ! అవిముక్తక్షేత్రానికి వెళ్ళి అక్కడినుండి తిరిగి వెళ్ళిపోకుండా ఉండే వారందరూ నా స్థానాన్ని పొందుతారు. దీనిలో ఎటువంటి సందేహం లేదు. విచారించ వలసిన పని లేదు.

వస్త్రప్రదం రుద్రకోటిం సిద్ధేశ్వరమహాలయమ్ ।
గోకర్ణం రుద్రకర్ణం చ సువర్ణాక్షం తథైవ చ ॥ 25 ॥

అమరం చ మహాకాలం తథా కాయావరోహణమ్ ।
ఏతాని హి పవిత్రాణి సాన్నిధ్యాత్ సంధ్యయోర్ద్వయోః ॥ 26 ॥

వస్త్రప్రదం, రుద్రకోటి, సిద్ధేశ్వరం, మహాలయం, గోకర్ణం, రుద్రకర్ణం, సువర్ణాక్షం, అమరం, మహాకాలం, మరియు కాయావరోహణం మొదలగు క్షేత్రాలన్నీ ఉదయ, సాయం సంధ్యాసమయాలలో నా సాన్నిధ్యంలో ఉంటాయి కావున మిక్కిలి పవిత్రాలు.

కాలింజరవనం చైవ శంకుకర్ణం స్థలేశ్వరమ్ ।
ఏతాని చ పవిత్రాణి సాన్నిధ్యాద్ధి మమ ప్రియే ॥
అవిముక్తే వరారోహే త్రిసంధ్యం నాత్ర సంశయః ॥ 27 ॥

మరియు ఓ ప్రియా! కాలింజరవనం, శంకుకర్ణం, స్థలేశ్వరం మొదలైన వాటిలో కూడ మూడుసంధ్యలలో నా సాన్నిధ్యముంటుంది. కావున అవి కూడ పవిత్ర క్షేత్రాలే. దీనిలో సందేహం లేదు.

హరిశ్చంద్రం పరం గుహ్యం గుహ్యమామ్రాతకేశ్వరమ్ ।
జలేశ్వరం పరం గుహ్యం పుణ్యం శ్రీపర్వతం తథా ॥ 28 ॥

మహాలయం తథా గుహ్యం కృమిచండేశ్వరం శుభమ్ ।
గుహ్యాతిగుహ్యం కేదారం మహాభైరవమేవ చ ॥ 29 ॥

అష్టావేతాని స్థానాని సాన్నిధ్యాద్ధి మమ ప్రియే ।
అవిముక్తే వరారోహే త్రిసంధ్యం నాత్ర సంశయః ॥ 30 ॥

ఇంకనూ ఓదేవీ! పరమరహస్యాలైన హరిశ్చంద్రం, ఆమ్రాతకేశ్వరం, జలేశ్వరం, పుణ్యప్రదమైన శ్రీపర్వతం, మహాలయం, శుభప్రదమైన కృమిచండేశ్వరం, మిక్కిలి రహస్యాలైన కేదార, మహాభైరవ క్షేత్రాలు నా సాన్నిధ్యం వలన పరమ పవిత్రాలు. అలాగే ఓ వరారోహా! మూడుసంధ్యలలోనూ నేను అవిముక్త క్షేత్రంలోనే ఉంటాను. దీనిలో సందేహం లేదు.

యాని స్థానాని శ్రూయన్తే త్రిషు లోకేషు సువ్రతే ।
అవిముక్తస్య పాదేషు నిత్యం సన్నిహితాని వై ॥ 31 ॥

అథోత్తరాం కథాం దివ్యామవిముక్తస్య శోభనే ।
స్కందో వక్ష్యతి మాహాత్మ్యమృషీణాం భావితాత్మనామ్ ॥ 32 ॥

ఓ సువ్రతా! ముల్లోకాలలో ప్రసిద్ధాలైన స్థానాలన్నీ అవిముక్త క్షేత్రపు పాదాలలో నిత్యమూ సన్నిహితాలై ఉంటాయి. ఇంక ఓ సుందరీ! దివ్యమైన ఈ అవిముక్త క్షేత్రపు తరువాతి కథావృత్తాంతాన్ని, దాని మహత్త్వాన్ని భావితాత్ములైన ఋషులకు స్కందుడు చెబుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అవిముక్త క్షేత్రమాహాత్మ్యే ఏకాశీత్యధిక శతతమోऽధ్యాయః ॥ 181 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అవిముక్త క్షేత్ర మాహాత్మ్యమనే నూట ఎనబైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వ్యశీత్యధిక శతతమోఽధ్యాయః - నూటఎనబై రెండవ అధ్యాయం

అవిముక్త మాహాత్మ్యమ్ - అవిముక్త మాహాత్మ్యం

సూత ఉవాచ - సూత మహర్షి చెప్పాడు.

కైలాసపృష్ఠమాసీనం స్కందం బ్రహ్మవిదాం వరమ్ ।
పప్రచ్ఛుర్ఋషయః సర్వే సనకాద్యాస్తపోధనాః ॥ 1 ॥

తథా రాజర్షయః సర్వే యే భక్తాస్తు మహేశ్వరే ।
బ్రూహి త్వం స్కంద భూర్లోకే యత్ర నిత్యం భవః స్థితః ॥ 2 ॥

తపోధనులైన సనకాది ఋషులందరు, అనేక మంది రాజర్షులు, శివభక్తులు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైనట్టి, కైలాసపర్వతంపై ఆసీనుడైన స్కందుని ఇలా అడిగారు. స్కందా! భూలోకంలో నిత్యమూ భవుడు (శివుడు) నివసించే స్థలమేది? దాని మాహాత్మ్యాన్ని మాకు వివరించు.

స్కంద ఉవాచ - స్కందుడు చెప్పాడు.

మహాత్మా సర్వభూతాత్మా దేవదేవః సనాతనః ।
ఘోరరూపం సమాస్థాయ దుష్కరం దేవదానవైః ॥ 3 ॥

ఆభూతసంప్లవం యావత్ స్థాణుభూతః స్థితః ప్రభుః ।
గుహ్యానాం పరమం గుహ్యమవిముక్తమితి స్మృతమ్ ॥ 4 ॥

మహాత్ముడు, సర్వభూతాత్ముడు, దేవదేవుడు, సనాతనుడు, దేవదానవులందరికీ దుష్కరమైన ఘోరరూపాన్ని పొందినవాడై రహస్యాతి రహస్యమైన అవిముక్తమనే పుణ్యక్షేత్రంలో ప్రళయకాలాంతం వరకు స్థాణువుగా (స్థిరుడై) ఉంటాడు.

అవిముక్తే సదాసిద్ధిర్యత్ర నిత్యం భవః స్థితః ।
అస్య క్షేత్రస్య మాహాత్మ్యం యదుక్తం త్వీశ్వరేణ తు ॥ 5 ॥

స్థానాన్తరం పవిత్రం చ తీర్థమాయతనం తథా ।
శ్మశానసంస్థితం వేశ్మ దివ్యమన్తర్హితం చ యత్ ॥ 6 ॥

ఈ అవిముక్తక్షేత్రంలో నిత్యమూ శివుడు నివసిస్తాడు కావున ఇది ఎల్లప్పుడూ సిద్ధప్రదం. ఈ క్షేత్రపు మాహాత్మ్యాన్ని స్వయంగా ఈశ్వరుడే ఇలా చెప్పాడు. దీనికంటె పవిత్రమైన స్థానమింకొకటి లేదు. ఇది తీర్థాలన్నింటికీ క్షేత్రరాజం. ఇక్కడ శ్మశానంలో వున్న శివుని ఆలయం దివ్యమైనది.

భూర్లోకే నైవ సంయుక్తమన్తరిక్షే శివాలయమ్ ।
అయుక్తాస్తు న పశ్యన్తి యుక్తాః పశ్యన్తి చేతసా ॥ 7 ॥

బ్రహ్మచర్యవ్రతోపేతాః సిద్ధా వేదాన్తకోవిదాః ।
ఆదేహపతనాద్యావత్తత్ క్షేత్రం యో న ముంచతి ॥ 8 ॥

బ్రహ్మచర్యవ్రతైః సమ్యక్ సమ్యగిష్టం మఖైర్భవేత్ ।
అపాపాత్మా గతిః సర్వా యా తూక్తా చ క్రియావతామ్ ॥ 9 ॥

ఈ శివాలయం అంతరిక్షంలో ఉన్నది. భూలోకంతో కలిసి లేదు. దీనిని యోగ రహితులైనవారు చూడలేరు కాని యోగసిద్ధి కలవారు. బ్రహచర్యవ్రతులు, సిద్ధులు, వేదాంతకోవిదులు, మాత్రమే చూడగలుగుతారు. దేహపతనం వరకు ఈ క్షేత్రాన్ని విడువకుండా ఉండేవారు మరియు బ్రహ్మచర్యవ్రతం నిష్ఠతో ఆచరించేవారు, నియమానుసారంగా యజ్ఞాదులనాచరించేవారు, పుణ్యప్రదాలైన కర్మలనాచరించేవారు, పాపరహితులై ఉత్తమగతిని పొందుతారు.

యస్తత్ర నివసేద్విప్రోఽ సంయుక్తాత్మాఽసమాహితః ।
త్రికాలమపి భుంజానో వాయుభక్షసమో భవేత్ ॥ 10 ॥

నిమేషమాత్రమపి యో హ్యవిముక్తే తు భక్తిమాన్ ।
బ్రహ్మచర్యసమాయుక్తః పరమం ప్రాప్నుయాత్తపః ॥ 11 ॥

ఏ బ్రాహ్మణుడైతే రోజుకు మూడు మార్లు భూజిస్తూ కూడ ఈ క్షేత్రంలో నివసిస్తాడో, అతను సమాహిత చిత్తుదు కాకపోయినప్పటికీ, యోగ రహితుడైనప్పటికీ అతను భుజించే భోజనం వాయు భక్షణంతో సమానమై ఉత్తమగతిని పొందుతాడు. అలాగే ఈ అవిముక్త క్షేత్రంలో ఒక నిమిషకాలమైనా ఏ భక్తుడైతే బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఉంటాడో అతను ఉత్తమమైన తపస్సు ద్వారా పొందే ఫలంతో సమానమైన ఫలాన్ని పొందుతాడు.

యోఽత్ర మాసం వసేద్ధీరో లఘ్వాహారో జితేంద్రియః ।
సమ్యక్తేన వ్రతం చీర్ణం దివ్యం పాశుపతం మహత్ ॥ 12 ॥

జన్మమృత్యుభయం తీర్త్వా స యాతి పరమాం గతిమ్ ।
నైఃశ్రేయసీం గతిం పుణ్యాం తథా యోగగతిం వ్రజేత్ ॥ 13 ॥

ఈ అవిముక్తక్షేత్రంలో ధీరుడై, మితాహారుడై జితేంద్రియుడై ఒక నెల రోజులు వ్రతమాచరిస్తే, అతడు దివ్యమైన, మహత్తరమైన పాశుపత వ్రతాన్ననుష్ఠించిన ఫలాన్ని పొందుతాడు. అతను జన్మమృత్యు భయాన్ని దాటి ఉత్తమమైన గతిని పొందుతాడు. పుణ్యప్రదమైన నిఃశ్రేయసగతిని (మోక్షాన్ని) మరియు యోగసిద్ధితో మాత్రమే పొందగలిగిన పరమగతిని పొందుతాడు.

న హి యోగగతిర్దివ్యా జన్మాన్తరశతైరపి ।
ప్రాప్యతే క్షేత్రమాహాత్మ్యాత్ ప్రభావాచ్ఛంకరస్య తు ॥ 14 ॥

బ్రహ్మహా యోఽభిగచ్ఛేత్తు అవిముక్తం కదాచన ।
తస్య క్షేత్రస్య మాహాత్మ్యాద్ బ్రహ్మహత్యా నివర్తతే ॥ 15 ॥

దివ్యమైన యోగగతి నూరు జన్మాంతరాలకైనా లభించదు. కాని ఈ క్షేత్రమాహాత్మ్యం వలన, శంకరుని ప్రభావం వలన అది ఇక్కడ లభిస్తుంది. బ్రహ్మహత్య చేసినవాడు ఒకసారి ఈ అవిముక్త క్షేత్రానికి వెళ్ళితే ఈ క్షేత్ర మాహాత్మ్యం వలన బ్రహ్మహత్యాపాపం కూడ పోతుంది.

ఆదేహపతనాద్యావత్ క్షేత్రం యో న విముంచతి ।
న కేవలం బ్రహ్మహత్యా ప్రాక్కృతా చ నివర్తతే ॥ 16 ॥

ప్రాప్య విశ్వేశ్వరం దేవం న సా భూయోఽభిజాయతే ।
అనన్యమనసో భూత్వా యోఽవిముక్తం న ముంచతి ॥ 17 ॥

తస్య దేవః సదా తుష్టః సర్వాన్ కామాన్ ప్రయచ్ఛతి ।
ద్వారం యత్సాంఖ్యయోగానాం స తత్ర వసతి ప్రభుః ॥ 18 ॥

సగణో హి భవో దేవో భక్తానామనుకంపయా ।

శరీరం పడిపోయే వరకు ఎవరైతే ఈ క్షేత్రాన్ని వదిలి పెట్టి వెళ్ళరో, వారికి కేవలం బ్రహ్మహత్యాపాపమే కాక పూర్వం చేసిన పాపాలన్నీ నశిస్తాయి. వారు విశ్వేశ్వరుని సాన్నిధ్యాన్ని పొందుతారు. వారికి పునర్జన్మ ఉండదు. పరమేశ్వరుని నుండి మనస్సును మరల్చకుండా ఎవరైతే ఈ అవిముక్త క్షేత్రంలో ఉంటారో వారి విషయంలో దేవుడు మిక్కిలి సంతుష్టుడై వారి కోరికలన్నీ తీరుస్తాడు. సాంఖ్య యోగ తత్త్వాలకు ద్వారం వంటి వాడు, ప్రభువైన మహాదేవుడు భక్తులయందలి దయతో తన గణాలతో పాటు అక్కడే నివసిస్తాడు.

అవిముక్తం పరం క్షేత్రమవిముక్తే పరా గతిః ॥ 19 ॥

అవిముక్తే పరా సిద్ధిః అవిముక్తే పరం పదమ్ ।
అవిముక్తం నిషేవేత దేవర్షిగణసేవితమ్ ॥ 20 ॥

యదీచ్ఛేన్మానవో ధీమాన్ న పునర్జాయతే క్వచిత్ ।
మేరోః శక్తో గుణాన్ వక్తుం ద్వీపానాం చ తథైవ చ ॥ 21 ॥

సముద్రాణాం చ సర్వేషాం నావిముక్తస్య శక్యతే ।

అవిముక్తం పరమోత్కృష్టమైన క్షేత్రం, అవిముక్తం పరమోత్కృష్టమైన గతిని, సిద్ధిని, స్థానాన్ని కలిగిస్తుంది. పునర్జన్మ కలుగకూడదనుకునే ధీమంతుడైన మానవుడు దేవర్షిగణాలు సేవించే ఈ అవిముక్త క్షేత్రాన్ని సేవించాలి. ఎవరెనా మేరు పర్వతం ద్వీపాలు, సముద్రాల గుణాలను చెప్పగలరు కాని అవిముక్తక్షేత్రపు గుణాలు వర్ణించడానికి శక్యం కానివి.

అన్తకాలే మనుష్యాణాం ఛిద్యమానేషు మర్మసు ॥ 22 ॥

వాయునా ప్రేర్యమాణానాం స్మృతిర్నైవోపజాయతే ।
అవిముక్తే హ్యన్తకాలే భక్తానామీశ్వరః స్వయమ్ ॥ 23 ॥

కర్మభిః ప్రేర్యమాణానాం కర్ణజాపం ప్రయచ్ఛతి ।

అంతకాలంలో మనుష్యుల మర్మస్థానాలు భిన్నమవుతుండగా, ప్రాణవాయువులు శిథిలమవుతుండగా, వారి స్మృతి నశించిపోతుంది. అంతకాలంలో అవిముక్త క్షేత్రంలో ఉన్న భక్తులకు ఈశ్వరుడే స్వయంగా వారు ఆచరించిన కర్మలతో ప్రేరితుడై వారి చెవులలో మంత్రోపదేశం చేస్తాడు.

మణికర్ణ్యాం త్యజన్ దేహం గతిమిష్టాం వ్రజేన్నరః ॥ 24 ॥

ఈశ్వరప్రేరితో యాతి దుష్ప్రాపామకృతాత్మభిః ।
అశాశ్వతమిదం జ్ఞాత్వా మానుష్యం బహుకిల్బిషమ్ ॥ 25 ॥

అవిముక్తం నిషేవేత, సంసారభయమోచనమ్ ।
యోగక్షేమప్రదం దివ్యం బహువిఘ్నవినాశనమ్ ॥ 26 ॥

విఘ్నైశ్చాలోద్యమానోఽపి యోఽవిముక్తం న ముంచతి ।
స ముంచతి జరాం మృత్యుం జన్మ చైతదశాశ్వతమ్ ।
అవిముక్తప్రసాదాత్తు శివసాయుజ్యమాప్నుయాత్ ॥ 27 ॥

మణికర్ణక్షేత్రంలో దేహాన్ని త్యజించే నరుడు తన కిష్టమైన గతిని పొందుతాడు. ఇంకనూ ఈశ్వరుని ప్రేరణతో పుణ్యం చేయనివారు పొందలేని ఉత్తమగతిని పొందుతాడు. మానవుడు పాపభూయిష్ఠమైన ఈ మనుష్యజన్మ అశాశ్వతమని తెలిసికొని సంసారభయం పోగొట్టే ఈ అవిముక్త క్షేత్రాన్ని సేవించాలి. ఈ క్షేత్రం వివిధ విఘ్నాలను నశింపజేసేది, దివ్యమైనది, యోగక్షేమాలనిచ్చేది. విఘ్నముల చేత బాధపడుతున్నప్పటికీ ఎవరైతే ఈ అవిముక్త క్షేత్రాన్ని వదలకుండా ఉంటారో, వారు అశాశ్వతాలైన జన్మ-జరా మృత్యువులను వదిలి అవిముక్త క్షేత్ర మహిమ వలన శివసాయుజ్యాన్ని పొందుతారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అవిముక్తమాహాత్మ్యే
ద్వ్యశీత్యధిక శతతమోఽధ్యాయః ॥ 182 ॥

శ్రీమత్స్యమహాపురాణంలో అవిముక్త క్షేత్ర మాహాత్మ్యంలో
నూటఎనబై రెండవ అధ్యాయం సమాప్తం.

త్ర్యశీత్యధిక శతతమోఽధ్యాయః – నూటఎనభై మూడవ అధ్యాయం

అవిముక్త మాహాత్మ్యమ్ – అవిముక్త క్షేత్ర మాహాత్మ్యం

దేవ్యువాచ – దేవి చెప్పింది.

హిమవన్తం గిరిం త్యక్త్వా మందరం గంధమాదనమ్ ।
కైలాసం నిషధం చైవ మేరుపృష్ఠం మహాద్యుతి ॥ 1 ॥

రమ్యం త్రిశిఖరం చైవ మానసం సుమహాగిరిమ్ ।
దేవోద్యానాని రమ్యాణి నందనం వనమేవ చ ॥ 2 ॥

సురస్థానాని ముఖ్యాని తీర్థాన్యాయతనాని చ ।
తాని సర్వాణి సంత్యజ్య అవిముక్తే రతిః కథమ్ ॥ 3 ॥

హిమవత్పర్వతం, మందరం, గంధమాదనం, కైలాసం, నిషధం, మహాకాంతివంతమైన మేరు పర్వతం, రమ్యమైన త్రిశిఖరం, మానస మహాపర్వతం, సుందరాలైన దేవోద్యానాలు, నందనవనం, దేవతలకు సంబంధించిన అనేక ముఖ్యస్థానాలు, తీర్థాలు, ఆయతనాలు మొదలైన వాటినన్నింటిని వదిలి మీకు ఈ అవిముక్త క్షేత్రమునందే ఎందుకింత ప్రీతి?

కిమత్ర సుమహత్పుణ్యం పరం గుహ్యం వదస్వ మే ।
యేన త్వం రమసే నిత్యం భూతసంపద్గుణైర్యుతః ॥ 4 ॥

క్షేత్రస్య ప్రవరత్వం చ యే చ తత్ర నివాసినః ।
తేషామనుగ్రహః కశ్చిత్తత్సర్వం బ్రూహి శంకర ॥ 5 ॥

ఇచ్చట గల ఆ మహాపుణ్యమేమిటి? దీని పరమ రహస్యమేమిటో నాకు చెప్పు. మరియు నీవు నీ భూత గణాలతో కూడ ఇక్కడ విహరించడానికి కారణమేమి? ఈ క్షేత్రపు శ్రేష్ఠత్వమేమిటి? ఇక్కడ ఎవరు నివసిస్తారు? వారి యందు నీ అనుగ్రహమెలా ఉంటుంది? ఓ శంకరా! ఇవ న్నీ నాకు వివరించు.

శంకర ఉవాచ – శంకరుడు చెప్పాడు.

అత్యద్భుతమిమం ప్రశ్నం యత్త్వం పృచ్ఛసి భామిని ।
తత్సర్వం సంప్రవక్ష్యామి తన్మే నిగదతః శృణు ॥ 6 ॥

భామినీ ! నీవత్యద్భుతమైన ప్రశ్న అడిగినావు. అదంతా నేనిప్పుడు వివరిస్తాను. నీవు శ్రద్ధగా విను.

వారాణస్యాం నదీ పుణ్యా సిద్ధగంధర్వసేవితా ।
ప్రవిష్టా త్రిపథా గంగా తస్మిన్ క్షేత్రే మమ ప్రియే ॥ 7 ॥

మమైవ ప్రీతిరతులా కృత్తివాసే చ సుందరి ।
సర్వేషాం చైవ స్థానానాం స్థానం తత్తు యథాధికమ్ ॥ 8 ॥

తేన కార్యేణ సుశ్రోణి తస్మిన్ స్థానే రతిర్మమ ।
తస్మిన్ లిఙ్గే చ సాన్నిధ్యం మమ దేవి సురేశ్వరి ॥ 9 ॥

ఈ పుణ్యక్షేత్రమైన వారాణసిలో పవిత్రమైన సిద్ధ గంధర్వాదులచేత సేవించబడే త్రిపథయైన గంగానది ప్రవేశించింది. ఓ సుందరీ! గజచర్మధారణలో నాకు ఎంత ప్రీతి ఉంటుందో అంతకంటె అధికమైన ప్రీతి ఈ క్షేత్రం పై కలదు. అందుకే ఇది అన్ని స్థానాలకంటె ఉత్తమమైన స్థానం. ఓ సుశ్రోణీ! అందువలననే ఇక్కడి లింగము నందు నేను సదా సన్నిహితుడనై ఉంటాను.

క్షేత్రస్య చ ప్రవక్ష్యామి గుణాన్ గుణవతాం వరే ।
యాన్ శ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥ 10 ॥

యది పాపో యది శఠో యది వాఽధార్మికో నరః ।
ముచ్యతే సర్వపాపేభ్యో హ్యవిముక్తం వ్రజేద్యది ॥ 11 ॥

ప్రలయే సర్వభూతానాం లోకే స్థావరజంగమే ।
న హి త్యక్ష్యామి తత్స్థానం మహాగణశతైర్వృతః ॥ 12 ॥

గుణవతులలో శ్రేష్ఠురాలవైన ఓ దేవీ! ఆ క్షేత్రపు గుణాలను వివరిస్తాను విను. ఆ గుణాలను విన్నవారు సర్వపాపాలనుండి ముక్తి పొందుతారు. దానిలో సందేహం లేదు. పాపియైనా, మూర్ఖుడైనా, అధర్మాన్ననుసరించేవాడైనా ఈ అవిముక్తక్షేత్రానికి వెళ్ళితే అన్ని పాపాలనుండి ముక్తి పొందుతాడు. స్థావరజంగమాత్మకమైన ఈ లోకంలో ప్రళయకాలం వచ్చినప్పుడు అన్ని ప్రాణులు నశించిపోయినా, మహాగణాలతో కలిసివున్న నేను ఈ అవిముక్త స్థానాన్ని వదిలిపెట్టను.

యత్ర దేవాః సగంధర్వాః సయక్షోరగరాక్షసాః ।
వక్త్రం మమ మహాభాగే ప్రవిశన్తి యుగక్షయే ॥ 13 ॥

తేషాం సాక్షాదహం పూజాం ప్రతిగృహ్ణామి పార్వతి ।
సర్వగుహ్యోత్తమం స్థానం మమ ప్రియతమం శుభమ్ ॥ 14 ॥

యుగక్షయకాలంలో దేవ గంధర్వ యక్షోరగ రాక్షసులందరూ నా నోటిలో ప్రవేశిస్తారు. ఓ మహాభాగా! పార్వతీ! అపుడు సాక్షాత్తుగా వారి పూజను నేనే గ్రహిస్తాను. ఇది రహస్యాలన్నింటిలో మిక్కిలి రహస్యం, ఇది ఉత్తమమైనది, నాకు ప్రియతమము.

ధన్యాః ప్రవిష్టాః సుశ్రోణి మమ భక్తా ద్విజాతయః ।
మద్భక్తిపరమా నిత్యం యే మద్భక్తాస్తు తే నరాః ॥ 15 ॥

తస్మిన్ ప్రాణాన్ పరిత్యజ్య గచ్ఛన్తి పరమాం గతిమ్ ।
సదా యజతి రుద్రేణ సదా దానం ప్రయచ్ఛతి ॥ 16 ॥

సదా తపస్వీ భవతి అవిముక్తస్థితో నరః ।
యో మాం పూజయతే నిత్యం తస్య తుష్యామ్యహం ప్రియే ॥ 17 ॥

సర్వదానాని యో దద్యాత్ సర్వయజ్ఞేషు దీక్షితః ।
సర్వతీర్థాభిషిక్తశ్చ స ప్రపద్యేత మామిహ ॥ 18 ॥

ఓ సుశ్రోణీ! ధన్యులైనవారు, భక్తులు, ద్విజాతులు, మరియు నాకు పరమభక్తులైన నరులు కూడ అక్కడ ప్రవేశిస్తారు. అక్కడ ప్రాణాలను వదిలి ఉత్తమగతిని పొందుతారు. ఈ అవిముక్తక్షేత్రంలో నివసించేవాడు ఎల్లప్పుడు రుద్రచమకాదులతో నన్ను పూజించే వాడితో సమానం. అలాగే ఇక్కడ నివసించేవాడు, సదా దానం చేసేవాడితో, సదా తపస్సు చేసేవాడితో సమానుడు. ఈ క్షేత్రంలో ఎవరైతే నన్ను నిత్యమూ పూజిస్తారో వారి విషయంలో నేను మిక్కిలి సంతృప్తుడను. ఇక్కడ ఉండి ఎవడైతే అన్ని రకాల దానాలు చేస్తాడో, ఎవడైతే యజ్ఞకర్మలలో దీక్షగలవాడై ఉంటాడో, ఎవడైతే అన్ని తీర్థాలలోను స్నానమాచరిస్తాడో అతడు నన్ను చేరుతాడు.

అవిముక్తం సదా దేవి యే వ్రజన్తి సునిశ్చితా ః ।
తే తిష్ఠన్తీహ సుశ్రోణి త్వద్భక్తాశ్చ త్రివిష్టపే ॥ 19 ॥

మత్ప్రసాదాత్తు తే దేవి దీవ్యన్తి శుభలోచనే ।
దుర్ధరాశ్చైవ దుర్ధర్షా భవన్తి విగతజ్వరాః ॥ 20 ॥

అవిముక్తం శుభం ప్రాప్య మద్భక్తాః కృతనిశ్చయా ః ।
నిర్ధూతపాపవిమలా భవన్తి విగతజ్వరాః ॥ 21 ॥

ఓ దేవీ! మంచి నిశ్చయంతో ఈ అవిముక్త క్షేత్ర యాత్ర చేసేవారు, ఈ క్షేత్రంలో నివసించేవారు నా భక్తులు స్వర్గలోకానికి వెడతారు. ఓ శుభలోచనా! నా దయవలన వారు అక్కడ పుణ్యాలతో ప్రకాశిస్తారు. అతి కఠినాత్ములైనవారు, లోకం భరించడానికి శక్యం కానివారు కూడ సకలపాపప్రాయశ్చిత్తాన్ని పొంది, శుభప్రదమైన ఈ అవిముక్త క్షేత్రాన్ని పొంది, వారి పాపాలన్నింటిని పోగొట్టుకొని, బాధారహితులై, నిర్మలాంతఃకరణులై నా సాయుజ్యాన్ని పొందుతారు.

పార్వత్యువాచ - పార్వతి చెప్పింది.

దక్షయజ్ఞస్త్వయా దేవ మత్ప్రియార్థం నిషూదితః ।
అవిముక్తగుణానాం తు న తృప్తిరిహ జాయతే ॥ 22 ॥

దేవా! నా తృప్తికొరకై ఒకప్పుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసావు. ఇప్పుడు అవిముక్తక్షేత్రపు గుణాల గురించి నీనుండి ఎంతగా విన్నా ఇంకా తృప్తి కలగటం లేదు. కావున ఇంకా ఈ క్షేత్రవైశిష్ట్యాన్ని వివరించు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు చెప్పాడు.

క్రోధేన దక్షయజ్ఞస్తు త్వత్ప్రియార్థే వినాశితః ।
మహాప్రియే మహాభాగే నాశితోఽయం వరాననే ॥ 23 ॥

అవిముక్తే యజన్తౌ తు మద్భక్తాః కృతనిశ్చయాః ।
న తేషాం పునరావృత్తిః కల్పకోటిశతై రపి ॥ 24 ॥

ఓ ప్రియతమా! నీ ప్రీతికొరకే నేను కోపంతో దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసాను. ఓమహాభాగా! దృఢసంకల్పంతో నా భక్తులెవరైతే ఈ అవిముక్తక్షేత్రంలో యజ్ఞాలాచరిస్తారో, వారు శతకోటి కల్పాల వరకు కూడ పునర్జన్మను పొందరు.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

దుర్లభాస్తు గుణా దేవ అవిముక్తే తు కీర్తితాః ।
సర్వాంస్తాన్మమ తత్త్వేన కథయస్వ మహేశ్వరః ॥ 25 ॥

కౌతూహలం మహాదేవ హృదిస్థం మమ వర్తతే ।
తత్సర్వం మమ తత్త్వేన ఆఖ్యాహి పరమేశ్వర ॥ 26 ॥

అపుడు దేవి ఇలా అన్నది. ఓ దేవా! అవిముక్తక్షేత్రపు దుర్లభాలైన గుణాలను చెప్పావు. ఓ మహేశ్వరా! మీరు చెప్పిన ఆ గుణములన్నింటిని మరొకమారు వాటి తత్త్వంతో నాకు వివరించండి. ఓ మహాదేవా! వాటి తత్త్వాన్ని తెలుసుకోవాలని నా హృదయం చాలా కుతూహలంతో ఉన్నది. కావున నాకు వివరించు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు చెప్పాడు.

అక్షయా హ్యమరాశ్చైవ హ్యదేహాశ్చ భవన్తి తే ।
మత్ప్రసాదాద్వరారోహే మామేవ ప్రవిశన్తి వై ॥ 27 ॥

బ్రూహి బ్రూహి విశాలాక్షి కిమన్య చ్ఛ్రోతుమర్హసి ॥ 28 ॥

ఓ వరారోహా! అవిముక్త క్షేత్రవాసులు నా అనుగ్రహం వలన అక్షయులు, అమరులు, పునర్జన్మ రహితులు అయి చివరలో నాయందే ప్రవేశిస్తారు. ఓ విశాలాక్షీ! ఇంకనూ ఏమేమి వినాలని కోరుతున్నావో చెప్పు.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

అవిముక్తే మహాక్షేత్రే అహో పుణ్యమహో గుణాః ।
న తృప్తిమధిగచ్ఛామి బ్రూహి దేవ పునర్గుణాన్ ॥ 29 ॥

దేవా! ఈ అవిముక్త క్షేత్రంలో ఎంత పుణ్యమున్నది? ఎన్ని మహత్తరాలైన గుణాలన్నాయి? ఎంత విన్నప్పటికీ నాకు తృప్తి కలగటం లేదు. నాకు ఇంకా ఆ గుణాల గురించి వినిపించు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు అన్నాడు.

మహేశ్వరి వరారోహే శృణు తాంస్తు మమ ప్రియే ।
అవిముక్తే గుణా యే తు తథాన్యానపి తచ్ఛృణు ॥ 30 ॥

ఓ మహేశ్వరీ! ఓ వరారోహా! ఓ ప్రియురాలా! ఈ అవిముక్త క్షేత్రపు ఇతర గుణాలను కూడ వివరిస్తాను విను అని శివుడు పార్వతితో అన్నాడు.

శాకపర్ణాశినో దాన్తాః సంప్రక్షాల్యా మరీచిపాః ।
దన్తోలూఖలినశ్చాన్యే అశ్మకుట్టాస్తథాపరే ॥ 31 ॥

మాసి మాసి కుశాగ్రేణ జలమాస్వాదయన్తి వై ।
వృక్షమూలనికేతాశ్చ శిలాశయ్యాస్తథాపరే ॥ 32 ॥

శాకాలు మరియు ఆకులు మాత్రమే తినేవారు, ఇంద్రియనిగ్రహం కలవారు, ఎల్లప్పుడూ స్నానమాచరించేవారు, సూర్యకిరణాలను మాత్రమే త్రాగి జీవించేవారు, తమ దంతాలనే రోళ్ళుగా చేసికొని జీవించేవారు అనగా ఏ ధాన్యాన్నైనా తమ పంటితో మాత్రమే నమిలి తినేవారు, రాళ్ళపై అరగదీసిన ధాన్యాన్ని మాత్రమే తిని ఉండేవారు, నెలకొకసారి మాత్రమే ధర్భాగ్రాల నుండి వచ్చే నీటి బిందువులను త్రాగి జీవించేవారు, చెట్ల మొదట్లో నివాస మేర్పర్చుకున్నవారు, రాళ్ళపైనే శయనించేవారు,

ఆదిత్యవపుషః సర్వే జితక్రోధా జితేన్ద్రియాః ।
ఏవం బహువిధైర్ధర్మైరన్యత్ర చరితవ్రతాః ॥ 33 ॥

త్రికాలమపి భుంజానా యేఽవిముక్తనివాసినః ।
తపశ్చరన్తి వాఽన్యత్ర కలాం నార్హన్తి షోడశీమ్ ॥
యేఽవిముక్తే వసన్తీహ స్వర్గే ప్రతివసన్తి తే ॥ 34 ॥

సూర్యునితో సమానమైన తేజస్సు కలవారు, కోపాన్ని జయించినవారు, ఇంద్రియాలను జయించినవారు, అనేక విధాలైన ధర్మాలను అనుసరిస్తూ, అనేక వ్రతాలు ఆచరిస్తూ, వేరేచోట తపస్సు చేసేవారు, మూడు పూటలా భోజనం చేస్తూ ఈ అవిముక్త క్షేత్రంలో నివసిస్తున్న వారిలో పదహారవ వంతుకు కూడ సాటిరారు. ఈ అవిముక్త క్షేత్రంలో నివసించేవారు స్వర్గవాసులే అవుతారు.

మత్సమః పురుషో నాస్తి త్వత్సమా నాస్తి యోషితామ్ ।
అవిముక్తసమం క్షేత్రం న భూతం న భవిష్యతి ॥ 35 ॥

అవిముక్తే పరో యోగో హ్యవిముక్తే పరా గతిః ।
అవిముక్తే పరో మోక్షః క్షేత్రం నైవాస్తి తాదృశమ్ ॥ 34 ॥

నాతో సమానమైన పురుషుడు లేడు. స్త్రీలలో నీతో సమానమైన వారెవరూ లేరు. అలాగే అవిముక్తక్షేత్రంతో, సమానమైన క్షేత్రం లేదు, ఇక ముందు ఉండదు. ఈ క్షేత్రంలో పరమమైన యోగం, ఉత్తమమైన గతి, ఉత్కృష్టమైన మోక్షం లభిస్తుంది. దీనితో సమానమైన క్షేత్రం లేదు.

పరం గుహ్యం ప్రవక్ష్యామి తత్త్వేన వరవర్ణిని ।
అవిముక్తే మహాక్షేత్రే యదుక్తం హి మయా పురా ॥ 37 ॥

జన్మాన్తరశతైర్దేవి యోగోఽయం యది లభ్యతే ।
మోక్షః శతసహస్రేణ జన్మనా లభ్యతే న వా ॥ 38 ॥

అవిముక్తే న సందేహో మద్భక్తః కృతనిశ్చయః ।
ఏకేన జన్మనా సోఽపి యోగం క్షేమం చ విన్దతి ॥ 39 ॥

ఓ వరవర్ణినీ! మరొక పరమరహస్యం చెబుతాను. విను. నేను ఇంతకుముందు చెప్పినట్లుగానే నూరుజన్మలకు లభించే యోగసిద్ధి, వేలకొలది జన్మల తరువాత లభించే మోక్షం ఈ అవిముక్తక్షేత్రంలో నివసించే నా భక్తునికి ఒకే జన్మలో లభిస్తాయి. సందేహం లేదు.

అవిముక్తే నరా దేవి యే వ్రజన్తి సునిశ్చితాః ।
తే విశన్తి పరం స్థానం మోక్షం పరమదుర్లభమ్ ॥ 40 ॥

పృథివ్యామీదృశం క్షేత్రం న భూతః న భవిష్యతి ।
చతుర్మూర్తిః సదా ధర్మో తస్మిన్ సన్నిహితః ప్రియే ॥
చతుర్ణామపి వర్ణానాం గతిస్తు పరమా స్మృతా ॥ 41 ॥

దేవీ! ఏ మానవులైతే దృఢనిశ్చయంతో ఈ అవిముక్త క్షేత్రానికి వెళుతారో వారు పరమదుర్లభమైన మోక్షాన్ని పొందుతారు. పృథివిలో ఇటువంటి క్షేత్రం ఇంతవరకు లేదు, ఉండదు కూడ. ఇక్కడ ధర్మం ఎప్పుడూ నాలుగు పాదాలతో నడుస్తూ ఉంటుంది. ఓ ప్రియా! ఇక్కడ నాలుగు వర్ణాలవారందరికీ పరమగతి లభిస్తుందని చెప్పబడింది.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

శ్రుతా గుణాస్తే క్షేత్రస్య ఇహ చాన్యత్ర యే ప్రభో ।
వదస్వ భువి విప్రేన్ద్రాః కం వా యజ్ఞైర్యజన్తి తే ॥ 42 ॥

ప్రభూ! ఈ క్షేత్రం మరియు ఇతర క్షేత్రాల గుణాలను నీ ద్వారా విని ఉన్నాను. ఓ దేవా! శ్రేష్ఠులైన బ్రాహ్మణులు ఇక్కడ యజ్ఞాలు ఆచరించేటప్పుడు వాటి ద్వారా వారు ఏ దేవతను ఆరాధిస్తారు?

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు చెప్పాడు.

ఇజ్యయా చైవ మన్త్రేణ మామేవ హి యజన్తి యే ।
న తేషాం భయమస్తీతి భవం రుద్రం యజన్తి యత్ ॥ 43 ॥

అమన్త్రో మన్త్రకో దేవి ద్వివిధో విధిరుచ్యతే ।
సాంఖ్యం చైవాథ యోగశ్చ ద్వివిధో యోగ ఉచ్యతే ॥ 44 ॥

దేవీ! వారు యజ్ఞాల ద్వారా, మరియు మన్త్రోచ్చారణలతో కూడ నన్నే ఆరాధిస్తారు. అలా ఆరాధించిన నా భక్తులకు ఇహపరలోకాలలో కూడ భయం లేదు. వారందరూ భవుడను, రుద్రుడనూ అయిన నన్నే పొందుతారు. దేవీ! యజ్ఞవిధి కూడ మంత్రయుక్తం, మంత్రరహితం అని రెండు విధములు. అలాగే యోగం కూడ సాంఖ్యం, యోగం అని రెండు విధాలు. (కర్మ కూడ మంత్రంతో కూడినదీ, మంత్రం లేనిదీ అని రెండు విధాలు.)

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥ 45 ॥

ఆత్మౌపమ్యేన సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 46 ॥

నిర్గుణః సగుణో వాఽపి యోగశ్చ కథితో భువి ।
సగుణశ్చైవ విజ్ఞేయో నిర్గుణో మనసః పరః ॥ 47 ॥

ఏతత్తే కథితం దేవి యన్మాం త్వం పరిపృచ్ఛసి ॥ 48 ॥

ఎవడైతే ఏకత్వభావనతో సర్వభూతాలలో వున్న నన్ను సేవిస్తాడో అతను యోగియై నాలోనే ఉంటాడు. మరియు అంతటా తనవలె నన్నే చూస్తాడో, అన్నింటినీ కూడ నాలోనే చూస్తాడో అతనికి నేను, నాకు అతడు లేకపోవుట ఉండదు. ఇంకనూ నిర్గుణం, సగుణం అని యోగం రెండు విధాలుగా చెప్పబడింది. వీటిలో సగుణయోగం జ్ఞానంతో గోచరమవుతుంది. నిర్గుణం మనస్సుకు అతీతమైంది. దేవీ! నీవడిగావు కాబట్టి నేను ఇవన్నీ నీకు వివరించాను.

దేవ్యువాచ - దేవి చెప్పింది.

యా భక్తి స్త్రివిధా ప్రోక్తా భక్తానాం బహుధా త్వయా ।
తామహం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః కథయస్వ మే ॥ 49 ॥

భక్తులనుష్ఠించే భక్తి మూడు విధాలని మీరు అనేకమార్లు చెప్పారు. దాని తత్త్వం మీ నుండి తెలుసుకోవాలనుకుంటున్నాను. ఈశ్వరా! నా కది చెప్పు.

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు చెప్పాడు.

శృణు పార్వతి దేవేశి భక్తానాం భక్తవత్సలే ।
ప్రాప్య సాంఖ్యం చ యోగం చ దుఃఖాన్తం చ నియచ్ఛతి ॥ 50 ॥

సదా యః సేవతే భిక్షాం తతో భవతి రంజితః ।
రంజనాత్తన్మయో భూత్వా లీయతే స తు భక్తిమాన్ ॥ 51 ॥

దేవతానాయికా! భక్తుల భక్తి యందు వాత్సల్యము గలదానా! పార్వతీ! విను. సాంఖ్యాన్ని గాని, యోగాన్ని గాని ఆశ్రయించినవాడు దుఃఖాంతాన్ని పొందుతాడు. ఎవడు ఎల్లప్పుడు భిక్షాటనతో జీవిస్తాడో అతడు భక్తితో ఆనందపడుతూ దాని ద్వారా భగవంతుని యందు తన్మయత్వాన్ని పొంది తర్వాత భగవంతునిలోనే లీనమైపోతాడు.

శాస్త్రాణాం తు వరారోహే బహుకారణదర్శినః ।
న మాం పశ్యన్తి తే దేవి జ్ఞానవాక్యవివాదినః ॥ 52 ॥

పరమార్థజ్ఞానతృప్తా యుక్తా జానన్తి యోగినః ।
విద్యయా విదితాత్మానో యోగస్య చ ద్విజాతయః ॥ 53 ॥

ప్రత్యాహారేణ శుద్ధాత్మా నాన్యథా చిన్తయేచ్చ తత్ ।
తుష్టిం చ పరమాం ప్రాప్య యోగం మోక్షం పరం తథా ॥
త్రిభిర్గుణైః సమాయుక్తో జ్ఞానవాన్ పశ్యతీహ మామ్ ॥ 54 ॥

శాస్త్రాధ్యయనం చేసినవారు అనేక కారణాలు చూప (చూడ) గలిగిన వారైనప్పటికీ జ్ఞానపరమైన వివిధ వాక్యాలతో వాదించుటలో నిమగ్నులవుతారు కాని నా రూపాన్ని చూడలేరు. పరమార్థ జ్ఞానంతో తృప్తులైన యోగులు, విద్యచేత ఆత్మతత్త్వాన్ని తెలిసికొన్న ద్విజులు మాత్రమే నన్ను దర్శించగలరు. ప్రత్యాహారం అనగా లౌకికసుఖాల నుండి ఇంద్రియాలను నిగ్రహించుకొని శుద్ధమైన ఆత్మను పొందాలి కాని అన్యథా చింతించగూడదు. పరమోత్కృష్టమైన తుష్టిని పొంది యోగాన్ని, మోక్షాన్ని సాధించాలి. అప్పుడు త్రిగుణాలతో కూడిన తత్త్వజ్ఞాని నన్ను చూడగలడు.

ఏతత్తే కథితం దేవి కిమన్యచ్ఛ్రోతుమర్హసి ।
భూయ ఏవ వరారోహే కథయిష్యామి సువ్రతే ॥ 55 ॥

గుహ్యం పవిత్రమథవా యచ్చాపి హృది వర్తతే ।
తత్సర్వం కథయిష్యామి శృణుష్వైకమనాః ప్రియే ॥ 56 ॥

దేవీ! నీవడిగినదంతా వివరించాను. ఇంకా ఏమి వినాలని కోరుకొంటున్నావు? ఓవరారోహా! సువ్రతా! తెలుపు. నీకు కావలసింది మరల వినిపిస్తాను. రహస్యమైనదైనా, పవిత్రమైనదైనా నీ మనస్సులో ఏ ఆలోచన కలదో అదంతా వివరిస్తాను. ఏకాగ్రచిత్తంతో విను.

దేవ్యువాచ – దేవి బదులిచ్చింది.

త్వద్రూపం కీదృశం దేవ యుక్తాః పశ్యన్తి యోగినః ।
పశ్యన్మే సంశయం బ్రూహి నమస్తే సురసత్తమ ॥ 57 ॥

ఓ దేవా! యోగయుక్తులైన ముముక్షులు దర్శించే నీ రూపమేవిధంగా ఉంటుంది. నా ఈ సంశయాన్ని అవలోకించిన నీవు చక్కగా వివరించు. ఓ దేవతాశ్రేష్ఠా! నీకు నమస్కారం.

శ్రీ భగవానువాచ - భగవానుడు చెప్పాడు.

అమూర్తం చైవ మూర్తం చ జ్యోతిరూపం హి తత్ స్మృతమ్ ।
తస్యోపలబ్ధిమన్విచ్ఛన్ యత్నః కార్యో విజానతా ॥ 58 ॥

గుణైర్వియుక్తో భూతాత్మా ఏవం వక్తుం న శక్యతే ।
శక్యతే యది వక్తుం వై దివ్యైర్వర్షశతైర్న వా ॥ 59 ॥

దేవీ! వాస్తవంగా నా రూపం మూర్తం మరియు అమూర్తం కూడ. అనగా అది సాకారం నిరాకారం. అది జ్యోతిరూపమైనదని తలంచారు. ఆ పరమాత్మ స్వరూపాన్ని పొందగోరే జ్ఞాని దానికొరకై దృఢంగా ప్రయత్నించాలి. నిర్గుణుడైన భూతాత్మ తత్త్వం (పరమాత్మ తత్త్వం) ఇటువంటిదని చెప్పుటకు వీలుకానిది. ఒక వేళ తెలిసికొనుటకు వీలవుతుందంటే నూరు దివ్యసంవత్సరాలకైనా సాధ్యమవుతుందో, కాదో చెప్పలేము.

దేవ్యువాచ - దేవి పలికింది.

కిం ప్రమాణం తు తత్ క్షేత్రం సమన్తాత్సర్వతో దిశమ్ ।
యత్ర నిత్యం స్థితో దేవో మహాదేవో గణైర్యుతః ॥ 60 ॥

మహాదేవుడైన పరమేశ్వరుడు తన ప్రమథగణాలతో కూడ నిత్యమూ నివసించే ఆ అవిముక్తక్షేత్రం అన్ని దిక్కులలో వ్యాపించివున్న విస్తారప్రమాణమెంతో వివరించు.

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇలా అన్నాడు.

ద్వియోజనం తు తత్ క్షేత్రం పూర్వపశ్చిమతః స్మృతమ్ ।
అర్ధయోజనవిస్తీర్ణం తత్ క్షేత్రం దక్షిణోత్తరమ్ ॥ 61 ॥

వారాణాసీ నదీ యావత్ తావచ్ఛుక్లనదీ తు వై ।
భీష్మచండికమారభ్య పర్వతేశ్వరమన్తికే ॥ 62 ॥

ఆ క్షేత్రపు తూర్పు పడమరల విస్తీర్ణం రెండు యోజనాలు. అలాగే దక్షిణోత్తరాల విస్తీర్ణం అర్ధయోజనం. వారణాసి స్వచ్ఛమైన తెల్లని నది. ఈ క్షేత్రం భీష్మచండికం నుండి పర్వతేశ్వరం వరకు వ్యాపించి ఉన్నది.

గణా యత్రావతిష్ఠన్తి సన్నియుక్తా వినాయకాః ।
కూశ్మాండగజతుండశ్చ జయన్తశ్చ మదోత్కటాః ॥ 63 ॥

సింహవ్యాఘ్రముఖాః కేచిద్వికటాః కుబ్జవామనాః ।
యత్ర నందీ మహాకాలశ్చండఘంటో మహేశ్వరః ॥ 64 ॥

దండచండేశ్వరశ్చైవ ఘంటాకర్ణో మహాబలః ।
ఏతే చాన్యే చ బహవో గణాశ్చైవ గణేశ్వరాః ॥ 65 ॥

మహోదరా మహాకాయా వజ్రశక్తిధరాస్తథా ।
రక్షన్తి సతతం దేవి హ్యవిముక్తం తపోవనమ్ ॥
ద్వారే ద్వారే చ తిష్ఠన్తి శూలముద్గరపాణయః ॥ 66 ॥

ఈ క్షేత్రంలో విఘ్నాలను హరించే వినాయకులు, ప్రమథగణాలు, మదోత్కటులైన కూశ్మాండుడు, గజతుండుడు, జయంతుడు మొదలైనవారున్నారు. ఇంకను సింహముఖులు, వ్యాఘ్రముఖులు, వికటరూపం కలవారు, కుబ్జులు, వామనులు, నందీశ్వరుడు, మహాకాళుడు, చండఘంటుడు, మహేశ్వరుడు, దండచండేశ్వరుడు, మహాబలుడైన ఘంటాకర్ణుడు, మొదలైనవారు కూడ ఉన్నారు. ఇంతేకాక అనేకమంది గణాలు, గణేశ్వరులు, మహోదరులు, మహాకాయులు, వజ్రం, శక్తి మొదలైన ఆయుధాలు కలవారు కూడ ఈ అవిముక్తమనే తపోవనాన్ని ఎల్లప్పుడూ రక్షిస్తూ ఉంటారు. ఇంకనూ శూలం, ముద్గరం మొదలైన ఆయుధాలు గలవారనేకులు ఈ క్షేత్రపు ప్రతిద్వారంలోను రక్షిస్తూ ఉంటారు.

స్వర్ణశృంగీం రౌప్యఖురాం చైలాజినపయస్వినీమ్ ।
వారాణస్యాం తు యో దద్యాత్సవత్సాం కాంస్యభాజనమ్ ॥ 67 ॥

గాం దత్వా తు వరారోహే బ్రాహ్మణే వేదపారగే ।
ఆసప్తమం కులం తేన తారితం నాత్ర సంశయః ॥ 68 ॥

ఓ వరారోహా! బంగారుకొమ్ములు, వెండిగిట్టలు కలిగిన, పుష్కలంగా పాలిచ్చే గోవును దూడతోపాటు మరియు ఒక కాంస్య పాత్రతో కూడ వేదపారంగతుడైన బ్రాహ్మణునికి ఈ వారాణాసీ క్షేత్రంలో ఎవరు దానం చేస్తారో వారు తమ వంశంలోని ఏడు తరాలవారిని పవిత్రులను చేస్తారనడంలో సందేహం లేదు.

యో దద్యాత్ బ్రాహ్మణే కించిత్ తస్మిన్ క్షేత్రే వరాననే ।
కనకం రజితం వస్త్రమన్నాద్యం బహువిస్తరమ్ ॥
అక్షయ్యం చావ్యయం చైవ స్యాతాం తస్య సులోచనే ॥ 69 ॥

ఓ వరాననా! ఎవరు ఈ క్షేత్రంలో బ్రాహ్మణునికి వెండి, బంగారు, వస్త్రం, అన్నం మొదలైనవి దానం చేస్తారో వారు చేసిన ఆ దానం అక్షయం, అవ్యయం కూడ అవుతుంది.

శృణు తత్త్వేన తీర్థస్య విభూతిం వ్యుష్టిమేవ చ ।
తత్ర స్నాత్వా మహాభాగే భవన్తి నీరుజా నరాః ॥ 70 ॥

దశానామశ్వమేధానాం ఫలం ప్రాప్నోతి మానవః ।
తదవాప్నోతి ధర్మాత్మా తత్ర స్నాత్వా వరాననే ॥ 71 ॥

ఓ మహాభాగా, ఈ తీర్థపు తత్త్వాన్ని, మహత్తరమైన సమృద్ధినిగురించి చెబుతాను విను. ఈ తీర్థంలో స్నానమాచరించే మానవులు వ్యాధిరహితులవుతారు. మరియు పది అశ్వమేధ యాగాలు చేసిన ఫలాన్ని పొందుతారు.

బహుస్వల్పే చ యో దద్యాద్ బ్రాహ్మణే వేదపారగే ।
శుభాం గతిమవాప్నోతి అగ్నివచ్చైవ దీప్యతే ॥ 72 ॥

వారాణసీజాహ్నవీభ్యాం సంగమే లోకవిశ్రుతే ।
దత్త్వాన్నం చ విధానేన న స భూయోఽభిజాయతే ॥ 73 ॥

ఏతత్తే కథితం దేవి తీర్థస్య ఫలముత్తమమ్ ॥ 74 ॥

వేదపారంగతుడైన బ్రాహ్మణునికి ఈ క్షేత్రంలో ఎంత స్వల్పదానం చేసినా శుభప్రదమైన గతిని మానవులు పొందుతారు. మరియు అగ్నివలె ప్రకాశిస్తారు. వరణ, అసి అనే నదులు గంగతో సంగమించే స్థలం లోక ప్రసిద్ధం. ఆ స్థలంలో యథావిధిగా అన్నదానం చేస్తే వారికి పునర్జన్మ ఉండదు. దేవీ! ఈ తీర్థపు ఉత్తమమైన ఫలాన్ని గురించి నీకు చెప్పాను.

ఉపవాసం తు యః కృత్వా విప్రాన్ సంతర్పయేన్నరః ।
సౌత్రామణేశ్చ యజ్ఞస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥ 75 ॥

ఏకాహారస్తు యస్తిష్ఠేన్మాసం తత్ర వరాననే ।
యావజ్జీవకృతం పాపం సహసా తస్య నశ్యతి ॥ 76 ॥

ఈ క్షేత్రంలో ఎవడైతే ఉపవాసం చేసి బ్రాహ్మణులకు భోజనాదులు సమర్పిస్తాడో, ఆ మానవుడు సౌత్రామణి యజ్ఞం చేసిన ఫలాన్ని పొందుతాడు. మరియు ఓ వరాననా! ఇక్కడ రోజుకు ఒక్కసారి మాత్రమే భుజిస్తూ ఎవడు ఉంటాడో, అతని జీవితంలో చేసిన పాపమంతా నశిస్తుంది.

అగ్నిప్రవేశం యే కుర్యుః అవిముక్తే విధానతః ।
ప్రవిశంతి ముఖం తే మే నిఃసందిగ్ధం వరాననే ॥ 77 ॥

దశ సౌవర్ణికం పుష్పం యోఽవిముక్తే ప్రయచ్ఛతి ।
అగ్నిహోత్రఫలం ధూపే గంధదానే తథా శృణు ॥
భూమిదానేన తత్తుల్యం గంధదానఫలం స్మృతమ్ ॥ 78 ॥

సంమార్జనే పంచశతం సహస్రమనులేపనే ।
మాలయా శతసాహస్రమనన్తం గీతవాద్యతః ॥ 79 ॥

ఓ వరాననా! ఈ అవిముక్త క్షేత్రంలో ఎవరైతే యథావిధిగా అగ్నిప్రవేశం చేస్తారో, వారు సాక్షాత్తు నా ముఖంలో ప్రవేశించిన ఫలాన్ని పొందుతారనుటలో సందేహం లేదు. మరియు ఈ అవిముక్తంలో పది బంగారు పుష్పాలను దానం చేసేవారికి నిత్యాగ్నిహోత్రంతో సమానమైన ఫలం లభిస్తుంది. అలాగే ఇక్కడ ధూపదానం, గంధదానం భూదానంతో సమానమైన ఫలాన్నిస్తాయి. అంతే కాక ఈ అవిముక్తక్షేత్రపు దేవాలయంలో ఊడ్చి శుభ్రం చేస్తే ఐదు వందలు దానం చేసిన ఫలం, అలికితే వేయిదానాలతో సమానమైన ఫలం, పుష్పమాల అర్పిస్తే లక్షదానంతో సమానమైన ఫలం, గీత వాద్యాలు జరిపిస్తే అనంతమైన ఫలం లభిస్తుంది.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

అత్యద్భుతమిదం దేవ స్థానమేతత్ ప్రకీర్తితమ్ ।
రహస్యం శ్రోతుమిచ్ఛామి యదర్థం త్వం న ముంచసి ॥ 80 ॥

దేవా! ఈ అవిముక్త క్షేత్రపు అత్యద్భుతమైన విషయాలన్నీ నీవు చెప్పినావు. ఇప్పుడు నీవీ క్షేత్రాన్ని విడువకుండా ఉండటంలోని రహస్య మేమిటో నేను తెలుసుకోగోరుతున్నాను.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు బదులు చెప్పాడు.

ఆసీత్ పూర్వం వరారోహే బ్రహ్మణస్తు శిరో వరమ్ ।
పంచమం శృణు సుశ్రోణి జాతం కాంచనసప్రభమ్ ॥ 81 ॥

జ్వలత్ తత్ పంచమం శీర్షం జాతం తస్య మహాత్మనః ।
తదేవమబ్రవీద్దేవి జన్మ జానామి తే హ్యయమ్ ॥ 82 ॥

తతః క్రోధపరీతేన సంరక్తనయనేన చ ।
వామాంగుష్ఠనఖాగ్రేణ ఛిన్నం తస్య శిరో మయా ॥ 83 ॥

ఓ వరారోహా! ఓ సుశ్రోణీ! ఆ విషయాన్ని చెబుతాను విను. పూర్వం బ్రహ్మదేవునికి బంగారువర్ణం వంటి వర్ణంతో మిక్కిలి ప్రకాశిస్తున్న ఐదవ శిరస్సు ఉద్భవించింది. ఆ సమయంలో బ్రహ్మ నన్ను నీ పుట్టుక గురించి తెలుసు అన్నాడు. దానితో నేను కోపోద్రిక్తుడనూ, ఎర్రని నేత్రాలు కలవాడనై నా ఎడమచేతి బొటనవేలి గోటితో ఆ అయిదవ తలను ఛేదించాను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

యదా నిరపరాధస్య శిరశ్ఛిన్నం త్వయా మమ ।
తస్మాచ్ఛాపసమాయుక్తః కపాలీ త్వం భవిష్యసి ॥
బ్రహ్మహత్యాకులో భూత్వా చర తీర్థాని భూతలే ॥ 84 ॥

నిరపరాధినైన నా శిరస్సును కారణం లేకుండా ఛేదించావు కావున నీవు శాపగ్రస్తుడవై, కపాలం ధరించి, బ్రహ్మహత్యాదోషంతో కూడినవాడవై భూలోకంలోని తీర్థాలలో తిరుగుతూ ఉండు.

తతోఽహం గతవాన్ దేవి హిమవన్తం శిలోచ్చయమ్ ।
తత్ర నారాయణః శ్రీమాన్ మయా భిక్షాం ప్రయాచితః ॥ 85 ॥

తతస్తేన స్వకం పార్శ్వం నఖాగ్రేణ విదారితమ్ ।
స్రవతో మహతీ ధారా తస్య రక్తస్య నిఃసృతా ॥ 86 ॥

అప్పుడు నేను హిమవత్పర్వతానికి వెళ్ళాను. అక్కడ శ్రీమన్నారాయణుని భిక్ష కోరాను. నా కోరిక విని శ్రీమన్నారాయణుడు తన పార్శ్వభాగాన్ని గోటి అగ్రభాగంతో చీల్చగా మహారక్తధార స్రవించసాగింది.

ప్రయాతా సాతివిస్తీర్ణా యోజనార్ధశతం తదా ।
న సంపూర్ణం కపాలం తు ఘోరమద్భుతదర్శనమ్ ॥ 87 ॥

దివ్యం వర్షసహస్రం తు సా చ ధారా ప్రవాహిణీ ।
ప్రోవాచ భగవాన్ విష్ణుః కపాలం కుత ఈదృశమ్ ॥ 88 ॥

ఆశ్చర్యభూతం దేవేశ సంశయో హృది వర్తతే ।
కుతశ్చ సంభవో దేవ సర్వం మే బ్రూహి పృచ్ఛతః ॥ 89 ॥

ఆ రక్తధార యాభైయోజనాల పొడవువరకు సాగింది. కాని దానితో నా కపాలం మాత్రము నిండలేదు. అద్భుతంగా కనబడే ఆ రక్తధార వేయి దివ్య సంవత్సరాల కాలం వరకు ప్రవహించసాగింది. అది చూచి విష్ణుభగవానుడు నాతో ఇలా అన్నాడు. దేవేశా! శివా! ఆశ్చర్యకరమైన ఈ కపాలం ఎక్కడినుండి లభించింది? అనే సంశయం నాకు కలుగుతున్నది. దేవా! దాని వివరాలు తెలిపి నా సంశయాన్ని తీర్చు.

దేవదేవ ఉవాచ - దేవదేవుడు చెప్పాడు.

శ్రూయతామస్య హే దేవ కపాలస్య తు సంభవః ।
శతం వర్షసహస్రాణాం తపస్తప్త్వా సుదారుణమ్ ॥ 90 ॥

బ్రహ్మాఽసృజత్ వపుర్దివ్యమద్భుతం లోమహర్షణమ్ ।
తపసశ్చ ప్రభావేణ దివ్యం కాంచనసన్నిభమ్ ॥ 91 ॥

జ్వలత్తత్పంచమం శీర్షం జాతం తస్య మహాత్మనః ।
నికృత్తం తన్మయా దేవ తదిదం పశ్య దుర్జయమ్ ॥ 92 ॥

యత్ర యత్ర చ గచ్ఛామి కపాలం తత్ర గచ్ఛతి ।
ఏవముక్తస్తతో దేవః ప్రోవాచ పురుషోత్తమః ॥ 93 ॥

దేవా! ఈ కపాలపు ఉత్పత్తి ఎలా జరిగిందో చెబుతాను విను. బ్రహ్మ నూరువేల దివ్యసంవత్సరాలు దారుణమైన తపస్సు ఆచరించి, దివ్యమైన, అద్భుతమైన శరీరానికి గగుర్పాటు కలిగించే, దివ్యమైన సువర్ణ కాంతి గలిగిన దేహాన్ని సంపాదించుకొన్నాడు. అప్పుడే ఆ మహానుభావునికి ఐదవ శిరస్సు ఉద్భవించింది. దేవా! నేనా శిరస్సును ఛేదించాను. దుర్జయమైన ఆ కపాలం నేను ఎక్కడికి వెళ్ళినా అక్కడికి నన్ను అనుసరించి వస్తున్నది. పరమేశ్వరుడు చెప్పిన విషయాన్ని విని పురుషోత్తముడైన వాసుదేవుడిలా అన్నాడు.

శ్రీభగవానువాచ - భగవానుడు చెప్పాడు.

గచ్ఛ గచ్ఛ స్వకం స్థానం బ్రహ్మణస్త్వం ప్రియం కురు ।
తస్మిన్ స్థాస్యతి భద్రం తే కపాలం తస్య తేజసా ॥ 94 ॥

శంకరా! నీ స్థానానికి నీవు వెళ్ళిపో. బ్రహ్మదేవునికి ప్రీతి కలిగేటట్లు చేయి. నీకు శుభం కలుగుగాక! ఈ కపాలం తన తేజస్సుతోనే నీకు శుభం కలిగిస్తుంది అని శ్రీమన్నారాయణుడు చెప్పాడు.

తతః సర్వాణి తీర్థాని పుణ్యాన్యాతనాని చ ।
గతో ఽస్మి పృథులశ్రోణి న క్వచిత్ ప్రత్యతిష్ఠత ॥ 95 ॥

తతో ఽహం సమనుప్రాప్తో హ్యవిముక్తే మహాశయే ।
అవస్థితః స్వకే స్థానే శాపశ్చ విగతో మమ ॥ 96 ॥

ఓ పృథులశ్రోణీ! భగవానుని మాటలను విని, ఆయన చెప్పినట్లు నేను అన్ని తీర్థాలను, పుణ్యప్రదాలైన క్షేత్రాలను తిరిగాను. కాని దానివలన నాకు ఎటువంటి శాంతి కలుగలేదు. అపుడు ఓ మహాశయా! నేను ఈ అవిముక్త క్షేత్రానికే వచ్చి నా స్థానంలోనే నిలిచాను. నాకు శాపవిమోచనం కూడ కలిగింది.

విష్ణుప్రసాదాత్ సుశ్రోణి కపాలం తత్సహస్రధా ।
స్ఫుటితం బహుధా జాతం స్వప్నలబ్ధం ధనం యథా ॥ 97 ॥

ఓ సుశ్రోణీ! శ్రీమహావిష్ణువు అనుగ్రహం వలన ఆ కపాలం వేయి భాగాలుగా చీలి స్వప్నంలో లభించిన ధనం వలె క్షణకాలంలోనే అదృశ్యమయింది.

బ్రహ్మహత్యాపహం తీర్థం క్షేత్రమేతన్మయా కృతమ్ ।
శ్మశానమేతద్ భద్రం మే దేవానాం వరవర్ణిని ॥ 98 ॥

కాలో భూత్వా జగత్సర్వం సంహరామి సృజామి చ ।

అపుడు నేను దీనిని బ్రహ్మహత్యా నివారకక్షేత్రంగా నిశ్చయించాను. ఓ వరవర్ణినీ! ఇది దేవతల శ్మశానం. ఇక్కడే ఉండి నేను కాలుడనై ఈ జగత్తునంతటిని సృష్టిస్తూ, సంహరిస్తూ ఉంటాను.

దేవేశి సర్వగుహ్యానాం స్థానం ప్రియతరం మమ ॥ 99 ॥

మద్భక్తాస్తత్ర గచ్ఛన్తి విష్ణుభక్తాస్తథైవ చ ।
యే భక్తా భాస్కరే దేవి లోకనాథే దివాకరే ॥
తత్రస్థో యస్త్యజేద్దేహం మామేవ ప్రవిశేత్తు సః ॥ 100 ॥

దేవేశీ! రహస్యస్థానాలన్నింటిలో నాకు ప్రియతమమైన స్థానమిది. నా భక్తులే కాకుండా విష్ణుభక్తులు, లోకనాథుడైన సూర్యభగవానుని భక్తులు కూడ ఆ అవిముక్తక్షేత్రానికి వెళతారు. అంతేకాక ఈ క్షేత్రంలో దేహాన్ని త్యజించేవారు సాక్షాత్తూ నాలోనే లీనమవుతారు.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

అత్యద్భుతమిదం దేవ యదుక్తం పద్మయోనినా ।
త్రిపురాన్తకరస్థానం గుహ్యమేతన్మహాద్యుతే ॥ 101 ॥

సన్నిధానాత్తు తే సర్వే కలాం నార్హన్తి షోడశీమ్ ।
యత్ర తిష్ఠతి దేవేశో యత్ర తిష్ఠతి శంకరః ॥ 102 ॥

దేవా! పద్మసంభవుడైన బ్రహ్మదేవుడు చెప్పిన ఈ విషయాలన్నీ అత్యద్భుతాలు. ఓ మహాకాంతిమంతుడా! త్రిపురాంతకుడవైన నీ ఈ స్థానం చాలా గోపనీయమైంది. ఇతర క్షేత్రాలన్నీ కలిసినా నీ సాన్నిధ్యంతో ఉన్న ఈ క్షేత్రపు పదహారవవంతుకు కూడ సరిపోవు. ఎందుకనగా దేవేశుడవైన, శంకరుడవైన నీవు నివసించే ఈ క్షేత్రం మహత్తరమైంది.

గంగా తీర్థసహస్రాణాం తుల్యా భవతి వా న వా ।
త్వమేవ భక్తిర్దేవేశ త్వమేవ గతిరుత్తమా ॥ 103 ॥

బ్రహ్మాదీనాం తు తే దేవ గతిరుక్తా సనాతనీ ।
శ్రావ్యతే యద్ ద్విజాతీనాం భక్తానామనుకంపయా ॥104॥

పరమేశ్వరుడవైన నీవుండే ఈ క్షేత్రంలో గల పవిత్రగంగానదితో వేలతీర్థాలు కూడ సమానాలవుతాయో, కావో చెప్పటానికి వీలు కాదు. దేవేశా! నీవే భక్తివి, నీవే ఉత్తమగతివి. ఓ దేవా! బ్రహ్మాదిదేవతలకు కూడ నీవే ఉత్తమ గతివి. ఇది భక్తులకు, ద్విజాతులకు కూడ నీ దయవలననే వినిపించవలసింది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అవిముక్తమాహాత్మ్యే
త్ర్యశీత్యధికశతతమోఽధ్యాయః ॥183॥

శ్రీమత్స్యమహాపురాణంలోని అవిముక్త క్షేత్రమాహాత్మ్యంలో
నూట ఎనబైమూడవ అధ్యాయం సమాప్తం



చతురశీత్యధిక శతతమోఽధ్యాయః – నూటఎనభై నాల్గవఅధ్యాయం

అవిముక్త తీర్థమాహాత్మ్యమ్ – అవిముక్త తీర్థ మాహాత్మ్యం

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు చెప్పాడు.

సేవితం బహుభిః సిద్ధైరపునర్భవకాంక్షిభిః ।
విదిత్వా తు పరం క్షేత్రమవిముక్తనివాసినామ్ ॥ 1 ॥

తద్ గుహ్యం దేవదేవస్య తత్తీర్థం తత్తపోవనమ్ ।
పరం స్థానం తు తే యాన్తి సంభవన్తి న తే పునః ॥ 2 ॥

ఈ అవిముక్తతీర్థంనందు నివసించువారి యొక్క శ్రేష్ఠత్వమును తెలిసికొనిన అనేకమంది సిద్ధులు పునర్జన్మరాహిత్యమును కోరువారై ఈ తీర్థమును సేవించారు. ఇది ఆ దేవదేవుని యొక్క పరమరహస్యస్థానం, గొప్ప తీర్థం, మహత్తరమైన తపోవనం. ఈ తీర్థమునకు వెళ్ళినవారు మరల జన్మించరు.

జ్ఞానే విహితనిష్ఠానాం పరమానందమిచ్ఛతామ్ ।
యా గతిర్విహితా సద్భిః సా విముక్తే మృతస్య తు ॥ 3 ॥

భవస్య ప్రీతిరతులా హ్యవిముక్తే హ్యనుత్తమా ।
అసంఖ్యేయం ఫలం తత్ర హ్యక్షయా చ గతిర్భవేత్ ॥ 4 ॥

పరం గుహ్యం సమాఖ్యాతం స్మశానమితి సంజ్ఞితమ్ ।
అవిముక్తం న సేవన్తే వంచితాస్తే నరా భువి ॥ 5 ॥

పరమానందమును కోరి జ్ఞానమునందే విహితచిత్తులైనవారికి కలుగునటువంటి ఉత్తమమైనగతి ఈ అవిముక్త క్షేత్రమున మృతి చెందినవారికి ప్రాప్తిస్తుంది. భవునకు దీనియందు అసమానమైన ప్రీతి కలదు. ఈ క్షేత్రమున అసంఖ్యేయమగు ఫలము అక్షయ్యమైన ఉత్తమగతి లభిస్తుంది. ఇది పరమరహస్యమైన శ్మశానముగా చెప్పబడినది. ఎవరు ఈ అవిముక్తక్షేత్రమును సేవింపరో, వారు సత్యముగా జీవితమున వంచితులైనట్లే.

అవిముక్తే స్థితైః పుణ్యైః పాంసుభిర్వాయునేరితైః ।
అపి దుష్కృతకర్మాణో యాస్యన్తి పరమాం గతిమ్ ॥ 6 ॥

మేరుమందరమాత్రోఽపి రాశిః పాపస్య కర్మణః ।
అవిముక్తం సమాసాద్య తత్సర్వం వ్రజతి క్షయమ్ ॥ 7 ॥

అవిముక్తక్షేత్రమున నున్న పుణ్యప్రదములైన వాయువుల చేత పైకి లేపబడిన ధూళికణములు తాకినంత మాత్రముననే దుష్కర్మలు ఆచరించినవారు కూడ ఉత్తమగతిని పొందుతారు. మేరుపర్వతం, మందరపర్వతం మొదలగు వాటి పరిమాణములోనున్న పాపరాశియైనను ఈ అవిముక్తక్షేత్రమునకు వచ్చినచో నశించిపోవును.

శ్మశానమితి విఖ్యాతం అవిముక్తం శివాలయమ్ ।
తద్గుహ్యం దేవదేవస్య తత్తీర్థం తత్తపోవనమ్ ॥ 8 ॥

తత్ర బ్రహ్మాదయో దేవా నారాయణపురోగమాః ।
యోగినశ్చ తథా సాధ్యా భగవన్తం సనాతనమ్ ॥ 9 ॥

ఉపాసన్తే శివం ముక్తా మద్భక్తా మత్పరాయణాః ।

ఈ అవిముక్తము మహాశ్మశానమని ఖ్యాతి చెందినది, అది శివాలయము, అది దేవదేవుని పరమరహస్య స్థానము, అది తీర్థము, అది తపోవనము, అక్కడ శ్రీమన్నారాయణునితో కూడ బ్రహ్మాది దేవతలందరు, యోగులు, సిద్ధులు, ముక్తి కోరువారు శివుని ఉపాసింతురు. నా యందే మత్పరాయణులైన భక్తులందరూ ప్రవేశింతురు.

యా గతిర్జ్ఞానతపసా యా గతిర్యజ్ఞయాజినామ్ ॥ 10 ॥

అవిముక్తే మృతానాం తు సా గతిర్విహితా శుభా ।
సంహర్తారశ్చ కర్తారస్తస్మిన్ బ్రహ్మాదయః సురాః ॥ 11 ॥

సమ్రాడ్విరాణ్మయా లోకా జాయన్తే హ్యపునర్భవాః ।
మహర్జన స్తపశ్చైవ సత్యలోకస్తథైవ చ ॥ 12 ॥

మనసః పరమో యోగో భూతభవ్య భవస్య చ ।
బ్రహ్మాది స్థావరాన్తస్య యోనౌ సాంఖ్యాదిమోక్షయోః ॥ 13 ॥

యేఽవిముక్తం న ముంచంతి నరాస్తే నైవ వంచితాః ।

జ్ఞానము చేత, తపస్సు చేత, యజ్ఞయాగాది కర్మలచేత లభించునట్టి ఉత్తమమైన గతిని ఈ అవిముక్త క్షేత్రమున మృతి చెందినవారు పొందుదురు. లోకకారకులు, లోకసంహారకులూ కూడ అయిన బ్రహ్మాది దేవతలు సమ్రాట్ విరాట్ స్వరూపులగు ఈశ్వరతత్త్వమును తెలిసిన వారు పునర్జన్మరహితులై ఈ అవిముక్తముననే వసింతురు. మరియు మహర్జన తపస్సత్యాదిలోకములందు వసించు బ్రహ్మాదిస్థావరపర్యంతజనము, భూత భవిష్యద్వర్త మానములను తెలిసిన పరమయోగులు, సాంఖ్యయోగాది తత్త్వములు తెలిసిన మహర్షిగణములు మరియు ఇతర జనులెవరైననూ ఈ అవిముక్త క్షేత్రమును వదిలిపెట్టరో వారెప్పటికినీ వంచితులు కారు.

ఉత్తమం సర్వతీర్థానాం స్థానానా ముత్తమం చ యత్ ॥ 14 ॥

క్షేత్రాణా ముత్తమం చైవ శ్మశానానాం తథైవ చ ।
తటాకానాం చ సర్వేషాం కూపానాం స్రోతసాం తథా ॥ 15 ॥

శైలానాముత్తమం చైతత్ తడాగానాం తథోత్తమమ్ ।
పుణ్యకృత్ భవభక్తైశ్చ హ్యవిముక్తం తు సేవ్యతే ॥ 16 ॥

ఇది సర్వ తీర్థములలో, స్థానములలో, క్షేత్రములలో, శ్మశానములలో, తటాకములలో, కూపములలో, నదులలో, పర్వతములలో ఉత్తమమైనది. పుణ్యాత్ములైన శివభక్తులచేత ఈ అవిముక్తము సేవింపబడును.

బ్రహ్మణః పరమం స్థానం బ్రహ్మణాధ్యాసితం చ యత్ ।
బ్రహ్మణా సేవితం నిత్యం బ్రహ్మణా చైవ రక్షితమ్ ॥ 17 ॥

అత్రైవసప్తభువనం కాంచనో మేరుపర్వతః ।
మనసః పరమో యోగః ప్రీత్యర్థం బ్రహ్మణః స తు ॥ 18 ॥

బ్రహ్మా తు తత్ర భగవాన్ త్రిసంధ్యం చేశ్వరే స్థితః ।
పుణ్యాత్ పుణ్యతమం క్షేత్రం పుణ్యకృద్భిర్నిషేవితమ్ ॥ 19 ॥

ఆదిత్యోపాసనం కృత్వా విప్రాశ్చామరతాం గతాః ।

ఇది బ్రహ్మకు పరమస్థానము, బ్రహ్మ నివసించు స్థానము, బ్రహ్మచే సేవింపబడిన స్థానము, బ్రహ్మచే సర్వధా రక్షింపబడిన స్థానము, సప్తభువనములు కాంచన (బంగారం) మేరు పర్వతము ఇదియే. బ్రహ్మత్వమును ప్రసన్నము చేసుకొనుటకు పరమశ్రేష్ఠమైన మనోయోగము ఇక్కడే లభిస్తుంది. భగవంతుడైన బ్రహ్మ త్రిసంధ్యల యందును ఇక్కడి ఈశ్వరునియందే ఉండును, పుణ్యమైనవాటిలో పుణ్యతమమైన ఈ స్థానము పుణ్యాత్ములచే సేవింపబడును. ఇక్కడ ఆదిత్యోపాసన చేసిన విప్రులు అమరత్వమును పొందుతారు.

అన్యేఽపి యే త్రయో వర్ణాః భవభక్త్యా సమాహితాః ॥ 20 ॥

అవిముక్తే తనుం త్యక్త్వా గచ్ఛంతి పరమాం గతిమ్ ।

ఇక ఇతరులైన మూడు వర్ణములవారు అనగా క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు సమాహితచిత్తులై పరమేశ్వరుని యందు భక్తి గలిగి ఈ అవిముక్తక్షేత్రమున తనువు చాలించినచో వారు పరమగతిని పొందుతారు.

అష్టౌ మాసాన్ విహారస్య యతీనాం సంయతాత్మనామ్ ॥ 21 ॥

ఏకత్ర చతురో మాసాన్ మాసౌ వా నివసేత్ పునః ।
అవిముక్తే ప్రవిష్టానాం విహారస్తు న విద్యతే ॥ 22 ॥

న దేహో భవితా తత్ర దృష్టం శాస్త్రే పురాతనే ।
మోక్షో హ్యసంశయస్తత్ర పంచత్వం తు గతస్య వై ॥ 23 ॥

నియంత్రింపబడిన మనస్సు గల యతీంద్రులు సంవత్సరకాలమున ఎనిమిది మాసముల పర్యన్తము ఇతరత్ర సంచరించుచు నాలుగు మాసములు లేదా రెండు మాసములైననూ ఒకే చోట నివసించుట నియమము కాని ఈ అవిముక్త క్షేత్రమున ప్రవేశించిన యతులకు పై నియమములు వర్తింపవు అనగా సంవత్సరమంతయూ ఈ క్షేత్రమున నుండిననూ దోషముండదు. ఈ అవిముక్తమున నుండువారికి దేహముండదని శాస్త్రములు తెలుపుచున్నవి. ఇక్కడ పంచత్వమును పొందినవారు అనగా మరణించినవారికి మోక్షమే ప్రాప్తించును అనుటలో సందేహము లేదు.

స్త్రియః పతివ్రతాయాశ్చ భవభక్తాః సమాహితాః ।
అవిముక్తే విముక్తాస్తా యాస్యంతి పరమాం గతిమ్ ॥ 24 ॥

అన్యా యాః కామచారిణ్యః స్త్రియో భోగపరాయణాః ।
కాలేన నిధనం ప్రాప్తా గచ్ఛన్తి పరమాం గతిమ్ ॥ 25 ॥

శివుని భక్తులైన సమాహితచిత్తులైన పతివ్రతలగు స్త్రీలు ఈ అవిముక్తమున గతించినచో ఉత్తమగతిని పొందుతారు. స్వేచ్ఛాచారిణులు, భోగపరాయణులూ ఐన స్త్రీలు కూడ ఇక్కడ నివసించుచూ మరణించినచో, కాలానుసారము నిధనమును పొంది, ఉత్తమగతిని పొందుతారు.

యత్ర యోగశ్చ మోక్షశ్చ ప్రాప్యతే దుర్లభో నరైః ।
అవిముక్తం సమాసాద్య నాన్యద్గచ్ఛేత్తపోవనవమ్ ॥ 26 ॥

సర్వాత్మనా తపఃసేవ్యం బ్రాహ్మణైర్నాత్ర సంశయః ।
అవిముక్తే వసేద్యస్తు మమ తుల్యో భవేన్నరః ॥ 27 ॥

యతో మయా న ముక్తం హి త్వవిముక్తం తతఃస్మృతమ్ ।

ఇక్కడ నరులకు దుర్లభములైన యోగము మోక్షము రెండు కూడ లభించును. అవిముక్తమునకు వచ్చినవారికి ఇక ఇతర తపోవనములను వెదుకుతూ వెళ్ళవలసిన పని లేదు. సంపూర్ణముగా మనస్సు నియంత్రించి తపమాచరించిన విప్రులు ముక్తి పొందుదురనుటలో సందేహము లేదు. అవిముక్తమున నివసించు నరులు నాతో సమానులు, ఎందుకనగా నాచే విడువబడనిదీ క్షేత్రము కావున దీనికి అవిముక్తమను పేరు సిద్ధించినది.

అవిముక్తం న సేవన్తే మూఢా యే తమసాఽఽవృతాః ॥ 28 ॥

విణ్మూత్రరేతసాం మధ్యే తే వసన్తి పునః పునః ।
కామః క్రోధశ్చ లోభశ్చ దంభఃస్తంభోఽతిమత్సరః ॥ 29 ॥

నిద్రా తంద్రా తథాలస్యం పైశున్యమితి తే దశ ।
అవిముక్తే స్థితా విఘ్నాః శక్రేణ విహితాః స్వయమ్ ॥ 30 ॥

వినాయకోపసర్గాశ్చ సతతం మూర్ధ్ని తిష్ఠతి ।
పుణ్యమేతద్భవేత్సర్వం భక్తానా మనుకంపయా ॥ 31 ॥

పరం గుహ్యమితి జ్ఞాత్వా తతః శాస్త్రానుదర్శనాత్ ।
వ్యాహృతం దేవదేవైస్తు మునిభి స్తత్త్వదర్శిభిః ॥ 32 ॥

అజ్ఞానాంధకారముతో ఆవృతులైన ఏ మూర్ఖులైతే అవిముక్తమును సేవింపరో వారు మల-మూత్రరేతస్సులందు మరల మరల నివసింతురు. కామము, క్రోధము, లోభము, దంభము, స్తంభము, అతిమత్సరము, నిద్రా, బద్ధకము, అలసత్వము, పిశునత్వము అను పది దుర్గుణములు మరియు ఇంద్రుడు అవిముక్త క్షేత్రమున కల్పించిన విఘ్నములు, వినాయకుడు కలిగించు విఘ్నములు మొదలగునవన్నియు ఎల్లప్పుడును తలమీద కూర్చుని యుండును. కాని ఇవన్నియు ఈ అవిముక్తముననున్న భక్తులను అనుగ్రహించుటకై పుణ్యప్రదములే అగునని శాస్త్రములను దర్శించిన తత్త్వజ్ఞులచేత, దేవదేవులచేత, మునులచేత కూడ తెలుపబడినది.

మేదసా విప్లుతా భూమిరవిముక్తే తు వర్జితా ।
పూతా సమభవత్సర్వా మహాదేవేన రక్షితా ॥ 33 ॥

సంస్కారస్తేన క్రియతే భూమే రన్యత్ర సూరిభిః ।

దేవతలచేత సంహరింపబడిన రాక్షసులయొక్క మేదస్సుచేత వ్యాప్తమై భూమియంతయు అపవిత్రమే అయిననూ ఈ అవిముక్త క్షేత్రము మాత్రము మహాదేవునిచే రక్షింపబడి ఎల్లప్పుడునూ పవిత్రముగానే యుండును కనుక ఇతరత్ర అపవిత్రమైన భూమిని పండితులు సంస్కరించినట్లు ఈ క్షేత్రమునకవసరము లేదు.

యే భక్త్యా వరదం దేవమక్షరం పదమం పదమ్ ॥ 34 ॥

దేవదానవగంధర్వ యక్షరక్షో మహెూరగాః ।
అవిముక్త ముపాసన్తే తన్నిష్ఠాస్తత్పరాయణాః ॥ 35 ॥

తే విశన్తి మహాదేవమాజ్యాహుతి రివానలమ్ ।
తం వై ప్రాప్య మహాదేవ మీశ్వరాధ్యుషితం శుభమ్ ॥ 36 ॥

అవిముక్తం కృతార్థో ఽస్మీత్యాత్మానముపలభ్యతే ।

దేవ దానవ గంధర్వ యక్ష రాక్షస నాగాదులు మొదలగు భక్తులందరు వరదుడు, అక్షరుడు, పరమోన్నతుడు, దేవదేవుడూ అయిన శంకరుని మరియు అవిముక్త క్షేత్రమును కూడ తన్నిష్ఠులై, తత్పరాయణులై ఉపాసింతురు. మరియు ఆజ్యాహుతి అగ్నిహోత్రమునందువలె మహాదేవునిలో ప్రవేశింతురు. మహాదేవునకు ఆశ్రయమైన శుభప్రదమైన అవిముక్త క్షేత్రమును ఆశ్రయించి కృతార్థులైనట్లు వారందరూ భావింతురు.

ఋషిదేవాసురగణైర్జపహెూమపరాయణైః ॥ 37 ॥

యతిభిర్మోక్షకామైశ్చ హ్యవిముక్తం నిషేవ్యతే ।
నావిముక్తే మృతః కశ్చిన్నరకం యాతి కిల్బిషీ ॥ 38 ॥

ఈశ్వరానుగృహీతా హి సర్వే యాన్తి పరాంగతిమ్ ।

జపహెూమపరాయణులైన ఋషులు, దేవతలు, అసురులు, మోక్షకాములైన యతులు ఈ అవిముక్తమునే సేవింతురు. అవిముక్తమున మరణించిన పాపాత్ములు కూడ నరకమునకు పోరు. ఈశ్వరానుగ్రహమువలన అందరునూ పరమగతినే పొందుదురు.

ద్వియోజనమథార్థం చ తత్క్షేత్రం పూర్వపశ్చిమమ్ ॥ 39 ॥

అర్ధయోజనవిస్తీర్ణం దక్షిణోత్తరతః స్మృతమ్ ।
వారాణసీ తదీయా చ యావచ్ఛుక్లనదీ తు వై ॥ 40 ॥

ఏష క్షేత్రస్య విస్తారః ప్రోక్తో దేవేన ధీమతా ।

ఈ క్షేత్రపు తూర్పు–పడమరల పొడవు రెండున్నరయోజనములు మరియు దక్షిణోత్తరముల విస్తీర్ణము అర్ధయోజనము, ఇది వారాణసీ నది మరియు శుక్లనదుల నడుమ ఉన్నది, అని ఈ అవిముక్తక్షేత్రపు విస్తారము ధీమంతుడైన మహాదేవునిచే చెప్పబడినది.

లబ్ధ్వా యోగం చ మోక్షం చ కాంక్షన్తో జ్ఞానముత్తమమ్ ॥ 41 ॥

అవిముక్తం న ముంచంతి తన్నిష్ఠాస్తత్పరాయణాః ।
తస్మిన్వసన్తి యే మర్త్యా న తే శోచ్యాః కదాచన ॥ 42 ॥

యోగాభ్యాసము చేసి తద్ద్వారా ఉత్తమమైన జ్ఞానమును మోక్షమును కూడ కాంక్షించుచు, ఆ పరమేశ్వరుని యందే నిష్ఠ గలవారై ఆతనిని ఉత్తమగమ్యముగా భావించేవారు. ఈ అవిముక్తమును వదిలిపెట్టరు.ఏ నరులైతే ఈ క్షేత్రమున వసింతురో వారెప్పటికిని అభినందింపదగినవారే.

యోగక్షేత్రం తపఃక్షేత్రం సిద్ధగన్ధర్వ సేవితమ్ ।
సరితః సాగరాః శైలాః నావిముక్తసమా భువి ॥ 43 ॥

భూర్లోకే చాన్తరిక్షే చ దివి తీర్థాని యాని చ ।
అతీత్య వర్తతే చాన్యదవిముక్తం ప్రభావతః ॥ 44 ॥

ఈ అవిముక్తము యోగక్షేత్రం, తపఃక్షేత్రం, సదా సిద్ధులచేత గంధర్వులచేత సేవింపబడునది నదులు, సముద్రములు, పర్వతములు మొదలగునవేవియూ ఈ భూలోకమున అవిముక్తముతో సమానములు కావు. భూలోకమున, అన్తరిక్షమున మరియు స్వర్గలోకముననున్న తీర్థములను ఈ అవిముక్త తీర్థము తన ప్రభావముచే అతిశయించియున్నది.

యే తు ధ్యానం సమాసాద్య ముక్తాత్మానః సమాహితాః ।
సన్నియమ్యేన్ద్రియగ్రామం జపన్తి శతరుద్రియమ్ ॥ 45 ॥

అవిముక్తే స్థితా నిత్యం కృతార్థాస్తే ద్విజాతయః ।
భవభక్తిం సమాసాద్య రమన్తే తు సునిశ్చితాః ॥ 46 ॥

ఏ బ్రాహ్మణులైతే ఈ అవిముక్త క్షేత్రమునందుండి ధ్యానమునవలంబించి, సమాహితచిత్తులై, ఇంద్రియములను నిగ్రహించుకొని నిత్యమూ శతరుద్రీయమును జపింతురో వారు కృతార్థులు మరియు నిశ్చయముగా భవునియందు భక్తిగలవారై ఈ క్షేత్రమున ఆనందం పొందుతారు.

సంహృత్య శక్తితః కామాన్ విషయేభ్యో బహిః స్థితాః ।
శక్తితః సర్వతో ముక్తాః శక్తితస్తపసి స్థితాః ॥ 47 ॥

కరణానీహ చాత్మానమపునర్భవభావితాః ।
తం వై ప్రాప్య మహాత్మాన మీశ్వరం నిర్భయాః స్థితాః ॥ 48 ॥

శక్త్యనుసారం కోరికలను నియంత్రించుకుని విషయసుఖములను దూరముగా త్యజించి, శక్త్యనుసారం అన్నింటిని త్యజించి, శక్త్యనుసారం తపస్సు నాచరించువారు పునర్భవరహితులై మహాత్ముడైన ఆ ఈశ్వరుని చేరి నిర్భయులై ఈ అవిముక్తమున వసింతురు.

న తేషాం పునరావృత్తిః కల్పకోటిశతైరపి ।
అవిముక్తే తు గృహ్యన్తే భవేన విభునా స్వయమ్ ॥ 49 ॥

ఉత్పాదితం మహాక్షేత్రం సిద్ధ్యన్తే యత్ర మానవాః ।
ఉద్దేశమాత్రం కథితా అవిముక్తగుణాస్తథా ॥ 50 ॥

సముద్రస్యేవ రత్నానామవిముక్తస్య విస్తరమ్ ।
మోహనం తదభక్తానాం భక్తానాం భక్తివర్ధనమ్ ॥ 51 ॥

అట్టి వారికి శతకోటి కల్పములవరకు కూడ పునర్జన్మ ఉండదు. ఈ అవిముక్తమున నుండువారిని శివుడు స్వయముగా తన దగ్గరకు తీసుకొనును. మానవులందరికిని సిద్ధి కలుగుటకై పరమేశ్వరునిచేత ఈ మహా క్షేత్రముత్పాదింపబడినది. ఈ క్షేత్రపు గుణములు ఉద్దేశమాత్రముగా (సంక్షిప్తముగా) ఇంతవరకును వివరింపబడినవి. సముద్రమునందలి రత్నములవలె ఈ క్షేత్రపు గుణములు కూడ అనంతములు. ఇచ్చట భక్తులు కానివారు మోహమును మూఢత్వమును పొందుదురు మరియు భక్తులైనవారియొక్క భక్తి మరింత వృద్ధి పొందును.

మూఢాస్తే తు న పశ్యన్తి శ్మశానమితి మోహితాః ।
హన్యమానోఽపి యో విద్వాన్ వసేద్విఘ్నశతైరపి ॥ 52 ॥

స యాతి పరమం స్థానం యత్ర గత్వా న శోచతి ।
జన్మమృత్యుజరాముక్తః పరం యాతి శివాలయమ్ ॥ 53 ॥

మూర్ఖులు మోహితులై దీనిని శ్మశానము వలెనే జూతురు. వందలాది విఘ్నములతో ఇబ్బంది పడుతున్నప్పటికిని ఏ విద్వాంసుడు ఇచ్చట నివసించునో అతడు శోకరహితమైన ఉత్తమగతిని పొందుతాడు. జన్మమృత్యుజరాదులకు అతీతుడై శివాలయమునకు చేరును.

అపునర్మరణానాం హి సా గతిర్మోక్షకాంక్షిణామ్ ।
యాం ప్రాప్య కృతకృత్యః స్యాదితి మన్యేత పండితః ॥ 54 ॥

న దానై ర్నతపోభిర్వా న యజ్ఞైర్నాపి విద్యయా ।
ప్రాప్యతే గతిరిష్టా యా హ్యవిముక్తే తు లభ్యతే ॥ 55 ॥

మోక్షము లభించువారికి ఉత్తమగతిని లభింపజేయు ఈ అవిముక్తము పునర్మరణాదులు లేకుండా జేయును. దానిని పొందిన పండితుడు కృతకృత్యుడనైతినని తలంచును. దానములు, తపస్సు, యజ్ఞములు మరియు విద్య మొదలగువాటిచేత పొందునట్టి ఉత్తమగతి ఈ అవిముక్తమున లభించును.

నానావర్ణా వివర్ణాశ్చ చండాలా యే జుగుప్సితాః ।
కిల్బిషైః పూర్ణదేహాశ్చ ప్రకృష్టైః పాతకై స్తథా ॥ 56 ॥

భేషజం పరమం తేషామవిముక్తం విదుర్బుధాః ।

వివిధవర్ణములకు చెందినవారు, ఏ వర్ణమునకు చెందనివారు, చండాలులు, లోకముచేత తిరస్కరింపబడిన వారు, ప్రకృష్టములైన పాపములు చేసిన వారు ఇత్యాదులందరికిని అవిముక్త క్షేత్రము పరమౌషధము వంటిదని పండితులు చెప్పుదురు.

జాత్యన్తరసహస్రేషు హ్యవిముక్తే మ్రియేత యః ॥ 57 ॥

భక్తో విశ్వేశ్వరే దేవే న స భూయోఽభిజాయతే ।
యత్ర చేష్టం హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ॥ 58 ॥

సర్వమక్షయ మేతస్మిన్ అవిముక్తే న సంశయః ॥
కాలేనోపరతా యాన్తి భవే సాయుజ్య మక్షయమ్ ॥ 59 ॥

వేలకొలది జాతులయందు జన్మించినవాడైనప్పటికిని ఎవరైతే ఈ అవిముక్తమున మరణింతురో వారు విశ్వేశ్వరునకు భక్తులే అగుదురు వారికి పునర్జన్మ ఉండదు, ఇచ్చట ఆచరించిన యజ్ఞములు, దానములు, తపస్సు మొదలగునవన్నియు అక్షయఫలప్రదములు, వీటన్నింటిని ఆచరించుచు కాలానుసారము మరణము పొందినవారు అక్షయమైన శివసాయుజ్యమును పొందుదురు.

కృత్వా పాపసహస్రాణి పశ్చాత్సంతాపమేత్య వై ।
యోఽవిముక్తే వియుజ్యేత స యాతి పరమాంగతిమ్ ॥ 60 ॥

ఉత్తరం దక్షిణం చాపి అయనం న వికల్పయేత్ ।
సర్వస్తేషాం శుభః కాలో హ్యవిముక్తే మ్రియన్తి యే ॥ 61 ॥

న తత్ర కాలో మీమాంస్యః శుభో వా యది వాఽశుభః ।
తస్య దేవస్య మాహాత్మ్యస్థానమద్భుతకర్మణః ।
సర్వేషామేవ నాథస్య సర్వేషాం విభునా స్వయమ్ ॥ 62 ॥

అనేక వేల పాపములాచరించినప్పటికిని పశ్చాత్తాపము పొంది ఈ అవిముక్తమున మరణించినచో నరులు ఉత్తమగతిని పొందుతారు. ఇక్కడ మరణించువారికి ఉత్తరాయణము, దక్షిణాయనము అను వికల్పముండదు. ఇక్కడ మృతి చెందిన వారికి అన్ని కాలములు శుభప్రదములే. కనుక అవిముక్త క్షేత్రమున శుభాశుభకాలముల విచారము చేయనవసరముండదు. అద్భుతకర్మలనాచరించు ఆ మహాదేవుని నివాసస్థానపు మాహాత్మ్యం చాలా గొప్పది.

శ్రుత్వేదమృషయః సర్వే స్కందేన కథితం పురా ।
అవిముక్తాశ్రమం పుణ్యం భావయేత్కారణైః శుభైః ॥ 63 ॥

పూర్వం స్కందునిద్వారా వినిపింపబడిన ఈ కథను విని ఋషులందరూ ఈ అవిముక్తక్షేత్రము అతి పుణ్యప్రదమైనదని తలంచి, శుభములైన అంతఃకరణములతో దానినే సర్వదా భావన చేశారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అవిముక్త తీర్థమాహాత్మ్యం నామ చతురశీత్యధికశతతమోఽధ్యాయః ॥ 184 ॥

శ్రీ మత్స్యమహాపురాణమున అవిముక్త తీర్థమాహాత్మ్యమను నూటఎనబై నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచాశీత్యధిక శతతమోఽధ్యాయః - నూటఎనభై ఐదవ అధ్యాయం

అవిముక్తతీర్థమాహాత్మ్యమ్ - అవిముక్తతీర్థమాహాత్మ్యం

సూత ఉవాచ - సూతుడు చెప్పెను.

అవిముక్తే మహాపుణ్యే ఆస్తికాః శుభదర్శనాః ।
విస్మయం పరమం జగ్ముః హర్ష గద్గదనిఃస్వనాః ॥ 1 ॥

ఊచుస్తే హృష్టమనసః స్కన్దం బ్రహ్మవిదాం వరమ్ ।
బ్రహ్మణో దేవ పౌత్రస్త్వం బ్రహ్మణ్యో బ్రహ్మణః ప్రియః ॥ 2 ॥

బ్రాహ్మణో బ్రహ్మవిద్ బ్రహ్మ బ్రహ్మేంద్రో బ్రహ్మలోకకృత్ ।
బ్రహ్మకృద్ బ్రహ్మచారీ త్వం బ్రహ్మదిర్బ్రహ్మవత్సలః ॥ 3 ॥

బ్రహ్మతుల్యోద్భవకరో బ్రహ్మతుల్య నమోఽస్తు తే ।

మహాపుణ్యప్రదమైన అవిముక్త క్షేత్రమునందు శుభదర్శనులు అనగా ప్రీతి కలిగించు రూపము కలవారునగు ఆస్తికులందరును హర్షముతో గద్గదస్వరం కలవారై, అత్యంతాశ్చర్యము పొందినవారై, సంతుష్టమనస్కులై బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన స్కందునితో ఇట్లనిరి. నీవు బ్రహ్మదేవుని పుత్రుడవు, బ్రహ్మణ్యుడవు, బ్రహ్మప్రియుడవు, బ్రహ్మచారివి, బ్రహ్మవత్సలుడవు, బ్రహ్మతో సమానముగా సృష్టి చేయ శక్తి కలవాడవు, బ్రహ్మ సమానుడవూ అయిన నీకు నమస్సులు.

ఋషయో భావితాత్మానః శ్రుత్వేదం పావనం మహత్ ॥ 4 ॥

తత్త్వస్తు పరమం జ్ఞాతం యద్ జ్ఞాత్వాఽమృతమశ్నుతే ।
స్వస్తి తేఽస్తు గమిష్యామో భూర్లోకం శంకరాలయమ్ ॥ 5 ॥

యత్రాసౌ సర్వభూతాత్మా స్థాణుభూతః స్థితః ప్రభుః ।
సర్వలోకహితార్థాయ తపస్యుగ్రే వ్యవస్థితః ॥ 6 ॥

సంయోజ్య యోగేనాత్మానం రౌద్రీం తనుముపాశ్రితః ।
గుహ్యకై రాత్మభూతస్తు ఆత్మతుల్యగుణైర్వృతః ॥ 7 ॥

పరమపావనమైన ఈ మహత్త్వమును విని భావితాత్ములైన ఋషులు "ఏది తెలిసికొనినచో అమృతత్వము సిద్ధించునో అట్టి పరమతత్త్వమును తెలిసికొంటిమి. నీకు శుభము కలుగుగాక! మేమిపుడు భూలోకములోని శంకరాలయమునకు వెళ్ళెదము. అక్కడ సర్వభూతాత్ముడు, స్థాణుస్వరూపుడు, సర్వలోకహితముకొరకై ఉగ్రమైన తపస్సుయందు నిమగ్నమైనవాడు, యోగంతో ఆత్మను సంయోజపరచి రౌద్రరూపమును పొందినవాడు, ఆత్మ స్వరూపులు, ఆత్మతుల్య గుణములు కలవారగు గుహ్యకులతో కలిసియున్న ఆ శంకరుని వద్దకు వెళ్ళెదము" అని చెప్పి వెళ్ళారు.

తతో బ్రహ్మాదిభిర్దేవైః సిద్ధై శ్చ పరమర్షిభిః ।
విజ్ఞప్తః పరయా భక్త్యా త్వత్ప్రసాదాద్గణేశ్వర ॥ 8 ॥

వస్తు మిచ్ఛామ నియతమవిముక్తే సునిశ్చితాః ।
ఏవం గుణే తథా మర్త్యా హ్యవిముక్తే వసన్తి యే ॥ 9 ॥
ధర్మశీలా జితక్రోధా నిర్మమా నియతేంద్రియాః ।
ధ్యానయోగపరాః సిద్ధిం గచ్ఛన్తి పరమవ్యయమ్ ॥ 10 ॥

తర్వాత బ్రహ్మాదిదేవతలు, సిద్ధులు, మహర్షులు పరమభక్తితో మరల ఆ స్కందునికి ఇట్లు విన్నవించారు. ఓ గణేశ్వరా! నీ కృపవలన సునిశ్చితులమైన మేమందరము అనుపమములైన గుణములు గలిగిన ఈ అవిముక్త క్షేత్రము నందు నివసించ గోరుచున్నాము. పుణ్యప్రదమైన ఈ అవిముక్తమున నివసించు మానవులు ధర్మశీలురు, క్రోధమును జయించినవారు, మమకారరహితులు, ఇంద్రియనిగ్రహం కలవారు, ధ్యానయోగ పరులు ఐనవారై అవ్యయమైన ఉత్తమసిద్ధిని పొందుతారు.

యోగినో యోగసిద్ధాశ్చ యోగమోక్ష ప్రదం విభుమ్ ।
ఉపాసతే భక్తియుక్తాః శాన్తా యోగగతిం గతాః ॥ 11 ॥

స్థానం గుహ్యం శ్మశానానాం సర్వేషా మేతదుచ్యతే ।
న హి యోగాదృతే మోక్షః ప్రాప్యతే భువి మానవైః ॥ 12 ॥

యోగులు, యోగసిద్ధులు భక్తియుక్తులై యోగమోక్ష ప్రదుడైన ఆ ప్రభువుని ఉపాసించి శాన్తస్వరూపులై యోగ గతిని పొందుదురు. లోకములోని శ్మశానములన్నింటిలో ఇది గుహ్యమగు స్థానమని చెప్పబడినది. భూలోకమున మానవులకు యోగం లేకుండా మోక్షం లభించదు.

అవిముక్తే తు వసతాం యోగో మోక్షశ్చ సిద్ధ్యతి ।
అనేకజన్మనైవేహ ప్రాప్యతే గతిరుత్తమా ॥ 13 ॥

కాని అవిముక్తమునందు నివసించువారికి యోగం మోక్షం కూడ సిద్ధించును. ఈ జన్మమునందే వారికి ఉత్తమగతి ప్రాప్తించును.

అవిముక్తే నివసతా వ్యాసేనామితతేజసా ।
నైవ లబ్ధా క్వచిద్ భిక్షా భ్రమమాణేన యత్నతః ॥ 14 ॥

క్షుధావిష్టస్తతః క్రుద్ధోఽచిన్తయచ్ఛాపముత్తమమ్ ।
దినం దినం ప్రతి వ్యాసః షణ్మాసం యోఽవతిష్ఠతి ॥ 15 ॥

కథం మమేదం నగరం భిక్షాదోషాద్ధతం త్విదమ్ ।
విప్రో వా క్షత్రియో వాఽపి బ్రాహ్మణీ విధవాఽపి వా ॥ 16 ॥

సంస్కృతాఽసంస్కృతా వాఽపి పరిపక్వాః కథం ను మే ।
న ప్రయచ్ఛన్తి వై లోకా బ్రాహ్మణాశ్చర్యకారకమ్ ॥ 17 ॥

(పూర్వమొకప్పుడు కారణాంతరమున అవిముక్త క్షేత్రముపై కోపించి దానిని శపించబూనిన వ్యాసుడు ఆ క్షేత్రమును విడువలేకపోయెను). అమితతేజస్కుడైన వ్యాసుడు ఈ అవిముక్తము నందు నివసించుచుండగా ఒకనాడు ప్రయత్నముతో అంతటా తిరిగినను ఏ ఒక్కచోటనూ భిక్ష లభించకపోయెను. ఆకలిచేత క్రుద్ధుడైన ఆతడు ఆ నగరమునకు శాపమిచ్చుటకై చింతించెను. దిన దిన క్రమమున నేనిక్కడ ఆరు మాసములు ఉంటిని. ఎట్లు ఈ నగరము నాకు భిక్ష ఈయకున్నది? నిజముగా ఈ దోషముతో ఈ అవిముక్తము హతమైనది. ఇక్కడ నివసించుచున్న బ్రాహ్మణుడో, క్షత్రియుడో, బ్రాహ్మణ స్త్రీయో, విధవయో, సంస్కరింపబడినదో సంస్కరింపబడనిదో అయిన ఏదో ఒక పరిపక్వమైన భిక్ష నాకు ఈయకున్నారే? ఆశ్చర్యకరంగా ఉన్నదే.

ఏషాం శాపం ప్రదాస్యామి తీర్థస్య నగరస్య తు ।
తీర్థం చాతీర్థతాం యాతు నగరం శాపయామ్యహమ్ ॥ 18 ॥

మాఽభూత్త్రిపౌరుషీ విద్యా మాఽభూత్త్రిపౌరుషం ధనమ్ ।
మాఽభూత్త్రిపౌరుషం సఖ్యం వ్యాసో వారాణసీం శపన్ ॥ 19 ॥

అవిముక్తే నివసతాం జనానాం పుణ్యకర్మణామ్ ।
విఘ్నం సృజామి సర్వేషాం యేన సిద్ధిర్న విద్యతే ॥ 20 ॥

నేను వీరందరికిని ఈ తీర్థమునకును, నగరమునకును శాపమిచ్చెదను. దానితో ఈ తీర్థము అతీర్థమగు గాక! నా శాపప్రభావమువలన ఇక్కడ నివసించు ఎంత పుణ్యకర్ములకైననూ మూడు తరముల పాటు విద్య కాని, ధనము కాని, సుఖము కాని లభింపకుండు గాక, ఇటువంటి శాపముతో వీరికి విఘ్నము కలిగింతును దాని వలన వీరు ఎటువంటి సిద్ధినీ పొందలేరు.

వ్యాసచిత్తం తదా జ్ఞాత్వా దేవదేవ ఉమాపతిః ।
భీతభీతస్తదా గౌరీం తాం ప్రియాం పర్యభాషత ॥ 21 ॥

శృణు దేవి వచో మహ్యం యాదృశం ప్రత్యుపస్థితమ్ ।
కృష్ణద్వైపాయనః కోపాచ్ఛాపం దాతుం సముద్యతః ॥ 22 ॥

వ్యాసచిత్తమును తెలిసికొనిన దేవదేవుడైన ఉమాపతి భయమునంది తన ప్రియమైన గౌరితో ఇట్లనెను. దేవీ! నా మాటలు వినుము. ఎటువంటి స్థితి వచ్చినదో చూడుము. కృష్ణద్వైపాయనుడు కోపోద్రిక్తుడై ఈ నగరమును శపింప సిద్ధపడుచున్నాడు.

దేవ్యువాచ – దేవి చెప్పింది.

కిమర్థం శపతే క్రుద్ధో వ్యాసః కేన ప్రకోపితః ।
కిం కృతం భగవంస్తస్య యేన శాపం ప్రయచ్ఛతి ॥ 23 ॥

దేవా! ఎవరివలన వ్యాసుడు ఇంతటి క్రుద్ధుడయ్యెను? భగవానుడవైన నీవు ఏమి అపకారము చేసితివి? ఆతడు ఎందుకు శాపమిచ్చుటకు సిద్ధపడెను?

దేవదేవ ఉవాచ – దేవదేవుడు చెప్పాడు.

అనేన సుతపస్తప్తం బహూన్వర్షగణాన్ ప్రియే ।
మౌనినా ధ్యానయుక్తేన ద్వాదశాబ్దాన్ వరాననే ॥ 24 ॥

తతః క్షుధా సుసంజాతా భిక్షామటితుమాగతః ।
నైవాస్య కేనచిద్ భిక్షా గ్రాసార్ధమపి భామిని ॥ 25 ॥

ఏవం భగవతః కాలః ఆసీత్ షాణ్మాసికో మునేః ।
తతః క్రోధపరీతాత్మా శాపం దాస్యతి సోఽధునా ॥ 26 ॥

ప్రియా! అనేక సంవత్సరముల పర్యంతం వ్యాసుడిక్కడ ఘోరమైన తపస్సు ఆచరించాడు. వరాననా! ధ్యానయుక్తుడై పన్నెండు సంవత్సరములవరకు మౌనియై యుండెను. అటు తర్వాత ఆతనికి ఆకలివేసి భిక్షాటనమునకు వెళ్ళెను కాని ఓ భామినీ! ఆతనికి ఎవరు కూడ ఒక అరముద్దమాత్రమైన భిక్ష వేయలేదు. అట్లు పూజ్యుడైన మునికి భిక్షాటనమున ఆరు మాసముల గడిచెను. అపుడు క్రోధపరీతాత్ముడై శాపమీయడానికై సిద్ధపడెను.

యావన్నైష శపేత్తావదుపాయస్తత్ర చిన్త్యతామ్ ।
కృష్ణద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణం ప్రియే ॥ 27 ॥

కోఽస్య శాపాన్న బిభేతి హ్యపి సాక్షాత్పితామహః ।
అదైవం దైవతం కుర్యాద్దైవం చాప్యపదైవతమ్ ॥ 28 ॥

ఈతను శపించులోపే కోపనివారణమునకై ఉపాయము ఆలోచించవలసినది. ప్రియా! ఈ కృష్ణద్వైపాయన వ్యాసుడు సాక్షాత్తూ నారాయణుడే అని తెలిసికొనుము. ఈతని శాపమునకు ఎవరు భయపడకుందురు? సాక్షాత్తు పితామహుడైన బ్రహ్మదేవుడే ఇతని శాపమునకు భయపడును. ఇతడు అదైవతమును దైవతముగాను మరియు దైవతమును అదైవతముగా చేయగల సామర్థ్యము గలవాడు.

ఆవాం తు మానుషౌ భూత్వా గృహస్థావిహ వాసినౌ ।
తస్య తృప్తికరీం భిక్షాం ప్రయచ్ఛావో వరాననే ॥ 29 ॥

ఏవముక్తా తతో దేవి దేవేన శంభునా తదా ।
వ్యాసస్య దర్శనం దత్వా కృత్వా వేషం తు మానుషమ్ ॥ 30 ॥

ఏహ్యేహి భగవన్ సద్యోభిక్షాం గ్రాహయ సత్తమ ।
అస్మద్ గృహం కదాచిత్త్వం నాగతోఽసి మహామునే ॥ 31 ॥

వరాననా! మనము మనుష్యరూపములో ఇక్కడ నివసించు గృహస్థులుగా మారి ఆతనికి తృప్తి కలిగించు భిక్ష పెట్టుదము అని చెప్పిన పరమేశ్వరుని మాటలు వినిన దేవి వెంటనే వ్యాసునకు మనుష్యరూపమున దర్శనమిచ్చి "ఓ సహృదయుడా, భగవన్! ఓ మహాముని! నీవింతవరకెప్పుడును మా ఇంటికి రాకపోతివి. ఇప్పుడు రమ్ము, మా ఇంటికి వచ్చి దయతో మా భిక్షను గ్రహింపుము" అని అనెను.

ఏతచ్ఛ్రుత్వా ప్రీతమనాః భిక్షాం గ్రహీతు మాగతః ।
భిక్షాం దత్త్వా తు వ్యాసాయ షడ్రసామమృతోపమామ్ ॥ 32 ॥

అనాస్వాదితపూర్వా సా భక్షితా మునినా తదా ।
భిక్షాం వ్యాసస్తతో భుక్త్వా చిన్తయన్ హృష్టమానసః ॥ 33 ॥

వవన్దే వరదం దేవం దేవీం చ గిరిజాం తదా ।
వ్యాసః కమలపత్రాక్ష ఇదం వచనమబ్రవీత్ ॥ 34 ॥

దేవో దేవీ నదీ గంగా మిష్టమన్నం శుభా గతిః ।
వారాణస్యాం విశాలాక్షి వాసః కస్య న రోచతే ॥ 35 ॥

దేవి యొక్క మాటలు వినిన వ్యాసుడు ప్రీతమనస్కుడై భిక్షను గ్రహించుటకై వచ్చెను. వెంటనే ఆమె షడ్రసోపేతము మరియు అమృతతుల్యమూ అయిన భిక్షను వ్యాసునకిచ్చెను. అప్పుడు ఇదివరకు ఎప్పుడునూ చూడని రుచిగల భిక్షను భుజించి సంతుష్టమనుస్కుడైన వ్యాసుడు వరములిచ్చు దేవుడైన పరమేశ్వరునికి, పార్వతీదేవికి కూడ నమస్కరించెను. తదనంతరము కమలపత్రాక్షుడైన ఆతను ఇట్లనెను. "ఓ దేవీ! విశాలాక్షీ! ఈ దేవుడు, ఈ దేవి, గంగానది, మృష్టాన్నము మరియు శుభగతి లభించు ఈ వారాణాసి యందు నివసించుట ఎవరి కిష్టము కాదు?

ఏవముక్త్వా తతో వ్యాసో నగరీమవలోకయన్ ।
చిన్తయానస్తతో భిక్షం హృదయానన్దకారిణీమ్ ॥ 36 ॥

అపశ్యత్పురతో దేవం దేవీం చ గిరిజాం తదా ।

అని చెప్పి వ్యాసుడు ఆ నగరమునంతటిని పరికించి చూచుచు తన హృదయమున కానందము కలిగించు భిక్షను గురించి ఆలోచించుచుండగా ఆతని ఎదుట పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమైనారు.

గృహాంగణస్థితం వ్యాసం దేవదేవోఽబ్రవీదిదమ్ ॥ 37 ॥

ఇహ క్షేత్రే న వస్తవ్యం క్రోధనస్త్వం మహామునే ।

అపుడు తన ఇంటి వాకిలిలో నున్న వ్యాసుని చూచి దేవదేవుడైన పరమేశ్వరుడాతనితో ఇట్లనెను. "ఓ మహాముని! నీవు కోపిష్ఠివి కావున ఈ క్షేత్రమున వసింపగూడదు.

ఏవం విస్మయమాపన్నో దేవం వ్యాసోఽ బ్రవీద్వచః ॥ 38 ॥

వ్యాస ఉవాచ - వ్యాసుడు చెప్పాడు.

చతుర్దశ్యామథాష్టమ్యాం ప్రవేశం దాతుమర్హసి ।
ఎవమస్త్విత్యనుజ్ఞాయ తత్రైవాన్తరధీయత ॥ 39 ॥

న తద్ గృహం న సా దేవీ న దేవో జ్ఞాయతే క్వచిత్ ।
ఏవం త్రైలోక్య విఖ్యాతః పురా వ్యాసో మహాతపాః ॥ 40 ॥

జ్ఞాత్వా క్షేత్రగుణాన్ సర్వాన్ స్థితస్తస్యైవ పార్శ్వతః ।
ఏవం వ్యాసం స్థితం జ్ఞాత్వా క్షేత్రం శంసన్తి పండితాః ॥ 41 ॥

ఆ మాటలు వినిన వ్యాసుడు ఆశ్చర్యము పొంది మహేశ్వరునితో ఇట్లనెను. ఓ పరమేశ్వరా! అష్టమీ మరియు చతుర్దశీ తిథులయందైనను ఈ నగరమున నాకు ప్రవేశమీయమని ప్రార్థించుచున్నాను. వ్యాసుని మనవిని అంగీకరించి మహేశ్వరుడచటనే అంతర్ధానము చెందెను. ఆ ఇల్లు గాని, ఆ దేవుడు గాని, ఆ దేవి గాని ఎచ్చట నుండెనో తెలియకుండా అదృశ్యమైనారు. ఇట్లు త్రైలోక్యవిఖ్యాతుడైన మరియు మహాతపః సంపన్నుడైన వ్యాసుడు ఈ క్షేత్రపు గుణములను తెలిసికొని దాని సమీపమునందే ఉండెను. ఇట్లు ఆ ప్రదేశమున వ్యాసుడే సాక్షాత్తుగా నివసించియుండుటవలన పండితులు ఆ క్షేత్రపు ప్రాశస్త్యమును ప్రశంసించినారు.

అవిముక్తగుణానాం తు కః సమర్థో వదిష్యతి ।
దేవ బ్రాహ్మణ విద్విష్టా దేవభక్తి విడంబకాః ॥ 42 ॥

బ్రహ్మఘ్నాశ్చ కృతఘ్నాశ్చ తథా నైష్కృతికాశ్చ యే ।
లోకద్విషో గురుద్విషస్తీర్థాయతన దూషకాః ॥ 43 ॥

సదా పాపరతాశ్చైవ యే చాన్యే కుత్సితా భువి ।
తేషాం నాస్తీతి వాసో వై స్థితోఽసౌ దండనాయకః ॥ 44 ॥

ఈ అవిముక్త క్షేత్రపు గుణములను వివరించు సామర్థ్యముగలవాడెవరు? దేవతలను బ్రాహ్మణులను ద్వేషించువారు, దేవభక్తిని నిందించువారు, బ్రహ్మహత్యాపాతకులు, కృతఘ్నులు, దుష్కర్మరతులు, లోకమును ద్వేషించువారు, గురుద్వేషులు, తీర్థములను క్షేత్రములను దూషించువారు, ఎప్పుడునూ పాపకర్మలాచరించువారు, కుత్సితులు మొదలగు వారెవరును ఈ క్షేత్రమందు ప్రవేశించరాదని దండనాయకుడు ఇక్కడ నిలుచుండెను.

రక్షణార్థం నియుక్తం వై దండనాయకముత్తమమ్ ।
పూజయిత్వా యథా శక్త్యా గంధపుష్పాదిధూపకైః ॥ 45 ॥

నమస్కారం తతః కృత్వా నాయకస్య తు మన్త్రవిత్ ॥
సర్వవర్ణావృతే క్షేత్రే నానావిధసరీసృపౌ ॥ 46 ॥

ఈశ్వరానుగృహీతా హి గతిం గాణేశ్వరీం గతాః ॥
నానారూపధరా దివ్యా నానావేషధరాస్తథా ॥ 47 ॥

సురా వై యే తు సర్వే చ తన్నిష్ఠాస్తత్పరాయణాః ।
యదిచ్ఛన్తి పరం స్థానమ్ అక్షయం తదవాప్నుయుః ॥ 48 ॥

ఇట్లు ఈ క్షేత్రరక్షణార్థమై నియోగింపబడిన ఉత్తముడైన ఈ దండనాయకుని గంధ పుష్ప ధూప దీపాదులతో యథాశక్తిగా పూజించి నమస్కరించి సర్వవర్ణములవారును నానా విధ సరీసృపములును నివసించు ఈ క్షేత్రమున ఈశ్వరానుగ్రహమును పొంది గణేశ్వరత్వమును పొందిరి. నానారూపములు నానావేషములును ధరించిన దేవతలు తన్నిష్ఠులై, తత్పరాయణులై తాము కోరుకున్నటువంటి అక్షయమైన గతిని పొందిరి.

పరం పురం దైవపురాద్విశిష్యతే తదుత్తరం బ్రహ్మపురాత్ పురఃస్థితమ్ ।
తపో బలాదీశ్వర యోగనిర్మితం న తత్సమం బ్రహ్మదివౌకసాలయమ్ ॥
మనోరమం కామగమం హ్యనామయమతీత్య తేజాంసి తపాంసి యోగవత్ ॥ 49 ॥

ఈ అవిముక్తపురము దేవపురమున కంటే విశిష్టమైనది. ఈ పురపు ఉత్తరభాగము బ్రహ్మపురం కంటే ఉచ్చతరమైనది. ఈశ్వరునియొక్క తపోబలంచేత యోగారాధనముచేత సువ్యవస్థితముగా నిర్మింపబడినది. బ్రహ్మలోకం, స్వర్గలోకం కూడ దీనితో సమానం కావు. ఇది మనోహరమైనట్టిది, కోరిన కోరికలు తీర్చునట్టిది, ఎటువంటి బాధలు లేనట్టిది, సకల తేజస్సులను తపశ్శక్తులను మించిన యోగశక్తి కలిగినట్టిది.

అధిష్ఠితస్తు తత్ స్థానే దేవదేవో విరాజతే ।
తపాంసి యాని తప్యన్తే వ్రతాని నియమాశ్చ యే ॥ 50 ॥

సర్వతీర్థాభిషేకం తు సర్వదానఫలాని చ ।
సర్వయజ్ఞేషు యత్పుణ్యం అవిముక్తే తదాప్నుయాత్ ॥ 51 ॥

అటువంటి గొప్ప స్థానమును అధిష్ఠించి దేవదేవుడైన పరమేశ్వరుడు విరాజిల్లుచున్నాడు. తపస్సులు, వ్రతములు, నియమములు, సర్వతీర్థములయందు స్నానములు, సర్వదానములు, సర్వయజ్ఞములు మొదలగు వాటి వలన వచ్చు పుణ్యము ఈ అవిముక్త క్షేత్రవాసము చేసినచో లభించును.

అతీతం వర్తమానం చ అజ్ఞానాత్ జ్ఞానతోఽపి వా ।
సర్వం తస్య చ యత్పాపం క్షేత్రం దృష్ట్వా వినశ్యతి ॥ 52 ॥

శాన్తైర్దాన్తైస్తపస్తప్తం యత్కించిద్ధర్మ సంజ్ఞితమ్ ।
సర్వం చ తదవాప్నోతి అవిముక్తే జితేంద్రియః ॥ 53 ॥

ఇతః పూర్వము మరియు ఇప్పుడు కూడ తెలిసి కాని తెలియక కాని చేసిన లేదా చేయుచున్న పాపములన్ని ఈ క్షేత్రదర్శనమాత్రముననే నశించును. శాంతస్వభావులు, జితేంద్రియులూ అయిన మునులు తపస్సులు చేసి సంపాదించు ధర్మము ద్వారా సిద్ధించు ఫలము జితేంద్రియులై ఈ అవిముక్తమున నివసించినచో లభించును.

అవిముక్తం సమాసాద్య లింగమర్చయతే నరః ।
కల్పకోటిశతైశ్చాపి నాస్తి తస్య పునర్భవః ॥ 54 ॥

అమరా హ్యక్షయాశ్చైవ క్రీడన్తి భవసన్నిధౌ ।
క్షేత్ర తీర్థోపనిషదమవిముక్తం న సంశయః ॥ 55 ॥

అవిముక్తము నందు నివసించి శివలింగము నర్చించు నరుడు నూరు కోట్ల కల్పముల తర్వాత కూడ మరల జన్మించడు. శివుని పూజించువారు అమరులై అక్షయులై భవసన్నిధి యందే సదా విహరింతురు. లోకమున నున్న క్షేత్రములన్నింటికిని తీర్థములన్నింటికిని ఈ అవిముక్త క్షేత్రము ఉపనిషత్స్వరూపమైనదనుటలో సందేహం లేదు.

అవిముక్తే మహాదేవమర్చయన్తి స్తువన్తి వై ।
సర్వపాపవినిర్ముక్తాస్తే తిష్ఠన్త్యజరామరాః ॥ 56 ॥

ఈ అవిముక్త క్షేత్రమున మహాదేవుని పూజించువారు, స్తుతించువారు సర్వపాపములనుండి ముక్తిని పొంది అజరామరులై ఉందురు.

సర్వకామాశ్చ యే యజ్ఞాః పునరావృత్తికాః స్మృతాః ।
అవిముక్తే మృతా యే చ సర్వే తే హ్యనివర్తకాః ॥ 57 ॥

గ్రహనక్షత్రతారాణాం కాలేన పతనాద్భయమ్ ।
అవిముక్తే మృతానాంతు పతనం నైవ విద్యతే ॥ 58 ॥

కల్పకోటిసహస్రైస్తు కల్పకోటిశతైరపి ।
న తేషాం పునరావృత్తిర్మృతా యే క్షేత్ర ఉత్తమే ॥ 59 ॥

సంసారసాగరే ఘోరే భ్రమన్తః కాలపర్యయాత్ ।
అవిముక్తం సమాసాద్య గచ్ఛన్తి మణికర్ణికామ్ ॥ 60 ॥

కోరికలన్నింటిని తీర్చునట్టి యజ్ఞయాగాదికర్మలు కూడ పునరావృత్తిప్రదములే, అవి ఆచరించినప్పటికిని పునర్జన్మయనునది ఉండును కాని అవిముక్త క్షేత్రమున మరణించినవారికి మాత్రము పునరావృత్తి యుండదు. గ్రహనక్షత్ర తారాదికమైన కాలమాసన్నమైనపుడు పతనమందుటవలన భయం కలుగవచ్చును కాని అవిముక్త క్షేత్రమున మృతి చెందినవారికి ఆ భయముండదు. వారు వందల-వేల కోట్ల సంవత్సరముల తర్వాత కూడ పునరావృత్తిని పొందరు. కాలవశమున ఘోరమైన ఈ సంసారమునందు భ్రమించుచు అంత్యమున ఇక్కడికి వచ్చువారు ఉత్తమగతిని పొందుతారు.

జ్ఞాత్వా కలియుగం ఘోరం హాహాభూతమచేతనమ్ ।
అవిముక్తం న ముంచంతి కృతార్థాస్తే నరా భువి ॥ 61 ॥

అవిముక్తం ప్రవిష్టస్తు యది గచ్ఛేత్తతః పునః ।
తదా హసన్తి భూతాని అన్యోన్యం కరతాడనమ్ ॥ 62 ॥

కామక్రోధేన లోభేన గ్రస్తా యే భువి మానవాః ।
నిష్క్రమన్తే నరా దేవి దండనాయకమోహితాః ॥ 63 ॥

అచేతనము, హాహాకారజనకము మరియు ఘోరకర్మలు కలదీ కలియుగమని తెలిసికొని ఈ అవిముక్తమును ఎవరైతే విడువకుండా ఉందురో వారు కృతార్థులగుదురు. అవిముక్తమున ప్రవేశించి, నివసించి మరల దీనిని విడిచి వెళ్ళిపోవు వారిని చూచి సకల భూతములు చప్పట్లు కొట్టుచూ పరిహసించును. కామక్రోధలోభగ్రస్తులైన మానవులు ఈ క్షేత్రమునకు వచ్చియు దండనాయకునికి భయపడి మరల బయటకు వెళ్ళిపోవుదురు.

జపధ్యానవిహీనానాం జ్ఞానవర్జితచేతసామ్ ।
తతో దుఃఖహతానాం చ గతిర్వారాణసీ నృణామ్ ॥ 64 ॥

జపధ్యానాదులు లేక జ్ఞానరహితచిత్తులైన వారికి మరియు దుఃఖితులైనవారికి ఈ వారాణాసీ క్షేత్రమే పరమగతి యని తెలిసికోవలసినది.

తీర్థానాం పంచకం సారం విశ్వేశానన్దకాననే ।
దశాశ్వమేధం లోలార్కః కేశవో బిందుమాధవః ॥ 65 ॥

పంచమీ తు మహాశ్రేష్ఠా ప్రోచ్యతే మణికర్ణికా ।
ఏభిస్తు తీర్థవర్యైశ్చ వర్ణ్యతే హ్యవిముక్తకమ్ ॥ 66 ॥

ఏక ఏవ ప్రభావోఽస్తి క్షేత్రస్య పరమేశ్వరి ।
ఏకేన జన్మనా దేవి! మోక్షం పశ్యన్త్యనుత్తమమ్ ॥ 67 ॥

విశ్వేశునకు ఆనందము కలిగించునట్టి తీర్థములు ఐదు. దశాశ్వమేధము, లోలార్కుడు, కేశవుడు, బిందు మాధవుడు మరియు సర్వశ్రేష్ఠమైన మణికర్ణిక. ఈ ఐదు తీర్థరాజములతో కూడి ఏర్పడినదే ఈ అవిముక్త క్షేత్రమని ప్రశంసింపబడినది. ఓ పరమేశ్వరీ! ఒకే జన్మలో మనుష్యులీ అవిముక్త క్షేత్రమునకు వచ్చి ఉత్తమగతిని పొందుదురు. ఇదే దీని గొప్పతనము.

ఏతద్వై కథితం సర్వం దేవ్యై దేవేన భాషితమ్ ।
అవిముక్తస్య క్షేత్రస్య తత్సర్వం కథితం ద్విజాః ॥ 68 ॥

ఓ ద్విజులారా! మహాదేవుడు పార్వతీదేవికి వివరించిన ఈ అవిముక్త క్షేత్రపు మహత్త్వమంతయూ నేను మీకు తెలిపితిని.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అవిముక్త తీర్థమాహాత్మ్యం నామ పంచాశీత్యధిక శతతమోఽధ్యాయః ॥185॥

శ్రీమత్స్యమహాపురాణమున అవిముక్త తీర్థమాహాత్మ్యమనే నూట ఎనభై అయిదవ అధ్యాయం సమాప్తం.

షడశీత్యధికశతతమో౽ధ్యాయః - నూటఎనబై ఆరవ అధ్యాయం

నర్మదా మాహాత్మ్యమ్ - నర్మదా మాహాత్మ్యం

ఋషయః ఊచుః - ఋషులు చెప్పారు.

మాహాత్మ్య మవిముక్తస్య యథావత్ కథితం త్వయా ।
ఇదానీం నర్మదాయాస్తు మాహాత్మ్యం వద సత్తమ ॥ 1 ॥

యత్రోఙ్కారస్య మాహాత్మ్యం కపిలాసంగమస్య చ ।
అమరేశస్య చైవాహుః మాహాత్మ్యం పాపనాశనమ్ ॥ 2 ॥

కథం ప్రలయకాలే తు న నష్టా నర్మదా పురా ।
మార్కండేయశ్చ భగవాన్న వినష్టస్తదా కిల ॥
త్వయోక్తం తదిదం సర్వం పునర్విస్తరతో వద ॥ 3 ॥

ఓ సజ్జనోత్తమా! నీవింతవరకు మాకు అవిముక్తక్షేత్రపు మాహాత్మ్యమును సవివరముగా తెలిపితివి. ఇప్పుడిక మాకు నర్మదా మాహాత్మ్యమును తెలుపుము. నర్మదానదికి సంబంధించిన ఓంకార తీర్థము, కపిలాసంగమ తీర్థము, అమరేశ తీర్థము మొదలగు వాటి యొక్క మాహాత్మ్యము సర్వపాపనాశకరమందురు. పూర్వము ప్రళయకాలమున నర్మదా నది ఎట్లు నశించకుండా ఉండెను? భగవానుడైన మార్కండేయుడు కూడ ఆ సమయమున ఎట్లు నశింపకుండెను? ఇదంతయును నీవు పూర్వము సందర్భానుసారము సంక్షిప్తముగా తెలిపితివి. ఇప్పుడదే సవిస్తరముగా వివరింపుము.

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

ఏత దేవ పురా పృష్టః పాండవేన మహాత్మనా ।
నర్మదాయాస్తు మాహాత్మ్యం మార్కండేయో మహామునిః ॥ 4 ॥

ఉగ్రేణ తపసా యుక్తో వనస్థో వనవాసినా ।
పృష్టః పూర్వం మహాగాథాం ధర్మపుత్రేణ ధీమతా ॥ 5 ॥

పూర్వమొకప్పుడు మహానుభావుడు, ధీమంతుడు పాండవాగ్రజుడు అయిన ధర్మరాజు వనవాస సమయమున ఉగ్రమైన తపస్సుతో కూడినట్టి మార్కండేయ మహామునిని ఈ మహాగాథను వివరింపు మని ప్రార్థించెను.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడు అడిగాడు.

శ్రుతా మే వివిధా ధర్మాస్త్వత్ప్రసాదాత్ ద్విజోత్తమ ।
భూయశ్చ శ్రోతు మిచ్ఛామి తన్మే కథయ సువ్రత ॥ 6 ॥

కథమేషా మహాపుణ్యా నదీ సర్వత్ర విశ్రుతా ॥
నర్మదా నామ విఖ్యాతా తన్మే బ్రూహి మహామునే ॥ 7 ॥

ఓ ద్విజోత్తమా! నీ దయవలన వివిధ ధర్మముల గురించి ఇతఃపూర్వము నేను వినియుంటిని, కాని ఓ సువ్రతా! మరల వాటిని వినగోరుచున్నాను కావున నాకు వివరింపుము. పుణ్యప్రదమైన ఈ నర్మదానది ఎట్లు సర్వలోకముల యందు ప్రసిద్ధి గాంచినదో ఓ మహామునీ! నాకు తెలుపుము.

మార్కండేయ ఉవాచ – మార్కండేయుడు చెప్పాడు.

నర్మదా సరితాం శ్రేష్ఠా సర్వపాపప్రణాశినీ ।
తారయే త్సర్వభూతాని స్థావరాణి చరాణి చ ॥ 8 ॥

నర్మదాయాస్తు మాహాత్మ్యం పురాణే యన్మయా శ్రుతమ్ ।
తదేతద్ధి మహారాజ తత్సర్వం కథయామి తే ॥ 9 ॥

నదులన్నింటిలోను నర్మదానది శ్రేష్ఠమైనట్టిది, సర్వపాపములను నశింపజేయునట్టిది, స్థావర జంగమాత్మకములైన ప్రాణులన్నింటిని తరింపజేయునట్టిది. ఓ మహారాజా! పురాణములలోనే నేను వినియున్నటువంటి నర్మదామాహాత్మ్యము నంతటిని నీకు వినిపించెదను.

పుణ్యా కనఖలే గంగా కురుక్షేత్రే సరస్వతీ ।
గ్రామే వా యది వాఽరణ్యే పుణ్యా సర్వత్ర నర్మదా ॥ 10 ॥

త్రిభిః సారస్వతం తోయం సప్తాహేన తు యామునమ్ ।
సద్యః పునాతి గాంగేయం దర్శనాదేవ నార్మదమ్ ॥ 11 ॥

కలింగదేశే పశ్చార్ధే పర్వతేఽమరకంటకే ।
పుణ్యా చ త్రిషు లోకేషు రమణీయా మనోరమా ॥ 12 ॥

కనఖల క్షేత్రమునందు గంగానది, కురుక్షేత్రము నందు సరస్వతీనది పుణ్యవంతములు. నర్మదానదైతే గ్రామమునందు కాని అరణ్యమునందు కాని ఎక్కడ ప్రవహించినను పుణ్యప్రదమే. మూడు రోజులు స్నానమాచరించినచో యమునా నది పవిత్రత కలిగించును. గంగానది స్నానమాచరించగానే వెంటనే పవిత్రత చేకూర్చును. కళింగ దేశపు పూర్వభాగము నందున్న అమరకంటక పర్వతపు సమీపము నుండి ప్రవహించు ఈ నర్మదా నది ముల్లోకములందలి అన్నింటికంటే పుణ్యప్రదమైనది, మనోహరమైనది, మరియు రమణీయమైనది.

సదేవాసురగంధర్వా ఋషయశ్చ తపోధనాః ।
తపస్తప్త్వా మహారాజ సిద్ధిం చ పరమం గతాః ॥ 13 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ నియమస్థో జితేంద్రియః ।
ఉపోష్య రజనీమేకాం కులానాం తారయేచ్ఛతమ్ ॥ 14 ॥

జలేశ్వరే నరః స్నాత్వా పిండం దత్త్వా యథావిధి ।
పితరస్తస్య తృప్యన్తి యావదాభూతసంప్లవమ్ ॥ 15 ॥

ఓ మహారాజా! దేవతలు, అసురులు, గంధర్వులు, తపోధనులైన ఋషులు ఈ నదీ సమీపాన తపమాచరించి ఉత్తమసిద్ధిని పొందిరి. ఓ రాజా! నియమనిష్ఠలు కలవాడు జితేంద్రియుడు అయినవాడు ఈ నదిలో స్నానము చేసి ఒక రాత్రి ఉపవాసము చేసినచో ఆతని కులములోని నూరు తరములవారు తరింతురు. మరియు ఓ రాజా! జలేశ్వర తీర్థమున స్నానము చేసి యథావిధిగా పిండప్రదానము చేసినవాని పితరులు ప్రళయకాలమువరకు తృప్తి పొందుదురు.

పర్వతస్య సమన్తాత్తు రుద్రకోటిః ప్రతిష్ఠితా ।
స్నాత్వా యః కురుతే తత్ర గంధమాల్యానులేపనైః ॥ 16 ॥

ప్రీతస్తస్య భవేచ్ఛర్వో రుద్రకోటిర్న సంశయః ।
పశ్చిమే పర్వతస్యాన్తే స్వయం దేవో మహేశ్వరః ॥ 17 ॥

తత్ర స్నాత్వా శుచిర్భూత్వా బ్రహ్మచారీ జితేంద్రియః ।
పితృకార్యం చ కుర్వీత విధివన్నియతేంద్రియః ॥ 18 ॥

తిలోదకేన తత్రైవ తర్పయేత్ పితృదేవతాః ।
ఆసప్తమం కులం తస్య స్వర్గే మోదేత పాండవ ॥ 19 ॥

ఈ పర్వతమునందంతటనూ కోటిరుద్రులు ప్రతిష్ఠించబడియున్నారు. నర్మదానదిలో స్నానమాచరించి గంధమాల్యానులేపనాదులతో శివుని అర్చించినచో కోటిరుద్రులు ప్రీతులగుదురు. ఇందులో సందేహం లేదు. మరియు ఈ పర్వతముయొక్క పశ్చిమదిశయందు మహేశ్వరుడు స్వయముగా ఉన్నాడు. శుచిమంతుడు జితేంద్రియుడూ అయిన బ్రహ్మచారి అక్కడ స్నానము చేసి విధిప్రకారముగా పితృకార్యము ఆచరించినచో నర్మదానది యందు తిలోదకములతో తర్పణములిచ్చినచో పితృదేవతలు సంతుష్టులగుదురు మరియు ఆతని వంశమున ఏడు తరముల వారు స్వర్గలోకమందు ఆనందము పొందుదురు.

షష్టివర్ష సహస్రాణి స్వర్గలోకే మహీయతే ।
అప్సరోగణసంకీర్ణే సిద్ధచారణసేవితే ॥ 20 ॥

దివ్యగంధానులిప్తశ్చ దివ్యాలంకారభూషితః ।
తతః స్వర్గాత్ పరిభ్రష్టో జాయతే విపులే కులే ॥ 21 ॥

ధనవాన్ దానశీలశ్చ ధార్మికశ్చైవ జాయతే ।
పునః స్మరతి తత్తీర్థం గమనం తత్ర రోచతే ॥ 22 ॥

కులాని తారయేత్సప్త రుద్రలోకం స గచ్ఛతి ।

మరియు అతను కూడ అరువదివేలసంవత్సరములవరకు స్వర్గలోకమున వసించును. అప్సరోగణములతో సిద్ధచారణములతో సేవింపబడు ఆ స్వర్గమున దివ్యగంధానులేపనములతో, దివ్యాలంకారభూషితుడై సర్వ సుఖములననుభవించి తదనంతరము స్వర్గమునుండి పరిభ్రష్టుడై నిర్మలమైన వంశమున ధనవంతుడు, దానశీలుడు మరియు ధార్మికుడై జన్మించును. మరల ఆ నర్మదా (జలేశ్వర) తీర్థమును స్మరించుకుని, అచ్చటికి వెళ్ళి స్నానమాచరించి ఏడు తరములవారిని తరింపజేసి మరల తాను కూడ రుద్రలోకమునకు వెళ్ళును.

యోజనానాం శతం సాగ్రం శ్రూయతే సరిదుత్తమా ॥ 23 ॥

విస్తారేణ తు రాజేంద్ర యోజనద్వయ మాయతా ।
షష్టితీర్థ సహస్రాణి షష్టి కోట్య స్తథైవ చ ॥ 24 ॥

సర్వం తస్య సమన్తాత్తు తిష్ఠత్యమరకంటకే ।

ఓ రాజేంద్రా! ఉత్తమమైన ఈ నర్మదానది నూరుయోజనముల పొడవు మరియు రెండు యోజనముల వెడల్పున్నదని వర్ణింతురు. మరియు అమరకంటక పర్వతమందంతటనూ కలిపి నర్మదానదికి సంబంధించిన అరువది కోట్ల అరువది వేల తీర్థములున్నవి.

బ్రహ్మచారీ శుచిర్భూత్వా జితక్రోధో జితేంద్రియః ॥ 25 ॥

సర్వహింసానివృత్తస్తు సర్వభూతహితే రతః ॥
పరం సర్వసమాచారో యస్తు ప్రాణాన్ పరిత్యజేత్ ॥ 26 ॥

తస్య పుణ్యఫలం రాజన్ శృణుష్వావహితో మమ ॥
శతం వర్షసహస్రాణాం స్వర్గే మోదేత పాండవ ॥ 27 ॥

శుచిమంతుడు, జితక్రోధుడు, జితేంద్రియుడు, ఎటువంటి హింసప్రవృత్తి లేనివాడు, ప్రాణులన్నింటి హితమును కోరువాడూ అయిన బ్రహ్మచారి సదాచారసంపన్నుడై ఇక్కడ తన ప్రాణములను వదిలి పెట్టినచో ఎంతటి ఫలము పొందునో వివరించెదను. ఓ రాజా! సావధానచిత్తుడవై వినుము. అతను ఒక లక్షసంత్సరముల వరకు స్వర్గలోకమున సుఖమును పొందును.

అప్సరోగణసంకీర్ణే సిద్ధచారణసేవితే ।
దివ్యగంధానులిప్తశ్చ దివ్యపుష్పోపశోభితః ॥ 28 ॥

క్రీడతే దేవలోకస్థో దైవతైః సహ మోదతే ।
తతః స్వర్గాత్ పరిభ్రష్టో రాజా భవతి వీర్యవాన్ ॥ 29 ॥

ఇంకనూ అప్సరసల సమూహముల చేత వ్యాప్తమైనట్టి, సిద్ధచారణాదుల చేత సేవింపబడునట్టి దేవలోకమున దివ్యగంధానులిప్తుడై దివ్యపుష్పోపశోభితుడై దేవతలతో సమానముగా విహరిస్తాడు. అటు తర్వాత స్వర్గమునుండి పరిభ్రష్టుడై వీర్యవంతుడైన రాజగును.

గృహం తు లభతే వై స నానారత్నవిభూషితమ్ ।
స్తంభైర్మణిమయైర్దివ్యైర్వజ్ర వైదూర్యభూషితైః ॥ 30 ॥

ఆలేఖ్యసహితం దివ్యం దాసీదాససమన్వితమ్ ।
మత్తమాతంగశబ్దైశ్చ హయానాం హ్రేషితేన చ ॥ 31 ॥

క్షుభ్యతే తస్య తద్వారమిన్ద్రస్య భవనం యథా ।

మరియు నానారత్నవిభూషితనమైనట్టి, దివ్యములైన మణులు, వజ్రవైదూర్యాదులతో అలంకృతములైన స్తంభములు గల్గినట్టి, ఆలేఖ్యములు=చిత్తరువులతో కూడిన గోడలు కల్గినట్టి, దివ్యదాసదాసీజనముతో కూడినట్టి, మదించిన ఏనుగుల యొక్క మరియు అశ్వముల యొక్క శబ్దములతో కూడినట్టి ద్వారములు గలిగిన ఇంద్రభవనముతో తుల్యమైన గృహమును అతడు పొందును.

రాజరాజేశ్వరః శ్రీమాన్ సర్వస్త్రీ జనవల్లభః ॥ 32 ॥
తస్మిన్ గృహే ఉషిత్వా తు క్రీడాభోగ సమన్వితే ।

జీవేద్వర్షశతం సాగ్రం సర్వరోగవివర్జితః ॥ 33 ॥
ఏవం భోగో భవేత్తస్య యో మృతోఽమరకంటకే ।

అతడు రాజరాజులకే ఈశ్వరుడై, సర్వస్త్రీజనవల్లభుడై క్రీడాభోగసమన్వితుడై ఆ గృహమునందు సర్వ వ్యాధిరహితుడై నిండునూరేళ్ళు జీవించును. అమరకంటకమున మరణించినవారి భోగమిట్లుండును.

అగ్నౌ విషజలే వాపి తథా చైవ హ్యనాశకే ॥ 34 ॥
అనివర్తికా గతిస్తస్య పవనస్యాంబరే యథా ॥

పతనం కురుతే యస్తు అమరేశే నరాధిప ॥ 35 ॥
కన్యానాం త్రిసహస్రాణి ఏకైకస్యాపి చాపరే ।

తిష్ఠన్తి భువనే తస్య ప్రేషణం ప్రార్థయన్తి చ ॥
దివ్యభోగైః సుసమ్పన్నః క్రీడతే కాలమక్షయమ్ ॥ 36 ॥

మరియు అగ్నియందు కాని విషజలమందు కాని ప్రవేశించినను ఆకాశమున వాయువునకు వలె ఆతని గమనమునకు ఎటువంటి అవరోధముండదు. ఓ నరాధిప! ఈ అమరేశ క్షేత్రమున మృతి చెందిన వారి ప్రతి ఒక్కరి ఇంటియందు కూడ మూడు వేల మంది కన్యలు ఎల్లప్పుడునూ నిలిచి ఆతని యాజ్ఞకై ఆతనిని సేవించుటకై నిరీక్షించుచుందురు. అతడు అక్షయకాలము వరకు దివ్యభోగసమన్వితుడై విహరించును.

పృథివ్యా మాసముద్రాయామీదృశో నైవ జాయతే ।
యాదృశోఽయం నృపశ్రేష్ఠ పర్వతేఽమరకంటకే ॥ 37 ॥

తావత్తీర్థం తు విజ్ఞేయం పర్వతస్య తు పశ్చిమే ।
హ్రదో జలేశ్వరో నామ త్రిషు లోకేషు విశ్రుతః ॥ 38 ॥

తత్ర పిండప్రదానేన సంధ్యోపాసనకర్మణా ।
పితరో దశ వర్షాణి తర్పితాస్తు భవన్తి వై ॥ 39 ॥

ఓ నృపశ్రేష్ఠ! సముద్రపర్యన్తము విస్తరించియున్న ఈ సమస్త భూమండలమున ఎక్కడనూ ఈ అమర కంటక పర్వతమందున్న తీర్థమువంటిది లేదు. ఈ పర్వతపు పశ్చిమభాగమున త్రిలోకప్రసిద్ధమైన జలేశ్వరమను సరోవరమున్నది. దానియందు పిండప్రదానము చేసిననూ, సంధ్యోపాసనాది కర్మలు ఆచరించినను అట్లాచరించిన వారి పితరులు పది సంవత్సరముల కాల పర్యన్తము సంతృప్తి పొందిన వారగుదురు.

దక్షిణే నర్మదా కూలే కపిలేతి మహానదీ ।
సకలార్జున సంఛన్నా నాతి దూరే వ్యవస్థితా ॥ 40 ॥

సాఽపి పుణ్యా మహాభాగా త్రిషు లోకేషు విశ్రుతా ।
తత్ర కోటి శతం సాగ్రం తీర్థానాం తు యుధిష్ఠిర ॥ 41 ॥

పురాణే శ్రూయతే రాజన్ సర్వం కోటిగుణం భవేత్ ।
తస్యాస్తీరే తు యే వృక్షాః పతితాః కాలపర్యయాత్ ॥ 42 ॥

నర్మదాతోయసంస్పృష్టాస్తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

నర్మదా తీరపు దక్షిణభాగమున కపిలా యను ఒక మహానది కలదు. ఆ నది అర్జున (మద్ది) చెట్లతో పరివ్యాప్తమైనదై చాలా దగ్గరలోనే కలదు. మహత్తరమైన పుణ్యప్రదయైన ఈ నది ముల్లోకములందు ప్రసిద్ధము. ఓ యుధిష్ఠిరా! ఆ నదీతీరమున వందల కోట్ల తీర్థములున్నాయని వాటిలో ప్రతియొకటి కోటిగుణములు కలదని పురాణము ద్వారా వినబడుచున్నది. ఆ కపిలానదీతీరమున మొలచి పెరిగి కాలక్రమానుసారము పడిపోయిన వృక్షములు కూడ నర్మదానదీజలపు స్పర్శ పొంది ఉత్తమగతిని పొందును.

ద్వితీయా తు మహాభాగా విశల్యకరణీ శుభా ॥ 43 ॥

తత్ర తీర్థే నరః స్నాత్వా విశల్యో భవతి క్షణాత్ ।
తత్ర దేవగణాః సర్వే ఋషయశ్చ తపోధనాః ॥ 44 ॥

యక్ష రాక్షస గంధర్వా ఋషయశ్చ తపోధనాః ।
సర్వే సమాగతాస్తత్ర పర్వతేఽమరకంటకే ॥ 45 ॥

తైశ్చ సర్వైః సమాగమ్య మునిభిశ్చ తపోధనైః ।
నర్మదా మాశ్రితా పుణ్యా విశల్యా నామ నామతః ॥ 46 ॥

ఉత్పాదితా మహాభాగా సర్వపాపప్రణాశినీ ।

అచ్చటనే మరొక మహత్తరమైన శుభప్రదమైన విశల్యకరణీ అను నది కలదు. ఆ నది యందు స్నానము చేసిన తక్షణమే నరుడు విశల్యుడు అనగా బాధలు లేనివాడగును. దేవగణములు, కిన్నరులు, మహోరగములు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు, తపోధనులైన ఋషులు మొదలగు వారందరు అమరకంటకపర్వతమున నున్న ఈ నదికి వచ్చుచుందురు. వారందరితోను మరియు తపోధనులైన మునులందరితోను కూడినదైన నర్మదా నదిని ఆశ్రయించి మహాభాగయైన సర్వపాపప్రణాశినీ అయిన ఈ విశల్యకరణీ నది సృష్టింపబడినది.

తత్ర స్నాత్వా నరో రాజన్ బ్రహ్మచారీ జితేంద్రియః ॥ 47 ॥

ఉపోష్య రజనీ మేకాం కులానాం తారయేచ్ఛతమ్ ।
కపిలా చ విశల్యా చ శ్రూయేతే రాజసత్తమ ॥ 48 ॥

ఈశ్వరేణ పురా ప్రోక్తే లోకానాం హితకామ్యయా ।
తత్ర స్నాత్వా నరో రాజన్ అశ్వమేధఫలం లభేత్ ॥ 49 ॥

ఓ రాజా! ఆ విశల్యకరణి యందు ఏ నరుడైతే స్నానము ఆచరించి బ్రహ్మచర్యవ్రతుడై, జితేంద్రియుడై ఒక దివసముపవసించునో ఆతని వంశపు నూరు తరముల వారు తరింతురు. లోకములకు హితము కలిగించు సంకల్పముతో పూర్వము ఈశ్వరునిచే ఈ కపిలా, విశల్యా నదులు సృష్టింపబడినవి. ఓ రాజసత్తమా! వీటియందు స్నానము చేసినచో అశ్వమేధయాగముతో సమానమైన ఫలితము లభించును.

అనాశకం తు యః కుర్యాత్త స్మింస్తీర్థే నరాధిప ।
సర్వపాపవిశుద్ధాత్మా రుద్రలోకం స గచ్ఛతి ॥ 50 ॥

నర్మదాయాస్తు రాజేంద్ర పురాణే యన్మయా శ్రుతమ్ ।
యత్ర యత్ర నరః స్నాత్వా చాశ్వమేధఫలం లభేత్ ॥ 51 ॥

యే వసన్త్యుత్తరే కూలే రుద్రలోకే వసన్తి తే ।
సరస్వత్యాం చ గంగాయాం నర్మదాయాం యుధిష్ఠిర ॥ 52 ॥

సమం స్నానం చ దానం చ యథా మే శంకరోఽబ్రవీత్ ।

ఎవడైతే ఆ తీర్థమునందు అనాశకము అనగా ఉపవాసమాచరించునో ఓ నరాధిపా! అతను సర్వపాపముల నుండి ముక్తుడై పరిశుద్ధమైన ఆత్మకలవాడై రుద్రలోకమునకు పోవును. మరియు ఓ రాజేంద్రా! నర్మదానదికి సంబంధించిన ఆయా తీర్థములందు స్నానమాచరించిన నరుడు అశ్వమేధయాగఫలమును పొందునని నేను పురాణముల ద్వారా వింటిని. నర్మదానది యొక్క ఉత్తరతీర్థమునందు నివసించువారు రుద్రలోకమునందే వసింతురు. సరస్వతీ, గంగా మరియు నర్మదానదుల యందు ఆచరించిన స్నానదానాదులన్ని సమానమైన పుణ్యమునే ఇచ్చునని నాకు శంకరుడు చెప్పెను.

పరిత్యజతి యః ప్రాణాన్ పర్వతేఽమరకంటకే ॥ 53 ॥

వర్షకోటిశతం సాగ్రం రుద్రలోకే మహీయతే ।
నర్మదాయా జలం పుణ్యం ఫేనోర్మిభిరలంకృతమ్ ॥ 54 ॥
పవిత్రం శిరసా వన్ద్యం సర్వపాపైః ప్రముచ్యతే ।

నర్మదా చ సదా పుణ్యా బ్రహ్మహత్యాపహారిణీ ॥ 55 ॥

అమరకంటకపర్వతమున ఎవరైతే ప్రాణములను విడుచుదురో వారు నూరుకోట్ల సంవత్సరముల పర్యంతము రుద్రలోకమున నివసించుదురు. నురుగులతో అలలతో అలంకృతమైన పవిత్రనర్మదానదీజలమును శిరస్సు వంచి నమస్కరించినను సర్వపాపములనుండి మానవుడు ముక్తి పొందును. మరియు నర్మదానది ఎల్లప్పుడునూ పుణ్యప్రదమైనది, బ్రహ్మహత్యా పాపమును కూడ నశింపజేయునది.

అహోరాత్రోపవాసేన ముచ్యతే బ్రహ్మహత్యయా ।
ఏవం రమ్యా చ పుణ్యా చ నర్మదా పాండునందన ॥ 56 ॥

త్రయణామపి లోకానాం పుణ్యా హ్యేషా మహానదీ ।
ఘటేశ్వరే మహాపుణ్యే గంగాద్వారే తపోవనే ॥ 57 ॥

ఏతేషు సర్వస్థానేషు ద్విజాః స్యుః సంశితవ్రతాః
శ్రుతం దశగుణం పుణ్యం నర్మదోదధిసంగమే ॥ 58 ॥

నర్మదానదీతీరమున అహోరాత్రము ఉపవాసవ్రతమాచరించినవాడు బ్రహ్మహత్యాసదృశపాపము నుండి కూడ ముక్తి పొందును. ముల్లోకములయందును ఈ మహానది పుణ్యప్రదమైనది. ఓ పాండునందనా! ఇట్లు నర్మదా నది కడు రమ్యమైనది మరియు పుణ్యప్రదమైనది. మరియు మహాపుణ్యప్రదములైన ఘటేశ్వరతీర్థము నందు, గంగా ద్వారము అనగా హరిద్వారమునందు, తపోవనమునందు ఇతర పవిత్రతీర్థములన్నింటియందును ద్విజులు నియమితవ్రతులై ఎంతటి పుణ్యమును పొందుదురో అంతకంటే పదిరెట్లధికపుణ్యమును ఈ నర్మదా-సాగర సంగమమున పొందుదురని పురాణములలో చెప్పబడినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నర్మదా మాహాత్మ్యే షడశీత్యధికశతతమోఽధ్యాయః ॥186॥

శ్రీమత్స్యమహాపురాణమున నర్మదామాహాత్మ్యమనే నూట ఎనబైఆరవ అధ్యాయం సమాప్తం



సప్తాశీత్యధికశతతమోఽధ్యాయః - నూటఎనభై ఏడవ అధ్యాయం
జ్వాలేశ్వర తీర్థమాహాత్మ్యమ్ - జ్వాలేశ్వర తీర్థమాహాత్మ్యం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

నర్మదా తు నదీశ్రేష్ఠా పుణ్యాత్పుణ్యతమా హితా ।
మునిభిస్తు మహాభాగై ర్విభక్తా మోక్షకాంక్షిభిః ॥ 1 ॥

యజ్ఞోపవీతమాత్రాణి ప్రవిభక్తాని పాండవ ।
తేషు స్నాత్వా తు రాజేంద్ర సర్వపాపైః ప్రముచ్యతే ॥ 2 ॥

పాండవా ! నదులలో శ్రేష్ఠమైనదైన నర్మదానది పుణ్యమైనవాటిలో పుణ్యతమమైనది. దానిని మహానుభావులు, మోక్షకాంక్షులైన మునులు యజ్ఞోపవీతములంత సన్నని ప్రవాహములుగా విభజించిరి. రాజేంద్రా! వాటి యందు స్నానమాచరించినవారు సర్వపాపముల నుండి విముక్తులగుదురు.

జ్వాలేశ్వరం పరం తీర్థం త్రిషు లోకేషు విశ్రుతమ్ ।
తస్యోత్పత్తిం కథయతః శృణు త్వం పాండునందన ॥ 3 ॥

పురా మునిగణాః సర్వే సేంద్రాశ్చైవ మరుద్గణాః ।
స్తువన్తి తే మహాత్మానం మహాదేవం మహేశ్వరమ్ ॥
స్తువన్తస్తేతు సంప్రాప్తా యత్ర దేవో మహేశ్వరః ॥ 4 ॥

విజ్ఞాపయన్తి దేవేశం సేంద్రాశ్చైవ మరుద్గణాః ।
భయోద్విగ్నా విరూపాక్షం పరిత్రాయస్వ నఃప్రభో ॥ 5 ॥

ఓ పాండునందనా! ముల్లోకములలోను ప్రసిద్ధమైన జ్వాలేశ్వరతీర్థపు ఉత్పత్తి గురించి వివరించెదను వినుము. పూర్వము మునులందరు మరియు ఇంద్రుడు, మరుద్గణములు మొదలగువారు మహాత్ముడు, మహాదేవుడూ అయిన మహేశ్వరుని స్తుతించిరి. వారట్లు స్తుతించుచు ఆ మహేశ్వరుడున్న ప్రదేశమునకు చేరిరి. అప్పుడు ఇంద్రాది మరుద్గణములన్నియు భయోద్వేగులై దేవేశుడైన విరూపాక్షుని “ఓ ప్రభూ! మమ్ము పరిరక్షింపుమని ప్రార్థించిరి.

భగవానువాచ - భగవానుడు పలికాడు.

స్వాగతం తే సురశ్రేష్ఠాః కిమర్థమిహ చాగతాః ।
కిం దుఃఖం కోఽను సన్తాపః కుతో వా భయమాగతమ్ ॥ 6 ॥

కథయధ్వం మహాభాగాః ఏవమిచ్ఛామి వేదితుమ్ ।
ఏవముక్తాస్తు రుద్రేణ కథయన్ సంశితవ్రతాః ॥ 7 ॥

ఓ సురశ్రేష్ఠులారా! మీకు స్వాగతము. మీ రెందుకిటు వచ్చితిరి? మీకు కలిగిన దుఃఖ మేమిటి? సంతాపమేమిటి? మీకు భయమెవరి నుండి కలుగుచున్నది? మహాభాగులారా! నేనది తెలిసి కోగోరుచున్నాను వివరింపు మని చెప్పెను. అట్లు రుద్రునిచే అడుగబడిన నియమితవ్రతులైన దేవతలు ఇట్లనిరి.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

అతివీర్యో మహాఘోరో దానవో బలదర్పితః ।
బాణో నామేతి విఖ్యాతో యస్య వై త్రిపురం పురమ్ ॥ 8 ॥

గగనే సతతం దివ్యం భ్రమతే తస్య తేజసా ।
తతో భీతో విరూపాక్ష త్వామేవ శరణం గతాః ॥ 9 ॥

త్రాయస్వ మహతో దుఃఖాత్త్వం హి నః పరమా గతిః ।
ఏవం ప్రసాదం దేవేశ సర్వేషాం కర్తుమర్హసి ॥ 10 ॥

యేన దేవాః సగంధర్వాః సుఖమేధన్తి శంకర ।
పరాం నిర్వృతి మాయాన్తి తత్ ప్రభో కర్తుమర్హసి ॥ 11 ॥

దేవా! అతివీర్యుడు, మహాఘోరుడు, బలముచేత గర్వం పొందినవాడు లోకవిఖ్యాతుడూ అయిన బాణాసురుడనే దానవుడున్నాడు. త్రిపురము అని పేరుగల పురము ఆతనిదే. ఆతని యొక్క తేజస్సుచేత దివ్యమైన త్రిపురము ఆకాశమునందెల్లప్పుడు భ్రమించుచుండెను. దానివలన భయమును పొందిన మేము ఓ విరూపాక్షా! నీ శరణు వేడుటకు వచ్చితిమి. ఈ మహత్తరదుఃఖమునుండి మమ్ము రక్షింపుము. నీవే మాకు పరమగతి. ఓ దేవేశా! మా అందరిని నీవే అనుగ్రహింపవలెను. నీవనుగ్రహించినచో గంధర్వసహితులైన దేవతలందరూ సుఖముగా వర్ధిల్లుదురు. పరమనిర్వృతిని పొందుదురు. కావున ఓ ప్రభో! శంకరా! నీవు మమ్ము అనుగ్రహించుము అనిప్రార్థించిరి.

భగవానువాచ – భగవానుడు పలికాడు.

ఏతత్సర్వం కరిష్యామి మా విషాదం గమిష్యథ ।
అచిరేణైవ కాలేన కుర్యాం యుష్మ త్సుఖావహమ్ ॥ 12 ॥

ఆశ్వాస్య స తు తాన్ సర్వాన్ నర్మదాతటమాశ్రితః ।
చిన్తయామాస దేవేశ స్తద్వధం ప్రతి మానద ॥ 13 ॥

అథ కేన ప్రకారేణ హన్తవ్యం త్రిపురం మయా ।
పరం సంచింత్య భగవాన్ నారదం చాస్మరత్తదా ॥
స్మరణాదేవ సంప్రాప్తో నారదః సముపస్థితః ॥ 14 ॥

దేవతలారా! మీరు కోరినదంతయు తీర్చెదను. మీరు బాధను పొందకుడు. అచిర కాలముననే మీరందరూ సుఖము పొందునట్లు చేయుదును అని దేవతలందరిని ఓదార్చి నర్మదాతటమునకు శివుడు వెళ్ళెను. ఓ రాజా!

దేవేశుడైన శంకరుడు ఆ బాణాసురుని ఎట్లు వధింపవలెనో వాని త్రిపురములను ఎట్లు భగ్నము చేయవలెనో అని చింతించుచూ వెంటనే మనస్సునందు నారదమహర్షిని స్మరించెను. స్మరించిన వెంటనే నారదుడు అక్కడికి వచ్చెను.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

ఆజ్ఞాపయ మహాదేవ కిమర్థం చ స్మృతో హ్యాహమ్ ।
కిం కార్యం తు మయా దేవ కర్తవ్యం కథయస్వ మే ॥ 15 ॥

స్మరించినంతనే అచ్చటికి వచ్చిన నారదుడు "ఓ మహాదేవ! ఆజ్ఞాపించుము. ఇప్పుడు మీరు మమ్మేల స్మరించితిరి? నేను చేయవలసిన కార్యమేమిటో వివరింపుడు.

భగవానువాచ – భగవానుడు చెప్పాడు.

గచ్ఛ నారద తత్రైవ యత్ర తత్త్రిపురం మహత్ ।
బాణస్య దానవేంద్రస్య శీఘ్రం గత్వా చ తత్కురు ॥ 16 ॥

తా భర్తృదేవతా స్తత్ర స్త్రియశ్చాప్సరసాం సమాః ।
తాసాం వై తేజసా విప్ర భ్రమతే త్రిపురం దివి ॥ 17 ॥
తత్ర గత్వా తు విప్రేంద్ర మతిమన్యాం ప్రచోదయ ।

నారదా! దానవేంద్రుడైన బాణాసురుని యొక్క మహాత్రిపురములున్న చోటికి వెంటనే వెళ్ళి నేను చెప్పినట్లు చేయుము. అక్కడ ఉండు స్త్రీలందరూ పతినే దేవతగా ఆరాధించువారు. సౌందర్యము నందు అప్సరసలతో సమానము. వారి తేజస్సు వలననే ఆ త్రిపురము ఆకాశమునందు తిరుగుచున్నది. ఓ నారదా! విప్రేంద్రా! నీవక్కడికి వెళ్ళి ఆ స్త్రీలలో మతిభేదమును ప్రేరేపించుము అని భగవానుడు నారదునకు చెప్పెను.

దేవస్య వచనం శ్రుత్వా మునిస్త్వరితవిక్రమః ॥ 18 ॥

స్త్రీణాం హృదయనాశాయ ప్రవిష్టస్తత్పురం ప్రతి ।
శోభతే యత్పురం దివ్యం నానారత్నోపశోభితమ్ ॥ 19 ॥

శతయోజన విస్తీర్ణం తతో ద్విగుణమాయతమ్ ।
తతోऽపశ్యద్ధి తత్రైవ బాణం తు బలదర్పితమ్ ॥ 20 ॥

మణికుండలకేయూరముకుటేన విరాజితమ్ ।
హారదోరసువర్ణైశ్చ చంద్రకాంతవిభూషితమ్ ॥ 21 ॥

మహాదేవుని మాటలు వినిన నారదుడు త్వరితగతిన అచ్చటి స్త్రీలకు మతిభ్రంశము కలిగించుటకై ఆ త్రిపురమునకు వెళ్ళెను. నానారత్నములతో అలంకరింపబడిన ఆ త్రిపురము దివ్యముగా ప్రకాశించుచుండెను. నూరు యోజనములు వెడల్పు రెండు వందల యోజనముల పొడవు గలిగి ఆ పురము విశాలముగా నుండెను. అక్కడ ప్రవేశించి మణికుండలములతో, కేయూరములు=భుజకీర్తులతో, కిరీటముతో, సువర్ణ హారములతో

బంగారపు మరియు తోరములతో చంద్రకాంతమణులతో విభూషితుడైనటువంటి, స్వబలముచే అత్యంతదర్పమును పొందినటువంటి బాణాసురుని చూచెను.

రశనా తస్య రత్నాఢ్యా బాహూ కనకమండితౌ ।
చంద్రకాంతమహావజ్రమణివిద్రుమభూషితే ॥ 22 ॥

ద్వాదశార్కద్యుతినిభే నివిష్టం పరమాసనే ।
ఉత్థితో నారదం దృష్ట్వా దానవేంద్రో మహాబలః ॥ 23 ॥

రత్నాదులతో చేయబడిన మొలనూలుతో, కనకాభరణములతో అలంకరింపబడిన బాహువులు కలిగినటువంటి ఆ బాణాసురుడు చంద్రకాంతమణులతో వజ్రములతో వైడూర్యములతో అలంకరింపబడిన పదురెండు సూర్యుల కాంతి వంటి కాంతి గలిగిన మహత్తరమైన ఆసనముపై కూర్చుండెను. కాని మహాబలుడు దానవేంద్రుడైన ఆ బాణుడు తన దగ్గరకు వచ్చుచున్న నారదుని చూచి తన ఆసనమునుండి లేచెను.

బాణ ఉవాచ – బాణుడు పలికాడు.

దేవర్షే త్వం స్వయం ప్రాప్తో హ్యర్ఘ్యం పాద్యం నివేదయే ।
సోఽభివాద్య యథాన్యాయం క్రియతాం కిం ద్విజోత్తమ ॥ 24 ॥

చిరాత్త్వమాగతో విప్ర! స్థీయతామిదమాసనమ్ ।
ఏవం సంభాషయిత్వా తు నారదం ఋషిసత్తమమ్ ॥
తస్య భార్యా మహాదేవీ హ్యనౌపమ్యా తు నామతః ॥ 25 ॥

బాణుడు నారదునితో ఇట్లనెను దేవర్షీ! నీవు స్వయముగా ఇచ్చటికి వచ్చితివి. నీకు అర్ఘ్యపాద్యములు సమర్పింతును అని శాస్త్రానుసారము నారదునికి అభివాదము చేసి ఓ ద్విజోత్తమా! నేను నీకు ఏమి చేయగలను? చాలా కాలము తర్వాత వచ్చితివి. ఈ ఆసనమును అధిష్ఠించుము అని ఋషిసత్తముడైన నారదునితో బాణుడు సంభాషించుచుండగా అనౌపమ్యా అను పేరు గల ఆతని మహారాణి అచ్చటికి వచ్చెను.

అనౌపమ్యోవాచ – అనౌపమ్య పలికింది.

భగవన్ మానుషే లోకే కేన తుష్యతి కేశవః ।
వ్రతేన నియమేనాథ దానేన తపసాఽపి వా ॥ 26 ॥

ఓ నారదా! మనుష్యలోకమున ఏ వ్రతము, ఏ నియమము ఏ దానము మరియు ఎటువంటి తపస్సు ఆచరించినచో కేశవుడు తృప్తి చెందును?అని అనౌపమ్య నారదుని అడిగెను.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

తిలధేనుం చ యో దద్యాత్ బ్రాహ్మణే వేదపారగే ।
ససాగరవనద్వీపా దత్తా భవతి మేదినీ ॥ 27 ॥

సూర్యకోటిప్రతీకాశైః విమానైః సార్వకామికైః ।
మోదతే సుచిరం కాలమక్షయం కృతశాసనమ్ ॥ 28 ॥

నారదుడిట్లు చెప్పెను - సకలవేదపారంగతుడగు బ్రాహ్మణునకు ఎవరైతే తిలలతో కూడిన గోదానము చేయుదురో వారికి సముద్రవన ద్వీప సహితమైన పృథివినంతటిని దానము చేసిన ఫలము వచ్చును. మరియు కోటి సూర్యులకాంతి గలిగిన, కోరికలన్నింటిని తీర్చునట్టి విమానములందు సంచరించుచు చిరకాలము వరకు అక్షయ్యమైన ఆనందమును పొందుదురు.

ఆమ్రామలకపిత్థాని బదరాణి తథైవ చ ।
కదంబ చంపకాశోక పుంనాగవివిధ ద్రుమాన్ ॥ 29 ॥

అశ్వత్థ పిప్పలాంశ్చైవ కదలీవటదాడిమాన్ ।
పిచుమర్దం మధూకం చ ఉపోష్య స్త్రీ దదాతి యా ॥ 30 ॥

స్తనౌ కపిత్థ సదృశావూరూ చ కదలీ సమౌ ॥
అశ్వత్థే వన్దనీయా చ పిచుమర్దే సుగంధినీ ॥ 31 ॥

మామిడి, ఉసిరిగ, వెలగ, రేగు, కదంబ, చంపక, అశోక, పున్నాగ, అశ్వత్థ, పిప్పల, అరటి, మర్రి,దానిమ్మ, పిచుమర్ద = వేప, ఇప్ప మొదలగు వృక్షములను ఉపవాస పూర్వకముగా ఏ స్త్రీ అయితే దానము చేయునో ఆమెకు వెలగపండ్లవంటి స్తనములు, అరటిస్తంభములవంటి తొడలు కలుగును. అశ్వత్థవృక్షము దానము చేసినచో అందరిలో వందనీయురాలు మరియు పిచుమంద = వేప వృక్షము దానము చేసినచో సుగంధయుక్తమైన దేహమును పొందును.

చంపకే చంపకాభా స్యాత్ అశోకే శోకవర్జితా ।
మధూకే మధురం వక్తి వటే చ మృదుగాత్రికా ॥ 32 ॥

బదరీ సర్వదా స్త్రీణాం మహాసౌభాగ్యదాయినీ ।
కుక్కుటీ కర్కటీ చైవ ద్రవ్యషష్ఠీ న శస్యతే ॥ 33 ॥

కదంబ మిశ్రకనక మంజరీ పూజనం తథా ।
అనగ్ని పక్వమన్నం చ పక్వాన్నానామభక్షణమ్ ॥ 34 ॥

ఫలానాం చ పరిత్యాగః సంధ్యామౌనం తథైవ చ ।

అట్లే సంపెంగ దానమువలన ఆ పూవువంటి కాంతిని, అశోకమువలన శోకరహితత్వమును, మధూక= ఇప్పవృక్షము దానమువలన మధురభాషిత్వమును, మర్రివలన మృదువైన శరీరమును, రేగువృక్షమువలన మహాసౌభాగ్యమును పొందును. కుక్కుటీ = బూరుగు, కర్కటీ = దోస, మరియు ద్రవ్యషష్ఠీ దానము చేయుటకు ప్రశస్తమైనవి కావు. కదంబ = కడిమి పూలు, కనక మంజరీ = ఉమ్మెత్తపూలయొక్క మిశ్రమణముతో పూజ శ్రేష్ఠమైనది. అగ్నిచేత పక్వము కానటువంటి అన్నమును మరియు ఇతరపక్వాన్నములను భుజించకూడదు. ఇతర ఫలములను తినుట కూడ పరిత్యజించవలెను. సంధ్యా సమయమున మౌనదీక్ష వహించవలెను.

ప్రథమం క్షేత్రపాలస్య పూజా కార్యా ప్రయత్నతః ॥ 35 ॥

తస్యా భవతి వై భర్తా ముఖప్రేక్షః సదానఘే ।
అష్టమీ చ చతుర్థీ చ పంచమీ ద్వాదశీ తథా ॥ 36 ॥

సంక్రాంతిర్విషువచ్చైవ దినచ్ఛిద్రముఖం యథా ।
ఏతాంస్తు దివసాం దివ్యానుపవాసన్తి యాః స్త్రియః ॥
తాసాం తు ధర్మయుక్తానాం స్వర్గవాసో న సంశయః ॥ 37 ॥

కలికాలుష్యనిర్ముక్తాః సర్వపాపవివర్జితాః ।
ఉపవాసరతాం నారీం నోపసర్పతి తాం యమః ॥ 38 ॥

ఏ పూజ చేయడమునకైననూ ముందుగా ప్రయత్నపూర్వకముగా క్షేత్రపాలుర పూజచేయవలెను. ఓ అనఘా! ఈ విధముగా పూజలాచరించిన స్త్రీకి ఎల్లప్పుడూ భర్త ఆమె వశుడై ఉండును. ఆమె ముఖమునే చూచుచుండును. అష్టమీ, చతుర్థీ, పంచమీ, ద్వాదశీ మొదలగు తిథులయందు, సంక్రమణ దివసమునందు (సూర్యుడు ఆయా రాశుల యందు ప్రవేశించు దివసము) విషువత్. అనగా రాత్రి పగలు రెండునూ సమానమైన పరిమాణముతో నుండు దివసము, మరియు ఛిద్ర తిథులు (షష్ఠి, అష్టమీ, ద్వాదశీ ఇత్యాదులు) మొదలగునవి స్త్రీలకు మంచి దివసములని చెప్పబడినవి. దివసములందు ధర్మాచరణులై ఉపవసించు స్త్రీలకు నిస్సందేహముగా స్వర్గవాసము కలుగును. కలికాలపు కాలుష్యము నుండి నిర్ముక్తలగుదురు, సర్వపాప రహితలగుదురు. ఇట్లు ఉపవాసదీక్షను ఆచరించు స్త్రీల దగ్గరకు యముడు కూడ రాలేడు అని నారదుడు అనౌపమ్యకు చెప్పెను.

అనౌపమ్య ఉవాచ – అనౌపమ్య పలికింది.

అస్మత్కృతేన పుణ్యేన పురా జన్మకృతేన వా ।
భవదాగమనం భూతం కించిత్ పృచ్ఛామ్యహం వ్రతమ్ ॥ 39 ॥

అస్తి వింధ్యావలిర్నామ బలిపత్నీ యశస్వినీ ।
శ్వశ్రూర్మమాపి విప్రేంద్ర న తుష్యతి కదాచన ॥ 40 ॥

శ్వశురోఽపి సర్వకాలం దృష్ట్వా చాపి న పశ్యతి ।
అస్తి కుంభీనసీ నామ ననాందా పాపకారిణీ ॥ 41 ॥

దృష్ట్వా చైవాంగులీభంగం సదా కాలం కరోతి చ ।
దివ్యేన తు పథా యాతి మమ సౌఖ్యం కథం వద ॥ 42 ॥

ఊషరే న ప్రరోహన్తి భవన్తి వశగా మమ ।
యేన వ్రతేన చీర్ణేన భవన్తి వశగా మమ ॥
తద్వ్రతం బ్రూహి విప్రేంద్ర దాసభావం వ్రజామి తే ॥ 43 ॥

అనౌపమ్య నారదునితో ఇట్లనెను. ఓ విప్రేంద్రా! నేను ఈ జన్మలోను పూర్వజన్మయందును చేసిన పుణ్య ఫలము వలన నీవు ఇక్కడికి వచ్చితివి, నేను ఒక వ్రతము గురించి మిమ్ము అడుగుచున్నాను. బలిచక్రవర్తికి యశస్వినియైనటువంటి వింధ్యావలి అను పత్ని యున్నది కదా! ఆమె మా అత్తగారు, ఆమెకు ఎప్పుడు కూడ నా విషయమున సంతోషము లేదు. మా మామగారు కూడ నన్ను ఎప్పుడునూ చూచుచునే ఉండును కాని సంతోషము ప్రకటించడు. కుంభీనసీయను పేరు గల ఆడబిడ్డ కలదు, ఆమె అన్నియు పాపపు పనులే చేయును. ఆమె నన్ను చూస్తునే ఎప్పుడును చేతులతో మెటికలు విరుచుచూ తన అయిష్టతను ప్రకటించును. ఇటువంటి స్థితిలో ఉన్న నాకు సౌఖ్యం కలిగే మంచి మార్గమే దైనా కలదేమో ఓ విప్రేంద్రా! వివరింపుము. చవిటిభూమియందు విత్తనములు మొలకెత్తవు కదా అయినను ఓ నారదమునీ! ఏ వ్రతమాచరించినచో వీరందరూ నా వశులగుదురో తెలుపుము, నేను నీకు దాసురాలనై ఉందును.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

యదేతత్తే మయా పూర్వం వ్రతముక్తం శుభాననే ।
అనేన పార్వతీ దేవి చీర్ణేన వరవర్ణిని ॥ 44 ॥

శంకరస్య శరీరస్థా విష్ణోర్లక్ష్మీస్తథైవ చ ।
సావిత్రీ బ్రహ్మణశ్చైవ వసిష్ఠస్యాప్యరుంధతీ ॥ 45 ॥

ఓ శుభాననా! ఓ వరవర్ణినీ! అనౌపమ్యా! నేనింతవరకు నీకు చెప్పినట్టి వ్రతమేదైతో కలదో దానిని ఆచరించి పార్వతీదేవి పరమశివుని శరీరముననే అర్ధభాగమును పొందినది. అట్లే లక్ష్మీదేవి శ్రీ మహావిష్ణువు యొక్క, సావిత్రీ దేవి బ్రహ్మదేవుని యొక్క అరుంధతి వసిష్ఠమహాముని యొక్క సంపూర్ణ ప్రేమనూ పొందిరి.

ఏతేనోపోషితేనేహ భర్తా స్థాస్యతి తే వశే ।
శ్వశ్రూ శ్వశురయోశ్చైవ ముఖబంధో భవిష్యతి ॥ 46 ॥

నేను వివరించిన ఈ ఉపవాస వ్రతమాచరించినచో నీ భర్త నీ వశుడై యుండును. నీ అత్త మామల నోళ్ళు కూడ మూతబడును. వారునూ నీ అధీనమున ఉండెదరు.

ఏవం శ్రుత్వా తు సుశ్రోణి యథేష్టం కర్తుమర్హసి ।
నారదస్య వచః శ్రుత్వా రాజ్ఞీ వచనమబ్రవీత్ ॥ 47 ॥

ప్రసాదం కురు విప్రేంద్ర దానం గ్రాహ్యం యథేప్సితమ్ ।
సువర్ణ మణిరత్నాని వస్త్రాణ్యాభరణాని చ ॥ 48 ॥

తవ దాస్యామ్యహం విప్ర యచ్చాన్య దపి దుర్లభమ్ ।
ప్రగృహాణ ద్విజశ్రేష్ఠ ప్రీయేతాం హరిశంకరౌ ॥ 49 ॥

ఇట్లు నేను చెప్పినదంతయూ విని నీకు నచ్చిన విధముగా వ్రతమాచరింపుము అని నారదుడు చెప్పిన మాటలు వినిన రాణియైన అనౌపమ్య ఆతనితో ఇట్లనెను. ఓ విప్రేంద్రా! నా యందు అనుగ్రహించి నీ కిష్టమైనట్టి

దానములు స్వీకరించవలసినది. సువర్ణము, మణులు, రత్నములు, వస్త్రములు, ఆభరణములు, మొదలగునవే కాక దుర్లభములైనవైననూ నేను నీకిత్తును కావున ఓ ద్విజశ్రేష్ఠా! దయచేసి హరిహరులు ప్రీతినందునట్లు నేనిచ్చు దానములను అంగీకరింపుము.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

అన్యస్మై దీయతాం భద్రే క్షీణవృత్తిస్తు యో ద్విజః ।
అహం తు సర్వసంపన్నో మద్భక్తిః క్రియతామితి ॥ 50 ॥

ఓ మంచిభావన కలిగినదానా! జీవనాధారము లేనట్టి మరి యే ఇతరబ్రాహ్మణునకైననూ ఈ దానములనివ్వుము. నేను సకల సంపన్నుడను, నాయందు కేవలం భక్తిభావము కలిగియుండుము.

ఏవం తాసాం మనో హృత్వా సర్వాసాం తు పతివ్రతాత్ ।
జగామ భరతశ్రేష్ఠ స్వకీయం స్థానకం పునః ॥ 51 ॥

తతో హ్యహృష్టహృదయా అన్యతో గతమానసాః ।
పురే ఛ్ఛిద్రం సముత్పన్నం బాణస్య తు మహాత్మనః ॥ 52 ॥

ఆ విధముగా నారదుడు పతివ్రతము నుండి వారందరియొక్క మనస్సులను హరించి పెడ మార్గము పట్టించి ఓ భరతశ్రేష్ఠా ! మరల తన స్థానమునకు వెళ్ళిపోయెను. అప్పటి నుండి ఆ త్రిపురపు స్త్రీలు అసంతుష్ట హృదయములతో ఇతరమార్గముల నవలంబించిరి. దానివలన మహాత్ముడైన బాణాసురుని త్రిపురము నందు ఛిద్రములు=గొడవలు సముత్పన్నమయ్యెను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే జ్వాలేశ్వర మాహాత్మ్యే సప్తాశీత్యధికశతతమోఽధ్యాయః ॥187॥

శ్రీమత్స్యమహాపురాణంలో జ్వాలేశ్వర మాహాత్మ్యమునందు నూట ఎనభైఏడవ అధ్యాయం సమాప్తం



అష్టాశీత్యధిక శతతమోఽధ్యాయః - నూటఎనబై ఎనిమిదవ అధ్యాయం

ఈశ్వర కృత బాణాసుర త్రిపుర దహనమ్ - ఈశ్వర కృత బాణాసుర త్రిపుర దహనం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

యన్మాం పృచ్ఛసి కౌంతేయ తన్మే కథయతః శృణు ।
ఏతస్మిన్నంతరే రుద్రో నర్మదాతటమాస్థితః ॥ 1 ॥

నామ్నా మాహేశ్వరం స్థానం త్రిషు లోకేషు విశ్రుతమ్ ।
తస్మిన్ స్థానే మహాదేవోఽచిన్తయత్ త్రిపురక్షయమ్ ॥ 2 ॥

మార్కండేయుడు ధర్మరాజుతో ఇట్లు చెప్పనారంభించాడు. ఓ కౌంతేయా! నీవు నన్నడిగిన వృత్తాంతం చెప్పుచున్నాను వినుము. ఇంతలో రుద్రుడు నర్మదానదీతటమునకు వెళ్ళెను. అక్కడ ముల్లోకములలో ప్రసిద్ధమైన మాహేశ్వరము అను స్థానమునందున్నవాడై త్రిపురక్షయమును గురించి ఆలోచించెను.

గాండీవం మందరం కృత్వా గుణం కృత్వా చ వాసుకిమ్ ।
స్థానం కృత్వా తు వైశాఖం విష్ణుం కృత్వా శరోత్తమమ్ ॥ 3 ॥

శల్యే చాగ్నిం ప్రతిష్ఠాప్య ముఖే వాయుం సమర్పయన్ ।
హయాంశ్చ చతురో వేదాన్ సర్వదేవమయం రథమ్ ॥ 4 ॥

అభీషవోఽశ్వినౌ దేవౌ అక్షో వజ్రధరః స్వయమ్ ।
స తస్యాజ్ఞాం సమాదాయ తోరణే ధనదః స్థితః ॥ 5 ॥

అపుడు మందరపర్వతమును ధనుస్సుగా, వాసుకిని అల్లెత్రాటిగా, విశాఖుని (కుమార స్వామిని) బాణము నిలుపు స్థానముగా, విష్ణువును ఉత్తమమైన బాణముగా చేసికొనెను. బాణపు మొన యందు అగ్నిని ప్రతిష్ఠించి, పై ప్రదేశమున వాయువును స్థాపించెను. దేవతలందరూ కూడి రథము కాగా నాలుగు వేదములు అశ్వములయ్యెను.

అశ్వినీ దేవతలిద్దరూ పగ్గములు కాగా ఇంద్రుడు రథమున కిరుసయ్యెను. కుబేరుడు ఈశ్వరుని యాజ్ఞ ననుసరించి తోరణమునందు నిలిచెను.

యమస్తు దక్షిణే హస్తే వామే కాలస్తు దారుణః ।
చక్రే త్వమరకోట్యస్తు గంధర్వా లోకవిశ్రుతాః ॥ 6 ॥

ప్రజాపతీ రథశ్రేష్ఠే బ్రహ్మా చైవ తు సారథిః ।
ఏవం కృత్వా తు దేవేశః సర్వదేవమయం రథమ్ ॥ 7 ॥

సోఽతిష్ఠత్ స్థాణు భూతస్తు సహస్రపరివత్సరాన్ ।

యముడు కుడిచేతియందు, దారుణరూపుడైన కాలుడు శివుని ఎడమచేతియందుండిరి. చక్రమునందు కోట్లాది లోకప్రసిద్ధులైన దేవతలు, గంధర్వులు ఉండిరి. రథమునకు ముందు భాగమున ప్రజాపతి ఉండగా స్వయముగా బ్రహ్మదేవుడే ఆ రథమునకు సారథియయ్యెను. ఈ విధంగా ఆ దేవేశుడు సర్వదేవమయమైన రథాన్ని నిర్మించుకొని స్థాణురూపుడై వేల సంవత్సరములవరకు అట్లే వేచియుండెను.

యదా త్రీణి సమేతాని అంతరిక్షే స్థితాని వై । 8 ।

త్రిపర్వాణి త్రిశల్యేన తదా తాని వ్యభేదయత్ ॥
శరః ప్రచోదిత స్తేన రుద్రేణ త్రిపురం ప్రతి ॥9॥

భ్రష్టతేజాః స్త్రియో జాతా బలం తాసాం వ్యశీర్యత ।
ఉత్పాతాశ్చ పురే తస్మిన్ ప్రాదుర్భూతాః సహస్రశః ॥ 10 ॥

త్రిపురస్య వినాశాయ కాలరూపాఽభవంస్తదా ।
అట్టహాసం ప్రముంచంతి హయాః కాష్ఠమయాస్తదా ॥ 11 ॥

నిమేషోన్మేషణం చైవ కుర్వంతి చిత్రరూపిణః ।
స్వప్నే పశ్యంతి చాత్మానం రక్తాంబరవిభూషితమ్ ॥ 12 ॥

ఎప్పుడైతే ఆ మూడు పురాలు ఒకటిగా కూడి ఆకాశమునందుండెనో అపుడు రుద్రుడు ఆ త్రిపురాల మీద మూడు కణుపులు మరియు మూడు పదునైన మొనలు కలిగినటువంటి తన బాణమును ప్రయోగించి ఆ త్రిపురాలను ఛేదించాడు. ఆ విధంగా రుద్రునిచే ప్రయోగింపబడిన బాణంచేత త్రిపురంలోని స్త్రీలు తేజోవిహీనులైరి. వారి బలం నశించిపోయింది. ఆ త్రిపురము నందు వేలకొలది ఉత్పాతాలుద్భవించాయి. అవి త్రిపురం యొక్క వినాశం కొరకై ఉద్భవించిన కాలపురుషరూపమున ఉండెను. కాష్ఠమయములైన అశ్వములు భయంకరంగా అట్టహాసము చేయసాగెను. చిత్రములోనున్న బొమ్మలు కన్నులు మూస్తూ తెరుస్తూ ఉన్నాయి. త్రిపురంలోని దానవులందరూ కలలో ఎవరికి వారే రక్తవస్త్రములు ధరించినవారిగా కనబడ్డారు.

స్వప్నే తు సర్వే పశ్యన్తి విపరీతాని యాని తు ।
ఏతాన్‌తు పశ్యత్యుత్పాతాన్ తత్ర స్థానే తు యే జనాః ॥ 13 ॥

తేషాం బలం చ బుద్ధిశ్చ హరకోపేన నాశితే ।
తతః సాంవర్తకో వాయుర్యుగాంతప్రతిమో మహాన్ ॥ 14 ॥

సమీరితోఽనలస్తేన ఉత్తమాంగేన ధావతి ।
జ్వలన్తి పాదపాస్తత్ర పతంతి శిఖరాణి చ ॥ 15 ॥
సర్వతో వ్యాకులీభూతం హాహాకారమచేతనమ్ ।
భగ్నోద్యానాని సర్వాణి క్షిప్రం తత్రప్యత్యభజ్యత ॥ 16 ॥

త్రిపురములలోని జనులకు స్వప్నమునందు కనబడిన అమంగళకరములైన విషయములన్నియు జాగ్రదవస్థయందు ఉత్పాతములుగా కనబడ్డాయి. హరుని కోపమువలన అక్కడి వారందరి బుద్ధి నశించి పోయింది. ప్రళయకాలపు గాలివలె సాంవర్తనము అను వాయువు భయంకరముగా వీచింది. ఆ వాయువుచే ప్రేరేపింపబడిన అగ్ని అతివేగంగా అంతటనూ వ్యాపించి వృక్షములన్నింటిని దహిస్తోంది. పర్వతముల శిఖరములు క్రిందపడ్డాయి. వ్యాకులచిత్తులైన అక్కడి ప్రజల హాహాకారములు అంతటా వ్యాపించాయి. ఉద్యానవనములన్నీ భగ్నములయ్యాయి మరియు అక్కడ ఉన్న భవనాదులన్నీ ముక్కలు కాసాగాయి.

తేనైవ పీడితం సర్వం జ్వలితం త్రిశిఖైః శరైః ।
ద్రుమాశ్చారామఖండాని గృహాణి వివిధాని చ ॥ 17 ॥

దశదిక్షు ప్రవృత్తోஉయం సమృద్ధో హవ్యవాహనః ।
మనః శిలానాం పుంజాని దిశో దశ విభాగశః ॥ 18 ॥

శిఖాశతైరనేకైస్తు ప్రజజ్వాల హుతాశనః ।
సర్వం కింశుకవర్ణాభం జ్వలితం దృశ్యతే పురమ్ ॥ 19 ॥

గృహాద్ గృహాన్తరం నైవ గన్తుం ధూమేన శక్యతే ।

హరుని మూడు మొనల బాణాలచేత త్రిపురమంతయూ పీడితమైంది. వృక్షాలు, ఉద్యానవనభాగాలు, అనేక గృహాలు భగ్నమయ్యాయి. బాగా వృద్ధిపొందిన అగ్ని దశదిక్కులకీ వ్యాపించింది. మనశ్శిలల సమూహాలవలె అగ్ని కణాలు అన్ని దిక్కులకీ వ్యాపించాయి. హుతాశనుడైన అగ్ని అనేక వందల జ్వాలలతో మండుతోంది. దానితో ఆ త్రిపురమంతా మోదుగుపూలవర్ణముతో సమానమైన జ్వాలలతో నిండిపోయాయి. అట్లు మండుతున్న అగ్నినుండి వస్తున్న పొగవలన ఇంటినుండి మరొక ఇంటికి వెళ్ళడానికి కూడ వీలులేకపోయింది.

హరకోపానలైర్దగ్ధం క్రందమానం సుదుఃఖితమ్ ॥ 20 ॥

ప్రదీప్తం సర్వతో దిక్షు దహ్యతే త్రిపురం పురమ్ ।
ప్రాసాదశిఖరాగ్రాణి వ్యశీర్యన్త సహస్రశః ॥21॥

నానామణివిచిత్రాణి విమానాన్యప్యనేకధా ।
గృహాణి చైవ రమ్యాణి దహ్యన్తే దీప్తవహ్నినా ॥ 22 ॥

త్రిపురమంతా హరకోపానలం చేత దగ్ధమై ఆక్రందనం చేస్తూ దుఃఖిస్తోంది. అట్లు అన్ని దిక్కులలో వ్యాపించిన అగ్నితో త్రిపురమంతా అంటుకుపోయింది. వేలకొలది ప్రాసాదశిఖరాగ్రాలు నశించిపోయాయి. అనేక విధాలైన మణులతో విచిత్రంగా కనబడిన విమానాలు నశించిపోయాయి. రమ్యములైన గృహాలన్ని దీప్తమైన వహ్నిచేత దహించి వేయబడ్డాయి.

ధావన్తి ద్రుమఖండేషు వలభీషు తథా జనాః ।
దేవాగారేషు సర్వేషు ప్రజ్వలన్తః ప్రధావితాః ॥ 23 ॥

క్రందన్తి చానలప్లుష్టా రుదన్తి వివిధైః స్వరైః ।
దహ్యన్తే దానవాస్తత్ర శతశోఽథ సహస్రశః ॥ 24 ॥

అపుడు అచ్చటి జనం అంతా కాలిపోతూ స్వరక్షణకై వృక్షపు గుబురులలోకి. భవనాలలోని ఎత్తైన గదులలోకి, దేవాగారాలలోకీ పరుగెత్తసాగారు. మండుతున్న జ్వాలలు కలిగిన ఆ అగ్నిని చూచి జనులందరూ వివిధస్వరాలతో అరుస్తూ, ఏడుస్తూ వున్నారు. మరియు వందలు, వేలకొలది దానవులు అగ్నిలో కాలిపోసాగారు.

హంస కారండవాకీర్ణా నలిన్యః సహపంకజాః ।
దృశ్యన్తేఽనలదగ్ధాని పురోద్యానాని దీర్ఘికాః ॥ 25 ॥

అమ్లాన పంకజశ్ఛన్నో విస్తీర్ణా యోజనాయతాః ।
గిరికూటనిభాస్తత్ర ప్రాసాదా రత్నభూషితాః ॥ 26 ॥

పతన్త్యనలనిర్దగ్ధా నిస్తోయా జలదా ఇవ ।
వరస్త్రీ బాలవృద్ధేషు గోషు పక్షిషు వాజిషు ॥ 27 ॥

నిర్దయో వ్యదహద్వహ్నిః హరక్రోధేన ప్రేరితః ।
సహస్రశః ప్రబుద్ధాశ్చ సుప్తాశ్చ బహవో జనాః ॥ 28 ॥

హంసలు, కారండవ పక్షులు మొదలైనవాటితో వ్యాప్తములై పద్మాలతో కూడిన సరస్సులు, విశాలాలైన పురోద్యానాలు అగ్నిదగ్ధాలై కనబడసాగాయి. యోజనాల కొలది విస్తీర్ణాలైయున్న సరస్సులు కూడ మ్లానములైన పద్మాలతో కప్పబడినట్లున్నాయి. పర్వతశిఖరాలను బోలిన, రత్నభూషితాలైన అనేక ప్రాసాదాలు అగ్నిచే దహింపబడి నీరులేని మేఘాల వలె క్రింద పడిపోతున్నాయి. హరుని క్రోధం చేత ప్రేరేపితుడైన అగ్నిదేవుడు నిర్దయుడై స్త్రీలు, బాలురు, వృద్ధులు, గోవులు, పక్షులు, అశ్వాలు మొదలైన వాటిని దహించి వేయసాగాడు. మేల్కొనియున్న అనేక వేలమంది మరియు నిద్రావస్థయందున్న వేలకొలదిమంది కూడ అగ్నిచే దహించి వేయబడ్డారు.

పుత్రమాలింగ్య తే గాఢం దహ్యన్తే త్రిపురాగ్నినా ।
అథ తస్మిన్ పురే దీప్తే స్త్రియశ్చాప్సరసోపమాః ॥ 29 ॥

అగ్నిజ్వాలాహతాస్తత్ర హ్యపతన్ ధరణీతలే ।
కాచిచ్ఛ్యామా విశాలాక్షీ ముక్తావలి విభూషితా ॥ 30 ॥

ధూమేనాకులితా సా తు పతితా ధరణీతలే ।

కొంత మంది తమ పుత్రులను గాఢంగా కౌగలించుకొని త్రిపురాగ్నిలో దగ్ధమై పోయారు. ఆ విధంగా త్రిపురము కాలిపోతుండగా అప్సరసలతో సమానులైన స్త్రీలెందరో అగ్నిజ్వాలలకు హతులై నేలపై పడుతున్నారు. విశాలనేత్రాలు కలిగి ముత్యాల హారం ధరించిన ఒక చామన ఛాయగల స్త్రీ పొగచేత వ్యాకులత చెందినదై నేలపై పడిపోతుంది.

కాచిత్కనకవర్ణాభా ఇంద్రనీలవిభూషితా ॥ 31 ॥

భర్తారం పతితం దృష్ట్వా పతితా తస్య చోపరి ।
కాచిదాదిత్యసంకాశా ప్రసుప్తా చ గృహే స్థితా ॥ 32 ॥

అగ్నిజ్వాలాహతా సా తు పతితా గతచేతనా ।

బంగారు కాంతి లాంటి శరీరఛాయ కలిగి ఇంద్రనీలమణిని అలంకరించుకొన్న ఇంకొక స్త్రీ తన భర్త పడిపోవుట చూచి తాను అతనిపై పడిపోయింది. ఆదిత్యుని లాంటి కాంతి కల మరొక స్త్రీ నిద్రపోతూ అగ్ని జ్వాలల చేత దహింపబడి తెలివితప్పి పడిపోయింది.

ఉత్థితో దానవస్తత్ర ఖడ్గహస్తో మహాబలః ॥ 33 ॥

వైశ్వానరహతః సోఽపి పతితో ధరణీతలే ।
మేఘవర్ణాపరా నారీ హారకేయూరభూషితా ॥ 34 ॥

శ్వేతవస్త్రపరీధానా బాలం స్తన్యం న్యధాపయత్ ।
దహ్యన్తం బాలకం దృష్ట్వా రుదతే మేఘశబ్దవత్ ॥ 35 ॥

మహాబలుడు, ఖడ్గహస్తుడూ అయిన దానవుడొకడు లేచి నిలబడి అగ్నిజ్వాలలకు హతుడై వెంటనే నేలమీద పడ్డాడు. మేఘం వంటి శరీరవర్ణం కలిగిన మరొక స్త్రీ హారకేయూరాది ఆభరణాలు, శ్వేతవస్త్రం కూడ ధరించినదై తన బాలునకు పాలు త్రాగించే సమయంలో ఆ బాలుడు కాలిపోవుట చూచి మేఘగర్జనలా రోదిస్తూ పడిపోయింది.

ఏవం స తు దహన్నగ్నిః హరక్రోధేన ప్రేరితః ।
కాచిచ్చంద్రప్రభా సౌమ్యా వజ్రవైదూర్యభూషితా ॥ 36 ॥

సుతమాలింగ్య వేపన్తీ దగ్ధా పతతి భూతలే ।
కాచిత్ కుందేందువర్ణాభా యా శయానా గృహే స్థితా ॥ 37 ॥

గృహే ప్రజ్వలితే సా తు ప్రతిబుద్ధా శిఖార్దితా ।
పశ్యన్తీ జ్వలితం సర్వం హా సుతో మే కథం గతః ॥ 38 ॥

సుతం సందగ్ధమాలింగ్య పతితా ధరణీతలే ।

ఇట్లు హరుని క్రోధంచే ప్రేరేపితమైన అగ్ని త్రిపురాలను దహించివేయ సాగింది. అపుడు చంద్రుని లాంటి కాంతి గలిగిన సౌమ్యురాలైన, వజ్రవైదూర్యాదులతో అలంకృతురాలైన ఒక స్త్రీ పుత్రుణ్ణి కౌగలించుకొని కాలిపోతూ వణుకుతూ నేలపై పడిపోయింది. మల్లెపూవులాంటి, చంద్రునిలాంటి కాంతి కల మరొక స్త్రీ స్వగృహంలో నిద్రిస్తూండగా ఆ గృహం కాలిపోవడం చూచి మేల్కొని మండిపోతున్న ఇంటిని చూచి అయ్యో! నా పుత్రుడు ఎక్కడ పోయాడో అని ఏడుస్తూ, కాలిపోతున్న తన సుతుని కౌగలించుకొని నేలపై పడిపోయింది.

ఆదిత్యోదయవర్ణాభా లక్ష్మీ వదనశోభనా ॥ 39 ॥

త్వరితా దహ్యమానా సా పతితా ధరణీతలే ॥
కాచిత్ సువర్ణ వర్ణాభా నీలరత్నైర్విభూషితా ॥ 40 ॥

ధూమేనాకులితా సా తు ప్రసుప్తా ధరణీతలే ।

ఉదయించే సూర్యుని లాంటి కాంతి గలిగిన, లక్ష్మీదేవి వదనం లాంటి వన్నె కలిగిన మరొక స్త్రీ అగ్నిచేత దహింపబడి నేలపై పడిపోయింది. సువర్ణకాంతి కలిగి, నీలరత్నాలను అలంకరించుకొన్న ఇంకొక స్త్రీ పొగచేత ఆచ్ఛాదితయై నేలపై పడిపోయింది.

అన్యా గృహీతహస్తాతు సఖి దహ్యతి బాలికా ॥ 41 ॥

అనేక దివ్యరత్నాఢ్యా దృష్ట్వా దహనమోహితా ।
శిరసి హ్యంజలిం కృత్వా విజ్ఞాపయతి పావకమ్ ॥ 42 ॥

భగవన్ యది వైరం తే పురుషేష్వపకారిషు ।
స్త్రియః కిమపరాధ్యన్తే గృహపంజరకోకిలాః ॥ 43 ॥

ఇంకొక స్త్రీ తన సఖురాలి చేయి పట్టుకుని "ఓ సఖీ! నీ బాలిక దహించి వేయబడుచున్నద" ని చెప్పుట విని దివ్యరత్నాభరణములను ధరించిన ఆమె దహనాగ్నిచేత మూర్ఛితురాలగుచు, తేరుకుని, తలవంచి అగ్నిదేవునకు నమస్కరించి ఇట్లనెను. ఓ భగవంతుడా! అగ్నిదేవా! నీకు అపకారము చేసిన పురుషుల యందు వైరమున్నచో గృహములనే పంజరములలో కోకిలలుగా ఉన్న మా స్త్రీలను ఎందుకు దహిస్తున్నావు. మేము నీ పట్ల ఏ అపరాధము చేసాము అని ఆక్రోశించింది.

పాప నిర్దయ నిర్లజ్జ కస్తే కోపః స్త్రియః ప్రతి ।
న దాక్షిణ్యం న తే లజ్జా న సత్యం శౌర్యవర్జిత ॥ 44 ॥

అనేన హ్యుపసర్గేణ తూపాలంభం శిఖిన్యదాత్ ।
కిం త్వయా న శ్రుతం లోకే హ్యవధ్యాః శత్రుయోషితః ॥ 45 ॥

కిం తు తుభ్యం గుణా హ్యేతే దహనోత్సాహనం ప్రతి ।
న కారుణ్యం దయా వాఽపి దాక్షిణ్యం న స్త్రియఃప్రతి ॥ 46 ॥

"ఓ పాపాత్ముడా! నిర్దయుడా! లజ్జారహితుడా! నీకు స్త్రీలపై కోపమెందులకు? నీకు దాక్షిణ్యము కాని, లజ్జ కాని, సత్యము కాని లేవా? నీవు శౌర్యవర్జితుడవు" అనుచు అగ్నిచే కలుగుతున్న ఉపద్రవముతో బాధపడి ఉక్రోషముతో అగ్నిని నిందించసాగెను. శత్రువనితలను వధింపకూడదనే నియమమును నీవు వినలేదా అని అడిగెను. నీ గుణములన్నియూ దహించివేయుటయందు నాశనము చేయుటయందే ఆసక్తి కలిగి ఉన్నట్టున్నవి. నీకు స్త్రీల పట్ల దయ, దాక్షిణ్యము, కారుణ్యము వంటివి అసలు లేవు.

దయాం కుర్వన్తి మ్లేచ్ఛాపి దహన్తీం వీక్ష్య యోషితమ్ ।
మ్లేచ్ఛానామపి కష్టోఽసి దుర్నివారో హ్యచేతనః ॥ 47 ॥

ఏతే చైవ గుణాస్తుభ్యం దహనోత్సాదనం ప్రతి ।
ఆసామపి దురాచార స్త్రీణాం కిం తే నిపాతనే ॥ 48 ॥

దుష్ట నిర్ఘృణ నిర్లజ్జ హుతాశిన్ మన్దభాగ్యక ।
నిరాశత్వం దురావాస బలాద్దహసి నిర్దయ ॥ 49 ॥

కాలిపోవుచున్న స్త్రీని చూచినప్పుడు మ్లేచ్ఛులకు కూడ దయ కలుగును. నీవు ఆ మ్లేచ్ఛులకంటే కఠినుడవు, అచేతనుడవు, నిన్ను ఎవరు కూడ నివారించలేరు. ఇటువంటి నిర్దయపూర్వకమైన కాల్చివేయుట, వధించుట అను గుణములు నీకు మంచివి కావు. ఓ దురాచారుడా! స్త్రీలను ఇట్లు కాల్చివేయుటవలన నీకేమి లభించును? ఓ దుష్టుడా! దయారహితుడా! లజ్జాహీనుడా! మందభాగ్యుడా! ఓ అగ్నీ! బలవంతముగా మమ్ములను ఎందులకు దహించివేయుచున్నావు?

ఏవం విలపమానాస్తా జల్పన్త్యశ్చ బహూన్యపి ।
అన్యాః క్రోశన్తి సంక్రుద్ధా బాలశోకేన మోహితాః ॥ 50 ॥

దహతే నిర్దయో వహ్నిః సంక్రుద్ధః పూర్వశత్రువత్ ।
పుష్కరిణ్యా జలం దగ్ధం కూపేష్వపి తథైవ చ ॥ 51 ॥

అస్మాన్ సందహ్య మ్లేచ్ఛ త్వం కాం గతిం ప్రాపయిష్యసి ।
ఏవం ప్రలపతాం తాసాం వహ్నిర్వచనమబ్రవీత్ ॥ 52 ॥

ఇట్లు ఆ స్త్రీలు రోదించుచు అగ్నిని అనేక విధములుగా నిందించసాగిరి. కొందరు స్త్రీలు వారి బాలురు మరణించుటవలన దుఃఖంతో మూర్ఛితులైరి. కొంతమంది క్రోధంతో అగ్నిని నిందించుచుండిరి. అత్యన్త క్రుద్ధుడవై నిర్దయుడవై, పూర్వశత్రువు వలె మమ్ము దహించుచున్నావు, నీ వలన పుష్కరిణుల యందున్న జలమే కాక బావులయందున్న జలము కూడ దహించి వేయబడుచున్నది, ఓ మ్లేచ్ఛుడా! మమ్ములను ఈ విధముగా దహించి నీవు ఎటువంటి గతిని పొందుదువు? అని అనేక విధములుగా నిందించుచున్న ఆ స్త్రీలనుద్దేశించి అగ్ని ఇట్లనెను.

అగ్నిరువాచ – అగ్ని చెప్పాడు.

స్వవశేనైవ యుష్మాకం వినాశం తు కరోమ్యహమ్ ।
అహమాదేశకర్తా వై నాహం కర్తాస్మ్యనుగ్రహమ్ ॥ 53 ॥

రుద్రక్రోధసమావిష్టో విచరామి యథేచ్ఛయా ।

నేను స్వయముగా మీకు నాశము కలిగించుట లేదు, నేను శివుని ఆదేశానుసారము ఇట్లు చేయుచున్నాను. నేను మీపై అనుగ్రహము చూపుటకు కర్తను కాను. కేవలం రుద్రుని క్రోధము చేత ప్రేరేపింపబడిన నేను అతని ఇచ్ఛానుసారమే దహించివేయుచున్నానను.

తతో బాణో మహాతేజాస్త్రిపురం వీక్ష్య దీపితమ్ ॥ 54 ॥

సింహాసనస్థః ప్రోవాచ హ్యయం దేవైర్వినాశితః ।
అల్పసత్త్వైర్దురాచారై రీశ్వరస్య నివేదితమ్ ॥ 55 ॥

అపరీక్ష్య త్వహం దగ్ధః శంకరేణ మహాత్మనా ।
నాన్యః శక్తస్తు మాం హన్తుం వర్జయిత్వా త్రిలోచనమ్ ॥ 56 ॥

అపుడు తన సింహాసనమున అధిష్ఠించియున్న మహాతేజోవంతుడగు బాణాసురుడు దహించివేయబడుచున్న త్రిపురమును చూచి ఇట్లనుకొన్నాడు. ఇది దేవతలు చేసినటువంటి వినాశనమే, అల్పసత్త్వులు=బలరహితులు, దురాచారులూ అయిన వారు ఈశ్వరునకు నాపై విరుద్ధముగా తెలిపియున్నట్లున్నారు. మహాత్ముడైన శంకరుడు కూడ ఆలోచన చేయకనే నన్ను దగ్ధము చేయచున్నాడు, త్రిలోచనుడు తప్ప నన్ను ఎవడు కూడ వధించలేడు.

ఉత్థితః శిరసా కృత్వా లిఙ్గం త్రిభువనేశ్వరమ్ ।
నిర్గతః స పురద్వారాత్ పరిత్యజ్య సుహృత్సుతాన్ ॥ 57 ॥

రత్నాని యాన్యనర్ఘాణి స్త్రియో నానావిధాస్తథా ।

వెంటనే సింహాసనమునుండి లేచిన బాణుడు త్రిభువనేశ్వరుడైన లింగరూపుని శిరస్సు పై ధరించి మిత్రులను, పుత్రులను, మహత్తరమైన రత్నములను, స్త్రీలందరిని కూడ వదిలిపెట్టి త్రిపురమును విడిచి బయల్దేరెను.

గృహీత్వా శిరసా లింగం గచ్ఛన్ గగనమండలమ్ ॥ 58 ॥

స్తువంశ్చ దేవదేవేశం త్రిలోకాధిపతిం శివమ్ ।
త్యక్తా పురీ మయా దేవ యది వధ్యోఽస్మి శంకర ॥ 59 ॥

త్వత్ప్రసాదాన్మహాదేవ మా మే లింగం వినశ్యతు ।
అర్చితం హి మయా దేవ భక్త్యా పరమయా సదా ॥ 60 ॥

త్వత్కోపాద్యది వధ్యోఽహం తదిదం మా వినశ్యతు ।
శ్లాఘ్యమేతన్మహాదేవ త్వత్కోపాద్దహనం మమ ॥ 61 ॥

లింగమును శిరస్సుపై పెట్టుకుని ఆకాశమండలమున వెళ్ళుచు దేవదేవేశుడు త్రిలోకాధిపతియూ అయిన శివుని స్తుతించెను. శంకరా! నేను నిజముగా వధింపయోగ్యుడనైతే నేను త్రిపురమును ఇప్పుడే విడిచిపెడ్తున్నాను కాని ఓ పరమశివా! మహాదేవా! నీ దయ వలన ఈ లింగమునకు ఎటువంటి నష్టము కలుగకపోవుగాక! దేవా! నేను పరమ భక్తితో ఎల్లప్పుడూ ఈ లింగమును పూజించితిని. ఒకవేళ నీ కోపముచే నేను వధ్యుడను కావాలనుకుంటే ఈ లింగము మాత్రము నశించకుండా ఉండుగాక! అయితే పరమశివా! నీ కోపము చేత నేను దహింపబడుట అనునది ప్రశంసనీయమైనదే.

ప్రతిజన్మ మహాదేవ త్వత్పాదనిరతో హ్యహమ్ ।
తోటకచ్ఛందసా దేవం స్తౌమి త్వాం పరమేశ్వర ॥ 62 ॥

ఓ మహాదేవా! నా ప్రతిజన్మయందునూ నేను నీ పాదనిరతుడనే. ఇప్పుడు తోటక ఛందస్సుతో ఓ పరమేశ్వరా! నిన్ను స్తుతింతును.

శివ శంకర శర్వ హరాయ నమో భవ భీమ మహేశ్వర శర్వ నమః ।
కుసుమాయుధ దేహ వినాశకర త్రిపురాన్తక అన్ధక శూలధర ॥ 63 ॥

ప్రమదాప్రియకాన్త విరక్త నమః ససురాసుర సిద్ధగణైర్నమిత ।
హయవానర సిద్ధ గజేంద్ర ముఖా దతిభాస్వరదీర్ఘ విశాలముఖ ॥ 64 ॥

ఉపలబ్ధు మశక్యతరై రసురైః ప్రథితోఽస్మి చ బాహుశతై ర్బహుభిః ।
ప్రణతోఽస్మి భవం భవభక్తి రతః చలచంద్రకలాకుల దేవ నమః ॥ 65 ॥

శివా! శంకరా! హరా! భవా! భీమా! మహేశ్వరా! కుసుమాయుధుడైన మన్మథుని దేహమును భస్మము చేసినవాడా! త్రిపురాన్తకా! అన్ధక వినాశకా! నీకు నమస్సులు. పార్వతీ దేవియందు ప్రీతితో శరీరములోని సగభాగమును ఆమెతో పంచుకున్నవాడా! (లేదా పార్వతీప్రియా!) కాంతివిరక్తా! సురాసుర సిద్ధగణాదులందరి చేత నమస్కరింపబడిన వాడా! అశ్వవానర సింహ గజేంద్ర ముఖులైన ప్రమథగణములు కలవాడా! తేజోమయము మరియు విశాలమూ అయిన ముఖము కలవాడా! నీకు నమస్కరించుచున్నాను. అసురులెవరికీ పొందడానికి శక్యము కానటువంటి నీ చరణములకు అనేకశతబాహువులు గలిగిన నేను నమస్కరించుచున్నాను. మరియు చంచలుడైన చంద్రుని కళలచేత ప్రకాశించున్నటువంటి ఓ దేవా! అత్యన్త భక్తితో నీకు నమస్కరించుచున్నాను.

న చ పుత్ర కలత్రహయాది ధనం మమ తు త్వదనుస్మరణం శరణమ్ ।

వ్యథితోఽస్మి తు బాహుశతైర్బహుభిః గమితా చ మహానరకస్య గతిః ॥ 66 ॥

న నివర్తతి జన్మ న పాపమతిః ।శుచికర్మ నిబద్ధమపి త్యజతి ॥
అనుకంపతి విభ్రమతి త్రసతి మమ చైవ కుకర్మ నివారయతి ॥ 67 ॥

దేవా! పరమేశ్వరా! నాకు పుత్రకళత్ర హయాది ధనము అవసరము లేదు. నేను సర్వదా నిన్నే స్మరింతును. నీవే నాకు శరణుడవు. అనేకశతబాహువులచేత నాకు వ్యథ మాత్రమే కలుగుచున్నది, వీటి కారణమున నేను నరకగతిని పొందుదును. ఈ జన్మకు నివృత్తి లేదు. పాపమతి అయిన వాడెప్పుడును శ్రుతినిబద్ధమైన పుణ్యకర్మను వదిలిపెట్టును. ఇప్పుడు నా మనస్సు కంపించుచున్నది. భ్రాంతి చెందుచున్నది. భయపడుచున్నది. నన్ను కుకర్మల నుండి నివారించుచున్నది.

యఃపఠేత్తోటకం దివ్యం ప్రయతః శుచిమానసః ।
బాణస్యేవ యథా రుద్రః తస్యాపి వరదో భవేత్ ॥ 68 ॥

ఎవరైతే పరిశుభ్రమనస్కులై ప్రయత్నముతో దివ్యమైన, తోటకవృత్తమునందు రచింపబడిన ఈ స్తోత్రమును పఠించుదురో వారికి పరమశివుడు బాణునికి వలె అభీష్టవరదుడగును.

ఇమం స్తవం మహాదివ్యం శ్రుత్వా దేవో మహేశ్వరః ।
ప్రసన్నస్తు తదా తస్య స్వయం దేవో మహేశ్వరః ॥ 69 ॥

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు చెప్పాడు.

న భేతవ్యం త్వయా వత్స సౌవర్ణే తిష్ఠ దానవ ।
పుత్ర పౌత్ర సుహృద్బన్ధు భార్యా భృత్యజనైః సహ ॥ 70 ॥

బాణుడు చేసిన మహాదివ్యమైన స్తవమును విని దేవదేవుడైన మహేశ్వరుడు బాణునిపట్ల స్వయముగా ప్రసన్నుడై ఇట్లనెను. దానవా! వత్సా! నీవు భయపడవలదు. నీవు నీ పుత్ర పౌత్ర సుహృద్ బంధు భార్యా భృత్య జనులందరితో కలిసి ఈ సౌవర్ణనగరంలో వసింతువు.

అద్య ప్రభృతి బాణ త్వమవధ్య స్త్రిదశైరపి ।
భూయస్తస్య వరో దత్తో దేవదేవేన పాండవ ॥ 71 ॥

అక్షయ శ్చావ్యయో లోకే విచరస్వాకుతోభయః ।
తతో నివారయామాస రుద్రః సప్తశిఖం తదా ॥ 72 ॥

బాణాసురా! ఇతఃపరం నీవు దేవతల చేత కూడ వధింపబడజాలవు. అని చెప్పి పరమేశ్వరుడు ఆతనికింకొక వరమును కూడ ఇచ్చెను. ఇక నుండి నీవు అక్షయుడవై, అవ్యయుడవై, ఎటువంటి భయం లేనివాడవై లోకమునందు సంచరింపుము అని చెప్పెను. అటు తర్వాత ఆ రుద్రుడు సప్తశిఖుడైన అగ్నిని కూడ త్రిపురమును కాల్చుటనుండి నివారించెను. (స్వర్ణ రజత లోహములతో కూడ మూడు పురములలో రజత మరియు లోహమయమైన పురములు దగ్ధమై పోగా స్వర్ణపురంలో మాత్రము కొంతభాగము కాలిపోకుండా ఉండెను) ఇప్పుడు ఇక దహింపవద్దని అగ్నిని శివుడాదేశించెను.

తృతీయం రక్షితం తస్య పురం తేన మహాత్మనా ।
భ్రమత్తు గగనే దివ్యం రుద్రతేజః ప్రభావతః ॥ 73 ॥

ఏవం తు త్రిపురం దగ్ధం శంకరేణ మహాత్మనా ।
జ్వాలామాలాప్రదీప్తం తత్ పతితం ధరణీతలే ॥ 74 ॥

ఏకం నిపతితం తత్ర శ్రీశైలే త్రిపురాన్తకే ।
ద్వితీయం పతితం తస్మిన్ పర్వతేఽమరకంటకే ॥ 75 ॥

అట్లు మహాదేవునిచే నివారింపబడుటవలన ఆ మూడవ పురము రక్షింపబడెను. రుద్రతేజః ప్రభావము వలన అది దివ్యమైనదై ఆకాశమున తిరుగుచుండెను. ఈ విధముగా మహాత్ముడైన శంకరుని చేత దగ్ధమైన, నగరములు జ్వాలామాలలతో ప్రదీప్తములగుచు ధరణీతలమున పడెను. వాటిలో ఒకటి శ్రీశైల సమీపముననున్న త్రిపురాంతకమున పడెను మరియొకటి అమరకంటకపర్వతమున పడెను.

దగ్ధేషు తేషు రాజేంద్ర రుద్రకోటిః ప్రతిష్ఠితా ॥
జ్వలత్తదపతత్తత్ర తేన జ్వాలేశ్వరః స్మృతః ॥ 76 ॥

ఊర్ధ్వేన ప్రస్థితా స్తస్య దివ్యజ్వాలాః దివంగతాః ।
హాహాకారస్తదా జాతో దేవాసురకృతో మహాన్ ॥ 77 ॥

శరమస్తమ్భయద్రుద్రో మాహేశ్వరపురోత్తమే ।
ఏవం వృత్తం తదా తస్మిన్ పర్వతేఽమరకంటకే ॥ 78 ॥

ఓ రాజేంద్రా! ఆ విధముగా దహించివేయబడిన తర్వాత ఆ అమరకంటకపర్వతమున కోటిరుద్రులు ప్రతిష్ఠింపబడినారు. జ్వలించుచూ ఆకాశమునుండి పడుట వలన ఆ స్థలము జ్వాలేశ్వరమనబడెను. వాటిలో మండుతున్న జ్వాలలు కొన్ని ఊర్ధ్వమార్గాన పైకివెళ్ళి స్వర్గలోకమునకు చేరెను. దానితో అక్కడ దేవతలు కొంతమంది దివ్యత్వాన్ని పొందిన అసురులు కూడ హాహాకారములు చేసిరి. అపుడు ఉత్తమమైన మాహేశ్వరపురము వైపు వెళ్ళుచున్న బాణమును రుద్రుడు స్తంభింపజేసెను. ఇట్లు పూర్వము అమరకంటకపర్వతమున జరిగిన వృత్తాన్తమిది.

చతుర్దశాఖ్యం భువనం స భుక్త్వా పాండునందన ।
వర్షకోటిసహస్రం తు త్రింశత్కోట్యస్తథా పరాః ॥ 79 ॥

తతో మహీతలం ప్రాప్య రాజా భవతి ధార్మికః ।
పృథివీమేకచ్ఛత్రేణ భుంక్తే స తు న సంశయః ॥ 80 ॥

పాండునందనా! పైన చెప్పిన విధముగా అమరకంటకమున ఉపవాసాది వ్రతములాచరించి శివుని అర్చించిన వాడు వేయి ముప్పది కోట్ల సంవత్సరముల పాటు చతుర్దశభువనములందు అనేక సుఖములననుభవించును. తర్వాత ధరణీతలమున ఒక గొప్ప ధార్మికుడైన రాజుగా జన్మించి పృథివినంతటిని ఏకచ్ఛత్రముగా పరిపాలించును. దీనిలో సంశయము లేదు.

ఏవం పుణ్యో మహారాజ పర్వతోఽమరకంటకః ।
చంద్ర సూర్యోపరాగే తు గచ్ఛేద్యోఽమరకంటకమ్ ॥ 81 ॥

అశ్వమేధా ద్దశగుణం ప్రవదన్తి మనీషిణః ।
స్వర్గలోకమవాప్నోతి దృష్ట్వా తత్ర మహేశ్వరమ్ ॥ 82 ॥

మహారాజా! ఈ విధముగా అమరకంటకము అత్యన్తపుణ్యకరమైనట్టిది. చంద్ర సూర్యగ్రహణ కాలములందు అమరకంటకమునకు వెళ్ళినచో అశ్వమేధ ఫలముకంటే పదిరెట్లు అధిక పుణ్యమునిచ్చునని విద్వాంసులు చెప్పుదురు. అక్కడ ఆ మహేశ్వరుని దర్శనము చేసుకున్నవారు స్వర్గలోకమునకు వెళ్ళుదురు.

బ్రహ్మహత్యా గమిష్యన్తి రాహుగ్రస్తే దివాకరే ।
తదేవం నిఖిలం పుణ్యం పర్వతేఽమరకంటకే ॥ 83 ॥

మనసాఽపి స్మరేద్యస్తం గిరిం త్వమరకంటకమ్ ।
చాంద్రాయణం శతం సాగ్రం లభతే నాత్ర సంశయః ॥ 84 ॥

రాహుగ్రస్త సూర్యగ్రహణసమయమున అమరకంటకమును దర్శించినచో బ్రహ్మహత్యా సదృశపాపములు కూడ నివృత్తములగును. ఇట్లు అమరకంటకమున అంతా పుణ్యమేనని తెలియుచున్నది. మనస్సుతో అమరకంటక గిరిని తలచినను వంద చాంద్రాయణవ్రతములు ఆచరించినంత పుణ్యము లభించును. దీనిలో సందేహము లేదు.

త్రయాణామపి లోకానాం విఖ్యాతోఽమరకంటకః ।
ఏష పుణ్యో గిరిశ్రేష్ఠః సిద్ధగంధర్వసేవితః ॥ 85 ॥

నానాద్రుమలతాకీర్ణో నానాపుష్పోపశోభితః ।
మృగవ్యాఘ్రసహస్రైస్తు సేవ్యమానో మహాగిరిః ॥ 86 ॥

ముల్లోకములందు ఈ అమరకంటకము అతిప్రసిద్ధము. ఇది పుణ్యప్రదమైన గిరిశ్రేష్ఠము, సిద్ధగంధర్వాదుల చేత సేవింపబడునది. అనేకవిధములైన వృక్షములతో లతలతో పరివ్యాప్తమైనది. అనేకవిధపుష్పములచేత అలంకరింపబడినది. సహస్రాధిక మృగములు వ్యాఘ్రములు ఈ మహాగిరిని ఆశ్రయించి ఉండును.

యత్ర సన్నిహితో దేవో దేవ్యా సహ మహేశ్వరః ।
బ్రహ్మా విష్ణుస్తథా చేంద్రో విద్యాధరగణైః సహ ॥ 87 ॥

ఋషిభిః కిన్నరైర్యక్షైః నిత్యమేవ నిషేవితః ।
వాసుకిః సహితస్తత్ర క్రీడతే యన్నగోత్తమే ॥ 88 ॥

ప్రదక్షిణం తు యః కుర్యాత్పర్వతే ఽమరకంటకే ।
పౌండరీకస్య యజ్ఞస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥ 89 ॥

ఈ అమరకంటకమున పార్వతీసహితుడైన పరమేశ్వరుడు ఎల్లప్పుడు నివసించును. అంతేకాక బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, విద్యాధరులు, ఋషులు, కిన్నరులు, యక్షులు మొదలగు వారందరూ ఈ గిరిని ఆశ్రయించియుందురు. వాసుకి మిగతా సర్పదేవతలతో కూడ అమరకంటకమున క్రీడించుచుండును. ఈ అమరకంటకమునకు ఎవరైతే ప్రదక్షిణము చేయుదురో వారికి పౌండరీకయజ్ఞము చేసినంత పుణ్యము (ఫలము) లభించును.

తత్ర జ్వాలేశ్వరం నామ తీర్థం సిద్ధనిషేవితమ్ ।
తత్ర స్నాత్వా దివం యాన్తి యే మృతాస్తేఽపునర్భవాః ॥ 90 ॥

జ్వాలేశ్వరే మహారాజ యస్తు ప్రాణాన్ పరిత్యజేత్ ।
చంద్రసూర్యోపరాగేషు తస్యాపి శృణు యత్ఫలమ్ ॥ 91 ॥

సర్వకర్మవినిర్ముక్తో జ్ఞానవిజ్ఞాన సంయుతః ।
రుద్రలోకమవాప్నోతి యావదాభూతసంప్లవమ్ ॥ 92 ॥

ఆ అమరకంటకసమీపమున సిద్ధులచే సేవింపబడు 'జ్వాలేశ్వరం' అనే తీర్థము కలదు. దానియందు స్నానము చేసినవారు స్వర్గలోకమునకు వెళ్ళుదురు. అక్కడ మృతి చెందినవారికి పునర్జన్మ ఉండదు. ఓ మహారాజా! ఆ జ్వాలేశ్వరతీర్థమున చంద్రసూర్యగ్రహణాదుల సమయమున మృతి చెందినవాడు పొందు ఫలమును చెప్పెద వినుము. అతడు సర్వకర్మవినిర్ముక్తుడై జ్ఞానవిజ్ఞాన సంయుతుడగును. ప్రళయకాలపర్యన్తము రుద్రలోకమునే సుఖించును.

అమరేశ్వరదేవస్య పర్వతస్య ఉభే తటే ।
తత్ర తా ఋషికోట్యస్తు తపస్తప్యన్తి సువ్రత ॥ 93 ॥

సమన్తా ద్యోజనక్షేత్రో గిరిశ్చామరకంటకః ॥ 94 ॥

అకామో వా సకామో వా నర్మదాయా శుభే జలే ।
స్నాత్వా తైర్ముచ్యతే పాపైః రుద్రలోకం స గచ్ఛతి ॥ 95 ॥

సువ్రతా! అమరేశ్వరదేవుని పర్వతమునకు రెండుప్రక్కలయందును కోట్లాది ఋషులు తపస్సు చేయుచుందురు. అమరకంటకమునకు చుట్టు యోజనదూరములో నున్న నర్మదానదియొక్క శుభప్రదమైన జలమందు స్నానము చేసినవాడు కోరికలున్నవాడైననూ లేనివాడైననూ సర్వపాపములనుండి విముక్తుడై రుద్రలోకమునకు చేరును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ఈశ్వరకృత బాణాసురత్రిపుర దహనే అష్టాశీత్యధికశతతమోఽధ్యాయః ॥188॥

శ్రీమత్స్యమహాపురాణమున ఈశ్వర కృత బాణాసుర త్రిపుర దహనమనే

నూట ఎనబై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోననవత్యధికశతతమోఽధ్యాయః – నూటఎనబై తొమ్మిదవ అధ్యాయం

కావేరీసంగమమహత్త్వమ్ – కావేరీ సంగమ మహత్త్వం

సూత ఉవాచ – సూత మహర్షి చెప్పాడు.

పృచ్ఛన్తి తే మహాత్మానో మార్కండేయం మహామునిమ్ ।
యుధిష్ఠిరపురోగాస్తే ఋషయశ్చ తపోధనాః ॥ 1 ॥

ఆఖ్యాహి భగవన్ తథ్యం కావేరీసంగమో మహాన్ ।
లోకానాం చ హితార్థాయ అస్మాకం చ వివృద్ధయే ॥ 2 ॥

సదా పాపరతా యే చ నరా దుష్కృతకారిణః ।
ముచ్యన్తే సర్వపాపేభ్యో గచ్ఛన్తి పరమం పదమ్ ॥
ఏతదిచ్ఛామ విజ్ఞాతుం భగవన్వక్తుమర్హసి ॥ 3 ॥

యుధిష్ఠిరుని అనుసరించి మహాత్ములు తపోధనులూ అయిన ఋషులందరూ మార్కండేయ మహామునిని ఇట్లడిగిరి. భగవన్! లోకములహితము కొరకు, మా అందరి అభివృద్ధి కొరకు మహత్తరమైనట్టి కావేరి సుగమ వృత్తాంతము సవివరముగా తెలుపుమని ప్రార్థించిరి. ఎల్లప్పుడు పాపరతులై దుష్కర్మలనాచరించు నరులు సర్వపాపముల నుండి ముక్తులై ఉత్తమగతిని ఎట్లు పొందుదురో అను విషయమును తెలిసికోగోరుచున్నాము, ఓ భగవాన్! మాకు తెలుపుటకు నీవే యోగ్యుడవు.

మార్కండేయ ఉవాచ – మార్కండేయమహర్షి చెప్పెను.

శృణ్వన్త్వవహితాః సర్వే యుధిష్ఠిరపురోగమాః ।
అస్తి వీరో మహాయక్షః కుబేరః సత్యవిక్రమః ॥ 4 ॥

ఇదం తీర్థమనుప్రాప్య రాజా యక్షాధిపోఽభవత్ ।
సిద్ధిం ప్రాప్తో మహారాజః తన్మే నిగదతః శృణు ॥ 5 ॥

యుధిష్ఠిరపురోగములైన ఓ మహానుభావులారా ! సావధానచిత్తులై మీరంతా వినుడు. పూర్వము వీరుడు సత్యవిక్రముడూ అయిన కుబేరుడనే మహాయక్షుడుండెను. అతను ఈ తీర్థమునకు వచ్చిన తర్వాత యక్షులకు రాజయ్యెను. ఆ మహారాజు ఎట్లు సిద్ధిని పొందెనో వివరించెదను, మీరు వినండి అని మార్కండేయుడు యుధిష్ఠిరాదులకు ఆ వృత్తాంతము చెప్పుట నారంభించెను.

కావేరీ నర్మదా యత్ర సంగమో లోకవిశ్రుతః ।
తత్ర స్నాత్వా శుచిర్భూత్వా కుబేరః సత్యవిక్రమః ॥ 6 ॥

తపోఽతప్యత యక్షేంద్రః దివ్యం వర్షశతం మహత్ ।
తస్య తుష్టో మహాదేవః ప్రదాతుం వరముత్తమమ్ ॥ 7 ॥

భో భో యక్ష మహాసత్త్వ వరం బ్రూహి యథేప్సితమ్ ।
బ్రూహి కార్యం యథేష్టం తు యద్వా మనసి వర్తతే ॥ 8 ॥

లోకవిఖ్యాతమైన కావేరీ నర్మదానదుల పవిత్రసంగమము ఎక్కడైతే కలదో అక్కడ స్నానము చేసి శుచిమంతుడై సత్యపరాక్రముడు యక్షేంద్రుడూ అయిన కుబేరుడు నూరు దివ్య సంవత్సరముల పర్యంతము మహత్తరమైన తపస్సు చేసెను. దానితో సంతుష్టుడైన మహాదేవుడు ఉత్తమమైన వరమతనికి ఇవ్వదలచి ఓ యక్షా! మహాసత్త్వా! నీకు ఈప్సితమైన వరమేది కావలెనో తెలుపుము, నీ మనస్సునందలి కోరికను యథేష్టముగా తెలుపుము.

కుబేర ఉవాచ - కుబేరుడు చెప్పాడు.

యది తుష్టోఽసి మే దేవ యది దేయో వరో మమ ।
అద్యప్రభృతి సర్వేషాం యక్షాణామధిపో భవ ॥ 9 ॥

దేవా! నా తపస్సుచే సంతుష్టుడవైనదా నాకు వరమీయదలచినచో "ఇప్పటినుండి నన్ను యక్షులందరికిని రాజును" అయ్యే వరమిమ్ము అని కుబేరుడు మహాదేవునికి విన్నవించెను.

కుబేరస్య వచః శ్రుత్వా పరితుష్టో మహేశ్వరః ।
ఏవమస్తు తతో దేవస్తత్రైవాంతరధీయత ॥ 10 ॥

సోఽపి లబ్ధవరో యక్షః శీఘ్రం యక్షకులం గతః ।
పూజితః స తు యక్షైశ్చ హ్యభిషిక్తస్తు పార్థివ ॥ 11 ॥

కుబేరునియొక్క మాటలు వినిన మహేశ్వరుడు పరితుష్టుడై అట్లే అగుగాక యని ఆశీర్వదించి అంతర్ధానము చెందెను. ఆ విధముగా వరము పొందిన యక్షుడు వెంటనే యక్షుల నివాసస్థానమునకు వెళ్ళెను. అచ్చట యక్షులందరిచే పూజింపబడినవాడై యక్షులందరికి రాజుగా అభిషిక్తుడయ్యెను.

కావేరీసంగమం తత్ర సర్వపాపప్రణాశనమ్ ।
యే నరా నాభిజానన్తి వంచితాస్తే న సంశయః ॥ 12 ॥

తస్మాత్సర్వప్రయత్నేన తత్ర స్నాయీత మానవః ।
కావేరీ చ మహాపుణ్యా నర్మదా చ మహానదీ ॥ 13 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర హ్యర్చయేద్ వృషభధ్వజమ్ ।
అశ్వమేధఫలం ప్రాప్య రుద్రలోకే మహీయతే ॥ 14 ॥

అచ్చటి ఆ కావేరీసంగమము సర్వపాపప్రణాశనము కావించునట్టిది, ఇది తెలియని నరులు వంచితులే అనుటలో సందేహము లేదు. కావున ఎంతటి ప్రయత్నమైననూ చేసి మానవుడు అచ్చట స్నానము చేయవలెను.

కావేరీ నర్మదా నదులు రెండును మహాపుణ్యప్రదములు. రాజేంద్రా! అక్కడ స్నానమాచరించి వృషభధ్వజుడైన పరమేశ్వరుని పూజించవలెను. అట్లు పూజించినచో అది అశ్వమేధయాగముతో సమానమైన ఫలమునిచ్చి రుద్రలోకమునకు తీసుకువె ళ్ళును.

అగ్నిప్రవేశం యః కుర్యాద్యశ్చ కుర్యాదనాశకమ్ ।
అనివర్త్యా గతిస్తస్య యథా మే శంకరోఽబ్రవీత్ ॥ 15 ॥

సేవ్యమానో వరస్త్రీభిః క్రీడతే దివి రుద్రవత్ ।
షష్టివర్షసహస్రాణి షష్టికోట్యస్తథా పరః ॥ 16 ॥

మోదతే రుద్రలోకస్థో యత్ర తత్రైవ గచ్ఛతి ।
పుణ్యక్షయాత్ పరిభ్రష్టో రాజా భవతి ధార్మికః ॥ 17 ॥

భోగవాన్ దానశీలశ్చ మహాకులసముద్భవః ।
తత్ర పీత్వా జలం సమ్యక్ చాంద్రాయణఫలం లభేత్ ॥ 18 ॥

ఆ సంగమప్రదేశమున అగ్నిప్రవేశము ద్వారా గాని నిరాహారాదుల ద్వారా ప్రాయోపవేశముతో కాని దేహత్యాగము చేసినవాడికి అనివర్తితమైన గతి లభించునని నాకు సాక్షాత్తూ శంకరుడే చెప్పాడు. అటువంటి పురుషుడు సుందరీమణులైన స్త్రీలతో సేవింపబడుచు రుద్రుని వలే స్వర్గలోకసుఖముననుభవించును. మరియు రుద్రలోకమునందు నివసించుచు తాను కోరిన చోటికల్లా పోవుచు యథేచ్ఛగా సంచరించుచు అరువదికోట్ల అరువది వేల సంవత్సరముల పర్యంతము రుద్రలోకముననే సకలసుఖములననుభవించును. మరల పుణ్యక్షయానంతరము రుద్రలోకమునుండి పరిభ్రష్టుడై ధార్మికుడైన రాజుగా జన్మించును. అతను భోగవంతుడు, దానశీలుడు, మరియు మహాకుల సముద్భవుడు కూడ కాగలడు. ఆ సంగమప్రాంతపు నీటిని త్రాగినవారు చాంద్రాయణవ్రత మాచరించినంత పుణ్యము పొందుదురు.

స్వర్గం గచ్ఛన్తి తే మర్త్యా యే పిబంతి శుభం జలమ్ ।
గంగాయమునయోర్మధ్యే యత్ఫలం ప్రాప్నుయాన్నరః ॥
కావేరీసంగమే స్నాత్వా తత్ఫలం తస్య జాయతే ॥ 19 ॥

ఏవమాది తు రాజేంద్ర కావేరీసంగమే మహత్ ।
పుణ్యం మహత్ఫలం తత్ర సర్వపాపప్రణాశనమ్ ॥ 20 ॥

ఇంకనూ ఇక్కడి శుభ్రమైన జలమును త్రాగినటువంటి మర్త్యులు స్వర్గలోకప్రాప్తిని పొందుదురు. కావేరీ సంగమమున స్నానము చేసిన నరుడు గంగాయమునాసంగమమున స్నానమాచరించిన పుణ్యమును పొందును. ఓ రాజేంద్రా! కావేరీనర్మదాసంగమమహత్త్వము అత్యంతపుణ్యప్రదమైనది, మహాఫలప్రదమైనది, సర్వపాపములనూ నశింపజేయునది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే కావేరీ సంగమ మహత్త్వే ఏకోననవత్యధికశతతమోఽధ్యాయః ॥189॥

శ్రీమత్స్యమహాపురాణమున కావేరీ సంగమ మహత్త్వమునందు కావేరీసంగమమహత్త్వమనే
నూట ఎనబై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

నవత్యధికశతతమోఽధ్యాయః – నూట తొంభయ్యవ అధ్యాయం

యంత్రేశ్వరతీర్థాది వర్ణనమ్ – యంత్రేశ్వరాదితీర్థముల వర్ణనం

మార్కండేయ ఉవాచ – మార్కండేయ మహర్షి చెప్పెను.

నర్మదా చోత్తరే కూలే తీర్థం యోజనవిస్తృతమ్ ।
యన్త్రేశ్వరేతి విఖ్యాతం సర్వపాపహరం పరమ్ ॥ 1 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ దైవతైః సహ మోదతే ।
పంచవర్షసహస్రాణి క్రీడతే కామరూపధృక్ ॥ 2 ॥

గర్జనం చ తతో గచ్ఛేద్యత్ర మేఘచయోత్థితః ।
ఇంద్రజిన్నామ సంప్రాప్తః తస్య తీర్థప్రభావతః ॥ 3 ॥

నర్మదానదికి ఉత్తరతీరమునఒక యోజనవిస్తారమగు యంత్రేశ్వరమను ప్రఖ్యాతమైనటువంటి సర్వపాపములను పోగొట్టునటువంటి గొప్ప తీర్థము కలదు. అక్కడ స్నానమాచరించిన నరుడు ఓ రాజా! దేవతలతో సహ ఆనందిస్తాడు మరియు ఐదు వేల సంవత్సరములవరకు తనకిష్టమైన రూపమును ధరించి సుఖము పొందును. తర్వాత 'గర్జన' మనే తీర్థము కలదు. అచ్చట మేఘముల సమూహములు పైన తిరుగుతూ కనబడును. ఆ తీర్థము యొక్క ప్రభావమువలననే మేఘనాథుడు ఇంద్రజిత్తు అను నామమును పొందెను.

మేఘనాదం తతో గచ్ఛేద్యత్ర మేఘానుగర్జితమ్ ।
మేఘనాదో గణస్తత్ర పరమాం గణతాం గతః ॥ 4 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర తీర్థమామ్రాతకేశ్వరమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ గోసహస్రఫలం లభేత్ ॥ 5 ॥

నర్మదోత్తరతీరేతు తీర్థం తు విశ్రుతం భవేత్ ।
తస్మింస్తీర్థే నరః స్నాత్వా తర్పయేత్పితృదేవతాః ॥ 6 ॥

సర్వాన్కామానవాప్నోతి మనసా మే విచిన్తితాః ।

తర్వాత మేఘనాదమనే తీర్థమునకు వెళ్ళవలెను. అక్కడ మేఘగర్జనములు వినబడుచుండును. ఆ తీర్థమును పూజించుట వలననే మేఘుడు అను పరమశివుని గణములలో ఒకడు గణాధ్యక్షతను పొందెను. ఓ రాజేంద్రా! అక్కడి నుండి 'ఆమ్రాతకేశ్వరము' అనే తీర్థమునకు వెళ్ళవలసినది. అక్కడ స్నానమాచరించిన నరునికి సహస్రగోదానాలతో సమానమైన ఫలము లభించును. అటు తర్వాత నర్మదానదికి ఉత్తరభాగమున 'విశ్రుతమ్' అనే తీర్థము కలదు.దానియందు స్నానము చేసి నరుడు పితృతర్పణము చేయవలసినది. అట్లాచరించినవారు స్వమనోభీష్టం మేరకు అన్ని కోరికలను తీర్చుకోగలరు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర బ్రహ్మావర్తమితి శ్రుతమ్ ॥ 7 ॥

తత్ర సన్నిహితో బ్రహ్మా నిత్యమేవ యుధిష్ఠిర ॥
తత్ర స్నాత్వా తు రాజేంద్ర బ్రహ్మలోకే మహీయతే ॥ 8 ॥

తతోఽగారేశ్వరం గచ్ఛేన్నియతో నియతాశనః ॥
సర్వపాపవినిర్ముక్తో రుద్రలోకం స గచ్ఛతి ॥ 9 ॥

రాజేంద్రా! దాని తర్వాత బహ్మావర్తమను తీర్థము కలదు, యుధిష్ఠిరా! బ్రహ్మదేవుడు సాక్షాత్తూ ఆ తీర్థము దగ్గర ఉండును. ఆ తీర్థమందు స్నానము చేసినచో బ్రహ్మలోకప్రాప్తిని మానవుడు పొందును. తర్వాత అగారేశ్వరము (అంగారేశ్వరము, గాణేశ్వరమని కూడ అందురు) అను తీర్థము కలదు. నియతాహారుడై నరుడు ఆ తీర్థమును దర్శించినచో సర్వపాపముల నుండి ముక్తుడై రుద్రలోకమునకు పోవును.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర కపిలాతీర్థముత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ కపిలాదాన మాప్నుయాత్ ॥ 10 ॥

గచ్ఛేత్కరంజతీర్థం తు దేవర్షిగణసేవితమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ గోలోకం సమవాప్నుయాత్ ॥ 11 ॥

రాజేంద్రా! తదనన్తరం ఉత్తమమైనట్టి కపిలాతీర్థము కలదు. ఆ తీర్థమునందు స్నానము చేసినచో ఓ రాజా! కపిలవర్ణము గల గోవును దానము చేసిన పుణ్యము లభించును. తర్వాత దేవర్షి గణములతో సేవింపబడునట్టి కరంజతీర్థము కలదు. అచ్చట స్నానమాచరించినచో నరుడు గోలోకమును పొందును.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర కుండలేశ్వరముత్తమమ్ ।
తత్ర సన్నిహితో రుద్రస్తిష్ఠతే హ్యుమయా సహ ॥ 12 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర హ్యవధ్యస్త్రిదశైరపి ।
పిప్పలేశం తతో గచ్ఛేత్సర్వపాపప్రణాశనమ్ ॥ 13 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర రుద్రలోకే మహీయతే ।

తదనన్తరము అచ్చటనే ఉన్న ఉత్తమమైన కుండలేశ్వరతీర్థమును దర్శించవలసినది. ఉమాసహితుడై పరమేశ్వరుడు సదా అచ్చట నివసించుచుండును. కుండలేశ్వరమున స్నానమాచరించినవారిని దేవతలు కూడ వధించలేరు. రాజేంద్రా! తర్వాత సర్వపాపప్రణాశిని యగు పిప్పలేశతీర్థము కలదు. దానియందు స్నానము చేసినవారికి రుద్రలోకము ప్రాప్తించును.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర విమలేశ్వర ముత్తమమ్ ॥ 14 ॥
తత్ర దేవశిలా రమ్యా చేశ్వరేణ వినిర్మితా ।
తత్ర ప్రాణపరిత్యాగాద్రుద్రలోకమవాప్నుయాత్ ॥ 15 ॥

తతః పుష్కరిణీం గచ్ఛేత్తత్ర స్నానం సమాచరేత్ ।
స్నానమాత్రో నరస్తత్ర హీంద్రస్యార్ధాసనం లభేత్ ॥ 16 ॥

అచ్చటనే ఉత్తమమైన విమలేశ్వరమనే తీర్థము కలదు. ఆ తీర్థమునందు స్వయముగా ఈశ్వరునిచేత నిర్మింపబడిన రమ్యమైన దేవశిల ఒకటి కలదు. ఆ ప్రదేశమున ప్రాణపరిత్యాగము చేసినవారు రుద్రలోకమునే పొందుదురు. అటు తర్వాత పుష్కరిణీతీర్థము కూడ కలదు, దానియందు స్నానమాచరించినంత మాత్రముననే ఇంద్రుని అర్ధాసనమును నరుడు పొందును.

నర్మదా సరితాం శ్రేష్ఠా రుద్రదేహాద్వినిఃసృతా ।
తారయేత్సర్వభూతాని స్థావరాణి చరాణి చ ॥ 17 ॥

సర్వదేవాధిదేవేన ఈశ్వరేణ మహాత్మనా ।
కథితా ఋషిసంఘేభ్యో హ్యస్మాకం చ విశేషతః ॥ 18 ॥

నదులలో శ్రేష్ఠమైనటువంటి నర్మద సాక్షాత్తు రుద్రుని దేహమునుండి వెలువడినది. ఈ నది స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తులోని సర్వప్రాణులనూ తరింపజేయగలది. సర్వదేవాధిదేవుడు, మహాత్ముడూ అయిన ఈశ్వరుని చేత ఋషిసమూహములకు ముఖ్యంగా మాకు ఇదంతయూ వివరింపబడినది.

మునిభిః సంస్తుతా హ్యేషా నర్మదా ప్రవరా నదీ ।
రుద్రదేహాద్వినిష్క్రాన్తా లోకానాం హితకామ్యయా ॥ 19 ॥

సర్వపాపహరా నిత్యం సర్వదేవనమస్కృతా ।
సంస్తుతా దేవగంధర్వైరప్సరోభిస్తథైవ చ ॥ 20 ॥

రుద్రుని దేహమునుండి లోకముల హితముకొరకై వెలువడిన శ్రేష్ఠమైన ఈ నర్మదానది మునులుచేత స్తుతింపబడినది. సర్వపాపములను హరించునటువంటి, నిత్యమూ సర్వదేవతలచేత నమస్కరింపబడునటువంటిది అయిన ఈ నర్మదానది దేవతలు, గంధర్వులు మరియు అప్సరసలచేత స్తుతింపబడినది.

నమః పుణ్యజలే హృద్యే నమః సాగరగామినీ ।
నమస్తే పాపశమని నమో దేవి వరాననే ॥ 21 ॥

నమోఽస్తు తే ఋషిగణసిద్ధసేవితే నమోఽస్తు తే శంకరదేహనిఃసృతే ।
నమోఽస్తు తే ధర్మభృతాం వరప్రదే నమోఽస్తు తే సర్వపవిత్రపావనే ॥ 22 ॥

పుణ్యజలా! హృద్యా! సాగరగామినీ! పాపశమనీ! వరాననా! దేవీ! ఋషిగణములచేత సిద్ధులచేత సేవింపబడుదానా! శంకరుని దేహమునుండి నిర్గతమైనదానా! ధర్మాచరణులకు వరమునొసంగుదానా! సర్వపవిత్రపావనా! ఓ నర్మదా నదీ! నీకు నమస్సులు.

యస్త్విదం పఠతే స్తోత్రం నిత్యం శ్రద్ధాసమన్వితః ।
బ్రాహ్మణో వేదమాప్నోతి క్షత్రియో విజయీ భవేత్ ॥ 23 ॥

వైశ్యస్తు లభతే లాభం శూద్రశ్చైవ శుభాం గతిమ్ ।
అర్థార్థీ లభతే హ్యర్థం స్మరణాదేవ నిత్యశః ॥ 24 ॥

నర్మదాం సేవతే నిత్యం స్వయందేవో మహేశ్వరః ।
తేన పుణ్యా నదీ జ్ఞేయా బ్రహ్మహత్యాపహారిణీ ॥ 25 ॥

నిత్యమూ శ్రద్ధాసమన్వితులై ఈ స్తోత్రమును పఠించినచో బ్రాహ్మణుడు వేదమును పొందును. క్షత్రియుడు విజయము పొందును. వైశ్యుడు లాభమును, శూద్రుడు సుఖమును పొందును. నిత్యమూ స్మరించినంతమాత్రముననే ధనమును కోరువాడు ధనమును పొందుతాడు. కావున ఇది పుణ్యతమమైన నది యని బ్రహ్మహత్యాపాపమును కూడ నశింపజేయునని తెలిసికోవలసినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నర్మదామాహాత్మ్యే (మం)యంత్రేశ్వరతీర్థాదివర్ణనం నామ నవత్యధిక శతతమోఽధ్యాయః

ఇట్లు శ్రీ మత్స్య మహాపురాణమున నర్మదామాహాత్మ్యమునందు (మ)యంత్రేశ్వరాది తీర్థాల వర్ణనమనే నూట తొంబైయవ అధ్యాయం సమాప్తం.



ఏకనవత్యధికశతతమోఽధ్యాయః - నూటతొంబై ఒకటవ అధ్యాయం

శూలభేద-భీమేశ్వర-నారదేశ్వరాద్యనేకతీర్థవర్ణనమ్

శూలభేద-భీమేశ్వర-నారదేశ్వరాద్యనేకతీర్థవర్ణనం

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

తదా ప్రభృతి బ్రహ్మాద్యాః ఋషయశ్చ తపోధనాః ।
సేవన్తే నర్మదాం రాజన్ రాగక్రోధవివర్జితాః ॥ 1 ॥

ఓ రాజా! అప్పటి నుండి బ్రహ్మాది దేవతలు, తపోధనులైన ఋషులు రాగక్రోధవివర్జితులై నర్మదానదిని సేవించుచున్నారు. అని మార్కండేయుడు ధర్మరాజునకు చెప్పెను.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడు చెప్పాడు.

కస్మిన్నిపతితం శూలం దేవస్య తు మహీతలే ।
తత్ర పుణ్యం సమాఖ్యాహి యథావన్మునిసత్తమ! ॥ 2 ॥

ఓ మునిశ్రేష్ఠా! ఈ మహీతలమునందు ఏ తీర్థము నందు మహాదేవుని శూలము పడెనో దాని యొక్క పుణ్యమును, మహత్త్వమును వివరింపుమని ధర్మరాజు మార్కండేయుని అడిగెను.

మార్కండేయ ఉవాచ - మార్కండేయుడు చెప్పాడు.

శూలభేదమితి ఖ్యాతం తీర్థం పుణ్యతమం మహత్ ।
తత్ర స్నాత్వార్చయేద్దేవం గోసహస్రఫలం లభేత్ ॥ 3 ॥

త్రిరాత్రం కారయేద్యస్తు తస్మింస్తీర్థే నరాధిప ।
అర్చయిత్వా మహాదేవం పునర్జన్మ న విద్యతే ॥ 4 ॥

అది శూలభేదమనే అత్యంత పుణ్యప్రదమైన ప్రఖ్యాతమైన తీర్థము. దానిలో స్నానము చేసి మహాదేవుని పూజించినచో సహస్రగోదానఫలముతో సమమైన పుణ్యము లభించును. మరియు ఓ నరాధిపా! ఆ తీర్థమునందు మూడు రాత్రులు దీక్ష చేసి మహాదేవుని అర్చించినచో పునర్జన్మముండదు.

భీమేశ్వరం తతో గచ్ఛేన్నారదేశ్వరముత్తమమ్ ।
ఆదిత్యేశం మహాపుణ్యం తథా ఘృతమధుస్రవమ్ ॥ 5 ॥

నందికేశం పరిష్వజ్య పర్యాప్తం జన్మనః ఫలమ్ ।
వరుణేశం తతః పశ్యేత్స్వతన్త్రేశ్వరమేవ చ ॥
సర్వతీర్థఫలం తస్య పంచాయతన దర్శనాత్ ॥ 6 ॥

అటు తర్వాత భీమేశ్వరము, ఉత్తమమైన నారదేశ్వర తీర్థములు కలవు. అచ్చటనే మహాపుణ్యప్రదమైన ఆదిత్యేశ్వర తీర్థము కలదు. దానియందు స్నానమాచరించినచో సమస్త పాపములూ నశించును. తర్వాత నందికేశ్వర తీర్థమున స్నానమాచరించినచో జన్మసాఫల్యమగును. అటుపిమ్మట వరుణేశ్వర తీర్థము మరియు స్వతంత్రేశ్వర తీర్థములయందు స్నానము చేసి శివపంచాయ తనము అనగా శివలింగముతో పాటు పార్వతీదేవి, వినాయకుడు, ఆదిత్యుడు, విష్ణువు మొదలగు వారున్న ఆలయమును దర్శించినచో సర్వతీర్థములను దర్శనము చేసుకున్న పుణ్యము లభించును.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర యుద్ధం తత్ర సుసాధితమ్ ।
కోటితీర్థం తు విఖ్యాతం అసురా యత్ర మోహితాః ॥ 7 ॥

యత్రైవ నిహతా రాజన్ దానవా బలదర్పితాః ।
తేషాం శిరాంస్యగృహ్ణంత సర్వే దేవాః సమాగతాః ॥ 8 ॥

తైస్తు సంస్థాపితో దేవః శూలపాణిర్వృషధ్వజః ।
కోటిర్వినిహతా తత్ర తేన కోటీశ్వరః స్మృతః ॥ 9 ॥

దర్శనాత్తస్య తీర్థస్య సదేహః స్వర్గమారుహేత్ ।

తదనంతరము ఓ రాజా! విఖ్యాతమైన కోటి తీర్థమునకు వెళ్ళవలసినది. అచ్చటనే పూర్వము దేవదానవులకు యుద్ధము జరిగినది. ఆ యుద్ధమునందు కోట్యాది అసురులు మూర్ఛిల్లిరి. అక్కడనే బలదర్పితులైన అనేక మంది రాక్షసులు వధింపబడిరి. అచ్చటనే అసురుల యొక్క శిరస్సులను దేవతలు ఖండించిరి. అటు పిమ్మట వృషధ్వజుడు శూలపాణియైన మహాదేవుడు అచ్చట ప్రతిష్ఠింపబడెను. ఆ ప్రదేశమున కోటి మంది దానవులు సంహరింపబడిరి. కావుననే ఆ స్థలమునకు కోటితీర్థమను పేరు ఏర్పడెను. కోటితీర్థమును దర్శించుకొనిన మాత్రముననే మానవుడు సశరీరుడై స్వర్గలోకమునకు వెళ్ళును.

యదాత్విన్ద్రేణ క్షుద్రత్వాద్వజ్రం కీలేన యన్త్రితమ్ ॥ 10 ॥

తదా ప్రభృతి లోకానాం స్వర్గమార్గో నివారితః ।
సఘృతం శ్రీఫలం జగ్ధ్వా కృత్వా చైవ ప్రదక్షిణమ్ ॥ 11 ॥

పార్వతం సహదీపం తు శిరసా చైవ ధారయేత్ ।
సర్వకామ సుసమ్పన్నో రాజా భవతి పాండవ ॥ 12 ॥

మృతో రుద్రత్వమాప్నోతి తతోఽసౌ జాయతే పునః ।
స్వర్గాదేత్య భవేద్రాజా రాజ్యం కృత్వా దివం వ్రజేత్ ॥ 13 ॥

కాని ఎప్పుడైతే ఇంద్రుడు తన క్షుద్రబుద్ధితో తన వజ్రాయుధముతో స్వర్గమార్గమును నియంత్రించెనో అప్పటి నుండి లోకులందరూ స్వర్గమునకు వెళ్ళుట నివారింపబడిరి. అయితే అచ్చట నెయ్యితో కూడిన మారేడు పండుతో హోమము చేసి, శిరస్సుపై దీపమును పెట్టుకొని పర్వతమునకు ప్రదక్షిణము చేసినవాడు సర్వకామసంపన్నుడైన రాజు కాగలడు. ఓ పాండవా! మృతుడైనవాడు సాక్షాత్తు రుద్రత్వమునే పొంది మరల

జన్మించును. స్వర్గము నుండి భూలోకమున మరల జన్మించి రాజు కాగలడు. చాలా కాలము రాజ్యపాలన చేసి పునః స్వర్గలోకమునకు పోవును.

బహునేత్రం తతఃపశ్యేత్ త్రయోదశ్యాం తు మానవః ।
స్నానమాత్రో నరస్తత్ర సర్వయజ్ఞఫలం లభేత్ ॥ 14 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర తీర్థం పరమశోభనమ్ ।
నరాణాం పాపనాశాయ హ్యగస్త్యేశ్వరముత్తమమ్ ॥ 15 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ బ్రహ్మలోకే మహీయతే ।

తర్వాత నరుడు త్రయోదశి తిథినాడు బహునేత్రమనే తీర్థమును దర్శించవలెను. ఆ తీర్థమున స్నానము చేసినవారు సర్వయజ్ఞఫలమును పొందుదురు. ఓ రాజేంద్రా! తదనన్తరము పరమశోభనమైన ఉత్తమమైన నరులందరి పాపములను నశింపజేయునట్టి అగస్త్యేశ్వరతీర్థమునకు వెళ్ళవలెను.

కార్తికస్య తు మాసస్య కృష్ణపక్షే చతుర్దశీ ॥ 16 ॥

ఘృతేన స్నాపయేద్దేవం సమాధిస్థో జితేంద్రియః ।
ఏకవింశకులోపేతో న చ్యవేదైశ్వరాత్ పదాత్ ॥ 17 ॥

ధేనుముపానహచ్ఛత్రే దద్యాచ్చ ఘృతకంబలమ్ ।
భోజనం చైవ విప్రాణాం సర్వం కోటిగుణం భవేత్ ॥ 18 ॥

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర బలాకేశ్వరముత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజసింహాసనపతిర్భవేత్ ॥ 19 ॥

మరియు అగస్త్యేశ్వరతీర్థసమీపమున కార్తీకమాసపు కృష్ణపక్ష చతుర్దశినాడు జితేంద్రియుడై పరమశివుని ఘృతముతో అభిషేకించినవాడు ఇరువది ఒక్క తరముల వరకు కూడ ఈశ్వరస్థానమైన కైలాసమునుండి చ్యుతుడు కాకుండా ఉండును. అచ్చట చేసిన గోదానము, పాదరక్షలు, ఛత్రము (గొడుగు) ఘృతము, కంబళము మొదలగు వాటి దానములు మరియు బ్రాహ్మణులకు భోజనాదులు ఇత్యాదులన్ని కోటిగుణ ఫలితము నిచ్చును. అగస్త్యేశ్వరము తర్వాత ఓ రాజా! ఉత్తమమైన బలాకేశ్వరతీర్థమునకు వెళ్ళి అక్కడ స్నానమాచరించినవాడు రాజ్య సింహాసనాధిపతి యగును.

నర్మదా దక్షిణే కూలే తీర్థం శక్రస్య విశ్రుతమ్ ।
ఉపోష్య రజనీమేకాం స్నానం తత్ర సమాచరేత్ ॥ 20 ॥

స్నానం కృత్వా యథాన్యాయమర్చయేచ్చ జనార్దనమ్ ।
గోసహస్రఫలం తస్య విష్ణులోకం స గచ్ఛతి ॥ 21 ॥

నర్మదా నది యొక్క దక్షిణతీరమున ప్రఖ్యాతి గాంచిన ఇంద్రతీర్థము కలదు. ఆ తీర్థప్రదేశమున ఒక రోజు ఉపవాసము చేసి స్నానము చేసి శాస్త్రోక్తముగా జనార్దనుని పూజించినచో సహస్రగోదానములు చేసినంత పుణ్యము పొందడమే కాక నరుడు విష్ణులోకప్రాప్తిని పొందును.

ఋషితీర్థం తతో గచ్ఛేత్సర్వపాపహరం నృణామ్ ।
స్నాతమాత్రో నరస్తత్ర గోసహస్రఫలం లభేత్ ॥ 22 ॥

దేవతీర్థం తతో గచ్ఛేద్ బ్రహ్మణా నిర్మితం పురా ।
తత్ర స్నాత్వా నరో రాజన్ బ్రహ్మలోకే మహీయతే ॥ 23 ॥

అటు తర్వాత ఋషితీర్థము కలదు. అది నరులకు సర్వపాపహరమైనట్టిది. ఆ తీర్థమున స్నానమాచరించిన మాత్రముననే సహస్రగోదాన ఫలితము ప్రాప్తించును. తదనంతరము బ్రహ్మచే స్వయంగా నిర్మించబడిన దేవతీర్థము కలదు. ఓ రాజా! అందు స్నానము చేసినవాడు బ్రహ్మలోకమును పొందును.

అమరకంటకం గచ్ఛేదమరైః స్థాపితం పురా ।
స్నాతమాత్రో నరస్తత్ర రుద్రలోకే మహీయతే ॥ 24 ॥

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర రావణేశ్వరముత్తమమ్ ।
తత్పంచాయతనం దృష్ట్వా ముచ్యతే బ్రహ్మహత్యయా ॥ 25 ॥

అచ్చటనే అమరులైన దేవతల చేత స్థాపింపబడిన అమరకంటకతీర్థము కలదు. ఆ తీర్థమున స్నానము చేసినచో నరుడు రుద్రలోకమును పొందును. తర్వాత ఓ రాజేంద్రా! ఉత్తమమైన రావణేశ్వరతీర్థమునకు వెళ్ళి అచ్చటి పంచాయతనమును దర్శించినచో బ్రహ్మహత్యాసదృశపాపము నుండి కూడ నరుడు ముక్తుడగును.

ఋణతీర్థం తతో గచ్ఛేదృణేభ్యో ముచ్యతే ధ్రువమ్ ।
వటేశ్వరం తతో దృష్ట్వా పర్యాప్తం జన్మనః ఫలమ్ ॥ 26 ॥

భీమేశ్వరం తతో గచ్ఛేత్సర్వవ్యాధివినాశనమ్ ।
స్నానమాత్రో నరో రాజన్ సర్వదుఃఖైః ప్రముచ్యతే ॥ 27 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర తురాసంగమముత్తమమ్ ।
తత్ర స్నాత్వా మహాదేవమర్చయన్ సిద్ధిమాప్నుయాత్ ॥ 28 ॥

అనంతరం నరుని ఋణములన్నింటి నుండి ముక్తిపొందింపజేయు ఋణతీర్థము, జన్మసాఫల్యమును కలిగించే వటేశ్వరతీర్థము, సర్వవ్యాధివినాశకారియగు భీమేశ్వరతీర్థము కలవు. భీమేశ్వరతీర్థమున స్నానము చేసినంత మాత్రముననే నరుడు సర్వదుఃఖ విముక్తుడు కాగలడు. అటు తర్వాత రాజేంద్రా! ఉత్తమోత్తమమైన తురాసంగమమను తీర్థము కలదు. అందు స్నానము చేసి మహాదేవుని అర్చించినవాడు సిద్ధిని పొందును.

సోమతీర్థం తతో గచ్ఛేత్ పశ్యేచ్చంద్రమనుత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ భక్త్యా పరమయా యుతః ॥ 29 ॥

తత్క్షణాద్దివ్యదేహస్థః శివవన్మోదతే చిరమ్ ।
షష్టివర్షసహస్రాణి రుద్రలోకే మహీయతే ॥ 30 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర పింగలేశ్వరముత్తమమ్ ।
అహోరాత్రోపవాసేన త్రిరాత్రఫలమాప్నుయాత్ ॥ 31 ॥

తదనంతరము సోమతీర్థము కలదు. ఆ తీర్థమున ఉత్తముడైన చంద్రుని దర్శించి పరమభక్తితో స్నానము చేసిన నరుడు దివ్యదేహమును పొంది చిరకాలము వరకు పరమశివునివలె ఆనందము పొందును. మరియు అరువయి వేల సంవత్సరముల పర్యంతము రుద్రలోకమున నివసించును. తర్వాత ఓ రాజేంద్రా! ఉత్తమమైన పింగళేశ్వరతీర్థమున స్నానము చేసినచో, అహోరాత్రోపవాసవ్రతము చేసినచో మూడు అహోరాత్రముల ఉపవాసఫలము నరుడు పొందును.

తస్మింస్తీర్థే తు రాజేంద్ర కపిలాం యః ప్రయచ్ఛతి ।
యావన్తి తస్యా రోమాణి తత్ప్రసూతికులేషు చ ॥ 32 ॥

తావద్వర్షసహస్రాణి రుద్రలోకే మహీయతే ।
యస్తు ప్రాణపరిత్యాగం కుర్యాత్తత్ర నరాధిప ॥ 33 ॥

అక్షయం మోదతే కాలం యావచ్చంద్రదివాకరౌ ।
నర్మదా తటమాశ్రిత్య తిష్ఠేయుర్యత్ర మానవాః ॥ 34 ॥

తే మృతాః స్వర్గమాయాన్తి సన్తః సుకృతినో యథా ।
సురేశ్వరం తతో గచ్ఛేన్నామ్నా కర్కోటకేశ్వరమ్ ॥ 35 ॥

గంగాఽవతరతే తత్ర దినే పుణ్యే న సంశయః ।

రాజేంద్రా! పింగళేశ్వరతీర్థమున కపిలవర్ణము గల గోవును దానము చేసినచో, దాని శరీరముపై రోమము లెన్ని కలవో అట్లే దాని వంశమున ఎన్ని గోవులు కలవో అన్ని వేల సంవత్సరముల పర్యన్తము నరుడు రుద్రలోకమున నివసించును. అంతేకాక ఓ నరాధిపా! అచ్చట ప్రాణత్యాగము చేసినవాడు సూర్యచంద్రులున్నంతకాలము అక్షయ్యమైన ఆనందము పొందును. మరియు నర్మదా నదీ తటమునకు వెళ్ళి అక్కడనే నివసించి మృతి చెందిన మానవులు సత్పురుషుల వలే పుణ్యాత్ముల వలే స్వర్గలోకమునకు పోవుదురు. తదనంతరము కర్కోటకేశ్వరమను పేరు గల సురేశ్వరతీర్థమునకు మానవుడు వెళ్ళవలెను. అచ్చట ప్రతి పుణ్యదివసము నందు సాక్షాత్తూ గంగానది అవతరించును.

నంది తీర్థం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ॥ 36 ॥

తుష్యతే తస్య నందీశః సోమలోకే మహీయతే ।
తతో దీపేశ్వరం గచ్ఛేద్వ్యాసతీర్థం తపోవనమ్ ॥ 37 ॥

నివర్తితా పురా తత్ర వ్యాసభీతా మహానదీ ।
హుంకారితా తు వ్యాసేన దక్షిణేన తతో గతా ॥ 38 ॥

ప్రదక్షిణం తు యః కుర్యాత్ తస్మింస్తీర్థే నరాధిప ।
అక్షయం మోదతే కాలం యావచ్చంద్ర దివాకరౌ ॥ 39 ॥

వ్యాసస్తస్య భవేత్ ప్రీతః ప్రాప్నుయాదీప్సితం ఫలమ్ ।
సూత్రేణ వేష్టయిత్వా తు దీపో దేయః సవేదికః ॥ 40 ॥

క్రీడతే హ్యక్షయం కాలం యథా రుద్రస్తథైవ చ ॥

అటు తర్వాత నందితీర్థము కలదు. దానిలో స్నానము చేసినచో నందీశ్వరుడు సంతోషించును. మరియు సోమలోక ప్రాప్తి కలిగించును. తర్వాత దీపేశ్వరతీర్థము కలదు. దాని తర్వాత తపోవనమని ప్రసిద్ధి చెందిన వ్యాసతీర్థము కలదు. వ్యాసుని హుంకారమునకు భయపడి ఆ మహానది తన దారి నుండి నివర్తింపబడినదై దక్షిణదిశకు మరలి ప్రవహించసాగెను. ఓ నరాధిపా! ఆ తీర్థమున ప్రదక్షిణము చేయువాడు సూర్యచంద్రులున్నంత కాలము అక్షయమైన ఆనందమును పొందును. అట్టివాని విషయమున వ్యాసుడు ప్రీతి చెంది ఈప్సితమైన ఫలమును ప్రసాదించును. వేదిక నిర్మించి దాని పైన దీపము వెలిగించి దారములతో చుట్టి దానము చేసినచో రుద్రునివలె అక్షయకాలం సుఖంగా జీవించును.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర ఐరణ్డీ తీర్థముత్తమమ్ ॥ 41 ॥

సంగమే తు నరః స్నాత్వా ముచ్యతే సర్వపాతకైః ।
ఐరణ్డీ త్రిషు లోకేషు విఖ్యాతా పాపనాశినీ ॥ 42 ॥

అథాశ్వయుజే మాసి శుక్లపక్షే తు చాష్టమీ ।
శుచి ర్భూత్వా నరః స్నాత్వా సోమవాసపరాయణః ॥ 43 ॥

బ్రాహ్మణం భోజయేదేకం కోటిర్భవతి భోజితా ।
మృత్తికాం శిరసి స్థాప్య హ్యవగాహ్య చ వై జలమ్ ॥ 44 ॥

నర్మదోదక సంమిశ్రం ముచ్యతే సర్వకిల్బిషైః ।
ప్రదక్షిణం తు యః కుర్యాత్తస్మింస్తీర్థే నరాధిప ॥ 45 ॥

ప్రదక్షిణీకృతా తేన సప్తద్వీపా వసుంధరా ।

తదనంతరము ఉత్తమమైన ఐరండీ తీర్థము కలదు. నర్మదా-ఐరండీ సంగమతీర్థప్రదేశమున స్నానము చేసినచో నరుడు సర్వపాతకముల నుండి ముక్తుడగును. ఐరండీ తీర్థము ముల్లోకముల యందు పాపనాశిని యని విఖ్యాతి గాంచినది. ఆశ్వయుజ మాసపు శుక్లపక్షములోని అష్టమీ తిథి యందు శుచిమంతుడైన నరుడు స్నానము చేసి సోమవారవ్రతము నాచరించి ఒక బ్రాహ్మణునకు భోజనము పెట్టినను అది కోటిమందికి భోజనము పెట్టిన దానితో సమానమగును. నర్మదా-ఐరండీ సంగమమున మట్టిని శిరస్సు పై పెట్టుకుని ఆ నీటిలో మునిగినచో అన్ని పాపముల నుండి ముక్తి పొందును. ఓ నరాధిపా! ఆ ప్రదేశమున ప్రదక్షిణము చేసినవారికి సప్తద్వీపములతో కూడిన భూమండలము నంతటికిని ప్రదక్షిణము చేసిన ఫలము లభించును.

తతః సువర్ణసలిలే స్నాత్వా దత్వా తు కాంచనమ్ ॥ 46 ॥

**కాంచనేన విమానేన రుద్రలోకే మహీయతే ।
తతః స్వర్గాచ్చ్యుతః కాలాద్రాజా భవతి వీర్యవాన్ ॥ 47 ॥**

**తతో గచ్ఛేచ్చ రాజేంద్ర హీక్షునద్యాస్తు సంగమమ్ ।
త్రైలోక్య విశ్రుతం దివ్యం తత్ర సన్నిహితః శివః ॥ 48 ॥**

తత్ర స్నాత్వా నరో రాజన్ గాణపత్యమవాప్నుయాత్ ।

అటు తర్వాత సువర్ణతీర్థము కలదు. ఆ తీర్థమున స్నానమాచరించి సువర్ణదానము చేసినచో సువర్ణమయ విమానము నెక్కి నరుడు రుద్రలోకము చేరును. తదనంతరము కాలవశమున స్వర్గము నుండి చ్యుతుడై వీర్యవంతుడైన రాజు కాగలడు. రాజేంద్రా! ఆ తీర్థముదాటిన తర్వాత అక్కడనే ఇక్షూ నదీ సంగమము కలదు. అది ముల్లోకములలో అత్యంత ప్రసిద్ధమైన తీర్థము, దానియందు పరమశివుడు ఎల్లప్పుడూ సన్నిహితుడై యుండును. అక్కడ స్నానము చేసిన నరుడు గాణపత్యమును పొందును.

స్కందతీర్థం తతో గచ్ఛేత్సర్వపాపప్రణాశనమ్ ॥ 49 ॥

**తత్తీర్థం త్రివిధం పాపం స్నానమాత్రాద్వ్యపోహతి ।
లింగసారం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ॥ 50 ॥**

**గోసహస్రఫలం తస్య రుద్రలోకే మహీయతే ।
భంగతీర్థం తతో గచ్ఛేత్సర్వపాపప్రణాశనమ్ ॥ 51 ॥**

**తత్ర గత్వా తు రాజేంద్ర స్నానం తత్ర సమాచరేత్ ।
సప్తజన్మకృతైః పాపైః ముచ్యతే నాత్ర సంశయః ॥ 52 ॥**

అటు తర్వాత సర్వపాపప్రణాశనమైన స్కందతీర్థము కలదు. అక్కడికి వెళ్ళి స్నానము చేసినచో నరునకు త్రివిధ పాపముల నుండి ముక్తి లభించును. తర్వాత లింగసారతీర్థము కలదు. దాని యందు స్నానము చేసిన వానికి సహస్రగోదానఫలితము లభించును మరియు రుద్రలోకమును పొందును. అటు పిమ్మట అన్ని పాపములను హరించివేయు శక్తిగల భంగతీర్థము కలదు. ఓ రాజేంద్రా! అక్కడికి వెళ్ళి స్నానము చేసినచో ఏడు జన్మలలో చేసిన పాపములన్నియునూ నశించిను, దానిలో సందేహం లేదు.

**వటేశ్వరం తతో గచ్ఛేత్సర్వ తీర్థమనుత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ గోసహస్రఫలం లభేత్ ॥ 53 ॥**

**సంగమేశం తతో గచ్ఛేత్సర్వదేవ నమస్కృతమ్ ।
స్నానమాత్రాన్నరస్తత్ర చేంద్రత్వం లభతే ధ్రువమ్ ॥ 54 ॥**

**కోటితీర్థం తతో గచ్ఛేత్సర్వపాపహరం పరమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజ్యం లభతే నాత్ర సంశయః ॥ 55 ॥**

తర్వాత ఉత్తమమైన వటేశ్వరతీర్థమందు స్నానము చేసిన నరుడు గోసహస్రదాన ఫలము పొందును. తదనన్తరము దేవతలందరిచే నమస్కరింపబడే సంగమేశతీర్థము కలదు. ఆ తీర్థమునకు వెళ్ళి స్నానం చేసినంతమాత్రముననే నరుడు నిశ్చయంగా ఇంద్రత్వమును పొందును. తర్వాత అన్ని పాపములను హరించివేయునట్టి కోటితీర్థము కలదు. దానిలో స్నానము చేసిన నరుడు రాజ్యమును పొందుననుటలో సందేహం లేదు.

తత్ర తీర్థం సమాసాద్య దత్త్వా దానం తు యో నరః ।
తస్య తీర్థప్రభావేణ సర్వం కోటిగుణం భవేత్ ॥ 56 ॥

అథ నారీ భవేత్కాచిత్ తత్ర స్నానం సమాచరేత్ ।
గౌరీతుల్యా భవేత్సాఽపి త్వింద్రపత్నీ న సంశయః ॥ 57 ॥

మరియు ఆ కోటితీర్థమునకు పోయి, ఏ నరుడైతే దానము చేయునో ఆ తీర్థప్రభావము వలన కోటిగుణ ఫలితమును పొందును. ఆ తీర్థమున స్నానము చేసిన స్త్రీ గౌరీ సమానురాలగును, ఇంద్రపత్నియగును అనుటలో సందేహము లేదు.

అంగారేశం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ।
స్నాతమాత్రో నరస్తత్ర రుద్రలోకే మహీయతే ॥ 58 ॥

అంగారక చతుర్థ్యాం తు స్నానం తత్ర సమాచరేత్ ।
అక్షయం మోదతే కాలం శుచిః ప్రయతమానసః ॥ 59 ॥

కోటితీర్థము తర్వాత అంగారకతీర్థము కలదు. దానిలో స్నానము చేసినంత మాత్రముననే రుద్రలోకమును నరుడు పొందును. మరియు విశేషంగా అంగారక చతుర్థినాడు ఆ తీర్థమునందు స్నానము చేసినచో నరుడు శుచిమంతుడై, నియంత్రితమనస్కుడై అనంతకాలము సుఖమును పొందును.

అయోని సంభవే స్నాత్వా న పశ్యేద్యోని సంకటమ్ ।
పాండవేశం తు తత్రైవ స్నానం తత్ర సమాచరేత్ ॥ 60 ॥

అక్షయం మోదతే కాలం అవధ్యస్త్రిదశైరపి ।
విష్ణులోకం తతో గత్వా క్రీడతే భోగసంయుతః ॥ 61 ॥

తత్ర భుక్త్వా మహాభోగాన్ మర్త్యరాజోఽభిజాయతే ।

తదనంతరము అయోని సంభవమను తీర్థమున స్నానము చేసిన నరునకు మరల యోని సంకటముండదు. తర్వాత సమీపముననే ఉన్న పాండవేశమను తీర్థము నందు స్నానమాచరించిన నరుడు అనంతకాలం సుఖమును పొందును. దేవతలచేత కూడ వధించుటకు శక్యము కాని వాడగును. తర్వాత విష్ణులోకమునకు వెళ్ళి అక్కడ అన్ని భోగములను నరుడు అనుభవించి మర్త్యలోకాధిపతియై జన్మించును.

కంతేశ్వరం తతో గచ్ఛేత్తత్ర స్నానం సమాచరేత్ ॥ 62 ॥

ఉత్తరాయణ సంప్రాప్తే యదిచ్ఛేత్తస్య తద్భవేత్ ।
చంద్రభాగాం తతో గచ్ఛేత్తత్ర స్నానం సమాచరేత్ ॥ 63 ॥

స్నాతమాత్రో నరో రాజన్ సోమలోకే మహీయతే ।

అటు తర్వాత కంతేశ్వరమను తీర్థము కలదు. ఉత్తరాయణ పుణ్యకాలమున ఆ తీర్థమునందు స్నానము చేసిన నరుడు ఏది కోరుకొనునో అది సిద్ధించును. దాని తర్వాత చంద్రభాగాతీర్థమునకు వెళ్ళి నరుడు స్నానమాచరించ వలసినది. ఓ రాజా! అచ్చట స్నానము చేసినంత మాత్రముననే సోమలోకమును పొందును.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర తీర్థం శక్రస్య విశ్రుతమ్ ॥ 64 ॥

పూజితం దేవరాజేన దేవైరపి నమస్కృతమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ దానం దత్త్వా తు కాంచనమ్ ॥ 65 ॥

అథవా నీలవర్ణాభం వృషభం యత్సముత్సృజేత్ ।
వృషభస్య తు రోమాణి తత్ప్రసూతికులేషు చ ॥ 66 ॥

తావద్వర్షసహస్రాణి నరో హరపురే వసేత్ ।
తతః స్వర్గాత్పరిభ్రష్టో రాజా భవతి వీర్యవాన్ ॥ 67 ॥

అశ్వానాం శ్వేతవర్ణానాం సహస్రాణాం నరాధిప ।
స్వామీ భవతి మర్త్యేషు తస్య తీర్థప్రభావతః ॥ 68 ॥

ఓ రాజేంద్రా! తదనంతరము లోకవిశ్రుతమైన శక్రతీర్థమునకు వెళ్ళవలసినది. ఆ తీర్థము దేవరాజైన ఇంద్రునిచే పూజింపబడినది, దేవతలందరి చేతనూ నమస్కరింపబడినది. ఆ తీర్థమున స్నానము చేసి సువర్ణదానము చేసినచో పుణ్యప్రదము. లేదా నీల వర్ణము గల వృషభమును ఆ తీర్థసమీపమున వదిలి పెట్టినచో ఆ వృషభమునకే కాక దాని సంతతికి కూడ వాటి శరీరములందుకల రోమములెన్ని సహస్రములు ఉండునో అన్ని వేల సంవత్సరములు శివపురము నందు నివసించును. అట్లు వేల సంవత్సరముల కాలము తర్వాత స్వర్గము నుండి పరిభ్రష్టుడై వీర్యవంతుడైన రాజుగా జన్మించును. ఓ నరాధిపా! ఆ శక్రతీర్థప్రభావము వలన నరుడు వేలకొలది తెల్లని అశ్వములకు అధిపతి యగును, మానవులందరికి రాజు కూడ అగును.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర బ్రహ్మావర్తమనుత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ తర్పయేత్ పితృదేవతాః ॥ 69 ॥

ఉపోష్య రజనీమేకాం పిండం దత్త్వా యథావిధి ।
కన్యాగతే తథాఽఽదిత్యే అక్షయం స్యాన్నరాధిప ॥ 70 ॥

తదనన్తరము ఉత్తమమైన బ్రహ్మావర్తతీర్థము కలదు. ఓ రాజేంద్రా! సూర్యుడు కన్యారాశి యందున్నప్పుడు ఆ తీర్థము నందు స్నానము చేసి ఒక అహోరాత్రముపవాసము ఆచరించి తర్వాత యథావిధిగా పిండప్రదానము చేసి పితృతర్పణాదులు ఆచరించినచో నరుడు అక్షయఫలమును పొందును.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర కపిలా తీర్థముత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ కపిలాం యః ప్రయచ్ఛతి ॥ 71 ॥

సంపూర్ణపృథివీం దత్త్వా యత్ఫలం తదవాప్నుయాత్ ।
నర్మదేశం పరం తీర్థం న భూతం న భవిష్యతి ॥ 72 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ అశ్వమేధఫలం లభేత్ ।

ఓ రాజేంద్రా! తదనంతరము ఉత్తమమైన కపిలాతీర్థము కలదు. అక్కడికి వెళ్ళి స్నానము చేసి కపిల వర్ణము గల గోవును దానము చేసినచో సంపూర్ణపృథివిని దానము చేసినంత పుణ్యము లభించును. తర్వాత గొప్పనైన నర్మదేశతీర్థమున్నది. తత్సమానమైన తీర్థమింత వరకు లేదు. ఇకముందు ఉండదు. ఆ తీర్థమున స్నానమాచరించినచో ఓ రాజా! అశ్వమేధయాగఫలము లభించును.

నర్మదా దక్షిణే కూలే సంగమేశ్వరముత్తమమ్ ॥ 73 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ సర్వయజ్ఞఫలం లభేత్ ।
తత్ర సర్వోద్యతో రాజా పృథివ్యామేవ జాయతే ॥ 74 ॥

సర్వలక్షణసంపూర్ణః సర్వవ్యాధివివర్జితః ।

తర్వాత నర్మదానది యొక్క దక్షిణతీరమందు ఉత్తమమైన సంగమేశ్వరతీర్థము కలదు. ఓ రాజా! ఆ తీర్థము నందు స్నానము చేసినచో నరునకు సర్వయజ్ఞఫలము లభించును. అంతేకాక ఆ నరుడు సర్వవ్యాధిరహితుడై సర్వలక్షణసంపన్నుడై, సర్వవిధబలముతో గూడిన రాజై పృథివియందు జన్మించును.

నర్మదే చోత్తరే కూలే తీర్థం పరమశోభనమ్ ॥ 75 ॥
ఆదిత్యాయతనం దివ్యమీశ్వరేణ తు భాషితమ్ ।
తస్య తీర్థప్రభావేణ దత్తం భవతి చాక్షయమ్ ॥ 76 ॥

దరిద్రా వ్యాధినో యే తు యే తు దుష్కృతకర్మిణః ।
ముచ్యన్తే సర్వపాపేభ్యః సూర్యలోకం తు యాన్తి వై ॥ 77 ॥

తదనన్తరము నర్మదానది యొక్క ఉత్తరతీరమున పరమశోభనమైనటువంటి దివ్యమైనటువంటి సాక్షాత్తు ఈశ్వరుని చేత చెప్పబడినటువంటి ఆదిత్యాయతనమనే తీర్థము కలదు. ఆ తీర్థప్రభావముచేత ఏది దానము చేసినను అక్షయమైన పుణ్యము లభించును. దరిద్రులు, వ్యాధిగ్రస్తులు, పాపకర్మలాచరించినవారు తమ పాపముల నుండి విముక్తులై సూర్యలోకమునకు పోవుదురు.

మాఘమాసే తు సంప్రాప్తే శుక్లపక్షస్య సప్తమీ ।
వసేదాయతనే తత్ర నిరాహారో జితేంద్రియః ॥ 78 ॥

న జరావ్యాధితో మూకో న చాంధో బధిరోఽథవా ।
సుభగో రూపసంపన్నః స్త్రీణాం భవతి వల్లభః ॥ 79 ॥

ఏవం తీర్థం మహాపుణ్యం మార్కండేయేన భాషితమ్ ।
యే న జానన్తి రాజేంద్ర వంచితాస్తే న సంశయః ॥ 80 ॥

మాఘమాసపు శుక్లపక్ష సప్తమీతిథి నాడు ఈ తీర్థము నందు నిరాహారులై జితేంద్రియులై ఉండువారికి వృద్ధాప్యముండదు, మూగతనము కాని, అంధత్వము కాని, బధిరత్వము కాని అసలు కలుగవు. మరియు ఇక్కడ పుణ్యకర్మలనాచరించినవారు ఓ రాజేంద్రా! రూపలావణ్యసంపన్నులైన స్త్రీలకు ప్రియులగుదురు. ఇట్లు మార్కండేయముని చేత వివరింపబడిన మహాపుణ్యప్రదమైన ఈ తీర్థము గురించి తెలిసికోనివారు జీవితమున వంచితులే అనుటలో సందేహం లేదు.

గర్గేశ్వరం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ।
స్నాతమాత్రో నరస్తత్ర స్వర్గలోకమవాప్నుయాత్ ॥ 81 ॥

మోదతే స్వర్గలోకస్థో యావదింద్రాశ్చతుర్దశ ॥
సమీపతః స్థితం తస్య నాగేశ్వరతపోవనమ్ ॥ 82 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర నాగలోకమవాప్నుయాత్ ।
బహ్వీభిర్నాగకన్యాభిః క్రీడతే కాలమక్షయమ్ ॥ 83 ॥

తర్వాత అక్కడే ఉన్నట్టి గర్గేశ్వరతీర్థమునకు వెళ్ళి స్నానమాచరించిన మాత్రముననే నరుడు స్వర్గలోకమును పొందును. అంతేకాక పద్నాలుగురింద్రులు స్వర్గలోకమును ఏలునంత కాలము వరకు ఆ నరుడు స్వర్గలోకవాసియై సర్వసుఖములనూ అనుభవించును. తదనంతరము తత్సమీపముననే నున్న నాగేశ్వరతపోవనమను తీర్థము సందర్శించవలెను. ఓ రాజేంద్రా! ఆ తీర్థమునందు స్నానము చేసినచో నరుడు నాగలోకమును పొందును. ఆ లోకమున అనేక మంది నాగకన్యలతో దీర్ఘకాలపర్యంతము విహరించును.

కుబేరభవనం గచ్ఛేత్ కుబేరో యత్ర సుస్థితః ।
కాలేశ్వరం పరం తీర్థం కుబేరో యత్ర తోషితః ॥ 84 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర సర్వసంపదమాప్నుయాత్ ।
తతః పశ్చిమతో గచ్ఛేన్మారుతాలయముత్తమమ్ ॥ 85 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర శుచిర్భూత్వా సమాహితః ।
కాంచనం తు తతో దద్యాత్ యథాశక్తి సుబుద్ధిమాన్ ॥ 86 ॥

పుష్పకేణ విమానేన వాయులోకం స గచ్ఛతి ।

అటు తర్వాత కుబేరుడున్నటువంటి కుబేరభవనతీర్థము కలదు. అచ్చటనే కుబేరుడు సంతుష్టుడైనటువంటి కాలేశ్వరతీర్థము కలదు. ఓ రాజేంద్రా! ఆ తీర్థమున స్నానమాచరించినవాడు సర్వసంపదలనూ పొందును. తదనంతరము నర్మదానదీతీరపు పశ్చిమప్రాంతమున ఉత్తమమైన మారుతాలయతీర్థము కలదు. రాజేంద్రా! అక్కడికి వెళ్ళి స్నానము చేసి శుచిమంతుడై సమాహితచిత్తుడై బుద్ధిమంతుడైన నరుడు సువర్ణము దానము చేసినచో పుష్పక విమానము ద్వారా వాయులోకమునకు పోవును.

యవతీర్థం తతో గచ్ఛేన్మాఘమాసే యుధిష్ఠిర! ॥ 87 ॥

కృష్ణపక్షే చతుర్దశ్యాం స్నానం తత్ర సమాచరేత్ ।
నక్తం భోజ్యం తతః కుర్యాన్న పశ్యేద్యోనిసంకటమ్ ॥ 88 ॥

అహల్యాతీర్థం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ।
స్నాతమాత్రో నరస్తత్ర హ్యప్సరోభిః ప్రమోదతే ॥ 89 ॥

అహల్యా చ తపస్తప్త్వా తత్ర ముక్తిముపాగతా ।

యుధిష్ఠిరా! తదనంతరము యవతీర్థమునకు నరుడు వెళ్ళి ఆ తీర్థమున మాఘకృష్ణ చతుర్దశీ తిథినాడు స్నానము చేయవలెను. అచ్చట నక్తవ్రతమాచరించినవానికి యోనిసంకటముండదు. తర్వాత అహల్యాతీర్థము కలదు. నరుడు దానియందు స్నానమాచరించవలెను. ఆ తీర్థమున స్నానము చేసినంత మాత్రముననే అప్సరసలతో నరుడు విహరించును. అహల్య ఆ ప్రదేశముననే తపస్సు చేసి ముక్తిని పొందెను.

చైత్రమాసే తు సంప్రాప్తే శుక్లపక్షే చతుర్దశీ ॥ 90 ॥

కామదేవదినే తస్మిన్నహల్యాం యస్తు పూజయేత్ ।
యత్ర యత్ర నరోత్పన్నో నరస్తత్ర ప్రియో భవేత్ ॥ 91 ॥

స్త్రీవల్లభో భవేచ్ఛ్రీమాన్ కామదేవ ఇవాపరః ।
అయోధ్యాం తు సమాసాద్య తీర్థం రామస్య విశ్రుతమ్ ॥ 92 ॥

స్నాతమాత్రో నరస్తత్ర సర్వపాపైః ప్రముచ్యతే ॥

చైత్రమాసపు శుక్లపక్షమున వచ్చు చతుర్దశి కామదేవతిథియని ప్రసిద్ధము. ఆ తిథియందు అహల్యను ఎవడు పూజించునో ఆ నరుడు ఎక్కడెక్కడ జన్మించునో అక్కడ అందరికీ ప్రియుడగును. అంతే కాక శ్రీమంతుడై అనేక మంది స్త్రీలకు మరొక మన్మథుని వలె ప్రీతిపాత్రుడగును. తదనంతరము అయోధ్యయను ప్రదేశమునకు సమీపమున ప్రఖ్యాతమైన రామతీర్థము కలదు. ఆ తీర్థమునకు వెళ్ళి స్నానమాచరించినచో అన్ని పాపముల నుండి నరుడు విముక్తుడగును.

సోమతీర్థం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ॥ 93 ॥

స్నాతమాత్రో నరస్తత్ర సర్వపాపైః ప్రముచ్యతే ।
సోమగ్రహే తు రాజేంద్ర పాపక్షయకరం నృణామ్ ॥ 94 ॥

త్రైలోక్యవిశ్రుతం రాజన్ సోమతీర్థం మహాఫలమ్ ।
యస్తు చాంద్రాయణం కుర్యాత్తస్మింస్తీర్థే నరాధిప ॥ 95 ॥

సర్వపాపవిశుద్ధాత్మా సోమలోకం స గచ్ఛతి ।
అగ్నిప్రవేశేఽథ జలే అథవాఽపి హ్యనాశకే ॥ 96 ॥

సోమతీర్థే మృతో యస్తు నాఽసౌ మర్త్యోఽభిజాయతే ।

అట్లే రామతీర్థము నుండి సోమతీర్థమునకు వెళ్ళి అక్కడ స్నానము చేసినచో నరుడు సర్వపాప విముక్తుడగును. ఓ రాజేంద్రా! చంద్రగ్రహణపర్వమున నరులకు సోమతీర్థము మహాఫలప్రదము, సకలపాప క్షయకరము, అది త్రిలోకప్రసిద్ధము. సోమ తీర్థమున చాంద్రాయణ వ్రతమాచరించుట ప్రసిద్ధము. ఆ వ్రత మాచరించినవారు సర్వపాపముల నుండి విముక్తులై విశుద్ధాత్ములగుదురు. సోమలోకప్రాప్తిని పొందుదురు. ఈ తీర్థమున అగ్నిప్రవేశము ద్వారా కాని, జలప్రవేశము ద్వారా గాని, నిరాహారవ్రతము ద్వారా గాని ప్రాణత్యాగము చేసినవాడు మానవునిగా పుట్టడు.

శుభతీర్థం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ॥ 97 ॥

స్నాతమాత్రో నరస్తత్ర గోలోకేషు మహీయతే ।
తతో గచ్ఛేచ్చ రాజేంద్ర విష్ణుతీర్థమనుత్తమమ్ ॥ 98 ॥

యోధనీపుర మాఖ్యాతం విష్ణుస్థానమనుత్తమమ్ ।
అసురా యోధితాస్తత్ర వాసుదేవేన కోటిశః ॥ 99 ॥

తత్ర తీర్థం సముత్పన్నం విష్ణుః ప్రీతో భవేదిహ ।
అహోరాత్రోపవాసేన బ్రహ్మహత్యాం వ్యపోహతి ॥ 100 ॥

తదనంతరము శుభతీర్థము కలదు. ఆ తీర్థమున స్నానము చేసినంత మాత్రముననే నరుడు గోలోకమును పొందును. అటుతర్వాత ఓ రాజేంద్రా! ఉత్తమమైనట్టి విష్ణుతీర్థము ఉన్నది. ఇది యోధనీపురమను పేరుతో ప్రసిద్ధము. ఈ విష్ణు స్థానము మహోత్తమమైనది. కోట్ల కొలది అసురులు వాసుదేవునితో యుద్ధము చేసి ఇక్కడ పరాజితులైరి. ఆ ప్రదేశముననే ఉత్పన్నమైనది కావున దీనికి విష్ణుతీర్థమని పేరు వచ్చినది. ఈ తీర్థమున అహోరాత్రో పవాసవ్రతము చేసినచో శ్రీమహావిష్ణువు ప్రీతి పొందును. మరియు ఆ వ్రతమాచరించిన వారిని బ్రహ్మహత్యా పాపము నుండి విముక్తుని చేయును.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర తాపసేశ్వరముత్తమమ్ ।
హరిణీ వ్యాధ సంత్రస్తా పతితా యత్ర సా మృగీ ॥ 101 ॥

జలే ప్రక్షిప్త గాత్రా తు అంతరిక్షం గతా చ సా ॥
వ్యాధో విస్మితచిత్తస్తు పరం విస్మయమాగతః ॥ 102 ॥

తేన తాపేశ్వరం తీర్థం న భూతం న భవిష్యతి ।

రాజేంద్రా! తదనంతరము ఉత్తమమైన తాపసేశ్వరతీర్థమునకు నరుడు వెళ్ళవలసినది. ఒక వ్యాధుని చేత భయపడినట్టి ఆడలేడి ఈ తీర్థజలమందు పడి జలమునందే తన శరీరమును దాచి అంతరిక్షమునకు పోయెను. అది చూచిన వ్యాధుడు ఆశ్చర్యచకితుడయ్యెను. తాపసేశ్వరతీర్థము వంటి తీర్థము ఇతః పూర్వము లేదు. ఇక ముందు కూడ ఉండదు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర బ్రహ్మతీర్థమనుత్తమమ్ ॥ 103 ॥

అమోహకమితి ఖ్యాతం పితౄంశ్చైవాత్ర తర్పయేత్ ।
పౌర్ణమాస్యామమాయాంతు శ్రాద్ధం కుర్యాద్యథావిధి ॥ 104 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ పితృపిండం తు దాపయేత్ ।
గజరూపా శిలా తత్ర తోయమధ్యే ప్రతిష్ఠితా ॥ 105 ॥

తస్యాం తు దాపయేత్పిండం వైశాఖ్యాం తు విశేషతః ।
తృప్యన్తి పితరస్తత్ర యావత్తిష్ఠతి మేదినీ ॥ 106 ॥

రాజేంద్రా! తదనన్తరము అత్యుత్తమమైన బ్రహ్మతీర్థము కలదు. అది అమోహకమను పేరుతో విఖ్యాతమైనది. ఇక్కడ పౌర్ణమి మరియు అమావాస్య తిథుల యందు పితృదేవతలకు తర్పణాదులు విడిచి యథావిధిగా శ్రాద్ధకర్మను ఆచరించి పిండప్రదానము చేయవలెను. ఈ బ్రహ్మతీర్థపు నీటి మధ్యలో గజరూపమగు శిల ఒకటి ప్రతిష్ఠింపబడినది. ఈ తీర్థమున విశేషముగా వైశాఖ మాసమందు పితరులకు పిండప్రదానము చేసినచో ఆ పితరులు ఈ భూమి ఉన్నంత వరకు తృప్తి పొందుదురు.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర సిద్ధేశ్వరమనుత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ గణపత్యన్తికం వ్రజేత్ ॥ 107 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర లింగో యత్ర జనార్దనః ।
తత్ర స్నాత్వా తు రాజేంద్ర విష్ణులోకే మహీయతే ॥ 108 ॥

ఓ రాజేంద్రా! దాని తర్వాత ఉత్తమమైన సిద్ధేశ్వరతీర్థము కలదు. ఆ తీర్థమున స్నానము చేసిన నరుడు సాక్షాత్తు గణపతి సాన్నిధ్యమునే పొందును. అటు తర్వాత ఆ సమీపముననే లింగరూపుడైన విష్ణువుండును. ఆ తీర్థమున స్నానము చేసిన నరుడు విష్ణులోకమున పొందును.

నర్మదా దక్షిణే కూలే తీర్థం పరమశోభనమ్ ।
కామదేవః స్వయం తత్ర తపోఽతప్యత వై మహత్ ॥ 109 ॥

దివ్యం వర్షసహస్రం తు శంకరం పర్యుపాసత ।
సమాధిభంగదగ్ధాస్తు శంకరేణ మహాత్మనా ॥ 110 ॥

శ్వేతపర్వా యమశ్చైవ హుతాశః శుక్రపర్వణి ॥
ఏతే దగ్ధాస్తు తే సర్వే కుసుమేశ్వరసంస్థితాః ॥ 111 ॥

నర్మదానది యొక్క దక్షిణతీరమున పరమశోభనమైన కుసుమేశ్వరతీర్థము కలదు. ఆ తీర్థము కామ దేవుడైన మన్మథుడు స్వయముగా సహస్రదివ్యవర్షములు మహత్తరమైన తపస్సు చేసి శంకరుని ఉపాసించెను. కాని సమాధినిష్ఠకు భంగము కలిగించెనను కోపముతో పరమశివుడు ఆతనిని మరియు అతనితో పాటు శ్వేతపర్వుణ్ణీ

(వాయుదేవుని) యముణ్ణీ, అగ్నినీ కూడ శుక్లపక్షపు పర్వదివసమైన పౌర్ణమి తిథినాడు దహించివేసెను. ఆ విధముగా శివుని కోపముతో దగ్ధమైన వీరందరూ కుసుమేశ్వర తీర్థమునే ఆశ్రయించి ఉన్నారు.

దివ్య వర్షసహస్రేణ తుష్టస్తేషాం మహేశ్వరః ।
ఉమయా సహితో రుద్రస్తుష్టస్తేషాం వరప్రదః ॥ 112 ॥

మోక్షయిత్వా తు తాన్ సర్వాన్ నర్మదాతటమాస్థితః ।
తతస్తీర్థప్రభావేణ పునర్దేవత్వమాగతాః ॥ 113 ॥

దివ్యములైన అనేక వేల సంవత్సరముల తర్వాత వారి నిష్ఠలో సంతుష్టుడైన మహేశ్వరుడు వారికి వరమొసంగ దలచి ఉమాసహితుడై అచ్చటికి వచ్చెను. వారికందరికి మోక్షము కల్పించి తాను కూడ నర్మదా తటమునాశ్రయించి ఉండెను. తదనంతరము ఆ తీర్థపు ప్రభావముచేత వారందరనూ దైవత్వమును పొందిరి.

త్వత్ప్రసాదాన్మహాదేవ! తీర్థం భవతు చోత్తమమ్ ।
అర్ధయోజనవిస్తీర్ణం క్షేత్రం దిక్షు సమన్తతః ॥ 114 ॥

తస్మింస్తీర్థే నరః స్నాత్వా చోపవాసపరాయణః ।
కుసుమాయుధరూపేణ రుద్రలోకే మహీయతే ॥ 115 ॥

వైశ్వానరో యమశ్చైవ కామదేవస్తథా మరుత్ ।
తపస్తప్త్వా తు రాజేంద్ర! పరాం సిద్ధిమవాప్నుయుః ॥ 116 ॥

మహాదేవా! నీ అనుగ్రహము వలన అర్ధయోజన విస్తీర్ణమైయున్న ఈ తీర్థము అన్ని దిక్కులకు వ్యాపించినదై ఉత్తమమైన తీర్థమగుగాక! యని యముడు, వాయువు, అగ్నిదేవుడు శివుని ప్రార్థించిరి. అట్టి తీర్థమునందు స్నానమాచరించిన నరుడు ఉపవాసదీక్షను కూడ ఆచరించినచో కుసుమాయుధుని అనగా మన్మథుని వంటి రూపమును పొంది రుద్రలోకమున నివసించును. అటు తర్వాత ఓ రాజేంద్రా! అగ్ని, యముడు, కామదేవుడు, వాయువు మహత్తరమైన తపస్సు చేసి ఆ తీర్థమున సిద్ధిని పొందిరి.

అంకోలస్య సమీపే తు నాతిదూరే తు తస్య వై ।
స్నానం దానం చ తత్రైవ భోజనం పిండపాతనమ్ ॥ 117 ॥

అగ్నిప్రవేశేఽథ జలే అథవా తు హ్యనాశకే ।
అనివర్తికా గతిస్తస్య మృతస్యాముత్ర జాయతే ॥ 118 ॥

ఓ రాజా! ఈ కుసుమేశ్వరతీర్థసమీపముననే ఉన్న అంకోల (ఊడుగ) వృక్షము దగ్గర స్నానదానాలు, పిండప్రదానము అటుపిమ్మట భోజనాదులు కూడ చేసినట్లైతే నరుడు ఉత్తమగతిని పొందును. అంతేకాక ఈ ప్రదేశమున అగ్నిప్రవేశము చేసిగాని, జలప్రవేశము చేసిగాని లేదా నిరాహారము చేసిగాని శరీరమును వదిలిన వానికి మరల జన్మముండదు.

త్ర్యమ్బకేణ తు తోయేన యశ్చరుం శ్రపయేన్నరః ।
అంకోలమూలే దత్త్వా తు పిండం చైవ యథావిధి ॥ 119 ॥

తృప్యన్తి పితరస్తస్య యావచ్చంద్రదివాకరౌ ।

త్ర్యంబకతీర్థపు జలముతో వండిన హవిస్సును అంకోల వృక్షమూలమున చరువుతో యథావిధిగా పిండప్రదానము చేసిన నరునియొక్క పితృదేవతలు సూర్యచంద్రులున్నంతకాలము తృప్తి పొందుదురు.

ఉత్తరే త్వయనే ప్రాప్తే ఘృతస్నానం కరోతి యః ॥ 120 ॥

పురుషో వాఽథ స్త్రీ వాఽపి వసేదాయతనే శుచిః ।
సిద్ధేశ్వరస్య దేవస్య ప్రాతః పూజాం ప్రకల్పయేత్ ॥ 121 ॥

స యాం గతి మవాప్నోతి న తాం సర్వైర్మహామఖైః ।
యదాఽవతీర్ణః కాలేన రూపవాన్ సుభగో భవేత్ ॥ 122 ॥

మర్త్యే భవతి రాజా చ త్వాసముద్రాన్తగోచరే ।

ఉత్తరాయణపుణ్యకాలము సందర్భమున ఎవరైతే పరమశివునకు ఘృతముతో అభిషేకము చేయుదురో మరియు పురుషుడైననూ, స్త్రీ అయిననూ శుచిమంతులై ఆలయమునందు నివసించి సిద్ధేశ్వరదేవుని ప్రాతః కాలమున పూజించినవారు గొప్ప గొప్ప యజ్ఞయాగాదులతో కూడ పొందలేనటువంటి ఉత్తమగతిని పొందుదురు. తర్వాత కాలానుగుణముగా మరల జన్మించినపుడు రూపవంతుడు గుణవంతుడుగా కూడ అయినవాడై సముద్రపర్యన్తము విస్తరించియున్న ఈ భూమండలమునకు అధిపతి యగును.

క్షేత్రపాలం న పశ్యేత్తు దండపాణిం మహాబలమ్ ॥ 123 ॥

వృథా తస్య భవేద్యాత్రా హ్యదృష్ట్వా కర్ణకుండలమ్ ।
ఏవం తీర్థఫలం జ్ఞాత్వా సర్వే దేవాః సమాగతాః ॥
ముంచన్తి కుసుమై ర్వృష్టిం తేన తత్ కుసుమేశ్వరమ్ ॥ 124 ॥

ఎవరైతే క్షేత్రపాలుడు మహాబలవంతుడూ అయిన దండపాణిని దర్శింపరో, కర్ణకుండలుని చూడరో వారి యాత్ర పూర్తిగా వ్యర్థమగును. ఇటువంటి ఈ తీర్థపు మాహాత్మ్యమును తెలిసికొని దేవతలందరూ ఇచ్చటికి వచ్చి పూలవర్షము కురిపించుచుందురు. కావుననే ఈ తీర్థము కుసుమేశ్వర తీర్థమని ప్రసిద్ధిచెందినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నర్మదా మాహాత్మ్యే శూలభేద-భీమేశ్వర-నారదేశ్వరాద్యనేకతీర్థవర్ణనం నామ ఏకనవత్యధిక శతతమోఽధ్యాయః ॥191॥

శ్రీమత్స్యమహాపురాణమున నర్మదామాహాత్మ్యమునందు శూలభేద-భీమేశ్వర-నారదేశ్వరాద్యనేక తీర్థవర్ణనమనే నూట తొంబైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వినవత్యధికశతతమోఽధ్యాయః - నూటతొంబై రెండవ అధ్యాయం

శుక్లతీర్థమహిమానువర్ణనమ్ - శుక్లతీర్థమహిమానువర్ణనం

మార్కండేయ ఉవాచ - మార్కండేయదుమహర్షి చెప్పాడు.

భార్గవేశం తతో గచ్ఛేద్భృగ్నే యత్ర జనార్దనః ।
అసురైస్తు మహాయుద్ధే మహాబలపరాక్రమైః ॥ 1 ॥

హుంకారితాస్తు దేవేన దానవాః ప్రలయం గతాః ।
తత్ర స్నాత్వా తు రాజేంద్ర సర్వపాపైః ప్రముచ్యతే ॥ 2 ॥

తదనంతరము భార్గవేశతీర్థము కలదు. ఆ తీర్థముననే శ్రీ మహావిష్ణువు మహాబలపరాక్రమశాలులైన అసురులతో గొప్పయుద్ధము చేసి వారి చేతిలో ఓడిపోయెను. కాని మరల ఆ దేవుని హుంకారము చేతనే దానవులందరూ నశించిపోయిరి. అటువంటి భార్గవేశతీర్థమున స్నానము చేసినచో ఓ రాజేంద్రా! నరుడు సర్వపాపముల నుండి ముక్తిపొందును.

శుక్లతీర్థస్య చోత్పత్తిం శృణు త్వం పాండునందన ।
హిమవచ్ఛిఖరే రమ్యే నానాధాతువిచిత్రితే ॥ 3 ॥

తరుణాదిత్యసంకాశే తప్తకాంచనసప్రభే ।
వజ్రస్ఫటికసోపానే చిత్రపట్టశిలాతలే ॥ 4 ॥

జాంబూనదమయే దివ్యే నానాపుష్పోపశోభితే ।
తత్రాసీనం మహాదేవం సర్వజ్ఞం ప్రభుమవ్యయమ్ ॥ 5 ॥

లోకానుగ్రహకర్తారం గణవృందైః సమావృతమ్ ।
స్కన్దనన్దిమహాకాలైర్వీరభద్రగణాదిభిః ॥
ఉమయా సహితం దేవం మార్కండిః పర్యపృచ్ఛత ॥ 6 ॥

పాండునందనా! ఇపుడు శుక్లతీర్థోత్పత్తి గురించి వివరించెదను. శ్రద్ధగా వినుము! గైరికాది నానావిధ ధాతువులతో విచిత్రమైనట్టి, ఉదయించిన సూర్యుని వంటి కాంతి కలిగినట్టి, కాచిన బంగారము వంటి వర్ణము కలిగినట్టి, వజ్రములతో స్ఫటికములతో చేసిన సోపానములు కలిగినట్టి, దివ్యమైనటువంటి, నానావిధపుష్పములతో అలంకృతమై యున్నట్టి, రమ్యమైన హిమవత్పర్వతశిఖరమునందు ఆసీనుడైయున్న సర్వజ్ఞుడు, ప్రభువు, అవ్యయుడు, లోకానుగ్రహకర్తయు, స్కంద-నంది-మహాకాల-వీరభద్రాది గణబృందములతో కూడి యున్నట్టి, ఉమాసహితుడైనట్టి మహాదేవుని మార్కండేయుడిట్లడిగెను.

దేవదేవ! మహాదేవ! బ్రహ్మవిష్ణీంద్ర సంస్తుత ।
సంసారభయభీతోఽహం సుఖోపాయం బ్రవీహి మే ॥ 7 ॥

భగవన్ భూత భవ్యేశ సర్వపాపప్రణాశనమ్ ।
తీర్థానాం పరమం తీర్థం తద్వదస్వ మహేశ్వర ॥ 8 ॥

దేవదేవా! మహాదేవా! బ్రహ్మ -విష్ణు - ఇంద్రాదులచే స్తుతింపబడువాడా! భగవన్! భూతభవిష్య ద్వర్తమానాదులు తెలిసిన వాడా! ఓ మహేశ్వరా! సంసార భయముచేత భీతుడనైన నాకు సర్వపాపప్రణాశనము చేయగల, సుఖోపాయమగు తీర్థములలోకెల్ల ఉత్తమమైన తీర్థమును గురించి తెలుపుము.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు చెప్పాడు.

శ్రుణు విప్ర మహాప్రాజ్ఞ! సర్వశాస్త్రవిశారద ।
స్నానాయ గచ్ఛ సుభగ ఋషిసంఘైః సమావృతః ॥ 9 ॥

మన్వత్రికశ్యపాశ్చైవ యాజ్ఞవల్క్యోశనోఽంగిరాః ।
యమాపస్తంబ సంవర్తాః కాత్యాయన బృహస్పతీ ॥ 10 ॥

నారదో గౌతమశ్చైవ సేవన్తే ధర్మకాంక్షిణః ।

సర్వశాస్త్రపారంగతుడా! మహాప్రాజ్ఞా! విప్రా! శుభస్వరూపా! ఋషి సమూహములతో పాటు పవిత్ర తీర్థమున స్నానమాచరించుటకై బయల్దేరుము. మనువు, అత్రి, కశ్యపుడు, యాజ్ఞవల్క్యుడు, శుక్రుడు, అంగీరసుడు, యముడు, ఆపస్తంబుడు, సంవర్తుడు, కాత్యాయనుడు, బృహస్పతి, నారదుడు, గౌతముడు మొదలగు ధర్మరక్షణ కాంక్షగలిగిన మునులు సేవించు శుక్ల తీర్థమునకు బయల్దేరుము.

గంగాం కనఖలం పుణ్యం ప్రయాగం పుష్కరం గయామ్ ॥ 11 ॥

కురుక్షేత్రం మహాపుణ్యం రాహుగ్రస్తే దివాకరే ।
దివా వా యది వా రాత్రౌ శుక్లతీర్థం మహాఫలమ్ ॥ 12 ॥

దర్శనాత్ స్పర్శనాచ్చైవ స్నానాద్దానాత్తపోజపాత్ ।
హోమాచ్చైవోపవాసాచ్చ శుక్లతీర్థం మహాఫలమ్ ॥ 13 ॥

ఈ తీర్థము గంగా, కనఖల, ప్రయాగ, పుష్కర, గయా, కురుక్షేత్రాదులవలే పుణ్యప్రదమైనది. రాహుగ్రస్త సూర్యగ్రహణసమయము నందు పగలు కాని, రాత్రి కాని, శుక్లతీర్థదర్శనం మహాఫలప్రదం. ఈ తీర్థమును దర్శించినను, స్పృశించిననూ, స్నానదాన తప జపహోమ ఉపవాసాది వ్రతములన్నింటికినీ కూడ మహాఫలప్రదము.

శుక్లతీర్థం మహాపుణ్యం నర్మదాయాం వ్యవస్థితమ్ ।
చాణక్యో నామ రాజర్షిః సిద్ధిం తత్ర సమాగతః ॥ 14 ॥

ఏతత్ క్షేత్రం సువిపులం యోజనం వృత్తసంస్థితమ్ ।
శుక్లతీర్థం మహాపుణ్యం సర్వపాపప్రణాశనమ్ ॥ 15 ॥

పాదపాగ్రేణ దృష్టేన బ్రహ్మహత్యాం వ్యపోహతి ।
జగతీ దర్శనాచ్చైవ భ్రూణహత్యాం వ్యపోహతి ॥ 16 ॥

నర్మదా నది యందున్నట్టి ఈ శుక్లతీర్థము మహాపుణ్యప్రదము. చాణక్యుడను రాజర్షి ఇచ్చట సిద్ధి పొందెను. సువిపులమైన ఈ తీర్థము ఒకయోజనవిస్తీర్ణమున వృత్తాకారమున నున్నది. ఇది సర్వపాపములను నశింపజేయునట్టిది. చెట్టు యొక్క అగ్రభాగమున కూర్చొని చూచినంతమాత్రముననే బ్రహ్మహత్యా సదృశపాపమును కూడ తొలిగించును. పృథ్వీతలముపై కూర్చుని చూసినను భ్రూణహత్యాపాపమును కూడ నశింపజేయును.

అహం తత్ర ఋషిశ్రేష్ఠ తిష్ఠామి హ్యుమయా సహ ।

వైశాఖే చైత్రమాసే తు కృష్ణపక్షే చతుర్దశీ ॥ 17 ॥
కైలాసాచ్చాపి నిష్క్రమ్య తత్ర సన్నిహితో హ్యహమ్ ।

దైత్యదానవగంధర్వాః సిద్ధవిద్యాధరాస్తథా ॥ 18 ॥
గణాశ్చాప్సరసో నాగాః సర్వే దేవాః సమాగతాః ।

గగనస్థాస్తు తిష్ఠన్తి విమానైః సార్వకామికైః ॥ 19 ॥

ఓ ఋషిశ్రేష్ఠా! చైత్ర - వైశాఖ మాసములందు కృష్ణపక్ష చతుర్దశి నాడు కైలాసమును వదిలి ఉమాసహితుడనై నేను ఈ తీర్థమున ఉందును. దైత్య దానవ గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు, అప్సరోగణములు, సర్పదేవతలు, మరియు దేవతలందరూ కూడ ఇక్కడికి వచ్చి సర్వకోరికలనూ తీర్చునట్టి విమానములను అధిరోహించి ఆకాశమున నిలుతురు.

శుక్ల తీర్థం తు రాజేంద్ర హ్యాగతా ధర్మకాంక్షిణః ।
రజకేన యథా వస్త్రం శుక్లం భవతి వారిణా ॥ 20 ॥

ఆజన్మజనితం పాపం శుక్లం తీర్థం వ్యపోహతి ।
స్నానం దానం మహాపుణ్యం మార్కండే ఋషిసత్తమ ॥ 21 ॥

ఓ రాజేంద్రా ! ధర్మకాంక్షులు మాత్రమే ఈ శుక్లతీర్థమునకు వత్తురు. చాకలివాడు నీటిలో వస్త్రమునకున్న మాలిన్యమును పోగొట్టి తెలుపు చేసినట్లు ఈ శుక్లతీర్థము కూడ మానవుని ఆజన్మసంచితమైన పాపమును పూర్తిగా పోగొట్టి నిష్కల్మషుని చేయును. ఓ ఋషిసత్తమా ! మార్కండేయా ! ఇక్కడ చేసిన స్నానము దానము కూడ మహాపుణ్యప్రదములు.

శుక్లతీర్థాత్పరం తీర్థం న భూతం న భవిష్యతి ।
పూర్వే వయసి కర్మాణి కృత్వా పాపాని మానవః ॥ 22 ॥

అహోరాత్రోపవాసేన శుక్లతీర్థే వ్యపోహతి ।
తపసా బ్రహ్మచర్యేణ యజ్ఞైర్దానేన వా పునః ॥ 23 ॥

దేవార్చనేన యా పుష్టిర్న సా క్రతుశతైరపి ।

శుక్లతీర్థము కన్న గొప్పతీర్థము ఇతః పూర్వము లేదు ఇక ముందు ఉండదు. మానవుడు తన బాల్యములో కాని యౌవనావస్థలో కాని, స్వకర్మల ద్వారా చేసిన పాపములన్నియు ఒక్క అహోరాత్రోపవాసము చేత ఈ

శుక్లతీర్థము నశింపజేయగలదు. ఈ తీర్థసమీపమున తపస్సు చేత, బ్రహ్మచర్యము చేత, యజ్ఞములు మరియు దానములచేత, దేవతార్చనచేత, లభించునట్టి పుష్టి ఇతరత్ర వందల యాగములు చేసిననూ లభించదు.

కార్తికస్య తు మాసస్య కృష్ణపక్షే చతుర్దశీ ॥ 24 ॥

ఘృతేన స్నాపయేద్దేవం ఉపోష్య పరమేశ్వరమ్ ।
ఏకవింశత్కులోపేతో నచ్యవేదైశ్వరాత్పదాత్ ॥ 25 ॥

శుక్లతీర్థం మహాపుణ్యం ఋషిసిద్ధనిషేవితమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ న పునర్జన్మభాగ్భవేత్ ॥ 26 ॥

కార్తీక మాసపు కృష్ణపక్షమున చతుర్దశీ తిథి నాడు ఉపవాసము చేసి పరమేశ్వరునికి ఘృతముతో అభిషేకము చేయవలెను. అట్టివారు 21 తరములవారితో సహా ఈశ్వరస్థానము నుండి పరిభ్రష్టులు కాకుండా ఉందురు. శుక్ల తీర్థము ఋషులు మరియు సిద్ధుల చేత సతతమూ సేవింపబడు మహాపుణ్యతీర్థము. ఓ రాజా ! అచ్చట స్నానము చేసిన నరునకు పునర్జన్మ ఉండదు.

స్నాత్వా వై శుక్లతీర్థే తు హ్యర్చయేద్ వృషభధ్వజమ్ ।
కపాలపూరణం కృత్వా తుష్యత్యత్ర మహేశ్వరః ॥ 27 ॥

అర్ధనారీశ్వరం దేవం పటే భక్త్యా లిఖాపయేత్ ।
శంఖతూర్యనినాదైశ్చ బ్రహ్మఘోషైశ్చ సద్విజైః ॥ 28 ॥

జాగరం కారయేత్తత్ర నృత్యగీతాదిమంగలైః ।
ప్రభాతే శుక్లతీర్థే తు స్నానం వై దేవతార్చనమ్ ॥ 29 ॥

ఆచార్యాన్ భోజయేత్ పశ్చాత్ శివవ్రతపరాన్ శుచీన్ ।
దక్షిణాం చ యథాశక్తి విత్తశాఠ్యం వివర్జయేత్ ॥ 30 ॥

శుక్ల తీర్థమున స్నానమాచరించి వృషభధ్వజుని పూజించి, అచ్చటనున్న కపాలమును పుష్పాదులతో నింపినచో మహేశ్వరుడు సంతుష్టుడగును. వస్త్రముపై అర్ధనారీశ్వరుని చిత్రించి శంఖతూర్యాది ధ్వనులతో సత్పురుషులైన ద్విజుల వేదఘోషములతో, నృత్యగీతాది మంగళధ్వనులతో ఆ తీర్థమున జాగరణ చేయవలెను. తదనంతరము ప్రభాతకాలమున శుక్లతీర్థమున స్నానము చేసి దేవతలను అర్చించి, ఆచార్యులకు భోజనాదులు అర్పించవలెను, శుచిమంతులైన శివవ్రతపరాయణులకు యథాశక్తిగా దక్షిణలు ఈయవలెను. కాని శివపూజా సందర్భమున దానాది కర్మలందు లోభత్వము చూపకూడదు.

ప్రదక్షిణం తతః కృత్వా శనైర్దేవాన్తికం వ్రజేత్ ।
ఏవం వై కురుతే యస్తు తస్య పుణ్యఫలం శృణు ॥ 31 ॥

దివ్యయానం సమారూఢో గీయమానోఽప్సరోగణైః ।
శివతుల్యబలోపేతః తిష్ఠత్యాభూతసంప్లవమ్ ॥ 32 ॥

తర్వాత ఆ శివవ్రతులకు ప్రదక్షిణము చేసి, సావధానముగా దైవ దర్శనమునకై వెళ్ళవలెను. ఓ రాజా ! ఇట్లు ఆచరించినవాని యొక్క పుణ్యఫలము ఎంతగొప్పదో వినుము. దివ్యమైన విమానమును అధిరోహించి అప్సరోగణములతో సేవింపబడుచున్నవాడై, శివునితో సమానమైన బలమును కూడ పొందినవాడై యుగాంత కాలము వరకు జీవించును.

శుక్లతీర్థే తు యా నారీ దదాతి కనకం శుభమ్ ।
ఘృతేన స్నాపయేద్దేవం కుమారం చాపి పూజయేత్ ॥ 33 ॥

ఏవం యా కురుతే భక్త్యా తస్యాః పుణ్యఫలం శృణు ।
మోదతే శర్వలోకస్థా యావదింద్రాశ్చతుర్దశ ॥ 34 ॥

శుక్లతీర్థమునందు స్నానము చేసి సువర్ణదానము కూడ చేసి ఘృతముతో పరమశివుని అభిషేకించి కుమారస్వామిని కూడ భక్తితో పూజించు స్త్రీ పద్నాలుగు ఇంద్రుల కాలపర్యంతము శివలోకమును పొంది సుఖించును.

పౌర్ణమాస్యాం చతుర్దశ్యాం సంక్రాంతౌ విషువే తథా ।
స్నాత్వా తు సోపవాసఃసన్విజితాత్మా సమాహితః ॥ 35 ॥

దానం దద్యాద్యథాశక్త్యా ప్రీయేతాం హరిశంకరౌ ।
ఏవం తీర్థప్రభావేణ సర్వం భవతి చాక్షయమ్ ॥ 36 ॥

పూర్ణిమ, చతుర్దశి, సంక్రాంతి, విషువము అనగా మేషతులా సంక్రమణముల కాలమున ఈ తీర్థమందు స్నానము చేసి ఉపవాసవ్రతమును ఆచరించి, విజితాత్ములై యథాశక్తిగా దానము చేసినచో హరిహరులిద్దరునూ సంతోషింతురు. ఈ శుక్లతీర్థప్రభావము చేత సర్వమూ అక్షయమగును.

అనాథం దుర్గతం విప్రం నాథవన్త మథాపి వా ।
ఉద్వాహయతి యస్తీర్థే తస్య పుణ్యఫలం శ్రుణు ॥ 37 ॥

యావత్తద్రోమసంఖ్యా చ తత్ప్రసూతికులేషు చ ।
తావద్వర్షసహస్రాణి శివలోకే మహీయతే ॥ 38 ॥

మరియు ఓ రాజా ! ఎవరూ లేనటువంటి బీదబ్రాహ్మణుని యొక్కగాని, అన్ని కలిగియున్న బ్రాహ్మణుని యొక్క గాని వివాహము ఈ తీర్థము నందు జరిపించనచో ఎంత పుణ్యము లభించునో వినుము. అట్లు జరిపించిన వాని శరీరమందు కల మరియు ఆతని సంతతి వారి శరీరమందు కూడ రోమములెన్ని ఉండునో అన్ని వేల సంవత్సరముల కాలము ఆతడు శివలోకముననే ఉండును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నర్మదా మాహాత్మ్యే శ్లుక్తీర్థ మహిమానువర్ణనే ద్వినవత్యధికశతతమోఽధ్యాయః ॥192॥

శ్రీ మత్స్యమహాపురాణమున నర్మదామాహాత్మ్యమునందు శుక్లతీర్థమహిమానువర్ణనమును
నూట తొంబై రెండవ అధ్యాయం సమాప్తం.

త్రినవత్యధికశతతమోऽధ్యాయః - నూటతొంబై మూడవ అధ్యాయం

అనరకతీర్థ - గోతీర్థ - కపిలతీర్థ - దశాశ్వమేధాది తీర్థవర్ణనమ్

అనరకతీర్థ - గోతీర్థ - కపిలతీర్థ - దశాశ్వమేధాది తీర్థాల వర్ణనం

మార్కండేయ ఉవాచ - మార్కండయ మహర్షి చెప్పాడు.

తతస్త్వనరకం గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ।
స్నాతమాత్రో నరస్తత్ర నరకం చ న పశ్యతి ॥ 1 ॥

తస్య తీర్థస్య మాహాత్మ్యం శృణు త్వం పాండునందన ।
తస్మింస్తీర్థే తు రాజేంద్ర యస్యాస్థీని వినిక్షిపేత్ ॥ 2 ॥

విలయం యాన్తి సర్వాణి రూపవాన్ జాయతే నరః ।

తదనంతరం నరుడు అనరకం అను తీర్థమునకు వెళ్ళి స్నానం చేయాలి. అచ్చట స్నానం చేసినంత మాత్రముననే నరుడికి నరకలోకదర్శనమే యుండదు. ఓ పాండునందనా! ఆ తీర్థపు మాహాత్మ్యమును వినుము. ఆ తీర్థమందు ఎవరి అస్థులను వేయుదురో వానియొక్క పాపములన్ని ధ్వంసమై పోవడమే గాక ఆతడు మళ్ళీ మంచి రూపవంతుడై జన్మిస్తాడు .

గోతీర్థం తు తతో గత్వా సర్వపాపాత్ప్రముచ్యతే ॥ 3 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర! కపిలా తీర్థముత్తమమ్ ।
తత్ర గత్వా నరో రాజన్ గోసహస్రఫలం లభేత్ ॥ 4 ॥

తర్వాత గోతీర్థం కలదు. అందు స్నానము చేసినచో నరుడు సర్వ పాపముల నుండి ముక్తి పొందుతాడు. ఓ రాజా! తదనంతరం ఉత్తమమైన కపిలాతీర్థం కలదు. అక్కడికి వెళ్ళి స్నానం చేసినచో సహస్ర గోదానఫలం లభిస్తుంది.

జ్యేష్ఠమాసే తు సంప్రాప్తే చతుర్దశ్యాం విశేషతః ।
తత్రోపోష్య నరో భక్త్యా కపిలాం యః ప్రయచ్ఛతి ॥ 5 ॥

ఘృతేన దీపం ప్రజ్వాల్య ఘృతేన స్నాపయేచ్ఛివమ్ ।
సఘృతం శ్రీఫలం జగ్ధ్వా దత్త్వా చాన్తే ప్రదక్షిణమ్ ॥ 6 ॥

ఘంటాభరణసంయుక్తాం కపిలాం యః ప్రయచ్ఛతి ।
శివతుల్యబలో భూత్వా నైవాసౌ జాయతే పునః ॥ 7 ॥

జ్యేష్ఠమాసం నందు విశేషించి చతుర్దశీ తిథినాడు ఈ తీర్థసమీపమున ఉపవాసవ్రతమాచరించి భక్తితో కపిలవర్ణం గల గోవును దానం చేయవలెను. నెయ్యితో దీపం వెలిగించి, నెయ్యితో శివునకు అభిషేకం చేసి

నెయ్యితో గూడిన మారేడు పండును ఆవునకు తినిపించి ప్రదక్షిణం చేసి ఘంటాది ఆభరణములు కలిగినటువంటి కపిలవర్ణం గల ఆవును దానం చేసినవాడు శివునితో సమానమైన బలమును పొందుతాడు. మరియు పునర్జన్మరాహిత్యమును కూడ పొందుతాడు.

అంగారకదినే ప్రాప్తే చతుర్థ్యాం తు విశేషతః ।
పూజయేత్తు శివం భక్త్యా బ్రాహ్మణేభ్యశ్చ భోజనమ్ ॥ 8 ॥

అంగారకనవమ్యాం తు అమాయాం చ విశేషతః ।
స్నాపయేత్తత్ర యత్నేన రూపవాన్ సుభగో భవేత్ ॥ 9 ॥

మంగళవారముతో కూడిన చతుర్థీ తిథి యందు విశేషముగా భక్తితో శివుని పూజించి బ్రాహ్మణులకు భోజనము పెట్టవలసినది. అంతే కాక మంగళవారముతో గూడిన నవమి, మరియు అమావాస్య తిథులయందు కూడ విశేషించి ప్రయత్నపూర్వకముగా శివుని అభిషేకించినచో నరుడు రూపవంతుడై జన్మిస్తాడు.

ఘృతేన స్నాపయేల్లింగం పూజయేద్భక్తితో ద్విజాన్ ।
పుష్పకేణ విమానేన సహస్రైః పరివారితః ॥ 10 ॥

శైవం పదమవాప్నోతి యత్ర చాభిమతం భవేత్ ।
అక్షయం మోదతే కాలం యథా రుద్రస్తథైవ సః ॥ 11 ॥

యదా తు కర్మసంయోగాత్ మర్త్యలోకముపాగతః ।
రాజా భవతి ధర్మిష్ఠో రూపవాన్ జాయతే కులే ॥ 12 ॥

నెయ్యితో శివుని అభిషేకించి బ్రాహ్మణులను భక్తితో పూజించిన నరుడు పుష్పకవిమానము నధిరోహించి వేలమంది పరివారంతో తనకభిమతమైన శివసాయుజ్యమును పొందుతాడు. అనంతకాలపర్యన్తము రుద్రునివలె అక్షయమైన శుభమును పొందుతాడు. తదనంతరం కర్మయోగవశమున మరల భూలోకమున జన్మించి ఉత్తమవంశంలో రూపవంతుడై పుట్టి ధార్మికుడగు రాజౌతాడు.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర ఋషితీర్థమనుత్తమమ్ ।
తృణబిందుర్నామ ఋషిః శాపదగ్ధో వ్యవస్థితః ॥ 13 ॥

తత్తీర్థస్య ప్రభావేణ శాపముక్తోఽభవద్ ద్విజః ।

ఓ రాజేంద్రా! తదనంతరం అత్యుత్తమమైన ఋషితీర్థం కలదు. తృణబిందుడు అనే ఋషి శాపవశమున దగ్ధుడయ్యెను. కాని ఆ తీర్థపు ప్రభావముతో శాపవిమోచనమును పొంది ఉత్తముడైన ద్విజుడాయెను.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర గంగేశ్వరమనుత్తమమ్ ॥ 14 ॥

శ్రావణే మాసి సంప్రాప్తే కృష్ణపక్షే చతుర్దశీ ।
స్నాతమాత్రో నరస్తత్ర రుద్రలోకే మహీయతే ॥ 15 ॥

పితౄణాం తర్పణం కృత్వా ముచ్యతే చ ఋణత్రయాత్ ।

ఓ రాజేంద్రా! తర్వాత ఉత్తమమైన గంగేశ్వరమను తీర్థమునకు నరుడు వెళ్ళ వలసినది. శ్రావణ మాసమున కృష్ణపక్ష చతుర్దశీ తిథి యందు ఆ తీర్థమందు స్నానం చేసినంత మాత్రముననే ఆతను రుద్రలోకమును పొందుతాడు. ఆ తీర్థమందు పితృదేవతలకు తర్పణాదులు అర్పించినచో ఋణత్రయం నుండి విముక్తి పొందుతాడు.

గంగేశ్వర సమీపే తు గంగా వదనముత్తమమ్ ॥ 16 ॥

అకామో వా సకామో వా తత్ర స్నాత్వా తు మానవః ।
ఆజన్మజనితైః పాపైః ముచ్యతే నాత్ర సంశయః ॥ 17 ॥

తత్ర తీర్థే నరః స్నాత్వా వ్రజేద్వై యత్ర శంకరః ।
సర్వదా పర్వదివసే స్నానం తత్ర సమాచరేత్ ॥ 18 ॥

పితౄణాం తర్పణం కృత్వా హ్యశ్వమేధఫలం లభేత్ ।
ప్రయాగే యత్ఫలం దృష్టం శంకరేణ మహాత్మనా ॥ 19 ॥

తదేవ నిఖిలం దృష్టం గంగా వదనసంగమే ।

ఆ గంగేశ్వరతీర్థ సమీపముననే ఉత్తమమైన గంగావదనతీర్థం కలదు. కోరికలున్న వాడైననూ, లేని వాడైనను మానవుడు ఆ తీర్థంనందు స్నానం చేసినచో జన్మము మొదలుకుని సంభవించిన పాపములన్నింటి నుండి విముక్తి పొందుతాడు. దానిలో సందేహం లేదు. ఆ తీర్థమున స్నానము చేసి నరుడు పరమశివుని దర్శించుటకై వెళ్ళవలెను. పర్వదినములయందు ఈ తీర్థమున తప్పక స్నానమాచరించి పితృతర్పణాదులు కూడ ఆచరించినచో అశ్వమేధయాగఫలం లభిస్తుంది. మహాత్ముడైన శంకరుడు ఎటువంటి ఫలమును ప్రయాగ తీర్థమున చూచెనో అటువంటి సంపూర్ణఫలితమును ఈ గంగావదనసంగమతీర్థమున కూడ చూచాడు.

తస్యైవ పశ్చిమే స్థానే సమీపే నాతిదూరతః ॥ 20 ॥

దశాశ్వమేధజననం త్రిషు లోకేషు విశ్రుతమ్ ।
ఉపోష్య రజనీమేకాం మాసి భాద్రపదే తథా ॥ 21 ॥

అమాయాం చ నరః స్నాత్వా వ్రజతే యత్ర శంకరః ।
సర్వదా పర్వదివసే స్నానం తత్ర సమాచరేత్ ॥ 22 ॥

గంగావదనతీర్థమునకు పశ్చిమమున అతి సమీపమునందే ముల్లోకములలో ప్రఖ్యాతమైన దశాశ్వమేధ తీర్థం కలదు. భాద్రపద మాసపు అమావాస్య తిథి యందు ఈ తీర్థమున అహోరాత్రముపవాస వ్రతమాచరించి పునః ప్రాతఃకాలమున స్నానం చేసి పరమశివుని దర్శించాలి. అన్ని పర్వదినములలోనూ అచ్చట స్నానమాచరించాలి.

పితౄణాం తర్పణం కృత్వా చాశ్వమేధఫలం లభేత్ ।
దశాశ్వమేధాత్పశ్చిమతో భృగుర్బ్రాహ్మణసత్తమః ॥ 23 ॥

దివ్యం వర్షసహస్రం తు ఈశ్వరం పర్యుపాసత ।
వల్మీక వేష్టితశ్చాసౌ పక్షిణాం చ నికేతనః ॥ 24 ॥

ఆశ్చర్యం సుమహజ్జాతముమాయాః శంకరస్య చ ।
గౌరీ పప్రచ్ఛ దేవేశం కోఽయమేవం తు సంస్థితః ॥
దేవో వా దానవో వాథ కథయస్వ మహేశ్వర ॥ 25 ॥

ఇచ్చట పితరులకు తర్పణము చేయుటచే నరుడు అశ్వమేధయాగఫలం పొందుతాడు. దశాశ్వమేధతీర్థపు పశ్చిమమున పూర్వము బ్రాహ్మణశ్రేష్ఠుడగు భృగుడు సహస్ర దివ్యసంవత్సరముల కాలపర్యంతం ఈశ్వరుణ్ని ఉపాసించాడు. తపస్సు చేయుచున్న ఆతని చుట్టు వల్మీకము (పుట్ట) పెరిగింది. అది పక్షులకు కూడ నివాసమయ్యింది. అది చూచి ఉమాశంకరులిద్దరికిని మహాదాశ్చర్యము కలిగింది. అపుడు గౌరి పరమేశ్వరుని ఇట్లడిగింది. మహేశ్వరా! ఇతనెవరు? ఎందులకిచ్చట ఈ స్థితిలో ఉన్నాడు? దేవుడా! దానవుడా! తెలుపు.

మహేశ్వర ఉవాచ - మహేశ్వరుడు చెప్పాడు.

భృగుర్నామ ద్విజశ్రేష్ఠ ఋషీణాం ప్రవరో మునిః ।
మాం ధ్యాయతే సమాధిస్థో వరం ప్రార్థయతే ప్రియే ॥ 26 ॥

ప్రియా! ఇతడు 'భృగువు' అను ద్విజశ్రేష్ఠుడు, ఋషులలో కూడ శ్రేష్ఠుడు. సమాధియందుండి నన్ను ప్రార్థిస్తున్నాడు. నా గురించి తపస్సు చేస్తున్నాడు .

తతఃప్రహసితా దేవీ ఈశ్వరం ప్రత్యభాషత ।
ధూమవత్తచ్ఛిఖా జాతా తతోఽద్యాపి న తుష్యతే ॥
దురారాధ్యోఽసి తేన త్వం నాత్ర కార్యా విచారణా ॥ 27 ॥

మహేశ్వరుని మాటలు వినినట్టి పార్వతీదేవి పెద్దగా నవ్వి శివునితో ఇట్లన్నది. చాలా పెద్దగా పెరిగిపోయిన ఈతని శిఖ పొగవలె కనబడుచున్నది. దీనిని బట్టి అతను ఎన్ని వేల సంవత్సరముల నుండి తపస్సు చేయుచున్నాడో తెలియుచున్నది. అయిననూ నీవు ఇప్పటికి ఆతని తపస్సుకు సంతోషించుట లేదు. నీవెంత దురారాధ్యుడవు= (సులభముగా మెప్పు పొందువాడివి కావు.) దీనిలో విచారింపవలసిన పనిలేదు.

మహేశ్వర ఉవాచ - మహేశ్వరుడు చెప్పాడు.

న జానాసి మహాదేవి హ్యయం క్రోధేన వేష్టితః ।
దర్శయామి యథాతథ్యం ప్రత్యయం తే కరోమ్యహమ్ ॥ 28 ॥

తతః స్మృతోఽథ దేవేన ధర్మరూపో వృషస్తదా ।
స్మరణాత్తస్య దేవస్య వృషః శీఘ్రముపస్థితః ॥
వదంస్తు మానుషీం వాచమాదేశో దీయతాం ప్రభో ॥ 29 ॥

అప్పుడు పరమశివుడిట్లు చెప్పాడు. ఓ మహాదేవీ! ఈతని గురించి నీకు తెలియదు. ఇతను క్రోధావిష్టుడు. ఈతని యథార్థతత్త్వము నీకు చూపిస్తా. అని శివుడు వెంటనే ధర్మరూపుడగు వృషభమును తలచాడు. అట్లు మహాదేవుడు స్మరించినంతనే వృషభము ఆతని ముందు నిలిచింది. అది మనుష్యభాషలో 'ప్రభూ! ఆదేశించుము' అని పలికింది.

శ్రీ భగవానువాచ – భగవానుడు చెప్పాడు.

వల్మీకం త్వం ఖనస్వైనం విప్రం భూమౌ నిపాతయ ।
యోగస్థస్తు తతో ధ్యాయన్ భృగుస్తేన నిపాతితః ॥ 30 ॥

తత్ క్షణాత్ క్రోధ సంతప్తో హస్తముత్క్షిప్య సోఽశపత్ ।
ఏవం సభాషమాణస్తు కుత్ర గచ్ఛసి భో వృష ।
అద్యాహం సమ్ప్రకోపేన ప్రలయం త్వాం నయే వృష ॥ 31 ॥

అపుడు శివుడు 'ఈ వల్మీకమును త్రవ్వి ఆ విప్రుని భూమిపై పడవేయుము' అని వృషభమునాదేశించాడు. వృషభము కూడ వెంటనే యోగస్థుడై ధ్యాననిమగ్నుడై యున్న ఆ భృగువుని క్రింద పడవేసింది. తక్షణమే క్రోధసంతప్తుడై భృగువు తన చేతిని పైకి లేపి ఆ వృషభమును శపించాడు. ఓ వృషభమా! నీవెక్కడికి వెళ్ళెదవు, నేనిప్పుడు నా కోపముతో నిన్ను నాశనం చేస్తాను అన్నాడు.

ధర్షితస్తు తదా విప్రశ్చాన్తరిక్షం గతో వృషమ్ ।
ఆకాశే ప్రేక్షతే విప్ర ఏతదద్భుతముత్తమమ్ ॥ 32 ॥

తత్ర ప్రహసితో రుద్ర ఋషిరగ్రే వ్యవస్థితః ।
తృతీయలోచనం దృష్ట్వా వై లక్ష్యాత్పతితో భువి ।
ప్రణమ్య దండవద్ భూమౌ తుష్టావ పరమేశ్వరమ్ ॥ 33 ॥

ఆ విధముగా భృగువు అత్యంత ఉద్వేగభరితుడై ఆకాశములోనికి వెళ్ళుచున్న వృషభమును చూచి ఇది ఎంత అద్భుతమని తలంచాడు. ఆ సమయముననే రుద్రుడు పెద్దగా నవ్వుచు ఋషి ముందు నిలిచాడు. శివుని యొక్క మూడవ కన్నును చూచి భయవిహ్వలుడై భూమిపై పడిపోయాడు. అప్పుడు ముని వెంటనే శివునకు సాష్టాంగనమస్కారం చేసి ఇట్లు స్తుతించాడు.

ప్రణిపత్య భూతనాథం భవోద్భవం త్వామహం దివ్యరూపమ్ ।
భవాతీతో భువనపతే ప్రభో! తు విజ్ఞాపయే కించిత్ ॥ 34 ॥

త్వద్గుణనికరాన్ వక్తుం కః శక్తో భవతి మానుషో నామ ।
వాసుకిరపి హి కదాచిద్వదనసహస్రం భవేద్యస్య ॥ 35 ॥

భూతనాథుడవు, భవోద్భవుడవు, దివ్యరూపుడవు అగు నీకు నమస్కరిస్తున్నాను. ఓ భువనపతీ! ప్రభూ! నేను నీ దయ వలననే సంసారమును దాట గలిగాను. ఇప్పుడు నేను ఒక మనవి చేస్తున్నాను. నీ గుణ గణములను

ఏ మానవుడు వర్ణించడానికి శక్తుడౌతాడు? ఒకప్పుడు వాసుకి సర్పానికి వెయ్యి నాలుకలున్నా నిన్ను వర్ణించడ లేకపోయింది.

భక్త్యా తథాஉపి శంకర భువనపతే త్వత్ స్తుతౌ ముఖరః ।
వదతః క్షమస్వ భగవన్ ప్రసీద మే తవ చరణ పతితస్య ॥ 36 ॥

సత్త్వం రజస్తమస్త్వం స్థిత్యుత్పత్త్యోర్వినాశనే దేవ ।
త్వాం ముక్త్వా భువనపతే భువనేశ్వర నైవ దైవతం కించిత్ ॥ 37 ॥

అయినప్పటికినీ ఓ భువనపతే! శంకరా! వాచాలుడనైన నేను నాకు వచ్చిన మాటల ద్వారా భక్తితో స్తుతించుచున్నాను. అట్లు స్తుతించుచున్న నన్ను క్షమించుము. భగవంతుడా! నీ చరణముల యందు పడియున్న నన్ను అనుగ్రహింపుము. సత్త్వ రజస్తమోగుణాత్మకుడవైన నీవు ఈ జగత్తు యొక్క స్థిత్యుత్పత్తి వినాశములకు కారణుడవు. ఓ దేవా! భువనపతే! భువనేశ్వర! నీవు తప్ప వేరే దైవమే లేదు.

యమనియమయజ్ఞదాన వేదాభ్యాసాశ్చ ధారణా యోగః ।
త్వద్భక్తేః సర్వమిదం నార్హతి హి కలాసహస్రాంశమ్ ॥ 38 ॥

ఉచ్ఛిష్ట రసరసాయన ఖడ్గాంజన పాదుకావివరసిద్ధిర్వా ।
చిహ్నం భవ వ్రతానాం దృశ్యతి చేహ జన్మని ప్రకటమ్ ॥ 39 ॥

శాఠ్యేన నమతి యద్యపి దదాసి త్వం భూతిమిచ్ఛతో దేవ ।
భక్తిర్భవ భేదకరీ మోక్షాయ వినిర్మితా నాథ ॥ 40 ॥

యమ నియమములు, యజ్ఞదాన వేదాభ్యాసాదులు, ధారణాయోగములు మొదలగునవన్ని నీ భక్తి ముందు వెయ్యవ వంతుతో సమము కావు. ఉచ్ఛిష్టరస, రసాయన, ఖడ్గ అంజన, పాదుకా, వివరసిద్ధి ఇత్యాది చిహ్నములు శివవ్రతము చేయువారి యందు ఈ జన్మలో ప్రత్యక్షముగా కనబడును. దేవా! శాఠ్యముతో అనగా కపటముతో నీకు నమస్కరించిన వానికి కూడ నీవు ఐశ్వర్యమును ప్రసాదింతువు. ఓ నాథా! జన్మలు తొలగించే భక్తిని మోక్ష సాధనముగా నీవే నిర్మించావు.

పరదారపరస్వరసం పరపరిభవదుఃఖశోకసంతప్తమ్ ।
పరవదన వీక్షణపరం పరమేశ్వర మాం పరిత్రాహి ॥ 41 ॥

మిథ్యాభిమానదగ్ధం క్షణభంగురవిభవవిలసన్తమ్ ।
క్రూరం కుపథ్యాభిముఖం పతితం మాం పాహి దేవేశ! ॥ 42 ॥

పరదార పరధనములందాసక్తి కలవాడనూ, పరులు కల్పించిన పరాభవముచే దుఃఖము పొంది శోక సంతప్తుడనైనవాడనూ, పరుల ముఖముల చూచుట యందు అపేక్షకలవాడనూ అయిన నన్ను ఓ పరమేశ్వరా! నన్ను పరిరక్షింపుము! మిథ్యాభిమానము చేత దగ్ధమైనవాడను, క్షణభంగురమైన సంపదల చేత గర్వించువాడను, క్రూరుడను, కుమార్గమునకు అభిముఖుడను మరియు పతితుడనూ అయిన నన్ను ఓ దేవేశా! రక్షింపుము!

దీనే ద్విజగణసార్థే బంధుజనేనైవ దూషితా హ్యాశా ।
తృష్ణా తథాపి శంకర కిం మూఢం మాం విడంబయతి ॥ 43 ॥

తృష్ణాం హరస్వ శీఘ్రం లక్ష్మీం ప్రదత్స్వ యావదాసినీం నిత్యమ్ ।
ఛింది మదమోహపాశానుత్తారయ మాం మహాదేవ ॥ 44 ॥

దీనులైన ద్విజులకు కలుగునట్టి ఆశను చూచి వారి బంధుజనులే దూషింతురు. అయినప్పటికి అది తెలిసినప్పటికిని ఓ శంకరా! మూఢుడనైన నన్ను ఈ తృష్ణ ఎందుకు వెంటాడుచున్నది మహాదేవా! నా ఈ తృష్ణను పోగొట్టుము! వెంటనే నిత్యము నాయందే ఉండునట్టి లక్ష్మి నివ్వుము (ప్రసాదించుము).!నా మదమోహపాశములను ఛేదించి నన్ను ఉద్ధరించుము!

కరుణాభ్యుదయం నామ స్తోత్రమిదం సర్వసిద్ధిదం దివ్యమ్ ।
యః పఠతి భక్తియుక్తస్తస్య తుష్యేద్ భృగోర్యథా చ శివః ॥ 45 ॥

కరుణాభ్యుదయమను సర్వసిద్ధిప్రదమైన దివ్యమైన ఈ స్తోత్రమును భక్తియుక్తులై ఎవరు పఠింతురో వారికి భృగుమహామునికి వలెనే శివుడు సంతుష్టుడౌతాడు.

ఈశ్వర ఉవాచ– ఈశ్వరుడు చెప్పాడు.

అహం తుష్టోఽస్మి తే వత్స ప్రార్థయస్వేప్సితం వరమ్ ।
ఉమయా సహితో దేవో వరం తస్య హ్యదాపయత్ ॥ 46 ॥

వత్సా! నీ ఈ స్తోత్రము చేత నేను సంతుష్టుడనైతిని. నీకు అభీప్సితమైన వరమును కోరుకొనుము అని ఉమతో కూడియున్న పరమశివుడు ఆతనికి వరమిచ్చుటకై సిద్ధపడ్డాడు.

భృగురువాచ – భృగువు చెప్పాడు.

యది తుష్టోఽసి దేవేశ యది దేయో వరో మమ ।
రుద్రవేదీ భవేదేవమేతత్సంపాదయస్వ మే ॥ 47 ॥

దేవేశా! నీవు నాయందు సంతుష్టుడవైనచో, నాకు వరమీయడానికి సిద్ధంగా ఉన్నట్లయితే, నేను రుద్ర తత్త్వజ్ఞుడను అగునట్లు చేయుము.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు చెప్పాడు.

ఏవం భవతు విప్రేంద్ర క్రోధస్థానం న భవిష్యతి ।
న పితాపుత్రయోశ్చైవ త్వైకమత్యం భవిష్యతి ॥ 48 ॥

విప్రేంద్రా! అట్లేయగుగాక! ఇక నుండి నీవు క్రోధరహితుడవు కాగలవు. (నీకు కోపముండదు) మీ తండ్రీ కొడుకుల మధ్య విరుద్ధాభిప్రాయములుండవు. ఐకమత్యము స్థాపింపబడుతుంది.

తదా ప్రభృతి బ్రహ్మాద్యాః సర్వదేవాః సకిన్నరాః ।
ఉపాసతే భృగోస్తీర్థం తుష్టో యత్ర మహేశ్వరః ॥ 49 ॥

దర్శనాత్తస్య తీర్థస్య సద్యః పాపాత్ ప్రముచ్యతే ।
అవశాః స్వవశా వాపి మ్రియన్తే యత్ర జన్తవః ॥ 50 ॥

గుహ్యాతిగుహ్యా సుగతిః తేషాం నిస్సంశయం భవేత్ ।
ఏతత్ క్షేత్రం సువిపులం సర్వపాపప్రణాశనమ్ ॥ 51 ॥

అప్పటినుండి బ్రహ్మాది దేవతలు, కిన్నరులు మహేశ్వరుడు సంతుష్టి చెందినటువంటి ప్రాంతమైన ఈ భృగుతీర్థమును ఉపాసిస్తున్నారు. ఈ తీర్థపు దర్శనముతో మానవుడు సర్వపాపములనుండి విముక్తుడౌతాడు. నియతేంద్రియులైననూ. కాకున్ననూ ఈ తీర్థమున మరణించు జనులు తెలియశక్యముకాని గతిని పొందుతారు. దీనిలో సంశయం లేదు. ఈ క్షేత్రం చాలా విస్తృతమైనది. సర్వపాపప్రణాశనమైనది.

తత్ర స్నాత్వా దివం యాన్తి యే మృతాస్తేఽపునర్భవాః ।
ఉపానహౌ చ ఛత్రం చ దేయమన్నం చ కాంచనమ్ ॥ 52 ॥

భోజనం చ యథాశక్త్యా హ్యక్షయం చ తథా భవేత్ ।
సూర్యోపరాగే యో దద్యాద్దానం చైవ యథేచ్ఛయా ॥ 53 ॥

దీయమానం తు తద్దానం అక్షయం తస్య తద్భవేత్ ।
చంద్రసూర్యోపరాగేషు యత్ఫలం త్వమరకంటకే ॥ 54 ॥

తదేవ నిఖిలం పుణ్యం భృగుతీర్థే న సంశయః ।

ఈ తీర్థమున స్నానమాచరించినవారు స్వర్గమునకు పోతారు. ఇక్కడ మరణించినవారికి పునర్జన్మ కలుగదు. ఇక్కడ పాదరక్షలు, ఛత్రము, అన్నము, సువర్ణము, భోజనము మొదలగువాటిని యథాశక్తిగా దానము చేసినచో అవి అక్షయములగును. సూర్యగ్రహణసమయమున యథేచ్ఛగా చేసిన ఏ దానమైనను అక్షయమైన పుణ్యమును ప్రాప్తింపజేయును. అంతేకాక సూర్యచంద్రుల గ్రహణముల సమయమందు అమరకంటకమున చేసిన దానములతో సమానమైన పుణ్యము ఈ భృగుతీర్థమందు కూడ లభించుననుటలో సందేహము లేదు.

క్షరన్తి సర్వదానాని యజ్ఞదానతపఃక్రియాః ॥ 55 ॥

న క్షరేత్తు తపస్తప్తం భృగుతీర్థే యుధిష్ఠిర! ।
యస్య వై తపసోగ్రేణ తుష్టేనైవ తు శంభునా ॥ 56 ॥

సాన్నిధ్యం తత్ర కథితం భృగుతీర్థే నరాధిప ।
ప్రఖ్యాతం త్రిషు లోకేషు యత్ర తుష్టో మహేశ్వరః ॥ 57 ॥

ఏవం తు వదతో దేవీం భృగుతీర్థమనుత్తమమ్ ।
న జానన్తి నరా మూఢా విష్ణుమాయా విమోహితాః ॥ 58 ॥

ఇతర స్థలములందు చేసిన యజ్ఞదానతపాదుల ఫలం సర్వదానముల ఫలము కూడ ఒకప్పటికి నశిస్తుంది. కాని ఓ యుధిష్ఠర! ఈ భృగుతీర్థంనందు ఆచరించిన తపఃఫలమెప్పుడునూ నశించదు. భృగువు యొక్క ఉగ్రమైన తపస్సుతో సంతుష్టుడైన శివుని సాన్నిధ్యము కలిగిన పవిత్ర తీర్థమిది. ఇట్లు మహేశ్వరుడు సంతుష్టుడైన ఈ భృగు తీర్థము ముల్లోకముల యందు ప్రసిద్ధము. ఈ భృగుతీర్థపు ఔన్నత్యమును సాక్షాత్తు పరమశివుడే పార్వతీదేవికి చెప్పాడు. అయిననూ విష్ణుమాయావిమోహితులైన మూర్ఖులు దీని మహత్త్వమును తెలిసికోలేరు.

నర్మదాయాం స్థితం దివ్యం భృగుతీర్థం నరాధిప! ।
భృగుతీర్థస్య మాహాత్మ్యం యః శ్రుణోతి నరః క్వచిత్ ॥ 59 ॥

విముక్తః సర్వపాపేభ్యో రుద్రలోకం స గచ్ఛతి ।

నరాధిపా! నర్మదానదీతీరమున నున్న దివ్యమైన ఈ భృగుతీర్థము యొక్క మాహాత్మ్యమును ఏ నరుడైతే వినునో, అతడు సర్వపాపముల నుండి విముక్తుడై రుద్రలోకమునకు పోతాడు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర గౌతమేశ్వరముత్తమమ్ ॥ 60 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్నుపవాసపరాయణః ।
కాంచనేన విమానేన బ్రహ్మలోకే మహీయతే ॥ 61 ॥

రాజేంద్రా! తదనంతరము ఉత్తమమైన గౌతమేశ్వరతీర్థం కలదు. అక్కడికి వెళ్ళి స్నానము చేసి, ఉపవాసవ్రత మాచరించిన నరుడు బంగారువిమానమునెక్కి బ్రహ్మలోకమునకు పోతాడు.

ధౌతపాపం తతో గచ్ఛేత్ క్షేత్రం యత్ర వృషేణ తు ।
నర్మదాయా కృతం రాజన్ సర్వపాతకనాశనమ్ ॥ 62 ॥

తత్ర తీర్థం నరః స్నాత్వా బ్రహ్మహత్యాం విముంచతి ।
తస్మింస్తీర్థే తు రాజేంద్ర ప్రాణత్యాగం కరోతి యః ॥ 63 ॥

చతుర్భుజస్త్రినేత్రశ్చ శివతుల్యబలో భవేత్ ।
వసేత్ కల్పాయుతం సాగ్రం శివతుల్యపరాక్రమః ॥ 64 ॥

కాలేన మహతా ప్రాప్తః పృథివ్యామేకరాడ్ భవేత్ ।

తర్వాత ఓ రాజా! నరుడు ధౌతపాపమను తీర్థమునకు వెళ్ళవలసినది. సర్వపాతకనాశనియైన ఈ తీర్థము నర్మదాతీరమున వృషభమే స్వయముగా ఏర్పర్చినది. ఆ తీర్థమందు స్నానము చేసినవాడు బ్రహ్మహత్యా పాపము నుండి కూడ ముక్తి పొందును. ఓ రాజేంద్రా! ఈ తీర్థమున ప్రాణత్యాగము చేసినవాడు చతుర్భుజుడు త్రినేత్రుడూ అయిన శివునితో సమానమైన బలవంతుడగును. అంతేకాక శివతుల్యపరాక్రమశాలియై కల్పాంతము వరకు శివ లోకముననే ఉండి కాలక్రమమున మరల జన్మించిననూ సమస్తభూమండలమునకు చక్రవర్తి అవుతాడు.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర ఐరండీతీర్థముత్తమమ్ ॥ 65 ॥

ప్రయాగే యత్ఫలం దృష్టం మార్కండేయేన భాషితమ్ ।
తత్ఫలం లభతే రాజన్ స్నాతమాత్రో హి మానవః ॥ 66 ॥

మాసి భాద్రపదే చైవ శుక్లపక్షే చతుర్దశీ ।
ఉపోష్య రజనీమేకాం తస్మిన్ స్నానం సమాచరేత్ ॥
యమదూతైర్న బాధ్యేత రుద్రలోకం స గచ్ఛతి ॥ 67 ॥

రాజేంద్రా! తదనంతరము ఉత్తమమైన ఐరండీ తీర్థమునకు నరుడు వెళ్ళవలెను. మార్కండేయుడు వివరించిన ప్రయాగక్షేత్రమున లభించు ఫలముతో సమానమైన ఫలము ఈ తీర్థమునందు స్నానము చేసిన మాత్రముననే లభిస్తుంది. భాద్రపదమాసపు శుక్లపక్షచతుర్దశీ తిథినాడు రాత్రి ఉపవాసము చేసి ఈ ఐరండీ తీర్థమున స్నానం చేసినవానిని యమదూతలు బాధించరు. అతడు రుద్రలోకమునకే వెళతాడు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర సిద్ధో యత్ర జనార్దనః ।
హిరణ్యద్వీప విఖ్యాతం సర్వపాపప్రణాశనమ్ ॥ 68 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ ధనవాన్ రూపవాన్ భవేత్ ।

రాజేంద్రా! అటు పిమ్మట సాక్షాత్తు జనార్దనుడే సిద్ధి పొందినట్టి సర్వపాపప్రణాశనకారియైనట్టి విఖ్యాతమైన హిరణ్యద్వీపమను తీర్థమును దర్శించవలసినది. ఓ రాజా! అచ్చట స్నానమాచరించిన నరుడు రూపవంతుడు, ధనవంతుడు కూడ కాగలడు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర తీర్థం కనఖలం మహత్ ॥ 69 ॥

గరుడేన తపస్తప్తం తస్మింస్తీర్థే నరాధిప ।
ప్రఖ్యాతం త్రిషు లోకేషు యోగినీ తత్ర తిష్ఠతి ॥ 70 ॥

క్రీడతే యోగిభిః సార్ధం శివేన సహ నృత్యతి ।
తత్ర స్నాత్వా నరో రాజన్ రుద్రలోకే మహీయతే ॥ 71 ॥

రాజేంద్రా! తదనంతరము గొప్పదైన కనఖల తీర్థమునకు వెళ్ళాలి. ఈ తీర్థము నందు గరుడుడు తపస్సు చేశాడు. ముల్లోకములయందు ప్రసిద్ధమైన యోగిని ఇచ్చట ఉంటుంది. ఆ యోగినీశక్తి యోగులతో విహరిస్తుంది. మరియు పరమశివునితో నృత్యం చేస్తుంది. రాజా! ఈ తీర్థమున స్నానము చేయువాడు రుద్రలోకము పొందుతాడు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర హంసతీర్థమనుత్తమమ్ ।
హంసాస్తత్ర వినిర్ముక్తా గతా ఊర్ధ్వం న సంశయః ॥ 72 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర సిద్ధో యత్ర జనార్దనః ।
వారాహం రూపమాస్థాయ అర్చితః పరమేశ్వరః ॥ 73 ॥

వారాహతీర్థే నరః స్నాత్వా ద్వాదశ్యాం తు విశేషతః ।
విష్ణులోకమవాప్నోతి నరకం న చ పశ్యతి ॥ 74 ॥

రాజేంద్రా! తర్వాత అత్యుత్తమమైన హంసతీర్థం కూడ కలదు. ఈ తీర్థమందు హంసలు పాపవినిర్ముక్తములై ఊర్ధ్వలోకములకేగునని ప్రసిద్ధి. తర్వాత జనార్దనుడే సిద్ధిపొందిన వారాహతీర్థం కలదు. శ్రీ మహావిష్ణువు వరాహరూపమును పొంది ఇచ్చటనే పరమశివుని పూజించెను. విశేషముగా ద్వాదశీతిథియందు ఈ తీర్థములో స్నానమాచరించినచో నరుడు విష్ణులోకమును పొందును. నరకలోకమును అసలు చూడడు. కావున నరుడు వరాహతీర్థమునకు వెళ్ళవలసినది.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర చంద్రతీర్థమనుత్తమమ్ ।
పౌర్ణమాస్యాం విశేషేణ స్నానం తత్ర సమాచరేత్ ॥ 75 ॥

స్నాతమాత్రో నరస్తత్ర చంద్రలోకే మహీయతే ।

రాజేంద్రా! అటు తర్వాత ఉత్తమమైన చంద్రతీర్థము కలదు. అక్కడికి వెళ్ళి విశేషముగా పౌర్ణమి తిథినాడు స్నానమాచరించవలెను. స్నానమాత్రము చేతనే నరుడు చంద్రలోకమునకు పోతాడు.

దక్షిణేన తు తీరేణ కన్యాతీర్థం తు విశ్రుతమ్ ॥ 76 ॥

శుక్లపక్షే తృతీయాయాం స్నానం తత్ర సమాచరేత్ ।
ప్రణిపత్య తు చేశానం బలిస్తేన ప్రసీదతి ॥ 77 ॥

హరిశ్చంద్రపురం దివ్యం అంతరిక్షే చ దృశ్యతే ।
శుక్రధ్వజే సమావృత్తే సుప్తే నాగారికేతనే ॥ 78 ॥

నర్మదా సలిలౌఘేన తరూన్ సంప్లావయిష్యతి ।
అస్మిన్ స్థానే నివాసః స్యాద్విష్ణుః శంకరమబ్రవీత్ ॥ 79 ॥

ద్వీపేశ్వరే నరః స్నాత్వా లభేద్ బహు సువర్ణకమ్ ।

నర్మదానది యొక్క దక్షిణతీరమున ప్రసిద్ధమైన కన్యాతీర్థము కలదు. శుక్లపక్షపు తదియనాడు ఆ తీర్థం నందు స్నానము చేయవలసినది. అక్కడ ఈశ్వరుని సేవించినచో బలి సంతుష్టుడగును. నాగరికులందరూ రాత్రి పూట నిద్రించియున్నప్పుడు ఆకాశమున ఇంద్రధనుస్సు అవతరించును. దానిలో హరిశ్చంద్రపురము దర్శనమిచ్చును. ఆ సమయమున నర్మదానది తన నీటి ప్రవాహముతో తీరములందున్న వృక్షములన్నింటిని ముంచి వేయును. ఈ స్థానం నందు నా నివాసముండు గాక యని విష్ణువు శంకరునకు చెప్పాడు. ఇదంతయూ ఒకప్పుడు కన్యాతీర్థమున జరిగెను. కావున కన్యాతీర్థము ప్రసిద్ధమైనది. అచ్చటనే ఉన్నట్టి ద్వీపేశ్వరతీర్థంనందు స్నానం చేసినచో సువర్ణం అధికంగా లభిస్తుంది.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర కన్యాతీర్థే సుసంగమే ॥ 80 ॥

స్నాతమాత్రో నరస్తత్ర దేవ్యాః స్థానమవాప్నుయాత్ ।
దేవతీర్థం తతో గచ్ఛేత్ సర్వతీర్థమనుత్తమమ్ ॥ 81 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర దైవతైః సహ మోదతే ।

తర్వాత ఓ రాజా! కన్యాతీర్థ సంగమమునకు వెళ్ళి నరుడు స్నానం చేసినంత మాత్రముననే దేవీ స్థానమును పొందుతాడు. తదనంతరము సర్వతీర్థములలో ఉత్తమమైన దేవతీర్థమునకు వెళ్ళాలి. అక్కడ స్నానము చేసిన నరుడు దేవతలతో సమానముగా ఆనందమును పొందుతాడు.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర శిఖితీర్థమనుత్తమమ్ ॥ 82 ॥

యత్తత్ర దీయతే దానం సర్వం కోటిగుణం భవేత్ ।
అపరపక్షే త్వమాయాం తు స్నానం తత్ర సమాచరేత్ ॥ 83 ॥

బ్రాహ్మణం భోజయేదేకం కోటిర్భవతి భోజితా ।

రాజేంద్రా! అటు తర్వాత ఉత్తమమైన శిఖితీర్థం కలదు. అచ్చట చేసిన ఏ దానమైననూ కోటిరెట్ల ఫలితాన్నిస్తుంది. కృష్ణపక్షమున అమావాస్య తిథినాడు ఆ తీర్థమున స్నానము చేసి ఒక బ్రాహ్మణునికి భోజనము పెట్టిననూ కోటి మంది బ్రాహ్మణులకు భోజన సంతర్పణ చేసిన పుణ్యం లభిస్తుంది.

భృగుతీర్థం తు రాజేంద్ర తీర్థకోటిర్వ్యవస్థితా ॥ 84 ॥

అకామో వా సకామో వా తత్ర స్నానం సమాచరేత్ ।
అశ్వమేధమవాప్నోతి దైవతైః సహ మోదతే ॥ 85 ॥

తత్ర సిద్ధిం పరాం ప్రాప్తో భృగుస్తు మునిపుంగవః ।
అవతారః కృతస్తత్ర శంకరేణ మహాత్మనా ॥ 86 ॥

రాజేంద్రా! భృగుతీర్థమందైతే కోటితీర్థముల మహిమ కలదు. నిష్కాముడైననూ, సకాముడైననూ అచ్చట స్నానము చేసినచో అశ్వమేధయాగఫలమును పొందుతాడు. దేవతలతో సమానముగా సుఖం పొందుతాడు. అచ్చటనే భృగుమహాముని ఉత్కృష్టమైన సిద్ధిని పొదాడు. మహాత్ముడగు శంకరుడు సాక్షాత్తు అక్కడ అవతరించాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నర్మదామాహాత్మ్యే అనరకతీర్థ–కపిలతీర్థ–దశాశ్వమేధాది తీర్థవర్ణనం నామ త్రినవత్యధికశతతమోఽధ్యాయః ॥ 193 ॥

శ్రీ మత్స్య మహాపురాణమున నర్మదామాహాత్మ్యంలో అనరకతీర్థ–కపిలతీర్థ–దశాశ్వమేధాది తీర్థవర్ణన మనే నూట తొంబైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్నవత్యధికశతతమోఽధ్యాయః – నూటతొంబై నాల్గవ అధ్యాయం

నర్మదామాహాత్మ్యమ్ – నర్మదానది మాహాత్మ్య వర్ణనం

మార్కండేయ ఉవాచ – మార్కండేయ మహర్షి చెప్పాడు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర హ్యంకుశేశ్వరముత్తమమ్ ।
దర్శనాత్తస్య దేవస్య ముచ్యతే సర్వపాతకైః ॥ 1 ॥

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర నర్మదేశ్వరముత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ స్వర్గలోకే మహీయతే ॥ 2 ॥

అశ్వతీర్థం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ।
సుభగో దర్శనీయశ్చ భోగవాన్ జాయతే నరః ॥ 3 ॥

ఓ రాజేంద్రా! ఆ తరువాత ఉత్తమమైన అంకుశేశ్వరతీర్థానికి వెళ్ళాలి. ఆ తీర్థంలో దేవుని దర్శిస్తే నరుడు సర్వపాతకాలనుండి ముక్తి పొందుతాడు. అటు తర్వాత పవిత్రమైన నర్మదేశ్వరతీర్థం కలదు. దానిలో స్నానం చేసిన నరుడు స్వర్గాన్ని పొందుతాడు. అక్కడి నుండి అశ్వతీర్థానికి వెళ్ళి స్నానమాచరిస్తే నరుడు సుందరుడు, మంచి రూపంకలవాడు, భోగవంతుడు కాగలడు.

పితామహం తతో గచ్ఛేద్ బ్రహ్మణా నిర్మితం పురా ।
తత్ర స్నాత్వా నరో భక్త్యా పితృపిండం తు దాపయేత్ ॥ 4 ॥

తిలదర్భవిమిశ్రం తు హ్యుదకం తత్ర దాపయేత్ ।
తస్య తీర్థప్రభావేణ సర్వం భవతి చాక్షయమ్ ॥ 5 ॥

సావిత్రీతీర్థమాసాద్య యస్తు స్నానం సమాచరేత్ ।
విధూయ సర్వపాపాని బ్రహ్మలోకే మహీయతే ॥ 6 ॥

ఓ రాజా! అటు తర్వాత బ్రహ్మచే నిర్మించిన పితామహతీర్థానికి వెళ్ళి, అక్కడ స్నానం చేసి, భక్తితో పితృపిండాన్ని అర్పించాలి. నువ్వులు, దర్భలతో కూడిన నీటితో తర్పణాదులు కూడ అర్పించాలి. ఆ తీర్థప్రభావంతో చేసిన పుణ్యాలు అక్షయాలవుతాయి. తర్వాత సావిత్రీతీర్థానికి వెళ్ళి స్నానం చేయాలి. అక్కడ స్నానమాచరించిన వారు సర్వపాపాల నుండి విముక్తులై బ్రహ్మలోకాన్ని పొందుతారు.

మనోహరం తతో గచ్ఛేత్తీర్థం పరమశోభనమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ పితృలోకే మహీయతే ॥ 7 ॥

తతో గచ్ఛేత్తు రాజేంద్ర మానసం తీర్థముత్తమమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ రుద్రలోకే మహీయతే ॥ 8 ॥

ఓ రాజా! ఆ తరువాత పరమశోభనమైన మనోహరతీర్థానికి వెళ్ళి స్నానమాచరించిన నరుడు పితృలోకాన్ని పొందుతాడు. అక్కడి నుండి ఓ రాజేంద్రా! ఉత్తమమైన మానసతీర్థానికి వెళ్ళి స్నానమాచరించిన నరుడు రుద్రలోకాన్ని పొందుతాడు.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర కుంజతీర్థముత్తమమ్ ।
విఖ్యాతం త్రిషు లోకేషు సర్వపాపప్రణాశనమ్ ॥ 9 ॥

యాన్ యాన్ కామయతే కామాన్ పశుపుత్రధనాని చ ।
ప్రాప్నుయాత్తాని సర్వాణి తత్ర స్నాత్వా నరాధిప ॥ 10 ॥

ఓ రాజేంద్రా! తర్వాత మూడు లోకాలలో ప్రఖ్యాతమైన పాపాలన్నింటినీ పోగొట్టే ఉత్తమమైన కుంజతీర్థానికి వెళ్ళాలి. అక్కడ స్నానం చేసిన నరుడు పశువులు, పుత్రులు, సంపదలు మొదలైన ఏ ఏ కోరికలు కోరుకుంటాడో అవన్నీ పొందుతాడు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర త్రిదశజ్యోతివిశ్రుతమ్ ।
యత్ర తా ఋషికన్యాస్తు తపోఽతప్యన్త సువ్రతాః ॥ 11 ॥

భర్తా భవతు సర్వాసామీశ్వరః ప్రభురవ్యయః ।
ప్రీతస్తాసాం మహాదేవో దండరూపధరో హరః ॥ 12 ॥

వికృతాననబీభత్సుః వ్రతీ తీర్థముపాగతః ।
తత్ర కన్యాం మహారాజ వరయన్ పరమేశ్వరః ॥ 13 ॥

కన్యామృషేర్వరయతః కన్యాదానం ప్రదీయతామ్ ।
తీర్థం తత్ర మహారాజ ఋషికన్యేతి విశ్రుతమ్ ॥ 14 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ సర్వపాపైః ప్రముచ్యతే ।

ఓ రాజా! అక్కడి నుండి ఉత్తమమైన 'త్రిదశజ్యోతి' అనే తీర్థానికి వెళ్ళాలి. అక్కడ సువ్రతులైన ఋషికన్యలు ప్రభువూ అవ్యయుడూ అయిన ఈశ్వరుడు తమ అందరికిని భర్త కావాలని తపస్సు చేశారు. వారి తపస్సుతో ప్రీతుడైన, దండరూపధారియైన మహాదేవుడు బ్రహ్మచారియై, వికృతమైన ముఖం, బీభత్సమైన రూపం కలవాడై అక్కడ ప్రత్యక్షమయ్యాడు. మరియు తపస్సు చేస్తున్న ఆ కన్యలను వరిస్తున్నవాడై ఓ మహారాజా! అక్కడి ఋషులను 'కన్యాదానం చేయండి' అని ప్రార్థించాడు. ఇలా ఋషికన్యల తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమైన ప్రదేశం కావున ఈ తీర్థం 'ఋషికన్యాతీర్థ'మనే పేరుతో కూడ ప్రసిద్ధి చెందింది. అక్కడ స్నానం చేసిన నరుడు సర్వపాపాల నుండి విముక్తుడవుతాడు.

తతో గచ్ఛేచ్చ రాజేంద్ర స్వర్ణబిందు త్వితి స్మృతమ్ ॥ 15 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ దుర్గతిం న చ పశ్యతి ।
అప్సరేశం తతో గచ్ఛేత్ స్నానం తత్ర సమాచరేత్ ॥ 16 ॥

క్రీడతే నాగలోకస్థో హ్యప్సరైః సహ మోదతే ।

ఓ రాజేంద్రా! అటు తర్వాత 'స్వర్ణబిందు' అనే పేరుగల తీర్థానికి వెళ్ళి అక్కడ స్నానం చేసిన నరుడు జీవితంలో దుర్గతిని చూడడు. ఆ తరువాత 'అప్సరేశ' తీర్థానికి వెళ్ళి, అక్కడ కూడ స్నానమాచరించిన నరుడు నాగలోకంలో అప్సరసలతో సహ సుఖాన్ని పొందుతాడు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర నరకం తీర్థముత్తమమ్ ॥ 17 ॥

తత్ర స్నాత్వాఽర్చయేద్దేవం నరకం చ న పశ్యతి ।
భారభూతిం తతో గచ్ఛేదుపవాసపరో జనః ॥ 18 ॥

ఏతత్తీర్థం సమాసాద్య చావతారం తు శాంభవమ్ ।
అర్చయిత్వా విరూపాక్షం రుద్రలోకే మహీయతే ॥ 19 ॥

అస్మింస్తీర్థే నరః స్నాత్వా భారభూతౌ మహాత్మనః ।
యత్ర తత్ర మృతస్యాపి ధ్రువం గాణేశ్వరీ గతిః ॥ 20 ॥

ఓ రాజేంద్రా! ఉత్తమమైన నరకతీర్థానికి వెళ్ళి, అక్కడ స్నానం చేసి, శివుని అర్చించిన నరుడు నరకలోకాన్ని చూడడు. అటు తర్వాత భారభూతితీర్థానికి వెళ్ళాలి. ఆ తీర్థానికి వెళ్ళి ఉపవాసవ్రతమాచరించి శంభుని అవతారమైన విరూపాక్షుని పూజించిన నరుడు రుద్రలోకాన్ని పొందుతాడు. ఈ భారభూతి తీర్థంలో స్నానం చేసిన వారు మహాత్ములు. వారు ఎక్కడ మృతిచెందినా గాణేశ్వరగతిని పొందుతారు.

కార్తికస్య తు మాసస్య హ్యర్చయిత్వా మహేశ్వరమ్ ।
అశ్వమేధాద్దశగుణం ప్రవదన్తి మనీషిణః ॥ 21 ॥

దీపకానాం శతం తత్ర ఘృతపూర్ణం తు దాపయేత్ ।
విమానైః సూర్యసంకాశైః వ్రజతే యత్ర శంకరః ॥ 22 ॥

ఈ తీర్థసమీపంలో కార్తికమాసంలో మహేశ్వరుని అర్చిస్తే అశ్వమేధయాగం కన్న పదిరెట్లు ఎక్కువ గుణం కలుగుతుందని పండితులు చెబుతారు. అలాగే ఈ తీర్థంలో నేతితో నింపిన నూరు దీపాలు దానం చేస్తే నరుడు సూర్యకాంతితో సమానమైన విమానాల ద్వారా శివుని సాన్నిధ్యానికి చేరుకొంటాడు.

వృషభం యః ప్రయచ్ఛేత్తు శంఖకుందేందుసప్రభమ్ ।
వృషయుక్తేన యానేన రుద్రలోకం స గచ్ఛతి ॥ 23 ॥

ధేనుమేకాం తు యో దద్యాత్తస్మింస్తీర్థే నరాధిప! ।
పాయసం మధుసంయుక్తం భక్ష్యాణి వివిధాని చ ॥ 24 ॥

యథాశక్త్యా చ రాజేంద్ర బ్రాహ్మణాన్ భోజయేత్తతః ।
తస్య తీర్థప్రభావేణ సర్వం కోటిగుణం భవేత్ ॥ 25 ॥

మరియు ఈ తీర్థంలో శంఖం వంటి, మల్లెపూల వంటి, చంద్రుని వంటి, తెల్లని వృషభాన్ని దానం చేస్తే వృషభవాహనం ద్వారా నరుడు రుద్రలోకానికి వెళతాడు. అంతేకాక ఓ నరాధిపా! ఇక్కడ ఎవరైతే గోదానం చేస్తారో, పాయసం, తేనె మొదలైన వాటితో కూడిన అనేక విధాలైన భక్ష్యాలతో యథాశక్తిగా బ్రాహ్మణులకు భోజనాలర్పిస్తారో, ఈ తీర్థప్రభావం చేత అవన్నీ కోటి రెట్లు ఫలాన్నిస్తాయి.

నర్మదాయా జలం పీత్వా హ్యర్చయిత్వా వృషధ్వజమ్ ।
దుర్గతిం చ న పశ్యన్తి తస్య తీర్థప్రభావతః ॥ 26 ॥

హంసయుక్తేన యానేన రుద్రలోకం స గచ్ఛతి ।
యావచ్చంద్రశ్చ సూర్యశ్చ హిమవాంశ్చ మహోదధిః ॥ 27 ॥

గంగాద్యాః సరితో యావత్తావత్స్వర్గే మహీయతే ।
అనాశకం తు యః కుర్యాత్తస్మింస్తీర్థే నరాధిప ॥ 28 ॥

గర్భవాసే తు రాజేంద్ర న పునర్జాయతే పుమాన్ ।

నర్మదానది నీరు త్రాగి వృషభధ్వజుడైన పరమశివుని అర్చించినవారు ఆ తీర్థప్రభావం వలన ఎటువంటి దుర్గతిని పొందరు. అంతేకాక హంసవాహనం ద్వారా రుద్రలోకానికి పోతారు. ఎంత వరకైతే చంద్రుడు, సూర్యుడు, హిమవంతుడు, మహాసముద్రం, గంగాది నదులు ఉంటాయో అంతవరకు స్వర్గలోకంలో నివసిస్తారు. ఓ నరాధిపా! ఈ తీర్థంలో ఎవరైతే నిరాహారవ్రతమాచరిస్తారో వారికి మరల గర్భవాసముండదు. పునర్జన్మ వుండదు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర ఆషాఢీతీర్థముత్తమమ్ ॥ 29 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్ ఇంద్రస్యార్ధాసనం లభేత్ ।
స్త్రియాస్తీర్థం తతో గచ్ఛేత్ సర్వపాపప్రణాశనమ్ ॥ 30 ॥

తత్రాపి స్నాతమాత్రస్య ధ్రువం గాణేశ్వరీ గతిః ।
ఐరండీనర్మదయోశ్చ సంగమం లోకవిశ్రుతమ్ ॥ 31 ॥

తచ్చ తీర్థం మహాపుణ్యం సర్వపాపప్రణాశనమ్ ।
ఉపవాసపరో భూత్వా నిత్యవ్రతపరాయణః ॥ 32 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర ముచ్యతే బ్రహ్మహత్యయా ।

రాజేంద్రా! ఆ తరువాత ఉత్తమమైన ఆషాఢీతీర్థానికి వెళ్ళాలి. అక్కడ స్నానం చేసినవాడు ఇంద్రుని అర్ధాసనాన్ని పొందుతాడు. రాజా! అటు తర్వాత స్త్రియా తీర్థానికి వెళ్ళాలి. ఆ తీర్థం కూడ పాపాలన్నింటినీ పోగొడుతుంది. అక్కడ స్నానం చేసినవారికి నిశ్చయంగా గాణాధిపత్యం లభిస్తుంది. అటు తర్వాత ఐరండీ నర్మదాతీర్థాల సంగమం లోకంలో ప్రసిద్ధి చెందింది. ఆ తీర్థం మహాపుణ్యప్రదమైంది. అన్ని పాపాలను

నశింపజేస్తుంది. నిత్యవ్రతాల నాచరిస్తూ, ఉపవాసాన్ననుసరిస్తూ ఆ తీర్థంలో స్నానం చేస్తే నరుడు బ్రహ్మహత్యా సదృశమైన పాపం నుండి కూడ విముక్తుడవుతాడు.

తతో గచ్ఛేచ్ఛ రాజేంద్ర నర్మదోదధిసంగమమ్ ॥ 33 ॥

జామదగ్న్యమితి ఖ్యాతం సిద్ధో యత్ర జనార్దనః ।
యత్రేష్ట్వా బహుభిర్యజ్ఞైః ఇంద్రో దేవాధిపోఽభవత్ ॥ 34 ॥

తత్ర స్నాత్వా తు రాజేంద్ర నర్మదోదధిసంగమే ।
త్రిగుణం చాశ్వమేధస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥ 35 ॥

రాజేంద్రా! అక్కడి నుండి నర్మదోదధిసంగమతీర్థానికి వెళ్ళాలి. ఈ తీర్థమే 'జామదగ్న్య తీర్థ'మనే పేరుతో ప్రసిద్ధి పొందింది. ఇక్కడ జనార్దనుడే స్వయంగా సిద్ధి పొందాడు. ఇంద్రుడు కూడా అనేక యజ్ఞాలాచరించి దేవాధిపతి అయ్యాడు. రాజేంద్రా! ఈ నర్మదోదధిసంగమంలో స్నానం చేసిన మానవుడు అశ్వమేధయాగం కంటె మూడు రెట్లధికమైన ఫలాన్ని పొందుతాడు.

పశ్చిమస్యోదధేః సంధౌ స్వర్గద్వారవిఘట్టనమ్ ।
తత్ర దేవాః సగంధర్వా ఋషయః సిద్ధచారణాః ॥ 36 ॥

ఆరాధయన్తి దేవేశం త్రిసంధ్యం విమలేశ్వరమ్ ।
తత్ర స్నాత్వా నరో రాజన్ రుద్రలోకే మహీయతే ॥ 37 ॥

విమలేశపరం తీర్థం న భూతం న భవిష్యతి ।
తత్రోపవాసం కృత్వా యే పశ్యన్తి విమలేశ్వరమ్ ॥ 38 ॥

సప్తజన్మకృతం పాపం హిత్వా యాన్తి శివాలయమ్ ।

పశ్చిమసముద్రపు సంధిలో 'స్వర్గద్వారవిఘట్టనం' అనే తీర్థం కలదు. అక్కడ దేవతలు, గంధర్వులు, ఋషులు, సిద్ధచారణాదులందరు దేవేశుడైన విమలేశ్వరుని ఉదయ, మధ్యాహ్న, సాయంసంధ్యాసమయాల్లో పూజిస్తారు. ఓ రాజా! అక్కడ స్నానం చేసిన నరుడు రుద్రలోకాన్ని పొందుతాడు. విమలేశం కంటె గొప్ప తీర్థమింతకు పూర్వం లేదు. భవిష్యత్తులో కూడ వుండదు. అక్కడ ఉపవాసం చేసి విమలేశ్వరుని దర్శించుకున్న వారు ఏడు జన్మలలో చేసిన పాపముల నుండి విముక్తులై శివసాన్నిధ్యాన్ని పొందుతారు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర కౌశికీతీర్థముత్తమమ్ ॥ 39 ॥

తత్ర స్నాత్వా నరో రాజన్నుపవాసపరాయణః ।
ఉపోష్య రజనీమేకాం నియతో నియతాశనః ॥ 40 ॥

ఏతత్తీర్థప్రభావేణ ముచ్యతే బ్రహ్మహత్యయా ।
సర్వతీర్థాభిషేకం తు యః పశ్యేత్సాగరేశ్వరమ్ ॥ 41 ॥

యోజనాభ్యన్తరే తిష్ఠన్నావర్తే సంస్థితః శివః ।
తం దృష్ట్వా సర్వతీర్థాని దృష్టాన్యేవ న సంశయః ॥ 42 ॥

సర్వపాపవినిర్ముక్తో యత్ర రుద్రః స గచ్ఛతి ।

ఓ రాజేంద్రా! ఆ తర్వాత ఉత్తమమైన కౌశికీతీర్థానికి వెళ్ళాలి. అక్కడ స్నానమాచరించి, ఉపవాసపరాయణుడై, ఇంద్రియనిగ్రహం కలవాడై, ఒక పగలు, రాత్రి ఉపవాసముండాలి. అలా చేస్తే ఈ తీర్థ ప్రభావం చేత బ్రహ్మహత్యతో సమానమైన పాపం నుండి కూడ మానవుడు ముక్తి పొందుతాడు. ఇక్కడనే సాగరేశ్వర తీర్థం కలదు. దీనిలో స్నానమాచరిస్తే తీర్థాలన్నింటిలో స్నానం చేసిన పుణ్యం లభిస్తుంది. ఇక్కడ సాగరేశ్వరుడనే శివుడు సముద్రంలో ఒక యోజనదూరంలో జలపు సుడుల మధ్యభాగంలో కలడు. ఆ శివుని దర్శించుకొంటే అన్నితీర్థములూ దర్శించినట్లే అనుటలో ఏ మాత్రము సందేహం లేదు. అలా దర్శించుకున్నవాడు అన్నిపాపాల నుండి ముక్తిని పొంది రుద్రలోకానికి వెళతాడు.

నర్మదాసంగమం యావద్యావచ్చామరకంటకమ్ ॥ 43 ॥

అత్రాన్తరే మహారాజ తీర్థకోట్యో దశ స్మృతాః ।
తీర్థాత్తీర్థాన్తరం యత్ర ఋషికోటినిషేవితమ్ ॥ 44 ॥

సాగ్నిహోత్రైస్తు విద్వద్భిః సర్వైర్ధ్యానపరాయణైః ।
సేవితాఽనేన రాజేంద్ర త్వీప్సితార్థప్రదాయికా ॥ 45 ॥

ఓ మహారాజా! నర్మదానది పవిత్రసంగమం మొదలుకొని అమరకంటకపర్వతం వరకు మధ్యలో సుమారుగా పదికోట్ల తీర్థాలున్నాయి. మరియు తీర్థానికీ తీర్థానికి మధ్య కోట్లాది ఋషులు కలరు. ఓ రాజేంద్రా! నిత్యాగ్ని హోత్రులు, విద్వాంసులు, ధ్యానపరాయణులూ అయిన ఆ ఋషులందరు కోరిన కోరికలను తీర్చే ఈ నర్మదానదిని ఎల్లప్పుడూ సేవిస్తూంటారు.

యస్త్విదం వై పఠేన్నిత్యం శృణుయాద్వాపి భావతః ।
తస్య తీర్థాని సర్వాణి హ్యభిషించన్తి పాండవ ॥ 46 ॥

నర్మదా చ సదా ప్రీతా భవేద్వై నాత్ర సంశయః ।
ప్రీతస్తత్ర భవేద్రుద్రో మార్కండేయో మహామునిః ॥ 47 ॥

ఎవరైతే ఈ నర్మదా తీర్థమాహాత్మ్యాన్ని శ్రద్ధతో నిత్యం పఠిస్తారో లేదా వింటారో వారిని ఈ తీర్థాలన్నీ స్వయంగా తమ జలాలతో అభిషేకిస్తాయి. పాండవా! నర్మదానది కూడ అటువంటివారి విషయంలో సదా ప్రీతి పొందుతుందనటంలో సందేహం లేదు. అంతే కాక పరమశివుడు, మార్కండేయ మహాముని కూడ సంతోషిస్తారు.

వంధ్యా చ లభేత్ పుత్రాన్ దుర్భగా సుభగా భవేత్ ।
కన్యా లభేత భర్తారం యశ్చ వాంఛేత్తు యత్ఫలమ్ ।
తదేవ లభతే సర్వం నాత్ర కార్యా విచారణా ॥ 48 ॥

బ్రాహ్మణో వేదమాప్నోతి క్షత్రియో విజయీ భవేత్ ।
వైశ్యస్తు లభతే లాభం శూద్రః ప్రాప్నోతి సద్గతిమ్ ॥ 49 ॥

మూర్ఖస్తు లభతే విద్యాం త్రిసంధ్యం యః పఠేన్నరః ।
నరకం చ న పశ్యేత్తు వియోగం చ న గచ్ఛతి ॥ 50 ॥

ఈ మాహాత్మ్యాన్ని చదవటం లేదా వినటం వలన వంధ్య అయిన స్త్రీకి పుత్రులు లభిస్తారు. కురూపియైన స్త్రీ సౌందర్యవతి అవుతుంది. కన్య తగిన భర్తను పొందుతుంది. మరియు ఎవరు ఏ ఫలాన్ని ఆశించి దీన్ని పఠిస్తారో లేదా వింటారో వారికా ఫలాలన్నీ లభిస్తాయి. ఈ విషయంలో సందేహం లేదు. బ్రాహ్మణుడు వేద విజ్ఞానాన్ని, క్షత్రియుడు విజయాన్ని పొందుతాడు. వైశ్యునికి వ్యాపారంలో లాభం కలుగుతుంది. మరియు శూద్రుడు సద్గతిని పొందుతాడు. మూర్ఖుడు విద్యావంతుడవుతాడు. ఎవరైతే త్రికాలసంధ్యలలో ఈ మాహాత్మ్యాన్ని పఠిస్తారో వారు ఎప్పుడూ నరకలోకం చూడరు. తమ ఆత్మీయులనుండి వియోగాన్ని కూడ పొందరు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే నర్మదామాహాత్మ్యం నామ
చతుర్నవత్యధికశతతమోఽధ్యాయః ॥ 194 ॥

శ్రీమత్స్యమహాపురాణంలో నర్మదామాహాత్మ్యంలో
నూటతొంబై నాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచనవత్యధికశతతమోఽధ్యాయః – నూటతొంబై ఐదవ అధ్యాయం

భృగుగోత్రప్రవరవర్ణనమ్ – భృగు వంశీయుల గోత్ర ప్రవరలు

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య స రాజేంద్ర ఓంకారస్యాభివర్ణనమ్ ।
తతః పప్రచ్ఛ దేవేశం మత్స్యరూపం జలార్ణవే ॥ 1 ॥

ఆ విధంగా ఓంకారక్షేత్ర వర్ణనను వినిన ఆ వైవస్వతమనువు ఆ తరువాత జలార్ణవంలో మత్స్యరూపంలో వున్న విష్ణుభగవానుని ఇలా అడిగాడు.

మనురువాచ – మనువు చెప్పాడు.

ఋషీణాం నామ గోత్రాణి వంశావతరణం తథా ।
ప్రవరాణాం తథా సామ్యమసామ్యం విస్తరాద్వద ॥ 2 ॥

మహాదేవేన ఋషయః శప్తాః స్వాయంభువాన్తరే ।
తేషాం వైవస్వతే ప్రాప్తే సంభవం మమ కీర్తయ ॥ 3 ॥

దాక్షాయణీనాం చ తథా ప్రజాః కీర్తయ మే ప్రభో ।
ఋషీణాం చ తథా వంశం భృగువంశవివర్ధనమ్ ॥ 4 ॥

దేవా! ఋషుల పేర్లు, గోత్రాలు, వారి వంశావతారాలు (వంశారంభం) వారి ప్రవరలు, వాటి సామ్యాసామ్యాలు మొదలైనవన్నీ విస్తరంగా వివరించు. స్వాయంభువమన్వంతరంలో ఋషులు మహాదేవునిచే ఎందుకు శపించబడినారు? మరల వైవస్వతమన్వంతరంలో వారు, ఏ విధంగా జన్మించారు? దక్షప్రజాపతి సంతతులను వారి నుండి వర్ధిల్లిన ఋషుల వంశావళిని దానిలో ముందుగా భృగువంశవివర్ధనం గురించి నాకు వివరించి చెప్పు అని మనువు భగవానుని ప్రార్థించాడు.

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

మన్వన్తరేఽస్మిన్ సంప్రాప్తే పూర్వం వైవస్వతే తథా ।
చరిత్రం కథ్యతే రాజన్ బ్రహ్మణః పరమేష్ఠినః ॥ 5 ॥

ఓ రాజా! ఈ మన్వంతరంలో మరియు మొదటి వైవస్వతమన్వంతరంలో జరిగిన పరమేష్ఠియైన బ్రహ్మదేవుని చరితము వివరిస్తాను.

మహాదేవస్య శాపేన త్యక్త్వా దేహం స్వయం తథా ।
ఋషయశ్చ సముద్భూతాశ్చ్యుతే శుక్రే మహాత్మనా ॥ 6 ॥

దేవానాం మాతరో దృష్ట్వా దేవపత్న్యస్తథైవ చ ।
స్కన్నం శుక్రం మహారాజ బ్రహ్మణః పరమేష్ఠినః ॥ 7 ॥

తజ్జుహావ తతో బ్రహ్మా తతో జాతా హుతాశనాత్ ।
తతో జాతో మహాతేజా భృగుశ్చ తపసాం నిధిః ॥ 8 ॥

పూర్వం మహాదేవుని శాపం వలన స్వయంగానే శరీరం త్యాగం చేసిన ఋషులు మరల మహాత్ముడైన బ్రహ్మదేవుని నుండి అనుకోకుండా స్ఖలితమైన శుక్రం నుండి ఉద్భవించారు. దేవమాతలను దేవపత్నులను కూడ చూచిన బ్రహ్మదేవుని నుండి శుక్రం స్ఖలితమయింది. ఓ మహారాజా! దానిని బ్రహ్మదేవుడు హోమం చేశాడు. అలా హోమం చేయబడిన అగ్ని నుండి ఈ వైవస్వతమన్వంతరపు ఋషులు ఉద్భవించారు. వారిలో తపోనిధి మరియు మహాతేజస్వి అయిన భృగుమహర్షి మొదట జన్మించాడు.

అంగారేష్వంగిరా జాతో హ్యర్చిభ్యోఽత్రిస్తథైవ చ ।
మరీచిభ్యో మరీచిస్తు తతో జాతో మహాతపాః ॥ 9 ॥

కేశస్తు కపిశో జాతః పులస్త్యశ్చ మహాతపాః ।
కేశః ప్రలంబైః పులహస్తతో జాతో మహాతపాః ॥ 10 ॥

వసుమధ్యాత్సముత్పన్నో వసిష్ఠస్తు తపోధనః ।

నిప్పు కణికల నుండి అంగిరుడు, అర్చిల నుండి అనగా జ్వాలలనుండి అత్రి, మరీచుల నుండి అనగా కిరణముల నుండి మరీచి, కేశముల నుండి కపిశుడు మరియు పులస్త్యుడు, వ్రేలాడుతున్న కేశముల కొన నుండి పులహుడు, వసుమధ్యము నుండి వసిష్ఠుడు మొదలగు తపోనిధులు జన్మించారు.

భృగుః పులోమ్నస్తు సుతాం దివ్యాం భార్యామవిన్దత ॥ 11 ॥

యస్యామస్య సుతా జాతా దేవా ద్వాదశ యాజ్ఞికాః ।
భువనో భౌవనశ్చైవ సుజన్యః సుజనస్తథా ॥ 12 ॥

ఋతుర్వసుశ్చ మూర్ధా చ త్యాజ్యశ్చ వసుదశ్చ హ ।
ప్రభవశ్చావ్యయశ్చైవ దక్షో ఽథ ద్వాదశస్తథా ॥ 13 ॥

ఇత్యేతే భృగవో నామ దేవా ద్వాదశ కీర్తితాః ।

వీరిలో భృగువు పులోముడనే రాక్షసుని కూతురైన, దివ్యత్వాన్ని పొందిన పౌలోమినిని వివాహం చేసికొన్నాడు. ఆమె ద్వారా భృగువు యాజ్ఞికులైన పన్నెండు మంది పుత్రులను కన్నాడు. వారు 1.భువనుడు 2.భౌవనుడు 3.సుజన్యుడు 4.సుజనుడు 5.ఋతువు 6.వసువు 7.మూర్ధుడు 8.త్యాజ్యుడు 9.వసుదుడు 10.ప్రభవుడు 11.అవ్యయుడు 12.దక్షుడు. భృగువుకు జన్మించిన ఈ పన్నెండు మంది పుత్రులు దేవతలుగానే పరిగణించబడి భృగువులుగా కీర్తించబడినారు.

పౌలోమ్యాం జనయద్విప్రాన్ దేవానాం తు కనీయసః ॥ 14 ॥

చ్యవనం తు మహాభాగమాప్నువానం తథైవ చ ।
ఆప్నువానాత్మజశ్చౌర్వో జమదగ్నిస్తదాత్మజః ॥ 15 ॥

ఆ తర్వాత భృగువు పౌలోమిని ద్వారా మహాభాగ్యశాలియైన చ్యవనుడు మరియు ఆప్నువానుడు అనే విప్రులైన ఇద్దరు చిన్న కుమారులను కూడ పొందెను. ఈ ఆప్నువానునికి ఔర్వుడు, ఔర్వునకు జమదగ్ని అనే పుత్రులు కలిగారు.

ఔర్వో గోత్రకరస్తేషాం భార్గవాణాం మహాత్మనామ్ ।
తత్ర గోత్రకరాన్ వక్ష్యే భృగోర్వై దీప్తతేజసః ॥ 16 ॥

భృగుశ్చ చ్యవనశ్చైవ ఆప్నువానస్తథైవ చ ।
ఔర్వశ్చ జమదగ్నిశ్చ వాత్స్యో దండిర్నడాయనః ॥ 17 ॥

వైగాయనో వీతిహవ్యః పైలశ్చైవాత్ర శౌనకః ।
శౌనకాయన జీవన్తిరాయేదః కార్షణిస్తథా ॥ 18 ॥

భృగువంశానికి సంబంధించిన మహానుభావులైన ఋషులందరికీ గోత్రకర్త ఔర్వుడేనని చెప్పబడింది. ఇప్పుడు దీప్తిమంతులైన భృగువుకు సంబంధించిన గోత్రప్రవర్తక ఋషులను చెబుతాను. భృగువు, చ్యవనుడు, ఆప్నువానుడు, ఔర్వుడు, జమదగ్ని, వాత్స్యుడు, దండి, నడాయనుడు, వైగాయనుడు, వీతిహవ్యుడు, పైలుడు, శౌనకుడు, శౌనకాయనుడు, జీవంతి, ఆయేదుడు, కార్షణి,

వైహీనరిర్విరూపాక్షో రౌహిత్యాయనిరేవ చ ।
వైశ్వానరిస్తథా నీలో లుబ్ధః సావర్ణికశ్చ సః ॥ 19 ॥

విష్ణుః పౌరోఽపి బాలాకిరైలికోఽనన్తభాగినః ।
మృగమార్గేయమార్కండజవినో వీతినస్తథా ॥ 20 ॥

మండ మాండవ్య మాండూకఫేనపాః స్తనిత స్తథా ।
స్థలపిండః శిఖావర్ణః శార్కరాక్షిస్తథైవ చ ॥ 21 ॥

వైహీనరి, విరూపాక్షుడు, రౌహిత్యాయని, వైశ్వానరి, నీలుడు, లుబ్ధుడు, సావర్ణికుడు, విష్ణువు, పౌరుడు, బాలాకి, ఐలికుడు, అనంతభాగి, మృగుడు, మార్గేయుడు, మార్కండుడు, జవినుడు, వీతినుడు, మండుడు, మాండవ్యుడు, మాండూకుడు, ఫేనపుడు, స్తనితుడు, స్థలపిండుడు, శిఖావర్ణుడు, శార్కరాక్షియూ.

జాలధిః సౌధికః క్షుభ్యః కుత్స్యన్యో మౌద్గలాయనః ।
మాంకార్మాయనో దేవపతిః పాండురోచిః సగాలవః ॥ 22 ॥

సాంకృత్యశ్చాతకిః సార్పిర్యజ్ఞపిండాయనస్తథా ।
గార్గ్యాయణో గాయనశ్చ ఋషిర్గార్హాయణస్తథా ॥ 23 ॥

గోష్ఠాయనో వాత్స్యాయనో వైశంపాయన ఏవ చ ।
వైకర్ణినిః శార్ఙ్గరవో యాజ్ఞేయిర్భ్రాష్టకాయణిః ॥ 24 ॥

లాలాటిర్నాకులిశ్చైవ లౌక్షిణ్యోపరిమండలౌ ।
ఆలుకిః సౌచకిః కౌత్సస్తథాన్యః పైంగలాయనిః ॥ 25 ॥

జాలధి, సౌధికుడు, క్షుభ్యుడు, కుత్సన్యుడు, మౌద్గలాయనుడు, మూంకాయనుడు, దేవపతి, పాండురోచి, గాలవుడు, సాంకృత్యుడు, చాతకి, సార్పి, యజ్ఞపిండాయనుడు, గార్గ్యాయణుడు, గాయనుడు, గార్హాయణుడు, గోష్ఠాయనుడు, వాత్స్యాయనుడు, వైశంపాయనుడు, వైకర్ణిని, శార్ఙ్గరవుడు, యాజ్ఞేయి, భ్రాష్టకాయనుడు, లాలాటి, నాకులి, లౌక్షిణ్యుడు, ఉపరిమండలుడు, ఆలుకి, సౌచకి, కౌత్సుడు, పైంగలాయని, మరియూ

సాత్యాయనిర్మాలాయనిః కౌటిలిః కౌచహస్తికః ।
సౌహః సోక్తిః సకోవాక్షిః కౌసిశ్చాంద్రమసిస్తథా ॥ 26 ॥

నైకజిహ్వో జిహ్మకశ్చ వ్యాధాజ్యో లౌహవైరిణః ।
శారద్వతికనైతిష్యౌ లోలాక్షిశ్చలకుండలః ॥ 27 ॥

వాగాయనిశ్చానుమతిః పూర్ణిమాగతికోఽసకృత్ ।
సామాన్యేన యథా తేషాం పంచైతే ప్రవరా మతాః ॥ 28 ॥

భృగుశ్చ చ్యవనశ్చైవ ఆప్నువానస్తథైవ చ ।
ఔర్వశ్చ జమదగ్నిశ్చ పంచైతే ప్రవరా మతాః ॥ 29 ॥

సాత్యాయని, మాలాయని, కౌటిలి, కౌచహస్తికుడు, సౌహుడు, సోక్తి, సకౌవాక్షుడు, కౌసి, చాంద్రమసి, నైకజిహ్వుడు, జిహ్మకుడు, వ్యాధాద్యుడు, లోహవైరిణుడు, శారద్వతికుడు, నైతిష్యుడు, లోలాక్షుడు, చలకుండలుడు, వాగాయని, ఆనుమతి, పూర్ణిమాగతికుడు, అసకృత్ మొదలగు వారు. సామాన్యంగా ఈ ఋషులందరికీ "భృగువు, చ్యవనుడు, ఆప్నువానుడు, ఔర్యుడు, జమదగ్ని" అనే ఐదుగురు ప్రవర ఋషులు. అనగా పైన చెప్పిన ఋషులందరు (గోత్రముల వారు) పంచార్షేయ ప్రవరాన్వితులని తెలిసికోవాలి.

అతఃపరం ప్రవక్ష్యామి శృణు త్వన్యాన్ భృగూద్వహాన్ ।
జమదగ్నిర్బిదశ్చైవ పౌలస్త్యో బైజభృత్తథా ॥ 30 ॥

ఋషిశ్చోభయజాతశ్చ కాయనిః శాకటాయనః ।
ఔర్వేయా మారుతాశ్చైవ సర్వేషాం ప్రవరాః శుభాః ॥ 31 ॥

భృగుశ్చ చ్యవనశ్చైవ ఆప్నువానస్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 32 ॥

ఇపుడు మరికొంతమంది భృగువంశ శ్రేష్ఠులను చెబుతాను విను. జమదగ్ని, బిదుడు,పౌలస్త్యుడు, బైజభృత్, ఋషి, ఉభయజాతుడు, కాయని, శాకటాయనుడు, ఈ ఎనిమిది మంది ఔర్వుని సంతతి వారు మరియు మరుత్

సంతతివారు. వీరందరికీ భృగువు, చ్యవనుడు, ఆప్నువానుడు అనే ఈ ముగ్గురు ప్రవర ఋషులు. ఈ ఋషులు తమలో తాము వివాహాలు చేసుకోరు.

భృగుదాసో మార్గపథో గ్రామ్యాయణికటాయనీ ।
ఆపస్త్రామ్బిస్తథా బిల్విర్నైకశిః కపిరేవ చ ॥ 33 ॥

ఆర్ష్టిషేణో గార్దభిశ్చ కార్దమాయనిరేవ చ ॥
ఆశ్వాయనిస్తథారూపిః పంచార్షేయాః ప్రకీర్తితాః ॥ 34 ॥

భృగుశ్చ చ్యవనశ్చైవ అప్నువానస్తథైవ చ ।
ఆర్ష్టిషేణస్తథారూపిః ప్రవరాః పంచకీర్తితాః ॥ 35 ॥

పరస్పరమవైబాహ్యా ఋషయః పరికీర్తితాః ।

భృగుదాసుడు, మార్గపథుడు, గ్రామ్యాయణి, కటాయని, ఆపస్తంబి, బిల్వి, నైకశి, కపి, ఆర్ష్టిషేణుడు, గార్దభి, కార్దమాయని, ఆశ్వాయని, రూపి అనే ఈ పదముగ్గురు పంచార్షేయులు. భృగువు, చ్యవనుడు, ఆప్నువానుడు, ఆర్ష్టిషేణుడు, రూపి అనే ఈ ఐదుగురు వీరి ప్రవరఋషులు. వీరు కూడ పరస్పరం వివాహాది సంబంధాలు చేసికోరాదు.

యాస్కో వా వాతిహవ్యో వా మథితస్తు తథా దమః ॥ 36 ॥

జైవన్త్యాయనిమౌంజశ్చ పిలిశ్చైవ చలిస్తథా ॥
భాగిలో భాగవిత్తిశ్చ కౌశాపిస్త్వథ కాశ్యపిః ॥ 37 ॥

బాలాపిః శ్రమదాగేపి సౌరస్తిథిస్తథైవ చ ।
గార్గీయస్త్వథ జాబాలిః తథా పౌష్ణ్యాయనో హ్యృషిః ॥ 38 ॥

గ్రామదశ్చ తథైతేషాం త్ర్యార్షేయాః ప్రవరాః మతాః ।
భృగుశ్చ వీతిహవ్యశ్చ తథా రేవసవైవసౌ ॥ 39 ॥

పరస్పరమవైవాహ్యాః ఋషయః పరికీర్తితాః ।

యాస్కుడు, వాతిహవ్యుడు, మథితుడు, దముడు, జైవన్త్యాయని, మౌంజుడు, పిలి, చలి, భాగిలుడు, భాగవిత్తి, కౌశాపి, కాశ్యపి, బాలాపి, శ్రమదాగేపి, సౌరుడు,తిథి, గార్గీయుడు, జాబాలి, పౌష్ణ్యాయనుడు, గ్రామదుడు మొదలగు ఈ ఇరవై మందికి, భృగువు, వీతిహవ్యుడు, రేవసుడు, వైవసుడు అనే వారు ప్రవర ఋషులు. ఈ గోత్రాల వారు కూడ పరస్పరం వివాహాది సంబంధాలు చేసికోరాదు.

శాలాయనిః శాకటాక్షో మైత్రేయః ఖాణ్డవస్తథా ॥ 40 ॥

ద్రౌణాయనో రౌక్మాయణా పిశలీ చాపికాయనిః ।
హంసజిహ్వస్తథైతేషాం త్ర్యార్షేయాః ప్రవరా మతాః ॥ 41 ॥

భృగుశ్చైవాథ వధ్ర్యశ్వో దివోదాసస్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 42 ॥

శాలాయని, శాకటాక్షుడు, మైత్రేయుడు, ఖాండవుడు,ద్రౌణాయనుడు, రౌక్మాయణుడు, పిశలి, ఆపికాయని,హంసజిహ్వుడు మొదలగువారికి ప్రవర ముగ్గురు ఋషులకు సంబంధించినది. భృగువు, వధ్ర్యశ్వుడు, దివోదాసుడు అనే వారు ప్రవర ఋషులు. వీరు పరస్పరం వివాహ సంబంధాలు చేసికోరాదు.

ఏకాయనో యాజ్ఞపతిర్మత్స్యగంధస్తథైవ చ ।
ప్రత్యహాశ్చ తథా సౌరిశ్చౌక్షిర్వై కార్దమాయనః ॥ 43 ॥

తథా గృత్సమదో రాజన్ సనకశ్చ మహానృషిః ।
ప్రవరాస్తు తథోక్తానామార్షేయాః పరికీర్తితాః ॥ 44 ॥

భృగుర్గృత్సమదశ్చైవ ఆర్షావేతౌ ప్రకీర్తితౌ ।
పరస్పరమవైవాహ్యా ఇత్యేతే పరికీర్తితాః ॥ 45 ॥

ఏతే తవోక్తా భృగువంశజాతా మహానుభావా నృప! గోత్రకారాః ।
ఏషాం తు నామ్నాం పరికీర్తితేన పాపం సమగ్రం విజహాతి జన్తుః ॥ 46 ॥

ఏకాయనుడు,యాజ్ఞపతి, మత్స్యగంధుడు, ప్రత్యూహుడు, సౌరి, ఔక్షి, కార్దమాయని, గృత్సమదుడు, అనే వారు ప్రవరఋషులు. ఈ ఇద్దరు ఋషుల వంశావళికి చెందిన వారికి కూడ పరస్పర వివాహాదులు నిషిద్ధం. ఓ రాజా! ఇవి గోత్రకారులు, మహానుభావులూ అయిన భృగువంశంలో జన్మించిన ఋషుల పేర్లు నీకు వివరించాను. ఈ మహర్షుల నామాలను కీర్తించిన మాత్రాననే నరుడు సకల పాపాల నుండి ముక్తి పొందుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే భృగు గోత్ర ప్రవర వర్ణనం నామ పంచనవత్యధికశతతమోఽధ్యాయః ॥ 195 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని భృగువంశీయుల గోత్ర ప్రవరలు అనే నూట తొంబై ఐదవ అధ్యాయం సమాప్తం



షణ్ణవత్యధికశతతమోఽధ్యాయః – నూటతొంబై ఆరవ అధ్యాయం
అంగిరో వంశకీర్తనమ్ – అంగిరస వంశ గోత్రప్రవరలు

మత్స్య ఉవాచ – మత్స్యుడు మూర్తి.

మరీచితనయా రాజన్ సురూపా నామ విశ్రుతా ।
భార్యా చాంగిరసో దేవాస్తస్యాః పుత్రా దశ స్మృతాః ॥ 1 ॥

ఆత్మాయుర్దమనో దక్షః సదః ప్రాణస్తథైవ చ ।
హవిష్మాంశ్చ గవిష్ఠశ్చ ఋతః సత్యశ్చ తే దశ ॥ 2 ॥

ఏతే చాంగిరసో నామ దేవా వై సోమపాయినః ।
సురూపా జనయామాస ఋషీన్ సర్వేశ్వరానిమాన్ ॥ 3 ॥

మత్స్యరూపంలో వున్న జనార్దనుడు వైవస్వతునికిలా చెప్పసాగాడు. ఓ రాజా! మరీచి ప్రజాపతికి 'సురూప' యను ప్రసిద్ధురాలైన కూతురుండేది. ఆమె అంగిరస మునికి భార్య అయ్యెను. వీరికి పదిమంది దేవతలు పుత్రులైనారు. వారు "ఆత్మ, ఆయువు, దమనుడు, దక్షుడు, సదుడు, ప్రాణుడు, హవిష్మాన్, గవిష్ఠుడు, ఋతుడు, సత్యుడు" అనేవారు. అంగిరసులనే పేరు గల ఈ దేవతలు యజ్ఞాలలో సోమపానం చేసేవారు. సర్వేశ్వరులైన ఈ పదిమంది ఋషులకు సురూప జన్మనిచ్చింది.

బృహస్పతిం గౌతమం చ సంవర్తమృషిముత్తమమ్ ।
ఉతథ్యం వామదేవం చ అజస్యమృషిజం తథా ॥ 4 ॥

ఇత్యేతే ఋషయః సర్వే గోత్రకారాః ప్రకీర్తితాః ।
తేషాం గోత్రసముత్పన్నాన్ గోత్రకారాన్నిబోధ మే ॥ 5 ॥

బృహస్పతి, గౌతముడు, సంవర్తుడు, ఉతథ్యుడు, వామదేవుడు, అజస్యుడు, ఋషిజుడు, అనే ఈ ఋషులు గోత్ర ప్రతిష్ఠాపకులు. వీరి గోత్రాలలో జన్మించిన గోత్రకారుల గురించి వివరిస్తాను విను.

ఉతథ్యో గౌతమశ్చైవ తౌలేయోఽభిజితస్తథా ।
సార్ధనేమిః సలౌగాక్షిః క్షీరః కౌష్టికిరేవ చ ॥ 6 ॥

రాహుకర్ణిః సౌపురిశ్చ కైరాతిః సామలోమకిః ।
పౌపజితిర్భార్గవతో హ్యైృషిశ్చైరీదవస్తథా ॥ 7 ॥

కారోటకః సజీవీ చ ఉపబిందు సురౌషిణౌ ।
వాహినీపతి వైశాలీ క్రోష్టా చైవారుణాయనిః ॥ 8 ॥

ఉతథ్యుడు, గౌతముడు, తౌలేయుడు, అభిజితుడు, సార్ధనేమి, సలౌగాక్షి, క్షీరుడు, కౌష్ఠికి, రాహుకర్ణి, సౌపురి, కైరాతి, సామలోమకి, పౌపజితి, భార్గవతుడు, ఐరీడవుడు, కారోటకుడు, సజీవి, ఉపబిందు, సురౌషిణుడు, వాహినీపతి, వైశాలి, క్రోష్ట, అరుణి.

సోమోఽత్రాయనికాసౌరుకౌశల్యాః పార్థివాస్తథా ।
రౌహిణ్యాయనిరేవాగ్ని మూలపః పాండురేవ చ ॥ 9 ॥

క్షయా విశ్వకరోఽరిశ్చ పారికారారిరేవ చ ।
ఆర్షేయాః ప్రవరాశ్చైవ తేషాం చ ప్రవరాన్ శృణు ॥ 10 ॥

అంగిరాః సువచోతథ్య ఉశిజశ్చ మహానృషిః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 11 ॥

సోముడు, అత్రాయని, కాసౌరు, కౌశల్యుడు, పార్థివుడు, రౌహిణ్యాయని, రేవాగ్ని, మూలపుడు, పాండుడు, క్షయా, విశ్వకరుడు, అరి, పారికారారి అనే ఈ ఋషుల ప్రవర విను! వీరందరికీ, అంగిరసుడు, సువచుడైన ఉతథ్యుడు, మహర్షియైన ఉశిజుడు అనే వారు ప్రవరఋషులు. ఈ గోత్రాల ఋషుల వంశాలలో జన్మించిన వారికి పరస్పరవివాహసంబంధాలు నిషేధం.

ఆత్రేయాయణిసౌవేష్ట్యావగ్నివేశ్యాః శిలాస్థలిః ।
బాలిశాయనిశ్చైకేపీ వారాహిర్బాష్కలిస్తథా ॥ 12 ॥

సౌటిశ్చ తృణకర్ణిశ్చ ప్రావహిశ్చాశ్వలాయనిః ।
వారాహిర్బర్హి సాదీ చ శిఖాగ్రీవిస్తథైవ చ ॥ 13 ॥

కారకిశ్చ మహాకాపిస్తథా చోడుపతిః ప్రభుః ।
కౌచకిర్ధమితశ్చైవ పుష్పాన్వేషిస్తథైవ చ ॥ 14 ॥

ఆత్రేయాయని, సౌవేష్ట్యుడు, అగ్నివేశ్యుడు, శిలాస్థలి, బాలిశాయని, చైకేపి, వారాహి, బాష్కలి, సౌటి, తృణకర్ణి, ప్రావహి, ఆశ్వలాయని, వారాహి, బర్హిసాది, శిఖాగ్రీవి, కారకి, మహాకాపి, ఉడుపతి, కౌచకి, ధమితుడు, పుష్పాన్వేషి,

సోమతన్విర్బ్రహ్మతన్విః సాలడిర్బాలడిస్తథా ।
దేవరారిర్దేవస్థానిర్హారికర్ణిః సరిద్భువిః ॥ 15 ॥

ప్రావేపిః సాద్యసుగ్రీవిః తథా గోమేదగంధికః ।
మత్స్యాచ్ఛాద్యో మూలహరః ఫలాహారస్తథైవ చ ॥ 16 ॥

గాంగోదధిః కౌరుపతిః కౌరుక్షేత్రిస్తథైవ చ ।
నాయకిర్జైత్యద్రోణిశ్చ జైహ్వలాయనిరేవ చ ॥ 17 ॥

సోమతన్వి, బ్రహ్మతన్వి, సాలడి, బాలడి, దేవరారి, దేవస్థాని, హారికర్ణి, సరిద్భువి, ప్రావేపి, సాద్యసుగ్రీవి, గోమేదగంధికుడు, మత్స్యాచ్ఛాద్యుడు, మూలహరుడు, ఫలాహారుడు, గాంగోదధి, కౌరుపతి, కౌరుక్షేత్రి, నాయకి, జైత్ర్యద్రోణి, జైహ్వాలాయని,

ఆపస్తమ్బిర్మౌంజవృష్టిర్మార్ష్టపింగలిరేవ చ ।
పైలశ్చైవ మహాతేజాః శాలంకాయనిరేవ చ ॥ 18 ॥

ద్వ్యాఖ్యేయో మారుతశ్చైషాం త్ర్యార్షేయః ప్రవరో నృపః ।
అంగిరాః ప్రథమస్తేషాం ద్వితీయశ్చ బృహస్పతిః ॥ 19 ॥

తృతీయశ్చ భరద్వాజః ప్రవరాః పరికీర్తితాః ।
పరస్పరమవైవాహ్యా ఇత్యేతే పరికీర్తితాః ॥ 20 ॥

ఆపస్తంబి, మౌంజవృష్టి, మార్ష్టపింగలి, పైలుడు, మహాతేజస్వి అయిన శాలంకాయని, ద్వ్యాఖ్యేయుడు, మారుతుడు, అనే ఈ ఋషుల గోత్రాలవారికి ప్రవర మూడు ఋషులకు సంబంధించింది. వీరి ప్రవరలోని ఋషులు అంగిరసుడు, బృహస్పతి మరియు భారద్వాజుడు. ఈ ప్రవరతో కూడినవారికి పరస్పరవివాహ సంబంధాలు నిషేధం.

కాణ్వాయనాః కోపచయాస్తథా వాత్స్యతరాయణాః ।
భ్రాష్టకృత్ రాష్ట్రపిండీ చ లైంద్రాణిస్సాయకాయనిః ॥ 21 ॥

క్రోష్టాక్షీ బహువీతీ చ తాలకృన్మధురావహః ।
లావకృద్గాలవిద్గా మార్కటిః పౌలికాయనిః ॥ 22 ॥

స్కందసశ్చ తథా చక్రీ గార్గ్యః శ్యామాయనిస్తథా ।
బాలాకిస్సాహరిశ్చైవ పంచార్షేయా ప్రకీర్తితాః ॥ 23 ॥

అంగిరాశ్చ మహాతేజా దేవాచార్యో బృహస్పతిః ।
భరద్వాజస్తథా గర్గః సైత్యశ్చ భగవానృషిః ॥ 24 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

కాణ్వాయనుడు, కోపచయుడు, వాత్స్యతరాయణులు, భ్రాష్టకృత్తు, రాష్ట్రపిండి, లైంద్రాణి, సాయకాయని, క్రోష్టాక్షి, బహువీతి, తాలకృత్తు, మధురావహుడు, లావకృత్, గాలవిత్, గాథిమార్కటి, పౌలికాయని, స్కందసుడు, చక్రి, గార్గ్యుడు, శ్యామాయని, బాలాకి, సాహరి, మొదలైన వారందరు ఐదుగురు ఋషులకు సంబంధించిన ప్రవరకలవారుగా చెప్పబడ్డారు. మహాతేజస్వియైన అంగిరసుడు, దేవాచార్యుడైన బృహస్పతి, భరద్వాజుడు, గర్గుడు మరియు పూజ్యుడైన సైత్యఋషి అనే ఐదుగురు వీరికి ప్రవర ఋషులు. ఈ గోత్రాలవారికి పరస్పర వివాహ సంబంధాలు నిషిద్ధం.

కపీతరః స్వస్తితరో దాక్షిః శక్తిః పతంజలిః ॥ 25 ॥

భూయసిర్జలసంధిశ్చ బిందుర్మాదిః కుసూదకిః ।
ఊర్వస్తు రాజకేశీ చ వౌషడిః శంసపిస్తథా ॥ 26 ॥

శాలిశ్చ కలశీకంఠఋషిః కారీరయస్తథా ।
కాట్యో ధాన్యాయనిశ్చైవ భావాస్యాయనిరేవ చ ॥ 27 ॥

భరద్వాజిః సౌబుధిశ్చ లఘ్వీ దేహమతిస్తథా ।
త్ర్యార్షేయోఽభిమతశ్చైషాం ప్రవరో భూమిపోత్తమ ॥ 28 ॥

అంగిరా దమవాహ్యశ్చ తథా చైవాప్యురుక్షయః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 29 ॥

కపీతరుడు, స్వస్తితరుడు, దాక్షి, శక్తి, పతంజలి, భూయసి, జలసంధి, బిందుడు, మాది,కుసూదకి, ఊర్వుడు, రాజకేశి, వౌషడి, శంసపి, శాలి, కలశీకంఠఋషి, కారీరయుడు, కాట్యుడు, ధాన్యాయని, భావాస్యాయని, భరద్యాజి, సౌబుధి, లఘ్వి, దేహమతి మొదలైనవారందరు ముగ్గురు ఋషులకు సంబంధించిన ప్రవర కలవారు. ఓ రాజా! అంగిరసుడు, దమవాహ్యుడు, ఉరుక్షయుడు అనే ముగ్గురు వీరికి ప్రవరఋషులు. వీరందరికి కూడ పరస్పర వివాహాదిసంబంధాలు పనికిరావు.

పరస్పరాయణ్యపర్ణీ లౌక్షిర్గార్గ్యహరిస్తథా ।
గాలవిశ్చైవ త్ర్యార్షేయః సర్వేషాం ప్రవరో మతః ॥ 30 ॥

అంగిరాః సంకృతిశ్చైవ గౌరవీతి స్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 31 ॥

పరస్పరాయణి, అపర్ణి, లౌక్షి, గార్గ్యహరి, గాలవి అనే ఈ ఋషులు ముగ్గురు ఋషులకు సంబంధించిన ప్రవరకలవారు. అంగిరసుడు, సంకృతి, గౌరవి అనే ఈ ముగ్గురు వీరి ప్రవరఋషులు. వీరికి కూడ పరస్పరం వివాహాదులు నిషిద్ధం.

కాత్యాయనో హరితకః కౌత్సః పింగస్తథైవ చ ।
హండిదాసో వాత్స్యాయనిర్మాద్రిర్మౌలిః కుబేరణిః ॥ 32 ॥

భీమవేగః శాశ్వదర్భిః సర్వే త్రిప్రవరాః స్మృతాః ।
అంగిరా బృహదశ్వశ్చ జీవనాశ్వస్తథైవ చ ॥ 33 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

కాత్యాయనుడు, హరితకుడు, కౌత్సుడు, పింగుడు, హండిదాసుడు, వాత్స్యాయని, మాద్రి, మౌళి, కుబేరణి, భీమవేగుడు, శాశ్వదర్భి అనే ఈ ఋషులు కూడ ముగ్గురు ఋషులకు సంబంధించిన ప్రవర కలవారేనని చెప్పబడింది.

అంగిరసుడు, బృహదశ్వుడు, జీవనాశ్వుడు అనే ముగ్గురు వీరికి ప్రవరఋషులు. వీరికి కూడ పరస్పర వివాహాది సంబంధాలు నిషిద్ధం.

బృహదుక్థో వామదేవస్తథా త్రిప్రవరా మతాః ॥ 34 ॥

అంగిరాశ్చ బృహదుక్థశ్చ వామదేవస్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఇత్యేతే పరికీర్తితాః ॥ 35 ॥

బృహదుక్థుడు, వామదేవుడు అనే గోత్రాలవారు కూడ ముగ్గురు ఋషులకు సంబంధించిన ప్రవర కలవారు. అంగిరసుడు, బృహదుక్థుడు, వామదేవుడు వీరి ప్రవరఋషులు. వీరికి పరస్పరవివాహసంబంధాలు పనికిరావు.

కుత్సగోత్రోద్భవాశ్చైవ తథా త్రిప్రవరా మతాః ॥
అంగిరాశ్చ సదస్యుశ్చ పురుకృత్సస్తథైవ చ ।
కుత్సాః కుత్సైరవైవాహ్యా ఏవమాహుః పురాతనాః ॥ 36 ॥

కుత్సగోత్రోద్భవులైనవారికి కూడ ముగ్గురు ఋషులకు సంబంధించిన ప్రవరే. అంగిరసుడు, సదస్యుడు, పురుకృత్సుడనే వారు వీరికి ప్రవరఋషులు. కుత్సగోత్రంవారు కుత్సగోత్రంవారితో ఇచ్చి పుచ్చుకొనుట నిషేధమని పూర్వీకులు చెప్పారు.

రథీతరాణాం ప్రవరాః త్ర్యార్షేయాః పరికీర్తితాః ।
అంగిరాశ్చ విరూపశ్చ తథైవ చ రథీతరః ॥
రథీతరా హ్యవైవాహ్యా నిత్యమేవ రథీతరైః ॥ 37 ॥

రథీతరగోత్రం వారుముగ్గురు ఋషులకు సంబంధించిన ప్రవరకలవారుగా వర్ణించబడి వున్నారు. అంగిరసుడు, విరూపుడు, రథీతరుడు, అనే ముగ్గురు వారి ప్రవరఋషులు. రథీతరగోత్రం వారు పరస్పర వివాహాదిసంబంధాలు చేసుకోకూడదు.

విష్ణుసిద్ధిః శివమతిర్జతృణః కర్తృణస్తథా ।
పుత్రవశ్చ మహాతేజాస్తథా వైరపరాయణః ॥ 38 ॥

త్ర్యార్షేయోఽభిమతస్తేషాం సర్వేషాం ప్రవరో నృప ।
అంగిరాశ్చ విరూపశ్చ వృషపర్వస్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 39 ॥

విష్ణుసిద్ధి, శివమతి, జతృణుడు, కర్తృణుడు, పుత్రవుడు, మహాతేజస్కుడైన వైరాయణుడు అనే ఋషుల గోత్రాల వారికి ప్రవర ముగ్గురు ఋషులకు సంబంధించిన అంగిరసుడు, విరూపుడు, వృషపర్వుడు అనే ముగ్గురు వీరికి ప్రవర ఋషులు. ఈ ఋషుల గోత్రాలు కలిగిన వారు కూడ పరస్పరవివాహసంబంధాలు కుదుర్చుకొనుట పనికిరాదు.

సాత్యముగ్రిర్మహాతేజా హిరణ్యస్తంభిముద్గలౌ ।
త్ర్యార్షేయో హి మతస్తేషాం సర్వేషాం ప్రవరో నృప ॥ 40 ॥

అంగిరా మత్స్యదగ్ధశ్చ ముద్గలశ్చ మహాతపాః ।
పరస్పరమవైవాద్యా ఋషయః పరికీర్తితాః ॥ 41 ॥

మహాతేజస్వి అయిన సాత్యముగ్రి , హిరణ్యస్తంభి, ముద్గలుడు అనే ఈ గోత్రం వారికి ముగ్గురు ఋషుల ప్రవరనే చెప్పబడింది. అంగిరసుడు, మత్స్యదగ్ధుడు, ముద్గలుడు అనే మహాతపస్సంపన్నులైన ముగ్గురు ఋషులు వీరి ప్రవరలో వున్నారు. ఈ గోత్రాలవారికి పరస్పరవివాహాదిసంబంధాలు నిషిద్ధం.

హంసజిహ్వో దేవజిహ్వో హ్యగ్నిజిహ్వో విరాడపః ।
అపాగ్నేయస్త్వశ్వయుశ్చ పరణ్యస్తావిమౌద్గలాః ॥ 42 ॥

త్ర్యార్షేయాభిమతాస్తేషాం సర్వేషాం ప్రవరాః శుభాః ।
అంగిరాశ్చైవ తాండిశ్చ మౌద్గల్యశ్చ మహాతపాః ॥ 43 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

హంసజిహ్వుడు, దేవజిహ్వుడు, అగ్నిజిహ్వుడు, విరాడపుడు, అపాగ్నేయుడు, అశ్వయుడు, పరణ్యస్తుడు, మౌద్గలుడు అనే ఈ ఋషులందరికీ ప్రవర ముగ్గురు ఋషులతో కూడినదేనని తెలిసికోవాలి. అంగిరసుడు, తాండి, మహాతపశ్శాలియైన మౌద్గల్యుడు వీరి ప్రవరలోని ముగ్గురు ఋషులు. వీరిలో కూడ పరస్పర వివాహాది సంబంధాలు నిషేధం.

అపాండుశ్చ గురుశ్చైవ తృతీయః శాకటాయనః ।
తతః ప్రాగాథమానారీ మార్కండో మరణః శివః ॥ 44 ॥

కటుర్మర్కటపశ్చైవ తథా నాడాయనో హ్యృషిః ।
శ్యామాయనస్తథైవైషాం త్ర్యార్షేయాః ప్రవరాః శుభాః ॥ 45 ॥

అంగిరాశ్చాజమీఢశ్చ కట్యశ్చైవ మహాతపాః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 46 ॥

అపాండువు, గురువు, శాకటాయనుడు, ప్రగాథుడు, మానారి మార్కండుడు, మరణుడు, శివుడు, కటువు, మర్కటుడు, నాడాయనుడు, శ్యామాయనుడు, అనే ఈ ఋషుల గోత్రాలకు కూడ ప్రవరలో ముగ్గురు ఋషులు కలరు. అంగిరసుడు, అజమీఢుడు, కట్యుడు అనే ఈ ముగ్గురే వారి ప్రవరలోని ఋషులు. ఈ గోత్రాలవారికి కూడ పరస్పరవివాహాది సంబంధాలు నిషేధం.

తిత్తిరిః కపిభూశ్చైవ గార్గ్యశ్చైవ మహానృషిః ।
త్ర్యార్షేయో హి మతస్తేషాం సర్వేషాం ప్రవరః శుభః ॥ 47 ॥

అంగిరాస్తిత్తిరిశ్చైవ కపిభూశ్చ మహానృషిః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 48 ॥

తిత్తిరి, కపిభూ, గార్గ్య మహర్షి అనే ఋషుల ప్రవరముగ్గురు ఋషులతో కూడినదే. అంగిరసుడు, తిత్తిరి, మహర్షియైన కపిభూ వీరి ప్రవరలోని ముగ్గురు ఋషులు. వీరు కూడ పరస్పరము వివాహాదులు కుదుర్చుకోవటం తగదు.

అథ ఋక్షభరద్వాజౌ ఋషివాన్ మానవస్తథా ।
ఋషిర్మైత్రవరశ్చైవ పంచార్షేయాః ప్రకీర్తితాః ॥ 49 ॥

అంగిరాఃసభరధ్వాజస్తథైవ చ బృహస్పతిః ।
ఋషిర్మిత్రవరశ్చైవ ఋషివాన్మానవస్తథా ॥
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 50 ॥

ఇంకనూ ఋక్షుడు, భరధ్వాజుడు, ఋషివానుడు, మానవుడు, మైత్రవర ఋషి, అనే ఈ ఋషుల గోత్రాలవారికి ప్రవరలో ఐదుగురు ఋషులున్నట్లు చెప్పబడింది. వారు అంగిరసుడు, భరద్వాజుడు, బృహస్పతి, మిత్రవర ఋషి, మానవుడు, అనే వారు. ఈ గోత్రాలవారికి కూడ పరస్పర వివాహాది సంబంధాలు నిషేధం.

భారద్వాజో హుతః శౌఙ్గః శైశిరేయస్తథైవ చ ।
ఇత్యేతే కథితాః సర్వే ద్వ్యాముష్యాయణగోత్రజాః ॥ 51 ॥

పంచార్షేయాస్తథా హ్యేషాం ప్రవరాః పరికీర్తితాః ।
అంగిరాశ్చ భరద్వాజస్తథైవ చ బృహస్పతిః ॥ 52 ॥

మౌద్గల్యః శైశిరశ్చైవ ప్రవరాః పరికీర్తితాః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 53 ॥

భారద్వాజుడు, హుతుడు, శౌంగుడు, శైశిరేయుడు, అనే ఈ ఋషులందరు ద్వ్యాముష్యాయన గోత్రంలో జన్మించినవారు. వీరికి ప్రవరలో ఐదుగురు ఋషులున్నట్లు చెప్పబడింది. అంగిరసుడు, భరద్వాజుడు, బృహస్పతి, మౌద్గల్యుడు, శైశిరుడు అనే ఐదుగురే వారి ప్రవరఋషులు. వారికి కూడ పరస్పరవివాహాదులు నిషేధించబడినవి.

ఏతే తవోక్తాంగిరసస్తు వంశే మహానుభావా ఋషిగోత్రకారాః ।
యేషాం తు నామ్నా పరికీర్తనేన పాపం సమగ్రం పురుషో జహాతి ॥ 54 ॥

ఇలా అంగిరసవంశంలో పుట్టిన మహానుభావులైన ఋషులు మరియు గోత్రకారుల గురించి నేను వివరించాను. వీరి నామకీర్తనంతో పురుషుడు సమస్త పాపాల నుండి విముక్తుడవుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రవరానుకీర్తనే అంగిరోవంశకీర్తనం నామ షణ్ణవత్యధికశతతమోఽధ్యాయః॥196॥

శ్రీమత్స్యమహాపురాణంలోని ఋషిప్రవరానుకీర్తనంలో అంగిరసవంశకీర్తనమనే నూట తొంబైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తనవత్యధిక శతతమోఽధ్యాయః - నూటతొంభై ఏడవ అధ్యాయం

అత్రివంశానుకీర్తనమ్ - అత్రివంశానుకీర్తనం

మత్స్య ఉవాచ - మత్స్యభగవానుడు చెప్పాడు.

అత్రివంశసముత్పన్నాన్ గోత్రకారాన్నిబోధ మే ।
కర్దమాయనశాఖేయాః తథా శారాయణాశ్చ యే ॥ 1 ॥

ఉద్దాలకిః శౌణకర్ణిరథౌ శౌక్రతవశ్చ యే ।
గౌరగ్రీవా గౌరజినస్తథా చైత్రాయణాశ్చ యే ॥ 2 ॥

అర్ధపణ్యా వామరథ్యా గోపనాస్తకిబిందవః ।
కర్ణజిహ్వో హరప్రీతిర్నైద్రాణిః శాకలాయనిః ॥ 3 ॥

తైలపశ్చ సవైతేయో అత్రిర్గోణీపతిస్తథా ।
జలదో భగపాదశ్చ సౌపుష్పిశ్చ మహాతపాః ॥ 4 ॥

ఛందోగేయస్తథైతేషాం త్ర్యార్షేయాః ప్రవరా మతాః ।
శ్యావాశ్వశ్చ తథాఽత్రిశ్చ ఆర్చనానశ ఏవ చ ॥ 5 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

మత్స్య భగవానుడిలా చెప్పాడు. అత్రివంశంలో జన్మించిన గోత్రకారులను గురించి వివరిస్తాను విను. కర్దమాయన శాఖేయులు, శారాయణులు, ఉద్దాలకి, శౌణకర్ణిరథుడు, శౌక్రతువు, గౌరగ్రీవుడు, గౌరజినుడు, చైత్రాయణులు, అర్ధపణ్యులు, వామరథ్యులు, గోపన, అస్తకి, బిందువు, కర్ణజిహ్వుడు, హరప్రీతి, నైద్రాణి, శాకలాయని, తైలపుడు, వైతేయుడు, అత్రి, గోణీపతి, జలదుడు, భగపాదుడు, మహాతపస్వియైన సౌపుష్పి, ఛందోగేయుడు మొదలైన ఈ ఋషులందరూ ముగ్గురు ఋషుల ప్రవరకలవారు. వీరికి శ్యావాశ్వుడు, అత్రి, ఆర్చనానశుడు అనే ముగ్గురు ప్రవరఋషులు. వీరికి పరస్పరం వివాహాదిసంబంధాలు నిషిద్ధం.

దాక్షిర్బలిః పర్ణవిశ్చ ఊర్ణనాభిః శిలార్దనిః ॥ 6 ॥

బీజవాపీ శిరీషశ్చ మౌంజకేశో గవిష్ఠిరః ।
భలందనస్తథైతేషాం త్ర్యార్షేయాః ప్రవరా మతాః ॥ 7 ॥

అత్రిర్గవిష్ఠిరశ్చైవ తథా పూర్వాతిథిః స్మృతః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 8 ॥

దాక్షి , బలి, పర్ణవి, ఊర్ణనాభి, శిలార్దని, బీజవాపి, శిరీషుడు, మౌంజకేశుడు, గవిష్ఠిరుడు, భలందనుడు మొదలైనవారికి ముగ్గురు ఋషుల ప్రవరే. అత్రి, గవిష్ఠిరుడు, పూర్వాతిథి అనే ముగ్గురు వీరికి ప్రవరఋషులు. వీరికి పరస్పరవివాహాదులు పనికిరావు.

ఆత్రేయపుత్రికాపుత్రానత ఊర్ధ్వం నిబోధ మే ।
కాలేయాశ్చ సబాలేయావామరథ్యాస్తథైవ చ ॥ 9 ॥

ధాత్రేయాశ్చైవ మైత్రేయాస్త్ర్యార్షేయాః పరికీర్తితాః ।
అత్రిశ్చ వామరథ్యశ్చ పౌత్రిశ్చైవ మహానృషిః ॥
పరస్పరమవైవాహ్యాః ఋషయః పరికీర్తితాః ॥ 10 ॥

ఇప్పుడు అత్రివంశంలోని కన్యల ద్వారా జన్మించిన ఋషుల గురించి వివరిస్తాను విను. కాలేయులు, బాలేయులు, వామరథ్యులు, ధాత్రేయులు, మైత్రేయులు అనే వీరికి కూడ ముగ్గురు ఋషుల ప్రవరే. అత్రి, వామరథి మరియు పౌత్రి మహర్షి వీరికి ప్రవరఋషులు. వీరు కూడ పరస్పరవివాహాదులు చేసికోకూడదు.

ఇత్యత్రివంశప్రభవాస్తవోక్తా మహానుభావా నృప గోత్రకారాః ।

యేషాం తు నామ్నాం పరికీర్తనేన పాపం సమగ్రం పురుషో జహాతి ॥ 11 ॥

ఓ రాజా! ఇలా అత్రివంశంలో జన్మించిన మహానుభావులైన గోత్రకారుల గురించి నీకు చెప్పాను. వీరి పేర్లను చెప్పడం చేతనే పురుషుడు అన్ని పాపాల నుండి విముక్తుడవుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రవరానుకీర్తనే అత్రి వంశానుకీర్తనం నామ సప్తనవత్యధికశతతమోఽధ్యాయః॥197॥

శ్రీ మత్స్య మహాపురాణంలో ప్రవరాను కీర్తనంలో అత్రివంశానుకీర్తనము అనే నూట తొంబై ఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టనవత్యధిక శతతమోఽధ్యాయః - నూటతొంబై ఎనిమిదవ అధ్యాయం

విశ్వామిత్ర వంశానువర్ణనం - విశ్వామిత్రవంశానువర్ణనం

మత్స్య ఉవాచ - మత్స్యమూర్తి చెప్పాడు.

అత్రేరేవాపరం వంశం తవ వక్ష్యామి పార్థివ ।
అత్రేః సోమః సుతః శ్రీమాన్ తస్య వంశోద్భవో నృప ॥ 1 ॥

విశ్వామిత్రస్తు తపసా బ్రాహ్మణ్యం సమవాప్తవాన్ ।
తస్య వంశమహం వక్ష్యే తన్మే నిగదతః శ్రుణు ॥ 2 ॥

ఓ రాజా! అత్రిమహర్షి నుండే ఉద్భవించిన మరొక వంశాన్ని గురించి చెబుతాను విను. అత్రి పుత్రుడైన సోముని వంశంలో జన్మించిన విశ్వామిత్రుడు తన తపస్సు చేత బ్రాహ్మణత్వాన్ని పొందాడు. ఇప్పుడు అతని వంశం గురించి చెబుతాను విను.

విశ్వామిత్రో దేవరాతస్తథా వైకృతిగాలవః ।
వతండశ్చ శలంకశ్చ హ్యభయశ్చాయతాయనః ॥ 3 ॥

శ్యామాయనా యాజ్ఞవల్క్యా జాబాలాః సైంధవాయనాః ।
బాభ్రవ్యాశ్చ కరీషాశ్చ సంశ్రుత్యా అథ సంశ్రుతాః ॥ 4 ॥

ఉలూపా ఔపహావాశ్చ పయోదజనపాదపాః ।
ఖరవాచో హలయమాః సాధితా వాస్తుకౌశికాః ॥ 5 ॥

త్ర్యార్షేయాః ప్రవరాస్తేషాం సర్వేషాం పరికీర్తితాః ।
విశ్వామిత్రో దేవరాత ఉద్దాలశ్చ మహాయశాః ॥ 6 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

విశ్వామిత్రుడు, దేవరాతుడు, వైకృతి, గాలవుడు, వతండుడు, శలంకుడు, అభయుడు, ఆయతాయనుడు, శ్యామాయనులు, యాజ్ఞవల్క్యులు, జాబాలులు, సైంధవాయనులు, బాభ్రవ్యులు, కరీషులు, సంశ్రుత్యులు, సంశ్రుతులు, ఉలూపులు, ఔపహావులు, పయోదులు, జనపాదపులు, ఖరవాచులు, హలయములు, సాధితులు, వాస్తుకౌశికులు మొదలగు వారందరికి ముగ్గురు ఋషులు కల ప్రవరే చెప్పబడింది. విశ్వామిత్రుడు, దేవరాతుడు, మహాయశస్వి అయిన ఉద్దాలుడు వీరి ప్రవరఋషులు. వీరు పరస్పరవివాహాదిసంబంధాలు కుదుర్చుకోకూడదు.

దేవశ్రవా సుజాతేయాః సౌముకాః కారుకాయణాః ॥ 7 ॥

తథా వైదేహరాతా యే కుశికాశ్చ నరాధిప ।
త్ర్యార్షేయోఽభిమతస్తేషాం సర్వేషాం ప్రవరః శుభః ॥ 8 ॥

దేవశ్రవా దేవరాతో విశ్వామిత్రస్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 9 ॥

ఓ నరాధిపా! దేవశ్రవులు, సుజాతీయులు, సౌముకులు, కారుకాయనులు, వైదేహరాతులు, కుశికులు మొదలైన ఋషుల, గోత్రాలవారికి ముగ్గురు ఋషులు కల ప్రవర చెప్పబడింది. దేవశ్రవుడు, దేవరాతుడు, విశ్వామిత్రుడు వీరికి ప్రవరఋషులు. ఈ గోత్ర ప్రవర కలిగిన ఋషుల వంశాలవారు కూడ పరస్పర వివాహాదులు చేసికోకూడదు.

ధనంజయః కపర్దేయః పరికూటశ్చ పార్థివ ।
పాణినిశ్చైవ త్ర్యార్షేయాః సర్వ ఏతే ప్రకీర్తితాః ॥ 10 ॥

విశ్వామిత్రస్తథాద్యశ్చ మాధుచ్ఛందస ఏవ చ ।
త్ర్యార్షేయాః ప్రవరా హ్యేతే ఋషయః పరికీర్తితాః ॥ 11 ॥

విశ్వామిత్రో మధుచ్ఛన్దాస్తథా చైవాఘమర్షణః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 12 ॥

ధనంజయుడు, కపర్దేయుడు, పరికూటుడు, పాణిని, మొదలైన ఋషుల గోత్రాల వారు ముగ్గురు ఋషుల ప్రవరగలవారిగా చెప్పబడ్డారు. విశ్వామిత్రుడు, ఆద్యుడు, మాధుచ్ఛందసుడు అనే ముగ్గురు వీరి ప్రవర ఋషులు. కొంతమంది వీరికి విశ్వామిత్రుడు, మధుచ్ఛందసుడు, మరియు అఘమర్షణుడు అని ముగ్గురే ప్రవర ఋషులని చెబుతారు. వీరికి కూడ పరస్పరం వివాహాదిసంబంధాలు నిషేధం.

కామలాయనిజశ్చైవ అశ్మరథ్యస్తథైవ చ ।
వంజులిశ్చాపి త్ర్యార్షేయః సర్వేషాం ప్రవరో మతః ॥ 13

విశ్వామిత్రశ్చాశ్వరథో వంజులిశ్చ మహాతపాః ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 14 ॥

కమలాయనిజుడు, అశ్మరథ్యుడు, వంజులి అనే ఋషుల గోత్రాలకు కూడ ముగ్గురు ఋషుల ప్రవరే. విశ్వామిత్రుడు, అశ్వరథుడు, మహాతపస్వి ఐన వంజులి అనే ముగ్గురు వీరి ప్రవరఋషులు. వీరికి పరస్పర వివాహాదులు పనికిరావు.

విశ్వామిత్రో లోహితశ్చ అష్టకః పూరణస్తథా ।
విశ్వామిత్రః పూరణశ్చ తయోర్ద్వౌ ప్రవరౌ స్మృతౌ ॥ 15 ॥

పరస్పరమవైవాహ్యాః పూరణాశ్చ పరస్పరమ్ ।
లోహితా అష్టకాశ్చైషాం త్ర్యార్షేయాః పరికీర్తితాః ॥ 16 ॥

విశ్వామిత్రో లోహితశ్చ అష్టకశ్చ మహాతపాః ॥
అష్టకా లోహితై ర్నిత్యమవైవాహ్యాః పరస్పరమ్ ॥ 17 ॥

విశ్వామిత్రుడు, లోహితుడు, అష్టకుడు, పూరణుడు అనే ఈ నలుగురు, ఋషులకు లేదా ఈ గోత్రాల వారికి విశ్వామిత్రుడు, పూరణుడు అనే ఇద్దరు ప్రవర ఋషులు. వీరు పరస్పర వివాహాది సంబంధాలు కుదుర్చుకోరాదు. లోహితులు మరియు అష్టకులు అనే వారికి మాత్రం ముగ్గురు ఋషుల ప్రవరే చెప్పబడింది. విశ్వామిత్రుడు, లోహితుడు, మహాతపస్వియైన అష్టకుడు అనే ముగ్గురు వీరికి ప్రవరఋషులు . అష్టకులు, లోహితులు పరస్పరం వివాహాదులు చేసికోరాదు.

ఉదరేణుః క్రథకశ్చ ఋషిశ్చోదావహిస్తథా ।
ఆర్షేయోఽభిమతస్తేషాం సర్వేషాం ప్రవరః స్మృతః ॥ 18 ॥

ఋణవాన్ గతినశ్చైవ విశ్వామిత్రస్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 19 ॥

ఉదరేణుడు, క్రథకుడు, ఉదావహి అనే గోత్రాలవారికి ముగ్గురు ఋషుల ప్రవర చెప్పబడింది. ఋణవంతుడు, గతి, విశ్వామిత్రుడనే ముగ్గురు వీరికి ప్రవరఋషులు. వీరికి కూడ పరస్పరం వివాహాది సంబంధాలు నిషేధించబడినాయి.

ఉదుంబరః సౌషిరిటిః ఋషిస్త్రాక్షాయణిస్తథా ।
శాట్యాయనిః కరీరాశీ శాలంకాయనిలావకీ ॥

మౌంజాయనిశ్చ భగవాన్ త్ర్యార్షేయాః పరికీర్తితాః ॥ 20 ॥
ఖిలిఖిలిస్తథా విద్యో విశ్వామిత్రస్తథైవ చ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 21 ॥

ఉదుంబరుడు, సౌషిరిటి, త్రాక్షాయణి, శాట్యాయని, కరీరాశి, శాలంకాయని, లావకి, మౌంజాయని మొదలైనవారికి ముగ్గురు ఋషుల ప్రవర చెప్పబడింది. వీరికి ఖిలిఖిలి, విశ్వామిత్రుడు, విద్యుడు అనే ముగ్గురు ప్రవరఋషులు. ఈ గోత్రానికిచెందిన ఋషులవంశాలవారు కూడ పరస్పరవివాహాదిసంబంధాలు కుదుర్చుకోకూడదు.

ఏతే తవోక్తాః కుశికా నరేంద్ర మహానుభావాః సతతం ద్విజేంద్రాః ।
యేషాం తు నామ్నా పరికీర్తనేన పాపం సమగ్రం పురుషో జహాతి ॥ 22 ॥

ఇలా నేను నీకు వివరించిన మహానుభావులైన విశ్వామిత్ర గోత్రానికి సంబంధించిన ఋషుల నామాలను ఉచ్చరించినా మానవుడు సమస్త పాపాల నుండి విముక్తుడవుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రవరానుకీర్తనే విశ్వామిత్రవంశానువర్ణనం నామ అష్టనవత్యధిక శతతమోఽధ్యాయః ॥ 198 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ప్రవరానుకీర్తనమున విశ్వామిత్రవంశానువర్ణనం అనే నూట తొంబై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

నవనవత్యధిక శతతమోఽధ్యాయః – నూటతొంబై తొమ్మిదవ అధ్యాయం

కశ్యప వంశవర్ణనమ్ – కాశ్యప వంశ గోత్ర ప్రవరలు

మత్స్య ఉవాచ – మత్స్యమూర్తి చెప్పాడు.

మరీచేః కశ్యపః పుత్రః కశ్యపస్య తథా కులే ।
గోత్రకారాన్ ఋషీన్ వక్ష్యే తేషాం నామాని మే శృణు ॥ 1 ॥

ఆత్రాయణిరృషిగణో మేషకీరిటకాయనాః ।
ఉదగ్రజా మాఠారాశ్చ భోజా వినయలక్షణాః ॥ 2 ॥

శాలాహలేయాః కౌరిష్టాః కన్యకాశ్చాసురాయణాః ।
మందాకిన్యాం వై మృగయాః శ్రోతనా భౌతపాయనాః ॥ 3 ॥

దేవయానా గోమయానా హ్యధశ్ఛాయాభయాశ్చ యే ।
కాత్యాయనాః శాక్రాయణాః బర్హిర్యోగగదాయనాః ॥ 4 ॥

భవనందిర్మహాచక్రిర్దాక్షపాయణ ఏవ చ ।
యోధయానాః కార్తికయా హస్తిదానాస్తథైవ చ ॥ 5 ॥

మత్స్యరూపంలో వున్న భగవానుడు ఇలా చెప్పాడు. ఓ రాజా! మరీచి మహర్షి పుత్రుడైన కశ్యపుని సంతతి వారైన గోత్రప్రవర్తక ఋషులను గురించి చెబుతాను విను. ఆత్రాయణి ఋషిగణము (ఆత్రాయణులు), మేషులు, కిరీటకాయనులు, ఉదగ్రజులు, మాఠరులు, భోజులు, వినయలక్షణులు, శాలాహలేయులు, కౌరిష్టులు, కన్యకులు, అసురాయణులు, మందాకిని నుండి ఉద్భవించిన మృగయులు, శ్రోతనులు, భౌతపాయనులు, దేవయానులు, గోమయానులు, అధశ్ఛాయులు, అభయులు, కాత్యాయనులు, శాక్రాయణులు, బర్హిర్యోగులు, గదాయనులు, భవనంది, మహాచక్రి, దాక్షపాయణులు, యోధయానులు, కార్తికయులు మరియు హస్తిదానులు,

వాత్స్యాయనా నికృతజా హ్యాశ్వలాయనినస్తథా ।
ప్రాగాయణాః పైలమౌలిరాశ్వవాతాయనస్తథా ॥ 6 ॥

కౌబేరకాశ్చ శ్యాకారా అగ్నిశర్మాయణాశ్చ యే ।
మేషపాః కైకరసపాస్తథా చైవ తు బభ్రవః ॥ 7 ॥

ప్రాచేయో జ్ఞానసంజ్ఞేయా ఆగ్నాప్రాసేవ్య ఏవ చ ।
శ్యామోదరా వైవశపాస్తథా చైవోద్బలాయనాః ॥ 8 ॥

కాష్ఠహారిణమారీచా ఆజిహాయనహాస్తికాః ।
వైకర్ణేయాః కాశ్యపేయాః సాసిసాహారితాయనాః ॥ 9 ॥

మాతంగినశ్చ భృగవః త్ర్యార్షేయాః పరికీర్తితాః ।
వత్సరః కశ్యపశ్చైవ నిధ్రువశ్చ మహాతపాః ॥ 10 ॥

పరస్పర మవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

వాత్స్యాయనులు, నికృతజులు, ఆశ్వలాయనులు, ప్రాగాయణులు, పైలమౌలి, ఆశ్వవాతాయనుడు, కౌబేరకులు, శ్యాకారులు, అగ్నిశర్మాయనులు, మేషపులు, కైకరసపులు, బభ్రువులు, ప్రాచేయులు, జ్ఞానసంజ్ఞేయులు, ఆగ్నులు, ప్రాసేవ్యులు, శ్యామోదరులు, వైవశపులు, ఉద్బలాయనులు, కాష్ఠహారిణులు, మారీచులు, ఆజిహాయనులు, హాస్తికులు, వైకర్ణేయులు, కాశ్యపేయులు, సాసిసులు, హారితాయనులు, మాతంగినులు, భృగువులు మొదలైన ఈ ఋషుల గోత్రాల వారికి ప్రవరలో ముగ్గురు ఋషులున్నట్లు చెప్పబడింది. 'వత్సరుడు, కశ్యపుడు, మహాతపస్వి ఐన నిధ్రువుడు' అనే ముగ్గురు వీరి ప్రవర ఋషులు. వీరు పరస్పరం వివాహాది సంబంధాలు చేసికోరాదు.

అతః పరం ప్రవక్ష్యామి ద్వాముష్యాయణగోత్రజాన్ ॥ 11 ॥

అనసూయో నాకురయః స్నాతపో రాజవర్తపః ।
శైశిరోదవహిశ్చైవ సైరంధ్రీ రౌపసేవకిః ॥ 12 ॥

యామునిః కాద్రుపింగాక్షిః సజాతంబిస్తథైవ చ ।
దివావష్టాశ్చ ఇత్యేతే భక్త్యా జ్ఞేయాశ్చ కాశ్యపాః ॥ 13 ॥

త్ర్యార్షేయాశ్చ తథైవైషాం సర్వేషాం ప్రవరాః శుభాః ।
వత్సరః కశ్యపశ్చైవ వసిష్ఠశ్చ మహాతపాః ॥ 14 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

ఇప్పుడు ద్వాముష్యాయన గోత్రాల వారిని వివరిస్తాను. అనసూయుడు, నాకురయుడు, స్నాతపుడు, రాజవర్తపుడు, శైశిరుడు, ఉదవహి, సైరంధ్రి, రౌపసేవకి, యాముని, కాద్రుపింగాక్షి, సజాతంబి, దివావష్టుడు, మొదలైన మునులందరూ భక్తి పూర్వకంగా కాశ్యపుని గోత్రంలో జన్మించిన వారని తెలిసికోవాలి. వీరందరికి కూడ ముగ్గురు ఋషుల ప్రవరే. 'వత్సరుడు, కశ్యపుడు, వసిష్ఠుడు' అనే ముగ్గురు వీరికి ప్రవర ఋషులు. వీరికి పరస్పరం వివాహాది సంబంధాలు నిషిద్ధం.

సంయాతిశ్చ నభశ్చైభౌ పిప్పల్యోఽథ జలంధరః ॥ 15 ॥

భుజాతపూరః పూర్యశ్చ కర్దమో గర్దభీముఖః ।
హిరణ్యబాహుకైరాతాభువౌ కాశ్యపగోభిలౌ ॥ 16 ॥

కులహో వృషకండశ్చ మృగకేతుస్తథోత్తరః ।
నిదాఘమసృణౌ భర్త్స్యౌ మహాన్తః కేరలాశ్చ యే ॥ 17 ॥

శాండిల్యో దానవశ్చైవ తథా వై దేవజాతయః ।
పైప్పలాదిః సప్రవరా ఋషయః పరికీర్తితాః ॥ 18 ॥

త్ర్యార్షేయాభిమతాశ్చైషాం సర్వేషాం ప్రవరాః శుభాః ।
అసితో దేవలశ్చైవ కశ్యపశ్చ మహాతపాః ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 19 ॥

సంయాతి, నభుడు, పిప్పల్యుడు, జలంధరుడు, భుజాతపూరుడు, పూర్యుడు, కర్దముడు, గర్దభీముఖుడు, హిరణ్యబాహువు, కైరాతుడు, కావ్యపుడు, గోభిలుడు, కులహుడు, వృషకందుడు, మృగకేతువు, ఉత్తరుడు, నిదాఘుడు, మసృణుడు, భర్తృృ్యడు, కేరలులు, శాండిల్యుడు, దానవులు, దేవజాతులు, పైప్పలాది ఇత్యాదులైన ఈ ఋషులకు ప్రవర ముగ్గురు ఋషుల చెప్పబడింది. 'అసితుడు, దేవలుడు, మహాతపస్వియైన కశ్యపుడు' అనే ముగ్గురు వీరి ప్రవర ఋషులు. వీరికి పరస్పర వివాహాది సంబంధాలు నిషేధించబడినవి.

ఋషిప్రధానస్య చ కశ్యపస్య దాక్షాయణీభ్యః సకలం ప్రసూతమ్ ।
జగత్ సమగ్రం మనుసింహ పుణ్యం కిం తే ప్రవక్ష్యామ్యహముత్తరం తు ॥ 20 ॥

ఓ మనుసింహా ! ఋషులలోనే ముఖ్యుడైన కశ్యపునికి దక్ష పుత్రికల ద్వారా సమస్త జగత్తే జనించింది. ఈ వంశ వర్ణనం పుణ్యప్రదమైంది. ఇంతకంటె గొప్పది నీకు నేను ఏమి చెప్పగలను?

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ఋషిప్రవరానుకీర్తనే కాశ్యపవంశవర్ణనం నామ
నవనవత్యధిక శతతమోఽధ్యాయః ॥199॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ఋషుల గోత్రప్రవరలను చెప్పటంలో కాశ్యప వంశ ప్రవరలు అనే
నూట తొంబైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



ద్విశతతమోఽధ్యాయః – రెండు వందలవ అధ్యాయం

వసిష్ఠ గోత్రాను వర్ణనమ్ – వసిష్ఠ వంశ గోత్ర ప్రవరలు

మత్స్య ఉవాచ – మత్స్యమూర్తి చెప్పాడు.

వసిష్ఠవంశజాన్ విప్రాన్ నిబోధ వదతో మమ ।
ఏకార్షేయస్తు ప్రవరో వాసిష్ఠానాం ప్రకీర్తితః ॥ 1 ॥

వసిష్ఠా ఏవ వాసిష్ఠా అవివాహ్యా వసిష్ఠజైః ।

వసిష్ఠవంశంలో జన్మించిన ఋషుల గోత్రాల వారిని గురించి వివరిస్తాను, విను. వీరికి ప్రవర ఋషి ఒక్కడే అని చెప్పబడింది. వసిష్ఠులకే వాసిష్ఠులని వ్యవహారమున్నది. వీరు అదే గోత్రాల వారితో వివాహాలు చేసికోరాదు.

వ్యాఘ్రపాదా ఔపగవా వైక్లవాః శాద్వలాయనాః ॥ 2 ॥

కపిష్ఠలా ఔపలోమా అలబ్ధాశ్చ శఠాః కఠాః ।
గౌపాయనా బోధపాశ్చ దాకవ్యాహ్యథ వాహ్యకాః ॥ 3 ॥

బాలిశయాః పాలిశయాస్తతో వాగ్గ్రంథయశ్చ యే ।
ఆపస్థూణాః శీతవృత్తాస్తథా బ్రాహ్మపురేయకాః ॥ 4 ॥

లోమాయనాః స్వస్తికరాః శాండిలిర్గౌడినిస్తథా ।
వాడోహలిశ్చ సుమనాశ్చోపావృద్ధిస్తథైవ చ ॥ 5 ॥

చౌలిర్వౌలిర్బ్రహ్మబలః పౌలిః శ్రవస ఏవ చ ।
పౌడవో యాజ్ఞవల్క్యశ్చ ఏకార్షేయాః మహర్షయః ॥ 6 ॥

వసిష్ఠ ఏషాం ప్రవరో హ్యవైవాహ్యాః పరస్పరమ్ ।

వ్యాఘ్రపాదులు, ఔపగవులు, వైక్లవులు, శాద్వలాయనులు, కపిష్ఠలులు, జాపలోములు, అలబ్ధులు, శఠులు, కఠులు, గౌపాయనులు, బోధపులు, దాకవ్యులు, వాహ్యకులు, బాలిశయులు, పాలిశయులు, వాగ్గ్రంథులు, ఆపస్థూణులు, శీతవృత్తులు, బ్రాహ్మపురేయకులు,లోమాయనులు, స్వస్తికరులు, శాండిలి, గౌడిని, వాడోహలి, సుమనసుడు, ఉపావృద్ధి, చౌలి, వౌలి, బ్రహ్మబలుడు, పౌలి, శ్రవసుడు, పౌడవుడు, యాజ్ఞవల్క్యుడు, మొదలగు ఈ ఋషుల గోత్రాల వారందరికి వసిష్ఠుడు ఒక్కడే ప్రవర ఋషి. వీరందరికి పరస్పర వివాహాది సంబంధాలు నిషిద్ధం.

శైలాలయో మహాకర్ణః కౌరవ్యః క్రోధినస్తథా ॥ 7 ॥

కపింజలా వాలఖిల్యా భాగవిత్తాయనాశ్చ యే ।
కౌలాయనః కాలిశిఖః కోరకృష్ణాః సురాయణాః ॥ 8 ॥

శాకాహార్యాః శాకధియః కాణ్వా ఉపలపాశ్చ యే ।
శాకాయనా ఉహాకాశ్చ అథ మాషశరావయః ॥ 9 ॥

దాకాయనా బాలవయో వాకయో గోరథాస్తథా ।
లంబాయనాః శ్యామవయో యే చ క్రోడోదరాయణాః ॥ 10 ॥

ప్రలంబాయనాశ్చ ఋషయ ఔపమన్యవ ఏవ చ ।
సాంఖ్యాయనాశ్చ ఋషయస్తథా వై వేదశేరకాః ॥ 11 ॥

పాలంకాయన ఉద్గాహా ఋషయశ్చ బలేక్షవః ।
మాతేయా బ్రహ్మబలినః పన్నాగారిస్తథైవ చ ॥ 12 ॥

త్ర్యార్షేయోఽభిమతశ్చైషాం సర్వేషాం ప్రవరస్తథా ।
భృగీవసుర్వసిష్ఠశ్చ ఇంద్రప్రమదిరేవ చ ॥ 13 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

శైలాలయుడు, మహాకర్ణుడు, కౌరవ్యుడు, క్రోధినులు, కపింజలురు, వాలఖిల్యులు, భాగవిత్తాయనులు, కాలాయనుడు, కాలశిఖి, కోరకృష్ణుడు, సురాయణుడు, శాకాహార్యులు, శాకధియులు, కాణ్వులు, ఉపలపులు, శాకాయనులు, ఉహాకులు, మాషశరావయులు, దాకాయనులు, బాలావయులు, వాకయులు, గోరథులు, లంబాయనులు, శ్యామవయుడు, క్రోడోదరాయణులు, ప్రలంబాయనులు, ఔపమన్యులు, సాంఖ్యాయనులు, వేదశేరకులు, పాలంకాయనులు, ఉద్గాహులు, బలేక్షులు, మాతేయులు, బ్రహ్మబలిలు, పన్నాగారి, అనే ఈ ఋషుల గోత్రాల వారికి ప్రవరలో ముగ్గురు ఋషులుంటారు. వారు భృగీవసువు, వసిష్ఠుడు, ఇంద్రప్రమది, వీరందరూ పరస్పరం వివాహాది సంబంధాలు చేసికోరాదు.

ఔపస్థలాః స్వస్థలయో బాలో హాలో హలాశ్చ యే ॥ 14 ॥

మాధ్యందినో మాక్షతయః పైప్పలాదిర్విచక్షుషః ।
త్రైశృంగాయణసైవల్కాః కుండినశ్చ నరోత్తమ ॥ 15 ॥

త్ర్యార్షేయాభిమతశ్చైషాం సర్వేషాం ప్రవరాః శుభాః ।
వసిష్ఠమిత్రావరుణౌ కుండినశ్చ మహాతపాః ॥ 16 ॥

పరస్పర మవైవాహ్యాః ఋషయః పరికీర్తితాః ।

ఔపస్థలులు, స్వస్థలులు, బాలుడు, హాలుడు, హలులు, మాధ్యందినుడు, మాక్షతులు, పైప్పలాది, విచక్షుషులు, త్రైశృంగాయణులు, సైవల్కులు, కుండినులు, మొదలైన వారందరికి ముగ్గురు ఋషుల ప్రవర చెప్పబడింది.

'వసిష్ఠుడు, మిత్రావరుణుడు, మహాతపస్వియైన కుండినుడు" అనే ముగ్గురు వీరి ప్రవర ఋషులు. వీరు కూడ పరస్పర వివాహాది సంబంధాలు కుదుర్చుకోరాదు.

శివకర్ణో వయశ్చైవ పాదపశ్చ తథైవ చ ॥ 17 ॥

త్ర్యార్షేయోఽభిమతశ్చైషాం సర్వేషాం ప్రవరస్తథా ।
జాతూకర్ణ్యో వసిష్ఠశ్చ తథైవాత్రిశ్చ పార్థివ ।
పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ॥ 18 ॥

శివకర్ణుడు, వయుడు, పాదపుడు అనే ఈ ఋషుల గోత్రాల వారికి ప్రవరలో "జాతుకర్ణ్యుడు, వసిష్ఠుడు, అత్రి" అను ముగ్గురు ఋషులున్నట్లు చెప్పబడింది. వీరికి కూడ పరస్పర వివాహాది సంబంధాలు నిషేధించబడినవి.

వసిష్ఠవంశేఽభిహితా మయైతే ఋషిప్రధానాః సతతం ద్విజేంద్రాః ।
యేషాం తు నామ్నాం పరికీర్తనేన పాపం సమగ్రం పురుషో జహాతి ॥ 19 ॥

ఓ రాజా! వసిష్ఠ వంశంలో జన్మించిన ఋషులందరిని నేను నీకు వివరించాను. వీరి నామ సంకీర్తనం చేసిన మాత్రాననే మానవుడు సమస్త పాపాల నుండి విముక్తుడవుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రవరానుకీర్తనే వసిష్ఠగోత్రాను వర్ణనం నామ ద్విశతతమోఽధ్యాయః ॥200॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ఋషుల గోత్రప్రవరలను చెప్పడంలో వసిష్ఠవంశ గోత్రప్రవరలు చెప్పడమనే రెండువందల అధ్యాయం సమాప్తం.



ఏకాధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఒకటవ అధ్యాయం

పరాశరవంశాను వర్ణనమ్ - పరాశరవంశగోత్ర ప్రవరలు

మత్స్య ఉవాచ - మత్స్యమూర్తి చెప్పాడు.

వసిష్ఠస్తు మహాతేజా నిమేః పూర్వపురోహితః ।
బభూవుః పార్థివశ్రేష్ఠ యజ్ఞాస్తస్య సమన్తతః ॥ 1 ॥

శ్రాన్తాత్మా పార్థివ శ్రేష్ఠ విశశ్రామ తదా గురుః ।
తం గత్వా పార్థివశ్రేష్ఠో నిమిర్వచనమబ్రవీత్ ॥ 2 ॥

మహాతేజస్విమైన వసిష్ఠుడు నిమి అనే రాజుకు పూర్వపురోహితుడు. పార్థివశ్రేష్ఠుడైన నిమి సదా అనేక యజ్ఞాలను ఆచరించేవాడు. ఆ యజ్ఞాలన్నింటిని ఆచరింపజేసిన గురువైన వసిష్ఠుడు అలసట పొందినవాడై విశ్రాంతి పొందుచుండినాడు. అపుడు రాజశ్రేష్ఠుడైన 'నిమి' అతని దగ్గరకు వెళ్ళి ఇలా ప్రార్థించాడు.

భగవన్ యష్టుమిచ్ఛామి తన్మాం యాజయ మా చిరమ్ ।
తమువాచ మహాతేజా వసిష్ఠః పార్థివోత్తమమ్ ॥ 3 ॥

కంచిత్కాలం ప్రతీక్షస్వ తవ యజ్ఞైః సుసత్తమైః ।
శ్రాన్తోఽస్మి రాజన్ విశ్రమ్య యాజయిష్యామి తే నృప ॥ 4 ॥

భగవంతుడా! నేను యజ్ఞం చేయాలని సంకల్పిస్తున్నాను. నీవు వెంటనే వచ్చి నాతో యజ్ఞాన్ని ఆచరింపజేయ వలసిందని ప్రార్థించాడు. మహాతేజస్వియైన వసిష్ఠుడు పార్థివోత్తమునితో ఇలా అన్నాడు. ఓ రాజా! కొంతకాలం ఆగు. సంస్కారవంతాలైన యజ్ఞ యాగాదులు చేయించి అలసట పొందాను. కావున కొంతకాలం విశ్రాంతి తీసుకుని మరల యజ్ఞాలు ఆచరిద్దాము.

ఏవముక్తః ప్రత్యువాచ వసిష్ఠం నృపసత్తమః ।
పారలౌకికకార్యే తు కః ప్రతీక్షితుముత్సహేత్ ॥ 5 ॥

న చ మే సౌహృదం బ్రహ్మన్ కృతాన్తేన బలీయసా ।
ధర్మకార్యే త్వరా కార్యా చలం యస్మాద్ధి జీవితమ్ ॥ 6 ॥

వసిష్ఠముని మాటలు విన్న నృపశ్రేష్ఠుడైన 'నిమి' ఆతనితో ఇలా అన్నాడు. పరలోకానికి సంబంధించిన పనుల విషయంలో ఎవరు నిరీక్షిస్తారు? ఓ బ్రహ్మర్షీ! యముడు మిక్కిలి బలవంతుడు, ఆతనికి నా యందు సౌహార్దమేమీ లేదు. జీవితం చంచలమైంది కావున ధర్మకార్యాచరణంలో ఎప్పుడూ త్వరపడుటే శ్రేష్ఠం.

ధర్మపథ్యోదనో జన్తుర్మృతోఽపి సుఖమశ్నుతే ।
శ్వః కార్యమద్య కుర్వీత పూర్వాహ్ణే చాపరాహ్ణికమ్ ॥ 7 ॥

న హి ప్రతీక్షతే మృత్యుః కృతం చాస్య న వా కృతమ్ ।
క్షేత్రాపణగృహాసక్తమన్యత్రగతమానసమ్ ॥ 8 ॥

వృకీవోరణమాసాద్య మృత్యురాదాయ గచ్ఛతి ।
నైకాన్తేన ప్రియః కశ్చిత్ ద్వేష్యశ్చాస్య న విద్యతే ॥ 9 ॥

ఆయుష్యే కర్మణి క్షీణే ప్రసహ్యా హరతే జనమ్ ।
ప్రాణవాయోశ్చలత్వం చ త్వయా విదితమేవ చ ॥ 10 ॥

తానాచరించిన ధర్మమే పరలోకగమనంలో ఆహారంగా పనికొస్తుంది. ధర్మానుష్ఠానం చేసిన వారే మరణానంతరం సుఖం పొందుతారు. స్వర్గలోక సుఖాల ననుభవిస్తారు. కావున రేపటి కార్యాన్ని వాయిదా వేయకుండా ఈ రోజే నిర్వర్తించాలి. అపరాహ్ణంలో ఆచరించవలసిన కార్యాన్ని పూర్వాహ్ణంలో ఆచరించాలి. మానవుడు తాను చేయవలసింది చేసినాడా లేదా అని మృత్యుదేవత చూడదు. వాడి పని పూర్తి కాలేదని నిరీక్షించదు. పొలం పనులలో, వ్యాపారాదులలో, గృహవిషయాలలో వ్యగ్రుడై ఉన్న వానిని సమీపించి తోడేలు గొర్రెను తీసుకొని పోయినట్లు మృత్యువు హరించుకుని పోతుంది. మృత్యువుకు ఎవరూ ప్రియం కాదు. ఎవరియందూ ద్వేషముండదు. పూర్వకర్మ సంచితాన్ననుసరించి ఆయుష్షు ముగియగానే అది హఠాత్తుగా ఎత్తుకొనిపోతుంది. ప్రాణవాయువు చంచలమైనదని నీకు తెలిసినదే కదా!

యదత్ర జీవ్యతే బ్రహ్మన్ క్షణమాత్రం తదద్భుతమ్ ।
శరీరం శాశ్వతం మన్యే విద్యాభ్యాసే ధనార్జనే ॥ 11 ॥

అశాశ్వతం ధర్మకార్యే ఋణవానస్మి సంకటే ।
సోఽహం సంభృతసంభారో భవన్మూలముపాగతః ॥ 12 ॥

న చేద్యాజయసే మాం త్వమన్యం యాస్యామి యాజకమ్ ।

ఓ బ్రహ్మజ్ఞుడా! ఈ క్షణంలో ఇక్కడ జీవిస్తున్నామన్నా అద్భుతమే. విద్యాభ్యాసంలో నందు ధనార్జనలో కూడ శరీరం శాశ్వతమని నేను తలుస్తాను కాని ధర్మకార్యాచరణంలో మాత్రం ఇది అశాశ్వతమనుకొంటాను. ఇటువంటి సంకటావస్థలో ఉన్న నేను అటువంటి ధర్మకార్యానుష్ఠానం విషయంలో ఋణపడి వున్నాను. కనుక యజ్ఞానికి సంబంధించిన సంభారాలన్నింటిని సమకూర్చుకొని నీ దగ్గరకు వచ్చాను. నీవొకవేళ నాచే యజ్ఞాన్ని చేయించలేనిచో నేనింకొక యాజకుని ఆశ్రయిస్తాను అని నిమి వసిష్ఠునికి చెప్పాడు.

ఏవముక్తస్తదా తేన నిమినా బ్రాహ్మణోత్తమః ॥ 13 ॥
శశాప తం నిమిం క్రోధాద్విదేహస్త్వం భవిష్యసి ।
శ్రాన్తం మాం త్వం సముత్సృజ్య యస్మాదన్యం ద్విజోత్తమమ్ ॥ 14 ॥
ధర్మజస్తు నరేంద్ర త్వం యాజకం కర్తుమర్హసి ।
నిమిస్తం ప్రత్యువాచాథ ధర్మకార్యరతస్య మే ॥ 15 ॥
విఘ్నం కరోషి నాన్యేన యాజనం చ తథేచ్ఛసి ।
శాపం దదాసి యస్మాత్త్వం విదేహోఽథ భవిష్యసి ॥ 16 ॥

ఆ విధంగా నిమి చెప్పిన మాటలు విన్న బ్రాహ్మణోత్తముడైన వసిష్ఠుడు క్రుద్ధుడై నీవు విదేహుడవై (దేహము లేనివాడవు) పోతావని శపించాడు. నేను అలసట పొందివున్నానని చెబుతున్నప్పటికీ లెక్కచేయక ద్విజోత్తముడనైన నన్నాదరించక మరొక యాజకుని ఆశ్రయిస్తానని ధర్మజ్ఞుడవైన నీవనటం తగదని వసిష్ఠుడు నిమిని శపించాడు. అది విన్న నిమి కూడ "ధర్మకార్యరతుడనైన నాకు విఘ్నం కలిగిస్తూ, వేరొక యాజకుని సంప్రదించడానికి అంగీకరించక నన్నే శపిస్తున్న నీవు కూడ విదేహుడవై పొమ్మని" వసిష్ఠుని శపించాడు.

ఏవ ముక్తే తు తౌ జాతౌ విదేహౌ ద్విజపార్థివౌ ।
దేహహీనౌ తయోర్జీవౌ బ్రహ్మాణముపజగ్మతుః ॥ 17 ॥

తావాగతౌ సమీక్ష్యాథ బ్రహ్మావచనమబ్రవీత్ ।
అద్య ప్రభృతి తే స్థానం నిమిజీవ దదామ్యహమ్ ॥ 18 ॥

నేత్రపక్ష్మసు సర్వేషాం త్వం వసిష్యసి పార్థివ ।
త్వత్సంబంధాత్తథా తేషాం నిమేషః సంభవిష్యతి ॥ 19 ॥

చాలయిష్యన్తి తు తదా నేత్రపక్ష్మాణి మానవాః ।
ఏవముక్తే మనుష్యాణాం నేత్రపక్ష్మసు సర్వశః ॥ 20 ॥
జగామ నిమిజీవస్తు వరదానాత్ స్వయంభువః ।

పరస్పరం శపించుకొన్న వారిద్దరు వెంటనే విదేహులై పోయారు. అపుడు నిమి - వసిష్ఠుల నుండి విడిపోయిన వారి జీవులిద్దరూ బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. ఆ రెండు జీవులను సమీక్షించి చూసిన బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. నిమి జీవా! ఇప్పటి నుండి ప్రాణులందరి కనురెప్పలు స్థానంగా నీకిస్తున్నాను. అందరి కనురెప్పలలో నీవు నివసిస్తావు. నీ సంబంధం వలననే ప్రాణులకు 'నిమిషము = రెప్పపాటు' కలుగుతుంది. (నిమి శయనించి లేదా నివసించి ఉంటాడు కావుననే నిమిషము అనేది ఏర్పడిందని విద్వాంసులంటారు). మానవులు మొదలైన ప్రాణులు తమ రెప్పలను కదిలిస్తారు. ఇలా బ్రహ్మదేవుడు వరమిచ్చిన వెంటనే నిమిజీవుడు ప్రాణుల కనురెప్పలలో నివసించసాగాడు.

వసిష్ఠజీవం భగవాన్ బ్రహ్మా వచనమబ్రవీత్ ॥ 21 ॥
మిత్రావరుణయోః పుత్రో వసిష్ఠ త్వం భవిష్యసి ।
వసిష్ఠేతి చ తే నామ తత్రాపి చ భవిష్యతి ॥ 22 ॥
జన్మద్వయమతీతం చ తత్రాపి త్వం స్మరిష్యసి ।

భగవానుడైన బ్రహ్మదేవుడు వసిష్ఠజీవునితో ఇలా అన్నాడు. వసిష్ఠా! నీవు మిత్రావరుణులనే జంట దేవతల పుత్రుడుగా జన్మిస్తావు. అప్పుడు కూడ నీకు వసిష్ఠుడనే పేరు ఉంటుంది. అప్పుడు కూడ నీకు గత రెండు జన్మల స్మృతి వుంటుంది.

ఏతస్మిన్నేవ కాలే తు మిత్రశ్చ వరుణస్తథా ॥ 23 ॥
బదర్యాశ్రమమాసాద్య తపస్తేపతురవ్యయమ్ ।
తపస్యతోస్తయోరేవం కదాచిన్మాధవే ఋతౌ ॥ 24 ॥

పుష్పితద్రుమసంస్థానే శుభే దయితమారుతే ।
ఊర్వశీ తు వరారోహా కుర్వతీ కుసుమోచ్చయమ్ ॥ 25 ॥

సుసూక్ష్మరక్తవసనా తయోర్దృష్టిపథం గతా ।
తాం దృష్ట్వేందుముఖీం సుభ్రూం నీలనీరజలోచనామ్ ॥ 26 ॥

ఉభౌ చుక్షుభతుర్దేవౌ తద్రూపపరిమోహితౌ ।
తపస్యతోస్తయోర్వీర్యమస్ఖలచ్చ మృగాసనే ॥ 27 ॥

ఇంతలో మిత్రావరుణు లిద్దరు బదర్యాశ్రమానికి వెళ్ళి తపస్సు చేయడానికి మొదలుపెట్టారు. వారలా తపస్సు చేస్తున్న సమయంలో ఒకసారి వసంతఋతువులో బాగా వికసించిన పుష్పాలు గల వృక్షసంపదలతో, చక్కటి గాలి వీస్తుండగా సౌందర్యరాశియైన ఊర్వశి పూలు కోస్తూ అతిపలుచని వస్త్రం ధరించి వారిరువురి దృష్టిలో పడింది. నల్ల కలువల వంటి కన్నులు, చక్కని కనుబొమ్మలు కలిగిన చంద్రుని వంటి ముఖం గల ఆ ఊర్వశిని చూచి వారిరువురు ఆమెయందు మోహితులైనారు. నిగ్రహాన్ని కోల్పోయారు. వెంటనే వారు తపస్సు చేస్తూ కూర్చున్న ఆసనం పై వారి వీర్యం పడింది.

స్కన్నం రేతస్తతో దృష్ట్వా శాపభీతౌ పరస్పరమ్ ।
చక్రతుః కలశే శుక్రం తోయపూర్ణే మనోరమే ॥ 28 ॥

తస్మాదృషివరౌ జాతౌ తేజసాప్రతిమౌ భువి ।
వసిష్ఠశ్చాప్యగస్త్యశ్చ మిత్రావరుణయోర్ద్వయోః ॥ 29 ॥

ఆ విధంగా స్ఖలించి మృగాసనంపై పడిన తమ శుక్రాన్ని చూచి శాపభీతితో వెంటనే దానిని జలంతో నిండిన మనోహరమైన కలశంలో ఉంచారు. ఆ శుక్రం నుండే ఋషిశ్రేష్ఠులు, అసమానమైన తేజస్సు గల వారు అయిన వసిష్ఠుడు మరియు అగస్త్యుడు మిత్రావరుణుల పుత్రులై జన్మించారు.

వసిష్ఠస్తూపయేమేఽథ భగినీం నారదస్య తు ।
అరుంధతీం వరారోహాం తస్యాం శక్తిమజీజనత్ ॥ 30 ॥

శక్తేః పరాశరః పుత్రః తస్య వంశం నిబోధ మే ।
యస్య ద్వైపాయనః పుత్రః స్వయం విష్ణురజాయత ॥ 31 ॥

ప్రకాశో జనితో యేన లోకే భారతచంద్రమాః ।
పరాశరస్య తస్య త్వం శృణు వంశమనుత్తమమ్ ॥ 32 ॥

తర్వాత వసిష్ఠుడు నారదుని సోదరి, ఉత్తమురాలైన అరుంధతిని వివాహమాడాడు. ఆమె ద్వారా 'శక్తి' అనే పుత్రుని కన్నాడు. శక్తికి పరాశరుడనే పుత్రుడు జన్మించాడు. ఆ పరాశరునికే సాక్షాత్తు విష్ణువే ద్వైపాయనుడైన వ్యాసుడుగా జన్మించాడు. ఆ వ్యాసుని నుండే మనకు ప్రకాశవంతమైన భారతమనే చంద్రుడుదయించాడు. అటువంటి ద్వైపాయనుని తండ్రియైన పరాశరుని ఉత్తమ వంశం గురించి ఇప్పుడు చెబుతాను. శ్రద్ధగా విను.

కాండశపో వాహనపో జైహ్మపో భౌమతాపనః ।
గోపాలిరేషాం పంచమ ఏతే గౌరాః పరాశరాః ॥ 33 ॥

ప్రపోహయా వాహ్యమయాః ఖ్యాతేయాః కౌతుజాతయః ।
హర్యశ్విః పంచమోహ్యేషాం నీలాః జ్ఞేయాః పరాశరాః ॥ 34 ॥

కాండశపుడు, వాహనుపుడు, జైహ్మపుడు, భౌమతాపనుడు, గోపాలి అనే ఈ ఐదుగురు గౌరపరాశరులు. ప్రపోహయులు, వాహ్యమయులు, ఖ్యాతేయులు, కౌతుజాతులు, హర్యశ్వి అనే ఐదుగురు నీలపరాశరులు.

కార్ష్ణాయనాః కపిముఖాః కాకేయస్థా జపాతయః ।
పుష్కరః పంచమశ్చైషాం కృష్ణా జ్ఞేయాః పరాశరాః ॥ 35 ॥

శ్రీవిష్ఠాయనబాలేయాః స్వాయష్టాశ్చోపయాశ్చ యే ।
ఇషీకహస్తశ్చైతే వై పంచ శ్వేతాః పరాశరాః ॥ 36 ॥

కర్ష్ణాయనులు, కపిముఖులు, కాకేయస్థులు, జపాతులు, పుష్కరుడు అనే ఈ ఐదుగురు కృష్ణ పరాశరులు. మరియు శ్రీవిష్ఠాయనులు, బాలేయులు, స్వాయష్టులు, ఉపయులు, ఇషీకహస్తులు అనే ఐదుగురు శ్వేత పరాశరులు.

వాటికో బాదరిశ్చైవ స్తమ్బా వై క్రోధనాయనాః ।
క్షైమిరేషాం పంచమస్తు ఏతే శ్యామాః పరాశరాః ॥ 37 ॥

ఖల్యాయనా వార్ష్యాయనాస్తైలేయాః ఖలు యూథపాః ।
తన్తిరేషాం పఞ్చమస్తు ఏతే ధూమ్రాః పరాశరాః ॥ 38 ॥

పరాశరాణాం సర్వేషాం త్ర్యార్షేయః ప్రవరో మతః ।
పరాశరశ్చ శక్తిశ్చ వసిష్ఠశ్చ మహాతపాః ॥
పరస్పరమవైవాహ్యా సర్వ ఏతే పరాశరాః ॥ 39 ॥

వాటికుడు, బాదరి, స్తంబుడు, క్రోధనాయనులు, క్షైమి అనే ఐదుగురు శ్యామ పరాశరులు. ఖల్యాయనులు, వార్ష్ణ్యాయనులు, తైలేయులు, యూథపులు, తన్తి అనే ఈ ఐదుగురు ధూమ్రపరాశరులు. ఇలా ఈ పరాశరులందరికీ ప్రవర ముగ్గురు ఋషులచే చెప్పబడింది. పరాశరుడు, శక్తి, మహాతపస్వియైన వసిష్ఠుడు అనే ముగ్గురు వారి ప్రవర ఋషులు. ఈ ఋషుల గోత్రాల వారు పరస్పరం వివాహాది సంబంధాలు కుదుర్చుకోరాదు.

ఉక్తాస్త్వవైతే నృప వంశముఖ్యాః పరాశరాః సూర్యసమప్రభావాః ॥
యేషాం తు నామ్నాం పరికీర్తనేన పాపం సమగ్రం పురుషో జహాతి ॥ 40 ॥

ఓ రాజా ! సూర్య సమాన ప్రభావం కలిగిన పరాశర వంశానికి సంబంధించిన ముఖ్య ఋషులను గురించి చెప్పాను. వీరి నామముచ్చరించినంతనే పురుషుడు సమస్త పాపాల నుండి విముక్తుడవుతాడు.

ఇతి శ్రీ మత్స్యే మహాపురాణే ప్రవరానుకీర్తనే పరాశర వంశవర్ణనం నామ ఏకాధికద్విశతతమోఽధ్యాయః ॥ 201॥

శ్రీ మత్స్య మహాపురాణంలో ఋషుల గోత్ర ప్రవరలు చెప్పడంలో పరాశర వంశ గోత్ర ప్రవరలు వర్ణించడమనే రెండు వందల ఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వ్యధికశతతమోఽధ్యాయః - రెండువందల రెండవ అధ్యాయం
అగస్త్యవంశానుకీర్తనమ్ - అగస్త్య వంశాన్ని గురించి చెప్పుట

మత్స్య ఉవాచ - మత్స్యమూర్తి చెప్పాడు.

అతః పరమగస్త్యస్య వక్ష్యే వంశోద్భవాన్ ద్విజాన్ ।
అగస్త్యశ్చ కరమ్భయః కౌశల్యాః శకటాస్తథా ॥ 1 ॥

సుమేధసో మయోభువస్తథా గాన్ధారకాయణాః ।
పౌలస్త్యాః పౌలహాశ్చైవ క్రతువంశభవాస్తథా ॥ 2 ॥

త్ర్యార్షేయాభిమతాశ్చైషాం సర్వేషాం ప్రవరాః శుభాః ।
అగస్త్యశ్చ మహేంద్రశ్చ ఋషిశ్చైవ మయోభువః ॥ 3 ॥

పరస్పరమవైవాహ్యా ఋషయః పరికీర్తితాః ।

ఇక ఇప్పుడు అగస్త్య వంశంలో జన్మించిన ద్విజులను గురించి చెబుతాను విను. అగస్త్యుడు, కరంభుడు, కౌశల్యుడు, శకటుడు, సుమేధసులు, మయోభువులు, గాంధారకాయణులు, పౌలస్త్యులు, పౌలహులు, క్రతువంశభవులు, మొదలైన వీరందరికి ముగ్గురు ఋషుల ప్రవర చెప్పబడింది. అగస్త్యుడు, మహేంద్రుడు, మయోభువుడు అనే ముగ్గురు వీరి ప్రవరలోని ఋషులు. ఈ ఋషుల గోత్రాలు కలవారు పరస్పరం వివాహాది సంబంధాలు చేసికోరాదు.

పౌర్ణమాసాః పారణాశ్చ త్ర్యార్షేయాః పరికీర్తితాః ॥ 4 ॥

అగస్త్యః పౌర్ణమాసశ్చ పారణశ్చ మహాతపాః ।
పరస్పరమవైవాహ్యాః పౌర్ణమాసాస్తు పారణైః ॥ 5 ॥

మరియు పౌర్ణమాసులు, పారణులు అనే ఋషులకు కూడ ప్రవరలో ముగ్గురే ఋషులున్నట్లు చెప్పబడింది. అగస్త్యుడు, పౌర్ణమాసుడు, మహాతపశ్శాలియైన పారణుడు అనే వారు వీరి ప్రవర ఋషులు. వీరు పరస్పరం వివాహాదులు చేసికోకూడదు. పౌర్ణమాసులు పారణులతో వివాహ సంబంధాలు కుదుర్చుకోకూడదు.

ఏవముక్తో ఋషీణాం తు వంశ ఉత్తమపౌరుషః ।
అతః పరం ప్రవక్ష్యామి, కిం భవానద్య కథ్యతామ్ ॥ 6 ॥

ఇలా నీ కింతవరకు ఉత్తమపురుషులతో గూడిన ఋషుల వంశాన్ని గురించి చెప్పాను. తర్వాత నీకేమి వివరించాలో తెలుపుమని మత్స్యమూర్తి మనువునడిగాడు.

మనురువాచ - మనువు చెప్పాడు.

పులహస్య పులస్త్యస్య క్రతోశ్చైవ మహాత్మనః ।
అగస్త్యస్య తథా చైవ కథం వంశస్తదుచ్యతామ్ ॥ 7 ॥

మహాత్ములైన పులహ, పులస్త్య, క్రతువులకు కూడ అగస్త్యవంశానికి చెందిన వారనే పేరెలా వచ్చిందో వివరించమని మత్స్యమూర్తిని మనువు ప్రార్థించాడు.

మత్స్య ఉవాచ – మత్స్యమూర్తి చెప్పాడు.

క్రతుః ఖల్వనపత్యోఽభూత్ రాజన్ వైవస్వతేఽన్తరే ।
ఇధ్మవాహం స పుత్రత్వే జగ్రాహ ఋషిసత్తమః ॥ 8 ॥

అగస్త్యపుత్రం ధర్మజ్ఞమాగస్త్యాః క్రతవస్తతః ।

ఓ రాజా! వైవస్వతమన్వంతరంలో క్రతువు మహర్షికి సంతానం లేకపోవుట వలన అగస్త్యుని పుత్రుడు, ధర్మజ్ఞుడూ అయిన ఇధ్మవాహుని తన పుత్రునిగా గ్రహించాడు. అందుకే క్రతు వంశంలో జన్మించిన వారందరూ అగస్త్యులయ్యారు.

పులహస్య తథా పుత్రాస్త్రయశ్చ పృథివీపతే ॥ 9 ॥

తేషాం తు జన్మ వక్ష్యామి ఉత్తరత్ర యథావిధి ।
పులహస్తు ప్రజాం దృష్ట్వా నాతిప్రీతమనాః స్వకామ్ ॥ 10 ॥

అగస్త్యజం దృఢాస్యం తు పుత్రత్వే వృతవాంస్తతః ।
పౌలహాశ్చ తథా రాజన్ ఆగస్త్యాః పరికీర్తితాః ॥ 11 ॥

ఓ రాజా! పులహునికి ముగ్గురు పుత్రులుండేవారు. వారి జన్మ గురించి తర్వాత వివరిస్తాను. కాని పులహుడు తన సంతానంతో సంతుష్టుడు కాకపోయాడు. అందుకే అగస్త్యపుత్రుడైన 'దృఢాస్యుడు' అనే వానిని తన పుత్రునిగా స్వీకరించాడు. కావుననే పౌలహులందరు కూడ ఆగస్త్యులైనారు.

పులస్త్యాన్వయసంభూతాన్ దృష్ట్వా రక్షఃసముద్భవాన్ ।
అగస్త్యస్య సుతం ధీమాన్ పుత్రత్వే వృతవాంస్తతః ॥ 12 ॥

పౌలస్త్యాశ్చ తథా రాజన్ అగస్త్యాః పరికీర్తితాః ।
సగోత్రత్వాదిమే సర్వే పరస్పరమనన్వయాః ॥ 13 ॥

పులస్త్యుడు కూడ తన వంశంలో జన్మించిన వారు రాక్షస జాతి వారవటం చూచి అగస్త్యుని ఒకానొక కుమారుని తన పుత్రునిగా గ్రహించాడు. అప్పటి నుండి ఓ రాజా! పౌలస్త్యులందరూ అగస్త్యులుగా పరిగణింపబడినారు. సగోత్రులైన వీరందరూ పరస్పరం వివాహాది సంబంధాలు కుదుర్చుకోరాదు.

ఏతే తవోక్తాః ప్రవరాః ద్విజానాం మహానుభావా నృప వంశకారాః ।
ఏషాం తు నామ్నాం పరికీర్తనేన పాపం సమగ్రం పురుషో జహాతి ॥ 14 ॥

ఓ రాజా! ఇలా మహానుభావులైన ద్విజుల ప్రవరల గురించి నీకు వివరించాను. వీరందరి పేర్లు కీర్తించటం చేత (ఉచ్చరించటంచేతనే) మానవుడు సమస్త పాపాల నుండి విముక్తి పొందుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రవరానుకీర్తనే అగస్త్య వంశానుకీర్తనే ద్వ్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥202॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ఋషుల గోత్రప్రవరలు చెప్పడంలో అగస్త్యవంశాన్ని గురించి చెప్పడమనే రెండువందల రెండవ అధ్యాయం సమాప్తం.

త్ర్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల మూడవ అధ్యాయం

ధర్మ(ఋషి)వంశానుకీర్తనమ్ - ధర్మవంశగోత్రప్రవరలు

మత్స్య ఉవాచ - మత్స్యమూర్తి చెప్పాడు.

అస్మిన్ వైవస్వతే ప్రాప్తే శృణు ధర్మస్య పార్థివ ।
దాక్షాయణీభ్యః సకలం వంశం దైవతముత్తమమ్ ॥ 1 ॥

ఓ రాజా! ఈ వైవస్వతమన్వన్తరం వచ్చిన తర్వాత 'ధర్ముడు' అనే ఋషికి దక్షపుత్రికల ద్వారా ఉత్తమమైన సకలదైవత వంశముత్పన్నమయింది. ఇప్పుడది వివరిస్తాను విను.

పర్వతాది మహాదుర్గశరీరాణి నరాధిప ।
అరున్ధత్యా ప్రసూతాని ధర్మాద్వైవస్వతేఽన్తరే ॥ 2 ॥

అష్టౌ చ వసవః పుత్రాః సోమపాశ్చ విభోస్తథా ।
ధరో ధ్రువశ్చ సోమశ్చ ఆపశ్చైవానలానిలౌ ॥ 3 ॥

ప్రత్యూషశ్చ ప్రభాసశ్చ వసవోఽష్టౌ ప్రకీర్తితాః ।

ఓ నరాధిపా! ధర్మునికి అరుంధతి ద్వారా సకల పర్వతాది మహాదుర్గాలతో సమానాలైన విశాలమైన శరీరం కలిగిన సోమపాయులైన (సోమపానం చేసే యోగ్యత కలిగిన) అష్ట వసువులు జన్మించారు. వారు:- ధరుడు, ధ్రువుడు, సోముడు, ఆపుడు, అనలుడు, అనిలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు.

ధరస్య పుత్రో ద్రవిణః కాలః పుత్రో ధ్రువస్య తు ॥ 4 ॥

కాలస్యావయవానాం తు శరీరాణి నరాధిప ।
మూర్తిమన్తి చ కాలాద్ధి సంప్రసూతాన్యశేషతః ॥ 5 ॥

సోమస్య భగవాన్ వర్చాః శ్రీమాంశ్చాపస్య కీర్త్యతే ।
అనేకజన్మజననః కుమారస్త్వనలస్య తు ॥ 6 ॥

పురోజవాశ్చానిలస్య ప్రత్యూషస్య తు దేవలః ।
విశ్వకర్మా ప్రభాసస్య త్రిదశానాం స వర్ధకిః ॥ 7 ॥

సమీహితకరాః ప్రోక్తాః నాగవీథ్యాదయో నవ ।
లమ్బాపుత్రః స్మృతో ఘోషో భానోః పుత్రాశ్చ భానవః ॥ 8 ॥

ధరునికి ద్రవిణుడనే పుత్రుడు, ధ్రువునికి కాలుడు అనే పుత్రుడు కలిగారు. ఆ కాలునకే మూర్తిమంతాలైన కాలావయవ శరీరాలన్నీ (మాసం, సంవత్సరం మొదలైనవి) జన్మించాయి. సోమునికి పూజ్యుడైన వర్చుడు, ఆపునికి శ్రీమాన్ అనే పుత్రుడు జన్మించారు. అనలునికి అనేక జన్మజననుడనే వాడు జన్మించాడు. అనిలునికి పురోజవుడు,

ప్రత్యూషునికి దేవలుడు, ప్రభాసునికి దేవతల వర్ధంగియైన విశ్వకర్మ జన్మించారు. 'నాగవీథి' మొదలైన తొమ్మిది మంది సంతానం ఇతరుల మనోరథాలను సిద్ధింపజేసేవారు. (గమనిక:- "యమీసుతా ఇతి ప్రోక్తా నాగ వీథ్యాదయో నవ" అనే పాఠం కొన్నింటిలో కలదు. సందర్భానుసారంగా చూస్తే ఇదే సరైన పాఠంగా తెలుస్తున్నది. అయితే నాగవీథి మొదలైన తొమ్మిది మంది 'యమి' అను ఆమె ద్వారా జన్మించారు అని అర్థం చెప్పుకోవలసివస్తుంది). మరియు 'లంబ' అనే ఆమె ద్వారా ఘోషుడనే పుత్రుడు, 'భానువు' ద్వారా భానువులు (బహుశః ద్వాదశాదిత్యులు) కలిగారు.

గ్రహర్క్షాణాం చ సర్వేషామన్యేషాం చామితౌజసామ్ ।
మరుత్వత్యాం మరుత్వన్తః సర్వే పుత్రాః ప్రకీర్తితాః ॥ 9 ॥

సంకల్పాయాశ్చ సంకల్పస్తథా పుత్రః ప్రకీర్తితః ।
ముహూర్తాశ్చ ముహూర్తాయాః సాధ్యాః సాధ్యాసుతాః స్మృతాః ॥ 10 ॥

మనో మనుశ్చ ప్రాణశ్చ నరోషా నోచ వీర్యవాన్ ।
చిత్తహార్యో ఉ యనశ్చైవ హంసో నారాయణస్తథా ॥ 11 ॥

విభుశ్చాపి ప్రభుశ్చైవ సాధ్యా ద్వాదశ కీర్తితాః ।
విశ్వాయాశ్చ తథా పుత్రా విశ్వేదేవాః ప్రకీర్తితాః ॥ 12 ॥

క్రతుర్దక్షో వసుః సత్యః కాలకామో మునిస్తథా ।
కురజో మనుజో వీజో రోచమానశ్చ తే దశ ॥ 13 ॥

గ్రహ - నక్షత్రాదులన్నింటి కంటే శ్రేష్ఠులైన మరుత్వంతులు మరుత్వతి యందు కలిగారు. సంకల్ప యందు సంకల్పుడు ముహూర్తయందు ముహూర్తములు, సాధ్యయందు సాధ్యులనే పుత్రులు కలిగారు. మనుడు, మనువు, ప్రాణుడు, నరోషుడు, నోచుడు, వీర్యవంతుడు, చిత్తహార్యుడు, అయనుడు, హంసుడు, నారాయణుడు, విభువు, ప్రభువు, అనే వారు పన్నెండు మంది సాధ్యులు. విశ్వ అనే ఆమె ద్వారా విశ్వేదేవతలు జన్మించారు. వారే క్రతువు, దక్షుడు, వసువు, సత్యుడు, కాలకాముడు, ముని, కురజుడు, మనుజుడు, వీజుడు మరియు రోచమానుడు అనే పదిమంది విశ్వేదేవతలు.

ఏతావదుక్తస్తవ ధర్మవంశః సంక్షేపతః పార్థివవంశముఖ్య ।
వ్యాసేన వక్తుం న హి శక్యమస్తి రాజన్వినా వర్షశతైరనేకైః ॥ 14 ॥

ఓ రాజుముఖ్యా! నీ కిలా ధర్ముని వంశం గురించి సంక్షిప్తంగా చెప్పాను. ఓ రాజా! ఇది విస్తరించి చెప్పడం వందల సంవత్సరాల కాలంలో తప్ప శక్యం కాదు. అది భగవంతుడైన వ్యాసుడు మాత్రమే చేయగలడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ధర్మవంశవర్ణనే ధర్మప్రవరానుకీర్తనం నామ త్ర్యధికద్విశతతమో ఉ ధ్యాయః ॥203॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ధర్మవంశ వర్ణనలో ధర్ముని గోత్రప్రవరలు చెప్పడమనే రెండువందల మూడవ అధ్యాయం సమాప్తం.

చతురధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల నాల్గవ అధ్యాయం

పితృగాథాకీర్తనమ్ – పితృదేవతల గాథలు

మత్స్య ఉవాచ – మత్స్యమూర్తి చెప్పాడు.

ఏతద్వంశభవా విప్రాః శ్రాద్ధే భోజ్యాః ప్రయత్నతః ।
పితౄణాం వల్లభం యస్మాదేషు శ్రాద్ధం నరేశ్వర ॥ 1 ॥

అతః పరం ప్రవక్ష్యామి పితృభిర్యాః ప్రకీర్తితాః ।
గాథాః పార్థివశార్దూల కామయద్భిః పురే స్వకే ॥ 2 ॥

ఓ నరేశ్వరా! ఈ ధర్ముని వంశంలో జన్మించిన బ్రాహ్మణులను ప్రయత్నపూర్వకంగా శ్రాద్ధంలో భుజింపజేయాలి. అది పితృదేవతలకు ప్రీతికరమైనది. ఓ రాజా! ఇప్పుడు తమ పురంలో వుండి శ్రాద్ధ కర్మలను అభిలషించే పితరులు కీర్తించి గాథలను నీకు వినిపిస్తాను.

అపి స్యాత్స కులేఽస్మాకం యో నో దద్యాజ్జలాంజలిమ్ ।
నదీషు బహుతోయాసు శీతలాసు విశేషతః ॥ 3 ॥

అపిస్యాత్స కులేఽస్మాకం యః శ్రాద్ధం నిత్యమాచరేత్ ।
పయోమూలఫలైర్భక్ష్యైః తిలతోయేన వా పునః ॥ 4 ॥

పుష్కలమైన జలం కలిగిన నదులలో ప్రత్యేకంగా శీతలమైన జలం కలిగిన నదులలో మాకు నీటితో అర్ఘ్యాలనర్పించే (తర్పణాలిచ్చే) మంచివాడొకడు మా వంశంలో జన్మించుగాక! పాలు, కందమూలాలు, ఫలాలు, భక్ష్యాలు మొదలైన వాటితో గాని, నువ్వుల కలిసిన జలంతో గాని నిత్యమూ శ్రాద్ధకర్మ నాచరించేవాడు మా వంశంలో జన్మించుగాక!

అపి స్యాత్స కులేఽస్మాకం యో నో దద్యాత్త్రయోదశీమ్ ।
పాయసం మధుసర్పిభ్యాం వర్షాసు చ మఘాసు చ ॥ 5 ॥

అపి స్యాత్స కులేఽస్మాకం ఖడ్గమాంసేన యః సకృత్ ।
శ్రాద్ధం కుర్యాత్ ప్రయత్నేన కాలశాకేన వా పునః ॥ 6 ॥

కాలశాకం మహాశాకం మధు మున్యన్నమేవ చ ।
విషాణవర్జ్యా యే ఖడ్గా ఆసూర్యం తదశీమహి ॥ 7 ॥

మరియు త్రయోదశీ నాడు వర్షఋతువులో, మఘానక్షత్రం రోజున కూడ తేనెతో, నెయ్యితో కలిసిన పాయసాన్ని మాకు అర్పిస్తాడో అటువంటి వాడు మా వంశంలో జన్మించుగాక. ఖడ్గంతో ఛేదించిన మాంసంతో

లేదా కాలశాకంతో ప్రయత్నశీలుడై ఒక్కసారైనా మాకు శ్రాద్ధకర్మ నాచరించే పుణ్యాత్ముడు మా వంశంలో జన్మించుగాక! ఇంకనూ కాలశాకం (కరివేము), మహాశాకం, తేనె మరియు మునులు సేవించే అన్నం, కొమ్ములు లేని మృగమాంసం మొదలైన వాటితో శ్రాద్ధమాచరిస్తే సూర్యుడున్నంత వరకు మేము వాటిని భుజిస్తాము. కావున వాటినన్నింటిని మాకు అర్పించే శక్తి గలవాడు మా వంశంలో జన్మించుగాక!

గయాయాం దర్శనే రాహోః ఖడ్గమాంసేన యోగినామ్ ।
భోజయేత్కః కులేఽస్మాకం ఛాయాయాం కుంజరస్య చ ॥ 8 ॥

ఆకల్పకాలికీ తృప్తిస్తేనాస్మాకం భవిష్యతి ।
దాతా సర్వేషు లోకేషు కామచారో భవిష్యతి ॥ 9 ॥

ఆభూతసంప్లవం కాలం నాత్ర కార్యా విచారణా ।
యదేతత్పంచకం తస్మాదేకేనాపి చ యః సదా ॥ 10 ॥

తృప్తిం ప్రాప్స్యామ చానన్త్యాం కిం పునః సర్వసంపదా ।

గయా తీర్థంలో రాహుగ్రస్త గ్రహణ కాలంలో యోగులకు ఏనుగు నీడలో ఖడ్గ మాంసాన్ని మా వంశంలో ఎవడు భుజింపజేస్తాడు? ఈ పదార్థాలతో శ్రాద్ధకర్మ ఆచరిస్తే మేము కల్పాంతం వరకు తృప్తి పొందుతాము. వీటినన్నింటిని మాకు అర్పించినవాడు మహాప్రళయ కాలాంతం వరకు స్వేచ్ఛానుసారంగా లోకాలన్నింటిలో సంచరిస్తాడు. ఈ విషయంలో సందేహం కాని విచారణ కాని అవసరం లేదు. ఈ ఐదింటిలో ఏదో ఒకదానితో శ్రాద్ధమాచరిస్తే మాకు అనంతమైన తృప్తి కలుగుతుంది. ఇంక అన్నింటితో ఆచరిస్తే ఎంత తృప్తి కలుగుతుందో చెప్పేదేముంది?

అపి స్యాత్స కులేఽస్మాకం దద్యాత్ కృష్ణాజినం చ యః ॥ 11 ॥

అపి స్యాత్స కులేఽస్మాకం కశ్చిత్ పురుష సత్తమః ।
ప్రసూయమానాం యో ధేనుం దద్యాత్ బ్రాహ్మణపుంగవే ॥ 12 ॥

అపి స్యాత్స కులేఽస్మాకం వృషభం యః సముత్సృజేత్ ।
సర్వవర్ణవిశేషేణ శుక్లనీలం వృషం తథా ॥ 13 ॥

అపి స్యాత్స కులేఽస్మాకం యః కుర్యాచ్ఛ్రద్ధయాన్వితః ।
సువర్ణదానం గోదానం పృథివీదానమేవ చ ॥ 14 ॥

కృష్ణాజినాన్ని మరియు ప్రసవించే ధేనువును ద్విజశ్రేష్ఠునికి దానం చేసే ఉత్తముడైనవాడు మా వంశంలో జన్మించుగాక! అన్ని రంగులు గల, లేదా తెల్లని, నీలి రంగుగల వృషభాన్ని మా కొరకై విసర్జించేవాడు మా వంశంలో జన్మించుగాక! మరియు శ్రద్ధతో సువర్ణదానం, గోదానం, భూదానం చేసేవాడు మా వంశంలో జన్మించుగాక!

అపి స్యాత్స కులేஉస్మాకం కశ్చిత్ పురుషసత్తమః ।
కూపారామతడాగానాం వాపీనాం యశ్చ కారకః ॥ 15 ॥

అపి స్యాత్స కులేஉస్మాకం సర్వభావేన యో హరిమ్ ।
ప్రయాయాచ్ఛరణం విష్ణుం దేవేశం మధుసూదనమ్ ॥ 16 ॥

అపి నః స కులే భూయాత్ కశ్చిద్విద్వాన్ విచక్షణః ।
ధర్మశాస్త్రాణి యో దద్యాద్విధినా విదుషామపి ॥ 17 ॥

కూపాలు ఆరామాలు, తటాకాలు, దిగుడు బావులు మొదలగు వాటిని శ్రద్ధతో ఏర్పరచే పురుష శ్రేష్ఠుడు మా వంశంలో జన్మించుగాక! అలాగే సర్వవ్యాపి మధుసూదనుడు, దేవేశుడు కూడ అయిన శ్రీహరిని అన్ని విధాలా శరణువేడే స్వభావం గలవాడు మా వంశంలో జన్మించుగాక! మరియు విద్వాంసుడు, వివేకవంతుడు, ధర్మశాస్త్రాలను పండితులకు దానం చేసేవాడు మా వంశంలో జన్మించుగాక!

ఏతావదుక్తం తవ భూమిపాల శ్రాద్ధస్య కల్పం మునిసంప్రదిష్టమ్ ।
పాపాపహం పుణ్యవివర్ధనం చ లోకేషు ముఖ్యత్వకరం తథైవ ॥ 18 ॥

ఓ రాజా! మునులు ఉపదేశించిన శ్రాద్ధకల్పాన్ని నీకింతవరకు వివరించాను. ఇది పాపాన్ని హరించివేసేది, పుణ్యాన్ని పెంచేది, లోకాలలో ప్రాముఖ్యాన్ని కలిగించేది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే పితృగాథాకీర్తనం నామ
చతురధికద్విశతతమోஉధ్యాయః ॥ 204॥

శ్రీ మత్స్య మహాపురాణంలో పితృదేవతల గాథలు చెప్పడమనే
రెండువందల నాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఐదవ అధ్యాయం

ధేను దానమ్ – ధేను దానం

మనురువాచ – మనువు చెప్పాడు.

> **ప్రసూయమానా దాతవ్యా ధేనుర్బ్రాహ్మణపుంగవే ।**
> **విధినా కేన ధర్మజ్ఞ దానం దద్యాచ్చ కిం ఫలమ్ ॥ 1 ॥**

ఓ ధర్మజ్ఞుడా! అప్పుడే ఈనుతున్న ధేనువును బ్రాహ్మణోత్తమునికి దానం చేయవలసిన విధానాన్ని మరియు దాని వలన కలిగే ఫలాన్ని గురించి వివరించు అని మనువు మత్స్యమూర్తిని అడిగాడు.

> **స్వర్ణశృంగీం రౌప్యఖురాం ముక్తాలాంగూలభూషితామ్ ।**
> **కాంస్యోపదోహనాం రాజన్ సవత్సాం ద్విజపుంగవే ॥ 2 ॥**

> **ప్రసూయమానాం గాం దత్వా మహత్ పుణ్యఫలం లభేత్ ।**
> **యావద్వత్సో యోనిగతో యావద్గర్భం న ముంచతి ॥ 3 ॥**

> **తావద్వై పృథివీ జ్ఞేయా సశైలవనకాననా ।**
> **ప్రసూయమానాం యో దద్యాద్ధేనుం ద్రవిణసంయుతామ్ ॥ 4 ॥**

> **ససముద్రగుహా తేన సశైలవనకాననా ।**
> **చతురన్తా భవేద్దత్తా పృథివీ నాత్ర సంశయః ॥ 5 ॥**

ఓ రాజా! బంగారు కొమ్ములతో, ముత్యాలతో అలంకరించబడిన తోకతో, వెండి గిట్టలతో, కంచుతో చేసిన పాలు పిదుకు పాత్రతో మరియు దూడతో కూడ కలిసి వున్నట్టి గోవును శ్రేష్ఠుడైన బ్రాహ్మణునికి దానం చేయాలి. అటువంటి గోదానం చేస్తే మహత్తరమైన పుణ్యం లభిస్తుంది. ఇంకనూ దూడ యోనియందే వుండి గర్భాన్ని విడువనంత వరకు ఆ గోవు కొండలు, వనాలు, కారడవులతో కూడిన ఈ విశాలమైన పృథివితో సమానమని తెలిసికోవాలి. ఈనబోవుతున్న ధేనువును ద్రవ్యంతో కూడ ఎవరైతే దానం చేస్తారో వారికి సముద్రాలు, గుహలు, పర్వతాలు, వనాలు, కారడలతో గూడిన ఈ భూమి నంతటిని దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. దీనిలో సందేహం లేదు.

> **యావన్తి ధేనురోమాణి వత్సస్య చ నరాధిప ।**
> **తావత్సంఖ్యం యుగగణం దేవలోకే మహీయతే ॥ 6 ॥**

ఆ విధంగా దానం చేసినవాడు ధేనువు మరియు దూడ శరీరాల పై ఎన్ని రోమాలుంటాయో, అన్ని యుగాలు దేవలోకంలో సర్వసుఖాల ననుభవిస్తాడు.

పితౄన్పితామహాంశ్చైవ తథైవ ప్రపితామహాన్ ।
ఉద్ధరిష్యత్యసందేహాన్నరకాద్ భూరిదక్షిణః ॥ 7 ॥

ఘృతక్షీరవహాః కుల్యా దధిపాయసకర్దమాః ।
యత్ర యత్ర గతస్తస్య ద్రుమాశ్చేప్సితకామదాః ॥
గోలోకః సులభస్తస్య బ్రహ్మలోకశ్చ పార్థివ ॥ 8 ॥


ఇంకనూ ఈనబోతున్న ధేనువును అనేక దక్షిణలతో కూడ ఎవరైతే దానం చేస్తారో, వారు వారి తండ్రులను, తాతలను, ముత్తాతలను కూడ నరకం నుండి తరింపజేస్తారు. అంతే కాక అతను ఎక్కడికి వెళ్ళినా నెయ్యి, పాలు, పెరుగు మరియు పాయసంతో కూడిన నదులు ప్రవహిస్తూ ఉంటాయి. అలాగే వృక్షాలు కోరిన కోరికలన్నింటిని తీరుస్తాయి. అటువంటి దాత గోలోకాన్ని, బ్రహ్మలోకాన్ని కూడ సులభంగా పొందుతాడు.

స్త్రియశ్చ తం చంద్రసమానవక్త్రాః ప్రతప్తజామ్బూనదతుల్యరూపాః ।
మహానితమ్బాస్తనువృత్తమధ్యా భజన్త్యజస్రం నలినాభనేత్రాః ॥ 9 ॥

అటువంటి గోదానం చేసిన పురుషుని అక్కడ చంద్రుని వంటి ముఖం కాచిన బంగారం వంటి శరీర కాంతి, విశాలమైన పిరుదులు, సన్నని నడుములు మరియు, కమలాలవంటి నేత్రాలు కలిగిన స్త్రీలు సదా సేవిస్తారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ధేనుదానం నామ పఞ్చాధికద్విశతతమోఽధ్యాయః ॥205॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ధేనుదానమనే రెండువందల ఐదవ అధ్యాయం సమాప్తం



షడధిక ద్విశతతమోऽధ్యాయః – రెండువందల ఆరవ అధ్యాయం
కృష్ణాజినప్రదానమ్ – నల్లజింక చర్మమిచ్చుట

మనురువాచ – మనువు అడిగాడు.

కృష్ణాజిన ప్రదానస్య విధికాలౌ మమానఘ ।
బ్రాహ్మణం చ తథాచక్ష్వ తత్ర మే సంశయో మహాన్ ॥ 1 ॥

ఓ పాపరహితుడా! కృష్ణాజినం దానం చేయుటానికి సరైన కాలాన్ని, తద్విధానమును కూడ తెలుపు. ఎటువంటి బ్రాహ్మణునికి దానమీయాలో కూడ తెలుపు. నాకీ విషయంలో చాలా సంశయాలున్నాయి.

మత్స్య ఉవాచ – మత్స్యమూర్తి చెప్పాడు.

వైశాఖీ పౌర్ణమాసీ చ గ్రహణే శశిసూర్యయోః ।
పౌర్ణమాసీ తు యా మాఘే హ్యాషాఢీ కార్తికీ తథా ॥ 2 ॥

ఉత్తరాయణద్వాదశీ వా తస్యాం దత్తం మహాఫలమ్ ।
ఆహితాగ్నిర్ద్విజో యస్తు తద్దేయం తస్య పార్థివః ॥ 3 ॥

వైశాఖ పూర్ణిమ, చంద్ర సూర్య గ్రహణాలు, మాఘ పూర్ణిమ, ఆషాఢ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, ఉత్తరాయణంలో ద్వాదశీతిథి మొదలైనవి ఈ దానానికి ప్రసిద్ధములు. ఓ రాజా! నిత్యాగ్నిహోత్రుడైన బ్రాహ్మణునికి ఈ దానమివ్వాలి.

యథా యేన విధానేన తన్మే నిగదతః శృణు ।
గోమయేనోపలిప్తే తు శుచౌ దేశే నరాధిప ॥ 4 ॥

ఆదావేవ సమాస్తీర్య శోభనం వస్త్రమావికమ్ ।
తతః సశృఙ్గం సఖురమాస్తరేత్ కృష్ణమార్గకమ్ ॥ 5 ॥

కర్తవ్యం రుక్మశృఙ్గం తద్రౌప్యదన్తం తథైవ చ ।
లాంగూలం మౌక్తికైర్యుక్తం తిలచ్ఛన్నం తథైవ చ ॥ 6 ॥

ఓ నరాధిపా! ఇది ఏ విధంగా చేయాలో వివరిస్తాను విను. ముందుగా గోమయంతో అలికిన శుభ్రమైన ప్రదేశంలో ప్రశస్తమైన, పవిత్రమైన కంబళాన్ని పరిచి, దానిపై కొమ్ములు, గిట్టలు కలిగిన కృష్ణాజినాన్ని గూడ పరిచి, దానికి బంగారం కొమ్ములు, వెండి దంతాలు, ముత్యాలతో అలంకరించిన తోకను చేసి వాటిని నువ్వులతో ఆచ్ఛాదించాలి.

తిలైశ్చ శిఖితం కృత్వా వాససాచ్ఛాదయేత్ శుచిః ।
సువర్ణనాభం తత్కుర్యాదలంకుర్యాద్విశేషతః ॥ 7 ॥

రత్నైర్గన్ధై ర్యథాశక్త్యా తస్య దిక్షు చ విన్యసేత్ ।
కాంస్యపాత్రాణి చత్వారి తేషు దద్యాద్యథాక్రమమ్ ॥ 8 ॥

మృణ్మయేషు చ పాత్రేషు పూర్వాదిషు యథాక్రమమ్ ।
ఘృతం క్షీరం దధి క్షౌద్రమేవం దద్యాద్యథావిధి ॥ 9 ॥

బుద్ధిమంతుడైన పురుషుడు ఆ మృగచర్మం పై నువ్వులు చల్లి, దానిపై నూతన వస్త్రాన్నుంచి, దాని నాభిని సువర్ణం చేసి విశేషంగా దాని నలంకరించి, శక్తిని బట్టి రత్నాలతోను, సుగంధద్రవ్యాలతోను అలంకరించి, నాలుగు దిక్కుల్లో నాలుగు కాంస్యపాత్రలనుంచి, నాలుగు మట్టి పాత్రలు వరుసగా వుంచి వాటిలో తూర్పువైపు వుంచిన పాత్రతో మొదలు చేసి క్రమంగా నెయ్యి, పాలు, పెరుగు మరియు తేనెను నింపాలి.

చమ్పకస్య తథా శాఖామవ్రణం కుమ్భమేవ చ ।
బాహ్యోపస్థానకం కృత్వా శుభచిత్తాం నివేశయేత్ ॥ 10 ॥

సూక్ష్మం వస్త్రం శుభం పీతం మార్జనార్థం ప్రయోజయేత్ ।
తథా ధాతుమయం పాత్రం పాదయోస్తస్య దాపయేత్ ॥ 11 ॥

చంపక చెట్టుకొమ్మను, రంధ్రం లేని కడవను వీటికి అవతలివైపు శుభచిత్తుడై వుంచాలి. పసుపు పచ్చని కొత్తని వస్త్రాన్ని మార్జనం కోసం వుంచాలి. తర్వాత కంచుతో చేసిన పాత్రలను పాదాల దగ్గర పెట్టాలి.

యాని కాని చ పాపాని మయా లోభాత్ కృతాని వై ।
లోహపాత్రాదిదానేన ప్రణశ్యన్తు మమాశు వై ॥ 12 ॥

తిలపూర్ణం తతః కృత్వా వామపాదే నివేశయేత్ ।
యాని కాని చ పాపాని కర్మోత్థాని కృతాని చ ॥ 13 ॥

కాంస్యపాత్రప్రదానేన తాని నశ్యన్తు మే సదా ।
మధుపూర్ణం తు తత్కృత్వా పాదే వై దక్షిణే న్యసేత్ ॥ 14 ॥

నేను లోభంతో చేసిన పాపాలన్నీ తొందరగా నశించుగాక! అంటూ లోహపాత్ర మొదలైన వాటిని దానం చేయాలి. తర్వాత కాంస్య పాత్రను నువ్వులతో నింపి, దానిని ఎడమపాదం దగ్గర వుంచి, కర్మవశాన నేను చేసిన పాపాలన్నీ శీఘ్రంగా నశించుగాక యని యనుకోవాలి. ఆ తరువాత ఆ కాంస్యపాత్రను తేనెతో నింపి కుడిపాదం వైపు వుంచాలి.

పరాపవాదపైశున్యాద్ వృషామాంసస్య భక్షణాత్ ।
తత్రోత్థితం చ మే పాపం తామ్రపాత్రాత్ ప్రణశ్యతు ॥ 15 ॥

కన్యానృతాద్గవాం చైవ పరదారాభిమర్షణాత్ ।
రౌప్యపాత్రప్రదానాద్ధి క్షిప్రం నాశం ప్రయాతు మే ॥ 16 ॥

ఇతరులను నిందించుట వలన, కలహాలు సృష్టించుట వలన, ఎద్దు మాంసం తినడం వలన కలిగిన నా పాపాలన్నీ తామ్రపాత్ర దానం వలన నశించుగాక! మరియు కన్యల విషయంలో అసత్యం పలుకుట వలన, గోవులకు హాని చేయటం వలన, ఇతరుల భార్యలను అవమానించటం వలన కలిగిన పాపాలన్నీ ఈ వెండి పాత్ర దానం వలన వెంటనే నశించుగాక యని యనుకోవాలి.

ఊర్ధ్వపాదే త్విమే కార్యం తామ్రస్య రజతస్య చ ।
జన్మజన్మసహస్రేషు కృతం పాపం కుబుద్ధినా ॥ 17 ॥

సువర్ణపాత్రదానాత్తు నాశయాశు జనార్దన ।
హేమముక్తా విద్రుమం చ దాడిమం బీజపూరకమ్ ॥ 18 ॥

ప్రశస్తపాత్రే శ్రవణే ఖురే శృఙ్గాటకాని చ ।
ఏవం కృత్వా యథోక్తేన సర్వశాకఫలాని చ ॥ 19 ॥

ఆ వెండి మరియు రాగి పాత్రలను చర్మపు ఎడమ మరియు కుడి పాదాల వద్ద ఉంచాలి. ఓ జనార్దనా! నేను వేల జన్మలలో చెడు బుద్ధితో చేసిన పాపాలన్నీ ఈ సువర్ణపాత్ర దానంతో శీఘ్రంగా నశింపజేయి అని ప్రార్థించాలి. బంగారంతో పొదిగిన ముత్యాలు, వైడూర్యాలు, బీజాలతో నిండిన దానిమ్మపండ్లు ప్రశస్తమైన పాత్రలో వుంచి, చెవులలో, గిట్టలలో, మరియు కొమ్ముల మధ్య భాగంలో యథావిధిగా అన్ని శాకాలను, ఫలాలను వుంచాలి.

తత్రప్రతిగ్రహవిద్విద్వాన్ ఆహితాగ్నిర్ద్విజోత్తమః ।
స్నాతో వస్త్రయుగచ్ఛన్నః స్వశక్త్యా చాప్యలంకృతః ॥ 20 ॥

ప్రతిగ్రహశ్చ తస్యోక్తః పుచ్ఛదేశే మహీపతే ।
తత ఏవం సమీపే తు మన్త్రమేనముదీరయేత్ ॥ 21 ॥

కృష్ణః కృష్ణగలో దేవః కృష్ణాజినధరస్తథా ।
తద్దానాద్ధూతపాపస్య ప్రీయతాం వృషభధ్వజః ॥ 22 ॥

ఈ దానాన్ని స్వీకరించే ఆహితాగ్నియైన బ్రాహ్మణుడు కూడ విద్వాంసుడై వుండాలి. మరియు స్నానం చేసి, ధోతి మరియు ఉత్తరీయం ధరించి శక్తిని బట్టి అలంకరించుకోవాలి. ఓ రాజా! ఆ ద్విజోత్తముడు ఈ దానాన్ని పుచ్ఛం వైపున వుండి స్వీకరించాలి. ఈ దానానికి మంత్రమిది. "ఓ కృష్ణాజినాన్ని! నల్లని కంఠము గలవాడు, కృష్ణాజినమును ధరించినవాడు, వృషభధ్వజుడూ అయిన మహాదేవుడు ఈ నా దానంచే ప్రీతి నొందుగాక! నా పాపాలన్నీ నశించుగాక". అని పఠించుకోవాలి.

అనేన విధినా దత్త్వా యథావత్ కృష్ణమార్గకమ్ ।
న స్పృశ్యోఽసౌ ద్విజో రాజంశ్చితియూపసమో హి సః ॥ 23 ॥

ఇలా యథావిధిగా కృష్ణాజినాన్ని దానం చేసిన తర్వాత దానం స్వీకరించిన బ్రాహ్మణుని తాకరాదు. అతడు ఆ సమయంలో చితిలోని యూపకాష్ఠంతో సమానుడు.

తం దానే శ్రాద్ధకాలే చ దూరతః పరివర్జయేత్ ।
స్వగృహాత్ ప్రేష్య తం విప్రం మంగలస్నానమాచరేత్ ॥ 24 ॥

పూర్ణకుంభేన రాజేంద్ర శాఖయా చంపకస్య తు ।
కృత్వాచార్యస్తు కలశం మంత్రేణానేన మూర్ధని ॥ 25 ॥

ఆప్యాయస్వ సముద్‌జ్యేష్ఠా ఋచా సంస్నాప్య షోడశ ।
అహతేవాససీవీత ఆచాన్తః శుచితామియాత్ ॥ 26 ॥

ఆ విప్రుని దానసమయంలో, శ్రాద్ధకాలంలో కూడ దూరంగా ఉంచాలి. అతనిని తన ఇంటి నుండి పంపిన తర్వాత దాత మంగళ స్నానమాచరించాలి. ఓ రాజేంద్రా! చంపక శాఖతో కూడిన పూర్ణకుంభాన్ని ఆచార్యుడు దాత శిరస్సుపై ఉంచి "ఆప్యాయస్వ" "సముద్‌జ్యేష్ఠా" మొదలైన పదహారు ఋక్కులతో నీటిని చల్లాలి (ప్రోక్షణ చేయాలి). ఆ తరువాత దాత క్రొత్తవస్త్రాల జతను (రెండుగా చించిన ధోతి, ఉత్తరీయం) ఒకటి ధోవతిగా, రెండవది ఉత్తరీయంగా ధరించి ఆచమనం చేసి శుచిత్వాన్ని పొందాలి.

తద్వాసః కుంభసహితం నీత్వా క్షేప్యం చతుష్పథే ।
కృతేనానేన యా తుష్టిర్న సా శక్యా సురైరపి ॥ 27 ॥

వక్తుం హి నృపతిశ్రేష్ఠ! తథాప్యుద్దేశతః శ్రుణు ।
సమగ్రభూమిదానస్య ఫలం ప్రాప్నోత్యసంశయమ్ ॥ 28 ॥

అటు తర్వాత కుండతో కూడా ఆ వస్త్రాన్ని తీసి నాలుగు త్రోవలు కలిసిన చోట పారవేయాలి. ఈ దానం వలన కలిగే తృప్తి ఇంతటిదని దేవతల చేత కూడ వర్ణింప శక్యం కానట్టిది. అయినప్పటికీ ఓ రాజా! నేను ఉద్దేశమాత్రంగా చెబుతాను విను. ఈ దానం ద్వారా సమగ్ర భూదానం చేసినంత ఫలం లభిస్తుందనటంలో సందేహం లేదు.

సర్వాన్ లోకాంశ్చ జయతి కామచారీ విహంగవత్ ।
ఆభూతసంప్లవం తావత్ స్వర్గమాప్నోత్యసంశయమ్ ॥ 29 ॥

న పితా పుత్రమరణం వియోగం భార్యయా సహ ।
ధనదేశపరిత్యాగం న చైవేహాప్నుయాత్ క్వచిత్ ॥ 30 ॥

ఓ రాజా! ఈ దానం చేసిన వాడు కామచారియై పక్షివలె అన్నిలోకాలలో సంచరిస్తాడు. ప్రళయాంతం వరకు ఉండి ఆ తరువాత స్వర్గాన్ని పొందుతాడు. దీనిలో సందేహం లేదు. అతనికి పితృ-పుత్ర-భార్యా వియోగాదులు ఉండవు. ఎప్పుడూ ధన నష్టం కాని దేశపరిత్యాగం కాని జరుగదు.

కృష్ణేప్సితం కృష్ణమృగస్య చర్మ దత్త్వా ద్విజేంద్రాయ సమాహితాత్మా ।
యథోక్తమేతన్మరణం న శోచేత్ ప్రాప్నోత్యభీష్టం మనసః ఫలం తత్ ॥ 31 ॥

ఓ రాజా! కృష్ణునకు ఇష్టమైన కృష్ణమృగ చర్మాన్ని శ్రద్ధాభక్తులతో ద్విజశ్రేష్ఠునికి దానం చేసినవారికి మరణాదుల వల్ల కలిగే శోకం కలుగదు. అంతేకాక తమ మనోభీష్టఫలం లభిస్తుంది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే కృష్ణాజినప్రదానం నామ షడధికద్విశతతమోஉధ్యాయః ॥206॥

శ్రీ మత్స్యమహాపురాణంలో నల్లజింక చర్మాన్ని దానం చేయడమనే రెండువందల ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తాధిక శతతమో౽ధ్యాయః – రెండువందల ఏడవ అధ్యాయం

వృషభ లక్షణమ్ – వృషోత్సర్గవిధిః – వృషభ లక్షణం మరియు వృషోత్సర్గ విధానం

మనురువాచ – మనువు చెప్పాడు.

భగవన్! శ్రోతుమిచ్ఛామి వృషభస్య చ లక్షణమ్ ।
వృషోత్సర్గవిధిం చైవ తథా పుణ్యఫలం మహత్ ॥ 1 ॥

దేవా ! వృషభం లక్షణాన్ని మరియు వృషోత్సర్గ విధానాన్ని, దాని వలన లభించే మహత్తరమైన పుణ్యఫలాన్ని గురించి కూడ వినగోరుచున్నాను.

మత్స్య ఉవాచ – మత్స్య భగవానుడు చెప్పాడు.

ధేనుమాదౌ పరీక్షేత సుశీలాం చ గుణాన్వితామ్ ।
అవ్యఙ్గామపరిక్లిష్టాం జీవద్వత్సామరోగిణీమ్ ॥ 2 ॥

స్నిగ్ధవర్ణాం స్నిగ్ధఖురాం స్నిగ్ధశృఙ్గీం తథైవ చ ।
మనోహరాకృతిం సౌమ్యాం సుప్రమాణామనుద్ధతామ్ ॥ 3 ॥

ముందుగా ఆ వృషభానికి తల్లియైన ధేనువును పరీక్షించాలి. ముఖ్యంగా ఆ ధేనువు మంచి శీలం కలది, గుణవతి, అంగవైకల్యం లేనిది, నలిగిపోని శరీరం కలది, వ్యాధి లేనిది, జీవిస్తున్న దూడలు కలది, మనస్సు నాకర్షించే వర్ణం కలది, మంచి గిట్టలు మరియు కొమ్ములు కలది, మనోహరమైన ఆకారం కలది, సౌమ్యమైన నడవడిక కలదై, మంచి ప్రమాణం కలిగి గర్వం లేకుండా వుండాలి.

ఆవర్తైర్దక్షిణావర్తైర్యుక్తాం దక్షిణతస్తథా ।
వామావర్తైర్వామతశ్చ విస్తీర్ణజఘనాం తథా ॥ 4 ॥

మృదుసంహతతామ్రోష్ఠీం రక్తగ్రీవా సుశోభితామ్ ।
అశ్యామదీర్ఘా ౽స్ఫుటితా రక్తజిహ్వా తథా చ యా ॥ 5 ॥

ఆ ధేనువుకి కుడివైపు సుడులు కుడివైపుకు మరియు ఎడమవైపు సుడులు ఎడమవైపుకు తిరిగి వుండాలి. విశాలమైనన పిరుదులు కలది, మృదువైన మరియు దట్టంగా కూడ ఉన్న పెదవులు కలది, ఎర్రని మెడ కలది, చక్కగా ప్రకాశిస్తున్నది, చామనఛాయ కలది మరియు ఎర్రని నాలుక కలది అయి ఉండాలి.

విస్రావామలనేత్రా చ శఫైరవిరలైర్దృఢైః ।
వైదూర్యమధువర్ణైశ్చ జలబుద్బుదసన్నిభైః ॥ 6 ॥

రక్తస్నిగ్ధైశ్చ నయనైస్తథా రక్తకనీనికైః ।
సప్తచతుర్దశ దన్తా తథా వా శ్యామతాలుకా ॥ 7 ॥

షడున్నతా సుపార్శ్వోరుః పృథుపంచ సమాయతా ।
అష్టాయతశిరోగ్రీవా యా రాజన్ సా సులక్షణీ ॥ 8 ॥

ఓ రాజా! విశాలమైన నేత్రాలు కలది, దృఢమైన డెక్కలు కలది, వైడూర్యం మరియు తేనె వంటి వర్ణం గల నేత్రాలు కలది, నీటి బుడగలవలె ఎత్తైన కనుబొమ్మలు కలది, ఎర్రని కనురెప్పలు కలది, ఏడు, ఏడుపద్నాలుగు దంతాలు కలది, చామన ఛాయ బోలిన దౌడలు కలది, ఆరు ఉన్నతాలైన చక్కని పార్శ్వాలు మరియు విశాలమైన తొడలు కలది. ఐదు భాగాలు విశాలంగా సమంగా వుండి, ఎనిమిది నిడువుల తల మెడ గల ధేనువు మంచి లక్షణం కలది.

మనురువాచ – మనువు అడిగాడు.

షడున్నతాః కే భగవన్ కే చ పంచ సమాయతాః ।
ఆయతాశ్చ తథైవాష్టౌ ధేనూనాం కే శుభావహాః ॥ 9 ॥

దేవా! షడున్నతములు, పంచ సమాయతములు, అష్టాయతములు అనగా నేవి? ధేనువులకు శుభావహములైనవి ఏవి?

మత్స్య ఉవాచ – మత్స్య భగవానుడు చెప్పాడు.

ఉరః పృష్ఠం శిరః కుక్షీ శ్రోణీ చ వసుధాధిప ।
షడున్నతాని ధేనూనాం పూజయన్తి విచక్షణాః ॥ 10 ॥

కర్ణౌ నేత్రే లలాటం చ పంచ భాస్కరనందన ।
సమాయతాని శస్యన్తే పుచ్ఛం సాస్నా చ సక్థినీ ॥ 11 ॥

చత్వారశ్చ స్తనా రాజన్ జ్ఞేయా హ్యష్టౌ మనీషిభిః ।
శిరో గ్రీవాయతాశ్చైతే భూమిపాల దశస్మృతాః ॥ 12 ॥

వక్షఃస్థలము, వీపు, శిరస్సు, కుక్షి పిరుదులు రెండు కలిపి ఈ ఆరు ఉన్నతాలైవున్న ధేనువులు శుభప్రదాలని పండితులు ప్రశంసిస్తారు. చెవులు, కన్నులు, లలాటం మొదలైన ఐదు సమానాలై పొడవుగా వుంటే ఆ ధేనువులు మంచివి. అలాగే తోక, గంగడోలు, రెండు తొడలు, నాలుగు స్తనములు మొదలగు ఎనిమిదితో పాటు శిరస్సు, కంఠం కూడ కలిపి ఓ భూమిపాలా! మొత్తం పది పొడవుగా వుంచాలి.

తస్యాః సుతం పరీక్షేత వృషభం లక్షణాన్వితమ్ ।
ఉన్నతస్కన్ధకకుదం ఋజులాంగూలకమ్బలమ్ ॥ 13 ॥

మహాకటితటస్కన్ధం వైదూర్యమణిలోచనమ్ ।
ప్రవాలగర్భశృఙ్గాగ్రం సుదీర్ఘపృథువాలధిమ్ ॥ 14 ॥

నవాష్టాదశసంఖ్యైర్వా తీక్ష్ణాగ్రైర్దశనైః శుభైః ।
మల్లికాక్షశ్చ మోక్తవ్యో గృహేఽపి ధనధాన్యదః ॥ 15 ॥

తర్వాత ఆ ధేనువు పుత్రుడైన వృషభాన్ని పరీక్షించాలి. ఆ వృషభం శుభలక్షణాలతో కూడినదై వుండాలి. అది ఉన్నతమైన మూపు, మూపురం, ఎత్తైన తోక, వక్రత లేకుండా సూటిగా వున్న గంగడోలు కలిగినదై వుండాలి. ఇంకనూ విశాలమైన కటిస్థలం, వైడూర్యాలవంటి కన్నులు, పగడాల వంటి కొమ్ముల కొనలు, దీర్ఘా లైన చెవులు, తొమ్మిది లేదా పద్దెనిమిది తీక్ష్ణాలైన మొనలు గల దంతాలు, మల్లికా పుష్పాల వంటి కన్నులు కలిగినదై ఉండాలి. ఇటువంటి లక్షణాలు కలిగిన వృషభాన్ని వదిలితే గృహంలో ధనధాన్యాదులు వృద్ధిపొందుతాయి.

వర్ణతస్తామ్రకపిలో బ్రాహ్మణస్య ప్రశస్యతే ।
శ్వేతో రక్తశ్చ కృష్ణశ్చ గౌరః పాటల ఏవ చ ॥ 16 ॥

శృంగిణస్తామ్రపృష్ఠశ్చ శవలః పంచవాలకైః ।
పృథుకర్ణో మహాస్కంధః శ్లక్ష్ణరోమా చ యో భవేత్ ॥
రక్తాక్షః కపిలో యశ్చ రక్తశృంగతలో భవేత్ ॥ 17 ॥

శ్వేతోదరః కృష్ణపార్శ్వో బ్రాహ్మణస్య తు శస్యతే ।

ఎర్రని తామ్రవర్ణం కలది, తెల్లనిది, రక్త వర్ణం కలది, నల్లనిది, గౌరవర్ణం కలది, పాటల వర్ణం కలది, బలమైన కొమ్ములు, ఎర్రని పృష్ఠభాగం, ఐదు వన్నెలుకల తోక, విశాలమైన చెవులు, గొప్ప మూపులు, దట్టమైన రోమాలు, ఎర్రని నేత్రములు, కపిల వర్ణం, ఎర్రని కొమ్ములు, తెల్లని పొట్ట, నల్లని పార్శ్వభాగాలు కలిగిన వృషభాన్ని బ్రాహ్మణుడు వదిలిపెట్టుటకు శ్రేష్ఠమైనదని చెప్పబడింది.

స్నిగ్ధో రక్తేన వర్ణేన క్షత్రియస్య ప్రశస్యతే ॥ 18 ॥

కాంచనాభేన వైశ్యస్య కృష్ణేనాప్యన్త్యజన్మనః ।
యస్య ప్రాగాయతే శృంగే భూముఖాభిముఖే సదా ॥ 19 ॥

సర్వేషామేవ వర్ణానాం సర్వః సర్వార్థసాధకః ।

స్నిగ్ధమైన ఎరుపు వర్ణం గల వృషభాన్ని క్షత్రియులు వదలిపెట్టుటకు శ్రేష్ఠము. బంగారు వర్ణం గల దానిని వైశ్యులు, నల్ల దానిని శూద్రులు వదిలిపెడితే శ్రేష్ఠమంటారు. మరియు ఏ వృషభం కొమ్ములు ముందుకు పొడుచుకొని వచ్చినట్లుంటాయో, ఆ వృషభం అన్ని వర్ణాలవారికీ సర్వార్థ సాధకమైనదిగా చెప్పబడినదని చెప్పారు.

మార్జారపాదః కపిలో ధన్యః కపిలపింగలః ॥ 20 ॥

శ్వేతో మార్జారపాదస్తు ధన్యో మణినిభేక్షణః ।
కరటః పింగలశ్చైవ శ్వేతపాదస్తథైవ చ ॥ 21 ॥

సర్వపాదసితో యశ్చ ద్విపాదశ్వేత ఏవ చ ।
కపింజలనిభో ధన్యః తథా తిత్తిరి సన్నిభః ॥ 22 ॥

మరియు పిల్లి పాదాల వంటి పాదాలు కలది, కపిలవర్ణం, కపిలపంగళ వర్ణం కూడ కల, వృషభం ధన్యమైనది. అలాగే తెల్లనిది, పిల్లి పాదాల వంటి పాదాలు కలది, మణులకాంతి వంటి కన్నులు గలది కూడ

ధన్యమైనదే. ఇంకనూ కాకి వంటి వర్ణం కలది, పింగళ వర్ణం కలది, తెల్లనిపాదాలు కలది, అన్ని పాదాలూ తెల్లగా వుండేది, రెండు పాదాలు మాత్రమే తెల్లగా వుండేది, కపింజల వర్ణం మరియు సారసపక్షి వర్ణం గల వృషభాలు ధన్యజాతులని చెప్పారు.

ఆకర్ణమూలశ్వేతం తు ముఖం యస్య ప్రకాశతే ।
నన్దీముఖః స విజ్ఞేయో రక్తవర్ణో విశేషతః ॥ 23 ॥

శ్వేతం తు జఠరం యస్య భవేత్ పృష్ఠం చ గోపతేః ।
వృషభః స సముద్రాఖ్యః సతతం కులవర్ధనః ॥ 24 ॥

మల్లికాపుష్పచిత్రశ్చ ధన్యో భవతి పుంగవః ।
కమలైర్మండలైశ్చాపి చిత్రో భవతి భాగ్యదః ॥ 25 ॥

చెవుల మొదళ్ళలో తెలుపు రంగు కల, బాగా ప్రకాశిసున్న ముఖం కల, రక్తవర్ణం కల వృషభమును "నందీముఖ" అనే కోడె అంటారని తెలసికోవాలి. దేని జఠర భాగం మరియు పృష్ఠభాగం కూడ తెల్లగా వుంటుందో, అది సముద్రమనే జాతికి చెందినదని, అది ఎల్లప్పుడూ కులవర్ధకమని చెబుతారు. ఇంకనూ మల్లెపూవు వంటి రంగు కల, వివిధ వర్ణాలు కల వృషభం, కమలాల వంటి వర్ణంకల వృషభం కూడ శ్రేష్ఠమైనదని, భాగ్యమునిస్తుందని తెలిసికోవాలి.

అతసీ పుష్పవర్ణశ్చ తథా ధన్యతరః స్మృతః ।
ఏతే ధన్యాస్తథాఽధన్యాన్ కీర్తయిష్యామి తే నృప ॥ 26 ॥

ఓ రాజా! అతసీ పుష్పమువంటి వర్ణము గల వృషభము కూడ ధన్యతరమైనదని చెప్పబడినది. ఇంత వరకును వివరించిన వన్నియు ధన్యములైనవి, ఇప్పుడు అధన్యములైన వాటి గురించి వివరించెదను వినుము.

కృష్ణతాల్వోష్ఠవదనా రూక్షశృంగశఫాశ్చ యే ।
అవ్యక్తవర్ణా హ్రస్వాశ్చ వ్యాఘ్రసింహనిభాశ్చ యే ॥ 27 ॥

ధ్వాంక్షగృహసవర్ణాశ్చ తథా మూషకసన్నిభాః ।
కుణ్ఠాః కాణా స్తథా ఖంజాః కేకరాక్షాస్తథైవ చ ॥ 28 ॥

విషమశ్వేతపాదాశ్చ ఉద్భ్రాన్తనయనాస్తథా ।
నైతే వృషాః ప్రమోక్తవ్యా న చ ధార్యాస్తథా గృహే ॥ 29 ॥

నల్లని దౌడలు, పెదవులు, ముఖం కలిగిన, బిరుసుగా వుండే కొమ్ములు, కలిగినవి, కనబడని రంగు కలిగినవి, పొట్టిగా ఉన్నవి, వ్యాఘ్రాలను మరియు సింహాలను బోలిన, కాకులవలె ఉన్నవి, మూషకాల వలె వున్నవి, నెమ్మదిగా నడచేవి, మెల్లికన్ను గలవి, పాదాలు సరిగా లేనివి, చూపు సరిగా లేనివి, సమంగా లేని తెల్లని పాదాలు గలవి, తిరుగుతున్న కనుగ్రుడ్లు కలవి అయిన వృషభాలు విడిచిపెట్టుటకు యోగ్యాలు కావు మరియు గృహంలో ఉంచుకోవడానికి కూడ పనికి రావు.

**మోక్తవ్యానాం చ ధార్యాణాం భూయో వక్ష్యామి లక్షణమ్ ।
స్వస్తికారకరశృంగాశ్చ తథా మేఘౌఘనిస్వనాః ॥ 30 ॥**

**మహాప్రమాణాశ్చ తథా మత్తమాతంగగామినః ।
మహోరస్కా మహోచ్ఛ్రాయా మహాబలపరాక్రమాః ॥
శిరః కర్ణౌ లలాటం చ వాలధిశ్చరణాస్తథా ॥ 31 ॥**

**నేత్రే పార్శ్వే చ కృష్ణాని శస్యన్తే చంద్రభాసినామ్ ।
శ్వేతాన్యేతాని శస్యంతే కృష్ణస్య తు విశేషతః ॥ 32 ॥**

ఇప్పుడు, విడవడానికి మరియు గృహంలో ఉంచుకోవడానికి యోగ్యమైన వృషభాల లక్షణాలు చెబుతాను. స్వస్తికాకారపు కొమ్ములు కలిగిన, మేఘాల ఉరుము వంటి గంభీర స్వరం కలిగినవి, గొప్పప్రమాణం కలిగినవి, మదించిన గజములవలె నడిచేవి, విశాలమైన వక్షఃస్థలం కలిగినవి, ఎత్తైన, గొప్ప బలపరాక్రమాలు కలిగినవి, శిరస్సు, చెవులు, లలాటం, తోక, పాదాలు, నేత్రాలు, డొక్కలు మొదలైన నల్లగా ఉండేవి, చంద్రుని వంటి శరీరకాంతి గలిగినవి, తెల్లగా ఉన్న విశేషంగా ప్రశస్తాలని చెబుతారు.

**భూమౌ కర్షతి లాంగూలం ప్రలమ్బస్థలవాలధిః ।
పురస్తా దుద్యతో నీలో వృషభశ్చ ప్రశస్యతే ॥ 33 ॥**

**శక్తిధ్వజపతాకాఢ్యా యేషాం రాజీ విరాజతే ।
అనడ్వాహస్తు తే ధన్యాశ్చిత్రసిద్ధిజయావహాః ॥ 34 ॥**

**ప్రదక్షిణం నివర్తన్తే స్వయం యే వినివర్తితాః ।
సమున్నతశిరోగ్రీవా ధన్యాస్తే యూథవర్ధనాః ॥ 35 ॥**

మరియు భూమిపై నేలను తాకుతూ వ్రేలాడుతుండే లావైన తోక కలవి, ముందుకు సాగినట్లుండే శరీరాకృతి కలవి, రోమపంక్తిలో శక్త్యాయుధం, ధ్వజం పతాకం మొదలైన చిహ్నాలు కలవి, ఉన్నతమైన శరీరం కలవి, చిత్రాలైన వర్ణాలు కలవి, సిద్ధిని, జయాన్ని కలిగించేవి, ప్రదక్షిణం చేసి తిరిగి వచ్చేవి, ఉన్నతాలైన శిరస్సు మరియు మెడ కలవి అయిన వృషభాలు శ్రేష్ఠాలని, అవి తమ సమూహాన్ని జాతిని వృద్ధి పొందిస్తాయని చెబుతారు.

**రక్తశృంగాగ్రనయనః శ్వేతవర్ణో భవేద్యది ।
శఫైః ప్రవాలసదృశైః నాస్తి ధన్యతరస్తతః ॥ 36 ॥**

**ఏతే ధార్యాః ప్రయత్నేన మోక్తవ్యా యది వా వృషాః ।
ధారితాశ్చ తథా ముక్తా ధనధాన్యప్రవర్ధనాః ॥ 37 ॥**

మరియు తెల్లని శరీరం కలిగి, ఎర్రని కొనలు కలిగిన కొమ్ములు, ఎర్రని కన్నులు, పగడాల వంటి గిట్టలు కలిగిన, వృషభం కన్న ప్రశస్తమైంది లేదు. ఈ విధమైన లక్షణాలు కలిగిన వాటిని ప్రయత్నంతో వదిలినా, గృహంలో ఉంచుకొన్నా శ్రేష్ఠం, అవి ఇంటిలో ధన ధాన్యాలను వృద్ధి చేస్తాయి.

చరణాని ముఖం పుచ్ఛం యస్య శ్వేతాని గోపతేః ।
లాక్షారససవర్ణశ్చ తం నీలమితి నిర్దిశేత్ ॥ 38 ॥

వృష ఏవ స మోక్తవ్యో న సంధార్యో గృహే భవేత్ ।
తదర్థమేషా చరతి లోకే గాథా పురాతనీ ॥ 39 ॥

ఏష్టవ్యా బహవః పుత్రా యద్యేకోఽపి గయాం వ్రజేత్ ।
గౌరీం చాప్యుద్వహేత్ కన్యాం నీలం వా వృషముత్సృజేత్ ॥ 40 ॥

ఏ వృషభం పాదాలు, ముఖం, తోక, తెల్లగా వుంటాయో, శరీరమంతా ఎఱ్ఱగా వుంటుందో, ఆ వృషభాన్ని నీలవృషభమంటారు. అటువంటి వృషభం విడువదగినదే కాని గృహంలో ఉంచుకోవడానికి యోగ్యం కాదు. లోకంలో ఈ విషయమై ప్రాచీనమైన కథ ఒకటి కలదు. చాలా మంది పుత్రులు కావాలని, వారిలో ఒకడైనా గయా క్షేత్రానికి వెళ్ళుతాడేమోనని, గౌరియైన (రజస్వల కానటువంటి) కన్యను దానం చేస్తాడేమోనని, నీల వృషభాన్ని వదులుతాడేమో నని తలచే పితరుల కథ కలదు.

ఏవం వృషం లక్షణసంప్రయుక్తం గృహోద్భవం క్రీతమథాపి రాజన్ ।
ముక్త్వా న శోచన్మరణం మహాత్మా మోక్షం గతశ్చాహమతోఽభిధాస్యే ॥ 41 ॥

ఓ రాజా! ఇలా సలక్షణమైన వృషభాన్ని తమ ఇంటిలో పుట్టిన దానిని కాని, లేదా కొనిన దానిని కాని వదిలిన వాడు తన మరణ విషయంలో శోకింపవలసిన పనిలేదు. ఆ మహాత్ముడు చివరకు మోక్షం కూడ పొందుతాడనటంలో సందేహం లేదు. అందుకే నేను ఈ విషయాన్ని నీకు విశేషంగా చెబుతున్నాను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వృషభలక్షణం నామ
సప్తాధికద్విశతతమోఽధ్యాయః ॥207॥

శ్రీ మత్స్యమహాపురాణంలో వృషభలక్షణం మరియు వృషోత్సర్గ విధానమనే
రెండువందల ఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనిమిదవ అధ్యాయం

సావిత్ర్యుపాఖ్యానే సావిత్రీవనప్రవేశః – సావిత్రి ఉపాఖ్యానంలో సావిత్రి అడవిలో ప్రవేశించుట

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

తతః స రాజా దేవేశం పప్రచ్ఛామితవిక్రమః ।
పతివ్రతానాం మాహాత్మ్యం తత్సమ్బద్ధాం కథామపి ॥ 1 ॥

అప్పుడు అమిత పరాక్రమవంతుడైన ఆ వైవస్వత మనువు పతివ్రతల మాహాత్మ్యాన్ని మరియు వారికి సంబంధించిన కథలను వివరించమని దేవేశుడైన మత్స్యభగవానుని అడిగాడు.

మనురువాచ – మనువు అడిగాడు.

పతివ్రతానాం కా శ్రేష్ఠా కయా మృత్యుః పరాజితః ।
నామసంకీర్తనం కస్యాః కీర్తనీయం సదా నరైః ॥
సర్వపాపక్షయకరమిదానీం కథయస్వ మే ॥ 2 ॥

పతివ్రతలలో శ్రేష్ఠురాలు ఎవరు? ఏ పతివ్రత చేత మృత్యువు జయించబడింది? నరులు ఏ పతివ్రత నామసంకీర్తనం ఎల్లప్పుడు చేయాలి? అన్ని పాపాలను పోగొట్టే ఆ వృత్తాంతాన్ని వివరించు.

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

వైలోమ్యం ధర్మరాజోఽపి నాచరత్యథ యోషితామ్ ।
పతివ్రతానాం ధర్మజ్ఞ పూజ్యాస్తస్యాపి తాః సదా ॥ 3 ॥

ధర్మరాజు కూడ పతివ్రతల విషయంలో ప్రతికూలంగా వ్యవహరించడు. ఓ ధర్మజ్ఞా ! పతివ్రతలతనికి గూడ సదా పూజ్యులే.

అత్ర తే వర్ణయిష్యామి కథాం పాపప్రణాశినీమ్ ।
యథా విమోక్షితో భర్తా మృత్యుపాశగతః స్త్రియా ॥ 4 ॥

ఓ రాజా! నీకిప్పుడు పాపాన్ని నశింపజేసే కథను వివరించి చెబుతాను. ఒక పతివ్రతయైన స్త్రీ తన భర్తను మృత్యుపాశం నుండి కూడ ఎలా విడిపించిందో నీకు తెలుపుతాను.

మద్రేషు శాకలో రాజా బభూవాశ్వపతిః పురా ।
అపుత్రస్తప్యమానోఽసౌ పుత్రార్థీ సర్వకామదామ్ ॥ 5 ॥

ఆరాధయతి సావిత్రీం లక్షితోఽసౌ ద్విజోత్తమైః ।
సిద్ధార్థకైర్హూయమానాం సావిత్రీం ప్రత్యహం ద్విజైః ॥ 6 ॥

శతసంఖ్యైశ్చతుర్థ్యాం తు దశమాసాగతే దినే ।
కాలే తు దర్శయామాస స్వాం తనుం మనుజేశ్వరమ్ ॥ 7 ॥

పూర్వం మద్రదేశంలో శాకల వంశానికి చెందిన అశ్వపతి అనే మహారాజుండినాడు. అతడు పుత్రులు లేక దుఃఖితుడై పుత్రుల కొరకు సర్వకామ ప్రదాయినియైన, ద్విజోత్తములు పూజించే సావిత్రిని ఆరాధించాడు. వందలకొలది బ్రాహ్మణోత్తములు తెల్లని ఆవాలతో ప్రతిదినం యాగం ద్వారా ఆమెను కొలువగా పదిమాసములు గడిచిన పిమ్మట ఒక చతుర్థీ తిథి నాడు ఆమె రాజుకు సాక్షాత్కరించింది.

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

రాజన్! భక్తోఽసి మే నిత్యం దాస్యామి త్వాం సుతాం సదా ।
తాం దత్తాం మత్ప్రసాదేన పుత్రీం ప్రాప్స్యసి శోభనామ్ ॥ 8 ॥

ఏతావదుక్త్వా సా రాజ్ఞః ప్రణతస్యైవ పార్థివ ।
జగామాదర్శనం దేవీ యథా వై నృప! చంచలా ॥ 9 ॥

ఓ రాజా! నీవు నాకు నిత్యమూ భక్తుడవైతివి, నీకు ఉత్తమురాలైన కూతురిని ప్రసాదిస్తాను. నా అనుగ్రహంతో పొందిన ఆ పుత్రిక ద్వారా నీకు అంతా శుభమే కలుగుతుంది అని వరమిచ్చి ఆ రాజు నమస్కరించేంతలోనే ఓ రాజా! సావిత్రీ దేవి మెరుపువలె మాయమయింది.

మాలతీ నామ తస్యాసీద్రాజ్ఞః పత్నీ పతివ్రతా ।
సుషువు తనయాం కాలే సావిత్రీమివ రూపతః ॥ 10 ॥

సావిత్ర్యాహుతయా దత్తా తద్రూపసదృశీ తథా ।
సావిత్రీ చ భవత్వేషా జగాద నృపతిర్ద్విజాన్ ॥ 11 ॥

ఆ రాజుకు మాలతి అనే పతివ్రతయైన భార్య వుండినది. కొంత కాలానికి ఆమె సావిత్రీ దేవి వంటి రూపం కలిగిన కూతురిని కనింది. ఆతని పూజలచే సంతుష్టురాలైన సావిత్రీదేవి దయతో జన్మించింది కావున ఆ బిడ్డ సావిత్రి వంటి రూపవతి అయింది. కనుకనే రాజు కూతురి పేరు 'సావిత్రి' యగుగాక అని బ్రాహ్మణులకు చెప్పాడు.

కాలేన యౌవనం ప్రాప్తా దదౌ సత్యవతే పితా ।
నారదస్తు తతః ప్రాహ రాజానం దీప్తతేజసమ్ ॥ 12 ॥

సంవత్సరేణ క్షీణాయుః భవిష్యతి నృపాత్మజః ।
సకృత్కన్యాః ప్రదీయన్తే చిన్తయిత్వా నరాధిప! ॥ 13 ॥

కాలక్రమాన్ననుసరించి ఆమె యౌవనవతి అవగానే అశ్వపతి మహారాజు ఆమెను సత్యవంతునకిచ్చి వివాహం చేశాడు. కాని తేజస్సుతో ప్రకాశించే ఆ రాజుతో నారదుడు "రాజకుమారుడైన సత్యవంతుడు ఒక సంవత్సరంలోనే మృతుడవుతాడని, అతను క్షీణాయుష్కుడని చెబుతూ, కన్యను సాధారణంగా బాగా ఆలోచించే వరునకు ఇస్తారు కదా అని అన్నాడు.

తథాఽపి ప్రదదౌ కన్యాం ద్యుమత్సేనాత్మజే శుభే ।
సావిత్ర్యపి చ భర్తారం ఆసాద్య నృపమందిరే ॥ 14 ॥

నారదస్య తు వాక్యేన దూయమానేన చేతసా ।
శుశ్రూషాం పరమాం చక్రే భర్తృశ్వశురయోర్వనే ॥ 15 ॥

రాజ్యాద్ భ్రష్టః సభార్యస్తు నష్టచక్షుర్నరాధిపః ।
న తుతోష సమాసాద్య రాజపుత్రీం తథా స్నుషామ్ ॥ 16 ॥

అయినప్పటికీ ఆ రాజు ద్యుమత్సేనుని పుత్రుడు శుభుడని తలచి తన కూతురిని ఆతనికిచ్చాడు. సావిత్రి కూడ రాజ మందిరంలో తన భర్త దగ్గరకు వెళ్ళింది. కాని నారదమహర్షి మాటలతో మనస్సులో బాధపడుతూ భర్తకు మరియు అత్తమామలకు సేవచేసింది. రాజ్యం పోగొట్టుకొన్న నరాధిపుడైన ద్యుమత్సేనుడు కళ్ళు కూడ లేనివాడై రాజపుత్రికను కోడలిగా పొందినప్పటికీ భార్యతో పాటు సంతోషం పొందలేకపోయాడు.

చతుర్థేఽహని మర్తవ్యం తథా సత్యవతా ద్విజాః ।
శ్వశురేణాభ్యనుజ్ఞాతా తదా రాజసుతాఽపి సా ॥ 17 ॥

చక్రే త్రిరాత్రం ధర్మజ్ఞా ప్రాప్తే తస్మింస్తదా దినే ।
దారుపుష్పఫలాహారీ సత్యవాంస్తు యయౌ వనమ్ ॥ 18 ॥

శ్వశురేణాభ్యనుజ్ఞాతా యాచనాభఙ్గభీరుణా ।
సావిత్ర్యపి జగామార్తా సహ భర్త్రా మహద్వనమ్ ॥ 19 ॥

చేతసా దూయమానేన గూహమానా మహద్భయమ్ ।
వనే పప్రచ్ఛ భర్తారం ద్రుమాంశ్చాసదృశాంస్తథా ॥ 20 ॥

ద్విజులారా! ఇక నాలుగవనాడు సత్యవంతుడు మరణిస్తాడనగా రాజపుత్రికయైన సావిత్రి ధర్మం తెలిసింది కావున అత్త మామల అంగీకారం పొంది, మూడు అహోరాత్రులు ఉపవాసం చేసింది. తరువాత నాలుగవ రోజున సత్యవంతుడు కట్టెలు, పుష్పాలు, ఫలాలు తీసుకురావడానికై వనానికి బయల్దేరగా మరల అత్తమామల అనుమతిని తీసుకొని సావిత్రి కూడ ఆతనితో పాటు ఆ మహావనానికి వెళ్ళింది. వ్యథ చెందిన మనస్సుతో, ఆ పెద్దభయాన్ని మనస్సులోనే దాచుకొని వనంలో వున్న వృక్షాలు మరియు పూలు మొదలైన వాటి గురించి అడిగింది.

ఆశ్వాసయామాస స రాజపుత్రీం క్లాన్తాం వనే పద్మవిశాలనేత్రామ్ ।
సందర్శనేనాథ ద్రుమద్విజానాం తథా మృగాణాం విపినే నృవీరః ॥ 21 ॥

వీరుడైన సత్యవంతుడు ఆ వనంలో అనేక వృక్షాలను, మృగాలను ఆమెకు చూపుతూ, తనతో కూడ వనంలో తిరిగి అలసి పోయిన, వికసించిన పద్మం వంటి కన్నులు కలిగిన ఆ రాజుపుత్రిని ఓదార్చాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే సావిత్ర్యుపాఖ్యానే సావిత్రీవనప్రవేశో నామ అష్టాధికద్విశతతమోఽధ్యాయః ॥208॥

శ్రీ మత్స్య మహాపురాణంలో సావిత్ర్యుపాఖ్యానంలో సావిత్రి అడవిలో ప్రవేశించడమనే రెండువందల ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

నవాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల తొమ్మిదవ అధ్యాయం

సావిత్ర్యుపాఖ్యానే వనదర్శనమ్ – సావిత్రి ఉపాఖ్యానంలో అడవిని చూచుట

సత్యవానువాచ – సత్యవంతుడు చెప్పాడు.

వనేఽస్మిన్ శాద్వలాకీర్ణే సహకారం మనోహరమ్ ।
నేత్ర ఘ్రాణ సుఖం పశ్య వసన్తం రతివర్ధనమ్ ॥ 1 ॥

వనేఽప్యశోకం దృష్ట్వైనం రాగవన్తం సుపుష్పితమ్ ।
వసన్తో హసతీవాయం మామేవాయతలోచనే! ॥ 2 ॥

విశాలమైన నేత్రాలు కలదానా! పచ్చిక బీడులతో వ్యాప్తమైన ఈ వనంలో వున్న కన్నులకు మరియు ముక్కులకు కూడ ఆనందం కలిగించే, రతివర్ధకమైన మనోహరమైన ఈ తీయమామిడి వృక్షాన్ని చూడు. బాగా వికసించిన ఎర్రని పుష్పాలు కల ఈ వనంలోని అశోక వృక్షాన్ని చూస్తే వసంతఋతువు మనల్ని చూచి నవ్వుతున్నట్టుగా వుంది.

దక్షిణే దక్షిణేనైతాం పశ్య రమ్యాం వనస్థలీమ్ ।
పుష్పితైః కింశుకైర్యుక్తాం జ్వలితానలసప్రభైః ॥ 3 ॥

సుగంధకుసుమామోదో వనరాజివినిర్గతః ।
కరోతి వాయుర్దాక్షిణ్యమావయోః క్లమనాశనమ్ ॥ 4 ॥

దాక్షిణ్య భావము కలదానా! దక్షిణ దిక్కులో జ్వలిస్తున్న అగ్నితో సమానమైన కాంతి గల, బాగా వికసించిన పువ్వులు గల, మోదుగు వృక్షాలతో వ్యాపించిన సుందరమైన ఈ వనస్థలిని చూడు. సుగంధంతో కూడిన పువ్వుల వాసనతో గూడ అడవి చెట్ల పంక్తి నుండి వీస్తున్న గాలి మనయందు దయ చూపి మన శ్రమ పోగొడుతున్నట్లున్నది.

పశ్చిమేన విశాలాక్షి! కర్ణికారైః సుపుష్పితైః ।
కాంచనేన విభాత్యేషా వనరాజీ మనోరమా ॥ 5 ॥

అతిముక్తలతాజాలరుద్ధమార్గా వనస్థలీ ।
రమ్యా సా చారుసర్వాఙ్గి! కుసుమోత్కరభూషణా ॥ 6 ॥

విశాలమైన నేత్రాలు కలదానా! సావిత్రీ! ఇటు పశ్చిమదిశలో చక్కగా పూచిన కర్ణికార వృక్షాలతో మనోహరమైన ఈ వనవృక్షశ్రేణి బంగారంతో అలంకరించినట్లు కనబడుతున్నది. ఓ సౌందర్యవతీ! అతిముక్త లతలతో నిండిపోయి నిరోధించబడిన మార్గం కలదై ఈ వనస్థలి కుసుమ సమూహంతో అలంకరించబడినట్లు కనబడుతున్నది చూడు.

మధుమత్తాలిఝఙ్కారవ్యాజేన వరవర్ణిని ।
చాపాకృష్టిం కరోతీవ కామః పార్శ్వే జిఘాంసయా ॥ 7 ॥

ఫలాస్వాదలసద్వక్త్ర పుంస్కోకిలనినాదితా ।
విభాతి చారుతిలకా త్వమివైషా వనస్థలీ ॥ 8 ॥

ఓ వరవర్ణినీ! మధువు సేవించి మత్తెక్కిన తుమ్మెదల ఝుంకారమనే మిషతో మన్మథుడు తన ధనుస్సును ఎక్కుబెట్టి పాంథులమైన మనబోటి వారిని హింసించ పూనినట్లున్నది. ఫలముల నాస్వాదించటం వలన ప్రకాశిస్తున్న ముఖాలతో వున్న పుంస్కోకిలల నాదంతో నిండిన మరియు తిలక వృక్షాలతో కూడ పరివ్యాప్తమైన ఈ వనస్థలి నీ వలె శోభాయమానంగా వున్నది.

కోకిలశ్చూతశిఖరే మంజరీరేణు పింజరః ।
గదితైర్వ్యక్తతాం యాతి కులీనశ్చేష్టితైరివ ॥ 9 ॥

పుష్పరేణువిలిప్తాంగీ ప్రియామనుసరన్ వనే ।
కుసుమం కుసుమం యాతి కూజన్ కామీం శిలీముఖః ॥ 10 ॥

మామిడి వృక్షపు ఎత్తైన కొమ్మ మీద కూర్చున్న కోకిల పుష్పమంజరుల రేణువుతో పింజర వర్ణం కలదై తన తియ్యని కూతలతో ఉత్తమ వంశంలో జన్మించిన వాని చేష్టలు మంచిగా వుంటాయని తెలుపుతున్నట్లున్నది. పూరేణువులచే వ్యాప్తమైన శరీరం గల తన ప్రియురాలిని వెంబడిస్తూ, ఝుంకారం చేస్తూ, కామోద్దీప్తమైన ఈ తుమ్మెద పువ్వు పువ్వును తిరుగుతున్నది చూడు.

మంజరీం సహకారస్య కాన్తావచ్చాగ్రపీడితామ్ ।
స్వదతే బహుపుష్పేఽపి పుంస్కోకిలయువా వనే ॥ 11 ॥

కాకః ప్రసూతాం వృక్షాగ్రే స్వామేకాగ్రేణ చంచునా ।
కాకీం సంభావయత్యేష పక్షాచ్ఛాదిత పుత్రికామ్ ॥ 12 ॥

భూభాగం నిమ్నమాసాద్య దయితాసహితో యువా ।
నాహారమపి చాదత్తే కామాక్రాన్తః కపింజలః ॥ 13 ॥

ఈ తీయమామిడి చెట్టున పూలు బాగా వికసించి వున్నప్పటకీ వయస్సులో ఉన్న పుంస్కోకిల తన ప్రియురాలు తన ముక్కుతో పొడిచిన మామిడి పూల గుత్తినే ఆస్వాదిస్తున్నది. ఇటువైపు ఒక చెట్టు కొనపై అప్పుడే ప్రసవించి తన శిశువును రెక్కలతో కప్పి పెట్టుకొనివున్న ఆడకాకిని మగ కాకి ముక్కుకొనతో ప్రేమగా స్పృశిస్తున్నది. అలాగే కామపరవశమైన కపింజల పక్షి తన ప్రియురాలితో గూడ నేలపై చేరి ఆహారాన్ని కూడ స్పృశించటం లేదు.

కలవిఙ్కస్తు రమయన్ ప్రియోత్సఙ్గం సమాస్థితః ।
ముహుర్ముహుర్విశాలాక్షి! ఉత్కణ్ఠయతి కామినః ॥ 14 ॥

వృక్షశాఖాం సమారూఢః శుకోఽయం సహ భార్యయా ।
భరేణ లమ్బయచ్ఛాఖాం కరోతి సఫలామివ ॥ 15 ॥

వనేఽత్ర పిశితాస్వాదతృప్తో నిద్రాముపాగతః ।
శేతే సింహయువా కాన్తా చరణాన్తరగామినీ ॥ 16 ॥

ఓ విశాలాక్షీ! కలవింక అనే ఒక పక్షి స్వేచ్ఛగా విహరిస్తూ తన ప్రియురాలి ఒడిలోకి చేరి ప్రేమతో అనునయిస్తూ కాముకులను ఉత్కంఠపరుస్తున్నది. భార్యతో కూడ వృక్షశాఖను అధిరోహించిన ఈ శుకం తన చేతులతో రెమ్మలను వంచుతూ వాటిపై ఊగుతూ తన కోరిక సఫలమైనట్లు ఆనందపడుతున్నది. వనంలో ఇటువైపు చూడుము ఓ సావిత్రీ! మాంసము తినుట వలన తృప్తిచెందిన యువ సింహము నిద్రించుచుండగా దాని ప్రియురాలు దాని కాళ్ళ మధ్యలో పడుకొని తృప్తి చెందుతున్నది.

వ్యాఘ్రయోర్మిథునం పశ్య శైలకందరసంస్థితమ్ ।
యయోర్నేత్రప్రభాలోకే గుహా భిన్నేవ లక్ష్యతే ॥ 17 ॥

అయం ద్వీపీ ప్రియాం లేఢి జిహ్వాగ్రేణ పునః పునః ।
ప్రీతిమాయాతి చ తయా లిహ్యమానః స్వకాన్తయా ॥ 18 ॥

ఉత్సఙ్గకృతమూర్ధానం నిద్రాపహృతచేతసమ్ ।
జన్తూద్ధరణతః కాన్తం సుఖయత్యేవ వానరీ ॥ 19 ॥

సావిత్రీ! ఈ పర్వతగుహలో ఉన్న పెద్దపులుల జంటను చూడు. వాటి కన్నుల కాంతి చేత గుహ ఛేదించబడిందా అన్నట్లున్నది. ఇటువైపున్న చిరుత పులిని చూడు. అది తన ప్రియురాలి శరీరాన్ని తన నాలుకతో నాకుతూ ఎంత ప్రీతి పొందుతున్నదో? ఆ స్త్రీ చిరుత కూడ ఎంత ఆనందపడుతున్నదో చూడు. ఈ ఆడ కోతిని చూడు, అది తన ఒడిలో తలపెట్టుకొని నిద్రసుఖాన్ని అనుభవిస్తున్న మగకోతి శరీరంలోని పేలు తీసివేస్తూ ఎంత ఆనందాన్ని కలిగిస్తున్నదో!

భూమౌ నిపతితాం రామాం మార్జారో దర్శితోదరీమ్ ।
నఖైర్దన్తైర్దశత్యేష న చ పీడయతే తథా ॥ 20 ॥

శశకః శశకీ చోభే సంసుప్తే పీడితే ఇమే ।
సంలీనగాత్రచరణే కర్ణై ర్వ్యక్తిముపాగతే ॥ 21 ॥

భూమిపై తన పొట్ట కనబడేటట్లు పడుకొనివున్న ఆడపిల్లిని తన గోళ్ళతో, దంతాలతో నొక్కుతున్న మగపిల్లి నొప్పిలేకుండా దానికి ఎంత హాయి కలిగిస్తున్నదో చూడు. ఈ కుందేళ్ళ జంటఒడలు ముడుచుకొని నిద్రిస్తున్నను వాటి చెవులను బట్టి అవి కుందేళ్ళు అని తెలిసేటట్లు ఎలా పడుకున్నవి?

స్నాత్వా సరసి పద్మాఢ్యే నాగస్తు మదనప్రియః ।
సంభావయతి తన్వంగీం మృణాలకవలః ప్రియామ్ ॥ 22 ॥

కాంతప్రోథసముత్థానైః కాంతమార్గానుగామినీ ।
కరోతి కవలం ముస్తైర్వరాహీ పోతకానుగా ॥ 23 ॥

దృఢాంగసన్ధిర్మహిషః కర్దమాక్తతనుర్వనే ।
అనువ్రజతి ధావన్తీం ప్రియాముద్ధతముత్సుకః ॥ 24 ॥

కామోద్దీప్తుడైన ఈ మగ ఏనుగు పద్మాలతో నిండిన సరస్సులో తన ఆడ ఏనుగుకు తామర తూడులను తినటానికి అందిస్తూ ఆదరిస్తున్నది. అలాగే ఆడ అడవిపంది తన పిల్లలు వెంట వస్తూండగా తన మగపందినే అనుసరిస్తూ అందమైన ముట్టెతో తవ్వి పైకెత్తిన ముస్తెలను తింటున్నది. ఇటు దృఢమైన దేహం గల ఈ మహిషాన్ని చూడు. వనంలో బురదతో నిండిన దేహం కలిగినదైనప్పటికీ గర్వంతో పరుగెత్తుతున్న తన ప్రియురాలినే సావధానంగా అనుసరిస్తున్నది.

పశ్య చార్వఙ్గి! సారఙ్గం త్వం కటాక్షవిభావనైః ।
సభార్యం మాం హి పశ్యన్తం కౌతూహలసమన్వితమ్ ॥ 25 ॥

పశ్య పశ్చిమపాదేన రోహీ కండూయతే ముఖమ్ ।
స్నేహార్ద్రభావాత్ కర్షన్తీ భర్తారం శృఙ్గకోటినా ॥ 26 ॥

ద్రాగిమాం చమరీం పశ్య సితవాలామగచ్ఛతీమ్ ।
అన్వాస్తే చమరః కామీ మాం చ పశ్యతి గర్వితః ॥ 27 ॥

ఓ సుందరీ! తన ప్రియురాలితో కూడ వున్న ఈ సారంగ మృగం ఎంత కుతూహలంతో కటాక్షవీక్షణాలతో నన్నే చూస్తున్నదో చూడు. ఇటు ఈ రోహీ (జింకజాతి) మృగాన్ని చూడు. వెనుక కాలితో తన ముఖాన్ని గోక్కుంటూ స్నేహార్ద్రతతో తన కొమ్ములను ముందుకు వంచి తన భర్తను దగ్గరకు లాక్కొంటున్నది. అలాగే ఈ చమరీమృగాన్ని తొందరగా చూడు. దాని తోక కుచ్చు ఎంత తెల్లగా ఉన్నదో! కామోద్దీప్తమైన ఈ చమర మృగం తన స్త్రీ మృగాన్ని దగ్గరకు తీసుకుంటూ నన్ను ఎంత గర్వంతో చూస్తున్నదో!

ఆతపే గవయం పశ్య ప్రకృష్టం భార్యయా సహ ।
రోమన్థనం ప్రకుర్వాణం కాకం కకుది వారయన్ ॥ 28 ॥

పశ్యాజం భార్యయా సార్ధం న్యస్తాగ్రచరణద్వయమ్ ।
విపులే బదరీస్కన్ధే బదరాశనకామ్యయా ॥ 29 ॥

ఎండలో తన భార్యతో పాటు నిలుచున్న ఈ గవయ మృగాన్ని చూడు. నెమరు వేసుకొంటూ తన మూపురంపై వాలిన కాకిని ఎలా వారిసున్నదో! అలాగే భార్యతో కూడివున్న ఈ మేకను చూడు. అది తన ముందు కాళ్ళను విశాలమైన రేగు చెట్టు కొమ్మపై పెట్టి రేగు ఆకులు తినడానికి ఎలా ప్రయత్నిస్తున్నదో!

హంసం సభార్యం సరసి విచరన్తం సునిర్మలమ్ ।
సుముక్తస్యేందుబిమ్బస్య పశ్య వై శ్రియముద్వహన్ ॥ 30 ॥

సభార్యశ్చక్రవాకోఽయం కమలాకరమధ్యగః ।
కరోతి పద్మినీం కాన్తాం సుపుష్పామివ సుందరి ॥ 31 ॥

చక్కగా ప్రకాశిస్తున్న చంద్ర బింబపు కాంతిని గలిగిన ఈ హంస దంపతులను చూడు, అవి సునిర్మలమైన సరస్సులో ఎంత హాయిగా విహరిస్తున్నాయో! ఇలా ఈ చక్రవాక పక్షిని చూడు. అది తన ఆడ పక్షితో గూడ కమలాల సమూహం మధ్యలో ఉండి పద్మాల సరస్సుకు ఎంత అందాన్ని చేకూరుస్తున్నదో!

మయా ఫలోచ్చయః సుభ్రు త్వయా పుష్పోచ్చయః కృతః ।
ఇంధనం న కృతం సుభ్రు తత్కరిష్యామ సాంప్రతమ్ ॥ 32 ॥

త్వమస్య సరసస్తీరే ద్రుమచ్ఛాయాం సమాశ్రితా ।
క్షణమాత్రం ప్రతీక్షస్వ విశ్రమస్వ చ భామిని ॥ 33 ॥

సుందరీ! ఇంతవరకు నా చేత పండ్లు, నీచేత పూలు కూడ సేకరించబడినాయి. కాని వంటచెరుకు (కట్టెలు) మనం సేకరించలేదు కదా! ఇప్పుడది ప్రోవు చేసుకొందాము. ఓ భామినీ! నీవు ఈ సరస్సు తీరంలో వున్న చెట్టునీడలో ఒక క్షణకాలం విశ్రాంతి తీసుకొంటూ నా కోసం నిరీక్షించు నేను వంటకు సరిపడు కట్టెలు ఏరుకుని తెస్తాను.

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

ఏవమేతత్కరిష్యామి మమ దృష్టిపథస్త్వయా ।
దూరం కాన్త న గన్తవ్యం బిభేమి గహనే వనే ॥ 34 ॥

నేనలాగే చేస్తాను కాని, ఓ ప్రియా! నీవు నా దృష్టిపథం నుండి దూరంగా పోకూడదు. గహనమైన ఈ వనంలో నాకు భయం కలుగుతుంది అని సావిత్రి సత్యవంతునితో చెప్పింది.

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

తతః స కాష్ఠాని చకార తస్మిన్ వనే తదా రాజసుతాసమక్షమ్ ।
తస్యా హ్యదూరే సరసస్తదానీం మేనే చ సా తం మృతమేవ రాజన్ ॥ 35 ॥

ఓ రాజా! సావిత్రి మాటలను ఆదరించిన సత్యవంతుడు ఆమెకు సమీప స్థలంలోనే ఆ సరస్సుకు అతి దగ్గరలోనే వంట కట్టెలు సేకరించసాగాడు. కాని సావిత్రి మాత్రం తన పతి మరణించినట్లే తలంచింది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే సావిత్ర్యుపాఖ్యానే వనదర్శనం నామ నవాధికద్విశతతమోఽధ్యాయః ॥209॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని సావిత్ర్యుపాఖ్యానంలో అడవిని చూడటమనే రెండువందల తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



దశాధిక ద్విశతతమో௨ధ్యాయః – రెండువందల పదవ అధ్యాయం

సావిత్ర్యుపాఖ్యానే ప్రథమవరలాభః – సావిత్రి ఉపాఖ్యానంలో మొదటి వరమును పొందుట

మత్స్య ఉవాచ – మత్స్య భగవానుడు చెప్పాడు.

తస్య పాటయతః కాష్ఠం జజ్ఞే శిరసి వేదనా ।
స వేదనార్తః సంగమ్య భార్యాం వచనమబ్రవీత్ ॥ 1 ॥

ఆయాసేన మమానేన జాతా శిరసి వేదనా ।
తమశ్చ ప్రవిశామీవ న చ జానామి కించన ॥ 2 ॥

త్వదుత్సంగే శిరః కృత్వా స్వప్తుమిచ్ఛామి సాంప్రతమ్ ।
రాజపుత్రీమేవముక్త్వా తథా సుష్వాప పార్థివః ॥ 3 ॥

తదుత్సంగే శిరః కృత్వా నిద్రయావిలలోచనః ।

ఓ రాజా! కట్టెలు కొడుతుండగా సత్యవంతునికి తలనొప్పి అనిపించింది. ఆ శిరోవేదనను భరించలేక సావిత్రి దగ్గరకు వచ్చి ఇలా చెప్పాడు. ఈ కట్టెలు కొట్టటం వలన కలిగిన ఆయాసంతో నాకు తలనొప్పి వస్తున్నది. చీకటిలో ప్రవేశిస్తున్నట్లున్నది, ఏమీ తెలిసికోలేకపోతున్నాను. ఇప్పుడు నీ తొడపై తలపెట్టి నిద్రపోవాలని అనిపిస్తున్నది అని ఆ రాజపుత్రియైన సావిత్రికి చెప్పి నిద్రతో కన్నులు మూసుకుపోతుండగా ఆమె తొడపై తలపెట్టి నిద్రించాడు.

పతివ్రతా మహాభాగా తతః సా రాజకన్యకా ॥ 4 ॥

దదర్శ ధర్మరాజం తు స్వయం తం దేశమాగతమ్ ।
నీలోత్పలదలశ్యామం పీతామ్బరధరం ప్రభుమ్ ॥ 5 ॥

విద్యుల్లతానిబద్ధాఙ్గం సతోయమివ తోయదమ్ ।

కిరీటేనార్కవర్ణేన కుండలైశ్చ విరాజితమ్ ॥ 6 ॥

హారభారార్పితోరస్కం తథాంగదవిభూషితమ్ ।
తథానుగమ్యమానం చ కాలేన సహ మృత్యునా ॥ 7 ॥

మహాపతివ్రతయైన ఆ రాజకన్యక స్వయంగా అక్కడికి వచ్చిన యమధర్మరాజును చూసింది. నల్లకలువ వంటి శరీరచ్ఛాయ కలవాడు, పీతాంబరాన్ని ధరించినవాడు, మెరుపు తీగలతో కూడిన వర్షపు మేఘం వంటివాడు, సూర్యుని కాంతివంటి కిరీటం గలవాడు, కుండలాలను ధరించినవాడు, అనేక హారాలతో నిండిన వక్షః స్థలము గలవాడు, భుజకీర్తులతో ప్రకాశించేవాడూ అయిన ఆ యమధర్మరాజు తన అనుచరులైన కాలుడు మరియు మృత్యువుతో కూడ అక్కడికి వచ్చాడు.

స తు సంప్రాప్య తం దేశం దేహాత్సత్యవతస్తదా ।
అంగుష్ఠమాత్రం పురుషం పాశబద్ధం వశంగతమ్ ॥ 8 ॥

ఆకృష్య దక్షిణామాశాం ప్రయయౌ సత్వరం తదా ।
సావిత్ర్యపి వరారోహా దృష్ట్వా తం గతజీవితమ్ ॥ 9 ॥

అనువవ్రాజ గచ్ఛన్తం ధర్మరాజమతన్ద్రితా ।
కృతాంజలిరువాచాథ హృదయేన ప్రవేపతా ॥ 10 ॥

యమధర్మరాజు సావిత్రీ సత్యవంతులున్న ప్రదేశానికి వచ్చి సత్యవంతుని దేహం నుండి బొటన వ్రేలంత పరిమాణం గల పురుషుని (సూక్ష్మదేహాన్ని) తీసుకొని పాశంతో బంధించి, తన వశం చేసికొని వేగముగా దక్షిణ దిశవైపు వెళ్ళాడు. పతివ్రతయైన సావిత్రి కూడ తన భర్త గతజీవుడవటం తెలిసికొని, ఎటువంటి ఆలస్యం చేయక ఆ ధర్మరాజుననుసరించి వెళ్ళసాగింది. అట్లు ఆయన్ని వేగంగా అనుసరిస్తూ కృతాంజలియై వణుకుతున్న హృదయంతో ఇలా అన్నది.

ఇమం లోకం మాతృభక్త్యా పితృభక్త్యా తు మధ్యమమ్ ।
గురు శుశ్రూషయా చైవ బ్రహ్మలోకం సమశ్నుతే ॥ 11 ॥

సర్వే తస్యాదృతా ధర్మా యస్యైతే త్రయ ఆదృతాః ।
అనాదృతాస్తు యస్యైతే సర్వాస్తస్యాఫలాః క్రియాః ॥ 12 ॥

యావత్త్రయస్తే జీవేయుస్తావన్నాన్యం సమాచరేత్ ।
తేషాం చ నిత్యం శుశ్రూషాం కుర్యాత్ ప్రియహితే రతః ॥ 13 ॥

తేషామనుపరోధేన పారతన్త్ర్యం యదాచరేత్ ।
తత్తన్నివేదయేత్తేభ్యో మనోవచనకర్మభిః ॥
త్రిష్వప్యేతేషు కృత్యం హి పురుషస్య సమస్యతే ॥ 14 ॥

జీవుడు మాతృభక్తి చేత ఈ భూలోక సుఖాలను, పితృభక్తి చేత మధ్యమ అనగా అంతరిక్షలోక సుఖాలను మరియు గురు శుశ్రూష చేత బ్రహ్మలోక సుఖాలను పొందుతాడు. ఈ మూడు నియమాలను ఆచరించిన వారు అన్ని ధర్మాలను ఆచరించినట్లే. ఎవరు ఈ మూడింటిని ఆచరించరో వారాచరించు క్రియలన్నియు నిష్ఫలములే యగును. ఈ ముగ్గురు జీవించి ఉన్నంత వరకు మానవుడు వేరే యే ఇతర ధర్మసేవనం చేయపనిలేదు. వారికి ప్రీతి కలిగించే హితం ఆచరించటంలో ఆసక్తుడై నిత్యం ఈ ముగ్గురి శుశ్రూషనే చేయాలి. వారి శుశ్రూషకు ఆటంకం కలుగకుండా జాగరూకతతో వ్యవహరిస్తూ త్రికరణశుద్ధితో (మనోవాక్కాయకర్మలు) తాను ఆచరించే వాటినన్నింటిని ఈ ముగ్గురికి తెలపాలి. ఇలా పురుషుడు చేసే పనులన్నీ ఈ ముగ్గురిలోనే ఇమిడి ఉంటాయనటంలో సందేహం లేదు.

యమ ఉవాచ - యముడు చెప్పాడు.

కృతేన కామేన నివర్తయాశు ధర్మో న తేభ్యోఽపి హి ఉచ్యతే చ ।
మమోపరోధస్తవ చ క్లమః స్యాత్తథాఽధునా తేన తవ బ్రవీమి ॥ 15 ॥

గురుపూజారతిర్భక్తా త్వం చ సాధ్వీ పతివ్రతా ।
వినివర్తస్వ ధర్మజ్ఞే గ్లానిర్భవతి తేఽధునా ॥ 16 ॥

సావిత్రి మాటలు విన్న యమధర్మరాజు ఇలా అన్నాడు. సావిత్రీ! నీవు ఏది కోరుకుని నన్ను అనుసరిస్తున్నావో అది తొందరగా వదలిపెట్టు. నీవన్నట్లుగా ఈ లోకంలో తల్లి దండ్రులు మరియు గురువు కంటె గొప్ప ధర్మమేదీ లేదు. నీవిలా నన్ను అనుసరించటం వలన నా గమనానికి ఆటంకం మరియు నీకు శ్రమ కలుగుతుందే కాని ఫలితముండదు. అందుకే నీకిప్పుడు ఈ మాట చెబుతున్నాను. గురువుల యందు, పెద్దవాళ్ళ యందు భక్తి కలదానవు. మంచి ప్రవర్తన కలదానవు, పతివ్రతవు మరియు ధర్మం తెలిసిన దానవు కనుక తిరిగి వెళ్ళు లేకపోతే నీకు చాలా కష్టమవుతుంది.

సావిత్ర్యువాచ - సావిత్రి చెప్పింది.

పతిర్హి దైవతం స్త్రీణాం పతిరేవ పరాయణమ్ ।
అనుగమ్యః స్త్రియా సాధ్వ్యా పతిః ప్రాణధనేశ్వరః ॥ 17 ॥

మితం దదాతి హి పితా మితం భ్రాతా మితం సుతః ।
అమితస్య చ దాతారం భర్తారం కా న పూజయేత్ ॥ 18 ॥

పతియే స్త్రీలకు దైవం కదా! పతియే పరమగతికి సాధనం, పతియే ప్రాణం, ధనం, ఈశ్వరుడు. కావున సాధ్వియైన పతివ్రత భర్తనే అనుసరించాలి. తండ్రి, సోదరుడు, పుత్రులు మొదలైన వారందరూ ఇవ్వగలిగింది మితంగా మాత్రమే. అమితంగా అన్నీ ఇచ్చేటువంటి భర్తను ఏ స్త్రీ పూజించదు?

నీయతే యత్ర భర్తా మే స్వయం వా యత్ర గచ్ఛతి ।
మయాఽపి తత్ర గన్తవ్యం యథాశక్తి సురోత్తమ! ॥ 19 ॥

పతిమాదాయ గచ్ఛన్తమనుగన్తుమహం యదా ।
త్వాం దేవ నహి శక్ష్యామి తదా త్యక్ష్యామి జీవితమ్ ॥ 20 ॥

మనస్వినీ తు యా కాచిద్వైధవ్యాక్షర దూషితా ।
ముహూర్తమపి జీవేత మణ్డనార్హా హ్యమణ్డితా ॥ 21 ॥

ఓ సురోత్తమా! నా భర్తను ఎక్కడికైనా తీసుకువెళ్ళినా లేదా తానే స్వయంగా ఎక్కడికైనా వెళ్ళినా అతని ననుసరించి యథాశక్తిగా నేను కూడ తప్పనిసరిగా వెళ్ళవలసిందే. నేను అతనిని అవశ్యం అనుసరించవలసిందే. ఓ దేవా! నా పతిని తీసుకొని పోతున్న నీ వెంట నేను రాలేకపోతే నా ప్రాణాలనైనా వదులుతాను. అభిమానవతియైన

ఏ స్త్రీ అయినా వైధవ్యాన్ని అక్షరాలచే దూషించబడినప్పుడు క్షణకాలం కూడ జీవించదు కదా! అలంకరణకు అర్హురాలైన ఆమె అలంకరణ లేకుండా ఎలా వుంటుంది?

యమ ఉవాచ – యముడు చెప్పాడు.

పతివ్రతే! మహాభాగే పరితుష్టోఽస్మి తే శుభే ।
వినా సత్యవతః ప్రాణైర్వరం వరయ మా చిరమ్ ॥ 22 ॥

ఓ పతివ్రతా! మహాభాగా! శుభప్రదా! నీ దీక్షకు నేను పరితుష్టుడనయ్యాను. సత్యవంతుని ప్రాణాలు కాక ఏదైనా వరం కోరుకో. వెంటనే ప్రసాదిస్తానని యముడు సావిత్రికి చెప్పాడు.

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

వినష్టచక్షుషో రాజ్యం చక్షుషా సహ కారయ ।
చ్యుతరాష్ట్రస్య ధర్మజ్ఞ! శ్వశురస్య మహాత్మనః ॥ 23 ॥

ఓ ధర్మజ్ఞా! మహానుభావుడైన మా మామగారు కంటి దృష్టిని మరియు రాజ్యాన్ని కూడ కోల్పోయి బాధపడుతున్నారు కావున వారికి ఆ రెంటిని వెంటనే ప్రసాదించుమని సావిత్రి యముని ప్రార్థించింది.

యమ ఉవాచ – యముడు చెప్పాడు.

దూరే పథే గచ్ఛ నివర్త భద్రే భవిష్యతీదం సకలం త్వయోక్తమ్ ।
మమోపరోధస్తవ చ క్లమః స్యాత్ తథాఽధునా తేన తవ బ్రవీమి ॥ 24 ॥

ఓ కల్యాణీ! నీవు చాలా దూరం వచ్చివున్నావు. ఇక తిరిగి వెళ్ళు. ఇప్పుడు నీవు కోరుకొన్నవన్నీ సిద్ధిస్తాయి. నీవింకనూ నన్నే అనుసరించి వస్తే నా గమనానికి ఆటంకం కలుగుతుంది. మరియు నీకు శ్రమ కూడ కలుగుతుంది. అందుకే నేనిలా చెబుతున్నాను, తిరిగి వెళ్ళు అని యమధర్మరాజు సావిత్రికి చెప్పాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే సావిత్ర్యుపాఖ్యానే ప్రథమవరలాభో నామ
దశాధికద్విశతతమోఽధ్యాయః॥210॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని సావిత్ర్యుపాఖ్యానంలో మొదటి వరాన్ని పొందడమనే
రెండువందల పదవ అధ్యాయం సమాప్తం.



ఏకాదశాధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల పదకొండవ అధ్యాయం

సావిత్ర్యుపాఖ్యానే ద్వితీయవరలాభః - సావిత్రి ఉపాఖ్యానంలో రెండవ వరమును పొందుట

సావిత్ర్యువాచ - సావిత్రి చెప్పింది.

కుతః క్లమో కుతో దుఃఖం సద్భిః సహ సమాగమే ।
సతాం తస్మాన్న మే గ్లానిస్త్వత్సమీపే సురోత్తమ! ॥ 1 ॥

సాధూనాం వాప్యసాధూనాం సన్త ఏవ సదా గతిః ।
నైవాసతాం నైవ సతామసన్తో నైవ మాత్మనః ॥ 2 ॥

ఓ సురోత్తమా! సత్పురుషులకు సజ్జనులతో సమాగమం లభించినప్పుడు శ్రమ ఎలా కలుగుతుంది? దుఃఖమెలా కలుగుతుంది? శ్రమ, దుఃఖం మొదలైనవి కలుగనే కలగవు. కావున నీ వంటి సజ్జనుని అనుసరిస్తున్న నాకు ఎటువంటి గ్లాని కలగడం లేదు. మందివారికి, చెడ్డవారికి కూడా ఎప్పుడూ సత్పురుషులే గతి అవుతారు. కాని చెడ్డవారు అటు మంచివారికి గాని, ఇటు చెడ్డవారికి గాని, చివరికి తమకు తామే కాని ఉపయోగపడరు.

విషాగ్ని సర్పశస్త్రేభ్యో న తథా జాయతే భయమ్ ।
అకారణం జగద్వైరిఖలేభ్యో జాయతే యథా ॥ 3 ॥

సన్తః ప్రాణానపి త్యక్త్వా పరార్థం కుర్వతే యథా ।
తథాఽసన్తోఽపి సన్త్యజ్య పరపీడాసు తత్పరాః ॥ 4 ॥

నిష్కారణంగా లోకానికి అపకారం చేసే దుష్టుల వలన ఎంత భయం కలుగుతుందో, విషం, అగ్ని, సర్పం, శస్త్రాదుల వలన లోకానికి అంత భయం కలుగదు. సత్పురుషులు ప్రాణాలను సైతం లెక్క చేయక పరోపకారం చేస్తారు. అలాగే దుష్టులు కూడ తమప్రాణాలను కూడ లెక్క చేయక పరులను పీడించటంలో ఆసక్తి గలవారవుతారు.

త్యజత్యసూనయం లోకస్తృణవద్యస్య కారణాత్ ।
పరోపఘాతశక్తాస్తం పరలోకం తథా సతః ॥ 5 ॥

నికాయేషు నికాయేషు తథా బ్రహ్మా జగద్గురుః ।
అసతాముపఘాతాయ రాజానం జ్ఞాతవాన్ స్వయమ్ ॥ 6 ॥

సజ్జనులు పరలోక సుఖసాధనం కొరకు తమ ప్రాణాలనైనా గడ్డిపోచ వలె వదిలిపెట్టడానికి సిద్ధపడతారు. కాని పరులకెప్పుడూ అపకారం చేసే దుష్టులు తమ ప్రాణాలు వదిలైనా ఇతరులకు హాని చేస్తారు. అందుకే ఆయా జన సమూహాలలో వున్న దుష్టులను శిక్షించడానికి జగద్గురువైన బ్రహ్మదేవుడు 'రాజు' అనే వాడిని సృష్టించాడు.

నరాన్ పరీక్షయేద్రాజా సాధూన్ సమ్మానయేత్ సదా ।
నిగ్రహం చాసతాం కుర్యాత్స లోకే లోకజిత్తమః ॥ 7 ॥

నిగ్రహేణాసతాం రాజా సతాం చ పరిపాలనాత్ ।
ఏతావదేవ కర్తవ్యం రాజ్ఞా స్వర్గమభీప్సునా ॥ 8 ॥

రాజు ఎప్పుడూ నరులను పరీక్షిస్తూ వుండాలి. సజ్జనులను ఆదరిస్తూ వుండాలి. దుష్టులను సదా నిగ్రహించాలి. ఇటువంటి రాజు మాత్రమే లోకాలను జయిస్తాడు. స్వర్గాన్ని కోరుకునే రాజు దుష్టులను నిగ్రహిస్తూ సజ్జనులను చక్కగా పరిపాలిస్తూ లోకాన్ని చక్కగా పాలించాలి.

రాజకృత్యం హి లోకేషు నాస్త్యన్యజ్జగతీపతే! ।
అసతాం నిగ్రహాదేవ సతాం చ పరిపాలనాత్ ॥ 9 ॥

రాజభిశ్చాప్యశాస్తానాం అసతాం శాసితా భవాన్ ।
తేన త్వమధికో దేవో దేవేభ్యః ప్రతిభాసి మే ॥ 10 ॥

జగత్తు ధార్యతే సద్భిః సతామగ్ర్యస్తథా భవాన్ ।
తేన త్వామనుయాన్త్యా మే క్లమో దేవ న విద్యతే ॥ 11 ॥

ఓ జగతీపతీ! లోకంలో దుష్టులను నిగ్రహించటం, సజ్జనులను ఆదరించటం కంటె గొప్ప రాజధర్మమింకొకటి లేదు. రాజులు దండించలేని దుష్టులను శాసించేవాడవు నీవు. అందుకే నీవు దేవతలందరికంటె గొప్ప మహత్త్వం కలవాడవుగా నాకు కనబడుతున్నావు. ఈ జగత్తు సత్పురుషులచేతనే నిలుస్తున్నది. అటువంటి సత్పురుషులలో నీవు ప్రథముడవు. అటువంటి నిన్ను అనుసరించి రావడంలో నాకు బాధ కలుగనే కలుగదు.

యమ ఉవాచ – యముడు చెప్పాడు.

తుష్టోఽస్మి తే విశాలాక్షి! వచనైర్ధర్మసంగతైః ।
వినా సత్యవతః ప్రాణాద్వరం వరయ మా చిరమ్ ॥ 12 ॥

ఓ విశాలమైన కన్నులు కలదానా! సావిత్రీ! ధర్మసంగతాలైన నీ మాటలు విని నేను సంతుష్టుడనయ్యాను. సత్యవంతుని ప్రాణాలు తప్ప నీకు కావలసిన ఏ వరాన్నైనా కోరుకో. వెంటనే ప్రసాదిస్తాను.

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

సహోదరాణాం భ్రాతౄణాం కామయామి శతం విభో ।
అనపత్యః పితా ప్రీతిం పుత్రలాభాత్ ప్రయాతు మే ॥ 13 ॥

ఓ ప్రభూ! నేను నూరు వంది సహోదరులను కోరుకుంటున్నాను. పుత్ర సంతానం లేక బాధపడుతున్న నా తల్లి దండ్రులు పుత్రప్రాప్తితో సంతుష్టులయ్యే వరాన్ని నాకు ప్రసాదించు.

తామువాచ యమో గచ్ఛ యథాగతమనిందితే ।
ఔర్ధ్వదైహికకార్యేషు యత్నం భర్తుః సమాచర ॥ 14 ॥

నానుగన్తుమయం శక్యస్త్వయా లోకాన్తరం గతః ।
పతివ్రతాఽసి తేన త్వం ముహూర్తం మమ యాస్యసి ॥ 15 ॥

ఓ అనిందితా! పవిత్రమైన స్వభావం కలదానా! నీవు ఏ మార్గం ద్వారా వచ్చావో దాని ద్వారానే తిరిగి వెళ్ళు. నీ భర్త ఊర్ధ్వదేహానికి సంబంధించిన కర్మలనాచరించే ప్రయత్నం చేయి. అంతేకాని లోకాంతరాలకు వెళ్ళిన ఇతనిని అనుసరించి నీవు రాలేవు. పతివ్రతవు కావున ఇంకొక ముహూర్త కాలం వరకు నాతో రాగలుగుతావు.

గురుశుశ్రూషణాద్ భద్రే తథా సత్యవతో మహత్ ।
పుణ్యం సమర్జితం యేన నయామ్యేనమహం స్వయమ్ ॥ 16 ॥

ఏతావదేవ కర్తవ్యం పురుషేణ విజానతా ।
మాతుః పితుశ్చ శుశ్రూషా గురోశ్చ వరవర్ణిని! ॥ 17 ॥

ఓ కల్యాణీ! సత్యవంతుడు పెద్దలను సేవించి మహత్తరమైన పుణ్యాన్ని సంపాదించాడు. కనుక నేనే స్వయంగా ఇతనిని తీసుకు వెళ్ళుతున్నాను. ఓ వరవర్ణినీ! విద్వాంసుడైన పురుషుడు దీనిని మాత్రం తప్పనిసరిగా ఆచరించాలి. తల్లిదండ్రులను మరియు గురువును ఎప్పుడూ సేవించాలి.

తోషితం త్రయమేతచ్చ సదా సత్యవతా వనే ।
పూజితం విజితః స్వర్గస్త్వయాఽనేన చిరం శుభే ॥ 18 ॥

తపసా బ్రహ్మచర్యేణ అగ్నిశుశ్రూషయా శుభే ।
పురుషాః స్వర్గమాయాన్తి గురుశుశ్రూషయా తథా ॥ 19 ॥

అడవిలో నివసించే సత్యవంతుడు ఈ ముగ్గురికి చక్కని శుశ్రూష చేశాడు. ఓ శుభప్రదా! ఇతనిని అనుసరిస్తూ, వీరందరిని పూజిస్తూ నీవు కూడ స్వర్గాన్ని జయించావు. తపస్సు, బ్రహ్మచర్యం, అగ్ని కార్యం మొదలైన వాటి చేత మరియు పెద్దలను సేవించడం చేత కూడ పురుషులు స్వర్గాన్ని పొందుతారు.

ఆచార్యశ్చ పితా చైవ మాతా భ్రాతా చ పూర్వజః ।
నార్తేనాప్యవమన్తవ్యా బ్రాహ్మణేన విశేషతః ॥ 20 ॥

ఆచార్యో బ్రహ్మణో మూర్తిః పితా మూర్తిః ప్రజాపతేః ।
మాతా పృథివ్యా మూర్తిస్తు భ్రాతా వై మూర్తిరాత్మనః ॥ 21 ॥

ఆచార్యుని, తల్లి దండ్రులను, మరియు జ్యేష్ఠ సోదరుని ఎవరు కూడ విశేషించి బ్రాహ్మణుడైన వాడు ఎంత క్లిష్టసమయంలోనైనా అవమానించకూడదు. ఆచార్యుడు స్వయంగా బ్రహ్మ రూపుడు. తండ్రి ప్రజాపతి స్వరూపుడు. తల్లి పృథివీ స్వరూపురాలు. మరియు జ్యేష్ఠసోదరుడు ఆత్మ స్వరూపుడు కనుక వీరిని ఎప్పుడూ అవమానించరాదు.

జన్మనా పితరౌ క్లేశం సహేతే సంభవే నృణామ్ ।
న తస్య నిష్కృతిః శక్యా కర్తుం వర్షశతైరపి ॥ 22 ॥

తయోర్నిత్యం ప్రియం కుర్యాత్ ఆచార్యస్య తు సర్వదా ।
తేష్వేవ త్రిషు తుష్టేషు తపః సర్వం సమాప్యతే ॥ 23 ॥

మానవులకు జన్మనివ్వడంలో తల్లిదండ్రులు మిక్కిలి క్లేశాన్ని అనుభవిస్తారు. వందల సంవత్సరాల వరకైనా వారి ఋణం తీర్చుకోవడానికి శక్యం కాదు. కావున నిత్యమూ వారికి ఇష్టమైన రీతిలో వ్యవహరించాలి. ఆచార్యుని కూడ ఎల్లప్పుడూ సంతోషపెట్టటానికి ప్రయత్నించాలి. వీరు ముగ్గురు సంతుష్టులైనప్పుడు తపస్సులన్నీ ఫలిస్తాయి.

తేషాం త్రయాణాం శుశ్రూషా పరమం తప ఉచ్యతే ।
న చ తైరననుజ్ఞాతో ధర్మమన్యం సమాచరేత్ ॥ 24 ॥

త ఏవ హి త్రయో లోకాస్త ఏవ త్రయ ఆశ్రమాః ।
త ఏవ చ త్రయో వేదాస్తథైవోక్తా స్త్రయోఽగ్నయః ॥ 25 ॥

పితా వై గార్హపత్యోఽగ్నిర్మాతా దక్షిణతః స్మృతః ।
గురురాహవనీయశ్చ సాఽగ్నిత్రేతా గరీయసీ ॥ 26 ॥

త్రిషు ప్రమాద్యతే నైషు త్రీన్ లోకాన్ జయతే గృహీ ।
దీప్యమానః స్వవపుషా దేవవద్దివి మోదతే ॥ 27 ॥

ఆ ముగ్గురికి చేసే సేవే గొప్ప తపస్సని చెప్పబడింది. వారి అనుజ్ఞ లేనిదే ఏ ఇతర ధర్మాన్ని ఆచరించకూడదు. ఆ ముగ్గురు మూడు లోకములు (పృథివి, అంతరిక్షం మరియు ద్యులోకం). వారు మూడు ఆశ్రమాలు అనగా బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, వారు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదమనే మూడు వేదాలతో సమానులు. మరియు వారు మూడు అగ్నులుగా కూడ కీర్తింపబడ్డారు. తండ్రి గార్హపత్యాగ్నిగా, తల్లి దక్షిణాగ్నిగా, గురువు ఆవహనీయాగ్నిగా కీర్తింపబడ్డారు. ఈ అగ్నిత్రయం చాలా శ్రేష్ఠమైనది. ఈ మూడింటి విషయంలో ఎప్పుడూ పొరపాటు పడని గృహస్థుడు ముల్లోకాలను జయిస్తాడు. మరియు ప్రకాశించే తన శరీరంతో దేవతలవలె స్వర్గలోకంలో సుఖం పొందుతాడు.

కృతేన కామేన నివర్త భద్రే భవిష్యతీదం సకలం త్వయోక్తమ్ ।
మమోపరోధస్తవ చ క్లమః స్యాత్ తథాఽధునా తేన తవ బ్రవీమి ॥ 28 ॥

ఓ కల్యాణీ! నీవనుకున్న కోరికలన్నీ తీరుతాయి కావున నీవు మరలిపో. నీవు కోరిన విషయాలన్నీ సిద్ధిస్తాయి. ఇంకనూ నీవు నన్ను అనుసరిస్తే నాకు భంగం కలుగుతుంది. మరియు నీకు శ్రమ కూడ కలుగుతుంది. అందువలన నా మాట విని ఇక మరలిపొమ్మని నీకిప్పుడు చెబుతున్నాను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే సావిత్ర్యుపాఖ్యానే ద్వితీయవరలాభో నామ ఏకాదశాధికద్విశతతమోఽధ్యాయః॥211॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని సావిత్ర్యుపాఖ్యానంలో రెండవ వరాన్ని పొందడమనే రెండువందల పదకొండవ అధ్యాయం సమాప్తం.

ద్వాదశాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల పన్నెండవ అధ్యాయం

సావిత్ర్యుపాఖ్యానే తృతీయవరలాభః – సావిత్రి కథలో మూడవ వరమును పొందుట

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

ధర్మార్జనే సురశ్రేష్ఠ! కుతో గ్లానిః క్లమస్తథా ।
త్వత్పాదమూలసేవా చ పరమం ధర్మకారణమ్ ॥ 1 ॥

ధర్మార్జనం తథా కార్యం పురుషేణ విజానతా ।
తల్లాభః సర్వలాభేభ్యో యథా దేవ! విశిష్యతే ॥ 2 ॥

యమధర్మరాజు మాటలు విన్న సావిత్రి అతనితో ఇట్లు చెప్పింది. ఓ సురశ్రేష్ఠా! ధర్మాన్ని సంపాదిస్తున్నప్పుడు గ్లాని కాని శ్రమ కాని ఎలా కలుగుతుంది? నీపాదసేవనం పరమ ధర్మానికి కారణం కదా! బుద్ధిమంతుడైన పురుషుడు ధర్మమాచరింటానికే అన్ని విధాలా ప్రయత్నం చేయాలి. దేవా! ధర్మాచరణం వలన కలిగే లాభం లాభాలన్నింటికంటె విశిష్టమైంది కదా!

ధర్మశ్చార్థశ్చ కామశ్చ త్రివర్గో జన్మనః ఫలమ్ ।
ధర్మహీనస్య కామార్థౌ వన్ధ్యాసుతసమౌ ప్రభో! ॥ 3 ॥

ధర్మాదర్థస్తథా కామో ధర్మాల్లోకద్వయం తథా ।
ధర్మ ఏకోఽనుయాత్యేనం యత్ర క్వచన గామినమ్ ॥ 4 ॥

ధర్మార్థకామాలనే త్రివర్గ సాధనమే జన్మఫలం. ధర్మాన్నాచరించని వారికి కామార్థాలు రెండూ గొడ్రాలైన స్త్రీయొక్క పుత్రుని వంటివి. ఓ ప్రభూ! ధర్మంతో అర్థం, అర్థంతో కామం (లౌకికమైన కోరికలు తీర్చటం) సంభవిస్తాయి కాని ధర్మాచరణం చేత ఇహ – పరలోకాలు రెండింటిలో జయం పొందవచ్చు. మనమెక్కడికి వెళ్ళినా మనల్ని అనుసరించి వచ్చేది ధర్మమొకటే కదా!

శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి ।
ఏకో హి జాయతే జన్తు రేక ఏవ విపద్యతే ॥ 5 ॥

ధర్మస్తమనుయాత్యేకో న సుహృన్న చ బాంధవాః ।
క్రియాసౌభాగ్యలావణ్యం సర్వం ధర్మేణ లభ్యతే ॥ 6 ॥

ధర్మం తప్ప మిగిలినవన్నీ శరీరంతో పాటు నశిస్తాయి. జీవుడు ఒకడే పుడతాడు మరియు తానొక్కడే నశిస్తాడు. ధర్మమొక్కటే ఎల్లప్పుడూ అతనిని అనుసరించి వస్తుంది. కాని మిత్రులు, బంధువులు ఎవరూ జీవుని అనుసరించి రారు కదా! తాను చేసే పనులన్నింటిలో ధర్మం వలన మాత్రమే సౌభాగ్యం, లావణ్యం (సుఖమయమైన జీవనం) లభిస్తుంది.

బ్రహ్మేన్ద్రోపేన్ద్ర శర్వేన్దుయమార్కా గ్న్యనిలామ్భసామ్ ।
వస్వశ్విధనదాద్యానాం యే లోకాః సర్వకామదాః ॥ 7 ॥

ధర్మేణ తానవాప్నోతి పురుషః పురుషాన్తక! ।
మనోహరాణి ద్వీపాని వర్షాణి సుసుఖాని చ ॥ 8 ॥
ప్రయాన్తి ధర్మేణ నరాస్తథైవ నరగణ్డికాః ।

ఓ దేవా! బ్రహ్మ, ఇంద్ర, విష్ణు ,శివ, చంద్ర, యమ, సూర్య, అగ్ని, వాయు, వరుణ, వసు, అశ్వినీ, కుబేరాదుల లోకాలన్నీ కోరికలన్నింటిని తీర్చేవి. ఓ నరాంతకా! ఆ లోకములన్నిటినీ పురుషుడు ధర్మాచరణం చేతనే పొందుతాడు కదా! మనోహరములైన జంబూద్వీపాది ద్వీపాలు, సుఖమయాలైన భరతవర్షాది వర్షాలు కూడ నరులు ధర్మాచరణంతోనే నరులు, నరోత్తములు పొందుతారు.

నన్దనాదీని ముఖ్యాని దేవోద్యానాని యాని చ ॥ 9 ॥

తాని పుణ్యేన లభ్యన్తే నాకపృష్ఠం తథా నరైః ।
విమానాని విచిత్రాణి తథైవాప్సరసః శుభాః ॥ 10 ॥

తైజసాని శరీరాణి సదా పుణ్యవతాం ఫలమ్ ।
రాజ్యం నృపతిపూజా చ కామసిద్ధిస్తథేప్సితా ॥ 11 ॥

సంస్కారాణి చ ముఖ్యాని ఫలం పుణ్యస్య దృశ్యతే ।

ఓ దేవా! ముఖ్యాలైన నందనాది దేవోద్యానాలు, స్వర్గాన్ని కూడ నరులు పుణ్యం చేతనే పొందుతారు. ఆశ్చర్యం కలిగించే విమానాలు, శుభరూపులైన అప్సరసలు, తేజోవంతాలైన శరీరాలు మొదలైనవన్నీ పుణ్యవంతులైన వారికి లభిస్తాయి. రాజ్యం, రాజపూజ, ఇష్టసిద్ధులు, ముఖ్యాలైన ఉత్తమ సంస్కారాలు కూడ పుణ్యఫలం వలననే లభిస్తాయి.

రుక్మవైడూర్యదండాని చండాంశుసదృశాని చ ॥ 12 ॥

చామరాణి సురాధ్యక్ష! భవన్తి శుభకర్మణామ్ ।
పూర్ణేందుమండలాభేన రత్నాంశుకవికాసినా ॥ 13 ॥

ధార్యతాం యాతి ఛత్రేణ నరః పుణ్యేన కర్మణా ।

ఓ సురాధ్యక్షా! బంగారం, వైడూర్యమణి ఖచితాలైన కర్రలు, ప్రచండసూర్యుని కాంతిని బోలిన చామరాలు శుభకర్మలాచరించే వారికే లభిస్తాయి. పూర్ణచంద్రుని వంటి కాంతి గలిగిన, రత్నఖచితమైన తెల్లని వస్త్రంతో శోభిల్లుతున్న ఛత్రాన్ని ధరించటం కూడ నరుడు పుణ్యకర్మల ద్వారానే పొందుతాడు.

జయః శంఖస్వరౌఘేణ సూతమాగధనిఃస్వనైః ॥ 14 ॥

వరాసనం సభృంగారం ఫలం పుణ్యస్య కర్మణః ।
వరాన్నపానం గీతం చ భృత్యమాల్యానులేపనమ్ ॥ 15 ॥

రత్నవస్త్రాణి ముఖ్యాని ఫలం పుణ్యస్య కర్మణః ।
రూపౌదార్యగుణోపేతాః స్త్రియశ్చాతిమనోహరాః ॥ 16 ॥

వాసః ప్రాసాదపృష్ఠేషు భవన్తి శుభకర్మిణః ।
సువర్ణకింకిణీమిశ్రచామరాపీడధారిణః ॥ 17 ॥

వహన్తి తురగా దేవ నరం పుణ్యేన కర్మణా ।

విజయాన్ని సూచించే శంఖధ్వనులు, జయ జయ ధ్వనులు, సూతుల మాగధుల గంభీర స్వరంతో కూడిన స్తుతులు మొదలైన వాటితో పాటు సుందరమైన, శ్రేష్ఠమైన సింహాసనాన్ని అధిష్ఠించటం కూడ పుణ్య కర్మల వలననే లభిస్తుంది. శ్రేష్ఠాలైన అన్నపానాదులు, గీతాలు, భృత్యుల సేవ, మాల్యాదులు,చందనం, శ్రేష్ఠాలైన రత్నవస్త్రాలు, అందమైన రూపం మరియు ఉదారగుణం గల మిక్కిలి మనోహరవతులైన స్త్రీలు, ఉన్నతాలైన ప్రాసాదాలలో నివసించటం, మొదలైనవన్నీ శుభకర్మలు ఆచరించే వారికే లభిస్తాయి. అలాగే బంగారు గజ్జెలతో మువ్వలతో అలంకరించబడిన అశ్వాలనధిరోహించే భాగ్యాన్ని కూడ నరుడు తాను చేసిన పుణ్యకార్యాలతోనే పొందుతాడు.

తస్య ద్వారాణి యజనం తపో దానం దమః క్షమా ॥ 18 ॥

బ్రహ్మచర్యం తథా సత్యం తీర్థానుసరణం శుభమ్ ।
స్వాధ్యాయసేవా సాధూనాం సహవాసః సురార్చనమ్ ॥ 19 ॥

గురూణాం చైవ శుశ్రూషా బ్రాహ్మణానాం చ పూజనమ్ ।
ఇంద్రియాణాం జయశ్చైవ బ్రహ్మచర్యమమత్సరమ్ ॥ 20 ॥

మానవుడు పుణ్యకర్మలతోనే భక్తిని పొందుతాడు. ఆ భక్తికి ద్వారాలే యజ్ఞాలు, తపస్సు, దానం, దమం, క్షమ, బ్రహ్మచర్యం, సత్యం, తీర్థయాత్రలు, స్వాధ్యాయసేవ, సాధువుల సహనం, దేవతార్చనం, గురుశుశ్రూష, బ్రాహ్మణ సత్కారం, ఇంద్రియనిగ్రహం, మాత్సర్యం లేకపోవటం మొదలైనవన్నీ పుణ్యకర్మలనాచరించిన వారికే ప్రాప్తిస్తాయి.

తస్మాద్ధర్మః సదా కార్యో నిత్యమేవ విజానతా ।
న హి ప్రతీక్షతే మృత్యుః కృతమస్య న వా కృతమ్ ॥ 21 ॥

బాల్య ఏవ చరేద్ధర్మం అనిత్యం దేవ! జీవితమ్ ।
కో హి జానాతి కస్యాద్య మృత్యురేవాపతిష్యతి ॥ 22 ॥

కావున విజ్ఞానవంతుడైన వాడు ఎల్లప్పుడు ధర్మాన్నాచరించాలి. ఇతడు ధర్మాన్నాచరించాడా లేదా అని మృత్యువు విచారించదు. కావున బాల్యం నుండే ధర్మాన్ని ఆచరించాలి. ఓ దేవా! ఈ జీవితం అశాశ్వతం. మృత్యువు ఎప్పుడు ఎవరిపై వచ్చిపడునో ఎవరికి తెలుసు?

పశ్యతోఽప్యస్య లోకస్య మరణం పురతః స్థితమ్ ।
అమరస్యేవ చరితమత్యాశ్చర్యం సురోత్తమ! ॥ 23 ॥

యువత్వాపేక్షయా బాలో వృద్ధత్వాపేక్షయా యువా ।
మృత్యోరుత్సఙ్గమారూఢః స్థవిరః కిమపేక్షతే ॥ 24 ॥

తత్రాపి విన్దతస్త్రాణం మృత్యునా తస్య కా గతిః ।
న భయం మరణం చైవ ప్రాణినామభయం క్వచిత్ ॥
తత్రాపి నిర్భయాః సన్తః సదా సుకృతకారిణః ॥ 25 ॥

లోకంలో తన కనుల ముందే వున్న మృత్యువును చూస్తూ కూడా నరుడు అమరుని వలె ప్రవర్తిస్తున్నాడు. ఓ సురోత్తమా! ఇదెంత ఆశ్చర్యకరంగా వున్నది. బాలుడు, యువకుడు గూడా (బాల్యంలో, యౌవనంలో) తమకు మృత్యువు చాలా దూరంలో వున్నదని అనుకొంటారు. మృత్యువు ఒడిలోకి వెళ్ళబోతున్న వృద్ధుడు కూడా తానిప్పుడే మరణించనని అనుకొంటాడు. కాని మృత్యువుకు అందరూ భయపడతారు. అయినా మృత్యువు నుండి రక్షించుకోవటానికి ప్రయత్నించే ఈ నరుని గతి ఏమిటి? దేవా! ప్రాణులకు అభయం అనేది ఎక్కడా వుండదు. మరణం ప్రాణలందరికీ భయం కలిగించేదే. ఎల్లప్పుడు మంచి పనులు చేస్తూ, ధర్మమార్గాన్నే అనుసరించేవారు మృత్యువుకు భయపడరు అని సావిత్రి యమునికి వివరించింది.

యమ ఉవాచ – యముడు చెప్పాడు.

తుష్టోఽస్మి తే విశాలాక్షి వచనైర్ధర్మసంగతైః ।
వినా సత్యవతః ప్రాణాన్ వరం వరయ మా చిరమ్ ॥ 26 ॥

సావిత్రి మాటలు విన్న యముడు ఇలా అన్నాడు. ఓ విశాలాక్షీ! ధర్మసంగతాలైన నీ మాటలతో నేను సంతుష్టుడనయ్యాను. సత్యవంతుని ప్రాణాలు తప్ప ఇంకేదైనా వరం శీఘ్రంగా కోరుకో.

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

వరయామి త్వయా దత్తం పుత్రాణాం శతమౌరసమ్ ।
అనపత్యస్య లోకేషు గతిః కిల న విద్యతే ॥ 27 ॥

దేవా! సంతాన రహితులకు ఏ లోకంలోను గతి లేదంటారు కదా! అందుకని నాకు వంద మంది పుత్రులు కలుగునట్లు వరం ప్రసాదించమని సావిత్రి యముని ప్రార్థించింది.

యమ ఉవాచ – యముడు చెప్పాడు.

కృతేన కామేన నివర్త భద్రే భవిష్యతీదం సకలం యథోక్తమ్ ।
మమోపరోధస్తవ చ క్లమః స్యాత్ తథాఽధునా తేన తవ బ్రవీమి ॥ 28 ॥

యముడు సావిత్రికి ఆ వరం ప్రసాదించి, ఓ కల్యాణీ! నీ ఆ కోరిక ఫలిస్తుంది. ఇక మరలిపో, నీవు కోరిన కోరికలన్నీ సిద్ధిస్తాయి. కావున నీవు నన్ను అనుసరించినచో నా గమనానికి భంగం కలుగుతుంది. నీకు కూడ శ్రమ కలుగుతుంది. కావున నీకిలా చెబుతున్నాను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే సావిత్ర్యుపాఖ్యానే తృతీయవరలాభో నామ ద్వాదశాధికద్విశతతమోఽధ్యాయః॥212॥

శ్రీ మత్స్య మహాపురాణంలో సావిత్ర్యుపాఖ్యానంలో మూడవ వరాన్ని పొందదమనే రెండు వందల పన్నెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోదశాధిక ద్విశతతమోஉధ్యాయః – రెండువందల పదమూడవ అధ్యాయం

సావిత్ర్యుపాఖ్యానే సత్యవజ్జీవితలాభః – సావిత్రి ఉపాఖ్యానంలో సత్యవంతుడు మరల జీవించుట

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

ధర్మాధర్మవిధానజ్ఞ! సర్వధర్మప్రవర్తక! ।
త్వమేవ జగతో నాథః ప్రజాసంయమనో యమః ॥ 1 ॥

కర్మణామనురూపేణ యస్మాద్యమయసే ప్రజాః ।
తస్మాద్వై ప్రోచ్యసే దేవ యమ ఇత్యేవ నామతః ॥ 2 ॥

ధర్మేణేమాః ప్రజాః సర్వా యస్మాద్రంజయసే ప్రభో! ।
తస్మాత్తే ధర్మరాజేతి నామ సద్భిర్నిగద్యతే ॥ 3 ॥

ధర్మాధర్మ విధానాలు తెలిసినవాడా! అన్ని ధర్మాలనూ ప్రవర్తింపజేసేవాడా! నీవే ఈ జగత్తుకు నాథుడవు, రక్షకుడవు, ప్రజలను చక్కగా నియంత్రించే యముడవు. ప్రజలను వారి కర్మలననుసరించి తగినట్లుగా నియంత్రించేవాడవు కావున నీవు యముడు అనే పేరుతో పిలువబడుతున్నావు. మరియు ఈ ప్రజలందరినీ ధర్మంతో రంజింపజేస్తావు కావున నీవు ధర్మరాజువని సత్పురుషులచే వ్యవహరింపబడినావు.

సుకృతం దుష్కృతం చోభే పురోధాయ యదా జనాః ।
త్వత్సకాశం మృతా యాన్తి తస్మాత్త్వం మృత్యురుచ్యతే ॥ 4 ॥

జనులు మరణించిన తరువాత తాము పుణ్య పాపాలు రెండూ ముందుంచుకొని నీ దగ్గరకు వస్తారు. కావున నీవు 'మృత్యువు' అని పిలువబడుతున్నావు.

కాలం కలార్ధం కలయన్ సర్వేషాం త్వం హి తిష్ఠసి ।
తస్మాత్కాలేతి తే నామ ప్రోచ్యతే తత్త్వదర్శిభిః ॥ 5 ॥

సర్వేషామేవ భూతానాం యస్మాదన్తకరో మహాన్ ।
తస్మాత్త్వమన్తకః ప్రోక్తః సర్వదేవైర్మహాద్యుతే! ॥ 6 ॥

ఓ దేవా! కళ అనగా 540 రెప్పపాటుల సమయం దాని అంశాలు మొదలైన కాలావయవ పరిమాణాలతో ప్రాణుల జీవితాలను లెక్కిస్తూ నీవు కాలవ్యవస్థను ఏర్పరుస్తావు కావున తత్త్వవేత్తలు నిన్ను 'కాలుడు' అని పిలుస్తారు. ఓ మహాప్రకాశవంతుడా! జగత్తులోని సర్వభూతాలకు అంతం కలిగించేవాడవు కావున దేవతలందరూ నిన్ను 'అంతకుడు' అని అంటారు.

వివస్వతస్త్వం తనయః ప్రథమః పరికీర్తితః ।
తస్మాద్వైవస్వతో నామ్నా సర్వలోకేషు కథ్యసే ॥ 7 ॥

ఆయుష్యే కర్మణి క్షీణే గృహ్ణాసి ప్రసభం జనమ్ ।
తదా త్వం కథ్యసే లోకే సర్వప్రాణహరేతి వై ॥ 8 ॥

వివస్వంతుని అనగా సూర్యుని ప్రథమ పుత్రునిగా కీర్తించబడిన నీవు లోకాలన్నింటిలో అవే పేరుతో పిలవబడుతున్నావు. ఆయుష్షు మరియు చేసిన కర్మలఫలం క్షీణించిన వెంటనే నీవు జనులను తీసుకువెళుతావు. అందుకే లోకంలో నిన్ను అందరి ప్రాణాలను హరించేవాడవని అంటారు.

తవ ప్రసాదాద్దేవేశ! త్రయీధర్మో న నశ్యతి ।
తవ ప్రసాదాద్దేవేశ! ధర్మే తిష్ఠన్తి జన్తవః ॥
తవ ప్రసాదాద్దేవేశ! సంకరో న ప్రజాయతే ॥ 9 ॥

ఓ దేవేశా! నీ కృప వలననే వైదిక ధర్మం నశించకుండా వున్నది. నీ ప్రసాదం వలననే ప్రాణులందరూ తమ ధర్మాన్ని అనుసరిస్తున్నారు. నీ అనుగ్రహం వలననే సంకరత్వం వ్యాప్తి చెందకుండా వుంది.

సతాం సదా గతిర్దేవ త్వమేవ పరికీర్తితః ।
జగతోఽస్య జగన్నాథ మర్యాదాపరిపాలకః ॥ 10 ॥

పాహి మాం త్రిదశశ్రేష్ఠ దుఃఖితాం శరణాగతామ్ ।
పితరౌ చ తథైవాస్య రాజపుత్రస్య దుఃఖితౌ ॥ 11 ॥

దేవా! సజ్జనులకు ఎల్లప్పుడూ గతి నీవే అని కీర్తించబడినావు. ఓ జగన్నాథా! ఈ జగత్తు మర్యాదా పరిపాలకుడవు కూడ నీవే. ఓ దేవతలలో శ్రేష్ఠుడా! దుఃఖితురాలను, నిన్ను శరణువేడినదానను అయిన నన్ను రక్షించు. ఓ దేవా! ఈ రాజపుత్రుని తల్లిదండ్రులు కూడ దుఃఖిస్తున్నారు.

యమ ఉవాచ – యముడు చెప్పాడు.

స్తవేన భక్త్యా ధర్మజ్ఞే! మయా తుష్టేన సత్యవాన్ ।
తవ భర్తా విముక్తోఽయం లబ్ధకామా వ్రజాబలే ॥ 12 ॥

రాజ్యం కృత్వా త్వయా సార్ధం వర్షాణాం శతపంచకమ్ ।
నాకపృష్ఠమథారుహ్య త్రిదశైః సహ రంస్యతే ॥ 13 ॥

త్వయి పుత్రశతం చాపి సత్యవాన్ జనయిష్యతి ।
తే చాపి సర్వే రాజానః క్షత్రియాస్త్రిదశోపమాః ॥ 14 ॥

ముఖ్యాస్త్వన్నామపుత్రాఖ్యా భవిష్యన్తి హి శాశ్వతాః ।

సావిత్రి మాటలు విన్న యముడిలా అన్నాడు. ఓ ధర్మం తెలిసినదానా! నీ భక్తితో మరియు స్తోత్రంతో సంతుష్టుడనైన నేను నీ భర్తయైన ఈ సత్యవంతుని వదులుతున్నాను. ఓ అబలా! నీ కోరిక తీరినది కావున తిరిగి వెళ్ళు. సత్యవంతుడు నీతో కూడ ఐదు వందల యేళ్ళు రాజ్యాన్ని పాలించి, తరువాత స్వర్గలోకానికి వెళ్ళి అక్కడ

దేవతలతో సమానంగా అన్ని సుఖాల ననుభవిస్తాడు. మీకు నూరు మంది పుత్రులు కలుగుతారు. వారందరూ దేవతలతో సమానమైన బలం కల రాజులవుతారు. వారిలో కొంతమంది ముఖ్యులైనవారు నీ పేరుతో ప్రసిద్ధులై శాశ్వతులవుతారు.

పితుశ్చ తే పుత్రశతం భవితా తవ మాతరి ॥ 15 ॥

మాలవ్యాం మాలవా నామ శాశ్వతాః పుత్రపౌత్రిణః ।
భ్రాతరస్తే భవిష్యన్తి క్షత్రియాస్త్రిదశోపమాః ॥ 16 ॥

స్తోత్రేణానేన ధర్మజ్ఞే! కల్యముత్థాయ యస్తు మామ్ ।
కీర్తయిష్యతి తస్యాపి దీర్ఘమాయుర్భవిష్యతి ॥ 17 ॥

నీ తల్లి దండ్రులకు కూడ వంద మంది పుత్రులు కలుగుతారు. మీ తల్లియైన మాలవి యందు జన్మిస్తారు కావున వారంతా మాళవులనే పేరుతో లోకంలో ప్రసిద్ధిపొందుతారు. అలాగే నీ సహోదరులందరు దేవతలతో సమానమైన బలం కల రాజులవుతారు. ఓ ధర్మం తెలిసినదానా! ఉదయాన్నే లేచి ఈ స్తోత్రంతో నన్ను ఎవరు స్తుతిస్తారో వారు కూడ దీర్ఘాయువును పొందుతారు.

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

ఏతావదుక్త్వా భగవాన్ యమస్తు ప్రముచ్య తం రాజసుతం మహాత్మా ।
అదర్శనం తత్ర యమో జగామ కాలేన సార్ధం సహ మృత్యునా చ ॥ 18 ॥

ఇలా చెప్పి మహాత్ముడు మరియు భగవానుడైన యమధర్మరాజు రాజకుమారుడైన సత్యవంతుని వదిలి, కాలునితో మరియు మృత్యువుతో కూడ అదృశ్యమయ్యాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే సావిత్ర్యుపాఖ్యానే సత్యవజ్జీవితలాభో నామ
త్రయోదశాధికద్విశతతమోఽధ్యాయః ॥213॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని సావిత్రి ఉపాఖ్యానంలో సత్యవంతుడు మరల జీవించడమనే
రెండువందల పదమూడవ అధ్యాయం సమాప్తం



చతుర్దశాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల పదునాల్గవ అధ్యాయం

సావిత్ర్యుపాఖ్యాన సమాప్తిః – సావిత్ర్యుపాఖ్యాన సమాప్తి

మత్స్య ఉవాచ – మత్స్యభగవానుడు చెప్పారు.

సావిత్రీ తు తతః సాధ్వీ జగామ వరవర్ణినీ ।
యథా యథాఽగతేనైవ యత్రాసీత్సత్యవాన్మృతః ॥ 1 ॥

సా సమాసాద్య భర్తారం తస్యోత్సంగగతం శిరః ।
కృత్వా వివేశ తన్వంగీ లంబమానే దివాకరే ॥ 2 ॥

సత్యవానపి నిర్ముక్తో ధర్మరాజా చ్ఛనైః శనైః ।
ఉన్మీలయత నేత్రాభ్యాం ప్రాస్ఫురచ్చ నరాధిప! ॥ 3 ॥

తదనన్తరము ఉత్తమురాలు, సాధ్వి యైనటువంటి సావిత్రి తాను ఏ మార్గము ద్వారా వచ్చెనో అదే మార్గము ద్వారా సత్యవంతుడు మృతి చెందిన చోటికి వెళ్ళింది. సూర్యాస్తమయ సమయము వరకు ఆమె తన భర్త దగ్గరకు చేరుకుని ఆతని తలను తన తొడపై నుంచుకొని కూర్చున్నది. నరాధిపా! అప్పుడు సత్యవంతుడు కూడ యమధర్మరాజు నుండి విముక్తడగుచు మెల్లమెల్లగా కండ్లు తెరుస్తూ కదలసాగాడు.

తతః ప్రత్యాగతప్రాణః ప్రియాం వచనమబ్రవీత్ ।
క్వాఽసౌ ప్రయాతః పురుషో యో మామప్యపకర్షతి ॥ 4 ॥

న జానామి వరారోహే! కశ్చాఽసౌ పురుషః శుభే! ।
వనేఽస్మిన్ చారుసర్వాంగి! సుప్తస్య చ దినం గతమ్ ॥ 5 ॥

ఉపవాసపరిశ్రాన్తా దుఃఖితా భవతీ మయా ।
అస్మద్దుర్హృదయేనాద్య పితరౌ దుఃఖితౌ తథా ॥ 6 ॥

తరువాత స్వప్రాణములను పొందిన సత్యవంతుడు తన ప్రియమైన భార్యతో ఇట్లనింది. ఇంతవరకు నన్ను పట్టి లాగుచుండిన ఆ పురుషుడెక్కడికి పోయాడు? ఓ వరారోహా! ఓ శుభప్రదా! ఆ పురుషుడెవరో నాకు తెలియలేదు. ఓ సౌందర్యవతీ! నిద్రించుచుండగానే ఈ వనమందు దివసమంతయూ గడచిపోయింది. నా కారణమున నీవు ఉపవాసముతో ఈ అడవిలో కృశించిపోయావు. అట్లే నా దురదృష్టము వలన తల్లిదండ్రులు కూడ దుఃఖితులైనారు.

సావిత్ర్యువాచ – సావిత్రి చెప్పింది.

ఆదిత్యేఽస్తమనుప్రాప్తే యది తే రుచితం ప్రభో ।
ఆశ్రమం తు ప్రయాస్యావః శ్వశురౌ హీనచక్షుషౌ ॥ 7 ॥

యథావృత్తం చ తత్రైవ తవ వక్ష్యే యథాశ్రమే ।
ఏతావదుక్త్వా భర్తారం సహ భర్త్రా తదా యయౌ ॥ 8 ॥

అపుడు సావిత్రి సత్యవంతునితో ఇట్లనింది. ఓ ప్రభో! వెళ్ళుటకు నీకు ఇష్టమైనచో సూర్యాస్తమయమున కంటే ముందుగానే ఆశ్రమానికి వెళదాం, అక్కడ అంధులైన అత్తమామలు నిరీక్షిస్తూంటారు. ఆశ్రమానికి చేరిన తర్వాత ఇక్కడ జరిగినదంతా యథాతథంగా వివరిస్తాను అని చెప్పి సావిత్రి భర్తతో కూడ ఆశ్రమానికి పోయింది.

ఆససాదాశ్రమం చైవ సహభర్త్రా నృపాత్మజా ।
ఏతస్మిన్నేవ కాలే తు లబ్ధచక్షుర్మహీపతిః ॥ 9 ॥

ద్యుమత్సేనః సభార్యస్తు పర్యతప్యత భార్గవ ।
ప్రియపుత్రమపశ్యన్వై స్నుషాం చైవాథ కర్షితామ్ ॥ 10 ॥

ఆశ్వాస్యమానస్తు తథా స తు రాజా తపోధనైః ।
దదర్శ పుత్రమాయాన్తం స్నుషయా సహ కాననే ॥ 11 ॥

నృపాత్మజయైన సావిత్రి భర్తతో కూడ ఆశ్రమమునకు చేరింది. ఇంతలో నేత్రములను పొందిన ద్యుమత్సేన మహారాజు భార్యతో కూడ ఓ భార్గవా! తమ ప్రియ పుత్రుని మరియు బాగుగా కృశించిపోయిన కోడలు కూడ ఇంకా అడవినుండి రాకపోయిరని పరితపించారు. అలా బాధపడుచున్న ఆ రాజు దంపతులను తపోధనులైన మునులు ఓదార్చారు. అదే సమయమున కోడలితో కూడ వనమునుండి వచ్చుచున్న పుత్రుని వారు చూచారు.

సావిత్రీ తు వరారోహా సహ సత్యవతా తదా ।
వవన్దే తత్ర రాజానం సభార్యం క్షత్రపుంగవమ్ ॥ 12 ॥

పరిష్వక్తస్తదా పిత్రా సత్యవాన్ రాజనన్దనః ।
అభివాద్య తతః సర్వాన్ వనే తస్మింస్తపోధనాన్ ॥ 13 ॥

ఉవాస తత్ర తాం రాత్రిమృషిభిః సర్వధర్మవిత్ ।

అప్పుడు శ్రేష్ఠురాలైన సావిత్రి సత్యవంతునితో కూడ ఆశ్రమమునకు చేరి క్షత్రియపుంగవుడైన మరియు భార్యాసహితుడైన ద్యుమత్సేన మహారాజునకు నమస్కరించింది. వెంటనే ద్యుమత్సేనుడు తమ పుత్రుడైన సత్యవంతుని ప్రేమతో కౌగిలించుకొన్నాడు. అనంతరము వనమునందు నివసించుచున్న తపోధనులైన మునీంద్రులందరికిని అభివాదము చేసి సర్వధర్మములు తెలిసినవాడైన ద్యుమత్సేనుడు సకుటుంబముగా ఆ మునులందరితో పాటు ఆ రాత్రికి అచ్చటనే గడిపాడు.

సావిత్ర్యపి జగాదాథ యథావృత్త మనిన్దితా ॥ 14 ॥

వ్రతం సమాపయామాస తస్యామేవ యథా నిశి ।
తతస్తూర్యే త్రియామాన్తే ససైన్యస్తస్య భూపతేః ॥ 15 ॥

ఆజగామ జనఃసర్వో రాజ్యార్థాయ నిమన్త్రణే ।
విజ్ఞాపయామాస తదా తత్ర ప్రకృతిశాసనమ్ ॥ 16 ॥

విచక్షుషస్తే నృపతే! యేన రాజ్యం పురా హృతమ్ ।
అమాత్యైః స హతో రాజా భవాంస్తస్మిన్ పురే నృపః ॥ 17 ॥

తరువాత ఉత్తమ స్త్రీయైన సావిత్రి వనమునందు జరిగినదంతయును వారందరికి వివరించింది. ఆ రాత్రియందు తన ఉపవాసవ్రత సమాపనము కూడ ఆమె చేసింది. తర్వాత ఆ రాత్రి యొక్క చివరి జాము సమయమున ద్యుమత్సేనుని పరిజనమంతయును సైన్యముతో కూడ ఆ ఆశ్రమమునకు వచ్చి ఆతనిని రాజ్యపాలనమునకై ప్రార్థించిరి. ప్రజారంజకముగా రాజ్యము నేలుమని వేడుకొనిరి. ఓ రాజా! నేత్రహీనుడవైన నీ యొక్క రాజ్యమును ఎవడు అపహరించెనో ఆ రాజును నీ అమాత్యులు హతమార్చిరి, ఇప్పుడు నీవే ఆ పురమునకు రాజువు కావున అక్కడికి వచ్చి రాజ్యమును పరిపాలించుమని ప్రార్థించిరి.

ఏతచ్ఛృత్వా యయౌ రాజా బలేన చతురంగిణా ।
లేభే చ సకలం రాజ్యం ధర్మరాజాన్మహాత్మనః ॥ 18 ॥

భ్రాతౄణాం తు శతం లేభే సావిత్ర్యపి వరాంగనా ।
ఏవం పతివ్రతా సాధ్వీ పితృపక్షం నృపాత్మజా ॥ 19 ॥

ఉజ్జహార వరారోహా భర్తృపక్షం తథైవ చ ।
మోక్షయామాస భర్తారం మృత్యుపాశగతం తదా ॥ 20 ॥

పరిజనుల మాటలు వినిన ద్యుమత్సేన మహారాజు చతురంగబలసహితుడై మహాత్ముడైన యమధర్మరాజు దయతో మరల లభించిన తన సకల రాజ్యమును పరిపాలించెను. ఉత్తమస్త్రీ అయిన సావిత్రి కూడ వంద మంది సహోదరులను పొందింది. ఇట్లు పతివ్రతయైన ఆ సావిత్రి అటు స్వపితృవంశమును ఇట్లు భర్తృవంశమును గూడా ఉద్ధరించింది. మరియు భర్తను మృత్యుపాశము నుండి రక్షించుకొన్నది.

తస్మాత్ సాధ్వ్యః స్త్రియః పూజ్యాః సతతం దేవవన్నరైః ।
తాసాం రాజన్! ప్రసాదేన ధార్యతే వై జగత్త్రయమ్ ॥ 21 ॥

తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా న జాతు లోకేషు చరాచరేషు ।
తస్మాత్సదా తాః పరిపూజనీయాః కామాన్సమగ్రానభికామయానైః ॥ 22 ॥

కావున నరులు సాధ్వీమణులు, పతివ్రతలూ అయిన స్త్రీలను దేవతలను పూజించినట్లు ఎల్లప్పుడూ పూజింపవలెను. ఓ రాజా! ఈ ముల్లోకములు కూడ వారి అనుగ్రహముతోనే నిలబడుచున్నవి. అట్టి పతివ్రతలు పలికినదేదీ ఈ చరాచర ప్రపంచమునందు ఎప్పుడునూ అసత్యము కాదు. కావున సకల కామనా సిద్ధికై ఆ పతివ్రతలను సదా పూజింపవలెను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే సావిత్ర్యుపాఖ్యానసమాప్తిర్నామ చతుర్దశాధిక ద్విశతతమోఽధ్యాయః ॥214॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని సావిత్ర్యుపాఖ్యాన సమాప్తి యను రెండువందల పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచదశాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల పదిహేనవ అధ్యాయం

రాజధర్మే రాజ్ఞాం సహాయ సంపత్తిః – రాజధర్మమునందు రాజుయొక్క సహాయసంపత్తి

మనురువాచ – మనువు చెప్పాడు.

రాజ్ఞోఽభిషిక్తమాత్రస్య కిం ను కృత్యతమం భవేత్ ।
ఏతన్మే సర్వమాచక్ష్వ సమ్యగ్వేత్తి యతో భవాన్ ॥ 1 ॥

ఓ దేవా! రాజ్యాభిషేకము పొందిన తర్వాత రాజు ఆచరింపవలసిన కృత్యము లేమి, సర్వజ్ఞుడవైన నీవు నాకు ఆ వివరాలు తెలుపు.

మత్స్యఉవాచ – మత్స్యభగవానుడు చెప్పాడు.

అభిషేకార్ద్ర శిరసా రాజ్ఞా రాజ్యావలోకినా ।
సహాయవరణం కార్యం తత్ర రాజ్యం ప్రతిష్ఠితమ్ ॥ 2 ॥

యదప్యల్పతరం కర్మ తదప్యేకేన దుష్కరమ్ ।
పురుషేణాసహాయేన కిము రాజ్యం మహోదయమ్ ॥ 3 ॥

రాజ్యభిషేకము అయిన పిదప తల తడి ఆరుటకు ముందే రాజ్యపాలనము నీకు కావలస్సిన సహాయకులందరిని నియమించుకోవాలి. ఎందునగా రాజ్యము వారియందే ప్రతిష్ఠింపబడియున్నది. లోకమున అల్పతరమైన కార్యమును కూడ ఇతరుల సహాయము లేకుండా ఒకడే చేయజాలడు కదా! ఇటువంటప్పుడు మహత్తరమైన రాజ్యమును ఒక్కడే ఎట్లు పాలించగలడు.

తస్మాత్సహాయాన్ వరయేత్ కులీనాన్ నృపతిః స్వయమ్ ।
శూరాన్ కులీనజాతీయాన్ బలయుక్తాన్ శ్రియాఽన్వితాన్ ॥ 4 ॥

రూపసత్త్వగుణోపేతాన్ సజ్జనాన్ క్షమయాఽన్వితాన్ ।
క్లేశక్షమాన్ మహోత్సాహాన్ ధర్మజ్ఞాంశ్చ ప్రియంవదాన్ ॥ 5 ॥

హితోపదేశకాలజ్ఞాన్ స్వామిభక్తాన్ యశోఽర్థినః ।
ఏవం విధాన్ సహాయాంశ్చ శుభకర్మసు యోజయేత్ ॥ 6 ॥

గుణహీనానపి తథా విజ్ఞాయ నృపతిః స్వయమ్ ।
కర్మస్వేవ నియుంజీత యథా యోగ్యేషు భాగశః ॥ 7 ॥

కావున రాజు స్వయంగా మంచివారిని, మంచి వంశమునందు జన్మించినవారిని, శూరులను, బలము కలవారిని, గౌరవాన్వితులైన తన సహాయకులుగా నియమించుకోవలెను. అంతేకాక రూపవంతులను, సత్త్వగుణము కలవారిని, సజ్జనులను, ఓర్పు కలవారిని, క్లేశమునెదుర్కొను సామర్థ్యం కలవారిని, గొప్ప ఉత్సాహవంతులను,

ధర్మము తెలిసిన వారిని, ప్రియముగా మాట్లాడు వారిని, హితోపదేశము చేయువారిని, కాలమునెరిగినవారిని, స్వామి యందు భక్తి కలవారిని, కీర్తిని కోరుకునేవారిని తన సహాయకులుగా నియమించుకుని శుభకర్మలయందు వారిని వినియోగింపవలెను. అలాగే రాజు స్వయంగా గుణహీనులను తెలిసికొని వారిని వారికి యోగ్యమైన పనులందే నియమింపవలెను.

కులీనః శీలసమ్పన్నో ధనుర్వేద విశారదః ।
హస్తి శిక్షాశ్వ శిక్షాసు కుశలః శ్లక్ష్ణ భాషితః ॥ 8 ॥

నిమిత్తే శకునే జ్ఞాతే వేత్తా చైవ చికిత్సతే ।
కృతజ్ఞః కర్మణాం శూరస్తథా క్లేశ సహస్త్వృజుః ॥ 9 ॥

వ్యూహతత్త్వ విధానజ్ఞః ఫల్గుసార విశేషవిత్ ।
రాజ్ఞా సేనాపతిః కార్యో బ్రాహ్మణః క్షత్రియోఽథవా ॥ 10 ॥

కులీనుడు, శీలసంపన్నుడు, ధనుర్వేదమునందారితేరినవాడు, ఏనుగులు మరియు అశ్వముల శిక్షయందు నిపుణుడు, మృదువుగా మాట్లాడువాడు, శుభాశుభశకునములు మరియు చికిత్సా శాస్త్రమును గూడా తెలిసినవాడు, కృతజ్ఞుడు, కర్మలనాచరించుటలో శౌర్యము కలవాడు, క్లేశములను ఓర్పుతో భరించేవాడు, ఋజు స్వభావము కలవాడు, యుద్ధవ్యూహములను, తత్త్వములను, విధానములను కూడ తెలిసినవాడు, సారవంతములైన మరియు నిస్సారములైన విషయములందు జ్ఞానము కలవాడు, అయినటువంటి బ్రాహ్మణుని కాని, క్షత్రియుని కాని రాజు తనకు సేనాపతిగా నియమించుకోవలెను.

ప్రాంశుః సురూపో దక్షశ్చ ప్రియవాదీ న చోద్ధతః ।
చిత్తగ్రాహశ్చ సర్వేషాం ప్రతీహారో విధీయతే ॥ 11 ॥

పొడవుగా వున్నవాడు, మంచిరూపము కలవాడు, సమర్థుడు, ప్రియముగా మాట్లాడువాడు, గర్వము లేని వాడు, అందరి చిత్తములను ఆకర్షించువాడు కూడ అయినట్టి వాడిని రాజు తన ప్రతీహారునిగా (ద్వారపాలకునిగా) నియమించుకొనవలెను.

యథోక్త వాదీ దూతః స్యా ద్దేశ భాషా విశారదః ।
శక్తః క్లేశసహో వాగ్మీ దేశకాలవిభాగవిత్ ॥ 12 ॥

విజ్ఞాత దేశకాలశ్చ దూతః స స్యాన్మహీక్షితః ।
వక్తా నయస్య యః కాలే స దూతో నృపతేర్భవేత్ ॥ 13 ॥

చూచినది చూచినట్లు, విన్నది విన్నట్లుగా, చెప్పినది చెప్పునట్లుగా తెలుపువాడు, దేశభాషలన్ని తెలిసినవాడు, సమర్థుడు, క్లేశములను సహించే ఓర్పు కలవాడు, చమత్కారముగా మాట్లాడువాడు, దేశ కాల విభాగములు తెలిసినవాడు, దేశకాలాదులననుసరించి ప్రవర్తించువాడు, రాజనీతిననుసరించి మాట్లాడే శక్తికలవాడూ, సర్వథా రాజు యొక్క హితమును కోరువాడు అయినటువంటివాడిని రాజు తన దూతనుగా నియమించుకొనవలయును.

ప్రాంశవో వ్యాయతాః శూరా దృఢభక్తా నిరాకులాః ।
రాజ్ఞా తు రక్షిణః కార్యాః సదా క్లేశసహా హితాః ॥ 14 ॥

అనాహార్యోఽ నృశంసశ్చ దృఢభక్తిశ్చ పార్థివే ।
తాంబూలధారీ భవతి నారీ వాప్యథ తద్గుణా ॥ 15 ॥

పొడవుగా ఉండేవారు, దృఢమైన శరీరము కలవారు, శూరులు, స్వామియందు దృఢమైన భక్తిగలవారు, వ్యాధి రహితులు, ఎల్లప్పుడు రాజు హితము కోరువారు, క్లేశములను ఓర్పుతో సహించుకునేవారు మాత్రమే రాజునకు అంగరక్షకులుగా వుండుటకు అర్హులు కావున అటువంటి వారినే రాజు స్వరక్షకులుగా నియమించుకొనవలెను. ఇక రాజు వెంట వుండునట్టి తాంబూలకరండధారులు స్త్రీ కాని పురుషుడు కాని కావచ్చును కాని ఇతరుల ప్రలోభములకు లొంగనివారై, క్రూరస్వభావరహితులై, స్వామియందు దృఢమైనభక్తి కలవారై వుండవలెను. అట్టివారినే రాజు నియమించుకొనవలెను.

షాడ్గుణ్యవిధి తత్త్వజ్ఞో దేశభాషావిశారదః ।
సాంధివిగ్రహికః కార్యో రాజ్ఞా నయవిశారదః ॥ 16 ॥

రాజనీతి విశారదుడు, దేశభాషలందు నైపుణ్యము కలవాడు, సంధి-విగ్రహ-యానము-ఆసనము-ద్వైధము-ఆశ్రయము అను షడ్గుణముల విధి విధానముల యొక్క తత్త్వమును తెలిసినవాడే 'సారథి విగ్రహకుడు- అనగా విదేశీ వ్యవహరములను చూచువాడుగా రాజు నియమించుకొనవలెను.

కృతాఽ కృతజ్ఞో భృత్యానాం జ్ఞేయః స్యాద్దేశరక్షితా ।
ఆయవ్యయజ్ఞో లోకజ్ఞో దేశోత్పత్తి విశారదః ॥ 17 ॥

సేవకుల కార్యా కార్యములను తెలుసుకొనేవాడు, రాజ్యపు ఆయవ్యయములు మరియు లోకవ్యవహారము, దేశము యొక్క ఉత్పత్తిని కూడ తెలుసుకునేవాడు దేశ రక్షకుడిగా వుండవలెను. కావున రాజు అటువంటి గుణములు కలవారినే ఆ స్థానమందు నియమింపవలెను.

సురూపస్తరుణః ప్రాంశుః దృఢభక్తిః కులోచితః ।
శూరః క్లేశసహశ్చైవ ఖడ్గధారీ ప్రకీర్తితః ॥ 18 ॥

శూరశ్చ బలయుక్తశ్చ గజాశ్వరథ కోవిదః ।
ధనుర్ధారీ భవేద్రాజ్ఞః సర్వ క్లేశసహః శుచిః ॥ 19 ॥

మంచి రూపము కలవాడు, యువకుడు, పొడవుగా వున్నవాడు, దృఢమైన భక్తి కలవాడు, మంచి వంశము నందు జన్మించినవాడు, శూరుడు, క్లేశములను సహించుకునే శక్తి కలవాడు, 'ఖడ్గధారి'గా వుండవలెను. అట్లే శూరుడు, బలవంతుడు, గజ-అశ్వ-రథ విద్యలయందు నైపుణ్యము కలవారు, సర్వక్లేశసహుడు, శుచిమంతుడు రాజునకు "ధనుర్ధారి" గా వుండవలెను.

నిమిత్తశకున జ్ఞానీ హయశిక్షావిశారదః ।
హయాయుర్వేద తత్త్వజ్ఞో భువో భాగవిచక్షణః ॥ 20 ॥

బలాబలజ్ఞో రథినః స్థిరదృష్టిః ప్రియంవదః ।
శూరశ్చ కృతవిద్యశ్చ సారథిః పరికీర్తితః ॥ 21 ॥

శుభాశుభసూచకములగు శకునములను తెలిసినవాడు, అశ్వశిక్షావిశారదుడు, అశ్వముల ఆయుర్విజ్ఞానమును తెలిసినవాడు, పృథివికి సంబంధించిన సమస్త భాగములను, వాటి విశేషములను తెలిసినవాడు, రథికుల బలాబలములు తెలిసినవాడు, స్థిరమైన దృష్టికలవాడు, ప్రియవచనుడు, శూరుడు, విద్యలయందారి తేరినవాడు సారథిగా ఉండవలెను.

అనాహార్యః శుచిర్దక్షశ్చికిత్సితవిదాం వరః ।
సూపశాస్త్ర విశేషజ్ఞః సూదాధ్యక్షః ప్రశస్యతే ॥ 22 ॥

సూదశాస్త్ర విధానజ్ఞాః పరాభేద్యాః కులోద్గతాః ।
సర్వే మహానసే ధార్యాః కృత కేశనఖా నరాః ॥ 23 ॥

వేషంనందు అలంకారములందు ఆసక్తి లేనివాడు, శుచిమంతుడు, సమర్థుడు, వైద్యవిధానము తెలిసినవాడు, పాకశాస్త్ర ప్రవీణుడు పాకశాలకు అధ్యక్షుడుగా వుండవలెను, అట్లే పాకశాస్త్రమునందు ఆరితేరినవారు, ఇతరులచే భేదింపబడనివారు, కులీనులు, జుట్టును గ్రోళ్ళను కత్తిరించుకొని శుభ్రముగా వుండువారూ వంటశాల యందుండుటకు అర్హులు కావున అట్టివారిని వంటశాలయందు నియమింపవలెను.

సమః శత్రౌ చ మిత్రే చ ధర్మశాస్త్రవిశారదః ।
విప్రముఖ్యః కులీనశ్చ ధర్మాధికరణో భవేత్ ॥ 24 ॥

కార్య స్తథా విధాస్తత్ర ద్విజముఖ్యాః సభాసదః ।

శత్రువులయందు మిత్రులయందు కూడ సమముగా శమముతో వ్యవహరించేవాడు, ధర్మశాస్త్ర ప్రవీణుడు, మంచివంశము నందు జన్మించినవాడు, ద్విజశ్రేష్ఠుడు రాజ్యమునందు ధర్మాధికారిగా నియమింపబడవలెను. అంతేకాక అతనితో సమానమైన గుణములు కల ద్విజశ్రేష్ఠులే ఆతనికి సహాయకులైన ధర్మాధికార సభ్యులుగా నియమింపబడవలెను.

సర్వదేశాక్షరాభిజ్ఞః సర్వశాస్త్రవిశారదః ॥ 25 ॥

లేఖకః కథితో రాజ్ఞః సర్వాధికరణేషు వై ।
శీర్షోపేతాన్ సుసంపూర్ణాన్ సమశ్రేణి గతాన్ సమాన్ ॥ 26 ॥

అక్షరాన్వై లిఖేద్యస్తు లేఖకః స వరఃస్మృతః ।
ఉపాయవాక్యకుశలః సర్వశాస్త్రవిశారదః ॥ 27 ॥

బహ్వర్థవక్తా చాల్పేన లేఖకః స్యాన్నృపోత్తమ ।

అన్ని దేశముల యొక్క భాషను అక్షరములను బాగుగా తెలిసి వున్నవాడు, సర్వశాస్త్ర విశారదుడూ అయినవాడే రాజ్యములోని ఆయా అధికరణములలో (విభాగములలో) లేఖకుడిగా ఉండవలెనని చెప్పబడినది. తలకట్టులు కలవి, నిండుగా వుండునట్టివి, సరియైన వరుసల యందుండునట్టివి, సమానమైన పరిమాణము కలిగినట్టివీ అయిన అక్షరములను ఎవరైతే వ్రాయుదురో వారే ఉత్తమ లేఖకులని చెప్పబడునది. ఇంకనూ ఓరాజా! ఉపాయముతో వాక్య నిర్మాణము చేయుటలో కుశలుడు, సర్వశాస్త్రములునూ తెలిసినవాడు, అల్పవాక్యములతోడనూ విస్తృతమైన అర్థమును తెలుపగలిగే సామర్థ్యం గలవాడు ఉత్తమ లేఖకుడు అనబడును కావున అటువంటి వారినే రాజు లేఖకులుగా నియమించుకొనవలెను.

పురుషాన్తర తత్త్వజ్ఞాః ప్రాంశవశ్చాప్యలోలుపాః ॥ 28 ॥

ధర్మాధికారిణః కార్యా జనా దానకరా నరాః ।
ఏవంవిధా స్తథా కార్యా రాజ్ఞా దౌవారికా జనాః ॥ 29 ॥

మనుష్యుల యొక్క అంతరంగమును తెలిసికోగలిగే తత్త్వజ్ఞులు, పొడవుగా ఉండేవారు, లోభము లేనివారు, దాన గుణము కలవారు ధర్మాధికారులుగా వుండవలెను. అట్లే ఇటువంటి గుణములు కలవారే ద్వారపాలురుగా నియమింపబడుటకు అర్హులు కావున అట్టి గుణములు కలవారినే రాజు ధర్మాధికారులుగా, ద్వారపాలురుగా గూడా నియమించుకొనవలెను.

లోహవస్త్రాజినాదీనాం రత్నానాం చ విధానవిత్ ।
విజ్ఞాతా ఫల్గు సారాణామనాహార్యః శుచిః సదా ॥ 30 ॥

నిపుణశ్చాప్రమత్తశ్చ ధనాధ్యక్షః ప్రకీర్తితః ।
ఆయద్వారేషు సర్వేషు ధనాధ్యక్షసమా నరాః ॥ 31 ॥

వ్యయద్వారేషు చ తథా కర్తవ్యాః పృథివీక్షితా ।

లోహములు, వస్త్రములు, మృగచర్మములు, రత్నములు మొదలగు వస్తువుల స్వరూపమును తెలిసినవాడు, సారవంతము మరియు సారరహితము అయిన వాటిని తెలిసికొన గలిగినవాడు, వేశభూషములందు ఆసక్తి లేనివాడు, శుచిమంతుడు, మంచి నైపుణ్యము కలవాడు, ఎల్లప్పుడూ అప్రమత్తముగా నుండువాడు. ధనాధ్యక్షుడిగా వుండవలెను. అట్లే రాజ్యములో ఆదాయమునకు సంబంధించిన విభాగములయందు కూడ ధనాధ్యక్షునితో సమానమైన గుణములు కలవాడే అధిపతులుగా వుండవలెను. కావున రాజు అటువంటివారినే నియమించుకోవలెను.

పరమ్పరాగతో యః స్యాదష్టాంగే సుచికిత్సతే ॥ 32 ॥

అనాహార్యః స వైద్యః స్యాద్ధర్మాత్మా చ కులోద్గతః ।
ప్రాణాచార్యః స విజ్ఞేయో వచనం తస్య భూభుజా ॥ 33 ॥

రాజన్! రాజ్ఞా సదా కార్యం యథా కార్యం పృథగ్జనైః ।

పరంపరాక్రమముగా వచ్చినవాడు, వైద్యశాస్త్రమునకు సంబంధించిన అష్టాంగముల యందు ప్రావీణ్యము కలవాడు, నిరాడంబరుడు, ధర్మాత్ముడు, ఉత్తమవంశమునందు జన్మించినవాడు రాజునకు వైద్యునిగా నియమింపబడ వలెను. ఓ రాజా! ఆ వైద్యుని ప్రాణాచార్యునిగా గుర్తింపవలసినది. మరియు రాజు ఎల్లప్పుడును ఆ వైద్యుని మాటలను సామాన్యమానవు లనుసరించునట్లే అనుసరించవలెను.

హస్తిశిక్షావిధానజ్ఞో వనజాతి విశారదః ॥ 34 ॥

క్లేశక్షమస్తథా రాజ్ఞో గజాధ్యక్షః ప్రశస్యతే ।
ఏతైరేవ గుణై ర్యుక్తః స్వాసనశ్చ విశేషతః ॥ 35 ॥

గజారోహో నరేంద్రస్య సర్వకర్మసు శస్యతే ।

గజముల శిక్షణావిధానము తెలిసినవాడు, వనమునందలి గజజాతుల గురించి తెలిసినవాడు, క్లేశములను సహించే ఓర్పుగలవాడు, రాజునకు గజాధ్యక్షుడుగా వుండవలెను. ఇటువంటి గుణములే కలవాడు ముఖ్యముగా స్థిరముగా కూర్చుండగలిగే ఓర్పు గలవాడు రాజునకు గజారోహకుడుగా (మావటివాడు) వుండవలెను. ఈ గుణములు కలిగినవాడు సర్వకర్మలయందు ప్రశస్తుడు కావున రాజు అట్టివారినే నియమించుకొనవలెను.

హయశిక్షావిధానజ్ఞః చికిత్సితవిశారదః ॥ 36 ॥

అశ్వాధ్యక్షో మహీభర్తుః స్వాసనశ్చ ప్రశస్యతే ।
అనాహార్యశ్చ శూరశ్చ తథా ప్రాజ్ఞః కులోద్గతః ॥ 37 ॥

దుర్గాధ్యక్షః స్మృతో రాజ్ఞః ఉద్యుక్తః సర్వకర్మసు ।

అశ్వశిక్షణా విధానము నెరిగినవాడు, అశ్వములకు సంబంధించిన చికిత్స తెలిసినవాడు, స్థిరముగా కూర్చునే ఓర్పుగలవాడు రాజునకు అశ్వాధ్యక్షుడిగా వుండవలెను. అట్లే నిరాడంబరుడు, శూరుడు, విద్వాంసుడు, సద్వంశము నందు జన్మించినవాడు, అన్ని వేళల యందు అన్ని కర్మలను ఆచరించుటకు సన్నద్ధుడై ఉండువాడు రాజునకు దుర్గాధ్యక్షుడిగా వుండవలెనని చెప్పబడినది.

వాస్తువిద్యావిధానజ్ఞో లఘుహస్తో జితశ్రమః ॥ 38 ॥

దీర్ఘదర్శీ చ శూరశ్చ స్థపతిః పరికీర్తితః ।
యన్త్రముక్తే పాణిముక్తే విముక్తే ముక్తధారితే ॥ 39 ॥

అస్త్రాచార్యో నిరుద్వేగః కుశలశ్చ విశిష్యతే ॥ 40 ॥

వాస్తు విద్యానిపుణుడు, హస్త లాఘవము కలవాడు, శ్రమను జయించువాడు, దూరదృష్టి కలవాడు, శూరుడూ అయినవాడు స్థపతిగా ఉండవలెను, యంత్రముక్తములు, పాణిముక్తములు, విముక్తములు మరియు

ముక్తధారితములు అగు అస్త్రప్రయోగములలో నిపుణుడు, ఉద్వేగమునకు లోను కానట్టివాడు, కుశలుడు అయినట్టివాడు రాజునకు అస్త్రాచార్యుడుగా ఉండవలెను.

వృద్ధః కులోద్గతః సూక్తః పితృపైతామహశ్శుచిః ।
రాజ్ఞామన్తః పురాధ్యక్షో వినీతశ్చ తథేష్యతే ॥ 41 ॥

వృద్ధుడు, ఉత్తమవంశమునందు జన్మించినవాడు, చక్కగా మాట్లాడువాడు, పితృ పితామహులననుసరించి వచ్చినవాడు, శుచిమంతుడు, వినయశీలుడూ అయినవాడు రాజుయొక్క అంతఃపురమునకు అధ్యక్షునిగా వుండవలెను.

ఏవం సప్తాధికారేషు పురుషాః సప్త తే పురే ।
పరీక్ష్య చాధికార్యాః స్యుః రాజ్ఞా సర్వేషు కర్మసు ॥
స్థాపనాజాతితత్త్వజ్ఞాః సతతం ప్రతిజాగ్రతాః ॥ 42 ॥

ఈ విధముగా రాజు తన రాజ్యములోని ఏడు ఆధికారికపదములందు ఏడుమంది రాజపురుషులను బాగుగా పరీక్షించి నియమించవలెను. అట్లు నియమింపబడిన ఆ ఏడుగురు అధికారులు అన్ని వేళలలోనూ అన్ని కర్మలునూ ఆచరించుటకు సన్నద్ధులై, రాజ్యానికి సంబంధించిన అన్ని విషయాలను తెలిసికొన్నవారై ఎల్లప్పుడు అత్యంత జాగరూకులై వుండవలెను.

రాజ్ఞః స్యాదాయుధాగారే దక్షః కర్మసు చోద్యతః ।
కర్మాణ్యపరిమేయాని రాజ్ఞో నృపకులోద్వహ! ॥ 43 ॥

ఉత్తమాధమమధ్యాని బుద్ధ్వా కర్మాణి పార్థివః ।
ఉత్తమాధమమధ్యేషు పురుషేషు నియోజయేత్ ॥ 44 ॥

నరకర్మ విపర్యాసాద్రాజా నాశమవాప్నుయాత్ ।

రాజుయొక్క ఆయుధాగారంనందు కూడ మంచి సమర్థుడు, ఎల్లప్పుడు ఉద్యమరూపములో కర్మలనన్నింటిని ఆచరించుటకు సిద్ధముగా ఉండేవాడు నియమింపబడవలెను. ఓ నృపకులోద్వహా! రాజ్యమునందు అపరిమితములైన పనులెన్నో వుండును. కావున వాటినన్నింటిని ఉత్తమ-మధ్యమ-అధమములుగా వాటి ప్రామాణ్యమును బట్టి నిర్ణయించుకుని, ఆ ప్రామాణ్యమును ప్రాముఖ్యమును ఆధారము చేసికొని ఉత్తమ-మధ్యమ-అధమ పురుషులను ఆయా కార్యములందు నియమించుకొనవలెను. ఎందుకనగా నరులు చేసే తప్పిదముల వలననే రాజు మరియు రాజ్యము నాశనము పొందును.

నియోగం పౌరుషం భక్తిం శ్రుతం శౌర్యం కులం నయమ్ ॥ 45 ॥

జ్ఞాత్వా వృత్తి ర్విధాతవ్యా పురుషాణాం మహీక్షితా ।
పురుషాన్తర విజ్ఞాన తత్త్వసారనిబంధనాత్ ॥ 46 ॥

రాజు ఆయా అధికారులను నియమించుకొనునప్పుడు వారి సామర్థ్యమును, పౌరుషమును, భక్తిని, శాస్త్రజ్ఞానమును, శౌర్యమును, కులమును, నీతిని తెలుసుకొని వాటికి అనుగుణమైన స్థానమునందు ఒక్కొకరిని నియమించుకొనవలెను. వారిని నియమించునప్పుడు వారి అంతరంగమును అనగా చిత్తశుద్ధిని, విజ్ఞానమును, విషయ పరిజ్ఞానమును తెలిసికొనుట అత్యావశ్యకము.

బహుభిర్మన్త్రయేత్కామం రాజా మన్త్రం పృథక్ పృథక్ ।
మన్త్రిణామపి నో కుర్యాన్మన్త్రి మన్త్ర ప్రకాశనమ్ ॥ 47 ॥

క్వచిన్న కస్య విశ్వాసో భవతీహ సదా నృణామ్ ।
నిశ్చయస్తు సదా మన్త్రే కార్య ఏకేన సూరిణా ॥ 48 ॥

భవేద్వా నిశ్చయావాప్తిః పరబుద్ధ్యుపజీవనాత్ ।
ఏకస్యైవ మహీభర్తుః భూయః కార్యో వినిశ్చయః ॥ 49 ॥

రాజు తన ఇష్టానుసారమే అనేకమందితో వేరువేరుగా మంత్రణము చేయవలెను. తానితరులచే చేసిన మంత్రణము మంత్రులలో కూడ ఎవరికినీ చెప్పకూడదు. రహస్యముగనే వుంచవలెను. రాజు ఎప్పుడునూ ఎవరి యందు పూర్తి విశ్వాసముంచకూడదు. ఒక్కరినే పూర్తిగా నమ్మకూడదు, అందరి అభిప్రాయములను విని చివరిగా విజ్ఞుడైన రాజు తానే నిర్ణయమును తీసుకొనవలెను. నిర్ణయము తీసుకొనుట అనునది పరబుద్ధ్యుపజీవనము. అనగా అందరి అభిప్రాయము మీదనే ఆధారపడివున్ననూ రాజు తాను కూడా బాగుగా విచారించి కార్యనిర్ణయము చేసికొనవలెను.

బ్రాహ్మణాన్ పర్యుపాసీత త్రయీశాస్త్రసునిశ్చితాన్ ।
నాసచ్ఛాస్త్రవతో మూఢాంస్తే హి లోకస్య కణ్టకాః ॥ 50 ॥

వృద్ధాన్ హి నిత్యం సేవేత విప్రాన్ వేదవిదః శుచీన్ ।
తేభ్యః శిక్షేత వినయం వినీతాత్మా చ నిత్యశః ॥ 51 ॥

సమగ్రాం వశగాం కుర్యాత్ పృథివీం నాఽత్ర సంశయః ।
బహవోఽవినయాద్ భ్రష్టా రాజానః సపరిచ్ఛదాః ॥ 52 ॥

వనస్థాశ్చైవ రాజ్యాని వినయాత్ ప్రతిపేదిరే ।

వేదశాస్త్రములందు పండితులైన బ్రాహ్మణులను రాజు సర్వదా సేవించవలెను. శాస్త్ర జ్ఞానహీనులైన మూర్ఖులను సేవింపగూడదు. వారు లోక కంటకులు, లోకమునకు అపకారము చేయుదురు. వేదవేత్తలైన శుచిమంతులైన అనుభవజ్ఞులైన బ్రాహ్మణులను రాజు నిత్యము సేవింపవలెను. వినీతాత్ముడైన రాజు వారినుండి నిత్యమూ వినయమును తెలిసికొనవలెను. అటువంటి రాజు సమస్త భూమిని తన వశము చేసికొని పరిపాలించును అనుటలో సందేహము లేదు. అవినయము వలన అనేక మంది రాజులు పరివారముతో కూడ భ్రష్టులైపోయిరి. మరికొంత మంది వనములలో నివసించుచున్ననూ స్వవినయముతో మరల తమ రాజ్యములను పొందిరి.

త్రైవిద్యేభ్యస్త్రయీం విద్యాం దణ్డనీతిం చ శాశ్వతీమ్ ॥ 53 ॥

అన్వీక్షికీం త్వాత్మవిద్యాం వార్తారమ్భాంశ్చ లోకతః ।
ఇంద్రియాణాం జయే యోగం సమాతిష్ఠేద్దివానిశమ్ ॥ 54 ॥

జితేంద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః ।

వేదవేత్తలైన బ్రాహ్మణులనుండి ఋగ్యజుస్సామాది వేదములను మరియు శాశ్వతమైన దండనీతిని అభ్యసించవలెను. అట్లే తర్కశాస్త్రము, ఆత్మవిద్యా మొదలగు వాటిని కూడ అభ్యసించవలెను. వాణిజ్య శాస్త్రమును కళలను కూడ లోక వ్యవహారము ద్వారా తెలిసికోవలెను. ఇంద్రియములను జయించుటకై రాత్రి పగలు అనకుండా సర్వదా యోగ శాస్త్రమును అభ్యసించవలెను. ఎందుకనగా జితేంద్రియుడైన రాజు మాత్రమే ప్రజలందరిని తన అధీనములో ఉంచుకోగలుగును కదా!

యజేత రాజా బహుభిః క్రతుభిశ్చ సదక్షిణైః ॥ 55 ॥

ధర్మార్థం చైవ విప్రేభ్యో దద్యాద్ భోగాన్ ధనాని చ ।
సాంవత్సరిక మాప్తైశ్చ రాష్ట్రాదాహారయేద్బలిమ్ ॥ 56 ॥

రాజు ఎల్లప్పుడు అనేక దక్షిణలతో కూడుకున్న యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించవలెను. అట్లే ధర్మాచరణము కొరకై బ్రాహ్మణులకు అనేక ధనభోగాదులను దానము చేయవలెను, మరియు బుద్ధిమంతులైన కర్మచారుల ద్వారా రాష్ట్రహితము కొరకై ప్రజలనుండి పన్నులను కూడ సేకరించుకొనవలెను.

స్యాత్ స్వాధ్యాయపరో లోకే వర్తేత పితృబంధువత్ ।
ఆవృత్తానాం గురుకులాద్ ద్విజానాం పూజకో భవేత్ ॥ 57 ॥

నృపాణామక్షయో హ్యేష విధిర్బ్రాహ్మోఽభిధీయతే ।
తం చ స్తేనా న వాఽమిత్రా హరన్తి న వినశ్యతి ॥ 58 ॥

తస్మాద్రాజ్ఞా విధాతవ్యో బ్రాహ్మో వై హ్యక్షయో విధిః ।
సమోత్తమాధమైః రాజా హ్యాహూయ పాలయేత్ ప్రజాః ॥ 59 ॥

రాజు స్వాధ్యాయపరుడై వేద శాస్త్రాదులను అధ్యయనం చేయుచు జనులందరితో తండ్రి వలె ఆత్మ బంధువు వలె వ్యవహరించవలెను. గురువుల ఆశ్రమములందు విద్యాభ్యాసము పూర్తి చేసికొని తిరిగివచ్చిన ద్విజులను సమ్మానింపవలెను. ఇది రాజులకొరకై సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు విధించినటువంటి అక్షయమైన రాజ్యపాలనా విధానము అని చెప్పబడినది. ఈ విధానముననుసరించిన రాజు యొక్క రాజ్యమును దొంగలు గాని శత్రువులు గాని అపహరింపలేరు మరియు దానంతట అదికూడ నశింపదు. కావున రాజుచేత అక్షయమైన బ్రహ్మప్రోక్తవిధానం. సర్వధా అనుసరింపవలసినది. రాజు ఎల్లప్పుడు ఉత్తములు, మధ్యములు, అధములుగా జనమును వారివారి నడవడికను ఆధారముగా విభజించుకుని సమయానుసారముగా వారిని తన వద్దకు ఆహ్వానించి యోగక్షేమాదులను విచారించి ప్రజలందరిని పాలించవలెను.

న నివర్తేత సంగ్రామాత్ క్షాత్రం వ్రతమనుస్మరన్ ।
సంగ్రామేష్వనివర్తిత్వం ప్రజానాం పరిపాలనమ్ ॥ 60 ॥

శుశ్రూషా బ్రాహ్మణానాం చ రాజ్ఞాం నిఃశ్రేయసం పరమ్ ।
కృపణానాం చ వృద్ధానాం విధవానాం చ పాలనమ్ ॥ 61 ॥

యోగక్షేమం చ వృత్తిం చ తథైవ పరికల్పయేత్ ।
వర్ణాశ్రమవ్యవస్థానం తథా కార్యం విశేషతః ॥ 62 ॥

రాజు క్షత్రియ ధర్మమును గుర్తుంచుకుని యుద్ధభూమి నుండి ఎప్పుడును వెనుతిరిగి రాకుండా వుండవలెను. యుద్ధభూమియందు స్థిరముగా ధైర్యముగానుండి అక్కడినుండి వెనుతిరిగి రాకుండా వుండుట, ప్రజలను చక్కగా పరిపాలించుట, బ్రాహ్మణులను సేవించుట మొదలగునవి రాజునకు పరమ మంగళదాయకములు. ఇంకనూ దీనులు, వృద్ధులు, వైధవ్యము పొందిన స్త్రీలు మొదలగువారికి కావలసినవి సమకూర్చి వారి యోగక్షేమములను విచారించుచు, వారికి జీవనవృత్తిని కల్పించుచు పాలించుట కూడ రాజుయొక్క బాధ్యతయే. ఇంకనూ విశేషముగా వర్ణాశ్రమ వ్యవస్థను కాపాడుతూ రాజ్యమును పాలించుట కూడ ముఖ్యమే.

స్వధర్మ ప్రచ్యుతాన్ రాజా స్మధర్మే స్థాపయేత్తథా ।
ఆశ్రమేషు తథా కార్య మన్నం తైలం చ భాజనమ్ ॥ 63 ॥

స్వయమేవానయే ద్రాజా సత్కృతాన్నావమానయేత్ ।
తాపసే సర్వకార్యాణి రాజ్యమాత్మానమేవ చ ॥
నివేదయేత్ ప్రయత్నేన దేవవచ్చిరమర్చయేత్ ॥ 64 ॥

తమ ధర్మమును వదిలి తప్పు దారిన నడుస్తున్నవారిని వారి ధర్మమునందు నిలుపుటకు, వారి ధర్మమును వారు ఆచరించుటకు ప్రయత్నం చేయాలి. అంతేకాక ఆశ్రమములందు నివసించుచున్నవారికి అన్నం, తైలం మరియు పాత్రల యొక్క వ్యవస్థ కూడ రాజు స్వయముగా కల్పించాలి. సజ్జనులను, సమ్మానించుటకు యోగ్యులైన వారిని అవమానించకూడదు. అట్లే తపస్వి జనులకొరకు అన్ని కార్యములను రాజ్యమును, ఆత్మసుఖమును కూడ వదలి అత్యన్త ప్రయత్నముతో వారికి కావల్సినవన్ని సమకూర్చాలి. వారిని దేవతలను వలే ఎల్లప్పుడు పూజించాలి.

ద్వే ప్రజ్ఞే వేదితవ్యే చ ఋజ్వీ వక్రా చ మానవైః ।
వక్రం జ్ఞాత్వా న సేవేత ప్రతిబాధేత చాగతమ్ ॥ 65 ॥

నాస్య ఛ్చిద్రం పరో విద్యాత్ విద్యాచ్ఛిద్రం పరస్య తు ।
గూహేత్ కూర్మ ఇవాంగాని రక్షేద్వివరమాత్మనః ॥ 66 ॥

సాధారణముగా మానవులకు సరళబుద్ధి మరియు వక్ర(కుటిల) బుద్ధియని రెండు విధముల బుద్ధియుండును. వీటిలో వక్రబుద్ధిని తెలిసికొని తన్మార్గమున ప్రవర్తించకుండా వుండునట్లు రాజు ప్రయత్నించాలి. అటువంటి కుటిలబుద్ధి ఒకవేళ ఎదరౌతున్నప్పుడు దానిని ప్రతిఘటించి సరళమార్గమునే అనుసరించుటకు యత్నించాలి.

రాజు ఎప్పుడును తన లోపములు ఇతరులు తెలుసుకోకుండా ఉండునట్లు జాగ్రతపడాలి కాని ఇతరుల ఛిద్రములను (లోపములను) తాను సర్వథా తెలిసికొనుటకై యత్నించాలి. అనవసరమైనప్పుడు తాబేలు తన అంగములన్నింటిని దాచుకున్నట్లు రాజు కూడ తన దోషములను తనలోనే ఇతరులు కనిపెట్టకుండా వుండునట్లు ప్రయత్నించాలి.

న విశ్వసేదవిశ్వస్తే విశ్వస్తే నాతివిశ్వసేత్ ।
విశ్వాసాద్భయముత్పన్నం మూలాన్యపి నికృన్తతి ॥ 67 ॥

విశ్వాసయేచ్చాప్యపరం తత్త్వభూతేన హేతునా ।
బకవచ్చిన్తయేదర్థాన్ సింహవచ్చ పరాక్రమేత్ ॥ 68 ॥

విశ్వాసము లేని వారి యందు విశ్వాసముంచరాదు. విశ్వసనీయులైన వారిని కూడ అతిగా విశ్వసించగూడదు. విశ్వాసము వలన కలిగిన భయము సమూలముగా నాశనము చేయుటకు కారణమౌతుంది. యథార్థములు వాస్తవములుగా అయిన కారణములతో ఇతరులను విశ్వసించునట్లు చేయాలి. కొంగవలె కపటధ్యానముతో నిశ్చల చిత్తముతో రాజనీతిని ఆలోచించాలి. అవసరానుసారము సింహం వలె పరాక్రమించాలి. తత్క్షణమే నిర్ణయాలు తీసుకోవాలి.

వృకవచ్చాపి లుమ్పేత శశవచ్చ వినిక్షిపేత్ ।
దృఢప్రహారీ చ భవేత్ తథా సూకరవన్నృపః ॥ 69 ॥

చిత్రాకారశ్చ శిఖివద్ దృఢభక్త స్తథాశ్వవత్ ।
తథా చ మధురాభాషీ భవేత్కోకిలవన్నృపః ॥ 70 ॥

అవసరానుగుణముగా నక్కవలె వ్యవహరించాలి. కుందేలు వలె దుమికి దుమికి పరుగుతీయాలి మరియు అడవి పందివలె దృఢముగా కొట్టువాడు కావాలి. నెమలి వలె విచిత్రాకారములు కలిగి వుండాలి. అశ్వము వలె దృఢమైన భక్తి కలవాడై వుండాలి మరియు రాజు కోకిల వలె మధురముగా మృదువుగా మాట్లాడువాడై వుండాలి.

కాకశంకీ భవేన్నిత్య మజ్ఞాతవసతిం వసేత్ ।
నాపరీక్షిత పూర్వం చ భోజనం శయనం వ్రజేత్ ॥
వస్త్రం పుష్పమలంకారం యచ్చాన్య న్మనుజోత్తమ! ॥ 71 ॥

న గాహే జ్జన సమ్బాధం న చాజ్ఞాతజలాశయమ్ ।
అపరీక్షిత పూర్వం చ పురుషైరాప్తకారిభిః ॥ 72 ॥

నారోహేత్ కుంజరం వ్యాలం నాదాన్తం తురగం యథా ।
నావిజ్ఞాతాం స్త్రియం గచ్ఛేన్నైవ దేవోత్సవే వసేత్ ॥ 73 ॥

ఓ మనుజోత్తమా! రాజు ఎవరినీ నమ్మక ఎల్లప్పుడూ కాకివలే శంకితుడై వుండాలి, ఎవరికీ తెలియని రహస్య స్థానమున వసించాలి. పరీక్షించని (ముందుగా) ఆహారమును సేవింపకూడదు. అట్లే పరీక్షింపని శయ్య

యందు నిద్రించకూడదు. వస్త్రములు, పుష్పములు, అలంకారములు మొదలగు వాటినన్నింటిని పరీక్షించిన తర్వాతనే ఉపయోగించాలి. జనసమ్మర్దమైన జలాశయమునందు కాని, ముందుగా ఆప్తులైన తన పురుషులతో పరీక్షింబడనటువంటి జలాశయమందు కాని స్నానము చేయుటకు వెళ్ళరాదు. దుష్టమైన ఏనుగును కాని, అశిక్షితమైన అశ్వమును కాని రాజు అధిరోహించకూడదు. తెలియనటువంటి స్త్రీని కలువకూడదు. ఉత్సవముల సమయమున దేవాలయములలో రాజు నివసించకూడదు.

నరేంద్రలక్ష్మ్యా ధర్మజ్ఞ త్రాతా యత్తో భవేన్నృపః ।
సద్ భృత్యాశ్చ తథా పుష్టాః సతతం ప్రతిమానితాః ॥ 74 ॥

రాజ్ఞా సహాయాః కర్తవ్యాః పృథివీం జేతుమిచ్ఛతా।
యథార్హం చాప్యసుభృతో రాజా కర్మసు యోజయేత్ ॥ 75 ॥

ఓ ధర్మజ్ఞుడా! రాజు సర్వధా రాజ్యలక్ష్మీ రక్షకుడై ఉండాలి. అతనెప్పుడునూ అలసిపోకుండా ఉండాలి. పృథివిని జయించాలనే కోరిక గల రాజు పుష్టి గలిగిన మంచి సేవకులను, మంచి సహాయకులను, గౌరవ ప్రదులైన వారిని నియమించుకోవాలి. వారిని వారి అర్హతకు సమానముగా సమ్మానించుచుండాలి. వారిని యోగ్యములైన కార్యములందు నియోగించాలి.

ధర్మిష్ఠాన్ ధర్మకార్యేషు శూరాన్ సంగ్రామకర్మసు ।
నిపుణానర్థకృత్యేషు సర్వత్రైవ తథా శుచీన్ ॥ 76 ॥

స్త్రీషు షణ్డం నియుంజీత తీక్ష్ణం దారుణకర్మసు ।

ధర్మిష్ఠులును ధర్మకార్యములందు, శూరులైనవారిని యద్ధకార్యములందును, ఆయవ్యయసంబంధి కార్యములందు శుచిమంతులను మరియు నిపుణులైనవారిని రాజు నియోగించాలి మరియు స్త్రీలను సేవించుటకై (సేవ చేయుటకు) నపుంసకులను, నిర్దయులైన వారిని తీక్ష్ణమైన కార్యములందును నియోగించాలి.

ధర్మే చార్థే చ కామే చ నయే చ రవినందన ॥ 77 ॥

రాజా యథార్హం కుర్యాచ్చ ఉపధాభిః పరీక్షణమ్ ।
సమతీతోపధాన్ భృత్యాన్ కుర్యాచ్ఛస్త వనేచరాన్ ॥ 78 ॥

తత్పాదాన్వేషిణో యత్తాంస్తదధ్యక్షాంస్తు కారయేత్ ।
ఏవమాదీని కర్మాణి నృపైః కార్యాణి పార్థివ! ॥ 79 ॥

ఓ రాజా! ధర్మము, అర్థము, కామము, మరియు రాజనీతియను నాలుగు ఉపధల యందు బాగుగా పరీక్షించి యోగ్యులైన వారినే సేవకులుగా నియమించాలి. వారియందు ప్రశంసనీయులైన వారిని వనచరుల రూపమున, సన్యాసి రూపమున రహస్యంగా నియోగించాలి మరియు వారియొక్క ప్రావీణ్యముననుసరించి రహస్యచరులకు అధ్యక్షులుగా నియమింపవలెను. ఓ రాజా! ఈ విధమున వివరింపబడిన పనులన్నింటియందు శ్రద్ధాసక్తుడై వాటి నాచరించుటకు రాజు సర్వాధా ప్రయత్నించాలి.

సర్వథా నేష్యతే రాజ్ఞః తీక్ష్ణోపకరణక్రమః ।
కర్మాణి పాపసాధ్యాని యాని రాజ్ఞో నరాధిప ॥ 80 ॥

సన్తస్తాని న కుర్వన్తి తస్మాత్తాని త్యజేన్నృపః ।
నేష్యతే పృథివీశానాం తీక్ష్ణోపకరణక్రియా ॥ 81 ॥

ఓ నరాధిపా! రాజునకు ఎప్పుడునూ తీక్ష్ణోపకరణక్రియ పనికిరాదు. రాజునకు సంబంధించిన కొన్ని పాపసాధ్యములైన కార్యములుండును. వాటిని సత్పురుషులు మృదుస్వభావులు ఆచరించుట కిష్టపడరు. కావున అటువంటి వాటిలో వారిని వదిలివేయాలి కాని వారియందు తీక్ష్ణముగా వ్యవహరించరాదు.

యస్మిన్ కర్మణి యస్య స్యాద్విశేషేణ చ కౌశలమ్ ।
తస్మిన్ కర్మణి తం రాజా పరీక్ష్య వినియోజయేత్ ॥
పితృపైతామహాన్ భృత్యాన్ సర్వకర్మసు యోజయేత్ ॥ 82 ॥

వినా దాయా చ కృత్యేషు పరీక్షాం స్వకృతాన్తరాన్ ।
నియుంజీత మహాభాగ తస్య తే హితకారిణః ॥ 83 ॥

ఏ ఏ పనులందు ఎవరికి ప్రావీణ్యము కలదో వారిని ఆయా పనులందు రాజు పరీక్షించి నియోగింపవలెను. సాధారణముగా అన్ని కార్యములందును వంశానుక్రమముగా వారి తండ్రి తాతలు పనిచేసినటువంటి స్థానములలో వారి వంశము వారినే భృత్యులుగా నియమించాలి. దాయాదులకు సంబంధించిన పనులు కాక ఇతర కార్యములందు వారిని పరీక్షించి మహానుభావా! భృత్యులుగా నియమించుకోవాలి. ఏలయన వారు సర్వథా రాజుయొక్క హితమునే కోరుతారు.

పరరాజగృహాత్ ప్రాప్తాన్ జనసంగ్రహకామ్యయా ।
దుష్టాన్వాప్యథవాఽదుష్టాన్ ఆశ్రయీత ప్రయత్నతః ॥ 84 ॥

దుష్టం విజ్ఞాయ విశ్వాసం న కుర్యాత్తత్ర భూమిపః ।
వృత్తిం తస్యాపి వర్తేత జనసంగ్రహకామ్యయా ॥ 85 ॥

ఇతర రాజ గృహములనుండి (ఇతర రాజ్యములనుండి) తన దగ్గరకు వచ్చిన వారిని జనులను సంగ్రహించుకోవలెనను కోరికతో దుష్టులైనను సజ్జనులైననూ ప్రయత్నపూర్వకముగా ఆదరించి ఆశ్రయమీయవలెను. కాని దుష్ట స్వభావము గల వారిని గుర్తించి రాజు వారి యందు నమ్మకముంచరాదు. అయితే వారికి కూడ తన రాజ్యములో జీవనవృత్తి కల్పించాలి. ఎందుకనగా రాజు ఎల్లప్పుడు జన సమీకరణమునకు ప్రాధాన్యమీయాలి.

రాజా దేశాన్తరప్రాప్తం పురుషం పూజయేద్ భృశమ్ ।
మమాయం దేశ సంప్రాప్తో బహుమానేన చిన్తయేత్ ॥ 86 ॥

కామం భృత్యార్జనం రాజా నైవ కుర్యాన్నరాధిప ।
న చ వా సంవిభక్తాంస్తాన్ భృత్యాన్ కుర్యాత్ కథంచన ॥ 87 ॥

శత్రవో౽గ్నిర్విషం సర్పో నిస్త్రింశ ఇతి చిన్తయేత్ ।
భృత్యా మనుజశార్దూల రుషితాశ్చ తథైకతః ॥ 88 ॥

ఓ నరాధిపా! ఇతర దేశములనుండి వచ్చినటువంటి పురుషులను రాజు ఆదరించి ఈతడు నా దేశమునకు వచ్చిన అతిథి యని గౌరవముతో సమ్మానించాలి. రాజు ఎప్పుడునూ అధిక సంఖ్యలో సేవకులను నియమించకూడదు. శత్రువు, అగ్ని, విషము, సర్పము మరియు తీక్ష్ణమైన ఖడ్గము మొదలగు వాటితో సమానుడు కోపించిన భృత్యుడు కావున అట్టివారితో జాగరూకతతో ఉండాలి.

తేషాం చారేణ చారిత్రం రాజా విజ్ఞాయ నిత్యశః ।
గుణినాం పూజనం కుర్యాత్ నిర్గుణానాం చ శాసనమ్ ॥

కథితాః సతతం రాజన్ రాజానశ్చారచక్షుషః ॥ 89 ॥

అటువంటి సేవకుల యొక్క చరిత్రను రాజు తన గూఢచారుల ద్వారా నిత్యమూ తెలిసికొని వారిలో గుణవంతులను ప్రోత్సహించి దుష్ట స్వభావులను శాసించుటకు యత్నించాలి. ఓ రాజా! రాజు లెల్లప్పుడూ చారచక్షులు అని చెప్పబడ్డారు కదా! (రాజులు తమ గూఢచారుల యొక్క కన్నులతో లోకాన్నంతటిని నిశితముగా చూస్తారు. కావున వారికి 'చారచక్షులు' అని పేరు వచ్చినదని శాస్త్రోక్తము)

స్వకే దేశే పరే దేశే జ్ఞానశీలాన్ విచక్షణాన్ ।
అనాహార్యాన్ క్లేశసహాన్ నియుంజీత తథా చరాన్ ॥ 90 ॥

జనస్యా౽విదితాన్ సౌమ్యాన్ తథా జ్ఞాతాన్ పరస్పరమ్ ।
వణిజో మన్త్ర కుశలాన్ సాంవత్సర చికిత్సకాన్ ॥
తథా ప్రవ్రాజితాకారాన్ చారాన్ రాజా నియోజయేత్ ॥ 91 ॥

తన దేశములోను పరదేశములోను జ్ఞానవంతులను, వివేకవంతులను, నిరాడంబరులను, క్లేశములను భరించు ఓర్పుకలవారిని, సామాన్యజనము గుర్తు పట్టని వారిని, సౌమ్యులను, పరస్పరము తెలియనట్టివారిని (పరస్పరము తెలిసినట్టివారిని అని పాఠభేదము ఉన్నది)గూఢచారులుగా నియమించుకోవాలి. మరియు వ్యాపారము చేయునట్టి, రాజనీతికుశలు లైనట్టి, జ్యోతిష్కులు మరియు వైద్యులు, సన్న్యాసులు మొదలగు వారి రూపములో రాజు గూఢచారులను నియమించుకోవాలి.

నైకస్య రాజా శ్రద్దధ్యాచ్చారస్యాపి సుభాషితమ్ ।
ద్వయోః సంబంధమాజ్ఞాయ శ్రద్దధ్యాన్నృపతిస్తదా ॥ 92 ॥

పరస్పర స్యావిదితౌ యది స్యాతాం చ తావుభౌ ।
తస్మాద్రాజా ప్రయత్నేన గూఢాంశ్చారాన్నియోజయేత్ ॥ 93 ॥

చారాణామపి యత్నేన రాజ్ఞా కార్యం పరీక్షణమ్ ।
రాగాపరాగౌ భృత్యానాం జనస్య చ గుణాగుణాన్ ॥
సర్వం రాజ్ఞా చరాయత్తం తేషు యత్నపరో భవేత్ ॥ 94 ॥

ఒక గూఢచారి చెప్పినది ఎంత సుభాషితమైననూ రాజు కేవలం దానిపైననూ ఆధారపడకూడదు, నమ్మకూడదు. అట్లు నమ్మవలసివచ్చు పక్షమున ఇంకొక గూఢచారి యొక్క మాటలను కూడ విని వారందించిన విషయమున సంబంధమును తెలిసికొని సరియైన నిర్ణయం తీసికోవాలి. ఒక వేళ ఆ గూఢచారులిద్దరూ పరస్పరము పరిచయము లేనివారైనచో వారి మాటలను నమ్మవచ్చును. అందువలన రాజు గూఢచారులను నియమించునప్పుడు చాలా జాగ్రత్త వహించవలెను. చారులను రాజు చాలా జాకరూకతతో పరీక్షించవలెను. ఎందుకనగా సేవకులందరి రాగద్వేషములు, గుణాగుణములన్నియు గూఢచారుల మీదనే ఆధారపడియుండును. కావున రాజు వారి విషయములో చాలా యత్నపూరుడై వుండవలెను.

కర్మణా కేన మే లోకే జనః సర్వోఽనురజ్యతే ।
విరజ్యతే కేన తథా విజ్ఞేయం తన్మహీక్షితా ॥
విరాగజనకం లోకే వర్జనీయం విశేషతః ॥ 95 ॥

తథా చ రాగప్రభవా హి లక్ష్మీః రాజ్ఞాం మతా భాస్కర వంశచంద్ర! ।
తస్మాత్ ప్రయత్నేన నరేంద్ర ముఖ్యైః కార్యోఽనురాగో భువి మానవేషు ॥ 96 ॥

లోకమున నేనాచరించుచున్న ఏ పనితో జనము ఆనందించుచున్నారు. ఏ పని వలన విరక్తులగుచున్నారను విషయమును రాజు సర్వథా తెలిసికోవాలి. జనులకు విరక్తి కలిగించు బాధ కలిగించునట్టి పనులు వెంటనే వదిలిపెట్టవలెను.

ఓ భాస్కర వంశచంద్రా! జనులందరి అనురాగమే రాజు యొక్క లక్ష్మి వృద్ధిపొందుటకు కారణము కావున శ్రేష్ఠులైన రాజులందరూ ఈ భూలోకమున మానవులందరి అనురాగము పొందుటకు యత్నించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజ్ఞాం సహాయసంపత్తిర్నామ పంచదశాధికద్విశతతమోఽధ్యాయః ॥215॥

శ్రీ మత్స్యమహాపురాణమున రాజుయొక్క సహాయ సంపత్తి వివరణమనే రెండువందల పదిహేనవ అధ్యాయం సమాప్తం.



షోడశాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల పదహారవ అధ్యాయం

రాజధర్మే అనుజీవితవర్తనమ్ – రాజధర్మంలో అనుజీవితవర్తనం

మత్స్యఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

యథాఽనువర్తితవ్యం స్యాన్మనో! రాజ్ఞోఽనుజీవినా ।
తథా తే కథయిష్యామి నిబోధ గదతో మమ ॥ 1 ॥

ఓ మను చక్రవర్తీ! రాజు యొక్క అనుచరులు ఆతనిని ఎట్లు అనువర్తించి ఉండవలెనో వివరించెదను వినుము.

రాజా యత్తు వదేద్వాక్యం శ్రోతవ్యం తత్ ప్రయత్నతః ।
ఆక్షిప్య వచనం తస్య న వక్తవ్యం తథా వచః ॥ 2 ॥

అనుకూలం ప్రియం తస్య వక్తవ్యం జనసంసది ।
రహోగతస్య వక్తవ్య మప్రియం యద్ధితం భవేత్ ॥ 3 ॥

రాజు ఏదైనా చెప్పుతున్నప్పుడు శ్రద్ధగా ప్రయత్నపూర్వకముగా వినవలెను, ఆతను చెబుతున్నప్పుడు మధ్యలో ఆపి తాను మాట్లాడకూడదు. సభయందున్నప్పుడు మరియు సమూహములో నున్నప్పుడు ఆతనికి అనుకూలముగా ప్రియమైన మాటలు చెప్పవలెను. హితకరములైనప్పటికిని రాజునకప్రియములైనచో ఆతను ఏకాంతమున నున్నప్పుడు చెప్పవలెను.

పరార్థమస్య వక్తవ్యం సమే చేతసి పార్థివ ।
స్వార్థం సుహృద్భిర్వక్తవ్యో న స్వయం తు కథంచన ॥ 4 ॥

కార్యాతిపాతః సర్వేషు రక్షితవ్యః ప్రయత్నతః ।
న చ హింస్యం ధనం కించిత్ నియుక్తేన చ కర్మణి ॥ 5 ॥

ఇతరులకు సంబంధించిన విషయములు రాజు సమచిత్తుడై ఉన్నప్పుడు చెప్పవలెను. తనకు కావలసిన విషయమేమైనా ఉన్నచో అనుచరుడు స్వయముగా తానే వివరించకుండా తన మిత్రులతో రాజునకు చెప్పించవలెను. రాజు చెప్పిన ఏకార్యమైననూ సమయము మించకుండా పూర్తి చేయుటకు ప్రయత్నించవలెను. నియమింపబడినట్టి పనియందు ఎప్పుడునూ ధనము వ్యర్థము కాకుండా చూడవలెను.

నోపేక్ష్యస్తస్య మానశ్చ తథా రాజ్ఞః ప్రియో భవత్ ।
రాజ్ఞశ్చ న తథా కార్యం వేషభాషితచేష్టితమ్ ॥ 6 ॥

రాజలీలా న కర్తవ్యా తద్విద్విష్టం చ వర్జయేత్ ।
రాజ్ఞః సమోఽధికో వా న కార్యో వేషో విజానతా ॥ 7 ॥

రాజు చేయు సమ్మానమును ఎప్పుడునూ ఉపేక్షింపకూడదు, ఎల్లప్పుడు రాజునకు ప్రీతికలుగునట్లు వ్యవహరించవలెను. రాజుయొక్క పనులను గాని, వేషము, మాట్లాడుట, చేష్టలు మొదలగువాటిని ఎప్పుడునూ అనుకరించకూడదు. రాజునకు ఇష్టము కానివాటిని వదిలిపెట్టవలెను. జ్ఞానవంతుడైనవాడెవడును రాజుతో సమానముగా కాని ఆతనికంటే అధికముగా కాని వేషభూషాదులను ధరించకూడదు.

ద్యూతాదిషు తథైవాన్యత్ కౌశలం తు ప్రదర్శయేత్ ।
ప్రదర్శ్య కౌశలం చాస్య రాజానం తు విశేషయేత్ ॥ 8 ॥

అన్తః పురజనాధ్యక్షైః వైరిదూతై ర్నిరాకృతైః ।
సంసర్గం న వ్రజేద్రాజన్ వినా పార్థివ శాసనత్ ॥ 9 ॥

నిఃస్నేహితాం చావమానం ప్రయత్నేన తు గోపయేత్ ।
యచ్చ గుహ్యం భవేద్రాజ్ఞో న తల్లోకే ప్రకాశయేత్ ॥ 10 ॥

ద్యూతాది క్రీడలయందు కౌశలమును ప్రదర్శింపవలెను కాని వాటియందు రాజే జయించునట్లు ఆడవలెను. అట్లే రాజు యొక్క అనుమతి లేనిదే అంతఃపురాధ్యక్షులతో, శత్రువుల దూతలతో, రాజుచేత తీసివేయబడిన అనుచరులతో మాట్లాడకూడదు, ఎటువంటి సంబంధమునకు అంగీకరించకూడదు. ఒక వేళ రాజునకు తమపట్ల స్నేహరాహిత్యము ఉన్నను, అవమాన దృష్టియున్ననూ రహస్యముగానే ఉంచవలెను కాని ఎవరికినీ చెప్పకూడదు, రాజునకు సంబంధించిన రహస్యమును సర్వథా కాపాడాలి. లోకమునకు తెలియునట్లు బహిరంగ పర్చకూడదు.

నృపేణ శ్రావితం యత్స్యాత్ వాచ్యావాచ్యం నృపోత్తమ ।
న తత్సం శ్రావయేల్లోకే తథా రాజ్ఞోఽప్రియో భవేత్ ॥ 11 ॥

ఆజ్ఞాప్యమానే వాన్యస్మిన్ సముత్థాయ త్వరాన్వితః ।
కిమహం కరవాణీతి వాచ్యో రాజా విజానతా ॥ 12 ॥

కార్యావస్థాం చ విజ్ఞాయ కార్యమేవ తథా భవేత్ ।
సతతం క్రియమాణే ఽస్మింల్లాఘవం తు వ్రజేద్ధ్రువమ్ ॥ 13 ॥

ఓ నృపోత్తమా! రాజుచే వినిపింపబడిన యోగ్యాయోగ్యములైన విషయములు వేటినీ ఎవరికీ తెలుపకూడదు, అలా తెలిపినవాడు రాజునకు అప్రియుడౌతాడు. రాజు ఇతరులకే దైనా పనిచేయుటకు ఆజ్ఞాపించుచున్ననూ తాను లేచి త్వరగా నేనేమి కార్యము నిర్వర్తించగలను అని బుద్ధిమంతుడైనవాడు రాజును అడగాలి. కార్యావస్థను తెలిసికొని దానిని నిర్వహించుటకు ప్రయత్నం చేయవలెను. ఎప్పుడూ ఇట్లే వ్యవహరించిననూ రాజు ముందు అట్లు చెప్పుట వలన చులకన అయ్యే అవకాశమున్నది కావున అనుచరులు జాగ్రత్తగా ఉండవలసినది.

రాజ్ఞః ప్రియాణి వాక్యాని న చాత్యర్థం పునఃపునః ।
న హాస్యశీలస్తు భవేన్న చాపి భృకుటీముఖః ॥ 14 ॥

నాతివక్తా న నిర్వక్తా న చ మాత్సరికస్తథా ।
ఆత్మ సంభావితశ్చైవ న భవేత్తు కథంచన ॥ 15 ॥

దుష్కృతాని నరేంద్రస్య న తు సంకీర్తయేత్ క్వచిత్ ।

రాజునకు ప్రియమైన విషయములు కదా యని వాటినే మళ్ళీ మళ్ళీ వినిపించకూడదు, రాజు ముందు అధికముగా నవ్వకూడదు మరియు గంభీరముతో కనుబొమ్మలు ముడిచి చూడకూడదు. అతిగా మాట్లాడుట లేదా అసలు మాట్లాడకుండా ఉండుట, మాత్సర్యముతో గంభీరముగా నుండుట, తనను తాను పొగడుకొనుట మొదలగునవి రాజు ముందు ఎప్పుడునూ చేయకూడదు. అట్లే రాజుచే ఆచరింపబడిన దుష్కర్మలగురించి ఎప్పుడునూ ఉచ్చరించగూడదు.

వస్త్రమస్త్రమలంకారం రాజ్ఞా దత్తం తు ధారయేత్ ॥ 16 ॥

ఔదార్యేణ న తద్దేయమన్య స్మై భూతి మిచ్ఛతా ।
తత్రైవాత్మాసనం కార్యం దివా స్వప్నం న కారయేత్ ॥ 17 ॥

వస్త్రము, అస్త్రము, అలంకారము మొదలగునవి రాజు ఇచ్చినచో వాటిని స్వయముగా ధరించవలెను గాని ఔదార్యముతో అవి ఇతరులకు ఇవ్వకూడదు, అట్లిచ్చుటవలన ఐశ్వర్యం నశిస్తుంది. రాజు ముందు ఎక్కువ తినగూడదు మరియు పగటిపూట కలలు కనగూడదు.

నానిర్దిష్టేత్తథా ద్వారే ప్రవిశేత్తు కథంచన ।
న చ పశ్యేత్తు రాజానమయోగ్యాసు చ భూమిషు ॥ 18 ॥

రాజ్ఞస్తు దక్షిణే పార్శ్వే వామే చోపవిశేత్తదా ।
పురస్తాచ్చ తథా పశ్చాదాసనం తు విగర్హితమ్ ॥ 19 ॥

నిర్దేశింపడని ద్వారము ద్వారా రాజభవనమునందు ప్రవేశింపరాదు, అయోగ్యములైన ప్రదేశములందు రాజును చూడడమునకై ప్రయత్నించకూడదు, రాజుయొక్క కుడిలేదా ఎడమవైపులందే కూర్చొనవలెను. కాని ముందు మరియు వెనుకవైపులందు కూర్చుండకూడదు, అట్లు కూర్చుండుట గర్హితము.

జృంభాం నిష్ఠీవనం కాసం కోపం పర్యస్తికాశ్రయమ్ ।
భృకుటిం వాన్తముద్గారం తత్సమీపే వివర్జయేత్ ॥ 20 ॥

ఆవలించుట, ఉమ్మివేయుట, దగ్గుట, కోపించుట, దిండ్లును ఆనుకుని కూర్చుండుట, కనుబొమ్మలు ముడివేయుట, కక్కుట మరియు త్రేపు తీయుట మొదలగునవి రాజు సమీపమున చేయకూడదు.

స్వయం తత్ర న కుర్వీత స్వగుణాఖ్యాపనం బుధః ।
స్వగుణాఖ్యాపనే యుక్త్యా పరమేవ ప్రయోజయేత్ ॥ 21 ॥

తెలివైనవాడెవడును రాజుముందు తన గుణములను ప్రశంసించుకొనుట తగదు, ఒకవేళ తన గురించి రాజునకు వివరింపవలసివచ్చినచో యుక్తితో ఇతరులద్వారా తెలిపించుట ఉచితము. రాజు ముందు ఆత్మప్రశంస చేసుకోకూడదు.

హృదయం నిర్మలం కృత్వా పరాం భక్తిముపాశ్రితైః ।
అనుజీవి గుణై ర్భావ్యం నిత్యం రాజ్ఞామతంద్రితైః ॥ 22 ॥

శాఠ్యం లౌల్యం చ పైశున్యం నాస్తిక్యం క్షుద్రతా తథా ।
చాపల్యం చ పరిత్యాజ్యం నిత్యం రాజ్ఞోఽనుజీవిభిః ॥ 23 ॥

నిర్మలమైన హృదయము కలిగి ఉండుట, రాజుయందు పరమభక్తి కలిగి ఉండుట, సోమరితనము లేకుండుట మొదలగు గుణములు రాజసేవకులకు చాలా ముఖ్యము, ఇంకనూ శాఠ్యము అనగా కొంటెతనము, లౌల్యము అనగా ఆయా విషయములందత్యంతాసక్తి, పిసినారి తనము, నాస్తికత, క్షుద్రత్వము, చాపల్యము మొదలగు వాటిని రాజసేవకులు సదా పరిత్యజించవలెను.

శ్రుతివిద్యా సుశీలైశ్చ సంయోజ్యాత్మానమాత్మనా ।
రాజసేవాం తతః కుర్యాద్ భూతయే భూతివర్ధనీమ్ ॥ 24 ॥

నమస్కార్యాః సదా చాస్య పుత్రవల్లభమన్త్రిణః ।
సచివైశ్చాస్య విశ్వాసో న తు కార్యః కథంచన ॥ 25 ॥

వేదాది విద్యలందు నిపుణులైనట్టి శీలవంతులైనట్టి వారు ఆత్మసంయమన పూర్వకముగా రాజసేవ చేయాలి. దానివలన శ్రేయస్సు కలుగుతుంది. సంపద వృద్ధిపొందుతుంది. రాజుయొక్క పుత్రులు, ప్రియవల్లభులు, మంత్రులు మొదలగు వారు ఎదుటవచ్చినప్పుడు తప్పనిసరిగా నమస్కరించాలి. కాని మంత్రులను మాత్రము ఎప్పుడునూ విశ్వసించకూడదు.

అపృష్టశ్చాస్య న బ్రూయాత్ కామం బ్రూయాత్తథా యది ।
హితం తథ్యం చ వచనం హితైః సహ సునిశ్చితమ్ ॥ 26 ॥

చిత్తం చైవాస్య విజ్ఞేయం నిత్యమేవానుజీవినా ।
భర్తురారాధనం కుర్యాచ్చిత్తజ్ఞో మానవః సుఖమ్ ॥ 27 ॥

రాజు అడుగనిదే ఏదియును చెప్పకూడదు. ఒకవేళ ఏదైనా చెప్పవలసివచ్చినను రాజునకు హితులైనవారిని సంప్రదించి తథ్యముగా ఆతనికి హితమే కలిగించునని నిశ్చయించుకొని చెప్పాలి. రాజానుచరులు రాజుయొక్క చిత్తమునర్థము చేసికోవాలి, రాజుయొక్క చిత్తమునెరిగి తదనుకూలముగా ఆయనను ఆరాధించినవారు సుఖముగా జీవిస్తారు.

రాగాపరాగౌ చైవాస్య విజ్ఞేయో భూతిమిచ్ఛతా ।
త్యజేద్విరక్తో నృపతీ రక్తోవృత్తిం తు కారయేత్ ॥ 28 ॥

విరక్తః కారయేన్నాశం విపక్షాభ్యుదయం యథా ।
ఆశావర్ధనకం కృత్వా ఫలనాశం కరోతి చ ॥ 29 ॥

అకోపోఽపి సకోపాభః ప్రసన్నోఽపి చ నిష్కలః ।
వాక్యం చ సమదం వక్తి వృత్తిచ్ఛేదం కరోతి వై ॥ 30 ॥

తన యొక్క యోగ క్షేమములను కోరుకొను సేవకుడు రాజునకు తనయందు అనురాగమున్నదా ద్వేషమా అని తెలిసికొని ద్వేషభావమున్నచో ఆ రాజును వదిలెయ్యాలి అట్లే అభిమానమున్నట్లైతే శ్రద్ధతో సేవించాలి. విరక్తుడైన రాజు తనను నాశనం చేయిస్తాడు. శత్రువుల అభ్యుదయానికి తొడ్పడతాడు ఆశలు కల్పించి మరల తానే ఫలమును నాశనం చేస్తాడు. కోపరహితుడైనప్పటికిని కోపమున్నవాని వలె కనిపిస్తాడు. ప్రసన్నచిత్తుడైనప్పటికి కళావిహీనుడైనట్లు కనబడతాడు. చాలా గర్వంతో మాట్లాడుతాడు. స్వజీవనానికి నాశనం తెస్తాడు.

ప్రదేశవాక్యముదితో న సంభావయతేఽన్యథా ।
ఆరాధనాసు సర్వాసు సుప్తవచ్చ విచేష్టతే ॥ 31 ॥

కథాసు దోషం క్షిపతి వాక్యభంగం కరోతి చ ।
లక్ష్యతే విముఖశ్చైవ గుణసంకీర్తనేఽపి చ ॥ 32 ॥

దృష్టిం క్షిపతి చాన్యత్ర క్రియమాణే చ కర్మణి ।
విరక్తలక్షణం చైతచ్ఛృణు రక్తస్య లక్షణమ్ ॥ 33 ॥

విరక్తుడైన రాజు అనుచరుడు చెప్పిన వాక్యాలు వినికూడ పూర్వము వలే సమ్మానించడు, సర్వవిధములైన సేవలు చేస్తున్నప్పుడు నిద్రబోతున్నట్లు నటిస్తాడు, ఏవైనా విషయాలు వివరిస్తున్నప్పుడు దోషాలు ఎత్తి చూపిస్తాడు, మధ్యలో ఆపేస్తాడు, ఆతని గుణసంకీర్తనము చేయుచున్నను విముఖుడుగా ఉంటాడు. తాను ఆచరిస్తున్న కర్మను వదిలి తన దృష్టిని ఇతరత్ర నిలుపుతాడు. ఇవన్నియు విరక్తుడైనటువంటి రాజుయొక్క లక్షణాలు, ఇక ఇప్పుడు అనురక్తుడగు వాని లక్షణాలు తెలుపుతా విను.

దృష్ట్వా ప్రసన్నో భవతి వాక్యం గృహ్ణాతి చాదరాత్ ।
కుశలాది పరిప్రశ్నం సంప్రయచ్ఛతి చాసనమ్ ॥ 34 ॥

వివిక్తదర్శనే చాస్య రహస్యేనం న శంకతే ।
జాయతే హృష్టవదనః శ్రుత్వా తస్య తు తత్కథామ్ ॥ 35 ॥

అనురక్తుడైన రాజు భృత్యులను చూడగానే ప్రసన్నుడౌతాడు. ఆతను చెప్పినవాటిని ఆదరంతో విని, కుశల ప్రశ్నలు వేస్తాడు, కూర్చొనుటకై ఆసనం చూపిస్తాడు, వివిక్తప్రదేశాలందు కానీ అంతఃపురమునందు కాని కనబడినప్పుడు సందేహించకుండా ఉంటాడు. భృత్యులు చెప్పిన మాటలు విని సంతుష్ట వదనుడౌతాడు.

అప్రియాణ్యపి వాక్యాని తదుక్తాన్యభినందతే ।
ఉపాయనం చ గృహ్ణాతి స్తోకమప్యాదరాత్తథా ॥ 36 ॥

కథాన్తరేషు స్మరతి ప్రహృష్టవదనస్తథా ।
ఇతి రక్తస్య కర్తవ్యా సేవా రవికులోద్వహ! ॥ 37 ॥

భృత్యులు చెప్పునట్టి వాక్యాలు అప్రియములైనప్పటికిని వారిని అభినందిస్తాడు, అల్పమైన ఉపాయనము నిచ్చిననూ ఆదరంతో స్వీకరిస్తాడు, ఇతర కథా ప్రస్తావ సందర్భమున కూడ ప్రహష్టవదనుడై భృత్యులను స్మరిస్తాడు. ఓ సూర్యవంశతిలక! ఇట్లు అనురక్తుడైనటువంటి రాజు యొక్క సేవ చేయాలి.

మిత్రం న చాపత్సు తథా చ భృత్యాః భజన్తి యే నిర్గుణమప్రమేయమ్ ।
విభుం విశేషేణ చ తే వ్రజన్తి సురేంద్ర ధామామర వృందజుష్టమ్ ॥ 38 ॥

ఇట్లు ఏ భృత్యులైతే నిర్గుణుడు (త్రిగుణాతీతుడు) అప్రమేయుడు అగు ప్రభువును ఆపదలయందు కూడ మిత్రులవలే వదిలి పెట్టకుండా విశేషముగా సేవింతురో వారు దేవతల సమూహములచే సేవింపబడుచున్న ఇంద్రుని ధామమునకు పోతారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజధర్మే ఽనుజీవిత వర్తనం నామ షోడశాధిక ద్విశతతమోఽధ్యాయః ॥216॥

శ్రీ మత్స్యమహాపురాణమున రాజధర్మవివరణ ప్రసంగమున అనుజీవిత వర్తనం అనే రెండవందల పదహారవ అధ్యాయం సమాప్తం.



సప్తదశాధిక ద్విశతతమోఽధ్యాయః - రెండవందల పదిహేడవ అధ్యాయం

రాజ్ఞాం ఓషధ్యాది సంచయకథనమ్ - రాజులకు సంబంధించిన ఔషధాదుల సంచయన వర్ణనం

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

రాజా సహాయ సంయుక్తః ప్రభూతయవ సేంధనమ్ ।
రమ్యమానత సామన్తం మధ్యమం దేశమావసేత్ ॥ 1 ॥

వైశ్య శూద్ర జనప్రాయ మనాహార్యం తథా పరైః ।
కించిత్ బ్రాహ్మణ సంగుప్తం బహుకర్మకరం తథా ॥ 2 ॥

రాజు సహాయకగణములతో, అంగరక్షకులతో, సరిపడునంత గడ్డి, ఇంధనములు (కట్టెలు) దొరకునటువంటిదీ, రమణీయముగా ఉండునట్టిదీ, సామంతులందరు వినమ్రతతో పిలిచినవెంటనే వచ్చి సేవించుటకు వీలుగా ఉండునట్టిదీ, వైశ్యులు శూద్రులు మొదలగు జనములున్నట్టివీ, శత్రువులు ప్రవేశించుటకు వీలుకానట్టిదీ, కొద్దిమంది బ్రాహ్మణులున్నట్టిదీ, ఆయా కార్యములు నిర్వహించుటకు అధిక సంఖ్యలో కర్మకారులున్నట్టిదీ ప్రదేశము నందు స్వ రాజధానిని నిర్మించుకొని అయిన నివసించాలి.

అదేవ మాతృకం రమ్యమనురక్త జనాన్వితమ్ ।
కరైరపీడితం చాపి బహుపుష్పఫలం తథా ॥ 3 ॥

అగమ్యం పరచక్రాణాం తద్వాసగృహమాపది ।
సమదుఃఖం సుఖం రాజ్ఞః సతతం ప్రియమాస్థితమ్ ॥ 4 ॥

సరీసృపవిహీనం చ వ్యాఘ్రతస్కరవర్జితమ్ ।
ఏవం విధం యథాలాభం రాజా విషయమావసేత్ ॥ 5 ॥

దేవ మాతృకము కానటువంటి(వర్షాధారముతో మాత్రమే పంటలు పండించుకొను దేశము దేవ మాతృకమని అంటారు) కేవలం వర్షములపైననే ఆధారపడకుండా ఉండునట్టిదీ, రమ్యమైనట్టి అనురక్తులైన జనులున్నటువంటిదీ, పన్నుల భారముచేత పీడించకుండా ఉండునట్టిదీ, అనేకవిధములైన ఫలములు, పుష్పములు లభించునటువంటిదీ, శత్రుసైన్యములకు అగమ్యమైనట్టిదీ, ఆపదలు లేనటువంటిదీ, సుఖదుఃఖములు సమానముగా ఉన్నట్టిదీ, ఎల్లప్పుడూ ఆనందము కలిగించునట్టిదీ, సరీసృపములు(సర్పమలు) వ్యాఘ్రములు, తస్కరులు లేనటువంటిదీ, లాభము చేకూర్చునటువంటిదీ అయిన ప్రదేశమునందు రాజు నివసించవలెను.

తత్ర దుర్గం నృపఃకుర్యాత్ షణ్ణామేకతమం బుధః ।
ధనుర్దుర్గం మహీదుర్గం నరదుర్గం తథైవ చ ॥ 6 ॥

వార్క్ష్యం చైవాంబుదుర్గం చ గిరిదుర్గం చ పార్థివ ।
సర్వేషామేవ దుర్గాణాం గిరిదుర్గం ప్రశస్యతే ॥ 7 ॥

ధనుర్దుర్గము, మహీదుర్గము, నరదుర్గము, వృక్షదుర్గము, అంబుదుర్గము, గిరిదుర్గము అను ఆరు విధములగు దుర్గములలో ఏదో ఒక దానిని పూర్వము తెలిపినట్టి ప్రదేశమునందు రాజు నిర్మించుకొనవలెను. కాని ఓ రాజా! ఈ ఆరు దుర్గములలో గిరిదుర్గమే శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది.

దుర్గం చ పరిఖోపేతం వప్రాట్టాలకసంయుతమ్ ।
శతఘ్నీ యంత్రముఖ్యైశ్చ శతశశ్చ సమావృతమ్ ॥ 8 ॥

గోపుర సకపాటం చ తత్ర స్యాత్సుమనోహరమ్ ।
సపతాకం గజారూఢో యేన రాజా విశేత్ పురమ్ ॥ 9 ॥

దుర్గమునకు చుట్టూ పరిఖము(లోతైన కందుకము కొటచుట్టూ త్రవ్వి శత్రువులు అకస్మాత్తుగా కోటపై దండెత్తకుండా కాపాడుకొనుటకై పూర్వకాలము రాజులు ఏర్పర్చుకునే రక్షణ వలయము) ఉండాలి. అట్లే ఎత్తైన ప్రాకారములు మరియు వాటిపైన మరల అట్టాలకములు అనగా కోటగోడలపై నిర్మించుకొను నీటితో కూడిన నదులను బోలిన కందుకములు కూడ ఉండవలెను. అంతేకాక వందలకొలది శ్రేష్టములైన శతఘ్నీయంత్రములతో కూడినదైయుండాలి. దృఢమైన తలుపులతో కూడిన సుమనోహరమైన ద్వారముండాలి అదియునూ ధ్వజంతో కూడుకొని గజారూఢుడై రాజు ప్రవేశించుటకు యోగ్యంగా ఉండాలి.

చతస్రశ్చ తథా తత్ర కార్యాస్త్వాయతవీథయః ।
ఏకస్మింస్తత్ర వీథ్యగ్రే దేవవేశ్మ భవేద్ దృఢమ్ ॥ 10 ॥

వీథ్యగ్రే చ ద్వితీయే చ రాజవేశ్మ విధీయతే ।
ధర్మాధికరణం కార్యం వీథ్యగ్రే చ తృతీయకే ॥ 11 ॥

చతుర్థేత్వథ వీథ్యగ్రే గోపురం చ విధీయతే ।

ఆ దుర్గమునందు పొడవైన నాలుగు వీధులు నిర్మించాలి. వాటిలో మొదటివీధియొక్క చివరిభాగమున దృఢమైన దేవాలయము, రెండవ వీధి చివర రాజభవనము, మూడవ వీధియొక్క చివర ధర్మాధికారి స్థానము, నాలుగవ వీధి చివరి భాగమున గోపురము - పురద్వారము ఉండునట్లు నిర్మించుకొనవలెను.

ఆయతం చతురస్రం వా వృత్తం వా కారయేత్ పురమ్ ॥ 12 ॥

ముక్తిహీనం త్రికోణం చ యవ మధ్యం తథైవ చ ।
అర్ధచంద్రప్రకారం చ వజ్రాకారం చ కారయేత్ ॥ 13 ॥

అర్ధచంద్రం ప్రశంసన్తి నదీ తీరేషు తద్వసన్ ।
అన్యత్తత్ర న కర్తవ్యం ప్రయత్నేన విజానతా ॥ 14 ॥

పురము ఆయుతము అనగా దీర్ఘచతురస్రము, చతురస్రము, వృత్తము, త్రికోణము, యవమధ్యము, అర్ధచంద్రము, వజ్రము మొదలగు ఆకారములలో ఉండవచ్చును. నదీ తీరములందు నిర్మించుకొను దుర్గము

అర్ధచంద్రాకారములోనే నిర్మించుట ప్రశంసమని పండితులు చెబుతారు. ఇవి కాకుండా ఇతర ఆకారములలో తమకు నచ్చిన రీతిలో దుర్గములు తెలిసినవాడెవడైననూ నిర్మించుకొనుటకు ప్రయత్నించకూడదు.

రాజ్ఞా కోశగృహం కార్యం దక్షిణే రాజవేశ్మనః ।
తస్యాపి దక్షిణే భాగే గజస్థానం విధీయతే ॥ 15 ॥

గజానాం ప్రాఙ్ముఖీ శాలా కర్తవ్యా వాప్యుదఙ్ముఖీ ।
ఆగ్నేయే చ తథా భాగే ఆయుధాగారమిష్యతే ॥ 16 ॥

రాజభవనమునకు దక్షిణదిశయందు కోశగృహము దానికి దక్షిణమున గజస్థానమును నిర్మించుకొనవలెను. ఈ గజస్థానము తూర్పు ముఖముగా నిర్మించుకొనవలెను. ఈ గజస్థానము తూర్పు ముఖముగా కాని ఉత్తరాభిముఖముగా కాని ఉండవచ్చును. ఆగ్నేయభాగమున ఆయుధాగారముండాలి.

మహానసం చ ధర్మజ్ఞ కర్మశాలాస్తథాపరాః ।
గృహం పురోధసః కార్యం వామతో రాజవేశ్మనః ॥ 17 ॥

మన్త్రివేద విదాం చైవ చికిత్సా కర్తురేవ చ ।
తత్రైవ చ తథా భాగే కోష్ఠాగారం విధీయతే ॥ 18 ॥

అట్లే ఆగ్నేయభాగమున వంటశాల, ఇతర కర్మశాలలుండవలెను. రాజభవనమునకు ఎడమభాగమున పురోహితగృహము, మంత్రిగృహము, వేదపండితుల గృహములు, వైద్యుని గృహముండవలెను, అట్లే ఆదిశయందే కోష్ఠాగారముండుట శ్రేయస్కరము.

గవా స్థానం తథైవాత్ర తురగాణాం తథైవ చ ।
ఉత్తరాభిముఖా శ్రేణీ తురగాణాం విధీయతే ॥ 19 ॥

దక్షిణాభిముఖా వాఽథ పరిశిష్టాస్తు గర్హితాః ।
తురగాస్తే తథా ధార్యాః ప్రదీపైః సార్వరాత్రికైః ॥ 20 ॥

అచ్చటనే గోశాల మరియు అశ్వశాల నిర్మించవలెను. వాటిలో అశ్వశాలయందు అశ్వములు ఉత్తరాభిముఖమై ఉండునట్లు గాని, దక్షిణాభిముఖమై ఉండునట్లు గాని నిర్మించాలి. ఇతర దిశలయందు అభిముఖముగా ఉండుట నిషిద్ధం, అశ్వశాలలో రాత్రులలో (రాత్రిసమయాలలతో) కాగడాలు (ప్రదీపములు) వెలుగుచుండాలి.

కుక్కుటాన్ వానరాంశ్చైవ మర్కటాంశ్చ విశేషతః ।
ధారయేదశ్వశాలాసు సవత్సాం ధేనుమేవ చ ॥ 21 ॥

అజాశ్చ ధార్యా యత్నేన తురగాణాం హితైషిణా ।
గోగజాశ్వాదిశాలాసు తత్పురీషస్య నిర్గమః ॥ 22 ॥

అస్తంగతే న కర్తవ్యో దేవదేవే దివాకరే ।

అశ్వముల యొక్క హితము కోరువారు ఆ అశ్వశాలలయందు కోళ్ళు, వానరములు, కోతులు, దూడలతో కూడిన గోవులు, మేకలు మొదలగువాటిని గట్టిప్రయత్నము జైసైనా నివసింపజేయాలి. గో గజాశ్వాది శాలలనుండి సూర్యాస్తమయమునకు ముందుగానే వాటి మలాన్ని తీసివేయాలి. సూర్యాస్తమయము తర్వాత వాటి పురీషమును (పేడ) తీయుట పనికిరాదు.

తత్ర తత్ర యథాస్థానం రాజా విజ్ఞాయ సారథీన్ ॥ 23 ॥

దద్యాదావసథ స్థానం సర్వేషామనుపూర్వశః ।
యోధానాం శిల్పినాం చైవ సర్వేషామవిశేషతః ॥ 24 ॥

దద్యాదావసథాన్ దుర్గే కాలమన్త్రవిదాం శుభాన్ ।
గోవైద్యానశ్వ వైద్యాంశ్చ గజవైద్యాంస్తథైవ చ ॥ 25 ॥

ఆహరేత భృశం రాజా దుర్గే హి ప్రబలా రుజః ।
కుశీలవానాం విప్రాణాం దుర్గే స్థానం విధీయతే ॥ 26 ॥

న బహూనామతో దుర్గే వినా కార్యం తథా భవేత్ ।

ఈ గోగజాశ్వాది శాలలయొక్క క్రమముననుసరించి అదే వరుసక్రమమున వాటికి సంబంధించిన సారథులకు వాటికి దగ్గరలోనే నివాసస్థలము లేర్పర్చవలెను. దుర్గమునందు యోధులకు, శిల్పులకు, కాలజ్ఞులకు అనగా జ్యోతిష్కులకు, మంత్రవేత్తలకు విశేషముగా చక్కని గృహములను రాజు నిర్మించవలెను. అంతేకాక గోవులకు, అశ్వములకు, గజములకు సంబంధించిన వైద్యులకు కూడ నివాసము లేర్పరిచి దుర్గమునందుండునట్లు యత్నించాలి. దుర్గమునందు ప్రబలమైన వ్యాధులు ఈపశుగణమునకు సోకుటకు అవకాశము కలదు. బ్రాహ్మణులు, నటులు మొదలగువారికి కూడ దుర్గము నందు స్థానముండాలి. కాని పని లేనివారికెవ్వరికినీ దుర్గమునందు స్థానముండరాదు. వీరికంటే అధికముగా కోటయందెవ్వరునూ ఉండకూడదు.

దుర్గే చ తత్ర కర్తవ్యా నానాప్రహరణాన్వితాః ॥ 27 ॥

సహస్రఘాతినో రాజన్ తైస్తు రక్షా విధీయతే ।
దుర్గే ద్వారాణి గుప్తాని కార్యాణ్యాపి చ భూభుజ ॥ 28 ॥

సంచయశ్చాత్ర సర్వేషాం ఆయుధానాం ప్రశస్యతే ।

ఓ రాజా! వేలాదిమందిని వధింపగల అనేకవిధములైన ఆయుధములను ధరించువారిని దుర్గము నందుండునట్లు యత్నించాలి. అట్లే ఓ భూభుజా! దుర్గమునకు గుప్తములైన ద్వారములు కూడ నిర్మించుకొనవలెను. అంతేకాక అనేకవిధములైన ఆయుధముల సంచయము దుర్గమునందుంచాలి.

ధనుషాం క్షేపణీయానాం తోమరాణాం చ పార్థివ ॥ 29 ॥

శరాణా మథ ఖడ్గానాం కవచానాం తథైవ చ ।
లగుడానాం గుడానాం చ హుడానా పరిఘైః సహ ॥ 30 ॥

అశ్మనాం చ ప్రభూతానాం ముద్గరాణాం తథైవ చ ।
త్రిశూలానాం పట్టిశానాం కుఠారాణాం చ పార్థివ ॥ 31 ॥

ప్రాసానాం చ సశూలానాం శక్తీనాం చ నరోత్తమ ।
పరశ్వధానాం చక్రాణాం వర్మణాం చర్మభిఃసహ ॥ 32 ॥

కుద్దాలరజ్జువేత్రాణాం పీఠకానాం తథైవ చ ।
తుషాణాం చైవ దాత్రాణాం అంగారాణాం చ సంచయః ॥ 33 ॥

సర్వేషాం శిల్పిభాండానాం సంచయశ్చాత్ర చేష్యతే ।
వాదిత్రాణాం చ సర్వేషా మోషధీనాం తథైవ చ ॥ 34 ॥

ఓ పార్థివా! ఇంకనూ ధనుష్యములు, బాణములు, తోమరములు, ఖడ్గములు, కవచములు, లగుడములు=పశువులను తోలుటకు ఉపయోగించుకట్టెలు, గుడములు, హుడములు, పరిఘములు, రాళ్ళు, ముద్గరములు, త్రిశూలములు, పట్టిశములు, కుఠారములు, ప్రాసములు, శూలములు, శక్తి(యను ఆయుధములు), గండ్రగొడ్డళ్ళు, చక్రములు, కవచములు, డాలు, కుద్దాలములు, త్రాడుతోనున్న కర్రలు, పీఠకములు, తుషలు=ధాన్యముల పొట్టు, దాత్రములు=కొడవళ్ళు, బొగ్గులు, సర్వశిల్పిభాండములు, వాద్యములు, సర్వవిధ ఔషధములు మొదలగువాటిని దుర్గమునందు ఎల్లపుడూ సిద్ధముగా ఉండునట్లు రాజు యత్నించాలి.

యవసానాం ప్రభూతానామింధనస్య చ సంచయః ।
గుడస్య సర్వతైలానాం గోరసానాం తథైవ చ ॥ 35 ॥

వసానామథ మజ్జానాం స్నాయూనా మస్థిభిః సహ ।
గోచర్మపటహానాం చ ధాన్యానాం సర్వత స్తథా ॥ 36 ॥

తథైవాభ్రపటానాం చ యవ గోధూమయోరపి ।
రత్నానాం సర్వవస్త్రాణాం లోహానా మప్యశేషతః ॥ 37 ॥

యవసములు (పశువుల మేత గడ్డి) మరియు వంట కట్టెలు అధికముగా నిలువ ఉండునట్లు రాజు యత్నించాలి. ఇంకనూ, బెల్లము, సర్వవిధ తైలములు, గోరసములు, వస-మజ్జ- స్నాయువులు, ఎముకలు, ఎద్దుల చర్మముతో చేసిన తప్పెటలు, వివిధ ధాన్యములు కూడ ప్రోగుచేసి దుర్గమునందుంచాలి. ఓ రాజా! అభ్రపటములు =శిబిరములు నిర్మించుకొనుటకుపయోగపడు దృఢవస్త్రములు, యవలు, గోధుమలు, రత్నములు, వివిధవస్త్రములు, సర్వవిధలోహములు మొదలగువాటిని కూడ సంగ్రహించుకొని దుర్గమునందు రాజు నిలువ ఉంచాలి.

కలాయముద్గమాషాణాం చణకానాం తిలైః సహ ।
తథా చ సర్వసస్యానాం పాంశుగోమయయోరపి ॥ 38 ॥

శణసర్జరసం భూర్జం జతులాక్షా చ టంకణమ్ ।
రాజా సంచినుయాద్దుర్గే యచ్చాన్యదపి కించన ॥ 39 ॥

కుంభాశ్చాశీవిషైః కార్యా వ్యాలసింహాదయస్తథా ।
మృగాశ్చ పక్షిణశ్చైవ రక్ష్యాస్తే చ పరస్పరమ్ ॥ 40 ॥

స్థానాని చ విరుద్ధానాం సుగుప్తాని పృథక్ పృథక్ ।
కర్తవ్యాని మహాభాగ యత్నేన పృథివీక్షితా ॥ 41 ॥

కలాయములు=బఠాణీలు, పెసలు, మినుములు, శనగలు, నువ్వులు, ఇంకా సర్వవిధ ధాన్యములు, ధూళులు, గోమయములు, జనుము, తగరము, భూర్జపత్రములు, లక్క, లాక్షారసము, రాళ్ళను కూడ చెక్కుటకు వీలైన ఉలి మొదలగువాటిని కూడ రాజు దుర్గమునందు సమృద్ధిగా ఉండునట్లు యత్నించాలి. అంతేకాక ఓ రాజా। పాములతో నిండిన కుంభములు, సింహాది క్రూరమృగములు, మృగములు, వివిధ పక్షులు కూడ దుర్గమునందుండు నట్లు యత్నించడమే కాకుండా వాటిని పరస్పరము హానిజరుగకుండా ఉండునట్లు రక్షించాలి. ఓ మహాభాగా! పరస్పర విరోధముగల పదార్థములకు, ప్రాణులకు కూడ కల్పించుస్థానములు రహస్యముగా రక్షితములై ఉ ండునట్లు రాజు యత్నించాలి.

ఉక్తాని చాప్యనుక్తాని రాజద్రవ్యాణ్యశేషతః ।
సుగుప్తాని పురే కుర్యాజ్జనానాం హితకామ్యయా ॥ 42 ॥

ఈ విధముగా ఓ రాజా! ఈ క్రమములో చెప్పినవి మరియు చెప్పనటువంటివి అయిన ద్రవ్యములన్ని పురమునందు జనులయొక్క హితముకొరకై సమృద్ధిగా సేకరించి వాటిని రహస్యముగా భద్రపరిచి ఉంచాలి.

జీవకర్షభ కాకోల మామలక్యాట రూషకాన్ ।
శాలపర్ణీ పృశ్నిపర్ణీ ముద్గపర్ణీ తథైవ చ ॥ 43 ॥

మాషపర్ణీ చ మదేద్వేసారివే ద్వే బలాత్రయమ్ ।
వారాంశ్వసంతీ వృష్యా చ బృహతీ కంటకారికా ॥ 44 ॥

శృంగీ శృంగాటకీ ద్రోణీ వర్షాభూర్దర్భరేణుకా ।
మధుపర్ణీ విదార్యే ద్వే మహాక్షీరా మహాతపాః ॥ 45 ॥

దుర్గమునందుండవలసిన ఆయుధాది సంగ్రహణమును వివరించి ఇప్పుడు అందుండవలసిన వృక్షములు మొదలగువాటి గురించి వివరించుచున్నాడు. జీవకము, ఋషభము, కాకోలము, ఆమలకి, ఆటరూషకము, శాలపర్ణి, పృశ్నిపర్ణి, ముద్గపర్ణి, మాషపర్ణి, రెండురకముల మేదాజాతి ఓషధులు, రెండురకముల శారిబా జాతి

ఓషధులు, మూడు విధముల బలాజాతి ఓషధులు, వారా, శ్వసంతి, వృష్య, బృహతీ, కంటకారిక, శృంగీ, శృంగాటకీ, ద్రోణి, వర్షాభూ, దర్భరేణుక, మధుపర్ణి, విదారిద్వయ, మహాక్షీర, మహాతపస్ ఇత్యాది వృక్షములు

ధన్వనః సహదేవాహ్వో కటుకైరణ్డకం విషః ।
పర్ణీ శతాహ్వా మృద్వీకా ఫల్గుఖర్జూరయష్టికాః ॥ 46 ॥

శుక్రాతిశుక్ర కాశ్మర్య శ్ఛత్రాతిచ్ఛత్ర వీరణాః ।
ఇక్షురిక్షువికారశ్చ ఫాణిరాద్యాశ్చ సత్తమ ॥ 47 ॥

సింహీ చ సహదేవీ చ విశ్వే దేవాశ్వరోధకమ్ ।
మధుకం పుణ్యహంసాఖ్యా శతపుష్పా మధూలికా ॥ 48 ॥

శతావరీ మధూకే చ పిప్పలం తాలమేవ చ ।
ఆత్మగుప్తా కట్ఫలాఖ్యా దార్వికా రాజశీర్షకీ ॥ 49 ॥

ధన్వనము, సహదేవ, కటుక, ఏరండక, విష, పర్ణి, శతాహ్వా, మృద్వీక, ఫల్గు, ఖర్జూర, యష్టిక, శుక్ర, అతిశుక్ర, కాశ్మరి, ఛత్ర, అతిఛత్ర, వీరణ, ఇక్షు(చెరుకు), చెరుకు నుండి ఉత్పన్నమయ్యే వస్తువులు, ఫాణితము, సింహీ, సహదేవి, విశ్వేదేవ, అశ్వరోధక, మధుక, పుణ్యహంస, శతపుష్ప, మధూలిక, శతావరి, మధూక, పిప్పల, తాళ, ఆత్మగుప్త, కట్ఫల, దార్విక మరియు రాజశీర్షకీ మొదలగునవి..

రాజసర్షపధా న్యాకమృష్యప్రోక్తా తథోత్కటా ।
కాలశాకం పద్మబీజం గోవల్లీ మధువల్లికా ॥ 50 ॥

శీతపాకీ కులింగాక్షీ కాక జిహ్వోరుపుష్పికా ।
పర్వత త్రపుసౌ చోభౌ గుంజాతకపునర్నవే ॥ 51 ॥

కసేరుకా తు కాశ్మీరీ బిల్వశాలూక కేసరమ్ ।
తుషధాన్యాని సర్వాణి శమీధాన్యాని చైవ హి ॥ 52 ॥

ఇంకనూ రాజసర్షపములు, ధాన్యాకము, ఋష్యప్రోక్తము, ఉత్కటము, కాలశాకము, పద్మబీజము, గోవల్లీ, మధువల్లికా, శీతపాకి, కులింగాక్షి, కాకజిహ్వా, ఉరుపుష్పిక, పర్వతము, త్రపుషము, గుంజాతకము, పునర్నవము, కశేరువు, కాశ్మీరీ, బిల్వము, శాలూకము, కేసరము, పొట్టు కలగినట్టి అన్ని ధాన్యములు, శమి మరియు ఇతర అన్నధాన్యములన్ని కూడ దుర్గమునందు పుష్కలముగా ఉండునట్లు రాజు యత్నించవలెను.

క్షీరం క్షౌద్రం తథా తక్రం తైలం మజ్జా వసాఘృతమ్ ।
నీపశ్చారిష్టకాక్షోదవాతా మాసోమబాణకమ్ ॥ 53 ॥

ఏవమాదీని చాన్యాని విజ్ఞేయో మధురో గణః ।
రాజా సంచినుయాత్సర్వం పురే నిరవశేషతః ॥ 54 ॥

పాలు, తేనె, మజ్జిగ, తైలము, మజ్జా, వస, నెయ్యి, నీపము, అరిష్టకము, అక్షోటము, వాతామము, సోమము, బాణకము, మొదలగు ధాన్యాదులే కాకుండా మధురములైన ఇతర మధుర జాతికి చెందిన ఓషధులు మొదలగు వాటిని రాజు తన పురమునందు నిరవశేషముగా ఉండునట్లు ప్రోగుచేసుకోవాలి.

దాడిమామ్రాతకౌ చైవ తింత్రిణీకామ్లవేతసమ్ ।
భవ్యకర్కంధులకుచ కరమర్దకరూషకమ్ ॥ 55 ॥

బీజపూరకకందూరే మాలతీ రాజబంధుకమ్ ।
కోలకద్వయపర్ణాని ద్వయో రామ్రాతయోరపి ॥ 56 ॥

పారావతం నాగరకం ప్రాచీనోలుకమేవ చ ।
కపిత్థామలకం చుక్రఫలం దంతశఠస్య చ ॥ 57 ॥

జాంబవం నవనీతం చ సౌవీరకరుషోదకే ।
సురాసవం చ మద్యాని మండతక్రదధీని చ ॥ 58 ॥

శుక్లాని చైవ సర్వాణి జ్ఞేయ మామ్లగణం ద్విజ ।
ఏవమాదీని చాన్యాని రాజా సంచినుయాత్ పురే ॥ 59 ॥

దాడిమము, ఆమ్రాతకము, తింత్రిణకము, ఆమ్లము, వేసము, భవ్యము, కర్కంధు, లకుచము, కరమర్దకము, రూషకము, బీజపూరకము, కందూరము, మాలతి, రాజబంధుకము, రెండురకములైన కోలక పత్రములు, రెండు రకముల ఆమ్లాతకములు, పారావతము, నాగరకము, ప్రాచీన రూకము, కపిత్థము, ఆమలకము, చుక్రఫలము, దంతశఠఫలము, జాంబవము, నవనీతము, సౌవీరకము, రూషోదకము, సుర, ఆసవము, మద్యము, మండము, తక్రము, దధి మొదలగు తెల్లని మరియు పుల్లని గణమునకు చెందిన పదార్థములన్నింటిని కూడ రాజు స్వపురమునందు సమృద్ధిగా ఉండునట్లుయత్నించాలి.

సైంధవోద్భిద పాఠేయ పాక్య సాముద్రలోమకమ్ ।
కుప్య సౌవర్చలవిడం బాలకేయం యవాహ్వకమ్ ॥ 60 ॥

ఔర్వం క్షారం కాలభస్మ విజ్ఞేయో లవణో గణః ।
ఏవమాదీని చాన్యాని రాజా సంచినుయాత్పురే ॥ 61 ॥

సైంధవము, ఉద్భిదము, పాథేయము, పాక్యము, సాముద్రలోమకము, కుప్యము, సౌవర్చలము, విడము, (ఉప్పు), బాలకేయము, యవాహ్వకము, ఔర్వము, క్షారము, కాలభస్మము మొదలగు లవణగణమునకు చెందిన పదార్థములు కూడ రాజు స్వపురమందు సేకరించుకుని ఉండాలి.

పిప్పలీ పిప్పలీమూలచవ్య చిత్రకనాగరమ్ ।
కుబేరకం చ మరిచం శిగ్రు భల్లాత సర్షపాః ॥ 62 ॥

కుష్టాజమోదా కిణిహీ హింగుమూలక ధాన్యకమ్ ।
కారవీ కుంచికా యాజ్యా సుముఖా కాలమాలికా ॥ 63 ॥

ఫణిజ్ఝకో ౽థ లశునం భూస్తృణం సురసం తథా ।
కాయస్థా చ వయఃస్థా చ హరితాలం మనఃశిలా ॥ 64 ॥

అమృతా చ రుదంతీ చ రోహిషం కుంకుమం తథా ।
జయా ఏరండకాండీరం శల్లకీ హంజకీ తథా ॥ 65 ॥

సర్వపిత్తాని మూత్రాణి ప్రాయో హరితకాని చ ।
ఫలాని చైవ హి తథా సూక్ష్మేలా హింగుపత్రికా ॥ 66 ॥

ఏవమాదీని చాన్యాని గణః కటుకసంజ్ఞిత ః ।
రాజా సంచినుయాద్దుర్గే ప్రయత్నేన నృపోత్తమా ॥ 67 ॥

పిప్పలి, పిప్పలివేరు, చవ్యము, చిత్రకము, నాగరము, కుబేరకము, మరిచము, శిగ్రువు (మునగ), భల్లాతకము, సర్షపము, కుష్టము, అజమోదము =జీలకర్ర, కిణిహీ=ఉత్తరేణి, హింగువు, మూలకము, ధాన్యకము, కారవీ, కుంచికము, యాజ్యా, సుముఖా, కాలమాలికా, ఫణిజ్ఝకము (తులసిలో ఒకజాతి), లశునము, భూస్త ృణము, సురసము, కాయస్థా, వయఃస్థా, హరితాళము, మనశ్శిల, అమృత, రుదంతీ, రోషిషము, కుంకుమము, జయ, ఏరండము, కాండీరము, శల్లకి, హంజకీ, ఇత్యాది పిత్తజనకములైన పదార్థములు మరియు పిత్తజనకములే అయిన ప్రాణుల మూత్రములను, తరచుగా పచ్చని వర్ణము కలవియు, సూక్ష్మములైన ఫలములు సూక్ష్మేలా, హింగుపత్రము మొదలగు కటుక సంజ్ఞిత ములైన ద్రవ్యములనన్నింటిని ఓ నృపోత్తమా! రాజు తన దుర్గమునందు మంచి ప్రయత్నముతో సేకరించి నిలువ ఉంచుకోవాలి.

ముస్తం చందన హ్రీబేర కృతమాలకదారవః ।
హరిద్రా నలదోశీర నక్తమాలకదంబకమ్ ॥ 68 ॥

దూర్వా పటోలకటుకా దంతీత్వక్ పత్రకం వచా।
కిరాత తిక్త భూతుంబీ విషా చాతివిషా తథా ॥ 69 ॥

తాలీస పత్రతగరం సప్త పర్ణవికం కతాః ।
కాకోదుంబరికా దివ్యాస్తథా చైవ సురోద్భవా ॥ 70 ॥

షడ్ గ్రంథా రోహిణీ మాంసీ పర్పటశ్చాథ దంతికా ।
రసాంజనం భృంగరాజం పతంగీ పరిపేలవమ్ ॥ 71 ॥

దుఃస్పర్శా గురణీకామా శ్యామాకం గంధనాకులీ ।
రూపపర్ణీ వ్యాఘ్రనఖం మంజిష్ఠా చతురంగులా ॥ 72 ॥

రంభా చైవాంకరాస్ఫోతా తాలాస్ఫోతా హరేణుకా ।
వేత్రాగ్రవేత సస్తుంబీ విషాణీ లోధ్రపుష్పిణీ ॥ 73 ॥

మాలతీకర కృష్ణాఖ్యా వృశ్చికా జీవితా తథా ।
పర్ణికా చ గుడూచీ చ సగణస్తిక్త సంజ్ఞకః ॥ 74 ॥

ఏవమాదీని చాన్యాని రాజా సంచినుయాత్ పురే ।

ముస్తము, చందనము, హ్రీబేరము, కృతమాలకము, దారవము, హరిద్ర, నలదము, ఉశీరము, నక్తమాలము, కదంబకము, దూర్వ, పటోలము, కటుకా, దంతీత్వక్, పత్రకము, వచా, కిరాతతిక్తము, భూనింబము, విష, అతివిష, తాళీసపత్రము తగరము, సప్తపర్ణము, వికంకతము, కాకోదుంబరికా, దివ్యా, సురోద్భవా, షడ్ గ్రంథా, రోహిణీ, మాంసీ, పర్పటము, దంతికా, రసాంజనము, భృంగరాజము, పతంగి, పరిపెలవము, దుఃస్పర్శ, గురుణి, కామా, శ్యామాకము, గంధనాకులి, రూపపర్ణి, వ్యాఘ్రనఖము, మంజిష్ఠా, చతురంగళ, రంభ, అంకురాస్ఫోతా, తాలాస్ఫోతా, హరేణుక, వేత్రాగ్రవేతసము, తుంబి, విషాణి, లోధ్రపుష్పిణి, మాలతీ, కరకృష్ణా, వృశ్చికా, జీవితా, పర్ణికా, గుడూచీ ఇత్యాది తిక్తములైన ఔషధగణమునంతటిని రాజు స్వపురమునందెల్లప్పుడు సంగ్రహించుకోవాలి.

అభయామలకే చోభే తథైవ చ విభీతకమ్ ॥ 75 ॥

ప్రియంగుధాతకీ పుష్పం మోచాఖ్యా చార్జునాసనాః ।
అనంతా స్త్రీ తువరికా, శ్యోణాకం కట్ఫలం తథా ॥ 76 ॥

భూర్జపత్రం శిలాపత్రం పాటలా పత్రలోమకమ్ ।
సమంగాత్రి వృతామూల కార్పాసః గైరికాంజనమ్ ॥ 77 ॥

విద్రుమం సమధూచ్ఛిష్టం కుంభికా కుముదోత్పలమ్ ।
న్యగ్రోధోదుంబరాశ్వత్థకింశుకాః శింశుపా శమీ ॥ 78 ॥

ప్రియాలపీలుకా సారీ శిరీషాః పద్మకం తథా ।
బిల్వో ఉ_గ్ని మంథః ప్లక్షశ్చ శ్యామాకం చ బకో ఘనమ్ ॥ 79 ॥

రాజాదనం కరీరం చ ధాన్యకం ప్రియకస్తథా ।
కంకోలాశోకబదరాః కదంబఖదిరద్వయమ్ ॥ 80 ॥

ఏషాం పత్రాణి సారాణి మూలాని కుసుమాని చ ।
ఏవమాదీని చాన్యాని కషాయాఖ్యో గణో మతః ॥ 81 ॥

ప్రయత్నేన నృపశ్రేష్ఠ రాజా సంచినుయాత్ పురే ।

అభయా, రెండు రకముల ఆమలకములు, విభీతకము, ప్రియంగు(కుంకుమపువ్వు), ధాతకీపుష్పము, మోచా, అర్జునము, ఆసనము, ఆనంతా, స్త్రీ, తువరికా, శ్యోణాకము, కట్ఫలము, భూర్జపత్రము, శిలాపత్రము, పాటలపత్రము, లోమకము, సమంగా, త్రివృతామూలము, కార్పాసము, గైరికాంజనము, విద్రుమము, తేనె, కుంభికా, కుముదము, ఉత్పలము, న్యగ్రోధము, ఉదుంబరము, అశ్వత్థము, కింశుకము, శింశపా, శమీ, ప్రియాలము, పీలు, కాసారము, శిరీష, పద్మకము, బిల్వము, అగ్నిమంథము, ప్లక్షము, శ్యామాకము, బకము, ఘనము, రాజాదనము, కరీరము, ధాన్యకము, ప్రియకము, కంకోలము, అశోకము, బదరము, కదంబము, రెండు రకముల ఖదిరము,

మొదలనవే కాక వీటి పత్రములు, సారములు, మూలములు(వ్రేళ్ళు), పూవులు ఇత్యాది కషాయగణమునకు చెందిన పదార్థములనన్నింటిని కూడ రాజు తన పురమునందు ప్రయత్నముతో సేకరించి నిలువ ఉంచవలెను.

కీటాశ్చ మారణే యోగ్యా వ్యంగతాయాం తథైవ చ ॥ 82 ॥

వాతధూమాంబుమార్గాణాం దూషణాని తథైవ చ ।
ధార్యాణి పార్థివైర్దుర్గే తాని వక్ష్యామి పార్థివ ॥ 83 ॥

విషాణాం ధారణం కార్యం ప్రయత్నేన మహీభుజా ।

ఓ నృపశ్రేష్ఠా! ఇతరులను వధించుటకు మరియు వికలాంగులుగా చేయుటకుపయుక్తములైన కీటకములను, గాలి, పొగ మరియు జలము ఇత్యాది మార్గావరోధకములగు (శత్రువులను ఎదుర్కొనటకుపయోగించునవి) వాటిని రాజు ఎల్లప్పుడు స్వదుర్గమునందు సిద్ధముగా ఉంచుకోవాలి. అంతేకాక ఓ రాజా! అనేకరకముల విషములను కూడ ప్రయత్నపూర్వకముగా రాజు సేకరించుకొనవలెను.

విచిత్రాశ్చాంగదా ధార్యా విషస్య శమనాస్తథా ॥ 84 ॥

రక్షోభూత పిశాచఘ్నాః పాపఘ్నాః పుష్టివర్ధనాః ।
కలావిదశ్చ పురుషాః పురే ధార్యాః ప్రయత్నతః ॥ 85 ॥

భీతాన్ ప్రమత్తాన్ కుపితాన్ తథైవ చ విమానితాన్ ।
కుభృత్యాన్ పాపశీలాంశ్చ న రాజా వాసయేత్ పురే ॥ 86 ॥

యంత్రాయుధాట్టాలచయోపపన్నం సమగ్ర ధాన్యౌషధి సంప్రయుక్తమ్ ।
వణి గ్జనై శ్చావృతమావసేత దుర్గం సుగుప్తం నృపతిః సదైవ ॥ 87 ॥

ఓ రాజా! విచిత్రములైన రోగబాధా నివారకములైన ద్రవ్యములను, మరియు విషోపశమనములైన పదార్థములను, రక్షో–భూత–పిశాచాదులను, పాపాత్ములను హరించివేయునట్టివి మరియు పుష్టి కలిగించునట్టివి అయిన పదార్థములను కూడ రాజు సర్వధా సేకరించి ఉంచుకోవాలి. అంతేకాక కళావిదులైన పురుషులను కూడ రాజు ప్రయత్నపూర్వకముగా స్వపురమునందు పోషించవలెను అట్లే భీతులైనవారిని, ప్రమత్తులను, కుపితులను, అవమానితులను, దుష్టులైన భృత్యులను, పాపశీలులను రాజు స్వపురమునందు నివసింపజేయగూడదు. ఈ విధముగా రాజు సర్వధా యంత్రములు, ఆయుధములు, అట్టాలములు, సమగ్రధాన్యములు, సర్వౌషధములు మరియు వ్యాపారవేత్తలతో నిండినట్టి అంగడిలు కలిగిన, సురక్షితమైన దుర్గమునందు రాజు నివసించుటకు యత్నించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజ్ఞాం ఔషధ్యాది సంచయ కథనం నామ సప్తదశాధిక ద్విశతతమోఽ ధ్యాయః॥217॥

శ్రీ మత్స్యమహాపురాణమున రాజులకు సంబంధించిన ఔషధాదుల సంచయన వర్ణనమను రెండువందల పదిహేడవ అధ్యాయం సమాప్తం.



అష్టాదశాధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల పద్దెనిమిదవ అధ్యాయం

అగదాధ్యాయమ్ – అగదాధ్యాయం

మనురువాచ – మనువు చెప్పాడు.

> **రక్షోఘ్నాని విషఘ్నాని యాని ధార్యాణి భూభుజా ।**
> **అంగదాని సమాచక్ష్వ తాని ధర్మభృతాం వర ॥ 1 ॥**

ధర్మాత్ములలో శ్రేష్ఠుడవైన ఓ మత్స్యభగవానుడా! రాక్షసులను నశింపజేయునట్టి, విషములను కూడ నశింపజేసి శాంతపరుచునట్టి ఏ యే ఔషధములను, రాజు తన దుర్గమునందు నిలువ ఉంచుకొనవలెనో వివరంగా తెలుపు.

మత్స్య ఉవాచ– మత్స్యుడు చెప్పాడు.

> **బిల్వాటకీ యవక్షారం పాటలా బాహ్లికోషణాః ।**
> **శ్రీపర్ణీ శల్లకీయుక్తో నిక్వాథః ప్రోక్షణం పరమ్ ॥ 2 ॥**
>
> **సవిషం ప్రోక్షితం తేన సద్యో భవతి నిర్విషమ్ ।**
> **యవసైంధవపానీయ వస్త్ర శయ్యాసనోదకమ్ ॥ 3 ॥**
>
> **కవచాభరణం ఛత్రం వాలవ్యజనవేశ్మనామ్ ।**
> **శేలుః పాటలాతివిషా శిగ్రుమూర్వా పునర్నవా ॥ 4 ॥**
>
> **సమంగావృషమూలం చ కపిత్థవృషశోణితమ్ ।**
> **మహాదన్తశఠం తద్వత్ ప్రోక్షణం విషనాశనమ్ ॥ 5 ॥**

బిల్వాటకీ, యవక్షారము, పాటలా, బాహ్లికము, ఊషణం, శ్రీపర్ణి =కరకచెట్టు, శల్లకీ మొదలగు వాటితో కాచిన కషాయమును విషపదార్థములపై చల్లినంతమాత్రముననే అవి నిర్విషాలౌతాయి. అట్లే యవలు, సైంధవము, పానీయములు, వస్త్రములు, శయనసామగ్రి ఆసనములు, ఉదకములు, కవచములు, ఆభరణములు, ఛత్రములు, వ్యజనములు, నివాసభవనములు, మొదలగునవన్నియు విషసంయుక్తములైనచో వాటిపై శెలువు, పాటలము, అతివిషము, శిగ్రువు, మూర్వా, పునర్నవ, సమంగ, వృషమూలము, కపిత్థము, వృషశోణితము, మహాదంతశఠము మొదలగు వాటి మిశ్రమంతో చేసిన కషాయాన్ని చల్లితే ఆ విషం నిర్మూలించబడుతుంది.

> **లాక్షా ప్రియంగుమంజిష్ఠా సమమేలా హరేణుకా ।**
> **యష్ట్యాహ్వామధురా చైవ బభ్రు పిత్తేన కల్పితాః ॥ 6 ॥**
>
> **నిశ నేద్గోవిషాణస్థం సప్తరాత్రం మహీతలే ।**
> **తతః కృత్వా మణిం హేమ్నా బద్ధం హస్తేన ధారయేత్ ॥ 7 ॥**

సంస్పృష్టం సవిషం తేన సద్యో భవతి నిర్విషమ్ ।

లాక్షా, ప్రియంగువు, మంజిష్ఠా, ఏలా, హరేణుకా మరియు అతిమధురము మొదలగువాటిని ముంగిన పిత్తముతో కలిపి భావన చేసి ఆ మిశ్రమమును ఎద్దుకొమ్ములో పోసి, దానిని ఏడురాత్రులు భూమిలో పాతి ఉంచి తీసి పూసలుగా చేసుకుని బంగారు దారంతో గ్రుచ్చి చేతికి కట్టుకొంటే విషయుక్త పదార్థాలను తాకినా అవి వెంటనే నిర్విషాలవుతాయి.

మనోహ్వాయా శమీపత్రం తుంబికాశ్వేత సర్షపాః ॥ 8 ॥

కపిత్థ కుష్ఠ మంజిష్ఠాః పిత్తేన శ్లక్ష్ణకల్పితాః ।
శునో గోః కపిలాయాశ్చ సౌమ్యాక్షిప్తో౽పరోగదః ॥ 9 ॥

విషజిత్పరమం కార్యం మణిరత్నం చ పూర్వవత్ ।
మూషికా జతుకా చాపి హస్తే బద్ధ్వా విషాపహా ॥ 10 ॥

మనోహ్వాయ, శమీపత్రము, తుంబికా, శ్వేత సర్షపములు, కపిత్థము, కుష్ఠము, మంజిష్ఠము మొదలగు వాటిని శునకపిత్తముతోగాని, కపిలగోపిత్తముతోగాని నున్నగా అరగదీసి పూసికొనినచో ఒకవిధమగు విష వినాశకరమగు ఒక ఔషధమవుతుంది మరియు మూషికా జతుకా అనురెండు ఔషధులతో కూడ పైన చెప్పినట్లు చేసి హస్తమునందు ధరించినచో విషమును హరించివేయు ఔషధముగా పనిచేస్తుంది.

హరేణు మాంసీ మంజిష్ఠా రజనీ మధుకా మధు ।
అక్షత్వక్సురసం లాక్షా శ్వపిత్తం పూర్వవద్భువి ॥ 11 ॥

వదిత్రాణి పతాకాశ్చ పిష్టైరేతైః ప్రలేపితాః ।
శ్రుత్వా దృష్ట్వా సమాఘ్రాయ సద్యో భవితి నిర్విషః ॥ 12 ॥

హరేణువు, మాంసి, మంజిష్ఠా, మధుకా, రజనీ, మధువు, అక్షత్వక్ , సురసము ఇత్యాదులను శునక పిత్తములతో కలిపి పూర్వము చెప్పినట్లే గోవు కొమ్ముయందు నింపి, భూమిలో ఉంచి తీసిన తర్వాత సిద్ధపరిచిన పిష్టము పూసిన వాద్యముల ధ్వని వినినను, పతాకములను చూచినను, వాటి వాసనను చూసినను సవిషపదార్థములు నిర్విషాలౌతాయి.

త్ర్యూషణం పంచలవణం మంజిష్ఠా రజనీ ద్వయమ్ ।
సూక్ష్మైలా త్రివృతాపత్రం విడంగానీంద్రవారుణీ ॥ 13 ॥

మధుకం వేతసం క్షౌద్రం విషాణే చ నిధాపయేత్ ।
తస్మాదుష్ణాంబునా మాత్రం ప్రాగుక్తం యోజయేత్తతః ॥ 14 ॥

ఊషణత్రయము అనగా పిప్పలి, మిరియాలు మరియు శొంఠి అను మూడింటిని, సాముద్రలవణము సైంధవలవణము, బిడాల లవణము, సౌవర్చల లవణము మొదలగు పంచలవణములు, మంజిష్ఠా, పసుపు,

మ్రానిపసుపు, సూక్ష్మేలా, త్రివృతాపత్రము, వాయువిడంగములు, ఇంద్రవారుణీ, మధుకము, వేతసము, తేనె మొదలగువాటిని కలిపి గోవు కొమ్మునందుంచి దాని నుండి తీసిన మాత్రలను వేడినీటితో కలిపి సేవించినచో విషాహారము జీర్ణమౌతుంది.

శుక్లం సర్జరసోపేతం సర్షపా ఏలవాలుకైః ॥ 15 ॥

సువేగా తస్కరసురౌ కుసుమైరర్జునస్య తు ।
ధూపో వాసగృహే హన్తి విషం స్థావరజంగమమ్ ॥ 16 ॥

న తత్ర కీటా న విషం దర్దురా న సరీసృపాః ।
న కృత్యా కర్మణాం చాపి ధూపో౽యం యత్ర దహ్యతే ॥ 17 ॥

శుక్లము, సర్జరసము, సర్షపములు, ఏలివాలుకములు, సువేగ, తస్కరము, సురము, అర్జున కుసుమములు మొదలగు వాటి మిశ్రణముతో పొగవేసినచో ఇంటియందు స్థావరజంగమాత్మకముల విషము నశించిపోవును. ఈ పొగ వ్యాపించుచోట కీటకములు, కప్పలు, సరీసృపములు మొదలగునవి ఉండదు. అభిచారిక కృత్యముల ప్రభావం ఉండదు.

కల్పితైశ్చందన క్షీరపలాశద్రుమవల్కలైః ।
మూర్వైలావాలుసరసానాకులీతండులీయకైః ॥ 18 ॥

క్వాథః సర్వోదకార్యేషు కాకమాచీయుతో హితః ।
రోచనా పత్రనేపాలీకుంకుమైస్తిలకాన్ వహన్ ॥ 19 ॥

విషైర్న బాధ్యతే స్యాచ్చ నరనారీనృపప్రియః ।
చూర్ణైర్హరిద్రా మంజిష్ఠా కిణిహీ కణనింబజైః ॥ 20 ॥

దిగ్ధం నిర్విషతామేతి గాత్రం సర్వవిషార్దితమ్ ।

చందనము, క్షీరము, పలాశవృక్షపు బెరడు, మూర్వా, ఏలవాలుకము, సరసము, నాకులి, తండులీయకము, మొదలగువాటితో కాచిన కషాయముతో ఉదక కార్యములందును, కాకమాచిరసముతో కలిపి ఉపయోగించినచో అన్ని విషములను హరించును. అట్లే గోరోచనపత్రము, నేపాలి, కుంకుమపువ్వు మొదలగు వాటితో తిలకము ధరించినచో ఎటువంటి విషముల నుండైననూ పురుషులు, స్త్రీలు కూడ బాధ పొందరు. హరిద్ర, మంజిష్ఠ కిణిహి, పిప్పలి మరియు వేపచెక్క మొదలగు వాటి చూర్ణముతో పూసినచో విషసహిత పదార్థములైనను నిర్విషములగును మరియు సర్వవిషములతో పీడింపబడిన శరీరము కూడ విషరహితమైపోవును.

శిరీషస్య ఫలం పత్రం పుష్పం త్వక్ మూలమేవ చ ॥ 21 ॥

గోమూత్ర ఘృష్టో హ్యంగదః సర్వకర్మకరః స్మృతః ।
ఏకవీరమహౌషధ్యః శృణు చాతఃపరం నృప ॥ 22 ॥

శిరీష వృక్షపు ఫలము, పత్రము, పుష్పము, బెరడు మరియు మూలము (వేరు) ఇత్యాదులు గోమూత్రముతో అరగదీసినచో సర్వవిషహరమగు ఔషధము సిద్ధమగును. ఏకవీరుడవైన ఓ మనూ! ఇప్పుడు ఇంకను గొప్పఔషధములను గురించి వివరించెదను, వినుము.

వంధ్యా కర్కోటకే రాజన్ విష్ణుక్రాన్తా తథోత్కటా ।
శతమూలీ సితానందా బలామోచా పటోలికా ॥ 23 ॥

సోమా పిండా నిశా చైవ తథా దగ్ధరుహా చ యా ।
స్థలే కమలినీ యా చ విశాలీ శంఖమూలికా ॥ 24 ॥

చండాలీ హస్తిమగధా గో౽జాపర్ణీ కరంభికా ।
రక్తా చైవ మహారక్తా తథా బర్హిశిఖా చ యా ॥ 25 ॥

ఓరాజా! వంధ్య, కర్కోటకి, విష్ణుక్రాంత, ఉత్కట, శతమూలి, సిత, ఆనందా, బల, మోచ, పటోలికా, సోమ, పిండా, నిశ, దగ్ధ స్థలపద్మ, విశాలి, శంఖమూలిక, చాండాలి, హస్తిమగధా, గొపర్ణి, అజాపర్ణి, కరంభికా, రక్తా, మహారక్తా, బర్హిశిఖ మొదలైనవి.

కోశాతకీ నక్తమాలం ప్రియాలం చ సులోచనీ ।
వారుణీ వసుగంధా చ తథా వై గంధనాకులీ ॥ 26 ॥

ఈశ్వరీ శివగంధా చ శ్యామలా వంశనాలికా ।
జతుకాలీ మహాశ్వేతా శ్వేతా చ మధుయష్టికా ॥ 27 ॥

వజ్రకః పారిభద్రశ్చ తథా వై సింధువారకాః ।
జీవానందా వసుచ్ఛిద్రా నతనాగరకంటకా ॥ 28 ॥

నాలం చ జాలీ జాతీ చ తథా చ వటపత్రికా ।
కార్తస్వరం మహానీలా కుందురుర్హంసపాదికా ॥ 29 ॥

మండూకపర్ణీ వారాహీ ద్వే తథా తండులీయకే ।
సర్పాక్షీ లవలీ బ్రహ్మీ విశ్వరూపా సుఖాకరా ॥ 30 ॥

కోశాతకి, నక్తమాలము, ప్రియాలము, సులోచని, వారుణి, వసుగంధ, గంధనాకులి, ఈశ్వరీ, శివగంధా, శ్యామలా, వంశనాలిక, జతుకాలీ, మహాశ్వేతా, శ్వేతా, మధుయష్టికా, వజ్రక, పారిభద్ర, సింధువారక, జీవానంద, వసుచ్ఛిద్రా, నత, నాగరకంటక, నాల, జాలీ, జాతీ, వటపత్రికా, కార్తస్వర, మహానీల, కుందురు, హంసపాదీ,మండూక పర్ణి, వారాహి, రెండువిధములగు తండులీయకములు, సర్పాక్షి, లవలి, బ్రాహ్మీ, విశ్వరూప, సుఖకరీ ఇత్యాదులు.

రుజాపహా వృద్ధికరీ తథా చైవ తు శల్యదా ।
పత్రికా రోహిణీ చైవ రక్తమాలా మహౌషధీ ॥ 31 ॥

తథాఽమలకవందాకం శ్యామచిత్రఫలా చ యా ।
కాకోలీ క్షీర కాకోలీ పీలుపర్ణీ తథైవ చ ॥ 32 ॥

కేశినీ వృశ్చికాలీ చ మహానాగా శతావరీ ।
గరుడీ చ తథా వేగా జలే కుముదినీ తథా ॥ 33 ॥

స్థలే చోత్పలినీయా చ మహాభూమిలతా చ యా ।
ఉన్మాదినీ సోమరాజీ సర్వరత్నాని పార్థివ ॥ 34 ॥

విశేషాన్మరకతాదీని కీటపక్షం విశేషతః ।
జీవజాతాశ్చ మణయః సర్వే ధార్యాః ప్రయత్నతః ॥ 35 ॥

రాజాపహా, వృద్ధికరీ, శల్యదా, పత్రికా, రోహిణీ, రక్తమాలా, మహౌషధీ, ఆమలక, వందాక, నల్లఉమ్మెత, చిత్రఫల, కాకోలి, క్షీరకాకోలి, పీలుపర్ణి, కేశినీ, వృశ్చికాలీ, మహానాగా, శతావరి, గరుడి, వేగా, నీటికలువ, ఉత్పలినీ, మహాభూమిలతా, ఉన్మాదినీ, సోమరాజీ, సర్వరత్నములు విశేషించి మరకతములు, కీటపక్షము, జీవజాతములైన, మణులు, మొదలగువాటినన్నింటిని అత్యంత ప్రయత్నముతో సేకరించి దుర్గమునందుంచవలెను.

రక్షోఘ్నాశ్చ విషఘ్నాశ్చ కృత్యా వైతాలనాశనాః ।
విశేషాన్నరనాగాశ్చ గోఖరోష్ట్ర సముద్భవాః ॥ 36 ॥

సర్పతిత్తిరి గోమాయు బభ్రు మండుకజాశ్చ యే ।
సింహవ్యాఘ్రర్క్ష మార్జార ద్వీపివానరసంభవాః ॥
కపింజలా గజా వాజిమహిషైణభవాశ్చయే ॥ 37 ॥

ఇత్యేవమేతైః సకలైరుపేతైః ద్రవ్యైః పరార్థ్యైః పరిరక్షితః స్యాత్ ।
రాజా వసేత్తత్ర గృహం సుశుభ్రం గుణాన్వితం లక్షణ సంప్రయుక్తమ్ ॥ 38 ॥

ఇంకనూ ఓరాజా! రాక్షసులను, విషములను, కృత్యములను, వైతాళులను నశింపజేయు వాటిని మరియు నర, గజ, గోవులు(ఆవులు), గర్దభ, ఉష్ట్రము(ఒంటె) మొదలగు వాటి నుండి ఉద్భవించునట్టివీ, సర్ప, తిత్తిరి, గోమాయ(నక్కలు), బభ్రు(ముంగీస) మరియు మండూకముల నుండి ఉద్భవించునట్టివీ, సింహ, వ్యాఘ్ర, ఋక్ష, మార్జాల, ద్వీపి, వానర, కపింజల, గజ, అశ్వ, మహిష, హరిణాదుల నుండి లభించునట్టివీ పదార్థములనన్నింటిని సేకరించుకొనవలెను. ఈ విధముగా ఇంతవరకు వివరించిన పదార్థములనన్నింటిని అధిక పరిమాణములో సేకరించి దుర్గమునందుంచవలెను. వీటివలన రాజు రక్షింపబడతాడు. ఈ విధముగా సురక్షితమైన శుభ్రమైన, సకలసద్గుణాన్వితమైన, సర్వలక్షణయుక్తమైన గృహము నందు రాజు నివసించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అగదాధ్యాయో నామ అష్టాదశాధిక ద్విశతతమోఽధ్యాయః ॥218॥

శ్రీ మత్స్యమహాపురాణమున అగదాధ్యాయమనే రెండువందల పదునెనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనవింశత్యధికశతతమోఽధ్యాయః – రెండువందల పందొమ్మిదవ అధ్యాయం

రాజరక్షాధ్యాయమ్ – రాజు తన రక్షణకు తీసుకోవలసిన జాగరూకత

మనురువాచ – మనువు చెప్పాడు.

రాజరక్షా రహస్యాని యాని దుర్గే నిధాపయేత్ ।
కారయేద్వా మహీభర్తా బ్రూహి తత్త్వాని తాని చ ॥ 1 ॥

మనువు ఈ విధముగా అడిగాడు. భవవంతుడా! రాజు స్వరక్షణకొరకై దుర్గమునందు ఉంచుకోవలసిన రహస్య పూర్ణములైన సాధనాలేవి? వాటినెట్లు సంగ్రహించుకోవాలి మరియు ఎట్లు ఉపయోగించుకోవాలో సవివరంగా తెలుపు.

మత్స్య ఉవాచ – మత్స్య భగవానుడు చెప్పాడు.

శిరీషోదుంబర శమీబీజపూరం ఘృతప్లుతమ్ ।
క్షుద్యోగః కథితో రాజన్ మాసార్ధస్య పురాతనైః ॥ 2 ॥

కశేరు ఫలమూలాని ఇక్షుమూలం తథా విషమ్ ।
దూర్వా క్షీర ఘృతైర్మండః సిద్ధోఽయం మాసికః పరః ॥ 3 ॥

నరః శస్త్రహతం ప్రాప్తో న తస్య మరణం భవేత్ ।

ఓ రాజా! శిరీషం (దిరిగన), ఉదుంబరం (మేడి), శమీ(జమ్మి) బీజ పూరము (మాదీఫలం) అను ఈ నాల్గింటిని నేతితో తడిపి పదిహేను దివసములుంచిన తర్వాత సేవించినచో ఆకలి తట్టుకొను శక్తి కలుగునని ప్రాచీనులు తెలిపారు. అట్లే కశేరు ఫలములను వాటి మూలములను చెరుకు వ్రేళ్ళు మరియు దూర్వా అను ఈ మూడింటిని పాలతో మరియు నెయ్యితో మండము చేసి ఒక నెలరోజులు ఉంచిన తర్వాత సేవించినచో శస్త్రఘాతము తగిలినవాడు కూడ మరణించడు.

కల్మాషవేణునా తత్ర జనయేత్తు విభావసుమ్ ॥ 4 ॥

గృహే త్రిరపసవ్యం తు క్రియతే యత్ర పార్థివ ।
నాఽన్యోఽగ్నిర్జ్వలనే తత్ర నాత్ర కార్యా విచారణా॥5

ఓ రాజా! కల్మాషవేణువను వెదురుతో అగ్నిని వెలిగించి దాని జ్వాలలను ఇంటిలో అపసవ్యముగా మూడుసార్లు త్రిప్పినచో ఆ ఇంటియందు ఇతరములగు ఏ అగ్నులు కూడ జ్వలింపవు. ఈ విషయమున విచారించవలసిన పనిలేదు.

కార్పాసాస్థ్నా భుజంగస్య తేన నిర్మోచనం భవేత్ ।
సర్పనిర్వాసనే ధూపః ప్రశస్తః సతతం గృహే ॥ 6 ॥

సాముద్ర సైంధవయవా విద్యుద్దగ్ధా చ మృత్తికా ।
తథానులిప్తం యద్వేశ్మ నాగ్నినా దహ్యతే నృప ॥ 7 ॥

పాముల ఎముకల పొడిని ప్రత్తితో చేర్చి పొగ వేసినచో అచ్చటికి పాములు రావు. సర్పములు రాకుండా చేయుటకు ఈ ధూపము ప్రశస్తమైనది. సముద్రవలణము, యవలు విద్యుత్తుచే దగ్ధమైన మృత్తికను కలిపి పూసిన గృహమును అగ్నికూడ దహింపదు.

దివా చ దుర్గే రక్ష్యోఽగ్ని ర్వాతి వాతే విశేషతః ।
విషాచ్చ రక్ష్యో నృపతిస్తత్ర యుక్తిం నిబోధ మే ॥ 8 ॥

క్రీడా నిమిత్తం నృపతిర్ధారయేన్మృగపక్షిణః ।
అన్నం వై ప్రాక్ పరీక్షేత వహ్నౌ చాన్యతరేషు చ ॥ 9 ॥

వస్త్రం పుష్పమలంకారం భోజనాచ్ఛాదనం తథా ।
నా పరీక్షత పూర్వం తు స్పృశేదపి మహామతిః ॥ 10 ॥

పగటి సమయమున గాలి ఎక్కువగా వీచునప్పుడు దుర్గమును అగ్ని నుండి రక్షించుటకు యత్నించాలి. అట్లే రాజును విషము నుండి రక్షించు ఉపాయములను వివరిస్తాను. విను, రాజు ఎల్లప్పుడు క్రీడా నిమిత్తమై మృగములను, పక్షులను దుర్గమునందు ఉంచుకోవాలి. రాజు తాను భుజించుటకు ముందు ఈ మృగపక్ష్యాదుల ద్వారా గాని, అగ్నితో గాని ఆ ఆహరమును పరీక్షించాలి. రాజు తాను భుజించుటకు ముందు ఈ మృగపక్ష్యాదులద్వారా గాని, అగ్నితో గాని ఆహరమును పరీక్షించవలెను. పరీక్షించనటువంటి వస్త్రములు, పుష్పములు, అలంకారములు, భోజనాచ్ఛాదనములు మొదలగువాటిని ఏ మాత్రము తాకకూడదు. బుద్ధిమంతుడైన రాజు వాటిని పరీక్షించకుండా స్పృశింపడు.

స్యాచ్ఛాసౌ వక్త్ర సంతప్తః సోద్వేగం చ నిరీక్షతే ।
విషదోఽథ విషం దత్తం యచ్చ తత్ర పరీక్షతే ॥ 11 ॥

స్రస్తోత్తరీయో విమనాః స్తమ్భకుడ్యాదిభిస్తథా ।
ప్రచ్ఛాదయతి చాత్మానం లజ్జతే త్వరతే తథా ॥ 12 ॥

భువం విలిఖతి గ్రీవాం తథా చాలయతే నృప ।
కండూయతి చ మూర్ధానం పరలోద్యాననం తథా ॥ 13 ॥

క్రియాసు త్వరితో రాజన్ విపరీతాస్వపి ధ్రువమ్ ।

ఏవమాదీని చిహ్నాని విషదస్య పరీక్షయేత్ ॥ 14 ॥

విషము పెట్టినవాని నోరు ఎండిపోతుంది. ఉద్వేగంతో (గాభరా) చూస్తుంటాడు. ఆతడిచ్చిన విషయుక్తమైన పదార్థమును పరీక్షించుట ఆరంభించగానే ఆతని ఉత్తరీయం జారిపోతుంది. మనస్సు వికలమైపోతుంది. స్తంభములు

మరియు గోడల చాటున నక్కి ఉండుటకై యత్నిస్తాడు. ఆతను సిగ్గుపడుచున్నట్లుంటాడు, తత్తరపడుతుంటాడు, మెడను నేలవైపు వంచి కాలుతో గీస్తుంటాడు, ముఖాన్ని తుడుచుకొంటూ తల గోక్కుంటూ ఉంటాడు. ఆతని స్వభావమునకు విరుద్ధమైన క్రొత్త క్రొత్త చేష్టలు చేయనారంభిస్తాడు. ఈ విధములైన చిహ్నాలను బట్టి విషము పెట్టినవానిని తెలసుకోవాలి.

సమీపైర్విక్షిపేద్వహ్నౌ తదన్నం త్వరయాఽన్వితః ।
ఇంద్రాయుధ సవర్ణం తు రూక్షం స్ఫోటసమన్వితమ్ ॥ 15 ॥

ఏకావర్తం తు దుర్గంధి భృశం చటచటాయతే ।
తద్ధూమసేవనాజ్జన్తోః శిరో రోగశ్చ జాయతే ॥ 16 ॥

సవిషేఽన్నే విలీయన్తే న చ పార్థివ మక్షికాః ।
నిలీనాశ్చ విపద్యన్తే సంస్పృష్టే సవిషే తథా ॥ 17 ॥

ఆ తర్వాత వెంటనే విషయుక్తమైన అన్నమును మండుచున్న అగ్నిలో వేయవలెను. అది విషయుక్తమైయున్నచో చిటచిట ధ్వనితో చిట్లుతూ ఇంద్రాయుధసమానమైన వర్ణముగల పొగను చిమ్మును, దాని నుండి భయంకరమైన దుర్వాసన వచ్చును. అట్టి పొగను పీల్చుట వలన ప్రాణులకు శిరోరోగము కలుగును. విషయుక్తమైన అన్నము పైన ఈగలు కూడ వాలవు, ఒకవేళ వాలిననూ వెంటనే అవి మృతి చెందును.

విరజ్యతి చకోరస్య దృష్టిః పార్థివసత్తమ ।
వికృతిం చ స్వరో యాతి కోకిలస్య తథా నృపః ॥ 18 ॥

గతిః స్ఖలతి హంసస్య భృంగరాజశ్చ కూజతి ।
క్రౌంచో మదమథాభ్యేతి కృకవాకుర్విరౌతి చ ॥ 19 ॥

విక్రోశతి శుకో రాజన్ సారికా వమతే తతః ।
చామీకరోఽన్యతో యాతి మృత్యుం కారండవస్తథా ॥ 20 ॥

మేహతే వానరో రాజన్ గ్లాయతే జీవజీవికః ।
హృష్టరోమా భవేద్ బభ్రుః పృషతశ్చైవ రోదితి ॥ 21 ॥

హర్షమాయాతి చ శిఖీ విషసందర్శనాన్నృప ।

ఓ పార్థివసత్తమా! విషాన్నపు దృష్టి తగిలినచో చకోరపక్షి చూపు మందగించును. ఓ రాజా! కోకిల యొక్క స్వరము కూడ వికృతత్వమును పొందుతుంది. హంసనడక తోట్రు పడుతుంది. తుమ్మెద అధికంగా రోద చేస్తుంది. క్రౌంచపక్షికి మదమెక్కుతుంది. కోడి అధికముగా అరుస్తుంది. చిలుక కూడ భయంతో అరుస్తుంది. సారిక గ్రక్కుకొంటుంది. చామీకర పక్షి స్వస్థలమును విడిచి వేరొక చోటుకు వెళుతుంది. కారండవపక్షి (నీటికోడి) చనిపోతుంది. కోతి మలమూత్రములు విసర్జిస్తుంది. జీవజీవకము (ఒక పక్షి) గ్లానిని పొందుతుంది. ముంగీస

యొక్క రోమములు నిక్కపొడుస్తాయి. జింక ఏడుస్తుంది. మరియు ఓ రాజా! నెమలి హర్షమును పొందుతుంది. (అది విషమును కూడ భుజిస్తుంది.)

అన్నం చ సవిషం రాజన్ చిరేణ చ విపద్యతే ॥ 22 ॥

తదా భవతి నిఃశ్రావ్యం పక్షపర్యుషితోపమమ్ ।
వ్యాపన్నరసగంధం చ చంద్రికాభిస్తథా యుతమ్ ॥ 23 ॥

వ్యంజనానాం తు శుష్కత్వం ద్రవాణాం బుద్బుదోద్భవః ।
ససైంధవానాం ద్రవ్యాణాం జాయతే ఫేనమాలితా ॥ 24 ॥

శస్యరాజిశ్చ తామ్రా స్యాన్నీలా చ పయసస్తథా ।
కోకిలాభా చ మద్యస్య తోయస్య చ నృపోత్తమ ॥ 25 ॥

ధాన్యామ్లస్య తథా కృష్ణా కపిలా కోద్రవస్య చ ।
మధుశ్యామా చ తక్రస్య నీలా పీతా తథైవ చ ॥ 26 ॥

ఓ రాజా! విషముతో కూడిన ఆహారము చేయుటకు అధిక సమయము పట్టును. అంతేకాక అది వెంటనే అప్పటికప్పుడె చెడిపోవును. అది పదిహేను రోజుల క్రితం చేసిన దానివలె పాసిపోవును. దాని రుచి మరియు వాసనకూడ చెడిపోవును. వాటిపైన నెమలి పింఛము వంటి రంగులేర్పడును. వ్యంజనములు అనగా కూరలు మొదలగునవి విషమిశ్రితములైనచో వెంటనే ఎండిపోవును. ద్రవ పదార్ధములైనచో వాటిపైన బుడగలు వచ్చును. ఉప్పు వేసిన పదార్థములైనచో వాటిపై నురుగులు ఏర్పడును, పంటపైరు పై విషము చల్లినచో ఎర్రబడును, పాలు నీలపు వర్ణమును పొందును, మద్యము మరియు నీరు కూడ కోకిల వర్ణమును పొందును, ఓ నృపోత్తమా! ధాన్యములు, ఆమ్లము కూడ నలుపు వర్ణము పొందును, కోద్రవము కపిల వర్ణమును పొందును. తేనే నల్లదైపోవును, పెరుగు, నీలవర్ణము పీతవర్ణములను కూడ పొందును.

ఘృతస్యోదక సంకాశా కపోతాభా చ మస్తునః ।
హరితా మాక్షికస్యాపి తైలస్య చ తథాఽరుణా ॥ 27 ॥

ఫలానామప్యపక్వానాం పాకః క్షిప్రం ప్రజాయతే ।
ప్రకోపశ్చైవ పక్వానాం మాల్యానాం మ్లానతా తథా ॥ 28 ॥

మృదుతా కఠినానాం స్యాన్మృదూనాం చ విపర్యయః ।
సూక్ష్మాణాం రూపదలనం తథా చైవాతిరంగతా ॥ 29 ॥

నెయ్యి నీటి వర్ణమును పొందుతుంది, మీగడ కపోతవర్ణమును పొందుతుంది, తేనె ఆకుపచ్చని వర్ణమును, తైలము అరుణవర్ణమును పొందుతుంది. విషసంసర్గంచేత పచ్చికాయలు తొందరగా పండుతాయి కాని పండిన వెంటనే క్రుళ్ళిపోతాయి. పువ్వులు తొందరగా వాడిపోతాయి. మృదువైనవి గట్టి పడుతాయి మరియు గట్టిగా ఉన్నవి మెత్తబడిపోతాయి. ఇంకనూ సూక్ష్మవస్తువులన్ని స్వరూపమును కోల్పోయి వెంటనే నశించి పోతాయి.

శ్యామమండలతా చైవ వస్త్రాణాం వై తథైవ చ ।
లోహానాం చ మణీనాం చ మలపంకోపదిగ్ధతా ॥ 30 ॥

అనులేపన గంధానాం మాల్యానాం చ నృపోత్తమ ।
విగంధతా చ విజ్ఞేయా తథా రాజన్ జలస్య తు ॥ 31 ॥

దంతకాష్ఠత్వచఃశ్యామాస్తనుసత్వాస్తథైవ చ ।
ఏవమాదీని చిహ్నాని విజ్ఞేయాని నృపోత్తమ ॥ 32 ॥

ఓ నృపోత్తమా! వస్త్రములపై నల్లని మచ్చలేర్పడతాయి. లోహములు మణులు మొదలగునవన్నియు బురదవంటి మాలిన్యాన్ని పొందుతాయి. అనులేపనాదులైన గంధాదిద్రవ్యముల యొక్క పువ్వుల యొక్క సుగంధము నశించిపోతుంది. ఓ రాజా! జలము కూడ పచ్చని వర్ణమును పొందుతుంది. దంతములు, చెక్క, తోలుతో తయారయినవి, చర్మము మొదలగునవన్ని నల్లబడి క్షీణిస్తాయి. ఓ రాజా! ఇట్లు ఆయా పదార్థములయొక్క విషచిహ్నములను గుర్తించాలి.


తస్మాద్రాజా సదా తిష్ఠేన్మణిమంత్రౌషధాగదైః ।
ఉక్తైః సంరక్షితో రాజా ప్రమాదపరివర్జకః ॥ 33 ॥

ప్రజాపతేర్మూలమిహావనీశఃతద్రక్షణాద్రాష్ట్రముపైతి వృద్ధిః ।
తస్మాత్ ప్రయత్నేన నృపస్య రక్షా సర్వేణ కార్యా రవివంశచంద్ర ॥ 34 ॥

కావున ఓ నృపోత్తమా! రాజు సర్వథా మణి మంత్రౌషధాదులతో రక్షణ పొందుతూ ఎటువంటి అలసత్వాన్ని పొందక ప్రమాదరహితుడై ఉండాలి. ప్రజావృక్షమునకు మూలము రాజు, దానిని జాగరూకతతో కాపాడినచో రాష్ట్రం వృద్ధిపొందుతుంది. కావున ఓ రవివంశచంద్రా! అందరును రాజును ప్రయత్నపూర్వకంగా రక్షించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజధర్మే రాజరక్షానామ ఏకోనవింశత్యధిక
ద్విశతతమోఽధ్యాయః ॥219॥

శ్రీమత్స్యమహాపురాణంలో రాజధర్మములందు రాజు తన రక్షణకు తీసుకోవలసిన జాగరూకత అను
రెండువందల పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



వింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఇరవైయవ అధ్యాయం

రాజధర్మానుకీర్తనమ్ - రాజధర్మానుకీర్తనం

మత్స్యఉవాచ - మత్స్య భగవానుడు చెప్పాడు.

రాజన్ పుత్రస్య రక్షా చ కర్తవ్యా పృథివీక్షితా ।
ఆచార్యశ్చాత్ర కర్తవ్యో నిత్యయుక్తశ్చ రక్షిభిః ॥ 1 ॥

ధర్మకామార్థ శాస్త్రాణి ధనుర్వేదం చ శిక్షయేత్ ।
రథే చ కుంజరే చైనం వ్యాయామం కారయేత్సదా ॥ 2 ॥

శిల్పాని శిక్షయేచ్చైనం నాప్తైర్మిథ్యాప్రియం వదేత్ ।
శరీరరక్షావ్యాజేన రక్షిణోఽస్య నియోజయేత్ ॥ 3 ॥

న చాస్య సంగో దాతవ్యః క్రుద్ధలుబ్ధావమానితైః ।

ఓ రాజా! రాజు తన కుమారుని రక్షించుకోవాలి. ఆతనికి ఒక ఆచార్యుని మరియు రక్షకులను కూడ ఏర్పాటు చేయాలి. ఆతనికి ఒక ఆచార్యుని మరియు రక్షకులను కూడ ఏర్పాటు చేయాలి. ఆచార్యుని ద్వారా రాజ కుమారునికి ధర్మకామార్థ శాస్త్రాలు, ధనుర్వేద, రథ, గజాది విద్యలు నేర్పించాలి. ఆతనితో ఎల్లపుడు వ్యాయమం చేయించాలి. శిల్పవిద్యలు కూడ నేర్పించాలి. ఆప్తులతో అసత్యములు అప్రియములు మాట్లాడకుండునట్లు శిక్షణ నీయాలి. శరీర రక్షణ వ్యాజముతో ఆతనికి రక్షకులను నియమించాలి. క్రుద్ధులు, లోభగుణం కలవారు మరియు అవమానితులతో ఈతడు కలువకుండునట్లు చూడాలి.

తథా చ వినయేదేనం యథా యౌవనగోచరే ॥ 4 ॥

ఇంద్రియై ర్నాపకృశ్యేత సతాం మార్గాత్సుదుర్గమాత్ ।
గుణాధానమశక్యం తు యస్య కర్తుం స్వభావతః ॥ 5 ॥

బంధనం తస్య కర్తవ్యం గుప్తదేశే సుఖాన్వితమ్ ।
అవినీత కుమారం హి కులమాశు విశీర్యతే ॥ 6 ॥

అధికారేషు సర్వేషు వినీతం వినియోజయేత్ ।
ఆదౌ స్వల్పే తతః పశ్చాత్ క్రమేణాథ మహత్స్వపి ॥ 7 ॥

యౌవనమునందు ఈతను ఇంద్రియలోలుడు కాకుండునట్లు జాగ్రత్త పడాలి. మరియు అతి దుర్గమములైన సజ్జనుల మార్గము నుండి తొలగకుండునట్లు శిక్షణ నీయాలి. స్వభావ సిద్ధముగా ఆతనికి సద్గుణములు కలిగించుట అశక్యమని తోచినచో ఆతనిని సుఖాన్వితమైన రహస్య ప్రదేశమునందు బంధించాలి. ఏలయన రాజకుమారుడు ఒకవేళ అవినీతుడైనచో రాజవంశమే నశిస్తుంది. వినీతుడైన రాజకుమారుని మొదట స్వల్పకార్యములందు తర్వాత క్రమముగా గొప్ప వాటియందు అటు తర్వాత ఆధికారిక కార్యములందు నియోగించాలి.

మృగయాపానమక్షాంశ్చ వర్జయేత్ పృథీవీపతిః ।
ఏతాంస్తు సేవమానాస్తు వినష్టాః పృథివీక్షితః ॥ 8 ॥

బహవో నరశార్దూల తేషాం సంఖ్యా న విద్యతే ।
వృథాటనం దివాస్వప్నం విశేషేణ వివర్జయేత్ ॥ 9 ॥

వాక్పారుష్యం న కర్తవ్యం దండపారుష్యమేవ చ ।
పరోక్షనిందా చ తథా వర్జనీయా మహీక్షితా ॥ 10 ॥

రాజు వేటను, మత్తుపానీయములను, ద్యూత క్రీడలను (పాచికలు) విడిచిపెట్టవలెను. వీటిని సేవించినటువంటి రాజులెందరో నాశనము పొందిరి. ఓ రాజా! అటువంటి వారి సంఖ్యకూడ లెక్కపెట్టుటకు వీలుకానిది. తర్వాత రాజు వ్యర్థంగా తిరుగుట, పగటిపూట నిద్రించుట వదలిపెట్టవలెను. కఠినంగా మాట్లాడుట, కఠినముగా శిక్షించుట, ఇతరులను పరోక్షంగా నిందించుట మొదలగు వాటిని కూడ వర్జింపవలెను.

అర్థస్య దూషణం రాజా ద్విప్రకారం వివర్జయేత్ ।
అర్థానాం దూషణం చైకం తథార్థేషు చ దూషణమ్ ॥ 11 ॥

ప్రాకారాణాం సముచ్ఛేదో దుర్గాదీనామసత్క్రియా ।
అర్థానాం దూషణం ప్రోక్తం విప్రకీర్ణత్వమేవ చ ॥ 12 ॥

అదేశకాలే యద్దానమపాత్రే దానమేవ చ ।
అర్థేషు దూషణం ప్రోక్తమసత్కర్మ ప్రవర్తనమ్ ॥ 13 ॥

రాజు రెండు విధములైన అర్ధదూషణములను రక్షించాలి. అర్థదోషము అర్థ సంబంధి దోషమని అర్థ దూషణము రెండు విధములు. వీటినే ధనమునకు సంబంధించిన ఆస్తికి సంబంధించిన దూషణమని అందురు. ప్రాకారములను ధ్వంసము చేయుట, దుర్గములు మొదలగు వాటిని సక్రమమైన పద్ధతిలో కట్టించక పోవుట, చెడిన వాటిని బాగు చేయించకుండుట, మొదలగునవి అర్ధదూషణమని అంటారు. దేశ, కాల పాత్రాదులను సరిగా తెలిసికొని దానము చేయకపోవుట, అనుచితములైన వాటి యందు ధనమును వ్యర్థం చేయుట ఇత్యాదులు అర్థసంబంధి దూషణములు కావున రాజును ఈ రెండు విధములైన అర్థదూషణముల నుండి రక్షించాలి.

కామః క్రోధో మదో మానో లోభో హర్షస్తథైవ చ ।
ఏతే వర్జ్యాః ప్రయత్నేన సాదరం పృథివీక్షితా ॥ 14 ॥

ఏతేషాం విజయం కృత్వా కార్యో భృత్యజయస్తతః ।
కృత్వా భృత్యజయం రాజా పౌరాన్ జానపదాన్ జయేత్ ॥ 15 ॥

కృత్వా చ విజయం తేషాం శత్రూన్ బాహ్యాన్ తతో జయేత్ ।
బాహ్యాశ్చ వివిధా జ్ఞేయాస్తుల్యాభ్యన్తరకృత్రిమాః ॥ 16 ॥

గురవస్తే యథా పూర్వం తేషు యత్నపరో భవేత్ ।

కామ క్రోధ మద మాన లోభ హర్షములను రాజు ప్రయత్నపూర్వకంగా వర్జించాలి. వీటిని జయించిన తర్వాత రాజు భృత్యులను జయించాలి. అటు తర్వాత పౌరులను జానపదులను కూడ జయించాలి. ఈ విధంగా వీరందరిని జయించి లోబర్చుకున్న తర్వాత రాజు బాహ్యాశత్రువులను జయించుటకు యత్నించాలి. ఈ బాహ్యాశత్రువులు అనేక విధములు, వారిలో కొంతమంది సమానమైన స్థానమునందుండువారు, కొంతమంది ఆభ్యన్తర శత్రువులు, మరి కొంతమంది కృత్రిమ శత్రువులు. వీరిలో ప్రతివారిని కూడ మహత్వపూర్ణమైన వారినిగా గుర్తించి జయము పొందుటకు దృఢప్రయత్నం చేయాలి.

పితృపైతామహం మిత్ర మమిత్రం చ తథా రిపోః ॥ 17 ॥

కృత్రిమం చ మహాభాగ మిత్రం త్రివిధముచ్యతే ।
తథాపి చ గురుః పూర్వం భవేత్తత్రాపి చాదృతః ॥ 18 ॥

ఓ మహాభాగా! రాజులకు మిత్రులు కూడ మూడు విధములు, పితృ పితామహుల కాలం నుండి వచ్చేవారు, శత్రువులకు శత్రువులు, కృత్రిమ మిత్రులు ఈ మూడు విధముల మిత్రులలో మొదటివారైన తడ్రింతాతలకాలం నుండి వచ్చేవారు ఉత్తమమైనవారు కనుక వారిని ఆదరంతో గౌరవించాలి.

స్వామ్యమాత్యో జనపదో దుర్గం దండస్తథైవ చ ।
కోశో మిత్రం చ ధర్మజ్ఞ సప్తాంగం రాజ్యముచ్చతే ॥ 19 ॥

సప్తాంగస్యాపి రాజ్యస్య మూలం స్వామీ ప్రకీర్తితః ।
తన్మూలత్వాత్ తథాంగానాం సతు రక్ష్యః ప్రయత్నతః ॥ 20 ॥

షడంగరక్షా కర్తవ్యా తథా తేన ప్రయత్నతః ।
అంగేభ్యో యస్తథైకస్య ద్రోహమాచరతేఽల్పధీః ॥ 21 ॥

వధస్తస్య తు కర్తవ్యః శీఘ్రమేవ మహీక్షితా ।

(1) స్వామి, (2) అమాత్యులు, (3)జనపదము, (4) దుర్గము, (5) దండము, (6) కోశము, (7) మిత్రులు అనునవి రాజ్యమునకు సప్త అంగములు. వీటిలో స్వామి అనగా రాజు రాజ్యమునకు మూలము అని చెప్పబడింది. కావున ఆతనిని ప్రయత్నపూర్వకంగా రక్షించుకోవాలి. రాజు కూడ మిగతా ఆరు అంగములను ప్రయత్నంతో రక్షించాలి. అంతేకాక ఈ షడంగాలలో ఎవరైనా ఖలుడు గాని అల్పబుద్ధికలవాడు కాని ద్రోహం తల పెడితు వానిని రాజు వెంటనే వధించాలి.

న రాజ్ఞా మృదునా భావ్యం మృదుర్హి పరిభూయతే ॥ 22 ॥

న భావ్యం దారుణేనాతి తీక్ష్ణా దుద్విజతే జనః ।
కాలే మృదుర్యో భవతి కాలే భవతి దారుణః ॥ 23 ॥

రాజా లోకద్వయాపేక్షీ తస్య లోకద్వయం భవేత్ ।
భృత్యైః సహ మహీపాలః పరిహాసం వివర్జయేత్ ॥ 24 ॥

భృత్యాః పరిభవంతీహ నృపం హర్షవశం గతమ్ ।

రాజు ఎప్పుడును మృదుస్వభావము కలవాడై ఉండకూడదు. ఏలయన మృదువుగా ఉన్నవారు పరాభవము పొందుతారు. మృదుస్వభావంగల వారిని దుష్టులు పరాభవిస్తారు. అట్లే రాజు అతి దారుణముగా కఠినుడుగా కూడ ఉండకూడదు. అతి తీక్ష్ణముగా ఉండట వలన జనము ఉద్విగ్నులైపోతారు. అవసరానుగుణముగా రాజు మృదుత్వమును మరియు తీక్ష్ణత్వమును పొందినచో ఆతనికి ఇహపరములందు సుఖం సిద్ధిస్తుంది. రాజు ఎప్పుడునూ తన భృత్యులతో పరిహాసములాడకూడదు. అట్లు చేసినచో రాజు హర్షవశుడైనప్పుడు భృత్యులు ఆతనిని పరిహసింతురు.

వ్యసనాని చ సర్వాణి భూపతిః పరివర్జయేత్ ॥ 25 ॥

లోకసంగ్రహణార్థాయ కృతకవ్యసనీ భవేత్ ।
శౌండీరస్య నరేంద్రస్య నిత్యముద్రిక్త చేతసః ॥ 26 ॥

జనా విరాగమాయాన్తి సదా దుస్సేవ్య భావతః ।
స్మితపూర్వాభిభాషీస్యాత్ సర్వస్యైవ మహీపతి ॥ 27 ॥

రాజు సర్వ విధములైన వ్యసనములను వదిలిపెట్టాలి. కానీ లోక సంగ్రహణార్థమై అనగా లోకులను తన స్వాధీనములో ఉంచుకొనుటకై ఒక్కొక్కపుడు కపటవ్యసనములను కనబరచక తప్పదు. రాజశ్రేష్ఠుడు అతి గర్విష్ఠిగా ఉన్ననూ, ఉద్రిక మనస్కుడై ఉన్ననూ ఈ రాజు సేవించుటకు తగడను భావనతో జనులందరు ఆతని యందు విరక్తులౌతారు. కనుక రాజు ప్రతివారితోను స్మితవదనుడై మాట్లాడాలి.

వధ్యేష్వపి మహాభాగ భృకుటిం న సమాచరేత్ ।
భావ్యం ధర్మభృతాం శ్రేష్ఠ స్థూలలక్ష్యేణ భూభుజా ॥ 28 ॥

స్థూలలక్ష్యస్య వశగా సర్వా భవతి మేదినీ ।
అదీర్ఘసూత్రశ్చ భవేత్ సర్వకర్మసు పార్థివః ॥ 29 ॥

వధింపబడే వారి యందు కూడ రాజు కనుబొమలు ముడిపెట్టకూడదు. ధర్మాత్ములలో శ్రేష్ఠుడవైన ఓ రాజా! రాజు ఎల్లప్పుడు గొప్పదైన లక్ష్యము కలవాడై ఉండాలి. మహత్తరమైన లక్ష్యము గలిగిన రాజుకు సమస్త పృథివీ మండలము వశమై ఉంటుంది. అట్లే రాజు ఏ కర్మయందు కూడ దీర్ఘ సూత్రుడై ఉండరాదు. అలసుడై ఉండకూడదు.

దీర్ఘసూత్రస్య నృపతేః కర్మహానిర్ధ్రువం భవేత్ ।
రాగే దర్పే చ మానే చ ద్రోహే పాపే చ కర్మణి ॥ 30 ॥

అప్రియే చైవ కర్తవ్యే దీర్ఘసూత్రః ప్రశస్యతే ।
రాజ్ఞా సంవృతమంత్రేణ సదా భావ్యం నృపోత్తమ! ॥ 31 ॥

తస్యాసంవృతమంత్రస్య రాజ్ఞః సర్వాపదో ధ్రువమ్ ।
కృతాన్యేవ తు కార్యాణి జ్ఞాయన్తే యస్య భూపతేః ॥ 32 ॥

నాఽఽరబ్ధాని మహాభాగ! తస్య స్యాద్వసుధా వశే ।

ఓ రాజా! దీర్ఘసూత్రుడై అనగా ఏ పనినైనను ఎక్కువకాలము వరకు లాగునట్టి రాజుయొక్క పనులన్నియు చెడిపోవును. అయితే ఓ నృపోత్తమా! రాగం, దర్పం, మానం, ద్రోహం, పాపం, అప్రియమూ అయినటువంటి కర్మలయందు రాజు దీర్ఘసూత్రుడై ఉండవచ్చును. అటువంటి రాజును లోకం ప్రశంసిస్తుంది. రాజు సర్వథా సంవృతమంత్రుడు అనగా తాను చేయుపనులన్నింటివిషయమున రహస్యమును పాటించువాడై ఉండాలి. రహస్యం పాటించని రాజుయొక్క పనులన్ని ధ్వంసమైపోతాయి, ఆపదలు సంభవిస్తాయి. ఏ రాజు యొక్క పనులు అవి ఆరంభించినపుడు కాకుండా ముగిసినప్పుడు ఫలితము నిచ్చునప్పుడు మాత్రమే లోకమునకు తెలియునో ఆ రాజుయొక్క వశమున రాజ్యముండును అందులకే రాజు తాను ఆరంభించె పనుల విషయమున జాగరూకుడై రహస్యాలోచన కలిగినవాడై ఉండాలి.

మన్త్రమూలం సదా రాజ్యం తస్మాన్మన్త్రఃసురక్షితః ॥ 33 ॥

కర్తవ్యః పృథివీపాలైః మన్త్ర భేదభయాత్సదా ।
మన్త్రవిత్సాధితో మన్త్రః సంపత్తీనాం సుఖావహః ॥ 34 ॥

మన్త్రచ్ఛలేన బహవో వినష్టాః పృథివీక్షితః ।

రాజ్యమునకు మంత్రమే మూలము కావున మంత్రమును సర్వథా రక్షించాలి. పృథివీపాలకులైన రాజులు నిపుణులైన మంత్రులద్వారా వివరింపబడిన మంత్రమును బయటపడనీయకుండా రహస్యంగా ఉండునట్లు కాపాడుకోవాలి. అట్లు కాపాడిన మంత్రము అన్ని సంపదలకు మరియు సుఖములకు మూలము. వీటిని సరిగా కాపాడుకోలేక పోయిన ఎంతోమంది రాజులు వినాశాన్ని పొందారు.

ఆకారైరింగితైర్గత్యా చేష్టయా భాషితేన చ ॥ 35 ॥

నేత్ర వక్త్ర వికారైశ్చ గృహ్యతేఽన్తర్గతం మనః ।
నయస్య కుశలస్తస్య వశే సర్వా వసుంధరా ॥ 36 ॥

భవతీహ మహీపాలే సదా పార్థివనందన ।
నైకస్తు మన్త్రయేన్మంత్రం రాజా న బహుభిః సహ ॥ 37 ॥

ఓ రాజా! ఆకారములు, ఇంగితములు, నడక, చేష్టలు, మాటలు, ముఖనేత్రాది వికారములు మొదలగు వాటి ద్వారా రాజు ఇతరుల యొక్క మనస్సును తెలిసికోవాలి. ఈ విధంగా ఎదుటివారిని గ్రహించగల నీతి కుశలులకు సర్వవసుంధర వశమౌతుంది. ఓ పార్థివనందన! ఎప్పుదును రాజు తానొక్కడె మంత్రణము చేసికొనరాదు అలాగని అనేకమందితో మంత్రణము చేసుకోకూడదు. అవసరమునసుసరించి తాను చేయబోవు మంత్రణమునకు సరైన ఉపాయం వివరించే శక్తిగలిగిన ఒకరిద్దరిని మాత్రమే సంప్రదించాలి.

నారోహేద్విషమాం నావమపరీక్షితనావికామ్ ।
యే చాస్య భూమిజయినో భవేయుః పరిపంథినః ॥ 38 ॥

తానానయేద్వశే సర్వాన్ సామాదిభిరుపక్రమైః ।
యథా న స్యాత్ కృశీభావః ప్రజానామనవేక్షయా ॥ 39 ॥

తథా రాజ్ఞా ప్రకర్తవ్యం స్వరాష్ట్రం పరిరక్షతా ।
మోహాద్రాజా స్వరాష్ట్రం యః కర్షయత్యనవేక్షయా ॥ 40 ॥

సోఽచిరాద్ భ్రశ్యతే రాజ్యాజ్జీవితాచ్చ సబాంధవః ।

రాజు నావికులను పరీక్షించకుండా విషమమైన నావను అధిరోహించకూడదు. తన భూమిని జయించుశత్రువులను సామ, దాన, భేద, దండోపాయముల ద్వారా స్వవశం చేసికోవాలి. తన రాజ్యమును రక్షించకొనగోరునటువంటి రాజు ప్రజలయందు అలక్ష్యముగా వ్యవహరించక, వారు దుఃఖితులు కాకుండునట్లు చూచుకొంటూ రాజ్యమును పరిపాలించాలి. ఏ రాజైతే మోహముతో అలసత్వముతో జాగరూకత లేనివాడై రాజ్యమును సక్రమముగా పరిపాలింపడో అతడు బంధుజనముతో కూడ రాజ్యము నుండి మరియు జీవితము నుండి కూడ భ్రష్టుడై పోతాడు.

భృతో వత్సో జాతబలః కర్మయోగ్యో యథా భవేత్ ॥ 41 ॥

తథా రాష్ట్రం మహాభాగ భృతం కర్మ సహం భవేత్ ।
యో రాష్ట్రమనుగృహ్ణాతి రాజ్యం స పరిరక్షతి ॥ 42 ॥

సంజాతముపజీవేత్తు విందతే స మహత్ఫలమ్ ।
రాష్ట్రాద్ధిరణ్యం ధాన్యం చ మహీం రాజా సురక్షితామ్ ॥ 43 ॥

మహతా తు ప్రయత్నేన స్వరాష్ట్రస్య చ రక్షితా ।
నిత్యం స్వేభ్యః పరేభ్యశ్చ యథా మాతా యథా పితా ॥ 44 ॥

ఓ రాజా! తాను పెంచుకొనుచున్న దూడను చక్కగా పోషించినచో బాగా బలమును పొంది పనులన్ని చేయుటకు ఎట్లు యోగ్యమగునో అట్లే రాష్ట్రమును కూడ చక్కగా పోషించి, పాలించినచో ఆ రాష్ట్రము కూడ సర్వసమర్థమగును. మరియు ఏరాజైతే తన రాజ్యమును అనుగ్రహంతో పరిరక్షించునో స్వయంగా పరిపాలించునో ఆరాజు మహత్తరమైన ఫలాన్ని పొందుతాడు. మరియు ఆ రాష్ట్రం నుండి సువర్ణమును, ధనధాన్యాదులను, సురక్షితమైన పృథివిని కూడ పొందుతాడు. రాజు గొప్ప ప్రయత్నంతో శత్రువుల నుండి తన రాజ్యమును, జనులను కూడ రక్షించుచు తల్లిదండ్రులవలె పరిపాలించాలి.

గోపితాని సదా కుర్యాత్ సంయతానీంద్రియాణి చ ।
అజస్రముపయోక్తవ్యం ఫలం తేభ్యస్తథైవ చ ॥ 45 ॥

సర్వం కర్మేదమాయత్తం విధానే దేవమానుషే ।
తయోర్దైవ మచిత్యం చ పౌరుషే విద్యతే క్రియా ॥ 46 ॥

ఏవం మహీం పాలయతోఽస్య భర్తుః లోకానురాగః పరమో భవేత్తు ।
లోకానురాగప్రభవా చ లక్ష్మీః లక్ష్మీవతశ్చాపి పరా చ కీర్తిః ॥ 47 ॥

రాజు ఇంద్రియనిగ్రహం కలవాడై రహస్యత్వమును, పాటించుచు అన్నింటిని ఎల్లప్పుడు ప్రజలకొరకై ఉపయోగించాలి. ఇదియంతయును ఓ రాజా! దైవాయత్తము మరియు పురుష (మానవ) ప్రయత్నంపై ఆధారపడియుండును. దైవము వలన వచ్చునది ఊహించుటకు శక్యము కానిది కాని పౌరుషము అనగా సర్వ క్రియలు పురుషప్రయత్నము పైననే నిలిచియున్నవి కనుక దైవము నందు విశ్వాసము కలిగి రాజు సర్వథా ప్రయత్నశీలుడై ఉండాలి. ఈ విధంగా రాజ్యమును సమర్థవంతముగా పరిపాలించు రాజుయందు లోకులకు మిక్కిలి అనురాగము కలుగుతుంది. లోకానురాగము ద్వారా లక్ష్మీప్రాప్తి కలుగుతుంది. లక్ష్మీవంతుడైన రాజు గొప్పకీర్తిని పొందుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజధర్మాను కీర్తనే వింశత్యధికద్విశతతమోఽధ్యాయః ॥220॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని రాజధర్మానుకీర్తనమనే రెండువందల ఇరవైయవ అధ్యాయం సమాప్తం.



ఏకవింశత్యధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల ఇరవైఒకటవ అధ్యాయం

దైవపురుషకార వర్ణనమ్ - దైవపురుషకార వర్ణనం

మనురువాచ - మనువు చెప్పాడు.

దైవే పురుషకారే చ కిం జ్యాయస్తద్బ్రవీహి మే ।
అత్ర మే సంశయో దేవ ఛేత్తు మర్హస్యశేషతః ॥ 1 ॥

ఓ దేవా! దైవమే (భాగ్యము) పురుషకారము (పురుషయత్నము) ఈ రెంటిలో ఏది శ్రేష్ఠమో నాకు తెలుపుము. భగవంతుడా! వీటివిషయములో నాకు కలిగిన సందేహమును సంపూర్ణముగా ఛేదింపుము.

మత్స్య ఉవాచ - మత్స్య భగవానుడు చెప్పాడు.

స్వమేవ కర్మ దైవాఖ్యం విద్ధి దేహాన్తరార్జితమ్ ।
తస్మాత్ పౌరుషమేవేహ శ్రేష్ఠమాహుర్మనీషిణః ॥ 2 ॥

ఓ రాజా! దేహాంతరార్జితమైన స్వకర్మఫలమే దైవమనబడునని తెలిసికొనుము. కావున వీటిలో (ఈ రెంటిలో) మానుషమే అనగా పురుషకారము పురుషప్రయత్నమే శ్రేష్టమైనదని మనీషులంటారు.

ప్రతికూలం తథా దైవం పౌరుషేణ విహన్యతే ।
మంగళాచారయుక్తానాం నిత్యముత్థానశాలినామ్ ॥ 3 ॥

యేషాం పూర్వకృతం కర్మ సాత్త్వికం మనుజోత్తమ ।
పౌరుషేణ వినా తేషాం కేషాంచిద్ దృశ్యతే ఫలమ్ ॥ 4 ॥

కర్మణా ప్రాప్యతే లోకే రాజసస్య తథా ఫలమ్ ।
కృచ్ఛ్రేణ కర్మణా విద్ధి తామసస్య తథా ఫలమ్ ॥ 5 ॥

ఓ మనుజోత్తమా! మంగళప్రదములైన కర్మలనాచరించువారికి, నిత్యమూ అభ్యుదయ శీలురైనవారికి ప్రతికూలమైన దైవము కూడ పురుషకారముతో ప్రభావరహితమౌతుంది. పూర్వజన్మలో ఆచరించిన సాత్త్వికములైన కర్మల వలన ఈ జన్మలో పురుషప్రయత్నం లేకున్నను సత్ ఫలితమును పొందుతారు. లోకమున పూర్వజన్మలో రాజసిక కర్మలనాచరించిన మనుష్యులకు కర్మాచరణము (ఈ జన్మలో పురుషప్రయత్నము) చేయుటతోనే ఫలము లభించును. అట్లే తామసిక కర్మలనాచరించినవారికి అత్యధిక శ్రమతో ప్రయత్నము చేసినగాని ఫలితము లభింపదు అని తెలిసికోవలసినది.

పౌరుషేణాప్యతే రాజన్ ప్రార్థితవ్యం ఫలం నరైః ।
దైవమేవ విజానంతి నరాః పౌరుషవర్జితాః ॥ 6 ॥

తస్మాత్ త్రికాల సంయుక్తం దైవం తు సఫలం భవేత్ ।
పౌరుషం దైవసంపత్త్యా కాలే ఫలతి పార్థివ ॥ 7 ॥

దైవం పురుషకారశ్చ కాలశ్చ పురుషోత్తమ ।
త్రయమేతన్మనుష్యస్య పిండితం స్యాత్ఫలావహమ్ ॥ 8 ॥

ఓరాజా! పౌరుషము (ప్రయత్నం) చేతనే మానవునికి అభిలషించిన ఫలము లభిస్తుంది. పౌరుషహీనులు, ప్రయత్నరహితులు సోమరులూ అయిన వారు దైవమే శ్రేష్ఠమైనదని భావిస్తారు. కావున ఓ పురుషోత్తమా! పురుషప్రయత్నంతో యుక్తమైన దైవమే మూడు కాలాలలో కూడా సత్ ఫలితాన్నిస్తుంది. ఓ రాజా! దైవం, పౌరుషం, కాలం మూడు కలిసిమాత్రమే మనుష్యునకు ఫలాన్నిస్తాయి.

కృషివృష్టి సమాయోగాద్ దృశ్యన్తే ఫలసిద్ధయః ।
తాస్తు కాలే ప్రదృశ్యన్తే నైవాకాలే కథంచన ॥ 9 ॥

తస్మాత్సదైవ కర్తవ్యం స్వధర్మం పౌరుషం నరైః ।
విపత్తావపి యస్యేహ పరలోకే ధ్రువం ఫలమ్ ॥ 10 ॥

ఓ రాజా! లోకములో వర్షముతో కూడిన కర్షకుల కృషి మాత్రమే మంచి పంటలను (సత్ ఫలితమును) ఇస్తుంది. కాని అది కూడా సరైన కాలమనందే ఫలాన్నిస్తుంది. కావున అకాలమునందు ఇవ్వవు కదా! కావున మానవులెప్పుడునూ సరైన సమయమున స్వధర్మమును, ధర్మయుక్తమైన పురుషకారమును ఆచరించాలి. ఆట్లాచరించిననూ ఎవరికైనా ఆపదలు ఈ జన్మలో కలిగిననూ వారి సత్కార్యములు తర్వాత సత్ఫలితములిచ్చుననుటలో సందేహము లేదు.

నాలసాః ప్రాప్నువంత్యర్థాన్ న చ దైవ పరాయణాః ।
తస్మాత్సర్వ ప్రయత్నేన ఆచరేద్ధర్మముత్తమమ్ ॥ 11 ॥

త్యక్త్వాఽలసాన్ దైవపరాన్మనుష్యాన్ ఉత్థానయుక్తాన్ పురుషాన్ హి లక్ష్మీః ।
అన్విష్య యత్నాద్ వృణుయాన్నృపేంద్ర తస్మాత్సదోత్థానవతా హి భావ్యమ్ ॥ 12 ॥

ఓ రాజా! అలసులు మరియు కేవల దైవపరాయణులు ఫలమును పొందరు కావున మానవులు సర్వప్రయత్నములతో ఉత్తమమైన ధర్మమును ఆచరించాలి. ఓ నృపేంద్రా! అలసులను (కర్మహీనులను) దైవపరాయణులను వదిలి కేవలం ఉత్థానయుక్తులను అనగా అభ్యుదయమును కోరే ప్రయత్నశీలురను మాత్రమే వెదికి లక్ష్మి ప్రయత్నపూర్వకముగా వరిస్తుంది. కావున మానవులు ఎల్లప్పుడు ప్రయత్నవంతులై ఉండాలి. అట్టి వారినే లక్ష్మి వరిస్తుంది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దైవపురుషకార వర్ణనం నామ ఏకవింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః॥221॥

శ్రీ మత్స్యమహాపురాణంలో దైవపురుషకారవర్ణనమనే రెండువందల ఇరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వావింశత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఇరవైరెండవ అధ్యాయం

రాజధర్మే సామోపాయబోధనమ్ – రాజధర్మమునందు సామోపాయ బోధనం

మనురువాచ –మనువు చెప్పాడు.

ఉపాయాంస్త్వం సమాచక్ష్వ సామపూర్వాన్మహాద్యుతే ।
లక్షణం చ తథా తేషాం ప్రయోగం చ సురోత్తమ! ॥ 1 ॥

ఓ మహాద్యుతీ! సురోత్తమా! ఇప్పుడు సామాది ఉపాయాలను, వాటి లక్షణాలను ప్రయోగాన్ని కూడ నాకు వివరించు.

మత్స్యఉవాచ – మత్స్యభగవానుడు చెప్పాడు.

సామభేదస్తథా దానం దండం చ మనుజేశ్వర ।
ఉపేక్షా చ తథా మాయా ఇంద్రజాలం చ పార్థివ ॥ 2 ॥

ప్రయోగాః కథితాః సప్త తన్మే నిగదతః శ్రుణు ।

ఓ మనుజేశ్వరా! సామము, భేదము, దానము, దండము, ఉపేక్షా, మాయ, ఇంద్రజాలము అనునవి ఏడు ఉపాయాలు ప్రయోగింపదగినవి కలవని చెప్పబడింది, వాటిని వివరిస్తాను, విను.

ద్వివిధం కథితం సామ తథ్యం చాతథ్యమేవ చ ॥ 3 ॥

తత్రాప్యతథ్యం సాధూనామాక్రోశాయైవ జాయతే ।
తత్ర సాధుః ప్రయత్నేన సామసాధ్యో నరోత్తమ ॥ 4 ॥

మహాకులీనా ఋజవో ధర్మనిత్యా జితేంద్రియాః ।
సామసాధ్యా న చాతథ్యం తేషు సామ ప్రయోజయేత్ ॥ 5 ॥

ఓ నరోత్తమ! ఈ ఏడింటిలో మొదటిదైన సామము తథ్యము అతథ్యమని రెండు విధాలు, వీటిలో అతథ్యమను సాధువుల విషయమున ప్రయోగించినచో వారు ఆక్రోశితులు కాగలరు. కావున సాధుజనులను అతి ప్రయత్నము చేసైననూ సామముతోనే సాధింపవలెను. మహాకులీనులు, ఋజుస్వభావము కలవారు, ధర్మనిత్యులు, జితేంద్రియులు సామోపాయముతో సాధింపబడగలవారు. వారి యందు అతథ్యమను సామమును ఎప్పుడునూ ప్రయోగింపకూడదు.

తథ్యం సామ చ కర్తవ్యం కులశీలాదివర్ణనమ్ ।
తథా తదుపచారాణాం కృతానాం చైవ వర్ణనమ్ ॥ 6 ॥

అనయైవ తథా యుక్త్యా కృతజ్ఞాఖ్యాపనం స్వకమ్ ।
ఏవం సామ్నా చ కర్తవ్యా వశగా ధర్మతత్పరాః ॥ 7 ॥

కులము, స్వభావము, ఉపచారములు, సత్కర్మలు మొదలగు వాటిగురించి ప్రశంసిస్తూ సజ్జనులను సేవించడమే తథ్యమను సామము యొక్క లక్షణం. ఇట్టి తథ్యమును యుక్తి పూర్వకముగా ఉపయోగిస్తూ స్వకృతజ్ఞతను ప్రకటిస్తూ ధర్మతత్పరులను స్వవశం చేసికోవాలి.

సామ్నా యద్యపి రక్షాంసి గృహ్ణంతీతి పరా శ్రుతిః ।
తథాప్యేతదసాధూనాం ప్రయుక్తం నోపకారకమ్ ॥ 8 ॥

అతిశంకితమిత్యేవం పురుషం సామవాదినమ్ ।
అసాధవో విజానన్తి తస్మాత్తత్తేషు వర్జయేత్ ॥ 9 ॥

సామోపాయంచే రాక్షసులను గూడ వశము చేసికొనవచ్చునని శ్రుతులు చెప్పచున్నప్పటికి దీనిని అసాధుజనుల యందు ప్రయోగించుట వలన ఉపకారము కలుగదు. అసాధుజనులు తమతో సామవచనములు పలుకువారిని శంకితమైన మనస్సుతో చూస్తారు. కావున ఈ ఉపాయం వారి విషయమున ఉపయోగించకూడదు.

యే శుద్ధవంశా ఋజవః ప్రణీతా ధర్మే స్థితాః సత్యపరా వినీతాః।
తే సామసాధ్యాః పురుషాఃప్రదిష్టాః మానోన్నతా యే సతతం చ రాజన్ ॥ 10 ॥

ఓ రాజా! ఎవరైతే శుద్ధవంశములనందు జన్మించిరో ఋజు ప్రవర్తన కలవారో, నీతిమంతులో, ధర్మతత్పరులో, సత్యవంతులో, వినీతులో వారే ఎల్లప్పుడును సామసాధ్యులు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజధర్మే సామబోధోనామ
ద్వావింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥222॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని రాజధర్మమునందు సామోపాయబోధనమనే
రెండు వందల ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం



త్రయోవింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఇరవైమూడవ అధ్యాయం

రాజధర్మే భేదప్రశంసా – రాజధర్మమునందు భేదప్రశంస

మత్స్యఉవాచ – మత్స్యభగవానుడిలా చెప్పాడు.

పరస్పరం తు యే దుష్టాః క్రుద్ధాః భీతావమానితాః ।
తేషాం భేదం ప్రయుంజీత భేదసాధ్యా హి తే మతాః ॥ 1 ॥

ఓ రాజా! రాజు తనకు గల అనేక శత్రువులలో ఎవరు పరస్పరము దుష్టస్వభావము కలవారో, ఎవరెవరు క్రుద్ధులో, ఎవరిని చూచి ఎవరు భయపడుదురో, ఎవర్ని ఎవరు అవమానింప యత్నింతురో వారిపై ఈ భేదోపాయము ఉపయోగించుటకు యత్నించాలి. ఎందుకనగా ఇటువంటి స్వభావము వల వారు సామాన్యముగా భేదోపాయసాధ్యులు కదా!

యే తు యేనైవ దోషేణ పరస్మాన్నాపి బిభ్యతి ।
తే తు తద్దోషపాతేన భేదనీయా భృశం తతః ॥ 2 ॥

ఆత్మీయం దర్శయేద్దోషం పరస్మాద్దర్శయేద్భయమ్ ।
ఏవం హి భేదయేద్భిన్నాన్ యథావద్వశమానయేత్ ॥ 3 ॥

ఓ రాజా! ఎవరు ఏ దోషము వలన ఇతరులవలన భయపడరో వారియందు ఆ దోషమునే ప్రయోగించి భేదోపాయముతో వారిని పరస్పరము వీడదీయాలి. దానికై ఒకని లోని దోషమును ఆసరాగా తీసికొని ఇంకొకని నుండి కలుగబోయే భయమును వివరించి వారిద్దరి మధ్యలో భేదము సృష్టించాలి. ఆ విధంగానే ఆ ఇద్దరినీ రాజు తన వశము చేసికోవాలి.

సంహతా హి వినా భేదం శక్రేణాపి సుదుఃసహాః ।
భేదమేవ ప్రశంసంతి, తస్మాన్నయవిశారదాః ॥ 4 ॥

స్వముఖే నా శ్రయేద్భేదం భేదం పరముఖేన చ ।
పరీక్ష్య సాధు మన్యేత భేదం పరముఖాచ్ఛ్రుతమ్ ॥ 5 ॥

సద్యః స్వకార్యముద్దిశ్య కుశలైర్యే హి భేదితాః ।
భేదితాస్తే వినిర్దిష్టా నైవ రాజ్ఞాఽర్థవాదిభిః ॥ 6 ॥

ఇద్దరు పరస్పరము కలిసిపోయి ఉన్నప్పుడు వారిని భేదో పాయము ద్వారా కాక విడదీయుట ఇంద్రునికికూడా, అసాధ్యమౌతుంది. అందులకే నీతి శాస్త్రజ్ఞులు భేదోపాయమే శ్రేష్ఠమని ప్రశంసిస్తారు. భేదోపాయమును స్వయంగా తానే ప్రయోగించవచ్చును లేదా ఇతరుల ద్వారానైననూ శత్రువులందు ప్రయోగించవచ్చును. పరులద్వారా ప్రయోగించునపుడు దానిని జాగరూకతతో పరిశీలించాలి. స్వకార్యాసిద్ధికొరకై ఇద్దరి మధ్యలో భేదభావము సృష్టించిన

తరువాత వారిద్దరూ భేదోపాయంతో విడిపోయారు కదా! అను భావంతో వారిని నమ్మకూడదని రాజనీతి శాస్త్రజ్ఞులంటారు.

అంతః కోపో బహిః కోపో యత్ర స్యాతాం మహీక్షితామ్ ।
అంతఃకోపో మహాన్ స్తత్ర నాశకః పృథివీక్షితామ్ ॥ 7 ॥

సామంతకోపో బాహ్యస్తు కోపః ప్రోక్తో మహీభృతః ।
మహిషీ యువరాజాభ్యాం తథా సేనాపతేః నృప ॥ 8 ॥

అమాత్యమంత్రిణాం చైవ రాజపుత్రే తథైవ చ ।
అంతఃకోపో వినిర్దిష్టః దారుణః పృథివీక్షితామ్ ॥ 9 ॥

బాహ్యకోపే సముత్పన్నే సుమహత్యపి పార్థివః ।
శుద్ధాన్తస్తు మహాభాగ శీఘ్రమేవ జయీ భవేత్ ॥ 10 ॥

అంతఃకోపం, బహిఃకోపం అని రాజులకు నష్టము కలిగించు కోపములు రెండు విధములు, వీటిలో అంతఃకోపము ప్రభావవంతమైనది. దీనితో రాజులకు నాశనము కలుగును. సామంతుల మరియు ఇతర రాజులయొక్క కోపము బాహ్యకోపమేనని చెప్పబడినది. మహిషి, యువరాజు, సేనాపతి, మంత్రులు, రాజపుత్రులు మొదలగు వారి యొక్క కోపము అంతఃకోపమని అంటారు. వీరందరి కోపం రాజులకు అతి దారుణమైనదని అంటారు. ఓ మహాభాగా! ఓ రాజా! బాహ్యకోపము అధికముగా ఉత్పన్నమైనను అంతఃపురములు కోపరహితమై శుద్ధముగా ఉంటే రాజు దానిని శీఘ్రముగానే జయిస్తాడు.

అపి శక్రసమో రాజా అంతఃకోపేన నశ్యతి ।
సోఽన్తఃకోపః ప్రయత్నేన తస్మాద్రక్ష్యో మహీభృతా ॥ 11 ॥

పరతః కోపముత్పాద్య భేదేన విజిగీషుణా ।
జ్ఞాతీనాం భేదనం కార్యం పరేషాం విజిగీషుణా ॥ 12 ॥

ఇంద్రునితో సమానమైన బలమున్న వాడైనప్పటికిని అంతఃకోపము కలిగినట్టి రాజు నశించిపోతాడు. కావున రాజు ఎల్లప్పుడునూ అంతఃకోపము నుండి తనను తాను రక్షించుకొనుటకు ప్రయత్నించాలి. మరియు శత్రువులను జయించాలనే కోరిక గల రాజు శత్రురాజులయొక్క జ్ఞాతుల మధ్యన భేదము సృష్టించి భేదోపాయము ద్వారా వారిని పరస్పరం విడదీయాలి.

రక్ష్యశ్చైవ ప్రయత్నేన జ్ఞాతి భేదస్తథాత్మనః ।
జ్ఞాతయః పరితప్యన్తే సతతం పరితాపితాః ॥ 13 ॥

తథాపి తేషాం కర్తవ్యం సుగంభీరేణ చేతసా ।
గ్రహణం దానమానాభ్యాం భేదస్తేభ్యో భయంకరః ॥ 14 ॥

న జ్ఞాతిమనుగృహ్ణన్తి న జ్ఞాతిం విశ్వసంతి చ ।
జ్ఞాతిభిర్భేదనీయాస్తు రిపవ స్తేన పార్థివైః ॥ 15 ॥

అట్లే రాజు తనకు తన జ్ఞాతులకు మధ్యన శత్రురాజులు భేదము కలిగించకుండా ఉండునట్లు ప్రయత్నించాలి. తనను తాను రక్షించుకోవాలి. ఎందుకనగా జ్ఞాతులు సాధారణముగానే తమవారి యొక్క ఔన్నత్యమును చూచి పరితపిస్తారు. అట్లు పరితపించువారిలో భేదభావం సృష్టించుట అతి సులభం కావున రాజు గంభీరమైన మనస్సుతో వారిని రక్షించుకొనుటకు యత్నించాలి. వారిని దానములతో సమ్మానములతో తనవైపు ఉండునట్లు యత్నించాలి. జ్ఞాతులలో భేదము కలిగినచో అది అతిభయంకరంగా ఉంటుంది. జ్ఞాతి ఎప్పుడునూ తన జ్ఞాతిని అనుగ్రహముతో చూడడు, అతని యందు విశ్వాసము కూడ కలిగి ఉండడు కావున రాజులు ఎల్లప్పుడు తమ శత్రువులను వారి జ్ఞాతులనుండి భేదపరచుటకై ప్రయత్నించాలి.

భిన్నా హి శక్యా రిపవః ప్రభూతాః స్వల్పేన సైన్యేన నిహన్తు మాజౌ ।
సుసంహతానాం తదస్తు భేదః కార్యో రిపూణాం నయ శాస్త్రవిద్భిః ॥ 16 ॥

ఇట్లు శత్రువులు అధిక సంఖ్యలో నున్ననూ, బలవంతులైననూ వారిని భేదోపాయము ద్వారా విడదీయగలిగిన రాజు తనయొక్క స్వల్పసైన్యముతోనే యుద్ధమునందు జయింపగలుగును. అందువలననే రాజనీతిజ్ఞులైన రాజులు సుసంహుతులు అనగా దృఢముగా కలిసి ఉన్నట్టి శత్రువులను భేదోపాయముచే విడదీయాలి సాధిస్తారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజధర్మే భేద ప్రశంసానామ
త్రయోవింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః॥223॥

శ్రీ మత్స్యమహాపురాణంలో రాజధర్మప్రకరణమున భేదోపాయ ప్రశంసమనే
రెండువందల ఇరవైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుర్వింశత్యధిక ద్విశతతమోऽధ్యాయః – రెండువందల ఇరవైనాల్గవ అధ్యాయం

రాజధర్మే దానప్రశంసా – రాజధర్మమునందు దానప్రశంస

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

సర్వేషా మప్యుపాయానాం దానం శ్రేష్ఠతమం మతమ్ ।
సుదత్తే నేహ భవతి దానేనోభయలోకజిత్ ॥ 1 ॥

న సోऽస్తి రాజన్ దానేన వశగో యో న జాయతే ।
దానేన వశగా దేవా భవంతీహ సదా నృణామ్ ॥ 2 ॥

దానమేవోపజీవన్తి ప్రజాః సర్వా నృపోత్తమ ।
ప్రియో హి దానవాన్ లోకే సర్వస్యైవోపజాయతే ॥ 3 ॥

ఓ రాజా! అన్ని ఉపాయములలో దానం శ్రేష్ఠతమము. చక్కగా ఇచ్చిన దానముతో మానవుడు ఇహపరలోకములు రెండును జయిస్తాడు. ఓ రాజా! దానంతో వశము కాని వాడెవడునూ లేదు. దేవతలు కూడ దానముతో వశులగుదురు. నృపోత్తమా! ప్రజలందరునూ దానమును ఆశ్రయించే జీవనము సాగింతురు. దానము చేయుప్రతివాడు ప్రతియొకనికి ప్రీతి పాత్రుడగును.

దానవానచిరేణైవ తథా రాజా పరాన్జయేత్ ।
దానవానేవ శక్నోతి సంహతాన్ భేదితుం పరాన్ ॥ 4 ॥

యదప్యలుబ్ధగంభీరాః పురుషాః సాగరోపమాః ।
న గృహ్ణన్తి తథాऽప్యేతే జాయన్తే పక్షపాతినః ॥ 5 ॥

అన్యత్రాపి కృతం దానం కరోత్యన్యాన్ యథా వశే ।
ఉపాయేభ్యః ప్రశంసంతి దానం శ్రేష్ఠతమం జనాః ॥ 6 ॥

దానవంతుడైన రాజు శత్రువులను అచిరకాలముననే జయిస్తాడు. దానవంతుడైన రాజే సుసంహతులైన శత్రువులను కూడ భేదింపగలడు. అలబ్ధులు, (లోభగుణములేనివారు) సముద్రముతో సమానమైన గంభీరము కలవారూ అయిన వారు దానమును గ్రహించకపోవచ్చును. కాని దానశీలురైన వారియందు పక్షపాతము వహిస్తారు. కొంతమందికి చేసినటువంటి దానముతో ఇతరులు కూడ దానము చేసిన వారి వశమౌతారు. అందువలననే ఉపాయములలో కెల్ల దానోపాయము శ్రేష్ఠతమమైనదని జనులు ప్రశంసిస్తారు.

దానం శ్రేయస్కరం పుంసాం దానం శ్రేష్ఠతమం పరమ్ ।
దానవానేవ లోకేషు పుత్రత్వే ధ్రియతే సదా ॥ 7 ॥

న కేవలం దానపరా భవన్తి భూలోకమేకం పురుషప్రవీరాః ।
జయన్తి తే రాజసురేంద్రలోకం సుదుర్జయం యో విబుధాధివాసః ॥8॥

దానము పురుషులకు శ్రేయస్కరమైనది. దానము అన్నింటికంటే ఉత్తమమైనది. దానవంతుడైనవాడే లోకములందెల్లప్పుడు సత్పుత్రుడు రక్షించినట్టు దానముచే రక్షింపబడతాడు. దానపరులైన పురుషశ్రేష్ఠులు కేవలం భూలోకమునే కాక సులభముగా జయించుటకు వీలుకాని సురేంద్రలోకమును కూడ జయిస్తారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రాజధర్మే దానప్రశంసా నామ
చతుర్వింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥224॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని రాజధర్మ ప్రకరణమున దాన ప్రశంసయను
రెండువందల ఇరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచవింశత్యాధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఇరవైఅయిదవ అధ్యాయం

రాజధర్మే దండప్రశంసా - రాజధర్మమునందు దండప్రశంస

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

న శక్యా యే వశే కర్తుముపాయత్రితయేన తు ।
దండేన తాన్ వశీకుర్యాద్దండో హి వశకృన్నృణామ్ ॥ 1 ॥

సమ్యక్ ప్రణయనం తస్య తథా కార్యం మహీక్షితా ।
ధర్మశాస్త్రానుసారేణ ససహాయేన ధీమతా ॥ 2 ॥

ఓ రాజా! పైన వివరించిన మూడు ఉపాయములతో వశము చేసికొను శక్యము కాని వారిని దండోపాయముతో వశము చేసుకోవాలి. ఎందుకనగా దండము చేత నరులు అవశ్యము వశమౌతారు కదా! ధీమంతుడైన రాజు ఇతరుల సహాయంతో ధర్మశాస్త్రానుసారంగా దండోపాయమును సరైన పద్ధతిలో ఆచరించాలి.

తస్య సమ్యక్ ప్రణయనం యథా కార్యం మహీక్షితా ।
వానప్రస్థాంశ్చ ధర్మజ్ఞాన్ నిర్మమాన్ నిష్పరిగ్రహాన్ ॥ 3 ॥

స్వదేశే పరదేశే వా ధర్మశాస్త్రవిశారదాన్ ।
సమీక్ష్య ప్రణయేద్దండం సర్వం దండే ప్రతిష్ఠితమ్ ॥ 4 ॥

వానప్రస్థులను, ధర్మజ్ఞులను, మమకారరహితులను, ఎవరినుండి ఏదియునూ తీసికోనివారిని, స్వదేశమున లేదా పరదేశమున గాని ఉన్నట్టి ధర్మశాస్త్ర విశారదులను పిలిచి వారితో చక్కగా సమీక్షించి వారి అభిప్రాయము ననుసరించి దండోపాయమును చక్కగా ఆచరించాలి. ఎందుకనగా రాజ్యపాలనమంతయు దండము నందే ఆధారపడి ఉన్నది.

ఆశ్రమీ యది వా వర్ణీ పూజ్యో వాఽథ గురుర్మహాన్ ।
నా దండ్యో నామ రాజ్ఞోఽస్తి స్వధర్మే యో న తిష్ఠతి ॥ 5 ॥

అదండ్యాన్ దండయన్ రాజా దండ్యాశ్చైవాప్యదండయన్ ।
ఇహ రాజ్యాత్ పరిభ్రష్టో నరకం చ ప్రపద్యతే ॥ 6 ॥

తస్మా ద్రాజ్ఞా వినీతేన ధర్మశాస్త్రానుసారతః ।
దండప్రణయనం కార్యం లోకానుగ్రహకామ్యయా ॥ 7 ॥

వర్ణాశ్రమధర్మములననుసరించువారిని, పూజ్యులను, గురువులను, మహానుభావులెవరినైనా, వారి ధర్మాన్ని ఆచరించని వారైతే వారిని రాజు దండించి తీరాలి. దండింపదగిన వారిని దండించకున్ననూ, దండింపకూడనివారిని

దండించిననూ రాజు రాజ్యభ్రష్టుడై నరకానికి చేరుకుంటాడు. కనుక రాజు లోకానుగ్రహకాంక్షతో వినీతుడై ధర్మశాస్త్రాను సారంగా దండోపాయాన్ని ఆచరించాలి.

యత్ర శ్యామో లోహితాక్షో దండశ్చరతి పాపహా ।
ప్రజాస్తత్ర న ముహ్యన్తి నేతా చేత్సాధు పశ్యతి ॥ 8 ॥

బాలవృద్ధాతురయతి ద్విజస్త్రీవిధవా యతః ।
మాత్స్యన్యాయేన భక్ష్యేరన్ యది దండం న పాతయేత్ ॥ 9 ॥

దేవదైత్యోరగగణాః సర్వే భూతపతత్రిణః ।
ఉత్క్రామయేయుర్మర్యాదాం యది దండం న పాతయేత్ ॥ 10 ॥

ఎక్కడ రాజు సజ్జనుడై నిరంతరము రాజ్యమును బాగుగా చూచునో, ఎచ్చట నల్లని దేహచ్ఛాయ కలిగి ఎఱ్ఱని కన్నులు గలిగిన పాపములను నశింపజేయగలిగిన దండాధిష్ఠానదేవత సంచరించునో అచ్చట ప్రజలు మోహము పొందరు. ప్రజలు తప్పుపనులు చేయరు. ఒక వేళ రాజు దండోపాయమును అనుసరించినట్లైనచో బాలురు, వృద్ధులు, ఆతురులు, యతులు, ద్విజులు, స్త్రీలు, విధవలు మొదలగు వారందరూ మాత్స్యన్యాయము ననుసరించి (పెద్దచేపలు చిన్న చేపలను మ్రింగినట్లు) బలవంతులైనవారు బలహీనులైన వారిని హింసిస్తారు. దేవతలు, దైత్యులు, ఉరగగణములు, పక్షులు మొదలగునవన్నియు స్వమర్యాదను అతిక్రమించి నడుచుకొంటారు.

ఏష బ్రహ్మాభిశాపేషు సర్వప్రహరణేషు చ ।
సర్వవిక్రమకోపేషు వ్యవసాయే చ తిష్ఠతి ॥ 11 ॥

పూజ్యన్తే దండినో దేవైః న పూజ్యన్తే త్వదండినః ।
న బ్రహ్మాణం విధాతారం న పూషార్య మణావపి ॥ 12 ॥

యజన్తే మానవాః కేచిత్ ప్రశాన్తాః సర్వకర్మసు ।
రుద్రమగ్నిం చ శక్రం చ సూర్యాచంద్రమసౌ తథా ॥ 13 ॥

విష్ణుం దేవగణాంశ్చాన్యాన్ దండినః పూజయన్తి చ ।

ఓ రాజా! దండము బ్రాహ్మణులిచ్చునట్టి శాపములందు, సర్వవిధములైన ఆయుధములయందు, అన్ని విధములైన పరాక్రమ పూర్వక క్రోధములందు, దృఢమైన ప్రయత్నములందును ప్రతిష్ఠితమైయుండును. అపరాధులను దండించునట్టి రాజులే దేవతలచేత పూజింపబడుదురు. దండించనటువంటివారిని ఎవరునూ గౌరవించరు. మానవులలో కొంతమంది అన్ని కర్మలయందునూ ప్రశాంతచిత్తులైన సృష్టికర్తయగు బ్రహ్మను, పూషన్ –అర్యమన్ మొదలగు దేవతలను పూజింపరు కాని దండించువారైన రుద్ర, అగ్ని, ఇంద్ర, సూర్య, విష్ణువు మొదలగువారిని ఇతర దేవగణములను కూడ పూజింతురు.

దండఃశాస్తి ప్రజాః సర్వా దండ ఏవాభిరక్షతి ॥ 14 ॥

దండః సుప్తేషు జాగర్తి దండం ధర్మం విదుర్బుధాః ।
రాజదండభయాదేవ పాపాః పాపం న కుర్వతే ॥ 15 ॥

యమ దండభయాదేకే పరస్పర భయాదపి ।
ఏవం సాంసిద్ధికే లోకే సర్వం దండే ప్రతిష్ఠితమ్ ॥ 16 ॥

దండమే ప్రజలందరిని శాసించును. దండమే ప్రజలందరిని రక్షించును. లోకమున అందరు నిద్రించు చున్నప్పటికి దండము మాత్రము మేల్కొని వుండును. అందువలననే దండమే ధర్మమని పండితులు అంటారు. రాజదండభయము వలన కొందరు, యమదండ భయము వలన కొందరు, పరస్పర భయము వలన మరికొందరు పాపాత్ములు పాపకర్మలనాచరించరు. ఇట్లు లోకవ్యవహారమంతయును, దండమునందే ప్రతిష్ఠితమై యున్నది.

అంధే తమసి మజ్జేయుర్యది దండం న పాతయేత్ ।
యస్మాద్దండో దమయతి దుర్మదాన్ దండయత్యపి ।
దమనాద్దండనాచ్చైవ తస్మాద్దండం విదుర్బుధాః ॥ 17 ॥

దండస్య భీతై స్త్రిదశై స్సమేతై ర్భాగో ధృత శ్శూలధరస్య యజ్ఞే ।
దత్తం కుమారే ధ్వజినీపతిత్వం వరం శిశూనాఞ్చ భయాద్బలస్య ॥18॥

రాజులు అపరాధులయందు దండమునుపయోగించకున్నచో ప్రజలు అంధతామిస్రమను నరకమున పడిపోతారు. దండోపాయం దుర్మదులను అణిచివేయును, అపరాధుల మదమును నియంత్రించి దండించునది కావుననే దీనిని దండము అని పండితులు అంటారు. దండమునకు భయపడిన దేవతలు శూలధరుడైన పరమశివునికి యజ్ఞములందు భాగాన్నిచ్చారు. శిశువులలో శ్రేష్ఠుడైన బలశాలికూడ అయిన కుమారస్వామికి కూడ దండన భయముల వలననే సేనాపతిత్వమునిచ్చారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రాజధర్మే దండప్రశంసా నామ పంచవింశత్యధిక
ద్విశతతమోఽధ్యాయః॥225॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని రాజధర్మప్రకరణమున దండప్రశంస అను
రెండువందల ఇరవైఅయిదవ అధ్యాయం సమాప్తం.

షడ్వింశత్యధికశతతమోఽధ్యాయః - రెండువందల ఇరవైఆరవ అధ్యాయం

రాజధర్మే రాజ్ఞ లోకపాల సామ్యనిర్దేశః - రాజధర్మప్రకరణంలో రాజుతో లోకపాల సామ్యనిర్దేశం

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

దండ ప్రణయనార్థాయ రాజా సృష్టః స్వయంభువా ।
దేవభాగానుపాదాయ సర్వభూతాది గుప్తయే ॥ 1 ॥

సర్వభూతములను అనగా సర్వప్రాణులను రక్షించు కొరకై దండోపాయాన్ని ప్రయోగించుటకు గాను బ్రహ్మదేవుడు సకలదేవతల అంశాలను తీసికొని రాజును సృష్టించాడు.

తేజసా యదముం కశ్చిన్నైవ శక్నోతి వీక్షితుమ్ ।
తతో భవతి లోకేషు రాజా భాస్కరవత్ ప్రభుః ॥ 2 ॥

యదాస్యఽదర్శనే లోకః ప్రసాదముపగచ్ఛతి ।
నయనానందకారిత్వాత్తదా భవతి చంద్రమాః ॥ 3 ॥

ఈతనికుండే తేజస్సు వలన ఎవ్వరునూ తేరిపారచూడలేరు కావున లోకములందు రాజు సూర్యుడితో సమానమైన తేజస్సుకలవాడు. ఈతనిని చూడగానే లోకము ప్రసన్నతను ఆనందమును పొందును. లోకుల నయనములకు ఆనందం కలిగించే శక్తి గలవాడు కావున ఈతను చంద్రునితో సమానుడు.

యథా యమః ప్రియద్వేష్యే ప్రాప్తే కాలే ప్రయచ్ఛతి ।
తథా రాజ్ఞా విధాతవ్యాః ప్రజాస్తద్ధి యమవ్రతమ్ ॥ 4 ॥

వరుణేన యథా పాశైః బద్ధ ఏవ ప్రదృశ్యతే ।
తథా పాపాన్నిగృహ్ణీయాద్ వ్రతమేతద్ధి వారుణమ్ ॥ 5 ॥

ఏ విధముగా యముడు సమయానుసారముగా ప్రియాప్రియులైన జనులకు సుఖదుఃఖములను కలుగజేయునో ఆవిధముగా రాజుకూడ సమయముననుసరించి ప్రజలయందు ఆచరించును కావున రాజు యమునితో సమానుడు. అట్లే వరుణుడు ఏ విధముగా పాశములతో బంధింపబడినవాడుగా కనబడునో ఆవిధముగా రాజు కూడ పాపులను బంధించి వరుణ వ్రతాన్ననుసరించాలి.

పరిపూర్ణం యథా చంద్రం దృష్ట్వా హృష్యతి మానవః ।
తథా ప్రకృతయో యస్మిన్ చంద్రప్రతిమో నృపః ॥ 6 ॥

ప్రతాపయుక్త స్తేజస్వీ నిత్యం స్యాత్ పాపకర్మసు ।
దుష్టసామంతహింస్రేషు రాజాఽగ్నేయవ్రతే స్థితః ॥ 7 ॥

పరిపూర్ణుడైన చంద్రుని చూచి ఎట్లు మానవులు హర్షమును పొందుదురో అట్లు రాజును చూచి ప్రజలు సంతోషముపొందుదురు. కావున రాజు చంద్రునితో సమానుడు. మరియు పాపకర్మలాచరించువారి విషయమున రాజు ప్రతాపయుక్తుడై తేజోవంతుడై ఉండి, దుష్టులైన సామంతుల విషయమున ఇతరులను హింసించువారియందు కూడ ఆగ్నేయవ్రతమునాచరించాలి. పాపకర్మలను అగ్నివలే దహించివేయాలి.

యథా సర్వాణి భూతాని ధరా ధారయతే స్వయమ్ ।
తథా సర్వాణి భూతాని బిభ్రతః పార్థివం వ్రతమ్ ॥ 8 ॥

ఇంద్రస్యార్కస్య వాతస్య యమస్య వరుణస్య చ ।
చంద్రస్యాగ్నేః పృథివ్యాశ్చ తేజోవ్రతం నృపశ్చరేత్ ॥ 9 ॥

వార్షికాంశ్చతురో మాసాన్ యథేంద్రోఽ భ్యవర్షతి ।
తథాభివర్షేత్ స్వం రాజ్యం కామమింద్రవ్రతం స్మృతమ్ ॥ 10 ॥

ఎట్లు భూదేవత సర్వ ప్రాణులను స్వయముగానే ధరించునో అట్లు రాజు కూడా సర్వప్రాణులను రక్షిస్తూ పార్థివవ్రతాన్ని ఆచరించాలి. ఇంద్రుడు, సూర్యుడు, వాయువు, యముడు, వరుణుడు, చంద్రుడు, అగ్ని మరియు పృథివి మొదలుగాగల వారందరినీ అనుసరిస్తూ రాజు తేజోవ్రతాన్ని ఆచరించాలి. ఇంకనూ ఏ విధంగా ఇంద్రుడు వర్షాకాలములోని నాలుగు నెలలయందు చక్కగా వర్షింపజేయునో ఆవిధముగా రాజు కూడ స్వరాజ్యమునందు వర్షము కురియునట్లు జేసే ఇంద్రవ్రతాన్ని ఆచరించాలి.

అష్టౌ మాసాన్ యథాఽదిత్య స్తోయం హరతి రశ్మిభిః ।
తథా హరేత్కరం రాష్ట్రాన్నిత్య మర్కవ్రతం హి తత్ ॥ 11 ॥

ప్రవిశ్య సర్వభూతాని యథా చరతి మారుతః ।
తథా చారైః ప్రవేష్టవ్యం వ్రతమేతద్ధి మారుతమ్ ॥ 12 ॥

ఎట్లు సంవత్సరములో ఎనిమిది నెలలు ఆదిత్యుడు తన కిరణములతో జలాశయములలోని జలమును లాగుకొనునో అట్లే రాజు తన రాష్ట్రము నుండి పన్నులను లాగుకొంటూ, అర్క వ్రతములనాచరించాలి. మరియు సర్వభూతములయందు వాయువు ప్రవేశించి సంచరించునట్లే రాజు కూడ గూడ గూఢచారుల ద్వారా అందరియందును ప్రవేశిస్తూ మారుతవ్రతాన్నాచరించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజధర్మే రాజ్ఞో లోకపాలసామ్య నిర్దేశో నామ
షడ్వింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥226॥

శ్రీ మత్స్య మహాపురాణంలో రాజధర్మప్రకరణమున రాజుతో లోకపాల సామ్య నిర్దేశమను
రెండువందల ఇరవై ఆరవఅధ్యాయం సమాప్తం.

సప్తవింశత్యధికశతతమోఽధ్యాయః – రెండువందల ఇరవైఏడవ అధ్యాయం

రాజధర్మే దండప్రణయనమ్ – రాజధర్మంలో దండప్రణయనం

మత్స్య ఉవాచ – మత్స్య భగవానుడు చెప్పాడు.

నిక్షేపస్య సమం మూలం దండో నిక్షేపభుక్ తథా ।
వస్త్రాదిక సమస్తస్య తదా ధర్మో న హీయతే ॥ 1 ॥

యో నిక్షేపం నార్పయతి యశ్చానిక్షిప్య యాచతే ।
తావుభౌ చోరవచ్ఛాస్యౌ దాప్యౌ వా ద్విగుణం ధనమ్ ॥ 2 ॥

ఓ రాజా! ఇతరులు తన వద్ద దాచిన ధనమును అనుభవించినవానికి ఆధనపు మూల్యముతో సమానమైన మూల్యమును చెల్లించున్నట్లు జేయుటనే దండము, వస్త్రాదుల విషయమునందును ఇట్లే చేయాలి. ఈ విధంగా దండము నిచ్చుట వలన ధర్మమునకు హాని కలుగదు. అంతేకాక ఇతరులు తన దగ్గర దాచుట కిచ్చిన ధనమును తిరిగి చెల్లించనవానికిని, దాచకుండానే దాచితినని అబద్ధమాడుతు ధనమడుగు వానిని దొంగలను వలె దండించాలి. ద్విగుణీకృతమైన ధనమును ఇప్పించాలి.

ఉపధాభిశ్చ యః కశ్చిత్ పరద్రవ్యం హరేన్నరః ।
ససహాయః స హన్తవ్యః ప్రకామం వివిధైర్వధైః ॥ 3 ॥

యో యాచితం సమాదాయ న తద్దద్యాత్ యథాక్రమమ్ ।
స నిగృహ్య బలాద్దాప్యో దండ్యో వా పూర్వసాహసమ్ ॥ 4 ॥

మోసపు పనులతో పరుల ద్రవ్యమును అపహరించినవానిని అనేక విధములైన హింసలతో వాని సహాయకులతో పాటు వధించాలి. మరియు ఇతరుల నుండి ధనమును అడిగితీసుకొని మరల ఈయనివానిని రాజు బంధించి దండించాలి లేదా బలవంతంగానైనా ఆ ధనమును తిరిగి ఇప్పించాలి.

అజ్ఞానాద్యదివా కుర్యాత్ పరద్రవ్యస్య విక్రయమ్ ।
నిర్దోషో జ్ఞానపూర్వం తు చోరవద్వధమర్హతి ॥ 5 ॥

మూల్యమాదాయ యో విద్యాం శిల్పం వా న ప్రయచ్ఛతి ।
దండ్యః సమూల్యం సకలం ధర్మజ్ఞేన మహీక్షితా ॥ 6 ॥

అజ్ఞానముతో తెలియకుండా పరద్రవ్యమును విక్రయించినచో దోషము కాదు కాని తెలిసికూడ ఇతరుల ద్రవ్యమును అమ్మినవానిని చోరుని దండించినట్లు దండించాలి. అలాగే మూల్యము తీసుకొని విద్యను కాని కళలను కాని ఈయనివానిని అంటే నేర్పనివానిని కూడ ధర్మజ్ఞుడైన రాజు కఠినముగా శిక్షించాలి. ఆ మూల్యమును సంపూర్ణంగా తిరిగి ఇప్పించాలి.

ద్విజో భోజ్యే తు సంప్రాప్తే ప్రతివేశ్మమభోజయన్ ।
హిరణ్యమాషకం దండ్యః పాపే నాస్తి వ్యతిక్రమః ॥ 7 ॥

ఆమంత్రితో ద్విజో యస్తు వర్తమానశ్చ స్వే గృహే ।
నిష్కారణం న గచ్ఛేద్యః స దాప్యోఽష్టశతం దమమ్ ॥ 8 ॥

ప్రతిశ్రుత్యాప్రదాతారం సువర్ణం దండయేన్నృపః ।

తన ఇంటిలో బ్రాహ్మణులకు భోజనము ఏర్పాటు చేసి ఆ సమయమున తన ఇరుగు పొరుగువారిని భోజనమునకు ఆహ్వానించనివారిని మాష ప్రమాణపు బంగారమును అపరాధ శుల్కముగా విధించి దండించాలి. ఇట్లు చేయుట వలన రాజుకు పాపము రాదు. అట్లే ఆహ్వానింపబడినట్టి బ్రాహ్మణుడు నిష్కారణముగా తన ఇంటియందే కూర్చుని ఆహ్వానించిన గృహమునకు పోనట్లైతే ఆతనికి ఎనిమిది వందల దమములు దండముగా విధించాలి. మరియు ఇత్తునని మాట ఇచ్చి ఇవ్వకుండా ఉండువానికి కూడ రాజు ఒక సువర్ణము (అనగా 80గురుగింజల ప్రమాణము) తో అపరాధశుల్కమును విధించి దండించాలి.

భృత్యశ్చాజ్ఞాం న కుర్యాద్యో దర్పాత్కర్మ యథోదితమ్ ।
స దండ్యః కృష్ణ లాన్యష్టౌ న దేయం చాస్య వేతనమ్ ॥ 10 ॥

సంగృహీతం న దద్యాద్యః కాలే వేతనమేవ చ ।
అకాలే తు త్యజేత్ భృత్యం దండ్యః స్యాచ్ఛతమేవ చ ॥ 11 ॥

గర్వముతో తన స్వామి చెప్పినట్టి కార్యమును ఆచరించని సేవకుని ఎనిమిది కృష్ణలములతో దండించాలి మరియు ఆతనికి వేతనము కూడ ఇవ్వకూడదు. అట్లే తన సేవకునకు సకాలమున వేతనము నీయని అకాలము నందు సేవకుడిని పనినుండి తీసివేసిన వానిని కూడ వెయ్యిరూపాయలతో దండించాలి.

యో గ్రామదేశసస్యానాం కృత్యా సత్యేన సంవిదమ్ ।
విసంవదేన్నరో లోభాత్తం రాష్ట్రాద్విప్రవాసయేత్ ॥ 12 ॥

క్రీత్వా విక్రియ వా కించిద్యస్యేహానుశయీ భవేత్ ।
సోఽన్తర్దశాహాత్తత్స్వామ్యం దద్యాచ్చైవాదదీత వా ॥ 13 ॥

పరేణ తు దశాహస్య న దద్యా న్నైవ దాపయేత్ ।
ఆదదద్విదదచ్చైవ రాజ్ఞా దండ్యః శతాని షట్ ॥ 14 ॥

ఓ రాజా! గ్రామ విషయమున గాని, దేశ విషయమున గాని, పంటల విషయమను గాని, ఇచ్చి పుచ్చుకొను వ్యవహారాదులలో ప్రమాణము చేసి తర్వాత లోభముతో మాట తప్పిన వానిని దేశమునుండి బహిష్కృతుని చేయాలి. ఏదైనా ఒక వస్తువును అమ్మినపుడు లేదా కొనినపుడు ఇవ్వవలసిన మూల్యములో మిగిలిన దానిని పదిరోజులలోపు మాత్రమే తీర్చాలి. పది దివసములు దాటిన తర్వాత ఇవ్వవలసిన దానిని ఈయని వానిని, ఇప్పించనివానిని కూడ రాజు ఆరువందల ఇరువది రూపాయలతో దండించాలి. పణము-ఇరువది రూపాయలు

యస్తు దోషవతీం కన్యా మనాఖ్యాయ ప్రయచ్ఛతి ।
తస్య కుర్యాన్నృపో దండం స్వయం షణ్ణవతిం పణాన్ ॥ 15 ॥

అకన్యైవేతి యఃకన్యాం బ్రూయాద్ద్వేషేణ మానవః ।
స శతం ప్రాప్నుయాద్దండం తస్యా దోషమదర్శయన్ ॥ 16 ॥

యస్త్వన్యాం దర్శయిత్వాన్యాం వోఢః కన్యాం ప్రయచ్ఛతి ।
ఉత్తమం తస్య కుర్వీత రాజా దండం తు సాహసమ్ ॥ 17 ॥

ఎవరైతే తన కూతురిలో ఉండే దోషములను తెలుపకుండా కన్యాదానము చేయుదురో వారికి రాజు తొంబది ఆరుపణములతో దండన విధించాలి. ఎవడైతే కన్యను అకన్యనుగా చిత్రించి దోషము చూపెట్టునో ఆతనిని వంద పణములతో దండించాలి. ఒక కన్యను చూపించి వివాహసమయమున వేరొక కన్యను కన్యాదానము చేయువానికి రాజు ఉత్తమమైన సాహసమైన దండన విధించాలి.

వరో దోషాననాఖ్యాయ యః కన్యాం వరయేదిహ ।
దత్తాప్యదత్తా సా తస్య రాజ్ఞా దండ్యః శతద్వయమ్ ॥ 18 ॥

ఏ వరుడైతే తనలోని దోషాలను తెలుపకుండా కప్పిపుచ్చుకొని ఏ కన్యనైన వివాహమాడినచో ఆవివాహము వివాహముగా పరిగణింపబడకూడదు. అటువంటి వరుడిని రాజు రెండు వందల పణములతో దండించాలి.

ప్రదాయ కన్యాం యోఽన్యస్మై పునస్తాం సంప్రయచ్ఛతి ।
దండః కార్యో నరేంద్రేణ తస్యాప్యుత్తమసాహసః ॥ 19 ॥

సత్యం కారేణ వా వాచా యుక్తం పణ్యమసంశయమ్ ।
లుబ్ధో హ్యన్యత్ర విక్రేతా షట్ శతం దండమర్హతి ॥ 20 ॥

తన కన్యను మొదట ఒకనికిచ్చి వివాహమున మరల ఆమెను ఇంకొకనికిచ్చుటకు ప్రయత్నించు వానిని రాజు కఠినంగా దండించాలి. అట్లే ఒక వస్తువును ఒకరికి ఇత్తునని మాట ఇచ్చి మరల లోభముతో మాటతప్పి ఇతరులకిచ్చుటకు యత్నించేవానిని కూడ రాజు ఆరువందల పణములతో శిక్షించాలి.

దుహితుః శుల్క విక్రేతా సత్యం కారాత్తు సంత్యజేత్ ।
ద్విగుణం దండయేదేనమితి ధర్మో వ్యవస్థితః ॥ 21 ॥

తన కూతురిని డబ్బులకు అమ్ముకొనువానిని, సత్యమును దాటవేయువానిని (వదిలివేయువానిని) వాడు అమ్మిన ధనమున కంటే రెండింతల ధనముతో దండించాలి అని ధర్మవ్యవస్థ చెబుతున్నది.

మూల్యైకదేశం దత్త్వాతు యది క్రేతా ధనం త్యజేత్ ।
స దండ్యో మధ్యమం దండం తస్య పణ్యస్య మోక్షణమ్ ॥ 22 ॥

దద్యాద్ధేనుం చ యః పాలో గృహీత్వా భక్తవేతనమ్ ।
స తు దండ్యః శతం రాజ్ఞా సువర్ణం చాప్యరక్షితా ॥ 23 ॥

దండం దత్త్వా తు విరమేత్ స్వామితః కృతలక్షణః ।
బద్ధః కార్ష్ణాయసైః పాశైః తస్య కర్మకరో భవేత్ ॥ 24 ॥

తాను కొనిన వస్తువు యొక్క మూల్యములో కొంత మాత్రము చెల్లించి మిగిలిన మూల్యమును చెల్లించనివానిని మధ్యమ దండముతో అనగా అత్యధికము లేదా అతి న్యూనము కాకుండునట్లు దండించాలి. మరియు ఆ వస్తువును అసలు వానికి ఇప్పించాలి. గోవును మేపుటకై కాపాడుటకై వేతనము తీసుకొని అది అనువర్తించనివానికి వంద బంగారు పణములతో దండన విధించాలి. అది చెల్లించని తర్వాత అట్లు చేసినవానికి అపరాధపు గురుతువేసి, లోహపు గోలుసులతో బంధించి రాజు విధించినట్టి పనిని చేయునట్లు ఆజ్ఞాపించాలి.

ధనుః శత పరీణాహో గ్రామస్య తు సమంతతః ।
ద్విగుణం త్రిగుణం వాపి నగరస్య తు కల్పయేత్ ॥ 25 ॥

వృత్తిం తత్ర ప్రకుర్వీత యాముష్ట్రో నావలోకయేత్ ।
ఛిద్రం వా వారయేత్సర్వం శ్వశూకరముఖానుగమ్ ॥ 26 ॥

యత్రాపరివృతం ధాన్యం విహింస్యుః పశవో యది ।
న తత్ర కారయేద్దండం నృపతిః పశురక్షిణే ॥ 27 ॥

గ్రామమునకు వెలుపల నాలుగు దిక్కులయందును నూరు ధనువుల దూరమునందు మరియు నగరమునకైనచో రెండు లేదా మూడు వందల ధనువుల దూరమందును చాలా ఎత్తైన కంచె నిర్మించాలి. ఇది ఒంటె కూడ తల ఎత్తి చూసుటకు వీలుకానంత ఎత్తుగా ఉండాలి. ఈ కంచెలో నుండి కుక్కలు, పందులు మొదలగునవి దూరిపోకుండునట్లు కంచెకు ఎటువంటి ఛిద్రములు లేకుండా జాగ్రత్తపడాలి. మరియు ఈ కంచెకు లోపలి భాగమున ఉండు పైరు పంటలను ఒకవేళ పశువులు హాని కలిగించిననూ పశు పాలకునకు రాజు ఎటువంటి దండన విధించకూడదు.

అనిర్దశాహాం గాం సూతీం వృషం దేవపశుం తథా ।
ఛిద్రం వా వారయేత్సర్వం న దండ్యామనురబ్రవీత్ ॥ 28 ॥

అథోఽన్యథా వినష్టస్య దశాంశం దండమర్హతి ।
పాల్యస్య పాలకస్వామీ వినాశే క్షత్రియస్య తు ॥ 29 ॥

భిక్షయిత్వోపవిష్టస్తు ద్విగుణం దండమర్హతి ।
విశం దండ్యాద్దశగుణం వినాశే క్షత్రియస్యతు ॥ 30 ॥

ఈనిన తర్వాత పదిదివసములు కూడ గడవని ఆవు, వృషభము, దేవతలకు అర్పించిన పశువు పంటపొలములలో దూరకుండా ఉండునట్లు జాగ్రత్తపడాలి. అవి దూరుటకు వీలుకాకుండా ఛిద్రములను

మూసివేయాలి. ఒక వేళ పొరపాటున అవి పొలములలో దూరినను వాటిని దండించకూడదు అని మనువు చెప్పాడు. ఇట్లు కాకుండా వేరొక విధముగా అవి పంటలకు నష్టం కలిగించినచో, అది క్షత్రియునకు సంబంధించినది అయినచో వాటి పాలకునకు పదింతల దండన విధించాలి. పశువు పైరు పంటలను తిని అక్కడనే పడుకొనియున్నచో ద్విగుణముగా = రెండింతల దండము విధించాలి. అట్లే క్షత్రియుని పైరులకు వైశ్యుని పశువులు నష్టం కలిగించినచో ఆతనిని పదిరెట్లు అధికముగా దండించాలి.

గృహం తడాగమారామం క్షేత్రం వాపి సమాహరన్ ।
శతాని పంచ దండస్యాద జ్ఞానాద్వింశతో దమః ॥ 31 ॥

సీమాబంధనకాలే తు సీమాన్తం యో హి కారయేత్ ।
తేషాం సంజ్ఞాం దదానస్తు జిహ్వాఛేదనమాప్నుయాత్ ॥ 32 ॥

అథైనామపి యో దద్యాత్ సంవిదం వాఽధిగచ్ఛతి ।
ఉత్తమం సాహసం దండ్య ఇతి స్వాయంభువోఽబ్రవీత్ ॥ 33 ॥

గృహము, చెరువు, తోట, పొలం మొదలగు వాటిని హరించిన వానిని ఐదు వందల కార్షాపణముల దండన విధించాలి. ఇవి తెలియక అజ్ఞానముతో చేసిన వారికి రెండువందలపణములతో దండన విధించాలి. పొలపు గట్టులను నిర్ణయించే ఏర్పాటు చేయునప్పుడు తప్పు హద్దులను నిర్ణయించినను, ఏర్పాటు చేసినను, అట్లు చేయుటకు సైగల ద్వారా పురమాయించిననూ చేసిన వాని నాలుకను ఛేదించాలి. తన హద్దు విషయమున అంగీకరించి మరల సీమోల్లంఘనము చేయువానిని వాడికి తోడ్పడువానిని కూడ ఉత్తమమైన కఠినమైన దండనముతో శిక్షింపవలెనని స్వాయంభువ మనువు చెప్పాడు.

వర్ణానా మానుపూర్వ్యేణ త్రయాణామవిశేషతః ।
అకార్య కారిణః సర్వాన్ ప్రాయశ్చిత్తాని కారయేత్ ॥ 34 ॥

అసత్యేన ప్రమాప్య స్త్రీశూద్రహత్యావ్రతం చరేత్ ।
దానేన చ ధనేనైకం సర్పాదీనామశక్నువన్ ॥ 35 ॥

ఏకైకం స చరేత్ కృచ్ఛ్రం ద్విజః పాపాపనుత్తయే ।
ఫలదానాం చ వృక్షాణాం ఛేదనే జప్యమృక్శతమ్ ॥ 36 ॥

బ్రాహ్మణ – క్షత్రియ – వైశ్యులలో ఎవరైననూ చేయకూడని కర్మ నాచరించినచో వారితో రాజు ప్రాయశ్చిత్తాది కర్మలు ఆచరింపజేయాలి. అసత్యపు మాటలతో మోసగించి స్త్రీని హత్యచేసినవాడు శూద్రహత్య చేసినప్పుడు ఆచరించే వ్రతములనాచరించాలి. సర్పాదులను తాను చంపలేక దానముతో ధనముతో వాటిని చంపించిన ద్విజునకు ఆ పాపము నుండి ముక్తి పొందుటకు కృచ్ఛ్రవ్రతములాచరింపజేయాలి. అట్లే ఫలములనిచ్చు వృక్షములను ఛేదించినవాడు ప్రాయశ్చిత్తార్థము వంద ఋక్కులను జపింపజేయాలి.

గుల్మవల్లీలతానాం చ పుష్పితానాం చ వీరుధామ్ ।
అస్థిమతాం చ సత్త్వానాం సహస్రస్య ప్రమాపణే ।
పూర్ణే వానస్యవస్థాతుం శూద్రహత్యావ్రతం చరేత్ ॥ 37 ॥

కించిద్దేయం చ విప్రాయ దద్యాదస్థిమతాం వధే ।
అనస్థ్నాం చైవ హింసాయాం ప్రాణాయామై ర్విశుధ్యతి ॥ 38 ॥

పూవులు కలిగిన పొదలను, వల్లులను, లతలను బాగా వికసించిన పూవులు గల వృక్షములను ఛేదించువారుకూడ వంద ఋక్కులను జపించాలి. ఎముకలు కలిగిన జీవులను వేలకొలది చంపించిననూ బండ్ల కొలదిగా వాటిని వధించిననూ అట్లు చేసినవాడు శూద్ర హత్య వ్రతాన్ని ఆచరించాలి. ఎముకలు గల ప్రాణులను చంపినప్పుడు విప్రునకు దానం కూడ చేయాలి. అస్థిరహితములైన జీవులను హింసించినప్పుడు ఆ పాపమును ప్రాణాయామము మొదలగు వాటితో శుద్ధిచేసుకోవచ్చును.

అన్నాదిజానాం సత్త్వనాం రసజానాం చ సర్వశః ।
ఫలపుష్పోద్గతానాం చ ఘృత ప్రాశో విశోధనమ్ ॥ 39 ॥

కృష్టానామోషధీనాం చ జాతానాం చ స్వయం వనే ।
వృథా ఛ్ఛేదేన గచ్ఛేత దినమేకం పయోవ్రతీ ॥ 40 ॥

ఏతైర్వ్రతైరపోహ్యం స్యాదేనో హింసాసముద్భవమ్ ।

అన్నాదులనుండి, రసములనుండి, ఫలపుష్పాదులనుండి ఉత్పన్నములైన ప్రాణులను చంపించినచో ఘృతప్రాశముతో శుద్ధిపొందాలి. తానే స్వయముగా దున్ని పండించిన ఓషధులను, వాటంతటఅవే వనమునందుద్భవించినవాటిని కారణములేకండా ఛేదించినచో ఒక దివస కాలము వ్రతమాచరించాలి. హింసాయుతమైన పాపకర్మలనుండి ఈ విధంగా వ్రతాలాచరించి శుద్ధిపొందాలి.

స్తేయకర్తృ పహర్తౄణాం శ్రూయతాం వ్రతముత్తమమ్ ॥ 41 ॥

ధాన్యాన్నధన చౌర్యాణి కృత్వా కామాద్ ద్విజోత్తమః ।
సజాతీయ గృహాదేవ కృచ్ఛ్రార్ధేన విశుధ్యతి ॥ 42 ॥

మనుష్యాణాం తు హరణే స్త్రీణాం క్షేత్రగృహస్య తు ।
కూపవాపీజలానాం తు శుద్ధిశ్చాంద్రాయణం స్మృతమ్ ॥ 43 ॥

ఇప్పుడు చౌర్యముతో వస్తువులను అపహరించినవారి దోషపరిహారమునకు సంబంధించి వ్రతాదులను వివరించెదను వినుము. ధాన్యము, అన్నము, ధనము మొదలగువాటిని బ్రాహ్మణుడు తన జాతి వారి నుండి అపహరించినట్లైతే అర్ధకృచ్ఛ్రవ్రతము నాచరించి శుద్ధి పొందవచ్చును. మనుష్యులను స్త్రీలను, పొలములను, గృహములను, కూపవాపీ జలములను అపహరించినచో చాంద్రాయణ వ్రతమాచరించి శుద్ధి పొందాలి.

ద్రవ్యాణామల్పసారాణాం స్తేయం కృత్వాఽన్యవేశ్మతః ।
చరేత్సాంతపనం కృచ్ఛ్రం తన్నిర్యాత్య విశుద్ధయే ॥ 44 ॥

భక్ష్య భోజ్యాపహరణే యానశయ్యాసనస్య తు ।
పుష్పమూలఫలానాం తు పంచగవ్యం విశోధనమ్ ॥ 45 ॥

అల్పసారములైన ద్రవ్యములను ఇతరుల గృహముల నుండి చౌర్యము చేసినచో సాంతపనకృచ్ఛ్ర వ్రతమాచరించాలి. భక్ష్య-భోజ్యాదులు, వాహన-శయ్య-ఆసనాదులు, పుష్ప-మూల -ఫలాదులు మొదలగు వాటిని అపహరించినచో పంచగవ్యముతో శుద్ధిచేసుకోవాలి.

తృణకాష్ఠద్రుమాణాం తు శుష్కాన్నస్య గుడస్య చ ।
చైల చర్మామిషాణాం తు త్రిరాత్రం స్యాదభోజనమ్ ॥ 46 ॥

మణిముక్తాప్రవాలానాం తామ్రస్య రజతస్య చ ।
అయస్కాంస్యోపలానాం చ ద్వాదశాహం కణాన్నభుక్ ॥ 47 ॥

గడ్డి, కట్టెలు, చెట్లు, శుష్కాన్నము, బెల్లము, వస్త్రము, చర్మము, మరియు మాంసము మొదలగువాటిని అపహరించినచో మూడు రాత్రులు ఉపవాసవ్రతమునాచరించాలి. అట్లే మణులు, ముత్యములు, పగడములు, తామ్రము, రజతము, కాంస్యోపలములు ఇత్యాదులను అపహరించినచో పన్నెండు రోజులు మెతుకులు ఏరుకొని తినాలి.

కార్పాసకీట జోర్ణానాం ద్విశఫైకశఫస్య చ ।
పక్షి గంధౌషధీనాం చ రజ్జ్వాశ్చైవ త్ర్యహం పయః ॥ 48 ॥

ఏతైర్వ్రతైరపోహన్తి పాపం స్తేయకృతం ద్విజః ।

ప్రత్తి నుండి మరియు కీటములనుండి వస్త్రములు, రెండు గిట్టలు మరియు ఒక గిట్టగల ప్రాణులు, పక్షులు, గంధద్రవ్యములు, ఓషధులు మొదలగు వాటిని అపహరించినచో మూడురోజుల పర్యంతము క్షీరాహారంతో శుద్ధిచేసికోవాలి. ఇట్లు దొంగతనం చేత కలిగే పాపములన్నింటినుండి ఈ వ్రతములనాచరించి పోగొట్టుకోవాలి.

అగమ్యాగమనీయం తు వ్రతైరేభిరపానుదేత్ ॥ 49 ॥

గురుతల్పవ్రతం కుర్యాద్రేతః సిక్త్వా స్వయోనిషు ।
సఖ్యుః పుత్రస్య చ స్త్రీషు కుమారీష్వన్త్యజాసు చ ॥ 50 ॥

పితృష్వస్రేయభగినీం స్వస్రీయాం మాతురేవ చ ।
మాతుశ్చ భ్రాతురార్యాయాం గత్వా చాంద్రాయణం చరేత్ ॥ 51 ॥

అగమ్యాగమనము జరిగినపుడు ఆ పాపనివృత్తి కొరకు ఎటువంటి వ్రతములాచరించవలెనో వివరించెదను వినుము. స్వజాతీయురాలైన ఇతర స్త్రీయోనియందు, మిత్రుని భార్యయందు, పుత్రభార్యయందు, కన్యయందు

రేతస్సు విడిచినట్లైతే గురుతల్పవ్రతమునాచరించాలి. మేనత్త, పినలేదా పెదతల్లి, మొదలగు వారితో సమాగమమైనచో చాంద్రాయణవ్రత మాచరించాలి.

ఏతాః స్త్రియస్తు భార్యార్థే నోపగచ్ఛేత్తు బుద్ధిమాన్ ।
జ్ఞాతీనాం చ స్త్రియో యాస్తు పతితానుగతాశ్చ యాః ॥ 52 ॥

అమానుషీషు పురుషో ఉదక్యాయామయోనిషు ।
రేతః సిక్త్వా జలే చైవ కృచ్ఛ్రసాన్తపనం చరేత్ ॥ 53 ॥

బుద్ధిమంతుడైన వాడెవడునూ వీరిలో ఎవ్వరినీ వివాహమాడరాదు. జ్ఞాతులైన స్త్రీలతో, పతితలైన స్త్రీలతో, మనుష్యేతర ప్రాణులతో , ఋతుమతులైన స్త్రీలతో కలిసి రేతస్సు విడిచినచో, నీటిలో మరియు యోని ప్రదేశం కానిచోట రేతస్సు విడిచిననూ కృచ్ఛ్రసాంతపనమను వ్రతమును ఆచరించాలి.

మైథునం చ సమాలోక్య పుంసి యోషితి వా ద్విజః ।
గోయానేఽప్సు దివా చైవ సవాసాః స్నానమాచరేత్ ॥ 54 ॥

చాండాలాంత్యస్త్రియో గత్వా భుక్త్వా చ ప్రతిగృహ్య చ ।
పతత్యజ్ఞానతో విప్రో జ్ఞానాత్ సామ్యం తు గచ్ఛతి ॥ 55 ॥

స్త్రీ పురుషులాచరించు మైథునమును గాని, ఎడ్లబండి యందుగాని , నీటిలోగాని, పగలు గాని మైథునమును చూచిన ద్విజుడు వస్త్ర సమేతుడై స్నానమాచరించాలి. చండాల స్త్రీ లేదా అంత్యజురాలైన స్త్రీతో తెలియకుండా కలిసిననూ, కలిసి భోజనము చేసినను, వివాహమాడినను ద్విజుడు పతితుడౌతాడు. ఇంక తెలిసి ఇవన్ని ఆచరించినవాడు తత్సముడే అవుతాడు.

విప్రదుష్టాం స్త్రియం భర్తా నిరుంధ్యాదేకవేశ్మని ।
యత్ పుంసః పరదారేషు తచ్చైనాం చారయేద్ వ్రతమ్ ॥ 56 ॥

సా చేత్ పునః ప్రదుష్యేత్తు సదృశేనోపమంత్రితా ।
కృచ్ఛ్రం చాంద్రాయణం చైవ తత్తస్యాః పావనం స్మృతమ్ ॥ 57 ॥

ఇంకొక బ్రహ్మణుని ద్వారా దూషితమైన తనస్త్రీని భర్త ఒక గదియందు ఒంటరిగా బంధించాలి. అట్లే పరస్త్రీని కోరుకునే పురుషుడి విషయమున కూడ ఇటువంటి వ్రతమే ఆచరించాలి. ఆమె మరల అటువంటి తప్పునే ఆచరించినచో ఆమెతో కృచ్ఛ్రమైన చాంద్రాయణవ్రతము ఆచరింపజేయాలి. అట్లు చేసినచో ఆమె పవిత్రతను పొందునని చెప్పబడినది.

యః కరోత్యేకరాత్రేణ వృషలీసేవనం ద్విజః ।
తద్భైక్ష్య భుగ్జపేన్నిత్యం త్రిభిర్వర్షైర్వ్యపోహతి ॥ 58 ॥

ఏషా పాపకృతా ముక్తా చతుర్ణామపి నిష్కృతిః ।
పతితై సంప్రయుక్తానామిమాం శృణుత నిష్కృతిమ్ ॥ 59 ॥

ఒక రాత్రి శూద్ర స్త్రీని పొందిన ద్విజుడు మూడుసంవత్సరముల వరకు ఏకభుక్త వ్రతమాచరించుచు గాయత్రీ జపము చేసినచో ఆ పాపమునుండి విముక్తుడగును. ఇట్లు నాలుగు వర్ణములవారు చేసే ఆయా పాపములకు ప్రాయశ్చిత్తాదులు తెలుపబడినవి ఇప్పుడు పతితలతో సమాగమము పొందిన దోషములకు ప్రాయశ్చిత్తములను వివరించెదను.

సంవత్సరేణ పతతి పతితేన సహాచరన్ ।
యాజనాధ్యాపనాద్యౌనాదనుయానాశనాసనాత్ ॥ 60 ॥

యో యేన పతితేనైషాం సంసర్గం యాతి మానవః ॥
స తస్యైవ వ్రతం కుర్యాత్ తత్సంసర్గవిశుద్ధయే ॥ 61 ॥

పతితుల ఇంటిలో యజ్ఞయాగాదులు నిర్వహించుట, అధ్యాపనము, అధ్యయనము చేయుట, వారితో వివాహది సంబంధములు కలుపుకొనుట, కలిసి ప్రయాణించుట, భోజనము చేయుట, ఒకే ఆసనముపై కూర్చొనుట మొదలగునవి చేసిన ద్విజుడు కూడ ఒక సంవత్సరకాలములో పతితుడగును. ఎవరు ఎటువంటి దోషము కలిగిన పతితునితో సంబంధమును పొందునో ఆ దోష నివారణమునకై ఆచరించవలసిన వ్రతమును ఆచరించి శుద్ధిని పొందాలి.

పతితస్యోదకం కార్యం సపిండైర్బాంధవై స్సహ ।
నిందితేఽహని సాయాహ్నే జ్ఞాతిభిర్గురుసన్నిధౌ ॥ 62 ॥

దాసీ ఘటామపాం పూర్ణం పర్యస్యేత్ ప్రేతవత్ సదా ।
అహోరాత్రముపాసీర న్నాశౌచం బాంధవైః సహ ॥ 63 ॥

జ్ఞాతులు, సపిండులు, బంధువులు మొదలగు వారందరు కలిసి ఒక అశుభదినపు సాయంకాలమున గురువులు సన్నిధిలో పతితుడైన వానికి తిలోదకము తీయాలి. నీటితో నిండిన కడవను దాసీతో తెప్పించి దానిని ప్రేతకు వలె అప్రదక్షిణముగా త్రిప్పి ఛిన్నమై పోవునట్లు నేలపై పడవేయించాలి. అంతేకాక బంధువులందరితో కలసి ఒక అహోరాత్రముపవాసముతో పాటు అశౌచము నాచరించాలి.

నివర్తయేరం స్తస్మాత్తు సంభాషణసహాసనమ్ ।
దాయాదస్య ప్రమాణం చ యాత్రమేవం చ లౌకికీమ్ ॥ 64 ॥

జ్యేష్ఠాభావాన్నివర్తేత జ్యేష్ఠ్యావాప్తం చ యత్ పునః ।
జ్యేష్ఠాంశం ప్రాప్నుయాచ్చాస్య యవీయాన్ గుణతోఽధికః ॥ 65 ॥

పైన చెప్పిన వారందరు ఆ పతితునితో సంభాషించుట, కలిసి కూర్చుండుట, దాయాదవ్యవహారమును పాటించుట, లౌకికములైన యాత్రాదులు చేయుట మొదలగువాటిని ఆచరించకూడదు. ఆ పతితుడు ఒకవేళ అన్నదమ్ములలో జ్యేష్ఠుడు అయినచో జ్యేష్ఠత్వము ద్వారా ప్రాప్తించు అధికారములు కోల్పోవును. వానికంటే చిన్నవాడైననూ గుణాధికుడైన అతని తమ్మునికై అటువంటి పిత్ర పైతామహములైన అధికారములన్నియు చేరాలి.

స్థాపితాం చాపి మర్యాదాం యే భింద్యుః పాపకర్మిణః ।
సర్వే పృథగ్ దండనీయా రాజ్ఞా ప్రథమసాహసమ్ ॥ 66 ॥

శతం బ్రాహ్మణ మాకృశ్య క్షత్రియో దండమర్హతి ।
వైశ్యస్తు ద్విశతం రాజన్ శూద్రస్తు వధమర్హతి ॥ 67 ॥

పంచాశద్ బ్రాహ్మణో దండ్యః క్షత్రియస్యాభిశంసనే ।
వైశ్యస్యాప్యర్ధపంచాశత్ శూద్రే ద్వాదశకో దమః ॥ 68 ॥

శాస్త్రములచే స్థాపితమైన మర్యాదను ఉల్లంఘించే పాపకర్ములలో ప్రతి ఒకరిని రాజు వేరు వేరుగా ఉత్తమమైన కఠినమైన దండనతో శిక్షించాలి. క్షత్రియుడు బ్రాహ్మణుని నిందించినచో ఆతనిని వంద పణములతో దండించాలి. వైశ్యుడు నిందించినచో రెండువందల పణములతో మరియు శూద్రుడు నిందించినచో ఆతనికి విధించే దండనము విధించాలి. ఒకవేళ బ్రాహ్మణుడు క్షత్రియుని నిందించినచో ఏబది పణములతోను, వైశ్యుని తిట్టినచో ఇరువది ఐదు పణములతోను శూద్రుని నిందించినచో పండ్రెండు పణములతో దండించాలి.

క్షత్రియస్యాప్నుయాద్వైశ్యః సాహసం పునరేవ చ ।

శూద్రః క్షత్రియమాకృశ్య జిహ్వాచ్ఛేదనమాప్నుయాత్ ॥ 69 ॥

పంచాశత్ క్షత్రియో దండ్యః తథా వైశ్యాభిశంసనే ।
శూద్రే చైవార్ధపంచాశత్ తథా ధర్మో న హీయతే ॥ 70 ॥

వైశ్యస్యాక్రోశనే దండ్యః శూద్రశ్చోత్తమసాహసమ్ ।
శూద్రాకోశే తథా వైశ్యః శతార్ధం దండమర్హతి ॥ 71 ॥

వైశ్యుడు క్షత్రియుని నిందించినచో ఉత్తమమైన సాహసదండన విధించాలి. అట్లే శూద్రుడు క్షత్రియుని నిందించినచో ఆతని నాలుకను ఛేదించాలి. ఒకవేళ క్షత్రియుడే వైశ్యుని నిందించినట్లైతే ఆతనికి ఏబది పణములలోను దండించాలి. అట్లు చేయుట వలన ధర్మము నశించదు. మరియు శూద్రుడు వైశ్యుని నిందించినచో ఆతనిని వంద పణములతో దండించాలి.

సవర్ణాక్రోశనే దండ్యస్తథా ద్వాదశకం స్మృతమ్ ।
వాదేష్వవచనీయేషు తదేవ ద్విగుణం భవేత్ ॥ 72 ॥

ఏకజాతిర్ద్విజాతిం తు వాచా దారుణయా క్షిపన్ ।
జిహ్వాయాఃప్రాప్నుయాచ్ఛేదం జఘన్యః ప్రథమో హి సః ॥ 73 ॥

నామజాతి గృహం తేషామభిద్రోహేణ కుర్వతః ।
నిక్షేప్యోఽ_యోమయః శంకుర్జ్వలన్నాస్యే దశాంగులః ॥ 74 ॥

వీరిలో ఎవరైనా తమజాతివారినే నిందించినచో పద్రెండు పణములతో దండించాలి. అంతేకాక ఒక వేళ అనకూడని మాటలతో నిందించినచో రెండింతలు ఎక్కువగా దండించాలి. ఏకజాతివాడైన శూద్రుడు ద్విజాతులైన బ్రాహ్మణ – వైశ్య– శూద్రులలో ఎవరిని దారుణమైన మాటలతో నిందించినచో ఆతని నాలుకను ఛేదించాలి. ఎవరైనా పేరుతో, జాతితో, గృహపు (వంశపు) నామముతో నిందించినచో ఆతని నోటిలో పది అంగళముల ప్రమాణము గలిగిన మండతున్న అయోమయ (ఇనుప) శంకువునుంచాలి.

ధర్మోపదేశం శూద్రస్తు ద్విజానామభికుర్వతః ।
తప్తమాసేచయేత్తైలం వక్త్రే శ్రోత్రే చ పార్థివః ॥ 75 ॥

శ్రుతిం దేశం చ జాతిం చ కర్మ శారీరమేవ చ ।
వితథం చ బ్రువన్ దండ్యో రాజ్ఞా ద్విగుణసాహసమ్ ॥ 76 ॥

శూద్రుడు ద్విజునితో ధర్మము విషయమున చర్చ చేయుటకు సిద్ధిపడినచో రాజు కాగిన నూనెను ఆతని నోటిలో చెవిలో కూడ పోసి దండించాలి. వేదములను, శాస్త్రములను, దేశమును, జాతిని, శారీరికకర్మలను నిందించిననూ వాటిని గ్లాని కలిగించిననూ అలా చేసినవారిని రెండింతల సాహసదండన విధించాలి.

యస్తు పాతకసంయుక్తః క్షిపేద్వర్ణాన్తరం నరః ।
ఉత్తమం సాహసం దండః పాత్యస్తస్మిన్ యథాక్రమమ్ ॥ 77 ॥

రాజ్ఞో నివేశనియమం వితథం యాన్తి వై మిథః ।
సర్వే ద్విగుణదండ్యాస్తే విప్రలంభాన్నృపస్య చ ॥ 78 ॥

ప్రీత్యా మయా స్యాభిహితం ప్రమాదేనాథవా వదేత్ ।
భూయో న చైవం వక్ష్యామి స తు దండార్థభాగ్భవేత్ ॥ 79 ॥

స్వయముగా తానే పాపాత్ముడై యుండి కూడ ఇంకొక జాతి వానిని దూషించినచో ఆతని ఉత్తమమైన దండనము విధించాలి. రాజు యందలి ద్వేషముతో కొంతమంది కలిసి రాజుయొక్క నియమములు సరైనవి కావని నిందించిన వారందరిని వేరు వేరుగా రెండింతలెక్కువగా దండించాలి. "నేను ఈతని యందు ప్రీతి వలన లేదా పొరపాటువలన ఈతని తప్పును సమర్థించితిని, మరల ఇట్లు ఆచరించను" అని ప్రతిజ్ఞ చేసిన వానిని సగమైనను దండించాలి.

కాణం వాఽప్యథవా ఖంజం అంధం చాపి తథావిధమ్ ।
తథ్యేనాపి బ్రువన్ దాప్యో దండం కార్షాపణం ధనమ్ ॥ 80 ॥

మాతరం పితరం జ్యేష్ఠం భ్రాతరం శ్వశురం గురుమ్ ।
ఆక్రోశయన్ శతం దండ్యః పంథానం చార్దయన్ గురోః ॥ 81 ॥

గురువర్జ్యం తు మానార్హం యో హి మార్గం న యచ్ఛతి ।
స దాప్యః కృష్ణలం రాజ్ఞః తస్య పాపస్య శాంతయే ॥ 82 ॥

మెల్లకన్ను వానిని, కుంటివానిని, అంధుని అట్లే ఇతర అంగవైకల్యము గల వానిని ఆ పదముతో పిలిచినచో అట్లు పిలిచినవానికి ఒక కార్షాపణధనము దండముగా విధించాలి. అట్లే తల్లిని, తండ్రిని, పెద్దవారిని, సోదరుని, మామను, గురువును మొదలగువారు ఆక్రోశము ప్రకటించినను, వారి మార్గమును నిరోధించినను వందపణములతో దండించాలి. గురువు కాకుండా అతనితో సమానులైన వారికి కూడ త్రోవ ఇవ్వని వాడికి ఆతని పాపము శాంతించుటకై ఒక కృష్ణలము దండము విధించాలి.

ఏకజాతిర్ద్విజాతిం తు యేనాంగేన పరాధ్నుయాత్ ।
తదేవ ఛేదయేత్తస్య క్షిప్రమేవావిచారయన్ ॥ 83 ॥

అవనిష్ఠీవతో దర్పాత్ ద్వావోష్ఠౌ ఛేదయేన్నృపః ।
అవమూత్రయతో మేఢ్రం అపశబ్దయతో గుదమ్ ॥ 84 ॥

సహాసన మభిప్రేప్సుః ఉత్కృష్ట స్యాపకృష్టజః ।
కట్యాం కృతాంకో నిర్వాస్య స్ఫిచం వాప్యస్య కర్తయేత్ ॥ 85 ॥

శూద్రుడు ద్విజునకు శరీరములోని ఏ అంగముతో అపకారము చేయునో ఎటువంటి విచారం చేయక రాజు ఆతని ఆ అంగమునే ఛేదించాలి. ఎట్లనగా అహంకారముతో ద్విజుని వైపు ఉమ్మినచో ఆతని రెండు పెదవులను ఛేదించాలి, మూత్రము పోసి అవమానించినచో మేఢ్రమును, అపానవాయుధ్వని చేసినచో గుదమును ఛేదించాలి. ఉన్నతుడైనవానితో సమానమైన ఆసనమును కోరిన శూద్రుని కటిని ఛేదించి గుర్తుకలిగినట్లు చేయాలి లేదా పిరుదును ఛేదించి వెడలగొట్టాలి.

కేశేషు గృహ్ణతో హస్తం ఛేదయేదవిచారయన్ ।
పాదయోర్నాసికాయాం చ గ్రీవాయాం వృషణేషు చ ॥ 86 ॥

త్వగ్భేదకం శతం దండ్యో లోహితస్య చ దర్శకః ।
మాంసభేత్తా చ షణ్ణిష్కాన్ నిర్వాస్యస్త్వస్థిభేదకః ॥ 87 ॥

అంగభంగకరస్యాంగం తదేవావహరేన్నృపః ।
దండపారుష్యకృద్దండ్యః సముత్థానవ్యయం తథా ॥ 88 ॥

అట్లే నిమ్నజాతివాడు ఉన్నతిజాతివాని జుట్టు, పాదములు, ముక్కు, మెడ, వృషణములు మొదలగు అవయవములను పట్టినచో రాజు ఎటువంటి విచారము లేకుండా ఆతని హస్తములను ఛేదించాలి. చర్మము ఛేదించి రక్తము కారునట్లు గాయపరిచినవానిని శతవిధములుగా దండించాలి. మాంసము తేలునట్లు కొట్టినవానిని దండించి గ్రామబహిష్కృతుని చేయాలి. ఇంకను ఇతరులకు అంగవైకల్యము కలిగించువానిని అదే అంగము ఛేదించి రాజు దండించాలి మరియు దండపారుష్యము చేసినవానిని తత్సమానంగా దండించాలి.

అర్ధపాదకరః కార్యో గోగజా శ్వోష్ట్రఘాతకః ।
పశు క్షుద్ర మృగాణాం చ హింసాయాం ద్విగుణో దమః ॥ 89 ॥

పంచాశచ్చ భవేద్దండ్యః తథైవ మృగపక్షిషు ।
క్రిమికీటేషు దండ్య స్స్యాద్రజతస్య చ మాషకమ్ ॥ 90 ॥

తస్యానురూపం మూల్యం చ ప్రదద్యాత్ స్వామినే తథా ।
స్వస్వామికానాం సకలం శేషాణాం దమమేవ చ ॥ 91 ॥

గోవులను, గజములను, అశ్వములను, ఒంటెలను వధించినవాని కాళ్ళు మరియు చేతులను సగము నరకాలి. పశువులను, క్షుద్రమృగములను హింసించినవానికి రెట్టింపుగా దండించాలి. మృగములను పక్షులను హింసించినవారికి కూడ ఒక మాషపరిమాణపు వెండితో దండించాలి. అంతేకాక ఆ ప్రాణులను పెంచుకున్న యజమానికి వాటితో సమానమైన మూల్యాన్ని ఇప్పించాలి. స్వస్వామి సంబంధము గల ప్రాణులను హింసించినపుడు కూడ ఇటువంటి దండవిధానాన్నే అనుసరించాలి.

వృక్షం తు సఫలం ఛిత్వా సువర్ణం దండమర్హతి ।
ద్విగుణం దండయేచ్చైనం పథి సీమ్ని జలాశయే ॥ 92 ॥

ఛేదనాదఫలస్యాపి మధ్యమం సాహసం స్మృతమ్ ।
గుల్మవల్లీ లతానాం చ సువర్ణస్య చ మాషకమ్ ॥ 93 ॥

వృథాచ్ఛేదీ తృణస్యాపి దండ్యః కార్షాపణం భవేత్ ।
త్రిభాగం కృష్ణలా దండ్యాః ప్రాణినస్తాడనే తథా ॥ 94 ॥

దేశకాలానురూపేణ మూల్యం రాజా ద్రుమాదిషు ।
తత్స్వామిన స్తథా దండ్యా దండముక్తస్తు పార్థివ ॥ 95 ॥

ఓ రాజా! ఫలములతో కూడిన వృక్షమును ఛేదించినచో సువర్ణముతో దండించాలి. ఇంకనూ, ఆ వృక్షము త్రోవ ప్రక్కనో, పొలిమేరయందో జలాశయసమీపముగా ఉన్నచో రెండింతల సువర్ణదండనము విధించాలి. ఫలరహితమైన వృక్షమును ఛేదించినను మధ్యమ రీతిలో దండించాలి. అలాగే పొదలు, వల్లులు, లతలు మొదలగు వాటిని ఛేదించినవారికి మాషపరిమాణపు సువర్ణదండన మీయాలి. కారణము లేకండా గడ్డిని ఛేదించువారికి కార్షాపణ దండనము, అకారణముగా ప్రాణులను కొట్టినచో మూడు కృష్ణలముల దండనము విధించాలి. ఇంకనూ అనవసరంగా వృక్షాదులను ఛేదించువారికి రాజులు దేశకాలాదులననుసరించి వాటి వెలను కట్టి వాటి యజమానులకు ఇప్పించాలి.

యత్రాతివర్తతే యుగ్యం వైగుణ్యాత్ ప్రాజకస్య తు ।
తత్ర స్వామీ భవేద్దండ్యో నాప్తశ్చేత్ ప్రాజకో భవేత్ ॥ 96 ॥

ప్రాజకశ్చ భవేదాప్తః ప్రాజకో దండమర్హతి ।
నాస్తి దండశ్చ తస్యాపి తథా వై హేతుకల్పకః ॥ 97 ॥

ద్రవ్యాణి యో హరేద్యస్య జానతో జానతోఽపి వా ।
స తస్యోత్పాదయేత్తుష్టిం రాజ్ఞో దద్యాత్తతో దమమ్ ॥ 98 ॥

బండి నడిపేవాడి తప్పిదము వలన ఒకవేళ అది పడిపోయినప్పుడు తద్వారా హాని కలిగినప్పుడు బండినడుపువాడు నిపుణుడు కానట్లైతే ఆ బండి యొక్క యజమానిని దండించాలి. లేదా నడుపువాడు నిపుణుడే అయినచో ఆతనినే దండించాలి. మరియు బండి ఏదైనా విశేషపరిస్థితులలో నడిపేవాడికి సంబంధములేని కారణము వలన పడిపోయినపుడు ఆతనిని దండించకూడదు. వేరొకరి ద్రవ్యములను తెలిసియో తెలియకనో అపహరించిన వానిని రాజు ముందు వానిని దండించి ఆ ద్రవ్యపు యజమానికి సంతోషం కలిగించాలి. మరియు రాజునకు కూడ దండమును చెల్లించాలి.

యస్తు రజ్జుం ఘటం కూపాత్ హరేత్ భింద్యాచ్చ తాం ప్రపామ్ ।
సదండం ప్రాప్నుయాన్మాషం తచ్చ సంప్రతిపాదయేత్ ॥ 99 ॥

ధాన్యం దశభ్యః కుంభేభ్యః హరతోఽభ్యధికం వధః
శేషేఽప్యేకాదశగుణం తస్య దండం ప్రకల్పయేత్ ॥ 100 ॥

తథా భక్ష్యాన్నపానానాం న తథాప్యధికే వధః ।

ఎవరైనా నలుగురికి ఉపయోగపడు బావినుండి నీటిని చేదు త్రాడును కాని, కడవను కాని దొంగిలించినచో ఆ బావికి హాని కలిగించినచో మాషపరిమాణపు సువర్ణముతో దండన విధించాలి. మరియు ఆ బావిని మరల అతనిచే తనే బాగు చేయించాలి. అట్లే పది కడవలకన్న అధికంగా ధాన్యమును హరించినవానికి వధించుట అను శిక్షనే విధించచాలి. మరియు అంతకంటే తక్కువ దొంగిలించినచో ఆ దొంగిలించిన ధాన్యమునకు పదకొండు రెట్లధిక ధాన్యమును దండనముగా విధించాలి. భక్ష్యాన్నపానాదులు హరించినవారికి కూడ ఇటువంటి దండనమే విధించాలి కాని వధించుశిక్షను విధించకూడదు.

సువర్ణరజతాదీరాముత్తమానాం చ వాససామ్ ॥ 101 ॥

పురుషాణాం కులీనానాం నారీణాం చ విశేషతః ।
మహాపశునాం హరణే శస్త్రాణా మోషధస్య చ ॥ 102 ॥

ముఖ్యానాం చైవ రత్నానాం హరణే వధమర్హతి ।

బంగారము, వెండి మొదలగు వాటిని, ఉత్తమములైన వస్త్రములను, ఉత్తమవంశము నందు జన్మించిన పురుషులను విశేషించి స్త్రీలను, మహాపశువులను, శస్త్రములను, ఔషధములను ముఖ్యమైన రత్నములు మొదలగు వాటిని హరించినవారికి మరణదండనమే విధించాలి.

దధ్నః క్షీరస్య తక్రస్య పానీయస్య రసస్య చ ॥ 103 ॥

వేణువైదల భాండానాం లవణానాం తథైవ చ ।
మృణ్మయానాం చ సర్వేషాం మృదో భస్మన ఏవ చ ॥ 104 ॥

కాలమాసాద్య కార్యంచ రాజా దండం ప్రకల్పయేత్ ।
గోషు బ్రాహ్మణసంస్థాసు మహిషీషు తథైవ చ ॥ 105 ॥

అశ్వాపహారకశ్చైవ సద్యః కార్యో౽ర్ధపాదకః ।

పెరుగు, పాలు, మజ్జిగ, పానీయజలము, రసద్రవ్యములు, వెదురుతో చేసిన బుట్టలు, ఉప్పు, మట్టితో చేసిన పాత్రలు మట్టి, భస్మము ఇత్యాదులను దొంగిలించినచో ఆయాకాలములనుసరించి రాజు దండనము విధించాలి. అట్లే బ్రాహ్మణుల గృహములందలి గోవులు, మహిషములు, మరియు అశ్వములు మొదలగు వాటిని హరించినవానికి వెంటనే కాళ్ళు సగము నరికించుటయను శిక్ష విధించాలి.

సూత్రకార్పాసకిణ్వానాం గోమయస్య గుడస్య చ ॥ 106 ॥

మత్స్యానాం పక్షిణాం చైవ తైలస్య చ ఘృతస్య చ ।
మాంసస్య మధునశ్చైవ యచ్చాన్యద్వస్తు సంభవమ్ ॥ 107 ॥

అన్యేషాం లవణాదీనాం మద్యానా మోదనస్య చ ।
పక్వాన్నానాం చ సర్వేషాం తన్మూల్యాద్ద్విగుణో దమః ॥ 108 ॥

దారము, ప్రత్తి, కిణ్వము అనగా తెలికపిండి, గోమయము, బెల్లము, చేపలు, పక్షులు, తైలము, నెయ్యి, మాంసము, తేనె మరియు ఆయా వస్తువులనుండి ఉత్పన్నమయ్యే ద్రవ్యములు, అన్యవిధములగు లవణములు, మద్యములు, అన్నములు, పక్వాన్నములు మొదలగువాటిని అపహరించినచో వాటి మూల్యము కన్న రెండింతలు ఎక్కువ దండనము విధించాలి.

పుష్పేషు హరితే ధాన్యే గుల్మవల్లీలతాసు చ ।
అన్నేష పరిపూర్ణేషు దండఃస్యాత్ పంచమాషకమ్ ।
పరిపూర్ణేషు ధాన్యేషు శాకమూలఫలేషు చ ॥ 109 ॥

నిరన్వయే శతం దండ్యః సాన్వయే ద్విశతం దమః ।
యేన యేన యథాంగేన స్తేనో౽న్యేషు విచేష్టతే ॥ 110 ॥

తత్తదేవ హరేత్తస్య ప్రత్యాదేశాయ పార్థివః ।

పుష్పములు, పచ్చని ధాన్యములు, గుల్మములు, వల్లులు, తీగలు మరియు పరిపూర్ణమైన అన్నాదులు హరించినచో ఐదు మాషములతో సమానమైన దండనము, అట్లే పరిపూర్ణధాన్యములు, శాకములు, కందమూలములు, ఫలములు దొంగలించినవానికి వాడు ఒక్కడే అయినచో నూరు కార్షాపణముల దండనము లేదా ఇతరులతో కలిసివచ్చి అపహరించినచో రెండువందల కార్షాపణముల దండనము మరియు ఆయా వస్తువులను ఏ అంగసహాయంతో దొంగిలించునో ఆ అవయవమును తొలగించుటకు రాజు ఆదేశమియ్యాలి.

ద్విజో౽ధ్వగః క్షీణవృత్తిర్ద్వావిక్షూ ద్వే చ మూలకే ॥ 111 ॥

త్రపుసోర్వారుకౌ ద్వౌ చ తావన్మాత్రం ఫలేషు చ ।
తథా చ సర్వ ధాన్యానాం ముష్టిగ్రాహేణ పార్థివ ॥ 112 ॥

శాకే శాకప్రమాణేన గృహ్యమాణే న దుష్యతి ।
వానస్పత్యం ఫలం మూలం దార్వగ్న్యర్థం తథైవ చ ॥ 113 ॥

తృణం గోఽభ్యవహారార్థం అస్తేయం మనురబ్రవీత్ ।

బ్రాహ్మణుడు వేరొక చోటికి నడకదారిలో వెళ్ళుచున్నప్పుడు తన దగ్గర తినుటకు ఏమీ లేక పోవుటవలన రెండు చెఱుకుగడలు కాని, మూలకములు గాని, బుడవకాయలు లేదా దోసకాయలు కాని, వేరే ఏ పండ్లైనను గాని, పిడికెడు ధాన్యపు కంకులు మరియు కూరకు సరిపోవునంత శాకములను గాని అపహరించినచో అది దోషము కాదు. అంతేకాక వానస్పత్యములైన ఫలములు, దుంపలు, సమిధలు, మొదలగు వాటిని అగ్నికొరకై (యజ్ఞముకొరకై), ఆవు మేతకై స్వామి యొక్క అనుమతి లేకుండా గడ్డిని గ్రహించినను దోషము లేదని మనువు చెప్పాడు.

అదేవ వాటిజం పుష్పం దేవతీర్థం తథైవ చ ॥ 114 ॥

ఆదదానః పరక్షేత్రాన్న దండం దాతుమర్హతి ।
శృంగిణం నఖినం రాజన్ దంష్ట్రిణం చ వధోద్యతమ్ ॥ 115 ॥

యో హన్యాన్న స పాపేన లిప్యతే మనుజేశ్వర ।

దేవతా పూజకై దేవాలయపు వాటికలోనివి కాకుండా పరక్షేత్రము నుండి పువ్వులు తీసుకువచ్చినచో దండనము ఇవ్వకూడదు. ఓ మనుజేశ్వరా! కొమ్ములు, గ్రోళ్ళు, దంష్ట్రములు కలిగిన క్రూరజంతువులు తనను వధించుటకు వచ్చినప్పుడు వాటిని చంపినచో అది పాపము కాదు

గురుం వా బాలవృద్ధం వా బ్రాహ్మణం వా బహుశ్రుతమ్ ॥ 116 ॥

ఆతతాయిన మాయాన్తం హన్యాదేవావిచారయన్ ।
నాతతాయివధే దోషో హన్తుర్భవతి కశ్చన ॥ 117 ॥

ప్రకాశం వాప్రకాశం వా మన్యుస్తం మన్యుమృచ్ఛతి ।

గురువైనను, బాలుడైనను, వృద్ధుడైనను, బ్రాహ్మణుడైనను, విద్వాంసుడైనను ఆతతాయి అయినచో తనకెదురు వచ్చినపుడు ఆలోచింపకుండానే చంపివేయాలి. ఆతతాయిని వధించినచో దోషము లేదు, ఈ ఆతతాయిని ప్రకాశముగా వధించినను రహస్యముగా వధించినను ఆ దోషము అపరాధిని అంటుకోదని చెబుతారు పండితులు.

గృహక్షేత్రాభి హర్తార స్తథాగమ్యాభిగామినః ॥ 118 ॥

అగ్నిదో గరదశ్చైవ తథా చాభ్యుద్యతాయుధః ।
అభిచారం తు కుర్వాణో రాజగామి చ పైశునమ్ ॥ 119 ॥

ఏతే హి కథితా లోకే ధర్మజ్ఞైరాతతాయినః ।

గృహములను, క్షేత్రములు అనగా పొలములను బలవంతముగా ఇతరుల నుండి హరించువారు, పొందరాని స్త్రీలను పొందువారు, ఇతరుల ఇండ్లకు నిప్పుపెట్టువారు, ఇతరులకు విషము నిచ్చువారు, కిరాతకముగా ఆయుధములతో హింసించువారు, అత్యాచారము నాచరించువారు, రాజుకు విరుద్ధముగా ఆచరించువారు, ద్రోహబుద్ధికలవారు మొదలగు వారందరిని లోకములో ధర్మజ్ఞులు ఆతతాయిలన్నారు.

భిక్షుకోఽ ప్యథవా నారీ యోఽ పి వా స్యాత్ కుశీలవః ॥ 120 ॥

ప్రవిశేత్ ప్రతిషిద్ధస్తు ప్రాప్నుయాద్ద్విగుణం దమః ।
పరస్త్రీణాం తు సంభాషే తీర్థేఽ రణ్యే గృహేఽ పి వా ॥ 121 ॥

నదీనాం చైవ సంభేదైః స సంగ్రహణమాప్నుయాత్ ।

భిక్షుకులు కాని, స్త్రీలు లేదా పురుషులు కాని, కుశీలవుడు కాని ప్రవేశమును నిషేధించినప్పటికి ఇంటిలో ప్రవేశించినచో ద్విగుణమైన దండనమీయాలి. తీర్థములయందు కాని, గృహమునందుకాని, నదుల సమీపము నందు కాని పరస్త్రీలను దూషిస్తూ మాట్లాడినవానిని చెరయందుంచి దండించాలి.

న సంభాషేత్ పరస్త్రీభిః ప్రతిషిద్ధః సమాచరేత్ ॥ 122 ॥

ప్రతిషిద్ధే సమాభాష్య సువర్ణం దండమర్హతి ।
నైష చారణదారేషు విధిరాత్మోపజీవిషు ॥ 123 ॥

సజ్జయన్తి మనుష్యైస్తా నిగూఢం వా చరన్త్యుత ।
కించిదేవ తు దాప్యః స్యాత్ సంభాషేణాపచారయన్ ॥ 124 ॥

ప్రేష్యాసు చైవ సర్వాసు గృహప్రవ్రజితాసు చ ।
యోఽ కామాం దూషయేత్కన్యాం స సద్యో వధ మర్హతి ॥ 125 ॥

తనతో సంభాషించకూడదని నిషేధము విధించిన స్త్రీలతో మాట్లాడినవారికి ఒక సువర్ణముతో దండనము విధించాలి. కాని స్వశక్తి పై జీవించు చారణస్త్రీల (గాయకులు నర్తకులు) విషయమున ఇటువంటి దండనములు, నిషేధములు వర్తింపవు. వారు మనుష్యులతో రహస్యముగా కలిసి జీవిస్తారు. వీరు అంతఃపురజనముతో మాట్లాడినను తిరిగినను నామ మాత్రపు శిక్ష విధించాలి. ఇట్లే ఇంటి నుండి వెళ్ళిపోయిన దాసీజనము విషయమున కూడ రాజు నామమాత్రపు శిక్ష విధించాలి. తనను ఇష్టపడని కన్యను బాలాత్కారంగా చెరిచిన వానిని వెంటనే మరణదండనముతో శిక్షించాలి.

సకామాం దూషమాణస్తు ప్రాప్నుయాద్ద్విశతం దమమ్ ।
యశ్చ సంచారకస్తత్ర పురుషః స తథా భవేత్ ॥ 126 ॥

పారదారికవద్దండ్యో యోఽ పి స్యాదవకాశదః ।
బలాత్సందూషయేద్యస్తు పరభార్యాం నరః క్వచిత్ ॥ 127 ॥

వధో దండో భవేత్తస్య సాపరాధో భవేత్ స్త్రియాః ।
రజస్తృ తీయం యా కన్యా స్వగృహే ప్రతిపద్యతే ॥ 128 ॥

అదండ్యా సా భవేద్రాజ్ఞా వరయన్తీ పతిం స్వయమ్ ।

కన్యను ఆమె కోరికననుసరించి కూడినవానికి రెండు వందల పణములతో దండించాలి. ఇటువంటి పనికి తోడ్పడువానిని కూడ సమానంగా దండించాలి. అవకాశముననుసరించి పరదారాగమనం చేసిన వానిని కూడ అట్లే దండించాలి. ఇతరుల భార్యను బలాత్కారం చేయువానిని మరణదండనంతో శిక్షించాలి. అటువంటి పనికి సహకరించిన స్త్రీని కూడ తత్సమానంగా దండించాలి. మూడవ మారు రజస్వల అయిన తర్వాత తాను తండ్రి గృహమునందున్నను స్వయంగా పతిని వరించినట్లైతే రాజు ఆమెను దండించకూడదు.

స్వదేశే కన్యకాం దత్త్వా తామాదాయ తథా వ్రజేత్ ॥ 129 ॥

పరదేశీ భవేద్వధ్యః స్త్రీ చోరః స యతో భవేత్ ।
అద్రవ్యాం మృతపత్నీం తు సంగృహ్ణన్నాపరాధ్యతి ॥ 130 ॥

సద్రవ్యాం తాం సంగ్రహేతా దండం తు క్షిప్రమర్హతి ।

స్వదేశమునందు కన్యకను వివాహమాడి ఆమెను తీసుకుని పరదేశమునకు వెళ్ళినవాడు స్త్రీ చోరుడే యగును కావున అతను వధార్హుడు. పతి మరణించినట్టి ధనహీనురాలైన స్త్రీని ఉంచుకొన్నవారిని అపరాధం కాదు కావున శిక్షింపపనిలేదు. కాని ఆమె ధనవంతురాలైనచో అతనిని వెంటనే శిక్షించాలి.

ఉత్కృష్టం యా భజేత్కన్యా దేయా తస్యైవ సా భవేత్ ॥ 131 ॥

యచ్చాన్యం సేవమానాం చ సంయతాం వాసయేద్ గృహే ।
ఉత్తమాం సేవమానస్తు జఘన్యో వధమర్హతి ।
జఘన్యముత్తమా నారీ సేవమానా తథైవ చ ॥ 132 ॥

భర్తారం లంఘయేద్యాస్త్రీ జ్ఞాతిభిర్బలదర్పితా ।
తాం చ నిష్కాసయేద్రాజా సంస్థానే బహుసంస్థితే ॥ 133 ॥

తన యోగ్యతను అనుసరించి తనకంటే ఉత్కృష్టుడైన వరుని కోరుకున్న కన్యను అతనికే ఇచ్చి వివాహము చేయాలి. తన కంటే తక్కువ వానిని కోరిన కన్యను ఇంటియందే బంధించాలి. మరియు తనకంటే ఉత్తమురాలైన స్త్రీని వివాహమాడుటకై కోరువానిని వెంటనే వధించాలి. అట్లే ఉత్తమస్త్రీ తన కంటే తక్కువ వాడిని కోరుకున్నచో ఆమెను కూడ వధించాలి. తన జ్ఞాతుల (బంధువుల) బలము చూసుకుని గర్వించి తన భర్తను అవమానపరిచే స్త్రీని సభలో అందరిముందు అవమానించి దేశము నుండి బహిష్కరించాలి.

హృతాధికారాం మలినాం పిండమాత్రోపజీవినీమ్ ।
వాసయేత్ స్వైరిణీం నిత్యం సవర్ణేనాభిదూషితామ్ ॥ 134 ॥

జ్యాయసా దూషితా నారీ ముండనం సమవాప్నుయాత్ ।
వాసశ్చ మలినం నిత్యం శిఖాం సంప్రాప్నుయాద్దశ ॥ 135 ॥

తన వర్ణమునకే చెందిన పరపురుషునితో కూడి మలినురాలైన స్వైరిణీ స్త్రీ యొక్క అధికారములు తొలగించి పిండమాత్రముతో అనగా కేవలం ఆమెకు చాలినంత అన్నమును మాత్రమే ఇచ్చి దానితోనే జీవించియుండునట్లు చేయాలి. తన కంటే అధికమైన వర్ణము వాడితో కలిసి అపవిత్రురాలైన స్త్రీని మలినవస్త్రములు మాత్రమే ధరించునట్లు చేసి ఆమెకు పది శిఖలుండు విధముగా తల గొరిగించాలి.

బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః క్షత్రవిట్ శూద్రయోషితః ।
వ్రజన్ దాప్యో భవేద్రాజ్ఞా దండముత్తమసాహసమ్ ॥ 136 ॥

వైశ్యాగమే చ విప్రస్య క్షత్రియస్యాంత్యజాగమే ।
మధ్యమం ప్రథమం వైశ్యో దండ్యః శూద్రాగమాద్భవేత్ ॥ 137 ॥

బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు ఒకవేళ క్షత్రియ వైశ్య శూద్ర జాతులకు సంబంధించిన స్త్రీతో కలిసిన ఎడల రాజు వారికి ఉత్తమ సాహసదండమీయాలి. అట్లే బ్రాహ్మణుడు వైశ్య స్త్రీతో, క్షత్రియుడు అంత్యజస్త్రీతో కలిసి పాపపు కర్మ ఆచరించినచో మధ్యమ దండము, వైశ్యుడు శూద్రస్త్రీతో కలిసినచో ప్రథమ దండము విధించాలి.

శూద్రః సవర్ణాగమనే శతం దండ్యో మహీక్షితా ।
వైశ్యస్తు ద్విగుణం రాజన్ క్షత్రస్తు త్రిగుణం తథా ॥ 138 ॥

బ్రాహ్మణశ్చ భవేద్దండ్యస్తథా రాజన్ చతుర్గుణమ్ ।
అగుప్తాసు భవేద్దండస్సుగుప్తాస్వధికో భవేత్ ॥ 139 ॥

శూద్రుడు శూద్ర స్త్రీని పొందినచో నూరు పణములతో, వైశ్యుడు పొందినచో రెండు వందల పణములతో, క్షత్రియుడు పొందినచో మూడు వందల పణములతో, బ్రాహ్మణుడు పొందినచో నాలుగు వందల పణములతో రాజు దండించాలి. రక్షణ లేని స్త్రీల విషయమున ఇట్టి దండము విధించాలి కాని రక్షణ కలిగియున్న వారియందు ఈ దండము ఇంకా అధికముగా విధించాలి.

మాతా పితృశ్వసాశ్వశ్రూ ర్మాతులానీ పితృవ్యజా ।
పితృవ్యసఖిశిష్య స్త్రీ భగినీ తత్సఖీ తథా ॥
భ్రాతృ భార్యాగమే పూర్వాద్దండస్తు ద్విగుణో భవేత్ ॥ 140 ॥

భాగినేయీ తథా చైవ రాజపత్నీ తథైవ చ ।
తథా ప్రవ్రజితా నారీ వర్ణోత్కృష్టా తథైవ చ ॥ 141 ॥

ఇత్యగమ్యాశ్చ నిర్దిష్టాస్తాసాం తు గమేన నరః ।
శిశ్నస్యోత్కర్తనం కృత్వా తతస్తు వధమర్హతి ॥ 142 ॥

చండాలీం చ శ్వపాకీం చ గచ్ఛన్ వధమవాప్నుయాత్ ॥ 143 ॥

తల్లి, మేనత్త, అత్త, మేనమామ భార్య, పినతండ్రి లేదా పెదతండ్రికూతురు, వారిభార్య, పిన్ని స్నేహితురాలు, శిష్యుని భార్య, భగినీ, ఆమె మిత్రురాలు, భ్రాతపత్ని మొదలగు వారితో కలిసినచో పూర్వము చెప్పిన దండనము కన్న ద్విగుణీకృత దండన విధించాలి. అక్క కూతురు, రాజపత్ని, సంన్యాసిని, ఉత్తమవర్ణమునకు చెందిన స్త్రీ మొదలగు వారు సమాగమము పొందకూడని స్త్రీలు, వీరిని పొందినవాని యొక్క శిశ్నమును ఛేదించి తర్వాత వానిని వధించాలి. చండాలస్త్రీని మరియు శ్వపాక స్త్రీతో వ్యభిచరించిన వానికి కూడ మరణదండనమే విధించాలి.

తిర్యగ్యోనిం చ గోవర్జ్యం మైథునం యో నిషేవతే ।
వపనం ప్రాప్నుయాద్దండం తస్యాశ్చ యవసోదకమ్ ॥ 144 ॥

సువర్ణం చ భవేద్దండ్యో గాం వ్రజన్ మనుజోత్తమ ।
వేశ్యాగామీ ద్విజో దండ్యో వేశ్యాశుల్కసమం పణమ్ ॥ 145 ॥

గోవు కాక ఇతర తిర్యక్ప్రాణియోనియందు మైథునము చేసినవాని తల గొరిగించి ఆ పశువుకు మేత మరియు నీటిని కూడ వానిచేతనే ఇప్పించు దండన విధించాలి. గోయోని యందు మైథునము చేసినచో సువర్ణ ముతో శిక్ష విధించాలి. అట్లే వేశ్యను అనుభవించిన ద్విజునకు ఆ వేశ్యకు సంబంధించిన శుల్కముతో సమానంగా దండన విధించాలి.

గృహీత్వా వేతనం వేశ్యా లోభాదన్యత్ర గచ్ఛతి ।
వేతనం ద్విగుణం దద్యాద్దండం చ ద్విగుణం తథా ॥ 146 ॥

అన్యముద్దిశ్య యో వేశ్యాం నయేదన్యస్య కారయేత్ ।
తస్య దండో భవేద్రాజన్ సువర్ణస్య చ మాషకమ్ ॥ 147 ॥

ఒకని నుండి తనను పొందుటకై శుల్కము తీసుకొనిన వేశ్య లోభముతో వాడిని వదిలి ఇంకొకని దగ్గరకు వెళ్ళినచో తన శుల్కముతో రెండింతలు మొదటి వానికిచ్చి అంతే సమానంగా రాజునకు కూడ దండముగా చెల్లించాలి. అట్లే వేశ్యను ఒకని కొరకు మాట్లాడి వేరొకని వద్దకు తీసుకునిపోవు వానికి మాషపు ప్రమాణం గల సువర్ణము దండంగా విధించాలి.

నీత్వా భోగాన్నయో దద్యాత్ దాప్యో ద్విగుణవేతనమ్ ।
రాజ్ఞశ్చ ద్విగుణం దండం తతో ధర్మో న హీయతే ॥ 148 ॥

బహూనాం వ్రజతామేకాం సర్వే తే ద్విగుణం దమమ్ ।
దద్యుః పృథక్ పృథక్ సర్వే దండం చ ద్విగుణం పరమ్ ॥ 149 ॥

వేశ్యను భోగించుటకై తీసుకుని పోయి ఆమెకు శుల్కము ఇవ్వనివానికి ఆ శుల్కముతో రెండింతలు ఆమెకు ఇప్పించుటయే కాక రాజునకు కూడ ఆ రెండింతలు దండముగా కట్టాలి. దాని వలన ధర్మం నశించదు. ఒకే స్త్రీ ని చాలా మంది అనుభవించినచో వారందరూ ఆమెకు వేరువేరుగా ద్విగుణమైన శుల్కము చెల్లించాలి.

న మాతా న పితా నస్త్రీ న ఋత్విక్ యాజ్యమానవాః ।
అన్యోన్యం పతితాస్త్యాజ్యా యోగే దండ్యా శతాని షట్ ॥ 150 ॥

పతితా గురవస్త్యాజ్యా న తు మాతా కథంచన ।
గర్భధారణపోషాభ్యాం తేన మాతా గరీయసీ ॥ 151 ॥

తల్లి, తండ్రి, స్త్రీ(భార్య), పురోహితుడు, యజమాని (తనను పోషించువాడు) మొదలగు వారిని ఎప్పుడునూ విడువకూడదు. కాని పతితలను మాత్రము విడిచిపెట్టాలి. పతితులతో సంబంధము పెట్టుకున్నవారికి రాజు ఆరు వందల పణముల దండము విధించాలి. గురువులైనను పతితులైనచో వదిలివేయాలి. కాని తల్లిని ఎటువంటి స్థితిలో విడువకూడదు. గర్భమున ధరించి జన్మనిచ్చి ఎల్లప్పుడూ పోషించునట్టి తల్లి అందరికంటే గొప్పది.

అధీయానోప్యనధ్యాయే దండ్యః కార్షాపణత్రయమ్ ।
అధ్యాపకశ్చ ద్విగుణం తథాచారస్య లంఘనే ॥ 152 ॥

అనుక్తస్య భవేద్దండః సువర్ణస్య చ కృష్ణలమ్ ।

అనధ్యాయదివసమునందు అధ్యయనము చేసిన మూడు కార్షాపణములతో దండించాలి. అట్లే అట్లా చరించుటకు హేతువైన అధ్యాపకునకు ఆచారమును అతిక్రమించినందుకుగాను దానితో రెండింతల దండము విధించాలి. వీటిలో చెప్పని దోషములకు సువర్ణ కృష్ణలము దండంగా విధించాలి.

భార్యా పుత్రశ్చ దాసశ్చ శిష్యో భ్రాతా చ సోదర ॥ 153 ॥

కృతాపరాధాస్తాడ్యాః స్యు రజ్జ్వా వేణుదలేన వా ।

పృష్ఠతస్తు శరీరస్య నోత్తమాంగం కథంచ న ॥ 154 ॥

అతోఽన్యథా ప్రహరతః ప్రాప్తం స్యాచ్చోరకిల్బిషమ్ ।
దూతీం సమాహ్వయంశ్చైవ యో నిషిద్ధం సమాచరేత్ ॥ 155 ॥

ఆచ్ఛన్నం వా ప్రకాశం వా సదండ్యః పార్థివేచ్ఛయా ।

భార్య, పుత్రుడు, దాసుడు, శిష్యుడు, భ్రాత మరియు సోదరుడు మొదలగు వారు అపరాధము చేసినచో త్రాడుతో గాని వెదురు బద్దతో గాని దండించాలి. ఎప్పుడైనను వారి వీపుపైననే కొట్టాలి. కాని ఉత్తమాంగమైన శిరస్సు పై కొట్టగూడదు, అట్లు కొట్టినవారిని రాజు దొంగను శిక్షించినట్లు శిక్షించాలి. దూతిని పిలిచి రహస్యముగా కాని ప్రకాశముగా కాని అనుచితముగా ప్రవర్తించినవానిని రాజు తన ఇష్టానుసారం దండించవచ్చు.

వాసాంసి ఫలకైః శ్లక్ష్ణైః నిర్ణిజ్యాద్రజకః శనైః ॥ 156 ॥

అతోఽన్యథా హి కుర్వంస్తు దండః స్యాద్రుక్మమాషకమ్ ।
రక్షాస్వధికృతైశ్చైవ ప్రదేయం యైర్విలుప్యతే ॥ 157 ॥

కర్షకేభ్యోఽర్థమాదాయ యః కుర్యాత్ కరమన్యథా ।
తస్య సర్వస్వమాదాయ తం రాజా విప్రవాసయేత్ ॥ 158 ॥

రజకుడు నున్నని రాళ్ళపైన వస్త్రములను మెల్లగా ఉదికి శుభ్రపరచాలి. అలా చేయని రజకుని మాషపుతూకముతో బంగారమును కొలిచి దండన విధించాలి. రాజు ద్వారా రక్షణకు నియుక్తులైన అధికారులు ఇతరుల నుండి పన్నుల రూపముతో సంగ్రహించిన దానిని వారే హరించినచో, కర్షకుల నుండి సంగ్రహించిన వారి కొరకు కాకుండా ఇతర పనులకు ఉపయోగించినవారిని కూడ దండించి వారి సర్వస్వమును తానే తీసుకుని వారికి దేశబహిష్కారదండం విధించాలి.

యే నియుక్తా స్వకార్యేషు హన్యుః కార్యాణి కార్యిణామ్ ।
నిర్ఘృణాః క్రూరమనసః సర్వే కర్మాపరాధినః ॥ 159 ॥

ధనోష్మణా పచ్యమానాః తాన్ నిఃస్వాన్ కారయేన్నృపః ।
కూటశాసనకర్తౄంశ్చ ప్రకృతానాం చ దూషకాన్ ॥ 160 ॥

స్త్రీ బాల బ్రాహ్మణఘ్నాంశ్చ వధ్యాద్విట్ సేవినస్తథా ।
అమాత్యః ప్రాడ్వివాకో వా యః కుర్యాత్ కార్యమన్యథా ॥ 161 ॥

తస్య సర్వస్వమాదాయ తం రాజా విప్రవాసయేత్ ।

తాము ఏ కార్యములందు నియుక్తులైనారో ఆ కార్యములు నిర్వర్తించక ఇతరుల కార్యములను కూడ హాని కలిగించువారిని, నిర్దయులను, క్రూరమనస్కులను, కర్మాపరాధులందరిని, ధనము చేత గర్విష్ఠులైన వారిని రాజు ధనహీనులను జేసి దండించాలి. కూట శాసనములు అనగా రాజు విధించని తప్పుడు శాసనములను జరుపువారిని, ప్రజలను దూషించువారిని, స్త్రీలను, బాలురను, బ్రాహ్మణులను హింసించువారిని, రాజు యొక్క శత్రువులను సేవించువారిని, రాజు మరణ దండనముతోనే శిక్షించాలి. అమాత్యుడైనను న్యాయాధిపతియైనను తమ కార్యమును సరిగా నిర్వర్తించని వారి సర్వస్వమును తీసుకోని రాజు వారిని దేశ బహిష్కృతులను చేయాలి.

బ్రహ్మఘ్నశ్చ సురాపశ్చ తస్కరో గురుతల్పగః ॥ 162 ॥

ఏతాన్ సర్వాన్ పృథగ్వింస్యాన్ మహాపాతకినో నరాన్ ।
మహాపాతకినో వధ్యా బ్రాహ్మణం తు వివాసయేత్ ॥
కృతచిహ్నం స్వదేశాచ్చ శ్రుణు చిహ్నకృతిం తత ॥ 163 ॥

గురుతల్పే భగః కార్యః సురాపానే సురాధ్వజః ।
స్తేనే తు శ్వపదం తద్వద్ బ్రహ్మహన్యశిరాః పుమాన్ ॥ 164 ॥

బ్రహ్మహత్యాపాతకులను, సురాపానము చేయువారిని, చోరులను, గురుతల్పగుని మరియు ఇటువంటి మహాపాతకులందరిని రాజు తీక్ష్ణంగా దండించాలి. ఒకవేళ బ్రాహ్మణుడు ఇట్టి మహాపాపములు ఆచరించినట్లైతే

ఆతనిని వధించకూడదు కాని దేహము పై చేసిన ఆతను ఆచరించిన మహాపాతకమునకు సమానమైన చిహ్నమును కలిపించి దేశబహిష్కృతుని జేయాలి. వాటిని వివరిస్తాను వినుము. గురుపత్నితో సంబంధము ఏర్పరుచుకున్నవాని శరీరము పైభాగమును మద్యపానశాలకుండునట్టి ధ్వజపు చిహ్నము మద్యపానం చేసినవారిని దొంగిలించిన వానికి కుక్క పాద చిహ్నము, బ్రహ్మహత్య చేసిన వానికి తలలేని పురుషుని ఆకారపుచిహ్నమును ఏర్పరిచి దండించాలి.

అసంభాష్యాహ్యసంభోజ్యా అసంవాహ్యా విశేషతః ॥ 165 ॥
త్యక్తవ్యాశ్చ తథా రాజన్ జ్ఞాతిసంబంధిబాంధవైః ।

మరియు ఇట్టి మహపాతకములాచరించిన ద్విజునితో ఎవరునూ మాట్లాడకూడదు, అతనితో కలసి భుజింపకూడదు, కలిసి ప్రయాణించకూడదు, జ్ఞాతులు మరియు ఇతర బంధుజనులందరూ ఆతనిని వదిలివేయాలి.

మహపాతకినో విత్తమాదాయ నృపతిఃస్వయమ్ ॥ 166 ॥

అప్సు ప్రవేశయేద్దండం వరుణాయోపపాదయేత్ ।
సహోఢం న వినా చోరం ఘాతయేద్ధార్మికో నృపః ॥ 167 ॥

సహోఢం సోపకరణం ఘాతయేదవిచారయన్ ।
గ్రామేష్వపి చ యే కేచిత్ చోరాణాం భక్ష్యదాయకాః ॥ 168 ॥

భాండావకాశదాశ్చైవ సర్వాంస్తానపి ఘాతయేత్ ।

మహపాతకియైనవాని ధనమును రాజు లాగివేసికొని దానిని నీట ముంచి వరుణ దేవునికర్పించాలి. దొంగలించిన సొమ్ము దొరుకనిదే దొంగను ధార్మికుడగు రాజు వధించకూడదు. దొంగలించిన ధనముతోపాటు వాడు ఉపయోగించిన ఉపకరణములన్ని ఆతని వద్దనే దొరికినచో ఏ మాత్రము విచారించకనే ఆతనిని వధించాలి. అంతేకాక గ్రామాదులలో ఇటువంటి దొంగలకు ఆశ్రయము కలిపించువారిని, ఆహారపదార్థముల నిచ్చువారిని, చౌర్యమునకు అవకాశమిచ్చిన వారిని కూడ రాజు వధించవచ్చు.

రాష్ట్రేషు రాజ్ఞాధికృతాః సామంతాశ్చైవ దూషకాః ॥ 169 ॥

అభ్యఘాతేషు మధ్యస్థాః క్షిప్రం శాస్యాస్తు చోరవత్ ।
గ్రామఘాతే మఠాభంగే పథి యోషాభిమర్దనే ॥ 170 ॥

శక్తితో నాభిధావంతో నిర్వాస్యాః సపరిచ్ఛదాః ।

రాష్ట్రమునందు రాజుచే నియమింపబడిన అధికారులు కాని, ఆతని అధీనములోనున్న సామంత గణము కాని యుద్ధాదులు జరుగుచున్నప్పుడు నిశ్చేష్టులై ఏమీ ఆచరించక తటస్థులై ఉన్నచో వారిని కూడ రాజు దొంగను శిక్షించినట్లే శిక్షించవలెను. గ్రామమునకు ఏదైన విఘాతము కలిగినప్పుడు గాని, మఠాదులకు భంగము కలిగినప్పుడు గాని, దారి దోపిడీలు జరిగినప్పుడు గాని, స్త్రీల యందు అపచారము జరిగినప్పుడు కాని అధికారులు, సామంతులు మొదలగువారు శక్తిమంతులైనప్పటికి వారిని నిరోధించకుండా ఉండినచో సపరివారముగా వారిని రాజు దేశబహిష్కృతుని చేయాలి.

రాజ్ఞః కోశాపహర్తృాంశ్చ ప్రతికూలేషు సంస్థితాన్ ॥ 171 ॥

అరీణాముపకర్తృాంశ్చ ఘాతయేద్వివిధైర్వధైః ।
సంధిం కృత్వా తు యే చౌర్యం రాత్రౌ కుర్వంతి తస్కరాః ॥ 172 ॥

తేషాం ఛిత్వా నృపో హస్తౌ తీక్ష్ణశూలే నివేశయేత్ ।
తడాగభేదకం హన్యాత్ అప్సు శుద్ధవధేన చ ॥ 173 ॥

యస్తు పూర్వం నివిష్టం స్యాత్తడాగస్యోదకం హరేత్ ।
ఆగమాం చాప్యపాం భింద్యాత్స దాప్యః పూర్వశాసనమ్ ॥ 174 ॥

రాజు యొక్క కోశాగారమును హరించువానిని, రాజునకు ప్రతికూలముగా వ్యవహరించువారిని, శత్రువులకు ఉపకరించువారిని రాజు అనేక విధములుగా దండించాలి. రాత్రి సమయమున కన్నము వేసి దొంగతనము చేయు వారి చేతులను నరికివేయాలి. తీక్ష్ణములైన శూలములతో హింసించాలి. చెరువులను పాడుచేయువానిని నీటిలో ముంచి చంపాలి. ప్రజోపయోగార్థం ఉంచిన చెరువు నీటిని వ్యర్థము చేసిన వానిని, చెరువులోని నీటిని రాకుండా చేసే వానిని కూడ కఠినమైన మృత్యుదండంతో వధించాలి.

కోష్ఠాగారాయుధాగారదేవాగార విభేదకాన్ ।
పాపాన్ పాపసమాచారాన్ ఘాతయేచ్ఛీఘ్రమేవ చ ॥ 175 ॥

సముత్సృజేద్ రాజమార్గే యస్త్వమేధ్యమనాపది ।
స హి కార్షాపణం దండ్యస్తత్త్వమేధ్యం చ శోధయేత్ ॥ 176 ॥

కోష్ఠాగారమును, ఆయుధాగారమును, దేవాలయములను, పాడుచేసిన పాపాత్ములను, పాపసమాచారమును ఊరికనే సరివ్యాప్తము చేయువారిని శీఘ్రముగా వధించాలి. అంతేగాక రాజమార్గమునందు ఎటువంటి ఆపదలేనిదే మలవిసర్జనము చేసిన వారిని ఒక కార్షాపణముతో వెంటనే దండించాలి. మరియు ఆ అమేధ్యమును తీసివేయించి ఆతనితోనే ఆ రాజమార్గమును శుభ్రం చేయించాలి.

అజంగమోఽథవా వృద్ధో గర్భిణీ బాల ఏవ చ ।
పరిభాషణమర్హన్తి న చ శోధ్యమితి స్థితిః ॥ 177 ॥

ప్రథమం సాహసం దండ్యో యశ్చ మిథ్యాం చికిత్సతే ।
పురుషే మధ్యమం దండముత్తమం చ తథోత్తమే ॥ 178 ॥

ఆపదలో ఉన్నవాడు, వృద్ధుడు, గర్భిణీ స్త్రీ, బాలుడు మొదలగువారు అట్టి నింద్యమైన పని చేసినచో వారిని తిట్టాలి. కాని వారిచే శుద్ధిచేయించకూడదు. మరియు పశువులకు తప్పుడు వైద్యం చేసినవానికి ఉత్తమమైన సాహసమైన దండనం విధించాలి. మనుష్యునకు చేసినచో మధ్యదండం, ఉత్తముడైనవానికి చేసినచో ఉత్తమమైన దండం విధించాలి.

ఛత్రస్య ధ్వజయష్టీనాం ప్రతిమానాం చ భేదకాః ।
ప్రతికుర్యుస్తతః సర్వే పంచ దండ్యాః శతాని చ ॥ 179 ॥

అదూషితానాం ద్రవ్యాణాం దూషణే భేదనే తథా ।
మణీనామపి భేదేన దండ్యః ప్రథమసాహసమ్ ॥ 180 ॥

ఛత్రమును, ధ్వజయష్టి అనగా జెండా స్తంభమును, ప్రతిమలు మొదలగు వాటిని ఛేదించిన వారికి ఏడు వందల కార్షాపణములు దండనమో లేదా వాటిని మరల సరిచేయించిడమో చేయాలి. అట్లే పవిత్రములైన ద్రవ్యములను అపవిత్రము చేసినను, ఛేదించినను మరియు మణులు మొదలగు వాటిని పగులకొట్టిననూ ప్రథమసాహసం అనగా ప్రథమశ్రేణి దండం విధించాలి.

సమం చ విషమం చైవ కురుతే మూల్యతోఽపి వా ।
సమాప్నుయాత్ స వై పూర్వం దమం మధ్యమమేవ చ ॥ 181 ॥

ఆ యా వస్తువుల వెలలను తారుమారు చేసి అట్టి వెలలతో అమ్మినవారికి ఉత్తమదండన సూమారు 1000 కార్షాపణములు మరియు రెండవ విధమగు తప్పిదము చేయువారికి మధ్యమదండనము రాజు విధించాలి.

బంధానాని చ సర్వాణి రాజమార్గే నివేశయేత్ ।
కర్షన్తో యత్ర దిశ్యన్తే వికృతాః పాపకారిణః ॥ 182 ॥

బంధన గృహములు అనగా చెరసాలలను రాజమార్గమునందే నిర్మించాలి. అట్లు నిర్మించుటవలన పాప కృత్యములు చేసినవారు అనుభవించు శిక్షలను జనులందరూ చూస్తారు, (ఆ శిక్షలను చూచి భయంతో ఇతరులు పాపపుపనులు ఆచరించరు).

ప్రాకారస్య చ భేత్తారం పరిఖాణాం చ భేదకమ్ ।
ద్వారాణాం చైవ భేత్తారం క్షిప్రం నిర్వాసయేత్ పురాత్ ॥ 183 ॥

మూలకర్మాభి చారేషు కర్తవ్యోద్విశతో దమః ।
అబీజ విక్రయీ యశ్చ బీజోత్కర్షక ఏవ చ ॥ 184 ॥

మర్యాదాభేదకశ్చాపి వికృతం వధమాప్నుయాత్ ।

కోటప్రాకారములను, వాటి చూట్టు ఉన్న పరిఖములను, దుర్గపు ద్వారములను ఛేదించువానిని వెంటనే దేశబహిష్కృతుని చేయాలి. వశీకరణము, అభిచారము మొదలగు కర్మలతో జనులను బాధించువారికి రెండింతల శిక్షవేయవలెను. చెడిపోయిన విత్తనములను మోసగించి అమ్మువారిని, విత్తన బీజములను అపహరించువానిని, పొలముల యొక్క పొలిమేరలను భంగపరిచి పంటలకు హాని కలిగించువారిని వికృతములైన దండనతో శిక్షించాలి.

సర్వసంకరపాపిష్ఠం హేమకారం నరాధిప! ॥ 185 ॥

అన్యాయే వర్తమానం చ ఛేదయేల్లవశః క్షురైః ।
ద్రవ్యమాదాయ వణిజామనర్ఘేణావరుంధతామ్ ॥ 186 ॥

ద్రవ్యాణాం దూషకా యస్తు ప్రతిచ్ఛన్నస్య విక్రయీ ।
మధ్యమం ప్రాప్నుయాద్దండం కూటకర్తా తథోత్తమమ్ ॥ 187 ॥

రాజా పృథక్ పృథక్కుర్యాత్ దండం చోత్తమసాహసమ్ ।

కల్తీ పనులు చేయు పాపిష్ఠుడైన కంసాలిని చురకత్తులతో ముక్కలు ముక్కలుగా నరకాలి. ఓ నరాధిపా! అన్యాయపు పనులు చేయువానిని శిక్షించాలి, అమ్మకమునకై ఆహారపదార్థములను సేకరించి వాటిని అంగడిలో అమ్మకుండా ఎక్కువ ధర వచ్చునని ఎదురు చూచువానిని, మరియు కలితీకలిపిన ద్రవ్యములను అమ్మువానిని, రహస్యముగా ఎక్కువ వెలకు ద్రవ్యములను విక్రయించువానిని మధ్యమశ్రేణి దండనలో శిక్షించాలి. ఇటువంటి పనులకు ప్రోత్సహించు కూటనీతిగల అధికారిని రాజు ఉత్తమదండనతో శిక్షించాలి.

శాస్త్రాణాం యజ్ఞతపసాం దేశానాం క్షేపకీ నరః ॥ 188 ॥
దేవతానాం సతీనాం చ ఉత్తమం దండమర్హతి ।

ఏకస్య దండపారుష్యే బహూనాం ద్విగుణో దమః ॥ 189 ॥
కలహో యద్గతో దాప్యో దండశ్చ ద్విగుణస్తతః ।

మధ్యమం బ్రాహ్మణం రాజా విషయాద్విప్రవాసయేత్ ॥ 190 ॥

శాస్త్రములను, యజ్ఞములను, తపోనిష్ఠులను, దేశములను, దేవతలను, పతివ్రతలను నిందించువానిని ఉత్తమ దండనతో శిక్షించాలి. ఒక వ్యక్తి అనేకుల విషయము నందు దండపారుష్యముతో తప్పునకు మించిన దండనం విధించినచో అట్లు దండించినవానిని రెండింతల ఉత్తమసాహస దండనముతో శిక్షించాలి. అట్లే జనుల మధ్యలో కలహములకు కారణమైన వానిని కూడ రాజు ద్విగుణమైన దండనతో శిక్షించాలి. అట్టి కలహమునకు కారణము ద్విజుడైనచో ఆతనికి దేశ బహిష్కరణ శిక్ష విధించాలి.

లశునం చ పలాండుం చ శూకరం గ్రామకుక్కుటమ్ ।
తథా పంచనఖం సర్వం భక్ష్యాదన్యత్తు భక్షయేత్ ॥ 191 ॥

వివాసయేత్ క్షిప్రమేవ బ్రాహ్మణం విషయాత్ స్వకాత్ ।
అభక్ష్యభక్షణే దండ్యః శూద్రో భవతి కృష్ణలమ్ ॥ 192 ॥

బ్రాహ్మణ క్షత్రియవిశాం చతుస్త్రిద్విగుణం స్మృతమ్ ।
యః సాహసం కారయతి సదండ్యో ద్విగుణం దమమ్ ॥ 193 ॥

వెల్లిఉల్లి, పెద్ద ఉల్లి, సూకరము, ఊరకోడి మరియు ఐదు గ్రోళ్ళు గల ప్రాణులు మొదలగు భక్షించకూడని వాటిని ద్విజుడు భక్షించినచో వెంటనే ఆతనిని దేశబహిష్కృతుని చేయాలి. అభక్ష్య భక్షణము శూద్రుడు చేసినచో

ఆతనికి కర్రతో వాత విధించాలి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు అయినచో వారికి వరుసగా నాలుగింతలు, మూడింతలు, రెండింతలు దండన విధించాలి. అట్లే సాహసపు పనులకు ఉత్తేజపరుచువానికి కూడ రాజు ద్విగుణమైన దండనముతో శిక్షించాలి.

యస్త్వేవముక్త్వాఽహం దాతా కారయేత్స చతుర్గుణమ్ ।
సందిష్టస్యాప్రదాతా చ సముద్రగృహభేదకః ॥ 194 ॥

పంచాశత్పణికా దండస్తత్ర కార్యో మహీక్షితా ।
అస్పృశ్యంచాఽస్పృశన్నార్యోహ్యయోగ్యో యోగ్యకర్మకృత్ ॥ 195 ॥

పుంస్త్వహర్తా పశూనాం చ దాసీగర్భవినాశకృత్ ।
శూద్రప్రవ్రజితానాం చ దైవే పైత్రే చ భోజకః ॥ 196 ॥

ఆవ్రజన్ బాధముక్త్వా తు తథైవ చ నిమన్త్రణే ।
ఏతే కార్షాపణశతం సర్వే దండ్యా మహీక్షితా ॥ 197 ॥

అట్లు సాహసపు దుష్కృత్యములకు ప్రోత్సహించి ధనసహాయము చేయువానికి నాలుగింతలు దండన విధించాలి. సందేశమును చేరవేయవలసిన చోట చేరవేయని సందేశహరునికి, తాళము వేసియున్న గృహమునకు నష్టము కలిగించువానికి రాజు ఏబదిపణముల దండన విధించాలి. అస్పృశ్యమైన దానిని స్పృశించిన ఆర్యుని, తన యోగ్యతను మించిన పనిచేసిన వానిని, పశువుల పుంస్త్వమును హరించువానిని, దాసీజనము యొక్క గర్భమును నశింపజేసినవానిని, శూద్రులు సన్యాసుల ఇంటి యందు దేవకార్యపు లేదా పితృకార్యపు భోజనము చేసినవానిని, తనను ఆహ్వానించిన వానింటికి తప్పక వత్తునని చెప్పి పోకుండా ఉండువానిని కూడ రాజు వంద కార్షాపణములతో దండించాలి.

దుఃఖోత్పాది గృహే ద్రవ్యం క్షిపన్ దండస్తు కృష్ణలమ్ ।
పితాపుత్రవిరోధే చ సాక్షిణాం ద్విశతో దమః ॥ 198 ॥

తులా శాసనమానానాం కూట కృన్నాణకస్య చ ।
ఏభిశ్చ వ్యవహర్తా చ స దండ్యో దమముత్తమమ్ ॥ 199 ॥

హాని కలిగించు దుఃఖోత్పాదకములైన ద్రవ్యములను ఇతరుల ఇంటిలో ఉంచినవారికి కృష్ణలమే, దండనము. మరియు తండ్రీ కొడుకుల మధ్యలో కలిగిన కలహమునకు సాక్ష్యము పలికిన వానికి రెండు వందల కార్షాపణములు దండనము విధించాలి. అట్లే తూకపు రాళ్ళ మరియు కొలతల పాత్రల విషయమున కూడ తప్పుడు వ్యాపారము చేసిన వానికి అటువంటి కూటపు వ్యాపారము చేసిన వానికి సహకరించినవానికి కూడ సహస్ర కార్షాపణములు దండనము విధించాలి.

విషాగ్నిదాం పతిగురునిజాపత్యప్రమాపణీమ్ ।
వికర్ణనాసికా వోష్ఠీం కృత్వా గోభిః ప్రమాపయేత్ ॥ 200 ॥

గ్రామస్య దాహకా యే చ యే చ క్షేత్రస్య వేశ్మనః ।
రాజపత్న్యభిగామీ చ దగ్ధవ్యాస్తే కటాగ్నినా ॥ 201 ॥

విషము పెట్టునటువంటి, అగ్నితో ఇండ్లు మొదలగు వాటిని దగ్ధము చేయునట్టి భర్తను, గురువులను (తల్లి తండ్రులను, అత్తమామలను) తన సంతానమును హింసించునట్టి స్త్రీ యొక్క చెవులు, ముక్కు, పెదవులు మొదలగు వాటిని నరికించి ఎద్దులతో త్రొక్కిస్తూ చంపాలి. అంతేకాక గ్రామమును, పొలమును, ఇంటిని దహించువారిని, రాజపత్నిగాములైన వారిని కటాగ్నితో వధించాలి.

ఊనం వాప్యధికం చాపి లిఖేద్యో రాజశాసనమ్ ।
పారదారికచౌరం వా ముంచతో దండ ఉత్తమః ॥ 202 ॥

అభక్ష్యేణ ద్విజం దూష్య దండ్య ఉత్తమసాహసమ్ ।
క్షత్రియం మధ్యమం వైశ్యం ప్రథమం శూద్రమర్ధకమ్ ॥ 203 ॥

రాజశాసనమును ఎక్కువ లేదా తక్కువ చేసి వ్రాయువాడు, పరదారహరణము చేయువాడు, తప్పుచేసిన వానిని దండింపక వదిలిపెట్టువాడు మొదలగువారిని ఉత్తమమైన దండనతో శిక్షించాలి. భక్షించుటకు యోగ్యము కానటువంటి దూషితమైనట్టి ఆహారమును బ్రాహ్మణ క్షత్రియ వైశ్యాదులకు అర్పించినవానికి ఉత్తమ-మధ్యమ-అధమ దండనము విధించాలి.

మృతాంగలగ్నవిక్రేతుః గురుం తాడయతస్తథా ।
రాజయానాసనారోఢుః దండ ఉత్తమసాహసః ॥ 204 ॥

యో మన్యేతాజితోఽస్మీతి న్యాయేనాపి పరాజితః ।
తమాయాన్తం పునర్జిత్వా దండయేద్ ద్విగుణం దమమ్ ॥ 205 ॥

శవముల దేహముల నుండి అవయములను, వస్త్రాభరణాదులను తీసికొని అమ్ముకొనువానిని, గురువును కొట్టువానిని, రాజుయొక్క ఆసనముపైన మరియు వాహనములపైన అధిష్ఠించువానిని ఉత్తమమైన దండనతో శిక్షించాలి. న్యాయముగా తాను ఓడిపోయినప్పటికిని ఓడలేదని వాదించువానిని కూడ రాజు మరల పరాజితుని చేసి ద్విగుణముగా దండించవలెను. రెట్టింపు శిక్ష విధించాలి.

ఆహ్వానకరో మధ్యః స్యాదనాహ్వానే తథాఽఽహ్వయన్ ।
దండికస్య చ యో హస్తాదభియుక్తః పలాయతే ॥ 206 ॥

హీనః పురుషకారేణ తం దండ్యాద్దాండికో ధనమ్ ।
ప్రేష్యాపరాధాత్ ప్రేష్యస్తు స దండ్యశ్చార్థమేవ చ ॥ 207 ॥

దండార్థం నియమార్థం చ నీయమానేషు బంధనమ్ ।
యది కశ్చిత్ పలాయేత దండశ్చాష్టగుణో భవేత్ ॥ 208 ॥

అపరాధము చేసిన వ్యక్తిని రాజు ఆహ్వానించినపుడు పోనియెడల, ఆహ్వానము లేకున్నను అనగా పిలువకపోయినను వచ్చి కూర్చొనువానిని, దండించువాని యొక్క హస్తమును విదిలించుకొని పారిపోవువానిని దండన విధించు న్యాయాధిపతి అధికమైన ధనము చెల్లించునట్లు దండించాలి. వార్తాహరుడైన దూత తన కర్తవ్యమును ఉచిత రీతిగా నిర్వహించనిచో ఆతనికి పైన చెప్పిన దండనతో అర్థభాగముతో దండించాలి. దండించుట కొరకు లేదా నియంత్రించుట కొరకు తీసుకువెళ్తున్నప్పుడు అపరాధియైనవాడు పారిపోయినచో ఎనిమిది గుణముల కంటే అధికమైన దండన విధించాలి.

అనిందితే వివాదే తు నఖరోమావతారణమ్ ।
కారయేద్యః స పురుషో మధ్యమం దండమర్హతి ॥ 209 ॥

బంధనం చాప్యవధ్యస్య బలాన్మోచయతే తు యః ।
వధ్యం విమోచయేద్యస్తు దండ్యాద్ద్విగుణభాగ్భవేత్ ॥ 210 ॥

దుర్దృష్టవ్యవహారాణం సభ్యానాం ద్విగుణోదమః ।
రాజ్ఞాత్రింశద్గుణో దండ్యః ప్రక్షేప్య ఉదకే భవేత్ ॥ 211 ॥

అనిందితుని నిందితునిగా నిర్ణయించి ఆతనికి కేశనఖాదులు కత్తిరించి శిక్షవిధించు రాజు సేవకునికి మధ్యమ రీతిగా దండన విధించాలి. వధార్హుడు కానట్టి అపరాధనిబంధనమునుండి విడిపించువానిని, మృత్యుదండనము విధింపబడిన అపరాధిని కూడ విడిపించువానిని రెట్టింపు దండముతో శిక్షించాలి. దుష్టములైన మరియు నింద్యములైన వ్యవహారములందు ఆసక్తులైన సభాసదులను కూడ రాజు రెట్టింపు దండనముతో శిక్షించాలి. అట్టి అపరాధులను ముప్పది గుణములధికముగా శిక్షించి, వారిని నీటి లోనికి త్రోయాలి.

అల్పదండేఽధికం కుర్యాత్ విపులే చాల్పమేవ చ ।
ఊనాధికం తు తం దండం సభ్యో దద్యాత్ స్వకాత్ గృహాత్ ॥ 212 ॥

యావానవధ్యస్య వధే తావాన్ వధ్యస్య రక్షణే ।
అధర్మో నృపతేర్దృష్టస్తథా వధ్యస్య మోక్షణే ॥ 213 ॥

అల్పదండన స్థానమున అధికము మరియు అధికదండన స్థానమున అల్పమును విధించునట్టి రాజు సేవకుడు తన ఇంటినుండియే ధనము చెల్లించు శిక్షకు అర్హుడవుతాడు. కావున రాజు ఆతనిని అట్లు శిక్షించాలి. అవధ్యుని వధించుట,వధ్యుని రక్షించుట ఇత్యాది అధర్మకర్మలయందు రాజు ఆ దోషాన్ని పొందుతాడు.

బ్రాహ్మణం నైవ హన్యాత్తు సర్వపాపేష్వవస్థితమ్ ।
ప్రవాసయేత్ స్వకాత్ రాష్ట్రాత్ సమగ్రధనసంయుతమ్ ॥ 214 ॥

న జాతు బ్రాహ్మణం వధ్యాత్ పాతకం త్వధికం భవేత్ ।
యస్మాత్తస్మాత్ ప్రయత్నేన బ్రహ్మాహత్యాం వివర్జయేత్ ॥ 215 ॥

ఎన్ని పాపములు చేసిన చేసినప్పటికి బ్రాహ్మణునికి మృత్యుదండన విధించకూడదు. కాని అట్టివానిని స్వధనముతో కూడ దేశ బహిష్కృతుని చేయాలి. ఈ విధంగా అధిక పాపకార్యము చేసినను ద్విజుని ఎప్పుడును వధించకూడదు కావున సర్వప్రయత్నంతో రాజు సర్వథా బ్రాహ్మణుని మరణదండనం నుండి వదిలివేయాలి.

అదండ్యాన్ దండయన్ రాజా దండ్యాంశ్చైవాప్యదండయన్ ।
అయశో మహదాప్నోతి నరకం చాధిగచ్ఛతి ॥ 216 ॥

జ్ఞాత్వాఽపరాధం పురుషస్య రాజా
కాలం తథా చానుమతం ద్విజానామ్ ।
దండ్యేషు దండ్యం పరికల్పయేత్తు
యో యస్య యుక్తః స సమీక్ష్య కుర్యాత్ ॥ 217 ॥

శిక్షార్హులు కాని వారిని శిక్షించినను, శిక్షార్హులను శిక్షించకపోయినను రాజు అపకీర్తిని పొందుతాడు. నరకలోకమును పొందుతాడు. కావున రాజు జాగరూకతతో ఆయా పురుషులు ఆచరించిన అపరాధమును చక్కగా తెలిసికొని, విచారించి దేశకాల స్థితులను ఆలోచించి, ద్విజశ్రేష్ఠుల అనుమతిని కూడ గ్రహించి దండ్యులకు మాత్రమే శిక్ష విధించాలి. ఏది ఏ అపరాధికి ఉచితమో నిర్ణయించుకొని సముచితమైన దండనము రాజు విధించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే రాజధర్మే దండప్రణయనం నామ
సప్తవింశత్యధిక ద్విశతతమోఽధ్యాయః॥127॥

శ్రీ మత్స్యమహాపురాణమున రాజధర్మప్రకరణము నందు దండప్రణయనమను
రెండువందల ఇరవైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టవింశత్యధికశతతమోఽధ్యాయః – రెండువందల ఇరవైఎనిమిదవ అధ్యాయం

రాజధర్మే అద్భుతశాంతిః – రాజధర్మమునందు అద్భుతశాంతి

మనురువాచ – మనువు చెప్పాడు.

దివ్యాంతరిక్షభౌమేషు యా శాంతిరభిధీయతే ।
తామహం శ్రోతుమిచ్ఛామి మహోత్పాతేషు కేశవ! ॥ 1 ॥

కేశవా! దివ్యములు, అంతరిక్షములు, భౌమములు అను త్రివిధములైన మహోత్పాతములు సంభవించినప్పుడు ఎటువంటి శాంతి జరుపవలెనని శాస్త్రము తెలుపుతున్నదో అది నీ నుండి వినగోరుచున్నాను అని మనువు మత్స్యభగవానుని ప్రార్థించాడు. అనుకోకుండా ఆకస్మికముగా సంభవించునట్టి ప్రకృతి విపరీతములనే ఉపద్రవములు, ఉత్పాతములు అని అంటారు. ఇటువంటి వాటిలో భూమికి సంబంధించిన వాటిని భౌమములని, అంతరిక్షంతో సంభవించునవి దివ్యములు అనగా గ్రహ నక్షత్రాదులతో సంభవించునవి, అని మూడు విధములు ఇట్టి ఉత్పాతములు కలిగినపుడు ఎటువంటి శాంతి కర్మలు ఆచరించాలని మనువు మత్స్యభగవానుని అడిగాడు.

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి త్రివిధామద్భుతాదిషు ।
విశేషేణ తు భౌమేషు శాంతిః కార్యా తథా భవేత్ ॥ 2 ॥

నీవడిగినట్లు అద్భుతములైన వివిధ ఉత్పాతములు సంభవించినప్పుడు విశేషముగా పృథివికి సంబంధించిన ఉత్పాతములు కలిగినప్పుడు ఎటువంటి శాంతి కార్యములు నిర్వహించవలెనో ఇప్పుడు వివరించెదనని మత్స్యభగవానుడు మనువుతో అన్నాడు.

అభయా చాంతరిక్షేషు సౌమ్యా దివ్యేషు పార్థివ ।
విజిగీషుః పరం రాజన్ భూతికామస్తు యో భవేత్ ॥ 3 ॥

విజిగీషుః పరానేవమభియుక్తస్తథా పరైః ।
తథాభిచారశంకాయాం శత్రూణామభినాశనే ॥ 4 ॥

భయే మహతి సంప్రాప్తే అభయా శాంతిరిష్యతే ।

ఓ రాజా! అంతరిక్షసంబంధమైన ఉత్పాతములకు 'అభయా' అను శాంతి, దివ్యములైనవాటికి 'సౌమ్యా' అను శాంతి జరపాలి. ఇతరులను జయించి వారి సంపదలను పొందగోరువాడును, ఇతరులను జయించి వారిపై తన ఆధిక్యతను పొందే కోరిక కలవాడును, తన విషయమున ఇతరుల అభిచారక్రియలను ఆచరించునప్పుడును, శత్రువులను నశింపజేయు కోరిక కలవాడును, మహత్తరమైన భయములు కలిగినప్పుడును ఆచరింపవలసిన శాంతిని అభయ శాంతి అని అంటారు.

రాజయక్ష్మాభిభూతస్య క్షతక్షీణస్య చాప్యథ ॥ 5 ॥

సౌమ్యా ప్రశస్యతే శాంతిః యజ్యకామ్యస్య చాప్యథ ।
భూకంపే చ సముత్పన్నే ప్రాప్తే చాన్నక్షయే తథా ॥ 6 ॥

అతివృష్ట్యామనావృష్ట్యాం శలభానాం భయేషు చ ।
ప్రమత్తేషు చ చౌరేషు వైష్ణవీ శాంతిరిష్యతే ॥ 7 ॥

పశూనాం మారణే ప్రాప్తౌ నరాణామపి దారుణే ।
భూతేషు దృశ్యమానేషు రౌద్రీ శాంతిస్తథేష్యతే ॥ 8 ॥

రాజయక్ష్మయను వ్యాధిచేత పీడితుడైనవాడును, గాయంతో బాధపొందుచున్నవాడు, యజ్ఞములనాచరింప గోరువాడు 'సౌమ్య' అను శాంతిని ఆచరించుట ప్రశస్తము, అట్లే భూకంపాలు కలిగినప్పుడు, అన్న క్షయమైనప్పుడు అతివృష్టి లేదా అనావృష్టి సంభవించినప్పుడు, శలభములు అనగా మిడుతలు అధికమై భయం కలిగించినప్పుడు, పిచ్చివారి ద్వారా మరియు దొంగల ద్వారా కూడ భయము కలిగినప్పుడు 'వైష్ణవి' అను శాంతి నిర్వహించుట శ్రేష్ఠము. మరియు పశుమరణములు అధికముగా సంభవించినప్పుడు, నరులు దారుణంగా హింసింపబడునప్పుడు, భూత ప్రేతాదుల భయము కలిగినప్పుడు 'రౌద్రీ' అను శాంతిని ఆచరించాలి.

వేదనాశే సముత్పన్నే జనే జాతే చ నాస్తికే ।
అపూజ్య పూజనే జాతే బ్రాహ్మీ శాంతిస్తథేష్యతే ॥ 9 ॥

భవిష్యత్యభిషేకే చ పరచక్రభయేఽపి చ ।
స్వరాష్ట్రభేదేఽరివధే రౌద్రీ శాంతిః ప్రశస్యతే ॥ 10 ॥

వేదనాశము కలుగునప్పుడు, జనులు నాస్తికులగుచున్నపుడు, అనర్హులు పూజింపబడున్నప్పుడు 'బ్రాహ్మీ' శాంతి ఆచరించుట ప్రశస్తము, రాజ్యాభిషేక సమయమున, శత్రువులు తన రాష్ట్రమునకు హాని కలిగించుటకై సన్నద్ధు లైనప్పుడు, స్వరాజ్యమునందు విభిన్నత్వము ఏర్పడినప్పుడు, శత్రువులను వధించు అవసరమునందును 'రౌద్రీ' శాంతిని ఆచరించుట ప్రశస్తమైనది.

త్ర్యహాతిరిక్తే పవనే భక్ష్యే సర్వవిగర్హితే ।
వైకృతే వాతజే వ్యాధౌ వాయవీ శాంతిరిష్యతే ॥ 11 ॥

అనావృష్టిభయే జాతే ప్రాప్తే వికృతి వర్షణే ।
జలాశయవికారేషు వారుణీ శాంతిరిష్యతే ॥ 12 ॥

అభిశాపభయే ప్రాప్తే భార్గవీ చ తథైవ చ ।
జాతే ప్రసవవైకృత్యే ప్రాజాపత్యా మహీభుజా ॥ 13 ॥

మూడు దివసముల కంటే అధికముగా ప్రబలమైన గాలివీచినప్పుడు, తినుటకు యోగ్యములైన భక్ష్యాది

పదార్థములు చెడిపోవునప్పుడు, వికృతములైన వాతమునకు సంబంధించి వ్యాధులు ప్రబలినప్పుడు "వాయవీ" శాంతి ఆచరించుట శ్రేష్ఠము, అట్లే అనావృష్టితో భయముత్పన్నమైనప్పుడు, వికృతములైన వర్షములు కురియునప్పుడు, జలాశయవికారములు కలిగినప్పుడు 'వారుణీ' శాంతి నాచరించాలి.ఎవరినుండైననూ శాప భయముత్పన్నమైనప్పుడు 'భార్గవీ' శాంతిని జరుపాలి. ప్రసవసమయమున స్త్రీలకు వికృత శిశువులు జన్మించినప్పుడు రాజు 'ప్రాజాపత్య' శాంతి ఆచరించాలి.

ఉపస్కరాణాం వైకృత్యే త్వాష్ట్రీ పార్థివనందన! ।
బాలానాం శాంతికామస్య కౌమారీ చ తథా నృప! ॥ 14 ॥

కుర్యాచ్ఛాన్తిమథాగ్నేయీం సంప్రాప్తే వహ్నివైకృతే ।
ఆజ్ఞాభంగే తు సంజాతే తథా భృత్యాది సంక్షయే ॥ 15 ॥

ఉపస్కరములు అనగా ఇంటికి సంబంధించిన ఆహారమునకు సంబంధించిన ఉపకరణములకు వికృతము కలిగినప్పుడు "త్వాష్ట్రీ" శాంతి చేయాలి. ఓ రాజా! బాలురకు శాంతి కలుగవలెనన్న 'కౌమారీ' శాంతిని ఆచరించాలి. అట్లే అగ్ని వైపరీత్యము సంభవించినప్పుడు, ఆజ్ఞా భంగములు వాటిల్లినప్పుడు, భృత్యనాశము కలిగినప్పుడు "ఆగ్నేయీ" శాంతి ఆచరించాలి.

అశ్వానాం శాంతికామస్య తద్వికారే సముత్థితే ।
అశ్వానాం కామయానస్య గాంధర్వీ శాంతిరిష్యతే ॥ 16 ॥

గజానాం శాంతికామస్య తద్వికారే సముత్థితే ।
గజానాం కామయానస్య శాంతిరాంగీరసీ భవేత్ ॥ 17 ॥

అశ్వముల శాంతి కోరుకున్నవారు, వాటికి వికారములు కలిగినప్పుడు మరియు వాటియొక్క వృద్ధి కోరుకునే వారు "గాంధర్వీ" అను శాంతిని ఆచరించాలి. మరియు గజముల యొక్క శాంతిని కోరుకొనేవారు, గజమునకు వికారాదులు కలిగినప్పుడు, గజములు అభివృద్ధి కోరుకునేవారు కూడ "ఆంగీరసీ" అను శాంతిని జరుపాలి.

పిశాచాదిభయే జాతే శాంతిర్వై నైరృతీ స్మృతా ।
అపమృత్యుభయే జాతే దుఃస్వప్నే చ తథా స్థితే ॥ 18 ॥

యామ్యాం తు కారయేచ్ఛాన్తిం ప్రాప్తే తు నరకే తథా ।
ధననాశే సముత్పన్నే కౌబేరీ శాంతిరిష్యతే ॥ 19 ॥

వృక్షాణాం చ తథార్థానాం వైకృతే సముపస్థితే ।
భూతికామ స్తథా శాంతిం పార్థివం ప్రతియోజయేత్ ॥ 20 ॥

పిశాచాదుల వలన భయము కలుగునప్పుడు "నైరృతీ" శాంతిని ఆచరించాలి, అపమృత్యుభయము పోగొట్టుటకు, దుఃస్వప్నములు మరియు నరక భయములు కలుగునప్పుడు "యామ్యా" శాంతిని ఆచరించాలని తెలుపబడినది. ధననాశము సముత్పన్నమైనప్పుడు "కౌబేరి" శాంతిని ఆచరించవలెను. అంతేకాక వృక్షములకు,

మరియు ధనమునకు హాని కలుగుతున్నప్పుడు, రాజు తాను అధికముగా భూమిని కోరుకుంటున్నప్పుడు కూడ "పార్థివీ" శాంతిని జరిపించాలి.

ప్రథమే దినయామే చ రాత్రౌ వా మనుజోత్తమ ।
హస్తే స్వాతౌ చ చిత్రాయామాదిత్యే చాశ్వినే తథా ॥ 21 ॥

అర్యమ్ణి సౌమ్యజాతేషు వాయవ్యాం త్వద్భుతేషు చ ।
ద్వితీయే దినయామే తు రాత్రౌ చ రవినందన ॥ 22 ॥

పుష్యాగ్నేయే విశాఖాసు పిత్ర్యాసు భరణేషు చ ।
ఉత్పాతేషు తథా భాగ్యే ఆగ్నేయీం తేషు కారయేత్ ॥ 23 ॥

ఓ మనుజోత్తమా! దివసపు పూర్వభాగమునందు,రాత్రి సమయమందు హస్త, స్వాతీ, చిత్రా, పునర్వసు ఆశ్వినీ నక్షత్రములయందు సూర్యాస్తమయమైన పిదప వాయవ్యకోణమునందు అద్భుతమైన ఉపద్రవములు కలిగినట్లు కనబడినప్పుడు "ఆగ్నేయీ" శాంతిని చేయాలి. ఓ రవినందనా! దివసపు ఉత్తరభాగమునందు కాని రాత్రి రెండవ భాగమునందు కాని పుష్యమి, కృత్తికా, విశాఖా నక్షత్రములందు ఆగ్నేయదిశలో ఉత్పాతము సంభవించినచో వెంటనే "ఆగ్నేయీ" శాంతిని ఆచరించాలి.

తృతీయే దినయామే చ రాత్రౌ చ రవినందన ।
రోహిణ్యాం వైష్ణవే బ్రాహ్మే వాసవే వైశ్వదేవతే ॥ 24 ॥

జ్యేష్ఠాయాం చ తథా మైత్ర్యే యే భవ్య స్త్వద్భుతాః క్వచిత్ ।
ఐన్ద్రీ తేషు ప్రయోక్తవ్యా శాంతీ రవికులోద్వహ! ॥ 25 ॥

ఓ రవినందనా! దివసపు తృతీయయామమునందు గాని, రాత్రి సమయములో గాని రోహిణీ, శ్రవణము, ఉత్తరాభాద్ర, ధనిష్ఠ, జేష్ఠా, అనూరాధ నక్షత్రములయందు ఈశాన్యకోణమునందు అద్భుతములైన ఉత్పాతములు సంభవించినచో "ఐంద్రీ" శాంతిని ఆచరించాలని చెప్పబడింది.

చతుర్థే దినయామే చ రాత్రౌ వా రవినందన! ।
సార్పే పౌష్ణే తథార్ద్రాయాం అహిర్బుధ్న్యే చ దారుణే ॥ 26 ॥

మూలే వారుణదైవత్యే యే భవన్త్యద్భుతాస్తథా ।
వారుణీ తేషు కర్తవ్యా మహాశాంతిర్మహీక్షితా ॥ 27 ॥

ఓ రవినందనా! పగలు కాని రాత్రి కాని నాలుగవ జామునందు ఆశ్లేష, రేవతి, ఆర్ద్ర, ఉత్తరాభాద్ర, శతభిషం, మూల మొదలగు నక్షత్రములందు ఉత్పాతములు సంభవించినచో "వారుణీ" అను మహాశాంతిని నిర్వర్తించాలి.

మిత్రమండలవేలాసు యే భవన్త్యద్భుతాః క్వచిత్ ।
తత్ర శాంతిద్వయం కార్యం నిమిత్తేషు చ నాన్యథా ॥
నిర్నిమిత్తకృతా శాంతిర్నిమిత్తే నోపయుజ్యతే ॥ 28 ॥

బాణప్రహారా న భవన్తి యద్వత్ రాజన్ నృణాం సన్నహనైర్యుతానామ్ ।
దైవోపఘాతా న భవన్తి తద్వత్ ధర్మాత్మనాం శాంతి పరాయణానామ్ ॥ 29 ॥

సూర్యమండలపు అంచులయందు ఉత్పాతహేతువులు కనబడినచో "అభయా-సౌమ్య" అను రెండు శాంతులు జరుపాలి. ఇట్లు వివరించిన ఉత్పాత నిమిత్తములు కలిగినప్పుడే తగిన ఆయా శాంతులనాచరించాలి. కాని నిమిత్తములు లేకుండా ఆచరించినటువంటి శాంతులు నిరుపయోగములేనని తెలిసికోవలసినది. ఓ రాజా! కవచాదులతో రక్షింపబడిన శరీరముగల రాజులకు బాణప్రహారములు ఎటువంటి హానిని కలిగించలేవు. అట్లే ధర్మపరాయణులై అవసరమునసరించి ఆయా శాంతులు జరిపించునట్టి రాజులకు దైవోపఘాతములు ఎటువంటి హాని కలిగించవు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అద్భుతశాంతిర్నామ అష్టావింశత్యధికద్విశతతమోఽధ్యాయః ॥228॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అద్భుతశాంతి అనే
రెండువందల ఇరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోన త్రింశత్యధికశతతమోऽధ్యాయః – రెండువందల ఇరవైతొమ్మిదవ అధ్యాయం

రాజధర్మే అద్భుత శాంతికోత్పత్తిః – రాజధర్మమునందు అద్భుతశాంతికోత్పత్తి

మనురువాచ – మనువు చెప్పాడు.

అద్భుతానాం ఫలం దేవ! శమనం చ తథా వద ।
త్వం హి వేత్సి విశాలాక్ష! క్షేమం సర్వమశేషతః ॥ 1 ॥

ఓ దేవా! అట్టి అద్భుతములైన ఉత్పాతములు ఘటించినప్పుడు వాటి పరిణామమెట్లుండును? వాటికి జరుపవలసిన శాంతులు గురించి నాకు విశదముగా వివరింపుము, ఓ విశాలాక్షా! ఇవన్నీ తెలిసినటువంటి సర్వజ్ఞుడవు నీవు.

అత్ర తే వర్ణయిష్యామి యదువాచ మహాతపాః ।
అత్ర యే వృద్ధగర్గస్తు సర్వధర్మభృతాం వరః ॥ 2 ॥

సరస్వత్యాం సుఖాసీనం గర్గం స్రోతసి పార్థివ ।
పప్రచ్ఛాసౌ మహాతేజాః అత్రిర్మునిజనప్రియమ్ ॥ 3 ॥

మహాతపస్వి, ధర్మాత్ములందరిలో శ్రేష్ఠుడూ అయిన వృద్ధగర్గుడు అత్రిమునికి వివరించిన దానినే నీకు తెలిపెదను. ఓ రాజా! పూర్వము సరస్వతీ నదీ తీరమునందు సుఖాసీనుడైయున్న గర్గుని మునిజనప్రియుడు, మహాతేజోవంతుడూ అయిన అత్రి ఇట్లడిగాడు.

అత్రిరువాచ – అత్రి చెప్పాడు.

నశ్యతాం పూర్వరూపాణి జనానాం కథయస్వ మే ।
నగరాణాం తథా రాజ్ఞాం త్వం హి సర్వం వదస్వ మామ్ ॥ 4 ॥

ఓ మహర్షీ! వినాశోన్ముఖులైన మనుష్యులు, రాజులు మరియు రాజుల యొక్క స్థితిని వశించుటకు ముందుండు వాటి రూపములు లేదా వాటిని సూచించు హేతువులను నాకు సవివరంగా తెలుపుము.

గర్గ ఉవాచ – గర్గ మహర్షి చెప్పాడు.

పురుషాపచారాన్నియతమపరజ్యన్తి దేవతాః ।
తతో పరాగాద్దేవానాముపసర్గః ప్రవర్తతే ॥ 5 ॥

దివ్యాన్తరిక్షభౌమం చ త్రివిధం సంప్రకీర్తితమ్ ।
గ్రహర్క్ష వైకృతం దివ్యమాన్తరిక్షం నిబోధ మే ॥ 6 ॥

ఉల్కాపాతో దిశాం దాహః పరివేషస్తథైవ చ ।
గంధర్వనగరం చైవ వృష్టిశ్చ వికృతా తు యా ॥ 7 ॥

ఏవమాదీని లోకేఽస్మిన్నాంతరిక్షం వినిర్దిశేత్ ।

మానవులు చేయు అపరాధముల వలన దేవతలు ఆగ్రహిస్తారు. దానివలన మహోపద్రవములు ఉద్భవించుట మొదలవుతాయి. ఈ ఉపద్రవములు దివ్యములు, అంతరిక్షములు, భౌమములు అని మూడు విధములు, గ్రహములు మరియు నక్షత్రములయందు కనబడే వికృతత్వములు దివ్యములు, ఉల్కాపాతములు, దిశలు మండునట్లు కనబడుట, గంధర్వనగరములు ఆకాశములో కనబడుట, వికృతములైన వర్షములు కురియుట మొదలగునవి అంతరిక్ష సంబంధి ఉపద్రవములు అని తెలిసికోవలసినది.

చరస్థిరభవో భౌమో భూకంపశ్చాపి భూమిజః ॥ 8 ॥

జలాశయానాం వైకృత్యం భౌమం తదపి కీర్తితమ్ ।
భౌమేత్వల్పఫలం జ్ఞేయం చిరేణ చ విపచ్యతే ॥ 9 ॥

అభ్రజం మధ్యఫలదం మధ్యకాలఫలప్రదమ్ ।
అద్భుతే తు సముత్పన్నే యది వృష్టిః శివా భవేత్ ॥ 10 ॥

సప్తాహాభ్యన్తరే జ్ఞేయమద్భుతం నిష్ఫలం భవేత్ ।

చరస్థిర ప్రాణులయందు కనబడు వికారములు కూడ భౌమములనబడును. అట్లే భూకంపములు, జలాశయములు యందు కలుగు వికారములు కూడ భౌమములే. భౌమాద్భుతముల వలన కలిగే వికారములు ఫలము అల్పముగనే ఉండునుకాని తొందరగా శాంతించవు. అంతరిక్ష నిమిత్తములైన వికారములు మధ్యమ ఫలమిచ్చును. మధ్యమముగానే అనగా అతిశీఘ్రం లేదా అత్యాలస్యం కాకుండా శమించును. ఇటువంటి ఉత్పాతములు కలిగిన వెంటనే ఒక వేళ మంగళప్రదమైన వర్షము కురిసినచో ఆ ఉత్పాతముల యొక్క ఫలము ఒక ఏడు రోజులలోనే నశించునని తెలిసికోవలసినది.

అద్భుతస్య విపాకశ్చ వినా శాన్త్యా న దృశ్యతే ॥ 11 ॥

త్రిభిర్వర్షైస్తథా జ్ఞేయం సుమహద్భయకారకమ్ ।
రాజ్ఞః శరీరే లోకే చ పురద్వారే పురోహితే ॥ 12 ॥

పాకమాయాతి పుత్రేషు తథా వై కోశవాహనే ।
ఋతుస్వభావాద్రాజేంద్ర భవన్త్యద్భుత సంజ్ఞితాః ॥ 13 ॥

శుభావహాస్తే విజ్ఞేయాస్తాంశ్చ మే గదతః శృణు ।

కాని ఈ దివ్యాద్భుతములైనవాటికి శాంతి జరుపనిదే వాటియొక్క దుష్ఫలితము శమింపదు. ఇవి కనబడిన మూడు సంవత్సరముల కాలములోగా రాజునకు, ప్రజలకు, పురద్వారమునకు, పురోహితునికి లేదా రాజ పుత్రులకు, కోశాగారములకు లేదా వాహనములకు ఆ ఉత్పాతములు హాని కలిగించును. ఓ రాజేంద్రా! ఋతు స్వభావముల వలన కలుగు కొన్ని అద్భుతములు కలవు. వాటిలోని శుభసూచకములైన వాటిని నేను ఇప్పుడు వినిపిస్తాను.

వజ్రాశని మహాకంప సంధ్యానిర్ఘాతనిః స్వనాః ॥ 14 ॥

పరివేషరజో ధూమరక్తార్కాస్తమయోదయాః ।
ద్రుమోద్భేదకరస్నేహా బహుశః సఫలద్రుమః ॥ 15 ॥

గోపక్షి మధువృద్ధిశ్చ శుభాని మధుమాధవే ।

ఉరుములు మెరుపులతో కూడిన పిడుగులు పడుట, భూకంపములు కలుగుట, సంధ్యాసమయమున ఉరుముట, పరివేషములు, ధూళి ధూమాదులు వ్యాప్తిచెందుట, అర్కోదయాస్తమయములు ఎర్రగా నుండుట, వృక్షములనుండి నూనె మరియు జిగురు కారుట, వృక్షములు అధికమైన కాయలు పండ్లు కలిగియుండుట, గోవులు, పక్షులు మరియు తేనె మొదలగునవి వృద్ధి పొందుట ఇత్యాదులు చైత్రవైశాఖ సమయములందు అనగా వసంతఋతువు నందు సంభవించినచో అవి శుభావహములు.

ఋక్షోల్కాపాతకలుషం కపిలార్కేందుమండలమ్ ॥ 16 ॥

కృష్ణశ్వేతం తథాపేనతం ధూసరధ్వాన్త లోహితమ్ ।
రక్తపుష్పారుణం సాంధ్యం నభః క్షుబ్ధార్ణవోపమమ్ ॥ 17 ॥

సరితాం చాంబుసంశోషం దృష్ట్వా గ్రీష్మే శుభం వదేత్ ।

గ్రీష్మర్తువునందు ఉల్కాపాతములు, రవిచంద్రమండలములు కపిలవర్ణములగుట, సంధ్యాసమయమున కృష్ణ వర్ణము, శ్వేత వర్ణము, ధూళి ధూసరముల చేత లోహిత వర్ణము కలుగుట, రక్తపుష్పముల వంటి ఎర్రని వర్ణము కలుగుట, ఆకాశము కల్లోలితమైన సముద్రము వలె కనబడుట, నదుల మరియు తటాకముల నీరు ఎండిపోవుట మొదలగునవి శుభసూచకములే.

శుక్రాయుధ పరీవేషం విద్యుదుల్కాధిరోహణమ్ ॥ 18 ॥

కంపోద్వర్తన వైకృత్యం హసనం దారణం క్షితేః ।
నద్యోదపాన సరసాం విధూనతరణప్లవాః ॥
శృంగిణాం చ వరాహాణాం వర్షాసు శుభమిష్యతే ॥ 19 ॥

ఇంద్రధనుస్సులు, పరివేషములు, మెరుపులు, ఉల్కాలు మొదలగునవి అధికమగుట, భూమి కంపించుట, భూమి బ్రద్దలగుట, నదులు, బావులు, సరస్సులు, మొదలగు వాటి యందు నీరధికమై కల్లోలితములగుట, కొమ్ములు గల ప్రాణులు, పందులు ఇత్యాదులు వణికిపోవుట మొదలగునవి వర్షర్తువు యందు సంభవించినచో శుభావహములేనని తెలిసికోవలసింది.

శీతానిల తుషారత్వం నర్దనం మృగపక్షిణామ్ ॥ 20 ॥

రక్షోభూతపిశాచానాం దర్శనం వాగమానుషీ ।
దిశో ధూమాంధకారాశ్చ సనభోవనపర్వతాః ॥ 21 ॥

ఉచ్చైః సూర్యోదయాస్తౌ చ హేమన్తే శోభనాః స్మృతాః ।

ఇక హేమంతర్తువునందు చల్లని గాలులు వీచుట, మంచు అధికంగా పడుట, మృగాలు, పక్షులు, అధికంగా ధ్వని చేయుట, రక్షోభూత పిశాచాదులు కనబడుట, అమానుషములైన వాక్కులు వినబడుట, అన్ని దిక్కులయందు, ఆకాశమందు, వన పర్వతాదులయందు ధూమాంధకారములు వ్యాప్తి చెందుట, సూర్యోదయాస్తమయాలు, అధిక వ్యత్యాసంతో సంభవించుట మొదలగునవి కలిగినచో అవి శుభప్రదములే.

దివ్యస్త్రీ రూపగంధర్వ విమానాద్భుతదర్శనమ్ ॥ 22 ॥

గ్రహ నక్షత్ర తారాణాం దర్శనం వాగమానుషీ ।
గీత వాదిత్ర నిర్ఘోషో వనపర్వతసానుషు ॥ 23 ॥

సస్యవృద్ధీ రసోత్పత్తిః శరత్కాలే శుభాః స్మృతాః ।

దివ్యస్త్రీలు, గంధర్వులు, విమానాలు, మొదలగు అద్భుతములు ఆకాశమునందు కనబడుట, గ్రహములు, నక్షత్రములు తారలు అధికము కనబడుట, అమానుషవాక్కులు వినబడుట, వనములు మరియు పర్వతసానువుల యందు గీతవాదిత్రముల ధ్వనులు వినబడుట, సస్యవృద్ధి కలుగుట, రసోత్పత్తి విశేషముగా కలుగుట మొదలగునవి శరత్కాలమునందు సంభవించినచో శుభకరములే.

హిమపాతానిలోత్పాత విరూపాద్భుతదర్శనమ్ ॥ 24 ॥

కృష్ణాంజనాభమాకాశం తారోల్కాపాతపింజరమ్ ।
చిత్రగర్భోద్భవః స్త్రీషు గోఽజాశ్వమృగపక్షిషు ॥
పత్రాంకురలతానాం చ వికారాః శిశిరే శుభాః ॥ 25 ॥

శిశిరఋతువునందు హిమపాతములతో కూడిన పెనుగాలులు వీచుట, వికృతములైన రూపములు కనబడుట, ఆకాశము సంపూర్ణముగా కాటుకవలె నల్లదైన వర్ణాలతో కనబడుట, పింజర వర్ణము కలిగిన ఉల్కలు, తారలు, రాలిపడుట, మానవస్త్రీల యందు, గోవులు, మేకలు, అశ్వాలు, మృగాలు మరియు పక్షులు మొదలగువాటి యందు విచిత్ర గర్భధారణము కలుగుట, పత్రాంకురలతలయందు వింతమార్పులు కలుగుట శుభావహములు.

ఋతుస్వభావేన వినాఽద్భుతస్య జాతస్య దృష్టస్య తు శీఘ్రమేవ ।
యథాగమం శాంతిరనన్తరం తు కార్యా యథోక్తా వసుధాధిపేన ॥ 26 ॥

ఓ రాజా! ఇవి కాకుండా ఋతుస్వభావమునకు విరుద్ధములైన అద్భుతోత్పాతములు కనబడినచో రాజు వెంటనే వాటి అశుభఫలమును శమింపజేయగల శాంతిని జరుపాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అద్భుతశాంతికోత్పత్తిర్నామ ఏకోనత్రింశద్విశతతమోఽధ్యాయః ॥229॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అద్భుతశాంతికోత్పత్తి యను
రెండువందల ఇరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

త్రింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పయవ అధ్యాయం

రాజధర్మే అద్భుత శాంతావర్చాధికారః - రాజధర్మమునందు అద్భుతశాంతిలో అర్చాధికారం

గర్గ ఉవాచ - గర్గ మహర్షి చెప్పాడు.

దేవతార్చాః ప్రనృత్యన్తి వేపన్తే ప్రజ్వలన్తి చ ।
వమన్త్యగ్నిం తథా ధూమం స్నేహం రక్తం తథా వసామ్ ॥ 1 ॥

ఆరటన్తి రుదన్త్యేతాః ప్రస్విద్యన్తి హసన్తి చ ।
ఉత్తిష్ఠన్తి నిషీదన్తి ప్రధావన్తి ధమన్తి చ ॥ 2 ॥

భుంజతే విక్షిపన్తే వా కోశప్రహరణధ్వజాన్ ।
అవాఙ్ముఖా వై భవన్తి స్థానాత్ స్థానం భ్రమన్తి చ ॥ 3 ॥

ఏవమాద్యా హి దృశ్యన్తే వికారాః సహసోత్థితాః ।
లింగాయతనవిప్రేషు తత్ర వాసం న రోచయేత్ ॥ 4 ॥

దేవతామూర్తులు (విగ్రహములు) నృత్యము చేయును, కంపించును, ప్రజ్వలించును, అగ్ని, ధూమము, తైలము, రక్తము, మాంసము మొదలగువాటిని క్రక్కును, గట్టిగా అరుచును, ఏడుచును, చెమటతో చెమర్చుచు, బాగా నవ్వును, లేచును, కూర్చుండును, పరుగెత్తును, ఊదును, తినును, విసిరివేయును, కోశములను, ధ్వజములను, ఇటునటు త్రిప్పును, తల త్రిప్పుకొనును, ఒక చోట నుండి ఇంకొక చోటికి కదులును, ఇట్లు అనేక విధముల వికృత చేష్టలు అకస్మాత్తుగా కనబడునట్టి దేవాలయములు మరియు బ్రాహ్మణులు ఇండ్లయందు వాటి సమీపమున నివాసముండుట పనికిరాదు.

రాజ్ఞో వా వ్యసనం తత్ర స చ దేశో వినశ్యతి ।
దేవయాత్రాసు చోత్పాతాన్ దృష్ట్వా దేశభయం భవేత్ ॥ 5 ॥

పితామహస్య హర్మ్యేషు తత్ర వాసం న రోచయేత్ ।
పశూనాం రుద్రజం జ్ఞేయం నృపాణాం లోకపాలజమ్ ॥ 6 ॥

జ్ఞేయం సేనాపతీనాం తు యత్ స్యాత్ స్కంధవిశాఖజమ్ ।
లోకానాం విష్ణువస్వింద్ర విశ్వకర్మ సముద్భవమ్ ॥ 7 ॥

అటువంటి వికృతములు సంభవించినప్పుడు రాజునకు ఆపదలు కలుగుతాయి. దేశమునకు కూడ నాశము కలుగుతుంది. దేవతల యాత్రలలో (ఉత్సవాదులలో) ఇటువంటి ఉత్పాతములు కనబడినచో దేశమునకే భయము వాటిల్లుతుంది. అట్టి ఉత్పాతములు ఉద్భవించునటువంటి దేశమున పితృ పితామహాదులచే నిర్మింపబడిన పురాతన గృహములందు కూడ నివాసము చేయరాదు. పశువులకు రుద్రుని వలన, రాజులకు లోకపాలకుల వలన,

సేనాపతులకు కార్తికేయుని వలన, సామాన్య జనులందరికిని విష్ణువు, వసువు, ఇంద్రుడు మరియు విశ్వకర్మ మొదలగువారి వలన కీడు కలుగునని తెలిసికోవలసినది. అనగా ఈ దేవతలందరిని ఎల్లప్పుడు ప్రసన్నులై ఉండునట్లు ప్రార్థించాలి, సేవించాలి. వారికి కోపము కలుగునట్లు వ్యవహరించినచో ఆయా ఉత్పాతములు సంభవిస్తాయి.

వినాయకోద్భవం జ్ఞేయం గణానాం యే తు నాయకాః ।
దేవప్రేష్యాన్నృపప్రేష్యా దేవస్త్రీభిః నృపస్త్రియః ॥ 8 ॥

గణనాయకులకు కలుగు ఉత్పాతములు విఘ్నేశ్వరుని వలన కలుగుతాయి. విఘ్నేశ్వరుని విషయమున అపరాధములు చేసినచో ఉత్పాతములు సంభవిస్తాయి. అట్లే రాజుల యొక్క స్త్రీలకు దేవతాస్త్రీల వలన, రాజసేవకులకు దేవదూతల వలన కలుగునని తెలిసికోవలసినది.

వాసుదేవోద్భవం జ్ఞేయం గ్రహాణామేవ నాన్యథా ।
దేవతానాం వికారేషు శ్రుతివేత్తా పురోహితః ॥ 9 ॥

దేవతార్చ్యాం తు గత్వా వై స్నానమాచ్ఛాద్య భూషయేత్ ।
పూజయేచ్చ మహాభాగ గంధమాల్యాన్నసంపదా ॥ 10 ॥

మధుపర్కేణ విధివత్ ఉపతిష్ఠేదనన్తరమ్ ।
పురోధా జుహుయాద్వహ్నౌ సప్తరాత్రమతంద్రితః ॥ 11 ॥

గ్రహములు ద్వారా కలుగు ఉపద్రవములు వాసుదేవుని వలన సంభవిస్తాయి. ఈవిధంగా దేవతామూర్తులయందు ఇటువంటి వికారములు కలిగినప్పుడు వేదవిదుడైన పురోహితుడు ఆయా దేవతా మూర్తుల దగ్గరకు వెళ్ళి స్నానాదులాచరింపజేసి (నీటితో శుభ్రముగా అభిషేకాదులు నిర్వహించి) వస్త్రములు, గంధము, పుష్పమాలాదుల చేత అలంకరించి, అన్నాది నైవేద్యములతో చక్కగా పూజించాలి. అంతేకాక యధావిధిగా మధుపర్కముతో ఆ దేవతామూర్తిని సేవించి అటు తర్వాత ఏడు రోజులు సావధానచిత్తులై హెూమాదులు నిర్వహించాలి.

విప్రాశ్చ పూజ్యా మధురాన్నపానైః స దక్షిణం సప్తదినం నరేంద్ర ।
ప్రాప్తేఽ ష్టమేఽ హ్ని క్షితిగోప్రదానైః స కాంచనైః శాంతిముపైతి పాపమ్ ॥ 12 ॥

ఓ రాజా! ఈ ఏడు దివసములలో విప్రులను మధురములైన అన్నపాయసాది భోజనములతో, ఉత్తమములైన దక్షిణలతో సత్కరించాలి. ఎనిమిదవ దివసమున గోభూ-హిరణ్యాది దానములతో బ్రాహ్మణులను సత్కరించాలి. ఇట్లాచరించినచో ఆయా ఉపద్రవములు, పాపములు శాంతిస్తాయి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అద్భుతశాంతావర్చాధికారో నామ త్రింశదధికద్విశతతమోఽ ధ్యాయః॥230॥
శ్రీ మత్స్యమహాపురాణంలో అద్భుతశాంతిలో, అర్చాధికారమను రెండువందల ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

ఏకత్రింశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ముప్పైఒకటవ అధ్యాయం

రాజధర్మ అద్భుతశాంతావగ్ని వైకృత్యమ్ – రాజధర్మమునందు అద్భుతశాంతియందు అగ్ని వైకృత్యం

గర్గ ఉవాచ – గర్గుడు చెప్పాడు.

అనగ్నిర్దీప్యతే యత్ర రాష్ట్రే యస్య నిరింధనః ।
న దీప్యతే చేంధనవాన్ తద్రాష్ట్రం పీడ్యతే నృపైః ॥ 1 ॥

ప్రజ్వలేదప్సు మాంసం వా తదర్థం వాఽపి కించన ।
ప్రాకారం తోరణం ద్వారం నృపవేశ్మ సురాలయమ్ ॥ 2 ॥

ఏతాని యత్ర దీప్యన్తే తత్ర రాజ్ఞో భయం భవేత్ ।
విద్యుతా వా ప్రదహ్యన్తే తదాఽపి నృపతేర్భయమ్ ॥ 3 ॥

ఏ దేశమునందు అగ్ని లేకుండానే ఇంధనములు మండునో, అట్లే ఇంధనములు లేకుండానే అగ్ని జ్వలించుచుండునో ఆ దేశమునకు శత్రురాజులచేత పీడ కలుగుతుంది. అగ్ని లేకుండా కేవలము జలముతోనే మాంసాదులు మండిపోవునో లేదా దానిలోని సగభాగము మండిపోవునో, ప్రాకారములు, ద్వారములు, తోరణములు, రాజభవనము, దేవాలయము మొదలగునవి మండిపోవుటయు లేదా మెరుపుల ద్వారా నిప్పు అంటుకుని అవి దహించి పోవుటయు సంభవించినచో ఆ దేశపు రాజునకు భయం కలుగుతుంది.

అనైశాని తమాంసి స్యుర్వినా పాంసురజాంసి చ ।
ధూమశ్చానగ్నిజో యత్ర తత్ర విన్ద్యాన్మహాభయమ్ ॥ 4 ॥

తడిత్త్వనభ్రే గగనే భయః స్యాద్ ఋక్షవర్జితే ।
దివా సతారే గగనే తథైవ భయమాదిశేత్ ॥ 5 ॥

రాత్రివేళ కాకున్నను అంతట అంధకారము పరివ్యాప్తమైనచో, ఎటువంటి ధూళి లేకున్నను ఆకాశము ధూసరితమైపోవుట, అగ్ని లేకుండా పొగ వ్యాపించుట ఇత్యాదులు సంభవించునో అక్కడ మహాభయము వాటిల్లును. అలాగే మేఘములు లేకపోయినను ఆకాశమును మెరుపులు మెరయుట, రాత్రి సమయమున కూడ ఆకాశమున నక్షత్రములు కనబడకుండుట, పగటి సమయమున నక్షత్రములు కనబడుట ఇత్యాదులు సంభవించినచో ఆ దేశమునందు మహాభయముత్పన్నమగును.

గ్రహనక్షత్ర వైకృత్యే తారా విషమదర్శనే ।

పుర వాహనయానేషు చతుష్పాన్ మృగపక్షిషు ॥ 6 ॥

ఆయుధేషు చ దీప్తేషు ధూమాయత్సు తథైవ చ ।
నిర్గమత్సు చ కోశాచ్చ సంగ్రామస్తుములో భవేత్ ॥ 7 ॥

గ్రహ నక్షత్రతారాది గణములలో వికృతత్వము కనబడినప్పుడు, పురవాహనయానాదులందు, నాలుగు పాదములు కలిగిన ప్రాణులయందు, మృగ పక్ష్యాదులయందు వికృతత్వము సంభవించినప్పుడు, ఆయుధములు మండుచున్నప్పుడు, పొగ వ్యాప్తిచెందినప్పుడు, కోశాగారములోని ధనము వ్యర్థమగునప్పుడు రాజ్యమునందు తుములయుద్ధం సంభవిస్తుంది.

వినాగ్నిం విస్ఫులింగాశ్చ దృశ్యతే యత్ర కుత్రచిత్ ।
స్వభావాచ్చాపి పూర్యంతే ధనూంషి వికృతాని చ ॥ 8 ॥

వికారశ్చాయుధానాం స్యాత్ తత్ర సంగ్రామమాదిశేత్ ।
త్రిరాత్రోపోషితశ్చాత్ర పురోధాః సుసమాహితః ॥ 9 ॥

సమిద్భిః క్షీరవృక్షాణాం సర్షపైశ్చ ఘృతేన చ ।
హోమం కుర్యాదగ్నిమంత్రైః బ్రాహ్మణాంశ్చైవ భోజయేత్ ॥ 10 ॥

రాజ్యములో ఎక్కడైననూ అగ్ని లేకున్ననూ నిప్పురవ్వలు ఉద్భవించినచో ఎక్కుపెట్టకపోయినప్పటికిని ధనుస్సులు తమంతటతామే ఎక్కుపెట్టబడినచో, ఇతర ఆయుధములు వికృతమైన చేష్టలు కలిగినవిగా అయినచో యుద్ధమే సంభవించును. ఇటువంటి సందర్భములలో పురోహితుడు దివసత్రయ పర్యంతము ఉపవాసవ్రతము చేసి సమాహిత చిత్తుడై పాలుగల వృక్షముల యొక్క సమిధలతో, ఆవాలతో, ఘృతముతో అగ్నిమంత్రముల నుచ్చరించుచు యథావిధిగా హోమం చేయాలి. బ్రాహ్మణులకు భోజనం సమకూర్చాలి.

దద్యాత్ సువర్ణం చ తథా ద్విజేభ్యో గాశ్చైవ వస్త్రాణి తథా భువం చ ।
ఏవం కృతే పాపముపైతి నాశం యదగ్నివైకృత్యభవం నరేంద్ర! ॥ 11 ॥

ఓ నరేంద్రా! ఇంకనూ ద్విజులకు సువర్ణము, గోవులు, వస్త్రములు, భూమి మొదలగువాటిని దానమీయాలి. ఈ విధంగా ఆచరించినచో అగ్ని వైకృతమునకు సంబంధించిన ఉపద్రవములు మరియు ఇతర పాపములు కూడ నశించును.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ అగ్నివైకృత్యం నామ
ఏకత్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥231॥

శ్రీ మత్స్యమహాపురాణమున అద్భుతశాంతియందు అగ్నివైకృత్యమను
రెండువందల ముప్పైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వాత్రింశదధికశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైరెండవ అధ్యాయం

అద్భుతశాంతౌ వృక్షోత్పాతప్రశమనమ్ - అద్భుతశాంతిలో వృక్షోత్పాత ప్రశమనం

గర్గ ఉవాచ - గర్గుడు చెప్పాడు.

పురేషు యేషు దృశ్యంతే పాదపా దేవచోదితాః ।
రుదంతో వా హసంతో వా స్రవంతో వా రసాన్ బహూన్ ॥ 1 ॥

అరోగా వా వినా వాతం శాఖాం ముంచత్యథ ద్రుమాః ।
ఫలం మూలం తథా కాలం దర్శయంతి త్రిహాయనాః ॥ 2 ॥

పూర్వవత్ స్వం దర్శయంతి ఫలం పుష్పం తథాన్తరే ।
క్షీరం స్నేహం తథా రక్తం మధు తోయం స్రవంతి చ ॥ 3 ॥

శుష్యంత్యరోగాః సహసా శుష్కా రోహంతి వా పునః ।

ఉత్తిష్ఠతీహ పతితాః పతంతి చ తథోత్థితాః ॥ 4 ॥
తత్ర వక్ష్యామి తే బ్రహ్మన్ విపాకం ఫలమేవ చ ।

ఏ నగరములయందు వృక్షములు దేవతల యొక్క ప్రేరణచేత ఏడ్చుచు మరియు నవ్వుచు కనబడునో, అనేక విధములైన రసములను స్రవించునో, ఎటువంటి వ్యాధి లేకపోయినను గాలి లేకపోయినను చెట్లు యొక్క కొమ్మలు పడిపోవునో, అకాలమందు మూడు సంవత్సరముల వయసు మాత్రమే కలిగిన వృక్షములకు పూలు పూయుట, పండ్లు కాయుట జరుగునో, అంతేకాక ఋతుకాలమునందు వలనే కొన్ని వృక్షములు అకాలమున కూడ పూలు, కాయలు, పండ్లు ఉన్నట్లు కనబడునో, పాలు, నూనె, రక్తం, మద్యము, నీరు ఇత్యాదులను స్రవించునో, రోగాలు లేకున్నను కొన్ని చెట్లు ఎండిపోవునో అట్లే ఎండిపోయినవి చిగురించునో, క్రింద పడిపోయిన చెట్లు లేచుట లేచినవి పడిపోవుట జరుగునో ఆ నగరమున ఎట్టి ఉపద్రవములు సంభవించునో వివరించెదను, ఓ బ్రహ్మ జ్ఞానీ! వినుము.

రోదనే వ్యాధి మభ్యేతి హసనే దేశవిభ్రమమ్ ॥ 5 ॥

శాఖా ప్రపతనం కుర్యాత్ సంగ్రామే యోధపాతనమ్ ।
బాలానాం మరణం కుర్యాత్ బాలానాం బాలపుష్పితా ॥ 6 ॥

స్వరాష్ట్రభేదం కురుతే ఫలపుష్పమథాన్తరే ।
క్షయః సర్వత్ర గోక్షీరే స్నేహే దుర్భిక్షలక్షణమ్ ॥ 7 ॥
వాహనాపచయం మద్యే రక్తే సంగ్రామమాదిశేత్ ।
మధుస్రావే భవేద్వ్యాధిః జలస్రావే న వర్షతి ॥ 8 ॥

చెట్లు ఏడ్చినచో వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. అవి నవ్వినచో సంకటములు సందేహములు వృద్ధిచెందుతాయి. వాటి కొమ్మలు విరిగి పడినచో యుద్ధము నందు యోధులు మరణిస్తారు. చిన్న చెట్లకే కాలం కాని కాలమున పువ్వులు పూచినచో బాలురు అధిక సంఖ్యలో మరణిస్తారు. కొమ్మల నడుమ ఫలపుష్పాదులు కలిగినచో దేశములో కలహములు భేద భావముల కలుగుతాయి. గోక్షీరం స్రవించినచో సర్వత్ర నాశము సంభవిస్తుంది. నూనె కార్చినచో (చెట్లు) దుర్భిక్షమేర్పడుతుంది. మద్యము స్రవించినచో వాహనములకు నష్టము వాటిల్లుతుంది. రక్తము స్రవించినచో సంగ్రామమే జరుగుతుంది. తేనె స్రవించినచో వ్యాధులు వ్యాప్తిచెందుతాయి, జలము స్రవించినచో వర్షాభావమేర్పడుతుంది.

అరోగశోషణం జ్ఞేయం బ్రహ్మన్ దుర్భిక్షలక్షణమ్ ।
శుష్కేషు సంప్రరోహస్తు వీర్యమన్నం చ హీయతే ॥ 9 ॥

ఉత్థానే పతితానాం చ భయం భేదకరం భవేత్ ।
స్థానాత్ స్థానం తు గమనే దేశ భంగ స్తథా భవేత్ ॥ 10 ॥

జ్వలత్స్వపి చ వృక్షేషు రుదత్స్వపి ధనక్షయమ్ ।
ఏతత్ పూజితవృక్షేషు సర్వం రాజ్ఞో విపద్యతే ॥ 11 ॥

ఎటువంటి రోగములు లేకున్నను చెట్లు ఎండిపోయిన దుర్భిక్షము కలుగుతుంది. మరియు ఎండిపోయిన చెట్లు చిగురించినచో అన్నము, వీర్యము కూడ నశించిపోతుంది. పడిపోయిన వృక్షములు లేచుట జరిగినచో దేశమునకే చీలిక భయమేర్పడుతుంది. వృక్షములు ఒక స్థానము నుండి ఇంకొక స్థానమునకు కదులుట సంభవించినచో దేశ భంగమేర్పడుతుంది. వృక్షములు మండినను, ఏడ్చినను దేశమునందు ధన క్షయమేర్పడుతుంది. ఇటువంటి ఉపద్రవములు పూజింపబడే వృక్షములందే సంభవించినచో రాజునకు సర్వవిపత్తులూ కలుగుతాయి.

పుష్పే ఫలే వా వికృతే రాజ్ఞో మృత్యుం తథాఽఽదిశేత్ ।
అన్యేషు చైవ వృక్షేషు వృక్షోత్పాతేష్వతంద్రితః ॥ 12 ॥

ఆచ్ఛాదయిత్వా తం వృక్షం గంధమాల్యైర్విభూషయేత్ ।
వృక్షోపరి తథా ఛత్రం కుర్యాత్ పాపప్రశాంతయే ॥ 13 ॥

శివమభ్యర్చయేద్దేవం పశుం చాస్మై నివేదయత్ ।
రుద్రేభ్య ఇతి వృక్షేషు హుత్వా రుద్రం జపేత్తతః ॥ 14 ॥

అట్లే వృక్షముల యొక్క పుష్పములందు ఫలములందు వికృతత్వము సంభవించినచో రాజునకే మృత్యుభయము వాటిల్లుతుంది. ఇటువంటివే కాక ఇతరములైన వృక్షోత్పాతములు ఏవైనా సంభవించినను జాగరూకతతో గమనించి ఆ వృక్షమునకు ఆచ్ఛాదనము చేసి గంధమాల్యాదులతో దానిని అలంకరించాలి. పాపప్రశమునకై ఆ వృక్షముపై ఛత్రమును(గొడుగు) నిలుపాలి. దేవదేవుడైన శివుని పూజించి పశువునర్పించాలి.

"రుద్రేభ్యః" అనుచు సంకల్పం చేసి ఆ చెట్టు క్రింద హెూమాదులు నిర్వహించి రుద్రజపం చేయాలి.

మధ్వాజ్యయుక్తేన తు పాయసేన సంపూజ్య విప్రాంశ్చ భువం చ దద్యాత్ ।
గీతేన నృత్యేన తథార్చయేత్తు దేవం హరం పాపవినాశహేతోః ॥ 15 ॥

ఓ రాజా! తేనె, నెయ్యి మొదలగువాటితో కూడిన పాయసముతో ద్విజులను పూజించి వారికి భూదానమీయాలి. పాపప్రశమునకై గీతనృత్యాదులతో శివుని పూజించాలి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ వృక్షోత్పాత ప్రశమనం నామ
ద్వాత్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥232॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అద్భుతశాంతిలో వృక్షోత్పాత ప్రశమనము
రెండువందల ముప్పైరెండవ అధ్యాయం సమాప్తం.



త్రయస్త్రింశదధికశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైమూడవ అధ్యాయం

అద్భుత శాంతౌ వృష్టివైకృతిప్రశమనమ్ - అద్భుతశాంతిలో వృష్టివైకృతి ప్రశమనం

గర్గ ఉవాచ - గర్గుడు చెప్పాడు.

అతివృష్టిరనావృష్టిః దుర్భిక్షాదిభయం మతమ్ ।
అనృతౌ తు దివానన్తా వృష్టిర్జ్ఞేయా భయానకా ॥ 1 ॥

అనభ్రే వైకృతాచ్చైవ విజ్ఞేయా రాజమృత్యవే ।
శీతోష్ణానాం విపర్యాసే నృపాణాం రిపుజం భయమ్ ॥ 2 ॥

అతివృష్టి మరియు అనావృష్టి రెండునూ దేశమునందు కలుగబోయే దుర్భిక్షమునకు నిమిత్తములు, అనృతువునందు కురియునట్టి అనంతవర్షము భయహేతువు అని తెలిసికోవలసినది. మేఘములు లేకుండానే కలుగు వికృతములు అనగా మెరుసుట, వర్షించుట ఇత్యాదులు రాజుయొక్క మరణమును సూచించును. శీతోష్ణములు విపరీతములైనప్పుడు అవి రాజునకు శత్రువుల ద్వారా కలుగబోయే భయమును సూచిస్తాయి.

శోణితం వర్షతే యత్ర తత్ర శస్త్రభయం భవేత్ ।
అంగారపాంసు వర్షేషు నగరం తద్వినశ్యతి ॥ 3 ॥

మజ్జాస్థిస్నేహమాంసానాం జనమారభయం భవేత్ ।
ఫలం పుష్పం తథా ధాన్యం పరేణాతిభయాయ తు ॥ 4 ॥

పాంశుజంతూపలానాం చ వర్షతో రోగజం భయమ్ ।
ఛిద్రే వాన్నప్రవర్షేణ సస్యానాం భీతివర్ధనమ్ ॥ 5 ॥

రక్తపు వర్షము కురిసినచో శస్త్రభయము కలుగుతుంది. నిప్పుకణికలు మరియు ధూళి వర్షించినచో నగరమే నశిస్తుంది. క్రొవ్వు, ఎముకలు, నూనె, మాంసము మొదలగునవి వర్షించినచో జనమునకు మృత్యుభయము వాటిల్లుతుంది. ఫలములు పుష్పములు మరియు ధాన్యములు వర్షించినచో శత్రుభయము వాటిల్లుతుంది. ధూళి, జంతువులు మరియు వడగళ్ళు వర్షించినచో దేశమునందు రోగభయము కలుగుతుంది. ఛిద్రములైన అన్నవర్షము కురిసినచో లోకమున సస్యభీతి కలుగుతుంది.

విరజస్కే రవౌ వ్యభ్రే యదా ఛాయా న దృశ్యతే ।
దృశ్యతే తు ప్రతీపా వా తత్ర దేశభయం భవేత్ ॥ 6 ॥

నిరభ్రే వాఽథ రాత్రౌ వా శ్వేతం యామ్యోత్తరేణ తు ।
ఇంద్రాయుధం తథా దృష్ట్వా ఉల్కాపాతం తథైవ చ ॥ 7 ॥

దిగ్దాహపరివేషౌ చ గంధర్వనగరం తథా ।
పరచక్రభయం బ్రూయాద్దేశోపద్రవమేవ చ ॥ 8 ॥

ఆకాశమునందు ధూళిలేకున్నను, మేఘములు లేకున్నను, సూర్యుడు ప్రకాశించుచున్నను, నీడ కనబడక పోయినను, విపరీత చిహ్నములు కనబడినను అవి దేశభయమునకే హేతువులని గమనించాలి. ఆకాశమున మేఘములు లేనప్పుడుకాని, రాత్రి సమయమున కాని దక్షిణదిశలో లేదా ఉత్తరదిశలో తెల్లని ఇంద్రధనస్సు కనబడినను, ఉల్కాపాతము కలిగినను, దిక్కులు దహించిపోతున్నట్లు కనబడినను, గంధర్వ నగరము కనబడినను శత్రుసేనల భయము ఉద్భవిస్తుంది. దేశోపద్రవము కూడ సంభవిస్తుంది.

సూర్యేందుపర్జన్యసమీరణానాం యాగస్తు కార్యో విధివద్ ద్విజేంద్ర ।
ధనాని గౌః కాంచనదక్షిణా చ దేయా ద్విజానామఘనాశహేతోః ॥9॥

ఓ ద్విజేంద్రా! సూర్యుడు, చంద్రుడు, మేఘములు, వాయువు, మొదలగు దేవతలనుద్దేశించి యథావిధిగా యజ్ఞయాగాదులు నిర్వహించి బ్రాహ్మణులకు, గోహిరణ్యాది దానములీయాలి. ఇట్లాచరించినచో సర్వపాపములు నశిస్తాయి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ వృష్టివైకృతి ప్రశమనం నామ
త్రయస్త్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥ 233॥

శ్రీ మహాపురాణంలో అద్భుతశాంతిలో వృష్టివైకృతి ప్రశమనమనే
రెండువందల ముప్పైమూడవ అధ్యాయం సమాప్తం.



చతుస్త్రింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైనాల్గవ అధ్యాయం
అద్భుతశాంతౌ సలిలాశయవైకృత్యమ్ - అద్భుతశాంతిలో సలిలాశయ వైకృత్యం

గర్గ ఉవాచ - గర్గుడు చెప్పాడు.

నగరాదపసర్పంతే సమీపముపయాన్తి చ ।
నద్యో హ్రదప్రస్రవాణి విరసాశ్చ భవంతి చ ॥ 1 ॥

వివర్ణం కలుషం తప్తం ఫేనవజ్జన్తుసంకులమ్ ।
స్నేహం క్షీరం సురాం రక్తం వహన్తే వ్యాకులోదకాః ॥ 2 ॥

షణ్మాసాభ్యంతరే తత్ర పరచక్రభయం భవేత్ ।

నదులు, సరస్సులు మరియు ప్రస్రవణములు అనగా ఊటబావులు నగరమునకు దగ్గరగా ఉన్నవి. దూరము పోవుట, అట్లే దూరముగా నున్నవి దగ్గరకు వచ్చుట జరిగినచో, ఇంకనూ వీటి నీరు రుచిలేకుండా పోవుట, వివర్ణత్వము పొందుట, కలుషితమైపోవుట, ఎండిపోవుట, నురుగులు, సుడులు ఏర్పడుట, నూనె, పాలు, మద్యము, రక్తము, మొదలగు వాటితో కలసి ప్రవహించుట లేదా ఉద్భవించుట ఇత్యాదులు కలిగినచో ఆరునెలల కాలములోగా ఆ దేశమునకు శత్రురాజుల భయమేర్పడుతుంది.

జలాశయా నదంతే వా ప్రజ్వలంతి కథంచన ॥ 3 ॥
విముంచంతి తథా బ్రహ్మన్ జ్వాలాధూమరజాంసి చ ।
అఖాతే వా జలోత్పత్తిః సుసత్త్వా వా జలాశయాః ॥ 4 ॥

సంగీతశబ్దాః శ్రూయంతే జనమారభయం భవేత్ ।
దివ్యమమ్భోమయం సర్పిర్మధుతైలావసేచనమ్ ॥ 5 ॥

జప్తవ్యా వారుణా మంత్రాస్తైశ్చ హోమో జలే భవేత్ ।

జలాశయములు శబ్దము చేయుట లేదా మండుట, మంటలను, పొగను, ధూళిని వదులుట, త్రవ్వకుండానే నీరు పైకి వచ్చుట, జలాశయములందు జలచరములధిక మగుట, నీటి నుండి సంగీతధ్వని వినిపించుట మొదలగునవి కలిగినచో జనులకు మరణభయము వాటిల్లుతుంది. ఇటువంటివాటి శాంతికై నెయ్యి తేనె, తైలము మొదలగు వాటితో పవిత్రములైన నీటితో ఆ జలాశయములందు వేయుచు వరుణదేవునికి సంబంధించిన మంత్రములను జపించుచు హోమం నిర్వహించాలి.

మధ్వాజ్యయుక్తం పరమాన్నమత్ర దేయం ద్విజానాం ద్విజభోజనార్థమ్ ।
గావశ్చ దేయాః సితవస్త్రయుక్తాస్తథోదకుంభాః సలిలాఘశాన్త్యై ॥ 7 ॥

ఓ ద్విజోత్తమా! అట్టి హోమం నిర్వహించినప్పుడు బ్రాహ్మణులకు తేనె, నెయ్యి కలిపిన పరమాన్నముతో భోజనాదులు ఏర్పర్చాలి. తెల్లని వస్త్రములతో కూడిన గోవులను మరియు నీటితో నిండిన కుంభములను గూడా ఈ శాంతికై బ్రాహ్మణులకు దానమీయాలి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ సలిలాశయ వైకృత్యం నామ చతుస్త్రింశదధికద్విశతతమోఽధ్యాయః॥234॥

శ్రీ మాత్స్యమహాపురాణంలో అద్భుతశాంతిలో సలిలాశయవైకృత్యమను
రెండువందల ముప్పైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచత్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల ముప్పైఅయిదవ అధ్యాయం

అద్భుతశాంతౌ స్త్రీ ప్రసవవైకృత్యమ్ – అద్భుతశాంతిలో స్త్రీప్రసవ వైకృత్యం

గర్గ ఉవాచ – గర్గుడు చెప్పాడు.

అకాలప్రసవాః నార్యః కాలాతీతప్రజాస్తథా ।
వికృతప్రసవాశ్చైవ యుగ్మసంప్రసవాస్తథా ॥1॥

అమానుషా హ్యతుండాశ్చ సంజాతవ్యసనాస్తథా ।
హీనాంగా అధికాంగాశ్చ జాయంతే యది వా స్త్రియః ॥2॥

పశవః పక్షిణశ్చైవ తథైవ చ సరీసృపాః ।
వినాశః తస్య దేశస్య కులస్య చ వినిర్దిశేత్ ॥3॥

స్త్రీలకు అకాలమందు ప్రసూతి జరిగిననూ లేదా కాలాతీతముగా ప్రసూతి అయినను, వికృత ప్రసవము కలిగినను, జంట ప్రసవములు కలిగినను, అమానుష ప్రాణప్రసవమైనను, ముక్కు, నోరు మొదలగునవి లేనివారు, దుర్వ్యసనములతో కూడినవారు, హీనాంగులు, అధికాంగులు ఇత్యాది ప్రసవములు కలిగినను, పశువులకు, పక్షులకు, సరీసృపాలు కూడ వికృత ప్రసవములు కలిగినను, ఆ దేశమునకు మరియు కులమునకు కూడ నష్టము వాటిల్లుతుంది.

వివాసయేత్తాన్నృపతిః స్వరాష్ట్రాత్స్త్రియశ్చ పూజ్యాశ్చ తతో ద్విజేంద్రాః ।
కస్యేచ్ఛకైః బ్రాహ్మణతర్పణం చ లోకే తతః శాంతి ముపైతి పాపమ్ ॥ 4 ॥

అట్టి ఉపద్రవములు సంభవించినప్పుడు రాజు అట్లు జన్మించినవారిని స్వరాష్ట్రము నుండి వెడలగొట్టాలి. స్త్రీలకు మరియు బ్రాహ్మణులకు విశేష సమ్మానం చేయాలి. బ్రాహ్మణులకు వారుకోరినవాటినిచ్చి సంతర్పణం చేయాలి అట్లు చేసినచో పాపాలు పోయి లోకమున శాంతి కలుగుతుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ స్త్రీ ప్రసవ వైకృత్యం నామ
పంచత్రింశదధిక ద్విశతతమోఽ ధ్యాయః ॥235॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అద్భుతశాంతిలో స్త్రీప్రసవ వైకృత్యమనే
రెండువందల ముప్పైఅయిదవ అధ్యాయం సమాప్తం.

షట్త్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైఆరవ అధ్యాయం

అద్భుతశాంతౌ ఉపస్కర వైకృత్యమ్ - అద్భుతశాంతిలో ఉపస్కర వైకృత్యం

గర్గ ఉవాచ - గర్గుడు చెప్పాడు.

యాన్తి యానాన్యయుక్తాని యుక్తాన్యపి న యాన్తి చ ।
చోద్యమానాని తత్ర స్యాన్మహద్భయముపస్థితమ్ ॥ 1 ॥

వాద్యమానా న వాద్యంతే వాద్యంతే చాప్యనాహతాః ।
అచలాశ్చ చలంత్యేవ న చలంతి చలాని చ ॥ 2 ॥

ఆకాశే తూర్యనాదశ్చ గీత గంధర్వనిఃస్వనః ।
కాష్ఠదర్వీకుతారాది వికారం కురుతే యది ॥ 3 ॥

గావో లాంగూలసంఘైశ్చ స్త్రియః స్త్రీ చ విఘాతయేత్ ।
ఉపస్కారాది వికృతౌ ఘోరం శస్త్రభయం భవేత్ ॥ 4 ॥

(ఈ అధ్యాయము ఉపస్కరవైకృత్యమనునది. బండ్లు, రథములు మొదలగునవే కాక మంచములు, పీటలు, కృషికిని, వంటకును ఉపయోగపడు పనిముట్లు ఇత్యాదులను ఉపస్కరములంటారు).

ఏ దేశములో అశ్వములు జోడించకున్ననూ రథములు నడుచునో, అశ్వములను జోడించిననూ, మరియు లాగిననూ కదలకుండా ఉండునో ఆ దేశమునకు మహాభయము ఉపస్థితమై ఉన్నట్లు తెలిసికోవలెను. వాద్యములు మ్రోగించిననూ మ్రోగకుండా ఉండుటయు, మ్రోగించకపోయిననూ మ్రోగుటయు, కదలలేనివి కదులుటయు, కదలగలిగేవి కదలకుండా ఉండుటయు, ఆకాశమున తూర్య నాదములు, గీత గంధర్వధ్వనులు వినిపించుటయు, కర్రతోచేయు పనిముట్లు, గరిటెలు, గొడ్డలి ఇత్యాదులందు వికారము కనపించుటయు, ఆవులు తమ తోకలతో తామే కొట్టుకొనుటయు, స్త్రీలను స్త్రీలే కొట్టుకొనుట మొదలగు ఉపస్కరాది వైకృతము సంభవించినచో దేశమునందు ఘోరమైన శస్త్రభయమేర్పడును.

వాయోస్తు పూజాం ద్విజం సక్తుభిశ్చ కృత్వా నియుక్తాంశ్చ జపేచ్చ మంత్రాన్ ।
దద్యాత్ ప్రభూతం పరమాన్నమత్ర సదక్షిణం తేన శమోఽస్య భూయాత్ ॥ 5 ॥

ఓ బ్రాహ్మణా! ఇట్టి ఉపద్రవములు కలిగినప్పుడు వాయుదేవుని పూజించి పేలపిండి నివేదనం చేయాలి. ద్విజులచే వాయుదేవతా మంత్రాలు జపింపజేయాలి. మరియు వారికి పరమాన్నాదులతో భోజనాలు కల్పించి సమృద్ధిగా దక్షిణనీయాలి. ఇట్లాచరిస్తే ఉపస్కరవైకృత్యదోషం శాంతిస్తుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ ఉపస్కరవైకృత్యం నామ షట్త్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః॥236॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అద్భుతశాంతిలో ఉపస్కర వైకృత్యం అనే రెండువందల ముప్పైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తత్రింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ముప్పైఏడవ అధ్యాయం

అద్భుతశాంతౌ మృగపక్షివైకృత్యమ్ - అద్భుత శాంతిలో మృగపక్షివైకృత్యం

గర్గ ఉవాచ - గర్గుడు చెప్పాడు.

ప్రవిశంతి యదా గ్రామ మారణ్యా మృగపక్షిణః ।
అరణ్యం యాన్తి వా గ్రామ్యాః స్థలం యాన్తి జలోద్భవాః ॥ 1 ॥

స్థలజాశ్చ జలం యాంతి ఘోరం వాశంతి నిర్భయాః ।
రాజద్వారే పురద్వారే శివాచాప్యశివప్రదాః ॥ 2 ॥

దివా రాత్రించరా వాపి రాత్రావపి దివాచరాః ।
గ్రామ్యాస్త్యజంతి గ్రామం చ శూన్యతాం తస్య నిర్దిశేత్ ॥ 3 ॥

అరణ్యముననుండు మృగపక్షాదులు గ్రామములందు ప్రవేశించుట, గ్రామములందుండు మృగపక్షాదులు అరణ్యములందు ప్రవేశించుట, జలచరములు భూమిపై సంచరించుట, భూమిపై సంచరించు ప్రాణులు జలములందు ప్రవేశించుట, అవి నిర్భయంగా ఘోరమైన ధ్వనులు చేయుట, రాజద్వారమునందు పురద్వారమునందు అమంగళకరములైన నక్కలు అరుచుట, రాత్రించరములైన ప్రాణులు పగలు సంచరించుట, దివాచరములైనవి రాత్రి సంచరించుట, గ్రామమున వసించు ప్రాణులు గ్రామమును త్యజించుట మొదలగునవి సంభవించినచో ఆ గ్రామము లేదా నగరము శూన్యమగునని తెలుసుకోవాలి.

దీప్తా వాశంతి సంధ్యాసు మండలాని చ కుర్వతే ।
వాశంతి విస్వరం యత్ర తదాప్యేతత్ ఫలం లభేత్ ॥ 4 ॥

ప్రదోషే కుక్కుటో వాశేత్ హేమంతే వాపి కోకిలః ।
అర్కోదయే కర్కాభిముఖీ శివా రౌతి భయం వదేత్ ॥ 5 ॥

గృహం కపోతః ప్రవిశేత్ క్రవ్యాదో మూర్ధ్ని లీయతే ।
మధు వా మక్షికాః కుర్యుః మృత్యుర్గృహపతేర్భవేత్ ॥ 6 ॥

ఎక్కడనైతే సంధ్యాకాలమునందు పశ్వాదిజీవగణములు ఒకచోటచేరి మండలాకారముగా నేర్పడి అకస్మాత్తుగా కోపోన్మత్తముతో వికట స్వరముతో అరిచిననూ ఇటువంటి దుష్ఫలితమే కలుగుతుంది. మరియు ప్రదోషకాలమున కోడి కూసినను, హేమంత ఋతువున కోకిల కూసినను, సూర్యోదయ సమయమున సూర్యుని కభిముఖముగా చేరి నక్కలు భయంకరముగా కూసిననూ, ఇంటియందు పావురము ప్రవేశించినను, మాంసాహారమును తిను పక్షులు ఇంటి పై వ్రాలినను, ఇంటియందు తేనెటీగలు తేనెతెట్టు పెట్టినను ఆ గృహయజమాని మరణిస్తాడు.

ప్రాకారద్వార గేహేషు తోరణాపణవీథిషు ।
కేతుచ్ఛత్రాయుధాద్యేషు క్రవ్యాదం ప్రపతేద్యది ॥ 7 ॥
జాయంతే వాఽథ వల్మీకా మధు వా స్యందతే యది ।
సదేశో నాశమాయాతి రాజా చ మ్రియతే తథా ॥ 8 ॥

ప్రాకారములందు, ద్వారములందు, గృహములందు, తోరణములందు, ఆపణములందు, వీథులయందు, ధ్వజములు, ఛత్రములు, ఆయుధములు మొదలగు వాటియందు కూడ మాంసాహారపు పక్షులు వ్రాలినను, వల్మీకములు (పుట్టలు) ఉద్భవించినను, తేనె స్రవించినను ఆ దేశము నాశమును పొందును మరియు రాజు మరణిస్తాడు.

మూషకాన్ శలభాన్ దృష్ట్వా ప్రభూతం క్షుద్భయం భవేత్ ।
కాష్ఠోల్ముకాస్థిశృంగాఢ్యాః శ్వానో మర్కటవేదనాః ॥ 9 ॥

దుర్భిక్షవేదనా జ్ఞేయా కాకా ధాన్యముఖా యది ।
జనానభిభవంతీహ నిర్భయా రణవేదినః ॥ 10 ॥

కాకో మైథునసక్తశ్చ శ్వేతస్తు యది దృశ్యతే ।
రాజా వై మ్రియతే తత్ర స చ దేశో వినశ్యతి ॥ 11 ॥

మూషకములు, మిడుతలు అధికమైనచో ఆగ్రామమున లేదా దేశమున ఆకలిబాధ అధికమగును, కట్టెలను కొరవులను, ఎముకలను, కొమ్ములను నోట కరుచుకొని తిరుగునట్టి కుక్కలు మరియు కోతులు అధికమైనచో కూడ అవి మృత్యువును సూచించును. కాకులు ధాన్యమును నోట పెట్టుకొని తిరిగినచో దుర్భిక్షభయం కలుగునని తెలిసికోవలసినది. అవి ఒక వేళ నిర్భయముగా జనావాసములపై అధికముగా తిరిగినచో యుద్ధము సంభవిస్తుంది. కాకులమైథునమును గాని తెల్లని కాకిగాని కనబడినచో ఆ దేశపురాజు మృతి చెందును లేదా ఆ దేశము నశించి పోతుంది.

ఉలూకో దృశ్యతే యత్ర నృపద్వారే తథా గృహే ।
జ్ఞేయో గృహపతేర్మృత్యుః ధననాశస్తథైవ చ ॥ 12 ॥

మృగపక్షి వికారేషు కుర్యాద్ధోమం స దక్షిణమ్ ।
దేవాః కపోతా ఇతి వా జప్తవ్యాః పంచభిర్ద్విజైః ॥ 13 ॥

గావశ్చ దేయా విధివద్ ద్విజానాం స కాంచనా వస్త్రయుగోత్తరీయాః ।
ఏవం కృతే శాంతిముపైతి పాపం మృగైర్ద్విజైర్వా వినివేదితం యత్ ॥ 14 ॥

రాజద్వారమునందు కాని, గృహమునందు కాని, గుడ్లగూబ కనబడినచో గృహపతికే మృత్యుభయము వాటిల్లుతుంది. ధననాశము కూడ కలుగుతుంది. మృగపక్షాదులతో ఇటువంటి వికారములు సంభవించినచో దక్షిణతో యుక్తమైన హెూమం నిర్వహించాలి. మరియు ఐదుమంది బ్రాహ్మణులతో "దేవాఃకపోతాః" ఇత్యాది మంత్రములు జపం జేయాలి. అంతేకాక గోవులు, ఉత్తరీయముతో కూడిన వస్త్రములు, సువర్ణము మొదలగు వాటిని ద్విజులకు దానమీయాలి. ఇటువంటి శాంతిని యథావిధిగా ఆచరించినచో మృగపక్షాదుల వలన కలుగు వైకృతముల పాపములు గూడ శాంతిస్తాయి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ మృగపక్షి వైకృత్యం నామ సప్తత్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః॥237॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అద్భుతశాంతిలో మృగపక్షి వైకృత్యం అనే
రెండువందల ముప్పైఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టత్రింశదధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల ముప్పైఎనిమిదవ అధ్యాయం

అద్భుతశాంతౌ ఉత్పాత ప్రశమనమ్ – అద్భుతశాంతిలో ఉత్పాతప్రశమనం

గర్గ ఉవాచ – గర్గుడు చెప్పాడు.

ప్రసాద తోరణాట్టాల ద్వార ప్రాకారవేశ్మనామ్ ।
నిర్నిమిత్తం తు పతనం దృఢానాం రాజమృత్యవే ॥ 1 ॥

రజసా వాథ ధూమేన దిశో యత్ర సమాకులాః ।
ఆదిత్య చంద్రతారాశ్చ వివర్ణా భయవృద్ధయే ॥ 2 ॥

రాజ ప్రాసాదములు, తోరణములు, బురుజులు, ద్వారములు, ప్రాకారములు, భవనములు మొదలగునవి ఎటువంటి నిమిత్తము లేకనే పడిపోయినచో అవి రాజు మృత్యువును సూచించును. దిక్కులు ధూళితో, ధూమముతో వ్యాప్తి చెందినచో, సూర్యచంద్రులు, తారలు వివర్ణత్వమును పొందినచో అవి భయవృద్ధికి సూచకములు.

రాక్షసా యత్ర దృశ్యంతే బ్రాహ్మణాశ్చ విధర్మిణః ।
ఋతవశ్చ విపర్యస్తా అపూజ్యాః పూజ్యతే జనైః ॥ 3 ॥

నక్షత్రాణి వియోగీని తన్మహద్ భయలక్షణమ్ ।
కేతూదయోపరాగౌ చ ఛిద్రం వా శశిసూర్యయోః ॥ 4 ॥

గ్రహర్క్ష వికృతిర్యత్ర తత్రాపి భయమాదిశేత్ ।

రాక్షసులు కనబడుట, బ్రాహ్మణులు తమ ధర్మమును తప్పుట, ఋతు ధర్మములు కూడ విపరీతమగుట, పూజించుటకు యోగ్యులు కాని వారిని పూజించుట, నక్షత్రములు ఆకాశమునకు అతి దూరముగానుండునట్లు కనబడుట మొదలగునవి మహాభయ లక్షణమునకు సూచనలు. ఇంకనూ ధూమకేతువులు కనబడుట, చంద్రసూర్యగ్రహణము తరచుగా వాటిల్లుట, చంద్రసూర్యమండలములు ఛిద్రముతో కనబడుట, గ్రహ నక్షత్రాదులు వికృతముగా కనబడుట ఇత్యాదులు కూడ రాబోవు భయాన్ని సూచిస్తాయి.

స్త్రియశ్చ కలహాయన్తే బాలా నిఘ్నంతి బాలకాన్ ॥ 5 ॥

క్రియాణాముచితానాం చ విచ్ఛిత్తిర్యత్ర జాయతే ।
హూయమానస్తు యత్రాగ్నిర్దీప్యతే న చ శాంతిషు ॥ 6 ॥

పిపీలికాశ్చ క్రవ్యాదా యాంతి చోత్తరతస్తథా ।
పూర్ణకుంభాః స్రవంతే చ హవిర్వా విప్రలుప్యతే ॥ 7 ॥

మంగల్యాశ్చ గిరో యత్ర న శ్రూయన్తే సమన్తతః ।
క్షవథుర్బాధతే వాఽథ ప్రహసన్తి నదన్తి చ ॥ 8 ॥

న చ దేవేషు వర్తన్తే యథావద్బ్రాహ్మణేషు చ ।
మందఘోషాణి వాద్యాని వాద్యంతే విస్వరాణి చ ॥ 9 ॥

గురు మిత్రద్విషో యత్ర శత్రుపూజారతా నరాః ।
బ్రాహ్మణాన్ సుహృదో మాన్యాన్ జనో యత్రావమన్యతే ॥ 10 ॥

శాంతిమంగల హోమేషు నాస్తిక్యం యత్ర జాయతే ।
రాజా వా మ్రియతే తత్ర స దేశో వా వినశ్యతి ॥ 11 ॥

స్త్రీలు అకారణముగానే పరస్పరము కలహించుట, బాలురు బాలురతో కలహించుట, ఉచితములైన క్రియలు జరగకపోవుట మరియు విచ్ఛిన్నమైపోవుట, శాంతికర్మలు ఆచరించునప్పుడు అగ్ని జ్వలింపకపోవుట, చీమలు, మాంసాహారపు పక్షులు ఉత్తరదిశవైపు పోవుచుండుట, పూర్ణకుంభములు కారుట, హవిస్సు లుప్తమగుట, ఏవైపునుండి కూడ మంగళకరమైన మాటలు వినబడకపోవుట, జనులకు జలుబు బాధ ఎక్కువగుట, కారణము లేకుండా నవ్వుట, అరుచుట, దేవతలను బ్రాహ్మణులను యథావిధిగా ఆదరించకపోవుట, వాద్యములు అతి మంద్రముగా లేదా అధికముగా మ్రోగుట , గురువులను, మిత్రులను, మాన్యులను జనులు అవమానించుట, శాంతి కార్యక్రములు, శుభకార్యములు, హోమములు మొదలగు వాటి యందు నాస్తికతాభావము కలుగుట ఇత్యాదులు దేశమునందు సంభవించినచో రాజు మరణించును లేదా దేశము నశించిపోవును.

రాజ్ఞో వినాశే సంప్రాప్తే నిమిత్తాని నిబోధ మే ।
బ్రాహ్మణాన్ ప్రథమం ద్వేష్టి బ్రాహ్మణైశ్చ విరుధ్యతే ॥ 12 ॥

బ్రాహ్మణస్వాని చాదత్తే బ్రాహ్మణాంశ్చ జిఘాంసతి ।
న చ స్మరతి కృత్యేషు యాచితశ్చ ప్రకుప్యతి ॥ 13 ॥

రమతే నిందయా తేషాం ప్రశంసాం నాభినందతి ।
అపూర్వం తు కరం లోభాత్తథా పాతయతే జనే ॥ 14 ॥

రాజునకే వినాశము సంప్రాప్తించునపుడు కలుగు నిమిత్తములను వివరించెదను వినుము. ముందుగా అతను బ్రాహ్మణులను ద్వేషించును, బ్రాహ్మణులతో వైరుధ్యము పెంచుకొనును, బ్రాహ్మణుల ధనమును అపహరించ యత్నించును, వారిని వధింప యత్నించును, సత్కార్యములలో వారిని స్మరింపకుండును, వారు యాచించినచో కోపించును, వారిని నిందించినచో సంతోషించును, ప్రశంసించినవారిని అభినందించకుండును, లోభముతో జనులపైకి క్రొత్తపన్నులు వేయును.

ఏతేష్వభ్యర్చయేచ్చక్రం సపత్నీకం ద్విజోత్తమ ।
భోజ్యాని చైవ కార్యాణి సురాణాం బలయస్తథా ॥
సంతో విప్రాశ్చ పూజ్యాః స్యుః తేభ్యో దానం చ దీయతామ్ ॥ 15 ॥

గావశ్చ దేయా ద్విజపుంగవేభ్యో భువస్తథా కాంచనమంబరాణి ।
హోమశ్చ కార్యోఽమరపూజనం చ ఏవం కృతే పాపముపైతి శాంతిమ్ ॥ 16 ॥

ఓ ద్విజోత్తమా! ఇటువంటి సందర్భములలో పత్నీ(శచీ) సహితుడైన ఇంద్రుని పూజించాలి. అనేక భోజ్య పదార్థములతో పాటు వివిధ దేవతలకు బలులు సమర్పించాలి. సత్పురుషులను బ్రాహ్మణులను పూజించి వారికి దానములీయాలి. ద్విజోత్తములకు గోవులు, భూమి, సువర్ణము, వస్త్రములు, మొదలగువాటిని దానమీయాలి. హోమాదులు నిర్వహించాలి. దేవతలను పూజించాలి. ఇట్టి కార్యక్రమములు నిర్వహిస్తే పాపాలు నశించి దేశంలో శాంతి చేకూరుతుంది.

ఇతి శ్రీ మత్స్యే మహాపురాణే అద్భుతశాంతౌ ఉత్పాతప్రశమనం నామ
అష్టత్రింశదధికద్విశతతమోఽధ్యాయః ॥238॥

శ్రీ మత్స్య మహాపురాణమున అద్భుతశాంతిలో ఉత్పాతప్రశమనం అనే
రెండువందల ముప్పైఎనిమిదవ అధ్యాయం సమాప్తం



ఏకోన చత్వారింశదధిక ద్విశతతమోऽధ్యాయః - రెండువందల ముప్పైతొమ్మిదవ అధ్యాయం

గ్రహయజ్ఞ విధానమ్ - గ్రహయజ్ఞ విధానం

మనురువాచ - మనువు చెప్పాడు.

గ్రహయజ్ఞః కథం కార్యో లక్షహోమః కథం నృపైః ।
కోటి హోమోऽపి వా దేవ సర్వపాపప్రణాశనః ॥ 1 ॥

క్రియతే విధినా యేన యద్దృష్టం శాంతిచింతకైః ।
తత్సర్వం విస్తరాద్దేవ! కథయస్వ జనార్దన! ॥ 2 ॥

ఓ దేవా! రాజులచేత గ్రహ యజ్ఞము లక్ష హోమము మరియు సర్వపాపప్రణాశనమగు కోటిహోమము ఎట్లు ఆచరించాలి? శాంతిచింతకులు శాస్త్రచింతకులూ అయిన మహానుభావులు వీటిని ఏ విధముగా ఆచరించారో, అదంతయూ ఓ జనార్దనా! మాకు సవిస్తరంగా వివరించు.

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

ఇదానీం కథయిష్యామి ప్రసంగాదేవ తే నృప ।
రాజ్ఞాం ధర్మప్రసక్తేన ప్రజానాం చ హితేప్సునా ॥ 3 ॥

గ్రహయజ్ఞః సదా కార్యః లక్షహోమసమన్వితః ।
నదీనాం సంగమే చైవ సురాణామగ్రతస్తథా ॥ 4 ॥

ఓ రాజా! నీవడిగినట్లుగా సందర్భానుసారముగా వాటి గురించి ఇపుడు వివరిస్తాను. ధర్మపరాయణుడు, ప్రజాహితమును కోరువాడూ అయిన రాజు లక్షహోమసమన్వితమైన గ్రహయజ్ఞము సర్వథా ఆచరించాలి. అట్టి యజ్ఞము నదుల సంగమమున గాని దేవాలయములో గాని చేయాలి.

సుసమే భూమిభాగే చ దైవజ్ఞాధిష్ఠితో నృపః ।
గురుణా చైవ ఋత్విగ్భిః సార్ధం భూమిం పరీక్షయేత్ ॥ 5 ॥

ఖనేత్కుండం చ తత్రైవ సుషమం హస్తమాత్రకమ్ ।
ద్విగుణం లక్షహోమే తు కోటిహోమే చతుర్గుణమ్ ॥ 6 ॥

దైవజ్ఞుల చేత, గురువుల చేత, ఋత్విక్కుల చేత కూడ వెళ్ళి యజ్ఞము ఆచరించు భూమిని రాజు పరీక్షించాలి. ఆ ప్రదేశమున సమతుల్యముగా నుండునట్లు చూడాలి. అక్కడ హస్తప్రమాణ చతురస్రముగా యజ్ఞకుండము త్రవ్వాలి. లక్షహోమమునకు దీనికి ద్విగుణముగా మరియు కోటి హోమమునకు దీనికంటే చతుర్గుణము అధికముగా యజ్ఞకుండము నిర్మించుకోవాలి.

యుగ్మాస్తు ఋత్విజః ప్రోక్తా అష్టౌ వై వేదపారగాః ।
కందమూల ఫలాహారా దధిక్షీరాశినోఽపి వా ॥ 7 ॥

వేద్యాం నిధాపయేచ్చైవ రత్నాని వివిధాని చ ।
సికతా పరివేషాచ్చ తతోఽగ్నిం చ సమింధయేత్ ॥ 8 ॥

ఈ యజ్ఞములందు సరిసంఖ్యలో ఎనిమిది మంది ఋత్వికులను మరియు ఎనిమిదిమంది వేదపండితులను నియమించాలి. అట్లు నియమింపబడిన వేదపండితులు ఋత్వికులు నియతాహారులై కందమూలఫలాలను, దధిక్షీరాదులను మాత్రమే సేవించాలి. వేదికయందు వివిధ రత్నములను వేసి ఇసుకతో మండలములు నిర్మించి హోమాగ్నిని ప్రజ్వలింపజేయాలి.

గాయత్ర్యా దశసాహస్రం మానస్తోకేన షడ్గుణః ।
త్రింశద్ గ్రహాదిమంత్రైశ్చ చత్వారో విష్ణుదైవతైః ॥ 9 ॥

కూష్మాండైర్జుహుయాత్ పంచ కుసుమాద్యైస్తు షోడశ ।
హోతవ్యా దశసాహస్రం బాదరైర్జాతవేదసి ॥ 10 ॥

శ్రియో మంత్రేణ హోతవ్యాః సహస్రాణి చతుర్దశ ।
శేషాః పంచసహస్రాస్తు హోతవ్యాస్త్వింద్రదైవతైః ॥ 11 ॥

హుత్వా శతసహస్రం తు పుణ్యస్నానం సమాచరేత్ ।
కుంభైః షోడశసంఖ్యైశ్చ సహిరణ్యైః సుమంగలైః ॥ 12 ॥

గాయత్రీ మంత్రముతో పదివేలు, "మానస్తోకే" మంత్రముతో ఆరువేలు, నవగ్రహదేవతా మంత్రములతో ముప్పదివేలు, విష్ణుదేవతా మంత్రములతో నాలుగు వేలు, కూశ్మాండములతో ఐదువేలు, పుష్పాదులతో పదహారు వేలు, బదరీ ఫలములతో పదివేలు, మరియు శ్రీ దేవతా సంబంధి మంత్రములతో పదునాలుగు వేలు, ఇంద్రదేవతా మంత్రములతో ఐదువేలు ఆహూతులతో హోమం చేయాలి. తరువాత యజమానుడు హిరణ్య సహితములైన పదహారు మంగళప్రదాలైన కుంభాలతో పుణ్యస్నానమాచరించాలి.

స్నాపయేద్యజమానం తు తతః శాంతిర్భవిష్యతి ।
ఏవం కృతే తు యత్కించిద్ గ్రహపీడాసముద్భవమ్ ॥ 13 ॥

తత్సర్వం నాశమాయాతి దత్వా వై దక్షిణాం నృప ।
తస్మాత్సర్వప్రయత్నేన ప్రధానా దక్షిణా స్మృతా ॥ 14 ॥

హస్త్యశ్వరథయానాని భూమివస్త్రయుగాని చ ।
అనడుద్గోశతం దద్యాత్ ఋత్విజాం చైవ దక్షిణామ్ ॥ 15 ॥

యథా విభవసారం తు విత్తశాఠ్యం న కారయేత్ ।
మాసే పూర్ణే సమాప్తస్తు లక్షహోమో నరాధిప ॥ 16 ॥

లక్ష హోమస్య రాజేంద్ర విధానం పరికీర్తితమ్ ।

ఆ విధముగా యజమాని స్నానమాచరించినచో సర్వము శాంతియగును. ఇట్లు వివరించిన విధముగా జరిపినచో గ్రహపీడాసముద్భవములైన ఉపద్రవములన్నియు నశించును. శాంతించును. తర్వాత యజ్ఞము ఆచరించిన పిదప పరిపూర్ణతను పొందుటకై ద్విజులకు దక్షిణలీయాలి. దక్షిణ అర్పించుట అత్యంత ప్రధానమైనది కావున సర్వప్రయత్నముతో దక్షిణలు ఈయాలి. అంతేకాక గజములు, అశ్వములు, యానములు, రథములు, భూమి, వస్త్రయుగ్మము, వంద వృషభములు మరియు గోవులు మొదలగు వాటిని పురోహితులకు సమర్పించాలి కాని ఎట్టి పరిస్థితులలోను 'లోభత్వము' ప్రకటించకూడదు. ఇది ఒక నెల రోజుల పర్యంతము జరిపినచో లక్షహోమము సమాప్తమగును. ఓ రాజేంద్రా! ఈ విధముగా నీకు లక్షహోమ విధానాన్ని వివరించాను.

ఇదానీం కోటిహోమస్య శృణు త్వం కథయామ్యహమ్ ॥ 17 ॥

గంగాతటేఽథ యమునా సరస్వత్యోర్నరేశ్వర! ।
నర్మదాదేవికాయాస్తు తటే హోమో విధీయతే ॥ 18 ॥

తత్రాపి ఋత్విజః కార్యా రవినందన! షోడశ ।
సర్వహోమే తు రాజర్షే దద్యాద్విప్రేఽథవా ధనమ్ ॥ 19 ॥

ఋత్విగాచార్యసహితో దక్షాం సాంవత్సరీం స్థితః ।
చైత్రే మాసే తు సంప్రాప్తే కార్తికే వా విశేషతః ॥ 20 ॥

ప్రారంభః కరణీయో వా వత్సరం వత్సరం నృప ।
యజమానః పయోభక్షీ ఫలాశీ చ తథాఽనఘ ॥ 21 ॥

ఓ నరేశ్వర! ఇపుడు కోటి హోమవిధానమును తెలిపెదను వినుము. గంగాతటమున, యమునాతటమున, సరస్వతీ తీరమున నర్మదాతటమున, దేవికా తటమున ఈ కోటి హోమము చేయాలి. ఓ రవి నందనా! ఈ హోమములో పదహారు మంది ఋత్విజులను నియమించాలి. ఓ రాజర్షి! ఇటువంటి హోమకార్యము లన్నింటియందును విప్రులకు ధనము దానముగా ఈయాలి. ఈ హోమమునందు రాజు ఋత్విజులు మరియు ఆచార్యునితో కూడ ఒక సంవత్సర కాలపు దీక్షను గ్రహించాలి. ఓ రాజా! ఈ హోమము చైత్రమాసమునందు కాని కార్తికమాసమునందు కాని ఆరంభించాలి. ఇది ప్రతి సంవత్సరమునందును జరుపాలి. ఈ హోమదీక్షా సమయమున యజమాని పాలు మరియు పండ్లు మాత్రమే ఆహారంగా స్వీకరించాలి.

యవాదివ్రీహయో మాషాస్తిలాశ్చ సహసర్షపైః ।
పాలాశాః సమిధః శస్తా వసోర్ధారా తథోపరి ॥ 22 ॥

మాసేఽథ ప్రథమే దద్యాత్ ఋత్విగ్భ్యః క్షీరభోజనమ్ ।
ద్వితీయే కృసరాం దద్యాత్ ధర్మ కామార్థ సాధనమ్ ॥ 23 ॥

తృతీయే మాసి సంయావో దేయో వై రవినందన! ।
చతుర్థే మోదకా దేయా విప్రాణాం ప్రీతిమావహన్ ॥ 24 ॥

ఈ హెూమమునకై యవలు, వరిధాన్యము, మినుములు, నువ్వులు, తెల్ల ఆవాలు, పలాశ సమిధలు మరియు వసుధార మొదలగునవి ఉపయోగించాలి. ఓ రాజా! ఋత్విక్కులకు మొదటి మాసమున క్షీరభోజనము, రెండవ మాసమున ధర్మకామార్థ సాధనియైన పులగము, మూడవ మాసమున గోధుమ రవ్వతో వండిన తియ్యని క్షీరాన్నము, నాలుగవ మాసమున ద్విజులకు ప్రీతి కలిగించు మోదకములతో కూడిన భోజనము వడ్డించాలి.

పంచమే దధిభక్తం తు షష్ఠే వై సక్తుభోజనమ్ ।
పూపాశ్చ సప్తమే దేయా హ్యష్టమే ఘృతపూపకాః ॥ 25 ॥

షష్ట్యోదనం చ నవమే దశమే యవషష్టకా ।
ఏకాదశే సమాషం తు భోజనం రవినందన ॥ 26 ॥

ద్వాదశే త్వథ సంప్రాప్తే మాసే రవికులోద్వహ ।
షడ్రసైః సహ భక్ష్యైశ్చ భోజనం సార్వకామికమ్ ॥ 27 ॥

ఐదవ మాసమున దధ్యోదనము, ఆరవ మాసమున సక్తుభోజనము, ఏడవ మాసమునందు అపూపములు, ఎనిమిదవ మాసమున నేతిబూరెలు, తొమ్మిదవ మాసమున షష్టికము అను బియ్యముతో వండిన అన్నము, పదవమాసమున షష్టికములను యవలచేత వండిన భోజనము, పదవకొండవ మాసమున మినుములతో చేసిన పదార్థములు మరియు పన్నెండవ మాసమునందు ఓ రాజా! భక్ష్యములతో కూడ షడ్రసోపేతమైన అందరికీ తృప్తి కలిగించునటువంటి భోజనము ఋత్వికులందరికి సమకూర్చాలి.

దేయా ద్విజానాం రాజేంద్ర మాసి మాసి చ దక్షిణాః ।
అహతవాసః సంవీతో దినార్ధం హెూమయేచ్ఛుచిః ॥ 28 ॥

తస్మాత్ సదోత్థితైర్భావ్యం యజమానైః సహ ద్విజైః ।
ఇంద్రాద్యాదిసురాణాం చ ప్రీణనం సార్వకామికమ్ ॥ 29 ॥

కృత్వా సురాణాం రాజేంద్రా పశుఘాతసమన్వితమ్ ।
సర్వదానాని దేవానాం అగ్నిష్టోమం చ కారయేత్ ॥ 30 ॥

ఓరాజా! ప్రతి మాసమునందునూ ద్విజులకు దక్షిణలు ఈయాలి ఋత్వికులతో పాటు యజమాని కూడ అహతవాససుడై అనగా చినగని, కాలని, చిల్లులుపడని, నలగని, వస్త్రములను ధరించినవాడై మధ్యాహ్నకాలము పర్యంతము హెూమం చేయాలి. ఈ కార్యక్రమమునాచరించునప్పుడు యజమాని కూడ ఋత్విజులతో కూడ ప్రాతఃకాలమునే మేల్కొని మరియు ఇంద్రాది దేవతలకు ప్రీతి కలిగించు సార్వకామికమగు హెూమం చేయాలి. అట్లే ఓ రాజేంద్రా! దేవతల కొరకై పశుబలి, సర్వవిధములైన దానములు ఆచరించి అగ్నిష్టోమాన్ని నియమంగా ఆచరించాలి.

ఏవం కృత్వా విధానేన పూర్ణాహుతిః శతే శతే ।
సహస్రే ద్విగుణా దేయా యావచ్ఛత సహస్రకమ్ ॥ 31 ॥

పురోడాశస్తతః సాధ్యో దేవతార్థే చ ఋత్విజైః ।
యుక్తో వసన్ మానవైశ్చ పునః ప్రాప్తార్చనాన్ ద్విజాన్ ॥ 32 ॥

ప్రీణయిత్వా సురాన్ సర్వాన్ పితౄనేవ తతః క్రమాత్ ।
కృత్వా శాస్త్రవిధానేన పిండానాం చ సమర్పణమ్ ॥ 33 ॥

ఓ రాజా! నియమానుసారముగా ఇట్లు ఆచరిస్తూ నూరేసి హవనముల కొకసారి పూర్ణాహుతి జరపాలి. వేయి హవనములు మరియు లక్షహవనములు కాగానే ఇతః పూర్యము కన్న రెండింతలెక్కువగా దానాదులు చేయాలి. తదనంతరము ఋత్వికులు పురోడాశమును సిద్ధము చేసికొని దానితో దేవతలకొరకై హవనం చేయాలి. యజమాని వారందరితో పాటు సామాన్యుడై నివసిస్తూ ద్విజులను మరియు దేవతలందరిని సంతసింపజేసి, తర్వాత క్రమముగా యథావిధిగా పితృదేవతలకు పిండప్రదానం చేయాలి.

సమాప్తౌ తస్య హోమస్య విప్రాణామథ దక్షిణామ్ ।
సమాం చైవ తులాం కృత్వా బద్ధ్వా శిక్యద్వయం పునః ॥ 34 ॥

ఆత్మానం తోలయేత్ తత్ర పత్నీం చైవ ద్వితీయకామ్ ।
సువర్ణేన తథాత్మానం రజతేన తథా ప్రియామ్ ॥ 35 ॥

తోలయిత్వా దదేద్రాజా విత్తశాఠ్యవివర్జితః ।
దదేత్ శతసహస్రం తు రూప్యస్య కనకస్య చ ॥ 36 ॥

సర్వస్వం వా దదేత్ తత్ర రాజసూయఫలం లభేత్ ।
ఏవం కృత్వా విధానేన విప్రాంస్తాంశ్చ విసర్జయేత్ ॥ 37 ॥

హోమము సమాప్తము అయినపుడు బ్రాహ్మణులకు సమృద్ధిగా దక్షిణలు ఈయాలి. తర్వాత త్రాసును ఏర్పర్చుకొని ఒక దానితో రాజు తాను బంగారముతో తులలో తూగి, తన భార్యను వెండితో తూకం వేయించాలి. అట్లు తూచిన సువర్ణాన్ని రజతాన్ని కూడ లోభత్వం ప్రదర్శించకుండా ఋత్వికులకు దానంగా ఈయాలి. మరియు వెండి, బంగారముతో చేసిన లక్ష నాణెములను లేదా తన సర్వస్వాన్ని దానం చేయాలి. అట్లాచరించినచో రాజసూయయాగముతో సమానమైన ఫలం లభిస్తుంది. ఈ విధంగా హోమ కార్యక్రమాన్ని నిర్వహించిన పిదప ఋత్వికులకు, బ్రాహ్మణులకు కూడ వీడ్కోలు ఇచ్చి పంపించాలి.

ప్రీయతాం పుండరీకాక్షః సర్వయజ్ఞేశ్వరో హరిః ।
తస్మింస్తుష్టే జగత్ తుష్టం ప్రీణితే ప్రీణితం భవేత్ ॥ 38 ॥

ఏవం సర్వోపఘాతే తు దేవమానుషకారితే ।
ఇయం శాంతిస్తవాఖ్యాతా యాం కృత్వా సుకృతీ భవేత్ ॥ 39 ॥

న శోచేజ్జన్మమరణే కృతాకృతవిచారణే ।
సర్వతీర్థేషు యత్ స్నానం సర్వయజ్ఞేషు యత్ఫలమ్ ॥
తత్ఫలం సమవాప్నోతి కృత్వా యజ్ఞత్రయం నృప ॥ 40 ॥

యజ్ఞాంతమునందు "పుండరీకాక్షుడు సర్వయజ్ఞేశ్వరుడూ అయిన శ్రీహరి ప్రీతినందుకాక" అని జపించాలి. హరి తుష్టుడైనచో జగత్తంతయూ తుష్టి పొందుతుంది. అతడు ప్రీతినందినచో జగత్తంతయు ప్రీతిపొందుతుంది. దైవికములు మరియు మానుషములు అయిన ఉపఘాతములన్నింటికిని ఇటువంటి శాంతి జరిపించినచో (జరిపించినవారు) మంచి ఫలితం లభిస్తుంది. ఓ రాజా! ఇట్టి శాంతిని ఆచరించినవారు జన్మమరణములను కాని కృతాకృతములను గురించి కాని విచారింపవలసిన పనిలేదు. సర్వతీర్థములందు స్నానము చేయుట వలన కలుగునట్టి మరియు సర్వవిధాలైన యజ్ఞాలాచరించుట వలన కలుగునట్టి ఫలము ఈ యజ్ఞత్రయం ఆచరిస్తే లభిస్తుంది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే గ్రహయజ్ఞ విధానం నామ
ఏకోనచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥239॥

శ్రీ మత్స్యమహాపురాణంలో గ్రహయజ్ఞ విధానమనే
రెండువందల ముప్పైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం



చత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలబైయవ అధ్యాయం

యాత్రా నిమిత్తకాలయోజ్యచింతనమ్ - యాత్రానిమిత్తకాల యోజ్యచింతనం

మనురువాచ - మనువు చెప్పాడు.

ఇదానీం సర్వధర్మజ్ఞ! సర్వశాస్త్రవిశారద! ।
యాత్రా కాల విధానం మే కథయస్వ మహీక్షితామ్ ॥ 1 ॥

ఓ సర్వధర్మజ్ఞా! సర్వశాస్త్రవిశారదా! ఇప్పుడు రాజులయొక్క యాత్రాకాల విధానమును గురించి నాకు వినిపించుము.

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

యదా మన్యేత నృపతిరాక్రందేన బలీయసా ।
పార్ష్ణి గ్రాహోభిభూతోఽరిస్తదా యాత్రాం ప్రయోజయేత్ ॥ 2 ॥

యోధాన్మత్వా ప్రభూతాంశ్చ ప్రభూతం చ బలం మమ ।
మూలరక్షా సమర్థోఽస్మి తదా యాత్రాం ప్రయోజయేత్ ॥ 3 ॥

నేను బలీయమైన యుద్ధము చేసినచో పొరుగుదేశపు శత్రురాజును ఓడించగలను అని రాజు తాను అనుకున్నప్పుడు లేదా అట్టి నమ్మకము తనకు కలిగినప్పుడు యుద్ధయాత్రకు సిద్ధపడాలి. అట్లే తన వద్దనున్న యోధులు బలవంతులు అని, నా సైన్యమంతయు చాలా దృఢముగానున్నది అని, నేను నా రాజ్యమును రక్షించుకొనే సామర్థ్యం కలవాడను అని నమ్మకం కలిగినపుడు రాజు యుద్ధయాత్రకు బయల్దేరవలెను.

అశుద్ధపార్ష్ణి ర్నృపతిర్నతు యాత్రాం ప్రయోజయేత్ ।
పార్ష్ణిగ్రాహాధికం సైన్యం మూలే నిక్షిప్య చ వ్రజేత్ ॥ 4 ॥

చైత్ర్యాం వా మార్గశీర్ష్యాం వా యాత్రాం యాయాన్నరాధిపః ।
చైత్ర్యాం పశ్యేచ్చ నైదాఘం హంతి పుష్టిం చ శారదీమ్ ॥ 5 ॥

ఏతదేవ విపర్యస్తం మార్గశీర్ష్యాం నరాధిపః ।
శత్రోర్వా వ్యసనే యాయాత్కాల ఏవ సుదుర్లభః ॥ 6 ॥

ఏ శత్రువు కారణముచేత తన రాజ్యమునందు శాంతి లేదో, ఏ పొరుగు రాజు బలవంతుడిగా కనబడునో అప్పుడు రాజు యుద్ధయాత్ర చేయకూడదు (యుద్ధమునకై వెళ్ళకూడదు) అయితే ఆ శత్రురాజుకంటే ఎక్కువ అధికముగా సైన్యమును తాను ఏర్పరుచుకున్న తర్వాత విజయయాత్ర కు రాజు వెళ్ళాలి. మరియు రాజు చైత్ర పూర్ణిమనాడు కాని మార్గశీర్ష పూర్ణిమ నాడు కాని యుద్ధయాత్రకు బయల్దేరాలి. చైత్రమునందు బయల్దేరినచో

యుద్ధయాత్రలో సూర్యుని తాపమును ఎదుర్కొన వలసి వచ్చును, శరత్కాలమునందు లభించునట్టి సస్యాది పుష్టి ఈ కాలమున లభించదు.

మార్గశీర్ష మాసమునందైతే ఓ రాజా! అది విరుద్ధముగానుండును అనగా సూర్యతాపముండదు మరియు సస్యములన్నియును పుష్టిగా లభించును. దీనికన్నను శత్రువు వ్యసన పీడుతుడై ఉండగా యుద్ధమునకై బయల్దేరుట ఉత్తమము కాని అటువంటి కాలము దొరుకుట దుర్లభము.

దివ్యాంతరిక్షక్షితిజైః ఉత్పాతైః పీడితం పరమ్ ।
షడక్షపీడాసంతప్తం పీడితం చ తథాగ్రహైః ॥ 7 ॥

దైవికములు, అంతరిక్ష సంబంధములైన మరియు భూమండలమునకు సంబంధించిన ఉత్పాతములతో శత్రువు పీడితుడై యున్నప్పుడు, షడ్విధములైన ఈతి బాధలతో, గ్రహములతో పీడితుడైయున్నప్పుడు కూడ రాజు యుద్ధమునకై బయల్దేరవచ్చును.

జ్వలంతీ చ తథైవోల్కా దిశం యా చ ప్రపద్యతే ।
భూకంపోల్కా దిశం యాతి యాం చ కేతుః ప్రసూయతే ॥ 8 ॥

నిర్ఘాతశ్చ పతేద్యత్ర తాం యాయాద్వసుధాధిపః ।
స బలవ్యసనోపేతం తథా దుర్భిక్షపీడితమ్ ॥ 9 ॥

సంభూతాంతరకోపం చ క్షిప్రం పాయాదరిం నృపః ।
యూకామాక్షీకబహులం బహుపంకం తథావిలమ్ ॥ 10 ॥

నాస్తికం భిన్నమర్యాదం తథాఽమంగలవాదినమ్ ।
అపేత ప్రకృతిం చైవ నిఃసారం చ తథా జయేత్ ॥ 11 ॥

విద్విష్టనాయకం సైన్యం తథా భిన్నం పరస్పరమ్ ।
వ్యసనాసక్తనృపతిం బలం రాజాఽభియోజయేత్ ॥ 12 ॥

ఏ శత్రువు యొక్క దేశమువైపు జ్వలించుచున్న ఉల్కలుపడునో, భూకంపములు సంభవించునో, ఉల్కాపాతములు కలుగునో, ధూమకేతువు కనబడునో, పిడుగులు పడునో ఆ శత్రురాజ్యముపై రాజు దండెత్తవలెను. ఏ శత్రువు యొక్క బలము నశించి వ్యసనపీడితుడౌనో, రాజ్యమున దుర్భిక్షము ప్రబలునో, అంతఃకలహములు వ్యాప్తిచెందునో ఆ శత్రువుపై రాజు యుద్ధయాత్ర చేయాలి. ఏ శత్రువు యొక్క దేశమునందు నల్లులు, పేలు, దోమలు, ఈగలు అధికమై, రాజ్యమంతయు బురదతో మలినమై పోవునో, ఏ శత్రువు నాస్తికుడై మర్యాదారహితుడై అమంగళకరములైన పనులు చేయునో, ఏ శత్రువు చరిత్ర హీనుడై పరాక్రమహీనుడై పోవునో ఆ శత్రువుపై రాజు దండెత్తాలి. మరియు ఏ శత్రురాజును ఆతని సేనానాయకుడే ద్వేషించునో, ఎవరి సైన్యమునందు పరస్పరము భిన్నత్వ మేర్పడునో, ఎవరు దుర్వ్యసనాసక్తుడైపోవునో, బలహీనుడైపోవునో అట్టి శత్రురాజ్యము పై యుద్ధయాత్ర చేయాలి.

సైనికానాం న శస్త్రాణి స్ఫురంత్యంగాని యత్ర చ ।
దుఃస్వప్నాని చ పశ్యంతి బలం తదభియోజయేత్ ॥ 13 ॥

ఉత్సాహబలసంపన్నః స్వానురక్తబలస్తథా ।
తుష్టపుష్టబలో రాజా పరానభిముఖో వ్రజేత్ ॥ 14 ॥

శరీర స్ఫురణే ధన్యే తథా దుఃస్వప్ననాశనే ।
నిమిత్తే శకునే ధన్యే జాతే శత్రుపురం వ్రజేత్ ॥ 15 ॥

ఋక్షేషు షట్సు శుద్ధేషు గ్రహేష్వనుగుణేషు చ ।
ప్రశ్నకాలే శుభే జాతే పరాన్యాయాన్నరాధిపః ॥ 16 ॥

ఏ రాజుయొక్క సైనికుల శస్త్రములు మరియు అవయవములు కూడ యుద్ధభూమికి వచ్చిన తర్వాత స్పందించకుండునో, ఎవరైతే రాత్రి సమయమున దుఃస్వప్నములు పొందుదురో అట్టి శత్రువు పై రాజు దండయాత్ర చేయాలి. ఉత్సాహవంతుడు, బలవంతుడు మరియు తననే అనుసరించు సైన్యబలము కలవాడు, తుష్టిమంతుడు పుష్టిమంతుడు కూడ అయినట్టి రాజు వెంటనే శత్రువుపై దండెత్తాలి. శుభసూచకములైన అవయవములు అదురుచుండగా, దుఃస్వప్నములు నశింపగా, శుభశకునములు కనబడుచుండగా రాజు శత్రుదేశముపై యుద్ధం ప్రకటించాలి. అట్లే జన్మాది ఆరు నక్షత్రములు శుభప్రదములై ఉండగా, గ్రహములు అనుకూలములై ఉండగా, ప్రశ్నించినప్పుడు శుభసూచకమై సమాధానము ప్రాప్తించగా కూడ నరాధిపుడు యుద్ధయాత్రకు వెళ్ళవచ్చును.

ఏవం తు దైవసంపన్నస్తథా పౌరుషసంయుతః ।
దేశకాలోపపన్నాంతు యాత్రాం కుర్యాన్నరాధిపః ॥ 17 ॥

స్థలే నక్రస్తు నాగస్య తస్యాపి సజలే వశే ।
ఉలూకస్య నిశి ధ్వాంక్షః స చ తస్య దివా వశే ॥ 18 ॥

ఏవం దేశం చ కాలం చ జ్ఞాత్వా యాత్రం ప్రయోజయేత్ ।
పదాతి నాగబహులాం సేనాం ప్రావృషియోజయేత్ ॥ 19 ॥

మరియు దైవబలముతో పరాక్రమముతో కూడ దేశకాల పరిస్థితులను అనుకూలత్వమును గమనించి రాజు యుద్ధయాత్ర చేయాలి. స్థలమందు మొసలి ఏనుగుకును, నీటిలో ఏనుగు మొసలికిని, రాత్రి సమయమున కాకి గుడ్లు గూబకును, పగటి వేళ గుడ్లగూబ కాకికి పరస్పరము వశమగుచుండును కనుక దేశకాల పరిస్థితులను తెలిసికొని శత్రువు పై యుద్ధయాత్ర చేయాలి. ఒక వేళ వర్షర్తువు సమయమున శత్రువుపై దండెత్తవలసి వచ్చినచో సైన్యమునందు అధికముగా పదాతులు మరియు గజములు ఉండునట్లు జాగ్రత్తపడాలి.

హేమంతే శిశిరే చైవ రథవాజి సమాకులామ్ ।
ఖరోష్ట్రబహులాం సేనాం తథా గ్రీష్మే నరాధిపః ॥ 20 ॥

చతురంగబలోపేతాం వసంతే వా శరద్యథ ।
సేనా పదాతి బహులా యస్య స్యాత్ పృథిపతేః ॥ 21 ॥

అభియోజ్యా భవేత్తేన శత్రుర్విషమమాశ్రితః ।
గమ్యే వృక్షావృతే దేశే స్థితం శత్రుం తథైవ చ ॥ 22 ॥

కించిత్ పంకే తథాయాయాత్ బహునాగో నరాధిపః ।

హేమంత-శిశిర ఋతువులందు అశ్వములు, రథములు సైన్యము నందు అధికంగా ఉండాలి. గ్రీష్మఋతువు నందు ఖరములు మరియు ఒంటెలు అధికముగానుండునట్లు నరాధిపుడు చూచుకోవాలి. వసంతఋతువు నందు కాని శరదృతువునందు కాని చతురంగబలసమన్వితుడై, పదాతిదళములు అధికముగా కలవాడై యుద్ధయాత్రకు వెళ్ళాలి. అట్లే శత్రువు విషమప్రదేశము నందున్నపుడు, అనేక వృక్షాదులతో ఆవృతమైయున్న స్థలమందున్నపుడు, బురద కలిగిన ప్రదేశమందున్నపుడు వారిని జయించుటకై నరాధిపుడై గజసేనను అధికంగా తీసుకుని యుద్ధమునకు వెళ్ళాలి.

రథాశ్వబహులో యాయాత్ శత్రుం సమపథస్థితమ్ ॥ 23 ॥

తమాశ్రయంతో బహులాస్తాం తు రాజా ప్రపూజయేత్ ।
ఖరోష్ట్రబహులో రాజా శత్రుర్బంధేన సంస్థితః ॥ 24 ॥

బంధనస్థోఽభియోజ్యోఽరిః తథా ప్రావృషి భూభుజాః ।
హిమపాతయుతే దేశే స్థితం గ్రీష్మేఽభియోజయేత్ ॥ 25 ॥

యవసేంధనసంయుక్తః కాలః పార్థివ హైమనః ।
శరద్వసంతౌ ధర్మజ్ఞ! కాలౌ సాధారణే స్మృతౌ ॥ 26 ॥

సమతలమునందు శత్రుసైన్యమును జయించుటకు రాజు రథాశ్వములు అధికముగా గల సైన్యమును తీసుకుని యుద్ధానికి వెళ్ళాలి. ఆ శత్రువును ఆశ్రయించి ఉన్న ఇతరులను కూడ రాజు జయించుటకు వెళ్ళాలి. తనను తాను రక్షించుకొనుటకై ఇతర బంధనములను ఉపయోగించికొని యుండే శత్రువును జయించుటకు సైన్యము నందు ఖరములు, ఉష్ట్రములు అధికంగా ఉండునట్లు రాజు యత్నించాలి. అటువంటి శత్రువులను జయించుటకు వర్షాకాలము సరైన సమయమని రాజు తెలుసుకోవాలి. హిమపాతమధికముగా ఉండు ప్రదేశమున నుండే శత్రువులను జయించుటకు గ్రీష్మకాలమున యుద్ధయాత్ర చేయాలి. ఎండుగడ్డి మరియు కట్టెలు ఎక్కువగా గల ప్రదేశముననున్న వారిని జయించుటకు హేమంత ఋతువు సరైన సమయమని రాజు తెలిసికోవలసినది కాని ఓ ధర్మజ్ఞా! శరద్వసంత ఋతువులు మాత్రం సాధారణంగా యుద్ధయాత్రకు అనుకూలములని చెప్పబడినవి.

విజ్ఞాయ రాజా హితదేశకాలౌ దైవం త్రికాలం చ తథైవ బుద్ధ్వా ।
యాయాత్పరం కాలవిదాం మతేన సంచిత్య సార్ధం ద్విజమంత్ర విద్భిః ॥ 27 ॥

రాజా! ఈ విధముగా దేశకాల పరిస్థితులను చక్కగా తెలిసికొని జ్యోతిష్కులు సహాయముతో త్రికాలముల స్థితులను తెలిసికొని, దైవమును ఆశ్రయించి, ద్విజులతోను, మంత్రవేత్తలతోనూ విచారించి, కాలజ్ఞులు నిర్ణయించిన సమయమున రాజు యుద్ధయాత్రకై వెళ్ళాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే యాత్రా నిమిత్తకాల యోజ్య చింతానామ చత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః॥240॥

శ్రీ మత్స్యమహాపురాణమున యాత్రానిమిత్తకాల యోజ్యచింతనమనే రెండువందల నలభైయవఅధ్యాయం సమాప్తం.

ఏకచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల నలభైఒకటవ అధ్యాయం

యాత్రానిమిత్తకదేహస్పందనమ్ – యాత్రానిమిత్తకదేహస్పందనం

మనురువాచ – మనువు చెప్పాడు.

బ్రూహి మే త్వం నిమిత్తాని అశుభాని శుభాని చ ।
సర్వధర్మభృతాం శ్రేష్ఠ త్వం హి సర్వవిదుచ్యసే ॥ 1 ॥

ధర్మవిదులందరిలో శ్రేష్ఠుడా! నీవు సర్వజ్ఞుడవని అందరిచే కీర్తింపబడినవాడవు. ఇప్పుడు శుభాశుభనిమిత్తములగు శకునముల గురించి వివరింపుము.

మత్స్య ఉవాచ – మత్స్యభగవానుడు చెప్పాడు.

అంగదక్షిణభాగే తు శస్తం ప్రస్ఫురణం భవేత్ ।
అథ శస్తం తథా వామే పృష్ఠస్య హృదయస్య చ ॥ 2 ॥

మానవుని శరీరములోని దక్షిణంవైపు అదురుట ప్రశంసనీయము. ఎడమవైపు కాని హృదయము మరియు వీపు భాగము కాని అదురుట ప్రశంసనీయము కాదు.

మనురువాచ – మనువు చెప్పాడు.

అంగానాం స్పందనం చైవ శుభాశుభవిచేష్టితమ్ ।
తన్మే విస్తరతో బ్రూహి యేన స్యాం తద్విదో భువి ॥ 3 ॥

ఓ మహానుభావా! అంగములు అదురుటలు వాటి శుభాశుభవిచేష్టితమునుగురించి నాకు విస్తారముగా వివరింపుము, అది విని ఈ భూలోకమున వాటిని తెలుసుకున్న వాడి నౌదును.

మత్స్య ఉవాచ – మత్స్యభగవానుడు చెప్పాడు.

పృథ్వీలాభో భవేన్మూర్ధ్ని లలాటే రవినందన ।
స్థానం వివృద్ధి మాయాతి భ్రూనసోః ప్రియసంగమః ॥ 4 ॥

భృత్యలబ్ధిశ్చాక్షిదేశే దృగుపాంతే ధనాగమః ।
ఉత్కంఠోపగమో మధ్యే దృష్టం రాజన్ విచక్షణైః ॥ 5 ॥

ఓ రవినందనా! తలపైన అదిరినచో పృథివీ లాభము, లలాటమందు అదిరినచో స్థానవృద్ధి, కనుబొమ్మల ప్రాంతమున అదిరినచో ప్రియాసంగమము కలుగును. కన్నులు అదిరినచో భృత్యలాభము, కన్నుల చివర అదిరినచో ధనప్రాప్తి, కనుల మధ్య భాగము అదిరినచో ఉత్కంఠత (ఉద్వేగము) పొందుదురని విద్వాంసులు తెలిపియున్నారు.

దృగ్బంధనే సంగరే చ జయం శీఘ్రమవాప్నుయాత్ ।
యోషిద్భోగోఽపాంగదేశే శ్రవణాంతే ప్రియశ్రుతిః ॥ 6 ॥

నాసికాయాం ప్రీతిసౌఖ్యం ప్రజాప్తిరధరోష్ఠజే ।
కంఠే తు భోగలాభః స్యాత్ భోగవృద్ధిరథాంసయోః ॥ 7 ॥

ఓ రాజా! కనురెప్పలు అదిరినచో యుద్ధమునందు శీఘ్రముగా జయము కలుగును. అపాంగదేశమున (కనుల చివరలో) అదిరినచో స్త్రీ భోగము, చెవికొనయందు అదిరినచో ప్రియమైన వార్త వినుట, నాసిక యందు అదిరినచో ప్రీతి సౌఖ్యము, అధరోష్ఠము క్రింది పెదవి అదిరినచో సంతానప్రాప్తి, కంఠమునందు అదిరినచో భోగలాభము, భుజప్రదేశములు అదిరినచో భోగవృద్ధి కలుగును.

సుహృత్ స్నేహశ్చ బాహుభ్యో హస్తే చైవ ధనాగమః ।
పృష్ఠే పరాజయః సద్యో జయో వక్షః స్థలే భవేత్ ॥ 8 ॥

కుక్షిభ్యాం ప్రీతిరుద్దిష్టా స్త్రియాః ప్రజననం స్తనే ।
స్థానభ్రంశో నాభిదేశే అంతే చైవ ధనాగమః ॥ 9 ॥

బాహువులు అదిరినచో మిత్రులతో స్నేహవృద్ధి, హస్తమునందైతే ధనాగమము, పృష్ఠభాగమునందైనచో పరాజయము, వక్షఃస్థలమునందైతే సద్యోజయుము, కుక్షులయందు అదిరినచో ప్రీతి, స్త్రీకి స్తనమందు అదిరినచో సంతానప్రాప్తి నాభిదేశమునందైతే స్థానభ్రంశము, నాభి మధ్యలోనైతే ధనప్రాప్తి కలుగుతుంది.

జానుసంధౌ పరైః సంధిః బలవద్భిర్భవేన్నృప! ।
దిశైకదేశనాశోఽథ జంఘాభ్యాం రవినందన! ॥ 10 ॥

ఉత్తమం స్థానమాప్నోతి పద్భ్యాం ప్రస్ఫురణాన్నృప ।
సలాభం చాధ్వగమనం భవేత్పాదతలే నృప ॥ 11 ॥

లాంఛనం పిటకం చైవ జ్ఞేయం స్ఫురణవత్తథా ।

ఓ రవినందనా! మోకాళ్ళప్రదేశమున అదిరినచో బలవంతులతో సంధి కుదుర్చుకొనుట, మరియు పిక్కలు అదిరినచో దేశములోని ఏదో ఒక భాగము నాశనము చెందుట జరుగును. ఓ రాజా! పాదములు అదురుటవలన ఉత్తమమైన స్థానము పొందుట, లాభాన్వితమైన యాత్రాగమనము గుహ్యములైన అంగములు అదిరినచో శరీరముపై పుండ్లు మొదలగునవి సంభవించును.

విపర్యయేణ విహితః సర్వః స్త్రీణాం ఫలాగమః ॥ 12 ॥

అప్రశస్తే తథా వామే త్వప్రశస్తం విశేషతః ।
దక్షిణేఽపి ప్రశస్తేంగే ప్రశస్తం స్యాద్విశేషతః ॥ 13 ॥

అతోఽన్యథా సిద్ధిప్రజల్పనాత్తు ఫలస్య శస్తస్య చ నిందితస్య ।
అనిష్టచిహ్నోపగమే ద్విజానాం కార్యం సువర్ణేన తు తర్పణం స్యాత్ ॥ 14 ॥

ఇక్కడ వివరించిన అదురులన్నియు స్త్రీలకు ఎడమవైపున కలిగినచో శుభఫలితములిచ్చును, పురుషులకు కుడివైపునందలి ప్రశస్తాంగములు స్పందించినచో విశేషమైన ఫలితములను ఎడమవైపునందలి అప్రశస్తములైన అంగములు స్పందించినచో అప్రశస్తమైన ఫలితములు కలుగునని తెలిసికోవలసినది. ఇచ్చట వివరించినవి కాక ఇతర అవయవముల స్పందన విషయమున విద్వాంసులైన ద్విజుల ద్వారా తెలిసికోవాలి. అనిష్టచిహ్నములు సంభవించినచో బ్రాహ్మణులకు సువర్ణదానముతో పాటు సంతర్పణాదులతో తృప్తి కలిగించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే యాత్రానిమిత్తక దేహస్పందనం నామ
ఏకచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥241॥

శ్రీ మత్స్యమహాపురాణంలో యాత్రానిమిత్తక దేహస్పందనమనే
రెండువందల నలబైఒకటవ అధ్యాయం సమాప్తం



ద్విచత్వారింశదధికశతతమోఽధ్యాయః - రెండువందల నలబైరెండవ అధ్యాయం

యాత్రానిమిత్తే స్వప్నాధ్యాయః - యాత్రానిమిత్త స్వప్నాధ్యాయం

మనురువాచ - మనువు చెప్పాడు.

స్వప్నాఖ్యానం కథం దేవ! గమనే ప్రత్యుపస్థితే ।
దృశ్యంతే వివిధాకారాః కథం తేషాం ఫలం భవేత్ ॥ 1 ॥

ఓ రాజా! యుద్ధయాత్రకు పోవుటకు ముందు కలుగు స్వప్నముల ఫలములెట్లుండును? స్వప్నములు వివిధరూపములలో కనబడును కదా! వాటి ఫలితములెట్లుండునో వివరింపుము?

మత్స్య ఉవాచ - మత్స్య భగవానుడు చెప్పాడు.

ఇదానీం కథయిష్యామి నిమిత్తం స్వప్నదర్శనే ।
నాభిం వినాఽన్యగాత్రేషు తృణవృక్షసముద్భవః ॥ 2 ॥

చూర్ణనం మూర్ధ్ని కాంస్యానాం ముండనం నగ్నతా తథా ।
మలినాంబరధారిత్వమభ్యంగః పంకదిగ్ధతా ॥ 3 ॥

ఉచ్చాత్ ప్రపతనం చైవ దోలారోహణమేవ చ ।
అర్జనం పక్వలోహానాం హయానామపి మారణమ్ ॥ 4 ॥

రక్తపుష్పద్రుమాణాం చ మండలస్య తథైవ చ ।
వరాహర్క్ష ఖరోష్ట్రాణాం తథా చారోహణక్రియా ॥ 5 ॥

ఓ రాజా! ఇపుడు కలలవలన కలుగు ఫలములగురించి వివరించెదను వినుము. నాభియందు కాక ఇతర అవయవములందు తృణములు, వృక్షములు మొలుచుట, తలపై కాంస్య పాత్ర పగిలినట్లు కనబడుట, ముండనము, నగ్నత్వము, మలినవస్త్రధారణము, నూనె తో అభ్యంగనము, బురదలో పడుట, ఎత్తైన స్థలమునుండి పడుట, ఊయలను అధిరోహించుట, ఉడికించిన మాంసము తెచ్చుట, అశ్వములను వధించుట, ఎఱ్రని పూలుగలిగిన వృక్ష సముదాయము చూచుట, వరాహములు, ఎలుగుబంట్లు, గాడిదలు, ఒంటెలు మొదలగు వాటిని ఎక్కుట.

భక్షణం పక్షిమత్స్యానాం తైలస్య కృసరస్య చ ।
నర్తనం హసనం చైవ వివాహో గీతమేవ చ ॥ 6 ॥

తంత్రీ వాద్య విహీనానాం వాద్యానామభివాదనమ్ ।
స్రోతోఽవ గాహగమనం స్నానం గోమయవారిణా ॥ 7 ॥

పంకోదకేన చ తథా మహీతోయేన చాప్యథ ।
మాతుః ప్రవేశో జఠరే చితారోహణమేవ చ ॥ 8 ॥

శక్రధ్వజాభిపతనం పతనం శశిసూర్యయోః ।
దివ్యాంతరిక్షభౌమానాం ఉత్పాతానాం చ దర్శనమ్ ॥ 9 ॥

దేవ ద్విజాతి భూపాలగురూణాం క్రోధ ఏవ చ ।
ఆలింగనం కుమారీణాం పురుషాణాం చ మైథునమ్ ॥ 10 ॥

పక్షులు మరియు మత్స్యములను భుజించుట, తైలముతో కలిపిన నూకలను భుజించుట, నృత్యం చేయుట, నవ్వుట, వివాహము జరుగుట, పాటలు పాడుట, తంత్రీరహితములైన వాద్యములను వాయించుట, నదిలో స్నానమాడుట, గోమయయుక్తమైన జలములో స్నానము చేయుట, బురదనీటితో మట్టి కలిపిన నీటితో స్నానము చేయుట, తల్లి గర్భమున ప్రవేశించుట, చితిపై ఎక్కుట, ఇంద్రధ్వజము మరియు సూర్యచంద్రులు పడిపోవుట, దివ్య అంతరిక్ష-భౌమాది సంబంధములైన ఉత్పాతములను చూచుట, దేవతలు, ద్విజులు, రాజులు, గురువులు, కోపించుట, కన్యలను కౌగలించుకొనుట, పురుషులతో సంభోగించుట.

హానిశ్చైవ స్వగాత్రాణాం విరేక వమనక్రియా ।
దక్షిణాశాభిగమనం వ్యాధినాఽభిభవస్తథా ॥ 11 ॥

ఫలాపహానిశ్చ తథా పుష్పహానిస్తథైవ చ ।
గృహాణాం చైవ పాతశ్చ గృహసమ్మార్జనం తథా ॥ 12 ॥

క్రీడా పిశాచక్రవ్యాదవానరర్క్ష నరైరపి ।
పరాదభిభవశ్చైవ తస్మాచ్చ వ్యసనోద్భవః ॥ 13 ॥

కాషాయవస్త్రధారిత్వం తద్వత్ స్త్రీ క్రీడనం తథా ।
స్నేహపానావగాహౌ చ రక్తమాల్యానులేపనమ్ ॥ 14 ॥

ఏవమాదీని చాన్యాని దుఃస్వప్నాని వినిర్దిశేత్ ।
ఏషాం సంకథనం ధన్యం భూయః ప్రస్వాపనం తథా ॥ 15 ॥

తన అవయవములకు హాని కలుగుట, విరేచనమగుట, వాంతి కలుగుట, దక్షిణ దిశవైపు ప్రయాణించుట, ఏదో ఒక వ్యాధి చేత బాధపడుట, ఫలహాని, పుష్పహాని కలుగుట, ఇండ్లు పడుట, ఇండ్లు ఊడ్చుట, పిశాచములు, మాంసాహారప్రాణులు, వానరులు, ఎలుగుబంట్లు, నరులు మొదలగు వాటితో క్రీడించుట, పరుల వలన అవమానము కలుగుట, దుర్వ్యసనముల పాలవుట, కాషాయ వస్త్రములు ధరించుట, స్త్రీలతో క్రీడించుట, నూనె త్రాగుట, నూనెతో స్నానము చేయుట, ఎర్రని పూలు, ఎర్రని చందనము పూసికొనుట మొదలగునవన్నియు చెడ్డకలలు. ఇటువంటివి కలిగినప్పుడు తన దగ్గరనున్నవారికి చెప్పుకొని మరల నిద్రించుట మంచిదని చెప్పబడినది.

కల్కస్నానం తిలైర్హోమో బ్రాహ్మణానాం చ పూజనమ్ ।
స్తుతిశ్చ వాసుదేవస్య తథా తస్యైవ పూజనమ్ ॥ 16 ॥

నాగేంద్రమోక్షశ్రవణం జ్ఞేయం దుఃస్వప్ననాశనమ్ ।

ఇట్టి దుఃస్వప్నములు కలిగినప్పుడు లేచిన వెంటనే కల్కస్నానము అనగా ఓషధీచూర్ణముతో స్నానము చేయుట, నువ్వులతో హోమమాచరించుట, బ్రాహ్మణులను పూజించుట, వాసుదేవుని స్తుతించుట, ఆతనిని పూజించుట, గజేంద్ర మోక్ష కథను వినుట మొదలగునవి ఆచరించాలి.

స్వప్నాస్తు ప్రథమే యామే సంవత్సరవిపాకినః ॥ 17 ॥

షడ్భిర్మాసైర్ద్వితీయే తు త్రిభిర్మాసై స్తృతీయకే ।
చతుర్థే మాసమాత్రేణ పశ్యతో నాత్ర సంశయః ॥ 18 ॥

అరుణోదయవేలాయాం దశాహేన ఫలం భవేత్ ।
ఏకస్యాం యది వా రాత్రే శుభం వా యది వాఽ శుభమ్ ॥ 19 ॥

పశ్చాద్ దృష్టస్తు యస్తత్ర తస్య పాకం వినిర్దిశేత్ ।
తస్మాచ్ఛోభనకే స్వప్నే పశ్చాత్ స్వాపో న శస్యతే ॥ 20 ॥

రాత్రివేళలో మొదటిజామున (జాము=3గంటలు) కలిగిన కలలు ఒక సంవత్సరములోగా, రెండవజామున కలిగినవి ఆరు మాసముల వ్యవధిలోగా, తృతీయమునందు కలిగినవి మూడు మాసముల వ్యవధిలో, నాలుగోజామునందు కలుగునవి ఒక మాసపు వ్యవధిలో, సూర్యోదయ వేళలో కలిగినవి పదిరోజుల లోగా ఫలమునిచ్చును. ఓకే రాత్రియందు శుభాశుభములగు రెండు విధముల కలలు వచ్చినచో వానిలో తర్వాత వచ్చినదే ఫలమునిచ్చును. కనుక శుభస్వప్నము కలిగిన తర్వాత మరల నిద్రించుట ప్రశస్తము కాదు.

శైలప్రాసాద నాగాశ్వ వృషభారోహణం హితమ్ ।
ద్రుమాణాం శ్వేతపుష్పాణాం గమనే చ తథా ద్విజ ॥ 21 ॥

ద్రుమతృణోద్భవో నాభౌ తథా చ బహుశీర్షతా ।
తథైవ బహుబాహుత్వం ఫలితోద్భవ ఏవ చ ॥ 22 ॥

సుశుక్లమాల్యధారిత్వం సుశుక్లాంబరధారితా ।
చంద్రార్కతారాగ్రహణం పరిమార్జనమేవ చ ॥ 23 ॥

శక్రధ్వజాలింగనం చ తదుచ్ఛ్రాయక్రియా తథా ।
భూమ్యంబుధీనాం గ్రసనం శత్రూణాం చ వధక్రియా ॥ 24 ॥

రాజా! పర్వతములు, మేడలు, ఏనుగులు, గుర్రాలు మరియు ఎద్దులు మొదలగు వాటిని అధిరోహించుట తెల్లని పువ్వులు కలిగిన వృక్షములవైపు వెళ్ళుట, నాభియందు చెట్టుకాని గడ్డికాని మొలచుట, తనకు అనేక తలలు కలిగినట్లు కనబడుట, అనేక చేతులున్నట్లు కనబడుట, జుట్టు నెరయుట, శుభ్రమైన తెల్లని పూలదండలు లేదా వస్త్రములు ధరించుట, చంద్రుని, సూర్యుని, నక్షత్రములను అందుకొనుట, వానిని తుడుచుట, ఇంద్రధ్వజమును

కౌగిలించుకొనుట లేదా దానినిపైకి ఎత్తినట్లగుట, భూమిని మరియు సముద్రమును మ్రింగుట శత్రువులను చంపు మొదలగు కలలు శుభప్రదములు.

జయో వివాదే ద్యూతే చ సంగ్రామే చ తథా ద్విజ ।
భక్షణం చాఽర్ద్రమాంసానాం మత్స్యానాం పాయసస్య చ ॥ 25 ॥

దర్శనం రుధిరస్యాపి స్నానం వా రుధిరేణ చ ।
సురారుధిరమద్యానాం పానం క్షీరస్య చాఽథవా ॥ 26 ॥

అంత్రైర్వా వేష్టనం భూమౌ నిర్మలం గగనం తథా ।
ముఖేన దోహనం శస్తం మహిషీణాం తథా గవామ్ ॥ 27 ॥

సింహీనాం హస్తినీనాం చ వడవానాం తథైవ చ ।
ప్రసాదో దేవవిప్రేభ్యో గురుభ్యశ్చ తథా శుభః ॥ 28 ॥

ఓ ద్విజుడా! వివాదములో, జూదములో, యుద్ధంలో జయించుట, పచ్చి మాంసమును, చేపలను, పాయసమును భక్షించుట, రక్తమును చూచుట, రక్తముతో స్నానము చేయుట, సురా–రుధిర–మద్యాదులను త్రాగుట లేదా పాలుత్రాగుట చేయుట, ప్రేవులను చుట్టుకొని నేలపై దొర్లుట, నిర్మలమైన ఆకాశమును చూచుట, గేదెల యొక్క ఆవుల యొక్క పాలను తన నోటిలోనికే పిదుకుకొనుట, ఆడ ఏనుగుల, ఆడ సింహముల, అశ్వముల పాలను నేరుగా నోటిలోనికే పిదుకుకొనుట, దేవతల, విప్రుల మరియు గురువుల అనుగ్రహము పొందుట ఇత్యాది స్వప్నములు శుభదాయకములు.

అంభసా త్వభిషేకస్తు గవాం శృంగశ్రితేన వా ।
చంద్రాద్ భ్రష్టేన వా రాజన్ జ్ఞేయో రాజ్యప్రదో హి సః ॥ 29 ॥

రాజ్యాభిషేకశ్చ తథా ఛేదనం శిరసస్తథా ।
మరణం వహ్నిదాహశ్చ వహ్నిదాహో గృహాదిషు ॥ 30 ॥

లబ్ధిశ్చ రాజ్యలింగానాం తంత్రీవాద్యాభివాదనమ్ ।
తథోదకానాం తరణం తథా విషమలంఘనమ్ ॥ 31 ॥

హస్తినీ వడవానాం చ గవాం చ ప్రసవో గృహే ।
ఆరోహణ మథాశ్వానాం రోదనం చ తథా శుభమ్ ॥ 32 ॥

ఓ రాజా! ఆవు, ఎద్దుల కొమ్ములనుండి కాని చంద్రునినుండి కాని పడుతున్న నీటిలో స్నానము చేసినట్లు కలకన్నచో అది రాజ్యప్రదమే అని తెలిసికోవలసినది. అట్లే రాజ్యాభిషేకము, తన తలనునరుకుట, స్వమరణము, తను అగ్నిచే దహింపబడుట, గృహాదులు దహించబడుట, రాజలాంఛనములు పొందుట, తంత్రీవాద్యములు మ్రోగించుట, నీటిలో ఈదుట, విషమప్రదేశములందు లంఘించుట, ఇంటిలో ఏనుగులు, గుర్రములు, ఆవులు అశ్వారోహణము మరియు ఏడుపు మొదలగునవి శుభస్వప్నములు.

వరస్త్రీణాం తథా లాభః తథాలింగనమేవ చ ।
నిగడైర్బంధనం ధన్యం తథా విష్ఠానులేపనమ్ ॥ 33 ॥

జీవతాం భూమిపాలానాం సుహృదామపి దర్శనమ్ ।
దర్శనం దేవతానాం చ విమలానాం తథాఽంభసామ్ ॥ 34 ॥

శుభాన్యథైతాని నరస్తు దృష్ట్వా ప్రాపోన్నోత్యయత్నాద్ ధ్రువమర్థలాభమ్ ।
స్వప్నాని వై ధర్మభృతాం వరిష్ఠ వ్యాధే ర్విమోక్షం చ తథాతురోఽపి ॥ 35 ॥

శ్రేష్ఠులైన స్త్రీలు కనబడుట, వారిని ఆలింగనము చేసుకొనుట, సంకెళ్ళతో బంధించుట, మలమును శరీరమునకు పూసికొనుట, జీవించియున్న రాజులను మరియు మిత్రులను చూచుట, దేవతామూర్తులను మరియు స్వచ్ఛమైన నీటిని చూచుట మొదలగునవన్ని కలలో కలిగినట్లైతే శుభప్రదములు, మరియు అర్థలాభమును కలిగింపజేయునని, వ్యాధిగ్రస్తులకు తొందరగా తద్విముక్తి కలుగునని తెలుపబడినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే యాత్రానిమిత్తే స్వప్నాధ్యాయో నామ
ద్విచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥242॥

శ్రీమత్స్యమహాపురాణంలో యాత్రానిమిత్త స్వప్నాధ్యాయమనే
రెండువందల నలభైరెండవ అధ్యాయం సమాప్తం



త్రిచత్వారింశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలబైమూడవ అధ్యాయం
యాత్రా నిమిత్తే మంగళాధ్యాయః - యాత్రానిమిత్త మంగళాధ్యాయం

మనురువాచ - మనువు చెప్పాడు.

గమనం ప్రతి రాజ్ఞాం తు సమ్ముఖాదర్శనే చ కిమ్ ।
ప్రశస్తాంశ్చైవ సంభాష్య సర్వానేతాంశ్చ కీర్తయ ॥ 1 ॥

రాజు విజయయాత్రకు బయల్దేరునప్పుడు ఏవి ఎదురుగా వచ్చినచో శుభమగునో, వాటిలో ప్రశస్తములైన వాటినన్నింటిని వివరింపుము.

మత్స్య ఉవాచ - మత్స్యభగవానుడు చెప్పాడు.

ఔషధాని త్వయుక్తాని ధాన్యం కృష్ణం చ యద్భవేత్ ।
కార్పాసశ్చ తృణం రాజన్! శుష్కం గోమయమేవ చ ॥ 2 ॥

ఇంధనం చ తథాఽంగారం గుడం తైలం తథాఽశుభమ్ ।
అభ్యక్తం మలినం ముండం తథా నగ్నం చ మానవమ్ ॥ 3 ॥

ముక్తకేశం ఋజార్తం చ కాషాయాంబరధారిణమ్ ।
ఉన్మత్తం తథా సత్త్వం దీనం చాఽథ నపుంసకమ్ ॥ 4 ॥

అయః పంకస్తథా చర్మ కేశబంధనమేవ చ ।
తథైవోద్ధృతసారాణి పిణ్యాకాదీని యాని చ ॥ 5 ॥

చండాలశ్వపచాశ్చైవ రాజబంధనపాలకాః ।
వధకాః పాపకర్మాణో గర్భిణీ స్త్రీ తథైవ చ ॥ 6 ॥

తుషభస్మకపాలాస్థి భిన్నభాండాని యాని చ
రిక్తాని చైవ భాండాని మృతం శార్ఙ్గకమేవ చ ॥ 7 ॥

ఏవమాదీని చాన్యాని అశస్తాన్యభిదర్శనే ।

అయుక్తములగు ఔషధములు, నల్లని ధాన్యములు, ప్రత్తి, గడ్డి, ఎండిపోయిన ఆవుపేడ, కట్టెలు, బొగ్గులు, బెల్లము, నూనె, మొదలగునవి అశుభములు. ఇంకనూ నూనె అంటుకొనిన మలినమైన బోడి తల, నగ్నముగానున్న మానవుడు, ముక్తకేశుడు, రోగపీడితుడు, కాషాయవస్త్రధారి, ఉన్మత్తుడు, బలహీనుడు, దీనుడు, సపుంసకుడు, ఇనుము, బురద, చర్మము, కేశబంధనము, తెలకపిండి మొదలగు సారము తీసివేసిన పదార్థములు, చండాలుడు, కుక్కమాంసము తినువారు, కారాగార రక్షకులు, కసాయివారు, పాపకర్మలనాచరించేవారు, గర్భిణి స్త్రీలు, ధాన్యపు

పొట్టు, భస్మము, కపాలములు, ఎముకలు, పగలిన పాత్రలు, లోపలఏమీలేని పాత్రలు, చనిపోయిన కొమ్ములుగల ప్రాణులు మొదలగునవన్నియు రాజు యాత్రాసయమమున ఎదురువచ్చినచో అమంగళకరములు.

అశస్తో వాద్యశబ్దశ్చ భిన్నభైరవజర్జరః ॥ 8 ॥

పురతః శబ్ద ఏహీతి శస్యతే న తు పృష్ఠతః ।
గచ్ఛేతి పశ్చాద్ధర్మజ్ఞ పురస్తాత్తు విగర్హితః ॥ 9 ॥

క్వ యాసి తిష్ఠ మా గచ్ఛ కిం తే తత్ర గతస్య తు ।
అన్యే శబ్దాశ్చ యేఽనిష్టాః తే విపత్తికరా అపి ॥ 10 ॥

అప్రశస్తములైన వాద్యధ్వనులు, భిన్నములు భయంకరములూ అయిన ధ్వనులు కూడ అశుభదాయకములే. ముందు నుండి 'రమ్మ' అను మాట వినిపించినచో ప్రశస్తము కాని వెనుక నుండి ఎవరైనా పిలిచినచో అశుభము. ఓ ధర్మజ్ఞా! అలాగే వెనుక నుండి ఎవరైనా "వెళ్ళుము" అని అనినచో శుభము కాని ముందువైపున నుండి వెళ్ళుము అని అనినచో నింద్యము ఎక్కడికి పోవుచున్నావు, నిలువుము, పోకుము, అక్కడకి పోయినచో నీకేమి లాభము కలుగును మొదలగు శబ్దములన్నియు అనిష్టములు మరియు విపత్తికరములే.

ధ్వజాదిషు తథా స్థానం క్రవ్యాదానాం విగర్హితమ్ ।
స్ఖలనం వాహనానాం చ వస్త్రసంగస్తథైవ చ ॥ 11 ॥

నిర్గతస్య తు ద్వారాదౌ శిరసశ్చాభిఘాతితా ।
ఛత్రధ్వజానాం వస్త్రాణాం పతనం చ తథాఽశుభమ్ ॥ 12 ॥

ధ్వజాదులపై మాంసాహారపక్షులు వాలుట కూడ అశుభసూచకమే, వాహనములు తడబడుట, వస్త్రములు దేనికో తగులుకొనుట, ద్వారములనుండి వెళ్ళునప్పుడు తలకు తాకుట, గొడుగు, జెండా, వస్త్రము ఇత్యాదులు పడిపోవుట కూడ అమంగళదాయకములే.

దృష్టే నిమిత్తే ప్రథమమమంగల్య వినాశనమ్ ।
కేశవం పూజయేద్విద్వాన్ స్తవేన మధుసూదనమ్ ॥ 13 ॥

ద్వితీయే తు తతో దృష్టే ప్రతీపే ప్రవిశేద్గృహమ్ ।
అథేష్టాని ప్రవక్ష్యామి మంగల్యాని తవాఽనఘ ॥ 14 ॥

మొదటిసారి ఇటువంటి అమంగళసూచకములు కలిగినప్పుడు బుద్ధిమంతుడైన రాజు వాటి నివారణకు మధుసూదనుడైన కేశవుని పూజించాలి. కాని రెండవసారి ఇటువంటి అశుభసూచకములు కలిగినప్పుడు తన యాత్రను (ప్రయాణమును) మాని తన ఇంటికి వెళ్ళిపోవాలి. ఇప్పుడు మంగళప్రదములైన శుభశకునముల గురించి వివరిస్తాను.

శ్వేతాః సుమనసః శ్రేష్ఠాః పూర్ణకుంభాస్తథైవ చ ।
జలజాః పక్షిణశ్చైవ మాంసమత్స్యాశ్చ పార్థివ ॥ 15 ॥

గావస్తురంగమా నాగా బుద్ధ ఏకః పశుస్త్వజః ।
త్రిదశాః సుహృదో విప్రా జ్వలితశ్చ హుతాశనః ॥ 16 ॥

గణికా చ మహాభాగ దూర్వా చాఽఽర్ద్రం చ గోమయమ్ ।
రుక్మం రూప్యం తథా తామ్రం సర్వరత్నాని చాప్యథ ॥ 17 ॥

ఓ రాజా! తెల్లని పువ్వులు, పూర్ణకుంభములు, నీటి పక్షులు, మాంసములు, మత్స్యములు, గోవులు, గుర్రములు, ఏనుగులు, బౌద్ధభిక్షువు, సాధుప్రాణియైన మేక, దేవతలు, మిత్రులు, విప్రులు, జ్వలించుచున్న అగ్ని, వేశ్య, గరిక, పచ్చిఆవుపేడ, బంగారము, వెండి, రాగి మరియు సర్వవిధరత్నములు శుభప్రదములు.

ఔషధాని చ ధర్మజ్ఞ యవాః సిద్ధార్థకాస్తథా ।
నృవాహ్యమానం యానం చ భద్రపీఠం తథైవ చ ॥ 18 ॥

ఖడ్గం ఛత్రం పతాకా చ మృదశ్చాయుధమేవ చ ।
రాజలింగాని సర్వాణి శవం రుదితవర్జితమ్ ॥ 19 ॥

ఘృతం దధి పయశ్చైవ ఫలాని వివిధాని చ ।
స్వస్తికం వర్ధమానం చ నంద్యావర్తం సకౌస్తుభమ్ ॥ 20 ॥

వాదిత్రాణాం సుఖః శబ్దః గంభీరః సుమనోహరః ।
గాంధారషడ్జఋషభాః యే చ శస్తాస్తథా స్వరాః ॥ 21 ॥

ఇంకనూ ఓ రాజా! ధర్మజ్ఞుడా! ప్రశస్తములైన ఔషధములు యవలు, తెల్లఆవాలు, మనుష్యులు మోయునట్టి పల్లకి, భద్రపీఠము, ఖడ్గము, ఛత్రము, పతాకము, మట్టి, ఆయుధము, సర్వవిధరాజ చిహ్నములు, ఏడుపులు లేకుండా ఉండునట్టి శవము, నెయ్యి, పెరుగు, పాలు, అనేకవిధములైన ఫలములు, స్వస్తిక, వర్ధమాన,నంద్యావర్తము, కౌస్తుభము అనుగృహములు, గంభీరము మరియు సుమనోహరమూ అగు వాద్యధ్వని, గాంధారషడ్జమ ఋషభాది ప్రశస్తములైన సంగీతస్వరములు మొదలగునవన్నియు శుభదాయకములు.

వాయుః సశర్కరో రూక్షః సర్వత్ర సముపస్థితః ।
ప్రతిలోమ స్తథా నీచో విజ్ఞేయో భయకృద్విజ ॥ 22 ॥

అనుకూలో మృదుః స్నిగ్ధః సుఖస్పర్శః సుఖావహః ।
రూక్షా రూక్షస్వరా భద్రాః క్రవ్యాదాః పరిగచ్ఛతామ్ ॥ 23 ॥

మేఘాః శస్తాఘనాః స్నిగ్ధాః గజబృంహితనిఃస్వనాః ।
అనులోమాస్తడిచ్ఛన్నాః శక్రచాపం తథైవ చ ॥ 24 ॥

ఓ ద్విజుడా! ఇసుకతో కూడి అంతటను చెలరేగిన తీవ్రమైన పెనుగాలి మరియు ప్రచండమైన వేగముతో వీచు నీచమైన గాలి కూడ భయకారణములే. అనుకూలముగా, మృదువుగా, మనోహరముగా, సుఖస్పర్శ కలిగించునట్టి గాలి సుఖమయమైనది. ఇట్లే మాంసాహారమైన జంతువులు కనబడుట కూడ శుభదాయకమే. మరియు దట్టమైన, నిండుజలముగలిగిన, ప్రశస్తములైన, ఏనుగులు అరుపులతో సమానమైన గర్జనతో కూడుకొన్న మేఘములు, మెరుపులతో కూడకొన్న మేఘములు, ఇంద్రధనస్సు మొదలగునవి కనబడుట కూడ ప్రశంసనీయమే.

అప్రశస్తే తథా జ్ఞేయే పరివేశప్రవర్షణే ।
అనులోమా గ్రహాః శస్తా వాక్పతిస్తు విశేషతః ॥ 25 ॥

ఆస్తిక్యం శ్రద్ధధానత్వం తథా పూజ్యాభిపూజనమ్ ।
శస్తాన్యేతాని ధర్మజ్ఞ యచ్చ స్యాన్మనసః ప్రియమ్ ॥ 26 ॥

యాత్రాసమయమున సూర్యచంద్రుల మండలములు కనబడినచో అవి అప్రశస్తములని తెలిసికోవలసినది. గ్రహములు ముఖ్యముగా బృహస్పతి తాను పోవుచున్న వైపు కాకుండా వెనుకవైపునుండి ఉదయించుట శుభప్రదము. ఓ ధర్మజ్ఞుడా! అట్లే ఆస్తిక్యభావన, శ్రద్ధ, పూజ్యులందు పూజ్యభావన కలిగి ఉండుట మరియు మనస్సునకు హాయి కలిగించునవన్నియు శుభప్రదములే.

మనసస్తుష్టిరేవాత్ర పరమం జయలక్షణమ్ ।
ఏకతః సర్వలింగాని మనసస్తుష్టిరేకతః ॥ 27 ॥

యానోత్సుకత్వం మనసః ప్రహర్షః శుభస్య లాభో విజయప్రవాదః ।
మాంగల్యలబ్ధిః శ్రవణం చ రాజన్ జ్ఞేయాని నిత్యం విజయావహాని ॥ 28 ॥

ఓ రాజా! యాత్రాకాలమున కలుగు మనస్తుష్టియే మొదటి జయలక్షణము. సర్వవిధశకునములన్ని ఒక ఎత్తైతే మనస్తుష్టి ఒక ఎత్తు, విజయయాత్రకు పోవలననే ఉత్సుకత, మనఃప్రహర్షము ఈ రెండునూ శుభశకునములే, లాభదాయకములే, విజయము ప్రాప్తించునని చెప్పునట్టి ప్రవాదములే, మంగళకరములైన వస్తులబ్ధి, మంగళకరములైన వార్తలు వినుట మొదలగునవన్నియు ఓ రాజా! విజయావహములేనని తెలిసికోవలసినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే యాత్రానిమిత్తే మంగళాధ్యాయో నామ
త్రిచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః॥243॥

శ్రీ మత్స్యమహాపురాణంలో యాత్రానిమిత్త మంగళాధ్యాయమనే
రెండువందల నలభైమూడవ అధ్యాయం సమాప్తం

చతుశ్చత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల నలభైనాల్గవ అధ్యాయం

వామన ప్రాదుర్భావే అదితివరప్రదానమ్ – వామన ప్రాదుర్భావమున అదితి వరప్రదానం

ఋషయ ఊచుః – ఋషులు చెప్పారు.

రాజధర్మస్త్వయా సూత! కథితో విస్తరేణ తు ।
తథైవాద్భుతమంగల్యం స్వప్నదర్శనమేవ చ ॥ 1 ॥

విష్ణోరిదానీం మాహాత్మ్యం పునర్వక్తుమిహార్హసి ।
కథం స వామనో భూత్వా బబంధ బలిదానవమ్ ॥
క్రమతః కీదృశం రూప మాసీల్లోకత్రయే హరేః ॥ 2 ॥

ఓ సూతమహర్షీ! నీవు మాకు ఇంతవరకు విస్తారపూర్వకముగా రాజధర్మములు, అద్భుతములు మంగళదాయకములూ అయిన శుభాశుభశకునములు, స్వప్నదర్శనము వలన కలుగు పరిణామములన్నింటిని వివరించావు. ఇప్పుడు మాకు భగవంతుడైన విష్ణువుయొక్క మాహాత్మ్యమును వివరింపప్రార్థిస్తున్నాము. ఆ భగవంతుడు వామనరూపమును దాల్చి దానవరాజైన బలిచక్రవర్తిని ఎట్లు బంధించెను? క్రమముగా ఆ భగవంతుని రూపమెట్లు ముల్లోకములనాశ్రయించుటకు వృద్ధి పొందును?

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఏతదేవ పురా పృష్టః కురుక్షేత్రే తపోధనః ।
శౌనకస్తీర్థయాత్రాయాం వామనాయతనే పురా ॥ 3 ॥

యదా సమయభేదిత్వం ద్రౌపద్యాః పార్థివం ప్రతి ।
అర్జునేన కృతం తత్ర తీర్థయాత్రాం తదా యయౌ ॥ 4 ॥

ధర్మక్షేత్రే కురుక్షేత్రే వామనాయతనే స్థితః ।
దృష్ట్వా స వామనం తత్ర అర్జునో వాక్యమబ్రవీత్ ॥ 5 ॥

ఓ ఋషులారా! పూర్వము యుధిష్ఠిరునికిచ్చిన మాట ప్రకారముగా ద్రౌపదితో పాటు నివసించు విషయమున స్వప్రతిజ్ఞా ఉల్లంఘనకారణముగా అర్జునుడు ఆ పాపనివృత్తికై తీర్థయాత్రకు వెళ్ళెను. ఆ తీర్థయాత్రాసందర్భముననే ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందున్న వామనాయతనమునందలి వామనుని చూచి ఆ వృత్తాంతము తెలుపుమని తపోధనుడైన శౌనకుని అడిగాడు.

అర్జున ఉవాచ – అర్జునుడు చెప్పాడు.

కిం నిమిత్తమయం దేవో వామనాకృతిరిజ్యతే ।
వరాహరూపే భగవాన్ కస్మాత్ పూజ్యోఽభవత్పురా ॥
కస్మాచ్చ వామనస్యేదం ఇష్టం క్షేత్రమజాయత ॥ 6 ॥

ఏ కారణము చేత భగవానుడు ఈ వామనాకృతిని పొందును, ఎందులకు పూర్వకాలమున దేవుడు పూజ్యవరాహరూపమును పొందెను. ఎందులకు ఈ క్షేత్రము వామనునకు ప్రియక్షేత్రమయ్యింది.

శౌనక ఉవాచ – శౌనక మహర్షి చెప్పాడు.

వామనస్య చ వక్ష్యామి వరాహస్య చ ధీమతః ।
త్యక్త్వాఽతివిస్తరం భూయో మాహాత్మ్యం కురునందన ॥ 7 ॥

పురా నివారితే శక్రే సురేషు విజితేషు చ ।
చింతయామాస దేవానాం జననీ పునరుద్భవమ్ ॥ 8 ॥

ఓ కురునందనా! ధీమంతులైన వామన–వరాహ మూర్తుల మాహాత్మ్యము గురించి నీకు సంక్షిప్తంగా వివరిస్తాను. పూర్వము దేవతలు దానవుల చేతిలో పరాజయము పొందగా ఇంద్రుడు తన సింహాసనము నుండి నిర్వాసితుడు కాగా దేవతల తల్లియైన అదితి మరల తన పుత్రులెట్లు అభ్యుదయమును పొందెదరో అని విచారించింది.

అదితిర్దేవమాతా చ పరమం దుశ్చరం తపః ।
తీవ్రం చచార వర్షాణాం సహస్రం పృథివీపతే ॥ 9 ॥

ఆరాధనాయ కృష్ణస్య వాగ్యథా వాయుభోజనా ।
దైత్యైః నిరాకృతాన్ దృష్ట్వా తనయాన్ కురునందన ॥ 10 ॥

వృథా పుత్రాహమస్మీతి నిర్వేదాత్ ప్రణతా హరిమ్ ।
తుష్టావ వాగ్భిరిష్టాభిః పరమార్థావబోధినీ ॥
దేవదేవం హృషీకేశం నత్వా సర్వగతం హరిమ్ ॥ 11 ॥

ఆ విచారముతోనే దేవమాతయైన అదితి ఓ రాజా! వేయి సంవత్సరములు అతికఠినమైన తపస్సు చేసింది. ఓ కురునందనా! కృష్ణుని తృప్తిపరచుటకై వాయుభోజనయై మౌనముతో తపస్సు చేసింది. దైత్యులచేత నిరాకృతులైన తన పుత్రులను చూచి నేను వ్యర్థపుత్రవతినేయని నిర్వేదముతో శ్రీహరికి నమస్కరిస్తూ పరమార్థప్రకాశములగు వాక్యములతో సర్వగతుడు, దేవదేవుడు, హృషీకేశుడూ అయిన ఆ శ్రీహరిని ప్రియమైన మాటలతో స్తుతించింది.

అదితిరువాచ – అదితి చెప్పింది.

నమః స్మృతార్తినాశాయ నమః పుష్కరమాలినే ।
నమః పరమకల్యాణ కల్యాణాయాదివేధసే ॥ 12 ॥

నమః పంకజనేత్రాయ నమః పంకజనాభయే ।
శ్రియః కాంతాయ దాంతాయ పరమార్థాయ చక్రిణే ॥ 13 ॥

నమః పంకజసంభూతి సంభవాయాత్మయోనయే ।
నమః శంఖాసిహస్తాయ నమః కనకరేతసే ॥ 14 ॥

స్మరించువారి అన్ని విధములైన ఆపత్తులను నశింపజేయువాడు, పద్మమాలి, పరమకల్యాణస్వరూపుడు,కల్యాణదాయకుడు, ఆదిబ్రహ్మస్వరూపుడు, పంకజనేత్రుడు, పంకజనాభుడు, లక్ష్మీకాంతుడు, ఇంద్రియనిగ్రహము కలవాడు,

పరమార్థమే ప్రయోజనముగా కలవాడు, చక్రధారి, పద్మసంభవుడైన బ్రహ్మదేవుని జన్మకారణుడు, ఆత్మయోని, శంఖము, ఖడ్గము హస్తమున ధరించినవాడు, హిరణరేతస్కుడూ అయిన హరికి నమస్సులు.

తథాత్మజ్ఞాన విజ్ఞాన యోగిచింత్యాత్మయోగినే ।
నిర్గుణాయావిశేషాయ హరయే బ్రహ్మరూపిణే ॥ 15 ॥

జగత్ప్రతిష్ఠితం యత్ర జగతా యో న దృశ్యతే ।
నమః స్థూలాతిసూక్ష్మాయ తస్మై దేవాయ శంఖినే ॥ 16 ॥

ఇంకనూ ఆత్మజ్ఞానీ, విజ్ఞానమయుడు, యోగులచే చింతింపబడువాడు, ఆత్మయోగి, నిర్గుణుడు, విశేషస్వరూపుడు, హరి, బ్రహ్మరూపుడు, జగత్తంతయునూ తనలో ప్రతిష్ఠించుకున్నవాడు కాని జగము చేత చూడబడుటకు వీలుకానివాడు, స్థూల సూక్ష్మస్వరూపుడూ అయిన ఆ పరమాత్మునికి నమస్కారము.

యం న పశ్యతి పశ్యంతో జగదప్యఖిలం నరాః ।
అపశ్యద్భిర్జగత్యత్ర న దేవో హృది సంస్థితః ॥ 17 ॥

యస్మిన్నన్నం పయశ్చైవ నద్యశ్చైవాఖిలం జగత్ ।
తస్మై సమస్తజగతా మాధారాయ నమో నమః ॥ 18 ॥

సమస్త జగత్తును చూడగలిగినప్పటికి నరులెవ్వరు ఆతనిని చూడలేరో, హృదయంలో స్థిరముగా ఉన్నప్పటికి ఈ జగత్తులో ఆతనిని చూడలేరో, ఎవనియందు అన్నము, జలము, సమస్తనదులు, సమస్త జగత్తులు ఎవరిని ఆధారంగా చేసికొని ఉన్నవో అటువంటి హరికి నమస్సులు.

ఆద్యః ప్రజాపతిపతిర్యః ప్రభూణాం పతిః పరః ।
పతిః సురాణాం యస్తస్మై నమః కృష్ణాయ వేధసే ॥ 19 ॥

యః ప్రవృత్తౌ నివృత్తౌ చ ఇజ్యతే కర్మభిః స్వకైః ।
స్వర్గాపవర్గఫలదో నమస్తస్మై గదాభృతే ॥ 20 ॥

యశ్చిన్త్యమానో మనసా సద్యః పాపం వ్యపోహతి ।
నమస్తస్మై విశుద్ధాయ పరాయ హరివేధసే ॥ 21 ॥

ప్రజాపతులకు అగ్రగణ్యుడు, ప్రభువులకే ప్రభువు, దేవతలందరిలో శ్రేష్ఠుడు ఆదికర్తయైన ఆ కృష్ణునకు నమస్కారము. ప్రవృత్తిమార్గములందు ఆయా కర్మలచేత ఆరాధింపబడునట్టి గదాధరుడు, స్వర్గమును అపవర్గమును(మోక్షమును) కూడ కలిగించునట్టి ఆ పరమాత్మకు నమస్కారము. మనస్సుతో చింతించినంతనే పాపములన్నింటిని హరించివేయునట్టి, విశుద్ధుడు, పరబ్రహ్మస్వరూపుడూ అయినట్టి భగవంతునికి నమస్కారం.

యం బుద్ధ్వా సర్వభూతాని దేవదేవేశమవ్యయమ్ ।
న పునర్జన్మమరణే ప్రాప్నువంతి నమామి తమ్ ॥ 22 ॥

యో యజ్ఞే యజ్ఞపరమైః ఇజ్యతే యజ్ఞసంజ్ఞితః ।
తం యజ్ఞపురుషం విష్ణుం నమామి ప్రభుమీశ్వరమ్ ॥ 23 ॥

గీయతే సర్వవేదేషు వేదవిద్భిర్విదాం పతిః ।
యస్తస్మై వేదవేద్యాయ విష్ణవే జిష్ణవే నమః ॥ 24 ॥

దేవాదిదేవుడు, అవ్యయుడూ అయిన ఆ పరమాత్ముని తెలిసికొనినంతనే సర్వప్రాణులు జన్మమరణ రహితులగుదురో ఆ భగవంతునికి నమస్కారం. యజ్ఞములందు యాజ్ఞికులైన మహర్షులచే యజ్ఞపురుషుడిగా ఆరాధింపబడునట్టి ఆ ఈశ్వరునికి నమస్కారం. వేదములన్నింటియందు వేదవేద్యుడని వేదవేత్తలచేత స్తుతింపబడునట్టి విజయశీలుడైన విష్ణుభగవానునికి నమస్కారం.

యతో విశ్వం సముత్పన్నం యస్మింశ్చ లయమేష్యతి ।
విశ్వాగమప్రతిష్ఠాయ నమస్తస్మై మహాత్మనే ॥ 25 ॥

బ్రహ్మాదిస్తంబపర్యన్తం యేన విశ్వమిదం తతమ్ ।
మాయాజాలం సముత్తర్తుం తముపేంద్రం నమామ్యహమ్ ॥ 26 ॥

యస్తు తోయస్వరూపస్థో బిభర్త్యఖిల మీశ్వరః ।
విశ్వః విశ్వపతిం విష్ణుం తం నమామి ప్రజాపతిమ్ ॥ 27 ॥

ఎవనినుండి సమస్తవిశ్వముద్భవించినదో, ఎవనియందు లయమగునో అటువంటి విశ్వాధారుడైన మహాత్మునికి నమస్కారం. బ్రహ్మాదిస్తంబపర్యంతం ఈ విశ్వమంతయూ వ్యాపించినట్టి ఆ ఉపేంద్రునికి ఈ మాయాజాలమైన ప్రపంచం నుండి ముక్తి పొందుటకు నమస్కరిస్తాను. జలస్వరూపుడైన ఈ చరాచరప్రపంచమును భరించువాడు, విశ్వపతి, ప్రజాపతి, ఈశ్వరుడూ అయిన ఆ విష్ణుపరమాత్మకు నమస్కారం.

యమారాధ్య విశుద్ధేన మనసా కర్మణా గిరా ।
తరన్త్యవిద్యమఖిలాం తముపేంద్రం నమామ్యహమ్ ॥ 28 ॥

విషాదతోషరోషాద్యైః యోఽజస్రం సుఖదుఃఖజైః ।
నృత్యత్యఖిలభూతస్థః తముపేంద్రం నమామ్యహమ్ ॥ 29 ॥

మూర్తం తమోఽసురమయం తద్వధాద్వినిహన్తి యః ।
రాత్రిజం సూర్యరూపీవ తముపేంద్రం నమామ్యహమ్ ॥ 30 ॥

కపిలాది స్వరూపస్థో యశ్చాజ్ఞానమయం తమః ।
హన్తి జ్ఞానప్రదానేన తముపేంద్రం నమామ్యహమ్ ॥ 31 ॥

యస్యాక్షిణీ చంద్రసూర్యౌ సర్వలోకశుభాశుభమ్ ।
పశ్యతః కర్మ సతతం ఉపేంద్రం తం నమామ్యహమ్ ॥ 32 ॥

ఎవనిని విశుద్ధముగా మనోవాక్కాయకర్మలతో ఆరాధించి జనులు అఖిలమగు అవిద్యను తరింతురో అట్టి ఉపేంద్రునికి నమస్కరిస్తాను. సుఖదుఃఖములకు కారణములైన విషాద–సంతోషరోషాదులచేత సమస్తజీవరాశిని నర్తింపజేయునట్టి ఉపేంద్రునికి నమస్కరిస్తాను. రాత్రియందేర్పడు అసురస్వరూపమైన అంధకారమును

సూర్యభగవానుని రూపముతో నశింపజేయునట్టి ఉపేంద్రునికి నమస్కరిస్తాను. కపిలాదిమహర్షులరూపమున జ్ఞానమిచ్చి అజ్ఞానమయమైన అంధకారమును నశింపజేయు ఉపేంద్రునికి నమస్కరిస్తాను. సూర్యచంద్రులే కన్నులుగా కలిగినవాడై సకలలోకశుభాశుభకర్మలను వీక్షించువాడైన ఉపేంద్రునికి ఎల్లప్పుడు నమస్కరిస్తాను.

యస్మిన్ సర్వేశ్వరే సర్వం సత్యమేతన్మయోదితమ్ ।
నానృతం తమజం విష్ణుం నమామి ప్రభుమవ్యయమ్ ॥ 33 ॥

యచ్చ తత్సత్యముక్తం మే భూయాంశ్చాతో జనార్దనః ।
సత్యేన తేన సకలాః పూర్యన్తాం మే మనోరథాః ॥ 34 ॥

సర్వుడు, సర్వేశ్వరుడూ అయిన ఏ పరమాత్మునిగురించి నాచే ఇంతవరకు వర్ణింపబడిన విశేషణములన్నియు పరమసత్యములో అట్టి విష్ణుభగవానునికి నమస్కరిస్తాను. నేను చెప్పిన ఇదియంతయు సత్యమే కావున లోకరక్షకుడైన జనార్దనుడు సత్యములైన నా మనోరథాలన్నింటిని సిద్ధింపజేయుగాక!

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

ఏవం స్తుతః స భగవాన్ వాసుదేవ ఉవాచ తామ్ ।
అదృశ్యః సర్వభూతానాం తస్యాః సందర్శనే స్థితః ॥ 35 ॥

అదితి ద్వారా ఆ విధముగా స్తుతింపబడిన వాసుదేవభగవానుడు సర్వభూతములకు అదృశ్యుడైననూ ఆమెకు దర్శనమిచ్చుచూ ఇట్లు పలికెను.

శ్రీ భగవానువాచ – శ్రీ భగవానుడు చెప్పాడు.

మనోరథాంస్త్వమదితే యానిచ్ఛస్యభివాంఛితాన్ ।
తాంస్త్వం ప్రాప్స్యసి ధర్మజ్ఞే మత్ప్రసాదాన్న సంశయః ॥ 36 ॥

శృణుష్వ సుమహాభాగే వరో యస్తే హృది స్థితః ।
తమాశు వ్రియతాం కామం శ్రేయస్తే సంభవిష్యతి ॥
మద్దర్శనం హి విఫలం న కదాచిద్భవిష్యతి ॥ 37 ॥

ధర్మజ్ఞురాలవైన ఓ అదితీ! అభివాంఛితములైన నీమనోరథములన్నియునూ నా అనుగ్రహముతో నిస్సందేహముగా ఫలిస్తాయి. ఓ మహానుభావురాలా! నీ మనస్సులో ఉన్నటువంటి వరమును వెంటనే కోరుకో. నీకు శుభము కలుగుతుంది. నా దర్శనమెప్పుడునూ విఫలం కాదు.

అదితిః ఉవాచ – అదితి చెప్పింది.

యది దేవ ప్రసన్నస్త్వం యద్భక్త్యా భక్తవత్సల
త్రైలోక్యాధిపతిః పుత్రస్తదస్తు మమ వాసవః ॥ 38 ॥

హృతం రాజ్యం హృతాశ్చాస్య యజ్ఞభాగా మహాసురైః ।
త్వయి ప్రసన్నే వరదే తాన్ ప్రాప్నోతి సుతో మమ ॥ 39 ॥

హృతం రాజ్యం న దుఃఖాయ మమ పుత్రస్య కేశవ ।
సాపత్న్యాద్దాయనిర్భ్రంశో బాధాం నః కురుతే యది ॥ 40 ॥

భక్తవత్సలుడా! దేవా! నా భక్తితో నీవు ప్రసన్నుడవైనచో నా పుత్రుడైన ఇంద్రుడు త్రైలోక్యాధిపతి అగుగాక! మహాసురులచే హరింపబడిన ఆతని రాజ్యము మరియు యజ్ఞభాగములన్నియును వరదుడవైన నీ దయతో అతను మరల పొందుగాక! ఓ కేశవా! ఇంద్రుని రాజ్యము హరించివేయుట నాకు దుఃఖము కాదు కాని నా సవతి కొడుకులు ఆతని దాయభాగమును హరించివేయుచున్నారనేది నా మనస్సుకు బాధ కలిగిస్తున్నది.

శ్రీ భగవానువాచ – భగవానుడు చెప్పాడు.

కృతః ప్రసాదో హి మయా తవ దేవి యథేప్సితః ।
స్వాంశేన చైవ తే గర్భే సంభవిష్యామి కశ్యపాత్ ॥ 41 ॥

తవ గర్భసముద్భూతః తతస్తే యే సురారయః ।
తానహం నిహనిష్యామి నివృత్తా భవ నందిని ॥ 42 ॥

దేవీ! నీవు కోరుకున్నట్లుగా నీ అభీష్టమునే నేను అనుగ్రహించాను. నా అంశమున కశ్యపుని ద్వారా నీ గర్భమున నేను జన్మిస్తాను. అట్లు జన్మించిన తర్వాత దేవతల శత్రువులనందరిని సంహరింపగలను కనుక ఓ నందినీ! నీవు చింతింపకుము.

అదితిరువాచ – అదితి చెప్పింది.

ప్రసీద దేవదేవేశ! నమస్తే విశ్వభావన! ।
నాహం త్వాముదరే దేవ సోఢుం శక్ష్యామి కేశవ ॥ 43 ॥

యస్మిన్ ప్రతిష్ఠితం విశ్వం యో విశ్వం స్వయమీశ్వరః ।
తమహం నోదరేణ త్వాం వోఢుం శక్ష్యామి దుర్ధరమ్ ॥ 44 ॥

దేవదేవేశా! ఓ విశ్వభావనా! కేశవా! నన్ను అనుగ్రహింపుము. దేవా! నిన్ను నా గర్భమునందు మోయగలనా! ఎవనియందు ఈ విశ్వమంతయూ ప్రతిష్ఠింపబడినదో, ఎవరు తానే స్వయముగా విశ్వరూపుడో, ధరించుటకు శక్యముకానటువంటి వాడో అట్టి ఈశ్వరుడవైన నిన్ను గర్భమునందు నేను మోయగలనా!

శ్రీ భగవానువాచ – భగవానుడు చెప్పాడు.

సత్య మాత్థ మహాభాగే మయి సర్వమిదం జగత్ ।
ప్రతిష్ఠితం న మాం శక్తా వోఢుం సేంద్రా దివౌకసః ॥ 45 ॥

కిం త్వహం సకలాన్ లోకాన్ సదేవాసురమానుషాన్ ।
జంగమాన్ స్థావరాన్ సర్వాన్ త్వాం చ దేవి సకశ్యపామ్ ॥
ధారయిష్యామి భద్రం తే తదలం సంభ్రమేణ తే ॥ 46 ॥

న తే గ్లానిర్న తే ఖేదో గర్భస్తే భవితా మయి ।
దాక్షాయణి ప్రసాదం తే కరోమ్యన్యైః సుదుర్లభమ్ ॥ 47 ॥

ఓ మహానుభావురాలా! నీవు చెప్పినది నిజమే. ఈ జగత్తంతయును నాయందే ప్రతిష్ఠింపబడినది. నన్ను ఇంద్రాదిదేవతలెవ్వరునూ భరించలేరు. కాని నేను సకలలోకములను, దేవాసురమనుష్యులతోపాటు స్థావర జంగమములన్నింటిని, నిన్ను కశ్యపుడిని అందరిని నేను భరించగలను. కావున నీవు సంభ్రమమునకు లోను కాకూడదు, నీకు శుభం కలుగును. నీవు నన్ను నీ గర్భమున ధరించినప్పుడు నీకు ఎటువంటి వ్యథకాని ఖేదము కాని కలుగదు. ఓ దాక్షాయణీ! అన్యులకు సుదుర్లభమైనటువంటి అనుగ్రహమును నీయందు నేను కలిగియున్నాను.

గర్భస్థే మయి పుత్రాణాం తవ యోఽరిర్భవిష్యతి ।
తేజసస్తస్య హానిం చ కరిష్యే మా వ్యథా కృథాః ॥ 48 ॥

నేను నీ గర్భమునందున్న సమయమున నీ పుత్రులకు హాని కలిగించువారి తేజస్సును నేను నశింపజేయుదును కావున నీవు వ్యథ చెందకుము.

శౌనక ఉవాచ - శౌనకుడు చెప్పాడు.

ఏవముక్త్వా తతః సద్యో యాతోఽన్తర్ధానమీశ్వరః ।
సాఽపి కాలేన తం గర్భమవాప కురుసత్తమ! ॥ 49 ॥

ఈ విధమైన వరమునిచ్చిన వెంటనే ఈశ్వరుడు అంతర్ధానం చెందెను. అటు తర్వాత కాలానుసారంగా అదితి గర్భమును పొందెను.

గర్భస్థితే తతః కృష్ణే చచాల సకలా క్షితిః ।
చకంపిరే మహాశైలాః క్షోభం జగ్ముస్తథాబ్ధయః ॥ 50 ॥

యతో యతో దితి ర్యాతి దదాతి లలితం పదమ్ ।
తతస్తతః క్షితిః ఖేదాన్ననామ వసుధాధిప ॥ 51 ॥

దైత్యానా మథ సర్వేషాం గర్భస్థే మధుసూదనే ।
బభూవ తేజసాం హానిర్యథోక్తం పరమేష్ఠినా ॥ 52 ॥

కృష్ణుడు అదితియొక్క గర్భస్థితుడై యుండగా సకలభూమండలం చలించింది. మహాపర్వతములన్నియును కంపించాయి. సముద్రములన్నియును క్షోభిల్లాయి. ఓ వసుధాధిపా! ఎక్కడెక్కడ అదితి మృదువుగా అడుగులు వేసెనో అక్కడక్కడ భూమి ఖేదముచేత వంగింది. మధుసూదనుడైన భగవానుడు గర్భస్థుడైన ఆ సమయమున పరమేశ్వరుడైన శ్రీ మహావిష్ణువు చెప్పినట్లే దైత్యులకు తేజస్సు నశించింది.

ఇతి శ్రీ మహాపురాణే వామనప్రాదుర్భావే అదితివరప్రదానం నామ చతుశ్చత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥244॥

శ్రీ మత్స్యమహాపురాణంలో వామన ప్రాదుర్భావమున అదితి వరప్రదానమనే రెండువందల నలభైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలభైఐదవ అధ్యాయం

వామన ప్రాదుర్భావే వామనోత్పత్తిః - వామన ప్రాదుర్భావఘట్టంలో వామనోత్పత్తి

శౌనక ఉవాచ - శౌనకుడు చెప్పాడు.

నిస్తేజసోఽసురాన్ దృష్ట్వా సమస్తానసురేశ్వరః ।
ప్రహ్లాదమథ పప్రచ్ఛ బలిరాత్మపితామహమ్ ॥ 1 ॥

అపుడు దైత్యులందరు తేజోహీనులై పోతుండటం చూచి అసురేశ్వరుడైన బలిచక్రవర్తి తన తాత అయిన ప్రహ్లాదుని ఇలా అడిగాడు.

బలిరువాచ - బలి చెప్పాడు.

తాత నిస్తేజసో దైత్యా నిర్దగ్ధా ఇవ వహ్నినా ।
కిమేతే సహసైవాద్య బ్రహ్మదండహతా ఇవ ॥ 2 ॥

అరిష్టం కిం ను దైత్యానాం కిం కృత్యా వైరినిర్మితా ।
నాశాయైషా సముద్భూతా యయా నిస్తేజసోఽసురాః ॥ 3 ॥

ఓ తండ్రీ! ఈ దైత్యులందరు అగ్నిచే దగ్ధులైనట్లుగా, అకస్మాత్తుగా బ్రహ్మదండంచేత దెబ్బతిన్నట్లుగా తమ తేజస్సును కోల్పోయారేమి? దైత్యులకు ఏదైనా అరిష్టం వాటిలుతున్నదా లేక శత్రువులేమైనా కృత్యను నిర్మించగా అది వీరందరి నాశనంకోసం పుట్టిందా? దాని వలననే అసురులందరు తేజోహీనులవుతున్నారా?

శౌనక ఉవాచ - శౌనకుడు చెప్పాడు.

ఇతి దైత్యపతిర్ధీరః పృష్టః పౌత్రేణ పార్థివ ।
చిరం ధ్యాత్వా జగాదైనమసురేంద్రం బలిం తదా ॥ 4 ॥

ఓ రాజా! తన మనుమడైన బలిచక్రవర్తి ఈ విధంగా అడుగగా ప్రహ్లాదుడు చాలా దీర్ఘంగా ధ్యానించి విషయాన్ని తెలిసికొని అతనితో ఇలా చెప్పాడు.

ప్రహ్లాద ఉవాచ - ప్రహ్లాదుడు చెప్పాడు.

చలంతి గిరయో భూమిర్జహాతి సహజాం ధృతిమ్ ।
సర్వే సముద్రాః క్షుభితాః దైత్యాః నిస్తేజసః కృతాః ॥ 5 ॥

సూర్యోదయే యథాపూర్వం యథా గచ్ఛన్తి న గ్రహాః ।
దేవానాం చ పరా లక్ష్మీః కారణైరనుమీయతే ॥ 6 ॥

మహదేతన్మహాబాహో కారణం దానవేశ్వర ।
న హ్యల్పమితి మన్తవ్యం త్వయా కార్యం సురార్దన! ॥ 7 ॥

ఓ దానవేశ్వరా! ఎందుకో గిరులు చలిస్తున్నాయి. భూమి సహజమైన తన ధృతిని కోల్పోతున్నది, సముద్రాలన్నీ క్షోభిల్లుతున్నాయి. దైత్యులందరూ తేజోహీనులయ్యారు. సూర్యోదయం తర్వాత సూర్యుని అనుసరించి నడిచినట్లు గ్రహాలన్నీ నడుచుట లేదు. ఈ కారణాలనుబట్టి దేవతలకు విశేషమైన అభ్యున్నతి కలుగుతున్నట్లు అనుమానం కలుగుతున్నది. ఓ మహాబాహూ! ఇదేదో మహత్తరమైన కారణం వలెనే కనబడుతున్నది. ఓ సురార్దనా! దీనిని నీవు అల్పంగా భావించకూడదు.

శౌనక ఉవాచ - శౌనకుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా దానవపతిం ప్రహ్లాదః సోఽసురోత్తమః ।
అత్యన్తభక్తో దేవేశం జగామ మనసా హరిమ్ ॥8॥

స ధ్యానయోగం కృత్వాఽథ ప్రహ్లాదః సుమనోహరమ్ ।
విచారయామాస తతో యతో దేవో జనార్దనః ॥ 9 ॥

స దదర్శోదరేఽదిత్యాః ప్రహ్లాదో వామనాకృతిమ్ ।
అంతస్థాన్ బిభ్రతం సప్తలోకానాదిప్రజాపతిమ్ ॥ 10 ॥

దానవపతియైన బలిచక్రవర్తికి ఆ విధంగా తెలిపి అసురోత్తముడు, పరమభక్తుడూ అయిన ప్రహ్లాదుడు మనస్సుతో హరిని ధ్యానించాడు. సుమనోహరమైన ధ్యానయోగంతో ప్రహ్లాదుడు దేవదేవుడైన జనార్దనుని తన చిత్తంలోనే చక్కగా విచారించాడు. అపుడు ప్రహ్లాదుడు అదితిగర్భంలో వామనాకృతిలో ఉన్న, సప్తలోకాలను తనలో ధరించిన ఆది ప్రజాపతియైన శ్రీమన్నారాయణుని చూచాడు.

తదన్తఃస్థాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా ।
సాధ్యాన్విశ్వాంస్తథాదిత్యాన్ గంధర్వోరగరాక్షసాన్ ॥ 11 ॥

విరోచనం స్వతనయం బలిం చాసురనాయకమ్ ।
జమ్భం కుజమ్భం నరకం బాణమన్యాన్ స్తథాఽసురాన్ ॥ 12 ॥

ఆత్మానమూర్వీం గగనం వాయుమంభో హుతాశనమ్ ।
సముద్రాన్ద్రి ద్రుమసరిత్సరాంసి చ పశూన్ మృగాన్ ॥ 13 ॥

వయో మనుష్యానఖిలాన్ తథైవ చ సరీసృపాన్ ।
సమస్తలోకస్రష్టారం బ్రహ్మాణం భవమేవ చ ॥
గ్రహనక్షత్రనాగాంశ్చ దక్షాద్యాంశ్చ ప్రజాపతీన్ ॥ 14 ॥

స పశ్యన్విస్మయావిష్టః ప్రకృతిస్థః క్షణాత్పునః ।
ప్రహ్లాదః ప్రాహ దైత్యేంద్రం బలిం వైరోచనిం తదా ॥ 15 ॥

ఇంకనూ అతనిలోపల వసువులు, రుద్రులు, అశ్వినులు, మరుత్తులు, సాధ్యులు, విశ్వేదేవతలు, ఆదిత్యులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు, విరోచన తనయుడు, అసురనాయకుడూ అయిన బలి, జంభ, కుజంభ-

నరక–బాణాది అసురులు, తాను, భూమి, ఆకాశం, వాయువు, జలము, అగ్ని, సముద్రాలు, వృక్షాలు, నదులు, సరస్సులు, పశువులు, మృగాలు, పక్షులు, మనుష్యులు, సరీసృపములు, సమస్తలోకములకు సృష్టికర్తయైన బ్రహ్మ, రుద్రుడు, గ్రహాలు, నక్షత్రాలు, సర్పాలు, దక్షుడు మొదలైన ప్రజాపతులు మొదలైన వారనేకులు కనబడినారు. వాటినన్నింటిని చూచి విస్మయావిష్టుడైన ప్రహ్లాదుడు క్షణకాలంలోనే తేరుకొని దైత్యేంద్రుడు మరియు విరోచనపుత్రుడైన బలితో ఇలా అన్నాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు చెప్పాడు.

వత్స జ్ఞాతం మయా సర్వం యదర్థం భవతామియమ్ ।
తేజసో హానిరుత్పన్నా తచ్ఛృణు త్వమశేషతః ॥ 16 ॥

వత్సా! నేనంతా తెలిసికొన్నాను. మీ అందరి తేజస్సుకు హాని కలిగిస్తున్న కారణాన్ని సంపూర్ణంగా వివరిస్తాను విను.

దేవదేవో జగద్యోగనిరయోనిర్జగదాదికృత్ ।
అనాదిరాదిర్విశ్వస్య వరేణ్యో వరదో హరిః ॥ 17 ॥

పరం పరాణాం పరమః పరః పరవతామపి ।
ప్రమాణం చ ప్రమాణానాం సప్తలోకగురోర్గురుః ॥ 18 ॥

ప్రభుః ప్రభూణాం పరమః పరాణాం అనాదిమధ్యో భగవాననన్తః ।
త్రైలోక్యమంశేన సనాథమేష కర్తుం మహాత్మాఽదితిజోఽవతీర్ణః ॥ 19 ॥

దేవదేవుడు, జగత్కారణుడు, స్వయంభువు, జగదాదికర్త, ఆదిలేనివాడు, విశ్వమునకాద్యుడు, వరేణ్యుడు వరదుడు, హరి, శ్రేష్ఠులలో శ్రేష్ఠుడు, పరమోత్కృష్టుడు, ప్రమాణాలకే ప్రమాణుడు, సప్తలోకాలకు గురువైన సృష్టికర్తకే గురువు, ప్రభువులకే ప్రభువు, ఆదిమధ్యాంతరహితుడు, మహానుభావుడూ అయిన పరమాత్ముడు ఈ ముల్లోకాలను తన అంశతో రక్షించుటకై అదితిగర్భంలో అవతరించాడు.

న తస్య రుద్రో న చ పద్మయోనిః నేంద్రో న సూర్యేందుమరీచిముఖ్యాః ।
జానంతి దైత్యాధిప యత్స్వరూపం స వాసుదేవః కలయాఽవతీర్ణః ॥ 20 ॥

యోఽసౌ కలాంశేన నృసింహరూపే జఘాన పూర్వం పితరం మమేశః ।
యః సర్వయోగీశమనోనివాసః స వాసుదేవః కలయాఽవతీర్ణః ॥ 21 ॥

శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు, సూర్యచంద్రులు, మరీచిమొదలైన మునులకుకూడ అర్థం కాని స్వరూపం కలిగిన ఆ వాసుదేవుడు తన అంశతో ఇప్పుడు అవతరిస్తున్నాడు. పూర్వం తన అవతారాంశతో నృసింహరూపుడై ఉద్భవించి మా తండ్రిని వధించినట్టివాడు, ఈశ్వరుడు, యోగులందరి మనస్సులో ఎల్లప్పుడూ నివసించేవాడూ అయిన ఆ వాసుదేవుడు ఇపుడు తన అంశతో అవతరిస్తున్నాడు.

యమక్షరం వేదవిదో విదిత్వా విశంతి యం జ్ఞానవిధూతపాపాః ।
యస్మిన్ ప్రవిష్టా న పునర్భవంతి తం వాసుదేవం ప్రణమామి నిత్యమ్ ॥ 22 ॥

భూతాన్యశేషాణి యతో భవంతి యథోర్మయస్తోయనిధేరజస్రమ్ ।
లయం చ యస్మిన్ ప్రలయే ప్రయాంతి తం వాసుదేవం ప్రణమామ్యచింత్యమ్ ॥ 23 ॥

న యస్య రూపం న బలప్రభావౌ న యస్య భావః పరమస్య పుంసః ।
విజ్ఞాయతే శర్వపితామహాద్యైః తం వాసుదేవం ప్రణమామ్యజస్రమ్ ॥ 24 ॥

అక్షరరూపుడైన ఆ పరమాత్ముని వేదవిదులైన పండితులు తమ జ్ఞానంతో తెలిసికొని పాపములన్నీ పోగొట్టుకుని (కడిగివేసికొని) అతనిలోనే లయాన్ని పొంది, పునర్జన్మ రహితులవుతారో ఆ వాసుదేవునికి నిత్యమూ నమస్కరిస్తున్నాను. సముద్రంలోనే నిరంతరం ఉద్భవించిన తరంగాలు మరల సముద్రంలోనే ఎలా లయాన్ని పొందుతాయో అలా సకల ప్రాణులు ఆతనినుండే ఉద్భవించి ప్రళయకాలంలో మరల అతనిలోనే కలిసిపోతాయి, అటువంటి అచింత్యుడైన వాసుదేవునికి నమస్కరిస్తున్నాను. ఏ పరమపురుషుని రూప-బల-ప్రభావాలు తెలిసికొనుటకు రుద్ర బ్రహ్మాదులకు కూడ శక్యం కావో అటువంటి వాసుదేవుని నిరంతరం నమస్కరిస్తున్నాను.

రూపస్య చక్షుర్గ్రహణే త్వగిష్టా స్పర్శే గ్రహీత్రీ రసనా రసస్య ।
శ్రోత్రం చ శబ్దగ్రహణే నరాణాం ఘ్రాణం చ గంధగ్రహణే నియుక్తమ్ ॥ 25 ॥

యేనైకదంష్ట్రాగ్రసముద్ధృతేయం ధరాచలాన్ ధారయతీహ సర్వాన్ ।
యస్మింశ్చ శేతే సకలం జగచ్చ తమీశమాద్యం ప్రణతోఽస్మి విష్ణుమ్ ॥ 26 ॥

ప్రాణుల రూపాన్ని చూచుటకై నేత్రాలు, స్పర్శతెలియుటకై చర్మాన్ని, రుచి తెలిసికొనుటకై నాలుక, శబ్దగ్రహానికి చెవులు, వాసన తెలియుటకై ముక్కు మొదలైనవి కల్పించిన వాసుదేవునికి నమస్కరిస్తున్నాను. తన ఒకే దంష్ట్రాగ్రంతో సమస్తభూమండలాన్ని ఆతడు ధరించినందువలననే పృథివీదేవత సకలప్రాణులను, పర్వతాదులను ధరించగలుగు తున్నది. మరియు ఈ జగత్తంతా ఆ పరమాత్మునిలోనే శయనిస్తుంది. కావున ఆద్యుడైన ఆ విష్ణు భగవానునికి ప్రణమిల్లుతున్నాను.

న ఘ్రాణచక్షుః శ్రవణాదిభిర్యః సర్వేశ్వరో వేదితుమక్షయాత్మా ।
శక్యస్తమీద్యం మనసైవ దేవం గ్రాహ్యం నతోఽహం హరిమీశితారమ్ ॥ 27 ॥

అంశావతీర్ణేన చ యేన గర్భం హృతాని తేజాంసి మహాసురాణామ్ ।
నమామి తం దేవ మనన్తమీశం అశేషసంసారతరోః కుఠారమ్ ॥ 28 ॥

చర్మం, కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు అనే జ్ఞానేంద్రియాలతో తెలుసుకొనుటకు శక్యం కాని అక్షయాత్ముడు, సర్వేశ్వరుడూ అయిన ఆ పరమాత్మ మనస్సుతో మాత్రమే తెలిసికొనుటకు శక్యుడు కావున అటువంటి శ్రీహరికి నమస్కరిస్తున్నాను. తన అంశావతారంతో అదితిగర్భంలో చేరి మహాసురుల తేజస్సును హరించే ఈ అశేషసంసార వృక్షానికి గొడ్డలివంటివాడు, అనంతస్వరూపుడైన ఆ దేవునికి నమస్కరిస్తున్నాను.

దేవో జగద్యోనిరయం మహాత్మా స షోడశాంశేన మహాసురేంద్ర ।
స దేవమాతుర్జఠరం ప్రవిష్టో హృతాని వస్తేన బలాద్వపూంషి ॥ 29 ॥

ఓ మహాసురేంద్రా! మహాత్ముడు జగత్కారణుడు అయిన ఆ పరమాత్ముడు తన పదహారవ అంశముతో దేవతల తల్లిగర్భంలో ప్రవేశించాడు. కావున ఆతని బలంచేతనే దైత్యుల తేజస్సులు హరించబడినాయి.

బలిరువాచ – బలిచక్రవర్తి చెప్పాడు.

తాత కోఽయం హరిర్నామ యతో నో భయమాగతమ్ ।
సంతి మే శతశో దైత్యా వాసుదేవబలాధికాః ॥ 30 ॥

విప్రచిత్తిః శిబిః శంకురయఃశంకుస్తథైవ చ ।
అయఃశిరశ్చాశ్వశిరా భంగకారీ మహాహనుః ॥ 31 ॥

ప్రతాపః ప్రఘసః శుంభః కుకురశ్చ సుదుర్జయః ।
ఏతే చాన్యే చ మే సన్తి దైతేయా దానవాస్తథా ॥ 32 ॥

మహాబలా మహావీర్యా భూభారోద్ధరణక్షమాః ।
ఏషామేకైకశః కృష్ణో న వీర్యార్ధేన సమ్మితః ॥ 33 ॥

ప్రహ్లాదుని మాటలు విన్న బలిచక్రవర్తి ఇలా అన్నాడు. తండ్రీ! మనకు భయం కలిగిస్తున్న ఈ హరియనే వాడెవరు? వాసుదేవుని బలంకంటె అధికమైన బలం గల వందలకొలది దైత్యులు నావద్ద కలరు. విప్రచిత్తి, శిబి, శంకువు, అయఃశంకువు, అయఃశిరుడు, అశ్వశిరుడు, భంగకారుడు, మహాహనువు, ప్రతాపుడు, ప్రఘసుడు, శుంభుడు, సులభంగా జయించుటకు సాధ్యంకాని కుకురుడు మొదలైనవారే కాక ఇంకనూ అనేకమంది దైత్యులు, దానవులు నావద్ద ఉన్నారు. మహాబలశాలులు, మహావీరులు, భూభారమునంతటిని ఉద్ధరించే శక్తి గలిగినవారు అనేకులు కలరు. శ్రీకృష్ణుడు ఈ బలవంతులందరిలో ఒక్కొక్కరి బలంలో సగం బలం కూడ కలిగిన వాడు కాదు.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

పౌత్రస్యైతద్వచః శ్రుత్వా ప్రహ్లాదో దైత్యపుంగవః ।
ధిగ్ధిగిత్యాహ స బలిం వైకుంఠాక్షేపవాదినమ్ ॥ 34 ॥

వైకుంఠవాసియైన శ్రీ మహావిష్ణువును అధిక్షేపిస్తున్న మనుమని మాటలు విన్న దైత్యపుంగవుడైన ప్రహ్లాదుడు అతనిని ఛీత్కరించాడు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు చెప్పాడు.

వినాశముపయాస్యంతి మన్యే దైతేయదానవాః ।
యేషాం త్వమీదృశో రాజా దుర్బుద్ధిరవివేకవాన్ ॥ 35 ॥

దేవదేవం మహాభాగం వాసుదేవమజం విభుమ్ ।
త్వామృతే పాపసంకల్పః కోఽన్య ఏవం వదిష్యతి ॥ 36 ॥

దుర్బుద్ధి కలవాడవు, వివేకరహితుడవూ అయిన నీ వంటివానిని రాజుగా కలిగిన దితిపుత్రులైన దానవులందరు వినాశం పొందుతారని నాకు తోస్తున్నది. దేవదేవుడు, మహానుభావుడు, అజుడు, విభుడూ అయిన వాసుదేవుని గురించి పాపసంకల్పుడవైన నీవంటివాడు తప్ప ఇతరులెవ్వరు ఇలా మాట్లాడుతారు.

య ఏతే భవతా ప్రోక్తాః సమాస్తా దైత్యదానవాః ।
సబ్రహ్మకాస్తథా దేవాః స్థావరానన్తభూమయః ॥ 37 ॥

త్వం చాహం చ జగచ్చేదం సాద్రిద్రుమనదీనదమ్ ।
సముద్రద్వీపలోకాశ్చ న సమం కేశవస్య హి ॥ 38 ॥

యస్యాతివంద్యవంద్యస్య వ్యాపినః పరమాత్మనః ।
ఏకాంశేన జగత్సర్వం కస్తమేవం ప్రవక్ష్యతి ॥ 39 ॥

ఋతే వినాశాభిముఖం త్వామేకమవివేకినమ్ ।
కుబుద్ధిమజితాత్మానం వృద్ధానాం శాసనాతిగమ్ ॥ 40 ॥

నీవు విష్ణువు గురించి చెప్పిన మాటలు సరికావు. సమస్త దైత్యదానవులు, బ్రహ్మాదిదేవతలు, స్థావర జంగమాత్మకాలైన పదార్థాలు, నీవు, నేను, పర్వతాలు, నదీనదాలు మరియు వృక్షాదులతో కూడిన ఈ జగత్తు, సముద్రాలు, ద్వీపాలు, లోకాలన్నీ ఆ కేశవునితో సమానం కావు. లోకంలో వందనీయులైన వారందరికీ వంద్యుడు, సర్వవ్యాపి, పరమాత్ముడూ అయిన ఏ శ్రీహరియొక్క ఏకాంశంతోనే ఈ జగత్తంతా నిలిచిందో, అటువంటి భగవానుని వినాశానికి అభిముఖుడవు వివేకరహితుడవు, దుష్టబుద్ధివి, మనస్సును జయంచలేనివాడవు, పెద్దల మాటలను విననటువంటి నీవు కాక ఇతరులెవ్వరు ఈ విధంగా అనగలుగుతారు?

శోచ్యోఽహం యస్య మే గేహే జాతస్తవ పితాఽధమః ।
యస్య త్వమీదృశః పుత్రో దేవదేవస్య నిందకః ॥ 41 ॥

తిష్ఠత్వేషా హి సంసారసంభృతాఘవినాశినీ ।
కృష్ణే భక్తిరహం తావదవేక్ష్యో భవతా న కిమ్ ॥ 42 ॥

న మే ప్రియతమః కృష్ణాదపి దేహో మహాత్మనః ।
ఇతి జానాత్యయం లోకో న భవాన్దితిజాధమ! ॥ 43 ॥

జానన్నపి ప్రియతరం ప్రాణేభ్యోఽపి హరిం మమ ।
నిందాం కరోషి తస్య త్వమకుర్వన్ గౌరవం మమ ॥ 44 ॥

దేవదేవుని నిందకుడవైన నీ వంటి వాడికి జన్మనిచ్చిన అధముడైన నీ తండ్రి నా వంశంలో పుట్టినందుకు నేను బాధపడుతున్నాను. శ్రీకృష్ణునియందు కలిగిన భక్తి ఈ సంసారంలోని సమస్తపాపాలను నశింపజేసే శక్తి గలది. అట్టి దానిని నీవెందుకు చూడలేకపోతున్నావు. ఈ లోకంలో మహాత్ముడైన కృష్ణునికంటె ప్రియతమమైనది నాకింకొకటి లేదు. ఈ విషయం లోకానికంతటికీ తెలుసు. ఓ దితిజాధమా! నా ప్రాణాలకన్నా హరియే నాకు ప్రియతముడు అని నీకు తెలిసినా ఆ శ్రీహరిని నిందిస్తూ నీవు నాయందు అగౌరవం ప్రకటిస్తున్నావు.

విరోచనస్తవ గురుః గురుస్తస్యాప్యహం బలే! ।
మమాపి సర్వజగతాం గురోర్నారాయణో గురుః ॥ 45 ॥

నిందాం కరోషి యస్తస్మిన్ కృష్ణే గురుగురోర్గురౌ ।
యస్మాత్తస్మాదిహైశ్వర్యాదచిరాద్ భ్రంశమేష్యసి ॥ 46 ॥

మమ దేవో జగన్నాథో బలే! తావజ్జనార్దనః ।
భవత్వహముపేక్ష్యస్తే ప్రతిమానస్తు మే గురుః ॥ 47 ॥

ఏతావన్మాత్రమప్యేవం నిందితస్త్రిజగద్గురుః ।
నావేక్షితం త్వయా యస్మాత్తస్మాచ్ఛాపం దదామి తే ॥ 48 ॥

ఓ బలీ! నీకు విరోచనుడు గురువు, విరోచనునికి నేను గురువును, నాకూ, ఈ సర్వజగత్తుకూ ఆ శ్రీమన్నారాయణుడే గురువు. గురువులకే గురువైన ఆ శ్రీకృష్ణుని నీవు నిందిస్తున్నావు కావున అచిరకాలంలోనే నీ ఐశ్వర్యమంతా నశించిపోతుంది. జగన్నాథుడైన జనార్దనుడు నాకు దేవుడు. నీవు నన్ను ఉపేక్షిస్తున్నావు. అయినా నా గురువు ప్రీతికలవాడు. కాని ఇదంతా నీకు తెలిసినా ముల్లోకాలకు గురువైన ఆ పరమాత్ముని మహత్త్వాన్ని నీవు నిందించినావు కావున నేను నిన్ను శపిస్తున్నాను.

యథా మే శిరసశ్ఛేదాదిదం గురుతరం వచః ।
త్వయోక్తమచ్యుతాక్షేపి రాజ్యభ్రష్టస్తథా పత ॥ 49 ॥

యథా చ కృష్ణాన్న పరం పరిత్రాణం భవార్ణవే ।
తథాఽచిరేణ పశ్యేయం భవన్తం రాజ్యవిచ్యుతమ్ ॥ 50 ॥

బలీ! అచ్యుతుని నిందిస్తూ నీవు పలికిన మాటలు నా శిరచ్ఛేదం కన్న ఎక్కువ బాధ కలిగించేవి. కావున నీవు రాజ్యభ్రష్టుడవై పోతావు. ఈ సంసారసాగరంలో శ్రీకృష్ణుడు తప్ప రక్షకుడెవరూ లేరు. అచిరకాలంలోనే నీవు రాజ్య భ్రష్టుడవవటం నేను చూస్తాను.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

ఇతి దైత్యపతిః శ్రుత్వా గురోర్వచనమప్రియమ్ ।
ప్రసాదయామాస గురుం ప్రణిపత్య పునః పునః ॥ 51 ॥

దైత్యపతియైన బలి తన తాత ప్రహ్లాదుని కఠినమైన మాటలు విని వినయంతో నమస్కరిస్తూ మరల మరల అతనిని ప్రసన్నుని చేసికొనుటకై ప్రయత్నించాడు.

బలిరువాచ – బలిచక్రవర్తి చెప్పాడు.

ప్రసీద తాత! మా కోపం కురు మోహహతే మయి ।
బలావలేపమత్తేన మయైతద్వాక్యమీరితమ్ ॥ 52 ॥

మోహోపహతవిజ్ఞానః పాపోऽహం దితిజోత్తమ ।
యచ్ఛప్తోऽస్మి దురాచారస్తత్సాధు భవతా కృతమ్ ॥ 53 ॥

తండ్రీ! ప్రసన్నుడవు కమ్ము, మోహహతుడనైననే నాపై కోపగించకుము. బలగర్వముచేత మత్తుడనైన నేనిట్లు మాట్లాడితిని. ఓ దితిజోత్తమా! మోహాంధకారముచేత కోల్పోయిన విజ్ఞానము కలవాడినైన నేను పాపుడను, దురాచారుడనైన నన్ను శపించి నీవు మంచి పని చేసితివి.

రాజ్యభ్రంశం వసుభ్రంశం సంప్రాప్స్యామీతి న త్వహమ్ ।
విషణ్ణోऽస్మి యథా తాత తవైవావినయే కృతే ॥ 54 ॥

త్రైలోక్యరాజ్యమైశ్వర్యం అన్యద్వా నాతిదుర్లభమ్ ।
సంసారే దుర్లభాస్తే తు గురవో యే భవద్విధాః ॥ 55 ॥

తత్ప్రసీద న మే కోపం కర్తుమర్హసి దైత్యప ।
త్వత్కోపదృష్ట్యా తాతాహం పరితప్యే న శాపతః ॥ 56 ॥

తండ్రీ! రాజ్యాన్ని ఐశ్వర్యాన్ని కోల్పోతానని నేను బాధపడటంలేదు కాని నీ విషయంలో నేను వినయరహితుణ్ణై ప్రవర్తించానని దుఃఖిస్తున్నాను. త్రైలోక్యాధిపత్యం, ఐశ్వర్యం లేదా ఏదైనా పొందటం దుర్లభం కాదు కాని ఈ ప్రపంచంలో నీవంటి గురువులను పొందటం దుర్లభం కావున ఓ దైత్యరక్షకా! నాయందు ప్రసన్నుడవుకా. నన్ను కోపగించకు, ఓ తండ్రీ! నీకు కోపం కలిగించానని పరితపిస్తున్నాను కానీ నీవిచ్చిన శాపం వల్ల కాదు.

ప్రహ్లాద ఉవాచ – ప్రహ్లాదుడు చెప్పాడు.

వత్స కోపో న మోహేన జనితస్తేన తే మయా ।
శాపో దత్తో వివేకశ్చ మోహేనాపహృతో మమ ॥ 57 ॥

యది మోహేన మే జ్ఞానం న క్షిప్తం స్యాన్మహాసుర ।
తత్కథం సర్వగం జానన్ హరిం కించిచ్ఛపామ్యహమ్ ॥ 58 ॥

వత్సా! నీ అజ్ఞానం వలన నాకు కోపం కలిగింది. నా వివేకం కూడ నశించి నిన్ను శపించాను. ఓ మహాసురా! నా జ్ఞానం కూడ మోహంతో కప్పివేయబడి ఉండకపోతే సర్వవ్యాపియైన హరి నీలో కూడ ఉంటాడని తెలిసిన నేను నిన్నెలా శపిస్తాను.

యోఽయం శాపో మయా దత్తో భవతోఽసురపుంగవ ।
భావ్యమేతేన నూనం తే తస్మాన్మా త్వం విషీద వై ॥ 59 ॥

అద్యప్రభృతి దేవేశే భగవత్యచ్యుతే హరౌ ।
భవేథా భక్తిమానీశే స తే త్రాతా భవిష్యతి ॥ 60 ॥

ఓ అసురపుంగవా! నేను నీకిచ్చిన శాపం తప్పనిసరిగా జరుగవలసిందే. కావున నీ వీ విషయమై దుఃఖించకు. ఇక ఇప్పటినుండి దేవేశుడు, భగవానుడు, అచ్యుతుడు, ఈశ్వరుడూ అయిన ఆ శ్రీహరియందే భక్తి కలిగి ఉండుము. ఆ భగవానుడే నిన్ను రక్షిస్తాడు.

శాపం ప్రాప్యాథ మాం వీర సంస్మరేథాః స్మృతస్త్వయా ।
యథా తథా యతిష్యేఽహం శ్రేయసా యోజ్యతే యథా ॥ 61 ॥

ఏవముక్త్వా స దైత్యేంద్రం విరరామ మహామతిః ।
అజాయత స గోవిందో భగవాన్ వామనాకృతిః ॥ 62 ॥

ఓ వీరా! నా నుండి శాపం పొందిన నీవు నన్నే స్మరిస్తావు. అలా స్మరించబడిన నేను అన్నివిధాలా నీకు శుభం కలుగుటకై ప్రయత్నిస్తాను. అని మహామతియైన ప్రహ్లాదుడు ఆ దైత్యేంద్రునికి చెప్పి విరమించాడు. అప్పుడు భగవంతుడైన గోవిందుడు వామనాకారుడై జన్మించాడు.

అవతీర్ణే జగన్నాథే తస్మిన్ సర్వామరేశ్వరే ।
దేవాశ్చ ముముచుర్దుఃఖం దేవమాతాఽదితిస్తథా ॥ 63 ॥

వవుర్వాతాః సుఖస్పర్శా విరజస్కమభూన్నభః ।
ధర్మే చ సర్వభూతానాం తదా మతిరజాయత ॥ 64 ॥

నోద్వేగశ్చాప్యభూత్తత్ర మనుజేంద్రాసురేష్వపి ।
తదాది సర్వభూతానాం భూమ్యమ్బరదివౌకసామ్ ॥ 65 ॥

ఆ విధంగా సర్వామరేశ్వరుడైన జగన్నాథుడు అవతరించిన వెంటనే దేవతలు మరియు వారి తల్లియైన అదితికూడ దుఃఖవిముక్తులైనారు. సుఖస్పర్శ కలిగించే గాలులు వీచినాయి. ఆకాశం ధూళి లేకుండా నిర్మలమయింది. ప్రాణులందరికీ ధర్మంలో ప్రీతి కలిగింది. మనుజేంద్రులకు, అసురులకు, భూమి అంతరిక్షం స్వర్గలోకాది వాసులకు, సర్వప్రాణులకు ఉద్వేగం నశించిపోయింది.

తం జాతమాత్రం భగవాన్ బ్రహ్మా లోకపితామహః ।
జాతకర్మాదికం కృత్వా కృష్ణం దృష్ట్వా చ పార్థివ ॥
తుష్టావ దేవదేవేశమృషీణాం చైవ శృణ్వతామ్ ॥ 66 ॥

ఓ రాజా! ఆవిధంగా భగవంతుడు జన్మించిన వెంటనే లోకపితామహుడైన బ్రహ్మదేవుడు జాతకర్మాదికం నిర్వహించి, ఆ పరమాత్ముని సందర్శించుకొని, ఋషులందరూ వింటూండగా దేవదేవుని ఇలా స్తుతించాడు.

బ్రహ్మోవాచ - బ్రహ్మదేవుడు చెప్పాడు.

జయాద్యేశ జయాజేయ జయ సర్వాత్మకాత్మక ।
జయ జన్మజరాపేత జయానన్త జయాచ్యుత ॥ 67 ॥

జయాజిత జయామేయ జయావ్యక్తస్థితే జయ ।
పరమార్థార్థ సర్వజ్ఞ జ్ఞానజ్ఞేయాత్మనిఃసృత ॥ 68 ॥

జయాశేష జగత్సాక్షిన్ జగత్కర్తుర్జగద్గురో! ।
జగతోఽస్య జయాంతే చ స్థితః పాలయితుం జయ ॥ 69 ॥

జయశేష జయాశేష జయాఖిలహృదిస్థిత ।
జయాదిమధ్యాంత జయ సర్వజ్ఞాననిధే జయ ॥ 70 ॥

ఓ ఆద్యా! ఈశ్వరా! అజేయా! సర్మాత్మకాత్మకా! జన్మజరారహితా! అనంతా! అచ్యుతా! నీకు జయం జయం అజేయుడా! అమేయుడా! వ్యక్తంకాని స్థితికలవాడా! పరమార్థా! సర్వజ్ఞుడా! జ్ఞానంచేత తెలిసికోబడే ఆత్మకలవాడా! అశేషజగత్తునకు సాక్షిస్వరూపుడా! ఓ జగత్కర్తా! జగద్గురో నీకు జయము జయము జగత్తునకే స్థితిలయ కారకుడా! సర్వజగత్తును పరిపాలించేవాడా! శేషుడా! అశేషుడా! అఖిలలోకహృదయంలో నివసించేవాడా! ఆదిమధ్యాంతరహితుడా! ఓ సర్వజ్ఞాననిధీ! నీకు జయము, జయము.

ముముక్షుభిరనిర్దేశ్య స్వయందృష్ట జయేశ్వర ।
యోగినాం ముక్తిఫలద దమాదిగుణభూషణ ॥ 71 ॥

జయాతిసూక్ష్మ దుర్జ్ఞేయ జయ స్థూలజగన్మయ ।
జయ స్థూలాతిసూక్ష్మ త్వం జయాతీంద్రియ సేంద్రియ ॥ 72 ॥

జయ స్వమాయాయోగస్థ శేషభోగశయాక్షర ।
జయైకదంష్ట్రా ప్రాంతాగ్రసముద్ధృతవసుంధర ॥ 73 ॥

నృకేసరిన్ జయారాతివక్షఃస్థలవిదారణ ।
సాంప్రతం జయ విశ్వాత్మన్ జయ వామన కేశవ ॥ 74 ॥

ముముక్షువులచేత కూడ నిర్దేశించబడుటకు వీలుకానివాడా! స్వయంభువా! ఈశ్వరా! యోగులకు ముక్తిని ప్రసాదించేవాడా! దమాదిగుణాలతో అలంకరించబడినవాడా! నీకు జయం జయం సూక్ష్మస్వరుపుడా! సులభంగా తెలియబడనివాడా! స్థూలస్వరూపా! జగన్మయా! ఓ అతీంద్రియా! సేంద్రియా! నీకు జయము జయము. ఓ మాయాయోగస్థితా, శేషభోగశయనా! ఒకే దంష్ట్రంతో వసుంధరను పైకి లేపినవాడా! ఓ నృకేసరీ! శత్రువువక్షఃస్థలాన్ని చీల్చినవాడా! ఓ విశ్వాత్ముడా! వామనా! కేశవా! నీకు జయం జయం.

నిజమాయాపటచ్ఛన్న జగన్మూర్తే జనార్దన ।
జయాచింత్య జయానేకస్వరూపైకవిధ ప్రభో ॥ 75 ॥

వర్ధస్వ వర్ధితాశేష వికారప్రకృతే హరే ।
త్వయ్యేషా జగతామీశే సంస్థితా ధర్మపద్ధతిః ॥ 76 ॥

న త్వామహం న చేశానో నేంద్రాద్యాస్త్రిదశా హరే ।
న జ్ఞాతుమీశా మునయః సనకాద్యా న యోగినః ॥ 77 ॥

తన మాయ అను వస్త్రంతో ఆచ్ఛాదించబడిన ఓ జగన్మూర్తీ! జనార్దనా! అచింత్యుడా! అనేకస్వరూపుడా! ఓ ప్రభో! నీకు జయం జయం. వృద్ధిపొందింపబడిన అశేషవికార ప్రకృతి స్వరూపుడా! హరీ! జగదీశ్వరుడవైన నీయందే ధర్మపద్ధతి కలవాడా! నేను కాని, పరమశివుడు కాని తెలిసికోవడానికి శక్యం కానివాడా! పరమేశ్వరా! నీకు జయం జయం.

త్వమేవారాధితో యేన ప్రసాదసుముఖ! ప్రభో! ।
స ఏవ కేవలో దేవ వేత్తి త్వాం నేతరే జనాః ॥ 79 ॥

నందీశ్వరేశ్వరేశాన! ప్రభవస్వ ప్రభావన ।
ప్రభవాయాస్య విశ్వస్య విశ్వాత్మన్! పృథులోచన! ॥ 80 ॥

ప్రభో! నిన్ను ఆరాధించి నీ ప్రసాదానుగ్రహాన్ని పొందిన వారు మాత్రమే నిన్ను తెలిసికోగలరు కాని ఇతరులెవ్వరూ నిన్ను తెలుసుకోలేరు. ఓ నందీశ్వరేశ్వరా! ఈశ్వరా! ఓప్రభూ! వామనా! విశ్వాత్మా! విశాలలోచనుడా! నీప్రభావంచేత మాత్రమే విశ్వమంతా వర్ధిల్లుతుంది.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

ఏవం స్తుతో హృషీకేశః స తదా వామనాకృతిః ।
ప్రహస్య భావగంభీరమువాచాబ్జసముద్భవమ్ ॥ 81 ॥

స్తుతోఽహం భవతా పూర్వమింద్రాద్యైః కశ్యపేన చ ।
మయా చ వః ప్రతిజ్ఞాతమింద్రస్య భువనత్రయమ్ ॥ 82 ॥

భూయశ్చాహం స్తుతోఽదిత్యా తస్యాశ్చాపి ప్రతిశ్రుతమ్ ।
యథా శక్రాయ దాస్యామి త్రైలోక్యం హృతకంటకమ్ ॥ 83 ॥

సోఽహం తథా కరిష్యామి మహేంద్రో జగతః పతిః ।
భవిష్యతి సాహస్రాక్షః సత్యమేతద్ బ్రవీమి వః ॥ 84 ॥

ఈ విధంగా స్తుతించబడిన తర్వాత వామనాకారంలోవున్న హృషీకేశుడు నవ్వి కమలోద్భవుడైన బ్రహ్మతో భావగంభీరంగా ఇలా అన్నాడు. పూర్వం నీవు, ఇంద్రాది దేవతలు, కశ్యపుడు మొదలైన వారితో స్తుతించబడిన నేను ఇంద్రునికి మరల మూడు లోకాల నిస్తానని ప్రతిజ్ఞ చేశాను. అలాగే అదితి చేత కూడ ప్రార్థించబడిన నేను కంటకరహితమైన భువనత్రయాన్ని ఇంద్రునికిస్తానని మాట ఇచ్చాను. కావున నేను మహేంద్రుని మూడు లోకాలకు అధిపతిని చేయగలను. నా మాట ప్రకారం సహస్రాక్షుడు జగత్పతిస్థానాన్ని పొందుతాడు ఇది సత్యం.

తతః కృష్ణాజినం బ్రహ్మా హృషీకేశాయ దత్తవాన్ ।
యజ్ఞోపవీతం భగవాన్ దదౌ తస్మై బృహస్పతిః ॥ 85 ॥

ఆషాఢమదదాద్దండం మరీచిర్బ్రహ్మణః సుతః ।
కమండలుం వసిష్ఠశ్చ కౌశం వేదమథాంగిరాః ॥ 86 ॥

అక్షసూత్రం చ పులహః పులస్త్యః సితవాససీ ।
ఉపతస్థుశ్చ తం వేదాః ప్రణవస్వరభూషణాః ॥ 87 ॥

శాస్త్రాణ్యశేషాణి తథా సాంఖ్యయోగోక్తయశ్చ యాః ।

అప్పుడు బ్రహ్మదేవుడు హృషీకేశునికి కృష్ణాజినాన్ని బృహస్పతి యజ్ఞోపవీతాన్ని, బ్రహ్మపుత్రుడైన మరీచిఋషి ఆషాఢదండాన్ని, వసిష్ఠముని కమండలాన్ని, అంగిరసుడు దర్భపవిత్రను, పులహుడు అక్షసూత్రాన్ని, పులస్త్యుడు తెల్లనివస్త్రాలను ఇచ్చారు. ప్రణవస్వరాలంకృతాలైన వేదాలు, సాంఖ్యం, యోగం మొదలైన అనేక శాస్త్రాలు స్వయంగానే ఆ వామనమూర్తిని ఆశ్రయించాయి.

స వామనో జటీ దండీ ఛత్రీ ధృతకమండలుః ॥ 88 ॥

సర్వవేదమయో భూప బలేరధ్వరమభ్యగాత్ ।
యత్ర యత్ర పదం భూయో భూభాగే వామనో దదౌ॥ 89 ॥

దదాతి భూమిర్వివరం తత్ర తత్రాతిపీడితా ।
స వామనో జడగతిః మృదు గచ్ఛన్ సపర్వతామ్ ॥
సాబ్ధిద్వీపవతీం సర్వాం చాలయామాస మేదినీమ్ ॥ 90 ॥

ఓ రాజా! తరువాత ఆ వామనుడు జటా-దండ-ఛత్ర-కమండలాదులు ధరించినవాడై సర్వవేదమయుడై బలిచక్రవర్తి ఆచరించే యజ్ఞానికి వెళ్ళాడు. భూభాగంలో ఎక్కడెక్కడ వామనుడు అడుగుపెట్టాడో అక్కడక్కడ భూమి కుంగి రంధ్రమేర్పడింది. వామనుడు నెమ్మదిగా, మృదువుగా వెళ్ళుతున్నప్పటికీ పర్వతాలు, సాగరాలు, ద్వీపాలతో కూడిన పృథివినంతా కదలించేశాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వామనప్రాదుర్భావే వామనోత్పత్తిర్నామ
పంచచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥245॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని వామనప్రాదుర్భావఘట్టంలో వామనోత్పత్తి అనే
రెండువందల నలభై ఐదవ అధ్యాయం సమాప్తం.

షట్చత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలభైఆరవ అధ్యాయం

వామనప్రాదుర్భావః - వామనావతారం

శౌనక ఉవాచ - శౌనకుడు చెప్పాడు.

సపర్వతవనాముర్వీం దృష్ట్వా సంక్షోభితాం బలిః।
పప్రచ్ఛోశనసం శుద్ధం ప్రణిపత్య కృతాంజలిః ॥ 1 ॥

ఆచార్య క్షోభమాయాతా సాబ్ధిభూభృద్వనా మహీ ।
కస్మాచ్చ నాసురాన్ భాగాన్ ప్రతిగృహ్ణంతి వహ్నయః ॥ 2 ॥

పర్వతాలు, వనాలతో కూడిన భూమి సంక్షోభించటం చూచి బలిచక్రవర్తి అంజలి ఘటించి తన గురువైన శుక్రాచార్యునికి నమస్కరించి "ఆచార్యా! పర్వతాలు, ద్వీపాలు, వనాలతో కూడిన పృథివి ఏల క్షోభిస్తున్నది? వహ్నులు అసురభాగాలను ఎందుకు గ్రహించటం లేదు" అని అడిగాడు.

ఇతి పృష్టోఽథ బలినా కావ్యో వేదవిదాం వరః ।
ఉవాచ దైత్యాధిపతిం చిరం ధ్యాత్వా మహామతిః ॥ 3 ॥

అవతీర్ణో జగద్యోనిః కశ్యపస్య గృహే హరిః ।
వామనేనేహ రూపేణ జగదాత్మా సనాతనః ॥ 4 ॥

స ఏష యజ్ఞమాయాతి తవ దానవపుంగవ ।
తత్పాదవిన్యాసవిక్షోభాదియం ప్రచలితా మహీ ॥
కమ్పంతే గిరయశ్చామీ క్షుభితో మకరాలయః ॥ 5 ॥

బలిచక్రవర్తి ఆ విధంగా అడిగిన పిదప వేదవిదులలో శ్రేష్ఠుడు, మహామతియైన శుక్రాచార్యుడు దీర్ఘంగా ధ్యానం చేసి దైత్యాధిపతితో ఇలా చెప్పాడు. జగత్కారణుడు, సనాతనుడు, జగత్తుకు ఆత్మవంటివాడైన శ్రీహరి వామన రూపంలో కశ్యపుని గృహంలో జన్మించాడు. ఓ దానవపుంగవా! ఆ వామనుడు ఇప్పుడు నీవు ఆచరిస్తున్న యజ్ఞానికి వస్తున్నాడు. ఆతని పాదవిన్యాసంవలననే పృథివి చలిస్తున్నది. పర్వతాలు కంపిస్తున్నవి. సముద్రాలు కూడ కలత చెందుతున్నవి.

నైనం భూతపతిం భూమిః సమర్థా వోఢుమీశ్వరమ్ ।
సదేవాసురగంధర్వయక్షరాక్షసకిన్నరా ॥ 6 ॥

అనేనైవ ధృతా భూమిరాపోఽగ్నిః పవనో నభః।
ధారయత్యఖిలాన్ దేవో మన్వాదీంశ్చ మహాసుర! ॥ 7 ॥

ఇయమేవ జగద్ధేతోర్మాయా కృష్ణస్య గహ్వరీ ।
ధార్యధారకభావేన యయా సంపీడితం జగత్ ॥ 8 ॥

తత్సన్నిధానాదసురా భాగార్హా నాసురోత్తమ! ।
భుంజతే నాసురాన్ భాగాన్ అమీ తేనైవ చాగ్నయః ॥ 9 ॥

భూతపతియైన ఆ ఈశ్వరుని పృథివి భరించలేకపోతున్నట్లున్నది. దేవాసుర గంధర్వ యక్ష రాక్షస కిన్నరాదులతో కూడిన ఈ భూమి ఆతనిచేతనే ధరించబడుతున్నది. అలాగే భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం మొదలైన వాటిని దేవతలందరిని, మన్వాదులను కూడ ఆతడే వహిస్తున్నాడు. ఓ మహాసురా! జగత్కారణుడైన ఆ కృష్ణుని మాయ అతి గహ్వరమైనది. ఆ మాయే ధార్యధారకభావంతో ఈ జగత్తంతటిని పీడిస్తున్నది. ఓ అసురోత్తమా! ఆతని సాన్నిధ్యం వలన అసురులు యజ్ఞభాగార్హులు కారు. అందులకే ఈ అగ్నులసురులకు సంబంధించిన హవిర్భాగాలను గ్రహించలేకున్నవి.

బలిరువాచ – బలి చెప్పాడు.

ధన్యోఽహం కృతపుణ్యశ్చ యన్మే యజ్ఞపతిః స్వయమ్ ।
యజ్ఞమభ్యాగతో బ్రహ్మన్ మత్తః కోఽన్యోఽధికః పుమాన్ ॥ 10 ॥

యం యోగినః సదా యుక్త్వా పరమాత్మానమవ్యయమ్ ।
ద్రష్టుమిచ్ఛంతి దేవేశం స మేఽధ్వరముపైష్యతి ॥ 11 ॥

హోతా భాగప్రదోఽయం చ యముద్గాతా చ గాయతి ।
తమధ్వరేశ్వరం విష్ణుం మత్తః కోఽన్య ఉపైష్యతి ॥ 12 ॥

సర్వేశ్వరేశ్వరే కృష్ణే మదధ్వరముపాగతే ।
యన్మయా కావ్య కర్తవ్యం తన్మమాదేష్టుమర్హసి ॥ 13 ॥

నేను ధన్యుడను, పుణ్యాత్ముడను, ఈ రోజు యజ్ఞపతియే స్వయంగా నేనాచరిస్తున్న ఈ యజ్ఞానికి వస్తున్నాడు. ఓ బ్రహ్మ! నాకంటె గొప్ప పురుషుడెవరుంటారు? యోగులందరూ యోగసమాధి ద్వారా ఏ అవ్యయుని, పరమాత్ముని, దేవదేవుడిని దర్శించుకొనుటకు ప్రయత్నిస్తారో ఆ యోగీశ్వరుడే స్వయంగా నా యజ్ఞానికి వస్తున్నాడు. యజ్ఞంలో హోత ఎవరికి యజ్ఞభాగాలిస్తాడో, ఉద్గాత ఎవరిని ఉద్దేశించి గానం చేస్తాడో, అధ్వరేశ్వరుడైన ఆ విష్ణువును నేను గాక ఇంకెవరు పొందుతారు? ఓ ఆచార్యా! సర్వేశ్వరేశ్వరుడైన ఆ కృష్ణుడే స్వయంగా నా యజ్ఞానికి వస్తున్నప్పుడు నేనాతనిని ఎలా స్వాగతించాలో నన్ను ఆదేశించు.

శుక్ర ఉవాచ – శుక్రుడు చెప్పాడు.

యజ్ఞభాగభుజో దేవా వేదప్రామాణ్యతోఽసుర ।
త్వయా తు దానవా దైత్యా మఖభాగభుజః కృతాః ॥ 14 ॥

అయం చ దేవః సత్త్వస్థః కరోతి స్థితిపాలనమ్ ।
విసృష్టేరను చాన్నేన స్వయమత్తి ప్రజాః ప్రభుః ॥ 15 ॥

త్వత్కృతే భవితా నూనం దేవో విష్ణుః స్థితౌ స్థితః ।
విదిత్వైతన్మహాభాగ కురు యత్నమనాగమాత్ ॥ 16 ॥

ఓ అసురా! వేదప్రమాణాన్ని బట్టి యజ్ఞభాగాన్ని గ్రహించటానికి దేవతలు మాత్రమే అర్హులు. కాని నీవు దైత్యులకు, దానవులకు కూడ ఆ అర్హత కలిగించావు. ఈ దేవుడు సత్త్వగుణాత్మకుడై లోకస్థితి పాలనములు చేయును. మరియు సృష్టి అంతంలో అతడే సర్వాన్ని భుజిస్తాడు. తనలో ఐక్యం చేసుకొంటాడు. ఓ మహాభాగా! ఈ విష్ణుభగవానుడు సాధారణంగా తనకున్న ఆ కార్యంలోనే లోకస్థితిపాలనములందే నిమగ్నుడై ఉంటాడు. కాని ఇప్పుడు కేవలం నీకొరకే ఇక్కడికి వస్తున్నాడు. కనుక ఇది తెలిసికొని జాగరూకతతో అతను రాకపూర్వమే చేయవలసిన ప్రయత్నం చేయి.

త్వయా హి దైత్యాధిపతే స్వల్పకేఽపి హి వస్తుని ।
ప్రతిజ్ఞా న హి వోఢవ్యా వాచ్యం సామ వృథాఫలమ్ ॥ 17 ॥

నాలం దాతుమహం దేవ దైత్య వాచ్యం త్వయా వచః ।
కృష్ణస్య దేవ భూత్యర్థం ప్రవృత్తస్య మహాసుర! ॥ 18 ॥

ఓ దైత్యాధిపతీ! అతను వచ్చి ఎంతస్వల్పమైన వస్తువు అడిగినా ఇస్తానని నీవు ప్రతిజ్ఞ చేయకూడదు. కాని ఫలితంలేని సామవచనాలు మాత్రమే పలకాలి. "ఓ దేవా! నేను ఏదీ దానం చేయటానికి శక్తుడను కాను" అని మాత్రమే నీవు చెప్పాలి. ఎందుకనగా ఆ కృష్ణభగవానుడు దేవతలకు మేలు చేయటానికి, వారి అభ్యున్నతి కోసం ప్రవర్తిస్తూ ఇక్కడికి వస్తున్నాడు. ఓ మహాసురా! నీవు జాగరూకుడవై ఉండాలి.

బలిరువాచ – బలి చక్రవర్తి చెప్పాడు.

బ్రహ్మన్! కథమహం బ్రూయామన్యేనాపి హి యాచితః ।
నాస్తీతి కిము దేవేన సంసారాఘౌఘహారిణా ॥ 19 ॥

వ్రతోపవాసైర్వివిధైః ప్రతిసంగ్రాహ్యతే హరిః ।
స చేద్వక్ష్యతి దేహీతి గోవిందః కిమతోఽధికమ్ ॥ 20 ॥

యదర్థముపహారాఢ్యాస్తపః శౌచగుణాన్వితైః ।
యజ్ఞాః క్రియన్తే దేవేశః స మాం దేహీతి వక్ష్యతి ॥21॥

ఓ బ్రహ్మన్! సాధారణ యాచకులు ప్రార్థించినపుడే లేదని అనని నేను ఈ సంసారపు సమస్తపాపాలను నశింపజేసే పరమాత్ముడే యాచిస్తే లేదని ఎలా చెబుతాను. వివిధాలైన ఉపవాసాది వ్రతాలు ఆచరించి ఏ భగవంతుని ప్రసన్నుని చేసుకొనుటకై జనం యత్నిస్తారో ఆ గోవిందుడే "దేహి" అని నన్ను యాచిస్తే నాకంతకన్న అధికం

ఏమున్నది? ఎవరి అనుగ్రహం కోసం తపస్సు శౌచగుణాలతో కూడిన జనులు అనేక ఉపహారాలర్పిస్తారో, యజ్ఞయాగాదికర్మలు ఆచరిస్తారో అటువంటి దేవదేవుడు నన్ను "దేహి" అని యాచించబోతున్నాడు.

తత్సాధు సుకృతం కర్మ తపః సుచరితం మమ ।
యన్మయా దత్తమీశేశః స్వయమాదాస్యతే హరిః ॥ 22 ॥

నిజంగా నా సుకృతం, నా తపస్సు, నా సుచరితం ఈనాటికి ఫలించినవి. ఎందుకనగా సాక్షత్తు శ్రీహరే స్వయంగా వచ్చి నేనిచ్చే దానాన్ని స్వీకరిస్తాడు.

నాస్తి నాస్తీత్యహం వక్ష్యే తమప్యాగతమీశ్వరమ్ ।
యదా వంచామి తం ప్రాప్తం వృథా తజ్జన్మనఃఫలమ్ ॥ 23 ॥

యజ్ఞేఽస్మిన్ యది యజ్ఞేశో యాచతే మాం జనార్దనః ।
నిజమూర్ధానమప్యత్ర తద్దాస్యామ్యవిచారితమ్ ॥ 24 ॥

స్వయంగా ఈశ్వరుడే వచ్చి యాచించునప్పుడు నేను నా దగ్గర ఏమియూ లేదని నేనట్లు అందును, నన్ను నేను ఎట్లు వంచన చేసికొందును. అలా చేస్తే ఈ జన్మఫలమే వ్యర్థమవుతుంది కదా! నేనాచరిస్తున్న ఈ యజ్ఞంలో యజ్ఞేశ్వరుడైన జనార్దనుడే స్వయంగా యాచిస్తే ఎటువంటి విచారం లేకుండా నా శిరస్సునైనా ఇస్తాను.

నాస్తీతి యన్మయా నోక్తమన్యేషామపి యాచతామ్ ।
వక్ష్యామి కథమాయాతే తదనభ్యస్తముచ్యతే ॥ 25 ॥

శ్లాఘ్య ఏవ హి వీరాణాం దానాదాపత్సమాగమః ।
నాబాధకారి యద్దానం తదమంగలవత్ స్మృతమ్ ॥ 26 ॥

ఇతరులు యాచకులుగా వచ్చినా లేదని అనని నేను ఈనాడు అచ్యుతుడే స్వయంగా వచ్చినపుడు అలవాటు లేని ఆ లేదనే మాట ఎలా అనగలను? అయినా వీరులకు దానం చేయటం వలన ఆపదలు కలిగినా అవి శ్లాఘనీయాలే. బాధ కలిగించని దానాన్ని అమంగళమైనదిగా చెబుతారు.

మద్రాజ్యే నాసుఖీ కశ్చిన్న దరిద్రో న చాతురః ।
నాభూషితో న చోద్విగ్నో న స్రగాదివివర్జితః ॥ 27 ॥

హృష్టస్తుష్టః సుగంధిశ్చ తృప్తః సర్వసుఖాన్వితః ।
జనః సర్వో మహాభాగ! కిముతాహం సదా సుఖీ ॥28॥

ఏతద్విశిష్టపాత్రోఽయం దానబీజఫలం మమ ।
విదితం భృగుశార్దూల! మయైతత్ త్వత్ప్రసాదతః ॥ 29 ॥

నా రాజ్యంలో సుఖరహితుడు, దరిద్రుడు, వ్యాధిగ్రస్తుడు, అలంకార రహితుడు, ఉద్విగ్నుడు, పుష్పమాలాదులు లేనివాడు మొదలైనవారు లేరు. అందురూ హర్షంతో, పుష్టితో, సుగంధాదులతో, తృప్తితో సర్వసుఖాలతో కూడి

ఉన్నారు. ఇక నా గురించి ఏమి చెప్పను? నేను సదా సుఖవంతుడను. ఓ భృగుశార్దూలా! విశిష్టులైన వారికి చేసిన దానబీజఫలం చాలా గొప్పగా ఉంటుందని నీ నుండే నేను తెలుసుకున్నాను కదా!

ఏతద్విజానతో దానబీజం పతతి చేద్ గురో! ।
జనార్దనమహాపాత్రే కిం న ప్రాప్తం తతో మయా ॥ 30 ॥

మత్తో దానమవాప్యేశో యది పుష్ణాతి దేవతాః ।
ఉపభోగాద్దశగుణం దానం శ్లాఘ్యతమం మమ ॥ 31 ॥

మత్ప్రసాదపరో నూనం యజ్ఞేనారాధితో హరిః ।
తేనాభ్యేతి న సందేహో దర్శనాదుపకారకృత్ ॥ 32 ॥

గురుదేవా! ఇంత తెలిసిన నా దానబీజం జనార్దనుడనే ఒక మహాపాత్రలో పడితే నాకు లభించని ఫలమేముంటుంది? నా నుండి దానం తీసుకుని దానితో దేవతలకు పుష్టి కలిగిస్తే ఆ దానం భోగాని కంటె పదిరెట్లు నాకు శ్లాఘించతగింది. శ్రీహరి నా యజ్ఞం ద్వారా ఆరాధించబడి, నా యందు అనుగ్రహం చూపినట్లే అవుతుంది. ఇటువంటి దానం శ్లాఘనీయమైనది అనటంలో సందేహం లేదు. పరమాత్ముడు తన దర్శనంతో నాకుపకారం చేయడానికి ఇక్కడికి వస్తున్నాడేమో!

అథ కోపేన వాఽభ్యేతి దేవభాగోపరోధినమ్ ।
మాం నిహన్తుమనాశ్చైవ వధః శ్లాఘ్యతరోఽచ్యుతాత్ ॥ 33 ॥

తన్మయం సర్వమేవేదం నాప్రాప్యం యస్య విద్యతే ।
స మాం యాచితుమభ్యేతి నానుగ్రహమృతే హరిః ॥ 34 ॥

యః సృజత్యాత్మభూః సర్వం చేతసైవ చ సంహరేత్ ।
స మాం హన్తుం హృషీకేశః కథం యత్నం కరిష్యతి ॥ 35 ॥

ఒకవేళ దేవతల యజ్ఞభాగాలను నిరోధిస్తున్న నన్ను చూచి కోపంతో నన్ను వధించటానికి ఆ శ్రీహరి ఇక్కడికి వస్తే అచ్యుతునిచేతిలో వధించబడటం శ్లాఘనీయమే కదా! ఈ జగత్తంతా ఆతనిమయమే అయినప్పుడు ఆతనికి లభించనిది లోకంలో ఏముంటుంది? అటువంటి శ్రీహరి నన్ను యాచించడానికి వస్తున్నాడంటే అది ఆయన అనుగ్రహమే కదా! స్వయంభువు అయిన ఆ పరమాత్ముడు కేవలం మనఃసంకల్పంతోనే సర్వాన్ని సృష్టించి లయం చేస్తాడు. అటువంటి హృషీకేశుడు నన్ను వధించుటకు ఎలా ప్రయత్నిస్తాడు?

ఏతద్విదిత్వా న గురో దానవిఘ్నకరేణ చ ।
త్వయా భావ్యం జగన్నాథే గోవిందే సముపస్థితే ॥ 36 ॥

ఓ గురుదేవా! ఇదంతా తెలిసిన నీవు జగన్నాథుడైన గోవిందుడు ఇక్కడికి వచ్చినపుడు దానవిఘ్నకరుడవు కారాదు. నీవిలా భావించటం కూడా తగదు.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

ఇత్యేవం వదతస్తస్య సంప్రాప్తః స జగత్పతిః ।
సర్వదేవమయోஉచింత్యో మాయావామనరూపధృక్ ॥ 37 ॥

తం దృష్ట్వా యజ్ఞవాటాన్తః ప్రవిష్టమసురాః ప్రభుమ్ ।
జగ్ముః సభాసదః క్షోభం తేజసా తస్య నిష్ప్రభాః ॥ 38 ॥

జేపుశ్చ మునయస్తత్ర యే సమేతా మహాధ్వరే ।
బలిశ్చైవాఖిలం జన్మ మేనే సఫలమాత్మనః ॥ 39 ॥

బలిచక్రవర్తి అలా అంటూండగానే జగత్పతి, సర్వదేవమయుడు, అచింత్యుడూ అయిన శ్రీహరి వామనరూపధారియై అక్కడికి వచ్చాడు. యజ్ఞవాటికలో ప్రవేశిస్తున్న ఆ ప్రభువును చూచి సభాసదులైన అసురలందరు ఆతని తేజస్సు చేత కాంతిహీనులై క్షోభితులైనారు. ఆ మహాధ్వరంలో వున్న మునులందరు వేదమంత్రాలను జపించారు. బలిచక్రవర్తి తనజన్మ సఫలమని భావించాడు.

తతః సంక్షోభమాపన్నో న కశ్చిత్కించిదుక్తవాన్ ।
ప్రత్యేకం దేవదేవేశం పూజయామాస తేజసా ॥ 40 ॥

అథాసురపతిం ప్రహ్వం దృష్ట్వా మునివరాంశ్చ తాన్ ।
దేవదేవపతిః సాక్షీ విష్ణుర్వామనరూపధృక్ ॥ 41 ॥

తుష్టావ యజ్ఞవహ్నిం చ యజమానమథర్త్విజః ।
యజ్ఞకర్మాధికారస్థాన్ సదస్యాన్ ద్రవ్యసంపదః ॥ 42 ॥

అప్పుడు యజ్ఞవాటికలో వున్న వారందరూ ఆశ్చర్యచకితులై ఎవరూ ఏమీ మాట్లాడలేదు. మరియు వారిలో ప్రతిఒక్కరూ ఆ దేవదేవుని మనస్సుతోనే పూజించుకొన్నారు. తర్వాత వినమ్రుడైన అసురపతిని మరియు మునివరులను కూడ చూచి దేవదేవుడు వామనరూపధారియైన విష్ణువు ఆ యజ్ఞాన్ని, వహ్నిని, యజమానుని, ఋత్విజులను, యజ్ఞకర్మాధికారులను, సదస్యులను, యజ్ఞద్రవ్యసంపదలను ప్రశంసించాడు.

తతః ప్రసన్నమఖిలం వామనం ప్రతి తత్క్షణాత్ ।
యజ్ఞవాటస్థితం వీరః సాధు సాధ్విత్యుదీరయన్ ॥ 43 ॥

స చార్ఘ్యమాదాయ బలిః ప్రోద్భూతపులకస్తదా ।
పూజయామాస గోవిందం ప్రాహ చేదం మహాసురః ॥ 44 ॥

తత్క్షణమే యజ్ఞవాటికలో వున్న అఖిలజనులు ఆ దేవదేవుని చూచి ప్రసన్నులైనారు. సాధువాదాలు పలికారు. ఆనందంతో పులకాంకితుడైన బలిచక్రవర్తి అర్ఘ్యాదులతో గోవిందుని పూజించి ఆ దేవునితో ఇలా అన్నాడు.

బలిరువాచ – బలిచక్రవర్తి చెప్పాడు.

సువర్ణరత్నసంఘాతం గజాశ్వమమితం తథా ।
స్త్రియో వస్త్రాణ్యలంకారాన్ తథా గ్రామాంశ్చ పుష్కలాన్ ॥ 45 ॥

సర్వస్వం సకలాముర్వీం భవతో వా యదీప్సితమ్ ।
తద్దదామి వృణుష్వ త్వం యేనార్థీ వామనః ప్రియః ॥ 46 ॥

సువర్ణం, రత్నసంచయం, అమితాలైన గజాలు, అశ్వాలు, సుందరీమణులైన స్త్రీలు, వస్త్రాలు, అలంకారాలు, పుష్కలంగా ఉన్న గ్రామాలు లేదా సమస్తపృథివీమండలం మొదలగు వాటిలో నీ కిష్టమైనది ఏదైనా ఇవ్వగలను.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

ఇత్యుక్తో దైత్యపతినా ప్రీతిగర్భాన్వితం వచః ।
ప్రాహ సస్మితగంభీరం భగవాన్ వామనాకృతిః ॥ 47 ॥

ఆ విధంగా ప్రీతితో కూడిన దైత్యపతి బలిచక్రవర్తి మాటలు విని, వామనాకృతిలో వున్న భగవంతుడు చిరునవ్వుతో గంభీరంగా ఇలా అన్నాడు.

వామన ఉవాచ – వామనుడు చెప్పాడు.

మమాగ్నిశరణార్థాయ దేహి రాజన్! పదత్రయమ్ ।
సువర్ణగ్రామరత్నాని తదర్థిభ్యః ప్రదీయతామ్ ॥ 48 ॥

ఓ రాజా! అగ్నిరక్షణకొరకై నాకు మూడడుగుల భూమిమాత్రం కావాలి. సువర్ణ, గ్రామ, రత్నాదులను అవి కోరుకొనే యాచకుల కివ్వు.

బలిరువాచ – బలిచక్రవర్తి చెప్పాడు.

త్రిభిః ప్రయోజనం కిం తే పాదైః పదవతాం వర ।
శతం శతసహస్రాణాం పదానాం మార్గతాం భవాన్ ॥ 49 ॥

పదధారులలో శ్రేష్ఠుడా! మూడు పాదముల పరిణామము గల భూమితో నీకేమి ప్రయోజనము వందలు లేదా లక్షల అడుగులు గల భూమిని కోరుకొనుము.

వామన ఉవాచ – వామనుడు చెప్పాడు.

ధర్మబుద్ధ్యా దైత్యపతే కృతకృత్యోఽస్మి తావతా ।
అన్యేషామర్థినాం విత్తమీహితం దాస్యతే భవాన్ ॥ 50 ॥

ఓ దైత్యపతీ! నీ ధర్మబుద్ధితో కృతకృత్యుడనయ్యాను. ధర్మబుద్ధితో నాకు కావలసిన మూడడుగల భూమిని మాత్రమే కోరుకుంటున్నాను. ధనాదులనన్నింటిని కోరుకున్నటువంటి ఇతర యాచకులకు ఇవ్వు.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

ఏతచ్ఛ్రుత్వా తు గదితం వామనస్య మహాత్మనః ।
దదౌ తస్మై మహాబాహుర్వామనాయ పదత్రయమ్ ॥ 51 ॥

పాణౌ తు పతితే తోయే వామనోఽభూదవామనః ।
సర్వదేవమయం రూపం దర్శయామాస తక్షణాత్ ॥ 52 ॥

మహాత్ముడైన వామనుని మాటలు విని మహాబాహువైన బలిచక్రవర్తి వామనమూర్తికి మూడడుగులనిచ్చాడు. దానజలం తన చేతిలో పడిన వెంటనే భగవంతుని వామనరూపం బృహద్రూపంగా మారింది. తత్‌క్షణమే ఆ పరమాత్ముడు సర్వదేవమయమైన తన విశ్వరూపాన్ని చూపించాడు.

చంద్రసూర్యౌ చ నయనే ద్యౌర్మూర్ధా చరణౌ క్షితిః ।
పాదాంగుల్యః పిశాచాస్తు హస్తాంగుల్యశ్చ గుహ్యకాః ॥ 53 ॥

విశ్వేదేవాశ్చ జానుస్థాః జంఘే సాధ్యాః సురోత్తమాః ।
యక్షా నఖేషు సంభూతా రేఖాశ్చాప్సరసస్తథా ॥ 54 ॥

దృష్టౌ ఋక్షాణ్యశేషాణి కేశాః సూర్యాంశవః ప్రభోః ।
తారకా రోమకూపాణి రోమాణి చ మహర్షయః ॥ 55 ॥

బాహవో విదిశస్తస్య దిశః శ్రోత్రే మహాత్మనః ।
అశ్వినౌ శ్రవణే తస్య నాసా వాయుర్మహాత్మనః ॥ 56 ॥

చంద్రసూర్యులు నేత్రాలలో, ఆకాశం శిరస్సులో, పృథివి పాదాలలో, పాదాల వ్రేళ్ళలో పిశాచాలు, చేతి వ్రేళ్ళలో గుహ్యకులు, విశ్వేదేవతలు మోకాళ్ళలో, సురోత్తములైన సాధ్యులు పిక్కలలో, గోళ్ళలో, యక్షులు, రేఖలలో అప్సరసలు, సకలనక్షత్రగణం చూపులలో, కేశాలలో, సూర్యకిరణాలు, రోమకూపాలలో, తారాగణాలు, రోమాలలో మహర్షులు, చేతులలో విదిశలు, శ్రోత్రాలలో దిశలు, చెవులలో అశ్వినీదేవతలు, ముక్కులో వాయువు కనబడినారు.

ప్రసాదశ్చంద్రమా దేవో మనో ధర్మః సమాశ్రితః ।
సత్యం తస్యాభవద్వాణీ జిహ్వా దేవీ సరస్వతీ ॥ 57 ॥

గ్రీవాదితిర్దేవమాతా విద్యాస్తద్వలయస్తథా ।
స్వర్గద్వారమభూన్మైత్రం త్వష్టా పూషా చ వై భ్రువౌ ॥ 58 ॥

ముఖం వైశ్వానరశ్చాస్య వృషణౌ చ ప్రజాపతిః ।
హృదయం చ పరం బ్రహ్మ పుంస్త్వం వై కశ్యపో మునిః ॥ 59 ॥

పృష్ఠేఽస్య వసవో దేవా మరుతః సర్వసంధిషు ।
సర్వసూక్తాని దశనా జ్యోతీంషి విమలప్రభాః ॥ 60 ॥

ప్రసన్నత్వంలో చంద్రుడు, మనస్సులో ధర్మం, వాక్కులో సత్యం, నాలుకలో సరస్వతి, కంఠంలో అదితి, ముడుతలలో విద్యలు, స్వర్గద్వారంలో మైత్రి, త్వష్ట మరియు పూష ఇద్దరూ కనుబొమలలో, ముఖంలో వైశ్వానరుడు, అండకోశంలో ప్రజాపతి, హృదయంలో పరబ్రహ్మ, పుంస్త్వంలో కశ్యపముని, వీపులలో వసువులు, అన్నిసంధులలో మరుద్గణం, దంతాలలో సర్వసూక్తాలు, విమలకాంతులలో జ్యోతిర్గణం మొదలైనవి కనిపించాయి.

వక్షఃస్థలే మహాదేవో ధైర్యం చాస్య మహార్ణవాః ।
ఉదరే చాస్య గంధర్వాః సంభూతాశ్చ మహాబలాః ॥ 61 ॥

లక్ష్మీర్మేధా ధృతిః కాంతిః సర్వవిద్యాశ్చ వై కటిః ।
సర్వజ్యోతీంషి జానీహి తస్య తత్పరమం మహః ॥ 62 ॥

తస్య దేవాధిదేవస్య తేజః ప్రోద్భూతముత్తమమ్ ।
స్తనౌ కుక్షీ చ వేదాశ్చ ఉదరం చ మహామఖాః ॥ 63 ॥

ఇష్టయః పశుబంధాశ్చ ద్విజానాం చేష్టితాని చ ।

ఇక వక్షఃస్థలంలో మహాదేవుడు, ధైర్యంలో మహాసముద్రాలు, ఉదరంలో మహాబలవంతులైన గంధర్వులు, లక్ష్మి, మేధ, ధృతి, కాంతి, సర్వవిద్యలూ కటిప్రదేశంలో, అన్నివిధాలైన కాంతులు ఆతని పరమతేజస్సులో కనిపించాయి. ఈ విధంగా దేవాధిదేవుడైన ఆ పరమాత్ముడు పరమోత్కృష్టమైన తేజస్సుతో ప్రకాశించాడు. మరియు సాక్షాత్తూ యజ్ఞపురుషుడే అయిన ఆ శ్రీహరి స్తనాలు మరియు కుక్షిప్రదేశంలో వేదాలు, ఉదరంలో మహా యజ్ఞాలన్నీ, ఇష్టిలు, పశుబంధాలు, ద్విజుల కర్మలన్నీ కనిపించాయి.

తస్య దేవమయం రూపం దృష్ట్వా విష్ణోర్మహాబలాః ॥64॥

ఉపాసర్పంత దైత్యేంద్రాః పతంగా ఇవ పావకమ్ ।
ప్రమథ్య సర్వానసురాన్ పాదహస్తతలైర్విభుః ॥ 65 ॥

కృత్వా రూపం మహాకాయం జహారాశు స మేదినీమ్ ।
తస్య విక్రమతో భూమిం చంద్రాదిత్యౌ స్తనాంతరే ॥ 66 ॥

నాభౌ విక్రమమాణస్య సక్థిదేశస్థితావుభౌ ।

మహాబలశాలురైన దైత్యులందరూ సర్వదేవమయమైన శ్రీ మహావిష్ణువు రూపాన్ని చూచి మిడుతలు అగ్నిచెంతకు వలె ఈ భగవంతుని సమీపానికి వచ్చారు. అపుడు ఆ పరమాత్ముడు తనహస్తపాదతలములతో ఆ దైత్యులందరిని నలుగగొట్టి మహాకాయరూపాన్ని పొంది వెంటనే పృథివినంతటిని హరించినాడు. శ్రీహరి భూమిని దాటి విక్రమిస్తూండగా చంద్రాదిత్యులు ఆతని స్తనముల నడుమ ఇమిడినారు. ఆ తర్వాత తన విరాట్స్వరూపం వృద్ధిపొందుచుండగా వారిద్దరూ ఆ దేవుని నాభిప్రదేశానికి అటు తర్వాత తొడలకడకు వచ్చినారు.

పరం విక్రమతస్తస్య జానుమూలే ప్రభాకరౌ ॥ 67 ॥

విష్ణోరాస్తాం మహీపాల! దేవపాలనకర్మణి ।
జిత్వా లోకత్రయం కృత్స్నం హత్వా చాసుర పుంగవాన్ ॥ 68 ॥

పురందరాయ త్రైలోక్యం దదౌ విష్ణురురుక్రమః ।
సుతలం నామ పాతాలమధస్తాద్వసుధాతలాత్ ॥ 69 ॥

బలేర్దత్తం భగవతా విష్ణునా ప్రభవిష్ణునా ।
అథ దైత్యేశ్వరం ప్రాహ విష్ణుః సర్వేశ్వరేశ్వరః ॥ 70 ॥

అంతకంటె అధికంగా ద్యులోకానికి వ్యాప్తమై భగవంతుడు విక్రమిస్తుండగా ఆ సూర్యచంద్రులు ఆతని జానుమూలానికి వెళ్ళినారు. ఓ మహీపాలా! దేవతలను రక్షించుటకై ఈ విధంగా ముల్లోకాలను జయించి, అసురపుంగవులందరిని వధించి, విస్తృతమైన, పరివ్యాప్తమైన, పదవిన్యాసం కలవాడై శ్రీ మహావిష్ణువు ఇంద్రునికి ముల్లోకాలనిచ్చాడు. మరియు సుతలమనే పాతాళలోకాన్ని బలిచక్రవర్తికిచ్చాడు. తర్వాత సర్వేశ్వరేశ్వరుడైన శ్రీమహావిష్ణువు దైత్యేశ్వరునితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ – శ్రీభగవానుడు చెప్పాడు.

యత్త్వయా సలిలం దత్తం గృహీతం పాణినా మయా ।
కల్పప్రమాణం తస్మాత్తే భవిష్యత్యాయురుత్తమమ్ ॥ 71 ॥

వైవస్వతే తథాతీతే బలే మన్వంతరే హ్యథ ।
సావర్ణికే తు సంప్రాప్తే భవానింద్రో భవిష్యతి ॥ 72 ॥

బలీ! నీవు ఇచ్చిన జలాన్ని నేను నా చేతితో గ్రహించినదాని ఫలితంగా నీకు కల్పప్రమాణంగల దీర్ఘాయుష్యం కలుగుతుంది. మరియు వైవస్వతమన్వంతరం తరువాత సావర్ణికమన్వంతరసమయంలో నీవు ఇంద్రుడవవుతావు.

సాంప్రతం దేవరాజాయ త్రైలోక్యం సకలం మయా ।
దత్తం చతుర్యుగాణాం చ సాధికా హ్యేకసప్తతిః ॥ 73 ॥

నియంతవ్యా మయా సర్వే యే తస్య పరిపంథినః ।
తేనాహం పరయా భక్త్యా పూర్వమారాధితో బలే! ॥ 74 ॥

సుతలం నామ పాతాలం త్వమాసాద్య మనోరమమ్ ।
వసాసుర మమాదేశం యథావత్ పరిపాలయన్ ॥ 75 ॥

బలీ! నేనిపుడు ముల్లోకాలను సంపూర్ణంగా దేవరాజైన ఇంద్రునికి ఇచ్చినాను. ఇక డెబ్బై ఒక్క చతుర్యుగాల వరకు ఆతని శత్రువులందరిని నేను నియంత్రిస్తాను. ఎందుకనగా పూర్వం నన్ను ఆతడు పరమభక్తితో ఆరాధించాడు. కావున నేను నీకిచ్చిన మనోహరమైన సుతలమనే పాతాళలోకాన్ని నా ఆదేశానుసారం పరిపాలిస్తూ అక్కడనే నివసించు.

తత్ర దివ్యవనోపేతే ప్రాసాదశతసంకులే ।
ప్రోత్ఫుల్లపద్మసరసి స్రవచ్ఛుద్ధసరిద్వరే ॥ 76 ॥

సుగంధిధూపస్రగ్వస్త్ర వరాభరణభూషితః ।
స్రక్చందనాదిముదితో గేయనృత్యమనోరమే ॥ 77 ॥

పానాన్నభోగాన్వివిధానుపభుంక్ష్వ మహాసుర! ।
మమాజ్ఞయా కాలమిమం తిష్ఠ త్వం సతతం వృతః ॥ 78 ॥

దివ్యమైన వనాలతో, వందలాది రాజప్రాసాదాలతో, వికసించిన పద్మాలు గల సరస్సులతో, స్వచ్ఛమైన, పవిత్రమైన జలం కలిగిన నదులతో, సుగంధంతో కూడిన ధూపంతో, పుష్పమాలలు, వస్త్రాలు మరియు వివిధాభరణాలతో అలంకరించబడుతూ, చందనాదులతో మనోహరాలైన గేయనృత్యాదులతో సంతుష్టుడవుతూ, వివిధాన్నపానాది భోగాలతో నా ఆజ్ఞానుసారం నేను చెప్పినంత కాలం వరకు అక్కడే నివసించు!

యావత్సురైశ్చ విప్రైశ్చ న విరోధం కరిష్యసి ।
తావదేతాన్మహాభోగాన్ అవాప్స్యసి మహాసుర! ॥ 79 ॥

యదా చ దేవవిప్రాణాం విరోధం త్వం కరిష్యసి ।
బంధిష్యంతి తదా పాశాః వరుణాస్త్వామసంశయమ్ ॥ 80 ॥

ఏతద్విదిత్వా భవతా మయాజ్ఞప్తమశేషతః ।
న విరోధః సురైః కార్యో విప్రైర్వా దైత్యసత్తమ! ॥ 81 ॥

ఓ మహాసురా! దేవతలకు మరియు విప్రులకు ఎంతవరకైతే నీవు విరోధం ప్రకటించకుండా ఉంటావో అంతవరకు ఈ మహాభోగాలన్నింటిని పొందుతావు. ఎప్పుడైతే నీవు దేవతలు మరియు విప్రుల విషయంలో విరోధం ప్రకటిస్తావో అప్పుడు నిన్ను నిస్సందేహంగా ఈ వరుణపాశాలు బంధిస్తాయి. ఈ విషయాన్ని నీవు చక్కగా తెలిసికొని నా ఆజ్ఞలను అనుసరించు. ఓ దైత్యసత్తమా! దేవతలతో మరియు విప్రులతో ఎప్పుడూ విరోధించకూడదు.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

ఇత్యేవముక్తో దేవేన విష్ణునా ప్రభవిష్ణునా ।
బలిః ప్రాహ మహారాజ! ప్రణిపత్య ముదా యుతః ॥ 82 ॥

మహారాజా! ప్రభవిష్ణువులైన శ్రీమహావిష్ణువు ఈ విధంగా వివరించగా బలిచక్రవర్తి సంతోషంతో కూడిన మనస్సుకలవాడై భగవంతునికి సాదరంగా నమస్కరించి ఈ విధంగా చెప్పాడు.

బలిరువాచ – బలిచక్రవర్తి చెప్పాడు.

తత్రాసతో మే పాతాలే భగవన్ భవదాజ్ఞయా ।
కిం భవిష్యత్యుపాదానం ఉపభోగోపపాదకమ్ ॥ 83 ॥

ఓ భగవంతుడా! నీ ఆదేశాన్ననుసరించి నేను పాతాళలోకంలో నివసించే సమయంలో ఎటువంటి భోగసాధనాలైన వస్తువులను గ్రహించడానికి నాకు అధికారముంటుంది?

శ్రీ భగవానువాచ – భగవంతుడు చెప్పాడు.

దానాన్యవిధిదత్తాని శ్రాద్ధాన్యశ్రోత్రియాణి చ ।
హుతాన్యశ్రద్ధయా యాని తాని దాస్యంతి తే ఫలమ్ ॥ 84 ॥

అదక్షిణాస్తథా యజ్ఞాః క్రియాశ్చావిధినా కృతాః ।
ఫలాని తవ దాస్యంతి అధీతాన్యవ్రతాని చ ॥ 85 ॥

యథావిధిగా చేయబడని దానాలు, శ్రోత్రియులు కాని వారు ఆచరించిన శ్రాద్ధకర్మలు, శ్రద్ధ లేకుండా అర్పించిన హవిస్సులు మొదలైనవి నీకు ఫలితమునిస్తాయి. అలాగే దక్షిణలులేని యజ్ఞాలు, యథావిధిగా ఆచరించని క్రియాకర్మలు, వ్రతరహితాలైన అధ్యయనాలు కూడ నీకు ఫలప్రాప్తి కలిగిస్తాయి.

శౌనక ఉవాచ – శౌనక మహర్షి చెప్పాడు.

బలేర్వరమిమం దత్త్వా శక్రాయ త్రిదివం తథా ।
వ్యాపినా తేన రూపేణ జగామాదర్శనం హరిః ॥ 86 ॥

ప్రశశాస యథాపూర్వం ఇంద్రస్త్రైలోక్యపూజితః ।
సిషేవే చ పరాన్ కామాన్ బలిః పాతాలసంస్థితః ॥ 87 ॥

ఈ విధంగా బలిచక్రవర్తికి వరాన్నిచ్చి, ఇంద్రునికి స్వర్గాధిపత్యాన్నిచ్చి, మూడు లోకాలలో వ్యాపించిన తన విరాట్ స్వరూపాన్ని వదిలి, భగవంతుడు అదృశ్యమయ్యాడు. తర్వాత త్రిలోకపూజితుడైన ఇంద్రుడు పూర్వం వలె స్వర్గలోకాన్ని పాలించాడు. మరియు పాతాళలోకంలో నివసిస్తూ బలిచక్రవర్తి కూడ తన మనోరథాలను సేవించాడు.

ఇహైవ దేవదేవేన బద్ధోఽసౌ దానవోత్తమః ।
దేవానాం కార్యకరణే భూయోఽపి జగతి స్థితః ॥ 88 ॥

సంబంధీ తే మహాభాగ! ద్వారకాయాం వ్యవస్థితః ।
దానవానాం వినాశాయ భారావతరణాయ చ ॥ 89 ॥

యతో యదుకులే కృష్ణో భవతః శత్రునిగ్రహే ।
సహాయభూతః సారథ్యం కరిష్యతి బలానుజః ॥ 90 ॥

ఏతత్సర్వం సమాఖ్యాతం వామనస్య చ ధీమతః ।
అవతారం మహావీర! శ్రోతుమిచ్ఛేస్త్వవార్జున ॥ 91 ॥

ఓ మహానుభావా! ఇక్కడే దేవదేవుడు దానవోత్తముడైన బలిచక్రవర్తిని బంధించాడు. మరియు దేవతలకోసం భగవంతుడు మరల పృథివిపై అవతరించాడు. ద్వారకానగరంలో జన్మించి, శత్రువులను వధించి, భూభారాన్ని

తగ్గించుటకై యదుకులంలో శ్రీకృష్ణుడుగా అవతరించాడు. ఓ మహావీరా! అర్జునా! శత్రువులను నియంత్రించుటకై నీకు సారథ్యం వహించి బలరామానుజుడు నీకు సహాయపడతాడు. ఈ విధంగా ఉత్సాహంతో వినాలనే కోరిక గలిగిన నీకు పరమాత్ముడైన వామనుని అవతారాన్ని గురించి వివరించాను.

అర్జున ఉవాచ – అర్జునుడు చెప్పాడు.

శ్రుతవానిహ తే పృష్టం మాహాత్మ్యం కేశవస్య చ ।
గంగాద్వారమితో యాస్యామ్యనుజ్ఞాం దేహి మే విభో! ॥ 92 ॥

విభూ! నేనడిగిన శ్రీమహావిష్ణువు మాహాత్మ్యాన్ని నీ ద్వారా విన్నాను. ఇక ఇపుడు ఇక్కడినుండి గంగాద్వారానికి వెళ్ళతాను. అనుజ్ఞనిమ్మని అర్జునుడు శౌనకుని అడిగాడు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఏవముక్త్వా యయౌ పార్థో నైమిషం శౌనకో గతః ।
ఇత్యేతద్దేవదేవస్య విష్ణోర్మాహాత్మ్యముత్తమమ్ ।
వామనస్య పఠేద్యస్తు సర్వపాపైః ప్రముచ్యతే ॥ 93 ॥

ఆ విధంగా ఆజ్ఞను తీసుకుని అర్జునుడు గంగాద్వారానికి మరియు శౌనకుడు నైమిషారణ్యానికి వెళ్ళారు. దేవదేవుడైన శ్రీమహావిష్ణువు అవతారమైన వామనుని ఉత్తమమాహాత్మ్యాన్ని పఠించినవారు సర్వపాపాల నుండి విముక్తి పొందుతారు.

బలిప్రహ్లాదసంవాదం మంత్రితం బలిశుక్రయోః ।
బలేర్విష్ణోశ్చ కథితం యః స్మరిష్యతి మానవః ॥ 94 ॥

నాఽఽధయో వ్యాధయస్తస్య న చ మోహాకులం మనః ।
భవిష్యతి ద్విజశ్రేష్ఠాః పుంసస్తస్య కదాచన ॥ 95 ॥

చ్యుతరాజ్యో నిజం రాజ్యమిష్టాప్తిం చ వియోగవాన్ ।
అవాప్నోతి మహాభాగో నరః శ్రుత్వా కథామిమామ్ ॥ 96 ॥

బలిప్రహ్లాద సంవాదాన్ని, బలిశుక్రుల సంభాషణను, బలిచక్రవర్తికి శ్రీమహావిష్ణువు వివరించిన విషయాన్ని ఏ మానవుడు స్మరిస్తాడో అతనికి మానసిక, శారీరక బాధలుండవు. మనస్సు మోహాన్ని పొందదు. ఈ కథను వింటే రాజ్యభ్రష్టులైనవారు రాజ్యాన్ని పొందుతారు. ఇష్టజనుల వియోగం నుండి బయటపడతారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వామనప్రాదుర్భావో నామ షట్ చత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః ॥246॥

శ్రీ మత్స్యమహాపురాణంలో వామనావతారమనే రెండువందల నలబైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తచత్వారింశదధికశతతమోఽధ్యాయః – రెండువందల నలభైఏడవ అధ్యాయం

వరాహప్రాదుర్భావః – వరాహావతారం

అర్జున ఉవాచ – అర్జునుడు చెప్పాడు.

> **ప్రాదుర్భావాన్ పురాణేషు విష్ణోరమితతేజసః ।**
> **సతాం కథయతాం విప్ర! వారాహ ఇతి నః శ్రుతమ్ ॥ 1 ॥**
>
> **జానే న తస్య చరితం న విధిం న చ విస్తరమ్ ।**
> **న కర్మగుణసంఖ్యానం న చాద్యన్తం మనీషిణః ॥ 2 ॥**
>
> **కిమాత్మకో వరాహోఽసౌ కిం మూర్తిః కస్య దేవతా ।**
> **కిం ప్రమాణః కిం ప్రభావః కిం వా తేన పురా కృతమ్ ॥ 3 ॥**
>
> **ఏతన్మే శంస తత్త్వేన వారాహం శ్రుతివిస్తరమ్ ।**
> **యథార్థం చ సమేతానాం ద్విజాతీనాం విశేషతః ॥ 4 ॥**

ఓ విప్రా! అనుపమాన తేజస్సు గల శ్రీమహావిష్ణువు అవతారాల గురించి మహానుభావుల ద్వారా పురాణాలలో మేము వరాహావతారం గురించి కూడ వినియున్నాము. కాని ఆ అవతారం చరిత్ర నాకు తెలియదు. విధిక్రమం కూడ తెలియదు. దాని విస్తరణ కూడ తెలియదు. ఆ అవతారపు కర్మలు–గుణాలు– ఆద్యంతాలను గురించి కూడ నాకు తెలియదు. అసలు వరాహుడెవడు? ఎటువంటివాడు? ఆతని మూర్తిత్వమెలా ఉంటుంది? ఆయనకు సంబంధించిన దేవత ఎవరు? ఆయన ప్రమాణమెటువంటిది? ఆతని ప్రభావమెలా ఉంటుంది? పూర్వం ఆతను ఆచరించిన కర్మలేవి? వరాహావతారానికి సంబంధించిన ఇలాంటి విషయాలన్నీ పురాణాలలో వివరించిన విధానాన్ని మాకు తెలుపు. విశేషించి ద్విజాతులందరితో కూడివున్న మాకు ఆ మహత్వాన్ని వివరించు.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

> **ఏతత్తే కథయిష్యామి పురాణం బ్రహ్మసమ్మితమ్ ।**
> **మహావరాహచరితం కృష్ణస్యాద్భుతకర్మణః ॥ 5 ॥**
>
> **యథా నారాయణో రాజన్ వారాహం వపురాస్థితః ।**
> **దంష్ట్రయా గాం సముద్రస్థాముజ్జహారారిమర్దనః ॥ 6 ॥**
>
> **ఛందో గీర్భిరుదారాభిః శ్రుతిభిః సమలంకృతః ।**
> **మనః ప్రసన్నతాం కృత్వా నిబోధ విజయాధునా ॥ 7 ॥**

అర్జునా! అద్భుతమైన పనులు చేసే శ్రీకృష్ణుని బ్రహ్మసమ్మితమైన మహావరాహచరితాన్ని పురాణాలలో వర్ణించినట్లుగా వివరిస్తాను. ఓ రాజా! ఏ విధంగా శ్రీమహావిష్ణువు వరాహరూపాన్ని ధరించి, శత్రుమర్దనం చేసి సముద్రంలో వున్న భూమిని ఏ విధంగా తన దంష్ట్రలతో పైకి ఎత్తాడో, సుకోమలాలు, ఉదారాలూ, మరియు

ఛందోబద్ధాలైన వేదవాక్కులతో ఆ ఈశ్వరుడు ఎలా అభినందించబడినాడో అదంతా నీకు చెబుతాను. ఓ అర్జునా! ప్రసన్నచిత్తుడవై విను!

ఇదం పురాణం పరమం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్ ।
నానాశ్రుతిసమాయుక్తం నాస్తికాయ న కీర్తయేత్ ॥ 8 ॥

పురాణం వేదమఖిలం సాంఖ్యం యోగం చ వేద యః ।
కార్త్స్న్యేన విధినా ప్రోక్తం సౌఖ్యార్థం వై వదిష్యతి ॥ 9 ॥

వరాహవృత్తాంతం పరమ పురాతనమైనది, పుణ్యప్రదమైనది, వేదాలతో, అనేకవిధాలైన శాస్త్రాలతో, శ్రుతులతో కూడుకొనివున్నది. కావున దీనిని నాస్తికులకు వినిపించకూడదు. ఎవరైతే పురాణం, సమస్తవేదాలు, సాంఖ్యం, యోగం మొదలైన శాస్త్రాలన్నింటిని విధిపూర్వకంగా తెలుసుకొంటారో వారి సౌఖ్యం కోసమై ఈ కథ వినిపించవలసినది.

విశ్వేదేవాస్తథా సాధ్యా రుద్రాదిత్యాస్తథాఽఽశ్వినౌ ।
ప్రజానాం పతయశ్చైవ సప్త చైవ మహర్షయః ॥ 10 ॥

మనః సంకల్పజాశ్చైవ పూర్వజా ఋషయస్తథా ।
వసవో మరుతశ్చైవ గంధర్వా యక్షరాక్షసాః ॥ 11 ॥

దైత్యాః పిశాచా నాగాశ్చ భూతాని వివిధాని చ ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రా మ్లేచ్ఛాశ్చ యే భువి ॥ 12 ॥

చతుష్పదాని సర్వాణి తిర్యగ్యోనిశతాని చ ।
జంగమాని చ సత్త్వాని యచ్చాన్యజ్జీవసంజ్ఞితమ్ ॥ 13 ॥

పూర్ణే యుగసహస్రే తు బ్రాహ్మేఽహని తథాగతే ।
నిర్వాణే సర్వభూతానాం సర్వోత్పాతసముద్భవే ॥ 14 ॥

హిరణ్యరేతాస్త్రిశిఖస్తతో భూత్వా వృషాకపిః ।
శిఖాభిర్విధమల్లోకానశోషయత వహ్నినా ॥ 15 ॥

విశ్వేదేవతలు, సాధ్యులు, రుద్రులు, ఆదిత్యులు, అశ్వినీదేవతలు, ప్రజాపతులు, సప్తమహర్షులు, మనః సంకల్పంతో మాత్రమే జన్మించిన అనేకమంది పూర్వఋషులు, అష్టవసువులు, మరుత్తులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, దైత్యులు, పిశాచులు, నాగులు, భూతగణం, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, మ్లేచ్ఛులు, చతుష్పాదులు, వందలకొలది తిర్యగ్యోనిజనిత జంతువులు, స్థావరజంగమజీవగణాలు మొదలైనవన్నీ దివ్యయుగసహస్రాంతకాలంలో బ్రహ్మకు ఒకరోజు గడిచిన పిదప సకలజీవగణాన్ని నశింపజేసే అనేకఉపద్రవాలు ఉద్భవిస్తుండగా హిరణ్యరేతస్కుడు మరియు వృషాకపి అనే పేరుతో ప్రసిద్ధుడైన భగవంతుడు మూడు శిఖలు గల అగ్నితో లోకాలను దహించివేస్తాడు.

దహ్యమానాస్తతస్తస్య తేజోరాశిభిరుద్గతైః ।
వివర్ణవర్ణా దగ్ధాంగా హతార్చిష్మద్భిరాననైః ॥ 16 ॥

సాంగోపనిషదో వేదా ఇతిహాసపురోగమాః ।
సర్వవిద్యాః క్రియాశ్చైవ సర్వధర్మపరాయణాః ॥ 17 ॥

బ్రహ్మాణమగ్రతః కృత్వా ప్రభవం విశ్వతోముఖమ్ ।
సర్వదేవగణాశ్చైవ త్రయస్త్రింశస్తు కోటయః ॥ 18 ॥

తస్మిన్నహని సంప్రాప్తే తం హంసం మహదక్షరమ్ ।
ప్రవిశంతి మహాత్మానం హరిం నారాయణం ప్రభుమ్ ॥ 19 ॥

అపుడు ఉన్నతాలైన ఆతని తేజోరాశులచే దహించబడుతూ, ఆ అగ్నిముఖాలనుండి వస్తున్న జ్వాలలతో హతములవుతూ, వికృతాలైన వర్ణాలను పొందుతూ దహించబడిన అంగాలు కలవై వేద-వేదాంగ-ఉపనిషత్-పురాణేతిహాసాది విద్యలన్నీ, సర్వక్రియలు, సర్వధర్మపరాయణులు, ముప్పది మూడు కోట్ల సర్వదేవతా గణాలు, విశ్వతోముఖుడు, లోకాలను పుట్టించిన బ్రహ్మను ముందుంచుకొని ఆ రోజు ముగిసిన వెంటనే అక్షరుడు, మహాత్ముడూ అయిన ఆ శ్రీమన్నారాయణునిలో ప్రవేశిస్తారు.

తేషాం భూయః ప్రవృత్తానాం నిధనోత్పత్తిరుచ్యతే ।
యథా సూర్యస్య సతతం ఉదయాస్తమనే ఇహ ॥ 20 ॥

పూర్ణం యుగసహస్రాంతే కల్పే నిఃశేష ఉచ్యతే ।
యస్మిన్ జీవకృతం సర్వే నిఃశేషం సమతిష్ఠత ॥ 21 ॥

సంహృత్య లోకానఖిలాన్ సదేవాసురమానుషాన్ ।
కృత్వా సుసంస్థా భగవానాస్త ఏకో జగద్గురుః ॥ 22 ॥

ఏ ప్రకారంగా సూర్యభగవానుని ఉదయాస్తమయాలు నిశ్చయించబడి ఉన్నాయో అలాగే మరల మరల ప్రవర్తమానమయ్యే ఈ లోకంలో ప్రాణుల ఉత్పత్తివినాశాలు జరుగుతూనే ఉంటాయి. యుగసహస్రాంతమైన కల్పం పూర్ణం కాగా సర్వమూ నిఃశేషమవుతుంది. అప్పుడు సమస్తజీవరాశుల కార్యాలు కూడ నిఃశేషాలవుతాయి. అప్పుడు దేవతలు, అసురులు, మానవులు మొదలగువారితో లోకాలనన్నింటిని సంహరించి (తనలో కలుపుకొని.) జగద్గురువైన భగవానుడు ఒక్కడే ఉంటాడు.

స స్రష్టా సర్వభూతానాం కల్పాంతేషు పునః పునః ।
అవ్యయః శాశ్వతో దేవో యస్య సర్వమిదం జగత్ ॥ 23 ॥

సర్వభూతస్రష్ట, అవ్యయుడు, శాశ్వతుడూ అయిన ఆ పరమాత్ముడు ఆయా కల్పాంతాలు జరిగిన వెంటనే మరల మరల ఈ జగత్తునంతటిని సృష్టిస్తూ ఉంటాడు.

నష్టార్కకిరణే లోకే చంద్రగ్రహవివర్జితే ।
త్యక్తధూమాగ్నిపవనే క్షీణయజ్ఞవషట్క్రియే ॥ 24 ॥

అపక్షిగణసంపాతే సర్వప్రాణిహరే పథి ।
అమర్యాదాకులే రౌద్రే సర్వతస్తమసావృతే ॥ 25 ॥

అదృశ్యే సర్వలోకేఽస్మిన్నభావే సర్వకర్మణామ్ ।
ప్రశాంతే సర్వసంపాతే నష్టే వైరపరిగ్రహే ॥ 26 ॥

గతే స్వభావసంస్థానే లోకే నారాయణాత్మకే ।
పరమేష్ఠీ హృషీకేశః శయనాయోపచక్రమే ॥ 27 ॥

ఎప్పుడైతే లోకంలో సూర్యుని కిరణాలుండవో, చంద్రుడు మరియు ఇతర గ్రహాలుండవో, ధూమం, అగ్ని, వాయువు, ఈ లోకాన్ని విడిచిపెడతాయో, యజ్ఞాలలో వషట్కారాదుల ధ్వని నశిస్తుందో, పక్షిసమూహాల సంఘాతం ఆగిపోతుందో, మార్గాలన్నీ సర్వప్రాణిశూన్యాలైపోతాయో, రౌద్రం మర్యాదను దాటి వ్యాప్తిచెందుతుందో, అంతటా చీకటి వ్యాపిస్తుందో, లోకాలన్నీ అదృశ్యమైపోతాయో, కర్మలన్నీ లేకుండాపోతాయో, సంఘర్షణాలన్నీ ప్రశాంతాలైపోతాయో, శత్రుత్వభావన నశించిపోతుందో, లోకమంతా నారాయణాత్మకమై తనస్వభావంలో నిలుస్తుందో, అప్పుడు పరమేష్ఠి, హృషీకేశుడూ అయిన శ్రీహరి శయనించుటకుపక్రమిస్తాడు.

పీతవాసా లోహితాక్షః కృష్ణో జీమూతసన్నిభః ।
శిఖాసహస్రవికచజటాభారం సముద్వహన్ ॥ 28 ॥

శ్రీవత్సలక్ష్మణధరం రక్తచందనభూషితమ్ ।
వక్షో బిభ్రన్ మహాబాహుః స విష్ణురివ తోయదః ॥ 29 ॥

పుండరీకసహస్రేణ స్రగస్య శుశుభే శుభా ।
పత్నీ చాస్య స్వయం లక్ష్మీర్దేహమావృత్య తిష్ఠతి ॥ 30 ॥

ఆ సమయంలో పీతాంబరధరుడు, లోహితాక్షుడు, నీలమేఘశ్యాముడు అయిన కృష్ణుడు, జ్వాలలతోసహస్ర జటాభారాన్ని వహిస్తూ, శ్రీవత్సలాంఛనంతో రక్తచందనంతో అలంకరించబడిన వక్షము కలవాడై, మెరపులతో మెరిసే మేఘం వంటి వన్నెతో, శోభాయమానమైన వేలకొలది పద్మాలతో కూర్చబడిన మాలను ధరించి ప్రకాశిస్తూ ఉంటాడు. ఆతని పత్నియైన లక్ష్మీదేవి ఆతని దేహాన్నావరించి ఉంటుంది.

తతః స్వపితి శాంతాత్మా సర్వలోకే శుభావహః ।
కిమప్యమితయోగాత్మా నిద్రాయోగముపాగతః ॥ 31 ॥

తతో యుగసహస్రే తు పూర్ణే స పురుషోత్తమః ।
స్వయమేవ విభుర్భూత్వా బుధ్యతే విబుధాధిపః ॥ 32 ॥

తతశ్చింతయతే భూయః సృష్టిం లోకస్య లోకకృత్ ।
నరాన్ దేవగణాంశ్చైవ పారమేష్ఠ్యేన కర్మణా ॥ 33 ॥

తతః సంచింతయన్ కార్యం దేవేషు సమితింజయః ।
సంభవం సర్వలోకస్య విదధాతి సతాం గతిః ॥ 34 ॥

తర్వాత శాంతాత్ముడు, సర్వలోకశుభకరుడు, యోగాత్ముడూ అయిన భగవానుడు నిద్రానిమగ్నుడవుతాడు. ఒక దివ్యయుగసహస్రం సమాప్తి పొందిన పిదప విబుధాధిపతియైన ఆ పరమాత్ముడు పురుషోత్తముడు స్వయంగానే మేల్కొని మరల లోకసృష్టి గురించి ఆలోచిస్తాడు. అపుడు లోకకర్తయై పరమేష్ఠి కార్యాన్ననుసరించి దేవగణాలను, నరులను ఇతర ప్రాణులను సృష్టిస్తాడు. తర్వాత దేవతలకు కావలసిన కార్యాలను విచారించినవాడై సజ్జనులందరికి సద్గతిని ప్రసాదించే పరమాత్ముడు సకలలోకాల సృష్టిని ఆరంభిస్తాడు.

కర్తా చైవ వికర్తా చ సంహర్తా వై ప్రజాపతిః ।
నారాయణః పరం సత్యం నారాయణః పరం పదమ్ ॥ 35 ॥

నారాయణః పరో యజ్ఞో నారాయణః పరా గతిః ।
స స్వయంభూరితి జ్ఞేయః స స్రష్టా భువనాధిపః ॥ 36 ॥

స సర్వమితి విజ్ఞేయో హ్యేష యజ్ఞః ప్రజాపతిః ।
యద్వేదితవ్యస్త్రిదశైస్తదేష పరికీర్త్యతే ॥ 37 ॥

ఈ సకల లోకాలకు సృష్టిస్థితిలయకారకుడు ఆ శ్రీహరే. ఆయనే ప్రజాపతి, ఆ శ్రీమన్నారాయణుడే పరమసత్యం, పరమపదం, పరమయజ్ఞం, పరమగతి. స్వయంభువు అయిన ఆ శ్రీమన్నారాయణుడే సకల భువనాలకధిపతి మరియు సర్వమూ అతడే అని తెలిసినవాడు. దేవతలందరూ కూడ తెలిసికోవలసింది ఆ తత్త్వమే అని శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి.

యత్తు వేద్యం భగవతో దేవా అపి న తద్విదుః ।
ప్రజానాం పతయః సర్వే ఋషయశ్చ సహామరైః ॥ 38 ॥

నాస్యాంతమధిగచ్ఛంతి విచిన్వన్త ఇతి శ్రుతిః ।
యదస్య పరమం రూపం న తత్పశ్యంతి దేవతాః ॥ 39 ॥

ప్రాదుర్భావే తు యద్రూపం తదర్చంతి దివౌకసః ।
దర్శితం యది తేనైవ తదవేక్ష్యంతి దేవతాః ॥ 40 ॥

యన్న దర్శితవానేష కస్తదన్వేష్టుమీహతే ।
గ్రామ్యాణాం సర్వభూతానామగ్నిమారుతయోర్గతిః ॥

ఆ భగవంతుని గురించి తెలిసికోవలసిన అసలైన తత్త్వాన్ని దేవతలు కూడ తెలుసుకోలేకపోయారు. ప్రజాపతులు, మహర్షులు, దేవతలు, మొదలైన వారెవ్వరూ ఆ పరమాత్ముని అంతాన్ని తెలుసుకోలేక ఇంకనూ

దానికోసం ప్రయత్నిస్తున్నారని వేదాలు చెబుతున్నాయి. పరమోత్కృష్టమైన ఆ పరాత్పరుని రూపాన్ని దేవతలు కూడ చూడకున్నారు. కాని ఆతను అవతారాలెత్తినప్పుడు మాత్రమే ఆయా అవతారాలకు సంబంధించిన రూపాన్ని చూడగలుగుతున్నారు. అర్చిస్తున్నారు. అయినా ఆ పరమాత్ముడు స్వయంగా దర్శనం కలిగించక పోయినప్పుడు ఆతనిని తెలుసుకొనుటకు ఎవరికి సాధ్యమవుతుంది? సర్వభూతములకు అగ్నిమారుతములకు గతి అతడే.

తేజసస్తపసశ్చైవ నిధానమమృతస్య చ ॥ 41 ॥

చతురాశ్రమధర్మేశశ్చాతుర్హోత్రఫలాశనః ।
చతుఃసాగరపర్యన్తశ్చతుర్యుగనివర్తకః ॥ 42 ॥

తదేష సంహృత్య జగత్ కృత్వా గర్భస్థమాత్మనః ।
ముమోచాండం మహాయోగీ ధృతం వర్షసహస్రకమ్ ॥ 43 ॥

మరియు తేజస్సుకు, తపస్సుకు, అమృతానికి ఆ పరమాత్ముడే మూలం. చతురాశ్రమాలకు అతనే ధర్మేశుడు. నాలుగు యజ్ఞాల ఫలాన్ని అనుభవించేవాడూ ఆ దేవుడే. నాలుగు సముద్రాల వరకు వ్యాప్తమైనవాడు, నాలుగు యుగాలను నిర్వహించేవాడు, ఆ భగవానుడే. ఈ సమస్త జగత్తును ఉపసంహరించి, దానిని వెయ్యి దివ్యసంవత్సరాల వరకు తన కడుపులో నిలుపుకొంటాడు. ఆ తరువాత ఆ మహాయోగి ఆ అండాన్ని మరల వదిలిపెడతాడు.

సురాసురద్విజభుజగాప్సరోగణైః ద్రుమౌషధిక్షితిధరయక్షగుహ్యకైః ।
ప్రజాపతిః శ్రుతిభిరసంకులం తదా స వై౽సృజజ్జగదిదమాత్మనా ప్రభుః ॥ 44 ॥

తర్వాత ప్రజాపతియైన ఆ భగవానుడు తన ఆత్మనుండి దేవతలు, రాక్షసులు, పక్షులు, సర్పాలు, అప్సరస సమూహాలు, వృక్షాలు, ఓషధులు, పర్వతాలు, యక్షులు, గుహ్యకులు మొదలైన వాటితో కూడిన, వేదాలు లేని ఈ జగత్తును సృష్టించాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వరాహప్రాదుర్భావో నామ సప్తచత్వారింశదధిక ద్విశతతమో౽ధ్యాయః ॥247॥

శ్రీ మత్స్యమహాపురాణంలో వరాహావతారమనే రెండువందల నలభైఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టచత్వారింశదధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల నలభైఎనిమిదవ అధ్యాయం

వరాహ ప్రాదుర్భావః – వరాహప్రాదుర్భావం

శౌనక ఉవాచ – శౌనకమహర్షి చెప్పాడు.

జగదండమిదం పూర్వమాసీద్దివ్యం హిరణ్మయమ్ ।
ప్రజాపతేరియం మూర్తిః ఇతీయం వైదికీ శ్రుతిః ॥ 1 ॥

తత్తు వర్షసహస్రాంతే బిభేదోర్ధ్వముఖం విభుః ।
లోకసర్జనహేతోస్తు బిభేదాధోముఖం నృప ॥ 2 ॥

భూయోఽష్టధా బిభేదాండం విష్ణుర్వై లోకజన్మకృత్ ।
చకార జగతశ్చాత్ర విభాగం స విభాగకృత్ ॥ 3 ॥

అర్జునా! పూర్వం ఈ జగమంతా హిరణ్మయమైన, దివ్యమైన అండంగా ఉండినది. ఈ అండమే ప్రజాపతిమూర్తి అని వేదాల ద్వారా వినబడుతున్నది. వెయ్యి సంవత్సరాలైన తరువాత ఈ అండమే పరమాత్మ ప్రేరణచేత ఊర్ధ్వముఖంగా భిన్నమైంది. మరల లోకసృష్టికొరకై ఆ విభుడే దానిని అధోముఖంగా కూడ భేదించాడు. లోక జన్మకర్తయైన శ్రీమహావిష్ణువు మరల ఆ అండాన్ని ఎనిమిది భాగాలుగా విభజించాడు మరియు వాటితో ప్రపంచాన్ని విభజించాడు.

యచ్ఛిద్రమూర్ధ్వమాకాశం వివరాకృతితాం గతమ్ ।
విహితం విశ్వయోగేన యదధస్తాద్రసాతలమ్ ॥ 4 ॥

యదండమకరోత్ పూర్వం దేవో లోకచికీర్షయా।
తత్ర యత్ సలిలం స్కన్నం సోఽభవత్ కాంచనో గిరిః ॥ 5 ॥

శైలైః సహస్రైర్మహతీ మేదినీ విషమాఽభవత్ ॥ 6 ॥

వాటిలో పైభాగాన వున్న రంధ్రం ఆకాశంగా ఏర్పడింది. తర్వాత విశ్వయోగి అయిన పరమాత్మ క్రింది భాగాన్ని రసాతలంగా ఏర్పరచినాడు. భగవంతుడు లోక సృష్టిచేయుటకు నిర్మించి నీటిలో వేసిన అండం కాంచనగిరి (మేరుపర్వతం)గా ఉద్భవించింది. ఆ తరువాత ఆ మేరుపర్వతంతో పాటు ఉద్భవించిన వేలకొలది పర్వతాలతో పృథివి విషమత్వాన్ని పొందింది.

తైశ్చ పర్వతజాలౌఘైః బహుయోజనవిస్తృతైః ।
పీడితా గురుభిర్దేవీ వ్యథితా మేదినీ తదా ॥ 7 ॥

మహామతే భూరిబలం దివ్యం నారాయణాత్మకమ్ ।
హిరణ్మయం సముత్సృజ్య తేజో వై జాతరూపిణమ్ ॥ 8 ॥

అశక్తా వై ధారయితుమధస్తాత్ ప్రావిశత్తదా ।
పీడ్యమానా భగవతః తేజసా తస్య సా క్షితిః ॥ 9 ॥

పృథ్వీం విశంతీం దృష్ట్వా తు తామధో మధుసూదనః ।
ఉద్ధారార్థం మనశ్చక్రే తస్యా వై హితకామ్యయా ॥ 10 ॥

అప్పుడు అనేక యోజనాల మేర విస్తరించిన ఆ పర్వతసమూహాలభారంతో పృథివి పీడించబడి మిక్కిలి వ్యథ చెందింది. ఓ మహామతీ! మహాపరాక్రమవంతుడైన శ్రీమన్నారాయణుని చేత సృష్టించబడిన దివ్యమైన ఆ హిరణ్మయ తేజస్సును వహించలేక పృథివి క్రిందకు క్రుంగిపోయింది. ఆ విధంగా భగవంతుని తేజస్సుచే పీడించబడి క్రిందకు పడిపోతున్న ఆ పృథివిని చూచి మధుసూదనుడు లోకకల్యాణార్థమై దానిని ఉద్ధరించాలని సంకల్పించాడు.

భగవానువాచ – శ్రీభగవానుడు చెప్పాడు.

మత్తేజ ఏషా వసుధా సమాసాద్య తపస్వినీ ।
రసాతలం ప్రవిశతి పంకే గౌరివ దుర్బలా ॥ 11 ॥

నేను సృష్టించిన తేజస్సును వహించలేక దయనీయస్థితిని పొందిన ఈ వసుధ బలహీనమైన ఆవు బురదలో చిక్కుకున్నట్లుగా రసాతలాన్ని ప్రవేశిస్తున్నది.

పృథివ్యువాచ – పృథివీదేవత చెప్పింది.

త్రివిక్రమాయామితవిక్రమాయ మహావరాహాయ సురోత్తమాయ ।
శ్రీశార్ఙ్గచక్రాసిగదాధరాయ నమోఽస్తు తే దేవవర ప్రసీద ॥ 12 ॥

తవ దేహాజ్జగజ్జాతం పుష్కరద్వీపముత్థితమ్ ।
బ్రహ్మాణమిహ లోకానాం భూతానాం శాశ్వతం విదుః ॥ 13 ॥

అమిత పరాక్రమశాలివి, త్రివిక్రముడవు, సురోత్తముడవు, మహావరాహ స్వరూపాన్ని ధరించినవాడవు, లక్ష్మిని, ధనుస్సును, చక్రాన్ని, ఖడ్గాన్ని మరియు గదను ధరించినవాడవు. దేవతలలో శ్రేష్ఠుడవైన ఓ పరమాత్మా! నీకు నమస్సులు, నన్ను కరుణించు! ఓ దేవా! నీ దేహం నుండే ఈ జగత్తు ఉద్భవించింది. నీ శరీరం నుండే పుష్కరద్వీపం ఉద్భవించింది. నీ శరీరం నుండే ఉద్భవించిన బ్రహ్మదేవుడు ఈ లోకంలో సమస్త ప్రాణులను సృష్టించగలుగుతున్నాడు.

తవ ప్రసాదాద్దేవోఽయం దివం భుంక్తే పురందరః ।
తవ క్రోధాద్ధి బలవాన్ జనార్దన జితో బలిః ॥ 14 ॥

ధాతా విధాతా సంహర్తా త్వయి సర్వం ప్రతిష్ఠితమ్ ।
మనుః కృతాంతోఽధిపతిః జ్వలనః పవనో ఘనః ॥ 15 ॥

వర్ణాశ్చాశ్రమధర్మాశ్చ సాగరాస్తరవోఽచలాః ।
నద్యో ధర్మశ్చ కామశ్చ యజ్ఞా యజ్ఞస్య చ క్రియాః ॥ 16 ॥

విద్యా వేద్యం చ సత్త్వం చ హ్రీః శ్రీః కీర్తిర్ధృతిః క్షమా ।
పురాణం వేదవేదాంగం సాంఖ్యయోగౌ భవాభవౌ ॥ 17 ॥

జంగమం స్థావరం చైవ భవిష్యం చ భవం చ యత్ ।
సర్వం తచ్చ త్రిలోకేషు ప్రభావోపహితం తవ ॥ 18 ॥

ఓ జనార్దనా! నీ అనుగ్రహం వలననే దేవరాజైన ఇంద్రుడు స్వర్గలోకాన్ని పాలిస్తున్నాడు. నీ క్రోధం ద్వారా బలవంతుడైన బలిచక్రవర్తి జయించబడినాడు. నీవే ధాతవు, విధాతవు, సంహర్తవు. నీయందే సమస్త జగత్తులు ప్రతిష్ఠించబడినవి. అధిపతియైన మనువు, కృతాంతుడు, అగ్ని, పవనుడు, మేఘుడు, నాలుగు వర్ణాలు (కులాలు), ఆశ్రమధర్మాలు, సముద్రాలు, వృక్షాలు, పర్వతాలు, నదులు, ధర్మం, కామం, యజ్ఞం, యజ్ఞక్రియలు, విద్య, వేద్యం (తెలిసికోవలసిన తత్త్వం), సత్త్వం, లజ్జ, లక్ష్మి (సంపద), కీర్తి, ధైర్యం (పట్టుదల), ఓర్పు, పురాణం, వేదం, వేదాంగాలు, సాంఖ్యం, యోగం, జన్మ, మరణం, జంగమం, స్థావరం, భూత-భవిష్యద్వర్తమానాలు, ఈ ముల్లోకాలలో నీ ప్రభావం చేతనే నిలిచినవి.

త్రిదశోదారఫలదః స్వర్గస్త్రీచారుపల్లవః ।
సర్వలోకమనఃకాన్తః సర్వసత్త్వమనోహరః ॥ 19 ॥

విమానానేకవిటపః తోయదాంబుమధుస్రవః ।
దివ్యలోకమహాస్కంధః సత్యలోకప్రకాశవాన్ ॥ 20 ॥

సాగరాకారనిర్యాసో రసాతలజలాశ్రయః ।
నాగేంద్రపాదపోపేతో జంతుపక్షినిషేవితః ॥ 21 ॥

శీలాచారార్యగంధస్త్వం సర్వలోకమయో ద్రుమః ।

దేవతలకు ఉత్తమమైన ఫలమిచ్చేవాడవు నీవే. స్వర్గలోకంలోని రమణీమణులను జయించినవాడవు నీవే. లోకులందరి మనస్సుకి ఆహ్లాదాన్ని కలిగించేవాడవు నీవే. సకల జీవుల మనస్సులను హరించేవాడవు. విశాలంగా కనబడే ఆకాశమయమైన మహావనమూ నీవే. మధురమైన జలాన్ని వర్షించే మేఘుడవు, దివ్యమైన లోకాలన్నింటికీ మూలస్కంధుడవు, సత్యలోకాన్ని ప్రకాశింపజేసేవాడవు, సాగరాకారుడవు, రసాతలజలాశ్రయుడవు, ఐరావతం, కల్పవృక్షం, సమస్త జీవజంతుగణాలలో సేవించబడేవాడవు, సదాచారుడవు, ఆర్యుడవు, సర్వలోకమయమైన సుగంధ మహావృక్షమునూ నీవే.

ద్వాదశార్కమయో ద్వీపః రుద్రైకాదశపత్తనః ॥ 22 ॥

వస్వష్టాజలసంయుక్తః త్రైలోక్యాంభోమహోదధిః ।
సిద్ధసాధ్యోర్మికలిలః సుపర్ణానిలసేవితః ॥ 23 ॥

దైత్యలోకమహాగ్రాహో రక్షోరగరుషాకులః ।
పితామహమహాధైర్యః స్వర్గస్త్రీరత్నభూషితః ॥ 24 ॥

ధీశ్రీహ్రీకాంతిభిర్నిత్యం నదీభిరుపశోభితః ।
కాలయోగమహాపర్వప్రయోగగతివేగవాన్ ॥ 25 ॥

త్వం స్వయోగమహావీర్యో నారాయణమహార్ణవః ।
కాలో భూత్వా ప్రసన్నాభిరద్భిర్హ్లాదయసే పునః ॥ 26 ॥

ద్వాదశ సూర్యులనే ద్వీపాలు, ఏకాదశ రుద్రులనే పట్టణాలు, అష్ట వసువులనే పర్వతాలు, మూడు లోకాలనే మహాసముద్రం, సిద్ధులు, సాధ్యులు అనే అలలు, గరుడులనే వాయువులు, దైత్యలోకమనే మొసళ్ళు, రాక్షసులు, సర్పాలు అనే భయంకరమైన జలచరాలు, పితామహుడు అనే ధీరత్వం, స్వర్గస్త్రీలనే రత్నాలు, ధీ-హ్రీ-శ్రీ కాంతులనే నదులు, కాలాంశాలు, యోగాలు, మహాపర్వతాలనే వేగవంతమైన ప్రయోగాలు, ఆత్మయోగమనే మహావీర్యం, నారాయణుడనే మహాసముద్రం మొదలైనవన్నీ నీవే. నీవు కాలస్వరూడవై నిర్మలాలైన జలాల ద్వారా లోకాన్ని సృష్టించి మరల అందరిని ఆహ్లాదపరుస్తావు.

త్వయా సృష్టాస్త్రయో లోకాః త్వయైవ ప్రతిసంహృతాః।
విశంతి యోగినః సర్వే త్వామేవ ప్రతియోజితాః ॥ 27 ॥

యుగే యుగే యుగాంతాగ్నిః కాలమేఘో యుగే యుగే ।
మహాభారావతారాయ దేవ త్వం హి యుగే యుగే ॥ 28 ॥

నీ చేతనే సృష్టింపబడిన ముల్లోకాలు మరల నీలోనే లయమౌతాయి. యోగులందరూ నీచే ప్రేరితులై నీలోనే ప్రవేశిస్తారు. ఓ దేవా! ప్రతియుగాంతంలో కాలమేఘస్వరూపుడవైన యుగాంతాగ్నివి నీవే. ఈ భూమి భారాన్ని తగ్గించుటకై మరల నీవే అవతరిస్తావు.

త్వం హి శుక్లః కృతయుగే త్రేతాయాం చమ్పకప్రభః ।
ద్వాపరే రక్తసంకాశః కృష్ణః కలియుగే భవాన్ ॥ 29 ॥

వైవర్ణ్యమభిధత్సే త్వం ప్రాప్తేషు యుగసందిషు ।
వైవర్ణ్యం సర్వధర్మాణాముత్పాదయసి వేదవిత్ ॥ 30 ॥

ఓ దేవా! నీవు కృతయుగంలో తెలుపురంగు, త్రేతాయుగంలో సంపెంగ రంగు, ద్వాపరయుగంలో ఎరుపురంగు, కలియుగంలో నలుపురంగు కలవాడవు. మరియు ఆయా యుగాల సంధికాలాల్లో వివిధఛాయలను పొందుతావు. మరియు వేదవేత్తవైన నీవు సర్వధర్మాలకు వర్ణరాహిత్యాన్ని కలిగిస్తావు.

భాసి వాసి ప్రతపసి త్వం చ పాసి విచేష్టసే ।
క్రుధ్యసి క్షాంతిమాయాసి త్వం దీపయసి వర్షసి ॥ 31 ॥

త్వం హాస్యసి న నిర్యాసి నిర్వాపయసి జాగ్రసి ।
నిఃశేషయసి భూతాని కాలో భూత్వా యుగక్షయే ॥ 32 ॥

నీవు ప్రకాశిస్తావు, వీస్తావు, తపింపజేస్తావు, రక్షిస్తావు, అనేక కర్మలాచరిస్తావు, కోపిస్తావు, ఓర్పును పొందుతావు, ప్రకాశింపజేస్తావు, వర్షిస్తా, వదిలిపెడతావు, స్థిరంగా ఉంటావు, మేల్కొంటావు, మరియు యుగక్షయమయ్యేటప్పుడు కాలుడవై జీవులన్నింటిని మిగలకుండా చేస్తావు.

శేషమాత్మానమాలోక్య విశేషయసి త్వం పునః ।
యుగాంతాగ్న్యవలీఢేషు సర్వభూతేషు కించన ॥ 33 ॥

యాతేషు శేషో భవసి తస్మాచ్ఛేషోఽసి కీర్తితః ।
చ్యవనోత్పత్తి యుక్తేషు బ్రహ్మేంద్రవరుణాదిషు ॥ 34 ॥

యస్మాన్న చ్యవసే స్థానాత్తస్మాత్సంకీర్త్యసేఽచ్యుతః ।

అలా నిశ్శేషమైన తరువాత మిగిలిన (శేషం) నిన్ను నీవు చూసుకుని మరల సృష్టిస్తావు. మరల యుగాంతంలో అగ్నిచే సర్వభూతాలూ దహించివేయబడగా అన్నీ నశించిన పిదప నీవు మాత్రమే శేషంగా మిగిలిపోవుట వలన జనులు నిన్ను శేషుడని కీర్తిస్తారు. మరియు బ్రహ్మ, ఇంద్రుడు, వరుణుడు మొదలగు వారు ఉత్పత్తి వినాశాలు కలవారు కాని నీవు నీ స్థానం నుండి ఎప్పుడూ చ్యుతుడవు కావు కావున నీవు అచ్యుతుడవని కీర్తించబడతావు.

బ్రహ్మాణమింద్రం చ యమం రుద్రం వరుణమేవ చ ॥ 35 ॥

నిగృహ్య హరసే యస్మాత్తస్మాద్ధరిరిహోచ్యసే ।
సమ్మానయసి భూతాని వపుషా యశసా శ్రియా ॥ 36 ॥

పరేణ వపుషా దేవ తస్మాచ్చాసి సనాతనః ।
యస్మాద్ బ్రహ్మాదయో దేవా మునయశ్చోగ్రతేజసః ॥ 37 ॥

న తేఽన్తమధిగచ్ఛంతి తేనానన్తస్త్వముచ్యసే ।

బ్రహ్మ, ఇంద్రుడు, యముడు, రుద్రుడు, వరుణుడు, మొదలైన వారందరిని నిగ్రహించి వారిని హరించి వేస్తావు కనుక నీవు "హరి" అనబడుతున్నావు. ఓ దేవా! విశాలమైన నీ శరీరంలో, యశస్సుతో మరియు సంపదతో ప్రాణులన్నింటిని సమ్మానిస్తావు కావున నీవు "సనాతనుడు" అని పిలువబడుతున్నావు. బ్రహ్మాదిదేవతలు, ఉగ్రతేజస్సులైన మునులు మొదలగువారెవరూ నీ అంతాన్ని తెలుసుకోలేరు కనుకనే నీవు "అనంతు"డనే పేరుతో ప్రసిద్ధుడవైనావు.

న క్షీయసే న క్షరసే కల్పకోటిశతైరపి ॥ 38 ॥

తస్మాత్త్వమక్షరత్వాచ్చ విష్ణురిత్యేవ కీర్త్యసే ।
విష్టబ్ధం యత్త్వయా సర్వం జగత్ స్థావరజంగమమ్ ॥ 39 ॥

జగద్విష్టంభనాచ్చైవ విష్ణురేవేతి కథ్యసే ।

ఓ దేవా! శతకోటి కల్పాల కాలం గడిచినా నీవు క్షీణించవు, చెడవు, ఆ విధంగా అక్షరత్వాన్ని పొందటం వలన మరియు స్థావరజంగమాత్మకమైన ఈ లోకమంతటిని వ్యాపించడం వలన నీవు 'విష్ణువు' అని పిలువబడతావు.

విష్టభ్య తిష్ఠసే నిత్యం త్రైలోక్యం సచరాచరమ్ ॥ 40 ॥

యక్షగంధర్వనగరం సుమహద్భూతపన్నగమ్ ।
వ్యాప్తం త్వయైవ విశతా త్రైలోక్యం సచరాచరమ్ ॥ 41 ॥

తస్మాద్విష్ణురితి ప్రోక్తః స్వయమేవ స్వయంభువా ।
నారా ఇత్యుచ్యతే హ్యాపో ఋషిభిస్తత్త్వదర్శిభిః ॥ 42 ॥

అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతః ।
యుగే యుగే ప్రణష్టాం గాం విష్ణో! విందసి తత్త్వతః ॥ 43 ॥

గోవిందేతి తతో నామ ప్రోచ్యతే ఋషిభిస్తథా ।

ఓ దేవా! చరాచార్మత్మకమైన ఈ ముల్లోకాలను నియమబద్ధంగా నడిపిస్తూ నిత్యమూ నీవు విలసిల్లుతున్నావు. యక్ష-గంధర్వాది నగరాలలోను, మహత్తరాలైన భూతపన్నగ లోకాలలోనూ, చరాచరాత్మకమైన ఈ ముల్లోకాలలో అంతటా నీవు వ్యాపించివున్నావు కనుక నీవు 'విష్ణువు" అని కీర్తింపబడుతున్నావు. మరియు తత్త్వజ్ఞానులైన ఋషులు 'అప్' అనగా జలాన్ని 'నారా' అంటారు. పూర్వం అవి నిన్ను ఆశ్రయించి ఉండినవి కావున నిన్ను "నారాయణుడు" అని పిలుస్తారు. ఓ విష్ణూ! ప్రతియుగంలోనూ నశించిపోయే (గాం=అనగా పృథివినైన) నన్ను నీవు రక్షిస్తావు కావున మహర్షులు నిన్ను "గోవిందుడు" అని పిలుస్తారు.

హృషీకాణీంద్రియాణ్యాహుః తత్త్వజ్ఞానవిశారదాః ॥ 44 ॥

ఈశితా చ త్వమేతేషాం హృశీకేశస్తథోచ్యసే ।
వసంతి త్వయి భూతాని బ్రహ్మాదీని యుగక్షయే ॥ 45 ॥

త్వం వా వససి భూతేషు వాసుదేవస్తథోచ్యసే ।
సఙ్కర్షయసి భూతాని కల్పే కల్పే పునః పునః ॥ 46 ॥

తతః సఙ్కర్షణః ప్రోక్తస్తత్త్వజ్ఞానవిశారదై ః ।
ప్రతి వ్యూహేన తిష్ఠన్తి సదేవాసురరాక్షసాః ॥ 47 ॥

ప్రవిద్యుః సర్వధర్మాణాం ప్రద్యుమ్నస్తేన చోచ్యసే ।

హృషీకాలనగా ఇంద్రియాలని తత్త్వజ్ఞానవిశారదులు అంటారు. నీవా హృషీకాలనబడే ఇంద్రియాలకే ఈశుడవు కావున నీవు "హృషీకేశు"డవని పిలువబడుతున్నావు. యుగాంతసమయంలో బ్రహ్మాదిదేవతలు, సకల ప్రాణులు నీలోనే నివసిస్తాయి. లేదా నీవే సర్వజీవులలో నివసిస్తావు కావున 'వాసుదేవు' డని పిలువబడుతావు. అలాగే ప్రతికల్పంలో సర్వభూతాలను నీలోనికే ఆకర్షిస్తావు, లయం చేస్తావు కనుక తత్త్వజ్ఞానవిదులు నిన్ను "సంకర్షణు" డని అంటారు. మరియు దేవతలు, అసురులు, రాక్షసులు మొదలైన వారందరూ నీ ద్వారానే వారి వారి వ్యూహాలలో ప్రకృష్టంగా వ్యవస్థితులై ఉంటారు. నీ నుండే అందరూ సర్వధర్మాలను తెలిసికొంటారు కావున నీవు "ప్రద్యుమ్నుడ'వని పిలువబడుతున్నావు.

నిరోద్ధా విద్యతే యస్మాన్న తే భూతేషు కశ్చన ॥ 48 ॥

అనిరుద్ధస్తతః ప్రోక్తః పూర్వమేవ మహర్షిభిః ।
యత్త్వయా ధార్యతే విశ్వం త్వయా సంహ్రియతే జగత్ ॥ 49 ॥

త్వం ధారయసి భూతాని భువనం త్వం బిభర్షి చ ।
యత్త్వయా ధార్యతే కించిత్తేజసా చ బలేన చ ॥ 50 ॥

మయా హి ధార్యతే పశ్చాన్నాధృతం ధారయే త్వయా ।
న హి తద్విద్యతే భూతం త్వయా యన్నాత్ర ధార్యతే ॥ 51 ॥

సమస్త జీవులలో నిన్ను నిరోధించగలిగిన శక్తి గల వారెవ్వరూ లేరు కనుక నిన్ను పూర్వమే మహర్షులు "అనిరుద్ధ"డు అన్నారు. ఈ విశ్వమంతా నీచేతనే ధరించబడుతున్నది మరియు నీచేతనే సంహరించబడుతున్నది. నీవే జీవులన్నింటిని ధరిస్తావు. భువనమంతటిని నీవే భరిస్తావు, నీ తేజస్సు చేత, బలం చేత ముందుగా నీవు ధరించిన తర్వాతనే నేను దేన్నైనా ధరిస్తాను. ఈ జగత్తులో నీవు ధరించబడని ప్రాణి కాని వస్తువు కాని ఏదీ లేదు.

త్వమేవ కురుషే దేవ! నారాయణ! యుగే యుగే ।
మహాభారావతరణం జగతో హితకామ్యయా ॥ 52 ॥

తవైవ తేజసాక్రాన్తాం రసాతలతలాం గతామ్ ।
త్రాయస్వ మాం సురశ్రేష్ఠ! త్వమేవ శరణం మమ ॥ 53 ॥

ఓ దేవా! నారాయణా! ప్రతియుగంలో ఈ జగత్తంతటికి హితం చేయాలనే కాంక్షతో నీవే నా పైన పడుతున్న మోయలేని భారాన్ని తగ్గిస్తావు. ఓ సురశ్రేష్ఠా! నీ తేజస్సుచేత ఆక్రమించబడిన నేను రసాతలలోకానికి చేరివున్నాను, నన్ను రక్షించు, నీవే నాకు శరణు.

దానవైః పీడ్యమానాఽహం రాక్షసైశ్చ దురాత్మభిః ।
త్వా మేవ శరణం నిత్యం ఉపయామి సనాతనమ్ ॥ 54 ॥

తావన్మేఽస్తి భయం దేవ యావన్న త్వం కకుద్మినమ్ ।
శరణం యామి మనసా శతశోఽప్యుపలక్షయే ॥ 55 ॥

ఉపమానం న తే శక్తాః కర్తుం సేంద్రా దివౌకసః ।
తత్త్వం త్వమేవ తద్వేత్సి నిరుత్తరమతః పరమ్ ॥ 56 ॥

దానవులచేత మరియు దుష్టులైన రాక్షసులచేత పీడించబడిన నేను సనాతనుడవైన నిన్ను శరణువేడుతున్నాను. కకుద్మియనగా మంచి మనస్సుకల నిన్ను శరణువేడనంతవరకు నాకు భయం కలుగుతూనే ఉంటుంది. అందుకే శతవిధాలుగా మనస్సుతో నిన్నే ఎప్పుడూ శరణు వేడుతుంటాను. ఓ దేవా! ఇంద్రాదిదేవతలెవ్వరూ నీతో ఉపమానం పొందుటకు అర్హులు కారు. నీవు మాత్రమే తత్త్వం తెలిసినవాడవు, ఇంతకు మించి నేనేమీ చెప్పలేను.

శౌనక ఉవాచ – శౌనకుడు చెప్పాడు.

తతః ప్రీతః స భగవాన్ పృథివ్యై శార్ఙ్గచక్రధృక్ ।
కామమస్యా యథాకామమభిపూరితవాన్ హరిః ॥ 57 ॥

అబ్రవీచ్చ మహాదేవి! మాధవీయం స్తవోత్తమమ్ ।
ధారయిష్యతి యో మర్త్యో నాస్తి తస్య పరాభవః ॥ 58 ॥

లోకాన్నిష్కల్మషాంశ్చైవ వైష్ణవాన్ ప్రతిపత్స్యతే ।
ఏతదాశ్చర్యసర్వస్య మాధవీయం స్తవోత్తమమ్ ॥ 59 ॥

అధీతవేదః పురుషో మునిః ప్రీతమనా భవేత్ ॥ 60 ॥

మా భైర్ధరణి కల్యాణి! శాంతిం వ్రజ మమాగ్రతః ।
ఏష త్వాముచితం స్థానం ప్రాపయామి మనీషితమ్ ॥ 61 ॥

పృథివీదేవత స్తోత్రంచేత ప్రీతిచెందిన ధనుస్సు మరియు చక్రం మొదలగు ఆయుధాలను ధరించిన భగవానుడు ఆమె కోరికలను ఆమె అభీష్టం ప్రకారంగా పూరించి ఇలా అన్నాడు. ఓ మహాదేవీ! నీవు చేసిన ఉత్తమమైన ఈ మాధవీయస్తోత్రాన్ని ఏ మానవుడు ధారణచేస్తాడో అతనికెప్పుడూ పరాభవం (పరాజయం) ఉండదు. మరియు నిష్కల్మషాలైన వైష్ణవలోకాన్ని పొందుతాడు. నీవు చేసిన ఉత్తమమైన ఈ మాధవీయస్తోత్రం అందరికి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఈ స్తోత్రాన్ని పఠించే పురుషుడు వేదాధ్యయనం చేసినవాడు మరియు మునిజనులకు కూడ ప్రీతి కలిగించే వాడవుతాడు. ఓ కల్యాణీ! ధరణీ! భయపడకు. శాంతిపొందు. ఇప్పుడే నీవు కోరుకున్నట్లుగా నిన్ను ఉచితమైన స్థానానికి చేరుస్తాను.

శౌనక ఉవాచ – శౌనకమహర్షి చెప్పాడు.

తతో మహాత్మా మనసా దివ్యం రూపమచింతయత్ ।
కిం ను రూపమహం కృత్వా ఉద్ధరేయం ధరామిమామ్ ॥ 62 ॥

అప్పుడు మహానుభావుడైన శ్రీమహావిష్ణువు నేను ఏ రూపం ధరించి ఈ పృథివిని ఉద్ధరించగలను అని మనసులో ఆలోచించాడు. మరియు వెంటనే దివ్యమైన రూపంతో అవతరించాలని తలచాడు.

జలక్రీడారుచిస్తస్మాద్వారాహం వపురాస్థితః ।
అధృష్యం సర్వభూతానాం వాఙ్మయం బ్రహ్మసంస్థితమ్ ॥ 63 ॥

శతయోజన విస్తీర్ణముచ్ఛ్రితం ద్విగుణం తతః ।
నీలజీమూతసంకాశం మేఘస్తనితనిఃస్వనమ్ ॥ 64 ॥

గిరిసంహననం భీమం శ్వేతం తీక్ష్ణాగ్రదంష్ట్రిణమ్ ।
విద్యుదగ్నిప్రతీకాశమాదిత్యసమతేజసమ్ ॥ 65 ॥

పీనోన్నతకటీదేశే వృషలక్షణపూజితమ్ ।
రూపమాస్థాయ విపులం వారాహమజితో హరిః ॥ 66 ॥

పృథివ్యుద్ధరణాయైవ ప్రవివేశ రసాతలమ్ ।

వెంటనే జలక్రీడలలో అభిరుచి గలిగిన ఆ నారాయణుడు వరాహరూపాన్ని ధరించాడు. ఆ రూపం ప్రాణులందరికి అంతుపట్టనిది, వాగ్రూపమైన పరబ్రహ్మంలో నిలచేది. ఆ వరాహుని శరీరం శతయోజన విస్తీర్ణం కలది. దానికంటే రెండు రెట్లు ఎత్తు కలిగినది. నీలమేఘపు వర్ణం కలిగినది. మరియు మేఘగర్జనంతో సమానమైన ధ్వని కలిగినది. పర్వతంతో సమానమైన దృఢత్వం మరియు భయంకరాకారం కలిగినది. తెల్లనైన, తీక్ష్ణమైన దంష్ట్రలు కలిగినది, మెరపువలె మరియు అగ్నివలె ప్రకాశించేది, సూర్యుని వంటి తేజస్సు కలది, బలిష్ఠమైన ఉన్నతమైన కటిప్రదేశం కలది. వృషభం వంటి లక్షణాలు గలది. అటువంటి విశాలమైన వరాహరూపాన్ని పొంది పృథివిని ఉద్ధరించుటకై రసాతలాన్ని ప్రవేశించాడు.

వేదపాదో యూపదంష్ట్రః క్రతుదన్తశ్చితీముఖః ॥ 67 ॥

అగ్నిజిహ్వో దర్భలోమా బ్రహ్మశీర్షో మహాతపాః ।
అహోరాత్రేక్షణధరో వేదాంగశ్రుతిభూషణః ॥ 68 ॥

ఆజ్యనాసః స్రువతుండః సామఘోషస్వనో మహాన్ ।
సత్యధర్మమయః శ్రీమాన్ కర్మవిక్రమసత్క్రమః ॥ 69 ॥

శ్రీయుక్తుడు, సత్యధర్మమయుడు, మహాతపస్వియైన ఆ వరాహమూర్తిలో వేదాలే పాదాలుగా, యూపస్తంభాలే దంష్ట్రలుగా, యజ్ఞాలే దంతాలుగా, యజ్ఞకుండాలే ముఖంగా, అగ్నియే నాలుకగా, దర్భలే రోమాలుగా, బ్రహ్మమే శిరస్సుగా, పగలు, రాత్రి కన్నులుగా, వేదాంగాలే కర్ణాభరణాలుగా, ఆజ్యమే నాసికగా, స్రువమే తుండంగా, సామవేదమే మహత్తరమైన స్వరంగా, కర్మవిక్రమాలే పాదవిన్యాసాలుగా కనబడినాయి.

ప్రాయశ్చిత్తనఖో ఘోరః పశుజానుర్మఖాకృతిః ।
ఉద్గాతా హోమలింగోఽథ బీజౌషధిమహాఫలః ॥ 70 ॥

వాయ్వన్తరాత్మా యజ్ఞాస్థివికృతిః సోమశోణితః ।
వేదస్కంధో హవిర్గంధో హవ్యకవ్య విభాగవాన్ ॥ 71 ॥

ప్రాగ్వంశకాయో ద్యుతిమాన్ నానాదీక్షాభిరన్వితః ।
దక్షిణాహృదయో యోగీ మహాసత్రమయో మహాన్ ॥ 72 ॥

ఉపాకర్మోష్ఠరుచకః ప్రవర్గ్యావర్తభూషణః ।
నానాఛందోగతిపథో గుహ్యోపనిషదాసనః ॥
ఛాయాపత్నీసహాయో వై మణిశృంగ ఇవోచ్ఛ్రితః ॥ 73 ॥

మరియు ప్రాయశ్చిత్తాలే భయం కల్గించే నఖాలుగా, పశుగణాలే మోకాళ్ళుగా, యజ్ఞమే శరీరాకృతిగా, ఉద్గాతే లింగంగా, బీజౌషధాలే మహాఫలంగా, వాయువే అంతరాత్మగా, అస్థులే (ఎముకలే) యజ్ఞవిశేషాలుగా,

సోమరసమే రక్తంగా, వేదమే స్కంధంగా, హవ్యకవ్యాది విభాగాలతో కూడిన హవిస్సులే గంధంగా, వివిధ దీక్షలతో కూడిన ప్రకాశవంతమైన ప్రాగ్వంశమే కాయంగా, దక్షిణలే హృదయంగా, ఉపాకర్మలే ప్రకాశవంతాలైన పెదవులుగా, ప్రవర్గ్యావృత్తులే భూషణాలుగా, నానా ఛందోగతులే మార్గాలుగా, రహస్యాలైన ఉపనిషత్తులే ఆసనంగా, కలిగిన మహానుభావుడు, మహాసత్రమయుడు, యోగిపుంగవుడూ అయిన ఆ వరాహమూర్తి ఛాయనే పత్నిగా కలవాడై మణిశృంగాలవలె మహోన్నతంగా ఉండినాడు.

రసాతలతలే మగ్నాం రసాతలతలం గతామ్ ।
ప్రభుర్లోకహితార్థాయ దంష్ట్రాగ్రేణోజ్జహార తామ్ ॥ 74 ॥

తతః స్వస్థానమానీయ వరాహః పృథివీధరః ।
ముమోచ పూర్వం మనసా ధారితాం చ వసుంధరామ్ ॥ 75 ॥

తతో జగామ నిర్వాణం మేదినీ తస్య ధారణాత్ ।
చకార చ నమస్కారం తస్మై దేవాయ శంభవే ॥ 76 ॥

అటువంటి పరమాత్మ రసాతలంలో పడిపోయి ఆ లోకంలో మగ్నమైపోతున్న భూమిని లోకకల్యాణార్థమై తన దంష్ట్రలతో పైకి లేపాడు. ఆ తరువాత పృథివిని ధరించిన ఆ వరాహమూర్తి వసుంధరయైన పృథివిని మనస్సుతో ధరించి ఆమెను స్వస్థానంలో నిలిపాడు. భగవంతుడు తనను అలా ధరించినందున శాంతిని పొంది, వెంటనే లోకకల్యాణకారుడైన ఆ భగవంతునికి నమస్కరించింది.

ఏవం యజ్ఞవరాహేణ భూత్వా భూతహితార్థినా ।
ఉద్ధృతా పృథివీ దేవీ సాగరాంబుగతా పురా ॥ 77 ॥

అథోద్ధృత్య క్షితిం దేవో జగతః స్థాపనేచ్ఛయా ।
పృథివీ ప్రవిభాగాయ మనశ్చక్రేఽంబుజేక్షణః ॥ 78 ॥

రసాం గతామవనిమచింత్యవిక్రమః సురోత్తమః ప్రవరవరాహరూపధృక్ ।
వృషాకపిః ప్రసభమథైకదంష్ట్రయా సముద్ధరద్ధరణిమతుల్యపౌరుషః ॥ 79 ॥

పూర్వం ఈ విధంగా సముద్రజలాలలో మునిగిపోయిన పృథివిని సకలభూత హితార్థియైన భగవంతుడు యజ్ఞవరాహరూపాన్ని ధరించి ఉద్ధరించాడు. ఆ తరువాత పద్మనేత్రుడైన ఆ దేవదేవుడు లోకాన్ని నిలిపే సంకల్పంతో తనచే ఉద్ధరించబడిన పృథివిని విభజించ తలచాడు. అసమానపౌరుషం కలవాడు, చింతించుటకు వీలుకాని పరాక్రమం కలవాడు, సురోత్తముడు, శ్రేష్ఠమైన యజ్ఞవరాహరూపాన్ని ధరించినవాడు, వృషాకపి అనగా ధర్మరక్షకుడైన శ్రీమన్నారాయణుడు దృఢమైన తన దంష్ట్రతో ధరణిని ఉద్ధరించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే వరాహ ప్రాదుర్భావో నామ అష్టచతారింశదధికద్విశతతమోఽధ్యాయః ॥248॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని వరాహప్రాదుర్భావమను రెండువందల నలభైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనపంచాశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల నలభైతొమ్మిదవ అధ్యాయం

అమృతమంథనమ్ - అమృత మంథనం

ఋషయ ఊచుః - ఋషులు చెప్పారు.

నారాయణస్య మాహాత్మ్యం శ్రుత్వా సూత యథాక్రమమ్ ।
న తృప్తిర్జాయతేఽస్మాకమతః పునరిహోచ్యతామ్ ॥ 1 ॥

కథం దేవా గతాః పూర్వమమరత్వం విచక్షణాః ।
తపసా కర్మణా వాఽపి ప్రసాదాత్కస్య తేజసా ॥ 2 ॥

సూతా! వరుసగా శ్రీమన్నారాయణుని మాహాత్మ్యాన్ని విన్నప్పటికీ ఇంకా మాకు తృప్తి కలగటం లేదు. కావున పూర్వం వివేకవంతులైన దేవతలు ఎలా అమరత్వాన్ని పొందారు? వారు ఎటువంటి తపస్సునాచరించారు? ఏ కర్మలననుష్ఠించారు? ఏ దేవత అనుగ్రహం వలన అమరత్వాన్ని పొందారు?

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

యత్ర నారాయణో దేవో మహాదేవశ్చ శూలధృక్ ।
తత్రామరత్వే సర్వేషాం సహాయో తత్ర తౌ స్మృతౌ ॥ 3 ॥

శ్రీమన్నారాయణుడు మరియు త్రిశూలధారియైన పరమశివుడు ఎక్కడ ఉన్నప్పటికీ దేవతలతో పాటు అందరికీ అమరత్వాన్ని కల్పిస్తారు. ఇలా అమరత్వాన్ని కల్పించటంలో వారిద్దరు పరస్పరం సహాయకులని చెబుతారు.

పురా దేవాసురే యుద్ధే హతాశ్చ శతశః సురాః ।
పునః సంజీవనీం విద్యాం ప్రయోజ్య భృగునందనః ॥ 4 ॥

జీవాపయతి దైత్యేంద్రాన్ యథా సుప్తోత్థితానివ ।
తస్య తుష్టేన దేవేన శంకరేణ మహాత్మనా ॥ 5 ॥

మృతసంజీవనీ నామ విద్యా దత్తా మహాప్రభా ।

పూర్వం దేవతలకు, రాక్షసులకు జరిగిన యుద్ధాలలో వందలకొలది రాక్షసులను దేవతలు వధించారు కాని, భృగునందనుడైన శుక్రాచార్యుడు సంజీవనీవిద్యను ప్రయోగించి వారినందరిని జీవింపజేశాడు. నిద్రనుండి మేలుకున్నట్లే ఆ దైత్యులందరూ మరల బ్రతికినారు. పూర్వం శుక్రుని తపస్సుచేత సంతుష్టుడైన మహాత్ముడైన పరమశివుడు మహాప్రభావవంతమైన 'మృతసంజీవని' విద్యను ఆతనికి ఇచ్చివున్నాడు.

తాం తు మాహేశ్వరీం విద్యాం మహేశ్వరముఖోద్గతామ్ ॥ 6 ॥

భార్గవే సంస్థితాం దృష్ట్వా యుయుధుః సర్వదానవాః ।
తతోఽమరత్వం దైత్యానాం కృతం శుక్రేణ ధీమతా ॥ 7 ॥

యా నాస్తి సర్వలోకానాం దేవానాం సర్వరక్షసామ్ ।
న నాగానామృషీణాం చ న చ బ్రహ్మేంద్రవిష్ణుషు ॥ 8 ॥

తాం లబ్ధ్వా శంకరాచ్ఛుక్రః పరాం నిర్వృతిమాగతః ।

ఆ విధంగా సాక్షాత్తు మహేశ్వరుని నుండి పొందిన ఆ మాహేశ్వరీ విద్య శుక్రుని వద్ద ఉండటం చూచిన దానవులందరు దేవతలతో యుద్ధం చేశారు. దేవతలచేత వధించబడిన దైత్యులందరిని ధీమంతుడైన శుక్రుడు మరల బతికించాడు. ఇలా లోకాలన్నింటిలోనూ దేవతలు, యక్షులు, రాక్షసులు, సర్పాలు, ఋషులు, బ్రహ్మేంద్రాదులు, విష్ణువు మొదలైన వారెవ్వరికీ లభించని అమరత్వం దైత్యులకు లభించింది. పరమశివుని నుండి పొందిన ఆ మృతసంజీవనీ విద్యతో శుక్రాచార్యుడు పరమానందం పొందాడు.

తతో దేవాసురో ఘోరః సమరః సుమహానభూత్ ॥ 9 ॥

తత్ర దేవైర్హతాన్ దైత్యాన్ శుక్రో విద్యాబలేన చ ।
ఉత్థాపయతి దైత్యేంద్రాన్ లీలయైవ విచక్షణః ॥ 10 ॥

ఏవం విధేన శక్రస్తు బృహస్పతిరుదారధీః ।
హన్యమానాస్తతో దేవాః శతశోఽథ సహస్రశః ॥ 11 ॥

విషణ్ణవదనాః సర్వే బభూవుర్వికలేంద్రియాః ।
తతస్తేషు విషణ్ణేషు భగవాన్ కమలోద్భవః ॥
మేరుపృష్ఠే సురేంద్రాణాం ఇదమాహ జగత్పతిః ॥ 12 ॥

ఆ తరువాత దేవతలకు, అసురులకు మహాఘోరమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో దేవతలచేత సంహరించబడిన దైత్యులందరిని శుక్రాచార్యుడు తన విద్యాబలంలో బ్రతికించసాగాడు. సంహరించబడినప్పటకీ మరల మరల బ్రతుకుతున్న ఆ దైత్యులను మరియు వారిచే సంహరించబడుతున్న వందలు, వేలకొలది దేవతలను చూచి ఇంద్రుడు మరియు ఉదారబుద్ధియైన బృహస్పతి, ఇతర దేవతలు విషణ్ణవదనులై ఇంద్రియాలు పటుత్వం కోల్పోగా అనేకవిధాలుగా చింతించారు. ఆ విధంగా చింతాక్రాంతులైన వారందరిని చూచి కమలోద్భవుడైన బ్రహ్మదేవుడు మేరుపర్వతశిఖరంపై కూర్చుని ఇంద్రాదిదేవతలతో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు చెప్పాడు.

దేవాః! శ్రుణుత మద్వాక్యం తత్తథైవ నిరూప్యతామ్ ।
క్షిపతాం దానవైః సార్ధం సఖ్యమత్ర ప్రవర్తతామ్ ॥ 13 ॥

క్రియతామమృతోద్యోగో మథ్యతాం క్షీరవారిధిః ।
సహాయం వరుణం కృత్వా చక్రపాణిర్విబోధ్యతామ్ ॥ 14 ॥

మంథానం మందరం కృత్వా శేషవేత్రేణ వేష్టితమ్ ।
దానవేంద్రో బలిః స్వామీ స్తోకకాలం నివేశ్యతామ్ ॥ 15 ॥

ప్రార్థ్యతాం కూర్మరూపశ్చ పాతాలే విష్ణురవ్యయః ।
ప్రార్థ్యతాం మందరఃశైలో మంథకార్యం ప్రవర్త్యతామ్ ॥ 16 ॥

దేవతలారా! నా మాటలు వినండి మరియు చెప్పినట్లు చేయండి. ప్రస్తుతం దానవులతో స్నేహం చేయడానికి ప్రయత్నించండి. మిత్రులుగా వ్యవహరిస్తూ అమృతాన్ని పొందటానికి క్షీరసాగరాన్ని మథించండి. వరుణదేవుని సహాయంతో చక్రపాణియైన ఆ శ్రీమహావిష్ణువును ప్రార్థించండి. మందర పర్వతాన్ని కవ్వంగా ఉండుటకై, ఆదిశేషుని త్రాడుగా ఉండుటకై, శ్రీమహావిష్ణువును కూర్మరూపందాల్చి పాతాళలోకంలో ప్రవేశించుటకై ప్రార్థించి సముద్రమథనకార్యక్రమమునకై ప్రయత్నించండి.

తచ్ఛ్రుత్వా వచనం దేవా జగ్ముర్దానవమందిరమ్ ।
అలం విరోధేన వయం భృత్యాస్తవ బలేఽధునా ॥ 17 ॥

క్రియతామమృతోద్యోగో వ్రియతాం శేషనేత్రకమ్ ।
త్వయా చోత్పాదితే దైత్య అమృతేఽమృతమంథనే ॥ 18 ॥

భవిష్యామోఽమరాః సర్వే త్వత్ప్రసాదాన్న సంశయః ।

పరమాత్ముని మాటలు విన్నదేవతలు వెంటనే దానవమందిరానికి వెళ్ళి, దానవేంద్రుడైన బలిచక్రవర్తిని ప్రార్థించారు. ఓ దానవేంద్రా? మేమంతా మీ భృత్యులం. మీతో మాకు ఎటువంటి విరోధం లేదు. కనుక మనమందరం కలిసి ఆదిశేషుని త్రాడుగా ఉండునట్లు ప్రార్థించి, అమృతాన్ని పొందటానికి ప్రయత్నిద్దాము. ఓ దైత్యా! నీ ప్రోత్సాహంతో సముద్రాన్ని చిలికి అమృతాన్ని పొందితే మనమందరం అమరులం కాగలము. దానిలో సందేహం లేదు.

ఏవముక్తస్తదా దేవైః పరితుష్టః స దానవః ॥ 19 ॥

యథా వదత హే దేవాః! తథా కార్యం మయాఽధునా ।
శక్తోఽహమేక ఏవాత్ర మథితుం క్షీరవారిధిమ్ ॥ 20 ॥

ఆహరిష్యేఽమృతం దివ్యం అమృతత్వాయ వోఽధునా ।
సుదూరాదాశ్రయం ప్రాప్తాన్ ప్రణతానపి వైరిణః ॥ 21 ॥

యో న పూజయతే భక్త్యా ప్రేత్య చేహ వినశ్యతి ।
పాలయిష్యామి వః సర్వానధునా స్నేహమాస్థితః ॥ 22 ॥

దేవతలు ఆ విధంగా ప్రార్థించగా దానవేంద్రుడు సంతుష్టుడై ఓ దేవతలారా! "మీరు చెప్పినట్లుగా నేను తప్పనిసరిగా చేస్తాను. నేనొక్కడినే క్షీరసాగరాన్ని మథించి మీకందరికీ అమృతత్వాన్ని కల్పించుటకై దివ్యమైన

అమృతాన్ని తేగలను. కాని బహుదూరంనుండి వినమ్రులై వచ్చిన శత్రువులను భక్తితో ఆదరించనివాడు నశించిపోతాడని శాస్త్రాలు చెబుతున్నాయి. కనుక నాతో స్నేహంగా ఉండుటకై శరణువేడుతున్న మీ అందరిని పరిపాలిస్తాను. మీ అభీష్టాన్ని నెరవేరుస్తాను" అని చెప్పాడు.

ఏవముక్త్వా స దైత్యేంద్రః దేవైః సహ యయౌ తదా ।
మన్దరం ప్రార్థయామాస సహాయత్వే ధరాధరమ్ ॥ 23 ॥

మంథా భవ త్వమస్మాకం అధునాఽమృతమంథనే ।
సురాఽసురాణాం సర్వేషాం మహత్కార్యమిదం జగత్ ॥ 24 ॥

ఆ విధంగా చెప్పిన దైత్యేంద్రుడు వెంటనే దేవతలందరితో కలిసి భూధరుడైన మందరుని దగ్గరకు వెళ్ళాడు. మరియు ఆతనిని అమృతం కోసం పాలసముద్రాన్ని చిలకడానికి కవ్వంగా ఉండుటకై ప్రార్థించాడు. ఇది దేవతలకు, దానవులకు సంబంధించిన మహత్తరమైన కార్యమని వివరించాడు.

తథేతి మన్దరః ప్రాహ యద్యాధారో భవేన్మమ ।
తత్ర స్థిత్వా భ్రమిష్యామి మథిష్యే వరుణాలయమ్ ॥ 25 ॥

కల్ప్యతాం వేత్రాకార్యే యః శక్తః స్యాద్వేష్టనే మమ ।
తతస్తు నిర్గతౌ దేవౌ కూర్మశేషౌ మహాబలౌ ॥ 26 ॥

విష్ణోర్భాగౌ చతుర్థాంశాద్ధరణ్యా ధారణే స్థితౌ ।
ఊచతుర్గర్వసంయుక్తం వచనం శేషకచ్ఛపౌ ॥ 27 ॥

మందరుడు కూడ వెంటనే అంగీకరించాడు. ఇంకా తనను భరించే శక్తిగల ఆధారం దొరికితే దానిపైన స్థిరంగా ఉండి సముద్రాన్ని మథించగలనని, తన మధ్యభాగాన త్రాడుగా ఉండే సమర్థుని కూడ కల్పించమని వారికి చెప్పాడు. అతని మాటలు విన్న వెంటనే మహాబలులైన కూర్మశేషులిద్దరూ అందుకు సిద్ధపడినారు. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు నాలుగో వంతు అంశలు గల శేషకచ్ఛపులు సగర్వంగా వారితో ఇలా అన్నారు.

కూర్మఉవాచ – కూర్మ భగవానుడు చెప్పాడు.

త్రైలోక్యధారణేనాపి న గ్లానిర్మమ జాయతే ।
కిము మందరకాత్ క్షుద్రాత్ గుటికాసన్నిభాదిహ ॥ 28 ॥

ఈ ముల్లోకాలను ధరించుట వలననే నాకెటువంటి కష్టం కలుగుట లేదు. ఇక బంతి వలెవున్న ఈ మందరపర్వతాన్ని ధరించటం వలన నాకేమి కష్టం కలుగుతుంది?

శేష ఉవాచ – శేషుడు చెప్పాడు.

బ్రహ్మాండవేష్టనేనాపి బ్రహ్మాండమథనేన వా ।
న మే గ్లానిర్భవేద్దేహే కిము మందరవర్తనే ॥ 29 ॥

ఈ బ్రహ్మాండాన్నే నన్ను చుట్టి చిలికినా నాకెటువంటి కష్టం కలుగదు. అటువంటిది ఈ మందర పర్వతాన్ని లోకోపకారం కొరకు చుట్టుట వలన నా దేహానికి ఏ మాత్రం బాధ కలుగదు.

తత ఉత్పాట్య తం శైలం తత్క్షణాత్ క్షీరసాగరే ।
చిక్షేప లీలయా నాగః కూర్మశ్చాధః స్థితః సదా ॥ 30 ॥

అప్పుడు తక్షణమే ఆదిశేషుడు మందరపర్వతాన్ని పెకిలించి క్షీరసాగరంలో సులభంగా పడవేశాడు. కూర్ముడు కూడ క్షీరసముద్రపు అధోభాగానికి వెళ్ళి నిలిచాడు.

నిరాధారం యదా శైలం న శేకుర్దేవదానవాః ।
మందరభ్రామణం కర్తుం క్షీరోదమథనే తథా ॥ 31 ॥

నారాయణనివాసం తే జగ్ముర్బలిసమన్వితాః ।
యత్రాస్తే దేవదేవేశః స్వయమేవ జనార్దనః ॥ 32 ॥

కాని దేవదానవులిరువురు కూడ నిరాధారమైన మందరపర్వతంతో క్షీరసాగరాన్ని మథించుటకు అశక్తులై వెంటనే బలితోపాటు వారందరూ స్వయంగా దేవదేవేశుడైన జనార్దనుడున్న నారాయణ నివాసానికి వెళ్ళారు.

తత్రాపశ్యంత తం దేవం సితపద్మప్రభం శుభమ్ ।
యోగనిద్రాసు నిరతం పీతవాససమచ్యుతమ్ ॥ 33 ॥

హారకేయూరనద్ధాంగమహిపర్యంకసంస్థితమ్ ।
పాదపద్మేన పద్మాయాః స్పృశన్తం నాభిమండలమ్ ॥ 34 ॥

అక్కడ శ్వేతపద్మపు కాంతికలవాడు, శుభప్రదుడు, యోగనిద్రానిరతుడు, పీతాంబరధారి, అచ్యుతుడు, హారకేయూరాది భూషణుడు, సర్పమే (వాసుకియే) పర్యంకంగా గలవాడు, పాదకమలములచే లక్ష్మీదేవి నాభిమండలాన్ని స్పృశిస్తున్నవాడూ అయిన ఆ దేవదేవుని చూచారు.

స్వపక్షవ్యజనేనాథ వీజ్యమానం గరుత్మతా ।
స్తూయమానం సమన్తాచ్చ సిద్ధచారణకిన్నరైః ॥ 35 ॥

ఆమ్నాయైర్మూర్తిమద్భిశ్చ స్తూయమానం సమన్తతః ।
సవ్యబాహూపధానం తం తుష్టువుర్దేవదానవాః ॥
కృతాంజలి పుటాః సర్వే ప్రణతాః సర్వతోదిశమ్ ॥ 36 ॥

గరుత్మంతుని రెక్కలనే వింజామరలచే వీచబడుతున్న, సిద్ధ–చారణ–గంధర్వాదులచే అన్ని వైపులనుండి స్తుతించబడుతున్న, మూర్తిమంతాలైన వేదాలచే స్తోత్రం చేయబడుతున్న, వామహస్తాన్నే తలగడగా ఉయోగించుకొంటున్న ఆ పరాత్పరుని దేవదానవులందరూ అంజలిఘటించి, వినమ్రులై స్తుతించారు.

దేవదానవా ఊచుః – దేవతలు, దానవులు చెప్పారు.

నమో లోకత్రయాధ్యక్ష! తేజసా జితభాస్కర! ।
నమో విష్ణో! నమో జిష్ణో! నమస్తే కైటభార్దన! ॥ 37 ॥

నమః సర్గక్రియాకర్త్రే జగత్పాలయతే నమః ।
రుద్రరూపాయ శర్వాయ నమః సంహారకారిణే ॥ 38 ॥

నమః శూలాయుధాధృష్య నమో దానవఘాతినే ।
నమః క్రమత్రయాక్రాంతత్రైలోక్యాయాభవాయ చ ॥ 39 ॥

ఓ లోకత్రయాధ్యక్షుడా! ఓ త్రిలోకాధిపతీ! నీతేజస్సుచేత సూర్యుని జయించినట్టివాడా! ఓ విష్ణుదేవుడా! విజయశీలుడా! కైటభాసురుని వధించినవాడా! సృష్టిస్థితిలయాలకు కారణమైనవాడా! ఓ జగత్ప్రభూ! రుద్రరూపా! శివా! జగత్తు సంహారానికి కారణభూతుడా! శూలాద్యాయుధాలు ధరించినవాడా! దానవమర్దనా! మూడు పాదాలచే ముల్లోకాలను ఆక్రమించినవాడా! జన్మరహితుడా! ఓ దేవదేవా! నీకు నమస్సులు.

నమః ప్రచండదైత్యేంద్రకులకాలమహానల! ।
నమో నాభిహ్రదోద్భూతపద్మగర్భమహాబల! ॥ 40 ॥

పద్మభూతమహాభూతకర్త్రే హర్త్రే జగత్ప్రియ! ।
జనితా సర్వలోకేశ క్రియాకారణకారిణే ॥ 41 ॥

అమరారివినాశాయ మహాసమరశాలినే ।
లక్ష్మీముఖాబ్జమధుప! నమః కీర్తినివాసినే ॥ 42 ॥

ప్రచండులైన దైత్యేంద్రుల వంశాలకే కాలానలస్వరూపుడా! నాభి అనే సరస్సునుండి ఉద్భవించిన కమలం కలవాడా! మహాబలుడా! పద్మోత్పత్తి కారకుడా! సృష్టిస్థితిలయకారకుడా! జగత్ప్రియుడా! సర్వలోకేశ్వరుడా! సర్వలోక క్రియాకారకుడా! దేవతల శత్రువులను వినాశం చేసేవాడా! గొప్ప యుద్ధం చేసేవాడా! లక్ష్మీదేవి ముఖానికి తుమ్మెద వంటివాడా! కీర్తికి నివాసస్థానమైన ఓ దేవా! నీకు నమస్సులు.

అస్మాకమమరత్వాయ ధ్రియతాం ధ్రియతామయమ్ ।
మందరః సర్వశైలానామయుతాయుతవిస్తృతః ॥ 43 ॥

అనంతబలబాహుభ్యామవష్టభ్యైకపాణినా ।
మథ్యతామమృతం దేవ స్వధాస్వాహార్థకామినామ్ ॥ 44 ॥

ఓ దేవా! మాకు అమరత్వం కల్పించుటకై పర్వతాలన్నింటిలో పదివేల యోజన విస్తీర్ణుడైవున్న ఈ మందరుని (మందరపర్వతాన్ని) ధరించు, ధరించు. అనంతమైన బాహుబలం కలిగిన ఓ దేవా! ఒక చేతితో ఈ మందరాచలాన్ని ఎత్తి నిరంతరం స్వాహాస్వధాభిలాషులైన ఈ దేవతలందరికి ఉపకరించుటకై అమృతమంథనం చేయి.

తతః శ్రుత్వా స భగవాన్ స్తోత్రపూర్వం వచస్తదా ।
విహాయ యోగనిద్రాం తాము వాచ మధుసూదనః ॥ 45 ॥

స్తోత్రపూర్వకాలైన వారి మాటలు విన్న భగవానుడైన ఆ మధుసూదనుడు యోగనిద్రను వీడి వారితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ – శ్రీభగవానుడు చెప్పాడు.

స్వాగతం విబుధాః సర్వే కిమాగమనకారణమ్ ।
యస్మాత్కార్యాదిహ ప్రాప్తాః తద్ బ్రూత విగతజ్వరాః ॥ 46 ॥

ఓ దేవతలారా! మీకు స్వాగతం, మీరందరూ కలిసి ఇక్కడికి రావడానికి గల కారణమేమి? ఏ పనిమీద ఇక్కడికి వచ్చారో ఆ పని గురించి చింతారహితులై నాకు వివరించండి.

నారాయణేనైవముక్తాః ప్రోచుస్తత్ర దివౌకసః ।
అమరత్వాయ దేవేశ మథ్యమానే మహోదధౌ ॥ 47 ॥

యథామృతత్వం దేవేశ తథా నః కురు మాధవ ।
త్వయా వినా న తచ్ఛక్యమస్మాభిః కైటభార్దన ॥ 48 ॥

ప్రాప్తుం తదమృతం నాథ తతోఽగ్రే భవ నో విభో ।

శ్రీమన్నారాయణుని ఆ మాటలు విన్న దేవతలు ఆ పరమాత్మునితో ఇలా అన్నారు. ఓ దేవేశా! మాకు అమృతత్వం కల్పించుటకై క్షీరసాగరాన్ని మథించుటకై మేము సంసిద్ధులమైనాము. కావున ఓ మాధవా! మేము అమృతత్వం పొందుటకై నీవే సహాయపడాలి. ఓ కైటభసంహారకా! నీవు లేకుండా మేము అమృతత్వం పొందలేము కనుక ఓ నాథా! మమ్మల్ని కరుణించి అమృతమథనకార్యంలో నీవే మాకు అగ్రేసరుడవై ఉండాలి.

ఇత్యుక్తశ్చ తతో విష్ణురప్రధృష్యోఽరిమర్దనః ॥ 49 ॥

జగామ దేవైః సహితో యత్రాసౌ మందరాచలః ।
వేష్టితో భోగిభోగేన ధృతశ్చామరదానవైః ॥ 50 ॥

విషభీతాస్తతో దేవా యతః పుచ్ఛం తతః స్థితాః ।
ముఖతో దైత్యసంఘాస్తు సైంహికేయపురఃసరాః ॥ 51 ॥

దేవతల ప్రార్థన విని శత్రునాశకుడు, తిరుగులేని పరాక్రమం కలవాడూ అయిన విష్ణుభగవానుడు దేవతలతో కూడ సముద్రంలో మందరాచలమున్న ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ ఆ మందరపర్వతాన్ని సర్పశ్రేష్ఠుడైన వాసుకి చుట్టుకొనగా దేవతలు మరియు దానవులు దానిని పట్టుకొన్నారు. విషభయంతో దేవతలు వాసుకి పుచ్ఛభాగాన్ని ఆశ్రయించగా, ముఖభాగాన్ని రాహువు మొదలుగా గల దైత్యులు పట్టుకొన్నారు.

సహస్రవదనం చాస్య శిరః సవ్యేన పాణినా ।
దక్షిణేన బలిర్దేహం నాగస్యాఽఽకృష్టవాంస్తథా ॥ 52 ॥

దధారామృతమంథానం మందరం చారుకందరమ్ ।
నారాయణః స భగవాన్ భుజయుగ్మద్వయేన తు ॥ 53 ॥

బలిచక్రవర్తి వేయి ముఖాలు గల వాసుకి శిరస్సును తన ఎడమ చేతితో, దేహాన్ని కుడిచేతితో లాగసాగాడు. అందమైన గుహలతో అమృతం చిలకడానికి కవ్వంగా వున్న మందరపర్వతాన్ని శ్రీమన్నారాయణుడు తన రెండు భుజాలతో ఎత్తి పట్టుకొన్నాడు.

తతో దేవాసురైః సర్వైర్జయశబ్దపురఃసరమ్ ।
దివ్యం వర్షశతం సాగ్రం మథితః క్షీరసాగరః ॥ 54 ॥

తతః శ్రాన్తాస్తు తే సర్వే దేవా దైత్యపురఃసరాః ।
శ్రాన్తేషు తేషు దేవేంద్రో మేఘో భూత్వాఽంబుశీకరాన్ ॥ 55 ॥

వవర్షామృతకల్పాంస్తాన్ వవౌ వాయుశ్చ శీతలః ।
భగ్నప్రాయేషు దేవేషు శాంతేషు కమలాసనః ॥ 56 ॥

మథ్యతాం మథ్యతాం సింధురిత్యువాచ పునః పునః ।
అవశ్యముద్యోగవతాం శ్రీరపారా భవేత్సదా ॥ 57 ॥

బ్రహ్మప్రోత్సాహితా దేవా మమంథుః పునరంబుధిమ్ ।

ఆ తరువాత దేవదానవులందరూ కలిసి జయజయధ్వానాలు చేస్తూ నూరు సంవత్సరాల వరకు క్షీరసాగరాన్ని మథించి వారందరూ మిక్కిలి అలసటను పొందారు. దేవదానవులందరూ అలసిపోవుట చూచిన దేవేంద్రుడు మేఘరూపాన్ని ధరించి అమృతతుల్యాలైన జలబిందువులను వర్షింపజేశాడు. దాని వలన గాలి కూడ శీతలత్వాన్ని పొందింది. అయినా అలసట చెంది నిరాశానిస్పృహలకు లోనవుతున్న దేవతలను చూచి కమలాసనుడైన బ్రహ్మదేవుడు సముద్రాన్ని మథించండి, ఇంకా మథించండి అని ప్రోత్సహిస్తూ "ప్రయత్నశీలురకు అపారమైన లక్ష్మి ప్రాప్తిస్తుంది" అని చెప్పాడు. అలా బ్రహ్మదేవుడు ప్రోత్సహించగా దేవతలు మరల ఏకాగ్రచిత్తులై సముద్రాన్ని మథించసాగారు.

భ్రామ్యమాణే తతః శైలే యోజనాయుతశేఖరే ॥ 58 ॥

నిపేతుర్హస్తియూథాని వరాహశరభాదయః ।
శ్వాపదాయుతలక్షాణి తథా పుష్పఫలద్రుమాః ॥ 59 ॥

తతః ఫలానాం వీర్యేణ పుష్పౌషధిరసేన చ ।
క్షీరమంబుధిజం సర్వం దధిరూపమజాయత ॥ 60 ॥

అలా దేవదానవులు పదివేల యోజనాల ఎత్తైన శిఖరం కలిగిన మందరపర్వతాన్ని త్రిప్పుతుండగా దానినుండి గజసమూహాలు, వరాహశరభాది మృగాలు, లక్షల సంఖ్యలో క్రూరమృగాలు, పుష్పాలు మరియు ఫలాలతో కూడిన వృక్షాలు వెలువడసాగాయి. తర్వాత ఫలరసం మరియు పుష్పౌషధిరసంతో క్షీరసాగరంలోని క్షీరమంతా కలిసిపోయి ఆ సాగరం దధిరూపాన్ని పొందింది.

తతస్తు సర్వజీవేషు చూర్ణితేషు సహస్రశః ।
తదంబు మేదసోత్సర్గాత్ వారుణీ సమపద్యత ॥ 61 ॥

వారుణీ గంధమాఘ్రాయ ముముదుర్దేవదానవాః ।
తదాస్వాదేన బలినో దేవదైత్యాదయోఽభవన్ ॥ 62 ॥

తతోఽతివేగాజ్జగృహుర్నాగేంద్రం సర్వతోఽసురాః ।
మంథానం మంథయష్టిస్తు మేరుస్తత్రాచలోఽభవత్ ॥ 63 ॥

అలా సాగరంలో పడిన వేలకొలది జీవులన్నీ చూర్ణితాలు కాగా వాటి మేదస్సు నీటితో కలిసి మద్యమయింది. అటువంటి మద్యపు గంధాన్ని ఆఘ్రాణించి దేవదానవులు సంతోషించారు. మరియు ఆ మద్యాన్ని ఆస్వాదించిన దేవదానవులందరు ఇంకా బలవంతులైనారు. అపుడు మరింత వేగంతో ఆసురులా నాగేంద్రుని మరియు కవ్వమైన మందరపర్వతాన్ని కూడ దృఢంగా పట్టుకొన్నారు. దానివలన కవ్వంగా వున్న మందరపర్వతం కదలకుండా అయింది.

అభవచ్చాగ్రతో విష్ణుర్భుజమందరబంధనః ।
స వాసుకిఫణాలగ్నపాణిః కృష్ణో వ్యరాజత ॥ 64 ॥

యథా నీలోత్పలైర్యుక్తో బ్రహ్మదండోఽతివిస్తరః ।
ధ్వనిర్మేఘసహస్రస్య జలధేరుత్థితస్తదా ॥ 65 ॥

భాగే ద్వితీయే మఘవానాదిత్యస్తు తతః పరమ్ ।
తతో రుద్రా మహోత్సాహా వసవో గుహ్యకాదయః ॥ 66 ॥

అప్పుడు విష్ణువు మందరపర్వతాన్ని తన భుజాలమధ్య బంధించుకొని ముందు నిలిచాడు. వాసుకి పడగలపై తన చేతినుంచిన ఆ భగవానుడు శ్యామలవర్ణంతో ప్రకాశించాడు. మరియు నల్లకలువలతో కూడిన అతి విస్తృతమైన బ్రహ్మదండం వలె కూడ ప్రకాశించాడు. తర్వాత సముద్రం నుండి వేల మేఘాల గర్జనం వంటి ధ్వని ఉత్పన్నమయింది. వాసుకి చివరి భాగంలో ఇంద్రుడు, ఆదిత్యుడు అటు తర్వాత మహోత్సాహవంతులైన రుద్రులు, వసువులు, గుహ్యకులు మొదలైనవారున్నారు.

పురతో విప్రచిత్తిశ్చ నముచిర్వృత్రశంబరౌ ।
ద్విమూర్ధా వజ్రదంష్ట్రశ్చ సైంహికేయో బలిస్తథా ॥ 67 ॥

ఏతే చాన్యే చ బహవో ముఖభాగముపస్థితాః ।
మమంథురంబుధిం దృప్తా బలతేజోవిభూషితాః ॥ 68 ॥

మరియు ముఖం వైపు విప్రచిత్తి, నముచి, వృత్రుడు, శంబరుడు, ద్విమూర్ధ, వజ్రదంష్ట్రుడు, రాహువు మరియు బలి మొదలైన వారెందరో నిలిచారు. తర్వాత దర్పం గలవారు, బలం మరియు తేజస్సుతో విభూషితులైన వారెందరో సముద్రాన్ని మథించారు.

బభూవాత్ర మహాఘోషో మహామేఘరవోపమః ।
ఉదధేర్మథ్యమానస్య మందరేణ సురాసురైః ॥ 69 ॥

తత్ర నానాజలచరా వినిర్ధూతా మహాద్రిణా ।
విలయం సముపాజగ్ముః శతశోఽథ సహస్రశః ॥ 70 ॥

అలా సురాసురులు మందరపర్వతంతో సముద్రాన్ని మథిస్తుండగా మహామేఘగర్జనాన్ని పోలిన మహాధ్వని వినబడింది. ఆ మందరమహాపర్వతంతో సముద్రాన్ని చిలుకుతుండగా దానిచే విసరివేయబడిన వందలు మరియు వేలకొలది జలచరాలు నశించిపోయాయి.

వారుణాని చ భూతాని వివిధాని మహీధరః ।
పాతాలతలవాసీని విలయం సముపానయత్ ॥ 71 ॥

తస్మింశ్చ భ్రామ్యమాణేఽద్రౌ సంఘృష్టాశ్చ పరస్పరమ్ ।
న్యపతన్ పతగోపేతాః పర్వతాగ్రాన్మహాద్రుమాః ॥ 72 ॥

ఇంకనూ ఆ మహీధరుడు వరుణలోకానికి సంబంధిచిన పాతాళలోక నివాసులైన అనేకవిధాలైనప్రాణులను నశింపజేశాడు. మందరపర్వతాన్ని అలా త్రిప్పుతుండగా పరస్పరం రాపిడి చెంది పక్షులతో కూడా మహావృక్షాలు ఆ పర్వతాగ్రం నుండి సముద్రంలో పడిపోయాయి.

తేషాం సంఘర్షణాచ్చాగ్నిరర్చిభిః ప్రజ్వలన్ముహుః ।
విద్యుద్భిరివ నీలాభ్రమావృణోన్మందరం గిరిమ్ ॥ 73 ॥

దదాహ కుంజరాంశ్చైవ సింహాంశ్చైవ వినిఃసృతాన్ ।
విగతాసూని సర్వాణి సత్త్వాని వివిధాని చ ॥ 74 ॥

తమగ్నిమమరశ్రేష్ఠః ప్రదహన్తమితస్తతః ।
వారిణా మేఘజేనేంద్రః శమయామాస సర్వతః ॥ 75 ॥

ఆ మహావృక్షాల రాపిడి వల్ల పుట్టిన అగ్నికూడ అధికమైన జ్వాలలతో మండుతూ నీల మేఘాన్ని మెరపులు ఆవరించినట్లు మందరపర్వతాన్ని ఆవరించింది. మరియు పర్వతం నుండి వెలికి వచ్చిన ఏనుగులు, సింహాలు మొదలైనవాటిని దహించివేసింది. ఆ విధంగా అనేక ప్రాణులు అగ్నిచే దహించబడి విగతజీవులైనాయి. అప్పుడు అమరశ్రేష్ఠుడైన ఇంద్రుడు అంతటా దహించివేస్తున్న అగ్నిని మేఘజలంతో చల్లార్చినాడు.

తతో నానారసాస్తత్ర సుస్రువుః సాగరాంభసి ।
మహాద్రుమాణాం నిర్యాసా బహవశ్చౌషధీరసాః ॥ 76 ॥

తేషామమృతవీర్యాణాం రసానాం పయసైవ చ ।
అమరత్వం సురా జగ్ముః కాంచనచ్ఛవిసన్నిభాః ॥ 77 ॥

అథ తస్య సముద్రస్య తజ్జాతముదకం పయః ।
రసాంతరైర్విమిశ్రశ్చ తతః క్షీరాదభూత్ ఘృతమ్ ॥ 78 ॥

తర్వాత ఆ మందరపర్వతం నుండి నానావిధ రసాలు సాగరజలంలో పడినాయి. మహావృక్షాల నుండి ఉద్భవించిన అనేక విధ ఔషధీరసాలు కూడ పడినాయి. అమృతతుల్యాలైన ఆ రసాలతో దేవతలందరు బంగారపు కాంతితో ప్రకాశిస్తూ అమరత్వాన్ని పొందారు. అపుడు సముద్రంలోని క్షీరరూపమైన జలం వేరే రసాలతో కలిసి నెయ్యిగా మారింది.

తతో బ్రహ్మాణమాసీనం దేవా వచనమబ్రువన్ ।
శ్రాంతాః స్మ సుభృశం బ్రహ్మన్నోద్భవత్యమృతం చ యత్ ॥ 79 ॥

ఋతే నారాయణాత్సర్వే దైత్యా దేవోత్తమాస్తథా ।
చిరాయితమిదం చాపి సాగరస్య తు మంథనమ్ ॥ 80 ॥

అప్పుడు కూర్చొని వున్న బ్రహ్మదేవునితో దేవతలు ఇలా చెప్పారు. ఓ బ్రహ్మదేవా! శ్రీమన్నారాయణుడు తప్ప మేమంతా బాగా అలసిపోయాము. దైత్యులు, దేవతలు కలిసి సాగరమథనం మొదలుపెట్టి చాలా రోజులు గడిచినవి. అయినా అమృతం లభించలేదు.

తతో నారాయణం దేవం బ్రహ్మా వచనమబ్రవీత్ ।
విధత్స్వైషాం బలం విష్ణో! భవానేవ పరాయణమ్ ॥ 81॥

దేవతల మాటలు విని బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణమూర్తితో "ఓ దేవా! విష్ణూ! వీరందరికీ బలం కలిగించు, వీరందరికీ నీవే శరణుడవు అని చెప్పాడు.

విష్ణురువాచ - విష్ణువు చెప్పాడు.

బలం దదామి సర్వేషాం కర్మైతద్యే సమాస్థితాః ।
క్షుభ్యతాం క్రమశః సర్వైర్మందరః పరివర్త్యతామ్ ॥ 82 ॥

బ్రహ్మదేవా! ఎవరు ఈ మహత్తరకార్యక్రమంలో నిరంతరం శ్రమపడుతున్నారో వారందరికీ బలాన్ని ప్రసాదిస్తున్నాను. మరల మీరందరూ సముద్రాన్ని మందరపర్వతంతో క్రమంగా మథించండి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అమృతమంథనే ఏకోనపంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥249॥

శ్రీ మత్స్యమహాపురాణంలో అమృతమంథనమనే రెండువందల నలభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

పంచాశదధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైయవ అధ్యాయం

అమృతమంథనే కాలకూటోత్పత్తిః

అమృతం కొరకు పాలసముద్రాన్ని చిలుకుతుండగా కాలకూటవిషం పుట్టుట

సూత ఉవాచ – సూతమహర్షి చెప్పాడు.

నారాయణవచః శ్రుత్వా బలినస్తే మహోదధౌ ।
తత్పయః సహితా భూత్వా చక్రిరే భృశమాకులమ్ ॥ 1 ॥

తతఃశతసహస్రాంశుసమాన ఇవ సాగరాత్ ।
ప్రసన్నాభః సముత్పన్నః సోమః శీతాంశురుజ్జ్వలః ॥ 2 ॥

శ్రీమన్నారాయణుని మాటలు విన్న బలవంతులైన దేవదానవులు క్షీరసాగరాన్ని ఇతోధికంగా మథించారు. అప్పుడు సాగరం నుండి వందసూర్యులతో సమానమైన ప్రసన్నమైనకాంతి కలిగిన, ఉజ్జ్వలుడు మరియు చల్లని కిరణాలు కలిగిన చంద్రుడు ఉద్భవించాడు.

శ్రీరనంతరముత్పన్నా ఘృతాత్పాండురవాసినీ ।
సురాదేవీ సముత్పన్నా తురగః పాండురస్తథా ॥ 3 ॥

కౌస్తుభశ్చ మణిర్దివ్యశ్చోత్పన్నోఽమృతసమ్భవః ।
మరీచివికచః శ్రీమాన్నారాయణ ఉరోగతః ॥ 4 ॥

తర్వాత నేతితో కూడిన క్షీరసాగరం నుండి తెల్లనివస్త్రాలు ధరించిన లక్ష్మీదేవి ఉద్భవించింది. వెంటనే సురాదేవి, తెల్లని అశ్వం ఉద్భవించాయి. తర్వాత అమృతసంభవమైన, దివ్యమైన మరియు తన కిరణాలచే ప్రకాశించే కౌస్తుభమణి ఉద్భవించి శ్రీమన్నారాయణుని వక్షఃస్థలాన్ని అలంకరించింది.

పారిజాతశ్చ వికచకుసుమస్తబకాంచితః ।
అనంతరమపశ్యంస్తే ధూమమంబరసన్నిభమ్ ॥ 5 ॥

ఆపూరిదిశాభాగం దుఃసహం సర్వదేహినామ్ ।
తమాఘ్రాయ సురాః సర్వే మూర్ఛితాః పరిలంబితాః ॥ 6 ॥

ఉపావిశన్నబ్ధితటే శిరః సంగృహ్య పాణినా ।

తరువాత వికసించిన పూలగుత్తులతో సుశోభితమైన పారిజాతం ఉద్భవించింది. తర్వాత దట్టమైన మేఘాలను బోలిన, సర్వప్రాణులకూ దుఃసహమైన, అన్ని దిశలకు వ్యాపిస్తున్న ధూమాన్ని సురాసురులు చూచారు. ఆ ధూమాన్ని ఆఘ్రాణించిన దేవతలందరూ మూర్ఛితులై వ్రేలాడుతూ చేతులతో తలలు పట్టుకొని సముద్రపు ఒడ్డున కూర్చున్నారు.

తతః క్రమేణ దుర్వారః సోऽనలః ప్రత్యదృశ్యత ॥ 7 ॥

జ్వాలామాలాకులాకారః సమన్తాద్భీషణోऽర్చిషా ।
తేనాగ్నినా పరిక్షిప్తాః ప్రాయశస్తు సురాసురాః ॥ 8 ॥

దగ్ధాశ్చాప్యర్ధదగ్ధాశ్చ బభ్రముః సకలా దిశః ।
ప్రధానా దేవదైత్యాశ్చ భీషితాస్తేన వహ్నినా ॥ 9 ॥

ఆ తరువాత క్రమంగా సముద్రం నుండి దుఃసహమైన అగ్ని పైకి వస్తూ కనబడింది. జ్వాలలనే మాలల సమూహంతో, భయంకరమైన కాంతితో ఆ అగ్ని అంతటా వ్యాపించింది. ఆ అగ్నిచేత దేవదానవులందరూ దహించబడసాగారు. దగ్ధమైన మరియు సగము మాత్రమే దగ్ధమైన శరీరాలతో వారందరూ అన్ని దిశలకు పరుగెత్తారు. దేవతలలో దైత్యులలో కూడ ప్రధానులైన వారందరూ ఆ అగ్నిని చూచి భయపడ్డారు.

అనంతరం సముద్భూతాస్తస్మాద్డుండుభజాతయః ।
కృష్ణసర్పా మహాదంష్ట్రా రక్తాశ్చ పవనాశనాః ॥ 10 ॥

శ్వేతాపీతాస్తథాచాన్యే తథా గోనసజాతయః ।
మశకా భ్రమరా దంశా మక్షికా శలభాస్తథా ॥ 11 ॥

కర్ణశల్యాః కృకలాసాః అనేకే చైవ బభ్రముః ।

తర్వాత భీషణమైన ఆ అగ్నినుండి అనేక డుండుభ (సర్ప) జాతులుద్భవించాయి. వాటిలో కృష్ణసర్పాలు, మహాదంష్ట్రలు కలిగిన రక్తసర్పాలు, వాయుభక్షణతో జీవించే సర్పాలు, శ్వేతసర్పాలు, పీతసర్పాలు, గోనసజాతికి చెందిన సర్పాలున్నాయి. అంతేకాక వాటి తరువాత మశకాలు, భ్రమరాలు, దంశాలు, మక్షికాలు, శలభాలు, కర్ణశల్యాలు, కృకలాసాలు (తొండలు) మొదలైనవి చాలా వెలువడినాయి.

ప్రాణినో దంష్ట్రిణో రౌద్రాస్తథా హి విషజాతయః ॥ 12 ॥

శార్ఙ్గహాలాహలాముస్తవత్సకంగరుభస్మగాః ।
నీలపత్రాదయశ్చాన్యే శతశో బహుభేదినః ।
యేషాం గంధేన దహ్యన్తే గిరిశృంగాణ్యపి ద్రుతమ్ ॥ 13 ॥

ఇంకనూ కోరలు కలిగిన, రౌద్రాకారం కలిగిన అనేక ప్రాణులు, విషజాతికి చెందిన సర్పాలు, శార్ఙ –హాలాహల–ముస్త–వత్స–కంగరు–భస్మగ మరియు నీలపత్రాదులు శతాధికంగా ఉద్భవించాయి. వాటి వాసన మాత్రం చేతనే గిరిశృంగాలు కూడ వెంటనే దహించివేయబడినాయి.

అనంతరం నీలరసౌఘభృఙ్గ భిన్నాఞ్జనాభం విషమం శ్వసన్తమ్ ।
కాయేన లోకాన్తరపూరకేణ కేకైశ్చ వహ్నిప్రతిమైర్జ్వలద్భిః ॥ 14 ॥

సువర్ణముక్తాఫలభూషితాంగం కిరీటినం పీతదుకూలజుష్టమ్ ।
నీలోత్పలాభం కుసుమైః కృతార్ధం గర్జన్తమంభోధరభీమవేగమ్ ॥ 15 ॥

అద్రాక్షురమ్భోనిధిమధ్యసంస్థం సవిగ్రహం దేహిభయాశ్రయం తమ్ ।

ఆ తరువాత నల్లనిరసంవలె, తుమ్మెదలవలె, చీల్చబడిన కాటుకకొండవంటి కాంతిని బోలిన, విషమయమైన శ్వాసలతో, లోకాంతరపూరకమైన శరీరంతో, అగ్నితో సమానంగా జ్వలిస్తున్న కేశాలతో, బంగారం మరియు ముత్యాలతో అలంకరించబడిన శరీరంతో, కిరీటంతో, పసుపు రంగు ధరించిన, నల్లకలువలవంటి కాంతి గలిగిన కుసుమాలను ధరించి, మేఘం వలె గర్జిస్తూ భయానకమైన వేగంతో సముద్రం మధ్యలో ఉద్భవించిన ప్రాణులందరికీ భయం కలిగించే విషపుంజాన్ని వారందరూ చూచారు.

విలోక్య తం భీషణముగ్రనేత్రం భూతాశ్చ విత్రేసురథాపి సర్వే ॥ 16 ॥

కేచిద్విలోక్యైవ గతా హ్యభావం నిఃసంజ్ఞతాం చాప్యపరే ప్రపన్నాః ।
వేముర్ముఖేభ్యోఽపి చ ఫేనమన్యే కేచిత్త్వవాప్తా విషమామవస్థామ్ ॥ 17 ॥

శ్వాసేన తస్య నిర్దగ్ధస్తతో విష్ణ్వింద్రదానవాః ।
దగ్ధాఙ్గారనిభా జాతాః యే భూతా దివ్యరూపిణః ।
తతస్తు సంభ్రమాద్విష్ణుస్తమువాచ సురాత్మకమ్ ॥ 18 ॥

భయంకరాకారం, ఉగ్రాలైన నేత్రాలు గల దానిని చూచి సకల ప్రాణులు భయం పొందారు. చూచిన వెంటనే కొందరు నశించిపోయారు. మరికొందరు స్పృహ కోల్పోయారు. ఇంకొందరు నోళ్ళనుండి నురుగులు కక్కారు. మరికొంతమంది విషమావస్థను పొందారు. దాని శ్వాసమాత్రంతో విష్ణువు, ఇంద్రుడు మరియు దానవులు కూడ నిర్ధగ్ధులైనారు. దాని జ్వాలలతో దివ్యమైన రూపం గలిగిన వారందరూ బొగ్గులవలె అయ్యారు. అప్పుడు వెంటనే శ్రీమహావిష్ణువు వేగిరపాటుతో సురాత్మకుడైన ఆతనితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ – శ్రీభగవానుడు చెప్పాడు.

కో భవానన్తకప్రఖ్యః కిమిచ్ఛసి కుతోఽపి చ ।
కిం కృత్వా తే ప్రియం జాయేదేవమాచక్ష్వ మేఽఖిలమ్ ॥ 19 ॥

తచ్చ తస్య వచః శ్రుత్వా విష్ణోః కాలాగ్నిసన్నిభః ।
ఉవాచ కాలకూటస్తు భిన్నదుందుభినిఃస్వనః ॥ 20 ॥

అంతకుడైన యమునితో సమానుడవైన నీవు ఎవరు? నీవు ఏమి కోరుతున్నావు? ఎక్కడి నుండి వచ్చావు? ఏమి చేస్తే నీకు ప్రీతి కలుగుతుంది? ఇదంతా వెంటనే నాకు చెప్పు అని పలికిన శ్రీమహావిష్ణువు మాటలు విని కాలాగ్ని సమానుడైన కాలకూటుడు? భిన్నమైన దుందుభిధ్వనిని బోలిన స్వరంతో ఇలా చెప్పాడు.

కాలకూట ఉవాచ - కాలకూటము చెప్పాడు.

అహం హి కాలకూటాఖ్యో విషోఽ మ్బుధిసముద్భవ ః ।
యదా తీవ్రతరామర్షైః పరస్పరవధైషిభిః ॥ 21 ॥

సురాసురైర్విమథితో దుగ్ధామ్భోనిధిరద్భుతః ।
సంభూతోఽ హం తదా సర్వాన్ హంతుం దేవాన్ సదానవాన్ ॥ 22 ॥

సర్వానిహ హనిష్యామి క్షణమాత్రేణ దేహినః ।
మాం వా గ్రసత వై సర్వే యాత వా గిరిశాంతికమ్ ॥ 23 ॥

నేను సముద్రం నుండి ఉద్భవించిన కాలకూటమనే విషాన్ని. తీవ్రతరమైన క్రోధం కలవారై, పరస్పరం సంహరించుకోవాలనే కోరిక గలవారై, దేవదానవులు అద్భుతమైన ఈ క్షీరసాగరాన్ని నేను వీరందరిని సంహరించడానికి పుట్టాను. నేను క్షణకాలంలోనే ప్రాణులందరినీ చంపుతాను. కావున వెంటనే మీరందరూ నన్ను మ్రింగండి. లేదా పరమశివుని వద్దకు వెళ్ళండి. ఆతనిని శరణు వేడండి.

శ్రుత్వైతద్వచనం తస్య తతో భీతాః సురాసురా ః ।
బ్రహ్మవిష్ణూ పురస్కృత్య గతాస్తే శంకరాన్తికమ్ ॥ 24 ॥

నివేదితాస్తతో ద్వాస్థై స్తే గణేశైః సురాసురాః ।
అనుజ్ఞాతాః శివేనాథ వివిశుర్గిరిశాన్తికమ్ ॥ 25 ॥

మందరస్య గుహాం హైమీం ముక్తామణివిభూషితామ్ ।
సుస్వచ్ఛమణిసోపానాం వైదూర్యస్తమ్భమండితామ్ ॥ 26 ॥

తత్రదేవాసురైః సర్వైః జానుభిర్ధరణీం గతైః ।
బ్రహ్మాణమగ్రతః కృత్వా ఇదం స్తోత్రముదాహృతమ్ ॥ 27 ॥

కాలకూటం యొక్క ఆ మాటలు విని దేవదానవులందరు భయాన్ని పొంది, బ్రహ్మ విష్ణువులను ముందుంచుకొని మహాదేవుని వద్దకు బయల్దేరారు. ద్వారం వద్దనున్న ప్రమథగణాల ద్వారా పరమశివుని అనుమతిని తెలిసికొని ఆ మహానుభావుని దగ్గరకు వెళ్ళారు. బంగారుమయం, ముత్యపు మణులతో అలంకరించబడింది, స్వచ్ఛమైన మణులతో నిర్మించిన మెట్లు గలది, వైడూర్యమణులచే అలంకరించబడిన స్తంభాలు కలదీ అయిన మందరపర్వతం గుహలో ప్రవేశించి, బ్రహ్మను ముందుంచుకుని, దేవదానవులందరూ మోకాళ్ళపై కూర్చుని శివునికి ప్రణమిల్లి ఆ దేవదేవుని ఇలా స్తుతించారు.

దేవదానవా ఊచుః - దేవదానవులు పలికారు.

నమస్తుభ్యం విరూపాక్ష నమస్తే దివ్యచక్షుషే ।
నమః పినాకహస్తాయ వజ్రహస్తాయ ధన్వినే ॥ 28 ॥

నమస్త్రిశూలహస్తాయ దండహస్తాయ ధూర్జటే! ।
నమస్త్రైలోక్యనాథాయ భూతగ్రామశరీరిణే ॥ 29 ॥

నమః సురారిహన్త్రే చ సోమాగ్న్యర్కాగ్ర్యచక్షుషే ।
బ్రహ్మణే చైవ రుద్రాయ నమస్తే విష్ణురూపిణే ॥ 30 ॥

బ్రహ్మణే వేదరూపాయ నమస్తే దేవరూపిణే ।
సాంఖ్యయోగాయ భూతానాం నమస్తే శంభవాయ తే ॥ 31 ॥

ఓ విరూపాక్షా! దివ్యమైన నేత్రాలు కలవాడా! పినాకమనే ధనుస్సును చేతిలో ధరించేవాడా! వజ్రహస్తుడా! ధన్వీ! త్రిశూలహస్తుడా! చేతిలో దండాన్ని ధరించేవాడా! ధూర్జటీ! త్రిలోకనాథా! సమస్తభూతాలే శరీరంగా కలవాడా! దేవతల శత్రువులను సంహరించేవాడా! చంద్ర సూర్యాగ్నులను నేత్రాలుగా కలవాడా! బ్రహ్మ-విష్ణు-రుద్రస్వరూపా! బ్రహ్మజ్ఞా! వేదస్వరూపా! దేవరూపా! సాంఖ్యస్వరూపా! యోగస్వరూపా! సమస్తప్రాణుల హితం కోరేవాడా! నీకు మా నమస్సులు.

మన్మథాంగవినాశాయ నమః కాలక్షయంకర ।
రంహసే దేవదేవాయ నమస్తే చ సురోత్తమ ॥ 32 ॥

ఏకవీరాయ సర్వాయ నమః పింగకపర్దినే ।
ఉమాభర్త్రే నమస్తుభ్యం యజ్ఞత్రిపురఘాతినే ॥ 33 ॥

శుద్ధబోధప్రబుద్ధాయ ముక్తకైవల్యరూపిణే ।
లోకత్రయవిధాత్రే చ వరుణేంద్రాగ్నిరూపిణే ॥ 34 ॥

ఋగ్యజుః సామవేదాయ పురుషాయేశ్వరాయ చ ।
అగ్ర్యాయ చైవ చోగ్రాయ విప్రాయ శ్రుతిచక్షుషే ॥ 35 ॥

మన్మథుని శరీరాన్ని నశింపజేసినవాడా! కాలక్షయకరా! వేగవంతుడా! దేవదేవా! సురోత్తమా! ఏకవీరా! సర్వా! పింగళవర్ణంగల జటాజూటం కలవాడా! ఉమాపతీ! దక్షయజ్ఞవినాశకా! త్రిపురవిధ్వంసకా! శుద్ధబుద్ధప్రబుద్ధా! ముక్తి కైవల్యరూపా! త్రిలోకవిధాతా! వరుణేంద్రాగ్ని రూపా! ఋగ్యజుఃసామవేద స్వరూపా! పరమపురుషా! ఈశ్వరా! సర్వశ్రేష్ఠుడా! ఉగ్రస్వరూపా! బ్రాహ్మణస్వరూపా! వేదములే నేత్రాలుగా కలవాడా! ఓ పరమశివా! నీకు మా నమస్సులు.

రజసే చైవ సత్త్వాయ తమసే తిమిరాత్మనే ।
అనిత్యనిత్యభావాయ నమో నిత్యచరాత్మనే ॥ 36 ॥

వ్యక్తాయ చైవావ్యక్తాయ వ్యక్తావ్యక్తాయ వై నమః ।
భక్తానామార్తినాశాయ ప్రియనారాయణాయ చ ॥ 37 ॥

ఉమాప్రియాయ శర్వాయ నందివక్త్రాంచితాయ చ ।
ఋతుమన్వంతకల్పాయ పక్షమాసదినాత్మనే ॥ 38 ॥

నానారూపాయ ముండాయ వరూథపృథుదండినే ।
నమః కమలహస్తాయ దిగ్వాసాయ శిఖండినే ॥ 39 ॥

ధన్వినే రథినే చైవ యతయే బ్రహ్మచారిణే ।
ఇత్యేవమాదిచరితైః స్తుతం తుభ్యం నమో నమః ॥ 40 ॥

ఓ సత్త్వరజస్తమోగుణస్వరూపా! అంధకారవినాశకా! నిత్యానిత్యస్వరూపా! నిత్యచరాత్మకా! వ్యక్తావ్యక్త స్వరూపా! భక్తార్తినాశకా! నారాయణప్రియా! ఉమాప్రియా! శర్వా! నంది ముఖంచే పూజించబడినవాడా! ఋతువులను, మన్వంతరాలను కల్పించేవాడా! పక్ష-మాస-దినస్వరూపా! అనేక రూపాలు కలవాడా! ముండరూపా! వరూథస్వరూపా! పృథుదండీ, కమలహస్తా! దిగంబరా! శిఖండీ! ధన్వీ! మహారథీ! యతీ! బ్రహ్మచారీ! పరమశివా! నీకు నమస్సులు. ఇలా అనేక విధాలుగా స్తోత్రం చేయబడేవాడా! నీకు నమస్కారం, నమస్కారం.

ఏవం సురాసురైః స్థాణుః స్తుతస్తోషముపాగతః ।
ఉవాచ వాక్యం భీతానాం స్మితాన్వితశుభాక్షరమ్ ॥ 41 ॥

ఈ విధంగా సురాసురులచే స్తుతించబడిన స్థాణుస్వరూపుడైన పరమశివుడు సంతోషం పొంది భీతావహులైన వారందరితో చిరునవ్వుతో కూడిన మంగళప్రదాలైన మాటలతో ఇలా అన్నాడు.

శ్రీ శంకర ఉవాచ – శ్రీ శంకరుడు చెప్పాడు.

కిమర్థమాగతా బ్రూత త్రాసగ్లానముఖాంబుజాః ।
కిం వాభీష్టం దదామ్యద్య కామం ప్రబ్రూత మా చిరమ్ ॥
ఇత్యుక్తాస్తే తు దేవేన ప్రోచుస్తం ససురాసురాః ॥ 42 ॥

భయంతో వాడిపోయిన కమలం వంటి ముఖాలు కల మీరందరూ ఇక్కడికి ఎందుకు వచ్చారు? మీ అభీష్టమేమిటి? వెంటనే చెప్పండి. మీ కోరిక ఇప్పుడే తీరుస్తాను అని పరమశివుడు వారికి అభయమివ్వగా వారిలా అన్నారు.

సురాసురా ఊచుః – దేవదానవులు చెప్పారు.

అమృతార్థే మహాదేవ మథ్యమానే మహోదధౌ ।
విషమద్భుతముద్భూతం లోకసంక్షయకారకమ్ ॥ 43 ॥

స ఉవాచాథ సర్వేషాం దేవానాం భయకారకః ।
సర్వాన్వా భక్షయిష్యామి అథవా మాం పిబంత్వథ ॥ 44 ॥

ఓ మహాదేవా! అమృతం కోసం మేము క్షీరసాగరాన్ని మథిస్తుండగా సర్వలోకవినాశకారియైన, అద్భుతమైన విషముద్భవించింది. దేవతలందరికీ భయంకరమైన ఆ విషం ఉద్భవించిన వెంటనే "నేను మీ అందరిని భక్షిస్తాను లేదా మీరు నన్ను త్రాగండి" అని చెప్పింది.

తమశక్తా వయం గ్రస్తుం సోఽస్మాన్ శక్తో బలోత్కటః ।
ఏష నిఃశ్వాసమాత్రేణ శతపర్వసమద్యుతిః ॥ 45 ॥

విష్ణుః కృష్ణః కృతస్తేన యమశ్చ విషమాత్మవాన్ ।
మూర్ఛితాః పతితాశ్చాన్యే విప్రణాశం గతాః పరే ॥ 46 ॥

భయంకరమైన ఆ విషాన్ని త్రాగుటకు మేము అశక్తులం కాని బలోద్రేకం గల అది మమ్ములనందరినీ నశింపజేయగలదు. దాని నిఃశ్వాసమాత్రం చేతనే నూరుచంద్రుల సమానమైన కాంతి గలిగిన శ్రీమహావిష్ణువు నల్లగా మారాడు. యముడు కూడ విషమస్థితిని పొందాడు. కొంతమంది దేవతలు మూర్ఛపొందారు మరియు మరికొంతమంది నశించిపోయారు.

అర్థోఽనర్థక్రియాం యాతి దుర్భగాణాం యథా విభో ।
దుర్బలానాం చ సంకల్పో యథా భవతి చాపది ॥ 47 ॥

విషమేతత్సముద్భూతం తస్మాద్వామృతకాంక్షయా ।
అస్మాత్ భయాన్మోచయ త్వం గతిస్త్వం చ పరాయణమ్ ॥ 48 ॥

ప్రభూ! దురదృష్టవంతులకు సంపద కూడా కష్టంగా పరిణమిస్తుంది. అలాగే దుర్బలుల సంకల్పాలు ఆపదలలో విపరీతఫలాలిస్తాయి. అమృతం కోసం సముద్రాన్ని మథించిన మాకు ఈ విషం లభించింది. దేవా! నీవే మమ్మల్ని ఈ భయం నుండి కాపాడాలి. నీవే మాకు శరణు అని వారు ప్రార్థించారు.

భక్తానుకంపీ భావజ్ఞో భువనాధీశ్వరో విభుః ।
యజ్ఞాగ్రభుక్ సర్వహవిః సౌమ్యః సోమః స్మరాంతకృత్ ॥ 49 ॥

త్వమేకో నో గతిర్దేవ గీర్వాణగణశర్మకృత్ ।
రక్షాస్మాన్ భక్ష సంకల్పాద్విరూపాక్ష విషజ్వరాత్ ॥ 50 ॥

తచ్ఛ్రుత్వా భగవానాహ భగనేత్రాన్తకృద్భవః ।

భక్తులయందు దయగలవాడవు, భావజ్ఞుడవు, సకల భువనాలకు ఈశ్వరుడవు, ప్రభువువు, యజ్ఞయాగాదులలో మొదటిభాగాన్ని గ్రహించేవాడవు, సర్వహవిఃస్వరూపుడవు, సౌమ్యుడవు, సోమస్వరూపుడవు, మన్మథునికి వినాశం కలిగించిన వాడవు, దేవతలందరికీ సుఖం కలిగించేవాడవూ అయిన ఓ పరమేశ్వరా! నీవే ఈ కాలకూటవిషాన్ని భక్షించి మమ్మల్ని ఈ విషజ్వరం నుండి రక్షించాలి అని దేవతలు ప్రార్థించగా అది విన్న పరమశివుడు వారితో ఇలా అన్నాడు.

దేవదేవ ఉవాచ – దేవదేవుడు చెప్పాడు.

భక్షయిష్యామ్యహం ఘోరం కాలకూటం మహావిషమ్ ।
తథాన్యదపి యత్కృత్యం కృచ్ఛ్రసాధ్యం సురాసురాః ॥ 52 ॥

ఇత్యుక్తా హృష్టరోమాణో బాష్పగద్గదకంఠినః ।
ఆనందాశ్రు పరీతాక్షాః సనాథా ఇవ మేనిరే ॥
సురా బ్రహ్మాదయః సర్వే సమాశ్వస్తాః సుమానసాః ॥ 53 ॥

నేను ఘోరమైన కాలకూట మహావిషాన్ని భక్షిస్తాను. అంతేకాక ఓ దేవతలారా! దానవులారా! మీకు కష్టసాధ్యమైన ఏ పనినైనా నేను సాధిస్తాను. అని మహాదేవుడు చెప్పగా, బ్రహ్మాది దేవతలందరూ గగుర్పాటు చెందారు. కన్నీటితో వారి కంఠం గద్గదమయింది. వారి కళ్ళనిండా ఆనంద బాష్పాలొచ్చాయి. తమను రక్షించే నాథుడున్నాడని ఓదార్పు పొందారు. ప్రసన్నమనస్కులైనారు.

తతోఽవ్రజత్ ద్రుతగతినా కకుద్మినా హరోఽమ్బరే పవనగతిర్జగత్పతి ః ।
ప్రధావితైరసురసురేంద్రనాయకైః స్వవాహనైర్విచలితశుభ్రచామరైః ॥
పురస్సరైః స తు శుశుభే శుభాశ్రయైః శివో వశీ శిఖికపిశోర్ధ్వజూటకః ॥ 54 ॥

ఆ తరువాత జగత్పతియైన హరుడు తననందివాహనాన్ని అధిరోహించి, వాయు వేగంతో ఆకాశమార్గాన బయల్దేరాడు. అలా బయల్దేరిన శివుని స్వచ్ఛచామరాలు గల సురాసురనాయకులందరూ తమ వాహనాలను అధిరోహించి అత్యంతవేగంతో అనుసరించారు. శుభప్రదాలైన ఆశయాలు గలిగిన వారందరూ ముందుకు నడుస్తుండగా శివుడు చాలా గొప్పగా ప్రకాశించాడు. మరియు అగ్నిజ్వాలవలెవున్న తన తృతీయనేత్రంతో పింగళవర్ణం గల జటాజూటంతో శివుడు ప్రకాశించాడు.

ఆసాద్య దుగ్ధసింధుం తం కాలకూటం విషం యతః ।
తతో దేవో మహాదేవో విలోక్య విషమం విషమ్ ॥ 55 ॥

ఛాయాస్థానకమాస్థాయ సోఽపిబద్వామపాణినా ।

అప్పుడు విషముద్భవించిన క్షీరసాగరం సమీపానికి వెళ్ళి, పరమశివుడు విషమస్వరూపమైన కాలకూట విషాన్ని చూచి, దాని నీడ ఉన్న స్థలంలో నిలిచి ఎడమచేతితో దానిని తీసుకుని త్రాగాడు.

పీయమానే విషే తస్మిన్ తతో దేవా మహాసురాః ॥ 56 ॥

జగుశ్చ ననృతుశ్చాపి సింహనాదాంశ్చ పుష్కలాన్ ।
చక్రుః శక్రముఖాద్యాశ్చ హిరణ్యాక్షాదయస్తథా ॥ 57 ॥

స్తువన్తశ్చైవ దేవేశం ప్రసన్నాశ్చాభవంస్తదా ।

మహాదేవుడు కాలకూటవిషాన్ని త్రాగివేయగా దేవతలు, దానవులు నాట్యం చేశారు. గానం చేశారు. సింహనాదాలవలె అరిచారు. ఇంద్రాది ప్రముఖులు, హిరణ్యాక్షుడు మొదలైనవారు కూడ ఆ దేవదేవుని స్తుతించి ఆనందించారు.

కంఠదేశే తతః ప్రాప్తే విషే దేవమథాబ్రువన్ ॥ 58 ॥

విరించిప్రముఖా దేవా బలిప్రముఖతోऽసురాః ।
శోభతే దేవ కంఠస్తే గాత్రే కుందనిభప్రభే ॥ 59 ॥

భృంగమాలానిభం కంఠేప్యత్రైవాస్తు విషం తవ ।
ఇత్యుక్తః శంకరో దేవస్తథా ప్రాహ పురాంతకృత్ ॥ 60 ॥

అలా త్రాగిన విషం శంకరుని కంఠదేశం చేరగానే బ్రహ్మాదిదేవతలు, బలిప్రముఖులైన దానవులు ఆ మహాదేవునితో ఇలా అన్నారు. ఓ దేవా! మల్లెపూలవంటి కాంతి గలిగిన నీ శరీరంలోని ఈ కంఠం తుమ్మెదల మాలవలె శోభిస్తున్నది. కావున ఓ పరమాత్మా! కాలకూటాన్ని తమ కంఠభాగంలోనే ఉండనిమ్మని ప్రార్థించారు. త్రిపురాంతకుడైన పరమేశ్వరుడు కూడ అలాగేనని దానికి సమ్మతించాడు.

పీతే విషే దేవగణాన్ విముచ్య గతో హరో మందరశైలమేవ ।
తస్మిన్ గతే దేవగణాః పునస్తం మమంథురబ్ధిం వివిధప్రకారాః ॥ 61 ॥

విషం త్రాగిన తర్వాత దేవతాగణాన్ని అక్కడనే వదిలి పరమశివుడు మందర పర్వతానికి వెళ్ళిపోయాడు. హరుడు వెళ్ళిపోయిన పిదప వారంతా మరల అనేక విధాలుగా ఆ క్షీరాబ్ధిని మథించసాగారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అమృతమంథనే కాలకూటోత్పత్తిర్నామ
పంచాశదధికద్విశతతమోऽధ్యాయః॥250॥

శ్రీ మత్స్య మహాపురాణంలో అమృతం కొరకు పాలసముద్రాన్ని చిలుకుతుండగా
కాలకూటవిషం పుట్టుట అనే రెండువందల యాభైయవ అధ్యాయం సమాప్తం.



ఏకపంచాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైఒకటవ అధ్యాయం

అమృతమంథనమ్ – పాలసముద్రాన్ని చిలుకగా అమృతం లభించుట

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

మథ్యమానే పునస్తస్మిన్ జలధౌ సమదృశ్యత ।
ధన్వన్తరిః స భగవాన్ ఆయుర్వేదప్రజాపతిః ॥ 1 ॥

మదిరా చాయతాక్షీ చ లోకచిత్తప్రమాథినీ ।
తతోఽమృతం చ సురభిః సర్వభూతభయాపహా ॥ 2 ॥

మరల దేవదానవులు క్షీరసాగరాన్ని మథిస్తుండగా ఆయుర్వేద ప్రజాపతియైన ధన్వంతరి భగవానుడు ఉద్భవిస్తూ కనబడినాడు. తర్వాత లోకుల చిత్తాన్ని కలవరపరచే విశాలనేత్రాలు కల మదిర, ఆ తరువాత అమృతం, ప్రాణులందరి భయాన్ని పోగొట్టే కామధేనువు ఉద్భవించాయి.

జగ్రాహ కమలాం విష్ణుః కౌస్తుభం చ మహామణిమ్ ।
గజేంద్రం చ సహస్రాక్షో హయరత్నం చ భాస్కరః ॥ 3 ॥

ధన్వంతరిం చ జగ్రాహ లోకారోగ్యప్రవర్తకమ్ ।
ఛత్రం జగ్రాహ వరుణః కుండలే చ శచీపతిః ॥ 4 ॥

పారిజాతతరుం వాయుః జగ్రాహ ముదితస్తథా ।

క్షీరసాగరం నుండి ఉద్భవించిన లక్ష్మీదేవిని మరియు కౌస్తుభమహామణిని కూడ శ్రీమహావిష్ణువు స్వీకరించాడు. అలాగే సహస్రాక్షుడైన ఇంద్రుడు గజేంద్రుని, హయరత్నమైన ఉచ్చైశ్రవాన్ని తీసుకొన్నాడు. సూర్యుడు లోకారోగ్యప్రవర్తకుడైన ధన్వంతరిని పరిగ్రహించాడు. ఛత్రాన్ని వరుణదేవుడు, కుండలాలను ఇంద్రుడు గ్రహించారు. పారిజాతవృక్షాన్ని వాయుదేవుడు సంతోషంతో తీసుకొన్నాడు.

ధన్వంతరిస్తతో దేవః వపుష్మానుదతిష్ఠత ॥ 5 ॥

శ్వేతం కమండలుం బిభ్రదమృతం యత్ర తిష్ఠతి ।
ఏతదత్యద్భుతం దృష్ట్వా దానవానాం సముత్థితః ॥ 6 ॥

అమృతార్థే మహానాదో మమేదమితి జల్పతామ్ ।
తతో నారాయణో మాయామాస్థితో మోహినీం ప్రభుః ॥ 7 ॥

స్త్రీరూపమతులం కృత్వా దానవానభిసంవృతః ।

అప్పుడు సుందరరూపుడైన ధన్వంతరి దేవుడు అమృతంతో నిండిన శ్వేత కమండలాన్ని ధరిస్తూ పైకి వచ్చాడు. ఇలాంటి అద్భుతాన్ని చూచిన వెంటనే దానవులలో కోలాహలం పుట్టింది. “ఇది నాది, ఇది నాది” అను

దానవుల పరస్పరపు అరుపులతో మహానాదం వ్యాప్తిచెందింది. అది గమనించిన శ్రీమన్నారాయణుడు సుందరమైన మాయామోహినీ రూపాన్ని ధరించి దానవుల వద్దకు వెళ్ళాడు.

తతస్తదమృతం తస్యై దదుస్తే మూఢచేతనాః ।
స్త్రియై దానవదైతేయాః సర్వే తద్గతమానసాః ॥ 8 ॥

అథాస్త్రాణి చ ముఖ్యాని మహాప్రహరణాని చ ।
ప్రగృహ్యాభ్యద్రవన్ దేవాన్ సహితా దైత్యదానవాః ॥ 9 ॥

ఆ మోహినియందే మనసు కలిగిన మూఢచిత్తులైన దానవదైత్యులా అమృతాన్ని ఆమెకిచ్చారు. తర్వాత వారందరూ ముఖ్యులైన, బలిష్ఠులైన ఆయుధాలన్నింటిని గ్రహించి దేవతలపైకి పరుగెత్తారు.

తతస్తదమృతం దేవో విష్ణురాదాయ వీర్యవాన్ ।
జహార దానవేంద్రేభ్యో నరేణ సహితః ప్రభుః ॥ 10 ॥

తతో దేవగణాః సర్వే పపుస్తదమృతం తదా ।
విష్ణోః సకాశాత్ సంప్రాప్య సంగ్రామే తుములే సతి ॥ 11 ॥

తతః పిబత్సు తత్కాలం దేవేష్వమృతమీప్సితమ్ ।
రాహుర్విబుధరూపేణ దానవోఽ పృపిబత్తదా ॥ 12 ॥

అదే సమయంలో వీర్యవంతుడైన శ్రీమహావిష్ణువు నరునితో గూడ దానవేంద్రుల నుండి అమృతాన్ని లాక్కొని తన వద్దనే ఉంచుకొన్నాడు. అప్పుడు దేవతలందరూ విష్ణువు నుండి అమృతాన్ని గ్రహించారు. దేవదానవులకు తుముల యుద్ధం జరుగుతున్నప్పటికీ దేవతలు అమృతాన్ని త్రాగసాగారు. తమకు మిక్కిలి ఇష్టమైన అమృతాన్నంతటిని దేవతలు త్రాగుతుండగా రాహువు అనే దైత్యుడు దేవతారూపాన్ని దాల్చి అమృతాన్ని త్రాగాడు.

తస్య కంఠమనుప్రాప్తే దానవస్యామృతే తదా ।
ఆఖ్యాతం చంద్రసూర్యాభ్యాం సురాణాం హితకామ్యయా ॥ 13 ॥

తతో భగవతా తస్య శిరశ్ఛిన్నమలంకృతమ్ ।
చక్రాయుధేన చక్రేణ పిబతోఽ మృతమోజసా ॥ 14 ॥

తచ్ఛైలశృఙ్గప్రతిమం దానవస్య శిరో మహత్ ।
చక్రేణోత్కృత్తమపతచ్చాలయన్ వసుధాతలమ్ ॥ 15 ॥

తతో వైరవినిర్బంధః కృతో రాహుముఖేన వై ।
శాశ్వతశ్చంద్రసూర్యాభ్యాం ప్రసహ్యాద్యాపి బాధతే ॥ 16 ॥

అలా అమృతం ఆ రాహువు కంఠంలోనికి చేరేంతలోనే దేవతల హితాన్ని కాంక్షించే చంద్రసూర్యులిద్దరు అతను అమృతాన్ని త్రాగుతున్న విషయాన్ని శ్రీమన్నారాయణునికి తెలిపారు. అప్పుడు వెంటనే శ్రీహరి తన చక్రాయుధంతో వాని శిరస్సును ఖండించాడు. ఖండించబడిన అతని శిరస్సు పర్వతశిఖరం వలె వసుధాతలాన్ని

కంపింపజేస్తూ క్రిందపడింది. అప్పటినుండి ముఖంతో మాత్రమే మిగిలిన రాహువు చంద్రసూర్యులతో శాశ్వతమైన వైరబంధాన్ని ఏర్పర్చుకొని ఇప్పటికీ వారిని బాధ పెడుతున్నాడు.

విహాయ భగవాంశ్చాపి స్త్రీరూపమతులం హరిః ।
నానాప్రహరణైర్భీమైః దానవాన్ సమకంపయత్ ॥
ప్రాసాః సువిపులాస్తీక్ష్ణాః పతన్తశ్చ సహస్రశః ॥ 17 ॥

తేఽసురాశ్చక్రనిర్భిన్నా వమన్తో రుధిరం బహు ।
అసిశక్తిగదాభిన్నా నిపేతుర్ధరణీతలే ॥ 18 ॥

అపుడు శ్రీవిష్ణుభగవానుడు కూడ అతులమైన ఆ స్త్రీరూపాన్ని వదిలి నానా విధాలైన ఆయుధాలతో దానవులందరిని కంపింపజేశాడు. వేలకొలది తీక్ష్ణాలు, విపులాలైన ఆయుధాలు వారిపై పడుతుండగా, రాక్షసులు చక్రం, ఖడ్గం, శక్తి మరియు గద మొదలైన ఆయుధాల చేత ఛిన్నాభిన్నాలైన దేహాలు కలవారై రక్తాన్ని క్రుక్కుతూ ధరణీతలంపై పడిపోయారు.

భిన్నాని పట్టిశైశ్చాపి శిరాంసి యుధి దారుణే ।
తప్తకాంచనమాల్యాని నిపేతురనిశం తదా ॥ 19 ॥

రుధిరేణావలిప్తాంగా నిహతాశ్చ మహాసురాః ।
అద్రిణామివ కూటాని ధాతురక్తాని శేరతే ॥ 20 ॥

పట్టిశాలు మొదలైన ఆయుధాలచేత భిన్నాలైన, బంగారుమాల్యాదులతో కూడుకొన్న దానవుల శిరస్సులు ఎడతెగక క్రిందపడసాగాయి. దారుణమైన ఆ యుద్ధంలో వధించబడిన మహాసురులందరు రక్తంతో తడిసిన శరీరాలు కలవారై గైరికాదిధాతువులతో ఎర్రగా వున్న పర్వతశిఖరాలవలె కనిపించారు.

తతో హలహలాశబ్దః సమ్బభూవ సమన్తతః ।
అన్యోన్యం ఛిందతాం శస్త్రైరాదిత్యే లోహితాయతి ॥ 21 ॥

పరిఘైశ్చాయసైః పాతైః సన్నికర్షైశ్చముష్టిభిః ।
నిఘ్నతాం సమరేఽన్యోన్యం శబ్దో దివమివాస్పృశత్ ॥ 22 ॥

ఛింది భింది ప్రధావేతి పాతయాభిసరేతి వై ।
విశ్రూయాన్తే మహాఘోరాః శబ్దాస్తత్ర సమన్తతః ॥ 23 ॥

ఆ తరువాత యుద్ధభూమిలో అంతటా "హల హాలా" అనే శబ్దాలు వినబడసాగినవి. పరస్పరం ఒకరిపై ఒకరు శస్త్రాస్త్రాలు విసురుకొంటుండగా సూర్యాస్తమయ సమయమయింది. ఇనుప పరిఘాలను విసిరివేస్తూ, సమీపంలో ఉన్న వారిని పిడికిళ్ళతో గ్రుద్దుకొంటూ, ఇంకా పరస్పరం వివిధ ఆయుధాలతో కొట్టుకొంటున్నవారి ధ్వనులు ఆకాశమంతా వ్యాపించాయి. "నరుకు, నరుకు, పరుగెత్తు, పడవేయి, తొలగు" మొదలైన మహాఘోరాలైన శబ్దాలు అంతటా వినబడినాయి.

ఏవం సుతుములే యుద్ధే వర్తమానే మహాభయే ।
నరనారాయణౌ దేవౌ సమాజగ్మతురాహవమ్ ॥ 24 ॥

తత్ర దివ్యం ధనుర్దృష్ట్వా నరస్య భగవానపి ।
చిన్తయామాస వై చక్రం విష్ణుర్దానవసూదనః ॥ 25 ॥

అలా మహాభయంకరమైన దొమ్మి యుద్ధం జరుగుతుండగా నరనారాయణులిరువురూ యుద్ధభూమికి వచ్చారు. అప్పుడు దానవహంతకుడైన విష్ణుభగవానుడు నరుని దివ్యమైన ధనుస్సును చూచి తన చక్రాన్ని గూర్చి స్మరించాడు.

తతోఽమ్బరాచ్చిన్తితమాత్రమాగతం మహాప్రభం చక్రమమిత్రనాశనమ్ ।
విభావసోస్తుల్యమకుంఠమండలం సుదర్శనం భీమమసహ్య విక్రమమ్ ॥ 26 ॥

తదాగతం జ్వలితహుతాశనప్రభం భయంకరం కరికరబాహురచ్యుతః ।
మహాప్రభం దనుకులదైత్యదారణం తథోజ్జ్వలజ్జ్వలనసమానవిగ్రహమ్ ॥ 27 ॥

ముమోచ వై తపనముదగ్రవేగవాన్ మహాప్రభం రిపునరగావదారణమ్ ।
సంవర్తకజ్వలనసమానవర్చసం పునఃపునర్న్యపతత వేగవత్తదా ॥ 28 ॥

అలా స్మరించిన వెంటనే శత్రునాశకమైన, మహాప్రభావవంతమైన, మహాభయంకరమైన, భరించలేని పరాక్రమం కల, సూర్యునితో సమానమైన తేజోమండలం కల సుదర్శనచక్రము ఆకాశం నుండి క్రిందికి వచ్చింది. జ్వలిస్తున్న అగ్నితో సమానమైన కాంతిగల, మహాప్రభావవంతమైన, సమస్త దానవ, దైత్యకులాలను నశింపజేసే, శత్రువుల నగరాలనన్నింటిని ధ్వంసం చేసే, మిక్కిలి వేగవంతమైన ఆ సుదర్శనచక్రాన్ని ఏనుగు తొండం వలె విశాలబాహువులు గలిగిన ఆ అచ్యుతభగవానుడు తన చేతిలోకి తీసుకుని శత్రువులపై వదిలినాడు. మండుతున్న అగ్నితో సమానమైన కాంతిగల ఆ చక్రాయుధం కూడ శత్రుసమూహాలపై మరల మరల పడి ధ్వంసం చేయసాగింది.

వ్యదారయద్దితితనయాన్ సహస్రశః కరేరితం పురుషవరేణ సంయుగే ।
దహత్ క్వచిజ్జ్వలన ఇవానిలేరితః ప్రసహ్య తానసురగణానకృంతత ॥ 29 ॥

తత్ప్రేరితం వియతి ముహుః క్షితౌ తదా పపౌ రణే రుధిరమథో పిశాచవత్ ।
అథాసురా గిరిభిరదీనమానసాః ముహుర్ముహుః సురగణమర్దయంస్తదా ॥ 30 ॥

యుద్ధభూమిలో పురుషోత్తముడు వదలిన ఆ చక్రాయుధం వేలకొలదిగా దైత్యులను సంహరించింది. వాయువుచే ప్రేరితుడైన అగ్నివలె వారినందరిని దహించివేసింది. శ్రీమహావిష్ణువు ప్రయోగించిన ఆ సుదర్శన చక్రం మరల మరల ఆకాశంలో లేస్తూ, భూమిపై పడుతూ పిశాచం వలె దానవుల రక్తాన్ని త్రాగింది. అప్పుడు అసురులు కూడ దీనత్వం పొందకుండా ధైర్యమనస్కులై పర్వతశిఖరాలతో దేవగణాలను మర్దించసాగారు.

మహాచలా విగలితమేఘవర్చసః సహస్రశో గగనమహాప్రపాతినః ।
అథాన్తరాభరజననాః ప్రపేదిరే సపాదపా బహువిధమేఘరూపిణః ॥ 31 ॥

మహాద్రయః ప్రవిగలితాగ్రసానవః పరస్పరం ద్రుతమభిపత్య భాస్వరాః ।
తతో మహీ ప్రచలితసాద్రికాననా మహీధరాః పవనహతాః సమన్తతః ॥ 32 ॥

జలాన్ని స్రవించే మేఘాలను బోలిన అనేక పర్వతాలు వేలకొలదిగా ఆకాశంలో కనబడసాగాయి. ఆ మహాచలాలు వివిధ వృక్షాలతో కూడినవై మేఘరూపాన్ని కలిగినవై, భయజనకాలై కనబడ్డాయి. మరియు విరిగి పడిపోతున్న సానువులు గల ఆ మహాద్రులెన్నో పరస్పరం దగ్గరకు చేరుతూ, మరియు మండుతూ ప్రకాశించాయి. అటు తర్వాత భూమి తనపై వున్న పర్వతాలతో, అరణ్యాలతో కూడ బాగా కంపించింది. అంతేకాక గాలి తాకిడికి పర్వతాలన్నీ అంతటా పడసాగాయి.

పరస్పరం భృశమభిగర్జితం ముహూ రణాజిరే భృశమభిసంప్రవర్తతే ।
నరస్తతో వరకనకాగ్రభూషణైః మహేషుభిః పవనపథం సమావృణోత్ ॥ 33 ॥

విదారయన్ గిరిశిఖరాణి పత్రిభిః మహాభయే సురగణవిగ్రహే తదా ।
తతో మహీం లవణజలం చ సాగరం మహాసురాః ప్రవివిశురర్దితాః సురైః ॥ 34 ॥

ఈ విధంగా ఆ రణరంగంలో మిక్కిలి భయంకరమైన యుద్ధం జరుగుతుండగా పరస్పరం దెబ్బల ధ్వనులతో గర్జిస్తున్న మేఘరాశివలె కనబడింది. అపుడు నరుడు మేలిమి బంగారు ఆభరణాలతో అలంకరించబడిన బాణాలతో ఆకాశమంతా ఆవరించాడు. తర్వాత అతిభయంకరమైన ఆ దేవరాక్షసులయుద్ధంలో తన బాణాలతో గిరిశిఖరాలను పడగొట్టాడు. అప్పుడు దేవతలు బాధించిన అసురులందరూ భూమిలో, లవణసాగరంలో ప్రవేశించారు.

వియద్గతం జ్వలితహుతాశనప్రభం సుదర్శనం పరికుపితం నిశామ్య చ ।
తతః సురైః విజయమవాప్య మందరః స్వమేవ దేశం గమితః సుపూజితః ॥ 35 ॥

వినాదయన్ స్వదిశముపేత్య సర్వశః తతో గతాః సలిలధరా యథాగతమ్ ।
దదుశ్చ తం నిధిమమృతస్య రక్షితుం కిరీటినే బలిభిరథామరైః సహ ॥ 36 ॥

జ్వలిస్తున్న అగ్నితో సమానమైన కాంతిగల సుదర్శనచక్రం తీవ్రమైన కోపంతో (వేగంతో) అంతరిక్షంలో కనబడటం జూచి వారందరూ భయపడి పారిపోయారు. అపుడు విజయం పొందిన దేవతలు మందరపర్వతాన్ని భక్తితో పూజించి దానిని యథాస్థానం నిలిపారు. తర్వాత మేఘాలన్నీ తమగర్జనలతో అంతరిక్షాన్నంతటిని ధ్వనింపజేస్తూ వాటి దిశలననుసరించి వెళ్ళిపోయాయి. తర్వాత దేవతలు తమకు లభించిన అమృతనిధిని రక్షించవలసిందిగా శ్రీమహావిష్ణువును ప్రార్థించి అమృతభాండాన్ని ఆతనికి అప్పగించారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అమృతమథనం నామ
ఏకపంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥251॥

శ్రీ మత్స్యమహాపురాణంలో పాలసముద్రాన్ని చిలుకగా అమృతం లభించుట మనే
రెండువందల యభైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్విపంచాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైరెండవ అధ్యాయం

వాస్తుభూతోద్భవః – వాస్తుపురుషుని పుట్టుక

ఋషయ ఊచుః – ఋషులు చెప్పారు.

ప్రసాదభవనాదీనాం నివేశం విస్తరాద్వద ।
కుర్యాత్కేన విధానేన కశ్చ వాస్తురుదాహృతః ॥ 1 ॥

ప్రాసాదాలు, భవనాలు మొదలైనవాటి నిర్మాణాన్ని మరియు వాటి సన్నివేశాన్ని వివరంగా చెప్పు. వాటిని నిర్మించటానికి తగిన విధానమేది? మరియు వాస్తు పురుషుడనగా ఎవరు? అని ఋషులు సూతుని అడిగారు.

సూత ఉవాచ – సూతమహర్షి చెప్పాడు.

భృగురత్రిర్వసిష్ఠశ్చ విశ్వకర్మా మయస్తథా ।
నారదో నగ్నజిచ్చైవ విశాలాక్షః పురందరః ॥ 2 ॥

బ్రహ్మా కుమారో నందీశః శౌనకో గర్గ ఏవ చ ।
వాసుదేవోఽనిరుద్ధశ్చ తథా శుక్రబృహస్పతీ ॥ 3 ॥

అష్టాదశైతే విఖ్యాతా వాస్తు శాస్త్రోపదేశకాః ।
సంక్షేపేణోపదిష్టం తు మనవే మత్స్యరూపిణా ॥ 4 ॥

భృగువు, అత్రి, వసిష్ఠుడు, విశ్వకర్మ, మయుడు, నారదుడు, నగ్నజిత్తు, విశాలాక్షుడు, పురందరుడు, బ్రహ్మ, కుమారుడు, నందీశుడు, శౌనకుడు, గర్గుడు, వాసుదేవుడు, అనిరుద్ధుడు, శుక్రుడు, బృహస్పతి ఈ పద్ధెనిమిదిమంది వాస్తుశాస్త్రప్రవర్తకులు. మత్స్యరూపధారియైన భగవానుడు వైవస్వత మనువుకు దీనిని సంక్షిప్తంగా వివరించాడు.

తదిదానీం ప్రవక్ష్యామి వాస్తుశాస్త్ర మనుత్తమమ్ ।
పురాంధకవధే ఘోరే ఘోరరూపస్య శూలినః ॥ 5 ॥

లలాటస్వేదసలిల మపతద్ భువి భీషణమ్ ।
కరాలవదనం తస్మాద్ భూతమద్భూతముల్బణమ్ ॥ 6 ॥

గ్రసమానమివాకాశం సప్తద్వీపాం వసుంధరామ్ ।
తతోఽంధకానాం రుధిరమపిబత్ పతితం క్షితౌ ॥ 7 ॥

ఇప్పుడటువంటి శ్రేష్ఠమైన వాస్తుశాస్త్రాన్ని మీకు చెబుతాను. పూర్వకాలంలో ఘోరమైన అంధకాసుర వధ సందర్భంలో ఘోరరూపుడైన పరమశివుని లలాటం నుండి భీషణమైన చెమట బిందువు ఒకటి భుమిపై పడింది.

దానినుండి భయంకరమైన ముఖంతో సప్తద్వీపసహితమైన భూమిని, ఆకాశాన్ని కూడ మ్రింగివేస్తున్నదా అనేటట్టు మహత్తరమైన ఆకలితో వున్న భూతమొకటి ఉద్భవించింది. వెంటనే భూమిపై పడిన ఆ అంధకుల రక్తాన్నంతటిని త్రాగింది.

తేన తత్సమరే సర్వం పతితం యన్మహీతలే ।
తథాఽపి తృప్తిమగమన్న తద్భూతం యదా తదా ॥ 8 ॥

సదాశివస్య పురతః తపశ్చక్రే సుదారుణమ్ ।
క్షుధావిష్టం తు తద్భూతం ఆహర్తుం జగతీత్రయమ్ ॥ 9 ॥

తతః కాలేన సంతుష్టో భైరవస్తస్య చాహ వై ।
వరం వృణీష్వ భద్రం తే యదభీష్టం తవానఘ ॥ 10 ॥

ఆ యుద్ధంలో మహీతలంపై పడిన రక్తాన్నంతటిని త్రాగినా ఆ భూతం తృప్తిచెందలేదు. ఆకలితో వున్న ఆ భూతం ముల్లోకాలను మ్రింగటానికి సదాశివుని గురించి ఘోరమైన తపస్సు చేసింది. అయితే కొంతకాలం తర్వాత ఆ తపస్సుకు సంతసించిన భైరవరూపుడైన సదాశివుడు అనఘా! నీ అభీష్టమైన వరాన్ని కోరుకో! అని అన్నాడు.

తమువాచ తతో భూతం త్రైలోక్యగ్రసనక్షమమ్ ।
భవామి దేవదేవేశ తథేత్యుక్తం చ శూలినా ॥ 11 ॥

తతస్త్రిదివం సర్వం భూమండలమశేషతః ।
స్వదేహేనాంతరిక్షంచ రుంధానం ప్రాపతద్భువి ॥ 12 ॥

భీతభీతైస్తతో దేవైః బ్రహ్మణా చాథ శూలినా ।
దానవాసురరక్షోభిరవష్టబ్ధం సమన్తతః ॥ 13 ॥

యేన యత్రైవ చాక్రాన్తం స తత్రైవావసత్ పునః ।
నివాసాత్ సర్వదేవానాం వాస్తురిత్యభిధీయతే ॥ 14 ॥

అపుడా భూతం "దేవదేవేశా! ఈ ముల్లోకాలను మ్రింగివేయగలిగే శక్తిని ప్రసాదించు అని కోరింది. పరమశివుడు దానికంగీరించాడు. అంతట ఆ భూతం సకల భూమండలంతో కూడిన ముల్లోకాలను మరియు అంతరిక్షాన్ని కూడ తన దేహంతో ఆక్రమిస్తూ భూమిపై పడింది. అది చూచి భయపడిన బ్రహ్మరుద్రాది దేవతలు, దానవాసుర రాక్షసులును కలిసి భూమిపై పడిన ఆ భూతాన్ని త్రొక్కి అణిచి పెట్టారు. ఎవరెక్కడ దానిని త్రొక్కి ఆక్రమించారో ఆ భూతానికి సంబంధించిన దేహపు అంశం అక్కడనే ఉండిపోయినది. ఆ విధంగా దేవతలందరి నివాసమైనందున ఆ భూతానికి వాస్తు అనే పేరు వచ్చింది.

అవష్టబ్ధాశ్చ తేనాపి విజ్ఞప్తాః సర్వదేవతాః ।
ప్రసీదధ్వం సురాః సర్వే యుష్మాభిర్నిశ్చలీకృతాః ॥ 15 ॥

స్థాస్యామ్యహం కిమాకారో హ్యవష్టబ్ధో హ్యధోముఖః ।
తతో బ్రహ్మాదిభిః ప్రోక్తం వాస్తుమధ్యే తు యో బలిః ॥ 16 ॥

ఆహారో వైశ్వదేవాన్తే నూనమస్మిన్ భవిష్యతి ।

ఆ విధంగా త్రొక్కివేయబడి అణిచివేయబడిన ఆ భూతం దేవతలందరితో ఇలా అన్నది. ఓ దేవతలారా! నన్ను అనుగ్రహించండి. మీరు నన్ను కదలకుండా చేశారు. ఇలా మీ చేత అణిచివేయబడి అధోముఖుడనై పడి ఉన్న నాకు ఆహారం ఎలా లభిస్తుంది అని ప్రార్థించింది. అపుడు బ్రహ్మాదిదేవతలీవిధంగా చెప్పారు. వైశ్వదేవ మాచరించే గృహస్థుడు, ఆ కర్మాంతంలో గృహం మధ్యభాగంలో వేసే బలి నీకు ఆహారమవుతుంది.

వాస్తుపూజామకుర్వాణస్తవాహారో భవిష్యతి ॥ 17 ॥

అజ్ఞానాత్తు కృతో యజ్ఞస్తవాహారో భవిష్యతి ।
యజ్ఞోత్సవాదౌ చ బలిస్తవాహారో భవిష్యతి ॥ 18 ॥

ఏవముక్తస్తతో హృష్టః స వాస్తురభవత్తదా ।
వాస్తుయజ్ఞః స్మృతస్తస్మాత్తతః ప్రభృతి శాంతయే ॥ 19 ॥

శాస్త్రోక్తంగా వాస్తు పూజ చేయకున్నా, దానికై అర్పించిన బలి నీ కాహారమవుతుంది. అజ్ఞానంతో యజ్ఞయాగాదులు నిర్వహించినా వాటిలో అర్పించేవి కూడ నీకు ఆహారమవుతాయి. యజ్ఞాలలో ఉత్సవాలలో అర్పించే 'బలి' నీకాహారమవుతుందని దేవతలు తెలుపగా ఆ వాస్తుపురుషుడు సంతసించాడు. అప్పటి నుండే లోకంలో అందరూ శాంతికోసం వాస్తుపూజ చేయటం ఆరంభమయింది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వాస్తుభూతోద్భవో నామ
ద్విపంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥252॥

శ్రీ మత్స్య మహాపురాణంలో వాస్తుపురుషుని పుట్టుక అనే
రెండువందల యాభైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రిపంచాశదధిక త్రిశతతమోఽధ్యాయః - రెండువందల యాభైమూడవ అధ్యాయం

ఏకాశీతి పదవాస్తు నిర్ణయః - ఏకాశీతి పదవాస్తు నిర్ణయం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి గృహకాలవినిర్ణయమ్ ।
యథాకాలం శుభం జ్ఞాత్వా సదా భవనమారభేత్ ॥ 1 ॥

ఇక ఇప్పుడు గృహారంభకాలనిర్ణయాదుల గురించి వివరిస్తాను. శుభప్రదమైన కాలమును తెలిసికొని భవననిర్మాణమారంభించాలి.

చైత్రే వ్యాధి మవాప్నోతి యో గృహం కారయేన్నరః ।
వైశాఖే ధేనురత్నాని జ్యేష్ఠే మృత్యుం తథైవ చ ॥ 2 ॥

ఆషాఢే భృత్య రత్నాని పశువర్గమవాప్నుయాత్ ।
శ్రావణే భృత్యలాభం తు హానిం భాద్రపదే తథా ॥ 3 ॥

పత్నీనాశోఽశ్వినే వింద్యాత్కార్తికే ధనధాన్యకమ్ ।
మార్గశీర్షే తథా భక్తం పౌషే తస్కరతో భయమ్ ॥ 4 ॥

లాభం చ బహుశో వింద్యాత్ అగ్నిం మాఘే వినిర్దిశేత్ ।
ఫాల్గునే కాంచనం పుత్రానితి కాలబలం స్మృతమ్ ॥ 5 ॥

చైత్రమాసం నందు గృహారంభము చేసినచో యజమాని వ్యాధిగ్రస్తుడవుతాడు. వైశాఖమాసమునందైనచో గోవులు, రత్నములు మొదలగు వాటిని పొందుతాడు. జ్యేష్ఠమాసం మృత్యుకారకము. ఆషాఢమాసమునందైతే మంచి భృత్యులను మరియు పశువర్గమును కూడ పొందును. శ్రావణమాసము నందు చేసిన భృత్యులాభము కలుగును. భాద్రపదమాసము మాత్రము హానికరము. ఆశ్వయుజమాసము పత్నీహానికారకమని తెలిసికోవాలి. కార్తికమాసము ధనధాన్యాది వృద్ధి కలిగించును. మార్గశీర్షమాసము ఆరంభించిన అన్నాభివృద్ధి కలుగును. కాని పుష్యమాసము చోరభయకారకము. మాఘమాసము బహులాభదాయకమే అయినా అగ్నిభయం కూడ కలదనువిషయము తెలిసికోవాలి. ఫాల్గునమాసము కాంచనమును మరియు అనేక పుత్రులను కూడ ఇస్తుంది. ఈ విధంగా కాలబలం వివరింపబడింది.

అశ్వినీ రోహిణీ మూలముత్తరాత్రయమైన్దవమ్ ।
స్వాతీ హస్తోఽనురాధా చ గృహారంభే ప్రశస్యతే ॥ 6 ॥

నక్షత్రములలో అశ్వినీ, రోహిణీ, మూల, ఉత్తర ఫల్గుని, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, మృగశిర, స్వాతి, హస్త, అనూరాధ అను నక్షత్రములు గృహారంభమునకు ప్రశస్తములు.

ఆదిత్యభౌమవర్జ్యాస్తు సర్వే వారాః శుభావహాః ।
వర్జం వ్యాఘాతశూలే చ వ్యతీపాతాతి గండయోః ॥ 7 ॥

ఆదివారము మరియు మంగళవారములను వదిలి మిగతా వారములన్నియు శుభప్రదములే. వ్యాఘాత – శూల వ్యతీపాతాది గండములు వదిలివేయవలెను.

విష్కంభగండపరిఘ వజ్రయోగేషు కారయేత్ ।
శ్వేతే మైత్రేఽథ మాహేంద్రే గంధర్వాభిజితి రౌహిణే ॥ 8 ॥

తథా వైరాజసావిత్రే ముహూర్తే గృహమారభేత్ ।
చంద్రాదిత్యబలం లబ్ధ్వా శుభలగ్నం నిరీక్షయేత్ ॥ 9 ॥

స్తంభోచ్ఛ్రాయాదికర్తవ్య మన్యత్తు పరివర్జయేత్ ।
ప్రాసాదేష్వేవమేవం స్యాత్కూపవాపీషు చైవ హి ॥ 10 ॥

విష్కంభ హేగండ పరిఘ వజ్రయోగములు గృహారంభమునకు ప్రశస్తాలు. మరియు శ్వేత, మైత్ర, మాహేంద్ర, గాంధర్వ – అభిజిత్ , రౌహిణి వైరాజ సావిత్ర మొదలగు ముహూర్తములందు గృహారంభకార్యం చేపట్టాలి. అంతేకాక చంద్రరవి బలమును తెలిసికొని శుభలగ్నమును కూడ విచారించి శుభప్రదమైన సమయమునందు గృహమునకు సంబంధించిన స్తంభస్థాపనాదులు చేపట్టాలి. ప్రాసాదనిర్మాణములందు, కూపవాపీ నిర్మాణాదులయందు ఇటువంటి ముహూర్తములను గమనించి ఆరంభించాలి.

(పగలు కాని రాత్రి సమయమున కాని క్రమముగా 15 ముహూర్తములుండునని జ్యోతిశ్శాస్త్రము తెలుపుతున్నది. 1. రౌద్రము 2. శ్వేతము 3. మైత్రము 4. సారభటము 5. సావిత్రము 6. వైరాజము 7. విశ్వావసువు 8. అభిజిత్ 9. రౌహిణము 10. బలము 11. విజయము 12. నైరృతము 13. వారుణము 14. సౌమ్యము 15. భగము. వీటిలో శ్వేతము, మైత్రము, మాహేంద్రము, గాంధర్వము, అభిజిత్, రౌహిణము, వైరాజము మరియు సావిత్రము అను ముహూర్తములు గృహారంభమునకు శ్రేష్ఠములని జ్యోతిశ్శాస్త్రము తెలుపుతున్నది).

పూర్వం భూమిం పరీక్షేత పశ్చాద్వాస్తుం ప్రకల్పయేత్ ।
శ్వేతా రక్తా తథా పీతా కృష్ణా చైవానుపూర్వశః ॥ 11 ॥

విప్రాదేః శస్యతే భూమిరతః కార్యం పరీక్షణమ్ ।
విప్రాణాం మధురాస్వాదా కటుకా క్షత్రియస్య తు ॥ 12 ॥

తిక్తా కషాయా చ తథా వైశ్యశూద్రేషు శస్యతే ।

ముందుగా భూమిని పరీక్షించి అటు పిమ్మట వాస్తుప్రకల్పనము చేయాలి. బ్రాహ్మణ – క్షత్రియ – వైశ్య – శూద్రులకు అదేక్రమముగా శ్వేత – రక్త – పీత – కృష్ణవర్ణములు గల భూములు శ్రేష్ఠమైనవి. కావున భూమిని

పరీక్ష చేయుట ఆవశ్యకము. అందులోనూ మధురముగా ఉండునవి బ్రాహ్మణులకు, వగరుగా ఉండునవి క్షత్రియులకు, తిక్తములు వైశ్యులకు, కషాయపు భూమి శూద్రులకు ప్రశస్తాలు.

అరత్నిమాత్రే వై గర్తే స్వనులిప్తే చ సర్వశః ॥ 13 ॥

ఘృతమామశరావస్థం కృత్వా వర్తిచతుష్టయమ్ ।
జ్వాలయేద్ భూపరీక్షార్థం తత్పూర్ణం సర్వదిఙ్ముఖమ్ ॥ 14 ॥

దీప్తౌ పూర్వాది గృహ్ణీయాత్ వర్ణానామనుపూర్వశః ।
వాస్తు సామూహికో నామ దీప్యతే సర్వతస్తు యః ॥ 15 ॥

శుభదః సర్వవర్ణానాం ప్రాసాదేషు గృహేషు చ । 16 ।

అటు పిమ్మట భూపరీక్షకై పిడిమూర గల లోతు, తత్సమానమైన పొడవు మరియు వెడల్పు గల చిన్న గుంతను త్రవ్వి, దానిని చక్కగా అలకాలి. ఆ గుంతలో ఒక పచ్చి మూకుడును ఉంచి, నేయి పోసి నాలుగు వత్తులను నాలుగు దిశలందుండునట్లు వేసి, వాటిని వెలిగించాలి. అప్పుడు ఏ దిక్కుయందలి దీపములు ఎక్కువ కాంతితో వెలుగునో గమనించాలి. తూర్పున నున్న దీపం బాగా వెలిగినచో అది విప్రులకు, దక్షిణ దిశ యందలిది క్షత్రియులకు, పడమరదీపం వైశ్యులకు మరియు ఉత్తర దిక్కుయందలిదీపము శూద్రులకు మంచిది అని గ్రహించాలి. ఒకవేళ అన్నిదిక్కులయందలి దీపములు ప్రకాశవంతముగా వెలిగినచో దానిని సామూహికవాస్తుప్రదేశమని గుర్తించాలి. అటువంటి భూమి అన్ని వర్ణములవారికి ప్రాసాదగృహనిర్మాణాదులకు శుభప్రదం.

రత్ని మాత్రమథో గర్తే పరీక్ష్యం ఖాతపూరణే ॥ 16 ॥

అధికే శ్రియమాప్నోతి న్యూనే హానిం సమే సమమ్ ।
ఫాలకృష్టే ఽథవా దేశే సర్వబీజాని వాపయేత్ ॥ 17 ॥

త్రిపంచసప్తరాత్రే చ యత్రారోహంతి తాన్యపి ।
జ్యేష్ఠోత్తమా కనిష్ఠా భూర్వర్జనీయతరా సదా ॥ 18 ॥

తదనంతరము ఆ త్రవ్విన మట్టితోడనే గోతిని పూడ్చాలి. ఆ గోతిని పూడ్చునప్పుడు త్రవ్విన మట్టి ఎక్కువైనచో శుభకరము, సరిపోయినచో ఫలితము సమముగానే ఉండును. కాని పూడ్చుటకు మట్టి తక్కువైనచో అది అమంగళకరము (కనుక అట్టి భూమి యందు గృహనిర్మాణాదులు పనికిరావని శాస్త్రము తెలుపుతున్నది). తర్వాత ఆ భూమిని నాగలితో దున్ని అన్ని విధములైన విత్తనములను చల్లవలెను. ఆ విత్తనము మూడుదివసములకు మొలకెత్తినచో చాలా ఉత్తమము, ఐదు దివసములకైనచో మధ్యమము మరియు ఏడు దివసములు పట్టినచో అధమము. అటువంటి ప్రదేశములు గృహనిర్మాణమునకు యోగ్యములు కావు.

పంచగవ్యౌషధిజలైః పరీక్షిత్వా చ సేచయేత్ ।
ఏకాశీతిపదం కృత్వా రేఖాభిః కనకేన చ ॥ 19 ॥

పశ్చాత్పిష్టేన చాలిప్య సూత్రేణాలీడ్య సర్వతః ।
దశపూర్వాయతా లేఖా దశ చైవోత్తరాయతాః ॥ 20 ॥

ఆ విధముగా స్థలమును శాస్త్రరీతిననుసరించి పరీక్షించి, అది గృహనిర్మాణమునకు యోగ్యమేనని నిర్ణయించి, ఆ స్థలమును పంచగవ్యములతోను, ఓషదులతోను సంమిశ్రితములైన నీటితో ప్రోక్షణచేసి (చల్లి) చక్కగా తడపాలి. తర్వాత ఆ ప్రదేశమునందు ఎనుబదియొక్క గదులు వచ్చునట్లు బంగారు పుల్లతో రేఖలు గీయాలి. తర్వాత దానిపై పిండితో పూసిన దారంతో అంతటను ఆలోడనము చేయవలెను. తర్వాత దారముతో తూర్పు పడమరలుగా పది, ఉత్తరదక్షిణములు పది రేఖలు వచ్చునట్లు గీయాలి.

సర్వవాస్తువిభాగేషు విజ్ఞేయా నవకా నవ ।
ఏకాశీతిపదం కృత్వా వాస్తువిత్ సర్వవాస్తుషు ॥ 21 ॥

పదస్థాన్ పూజయేద్దేవాన్ త్రింశత్పంచదశైవ తు ।
ద్వాత్రింశద్బాహ్యతః పూజ్యాః పూజ్యాశ్చాంతస్త్రయోదశ ॥ 22 ॥

నామతస్తాన్ ప్రవక్ష్యామి స్థానాని చ నిబోధత ।
ఈశానకోణాదిషు తాన్ పూజయేద్ధవిషా నరః ॥ 23 ॥

సర్వవాస్తు విభాగములందు ఇట్లే ఆచరించాలని తెలిసికోవాలి. ఈ విధంగా గీచిన తొమ్మిది తొమ్మదులు (9×9=81) ఎనుబదియొక్క గదులు ఏర్పడును. వాస్తుశాస్త్రవేత్త అయిన పండితుడు వాస్తునిర్మాణ కర్మములన్నిటియందును ఈ పద్ధతినే అనుసరించాలి. తర్వాత ఈ గదులకు వెలుపల ముప్పది రెండు మంది, లోపల పదమూడు (32+13) మంది (అనగా నలుబదిఐదు మంది) ఆయా దేవతలను యజమాని ఈశాన్యకోణాదిగా ఆయా స్థానములందు నిలిపి ప్రతిష్ఠించి హవిస్సుతో పూజించాలి. ఇప్పుడు ఆ దేవతల పేర్లను వారి స్థానములను క్రమంగా వివరిస్తాను.

శిఖీ చైవాథ పర్జన్యో జన్యతః కులిశాయుధః ।
సూర్యసత్యౌ భృశశ్చైవ ఆకాశో వాయురేవ చ ॥ 24 ॥

పూషా చ వితథశ్చైవ గృహక్షతయమావుభౌ ।
గంధర్వో భృంగరాజశ్చ మృగః పితృగణస్తథా ॥ 25 ॥

దౌవారికోఽథ సుగ్రీవః పుష్పదంతో జలాధిపః ।
అసురః శోషపాపౌ చ రోగోఽహిముఖ్య ఏవ చ ॥ 26 ॥

భల్లాటః సోపసర్పౌ చ అదితిశ్చ దితిస్తథా ।
బహిర్ద్వాత్రింశదేతే తు తదన్తస్తు తతః శృణు ॥ 27 ॥

అగ్ని, పర్జన్యుడు, జయంతుడు, ఇంద్రుడు, సూర్యుడు, సత్యుడు, భృశుడు, ఆకాశుడు, వాయువు, పూష, వితథుడు, గృహక్షతుడు, యముడు, గంధర్వుడు, భృంగరాజు, మృగుడు, పితృగణము, దౌవారికుడు, సుగ్రీవుడు,

పుష్పదంతుడు, జలాధిపుడైన వరుణుడు, అసురుడు, శోషుడు, పాపుడు, రోగుడు, అహి, ముఖ్యుడు, భల్లాటుడు, సోముడు, సర్పుడు, అదితి, దితి అను ఈ ముప్పదిరెండు మందిని బయట గదుల యందు స్థాపించాలి. లోపలి గదులందు ప్రతిష్ఠించవలసిన దేవతల పేర్లను వినుము.

ఈశానాదిచతుష్కోణ సంస్థితాన్ పూజయేద్ బుధః ।
ఆపశ్చైవాథ సావిత్రో జయారుద్రస్తథైవ చ ॥ 28 ॥

మధ్యే నవపదే బ్రహ్మా తస్యాష్టౌ చ సమీపగాన్ ।
సాధ్యానేకాంతరాన్ వింద్యాత్ పూర్వాద్యాన్నామతః శృణు ॥ 29 ॥

లోపలి భాగమున ఈశానాది చతుష్కోణములందు ఆపుడు, సావిత్రుడు, జయుడు, రుద్రుడు అను వారిని ప్రతిష్ఠించాలి. అట్లే మధ్యలో నున్న గదియందు బ్రహ్మను, ఆ బ్రహ్మకు దగ్గరలో ఒక గదిని వదిలి దాని ప్రక్కన నున్న గదియందు ఎనిమిది మంది సాధ్యులను స్థాపించాలి. క్రమముగా వారి నామములను వినుము.

అర్యమా సవితా చైవ వివస్వాన్ విబుధాధిపః ।
మిత్రోఽథ రాజయక్ష్మా చ తథా పృథ్వీధరః స్మృతః ॥ 30 ॥

అష్టమశ్చాపవత్సస్తు పరితో బ్రహ్మణః స్మృతః ।
ఆపశ్చైవాపవత్సశ్చ పర్జన్యోఽగ్నిర్దితి స్తథా ॥ 31 ॥

పదికానాం తు వర్గోఽయమేవం కోణేష్వశేషతః ।
తన్మధ్యే తు బహిర్వింశద్ ద్విపదాస్తే తు సర్వశః ॥ 32 ॥

అర్యమా చ వివస్వాంశ్చ మిత్రః పృథ్వీధరస్తథా ।
బ్రహ్మణః పరితో దిక్షు త్రిపదాస్తే తు సర్వశః ॥ 33 ॥

అర్యముడు, సవిత, వివస్వంతుడు, ఇంద్రుడు, మిత్రుడు, రాజయక్ష్ముడు, పృథ్వీధరుడు మరియు ఆపవత్సుడు. వీరందరిని బ్రహ్మకు చుట్టూ ప్రాగాదిగా స్థాపించాలి. ఇపుడు ఆయా మూలలందు స్థాపించవలసిన పదికుల గురించి తెలిసికొందము. (పదము అనగా గది లేదా అంకణము. వాటిలో నిలుపువారిని పదికులు అందురు. అనగా ఆయా అంకణములకు వారు అధిపతులని గ్రహించాలి). ఈశాన్య కోణమునందుడు ఆపుడు, ఆపవత్సుడు, పర్జన్యుడు, అగ్ని మరియు దితి, ఆగ్నేయమునందుండు ఆకాశ - పూష - వాయు- సావిత్రి - సవిత్రులు, నైఋతిదిశయందుండు మృగ, దౌవారిక, పితృగణ, జయ, విబుధాధిపులు, వాయవ్యదిశయందుండు పాప, అహి, రోగ, రుద్ర, రాజయక్ష్ములు అను ఈ ఇరువది మంది, ఒక్కొక్క గదికి అధిపతులని గ్రహించాలి. అట్లే తూర్పు దిశ యందున్న జయంతుడు, ఇంద్రుడు, సూర్యుడు, సత్యుడు, భృశుడు మొదలగు వారు, దక్షిణ దిశయందుండు వితథ, గృహక్షలు, యమ, గంధర్వ, భృంగరాజులు, పశ్చిమదిశయందుండు సుగ్రీవ, పుష్పదంత వరుణ, అసుర, శోషలు ఉత్తర దిక్కుయందుండు ముఖ్య, భల్లాట, సోమ, సర్ప, అదితులు అను ఇరువది మంది రెండేసి గదులకు అధిపతులని కూడ తెలిసికోవాలి. మరియు లోపలి వరుస యందుండు అర్యముడు, వివస్వంతుడు,

మిత్రుడు, పృథ్వీధరుడు అను నలుగురునూ మూడేసి గదులకు అధిపతులని కూడ తెలుసుకోవాలి. వీరందరి మధ్యన ఉండు బ్రహ్మ తొమ్మిది గదులకు అధిపతి. ఇట్లు 20 + 40 + 12 + 9 = 81 గదులకు వీరందరు అధిపతులు.

వంశానిదానీం వక్ష్యామి ఋజూనపి పృథక్ పృథక్ ।
వాయుం యావత్తథా రోగాత్ పితృభ్యః శిఖినం పునః ॥ 34 ॥

ముఖ్యాద్ భృశం తథా శేషాద్వితథం యావదేవ తు ।
సుగ్రీవాదదితిం యావత్ మృగాత్ పర్జన్యమేవ చ ॥ 35 ॥

ఇపుడు పైన వివరించిన దేవతలకు సంబంధించిన వంశముల గురించి సరళముగా వివరించెదను. వాయువు నుండి రోగుని వరకు, పితృగణము మొదలుకొని అగ్ని పర్యంతము, ముఖ్యుని నుండి భృశుని పర్యంతము, శేషునినుండి వితథుని పర్యంతము, సుగ్రీవుని నుండి అదితి పర్యంతము మరియు మృగుని మొదలుకొని పర్జన్యుని వరకును వారి వారి వంశానుక్రమముండును.

ఏతే వంశాః సమాఖ్యాతాః క్వచిచ్చ జయమేవ తు ।
ఏతేషాం యస్తు సమ్పాతః పదం మధ్యం సమం తథా ॥36 ॥

మర్మచైతత్సమాఖ్యాతం త్రిశూలం కోణగం చ యత్ ।
స్తమ్భం న్యాసేషు వర్జ్యాని తులావిధిషు సర్వదా ॥ 37 ॥

కీలోచ్ఛిష్టోపఘాతాది వర్జయేద్యత్నతో జనః ।

పైన చెప్పిన వంశవిధానమందు కొంతమంది నాలుగవదానిలో మృగుని నుండి జయుని పర్యంత ముండునని అందురు.ఆయా పదములనడుమ ఏర్పడునట్టి ఈ రేఖల సంపాత స్థానములను మర్మములని అందురు. కోణస్థానములకు త్రిశూలమని చెప్పబడినది. అయితే ఈ సంపాతస్థానములందు కాని, త్రిశూలస్థానములందు కాని స్తంభము నిలుపకూడదు. కీలోచ్ఛిష్ట–ఉపఘాతాదులను వాస్తుపూజాదులను ఆచరించువారు జాగరూకతతో వదిలివేయాలి. అటువంటి ఉపఘాతములు కలుగకుండునట్లు ప్రయత్నించాలి.

సర్వత్ర వాస్తు నిర్దిష్టో పితృవైశ్వానరాయతః ॥ 38 ॥

మూర్ధన్యాగ్నిః సమాదిష్టః ముఖే చాపః సమాశ్రితః ।
పృథ్వీధరోఽ ర్యమా చైవ స్తనయోస్తావధిష్ఠితౌ ॥ 39 ॥

వక్షః స్థలే చాపవత్సః పూజనీయః సదా బుధైః ।
నేత్రయోర్దితి పర్జన్యౌ శ్రోత్రేఽ దితి జయన్తకౌ ॥ 40 ॥

సర్పేంద్రావంససంస్థౌ తు పూజనీయౌ ప్రయత్నతః ।
సూర్యసోమాదయస్తద్వద్బాహ్వోః పంచ చ పంచ చ ॥ 41 ॥

మరియు ఈ చతుశ్శాలాత్మకమగు వాస్తుచక్రం సంపూర్ణంగా పితృవర్గము మరియు వైశ్వానరవర్గపు అధీనమై యుండునని తెలుసుకోవాలి. (ఇప్పుడు పైన వివరించిన వాస్తుచక్రమున అగ్నిస్థానము మొదలుకొని పితృస్థానముగల కోణము వరకు వాస్తుపురుషుని దేహదైర్ఘ్యము వర్ణించబడుచున్నది). శిరః స్థానమున అగ్నియు, ముఖము నందు ఆపుదును సమాశ్రితులై ఉంటారు. పృథ్వీధరుడు మరియు అర్యముడు స్తనములందు, ఆపవత్సుడు వక్షఃస్థలమునందు. ప్రతిష్ఠింపబడి పండితుల చేత పూజింపబడతారు. దితి–పర్జన్యులిద్దరూ నేత్రములందు, అదితి – జయంతకులిరువురు చెవులయందు, సర్పుడు మరియు ఇంద్రుడు భుజములందు ఉంటారు కావున వారిని ఆ స్థానమున శ్రద్ధగా పూజించాలి. అట్లే బాహువులందు సూర్యచంద్రాది దేవతలు ఐదుగురు సమాశ్రితులై ఉంటారు.

రుద్రశ్చ రాజయక్ష్మా చ వామహస్తే సమాస్థితౌ ।
సావిత్రః సవితా తద్వద్ధస్తం దక్షిణ మాస్థితౌ ॥ 42 ॥

వివస్వానథ మిత్రశ్చ జఠరే సంవ్యవస్థితౌ ।
పూషా చ పాపయక్ష్మా చ హస్తయోర్మణిబంధనే ॥ 43 ॥

రుద్రుడు రాజయక్ష్ముడు వామహస్తమునందు, సావిత్రుడు మరియు సవిత దక్షిణహస్తమునందును ఉందురు. అట్లే వివస్వంతుడు, మిత్రుడు ఇరువురు జఠరమునందు, పూషన్ మరియు పాపయక్ష్ముడు ఉభయహస్తముల యొక్క మణిబంధనము నందు ఉంటారు కావున ఆయా దేవతలను ఆయా స్థలములందున్నట్లు భావించి ప్రతిష్ఠించి పూజించాలి.

తథైవాసురశోషౌ చ వామపార్శ్వం సమాశ్రితౌ ।
పార్శ్వే తు దక్షిణే తద్వత్ వితథః సగృహక్షతః ॥ 44 ॥

ఊర్వోర్యమాంబుపౌ జ్ఞేయౌ జాన్వోర్గంధర్వపుష్పకౌ ।
జంఘయోర్భృగుసుగ్రీవౌ స్ఫిక్ స్థౌ దౌవారికో మృగః ॥ 45 ॥

జయశక్రౌ తథా మేఢ్రే పాదయోః పితరస్తథా ।
మధ్యే నవపదే బ్రహ్మా హృదయే సతు పూజ్యతే ॥ 46 ॥

అసుర శోషలిద్దరు వామపార్శ్వమునందు, వితథుడు, గృహక్షతుడు దక్షిణపార్శ్వమునందు, యముడు, వరుణుడు ఊరువులయందు, గంధర్వుడు పుష్పకుడు జానువుల (మోకాళ్ళ) యందు, భృగువు మరియు సుగ్రీవుడు పిక్కలయందు, దౌవారికుడు మరియు మృగుడు పిరుదులయందు, జయుడు, శక్రుడు మేఢ్రము అనగా మర్మావయవము నందు, పితరులు పాదములయందు, మధ్యభాగమైన హృదయమునందు బ్రహ్మ ఉండునని శాస్త్రములు తెలుపుతున్నవి, కనుక వారిని ఆయా స్థానములందు స్థాపించి పూజించాలి.

చతుః షష్టిపదో వాస్తుః ప్రాసాదే బ్రహ్మణా స్మృతః ।
బ్రహ్మే చతుష్పదస్తత్ర కోణేష్వర్ధపదసథా ॥ 47 ॥

బహిష్కోణేషు వాస్తౌ తు సార్ధా శ్చోభయ సంస్థితాః ।
వింశతిః ద్విపదాశ్చైవ చతుఃషష్టిపదే స్మృతాః ॥ 48 ॥

ప్రాసాదములయందు వాస్తురూపము అరువదినాలుగు అంకణములతో యేర్పడునని బ్రహ్మదేవుడు చెప్పాడు. బహిఃకోణములందు మరియు అంతఃకోణములయందు కూడ నాలుగేసి గదులయందు ఆయాదేవతలు ఎనిమిది మంది అధిపతులుగా ఉంటారు. వాటి నడుమ బ్రహ్మస్థానము నాలుగు పదములతో ఏర్పడుతుంది. ఈ విధంగా ఇరువది మంది దేవతలు రెండేసి పదములకు ఈ చతుష్షష్టిపదములతో కూడిన యంత్రమునందు అధిపతులుగా ఉంటారు.

గృహారంభేషు కండూతిః స్వామ్యంగం యత్ర జాయతే ।
శల్యం త్వపనయేత్తత్ర ప్రాసాదే భవనే తథా ॥ 49 ॥

సశల్యం భయదం యస్మాదశల్యం శుభదాయకమ్ ।
హీనాధికాం గతాం వాస్తోః సర్వథా తు వివర్జయేత్ ॥ 50 ॥

నగరగ్రామదేశేషు సర్వత్రైవం వివర్జయేత్ ।

గృహారంభసమయమున గృహయజమానికి ఏ అంగమునందు బాగుగా దురదకలుగునో ఇంతకముందు వివరించిన ఏకాశీతి పదవిభజనానుసారము వాస్తుపురుషునియొక్క ఆకృతిలో కూడ ఆ అంగము వచ్చు ప్రదేశమున శల్యములుండునని తెలిసికొని, వాటిని గుర్తించి, త్రవ్వి వాటిని తొలగించాలి. గృహనిర్మాణస్థానమునందు శల్యములుండుట భయకారకము, శల్యరహితముగా ఉన్న స్థలము శుభకరము. కావున శల్యములు లేకుండునట్లు చూడవలెను. వాస్తు పురుషుడు హీనాంగుడో, అధికాంగుడో అయినచో ఆ స్థలము గృహనిర్మాణమునకు అయోగ్యము కావున అట్టి స్థలమును వర్జించాలి. నగరములు మరియు గ్రామములందును కూడ అట్టి ప్రదేశమును తప్పనిసరిగా వదిలివేయాలి.

చతుశ్శాలం త్రిశాలం చ ద్విశాలం చైకశాలకమ్ ।
నామతస్తాన్ ప్రవక్ష్యామి స్వరూపేణ ద్విజోత్తమాః ॥ 51 ॥

గృహములు చతుశ్శాలములు, త్రిశాలములు, ద్విశాలములు, ఏకశాలములని నాలుగు విధములు. ఓ ద్విజోత్తములారా! క్రమానుసారంగా వాటి స్వరూపమును నామములతో పాటు వివరిస్తాను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ఏకాశీతి పదవాస్తునిర్ణయో నామ
త్రిపంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥253॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ఏకాశీతి పదవాస్తునిర్ణయమనే
రెండువందల యాభైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుఃపంచాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైనాల్గవ అధ్యాయం

వాస్తువిద్యాసు గృహమాననిర్ణయః – వాస్తువిద్యలో గృహమాననిర్ణయం

సూత ఉవాచ – సూతమహర్షి చెప్పాడు.

చతుఃశాలం ప్రవక్ష్యామి స్వరూపం నామతస్తథా ।
చతుఃశాలం చతుర్ద్వారై రలిందైః సర్వతో ముఖమ్ ॥ 1 ॥

నామ్నా తత్సర్వతోభద్రం శుభం దేవనృపాలయే ।
పశ్చిమ ద్వారహీనం చ నంద్యావర్తం ప్రచక్షతే ॥ 2 ॥

ఇప్పుడు నామక్రమమున ప్రథమముగా చతుఃశాలాగృహస్వరూపమును గురించి వివరిస్తాను. ఈ చతుఃశాలము నాలుగు వైపులా ద్వారాలు వసారాలు కలిగి నాలుగు శాలాగృహములు కలిగివుంటుంది. దీనిని సర్వతోభద్రమని అంటారు. దేవతలకు రాజులకు ఇట్టి చతుఃశాలము శుభప్రదము. కాని అన్ని వైపులకును వాకిళ్ళు కలిగి ఒక పశ్చిమదిక్కు వాకిలి లేనిచో దానిని నంద్యావర్తము అని అంటారు.

దక్షిణ ద్వారహీనం తు వర్ధమానముదాహృతమ్ ।
పూర్వద్వార విహీనం తత్ స్వస్తికం నామ విశ్రుతమ్ ॥ 3 ॥

రుచకం చోత్తరద్వార విహీనం తత్ ప్రచక్షతే ।
సౌమ్యశాలావిహీనం యత్ త్రిశాలం ధాన్యకం చ తత్ ॥ 4 ॥

క్షేమవృద్ధికరం నృణాం బహుపుత్రఫలప్రదమ్ ।
శాలయా పూర్వయా హీనం సుక్షేత్రమితి విశ్రుతమ్ ॥ 5 ॥

ధన్యం యశస్య మాయుష్యం శోకమోహవినాశనమ్ ।

దక్షిణదిశయందు ద్వారము లేనటువంటి చతుఃశాలమును "వర్ధమాన" మంటారు. తూర్పున ద్వారము లేనిచో "స్వస్తిక" మని, ఉత్తరముద్వారము లేనిచో "రుచక" మని తెలుపబడినది. తూర్పు – పశ్చిమ – దక్షిణ దిక్కులయందు శాలలుండి ఉత్తరదిక్కు యందు శాలావిహీనమైన దానిని 'ధాన్యక' మను త్రిశాలభవనమంటారు. ఇది మానవులకు క్షేమకరము, వృద్ధికరము, బహుపుత్రఫలప్రదము. తూర్పువైపున శాలావిహీనమైన త్రిశాలమును 'సుక్షేత్ర' మంటారు. ఇది పవిత్రమైనది, యశస్సును ఆయుష్యమును పెంపొందించును మరియు శోకమోహాదులను నశింపజేయును.

శాలయా యామ్యయా హీనం యద్విశాలం తు శాలయా ॥ 6 ॥

కులక్షయకరం నృణాం సర్వం వ్యాధిభయావహమ్ ।
హీనం పశ్చిమయా యత్తు పక్షఘ్నం నామతత్పునః ॥ 7 ॥

మిత్రబంధూన్ సుతాన్ హంతి తథా సర్వభయావహమ్ ।
యామ్యాపరాభ్యాం శాలాభ్యాం ధనధాన్యఫలప్రదమ్ ॥ 8 ॥

క్షేమవృద్ధికరం నృణాం తథా పుత్రఫలప్రదమ్ ।

దక్షిణదిశ యందు ద్వారము లేని త్రిశాలభవనమునకు "విశాల" మంటారు. ఇది కులక్షయమును సర్వవిధవ్యాధిభయమును కలిగించును. పశ్చిమద్వారవిహీనమైన దానిని 'పక్షఘ్న' మని అంటారు. ఇది మిత్రబంధుసుతాదినాశనమునకు హేతువై, సర్వవిధభయములు కలిగించును. ఇక దక్షిణ మరియు పశ్చిమ దిక్కులయందు శాలలు కలిగిన ద్విశాలభవనము ధనధాన్యఫలప్రదమైనది, మానవులకు క్షేమకరము, వృద్ధికరము, అట్లే పుత్రఫలప్రదము అని చెప్పబడింది.

యమసూర్యం చ విజ్ఞేయం పశ్చిమోత్తరశాలికమ్ ॥ 9 ॥

రాజాగ్నిభయదం నృణాం కులక్షయకరం చ యత్ ।
ఉదక్ పూర్వే తు శాలేహం దండాఖ్యే యత్ర తద్భవేత్ ॥ 10 ॥

అకాలమృత్యుభయదం పరచక్రభయావహమ్ ।
ధనాఖ్యం పూర్వయామ్యాభ్యాం శాలాభ్యాం యద్విశాలకమ్ ॥ 11 ॥

తచ్ఛస్త్రభయదం నృణాం పరాభవభయావహమ్ ।
చుల్లీ పూర్వాపరాభ్యాం తు సా భవేన్మృత్యుసూచనీ ॥ 12 ॥

వైధవ్యదాయకం స్త్రీణామనేకభయకారకమ్ ।
కార్యముత్తరయామ్యాభ్యాం శాలాభ్యాం భయదం నృణామ్ ॥ 13 ॥

సిద్ధార్థవజ్రవర్జ్యాణి విశాలాని సదా బుధైః ।

పశ్చిమోత్తరశాలలు కల ద్విశాలమునకు 'యమసూర్యం' అని పేరు. దీని వలన మానవులకు రాజభయం, అగ్నిభయము మరియు కులక్షయమును కలుగును. ఉత్తర మరియు పూర్వదిక్కుల యందు శాలలుకలిగినది 'దండము' అనబడును. ఇది అకాలమృత్యుభయమునకు మరియు శత్రుసేనాభయమునకు హేతువగును. పూర్వ మరియు దక్షిణదిశలలో శాలలుకలిగినది ద్విశాలమును "ధనము" అని అంటారు. ఇది మానవులకు శస్త్రభయమును పరాభవభయమును కలుగజేయును. తూర్పు మరియు పడమరదిశలయందు శాలలు కలిగిన ద్విశాలమును "చుల్లీ" (పొయ్యి) అని అంటారు. ఇది కూడ మృత్యుసూచకము. స్త్రీలకు వైధవ్యకారకమే కాక అనేక విధభయములు కలిగించుటకు కారణమగును. ఉత్తర మరియు దక్షిణ దిశలయందు శాలలు గల ద్విశాలమునకు 'కార్యము' అని పేరు. ఇది కూడ భయకారకమే. ఇంకనూ 'సిద్ధార్థము' 'వజ్రము' ఇత్యాది నామములు కలిగినటువంటి ద్విశాలాభవనములను బుద్ధిమంతులు వర్జించాలని తెలుపబడినది.

అథాతః సంప్రవక్ష్యామి భవనం పృథివీపతేః ॥ 14 ॥

పంచప్రకారం తత్ ప్రోక్తం ఉత్తమాది విభేదతః ।
అష్టోత్తరం హస్తశతం విస్తరశ్చోత్తమో మతః ॥ 15 ॥

చతుర్ష్వన్యేషు విస్తారో హీయతే చాష్టభిః కరైః ।
చతుర్థాంశాధికం దైర్ఘ్యం పంచస్వపి నిగద్యతే ॥ 16 ॥

ఇక ఇప్పుడు రాజభవనపు వాస్తు గురించి చెబుతాను. అది ఉత్తమాదిభేదములతో ఐదు విధములు. వీనిలో మొదటిదాని వెడల్పు 108 మూరలు. మిగిలిన నాలుగింటికి క్రమముగా ఈ మొదటిదానివెడల్పులో నుండి ఎనిమిదేసి మూరలు తగ్గించాలి. ప్రతిదానియందు పొడవు కంటె వెడల్పులో చతుర్థాంశము అధికముగా ఉండాలని తెలిసికోవాలి.

యువరాజస్య వక్ష్యామి తథా భవనపంచకమ్ ।
షడ్భిః షడ్భిః తథాశీతి ర్హీయతే తత్ర విస్తరాత్ ॥ 17 ॥

త్ర్యంశేన చాధికం దైర్ఘ్యం పంచస్వపి నిగద్యతే ।

అట్లే యువరాజు భవనమును గురించి చెబుతాను. ఇక్కడ ఐదు విధములైన భవనములుండును. వీటిలో మొదటిదానికి 80 మూరలుండును. అటు తర్వాత నాలుగింటిలో ఒక్కో దానికి ఆరు మూరల చొప్పున తగ్గవలయును. మరల ప్రతి దానియందు పొడవు కంటే వెడల్పులో మూడవ వంతు అధికమైన వైశాల్యముండాలి.

సేనాపతేః ప్రవక్ష్యామి తథా భవనపంచకమ్ ॥ 18 ॥

చతుఃషష్టిస్తు విస్తారాత్ షడ్భిః షడ్భిస్తు హీయతే ।
పంచస్వేతేషు దైర్ఘ్యం చ షడ్భాగేనాధికం భవేత్ ॥ 19 ॥

పూర్వంవలెనే సేనాపతి భవనవిషయమును కూడ వివరిస్తాను. ఇవి కూడ ఐదు విధములుండును. వీటిలో మొదటిదాని వెడల్పు 64 మూరలుండాలి. తర్వాత నాలుగింటిలోనూ క్రమముగా 6 మూరల చొప్పున తగ్గించాలి. మరల ప్రతిదానియందు వెడల్పు కంటె పొడవు ఆరవవంతు అధికంగా ఉండాలి.

మంత్రిణామథ వక్ష్యామి తథా భవనపంచకమ్ ।
చతుశ్చతుర్భిర్హీనా స్యాత్ కరషష్టిప్రవిస్తరే ॥ 20 ॥

అష్టాంశేనాధికం దైర్ఘ్యం పంచస్వపి నిగద్యతే ।

మంత్రుల భవనముల గురించి చెబుతాను. పూర్వము వలెనే ఇవి కూడ ఐదు విధములు. మొదటి దానియొక్క వెడల్పు 60 మూరలు. తర్వాత మిగిలిన నాలుగింటిలో నాలుగేసి మూరలు చొప్పున తగ్గుచూ వుండాలి. పొడవు కంటె వెడల్పులో అయిదింటిలోనూ అష్టాంశము అధికముగా ఉండాలి.

సామంతామాత్యలోకానాం వక్ష్యే భవనపంచకమ్ ॥ 21 ॥

చత్వారింశత్తథాష్టౌ చ చతుర్భిర్హీయతే క్రమాత్ ।
చతుర్థాంశాధికం దైర్ఘ్యం పంచస్వేతేషు శస్యతే ॥ 22 ॥

సామంతులు మరియు అమాత్యులు మొదలుగువారి భవనములు కూడ ఐదు విధములు. మొదటి దాని యొక్క వైశాల్యము 48 అడుగులుండాలి. తర్వాత క్రమంగా ఒక్కొదానిలో 4 అడుగులు చొప్పున తగ్గాలి. పూర్వము వలె వీటిలో పొడవు కంటె వెడల్పులో నాలుగు అంశములు అధికముగా ఉండాలి.

శిల్పినా కంచుకీనాం చ వేశ్యానాం గృహపంచకమ్ ।
అష్టావింశత్కరాణాం తు విహీనం విస్తరే క్రమాత్ ॥ 23 ॥

ద్విగుణం దైర్ఘ్యమేవోక్తం మధ్యమేష్వేవమేవ తత్ ।

శిల్పులు, కంచుకిలు, వేశ్యలు మొదలగువారియొక్క గృహములు కూడ ఐదు విధములుండాలి. 28 మూరలతో మాత్రమే ఆరంభింపబడి తర్వాత క్రమముగా నాలుగింటిలోను రెండు మూరల చొప్పున తగ్గుచు వుండాలి. వీటిలో వెడల్పుకంటే పొడవు ద్విగుణమధికముగా ఉండాలి.

దూతీకర్మాన్తికాదీనాం వక్ష్యే భవనపంచకమ్ ॥ 24 ॥

చతుర్థాంశాధికం దైర్ఘ్యం విస్తారో ద్వాదశైవ తు ।
అర్ధార్ధకరహానిః స్యాత్ విస్తారాత్ పంచశః క్రమాత్ ॥ 25 ॥

దూతికలు, కర్మచారులు, సేవకులు మొదలగువారికి కూడ పంచవిధముల గృహములుండును. వీటిలో 12 మూరల వైశాల్యంతో ఉండునది మొదటిది. తర్వాత వాటిలో క్రమముగా అర్ధార్ధకరముగా వెడల్పు తగ్గుచుండును. మరియు వీటిలో వెడల్పుకన్నను పొడవు నాలుగవ వంతు అధికముగా ఉండును.

దైవజ్ఞగురువైద్యానాం సభాస్తారపురోధసామ్ ।
తేషామపి ప్రవక్ష్యామి తథా భవనపంచకమ్ ॥ 26 ॥

చత్వారింశత్తు విస్తారాచ్చతుర్భిర్హీయతే క్రమాత్ ।
పంచస్వేతేషు దైర్ఘ్యం చ షడ్భాగేనాధికం భవేత్ ॥ 27 ॥

దైవజ్ఞులు, గురువులు, వైద్యులు, సభాస్తారులు, పురోహితులు ఇత్యాదుల గృహములు కూడ పంచవిధములు. వీటిలో 40 మూరల విస్తారముతో నున్నది మొదటిది. ఆ తర్వాత నాలుగింటిలో క్రమముగా నాలుగేసి మూరలు తగ్గుచుండును. వీటిలో సాధారణంగా 6 అడుగుల వెడల్పు మరియు 7 అడుగుల పొడవూ విస్తారముండాలి.

చాతుర్వర్ణ్యస్య వక్ష్యామి సామాన్యం గృహపంచకమ్ ।
ద్వాత్రింశతి కరాణాం తు చతుర్భిర్హీయతే క్రమాత్ ॥ 28 ॥

ఆషోడశాదితి పరం న్యూనమన్తేఽవసాయినామ్ ।
దశాంశేనాష్టభాగేన త్రిభాగేనాథ పాదికమ్ ॥ 29 ॥

అధికం దైర్ఘ్యమిత్యాహుః బ్రాహ్మణాదేః ప్రశస్యతే ।

చాతుర్వర్ణ్యముల వారికి సంబంధించిన గృహముల గురించి వివరిస్తాను. వీరందరికీ నిర్మించు గృహములు కూడ ఐదు విధములుగా ఉండాలి. ఈ గృహములు వెడల్పులు 32 మూరలతో ఆరంభమై 17 మూరల వరకు ఉండాలి. అటు తర్వాత మిగతా నాలుగింటిలో 4 మూరలు చొప్పున తగ్గించుకొనవలెను. వీటిలో మరల బ్రాహ్మణుల గృహముల పొడవు వెడల్పులు 11×10 వలె ఉండాలి. క్షత్రియుల గృహములు 9×8 ఉండవలెను. వైశ్యుల గృహములు 4×8 గా ఉండవలెనని, శూద్రుల మరియు అంత్యజుల గృహములకై 5×4 మాదిరి పొడవు వెడల్పులుండాలని తెలిసికోవాలి.

సేనాపతేః నృపస్యాపి గృహయోరన్తరేణ తు ॥ 30 ॥

నృపవాసగృహం కార్యం బాణ్డాగారం తథైవ చ ।
సేనాపతే ర్గృహస్యాపి చాతుర్వర్ణ్యస్య చాన్తరే ॥
వాసాయ చ గృహం కార్యం రాజపూజ్యేషు సర్వదా ॥ 31 ॥

అన్తరప్రభవాణాం చ స్వపితుర్గృహమిష్యతే ।
తథా హస్తశతాదూర్ధ్వం గదితం వనవాసినామ్ ॥ 32 ॥

సేనాపతి మరియు రాజభవనములకు నడుమ అతిథులుగా వచ్చునట్టి రాజులకుపయోగపడు భవనములుండాలి. అచటనే భాండాగారము కూడ ఉండాలి. సేనాపతి భవనము మరియు చాతుర్వర్ణ్యముల వారి గృహములకు మధ్యన రాజపూజ్యులగువారు నివసించు భవనములుండాలి. వీటికి ముందు భాగమున రాజపితృభవనముండాలి. వనవాసులగువారు నివసించుటకు యోగ్యమైన భవనములు వీటన్నింటి తర్వాత వందమూరల విశాలంతో నిర్మించాలి.

సేనాపతేర్నృపస్యాపి సప్తస్యా సహితేఽన్వితే ।
చతుర్దశహృతే వ్యాసే శాలాన్యాసః ప్రకీర్తితః ॥ 33 ॥

పంచత్రింశాన్వితే తస్మిన్నలిందః సముదాహృతః ।
తథా షట్త్రింశద్ధస్తా తు సప్తాంగులసమన్వితా ॥ 34 ॥

విప్రస్య మహతీ శాలా న దైర్ఘ్యం పరతో భవేత్ ।

రాజునకు సేనాపతికి నిర్మించు భవనములకై వివరించిన వెడల్పునకు డెబ్బది మూరలు అధికముగా తీర్చి మరల ఆ మొత్తమును 14 సంఖ్యతో భాగించి దానితో వచ్చినట్టి వెడల్పును ఆళిందమునకు అని గ్రహించాలి. మరియు విప్రులగృహములకు సంబంధించినట్టి మహాశాల ముప్పది ఆరు మూరల ఏడు అంగుళముల వైశాల్యముతో నుండాలి కాని అంతకు మించిన వైశాల్యముండ కూడదని శాస్త్రము చెబుతుంది.

దశాంగులాధికా తద్వత్ క్షత్రియస్య విధీయతే ॥ 35 ॥

పంచత్రింశత్కరా వైశ్యే హ్యంగులాని త్రయోదశ ।
తావత్కరైవ శూద్రస్య యుతా పంచదశాంగులైః ॥ 36 ॥

క్షత్రియుని భవనపు మహాశాల వైశాల్యము ముప్పది ఆరు మూరల పది అంగుళములు ఉండాలి. వైశ్యుల గృహపు మహాశాల వైశాల్యము ముప్పది ఐదు మూరల పదమూడు అంగుళములు మరియు శూద్రుని గృహపు మహాశాల వైశాల్యము ముప్పదిఐదు మూరల పదిహేను అంగుళములు ఉండాలి.

శాలాయాస్తు త్రిభాగేన యస్యాగ్రే వీథికా భవేత్ ।
సోష్ణీషం నామ తద్వాస్తు పశ్చాచ్ఛ్రేయోచ్ఛ్రయం భవేత్ ॥ 37 ॥

పార్శ్వయోర్వీథికా యత్ర సావష్టమ్భం తదుచ్యతే ।
సమన్తాద్వీథికా యత్ర సుస్థితం తదిహోచ్యతే ॥ 38 ॥

శుభదం సర్వమేతత్ స్యాత్ చాతుర్వర్ణ్యే చతుర్విధమ్ ।

శాలకు మూడు వైపుల వదిలి ముందు భాగమున మాత్రము వీథిక ఉన్నచో అటువంటి వాస్తును "సోష్ణీషము" అంటారు. శాలకు వెనుక వైపు వీథికయున్నచో దానిని "శ్రేయోచ్ఛ్రాయము" అంటారు. అట్లే శాలకు రెండు వైపుల కూడ వీథిక ఉన్నచో దానిని "సావష్టంభము" అని, గృహమునకు అన్ని వైపులందును వీథిక ఉన్నచో ఆ వాస్తును "సుస్థితము" అని అంటారు. చాతుర్వర్ణ్యముల వారికందరికిని నాలుగు విధములైన ఈ వాస్తులలో ప్రతి యొక్కటియు శుభకారకమే.

విస్తరాత్ షోడశో భాగస్తథా హస్తచతుష్టయమ్ ॥ 39 ॥

ప్రథమో భూమికోచ్ఛ్రాయ ఉపరిష్టాత్ ప్రహీయతే ।
ద్వాదశాంశేన సర్వాసు భూమికాసు తథోచ్ఛ్రయః ॥ 40 ॥

ఎత్తైన భవనములు కట్టునప్పుడు ఆయా భవనముల గర్భపు వెడల్పు ఎంత నిర్ణయించబడి కట్టుబడునో దానిలో పదుహారవ వంతుగు నాలుగుమూరల ఎత్తుతోడను మొదటి అంతస్తు నిర్మించవలెను. అధికమైన అంతస్తులు కలిగినది కట్టునప్పుడు మొదటి అంతస్తు ఎత్తులో పంద్రెండ్రవ వంతు రెండవ అంతస్తు ఉండునట్లు తర్వాత రెండవ దాని ఎత్తులో ప్రంద్రెంద్రవ వంతు తక్కువగా మూడవ అంతస్తు ఉండునట్లు చూడాలి. ఎత్తైన భవనములు నిర్మించునప్పుడు ఈ క్రమమును గ్రహించాలి.

పక్వేష్టకా భవేద్భిత్తిః షోడశాంశేన విస్తరాత్ ।
దారవైరపి కల్ప్యాః స్యాత్ తథా మృణ్మయభిత్తికా ॥ 41 ॥

గర్భమానేన మానం తు సర్వవాస్తుషు శస్యతే ।
గృహవ్యాసస్య పంచాశత్ అష్టాదశభిరంగులైః ॥ 42 ॥

భవనపు గోడలు కాల్చిన ఇటుకలతో కట్టాలి. అట్టి గోడలు మందము శాలావిస్తారమును బట్టి పదహారవ వంతు ఉండాలి. మరియు గోడలు ఇటుకలతోనే కాక కొయ్యతునుకలతో గాని మట్టితో గాని కట్టవచ్చును. ఏ

విధమైన వాస్తునిర్మాణములందైనను గృహము యొక్క మొత్తము వెడల్పు మరియు గర్భపు అనగా ఇంటికి నడుమ భాగపు వెడల్పును సరియైన అనుపాతములోనే ఉంచాలి.

సంయుతో ద్వారవిష్కంభో ద్విగుణశ్చోచ్ఛ్రయో భవేత్ ।
ద్వారశాఖాసు బాహుల్యముచ్ఛ్రాయకరసమ్మితః ॥ 43 ॥

అంగులైః సర్వవాస్తూనాం పృథుత్వం శస్యతే బుధైః ।
ఉదుమ్బరోత్తమాంగం చ తదర్ధార్ధప్రవిస్తరాత్ ॥ 44 ॥

భవనముయొక్క ద్వారపు వెడల్పు అరువది ఎనిమిది అంగుళములుగాను ఎత్తు దానికంటే ద్విగుణము అనగా నూటముప్పది ఆరు అంగుళములు గానూ ఉండాలి. వాకిలి ఎత్తు ఎన్ని మూరలుండునో ద్వారశాఖపు వెడల్పు కూడా అన్ని అంగుళములుండాలి. ఈ మందము సర్వవిధవాస్తులందును ఇట్లే ఉండాలి మరియు ద్వారముయొక్క ఉత్తమాంగము అనగా పైన వేయునట్టి అడ్డుపట్టెయొక్క మందము కూడ ద్వారశాఖల వెడల్పులో నాలుగవ వంతు ఉండాలి. ఈ అడ్డుపట్టెను ఉదుంబర వృక్షపు (మేడి) కఱ్ఱతో చేయించాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వాస్తువిద్యాసు గృహమాననిర్ణయో నామ
చతుఃపంచాశదధికద్విశతతమోఽ ధ్యాయః ॥254॥

శ్రీ మత్స్యమహాపురాణమున వాస్తువిద్యలో గృహమాననిర్ణయం అను
రెండువందల యాభైనాల్గవ అధ్యాయం సమాప్తం.



పంచపంచాశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల యాభైఐదవ అధ్యాయం

వాస్తువిద్యాసు వేధపరివర్జనమ్ - వాస్తువిద్యలో వేధపరివర్జనం

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి స్తంభమాన వినిర్ణయమ్ ।
కృత్వా స భవనోచ్ఛ్రాయం సదా సప్తగుణం బుధైః ॥ 1 ॥

అశీత్యంశః పృథుత్వం స్యాదగ్రేణావగుణైః సహ ।
రుచకశ్చతురః స్యాత్తు అష్టాస్రో వజ్ర ఉచ్యతే ॥ 2 ॥

ద్వివజ్రః షోడశాస్రస్తు ద్వాత్రింశాస్రః ప్రలీనకః ।
మధ్యప్రదేశే యస్తమ్భో వృత్తో వృత్త ఇతిస్మృతః ॥ 3 ॥

ఏతే పంచమహాస్తంభాః ప్రశస్తాః సర్వవాస్తుషు ।

ఇక ఇప్పుడు స్తంభమాన వినిర్ణయమును వివరిస్తాను. పండితులు స్వభవనపు ఎత్తును ఏడుతో గుర్ణించి దానిని ఎనుబదితో భాగించగా వచ్చిన సంఖ్య గల మూరలనే స్తంభపు మందముగా ఉంచాలని నిర్ణయించాలి. స్తంభముల బోదే మరింత ఎక్కువ మందముతో నుండాలి. భవనపు ఎత్తును తొమ్మిదితో గుణించి ఎనుబదితో భాగించగా వచ్చిన సంఖ్యతో స్తంభపు బోదెయొక్క మందమును నిర్ణయించాలి. స్తంభపు ఆకారము చతురస్రముగా నున్నచో "రుచకము" అని, అష్టాస్రమైనచో "వజ్రము" అని, షోడశాస్రమైనచో "ద్వివజ్రము" అని, ద్వాత్రింశా (32) స్రమైనచో "ప్రలీనకము" అని, మధ్యప్రదేశమున వృత్తాకారముతో నున్నచో "వృత్తము" అని వ్యవహరిస్తారు. ఇట్లు ఈ ఐదు విధములగు మహాస్తంభములు సర్వవాస్తువులందును చాలా ప్రశస్తములు.

పద్మవల్లీ లతాకుంభపత్రదర్పణరూపితాః ॥ 4 ॥

స్తంభస్య నవమాంశేన పద్మకుంభాన్తరాణి తు ।
స్తంభతుల్యా తులా ప్రోక్తా హీనా చోపతులా తతః ॥ 5 ॥

త్రిభాగేనేహ సర్వత్ర చతుర్భాగేన వా పునః ।
హీనం హీనం చతుర్థాంశాత్ తథా సర్వాసు భూమిషు ॥ 6 ॥

స్తంభము యొక్క ఎత్తులో తొమ్మిదవ వంతు స్థలమును పద్మలు, వల్లులు, లతలు, కుంభములు, పత్రములు, అద్దములు మొదలగు శిల్పములతో అలంకరించాలి. స్తంభమెంత మందముగా నుండునో అంతే మందముగా దూలములు కూడ ఉండాలి. మరియు చిన్న దూలములు పెద్ద దూలపుమందములో మూడవ వంతుకాని నాలుగవ వంతు గాని క్రమముగా తగ్గుతూ ఉండాలి. అన్ని భూములయందును ఇదే పద్ధతిననుసరించాలి.

వాసగేహాని సర్వేషాం ప్రదేశే దక్షిణేన తు ।
ద్వారాణి తు ప్రవక్ష్యామి ప్రశస్తానీహ యాని తు ॥ 7 ॥

పూర్వేణేంద్రం జయంతం చ ద్వారం సర్వత్ర శస్యతే ।
యామ్యం చ వితథం చైవ దక్షిణేన విదుర్బుధాః ॥ 8 ॥

పశ్చిమే పుష్పదంతం చ వారుణం చ ప్రశస్యతే ।
ఉత్తరేణ తు భల్లాటం సౌమ్యం తు శుభదం భవేత్ ॥ 9॥

నివాసగృహములకు దక్షిణదిక్కు నుండి ప్రవేశించుట శ్రేష్ఠము. అందులకై ఉండవలసినటువంటి ద్వార స్థానముల గురించి ఇప్పుడు వివరిస్తాను. తూర్పుదిశ యందు ఇంద్ర, జయంతస్థానములు ప్రశస్తములు. దక్షిణదిక్కున యామ్య, వితథస్థానములు, పశ్చిమమున పుష్పదంత వారుణస్థానములు మరియు ఉత్తరదిశన భల్లాట, సోమ స్థానములు శుభప్రదములు.

తథా వాస్తుషు సర్వత్ర వేధం ద్వారస్య వర్జయేత్ ।
ద్వారే తు రథ్యయా విద్ధే భవేత్ సర్వకులక్షయః ॥ 10 ॥

తరుణా ద్వేషబాహుల్యం శోకః పంకేన జాయతే ।
అపస్మారో భవేన్నూనం కూపవేధేన సర్వదా ॥ 11 ॥

వృథా ప్రస్రవణేన స్యాత్ కీలేనాగ్నిభయం భవేత్ ।
వినాశో దేవతావిద్ధే స్తమ్భేవ స్త్రీకృతం భవేత్ ॥ 12 ॥

వాస్తులయందు అన్నిచోట్లను ద్వారవేధ (కీడు కలిగించునది, బాధ కలిగించునది) లేకుండా చూచుట చాలా ముఖ్యము. ద్వారమునకు ఎదురుగా నిషిద్ధములైన, తనది కానిది ఉండకూడదు. అట్లే ద్వారమురకు ఎదురుగా రథ్యా (నాలుగు వీథుల కూడలి) వేధ ఉన్నచో అది సర్వవంశనాశన కారణమగును. వృక్షవేధ శత్రుబాహుల్యమునకును పంక (బురద) వేధ శోకమునకు, కూపవేధ అపస్మారవ్యాధికి, ప్రస్రవణవేధ వ్యథకును, కీలవేధ అగ్ని భయమునకును, దేవతావేధ వినాశనమునకు, స్తంభవేద స్త్రీలదుఃఖమునకు కారణములగును. కావున వీటి విషయమున జాగరూకతగా వ్యవహరించాలి.

గృహభర్తుర్వినాశః స్యాత్ గృహేణ చ గృహే కృతే ।
అమేధ్యావస్కరైర్విద్ధే గృహిణీ బంధకీ భవేత్ ॥ 13 ॥

తథా శస్త్రభయం విన్ద్యాదన్త్యజస్య గృహేణ తు ।
ఉచ్ఛ్రాయా ద్విగుణా భూమిం త్యక్త్వా వేధో న జాయతే ॥ 14 ॥

మరియు గృహవేధ గృహయజమాని నాశమునకును, అమేధ్యము మరియు అవస్కరములవేధ గృహిణీ బాధకును, అంత్యజవేధ శస్త్రభయమునకును కారణములవుతాయి. కావున ఇట్టి వాటికి లేకుండా చూడాలి. అయితే ఇంటి ఎత్తు ఎంత ఉండునో దానితో ఇంటికి అంతకు రెట్టింపు దూరమున వేధయున్నచో దోషముండదని గ్రహించాలి.

స్వయముత్పాటితే ద్వారే ఉన్మాదో గృహవాసినామ్ ।
స్వయం వా పిహితే విద్యాత్ కులనాశం విచక్షణః ॥ 15 ॥

మానాధికే రాజభయం న్యూనే తస్కరతో భవేత్ ।
ద్వారోపరి చ యద్ద్వారం తదంతకముఖం స్మృతమ్ ॥ 16 ॥

అధ్వనో మధ్యదేశే తు అధికో యస్య విస్తరః ।
వజ్రం తు సంకటం మధ్యే సద్యో భర్తుర్వినాశనమ్ ॥ 17 ॥

ఇంటి ముఖ్యద్వారపు తలుపు దానంతట అదే తెరచుకొనుచున్నచో ఆ గృహవాసులకు ఉన్మాదము కలుగుటకు కారణమగును. అది స్వయముగా మూసికొనుచున్నచో కులనాశనమునకు హేతువగును. ద్వారము శాస్త్రోక్తమైన పరిమాణము కన్న అధికపరిమాణంతో నిర్మించినచో అది రాజభయమును, తక్కువ పరిమాణమున్నదైనచో చోరభయమునకు హేతువగును. ద్వారముపై ద్వారమున్నచో అది మృత్యుముఖసూచకము. ముఖ్యద్వారము కన్నను ఇతర ద్వారములు విశాలములైనచో వాటిని 'సంకట' మని "వజ్ర" మని అంటారు. ఇవి గృహయజమాని సద్యోమృతికి కారణములవుతాయి.

తథాఽన్యపీడితం ద్వారం బహుదోషకరం భవేత్ ।
మూలద్వారాత్తథాన్యత్తు నాధికం శోభనం భవేత్ ॥ 18 ॥

కుంభశ్రీపర్ణివల్లీభిః మూలద్వారం తు శోభయేత్ ।
పూజయేచ్చాపి తన్నిత్యం బలినా చాక్షతోదకైః ॥ 19 ॥

ముఖద్వారము ఇతర ద్వారములతో అట్లు పీడితమైనచో బహుదోషకారకమవుతుంది. మూలద్వారమున కంటే ఇతర ద్వారములు ఏవియు ఎత్తుగా నుండరాదు, అది గృహమునకు శోభింపవు. గృహపు ముఖ్యద్వారమెల్లప్పుడును పూర్ణకుంభముతోను, శ్రీపర్ణిలతలతోను అలంకరింపబడి వుండాలి. మరియు దానిని బలులతోను, అక్షతోదకములతో నిత్యమూ పూజించాలి.

భవనస్య వటః పూర్వే దిగ్భాగే సార్వకామికః ।
ఉదుమ్బరస్తథా యామ్యే వారుణ్యాం పిప్పలః శుభః ॥ 20 ॥

ప్లక్షశ్చోత్తరతో ధన్యో విపరీతాస్త్వసిద్ధయే ।
కంటకీ క్షీరవృక్షశ్చ ఆసనః సఫలో ద్రుమః ॥ 21 ॥

భార్యాహానౌ ప్రజాహానౌ భవేతాం క్రమశస్తదా ।
న ఛింద్యాద్యది తానన్యానన్తరే స్థాపయేచ్ఛుభాన్ ॥ 22 ॥

భవనముకు తూర్పుదిక్కుయందు మర్రిచెట్టు, దక్షిణదిశ యందు ఉదుంబర వృక్షము, పశ్చిమదిశ యందు రావి, ఉత్తరదిశయందు జువ్వి వృక్షములు ఉండుట శుభప్రదము. దీనికి విరుద్ధముగా నున్నచో అమంగళకరము.

అంతే కాక కంటక (ముళ్ళు) కలిగిన వృక్షములు, క్షీరవృక్షములు, ఆసనవృక్షములు, మరియు ఇతర నిషిద్ధమైన ఫలవృక్షములు గృహముయొక్క ఆవరణ లోపలనున్నచో భార్యహానికి, సంతానహానికి కారణములవుతాయి. కాని అటువంటి చెట్లు వాటంతట అవియే మొలచినచో వాటిని పెరికి వేయకూడదు. వాటి మధ్యలో శుభప్రదములైన వృక్షములను నాటాలి.

పున్నాగాశోకబకుల శమీతిలకచంపకాన్ ।
దాడిమీపిప్పలీ ద్రాక్షాస్తథా కుసుమమండపాన్ ॥ 23 ॥

జంబీరపూగపనసద్రుమకేతకీభిః జాతీసరోజశత పత్రికమల్లికాభిః ।
యన్నారికేలకదలీదలపాటలాభిః యుక్తం తదత్ర భవనం శ్రియమాతనోతి ॥ 24 ॥

ఇంకనూ పున్నాగము, అశోకము, వకుళము, శమీ, తిలకము, చంపకము, దాడిమ, పిప్పలీ, ద్రాక్ష మరియు ఇతర పూలతీగలు, పూలతీగల మంటపములు, నిమ్మ, పోక, పనస, కేతకి, జాజి, తామర, పద్మ, మల్లిక, నారికేళ, అరటి, పాటల ఇత్యాది అనేక వృక్షములు, లతలు గృహముయొక్క ఆవరణలోనుండుట గృహమునకు శోభాకరములు.

ఇతి శ్రీ మాత్స్యేమహాపురాణే వాస్తువిద్యాసు వేధపరివర్జనం నామ
పంచపంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥255॥

శ్రీ మత్స్యమహాపురాణమున వాస్తువిద్యలో వేధపరివర్జన మనే
రెండువందల యాభైఐదవ అధ్యాయం సమాప్తం



షట్పంచాశదధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల యాభైఆరవ అధ్యాయం

వాస్తువిద్యా గృహనిర్ణయః - వాస్తువిద్యలో గృహనిర్ణయం

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

ఉదగాదిప్లవం వాస్తు సమానశిఖరం తథా ।
పరీక్ష్య పూర్వవత్కుర్యాత్ స్తంభోచ్ఛ్రాయం విచక్షణః ॥ 1 ॥

న దేవ ధూర్త సచివ చత్వరాణాం సమన్తతః ।
కారయేద్భవనం ప్రాజ్ఞో దుఃఖశోకభయం తతః ॥ 2 ॥

వాస్తుశాస్త్రముననుసరించి నివాసస్థలమును బాగుగా పరీక్షించి, ఆ స్థలమున పడిన నీరు ఉత్తరదిశవైపు కాని ఈశాన్యదిశవైపుకాని ప్రవహించునట్లు చూడాలి. మధ్యభాగమున నుండు స్థలమంతయూ సమతలముగా ఉండాలి. తదనంతరము ప్రాజ్ఞుడైన గృహస్థుడు మూలస్తంభమును ప్రతిష్ఠించాలి సాధారణంగా గృహస్థుడు దేవతల, ప్రభువుల, మంత్రుల మరియు నాల్గుమార్గాల కూడలి సమీపమునందు గృహనిర్మాణము చేయకూడదు. దానిచే దుఃఖశోకభయాదులు కలుగును.

తస్య ప్రదేశాశ్చత్వారః తథోత్సర్గోఽగ్రతః శుభః ।
పృష్ఠతః పృష్ఠభాగస్తు సవ్యావర్తః ప్రశస్యతే ॥ 3 ॥

అపసవ్యో వినాశాయ దక్షిణే శీర్షకస్తథా ।
సర్వకామఫలో నృణాం సంపూర్ణోనామ వామతః ॥ 4 ॥

ఏవం ప్రదేశమాలోక్య యత్నేన గృహమారభేత్ ।

గృహమునకు సంబంధించినంత వరకు నాలుగు ప్రదేశములుండును. అవి: ఉత్సర్గము, సవ్యావర్తము, అపసత్యము, సంపూర్ణము. (ఇంటి నుండి నీరు బయటకు వెళ్ళు మార్గమును బట్టి ఈ నాలుగు పేర్లు నిర్ణయించినట్లున్నది.) ఇంటికి ముందు నుండియే అనగా తూర్పువైపునుండి నీరు బయటకు పోవుచున్నచో అది ఉత్సర్గము శుభప్రదము. రెండవది సవ్యావర్తము అనగా గృహమునకు వెనుక వైపునుండి నీరు బయటకు పోవునది, ఇది కూడ ప్రశస్తమైనదే. మూడవది అపసవ్యము. దక్షిణము వైపు నీరు పోవునట్టిది ఇది వినాశకరము, నాలుగవది సంపూర్ణము అనునది. ఇంటికి ఉత్తరదిశనుండి నీరు బయటకు వెళ్ళు వ్యవస్థ కలది. ఇది సర్వకామఫలప్రదము. కనుక గృహనిర్మాణమునకు ముందే ఆ ప్రదేశమును, చక్కగా పరిశీలించి సరైన స్థలమునందు ఇల్లు కట్టవలెను.

అథ సాంవత్సరప్రోక్తే ముహూర్తే శుభలక్షణే ॥ 5 ॥

రత్నోపరి శిలాకృత్వా సర్వబీజసమన్వితామ్ ।
చతుర్భిః బ్రాహ్మణైః స్తమ్భం కారయిత్వా సుపూజితమ్ ॥ 6 ॥

శుక్లాంబరధరః శిల్పిసహితో వేదపారగః ।
స్నాపితం విన్యసేత్తద్వత్సర్వౌషధి సమన్వితమ్ ॥ 7 ॥

నానాక్షతసమోపేతం వస్త్రాలంకారసంయుతమ్ ।
బ్రహ్మఘోషేణ వాద్యేన గీతమంగలనిఃస్వనైః ॥ 8 ॥

తదనంతరము దైవజ్ఞులు నిర్ణయించిన శుభలక్షణయుక్తమైన ముహూర్తమునందు పూర్వము స్తంభమును స్థాపించుటకై త్రవ్వినట్టి గోతి యందు రత్నములు వేసి వాటిపై శిలను ఉంచవలెను. తదుపరి శాస్త్రోక్తములైన సర్వవిధ బీజములను కూడ చల్లవలెను. తెల్లని వస్త్రములను ధరించినట్టి శిల్పి మరియు వేదపారగులైన నలుగురు బ్రాహ్మణులు వేదమంత్రములు పఠించుచుండగా పూర్వమే సిద్ధము చేసికొన్న స్తంభమునకు స్నానమాచరింపజేసి గంధపుష్పాక్షతాదులతో పూజించి, సర్వౌషధి సమన్వితమైన అట్టి స్తంభమును వేదధ్వనులు మరియు గీత మంగళ వాద్యధ్వనులు మ్రోగుచుండగా ప్రతిష్ఠించాలి.

పాయసం భోజయేద్విప్రాన్ హోమం తు మధుసర్పిషా ।
వాస్తోష్పతే ప్రతిజానీహి మన్త్రేణానేన సర్వదా ॥ 9 ॥

సూత్రపాతే తథా కార్యం ఏవం స్తంభోదయే పునః ।
ద్వారవంశోచ్ఛ్రయే తద్వత్ ప్రవేశసమయే తథా ॥ 10 ॥

విప్రులకు పాయసాదులను భుజింపజేయాలి. మరియు "వాస్తోష్పతే ప్రతిజానీహి" ఇత్యాది మంత్రములతోను ఎల్లప్పుడు తేనె, నెయ్యి మొదలగు వాటితోను వాస్తుహోమము నిర్వహించాలి. సూత్రపాతసమయమున, స్తంభప్రతిష్ఠా సమయమున ద్వారమును నిలుపు సమయమున, ప్రవేశసమయమున కూడ వాస్తు పూజలు నిర్వహించాలి.

వాస్తూపశమనే తద్వద్వాస్తుయజ్ఞస్తు పంచధా ।
ఈశానే సూత్రపాతః స్యాదాగ్నేయే స్తమ్భరోపణమ్ ॥ 11 ॥

ప్రదక్షిణం చ కుర్వీత వాస్తోః పదవిలేఖనమ్ ।
తర్జనీ మధ్యమా చైవ తథాంగుష్ఠస్తు దక్షిణే ॥ 12 ॥

ప్రవాలరత్నకనకఫలం పిష్ట్వా కృతోదకమ్ ।
సర్వవాస్తువిభాగేషు శస్తం పదవిలేఖనే ॥ 13 ॥

మరియు వాస్తూపశమనము కొరకై ఐదు విధములైన వాస్తుయజ్ఞములు నిర్వహించాలి. (భూమి పరీక్ష, సూత్రపాతము, స్తంభప్రతిష్ఠ, ద్వారప్రతిష్ఠ, గృహప్రవేశము అనునవి ఐదు విధములైన వాస్తు యజ్ఞములు) ఈశాన్యమున సూత్రపాతము, ఆగ్నేయమున స్తంభారోపణము చేసి ప్రదక్షిణము చేయాలి. గృహనిర్మాణమునకు ముందే వాస్తుచక్రమును లిఖించి ఉంచుకోవాలి. వాస్తుచక్రలేఖనమునకై చూపుడువ్రేలును మధ్యవ్రేలును మరియు బొటనవ్రేలును మాత్రమే ఉపయోగించాలి. వాస్తుచక్ర లేఖనమునకు పగడములు, రత్నములు, కనకము మొదలగు వాటిని నీటితో తడిపి ఉపయోగించాలి. సర్వవిధవాస్తువిభాగములందునూ పదవిలేఖనము ఇట్లు ఆచరించుట శ్రేష్ఠము.

న భస్మాంగారకాష్ఠేన నఖశస్త్రేణ చర్మభిః ।
న శృంగాస్థి కపాలైశ్చ క్వచిద్వాస్తు విలేఖయేత్ ॥ 14 ॥

ఏభిర్విలిఖితం కుర్యాత్ దుఃఖశోకభయాదికమ్ ।

భస్మము, బొగ్గులు, కట్టెముక్కలు, గోళ్ళు, శస్త్రములు, చర్మము, కొమ్ములు, ఎముకలు, కపాలములు మొదలగు వాటితో వాస్తుచక్రమును వ్రాయకూడదు, వీటితో వ్రాసినచో ఇవి దుఃఖశోకభయాదికములకు హేతువులగును.

యదా గృహప్రవేశః స్యాత్ శిల్పీ తత్రాపి లక్షయేత్ ॥ 15 ॥

స్తంభసూత్రాదికం తద్వత్ శుభాశుభఫలప్రదమ్ ।
ఆదిత్యాభిముఖం రౌతి శకునిః పరుషం యది ॥ 16 ॥

తుల్యకాలం స్పృశేదంగం గృహభర్తుర్యదాత్మనః ।
వాస్త్వంగే తద్విజానీయాత్ నరశల్యం భయప్రదమ్ ॥ 17 ॥

గృహమును నిర్మించుటకై సరియైన భూమిని గుర్తించుట మొదలుకొని పైన చెప్పిన స్తంభప్రతిష్ఠ, సూత్రపాతము ఇత్యాది అన్ని సందర్భములలోనూ శిల్పి తప్పనిసరిగా అచ్చటనే ఉండి శుభాశుభఫలితములను సూచించు శకునములను గుర్తించాలి. సూర్యునికి అభిముఖముగా ఏదైనా పక్షి పరుషముగా కూయుటగాని, గృహయజమానికి ఒకేసారి అవయములు అదురుటగాని సంభవించినచో గాని వాస్తుపురుషునికి సంబంధించిన ఆ భాగమునందు భయప్రదమైన నరుని ఎముక ఉండి ఉండవచ్చని శిల్పి గ్రహించాలి.

అంకనానంతరం యత్ర హస్త్యశ్వశ్వాపదం భవేత్ ।
తదంగసంభవం వింద్యాత్తత్ర శల్యం విచక్షణః ॥ 18 ॥

ప్రసార్యమాణే సూత్రే తు శ్వాగోమాయుర్విలంఘతే ।
తత్తు శల్యం విజానీయాత్ ఖరశబ్దేఽతిభైరవే ॥ 19 ॥

ఎక్కడనైతే వాస్తుచక్రమును లిఖించిన స్థలమునందు ఏనుగు, అశ్వము, శునకము, మొదలగు ప్రాణులు వచ్చి నిలిచినచో ఆ స్థలమున శల్యముండునని విజ్ఞులు తెలిసికోవాలి. అట్లే వాస్తుసూత్రమును కొలతకై ప్రసరింపచేయు సమయమున శునకమో, నక్కయో ఆ స్థలమునందు దుమికి నిలుచునో, లేదా ఏ ప్రదేశమున గాడిద నిలుచుని భయంకరముగా అరుచునో అచ్చట శల్యములుండునని గ్రహించాలి.

యదీశానే తు దిగ్భాగే మధురం రౌతి వాయసః ।
ధనం తత్ర విజానీయాత్ భాగే వా స్వామ్యధిష్ఠితే ॥ 20 ॥

వాస్తుపూజ చేయు స్థలమునకు ఈశాన్య దిగ్భాగమున కాకి మధురముగా కూసినచో అక్కడ ధనము నిక్షేపింపబడి ఉండునని గ్రహించాలి.

సూత్రచ్ఛేదే భవేన్మృత్యుః వ్యాధిః కీలే త్వధోముఖే ।
అంగారేషు తథోన్మాదం కపాలేషు చ సంభ్రమమ్ ॥ 21 ॥

కంబుశల్యేషు జానీయాత్ పౌంశ్చల్యం స్త్రీషు వాస్తువిత్ ।
గృహభర్తుర్గృహస్యాపి వినాశః శిల్పిసంభ్రమే ॥ 22 ॥

సూత్రపాతము చేయు సందర్భమున ఒకవేళ సూత్రము తెగినచో అది గృహయజమానియొక్క మృత్యువునకు హేతువగును. అట్లే సూత్రము కట్టుటకుపయోగించు కీలము తలక్రిందులైనచో వ్యాధి కలుగును. వాస్తుపూజ చేయు భూమి యందు బొగ్గులు వచ్చినచో ఉన్మాదము, కపాలములు కనబడినయో సంభ్రమము కలుగును. శంఖము, శల్యములు కనబడినచో ఆ గృహిణి జారిణీత్వమును పొందును. శిల్పి తాను చేయు కార్యక్రమమునందు తడబడినచో గృహమునకు గృహయజమానికిని నష్టము సంభవించును.

స్తంభే స్కంధచ్యుతే కుంభే శిరోరోగం వినిర్దిశేత్ ।
కుంభాపహారే సర్వస్య కులస్యాపి క్షయో భవేత్ ॥ 23 ॥

మృత్యుః స్థానచ్యుతే కుంభే భగ్నే బంధం విదుర్బుధాః ।
కరసంఖ్యా వినాశే తు నాశం గృహపతేర్విదుః ॥ 24 ॥

స్తంభము నుండి జలకుంభము జారినచో యజమానికి శిరోరోగము కలుగును. జలకుంభము అపహరింప బడినచో కులమంతటికి వినాశనము సంభవించును. జలకుంభము స్థానచ్యుతమైనను మృత్యుదోషము కలుగును. అట్లే అది పగిలినచో బంధనము కలుగును. స్థలమును కొలుచునప్పుడు కరసంఖ్య అనగా మూరల సంఖ్యకు విఘాతము కలిగినచో గృహపతికి నాశము కలుగును.

బీజౌషధివిహీనే తు భూతేభ్యో భయమాదిశేత్ ।
తతః ప్రదక్షిణే నాన్యాన్ న్యసేత్ స్తంభాన్ విచక్షణః ॥ 25 ॥

యస్మాద్ భయకరం నృణాం యోజితా హ్యప్రదక్షిణమ్ ।
రక్షాం కుర్వీత యత్నేన స్తంభోపద్రవనాశినీమ్ ॥ 26 ॥

వాస్తుపూజా సమయమున ఆ స్థలమునందు చల్లినట్టి బీజములు, ఓషధులు చెడిపోయినచో ఇంటికి భూతభయము వాటిల్లును. విచక్షణుడైన విప్రుడు స్తంభములను కూడ ప్రదక్షిణ క్రమముననే స్థాపింపవలెను. అప్రదక్షిణము స్థాపించినచో అతిభయంకరమైన ఆపదలు కలుగును. కావున ఉపద్రవముల నుండి కాపాడుకొనుటకు స్తంభముల స్థాపనలో భంగము కలుగకుండా ఉండునట్లు శ్రద్ధ వహించాలి.

తథా ఫలవతీం శాఖాం స్తంభోపరి నివేశయేత్ ।
ప్రాదుదక్ ప్రవణం కుర్యాత్ దిఙ్మూఢం తు న కారయేత్ ॥ 27 ॥

స్తంభం వా భవనం వాఽపి ద్వారం వాసగృహం తథా ।
దిఙ్మూఢే కులనాశః స్యాన్న చ సంవర్ధయేద్ గృహమ్ ॥ 28 ॥

ఫలవంతములైన చెట్లయొక్క కొమ్మలనే స్తంభములకు కట్టవలెను. గృహనిర్మాణసమయమున దిశల నియమమును జాగ్రత్తగా పాటించవలెను. తూర్పు మరియు ఉత్తరదిక్కుల యందు మాత్రమే స్తంభములుండునట్లు నిర్మించుకొనవలెను అంతేకాని దిక్కుల వైపరీత్యము పనికిరాదు. స్తంభముకాని, భవనముకాని, వాసగృహముకాని, ద్వారముకాని స్థాపించునప్పుడు లేదా ఆరంభించునపుడు శాస్త్రసూచితములైన దిశల యందు మాత్రమే ఆయా పనులు నిర్వహించాలి. కాని తద్విపరీతముగా చేసినచో కులనాశనమునకు హేతువగును. ఆ గృహమును వృద్ధిపొందనివ్వవు కావున జాకరూకతతో ఉండవలెను. ఒకమారు గృహనిర్మాణము జరిగిన తర్వాత మరల దానిని పెంచుట మంచిది కాదు.

యది సంవర్ధయేద్గేహం సర్వదిక్షు వివర్ధయేత్ ।
పూర్వేణ వర్ధితం వాస్తు కుర్యాద్వైరాణి సర్వదా ॥ 29 ॥

దక్షిణే వర్ధితం వాస్తు మృత్యవే స్యాన్న సంశయః ।
పశ్చాద్వివృద్ధం యద్వాస్తు తదర్థక్షయకారకమ్ ॥ 30 ॥

వర్ధాపితం తథా సౌమ్యే బహుసంతాపకారకమ్ ।
ఆగ్నేయే యజ్ఞవృద్ధిః స్యాత్తదగ్నిభయదం భవేత్ ॥ 31 ॥

వర్ధితం రాక్షసే కోణే శిశుక్షయకరం భవేత్ ।
వర్ధాపితం తు వాయవ్యే వాతవ్యాధిప్రకోపకృత్ ॥ 32 ॥

ఈశాన్యామన్నహానిః స్యాద్వాస్తౌ సంవర్ధితే సదా ।

ఒకవేళ పెంచుటకు యత్నించినచో గృహమునకు అన్ని దిశలయందు పెంచుటకు యత్నించవలెను. కేవలం తూర్పునకు ఇల్లు పెంచినచో వైరవృద్ధి కలుగును, దక్షిణమునకు వృద్ధి పొందింపజేసినచో మృత్యుభయము వాటిల్లును. పశ్చిమమునందు మాత్రమే పెంచినచో ధననాశమునకు హేతువగును. అట్లే కేవలం ఉత్తరదిక్కున పెంచినచో అది బహు సంతాపకారకమగును. ఆగ్నేయమునందు పెంచినచో అగ్ని భయము, నైరుతి దిశయందు పెంచినచో శిశుక్షయము, వాయవ్యదిశ యందు వాతవ్యాధిప్రకోపము, ఈశాన్యదిశయందు పెంచిన అన్నహాని కలుగును. కావున గృహమును పెంచుసమయమున జాగరూకత వహించాలి.

ఈశాన్యే దేవతాగారం తథా శాంతిగృహం భవేత్ ॥ 33 ॥

మహానసం తథాగ్నేయే తత్ పార్శ్వే చోత్తరే జలమ్ ।
గృహస్యోపస్కరం సర్వం నైఋత్యే స్థాపయేద్ బుధః ॥ 34 ॥

వధస్థానం బహిః కుర్యాత్ స్నానమండలమేవ చ ।
ధనధాన్యం చ వాయవ్యే కర్మశాలా తతో బహిః ॥
ఏవం వాస్తు విశేషః స్యాద్ గృహభర్తుః శుభావహః ॥ 35 ॥

గృహమునకు ఈశాన్యమున దేవతాగృహము కాని శాంతిగృహము కాని ఉండాలి. ఆగ్నేయదిశలో వంట ఇల్లు, దానికి ప్రక్కనే ఉత్తరదిశయందు నీటి గృహము ఉండాలి. గృహోపకారణములన్నీ నైఋతి దిశ యందుండునట్లు యత్నించాలి. అట్లే వధస్థానము అనగా వడ్లు దంచుట, పిండి విసురుట మొదలగు వాటిని మరియు స్నానగృహమును కూడ ఇంటికి బయట ఉండునట్లు నిర్మించుకోవాలి. ఇంకనూ ధనధాన్యాదుల నిలువ వాయవ్యదిశయందు, కర్మశాల అనగా వస్త్రములు పాత్రలు మొదలగువాటిని శుభ్రపరుచుకొను స్థలము దాని తర్వాత ఉండునట్లు నిర్మించుకోవాలి. వాస్తువిశేషము ఈ విధంగా చేసుకోన్నచో గృహయజమానికి సర్వదా శుభకరము.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వాస్తువిద్యా గృహనిర్ణయో నామ
షట్పంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥256॥

శ్రీ మత్స్యమహాపురాణంలో వాస్తువిద్యలో గృహనిర్ణయ మనే
రెండువందల యాభైఆరవ అధ్యాయం సమాప్తం.



సప్తపంచాశదధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల యాభైఏడవ అధ్యాయం

వాస్తువిద్యానుకీర్తనమ్ - వాస్తువిద్యానుకీర్తనం

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి దార్వాహరణముత్తమమ్ ।
ధనిష్ఠాపంచకం ముక్త్వా త్విష్ట్యాదికమతః పరమ్ ॥ 1 ॥

తతఃసాంవత్సరాదిష్టే దినే యాయాద్వనం బుధః ।
ప్రథమం బలిపూజాం చ కుర్యాద్ వృక్షస్య సర్వదా ॥ 2 ॥

ఇప్పుడు గృహనిర్మాణమునకు ముఖ్యమైన దూలములు మొదలగువాటకి అవసరమైన కర్రలను సంగ్రహించుకొను విధానమును తెలుపుతాను. దార్వాహరణమునకు బయల్దేరునప్పుడు ధనిష్ఠా, శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి అను ఐదు నక్షత్రములను, విష్టి మొదలగు దుర్ముహూర్తములను వదిలిపెట్టాలి. జ్యోతిష్కుడు సూచించు శుభసమయమున బుద్ధిమంతుడైన గృహయజమాని దార్వాహరణమునకై బయలుదేరాలి. తనకు కావలసిన వృక్షము ఛేదించుటకు ముందు దానికి బలిపూజాదులు నిర్వహించాలి.

పూర్వోత్తరేణ పతితం గృహదారు ప్రశస్యతే ।
అన్యథా న శుభం విన్ద్యాత్ యామ్యోపరి నిపాతనమ్ ॥ 3 ॥

క్షీరవృక్షోద్భవం దారు న గృహే వినివేశయేత్ ।
కృతాధివాసం విహగైరనిలానలపీడితమ్ ॥ 4 ॥

తాను ఛేదించిన వృక్షము ఈశాన్యదిశలో పడుట శ్రేష్ఠము. ఈశాన్యము వైపు కాకుండా ఇతర ఏ దిశలో పడినను అది శుభప్రదము కాదు. ఇంటికొరకుపయోగించు కర్రలు పాలుగల అనగా మర్రిమొదలగు వృక్షముల నుండి సేకరించగూడదు. అంతేకాక పక్షులు గూళ్ళు నిర్మించుకొనిన వృక్షములు కాని, గాలిచేత పడిపోయినవిగాని, అగ్నిచే దగ్ధమైనట్టి వృక్షముల దారువు యోగ్యము కాదు.

గజావరుగ్ణం చ తథా విద్యున్నిర్ఘాతపీడితమ్ ।
అర్ధశుష్కం తథా దారు భగ్నశుష్కం తథైవ చ ॥ 5 ॥

చైత్యదేవాలయోత్పన్నం నదీసంగమజం తథా ।
శ్మశానకూపనిలయం తడాగాది సముద్భవమ్ ॥ 6 ॥

వర్జయేత్సర్వదా దారు యదీచ్ఛేద్విపులాం శ్రియమ్ ।
తథా కంటకినో వృక్షాన్ నీపనింబవిభీతకాన్ ॥ 7 ॥

శ్లేష్మాతకానామ్రతరూన్వర్జయేద్ గృహకర్మణి ।

మరియు ఏనుగులచేత విరుగగొట్టబడినట్టి, పిడుగుపాటుచే పడిపోయినట్టి, సగము ఎండినట్టి మరియు విరిగిన పిదప ఎండినట్టి దారువును కూడ వదిలివేయవలెను. అట్లే ప్రార్థనాస్థలములందు కాని, దేవాలయ సమీపమునందు కాని, నదీప్రాంతమునందు కాని, శ్మశానవాటిక సమీపమున కాని బావులు మరియు చెరువులు మొదలగు వాటి దగ్గరగానున్న వృక్షములను ఇంటియొక్క విపులమైన శ్రేయస్సును కోరువారు ఎల్లప్పుడును వదిలివేయాలి. అలాగే ముళ్ళు గల వృక్షములు, నిమ్మ, తాండ్ర, విరిగి, మామిడి మొదలగు చెట్లయొక్క దారువును కూడ గృహకర్మకై ఎప్పుడునూ ఉపయోగించరాదు.

ఆసనాశోకమధుక సర్జశాలాః శుభావహాః ॥ 8 ॥

చందనం పనసం ధన్యం సురదారు హరిద్రవః ।
ద్వాభ్యామేకేన వా కుర్యాత్ త్రిభిర్వా భవనం శుభమ్ ॥ 9 ॥

ఆసన – అశోక – మధుక – సర్జ – సాలవృక్షముల కర్రలు శుభప్రదములు. అట్లే, చందన – పనస – ధన్య – దేవదారు – హరిద్ర మొదలగు వృక్షములు కూడ శ్రేష్ఠములు. అయితే వీటిలో ఒకటి – రెండు లేదా మూడింటితో గృహనిర్మాణము చేసికొనుట శుభప్రదము.

బహుభిః కారితం యస్మాదనేక భయదం భవేత్ ।
ఏకైవ శింశపా ధన్యా శ్రీపర్ణీ తిందుకీ తథా ॥ 10 ॥

ఏతా నాన్యసమాయుక్తాః కదాచిచ్ఛుభకారకాః ।
స్యందనః పనసస్తద్వత్సరలార్జునపద్మకాః ॥ 11 ॥

ఏతే నాన్యసమాయుక్తా వాస్తుకార్యఫలప్రదాః ।

అంతకంటే ఎక్కువగా వివిధవృక్షముల కర్రను గృహనిర్మాణమునకు వాడినచో అది అనేక విధ భయములకు హేతువగును. శింశపా – శ్రీపర్ణి – తిందుకవృక్షములలో ఏదో ఒక దానియొక్క కర్రను మాత్రమే ఉపయోగించినచో అది అత్యంత శ్రేష్ఠము. కాని వీటిని వేరే విధములైన వృక్షముల కర్రలతో కలిపి ఉపయోగించినచో అవి శుభకారకములు కావు. అట్లే స్యందన – పనస – సరల – అర్జున – పద్మక ఇత్యాది వృక్షములు ఇతర వృక్షముల కర్రలతో ఉపయోగించుట వాస్తుకార్యఫలప్రదములు కావు.

తరుచ్ఛేదే మహాపీతే గోధాం వింద్యాద్విచక్షణః ॥ 12 ॥

మాంజిష్ఠవర్ణే భేకః స్యాన్నీలే సర్పాది నిర్దిశేత్ ।
అరుణే సరటం విద్యాన్ముక్తాభే శుకమాదిశేత్ ॥ 13 ॥

కపిలే మూషకాన్ విద్యాత్ ఖాడ్గభే జలమాదిశేత్ ।
ఏవం విధం సగర్భం తు వర్జయేద్వాస్తుకర్మణి ॥ 14 ॥

పూర్వచ్ఛిన్నం తు గృహ్ణీయాన్నిమిత్తశకునైః శుభైః ।

భవననిర్మాణమునకై వృక్షమును ఛేదించునప్పుడు దాని దారుఖండము అతిపచ్చగా ఉన్నచో ఉడుము, మంజిష్ఠ వర్ణము వలె ఎర్రగా ఉన్నచో కప్ప, నీలపురంగులో ఉన్నచో సర్పములు, అరుణవర్ణములో ఉన్నచో తొండ, ముత్యపు వర్ణమున ఉన్నచో చిలుక, కపిలవర్ణములోనున్నచో జలము మొదలగునవి ఉండునని తెలుసుకోవాలి. చిట్లిన గర్భదారువును గృహనిర్మాణమునకు ఉపయోగించకూడదు. ముందుగానే నరికియుంచి అది ఆరిన పిమ్మట శుభముహూర్తమును చూసుకొని తీసుకొని రావలెను.

వ్యాసేన గుణితే దైర్ఘ్యే అష్టాభిర్వై హృతే తథా ॥ 15 ॥

యచ్ఛేషమాయతం వింద్యాదష్టభేదం వదామి వః ।
ధ్వజో ధూమశ్చ సింహశ్చ వృషభః ఖర ఏవ చ ॥ 16 ॥

హస్తీ ధ్వాంక్షశ్చ పూర్వాద్యాః కరశేషా భవన్త్యమీ ।
ధ్వజః సర్వముఖో ధన్యః ప్రత్యగ్ ద్వారో విశేషతః ॥ 17 ॥

ఉదఙ్ముఖో భవేత్సింహః ప్రాఙ్ముఖో వృషభో భవేత్ ।
దక్షిణాభిముఖో హస్తీ సప్తభిః సముదాహృతః ॥ 18 ॥

ఏకేన ధ్వజ ఉద్దిష్టః త్రిభిః సింహ ప్రకీర్తితః ।
పంచభిర్వృషభః ప్రోక్తో వికోణస్థాంశ్చ వర్జయేత్ ॥ 19 ॥

ఇంటియొక్క వెడల్పును పొడవుతో గుణించగా వచ్చిన దానిని మరల ఎనిమిదితో భాగించాలి. వెడల్పు×పొడవు÷8, అట్లు భాగించగా వచ్చినట్టి శేషములలో "1. ధ్వజ 2. ధూమ 3. సింహ 4. శునక 5. వృషభ 6. ఖర 7. గజ 8. ధ్వాంక్ష" అను ఎనిమిది విధములగు ఆయములను తెలుపును. ఈ ఎనిమిది విధములగు ఆయములు క్రమముగా తూర్పునుండి ఈశాన్యము వరకు ఎనిమిది దిక్కులయందుండునని తెలిసికోవాలి. వీటిలో మొదటిదైన ధ్వజాయము అన్ని దిక్కులకును అభిముఖమై విశేషించి పశ్చిమాభిముఖమై వాస్తు స్థానమునందు తూర్పుదిశయందుండును. సింహాయము దక్షిణదిశయందు ఉత్తరాభిముఖమై యుండును, వృషభాయము పశ్చిమదిశయందు తూర్పునకు అభిముఖమై యుండును. గజాయము ఉత్తరదిశయందు దక్షిణాముఖమై ఉండును. ఇట్లు 1,3,5,7 సంఖ్యలో వచ్చునట్టి ఆయములు యోగ్యమైనవి. విదిశల యందు వచ్చునట్టి 2,4,6,8 అను సంఖ్యతో గల ఆయములు అయోగ్యమైనవి. కావున వాటిని వదిలివేయాలి.

తమేవాష్టగుణం కృత్వా కరరాశిం విచక్షణః ।
సప్తవింశాహృతే భాగే ఋక్షం విద్యాద్విచక్షణః ॥ 20 ॥

అష్టభిర్భాజితే ఋక్షే యః శేష స వ్యయో మతః ।
వ్యయాధికం న కుర్వీత యతో దోషకరం భవేత్ ।
ఆయాధికే భవేచ్ఛాంతః ఇత్యాహ భగవాన్ హరిః ॥ 21 ॥

గృహముయొక్క పొడవు – వెడల్పులను పరస్పరము గుణించగా వచ్చినట్టి చదరపు హస్తముల సంఖ్యను ఎనిమిదితో గుణించి మరల దానిని 27 తో భాగించగా "పొడవు×వెడల్పు×8÷27" వచ్చు శేషమును నక్షత్రమందురు. మరల ఈ నక్షత్ర సంఖ్యను ఎనిమిదిచే భాగింపగా వచ్చు శేషమును "వ్యయము" అని అందురు. ఈ విధముగా గణనచేయగా వచ్చునటువంటి "ఆయవ్యయముల" లో 'ఆయము' అధికమైనచో ఇంటి యజమానికి శుభముకలుగును అని సాక్షాత్తు భగవంతుడయిన హరి వివరించాడు.

కృత్వాగ్రతో ద్విజవరానథ పూర్ణకుంభం దధ్యక్షతామ్రదలపుష్పఫలోపశోభమ్ ।
కృత్వా హిరణ్యవసనాని తదా ద్విజేభ్యో మాంగల్యశాంతినిలయాయ గృహం విశేత్తు ॥ 22 ॥

గృహ్యోక్తహోమవిధినా బలికర్మ కుర్యాత్ ప్రాసాదవాస్తుశమనే చ విధిర్య ఉక్తః ।
సన్తర్పయేద్ ద్విజవరానథ భక్ష్యభోజ్యైః శుక్లాంబరః స్వభవనం ప్రవిశేత్సధూపమ్ ॥ 23 ॥

శ్రేష్ఠులైన ద్విజులను ముందుంచుకొని, పూర్ణకుంభమును, దధి, అక్షతలు, మామిడి ఆకులు, పువ్వులు, ఫలములు మొదలగువాటిని తీసుకొని, విప్రులకు హిరణ్యవస్త్రాదులను సమర్పించుకొని, శుభము మరియు శాంతియును కలుగవలెనను భావన చేయుచు గృహయజమాని నూతన గృహమున ప్రవేశింపవలెను. అంతేకాక గృహ్యసూత్రములలో చెప్పబడినట్టి కల్పవిధానానుసారముగ ఇంటికి వాస్తుశాంతిని, హోమమును బలి కార్యమును కూడ నిర్వర్తించి, శ్రేష్ఠులైన బ్రాహ్మణులను భక్ష్య భోజ్యాదులతో భోజనములు కల్పించి తృప్తి పరచవలెను. తెల్లని వస్త్రములతో మాత్రమే యజమాని ధూపంతో పరిమళ్ళించే స్వనూతనగృహమున ప్రవేశించవలెను.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వాస్తువిద్యానుకీర్తనం నామ
సప్తపంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥257॥

శ్రీ మత్స్యమహాపురాణమున వాస్తువిద్యానుకీర్తనం అనే
రెండువందల యాభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టపంచాశదధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల యాభైఎనిమిదవ అధ్యాయం
దేవతార్చానుకీర్తనే ప్రమాణాను కీర్తనమ్ – దేవాతార్చానుకీర్తనము నందు ప్రమాణానుకీర్తనం

ఋషయ ఊచుః – ఋషులు చెప్పారు.

క్రియాయోగః కథం సిద్ధ్యేత్ గృహస్థాదిషు సర్వదా ।
జ్ఞానయోగ సహస్రాద్ధి కర్మయోగో విశిష్యతే ॥ 1 ॥

సహస్రజ్ఞానయోగములకంటే క్రియాయోగము విశిష్టమైనది కదా, మరి ఈ క్రియాయోగము గృహస్థాదులకు ఎట్లు సిద్ధించునో తెలుపు మని ఋషులు సూతమహార్షిని అడిగారు.

సూత ఉవాచ – సూతమహర్షి చెప్పాడు.

క్రియాయోగం ప్రవక్ష్యామి దేవతార్చానుకీర్తనమ్ ।
భుక్తిముక్తిప్రదం యస్మాన్నాన్యల్లోకేషు విద్యతే ॥ 2 ॥

ప్రతిష్ఠాయాం సురాణాం తు దేవతార్చానుకీర్తనమ్ ।
దేవయజ్ఞోత్సవం చాపి బంధనాద్యేన ముచ్యతే ॥ 3 ॥

దేవతార్చానుకీర్తనము అను క్రియాయోగ పద్ధతిని ఇప్పుడు నేను మీకు వివరిస్తాను. క్రియాయోగము కంటే శ్రేష్ఠమైనది, భుక్తి ముక్తిప్రదమైనది ముల్లోకములలో ఎచ్చటనూ లేదు. దేవతలను ప్రతిష్ఠించునప్పుడుగాని, యజ్ఞయాగాది క్రియలు నిర్వహించునప్పుడు గాని దేవతలయొక్క అర్చామూర్తులను పూజించుట ఆవశ్యకము.

విష్ణోస్తావత్ ప్రవక్ష్యామి యాదృగ్రూపం ప్రశస్యతే ।
శంఖచక్రధరం శాంతం పద్మహస్తం గదాధరమ్ ॥ 4 ॥

ఛత్రాకారం శిరస్తస్య కంబుగ్రీవం శుభేక్షణమ్ ।
తుంగనాసం శుక్తికర్ణం ప్రశాంతోరుభుజక్రమమ్ ॥ 5 ॥

క్వచిదష్టభుజం విద్యాత్ చతుర్భుజమథాపరమ్ ।
ద్విభుజశ్చాపి కర్తవ్యో భవనేషు పురోధసా ॥ 6 ॥

ఇపుడు ముందుగా ప్రశస్తమైన విష్ణుప్రతిమారూపమును గురించి వివరిస్తాను. శ్రీమహావిష్ణువు శంఖ చక్రధరుడు, శాంతుడు, పద్మహస్తుడు, గదాధరుడు, ఛత్రాకారశిరస్కుడు, శంఖము వంటి మెడకలవాడు, శుభప్రదములైన కన్నులు గలవాడు, ఎత్తైన ముక్కు కలవాడు, పరాక్రమవంతములైన భుజములు కలవాడు. అటువంటి శ్రీమహావిష్ణువును ఇంటియందు పూజించుటకై శాస్త్రజ్ఞుడగు పురోహితుడు అష్టభుజమూర్తిగనో చతుర్భుజమూర్తిగనో లేదా ద్విభుజ మూర్తిగనో చేయించాలి.

దేవస్యాష్టభుజస్యాస్య యథాస్థానం నిబోధత ।
ఖడ్గో గదా శరః పద్మం దివ్యం దక్షిణతో హరేః ॥ 7 ॥

ధనుశ్చ ఖేటకం చైవ శంఖచక్రే చ వామతః ।
చతుర్భుజస్య వక్ష్యామి యథైవాయుధ సంస్థితిః ॥ 8 ॥

దక్షిణేన గదా పద్మం వాసుదేవస్య కారయేత్ ।
వామతః శంఖచక్రే చ కర్తవ్యే భూతిమిచ్ఛతా ॥ 9 ॥

అష్టభుజములు కలిగిన శ్రీహరికి కుడిచేతులందు ఖడ్గము, గద, శరము, దివ్యమైన పద్మము ఇత్యాదులు. ఎడమచేతులందు ధనుష్యము, ఖేటకము, మరియు శంఖచక్రములు ఉండును. ఇక చతుర్భుజుడైనప్పుడు కుడి చేతులందు గదా, పద్మములు ఎడమ చేతులందు శంఖచక్రములుండును. ఐశ్వర్యమును కోరువారు ఇట్టి మూర్తులను చేయించుకోవలెను.

కృష్ణావతారే తు గదా వామహస్తే ప్రశస్యతే ।
యథేచ్ఛయా శంఖచక్రే చోపరిష్టాత్ ప్రకల్పయేత్ ॥ 10 ॥

కృష్ణప్రతిమకు వామహస్తము నందు గద యుండుట ప్రశస్తము. ఇక శంఖచక్రములు మాత్రము తమ ఇచ్ఛానుసారము అనగా కుడి లేదా ఎడమ చేతులందు లేదా పై చేతులందుకాని ఉండునట్లు చూచుకోవచ్చును.

అధస్తాత్ పృథివీ తస్య కర్తవ్యా పాదమధ్యతః ।
దక్షిణే ప్రణతం తద్వద్ గరుత్మన్తం నివేశయేత్ ॥ 11 ॥

వామతస్తు భవేల్లక్ష్మీః పద్మహస్తా శుభాననా ।
గరుత్మానగ్రతో వాపి సంస్థాప్యో భూతిమిచ్ఛతా ॥ 12 ॥

దేవుని క్రింది భాగమున పాదముల మధ్యమున భూదేవి యుండాలి. అట్లే కుడివైపున నమస్కరించుచున్న గరుత్మంతుడు వుండాలి. వామభాగమున చేతి యందు పద్మము మరియు శుభావహమైన లక్ష్మీదేవి యుండవలెను. గరుత్మంతుని, శ్రీహరికి ముందువైపు ఉండునట్లు చూచుకోవాలి. శుభమును కోరుకొనువారు దీనిని పాటించాలి.

శ్రీశ్చ పుష్టిశ్చ కర్తవ్యే పార్శ్వయోః పద్మసంయుతే ।
తోరణం చోపరిష్టాత్తు విద్యాధరసమన్వితమ్ ॥ 13 ॥

దేవదుందుభిసంయుక్తం గంధర్వమిథునాన్వితమ్ ।
పత్రవల్లీసమోపేతం సింహవ్యాఘ్రసమన్వితమ్ ॥ 14 ॥

తథా కల్పలతోపేతం స్తువద్భిరమరేశ్వరైః ।
ఏవం విధో భవేద్విష్ణోః త్రిభాగేనాస్య పీఠికా ॥ 15 ॥

నవతాలప్రమాణాస్తు దేవదానవకిన్నరాః ।

దేవునకు ఇరువైపుల పద్మము చేతిలో కలిగిన శ్రీదేవి మరియు పుష్టిదేవి ఉండాలి. దేవునికి పై భాగమున విద్యాధరులతోనున్న తోరణమును నిర్మించాలి. తర్వాత దేవదుందుభులతో పాటు గంధర్వదంపతులు, పత్రములు, వల్లులు, సింహములు, వ్యాఘ్రములు, కల్పలతలు, స్తోత్రములు చేయుచున్నదేవతలు తోరణముపై ఉండవలెను. శ్రీమహావిష్ణువు యొక్క దేవతామూర్తి ఇట్లుండును. ఇక మూర్తియొక్క పరిమాణములో మూడవవంతు పీఠముయొక్క పరిమాణముండాలి. దేవదానవకిన్నరులు మొదలగువారి ప్రతిమలు తొమ్మిది తాళముల ప్రమాణముతో నుండాలి.

అతఃపరం ప్రవక్ష్యామి మానోన్మానం విశేషతః ॥ 16 ॥

జాలాంతరప్రవిష్టానాం భానూనాం యద్రజః స్ఫుటమ్ ।
త్రసరేణుః స విజ్ఞేయో వాలాగ్రం తైరథాష్టభిః ॥ 17 ॥

తదష్టకేన లిఖ్యా తు యూకా లిఖ్యాష్టకైర్మతా ।
యవో యూకాష్టకం తద్వదష్టభిస్తైస్తదంగులమ్ ॥ 18 ॥

స్వకీయాంగులిమానేన ముఖం స్యాద్ ద్వాదశాంగులమ్ ।
ముఖ్యమానేన కర్తవ్యా సర్వావయవకల్పనా ॥ 19 ॥

ఇపుడు సూక్ష్మభేదముతో గూడిన ఈ కొలతలను గురించి వివరిస్తాను. (మాన+ఉన్మానము, ఉన్మానము అనగా తూకపు పరిమాణము అని కోశగ్రంథములు తెలుపుతున్నాయి. అయితే ఈ సందర్భమున మాత్రము దైర్ఘ్యాది మానమును కొలుచు విధానము అని అర్థము చేసుకోవాలి). గవాక్షరంధ్రముల నుండి లోపలికి ప్రవేశించు సూర్యుని కిరణముల నడుమ గాలిలో ఎగురుచున్నట్లు కనబడు రజఃకణములలో సూక్ష్మతమమైన కణమును "త్రసరేణువు" అంటారు. అట్టి త్రసరేణువులు ఎనిమిదియైనచో "వాలాగ్రము", అవి ఎనిమిది ఐనచో "లిఖ్య /లిక్ష" యనబడును. ఎనిమిది లిఖ్యలు ఐనచో "యూక", అవి ఎనిమిదిఐనచో "యువ" అని యువలు ఎనిమిది కలిసినచో ఒక "అంగుళము" అగును. యజమాని యొక్క పదునెండు అంగుళముల ప్రమాణములో ప్రతిమా ముఖపు నిలువు ఉండవలెను. ముఖమానమును బట్టి మూర్తియొక్క ఇతర అవయవముల కొలతలుండాలి.

సౌవర్ణీ రాజతీ వాపి తామ్రీ రత్నమయీ తథా ।
శైలీ దారుమయీ చాపి లోహసీసమయీ తథా ॥ 20 ॥

రీతికాధాతుయుక్తా వా తామ్రకాంస్యమయీ తథా ।
శుభదారుమయీ వాఽపి దేవతార్చా ప్రశస్యతే ॥ 21 ॥

బంగారము, వెండి, రాగి, రత్నములు, శిల, దారువు, లోహము, సీసము, ఇత్తడి, తామ్రము, కాంస్యము, చందనము మరియు శుభప్రదములైన వృక్షముల దారువులు మొదలగు వాటితో ప్రతిమలను చేయించి చేసుకొని దేవతార్చన చేయుట ప్రశస్తము.

అంగుష్ఠపర్వాదారభ్య వితస్తిర్యావదేవ తు ।
గృహేషు ప్రతిమా కార్యా నాధికా శస్యతే బుధైః ॥ 22 ॥

ఆషోడశా తు ప్రాసాదే కర్తవ్యా నాధికా తతః ।
మధ్యోత్తమకనిష్ఠా తు కార్యా విత్తానుసారతః ॥ 23 ॥

ఇండ్లలో అర్చించుకొను దేవతల ప్రతిమలు కుడిచేతి బ్రొటనవ్రేలి కణుపంతు మొదలుకొని జానెడు వరకు గల నిలువుతో ఉండాలి. కాని అంతకన్న పెద్దగా ఉండకూడదని పండితుల అభిప్రాయం. దేవాలయములందలి దేవతామూర్తులా పదహారు జానెడుల ప్రమాణముతో నుండవచ్చును. కాని అంతకు మించిన ఎత్తుగా ఉండుట ప్రశస్తము కాదు. అయితే విత్తశక్తి ననుసరించి ఈ పరిమితముల నడుమ అనగా ఉత్తమాధమకనిష్ఠములలో ఏదో ఒక ప్రమాణముతో దేవతావిగ్రహనిర్మాణము చేసికోవచ్చును.

ద్వారోచ్ఛ్రాయస్య యన్మానమష్టధా తత్తు కారయేత్ ।
భాగమేకం తతస్త్యక్త్వా పరిశిష్టం తు యద్భవేత్ ॥ 24 ॥

భాగద్వయేన ప్రతిమా త్రిభాగీకృత్య తత్పునః ।
పీఠికా భాగతః కార్యా నాతినీచా న చోచ్ఛ్రితా ॥ 25 ॥

దేవాలయ ద్వారపు ఎత్తును ఎనిమిదిగా విభజించి దాని నుండి ఒక భాగమును తీసివేసి మిగిలినట్టి ఏడు భాగముల పరిమాణముతో దేవతామూర్తిని చేయించాలి. తర్వాత మొత్తము పరిమాణమును మరల మూడు భాగములుగా చేసుకొని దానినుండి త్రిభాగముతో పీఠమును నిర్మించుకోవాలి. కాని పీఠము అతి అధికమైన ఎత్తుగాని అతి తక్కువైన ఎత్తు కాని కాకుండా ఉండునట్లు చూచుకోవాలి.

ప్రతిమాముఖమానేన నవ భాగాన్ ప్రకల్పయేత్ ।
చతురంగులా భవేద్ గ్రీవా భాగేన హృదయం పునః ॥ 26 ॥

నాభిస్తస్మాదధః కార్యా భాగేనైకేన శోభనా ।
నిమ్నత్వే విస్తరత్వే చ అంగులం పరికీర్తితమ్ ॥ 27 ॥

ప్రతిమ యొక్క ముఖపు పరిమాణమును బట్టి తొమ్మిది భాగములను కల్పించుకోవాలి. ముఖము నిలువుఎత్తు 12 అంగుళములైనప్పుడు మెడ నాలుగు అంగుళములుండాలి. దాని క్రింద వక్షఃస్థలము. ఇది ఒక భాగము. దాని క్రింద నాభిమండలము అందముగా నిర్మించబడాలి. నాభి ఒక అంగుళము లోతు, ఒక అంగుళము విస్తారము కలదై ఉండాలి.

నాభేరధస్తథా మేఢ్రం భాగేనైకేన కల్పయేత్ ।
ద్విభాగేనాయతావూరూ జానునీ చతురంగులే ॥ 28 ॥

జంఘే ద్విభాగే విఖ్యాతే పాదౌ చ చతురంగులౌ ।
చతుర్దశాంగులస్తద్వన్మౌలి రస్య ప్రకీర్తితః ॥ 29 ॥

ఊర్ధ్వమానమిదం ప్రోక్తం పృథుత్వం చ నిబోధత ।
సర్వావయవమానేషు విస్తారం శృణుత ద్విజాః ॥ 30 ॥

తర్వాత నాభికి దిగువన మర్మాంగము ఒక భాగము. దానిక్రింద తొడలు రెండు భాగములు. మోకాళ్ళు నాలుగు అంగుళముల పరిమాణముతోను, వాటి క్రింది రెండు అంగుళముల పరిమాణముతో పిక్కలు, అటు తర్వాత నాలుగు అంగుళముల పరిమాణముతో పాదములు ఉండునట్లు చూడాలి. తర్వాత శిరస్సు 14 అంగుళములు ఉండాలి. ఈ విధముగా శిరస్సునుండి పాదముల వరకు దేవతామూర్తియొక్క నిర్మాణముండాలి. ఇక ఇప్పుడు అవయవముల కొలతలను మరియు వాటి వైశాల్యమును కూడ వివరిస్తాను. ఓ ద్విజులారా! శ్రద్ధగా వినండి.

చతురంగులం లలాటం స్యాదూర్ధ్వం నాసా తథైవ చ ।
ద్వ్యంగులస్తు హనుర్జ్ఞేయః ఓష్ఠః స్వాంగులసమ్మితః ॥ 31 ॥

అష్టాంగులే లలాటే చ తావన్మాత్రే భ్రువౌ మతే ।
అర్ధాంగులా భ్రువోర్లేఖా మధ్యే ధనురివానతా ॥ 32 ॥

ఉన్నతాగ్రా భవేత్ పార్శ్వే శ్లక్ష్ణతీక్ష్ణాప్రశస్యతే ।
అక్షిణీ ద్వ్యంగులా యామే తదర్ధం చైవ విస్తరే ॥ 33 ॥

ఉన్నతోదరమధ్యే తు రక్తాంతే శుభలక్షణే ।
తారకార్ధవిభాగేన దృష్టిః స్యాత్ పంచభాగికీ ॥ 34 ॥

లలాటపు నిలువు టెత్తు నాలుగు అంగుళములు మరియు ముక్కు నిలువుటెత్తు కూడ నాలుగు అంగుళములు. హనువు ఒక్కొక్కటియు రెండు అంగుళములు, పెదవులు ఒక అంగుళపు విస్తారము కలిగి ఉండాలి. లలాటపు అడ్డపు కొలతలు ఎనిమిది అంగుళములు, కనుబొమ్మలు రెండునూ కలిసి ఎనిమిది అంగుళములుండాలి. కనుబొమ్మల మధ్యన ధనువు వలె వంగియుండు చోటు దాని వంపుటెత్తు అర్ధాంగుళము మరియు కనుబొమ్మల పార్శ్వమునందుండు కొన ఉన్నతముగాను, నునుపుగాను, వాడిగను ఉండవలెను. ఈ విధముగా నిర్మింపబడినదే ప్రశస్తమైనది. నేత్రములు రెండును వేరువేరుగ రెండు అంగుళముల విస్తారమును కలిగి ఉండాలి. కనుగ్రుడ్లు నడుమ ఉబ్బుగను, కనుల కొనలు ఎరుపుగను ఉండవలెను. ఇట్లున్న కన్నులు శుభలక్షణములు కలిగినవని చెప్పవచ్చును. మొత్తము కంటి వైశాల్యములో ఐదవ వంతు కొలతతో కంటి గ్రుడ్డులోని అర్ధ భాగము ఉండవలెను.

ద్వ్యంగులం చ భ్రువోర్మధ్యే నానామూలమథాంగులమ్ ।
నాసాగ్రవిస్తరం తద్వత్ పుటద్వయమథానతమ్ ॥ 35 ॥

నాసాపుటవిలం తద్వదర్ధాంగులముదాహృతమ్ ।
కపోలే ద్వ్యంగులే తద్వత్ కర్ణమూలాద్వినిర్గతే ॥ 36 ॥

హన్వగ్రమంగులం తద్వద్విస్తారో ద్వ్యంగులో భవేత్ ।
అర్ధాంగులా భ్రువో రాజీ మృణాలసదృశీ సమా ॥ 37 ॥

అర్ధాంగులసమస్తద్వదుత్తరోష్ఠస్తు విస్తరే ।
నిష్పావసదృశం తద్వన్నాసాపుటదలం భవేత్ ॥ 38 ॥

రెండు కనుబొమ్మల మధ్యభాగము రెండు అంగుళములు, నాసామూలము అనగా ముక్కు కనుబొమ్మల కలియు చోటు ఒక అంగుళముండాలి. నాసాగ్రము కూడ అట్లే ఒక అంగుళము వెడల్పు ఉండాలి. రెండు ముక్కుపుటములును కుడి ఎడమలకు వంగి యుండాలి. నాసాపుటబిలము మాత్రము అర్ధాంగుళ ప్రమాణముండవలెను. చెవి మూలముల నుండి వెలికి వచ్చునంత వరకు కపోలములు రెండంగుళప్రమాణము, హనువు అనగా దవడకొన ఒక అంగుళము, దానియొక్క వెడల్పు రెండంగుళములు ఉండాలి. కనుబొమ్మల వరుస మందముగాను, మృణాలీ సదృశముగాను అర్ధాంగుళప్రమాణముతో ఉండాలి. అట్లే పై పెదవి అర్ధాంగుళము మరియు ముక్కుడిప్పలు అనుపగింజలపప్పుబ్రద్దవలె విషమస్వరూపములో నుండాలి.

సృక్కిణీ జ్యోతిస్తుల్యే తు కర్ణమూలాత్ షడంగులే ।
కర్ణౌ తు భ్రూసమౌ జ్ఞేయావూర్ధ్వం తు చతురంగులౌ ॥ 39 ॥

ద్వ్యంగులౌ కర్ణపార్శ్వౌ తు మాత్రామేకాం తు విస్తృతౌ ।
కర్ణయోరుపరిష్టాచ్చ మస్తకం ద్వాదశాంగులమ్ ॥ 40 ॥

లలాటాత్ పృష్ఠతోఽర్ధేన ప్రోక్తమష్టాదశాంగులమ్ ।
షట్త్రింశదంగులశ్చాస్య పరిణాహః శిరోగతః ॥ 41 ॥

సకేశనిచయో యస్య ద్విచత్వారింశదంగులః ।
కేశాంతాద్ధనుకా తద్వదంగులాని తు షోడశ ॥ 42 ॥

పెదవిమూలములు దీపజ్వాల వలె కర్ణమూలము నుండి ఆరు అంగుళాలదూరమునందుండాలి. కనుబొమ్మలపై అంచునకు తిన్నగా చెవులపై అంచులు ఉండాలి. వాటి నిలువుటెత్తు నాలుగు అంగుళములుగా ఉండాలి. చెవులయొక్క అడ్డపు నిడివి రెండు అంగుళముల కంటే కొంచెము ఎక్కువగా ఉండాలి. అట్లే చెవుల పైఅంచునుండి మస్తకపు పై కొనవరకు ఎత్తుసరి పదునెండు అంగుళములు, లలాటపు పై అంచునుండి ఐనను తల వెనుక భాగమున మధ్య భాగము వరకు పదునెనిమిది అంగుళములుగా ఉండాలి. అనగా లలాటమునకు తిన్నగా నుండు తల యొక్క పూర్తి పరిమాణము ముప్పది ఆరు అంగుళములని గ్రహించాలి. కేశనిచయము ఉండు శిరోభాగము నలుబది రెండు అంగుళములు అట్లే తల వెనుకవైపు మధ్యభాగములో వెంట్రుకలు మొలుచుట ఆగిపోవు చోటనుండి దౌడల ఆరంభము వరకును ఉండునట్టి దూరము పదహారు అంగుళములుండాలని తెలుసుకోవాలి.

గ్రీవామధ్య పరీణాహశ్చతుర్వింశతికాంగులః ।
అష్టాంగులా భవేద్ గ్రీవా పృథుత్వేన ప్రశస్యతే ॥ 43 ॥

స్తనగ్రీవాన్తరం ప్రోక్తమేక తాలం స్వయంభువా ।
స్తనయోరన్తరం తద్వద్ ద్వాదశాంగుల మిష్యతే ॥ 44 ॥

**స్తనయోర్మండలం తద్వద్ ద్వ్యంగులం పరికీర్తితమ్ ।
చూచుకౌ మండలస్యాన్తర్యయవమాత్రావుభౌ స్మృతౌ ॥ 45 ॥**

మెడ ఎత్తులోని మధ్యభాగము దాని చుట్టుకొలత ఇరువది నాలుగు అంగుళములు, మెడ ముందుభాగపు వెడల్పు ఎనిమిది అంగుళములు, స్తనముల నడిమి బిందువునుండి మెడ క్రిందిభాగము వరకు ఒక తాళ ప్రమాణముండాలి. మరియు స్తనబిందువుల మధ్యదూరము పదునెండు అంగుళములు కలిగివుండి ఒక్కొక్క స్తనపు కొలత రెండు అంగుళములు మరియు స్తనమండలమునకు మధ్యలో నుండు చూచుకములు (చనుమెనలు) యవలంత పరిమాణమము మాత్రమే ఉండాలి.

**ద్వితాలం చాపి విస్తారాద్వక్షః స్థలముదాహృతమ్ ।
కక్షే షడంగులే ప్రోక్తే బాహుమూలస్తనాంతరే ॥ 46 ॥**

**చతుర్దశాంగులౌ పాదావంగుష్ఠౌ తు త్రిరంగులౌ ।
పంచాంగులపరీణాహ మంగుష్ఠాగ్రం తథోన్నతమ్ ॥ 47 ॥**

**అంగుష్ఠకసమా తద్వదాయామా స్యాత్ ప్రదేశినీ ।
తస్యాః షోడశభాగేన హీయతే మధ్యమాంగులీ ॥ 48 ॥**

**అనామికాష్టభాగేన కనిష్ఠా చాపి హీయతే ।
పర్వత్రయేణ చాంగుల్యో గుల్ఫౌ ద్వ్యంగులకౌ మతౌ ॥ 49 ॥**

వక్షఃస్థలము యొక్క వైశాల్యము రెండు తాళములు, బాహుమూలముల క్రింది అంచునుండి స్తనపు నడుమ వరకు గల దూరము (కక్ష=చంక వరకు) ఆరంగుళములు. అట్లే పాదముల వైశాల్యము పద్నాలుగు అంగుళములు, బ్రొటనవ్రేళ్ళు మూడు అంగుళములు, పాదాంగుష్ఠము ఉన్నతభాగమున ఐదు అంగుళముల నిలువు చుట్టుకొలతతో ఉండవలెను. పాదపు రెండవ వ్రేలు కూడ బ్రొటన వ్రేలంత పొడవే ఉండాలి. పాదపు నడిమి వ్రేలు మొదటి వ్రేలు కంటే షోడశాంశము తక్కువగా ఉండాలి. పాదపు అనామికవ్రేలు పొడవులో అష్టాంశము తగ్గి ఉండాలి. పాదపు బ్రొటనవ్రేలికి తప్ప మిగిలిన వ్రేళ్ళకు అన్నింటికి మూడేసి కణుపులు ఉండాలి. గుల్ఫములు అనగా మడిమలు రెండు అంగుళములు ఉండాలి.

**పార్ష్ణి ద్వ్యంగులమాత్రస్తు కలయోచ్చైః ప్రకీర్తితః ।
ద్విపర్వాంగుష్ఠకః ప్రోక్తః పరీణాహశ్చ ద్వ్యంగులః ॥ 50 ॥**

**ప్రదేశినీ పరీణాహస్త్ర్యంగులః సముదాహృతః ।
కనిష్ఠికాష్టభాగేన హీయతే క్రమశో ద్విజాః ॥ 51 ॥**

**అంగులేనోచ్ఛ్రయః కార్యో హ్యంగుష్ఠస్య విశేషతః ।
తదర్ధేన తు శేషాణామంగులీనాం తథోచ్ఛ్రయః ॥ 52 ॥**

జంఘాగ్రే పరిణాహస్తు అంగులాని చతుర్దశ ।
జంఘా మధ్యే పరీణాహస్తథైవాష్టాదశాంగులః ॥ 53 ॥

జానుమధ్యే పరీణాహ ఏకవింశతిరంగులః ।
జానూచ్ఛ్రయోఽంగులః ప్రోక్తో మండలం తు త్రిరంగులమ్ ॥ 54 ॥

మడమ ఎత్తు రెండు అంగులములకంటే ఒక కల మాత్రము ఎక్కువగా ఉండాలి. పాదపు బొటనవ్రేలికి కణుపులు రెండు మాత్రమే. కాని దాని చుట్టుకొలత మూడు అంగుళములుండాలి. రెండవ వ్రేలి నిలువు చుట్టుకొలత మూడు అంగుళములే. కాని ఇవి క్రమముగా కనిష్ఠక వరకు ఒకదాని కంటె ఒకటి ఒక అష్టమాంశము తగ్గుచు ఉండాలి. అట్లే పాదాంగుష్ఠమును ముందువైపు చూచునప్పుడు దాని నిలువుటెత్తు ఒక అంగుళపరిమాణము మరియు మిగిలిన నాలుగు వ్రేళ్ళకు ముందు వైపు అర్ధాంగుళపు ఎత్తు ఉండవలెను. ఇక పిక్కల పైభాగపు చుట్టుకొలత పద్నాలుగు అంగుళములు వుండి, వాటి మధ్యభాగం పదునెనిమిది అంగుళములు ఉండాలి. తర్వాత మోకాళ్ళకు మధ్యభాగమున ఒక్కొక్క మోకాలికి ఉండు చుట్టుకొలత ఇరువది ఒక అంగుళములు, మోకాలి చిప్పల ఎత్తు ఒక అంగుళము, మరల వాటి చుట్టుకొలత మూడు అంగుళములుగా ఉండాలి.

ఊరుమధ్యే పరీణాహో హ్యష్టావింశతికాంగులః ।
ఏకత్రింశోపరిష్టాచ్చ వృషణౌ తు త్రిరంగులౌ ॥ 55 ॥

ద్వ్యంగులం చ తథా మేఢ్రం పరీణాహః షడంగులః ।
మణిబంధాదధో విద్యాత్ కేశరేఖా స్తథైవ చ ॥ 56 ॥

మణికోశపరీణాహశ్చతురంగుల ఇష్యతే ।
విస్తరేణ భవేత్తద్వత్ కటిరష్టాదశాంగులా ॥ 57 ॥

తర్వాత తొడలయొక్క (మొత్తము వైశాల్యములో) మధ్య భాగమునందు వాటిని ఒక్కొక్కదాని చుట్టుకొలత ఇరువది ఎనిమిది అంగుళములుగా ఉండాలి. తొడ (ఒక్కొక్కటియు) పై భాగమున ముప్పదియొక్క అంగుళముల పరిమాణము వృషణముల (యొక్క రెండింటి) ప్రమాణము మూడు అంగుళములుగా ఉండాలి. రహస్యాంగము యొక్క ప్రమాణము రెండు అంగుళములు మరియు (దాని నిలువు) చుట్టుకొలత ఆరు అంగుళములు ఉండాలి. మణిబంధమునకు దిగువ కేశరేఖలను స్పష్టముగా చూపవలెను. ఈ మణిబంధపు చుట్టుకొలత నాలుగు అంగుళములుండాలి. అట్లే కటిప్రదేశపు (ముఖ్యముగా) ముందు భాగము విస్తారము పదునెనిమిది అంగుళములుండాలి.

ద్వావింశతి తథా స్త్రీణాం స్తనౌ చ ద్వాదశాంగులౌ ।
నాభిమధ్యపరీణాహో ద్విచత్వారింశదంగులః ॥ 58 ॥

పురుషే పంచపంచాశత్ కట్యాం చైవ తు వేష్టనమ్ ।
కక్షయోరుపరిష్టాత్తు స్కంధౌ ప్రోక్తౌ షడంగులౌ ॥ 59 ॥

అష్టాంగులాం తు విస్తారే గ్రీవాం చైవ వినిర్దిశేత్ ।
పరీణాహే తథా గ్రీవాం కలా ద్వాదశ నిర్దిశేత్ ॥ 60 ॥

స్త్రీమూర్తులయొక్క కటివిస్తారము ఇరువది రెండు అంగుళములు, స్తనములయొక్క చుట్టుకొలత పంద్రెండు అంగుళములు అట్లే వారి నాభికి తిన్నగా ఉండు నడుము కొలత నలుబది రెండు అంగుళములు అని గమనించాలి. పురుషమూర్తికైనచో కటిప్రదేశపు చుట్టు కొలత ఏబది ఐదు అంగుళములు. (కక్షలు అనగా) చంకలకు పైభాగమున ఉండు (స్కంధము అనగా) భుజముల ప్రమాణము ఆరు అంగుళములు, మరియు మెడకు ముందుభాగము ఎనిమిది అంగుళములు చుట్టుకొలత పన్నెండు కళలు అని ఉండాలి. అనగా తాళప్రమాణమును ముందుగా పదహారు భాగములుగా చేసి వాని నుండి పంద్రెండు భాగములు గ్రహించవలెను.

ఆయామో భుజయోస్తద్వత్ ద్విచత్వారింశదంగులః ।
కార్యం తు బాహుశిఖరం ప్రమాణే షోడశాంగులమ్ ॥ 61 ॥

ఊర్ధ్వం యద్ బాహుపర్యంతం వింద్యాదష్టాంగులం శతమ్ ।
తథైకాంగుల హీనం తు ద్వితీయం పర్వ ఉచ్యతే ॥ 62 ॥

బాహుమధ్యే పరీణాహో భవేదష్టాదశాంగులః ।
షోడశోక్తః ప్రబాహుస్తు షట్ కలోఽగ్రకరో మతః ॥ 63 ॥

తర్వాత భుజములయొక్క పొడవు నలుబది రెండు అంగుళములు మరియు భుజశిఖరములు ఒక్కొక్కటి పదహారు అంగుళములు, బాహుపర్యంతము గల పైనిడివి అనగా మోచేతి పైభాగము ఎనిమిది అంగుళములు మరియు మోచేతి క్రిందిభాగము దాని కన్న ఒక అంగుళము తక్కువగా అనగా ఏడు అంగుళముల ప్రమాణము, అటు తర్వాత బాహువులలో ఒక్కొదాని మధ్యభాగమున నుండు చుట్టుకొలత పద్దెనిమిది అంగుళములు మరియు మోచేతికి దిగువభాగమున చుట్టుకొలత పదహారు అంగుళములు, అగ్రకరపు చుట్టుకొలత ఆరు కళలుగా ఉండునని గమనించాలి.

సప్తాంగులం కరతలం పంచ మధ్యాంగులీ మతా ।
అనామికా మధ్యమాయాః సప్తభాగేన హీయతే ॥ 64 ॥

తస్యాస్తు పంచభాగేన కనిష్ఠా పరిహీయతే ।
మధ్యమాయాస్తు హీనా వై పంచభాగేన తర్జనీ ॥ 65 ॥

అంగుష్ఠ తర్జనీ మూలాదధః ప్రోక్తస్తు తత్సమః ।
అంగుష్ఠ పరీణాహస్తు విజ్ఞేయశ్చతురంగులః ॥ 66 ॥

శేషాణామంగులానాం తు భాగో భాగేన హీయతే ।
మధ్యమాపర్వమధ్యం తు అంగులద్వయమాయతమ్ ॥ 67 ॥

యవో యవేన సర్వాసాం తస్యాస్తస్యాః ప్రహీయతే ।
అంగుష్ఠపర్వమధ్యం తు తర్జన్యా సదృశం భవేత్ ॥ 68 ॥

అరచేతి పొడవు ఏడు అంగుళములు, చేతి నడిమివ్రేలు ఐదు అంగుళములు, అనామిక పొడవు మధ్యవ్రేలు పొడవులో ఐదవ వంతు తగ్గి తర్జని పొడవు ఉండును. మరల తర్జనీ మూలము నుండి దిగువభాగమునకు వచ్చిన అంగుష్ఠము దానితో సమముగా ఉండును. అలాగే అంగుష్ఠపు రెండు కణుపుల మొత్తము పరిమాణము నాలుగు అంగుళములు, మిగిలిన వ్రేళ్ళ కణుపులు కూడ ఒక్కొక్కటి బొటన వ్రేలి యొక్క ఒక్కొక్క కణపుకన్న కొంచెము తగ్గుచు ఉండాలి. మధ్యపర్వపు కొలత రెండు అంగుళములుండాలి. మిగిలిన వ్రేళ్ళ కణుపుల పొడవులు ఒక దాని కన్న మరియొకదాని పొడవు యవ – యవ – పరిమాణము తగ్గుచుండాలి. అంగుష్ఠపర్వమధ్యము మాత్రము తర్జనితో సమానముగానే ఉండాలి.

యవద్వయాధికం తద్వదగ్రపర్వ ఉదాహృతమ్ ।
పూర్వార్ధే తు నఖాన్ విద్యాదంగులీషు సమన్తతః ॥ 69 ॥

స్నిగ్ధం శ్లక్ష్ణం ప్రకుర్వీత ఈషద్రక్తం తథాగ్రతః ।
నిమ్నపృష్ఠం భవేన్మధ్యే పార్శ్వతః కలయోచ్ఛ్రితమ్ ॥ 70 ॥

తథైవ కేశవల్లీయం స్కంధోపరి దశాంగులా ।

అంగుష్ఠపు మొదటి పర్వము తర్జనీ పర్వపరిమాణము కంటే రెండు యవలు అధికముగా నుండాలి. ప్రతి యొక్క వ్రేలియందును ఆ వ్రేలి చివరి భాగమున ఆ వ్రేలియొక్క గోరు ఉండాలి. ఆ గోళ్ళు స్నిగ్ధముగా సొగసుగా చివరలో కొంచెము ఎరుపుగా నుండాలి. అందులోనూ, మరల పైభాగము కొంచెము పల్లముగాను, మధ్యభాగము కొంచెము ఎత్తుగానుండాలి. కేశవల్లిక భుజమూలములకు పైగా పది అంగుళముల వరకు వ్యాపించి ఉండాలి.

స్త్రియః కార్యాస్తు తన్వఙ్గ్యః స్తనోరుజఘనాధికాః ॥ 71 ॥

చతుర్దశాంగులాయామముదరం నామ నిర్దిశేత్ ।
నానాభరణసంపన్నాః కించిచ్ఛ్లక్ష్ణభుజాస్తతః ॥ 72 ॥

కించిద్దీర్ఘం భవేద్వక్రమలకావలిరుత్తమా ।
నాసా గ్రీవా లలాటం చ సార్ధమాత్రం త్రిరంగులమ్ ॥ 73 ॥

అధ్యర్ధాంగులవిస్తారః శస్యతేఽధరపల్లవః ।

అధికం నేత్రయుగ్మం తు చతుర్భాగేన నిర్దిశేత్ ॥
గ్రీవావలిశ్చ కర్తవ్యా కించిదర్ధాంగులోచ్ఛ్రయా ॥ 74 ॥

స్త్రీల మూర్తుల విషయమున, వారి స్తనములు, తొడలు, కటిప్రదేశము మొదలగు వాటిని ఎత్తుగా ఉండునట్లు నిర్మించవలెను. వారి ఉదరము పధ్నాలుగు అంగుళములుగానుండాలి. వారు నానాభరణసంపన్నులై

మృదువైన సొంపైన ముఖములు కలవారై ఉండునట్లు చూడాలి. స్త్రీమూర్తుల మొగము కొంచెము పొడువుగా వుండి. (అలకావళి అనగా) వారి ముంగురుల వరుస ఉత్తమముగా నుండాలి. ముక్కు, మెడ, లలాటము, మొదలగునవి మూడున్నరేసి అంగుళములుగా నుండాలి. క్రింది పెదవి చిగురుటాకు వలె వుండి ఒకటిన్నర అంగుళము వెడల్పు కలిగి ఉండాలి. వారి కన్నులను పురుషుల నేత్ర దైర్ఘ్యము కన్న నాలుగవ పాలు అధికముగా నుంచాలి. వారి మెడభాగము పురుషులకంటే అర్ధాంగుళము అధికముగా నుండాలి.

ఏవం నారీషు సర్వాసు దేవానాం ప్రతిమాసు చ ।
నవతాలమిదం ప్రోక్తం లక్షణం పాపనాశనమ్ ॥ 75 ॥

ఇట్లు దేవతాప్రతిమలకు మరియు స్త్రీప్రతిమలకు కూడ ఉండవలసిన ఆయా అవయవముల యొక్క లక్షణములను వాటి పరిమాణములను కూడ ఇక్కడ వివరించినాను. ఇవి నవతాళలక్షణము ప్రకారము వివరింపబడినవి, ఇక్కడ వివరించినట్లు అనుసరించిన పాతకములు తొలగిపోవును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దేవతార్చానుకీర్తనే ప్రమాణానుకీర్తనం నామ
అష్టపంచాశదధికద్విశతతమోఽధ్యాయః ॥258॥

శ్రీ మత్స్యమహాపురాణంలో దేవాతార్చానుకీర్తనము నందు ప్రమాణానుకీర్తనం అనే
రెండు వందల యాభై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల యాభైతొమ్మిదవ అధ్యాయం

ప్రతిమాలక్షణమ్ - ప్రతిమాలక్షణం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

అతః పరం ప్రవక్ష్యామి దేవాకారాన్విశేషతః ।
దశాతాలః స్మృతో రామో బలిర్వైరోచనిస్తథా ॥ 1 ॥

వారాహో నారసింహశ్చ సప్తతాలస్తు వామనః ।
మత్స్యకూర్మౌ చ నిర్దిష్టౌ యథాశోభం స్వయంభువా ॥ 2 ॥

ఇప్పుడు ఆయా దేవతారూపములను విశేషాకారములను గురించి విశదముగా చెబుతాను. రాముడు, వైరోచనసుతుడైన బలి, వారాహుడు, నారసింహుడు, మొదలగు దేవతామూర్తులకు దశతాలప్రమాణమును, వామనమూర్తికి మాత్రము సప్తతాళప్రమాణమును అనుసరించాలి. ఇక మత్స్య, కూర్మమూర్తులు శోభాయమానముగా ఉండునట్లు (ఎంత పరిమాణముతోనైననూ) చేయవచ్చునని స్వాయంభూబ్రహ్మ చెప్పియున్నాడు.

అతఃపరం ప్రవక్ష్మామి రుద్రాద్యాకారముత్తమమ్ ।
స పీనోరుభుజస్కన్ధః తప్తకాంచనసన్నిభః ॥ 3 ॥

శుక్లోఽర్కరశ్మిసంఘాతః చంద్రాంకితజటో విభుః ।
జటాముకుటధారీ చ ద్వ్యష్టవర్షాకృతిశ్చ సః ॥ 4 ॥

ఇప్పుడు రుద్రాది దేవతామూర్తుల ఉత్తమ లక్షణములను వివరిస్తాను. ఈశ్వరుని మూర్తి బాగుగా దృఢమైన ఊరువులు, భుజములు, మరియు భుజస్కంధములు కలిగి ఉండాలి. అట్లే ఆ మూర్తి తప్తకాంచన సన్నిభుడు. ఉదయించిన సూర్యకిరణములను బోలిన జటాజూటము, శిరస్సుపైన చంద్రరేఖను కలిగి యుండాలి. ఈ మూర్తి పదహారు సంవత్సరముల వయస్సు కలిగినవాడుగా ఉండాలి.

బాహూ వారణహస్తాభౌ వృత్తజంఘోరుమండలః ।
ఊర్ధ్వకేశశ్చ కర్తవ్యో దీర్ఘాయతవిలోచనః ॥ 5 ॥

వ్యాఘ్రచర్మపరీధానః కటిసూత్రత్రయాన్వితః ।
హారకేయూరసంపన్నో భుజంగాభరణస్తథా ॥ 6 ॥

బాహవశ్చాపి కర్తవ్యా నానాభరణభూషితాః ।
పీనోరుగండఫలకః కుండలాభ్యామలంకృతః ॥ 7 ॥

ఇంకనూ అతనికి గజహస్తసమాన బాహువులు, వృత్తజంఘోరుమండలములు, ఊర్ధ్వకేశములు, విశాలమైన నేత్రములు ఉండాలి. వ్యాఘ్రచర్మాంబరధారియై, మూడు కటిసూత్రములు, హారకేయూరాది భూషణములు,

నాగాభరణములు కలవాడుగా ఉండాలి. అనేక ఆభరణములతో అలంకరింపబడిన బాహువులు, విశాలమైన వక్షఃస్థలము మరియు (కర్ణ) కుండలములచేత అలంకరింపబడినవాడై ఉండాలి.

ఆజానులంబబాహుశ్చ సౌమ్యమూర్తిః సుశోభనః ।
ఖేటకం వామహస్తే చ ఖడ్గం చైవ తు దక్షిణే ॥ 8 ॥

శక్తిం దండం త్రిశూలం చ దక్షిణేషు నివేశయేత్ ।
కపాలం వామపార్శ్వే తు నాగం ఖట్వాంగమేవ చ ॥ 9 ॥

ఏకశ్చ వరదో హస్తః తథాక్షవలయోఽపరః ।
వైశాఖ స్థానకం కృత్వా నృత్యాభినయసంస్థితః ॥ 10 ॥

ఆజానుబాహువై, సౌమ్యమైన మూర్తిస్వరూపుడై కాంతివంతమైన రూపంతో ఉండాలి. (కిందనున్న) వామహస్తమునందు ఖేటకము, దక్షిణహస్తమునందు ఖడ్గము వుండాలి. దక్షిణమునందుండు పై చేతులలో శక్తి దండత్రిశూలాది ఆయుధములు, వామపార్శ్వమునందు కపాలము, నాగము, ఖట్వాంగము ఇత్యాదులు ధరించి వుండాలి. ఇంకనూ నృత్యాభినయస్వరూపుడై వైశాఖమను నృత్యభంగిమలో ముందరి క్రింది చేతులలో ఒక దానిలో వరదహస్తమును రెండవ దానిలో అక్షసూత్రమును ధరింపచేయాలి.

నృత్యన్ దశభుజః కార్యో గజచర్మధరస్తథా ।
తథా త్రిపురదాహే చ బాహవః షోడశైవ తు ॥ 11 ॥

శంఖం చక్రం గదా శార్ఙం ఘంటా తత్రాధికా భవేత్ ।
తథా ధనుః పినాకశ్చ శరో విష్ణుమయస్తథా ॥ 12 ॥

నాట్యమూర్తిని దశభుజునిగాను, గజచర్మాంబర ధారిగాను, త్రిపురారికైనచో పదహారు బాహువుండాలి. శంఖము, చక్రము, గద, శార్ఙ్గము, ఘంట, పినాకమను ధనుస్సు విష్ణుమయమైన బాణములు ఆయుధములుగా ఉంచాలి.

చతుర్భుజోఽష్టబాహుర్వా జ్ఞానయోగేశ్వరో మతః ।
తీక్ష్ణనాసాగ్రదశనః కరాలవదనో మహాన్ ॥ 13 ॥

భైరవః శస్యతే లోకే ప్రత్యాయతనసంస్థితః ।
న మూలాయతనే కార్యో భైరవస్తు భయంకరః ॥ 14 ॥

జ్ఞానయోగేశ్వర మూర్తి చతుర్భుజునిగానో, అష్టబాహువులు కలవాడిగనో ఉండాలి. అట్లే అతని నాసాగ్రము, దంతములు తీక్ష్ణములై ఉండాలి. కరాలవదనుడై కూడ ఉండాలి. అయితే శివుడు భైరవమూర్తియైనప్పుడు భయంకరస్వరూపుడై ఉండును. కావున అతనిని మూలాయతనము, అనగా–ప్రధానమైన ఆలయమునందు కాక ప్రత్యాయతనమునందు, అనగా–ఉపాలయమునందు ప్రతిష్ఠించుట ప్రశస్తము.

నారసింహో వరాహో వా తథాఽన్యేఽపి భయంకరాః ।
నాధికాంగాః న హీనాంగా కర్తవ్యాః దేవతాః క్వచిత్ ॥ 15 ॥

భైరవమూర్తినే కాక నారసింహ - వరాహాది భయంకరమూర్తులకును కూడా అధికాంగములు కలవారిగా కాని, హీనాంగములు కలిగినవారిగా కాని ఎప్పుడునూ చేయకూడదు. అట్లు కాకుండా ఉండునట్లు జాగరూకత వహించాలి.

స్వామినం ఘాతయేన్న్యూనా కరాలవదనా తథా ।
అధికా శిల్పినం హన్యాత్ కృశా చైవార్థనాశినీ ॥ 16 ॥

కృశోదరీ తు దుర్భిక్షం నిర్మాంసా ధననాశినీ ।
వక్రనాసా తు దుఃఖాయ సంక్షిప్తాంగీ భయంకరీ ॥ 17 ॥

చిపిటా దుఃఖశోకాయ అనేత్రా నేత్రనాశినీ ।
దుఃఖదా హీనవక్త్రా తు పాణిపాదకృశా తథా ॥ 18 ॥

హీనాంగములతో భయంకరాకారము కలిగిన మూర్తులను నిర్మించినచో అది యజమానికే ఘాతము కలిగించును. అధికములైన అంగములతో నిర్మించిన శిల్పికి ప్రాణహానిని, కృశాంగము అర్థనాశనమును కలిగించును. కృశోదరము గల మూర్తి దుర్భిక్షమును, మాంసరహిత (పుష్టిగా లేని) మూర్తి ధననాశనమును కలిగించును. వక్రముగానున్న ముక్కు దుఃఖమునకు, సంక్షిప్తాంగములు భయమునకు హేతువులగును. చప్పగా నుండు ముక్కు దుఃఖమును, శోకమును, నేత్రరహితమైన మూర్తి నేత్రనాశనమును కలిగించును. హీనమైన వక్త్రము దుఃఖమును, కృశించిన పాదములు చేతులు కలదైనచో కూడ దుఃఖమును కలిగించును.

హీనాంగా హీనజంఘా చ భ్రమోన్మాదకరీ నృణామ్ ।
శుష్కవక్త్రా తు రాజానం కటిహీనా చ యా భవేత్ ॥ 19 ॥

పాణిపాదవిహీనో యో జాయతే మారకే మహాన్ ।
జంఘాజానువిహీనా చ శత్రుకల్యాణకారిణీ ॥ 20 ॥

ప్రతిమ హీనాంగము మరియు హీనజంఘములు కలదైనచో మానవులకు భ్రమోన్మాదాదులు కలిగించును. వక్త్రము శుష్కము కటిహీనమూ అయినచో రాజును వధించును. చేతులలో, పాదములలో లోపమున్నచో అధికమైన మారకముగా మారును. పిక్కలు మరియు మోకాళ్ళు సరిగా లేనట్టి విగ్రహము శత్రువులకు మంచి చేయును.

పుత్రమిత్రవినాశాయ హీనవక్షఃస్థలా తు యా ।
సంపూర్ణావయవా యా తు ఆయుర్లక్ష్మీప్రదా సదా ॥ 21 ॥

ఏవం లక్షణమాసాద్య కర్తవ్యః పరమేశ్వరః ।

వక్షఃస్థలమునందు లోపమున్న మూర్తి అది పుత్రులకు మిత్రులకు కూడ వినాశము కలిగించును. కాని అవయవములన్నియు సంపూర్ణముగా ఉండవలసిన రీతిలో నిర్మించిన మూర్తి ఆయుష్యమును ఐశ్వర్యమును

కూడ సమృద్ధిగా కలుగజేయును. కనుక ఇక్కడ వివరించినటువంటి లక్షణముల ననుసరించి పరమేశ్వరుని మూర్తిని సిద్ధము చేసుకోవలెను.

స్తూయమానః సురైః సర్వైః సమన్తాద్దర్శయేద్ భవమ్ ॥ 22 ॥

శక్రేణ నందినా చైవ మహాకాలేన శంకరమ్ ।
ప్రణతా లోకపాలాస్తు పార్శ్వే తు గణనాయకాః ॥ 23 ॥

నృత్యద్ భృంగిరిటిశ్చైవ భూతవేతాలసంవృతాః ।
సర్వే హృష్టాస్తు కర్తవ్యాః స్తువంతః పరమేశ్వరమ్ ॥ 24 ॥

అటు తర్వాత శివుని దేవతలందరిచేత స్తుతింపబడుచున్నట్లు, అన్ని వైపుల నుండి దర్శించుకొనునట్లు, ఇంద్రుడు, నంది, మహాకాలుడు, లోకపాలకుల చేత నమస్కరింపబడుచున్నట్టు చిత్రించాలి. శంకరుని రెండు వైపులయందు గణనాయకులుండాలి. ఇంకనూ భృంగిరిటి ఇత్యాదులు నృత్యము చేయుచున్నట్టుగానూ భూత, వేతాలాదులు ఆ పరమేశ్వరుని హర్షముతో స్తుతించుచున్నట్లుగానూ చూపవలెను.

గంధర్వవిద్యాధరకిన్నరాణామథాప్సరోగుహ్యకనాయకానామ్ ।
గణైరనేకైః శతశో మహేంద్రై మునిప్రవీరైరపి నమ్యమానమ్ ॥ 25 ॥

ధృతాక్షసూత్రై శతశః ప్రవాలపుష్పోపహారప్రచయం దదద్భిః ।
సంస్తూయమానం భగవంతమీడ్యం నేత్రత్రయేణామరమర్త్యపూజ్యమ్ ॥ 26 ॥

ఇంకనూ గంధర్వులు, విద్యాధరులు, కిన్నరులు, అప్సరసలు, గుహ్యకనాయకులు మొదలగు అనేక గణములతో మహేంద్రాదులతో, మునిశ్రేష్ఠులతో నమస్కరింపబడుచున్నట్టి, దేవతలచేత, మానవులచేత పూజింప బడుచున్నట్టి అక్షసూత్రములు, ప్రవాళములు, పుష్పములు, ఉపహారములను గూడ ధరించినట్టి, అందరిచేతనూ స్తుతింపబడుచున్నట్టి త్రినేత్రుడైన పరమేశ్వరమూర్తిని నిర్మించాలి.

ఇతి శ్రీ మాత్స్యేమహాపురాణే ప్రతిమా లక్షణే
ఏకోనషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥259॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ప్రతిమా లక్షణమనే
రెండువందల యాభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

షష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైయవ అధ్యాయం

ప్రతిమాలక్షణమ్ - ప్రతిమాలక్షణం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

అధునా సంప్రవక్ష్యామి అర్ధనారీశ్వరం పరమ్ ।
అర్ధేన దేవదేవస్య నారీరూపం సుశోభనమ్ ॥ 1 ॥

ఈశార్ధే తు జటాభాగే బాలేందుకలయా యుతః ।
ఉమార్ధే చాపి దాతవ్యౌ సీమంతతిలకావుభౌ ॥ 2 ॥

వాసుకిం దక్షిణే కర్ణే వామే కుండలమాదిశేత్ ।
బాలికా చోపరిష్టాత్తు కపాలం దక్షిణే కరే ॥ 3 ॥

త్రిశూలం వాఽపి కర్తవ్యం దేవదేవస్య శూలినః ।

ఇప్పుడు శ్రేష్ఠమైన అర్ధనారీశ్వరమూర్తిని గురించి వివరిస్తాను. దేవదేవుడైన పరమేశ్వరుని అర్ధభాగముతో ఏర్పడిన శోభాయమానమగు నారీరూపమిది. ఈ మూర్తియందు ఈశ్వరునికి చెందిన అర్ధభాగమున బాలచంద్రుని కళతో కూడిన జటాభాగము వుండాలి. రెండవ వైపుదైన ఉమార్ధమునందు సీమంతము మరియు తిలకము వుండాలి. కుడి చెవిని వాసుకితోను, ఎడమచెవిని కుండలముతో అలంకరించాలి. అట్లే పై భాగమున బాలికాముఖము, శివుని దక్షిణహస్తమునందు కపాలముకాని, త్రిశూలము కాని వుండవలెను.

వామతో దర్పణం దద్యాదుత్పలం చ విశేషతః ॥
వామబాహుశ్చ కర్తవ్యః కేయూరవలయాన్వితః ॥ 4 ॥

ఉపవీతం చ కర్తవ్యం మణిముక్తామయం తథా ॥ 5 ॥
స్తనభారం తథార్ధేఽవామే పీనం ప్రకల్పయేత్ ।

పరార్ధముజ్జ్వలం కుర్యాత్ శ్రోణ్యర్ధే తు తథైవ చ ॥ 6 ॥

వామహస్తమందు దర్పణమును లేదా కమలమును ఉంచవలెను. ఇంకనూ వామబాహువును కేయూరవలయములతో అలంకరించాలి. ముక్తామణిమయమైన యజ్ఞోపవీతము కూడ అలంకరింపచేయాలి. ఒక భాగమున భారమైన స్తనమును మరియొక భాగమున పీనమగు స్తనమును అమర్చవలెను. అట్లే ఎడమవైపున ఉజ్జ్వలమగు పరార్ధమును మరియు లావైన శ్రోణిని నిర్మింపచేయాలి.

లింగార్ధమూర్ధ్వగం కుర్వాత్ వ్యాలాజినకృతాంబరమ్ ।
వామే లంబపరీధానం కటిసూత్రత్రయాన్వితమ్ ॥ 7 ॥

నానారత్నసమోపేతం దక్షిణే భుజగాన్వితమ్ ।
దేవస్య దక్షిణం పాదం పద్మోపరి సుసంస్థితమ్ ॥ 8 ॥

కించిదూర్ధ్వం తథా వామం భూషితం నూపురేణ తు ।
రత్నైర్విభూషితాన్ కుర్యాత్ అంగులీష్వంగులీయకాన్ ॥ 9 ॥

సాలక్తకం తథా పాదం పార్వత్యా దర్శయేత్ సదా ।
అర్ధనారీశ్వరస్యేదం రూపమస్మిన్నుదాహృతమ్ ॥ 10 ॥

ఇంకనూ కుడివైపున ఊర్ధ్వముఖమగు లింగార్ధమును మరియు వ్యాఘ్రాజిన వస్త్రమును, వామభాగమునందు వ్రేలాడు కట్టువస్త్రమును, కటిసూత్రత్రయమును కూడ నిర్మింపచేయాలి. అక్కడే నానారత్నసమోపేతమైన హారముండగా దక్షిణమునందు భుజగమే హారముగానుంచాలి. దేవునియొక్క దక్షిణపాదము పద్మముపైన వుండునట్లు ఎడమ పాదము మాత్రము నూపురముతో అలంకృతమై వుండవలెను. వామహస్తపు అంగుళములు రత్నవిభూషితములైన అంగులీయకములతోను అట్లే పార్వతీదేవియొక్క పాదము లత్తుకరసముతోను అలంకరించబడి వుండాలి. ఈ విధంగా అర్ధనారీశ్వరమూర్తి యొక్క లక్షణములు ఉదాహరింపబడినవి.

ఉమామహేశ్వరస్యాపి లక్షణం శృణుత ద్విజాః ।
సంస్థానం తు తయోర్వక్ష్యే లీలాలలితవిభ్రమమ్ ॥ 11 ॥

చతుర్భుజం ద్విబాహుం వా జటాభారేందుభూషణమ్ ।
లోచనత్రయసంయుక్తం ఉమైకస్కంధపాణినమ్ ॥ 12 ॥

దక్షిణేనోత్పలం శూలం వామే కుచభరే కరమ్ ।
ద్వీపిచర్మపరీధానం నానారత్నోపశోభితమ్ ॥ 13 ॥

సుప్రతిష్ఠం సువేషం చ తథార్ధేందు కృతాననమ్ ।

ఓ ద్విజులారా! ఇప్పుడు ఉమామహేశ్వరుల ప్రతిమాలక్షణముల గురించి వినుడు. లీలాలలిత విభ్రమ యుక్తమగు ఆ పార్వతీపరమేశ్వరుల మూర్తి ఎట్లు ఉండవలెనో తెలిపెదను. పరమశివుడు నాలుగు లేదా రెండు భుజములు కలవాడై జటాభారమునందు చంద్రుని రేఖ కలవాడై మూడు నేత్రములు కలవాడై, పార్వతీదేవి యొక్క ఒక స్కంధముపై ఒక హస్తమును వుంచినట్టు వుండాలి. దక్షిణహస్తములలో కమలము మరియు శూలమును, వామహస్తముతో పార్వతీదేవి స్తనమును స్పృశించుచున్నట్లు వుండాలి. ఇంకనూ వ్యాఘ్రచర్మమునే వస్త్రముగా కలవాడై అనేకవిధ రత్నములచేత అలంకరింపబడినవాడై, స్వచ్ఛమైన వేషముతో, అర్ధచంద్రుని ధరించిన ముఖము కలవాడై వుండాలి.

వామే తు సంస్థితా దేవీ తస్యోరౌ బాహుగూహితా ॥ 14 ॥

శిరోభూషణసంయుక్తైః అలకైర్లలితాననా ।
సబాలికా కర్ణవతీ లలాటతిలకోజ్జ్వలా ॥ 15 ॥

మణికుండలసంయుక్తా కర్ణికాభరణా క్వచిత్ ।
హారకేయూరబహులా హరవక్త్రావలోకినీ ॥ 16 ॥

వామాంసం దేవదేవస్య స్పృశంతీ లీలయా తతః ।
దక్షిణం తు బహిః కృత్వా బాహుం దక్షిణతస్తథాః ॥ 17 ॥

స్కంధం వా దక్షిణే కుక్షౌ స్పృశంత్యంగులజైః క్వచిత్ ।
వామే తు దర్పణం దద్యాదుత్పలం వా సుశోభనమ్ ॥ 18 ॥

పరమశివుని ఎడమ తొడపై అధిష్ఠించియున్న దేవి ఆతని ఎడమబాహువుతో ఆలింగితురాలై ఉండాలి. శిరోభూషణములతో లలితములైన ముంగురులతో అలంకరింపబడిన ముఖము కలదై ఉండాలి. లలాటము ఉజ్జ్వలమైన తిలకము, చెవులకు ఆభరణములు, మణికుండలములు మరియు శరీరముపై హారకేయూరములు మొదలగునవన్నియును కలదై పరమేశ్వరుని ముఖమునే చూచుచున్నదై వుండవలెను. ఇంకను దేవదేవుని ఎడమభుజమును విలాసముగా స్పృశించుచు తన దక్షిణబాహువును కుడివైపున బయటకు వదిలి వుంచినట్లు వుండవలెను. కొన్ని విగ్రహములందు తన దక్షిణబాహువును శివుని స్కంధముపైగాని దక్షిణ హస్తముయొక్క వ్రేళ్ళతో ఆతనిని స్పృశించుచున్నట్లుగా గాని వుండును. అట్లే వామహస్తమునందు దర్పణమును గాని అందమైన కలువపువ్వును కాని ధరించి వుండును.

కటిసూత్రత్రయం చైవ నితంబే స్యాత్ ప్రలంబకమ్ ।
జయా చ విజయా చైవ కార్తికేయవినాయకౌ ॥ 19 ॥

పార్శ్వయోర్దర్శయేత్తత్ర తోరణే గణగుహ్యకాన్ ।
మాలా విద్యాధరాం స్తద్వద్వీణావానప్సరోగణః ॥ 20 ॥

ఏతద్రూపముమేశస్య కర్తవ్యం భూతిమిచ్ఛతా ।

అమ్మవారి నితంబముపై వరకు కటిసూత్రత్రయము వ్రేలాడుచుండవలెను. ఆమెకు రెండు వైపులయందు జయ విజయులు, కార్తికేయ వినాయకులు, గణాధిపతులు, గుహ్యకులు మొదలగు వారందరు వుండవలెను. అట్లే విద్యాధరుల సమూహము, వీణావాదనచేయు అప్సరోగణసమూహములు గూడ ఆమె ముందు వుండవలెను. ఈ విధముగా ఉమామహేశ్వరమూర్తిని శుభమునుకోరువారు నిర్మించుకొందురు.

శివనారాయణం వక్ష్యే సర్వపాపప్రణాశనమ్ ॥ 21 ॥

వామార్ధే మాధవం విద్యాద్దక్షిణే శూలపాణినమ్ ।
బాహుద్వయం చ కృష్ణస్య మణికేయూరభూషితమ్ ॥ 22 ॥

శంఖచక్రధరం శాన్తం ఆరక్తాంగులివిభ్రమమ్ ।
చక్రస్థానే గదాం వాపి పాణౌ దద్యాద్గదాభృతః ॥ 23 ॥

శంఖం చ వేతరే దద్యాత్ కట్యర్ధం భూషణోజ్జ్వలమ్ ।
పీతవస్త్రపరీధానం చరణం మణిభూషణమ్ ॥ 24 ॥

ఇప్పుడు సర్వపాపవినాశనకారియగు శివనారాయణమూర్తి గురించి వివరిస్తాను. శివనారాయణమూర్తికి వామార్ధమునందు మాధవుడు దక్షిణార్ధమునందు శూలపాణిని ఉంచాలి. కృష్ణుని నారాయణుని బాహుద్వయము

మణికేయూరములను కలిగి, హస్తద్వయమునందు శంఖచక్రములను కలవాడై వుండవలెను. శాంతస్వరూపుడై, అంగుళులు ఎర్రని వర్ణముతో అలంకరింపబడి వుండవలెను. కృష్ణుని హస్తమునందు ఒక్కొసారి చక్రమునకు బదులుగా గదయును ఉంచవచ్చును. ఇతరహస్తమునందు శంఖముకూడ ఉంచవచ్చును. భూషణములతో అలంకరింపబడిన కటిప్రదేశము కలవాడై, పీతాంబరధారియై, మణులు పొదిగిన పాదములు కలవాడై ఉండవలెను.

దక్షిణార్ధం జటాభారం అర్ధేందుకృతభూషణమ్ ।
భుజంగహారవలయం వరదం దక్షిణం కరమ్ ॥ 25 ॥

ద్వితీయం చాపి కుర్వీత త్రిశూలవరధారిణమ్ ।
వ్యాలోపవీత సంయుక్తం కట్యర్ధం కృత్తివాససమ్ ॥ 26 ॥

మణిరత్నైశ్చ సంయుక్త పాదం నాగవిభూషితమ్ ।
శివనారాయణస్యైవం కల్పయేద్రూపముత్తమమ్ ॥ 27 ॥

శివుడు దక్షిణార్ధమునందు జటాభారము, అర్ధచంద్రాలంకారభూషణము, భుజంగహారవలయము, వరమునిచ్చు దక్షిణహస్తము కలవాడై వుండాలి. సర్పమునే యజ్ఞోపవీతముగాను కటిపర్యంతము చర్మాంబరమును ధరించి, మణులు, రత్నములు, మొదలగు వాటిచేత అలంకరింపబడి, నాగవిభూషితములైన పాదములు కలవాడు అయి వుండాలి. ఈ విధముగా ఈ లక్షణములతో శ్రేష్ఠమైన శివనారాయణమూర్తిని నిర్మింపచేయాలి.

మహావరాహం వక్ష్యామి పద్మహస్తం గదాధరమ్ ।
తీక్ష్ణదంష్ట్రాగ్రఘోణాస్యం మేదినీవామకూర్పరమ్ ॥ 28 ॥

దంష్ట్రాగ్రేణోద్ధృతాం దాన్తాం ధరణీముత్పలాన్వితామ్ ।
విస్మయోత్ఫుల్లవదనాముపరిష్టాత్ ప్రకల్పయేత్ ॥ 29 ॥

దక్షిణం కటిసంస్థం తు కరం తస్యాః ప్రకల్పయేత్ ।
కూర్మోపరి తథా పాదమేకం నాగేంద్రమూర్ధని ॥ 30 ॥

సంస్తూయమానం లోకేశైః సమన్తాత్పరికల్పయేత్ ।

ఇప్పుడు మహావరాహమూర్తిని గురించి వివరిస్తాను. ఈ మహావరాహమూర్తి పద్మహస్తుడు, గదాధరుడు, తీక్ష్ణములైన దంష్ట్రములు, ఉగ్రమైన కోరలు కలిగిన ముఖముతో, ఎడమమోచేతిని భూదేవిపై నుంచి, భూమండలమును తన కోరలతో పైకి ఎత్తుచున్నట్టి వానిగా ఉంచవలెను. ఆ భూదేవత గూడ జితేంద్రియయై చేతులందు కలువపువ్వులు ధరించి, విస్మయముతో వికసించిన కన్నులతో వుండునట్లుగా నిర్మించవలెను. ఆమె దక్షిణహస్తము తన కటిపైన వుండునట్లుండవలెను. మరియు ఆ దేవునియొక్క పాదమొకటి కూర్మముపైనను ఇంకొక పాదము నాగేంద్రుడైన వాసుకితలపైన వుండునట్లు, లోకపాలకులందరి చేత స్తుతింసబడుచున్నట్లు వుండవలెను.

నారసింహం తు కర్తవ్యం భుజాష్టకసమన్వితమ్ ॥ 31 ॥

రౌద్రం సింహాననం తద్వత్ విదారితముఖేక్షణమ్ ।
స్తబ్ధపీటసటాకర్ణం దారయంతం దితేః సుతమ్ ॥ 32 ॥

వినిర్గతాం త్రజాలం చ దానవం పరికల్పయేత్ ।
వమంతం రుధిరం ఘోరం భ్రుకుటీవదనేక్షణమ్ ॥ 33 ॥

యుధ్యమానశ్చ కర్తవ్యః క్వచిత్కరణబంధనైః ।
పరిశ్రాంతేన దైత్యేన తర్జ్యమానో ముహుర్ముహుః ॥ 34 ॥

దైత్యం ప్రదర్శయేత్తత్ర ఖడ్గఖేటకధారిణమ్ ।
స్తూయమానం తథా విష్ణుం దర్శయేదమరాధిపైః ॥ 35 ॥

నరసింహమూర్తి లక్షణమిట్లుండును. ఆ మూర్తి అష్టభుజములు కలిగి, రౌద్రాకారముతో, సింహపుముఖమున, విప్పారిన దృష్టి కలవాడై, స్తబ్దముగా దృఢముగా నుండు జూలుతో కప్పబడిన కర్ణములు కలవాడై, దితిపుత్రుడైన హిరణ్యకశిపుని చీల్చుచున్నట్టు వుండవలెను. ఆ దానవుని ప్రేగులను బయటకు తీయుచున్నట్టు, రక్తమును కక్కుచున్నట్టు, కనుబొమ్మలతో భయంకరమయిన చూపులు కలవానిగా నరసింహమూర్తి వుండవలెను. ఇంకనూ కొన్నిచోట్ల కరణబంధనముతో యుద్ధము చేయుచున్నట్టుగా కూడ వుంచవచ్చును. అలసిపోయి ఖడ్గము మరియు ఖేటకము ఇత్యాది ఆయుధములు ధరించిన దైత్యుని బెదిరించుచున్నట్లు వుంచవచ్చును. ఆ విష్ణుమూర్తి అమరాధిపులచేత స్తుతింపబడుచున్నట్టు వుంచవలెను.

తథా త్రివిక్రమం వక్ష్యే బ్రహ్మాండక్రమణోల్బణమ్ ।
పాదపార్శ్వే తథా బాహుముపరిష్టాత్ ప్రకల్పయేత్ ॥ 36 ॥

అధస్తాద్వామనం తద్వత్ కల్పయేత్సకమణ్డలుమ్ ।
దక్షిణే ఛత్రికాం దద్యాత్ ముఖం దీనం ప్రకల్పయేత్ ॥ 37 ॥

శృంగారధారిణం తద్వత్ బలిం తస్య చ పార్శ్వతః ।
బంధనం చాస్య కుర్వన్తః గరుడం తస్య దర్శయేత్ ॥ 38 ॥

అలాగే త్రివిక్రమమూర్తి (వామన) లక్షణములు చెబుతాను. త్రివిక్రమమూర్తి బ్రహ్మాండాదులను ఆక్రమించు తీవ్రమైన రూపము కలవాడై వుండును. ఎత్తిన తన పాదమును తన బాహువుతోడనే పట్టుకొని యుండును. అట్లే క్రిందిభాగమున వామహస్తము చేత కమండలము ధరించినట్టు యుండును. దక్షిణ హస్తమునందు గొడుగును ధరించి వుండును. ముఖము దీనముగా వుండును. ఆతని ప్రక్కన శృంగమును ధరించిన బలి యుండవలెను, వామనుడు బలిని బంధించుచున్నట్లుగా వుండవలెను. ఆతని ముందు గరుడుని కూడ కల్పించవలెను.

మత్స్యరూపం తథా మత్స్యం కూర్మం కూర్మాకృతిం న్యసేత్ ।
ఏవం రూపస్తు భగవాన్ కార్యో నారాయణో హరిః ॥ 39 ॥

మరియు మత్స్యుని మత్స్యరూపములోను, కూర్మదేవుని కూర్మరూపమునందుండునట్లు నిర్మించాలి. ఇట్లు భగవానుడైన ఆ నారాయణుడు ఏ అవతారమునందు ఎట్టి రూపము ధరించెనో ఆ రూపమును కల్పించవలెను.

బ్రహ్మా కమండలుధరః కర్తవ్యః స చతుర్ముఖః ।
హంసారూఢః క్వచిత్కార్యః క్వచిచ్చ కమలాసనః ॥ 40 ॥

వర్ణతః పద్మగర్భాభః చతుర్బాహుః శుభేక్షణః ।
కమండలుం వామకరే స్రువం హస్తే తు దక్షిణే ॥ 41 ॥

వామే దండధరం తద్వత్ స్రువం చాపి ప్రదర్శయేత్ ।
మునిభిర్దేవగంధర్వైః స్తూయమానం సమన్తతః ॥ 42 ॥

కుర్వాణమివ లోకాన్ త్రీన్ శుక్లాంబరధరం విభుమ్ ।
మృగచర్మధరం చాపి దివ్యయజ్ఞోపవీతినమ్ ॥ 43 ॥

ఆజ్యస్థాలీం న్యసేత్ పార్శ్వే వేదాంశ్చ చతురః పునః ।
వామపార్శ్వేఽ స్య సావిత్రీం దక్షిణే చ సరస్వతీమ్ ॥ 44 ॥

అగ్రే చ ఋషయస్తద్వత్ కార్యాః పైతామహే పదే ।

ఇప్పుడు బ్రహ్మదేవునిమూర్తి గురించి వివరిస్తాను. చతుర్ముఖుడైన బ్రహ్మ కమండలమును ధరించి వుండాలి. ఒక్కొసారి హంసవాహనమును ఒక్కొసారి కమలాసనమును అధిష్ఠించినవాడై వుండాలి. పద్మము యొక్క లోపలిభాగపు వర్ణము కలవాడై, చతుర్బాహుడై మరియు శుభేక్షణుడై వుండాలి. వామహస్తము కమండలమును దక్షిణహస్తమున స్రువమును, ఇంకొక వామహస్తము నందు దండమును మరియొక దక్షిణహస్తమున స్రుక్కును ధరించి వుండాలి. ఇంకనూ మునులు, దేవతలు, గంధర్వులు మొదలగువారిచే స్తుతింపబడుచున్నట్లు, లోకములను సృష్టించుచున్నట్లు వుంచాలి. శుక్లాంబరధారిగా గాని లేదా మృగచర్మధారిగా గాని వుంచాలి. దివ్యమైన యజ్ఞోపవీతము కలిగి వుండాలి. ఆ దేవుని ప్రక్కన ఘృతపాత్రము, ముందు వైపున నాలుగు వేదములు వుంచాలి. ఇంకనూ ఎడమవైపున సావిత్రీ, దక్షిణమువైపున సరస్వతీదేవి, ముందువైపున ఋషులు వుండాలి. పితామహుడైన బ్రహ్మదేవుని మూర్తి ఇట్లుండును.

కార్తికేయం ప్రవక్ష్యామి తరుణాదిత్యసప్రభమ్ ॥ 45 ॥

కమలోదరవర్ణాభం కుమారం సుకుమారకమ్ ।
దండకైశ్చరకైర్యుక్తం మయూరవరవాహనమ్ ॥ 46 ॥

స్థాపయేత్ స్వేష్టనగరే భుజాన్ ద్వాదశ కారయేత్ ।
చతుర్భుజః ఖర్వటే స్యాత్ వనే గ్రామే ద్విబాహుకః ॥ 47 ॥

ఇప్పుడు ఉదయించిన సూర్యునితో సమానమైన కాంతిగలిగిన కార్తికేయుని గురించి వివరిస్తాను. కమలములోని లోపలిభాగపు వర్ణము కలవాడు, సుకుమారస్వరూపుడు అయిన కుమారస్వామి ఒక చేతియందు దండమును మరియు మరియొక చేతియందు మృగచర్మమును కలిగి, శ్రేష్ఠమైన మయూరవాహనము కలవాడుగా వుండాలి. స్వాభీష్టమైన నగరమందుండు అతడు ద్వాదశభుజములు కలిగి వుండాలి. గూడెమునందున్నట్లు

నిర్మించినచో కుమారస్వామిని చతుర్భుజుడుగానూ, వనమందు కాని, గ్రామమునందు కాని వున్నట్లు నిర్మించినచో బాహుద్వయముతోను వుంచాలి.

శక్తిః పాశస్తథా ఖడ్గః శరః శూలం తథైవ చ ।
వరదశ్చైకహస్తఃస్యాత్ అథ చాభయదో భవేత్ ॥ 48 ॥

ఏతే దక్షిణతో జ్ఞేయాః కేయూరకటకోజ్జ్వలాః ।
ధనుఃపతాకాముష్టిశ్చ తర్జనీ తు ప్రసారితా ॥ 49 ॥

ఖేటకం తామ్రచూడం చ వామహస్తే తు శస్యతే ।
ద్విభుజస్య కరే శక్తిః వామే స్యాత్ కుక్కుటోపరి ॥ 50 ॥

చతుర్భుజే శక్తిపాశౌ వామతో దక్షిణే త్వసిః ।
వరదోఽభయదో వాపి దక్షిణః స్యాత్తురీయకః ॥ 51 ॥

మరియు శక్తి, పాశము, ఖడ్గము, శరము, శూలము, వరదహస్తము లేదా అభయహస్తము ఇత్యాదులన్నియు దక్షిణము వైపున వుండాలి. అట్లే కేయూరములు కడియములు కూడ వుండాలి. ధనుష్యము, పతాకము, పిడికిలి, చాచినట్టి చూపుడువ్రేలు, ఖేటకము, తామ్రచూడము ఇత్యాదులన్ని వామహస్తములందుండుట ప్రశస్తములు. ద్విభుజుడైనచో దక్షిణహస్తమునందు శక్తి వామహస్తమునందు కోడిపుంజు వుండాలి. చతుర్భుజుడైనచో వామహస్తములందు శక్తి మరియు పాశములను, దక్షిణహస్తములందు వరదహస్తము లేదా అభయహస్తముండవలెను. కుమారస్వామి ఉత్తరీయము కూడ కలవాడై వుండాలి.

వినాయకం ప్రవక్ష్యామి గజవక్త్రం త్రిలోచనమ్ ।
లంబోదరం చతుర్బాహుం వ్యాలయజ్ఞోపవీతినమ్ ॥ 52 ॥

ధ్వస్తకర్ణం బృహత్తుండమేకదంష్ట్రం పృథూదరమ్ ।
స్వదన్తం దక్షిణకరే ఉత్పలం చాపరే తథా ॥ 53 ॥

మోదకం పరశుం చైవ వామతః పరికల్పయేత్ ।
బృహత్త్వాత్ క్షిప్తవదనం పీనస్కంధాంఘ్రిపాణికమ్ ॥ 54 ॥

యుక్తం తు బుద్ధిబుద్ధిభ్యామధస్తాన్మూషికాన్వితమ్ ।

ఇక ఇప్పుడు వినాయకుని ప్రతిమ గురించి చెబుతాను. వినాయకుడు గజముఖుడు, త్రిలోచనుడు, లంబోదరుడు, నాలుగుభుజములు కలవాడు, పొడవైన తొండము మరియు ఏకదంతమును కలవాడు, ఎత్తైన పొట్టకలవాడుగా వుండును. ఆతని యొక్క ఒక కుడిచేతియందు తన దంతమును, రెండవచేతి యందు కలువపువ్వును, ఒక ఎడమచేతియందు మోదకమును, రెండవదానియందు గొడ్డలిని ధరించి వుండును. బృహత్కాయము కలవాడు అగుట వలన ముఖము చిన్నదిగా కనబడును. బలిష్ఠములైన భుజములు, పాదములు, చేతులు కలవాడు. మరియు బుద్ధి, సిద్ధియను భార్యలు ప్రక్కన కలవాడు ముందు భాగమున మూషికవాహనముతో నుండును.

కాత్యాయన్యాః ప్రవక్ష్యామి రూపం దశభుజం తథా ॥ 55 ॥

త్రయాణామపి దేవానామనుకారానుకారిణీమ్ ।
జటాజూటసమాయుక్తాం అర్ధేందుకృతశేఖరామ్ ॥ 56 ॥

లోచనత్రయసంయుక్తాం పూర్ణేందుసదృశాననామ్ ।
అతసీపుష్పవర్ణాభాం సుప్రతిష్ఠాం సులోచనామ్ ॥ 57 ॥

నవయౌవనసంపన్నాం సర్వాభరణభూషితామ్ ।
సుచారుదశనాం తద్వత్ పీనోన్నతపయోధరామ్ ॥ 58 ॥

ఇప్పుడు కాత్యాయనీ స్వరూపమును నిర్వచించెదను. ఆ దేవి దశభుజములు కలది. ఆమె యందు బ్రహ్మ–విష్ణు–రుద్ర అను త్రిమూర్తుల లక్షణములుండును. తలపై జటాజూటము, శిరస్సుయందు అర్ధచంద్రుడు, మూడు నేత్రములు, పూర్ణచంద్రునితో సమానమైన ముఖము, అవిసిపుష్పము వంటి శరీరచ్ఛాయతో, చక్కని నేత్రములు కలిగి, నూతనమైన యౌవనముతో, అనేకాభరణములతో అలంకృతయై, అందమైన పలువరసతో, దృఢములు, ఉన్నతములైన స్తనములను కలిగి వుండును.

త్రిభంగస్థానసంస్థానాం మహిషాసురమర్దినీమ్ ।
త్రిశూలం దక్షిణే దద్యాత్ ఖడ్గం చక్రం తథైవ చ ॥ 59 ॥

తీక్ష్ణబాణం తథా శక్తిం వామతోఽపి నిబోధత ।
ఖేటకం పూర్ణచాపం చ పాశమంకుశమేవ చ ॥ 60 ॥

ఘంటాం వా పరశుం వాపి వామతః సన్నివేశయేత్ ।
అధస్తాన్మహిషం తద్వత్ ద్విశిరస్కం ప్రదర్శయేత్ ॥ 61 ॥

శిరశ్ఛేదోద్భవం తద్వద్దానవం ఖడ్గపాణినమ్ ।
హృది శూలేన నిర్భిన్నం తిర్యగ్రక్త విభూషితమ్ ॥ 62 ॥

ఇంకను త్రిభంగభంగిమలో, మహిషాసురుని మర్దించుచు, కుడి చేతులలో త్రిశూలము, ఖడ్గము, చక్రము, తీక్ష్ణమైన బాణము, శక్తి మొదలగు ఆయుధములును, ఎడమచేతులలో ఖేటకము, పూర్ణచాపము, పాశము, అంకుశము మొదలగునవి కాని ఘంటము, పరశువు మొదలగునవి కాని వుండును. ఆమెకు క్రిందిభాగమున రెండు శిరస్సులు కల మహిషము, శిరస్సు ఛేదింపబడిన మరియు చేతియందు ఖడ్గము కలిగిన దానవుడు వుండును. వాని హృదయమునందు శూలము గ్రుచ్చబడి. భయంకరమైన రక్తము స్రవించుచున్నవానిగా గూడా వుండును.

రక్తరక్తీకృతాంగం చ రక్తవిస్ఫారితేక్షణమ్ ।
వేష్టితం నాగపాశేన భృకుటీభీషణాననమ్ ॥ 63 ॥

సపాశవామహస్తేన ధృతకేశం చ దుర్గయా ।
వమద్రుధిరవక్త్రం చ దేవ్యాః సింహం ప్రదర్శయేత్ ॥ 64 ॥

దేవ్యాస్తు దక్షిణం పాదం సమం సింహోపరి స్థితమ్ ।
కించిదూర్ధ్వం తథా వామమంగుష్ఠం మహిషోపరి ॥ 65 ॥

స్తూయమానం చ తద్రూపం అమరైః సన్నివేశయేత్ ।

ఆ దానవుని శరీరావయవములన్నియు నెత్తుటితో ఎర్రగా మెరియుచుండును. అతడు ఎర్రని విస్ఫారితములైన నేత్రములతో, నాగ పాశవేష్ఠితుడై, వంకరగా నున్న కనుబొమ్మలతో భీషణమైన ముఖము కలవానిగా వుండును. అంతేకాక రక్తము క్రక్కుచున్న సింహమును కూడ నిర్మించవలెను. దేవియొక్క దక్షిణపాదము ఆ సింహముపై వుంచాలి. వామపాదము కొంచెము పైకెత్తి దాని బొటనవ్రేలు మహిషముపై వుండును. అట్టి ఆ కాత్యాయనీ రూపము అమరలందరూ స్తుతించుచున్నట్లుండవలెను.

ఇదానీం సురరాజస్య రూపం వక్ష్యే విశేషతః ॥ 66 ॥

సహస్రనయనం దేవం మత్తవారణసంస్థితమ్ ।
పృథూరువక్షోవదనం సింహస్కంధం మహాభుజమ్ ॥ 67 ॥

కిరీటకుండలధరం పీవరోరుభుజేక్షణమ్ ।
వజ్రోత్పలధరం తద్వన్నానా భరణభూషితమ్ ॥ 68 ॥

పూజితం దేవగంధర్వైః అప్సరోగణసేవితమ్ ।
ఛత్రచామరధారిణ్యః స్త్రియః పార్శ్వే ప్రదర్శయేత్ ॥ 69 ॥

సింహాసనగతం చాపి గంధర్వగణసంయుతమ్ ।
ఇంద్రాణీం వామతశ్చాస్య కుర్యాదుత్పలధారిణీమ్ ॥ 70 ॥

ఇప్పుడు సురరాజైన ఇంద్రుని రూపమును గూర్చి తెలిపెదను. ఇంద్రుడు సహస్రనేత్రుడు, మదించిన ఐరావతమునధిష్ఠించి యుండును. విశాలమైన వక్షఃస్థలము మరియు వదనము కలవాడై, సింహమువంటి బలమైన మూపులు కలిగి వుండును. మహాభుజుడు, కిరీటము మరియు కుండలములను ధరించి, దృఢమైన భుజములతోను, విశాలమైన నేత్రములతోను వుండి, వజ్రాయుధమును, కలువను చేతులతో ధరించి వుండును. అనేక ఆభరణములచేత అలంకరింపబడి, దేవతలు, గంధర్వులు, అప్సరసలు మొదలగువారిచే ఎల్లప్పుడు సేవింపబడుచుండును. ఆతనికి రెండువైపుల ఛత్రచామరాదులు ధరించిన స్త్రీపరిచారికులు వుండవలెను. సింహాసనమును అధిష్ఠించి యుండు, గంధర్వగణములతో సేవించు, వామభాగమున కలువపువ్వును ధరించినట్టి శచీదేవిని కలవాడై వుండవలెను. ఇట్టి విశేషములు కలిగిన ఇంద్రు మూర్తిని నిర్మించినచో శుభము కలుగును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రతిమా లక్షణే షష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥260॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ప్రతిమా లక్షణమనే అనే రెండువందల అరవైయవ అధ్యాయం సమాప్తం

ఏకషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైఒకటవ అధ్యాయం

దేవతార్చానుకీర్తనే ప్రతిమాలక్షణమ్ - దేవతార్చానుకీర్తనే ప్రతిమాలక్షణం

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

ప్రభాకరస్య ప్రతిమామిదానీం శృణుత ద్విజాః ।
రథస్థం కారయేద్దేవం పద్మహస్తం సులోచనమ్ ॥ 1 ॥

సప్తాశ్వం చైకచక్రం చ రథం తస్య ప్రకల్పయేత్ ।
ముకుటేన విచిత్రేణ పద్మగర్భసమప్రభమ్ ॥ 2 ॥

నానాభరణభూషాభ్యాం భుజాభ్యాం ధృతపుష్కరమ్ ।
స్కంధస్థే పుష్కరేతే తు లీలయైవ ధృతే సదా ॥ 3 ॥

చోలకచ్ఛత్రవపుషం క్వచిచ్చిత్రేషు దర్శయేత్ ।
వస్త్రయుగ్మసమోపేతం చరణౌ తేజసా వృతౌ ॥ 4 ॥

ఓ ద్విజులారా! ఇపుడు సూర్యదేవుని ప్రతిమను గురించి వివరిస్తాను. వినుదు! ఈ దేవుడు పద్మహస్తుడు, సులోచనుడు. ఇతడు సప్తాశ్వములు కలిగిన ఏకచక్రరథమును అధిష్ఠించినట్లు వుండాలి. విచిత్రమైన ముకుటమును ధరించి, పద్మగర్భసమానమైన చ్ఛాయతో, అనేక విధములైన ఆభరణములచేత అలంకరింపబడి హస్తములయందు కలువలను ధరించినవాడుగా వుండును. భుజములపైన కూడ కలువలను ధరించినవాడుగా వుండును. చొక్కా ధరించినవాడుగా కూడ కొన్ని చిత్రములందు కనబడును. వస్త్రయుగ్మమును ధరించి ప్రకాశించు పాదములు గలవానిగా చిత్రించవచ్చును.

ప్రతీహారౌ చ కర్తవ్యౌ పార్శ్వయోర్దండిపింగలౌ ।
కర్తవ్యౌ ఖడ్గహస్తౌ తౌ పార్శ్వయోః పురుషావుభౌ ॥ 5 ॥

లేఖనీ కృతహస్తం చ పార్శ్వే ధాతారమవ్యయమ్ ।
నానాదేవగణైర్యుక్తం ఏవం కుర్యాద్దివాకరమ్ ॥ 6 ॥

అరుణః సారథిశ్చాస్య పద్మినీపత్రసన్నిభః ।
అశ్వౌ సువలయగ్రీవా వన్తస్థౌ తస్య పార్శ్వయోః ॥ 7 ॥

భుజంగరజ్జుభిర్బద్ధాః సప్తాశ్వా రశ్మిసంయుతాః ।
పద్మస్థం వాహనస్థం వా పద్మహస్తం ప్రకల్పయేత్ ॥ 8 ॥

ఆతనిని ఇరు ప్రక్కలయందు దండి, పింగళ అను పురుషప్రతీహారులుండాలి. వారిద్దరి హస్తములందు ఖడ్గములుండాలి. సూర్యదేవునికి ఒక ప్రక్కన చేతితో లేఖినిని ధరించిన బ్రహ్మదేవుడు వుండాలి. అనేక

వివిధ దేవతాసమూహములు ఈ సూర్యభగవానుని స్తుతించుచుందురు. ఈతనికి పద్మినీపత్రము వంటి శరీరచ్ఛాయ కలిగిన 'అరుణుడు' అను రథసారథి, రెండు పార్శ్వములయందు ఏడు ఆశ్వములుండాలి. అవి సర్పములత్రాడుతో బంధింపబడి కిరణములతో ప్రకాశించుచున్నట్టు వుండాలి. అవి ఎల్లప్పుడూ మెడలు ముందుకు చాచినవై పరుగెత్తుటకు సిద్ధముగా వున్నట్టు ఉండాలి. పద్మహస్తుడైన సూర్యభగవానుడు పద్మముపై గాని, రథమునందు అధిష్ఠించియున్నట్లు గాని నిర్మించవలెను.

వహ్నేస్తు లక్షణం వక్ష్యే సర్వకామఫలప్రదమ్ ।
దీప్తం సువర్ణవపుషం అర్ధచంద్రాసనే స్థితమ్ ॥ 9 ॥

బాలార్కసదృశం తస్య వదనం చాపి దర్శయేత్ ।
యజ్ఞోపవీతినం దేవం లంబకూర్చధరం తథా ॥ 10 ॥

కమండలుం వామకరే దక్షిణే త్వక్షసూత్రకమ్ ।
జ్వాలావితానసంయుక్తం అజవాహనముజ్జ్వలమ్ ॥ 11 ॥

కుండస్థం వాపి కుర్వీత మూర్ధ్ని సప్తశిఖాన్వితమ్ ।

ఇపుడు సర్వకామఫలప్రదుడగు అగ్నిదేవుని లక్షణమును వివరిస్తాను. ప్రకాశించు బంగారము వంటి వర్ణముతోను, అర్ధచంద్రాసనమునందు, ఉదయించు సూర్యుని కాంతితో, యజ్ఞోపవీతమును మరియు పొడవైన కూర్చమును కలిగినవాడై, వామహస్తము నందు కమండలమును, దక్షిణహస్తమునందు అక్షసూత్రమును కలిగి వుండాలి. జ్వాలాసమూహములతో కూడుకొని, ఉజ్జ్వలమైన 'మేక' ను వాహనముగా కలిగి సతతము హోమ కుండమునకు ముందున్నట్లు మరియు తలపై సప్తజ్వాలలు కలిగి వుండవలెను. ఇటువంటి లక్షణములతో అగ్నిదేవుని నిర్మించవలెను.

తథా యమం ప్రవక్ష్యామి దండపాశధరం విభుమ్ ॥ 12 ॥

మహామహిషమారూఢం కృష్ణాంజనచయోపమమ్ ।
సింహాసనగతం చాపి దీప్తాగ్నిసమలోచనమ్ ॥ 13 ॥

మహిషశ్చిత్రగుప్తశ్చ కరాలః కింకరాస్తథా ।
సమన్తాద్దర్శయేత్తస్య సౌమ్యా సౌమ్యాన్సురాసురాన్ ॥ 14 ॥

ఇపుడు యమధర్మరాజ ప్రతిమను గురించి చెబుతాను. యముడు దండపాశధరుడు, మహామహిషమును అధిరోహించి వుండును. నల్లని కాటుకరాశివంటి ఛాయకలవాడై సింహాసనమును అధిష్ఠించినట్లు వుంచాలి. జ్వలించు అగ్నివంటి కన్నులు కలిగి వుండాలి. ఆతనికి అన్ని వైపులందును మహిషము, చిత్రగుప్తుడు, భయంకరరూపము గల కింకరులు సౌమ్యస్వరూపులైన అసురులు కూడ వుందురు.

రాక్షసేంద్రం తథా వక్ష్యే లోకపాలం చ నైఋతమ్ ।
నరారూఢం మహామాయం రక్షోభిర్బహుభిర్వృతమ్ ॥ 15 ॥

ఖడ్గహస్తం మహానీలం కజ్జలాచలసన్నిభమ్ ।
నరయుక్తవిమానస్థం పీతాంభరణభూషితమ్ ॥ 16 ॥

ఇపుడు నిఋృతి గురించి వివరిస్తాను. ఇతడు రాక్షసేంద్రుడు, లోకపాలకుడు, నరుడే వాహనముగా కలిగినవాడు, మహామాయాది అనేక రాక్షసులతో సమావృతుడై చేతియందు ఖడ్గము కలిగిన మహానీలుడు. ఇతడు కాటుక పర్వతము వంటివాడు, నరయుక్త విమానమునందుండువాడు, పచ్చని ఆభరణములతో అలంకృతుడై యుండువాడు.

వరుణం చ ప్రవక్ష్యామి పాశహస్తం మహాబలమ్ ।
శంఖస్ఫటికవర్ణాభం సితహారాంబరావృతమ్ ॥ 17 ॥

ఝషాసనగతం శాంతం కిరీటాంగదధారిణమ్ ।

వరుణుని గురించి తెలిపెదను. వరుణుడు పాశహస్తుడు, మహాబలవంతుడు, శంఖము మరియు స్ఫటికము వంటి వర్ణము కలవాడు, తెల్లని హారములతో వస్త్రములతో అలంకరింపబడినవాడు. మత్స్యమును ఆసనముగా గలవాడు, శాంతస్వరూపుడు, కిరీటము, భుజకీర్తులు మొదలగునవి ధరించినవాడుగా వుండును.

వాయురూపం ప్రవక్ష్యామి ధూమ్రం తు మృగవాహనమ్ ॥ 18 ॥
చిత్రాంబరధరం శాన్తం యువానం కుంచితభ్రువమ్ ।

మృగాధిరూఢం వరదం పతాకాధ్వజసంయుతమ్ ॥ 19 ॥

ఇప్పుడు వాయురూపమును తెలిపెదను. వాయుదేవుడు ధూమ్రవర్ణుడు, మృగవాహనుడు, చిత్రమైన వస్త్రమును ధరించినవాడు, శాంతుడు, యువకుడు, వక్రముగానున్న కనుబొమ్మలు కలవాడు, మృగమును అధిరోహించి వుండువాడు, వరదుడు, పతాకములు, ధ్వజములను కలవాడుగా వుండవలెను.

కుబేరం చ ప్రవక్ష్యామి కుండలాభ్యామలంకృతమ్ ।
మహోదరం మహాకాయం నిధ్యష్టకసమన్వితమ్ ॥ 20 ॥

గుహ్యకైర్బహుభిర్యుక్తం ధనవ్యయకరైస్తథా ।
హారకేయూరరచితం సితాంబరధరం సదా ॥ 21 ॥

గదాధరం చ కర్తవ్యం వరదం ముకుటాన్వితమ్ ।
నరయుక్తవిమానస్థం ఏవం రీత్యా చ కారయేత్ ॥ 22 ॥

ఇప్పుడు కుబేరస్వరూపమును తెలిపెదను. కుండలములను ధరించినవాడు, మహోదరుడు, మహాకాయుడు, అష్టవిధనిధులు కలిగినవాడు, గుహ్యకులచే కూడుకొనియున్నవాడు, ధనమును వ్యయము చేయువారిచేత కొలువబడువాడు, హారకేయూరాదులచేత అలంకరింపబడినవాడు, తెల్లని వస్త్రములను ధరించినవాడు, గదాధరుడు, వరదుడు, ముకుటము కలిగినవాడు, నరయుక్త విమానస్థుడు. కుబేరుని ప్రతిమను చేయునపుడు ఈ లక్షణములను గమనించవలెను.

తథైవేశం ప్రవక్ష్యామి ధవలం ధవలేక్షణమ్ ।
త్రిశూలపాణినం దేవం త్ర్యక్షం వృషగతం ప్రభుమ్ ॥ 23 ॥

అట్లే ఈశానుని స్వరూపమును గూడ తెలిపెదను. ఈశానుడు తెల్లనివాడు, తెల్లని కన్నులు కలవాడు, చేతిలో త్రిశూలము కలవాడు, త్రిలోచనుడు, వృషభము వాహనముగా కలవాడైన దేవుడు అని గమనించవలెను.

మాతౄణాం లక్షణం వక్ష్యే యథావదనుపూర్వశః ।
బ్రహ్మాణీ బ్రహ్మసదృశీ చతుర్వక్త్రా చతుర్భుజా ॥ 24 ॥

హంసాధిరూఢా కర్తవ్యా సాక్షసూత్రకమండలుః ।
మహేశ్వరస్య రూపేణ తథా మాహేశ్వరీ మతా ॥ 25 ॥

జటాముకుటసంయుక్తా వృషస్థా చంద్రశేఖరా ।
కపాలశూలఖట్వాంగవరదాఢ్యా చతుర్భుజా ॥ 26 ॥

ఇప్పుడు నామానుపూర్వముననుసరించి మాతృకల లక్షణమును తెలిపెదను. వారిలో "బ్రహ్మాణీ" బ్రహ్మవలె వుండును నాలుగు ముఖములు నాలుగు భుజములు కలిగి, హంసవాహనమును అధిరోహించియుండును. అక్షసూత్రము, కమండలమును ధరించి యుండును. ఇక "మాహేశ్వరీ" మహేశ్వరుని వలె వుండును. ఆమె జటాముకుటాదులతో అలంకరింపబడి, వృషభవాహనమునధిరోహించి యుండును, తలపై చంద్రుని కలిగి కపాలము, శూలము, ఖట్వాంగము మొదలగువాటిని ధరించి వుండును. ఆమె వరదహస్తురాలుగానూ చతుర్భుజములు కలదిగానూ వుండవచ్చును.

కుమారరూపా కౌమారీ మయూరవరవాహనా ।
రక్తవస్త్రధరా తద్వచ్ఛూలశక్తిధరా మతా ॥ 27 ॥

హారకేయూరసంపన్నా కృకవాకుధరా తథా ।
వైష్ణవీ విష్ణుసదృశీ గరుడే సముపస్థితా ॥ 28 ॥

చతుర్బాహుశ్చ వరదా శంఖచక్రగదాధరా ।
సింహాసనగతా వాపి బాలకేన సమన్వితా ॥ 29 ॥

"కౌమారీ" కుమారస్వామి రూపముతో నుండును. శ్రేష్ఠమైన మయూరమును వాహనముగా కలిగి ఉండును. రక్తవర్ణవస్త్రమును ధరించును, శూలము, శక్తి ఇత్యాది ఆయుధములను ధరించును. హారకేయూరాది ఆభరణములతో అలంకరింపబడి, చేతితో కుక్కుటము ధరించి ఉండును. ఇక "వైష్ణవి" విష్ణువు వలె ఉండును. గరుడవాహనమును అధిరోహించినదై ఉండును, చతుర్బాహువులు కలదై శంఖ, చక్రగదాదులను కూడ కలిగినదై వరదహస్తముతో ఉండును. సింహాసనము అధిరోహించి ఉన్నదైనప్పటికిని బాలకునితో పాటు కనబడును.

వారాహీం చ ప్రవక్ష్యామి మహిషోపరిసంస్థితామ్ ।
వరాహసదృశీ దేవీ శిరశ్చామరధారిణీ ॥ 30 ॥

గదాచక్రధరా తద్వద్దానవేంద్రవినాశినీ ।
ఇంద్రాణీమింద్రసదృశీం వజ్రశూలగదాధరామ్ ॥ 31 ॥

గజాసనగతాం దేవీం లోచనైర్బహుభిర్వృతామ్ ।
తప్తకాంచనవర్ణాభాం దివ్యాభరణభూషితామ్ ॥ 32 ॥

"వారాహీ" వరాహసమానరూపము కలది, ఆమెను గురించి చెప్పెదను. మహిషముపై కూర్చుని యుండునది, శరము, చామరము, గద, చక్రము మొదలగువాటిని ధరించినది, దానవేంద్రులను వినాశము చేయుచుండును. ఇక "ఇంద్రాణీ " గురించి చెప్పెదను. ఈమె ఇంద్రుని బోలియుండును, వజ్రాయుధము, శూలము, గద ఇత్యాదులను ధరించి యుండును. ఈమె గజమే ఆసనముగా అధిరోహించి వుండును. అనేకములైన నేత్రములుండును. తప్తమైన బంగారము వంటి కాంతితో ప్రకాశించును. దివ్యమైన ఆభరణములచేత అలంకరింపబడి వుండును.

తీక్ష్ణ ఖడ్గధరాం తద్వత్ వక్ష్యే యోగీశ్వరీమిమామ్ ।
దీర్ఘజిహ్వామూర్ధ్వకేశీం అస్థిఖండైశ్చ మండితామ్ ॥ 33 ॥

దంష్ట్రాకరాలవదనాం కుర్యాచ్చైవ కృశోదరీమ్ ।
కపాలమాలినీం దేవీం ముండమాలా విభూషితామ్ ॥ 34 ॥

కపాలం వామహస్తే తు మాంసశోణితపూరితమ్ ।
మస్తిష్కాక్తం చ బిభ్రాణాం శక్తికాం దక్షిణే కరే ॥ 35 ॥

గృధ్రస్థా వాయసస్థా వా నిర్మాంసా వినతోదరీ ।
కరాలవదనా తద్వత్ కర్తవ్యా సా త్రిలోచనా ॥ 36 ॥

ఇప్పుడు "యోగీశ్వరీ" దేనిని గురించి వివరిస్తాను. ఈమె తీక్ష్ణమైన ఖడ్గమును ధరించును. దీర్ఘమైన నాలుకను, సుదీర్ఘమైన కేశములు కలిగి, అస్థిఖండములతో అలంకరింపబడి, పదునైన కోరలతో భయము కలిగించును. చిక్కిన ఉదరము, కపాలములమాలను మరియు కపాలమాలను ధరించి వుండును. వామహస్తము నందు మాంసశోణితపూరితమైన మస్తిష్కముతో కూడిన కపాలముండాలి. దక్షిణహస్తమునందు శక్తిని ధరించాలి. గృధ్రమును గాని వాయసమును గాని అధిరోహించియుండాలి. మాంసరహితమై వంగిన ఉదరముతో, భయంకరమైన వదనముతో మూడు కన్నులతో ప్రకాశించుచుండాలి. ఇది యోగీశ్వరీ ప్రతిమాలక్షణము.

చాముండా బద్ధఘంటా వా ద్వీపిచర్మధరా శుభా ।
దిగ్వాసాః కాలికా తద్వత్ రాసభస్థా కపాలినీ ॥ 37 ॥

సురక్తపుష్పాభరణా వర్ధనీధ్వజసంయుతా ।

శుభదాయిని అయిన ఆమె "చాముండా" రూపమునందున్నప్పుడు చేత ఘంటను ధరించి వ్యాఘ్రచర్మముతో అలంకరించబడి వుండాలి. కాళికా రూపము నందున్నప్పుడు ఆమె దిగంబరమును, కపాలమును ధరించాలి. గర్దభవాహనముపై నుండాలి. ఎర్రని పుష్పములే ఆభరణములుగా గలిగి, ధ్వజసహితయై జలపాత్రసహితయై వుండాలి.

వినాయకం చ కుర్వీత మాతౄణామన్తికే సదా ॥ 38 ॥

వీరేశ్వరశ్చ భగవాన్ వృషారూఢో జటాధరః ।
వీణాహస్తస్త్రిశూలీ చ మాతౄణామగ్రతో భవేత్ ॥ 39 ॥

ఈ మాతృకలకు ముందుభాగమున ఎల్లప్పుడు వినాయకుని స్థాపించాలి. అట్లే వృషభవాహనుడు, జటాధరుడు, వీణాహస్తుడు, త్రిశూలధారియైన వీరేశ్వరభగవానుని గూడ ఈ మాతృకలకు ముందు వుంచాలి.

శ్రియం దేవీం ప్రవక్ష్యామి నవే వయసి సంస్థితామ్ ।
సుయౌవనాం పీనగండాం రక్తౌష్ఠీం కుంచితభ్రువమ్ ॥ 40 ॥

పీనోన్నతస్తనతటాం మణికుండలధారిణీమ్ ।
సుమండలం ముఖం తస్యాః శిరః సీమన్తభూషణమ్ ॥ 41 ॥

పద్మస్వస్తికశంఖైర్వా భూషితాం కుండలాలకైః ।
కంచుకాబద్ధగాత్రీ చ హారభూషా పయోధరౌ ॥ 42 ॥

నాగహస్తోపమౌ బాహూ కేయూరకటకోజ్జ్వలౌ ।
పద్మం హస్తే ప్రదాతవ్యం శ్రీఫలం దక్షిణే భుజే ॥ 43 ॥

ఇప్పుడు "లక్ష్మీదేవి" ని గురించి వివరిస్తాను. లక్ష్మీదేవి నవయౌవన అయి వుండాలి. చక్కని యౌవనావస్థలో వుండు ఈమె యొక్క చెక్కిళ్ళు దృఢముగాను, ఎఱ్ఱని స్తనములతో మణికుండలములు ధరించి, చక్కగా గుండ్రంగా నున్న ముఖముతో తలపై సీమన్తము చేత అలంకృతమై వుండాలి. ఇంకను పద్మములతో, స్వస్తికములతో, శంఖములతో మరియు అందమైన ముంగురులతో అలంకృతమై వుండాలి. రవికతో బిగించబడిన అవయవములు కలిగి, హారాదులచేత భూషితయై స్తనద్వయము కలదై వుండాలి. ఇంకనూ ఏనుగు తొండము వంటి బాహువులు కలదై, ప్రకాశవంతములైన కేయూర, కటకాది ఆభరణములు ధరించి వుండాలి. మరియు ఈమె వామహస్తమున పద్మము దక్షిణహస్తమున శ్రీఫలము అనగా మారేడు ఫలములను వుంచాలి.

మేఖలాభరణాం తద్వత్ తప్తకాంచనసప్రభామ్ ।
నానాభరణసంపన్నాం శోభనాంబరధారిణీమ్ ॥ 44 ॥

పార్శ్వే తస్యాః స్త్రియః కార్యాః చామరవ్యగ్రపాణయః ।
పద్మాసనోపవిష్టా తు పద్మసింహాసనసంస్థితా ॥ 45 ॥

కరిభ్యాం స్నాప్యమానాఽసౌ భృంగారాభ్యామనేకశః ।
ప్రక్షాలయంతౌ కరిణౌ భృంగారాభ్యాం తథాపరౌ ॥ 46 ॥

స్తూయమానా చ లోకేశైః తథా గంధర్వగుహ్యకైః ।

మరియు మేఖలా (ఒడ్డాణము) భరణముతో, కాచిన బంగారపు వర్ణముతో అనేక విధములైన ఆభరణములతో అందమైన వస్త్రములతో అలంకృతయై వుండాలి. ఆమెకు ఇరువైపులను చేతులతో చామరములు (వింజామరములు) ధరించిన స్త్రీలు వుండాలి. పద్మమే సింహాసనముగా కలిగిన ఆ దేవి పద్మాసనోపవిష్టయై యుండును. రెండు ఏనుగులు భృంగారములను పాత్రవిశేషములతో ఇరువైపులనుండి నీరు వంచి ఆమెకు స్నానము చేయించుచున్నట్లు వుండాలి. అట్లే ఇంకొక రెండు ఏనుగులు భృంగారములు ధరించి ఆమెను సేవించుకొనుటకై సిద్ధముగా వుండవలెను. ఇంకనూ లోకపాలకులు, గంధర్వులు, గుహ్యకులు మొదలగు వారందరు ఆమెను స్తుతించుచున్నట్లు వుండాలి.

తథైవ యక్షిణీ కార్యా సిద్ధాసురనిషేవితా ॥ 47 ॥

పార్శ్వయోః కలశౌ తస్యాః తోరణే దేవదానవాః ।
నాగాశ్చైవ తు కర్తవ్యాః ఖడ్గఖేటకధారిణః ॥ 48 ॥

అధస్తాత్ ప్రకృతిస్తేషాం నాభేరూర్ధ్వం తు పౌరుషీ ।
ఫణాశ్చ మూర్ధ్ని కర్తవ్యో ద్విజిహ్వాః బహవః సమాః ॥ 49 ॥

పిశాచా రాక్షసాశ్చైవ భూతవేతాలజాతయః ।
నిర్మాంసాశ్చైవ తే సర్వే రౌద్రా వికృతరూపిణః ॥ 50 ॥

ఆమెకు దగ్గరలోనే సిద్ధులు, అసురులు మొదలగు వారిచే సేవింపబడుచున్న "యక్షిణి" వుండును. ఈ యక్షిణీ దేవతకు ఇరువైపుల యందు రెండు కలశములుండును. తోరణమునందు దేవతలు, దానవులు, నాగులు మొదలగువారు వుండాలి. బొడ్డునకు దిగువభాగమున సర్పాకారము, పైభాగమున మానవాకారము కలిగిన నాగులు ఖడ్గ, ఖేటకాది ఆయుధములతో నిలబడి ఉండాలి. తలపైన ఫణములు రెండేసి నాలుకలతో వుండాలి. మరియు పిశాచులు, రాక్షసులు, భూతబేతాళాది జాతులు అందరును లక్ష్మీదేవియొక్క ద్వారసమీపమున వుండాలి. వీరందరు మాంసరహితులై, రౌద్రములైన వికృతములైన రూపములు కలిగి వుండాలి. ఈ విధముగా "లక్ష్మీదేవి" ప్రతిమ వీటన్నింటితో వున్నట్లుగా నిర్మించినచో శుభప్రదము.

క్షేత్రపాలశ్చ కర్తవ్యో జటిలో వికృతాననః ।
దిగ్వాసా జటిలస్తద్వత్ శ్వగోమాయునిషేవితః ॥ 51 ॥

కపాలం వామహస్తే తు శిరః కేశసమావృతమ్ ।
దక్షిణే శక్తికాం దద్యాత్ అసురక్షయకారిణీమ్ ॥ 52 ॥

అటు తర్వాత అచ్చట "క్షేత్రపాలుని" నిర్మించాలి. ఈ క్షేత్రపాలుడు జటిలుడు, వికృతమైన ముఖము కలిగి, దిగంబరుడు, కుక్కలు మరియు నక్కల చేత సేవింపబడుచున్నవాడై వుండాలి. ఈతని వామహస్తము నందు శిరస్సు మరియు కేశసమావృతమైన కపాలము అట్లే దక్షిణహస్తమునందు అసురక్షయకారిణియైన శక్తి వున్నట్టు చూడాలి.

అథాతః సంప్రవక్ష్యామి ద్విభుజం కుసుమాయుధమ్ ।
పార్శ్వే చాశ్వముఖం తస్య మకరధ్వజసంయుతమ్ ॥ 53 ॥

దక్షిణే పుష్పబాణం చ వామే పుష్పమయం ధనుః ।
ప్రీతిః స్యాద్దక్షిణే తస్య భోజనోపస్కరాన్వితా ॥ 54 ॥

రతిశ్చ వామపార్శ్వే తు శయనం సారసాన్వితమ్ ।
పటశ్చ పటహశ్చైవ ఖరః కామాతురస్తథా ॥ 55 ॥

పార్శ్వతో జలవాపీ చ వనం నందనమేవ చ ।

సుశోభనశ్చ కర్తవ్యో భగవాన్ కుసుమాయుధః ॥ 56 ॥

సంస్థానమీషద్వక్రం స్యాత్ విస్మయస్మితవక్త్రకమ్ ।

ఇక ఇప్పుడు మన్మథుని లక్షణములను వివరిస్తాను. మన్మథునకు రెండు భుజములు వుండాలి. పుష్పములే ఈతనికి ఆయుధములు. ఈతని పార్శ్వమునందు మొసలిని రూపముకల ధ్వజమునకలిగిన అశ్వము వంటి ముఖము కలిగినవాడు వుండాలి. ఈతనికి దక్షిణహస్తమున పుష్పబాణములు, వామహస్తమున పుష్పమయమైన ధనుస్సు వుండాలి. దక్షిణభాగమున భోజనపదార్థములతో కూడిన ప్రీతిదేవి, వామభాగమున శయనోపభోగ్యములైన పరికరములతో కూడిన రతీదేవి వుండాలి. ఈతని దగ్గరలో పటము, పటహము మరియు కామాతురయైన ఒక గాడిద కూడ వుండును. ప్రక్కనే నీటితో నిండిన దిగుడుబావి మరియు నందనవనము కూడ వుండాలి. కుసుమాయుధుడైన మన్మథుని ఈ విధముగా స్ఫురద్రూపునిగా నిర్మించాలి. ముఖ్యముగా ఈతని ఉనికి కొంచెము ప్రక్కకు వంపు తిరిగి యుండాలి. అంతేకాక విస్మయముతో కూడిన ముఖము కలవాడై వుండాలి.

ఏతదుద్దేశతః ప్రోక్తం ప్రతిమాలక్షణం మయా ।
విస్తరేణ న శక్నోతి బృహస్పతి రపి ద్విజాః! ॥ 57 ॥

ఓ ద్విజులారా! ఇట్లు నేను కేవలము ఆయా ప్రతిమాలక్షణములను సంగ్రహ (ఉద్దేశ) మాత్రమున అనగా సంక్షిప్తముగా వివరించాను. ఇంకనూ విస్తరముగా దీనిని వివరించుటకు బృహస్పతికి కూడ శక్యము కాదు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దేవతార్చానుకీర్తనే ప్రతిమాలక్షణం నామ
ఏకషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః ॥261॥

శ్రీ మత్స్యమహాపురాణంలో దేవతార్చానుకీర్తనే ప్రతిమాలక్షణ మనే
రెండువందల అరవైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్విషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైరెండవ అధ్యాయం

దేవతార్చానుకీర్తనే పీఠికానుకీర్తనమ్ - దేవతార్చానుకీర్తనమున పీఠికానుకీర్తనం

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

పీఠికా(పిండికా)లక్షణం వక్ష్యే యథావదనుపూర్వశః ।
పీఠోచ్ఛ్రాయం యథావచ్చ భాగాన్ షోడశ కారయేత్ ॥ 1 ॥

ఇప్పుడు పూర్వసంప్రదాయమును అనుసరించి పీఠికాలక్షణమును యథాతథముగా వివరిస్తాను. పీఠపు ఎత్తును పదహారు భాగాలుగా చేసికోవాలి. (దేవాలయపు ద్వారము ఎత్తును బట్టి దేవుని ప్రతిష్ఠించు పీఠపు ఎత్తును నిర్ణయించుకోవలెనని ఇంతకు పూర్వమే తెలుపబడినది).

భూమావేకః ప్రవిష్టః స్యాత్ చతుర్భిర్జగతీ మతా ।
వృత్తో భాగస్తథైవః స్యాత్ వృత్తః పటలభాగతః ॥ 2 ॥

భాగైస్త్రిభిస్తథా కంఠః కంఠపట్టస్త్రిభాగతః ।
భాగాభ్యామూర్ధ్వ పట్టశ్చ శేషభాగేన పట్టికా ॥ 3 ॥

ప్రవిష్టం భాగమేకైకం జగతీ యావదేవ తు ।
నిర్గమస్తు పునస్తస్య యావద్వై శేషపట్టికా ॥ 4 ॥

వారినిర్గమనార్థం తు తత్ర కార్యః ప్రణాలకః ।
పీఠికానాం తు సర్వాసామేతత్సామాన్య లక్షణమ్ ॥ 5 ॥

పదహారు భాగాలలో ఒక భాగము భూమియందు ప్రవేశిస్తుంది. దానికి పైన నాలుగు భాగములతో "జగతీ" అనేది వుంటుంది. దానికి పైన ఒక షోడశాంశముతో "వృత్తపటలము" అనేది వుంటుంది. ఆ తర్వాత మూడు షోడశాంశములు కలిగిన "కంఠము" అనేది. దానిపైన మరల మూడు భాగములతో "కంఠపట్టము" అనేది వుంటుంది. దాని తర్వాత రెండు భాగములు కలిగిన "ఊర్ధ్వపట్టము" ఉంటుంది. ఇప్పుడు పదహారింటలో పద్నాలుగు భాగములు పోయిన తర్వాత మిగిలిన రెండు భాగములతో "పీఠిక" అనునది చేయవలెను. తర్వాత నీరు బయటకు పోవుటకై ఈ భాగమునందే "ప్రణాలకము" ను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతిమాదులను కడిగిన నీరు బయటకు పోవుటకై తగిన ఏర్పాటు చూడాలి. ఈ విధముగా "పీఠికల" న్నింటికిని ఇదియే సామాన్య లక్షణము.

విశేషాన్ దేవతాభేదాన్ శృణుధ్వం ద్విజసత్తమాః ।
స్థండిలా వాఽథ వాపీ వా యక్షీ వేదీ చ మండలా ॥ 6 ॥

పూర్ణచంద్రా చ వజ్రా చ పద్మా వాఽర్ధశశీ తథా ।
త్రికోణా దశమీ తాసాం సంస్థానం వా నిబోధత ॥ 7 ॥

ఓ ద్విజోత్తములారా! ఆయా దేవతాభేదములను బట్టి వారి వారి విశేషములకు తగినట్లుగా పీఠికలు నిర్మింపవలెను. ఇప్పుడు వాటి గురించి వివరించెదను, శ్రద్ధగా వినుము. పీఠికలు పది విధములు అవి 1.స్థండిలా

2.వాపీ 3.యక్షీ 4.వేదీ 5.మండలా 6.పూర్ణచంద్రా 7.వజ్రా 8.పద్మా 9.అర్ధశశీ 10.త్రికోణా. ఇప్పుడు వీటిలో ఒక్కోదాని గురించి తెలుపుతాను.

స్థండిలా చతురస్రా తు వర్జితా మేఖలాదిభిః ।
వాపీ ద్విమేఖలా జ్ఞేయా యక్షీ చైవ త్రిమేఖలా ॥ 8 ॥

చతురస్రాయతా వేదీ న తాం లింగేషు యోజయేత్ ।
మండలా వర్తులా యా తు మేఖలాభిర్గణప్రియా ॥ 9 ॥

వీటిలో మొదటిదైన 'స్థండిలా' చతరస్రాకారముగా వుండును. దీనికి మేఖలాదులేవియును ఉండవు. రెండవదైన 'వాపీ' అనునది రెండు మేఖలలు కలదై వుండును. "యక్షీ" అను మూడవ పీఠికకు మేఖలా త్రయముండును. నాలుగవదైన "వేదీ" దీర్ఘచతురస్రాకృతితో వుండును. దీనిని లింగప్రతిష్ఠకు ఉపయోగించకూడదు. "మండలా" అను ఐదవ పీఠిక వర్తులాకారములో నుండును. దీనికి మూడు మేఖలుండును. ఇది ప్రమథగణములు మొదలగు వారికి ప్రియమైనది.

రక్తా ద్విమేఖలా మధ్యే పూర్ణచంద్రా తు సా భవేత్ ।
మేఖలాత్రయ సంయుక్తా షడస్రా వజ్రికా భవేత్ ॥ 10 ॥

షోడశాస్రా భవేత్పద్మా కించిద్ధ్రస్వా తు మూలతః ।
తథైవ ధనురాకారా సార్ధచంద్రా ప్రశస్యతే ॥ 11 ॥

త్రిశూల సదృశీ తద్వత్త్రికోణా హ్యూర్ధ్వతో మతా ।
ప్రాగుదక్ ప్రవణా తద్వత్ ప్రశస్తా లక్షణాన్వితా ॥ 12 ॥

ఇక "పూర్ణచంద్రా" అను ఆరవ పీఠమునకు మధ్యలో రెండు మేఖలలు వుండును. ఏడవదైన "వజ్రా" అనుదానికి మేఖలాత్రయము షడస్రాకారముతో వుండును. తర్వాత "పద్మా" అనునది షోడశాస్రము కలది, మూలమున కొంచెము హ్రస్వత్వముండును. తొమ్మిదవదైన "అర్ధాశశీ లేదా అర్ధచంద్ర" అనునది ధనురాకారమున నుండును. ఇది ప్రశస్తమైనది. ఇక "పదవదైన "త్రికోణా" అనునది త్రికోణాకారములో నుండును. లింగపు ఎత్తులో సగము ఎత్తు వరకు నిలువుగా వుండి త్రిశూలాకారములో నుండవలెను. ఈ పీఠిక యందు ఈశాన్యము వైపున కొంచెము వంపుగా వుండే లక్షణముతో ఉన్నచో అది చాలా ప్రశస్తమైనది.

పరివేషం త్రిభాగేన నిర్గమం తత్ర కారయేత్ ।
విస్తారం తత్ప్రమాణం చ మూలే చాగ్రే తథోర్ధ్వతః ॥ 13 ॥

జలమార్గశ్చ కర్తవ్యః త్రిభాగేన సుశోభనః ।
లింగస్యార్ధవిభాగేన స్థౌల్యేన సమధిష్ఠితా ॥ 14 ॥

మేఖలా తత్త్రిభాగేన ఖాతం చైవ ప్రమాణతః ।
అథవా పాదహీనం తు శోభనం కారయేత్సదా ॥ 15 ॥

ఉత్తరస్థం ప్రణాలం చ ప్రమాణాదధికం భవేత్ ।

తర్వాత పీఠికయందు చక్కగా నుండునట్టి జలనిర్గమన మార్గమును కల్పించవలెను. అది లింగమునకు లేదా దేవతాప్రతిమకు చుట్టూ ఉండునట్టి పరివేషపు పరిమాణములో మూడవ వంతు ఉండవలెను. ఈ జలనిర్గమ మార్గపు కొలతలు మూలమందు గాని, నడుమ కాని, పై భాగమున గాని పరివేషపు కొలతకు అనుగుణముగా ఉండవలెను. అంతేకాక లింగపు ఎత్తులో సగము ఎత్తుమందముగా మేఖల యుండవలెను. ఈ మేఖలకు గల మందములో మూడవవంతు తక్కువగా ఉండునట్లు జలనిర్గమ మార్గమును (కాలువ) కల్పించవలెను. నీరు బయటకు పోవుటకు ఈ పీఠపు ఉత్తరదిశయందు ఏర్పరిచిన మార్గము దీని కంటే కొంచెము ఎక్కువ వెడల్పుతో కూడ ఉండవచ్చును.

స్థండిలాయా మథారోగ్యం ధనం ధాన్యం చ పుష్కలమ్ ॥ 16 ॥
గోప్రదా చ భవేద్యక్షీ వేదీ సంపత్ప్రదా భవేత్ ।
మండలాయాం భవేత్ కీర్తిః వరదా పూర్ణచంద్రికా ॥ 17 ॥
ఆయుష్ప్రదా భవేద్వజ్రా పద్మా సౌభాగ్యదా భవేత్ ।
పుత్రప్రదాఽర్ధ చంద్రా స్యాత్ త్రికోణా శతృనాశనీ ॥ 18 ॥

ఈ పీఠికలలో 'స్థండిలా' మంచి ఆరోగ్యమును, 'వాపీ' పుష్కలమైన ధనమును, 'యక్షీ' గోవృద్ధిని, 'వేదీ' సంపత్తును, 'మండలా' కీర్తిని, 'పూర్ణచంద్ర' వరములను, 'వజ్రా' ఆయుష్యమును, 'పద్మా' సౌభాగ్యమును, 'అర్ధచంద్రా' పుత్రులను కలిగించును మరియు చివరిదైన "త్రికోణా" శత్రునాశనము జేయును.

దేవస్య పూజనార్థం తు పీఠికా దశ కీర్తితాః ।
శైలే శైలమయీం దద్యాత్ పార్థివే పార్థివీం తథా ॥ 19 ॥
దారుజే దారుజాం కుర్యాత్ మిశ్రే మిశ్రాం తథైవ చ ।
నాన్యయోనిస్తు కర్తవ్యా సదా శుభఫలేప్సుభిః ॥ 20 ॥
అర్చాయామసమం దైర్ఘ్యం లింగాయామసమం తథా ।
యస్య దేవస్య యా పత్నీ తాం పీఠే పరికల్పయేత్ ॥
ఏతత్సర్వం సమాఖ్యాతం సమాసాత్ పీఠలక్షణమ్ ॥ 21 ॥

ఇట్లు దేవతామూర్తులను పూజించుటకై వారిని ప్రతిష్ఠించుటకు నిర్మించవలసిన పది పీఠముల యొక్క లక్షణములను ఇక్కడ వివరింపబడినవి. దేవతాప్రతిమను శిలతో నిర్మించినచో పీఠము కూడ శిలతోనే నిర్మించవలెను. అట్లే మట్టిమూర్తికి మట్టితో మూర్తిపీఠము, మిశ్రలోహములతో నిర్మించినచో మిశ్రలోహముల పీఠము నిర్మించుకొనవలెను. శుభఫలములను కోరువారు ఎప్పుడునూ పూజింపబడు దేవతామూర్తిని మరియు పీఠమును భిన్నమైన పదార్థములతో నిర్మించుకోకూడదు. దేవతాప్రతిమయొక్క, లింగముయొక్క ఎత్తు మరియు వైశాల్యము ఎంత ఉండునో దానిని బట్టి పీఠమును నిర్మించుకొనవలెను కాని అసమత్వము ఉండకూడదు.తర్వాత ఏ దేవుని ప్రతిమను ప్రతిష్ఠింతురో ఆ దేవుని భార్యను కూడ ప్రతిష్ఠించవలెను. పీఠముల గురించి వాటిలక్షణములను గురించి ఇక్కడ సంక్షిప్తముగా వివరింపబడినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దేవతార్చానుకీర్తనే పీఠికానుకీర్తనం నామ ద్విషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః॥262॥

శ్రీ మత్స్యమహాపురాణమున దేవతార్చాను కీర్తనమున పీఠికానుకీర్తనం అను రెండువందల అరవైరెండవ అధ్యాయం సమాప్తం.

త్రిషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైమూడవ అధ్యాయం

దేవతార్చానుకీర్తనమ్ - దేవతార్చానుకీర్తనం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు

అథాతః సంప్రవక్ష్యామి లింగలక్షణముత్తమమ్ ।
సుస్నిగ్ధం చ సువర్ణం చ లింగం కుర్యాద్విచక్షణః ॥ 1 ॥

పీఠికాలక్షణములు తెలిపిన తర్వాత ఇప్పుడు ఉత్తమమైనటువంటి లింగలక్షణములను వివరింతును. విచక్షణుడగు శిల్పి గాని, ఆగమశాస్త్రపండితుడు గాని మనోహరముగా మరియు చక్కని వన్నెతో ప్రకాశించునట్టి లింగమును నిర్మించుకొనవలెను.

ప్రాసాదస్య ప్రమాణేన లింగమానం విధీయతే ।
లింగమానేన వా విద్యాత్ ప్రాసాదం శుభలక్షణమ్ ॥ 2 ॥

చతురస్రే సమే గర్తే బ్రహ్మసూత్రం నిపాతయేత్ ।
వామేన బ్రహ్మసూత్రస్య అర్చా వా లింగమేవ చ ॥ 3 ॥

ప్రాసాదమును అనగా దేవాలయమును ముందుగా నిర్మించుకుని దాని కొలతను బట్టి తదనుగుణముగా లింగమును నిర్మించవలెను. లేదా ముందుగా లింగమును లేదా దేవతామూర్తిని నిర్మించుకొని వాటి ప్రమాణమునకు అనుగుణముగా దేవాలయమును శుభలక్షణసహితముగా నిర్మించుకొనవచ్చును. తర్వాత దేవాలయపు గర్భగుడి యందు చతురస్రపు గర్తమును అనగా గుంతను త్రవ్వి దానిలో శాస్త్రప్రమాణమును అనుసరించి బ్రహ్మసూత్రమును వేయవలెను. తరువాత ఆ బ్రహ్మసూత్రపు ఎడమ వైపునకు ఉండునట్లు అర్చామూర్తిని గాని లింగమును గాని ప్రతిష్ఠించవలెను.

ప్రాగుత్తరేణ లీనం తు దక్షిణాపరమాశ్రితమ్ ।
పురస్యాపరదిగ్భాగే పూర్వద్వారం ప్రకల్పయేత్ ॥ 4 ॥

పూర్వేణ చాపరం ద్వారం మాహేంద్రం దక్షిణోత్తరమ్ ।
ద్వారం విభజ్య పూర్వం తు ఏకవింశతిభాగికమ్ ॥ 5 ॥

గ్రామమునకు పడమర దిశగా కొంచెము దక్షిణమున దేవాలయము నిర్మించవలెను. అదియును ఈశాన్యము వైపునకు మలుపుగా నుండవలెను. ఆలయపు ద్వారము తూర్పు దిశయందు ఉండవలెను, తర్వాత ఆ ద్వారమునకు తూర్పు ఇంకొక ద్వారము కూడ ఉండవలెను. ఇట్లు దక్షిణోత్తరముగా నిర్మించుకొనిన ఈ ద్వారమును “మాహేంద్రము” అని అందురు. ఈ రెండు ద్వారములలో మొదటి దాని యొక్క దక్షిణోత్తరమానమును ఇరవై ఒక్క భాగాలుగా విభజించవలెను.

తతో మధ్యగతం జ్ఞాత్వా బ్రహ్మసూత్రం ప్రకల్పయేత్ ।
తస్యార్ధం తు త్రిధా కృత్వా భాగం చోత్తరతస్త్యజేత్ ॥ 6 ॥

ఏవం దక్షిణతస్త్యక్త్వా బ్రహ్మస్థానం ప్రకల్పయేత్ ।
భాగార్ధేన తు యల్లింగం కార్యం తదిహ శస్యతే ॥ 7 ॥

తర్వాత వాటిలో మధ్యభాగమును గుర్తించి అచ్చట బ్రహ్మసూత్రమును నిలుపవలెను. తదనంతరం ద్వారం యొక్క ఆయామపు అర్ధభాగమును మూడుగా విభజించి ఉత్తర తృతీయాంశమును వదిలి నడుమనున్న తృతీయాంశములో అర్ధాంశమును గ్రహించవలెను. దీనినే బ్రహ్మస్థానమని అందురు. లింగము యొక్క అడ్డు కొలత వ్యాసము ఈ పరిమాణములో నుండునట్లు చేయించవలెను. ఇది ప్రశస్తమైనది.

పంచభాగవిభక్తే తు త్రిభాగే జ్యేష్ఠ్యముచ్యతే ।
భాజితే నవధా గర్భే మధ్యమం పాంచభాగికమ్ ॥ 8 ॥

ఏకస్మిన్నేవ నవధా గర్భే లింగాని కారయేత్ ।
సమసూత్రం విభజ్యాథ నవధా గర్భభాజితమ్ ॥ 9 ॥

జ్యేష్ఠమర్ధం కనీయోఽర్ధం తథా మధ్యమమధ్యమమ్ ।
ఏవం గర్భః సమాఖ్యాతస్త్రిభిర్భాగైర్విభాజయేత్ ॥ 10 ॥

జ్యేష్ఠం తు త్రివిధం జ్ఞేయం మధ్యమం త్రివిధం తథా ।
కనీయస్త్రివిధం సద్వల్లింగభేదా నవైవ తు ॥ 11 ॥

ద్వారము యొక్క దక్షిణోత్తరాయామమును ఐదు భాగాలుగా విభజించి దానిలోని భాగత్రయమును గ్రహించి అందు అడ్డు వ్యాసముతో లింగమును నిర్మింపజేయాలి. దీనినే జ్యేష్ఠపరిమాణం అని అంటారు. లేదా ద్వారపు దక్షిణోత్తరాయామమును తొమ్మిదిగా విభజించి దానిలోని దక్షిణభాగద్వయము, ఉత్తరభాగద్వయమును గూడా వదిలి మధ్యలో భాగపంచకమును గ్రహించాలి. దీనిని మధ్యమపరిమాణమని అంటారు. లేదా దక్షిణోత్తరాయమమును ఐదు భాగములు చేసి ఉత్తర మరియు దక్షిణ భాగద్వయమును గూడ వదిలి మధ్యలోని పంచమాంశపరిమాణమున లింగము నిర్మించాలి. దానిని కనిష్ఠ పరిమాణమని అంటారు. ఇంతే కాక జ్యేష్ఠ, మధ్యమ, కనిష్ఠ పరిమాణపు లింగములను మూడింటిని కూడ మరల ఉపవిభాగములతో తొమ్మిది భాగములుగా నిర్మించుకునే మార్గము గూడ కలదు. జ్యేష్ఠ మధ్యమ కనిష్ఠములను వేరు వేరుగా తొమ్మిదేసి భాగములుగా విభజించుకొనవలెను.

నాభ్యర్ధమష్టభాగేన విభజ్యాథ సమం బుధైః ।
భాగత్రయం పరిత్యజ్య విష్కమ్భం చతురస్రకమ్ ॥ 12 ॥

అష్టాస్రం మధ్యమం జ్ఞేయం భాగం లింగస్య వై ధ్రువమ్ ।
వికీర్ణే చేత్ తతో గృహ్య కోణాభ్యాం లాంఛయేద్బుధః ॥ 13 ॥

లింగలక్షణము తెలిసికొని శిల్పి లింగమునందలి నాభి నుండి క్రింది సగభాగమును ఎనిమిది సమభాగములుగా విభజించవలెను. తర్వాత వాటిలో పై నుండి మూడు అష్టమాంశములను వదిలి మిగిలిన ఐదు అష్టమాంశములను "చతురస్రము" గా చేసికోవాలి. ఈ మూడు అష్టమాంశాలను కూడ 'అష్టాస్రము' గా నిర్మించుకొనవచ్చును. వికీర్ణమైన అనగా ముఖములతో ప్రతిదానియందు రెండు చివరలతో కొంత భాగమును కోణముగా చెక్కవలెను.

అష్టాస్రం కారయేత్తద్వత్ ఊర్ధ్వమప్యేవమేవ తు ।
షోడశాస్రీ కృతం పశ్చాద్వర్తులం కారయేత్తతః ॥ 14 ॥

ఆయామం తస్య దేవస్య నాభ్యాం వై కుండలీకృతమ్ ।
మాహేశ్వరం త్రిభాగం తు ఊర్ధ్వవృత్తం త్వవస్థితమ్ ॥ 15 ॥

అధస్తాద్ బ్రహ్మభాగస్తు చతురస్రో విధేయతే ।
అష్టాస్రో వైష్ణవో భాగో మధ్యస్తస్య ఉదాహృతః ॥ 16 ॥

ఏవం ప్రమాణసంయుక్తం లింగవృద్ధిప్రదం భవేత్ ।

అట్లు చేసినచో అది సహజంగానే అష్టాస్రమంగా అవుతుంది. తర్వాత మిగిలిన లింగపు నాభియొక్క ఊర్ధ్వభాగమును గూడ ఎనిమిది సమభాగములుగా చేసి, నాభి స్థానమునుండి పైకి గల మొదటి మూడు భాగములను కూడ అష్టాస్రంగా చేయవలెను. నాభిపైన గల పూజకు యోగ్యమైన ప్రదేశమున ఆరంభించి 'షోడశాస్రము'గా రూపొందించి తదనంతరము దానిని క్రమంగా వర్తులాకారంగా అగునట్లు చేయవలెను. నడిమ గురుతు స్పష్టముగా తెలియుటకై నాభిభాగమునందు కుండలీకరణము చేయవలెను. అప్పుడు త్రిభాగాత్మకైన 'మాహేశ్వరము' ఊర్ధ్వవృత్తమై ఉండును. చతురస్రాకారములోనున్న అధోభాగము 'బ్రహ్మభాగము'. అష్టాస్రముగానున్న మధ్యభాగము 'విష్ణుభాగము'. ఇట్లు మొత్తము లింగము మూర్తిత్రయాత్మకమైనది. ఈ విధముగా ఇక్కడ వివరించినటువంటి ప్రమాణములతో నిర్మించబడిన లింగము అందరికినీ అత్యంత వృద్ధిప్రదము అని తెలిసికోవలసినది.

తథాఽన్యదపి వక్ష్యామి గర్భమానం ప్రమాణతః ॥ 17 ॥

గర్భమానప్రమాణేన యల్లింగముచితం భవేత్ ।
చతుర్ధా తద్విభజ్యాథ విష్కమ్భం తు ప్రకల్పయేత్ ॥ 18 ॥

దేవతాయతనం సూత్రం భాగత్రయవికల్పితమ్ ।
అధస్తాచ్చతురస్రం తు అష్టాస్రం మధ్యభాగతః ॥ 19 ॥

పూజ్యభాగస్తతోఽర్ధం తు నాభిభాగస్తథోచ్యతే ।
ఆయామే యద్భవేత్సూత్రం నాహస్య చతురశ్రకే ॥ 20 ॥

చతురస్రార్ధం పరిత్యజ్య అష్టాస్రస్య తు యద్భవేత్ ।
తస్యాప్యర్ధం పరిత్యజ్య తతో వృత్తం తు కారయేత్ ॥ 21 ॥

గర్భాలయపు ప్రమాణము ననుసరించి నిర్మించదగిన లింగలక్షణమును ఇంకొక దానిని కూడ తెలిపెదను. గర్భాలయ ప్రమాణముననుసరించి ఎటువంటి లింగము ఉచితమగునో దానిని నాలుగు భాగములుగా విభజించి విష్కంభమును కల్పించవలెను. తర్వాత దేవతాయతనసూత్రము ద్వారా దానిని మూడుభాగములుగా విభజించివలెను. వాటిలో క్రిందిభాగమును చతురస్రముగాను, మధ్యభాగమును అష్టాస్రముగాను గుర్తించవలసినది. ఇంకనూ మధ్యభాగమునకు కొంచెము పైన ఉన్నట్టి దానిని పూజ్యభాగము అని తెలిసికోవలసినది. అష్టాస్రభాగమునందలి అర్ధభాగమునకు పైన మిగిలిన భాగమును క్రమముగా వర్తులాకారముగా ఉండునట్లు చేయవలెను.

శిరఃప్రదక్షిణం తస్య సంక్షిప్తం మూలతో న్యసేత్ ।
జ్యేష్ఠపూజ్యం భవేల్లింగమధస్తాద్విపులం చ యత్ ॥ 22 ॥

శిరసా చ సదా నిమ్నం మనోజ్ఞం లక్షణాన్వితమ్ ।
సౌమ్యం తు దృశ్యతే యత్తు లింగం తద్వృద్ధిదం భవేత్ ॥ 23 ॥

లింగము యొక్క శిరోభాగము ప్రదక్షిణాకారముగా ఉండవలెను. లింగము దిగువ భాగము కంటే పైనున్న భాగము తక్కువ వ్యాసముతో ఉండవలెను. ఇట్లున్నటువంటి జ్యేష్ఠ పరిమాణక లింగము పూజ్యమగును. ఇట్లు విచారించి చూడగా లింగపు చతురస్రపు నాలుగు భుజముల చుట్టూ ఉండునట్టి కొలత ఎంత ఉండునో దానిని బట్టి ఆ లింగపు ఎత్తు కూడ అంతే పరిమాణములో ఉండవలెను. ఇట్లు మనోజ్ఞమైన లక్షణములతో కూడినట్టి సౌమ్యముగా ఉన్నట్టి లింగము సర్వథా వృద్ధిప్రదముగా నుండును.

అథ మూలే చ మధ్యే తు ప్రమాణే సర్వతః సమమ్ ।
ఏవం విధం తు యల్లింగం భవేత్తత్సార్వకామికమ్ ॥ 24 ॥

అన్యథా యద్ భవేల్లింగం తదసత్ సంప్రచక్షతే ।
ఏవం రత్నమయం కుర్యాత్ స్ఫాటికం పార్థివం తథా ॥
శుభం దారుమయం చాపి యద్వా మనసి రోచతే ॥ 25 ॥

ఇంతవరకు చెప్పినదాని ప్రకారముగా క్రిందివ్యాసపు కొలతకంటె పైవ్యాసపు కొలత తక్కువ కాకుండా మూలమందును మధ్యభాగమున అంతమందును గూడ సమానముగా ఉండు లింగము సర్వకామ ఫలప్రదమగును. ఈ లక్షణములకు విరుద్ధముగా నిర్మించిన లింగము మంచిది కాదని పండితులచే చెప్పబడినది. ఇట్లు లింగమును రత్నములతో, స్ఫటికములతో, మృత్తికతో, శిలతో లేదా దారువుతో కూడ నిర్మించుకోవచ్చును. అయితే ఎవరి మనసుకు ఏ పదార్థముతో లింగనిర్మాణము ఇష్టమగునో అట్టి దానితో చేయించుకొనవచ్చును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే దేవతార్చానుకీర్తనం త్రిషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥263॥

శ్రీ మత్స్యమహాపురాణమున దేవతార్చానుకీర్తన మను రెండువందల అరవైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుఃషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైనాల్గవ అధ్యాయం

ప్రతిష్ఠానుకీర్తనమ్ - ప్రతిష్ఠానుకీర్తనం

ఋషయః ఊచుః - ఋషులు చెప్పారు.

దేవతానామథైతాసాం ప్రతిష్ఠావిధిముత్తమమ్ ।
వద సూత యథాన్యాయం సర్వేషామప్యశేషతః ॥ 1 ॥

ఓ సూత మహర్షీ! ఈ దేవతల యొక్క ఉత్తమమైన ప్రతిష్ఠావిధి గురించి యథాన్యాయముగా యథాశాస్త్రముగా సర్వవిధులును సంపూర్ణముగా తెలుపుము.

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి ప్రతిష్ఠావిధిముత్తమమ్ ।
కుండమండపవేదీనాం ప్రమాణం చ యథాక్రమమ్ ॥ 2 ॥

ఓ ఋషులారా! ఇప్పుడు ఉత్తమమైనట్టి ప్రతిష్ఠావిధి గురించి వివరించెదను. కుండ - మండప -వేదికలు యొక్క లక్షణములను కూడ యథాక్రమముగా తెలిపెదను.

చైత్రే వా ఫాల్గుణే వాపి జ్యేష్ఠే వా మాధవే తథా ।
మాఘేవా సర్వదేవానాం ప్రతిష్ఠా శుభదా భవేత్ ॥ 3 ॥

ప్రాప్యం పక్షం శుభం శుక్లమతీతే దక్షిణాయనే ।
పంచమీ చ ద్వితీయా చ తృతీయా సప్తమీ తథా ॥ 4 ॥

దశమీ పౌర్ణమాసీ చ తథా శ్రేష్ఠా త్రయోదశీ ।
ఆసు ప్రతిష్ఠా విధివత్ కృతా బహుఫలా భవేత్ ॥ 5 ॥

చైత్రము, వైశాఖము, జ్యేష్ఠము, మాఘము, ఫాల్గుణ మాసములు దేవతల ప్రతిమాప్రతిష్ఠ చేయుటకు శుభప్రదములు. ఉత్తరాయణము మరియు శుక్లపక్షము శుభకరములు. ద్వితీయా, తృతీయా, పంచమీ, సప్తమీ, దశమీ, త్రయోదశి, పూర్ణిమా తిథులు దేవతా ప్రతిష్ఠకు శ్రేష్ఠములు. ఈ చెప్పిన వాటి యందు శాస్త్రనియమాను సారంగా ప్రతిష్ఠ చేసినచో బహుఫలములు లభిస్తాయి.

ఆషాఢే ద్వే తథా మూలముత్తరాద్వయమేవ చ ।
జ్యేష్ఠా శ్రవణరోహిణ్యః పూర్వా భాద్రపదా తథా ॥ 6 ॥

హస్తాశ్వినీ రేవతీ చ పుష్యో మృగశిరాస్తథా ।
అనురాధా తథా స్వాతీ ప్రతిష్ఠాదిషు శస్యతే ॥ 7 ॥

బుధో బృహస్పతిః శుక్రస్త్రయో౽ప్యేతే శుభగ్రహాః ।
ఏభిర్నిరీక్షితం లగ్నం నక్షత్రం చ ప్రశస్యతే ॥ 8 ॥

నక్షత్రములలో పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, మూల, ఉత్తరఫాల్గుని, ఉత్తరాభాద్ర, జ్యేష్ఠ, శ్రవణం, రోహిణి, పూర్వాభాద్ర, హస్త, అశ్విని, రేవతి, పుష్యమి, మృగశిర, అనూరాధ, స్వాతి ఇత్యాది నక్షత్రములు దేవతా ప్రతిష్ఠలకు శ్రేష్ఠములు. అట్లే గ్రహములలో బుధ-బృహస్పతి-శుక్రగ్రహములు శుభప్రదములు. ఈ మూడు గ్రహముల శుభదృష్టితో చూడబడుచున్న లగ్నము, నక్షత్రము ప్రశస్తములు.

గ్రహతారాబలం లబ్ధ్వా గ్రహపూజాం విధాయ చ ।
నిమిత్తం శకునం లబ్ధ్వా వర్జయిత్వా౽ద్భుతాదికమ్ ॥ 9 ॥

శుభయోగే శుభస్థానే క్రూరగ్రహవివర్జితే ।
లగ్నే ఋక్షే ప్రకుర్వీత ప్రతిష్ఠాదికముత్తమమ్ ॥ 10 ॥

అయనం విషువే తద్వత్ షడశీతిముఖే తథా ।
ఏతేషు స్థాపనం కార్యం విధిదృష్టేన కర్మణా ॥ 11 ॥

ప్రాజాపత్యే తు శయనం శ్వేతే తూత్థాపనం తథా ।
ముహూర్తే స్థాపనం కుర్యాత్ పునర్బ్రాహ్మే విచక్షణః ॥ 12 ॥

గ్రహబలము తారాబలములను చూచుకొని గ్రహపూజను కూడ చేసికొని, శుభనిమిత్తములను శకునములను చూచుకొని అద్భుతాదియోగములను వదిలి శుభయోగమున క్రూరగ్రహములు ఏవియునూ లేనటువంటి శుభస్థానమునందు, శుభలగ్నము మరియు శుభనక్షత్రమునందు ఉత్తమమైన ప్రతిష్ఠాదులను నిర్వహించుకొనవలెను. ఇంకనూ ఆయనము విషువపుణ్యకాలము షడశీతి ముఖ పుణ్యకాలములందు శాస్త్రవిధానముననుసరించి స్థాపనకార్యము చేయవలెను. విచక్షణుడు అయిన ద్విజుడు ప్రాజాపత్యముహూర్తమునందు ప్రతిష్ఠచేయబోవు దేవతామూర్తి యొక్క శయనమును, శ్వేత ముహూర్తమునందు ఉత్థాపనము, బ్రాహ్మముహూర్తమునందు స్థాపనమును అనగా ప్రతిష్ఠాపనమును జరుపుకొనవలెను.

ప్రాసాదస్యోత్తరే వా౽పి పూర్వే వా మండపో భవేత్ ।
హస్తాన్ షోడశ కుర్వీత దశ ద్వాదశ వా పునః ॥ 13 ॥

మధ్యే వేదికయా యుక్తః పరిక్షిప్తః సమన్తతః ।
పంచ సప్తాపి చతురః కరాన్ కుర్వీత వేదికామ్ ॥ 14 ॥

ప్రాసాదమునకు తూర్పునందు గాని ఉత్తరమునందు కాని హోమాదులు నిర్వర్తించుటకు మండపము నిర్మించుకొనవలెను. అది పదహారు గాని పదునెండు కాని హస్తముల అనగా మూరల ప్రమాణముగల నాలుగు భుజములతో చతురస్రాకారమున నుండవలెను. దాని మధ్యభాగమున వేదిక యుండవలెను. ఆ వేదిక నాలుగు కాని ఐదు కాని మూరలతో చతురస్రముగా నుండవలెను.

చతుర్భిస్తోరణైర్యుక్తో మండపః స్యాచ్చతుర్ముఖః ।
ప్లక్షద్వారం భవేత్ పూర్వం యామ్యే చౌదుమ్బరం భవేత్ ॥ 15 ॥

పశ్చాదశ్వత్థఘటితం న్యగ్రోధం చ తథోత్తరే ।
భూమౌ హస్తప్రవిష్టాని చతుర్హస్తాని చోచ్ఛ్రయే ॥ 16 ॥

సూపలిప్తం తథా శ్లక్ష్ణం భూతలం స్యాత్ సుశోభనమ్ ।
వస్త్రైర్నానావిధైస్తద్వత్ పుష్పపల్లవశోభితమ్ ॥ 17 ॥

ఈ మండపము చతుర్ముఖమై నాలుగు వైపులకు నాలుగు తోరణముల ద్వారములతో ఉండవలెను. ఈ ద్వారములలో తూర్పుద్వారము జువ్విచెట్టు యొక్క కొయ్యతో, దక్షిణద్వారము మేడికొయ్యతో, పశ్చిమద్వారము అశ్వత్థవృక్షపు కొయ్యతో మరియు ఉత్తరద్వారము న్యగ్రోధ (మర్రి) వృక్షపు కొయ్యతో చేయవలెను. ఈ ద్వారముల నిలుపు కమ్ములు ఐదు మూరల పొడవుతో ఉండి వాటిలో ఒక మూరెడు భూమిలోనికి పోవలెను. మండపము దగ్గరి భూతలమంతయు చక్కగా అలికి సుందరముగా సుశోభనముగా ఉండునట్లు చూచుకొనవలెను. తర్వాత దానినంతటిని నానావిధవస్త్రములతో పుష్పములతో మరియు పల్లవములతో అలంకరించవలెను.

కృత్వైవం మండపం పూర్వం చతుర్ద్వారేషు విన్యసేత్ ।
అవ్రణాన్ కలశానష్టౌ జ్వలత్కాంచనగర్భితాన్ ॥ 18 ॥

చూత పల్లవ సంఛన్నాన్ సితవస్త్రయుగాన్వితాన్ ।
సర్వౌషధిఫలోపేతాన్ చందనోదకపూరితాన్ ॥ 19 ॥

ఏవం నివేశ్య తద్గర్భే గంధధూపార్చనాదిభిః ।
ధ్వజాధిరోహణం కార్యం మండపస్య సమన్తతః ॥ 20 ॥

ఈ విధముగా మండపమును సిద్ధము చేసికొనిన తర్వాత నాలుగు ద్వారముల యొక్క నిలువుకమ్ముల దగ్గర రెండేసి చొప్పున ఎనిమిది కలశములను ఉంచవలెను. ఆ కలశములకు రంధ్రములు కాని సొట్టలు కాని ఉండకూడదు. బంగారపు వన్నెతో ప్రకాశించుచున్నట్లుండవలెను. మామిడి ఆకులతో వాటిని కప్పి రెండేసి వస్త్రములను వాటికి చుట్టవలెను. నానావిధ ఔషధులు ఫలములు వాటి యందుంచి చందనోదకములతో వాటిని నింపవలెను. తర్వాత మండపపు అంతర్భాగమున వీటన్నింటిని పెట్టి గంధధూపాదులతో అర్చన చేయవలెను. తర్వాత మండపము యొక్క అన్ని దిక్కులయందు ధ్వజారోహణం చేయవలెను.

ధ్వజాంశ్చ లోకపాలానాం సర్వదిక్షు నివేశయేత్ ।
పతాకా జలదాకారా మధ్యే స్యాన్మండపస్య తు ॥ 21 ॥

గంధధూపాదికం కుర్యాత్ స్వైః స్వైర్మన్త్రైరనుక్రమాత్ ।
బలిం చ లోకపాలేభ్యః స్వమన్త్రేణ నివేదయేత్ ॥ 22 ॥

ఊర్ధ్వం తు బ్రహ్మణే దేయం త్వధస్తాచ్ఛేషవాసుకేః ।
సంహితాయాం తు యే మన్త్రాస్తద్దైవత్యాః శ్రుతౌ స్మృతాః ॥ 23 ॥

తైః పూజా లోకపాలానాం కర్తవ్యా చ సమన్తతః ।
త్రిరాత్రమేకరాత్రం వా పంచరాత్రమథాపి వా ॥ 24 ॥

అథవా సప్తరాత్రం తు కార్యం స్యాదధివాసనమ్ ।

తదనంతరం అన్ని దిక్కులయందు ఆయా దిక్పాలకులకు చెందిన ధ్వజారోహణములు చేయవలెను. మండపపు మధ్యలో పై భాగమున మేఘము వంటి పతాకమును (ధ్వజమును) నిలుపవలెను. తర్వాత ఆయా దేవతలకు సంబంధించిన మంత్రములతో గంధ ధూపాదులతో యథాక్రమముగా పూజలు చేయవలెను. ఆయా లోకపాలకులకు సంబంధించిన మంత్రోచ్చారణములతో వారికి 'బలి' అర్పించవలెను. అందరికన్న ఊర్ధ్వభాగము నందు బ్రహ్మకు అధోభాగమునందు శేషునకు, వాసుకికి గంధపుష్పాదులు అర్పించవలెను. తర్వాత ఆయా దేవతలకై వైదిక సంహితలయందు ఏయే మంత్రములు నిర్ధారింపబడియున్నవో వాటితో లోకపాలకులందరికిని పూజ చేయవలెను. ఈ విధముగా ఆచరించిన పిదప ఆ దేవతామూర్తులకు ఒక రాత్రి కాని, మూడు రాత్రులు కాని, ఐదు రాత్రులు కాని లేదా ఏడు రాత్రులు కాని అధివాసనము జరుపవలెను.

ఏవం సతోరణం కృత్వా అధివాసనముత్తమమ్ ॥ 25 ॥

తస్యాప్యుత్తరతః కుర్యాత్ స్నానమండపముత్తమమ్ ।
తదర్ధేన త్రిభాగేన చతుర్భాగేన వా పునః ॥ 26 ॥

ఇట్లు తోరణయుక్తముగా ఉత్తమమైన అధివాసనము ఏర్పరిచి దానికి ఉత్తరభాగమున ఆ మండపపు కొలతలో సగము కొలతతో కాని, మూడవ వంతు లేదా నాలుగవ వంతు కొలతతో గాని స్నానమండపమును నిర్మించవలెను.

ఆనీయ లింగమర్చాం వా శిల్పినః పూజయేద్ బుధః ।
వస్త్రాభరణరత్నైశ్చ యేఽపి తత్పరిచారకాః ॥ 27 ॥

క్షమధ్వమితి తాన్ బ్రూయాత్ యజమానోఽప్యతః పరమ్ ।
దేవం ప్రస్తరణే కృత్వా నేత్రజ్యోతిః ప్రకల్పయేత్ ॥ 28 ॥

తదనంతరము ప్రతిష్ఠించవలసిన లింగమును లేదా దేవతామూర్తిని తీసుకువచ్చిన శిల్పిని మరియు ఆతని పరిచారకులను కూడ బుద్ధిమంతుడైన ద్విజుడు వస్త్రాభరణములతో రత్నములతో పూజింపవలెను. అటుతర్వాత యజమాని వారిని క్షమింపుమని ప్రార్థింపవలెను. అప్పుడు దేవతామూర్తిని లేదా లింగమును దర్భలు మొదలగు వాటితో సిద్ధము చేసిన ప్రస్తరణముపై ఉంచి ఆ మూర్తికి నేత్రజ్యోతిని అనగా నేత్రోన్మీలనము కావించవలెను. (దీనినే నేత్రోద్ధరణము అని కూడ అందురు.)

అక్ష్ణోరుద్ధరణం వక్ష్యే లింగస్యాపి సమాసతః ।
సర్వతస్తు బలిం దద్యాత్ సిద్ధార్థఘృతపాయసైః ॥ 29 ॥

శుక్లపుష్పైరలంకృత్య ఘృతగుగ్గులు ధూపితమ్ ।
విప్రాణాం చార్చనం కుర్యాత్ యావచ్ఛక్త్యా చ దక్షిణామ్ ॥ 30 ॥

ఇపుడు నేత్రోద్ధరణ ప్రక్రియను గురించి సంక్షిప్తముగా తెలిపెదను. సర్వప్రథమము ఆ దేవతామూర్తిని తెల్లని పువ్వులతో అలంకరించి నెయ్యి, గుగ్గులు, ధూపాదులతో అర్చించి, తెల్లని ఆవలు, ఘృతము, పాయసము మొదలగు వాటితో బలి సమర్పింపవలెను. తర్వాత యథాశక్తి దక్షిణలతో ద్విజులను అర్చింపవలెను.

గాం మహీం కనకం చైవ స్థాపకాయ నివేదయేత్ ।
లక్షణం కారయేద్ భక్త్యా మంత్రేణానేన వై ద్విజః ॥ 31 ॥

ఓం నమో భగవతే తుభ్యం శివాయ పరమాత్మనే ।
హిరణ్యరేతసే విష్ణో విశ్వరూపాయ తే నమః ॥ 32 ॥

మన్త్రోఽయం సర్వదేవానాం నేత్రజ్యోతిఃష్వపి స్మృతః ।

తదనంతరం భూ-గో-హిరణ్యాది దానములతో స్థాపకుని (ప్రధానఋత్వికుడు) అర్చించాలి. అపుడు ద్విజుడు భక్తి పూర్వకంగా "ఓం నమో భగవతే తుభ్యం శివాయపరమాత్మనే, హిరణ్యరేతసే విష్ణో! విశ్వరూపాయ తే నమః" అను మంత్రముతో ఆ దేవతామూర్తికి లాంఛనం చేయవలెను. (ప్రణవ స్వరూపుడవు, భగవానుడవు, శివస్వరూపుడవు, పరమాత్ముడవు, హిరణ్యరేతస్కుడవు, సర్వాంతర్యామివి, విశ్వరూపుడవు అయిన నీకు నమస్సులు అని మంత్రమునకు అర్థము). (ఈ మంత్రము నేత్రోన్మీలన కార్యము జరుపునప్పుడు సకల దేవతల విషయమునందును ఉపయోగించవలసినది.)

ఏవమామంత్ర్య దేవేశం కాంచనేన విలేఖయేత్ ॥ 33 ॥

మంగల్యాని చ వాద్యాని బ్రహ్మఘోషం సగీతకమ్ ।
సిద్ధ్యర్థం కారయేద్విద్వాన్ అమంగల్య వినాశనమ్ ॥ 34 ॥

లక్షణోద్ధరణం వక్ష్యే లింగస్య సుసమాహితః ।
త్రిధా విభజ్య పూజయాం లక్షణం స్యాద్విభాగకమ్ ॥ 35 ॥

లేఖాత్రయం తు కర్తవ్యం యవాష్టాన్తరసంయుతమ్ ।
న స్థూలం న కృశం తద్వన్న వక్రం ఛేదవర్జితమ్ ॥ 36 ॥

ఈ మంత్రమును పఠిస్తూ దేవుని ఆ మూర్తిలోనికి ఆవాహనం చేసి ఒక బంగారు ఉపకరణంతో మూర్తిపై లిఖించవలెను. ఈ ప్రక్రియ సంపూర్ణంగా సరైన రీతిలో సిద్ధించుటకై సంప్రదాయాలు తెలిసిన స్థాపకుడు మంగళ వాద్యధ్వనులు, వేదధ్వనులు మరియు చక్కని గీతములు మొదలగు వాటితో జరిపించవలెను. మంగళప్రదములైన

వీటివలన అమంగళము లైనవన్నీ నశిస్తాయి. తర్వాత సంయమితేంద్రుడైన స్థాపకుడు లింగమునకు లేదా అర్చామూర్తికి లక్షణోద్ధారము జరుపవలెను. స్వస్థచిత్తుడైన స్థాపకుడు లింగమును మూడు భాగములుగా భావించుకుని అపుడు ఎనిమిది యవల ఎడముండునట్లు చూసుకొని మూడు అడ్డరేఖలు గీయవలెను. ఆ రేఖలు స్థూలములు కాకుండా అలాగే అతిసూక్ష్మములు కాకుండా, వక్రము లేకుండా, మధ్యలో ఛేదము లేకుండా కూడ ఉండునట్లు జాగ్రత్తపడవలెను.

నిమ్నం యవప్రమాణేన జ్యేష్ఠలింగస్య కారయేత్ ।
సూక్ష్మాస్తతస్తు కర్తవ్యా తథా మధ్యమకే న్యసేత్ ॥ 37 ॥

అష్టభక్తం తతః కృత్వా త్యక్త్వా భాగత్రయం బుధః ।
లంబయేత్సప్తరేఖాస్తు పార్శ్వయోరుభయోః సమాః ॥ 38 ॥

తావత్ ప్రలంబయేద్విద్వాన్ యావద్భాగచతుష్టయమ్ ।
భ్రామ్యతే పంచభాగోర్ధ్వం కారయేత్ సంగమం తతః ॥ 39 ॥

రేఖయోః సంగమే తద్వత్ పృష్ఠే భాగద్వయం భవేత్ ।
ఏవమేతత్సమాఖ్యాతం సమాసాల్లక్షణం మయా ॥ 40 ॥

జ్యేష్ఠలింగమునందు క్రిందిరేఖ యవపరిమాణముతో నుండవలెను. మధ్యభాగమున నుండు రేఖ దానికన్న కొంచెము సూక్ష్మముగా ఉండవలెను. తర్వాత లింగపు నిలువుటెత్తును ఎనిమిది భాగములు చేసి పై మూడు భాగాలను వదిలి బుద్ధిమంతుడైన ద్విజుడు అక్కడి నుండి లోగల చెక్కిన అడ్డరేఖలకు రెండు పార్శ్వములందును వచ్చునట్లు సమముగా ఉండునట్టి సప్తరేఖలు గీయవలెను. తర్వాత వాటిలో నాలుగవ భాగమందలిరేఖ దిగువ కొన ఐదవ భాగమందలి రేఖపైనున్న కొనను తాకునట్లు ఆ రెంటిని కలుపవలెను. ఇట్లు రేఖాద్వయ సంగమస్థానమున మరియు పృష్ఠభాగమునందును రెండు భాగము లేర్పడునట్లు విద్వాంసుడు చూచుకొనవలెను. ఇట్లు లింగోద్ధారణ విధానమును మీకు సంక్షిప్తముగా తెలిపితిని.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రతిష్ఠానుకీర్తనం నామ
చతుఃషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥264॥

శ్రీ మత్స్యమహాపురాణమున ప్రతిష్ఠానుకీర్తనమను
రెండువందల అరవైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచషష్ట్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైఐదవ అధ్యాయం

అధివాసనవిధిః - అధివాసన విధి

సూత ఉవాచ - సూతమహర్షి చెప్పాడు.

అతః పరం ప్రవక్ష్యామి మూర్తిపానాం తు లక్షణమ్ ।
స్థాపకస్య సమాసేన లక్షణం శృణుత ద్విజాః ॥ 1 ॥

ఓ ద్విజులారా ! నేను ఇప్పుడు మూర్తులను రక్షించు మరియు మూర్తులను ప్రతిష్ఠించు వారియొక్క లక్షణములను సంక్షిప్తముగా వివరింతును వినుము.

సర్వావయవసంపూర్ణో వేదమంత్రవిశారదః ।
పురాణవేత్తా తత్త్వజ్ఞో దమ్భలోభవివర్జితః ॥ 2 ॥

కృష్ణసారమయే దేశే య ఉత్పన్నః శుభాకృతిః ।
శౌచాచారపరో నిత్యం పాషండకులనిఃస్పృహః ॥ 3 ॥

సమః శత్రౌ చ మిత్రే చ బ్రహ్మోపేంద్ర హరప్రియః ।
ఊహాపోహార్థతత్త్వజ్ఞో వాస్తుశాస్త్రస్య పారగః ॥ 4 ॥

స్థాపకుడు అయినవాడు సర్వావయవసంపూర్ణుడు అనగా ఎటువంటి అంగవైకల్యము లేనివాడు, వేదమంత్ర విశారదుడు, పురాణములన్నియు తెలిసినవాడు, తత్త్వజ్ఞుడు, దంభము లోభము మొదలగు గుణములు లేనివాడు, నల్లని చారలు కలిగిన జింకలుండు దేశమున జన్మించినవాడు, చక్కని ఆకారము కలవాడు, నిత్యము పవిత్రములైన ఆచారవ్యవహారములందు ఆసక్తి కలవాడు, పాషండులయందు (అనగా వేదమును నిందించువారు,) ధర్మమును అపహాస్యము చేయువారియందు ఎట్టి ఆసక్తి లేనివాడును, శత్రువులయందు, మిత్రులయందు కూడ సమభావము కలవాడు, ఊహాపోహార్థతత్త్వజ్ఞుడు (అనగా అవసరమైన వాటిని శాస్త్రనియమానుసారం ఊహించి తదనుగుణంగా ఆచరించువాడు,) అనావశ్యకములైన వాటిని వదిలివేయగల శక్తి కలవాడు మరియు వాస్తుశాస్త్రపారంగతుడు అయి ఉండవలెను.

ఆచార్యస్తు భవేన్నిత్యం సర్వదోషవివర్జితః ।
మూర్తిపాస్తు ద్విజాశ్చైవ కులీనా ఋజవస్తథా ॥ 5 ॥

ద్వాత్రింశత్ షోడశాఽథాపి అష్టౌ వా శ్రుతిపారగాః ।
జ్యేష్ఠమధ్యకనిష్ఠేషు మూర్తిపా వః ప్రకీర్తితాః ॥ 6 ॥

ఆచార్యుడు సర్వదోషవివర్జితుడై ఉండవలెను. అట్లే మూర్తిరక్షకులైన ద్విజులు కూడ సద్వంశము నందు జన్మించినవారై సత్ప్రవర్తన మరియు ఉదారమైన స్వభావము కలవారై ఉండవలెను. ఈ మూర్తిపులు జ్యేష్ఠ పరిమాణక

లింగప్రతిష్ఠయందైతే ముప్పదిరెండు మంది, మధ్యమపరిమాణక లింగప్రతిష్ఠయందైతే పదహారు మంది, కనిష్ఠపరిమాణక లింగప్రతిష్ఠయందైతే ఎనిమిదిమంది ఉండవలెను.

తతో లింగమథార్చాం వా నీత్వా స్నపనమండపమ్ ।
గీతమంగలశబ్దేన స్నపనం తత్ర కారయేత్ ॥ 7 ॥

పంచగవ్యకషాయేణ మృద్భిర్భస్మోదకేన వా ।
శౌచం తత్ర ప్రకుర్వీత వేదమంత్రచతుష్టయాత్ ॥ 8 ॥

తదనంతరం లింగమును లేదా అర్చామూర్తిని స్నానమండపమునకు తీసుకుని వెళ్ళి అక్కడ గీత మంగళ వాద్యములతో స్నానం చేయించవలెను. పంచగవ్యము తోను కషాయ మిశ్రిత జలముతోను, మృత్తికతోను, భస్మోదకముతోను, నాలుగు వేదమంత్రాలను పఠిస్తూ శౌచకర్మనిర్వహించవలెను.

సముద్ర జ్యేష్ఠ మంత్రేణ ఆపో దివ్యేతి చాపరః ।
యాసాం రాజేతి మంత్రస్తు ఆపోహిష్ఠేతి చాపరః ॥ 9 ॥

ఏవం స్నాప్య తతో దేవం పూజ్యగంధానులేపనైః ।
ప్రచ్ఛాద్య వస్త్రయుగ్మేన అభివస్త్రే త్యుదాహృతమ్ ॥ 10 ॥

ఉత్థాపయేత్తతో దేవముత్తిష్ఠ బ్రహ్మణస్పతే ।
ఆమూరజేతి చ తథా రథే తిష్ఠేతి చాపరః ॥ 11 ॥

రథే బ్రహ్మరథే వాఽపి ధృతాం శిల్పగణేన తు ।
ఆరోప్య చ తతో విద్వానాకృష్ణేన ప్రవేశయేత్ ॥ 12 ॥

"1. సముద్రజ్యేష్ఠాః, 2. యా ఆపో దివ్యా, 3. యాసాం రాజా, 4. ఆపోహిష్ఠా" అను ఈ నాలుగు వేదమంత్రములను పఠించుచు దేవుని ప్రతిమకు స్నపనము చేయించి గంధానులేపనాదులతో పూజించి "అభివస్త్రా" ఇత్యాది మంత్రమును ఉచ్చరించుచు నూతన వస్త్రయుగ్మముతో కప్పి, తదనంతరము"ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే", "ఆమూరజ" "రథే తిష్ఠన్ " ఇత్యాది మంత్రములను పఠించుచు దేవుని లేవదీయవలెను. తర్వాత ఆ మూర్తిని రథమునందు గాని బ్రహ్మరథము నందు కాని శిల్పుల సహాయముతో అధిరోహింపజేసి రథమును లాగుతు విద్వాంసుడైన ద్విజుడు ఆ మూర్తిని ప్రవేశింపజేయవలెను.

తతః ప్రాస్తీర్య శయ్యాయాం స్థాపయేచ్ఛనకైర్బుధః ।
కుశానాస్తీర్య పుష్పాణి స్థాపయేత్ ప్రాఙ్ముఖం తతః ॥ 13 ॥

తతస్తు నిద్రాకలశం వస్త్రకాంచనసంయుతమ్ ।
శిరోభాగే తు దేవస్య జపన్నేవం నిధాపయేత్ ॥ 14 ॥

ఆపోదేవీతి మంత్రేణ ఆపోఽస్మాన్మాతరోఽపి వా ।
తతో దుకూలపట్టైశ్చ ఛాద్య నేత్రోపధానకమ్ ॥ 15 ॥

దద్యాచ్ఛిరసి దేవస్య కౌశేయం వా విచక్షణః ।
మధునా సర్పిషాఽభ్యజ్య పూజ్య సిద్ధార్థకైస్తతః ॥ 16 ॥

ఆప్యాయస్వేతి మంత్రేణ యాతే రుద్ర శివేతి చ ।
ఉపవిశ్యార్చయేద్దేవం గంధపుష్పైః సమన్తతః ॥ 17 ॥

తర్వాత రథము నుండి దేవుని, అర్చామూర్తిని నెమ్మదిగా దించవలెను. అచ్చట దర్భలను పరిచి వాటిపై పువ్వులను చల్లవలెను. అపుడు అట్లు ఏర్పరిచిన శయ్యయందు మూర్తిని ప్రాఙ్ముఖముగా పడుకొనపెట్టవలెను. తర్వాత "ఆపోదేవి" అను మంత్రమునుగాని "ఆపోఽస్మాన్మాతరః" అను మంత్రమును గాని పఠించుచు లోపల బంగారమును ఉంచి, నూతనవస్త్రములను చుట్టిన నిద్రాకలశమును దేవుని యొక్క శిరోభాగము వైపు ఉంచవలెను. తదనంతరము తెల్లని వస్త్రముతో దేవుని కప్పవలెను. తర్వాత ఉన్ని వస్త్రముతో చేసిన దిండును కాని పట్టువస్త్రమును కాని దిండువలె తలక్రింద ఉంచవలెను. అపుడు దేవుని దగ్గర కూర్చొని దేవునికి తేనే నెయ్యి మొదలగు వాటితో అభ్యంజనము చేయవలెను. తెల్లని ఆవాలతో పూజించవలెను. ఇంకనూ "ఆప్యాయస్వ" "యాతే రుద్ర" ఇత్యాది మంత్రములు పఠించుచు గంధపుష్పాదులతో పూజించవలెను.

సితం ప్రతిసరం దద్యాద్బార్హస్పత్యేతి మన్త్రతః ।
దుకూలప ట్టైః కార్పాసైః నానాచిత్రైరథాపి వా ॥ 18 ॥

ఆచ్ఛాద్యదేవం సర్వత్ర ఛత్రచామరదర్పణమ్ ।
పార్శ్వతః స్థాపయేత్తత్ర వితానం పుష్పసంయుతమ్ ॥ 19 ॥

రత్నాన్యోషధయస్తత్ర గృహోపకరణాని చ ।
భాజనాని విచిత్రాణి శయనాన్యాసనాని చ ॥ 20 ॥

అభి త్వా శూరమంత్రేణ యథావిభవతో న్యసేత్ ।

తర్వాత "బర్హస్పత్య" అను మంత్రమునుచ్చరించుచు దేవునికి తెల్లని ప్రతిసరమును ధరింపజేయవలెను. కార్పాసము (దూది) తో గాని పట్టుతో గానీ నేయబడి నానావిధ వర్ణములు చిత్రములు గల వస్త్రములను దేవునిపై కప్పి ఆతనికి రెండు వైపుల ఛత్ర చామర దర్పణాదులను, పుష్పములతో కూడిన వితానమును ఉంచవలెను. అంతేకాక రత్నములు, ఓషధులు, గృహోపకరణములు, వివిధమైన పాత్రలు, శయనోపకరణములు, ఆసనములు మొదలగు వాటిని "అభిత్వాశూర" ఇత్యాది మంత్రమును పఠించుచు యజమాని తన శక్తిననుసరించి పూజించవలెను.

క్షీరం క్షౌద్రం ఘృతం తద్వద్భక్ష్యభోజ్యాన్నపాయసైః ॥ 21 ॥

షడ్విధైశ్చరసైస్తద్వత్ సమంతాత్పరిపూజయేత్ ।
బలిం దద్యాత్ ప్రయత్నేన మన్త్రేణానేన భూరిశః ॥ 22 ॥

త్ర్యమ్బకం యజామహే ఇతి సర్వతః శనకైర్భువి ।
మూర్తిపాన్ స్థాపయేత్పశ్చాత్ సర్వదిక్షు విచక్షణః ॥ 23 ॥

చతురో ద్వారపాలాంశ్చ ద్వారేషు వినివేశయేత్ ।
శ్రీసూక్తం పవమానం చ సోమసూక్తం సుమంగలమ్ ॥ 24 ॥

తథా చ శాంతికాధ్యాయం ఇంద్రసూక్తం తథైవ చ ।
రక్షోఘ్నం చ తథా సూక్తం పూర్వతో బహ్వృచో జపేత్ ॥ 25 ॥

మరియు పాలు, తేనె, నెయ్యి, భక్ష్యభోజ్యాన్నపాయసాదులతోను, షడ్విధరసములతోను "త్ర్యంబకం యజామహే" అను మంత్రమును పఠిస్తూ, పూజాదులు నిర్వహిస్తూ ప్రయత్నపూర్వకంగానే అధికమైన బలిని సమర్పించవలెను. తర్వాత విద్వాంసుడైన ద్విజుడు మూర్తిపములను అన్ని దిక్కులయందు కూర్చుండబెట్టవలెను. అటు పిమ్మట నాలుగు ద్వారములయందు నలుగురు ద్వారపాలకులను స్థాపించవలెను. అప్పుడు "బహ్వృచుడు" అను వేదబ్రాహ్మణుడు తూర్పుదిశాభిముఖుడై శ్రీసూక్తమును, పవమానసూక్తమును, మంగళప్రదమైన సోమసూక్తమును, శాంతికాధ్యాయములను, ఇంద్రసూక్తమును, రక్షోఘ్నసూక్తము మొదలగు వాటిని జపించవలెను.

రౌద్రం పురుషసూక్తం చ శ్లోకాధ్యాయం సశుక్రియమ్ ।
తథైవ మండలాధ్యాయ మధ్వర్యుర్దక్షిణే జపేత్ ॥ 26 ॥

వామదేవం బృహత్సామ జ్యేష్ఠసామ రథన్తరమ్ ।
తథా పురుషసూక్తం చ రుద్రసూక్తం సశాన్తికమ్ ॥ 27 ॥

భారుండాని చ సామాని ఛ్ఛందోగః పశ్చిమే జపేత్ ।
అథర్వాంగిరసం తద్వన్నీలం రౌద్రం తథైవ చ ॥ 28 ॥

తథాఽపరాజితా దేవీ సప్తసూక్తం సరౌద్రకమ్ ।
తథైవ శాన్తికాధ్యాయ మథర్వాశ్చోత్తరే జపేత్ ॥ 29 ॥

అట్లే అధ్వర్యుశాఖాధ్యాయియైన ద్విజుడు దక్షిణాభిముఖుడై రుద్రసూక్తమును, పురుషసూక్తమును, శుక్రియానువాకములతో కూడిన శ్లోకాధ్యాయములను జపించవలెను. సామవేదాధ్యాయియైన ద్విజుడు పశ్చిమాభిముఖుడై వామదేవ, బృహత్సామ, రథంతర, జ్యేష్ఠ సామములను, శాంతికాధ్యాయముతో కూడిన పురుషసూక్తమును, రుద్రసూక్తమును మొదలగు వాటిని పఠించవలెను. అట్లే అథర్వవేదపండితుడు ఉత్తరాభిముఖుడై అథర్వాంగిరసమంత్రభాగమును, నీలాసూక్తమును, రౌద్రసూక్తమును, అపరాజితాదేవి సూక్తసప్తకమును శాంతికాధ్యాయమును పఠించవలెను.

శిరఃస్థానే తు దేవస్య స్థాపకో హోమమాచరేత్ ।
శాంతికైః పౌష్టికైస్తద్వన్మంత్రైర్వ్యాహృతిపూర్వకైః ॥ 30 ॥

పలాశోదుంబరాశ్వత్థా అపామార్గః శమీ తథా ।
హుత్వా సహస్రమేకైకం దేవం పాదే తు సంస్పృశేత్ ॥ 31 ॥

తతో హోమసహస్రేణ హుత్వా హుత్వా తతస్తతః ।
నాభిమధ్యం తథా వక్షః శిరశ్చాప్యాలభేత్ పునః ॥ 32 ॥

హస్తమాత్రేషు కుండేషు మూర్తిపాః సర్వతో దిశమ్ ।
సమేఖలేషు తే కుర్యుః యోనివక్త్రేషు చాదరాత్ ॥ 33 ॥

దేవుని శిరఃస్థానమునందు ప్రధాన ఋత్విజుడైన స్థాపకుడు వ్యాహృతి పూర్వకములగు శాంతిక మరియు పౌష్టికమంత్రములతో పలాశము, ఉదుంబరము, అశ్వత్థము, అపామార్గము శమీ, మొదలగు వృక్షముల యొక్క సమిధలతో ఒక్కొక్క ఆవృత్తిలో హెూమము చేసి ఒక్కొక్క సహస్రము యొక్క చివరన క్రమంగా దేవుని పాదములను, నాభిమధ్యమును, వక్షఃస్థలమును, శిరస్సును స్పృశించవలెను. అన్నిదిశలయందున్న మూర్తులు మేఖలాలతో కూడి, హస్తమాత్రపరిమాణం కల కుండములందు ఆదరపూర్వకముగా భక్తితో హెూమము చేయుచుందురు. ఈ కుండములకు వక్త్రభాగమునందు యోని ఉండవలెను.

వితస్తిమాత్రా యోనిః స్యాద్గజోష్ఠసదృశీ తథా ।
ఆయతా ఛిద్రసంయుక్తా పార్శ్వతః కలయోఛ్ఛ్రితా ॥ 34 ॥

కుండాత్కలానుసారేణ సర్వతశ్చతురంగులా ।
విస్తారేణోఛ్ఛ్రయా తద్వచ్చతురస్రా సమా భవేత్ ॥ 35 ॥

వేదీ భిత్తిం పరిత్యజ్య త్రయోదశభిరంగులైః ।
ఏవం నవసు కుండేషు లక్షణం చైవ దృశ్యతే ॥ 36 ॥

ఈ యోని దీర్ఘచతురస్రాకృతితో వితస్తి అనగా పన్నెండు భారతీయాంగళముల మాత్రపు పొడవును ఆరు లేదా ఏడు అంగుళముల వెడల్పును కలిగియుండవలెను. ఇది గజోష్ఠము అనగా ఏనుగు పెదవి వంటి ఆకారము కలిగి ఉండవలెను. ఇంకనూ ఆయతము పన్నెండు భారతీయాంగుళముల పొడవును ఆరుకాని ఏడుకాని అంగుళముల వెడల్పును కలిగి నడుమ కూర్మపృష్ఠమువలె ఎత్తుగా నుండవలెను. కుండము ఒక హస్తము అనగా ఇరువదినాలుగు అంగుళముల పొడవు వెడల్పు లోతులు కలిగి ఉండవలెను. ఈ కుండములన్నియును వేదిభిత్తి నుండి పదమూడు అంగుళముల దూరములో ఉండవలెను. ఈ విధముగా ఈ సందర్భమున ఉండవలసిన తొమ్మిది కుండములకును 'యోని' నిర్మాణము నియమానుసారము చేయవలెను.

ఆగ్నేయశక్రయామ్యేషు హెూతవ్యముదగాననైః ।
మూర్తిపా లోకపాలేభ్యో మూర్తిభ్యః క్రమశస్తథా ॥ 37 ॥

తథా మూర్త్యధిదేవానాం హెూమం కుర్యాత్సమాహితః ।
వసుధా వసురేతాశ్చ యజమానో దివాకరః ॥ 38 ॥

జలం వాయుస్తథా సోమ ఆకాశశ్చాష్టమః స్మృతః ।
దేవస్య మూర్తయస్త్వష్టావేతాః కుండేషు సంస్మరేత్ ॥ 39 ॥

తర్వాత ఆగ్నేయ కోణమునందు, తూర్పుదిశయందు, దక్షిణదిశయందు ఉన్నట్టి ఋత్విజులు నిష్ఠతో ఉత్తరదిశాభిముఖులై మూర్తులకు, లోకపాలకులకు మరియు దేవతామూర్తులకు క్రమముగా పూజాదులు నిర్వహించ వలెను. తదనంతరము మూర్త్యధిదేవతలకు సమాహితచిత్తులై హెూమములు చేయవలెను. 1. పృథివి 2. జలము

3. అగ్ని 4. వాయువు 5. ఆకాశము 6. సూర్యుడు 7. చంద్రుడు 8. యజమానుడు అను ఈ ఎనిమిది మూర్తులకలయికయే పరమశివుడు. అందుకని అష్టమూర్తులను కుండములయందు చక్కగా స్మరించుచూ పూజింపవలెను.

ఏతాసామధిపాన్ వక్ష్యే పవిత్రాన్మూర్తినామతః ।
పృథ్వీం పాతి చ శర్వశ్చ పశుపశ్చాగ్నిమేవ చ ॥ 40 ॥

యజమానం తథైవోగ్రో రుద్రశ్చాదిత్యమేవ చ ।
భవో జలం సదా పాతి వాయుమీశాన ఏవ చ ॥ 41 ॥

మహాదేవస్తథా చంద్రః భీమశ్చాకాశమేవ చ ।
సర్వదేవప్రతిష్ఠాసు మూర్తిపాః హ్యేత ఏవ తు ॥ 42 ॥

ఏతేభ్యో వైదికైర్మంత్రైః యథాస్వం హోమమాచరేత్ ।

ఇపుడు ఈ అష్టమూర్తుల అధిదేవతలను తెలుపుదును. పృథివికి శర్వుడు, అగ్నికి పశుపతి, యజమానునకు ఉగ్రుడు, ఆదిత్యునికి రుద్రుడు, జలమునకు భవుడు, వాయువునకు ఈశానుడు, చంద్రునికి మహాదేవుడు, ఆకాశమునకు భీముడు. మూర్తిప్రతిష్ఠాప్రక్రియలయందు శివుని విషయమున వీరే మూర్తులు=అధిదేవతలు. వీరిని కూడ యథావిధిగా పూజించుట ఆవశ్యకము. ఈ దేవతలకు సంబంధించిన వేదమంత్రములతో హోమములు చేయవలెను.

తథా శాంతిఘటం కుర్యాత్ ప్రతికుండేషు సంన్యసేత్ ॥ 43 ॥

శతాంతే వా సహస్రాంతే సంపూర్ణాహుతిరిష్యతే ।
సమపాదః పృథివ్యాం తు ప్రశాంతాత్మా వినిక్షిపేత్ ॥ 44 ॥

ఆహుతీనాం తు సమ్పాతం పూర్ణకుమ్భేషు వై న్యసేత్ ।
మూలమధ్యోత్తమాంగేషు దేవం తేనావసేచయేత్ ॥ 45 ॥

స్థితం చ స్నాపయేత్తేన సమ్పాతాహుతి వారిణా ।

అట్లు హోమమాచరించున్నపుడు ప్రతికుండపు సమీపమున శాంతి ఘటములనుంచవలెను. నూరు లేదా వేయి ఆహుతులు కాగానే ఒక్కొక్కసారి పూర్ణాహుతి జరుపవలెను. పూర్ణాహుతి సామగ్రిని నేలపై సమపాదుడై నిలిచి హోమకుండమునందు వేయవలెను. ప్రశాంతచిత్తుడై ఉండవలెను. ఆహుతులు సమర్పించునపుడు దర్వియందు మిగిలిన ఆహుతి శేషమును పూర్ణఘటములయందే వేయవలెను.తర్వాత వీటితో మిశ్రితమైన జలముతోనే దేవుని మూల మధ్యమోత్తమాంగములను (పాదములు, నాభిశిరస్సు) చక్కగా తడుపవలెను. అటు తర్వాత దేవుని నిలువబెట్టి ఆహుతిశేష మిశ్రితజలముతో స్నపనము కూడ చేయించవలెను.

ప్రతియామేషు ధూపం తు నైవేద్యం చందనాదికమ్ ॥ 46 ॥

పునఃపునః ప్రకుర్వీత హోమః కార్యః పునః పునః ।
పునః పునశ్చ దాతవ్యా యజమానేన దక్షిణా ॥ 47 ॥

సితవస్త్రైశ్చ తే సర్వే పూజనీయాః సమన్తతః ।
విచిత్రైర్హేమకటకైః హేమసూత్రాంగులీయకైః ॥ 48 ॥

వాసోభిః శయనీయైశ్చ ప్రతియామే చ శక్తితః ।
భోజనం చాపి దాతవ్యం యావత్స్యాదధివాసనమ్ ॥ 49 ॥

ప్రతి యామమునందు చందనోదకముతోడను ధూపదీపనైవేద్యాదులతోడను పూజించవలెను. పర్యాయ క్రమమున మరల మరల హోమము చేయుచుండవలెను. ప్రతి పర్యాయము యజమానుడు ఋత్విజులకు దక్షిణలీయవలెను. ఇంకనూ తెల్లని వస్త్రములు, బంగారు కడియములు, బంగారు సూత్రములు, బంగారు ఉంగరములు, వాసయోగ్యమైన మరియు శయనయోగ్యమైన ఉపకరణములు మొదలగు వాటితో సమ్మానించవలెను. అధివాసనము సంపూర్ణమగు వరకు భోజనాదులు ఏర్పరచవలెను.

బలిస్త్రిసంధ్యం దాతవ్యో భూతేభ్యో సర్వతోదిశమ్ ।
బ్రాహ్మణాన్ భోజయేత్ పూర్వం శేషాన్ వర్ణాంస్తు కామతః ॥ 50 ॥

రాత్రౌ మహోత్సవః కార్యో నృత్యగీతకమంగలైః ।
సదా పూజ్యాః ప్రయత్నేన చతుర్థీకర్మయావతా ॥ 51 ॥

త్రిరాత్రమేకరాత్రం వా పంచరాత్రమథాపి వా ।
సప్తరాత్రమథో కుర్యాత్ క్వచిత్ సద్యోఽధివాసనమ్ ॥
సర్వయజ్ఞఫలో యస్మాదధివాసోత్సవః సదా ॥ 52 ॥

అంతేకాక త్రికాల సంధ్యాసమయములలోనూ అన్ని దిశలయందును భూతబలి తప్పనిసరిగా వేయుచుండ వలెను. ప్రతిపూటలోను మొదట బ్రాహ్మణులకు అనంతరము ఇతర వర్ణముల వారికందరికిని యథేష్టముగా భోజనములు పెట్టుచుండవలెను. నృత్యగీతాది మంగళప్రదములైన కార్యక్రమాలతో ప్రతిరాత్రియందు మహోత్సవాలు జరుపుచుండవలెను. చతుర్థీకర్మ అనగా ప్రతిష్ఠాక్రియముగియు వరకు అందరిని ప్రయత్న పూర్వకముగా పూజించవలెను. ఇట్లు ఈ అధివాసన క్రియను ఒకటి, మూడు, ఐదు లేదా ఏడు(అహో) రాత్రులపాటు జరుపవలెను. ఈ అధివాసోత్సవము సర్వయజ్ఞఫలమునిచ్చును కావున ఎల్లప్పుడు శ్రద్ధగా నిర్వహించవలసినది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే అధివాసనవిధిర్నామ
పంచషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥265॥

శ్రీ మత్స్యమహాపురాణమున అధివాసనవిధి యను
రెండువందల అరవైఐదవ అధ్యాయం సమాప్తం.

త్రిషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైఆరవ అధ్యాయం
ప్రతిష్ఠానుకీర్తనమ్ - ప్రతిష్ఠానుకీర్తనం

సూతః ఉవాచ - సూతుడు చెప్పాడు.

కృత్వాఽధివాసం దేవానాం శుభం కుర్యాత్సమాహితః ।
ప్రాసాదస్యానురూపేణ మానం లింగస్య వా పునః ॥ 1 ॥

పుష్పోదకేన ప్రాసాదం ప్రోక్ష్య మంత్రయుతేన తు ।
పాతయేత్పక్షసూత్రం తు ద్వారసూత్రం తథైవ చ ॥ 2 ॥

ఆశ్రయేత్ కించిదీశానీం మధ్యం జ్ఞాత్వా దిశం బుధః ।
ఈశానీమాశ్రితం దేవం పూజయన్తి దివౌకసః ॥ 3 ॥

ఆయురారోగ్యఫలదమథోత్తర సమాశ్రితమ్ ।
శుభం స్యాదశుభం ప్రోక్తమన్యథా స్థాపనం బుధః ॥ 4 ॥

ప్రాసాద పరిమాణమును బట్టిగాని లింగ పరిమాణమును బట్టిగాని. దేవతామూర్తులకు అధివాసనవిధిని ముగించిన పిదప యజమానుడు సమాహితచిత్తుడై పుణ్యాహకర్మను ఆచరించవలెను. పుణ్యాహమంత్రములను పఠించుచు పుష్పోదకముతో ప్రాసాదమును ప్రోక్షణచేయవలెను. తర్వాత పక్షసూత్రమును ద్వారసూత్రమును కూడ ఏర్పర్చుకొనవలెను. (దేవాలయ ప్రధానద్వారపు నడిమి నుండి నేరుగా గర్భగుడిలోని పడమటి గోడయొక్క అంచు వరకు ప్రాక్పశ్చిమములుగా ప్రసరింపజేయు సూత్రమును ద్వారసూత్రమందురు. అట్లే గర్భగుడిలోని ప్రాక్ పశ్చిమాయామముల మధ్యలోని బిందువునకు నేరుగా దక్షిణోత్తరములుగా ప్రసరింపజేయు సూత్రమును పక్షసూత్రము అందురని శాస్త్రములు తెలుపుచున్నవి). కనుక దేవతామూర్తిని ప్రతిష్ఠించవలసిన గర్భగృహపు మధ్యస్థానమును చక్కగా గుర్తించి దానికి కొంచెము ఈశాన్యదిశగా నుండునట్లు ప్రతిమను ప్రతిష్ఠించవలెను. ఈశాన్యదిశను ఆశ్రయించియున్న దేవతామూర్తిని దేవతలు పూజింతురు. ఇట్లు ప్రతిష్ఠించినచో ఆయురారోగ్య- ఐశ్వర్యములను, చక్కని ఫలప్రాప్తిని కలిగించును. శుభప్రదమగును. దీనికి విరుద్ధముగా ప్రతిష్ఠాదులు కావించినచో అశుభమునకు హేతువగునని పండితులు అందురు.

అధః కూర్మశిలా ప్రోక్తా సదా బ్రహ్మశిలాఽధికా ।
ఉపర్యవస్థితా తస్యా బ్రహ్మభాగాఽధికాశిలా ॥ 5 ॥

తతస్తు పిండికా కార్యా పూర్వోక్తైర్మానలక్షణైః ।
తతః ప్రక్షాలికాం కృత్వా పంచగవ్యేన పిండికామ్ ॥ 6 ॥

కషాయతోయేన పునర్మన్త్రయుక్తేన సర్వతః ।
దేవతార్చాశ్రయం మంత్రం పిండికాసు నియోజయేత్ ॥ 7 ॥

దేవతామూర్తిని ప్రతిష్ఠించుస్థానమున మొదట క్రిందిభాగమున "కూర్మశిల" ను ఉంచవలెను. దానిపైన "బ్రహ్మశిల" యుండును. ఇది కూర్మశిలకంటే అధికపరిమాణమంలో ఉండవలెను. దానిపైన పూర్వోక్తములగు లక్షణములతో 'పిండికా' అనగా 'పీఠిక' శిలను ప్రతిష్ఠించవలెను. తర్వాత ఆ పీఠికను పంచగవ్యాదులతో, కషాయజలముతోను మంత్రోచ్చారణపూర్వకముగా అంతటా ప్రక్షాళనము చేయవలెను. దేవతార్చామంత్రములనే పీఠికా ప్రక్షాళనమునకు వినియోగించవలెను.

తత ఉత్థాప్య దేవేశముత్తిష్ఠ బ్రహ్మణేతి చ ।
ఆనీయ గర్భభవనం పీఠాన్తే స్థాపయేత్ పునః ॥ 8 ॥

అర్ఘ్యపాద్యాదికం తత్ర మధుపర్కం ప్రయోజయేత్ ।
తతో ముహూర్తం విశ్రమ్య రత్నన్యాసం సమాచరేత్ ॥ 9 ॥

అప్పుడు దేవతార్చామూర్తిని "ఉత్తిష్ఠ బ్రహ్మణస్పతే" అను మంత్రముతో లేవదీసి గర్భాలయములోనికి తీసుకొనివచ్చి పీఠికాంతమున స్థాపించవలెను, తదనంతరం ఒక ముహూర్తకాలం తర్వాత అర్ఘ్యపాద్యాదులతో మధుపర్కంతో దేవతార్చామూర్తిని పూజించి రత్నన్యాసమును ఆచరించవలెను.

వజ్రమౌక్తిక వైడూర్యశఙ్ఖస్ఫటికమేవ చ ।
పుష్పరాగేంద్రనీలం చ నీలం పూర్వాదిదిక్క్రమాత్ ॥ 10 ॥

తాలకం చ శిలావజ్రమంజనం శ్యామమేవ చ ।
కాక్షీ కాశీ సమాక్షీకం గైరికం చాదితః క్రమాత్ ॥ 11 ॥

వజ్రము, మౌక్తికము, వైడూర్యము, శంఖము, స్ఫటికము, పుష్యరాగము, ఇంద్రనీలము, నీలము, అను రత్నములను పూర్వాదిక్రమంగా అన్ని దిక్కులయందు ఉంచవలెను. అట్లే తాలకము, శిలావజ్రము, శ్యామాంజనము, కాక్షీ, కాసికము, మాక్షీకము మరయు గైరికము మొదలగు రసద్రవ్యములను కూడ అదే క్రమంలో ఉంచవలెను.

గోధూమం చ యవం తద్వత్తిలం ముద్గం తథైవ చ ।
నీవారమథ శ్యామాకం సర్షపం వ్రీహిమేవ చ ॥ 12 ॥

న్యస్య క్రమేణ పూర్వాది చందనం రక్తచందనమ్ ।
అగురుం చాంజనం చాపి ఉశీరం చ తతఃపరమ్ ॥ 13 ॥

వైష్ణవీం సహదేవీం చ లక్ష్మణాం చ తతఃపరమ్ ।
స్వర్లోకపాలనామ్నాతు న్యసేదోంకారపూర్వకమ్ ॥ 14 ॥

తర్వాత గోధుమలు యవలు, నువ్వులు, ముద్గములు, నీవారములు, శ్యామాకములు, సర్షపములు(ఆవాలు), వరి మొదలగు ధాన్యవిశేషములను కూడ అదే క్రమంగా ఉంచవలెను. తదనంతరం చందనం, రక్తచందనం, అగురు, అంజనం, వట్టివేళ్ళు, వైష్ణవి, సహదేవి, లక్ష్మణ మొదలైన మూలికౌషధీద్రవ్యాలను కూడ

పూర్వాది దిశలయందు క్రమంగా ఆయాలోకపాలకుల నామాలతో వారికి సంబంధించిన మంత్రములతో ఓంకారపూర్వకముగా ఉంచవలెను.

సర్వబీజాని ధాతూంశ్చ రత్నాన్యోషధయస్తథా ।
కాంచనం పద్మరాగం తు పారదం పద్మమేవ చ ॥ 15 ॥

కూర్మం ధరా వృషం తత్ర న్యసేత్పూర్వాదితః క్రమాత్ ।
బ్రహ్మస్థానే తు దాతవ్యాః సంహతాః స్యుః పరస్పరమ్ ॥ 16 ॥

కనకం విద్రుమం తామ్రం కాంస్యం చైవారకూటకమ్ ।
రజతం విమలం పుష్పం లోహం చైవ క్రమేణ తు ॥ 17 ॥

కాంచనం హరితాలం చ సర్వాభావేఽపి నిక్షిపేత్ ।
దద్యాద్బీజౌషధీస్థానే సహదేవీం యవానపి ॥ 18 ॥

తర్వాత బ్రహ్మస్థానమందు సర్వబీజములు, ధాతువులు, రత్నములు, ఓషదులు, కాంచనము, పద్మరాగము, పారదము, పద్మము, కూర్మము, ధర, వృషము మొదలగు వాటినన్నింటిని తూర్పునుండి మొదలుకొని క్రమంగా అన్ని దిశల యందుంచవలెను. ఇవన్నీ బ్రహ్మస్థానమునందు పరస్పరము కలిసిపోవును. ఇంకను కనకము, విద్రుమము, తామ్రము, కాంస్యము, ఆరకూటము (అనగా ఇత్తడి,) రజతము, విమలపుష్పము, లోహము మొదలగు వాటిని కూడ అదే క్రమంగా ఉంచవలెను. ఒకవేళ ఇవన్నియు లేనప్పుడు కాంచనము హరితాళము ఉంచవలెను. అట్లే బీజములు ఔషధులు ఇత్యాది స్థానములలో యవలు మరియు సహదేవిని ఉంచవచ్చును.

న్యాసమంత్రానతో వక్ష్యే లోకపాలాత్మకానిహ ।
ఇంద్రస్తు మహసా దీప్తః సర్వదేవాధిపో మహాన్ ॥ 19 ॥

వజ్రహస్తో మహాసత్త్వస్తస్మై నిత్యం నమో నమః ।
ఆగ్నేయః పురుషో రక్తః సర్వదేవమయః శిఖీ ॥ 20 ॥

ధూమకేతు రనాధృష్యః తస్మై నిత్యం నమో నమః ।
యమశ్చోత్పలవర్ణాభః కిరీటీ దండధృక్సదా ॥ 21 ॥

ధర్మసాక్షీ విశుద్ధాత్మా తస్మై నిత్యం నమో నమః ।

ఇప్పుడు లోకపాలకులకు సంబంధించిన న్యాసమంత్రములను తెలిపెదను.

మొదట ఇంద్రునకు :- "మహత్తరమైన కాంతి మంతులు, దేవతలందరికినీ ప్రభువు, చేతితో వజ్రాయుధము కలవాడు, మహాబలవంతుడు" అటువంటి ఇంద్రునకు నిత్యము నమస్కరింతును, నమస్కరింతును.

అగ్నికి :- "అగ్నిపురుషుడు, రక్తవర్ణుడు, సర్వదేవమయుడు, జ్వాలలుకలవాడు, ధూమమే ధ్వజముగా కలవాడు, అనాధృష్యుడు" అయినట్టి అగ్నిదేవునకు నిత్యము నమస్కరింతును, నమస్కరింతును.

యమునకు :- "నల్లకలువ వంటి వర్ణము కలవాడు, కిరీటి, దండధరుడు, ధర్మసాక్షి, విశుద్ధాత్ముడు" అయిన యమునికి నిత్యం నమస్కరింతును, నమస్కరింతును.

నిరృతిస్తు పుమాన్ కృష్ణః సర్వరక్షోఽధిపో మహాన్ ॥ 22 ॥

ఖడ్గహస్తో మహాసత్త్వః తస్మై నిత్యం నమో నమః ।
వరుణో ధవళో విష్ణుః పురుషో నిమ్నగాధిపః ॥ 23 ॥

పాశహస్తో మహాబాహుః తస్మై నిత్యం నమో నమః ।
వాయుశ్చ సర్వవర్ణో వై సర్వగంధవహః శుభః ॥ 24 ॥

పురుషో ధ్వజహస్తశ్చ తస్మై నిత్యం నమో నమః ।

నిరృతికి :- "నిరృతి నల్లని వర్ణముకల పురుషుడు, రాక్షసులందరికిని ప్రభువు, మహాత్ముడు, హస్తమునందు ఖడ్గము కలవాడు, మహాబలవంతుడు" అయిన నిరృతికి నిత్యం నమస్కరింతును, నమస్కరింతును.

వరుణునకు :- "ధవలవర్ణము కలవాడు, విష్ణుసదృశ పురుషుడు, నదులన్నింటికిని అధిపతి, పాశహస్తుడు, మహాబాహువు" అయినట్టి వరుణదేవునికి నిత్యమూ నమస్సులు, నమస్సులు.

వాయువునకు :- "సర్వవిధములైన వర్ణములు కలవాడు, సర్వవిధములైన వాసనలను వహించువాడు, శుభుడు, పురుషుడు, ధ్వజహస్తుడు" అయిన వాయుదేవునికి నిత్యము నమస్సులు నమస్సులు.

గౌరో యశ్చ పుమాన్ సౌమ్యః సర్వౌషధిసమన్వితః ॥ 25 ॥

నక్షత్రాధిపతిః సోమః తస్మై నిత్యం నమో నమః ।
ఈశానః పురుషః శుక్లః సర్వవిద్యాధిపో మహాన్ ॥ 26 ॥

శూలహస్తో విరూపాక్షః తస్మై నిత్యం నమో నమః ।
పద్మయోనిశ్చతుర్మూర్తిః వేదావాసః పితామహః ॥ 27 ॥

యజ్ఞాధ్యక్షశ్చతుర్వక్త్రః తస్మై నిత్యం నమో నమః ।
యోఽసావనన్తరూపేణ బ్రహ్మాండం సచరాచరమ్ ॥ 28 ॥

పుష్పవద్ధారయే న్మూర్ధ్ని తస్మై నిత్యం నమో నమః ।

సోమునకు :- "గౌర వర్ణము కలిగిన పురుషుడు, సౌమ్యుడు, సర్వౌషధిసమన్వితుడు, నక్షత్రములన్నింటికిని అధిపతి", అయినట్టి సోమునకు నిత్యము నమస్సులు, నమస్సులు.

ఈశానునకు :-"శుక్లవర్ణము గల పురుషుడు, సర్వవిద్యలకు అధిపతి, మహానుభావుడు, శూలహస్తుడు, విరూపాక్షుడు" అయిన ఈశానదేవునికి నిత్యము నమస్సులు నమస్సులు.

బ్రహ్మకు :-"పద్మమే జన్మస్థానముగా కలవాడు, చతుర్మూర్తి, వేదములే ఆవాసముగా కలవాడు, పితామహుడు, యజ్ఞాధ్యక్షుడు, చతుర్ముఖుడు", అయినట్టి బ్రహ్మదేవునికి నిత్యమూ నమస్సులు నమస్సులు.

అనంతునకు(ఆదిశేషుడు) :-“అనంతమైన రూపము కలవాడు, చరాచరములతో కూడిన బ్రహ్మాండము నంతటినీ పుష్పమువలె ధరించువాడు” అయిన అనంతునికి నిత్యము నమస్సులు నమస్సులు.

ఓంకార పూర్వకా హ్యేతే న్యాసే బలినివేదనే ॥ 29 ॥

మంత్రాః స్యుః సర్వకార్యాణాం వృద్ధిపుత్రఫలప్రదాః ।
న్యాసం కృత్వా తు మంత్రాణాం పాయసేనానులేపితమ్ ॥ 30 ॥

పటే నాచ్ఛాదయే చ్ఛుభ్రం శుక్లేనోపరి యత్నతః ।

న్యాసమునందు, బలినివేదనమునందు కూడ ఈ మంత్రములన్నింటిని ఓంకార పూర్వకముగా పఠించవలసినది. సర్వకార్యములలోను పఠింపదగిన ఈ మంత్రములు అభివృద్ధిని, పుత్రులను, ఇతర ఫలములన్నింటిని కలిగించును. ఇట్లు ఈ మంత్రములన్నింటిని పఠించుచు న్యాసము జరిపి మూర్తిని ప్రతిష్ఠించవలసిన పీఠిక యథాశక్తిగా ప్రయత్నశీలురై తెల్లని వస్త్రమును కప్పవలెను.

తత ఉత్థాప్య దేవేశం ఇష్టదేశే తు శోభనే ॥ 31 ॥

ధ్రువా ద్యౌ రితి మంత్రేణ శ్వభ్రోపరి నివేశయేత్ ।
తతః స్థిరీకృతస్యాస్య హస్తం దత్వా తు మస్తకే ॥ 32 ॥

ధ్యాత్వా పరమసద్భావాత్ దేవదేవం చ నిష్కలమ్ ।
దేవవ్రతం తథా సామ రుద్రసూక్తం తథైవ చ ॥ 33 ॥

ఆత్మాన మీశ్వరం కృత్వా నానాభరణభూషితమ్ ।
యస్య దేవస్య యద్రూపం తద్ధ్యానే సంస్మరేత్తథా ॥ 34 ॥

తర్వాత దేవేశుని అనగా దేవతార్చామూర్తిని పైకి లేవదీసి కొంతసేపు ఇష్టమైనట్టి శోభనప్రదేశమునందుంచి “ధ్రువా ద్యౌః ” అను మంత్రమును జపించుచు దేవుని ప్రతిష్ఠించవలసిన పీఠపు గోతియందు ఉంచవలెను. తర్వాత ఆ మూర్తిని స్థిరీకరించి దేవుని శిరస్సుపై యజమానుడు మరియు ఆచార్యుడు కూడ తమ హస్తమునుంచి పరమోత్కృష్టమైన శ్రద్ధతో సద్భావనతో నిష్కలరూపుడైన దేవుని ధ్యానించవలెను. అపుడు “దేవవ్రతసామమును”, “రుద్రసూక్త” మును కూడ పఠించవలెను. తర్వాత ఏ దేవతకు ఏ రూపముండునో ఆ రూపమునే మనసా ధ్యానింపలెను.

అతసీపుష్పసంకాశం శంఖచక్రగదాధరమ్ ।
సంస్థాపయామి దేవేశం దేవో భూత్వా జనార్దనమ్ ॥ 35 ॥

అవిసె పుష్పము వంటి వర్ణము కలవాడు, శంఖచక్ర గదాధరుడు, దేవేశుడూ అయిన జనార్దనుని స్వ ఆత్మగా భావించుచు ప్రతిష్ఠించుచున్నాను.

అక్షరం దశబాహుంచ చంద్రార్ధకృతశేఖరమ్ ।
గణేశం వృష సంస్థం చ స్థాపయామి త్రిలోచనమ్ ॥ 36 ॥

అక్షరుడు, దశభుజుడు, చంద్రశేఖరుడు, ప్రమథగణాధీశుడు, వృషభవాహనుడు మరియు త్రిలోచనుడూ అయిన పరమశివుని స్వ ఆత్మగా భావించుచు ప్రతిష్ఠించుచున్నాను.

ఋషిభిః సంస్తుతం దేవం చతుర్వక్త్రం జటాధరమ్ ।
పితామహం మహాబాహుం స్థాపయామ్యంబుజోద్భవమ్ ॥37 ॥

ఎల్లప్పుడు ఋషులచేత స్తుతింపబడువాడు, చతుర్ముఖుడు, జటాధరుడు, పితామహుడు, మహాబాహువు, కమలోద్భవుడు అయిన బ్రహ్మదేవుని స్వ ఆత్మగా భావించుచు ప్రతిష్ఠించుచున్నాను.

సహస్రకిరణం శాంతమప్సరోగణసంయుతమ్ ।
పద్మహస్తం మహాబాహుం స్థాపయామి దివాకరమ్ ॥ 38 ॥

సహస్ర కిరణుడు, శాంతస్వరూపుడు, అప్సరోగణ సంయుతుడు, పద్మహస్తుడు, మహాబాహువు, దివాకరుడూ అయినట్టి సూర్యదేవుని మనసా భావించుచూ ప్రతిష్ఠించుచున్నాను.

దేవమంత్రాన్తథా రౌద్రాన్ రుద్రస్య స్థాపనే జపేత్ ।
విష్ణోస్తు వైష్ణవాం స్తద్వద్ బ్రహ్మేన్ వై బ్రహ్మణో బుధః ॥ 39 ॥

సౌరాః సూర్యస్య జప్తవ్యా స్తథాఽన్యేషు తదాశ్రయాః ।
వేదమంత్రప్రతిష్ఠా తు యస్మాదానందదాయినీ ॥ 40 ॥

రుద్రుని ప్రతిష్ఠించునప్పుడు రౌద్ర మంత్రములను, విష్ణువును ప్రతిష్ఠించునప్పుడు ఆ దేవునికి సంబంధించిన మంత్రములను, బ్రహ్మదేవుని ప్రతిష్ఠించునప్పుడు ఆ దేవునికి సంబంధించినవి, అట్లే సూర్యప్రతిష్ఠకు సౌర మంత్రములను ఇంకా ఇతర దేవతలను ప్రతిష్ఠించునప్పుడు ఆయా దేవతలకు సంబంధించిన మంత్రములు పఠించవలెను. ఎందువలననగా వేద మంత్రోచ్చారణముతో ప్రతిష్ఠచేయుట ఆనందమును కలిగించునది కదా!

స్థాపయేద్యం తు దేవేశం తం ప్రధానం ప్రకల్పయేత్ ।
తస్య పార్శ్వస్థితానన్యాన్ సంస్మరేత్ పరివారితః ॥ 41 ॥

గణం నందిమహాకాళం వృషం భృంగిరిటిం గుహమ్ ।
దేవీం వినాయకం చైవ విష్ణుం బ్రహ్మాణమేవ చ ॥ 42 ॥

రుద్రం శక్రం జయన్తం చ లోకపాలాన్ సమన్తతః ।
తథైవాప్సరసః సర్వా గంధర్వగణగుహ్యకాన్ ॥ 43 ॥

యో యత్ర స్థాప్యతే దేవః తస్య తాన్పరితః స్మరేత్ ।

ప్రధానమైన దేవతామూర్తిని ప్రతిష్ఠించి ఆతనికి పార్శ్వస్థులగు ఇతరదేవతలను, పరివారదేవతలను స్మరించుకొనవలెను. శివుని ప్రతిష్ఠించినప్పుడు ఆ దేవునికి సంబంధించిన ప్రమథగణములు, నంది, మహాకాలుడు, వృషభము, భృంగిరిటి, గుహుడు, పార్వతి, వినాయకుడు, విష్ణువు, బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, జయంతుడు,

లోకపాలకులు, అప్సరసలు, గంధర్వగణములు, గుహ్యకాదులు మొదలగు వారినందరిని పరమశివుని పరివార దేవతలుగా భావించి (లేదా యజమాని ఇచ్ఛానుసారముగాని వంశసంప్రదాయముననుసరించిగాని) ఆయా దేవతలను వారి స్థానములలో వేదమంత్రాచ్చారణముతో స్థాపించవలెను.

ఆవాహయేత్తథా రుద్రం మన్త్రేణానేన యత్నతః ॥ 44 ॥

యస్య సింహో రథే యుక్తా వ్యాఘ్రు భూతాస్తథోరగాః ।
ఋషయో లోకపాలాశ్చ దేవః స్కన్దస్తథా వృషః ॥ 45 ॥

ప్రియో గణో మాతరశ్చ సోమో విష్ణుః పితామహాః ।
నాగా యక్షాః సగంధర్వా యే చ దివ్యా నభశ్చరాః ॥ 46 ॥

తమహం త్ర్యక్షమీశానం శివం రుద్రముమాపతిమ్ ।
ఆవాహయామి సగణం సపత్నీకం వృషధ్వజమ్ ॥ 47 ॥

ఆగచ్ఛ భగవన్ రుద్రాఽనుగ్రహాయ శివో భవ ।
శాశ్వతో భవ పూజాం మే గృహాణ త్వం నమో నమః ॥ 48 ॥

తదనంతరము ప్రయత్నపూర్వకంగా ఇప్పుడు చెప్పబోవు మంత్రముతో రుద్రుని ఆవాహనము చేయవలెను. “ఏ దేవుని రథమున సింహములు, వ్యాఘ్రములు, భూతములు, సర్పములు మొదలగునవి ఉంచబడినవో, ఋషులు, లోకపాలురు, స్కందదేవుడు, వృషము, ప్రియప్రమథగణములు, మాతృకలు, సోముడు, విష్ణువు, బ్రహ్మ, నాగులు, యక్షులు, గంధర్వులు, దివ్యఖేచరులు మొదలగు వారందరును ఏ దేవుని పరివారముగా ఉందురో అట్టి త్రినేత్రుడు, ఈశానుడు, శివుడు, రుద్రుడు ఉమాపతి అయినటువంటి మహాదేవుని పత్నీసహితముగా, ప్రమథగణయుక్తంగా ఆవాహనము చేయుచున్నాను”. “ఓ భగవాన్! రుద్రా! శివుడవై కల్యాణప్రదుడవై నన్ను అనుగ్రహించుటకు ఇచ్చటికి రమ్ము, ఇందు శాశ్వతముగా ఉండి నా పూజలను గ్రహింపుము, ఓ దేవా! నీకు నమోనమః”.

ఓం నమః స్వాగతం భగవతే నమః । ఓం నమః సోమాయ సగణాయ సపరివారాయ ప్రతిగృహ్ణాతు ॥48॥
భగవన్మంత్రపూతమిదం సర్వమర్ఘ్యపాద్య మాచమనీయమాసనం బ్రహ్మణాఽభిహితం నమోనమః స్వాహా॥49॥

“ప్రణవస్వరూపుడైన భగవంతునికి నమః పూర్వకస్వాగతము. ఉమతో ప్రమథగణములతో, పరివారముతో కూడియున్న పరమశివునకు మా నమస్సులు. ఓ భగవన్ ! సాక్షాత్తు బ్రహ్మచేత అభిహితములైన వేదమంత్రములతో పవిత్రములైనట్టి అర్ఘ్య–పాద్య–ఆచమనీయాసనాదులన్నియును నీవు గ్రహింతువు గాక”, అను ఈ మంత్రములతో పరమశివునికి నమస్సులు అర్పించవలెను.

తతః పుణ్యాహఘోషేణ బ్రహ్మఘోషైశ్చ పుష్కలైః ।
స్నాపయేత్తు తతో దేవం దధిక్షీరఘృతేన చ ॥ 50 ॥

మధుశర్కరయా తద్వత్ పుష్పగంధోదకేన చ ।
శివధ్యానైకచిత్తస్తు మంత్రానేతానుదీరయేత్ ॥ 51 ॥

ఆ విధముగా ఆవాహనము చేసిన తర్వాత పుష్కలమగు పుణ్యాహమంత్రధ్వనులతో, వేదమంత్రధ్వనులతో దధిక్షీరఘృతాదులతో, మధు-శర్కర-పుష్పోదకము, గంధోదకము మొదలగు వాటితో దేవునికి స్నపనము చేయించవలెను. తర్వాత శివునియందే తదేకచిత్తులై ఈ చెప్పబోవు మంత్రములనుచ్చరించవలెను.

"యజ్జాగ్రతో దూరముదేతి", "తతో విరాడజాయత", ఇతి చ ।
"సహస్రశీర్షా పురుష" ఇతి చ ॥

"అభిత్వా శూర నో నమ" ఇతి చ । "పురుష ఏవేదం సర్వమితి" ।
"త్రిపాదూర్ధ్వమితి" "యేనేదం భూత" మితి। "నత్వాహం అన్య"ఇతి ॥ 52 ॥

సర్వాంశ్చైతాన్ ప్రతిష్ఠాసు మంత్రాన్ జప్త్వా పునః పునః ।
చతుః కృత్వా స్పృశేదద్భిః మూలే మధ్యే శిరస్యపి ॥ 53 ॥

స్థాపితే తు తతో దేవే యజమానోఽథ మూర్తిపమ్ ।
ఆచార్యం పూజయేద్ భక్త్యా వస్త్రాలంకారభూషణైః ॥ 54 ॥

దీనాంధకృపణాన్ తద్వద్యేచాన్యే సముపస్థితాః ।

"యజ్జాగ్రతో దూరముదేతి", "తతో విరాడజాయత", "సహస్రశీర్షా పురుషః", "అభిత్వా శూరనో నమః", "పురుష ఏవేదం సర్వమ్", "త్రిపాదూర్ధ్వమ్", "యేనేదం భూతం" "నత్వాహం అన్య" ఇత్యాది మంత్రములనన్నింటిని దేవతా ప్రతిష్ఠలయందు మరల మరల పఠించుచు జలముతో నాలుగు సార్లు దేవతామూర్తి యొక్క పాదములను, శరీర మధ్యప్రదేశమును మరియు శిరస్సును స్పృశించవలెను. ఇట్లు దేవతామూర్తిని స్థాపించిన పిదప యజమానుడు వస్త్రాలంకారభూషణాదులతో ఆచార్యుని సభక్తికముగా పూజింపవలెను, అంతేకాక ఆ కార్యక్రమమునకు వచ్చినటు వంటి దీనులను, అంధులను, కృపణులను మొదలగువారిని కూడ యథోచితముగా ఆదరింపవలెను.

తతస్తు మధునా దేవం ప్రథమేఽహని లేపయేత్ ॥ 55 ॥

హరిద్రయాఽథ సిద్ధార్థైః ద్వితీయేఽహని తత్త్వతః ।
చందనేన యవై స్తద్వత్ తృతీయేఽహని లేపయేత్ ॥ 56 ॥

మనఃశిలాప్రియంగుభ్యాం చతుర్థేఽహని లేపయేత్ ।
సౌభాగ్యశుభదం యస్మాల్లేపనం వ్యాధినాశనమ్ ॥ 57 ॥

పరం ప్రీతికరం నృణామేతద్వేదవిదో విదుః ।

తదనంతరము ప్రథమదివసమున తేనెతోను, రెండవదివసమున పసుపు మరియు తెల్ల ఆవలపిండితోను, మూడవదివసమున చందనము మరియు యవలపిండితోను, నాలుగవ దివసమున ప్రియంగు మరియు మనఃశిలాధాతువుతోను క్రమముగా దేవతామూర్తికి పూతపూయవలెను. ఈ విధముగా పూయుట వలన నరులకు సౌభాగ్యం కలుగునని, శుభము కలుగునని, వ్యాధులు నశించిపోవునని, అందులకే ఇది నరులకు పరమప్రీతికరమని వేదవిదులు చెప్పుదురు.

కృష్ణాంజనం తిలం తద్వత్ పంచమేఽపి నివేదయేత్ ॥ 58 ॥

షష్ఠే తు సఘృతం దద్యాచ్చందనం పద్మకేసరమ్ ।
రోచనాగురుపుష్పం తు సప్తమేఽహని లేపయేత్ ॥ 59 ॥

యత్ర సద్యోఽధివాసః స్యాత్ తత్ర సర్వం నివేదయేత్ ।
స్థితం న చాలయేద్దేవ మన్యథా దోషభాగ్భవేత్ ॥ 60 ॥

ఐదవ దివసమున కృష్ణాంజనము మరియు నువ్వులతోను, ఆరవదివసమున ఘృతము, చందనము పద్మకేసరములతోను, సప్తమదివసమున గోరోచనము, అగురు మరియు ఇతర పుష్పములతోను దేవతా ప్రతిమకు పూత పూయవలెను. అయితే సద్యోఽధివాసముతోనే దేవతాప్రతిష్ఠ చేయదలచినచో వీటన్నింటికి క్రమముగా ఒకే సారి పూయవచ్చును. ఒకసారి ప్రతిష్ఠ చేసిన తర్వాత దేవతామూర్తిని ఎప్పుడునూ కదిలించకూడదు, కదిలించినచో దోషము కలుగునని తెలుపబడుచున్నది.

పూరయేత్ సికతాభిస్తు నిశ్ఛిద్రం సర్వతో భవేత్ ।
లోకకపాలస్య దిగ్భాగే యస్య సంచలతే విభుః ॥ 61 ॥

తస్య లోకపతేః శాంత్యై దేయాశ్చేమాశ్చ దక్షిణాః ।

దేవతామూర్తిని స్థాపించుటకై త్రవ్విన గోతిని ఎటువంటి రంధ్రములు లేకుండా ఇసుకతో నింపవలెను. ప్రతిష్ఠించిన మూర్తి కదలకుండా ఉండునట్లు చూచుకోవలెనని అర్థము, ఒకవేళ దేవతామూర్తి చలించినట్లైతే అనగా కదిలినచో ఆ కదలిక ఏదిశ వైపు జరిగినదో ఆ దిక్పాలకుడు శాంతించుటకై బంగారము మరియు దక్షిణ ఇవ్వవలెను.

ఇంద్రాయాభరణం దద్యాత్ కాంచనం చాల్పవిత్తవాన్ ॥ 62 ॥

అగ్నేః సువర్ణమేవ స్యాత్ యమస్య మహిషం తథా ।
అజం చ కాంచనం దద్యాత్ నైరృతం రాక్షసం ప్రతి ॥ 63 ॥

వరుణం ప్రతి ముక్తాని సశుక్తీని ప్రదాపయేత్ ।
రీతికాం వాయవే దద్యాత్ వస్త్రయుగ్మేన సాంప్రతమ్ ॥ 64 ॥

సోమాయ ధేనుర్దాతవ్యా రజతం సవృషం శివే ।

ఏ ఏ దిక్పాలకునకు ఎటువంటి వస్తువుల ఈయవలెనో ఇప్పుడు తెలుపుతున్నాను. ఇంద్రునకు బంగారపు ఆభరణం ఈయవలెను. ఒకవేళ యజమాని అల్పధనవంతుడైతే కొంచెము బంగారమునైననూ సమర్పించవలెను. అగ్నిదేవునికి బంగారము, యమునికి మహిషమును సమర్పించవలెను. నిర్ఋతికి బంగారముతో చేసిన మేకను, వరుణదేవునికి ముత్యములు ఈయవలెను. వాయుదేవునకు ఇత్తడిపాత్ర మరియు వస్త్రయుగ్మము సమర్పించవలెను. సోమునకు ధేనువును, శివునకు వృషభముతో పాటు వెండి దానము కూడ చేయవలెను.

యస్యాం యస్యాం సంచలనం శాంతిః స్యాత్తత్ర తత్ర తు ॥ 65 ॥

అన్యథా తు భవేద్ఘోరం భయం కులవినాశనమ్ ।
అచలం కారయేద్యత్నాత్సికతాభిః సురేశ్వర ॥ 66 ॥

అన్నం వస్త్రం చ దాతవ్యం పుణ్యాహజయమఙ్గలమ్ ।

ఏ ఏ దిక్కులయందు సంచలనము (కదలిక) కలుగునో అక్కడ తప్పనిసరిగా శాంతి చేయవలెను. లేనిచో ఘోరమైనట్టి కులవినాశకరమగు భయము వాటిల్లును. కావున ఓ సురేశ్వరా ! అట్లు కదలినట్లు కనబడినచో వెంటనే ఇసుకతో నింపి దేవతామూర్తిని స్థిరముగా కదలకుండా ఉండునట్లు చేయవలెను. అన్నవస్త్రాదులు దానము చేయవలెను పుణ్యాహవాచనము, జయాది హెూమములు చేయవలెను.

త్రిపంచసప్త దశ వా దివాని స్యాన్మహెూత్సవః ॥ 67 ॥

చతుర్థేఽహ్ని మహాస్నానం చతుర్థీకర్మ కారయేత్ ।
దక్షిణా చ పునస్తద్వద్దేయా తత్రాతిభక్తితః ॥ 68 ॥

ఈ ప్రతిష్ఠా మహెూత్సవము మూడు, ఐదు, ఏడు లేదా పదిరోజులు నిర్వహించవచ్చును. కాని సాధారణముగా నాలుగవ రోజున మహాస్నానమాచరించవలెను మరియు చతుర్థీకర్మ అనగా ప్రతిష్ఠాకార్యక్రమం నిర్వహించవలెను. అట్లే మంచి భక్తితో దక్షిణలు కూడ ఈయవలెను.

దేవప్రతిష్ఠావిధిరేష తుభ్యం నివేదితః పాపవినాశహేతోః ।
యస్మాద్ బుధైః పూర్వమనన్తముక్త మనేక విద్యాధరదేవ పూజ్యమ్ ॥ 69 ॥

ఈ విధముగా పాపవినాశనహేతువైనట్టి చక్కని దేవప్రతిష్ఠావిధానమును నీకు తెలిపితిని. విద్యాధరులు, దేవతలు కూడ విని ఆనందం పొందునట్టి ఈ విధానమును ఇతఃపూర్వము అనేక మంది విద్వాంసులు అనంతంగా బోధించిరి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే ప్రతిష్ఠానుకీర్తనం నామ
షట్షష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥266॥

శ్రీ మత్స్య మహాపురాణమున ప్రతిష్ఠానుకీర్తనం అనే
రెండువందల అరవైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల అరవైఏడవ అధ్యాయం

దేవతా స్నానవిధిః - దేవతా స్నానవిధానం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి దేవస్నపనముత్తమమ్ ।
అర్ఘ్యస్యాపి సమాసేన శృణుధ్వం విధిముత్తమమ్ ॥ 1 ॥

ఇక ఇప్పుడు ఉత్తమమైన దేవస్నపనవిధానమును మరియు ఉత్తమమైన అర్ఘ్యప్రదానవిధిని కూడ సంక్షిప్తముగా వివరించెదను వినుము.

దధ్యక్షతకుశాగ్రాణి క్షీరం దూర్వాస్తథా మధు ।
యవాః సిద్ధార్థ కాస్తద్వత్ అష్టాంగోర్ఘ్య ఫలైః సహ ॥ 2 ॥

గజాశ్వరథ్యావల్మీక వరాహోత్ఖాతమండలాత్ ।
అగ్న్యాగారాత్ తథా తీర్థాత్ వ్రజాద్గోమణ్డలాదపి ॥ 3 ॥

కుంభే తు మృత్తికాం దద్యాదుద్ధృతాఽసీతి మన్త్రవిత్ ।

దధి, అక్షతలు, కుశాగ్రములు, క్షీరము, దూర్వ, తేనె, యవలు, తెల్ల ఆవాలు మొదలగు ఎనిమిది అంగములతో కూడిన అర్ఘ్యములకు సంబంధించిన సామగ్రితో పాటు ఫలములను కూడ సమకూర్చుకొనవలెను. తర్వాత గజములు అశ్వములు, రథ్య అనగా చతుష్పథము (నాలుగు మార్గములు కలియుచోటు,) వల్మీకము, వరాహములు త్రవ్విన ప్రదేశములు, అగ్నిగృహము, పుణ్యతీర్థము, గొల్లపల్లె, గోశాల మొదలగు ప్రదేశముల నుండి మట్టిని సేకరించి "ఉద్ధృతాసి" అను మంత్రముతో కుంభమునందు వేయవలెను.

"శన్నోదేవీ" త్యపాం మన్త్ర "మాపోహిష్ఠే" తి వై తథా ॥ 4 ॥

"సావిత్ర్యా" దాయ గోమూత్రం "గంధద్వారే" తి గోమయమ్ ।
"అప్యాయస్వే" తి చ క్షీరం "దధిక్రావ్ణే" తి వై దధి ॥ 5 ॥

"తేజోఽ సీ" తి ఘృతం తద్వత్ "దేవస్యత్వే" తి చోదకమ్ ।
కుశమిశ్రం క్షిపేద్విద్వాన్ పంచగవ్యం భవేత్తతః ॥ 6 ॥

తర్వాత "శంనోదేవి" "ఆపోహిష్ఠా" అను మంత్రములతో జలమును, అట్లే "సావిత్ర్యా" అను గాయత్రీ మంత్రోచ్చారణముతో గోమూత్రమును, "గంధద్వారాం" అను మంత్రముతో గోమయమును, "ఆప్యాయస్వ" మంత్రముతో క్షీరమును, "దధిక్రావణ్ణో" అను మంత్రముతో పెరుగు, "తేజోఽసి" అను మంత్రముతో ఘృతమును, "దేవస్య త్వా" మంత్రముతో కుశమిశ్రితమైన జలమును కుంభమునందు పోయవలెను. దీనినే పంచగవ్యమందురు.

స్నాప్యాథ పంచగవ్యేన దధ్నా శుద్ధేన వై తతః ।
"దధిక్రావ్ణేతి" మంత్రేణ స్నాపయేద్రత్నవారిణా ॥ 7 ॥

కుశామ్బునా తతః స్నానం "దేవస్యత్వే" తి కారయేత్ ।
ఫలోదకేన చ స్నానం "అగ్నఆయాహి" కారయేత్ ॥ 8 ॥

తతస్తు గంధతోయేన సావిత్ర్యా చాభిమంత్రయేత్ ।

తదనంతరం ఆ పంచగవ్యంతో దేవునికి స్నపనము చేయించవలెను. "దధిక్రాఉణ్ణో" అను మంత్రము నుచ్చరించుచు శుద్ధమైన దధిస్నానము చేయించి తర్వాత రత్నమిశ్రితమైన జలముతో స్నానము చేయించవలెను. అప్పుడు "దేవస్సత్వా" అను మంత్రముతో ఫలోదకస్నానము, గాయత్రీ మంత్రోచ్చారణముతో గంధోదకస్నానము చేయించవలెను.

తతో ఘటసహస్రేణ సహస్రార్ధేన వా పునః ॥ 9 ॥

తస్యాప్యర్ధేన వా కుర్యాత్ సపాదేన శతేన వా ।
చతుఃషష్ట్యా తతోఽర్ధేన తదర్ధేఽర్ధేన వా పునః ॥ 10 ॥

చతుర్భిరథవా కుర్యాత్ ఘటానా మల్పవిత్తవాన్ ।
సౌవర్ణైః రాజతైర్వాపి తామ్రై ర్వా రీతికోద్భవైః ॥ 11 ॥

కాంస్యైర్వా పార్థివై ర్వాపి స్నపనం శక్తితో భవేత్ ।

తర్వాత దేవతామూర్తిని శక్తికొలది వేయి ఘటములు, ఐదువందలు, రెండు వందల ఏభై (250), నూట ఇరవై ఐదు (125) అరవై నాలుగు (64) ముప్పైరెండు (32) పదహారు (16) , ఎనిమిది (8) లేదా నాలుగు (4) సంఖ్య గల ఘటములతో స్నానం చేయించవలెను. ఈ ఘటములు శక్త్యనుసారంగా బంగారు, వెండి, రాగి, ఇత్తడి, కంచు లేదా మట్టితోగాని చేసినవై ఉండవలెను.

సహదేవీవచా వ్యాఘ్రీ బలా చాతిబలా తథా ॥ 12 ॥

శంఖపుష్పీ తథా సింహీ హ్యష్టమీ చ సువర్చలా ।
మహౌషధ్యష్టకం హ్యేతన్మహాస్నానేషు యోజయేత్ ॥ 13 ॥

యవగోధూమనీవార తిలశ్యామాకశాలయః ।
ప్రియంగవో వ్రీహయశ్చ స్నానేషు పరికల్పితాః ॥ 14 ॥

స్వస్తికం పద్మకం శంఖముత్పలం కమలం తథా ।
శ్రీవత్సం దర్పణం తద్వన్నంద్యావర్త మథాష్టకమ్ ॥ 15 ॥

సహదేవీ, వచా, వ్యాఘ్రీ, బలా, అతిబలా, శంఖపుష్పీ, సింహీ, సువర్చలా అను మహౌషధి అష్టకము మహాస్నానవిధిలో ఉపయోగించవలసినవి, అట్లే యవలు, గోధుమలు, నీవారములు, నువ్వులు, శ్యామాకములు, శాలిధాన్యము, ప్రియంగవులు, వరి మొదలగు అష్టవిధ ధాన్యములు, స్వస్తికము, పద్మకము, శంఖము, కలువ, కమలం, శ్రీవత్సము, దర్పణము మరియు నంద్యావర్తము మొదలగు ఎనిమిది ద్రవ్యములు కూడ మహాస్నాన విధియందు ఉంయోగించవలసినవి.

ఏతాని గోమయైః కుర్యాత్ మృదా చ శుభయా తతః ।
పంచవర్ణాదికం తద్వత్ పంచవర్ణం రజస్తథా ॥ 16 ॥

దూర్వాః కృష్ణతిలాన్ దద్యాత్ నీరాజన విధిం తతః ।
ఏవం నీరాజనం కృత్వా దద్యాదాచమనం బుధః ॥ 17 ॥

మందాకిన్యాస్తు యద్వారి సర్వపాపాపహరం శుభమ్ ।

అవన్నియు గోమయము చేత పవిత్రమైన మట్టి చేత కలుపవలెను. తర్వాత పంచవర్ణములు చూర్ణములను, దూర్వ, నల్లనువ్వులు మొదలగు వాటిని అర్పించవలెను. దాని తర్వాత నీరాజనమునీయవలెను. నియమానుసారముగా నీరాజనము అర్పించి సర్వపాపహరమైన గంగాజలముతో ఆచమనమును అర్పించవలెను.

తతో వస్త్రయుగ్మం దద్యాన్మంత్రేణానేన యత్నతః ॥ 18 ॥

దేవసూత్రసమాయుక్తే యజ్ఞదానసమన్వితే ।
సర్వవర్ణే శుభే దేవ వాససీ తే వినిర్మితే ॥ 19 ॥

తదనంతరము "సూత్రములతో అల్లినట్టు, యజ్ఞదానసమన్వితమైనట్టి, అన్ని విధములైన వర్ణములు కలిగి ఉన్నట్టి శుభప్రదమైనట్టి నీ కొరకే నిర్మించినట్టి ఈ వస్త్రద్వయమును ఓ దేవా ! నీ కర్పించుచున్నాను" అని అనుచు దేవునికి వస్త్రయుగ్మమును సమర్పించవలెను.

తతస్తు చందనం దద్యాత్సమం కర్పూరకుంకుమైః ।
ఇమముచ్చారయేన్మంత్రం దర్భపాణిః ప్రయత్నతః ॥ 20 ॥

శరీరం తే న జానామి చేష్టాం నైవ చ నైవ చ ।
మయా నివేదితాన్ గంధాన్ ప్రతిగృహ్య విలిప్యతామ్ ॥ 21 ॥

తర్వాత యజమాని దర్భపాణియై ప్రయత్నపూర్వకంగా కర్పూరం, కుంకుమ మొదలగు వాటితో మిశ్రితమైన చందనమును చేతిలోకి తీసుకొని "ఓ దేవా! నీ శరీరమును కాని, చేష్టలను కాని నేను తెలిసికోలేక పోతిని కావున నేనర్పించు ఈ చందనమును గ్రహించి నీవే విలేపనమొనరించుకొనుము" అను మంత్రమునుచ్చరించుచు దేవునికి చందనము సమర్పించవలెను.

చత్వారింశత్తతో దీపాన్ దద్యాచ్చైవ ప్రదక్షిణాన్ ।
త్వం సూర్యచంద్ర జ్యోతీంషి విద్యుదగ్ని స్తథైవ చ ॥ 22 ॥

త్వమేవ సర్వజ్యోతీంషి దీపోఽయం ప్రతిగృహ్యతామ్ ।
తతస్త్వనేన మంత్రేణ ధూపం దద్యాద్విచక్షణః ॥ 23 ॥

వనస్పతిరసో దివ్యో గంధాఢ్యో గంధ ఉత్తమః ।
మయా నివేదితో భక్త్యా ధూపోఽయం ప్రతిగృహ్యతామ్ ॥ 24 ॥

తర్వాత "దేవా ! నీవే సూర్యుడవు, చంద్రుడవు, విద్యుత్తువు, అగ్నివి, సర్వవిధజ్యోతిస్సులు (కాంతులును) నీవే, అయిననూ నేను భక్తితో అర్పించు ఈ దీపమును ప్రతిగ్రహించుము" అను మంత్రమును పఠించుచు ప్రదక్షిణ క్రమంలో నలుబది దీపములను (లేదా యథా శక్తిగా) దేవునికి సమర్పించవలెను. తదనంతరము "వివిధ వనస్పతుల రసమిశ్రితమైనట్టి ఉత్తమమైన సుగంధద్రవ్యములతో మిశ్రితమైనట్టి నా చేత భక్తితో అర్పించబడుచున్నట్టి ఈ ధూపమును ఓ దేవా ! ప్రతిగ్రహించుము" అను మంత్రమును పఠిస్తూ దేవునికి ధూపాన్ని విచక్షణుడైన భక్తుడు సమర్పించవలెను.

తతస్త్వాభరణం దద్యాత్ మహాభూషాయ తే నమః ।
అనేన విధినా కృత్వా సప్తరాత్రం మహోత్సవమ్ ॥ 25 ॥

తర్వాత "మహాభూషాయ తే నమః" అను మంత్రమును పఠిస్తూ దేవతామూర్తికి ఆభరణాలను అర్పించవలెను. ఈ విధముగా ఈ మహోత్సవాన్ని సప్తరాత్రులు నిర్వహించవలెను.

దేవం కుంభైస్తతః కుర్యాత్ యజమానోఽభిషేచనమ్ ।
చతుర్భిరష్టభిర్వాపి ద్వాభ్యామేకేన వా పునః ॥ 26 ॥

సపంచరత్నకలశైః సితవస్త్రాభివేష్టితైః ।
దేవస్యత్వేతి మన్త్రేణ సామ్నాచాథర్వణేన చ ॥ 27 ॥

అభిషేకే చ మే మన్త్రాః నవగ్రహమఖే స్మృతాః ।

అప్పుడు యజమాని ఎనిమిది, నాలుగు, రెండు లేదా ఒకటి కలశములతో దేవునికి అభిషేకము చేయవలెను. తెల్లనివస్త్రములను దేవతామూర్తికి కట్టి పంచరత్నకలశములచేత "దేవస్యత్వా" అను మంత్రము పఠించుచు గాని, సామవేదము లేదా అథర్వవేదమునకు సంబంధించిన మంత్రములను గాని పఠించుచు దేవునికి అభిషేకము చేయవలెను. అభిషేకమంత్రములతో పాటు నవగ్రహపూజకు సంబంధించిన మంత్రములను కూడ చదువవలెను.

సితాంబరధరః స్నాత్వా దేవాన్ సంపూజ్య యత్నతః ॥ 28 ॥

స్థాపకం పూజయేద్ భక్త్యా వస్త్రాలంకారభూషణైః ।
యజ్ఞభాండాని సర్వాణి మణ్డపోపస్కరాదికమ్ ॥ 29 ॥

యచ్చాన్యదపి తద్గేహే తదాచార్యాయ దాపయేత్ ।
సుప్రసన్నే గురౌ యస్మాత్ తృప్యంతే సర్వదేవతాః ॥ 30 ॥

తర్వాత యజమాని కూడ తెల్లని వస్త్రములను ధరించినవాడై దేవతలను ప్రయత్నపూర్వకంగా పూజించి, తదనంతరం వస్త్రాలంకారభూషణాదులతో భక్తిపూర్వకంగా స్థాపకుని సన్మానింపవలెను. దేవతా మంటపమునకు ఉపయోగించు వస్తువులు, యజ్ఞపాత్రలే కాకుండా గృహమునందున్నట్టి ఆచార్యునకు యోగ్యమైన వస్తువులన్నింటిని సమర్పించి సమ్మానింపవలెను. ఎందుకనగా గురువు ప్రసన్నచిత్తుడైనప్పుడే దేవతలందరునూ సంతోషింతురు.

నైతద్విశీలేన చ దాంభికేన న లింగినా స్థాపనమత్ర కార్యమ్ ।
విప్రేణ కార్యం శ్రుతిపారగేణ గృహస్థధర్మాభిరతేన నిత్యమ్ ॥ 31 ॥

ఈ దేవతామూర్తి ప్రతిష్ఠాపనము శీలరహితుడైన వాడి చేతగాని, దాంభికముగలవాని చేతగాని, కామోద్రేకము గలవాని చేతగాని చేయబడకూడదు. అట్టి వారు ఈ కార్యక్రమమునకు అనర్హులు. ఇది కేవలము శ్రోత్రియుడైనట్టి, వేదపారంగతుడైనట్టి, గృహస్థధర్మమును చక్కగా ఆచరించుచున్నట్టి బ్రాహ్మణుని చేత మాత్రమే చేయవలసినది.

పాషండినం యస్తు కరోతి భక్త్యా విహాయ విప్రాన్ శ్రుతిధర్మయుక్తాన్ ।
గురుం ప్రతిష్ఠాదిషు తత్ర నూనం కులక్షయః స్యాదచిరాదపూజ్యః ॥ 32 ॥

స్థానం పిశాచైః పరిగృహ్యతే వా అపూజ్యతాం యాత్యచిరేణ లోకైః ।
విప్రైః కృతం యచ్ఛుభదం కులే స్యాత్ ప్రపూజ్యతాం యాతి చిరం చ కాలమ్ ॥ 33 ॥

ఎవరైతే శ్రుతి ధర్మయుక్తులైన విప్రులను వదిలి పాషండులను, దాంభికులను ప్రతిష్ఠాకార్యక్రమమున గురువుగా స్వీకరించెదరో వారి వంశము నశించిపోవును, పిశాచాది దుష్టశక్తులు ఆ దేవాలయమున ప్రవేశించును, లోకులు ఆ దేవతామూర్తిని పూజింపరు కనుక అట్లు చేయుట అమంగళకరమని తెలిసికోవలసినది. కాని శ్రోత్రియులైన పండితులైన విప్రోత్తముల చేత చేయింపబడిన ప్రతిష్ఠాకార్యక్రమము కులమునకు వంశమునకు శుభప్రదమగును, లోకులందరును భక్తితో పూజింతురు. చిరకాలం అందరిచేత ఆ దేవతామూర్తి పూజింపబడును.

ఇతి శ్రీ మత్స్యమహాపురాణే దేవతాస్నానవిధిర్నామ
సప్తషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥267॥

శ్రీ మత్స్యమహాపురాణమునందు దేవతాస్నాన విధానం అనే
రెండువందల అరవైఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టషష్ట్యధిక ద్విశతతమోऽధ్యాయః – రెండువందల అరవైఎనిమిదవ అధ్యాయం

వాస్తుదోషోపశమనమ్ – వాస్తుదోష ఉపశమనం

ఋషయః ఊచుః – ఋషులు చెప్పారు.

ప్రాసాదాః కీదృశాః సూత కర్తవ్యా భూతిమిచ్ఛతా ।
ప్రమాణం లక్షణం తద్వద్వద విస్తరతోऽధునా ॥ 1 ॥

ఓ సూతమహర్షీ ! ఐశ్వర్యమును కోరుకునే వారిచేత ఎటువంటి ప్రాసాదములు నిర్మించవలసినది, వాటి ప్రమాణమేమిటి? వాటి లక్షణమేమిటి ? విస్తారముగా వాటి గురించి వివరింపుము.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి ప్రాసాద విధినిర్ణయమ్ ।
వాస్తౌ పరీక్షతే సమ్యగ్వాస్తుదేహవిచక్షణః ॥ 2 ॥

ఓ ఋషులారా! ఇప్పుడు ప్రాసాదవిధి నిర్ణయమును గురించి వివరించెదను. వాస్తుశాస్త్రనిపుణుడైన విద్వాంసుడు ముందుగా వాస్తుయొక్క భూమిని శ్రద్ధగా పరీక్షించుకొనవలెను.

వాస్తూపశమనం కుర్యాత్సమిద్భిర్బలికర్మణా ।
జీర్ణోద్ధారే తథోద్యానే తథా గృహనివేశనే ॥ 3 ॥

నవప్రాసాదభవనే ప్రాసాదపరివర్తనే ।
ద్వారాభివర్తనే తద్వత్ ప్రాసాదేషు గృహేషు చ ॥ 4 ॥

ముందుగా సమిద్ధహోమముతోను బలిప్రదానముతోను వాస్తుశాంతి జరుపవలెను. జీర్ణగృహములు, ఆలయములు ఉద్ధరించుచునప్పుడు, ఉద్యాన, గృహనివేశన, గృహనిర్మాణ, నూతన ప్రాసాద నిర్మాణ, ప్రాసాద పరివర్తన, ద్వారాభివర్తన, ప్రాసాద, గృహాదులలో ఇతర నిర్మాణములు జరుపబోవు ముందు వాస్తుశాంతి చేయవలెను.

వాస్తూపశమనం కుర్యాత్ పూర్వమేవ విచక్షణః ।
ఏకాశీతిపదం లిఖ్య వాస్తుమధ్యే చ పృష్ఠతః ॥ 5 ॥

హోమస్త్రిమండలే కార్యః కుండే హస్తప్రమాణకే ।
యవైః కృష్ణతిలైస్తద్వత్సమిద్భిః క్షీరవృక్షజైః ॥ 6 ॥

పాలాశైః ఖదిరైశ్చాపి మధుసర్పిః సమన్వితైః ।
కుశదూర్వామయైర్వాపి మధుసర్పిఃసమన్వితైః ॥ 7 ॥

కార్యస్తు పంచభిర్బిల్వైః బిల్వబీజైరథాపి వా ।
హోమాన్తే భక్ష్యభోజ్యైస్తు వాస్తుదేశే బలిం హరేత్ ॥ 8 ॥

విచక్షణుడైన విప్రుడు ముందుగానే వాస్తూపశమనమును ఆచరించును. వాస్తు మధ్యమునందు పిండులతో ఏకాశీతి పద వాస్తు రూపమును వ్రాసి ఆ స్థలమునందే మూడు మేఖలలతో ఆవరింపబడినట్టి ఒక హస్తప్రమాణకమైన కుండమునందు యవలు, నల్లనువ్వులు, క్షీరవృక్షములనుండి తీసినట్టి సమిధలు, పాలాశ, ఖదిరసమిధలు, కుశములు, దూర్వలు మొదలగు వాటిని తేనె మరియు ఆవు నెయ్యితో కలిపి వాటితో హెూమము చేయవలెను. ఇంకను పంచబిల్వములు, బిల్వఫలములు మొదలగు వాటితో కూడ హెూమము చేయవలెను. హెూమము ముగిసిన తర్వాత భక్ష్యభోజ్యాదులతో వాస్తుప్రదేశమున బలులీయవలెను.

తద్వద్విశేషనైవేద్యమేవం దద్యాత్క్రమేణ తు ।
ఈశకోణే ఘృతాన్నం తు శిఖినే వినివేదయేత్ ॥ 9 ॥

ఓదనం సఫలం దద్యాత్ పర్జన్యాయ ఘృతాన్వితమ్ ।
జయాయ చ ధ్వజాన్ పీతాన్ పైష్టం కూర్మంచ సంన్యసేత్ ॥ 10 ॥

ఇంద్రాయ పంచరత్నాని పైష్టం చ కులిశం తథా ।
వితానకం చ సూర్యాయ ధూమ్రం సక్తుం తథైవ చ ॥ 11 ॥

తదనంతరం ఇక్కడ వివరించిన విధంగా ఆయా దేవతలకు విశేషనైవేద్యం అర్పించవలెను. మొదట ఈశాన్యమున అగ్నిదేవునికి ఘృతాన్నమును నివేదించవలెను. పర్జన్యునకు ఫలము మరయు ఘృతముతో కూడిన ఓదనమును, జయునకు పీతధ్వజములు మరియు పిష్టముతో చేసిన కూర్మమును, ఇంద్రునకు పంచరత్నములు, పిష్టవజ్రమును, సూర్యునకు వితానకము మరియు ధూమ్రవర్ణపు సక్తును సమర్పింపవలెను.

సత్యాయ ఘృతగోధూమం మత్స్యం దద్యాద్ భృశాయ చ ।
శష్కులీశ్చాంతరిక్షాయ దద్యాత్సక్తూం చ వాయవే ॥ 12 ॥

లాజాః పూష్ణే తు దాతవ్యా వితథే చణకౌదనమ్ ।
గృహక్షతాయ మధ్వన్నం యమాయ పిశితౌదనమ్ ॥ 13 ॥

గంధౌదనం చ గంధర్వే భృంగరాజస్య భృంగికామ్ ।
మృగాయ యావకం దద్యాత్ పితృభ్యః కృసరా మతా ॥ 14 ॥

సత్యునికి ఘృతమిశ్రితమైన గోధూమాన్నము, భృశునకు మత్స్యమును, అంతరిక్షునకు చక్కిలములును, వాయువునకు సక్తులను సమర్పింపవలెను. ఇంకనూ పూషునకు లాజములు, వితథునకు శనగలతో మిశ్రితమైన అన్నమును, గృహక్షతునకు మధ్వన్నము, యమునకు పిశితౌదనము, గంధర్వునకు గంధాన్నమును, భృంగరాజునకు భృంగికము, మృగునకు యావకము, పితరులకు పులగమును సమర్పింపవలెను.

దౌవారికే దన్తకాష్ఠం పైష్టం కృష్ణబలిం తథా ।
సుగ్రీవే పుష్పకం దద్యాత్ పుష్పదంతాయ పాయనమ్ ॥ 15 ॥

కుశస్తంబేన సంయుక్తం తథా పద్మం చ వారుణమ్ ।
పిష్టం హిరణ్మయం దద్యాత్ అసురాయ సురా మతా ॥ 16 ॥

ఘృతౌదనం చ శేషాయ యవాన్నం పాపయక్ష్మణే ।
ఘృతలడ్డుకాంస్తు రోగాయ నాగే పుష్పఫలాని తు ॥ 17 ॥

దౌవారికునకు దంతకాష్టము మరియు పిండితో చేసిన నలుపురంగుల గల బలిని, సుగ్రీవునకు పుష్పకమును, పుష్పదంతునకు పాయసమును, వరుణునకు కుశస్తంబముతో కూడిన పద్మమును, అసురునకు హిరణ్మయ పిష్టము మరియు మద్యము, శేషునకు ఘృతౌదనము, పాపయక్ష్మునకు యవాన్నము, రోగునకు నెయ్యితో చేసిన లడ్డకములు, నాగునకు పుష్పములు మరియు ఫలములు కూడ సమర్పించవలెను.

సర్పిర్ముఖ్యాయ దాతవ్యం ముద్గౌదనమతః పరమ్ ।
భల్లాటస్థానకే దద్యాత్ సోమాయ ఘృతపాయసమ్ ॥ 18 ॥

భగాయ శాలికం పిష్టమదిత్యై పూరికాస్తథా ।
దిత్యై చ పూరికాం దద్యాదిత్యేవం బాహ్యతో బలిః ॥ 19 ॥

ముఖ్యునకు గోఘృతము, భల్లాటునకు ముద్గౌదనమును, సోమునకు ఘృతమిశ్రిత పాయసమును, భగునకు శాలిధాన్యముతో చేసిన పిష్టమును, అదితికి పూరికలు మరియు దితికి ఒకే పూరికను సమర్పింపవలెను. ఇవన్నియును బహిఃపదములందు సమర్పించవలసిన బలిక్రమమని తెలిసికోవలసినది.

క్షీరం యమాయ దాతవ్యం ఆపవత్సాయ వై దధి ।
సావిత్రే లడ్డుకాన్ దద్యాత్ సమరీచం కుశౌదనమ్ ॥ 20 ॥

సవితుర్గుడపూపాంస్తు జయాయ ఘృతచందనమ్ ।
వివస్వతే పునర్దద్యాద్రక్త చందన పాయసమ్ ॥ 21 ॥

హరితాతౌదనం దద్యాదింద్రాయ ఘృతసంయుతమ్ ।
ఘృతౌదనం చ మిత్రాయ రుద్రాయ ఘృతపాయసమ్ ॥ 22 ॥

ఇప్పుడు అంతరపదములందు సమర్పించవలసినట్టి బలిక్రమము ఇట్లుండును. యమునకు క్షీరము, ఆపవత్సునకు పెరుగు, సావిత్రునకు లడ్డుకములు మరియు మిరియాలతో కూడుకున్న దర్భయుక్తమగు అన్నము, సవితకు బెల్లపు అపూపములు, జయునకు నెయ్యి, చందనము, వివస్వంతునకు రక్తచందనము, పాయసము, ఇంద్రునకు ఘృతాన్నము, రుద్రునకు ఘృతపాయసమును సమర్పించవలెను.

ఆమం పక్వం తథా మాంసం దేయం స్యాద్రాజయక్ష్మణే ।
పృథ్వీధరాయ మాంసాని కూశ్మాండాని నివేదయేత్ ॥ 23 ॥

శర్కరాపాయసం దద్యాత్ అర్యమ్ణే పునరేవ హి ।
పంచగవ్యం యవాంశ్చైవ తిలాక్షతమయం చరుమ్ ॥ 24 ॥

భక్ష్యం భోజ్యం చ వివిధం బ్రహ్మణే వినివేదయేత్ ।
ఏవం సంపూజితా దేవాః శాంతిం కుర్వంతి తే సదా ॥ 25 ॥

సర్వేభ్యః కాంచనం దద్యాత్ బ్రాహ్మణే గాం పయస్వినీమ్ ।

రాజయక్ష్మనకు ఆమము మరియు పక్వమైన మాంసము, పృథ్వీధరునకు మాంసము మరియు కూశ్మాండములు, అర్యమునకు శర్కరమిశ్రిత పాయసము, బ్రహ్మకు పంచగవ్యము, యవలు, తిలాక్షతలతో మిశ్రితమైన చరువును వివిధములైన భక్ష్యములు భోజ్యములు కూడ సమర్పించవలెను. ఈ విధంగా పూజింపబడినట్టి దేవతలు ఎల్లప్పుడు శాంతిని కలిగింతురు. అట్లే బ్రహ్మకు పయస్వినీ అను గోవును మిగతావారందరికిని సువర్ణము ఈయవలెను.

రాక్షసీనాం బలిర్దేయో హ్యపి యాదృగ్యథా శృణు ॥ 26 ॥

మాంసౌదనం ఘృతం పద్మకేసరం రుధిరాన్వితమ్ ।
ఈశానభాగమాశ్రిత్య చరక్యై వినివేదయేత్ ॥ 27 ॥

మాంసౌదనం చ రుధిరం హరిద్రౌదనమేవ చ ।
ఆగ్నేయీం దిశమాశ్రిత్య విదార్యై వినివేదయేత్ ॥ 28 ॥

రాక్షసీ జనమునకు ఎటువంటి బలి నీయవలెనో ఇప్పుడు వివరించెదను వినుము. ఈశాన్యదిశను ఆశ్రయించియుండు 'చరకి' కి మాంసాన్నము, నెయ్యి, పద్మకేసరము, రుధిరము, ఆగ్నేయదిశయందుండు 'విదారి' కి మాంసౌదనము, రుధిరము, హరిద్రాన్నమును నివేదించవలెను.

దధ్యోదనం సరుధిరం అస్థిఖండైశ్చ సంయుతమ్ ।
పీతరక్తం బలిం దద్యాత్ పూతనాయై చ రక్షసే ॥ 29 ॥

వాయవ్యాం పాపరాక్షస్యై మత్స్య మాంసం సురాసవమ్ ।
పాయసం వాఽపి దాతవ్యం స్వనామ్నా సర్వతః క్రమాత్ ॥ 30 ॥

నమస్కారాంతయుక్తేన ప్రణవాద్యేన సంయుతః ।
తతః సర్వౌషధీస్నానం యజమానస్య కారయేత్ ॥ 31 ॥

నైఋతి దిశయందున్న 'పూతన' కు దధ్యోదనము, రక్తము, అస్థిఖండములు మొదలగు వాటిని, వాయువ్య దిశయందున్న 'పాపరాక్షసి' కి మత్స్యమాంసము, సురాసవము నివేదించవలెను. ఇట్లు ఇవన్నియును ఆయా దేవతల నామములనుచ్చరించుచు 'ఓం' కారముతో ఆరంభించి 'నమః' అని చివరలో (పదం) ఉపయోగించుచు తెలిపినట్టి పదార్థములను బలిగా సమర్పించవలెను. తదనంతరము యజమానుడు సర్వౌషధీస్నానమును ఆచరించవలెను.

ద్విజాన్ సంపూజయేద్ భక్త్యా యే చాన్యే గృహమాగతాః ।
ఏతద్వాస్తూపశమనం కృత్వా కర్మ సమారభేత్ ॥ 32 ॥

తర్వాత ద్విజులను మరియు ఇంటికి వచ్చినట్టి ఇతరులను కూడ భక్తితో పూజించవలెను. ఇట్లు 'వాస్తూపశమనము'ను జరిపిన తర్వాతనే నిర్మాణాది కార్యములనారంభించుకోవలెను.

ప్రాసాదభవనోద్యాన ప్రారంభే వినివర్తనే ।
పురవేశ్మప్రవేశేషు సర్వదోషాపనుత్తయే ॥ 33 ॥

రక్షోఘ్నపవమానేన సూక్తేన భవనాదికమ్ ।
నృత్యమంగల వాద్యేన కుర్యాద్ బ్రాహ్మణవాచనమ్ ॥ 34 ॥

ప్రాసాదములు, భవనములు, ఉద్యానములు ప్రారంభించునపుడు, కార్యక్రమము ముగించునప్పుడు, పురవేశ్మాదులు ప్రవేశించునప్పుడు కూడ సర్వదోషములు నివారించుకొనుటకు గాను రాక్షసబాధానివారకమగు 'పవమానసూక్త' పారాయణములు చేయవలెను. ఇంకను శుభప్రదములైన నృత్యములు, మంళవాద్యములు, బ్రాహ్మణుల స్వస్తివాచనములు మొదలగు వాటిని నిర్వహించవలెను.

అనేన విధినా యస్తు ప్రతిసంవత్సరం బుధః ।
గృహే వాఽఽయతనే కుర్యాన్న స దుఃఖమవాప్నుయాత్ ॥ 35 ॥

న చ వ్యాధిభయం తస్య న చ బంధు ధనక్షయః ।
జీవేద్వర్షశతం స్వర్గే కల్పమేకం చ తిష్ఠతి ॥ 36 ॥

ఇట్లు ఈ విధి ననుసరించి ఎవరైతే బుద్ధిమంతుడైనవాడు ప్రతిసంవత్సరము ఇంటిలో గాని, దేవాలయము నందు కాని ఈ కార్యక్రమములు నిర్వహించునో అతను ఎప్పుడునూ దుఃఖము పొందడు, వ్యాధి భయమునూ ఉండదు, బంధుజనధనక్షయము కూడ కలుగదు, అతను సంపూర్ణముగా శతసంవత్సరములు జీవించును. ఒక కల్పకాలము వరకు స్వర్గలోకమున వసించును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే వాస్తుదోషోపశమనం నామ
అష్టషష్ట్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥268॥

శ్రీ మత్స్యమహాపురాణమున వాస్తుదోషోపశమనం అనే
రెండువందల అరవైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోన సప్తత్యధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల అరవైతొమ్మిదవ అధ్యాయం

ప్రాసాదానుకీర్తనమ్ – ప్రాసాదానుకీర్తనం

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఏవం వాస్తు బలిం కృత్వా భజేత్ షోడశభాగికమ్ ।
తస్య మధ్యే చతుర్భిస్తు భాగైర్గర్భం తు కారయేత్ ॥ 1 ॥

భాగద్వాదశకం సార్ధం తతస్తు పరికల్పయేత్ ।
చతుర్దిక్షు తథా జ్ఞేయం నిర్గమం తు తతో బుధైః ॥ 2 ॥

పూర్వ అధ్యాయమున వర్ణించిన రీతిలో వాస్తుబలి జరిపిన తర్వాత ప్రాసాదనిర్మాణమునకై ఎంచుకొనిన ప్రదేశమును 16 భాగములుగా విభజించుకొనవలెను. మధ్యలో నున్న నాలుగు భాగముల స్థలమున చతురస్రాకారమున గర్భాలయమును నిర్మించవలెను. దీనికి నాలుగు వైపుల మిగిలియున్న ప్రదేశపు వైశాల్యము పండ్రెండు భాగములుగా ఉండునట్లు పండితులు చూచుకోవలెను.

చతుర్భాగేన భిత్తీనాముచ్ఛ్రాయః స్యాత్ప్రమాణతః ।
ద్విగుణః శిఖరోచ్ఛ్రాయో భిత్త్యుచ్ఛ్రాయ ప్రమాణతః ॥ 3 ॥

శిఖరార్ధస్య చార్ధేన విధేయా తు ప్రదక్షిణా ।
గర్భసూత్రద్వయం చాగ్రే విస్తారో మండపస్య తు ॥ 4 ॥

ఆయతః స్యాత్త్రిభిర్భాగైః భద్రయుక్తః సుశోభనః ।
పంచభాగేన సంభజ్య గర్భమానం విచక్షణః ॥ 5 ॥

భాగమేకం గృహీత్వా తు ప్రాగ్గ్రీవం కల్పయేద్ బుధః ।
గర్భసూత్రసమాద్భాగాత్ అగ్రతో ముఖమండపః ॥ 6 ॥

ఏతత్సామాన్యముద్దిష్టం ప్రాసాదస్యేహ లక్షణమ్ ।
తథాఽన్యం చ ప్రవక్ష్యామి ప్రాసాదం లింగమానతః ॥ 7 ॥

ఈ కొలతలకై గ్రహించిన ప్రమాణములు నాలుగు ఆలయభిత్తుల ఎత్తు ఉండవలెను. ఇక భిత్తుల ఎత్తునకై గ్రహించినట్టి ప్రమాణములేవైతే కలవో అవి అంతకు రెట్టింపు (ద్విగుణము) శిఖరపు ఎత్తు ఉండవలెను. అలాగే ఆలయ శిఖరము యొక్క ఎత్తునకు సగములో సగము అనగా నాలుగవ వంతు ప్రమాణముల కొలతతో గర్భాలయమునకు అన్ని వైపులయందు "ప్రదక్షిణ" ఉండవలెను. అంతేకాక ఈ నాలుగు వైపులయందును "నిర్గమము" ఉండవలెను. గర్భగుడిలోని కుడి ఎడమలందలి సూత్రములను రెండింటిని ముందువైపునకు పెంచి గర్భాలయపు వెడల్పు పొడవు పరిమాణముతో ఇట్టి మూడు భాగములంత వెడల్పుగా ఉండునట్లు, దీర్ఘచతురస్రాకృతిలో గర్భగుడికి

ముందు మండపము ఏర్పర్చవలెను. గర్భాలయము యొక్క మూడు భాగములు అనగా కుడి ఎడమ మరియు వెనుక వైపులందు నిర్మించు'భద్రము' అందముగా ఉండవలెను. ఆ తర్వాత గర్భాలయము యొక్క కొలతలకై తీసికొనిన పరిమాణమును విచక్షణుడైన విప్రుడు ఐదుభాగములుగా విభజించి అందలి ఒక భాగముతో 'ప్రాగ్గ్రీవము'ను నిర్మించవలెను. గర్భాలయపు ఉభయ పార్శ్వములందలి సూత్రములను ముందునకు పెంచి మండపమును నిర్మించవలెను. ఇట్లు ప్రాసాదము యొక్క సామాన్యలక్షణము ప్రతిపాదింపబడినది. ఇప్పుడు లింగప్రమాణము నాధారము చేసికొని నిర్మించవలసిన 'ప్రాసాద'లక్షణమును వివరించెదను.

లింగపూజాప్రమాణేన కర్తవ్యా పీఠికా బుధైః ।
పీఠికార్ధేన భాగస్స్యాత్ తన్మానేన తు భిత్తయః ॥ 8 ॥

బాహ్యభిత్తి ప్రమాణేన ఉత్సేధస్తు భవేత్పునః ।
భిత్త్యుచ్ఛ్రాయాత్తు ద్విగుణః శిఖరస్య సముచ్ఛ్రయః ॥ 9 ॥

శిఖరస్య చతుర్భాగాత్ కర్తవ్యా చ ప్రదక్షిణా ।
ప్రదక్షిణాయాస్తు సమస్త్వగ్రతో మండపో భవేత్ ॥ 10 ॥

తస్య చార్ధేన కర్తవ్య స్త్వగ్రతో ముఖమండపః ।

విద్వాంసులు ఎల్లప్పుడు లింగప్రమాణమునుగాని, దేవతార్చామూర్తి ప్రమాణమునుసరించిగాని, వాటికి సంబంధించిన పీఠికానిర్మాణము చేయవలెను. పీఠికకు గల ఎత్తు అర్ధభాగమును ఒక్కొక్క ప్రమాణభాగముగా గ్రహించి దానికన్న ఒక్క ప్రమాణము ఎత్తుగా ఉండునట్లు గర్భాలయపు బాహ్యభిత్తులు ఉండవలెను. ఈ బాహ్యభిత్తుల ప్రమాణముతోనే అంతర్భిత్తుల ఎత్తు నిర్ణయింపబడును. ఈ భిత్తుల మొత్తము ఎత్తునకు ద్విగుణమైన ఎత్తుతో శిఖరము నిర్మింపవలెను. మరల శిఖరపు ఎత్తులో చతుర్భాగ ప్రమాణములతో "ప్రదక్షిణ" ఉండవలెను. ఈ ప్రదక్షిణతో సమముగా ముందుకు పెంచి మండపము నిర్మించవలెను. అంతేకాక ఈ మండపు వెడల్పులో సగము వెడల్పుతో దానికి ముందు ఉండునట్టి ముఖమండపము నిర్మించవలెను.

ప్రాసాదాన్నిర్గతౌ కార్యౌ కపోలౌ గర్భమానతః ॥ 11 ॥

ఊర్ధ్వం భిత్త్యుచ్ఛ్రయాత్తస్య మంజరీం తు ప్రకల్పయేత్ ।
మంజర్యాశ్చార్ధభాగేన శుకనాసాం ప్రకల్పయేత్ ॥ 12 ॥

ఊర్ధ్వం తథాఽర్ధభాగేన వేదీ బంధో భవేదిహ ।
వేద్యాశ్చోపరి యచ్ఛేషం కణ్ఠశ్చామలసారకః ॥ 13 ॥

ఏవం విభజ్య ప్రాసాదం శోభనం కారయేద్ బుధః ।
అథాన్యచ్చ ప్రవక్ష్యామి ప్రాసాదస్యేహ లక్షణమ్ ॥ 14 ॥

ప్రాసాదము (గర్భాలయము) నుండి వెలుపలకు సాగి వ్యాపించియుండు విధముగా గర్భాలయ ప్రమాణమునే ఆధారముగా చేసికొని ప్రతి ఒక వైపున రెండేసి 'కపోలములు' నిర్మించవలెను. శిఖరభాగములు ఎట్లుండవలెనన్న

గర్భాలయమునకు పైభాగమున అంతరభిత్తుల యొక్క ఎత్తునకు సమానముగా 'మంజరీ' అనునట్టి శిఖరభాగమును నిర్మించవలెను. తర్వాత 'మంజరీ' భాగపు మొత్తము ఎత్తులో సగము ఎత్తుతో 'శుకనాసా' అను శిఖరభాగమును, మరల ఈ శుకనాసమునకు ఎత్తులో సగము ఎత్తుతో "వేదీబంధము"ను, మిగిలిన నాలుగవ వంతు ప్రమాణముతో 'కంఠము' 'ఆమలసారము' అను శిఖరభాగములను నిర్మించవలెను. ఇక ఇదే సందర్భమున ఇంకొక విధముగ 'ప్రాసాదపు' లక్షణమును వివరింతును.

గర్భమాన ప్రమాణేన ప్రాసాదం శృణుత ద్విజాః ।
విభజ్య నవధా గర్భం మధ్యే స్యాల్లింగపీఠికా ॥ 15 ॥

పాదాష్టకం తు రుచిరం పార్శ్వతః పరికల్పయేత్ ।
మానేన తేన విస్తారో భిత్తీనాం తు విధీయతే ॥ 16 ॥

పాదం పంచగుణం కృత్వా భిత్తీనా ముచ్ఛ్రయో భవేత్ ।
స ఏవ శిఖరస్యాపి ద్విగుణః స్యాత్సముచ్ఛ్రయః ॥ 17 ॥

చతుర్ధా శిఖరం భజ్య అర్ధభాగద్వయస్య తు ।
శుకనాసం ప్రకుర్వీత తృతీయా వేదికా మతా ॥ 18 ॥

ఇప్పుడు మూడవవిధమగు ప్రాసాదము: ఓ ద్విజులారా! ముందుగా గర్భాలయ ప్రమాణమును నిర్ణయించుకొని తదనుసారముగా ఆలయపు మిగతా అంశముల కొలతలను గ్రహించు విధానమును వినుము. గర్భాలయమును తొమ్మిది భాగములుగా విభజించి వాటిలో మధ్యలోనున్న ఒక పదమునందు లింగమునకు లేదా అర్చామూర్తికి గాని సంబంధించిన పీఠికను నిర్మించవలెను. దీనికి పోగా మిగిలిన అష్టభాగములలో అంతర్భిత్తులుండవలెను. ఇవి విశాలముగా రుచిరముగా ఉండవలెను. దీనికి రెట్టింపు అనగా పంచగుణములధికమైన ఎత్తు వీటికి ఉండవలెను. మరియు దీనికన్న శిఖరపు ఎత్తు రెండింతలు ఎక్కువగా ఉండవలెను. తర్వాత శిఖరముయొక్క ఎత్తును నాలుగు భాగములుగా విభజించి అందలి రెండు భాగముల ఎత్తులో ఒకదానితో సమముగా 'శుకనాసము' రెండవదానితో సమముగా 'వేదిక' నిర్మించవలెను.

కంఠమామలసారం తు చతుర్థే పరికల్పయేత్ ।
కపోలయోస్తు సంహారో ద్విగుణోఽత్ర విధీయతే ॥ 19 ॥

శోభనైః పత్రవల్లీభిః అండకైశ్చ విభూషితః ।
ప్రాసాదోఽయం తృతీయస్తు మయాతుభ్యం నివేదితః ॥ 20 ॥

తర్వాత మిగిలిన నాలుగవ భాగములో 'కంఠము' మరియు 'ఆమలసారము' అను రెండు అంశములను పరికల్పించవలెను. తదనంతరము రెండు పదములయంత 'కపోలములు' కూడ నిర్మించవలెను. అట్లే ఆలయము శోభాయమానముగా ఉండుటకై "పత్రవల్లులు" "అండకములు" మొదలగు వాటితో అలంకరింపజేయవలెను. ఈ విధముగా ప్రాసాదములతో ఇది మూడవది, ఇంతవరకు మీకు వివరించాను.

సామాన్యమపరం తద్వత్ ప్రాసాదం శృణుత ద్విజాః ।
త్రిభేదం కారయేత్ క్షేత్రం యత్ర తిష్ఠంతి దేవతాః ॥ 21 ॥

రథాఙ్కస్తేన మానేన బాహ్య భాగవినిర్గతః ।
నేమిపాదేన విస్తీర్ణా ప్రసాదః స్యాత్సమన్తతః ॥ 22 ॥

గర్భం తు ద్విగుణం కుర్యాత్ తస్య మానం భవేదిహ ।
స ఏవ భిత్తే రుత్సేధో ద్విగుణః శిఖరో మతః ॥ 23 ॥

ప్రాగ్గ్రీవః పంచభాగేన నిష్కాసస్తస్య చోచ్యతే ।
కారయేత్ సుషిరం తద్వత్ ప్రాకారస్య త్రిభాగతః ॥ 24 ॥

ద్విజులారా! ఇప్పుడు సామాన్యమగు ఇంకొక ప్రసాదభేదమును దాని లక్షణమును తెలిపెదను, వినుడు. ముందుగా దేవతలుండు క్షేత్రమును (గర్భాలయమును) మూడు భాగములుగా విభజించవలెను. వాటిలో ఒక భాగపు పరిమాణమును ప్రమాణముగా తీసుకుని గర్భాలయమునకు మూడు వైపులను దాని బాహ్యాన్తర్భిత్తులనుండి వెలపలికి వచ్చునట్లు "రథాంకము" ను నిర్మించవలెను. అట్లే తృతీయ భాగపు పరిమాణముతో ప్రాసాదమునకు అన్ని దిశలలోను "నేమి" నిర్మించవలెను. గర్భాలయపు పరిమాణము కన్న ద్విగుణపు ఎత్తుతో భిత్తులు నిర్మించవలెను. ఆ భిత్తులకన్న రెట్టింపు ఎత్తులో శిఖరముండవలెను. ఇంకా గర్భాలయపరిమాణములోని ఐదవవంతు కొలతతో "ప్రాగ్రీవము" "నిష్కాసము" అనువాటిని నిర్మించవలెను. అంతే కాక ప్రాకారము యొక్క ఎత్తులో మూడవవంతు ఎత్తుతో "సుషితరము" నిర్మించవలెను.

ప్రాగ్గ్రీవ పంచభాగేన నిష్కాసేణ విశేషతః ।
కుర్యాద్వా పంచభాగేన ప్రాగ్గ్రీవే కర్ణమూలతః ॥ 25 ॥

స్థాపయేత్కనకం తత్ర గర్భాన్తే ద్వారమూలతః ।
ఏవం తు త్రివిధం కుర్యాత్ జ్యేష్ఠమధ్యకనీయసమ్ ॥ 26 ॥

లింగమాననుభేధేన రూపభేదేన వా పునః ।
ఏతే సమాసతః ప్రోక్తా నామతః శృణుతాధునా ॥ 27 ॥

ఇంకనూ అదే ప్రాకారపు ఎత్తులో ఐదవవంతు పరిమాణముతో "ప్రాగ్గ్రీవము" మరియు "నిష్కాసము"ను నిర్మించవచ్చును లేదా గర్భాలయపు చతురస్రాకృతిలో ఏర్పడునట్టి 'కర్ణ' పరిమాణములో కూడ 'ప్రాగ్గ్రీవము'ను నిర్మించవచ్చును. గర్భాలయము యొక్క అంతమున ద్వార మూలప్రదేశమున సువర్ణమును స్థాపించవలెను. ఈ విధముగా ఆలయనిర్మాణమును జ్యేష్ఠ-మధ్యమ-కనిష్ఠ పరిమాణములలో లేదా లింగ పరిమాణముననుసరించియో రూపభేదకల్పనాప్రకారముగానో జరుపవలెను. ఇట్లు సంక్షిప్తముగా ప్రసాదముల యొక్క సామాన్యలక్షణములు చెప్పబడినవి. ఇప్పుడు విభిన్న ప్రాసాదముల/దేవాలయములను గురించి వివరించెదను, ఓ ద్విజులారా! వినుడు!

మేరుమందర కైలాసకుంభసింహమృగాస్తథా ।
విమానచ్ఛందకస్తద్వత్ చతురస్ర స్తథైవ చ ॥ 28 ॥

అష్టాస్రః షోడశాస్రశ్చ వర్తులః సర్వభద్రకః ।
సింహాస్యో నందనశ్చైవ నందివర్ధనకస్తథా ॥ 29 ॥

హంసో వృషసుపర్ణేశః పద్మకోఽథ సముద్గకః ।
ప్రాసాదా నామతః ప్రోక్తా విభాగం శృణుత ద్విజాః ॥ 30 ॥

(1) మేరువు (2)మందరము (3) కైలాసము (4) కుంభము (5) సింహము (6) గజము (7) విమానము (8) ఛందకము (9) చతురస్రము (10) అష్టాస్రము (11) షోడశాస్రము (12) వర్తులము (13) సర్వభద్రకము (14) సింహాస్యము (15) నందనము (16) నందివర్ధనకము (17) హంసము (18) వృషము (19) సువర్ణేశము (20) పద్మకము (21) సముద్గకము మొదలగునవి విభిన్న ప్రాసాదములు. ద్విజులారా! ఇపుడు వీటి విభాగలక్షణములను తెలిపెదను వినుము.

శతశృఙ్గశ్చతుర్ద్వారో భూమికా షోడశోచ్ఛ్రితః ।
నానావిచిత్రశిఖరో మేరుః ప్రాసాద ఉచ్యతే ॥ 31 ॥

మన్దరో ద్వాదశ ప్రోక్తాః కైలాసో నవభూమికః ।
విమానచ్ఛన్దక స్తద్వత్ అనేక శిఖరాననః ॥ 32 ॥

స చాష్టభూమిక స్తద్వత్ సప్తభిర్నన్దివర్ధనః ।
విషాణాంకసమాయుక్తో నన్దనః స ఉదాహృతః ॥ 33 ॥

మేరువు అను ప్రాసాదమునకు నూరు శృంగములు, నాలుగు ద్వారములు, పదహారు భూమికల ఎత్తు, అనేక విధవర్ణములు గల శిఖరము ఉండును. మందర ప్రాసాదము పన్నెండు భూమికల ఎత్తు కలిగి ఉండును, విమానము మరియు ఛందకము అను రెండు ప్రాసాదములు అనేక శిఖరములు ద్వారములు కలిగి ఉండును. మరియు ఎనిమిది భూమికల ఎత్తు కలిగి ఉండును. నందివర్ధనమనునది సప్తభూమికల ఎత్తు కలిగి ఉండును మరియు నందనమను ప్రాసాదమునకు ఒకే శిఖరముండును.

షోడశాస్రసమాయుక్తో నానారూపసమన్వితః ।
అనేక శిఖరస్తద్వత్సర్వతోభద్ర ఉచ్యతే ॥ 34 ॥

చిత్రశాలా సమోపేతో విజ్ఞేయః పంచభూమికః ।
వలభీచ్ఛన్దకస్తద్వదనేక శిఖరాననః ॥ 35 ॥

వృషస్యోచ్ఛ్రాయతస్తుల్యో మణ్డలశ్చాస్రవర్జితః ।
సింహః సింహసమో జ్ఞేయో గజో గజసమస్తథా॥ 36 ॥

ఇక సర్వతోభద్రమను ప్రాసాదము షోడశాస్రపు ఆకారము కలదియు, నానారూపములు కలదియు మరియు అనేక శిఖరములు కూడ కలదియై ఉండును. వలభీచ్ఛందకము అనునది చిత్రమైన శాలలు, ఐదుభూమికలు, అనేక శిఖరములు మరియు ద్వారములు కలదియై ఉండును. ఇది వృషము వలె చాలా ఎత్తుగా ఉండును మరియు అరలు లేనటువంటి మండలము వలె ఉండును. సింహప్రాసాదము సింహపు ఆకారమున మరియు గజప్రాసాదము గజము వలె నుండును.

కుమ్భః కుమ్భాకృతిస్తద్వత్ భూమికానవకోచ్ఛ్రయః ।
అంగులీపుటసంస్థానః పంచాండక విభూషితః ॥ 37 ॥

షోడశాస్రః సమన్తాచ్చ విజ్ఞేయః ససముద్గకః ।
పార్శ్వయోశ్చంద్ర శాలేఽస్య ఉచ్ఛ్రాయో భూమికాద్వయమ్ ॥ 38 ॥

తథైవ పద్మకః ప్రోక్తః ఉచ్ఛ్రాయో భూమికాత్రయమ్ ।
షోడశాస్రః స విజ్ఞేయో విచిత్రశిఖరః శుభః ॥ 39 ॥

కుంభప్రాసాదము కుంభపు ఆకారము కలదిగా ఉండును. తొమ్మిది భూమికల ఎత్తు, అంగులీపుటము వంటి అమరిక మరియు ఐదు అండకములచేత అలంకృతమైనదై ఉండును. సముద్గక ప్రాసాదమనునది షోడశాస్రములు కలదై ఉభయపార్శ్వముల యందు రెండు చంద్రశాలలు మరియు రెండు భూమికల ఎత్తు కూడ కలదై ఉండును. పద్మకమనునది సముద్గకపు లక్షణములే కలదై ఉండును. మూడు భూమికల ఎత్తు కలదై ఉండును. షోడశాస్రమను ప్రాసాదము విచిత్రములైన శిఖరములు కలదై యుండును.

మృగరాజస్తు విఖ్యాతశ్చన్ద్రశాలా విభూషితః ।
ప్రాగ్గ్రీవేణ విశాలేన భూమికాసు షడున్నతః ॥ 40 ॥

అనేకచన్ద్రశాలశ్చ గజప్రాసాద ఇష్యతే ।
పర్యస్త గృహరాజా వై గరుడో నామ నామతః ॥ 41 ॥

సప్తభూమ్యుచ్ఛ్రయస్తద్వచ్చంద్రశాలాత్రయాన్వితః ।
భూమికా షడశీతిస్తు బాహ్యతః సర్వతో భవేత్ ॥ 42 ॥

మృగరాజ ప్రాసాదము అనేక చంద్రశాలలతో విభూషితమైనట్టిది, విశాలమైన ప్రాగ్గ్రీవము కలది మరియు ఆరు భూమికల ఎత్తు కలది. గజప్రాసాదము కూడ అనేక చంద్రశాలలు కలదై ఉండును. గరుడప్రాసాదము ఏడు భూమికల ఎత్తుకలది, మూడుచంద్రశాలలు కలిగినటువంటిది, మృగరాజ ప్రాసాదమువలె ఉండునట్టిదై యుండును, అయితే ఆరు భూమికల ఎత్తు కలదైన ఎనుబది (అశీతి) హస్తముల ప్రమాణము కలిగినట్టి గరుడప్రాసాదము కూడ ఉండును.

తథాఽన్యో గరుడస్తద్వదుచ్ఛ్రయాద్దశభూమికః ।
భూమిక షోడశాస్రస్తు భూమి ద్వయమథాధికః ॥ 43 ॥

పద్మతుల్యప్రమాణేన శ్రీవృక్షక ఇతి స్మృతః ।
పంచాండకో ద్విభూమిశ్చ గర్భే హస్తచతుష్టయమ్ ॥ 44 ॥

వృషో భవతి నామ్నాఽయం ప్రాసాదః సార్వకామికః ।

అంతేకాక మరొకవిధమైన గరుడప్రాసాదము కూడ ఉన్నది, అది పది పది భూమికల ఎత్తు కలదై, షోడశాస్రములు కూడ కలదై ఉండును. దీనికి పూర్వపు వాటి కన్న అధికముగా రెండు భూమికలు ఎత్తు ఉండును. శ్రీవృక్షకప్రాసాదముల పద్మకముతో సమానముగా ఉండును. ఇది ఐదు అండకములు, రెండు ఖండములు, మధ్యభాగమున నాలుగు హస్తముల ప్రమాణములు కలిగినదై ఉండును. వృషమను ప్రాసాదము కోరికలన్నింటిని ఫలింపజేయునట్టిదని ప్రసిద్ధము.

సప్తకాః పంచకాశ్చైవ ప్రసాదా వై మయోదితాః ॥ 45 ॥

సింహాస్యేన సమాజ్ఞేయా యే చాన్యే తత్ప్రమాణకాః ।
చంద్రశాలైః సమోపేతాః సర్వే ప్రాగ్గ్రీవసంయుతాః ॥
ఐష్టకా దారవాశ్చైవ శైలా వా స్యుః సతోరణాః ॥ 46 ॥

నేనితంవరకు చెప్పినటువంటి సప్తభూమికలు, పంచభూమికలు కల్గినట్టి ప్రాసాదములు, చంద్రశాలలు మరియు ప్రాగ్గ్రీవములతో కూడియున్నట్టివన్నియు "సింహాస్య" మను ప్రాసాదముతో సమానమైనవని తెలిసికో వలసినది. అయితే ఇవన్నియును ఇటుకలతోగాని, శిలలతోగాని, దారువులతోగాని నిర్మింపబడి తోరణములతో అలంకరింపబడియుండును.

మేరుః పంచాశద్ధస్తః స్యాన్మందరః పంచహీనకః ।
చత్వారింశస్తు కైలాసశ్చతుస్త్రింశద్విమానకః ॥ 47 ॥

నందివర్ధనకస్తద్వత్ ద్వాత్రింశత్సముదాహృతః ।
త్రింశతా నందనః ప్రోక్తః సర్వతోభద్రక స్తథా ॥ 48 ॥

వర్తులః పద్మకశ్చైవ వింశద్ధస్త ఉదాహృతః ।
గజః సింహశ్చ కుంభశ్చ వలభీచ్ఛందక స్తథా ॥ 49 ॥

ఏతే షోడశహస్తాః స్యుః చత్వారో దేవవల్లభాః ।
కైలాసో మృగరాజశ్చ విమానచ్ఛందకో మతః ॥ 50 ॥

ఏతే ద్వాదశహస్తాః స్యుః ఏతేషాం విహితాత్మనామ్ ।
గరుడో ఽష్టకరో జ్ఞేయో హంసో దశ ఉదాహృతః ॥ 51 ॥

ఇప్పుడు ఆయా ప్రాసాదములకు కల ప్రదేశములకు తీసుకోవలసిన భుజముల ప్రమాణములు తెలుపబడుచున్నవి. మేరువు 50, మందరము45, కైలాసము40, విమానకము34, నందివర్ధనకము32, నందనము

మరియు సర్వతోభద్రము30, వర్తులము మరియు పద్మకము20, గజము, సింహము, కుంభము, వలభీచందకము ఒక్కొక్కటి 16, ఈ నాలుగు దేవతలకు ప్రీతి కలిగించునవి కైలాసము, మృగరాజము, విమానచందకము ఒక్కొక్కటి 12, గరుడము 8, హంసము 10

ఏవమేతే ప్రమాణేన కర్తవ్యాః శుభలక్షణాః ।
యక్షరాక్షసనాగానాం మాతృహస్తాన్ ప్రశస్యతే ॥ 52 ॥

ఇంతవరకు తెలిపిన ప్రమాణములతో శుభలక్షణములు కలిగినట్టి ప్రాసాదములను నిర్మించవలెను. యక్షులు రాక్షసులు, నాగులు మొదలగువాటికి నిర్మించు ప్రాసాదములకై మాతృహస్త ప్రమాణము తీసుకోవటం ప్రశస్తము.

తథా మేర్వాదయః సప్త జ్యేష్ఠలింగే శుభావహాః ।
శ్రీవృక్షకాదయశ్చాష్టౌ మధ్యమస్య ప్రకీర్తితాః ॥ 53 ॥

తథా హంసాదయః పంచ కన్యసే శుభదాః మతాః ।
వలభీచ్ఛందకే గౌరీ జటాముకుటధారిణీ ॥ 54 ॥

వరదాఽభయదా తద్వత్ సాక్షసూత్రకమండలుః ।

మేరువు మొదలగు ఏడు ప్రాసాదములు జ్యేష్ఠపరిమాణకలింగమునకు శుభావహములు, శ్రీవృక్షకము మొదలగు ఎనిమిది మధ్యమలింగమును ప్రతిష్ఠించుటకు శుభావహములని కీర్తింపబడినవి. అట్లే హంసాది ఐదు ప్రాసాదములు కనిష్ఠలింగమునకు శుభప్రదములు. వలభీచ్ఛందకమను ప్రాసాదమునందుండు దేవి జటాముకుట ధారిణియై వరములను, అభయములను ఇచ్చుచున్నట్టి హస్తములు కలదై, అక్షసూత్రము, కమండలములను ధరించి ఉండవలెను.

గృహే తు రక్తముకుటా ఉత్పలాంకుశధారిణీ ।
వరదాఽభయదా చాఽపి పూజనీయా సభర్తృకా ॥ 55 ॥

తపోవనస్థామితరాం తాం తు సంపూజయేద్ బుధః ।
దేవ్యా వినాయక స్తద్వద్వలభీచ్ఛందకే శుభః ॥ 56 ॥

గృహమను ప్రాసాదమునందైతే రక్తవర్ణపు ముకుటము కలిగినట్టి కలువ మరియు అంకుశము హస్తములందు ధరించినట్టి, వరదాభయహస్తములతో అయినట్టి భర్తయైన మహేశ్వరునితో కూడ విలసిల్లు అమ్మవారిని పూజింపవలెను. అట్లే తపోవనమునందున్నట్టి ఇట్టివాటితో నున్న బుధుడు పూజింపవలెను, దేవితో కూడ వలభీచ్ఛందకమను ప్రాసాదమున వినాయకుని కూడ పూజించుట శుభప్రదము.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రాసాదనుకీర్తనం నామ ఏకోనసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥269॥

శ్రీమత్స్య మహాపురాణమున ప్రాసాదానుకీర్తన మనే రెండువందల అరవైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైయవ అధ్యాయం

ప్రాసాదానుకీర్తనమ్ - ప్రాసాదానుకీర్తనం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మణ్డపానాం తు లక్షణమ్ ।
మణ్డపప్రవరాన్ వక్ష్యే ప్రాసాదస్యానురూపతః ॥ 1 ॥

ఇప్పుడిక మండపలక్షణములను వివరిస్తాను. దేవాలయములకు అనురూపముగా ఉండు శ్రేష్ఠములైన మండపములను గురించి తెలుపుతాను.

వివిధా మణ్డపాః కార్యా జ్యేష్ఠమధ్యకనీయసః ।
నామతస్తాన్ ప్రవక్ష్యామి శృణుధ్వం ఋషిసత్తమాః ॥ 2 ॥

పుష్పకః పుష్పభద్రశ్చ సువ్రతోఽమృతనన్దనః ।
కౌశల్యో బుద్ధిసంకీర్ణో గజభద్రో జయావహః ॥ 3 ॥

శ్రీవత్సో విజయశ్చైవ వాస్తుకీర్తిః శ్రుతిఙ్జయః ।
యజ్ఞభద్రో విశాలశ్చ సుశ్లిష్టః శత్రుమర్దనః ॥ 4 ॥

భాగపంచో నందనశ్చ మానవో మానభద్రకః ।
సుగ్రీవో హరితశ్చైవ కర్ణికారః శతర్ధికః ॥ 5 ॥

సింహశ్చ శ్యామభద్రశ్చ సుభద్రశ్చ తథైవ చ ।
సప్తవింశతి రాఖ్యాతో లక్షణం శృణుత ద్విజాః ॥ 6 ॥

ఓ ఋషిశ్రేష్ఠులారా! జ్యేష్ఠము, మధ్యమము, కనీయసము అని మండపములు మూడు విధములు. ఇప్పుడు వాటి పేర్లను వినుడు. అవి: (1) పుష్పకము (2) పుష్పభద్రము (3) సువ్రతము (4) అమృతనందనము (5) కౌశల్యము (6) బుద్ధిసంకీర్ణము (7) గజభద్రము (8) జయావహము (9) శ్రీవత్సము (10) విజయము (11) వాస్తుకీర్తి (12) శ్రుతింజయము (13) యజ్ఞభద్రము (14) విశాలము (15) సుశ్లిష్టము (16) శత్రుమర్దనము (17) భాగపంచము (18) నందనము (19) మానవము (20) మానభద్రకము (21) సుగ్రీవము (22) హరితము (23) కర్ణికారము (24) శతర్ధికము (25) సింహము (26) శ్యామభద్రము (27) సుభద్రము అది ఇరువది ఏడు రకముల మండపములు. ఇప్పుడు వాటి లక్షణములు తెలుపుతాను.

స్తమ్భా యత్ర చతుః షష్టిః పుష్పకః సముదాహృతః ।
ద్విషష్టిః పుష్పభద్రస్తు షష్టిః సువ్రత ఉచ్యతే ॥ 7 ॥

అష్టపఞ్చాశకస్తమ్భః కథ్యతేఽమృతనన్దనః ।
కౌశల్యః షట్ చ పంచాశచ్చతుః పంచాశతా పునః ॥ 8 ॥

నామ్నా తు బుద్ధిసంకీర్ణో ద్విహీనో గజభద్రకః ।
జయావహస్తు పంచాశచ్ఛ్రీవత్సస్తద్విహీనకః ॥ 9 ॥

విజయస్తద్విహీనః స్యాత్ వాస్తు కీర్తిస్తథైవ చ ।
ద్వాభ్యామేవ ప్రహీయేత తతః శ్రుతిఙ్జయోఽపరః ॥ 10 ॥

(ఈ 27విధముల మండపములు అరువదినాలుగు స్తంభములతో మొదలుకొని పన్నెండు స్తంభముల వరకు రెండేసి స్తంభముల వంతున తగ్గుతూ ఏర్పడును.) వీటిలో మొదటిదైన (1) పుష్పకము 64స్తంభముల కలది ఇక (2) పుష్పభద్రమునకు 62 స్తంభములు. (3) సువ్రతమునకు 60. (4) అమృతనందనమునకు 58. (5) కౌశల్యమునకు 56. (6) బుద్ధిసంకీర్ణమునకు 54. (7) గజభద్రకమునకు 52. (8)జయావహమునకు 50. (9) శ్రీవత్సమునకు 48. (10) విజయమునకు 46. (11) వాస్తుకీర్తికి 44. (12) శ్రుతింజయమునకు 42 స్తంభములుండును.

చత్వారింశద్యజ్ఞభద్రః తద్విహీనో విశాలకః ।
షట్ త్రింశచ్చైవ సుశ్లిష్టో ద్విహీనః శత్రుమర్దనః ॥ 11 ॥

ద్వాత్రింశద్ భాగపంచస్తు త్రింశద్భిర్నందనః స్మృతః ।
అష్టావింశన్మానవస్తు మానభద్రో ద్విహీనకః ॥ 12 ॥

చతుర్వింశస్తు సుగ్రీవో ద్వావింశో హరితో మతః ।
వింశతిః కర్ణికారః స్యాత్ అష్టాదశశతర్ధికః ॥ 13 ॥

సింహో భవేత్ ద్విహీనశ్చ శ్యామభద్రో ద్విహీనకః ।
సుభద్రస్తు తథా ప్రోక్తో ద్వాదశస్తమ్భసంయుతః ॥ 14 ॥

(13) యజ్ఞభద్రమునకు 40. (14) విశాలమునకు 38. (15) సుశ్లిష్టమునకు 36. (16) శత్రుమర్దనమునకు 34. (17) భాగపంచమునకు 32. (18) నందనమునకు 30. (19) మానవమునకు 28. (20) మానభద్రకమునకు 26. (21) సుగ్రీవమునకు 24. (22) హరితమునకు 22. (23) కర్ణికారమునకు 20. (24) శతర్ధికమునకు 18. (25) సింహమునకు 16. (26) శ్యామభద్రమునకు 14. (27) సుభద్రమునకు 12. స్తంభములుండును. ఈ విధముగా 27 విధముల మండపములు 64 స్తంభములు మొదలుకొని ఒక్కోదానికి రెండేసి స్తంభములు తగ్గుతూ చివరిదైన సుభద్రమునకు 12స్తంభములు మాత్రమే ఉండును.

మణ్డపాః కథితాస్తుభ్యం యథావల్లక్షణాన్వితాః ।
త్రికోణం వృత్తమర్ధం తు హ్యష్టకోణం ద్విరష్టకమ్ ॥ 15 ॥

చతుష్కోణం తు కర్తవ్యం సంస్థానం మణ్డపస్య తు ।
రాజ్యం చ విజయశ్చైవ ఆయుర్వర్ధనమేవ చ ॥ 16 ॥

పుత్రలాభః శ్రియః పుష్టిః త్రికోణాదిక్రమాద్భవేత్ ।
ఏవం తు శుభదాః ప్రోక్తాశ్చాన్యథా త్వశుభావహాః ॥ 17 ॥

మీకు ఇంతవరకు యథాక్రమముగా మండప లక్షణములను తెలిపితిని. ఇప్పుడు మండపముల యొక్క ఆకృతి గురించి తెలుపుతాను. మండపములు సాధారణముగా త్రిభుజాకారములో గాని, వృత్తాకారములో గాని, అష్టభుజాకారములో గాని, షోడశభుజాకృతిలోగాని, చతుర్భుజాకృతిలో గాని యుండును. ఇట్లు నిర్మించిన మండపములు రాజ్యములను, విజయములను, ఆయుర్వృద్ధిని, పుత్రలాభమును, సంపత్తును, పుష్టిని కలిగించును. ఇవి శుభప్రదములు. వీటికి విరుద్ధముగా నిర్మించినచో అవి అశుభకారకములగును.

చతుఃషష్టి పదం కృత్వా మధ్యే ద్వారం ప్రకల్పయేత్ ।
విస్తారాద్ ద్విగుణోచ్ఛ్రాయం తత్ త్రిభాగః కటిర్భవేత్ ॥ 18 ॥

విస్తారార్ధో భవేద్గర్భో భిత్తయోఽన్యాః సమన్తతః ।
గర్భపాదేన విస్తీర్ణం ద్వారం త్రిగుణమాయతమ్ ॥ 19 ॥

తథా ద్విగుణవిస్తీర్ణముఖస్తద్వదుదుమ్బరః ।
విస్తారపాదప్రతిమం బాహుల్యం శాఖయోః స్మృతమ్ ॥ 20 ॥

త్రిపంచసప్తనవభిః శాఖాభిర్ద్వారమిష్యతే ।
కనిష్ఠమధ్యమం జ్యేష్ఠం యథాయోగం ప్రకల్పయేత్ ॥ 21 ॥

మండపనిర్మాణము కొరకై నిర్ణయించుకొనిన ప్రదేశమును 64 సమచతురస్రములుగా విభజించుకొని వాటికి మధ్యభాగములో ద్వారము ఉండునట్లు కల్పించవలెను. ద్వారముయొక్క వెడల్పు నాధారముగా చేసికొని వాకిలి యొక్క ఎత్తు అంతకన్న ద్విగుణముండునట్లు చూడాలి. ద్వారపు కటి (బహుశః గడియ అయి ఉండవచ్చును) దాని వెడల్పులో మూడవ వంతు పొడవు ఉండాలి. మండపము నందు మండపగర్భము మండపము యొక్క మొత్తము వెడల్పులో సగముండాలి. మండపమునకు నాలుగువైపులా గోడలు ఉండాలి. దీనికి ముందు భాగమున గర్భపు వెడల్పులో సమముగా ద్వారముండవలెను. మరియు దీని ఎత్తు ఈ వెడల్పుకన్న మూడింతలు ఎత్తు ఉండవలెను. ఈ ద్వారపు తలుపులు మేడికొయ్యతో చేయవలెను. ద్వారపు నిలుపుకమ్మలు శాఖలు ద్వారపు వెడల్పులో నాలుగవవంతు మందముతో నుండవలెను. ద్వారమునకు తలుపులు మూడు, ఐదు లేదా ఏడు చెక్కలను కలిపి చేయవలెను. ద్వారములను జ్యేష్ఠ, మధ్యమ కనిష్ఠభేదమున కూడ యథాయోగ్యముగా ఏర్పరచవచ్చును.

అంగులానాం శతం సార్ధం చత్వారింశత్తథోన్నతమ్ ।
త్రింశద్వింశోత్తరం చాన్య ద్ధన్యముత్తమమేవ చ ॥ 22 ॥

శతం చాశీతి సహితం వాతనిర్గమనే భవేత్ ।
అధికం దశభిస్తద్వత్తథా షోడశభిః శతమ్ ॥ 23 ॥

శతమానం తృతీయం చ నవత్యాऽశీతిభిస్తథా ।
దశద్వారాణి చైతాని క్రమేణోక్తాని సర్వదా ॥ 24 ॥

అన్యాని వర్జనీయాని మనసోద్వేగదాని చ ।
ద్వారవేధం ప్రయత్నేన సర్వవాస్తుషు వర్జయేత్ ॥ 25 ॥

ముఖ్యమైన ద్వారము సాధారణంగా నూటనలుబది (140), లేదా నూటముప్పది (130) లేదా నూట ఇరువది ((120) అంగుళముల ఎత్తులో నుండును. ఇవి జ్యేష్ఠపరిమాణపు ద్వారములు, ఇవి ధన్యములు మరియు ఉత్తమములు. నూటనాలుగు (104) అంగుళముల ఎత్తుతో నుండు ద్వారములు మధ్యమ పరిమాణకద్వారములని అందురు. అటు తర్వాత నూరు (100) లేదా తొంబది (90) లేదా ఎనుబది (80) అంగుళముల ఎత్తుతో గల ద్వారములు కనిష్ఠ ద్వారములని అందురు. ఈ క్రమముగా చెప్పిన పదిద్వారములు ఎల్లప్పుడు ఇవి ప్రశస్తములు. కాని అన్యవిధములైన కొలతలతో నిర్మించు మనస్సుకు ఉద్వేగం కలిగించు ద్వారములను సర్వదా వర్జింపవలెను. అంతేకాక సర్వవిధవాస్తులయందు ప్రయత్నపూర్వకముగా ద్వారవేధ లేకుండునట్లు చూడవలెను.

వృక్షకోణభ్రమిద్వారస్తమ్భకూపధ్వజాదపి ।
కుడ్యశ్వభ్రేణ వా విద్ధం ద్వారం న శుభదం భవేత్ ॥ 26 ॥

క్షయశ్చ దుర్గతిశ్చైవ ప్రవాసః క్షుద్భయం తథా ।
దౌర్భాగ్యం బంధనం రోగో దారిద్ర్యం కలహం తథా ॥ 27 ॥

విరోధశ్చార్థనాశశ్చ సర్వం వేధాద్భవేత్ క్రమాత్ ।

వృక్షము, కోణము, భ్రమి, స్తంభము, బావి, ధ్వజము, గోడ, గోయి మొదలగు వాటిచేత వేధ పొందిన ద్వారము శుభప్రదం కాదు. వేధ కలిగిన ద్వారము వలన క్షయము, దుర్గతి, ప్రవాసము, ఆకలిభయము, దౌర్భాగ్యము, బంధనము, వ్యాధులు, దారిద్ర్యము, కలహములు, విరోధములు, ధననాశము మొదలగు అనేక దుష్ఫలితములు కలుగును.

పూర్వేణ ఫలినో వృక్షాః క్షీరవృక్షాస్తు దక్షిణే ॥ 28 ॥

పశ్చిమేన జలం శ్రేష్ఠం పద్మోత్పలవిభూషితమ్ ।
ఉత్తరే సరలైస్తాలైః శుభా స్యాత్ పుష్పవాటికా ॥ 29 ॥

సర్వతస్తు జలం శ్రేష్ఠం స్థిరమస్థిరమేవ చ ।
పార్శ్వతశ్చాపి కర్తవ్యం పరివారాదికాలయమ్ ॥ 30 ॥

మండపముయొక్క ఆవరణము నందు తూర్పుదిక్కున పండ్లుచెట్లు, దక్షిణమునందు పాలుగల (మర్రివంటివి) వృక్షములు పశ్చిమమున కలువలు కమలములతో అలంకృతములైన జలాశయము ఉత్తరమున, సరళవృక్షములు, తాళవృక్షములు, పుష్పవాటికలు ఉండుట శుభప్రదము. అంతేకాక అన్ని దిక్కులలోనూ స్థిరమైన లేదా అస్థిరమైన

జలాశయం ఉండుట శ్రేయస్కరము. ఇవే కాక మండపపు రెండు వైపులా దేవుని పరివారమునకు సంబంధించిన ఇతర దేవతలుండుట శుభప్రదము.

యామ్యే తపోవనస్థానముత్తరే మాతృకాగృహమ్ ।
మహానసం తథాగ్నేయే నైరృత్యేఽథ వినాయకమ్ ॥ 31 ॥

వారుణే శ్రీనివాసస్తు వాయవ్యే గృహమాలికా ।
ఉత్తరే యజ్ఞశాలా తు నిర్మాల్యస్థానముత్తరే ॥ 32 ॥

వారుణే సోమదైవత్యే బలినిర్వపణం స్మృతమ్ ।
పురతో వృషభస్థానం శేషే స్యాత్ కుసుమాయుధః ॥ 33 ॥

జలం వాఽపి తథైశానే విష్ణుస్తు జలశాయ్యపి ।
ఏవమాయతనం కుర్యాత్ కుండమండపసంయుతమ్ ॥ 34 ॥

మండపపు ఆవరణమందు దక్షిణమున తపోవనము, ఉత్తరమున మాతృకాగృహములు, ఆగ్నేయమున వంటశాల, నైఋతిదిశయందు వినాయకుడు, పశ్చిమమున విష్ణువు, వాయవ్యమునందు వసతి గృహములు, ఉత్తరమున యజ్ఞశాలలు మరియు నిర్మాల్యస్థానములు ఉండవలెను. అంతేకాక పశ్చిమమున సోమదేవతాక స్థానమును, బలినిర్వపణస్థానమును ముందు తూర్పువైపున వృషభస్థానమును మిగిలిన ప్రదేశమున మన్మథ స్థానము ఉండవలెను. ఇంకనూ ఈశాన్యమునందు జలములో శయనించి యుండు విష్ణువుయొక్క స్థానము ఉండవలెను. ఈవిధముగా కుండములతోను, మండపములతోను కూడుకున్న దేవాలయమును నిర్మించవలెను.

ఘంటావితానకసతోరణచిత్రయుక్తం నిత్యోత్సవప్రముదితేన జనేన సార్ధమ్ ।
యః కారయేత్ సురగృహం వివిధధ్వజాఢ్యం శ్రీస్తం న ముంచతి సదా దివి పూజ్యతే చ ॥ 35 ॥

ఏవం గృహార్చనవిధావపి శక్తితః స్యాత్ సంస్థాపనం సకలమంత్రవిధానయుక్తమ్ ।
గోవస్త్రకాంచన హిరణ్య ధరాప్రదానం దేయం గురుద్విజవరేషు తథాఽన్న దానమ్ ॥ 36 ॥

ఘంటలు, వితానములు, తోరణములు, చిత్రములతో అలంకరించబడిన, నిత్యోత్సవములచేత ఆనందం కలిగిన జనులు మరియు వివిధ ధ్వజములతో కూడిన దేవాలయమును ఎవరు నిర్మింతురో వారిని లక్ష్మీ దేవి ఎప్పుడునూ వదిలిపెట్టదు. అటువంటి వారు స్వర్గలోకమున పూజింపబడుదురు. ఇట్లే గృహార్చనవిధిలో కూడ సకలమంత్రములతో, శాస్త్రోక్త విధానములతో యథాశక్తిగా పూజ చేసుకొను వ్యవస్థ నేర్పరచవలెను. అంతేకాక ఆయా కార్యక్రమములయందు గురువులకు, ద్విజశ్రేష్ఠులకు గో-వస్త్ర-కాంచన-హిరణ్య-భూఅన్నదానం చేయవలెను.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రాసాదానుకీర్తనం నామ సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥270॥

శ్రీమత్స్యమహాపురాణంలో ప్రాసాదానుకీర్తనం అనే రెండువందల డెబ్బైయవ అధ్యాయం సమాప్తం.

ఏకసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల డెబ్బైఒకటవ అధ్యాయం

రాజవంశానుకీర్తనమ్ – రాజవంశానుకీర్తనం

ఋషయ ఊచుః – ఋషులు చెప్పారు.

పూరోర్వంశస్త్వయా సూత! స భవిష్యో నివేదితః ।
సూర్యవంశే నృపా యే తు భవిష్యన్తి హి తాన్ వద ॥ 1 ॥

తథైవ యాదవే వంశే రాజానః కీర్తివర్ధనాః ।
కలౌ యుగే భవిష్యన్తి తానపీహ వదస్వ నః ॥ 2 ॥

వంశాన్తే జ్ఞాతయో యాశ్చ రాజ్యం ప్రాప్స్యన్తి సువ్రతాః ।
బ్రూహి సంక్షేపతస్తాసాం యథాభావ్యమనుక్రమాత్ ॥ 3 ॥

ఓ సూతమహర్షీ! నీవు పూరువంశమును, భవిష్యత్తులో ఆ వంశమున ఉండు రాజుల గురించి కూడ మాకు తెలిపితివి. ఇప్పుడు సూర్యవంశమునందు రాబోవు రాజుల గురించి మరియు కీర్తివర్ధనులైన యాదవవంశరాజుల గురించి, వీరి వంశానికి చెందిన ఏయే రాజులు కలియుగములో ఉందురో వారి గురించి కూడా తెలుపుము. అంతేకాక వంశాంతమున సువ్రతులై రాజ్యమును పొందిన జ్ఞాతుల అనుక్రమమును యథాసంభవము సంక్షిప్తముగా వివరింపుము.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి ఇక్ష్వాకూణాం మహాత్మనామ్ ।
బృహద్వలస్య దాయాదో వీరో రాజా హ్యురుక్షయః ।
ఉరుక్షయసుతశ్చాపి వత్సద్రోహో మహాయశాః ॥ 4 ॥

వత్సద్రోహత్ ప్రతివ్యోమస్తస్య పుత్రో దివాకరః ।
తస్యైవ మధ్యదేశే తు అయోధ్యా నగరీ శుభా ॥ 5 ॥

దివాకరస్య భవితా సహదేవో మహాయశాః ।
సహదేవాచ్చ భవితా ధ్రువాశ్వో వై మహామనాః ॥ 6 ॥

ఇప్పుడు నేను మహాత్ములైన ఇక్ష్వాకువంశజుల గురించి చెబుతాను. ముందుగా (1) బృహద్వలుడు. ఆతని కుమారుడు (2) వీరుడైన ఉరుక్షయుడు. ఉరుక్షయునకు (3) మహాయశస్వియైన వత్సద్రోహుడు. వత్సద్రోహునకు (4) ప్రతివ్యోముడు, ఆతనికి (5) దివాకరుడు కుమారుడు. మధ్య దేశమునందలి శుభప్రదమైన 'అయోధ్య' దివాకరుని నగరము. దివాకరునకు కీర్తిమంతుడైన (6) సహదేవుడు. ఆతనికి (7) వారసుడు ధ్రువాశ్వుడు.

తస్య భావ్యో మహాభాగః ప్రతీపాశ్వశ్చ తత్సుతః ।
ప్రతీపాశ్వసుతశ్చాపి సుప్రతీపో భవిష్యతి ॥ 7 ॥

మరుదేవః సుతస్తస్య సునక్షత్ర స్తతోఽభవత్ ।
కిన్నరాశ్వః సునక్షత్రాద్ భవిష్యతి పరంతపః ॥ 8 ॥

కిన్నరాశ్వాదన్తరిక్షో భవిష్యతి మహామనాః ।
సుషేణశ్చాన్తరిక్షాచ్చ సుమిత్రశ్చాప్యమిత్రజిత్ ॥ 9 ॥

సుమిత్రజో బృహద్రాజా తస్య పుత్రశ్చ వీర్యవాన్ ।
పుత్రః కృతంజయో నామ ధార్మికశ్చ భవిష్యతి ॥ 10 ॥

ధ్రువాశ్వునకు (8) మహాత్ముడైన భావ్యుడు పుత్రుడు. ఇతనిని భానురథుడు భావ్యరథుడు అనికూడ అంటారు. భావ్యునకు (9) ప్రతీపాశ్వుడు, ఆతనికి (10) సుప్రతీపుడు, ఆతనికి (11) మరుదేవుడు, (12) ఆతనికి సునక్షత్రుడు, ఆతనికి (13) కిన్నరాశ్వుడు, (14) కిన్నరాశ్వునకు అంతరిక్షుడు కలిగారు. ఇతను మహామనస్వి అయిన (15) అంతరిక్షునకు సుషేణుడు సుషేణునకు శత్రువిజేతయైన (16) సుమిత్రుడు, ఆతనికి (17) వీర్యవంతుడైన బృహద్రాజు, ఆతనికి ధార్మికుడైన (18) కృతంజయుడు వారసులు.

కృతంజయసుతో విద్వాన్ భవిష్యతి రణేజయః ।
భవితా సంజయశ్చాపి వీరో రాజా రణేజయాత్ ॥ 11 ॥

సంజయస్య సుతః శాక్యః శాక్యాచ్ఛుద్ధోదనో నృపః ।
శుద్ధోదనస్య భవితా సిద్ధార్థః పుష్కలః సుతః ॥ 12 ॥

ప్రసేనజినత్తతో భావ్యః క్షుద్రకో భవితా తతః ।
క్షుద్రకా త్కులకో భావ్యః కులకాత్సురథః స్మృతః ॥ 13 ॥

కృతంజయునకు (19) విద్వాంసుడైన రణేజయుడు, ఆతనికి వీరుడైన (20) సంజయుడు, ఆతనికి (21)శాక్యుడు, శాక్యునకు (22) శుద్ధోదనుడు, ఆతనికి (23) సిద్ధార్థుడు, సిద్ధార్థునకు (24) పుష్కలుడు, ఆతనికి (25) ప్రసేనజిత్తు, ఆతనికి (26) క్షుద్రకుడు, ఆతనికి (27) కులకుడు, ఆతనికి (28) సురథుడు అనువారు కలుగుతారు.

సుమిత్రః సురథాజ్జాతో హ్యన్యస్తు భవితా నృపః ।
ఏతే హైక్ష్వాకవః ప్రోక్తాః భవిష్యా యే కలౌ యుగే ॥ 14 ॥

బృహద్బలాన్వవాయే తు భవిష్యాః కులవర్ధనాః ।
అత్రానువంశశ్లోకోఽయం విప్రైర్గీతః పురాతనైః ॥ 15 ॥

ఇక్ష్వాకూణామయం వంశః సుమిత్రాన్తో భవిష్యతి ।
సుమిత్రం ప్రాప్య రాజానం సంస్థాం ప్రాప్యతి వై కలౌ ॥ 16 ॥

ఇత్యేవం మానవో వంశః ప్రాగేవ సముదాహృతః ।

తర్వాత సురథుని కుమారుడు (29) సుమిత్రుడు. ఇతడే ఈ వంశములో చివరిరాజు. కలియుగమునందు ఇక్ష్వాకు వంశమున జన్మించబోవు రాజులు వీరు. బృహద్బలుని వంశమున కలుగబోవు కులవర్ధనులను గురించి విద్వాంసులు చెప్పిన అనువంశిక శ్లోకమిది:- ఈ ఇక్ష్వాకువంశము సుమిత్రునితో అంతమగును. కలియుగమున ఈ రాజవంశపాలన ఇతనితో ముగియును. పూర్వము మీకు తెలుపుటకు ఆరంభించిన మనువంశ వృత్తాంతమిది.

అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి మాగధాః యే బృహద్రథాః ॥ 17 ॥

పూర్వేణ యే జరాసన్ధాత్ సహదేవాన్వయే నృపాః ।
అతీతా వర్తమానాశ్చ భవిష్యాశ్చ నిబోధత ॥ 18 ॥

సంగ్రామే భారతే వృత్తే సహదేవే నిపాతితే ।
సోమాధిస్తస్య దాయాదో రాజాఽభూత్స గిరివ్రజే ॥ 19 ॥

పంచాశతం తథాష్టౌ చ సమా రాజ్యమకారయత్ ।
శ్రుతశ్రవాశ్చతుఃషష్టిం సమాస్తస్యాన్వయేఽభవత్ ॥ 20 ॥

అప్రతీపీ చ షట్త్రింశత్సమా రాజ్యమకారయత్ ।
చత్వారింశత్సమాస్తస్య నిరమిత్రో దివం గతః ॥ 21 ॥

ఇక ఇప్పుడు బృహద్రథ వంశీయులయిన మాగధుల గురించి తెలిపెదను. ఇతఃపూర్వము మీకు తెలిపినట్టి జరాసంధుని పుత్రుడగు సహదేవుని వంశమునందలి భూత-భవిష్యత్‌వర్తమాన రాజుల వివరములు వినుడు. భారతసంగ్రామమున సహదేవుడు చనిపోయిన తరువాత ఆతని కుమారుడైన సోమాధి గిరి వ్రజమునకు రాజయ్యాడు. ఏబది ఎనిమిది (58) ఏండ్లు పాలించాడు. అతని వంశీయుడయిన శ్రుతశ్రవుడు అరువది నాలుగు ఏండ్లు రాజ్యము చేశాడు. అటు తర్వాత అప్రతీపి అను రాజు ముప్పదిఆరు (36) సంవత్సరములు రాజ్యము చేశాడు. తదనంతరము నిరమిత్రుడు అనునతడు నలుబది(40) సంవత్సరముల పర్యంతం రాజ్యమేలి దివంగతుడయ్యాడు.

పంచాశతం సమాః షట్ చ సురక్షః ప్రాప్తవాన్ మహీమ్ ।
బృహత్కర్మా త్రయోవింశదబ్దం రాజ్యమకారయత్ ॥ 22 ॥

సేనజిత్ సంప్రయాతశ్చ భుక్త్వా పంచశతం మహీమ్ ।
శ్రుతంజయస్తు వర్షాణి చత్వారింశద్భవిష్యతి ॥ 23 ॥

అష్టావింశతి వర్షాణి మహీం ప్రాప్స్యతి వై విభుః ।
అష్టపంచాశతం షట్ చ రాజ్యే స్థాస్యతి వై శుచిః ॥ 24 ॥

అష్టావింశత్సమా రాజా క్షేమో భోక్ష్యతి వై మహీమ్ ।
అనువ్రతశ్చతుఃషష్టి రాజ్యం ప్రాప్స్యతి వీర్యవాన్ ॥ 25 ॥

పంచత్రింశతివర్షాణి సునేత్రో భోక్ష్యతే మహీమ్ ।
భోక్ష్యతే నిర్వృత్తిశ్చేమామష్టపంచాశతం సమాః ॥ 26 ॥

తర్వాత సురక్షుడను రాజు ఏబది యారు (56) సంవత్సరములు పృథివిని ఏలాడు. సురక్షుని తర్వాత బృహత్కర్ముడు ఇరువది మూడు ఏండ్లు రాజ్యమేలాడు. తదనంతరము సేనజిత్ అనువాడు ఏబది (50)వర్షములు రాజ్యమేలి దివంగతుడయ్యాడు. తర్వాత శ్రుతంజయుడు (40) నలుబది సంవత్సరములు పరిపాలిస్తాడు. ఆతని తర్వాత విభుడు అను రాజు (28) ఇరువది ఎనిమిది సంవత్సరములు రాజ్యమేలును. తర్వాత శుచి అను రాజు (64) ఆరువది నాలుగు సంవత్సరములు రాజ్యం పాలించును. తదనంతరము క్షేముడు అను రాజు (28) ఇరువది ఎనిమిదేండ్లు రాజ్యమేలును. తర్వత పరాక్రమవంతుడైన అనువ్రతుడను వాడు (64) అరువది నాలుగు పండ్లు రాజ్యమునేలును. ఆతని అనంతరము సునేత్రుడు రాజై (25) ముప్పది సంవత్సరములు రాజ్యమును పరిపాలించును. సునేత్రుని అనంతరము నిర్వృతి యను వాడు (58) ఏబదిఎనిమిది సంవత్సరములు రాజ్యము నేలును.

అష్టావింశత్సమా రాజ్యం త్రినేత్రో భోక్ష్యతే తతః ।
చత్వారింశత్తథాఽష్టౌ చ ద్యుమత్సేనా భవిష్యతి ॥ 27 ॥

త్రయస్త్రింశత్తు వర్షాణి మహీనేత్రః ప్రకాశ్యతే ।
ద్వాత్రింశత్తు సమా రాజా హ్యచలస్తు భవిష్యతి ॥ 28 ॥

రిపుంజయస్తు వర్షాణి పంచాశత్ ప్రాప్స్యతే మహీమ్ ।
ద్వాత్రింశతి నృపా హ్యేతే భవితారో బృహద్రథాః ॥ 29 ॥

పూర్ణం వర్షసహస్రం తు తేషాం రాజ్యం భవిష్యతి ।
జయతాం క్షత్రియాణాం చ బాలకః పులకో భవేత్ ॥ 30 ॥

తర్వాత త్రినేత్రుడను రాజు (28) ఇరువది ఎనిమిది ఏండ్లు, ఆతని తర్వాత ద్యుమత్సేనుడను రాజు (48) నలుబది ఎనిమిది పండ్లు, తదనంతరము మహేనేత్రుడు అను రాజు (33) ముప్పదిమూడు సంవత్సరములు, మహీనేత్రుని తర్వాత అచలుడను రాజు(32) ముప్పది రెండు సంవత్సరములు రాజ్యమునేలును. ఆతని అనంతరము రిపుంజయుడను రాజు (50) ఏబది ఏండ్లు ఈ భూమిని పరిపాలించును. ఈ విధముగా బృహద్రథవంశీయులైన ముప్పది రెండు మంది రాజులు సుమారుగా (1000) వేయి సంవత్సరముల పర్యంతము రాజ్యమును పరిపాలింతురు. అటు తర్వాత విజయశీలురైన ఈ క్షత్రియవంశమున పులకుడు అను బాలకుడు జన్మించును.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రాజవంశానుకీర్తనం నామ ఏకసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥271॥

శ్రీమత్స్యమహాపురాణంలో రాజవంశానుకీర్తనం అనే రెండువందల డెబ్బైఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్విసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైరెండవ అధ్యాయం

రాజవంశానుకీర్తనమ్ - రాజవంశానుకీర్తనం

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

బృహద్రథేష్వతీతేషు వీతిహోత్రేష్వవన్తిషు ।
పులకః స్వామినం హత్వా స్వపుత్రమభిషేక్ష్యతి ॥ 1 ॥

మిషతాం క్షత్రియాణాం చ బాలకః పులకోద్భవః ।
స వై ప్రణతసామన్తో భవిష్యో న చ ధర్మతః ॥ 2 ॥

త్రయోవింశత్సమా రాజా భవితా స నరోత్తమః ।
అష్టావింశతివర్షాణి పాలకో భవితా నృపః ॥ 3 ॥

విశాఖయూపో భవితా త్రిపంచాశత్తథా సమాః ।
ఏకవింశత్సమా రాజా సూర్యకస్తు భవిష్యతి ॥ 4 ॥

భవిష్యతి సమా త్రింశత్ తత్సుతో నందివర్ధనః ।
ద్విపంచాశత్తతో భుక్త్వా ప్రణష్టాః పంచ తే నృపాః ॥
హత్వా తేషాం యశః కృత్స్నం శిశునాకో భవిష్యతి ॥ 5 ॥

బృహద్రథులు, వీతిహోత్రులు, అవంతులు మొదలగు రాజవంశములు గతించిన పిదప పులకుడు అనువాడు తమ స్వామిని వధించి తనకుమారుని రాజుగా అభిషేకించును. క్షత్రియులందరు సంభ్రాంతులై చూచుచుండగనే పులకపుత్రుడగు ఆ బాలకుడు తన సామంతరాజులందరిచేత వందనీయుడై ధర్మపాలనతో కాకుండా తన శక్తితో వారిని నియంత్రిస్తాడు. అట్లు తన శక్తిచేతనే నరోత్తముడనిపించుకొని (23) ఇరువది మూడేండ్లు రాజ్యమును పాలించును. తర్వాత పాలకుడను రాజు (28) ఇరువది ఎనిమిది సంవత్సరములు రాజ్యమేలును. ఆతని అనంతరము విశాఖయూపుడను వాడు (53) ఏబది మూడు ఏండ్లు, తర్వాత సూర్యకుడను రాజు (21) ఇరువది ఒక్క సంవత్సరములు, అటు తర్వాత ఆతని పుత్రుడు నందివర్ధనుడు (30) ముప్పది సంవత్సరములు రాజ్యమును పాలించును. ఈ విధముగా ఈ ఐదుగురు రాజులు 155 నూట యాబది ఐదు సంవతర్సముల పర్యంతము రాజ్యమును పాలించి నశింతురు. అటు తర్వాత వీరి కీర్తినంతటినీ నశింపజేసి శిశు నాకుడను వాడు రాజగును.

వారాణస్యాం సుతం స్థాప్య శ్రయిష్యతి గిరివ్రజమ్ ।
శిశునాకస్తు వర్షాణి చత్వారింశద్ భవిష్యతి ॥ 6 ॥

కాకవర్ణః సుతస్తస్య షడ్వింశత్ ప్రాప్స్యతే మహీమ్ ।
షట్త్రింశచ్చైవ వర్షాణి క్షేమధర్మా భవిష్యతి ॥ 7 ॥

చతుర్వింశత్సమాః సోఽపి క్షేమజిత్ ప్రాప్స్యతే మహీమ్ ।
అష్టావింశతివర్షాణి వింధ్యసేనో భవిష్యతి ॥ 8 ॥

భవిష్యతి సమా రాజా నవ కాణ్వాయనో నృపః ।
భూమిమిత్రః సుతస్తస్య చతుర్దశ భవిష్యతి ॥ 9 ॥

శిశునాకుడు వారణాసి యందు తన పుత్రుని రాజుగా చేసి తాను గిరివ్రజమునాశ్రయించి (40) నలుబది ఏండ్లు రాజ్యమేలును. అటు తర్వాత ఆతని పుత్రుడైన కాకవర్ణుడను నతడు (26) ఇరువది ఆరేండ్లు రాజ్యమేలును. తదనంతరము క్షేమధర్ముడు (36) ముప్పది ఆరు సంవత్సరములు, క్షేమజిత్తు అనువాడు (40) నలుబది ఏండ్లు, తర్వాత వింధ్యసేనుడు అను రాజు (28) ఇరువది ఎనిమిది ఏండ్లు, కాణ్వాయనుడు అను నతడు (9) తొమ్మిది ఏండ్లు, ఆతని పుత్రుడైన భూమిమిత్రుడు (14) పద్నాలుగు సంవత్సరముల పాటు రాజ్యము చేయును.

అజాతశత్రుర్భవితా సప్తవింశత్సమా నృపః ।
చతుర్వింశత్సమా రాజా వంశకస్తు భవిష్యతి ॥ 10 ॥

ఉదాసీ భవితా తస్మాత్త్రయస్త్రింశత్సమా నృపః ।
చత్వారింశత్సమా భావ్యో రాజా వై నందివర్ధనః ॥ 11 ॥

చత్వారింశత్త్రయశ్చైవ మహానందీ భవిష్యతి ।
ఇత్యేతే భవితారో వై దశ ద్వౌ శిశునాకజాః ॥ 12 ॥

శతాని త్రీణి పూర్ణాని షష్టివర్షాధికాని తు ।
శిశునాకా భవిష్యంతి రాజానః క్షత్రబంధవః ॥ 13 ॥

తదనంతరము అజాతశత్రువు అను రాజు (27) ఇరువది ఏడు ఏండ్లు, వంశకుడు అనునతడు (24) ఇరువది నాలుగు ఏండ్లు, ఉదాసి అను రాజు ముప్పది మూడు ఏండ్లు (33), నందివర్ధనుడు అను రాజు (40) నలుబది ఏండ్లు రాజ్యము పరిపాలింతురు. అటు తర్వాత మహానంది అను రాజుకూడ (43) నలుబది మూడు సంవత్సరములు రాజ్యమేలును. ఈ విధముగా ఈ శిశునాకుని వంశమునకు చెందిన క్షత్రియబంధువులు (360) మూడువందల ఆరువది సంవత్సరముల కాలపర్యంతం రాజ్యమును పరిపాలింతురు.

ఏతైః సార్ధం భవిష్యన్తి యావత్కలి నృపాః పరే ।
తుల్యకాలం భవిష్యన్తి సర్వే హ్యేతే మహీక్షితః ॥ 14 ॥

చతుర్వింశత్తథైక్ష్వాకాః పాంచాలాః సప్తవింశతి ।
కాశేయాస్తు చతుర్వింశ దష్టావింశత్తు హైహయాః ॥ 15 ॥

కలింగాశ్చైవ ద్వాత్రింశదశ్మకాః పంచవింశతిః ।
కురవశ్చాపి షడ్వింశదష్టావింశాస్తు మైథిలాః ॥ 16 ॥

శూరసేనాస్త్రయోవింశద్వీతిహోత్రాశ్చ వింశతిః ।
ఏతే సర్వే భవిష్యన్తి ఏకకాలం మహీక్షితాః ॥ 17 ॥

మరియు ఈ శిశునాకులతో పాటు అనగా వీరు రాజ్యమును పరిపాలించుచున్నకాలము నందే దేశము యొక్క వివిధ ప్రదేశములందు అనేక మంది రాజులు పరిపాలింతురు. వారిలో ఇరువది నాలుగు (24) మంది ఇక్ష్వాకువంశమునకు చెందినవారు. ఇరువది ఏడు (27) మంది పాంచాలవంశీయులు, ఇరువది నలుగురు (24) కాశేయులు, ఇరువది ఎనిమిది (28) మంది హైహయవంశమునకు చెందినవారు, ముప్పది రెండు (32) మంది రాజులు కలింగ వంశీయులు, ఇరువది ఐదుగురు (25) అశ్మకవంశీయులు, ఇరువది ఆరు (26) కురుకుల వంశీయులు, ఇరువది ఎనిమిది (28) మంది రాజులు మైథిలవంశీయులు, ఇరువది మూడు (23) మంది శూరసేనులు, ఇరువది (20) మంది రాజులు వీతిహోత్రులు, వీరందరునూ తుల్యకాలమునందే ఆయా రాజ్యములను పరిపాలింతురు.

మహానందిసుతశ్చాపి శూద్రాయాం కలికాంశజః ।
ఉత్పత్స్యతే మహాపద్మః సర్వక్షత్రాన్తకో నృపః ॥ 18 ॥

తతః ప్రభృతి రాజానో భవిష్యాః శూద్రయోనయః ।
ఏకరాట్ స మహాపద్మో ఏకచ్ఛత్రో భవిష్యతి ॥ 19 ॥

అష్టాశీతి తు వర్షాణి పృథివ్యాం చ భవిష్యతి ।
సర్వక్షత్ర మథోత్సాద్య భావినాఽర్థేన చోదితః ॥ 20 ॥

సుకల్పాదిసుతా హ్యష్టౌ సమా ద్వాదశ తే నృపాః ।
మహాపద్మస్య పర్యాయే భవిష్యంతి నృపాః క్రమాత్ ॥ 21 ॥

ఉద్ధరిష్యతి కౌటిల్యః సమా ద్వాదశభిః సుతాన్ ।
భుక్త్వా మహీం వర్షశతం తతో మౌర్యాన్ గమిష్యతి ॥ 22 ॥

తర్వాత మహానంది యను రాజునకు శూద్రస్త్రీ ద్వారా కలియంశమున సర్వక్షత్రాంతకుడైన మహాపద్ముడను పుత్రుడు కలుగును. అది మొదలుకొని రాజులందరు శూద్రయోనులే అగుదురు. సర్వక్షత్రాంతకుడైన మహాపద్ముడే ఏకచ్ఛత్రాధిపతియై రాజ్యమేలును. అతను (88) ఎనుబది ఎనిమిది ఏండ్లు ఈ పృథివిని పాలించును. ఆతని సుతులైన సుకల్పుడు మొదలగు ఎనిమిది మంది రాజులు (12) పన్నెండు సంవత్సరములు రాజ్యమును పరిపాలింతురు. మహాపద్ముని తర్వాత వీరందరూ క్రమముగా రాజ్యమేలుదురు. తదనంతరము కౌటిల్యుడు ఈ పన్నెండు మంది రాజులను నశింపజేసి మౌర్యవంశీయులకు రాజ్యపరిపాలనము నప్పగించి దివంగతుడగును.

భవితా శతధన్వా చ తస్య పుత్రస్తు షట్ సమాః ।
బృహద్రథస్తు వర్షాణి తస్య పుత్రశ్చ సప్తతిః ॥ 23 ॥

షట్త్రింశత్తు సమా రాజా భవితా శక ఏవ చ ।
సప్తానాం దశవర్షాణి తస్య నప్తా భవిష్యతి ॥ 24 ॥

రాజా దశరథోఽష్టౌ తు తస్య పుత్రో భవిష్యతి ।
భవితా నవ వర్షాణి తస్య పుత్రశ్చ సప్తతిః ॥ 25 ॥

ఇత్యేతే దశ మౌర్యాస్తు యే భోక్ష్యన్తి వసుంధరామ్ ।
సప్తత్రింశచ్ఛతం పూర్ణం తేభ్యః శుఙ్గాన్ గమిష్యతి ॥ 26 ॥

తర్వాత ఆ మౌర్యవంశములోని శతధన్వుడు అనునతడు (6) ఆరు సంవత్సరములు, ఆతని పుత్రుడైన బృహద్రథుడు (70) డెబ్బది ఏండ్లు, ఆతని తర్వాత శకుడు అను రాజు (36) ముప్పది ఆరు ఏండ్లు ఆతని మునిమనుమడు డెబ్బది (70) ఏండ్లు రాజ్యమును పరిపాలింతురు. అటు పిమ్మట ఆతని పుత్రుడైన దశరథుడు (8) ఎనిమిది సంవత్సరములు అతని పుత్రుడు (9) తొమ్మిదిదేండ్లు, ఆతని పుత్రుడు (70) డెబ్బది ఏండ్లు రాజ్యము పరిపాలింతురు. ఈ విధముగా మౌర్యవంశానికి చెందిన పది (10) మంది రాజులు ఈ భూమిని పరిపాలింతురు. ఇట్లు (137) నూట ముప్పది ఏడు సంవత్సరములు రాజ్యము చేసిన తర్వాత ఆ రాజ్యము శుంగవంశము వారికి పోవును.

పుష్యమిత్రస్తు సేనానీరుద్ధృత్య స బృహద్రథాన్ ।
కారయిష్యతి వై రాజ్యం షట్త్రింశతి సమా నృపః ॥ 27 ॥

భవితాఽపి వసుజ్యేష్ఠః సప్త వర్షాణి వై నృపః ।
వసుమిత్ర స్తథా భావ్యో దశ వర్షాణి వై తతః ॥ 28 ॥

తతోఽన్తకః సమే ద్వే తు తస్య పుత్రో భవిష్యతి ।
భవిష్యతి సమాస్తస్మాత్త్రీణ్యేవం స పులిందకః ॥ 29 ॥

భవితా వజ్రమిత్రస్తు సమారాజా పునర్భవః ।
ద్వాత్రింశత్తు సమాభాగః సమాభాగాత్తతో నృపః ॥ 30 ॥

భవిష్యతి సుతస్తస్య దేవభూమిః సమా దశ ।
దశైతే క్షుద్రరాజానో భోక్ష్యన్తీమాం వసున్ధరామ్ ॥ 31 ॥

సేనాని ఐన పుష్యమిత్రుడు బృహద్రథులనుండి రాజ్యమును లాగుకొని (36) ముప్పది ఆరు సంవత్సరముల పాటు రాజ్యమేలును. తర్వాత వసుజ్యేష్ఠుడు (7) ఏడు సంవత్సరములు, వసుమిత్రుడు (10) పదిసంవత్సరములు వాని పుత్రుడైన అంతకుడు అను రాజు (2) రెండు సంవత్సరములు, తర్వాత అతని కుమారుడు పులిందకుడు మూడు సంవత్సరములు, వజ్రమిత్రుడు తొమ్మిది (9) ఏండ్లు, పునర్భవుడను వాడు రెండు సంవత్సరములు, సమాభాగుడను వాడు (32) ముప్పది రెండు ఏండ్లు, సమాభాగుని పుత్రుడైన దేవభూమి పది (10) ఏండ్లు రాజ్యము నేలుతారు. ఈ విధముగా ఈ పదిమంది క్షుద్రరాజులు ఈ భూమిని పరిపాలిస్తారు.

శతం పూర్ణం శతే ద్వే చ తతః శుఙ్గాన్ గమిష్యతి ।
అమాత్యో వసుదేవస్తు ప్రసహ్య హ్యవనీం నృపః ॥ 32 ॥

దేవభూమిమథోత్సాద్య శౌఙ్గస్తు భవితా నృపః ।
భవిష్యతి సమా రాజా నవ కాణ్వాయనో నృపః ॥ 33 ॥

భూమిమిత్రః సుతస్తస్య చతుర్దశ భవిష్యతి ।
నారాయణః సుతస్తస్య భవితా ద్వాదశైవ తు ॥ 34 ॥

అట్లు వారు సంపూర్ణంగా నూరేండ్లు రాజ్యమేలిన తర్వాత అది శుంగరాజులవశమగును. అటు తర్వాత అమాత్యుడైన వసుదేవుడు దేవభూమిని బలాత్కారంగా తొలగించి, తాను శుంగుల రాజగును. తర్వాత కాణ్వాయనుడను రాజు తొమ్మిది సంవత్సరములు రాజ్యమును పరిపాలించును. అనంతరము కాణ్వాయనుని పుత్రుడైన భూమిమిత్రుడు(14)పద్నాలుగేండ్లు, తర్వాత ఆతని పుత్రుడే అయిన నారాయణుడు (12) పన్నెండు ఏండ్లు రాజ్యమేలుతారు.

సుశర్మా తత్సుతశ్చాపి భవిష్యతి దశైవ తు ।
ఇత్యేతే శుంగభృత్యాస్తు స్మృతా కాణ్వాయనా నృపాః ॥ 35 ॥

చత్వారింశద్ ద్విజా హ్యేతే కాణ్వా భోక్ష్యన్తి వై మహీమ్ ।
చత్వారింశత్ పంచచైవ భోక్ష్యన్తీమాం వసుంధరామ్ ॥ 36 ॥

ఏతే ప్రణతసామన్తా భవిష్యా ధార్మికాశ్చ యే ।
యేషాం పర్యాయకాలే తు భూమిరాంధ్రాన్ గమిష్యతి ॥ 37 ॥

నారాయణుని సుతుడైన సుశర్మ అనురాజు పదేండ్లు రాజ్యము నేలుతాడు. ఈ వంశపు రాజులందరూ శుంగభృత్యులు మరియు కాణ్వాయనులు అని పిలవబడతారు. ద్విజులైన ఈ కాణ్వాయనులు (45) నలుబది ఐదేండ్లు ఈ భూమిని పాలిస్తారు. వీరందరు ప్రణతసామంతులు మరియు ధార్మికులు కూడ. వీరి తర్వాత రాజ్యపరిపాలనాధికారము ఆంధ్రరాజులకు పోవును.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రాజవంశానుకీర్తనే ద్విసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥272॥

శ్రీ మత్స్యమహాపురాణమున రాజవంశానుకీర్తనం అనే రెండువందల డెబ్బైరెండవ అధ్యాయం సమాప్తం

(సూచన:– ఇక్కడ వర్ణించిన ఆయా రాజులకాలము గురించి విష్ణుపురాణములోను వాయుపురాణములోను విభిన్నమైన అభిప్రాయములు చెప్పబడినాయి.)

త్రిసప్తత్యధికద్విశతతమోऽధ్యాయః - రెండువందల డెబ్బైమూడవ అధ్యాయం

భవిష్య రాజానుకీర్తనమ్ - భవిష్య రాజానుకీర్తనం

సూత ఉవాచ- సూతుడు చెప్పాడు.

కాణ్వాయనాస్తతో భూపాః సుశర్మాణః ప్రసహ్య తామ్ ।
శుంగానాం చైవ యచ్ఛేషం క్షపిత్వా తు బలీయశః ॥ 1 ॥

శిశుకోऽంధ్రః సజాతీయః ప్రాప్స్యతీమాం వసుంధరామ్ ।
త్రయోవింశత్సమా రాజా శిశుకస్తు భవిష్యతి ॥ 2 ॥

తదనంతరము ఆంధ్రజాతీయుడు, అత్యంత పరాక్రమవంతుడు అయిన 'శిశుకుడు' అనువాడు ఆ కాణ్వాయనరాజులలో చివరివాడగు సుశర్మను బలాత్కారముగా రాజ్యము నుండి తొలగించి, శుంగవంశము నకు చెందినవారిని శేషములేకుండా చేసి ఈ వసుంధరను (23) ఇరువది మూడు సంవత్సరముల కాలము పరిపాలిస్తాడు.

కృష్ణో రాజా యవీయస్తు హ్యష్టాదశ భవిష్యతి ।
శ్రీమల్లకర్ణిర్భవితా తస్య పుత్రస్తు వై దశ ॥ 3 ॥

పూర్ణోత్సంగస్తతో రాజా వర్షాణ్యష్టాదశైవ తు ।
స్కన్ధస్తమ్భి స్తథా రాజా వర్షాణ్యష్టాదశైవ చ ॥ 4 ॥

పఞ్చాశతం సమాః షట్ చ శాంతకర్ణిర్భవిష్యతి ।
దశ చాష్టౌ చ వర్షాణి తస్య లంబోదరః సుతః ॥ 5 ॥

ఆపీతకో దశ ద్వే చ తస్య పుత్రో భవిష్యతి ।
దశచాష్టౌ చ వర్షాణి మేఘస్వాతిర్భవిష్యతి ॥ 6 ॥

స్వాతిశ్చ భవితా రాజా సమాస్త్వష్టాదశైవ చ ।
స్కన్దస్వాతిస్తథా రాజా సప్తైవ తు భవిష్యతి ॥ 7 ॥

తర్వాత ఆతని తమ్ముడైన కృష్ణుడను రాజు (18) పదునెనిమిదేండ్లు రాజవుతాడు. తదనంతరముల ఆతని పుత్రుడైన మల్లకర్ణి (10) పది సంవత్సరములు, పూర్ణోత్సంగుడను రాజు (18) పదునెనిమిది సంవత్సరములు, స్కన్ధసంభి అను రాజు (18) పదునెనిమిది సంవత్సరములు, తదనంతరము శాంతకర్ణియను రాజు (56) ఏబది ఆరేండ్లు లంబోదరుడనునతడు (18) పదునెనిమిది సంవత్సరములు రాజ్యమేలుదురు. లంబోదరుని అనంతరము ఆతని పుత్రుడైన ఆపేతకుడను రాజు (12) పన్నెండు సంవత్సరములు, తర్వాత మేఘస్వాతి మరియు స్వాతియను వారిద్దరునూ క్రమముగా (18) పదునెనిమిది సంవత్సరములు, స్కందస్వాతి అనునతడు ఏడు సంవత్సరముల కాలము రాజ్యమేలుతారు.

మృగేంద్రః స్వాతికర్ణస్తు భవిష్యతి సమాస్త్రయః ।
కున్తలః స్వాతికర్ణస్తు భవితాష్టౌ సమా నృపః ॥
ఏక సంవత్సరం రాజా స్వాతివర్ణో భవిష్యతి ॥ 8 ॥

భవితా రిక్తవర్ణస్తు వర్షాణి పంచవింశతిః ।
తతః సంవత్సరాన్ పంచ హాలో రాజా భవిష్యతి ॥ 9 ॥

పంచ మందులకో రాజా భవిష్యతి సమా నృపః ।
పురీంద్రసేనో భవితా తస్మాత్ సౌమ్యో భవిష్యతి ॥ 10 ॥

సుందరః శాంతికర్ణస్తు అబ్దమేకం భవిష్యతి ।
చకోరః స్వాతికర్ణస్తు షణ్మాసాన్ వై భవిష్యతి ॥ 11॥

అష్టావింశతి వర్షాణి శివస్వాతిర్భవిష్యతి ।
రాజా చ గౌతమీపుత్రో హ్యేకవింశత్యతో నృపః ॥ 12 ॥

తర్వాత మృగేంద్రస్వాతికర్ణుడను వాడు మూడేండ్లు, కుంతలస్వాతికర్ణుడు ఎనిమిదేండ్లు, స్వాతివర్ణుడు ఒక సంవత్సరం, రిక్తవర్ణుడు ఇరువది ఐదు సంవత్సరములు, హాలుడు ఐదు సంవత్సరములు, మందులకుడను రాజు కూడ ఐదు సంవత్సరములు రాజ్యమేలును. వారి తర్వాత పురీంద్రసేనుడు, సౌమ్యుడు, (వీరిద్దరికి కాలము తెలుపలేదు) అటు తర్వాత సుందరశాంతికర్ణుడను రాజు ఒక సంవత్సరకాలము రాజ్యమేలుతారు. తదనంతరం శివస్వాతి అనునతడు ఇరువది ఎనిమిది ఏండ్లు మరియు గౌతమీపుత్రుడను రాజు ఇరువది ఒక్క ఏండ్లు రాజ్యమును పరిపాలిస్తారు.

అష్టావింశత్సుతస్తస్య పులోమా వై భవిష్యతి ।
శివశ్రీర్వై పులోమాత్తు సప్తైవ భవితా నృపః ॥ 13 ॥

శివస్కన్ధః శాంతికర్ణాద్భవితా హ్యాత్మజః సమాః ।
నవవింశతి వర్షాణి యజ్ఞశ్రీః శాంతికర్ణికః ॥ 14 ॥

షడేవ భవితా తస్మాద్విజయస్తు సమాస్తతః ।
చణ్డశ్రీః శాన్తికర్ణస్తు తస్య పుత్ర సమా దశ ॥ 15 ॥

పులోమా సప్త వర్షాణి అన్యస్తేషాం భవిష్యతి ।
ఏకోనవింశతి హ్యేతి ఆంధ్రా భోక్ష్యన్తి వై మహీమ్ ॥ 16 ॥

తేషాం వర్షశతాని స్యుః చత్వారి షష్టిరేవ చ ।

గౌతమీపుత్రుని సుతుడైన పులోముడను రాజు (28) ఇరువది ఎనిమిది సంవత్సరములు, అతని సుతుడైన శివశ్రీ అనునతడు (7) ఏడు సంవత్సరములు, శాంతికర్ణుని సుతుడైన శివస్కంధుడు (ఎన్ని ఏండు పాలించెనో సంఖ్య తెలుపబడలేదు) అతని తర్వాత యజ్ఞశ్రీ శాంతికర్ణుడు (29) ఇరువది తొమ్మిది సంవత్సరములు, విజయుడను

రాజు (6) ఆరు ఏండ్లు, ఆతని పుత్రుడైన చండశ్రీశాంతికర్ణుడు పది ఏండ్లు, తర్వాత వీరిలో చివరివాడైన పులోముడు ఏడు సంవత్సరములు రాజ్యము పరిపాలిస్తారు. ఈ విధముగా ఈ (19) పందొమ్మిదిమంది ఆంధ్రవంశరాజులు (460) నాలుగువందల ఆరువది సంవత్సరముల పాటు రాజ్యమేలుతారు.

ఆంధ్రాణాం సంస్థితా రాజ్యే తేషాం భృత్యాన్వయే నృపాః ॥ 17 ॥

సప్తైవాంధ్రా భవిష్యన్తి దశాభీరాస్తథా నృపాః ।
సప్త గర్దభిలాశ్చాపి శకాశ్చాష్టాదశైవ తు ॥ 18 ॥

యవనాష్టౌ భవిష్యన్తి తుషారాశ్చ చతుర్దశ ।
త్రయోదశ గురుండాశ్చ హూణా హ్యేకోనవింశతిః ॥ 19 ॥

యవనాఽష్టౌ భవిష్యంతి సప్తాశీతి మహీమిమామ్ ।
సప్త గర్దభిలా భూయో భోక్ష్యన్తీమాం వసున్ధరామ్ ॥ 20 ॥

ఈ ఆంధ్రురాజుల రాజ్యపాలనము అంతమొందిన తర్వాత వారి భృత్యుల వంశమువారు (ఆంధ్రభృత్యులు) రాజ్యమును పాలిస్తారు. వీరిలో ఏడు మంది (7) అభీరులు అనువారు, ఏడుమంది (7) గర్దభిలులు , శకులను వారు (18) పదునెనిమిది మంది, యవనులు (8) ఎనిమిది మంది, తుషారులు (14)పద్నాలుగురు, గురుండులను వారు (13) పదమూడుగురు, హూణులనువారు (19) పందొమ్మిది మంది, మరల యవనులనువారు ఎనిమిది (8) మంది ఈ భూమిని పరిపాలిస్తారు. ఈ యవనుల పదవీకాలము (87) ఎనుబది ఏడేండ్లు వీరి తర్వాత మరల (7) ఏడుగురు గర్దభిలులను వారు ఈ భూమిని పాలిస్తారు.

సప్తవర్షసహస్రాణి తుషారాణాం మహీ స్మృతా।
శతాని త్రీణ్యశీతిం చ శతాన్యష్టాదశైవ తు ॥ 21 ॥

శతాన్యర్ధం చతుష్కాణి భవితవ్యా స్త్రయోదశ ।
గురుండా వృషలైస్సార్ధం భోక్ష్యన్తే మ్లేచ్ఛసంభవాః ॥ 22 ॥

శతాని త్రీణి భోక్ష్యన్తే వర్షాణ్యేకాదశైవ తు ।
ఆంధ్రాః శ్రీపార్వతీయాశ్చ తే ద్విపంచాశతం సమాః ॥ 23 ॥

సప్తషష్టిస్తు వర్షాణి దశాభీరాస్తథైవ చ ।
తేషూత్సన్నేషు కాలేన తతః కిలకిలా నృపాః ॥ 24 ॥

తర్వాత తుషారులను వారు ఏడువేల సంవత్సరములు ఈ భూమిని పాలిస్తారు. వీరిలో (18) పద్దెనిమి మంది (183)నూట ఎనభై మూడు సంవత్సరములు రాజ్యమేలుదురు. అనంతరం(13) పదమూడు మంది గురుండులు మరియు వారికి సమకాలములోనే కొంతమంది వృషలురు కూడ పద్దెనిమిది వందల ఏబది నాలుగేండ్లు ఈ భూమిని పరిపాలిస్తారు. ఈ గురుండులు మ్లేచ్ఛసంభవులుగా చెప్పబడినారు. తదనంతరము శ్రీపర్వత ప్రాంతీయులయిన ఆంధ్రులే మూడు వందల పదకొండు, (52) ఏబది రెండు సంవత్సరములు రాజ్యమును

పాలింతురు. అటు తర్వాత పదిమంది (10) అభీరులను వారు కూడా (67) అరువది ఏడేండ్లు పరిపాలిస్తారు. కాలక్రమముననుసరించి వారు కూడా నశించిపోతారు.

భవిష్యన్తీ హ యవనా ధర్మతః కామతోఽర్థతః ।
తైర్విమిశ్రా జనపదా ఆర్యా మ్లేచ్ఛాశ్చ సర్వశః ॥ 25 ॥

విపర్యయేణ వర్తన్తే క్షయమేష్యన్తి వై ప్రజాః ।
లుబ్ధానృతాబ్రువాశ్చైవ భవితారో నృపాస్తథా ॥ 26 ॥

కల్కినానుహతాః సర్వే ఆర్యా మ్లేచ్ఛాశ్చ సర్వశః ।
అధార్మికాశ్చ యేఽత్యర్థం పాషణ్డాశ్చైవ సర్వశః ॥ 27 ॥

ప్రణష్టే నృపవంశే తు సంధ్యాశిష్టకలౌ యుగే ।
కించిచ్ఛిష్టాః ప్రజాస్తా వై ధర్మే నష్టేఽపరిగ్రహాః ॥ 28 ॥

అసాధవో హ్యసత్వాశ్చ వ్యాధిశోకేన పీడితాః ।
అనావృష్టిహతాశ్చైవ పరస్పరవధేప్సవః ॥ 29 ॥

తరువాత ధర్మార్థకామ ప్రవృత్తులననుసరించునట్టి యవనులు వస్తారు. జనపదములన్నీ ఆర్యులు మరియు మ్లేచ్ఛులతో కలిసిపోతాయి. వీరందరూ తమ ధర్మమును తప్పి ప్రవర్తిస్తారు. దానివలన ప్రజలందరునూ క్షీణిస్తారు. తర్వాత రాజులందరును లుబ్ధులు, అసత్యము మాట్లాడువారు అవుతారు. కల్కి ప్రభావము చేత ఆర్యులు, మ్లేచ్ఛులు అందరూ అధార్మికులు, పాషండులు అవుతారు. కలియుగము ప్రధాన పరిమాణము ముగిసి సంధికాలము రాగా, నృపులవంశము నశించగా మిగిలిన కొంతమంది కూడా ధర్మమును ఆచరించక అసాధువులై, అసత్త్వులై, వ్యాధులచేత, దుఃఖముల చేత పీడితులై, అనావృష్ట్యాది బాధలను పొందుచు, ఒకరినొకరు పరస్పరం వధించుకొను కోరిక గల వారగుతారు.

అశరణ్యాః పరిత్రస్తా సఙ్కటం ఘోరమాశ్రితాః ।
సరిత్పర్వతవాసిన్యో భవిష్యన్త్యఖిలాః ప్రజాః ॥ 30 ॥

పత్రమూలఫలాహారాః చీరపత్రాజినామ్బరాః ।
వృత్త్యర్థమభిలప్స్యన్త్యః చరిష్యన్తి వసున్ధరామ్ ॥ 31 ॥

ఏవం కష్టమనుప్రాప్తాః ప్రజాః కాలే యుగాన్తకే ।
నిఃశేషాస్తు భవిష్యన్తి సార్ధం కలియుగేన తు ॥ 32 ॥

రక్షణలేనివారై, భయం పొందుతూ, ఘోరమైన సంకటములను పొందుతూ నదుల తీరమందు, పర్వత ప్రాంతములందు నివసించుటకై ప్రజలందరు వలసలు పోతారు. పత్ర మూల ఫలాహారులవుదురు. చీర పత్రాజినములను ధరిస్తారు. వృత్తికొరకు భృతికొరకు భూమి యందంతటనూ భ్రమిస్తారు. ఈ విధముగా ప్రజలు కలియుగమున అనేక కష్టములనుభవించుచు, కలియుగపు అంతముతో పాటు వారును నిఃశ్శేషులవుతారు.

క్షీణే కలియుగే తస్మిన్దివ్యే వర్షసహస్రకే ।
ససంధ్యాంశే నునిఃశేషే కృతం తు ప్రతిపత్స్యతే ॥ 33 ॥

ఏవం వంశక్రమః కృత్స్నః కీర్తితో యో మయా క్రమాత్ ।
అతీతా వర్తమానాశ్చ తథైవానాగతాశ్చ యే ॥ 34 ॥

మహాపద్మాభిషేకాత్తు యావజ్జన్మ పరీక్షితః ।
ఏవం వర్షసహస్రం తు జ్ఞేయం పంచాశదుత్తరమ్ ॥ 35 ॥

పౌలోమాస్తు తథాన్ధ్రాస్తే మహాపద్మాన్తరే పునః ।
అనన్తరం శతాన్యష్టౌ షట్త్రింశత్తు సమాస్తథా ॥ 36 ॥

తావత్కాలాన్తరం భావ్యమాంధ్రాన్తాదాపరీక్షితః ।
భవిష్యే తే ప్రసంఖ్యాతాః పురాణజ్ఞైః శ్రుతర్షిభిః ॥ 37 ॥

దివ్యవర్షసహస్రపరిమాణ్మాకమైన కలియుగము తన సంధి సంధ్యాంశములతో కూడా క్షీణించగా కృతయుగము వచ్చును. ఈ విధముగా నేను వంశక్రమమంతయును యథాక్రమముగా చెప్పితిని. భూత వర్తమానభవిష్యద్రాజవంశముల గురించి తెలిపితిని. మహాపద్ముని అభిషేకము మొదలుకొని పరీక్షిత్తు జన్మించు వరకు మొత్తము కాలావధి ఒకవేయి ఐదువందల సంవత్సరములు. పౌలోములు మరియు ఆంధ్రులలో చివరి రాజు మొదలుకొని మహాపద్ముని రాజ్యాభిషేకము వరకు ఎనిమిది వందల ముప్పది ఆరేండ్లగును. పరీక్షిత్తుని జన్మ మొదలుకొని ఆంధ్రుల వరకు పాలనాంతము వరకు అగు కాలమిదని పురాణజ్ఞులైన వైదిక ఋషులు భవిష్యపురాణము నందు లెక్కించి వివరించియున్నారు.

సప్తవర్షస్తదా ప్రాంశు ప్రదీప్తేనాగ్నినా సమాః ।
సప్తవింశతిభావ్యానామాంధ్రాణాం తు యదా పునః ॥ 38 ॥

సప్తర్షయస్తు వర్తంతే యత్ర నక్షత్రమండలే ।
సప్తర్షయస్తదా ప్రాంశు పర్యాయేణ శతం శతమ్ ॥ 39 ॥

సప్తర్షీణాముపర్యేతత్ స్మృతం వై దివ్యసంజ్ఞయా ।
సమా దివ్యాః స్మృతాః షష్టిర్దివ్యాబ్దాని తు సప్తభిః ॥ 40 ॥

ఏభిః ప్రవర్తతే కాలో దివ్యః సప్తర్షిభిస్తు వై ।
సప్తర్షీణాం చ యౌ పూర్వౌ దృశ్యేత హ్యుదితౌ నిశి ॥ 41 ॥

తయోర్మధ్యే తు నక్షత్రం దృశ్యతే యత్సమం దివి ।
తేన సప్తర్షయో జ్ఞేయా యుక్తా వ్యోమ్ని శతం సమాః ॥ 42 ॥

నక్షత్రాణామృషీణాంచ యోగస్త్వేతన్నిదర్శనమ్ ।
సప్తర్షయో మఘాయుక్తాః కాలే పారిక్షితే శతమ్ ॥ 43 ॥

బ్రాహ్మణాస్తు చతుర్వింశా భవిష్యతి శతం సమాః ।

మరల ఇరువది ఏడు మంది భవిష్యత్ ఆంధ్రరాజులు పరిపాలించుటకు ఉపక్రమించినపుడు సప్తర్షులు ప్రదీప్తమైన అగ్నితో సమానముగా ఆకాశమునందు ఉన్నతమైన స్థితియందుందురు. ఈ సప్తర్షులు ప్రత్యేక నక్షత్రమండలమునందు నూరు సంవత్సరములు నివసింతురు. ఇట్లు ఇరువది ఏడు నక్షత్రములందు సంచరించుటకై పట్టుకాలమును దివ్య మాసముతో లెక్కించిన ఏడు సంవత్సరముల ఆరు మాసములగును. ఇట్లు దివ్యులైన సప్తర్షులచేతనే కాలగణనము చేయబడును. రాత్రులలో ఉదయించి సప్తర్షులలో పైగాకనబడునటువంటి నక్షత్రముల మధ్యలో ఏ నక్షత్రము కనబడునో ఆ నక్షత్రమునందే సప్తర్షులుందురని శాస్త్రము. ఇట్లు సప్తర్షులు ఒకొక్క నక్షత్రమునందు నూరేసి సంవత్సరముల కాలముందురు. నక్షత్రములు సప్తర్షులు కూడ కలిసి ఉందురనుటకిదే నిదర్శనం. సప్తర్షులు మఘా నక్షత్రయుక్తులై ఉన్నప్పుడదే పరీక్షిత్తు యొక్క సమయమని తెలిసికోవలసినది. ఈ సప్తర్షులు ఇరువది నాలుగవ నక్షత్రమునకు ఎప్పుడు వత్తురో అప్పుడు బ్రాహ్మణ రాజుల కాలమారంభమగును.

తతః ప్రభృత్యయం సర్వో లోకో వ్యాపత్స్యతే భృశమ్ ॥ 44 ॥

అనృతోపహతా లుబ్ధాః ధర్మతః కామతోఽర్థతః ।
శ్రౌత స్మార్తేఽతిశిథిలే నష్టవర్ణాశ్రమే తథా ॥ 45 ॥

సఙ్కరం దుర్బలాత్మానః ప్రతిపత్స్యన్తి మోహితాః ।
బ్రాహ్మణాః శూద్రయోనిస్థాః శూద్రావై మన్త్రయోనయః ॥ 46 ॥

ఉపస్థాస్యన్తి తాన్విప్రాస్తదర్థమభిలిప్సవః ।
క్రమేణైవ చ దృశ్యంతే స్వవర్ణాన్తరదాయకమ్ ॥ 47 ॥

క్షయమేవ గమిష్యన్తి క్షీణశేషా యుగక్షయే ।

అప్పటినుండి ఈ లోకమునందంతటయును ఆపత్తులు సంభవించును. జనులు అసత్యోపహతులగుదురు. ఇంకనూ లుబ్ధులై ధర్మకామార్థములను మరచిపోతారు. శ్రౌత స్మార్తాది ధర్మములు నశించి పోతాయి. వర్ణాశ్రమ ధర్మములు శిథిలమైపోతాయి. జనులు బలహీనులై వర్ణసాంకర్యములను పొందుతారు. బ్రాహ్మణులు శూద్రయోనిగతులవుతారు. శూద్రులు మంత్రయోనులవుతారు. శూద్రులు విప్రధర్మములాచరించుట వలన విప్రులు వారిని ఆశ్రయిస్తారు. క్రమముగా విప్రులు స్వ-పర-వర్ణ భేదము తెలియనందున ధర్మమును నశింపజేసిన వారగుతారు. ఈ విధముగా యుగాన్తమువరకు మిగిలిన కొన్ని ధర్మముల కూడా నశించిపోతాయి.

యస్మిన్ కృష్ణో దివం యాతః తస్మిన్నేవ తదాహని ॥ 48 ॥

ప్రతిపన్నం కలియుగం ప్రమాణం తస్య మే శ్రుణు ।
చతుశ్శత సహస్రం తు వర్షాణాం వై స్మృతం బుధైః ॥ 49 ॥

చత్వార్యష్టసహస్రాణి సంఖ్యాతం మానుషేణ తు ।
దివ్యం వర్షసహస్రం తు సదా సంఖ్యా ప్రవర్తతే ॥ 50 ॥

నిఃశేషే తు సదా తస్మిన్ కృతం వై ప్రతిపత్స్యతే ।
ఐలశ్చేక్ష్వాకువంశశ్చ సహదేవః ప్రకీర్తితాః ॥ 51 ॥

ఇక్ష్వాకోః సంస్కృతం క్షత్రం సుమిత్రాన్తం భవిష్యతి ।
ఐలం క్షత్రం సమాక్రాన్తం సోమవంశవిదో విదుః ॥ 52 ॥

కృష్ణ పరమాత్మ దివమునకేగిన నాటినుండే కలియుగమారంభమగును. దానికి ప్రమాణములను తెలిపెదను వినుము. ఇది మానుషప్రమాణానుసారము నాలుగు లక్షల ముప్పదిరెండువేల సంవత్సరములు. దివ్య ప్రమాణానుసారము వేయి దివ్య సంవత్సరములు. కలియుగము ముగియునప్పుడు కలియొక్క సంధ్యాకాలము ఆరంభమగును. తర్వాత కలియుగము నిశ్శేషముగా ముగిసినప్పుడు కలియొక్క సంధ్యాకాలము ఆరంభమగును. తర్వాత కలియుగము నిశ్శేషముగా ముగిసినప్పుడు కృతయుగము ఆరంభమగును. ఐలుడు మరియు ఇక్ష్వాకువంశీయులైన ఇద్దరు రాజులు సహదేవుడను నామముతో పిలువబడుదురు. ఇక్ష్వాకు రాజవంశము సుమిత్రుడను రాజుతో అంతమగును. సోమవంశవిదులైన పండితులు ఐలవంశము కూడ చంద్రవంశమున సంక్రాన్తమగునని చెప్పియున్నారు.

ఏతే వివస్వతః పుత్రాః కీర్తితా కీర్తివర్ధనాః ।
అతీతా వర్తమానాశ్చ తథైవానాగతాశ్చ యే ॥ 53 ॥

బ్రాహ్మణః క్షత్రియా వైశ్యాస్తథా శూద్రాశ్చ వై స్మృతాః ।
వైవస్వతేఽన్తరే తస్మిన్నితి వంశః సమాప్యతే ॥ 54 ॥

దేవాపిః పౌరవో రాజా ఐక్ష్వాకో యశ్చ తే మతః ।
మహాయోగబలోపేతౌ కలాపగ్రామమాశ్రితౌ ॥ 55 ॥

ఏతౌ క్షత్రప్రణేతారౌ నవవింశే చతుర్యుగే ।
సువర్చా మనుపుత్రస్తు ఐక్ష్వాకాద్యో భవిష్యతి ॥ 56 ॥

భూత- వర్తమాన- భవిష్యత్కాలమున కూడా ఉందు వీరు. వివస్వంతుని పుత్రులుగా కీర్తింపబడినారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు మొదలగు వారందరు వైవస్వతమన్వంతరమున వివస్వంతుని సంతానమునకు చెందినవారే. ఈ విధముగా ఈ వంశకీర్తనమిట్లు సమాప్తము చేయబడుచున్నది. ఇక పురవంశమునకు చెందిన దేవాపియను క్షత్రియుడు, ఇక్ష్వాకు వంశమునకు చెందిన మనువు మహాయోగము గలవారు, బలోపేతులు. వీరిరువురు కలాపి గ్రామము నాశ్రయించి ఉందురు. వీరిద్దరు రాబోవు ఇరువది తొమ్మిదవ మహాయుగమునందు క్షత్రియవంశప్రవర్తకులగుదు. మనుపుత్రుడైన సువర్చుడు ఇక్ష్వాకువంశమునకు ఆద్యుడవుతాడు.

నవవింశే యుగేఽసౌ వై వంశస్యాదిర్భవిష్యతి ।
దేవాపి పుత్ర స్సత్యస్తు ఐలానాం భవితా నృపః ॥ 57 ॥

క్షత్రప్రవర్తకావేతౌ భవిష్యే తు చతుర్యుగే ।
ఏవం సర్వేషు విజ్ఞేయం సంతానార్థం తు లక్షణమ్ ॥ 58 ॥

ఇరువది తొమ్మిదవ చతుర్యుగమున ఈతడు తన వంశమునకు మూలపురుషడవుతాడు. దేవాపి పుత్రుడైన సత్యుడు ఐలవంశీయ రాజులకు ప్రముఖుడవుతాడు. భవిష్యత్కాలీన చతుర్యుగమున వీరిద్దరునూ క్షాత్రధర్మప్రవర్తకులవుతారు. అన్ని వంశములలో నుండు రాజుల యొక్క లక్షణములిట్లే ఉండునని తెలియవలెను.

క్షీణే కలియుగే చైవ తిష్ఠన్తీతి కృతే యుగే ।
సప్తర్షయస్తు తైః సార్ధం మధ్యే త్రేతాయుగే పునః ॥ 59 ॥

బీజార్థం వై భవిష్యన్తి బ్రహ్మక్షత్రస్తు వై పునః ।
ఏవమేవం తు సర్వేషు తిష్ఠ్యన్తేష్వన్తరేషు చ ॥ 60 ॥

సప్తర్షయో నృపైః సార్ధం సన్తానార్థం యుగే యుగే ।
ఏవం క్షత్రస్య చోత్సేధః సంబంధో వై ద్విజైః స్మృతః ॥ 61 ॥

కలియుగము తర్వాత వచ్చు కృతయుగమున, త్రేతాయుగమున కూడ సప్తర్షులు ఆయా యుగ ధర్మములను ప్రవర్తింపజేయుదురు. ఇట్లు వీరు బ్రాహ్మణ మరియు క్షత్రియ జాతికి కూడ బీజభూతులై ధర్మమును ప్రవర్తింపజేయుట ప్రతి కలియుగాంతమునందును జరుగుచునే యుండును. క్షాత్రధర్మమును లోకమున వ్యాపింపజేయుటకై విప్రులు క్షత్రియులతో సంబంధమునందుండుట మరియు సప్తర్షులు కూడ వీరితో కలిసి ఉండుట వలననే ప్రతియుగము నందును ధర్మసంతానము నడుచును.

మన్వన్తరాణాం సన్తానే సన్తానాశ్చ శ్రుతౌ స్మృతాః ।
అతిక్రాన్తయుగాశ్చైవ బ్రహ్మక్షత్రస్య సంభవాః ॥ 62 ॥

యథా ప్రశాన్తిస్తేషాం వై ప్రకృతీనాం యథా క్షయః ।
సప్తర్షయో విదుస్తేషాం దీర్ఘాయుష్ట్వం క్షయోదయౌ ॥ 63 ॥

ఏతేన క్రమయోగేన ఐలా ఇక్ష్వాకవో నృపాః ।
ఉత్పాద్యమానాస్త్రేతాయాం క్షయమాణాః కలౌయుగే ॥ 64 ॥

అనుయాన్తి యుగాఖ్యాం తు యావన్మన్వన్తరక్షయమ్ ।

ప్రత్యేక మన్వంతరపు సృష్టివిషయము, అతిక్రాంత యుగధర్మములు, బ్రాహ్మణ క్షత్రియగణముల యొక్క సంతానము మొదలగునవన్నియు శ్రుతులలో కీర్తింబడినవి. అంతేకాక గడిచిన యుగములు, వానియందలి బ్రాహ్మణ క్షత్రియజాతుల ఉత్పత్తి విధానములు, వారి ప్రకాశ, క్షయములు, దీర్ఘాయుఃపరిమాణమములు, వృద్ధి ఇత్యాదులనన్నింటిని సప్తర్షులు ఎరుగుదురు. ఈ క్రమయోగముననుసరించి ఐలులు మరియు ఇక్ష్వాకువంశీయులు త్రేతాయుగమున జనించి కలియుగమున క్షయమునొందుదురు. ఇది ఇట్లే మన్వంతరావసానము వరకు కొనసాగుచునే యుండును.

జామదగ్న్యేన రామేణ క్షత్రే నిరవశేషితే ॥ 65 ॥

రిక్తేయం వసుధా సర్వా క్షత్రియైర్వసుధాధిపైః ।
ద్వివంశకరణం సర్వం కీర్తయిష్యే నిబోధ మే ॥ 66 ॥

ఐలం చైక్ష్వాకువంశం చ ప్రకృతిం పరిచక్షతే ।
రాజానః శ్రేణిబద్ధాశ్చ తథాఽన్యే క్షత్రియా భువి ॥ 67 ॥

ఐలవంశాస్తు భూయాంసో న తథేక్ష్వాకవో నృపాః ।
ఏషామేకశతం పూర్ణం కులానామభిరోచతే ॥ 68 ॥

తావదేవ తు భోజానాం విస్తారాద్ద్విగుణం స్మృతమ్ ।
భోజానాం ద్విగుణం క్షత్రం చతుర్ధా తద్యథాతథమ్ ॥ 69 ॥

జామదగ్ని రాముడు క్షత్రియజాతి నంతటిని సమూలముగా నశింపజేయగా, ఈ వసుధయంతయు క్షత్రియజాతి శూన్యమగును. ఐనప్పటికిని మరల రెండు రాజవంశములు లోకమునందు కొనసాగు విషయమును తెలిపెదను వినుము. ఈ క్షత్రియ వంశములకు ఐలవంశము మరియు ఇక్ష్వాకు వంశము మూలభూతములు. వీని మూలముననే ఈ జగత్తునందు రాజవంశపరంపరలు మరియు ఇతర క్షత్రియజాతులన్నియును నిలుచును. ఈ రెండింటిలోనూ మరల ఇక్ష్వాకులకంటే ఐలవంశయుల సంఖ్యయే అధికముగా ఉండును. వీరు మొత్తము ఏకశతవంశములవారు తదనంతరము క్రమముగా వీరు వృద్ధిపొందినప్పటికిని భోజవంశీయులే వీరికంటే అధికమైరి. భోజవంశీయుల వ్యాప్తి ఐల మరియు ఇక్ష్వాకు వంశీయులకన్నను నాలుగు రెట్లు అధికముగా ఉండును.

తే హ్యతీతాః సనామానో బ్రువతస్తాన్నిబోధ మే ।
శతం వై ప్రతివింధ్యానాం శతం నాగాః శతం హయాః ॥ 70 ॥

శతమేకం ధార్తరాష్ట్రా హ్యశీతిర్జనమేజయాః ।
శతం వై బ్రహ్మదత్తానాం వీరాణాం కురవః శతమ్ ॥ 71 ॥

తతః శతం చ పాంచాలాః శతం కాశికుశాదయః ।
తథాపరే సహస్రే ద్వే యే నీపాః శశబిందవః ॥ 72 ॥

గడిచిపోయిన రాజవంశములలో వారివారి సనామత్వము ననుసరించి వారి క్రమమును తెలిపెదను వినుము. వారిలో ప్రతివింధ్యులు -100, నాగులు - 100, హయవంశీయులు - 100, ధార్తరాష్ట్రులు -100, పాంచాలులు-100, కాశికుశాదులు -100, మరియు నీపులు శశబిందువులు మొదలగు ఇతరవంశీయులు జనమేజయులు -100, బ్రహ్మదత్తులు-100, కురువంశీయులు-100 రెండువేల వరకు ఉందురు.

ఇష్టవన్తశ్చ తే సర్వే సర్వే నియుతదక్షిణాః ।
ఏవం రాజర్షయోఽతీతాః శతశోఽథ సహస్రశః ॥ 73 ॥
మనోర్వైవస్వతస్యాసన్ వర్తమానేఽన్తరే విభోః ।
తేషాం తు నిధనోత్పత్తౌ లోకసంస్థితయః స్థితాః ॥ 74 ॥

న శక్యో విస్తరస్తేషాం సన్తానస్య పరస్పరమ్ ।
తత్పూర్వాపరయోగేన వక్తుం వర్షశతైరపి ॥ 75 ॥

పైన చెప్పబడిన రాజలందరునూ యజ్ఞయాగాది కర్మలనాచరించి అనేకవిధములైన దక్షిణలు ఇచ్చినవారే. ఈ వంశములకు చెందిన వందలు మరియు వేలకొలది రాజర్షులు ఎందరో వెళ్ళిపోయిరి. వారందరియొక్క జననమరణముల గురించి కాని రాజ్యపాలనము గురించి కాని, పారస్పరిక సంబంధబాంధవ్యముల గురించి కాని, పూర్వాపరయోగముతో సమగ్రముగా చెప్పుటకు ఒక వంద ఏండ్లయిననూ సరిపోవు.

అష్టావింశత్సమాఖ్యాతా గతా వైవస్వతేఽన్తరే ।
ఏతే దేవగణైః సార్ధం శిష్టా తే తాన్నిబోధత ॥ 76 ॥

చత్వారింశత్త్రయశ్చైవ భవిష్యాస్తే మహాత్మనః ।
అవశిష్టా యుగాఖ్యాస్తే తతో వైవస్వతో హ్యయమ్ ॥ 77 ॥

ఏతద్వః కీర్తితం సమ్యక్ సమాసవ్యాసయోగతః ।
పునర్వక్తుం బహుత్వాత్తు న శక్యం విస్తరేణ తు ॥ 78 ॥

ఉక్తా రాజర్షయో యే తు అతీతాస్తే యుగైస్సహ ।
యే తే యయాతివంశ్యానాం యే చ వంశా విశాంపతే ॥ 79 ॥

ఈ వైవస్వంతమన్వంతరమున ఇంతవరకూ ఇరువది ఎనిమిది మహాయుగములు గడిచినవి. ఇంకా నలుబది మూడు మహాయుగములు గడుపవలసియున్నది. ఈ మహాయుగములతో పాటు అనేక దేవతాగణములకు సంబంధించిన వారు సంబద్ధులైయున్నారు. అది తెలుసుకొనుము. ఇక అవిశిష్టులైన వైవస్వతమనువంశమునకు చెందినవారి పేర్లతోనే ఆయా యుగములు ప్రసిద్ధములగును. ఇంతవరకు ఈ వంశముల యొక్క చరిత్ర సంక్షిప్తరూపమున చక్కగా వివరించితిని కాని మరల దీని గురించి విస్తరముగా చెప్పుటకు వీలుకాదు. ఇంతవరకు మీకు చెప్పబడిన రాజర్షులందరు ఆయా యుగములతో పాటు గడిచిపోయినవారే. ఈ చెప్పినవన్నియును యయాతి వంశమునకు చెందిన రాజులయొక్క అనువంశవృత్తాంతములు.

కీర్తితా ద్యుతిమన్తస్తే య ఏతాన్ధారయేన్నరః ।
లభతే స వరాన్ పంచ దుర్లభానిహ లౌకికాన్ ॥ 80 ॥

ఆయుః కీర్తిం ధనం స్వర్గం పుత్రవాంశ్చాభిజాయతే ।
ధారణాచ్ఛ్రవణాచ్చైవ పరం స్వర్గస్య ధీమతః ॥ 81 ॥

ఇంతవరకు ఇక్కడ వివరించిన రాజులయొక్క చరిత్రను హృదయమునందు ధరించువారు తేజోవంతులగుదురు. మరియు అత్యంత దుర్లభములైన ఆయుష్యము, కీర్తి, ధనము, స్వర్గము, పుత్రులు అను లౌకికములైన ఐదు వరములను పొందుదురు. వీటిని శ్రద్ధగా విని, సతతము హృదయమున ధరించువాడు ధీమంతుడై స్వర్గప్రాప్తిని పొందును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే భవిష్యరాజానుకీర్తనం నామ త్రిసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥273॥

శ్రీ మత్స్యమహాపురాణమున భవిష్యరాజానుకీర్తనమనే రెండువందల డెబ్బైమూడవ అధ్యాయం సమాప్తం.

చతుఃసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల డెబ్బైనాల్గవ అధ్యాయం

మహాదానానుకీర్తనే తులాపురుషదానమ్ – మహాదానానుకీర్తనలో తులాపురుషదానం

ఋషయః ఊచుః – ఋషులు చెప్పారు.

న్యాయేనార్జనమర్థానాం వర్ధనం చాభిరక్షణమ్ ।
సత్పాత్ర ప్రతిపత్తిశ్చ సర్వశాస్త్రేషు పఠ్యతే ॥ 1 ॥

కృతకృత్యో భవేత్కేన మనస్వీ ధనవాన్ బుధః ।
మహాదానేన దత్తేన తన్నో విస్తరతో వద ॥ 2 ॥

ఓ సూతమహార్షీ! న్యాయమార్గమున ధనము నార్జించుట, ఆర్జించిన దానిని వృద్ధి, చేయుట, రక్షించుకొనుట యోగ్యులైన వారికి దానము చేయుట అను విషయమును అన్ని శాస్త్రములు వివరించుచున్నవి. కాని ఎటువంటి మహాదానము చేసినచో వివేకియైన ధనవంతుడు కృతకృత్యుడగునో దానిని గురించి విస్తరముగా మాకు తెలుపుదు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

అథాతః సమ్ప్రవక్ష్యామి మహాదానానుకీర్తనమ్ ।
దానధర్మేఽపి యన్నోక్తం విష్ణునా ప్రభవిష్ణునా ॥ 3 ॥

తదహం సమ్ప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
సర్వపాపక్షయకరం నృణాం దుఃస్వప్ననాశనమ్ ॥ 4 ॥

యత్తత్షోడశధా ప్రోక్తం వాసుదేవేన భూతలే ।
పుణ్యం పవిత్రమాయుష్యం సర్వపాపహరం శుభమ్ ॥ 5 ॥

సాక్షాత్తూ త్రిలోకనాథుడైన శ్రీమహావిష్ణువు దానధర్మ ప్రకరణమున వివరించిన మహాదానం గురించి తెలుపుతాను. మానవులకు సకల పాపక్షయకరము, దుఃస్వప్ననాశనము అయిన ఈ మహాదానం భూతలమునందు పదహారు విధములని వాసుదేవుడే స్వయముగా చెప్పాడు. అది పుణ్యకర్మ, పవిత్రమైనట్టిది సర్వపాపహరము, శుభప్రదము.

పూజితం దేవతాభిశ్చ బ్రహ్మవిష్ణుశివాదిభిః ।
ఆద్యం తు సర్వదానానాం తులాపురుషసంజ్ఞకమ్ ॥ 6 ॥

హిరణ్యగర్భదానం చ బ్రహ్మాణ్డం తదనన్తరమ్ ।
కల్పపాదపదానం చ గోసహస్రం చ పంచమమ్ ॥ 7 ॥

హిరణ్యకామధేనుశ్చ హిరణ్యాశ్వస్తథైవ చ ।
హిరణ్యాశ్వరథస్తద్వత్ హేమహస్తిరథస్తథా ॥ 8 ॥

పంచలాఙ్గలకం తద్వత్ ధరాదానం తథైవ చ ।
ద్వాదశం విశ్వచక్రం తు తతః కల్పలతాత్మకమ్ ॥ 9 ॥

సప్తసాగరదానం చ రత్నధేనుస్తథైవ చ ।
మహాభూతఘటస్తద్వత్ షోడశం పరికీర్తితమ్ ॥ 10 ॥

బ్రహ్మవిష్ణు శివాది దేవతల చేత పూజింపబడిన సమస్త దానములలో మొదటి దానం (1) తులాపురుషదానం. మిగిలిన దానములు వరుసగా: (2) హిరణ్యగర్భదానం (3) బ్రహ్మాండదానం (4) కల్పపాదపదానం (5) గోసహస్రదానం (6) హిరణ్యకామధేనుదానం (7) హిరణ్యాశ్వదానం (8) హిరణ్యాశ్వరథదానం (9) హిరణ్యగజరథదానం (10) పంచలాంగలకదానం (11) ధరాదానం (12) విశ్వచక్రదానం (13) కల్పలతాదానం (14) సప్తసాగరదానం (15) రత్నధేనుదానం (16) మహాభూతఘటదానం. ఇవి పదహారు విధముల దానములు.

సర్వాణ్యేతాని కృతవాన్ పురా శమ్బరసూదనః ।
వాసుదేవస్తు భగవాన్ అంబరీషోఽథ భార్గవః ॥ 11 ॥

కార్తవీర్యార్జునో నామ ప్రహ్లాదః పృథురేవ చ ।
కుర్యురన్యే మహీపాలాః కేచిచ్చ భరతాదయః ॥ 12 ॥

యస్మాద్విఘ్నసహస్రేణ మహాదానాని సర్వదా ।
రక్షన్తే దేవతాః సర్వా ఏకైకమపి భూతలే ॥ 13 ॥

ఏషామన్యతమం కుర్యాత్ వాసుదేవ ప్రసాదతః ।
న శక్యమన్యథా కర్తుమపి శక్రేణ భూతలే ॥ 14 ॥

పూర్వము శంబరాసుర శత్రువైన వాసుదేవభగవానుడు, అంబరీషుడు, భార్గవుడు, కార్తవీర్యార్జునుడు, ప్రహ్లాదుడు, పృథుమహారాజు, భరతుడు మొదలగు ఇతర రాజులు కూడా ఈ మహాదానములు చేశారు. ఎందుకనగా వేలకొలది విఘ్నముల నుండి దేవతలు సర్వథా ఈ మహాదానములను రక్షించుచుండురు. కావున వాసుదేవుని అనుగ్రహముతో వీటిలో ఏ ఒక్క మహాదానమునైనను చేయవలెను. ఈ దానఫలమును భూతలమందు ఇంద్రుడు కూడ అన్యథా చేయుటకు సమర్థుడు కాదు.

తస్మాదారాధ్య గోవిందం ఉమాపతివినాయకౌ ।
మహాదానమఖం కుర్యాత్ద్వి విప్రశ్చైవానుమోదితః ॥ 15 ॥

ఏతదేవాహ మనవే పరిపృష్టో జనార్దనః ।
యథావదనువక్ష్యామి శృణుధ్వం ఋషిసత్తమాః! ॥ 16 ॥

కావున గోవిందుని, ఉమాపతిని, వినాయకుని యథాశక్తిగా ఆరాధించి విప్రులయొక్క అనుమతితో ఈ మహాదానయజ్ఞము నారించవలెను. ఈ విషయమునే మనువు జనార్దనుని అడిగాడు. ఓ ఋషిసత్తములారా! నేను వినిన ఆ విషయమును యథాతథముగా వివరిస్తాను వినుడు.

మనురువాచ – మనువు చెప్పాడు.

మహాదానాని యానీహ పవిత్రాణి శుభాని చ ।
రహస్యాని ప్రదేయాని తాని మే కథయాచ్యుత ॥ 17 ॥

ఓ అచ్యుతా ! పవిత్రములైనట్టి, శుభప్రదములైనట్టి రహస్యముగా దానము చేయవలసినట్టి మహాదానములను దయతో తెలుపుము.

మత్స్య ఉవాచ – మత్స్య భగవానుడు చెప్పాడు.

యాని నోక్తాని గుహ్యాని మహాదానాని షోడశ ।
తాని తే కథయిష్యామి యథావదనుపూర్వశః ॥ 18 ॥

తులా పురుషయోగోఽయం యేషామాదౌ విధీయతే ।
అయనే విషువే పుణ్యే వ్యతీపాతే దినక్షయే ॥ 19 ॥

యుగాదిషూపరాగేషు తథా మన్వన్తరాదిషు ।
సంక్రాంతా వైధృతిదినే చతుర్దశ్యష్టమీషు చ ॥ 20 ॥

సితపంచదశీ పర్వద్వాదశీష్వష్టకాసు చ ।
యజ్ఞోత్సవవివాహేషు దుఃస్వప్నాద్భుతదర్శనే ॥ 21 ॥

ద్రవ్యబ్రాహ్మణలాభే వా శ్రద్ధా వా యత్ర జాయతే ।
తీర్థే వాయతనే గోష్ఠే కూపారామసరిత్సు చ ॥ 22 ॥

గృహే వాయతనే వాఽపి తడాగే రుచిరే తథా ।
మహాదానాని దేయాని సంసారభయభీరుణా ॥ 23 ॥

అనిత్యం జీవితం యస్మాద్వసు చాతీవ చంచలమ్ ।
కేశేష్వేవ గృహీతః సన్ మృత్యునా ధర్మమాచరేత్ ॥ 24 ॥

ఇంత వరకు ఎవరూ చెప్పనట్టి రహస్యములైన పదహారు మహాదానముల గురించి క్రమానుసారముగా చెబుతాను. వీటిన్నింటిలో మొదటది తులాపురుషదానము. దానములను సరియయిన ఆయనం, విషువం, వ్యతీపాతం, దినక్షయం, యుగాది దివసములందు, గ్రహణం, మన్వన్తరాదిదివసం, సంక్రాంతి, వైధృతి ఉండే దివసం, చతుర్దశీ, అష్టమి, శుక్లపూర్ణిమా పర్వదివసములందు, ద్వాదశి, అష్టకం, యజ్ఞం, ఉత్సవం, వివాహములందు, దుఃస్వప్నములు, అద్భుతములు కనబడినపుడు, ద్రవ్యము లభించినప్పుడు, యోగ్యుడైన బ్రాహ్మణుడు లభించినప్పుడు, శ్రద్ధ కలిగినప్పుడు చేయవలెను. అటులనే తీర్థములు, క్షేత్రములు, గోష్ఠములు, కూపములు, ఆరామములు, నదులు, గృహము, దేవాలయములు, తటాకములు మొదలగు శుచి ప్రదేశములందు సంసారమనిన భయపడు భీరువులైనవారు ఈ మహాదానము లీయవలెను. జీవితం అనిత్యమైనది. ధనం అతిచంచలమైనది. మృత్యువు చేత కేశములను పట్టుకొనబడిన వానివలె నరడు ధర్మమునవశ్యము ఆచరించవలెను.

**పుణ్యాం తిథిమథాసాద్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
షోడశరత్నిమాత్రం తు దశ ద్వాదశ వా కరాన్ ॥ 25 ॥**

**మండపం కారయేద్విద్వాన్ చతుర్భద్రాసనం బుధః ।
సప్తహస్తా భవేద్వేదీ మధ్యే పంచకరా తథా ॥ 26 ॥**

**తన్మధ్యే తోరణం కుర్యాత్ సారదారుమయం బుధః ।
కుర్యాత్ కుండాని చత్వారి చతుర్దిక్షు విచక్షణః ॥ 27 ॥**

పవిత్రమైన శుభప్రదమైన తిథినాడు బ్రాహ్మణులచే స్వస్తి పుణ్యాహవాచనములు గావించి, పదహారు హస్తముల పొడవును పది లేదా పన్నెండు హస్తముల వెడల్పుగల దీర్ఘచతురస్రాకారపు మండపమును నిర్మించుకొనవలెను. తర్వాత ఆ మండపమున నాలుగు ఆసనములు ఏర్పరుచవలెను. దాని నడుమ ఐదు లేదా ఏడు మూరల వెడల్పున మనుజులు తిరుగుటకు వీలుగా వీధిని ఏర్పర్చుకొనవలెను. అలాగే మండప మధ్యలో ధృడమైన దారువుతో తోరణమును నిర్మించవలెను. విచక్షణుడైన బుధుడు అక్కడ నాలుగు దిక్కులయందు నాలుగు కుండములను ఏర్పరచవలెను.

**సమేఖల యోనియుతాని కుర్యాత్ సంపూర్ణకుంభాని సహాసనాని ।
సుతామ్రపాత్రద్వయసంయుతాని సయజ్ఞపాత్రాణి సువిష్టరాణి ॥ 28 ॥**

**హస్తప్రమాణాని తిలాజ్య ధూప పుష్పోపహారాణి సుశోభనాని ।
పుర్వోత్తరే హస్తమితాథ వేదీ గ్రహాదిదేవేశ్వరపూజనాయ ॥ 29 ॥**

కుండములను మేఖలలతోను, పూర్ణకుంభములతోను మరియు ఆసనములతోను సిద్ధం చేయవలెను. తర్వాత ప్రతికుండ సమీపమునున్న రెండేసి తామ్రపాత్రలు, సృక్-సృవ- ఆజ్యస్థాలీత్యాది యజ్ఞపాత్రలు, మూరెడు చదరపు విష్టరములను, తిలలను, ఆజ్యమును, ధూపమును, మంచి పుష్పోపహారములను కూడ వుంచవలెను. ఈశాన్య దిశయందు వేరుగా గ్రహాదులను, లోకపాలకులను పూజించుటకై ఒక మూరెడు చదరపు ప్రమాణముతో వేదికనొక దానిని నిర్మించుకొనవలెను.

**అత్రార్చనం బ్రహ్మశివాచ్యుతానాం తత్రైవ కార్యం ఫలమాల్యవస్త్రైః ।
లోకేశవర్ణాః పరితః పతాకాః మధ్యే ధ్వజః కింకిణికాయుతః స్యాత్ ॥ 30 ॥**

**ద్వారేషు కార్యాణి చ తోరణాని చత్వార్యపి క్షీరవనస్పతీనామ్ ।
ద్వారేషు కుంభద్వయమత్ర కార్యం స్రగ్గంధధూపామ్బరరత్నయుక్తమ్ ॥ 31 ॥**

**శాలేంగుదీచందనదేవదారు శ్రీపర్ణి బిల్వప్రియకాంచనోత్థమ్ ।
స్తంభద్వయం హస్తయుగావఖాతం కృత్వా ధృఢం పంచకరోచ్ఛ్రితం చ ॥ 32 ॥**

కుండములపైన ఫలమాల్యవస్త్రాదుల చేత బ్రహ్మ-విష్ణు-రుద్రులను పూజించవలెను. అచ్చటనే ఆయా లోకేశ్వర గ్రహాదులకు చెప్పినటువంటి వర్ణముల వస్త్రములతో చేసినట్టి పతాకములను, వాటి నడుమ చిరుగంటలతోను

నూపురములతో కూడిన ఒక పెద్ద ధ్వజము నుంచవలెను. నాలుగువైపుల వుండు ద్వారములకు మ(ఱ్రి, జువ్వి మొదలగు పాలుగారు వృక్షముల (చెట్లు) చిగుళ్ళతో చేసిన తోరణములు కట్టవలెను. తర్వాత ప్రతి ద్వారమునందును రెండేసి పూర్ణకుంభములను, మాలలు, గంధ–ధూప–వస్త్ర–రత్నాదుల నుంచవలెను. మరియు ఈ మండప సమీపముననే శాల–ఇంగుదీ–చందన–దేవదారు,–శ్రీపర్ణీ–మారేడు –మామిడి మరియు కడిమి ఇత్యాదులతో చేసిన ఐదు మూరల ప్రమాణము గల చేసిన స్తంభములను రెండు మూరల లోతుగల గోతిలో దృఢముగా నాటించవలెను.

తదన్తరం హస్తచతుష్టయం స్యా దథోదరజ్జశ్చ తదజ్గమేవ ।
సమానజాతిశ్చ తులాఽవలంబ్యా హైమేన మధ్యే పురుషేణ యుక్తా ॥ 33 ॥

దైర్ఘ్యేణ సా హస్తచతుష్టయం స్యాత్ పృథుత్వమస్యాస్తు దశాఙ్గులాని ।
సువర్ణపట్టాభరణా తు కార్యా సా లోహపాశద్వయ శృఙ్ఖలాభిః ॥ 34 ॥

యుతా సువర్ణేన తు రత్నమాలా సంస్థాపయేత్పుష్పఫలోపశోభమ్ ।
చక్రం లిఖేద్వారిజగర్భయుక్తం నానారజోభిర్భువి పుష్పకీర్ణమ్ ॥ 34 ॥

తర్వాత ఆ రెండు స్తంభములకు నడుమ నాలుగమూరల దూరముండునట్లు చూచుకొని వానిపై అడ్డముగా ఇంకొక దారువును అమర్చవలెను. ఈ స్తంభములు మరియు వాటిపై నిలిపిన దారువు ఒకే జాతి దారువుతోనే చేయించవలెను. తర్వాత అటువంటి జాతితోనే చేసినట్టి తులను వ్రేలాడదీయవలెను. తదనంతరము ఈతులకు మధ్యలో బంగారముతో చేసిన పురుషుని నిలుపవలెను. ఈ 'తుల' ((త్రాసు) నాలుగు మూరల పొడవును పది అంగుళముల వెడల్పును కలదై వుండవలెను. దీనికి బంగారు పట్టికలే ఆభరణములుగా ఉంచవలెను. దీనికి రెండు కొనలయందు లోహముతో చేసిన పళ్ళెరములను లోహపు గొలుసులతోనే బిగించవలెను. ఇంకనూ దీనిని సువర్ణముతోను, రత్నములతోను, చేసిన మాలలతో అలంకరించి పుణ్యప్రదములైన ఫలములతో ఉపశోభితమై వుండవలెను. తర్వాత అక్కడ భూమిపైన ముగ్గుతో చక్రమును నిర్మించి దానిపై అనేకవిధములైన పుష్పములను చల్లవలెను.

వితానకం చోపరి పఞ్చవర్ణం సంస్థాపయేత్పుష్పఫలోపశోభమ్ ।
అథర్త్విజో వేదవిదశ్చ కార్యాః సురూపవేషాన్వయశీలయుక్తాః ॥ 36 ॥

విధానదక్షాః పటవోఽనుకూలా యే చార్యదేశప్రభవా ద్విజేంద్రాః ।
గురుశ్చ వేదాన్తవిదార్యవంశ సముద్భవః శీలకులాభిరూపః ॥ 37 ॥

పురాణశాస్త్రాభిరతోఽతిదక్షః ప్రసన్నగంభీరసరస్వతీకః ।
సితామ్బరః కుణ్డలహేమసూత్ర కేయూరకణ్ఠాభరణాభిరామః ॥ 38 ॥

అట్లే ఐదు వర్ణములు కలిగిన పుష్పఫలోపశోభితమైన వితానమును కూడ ఈ తులకు పైన వచ్చునట్లు ఏర్పర్చవలెను. తర్వాత మంచి రూపము, వంశము, వేషము, శీలము కలవారై విధివిధానములందు దక్షులై,

సమర్థులై, అనుకూలురై, ఆర్యవిధివిధానములందు దక్షులై, సమర్థులై, అనుకూలురై, ఆర్య దేశమునందే జన్మించినవారై వేదవిదులైన ఋత్విజులను, వేదార్థవిచారణాదక్షుడైనట్టి, ఉత్తమవంశమునందు జన్మించినట్టి, మంచి శీలము, స్ఫురద్రూపము కలిగియున్నట్టి, పురాణములు, శాస్త్రములు మొదలగువాటియందు ఆసక్తి కలిగినట్టి, మంచి సమర్థవంతుడైనట్టి, ప్రసన్నముగానే గాక గంభీరముగా కూడా మాట్లాడ కలిగినట్టి, తెల్లని వస్త్రములు ధరించియున్నట్టి, కుండలములను, బంగారు హారములను, భుజకీర్తులు, కంఠాభరణములను ధరించినట్టి, సౌందర్యవంతుడైనట్టి ఆచార్యుని గూడా నియమించుకొనవలెను.

పూర్వేణ ఋగ్వేదవిదావథాస్తాం యజుర్విదౌ దక్షిణతశ్చ శస్తౌ ।
స్థాపయౌ ద్విజౌ సామవిదౌ తు పశ్చాత్ ఆథర్వణావుత్తరతస్తు కార్యౌ ॥ 39 ॥

వినాయకాదిగ్రహలోకపాలవస్వష్టకాదిత్యమరుద్గణానామ్ ।
బ్రహ్మాచ్యుతేశార్కవనస్పతీనాం స్వమంత్రతో హోమచతుష్టయం స్యాత్ ॥ 40 ॥

జప్యాని సూక్తాని తథైవ చైషామనుక్రమేణాపి యథాస్వరూపమ్ ।
హోమావసానే కృతతూర్యనాదో గురుర్గృహీత్వా బలిపుష్పధూపమ్ ॥
ఆవాహయేత్ లోకపతీన్ క్రమేణ మన్త్రైరమీభిర్యజమానయుక్తః ॥ 41 ॥

మండపములోని తూర్పువైపున ఋగ్వేదపండితులను, దక్షిణమువైపున ఇద్దరు యజుర్వేదపండితులను, పశ్చిమమువైపున సామవేదకోవిదులను, ఉత్తరమునందు ఇద్దరు అధర్వణవేదపండితులను కూర్చుండబెట్టి వేదపారాయణములు కావింపవలెను. అంతేకాక వినాయకుడు మొదలగు దేవతలను, గ్రహములను, దిక్పాలకులను, అష్టవసువులను, ద్వాదశాదిత్యులను, మరుద్గణములను మరియు ఇతరదేవతాగణములన్నింటిని, బ్రహ్మ విష్ణురుద్రులను, సూర్యుని ప్రార్థించి ఆయా వనస్పతుల సమిధలతో, ఆయా దేవతలకు సంబంధించిన మంత్రములను పఠించుచు నాలుగేసి హోమములు చేయవలెను. తరువాత ఆయా దేవతలకై నిర్దేశించిన సూక్తములను క్రమానుసారముగా జపించవలెను. ఇక హోమావసానమునందు ఆచార్యుడు తూర్యనాదములతో బలిపుష్పధూపాదులను ఇచ్చుచూ యజమానితో పాటు ఇప్పుడు చెప్పబోవు మంత్రములనుచ్చరించుచు లోకపాలకుల నందరినీ క్రమముగా ఆవాహనము చేయవలెను.

ఏహ్యేహి సర్వామరసిద్ధ సాధ్యై రభిష్టుతో వజ్రధరోఽమరేశః ।
సంవీజ్యమానోఽప్సరసాం గణేన రక్షాధ్వరం నో భగవన్! నమస్తే ॥ 42 ॥
ఓమ్ ఇంద్రాయ నమః ॥

సర్వదేవతలు , సిద్ధులు, సాధ్యులు మొదలగు వారందరికీ ఇష్టుడవు, వజ్రాయుధము ధరించువాడవు, అమరేశుడవు, ఎల్లప్పుడు అప్సరలచేత వీజనము చేయబడువాడవు అయిన ఓ భగవన్! ఇంద్రా! నా ఈ యజ్ఞమును రక్షింపుము. శుభప్రదుడైన ఇంద్రునకు నమస్కారము

ఏహ్యేహి సర్వామరహవ్యవాహ మునిప్రవీరై రభితోఽభిజుష్టః ।
తేజస్వినా లోకగణేన సార్థం మమాధ్వరం రక్ష కవే నమస్తే ॥
ఓమ్ అగ్నయే నమః ॥ 43 ॥

అర్పించిన హవిస్సును దేవతలందరికీ కొనిపోవువాడవు కనుక "హవ్యవాహుడు" అని పేరు పొందిన అగ్నిదేవా! మునిశ్రేష్ఠులందరి చేత స్తుతింపబడువాడా! తేజోవంతులైన దేవతలందరితో ఇక్కడికి వచ్చి ఈ అధ్వరమును రక్షింపుము. ఓంకారయుక్తుడైన అగ్నిదేవునికి నమస్కారము.

ఏహ్యేహి వైవస్వత ధర్మరాజ సర్వామరైరర్చితదివ్యమూర్తే ।
శుభాశుభానందశుచామధీశ శివాయ నః పాహి మఖం నమస్తే ॥ 44 ॥
ఓమ్ యమాయ నమః

వివస్వంతుని (సూర్యుని) పుత్రుడవైన ఓ యమధర్మరాజా! దేవతలందరిచేత పూజింపబడువాడా ! ఓ దివ్యమూర్తే! శుభాశుభములకు సుఖదుఃఖములకు కూడా అధిపతివైన ఓదేవా! రమ్ము! మాకు మంగళము కలుగుటకై మా యజ్ఞమును రక్షింపుము. ఓంకారయుక్తుడైన యమధర్మరాజునకు నమస్సులు

ఏహ్యేహి రక్షోగణనాయకస్త్వం సర్వైస్తు వేతాలపిశాచసంఘైః ।
మమాధ్వరం పాహి శుభాదినాథ లోకేశ్వరస్త్వం భగవన్నమస్తే ॥ 45 ॥
ఓమ్ నిర్ఋతయే నమః

ఓ భగవన్! నిరృతీ ! నీవు రక్షోగణనాయకడవు, నీ సేవకులైన సర్వవిధ బేతాళ పిశాచాదులతో కూడి ఇక్కడికి రమ్ము! మా యజ్ఞమును కాపాడుము. లోకేశ్వరుడైన భగవంతుడా! నీకు నమస్కారం. ఓంకార యుక్తుడైన నిరృతి దేవునకు నమస్సులు.

ఏహ్యేహి యాదో గణవారిధీనాం గణేన పర్జన్య మహాప్సరోభిః ।
విద్యాధరేంద్రామరగీయమాన పాహి త్వమస్మాన్ భగవన్నమస్తే ।
ఓమ్ వరుణాయ నమః ॥ 46 ॥

జలజంతువులగణముతో, సముద్రముల గణములతో, అప్సరో గణములతో కూడిన ఓ వరుణదేవా! విద్యాధరులచేత దేవతలచేత స్తుతింపబడువాడా! భగవాన్! రమ్ము ఇక్కడికి, మా యజ్ఞమును రక్షింపుము. ఓంకారయుక్తుడైన వరుణదేవునకు నమస్సులు.

ఏహ్యేహి యజ్ఞే మమ రక్షణాయ మృగాధిరూఢః సహ సిద్ధసంఘైః ।
ప్రాణాధిపః కాలకవేః సహాయో గృహాణ పూజాం భగవన్నమస్తే ॥
ఓమ్ వాయవే నమః ॥ 47 ॥

ఓ వాయుదేవా! నీవు ప్రాణాధిపుడవు, కాలకవికి సహాయకారుడవు, సిద్ధులయొక్క సమూహములచేత స్తుతింపబడువాడవు, మృగాధిరూఢుడవై వెంటనే నా యజ్ఞరక్షణకు రమ్ము! ఓ భగవన్! నేను చేయు ఈ పూజను గైకొనుము. ఓంకార సహితుడవైన నీకు మా నమస్సులు.

ఏహ్యేహి యజ్ఞేశ్వర యజ్ఞరక్షాం విధత్స్వ నక్షత్రగణేన సార్ధమ్ ।
సర్వౌషధీభిః పితృభిః సహైవ గృహాణ పూజాం భగవన్నమస్తే ।
ఓం సోమాయ నమః ॥ 48 ॥

ఓ సోమదేవా! యజ్ఞేశ్వరా! నక్షత్రగణములతోను సర్వవిధౌషధులతోను, పితరులతోను కూడ ఇక్కడికి రమ్ము, నా యజ్ఞమును రక్షింపుము. ఓ భగవన్! నేను చేయు ఈ పూజను గైకొనుము. ఓంకారయుక్తుడైన సోమదేవునకు నమస్సులు.

ఏహ్యేహి విశ్వేశ్వర న స్త్రిశూల కపాలఖట్వాంగధరేణ సార్ధమ్ ।
లోకేశ యజ్ఞేశ్వర యజ్ఞసిద్ధ్యై గృహాణ పూజాం భగవన్నమస్తే ।
ఓమ్ ఈశానాయ నమః ॥ 49 ॥

ఓ విశ్వేశ్వరా! లోకేశ్వరా! యజ్ఞేశ్వరా ! త్రిశూల- కపాల - ఖట్వాంగాదులతో కూడ వచ్చి నా పూజను గైకొని ఓ భగవన్! నా యజ్ఞమును రక్షింపుము. ఓంకారయుక్తుడైన పరమేశ్వరునకు నమస్సులు.

ఏహ్యేహి పాతాల ధరాధరేంద్ర నాగాఙ్గనాకిన్నరగీయమాన ।
యక్షోరగేంద్రామరలోకసార్ధమ్ అనన్త! రక్షాధ్వరమస్మదీయమ్ ।
ఓమ్ అనన్తాయ నమః ॥ 50 ॥

పాతళము వరకు ఉన్నట్టి ఈ భూమినంతటిని ధరించిన ఓ మహానుభావా! నాగాంగనలచేత, కిన్నరుల చేత స్తుతింపబడువాడా యక్షులు, నాగేంద్రులు, అమరులు మొదలగు వారితో కూడినవాడవై ఇక్కడికి రమ్ము! ఓ అనంతా! మా యజ్ఞమును రక్షింపుము, ఓంకారయుక్తుడైన శ్రీ అనంతునకు నమస్సులు.

ఏహ్యేహి విశ్వాధిపతే మునీంద్ర లోకేన సార్ధం పితృదేవతాభిః ।
సర్వస్య ధాతాఽ స్యమితప్రభావ విశాధ్వరం నో భగవన్నమస్తే ॥ 51 ॥
ఓమ్ బ్రహ్మణే నమః

ఓ విశ్వాధిపతీ ! బ్రహ్మదేవా! మునీంద్రగణములతో, సమస్త పితృదేవతలతో కూడ ఇచ్చుటకు రమ్ము. నీవు ఈ ప్రపంచమంతటికిని సృష్టికర్తవు, అమితమైన ప్రభావము కలవాడవు, ఓ భగవన్ ! నా ఈ అధ్వరమును రక్షింపుము. ఓంకార పూర్వకుడైన బ్రహ్మదేవునికి నమస్సులు.

త్రైలోక్యే యాని భూతాని స్థావరాణి చరాణి చ ।
బ్రహ్మవిష్ణుశివైః సార్ధం రక్షాం కుర్వన్తు తాని మే ॥ 52 ॥

దేవదానవగంధర్వా యక్షరాక్షసపన్నగాః ।
ఋషయో మునయో గావో దేవమాతర ఏవ చ ॥ 53 ॥

సర్వే మమాధ్వరే రక్షాం ప్రకుర్వన్తు ముదాన్వితాః ।
ఇత్యావాహ్య సురాన్ దద్యాదృత్విగ్భ్యో హేమభూషణమ్ ॥ 54 ॥

"ముల్లోకములందున్న చరాచర భూతములన్నియు, బ్రహ్మవిష్ణురుద్రాది దేవతలతో పాటు నన్ను రక్షించుగాక! దేవదానవగంధర్వులు, యక్షరాక్షసపన్నగములు, ఋషులు, మునులు, గోవులు, దేవమాతలు మొదలగు వారందరు

నా యజ్ఞమునకు వచ్చి ముదాన్వితులై రక్షణకల్పింతురు గాక" అని అందరిని యజ్ఞంనందు ఆవాహనం చేసి ఋత్విజులకు బంగారు ఆభరణములు దాన మీయవలెను.

కుండలాని చ హైమాని సూత్రాణి కటకాని చ ।
అంగులీయపవిత్రాణి వాసాంసి శయనాని చ ॥ 55 ॥

ద్విగుణం గురవే దద్యాత్ భూషణాచ్ఛాదనాని చ ।
జపేయుః శాంతికాధ్యాయం జాపకాః సర్వతో దిశమ్ ॥ 56 ॥

తత్రోషితాస్తు తే సర్వే కృత్త్వైవ మధివాసనమ్ ।
ఆదావన్తే చ మధ్యే చ కుర్యాద్ బ్రాహ్మణవాచనమ్ ॥ 57 ॥

అంతేకాక బంగారముతో చేసిన కుండలములు, సూత్రములు, కటకములు, అంగుళీయకములు, పవిత్రలు, వస్త్రములు, శయనములు మొదలగు వాటినన్నింటిని ఇవ్వవలెను. గురువుకు ఋత్విజులకిచ్చిన దానికంటే రెట్టింపు దక్షిణగా భూషణములు, వస్త్రములు ఇవ్వవలెను. అన్ని దిక్కుల యందును శాంతి పాఠములు జపించవలెను. ఆ ఋత్విజులు అచ్చటనే ఉండి దేవతాధివాసము జరుగుచుండగా, ఆది మధ్యావసానములందు స్వస్తివాచనములు పఠించవలెను.

తతో మంగళశబ్దేన స్నాపితో వేదపుంగవైః ।
త్రిఃప్రదక్షిణమావృత్య గృహీతకుసుమాంజలిః ॥ 58 ॥

శుక్లమాల్యామ్బరో భూత్వా తాం తులామభిమన్త్రయేత్ ।

తర్వాత మంగళధ్వనులు మ్రోగుచుండగా వేదపుంగవుల చేత స్నానము చేయించబడి తెల్లని వస్త్రములను పూల మాలను ధరించి, తులతో పాటు దేవతలందరికి మూడు మార్లు ప్రదక్షిణము చేసి, చేతిలో పూవులను పట్టుకొని ఈ చెప్పబోవు మంత్రముతో 'తుల'ను అభిమంత్రించవలెను.

నమస్తే సర్వదేవానాం శక్తిస్త్వం సత్యమాస్థితా ॥ 59 ॥

సాక్షిభూతా జగద్ధాత్రీం నిర్మితా విశ్వయోనినా ।
ఏకతః సర్వసత్యాని తథాఽనృతశతాని చ ॥ 60 ॥

ధర్మాధర్మకృతాం మధ్యే స్థాపితాఽసి జగద్ధితే ।
త్వం తులే సర్వభూతానాం ప్రమాణమిహ కీర్తితా ॥ 61 ॥

మాం తోలయన్తీ సంసారాదుద్ధరస్వ నమోఽస్తు తే ।

"ఓ తులా! నీవు సకలదేవతలయొక్క శక్తి స్వరూపురాలవు, సత్యము నాశ్రయించియున్నదానవు. ఓ జగద్ధాత్రీ! సకలలోకములకు సాక్షిభూతురాలవు, సాక్షాత్తు విశ్వయోనిచేత నిర్మింపబడినదానవు, నీకు నమస్సులు. నీకు ఒక

వైపు సర్వ సత్యములు మరియు మరొక వైపున సర్వవిధ అసత్యములు వుండును. జగత్తునకే హితకారిణివియైన ఓ తులా! ధర్మాధర్మములు రెంటినీ ఆచరించు జనులమధ్య వాటిని తూకము చేయుటకై నిన్ను స్థాపించియున్నాము. తులా! నీవు సర్వభూతములకు ప్రమాణమని కీర్తింపబడుచున్నావు. ఇప్పుడు నన్ను నీవు తూకము వేసి ఈ సంసారము నుండి ఉద్ధరించుము, నీకు నా నమస్సులు".

యోఽసౌ తత్త్వాధిపో దేవః పురుషః పఞ్చవింశకః ॥ 62 ॥

స ఏకోఽధిష్ఠితో దేవి త్వయి తస్మాన్నమో నమః ।
నమో నమస్తే గోవింద తులా పురుషసంజ్ఞక ॥ 63 ॥

త్వం హరే తారయస్వాస్మాన్ అస్మాత్సంసారకర్దమాత్ ।
పుణ్యకాలం సమాసాద్య కృత్వైవమధివాసనమ్ ॥ 64 ॥

పునః ప్రదక్షిణం కృత్వా తులామారోహయేద్ బుధః ।
సఖడ్గచర్మకవచః సర్వాభరణభూషితః ॥ 65 ॥

దేవీ! తత్త్వములకు అధిపతియు, పంచవింశతి తత్త్వముగా కీర్తింపబడు ఆ పరమపురుషుడు నీయందు అధిష్ఠించియున్నాడు. కావున నీకు నమస్సులు నమస్సులు. తులాపురుష సంజ్ఞకుడవైన గోవిందుడా! నీకు ప్రణమిల్లుచున్నాను. ఓ హరీ! ఈ సంసారకర్దమము నుండి మమ్ము తరింపజేయుము. ఈ విధముగా దేవతాధివాసన కార్యక్రమము ముగిసిన పిదప వివేకవంతుడైన యజమానుడు పుణ్యకాలమును చూసుకొని మరల ప్రదక్షిణము చేసి ఖడ్గము, చర్మము, కవచములు, ధరించి సర్వాభరణభూషితుడై తులను ఆరోహించవలెను.

ధర్మరాజమథాదాయ హైమం సూర్యేణ సంయుతమ్ ।
కరాభ్యాం బద్ధముష్టిభ్యాం ఆస్తే పశ్యన్హరేర్ముఖమ్ ॥ 66 ॥

తతోఽపరే తులాభాగే న్యసేయుర్ద్విజపుంగవాః ।
సమాధభ్యధికం యావత్కాంచనం చాతినిర్మలమ్ ॥ 67 ॥

పుష్టికామస్తు కుర్వీత భూమి సంస్థం నరేశ్వరః ।
క్షణమాత్రం తతః స్థిత్వా పునరేవముదీరయేత్ ॥ 68 ॥

తదనంతరము సువర్ణముతో చేసిన సూర్యునితో పాటు వున్నట్టి ధర్మరాజును పిడికిళ్ళు గట్టిగా పట్టుకున్న చేతులతో పట్టుకొని హరిముఖమునే చూచుచు అప్పుడు ద్విజశ్రేష్ఠులు రెండవ తులాభాగమందు యజమానుని బరువుతో సమానమైన, దానికన్న అధికభారము కల్గిన నిర్మలమైన సువర్ణమును వుంచవలెను. పుష్టిని కోరుకునే నరేశ్వరుడు ఆ అపరతులా భాగమును బంగారపు బరువుతో భూమికి తాకునట్లు చేసి, క్షణకాలం అట్టే వుండి ఇప్పుడు చెప్పబోవు మంత్రమును పఠించవలెను.

నమస్తే సర్వభూతానాం సాక్షిభూతే సనాతని ।
పితామహేన దేవి త్వం నిర్మితా పరమేష్ఠినా ॥ 69 ॥

త్వయా ధృతం జగత్సర్వం సహస్థావరజంగమమ్ ।
సర్వభూతాత్మభూతస్థే నమస్తే విశ్వధారిణి ॥ 70 ॥

తతోఽవతీర్య గురవే పూర్వమర్ధం నివేదయేత్ ।
ఋత్విగ్భ్యోఽపరమర్ధం తు దద్యాదుదకపూర్వకమ్ ॥ 71 ॥

గురవే గ్రామరత్నాని ఋత్విగ్భ్యశ్చ నివేదయేత్ ।
ప్రాప్య తేషామనుజ్ఞాం తు తథాఽన్యేభ్యోఽపి దాపయేత్ ॥ 72 ॥

"సర్వభూతములకు సాక్షిభూతమైనదానా! ఓ సనాతనీ! నీకు నమస్సులు. ఓ దేవీ! పరమేష్ఠి అయిన పితామహునిచే స్వయంగా నిర్మింపబడినదానవు. స్థావరజంగమాత్మకమగు ఈ జగత్తంతయును నీ చేతనే ధరించబడుచున్నది. సర్వభూతములకు ఆత్మభూతురాలవైన నీకు నా నమస్సులు" అని చెప్పుచూ, తులనుండి దిగి తూచినట్టి ధనములోని సగభాగమును గురువునకు, మిగిలిన అర్ధభాగమును ఇతర ఋత్విక్కులకు ఉదక పూర్వకముగా నివేదించవలెను. అంతేకాక గురువునకు, ఋత్విజులకు కూడా గ్రామములను, రత్నములను దానం ఇవ్వవలెను. తర్వాత వారి అనుమతిని తీసుకుని ఇతరులకు కూడా దానమియ్యవలెను.

దీనానాథవిశిష్టాదీన్ పూజయేద్ బ్రాహ్మణైః సహ ।
న చిరం ధారయేద్గేహే సువర్ణం ప్రోక్షితం బుధః ॥ 73 ॥

తిష్ఠేద్ భయావహం యస్మాచ్ఛోకవ్యాధికరం నృణామ్ ।
శీఘ్రం పరస్వీకరణాచ్ఛ్రేయః ప్రాప్నోతి మానవః ॥ 74 ॥

అట్లే బ్రాహ్మణులతో పాటు దీనులను, అనాథులను, సాధు జనులను గూడ సత్కరించవలెను. తులాదానం చేయబడిన సువర్ణమును చిరకాలం గృహమునందు వుంచరాదు. అది ఎక్కువకాలం గృహమునందున్నచో మానవులకు భయము, శోకము, వ్యాధులు కల్గును. కనుక దానిని తొందరగా పరులకు పంచుట వలన మానవుడు శ్రేయస్సును పొందును.

అనేన విధినా యస్తు తులాపురుషమాచరేత్ ।
ప్రతిలోకాధిపస్థానే ప్రతిమన్వన్తరం వసేత్ ॥ 75 ॥

విమానేనార్కవర్ణేన కింకిణీజాలమాలినా ।
పూజ్యమానోఽప్సరోభిశ్చ తతో విష్ణుపురం వ్రజేత్ ॥
కల్పకోటి శతం యావత్తస్మింల్లోకే మహీయతే ॥ 76 ॥

ఈ విధముగా 'తులాపురుష' దానము నాచరించువాడు ఒక్కొక్క లోకాధిపతియొక్క లోకమునందు ఒక్కొక్క మన్వంతరకాలము నివసించును. అర్క వర్ణముగల విమానము నెక్కి చిరుమువ్వల సవ్వడిని వినుచు, అప్సరసలచే పూజింపబడుచు విష్ణులోకమునకు వెళ్ళును. అక్కడ శతకోటి కల్పముల కాలపర్యంతము ఆ లోకమునందే వసించును.

కర్మక్షయాదిహ పునర్భువి రాజరాజో భూపాలమౌలిమణిరంజితపాదపీఠః ।
శ్రద్ధాన్వితో భవతి యత్రసహస్రయాజీ దీప్తప్రతాపజితసర్వమహీపలోకః ॥ 77 ॥

యో దీయమానమపి పశ్యతి భక్తియుక్తః కాలాన్తరే స్మరతి వాచయతీహ లోకే ।
యో వా శృణోతి పఠతీంద్ర సమానరూపః ప్రాప్నోతి ధామ స పురన్దరదేవజుష్టమ్ ॥ 78 ॥

తర్వాత కర్మక్షయమైన పిదప మరుల భూపాలుర కిరీటములందలి మణులచే ప్రకాశించు పాదపీఠము గల చక్రవర్తియై ఈ లోకం నందు రారాజుగా జన్మించును. శ్రద్ధాన్వితుడై యజ్ఞసహస్రములు ఆచరించి దీప్తమైన స్వప్రతాపముతో రాజులందరినీ జయించును. ఇంకనూ ఎవడు ఈ తులాదానము ఇవ్వబడుచుండగా భక్తియుక్తుడై చూచునో, కాలాంతరము నందు మరల ఈ దానమును గురించి స్మరించునో, ఇతరులతో దీని గురించి చర్చించునో, ఎవడు శ్రద్ధగా దీనిని గురించి వినునో లేదా చదువునో వాడు గూడా ఇంద్రసమానమైన రూపమును పొంది ఇంద్రాది దేవతలకాశ్రయమైన స్వర్గలోకమును పొందును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే తులాపురుషదానం నామ
చతుఃసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥274॥

శ్రీమత్స్య మహాపురాణమున మహాదానానుకీర్తనలో తులాపురుషదాన మనే
రెండువందల డెబ్బైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పఞ్చ సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైఐదవ అధ్యాయం

మహాదానానుకీర్తనే హిరణ్యగర్భప్రదానవిధిః - మహాదానానుకీర్తనలో హిరణ్యగర్భప్రదానవిధి

మత్స్య ఉవాచ - మత్స్య భగవానుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
నామ్నా హిరణ్యగర్భాఖ్యం మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

పుణ్యం దినమథాసాద్య తులాపురుషదానవత్ ।
ఋత్విఙ్మణ్డపసమ్భారభూషణాచ్ఛాదనాదికమ్ ॥ 2 ॥

కుర్యాదుపోషితస్తద్వత్ లోకేశావాహనం బుధః ।

ఇప్పుడు మహాపాతకములను కూడ నశింపజేయు మహోత్తరమైనట్టి 'హిరణ్యగర్భ' మను మహాదానమును గురించి వివరిస్తాను. తులాపురుషదానము వలె ఈ దానమునకు కూడ పుణ్యమైన దినమును చూచుకొని ఋత్విజులను, మండపములను, సంభారములను, భూషణములను, వస్త్రాదులను కూడా సమకూర్చుకొని, ఉపవాసము చేసి దిక్పాలకులను ఆవాహనం చేయవలెను.

పుణ్యాహవాచనం కృత్వా తద్వత్ కృత్వాఽధివాసనమ్ ॥ 3 ॥

బ్రాహ్మణై రానయేత్ కుమ్భం తపనీయమయం శుభమ్ ।
ద్విసప్తత్యంగులోచ్ఛ్రాయం హేమపంకజగర్భవత్ ॥ 4 ॥

త్రిభాగహీనవిస్తార మాజ్యక్షీరాభిపూరితమ్ ।
దశాస్త్రాణి చ రత్నాని దాత్రీం సూచీం తథైవ చ ॥ 5 ॥

హేమతాలం సపిటకం బహిరాదిత్యసంయుతమ్ ।
తథైవావరణం నాభేరుపవీతం చ కాంచనమ్ ॥ 6 ॥

పుణ్యాహవాచనం మరియు దేవతాధివాసనం చేయించవలెను. తర్వాత విప్రులచే సుందరముగ ప్రకాశించు కడువను తెప్పించవలెను. ఆ కడవ డెబ్బది రెండు అంగుళముల ఎత్తు కలిగి పై భాగమున పద్మము, బ్రహ్మదేవుని చిహ్నములు కలిగి యుండవలెను. దానిని మూడవ వంతు నెయ్యితో లేదా పాలతో నింపవలెను. దాని ప్రక్కనే పది విధములైన ఆయుధములు, రత్నములు, రాగి సూది, బంగారు తాలములతో కూడిన పిటక, సూర్యుని ప్రతిమ మొదలగువాటిని వుంచవలెను. అట్లే దాని నాభిప్రదేశమును మేఖలతోను, బంగారు ఉపవీతముతోను అలంకరించవలెను.

పార్శ్వతః స్థాపయేత్తద్వత్ హేమదణ్డకమణ్డలూ ।
పద్మాకారం విధానం స్యాత్సమన్తాదఙ్గులాధికమ్ ॥ 7 ॥

ముక్తావలీ సమోపేతం పద్మరాగసమన్వితమ్ ।
తిలద్రోణోపరిగతః వేదిమధ్యే వ్యవస్థితమ్ ॥ 8 ॥

తరువాత రెండు ప్రక్కలయందు సువర్ణముతో చేసిన దండ కమండలముల నుంచవలెను. కమండలము పై అన్ని వైపులయందును ఒక అంగుళపు పరిమాణము కన్న ఎక్కువగా వుండునట్లు పద్మముల ప్రతిమలను ఏర్పరచవలెను. ఇతఃపూర్వముంచిన బంగారు కడువను ముత్యాల హారముతో అలంకరించవలెను. పద్మరాగ దళములను ఏర్పరచవలెను. తర్వాత కడవ పైన నువ్వులతో నింపిన ద్రోణమును వుంచవలెను. వీటన్నింటిని వేది మధ్య వుంచవలెను.

తతో మంగలశబ్దేన బ్రహ్మఘోషరవేణ చ ।
సర్వౌషధ్యుదకస్నానస్నాపితో వేదపుంగవైః ॥ 9 ॥

శుక్లమాల్యాంబరధరః సర్వాభరణభూషితః ।
ఇమముచ్చారయేన్మన్త్రం గృహీత కుసుమాంజలిః ॥ 10 ॥

తర్వాత మంగళవాద్యములతోను వేదధ్వనుల నడుమ యజమాని వేదపుంగవుల చేత సర్వౌషధీ జలములతో స్నానం చేయించుకొని తెల్లని వస్త్రములను మరియు పూవులను ధరించి, సర్వాభరణభూషితుడై దోసిలితో పూవులు తీసికొని ఈ చెప్పబోవు మంత్రములను ఉచ్చరించవలెను.

నమో హిరణ్యగర్భాయ హిరణ్యకవచాయ చ ।
సప్తలోకసురాధ్యక్ష జగద్ధాత్రే నమో నమః ॥ 11 ॥

భూలోకప్రముఖా లోకాస్తవ గర్భే వ్యవస్థితాః ।
బ్రహ్మాదయస్తథా దేవ నమస్తే విశ్వధారిణే ॥ 12 ॥

నమస్తే భువనాధార! నమస్తే భువనాశ్రయ! ।
నమో హిరణ్యగర్భాయ గర్భే యస్య పితామహః ॥ 13 ॥

యతస్త్వమేవ భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః ।
తస్మాన్మాముద్ధరాశేషదుఃఖసంసారసాగరాత్ ॥ 14 ॥

హిరణ్యగర్భుడు, హిరణ్మయకవచుడు అయిన భగవంతునికి నమస్సులు. సప్త లోకములందలి దేవతలందరికి అధిపతియై, ఈ జగత్తునంతటిని ధరించునట్టి దేవునికి నమస్సులు. భూలోకము మొదలగు ప్రధాన లోకములు మరియు బ్రహ్మాది దేవతలూ నీ గర్భము నందే కలరు. సమస్త విశ్వమును ధరించినవాడా! దేవా! నీకు నమస్సులు. సమస్త భువనములకు ఆధారుడవు, సమస్త భువనముకు ఆశ్రయుడవూ అయిన నీకు నమస్సులు. హిరణ్యగర్భుడా! పితామహుడైన బ్రహ్మదేవునే గర్భమునందు ధరించినవాడా! నీకు నమస్సులు. ప్రతి భూతమునందు (ప్రాణులన్నింటి యందు) ఉండువాడవు నీవే. భూతాత్ముడవు కావున ఓ దేవా! ఈ అశేష దుఃఖ సంసారసాగరమునుండి నన్ను ఉద్ధరించుము.

ఏవమామన్త్ర్య తన్మధ్యమావిశ్యాస్త ఉదఙ్ముఖః ।
ముష్టిభ్యాం పరిసంగృహ్య ధర్మరాజచతుర్ముఖౌ ॥ 15 ॥

జానుమధ్యే శిరః కృత్వా తిష్ఠేదుచ్ఛ్వాసపంచకమ్ ।
గర్భాధానం పుంసవనం సీమంతోన్నయనం తథా ॥ 16 ॥

కుర్యుః హిరణ్యగర్భాయ తతస్తే ద్విజపుంగవాః ।
గీతమంగలవేషేణ గురురుత్థాపయేత్తతః ॥ 17 ॥

జాతకర్మాదికాః కుర్యుః క్రియాః షోడశ చాపరాః ।
సూచ్యాదికం చ గురవే దద్యాన్మంత్రమిమం జపేత్ ॥ 18 ॥

అనుచు హిరణ్యగర్భుని ఆమంత్రించి మండపమధ్యభాగమును ప్రవేశించి ఉత్తరాభిముఖుడై కూర్చుండి ధర్మరాజును మరియు చతుర్ముఖుని పిడికిళ్ళతో పట్టుకొని మోకాళ్ళ తల పెట్టుకొని, ఐదు ఉచ్ఛ్వాసములను విడువడలెను. ఆ తర్వాత ద్విజశ్రేష్ఠులు హిరణ్యగర్భునకు గర్భాదాన, పుంసవన, సీమంతోన్నయనములను సంస్కారములను నిర్వహించవలెను. తదనంతరము ఆచార్యుడు యజమానిని గీత మంగళవాయిద్యములతో అక్కడినుండి లేపి, జాతకర్మాది షోడశసంస్కారములను జరుపవలెను. అపుడు యజమాని గురువునకు 'రాగి' సూదిని ఇచ్చుచు ఈ మంత్రమును జపించవలెను.

నమో హిరణ్యగర్భాయ విశ్వగర్భాయ వై నమః ।
చరాచరస్య జగతో గృహభూతాయ వై నమః ॥ 19 ॥

యథాఽహం జనితః పూర్వం మర్త్యధర్మా సురోత్తమ! ।
త్వద్గర్భసంభవాదేష దివ్యదేహో భవామ్యహమ్ ॥ 20 ॥

హిరణ్యగర్భునకు నమస్సులు. విశ్వగర్భునకు నమస్సులు. ఈ చరాచరజగత్తునకు గృహభూతుడైన పరమాత్మునికి నమస్సులు. ఓ సురోత్తమా! పూర్వము నేను మనుష్యధర్మములతోనే జన్మించితిని కాని ఇప్పుడు నీ గర్భసంభవుడనై దివ్యదేహుడను కాగలను.

చతుర్భిః కలశై ర్భూయస్తతస్తే ద్విజపుంగవాః ।
స్నాపయేయుః ప్రసన్నా గా సర్వాభరణభూషితాః ॥ 21 ॥

దేవస్య త్వేతి మన్త్రేణ స్థితస్య కనకాసనే ।
అద్య జాతస్య తేఽంగాని అభిషేక్ష్యామహే వయమ్ ॥ 22 ॥

తర్వాత సర్వాభరణభూషితులైన నలుగురు ద్విజశ్రేష్ఠులు ప్రసన్నాత్ములై నాలుగు కలశములతో యజమానికి స్నానం చేయించవలెను. కనకాసనమునందు ఆసీనుడవైన, ఇప్పుడే జన్మించినవాడైన నీ అంగములన్నింటికిని "దేవస్య త్వా" ఇత్యాది మంత్రములతో మేము అభిషేకించుచున్నాము.

దివ్యేనానేన వపుషా చిరంజీవ సుఖీభవ ।
తతో హిరణ్యగర్భం తం తేభ్యో దద్యాద్విచక్షణః ॥ 23 ॥

తే పూజ్యాః సర్వభావేన బహవో వా తదాజ్ఞయా ।
తత్రోపకరణం సర్వం గురవే వినివేదయేత్ ॥ 24 ॥

పాదుకోపానహచ్ఛత్రచామరాసనభాజనమ్ ।
గ్రామం వా విషయం వాఽపి యదన్యదపి సంభవేత్ ॥ 25 ॥

తరువాత దివ్యమైన ఈ దేహముతో చిరకీలము జీవించుము. సుఖముగా నుండుము అని చెప్పవలెను. అపుడు విచక్షణుడైన యజమాని హిరణ్యగర్భుని ప్రతిమను అచ్చట నున్న ద్విజులకు సమర్పించవలెను. విప్రులందరిని చక్కని భావముతో పూజించవలెను. తర్వాత వారి ఆజ్ఞను నొంది అక్కడున్న పాదుకలు, పాదరక్షలు, ఛత్రము, చామరము, ఆసనము, పాత్రలు, గ్రామము, దేశము మొదలగు ఉపకరణములన్నింటిని గురువునకు సమర్పించవలెను.

అనేన విధినా యస్తు పుణ్యేఽహని నివేదయేత్ ।
హిరణ్యగర్భదానం స బ్రహ్మలోకే మహీయతే ॥ 26 ॥

పురేషు లోకపాలానాం ప్రతిమన్వంతరం వసేత్ ।
కల్పకోటిశతం యావద్ బ్రహ్మలోకే మహీయతే ॥ 27 ॥

ఈ విధానము ననుసరించి పుణ్యప్రదమైన శుభదివసమున హిరణ్యగర్భదానము చేయువాడు బ్రహ్మలోకమును పొందును. ఒక్కొక్క లోకపాలుని లోకమునందు ఒక్కొక్క మన్వంతరకాలం వసించుచు నూరుకోట్ల కల్పముల కాలము బ్రహ్మలోక నివాసమును పొందును.

కలికలుషవిముక్తః పూజితః సిద్ధసాధ్యైః అమరచమరమాలావీజ్యమానోఽప్సరోభిః ।
పితృశతమథ బంధూన్ పుత్రపౌత్రాన్ప్రపౌత్రానపి నరకనిమగ్నాంస్తారయేత్ ఏక ఏవ ॥ 28 ॥

ఇంకనూ కలికాలపు దోషములనుండి విముక్తుడై, సిద్ధులు, సాధ్యులు మొదలగు వారందరితో పూజితుడై, స్వర్గలోకమున అప్సరసలతో చమరీ మృగముల చామరములతో సర్వధా వీచబడును. మరియు తానొక్కడే నూరు మంది పితరులను, బంధువులను, పుత్ర పౌత్రులను, ప్రపౌత్రులను గూడా నరకలోక విముక్తులను చేయగల సామర్థ్యమును పొందును.

ఇతి పఠతి య ఇత్థం యః శృణోతీహ సమ్యఙ్మధురిపురివ లోకే పూజ్యతే సోఽపి సిద్ధైః ।
మతిమపి చ జనానాం యో దదాతి ప్రియార్థం విబుధపతి జనానాం నాయకః స్యాదమోఘమ్॥ 29 ॥

దీనిని చక్కగా చదువువాడు, వినువాడు మధుసూదనుడైన శ్రీ మహావిష్ణువు వలె సిద్ధులచేత పూజితుడగును. జనులకు ప్రియమైన వాటిని దానము చేయువాడు, అమోఘమైన విబుధపతి సౌఖ్యమును పొందును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే హిరణ్యగర్భప్రదాన విధిర్నామ పఞ్చసప్తత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥275॥

శ్రీ మత్స్యమహాపురాణమున మహాదానానుకీర్తనమునందు హిరణ్యగర్భప్రదానవిధి యనే రెండువందల డెబ్బై ఐదవ అధ్యాయం సమాప్తం.

షట్సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల డెబ్బైఆరవ అధ్యాయం

మహాదానానుకీర్తనే బ్రహ్మాణ్డప్రదాన విధిః – మహాదానానుకీర్తనలో బ్రహ్మాణ్డప్రదాన విధి

మత్స్య ఉవాచ – మత్స్య భగవానుడు చెప్పాడు.

అథాతః సమ్ప్రవక్ష్యామి బ్రహ్మాండవిధిముత్తమమ్ ।
యచ్ఛ్రేష్ఠం సర్వదానానాం మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

పుణ్యం దినమథాసాద్య తులాపురుషదానవత్ ।
ఋత్విజ్ మండపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ॥ 2 ॥

లోకేశవావాహనం కుర్యాదధివాసనకం తథా ।

ఇప్పుడిక ఉత్తమమైన బ్రహ్మాండదానమును గురించి వివరిస్తాను. ఇది దానములన్నింటిలో శ్రేష్ఠమైనది మరియు మహాపాతకములను కూడ నశింపజేయునది. పవిత్రమైన శుభదివసమును ఎంచుకొని తులాపురుష దానమునందు వలెనే ఋత్విజులు, మండపము, సంభారములు, భూషణములు, వస్త్రములు మొదలగు వాటిని సమకూర్చుకొనవలెను. తర్వాత లోకపాలకుల ఆవాహనము చేసి వారికి అధివాసనమును కల్పించవలెను.

కుర్యాద్వింశపలాదూర్ధ్వమా సహస్రాచ్చ శక్తితః ॥ 3 ॥

కలశద్వయసంయుక్తం బ్రహ్మాండం కాంచనం బుధః ।
దిగ్గజాష్టకసంయుక్తం షడ్వేదాంగసమన్వితమ్ ॥ 4 ॥

లోకపాలాష్టకోపేతం మధ్యస్థితచతుర్ముఖమ్ ।
శివాచ్యుతార్కశిఖరముమాలక్ష్మీసమన్వితమ్ ॥ 5 ॥

వస్వాదిత్యమరుద్గర్భం మహారత్నసమన్వితమ్ ।
విస్తరేదంగులశతం యావదాయామవిస్తరమ్ ॥ 6 ॥

కౌశేయవస్త్రసంవీతం తిలద్రోణోపరి న్యసేత్ ।
తథాఽష్టాదశధాన్యాని సమన్తాత్పరికల్పయేత్ ॥ 7 ॥

ఇరువది పలములకు తక్కువ కాకుండా వేయి పలముల వరకు గల తూకముతో బంగారపు కలశములను రెండింటిని మరియు బ్రహ్మాండమును కూడ చేయించవలెను. వాటియందు అష్టదిగ్గజములు, ఆరువేదాంగములతో కూడిన చతుర్వేదములు, అష్టపాలకులు, బ్రహ్మ, శివుడు, విష్ణువు, సూర్యుడు మొదలగు ప్రముఖులను పార్వతి, లక్ష్మి ఇత్యాది దేవతలను, అష్టవసువులను, ద్వాదశాదిత్యులను, సప్తమరుత్తులను, మహారత్నములను వుంచవలెను. వంద అంగుళముల పొడవు మరియు వెడల్పు గల పట్టు వస్త్రమును పరిచి దానిపై తిలద్రోణములనుంచి దానిపై కలశములు, బ్రహ్మాండమును కూడ ప్రతిష్ఠించి తదుపరి పదునెనిమిది విధముల ధాన్యములను వుంచవలెను.

పూర్వేణానన్తశయనం ప్రద్యుమ్నం పూర్వదక్షిణే ।
ప్రకృతిం దక్షిణే దేశే సంకర్షణమతఃపరమ్ ॥ 8 ॥

పశ్చిమే చతురో వేదాన్ అనిరుద్ధమతః పరమ్ ।
అగ్నిముత్తరతో హైమం వాసుదేవమతఃపరమ్ ॥ 9 ॥

సమన్తాత్ గుడపీఠస్థానర్చయేత్ కాంచనాన్ బుధః ।
స్థాపయేద్వస్త్రసంవీతాన్ పూర్ణకుమ్భాన్దశైవ తు ॥ 10 ॥

తరువాత అనంతశయనుడైన శ్రీ మన్నారాయణుని తూర్పునందు, ప్రద్యుమ్నుని ఆగ్నేయమున, దక్షిణమునందు ప్రకృతి దేవతను, సంకర్షణుని నైఋతి దిశలో, పశ్చిమమున నాలుగు వేదములను, అనిరుద్ధుని వాయువ్యమున, అగ్నిదేవుని ఉత్తరమునందు, తర్వాత ఈశాన్యమున వాసుదేవుని బంగారు ప్రతిమలుగా గుడపీఠమునందు స్థాపించి పూజించవలెను. నూతన వస్త్రములు చుట్టిన పది పూర్ణకుంభములను కూడా అక్కడ పెట్టవలెను.

దశైవ ధేనవో దేయాః సహేమామ్బరదోహనాః ।
పాదుకోపానహచ్ఛత్రచామరాసనదర్పణైః ।
భక్ష్యభోజ్యాన్నదీపేక్షు ఫలమాల్యానులేపనైః ॥ 11 ॥

హోమాధివాసనాన్తే చ స్నాపితో వేదపుంగవైః ।
ఇమముచ్చారయేన్మన్త్రం త్రిః కృత్వాథ ప్రదక్షిణమ్ ॥ 12 ॥

మరియు పది పాడియావులను, బంగారు ఆభరణములను, వస్త్రములను, పాలు పిదుకుపాత్రలను, పాదుకలను, పాదరక్షలను, ఛత్రము, చామరము, ఆసనము, దర్పణములు మొదలగునవి ఈయవలెను. అంతేకాక భక్ష్య భోజ్యాన్నాదులు, దీపములు, ఇక్షురసము,ఫలమాల్య సుగంధా లేపనాదులు కూడ ఈయవలెను. తదనంతరము హోమము మరియు అధివాసము ముగిసిన తర్వాత వేదవేత్తలైన ద్విజశ్రేష్ఠుల మంత్ర పఠనముతో (యజమానులకు) స్నానము చేయించి, దేవతామూర్తులకు మూడు ప్రదక్షిణములు చేయించి, ఈ క్రింది మంత్రమును పఠించవలెను.

నమోఽస్తు విశ్వేశ్వర విశ్వధామ జగత్సవిత్రే భగవన్నమస్తే ।
సప్తర్షిలోకామరభూతలేశ గర్భేణ సార్ధం వితరాభిరక్షామ్ ॥ 13 ॥

యే దుఃఖితా స్తే సుఖినో భవన్తు ప్రయాన్తు పాపాని చరాచరాణామ్ ।
త్వద్దానశస్త్రాహతపాతకానాం బ్రహ్మాణ్డదోషాః ప్రలయం వ్రజన్తు ॥ 14 ॥

"ఓ విశ్వేశ్వరా! విశ్వధామన్! జగత్ సృష్టికర్తవైన ఓ భగవంతుడా! నీకు నమస్సులు. సప్తర్షులకు, లోకములన్నింటికిని, దేవతలకు, సకల ప్రాణులకును ఆధారమైన నీవు హిరణ్మయగర్భములో మాకు అన్ని వైపులనుండి రక్షణ కల్పించుము. దుఃఖితులందరూ సుఖప్రాప్తులగుదురు గాక! చరాచర ప్రాణులందరి పాపములన్నియు తొలగిపోవుగాక! నీ దానమనెడు శస్త్రములతో అస్మత్ పాపములన్నియు ప్రహతములై పోవుగాక! బ్రహ్మాండము నందలి దోషములన్నియు నశించిపోవుగాక!"

ఏవం ప్రణమ్యామరవిశ్వగర్భం దద్యాద్ ద్విజేభ్యో దశధా విభజ్య ।
భాగద్వయం తత్ర గురోః ప్రకల్ప్య సమం భజేచ్ఛేషమనుక్రమేణ ॥ 15 ॥

స్వల్పే చ హోమం గురురేక ఏవ కుర్యాదథైకాగ్నివిధానయుక్త్యా ।
స ఏవ సంపూజ్యతమోఽల్పవిత్తే యథోక్తవస్త్రాభరణాదికేన ॥ 16 ॥

ఇట్లు అమరవిశ్వగర్భుడైన భగవంతుని నమస్కరించి ఆ ద్రవ్యము నంతటిని పది భాగములుగా విభజించి వాటిలో రెండు భాగములు గురువునకు వదలి మిగిలిన ఎనిమిది భాగములను ఋత్విజులందరికిని సమముగా మరియు అనుక్రమముగా పంచవలెను. హోమమును స్వల్పముగానే అనగా ఏకాగ్ని విధానమున జరిపినచో గురువు ఒక్కడు మాత్రమే వుండవలెను. కావున అతనినే పూజ్యతమునిగా భావించి యథావిధిగా వస్త్రాభరణాదులతో సత్కరించి పూజింపవలెను.

ఇత్థం య ఏతదఖిలం పురుషోఽత్ర కుర్యాత్ బ్రహ్మాణ్డదానమధిగమ్య మహద్విమానమ్ ।
నిర్ధూతకల్మషవిశుద్ధతనుర్మురారేః ఆనందకృత్పదముపైతి సహాప్సరోభిః ॥ 17 ॥

సన్తారయేత్పితృపితామహపుత్రపౌత్రబంధుప్రియాతిథికలత్రశతాష్టకం సః ।
బ్రహ్మాణ్డదానశకలీకృతపాతకౌఘమానన్దయేచ్చ జననీకులమప్యశేషమ్ ॥ 18 ॥

ఈ విధముగా విధివిధానముననుసరించి బ్రహ్మాణ్డదానమును చేయువాడు మహద్విమానము నధిరోహించి మురారి లోకమును పొందును. అతని పాపములు హరించబడి పరిశుద్ధాన్తః కరుణుడగును. అంతేకాక పితృ, పితామహ, పుత్ర, పౌత్ర, బంధుజన, ప్రియాతిథి కళత్రాదులగు నూట ఎనిమిది మందిని కూడా సంసారమునుండి తరింపజేయును. ఈ బ్రహ్మాణ్డదానము చేత పాపములు హరించబడినవారై అందరూ ఆనందమును పొందుదురు. ఈ బ్రహ్మాణ్డదానమును ఆచరించినవాడు అశేషమైన తన మాతృవంశమును కూడ ఉద్ధరించును.

ఇతి పఠతి శృణోతి వా య ఏతత్ సురభవనేషు గృహేషు ధార్మికాణామ్ ।
మతిమపి చ దదాతి మోదతేఽసావమరపతేర్భవనే సహాప్సరోభిః ॥ 19 ॥

దీనినిట్లు సురభవనమునలందు, ధార్మికుల గృహములందు పఠించువారు లేదా వినువారు సుఖములను పొందుదురు. ఉత్తమమైన భావన కలవారై తాము ఆనందించి ఇతరులను ఆనందింపజేయుదురు. ఇంద్రభవనమున అప్సరసలతో సర్వవిధసుఖములను అనుభవింతురు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే బ్రహ్మాణ్డప్రదానవిధిర్నామ
షట్సప్తత్యధికద్విశతతమోఽధ్యాయః ॥276॥

శ్రీ మాత్స్యమహాపురాణమున మహాదానానుకీర్తనలో బ్రహ్మాణ్డప్రదానవిధి అనే
రెండువందల డెబ్బైఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైఏడవ అధ్యాయం
మహాదానానుకీర్తనే కల్పపాదపప్రదానవిధిః - మహాదానానుకీర్తనలో కల్పపాదపప్రదానవిధి

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

కల్పపాదపదానాఖ్యమతః పరమనుత్తమమ్ ।
మహాదానం ప్రవక్ష్యామి సర్వపాతకనాశనమ్ ॥ 1 ॥

ఇపుడు అత్యన్త్తోత్తమమైన సర్వపాపములనూ నశింపజేయగల కల్పవృక్షదానమను మహాదానమును గురించి వివరిస్తాను.

పుణ్యం దినమథాసాద్య తులాపురుషదానవత్ ।
పుణ్యాహవాచనం కృత్వా లోకేశావాహనం తథా ॥ 2 ॥

ఋత్విజ్ మణ్డపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ।
కాంచనం కారయేద్ వృక్షం నానాఫలసమన్వితమ్ ॥ 3 ॥

పుణ్యప్రదమైన దివసమును ఎంచుకొని తులాపురుష దానమునందు వలెనె దీనిలో కూడ పుణ్యాహవాచన కార్యక్రమమును ఆచరించి లోకపాలకులను కూడ ఆహ్వానించవలెను. ఋత్విజులను, మండపమును, సంభారములను, వస్త్రాలంకారాదులను సమకూర్చుకొని అనేక విధములైన ఫలములతోనున్న బంగారువృక్షమును సిద్ధము చేసికొనవలెను.

నానావిహగవస్త్రాణి భూషణాని చ కారయేత్ ।
శక్తితస్త్రిఫలాదూర్ధ్వమాసహస్రం ప్రకల్పయేత్ ॥ 4 ॥

అర్ధక్లృప్తసువర్ణస్య కారయేత్ కల్పపాదపమ్ ।
గుడప్రస్థోపరిష్టాచ్చ సితవస్త్రయుగాన్వితమ్ ॥ 5 ॥

బ్రహ్మవిష్ణుశివోపేతం పంచశాఖం సభాస్కరమ్ ।
కామదేవమధస్తాచ్చ సకలత్రం ప్రకల్పయేత్ ॥ 6 ॥

అట్లే నానావిధ పక్షులను, వస్త్రములు, ఆభూషణములు మొదలగు వాటిని కూడ ఆ వృక్షముతో పాటు ఏర్పరుచుకొనవలెను. యథాశక్తిగా ఫలత్రయమునకునూ వేయి ఫలములకును నడుమ తూకము గల బంగారముతో చేయించవలెను. మొత్తము తూకములో సగము తూకపు బంగారముతో కల్పవృక్షమును చేయించి దానిని ప్రస్థమాత్రపు గుడముపై మరియు తెల్లని వస్త్రద్వయముపై ప్రతిష్ఠించి మిగిలిన సగభాగములో కొంత తీసుకొని బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులను, పంచ శాఖలను, భాస్కరుని గూడ కల్పించి ఆ వృక్షపు అధోభాగమున రతీదేవి సహితుడైన మన్మథుని గూడ నిక్షేపించివలెను.

సంతానం పూర్వతస్తద్వత్తురీయాంశేన కల్పయేత్ ।
మందారం దక్షిణే పార్శ్వే శ్రియా సార్ధం ఘృతోపరి ॥ 7 ॥

పశ్చిమే పారిజాతం తు సావిత్ర్యా సహ జీరకే ।
సురభీసంయుతం తద్వత్తిలేషు హరిచందనమ్ ॥ 8 ॥

తురీయాంశేన కుర్వీత సౌమ్యేన ఫలసంయుతమ్ ।

తర్వాత తూర్పుదిశయందు తూకములో నాలుగవవంతులో సంతాన వృక్షమును, దక్షిణమునందు అదే నాలుగవ భాగముతో నేతియందు మందారవృక్షమును లక్ష్మీదేవితో కూడ కల్పించాలి. అట్లే పశ్చిమమున జీరకమునందు సావిత్రితో కూడిన పారిజాత వృక్షమున నాలుగ వంతు తూకము తోడనే చేయించి తత్సమానమైన తూకపు సువర్ణముతో కామధేనువును మరియు హరిచందనమును కల్పవృక్షముతో ఫలసంయుతముగా ఉత్తరదిశయందు చేయించాలి.

కౌశేయ వస్త్ర సంవీతాన్ ఇక్షుమాల్యఫలాన్వితాన్ ॥ 9 ॥

తథాష్టౌ పూర్ణకలశాన్ పాదుకాశనభాజనమ్ ।
దీపికోపానహచ్ఛత్ర చామరాసనసంయుతమ్ ॥ 10 ॥

ఫలమాల్యయుతం తద్వదుపరిష్టాద్వితానకమ్ ।
తథాఽష్టాదశధాన్యాని సమన్తాత్ పరికల్పయేత్ ॥ 11 ॥

అంతేకాక పట్టువస్త్రములు, చెరకు గడలు, పుష్పమాలలు, ఫలములు మొదలగు వాటిని మరియు ఎనిమిది పూర్ణ కలశములను, పాదుకలను, భోజనపాత్రలను, దీపకములను, పాదరక్షలను, ఛత్రచామరాసనాదులను సమకూర్చుకొని, ఫలపుష్పాదుల చేత అలంకృతమైన వితానమును మరియు అష్టాదశవిధములైన ధాన్యములను కూడా అన్ని దిశలయందు సిద్ధంగా ఉంచుకోవాలి.

హోమాధివాసనాన్తే చ స్నాపితో వేదపుంగవైః ।
త్రిఃప్రదక్షిణమావృత్య మన్త్రమేతముదీరయేత్ ॥ 12 ॥

హోమము మరియు అధివాసనమును ముగిసిన తర్వాత వేదపుంగవుల మంత్రోచ్చారణముతో యజమాని స్నానము చేయించుకొన్నవాడై కల్పవృక్షాదికములకు మూడు ప్రదక్షిణములు చేయుచు ఈ మంత్రమును పఠించుకోవాలి.

నమస్తే కల్పవృక్షాయ చింతితార్థప్రదాయినే ।
విశ్వమ్భరాయ దేవాయ నమస్తే విశ్వమూర్తయే ॥ 13 ॥

యస్మాత్త్వమేవ విశ్వాత్మా బ్రహ్మా స్థాణుర్దివాకరః ।
మూర్తోఽమూర్తపరం బీజమతః పాహి సనాతన ॥ 14 ॥

త్వమేవామృతసర్వస్వమనన్తః పురుషో౽వ్యయః ।
సంతానాద్యైరుపేతాస్మాన్ పాహి సంసారసాగరాత్ ॥ 15 ॥

చింతితార్థప్రదాయిని అగు కల్పవృక్షమునకు నమస్సులు. విశ్వంభరుడు, విశ్వమూర్తి, విశ్వాత్ముడు అయిన దేవునికి నమస్సులు. ఓ దేవా! నీవే బ్రహ్మవు, రుద్రుడవు, దివాకరుడవు. మూర్తామూర్తములన్నింటికిని బీజరూపుడవు కూడా నీవే. సనాతనమైన రూపము కల్గినవాడా! నన్ను రక్షింపుము. అమృత సర్వస్వమువు నీవే, అవ్యయము మరియు అనంతమూ అయిన పురుషోత్తముడవూ నీవే. సంతానాది కల్పవృక్షవిశేషములతో కూడినవాడవై మమ్ము ఈ సంసారసాగరము నుండి రక్షింపుము.

ఏవ మామన్త్ర్య తం దద్యాద్గురవే కల్పపాదపమ్ ।
చతుర్భ్యశ్చాథ ఋత్విగ్భ్యః సన్తానాదీన్ ప్రకల్పయేత్ ॥ 16 ॥

స్వల్పే త్వేకాగ్నివత్కుర్యాత్ గురవే చాభిపూజనమ్ ।
న విత్తశాఠ్యం కుర్వీత న చ విస్మయవాన్భవేత్ ॥ 17 ॥

ఈ విధముగా మంత్రమునుచ్చరించుచు కల్పవృక్షమును గురువునకు అర్పించాలి. తర్వాత సంతానాది నాలుగు వృక్షములను నలుగురు ఋత్విజులకు ఈయాలి. స్వల్పపరిమాణముతో చేయునపుడు ఏకాగ్ని విధానముతో హోమాదికము నిర్వహించుకుని అందు ఋత్విజులెవరునూ వుండరు కావున అంతయునూ గురువునకే అర్పించాలి. దీనిలో విత్తశౌర్యము అనగా ధనలోభము చేయకూడదు మరియు ఇంత వ్యయమైనదే యను ఆశ్చర్యములను పొందరాదు.

అనేన విధినా యస్తు ప్రదద్యాత్ కల్పపాదపమ్ ।
సర్వపాపవినిర్ముక్తః సో౽శ్వమేధఫలం లభేత్ ॥ 18 ॥

అప్సరోభిః పరివృతః సిద్ధచారణకింనరైః ।
భూతాన్ భవ్యాంశ్చ మనుజాంస్తారయేత్ గోత్రసంయుతాన్ ॥ 19 ॥

ఈ విధముగా ఈ కల్పవృక్ష మహాదానమును చేయువాడు సర్వపాప వినిర్ముక్తుడగుటయే కాక అశ్వమేధయాగ ఫలమును పొందును. తర్వాత అప్సరసలు, సిద్ధులు, చారణులు, కిన్నరులు మొదలగువారితో పరివృతుడై సర్వలోక సుఖములు అనుభవించును. ఇంకనూ తన వంశములోని పూర్వీకులనే కాక జన్మింపబోవు వారినందరిని కూడా తరింపజేయును.

స్తూయమానో దివః పృష్ఠే పితృపుత్రప్రపౌత్రకాన్ ।
విమానేనార్కవర్ణేన విష్ణులోకం స గచ్ఛతి ॥ 20 ॥

దివి కల్పశతం తిష్ఠేత్ రాజరాజో భవేత్తతః ।
నారాయణబలోపేతా నారాయణపరాయణః ॥
నారాయణకథాసక్తో నారాయణపురం వ్రజేత్ ॥ 21 ॥

అందరిచేత స్తుతింపబడిన వాడగుచు పితృపుత్ర ప్రపౌత్రులందరితో కూడ సూర్యుని కాంతితో సమానమైన విమానమునెక్కి విష్ణులోకమునకు వెళ్ళాడు. నూరు కల్పముల వరకు స్వర్గలోకమున నివసించిన పిదప చక్రవర్తియై జన్మిస్తాడు. శ్రీ మన్నారాయణుని బలమును పొందినవాడై నారాయణ పరాయణుడై సర్వథా నారాయణ కథాసక్తుడై నారాయణపురమునకు వెళ్ళాడు.

యో వా పఠేత్ సకలకల్పతరుప్రదానం యో వా శృణోతి పురుషోఽల్పధనః స్మరేద్వా ।
సోఽపీన్ద్రలోకమధిగమ్య సహాప్సరోభిః మన్వన్తరం వసతి పాపవిముక్తదేహః ॥ 22 ॥

ఇట్టి ఈ సకల కల్పవృక్ష ప్రదాన వివరమును ఎవరు పఠింతురో, విందురో వారు మరియు అల్పధనులై ఇటువంటివి ఆచరించలేని వారెవరైనా స్మరింతురో వారు కూడా ఇంద్రలోకమును పొంది అప్సరసాదులతో స్వర్గభోగముల ననుభవిస్తూ సర్వపాప విముక్తదేహులై ఒక మన్వంతరకాలము వరకు నివసింతురు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే కల్పపాదపప్రదానవిధిర్నామ
సప్తసప్తత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥277॥

శ్రీ మత్స్యమహాపురాణమున మహాదానానుకీర్తనం నందు కల్పపాదపప్రదానవిధి అనే
రెండువందల డెబ్బైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైఎనిమిదవ అధ్యాయం
మహాదానానుకీర్తనే గోసహస్రప్రదానవిధిః - మహాదానానుకీర్తనలో గోసహస్రప్రదానవిధి

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
గోసహస్రప్రదానాఖ్యం సర్వపాపహరం పరమ్ ॥ 1 ॥

అనంతరం ఇపుడు అత్యుత్తమమైన సర్వపాపములను హరించునట్టి గోసహస్రదానమను మహాదానమును గురించి వివరిస్తాను.

పుణ్యం తిథిం సమాసాద్య యుగమన్వన్తరాదికమ్ ।
పయోవ్రతం త్రిరాత్రం స్యాదేకరాత్రమథాపి వా ॥ 2 ॥

లోకేశావాహనం కుర్యాత్తులాపురుషదానవత్ ।
పుణ్యాహవాచనం కుర్యాద్ధోమః కార్యస్తథైవ చ ॥ 3 ॥

ఋత్విఙ్మండపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ।
వృషం లక్షణసంయుక్తం వేదిమధ్యేఽధివాసయేత్ ॥ 4 ॥

యుగాది మన్వంతరాదుల వంటి పుణ్యప్రదమైన తిథియందు కేవలం పాలు మాత్రమే ఆహారంగా తీసుకొనుచు మూడు రాత్రులు లేదా ఒకరాత్రి ఉపవాసము ఆచరించి అటు తర్వాత తులాపురుషదానం నందు వలెనే లోకపాలకులనాహ్వానించి పుణ్యాహ వాచనాది కార్యక్రమములు నిర్వహించి హెూమమును గూడా చేయాలి. ఋత్విజులను, మండపమును, సంభారములను, వస్త్రములను ఆభూషణాచ్ఛాదనాదికములను కూడ సమకూర్చుకొని సర్వ లక్షణయుక్తమైన వృషభమును వేదికమధ్యయందు అధివసింపజేయాలి.

గోసహస్రం బహిః కుర్యాద్వస్త్రమాల్యవిభూషణమ్ ।
సువర్ణశృంగాభరణం రౌప్యపాదసమన్వితమ్ ॥ 5 ॥

అంతః ప్రవేశ్య దశకం వస్త్రమాల్యైశ్చ పూజయేత్ ।
సువర్ణఘంటికాయుక్తం కాంస్యదోహనకాన్వితమ్ ॥ 6 ॥

సువర్ణతిలకోపేతం హేమపట్టైరలంకృతమ్ ।
కౌశేయవస్త్రసంవీతం మాల్యగంధ సమన్వితమ్ ॥ 7 ॥

హేమరత్నమయైః శృంగైశ్చామరైరుపశోభితమ్ ।
పాదుకోపానహచ్ఛత్ర భాజనాసనసంయుతమ్ ॥ 8 ॥

దానము కొరకై సిద్ధము చేసికొనిన వేయి గోవులను బయట నిలబెట్టాలి. వాటిని వస్త్రమాల్యాదులతో అలంకరించాలి. సువర్ణ శృంగాభరణములతో, వెండి కాలిగిట్టలతో కూడా అలంకరించాలి. ఆ వేయి ఆవులలో

పదింటిని లోపలికి తీసుకు వచ్చి వీటిని యథావిధిగా పూజించాలి. ఇంకనూ బంగారముచిరుగంటలతో, కాంస్యముతో చేసిన పాలు పితుకు పాత్రలతో, సువర్ణ తిలకములతో, బంగారు పట్టెలతో, పట్టు వస్త్రములతో, పుష్పమాలలతో, సుగంధ ద్రవ్యములతో, కనకరత్నమయములైన శృంగములతో, చామరములు మొదలగు వాటితో వాటిని అలంకరించి, పాదుకలు, పాదరక్షలు, ఛత్రములు, పాత్రలు, ఆసనములు మొదలగు వాటితో సిద్ధంగా వుంచాలి.

గవాం దశకమధ్యే స్యాత్కాంచనో నందికేశ్వరః ।
కౌశేయవస్త్రసంవీతో నానాభరణభూషితః ॥ 9 ॥

లవణద్రోణశిఖరే మాల్యేక్షుఫలసంయుతః ।
కుర్యాత్పలశతాదూర్ధ్వం సర్వమేతదశేషతః ॥ 10 ॥

శక్తితః పలసాహస్రత్రితయం యావదేవ తు ।
గోశతేఽపి దశాంశేన సర్వమేతత్సమాచరేత్ ॥ 11 ॥

ఆ పది గోవుల మధ్యలో బంగారపు నందికేశ్వరుడుండాలి. పట్టువస్త్రముతో నానావిధములైన ఆభరణములతో అలంకరించి పుష్పమాలలు, చెరకు గడలు, ఫలములు మొదలగు వాటితో ద్రోణ పరిమాణమగు ఉప్పు గల పాత్రలో పై భాగమున దానిని వుంచాలి. ఆ కాంచననందికేశ్వరుని నూరు పలములకు మరియు మూడువేల పలములకు మధ్యనుండు తూకపు బంగారముతో చేయించవచ్చు. తర్వాత మరి వంద గోవులకును నడుమ ఇందు దశాంశపు తూకముతో ఇదంతయు చేయించాలి.

పుణ్యకాలం సమాసాద్య గీతమంగలనిఃస్వనైః ।
సర్వౌషధ్యుదకస్నానస్నాపితో వేదపుంగవైః ॥ 12 ॥

ఇమ ముచ్చారయేన్మన్త్రం గృహీతకుసుమాంజలిః ।
నమోఽస్తు విశ్వమూర్తిభ్యో విశ్వమాతృభ్య ఏవ చ ॥ 13 ॥

లోకాధివాసినీభ్యశ్చ రోహిణీభ్యో నమో నమః ।

తర్వాత శభముహూర్తము నందు మంగళగీత వాద్యముల నడుమ వేదపుంగవుల మంత్రోచ్చారణముల ద్వారా సర్వౌషధీ జలములతో స్నానము చేయింపబడినవాడై యజమానుడు దోసిలియందు పుష్పములు గ్రహించినవాడై ఈ మంత్రమును పఠించాలి. "విశ్వమూర్తులకు, విశ్వమాతలకు నమస్సులు. లోకాధివాసినులైన రోహిణీ ధేనువులకు నమస్సులు.

గవామంగేషు తిష్ఠన్తి భువనాన్యేకవింశతిః ॥ 14 ॥

బ్రహ్మాదయస్తథా దేవా రోహిణ్యః పాన్తు మాతరః ।
గావో మే అగ్రతః సన్తు గావః పృష్ఠత ఏవ చ ॥ 15 ॥

గావః శిరసి మే నిత్యం గవాం మధ్యే వసామ్యహమ్ ।
యస్మాత్త్వం వృషరూపేణ ధర్మ ఏవ సనాతనః ॥ 16 ॥

అష్టమూర్తేరధిష్ఠానమతః పాహి సనాతన ।

ఇరువదియొక్క లోకములు బ్రహ్మాది దేవతలు గూడా గోవుల యొక్క అవయవములందు అధివసిస్తారు. అటువంటి రోహిణీధేనువులు మమ్ము రక్షించుగాక! నాకు ముందు భాగమున మరియు వెనుక భాగమున కూడా గోవులు ఉండుగాక! నా శిరస్సుయందు కూడ గోవులే ఉండుగాక! నేను గోవుల మధ్యలోనే నివసిస్తున్నాను. ఓ గోవా! వృష రూపములోనున్న సనాతన ధర్మమువు నీవే, అష్టమూర్తియైన పరమశివుని అధిష్ఠానము గూడా నీవే కావున ఓ సనాతనా! నన్ను రక్షింపుము.

ఇత్యామన్త్ర్య తతో దద్యాద్ గురవే నందికేశ్వరమ్ ॥ 17 ॥

సర్వోపకరణోపేతం గోయుతం చ విచక్షణః ।
ఋత్విగ్భ్యో ధేనుమేకైకాం దశైకాద్వినివేదయేత్ ॥ 18 ॥

గవాం చ శతమేకైకం తదర్ధం వాథ వింశతిమ్ ।
దశ పంచాథ వా దద్యాత్ అన్యేభ్యస్తదనుజ్ఞయా ॥ 19 ॥

నైకా బహుభ్యో దాతవ్యా యతో దోషకరీ భవేత్ ।
బహ్వ్యశ్చైకస్య దాతవ్యాః ధీమతారోగ్యవృద్ధయే ॥ 20 ॥

ఈ విధముగా ఆమంత్రించి గురువైన ఋత్విజునకు నందికేశ్వరుని మరియు సర్వోపరకణములు కలిగిన గోవును విచక్షణుడైన యజమానుడీయాలి. పది గోవులలో ఒక్కొక్క గోవును ఋత్విజులకు ఇయ్యాలి. తర్వాత ఒక్కొక్క బ్రాహ్మణునకు నూరేసి లేదా ఏబది కాని, ఇరువది కాని ఐదు కాని ఆచార్యుని అనుమతితో దానం చేయాలి. కాని బుద్ధిమంతుడు ఒకే గోవును అనేక మంది విప్రులకిచ్చుట మాత్రం దోషకరం. అయితే అనేక గోవులను ఒకే విప్రునకు దానమీయవచ్చును. అది యజమాని యొక్క ఆరోగ్యవృద్ధికి సంకేతం.

పయోవ్రతః పునస్తిష్ఠేదేకాహం గోసహస్రదః ।
శ్రావయేచ్ఛృణుయాద్వాఽపి మహాదానానుకీర్తనమ్ ॥ 21 ॥

తద్దినే బ్రహ్మచారీ స్యాద్యదీచ్ఛేద్విపులాం శ్రియమ్ ।
అనేన విధినా యస్తు గోసహస్రప్రదో భవేత్ ॥
సర్వపాపవినిర్ముక్తః సిద్ధచారణసేవితః ॥ 22 ॥

విమానేనార్కవర్ణేన కింకిణీజాలమాలినా ।
సర్వేషాం లోకపాలానాం లోకే సంపూజ్యతేఽమరైః ॥ 23 ॥

ఆ విధంగా గోసహస్రదానం తర్వాత దాత ఒక రోజంతయు పయోవ్రతుడై అనగా పాలు మాత్రమే ఆహారముగా స్వీకరించి వ్రతమాచరించాలి. తర్వాత యజమానుడు ఆ మహాదానానుకీర్తనమును తాను విని ఇతరులకు కూడా వినిపించాలి. ఒకవేళ తాను విపులమైన సంపదను కోరుకుంటున్నవాడైనచో ఆ దివసమున బ్రహ్మచర్యమును పాటించాలి. ఈ విధానము ననుసరించి గోసహస్రదానమును ఎవరైతే ఆచరింతురో వారు సర్వపాపములనుండి విముక్తులై, సిద్ధ చారణ సేవితులై చిరుమువ్వల తోరణములు కలిగినట్టి సూర్యుని ప్రకాశముతో తుల్యమైన విమానమునెక్కి సర్వలోకపాలకుల యొక్క లోకములకేగి, తదనంతరము దేవతలచేత పూజింపబడును.

ప్రతిమన్వన్తరం తిష్ఠేత్ పుత్రపౌత్రసమన్వితః ।
సప్తలోకానతిక్రమ్య తతః శివపురం వ్రజేత్ ॥ 24 ॥

శతమేకోత్తరం తద్వత్పితౄణాం తారయేద్బుధః ।
మాతామహానాం తద్వచ్చ పుత్రపౌత్రసమన్వితః
యావత్కల్పశతం తిష్ఠేత్ రాజరాజో భవేత్పునః ॥ 25 ॥

అశ్వమేధశతం కుర్యాత్ శివధ్యానపరాయణః ।
వైష్ణవం యోగమాస్థాయ తతో ముచ్యేత బంధనాత్ ॥ 26 ॥

గోసహస్రదానం చేసినవారు పుత్రపౌత్రసమన్వితులై ఒక మన్వన్తరకాలం జీవించి తర్వాత ఏడు లోకములను గూడా అతిక్రమించి శివపురానికి వెళుతారు. అంతేకాక ఆ బుధుడు నూటొక్క మంది పితరులను తరింపజేస్తాడు. అట్లే మాతామహుల వంశమును గూడా తరింపజేస్తాడు. నూరు కల్పముల కాలము జీవించి మరల చక్రవర్తిగా జన్మించి శివధ్యానపరాయణుడై నూరు అశ్వమేధయాగాలు ఆచరిస్తాడు. తర్వాత యోగం ద్వారా విష్ణులోకానికి చేరి బంధ విముక్తుడౌతాడు.

పితరశ్చాభినందంతి గోసహస్రప్రదం సుతమ్ ।
అపి స్యాత్స కులేఽస్మాకం పుత్రో దౌహిత్ర ఏవ వా ।
గోసహస్రప్రదో భూత్వా నరకాదుద్ధరిష్యతి ॥ 27 ॥

తస్య కర్మకరో వా స్యాదపి ద్రష్టా తథైవ చ ।
సంసారసాగరాదస్మాద్యోఽస్మాన్ సంతారయిష్యతి ॥ 28 ॥

గోసహస్రదానమును చేసిన పుత్రుని పితృదేవతలందరూ అభినందిస్తారు. గోసహస్రదానం చేయునట్టి వానిని మా వంశమునందు పుత్రుడుగానో, దౌహిత్రుడుగానో జన్మించాలని కోరుకొంటారు, అట్టివాడు వంశోద్ధారకుడై అందరిని నరకమునుండి ఉద్ధరిస్తాడని భావిస్తారు. గోసహస్రదాన కార్యక్రమమును చూచిననూ, పాల్గొనిననూ, సహాయకారిగా ఉన్ననూ ఈ సంసారసాగరము నుండి మమ్ము తరింపజేయుమని భావిస్తారు.

ఇతి పఠతి య ఏతద్గోసహస్రప్రదానం సురభువనముపేయాత్సంస్మరేద్వాఽథ పశ్యేత్ ।
అనుభవతి ముదం వా ముచ్యమానో నికామం ప్రహతకలుషదేహః సోఽపి యాతీంద్రలోకమ్ ॥ 29 ॥

ఇట్టి గోసహస్రప్రదాన ఇతివృత్తమును ఎవరు పఠింతురో, స్మరింతురో లేదా సాక్షాత్తు చూచెదరో వారు స్వర్గలోకానికి పోతారు. అంతేకాక సంతోషమయమైన జీవనమును గడిపి, అన్నింటినుండి విముక్తులై కలుషములన్ని నశించినవారై ఇంద్రలోకాన్ని పొంది సుఖంగా ఉంటారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే గోసహస్రప్రదానవిధిర్నామాష్టసప్తత్యధికద్విశతతమోఽధ్యాయః॥278॥

శ్రీ మత్స్య మహాపురాణమున మహాదానానుకీర్తన గో సహస్రప్రదాన విధి అనే రెండువందల డెబ్బైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనపంచాశదధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల డెబ్బైతొమ్మిదవ అధ్యాయం

మహాదానానుకీర్తనే హిరణ్యకామధేనుప్రదానవిధిః-

మహాదానానుకీర్తనలో హిరణ్యకామధేనుప్రదానవిధి

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి కామధేనువిధిం పరమ్ ।
సర్వకామప్రదం నృణాం మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

ఇప్పుడు సర్వకామప్రదాయిని అయినట్టి మానవుల మహాపాతకములన్నింటిని నశింపజేయునట్టిది పరమోత్కృష్టమైన కామధేను దాన విధానమును తెలిపెదను.

లోకేశావాహనం తద్వద్ధోమః కార్యోఽధివాసనమ్ ।
తులాపురుషవత్కుర్యాత్ కుండమండపవేదికమ్ ॥ 2 ॥

స్వల్పే త్వేకాగ్నివత్కుర్యాద్గురురేకః సమాహితః ।
కాంచనస్యాతిశుద్ధస్య ధేనుం వత్సం చ కారయేత్ ॥ 3 ॥

దీనియందు కూడా తులాపురుషదానమునందు వలె కుండములు, మండపములు, వేదికలు నిర్మించుకోవాలి. లోకేశావాహనం, హోమం, అధివాసనం మొదలగునవి కూడా అట్లే జరపాలి. ఒకవేళ స్వల్పప్రక్రియా విధానమునాలోచించినచో ఎక్కువ మంది ఋత్విజులు లేకుండా ఏకాగ్నివిధానమున ఒక గురువును మాత్రమే ఆహ్వానించి ఆయా కార్యములన్నియు జరుపుకోవాలి. తర్వాత శుద్ధమైన బంగారముతో ఆవును మరియు దూడను కూడా చేయించాలి.

ఉత్తమా పలసాహస్రీ తదర్ధేన తు మధ్యమా ।
కనీయసీ తదర్ధేన కామధేనుః ప్రకీర్తితా ॥ 4 ॥

శక్తితస్త్రిపలాదూర్ధ్వమశక్తోఽపీహ కారయేత్ ।
వేద్యాం కృష్ణాజినం న్యస్య గుడప్రస్థసమన్వితమ్ ॥ 5 ॥

న్యసేదుపరి తాం ధేనుం మహీరత్నైరలంకృతామ్ ।
కుంభాష్టకసమోపేతాం నానాఫలసమన్వితామ్ ॥ 6 ॥

తథాష్టాదశ ధాన్యాని సమన్తాత్ పరికల్పయేత్ ।
ఇక్షుదండాష్టకం తద్వన్నానాఫలసమన్వితమ్ ॥
భాజనం చాసనం తద్వత్తామ్ర దోహనకం తథా ॥ 7 ॥

వేయి లేదా ఐదు వందలు లేదా రెండువందల ఏబది పలముల బంగారమును ఆవు దూడలను చేయుటకుపయోగించుట ఉత్తమ-మధ్యమ-అధమ విధానాలని చెప్పబడినవి. అశక్తులైనచో మూడు పలములకు

తక్కువ కాని ఎంత బంగారముతోనైనను ఇవి చేయించవచ్చును. తర్వాత వేదికయందు కృష్ణాజినమును పరిచి ఒక ప్రస్థ పరిమాణము గల గుడమును దానిపై నుంచిన పిమ్మట మహారత్నముల చేత అలంకరింపబడినట్టి ధేనువును దానిపై ఉంచాలి. అపుడు ఎనిమిది పూర్ణ కుంభములు, నానా విధ ఫలములు, పదునెనిమిది విధముల ధాన్యమును కూడా అచ్చట కల్పించాలి. అంతేకాక ఎనిమిది చెరకు గడలు, అనేక రకముల ఫలములు, పాత్రలు, ఆసనములు, పాలు పితుకుటకై తామ్రపాత్రలు మొదలగు వాటిని కూడా సిద్ధం చేసుకోవాలి.

కౌశేయవస్త్రద్వయసంయుతాం గాం దీపాతపత్రాభరణాభిరామామ్ ।
సచామరాం కుణ్డలినీం సఘణ్టాం సువర్ణశృంగీం పరిరూప్యపాదామ్ ॥ 8 ॥

రసైశ్చ సర్వైః పరితోఽభిజుష్టాం హరిద్రయా పుణ్యఫలైరనేకైః ।
అజాజికుస్తుమ్బురుశర్కరాదిభిః వితానకం చోపరి పంచవర్ణమ్ ॥ 9 ॥

తదనంతరం రెండు పట్టు వస్త్రములతో దీపము, ఆతపత్రము మరియు ఇతర ఆభరణములతో ధేనువును అలంకరించాలి. చామరములు, కుండలములు, ఘంటములు, బంగారు కొమ్ములు, వెండితో చేసిన గిట్టలు ఇత్యాదులతో కూడ ధేనువును అలంకరించాలి. అనేకవిధ రసములను కూడ కల్పించాలి. పసుపు మరియు జీలకర్ర ధనియాలు చక్కెర మొదలగు వాటితో కలిపిన పొడిని కూడ సిద్ధం చేసికోవాలి. పంచ వర్ణాత్మకమైన వితానమును అనగా మేలుకట్టును కూడ ధేనువుపై అమర్చాలి.

స్నాతస్తతో మంగళవేదఘోషైః ప్రదక్షిణీకృత్య సపుష్పహస్తః ।
ఆవాహయేత్తాం గురుణోక్తమంత్రైః ద్విజాయ దద్యాదథ దర్భపాణిః ॥ 10 ॥

తర్వాత యజమానుడు మంగళవేదధ్వనులు మ్రోగుచుండగా, స్నానమాచరించి పుష్పహస్తుడై హోమకుండమునకు బ్రాహ్మణులకు, ధేనువత్సములకు కూడ ప్రదక్షిణము చేసి దర్భపాణియై గురువు చెప్పు మంత్రములను వినుచు ధేనువును ద్విజునకు ఈయాలి.

త్వం సర్వదేవగణమందిరమంగభూతా విశ్వేశ్వరి త్రిపథగోదధిపర్వతానామ్ ।
త్వద్దానశస్త్రశకలీకృతపాతకౌఘఃప్రాప్తోఽస్మి నిర్వృతిమతీవ పరాం నమామి ॥ 11 ॥

లోకే యథేప్సితఫలార్థవిధాయినీం త్వామాసాద్య కో హి భువి దుఃఖముపైతి మర్త్యః ।
సంసారదుఃఖశమనాయ యతస్వ కామం త్వాం కామధేనుమితి వేదవిదో వదన్తి ॥ 12 ॥

ఆమన్త్ర్య శీలకులరూపగుణాన్వితాయ విప్రాయ యః కనకధేనుమిమాం ప్రదద్యాత్ ।
ప్రాప్నోతి ధామ స పురందరదేవజుష్టం కన్యాగణైః పరివృతః పదమిందుమౌలేః ॥ 13 ॥

ఓ విశ్వేశ్వరీ! కామధేనువా! నీవు దేవగణములందరికిని గృహభూతురాలవు. నీ అంగమునందు వారందరికి స్థానం కల్పించినదానవు. గంగానదికి, సముద్రములకు, పర్వతములకు కూడ నీవు అంగభూతురాలవు. నిన్ను దానము చేయుటనే ఆయుధమై నా పాపరాసులన్నియు ఖండితములు కాగా పరమోత్కృష్టమైన ఆనందమును

పొందుచున్న నేను నీకు నమస్కరిస్తున్నాను. కోరిన కోరికలన్నింటిని ఫలింప జేయునట్టి నీవు ఈ భువిలో వుండగా ఎవరు దుఃఖాన్ని పొందుతారు? ఓ కామధేనువా! మా సంసార దుఃఖాలన్నింటిని నశింపజేయుదానవు. కావుననే వేదవిదులందరు శీలకుల రూప గుణాన్వితుడైన విప్రుని ఆహ్వానించి ఎవడైతే ఈ కనక కామధేనువును దానము చేయునో అతను దేవకన్యాగణములతో పరివృతుడై ఇంద్రాది దేవతలు గూడా కోరునట్టి పరమశివుని స్థానాన్ని పొందుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే హిరణ్యకామధేనుప్రదానవిధిర్నామా ఏకోనాశీతిత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥279॥

శ్రీ మాత్స్య మహాపురాణమున మహాదానానుకీర్తనలో హిరణ్యకామధేను ప్రదానవిధి అనే రెండువందల డెబ్బైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.



అశీత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనబయ్యవ అధ్యాయం

మహాదానానుకీర్తనే హిరణ్యాశ్వప్రదానవిధిః – మహాదానానుకీర్తనలో హిరణ్యాశ్వప్రదానవిధి

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి హిరణ్యాశ్వ విధిం పరమ్ ।
యస్య ప్రదానాద్భువనే చానన్తం ఫలమశ్నుతే ॥ 1 ॥

ఇప్పుడు హిరణ్యాశ్వ మహాదానం గురించి వివరిస్తాను. ఈ దానం చేయుటవలన లోకమునందు అనంతములైన మహాఫలితాన్ని పొందును.

పుణ్యాం తిథిమథాసాద్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
లోకేశావాహనం కుర్యాత్తులాపురుషదానవత్ ॥ 2 ॥

ఋత్విఙ్మండపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ।
స్వల్పే త్వేకాగ్నివత్కుర్యాద్ధేమవాజిమఖం బుధః ॥ 3 ॥

శుభప్రదమైన తిథిని చూసుకుని బ్రాహ్మణులచే పుణ్యాహవాచనాదులు కావించి తులాపురుషదానంనందు వలె లోకపాతకులను ఆహ్వానించాలి. తర్వాత ఋత్విజులు, మండపములు, ఆభూషణములు, ఆచ్ఛాదనాది ఇతర సంభారములన్నింటిని సమకూర్చుకోవాలి. స్వల్ప ప్రక్రియతోనే ఈ హిరణ్యాశ్వ దానయజ్ఞమును నిర్వహించుకో వచ్చును.

స్థాపయేద్వేదిమధ్యే తు కృష్ణాజినతిలోపరి ।
కౌశేయవస్త్రసంవీతం కారయేద్ధేమవాజినమ్ ॥ 4 ॥

శక్తితస్త్రిపలాదూర్ధ్వమా సహస్రపలాద్ బుధః ।
పాదుకోపానహచ్ఛత్రచామరాసనభాజనైః ॥ 5 ॥

పూర్ణకుంభాష్టకోపేతం మాల్యేక్షుఫలసంయుతమ్ ।
శయ్యాం సోపస్కరాం తద్వద్ధేమమార్తండసంయుతామ్ ॥ 6 ॥

తతః సర్వౌషధిస్నానస్నాపితో వేదపుంగవైః ।
ఇమముచ్చారయేన్మంత్రం గృహీతకుసుమాంజలిః ॥ 7 ॥

వేది మధ్యయందు కృష్ణాజినమును పరిచి దానిపై నువ్వులు పోసి బంగారముతో చేసిన అశ్వమును పట్టు వస్త్రములతో చుట్టి దానిపైన వుంచాలి. తమ శక్తి ననుసరించి బంగారు అశ్వమును మూడు పలములకంటే ఎక్కువగా వేయి పలములను మించకుండా చేయించాలి. పాదుకలు, పాదరక్షలు, ఛత్రము, చామరములు, ఆసనము, పాత్రలు, ఎనిమిది పూర్ణకుంభములు, మాలలు, చెరకుగడలు, ఫలములు మొదలగువాటిని కూడా సిద్ధంగా

నుంచుకోవాలి. అలాగే వస్తువులన్నింటితో గూడిన శయ్య మరియు బంగారముతో చేసిన సూర్యుని ప్రతిమను కూడా సిద్ధముగా నుంచుకోవాలి. అటు తర్వాత వేదపుంగవుల మంత్రోచ్చారణముతో యజమానుడు సర్వౌషధీ స్నానమాచరించి దోసిలిలో పూలు పట్టుకొని ఈ క్రింది మంత్రమునుచ్చరించాలి.

నమస్తే సర్వదేవేశ వేదాహరణలంపట ।
వాజిరూపేణ మామస్మాత్పాహి సంసారసాగరాత్ ॥ 8 ॥

త్వమేవ సప్తధా భూత్వా ఛందోరూపేణ భాస్కర ।
యస్మాద్భాసయసే లోకాన్ అతః పాహి సనాతన ॥ 9 ॥

సర్వదేవేశా! వేదములను తిరిగి తెచ్చుటయందాసక్తి గలవాడా! (హయగ్రీవ) అశ్వరూపమున నున్న నీవు నన్ను ఈ సంసారసాగరము నుండి రక్షింపుము. నీకు నమస్సులు. ఓ భాస్కరా! ఏడు విధములైన ఛందోరూపమును కలిగినవాడా! ఏ విధముగానైతే లోకములన్నింటిని భాసింపజేయుచున్నావో ఆ విధముగా ఓ సనాతనా! మమ్ములను కూడా రక్షింపుము.

ఏవముచ్చార్య గురవే తమశ్వం వినివేదయేత్ ।
దత్వా పాపక్షయాద్భానోర్లోకమభ్యేతి శాశ్వతమ్ ॥ 10 ॥

గోభిర్విభవతః సర్వాన్ ఋత్విజశ్చాపి పూజయేత్ ।
సర్వధాన్యోపకరణం గురవే వినివేదయేత్ ॥ 11 ॥

సర్వం శయ్యాదికం దత్త్వా భుంజీతాతైలమేవ హి ।
పురాణశ్రవణం తద్వత్ కారయేద్భోజనాదికమ్ ॥ 12 ॥

ఇట్లుచ్చరించి గురువునకు ఆ అశ్వమును అర్పించాలి. అట్లు ఆ అశ్వదానముతో పాపములన్నియును క్షయంచినవాడై యజమానుడు సూర్యలోకాన్ని పొందుతాడు. తదనంతరం గోవులతో ఋత్విజులనందరిని పూజించాలి. సర్వధాన్యోపకరణములను గురువునకు సమర్పించాలి. శయ్య మొదలగువాటిని దానం చేసి తైలరహితమైన ఆహారమును భుజించాలి. పురాణశ్రవణము మరియు భోజనాదికమును కూడా జరిపించాలి.

ఇమం హిరణ్యాశ్వవిధిం కరోతి యః పుణ్యమాసాద్య దినం నరేంద్ర ।
విముక్తపాపః స పురం మురారేః ప్రాప్నోతి సిద్ధైరభిపూజితః సన్ ॥ 13 ॥

ఓ రాజా! ఈ విధముగా మంచి రోజున ఎవడైతే హిరణ్యాశ్వదానమును చేయునో, అతడు సర్వపాప విముక్తుడై సిద్ధాదులందరిచేత పూజింపబడుచున్నవాడై విష్ణులోకమును పొందుతాడు.

ఇతి పఠతి య ఏతద్ధేమవాజిప్రదానం సకలకలుషముక్తః సోఽశ్వమేధేన యుక్తః ।
కనకమయవిమానేనార్కలోకం ప్రయాతి త్రిదశపతివధూభిః పూజ్యతే యోఽభిపశ్యేత్ ॥ 14 ॥

యో వా శృణోతి పురుషోఽల్పధనః స్మరేద్వా హేమాశ్వదానమభినందయతీహ లోకే ।
సోఽపి ప్రయాతి హతకల్మషశుద్ధదేహః స్థానం పురందరమహేశ్వరదేవజుష్టమ్ ॥ 15 ॥

ఈ సువర్ణాశ్వ దానవిధిని పఠించినవాడు సమస్త పాపములనుండి విముక్తుడై అశ్వమేధఫలమును పొంది, బంగారువిమానము నెక్కి సూర్యలోకానికి వెళుతాడు. తర్వాత అచ్చట అప్సరసల చేత పూజింపబడతాడు.

అంతేకాక ధనరహితుడైన బీదవాడు ఈ దాన విధానమును వినినను, స్మరించినను, హేమాశ్వదానము చేయువారిని అభినందించినను పాప విముక్తుడై, శుద్ధమైన అంతఃకరణ కలవాడై ఇంద్రాదులు రుద్రుడు మొదలగు వారు వసించులోకాన్ని పొందుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే హిరణ్యాశ్వప్రదానవిధిర్నామ
అశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥279॥

శ్రీ మత్స్య మహాపురాణమునందు మహాదానానుకీర్తనలో హిరణ్యాశ్వ ప్రదాన విధి అనే
రెండువందల ఎనభైయవ అధ్యాయం సమాప్తం.



ఏకాశీత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనబైఒకటవ అధ్యాయం

మహాదానానుకీర్తనే హిరణ్యాశ్వరథప్రదానవిధిః – మహాదానానుకీర్తనలో హిరణ్యాశ్వరథప్రదానవిధి

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
పుణ్యమశ్వరథం నామ మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

ఇప్పుడు ఉత్తమోత్తమమైనట్టి మహాపాతకములను కూడ నశింపజేయునట్టి హిరణ్యాశ్వరథ ప్రదాన విధానాన్ని వివరిస్తాను.

పుణ్యం దినమథాసాద్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
లోకేశావాహనం కుర్యాత్తులాపురుషదానవత్ ॥ 2 ॥

ఋత్విఙ్మండపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ।
కృష్ణాజినే తిలాన్ కృత్వా కాంచనం స్థాపయేద్రథమ్ ॥ 3 ॥

అష్టాశ్వం చతురశ్వం వా చతుశ్చక్రం సకూబరమ్ ।
ఇంద్రనీలేన కుంభేన ధ్వజరూపేణ సంయుతమ్ ॥ 4 ॥

లోకపాలాష్టకం తద్వత్పద్మరాగదలాన్వితమ్ ।
చతురః పూర్ణకలశాన్ ధాన్యాన్యష్టాదశైవ తు ॥ 5 ॥

పుణ్యప్రదమైన శుభదివసమును చూసుకొని బ్రాహ్మణులచే పుణ్యాహవాచనాదికము చేయించి తులాపురుష దానమునందువలనే లోకపాలకులను ఆహ్వానించాలి. ఋత్విజులు, మండపము, సంభారములు, ఆభూషణములు, వస్త్రములను సమకూర్చుకుని వేదికపైన కృష్ణాజినమును పరచి నువ్వులు పోసి బంగారముతో చేసిన రథమును దానిపై స్థాపించాలి. ఆ రథమునకు ఎనిమిది లేదా నాలుగు అశ్వములు మరియు నాలుగు చక్రములు, కూబరము ఇంద్రనీలమణులు పొదిగిన కుంభము, ధ్వజము, అష్టలోకపాలకులు పద్మరాగదళాన్వితములైన నాలుగు పూర్ణ కలశములు అష్టాదశ ధాన్యములు కూడ అక్కడ సిద్ధంగా వుంచుకోవాలి.

కౌశేయవస్త్రసంయుక్తముపరిష్టాద్వితానకమ్ ।
మాల్యేక్షుఫలసంయుక్తం పురుషేణ సమన్వితమ్ ॥ 6 ॥

యో యద్భక్తః పుమాన్ కుర్యాత్స తన్నామ్నాధివాసనమ్ ।
ఛత్రచామరకౌశేయవస్త్రోపానహపాదుకమ్ ॥ 7 ॥

గోభిర్విభవతః సార్ధం దద్యాచ్చ శయనాదికమ్ ।
ఆభారాత్రిపలాదూర్ధ్వం శక్తితః కారయేద్బుధః ॥ 8 ॥

తర్వాత పట్టువస్త్రములు, వితానకము (అగ్నులు), పూవులు, చెరకుగడలు, పురుషప్రతిమ, ఛత్ర చామరములను పాదుకలు, పాదరక్షలు మొదలగు వాటిని కూడ సిద్ధముగా నుంచుకోవాలి. ఎవరు ఏ దేవుని భక్తులో ఆ దేవుని పేరుతో అధివాసనము జరుపాలి. యథాశక్తిగా గోవులను, శయనాదికమును గూడా ఈయాలి. రథాదులను మూడు పలములనుండి వేయిపలముల నడుమ గల తూకముతో చేయించాలి.

అశ్వాష్టకేన సంయుక్తం చతుర్భిరథ వాజిభిః ।
ద్వాభ్యామపి యుతం దద్యాద్ధేమసింహధ్వజాన్వితమ్ ॥ 9 ॥

చక్రరక్షావుభౌ తస్య తురగస్థావథాశ్వినౌ ।
పుణ్యకాలమథావాప్య పూర్వవత్ స్నాపితో ద్విజైః ॥ 10 ॥

త్రిః ప్రదక్షిణమావృత్య గృహీతకుసుమాంజలిః ।
శుక్లమాల్యాంబరో దద్యాదిమం మన్త్రముదీరయేత్ ॥ 11 ॥

రథమునకు ఎనిమిది లేదా నాలుగు అశ్వములను లేదా రెండు అశ్వములను ఏర్పరిచి బంగారముతో చేసిన సింహధ్వజమును, చక్రముల రక్షకులుగా అశ్వినీ దేవతలను కూడా ఏర్పరచాలి. తదనంతరము ఇతఃపూర్వం దానములో చెప్పిన విధముగా ద్విజుల మంత్రోచ్చారణములతో యజమానుడు స్నానము చేయించబడినవాడై, తెల్లని వస్త్రములను ధరించి, దోసిలిలో పూవులను తీసుకుని, మూడుమార్లు ప్రదక్షిణమాచరించి ఈ క్రింది మంత్రమునుచ్చరిస్తూ దానం చేయాలి.

నమో నమః పాపవినాశనాయ విశ్వాత్మనే వేదతురంగమాయ ।
ధామ్నామధీశాయ దివాకరాయ పాపౌఘదావానల దేహి శాన్తిమ్ ॥ 12 ॥

వస్వష్టకాదిత్యమరుద్గణానాం త్వమేవ ధాతా పరమం నిధానమ్ ।
యతస్తతో మే హృదయం ప్రయాతు ధర్మైకతానత్వమఘౌఘనాశాత్ ॥ 13 ॥

పాపవినాశకారుడవు, విశ్వాత్ముడవు, వేద రక్షకుడవు, తేజస్సులన్నింటికిని అధిపతివి. పాపములన్నింటిని దావానలము వలే దహించి వేయువాడవూ అయిన దివాకరా నీకు నమస్సులు. మాకు శాంతి కలిగింపుము. అష్టవసువులకు, ద్వాదశాదిత్యులకు, మరుద్గణములకు కూడా నీవే కర్తవు. నీవే పరమాశ్రయుడవు. నీ దయతో పాపములన్ని నశించి మా హృదయము ధర్మమును మాత్రమే ఆశ్రయించుగాక!

ఇతి తురగరథప్రదానమేకం భవభయసూదనమత్ర యః కరోతి ।
స కలుషపటలైర్విముక్తదేహః పరమముపైతి పదం పినాకపాణేః ॥ 14 ॥

దేదీప్యమానవపుషాం విజితప్రభావమాక్రమ్య మండలమఖండితచండభానోః ।
సిద్ధాంగనానయనషట్పదపీయమానవక్త్రాంబుజోఽమ్బుజభవేన చిరం సహాస్తే ॥ 15 ॥

ఇట్లు భవభయనాశకమగు హిరణ్యాశ్వరథప్రదానమును ఎవరైతే చేయుదురో వారు కలుషములన్నియు నశించిన దేహము కలవాడై పరమోత్కృష్టమైన పినాకపాణి అనగా శివుని సాన్నిధ్యమును పొందును. ఇంకనూ

దేదీప్యమానమైన శరీరము కలవాడై విజితప్రభావుడై అఖండమైన సూర్య మండలము నాశ్రయించి, సిద్ధాంగనలచేత సేవించబడినవాడై అంబుజభవుడైన బ్రహ్మదేవుని సాన్నిధ్యమున చిరకాలము వరకు వసించును.

ఇతి పఠతి శృణోతి వా య ఇత్థం కనకతురగరథప్రదానమస్మిన్ ।
న స నరకపురం వ్రజేత్కదాచిత్ నరకరిపోర్భువనం ప్రయాతి భూయః ॥ 16 ॥

ఇట్లు హిరణ్యాశ్వరథ ప్రదానవిధానమును ఎవరు పఠింతురో లేదా విందురో వారు నరకపురమునకు ఎప్పుడునూ వెళ్ళరు, కాని నరకాసుర శత్రువైన శ్రీమన్నారాయణుని పురమునే పొందుతారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే హిరణ్యాశ్వరథప్రదానవిధిర్నామ ఏకాశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥281॥

శ్రీ మత్స్య మహాపురాణమునందు మహాదానానుకీర్తనమున హిరణ్యాశ్వరథ ప్రదానవిధి అనే రెండువందల ఎనభైఒకటవ అధ్యాయం సమాప్తం.



ద్వ్యశీత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనభైరెండవ అధ్యాయం

మహాదానానుకీర్తనే హేమహస్తిరథప్రదానవిధిః – మహాదానానుకీర్తనలో హేమహస్తిరథప్రదానవిధి

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి హేమహస్తిరథం శుభమ్ ।
యస్య ప్రదానాత్ భువనం వైష్ణవం యాతి మానవః ॥ 1 ॥

ఇప్పుడిక శుభప్రదమైన హేమహస్తిరథదానాన్ని గురించి వివరిస్తాను. ఈ దానం చేసిన మానవుడు విష్ణులోకాన్ని పొందుతాడు.

పుణ్యాం తిథిమథాసాద్య తులాపురుషదానవత్ ।
విప్రవాచనకం కుర్యాల్లోకేశావాహనం బుధః ।
ఋత్విఙ్మణ్డపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ॥2॥

అత్రాప్యుపోషితస్తద్వద్ బ్రాహ్మణైః సహ భోజనమ్ ।
కుర్యాత్ పుష్పరథాకారం కాంచనం మణిమండితమ్ ॥ 3 ॥

వల్లభీభిర్విచిత్రాభిశ్చతుశ్చక్రసమన్వితమ్ ।
కృష్ణాజినే తిలద్రోణం కృత్వా సంస్థాపయేద్రథమ్ ॥ 4 ॥

లోకపాలాష్టకోపేతం బ్రహ్మార్కశివసంయుతమ్ ।
మధ్యే నారాయణోపేతం లక్ష్మీపుష్టిసమన్వితమ్ ॥ 5 ॥

మంగళప్రదమైన తిథిని ఎంచుకుని తులాపురుష దానమునందు వలె ద్విజోత్తములచేత పుణ్యాహవాచనమును కావించి లోకపాలకులను ఆహ్వానించాలి. బుద్ధిమంతుడైన యజమానుడు ఋత్విజులను, మండపము, ఇతర సంభారములు, ఆభూషణాచ్ఛాదికములన్నింటిని ముందుగానే సమకూర్చుకోవాలి. పూర్వపు దానములందు ఆచరించినట్లే ఇక్కడ ఉపవాసమాచరించి తదనంతరము బ్రాహ్మణులతో కూడ భోజనం చేయాలి. తర్వాత పుష్పరథాకారమగు బంగారు రథం చేయించాలి. మణులచేత అలంకరింపబడిన ఆకర్షించునట్టి వల్లభులను, నాలుగు చక్రములను కూడ రథమునకు అమర్చాలి. కృష్ణాజినమును పరిచి తిలద్రోణము కూడ దానిపై నుంచి, తదుపరి ఆ రథమును స్థాపించాలి. అష్టదిక్పాలకులను, బ్రహ్మ, రుద్రుడు మరియు సూర్యుని కూడ ఆహ్వానించి వారి మధ్యలో పుష్టిగా ఉండునట్టి లక్ష్మీనారాయణులను స్థాపించాలి.

తథాఽష్టాదశ ధాన్యాని భాజనాసనచందనైః ।
దీపకోపానహచ్ఛత్రదర్పణం పాదుకాన్వితమ్ ॥ 6 ॥

ధ్వజే తు గరుడం కుర్యాత్కూబరాగ్రే వినాయకమ్ ।
నానాఫల సమాయుక్తముపరిష్టాద్వితానకమ్ ॥ 7 ॥

అట్లే అష్టాదశ ధాన్యములు, పాత్రలు, ఆసనములు, చందనము, దీపకము, పాదరక్షలు, ఛత్రము, దర్పణము, పాదుకలు మొదలగు వాటిని సిద్ధముగా నుంచుకోవాలి. ధ్వజమునందు గరుడుని స్థాపించవలెను. కూబరపుకొన యందు వినాయకుడిని ఉంచాలి. నానావిధఫలములు సమకూర్చుకొని వితానకమును కూడ సిద్ధముగా ఉంచుకోవాలి.

కౌశేయం పంచవర్ణం తు అమ్లాన కుసుమాన్వితమ్ ।
చతుర్భిః కలశైస్సార్ధం గోభిరష్టాభిరన్వితమ్ ॥ 8 ॥

చతుర్భిర్హేమమాతంగైర్ముక్తాదామవిభూషితైః ।
స్వరూపతః కరిభ్యాం చ యుక్తం కృత్వా నివేదయేత్ ॥ 9 ॥

కుర్యాత్పంచపలాదూర్ధ్వమాభారాదపి శక్తితః ।
తథా మంగలశబ్దేన స్నాపితో వేదపుంగవైః ॥ 10 ॥

త్రిః ప్రదక్షిణమావృత్య గృహీతకుసుమాంజలిః ।
ఇమముచ్చారయేన్మంత్రం బ్రాహ్మణేభ్యో నివేదయేత్ ॥ 11 ॥

పంచవర్ణములు కలిగిన పట్టు వస్త్రములు, శుద్ధమైన స్వచ్ఛని పూలు, నాలుగు కలశములు మరియు ఎనిమిది ఆవులను కూడ ఏర్పర్చుకోవాలి. తర్వాత ముత్యముల దండల చేత అలంకరింపబడిన నాలుగు బంగారపు ఏనుగులను రెండు నిజమైన ఏనుగులతో కలిపి దానమీయాలి. ఐదు పలములకన్నా అధికమైన తూకముగల బంగారముతో రథము ఏనుగులు చేయించాలి. తదనంతరము మంగళ వాయిద్యములతో వేదపుంగవుల చేత యజమానుడు స్నానమునాచరించాలి. తర్వాత దోసిలిలోనికి పూవులు తీసుకొని మూడు మార్లు ప్రదక్షిణము చేసి ఈ క్రింది మంత్రమునుచ్చరిస్తూ బ్రాహ్మణులకు దానం చేయాలి.

నమో నమః శంకరపద్మజార్కలోకేశవిద్యాధరవాసుదేవైః ।
త్వం సేవ్యసే వేదపురాణయజ్ఞైః తేజోమయస్పందన పాహి తస్మాత్ ॥ 12 ॥

యత్తత్పదం పరమగుహ్యతమం మురారేః ఆనందహేతుగుణరూపవిముక్తమన్తః ।
యోగైకమానసదృశో మునయః సమాధౌ పశ్యంతి తత్త్వమసి నాథ రథాధిరూఢః ॥ 13 ॥

యస్మాత్త్వమేవ భవసాగరసంప్లుతానామ్ ఆనందభాగమృతమధ్వగపారపత్రమ్ ।
తస్మాదఘౌఘశమనేన కురు ప్రసాదం చామీకరేభరథ మాధవ సంప్రదానాత్ ॥ 14 ॥

తేజోమయమైన రథమా! నీకు నమస్సులు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, సూర్యుడు, అష్టదిక్పాలకులు, విద్యాధరులు వేద పురాణ యజ్ఞాదులతో నీవు సేవింపబడుచున్నావు. కావున మమ్ము రక్షింపుము. అత్యంత రహస్యమైనటువంటి, పరమానందమునకు హేతువైనట్టి, గుణరూపరహితమైనట్టి విష్ణు పదమును యోగైకమానసులైన మునులు సమాధి ద్వారా తెలుసుకొందురు. అట్టి శ్రీ మహావిష్ణువు అధిరోహించిన రథమువు నీవు. కావున ఓ రథమా! మమ్ము రక్షింపుము భవసాగరమునందు మునిగిపోవుచున్న మానవులకు ఆనందకరమైన

అమృత మార్గమును చూపుదానవు కావున మా పాపములన్నింటిని శాంతింపజేసి మమ్ము అనుగ్రహింపుము. ఓ మాధవా! హస్తి రథ దానమును అంగీకరించి మమ్ము రక్షింపుము.

ఇత్థం ప్రణమ్య కనకేభరథ ప్రదానం యః కారయేత్సకల పాప విముక్తదేహః ।
విద్యాధరామరమునీంద్ర గణాభిజుష్టం ప్రాప్నోత్యసౌ పదమతీంద్రియ మిందుమౌలేః ॥ 15 ॥

ఇట్టి మంత్రమునుచ్చరిస్తూ భక్తి పూర్వకంగా నమస్కరించి హిరణ్య హస్తి రథమును ఎవరైతే దానము చేయుదురో వారు సకల పాపములనుండి విముక్తులై విద్యాధరులు, దేవతలు, మునీంద్రులు మొదలగు వారందరు, పొందునట్టి పరమోన్నతమైన శివసాన్నిధ్యమును పొందుతారు.

కృతదురితవితానప్రజ్వలద్వహ్నిజాలవ్యతికరకృతదేహోద్వేగభాజోఽపి బంధూన్ ।
నయతి స పితృపుత్రాన్ బాంధవానప్యశేషాన్ కృతగజరథదానాచ్ఛాశ్వతం సద్మ విష్ణోః ॥ 16 ॥

తాము చేసిన పాపముల చేత మండిపోవుచున్న దేహములు గల బంధువులను, పితరులను, పుత్రులను ఇతర బంధువులందరిని కూడ తాను చేసిన హిరణ్యహస్తిరథదానముతో శాశ్వతమైన విష్ణుపదమును పొందింప జేయును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే హేమహస్తిరథప్రదానవిధిర్నామ
ద్వ్యశీత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥282॥

శ్రీ మత్స్య మహాపురాణమున మహాదానానుకీర్తనలో హేమహస్తిరథప్రదానవిధిఅనే
రెండువందల ఎనభైరెండవ అధ్యాయం సమాప్తం



త్ర్యశీత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఎనభైమూడవ అధ్యాయం

పంచలాంగలకప్రదానవిధిః - పంచలాంగలకప్రదానవిధి

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
పంచలాంగలకం నామ మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

తదనంతరము ఇపుడు అత్యుత్తమమైన మహాపాతకనాశనమైన పంచలాంగలక దాన విధానాన్ని వివరిస్తాను.

పుణ్యాం తిథిమథాసాద్య యుగాదిగ్రహణాదికమ్ ।
భూమిదానం నరో దద్యాత్పంచలాంగలకాన్వితమ్ ॥ 2 ॥

పవిత్రమైన తిథిని నిర్ణయించుకుని లేదా ఉగాది పర్వదివసమున చంద్రసూర్యాదిగ్రహణ సమయమున కాని పంచలాంగలకముతో కూడిన భూదానం చేయాలి.

ఖర్వటం ఖేటకం వాఽపి గ్రామం వా సస్యశాలినమ్ ।
నివర్తనశతం వాఽపి తదర్ధం వాఽపి శక్తితః ॥ 3 ॥

దానము చేయుటకు నిశ్చయించిన భూమి పంటలతో సస్యమైనదై ఉండాలి. అది ఖర్వటము=కొండల సమాపమున నున్న గ్రామము, ఖేటకము=చిన్న పల్లెటూరు, మరియు నూరు నివర్తనములు (ఒక నివర్తనము అనగా 576 అంగుళములని కోశ గ్రంథాలు సూచిస్తున్నవి) లేదా దానిలో సగభాగము కలిగిన భూమి కాని శక్తి ననుసరించి కాని దానము చేయు భూమి ఉండవచ్చును.

సారదారుమయాన్ కృత్వా హలాన్ పంచవిచక్షణః ।
సర్వోపకరణైర్యుక్తాన్ అన్యాన్ పంచ చ కాంచనాన్
కుర్యాత్పంచ పలాదూర్ధ్వమాసహస్రపలావధి ॥ 4 ॥

వృషాన్ లక్షణసంయుక్తాన్ దశ చైవ దురంధరాన్ ।
సువర్ణ శృంగాభరణాన్ ముక్తాలాంగూల భూషణాన్ ॥ 5 ॥

రూప్యపాదాగ్రతిలకాన్ రక్తకౌశేయభూషణాన్ ।
స్రగ్దామచందనయుతాన్ శాలాయామధివాసయేత్ ॥ 6 ॥

విచక్షణుడైన దాత దృఢమైన దారువుతో నాగళ్ళను మరియు వాటికి కావలసిన ఉపకరణములన్నింటిని సిద్ధము చేసికొని అట్లే ఐదు పలములకంటే అధికముగా వేయిపలముల కంటే తక్కువ గల తూకపు బంగారముతో ఐదు నాగలి ప్రతిమలను చేయించవలెను.అంతేకాక దారువులతో చేసిన నాగళ్ళకొరకై మంచి లక్షణములు కలిగిన, బలిష్ఠములైన పది ఎద్దులను కూడ బంగారు కొమ్ములతో, ఆభరణములతో, ముత్యాలహారములతో, వెండి గిట్టలతో, చందనాది ద్రవ్యములతో అలంకరించి వాటిని శాల యందుంచి అధివాసనం చేయాలి.

ధరణ్యాదిత్యరుద్రేభ్యః పాయసం నిర్వపేచ్చరుమ్ ।
ఏకస్మిన్నేవ కుండే తు గురుస్తేభ్యో నివేదయేత్ ॥ 7 ॥

పలాశసమిధ స్తద్వదాజ్యం కృష్ణతిలాస్తథా ।
తులాపురుషవత్కుర్యాల్లోకేశావాహనం బుధః ॥ 8 ॥

పృథివికి, ఆదిత్యులకు, రుద్రులకు ఒకే కుండము నందు చరువుతో పాయసము చేసి గురువు నివేదించాలి. పలాశసమిధలను, ఆజ్యమును, నల్ల నూవులు కూడా సిద్ధము చేసికొని తులాపురుష దానమునందు వలె లోకాశావాహనం మొదలగు వాటిని చేయాలి.

తతో మంగలశబ్దేన శుక్లమాల్యాంబరో బుధః ।
ఆహూయ ద్విజదాంపత్యం హేమసూత్రాంగులీయకైః ॥ 9 ॥

కౌశేయవస్త్రకటకైర్మణిభిశ్చాభిపూజయేత్ ।
శయ్యాం సోపస్కరాం దద్యాద్ధేనుమేకాం పయస్వినీమ్ ॥ 10 ॥

తథాஉష్టాదశ ధాన్యాని సమన్తాదధివాసయేత్ ।
తతః ప్రదక్షిణీకృత్య గృహీతకుసుమాంజలిః ॥ 11 ॥

ఇమముచ్చారయేన్మంత్రమథ సర్వం నివేదయేత్ ।

తదనన్తరము మంగళవాద్యములు, ద్విజుల వేదపఠనములతో స్నానమాచరించి బుద్ధిమంతుడైన యజమాని తెల్లని వస్త్రములు ధరించి ద్విజదంపతులను ఆహ్వానించి బంగారు గొలుసులతో, ఉంగరములతో, పట్టు వస్త్రములతో గూడిన శయ్యను మరియు పయస్విని అయిన పాడియావుని వారికి దానం చేయాలి. అట్లే అష్టాదశధాన్యములను అంతటా అధివాసం చేసి, దోసిలిలో పువ్వులు తీసుకొని, ప్రదక్షిణము చేసి ఈ క్రింది మంత్రముచ్చరిస్తూ సర్వమునూ వారికి నివేదించాలి.

యస్మాద్దేవగణాః సర్వే స్థావరాణి చరాణి చ ॥ 12 ॥

ధురంధరాంగే తిష్ఠంతి తస్మాద్భక్తిశ్శివేஉస్తు మే ।
యస్మాచ్చ భూమిదానస్య కలాం నార్హంతి షోడశీమ్ ॥ 13 ॥

దానాన్యన్యాని మే భక్తిర్ధర్మ ఏవ దృఢా భవేత్ ।

"సర్వదేవగణములు, స్థావరజంగమములన్నియును ధురంధరమైన నాగలి యందుండును. కావున అట్టివాని దయతో నాకు పరమశివుని యందు భక్తి కలుగుగాక! ఇంకనూ ఇతర దానము లేవియునూ భూమిదానములో పదహారవవంతునకు కూడా సరిపోవు కావున ఆ దానమహత్త్వమువలన నాకు ధర్మమునందు దృఢమైన భక్తి కలుగుగాక!

దండేన సప్తహస్తేన త్రింశద్దండం నివర్తనమ్ ॥ 14 ॥

త్రిభాగహీనం గోచర్మమానమాహ ప్రజాపతిః ।
మానేనానేన యో దద్యాన్నివర్తనశతం బుధః ।
విధినానేన తస్యాశు క్షీయతే పాపసంహతిః ॥ 15 ॥

తదర్ధమథవా దద్యాదపి గోచర్మమాత్రకమ్ ।
భవనస్థానమాత్రం వా సోఽపి పాపైః ప్రముచ్యతే ॥ 16 ॥

ఏడు మూరల పొడవు ఒక దండము, ముప్పది దండముల చదరపు భూమి ఒక నివర్తము,దానినుండి మూడవ వంతు తగ్గినచో గోచర్మపరిమాణమందురని స్వయముగా ప్రజాపతి చెప్పాడు. ఈ ప్రమాణముననుసరించి నూరు నివర్తనములు గల భూమిని బుద్ధిమంతుడైన దాత దానం చేయాలి. ఇచ్చట వివరించిన విధానము ననుసరించి దానం చేయువాని పాపాలన్నీ శీఘ్రంగా నశించిపోతాయి. లేదా శక్తిననుసరించి ఏబది నివర్తనములో గోచర్మమాత్రమో లేదా భవనమునకు సరిపోవు మాత్రమైన భూమిని దానము చేసినను దాత పాపవిముక్తుడౌతాడు.

యావన్తి లాంగలకమార్గముఖాని భూమేః భాసాం పతేర్దుహితురంగజరోమకాణి ।
తావంతి శంకరపురే స సమా హి తిష్ఠేత్ భూమిప్రదానమిహ యః కురుతే మనుష్యః ॥ 17 ॥

ఈ విధముగా భూదానము చేసిన మానవుడు ఆ భూమియందు ఎన్ని నాగలి చాళ్ళు ఏర్పడునో మరియు దానము చేసిన పాడియావు శరీరమునందెన్ని రోమములుండునో అన్ని సంవత్సరములు పరమశివుని పురమైన కైలాసమున నివసించును.

గంధర్వకిన్నరసురాసురసిద్ధసంఘైః ఆధూతచామరముపేత్య మహద్విమానమ్
సంపూజ్యతే పితృపితామహబంధుయుక్తః శంభోః పదం వ్రజతి చామరనాయకః సన్ ॥ 18 ॥

గంధర్వులు, కిన్నరులు, సురులు, అసురులు, సిద్ధులు మొదలగు వారందరు చామరములతో వీచుచుండగా పితృపితామహ బంధుజనయుక్తుడై దివ్యమైన విమానము నధిరోహించి పరమశివపదమును పొంది అమరనాయకుడై సుఖంగా జీవిస్తాడు.

ఇంద్రత్వమప్యధిగతం క్షయమభ్యుపైతి గోభూమిలాంగలధురంధరసంప్రదానాత్ ।
తస్మాదఘౌఘపటలక్షయకారిభూమేః దానం విధేయమితి భూతిభవోద్భవాయ ॥ 19 ॥

గోవును, భూమిని, నాగళ్ళను మరియు వాటిని లాగునట్టి దృఢమైన ఎద్దులను దానము చేయుట వలన కలిగిన పుణ్యముతో పోల్చినపుడు యజ్ఞయాగాది కర్మలాచరించి పొందిన ఇంద్రపదము కూడా నశించిపోవునదే అగును. కాని ఈ దానము సమస్త పాపరాశిని క్షయింపజేయును కావున అభ్యుదయము పొందగోరువాడు ఇట్టి భూదానమును తప్పనిసరిగా చేయాలి.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే పంచలాంగలకప్రదానవిధిర్నామ త్ర్యశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥283॥

శ్రీ మత్స్యమహాపురాణమున మహాదానానుకీర్తనలో పంచలాంగలకప్రదానవిధి అనే రెండువందల ఎనబైమూడవ అధ్యాయం సమాప్తం.

చతురశీత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనభైనాల్గవ అధ్యాయం

మహాదానానుకీర్తనే హేమపృథివీదానమాహాత్మ్యమ్

మహాదానానుకీర్తనలో హేమపృథివీదానమాహాత్మ్యం

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి ధరాదానమనుత్తమమ్ ।
పాపక్షయకరం నృణాం అమంగళ్యవినాశనమ్ ॥ 1 ॥

తదనంతరమిపుడు అత్యుత్తమమైన ధరాదానమును గురించి తెలిపెదను. మానవులకి పాపక్షయకరమైనట్టిది అమంగళములను నశింపజేయునది.

కారయేత్ పృథివీం హైమీం జంబూద్వీపానుకారిణీమ్ ।
మర్యాదాపర్వతవతీం మధ్యే మేరుసమన్వితామ్ ॥ 2 ॥

లోకపాలాష్టకోపేతాం నవవర్షసమన్వితామ్ ।
నదీనదసమోపేతాం సప్తసాగరవేష్టితామ్ ॥ 3 ॥

మహారత్నసమాకీర్ణాం వసురుద్రార్కసంయుతామ్ ।
హేమ్నః పలసహస్రేణ తదర్ధేనాథ శక్తితః ॥ 4 ॥

శతత్రయేణ వా కుర్యాద్ద్విశతేన శతేన వా ।
కుర్యాత్పంచపలాదూర్ధ్వమశక్తోఽపి విచక్షణః ॥ 5 ॥

ముందుగా జంబూద్వీపమును అనుకరించి ఉండునట్లు పృథివీప్రతిమను బంగారముతో చేయాలి. దానియందు మర్యాదాపర్వతములను మధ్యలో మేరు పర్వతమును, అష్టలోకపాలకులను, నవవర్షములను, నదీనదములను, సప్తసముద్రములు హద్దుగా కలిగి ఉన్నట్టుగానూ చేయించుకోవాలి. ఇంకనూ మహారత్నములతో పరివ్యాప్తమైనట్టిదై వసురుద్ర – ఆదిత్యులతో కూడియున్నట్లుగానూ ఆ పృథివీప్రతిమ ఉండాలి. వేయి పలముల బంగారముతో గాని, ఐదువందల లేదా శక్తిననుసరించి, మూడు, రెండు లేదా ఒక వందపలములతో పృథివీప్రతిమను చేయించాలి. ఒక వందపలములతో పృథివీ ప్రతిమను చేయించాలి. విచక్షణుడైన దాత తనశక్తికి మించినది అనుకున్ననూ ఐదుపలముల తూకముకన్న అధికముగా ఉండునట్లు చూసుకోవాలి.

తులాపురుషవత్కుర్యాత్ లోకేశావాహనం బుధః ।
ఋత్విఙ్మండపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ॥ 6 ॥

తులాపురుషదానసందర్భమున చేసినట్లే బుద్ధిమంతుడైన దాత లోకేశావాహనము చేసి ఋత్విజులు, మండపములు, సంభారములు, ఆభూషణములు, ఆచ్ఛాదనము మొదలగు వాటినన్నింటిని సిద్ధము చేసికోవలసినది.

వేద్యాం కృష్ణాజినం కృత్వా తిలానాముపరి న్యసేత్ ।
తథాష్టాదశ ధాన్యాని రసాంశ్చ లవణాదికాన్ ॥ 7 ॥

తథాఽష్టౌ పూర్ణకలశాన్ సమన్తాత్పరికల్పయేత్ ।
వితానకం చ కౌశేయం ఫలాని వివిధాని చ ॥ 8 ॥

తథాఽంశుకాని రమ్యాణి శ్రీఖండశకలాని చ ।
ఇత్యేవం కారయిత్వా తామధివాసనపూర్వకమ్ ॥ 9 ॥

శుక్లమాల్యాంబరధరః శుక్లాభరణభూషితః ।
ప్రదక్షిణం తతః కృత్వా గృహీతకుసుమాంజలిః ॥ 10 ॥

పుణ్యం కాలమథాసాద్య మంత్రానేతానుదీరయేత్ ।

వేదికయందు కృషాజినమును పరిచి దానిపై నువ్వులుంచాలి. తర్వాత అష్టాదశధాన్యములు, లవణాది రసద్రవ్యాలు, ఎనిమిది పూర్ణకలశాలను కూడ సిద్ధం చేసుకోవాలి. అట్లే పట్టు వస్త్రపు వితానకము, వివిధ ఫలములు, రమ్యములైన సాధారణ వస్త్రములు, శ్రీఖండపుముక్కలను కూడా ఉంచాలి. వీటన్నింటిని అమర్చిన పిదప పృథివీప్రతిమకు అధివాసం జరిపి, తెల్లని వస్త్రములను మరియు తెల్లని పూమాలలను కూడా ధరించి, శుక్లాభరణభూషితుడైన యజమానుడు దోసిలిలో పూవులు తీసుకుని ప్రదక్షిణ చేసి, పవిత్రమైన సమయమును చూసుకొని ఈ క్రింది మంత్రాలను జరిపించాలి.

నమస్తే సర్వదేవానాం త్వమేవ భవనం యతః ॥ 11॥

ధాత్రీ చ సర్వభూతానామతః పాహి వసున్ధరే ।
వసు ధారయసే యస్మాద్వసు చాతీవ నిర్మలమ్ ॥ 12 ॥

వసున్ధరా తతో జాతా తస్మాత్పాహి భయాదలమ్ ।
చతుర్ముఖోఽపి నో గచ్ఛేద్యస్మాదన్తం తవాచలే ॥ 13 ॥

అమ్మా! సర్వదేవులకు భవనమువు నీవే, సర్వభూతములకు ధాత్రివి నీవే, కావున ఓ వసుంధరా! మమ్ము రక్షింపుము. వసువును అనగా ధనమును అందునూ నిర్మలమైన వసువును నీవు ధరింతువు గావున నీవు 'వసుంధర' అని పేరుతో ప్రసిద్ధి పొందితివి. కావున మమ్ము అన్ని విధముల భయముల నుండి రక్షింపుము. ఓ అచలా! చతుర్ముఖుడు కూడా నీ అంతమును చేరుకోలేడు కదా!

అనంతాయై నమస్తస్మాత్పాహి సంసారకర్దమాత్ ।
త్వమేవ లక్ష్మీర్గోవిందే శివే గౌరీతి సంస్థితా ॥ 14 ॥

గాయత్రీ బ్రహ్మణః పార్శ్వే జ్యోత్స్నా చంద్రే రవౌ ప్రభా ।
బుద్ధిర్బృహస్పతౌ ఖ్యాతా మేధా మునిషు సంస్థితా ॥ 15 ॥

విశ్వం వ్యాప్య స్థితా యస్మాత్తతో విశ్వమ్భరా స్మృతా ।
ధృతిః స్థితిః క్షమా క్షోణీ పృథ్వీ వసుమతీ రసా ॥ 16 ॥

ఏతాభిర్మూర్తిభిః పాహి దేవి! సంసారసాగరాత్ ।

అందులకే నీకు 'అనంత' యను పేరు వచ్చినది, ఓ దేవా అనంతా! నీకు నమస్సులు, మమ్ము ఈ సంసారమనే బురద నుండి రక్షింపుము. గోవిందుని వద్దనున్న లక్ష్మివి, శివుని వద్ద నున్న గౌరివి, బ్రహ్మదేవుని వద్ద నున్న గాయత్రివి, చంద్రుని వెన్నెలవు, సూర్యుని కాంతివి, బృహస్పతియందలి బుద్ధివి, మునులందరి మేధస్సువూ నీవే, విశ్వమంతయూ ఈ విధముగా వ్యాపించి ఉన్నావు. కావున నీవు విశ్వంభరవు అయినావు. ధృతి, స్థితి, క్షమా, క్షోణి, పృథ్వీ, వసుమతి, రస అను అనేక మూర్తులతో నున్న ఓ దేవీ! మమ్ము ఈ సంసారసాగరము నుండి రక్షింపుము.

ఏవముచ్చార్య తాం దేవీం బ్రాహ్మణేభ్యో నివేదయేత్ ॥ 17 ॥

ధరార్ధం వా చతుర్భాగం గురవే ప్రతిపాదయేత్ ।
శేషం చైవాథ ఋత్విగ్భ్యః ప్రణిపత్య విసర్జయేత్ ॥ 18 ॥

ఇట్లుచ్చరించి ఆ దేవిని బ్రాహ్మణులకు ఈయాలి. అందులో సగమో నాల్గవవంతో గురువునకిచ్చి మిగిలిన భాగములను ఋత్విజులకు ఇచ్చి వినయముతో నమస్కరించాలి.

అనేన విధినా యస్తు దద్యా ద్ధేమధరాం శుభామ్ ।
పుణ్యకాలే తు సంప్రాప్తే స పదం యాతి వైష్ణవమ్ ॥ 19 ॥

విమానేనార్కవర్ణేన కింకిణీజాలమాలినా ।
నారాయణపురం గత్వా కల్పత్రయమథావసేత్ ।
పితౄన్ పుత్రాంశ్చ పౌత్రాంశ్చ తారయేదేకవింశతిమ్ ॥ 20 ॥

ఈ విధానముననుసరించి పుణ్యకాలము వచ్చినపుడు శుభప్రదాయినియైన సువర్ణ పృథివిని దానం చేసినవాడు విష్ణుపదమును పొందుతాడు. తర్వాత మువ్వల మాలలతో అలంకరింపబడిన సూర్యుని కాంతివంటి కాంతిగలిగిన రథముయొక్క నారాయణపురమునకు వెళ్ళి కల్పత్రయకాలపర్యంతం అక్కడే నివసించును, పితృపుత్రపౌత్రాదులను మరియు తమ వంశమునకు చెందిన ఇరువదియొక్క తరములవారిని తరింపజేయును.

ఇతి పఠతి య ఇత్థం యః శృణోతి ప్రసంగా
దపి కలుషవితానైర్ముక్తదేహః సమన్తాత్ ।

దివమమరవధూభిర్యాతి సంప్రార్థ్యమానో
పదమమరసహస్రైః సేవితం చంద్రమౌళేః ॥ 21 ॥

ఇట్టిది చదివినవారు ప్రసంగవశమున వినినవారు కూడా సంపూర్ణముగా తమ పాపములు నుండి విముక్తులై అమరవధువులచే సేవింపబడుచున్నవారై స్వర్గలోకమునకు వెళ్ళి అటు తర్వాత వేలాది దేవతలచే సేవితమైన చంద్రమౌళీశ్వరపదమును పొందుతారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే హేమపృథివీదానమాహాత్మ్యం నామ
చతురశీత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥283॥

శ్రీ మత్స్యమహాపురాణమున మహాదానానుకీర్తనలో హేమపృథివీదానమాహాత్మ్యమనే
రెండువందల ఎనభైనాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచాశీత్యధిక ద్విశతతమోఽధ్యాయః – రెండువందల ఎనభైఅయిదవ అధ్యాయం

మహాదానానుకీర్తనే విశ్వచక్రమహాదానవిధిః – మహాదానానుకీర్తనలో విశ్వచక్రమహాదానవిధి

శ్రీ మత్స్య ఉవాచ – శ్రీ మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
విశ్వచక్రమితి ఖ్యాతం మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

ఇప్పుడు మహాపాతకనాశినియగు, ఉత్తమోత్తమమైనదియగు ప్రసిద్ధమైన విశ్వచక్రమహాదానమును గురించి తెలుపుతాను.

తపనీయస్య శుద్ధస్య విషువాదిషు కారయేత్ ।
శ్రేష్ఠం పలసహస్రేణ తదర్ధేన తు మధ్యమమ్ ॥ 2 ॥

తస్యార్ధేన కనిష్ఠం స్యాద్విశ్వచక్రముదాహృతమ్ ।
అన్యద్వింశపలాదూర్ధ్వమశక్తోఽపి నివేదయేత్ ॥ 3 ॥

విషువాది పుణ్యదివసములందు సువర్ణంతో విశ్వచక్రాన్ని చేయించాలి. సహస్రపలముల తూకపు బంగారంతో చేయించినచో శ్రేష్ఠమని, ఐదువందల పలములతో చేసినచో మధ్యమమని, దానిలో సగము అనగా 250 పలములతో చేసినచో కనిష్ఠమందురని విశ్వచక్రము గురించి ప్రాచీనులు చెప్పారు. అంతగా శక్తిలేని వారెవరైనా ఉన్నచో ఇరువదిపలముల తూకముతోనైనను విశ్వచక్రాన్ని చేయించి దానమీయాలి.

షోడశారం తతశ్చక్రం భ్రమన్నేమ్యష్టకావృతమ్ ।
నాభిపద్మే స్థితం విష్ణుం యోగారూఢం చతుర్భుజమ్ ॥ 4 ॥

శంఖచక్రేఽస్య పార్శ్వే తు దేవ్యష్టకసమావృతమ్ ।
ద్వితీయావరణే తద్వత్ పూర్వతో జలశాయినమ్ ॥ 5 ॥

అత్రిర్భృగుర్వసిష్ఠశ్చ బ్రహ్మా కశ్యప ఏవ చ ।
మత్స్యః కూర్మో వరాహశ్చ నరసింహోఽథ వామనః ॥ 6 ॥

రామో రామశ్చ కృష్ణశ్చ బుద్ధః కల్కీతి చ క్రమాత్ ।

తర్వాత ఆ చక్రమును పదహారు అరలతో ఎనిమిది ఆవరణములతో యంత్రరూపమున చేయించాలి. ఆ చక్రపునాభి యందు యోగారూఢుడు, చతుర్భుజుడూ అయిన శ్రీమహావిష్ణువును చేయించాలి. ఈతని పార్శ్వములందు శంఖచక్రముల తర్వాత ఎనిమిది అరలయందు అష్టలక్ష్మీప్రతిమలుండాలి. మిగిలిన ఎనిమిది అరలయందు వివిధములైన భూషణముల ఆవృతులుండాలి. ఇక ద్వితీయావరణమున జలశయనుని, తదనంతరము అత్రి,

భృగు వసిష్ఠ బ్రహ్మ కశ్యపులను, మత్స్య కూర్మ వరాహ నరసింహ వామన రామ రామకృష్ణ బుద్ధ కల్కి అను పదిమందిని మొత్తము కలిపి పదహారుమందిని క్రమంగా కల్పించాలి.

తృతీయావరణే గౌరీ మాతృభిర్వసుభిర్యుతా ॥ 7 ॥

చతుర్థే ద్వాదశాదిత్యా వేదాశ్చత్వార ఏవ చ ।
పంచమే పంచభూతాని రుద్రాశ్చైకాదశైవ తు ॥ 8 ॥

లోకపాలాష్టకం షష్ఠే దిఙ్మాతంగస్తథైవ చ ।
సప్తమేఽస్త్రాణి సర్వాణి మంగలాని చ కారయేత్ ॥ 9 ॥

అన్తరాన్తరతో దేవాన్ విన్యసేదష్టమే పునః ।
తులాపురుషవచ్ఛేషం సమన్తాత్పరికల్పయేత్ ॥ 10 ॥

తృతీయావరణమునందు మాతృకలు మరియు వసువులతో గూడిన గౌరి ఉండాలి. చతుర్థావరణమున ద్వాదశాదిత్యులు నాలుగు వేదాలుండాలి. పంచమావరణమున పంచమహాభూతములు, ఏకాదశరుద్రులు, షష్ఠావరణమున అష్టదిక్పాలకుల అష్టదిగ్గజములు, సప్తమావరణమున మంగళకరములైన సర్వవిధ అస్త్రములుండాలి. అష్టమావరణమున అంతరాంతరములందు దేవతలను స్థాపించాలి. మిగిలినవన్నియు తులాపురుషదానమందువలే కల్పించుకోవాలి.

ఋత్విఙ్మణ్డపసంభార భూషణాచ్ఛాదనాదికమ్ ।
విశ్వచక్రం తతః కుర్వాత్ కృష్ణాజినతిలోపరి ॥ 11 ॥

తథాఽష్టాదశ ధాన్యాని రసాంశ్చ లవణాదికాన్ ।
పూర్ణకుంభాష్టకం చైవ వస్త్రాణి వివిధాని చ ॥ 12 ॥

మాల్యేక్షుఫలరత్నాని వితానం చాపి కారయేత్ ।
తతో మంగలశబ్దేన స్నాతః శుక్లాంబరో గృహీ ॥
హోమాధివాసనాన్తే వై గృహీతకుసుమాంజలిః ॥ 13 ॥

ఇమముచ్చారయేన్మంత్రం త్రిః కృత్వా తు ప్రదక్షిణమ్ ।

ఋత్విజులు, మండపము, సంభారములు, ఆభూషణములు, ఆచ్ఛాదనాదులన్నింటిని సిద్ధముగా ఉంచుకోవాలి. తర్వాత వేదికపైన కృష్ణాజినము దానిపై తిలలుంచి వాటిపై విశ్వచక్రమునుంచాలి. ఇంకనూ అష్టాదశ ధాన్యములు, లవణాదిరసములను, ఎనిమిది పూర్ణకలశములను, వివిధ వస్త్రములను, పుష్పమాలలు, చెరకుగడలు, ఫలములు, రత్నములు మరియు వితానమును కూడ అక్కడ ఉంచాలి. తర్వాత మంగళవాయిద్యములతో ద్విజులు వేదోచ్చారణమధ్యమున యజమానుడు స్నానమాచరించినవాడై తెల్లని వస్త్రములను ధరించి హోమము మరియు అధివాసనము కూడ అయిన పిదప దోసిలిలో పూలు తీసుకుని మూడు మార్లు ప్రదక్షిణ చేయుచు ఈ క్రింది మంత్రమునుచ్చరించాలి.

నమోః విశ్వమయాయేతి విశ్వచక్రాత్మనే నమః ॥ 14 ॥

పరమానందరూపీ త్వం పాహి నః పాపకర్దమాత్ ।
తేజోమయమిదం యస్మాత్ సదా పశ్యన్తి యోగినః ॥ 15 ॥

హృది తత్త్వం గుణాతీతం విశ్వచక్రం నమామ్యహమ్ ।
వాసుదేవే స్థితం చక్రం చక్రమధ్యే తు మాధవః ॥ 16 ॥

అన్యోన్యాధారరూపేణ ప్రణమామి స్థితావిహ ।
విశ్వచక్రమిదం యస్మాత్ సర్వపాపహరం పరమ్ ॥ 17 ॥

ఆయుధం చాపి వాసశ్చ భవాదుద్ధర మామతః ।

విశ్వమయుడవైన నీకు నమస్సులు, విశ్వచక్రాత్మకుడవగు నీకు నమస్సులు. పరమానందరూపుడవైన నీవు మమ్ము ఈ పాపపంకిలము నుండి కాపాడుము. యోగులు ఎల్లప్పుడు తమ హృదయమునందు తేజోమయమైనటువంటి త్రిగుణాతీతమైనటువంటి ఈ చక్రమునే దర్శింతురు కావున అట్టి విశ్వచక్రమును నేను నమస్కరిస్తున్నాను. వాసుదేవునియందు చక్రము, ఆ చక్రమధ్యమున మాధవుడు ఉంటారు. ఇట్లు అన్యోన్యాధారరూపముననున్న వారిద్దరికి నమస్కరిస్తున్నాను. ఈ విశ్వచక్రం సర్వపాపహరం, ఇది ఉత్కృష్టమైనది, శ్రీ మహావిష్ణువునకు ఆయుధము కావున ఓ విశ్వచక్రమా! మమ్ము ఈ భవసాగరము నుండి రక్షింపుము.

ఇత్యామన్త్ర్య చ యో దద్యాద్విశ్వచక్రం విమత్సరః ॥ 18 ॥

విముక్తః సర్వపాపేభ్యో విష్ణులోకే మహీయతే ।
వైకుంఠలోకమాసాద్య చతుర్బాహుః సనాతనః ॥ 19 ॥

సేవ్యతేఽప్సరసాం సంఘైః తిష్ఠేత్కల్పశతత్రయమ్ ।
ప్రణమేద్వాఽథ యః కృత్వా విశ్వచక్రం దినే దినే ॥
తస్యాయుర్వర్ధతే నిత్యం లక్ష్మీశ్చ విపులా భవేత్ ॥ 20 ॥

ఈ విధముగా ఆమంత్రించి, విమత్సరుడై ఎవరైతే విశ్వచక్రాన్ని దానం చేయునో అతడు సర్వపాపాల నుండి విముక్తుడై విష్ణులోకాన్ని పొందుతాడు. వైకుంఠలోకాన్ని చేరి చతుర్బాహుడు, సనాతనుడూ అయిన విష్ణుపదమును పొంది అప్సరసల చేత సేవింపబడినవాడై మూడు వందల కల్పముల కాలపర్యంతం కూడా నివసిస్తాడు. అంతేకాక విశ్వచక్రాన్ని ప్రతిదివసము నమస్కరించినవారికి నిత్యమూ ఆయుర్వృద్ధి కలుగుతుంది. విపులమైన లక్ష్మి ప్రాప్తిస్తుంది.

ఇతి సకలజగత్సురాధివాసం వితరతి యస్తపనీయషోడశారమ్ ।
హరిభవనముపాగతః స సిద్ధైః చిరమభిగమ్య నమస్యతే శిరోభిః ॥ 21 ॥

అసుదర్శనతాం ప్రయాతి శత్రోః మదనసుదర్శనతాం చ కామినీభ్యః ।
స సుదర్శనకేశవానురూపః కనకసుదర్శనదానదగ్ధపాపః ॥ 22 ॥

ఇట్లు సకలజగత్తులకు, దేవతలకు అధివాసమైనట్టి ప్రకాశించు పదహారు అరలు కలిగినట్టిదియు అగు సువర్ణమయ చక్రమును ఎవరు దానము చేయుదురో వారు శ్రీహరి భువనమును పొంది సిద్ధులచేత సవినయముగా సేవింపబడుతారు. ఇంకనూ సువర్ణ సుదర్శనచక్రదానముతో దగ్ధము చేయబడిన పాపములు కలవాడై సుదర్శన చక్రముతో నున్న కేశవుని అనురూపుడై (రూపమును పొంది) తన శత్రువులకు శుభదర్శనుడై స్త్రీలకు మన్మథుని వంటి రూపము కలవాడై కనిపిస్తాడు.

కృత గురుదురితాని షోడశారప్రవితరణే ప్రవరాకృతిర్మురారేః ।
అభిభవతి భవోద్భవన్తి భీత్యా భవమభితో భువనే భయాని భూయః ॥ 23 ॥

ఇట్లు దానము చేయబడినట్టి ఈ షోడశారవిశ్వచక్రమునందున్న మురారియొక్క ఉత్తమాకృతి మానవులచే చేయబడిన మహాపాపములను, భవసాగరము వలన కలుగు భయములను కూడా పారద్రోలి జన్మమరణముల ద్వారా కలుగు భయములన్నింటిని దూరము చేయును.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే విశ్వచక్రమహాదానవిధిర్నామ
పంచాశీత్యధిక ద్విశతతమో ఽధ్యాయః ॥285॥

శ్రీ మాత్స్య మహాపురాణమున మహాదానానుకీర్తనలో విశ్వచక్రమహాదానవిధి అనే
రెండువందల ఎనభైఅయిదవ అధ్యాయం సమాప్తం.



షడశీత్యధికద్విశతతమోऽధ్యాయః – రెండువందల ఎనబైఆరవ అధ్యాయం

మహాదానానుకీర్తనే కనకకల్పలతాప్రదానవిధిః –మహాదానానుకీర్తనలో కనకకల్పలతాప్రదాన విధి

మత్స్య ఉవాచ – మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
మహాకల్పలతా నామ మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

పుణ్యాం తిథిమథాసాద్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
ఋత్విఙ్మణ్డలసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ॥ 2 ॥

తులాపురుషవత్కుర్యాత్ లోకేశావాహనం బుధః ।

ఇప్పుడు మహాపాతనాశినియగు అత్యంతోత్తమమైన మహాకల్పలతా దానమును గురించి వివరిస్తాను. శుభప్రదమైన తిథిని ఎంచుకొని, బ్రాహ్మణులచేత పుణ్యాహవాచనాదికము చేయించి, ఋత్విజులు మండపము, సంభారములు, ఆభూషణములు, ఆచ్ఛాదనము మొదలగువాటిని సిద్ధముగానుంచుకొని బుద్ధిమంతుడైన దాత తులాపురుష దానవిధానము వలె లోకేశావాహనం ఇత్యాదులను నిర్వహించాలి.

చామీకరమయీః కుర్యాద్దశ కల్పలతాః సమాః ॥ 3 ॥

నానాపుష్పఫలోపేతా నానాంశుకవిభూషితాః ।
విద్యాధరసుపర్ణానాం మిథునైరుపశోభితాః ॥ 4 ॥

పుష్పాణ్యాదిత్సుభిః సిద్ధైః ఫలాని చ విహంగమైః ।
లోకపాలానుకారిణ్యః కర్తవ్యాస్తాసు దేవతాః ॥ 5 ॥

ముందుగా చామీకరము అనగా బంగారముతో సమానముగా ఉండునట్టి పది కల్పలతలను చేయించుకోవాలి. అవి నానావిధ పుష్పఫలసమన్వితములై నానావిధ వస్త్రములచే అలంకృతములై ఉండాలి. విద్యాధర గరుడాది దంపతుల కలయిక గలవై ఉండాలి. పుష్పములను తీసుకోగోరు సిద్ధుల చేత ఫలములను గ్రహించబోవు నానావిధపక్షుల చేత, లోకపాలకులను బోలిన దేవతాప్రతిమల చేత ఉపశోభితములై ఉండాలి.

బ్రాహ్మీమనంతశక్తిం చ లవణస్యోపరి న్యసేత్ ।
అధస్తాల్లతయోర్మధ్యే పద్మశంఖకరే శుభే ॥ 6 ॥

ఇభాసనస్థా తు గుడే పూర్వతః కులిశాయుధా ।
రజనీ సంస్థితాగ్నేయా స్రువపాణిరథానలే ॥ 7 ॥

యామ్యే చ మహిషారూఢా గదినీ తండులోపరి ।
ఘృతే తు నైరృతీ స్థాప్యా సఖడ్గా దక్షిణాపలే ॥ 8 ॥

తర్వాత లవణరాశి మీద బ్రాహ్మిని మరియు అనంతశక్తిని ఉంచాలి. రెండు లతలక్రింద భాగమున వారిద్దరి చేతుల్లో ఉండునట్లు పద్మము మరియు శంఖమునుంచాలి. గజాసనము పై తూర్పుదిక్కున బెల్లముపై వజ్రాయుధము ధరించిన ఇంద్రాణీ దేవతను, ఆగ్నేయమున స్రువము చేత ధరించి పసుపు పై కూర్చున్న అగ్నాయీ దేవతను, దక్షిణ దిశయందు బియ్యముపై మహిషమునధిరోహించిన గదినీదేవతయు, నైఋతీదిశయందు ఘృతమునందు దక్షిణ హస్తము ఖడ్గమున ధరించిన నైరృతీదేవతనూ స్థాపించాలి.

వారుణే వారుణీ క్షీరే ఝషస్థా నాగపాశినీ ।
పతాకినీ చ వాయవ్యే మృగస్థా శర్కరోపరి ॥ 9 ॥

సౌమ్యా తిలేషు సంస్థాప్యా శంఖినీ నిధిసంస్థితా ।
మహేశ్వర వృషారూఢా నవనీతే త్రిశూలినీ ॥ 10 ॥

పశ్చిమమున పాలయందు మత్స్యము పై కూర్చుని ఉన్న నాగపాశినియైన వారుణీదేవతను, వాయవ్యమున శర్కరయందు మృగావాహనియైన పతాకినీ దేవియు, ఉత్తరమున తిలలయందు నిధిపై కూర్చుండియున్న శంఖినీ దేవతయు, ఈశాన్యభాగమున నవనీతమునందు వృషారూఢియై త్రిశూలము ధరించిన మాహేశ్వరీ దేవిని స్థాపించాలి.

మౌలిన్యో వరదాస్తద్వత్ కర్తవ్యా బాలకాన్వితాః ।
శక్త్యా పంచపలాదూర్ధ్వమాసహస్రాత్ ప్రకల్పయేత్ ॥ 11 ॥

సర్వాసాముపరి స్థాప్యం పంచవర్ణం వితానకమ్ ।
ధేనవో దశ కుంభాశ్చ వస్త్రయుగ్మాని చైవ హి ॥ 12 ॥

మధ్యమే ద్వే తు గురవే ఋత్విగ్భ్యోఽన్యాస్తథైవ చ ।
తతో మంగలశబ్దేన స్నాతః శుక్లాంబరో బుధః ॥

త్రిఃప్రదక్షిణమావృత్య మన్త్రమేతముదీరయేత్ ॥ 13 ॥

వీరందరు కూడ కిరీటములను ధరించి బాలకాన్వితులై ఉండునట్లు, వరదముద్ర కలిగినట్లుగాను ఉండాలి. వీటన్నింటిని శక్తిననుసరించి పంచపలముల కన్న అధికముగా సహస్రపలము వరకు గల తూకపు బంగారముతో చేయించాలి. వీరందరిపైన వచ్చునట్లుగా పంచనవర్ణములు గల వితానకమును కూడ చేయించాలి. పాడియావులు, పది కలశములు, వస్త్రయుగ్మములు కూడ ఉండాలి. మధ్యభాగమున నుండు బ్రాహ్మి అనంతశక్తి అను రెండింటిని గురువునకు, మిగిలినవాటిని ఋత్విజులకు ఈయాలి. తర్వాత మంగళధ్వనులతో వేదధ్వనులతో కూడ యజమానుడు స్నానమాచరించి, తెల్లని వస్త్రములను ధరించినవాడై బుద్ధిమంతుడైన యజమాని మూడుమార్లు ప్రదక్షిణములునాచరించి ఈ క్రింది మంత్రమును ఉచ్చరించాలి.

నమో నమః పాపవినాశినీభ్యః బ్రహ్మాండలోకేశ్వరపాలినీభ్యః ।
ఆశంసితాధిక్యఫలప్రదాభ్యో దిగ్భ్యస్తథా కల్పలతావధూభ్యః ॥ 14 ॥

పాపవినాశినులు, బ్రహ్మాండ లోకేశ్వర పాలినులు, కోరినవాటికంటే అధికమైన ఫలములనిచ్చువారును అగు దిగ్దేవతలైన కల్పలతా దేవతలకు నమస్సులు

ఇతి సకలదిగంగనాప్రదానం భవభయసూదనకారి యః కరోతి ।
అభిమతఫలదే స నాగలోకే వసతి పితామహవత్సరాణి త్రింశత్ ॥ 15 ॥

పితృశతమథ తారయేద్భవాబ్ధేః భవదురితౌఘవిఘాతశుద్ధదేహః ।

సురపతివనితాసహస్రసంఖ్యైః పరివృతమంబుజసంసదాభివంద్యః ॥ 16 ॥

ఇట్లు అనుచు భవభయనాశినియగు సకలదిగ్దేవతాప్రదానమును ఎవరు చేయుదురో వారు అభిమత ఫలముల నిచ్చునట్టి నాగలోకమునందు బ్రహ్మదేవునికి సంబంధించిన ముప్పది సంవత్సరముల కాల పర్యంతము నివసింతురు, వందమంది పితృదేవతలను భవసాగరము నుండి తరింపజేయుదురు, అంతేకాక సంసారము ద్వారా కలిగిన పాపములన్ని నశించగా విశుద్ధదేహులై వేలాది స్వర్గలోకస్త్రీలచేత పరివృతులై బ్రహ్మదేవునిచేత కూడ అభినందనీయులౌతారు.

ఇతి విధానమిదం దిగంగనానాం కనకకల్పలతావినివేదకమ్ ।
పఠతి యః స్మరతీహ తథేక్షతే స పదమేతి పురందరసేవితమ్ ॥ 17 ॥

ఇట్టి దిగంగనాకనకకల్పలతాదానవిధానమును ఎవరు పఠింతురో లేదా స్మరింతురో లేదా వీక్షింతురో వారు పురందరుడైన ఇంద్రునిచే సేవింపబడు స్వర్గలోకమును పొందుతారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే కనకకల్పలతాప్రదానవిధిర్నామ
షడశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥286॥

శ్రీ మాత్స్య మహాపురాణమున మహాదానానుకీర్తనమునందు కనకకల్పాలతాప్రదానవిధి యను
రెండువందల ఎనబైఆరవ అధ్యాయం సమాప్తం



సప్తాశీత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఎనభైఏడవ అధ్యాయం

మహాదానానుకీర్తనే సప్తసాగరప్రదానవిధిః - మహాదానానుకీర్తనలో సప్తసాగరప్రదానవిధి

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
సప్త సాగరకం నామ సర్వపాపప్రణాశనమ్ ॥ 1 ॥

పుణ్యం దినమథాసాద్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
తులాపురుషవత్కుర్యాత్ లోకేశావాహనం బుధః ॥ 2 ॥

ఋత్విఙ్మణ్డపసంభారభూషణాచ్ఛాదనాదికమ్ ।
కారయేత్సప్తకుండాని కాంచనాని విచక్షణః ॥ 3 ॥

తదనంతరమిపుడు అత్యుత్తమమైనట్టి, సర్వపాపప్రణాశిని అయినట్టి సప్తసాగరక మహాదానాన్ని వివరిస్తాను. శుభప్రదమైన దివసమునెంచుకొని, వేద పండితులచే పుణ్యాహవాచనము కావించి బుధుడైన యజయానుడు తులా పురుషదానమునందు వలెనే దిక్పాలకావాహానాదులు చేయవలెను. ఋత్విజులు, మండపము, సంభారములు, ఆభూషణములు, ఆచ్ఛాదనము మొదలగు వాటిని సమకూర్చుకొని విచక్షణుడైన కర్త బంగారముతో సప్తకుండములను చేయించుకోవాలి.

ప్రాదేశమాత్రాణి తథారత్ని మాత్రాణి వై పునః ।
కుర్యాత్సప్తపలాదూర్ధ్వమాసహస్రాచ్చ శక్తితః ॥ 4 ॥

సంస్థాప్యాని చ సర్వాణి కృష్ణాజినతిలోపరి ।
ప్రథమం పూరయేత్కుండం లవణేన విచక్షణః ॥ 5 ॥

ద్వితీయం పయసా తద్వత్తృతీయం సర్పిషా పునః ।
చతుర్థం తు గుడేనైవ దధ్నా పంచమమేవ చ ॥ 6 ॥

షష్ఠం శర్కరయా తద్వత్సప్తమం తీర్థవారిణా ।
స్థాపయేల్లవణస్థం తు బ్రహ్మాణం కాంచనం శుభమ్ ॥ 7 ॥

ప్రాదేశమాత్రము (అనగా చాచిన బొటనవ్రేలి చివరకును అట్లే చాచిన తర్జనీ వ్రేలుకును నడుమగల దూరము) గాని పిడిమూరగాగాని వ్యాసముగాగల ఏడు కుండములను శక్తిననుసరించి ఏడు నుండి వేయి పలముల తూకముగల బంగారంతో చేయించాలి. వాటినన్నింటిని కృష్ణాజినమునందు తిలలపై స్థాపించాలి. వాటిలో మొదటి దానిని లవణముతో, రెండవ దానిని క్షీరముతో, మూడవ దానిని నెయ్యితో, నాల్గవ దానిని బెల్లముతో, ఐదవ దానిని పెరుగుతో ఆరవదానిని శర్కరతో మరియు ఏడవదానిని తీర్థజలముతో విచక్షణుడై దాత నింపాలి. తర్వాత లవణమందు బంగారు బ్రహ్మదేవుని ప్రతిమను పెట్టాలి.

కేశవం క్షీరమధ్యే తు ఘృతమధ్యే మహేశ్వరమ్ ।
భాస్కరం గుడమధ్యే తు దధిమధ్యే నిశాధిపమ్ ॥ 8 ॥

శర్కరాయాం న్యసేల్లక్ష్మీం జలమధ్యే తు పార్వతీమ్ ।
సర్వేషు సర్వరత్నాని ధాన్యాని చ సమన్తతః ॥ 9 ॥

తులాపురుష వచ్ఛేషమత్రాపి పరికల్పయేత్ ।
తతో వారుణహోమాంతే స్నాపితో వేదపుంగవైః ॥

త్రిః ప్రదక్షిణమావృత్య మంత్రానేతానుదీరయేత్ ॥ 10 ॥

ఇంకనూ క్షీరమునందు కేశవుని, ఘృతమునందు మహేశ్వరుని, బెల్లమునందు భాస్కరుని, దధియంది చంద్రుని, శర్కరయందు లక్ష్మీ దేవిని, జలమధ్యమున పార్వతీదేవిని స్థాపించి, తదనంతరము అన్నింటి యందు అన్నివిధములైన రత్నములు ధాన్యములు కూడ పోయాలి. ఇక తులాపురుషదానములో వలె మిగిలినవన్నియు పరికల్పించుకోవాలి. అపుడు వారుణహోమము కూడ ముగించిన తర్వాత వేదపండితుల మంత్రోచ్చారణముల మధ్యన స్నానము చేసిన యజమానుడు వాటన్నింటికిని మూడు మార్లు ప్రదక్షిణములు చేసి ఈ క్రింది మంత్రమునుచ్చరించాలి.

నమో వః సర్వభూతానామాధారేభ్యః సనాతనాః ।
జన్తూనాం ప్రాణదేభ్యశ్చ సముద్రేభ్యో నమో నమః ॥ 11 ॥

ఓ సనాతనులైన సముద్రములారా! సర్వభూతము ఆధారములైనట్టి, జన్తువులన్నింటికిని ప్రాణమిచ్చు నటువంటి మీకు నమస్సులు,

క్షీరోదకాజ్యదధిమాధురలావణేక్షుసారామృతేన భువనత్రయజీవసంఘాన్ ।
ఆనందయంతి వసుభిశ్చ యతో భవన్తః తస్మాన్మమాప్యఘవిఘాతమలం దిశన్తు ॥ 12 ॥

పాలు, ఉదకము, ఘృతము, పెరుగు, మధురజలము, లవణజలము, ఇక్షురసము మొదలగు వాటి రూపములో నున్న అమృతసారముతో భువనత్రయమందున్న జీవసంఘములన్నింటిని మీరు ఆనందింపజేస్తున్నారు. అట్లే అష్టవిధ వసువులతో జీవులకు ఆనందం కలిగించుచున్నారు కావున మీరు నా యొక్క పాపములన్నింటికిని విఘాతము కలిగించి నాకు ఆనందము కలిగింపుడు.

యస్మాత్సమస్తభువనేషు భవన్త ఏవ తీర్థామరాసురసుబద్ధమణిప్రదానమ్ ।
పాపక్షయామృతవిలేపనభూషణాయ లోకస్య బిభ్రతి తదస్తు మమాపి లక్ష్మీః ॥ 13 ॥

సమస్తభువనముల యందుండెడి తీర్థములకు, దేవతలకు, అసురులకు, ఉత్తమమైన మణులను మీరు ప్రదానము చేయుదురు. సమస్తపాపక్షయమునకై అమృతవిలేపనమునే ఆభూషణముగా నిత్తురు. ఇవన్నియును మీరు లోకముకొరకై మాత్రమే భరింతురు కావున మీరు నాకు సర్వథా ఉండునట్లు లక్ష్మిని ప్రసాదింపుడు.

ఇతి దదాతి రసామృతసంయుతాన్ శుచిరవిస్మయవానిహ సాగరాన్ ।
అమలకాంచనవర్ణమయానసౌ పదముపైతి హరేరమరార్చితః ॥ 14 ॥

సకలపాపవిధౌతవిరాజితః పితృపితామహపుత్రకలత్రకమ్ ।
నరకలోకసమాకులమప్యయం ఝటితి సోఽపి నయేచ్ఛివమందిరమ్ ॥ 15 ॥

ఇట్లు ఇక్కడ వివరించిన పద్ధతిననుసరించి ఏ మనుష్యుడైతే పవిత్రుడై విస్మయరహితుడై రసామృతములతో కూడియున్నట్టి స్వచ్ఛమైన బంగారముతో చేసిన కుండములను దానము చేయునో అతడు దేవతలచేత పూజింపబడువాడై శ్రీహరి పదమును పొందుతాడు. ఇంకనూ సకల పాపములు నశించిపోవుటచే మంచి తేజస్సు కలవాడై పితృపితామహ, పుత్రకళత్రాదులందరిని నరకలోకగమనము నుండి రక్షించి వెంటనే శివమందిరానికి తీసుకు వెళ్ళుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే సప్తసాగరప్రదానవిధిర్నామ
సప్తాశీత్యధికద్విశతతమోఽధ్యాయః ॥287॥

శ్రీ మత్స్య మహాపురాణమున మహాదానానుకీర్తనలో సప్తసాగర ప్రదాన విధి అనే
రెండువందల ఎనభైఏడవ అధ్యాయం సమాప్తం.



అష్టాశీత్యధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఎనబైఎనిమిదవ అధ్యాయం
మహాదానానుకీర్తనే రత్నధేను ప్రదానవిధిః - మహాదానానుకీర్తనలో రత్నధేనుప్రదానవిధి

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
రత్నధేన్వితి విఖ్యాతం గోలోకఫలదం నృణామ్ ॥ 1 ॥

పుణ్యం దినమథాసాద్య తులాపురుషదానవత్ ।
లోకేశావాహనం కృత్వా తతో ధేనుం ప్రకల్పయేత్ ॥ 2 ॥

ఇక ఇప్పుడు ఉత్తమోత్తమమైనట్టి మానవులకు గోలోకవాసమును కల్పించునట్టి విఖ్యాతమైనట్టి రత్నధేనుప్రదానాన్ని తెలుపుతాను. పవిత్రమైన దివసమును ఎంచుకొని తులాపురుషదానమునందు వలెనే ఇక్కడ కూడ లోకేశావాహనాదులు నిర్వహించి రత్నధేనువును కల్పించుకోవాలి.

భూమౌ కృష్ణాజినం కృత్వా లవణద్రోణసంయుతమ్ ।
ధేనుం రత్నమయీం కుర్యాత్ సంకల్ప్య విధిపూర్వకమ్ ॥ 3 ॥

స్థాపయేత్పద్మరాగాణామేకాశీతిం ముఖే బుధః ।
పుష్పరాగశతం తద్వద్ఘోణాయాం పరికల్పయేత్ ॥ 4 ॥

లలాటే హేమతిలకం ముక్తాఫలశతం దృశోః ।
భ్రూయుగే విద్రుమశతం శుక్తీ కర్ణద్వయే స్మృతే ॥ 5 ॥

కాంచనాని చ శృంగాణి శిరో వజ్రశతాత్మకమ్ ।
గ్రీవాయాం నేత్రపటలం గోమేదికశతాన్వితమ్ ॥ 6 ॥

భూమిపై కృష్ణాజినమును పరిచి ద్రోణపరిమాణముతో లవణమును దానిపై పోయాలి. తర్వాత దానిపై విధి పూర్వకముగా సంకల్పము చేసి రత్నమయమైన ధేనువును కల్పించుకోవాలి. ధేనువు యొక్క ముఖమునందు ఎనుబదియొక పద్మరాగములను, ముట్టెయందు ఒక వంద పుష్యరాగములను కల్పించాలి. అట్లే లలాటమునందు బంగారు తిలకమును నేత్రములందు నూరు ముత్యములను, కనుబొమ్మల యందు నూరు పగడములు, రెండు చెవులయందు రెండు ముత్యపు చిప్పలను, మరియు బంగారు కొమ్ములను, నూరు వజ్రములతో శిరస్సును మెడయందు నూరు గోమేదకములు కల్పించాలి.

ఇంద్రనీలశతం పృష్ఠే వైడూర్యశతపార్శ్వకే ।
స్ఫాటికైరుదరం తద్వత్సౌగంధికశతైః కటిమ్ ॥ 7 ॥

ఖురా హేమమయాః కార్యాః పుచ్ఛం ముక్తావలీమయమ్ ।
సూర్యకాంతేందుకాంతౌ చ ఘ్రాణే కర్పూరచందనే ॥ 8 ॥

కుంకుమాని చ రోమాణి రౌప్యనాభిం చ కారయేత్ ।
గారుత్మతశతం తద్వదపానే పరికల్పయేత్ ॥ 9 ॥

వీపు పైన నూరు ఇంద్రనీలమణులతో, నూరు వైడూర్యమణులతో రెండు పార్శ్వములను, స్ఫటికములతో ఉదరమును, నూరు సౌంగధికములతో కటిప్రదేశమును, బంగారముతో గిట్టలను, ముత్యాలహారముతో తోకను, సూర్యకాంత మరియు ఇంద్ర కాంతమణులు మరియు కర్పూర చందనముతో ముక్కు పుటలను, కుంకుమ పువ్వుతో హెూమములను, వెండితో నాభిని, నూరు గరుడపచ్చలతో అపానమును కల్పించాలి.

తథాఽన్యాని చ రత్నాని స్థాపయే త్సర్వసంధిషు ।
కుర్యాచ్ఛర్కరయా జిహ్వాం గోమయం చ గుడాత్మకమ్ ॥ 10 ॥

గోమూత్రమాజ్యేన తథా దధిదుగ్ధే స్వరూపతః ।
పుచ్ఛాగ్రే చామరం దద్యాత్సమీపే తామ్రదోహనమ్ ॥ 11 ॥

కుండలాని చ హైమాని భూషణాని చ శక్తితః ।
కారయేదేవమేవం తు చతుర్థాంశేన వత్సకమ్ ॥ 12 ॥

అంతే కాక అన్ని సంధులయందు ఇతర రత్నములను అమర్చాలి. తర్వాత శర్కరతో నాలుకను, బెల్లముతో గోమయమును, నెయ్యితో గోమూత్రమును, గోక్షీరమును, పెరుగును సాధరణవస్తువులుగాను, తోక చివరగా చామరమును దాని సమీపమున పాలు పిదుకు రాగిపాత్రను, బంగారు కుండలములను మరియు శక్తిననుసరించి ఇతర ఆభూషణములన్నియును చేయించాలి. తర్వాత ఇందులోని నాలుగవ వంతు సామగ్రితో దూడను కూడ చేయించాలి.

తథా ధాన్యాని సర్వాణి పాదాశ్చేక్షుమయాః స్మృతాః ।
నానాఫలాని సర్వాణి పంచవర్ణం వితానకమ్ ॥ 13 ॥

ఏవం విరచనం కృత్వా తద్వద్ధోమాధివాసనమ్ ।
ఋత్విగ్భ్యో దక్షిణాం దద్యాద్ధేనుమామన్త్రయేత్తతః ॥

గుడధేనువదావాహ్య ఇదం చోదాహరేత్తతః ॥ 14 ॥

అటు తర్వాత అన్ని విధముల ధాన్యములు, చెరకు గడలు, నానావిధఫలములు, ఐదువర్ణములు గల వితానకము మొదలగు వాటిని అమర్చుకొని, హెూమము మరియు దేవతాధివాసనము కూడ జరిపి ఋత్విజులకు దక్షిణలు సమర్పించిన తర్వాత సిద్ధము చేసిన రత్నధేనువునకు గుడధేనువును వలె ఆవాహనము చేసి ఈ క్రింది మంత్రమునుచ్చరించవలెను.

త్వాం సర్వదేవగణధామ యతః పఠన్తి రుద్రేంద్రసూర్యకమలాసనవాసుదేవాః ।
తస్మాత్సమస్తభువనత్రయదేహయుక్తా మాం పాహి దేవి భవసాగరపీడ్యమానమ్ ॥ 15 ॥

బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు, ఇంద్రుడు, సూర్యుడు మొదలగు సర్వదేవగణములకును నీవు ఆవాసస్థానమని అందరునూ తెలుపుచుందురు, సమస్త భువనత్రయమునందలి దేవతలందరునూ నీదేహమునందే ఉన్నారు కావున ఓ దేవీ! ఈ సంసారసాగరముచే పీడించడబడుతున్న నన్ను రక్షింపుము.

ఆమన్త్ర్య చేత్థమభితః పరివృత్య భక్త్యా దద్యాద్ ద్విజాయ గురవే జలపూర్వికాం గామ్ ।
యః పుణ్యమాప్య దినమత్ర కృతోపవాసః పాపైర్విముక్తతనురేతి పదం మురారేః ॥ 16 ॥

ఈ విధముగా మంత్రమును పఠించుచు భక్తితో ధేనువునకు ప్రదక్షిణము చేసి జలపూర్వకముగా ద్విజుడైన గురువునకు దానం చేయాలి. పుణ్యదివసమున ఉపవాసముండి ఈ దానము చేసినవారు పాపవిముక్త దేహులై విష్ణుపదాన్ని పొందుతారు.

ఇతి సకలవిధిజ్ఞో రత్నధేనుప్రదానం వితరతి స విమానం ప్రాప్య దేదీప్యమానమ్ ।
సకల కలుషముక్తో బంధుభిః పుత్రపౌత్రైః స హి మదనసరూపః స్థానమభ్యేతి శమ్భోః ॥ 17 ॥

ఇట్లు సకలవిధివిధానములను తెలిసినవాడు ఎవరైతే ఈ రత్నధేనుదానమును చేయునో అతడు సకల కలుషముల నుండి విముక్తుడై దేదీప్యమానమైన విమానమును అధిరోహించి మన్మథునితో సమానమైన రూపమును పొంది బంధువులతో, పుత్రపౌత్రాదులందరితో కలసి పరమశివుని పదాన్ని పొందుతాడు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే రత్నధేనుప్రదానవిధిర్నామ
అష్టాశీత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥288॥

శ్రీ మత్స్యమహాపురాణమున మహాదానానుకీర్తనలో రత్నధేనుప్రదానవిధియను
రెండువందల ఎనబైఎనిమిదవ అధ్యాయం సమాప్తం.



ఏకోనవవత్యధికద్విశతతమోఽధ్యాయః - రెండువందల ఎనభైతొమ్మిదవ అధ్యాయం

మహాదానానుకీర్తనే మహాభూతఘట దానవిధిః - మహాదానానుకీర్తనలో మహాభూతఘట దానవిధి

మత్స్య ఉవాచ - మత్స్యుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి మహాదానమనుత్తమమ్ ।
మహాభూతఘటం నామ మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

పుణ్యాం తిథిమథాసాద్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
ఋత్విఙ్మణ్డపసంభార భూషణాచ్ఛాదనాదికమ్ ॥ 2 ॥

తులాపురుషవత్కుర్యాత్ లోకేశావాహనాదికమ్ ।
కారయేత్కాంచనం కుంభం మహారత్నాచితం బుధః ॥ 3 ॥

ఇక ఇప్పుడు మహాపాతకనాశినియగు మహాభూతఘటదానమను అత్యుత్తమమైన ఒక మహాదానమును గురించి వివరిస్తాను. యజమానుడు మంగళప్రదమైన తిథిని ఎంచుకొని వేదపండితులతో పుణ్యాహవాచనము చేయించి, ఋత్విజులు, మండపము, సంభారములు, ఆభూషణములు, ఆచ్ఛాదనము ఇత్యాదులకును సిద్ధముగా నుంచుకొని తులాపురుషదానము నందు వలెనే ఇక్కడ కూడ దిక్పాలకులనాహ్వానించి మహారత్నఖచితమైన బంగారు ఘటమును చేయించాలి.

ప్రాదేశాదంగులశతం యావత్కుర్యాత్ ప్రమాణతః ।
క్షీరాజ్యపూరితం తద్వత్ కల్పవృక్షసమన్వితమ్ ॥ 4 ॥

పద్మాసనగతాంస్తత్ర బ్రహ్మవిష్ణుమహేశ్వరాన్ ।
లోకపాలాన్ మహేంద్రాంశ్చ స్వస్వవాహనమాస్థితాన్ ॥

వరాహేణోద్ధృతాం తద్వత్కుర్యాత్ పృథ్వీం సపంకజామ్ ॥ 5 ॥

ఆ సువర్ణఘటము ప్రాదేశపరిమాణమునకు తక్కువ కాకుండా మరియు నూరు అంగళములకు మించినది కూడ కాకుండునట్లు చేయించుకోవాలి. తర్వాత దానిని పాలు మరియు నెయ్యితోనూ నింపి కల్పవృక్షముతో జత పరచాలి. తర్వాత పద్మాసనగతులైనట్లున్న బ్రహ్మవిష్ణుమహేశ్వరులను మరియు వారివారి వాహనముల నధిష్ఠించియున్న మహేంద్రాది అష్టదిక్పాలకులను, వరాహమూర్తిచే ఉద్ధరింపబడినదై పంకజముతోపాటు ఉన్నట్టి పృథివిని కూడ సిద్ధం చేయాలి.

వరుణం చాసనగతం కాంచనం మకరోపరి ।
హుతాశనం మేషగతం వాయుం కృష్ణమృగాసనమ్ ॥ 6 ॥

తథా కోశాధిపం కుర్యాన్మూషకస్థం వినాయకమ్ ।
విన్యస్య ఘటమధ్యే తాన్వేదపంచకసంయుతాన్ ॥ 7 ॥

ఋగ్వేదస్యాక్షసూత్రం స్యాత్ యజుర్వేదస్య పంకజమ్ ।
సామవేదస్య వీణా స్యాత్ వేణుం దక్షిణతో న్యసేత్ ॥ 8 ॥

అథర్వవేదస్య పునః స్రుక్ స్రువౌ కమలం కరే ।
పురాణవేదో వరదః సాక్షసూత్రకమండలుః ॥ 9 ॥

ఇంకనూ బంగారు మకరమునధిష్ఠించిన వరుణుని, మేషారూఢుడైన అగ్నిదేవుని, కృష్ణమృగముపై కూర్చునియున్న వాయుదేవుని, కోశాధిపతిరూపములో నుండి మూషకమునధిరోహించిన వినాయకుని కూడ చేయించాలి. తర్వాత వాటిని వేదపంచకముతో కూడ ఆ ఘటపు నడుమ స్థాపించాలి. అట్లే ఋగ్వేదమునకు అక్షమాలను, యజుర్వేదమునకు పద్మమును, సామవేదమునకు వీణను, మరియు కుడి చేతి యందు వేణువును, అధర్వవేదమునకు స్రుక్కుస్రువములు మరియు హస్తమునందు కమలము పురాణవేదమునకు అక్షసూత్రక మండులువులును మరియు కరములందు వరదముద్రయు ఉండునట్లు చూచుకోవాలి.

పరితః సర్వధాన్యాని చామరాసనదర్పణమ్ ।
పాదుకోపాహనచ్ఛత్రం దీపికాభూషణాని చ ॥ 10 ॥

శయ్యాం చ జలకుంభాంశ్చ పంచవర్ణం వితానకమ్ ।
స్నాత్వాధివాసనాంతే తు మంత్రమేతముదీరయేత్ ॥ 11 ॥

తర్వాత వాటికి చుట్టూరా అన్ని దిశల యందు ధాన్యములన్నింటిని ఉంచి చామరములు, ఆసనములు, అద్దము, పాదుకలు, పాదరక్షలు, ఛత్రము, దీపము, ఆభూషణములు, శయ్య, జలముతో కూడిన ఘటములు, పంచవర్ణము గల వితానకము మొదలగు వాటిని కూడ సిద్ధము చేసికొని, స్నానమాచరించి దేవతాధివాసము కూడ కావించి ఈ మంత్రమునుచ్చరించాలి.

నమో వః సర్వదేవానాం ఆధారేభ్యశ్చరాచరే ।
మహాభూతాధిదేవేభ్యః శాంతిరస్తు శివం మమ ॥ 12 ॥

యస్మాన్న కించిదప్యస్తి మహాభూతైర్వినా కృతమ్ ।
బ్రహ్మాండే సర్వభూతేషు తస్మాచ్ఛ్రీరక్షయాఽస్తు మే ॥ 13 ॥

ఈ చరాచరప్రపంచమునందు సర్వదేవతలకును, మహాభూతాదులన్నింటికిని ఆధారభూతములైన మీకు నమస్సులు, నాకు శాంతి మరియు శుభము కలుగుగాక! మహాభూతములు వ్యాప్తి చెందని ప్రదేశము ఈ బ్రహ్మాండము నందు సర్వప్రాణులయందును లేదు, అటువంటి మీకు నమస్సులు, మీ దయతో నా సంపదలు అక్షయములు అగుగాక!

ఇత్యుచ్చార్య మహాభూతఘటం యో వినివేదయేత్ ।
సర్వపాపవినిర్ముక్తః స యాతి పరమాం గతిమ్ ॥ 14 ॥

విమానేనార్కవర్ణేన పితృబంధుసమన్వితః ।
స్తూయమానో వరస్త్రీభిః పదమధ్యేతి వైష్ణవమ్ ॥ 15 ॥

ఈ విధముగా ఉచ్చరించి మహాభూతఘటమును ఎవరైతే దానము చేయుదురో వారు సర్వపాపవినిర్ముక్తులై ఉత్తమగతిని పొందుతారు. అంతేకాక సూర్యుని వంటి ప్రకాశముగలిగిన విమానమును అధిరోహించి పితరులతో బంధువులతో కూడినవారై శ్రేష్ఠమైన దేవతాస్త్రీలచే స్తుతింపబడుచున్నవారై విష్ణుపదాన్ని పొందుతారు.

షోడశైతాని యః కుర్యాన్మహాదానాని మానవః ।
న తస్య పునరావృత్తిః ఇహ లోకేఽభిజాయతే ॥ 16 ॥

ఈ ప్రకారముగా ఇక్కడ వివరించిన షోడశ మహాదానములు. ఎవరు ఆచరిస్తారో వారు పునరావృత్తి రహితమైన మోక్షాన్నే పొందుతారు.

ఇహ పఠతి య ఇత్థం వాసుదేవస్య పార్శ్వే ససుతపితృకలత్రః సంశృణోతీహ సమ్యక్ ।
మురరిపుభవనే వై మన్దిరే వార్కలక్ష్మ్యా త్వమరపురవధూభిర్మోదతే సోఽపి నిత్యమ్ ॥ 17 ॥

ఎవరు ఈ షోడశమహాదానవివరణములను వాసుదేవుని సన్నిధి యందు పఠిస్తారో మరియు పితృపుత్రకళత్రసహితులై దీనిని శ్రద్ధగా విందురో వారు సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు మందిరమునకు వెళుతారు. మరియు సూర్యుని కాంతి వంటి కాంతి గలవారై స్వర్గలోకస్త్రీలతో కూడి సదా సంతృప్తి పొందుతారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మహాదానానుకీర్తనే మహాభూతఘట దానవిధిర్నామ
ఏకోననవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥289॥

శ్రీ మాత్స్యమహాపురాణమున మహాదానానుకీర్తనలో మహాభూతఘటదానవిధి అనే
రెండువందల ఎనభైతొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

నవత్యధిక ద్విశతతమోఽధ్యాయః - రెండువందల తొంబైయవ అధ్యాయం

కల్పానుకీర్తనమ్ - కల్పానుకీర్తనం

మనురువాచ - మనువు చెప్పాడు.

కల్పమానం త్వయా ప్రోక్తం మన్వన్తరయుగేషు చ ।
ఇదానీం కల్పనామాని సమాసాత్కథయాఽచ్యుత! ॥ 1 ॥

అచ్యుతా! నీవు నాకు యుగములయొక్కయు మన్వంతరములయొక్కయు పరిమాణమును మరియు కల్పపరిమాణమును కూడ వివరించావు. ఇప్పుడిక సంక్షిప్తంగా కల్పాల యొక్క నామాలను తెలుపు.

మత్స్య ఉవాచ - మత్స్యభగవానుడు చెప్పాడు.

కల్పానాం కీర్తనం వక్ష్యే మహాపాతకనాశనమ్ ।
యస్యానుకీర్తనాదేవ వేదపుణ్యేన యుజ్యతే ॥ 2 ॥

ప్రథమం శ్వేతకల్పస్తు ద్వితీయో నీలలోహితః ।
వామదేవస్తృతీయస్తు తథా రాథన్తరోఽపరః ॥ 3 ॥

రౌరవః పంచమః ప్రోక్తః షష్ఠో దేవ ఇతి స్మృతః ।
సప్తమోఽథ బృహత్కల్పః కందర్పోఽష్టమ ఉచ్యతే ॥ 4 ॥

సద్యోఽథ నవమః ప్రోక్త ఈశానో దశమః స్మృతః ।
తమ ఏకాదశ ప్రోక్తస్తథా సారస్వతః పరః ॥ 5 ॥

త్రయోదశ ఉదానస్తు గారుడోఽథ చతుర్దశః ।
కౌర్మః పఞ్చదశః ప్రోక్తః పౌర్ణమాస్యామజాయత ॥ 6 ॥

మొదటిది శ్వేతకల్పము, రెండవది నీలలోహితము, మూడవది వామదేవకల్పము, నాల్గవది రాథంతరము, ఐదవది రౌరవము, ఆరవది దేవకల్పము, ఏడవది బృహత్కల్పము, ఎనిమిదవది కందర్పము, తొమ్మిదవది సద్యకల్పము, పదవది ఈశానము, పదకొండవది తమము, పన్నెండవది సారస్వతము, పదమూడవది ఉదానము, పద్నాల్గవది గారుడకల్పము, పదిహేనవది కౌర్మకల్పము ఇది పౌర్ణమితిథి యందుండును.

షోడశో నారసింహస్తు సమానస్తు తతోఽపరః ।
ఆగ్నేయోఽష్టాదశః ప్రోక్తః సోమకల్పస్తథాపరః ॥ 7 ॥

మానవో వింశతిః ప్రోక్తస్తత్పుమానితి చాపరః ।
వైకుంఠశ్చాపరస్తద్వల్లక్ష్మీకల్పస్తథాపరః ॥ 8 ॥

చతుర్వింశతితమః ప్రోక్తః సావిత్రీకల్పసంజ్ఞకః ।
పంచవింశస్తతో ఘోరో వారాహస్తు తతో௨పరః ॥ 9 ॥

సప్తవింశో௨థ వైరాజో గౌరీకల్పస్తథాపరః ।
మాహేశ్వరస్తు స ప్రోక్తస్త్రిపురం యత్ర ఘాతితమ్ ॥ 10 ॥

పితృకల్పస్తథాన్తే తు యా కుహూర్బ్రహ్మణః పురా ।
ఇత్యేవం బ్రహ్మణో మాసః సర్వపాతకనాశనః ॥ 11 ॥

తర్వాత పదహారవది నారసింహకల్పము, పదహేడవది సమానకల్పము, పదునెనిమిదవది ఆగ్నేయము, పందొమ్మిదవది సోమము, ఇరువదవది మానవము, ఇరువది ఒకటవది తత్పురుషము, ఇరువదిరెండవది వైకుంఠకల్పము, ఇరువది మూడవది లక్ష్మీకల్పము, ఇరువది నాలుగవది సావిత్రీకల్పము, ఇరువది ఐదవది ఘోరకల్పము, ఇరువది ఆరువది వారాహకల్పము, ఇరువది ఏడవది వైరాజము, ఇరువది ఎనిమిదవది గౌరీకల్పము, ఇరువది తొమ్మిదవది త్రిపురాసురసంహారము జరిగిన మాహేశ్వరకల్పము, ముప్పదవది పితృకల్పము, ఇది బ్రహ్మదేవుని మాసమునందలి తిథులలో చివరి దగు కుహూరూపమగు అమావాస్య. ఇది సర్వపాతకములను నశింపజేయునట్టిది. (చతుర్దశితో ఏ మాత్రము సంబంధము లేనటువంటి చంద్రదర్శనము కూడ లేనట్టి అమావాస్యను 'కుహూ' అంటారు).

ఆదావేవ హి మాహాత్మ్యం యస్మిన్యస్య విధీయతే ।
తస్య కల్పస్య తన్నామ విహితం బ్రహ్మణా పురా ॥ 12 ॥

సంకీర్ణాస్తామసాశ్చైవ రాజసాః సాత్త్వికాస్తథా ।
రజస్తమోమయస్తద్వత్ ఏతే త్రింశదుదాహృతాః ॥ 13 ॥

ఏ కల్పము యొక్క ఆరంభమునందు భగవంతుని ఏ తత్త్వపు మాహాత్మ్యము వర్ణింపబడెనో ఆ కల్పమునకు ఆ నామమును బ్రహ్మదేవుడు పూర్వమే నిశ్చయించాడు. ఈ ముప్పది కల్పములు తామసములు, రాజసములు, సాత్త్వికములు, మరియు సంకీర్ణములై కూడ ఉండెను. ఈ విధముగా ముప్పది కల్పములు తెలుపబడ్డాయి.

సంకీర్ణేషు సరస్వత్యాః పితౄణాం వృష్టిరుచ్యతే ।
అగ్నేః శివస్య మాహాత్మ్యం తామసేషు దివాకరే ॥
రాజసేషు చ మాహాత్మ్యమధికం బ్రహ్మణః స్మృతమ్ ॥ 14 ॥

యస్మిన్ కల్పే తు యత్ప్రోక్తం పురాణం బ్రహ్మణా పురా ।
తస్య తస్య తు మాహాత్మ్యం తత్స్వరూపేణ వర్ణ్యతే ॥ 15 ॥

సాత్త్వికేష్వధికం తద్వద్విష్ణోర్మాహాత్మ్యముత్తమమ్ ।

తథైవ యోగసంసిద్ధా గమిష్యన్తి పరాం గతిమ్ ॥ 16 ॥

వీటిలో గుణత్రయసంకీర్ణము గలిగిన పురాణములయందు సరస్వతీమాహాత్మ్యమో లేదా పితరుల మాహాత్మ్యమో నిరూపింపబడుతుంది. తామసప్రధానములైన వాటియందు అగ్ని మరియు శివుని తత్త్వములు వర్ణింపబడతాయి. రజోగుణప్రధానములైన కల్పములందు బ్రహ్మామాహాత్మ్యము, సాత్త్వికకల్పములందు విష్ణుతత్త్వము ప్రధానముగా వర్ణింపబడతాయి. యోగము ద్వారా సిద్ధిపొందగోరే వారు వీటిని పఠించి ఉత్తమగతిని పొందుతారు. ఈ విధముగా పూర్వము బ్రహ్మదేవుడు ఏ కల్పమునందు ఏ పురాణమును ప్రవచించెనో ఆ కల్పానుసారముగా ఆ గుణతత్త్వమును బట్టి ఆ దేవుని మహత్త్వము వర్ణింపబడుతుంది.

బ్రాహ్మం పాద్మమిమం యస్తు పఠేత్పర్వణి పర్వణి ।
తస్య ధర్మే మతిర్బ్రహ్మా కరోతి విపులాం శ్రియమ్ ॥ 17 ॥

యస్తు దద్యాదిమాన్ కృత్వా హైమాన్ పర్వణి పర్వణి ।
బ్రహ్మవిష్ణుపురే వాసం మునిభిః పూజ్యతే దివి ॥ 18 ॥

సర్వపాపక్షయకరం కల్పదానం యతో భవేత్ ।
మునిరూపాంస్తతః కృత్వా దద్యాత్ కల్పాన్ విచక్షణః ॥ 19 ॥

ఎవరైతే పర్వదివసములయందు బ్రహ్మ మరియు పద్మ పురాణములను పఠించుదురో వారికి బ్రహ్మదేవుడు ధర్మమునందే చిత్తము ప్రసరింపచేస్తాడు. విపులమైన సంపత్తిని కలిగిస్తాడు. ఇంకనూ ఎవరైతే పర్వకాలమునందు సువర్ణనిర్మితమైన ఈ కల్పములను దానము చేయుదురో వారికి బ్రహ్మదేవుడు విష్ణులోకనివాసమే కల్పిస్తాడు. స్వర్గలోకమున మునులందరిచేత స్తుతింపబడునట్లు చేస్తాడు. కల్పదానము సర్వపాపక్షయకరము కావున మునిరూపము దాల్చి విచక్షణుడైన వాడు వీటిని చేయాలి.

పురాణసంహితా చేయం తవ భూప! మయోదితా ।
సర్వపాపహరా నిత్యమారోగ్యశ్రీఫలప్రదా ॥ 20 ॥

బ్రహ్మసంవత్సరశతాదేకాహం శైవముచ్యతే ।
శివవర్షశతాదేకం నిమేషం వైష్ణవం విదుః ॥ 21 ॥

యదా స విష్ణుర్జాగర్తి తదేదం చేష్టతే జగత్ ।
యదా స్వపితి శాంతాత్మా తదా సర్వం నిమీలతి ॥ 22 ॥

ఓ రాజా! నేను నీకు వివరించిన పురాణసంహిత సర్వపాపహరము మరియు నిత్యము ఆరోగ్యమును సంపదను మంచి ఫలితములనిచ్చునది. బ్రహ్మదేవుని వందసంవత్సరముల కాలము శివునికి ఒక దివసము, శివుని వంద సంవత్సరముల కాలము విష్ణువునకు ఒక నిమిషము వంటిది. అట్టి శ్రీ మహావిష్ణువు మెలకువతో నున్నప్పుడు ఈ చరాచరజగత్తంతయును ప్రవర్తిల్లుచుండును, ఆ మహానుభావుడు శాంతాత్ముడై నిదురించునపుడు ఈ జగత్తంతా ప్రలీనమౌతుంది.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా దేవదేవేశో మత్స్యరూపీ జనార్దనః ।
పశ్యతాం సర్వభూతానాం తత్రైవాంతరధీయత ॥ 23 ॥

ఇట్లు చెప్పి మత్స్య రూపములో నున్న దేవదేవేశుడైన ఆ జనార్దనుడు సర్వభూతములూ చూస్తూండగనే అంతర్ధానం చెందాడు.

వైవస్వతో హి భగవాన్ విసృజ్య వివిధాః ప్రజాః ।
స్వాంతరం పాలయామాస మార్తాణ్ణకులవర్ధనః ॥ 24 ॥

యస్య మన్వన్తరం చైతదధునా చానువర్తతే ।
పుణ్యం పవిత్రమేతద్వః కథితం మత్స్యభాషితమ్ ॥

పురాణం సర్వశాస్త్రాణాం యదేతన్మూర్ధ్ని సంస్థితమ్ ॥ 25 ॥

తర్వాత భగవానుడగు వైవస్వతమనువు వివిధములైన ప్రజలను సృష్టించి మార్తాండకులవర్ధనుడై తన అంతరమును పరిపాలించాడు. ఇప్పుడు అనువర్తితమగుచున్న మన్వంతరము ఆ మహానుభావునిదే. మత్స్యరూపుడైన పరమేశ్వరుని భాషితమైట్టి ఈ పురాణము పుణ్యప్రదమైనట్టిది, అత్యంత పవిత్రమైనటువంటిది, దీనిని మీకు నేను వినిపించాను. ఈ పురాణము సర్వశాస్త్రములకు మూర్ధన్యము వంటిది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే కల్పానుకీర్తనం నామ నవత్యధికద్విశతతమోఽధ్యాయః ॥290॥

శ్రీ మత్స్యమహాపురాణము నందు కల్పానుకీర్తనమనే రెండువందల తొంభైయవ అధ్యాయం సమాప్తం



ఏకనవత్యధికద్విశతతమోఽధ్యాయః – రెండువందల తొంబైఒకటవ అధ్యాయం

అనుక్రమణికాః – అనుక్రమణికలు

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఏతద్వః కథితం సర్వం యదుక్తం విశ్వరూపిణా ।
మాత్స్యం పురాణమఖిలం ధర్మకామార్థసాధనమ్ ॥ 1 ॥

యత్రాదౌ మనుసంవాదో బ్రహ్మాణ్డకథనం తథా ।
సాంఖ్యం శారీరకం ప్రోక్తం చతుర్ముఖముఖోద్భవమ్ ॥ 2 ॥

విశ్వస్వరూపుడైన మత్స్యభగవానునిచే చెప్పబడినట్టి ధర్మకామార్థసాధనమునకు హేతువైనట్టి సమస్త మత్స్య పురాణమును నేను మీకు వినిపించాను. దీనితో ప్రప్రథమంగా మనుసంవాదము తర్వాత బ్రహ్మాండకథనము, చతుర్ముఖుడైన బ్రహ్మనుండి వెలువడిన శారీరిక సాంఖ్యతత్త్వం వర్ణింపబడింది.

దేవాసురాణాముత్పత్తిర్మారుతోత్పత్తిరేవ చ ।
మదనద్వాదశీ తద్వల్లోకపాలాభిపూజనమ్ ॥ 3 ॥

మన్వన్తరాణాముద్దేశో వైన్యరాజాభివర్ణనమ్ ।
సూర్యవైవస్వతోత్పత్తిః బుధసంగమనం తథా ॥ 4 ॥

పితృవంశానుకథనం శ్రాద్ధకాలస్తథైవ చ ।
పితృతీర్థప్రవాసశ్చ సోమోత్పత్తిసథైవ చ ॥ 5 ॥

కీర్తనం సోమవంశస్య యయాతిచరితం తథా ।
కార్తవీర్యస్య మాహాత్మ్యం వృష్ణివంశానుకీర్తనమ్ ॥ 6 ॥

తర్వాత దేవాసురుల ఉత్పత్తి, మరుద్గణముల ఉత్పత్తి, మదనద్వాదశివ్రతము, లోకపాలకుల పూజ, మన్వంతరముల ఉద్దేశ్యము, వైన్యరాజువర్ణనము, సూర్యుడు మరియు వైవస్వతుల ఉత్పత్తి, బుధసంగమనము, పితృవంశవర్ణనము, శ్రాద్ధకాలనిర్ణయము, పితృతీర్థప్రవాసము, సోమోత్పత్తి మరియు సోమవంశ కీర్తనము, యయాతి చరితము, కార్తవీర్యుని మాహాత్మ్యము, వృష్ణివంశవర్ణనము.

భృగుశాపస్తథా విష్ణోర్దైత్యశాపస్తథైవ చ ।
కీర్తనం పురుషేశస్య వంశో హౌతాశనస్తథా ॥ 7 ॥

పురాణకీర్తనం తద్వత్ క్రియాయోగస్తథైవ చ ।
వ్రతం నక్షత్రసంఖ్యాకం మార్తండశయనం తథా ॥ 8 ॥

కృష్ణాష్టమీవ్రతం తద్వద్రోహిణీచంద్రసంజ్ఞితమ్ ।
తడాగవిధిమాహాత్మ్యం పాదపోత్సర్గ ఏవ చ ॥ 9 ॥

సౌభాగ్యశయనం తద్వదగస్త్యవ్రతమేవ చ ।
తథానన్తతృతీయా తు రసకల్యాణినీ తథా ॥ 10 ॥

విష్ణువునకు భృగుమహర్షిశాపము, దైత్యులకిచ్చిన భృగుశాపము, పురవంశకీర్తనము, హుతాశన (అగ్ని) వంశవర్ణనము, పురాణకీర్తనము, క్రియాయోగము, నక్షత్రసంఖ్యావ్రతము, మార్తాండశయనవ్రతము, కృష్ణాష్టమీ వ్రతము, రోహిణీచంద్రవ్రతము, అగస్త్యవ్రతము, అనంతతృతీయావ్రతము, రసకల్యాణినీవ్రతము.

ఆర్ద్రానందకరీ తద్వద్వ్రతం సారస్వతం పునః ।
ఉపరాగాభిషేకశ్చ సప్తమీ స్నపనం పునః ॥ 11 ॥

భీమాఖ్యా ద్వాదశీ తద్వదనంగశయనం తథా ।
అశూన్యశయనం తద్వత్తథైవాంగారకవ్రతమ్ ॥ 12 ॥

సప్తమీసప్తకం తద్వద్విశోకద్వాదశీ తథా ।
మేరుప్రదానం దశధా గ్రహశాంతిస్తథైవ చ ॥ 13 ॥

గ్రహస్వరూపకథనం తథా శివచతుర్దశీ ।
తథా సర్వఫలత్యాగః సూర్యవారవ్రతం తథా ॥ 14 ॥

సంక్రాన్తిస్నపనం తద్వద్ విభూతిద్వాదశీవ్రతమ్ ।
షష్టివ్రతానాం మాహాత్మ్యం తథా స్నానవిధిక్రమః ॥ 15 ॥

ఆర్ద్రానందకరీ తృతీయావ్రతము, సారస్వతవ్రతము, గ్రహణస్నానవ్రతము, సప్తమీస్నపనవ్రతము, భీమద్వాదశీ, అనంగశయనవ్రతము, అశూన్యశయనవ్రతము, అంగారకవ్రతము, సప్తమీసప్తకవ్రతము, విశోకద్వాదశీ, దశవిధమేరు పర్వతదానవ్రతము, గ్రహశాంతి, గ్రహస్వరూపకథనము, శివచతుర్దశీవ్రతము, సర్వఫల త్యాగతవ్రతము, సూర్యవారవ్రతము, సంక్రాంతిస్నపనము, విభూతిద్వాదశీవ్రతము, షష్టి అనగా అరువదివ్రతముల మాహాత్మ్యము, స్నానవిధిక్రమము.

ప్రయాగస్య తు మాహాత్మ్యం సర్వతీర్థానుకీర్తనమ్ ।
పైలాశ్రమఫలం తద్వద్ద్వీపలోకానుకీర్తనమ్ ॥ 16 ॥

సూర్యచన్ద్రగతిస్తద్వదాదిత్యరథవర్ణనమ్ ।
తథాన్తరిక్షచారశ్చ ధ్రువమాహాత్మ్యమేవ చ ॥ 17 ॥

భువనాని సురేంద్రాణాం త్రిపురాఘోషణం తథా ।
పితృపిణ్డదమాహాత్మ్యం మన్వన్తరవినిర్ణయః ॥ 18 ॥

వజ్రాంగస్య తు సంభూతిస్తారకోత్పత్తిరేవ చ ।
తారకాసురమాహాత్మ్యం బ్రహ్మదేవానుమన్త్రణమ్ ॥ 19 ॥

పార్వతీసమ్భవస్తద్వత్తథా శివతపోవనమ్ ॥
అనఙ్గదేహదాహస్తు రతిశోకస్తథైవ చ ॥ 20 ॥

ప్రయాగమాహాత్మ్యము, సకలతీర్థానుకీర్తనము, పైలాశ్రమఫలవర్ణనము, ద్వీపానుకీర్తనము, సూర్యచంద్రుల గమనరీతి, ఆదిత్యరథవర్ణనము, అంతరిక్షచారవర్ణనము, ధ్రువమాహాత్మ్యము, సురేంద్రభువనవర్ణనము, త్రిపురాఘోషణము, పితృమాహాత్మ్యము, మన్వంతరనిర్ణయము, వజ్రాంగసంభవము, తారకోత్పత్తి, తారకాసురమాహాత్మ్యము, దేవతలు, బ్రహ్మదేవుని కలుసుట, పార్వతీసంభవము, శివతపోవనవర్ణనము, మన్మథదహనము, రతిశోకము.

గౌరీ తపోవనం తద్వద్విశ్వనాథప్రసాదనమ్ ।
పార్వతీ ఋషిసంవాదస్తథైవోద్వాహమఙ్గలమ్ ॥ 21 ॥

కుమారసమ్భవస్తద్వత్ కుమారవిజయస్తథా ।
తారకస్య వధో ఘోరో నరసింహోపవర్ణనమ్ ॥ 22 ॥

పద్మోద్భవవిసర్గస్తు తథైవాంధకఘాతనమ్ ।
వారాణస్యాస్తు మాహాత్మ్యం నర్మదాయాస్తథైవ చ ॥ 23 ॥

ప్రవరానుక్రమస్తద్వత్ పితృగాథానుకీర్తనమ్ ।
తథోభయముఖీదానం దానం కృష్ణాజినస్య చ ॥ 24 ॥

తథా సావిత్ర్యుపాఖ్యానం రాజధర్మస్తథైవ చ ।
యాత్రానిమిత్తకథనం స్వప్నమాఙ్గల్యకీర్తనమ్ ॥ 25 ॥

ఇంకనూ గౌరీతపోవనవర్ణనము, విశ్వనాథానుగ్రహము, పార్వతీఋషిసంవాదము, పార్వతీవివాహము, మంగళకార్యక్రమ వర్ణనము, కుమారోత్పత్తి, కుమార విజయము, తారకుని సంహారము, నరసింహావతారవర్ణనము, పద్మోద్భవ విసర్గము, అంధకాసుర సంహారము, వారాణసీమాహాత్మ్యము, నర్మదానదీమాహాత్మ్యము, ప్రవరానుక్రమవర్ణనము, పితృగాథానుకీర్తనము, ఉభయముఖీదానము, కృష్ణాజినదానము, సావిత్ర్యుపాఖ్యానము, రాజధర్మములు, రాజుల యాత్రాకాలనిమిత్తములు, స్వప్నమంగళశకునములు.

వామనస్య తు మాహాత్మ్యం తథైవాథ వరాహజమ్ ।
క్షీరోదమథనం తద్వత్ కాలకూటాభిశాసనమ్ ॥ 26 ॥

దేవాసురవిమర్దశ్చ వాస్తువిద్యాస్తథైవ చ ।
ప్రతిమాలక్షణం తద్వద్దేవతారాధనం తతః ॥ 27 ॥

ప్రాసాదలక్షణం తద్వన్మణ్డపానాం తు లక్షణమ్ ।
పూరువంశే తు సంప్రోక్తం భవిష్యద్రాజవర్ణనమ్ ॥ 28 ॥

తులాదానాది బహుశో మహాదానానుకీర్తనమ్ ।
కల్పానుకీర్తనం తద్వత్ గ్రంథానుక్రమణీ తథా ॥ 29 ॥

తర్వాత వామనావతారమాహాత్మ్యము, వరాహమాహాత్మ్యము, క్షీరసాగరమథనము, కాలకూటోత్పత్తి, దేవాసురసంగ్రామము, వాస్తువిద్యావర్ణనము, ప్రతిమాలక్షణము, దేవతారాధననియమము, ప్రాసాదలక్షణము, మండపముల లక్షణము, పురువంశచరిత్ర, భవిష్యద్రాజవర్ణనము, తులాదానాది అనేక మహాదానానుకీర్తనము, కల్పానుకీర్తనము, మరియు గ్రంథానుక్రమణీ కథనము, మొదలగునవన్నియు ఈ మత్స్యపురాణమునందు ప్రతిపాదింపబడిన ప్రధానవిషయములు.

ఏతత్పవిత్రమాయుష్యమ్ ఏతత్ కీర్తివివర్ధనమ్ ।
ఏతత్ పవిత్రం కల్యాణం మహాపాపహరం శుభమ్ ॥ 30 ॥

ఈ మత్స్యపురాణము చాలా పవిత్రమైనది. దీర్ఘాయుష్యమును కలిగించునది, కీర్తిని వృద్ధిపొందింపజేయునది, శుభప్రదమైన మరియు కల్యాణకారియైన ఈ పురాణము సర్వపాపహరము.

అస్మాత్ పురాణాదపి పాదమేకం పఠేత్తు యః సోఽపి విముక్తపాపః ।
నారాయణస్యాస్పదమేతి నూనమనఙ్గవద్దివ్యవపుః సుఖీ స్యాత్ ॥ 31 ॥

శుభప్రదమైన ఇట్టి పురాణమునండి ఒక శ్లోకపాదమునైననూ ఎవరు పఠింతురో వారు పాపములన్నింటి నుండి విముక్తులై నిశ్చయముగా శ్రీమన్నారాయణుని స్థానమును పొందుదురు మరియు మన్మథుని వంటి దివ్యమైన సుందరమైన రూపాన్ని పొంది సుఖంగా జీవిస్తారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అనుక్రమణికా నామ ఏకనవత్యధిక ద్విశతతమోఽధ్యాయః ॥291॥

శ్రీ మత్స్య మహాపురాణమునందు అనుక్రమణిక అనే రెండువందల తొంబైఒకటవ అధ్యాయం సమాప్తం.

శ్రీమాత్స్యమహాపురాణమ్ సమాప్తమ్

శ్రీమాత్స్యమహాపురాణం సమాప్తం.